నేడు 'భారత్- న్యూజిలాండ్' టీ-20 మ్యాచ్

సాధనలో పాల్గొన్న అక్సర్‌పటేల్, అర్షదీప్‌సింగ్

విశాఖక్రీడలు, న్యూస్‌టుడే : 'భారత్- న్యూజిలాండ్' జట్ల మధ్య నాలుగో టీ-20 మ్యాచ్ బుధవారం నగరంలోని ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్యాలరీలను శుభ్రం చేసి, కుర్చీలకు సీటింగ్ నెంబర్లు వేశారు. భద్రత విధులకు పోలీసులు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ట్రాఫిక్ పోలీసులు సిద్ధమయ్యారు.

★ మంగళవారం స్టేడియంలో, 'బి' మైదానంలో క్రికెటర్లు సాధన చేశారు. తక్కువ ధర కలిగిన టికెట్లు దాదాపుగా అమ్ముడయ్యాయని, అధిక ధర కలిగిన టికెట్లు కొన్ని మాత్రమే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని ఏసీఏ వర్గాలు పేర్కొన్నాయి.

★ మ్యాచ్ సందర్భంగా బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ట్రాఫిక్ మళ్లింపు అమల్లో ఉంటుందని, వాహనదారులు సహకరించాలని పోలీసులు సూచించారు. మ్యాచ్ వీక్షించడానికి వచ్చే వారిలో వీవీఐపీ పాసులు కలిగిన వారు ఎన్‌హెచ్-16 స్టేడియం వరకు వెళ్లి 'ఏ' మైదానం లోపల 'పీ-1' పార్కింగ్ వద్ద, వీఐపీ పాసులు కలిగిన వారు స్టేడియం 'బి' గ్రౌండ్ లోపల 'పీ-2' పార్కింగ్ వద్ద, ఇతర టికెట్లు కలిగిన వారు వైజాగ్ కన్వెన్షన్ సమీప 'పీ-3' పార్కింగ్ వద్ద వాహనాలను నిలపాలన్నారు. సాధారణ ప్రేక్షకులు సాంకేతిక ఇంజినీరింగ్ మైదానంలోని 'పీ-4' పార్కింగ్ వద్ద, ఏఎస్‌నగర్ ఆరో వార్డు జీవీఎంసీ పార్కు-1లో, జీవీఎంసీ పార్కు-2లో, రత్నగిరి కాలనీ సమీప జీవీఎంసీ పార్కు-3లో పార్కింగ్ చేసుకోవాలని సూచించారు.

7న మెగా జాబ్‌మేళా

సీలేరు, న్యూస్‌టుడే: గూడెంకొత్తవీధి మండల పరిషత్తు కార్యాలయంలో ఫిబ్రవరి 7న మెగా జాబ్‌మేళా జరగనుంది. ఈ మేళా సంబంధించిన బ్రోచర్లను ఎంఈఓ గోవింద్‌పడాల్, శ్రీసాయి అశ్విన్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి సాయిరాం, ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం మంగళవారం ఆవిష్కరించారు. 15 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరవుతారని, నిరుద్యోగ యువత మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మేళాకు హాజరయ్యే వారికి భోజన సదుపాయం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి ఫిర్యాదుల స్వీకరణ

విశాఖపట్నం: ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి ఈనెల 29, 30న జడ్పీ సమావేశ మందిరంలో ఉప లోకాయుక్త పి.రజని ఆధ్వర్యంలో ఫిర్యాదుల స్వీకరణతో పాటు, ఇప్పటికే లోకాయుక్త పరిధిలో ఉన్న కేసుల విచారణ చేపట్టనున్నారు. లోకాయుక్త చట్టం ప్రకారం అధికారులు, ఉద్యోగుల దురుసు ప్రవర్తన, అవినీతి, అధికార దుర్వినియోగం, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వంటి అంశాలకు సంబంధించి ఫిర్యాదుల స్వీకరణ ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

రారండోయ్.. అరకు ఉత్సవ్‌కు!

- ఆహ్లాదంతోపాటు ఆనందం పంచే వేడుక
- పర్యాటకులను అలరించేందుకు వివిధ కార్యక్రమాలు

అరకులోయ, న్యూస్‌టుడే

చుట్టూ కొండలు.. ప్రకృతి సోయగాలే అరకుకు ఆకర్షణ. తెల్లవారు చలి దుప్పటి కప్పుకొనే అరకు చూడాలని ఎక్కడెక్కడి నుంచో పర్యాటకులు తరలివస్తారు. వారికి ఆహ్లాదంతోపాటు ఆనందం పంచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అలరించే సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్కంఠ రేకెత్తించే సాహస క్రీడలతో పర్యాటకులను ఆకట్టుకునేలా ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 1 వరకు అరకు ఉత్సవాలను నిర్వహిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం అధికారికంగా ఉత్సవాలను ప్రారంభించనున్నారు. ఉత్సవాలకు గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, పర్యాటకశాఖమంత్రి కందుల దుర్గేశ్‌తోపాటు మరో ఇద్దరు మంత్రులు రానున్నారు. అరకు ఉత్సవాల పోస్టర్‌ని కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దార్, డీఎస్పీ అభిషేక్ మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు.

సాంస్కృతిక సందడి : కార్నివాల్‌లో భాగంగా సుమారు 400 మంది కళాకారులు ప్రదర్శనలు ఇస్తున్నారు. మూడురోజులపాటు ప్రతిరోజూ రాష్ట్రంలోని అన్ని గిరిజన ప్రాంతాల నుంచి వచ్చే కళాకారులతో గిరిజన సంప్రదాయ నృత్యాలు ఏర్పాటు చేస్తున్నారు. తప్పెటగుళ్ళ, డప్పు వాద్యం, పులివేషాలు తదితరాలను ప్రదర్శిస్తారు.

★ పద్మాపురం ఉద్యానంలో ఫ్లవర్‌షో ఏర్పాటు చేయనున్నారు. అరకు బొకేని పర్యాటకులకు పరిచయం చేయనున్నారు.

★ 30న హైదరాబాద్ నుంచి షహరీ బ్యాండ్ ప్రదర్శన ఉంటుంది.

సాహసికులూ సిద్ధం కండి

విశాఖపట్నం-అరకు ఘాట్ రహదారిపై గాలికొండ వ్యూపాయింట్ వద్ద ఔత్సాహికులతో 30న ట్రెక్కింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాంతంలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి ట్రెక్కింగ్ ప్రేమికులు తరలిరానున్నారు.

★ లోతేరు రహదారి నుంచి పద్మాపురం వరకు సైక్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నారు. 31న మారథాన్ పోటీలు జరుగుతాయి. ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

★ హాట్ ఎయిర్ బెలూన్, పారా గ్లైడింగ్, పారా మోటరింగ్, హెలికాప్టర్ విహారాలు ఉంటాయి.

సంప్రదాయాల పరిచయం

★ దేశంలోని వివిధ గిరిజన ప్రాంతాల నుంచి వచ్చే హస్త కళాకారులతో స్టాళ్లు

★ గిరిజన యువత ఫ్యాషన్ షో

★ తిరుపతిలోని ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో గిరిజన వంటకాల తయారీపై అవగాహన కార్యక్రమం

ప్రత్యేక ఆకర్షణలు

★ 31న గాయని సునీతతో సంగీత విభావరి, ఒకటిన సంగీత దర్శకుడు తమన్ రాక

★ ముగింపు కార్యక్రమంలో వివిధ రకాల డ్రోన్ల ప్రదర్శన ఉంటుంది. ముఖ్య అతిథిగా ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వచ్చే అవకాశం ఉంది.

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

చొంపిలో హోంస్టే పరిశీలన

అరకులోయ, న్యూస్‌టుడే: అరకు ఉత్సవాల ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం అరకులోయ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి చొంపి గ్రామంలోని హోంస్టేలను పరిశీలించి.. నిర్వాహకులతో మాట్లాడనున్న నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి తిరుమణి శ్రీపూజ వాటిని పరిశీలించారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపరుస్తున్నారు. గ్రామానికి వెళ్లే రహదారిని మరమ్మతు చేస్తున్నారు. పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే చొంపి గ్రామంలో జాగిలాలతో తనిఖీలు చేపట్టారు. కొత్తవలస ప్రదర్శన క్షేత్రంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్‌తో పాటు అక్కడే కార్యకర్తలు, నాయకులతో సీఎం మాట్లాడనున్న సమావేశ స్థలాన్ని పరిశీలించారు. హెలిప్యాడ్‌లో దిగిన అనంతరం సీఎం నేరుగా ఉత్సవాలు నిర్వహించే డిగ్రీ కళాశాల మైదానానికి చేరుకుంటారు. కార్నివాల్‌ని ప్రారంభించి అక్కడే ఏర్పాటు చేసిన సభలో మాట్లాడతారు. చొంపి గ్రామాన్ని సందర్శించి... హోంస్టే నిర్వాహకులతో మాట్లాడతారు. తెదేపా కార్యకర్తలు, నాయకులతో సమావేశమవుతారు. అనంతరం హెలికాప్టర్‌లో తిరుగుముఖం పడతారు. ఆర్టీసీ విజయనగరం రీజియన్ ఛైర్మన్ దొన్నుదొర, ఎస్పీ అమిత్ బర్దార్, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, ఎంపీడీవో లవరాజు, తహసీల్దార్ కుమారస్వామి, డీఎస్పీ అభిషేక్, సీఐ హిమగిరి, ఎస్ఐ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

పురిటి నొప్పులు.. ప్రయాణ కష్టాలు

సీలేరు, న్యూస్‌టుడే: గూడెంకొత్తవీధి మండలం జెర్రెల పంచాయతీ పెద్దూరుగొందికి రహదారి సౌకర్యం లేకపోవడంతో ఓ గర్భిణిని అయిదు కిలోమీటర్లు డోలీ మోతతో తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దూరుగొందికి చెందిన గర్భిణి పూజారి లక్ష్మికి మంగళవారం ఉదయం పురిటి నొప్పులు తీవ్రమయ్యాయి. గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేదు. దీంతో అయిదు కిలోమీటర్లు డోలీమోతతో కొండపల్లి వరకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో జెర్రెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రధాన రహదారి నుంచి తమ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో తరచూ ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా.. అధికారులు స్పందించడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

డోలీలో గర్భిణిని తరలిస్తున్న పెద్దూరుగొంది గ్రామస్థులు

మానని గాయం.. అందని సాయం!

ఈనాడు డిజిటల్, పాడేరు
న్యూస్‌టుడే, అరకులోయ

తెగులు సోకిన కాఫీ పండ్లు చూపిస్తున్న రైతులు

గిరిపుత్రుల జీవనశైలిని పూర్తిగా మార్చేసిన కాఫీ పంటకు గతేడాది బెర్రీబోరర్ అనే తెగులు ఆశించింది. అతి తక్కువ సమయంలో వందల ఎకరాల్లో తోటలకు వ్యాపించింది. తోటలనే నమ్ముకున్న రైతుల ఆశలు.. తెగులు ద్వారా ఆవిరి అవడంతో కూటమి ప్రభుత్వం బాధితులను ఆదుకుంటామని ప్రకటించింది. ఎకరాకు రూ. 5 వేలు చొప్పున పరిహారం అందిస్తామని చెప్పినా ఇంతవరకు పరిహారం అందక పోవడంతో కాఫీ సాగుదారులు ఆందోళనకు గురవుతున్నారు.

ఈ ఏడాది కాఫీ సాగు పక్వానికి వచ్చిన దశలోనే బెర్రీబోరర్ ఆశించింది. అరకులోయ మండలం చినలబుడు, తుడుం, మాలివలస, మాలిసింగారం, హట్టగుడతోపాటు డుంబ్రిగుడ మండలంలోని పలు గ్రామాల్లో దీని ప్రభావం తీవ్రంగా కనిపించింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 180 ఎకరాల తోటలకు నష్టం వాటిల్లింది. ఈ కీటకాన్ని మొగ్గలోనే తుంచి గిరిజన ప్రాంతంలోని తోటలను సంరక్షించాలని శాస్త్రవేత్తలు సూచించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కూటమి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన అధికారులు, శాస్త్రవేత్తలను కాఫీ తోటలకు పంపించి సస్యరక్షణ ఏర్పాట్లపై చర్యలు చేపట్టింది. బెర్రీబోరర్ నిరోధక చర్యల్లో భాగంగా తెగులు బారినపడిన కాఫీ పండ్లని తుంచి వాటిని భూమిలో పాతిపెట్టే చర్యలకు శ్రీకారం చుట్టింది. కాఫీ రైతులను ఆదుకునేందుకు వీలుగా కీటకం సోకిన తోటల్లోని కాఫీ పండ్లకి కేజీ రూ. 50 చొప్పున ధర చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఏడాది కాఫీకి ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ లభించింది. గతేడాది కేజీ పండ్లు రూ. 60 వరకు మాత్రమే ధర పలకగా.. ఈ ఏడాది రూ. 120 వరకు పలికింది. పంటకు డిమాండ్ పెరిగిన తరుణంలో బెర్రీబోరర్ రైతుల పొట్టకొట్టింది. ప్రస్తుతం కాఫీ సీజన్ పూర్తయ్యే సమయం వచ్చినా ఇప్పటికీ ప్రభుత్వం నుంచి పరిహారం అందక పోవటంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అతి త్వరలో పరిహారం అందిస్తాం

బెర్రీబోరర్ తెగులు వల్ల కలిగిన నష్టాన్ని ఇప్పటికే గుర్తించాం. కేజీ రూ.50 చొప్పున పరిహారం అందిస్తాం. బాధిత రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నష్టాన్ని అంచనా వేసి నిధుల కోసం ప్రభుత్వానికి కూడా నివేదించాం. అతి త్వరలో అత్యవసర సహాయం కింద కొంత మొత్తం అందిస్తాం. - **తిరుమణి శ్రీపూజ, పీఓ, పాడేరు ఐటీడీఏ**

తీవ్రంగా నష్టపోయాం

ఎప్పుడూ లేని విధంగా బెర్రీబోరర్ కీటకం కాఫీ తోటలను దెబ్బతీసింది. ఈ ఏడాది ధర బాగుంది. కానీ దురదృష్టం మమ్మల్ని వెక్కిరించింది. తెగులు కారణంగా తీవ్రంగా నష్టపోయాం. చాలావరకు మొక్కలను సైతం తొలగించాం. ప్రభుత్వం ప్రకటించిన పరిహారం సొమ్ము ఇప్పటికీ మాకు అందలేదు. - **కుంబో, హట్టగుడ**

ప్రభుత్వం ఆదుకోవాలి

తెగులు కారణంగా మా గ్రామాల్లోని కాఫీ తోటలకు నష్టం కలిగింది. తోటలను కాపాడుకోవాలని అధికారులు చెప్పారు. వారు సూచనల ప్రకారం పండ్లని మేమే స్వచ్ఛందంగా తొలగించాం. ప్రభుత్వ సాయం అందుతుందని కోటి ఆశలతో ఎదురుచూస్తున్నాం. - **మొద్దు, తుడుం**

భూముల మార్కెట్ విలువ పెంపునకు సన్నద్ధం!

నర్సీపట్నం అర్బన్, మాకవరపాలెం, న్యూస్‌టుడే: భూముల మార్కెట్ విలువలు పెరగనున్నాయి. పెరిగిన ధరలు ఫిబ్రవరి ఒకటి నుంచి అమలు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో క్షేత్ర పరిశీలన చేసి ఎక్కడెక్కడ ఎంత సవరించాలన్నది అంచనాకు వచ్చారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులతో కూడిన కమిటీ ఆమోదానికి పంపారు. అభ్యంతరాలేవీ రాకుంటే ఈ ప్రతిపాదనలకు ఆమోదం లభించనుంది. నర్సీపట్నం మున్సిపాలిటీలో మార్కెట్ విలువ 13 నుంచి 20 శాతం పెంచారు. పెదబొడ్డేపల్లి, బలిఘట్టం, నర్సీపట్నం పరిధిలోని కొన్ని ప్రదేశాల్లో ఇటీవల కాలంలో వాణిజ్యం గణనీయంగా పెరిగింది. ఇలాంటి చోట్ల విలువ అధికంగా పెంచారు.

★ రోలుగుంట మండలంలో 13 శాతం, గొలుగొండ మండలంలో 14 శాతం, మాకవరపాలెం మండలంలో నాలుగు, రావికమతం మండలం ఏడు గ్రామాల్లో పది శాతం చొప్పున సవరించారు.

★ నర్సీపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఏటా రూ. 22 కోట్ల నుంచి రూ.24 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. తాజా పెంపుదల వల్ల కనీసం రూ.ఐదు కోట్ల వరకు ఆదాయం పెరుగుతుందని అంచనా.

★ గతంలో భూముల మార్కెట్ విలువలు పెరుగుతున్నాయంటే వారం, పది రోజుల ముందు నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కిటకిటలాడుతుంది. ఈసారి అలాంటి సందడేమీ కనిపించడం లేదు.

భావితరాలకు బంగారు బాట

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే

ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైంది. ఆదర్శనీయమైంది. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు అందించే బోధన, సేవలు ఎంతగానో దోహదపడతాయి. జిల్లాలో కొందరు ఉపాధ్యాయులు బోధనతోపాటు తమలోని సృజనాత్మక సామర్థ్యంతో పిల్లలను అలరింపజేయడంతోపాటు సమాజానికి ఉపయోగపడే పనులు చేస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందుతున్నారు. వినూత్నంగా, విభిన్నంగా సామర్థ్యాలను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులను కలెక్టర్ దినేష్‌కుమార్ తొలిసారిగా గుర్తించి గణతంత్ర దినోత్సవ కార్యక్రమంలో ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు.

వంచడిగొంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు గిరి

పెదబయలు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న నాగేశ్వరరావు వినూత్న ఆలోచన, బోధనతో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందారు. గతేడాది ఉపాధ్యాయ దినోత్సవం రోజున అవార్డు అందుకున్నారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా కలెక్టర్ దినేష్‌కుమార్ నిర్వహించిన ఎట్ హోం వేదికపై **నాగేశ్వరరావు** ఫ్లూట్ ఊది అందరి ప్రశంసలు అందుకున్నారు. గతేడాది పెదబయలు ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంగా పదో తరగతి విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేలా కృషి చేశారు.

పర్యావరణ పరిరక్షణలో జాతీయ స్థాయి గుర్తింపు

పురస్కారం అందుకుంటున్న బాలకృష్ణ

పెదబయలు గిరిజన ఆశ్రమ పాఠశాలలో సామాన్య శాస్త్రం ఉపాధ్యాయుడు చెండా బాలకృష్ణ బోధనతోపాటు పలు వినూత్న కార్యక్రమాలు చేపడుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. పాఠ్యాంశాలతోపాటు చుట్టూ ఉన్న పరిసరాల పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కూరగాయలు, పూలతోటల పెంపకం చేపడుతున్నారు. వారితో కలిసి చెత్తను తొలగించడం, పరిసరాలను శుభ్రం చేయడం చేస్తున్నారు. ఈయన సేవలకు గుర్తించిన నేషనల్ గ్రీన్ కార్ప్స్ (ఎన్‌జీసీ) సంస్థ జాతీయ స్థాయిలో అవార్డుతో సత్కరించింది.

ఆంగ్లంపై భయం పోగొట్టేలా..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో ఆంగ్లం అంటే తెలియని భయం. పాడేరు మండలంలో మారుమూలనున్న వంచడిగొంది గ్రామంలో విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా ఆంగ్ల పాఠాలు బోధిస్తూ సత్ఫలితాలు సాధిస్తున్నారు ఉపాధ్యాయుడు గిరి. గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. పిల్లలకు ఆంగ్ల బోధన చేయాలనే ఉద్దేశంతో సొంత నిధులతో బెంగళూరులో శిక్షణ పొందారు. ఈయన సేవలకు మెచ్చిన పూర్వ డీఈవో రమేష్ ప్రత్యేకంగా ఎన్‌సీఈఆర్‌టీ శిక్షణకు ఎంపిక చేశారు. ఈ పాఠశాల విద్యార్థులు అధికారులతో ఆంగ్లంలో మాట్లాడటం గమనార్హం.

దుమ్ము రేగుతోంది!

జి.మాడుగుల మండలం మీదుగా జాతీయ రహదారి 516-ఈ నిర్మాణంతో దుమ్ము రేగుతోంది. నీటితో సక్రమంగా తడపకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిని ఆనుకుని గాంధీనగర్ వద్ద పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. దుమ్ము, ధూళితో విద్యార్థులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. పనులు జరుగుతున్న సమయంలో రోజూ రహదారిని నీటితో తడపాలని గాంధీనగర్ ప్రభుత్వ మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మత్స్యరాజు కోరారు. - **న్యూస్‌టుడే, జి.మాడుగుల**

శరవేగంగా రహదారి పనులు

రహదారి పనులు చేస్తున్న యంత్రం

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతగిరి పంచాయతీ పరిధిలోగల తలారిపాడు రింగ్ రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయి. రేగం, తలారిపాడు, మాలింగవలస, తేనేపుట్టు, నందిగుమ్మి, పాతకోట, మద్దిగరువు, తదితర గ్రామాలను కలుపుతూ సుమారుగా రూ. 9.85 కోట్ల నిధులతో నిర్మాణం చేపడుతున్న రహదారి పనులు ఊపందుకున్నాయి. ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు చేపడుతున్నామని గిరిజన సంక్షేమ శాఖ ఏఈ గణేష్ తెలిపారు. అడవితల్లి బాటలో భాగంగా సుమారు 10 కిలోమీటర్ల దూరం వరకు ఈ రహదారి పనులు చేస్తున్నామని తెలిపారు

మహిళల కబడ్డీ పోటీల విజేత విశాఖ

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: చోడవరం మండలం అంకుపాలెం గ్రామంలో దుర్గాంబిక తీర్థం సందర్భంగా మూడురోజుల నుంచి జరుగుతున్న రాష్ట్రస్థాయి మహిళల, పురుషుల కబడ్డీ పోటీలు మంగళవారం రాత్రితో ముగిశాయి. ఈ పోటీలలో విశాఖ మహిళల జట్టు ప్రథమస్థానంలో నిలిచింది. తర్వాత స్థానాల్లో విజయనగరం, అనకాపల్లి జిల్లాల జట్లు విజేతలుగా గెలుపొందాయి. పురుషుల విభాగంలో ప్రథమస్థానంలో కృష్ణాజిల్లా, ద్వితీయ స్థానంలో తూర్పుగోదావరి, తృతీయ స్థానంలో విశాఖ జిల్లాల జట్లు నిలిచాయి. ఎమ్మెల్యే రాజు పాల్గొని విజేతలకు నగదు బహుమతులను అందించారు. ఈ పోటీలు ఏపీ కబడ్డీ అసోసియేషన్ సీఈఓ వీర లంకయ్య, ఏపీ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి పద్మజాబాల, ఆర్గనైజన్ కార్యదర్శి వి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగాయి.

ఫైనల్‌లో తలపడుతున్న విశాఖ-విజయనగరం స్త్రీల జట్టు

సీలేరులో రవితేజ సినిమా చిత్రీకరణ

మారెమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అయ్యప్ప పడిపూజ సెట్

సీలేరు, న్యూస్‌టుడే: మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై రవితేజ హీరోగా నటిస్తున్న 'ఇరుముడి' చిత్రానికి సంబంధించిన పాట చిత్రీకరణ సీలేరులో నిర్వహిస్తున్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో నృత్యదర్శకుడు బాబా భాస్కర్ నేతృత్వంలో హీరో రవితేజ, జూనియర్ ఆర్టిస్టులు, డ్యాన్సర్లపై ఈ పాటను చిత్రీకరిస్తున్నారు. సీలేరులో మారెమ్మ ఆలయం వద్ద ప్రముఖ కళాదర్శకుడు సాహీ సురేష్ ఆధ్వర్యంలో మంగళవారం అయ్యప్ప ఆలయం, పడిపూజ సెట్ వేశారు. అయ్యప్ప దీక్షలో రవితేజ పడిపూజ నిర్వహిస్తున్న సందర్భంగా పాడే పాటను ఈ చిత్రం కోసం చిత్రీకరిస్తున్నారు.

చూపండి స్థలాలు.. మోగేను గుడిగంటలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే

గ్రామాల్లోని కాలనీల్లో ఆలయాల నిర్మాణానికి రంగం సిద్ధమవుతోంది. గ్రామ గ్రామాన ప్రజల్లో భక్తి భావానికి తోడు శాంతి సామరస్యాలు వృద్ధి చెందేలా తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఈ గుడులకు ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ప్రజా ప్రతినిధులు, దాతలు వీటి కోసం స్థలం కేటాయిస్తే తక్షణం సొమ్ము మంజూరు కానుంది. స్థలం ఎక్కువ ఉంటే రూ. 20 లక్షల వరకు సాయం అందుతుంది. వీటిపై అందిన మార్గదర్శకాలతో ఇప్పటికే దేవాదాయశాఖ అధికారులు ఎమ్మెల్యేల సహకారంతో అనువైన స్థలాల సేకరణకు సన్నాహాలు చేస్తున్నారు.

ఆలయాల నిర్మాణానికి తితిదే ఆర్థిక సాయం

▮ తితిదే ఆధ్వర్యంలో శ్రీవాణి భజన మండపం పథకం కింద గ్రామానికి ఒకటి చొప్పున ఈ గుడులు నిర్మించనున్నారు. గత నవంబరు నెలలో దీనికి సంబంధించిన ఆదేశాలు అధికారులకు అందాయి. వీటిలో ప్రత్యేక నమూనా పొందుపరిచారు. ఇందులో ఆలయానికి అందజేసే స్థలం, గ్రామం తదితర అన్ని వివరాలు పేర్కొంటూ ప్రతిపాదనలు పంపాల్సిందిగా కోరారు. ఇవి తప్పనిసరిగా ఎమ్మెల్యేల అనుమతితో మాత్రమే మంజూరు కానున్నాయి. దాతలు సైతం ముందుకు వచ్చి స్థలాల ప్లాన్లు, జీపీఎస్ ఫొటోలతో శాసనసభ్యుల లేఖను జత చేసి ఇవి పంపవచ్చు. గ్రామకంఠాల్లోని స్థలాలకు ప్రాధాన్యం లభిస్తుంది.

▮ గ్రామాల్లోని ఎస్సీ, బీసీ, మత్స్యకార కాలనీల్లో ఇవి నిర్మించాల్సి ఉంది. హిందూ దేవతలైన శ్రీ వేంకటేశ్వరుడు, శ్రీరాముడు, శివుడు, ఇతర గ్రామ దేవతల గుడులను ఈ పథకం కింద నిర్మించుకోవచ్చు. స్థలం అయిదు సెంట్ల వరకు ఉంటే ఆలయం కట్టడానికి రూ. 10 లక్షలు, ఎనిమిది సెంట్ల కంటే ఎక్కువుంటే రూ. 15 లక్షలు, పది సెంట్లకు మించి ఉంటే రూ. 20 లక్షల వరకు తితిదే సొమ్ము మంజూరు చేయనుంది. వైకాపా హయాంలో రూ.పది లక్షల రూపాయల చొప్పున మాత్రమే నిధులు అందజేశారు. వీటితో జిల్లాలో చేపట్టిన సుమారు 200 గుడుల పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. జిల్లాలోని ఎమ్మెల్యే అందరితోనూ వీటి గురించి చర్చించి సహకారం కోరామని జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ **సుధారాణి** తెలిపారు. ముందుకు వచ్చే దాతలు తమను సంప్రదించవచ్చని చెప్పారు.

31న గవరపాలెం గౌరీపరమేశ్వరుల జాతర

అనకాపల్లి, న్యూస్‌టుడే: ఈనెల 31న గవరపాలెం శ్రీగౌరీపరమేశ్వరుల జాతర నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ఛైర్మన్ కొణతాల సంతోష అప్పారావు నాయుడు తెలిపారు. దీనికి సంబంధించిన గోడ ప్రతులను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ కొణతాల మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్సవంలో 45 స్టేజ్ ప్రోగ్రాంలు ఏర్పాటు చేశామన్నారు. కోల్‌కతా విద్యుత్తు అలంకరణ, బాణాసంచా విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయని తెలిపారు. ఈనెల 28న వందలాది పిండివంటలతో అమ్మవారికి సారె ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఈనెల 29న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని చెప్పారు. గవరపాలెం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో ఉదయం 8 గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు.

(c) eenadu

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం ప్రిన్సిపల్ రాజేశ్వరి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2013 సెప్టెంబర్ 1 నుంచి 2017 ఆగస్టు మధ్య.. బీసీ, ఓసీ విద్యార్థులు 2015 సెప్టెంబర్ 1 నుంచి 2017 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. మార్చి 1న ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఆసక్తి ఉన్న ఫిబ్రవరి 19లోగా ఆన్‌లైన్‌లో చేసుకోవాలని సూచించారు.

31 వరకు ఇగ్నోలో ప్రవేశాలు : ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో 2026 విద్యాసంవత్సరానికి డిప్లమో, డిగ్రీ, పీజీ కోర్సుల్లో దూరవిద్యతోపాటు, ఆన్‌లైన్‌లో ప్రవేశాలు ఈనెల 31 వరకు జరుగుతాయని సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ ధర్మారావు టూరిజం, నర్సింగ్, డెయిరీ టెక్నాలజీ, ఆక్వా కల్చర్, వ్యవసాయం, జర్నలిజం, న్యాయవిద్య కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఫీజులు ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు డిగ్రీ కోర్సుల్లో 50శాతం ఫీజు రాయితీ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ignouadmission.samarth.edu.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

జి.మాడుగులలో 7.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు

చింతపల్లి, న్యూస్‌టుడే: జి.మాడుగులలో మంగళవారం 7.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చింతపల్లి, హుకుంపేటలో 7.5, అరకులోయలో 8.4, పెదబయలులో 8.7, ముంచంగిపుట్టులో 9.2, కొయ్యూరు 11.9, గూడెంకొత్తవీధిలో 12.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ అప్పలస్వామి తెలిపారు.

దంతెవాడ వరకే కిరండూల్ రైలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే : కేకే.లైన్‌లో భద్రతపరమైన ఆధునికీకరణ పనులు, ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపడుతున్న నేపథ్యంలో ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 9 వరకు విశాఖ- కిరండూల్(58501) రైలు దంతెవాడ వరకే రాకపోకలు సాగిస్తుందని వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు.

★ ఖుర్దారోడ్ రైల్వే డివిజన్ పరిధిలో మూడు రైళ్ల సమయాల్లో మార్పులు చేసినట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. 18118 గుణుపూర్-రవుర్కెలా, 12253 ఎస్ఎంవీ బెంగళూరు- భాగల్పూర్, 22856 తిరుపతి- సంత్రాగచ్చి రైళ్ల సమయాల్లో మార్పులు జరిగాయని, ప్రయాణికులు గమనించాలని సూచించారు.

బతుకు భారమే.. బిడ్డ బరువై..!

ఆటోలో శిశువును వదిలేసిన తల్లి

విశాఖపట్నం, న్యూస్‌టుడే: భర్తతో మనస్పర్థల కారణంగా ఐదు నెలల బిడ్డను జ్ఞానాపురం రైల్వేస్టేషన్ గేటు సమీపంలోని ఓ ఆటోలో తల్లి వదిలేసిన ఘటన ఇది. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా వేపాడ ప్రాంతానికి చెందిన శ్రావణి (22)కి అర్జున్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. ప్రస్తుతం కొమ్మాదిలో నివాసం ఉంటున్నారు. ఐదు నెలల కింద కుమారుడు జన్మించాడు. కొంతకాలంగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఉపాధి కోసం వారం రోజుల కిందట భార్యాభర్తలు విజయవాడ వెళ్లారు. అక్కడ ఎటువంటి పని దొరక్క పోవడంతో విశాఖ రావడానికి సోమవారం మధ్యాహ్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. రైలు దువ్వాడ స్టేషన్‌లో ఆగిన తర్వాత భార్యకు చెప్పకుండా అర్జున్ వెళ్లిపోయాడు. రైలు విశాఖ స్టేషన్‌కు వచ్చిన తర్వాత శ్రావణి భర్తకోసం వెతకగా కనిపించలేదు. తనను వదిలించుకునేందుకు పారిపోయాడని గ్రహించింది. చేతిలో చిల్లి గవ్వలేకపోవడం, భర్త వదిలేసి వెళ్లిపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన శ్రావణి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. దీంతో జ్ఞానాపురం స్టేషన్ గేటు బయట ఆటోలో బిడ్డను, బ్యాగ్‌ను వదిలేసి వెళ్లిపోయింది. కొంత సమయానికి ఆటోడ్రైవర్ వచ్చి చూడగా బాబు ఉండటంతో అవాక్కయ్యాడు. చుట్టు పక్కల వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. కంచరపాలెం పోలీసులు ఛైల్డ్‌రైట్స్ ప్రతినిధుల సహకారంతో శిశువును చికిత్స నిమిత్తం కేజీహెచ్ తరలించారు.

❖ తల్లిని గుర్తించేందుకు పోలీసులు సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు వెళ్లిన ఆమె అక్కడ కళ్లు తిరిగిపడి పోయింది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఆమెను స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం కేజీహెచ్‌కు తీసుకువెళ్లి బిడ్డను అప్పగించారు.

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - తాడికొండ

బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు జిల్లాలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) NECC
Hospitality Partner: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Man of the Series: HERO
Digital Partner: ఈనాడు.నెట్, ETV BHARAT
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు



విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - 1 జూనియర్స్: మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్సులతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులకు చేసి ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించారు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - 1 జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్సులతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సులతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

గ్రౌండ్-2లో సీనియర్స్: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సులతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

సీనియర్స్ విన్నర్స్ రాయలసీమ రాకర్స్

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ | చరణ్ జిత్ | ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-1 (జూనియర్స్)
మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)
మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

'గాలి'లో దీపంలా ఆరోగ్యం!

★ నగరంలో క్షీణిస్తున్న వాయు నాణ్యత ★ పోర్టు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి

ఈనాడు-విశాఖపట్నం: నగరంలో గాలి నాణ్యత రోజురోజుకీ క్షీణిస్తోంది. పీల్చే గాలి కాలుష్యమై చిన్నారులు, వృద్ధులు శ్వాసకోశ సమస్యలతో అల్లాడుతున్నారు. ఈ సమస్య క్రమంగా పెరుగుతోంది.

> నగరానికి మూడువైపులా కొండలు, ఒకవైపు సముద్రం ఉన్నాయి. గాలిలో వేగం లేక... నగరాన్ని కాలుష్యం కమ్మేస్తోంది. తాజా గణాంకాలు సైతం భయాందోళన కలిగిస్తున్నాయి.

➤ **ఉదయం వాకర్స్‌పై ప్రభావం:** గాలి నాణ్యత (ఏక్యూ) క్షీణించడంతో ఉదయం వాకింగ్, వ్యాయామం చేసేవారిపై ప్రభావం పడుతోంది. పిల్లలు, వృద్ధుల్లో ఆస్తమా, శ్వాస సమస్యలు వస్తాయి. గుండె సమస్యలున్న వారు ఇలాంటి గాలి పీల్చితే ఇబ్బందులు తలెత్తుతాయని నిపుణులు చెబుతున్నారు.

➤ **పోర్టు కాలుష్యమే కారణం:** నగరంలో పోలీస్ బ్యారెక్స్ వద్ద గాలి నాణ్యత బాగా క్షీణించింది. దీనికి కారణం పోర్టు కాలుష్యమని అధికారులు పేర్కొంటున్నారు. నిత్యం బొగ్గు, ఇతర నిల్వలపై, రోడ్లపై నీళ్లు చల్లడం, నిల్వలు కవర్‌షెడ్‌లలో పెట్టడం, రవాణా సమయంలో కవర్‌తో కప్పడం వంటివి పూర్తిగా అమలు కావడం లేదు. వాహనాలు అధిక లోడు (ఓవర్‌లోడు)తో వెళుతూ కాలుష్యానికి కారణమవుతున్నాయి. పలుసార్లు చెప్పినా మార్పు రాని నేపథ్యంలో పోర్టులో కాలుష్య నియంత్రణపై అమరావతి స్థాయిలో సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు.

గాలి నాణ్యత లెక్క.. ప్రభావం ఇలా

★ **0-50 :** మంచి గాలి (ఆరోగ్యానికి సురక్షితం) ★ **51-100:** సంతృప్తికరం (కొద్దిగా ప్రభావం ఉండొచ్చు)
★ **101-200:** మోస్తరు (చిన్నారులు, వృద్ధులకు ఊపిరితిత్తులు, ఆస్తమా సమస్యలు) ★ **201-300:** ప్రభావం చూపే స్థాయి (శ్వాస సమస్యలు)
★ **301-400:** ప్రభావం చాలా ఎక్కువ (తీవ్రమైన సమస్యలు)

➤ **పీఎం10, 2.5 పెరుగుదల:** గాలి నాణ్యతలో మార్పులతోపాటు సూక్ష్మ కాలుష్య కణాల (పీఎం10, పీఎం2.5) స్థాయి సైతం 7 నుంచి 12శాతానికి ఈనెల 25న పెరిగినట్లు గుర్తించారు. సంక్రాంతి సమయంలో నగరం నుంచి పెద్ద సంఖ్యలో జనం ఇతర ప్రాంతాలకు వెళ్లారు. నగరంలో వాహనాల రాకపోకలు తగ్గాయి. అప్పుడు వాస్తవ గాలి నాణ్యతను మధురవాడ, ఆరిలోవ, జీవీఎంసీ, చౌల్ట్రీ పరిధిలో పరిశీలించారు. నివేదికలు త్వరలో విడుదల చేస్తామని పీసీబీ ఈఈ పీవీ ముకుందరావు 'ఈనాడు'తో తెలిపారు.

ఈ నెల 19 నుంచి 25 వరకు వివిధ ప్రదేశాల్లో గాలి నాణ్యత సరాసరి ఇలా

మింధి	115
ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్	125
పోలీస్ బ్యారెక్స్	**237**
ఈఎస్ఐ హాస్పిటల్,మల్కాపురం	105
సీతమ్మధార	120
జ్ఞానాపురం	183
పెదగంట్యాడ	103
ఎంవీపీ రైతు బజార్	120
మాధవధార	94
ఆశీల్‌మెట్ట జీవీఎంసీ ఆఫీస్	197

ట్రాక్టరు ఢీకొని ఒకరి దుర్మరణం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ట్రాక్టరు ఢీకొన్న ప్రమాదంలో మంగళవారం రాత్రి ఒకరు దుర్మరణం చెందారు. రాజుగారిబీడుకు చెందిన కె.సుబ్బారావు (56) ద్విచక్ర వాహనంపై బంధువుల అబ్బాయితో కలిసి ఇంటికి వెళ్తున్నారు. వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ వీరిని ఢీకొంది. సుబ్బారావు సంఘటన స్థలంలోనే మృతిచెందారు. వెనుక కూర్చున్న యువకుడు ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. సుబ్బారావుకు ఇద్దరు పిల్లలున్నారు.

కాలిన గాయాలతో వృద్ధురాలి మృతి

అనకాపల్లి, న్యూస్‌టుడే: అగ్నిప్రమాదంలో తీవ్రగాయాలకు గురైన కాపుశెట్టి వరహాలమ్మ (81) మంగళవారం మృతి చెందారు. కాపుశెట్టివానిపాలేనికి చెందిన ఈమె ఈనెల 23న వంట చేస్తుండగా చీరకు నిప్పుఅంటుకుంది. తీవ్ర గాయాలు కావడంతో కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మరణించారు. ఈ కేసును గ్రామీణ ఎస్ఐ రవికుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

సీలేరులో 35 కేజీల గంజాయి స్వాధీనం

సీలేరు, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం సీలేరు ఇన్‌టేక్ కూడలి వద్ద ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తున్న ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై యాసీన్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఈ వివరాలు వెల్లడించారు. ఇన్‌టేక్ కూడలి వద్ద ఉదయం వాహన తనిఖీలో భాగంగా ఓ ద్విచక్ర వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, ప్యాకింగ్ చేసిన 35 కేజీల గంజాయి పట్టుబడిందన్నారు. దీని విలువ సుమారు రూ. అయిదు లక్షలు ఉంటుందన్నారు. కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం శృంగవరం గ్రామానికి చెందిన బి.శ్రీను ఒడిశాలోని పసుపులంక సమీపాన ఏనుగురాయి వద్ద దీన్ని కొనుగోలు చేసి మైదాన ప్రాంతానికి తరలిస్తుండగా పట్టుబడ్డారని ఎస్సై తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని గంజాయి, ద్విచక్ర వాహనం సీజ్ చేశామని, రూ. 600 నగదు, చరవాణి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వివరాలు సేకరిస్తున్న ఎస్సై యాసీన్

రోజ్‌వుడ్ కలప పట్టివేత

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నర్సీపట్నం అటవీ సిబ్బంది గొలుగొండ మండలం ఏటిగైరంపేట వద్ద సోమవారం కారులో నాలుగు రోజ్‌వుడ్ మంచాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిని తరలిస్తున్న సీలేరుకు చెందిన షేక్ అనిఫా (45)ను అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై మంగళవారం విడుదల చేసినట్లు రేంజ్ అధికారి రాజేశ్వరరావు చెప్పారు. స్వాధీనం చేసుకున్న కలప 0.791 సీఎంటీలుగా లెక్కించామన్నారు. దీని విలువ రూ. 1.11 లక్షలు ఉంటుందన్నారు. కోర్టులో నేరం రుజువైతే నిందితుడికి మూడు నుంచి ఐదేళ్ల జైలు, రూ.3 లక్షల వరకు జరిమానా పడే ఆస్కారముందన్నారు.

కొలతలు వేస్తున్న అటవీ సిబ్బంది

వీడిన ఉత్కంఠ

బంగ్లాదేశ్ నుంచి మత్స్యకారులకు విముక్తి

విశాఖపట్నం, న్యూస్‌టుడే : బంగ్లాదేశ్‌లోని భాగర్‌హాట్ జైల్లో బందీలుగా ఉన్న మత్స్యకారులు మంగళవారం విడుదలయ్యారు. భారత్- బంగ్లాదేశ్‌ల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం జైలు అధికారులు భారత్‌కు చెందిన 23 మంది మత్స్యకారులను విడుదల చేసి ఆ దేశ కోస్టుగార్డుకు అప్పగించారు. వారిలో 9 మంది విశాఖకు చెందిన వారు కాగా, మిగిలిన 14 మంది పశ్చిమబెంగాల్‌కు చెందిన వారు. విశాఖ మత్స్యకారుల బోటు అక్కడి మోంగ్లా పోర్టు వద్ద ఉండిపోవడంతో, వారిని అక్కడకు తీసుకెళ్లారు. బోటు మొత్తం పాడైపోవడంతో, మత్స్యకారులు మరమ్మతులు చేపడుతున్నారు. ఆయా పనులు పూర్తయిన తర్వాత, ఈనెల 29వ తేదీ అర్ధరాత్రి అక్కడ నుంచి భారత్‌కు బయలుదేరనున్నారు. భారత తూర్పుకోస్తా మర పడవల యజమానుల సంఘం అధ్యక్షులు వాసుపల్లి జానకిరామ్ బంగ్లాదేశ్ వెళ్లి, విడుదలైన మత్స్యకారుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచే బాధిత కుటుంబీకులతో ఫోన్లో మాట్లాడించారు.

ఇదీ జరిగింది: విశాఖపట్నం చేపలరేవు సమీప జాలరిపేటలో నివాసం ఉండే సత్యనారాయణకు చెందిన బోటులో (ఏపీ వీ5ఎంఎం 735) విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కొండరాజుపాలెం, తిప్పలవలస, రెల్లివీధి, బర్రిపేట, జాలరిపేటకు చెందిన మత్స్యకారులు.. ఎం.చినఅప్పన్న(డ్రైవర్), సూరాడ అప్పలకొండ, సూరపతి రాము, వాసుపల్లి సీతయ్య, నక్కా రమణ, మరుపల్లి ప్రవీణ్, మరుపల్లి రమేష్, మరుపల్లి చినఅప్పన్న, మైలపల్లి అప్పన్న అక్టోబరు 13న చేపలరేవు నుంచి బయలుదేరి వేటకు వెళ్లారు. సముద్రంలో మూడు వారాల పాటు చేపలవేట సాగించాల్సి ఉండగా, పొరపాటున అక్టోబరు 22న బంగ్లాదేశ్ జలాల్లోకి ప్రవేశించారు. బంగ్లాదేశ్ కోస్టుగార్డు అధికారులు అదే రోజున అరెస్టు చేసి భాగర్‌హాట్ జైలుకు తరలించారు. వీరు 98 రోజుల పాటు జైల్లో ఉన్నారు. భారత్, బంగ్లాదేశ్ మధ్య నెలకొన్న పరిణామాల నేపథ్యంలో వీరి విడుదలపై సందేహాలు ముసురుకున్నాయి. అయితే.. విశాఖపట్నం, విజయనగరం ఎంపీలు ఎం.శ్రీభరత్, అప్పలనాయుడు, విశాఖ దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, విశాఖ దక్షిణం తెదేపా ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ మత్స్యకారుల విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు వివరించారు. వారు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపడంతో మత్స్యకారుల విడుదలకు మార్గం సుగమమైంది.

జైలు నుంచి విడుదలైన మత్స్యకారులతో మోంగ్లా పోర్టు వద్ద తూర్పుకోస్తా మరపడవల యజమానుల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్, తదితరులు

ప్రమాదాల దండయాత్ర.. వైద్య బతికించే మాత్ర!!

రోడ్లపై ఘటనలతో బెంబేలు

అవసరాలకు తగ్గట్టుగా లేని ట్రామాకేర్ సెంటర్లు

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, వన్‌టౌన్: విశాఖ నగర పరిధిలో రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రమాదం జరిగిన తొలి గంట (గోల్డెన్ అవర్)లో సరైన చికిత్స అందక మరణాలు ఏటికేడు ఎక్కువవుతున్నాయి. బాధితులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కేజీహెచ్‌లో మాత్రమే ట్రామా కేర్ సెంటర్ (టీసీసీ) అందుబాటులో ఉంది. లంకెలపాలెం నుంచి ఆనందపురం వరకు 16వ నంబరు జాతీయ రహదారి నగరంలో 73 కి.మీ. మేర విస్తరించి ఉంది. గతేడాది జాతీయ రహదారిపై 420 ప్రమాదాలు జరగగా.. 149 మంది ప్రాణాలు కోల్పోయారు. దీనికి తగ్గట్టుగా అత్యవసర వైద్యమందించేందుకు టీసీసీలు లేవు.



ప్రతిపాదనలకే పరిమితం

విమ్స్‌లో టీసీసీ ఏర్పాటుచేయనున్నట్లు గతంలో ఉన్నతాధికారులు ప్రకటించారు. కానీ ఆ ప్రతిపాదనలు ముందుకు వెళ్లలేదు. జాతీయ రహదారి పక్కనే ఉన్న విమ్స్‌లో టీసీసీ ఏర్పాటుచేస్తే ఎంతో ప్రయోజనకరం.

ఎక్కడ జరిగినా కేజీహెచ్‌కే...

విశాఖ నగరం, శివార్లలో నిత్యం కనీసం ఒకటి లేదా రెండు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎక్కడ ప్రమాదం జరిగినా ఎక్కువ శాతం బాధితులను అంబులెన్సుల్లో కేజీహెచ్‌కే తీసుకొస్తున్నారు. నగరం మధ్యలో ఉన్న కేజీహెచ్‌కు రావాలంటే కనీసం 30 నిమిషాల సమయం పడుతుంది. ప్రమాదాలు జరిగినప్పుడు మొదటి గంటలో వైద్యమందిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని వైద్యులు చెబుతున్నారు. అత్యవసర వైద్యంలో జాప్యం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

● వైద్యుల పోస్టులు ఖాళీ... »

» కేజీహెచ్‌లో 11వ పంచవర్ష ప్రణాళికలో భాగంగా ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుచేశారు. అది పూర్వం ఆర్థోపెడిక్, న్యూరోసర్జరీ విభాగాల ఆధ్వర్యంలో ఉండేది. ప్రస్తుతం అత్యవసర వైద్య విభాగం (ఈఎండీ) ఆధ్వర్యంలో నడుస్తోంది.

» అప్పట్లో కాంట్రాక్టు ప్రాతిపదికన 20 వైద్యుల పోస్టులు మంజూరు చేశారు. అందులో చాలా మందికి మెరుగైన అవకాశాలు రావడంతో అక్కడ మానేసి వెళ్లిపోయారు. ప్రస్తుతం 10కి పైగా వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో అనుబంధ విభాగాల సహకారంతో నిర్వహణ సాగుతోంది.

» ఇక్కడికి వచ్చే కేసుల్లో బాధితులకు ప్రాథమిక చికిత్స తర్వాత, అవసరమైన పరీక్షలు చేసి.. సంబంధిత విభాగానికి పంపిస్తున్నారు. ఆ విభాగం ఆధ్వర్యంలో 20 వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయి. చాలా మంది బాధితులు ముందు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి బిల్లులు చెల్లించలేక చివరి నిమిషంలో కేజీహెచ్‌కు వస్తున్నారు. ఇక్కడ సరిపడా వెంటిలేటర్లు లేక అవస్థలు తప్పడం లేదు.

» ఈ కేంద్రానికి ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాలతోపాటు ఒడిశా నుంచి రోజుకు కనీసం 30 మంది రోగులు వస్తున్నారు. నెలకు 800 నుంచి 900 కేసుల వరకు వస్తున్నాయి. అవసరాలకు తగ్గట్టుగా అత్యాధునిక వైద్య సామగ్రి, మరిన్ని వెంటిలేటర్లు సమకూర్చాల్సి ఉంది.

'ఐదు పని రోజులు' విధానానికి డిమాండ్

విశాఖపట్నం, న్యూస్‌టుడే : ప్రతి వారం ఐదు పని రోజుల విధానాన్ని అమలు చేయాలని కోరుతూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం బ్యాంకు ఉద్యోగులు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. ఆందోళనలో పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు మాట్లాడుతూ... భాజపా అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగుల్ని, కార్మికుల్ని ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్ సంస్థలకు అనుగుణంగా నాలుగు లేబర్‌కోడ్స్ తీసుకురావడం దారుణమన్నారు. బ్యాంకు ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఐక్య పోరాటాలతోనే హక్కులు, డిమాండ్లు సాధ్యమవుతాయన్నారు. డాబాగార్డెన్స్ సమీప ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద నిర్వహించిన ఆందోళనలో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ (యూఎఫ్‌బీయూ) విశాఖపట్నం కన్వీనర్ సుష్మ, ఇతర సంఘాల ప్రతినిధులు రమేష్‌నాయుడు, సతీష్, శ్రీనివాస్ మాట్లాడారు. బ్యాంకింగ్ రంగంలో 5 రోజుల పని విధానానికి రెండేళ్ల కిందట ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఆందోళనలో 9 యూనియన్ల సభ్యులు పాల్గొన్నారు.

అయితంపూడి విద్యార్థినికి ఉత్తమ క్యాడెట్ అవార్డు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: అయితంపూడికి చెందిన కరణం రేవతి విద్యార్థినికి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఎన్‌సీసీ క్యాడెట్ అవార్డు లభించింది. అమరావతిలో జరిగిన గణతంత్ర వేడుకల పరేడ్‌లో పాల్గొని గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా అవార్డు అందుకుంది. రేవతి ప్రస్తుతం నూజివీడు ట్రిపుల్ ఐటీలో బీటెక్ చదువుతోంది. అమరావతిలో ప్రభుత్వం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో గవర్నర్‌కు సీనియర్ అండర్ ఆఫీసర్‌గా సెల్యూట్ చేసే అవకాశం దక్కింది. అవార్డు స్వీకరించడంపై కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గవర్నర్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న రేవతి

బెట్టింగ్ కేసులో మరో నలుగురి అరెస్టు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: క్రికెట్ బెట్టింగ్ కేసులో మరో నలుగురు నిందితులను సైబర్ క్రైం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఇప్పటివరకు ఈ కేసులో ఇద్దరిని అరెస్టు చేయగా తాజాగా ఆ సంఖ్య ఆరుకి చేరింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కమీషన్ కోసం నాని క్రికెట్ ప్రెడిక్షన్, వినయ్ క్రికెట్ కింగ్, మురళీ క్రికెట్, అజయ్ క్రికెట్ సంస్థల ద్వారా బెట్టింగ్ నిర్వాహకులు, ఆడేవారికి ఆన్‌లైన్‌లో మధ్యవర్తులుగా ఉంటూ పలువురు లావాదేవీలు జరుపుతున్నారు. ఈ క్రమంలో బుకీల సమాచారం వెలుగులోకి వచ్చింది. విశాఖల రుషికొండలోని ఓ హోటల్‌లో నిందితులను గుర్తిస్తూ నలుగురిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. చరవాణులు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు.

బోటు దొంగించిన కేసులో..

పాయకరావుపేట: బోటు దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ అప్పన్న తెలిపారు. రాజవరంలో సముద్రపు ఒడ్డున ఉంచిన ముత్తు జగదీష్‌కు చెందిన బోటు.. దానిలో ఉంచిన డీజిల్, వలతో ఈ నెల 21న ఎత్తుకుపోయారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజవరం తీరంలో మంగళవారం ఉదయం అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పట్టుకున్నారు. మధ్యవర్తుల సమక్షంలో విచారించగా కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం మూలపేటకు చెందిన సత్తిబాబుగా గుర్తించారు. అతనే బోటు ఎత్తుకుపోయినట్లు అంగీకరించాడని సీఐ తెలిపారు. మూలపేటలో దాచిన బోటును స్వాధీనం చేసుకుని నిందితుడిని కోర్టుకు హాజరుపర్చినట్లు చెప్పారు.

గిరిజన మ్యూజియం కార్మికుల సమ్మె వాయిదా

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: ఐటీడీఏ నిర్వహణలో అరకులోయ గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్ కార్మికులు సమస్యల పరిష్కారం కోరుతూ తలపెట్టిన సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఐటీడీఏ కార్మిక యూనియన్ గౌరవ అధ్యక్షులు ఉమామహేశ్వరరావు, కార్యదర్శి దాడిరాజు తెలిపారు. సమస్యలు పరిష్కారం కోరుతూ 28 నుంచి సమ్మె చేపట్టనున్నట్లు అధికారులకు నోటీసులు అందించిన నేపథ్యంలో ఐటీడీఏ ఏపీఓ వెంకటేశ్వరరావు మంగళవారం యూనియన్ నాయకులతో చర్చలు జరిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యం, ఈ చర్చల్లో కార్మికుల సమస్యలపై సానుకూలంగా స్పందించడంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లుగా యూనియన్ నాయకులు ప్రకటించారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రధానకార్యదర్శి ఉమామహేశ్వరరావు, మ్యూజియం కార్మికులు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	135	130
లైవ్	162	150
డ్రెస్‌డ్	235	270
స్కిన్‌లెస్	267	280

(c) eenadu

జామిగుడలో ప్రజాదర్బార్

సమస్యలు తెలుసుకుంటున్న జనసేన పార్టీ అరకులోయ ఇన్‌ఛార్జ్ చిరంజీవి

పెదబయలు, న్యూస్‌టుడే: మారుమూల గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు జనసేన పార్టీ అరకులోయ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిరంజీవి చెప్పారు. ఏవోబీ సరిహద్దు సున్న జామిగుడ పంచాయతీలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ పంచాయతీలోని 15 గ్రామాలను సోమ, మంగళవారాల్లో సందర్శించి సమస్యలను గుర్తించినట్లు పేర్కొన్నారు. విద్య, వైద్య, తాగు, సాగునీరు, రవాణా, విద్యుత్తు తదితర సమస్యలపై దృష్టిసారిస్తున్నట్లు చెప్పారు. జామిగుడలో పంచాయతీ భవనం, అంగన్‌వాడీ కేంద్రం, డీఆర్ డిపో భవనం, గుంజివాడ వద్ద వంతెన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. జనసేన, తెదేపా కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లె ఆరోగ్యానికి ఊపిరి

మారుమూల గిరిజనులకు అందుబాటులో వైద్యం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మన్యంలో మారుమూలనున్న గిరిజన గ్రామాల్లో ఆసుపత్రులు, వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు సరైన వైద్యం అందడం లేదు. అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స నోచుకోక వృద్ధులు, మహిళలు, పిల్లలు ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో గిరి గ్రామాలకు ఆరోగ్య సేవల విస్తరణపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. లోతుగెడ్డ, లంబసింగి, తాజంగి, కోరుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది మారుమూలనున్న గ్రామాలకు నెలలో రెండు సార్లు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు రోగుల వివరాలు నమోదు చేసుకుంటున్నారు. వాటిని పరిశీలించిన వైద్యులు అవసరమైన పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు.

ఏయే పరీక్షలు అందుబాటులో ఉన్నాయంటే..: రక్తపోటు, మధుమేహం, ఈసీజీ, టైఫాయిడ్, మలేరియా, డెంగీ, హెచ్ఐవీ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. పరీక్షలకు అయ్యే ఖర్చులు ఆదా అవుతుండటంతో అందరూ సద్వినియోగం చేసుకుంటున్నారు. గ్రామ జనాభా ఆధారంగా వంద నుంచి 200 మందికి పరీక్షలు చేస్తున్నారు.

రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఇంటి వద్దే ప్రథమ చికిత్స

గ్రామీణ ప్రాంతాల వారికి ఏ ఇబ్బంది లేకుండా ముందస్తు సమాచారంతో వైద్యం సేవలు అందజేస్తున్నాం. ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానం తీసుకురావడం వల్ల అందరికీ ఇంటి వద్దే ప్రథమ చికిత్స అందుతోంది. – సౌమ్య, వైద్యురాలు, అరడి నగర్

తాజంగిలో ఆహా! ఆహా!

లంబసింగి సమీపంలోని తాజంగి జలాశయంలో బోటు షికారుకు పర్యాటకుల నుంచి ఆదరణ లభిస్తోంది. సెలవు దినాల్లోనే కాకుండా సాధారణ రోజుల్లోనూ దూర ప్రాంతాల నుంచి ఇక్కడకు వస్తున్న సందర్శకులు పర్యాటక శాఖ, ఐటీడీఏ సంయుక్తంగా ఏర్పాటు చేసిన బోటు షికారును ఆస్వాదిస్తున్నారు. ఇటీవల పర్యాటక వికాస్ సంఘ సభ్యులు ఆరు కొత్త బోట్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అవసరమైన భద్రతా ప్రమాణాలన్నీ పాటిస్తున్నారు. ఇందులో భాగంగా బోటు షికారు చేసే వారికి లైఫ్ జాకెట్లు అందజేస్తున్నారు. – న్యూస్‌టుడే, చింతపల్లి

మేమున్నాం.. మీకు తోడుగా

పాడేరు: 89853 66570 | అరకులోయ: 63034 86346 | చింతపల్లి: 94404 07658

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: పోతంగి పంచాయతీ అమలగుడలో గ్రావిటీ పథకం అడుగంటి పోయింది. గత్యంతరం లేక బావిలోని కలుషిత నీటితో అవసరాలను తీర్చుకుంటున్నాం. – రాందాస్, స్థానికుడు, ✓: అమలగుడలో మోటారు పథకానికి సుమారు రూ.10 లక్షల నిధులు అవసరం. పంచాయతీ నిధులు సరిపోక మంజూరు చేయాలని ఉన్నత అధికారులకు నివేదించాం. – గౌతమి, పంచాయతీ కార్యదర్శి

చింతపల్లి, న్యూస్‌టుడే: లంబసింగి, తాజంగి ప్రాంతాల్లో ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు వస్తున్న పర్యాటకులకు ఇక్కడి పరిస్థితులు ఇబ్బందికరంగా ఉంటున్నాయి. రిసార్టుల పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొంది. పాలిథిన్, ప్లాస్టిక్ వ్యర్థాలు, ఖాళీ మద్యం సీసాలు దర్శనం ఇస్తున్నాయి. – ప్రసాద్, పర్యాటకుడు, ✓: లంబసింగి, తాజంగి ప్రాంతాల్లో రిసార్టుల నిర్వాహకులకు పంచాయతీల తరఫున కార్యదర్శుల ద్వారా ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. రిసార్టుల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించాం. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం. – సీతామహలక్ష్మి, ఎంపీడీవో

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: అంతర్ల గ్రామంలో ఆటస్థలం సమీపంలోని విద్యుత్తు స్తంభం అడుగుభాగంలో బీటలు వారి ప్రమాదకరంగా ఉంది. – శ్రీను, అంతర్ల, ✓: సమస్య మా దృష్టికి వచ్చింది. దాన్ని తొలగించి కొత్త స్తంభం ఏర్పాటు చేస్తాం. – ప్రభాకరరావు, విద్యుత్తు ఏఈ

పెదబయలు, న్యూస్‌టుడే: రూడకోటలో ప్రయాణికుల విశ్రాంతి కోసం నిర్మించిన విశ్రాంతి భవనం కొన్నేళ్లుగా రేకులు పోయి నిరుపయోగంగా ఉంది. వినియోగంలోకి తీసుకురావాలి. – సురేష్, ప్రయాణికుడు, ✓: ఆర్టీసీ, పంచాయతీ అధికారులతో మాట్లాడి సమస్యని పరిష్కరిస్తాం – ఎల్ పూర్ణయ్య, పాలనాధికారి(ఏఓ), పెదబయలు

సంపద కేంద్రాల వినియోగం ఎప్పుడో..!

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో చెత్తను సేకరించి తద్వారా సంపద సృష్టించాలన్న ప్రభుత్వ ఆశయానికి తూట్లు పడుతున్నాయి. మండలంలోని 23 పంచాయతీల్లో సంపద కేంద్రాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. వీటిలో సుమారు తొమ్మిది కేంద్రాల నిర్మాణం పూర్తిచేశారు. మిగిలిన 14 వివిధ దశల్లో ఉన్నాయి. అయితే పూర్తయినవి కూడా నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. సీతగుంట, బొండపల్లి, అరడకోట, గోమంగి, పంచాయతీల్లో వీటి నిర్మాణం వివిధ దశల్లో ఉంది. లక్ష్మీపేట పంచాయతీలో చెత్త సంపద కేంద్రం పూర్తిచేసి ఏళ్లు గడుస్తున్నా వినియోగించడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కేంద్రాల్లో వర్మికంపోస్ట్ తయారీ జరగడంలేదు. సంపద కేంద్రాలు ఉపాధి హామీ పథకంలో పనులు చేయడం జరిగింది, పూర్తి చేసిన వాటిని వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

లక్ష్మీపేట గ్రామంలో నిరుపయోగంగా సంపద కేంద్రం

అనకాపల్లి ఉత్సవాలు విజయవంతం చేయండి

అనకాపల్లి, న్యూస్‌టుడే: ఈనెల 30, 31 తేదీల్లో తొలిసారిగా అనకాపల్లి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఉత్సవాలు నిర్వహించే ఎన్టీఆర్ బెల్లం మార్కెట్, ఎన్టీఆర్ ఆటస్థలం ప్రాంతాలను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కలెక్టర్ విజయకృష్ణన్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావుతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష చేశారు. ఈసందర్భంగా అయ్యన్న మాట్లాడుతూ వాస్తవానికి ఈనెల 29, 30 తేదీల్లో ఉత్సవాలు నిర్వహించాలని భావించామన్నారు. అనివార్య కారణాల వల్ల తేదీలు మార్పు చేశామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లాలోని మూడు ప్రాంతాల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, వీటిలో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మార్కెట్ యార్డులో పుష్పప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. ఎన్టీఆర్ ఆటస్థలంలో 30న సినీ గాయని సునీత, 31న రామ్ మిరియాల సంగీత విభావరి, జాతీయ కళాకారులతోపాటు స్థానిక కళాకారులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. మండుగుంద విన్యాసాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రోజూ సాయంకాలం 7.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి నూకాలమ్మ ఆశీస్సులతో ఇక్కడి నుంచి ప్రదర్శనగా బయలుదేరి ఉత్సవాలను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకురాలు కల్యాణి, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, ఆర్డీఓ ఆయిషా, డీఎస్పీ శ్రావణి, జోనల్ కమిషనర్ చక్రవర్తి పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలిస్తున్న సభాపతి అయ్యన్న, కొణతాల

భక్తిశ్రద్ధలతో అడవిరాజుబాబుల పండగ

సీలేరు, న్యూస్‌టుడే: గూడెంకొత్తవీది మండలంలోని పలు గ్రామాల్లో అడవిరాజుబాబుల పండగ మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాతవీధి, నూతులు, డేరాలు గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు. బంధువులు, చుట్టుపక్కల వారితో భోజనాలు చేశారు.

పీహెచ్‌సీలో అందుబాటులో రక్తపరీక్షలు

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు పీహెచ్‌సీలో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందిస్తున్నట్లు వైద్యాధికారి నారాయణరావు తెలిపారు. అన్ని రకాల రక్తపరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల గిరిజనులు ఏ క్షణంలోనైనా ఆసుపత్రికి రావచ్చని వైద్యాధికారి నారాయణరావు తెలిపారు.

గిరిజన ప్రాంత అభివృద్ధికి విఘాతం

జి.మాడుగుల, న్యూస్‌టుడే: షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం చేయాలని మానవ హక్కుల బోర్డు డైరెక్టర్ కె.గణపతి మంగళవారం డిమాండు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలు గిరిజన ప్రాంత అభివృద్ధికి విఘాతంగా మారుతున్నాయన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన జీవో నంబర్ 3కు ప్రత్యామ్నాయంగా మరో జీవో జారీ చేయాలన్నారు. ప్రత్యేక డీఎస్సీ ప్రకటించి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని కోరారు. గిరిజన ప్రాంత ప్రజల జీవన విధానాలతో ముడిపడి ఉన్న అంశాలపై జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ప్రకటన చేయాల్సిన అవసరముందన్నారు.

హైడ్రో ప్రాజెక్టు రద్దుకు డిమాండు

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో హైడ్రో పవర్ ప్రాజెక్టుకు సంబంధించిన జీవోలను అరకులోయ పర్యటనకు ముందే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రద్దు చేస్తూ ప్రకటన చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా నాయకులు బాలదేవ్ డిమాండ్ చేశారు. అరకులోయ గిరిజన సంఘ కార్యాలయంలో బాలదేవ్ ఇతర సంఘ నాయకులతో, తురాయిగుడలో సురేంద్ర మాట్లాడారు. ఎన్నికల బహిరంగ సభలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, బెర్రీబోరర్‌తో నష్టపోయిన కాఫీ రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. మెగా డీఎస్సీలో ఆదివాసీ ప్రాంతాల్లో గిరిజనులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా స్పష్టమైన ఉత్తర్వులు లేక నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. తురాయిగుడ గ్రామంలో తారురోడ్డు, చెక్‌డ్యాం నిర్మాణాలు చేపట్టాలని కోరారు. సీపీఎం నాయకులు రామారావు, చినలబుడు మాజీ సర్పంచి పీతాంబర్, ముకుందు, బుజ్జిబాబు, దశరథ్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేయండి

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: అరకులో ఈనెల 29న తెదేపా అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని తెదేపా మండల అధ్యక్షుడు ఆనందరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కిడారి భవన్‌లో పార్టీ శ్రేణులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. సుబ్బారావు, స్వామి, గెన్ను, వెంకటరాజు, సింహాద్రి, భీమరాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల రక్తదానం

పాడేరు, న్యూస్‌టుడే: ప్రాణాపాయంలో ఉన్న వారికి రక్తదానంచేసి ప్రాణదాతలు కావాలని ఆర్టీసీ డీఎం శ్రీనివాస్ అన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ సౌజన్యంతో పాడేరులో ఆర్టీసీ డీఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆర్టీసీ డీఎంతోపాటు ఉద్యోగులు రక్తదానం చేసి సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. శిబిరంలో 18 యూనిట్లు రక్తం సేకరించినట్లు రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు గౌరీశంకర్, సూర్యరావు తెలిపారు. ఆర్టీసీ డీఎం మాట్లాడుతూ జిల్లాలో అనేక మంది గర్భిణులు, బాలింతలకు ప్రాణాపాయంలో ఉన్న రోగుల ప్రాణాలు కాపాడేందుకు రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని కోరారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు ప్రసాద్‌నాయుడు, సుబ్రహ్మణ్యం, బొర్రా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో రక్తదానం చేస్తున్న ఆర్టీసీ డీఎం శ్రీనివాస్‌తో ఉద్యోగులు, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు

అనురాగాల వేదిక.. ఆత్మీయ వేడుక

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం చింతపల్లి జడ్పీ పాఠశాలలో మంగళవారం వేడుకగా జరిగింది. విద్యార్థులు సినిమా పాటలకు డ్యాన్స్ చేస్తూ సందడి చేశారు. ప్రధాన వేదికపై గ్రూపు ఫొటోలు దిగారు. పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న వారికి ప్యాడ్లు, పెన్నులు బహుమతిగా అందజేశారు. ఎంఈవో బోడంనాయుడు, హెచ్‌ఎం లక్ష్మణ్‌కుమార్‌రావు, సీనియర్ ఉపాధ్యాయిని వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ప్రజలందరి ఆనందమే ప్రభుత్వ ధ్యేయం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: రోజులు మారిపోయాయి. విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు ఒత్తిడి పెరిగిపోతోందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. ప్రజలందరూ ఆనందంగా, హాయిగా జీవించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉత్సవాలను నిర్వహిస్తోందన్నారు. కుటుంబాలతో అందరూ వచ్చి స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించాలన్నారు. కొండకర్ల ఆవలో అనకాపల్లి ఉత్సవాల కోసం ఏర్పాట్లను మంగళవారం ఆయన కలెక్టర్ విజయకృష్ణన్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈనెల 29న అరకు.. 30, 31 తేదీల్లో అనకాపల్లి జిల్లాలో ఉత్సవాలు అద్భుతంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. వీటిని విజయవంతం చేయడానికి కృషి చేయాలన్నారు. అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునే విధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పండగ వాతావరణం తీసుకొస్తున్నట్లు తెలిపారు. మాడుగుల హల్వా, అరిసెలు, ఏటికొప్పాక బొమ్మలు, అరకు కాఫీ ఇలా స్థానికత ఉట్టిపడేలా ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. 31న అనకాపల్లి గౌరమ్మ పండగ జరుగుతుందన్నారు. నాయకులు దాడి రత్నాకర్, రాజాన సన్యాసినాయుడు, గొంతిన భక్తసాయిరాం, జనప రెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి రాందాసు, డ్రీమ్స్ నాయుడు, కొరుపోలు చిన్నారావు, పిన్నంరాజు వాసు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

కొయ్యూరు, న్యూస్‌టుడే: సైబర్ నేరాల బారిన పడకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ శ్రీనివాసరావు సూచించారు. కొమ్మిక, తుమ్మలబంద గ్రామాల్లో మంగళవారం స్థానికులకు సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు ఓటీపీలు అడిగితే చెప్పవద్దన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మహిళా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. వాహన చోదకులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఎస్సై కిశోర్‌వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

50 శాతం రాయితీపై పశువుల దాణా

కొయ్యూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం 50 శాతం రాయితీపై పశువుల దాణా అందజేస్తోందని పశువైద్యాధికారి రాజేష్‌కుమార్ సూచించారు. కొండగోకిరి పంచాయతీలో మంగళవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. పశువులకు ఈ నెల 31లోగా బీమా చేయించాలన్నారు. ఒకసారి బీమా చేస్తే మూడేళ్లలో ఏ కారణంతో పశువు మరణించినా పరిహారం రైతు ఖాతాకు జమవుతుందన్నారు. పశువు మృతి చెందిన వెంటనే సమీపంలో పశువైద్య కేంద్రంలో సమాచారం అందించాలన్నారు. దాణా కావాల్సిన వారు గ్రామ సచివాలయాల్లో సంప్రదించవచ్చన్నారు. సర్పంచి ముసిలినాయుడు, తెదేపా మహిళా నాయకురాలు రత్నం, పెసా కమిటీ కార్యదర్శి గోపి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అద్దరవీధిలో పశువైద్య శిబిరం

సీలేరు, న్యూస్‌టుడే: గూడెం కొత్తవీది మండలం అద్దరవీధిలో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి లోకుల రమేష్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ శిబిరంలో మొత్తం 493 పశువులకు, కోళ్లకు వివిధ పరీక్షలు చేశారు. పశు వైద్యాధికారి లోకుల రమేష్ మాట్లాడుతూ వంద శాతం రాయితీతో ఉపాధి హామీ పథకం ద్వారా పశు గ్రాసాలను సాగు చేసుకోవచ్చని, ఈ వైద్య శిబిరాలు, బీమా సౌకర్యాన్ని రైతులంతా వినియోగించుకోవాలని కోరారు. ఎంపీటీసీ సభ్యులు రాజేశ్వరి, నాగమణి, పశు వైద్య సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిబిరంలో మాట్లాడుతున్న పశువైద్యాధికారి రమేష్

లక్ష్మీపేట ఘాట్‌లో రహదారి ఛిద్రం

పెదబయలు, న్యూస్‌టుడే: అల్లంపుట్టు లక్ష్మీపేటకు వెళ్లే ప్రధాన రహదారి ఛిద్రంగా మారింది. తారు పూర్తిగా పోయి రాళ్లు తేలుతున్నాయి. ఈ మార్గంలో ప్రయాణించడానికి వాహనదారులు నానా ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

డెంద్రాయిపుట్టుకు రోడ్డు నిర్మాణం

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో గోమంగి పంచాయతీ డెంద్రాయిపుట్టు గ్రామానికి రోడ్డు సదుపాయం సమకూరడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు సదుపాయం కోసం స్థానికుల వినతి మేరకు కలెక్టర్ దినేష్ కుమార్ రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి రూ. 65 లక్షల నిధులు మంజూరు చేశారు. నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి అవ్వడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

పదోన్నతి పొందిన అధికారులకు సన్మానం

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు ఏపీ జెన్‌కో కార్యాలయంలో పదోన్నతి పొందిన ఇంజినీర్లను మంగళవారం సాయంత్రం జెన్‌కో అధికారులు సన్మానించారు. ఏపీ జెన్‌కో ఎస్ఈ కార్యాలయంలో ఏఈఈలుగా పనిచేస్తున్న నాగార్జున, శ్రీనివాసరావులకు ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లుగా పదోన్నతి వచ్చింది. నాగార్జునను సీలేరు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులో, శ్రీనివాసరావును విద్యుత్తు సౌధలో డీఈఈలుగా నియమించారు. ఏపీ జెన్‌కో ఈఈ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎస్ఈ హనుమ ఆధ్వర్యంలో పదోన్నతి పొందిన వీరిని సన్మానించారు. ఇన్‌ఛార్జి ఈఈ జయపాల్, డీఈఈ అప్పలనాయుడు, ఏఈఈలు శ్యామ్యూల్, సురేష్, అనుదీప్, ఏఏవో సత్యనారాయణ, జేఏవోలు సత్తిబాబు, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన అధికారులను సన్మానిస్తున్న జెన్‌కో ఇంజినీర్లు, అధికారులు

ఎంఈవోకు సత్కారం

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రాన్ని అందుకున్న మండల విద్యాశాఖ అధికారి సుందర్‌రావును పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు శాలువా కప్పి సత్కరించారు. జిల్లా కేంద్రం పాడేరులో జరిగిన గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ దినేష్ కుమార్ చేతులమీదుగా ఆయన ఉత్తమ అధికారిగా ప్రశంసా పత్రాన్ని పొందడం అభినందనీయమన్నారు. ఆ సంఘం నాయకులు శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఈదులపుట్టు సమీపంలో రహదారి మలుపు వద్ద మంగళవారం ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొంది. పాడేరు నుంచి 36 మంది ప్రయాణికులతో పెదబయలు వస్తున్న బస్సును ఈదులపుట్టు దాటిన తర్వాత ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో బస్సు ముందు భాగం దెబ్బతింది. బస్సు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రయాణికులు అందరూ సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడ్డారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ చెప్పారు.

లోయలోకి దూసుకెళ్లిన కారు

హుకుంపేట, న్యూస్‌టుడే: మంచు.. అతి వేగం కారణంగా పర్యాటకుల కారు ఒకటి అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. హుకుంపేటలో మంగళవారం చోటుచేసుకున్న ఈ ప్రమాదం వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడలో బీటెక్ చదువుతున్న అయిదుగురు విద్యార్థులు పాడేరు మండలం వంజంగి కొండల్లో మంచు అందాలు చూసి అరకులోయ అందాలు చూసేందుకు కారులో వెళ్తున్నారు. తాడిపుట్టు గ్రామం సమీపంలో హైవేలో కుక్క అడ్డంగా వచ్చింది. దానిని తప్పించే ప్రయత్నంలో కారు రహదారి పక్కనే ఉన్న లోయలోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న రోహిత్, రేవంత్, సంపత్, ముకేశ్ అభిషేక్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. తోటి ప్రయాణికులు వీరిని పాడేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పుణ్యస్నానాలకు పక్కాగా ఏర్పాట్లు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: రేవుపోలవరం తీరంలో ఆదివారం జరిగే మాఘపౌర్ణమి పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు కల్పించాల్సిన ఏర్పాట్లపై మండలస్థాయి అధికారులు మంగళవారం సమీక్షించారు. తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీఓ మీనా కుమారి, ఎస్సై విభీషణరావు, తెదేపా మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, కొరుప్రోలు పీఏసీఎస్ ఛైర్మన్ గుర్రం రామకృష్ణ తీరంలో పర్యటించారు. పడవలు, గజ ఈతగాళ్లు, విద్యుద్దీపాలు, తాగునీరు, బయో మరుగుదొడ్లు, మహిళలు దుస్తులు మార్చుకోవడానికి గదులు, వైద్య శిబిరాలు, పోలీసు కంట్రోల్ రూం ఏర్పాటు, తీరంలో నిషేధిత ప్రాంతం, పారిశుద్ధ్య పనులు, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై చర్చించి, ఆయా శాఖల అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన నిరసన దీక్ష

కొయ్యూరు, న్యూస్‌టుడే: ఎం.మాకవరం గ్రామానికి తారు రోడ్డు నిర్మించాలంటూ నడింపాలెం జాతీయ రహదారి పక్కన సీపీఐ నాయకులు చేపట్టిన నిరసన దీక్ష రెండో రోజూ కొనసాగింది. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.సత్యనారాయణ మాట్లాడుతూ రెండు రోజులుగా దీక్ష చేస్తున్నా పాలకుల్లో చలనం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి నడింపాలెం జాతీయ రహదారి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎం.మాకవరం గ్రామానికి తారు రోడ్డు నిర్మించి చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. సర్పంచి చినతల్లి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దేముడు, మండల కార్యదర్శి సూరిబాబు, చింతలపూడి ఎంపీటీసీ సభ్యురాలు రత్నం, నాయకులు కనకరాజు, రాజు, నాగరాజు, అచ్చిరాజు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.


శిబిరం వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ తదితరుల నినాదాలు

గ్రామస్థాయిలో బలోపేతమే లక్ష్యం

జి.మాడుగుల, న్యూస్‌టుడే: గ్రామ స్థాయిలో వైకాపా బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు నాయకులు, కార్యకర్తలకు సూచించారు. జి.మాడుగులలో మంగళవారం ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. గ్రామ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పాడేరు, అరకులోయ నియోజకవర్గాల పరిశీలకుడు సత్యారావు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ ఎంపీపీ వెంకట గంగరాజు, నాయకులు మత్స్యకొండం నాయుడు, సురేష్‌కుమార్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వైకాపా గ్రామ కమిటీల ఏర్పాటు

అనంతగిరి, న్యూస్‌టుడే: మండలంలో గల గుమ్మకోట, గరుగుబిల్లి పంచాయతీల వైకాపా గ్రామ కమిటీల ఎన్నికను మంగళవారం నిర్వహించినట్లుగా మాజీ ఎంపీపీ నీలవేణి, పార్టీ మండలాధ్యక్షుడు సూర్యనారాయణ తెలిపారు. గుమ్మకోట సర్పంచి అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ ఎన్నికలో గుమ్మకోట, గరుగుబిల్లి గ్రామ కమిటీ అధ్యక్షులుగా పెంటయ్య, త్రిమూర్తులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు తవిటినాయుడు, కృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్సు లేకుంటే వాహనాలు ఇవ్వొద్దు

అనకాపల్లి, న్యూస్‌టుడే: అందరి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కలెక్టర్ విజయ్‌కృష్ణన్ కోరారు. అనకాపల్లిలో మంగళవారం ఆర్టీసీ, రవాణా, పోలీస్ శాఖల సంయుక్త నిర్వహణలో రహదారి భద్రతా వాక్‌థాన్ 2026ను ప్రారంభించి సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబంధనలు పాటించడంతో పాటు వాటిని పర్యవేక్షిస్తున్న వ్యవస్థలకు సహకరించాలని కోరారు. నిబంధనల అమల్లో అధికారులు కఠినంగా ఉండాలన్నారు. 18 ఏళ్లు నిండిన తరవాత డ్రైవింగ్ లైసెన్స్ పొందాలన్నారు. లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులను కోరారు. పిల్లలకు వాహనాలు కొనే సమయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రయాణాలు ప్రమాదాలకు దారితీయకుండా చూసుకోవాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్లు, సీటు బెల్టులను వినియోగించాలన్నారు. డ్రైవింగ్‌లో సెల్‌ఫోన్ వినియోగించొద్దని, మనవల్ల, మన వాహనం వల్ల ఇతరులకు ఎటువంటి హాని, ఇబ్బంది లేకుండా చూసుకోవాలని బాధ్యత అందరిపై ఉందన్నారు.

వయోజనులకు అక్షర జ్ఞానం

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జాతీయ సేవాపథం ఆధ్వర్యంలో దత్తత గ్రామాలు పానిరంగిని, కరసలిగుడలో ప్రత్యేక సేవాశిబిరం నాలుగో రోజు కొనసాగింది. మంగళవారం వయోజనవిద్య, పర్యావరణ సంరక్షణ అంశాలపై ప్రత్యేక కార్యచరణ చేపట్టారు. ఎన్ఎస్ఎస్ పీఓ బాలరాజు ఆధ్వర్యంలో అధ్యాపక సిబ్బంది, విద్యార్థినులు గ్రామంలో నిరక్షరాస్యులైన 15ఏళ్లు పైబడిన వారిని గుర్తించి అక్షరజ్ఞానం కల్పించే ప్రయత్నం చేశారు. గ్రామంలో ప్రధాన రహదారి, శివారు ప్రాంతాల్లో స్వచ్ఛత పనులు చేపట్టారు. డిగ్రీ, మహిళా డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ భరత్‌కుమార్ నాయక్, చలపతిరావు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఇతర అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

అక్షరాలు దిద్దిస్తున్న అధ్యాపక సిబ్బంది, విద్యార్థినులు

(c) eenadu

ఈనాడు
అమరావతి
గుంటూరు
బుధవారం జనవరి 28, 2026
5

సూత్రధారులకు రక్ష.. పాత్రధారులకు శిక్ష
డీసీసీబీని ముంచేసిన మాయగాళ్లపై చర్యలేవీ?

ఈనాడు – అమరావతి

డీసీసీబీని అడ్డంగా దోచేసినవారంతా సురక్షితంగా ఉన్నారు.. వారిపై ఈగ వాలితే ఒట్టు.. వారికి సహకరించిన వారు మాత్రం పోలీసులకు చిక్కి బలైపోయారు.. ఈనాటికీ అసలు దొంగలను గుర్తించలేదు... వారి గురించి ఆరా తీయడం లేదు.

గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో వైకాపా ప్రభుత్వ హయాంలో నకిలీ పట్టాదారు పాసుపుస్తకాలు, బోగస్ ఆధార్‌కార్డులు, తప్పుడు చిరునామాలు సృష్టించి.. రూ.10 కోట్లు కొల్లగొట్టారు. పల్నాడు జిల్లాలోని బెల్లంకొండ, నూజెండ్ల, మాచవరం, బొల్లాపల్లి, ఈపూరు మండలాల్లో భూములున్నట్లు చూపించి.. గుంటూరు సహా చుట్టుపక్కల సహకార బ్యాంకు శాఖల పరిధిలోని సొసైటీల్లో రుణాలు తీసుకున్నారు. ఏదైనా దారిన బకాయిలు చెల్లించకపోవడంతో సొసైటీల సిబ్బంది ఆయా చిరునామాల్లో ఆరా తీయగా.. అవన్నీ నకిలీవని తేలింది. వీటిపై ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. క్లాస్టరింగ్ కూలీలు, రోజువారీ పనులు చేసుకునేవారు, నగర శివారు కాలనీల్లోని మహిళల పేరుతో పట్టాదారుపాసు పుస్తకాలు, ఆధార్ రికార్డులు నకిలీవి సృష్టించి రుణాలు పొందినట్లు దర్యాప్తులో తేలింది. ఒక్కొక్కరికి రూ.5 వేలు ముట్టజెప్పి పంట రుణం మొత్తం కొల్లగొట్టినట్లు బయటపడింది. అసలైన సూత్రధారుల జోలికి ఇంతవరకు వెళ్లలేదు.

వక్ఫ్ ప్రణాళికతో...

వైకాపా ఎమ్మెల్యే మేనల్లుడితోపాటు కొంతమంది నేతలు.. కొందరు రెవెన్యూ అధికారుల సహకారంతో వెబ్‌ల్యాండ్‌లో మిగులు భూమి స్థానంలో రోజువారీ కూలీల పేర్లు నమోదు చేయించారు. ఐదుకుమునుగుంటలో పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధార్ రికార్డులు, చిరునామాలు సృష్టించి.. వెబ్‌ల్యాండ్‌లో ఆ భూవివరాలను ఆధారంగా కూలీలనే రైతులుగా చూపించి.. పంట రుణాలకు దరఖాస్తు చేయించారు. అప్పట్లో సొసైటీ త్రిమెన్ కమిటీగా వైకాపా నేతలు ఉండడంతో వారి సహకారంతో సీఈవోలపై ఒత్తిడి తెచ్చి సభ్యులు కానివారికి కూడా రుణాలు మంజూరు చేయించారు. అనంతరం వెబ్‌ల్యాండ్‌లో ఆయా కూలీల పేరుతో ఉన్న భూవివరాలను తొలగించారు. ఆ సొమ్మును హైదరాబాద్‌తోపాటు గుంటూరు పరిసరాల్లో స్థిరాస్తి వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టారు.

ఇలా చేస్తే..

వెబ్‌ల్యాండ్‌లో కొత్త వ్యక్తుల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వల్ల.. ఏ సమయంలో ఏ సర్వే నంబరుకు కొత్త వ్యక్తుల పేర్లు నమోదు చేశారు? ఎప్పుడు తొలగించారో కూడా సమయం, తేదీ, మార్పు చేసిన వ్యక్తి పేరుతో వివరాలు నిక్షిప్తమై ఉంటాయి. ఈ కోణంలో దర్యాప్తు చేస్తే వివరాలు వెల్లడవుతాయి. సదరు అధికారులపై ఒత్తిడి తెచ్చిందెవరు? దీని వెనుక ఎవరున్నారో స్పష్టమవుతుంది. పంట రుణం మంజూరయ్యాక గుంటూరు నగరంలోని ఒకే వ్యక్తి పది డెబిట్ కార్డుల ద్వారా ఒకే రోజు ఒకే ఏటీఎం నుంచి సొమ్ము డ్రా చేశారు. ఇది సీసీ కెమెరాల ద్వారా గుర్తించిన బ్యాంకు సిబ్బంది పుటేజీని విచారణాధికారులకు అందించారు. వీడియోలో ఉన్న వ్యక్తి ఎవరో గుర్తిస్తే అక్రమాల డొంక కదులుతుంది.

వైభవం.. విజయకీలాద్రి బ్రహ్మోత్సవం

తాడేపల్లి, న్యూస్‌టుడే: సీతానగరం కొండపై విజయకీలాద్రి దివ్యక్షేత్రం తొమ్మిదో వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసుని పల్లకిపై ఊరేగించారు. చినజీయర్‌స్వామి ప్రత్యేక పర్యవేక్షణలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అనుగ్రహ భాషణం చేశారు. హనుమంత వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు.

భక్తులకు తీర్థం అందజేస్తున్న చినజీయర్‌స్వామి

శ్రీనివాసుడికి హనుమంత సేవ

ఆ మలుపులు.... మృత్యు పిలుపులు

మోతడక వద్ద ప్రమాదకర మలుపు

ఈనాడు – అమరావతి

ఏడాదిలో 21 మంది.. గుంటూరు నుంచి తాడికొండ అడ్డరోడ్డు మీదుగా అమరావతికి వెళ్లే రోడ్డుపై ప్రమాదాల్లో చనిపోయినవారి సంఖ్య ఇది. **గతేడాది** 46 ప్రమాదాలు నమోదవగా.. 50 మంది క్షతగాత్రులయ్యారు.

ప్రాణాలు తీస్తున్న ప్రమాదాలకు అడ్డుకట్ట పడడం లేదు. లోపాలను గుర్తించి.. సరిదిద్దే ప్రయత్నం కానరావడం లేదు. ఫలితంగా నవ్యాంధ్ర రాజధాని అమరావతికి వెళ్లే గుంటూరు - తాడికొండ మార్గం అత్యంత ప్రమాదకరంగా మారింది. వాహనాల రద్దీ విపరీతంగా పెరిగినా.. అందుకు తగ్గట్టుగా రహదారిని విస్తరించకపోవడం, మలుపులను సరిచేయకపోవడం, సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, మితిమీరిన వేగం.. ప్రధాన కారణాలు. లాం, కొండవీటివాగు వద్ద చప్టా, తాడికొండ అడ్డరోడ్డు, మోతడక, నిడుముక్కల, నరుకుళ్లపాడు గ్రామాల్లో బ్లాక్ స్పాట్లు ఎక్కువగా ఉన్నాయి. లాం గ్రామంలోకి ప్రవేశించే ప్రాంతం, మునగపాడు వద్ద ఉన్న రెండు మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడం, వేగం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ప్రమాదకరంగా గుంటూరు-తాడికొండ అడ్డరోడ్డు

రక్షణ గోడ లేని లాం చప్టా

ఇరుకు మార్గంలో ఇక్కట్లు.. గుంటూరు నుంచి పల్నాడు జిల్లాకు వెళ్లే వాహనాలు ఈ మార్గంలోనే వెళ్తుంటాయి. రోజుకు ప్యాసింజర్ కార్ యూనిట్లు 20 వేలకుపైగానే తిరుగుతున్నాయి. ☛ దీని వెడల్పు కొన్నిచోట్ల 5.5 మీటర్లు, కొంతదూరం 7, మిగిలినచోట్ల 10 మీటర్లు. ☛ లాం-తాడికొండ అడ్డరోడ్డు మధ్య కొండవీటివాగుపై చప్టా ఉంది. ఇక్కడ వెడల్పు 5.5 మీటర్లే. అంతవరకు పదిమీటర్ల వెడల్పు రోడ్డులో వచ్చిన వాహనాలు ఇరుకు చప్టాపై ప్రమాదాలకు గురవుతున్నాయి. మలుపుల వద్ద వాహనాలు సమీపంలోకొచ్చే వరకు కనిపించడం లేదు. ☛ గుంటూరు-అమరావతి మధ్య 70 టాటామ్యాజిక్ వాహనాలతోపాటు ఆటోలు, కంకర, మట్టి లారీలు తిరుగుతుంటాయి. ☛ నాలుగు వరుసలుగా విస్తరించాలన్న ప్రతిపాదన ఆమోదం పొందలేదని ఆర్అండ్‌బీ ఇంజినీరు ఒకరు తెలిపారు.

నిబంధనలకు నీళ్లు.. టాటామ్యాజిక్ వాహనాల్లో ఆరుగురే ప్రయాణించాలి. కానీ.. పదిమందికిపైగానే ఎక్కుతుంటున్నారు. ఆటోల్లోనూ పరిమితికి మించి ప్రయాణాలు చేస్తున్నారు. టిప్పర్ల వేగానికి అంతు ఉండడం లేదు. ☛ ఆయా గ్రామాల ప్రజలు రోడ్డు దాటేటప్పుడు అప్రమత్తంగా లేకపోవడం, ద్విచక్రవాహనదారులు వేగంగా వెళ్తుండడం ప్రమాదాలకు కారణమవుతోంది. ☛ ఎక్కడికక్కడ సూచిక బోర్డుల్లేవు. ☛ ప్రమాదాలకు కారణాలు విశ్లేషించి. . లోపాలను సరిదిద్దే ప్రయత్నం లేదు. ☛ వేగంగా వెళ్తున్నవారిని నియంత్రించే వ్యవస్థ లేదు.

నా గ్రామం.. నా వారసత్వం
అందుబాటులోకి యాప్

న్యూస్‌టుడే, కొల్లిపర

దేశ సాంస్కృతిక వారసత్వ వెలుగుల్ని నలుదిశలా నింపేందుకు నా గ్రామం.. నా వారసత్వం పేరిట వినూత్న కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గ్రామీణ ప్రాంతాల విశిష్టతను చాటి చెప్పేందుకు, పర్యాటక ప్రాంతాలను చేరువ చేసేందుకు ఇది దోహదం కానుంది. దేశంలోని ప్రతి గ్రామంలో చారిత్రక అంశాలను, చెరగని జ్ఞాపకాలను నమోదు చేసేందుకు ప్రత్యేక యాప్‌ను కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. సిబ్బందికి శిక్షణ తరగతులు ముగియగా మంగళవారం నుంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. లక్షలాది గ్రామాల వారసత్వ విశేషాలను, చారిత్రక అంశాలను ఒకేవేదికపైకి తీసుకొచ్చేందుకు ఈ యాప్ ఉపయుక్తం కానుంది. గ్రామం, స్పష్టమైన, అస్పష్టమైన సాంస్కృతిక ఆచారాలు, ఉత్సవాలు, మేళాలు, కళాకారుల వివరాలు, సాంస్కృతిక, వారసత్వ స్థలం, వస్తువులు, కళాఖండాల వివరాలను, భౌగోళిక ఆకర్షణలు నమోదు చేయనున్నారు. విశిష్టతలను ఐదు అంశాలుగా క్రోడీకరించి నమోదు చేస్తారు. అంశాల మ్యాపింగ్‌తో విశ్లేషణ సులువు కానుంది.

పర్యాటకానికి దోహదం: క్షేత్ర స్థాయిలో సందర్శనీయ ప్రాంతాల నమోదు, విశేషాలతో కూడిన యాప్ వినియోగంలోకి వస్తే, పర్యాటక రంగానికి పరిపూర్ణ రూపును తేనుంది. గ్రామీణ ప్రాంతాల్లోని విశేషాలు, విశిష్టత నమోదుతో భవిష్యత్ తరాలు తమ సంస్కృతి విశేషాలను తెలుసుకునేందుకు ఎంతో ఉపకరిస్తుంది. దేశ ఆర్థిక అభివృద్ధికి, బలోపేతానికి, వాణిజ్య వ్యాపార రంగాల పురోభివృద్ధికి దోహదం కానుంది.

ఎయిమ్స్‌లో జీనోమిక్ సీక్వెన్సింగ్ ప్రయోగశాల
ప్రత్యేక యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ డేటా తయారీపై కసరత్తు

ఈనాడు – అమరావతి

మంగళగిరి ఎయిమ్స్‌లో జీనోమిక్ సీక్వెన్సింగ్ ప్రయోగశాల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ప్రత్యేక యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ డేటా తయారీ దిశగా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. మన్ కీ బాత్‌లో ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఎయిమ్స్ వర్గాలు కసరత్తు మొదలుపెట్టాయి. యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) 21వ శతాబ్దంలో ఎదురవుతున్న అత్యంత తీవ్రమైన ప్రజారోగ్య సవాళ్లలో ఒకటి. కాలక్రమేణా కొన్ని సూక్ష్మజీవులు సహజంగానే మార్పులకు లోనై, వాటిని నశింపజేయడానికి రూపొందించిన మందులకు లొంగకుండా మొండిగా మారతాయి. అప్పుడు మందులు పనిచేయవు. ఈ పరిస్థితి వైద్య సేవలను సంక్లిష్టం చేయడమే కాకుండా.. అత్యంత తీవ్రస్థితిలో ఉన్న రోగుల్లో ప్రతికూల ఫలితాల ప్రమాదాన్ని పెంచుతోంది.

డబ్ల్యూహెచ్‌వో హెచ్చరిక.. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) సైతం ఏఎంఆర్‌ను ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న తొలి పది ప్రజారోగ్య ముప్పుల్లో ఒకటిగా గుర్తించింది. 2021 గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ అధ్యయనం ప్రకారం, బ్యాక్టీరియల్ ఏఎంఆర్ ప్రపంచవ్యాప్తంగా సుమారు 47.1 లక్షల మరణాలకు కారణం కాగా, అందులో 11.4 లక్షల మరణాలు నేరుగా రెసిస్టెంట్ ఇన్ఫెక్షన్ల వల్ల సంభవించాయన్నది సారాంశం.

ప్రధాని పిలుపుతో అడుగులు ... ప్రపంచానికి ఏఎంఆర్ ఎలా ముప్పుగా పరిణమిస్తోందో 'మన్ కీ బాత్'లో ఇటీవల నరేంద్రమోదీ వివరించారు. వైద్య అధ్యయన సంస్థలు ఈ పరిస్థితిలో మార్పు దిశగా తమవంతు కృషి చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ఆ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ జాతీయ కార్యాచరణ ప్రణాళిక ఏఎంఆర్ 2.0లో భాగంగా మంగళగిరి ఎయిమ్స్ వర్గాలు కొన్ని కీలక అడుగులు వేస్తున్నాయి. క్లినికల్ మైక్రోబయాలజీ విభాగం నేతృత్వంలో బలమైన యాంటీమైక్రోబియల్ స్టీవార్డ్‌షిప్ కార్యక్రమాలు, 24×7 ఆధునిక నిర్ధారణ సేవలు, నిరంతర శిక్షణ కార్యక్రమాలు, ఇన్ఫెక్షన్ నియంత్రణ చర్యలు, ప్రిస్క్రిప్షన్ ఆడిట్లు, కచ్చితత్వ ఆధారిత యాంటీబయోటిక్ రిపోర్టింగ్ తదితర అంశాల ద్వారా ఏఎంఆర్‌పై దృష్టి పెట్టారు. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా ఏఎంఆర్ డేటాబేస్‌ను నిర్మించేందుకు జీనోమిక్ సీక్వెన్సింగ్ ప్రయోగశాల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. తద్వారా దేశానికి ఏఎంఆర్ డేటా రూపొందించడానికి మార్గం సుగమం చేయనున్నట్లు చెబుతున్నారు. ఇప్పటివరకు భారతదేశం పాశ్చాత్య దేశాల సమాచారం (ఏఎంఆర్ డేటా) పైనే ఆధారపడి అధ్యయనం చేస్తుండగా.. యాంటీ మైక్రోబియల్స్‌కు సంబంధించిన ఎపిడెమియాలజికల్ కట్ ఆఫ్ విలువలు (ఈసీఓఎఫ్ఎఫ్ఎస్) దేశీయంగా అభివృద్ధి చేయడానికి ఇది దోహదపడనుంది.

స్వయం ఉపాధి కోర్సుల్లో మహిళలకు ఉచిత శిక్షణ

జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణకు జిల్లాలోని నిరుద్యోగ మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా మహిళా ప్రగతి ప్రాంగణం మేనేజర్ బి.రమణశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాబ్రిక్ పెయింటింగ్, చిరుధాన్యాల స్నాక్స్ తయారీ, మార్కెటింగ్ కోర్సుల్లో శిక్షణకు పదో తరగతి విద్యార్హత కలిగిన వారు అర్హులన్నారు. అభ్యర్థినుల వయసు 18 నుంచి 40 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. పూర్తి వివరాలకు గుంటూరులోని జిల్లా పరిషత్తు కార్యాలయం ఎదుట ఉన్న మహిళా ప్రగతి ప్రాంగణంలోగానీ, 83339 21371 నంబరులోగానీ సంప్రదించాలని సూచించారు.

బార్‌లకు దరఖాస్తుల స్వీకరణ నేటి నుంచి

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లాలో 42 బార్‌లకు ఈ నెల 28వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గుంటూరు ఎక్సైజ్‌శాఖ అధికారి ఈఎస్ అరుణకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మిగిలిపోయినవి గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 26, మంగళగిరి, తాడేపల్లిలో 6, తెనాలి మున్సిపాలిటీ పరిధిలో 9, పొన్నూరులో 1 చొప్పున మొత్తం 42 బార్‌లకు ఫిబ్రవరి 4వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఫిబ్రవరి 5వ తేదీ లాటరీ పద్ధతిలో బార్‌ల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు.

WE MANUFACTURE AND SUPPLY APPAREL
FOR BULK ORDER QUANTITES
REGULAR WEAR
- RELIGIOUS WEAR
- TOPS
- BOTTOMS
- UNDERGARMENTS
- NIGHT WEAR

FOR MEN & WOMEN
BOYS & GIRLS
VIJAYAWADA-AP
8977796538

తిక్కన గ్రంథాలయం

మహాకవి తిక్కన తిరిగెనిచ్చట

చరిత్ర పుటల్లో పాతగుంటూరుకు ప్రత్యేక స్థానం ఉంది. 13వ శతాబ్దానికి చెందిన మహాకవి తిక్కన ఈ ప్రాంతంలోనే జన్మించినట్టు ఆధారాలు చెబుతున్నాయి. అప్పట్లో ఇక్కడి ఎర్రచెరువులో స్నానమాచరించి.. సమీపంలో ఉన్న అగస్త్యేశ్వరస్వామికి (పాతగుంటూరులోని శివాలయం) పూజలు చేసేవారు. బొర్రాయి సెంటర్లో, పాతగుంటూరు పోలీస్‌స్టేషన్ ఉన్న స్థలం, పులిపాక హైస్కూల్ ఉన్న స్థలాల్లో ఆయన కుటుంబం నివాసం ఉండేది. యుక్త వయసు వచ్చే వరకు ఇక్కడే ఉన్నట్టు చరిత్ర పుస్తకాల్లో ఉందని పెద్దలు చెబుతున్నారు. అనంతరం నెల్లూరులోని తన మేనమామ ఇంటికి వెళ్లాక అప్పటి రాజు మనుమసిద్ధి ఆశ్రయమిచ్చినట్టు ఆధారాలున్నాయి. ఆయన నడయాడిన నేలగా పేరొందిన బొర్రాయి సెంటర్లోని స్థలంలో 1911లో నాటి పెద్దలు తిక్కన విద్యాలయం స్థాపించారు. ఇక్కడ చిన్నారులు విద్యాభ్యాసం చేసేవారు. ప్రస్తుతం ఈ విద్యాలయాన్ని గ్రంథాలయంగా మార్చారు. తిక్కన జ్ఞాపకార్థం ఏటా త్యాగరాజ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆయన వాడిన వస్తువులను కొన్నాళ్లపాటు భద్రపరిచినా.. కాలక్రమంలో మాయమయ్యాయి. ఆయన జ్ఞాపకార్థం ఎన్టీఆర్ ఐలాండ్ సెంటర్ - బీఆర్ స్టేడియం సెంటర్‌కు వచ్చే రోడ్డుకు మహాకవి తిక్కన మార్గంగా పేరు పెట్టారు.

- న్యూస్‌టుడే, పట్నంబజారు

విజ్ఞానం పంచేలా.. అవగాహన పెంచేలా...

ఈనాడు–అమరావతి

- 30 ఏళ్ల తరవాత మెడికల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నాం
- 'ఈనాడు'తో వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి

వైద్య విజ్ఞానం పంచాలి... ప్రతి ఒక్కరిలోనూ ఆరోగ్యం పట్ల అవగాహన పెంచాలి.. మానవ శరీర నిర్మాణం తీరుతెన్నులు, అవయవాల పనితీరుపై అందరిలోనూ ఆలోచన రేకెత్తించాలన్న లక్ష్యంతో 30 ఏళ్ల తరువాత గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో రాష్ట్రస్థాయి మెడికల్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తున్నామని ప్రిన్సిపల్ **డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి** చెప్పారు. ఫిబ్రవరి 3 నుంచి లాంఛనంగా ప్రారంభంకానున్న ఈ కార్యక్రమ విశేషాలను 'ఈనాడు'కు వివరించారు. ఆయన మాటల్లోనే...

గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో మెడికల్ ఎగ్జిబిషన్ 1982లో, 1996లో నిర్వహించారు. మళ్లీ ఇన్నాళ్లకు అవకాశం వచ్చింది. 35 విభాగాలకు చెందిన 350 వరకు ఎగ్జిబిట్స్ ప్రదర్శించబోతున్నాం. మానవ శరీర నిర్మాణంలో అనుబంధ అవయవాలు, ఇతర నమూనాలు కూడా ఉంటాయి. ఎగ్జిబిట్స్ ఎంపిక, ఏర్పాటు కోసం 12 కమిటీలు వేశాం. ప్రతి కమిటీ తనదైన పాత్ర పోషిస్తోంది. ప్లాస్టిక్ నమూనాలకంటే. . నిజమైన అవయవాలు, శరీర భాగాలు ఎక్కువగా ఉండేలా చూస్తున్నాం. ఎంఆర్ఐ, సీటీస్కాన్ వంటి యంత్రాల పనితీరు వివరిస్తాం. శని, సోమవారాల్లో ట్రయల్ రన్ నిర్వహిస్తాం. 3న వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా ప్రారంభించాలని నిర్ణయించాం. రెండువారాల పాటు నిర్వహించాలనుకున్నా... స్పందన ఉంటే మరో రెండు వారాలు పొడిగిస్తాం.

ప్రాజెక్టు సిద్ధం చేస్తున్న వైద్య విద్యార్థినులు

రూ.2 కోట్ల అంచనా వ్యయం.. ఎగ్జిబిషన్ నిర్వహణకు సుమారు రూ.2 కోట్ల వరకు వ్యయమవుతుందని అంచనా. సీడీఎస్ నుంచి ఖర్చు చేయడానికి ఉన్నతస్థాయి అనుమతులొచ్చాయి. ఉచిత ప్రవేశం కల్పించాలనుకున్నాం. నిధుల పరిస్థితుల దృష్ట్యా ప్రవేశ రుసుం నిర్ణయిస్తాం. ఆన్‌లైన్‌లో చెల్లించేలా ఏర్పాట్లు చేస్తాం.

3 వేల మంది.. 6 గంటలు.. రోజుకు 3 వేలమంది తిలకించేందుకు వస్తారని అంచనా వేస్తున్నాం. ప్రతి ఒక్కరూ ఆరేడుగంటలపాటు వీక్షించేలా ఎగ్జిబిట్స్ ఉంటాయి. శరీర నిర్మాణం, అంతర్గత అవయవాల తీరుతెన్నులను తెలుసుకోవాలన్న తృష్ణ అందరిలోనూ ఉంటుంది. అందుకే ఈ అవకాశం కల్పిస్తున్నాం.

హైటెక్ సిటీ తరహాలో క్వాంటమ్ వ్యాలీ భవనం

రాజధాని గ్రామాలను అభివృద్ధి చేస్తాం: మంత్రి నారాయణ

తుళ్లూరు, న్యూస్‌టుడే: 'ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేస్తున్నాం. ప్రస్తుతం క్వాంటమ్ వ్యాలీకి చెందిన ఒక భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు మరో రెండు భవనాలను నిర్మించనున్నాం. వాటిలో ఒక దాన్ని హైదరాబాద్‌లో హైటెక్ సిటీలా 40 అంతస్తులతో నిర్మిస్తాం' అని పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కల్పనపై మంగళవారం రాజధాని గ్రామాలైన బోరుపాలెం, అబ్బరాజుపాలెం, రాయపూడిలో జరిగిన ప్రత్యేక గ్రామ సభల్లో ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, కమిషనర్ కె. కన్నబాబులతో కలిసి ఆయన పాల్గొన్నారు. రాయపూడిలో మంత్రి మాట్లాడుతూ.. అమరావతి నగరంలో ఎల్‌పీఎస్‌లతో సమానంగా రాజధాని 29 గ్రామాల్లో సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. బోరుపాలెంలో రూ.13.75 కోట్లు, అబ్బరాజుపాలెంలో రూ.7.9 కోట్లు, రాయపూడిలో రూ.22.12 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, తాగునీరు తదితర వసతులు కల్పిస్తామన్నారు. రాయపూడిలో ఈద్గా స్థలాన్ని వారం రోజుల్లో కేటాయిస్తామని, జరీబు, మెట్ట సమస్యలను 45 రోజుల్లో, గ్రామ కంఠాల సమస్యలను 65 రోజుల్లో పరిష్కరించడానికి హైలెవెల్ కమిటీ నియమించామని, ఆ నివేదిక వచ్చిన తర్వాత ఆయా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాజధాని గ్రామాల్లోని లంక భూముల్లో గతంలో ఇచ్చిన ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేస్తున్నామని, కొత్త లంక భూములు పూలింగ్ చేసేందుకు కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, వాటిపై మంత్రి నారాయణ, కలెక్టర్, సీఆర్డీఏ కమిషనర్‌తో చర్చించి పరిష్కరిస్తామన్నారు.

అబ్బరాజుపాలెంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ, పక్కన ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు తదితరులు

గ్రామాల వారీగా తెలిపిన సమస్యలు ఇలా.. బోరుపాలెం: రహదారుల నిర్మాణంలో ఇళ్లు కోల్పోయే వారికి పరిహారం ఇప్పించాలి. **అబ్బరాజుపాలెం:** గతంలో నిలిచిపోయిన వారికి పింఛన్లు ఇవ్వాలి. ☛ ఎన్-14 రోడ్డులో ఇళ్లు కోల్పోతున్న వారికి పరిహారం ఇప్పించాలి. **రాయపూడి:** కల్యాణ మండపం, ముస్లిం సోదరులకు ఈద్గా, ఎస్సీ కాలనీలో సామాజిక భవనం నిర్మించాలి. ☛ బొడ్డురాయి సెంటర్‌లో ఇంటర్‌నెట్ సౌకర్యంతో లైబ్రరీ నిర్మించాలి. ☛ నిమ్మకాయల మార్కెట్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి.

బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా

ఏఎన్‌యూ : ఏఎన్‌యూ పరిధిలోని బీఈడీ కళాశాలలో ఫిబ్రవరి 5 నుంచి జరగాల్సిన మొదటి సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు సీఈ శివప్రసాద్ తెలిపారు. విద్యార్థుల ఆమోద ప్రక్రియ పూర్తి కాకపోవడం, ప్రవేశాలు కొనసాగుతుండటంతో పరీక్షలను వాయిదా వేసినట్లు వెల్లడించారు.

పెద్దకర్మ
(తేది: 29-1-2026)



జననం: 12-06-1938
మరణం: 15-1-2026

కీ॥శే॥ డాక్టర్ కొమ్మినేని లక్ష్మయ్య నాయుడు గారు
(Dr. KL నాయుడు)
HIG, BHEL, R.C.Puram

ప్రముఖ వైద్యులు, సేవాభావానికి మారుపేరైన డాక్టర్ కొమ్మినేని లక్ష్మయ్య నాయుడు గారు తేది: 15-1-2026 నాడు స్వర్గస్తులయ్యారు. వైద్య వృత్తిలో నిష్ఠ, నైతికత, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచి, పేద- ధనిక భేదం లేకుండా అందరికీ సేవలందించిన వారి జీవితం అనేక మందికి ఆదర్శప్రాయం.

వారి వియోగం కుటుంబానికి మాత్రమే కాకుండా, సమాజానికి కూడా తీరని లోటు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా భగవంతుణ్ణి ప్రార్థిస్తూ.. అశ్రునయనాలతో..

భార్య: కొమ్మినేని లక్ష్మీ సుశీల
కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు

కార్యస్థలము: తేది: 29-1-2026 గురువారం, శ్రీ కన్వెన్షన్ సెంటర్, Opp: D Mart, ముంబయి హైవే, రామచంద్రాపురం, BHEL, HYD. ✆ 9848484800

పిల్లలకు ఎలాంటి భోజనం పెడుతున్నారు?

✦ వసతిగృహాల్లోని పరిస్థితిపై సర్వే ✦ అప్రమత్తమైన అధికారులు

న్యూస్‌టుడే – జిల్లా పరిషత్తు

ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు పెడుతున్న ఆహార పదార్థాల నాణ్యతతోపాటు హెచ్‌డబ్ల్యూవోల పనితీరుపై ప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వే చేస్తోంది. గత వారం రోజులుగా విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్ ఫోన్లకు సీఎం పేషీ నుంచి ఫోన్లు చేస్తున్నారు. ప్రధానంగా మెనూ ప్రకారం ఆహారం వడ్డిస్తున్నారా? లేదా? నాణ్యత ఉంటోందా? హెచ్‌డబ్ల్యూవోలు స్థానికంగా అందుబాటులో ఉంటున్నారా? పిల్లలను బాగా చూస్తున్నారా? లేదా? అన్న ప్రశ్నలు అడుగుతున్నారు. సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాలకు సంబంధించి అత్యధికులు అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. బీసీ సంక్షేమశాఖ వసతిగృహాల పనితీరు మొదటి ఐదు స్థానాల్లో ఉండడంతో అక్కడి పరిస్థితి సంతృప్తికరంగానే ఉన్నట్టు భావిస్తున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశం... సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాలపై పూర్తిస్థాయి సంతృప్తి వ్యక్తం కాకపోవడంతో ఉన్నతాధికారులు జిల్లా అధికారుల నుంచి వివరణ తీసుకున్నారు. పరిస్థితిని మెరుగుపరచాలని ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి సత్యనారాయణ, సంచాలకులు మల్లికార్జున జూమ్ మీటింగ్ నిర్వహించి తాగునీటి వసతి, మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ☛ జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకుడు యు.చెన్నయ్య... ఏఎస్‌డబ్ల్యూవోలు, హెచ్‌డబ్ల్యూవోలతో పలుమార్లు మాట్లాడి క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం వడ్డించాలని స్పష్టం చేశారు. ☛ ఐవీఆర్ఎస్ సర్వే ఫలితాలతో వసతిగృహాల అధికారులు, హెచ్‌డబ్ల్యూవోలు కలవరం చెందుతున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారి సమాచారం పైస్థాయికి తెలియడంతో ఎవరిపై వేటు పడుతుందోనన్న ఆందోళనలో ఉన్నారు.

సాంఘిక సంక్షేమ వసతిగృహాలు: 33
బీసీ హాస్టళ్లు: 27 ఎస్టీ హాస్టళ్లు: 4
విద్యార్థులు: సుమారు 4 వేలమంది

SHRIRAM Finance
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
ఆఫీస్ చిరునామా : జోనల్ ఆఫీస్, శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లేన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034.

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (సదరు చట్టం) లోని నిబంధనల క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్,2002 (సదరు చట్టం) యొక్క రూల్ 3తో చదువుకోవలసిన సదరు చట్టంలోని సెక్షన్ 13 (12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్)**, గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్సియుఎఫ్)గా పిలువబడేది. యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు డిమాండ్ నోటీసులో తెలిపిన మొత్తమును తిరిగి చెల్లించవలసిందిగా దిగువ పట్టికలోని వివరాలుగల ఋణగ్రహీతలకు డిమాండ్ నోటీసులను జారీ చేశారు.

ఋణగ్రహీతలు సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించనందున ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుకోవలసిన సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు దిగువ తెలిపిన ఆస్తిని ఈ క్రింది తేదీన స్వాధీన పరచుకున్నారు.

ఋణగ్రహీత పేరు మరియు చిరునామా	డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి	స్వాధీనత తేది
1. ఇల్లా వెంకటేష్, తండ్రి : సత్యనారాయణ, డి.నెం.22-4-17/1, భారత్ పేట, 4వ లైన్, నాయుడుపేట, గుంటూరు – 522002. వేరొక చిరునామా: డోర్ నెం.7-201, పలమూరు, పెనుమంట్ర మండలం, పశ్చిమగోదావరి జిల్లా. **2. చెల్లంగి ఆలేఖ్య,** భర్త : ఇల్లా వెంకటేష్, నివాసం : డోర్ నెం.7-201, పలమూరు, పెనుమంట్ర మండలం, పశ్చిమగోదావరి జిల్లా. **3. ఇల్లా సత్యనారాయణ,** తండ్రి : వెంకన్న, వ్యాపారం, నివాసం : డోర్ నెం.7-201, పలమూరు, పెనుమంట్ర మండలం, పశ్చిమగోదావరి జిల్లా. **4. లక్ష్మీరాజు విజయ హనుమాన్,** తండ్రి : శ్రీనివాసరావు, వ్యాపారం, నివాసం : డోర్ నెం.7-16-1811, రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహం దగ్గర, 8/1 శ్రీనగర్, గుంటూరు సిటీ, గుంటూరు జిల్లా.	ఋణ ఖాతా నెం. GUNBRTF1904300009 యొక్క రిఫరెన్సు క్రింద రూ.46,51,071/- (అక్షరాల నలభై ఆరు లక్షల యాభై ఒక్క వేల డెబ్బై ఒక్క రూపాయలు మాత్రమే) చెల్లించవలసి యున్నది డిమాండ్ నోటీసు తేది : 27-10-2025	24 జనవరి, 2026

ఆస్తి వివరములు : ఇల్లా వెంకటేష్ గారు తనఖా పెట్టిన ఆస్తి : గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్ డిస్ట్రిక్ట్, వెంగలాయపాలెం గ్రామ పంచాయితీ ఏరియా, అంకిరెడ్డిపాలెం హామ్లెట్, అంకిరెడ్డిపాలెం గ్రామం, డి.నెం.968/1 లోని ఎ.0.35 సెంట్లు మొత్తంలో 484 చ॥గ॥లు, దీనిలో 105.77 చ॥గ॥లు (అమ్మబడినది) మినహాయించి మరియు 106.25 చ॥గ॥లు (దారి కొరకు విడిచిపెట్టబడినది), మిగిలిన తూర్పు వైపున విస్తీర్ణం 271.44 చ॥గ॥లు లేదా 226.95 చ॥మీ॥ల ఖాళీ స్థలం సమీప డోర్ నెం.18-162 వద్ద కలదు. **హద్దులు: తూర్పు:** జానపురపు వీరయ్య గారి ఆస్తి - 87.5 అ॥లు, **దక్షిణం:** వేసరాజు ఆది లక్ష్మమ్మ గారి ఆస్తి - 26 అ॥లు, **పడమర :** కొన శ్రీనివాసరావు గారి స్థలం - 87 అ॥లు, **ఉత్తరం :** రోడ్డు - 30 అ॥లు., **పైన తెలిపిన హద్దులలోని విస్తీర్ణం 271.44 చ॥గ॥లు లేదా 226.95 చ॥మీ॥ల విస్తీర్ణం గల ఖాళీ ఇంటి స్థలం మాత్రమే. (ఈ ఆస్తి డాక్యుమెంట్ నెం.7730/2018, నల్లపాడు ఎస్ఆర్ఓ ప్రకారం కలదు)**

సాధారణ ప్రజానీకమంతటికి కూడా ఈ నోటీసు ద్వారా హెచ్చరిక చేయునది ఏమనగా ఇందులో పైన తెలిపిన స్థిరాస్తిపై **ఎస్ఎఫ్ఎల్** యొక్క అధీకృత అధికారి చట్టపరమైన స్వాధీనతను కలిగియున్నారు మరియు ఈ నోటీసు అందిన తర్వాత ఋణగ్రహీతలు లేదా ఎవరేని వ్యక్తి **ఎస్ఎఫ్ఎల్** యొక్క ముందస్తు లిఖితపూర్వక సమ్మతి లేకుండా ఈ నోటీసులో పైన తెలిపిన ఏదేని సెక్యూర్డ్ ఆస్తిని అమ్మకం, లీజు లేదా మరే విధంగా బదిలీ చేయరాదు లావాదేవి జరుపరాదు / అన్యాక్రాంతం చేయరాదు.

ప్రదేశం : గుంటూరు, తేది : 24-01-2026
అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

(c) eenadu

31 నుంచి విజ్ఞాన్ బాల మహోత్సవ్

పొన్నూరు, న్యూస్‌టుడే: విజ్ఞాన్ యూనివర్సిటీలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 వరకు రాష్ట్ర స్థాయి బాల మహోత్సవ్ నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి కేటీ క్రిష్ణ కిశోర్ వెల్లడించారు. మంగళవారం చేబ్రోలు మండల పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో విజ్ఞాన్ బాల మహోత్సవ్-2కె26 గోడ పత్రికను విజ్ఞాన్ విద్యా సంస్థల అధ్యక్షుడు లావు రత్తయ్య ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు యూనివర్సిటీ వేదిక కాబోతుందన్నారు. బాల మహోత్సవ్‌లో 5 నుంచి 7, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 50 పైగా వివిధ రకాల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి సాత్విక్-73822 61632, రోషిత-77998 74416, వాసుదేవ్-95025 16513, ప్రణవ్‌రెడ్డి-73965 96289 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గోడ ప్రతులను ప్రదర్శిస్తున్న లావు రత్తయ్య తదితరులు

ముగిసిన బైబిల్ మిషన్ మహోత్సవాలు
ప్రజలందరూ ఐక్యతతో ముందుకు సాగాలి

పాల్గొన్న విశ్వాసులు

ముగింపు వేడుకల్లో రెవరెండ్లు

పెదకాకాని, న్యూస్‌టుడే: ప్రజలందరూ ఐక్యతతో ముందుకు సాగాలని మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె. శామ్యూల్ కిరణ్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహిస్తున్న 88వ బైబిల్ మిషన్ మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. తొలుత విజయవాడ బైబిల్ మిషన్ సంగీత బృందం ప్రత్యేక భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం ఆయన వాక్యోపదేశం చేస్తూ.. దేవుని కృపతో గృహాల్లో భద్రత, శాంతి కలుగుతుందన్నారు. మహోత్సవాల నిర్వహణకు ఆటంకాలు వచ్చినప్పటికీ దేవుడు మార్గం సరళం చేశారన్నారు. ప్రత్యక్షం, పరోక్షంగా సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 24 నుంచి 26 వరకు బైబిల్ మిషన్ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రెవరెండ్లు ఇమ్మాన్యుయేల్ దేవదాస్, లూథర్‌బాబు, ఆగమనరావు, దైవ సందేశాలు అందించారు. గవర్నింగ్ బాడీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు: బైబిల్ మిషన్ మహోత్సవాల నిర్వహణకు సహకరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, జిల్లా యంత్రాంగం, వివిధ కమిటీ సభ్యులకు రెవరెండ్ జె. శామ్యూల్ కిరణ్ కృతజ్ఞతలు తెలిపారు.

వెలుగులు.. జిలుగులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని సీడ్ యాక్సెస్ రోడ్డులో రాయపూడి నుంచి దొండపాడు శివారు వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. గతేడాది ఈ మార్గంలో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేసినప్పటికీ లైట్లు అమర్చలేదు. రాత్రి వేళ ప్రమాదాలు జరుగుతుండటంతో విద్యుత్ దీపాలు ఉపయోగపడతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీసేందుకే 'ఉద్ఘోష్-2026'

తాడికొండ, న్యూస్‌టుడే: మోతడక వలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో రాష్ట్రస్థాయి ఉద్ఘోష్-2026 కార్యక్రమం వచ్చే నెల 20, 21వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ వై.వి. ఆంజనేయులు మంగళవారం తెలిపారు. ఇందులో సాంస్కృతిక, సాంకేతిక, క్రీడా విభాగాల్లో పోటీలు ఉంటాయని, ఇవి వారిలో ప్రతిభ వెలికితీసేందుకు ఉపయోగపడతాయన్నారు. రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. దీనికి సంబంధించిన కరపత్రాలను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ కె.మధుమూర్తి, కళాశాల ప్రతినిధులు ఆవిష్కరించారు.

గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న మధుమూర్తి, వైవీ ఆంజనేయులు

సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

గుంటూరు నగరం, కలెక్టరేట్, న్యూస్‌టుడే: సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. గుంటూరు శ్యామలానగర్‌లోని సహకార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద మంగళవారం వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జీవో 36 విడదల చేసి ఆరేళ్లవుతున్నా ఇంత వరకు అమలు చేయలేదన్నారు. ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆందోళన బాట పట్టామన్నారు. ఫిబ్రవరి 16వ తేదీలోగా జీవోను అమలు చేయకుంటే నిరవధిక సమ్మె చేయాలని నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణం 12 డిమాండ్లు పరిష్కరించే చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఉద్యోగులకు ప్రతి ఏడేళ్లకు వేతన సవరణ చేయాలన్నారు. ప్రతి ఉద్యోగికి 10 లక్షలు తక్కువ కాకుండా ఆరోగ్య బీమా అమలు చేయాలన్నారు. 2019 తర్వాత చేరిన వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు నారాయణ, రాష్ట్ర కార్యదర్శి దొప్పలపూడి శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుర్రపుశాల శ్రీనివాసరావు, నాయకులు నాగిపోగు ఆరాధ్యుల శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, చిన్నారావు, కిశోర్, నిమ్మగడ్డ శ్రీనివాసరావు, సుజని, హర్షిణి, అరుణ, అలీఖా, తోట వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు. నిరసనకు సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ నాయకులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, రావుల అంజిబాబు, హనుమంతరావు మద్దతు ప్రకటించారు.

వంటావార్పుతో నిరసన తెలుపుతున్న సహకార సంఘాల ఉద్యోగులు

రెవెన్యూ కార్యశాల నేడు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: రెవెన్యూ అంశాలు, సమస్యల పరిష్కారంపై గ్రామ స్థాయిలోని ఉద్యోగుల నుంచి జిల్లా స్థాయిలోని అధికారుల వరకు ప్రత్యేకించి కార్యశాలను నిర్వహించనున్నారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో బుధవారం ఉదయం గుంటూరు, మధ్యాహ్నం తెనాలి డివిజన్‌లోని రెవెన్యూ అధికారులు, ఉద్యోగులకు కార్యశాల జరగనుంది. కలెక్టర్, జేసీలు రెవెన్యూ అంశాలపై దిశానిర్దేశం చేయనున్నారు.

91.9 FM Vijayawada

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
స్వర్ణ నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - ఉ. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297

7న జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లాపరిషత్తు స్థాయీ సంఘ సమావేశాలు ఫిబ్రవరి 7న తేదీ ఉదయం 10.30 గంటలకు గుంటూరులోని జిల్లాపరిషత్తు కార్యాలయంలో జరుగనున్నాయని సీఈవో వి.జ్యోతిబసు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాపరిషత్తు ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తారు. జడ్పీ ఉపాధ్యక్షుడు శొంఠిరెడ్డి నర్సిరెడ్డి అధ్యక్షతన 3వ స్థాయీ సంఘం, తెనాలి జడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమా ప్రణతి, జడ్పీ ఉపాధ్యక్షురాలు బత్తుల అనురాధల అధ్యక్షతన 5, 6 స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని వివరించారు.

ఆలయంలో మాంసాహారం తిన్నారని వదంతులు

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో కొందరు భక్తులు మాంసాహారం తిన్నారంటూ వదంతులు వ్యాపించాయి. దీనిపై ఈవో గోగినేని లీలాకుమార్ పెదకాకాని పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. ప్రకాశం జిల్లాకు చెందిన కొందరు భక్తులు ఆదివారం పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారి ఆలయానికి వెళ్లి అక్కడ మొక్కు తీర్చుకున్నారు. తిరుగు ప్రయాణంలో పెదకాకాని మల్లేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ వారు భోజనం చేశారు. ఆ సమయంలో అక్కడ భక్తులు తిన్న మాంసాహారం గిన్నె ఉందని కొందరు వదంతులు పుట్టించారు. దీంతో ఆలయ అధికారులు భక్తులు వచ్చిన బస్సు నంబరుతో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై మిరాజ్ చేపట్టిన ప్రాథమిక దర్యాప్తులో సాంబారుతో భోజనం చేశామని, బస్సులు బయలుదేరి వెళ్తుండగా మిగిలిపోయిన మాంసాహారాన్ని ఓ వ్యక్తికి ఇవ్వగా.. వీడియో తీశారని భక్తులు చెప్పారు. లోతైన దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. కాగా ఆలయానికి వచ్చిన భక్తులతో కలిసి వాచ్‌మెన్ సైతం మాంసాహారం తిన్నారని, లోతైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వైకాపా నేతలు ఈవోకి ఫిర్యాదు చేశారు.

సమష్టి కృషితో విజయం సుసాధ్యం

పెదనందిపాడు, న్యూస్‌టుడే: సమష్టి కృషి చేస్తే సాధించలేనిది ఏమీ లేదని ఎన్‌ఆర్‌ఐ కరణం రాజా అన్నారు. పెదనందిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం 1984 బ్యాచ్ పూర్వ విద్యార్థులు, అప్పి జెడ్‌హెచ్‌ఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాఠశాల పూర్వవిద్యార్థి, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఎస్పీ గుమ్మడి నాగబాబును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. పెదనందిపాడు జడ్పీ పాఠశాల అభివృద్ధికి అందరు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఈ పాఠశాల ఏర్పాటుకు తన తాత చిన్నయ్య ఎకరం భూమి దానం ఇవ్వడంతో ఎందరో ఉన్నతికి ఎదిగారన్నారు. పాఠశాల అభివృద్ధికి రూ. లక్ష విరాళం ప్రకటించారు. చదువుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎన్ఆర్ఐ కరణం రాజా బృందం రూ.10 వేలు నగదు బహుమతులను అందజేశారు. వెలగా నాగార్జున పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలు ఇచ్చారు. దాతలు ఇదుపులపాటి చంద్రయ్య, కె.శ్రీధరలను సన్మానించారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి పి.అంకమ్మ చౌదరి, ఎంఈవో సెల్వ్, వ్యాపారవేత్త నూతి నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, అప్పి జెడ్‌హెచ్‌ఎస్ సంక్షేమ సంఘ అధ్యక్షుడు సీకే రామయ్య, ఎన్‌ఆర్ఐ విభాగ అధ్యక్షుడు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నాగబాబును సన్మానిస్తున్న కార్యవర్గ సభ్యులు, పూర్వ విద్యార్థులు

GOVERNMENT OF ANDHRA PRADESH
A.P. Greening and Beautification Corporation Municipal Administration & Urban Development Department.

Andhra Pradesh Greening & Beautification corporation invites for the 2 works through E- Procurement platform costing form 21 Lakhs to 38.75 Lakhs for further details please see E-Procurement web site

Managing Director
APG&BC

శ్రీ సత్తెమ్మతల్లి దేవస్థానము
మాదిపాడు (గ్రా), అచ్చంపేట (మం), పల్నాడు జిల్లా

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

మాదిపాడు (గ్రా), అచ్చంపేట (మం), పల్నాడు జిల్లా శ్రీ సత్తెమ్మతల్లి దేవస్థానము పునరుద్ధరణము కొరకు టెండర్లు ప్రకటన చేయడమైనది. మిగిలిన వివరములు కొరకు https://tender.apeprocurement.gov.in లో చూడవచ్చు.

సం/- కార్యనిర్వహణాధికారి
శ్రీ సత్తెమ్మతల్లి దేవస్థానము
మాదిపాడు (గ్రా), అచ్చంపేట (మం), పల్నాడు జిల్లా

భార్యను హత్య చేసిన భర్త

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: అనుమానం పెను భూతమై భార్యను హత్య చేసిన దారుణ ఘటన మంగళవారం తెనాలి పట్టణ రామలింగేశ్వరపేటలో చోటుచేసుకుంది. తెనాలి వన్‌టౌన్ పోలీసులు తెలిపిన సమాచారం మేరకు తెనాలికి చెందిన సాయిబాబుకు నల్లగొండకు చెందిన శిరీష(26)కు 2015లో వివాహమైంది. దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. గతంలో హైదరాబాద్‌లో ఉన్న దంపతులు ఇటీవల ఆరు నెలల క్రితం తెనాలి వచ్చి రామలింగేశ్వరపేటలో ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. సాయిబాబు ప్యాకింగ్ పనులకు వెళుతూ ఉంటాడు. శిరీష పని ఉన్నప్పుడు బ్యూటీ పార్లర్‌కు వెళుతూ ఉంటారు. భార్యపై అనుమానంతో తరచూ ఆమెతో గొడవ పడుతూ ఉండేవాడు. సోమవారం మంగళవారం కూడా అదే రీతిలో వ్యవహరించి శిరీషను కొట్టాడు. మంచంపై పడిన ఆమెను గొంతు నులిమి చంపేశాడు. అనంతరం ఇంటి నుంచి బయటకు వచ్చి రోడ్డుపై ఉన్న యువకుడి వద్ద మాట్లాడి ఇస్త్రానా ఫోన్ తీసుకుని దానితో సహా పరారయ్యాడు. కొంత సమయం తర్వాత హైదరాబాద్‌లో ఉన్న తన బావమరిదికి, తెనాలిలో ఉన్న మేనల్లుడికి ఫోన్లు చేసి తాను భార్యను చంపేశానని, శిరీష పడి ఉంది వెళ్లి చూడండి అని చెప్పాడు. సాయిబాబు బావమరిది స్నేహితులు ఇంటికి వెళ్లి పరిశీలించగా శిరీష చలనం లేకుండా పడి ఉంది. ఆమెను ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందిందని తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించారు, సాక్షులను విచారించారు, క్లూస్ బృందం ఆధారాలను సేకరించింది. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. తల్లి చనిపోవడం, తండ్రే హంతకుడు కావడంతో ఇద్దరు పిల్లల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం వారు తెనాలిలోనే ఉన్న బంధువుల సంరక్షణలో ఉన్నారు.

భర్త బిడ్డలతో శిరీష (పాతచిత్రం)

29న రాజధాని రైతులకు మలి విడత ప్లాట్ల కేటాయింపు

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని సీడ్ యాక్సెస్ రహదారి నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులకు ఈ నెల 29న ఈ లాటరీ ద్వారా మలి విడత ప్లాట్ల కేటాయింపు నిర్వహించనున్నట్లు మంగళవారం రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. నిబంధనల ప్రకారం ప్లాట్ల కేటాయింపులు ఉంటాయని సంబంధిత రైతులు హాజరుకావాలన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 143, రిటైల్ ధర - 170, చికెన్ విత్‌స్కిన్ - 247, చికెన్ స్కిన్‌లెస్ - 281.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -143 రిటైల్ ధర 170 చికెన్ విత్ స్కిన్ - 247 చికెన్ స్కిన్‌లెస్ - 281.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 155, 164, 175 చికెన్ విత్ స్కిన్ - 300 చికెన్ స్కిన్‌లెస్ - 310.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఆఫీస్ చిరునామా : జోనల్ ఆఫీస్, శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లేన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034.

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (సదరు చట్టం) లోని నిబంధనల క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్,2002 (సదరు చట్టం) యొక్క రూల్ 3తో చదువుకోవలసిన సదరు చట్టంలోని సెక్షన్ 13 (12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్), గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్‌సియుఎఫ్)గా పిలువబడేది. యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు డిమాండ్ నోటీసులో తెలిపిన మొత్తమును తిరిగి చెల్లించవలసిందిగా దిగువ పట్టికలోని వివరాలుగల ఋణగ్రహీతలకు డిమాండ్ నోటీసులను జారీ చేశారు.

ఋణగ్రహీతలు సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించనందున ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుకోవలసిన సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు దిగువ తెలిపిన ఆస్తిని ఈ క్రింది తేదీన స్వాధీన పరచుకున్నారు.

ఋణగ్రహీత పేరు మరియు చిరునామా	డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి	స్వాధీనత తేది
1. పసుపులేటి శ్రీనివాసరావు, తండ్రి : వెంకటేశ్వర్లు, డి.నెం. 22-4-25, విపిఆర్ కాంప్లెక్స్, పాత గుంటూరు, లాలాపేట, గుంటూరు - 522003. వేరొక చిరునామా: వ్యాపారం, నివాసం : డోర్ నెం.ఇఎస్ఆర్ ఎన్‌క్లేవ్, సంక్రాంతి బ్లాక్, బాలాజీ నగర్, 4వ లైన్, విజయ్ డిజిటల్స్ ఎదురుగా, ఇన్నర్ రింగ్ రోడ్డు, గుంటూరు సిటీ, గుంటూరు జిల్లా. 2. పసుపులేటి మహాలక్ష్మి, భర్త : శ్రీనివాసరావు, నివాసం : డోర్ నెం.ఇఎస్ఆర్ ఎన్‌క్లేవ్, సంక్రాంతి బ్లాక్, బాలాజీ నగర్, 4వ లైన్, విజయ్ డిజిటల్స్ ఎదురుగా, ఇన్నర్ రింగ్ రోడ్డు, గుంటూరు సిటీ, గుంటూరు జిల్లా. 3. సుద్దపల్లి సుబ్రహ్మణ్యం, తండ్రి : వెంకటాయ్యపయ్య, ఎంప్లాయి, డోర్ నెం.3-490/1, ఉండవల్లి సెంటర్, తాడేపల్లి పోస్ట్, గుంటూరు జిల్లా - 522501.	ఋణ ఖాతా నెం. GNTR4TF1903270020 యొక్క రిఫరెన్సు క్రింద రూ. 46,81,208/- (అక్షరాల నలభై ఆరు లక్షల ఎనభై ఒక్క వేల రెండు వందల ఎనిమిది రూపాయలు మాత్రమే) చెల్లించవలసి యున్నది. డిమాండ్ నోటీసు తేది : 27-10-2025	24 జనవరి, 2026

ఆస్తి వివరములు : పసుపులేటి శ్రీనివాసరావు మరియు పసుపులేటి మహాలక్ష్మి గార్లు తనఖా పెట్టిన ఆస్తి : **ఐటమ్ నెం.1:** గుంటూరు జిల్లా, పెదకాకాని సబ్ డిస్ట్రిక్ట్, కొప్పురావూరు గ్రామ పంచాయితీ ఏరియా, కొప్పురావూరు గ్రామం, డి.నెం.22/సి లోని 220 చ॥గ॥లు లేదా 183.95 చ॥మీ॥ల విస్తీర్ణంలో ప్లాట్ నెం.33తో గల ఖాళీ ఇంటి స్థలం యావత్తు ఆస్తి. **హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం.16 లోని స్థలం - 36 అ॥లు, **దక్షిణం:** ప్లాట్ నెం.34 లోని స్థలం - 55 అ॥లు, **పడమర :** 25 అ॥ల వెడల్పు రోడ్డు - 36 అ॥లు, **ఉత్తరం :** ప్లాట్ నెం.32 లోని స్థలం - 55 అ॥లు., పైన తెలిపిన హద్దులలోని విస్తీర్ణం 220 చ॥గ॥లు లేదా 183.95 చ॥మీ॥ల విస్తీర్ణంలో ప్లాట్ నెం.33తో గల ఖాళీ ఇంటి స్థలం మాత్రమే. (ఈ ఆస్తి డాక్యుమెంట్ నెం.7561/2006, పెదకాకాని ఎస్ఆర్ఓ ప్రకారం శ్రీ పసుపులేటి శ్రీనివాసరావు గారికి చెందినది)

ఐటమ్ నెం.2: గుంటూరు జిల్లా, పెదకాకాని సబ్ డిస్ట్రిక్ట్, కొప్పురావూరు గ్రామ పంచాయితీ ఏరియా, కొప్పురావూరు గ్రామం, డి.నెం.22/సి లోని 220 చ॥గ॥లు లేదా 167.22 చ॥మీ॥ల విస్తీర్ణంలో ప్లాట్ నెం.17తో గల ఖాళీ ఇంటి స్థలం యావత్తు ఆస్తి. **హద్దులు: తూర్పు:** 25 అ॥ల వెడల్పు రోడ్డు - 36 అ॥లు, **దక్షిణం:** ప్లాట్ నెం.16 లోని స్థలం - 50 అ॥లు, **పడమర :** ప్లాట్ నెం.32 లోని స్థలం - 36 అ॥లు, **ఉత్తరం :** ప్లాట్ నెం.18 లోని స్థలం - 50 అ॥లు., పైన తెలిపిన హద్దులలోని విస్తీర్ణం 220 చ॥గ॥లు లేదా 167.22 చ॥మీ॥ల విస్తీర్ణంలో ప్లాట్ నెం.17తో గల ఖాళీ ఇంటి స్థలం మాత్రమే. (ఈ ఆస్తి డాక్యుమెంట్ నెం.3994/2004, పెదకాకాని ఎస్ఆర్ఓ ప్రకారం శ్రీ పసుపులేటి మహాలక్ష్మి గారికి చెందినది)

సాధారణ ప్రజానీకమంతటికి కూడా ఈ నోటీసు ద్వారా హెచ్చరిక చేయునది ఏమనగా ఇందులో పైన తెలిపిన స్థిరాస్తిపై ఎస్ఎఫ్ఎల్ యొక్క అధీకృత అధికారి చట్టపరమైన స్వాధీనతను కలిగియున్నారు మరియు ఈ నోటీసు అందిన తర్వాత ఋణగ్రహీతలు లేదా ఎవరేని వ్యక్తి ఎస్ఎఫ్ఎల్ యొక్క ముందస్తు లిఖితపూర్వక సమ్మతి లేకుండా ఈ నోటీసులో పైన తెలిపిన ఏదేని సెక్యూర్డ్ ఆస్తిని అమ్మకం, లీజు లేదా మరే విధంగా బదిలీ చేయరాదు లావాదేవి జరుపరాదు / అన్యాక్రాంతం చేయరాదు.

ప్రదేశం : గుంటూరు, తేది : 24-01-2026 — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

ఆఫీస్ చిరునామా : జోనల్ ఆఫీస్, శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లేన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034.

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (సదరు చట్టం) లోని నిబంధనల క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్,2002 (సదరు చట్టం) యొక్క రూల్ 3తో చదువుకోవలసిన సదరు చట్టంలోని సెక్షన్ 13 (12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్), గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్‌సియుఎఫ్)గా పిలువబడేది. యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు డిమాండ్ నోటీసులో తెలిపిన మొత్తమును తిరిగి చెల్లించవలసిందిగా దిగువ పట్టికలోని వివరాలుగల ఋణగ్రహీతలకు డిమాండ్ నోటీసులను జారీ చేశారు.

ఋణగ్రహీతలు సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించనందున ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుకోవలసిన సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు దిగువ తెలిపిన ఆస్తిని ఈ క్రింది తేదీన స్వాధీన పరచుకున్నారు.

ఋణగ్రహీత పేరు మరియు చిరునామా	డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి	స్వాధీనత తేది
1) చుండ్రు ఆది నారాయణ, తండ్రి: రామాంజనేయులు, డి.నెం.4-5-26/50/ఇ, 1/2 నవభారత్ నగర్, పట్టాభిపురం, రింగు రోడ్డు, గుంటూరు సిటీ, గుంటూరు జిల్లా. 2.శ్రీమతి చుండ్రు లక్ష్మి సునీత, భర్త: చుండ్రు ఆదినారాయణ, డి.నెం.4-5-26/50/ఇ, 1/2 నవభారత్ నగర్, పట్టాభిపురం, రింగు రోడ్డు, గుంటూరు సిటీ, గుంటూరు జిల్లా. 3.మద్దు నరసింహారావు, తండ్రి: సత్యనారాయణ, డి.నెం.12-8-66, కొత్తపేట, మంగళబాలి వీధి. గుంటూరు సిటీ, గుంటూరు జిల్లా.	ఋణ ఖాతా నెం. GUNBRTF1410290004 యొక్క రిఫరెన్సు క్రింద రూ.48,76,384/- (అక్షరాల నలభై ఎనిమిది లక్షల డెబ్బై ఆరు వేల మూడు వందల ఎనభై నాలుగు రూపాయలు మాత్రమే) చెల్లించవలసి యున్నది. డిమాండ్ నోటీసు తేది : 22-10-2025	24 జనవరి, 2026

ఆస్తి వివరములు : చుండూరు ఆదినారాయణ మరియు చుండూరు లక్ష్మీ సునీత గార్లు తనఖా పెట్టిన ఆస్తి : షెడ్యూలు-ఎ: గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ డిస్ట్రిక్ట్, ప్రస్తుతం కొరిటెపాడు సబ్ డిస్ట్రిక్ట్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, గుంటూరు సిటీ, నవభారత్ నగర్, 1వ లైన్, 2వ క్రాస్, కొరిటెపాడు గ్రామం, డి.నెం.12/బి లోని ఎ.4.04 సెంట్లు మొత్తంలో "స్వర్ణ సౌధ" అను పేరుతో నిర్మించిన ఒక అంతస్తుతో కూడిన నివాస కాంప్లెక్స్ (డోర్ నెం.4-5-26/50తో గల ఇంటికి ఎదురుగా) యావత్తు ఆస్తి. **హద్దులు: తూర్పు** : నాయుడు పున్నయ్య గారు అమ్మిన ఇతరులకు చెందిన ఆస్తి, **పడమర** : డా॥ జి. జె. నరసింహారావు గారి ఆస్తి, **ఉత్తరం** : కె. బాలకోటి రెడ్డి గారి ప్రహరీ గోడ, **దక్షిణం** : మున్సిపల్ రోడ్డు.

పైన తెలిపిన హద్దులలోని "స్వర్ణ సౌధ" అనే పేరుతో ఒక అంతస్తు నివాస సముదాయం 420 చ॥గ॥ల స్థలంలో నిర్మించబడినది. ఈ స్థలంలో నుంచి, విక్రేత ఇక్కడ 135 చ॥గ॥ల అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు స్థలాన్ని, ఆ సముదాయంలో భాగంగా, తూర్పు వైపున ఉన్న కారు పార్కింగ్ స్థలంపై ప్రత్యేక హక్కుతో పాటు, ఉత్తరం వైపున ఉన్న భవనం యొక్క మొత్తం మొదటి అంతస్తు (డ్యూప్లెక్స్ విధానం) భవనాన్ని, టెర్రాస్ హక్కులతో సహా, కానీ క్రింది అంతస్తును మినహాయించి, కొనుగోలుదారునికి విక్రయిస్తున్నాడు. ఈ వివరాలు దిగువ ఇచ్చిన షెడ్యూలు - బిలో పేర్కొనబడ్డాయి.

షెడ్యూలు-బి: గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ డిస్ట్రిక్ట్, ప్రస్తుతం కొరిటెపాడు సబ్ డిస్ట్రిక్ట్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, గుంటూరు సిటీ, నవభారత్ నగర్, 1వ లైన్, 2వ క్రాస్, కొరిటెపాడు గ్రామం, డి.నెం.12/బి లోని ఎ.4.04 సెంట్లు మొత్తంలో "స్వర్ణ సౌధ" అను పేరుతో నిర్మించిన ఒక అంతస్తుతో కూడిన నివాస కాంప్లెక్స్ ఉత్తరం వైపున ఒక అంతస్తు భవనం ఉన్నది, ఆ భవనంలో ఉన్న మొత్తం మొదటి అంతస్తు భవనం, కొనుగోలుదారునికి సంపూర్ణ హక్కుతో కలదు. **హద్దులు: తూర్పు** : ఈ భవనం వరండా, నాయుడు పున్నయ్య విక్రయించిన ఇతరుల ఆస్తి, **పడమర** : ఈ భవనం గోడ, డా॥ జి. టి. నరసింహారావు గారి ఆస్తి, **ఉత్తరం** : ఈ ఆస్తి గోడ, కె. బాలకోటి రెడ్డి గారి ప్రహరీ గోడ, **దక్షిణం** : మెట్లు, ఈ భవనం గోడ, వై. స్వర్ణలత ఆస్తి మధ్య ఉన్న ఉమ్మడి మార్గం.

ఈ హద్దులలో సుమారు 1600 చ॥అ॥ల ప్లింత్ ఏరియా కలిగిన డ్యూప్లెక్స్ విధానంలో ఉన్న భవనం యొక్క మొత్తం మొదటి అంతస్తు, అన్ని తలుపులు, తలుపులు ఫ్రేమ్‌లు, కిటికీలు, ఆల్మారాలు, శానిటరీ సామాగ్రి, ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్, మెట్లతో సహా, టెర్రాస్‌పై సంపూర్ణ హక్కుతో పాటు, మార్గాలు, డ్రైనేజీ, నీటి సదుపాయం, సామూహిక లైటింగ్ మొదలైన సాధారణ సదుపాయాలలో సంయుక్త హక్కుతో కలిపి ఉంటుంది. **(అసెస్మెంట్ నెం.35723, డోర్ నెం.4-5-26/50/ఇ, నవభారత్ నగర్, గుంటూరు లో ఉన్న ఈ ఆస్తి, ఎస్.ఆర్.ఓ గుంటూరు లోని డాక్యుమెంట్ నెం.8482/1999కు అనుసంధానమైనది)**

సాధారణ ప్రజానీకమంతటికి కూడా ఈ నోటీసు ద్వారా హెచ్చరిక చేయునది ఏమనగా ఇందులో పైన తెలిపిన స్థిరాస్తిపై ఎస్ఎఫ్ఎల్ యొక్క అధీకృత అధికారి చట్టపరమైన స్వాధీనతను కలిగియున్నారు మరియు ఈ నోటీసు అందిన తర్వాత ఋణగ్రహీతలు లేదా ఎవరేని వ్యక్తి ఎస్ఎఫ్ఎల్ యొక్క ముందస్తు లిఖితపూర్వక సమ్మతి లేకుండా ఈ నోటీసులో పైన తెలిపిన ఏదేని సెక్యూర్డ్ ఆస్తిని అమ్మకం, లీజు లేదా మరే విధంగా బదిలీ చేయరాదు లావాదేవి జరుపరాదు / అన్యాక్రాంతం చేయరాదు.

ప్రదేశం : గుంటూరు, తేది : 24-01-2026 — అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

M/s. ఎత్నిక్ టొబాకో (ఇండియా) లిమిటెడ్ (లిక్విడేషన్‌లోనిది) విషయమై 10 జనవరి, 2026న జారీ చేసిన ఇ-వేలం అమ్మకపు నోటీసుకు సవరణ

అన్ని మూడు లాట్‌ల కొరకు వేలం సమయమును సవరించిన/పొడిగించడమైనది

వేలం సమయములు	
ఆస్తి తనిఖీ/సందర్శన కొరకు	12.01.2026 నుండి 06.02.2026 వరకు
అర్హత గల పత్రముల దాఖలు	10.02.2026
ధరావత్తు సొమ్ము దాఖలు	10.02.2026
ఇ-వేలం తేది (బిడ్ల దాఖలు)	12.02.2026 న ఉ. 11.00 గం॥ల నుండి సా. 04.00 గం॥ల మధ్య

గమనికలు:
1. పైన తెలిపిన కంపెనీ యొక్క లిక్విడేషన్ సమయం 31.01.2026న ముగియును మరియు లిక్విడేటార్ సమయము పొడిగింపు కొరకు దరఖాస్తు దాఖలు చేసినారు. కావున గౌరవనీయ NCLT, అమరావతి బెంచ్ ద్వారా లిక్విడేషన్ సమయముకు లోబడి ఇ-వేలం సమయం సవరించబడును/పొడిగించబడును.
2. ఈ సవరణలో భాగముగా 10 జనవరి, 2026 నాటి ఇ-వేలం ప్రాసెస్ మెమొరాండమ్ మరియు సదరు ఇ-వేలం ప్రాసెస్ మెమొరాండమ్‌తో పాటు కలిపి చదువుకోవెను. ఇతర అన్ని నియమ నిబంధనలలో ఎటువంటి మార్పు లేదు.

కాశీ శ్రీనివాస్, లిక్విడేటర్
M/s. ఎత్నిక్ టొబాకో (ఇండియా) లిమిటెడ్ (లిక్విడేషన్‌లోనిది)
IBBI/IPA-003/IPA-ICAI-N-000237/2019-2020/12840
AFA 31.12.2026 వరకు చెల్లుబాటవుతుంది
ఫ్లాట్ నెం. 104, కావూరి సుప్రీమ్ ఎన్‌క్లేవ్, కావూరి హిల్స్, మాదాపూర్, హైదరాబాద్, తెలంగాణ-500033
తేది: 28.01.2026
ప్రదేశం: హైదరాబాద్
ఇ-మెయిల్: cirp.ethnictobacco@gmail.com

M/s. ఇండ్ టాబ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లోనిది) విషయమై 10 జనవరి, 2026న జారీ చేసిన ఇ-వేలం అమ్మకపు నోటీసుకు సవరణ

వేలం సమయమును ఈ క్రింది విధంగా సవరించిన/పొడిగించడమైనది

వేలం సమయములు	
ఆస్తి తనిఖీ/సందర్శన కొరకు	12.01.2026 నుండి 06.02.2026 వరకు
అర్హత గల పత్రముల దాఖలు	10.02.2026
ధరావత్తు సొమ్ము దాఖలు	10.02.2026
ఇ-వేలం తేది (బిడ్ల దాఖలు)	12.02.2026 న ఉ. 11.00 గం॥ల నుండి సా. 04.00 గం॥ల మధ్య

గమనికలు:
1. పైన తెలిపిన కంపెనీ యొక్క లిక్విడేషన్ సమయం 31.01.2026న ముగియును మరియు లిక్విడేటార్ సమయము పొడిగింపు కొరకు దరఖాస్తు దాఖలు చేసినారు. కావున గౌరవనీయ NCLT, అమరావతి బెంచ్ ద్వారా లిక్విడేషన్ సమయముకు లోబడి ఇ-వేలం సమయం సవరించబడును/పొడిగించబడును.
2. ఈ సవరణలో భాగముగా 10 జనవరి, 2026 నాటి ఇ-వేలం ప్రాసెస్ మెమొరాండమ్ మరియు సదరు ఇ-వేలం ప్రాసెస్ మెమొరాండమ్‌తో పాటు కలిపి చదువుకోవెను. ఇతర అన్ని నియమ నిబంధనలలో ఎటువంటి మార్పు లేదు.

కాశీ శ్రీనివాస్, లిక్విడేటర్
M/s. ఇండ్ టాబ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లోనిది)
IBBI/IPA-003/IPA-ICAI-N-000237/2019-2020/12840
AFA 31.12.2026 వరకు చెల్లుబాటవుతుంది
ఫ్లాట్ నెం. 104, కావూరి సుప్రీమ్ ఎన్‌క్లేవ్, కావూరి హిల్స్, మాదాపూర్, హైదరాబాద్, తెలంగాణ-500033
తేది: 28.01.2026
ప్రదేశం: హైదరాబాద్
ఇ-మెయిల్: cirp.indtob@gmail.com

శ్రీ తాడిశెట్టి మురళి మోహన్ మరియు శ్రీమతి తాడిశెట్టి వెంకట రమణ (దివాలా ప్రక్రియ) విషయమై 10 జనవరి, 2026న జారీ చేసిన ఇ-వేలం అమ్మకపు నోటీసుకు సవరణ

వేలం సమయమును ఈ క్రింది విధంగా సవరించిన/పొడిగించడమైనది

వేలం సమయములు	
ఆస్తి తనిఖీ/సందర్శన కొరకు	12.01.2026 నుండి 06.02.2026 వరకు
అర్హత గల పత్రముల దాఖలు	10.02.2026
ధరావత్తు సొమ్ము దాఖలు	10.02.2026
ఇ-వేలం తేది (బిడ్ల దాఖలు)	12.02.2026 న ఉ. 11.00 గం॥ల నుండి సా. 04.00 గం॥ల మధ్య

గమనికలు:
ఈ సవరణలో భాగముగా 10 జనవరి, 2026 నాటి ఇ-వేలం ప్రక్రియ సమాచార డాక్యుమెంటు మరియు సదరు ఇ-వేలం సమాచార డాక్యుమెంటుతో పాటు కలిపి చదువుకోవలెను. ఇతర అన్ని నియమ నిబంధనలలో ఎటువంటి మార్పు లేదు.

కూరపాటి శింగరయ్య చౌదరి,
బ్యాంక్రప్టసీ ట్రస్టీ
Reg. No. IBBI/IPA-003/IP-N000149/2017-2018/11728
ఫ్లాట్ నెం. 104, కావూరి సుప్రీమ్ ఎన్‌క్లేవ్, కావూరి హిల్స్, మాదాపూర్, హైదరాబాద్, తెలంగాణ-500033
తేది: 28.01.2026
ప్రదేశం: హైదరాబాద్
ఇ-మెయిల్: pg.ethnicagros@gmail.com

శ్రీ తాడిశెట్టి మురళి మోహన్ మరియు శ్రీ తాడిశెట్టి వెంకట రావు (దివాలా ప్రక్రియ) విషయమై 10 జనవరి, 2026న జారీ చేసిన ఇ-వేలం అమ్మకపు నోటీసుకు సవరణ

వేలం సమయమును ఈ క్రింది విధంగా సవరించిన/పొడిగించడమైనది

వేలం సమయములు	
ఆస్తి తనిఖీ/సందర్శన కొరకు	12.01.2026 నుండి 06.02.2026 వరకు
అర్హత గల పత్రముల దాఖలు	10.02.2026
ధరావత్తు సొమ్ము దాఖలు	10.02.2026
ఇ-వేలం తేది (బిడ్ల దాఖలు)	12.02.2026 న ఉ. 11.00 గం॥ల నుండి సా. 04.00 గం॥ల మధ్య

గమనికలు:
ఈ సవరణలో భాగముగా 10 జనవరి, 2026 నాటి ఇ-వేలం ప్రక్రియ సమాచార డాక్యుమెంటు మరియు సదరు ఇ-వేలం సమాచార డాక్యుమెంటుతో పాటు కలిపి చదువుకోవలెను. ఇతర అన్ని నియమ నిబంధనలలో ఎటువంటి మార్పు లేదు.

కూరపాటి శింగరయ్య చౌదరి,
బ్యాంక్రప్టసీ ట్రస్టీ
Reg. No. IBBI/IPA-003/IP-N000149/2017-2018/11728
ఫ్లాట్ నెం. 104, కావూరి సుప్రీమ్ ఎన్‌క్లేవ్, కావూరి హిల్స్, మాదాపూర్, హైదరాబాద్, తెలంగాణ-500033
తేది: 28.01.2026
ప్రదేశం: హైదరాబాద్
ఇ-మెయిల్: pg.ethnicagros@gmail.com

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్నమీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును.(స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph : 8142292071.

TO LET

COMMERCIAL

గుంటూరు అరండల్‌పేట 11/2 లో 1200 Sft, లాలాపేట జిన్నాటవర్ సెంటర్‌లో 1800 Sft గల కమర్షియల్ బిల్డింగ్స్ ఆఫీసులకు, బ్యాంకులకు అద్దెకు ఇవ్వబడును. ✆ 99637 75262.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

JOBS

Wanted Front Desk for Solar Systems, min 1 year exp, Office: SVN Colony, Guntur. 91777 21607.

Kesava Techno hub hearing Marketing Executive Qul: Degree, 1 to 2 Years Sales & Marketing Exp, Sal: 13k - 18k, GNT. 8712126699.

TATA కంపెనీలో లైఫ్ & హెల్త్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ మరియు టీము లీడర్లు కావలెను. మీ శ్రమకు తగిన ఆదాయం + ఫారిన్ ట్రిప్స్ కలవు. ✆ 98480 83351.

శ్రీరామ్ చిట్స్ గుంటూరు జిల్లాలోని అన్ని మండల ఏరియాలలో పనిచేయుటకు ఇన్‌చార్జెస్ కావలెను. 91000 42655.

రైస్ మిల్ & ప్లాంట్ ఆపరేటర్స్ కావలెను. అనుభవజ్ఞులైన వెల్డింగ్, ఫిటర్ తెలిసిన ఆపరేటర్స్ కావలెను. Contact No: ✆ 80962 46099.

ప్రముఖ ఫైనాన్షియల్ సర్వీసెస్ గుంటూరు నందు పనిచేయుటకు పదవతరగతి విద్యార్హతతో వివాహిత స్త్రీలకి ఆఫీసు అసిస్టెంట్ జాబు చేయుటకు పోస్టులు కలవు. ✆ 90309 93895, 86396 89939.

తెనాలిలో ప్రముఖ సంస్థకు MS Officeలో అనుభవం గల లేడీ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. ఫోన్: 86869 35606.

DDU - GKY ట్రైనింగ్ సెంటర్, ఫిరంగిపురం నందు టెలికాలర్స్, PRO's, వార్డెన్స్, కంప్యూటర్ ఫ్యాకల్టీ, ఇంగ్లీష్ ఫ్యాకల్టీ, బ్రాడ్ బ్యాండ్ టెక్నీషియన్ కావలెను. భోజన వసతి కలదు. 99512 79786, 70137 86905.

గుంటూరులో గల కాలేజి నందు పనిచేయుటకు 25 సంవత్సరాల పైబడిన ఇంటర్, డిగ్రీ చదివిన రెసిడెన్షియల్ లేడి వార్డెన్ కావలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 81224 61164.

DRIVERS

లగ్జరీ కార్లు నడిపించగల డ్రైవర్లకు గోల్డెన్ ఛాన్స్! ప్రముఖ సంస్థలో స్థిరమైన ఉద్యోగం, 40 లోపు వయస్సు, 5 సం॥ల అనుభవం, ఆకర్షణీయమైన జీతం, గుంటూరు పరిసర ప్రాంతాలవారికే ప్రాధాన్యత. ఫో: 7075476853.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

మురుగు, వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం: తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి పట్టణ ఐతానగర్ గోలీవాంక రోడ్డులో గృహ సముదాయాల నడుమ నిర్వహణ లేని ఖాళీ స్థలం మురుగు, చెత్తతో నిండిపోవడంతో ఈ నెల 17న ఈనాడులో 'ఇళ్ల మధ్య మురుగు..' పేరుతో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. పొక్లెయిన్‌తో వ్యర్థాలను తొలగించి సమస్యను పరిష్కరించారు.

పేరు దుర్వినియోగంపై చర్యలు

తెనాలి టౌన్: తమ సంస్థ పేరుతో సినిమాల్లో అవకాశాలిస్తామని రాష్ట్రంలో కొంత మంది ఆడిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిసిందని, వాటికి సంస్థకు ఎటువంటి సంబంధం లేదని మా ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దర్శకుడు దిలీప్ రాజా తెలిపారు. పెదరావూరు స్టూడియోలో మంగళవారం మాట్లాడుతూ సంబంధితులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

తెనాలి

• తెనాలి • పొన్నూరు

పుస్తకాలు అందజేత

చేబ్రోలు,న్యూస్‌టుడే: కొత్తరెడ్డిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు మంగళవారం పూర్వ విద్యార్థుల సహకారంతో మాదిరి ప్రశ్నపత్రాల పుస్తకాలను అందజేశారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల సంఘం ఉపాధ్యక్షులు గాదె అనురాధ పాల్గొన్నారు.

చదువులో రాణిస్తూ.. ఆటల్లో సత్తా చాటుతూ..

చేబ్రోలు, న్యూస్‌టుడే: పాఠశాల స్థాయిలో ఇష్టంతో నేర్చుకున్న వాలీబాల్ ఆటను కళాశాలల్లోనూ ఆడుతూ రాణిస్తున్నారు ఈ విద్యార్థినులు. వేజండ్ల గ్రామానికి చెందిన వీరు చదువుతో పాటు ఆటల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతున్నారు. జడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు వారికి ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు.

బి.మనీషా

నా పేరు మనీషా. అమ్మ, నాన్న కూలి పని చేస్తారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నా. ఇప్పటి వరకు వాలీబాల్ అండర్ 19 విభాగంలో ఒక బంగారు, రెండు వెండి పతకాలు సాధించా. జాతీయ స్థాయిలో పతకాలు సాధించడమే లక్ష్యం.

పఠాన్ షాహిదా

నా పేరు పఠాన్ షాహిదా. అమ్మ నాన్న కూలీ పనులకు వెళ్తారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నా. ఇప్పటి వరకు 5 సార్లు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నాను. మూడు బంగారు, రెండు వెండి పతకాలు సాధించా. జాతీయ స్థాయిలో రాణించేందుకు కృషి చేస్తున్నాను.

బేబీ సునీత

నా పేరు బేబీ సునీత. అమ్మ, నాన్న సెంట్రింగ్ పని చేస్తారు. తెనాలిలో డిగ్రీ చదువుతున్నాను. వాలీబాల్ క్రీడలో అండర్ 19 విభాగంలో ఒక బంగారు, రెండు పతకాలు అందుకున్నాను. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ జట్టుకు ఎంపికై రెండు సార్లు సౌత్ జోన్ పోటీల్లో ప్రతిభ చాటాను. జాతీయ స్థాయిలో పోటీ పడేందుకు శిక్షణ తీసుకుంటున్నా.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పొన్నూరు పట్టణ పరిధిలోని 23వ వార్డులో రహదారి పగుళ్లు వచ్చింది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. - పి.డేవిడ్, 23వ వార్డు ✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - షేక్ హసీనా, సహాయ ఇంజినీర్. ? పొన్నూరు పట్టణ పరిధిలోని షరాఫ్ బజారులో డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకుపోయాయి. - షేక్ బాజీ, స్థానికుడు ✔ వ్యర్థాలను తొలగిస్తాం. - పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి. - న్యూస్‌టుడే, పొన్నూరు

? తెనాలి పట్టణ ఐతానగర్ గోలీవాంక రోడ్డులో రెండు నెలల క్రితం పగులగొట్టారు. ఇంకా పనులు ప్రారంభించలేదు. - రామారావు, స్థానికుడు ✔ కాలువలు నిర్మించడానికి టెండర్లు పిలిచి ఉన్నాం. త్వరలో ప్రారంభిస్తాం. ? తెనాలి 20వ వార్డు వంగర వెంకటప్పయ్య వీధిలో రెండ్రోజులుగా చెత్త తరలించే సిబ్బంది రావడం లేదు. - స్థానికులు ✔ స్థానిక సిబ్బందితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం.

? తెనాలి పట్టణ పాండురంగపేట రైల్వే ట్రాక్ పక్క రోడ్డులో చీకటి పడకముందే వీధి దీపాలు ఆరిపోతున్నాయి. ట్రాక్ రిపేర్లు జరుగుతున్నందున రోడ్డుపై మెటీరియల్ ఉంచుతున్నారు. వీధి దీపాల సమయాలు మారిస్తే ఉపయోగంగా ఉంటుంది. - రాఘవరావు, పాండురంగపేట ✔ సమస్యలను పరిష్కరిస్తాం. - రామ అప్పల నాయుడు మున్సిపల్ కమిషనర్ - న్యూస్‌టుడే, తెనాలి

స్పందన: ★ సాయి నగర్‌లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ★ పాత పొన్నూరులో పాడైపోయిన వీధి దీపాన్ని బాగు చేశారు. - న్యూస్‌టుడే, పొన్నూరు

★ తెనాలి పట్టణ బాస్యంరరావు దిబ్బ రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదని, చినరావూరు తోటలో రోడ్డు వెంబడి పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగిపోయాయని స్థానికులు ఈ నెల 25న మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో సంబంధిత అధికారులు సమస్యలను పరిష్కరించారు.- న్యూస్‌టుడే, తెనాలి టౌన్

నాన్న తాగొచ్చాడు.. అమ్మని కొట్టాడు!

గ్రామాల్లో మద్యం గొలుసు దుకాణాలతో చిన్నారుల కష్టాలు

న్యూస్‌టుడే, పెదకాకాని, చేబ్రోలు

పెదకాకానిలోని ఓ పాఠశాలలో ఇటీవల ఓ చిన్నారి నీరసంతో అకస్మాత్తుగా పడిపోయింది. వెంటనే ఉపాధ్యాయులు ఆ పాపను గదిలోకి తీసుకెళ్లి పడుకోబెట్టారు. కొంత సేపటికి లేచిన ఆ పాపను ఏమీ తిని రాలేదా అని అడిగితే.. రాత్రి మా నాన్న తాగొచ్చాడు టీచర్.. అమ్మను కొట్టాడు. పొద్దున వంట చేయలేకపోయింది. నీరసంగా ఉంది టీచర్.. అని చెప్పి కన్నీరు పెట్టింది. ఆపాప మాటలకు ఉపాధ్యాయుల కళ్లల్లోనూ నీళ్లు తిరిగాయి. ఇదీ ఏ పల్లెలో చూసినా నిత్యం కనిపించే ఘటనలు. ఇందుకు కారణం విచ్చలవిడిగా మద్యం గొలుసు దుకాణాలు అందుబాటులో ఉండటమే..

వడ్లమూడిలోని ఓ దుకాణం

పెదకాకాని, చేబ్రోలు మండలాల్లోని గ్రామాల్లో బెల్టు దుకాణాల ద్వారా పగలూ రాత్రి తేడా లేకుండా మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. పెదకాకానిలో 12 గ్రామాలకు గాను 30, చేబ్రోలు మండలంలోని 13 పల్లెల్లో 40 గొలుసు దుకాణాలున్నాయి. నిర్వాహకులు అధికారిక దుకాణాల్లో మద్యం కొనుగోలు చేసి విక్రయిస్తున్నారు. క్వార్టర్ బాటిల్‌కి రూ.50 అదనంగా విక్రయిస్తున్నారు. ఉదయం 5 నుంచి అర్ధరాత్రి వరకు ఇవి తెరిచి ఉంటుండటంతో అక్కడికక్కడే కొనుగోలు చేసి తాగుతున్నారు. ఎక్సైజ్ అధికారుల నిఘా ఉంటే వీటిని ఎప్పుడో కట్టడి చేసే వారని విమర్శలున్నాయి. ఎన్నో కుటుంబాలు ఆర్థిక, ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నాయి. ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి పెట్టి బంగారు బాల్యాన్ని అనారోగ్యం బారిన పడకుండా చూడాలని ఓ ఉపాధ్యాయుడు అభిప్రాయపడ్డారు.

పర్యావరణ కలుషితం

గ్రామాల్లో గొలుసు దుకాణాల ద్వారా మద్యం బాటిళ్లతో పాటు ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, గ్లాసులు, తినుబండారాలను కొనుగోలు చేసి పొలాలు, బహిరంగ ప్రదేశాలు చెరువు, కాలువగట్లపై కూర్చొని మద్యం తాగి వాటిని అక్కడే పడేస్తున్నారు. వ్యవసాయం చేస్తున్న రైతులకు ఈ పగిలిన సీసా పెంకులు గుచ్చుకుని గాయాలపాలవుతున్నారు. ప్లాస్టిక్ కవర్లకు నిప్పు పెట్టడంతో పర్యావరణం కలుషితం అవుతోంది. మద్యం తాగిన వారు ఇరుగుపొరుగు వారితో వాగ్వాదానికి దిగుతుంటే పంచాయితీలు పోలీస్ స్టేషనుకు చేరుతున్నాయి.

కట్టడి చేయకుంటే కష్టాలే..

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నిబంధనల ప్రకారం ఒక మనిషికి మూడు బాటిళ్లు విక్రయించాలి. దీనికి విరుద్ధంగా కొన్ని దుకాణాల్లో పని చేస్తున్న సిబ్బంది గొలుసు దుకాణదారులకు ఒకే సారి అధిక సంఖ్యలో మద్యం బాటిళ్లు అమ్ముతున్నారు. దీనిపై అధికారులు నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది. గొలుసు దుకాణాలను కట్టడి చేయకుంటే పల్లెలన్నీ చితికిపోవడం ఖాయమని ఆందోళన వ్యక్తమవుతోంది.

ఉద్యోగులపై పని భారం మోపొద్దు

సంఘీభావం తెలుపుతున్న ఉద్యోగులు, సంఘ నాయకులు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: సర్వేల పేరుతో పెంచిన పని భారంతో మానసిక ఒత్తిడికి గురై కొందరు మరణించినట్లు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం చనిపోయిన ఉద్యోగులకు సంఘీభావం తెలుపుతూ పట్టణంలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వం ఉద్యోగులపై పనిభారం మోపరాదని వారు కోరారు. ఎన్జీవో అసోసియేషన్ నాయకులు మద్దతు తెలిపారు.

నిర్లక్ష్యం నీరై పారుతోంది!

పట్టణ వాసుల దాహార్తి తీర్చేందుకు కూటమి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇచ్చింది. మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా నీటిని వృథా కానివ్వొద్దని అధికారులకు సూచనలు చేస్తున్నారు. కింది స్థాయి పురపాలక, వార్డు సచివాలయాల ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్ల నిర్లక్ష్యంతో ఐతానగర్‌లోని గోపీకృష్ణ వాటర్ సప్లయర్స్, వంట ఇల్లు, రవిమెకానిక్ దుకాణం వద్ద నిత్యం వందల లీటర్ల తాగునీరు వృథాగా పోతోంది. గతంలోనూ ఇక్కడ నీటి పైపు లీకేజీ అయితే మున్సిపల్ సిబ్బంది తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి వదిలేశారు. అప్పటి నుంచి లీకేజీ అవుతుండగా, పక్షం రోజులుగా ఇంకా ఎక్కువ నీరు పోతోంది. సమస్యను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో స్థానికులు వృథా నీటిని పక్కన కాలువలోకి మళ్లించారు. - న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట)

మెకానిక్ దుకాణం వద్ద

వాటర్ సప్లయర్స్ దుకాణం వద్ద

పుర బడ్జెట్ రూ.94 కోట్లు!

కౌన్సిల్ సమావేశ వేదిక

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: పురపాలక సంఘ బడ్జెట్ సమావేశం బుధవారం జరగనుంది. 2026-27 సంవత్సరానికి రూ.94.08 కోట్లతో బడ్జెట్ అంచనాలు తయారు చేశారు. ఈ దస్త్రాన్ని ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక దృష్టికి తీసుకెళ్లారు. ఆమె కౌన్సిల్ సభ్యుల ఆమోదం కోసం నేటి బడ్జెట్ సమావేశంలో ప్రవేశపెట్టి సభ్యుల ఆమోదం పొందనున్నారు.

ప్రజల కష్టాలపై చర్చించేనా?

తగినంత మంది కార్మికులను నియమించక పట్టణ పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, అదనపు కార్మికులు పనిచేయట్లేదని, చెత్త తరలింపు వాహనాలు మూలన పడి గుట్టలుగా పేరుకుపోతోందని కౌన్సిలర్లు ప్రతి సమావేశంలోనూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదనపు కార్మికులకు, మరమ్మతులకు బడ్జెట్‌లో సుమారు రూ.70లక్షల ఖర్చు చూపడం చూస్తే పనిచేయనిచోట ఇన్ని నిధులు ఎలా ఖర్చు చూపిస్తున్నారని కౌన్సిలర్లు ప్రశ్నిస్తున్నారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణకు నగర దీపికలతోపాటు, 47 మంది శానిటేషన్ కార్యదర్శులు, మేస్త్రీలు, సూపర్‌వైజర్లు ఇబ్బడిముబ్బడిగా ఉన్నారు. పారిశుద్ధ్య వాహనాల ఇంధనానికి రూ.1.31 కోట్లు, మరమ్మతులకు రూ.31.47 లక్షలు వెచ్చించినా.. మూడు కాంపాక్టర్లు మూలన పడడం గమనార్హం. అదనపు పనివాళ్లకు రూ.62.55 లక్షలు వెచ్చించారు. పారిశుద్ధ్య కార్మికులకన్నా పర్యవేక్షకులు ఎక్కువయ్యారని ప్రజాధనం వృథా అవుతోందని కౌన్సిలర్లు వాపోతున్నారు. చెత్త తరలింపునకు కిలోమీటరకు టన్నుకు రూ.6 వంతున చెల్లిస్తున్నారు. రోజూ వచ్చే 90 టన్నుల్లో 60 టన్నులు మాత్రమే తరలించి మిగిలింది నిప్పు పెట్టి ప్రజారోగ్యానికి హాని కలిగిస్తున్నారు. కంపోస్టు యార్డులో లక్ష టన్నుల పైన చెత్త ఉందని లెక్కల్లో చూపారు. తీరా బయోమైనింగ్ చేశాక ఇంకా 50 వేల టన్నులు ఉందని కాకిలెక్కలు చెబుతున్నారు. కొన్ని వార్డుల్లో తాగునీటి కుళాయిలకు నీరివ్వక పన్ను వేయటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీటిపై కౌన్సిలర్లు బడ్జెట్ సమావేశంలో సమగ్రంగా చర్చించి పరిష్కరించాలని జనం కోరుతున్నారు.

రూపాయి రాక		రూపాయి పోక	
ప్రారంభ నిల్వ	26,77,93,747	సాధారణ ఖర్చు	39,65,55,000
సాధారణ ఆదాయం	42,65,09,960	మూలధన వ్యయం	42,77,82,040
మూలధన ఆదాయం	24,65,77,040	ముగింపు నిల్వ	11,65,43,707
మొత్తం	94,08,80,747	మొత్తం	94,08,80,747

ఏ క్షణంలో ఎవరి మీద పడుతుందో!



తెనాలి ప్రధాన బస్టాండ్‌లో నిత్యం రద్దీగా ఉండే విజయవాడ బస్సులు ఆగే చోట స్లాబ్ ఇలా ప్రమాదకరంగా ఉంది. స్లాబ్ దెబ్బతినగా సిమెంటు పూత పూసి మమ అనిపించారు. ఇప్పుడు ఆ సిమెంట్ పూత పలు చోట్ల ఊడిపోయి ఏ క్షణంలోనైనా ప్రయాణికుల మీద పడేలా ఉంది. ప్రమాదం జరిగే వరకు వేచి చూడకుండా అధికారులు ముందుగానే తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

తెట్టు కట్టిన మురుగు

తెనాలి రెండో పట్టణ పోలీస్ స్టేషన్ మార్గంలోని ఓ కాలువలో మురుగు ఇలా వ్యర్థాలతో తెట్టు కట్టింది. పలు హోటళ్లు, వైద్యశాలలు, పెద్ద సంఖ్యలోని వ్యాపార సంస్థలు ఉన్న ప్రాంతంలో కాలువల్లో పారుదల నిలిచిపోయి మురుగు తెట్టుకట్టి విపరీతమైన దుర్వాసన వస్తోంది. ప్రజలు కొంచెం సేపు కూడా నిలబడే పరిస్థితి లేదు. అధికారులు తాత్కాలిక చర్యలు కాకుండా నిత్యం పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

తీరనున్న వెతలు!

కార్యాలయం వద్ద నిర్మాణ సామగ్రి

పట్టణంలోని ఐసీడీఎస్ తెనాలి ప్రాజెక్టు కార్యాలయ భవన ప్రహరీ నిర్మాణానికి సుమారు రూ.8 లక్షల నిధులు మంజూరయ్యాయి. దీంతో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు టెండర్ వేసి గుత్తేదారును ఎంపిక చేశారు. కాంట్రాక్టర్ నిర్మాణ పనులు కూడా చేపట్టారు. దీంతో చుట్టూ ప్రహరీ లేక ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పడుతున్న వెతలు తీరనున్నాయి.- న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట)

ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేత

పెదకాకాని, న్యూస్‌టుడే: పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి తోడ్పాటు అందిస్తున్నట్లు మంగళవారం ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. పెదకాకాని, నంబూరు, తక్కెళ్లపాడు, ఉప్పలపాడు, కొప్పురావూరు, వెనిగండ్ల గ్రామాలకు చెందిన 15 మందికి రూ.9,60,778 విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. తెదేపా మండలాధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

వసతిగృహాల తనిఖీ

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వసతి గృహాలను రెక్టార్ ఆచార్య శివరామప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం తనిఖీలు చేశారు. కొంతకాలంగా విశ్వవిద్యాలయంలో భోజనం, వసతి గృహాల్లో వసతులు సక్రమంగా లేవంటూ విద్యార్థి సంఘాల నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం రాత్రి వసతి గృహాలను వారు తనిఖీలు నిర్వహించారు. గౌతమి వసతి గృహంలో పెచ్చులూడుతున్నాయని, శాతవాహన, అశోక వసతి గృహంలో తాగునీరు, డ్రెయినేజీ సమస్య ఉందని విద్యార్థులు చెప్పడంతో.. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి మెస్‌లో భోజనం చేశారు.

ఉడికేదెప్పుడో.. తినేదెప్పుడో!

అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న 7 నుంచి 72 నెలల చిన్నారులకు మంగళ, శని వారాల్లో ఉదయం అల్పాహారం కింద ఉడకబెట్టిన గుడ్డుకు బదులు ఉడకబెట్టిన శనగలు ఇవ్వాలని నెల కిందట కార్యకర్తలకు ఉత్తర్వులు అందాయి. కానీ ఇంత వరకు శనగలు అందించలేదు. ఇవి కాగితాలకే పరిమితమయ్యాయి. మధ్యాహ్న పోషకాహారం కింద ఆ రెండు రోజుల్లో అందించే పులిహోర, వెజ్ ఫ్రైడ్ రైస్‌కు బదులు ఎగ్ ఫ్రైడ్ రైస్ మాత్రం ఇస్తున్నారు. దీనిపై గుంటూరు జిల్లా డబ్ల్యూడీ అండ్ సీడబ్ల్యూ విభాగం ప్రాజెక్టు డైరక్టర్ లక్ష్మీ ప్రసూనను సంప్రదించగా వారంలో రెండు రోజులు ఉదయం అల్పాహారం కింద అందివ్వాల్సిన శనగలు ఇంకా కేంద్రాలకు అందించలేదని, వచ్చాక ఉడకబెట్టినవి అందించనున్నట్లు పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, తెనాలి(కొత్తపేట)

తెనాలి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

అంతులేని విషాదంలోనూ ఆదర్శ నిర్ణయం

అమర్‌బాబు కుటుంబ సభ్యులకు మంత్రి మనోహర్ పరామర్శ

తల్లి కోటేశ్వరిని ఓదారుస్తున్న మంత్రి మనోహర్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందిన అంతులేని విషాద సమయంలోనూ, మరి కొందరికి ప్రాణదానం చేసేలా అవయవదానం నిర్ణయం తీసుకుని ఆదర్శంగా నిలిచారని, ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని మంత్రి మనోహర్ హామీ ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తెనాలి పినపాడుకు చెందిన పెరుగు అమర్‌బాబు కుటుంబ సభ్యులను మంత్రి మనోహర్ పరామర్శించారు. అమర్‌బాబు చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. తల్లి కోటేశ్వరి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. తండ్రి చిన్నప్పుడే చనిపోగా కూలి పనులు చేస్తూ కోటేశ్వరి బిడ్డలను చదివించుకున్నారని, ప్రమాదంలో కుమారుడిని కోల్పోయినా సమాజంపై ప్రేమతో ఆరుగురి జీవితాల్లో వెలుగు నింపేలా బిడ్డ అవయవదానానికి అంగీకరించి స్ఫూర్తిగా నిలిచారని, ఈ కుటుంబానికి తోడుగా నిలిచే విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లతో మాట్లాడతానని వివరించారు. మంగళవారం మధ్యాహ్నం అమర్‌బాబు భౌతికకాయానికి బంధుమిత్రులు, స్థానికుల ఆశ్రునయనాల నడుమ తెనాలిలో అంత్యక్రియలు పూర్తిచేశారు..

అంతిమ సంస్కార సేవ

శ్రీశివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి, తెనాలి ప్రతినిధులు మంగళవారం రెండు మృతదేహాల అంతిమ సంస్కారాలను నిర్వహించారు. ఒడిశాకు చెందిన వ్యక్తి రైలు కింద పడి మృతిచెందగా కుటుంబ సభ్యులు మృతదేహాన్ని అక్కడకు తీసుకెళ్లలేమని, ఇక్కడే అంత్యక్రియలు జరపాలని కోరారు. రైల్వే పోలీసులు సూచనలతో సమితి ప్రతినిధులు దహనసంస్కారాన్ని పూర్తి చేశారు. చింతలపూడి గ్రామానికి చెందిన వృద్ధురాలి భౌతిక కాయానికి కూడా బంధువుల వినతితో అంత్యక్రియలు చేశారు. కుర్రా శ్రీను, వాసు, రాంబాబు, పోతురాజు సేవల్లో పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, తెనాలి టౌన్

తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలి

బహుమతులు అందజేస్తున్న ఎంఈవో, విద్యా కమిటీ ఛైర్మన్

చేబ్రోలు, న్యూస్‌టుడే: విద్యార్థులు తల్లిదండ్రులు, చదివిన పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఎంఈవో సుబ్బారావు అన్నారు. నారాకోడూరులోని పీఎంశ్రీ జిల్లా ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు, వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో పాఠశాలకు గుర్తింపు తేవాలని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు ఏడు కొండలు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యా కమిటీ అధ్యక్షుడు గోపీనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐదు రోజుల పనిదినాలు కల్పించాలి

నిరసన తెలుపుతున్న బ్యాంకుల ఉద్యోగులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: వారంలో ఐదు రోజుల పని దినాలు కల్పించాలని ఆయా బ్యాంకుల ఉద్యోగులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా తెనాలిలో మంగళవారం యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రేమకుమార్, శివన్నారాయణ తదితర నాయకులు మాట్లాడగా పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

పొన్నూరు, న్యూస్‌టుడే: బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం వివిధ బ్యాంకుల ఉద్యోగులు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. యూనియన్ నాయకుడు అనిల్ కుమార్ మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్యాంకు ఉద్యోగుల పనిదినాలు 5 రోజులు చేయాలని కోరారు.

పొన్నూరులో నినాదాలు చేస్తూ..

వార్షికోత్సవాలు.. వీడ్కోలు సంబరాలు

కొలకలూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ..

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మండలం కఠెవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల్లో మంగళవారం పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు వేడుక సందడిగా సాగింది. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. దాత గుమ్మడి వెంకటనారాయణ విద్యార్థులకు అట్టలు, పరీక్షా సామగ్రిని అందించారు. ప్రధానోపాధ్యాయుడు టి.శ్రీధర్ పర్యవేక్షించారు. కొలకలూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇదే పాఠశాల్లో 1977-78 సంవత్సరాల్లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు హాజరై ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలు అందించారు. ఉత్తమ ఉపాధ్యాయునిగా బాలనాగయ్యానాయక్‌ను ఎంపిక చేసి సత్కరించారు. తెనాలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారిణి శాంతకుమారి, మండల విద్యాశాఖాధికారులు లక్ష్మీనారాయణ, జయంతిబాబు ముఖ్య అతిథులుగా హాజరుకాగా ప్రధానోపాధ్యాయుడు మాచర్ల నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

కఠెవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ..

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై విచారణ

విచారణ చేస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీవో దీప్తి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: కొలకలూరులో ప్రభుత్వ స్థలం ఆక్రమణలపై మంగళవారం తహసీల్దార్ గోపాలకృష్ణ విచారణ నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ వైద్యశాల నిర్మాణం నేపథ్యంలో గతంలో వైద్యశాల కోసం దాత ఇచ్చిన స్థలంలో మూడు సెంట్లు ఆక్రమణలకు గురైందని గుర్తించారు. సంబంధితులతో మాట్లాడి.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సూచించారు. ఖాళీ చేయడానికి 24 గంటలు గడువు ఇచ్చారు. ఎంపీడీవో దీప్తి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా అధిక వినియోగమొద్దు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: యూరియాను పరిమిత మోతాదులోనే వినియోగించాలని సహాయ వ్యవసాయ సంచాలకుడు విజయబాబు, మండల వ్యవసాయాధికారి సుధీర్‌బాబు అన్నారు. మల్లెపాడులో మంగళవారం పొలాలను పరిశీలించారు. జొన్న పంటలో మొవ్వ పురుగు నివారణపై సూచనలిచ్చారు.

ఏఎన్‌యూలో ఆస్ట్రేలియా అధ్యాపకులు

సమావేశంలో ఆచార్య గంగాధర్, కమల కరుణ దాస తదితరులు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆస్ట్రేలియాలోని ఓ విశ్వవిద్యాలయం డీన్ ఆచార్య కమల కరుణ దాస మంగళవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పర్యటించారు. అంతర్జాతీయ వ్యాపార, న్యాయ విభాగాలను సందర్శించారు. అనంతరం ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్‌తో సమావేశమై, అంతర్జాతీయ ప్రవేశాలు, అధ్యాపకుల పరస్పర మార్పిడి తదితరాలపై చర్చించారు. ఏఎన్‌యూలో త్వరలో జరగనున్న అకడమిక్ సమిట్‌లో పరస్పర అవగాహన ఒప్పందం చేసుకుందామన్నారు. రెక్టార్ ఆచార్య శివరామప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ఆచార్య బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రకు మూడేళ్లు

కేక్ కోస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరు, న్యూస్‌టుడే: కుప్పం నుంచి శ్రీకాకుళం వరకు లోకేశ్ యువగళం పాదయాత్ర ముగిసి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం రాత్రి గుంటూరులోని కార్యాలయంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కేక్ కోశారు. ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్ర వైకాపా అరాచక పాలనను తరిమికొట్టిన యాత్ర అని చెప్పారు.

దాడి కేసులో 15 నెలల జైలు శిక్ష

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: యువకుడిపై కత్తితో దాడి చేసిన కేసులో నిందితుడైన (2021లో) తలవరస విజయబాబుకు తెనాలి న్యాయస్థానంలో న్యాయమూర్తి 15 నెలల జైలు శిక్ష విధించినట్లు త్రీ టౌన్ పోలీసులు మంగళవారం తెలిపారు. తెనాలి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏ ప్లస్ రౌడీ షీటర్‌గా ఉన్న విజయబాబును పీడీ యాక్ట్ కింద రాజమండ్రి కేంద్ర కారాగారానికి పంపారు.

(c) eenadu

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

సీఎం సహాయ నిధితో భరోసా

చెక్కు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

మంగళగిరి గ్రామీణం, మంగళగిరి, న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్ సహకారంతో పలువురు బాధితులకు సీఎం సహాయ నిధి సాయం మంజూరైంది. ఇస్లాంపేటకు చెందిన కేసనం పార్వతికి రూ.70,000, తిరువీధుల ఝాన్సీలక్ష్మీకి రూ.20,946, షరాఫ్ బజార్‌కి చెందిన చిల్లపల్లి శ్రీనివాసరావు కు రూ.20,000, వీవర్స్ కాలనీకి చెందిన పొట్లాబత్తిన శ్రీనివాస్‌కు రూ.54,799 మంజూరైన చెక్కులను మంగళవారం తెదేపా నాయకులు అందజేశారు. మంగళగిరి పట్టణ తెదేపా అధ్యక్షుడు పడవల మహేష్, షేక్.రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ 'యువగళం' పాదయాత్ర చరిత్రాత్మకం

మంగళగిరి, న్యూస్‌టుడే: కూటమి విజయానికి పునాది వేసిన 'యువగళం' పాదయాత్ర చరిత్రాత్మకం అని తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయసత్య, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు వేర్వేరు ప్రకటనలో తెలిపారు. యువగళం పాదయాత్ర మూడేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా యాత్ర సాగిన తీరును వివరించారు. యాత్రలో ఇచ్చిన హామీలను అధికారం చేపట్టిన వెంటనే అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన అంతమై ప్రజాపాలన ఏర్పడటానికి మంత్రి లోకేశ్ చేసిన కృషి ఆదర్శనీయమని పేర్కొన్నారు. మంగళగిరితోపాటు రాష్ట్రాభివృద్ధికి ఆయన అహర్నిశలు కృషిచేస్తున్నారని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

స్పందన: మంగళగిరి, న్యూస్‌టుడే: కాజ గ్రామ పొలాలకు వెళ్లే రహదారిలోని గుంటూరు ఛానల్ కాలువలో గుర్రపుడెక్క వంతెన చుట్టూ పెరిగింది. సమస్యను స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా శానిటైజేషన్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌ను దృష్టికి తీసుకెళ్లగా... ఆయన స్పందించి కార్మికులతో ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. ✤ నిడమర్రు గ్రామ కొత్తూరు సెంటర్‌లో మురుగు స్తంభించింది. శానిటైజేషన్ ఇన్‌స్పెక్టర్ ఇందు దృష్టికి సమస్యల తీసుకెళ్లగా కార్మికులతో పూడిక తీయించారు. ✤ చినకాకాని పశువుల ఆసుపత్రి సమీపంలో డ్రెయిన్ పూడిపోయింది. శానిటైజేషన్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌కు స్థానికులు విన్నవించగా.. పూడిక తీయించి బ్లీచింగ్ చల్లించారు.

పెదనందిపాడు: నాగులపాడు (లక్ష్మీపురం) లోమురుగు కాలువలో పూడిక ఏర్పడింది. సమస్యను కార్యదర్శి శ్వేత దృష్టికి స్థానికులు తీసుకువెళ్లగా కార్మికులతో శుభ్రం చేయిచారు.

చదువుల ఒడి.. అవస్థల బడి

పాఠశాలల్లో పూర్తికాని నిర్మాణ పనులు | విద్యార్థుల ఎదురుచూపులు

మంగళగిరి గ్రామీణం, మేడికొండూరు, ప్రత్తిపాడు, న్యూస్‌టుడే:

పరిశీలన

బాలల భవిష్యత్తుకు భరోసా ఇవ్వాల్సిన బడులను అసౌకర్యాలు వెంటాడుతున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకం రెండో దశలో చేపట్టిన పనులు పలు చోట్ల ఇంకా అసంపూర్తిగా మిగిలిపోయాయి. ప్రస్తుతం 'మన బడి- మన భవిష్యత్తు' పథకం కింద పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఈ నేపథ్యంలో అసంపూర్తిగా పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

మేడికొండూరు: కొర్రపాడు నగర్‌లో శిథిలస్థితిలో ఎంపీపీ పాఠశాల భవనం

పేరేచర్లలో సిమెంట్ రాళ్లపై నిలబెట్టిన బోర్డు

మేడికొండూరు పరిధిలో..

★ మేడికొండూరు జడ్పీ పాఠశాలలో చేపట్టిన రెండు తరగతి గదుల పనులు పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయి. ★ పేరేచర్లలో అదనపు గదులు కట్టినా బండలు, రంగులు, తలుపులు, కిటికీలు, నల్లబోర్డులు ఏర్పాటు వంటి పని మిగిలిపోయింది. దీనితో ఇక్కడ మట్టి గదుల్లోనే బల్లలు వేసి ఉపయోగించుకుంటున్నారు. ★ కొర్రపాడు నగర్ ఎంపీపీ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. పిచ్చిచెట్లు పెరగడంతో గోడలు బీటలు వారాయి. సంబంధించిన నిధులు మంజూరు కాగానే మిగిలిన ఆయా పనులు పూర్తి చేస్తామని, అవసరమైన చోట కొత్త భవనాలు కూడా కట్టేలా చర్యలు తీసుకుంటామని గుంటూరు డివిజన్ డిప్యూటీ డీఈవో ఏసురత్నం తెలిపారు.

మరుగుదొడ్లు లేక.. మరమ్మతులు చేయక..

★ నవులూరు ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల వసతి లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రహరీ లేక పందులు సంచరిస్తున్నాయి. ఇక్కడ 6 నుంచి పది వరకు 177 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం ఇక్కడ రెండు తరగతి గదుల నిర్మాణం పూర్తికాలేదు. ★ రత్నాలచెరువు బీఎన్ఆర్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులకు ఫ్లోరింగ్, గోడలకు ప్లాస్టరింగ్, మంగళగిరి బీ.ఆర్ హైస్కూల్‌లో గోడలు నిర్మించాల్సి ఉంది. దీనిపై ఎంఈవో ఎన్.బాబు మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పూర్తి చేయిస్తామని చెప్పారు.

నవులూరులో పూర్తికాని భవనం

గదులు 2.. విద్యార్థులు 77

ప్రత్తిపాడు: ఎల్ఈ ప్రాథమిక పాఠశాలలో వరండాలో కూర్చున్న 3,4 తరగతుల విద్యార్థులు

ప్రత్తిపాడు ఎల్ఈ ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతుల్లో 77 మంది విద్యార్థులుండగా, ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. రెండు తరగతి గదులే ఉండడంతో 1, 2, 5 తరగతులను గదుల్లో, వరండాలో 3, 4 తరగతులను కలిపి బోధన సాగిస్తున్నారు. ఎస్టీ కాలనీలో పాఠశాలలో చేపట్టిన రెండు తరగతి గదుల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. సమస్యను ఎంఈవో సీహెచ్ రమాదేవి దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేయిస్తామని చెప్పారు.

వెల్లివిరిసిన 'స్నేహ' సౌరభం

పూర్వ విద్యార్థుల బృంద చిత్రం

పెదనందిపాడు న్యూస్‌టుడే: 41 ఏళ్ల తరువాత మళ్లీ కలుసుకుని మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకుని 1984- 85 పెదనందిపాడు జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు మురిసిపోయారు. మంగళవారం జరిగిన ఆత్మీయ సమావేశంలో వారంతా సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను స్మరించుకున్నారు.

చదువే ఆయుధం

చదువు ఆయుధం లాంటిది. ఉన్నతికి అదొక్కటే మార్గం. మళ్లీ స్నేహితులను కలుసుకోవడం, ఆనాటి జ్ఞాపకాలు నెమరు వేసుకోవడం చాలా ఆనందంగా ఉంది.

- గుమ్మడి నాగబాబు, ఇంటెలిజెన్సీ సెక్యూరిటీ వింగ్, ఎస్పీ

పాఠశాల అభివృద్ధికి సహకరిస్తాం

పెదనందిపాడు పాఠశాలలో చదవడం వల్లే ఉన్నతికి ఎదిగాను. జీవితంలో స్థిరపడేందుకు అవకాశం కలిగింది. అందరం కలిసి పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తాం.

- జి. రామకృష్ణ, ప్రైవేటు కళాశాల ప్రిన్సిపల్

పంట నమోదు తప్పనిసరి

మేడికొండూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం వ్యవసాయ రంగం అభివృద్ధికి కృషి చేస్తుందని జిల్లా వ్యవసాయాధికారి విజయలక్ష్మి పేర్కొన్నారు. కొర్రపాడులో మంగళవారం ఆమె పర్యటించారు. రబీకు సంబంధించి పంట నమోదు త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఏవో లక్ష్మీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలపై దృష్టిసారించాలి

నమూనాలు పరిశీలిస్తున్న అతిథులు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థులు ఆవిష్కరణలపై దృష్టిసారించాలని డాక్టర్ నరసింహరాజు అన్నారు. చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో డిజైన్ థింకింగ్, క్రిటికల్ థింకింగ్, ఇన్నోవేషన్ డిజైన్ అంశంపై రెండు రోజుల కార్యశాల మంగళవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన నరసింహరాజు మాట్లాడుతూ.. కేవలం పుస్తకజ్ఞానం తోనే కాకుండా సమస్యలను గుర్తించే సామర్థ్యం, సృజనాత్మక ఆలోచన, నూతన ఆవిష్కరణలపై దృష్టిసారించాలన్నారు. అనంతరం ప్రాజెక్టుల తయారీపై మార్గనిర్దేశం చేశారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మురళీమోహన్, ప్రిన్సిపల్ కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకురాలినంటూ మోసాలు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: తాను జనసేన నాయకురాలినని, ఉద్యోగం ఇప్పిస్తానని హైదరాబాద్‌కు చెందిన సుమలత తనను మోసం చేసిందని గుంటూరుకు చెందిన, ప్రస్తుతం నిడమర్రులో నివాసం ఉంటున్న స్వర్ణలత పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళగిరి గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తనకు పరిచయస్థుడైన రాజు అనే వ్యక్తి ద్వారా తన సమాచారం తీసుకుని సదరు మహిళ తనకు ఎస్ఆర్ఎం వర్సిటీలో ఉద్యోగం ఇప్పిస్తానని గతేడాది రెండు విడతలుగా రూ.53,700 తీసుకుందని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. గట్టిగా ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని ఆమె పోలీసులకు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదైంది. కాగా, మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గత నెల బేతపూడి సాంబయ్య అనే వ్యక్తిని రూ.1,13,000లకు, ఈ నెల 21న రూ.1,83,000లకు మరొకరిని సుమలత మోసగించినట్లు కేసులు నమోదయ్యాయి.

ఏకాగ్రత, నైతిక విలువలతో ఉన్నత శిఖరాలు

మంగళగిరి గ్రామీణం: నూతక్కి పీఎంశ్రీ పాఠశాలలో నృత్యం

పల్లపాడు జడ్పీ పాఠశాలలో..

తాడేపల్లి: పెనుమాక జడ్పీ పాఠశాలలో

న్యూస్‌టుడే బృందం: జ్ఞానం, ఏకాగ్రత, నైతిక విలువలతోనే ఉన్నత శిఖరాలు అందుకోగలమని వక్తలు పేర్కొన్నారు. పాఠశాలల్లో మంగళవారం పలు విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాలు, వార్షికోత్సవాలు సందడిగా సాగాయి. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ప్రత్తిపాడు: కోలాట ప్రదర్శనలో విద్యార్థినులు

పెదనందిపాడు పీఎంశ్రీ జడ్పీ పాఠశాలలో..

నష్టాల నుంచి లాభాల బాట

దుగ్గిరాల పీఏసీఎస్‌కు ఉత్తమ అవార్డు

దుగ్గిరాల, న్యూస్‌టుడే: [illegible] రూ. 300 నుంచి రూ. 400కు అమ్ముతున్న దశలో సొసైటీ తరఫున రూ. 266కే అందించారు. ప్రభుత్వం ఇచ్చిన ధరపై ఒక్క పైసా కూడా అదనంగా వేయకుండా అమ్మారు. [illegible] కానీ, నగదు క్రెడిట్ ద్వారా కానీ, పంట రుణాలు కానీ రూ. 25 కోట్లు కర్షకులకు ఇచ్చారు. దుగ్గిరాల, పెదపాలెంలలో గోదాములు కూడా నిర్మించారు. సొసైటీ విజయం వెనుక కూటమి ప్రభుత్వ ప్రోత్సాహం ఎంతో ఉందని హరిప్రసాద్ చెబుతున్నారు.

దారంతా గుంతలు..

మండలంలోని సిరిపురం - వరగాని మధ్య రోడ్డులో అక్కడక్కడా గుంతలు పడ్డాయి. అవి రాత్రిళ్లు కనిపించడం లేదు. దీంతో ద్విచక్ర వాహనాలు గుంతలో పడి అదుపు తప్పుతున్నాయి. ప్రమాదకరంగా మారింది. తక్షణమే సంబంధిత అధికారులు కలగజేసుకుని గుంతలు పూడ్చాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. **- మేడికొండూరు, న్యూస్‌టుడే**

వాగు దాటేదెలా?

వాగు మధ్యలో తూములు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడులో ఎస్టీకాలనీ, ఎస్సీ ఏరియా మధ్యలో నక్కవాగు ఉంది. రెండు కాలనీల్లోకి రాకపోకలు సాగించాలంటే వాగు దాటాల్సిందే. ఏళ్లుగా పట్టించుకోకపోవడంతో స్థానికులే సొంత డబ్బుతో రెండు తూములు ఏర్పాటు చేసుకున్నారు. వర్షాలకు అవి దెబ్బతిన్నాయి. దీంతో బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



నవులూరు గ్రామ టిడ్కో పరిధిలో ప్రమాదకర బావి ఉందని స్థానికులు తెలిపారు. బావిలో విషసర్పాలు ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా టిడ్కో అధికారులు స్పందించి బావిని పూడ్చటం, మూతను ఏర్పాటు చేయాలని ప్రాంతవాసులు కోరుతున్నారు. **-మంగళగిరి గ్రామీణం**

ఆడ్డదిడ్డంగా నిలిపి..అవస్థలు తెచ్చి..

మంగళగిరి పట్టణంలోని ఏపీ ఎస్ఆర్టీసీ ప్రాంగణం ఎదురుగా ఆటో రోడ్డు మధ్యలో నిలపడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ట్రాఫిక్ పోలీసులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. **- మంగళగిరి గ్రామీణం**

CHANGE OF NAME

I **MEKALA NIRMALA JYOTHI** (Old Name),D/o DAVEEDU resident of Door No: 3-144, Gundimeda, Tadepalli Mandal, Guntur District,. Do hereby inform the public that I changed my Name as **MEKALA PITCHAMMA** (New Name) D/O DAVEEDU RAJU, From Henceforth my name is known as MEKALA PITCHAMMA D/O DAVEEDU RAJU and My mother's name is MEKALA MERIMMA.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ అయిన గుంటూరు జిల్లా, మంగళగిరి మండలం, నవులూరు శివారు బేతపూడి గ్రామ కాపురస్తుడు కోసూరు సాంబశివరావు గారి కుమారుడు కోసూరు సుబ్బారావు గారి నుండి సంజాయిషీ పొంది ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయునది.

మా క్లయింట్ తన తల్లి అయిన కోసూరు [illegible]

మంగళగిరి Dt. 27.01.2026

గుట్టుగా తవ్వి.. జోరుగా తరలించి..

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

మేడికొండూరు, న్యూస్‌టుడే

రాష్ట్ర కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజధాని అమరావతి పనులు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో రాజధాని చుట్టుపక్కల ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారం బాగా జోరందుకుంది. మేడికొండూరు పరిధిలో భూమి ధరలు క్రమేపీ పెరుగుతున్నాయి. దీంతో వెంచర్లు, ప్లాట్లు బాగా వెలుస్తున్నాయి. వాటిని మెరక చేసేందుకు ఇతర ప్రాంతాల నుంచి మట్టి భారీగా దిగుమతి అవుతుంది. లాభార్జన కోసం కొంత మంది వ్యాపారంగా మలుచుకుని చుట్టు పక్కల గ్రామాల నుంచి నిబంధనలకు విరుద్ధంగా మట్టి సరఫరా చేస్తున్నారు. సత్తెనపల్లి, ఓబులనాయుడు పాలెం, అమీనాబాద్ శివారు ప్రాంతాల్లో మట్టి తవ్వకం పనులు జోరుగా జరుగుతున్నాయి. రాత్రి పగలు తేడా లేకుండా మట్టి తరలింపు జరుగుతుంది. తక్షణమే సంబంధిత అధికారులు కలగజేసుకుని తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. 'మేడికొండూరు మండల పరిధిలో ఎలాంటి అక్రమం మట్టి తవ్వకం పనులు జరగడం లేదు. ఇతర ప్రాంతాల నుంచి మట్టి సరఫరా జరుగుతుందని మా దృష్టికి వచ్చింది. ఆ విషయాన్ని భూగర్భ గనులు శాఖ అధికారులు దృష్టికి తీసుకెళ్లాం.' అని రెవెన్యూ అధికారులు తెలిపారు.

8 లారీలు స్వాధీనం..

తాడేపల్లి, న్యూస్‌టుడే: రాజధాని గ్రామాల నుంచి మట్టిని రాత్రి సమయంలో తరలిస్తున్న 8 లారీలను తాడేపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఆయా ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు మట్టి తరలించరాదని పోలీసులు తెలిపారు. కాగా, కొంత మంది రాత్రి సమయాల్లో మట్టిని బయటకు తరలించడంపై నిఘా ఉంచామని చెప్పారు.

సైన్స్ ప్రదర్శనలో సత్తా

బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

తుళ్లూరు, న్యూస్‌టుడే: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు జరిగిన ఏపీ స్పేస్ టెక్నాలజీ సమ్మిట్-2026లో ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ విద్యార్థులు ప్రతిభ చాటారు. సివిల్ ఇంజినీరింగ్ మూడో సంవత్సరం విద్యార్థులు సుమయ, నిత్యలు ప్రజెంట్ చేసిన 'రాపిడ్ సర్ఫేస్ వాటర్ క్వాలిటీ అసెస్‌మెంట్' పోస్టర్‌కు రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి లభించింది. విద్యార్థులను మంగళవారం వీసీ ఆచార్య సతీష్‌కుమార్ అభినందించారు.

కార్మిక బీమాను సద్వినియోగం చేసుకోండి

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల ప్రైవేటు ఎలక్ట్రికల్ అండ్ ప్లంబర్ యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ ఎలక్ట్రీషియన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇందిరానగర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జి.ప్రభాకరరావు పాల్గొని మాట్లాడారు. కార్మికులు ప్రభుత్వ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలను కార్మిక కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. ఆ యూనియన్ అధ్యక్షుడు అన్నం నాగబాబు, అంకరాజు తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువల కలకలం

తాడేపల్లి, న్యూస్‌టుడే: ఉండవల్లి నుంచి కొండవీటి వాగు ఎత్తిపోతలకు వచ్చే మార్గంలో, మంగళగిరి గండాలయ పేటలో సోమవారం అర్ధరాత్రి దాటక రెండు కొండ చిలువలు కనిపించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. గండాలయ పేటలో కొండచిలువ రావడం రెండోసారని స్థానికులు తెలిపారు.

విపత్తుల నిర్వహణపై అవగాహన

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లిలోని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయాన్ని మంగళగిరి ఎయిమ్స్ బీఎస్సీ నర్సింగ్ చివరి సంవత్సరం విద్యార్థులు మంగళవారం సందర్శించారు. అత్యవసర పరిస్థితుల్లో డాక్టర్లు, నర్సులు, విపత్తుల ప్రమాద తగ్గించేందుకు తీసుకోవాల్సిన అంశాలను ఏపీఎస్‌డీఎంఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట్‌దీపక్ వివరించారు.

ఆరోగ్యం పరిరక్షణపై అవగాహన

పెదపాలెం(దుగ్గిరాల), న్యూస్‌టుడే: కేఎల్ యూలోని సెంటర్ ఫర్ ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్, సీఎస్ఈ రెండో సంవత్సరం విద్యార్థులు పెదపాలెం మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, శారీరక వ్యాయామం, సమతుల ఆహార ప్రాధాన్యాన్ని వివరించారు.

మూతపడిన బ్యాంకులు

తాడేపల్లి, ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: బ్యాంక్ యూనియన్ల ఐక్యవేదిక (యూఎఫ్‌బీయూ) పిలుపు మేరకు మంగళవారం మంగళగిరి, తాడేపల్లిలోని ప్రభుత్వరంగ బ్యాంక్ ఉద్యోగులు సమ్మెలో పాల్గొనడంతో కార్యకలాపాలు నిలిచిపోయాయి. వరుసగా వచ్చిన సెలవులతో ఖాతాదారులు అసౌకర్యానికి గురయ్యారు. ప్రభుత్వ రంగంలోని బ్యాంకు ఉద్యోగుల సమ్మెతో ప్రత్తిపాడులో మంగళవారం బ్యాంకులు తెరచుకోలేదు.

చోదకులకు కంటి వైద్య పరీక్షలు

తాడేపల్లి, న్యూస్‌టుడే: రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని మంగళగిరి రవాణాశాఖ కార్యాలయంలో మంగళవారం పాఠశాలల బస్సుల డ్రైవర్లు సుమారు 125 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. రవాణాశాఖాధికారి వేమూరి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'జీవధార' లఘు చిత్రానికి పురస్కారం

తాడేపల్లి, న్యూస్‌టుడే: 'జీవధార' లఘు చిత్రం రోటరీ క్లబ్ కళా చైతన్య అవార్డుకు ఎంపికైంది. నీటి పరిరక్షణ ప్రాధాన్యాన్ని వివరిస్తూ ఉండవల్లికి చెందిన గాదె నాగభూషణం రచన, దర్శకత్వంలో దీన్ని రూపొందించారు. ప్రధాన పాత్రలో నటించిన పులిగడ్డ సత్యనారాయణ ఉత్తమ నటుడు అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 31న హైదరాబాద్‌లో అవార్డును అందజేయనున్నట్లు రోటరీ ప్రతినిధులు తెలిపారు.

ధర్నా జయప్రదం చేయాలి

పెదనందిపాడు, న్యూస్‌టుడే: తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరిగిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రామారావు మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేక విధానాలను నిరసనగా ఫిబ్రవరి 5న మండల కేంద్రాలలో జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం మండల కార్యదర్శి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలుపై సమీక్ష

ఫిరంగిపురం న్యూస్‌టుడే: ఫిరంగిపురంలో మంగళవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ఇంటి పన్ను వసూలుపై డివిజనల్ పంచాయతీ అధికారి కె. శ్రీనివాసరావు సమీక్షించారు. ఫిబ్రవరి 15 లోపు 100 శాతం పన్ను వసూళ్ళు పూర్తి చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం

పెదనందిపాడు, న్యూస్‌టుడే: గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ తమీమ్‌అన్సారియా నుంచి అవార్డు అందుకున్న అశోక పాఠశాల కరస్పాండెంట్, రోటరీ క్లబ్ రీజినల్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ దంపతులను మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. ఆయన సేవలను పలువురు వక్తలు కొనియాడారు.

వరించిన పురస్కారం

కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శ్రీవిద్య

మేడికొండూరు, న్యూస్‌టుడే: గుంటూరులో సోమవారం జరిగిన గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా మంగళగిరి హెడ్ క్వార్టర్స్‌కు చెందిన ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ శ్రీవిద్య ప్రతిభా పురస్కారం అవార్డు అందుకున్నారు. విధి నిర్వహణలో అంకితభావానికి గాను ఆమెకు ఈ అవార్డు దక్కింది.

నదిలో గుర్తుతెలియని మృతదేహం

తాడేపల్లి, న్యూస్‌టుడే: కృష్ణానదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీతానగరం వద్ద ప్రకాశం బ్యారేజీ ఎగవ భాగాన పోలీసు ఔట్‌పోస్టు వెనుక భాగంలో నదిలో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు గుర్తించి సమాచారం అందించారు. నదిలో ఉన్న మృతదేహాన్ని పోలీసులు మంగళవారం బయటకుతీశారు. మృతుడికి సంబంధించిన ఎలాంటి వివరాలు లభ్యం కాలేదని చెప్పారు. కేసు విచారణ చేస్తున్నామన్నారు.

బోల్తా కొట్టిన లారీ

క్రేన్ల సాయంతో వాహనాన్ని తొలగిస్తున్న పోలీసులు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: [illegible] ట్రాఫిక్ పునరుద్ధరించారు. ఆ వాహనం కోల్‌కతాకు చెందిన వ్యక్తిదని పోలీసులు తెలిపారు.

సైడు కాలువలో వ్యర్థాల తొలగింపు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: కొత్తపేట మల్లయ్యలింగంభవన్ ప్రాంతంలో సైడుకాలువల్లో చెత్త, వ్యర్థాలు పెద్ద ఎత్తున చేరి మురుగునీటి ప్రవాహానికి ఇబ్బందులు వస్తున్నాయని 'కాలువల్లోకి చేరుతున్న వ్యర్థాలు' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్రవార్తకు ప్రజారోగ్య విభాగం అధికారులు స్పందించారు. మంగళవారం ఆ ప్రాంతంలో సైడు కాలువల్లో వ్యర్థాలను తొలగింపజేశారు. దుకాణాల వద్ద డస్ట్‌బిన్లు పెట్టి తప్పకుండా వినియోగించాలని సూచించారు.

గుంటూరు తూర్పు



ఎన్టీఆర్ రైతు బజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.లో) టమాట 14, వంగ 24, బెండ 29, పచ్చిమిర్చి 36, కాకర 37, క్యారెట్ 28, క్యాబేజీ 23, బీర 24, దొండ 38, బంగాళ దుంప 22, ఉల్లిపాయలు 25, గోరుచిక్కుడు 40, దోస 36, పొట్ల 35, చామ 22, గోంగూర 10, తోటకూర 10, చుక్కకూర 10, మెంతికూర 5, కొత్తిమీర 20, బీట్‌రూట్ 25, కీర 30, క్యాప్సికం 55, అల్లం 75, ఫ్రెంచి బీన్స్ 55, సొర 10, అరటి 8. - న్యూస్‌టుడే, పట్నంబజారు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
94406 38515, 80085 73097

స్పందన: పద్మావతి నగర్ మూడోలైన్‌లో సైడు కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగునీరు నిలిచిపోయి దోమల వ్యాప్తి అధికంగా ఉంటోందని స్థానికుడు హనీఫ్ 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందిని పంపి కాలువల్లో పూడికలు తొలగించారు. ☛ వినోబానగర్ ప్రధాన రోడ్డులో చెత్తకుప్పలు తీయకపోవడంతో వీధులు అపరిశుభ్రంగా మారుతున్నాయని స్థానికుడు వంశీ సమస్యను ప్రజారోగ్య విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు సిబ్బందిని పంపి చెత్తకుప్పలు తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు. - న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ

చెక్కులు అందిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

పోలీసు కుటుంబాలకు ఆర్థిక చేయూత

గుంటూరు నేరవార్తలు: పోలీసుశాఖలో విధులు నిర్వహించి వివిధ కారణాలతో మృతి చెందిన ఎస్సైలు వెంకటరావు, రవీంద్రబాబు, ఏఎస్సై బ్రహ్మనాయుడు, ఏఆర్ఎస్సై రవీంద్ర సింగ్ కుటుంబ సభ్యులకు ఆర్థిక చేయూతగా ఒక్కొక్కరికి రూ.లక్ష చెక్కులను మంగళవారం ఎస్పీ వకుల్ జిందాల్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అసోసియేషన్ కార్యదర్శి శివప్రసాద్, సంయుక్త కార్యదర్శి లక్ష్మయ్య, కోశాధికారి హనుమన్, సభ్యుడు సాంబశివరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

పట్నంబజారు, న్యూస్‌టుడే: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను అధికారులు తక్షణం పరిష్కరించాలని ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎస్.రత్నాకర్ కోరారు. సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం ఆర్టీసీ ఉద్యోగులు బస్టాండులో ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్యూటీకి ఉద్యోగులు సకాలంలో వస్తున్నా.. నిర్ణీత సమయంలో బస్సుల్ని అందుబాటులో ఉంచటం లేదన్నారు. దాదాపు రెండు గంటల పాటు ఉద్యోగుల్ని గ్యారేజీల్లో వెయిట్ చేయించి బస్సులు ఖాళీగా లేవంటూ ఆ రోజు సెలవు నమోదు చేస్తున్నారని చెప్పారు. జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మయ్య మాట్లాడుతూ బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణికులు ఉంటున్నారని, దీనివల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టోనీ శ్రీను, జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాసిం, మస్తాన్‌వలి, ఎస్.ఎస్.రెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండులో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు

చెత్త కదలదు.. సిబ్బంది కనబడరు!

న్యూస్‌టుడే – నగరపాలక సంస్థ

వెహికల్ షెడ్‌కు పరిమితమైన ఈ-ఆటోలు

ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో పారిశుద్ధ్య నిర్వహణకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో మార్పు కనిపించడం లేదు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా నగరంలో చెత్త పాయింట్లు (బ్లాక్‌స్పాట్లు) లేకుండా చేయాలని అధికారులు నిర్ణయించడంతో డంపర్‌బిన్లు, కాంపాక్టర్ బిన్లు లేకుండా చేశారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేసి.. హోం, క్లస్టర్ కంపోస్ట్ తయారీలను ప్రోత్సహిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఈ-ఆటోలు చాలావరకు పని చేయకుండా మూలకు చేరాయి. మరమ్మతులు చేయాల్సిన అధికారులు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారు. కొన్ని వాహనాలు పూర్తిగా శిథిలమైన స్థితి. ఇంటింటి చెత్త సేకరణకు ఈ-ఆటోలు వినియోగించాల్సి ఉన్నా అవి మొరాయించడంతో క్షేత్రస్థాయిలో సమస్యగా మారింది. పుష్‌కార్ట్‌ల ద్వారా సేకరించిన చెత్తను బ్లాక్ స్పాట్‌ల వద్దకు తరలించి ప్లాస్టిక్ డబ్బాల్లో ఉంచుతున్నారు. దీన్ని డంపింగ్‌యార్డుకు తరలించేందుకు ట్రాక్టర్లు వచ్చే వరకు అలాగే ఉంచేస్తున్నారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో చెత్త సమస్యలు ఎదురవుతున్నాయి.

నగరంలో డివిజన్లు	: 57
ఈ-ఆటోలు	: 220
మరమ్మతులకు గురైనవి	: 130
వినియోగంలో ఉన్నవి	: 55
కాలం చెల్లినవి	: 35
నిత్యం వచ్చే చెత్త (మెట్రిక్ టన్నుల్లో)	: 420

అదనపు వాహనాలు.. సిబ్బంది ఎక్కడ?

ఈ-ఆటోలు చాలా వరకు వెహికల్ షెడ్‌కే పరిమితం కావడం, వాటి మరమ్మతులకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇబ్బందులు కొనసాగుతున్నాయి. ఎలక్ట్రిక్ ఆటోలను మరమ్మతులు చేసేందుకు ప్రత్యేక నైపుణ్యం ఉన్న సిబ్బందిని పంపాలని ఇప్పటికే పలుమార్లు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు లేఖలు రాసినట్లు జీఎంసీ అధికారులు చెబుతున్నారు. గతేడాది నగరంలో పారిశుద్ధ్య నిర్వహణకు 450 మంది అదనపు రోజువారీ కార్మికులను తీసుకున్నారు. 60 వరకు అదనపు ట్రాక్టర్లను అద్దె ప్రాతిపదికన తీసుకున్నారు. వీరిని పారిశుద్ధ్య పనులకు వినియోగిస్తున్నట్లు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో సమస్యలు అలాగే ఉంటున్నాయి. వీరంతా ఎక్కడ పనిచేస్తున్నారో అర్థంకాని పరిస్థితి. అదనపు వాహనాల పేరుతో చెత్త తరలింపులో అవకతవకలు జరుగుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదనంగా తీసుకున్న కార్మికులు, వాహనాలను ఎక్కడ వినియోగిస్తున్నారో అధికారులు తనిఖీలు చేసి పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది.

సకాలంలో రాకపోతే సగం రోజు సెలవు

● జీఎంసీ కమిషనర్ ఆదేశం ● 'ఈనాడు' కథనానికి స్పందన

రికార్డు రూంలో తనిఖీ చేస్తున్న కమిషనర్ మయూర్ అశోక్

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ఉద్యోగులంతా సకాలంలో విధులకు హాజరుకావాలని.. తనిఖీ సమయంలో ఆలస్యంగా వచ్చే అధికారులు, సిబ్బందికి సగం రోజు సెలవుగా నమోదు చేయాలని జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశించారు. అయినా మార్పు రాకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మంగళవారం ఆయన జీఎంసీ కార్యాలయంలో రెవెన్యూ, పరిపాలన, రికార్డు రూం, కంప్యూటర్, ప్రజారోగ్యం, సర్వే, ఇంజినీరింగ్ విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 'ఈనాడు'లో ఈ నెల 21న 'దస్త్రం.. దోబూచీ ఆట్లం' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. రికార్డు రూమ్‌లో దస్త్రాల గురించి ఆరా తీసి తెలుసుకున్నారు. వాటిని డిజిటల్ రూపంలో భద్రపరచాలని సూచించారు. విలువైన, భద్రపరచాల్సిన దస్త్రాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. రోజువారీ వస్తున్న ప్రతి దస్త్రం ఆన్‌లైన్‌లోనే ఉండాలన్నారు. కొందరు సిబ్బంది ఉదయం 11 గంటలకు కూడా రాకపోవడంతో అసహనం వ్యక్తంచేశారు. ప్రతి విభాగంలో మూమెంట్ రిజిస్టర్ నిర్వహణ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి ఉద్యోగి టేబుల్ వద్ద చేస్తున్న విధులు, పేరుతో బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. పరిపాలన విభాగం నుంచి ప్రతి ఉద్యోగికి అందాల్సిన ఇంక్రిమెంట్లు, ఇతర ప్రయోజనాలు నిర్దేశిత గడువు మేరకు పరిష్కరించాలని చెప్పారు. ఇక నుంచి కార్యాలయం విభాగాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తామన్నారు.

అఖిలభారత కిసాన్ జాతీయ సమావేశాలు జయప్రదం చేయండి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: గుంటూరులో ఈ నెల 30నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ(ఏఐకేయస్) జాతీయ కౌన్సిల్ సమావేశాలు జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. మంగళవారం బ్రాడీపేటలోని రైతు సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులపై, పంటకు గిట్టుబాటు ధరలేకపోవడం వంటి సమస్యలపై జాతీయ కౌన్సిల్ సమావేశంలో చర్చించాలని పేర్కొన్నారు. జాతీయ సమావేశాల్లో భాగంగా ఈ నెల 29 నుంచి వ్యవసాయ ఎగ్జిబిషన్ ఉంటుందని చెప్పారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, ఆచార్యులు వేణుగోపాలరావు, నాయకులు రామారావు, చిష్టి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణయ్య, అజయ్‌కుమార్, వేణుగోపాలరావు, రామారావు, చిష్టి

అంగన్‌వాడీల సమ్మె నోటీసు

కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డికి నోటీసు ఇస్తున్న సుబ్బరావమ్మ, శౌరమ్మ, రమాదేవి, జ్యోతి, గంగాదేవి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారం కోరుతూ ఫిబ్రవరి 12న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు, మినీ టీచర్లు పాల్గొంటారని అంగన్‌వాడీ సంఘాల రాష్ట్ర నాయకులు తెలిపారు. మంగళవారం గుంటూరులోని స్త్రీ, శిశు సంక్షేమశాఖ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డిని అంగన్‌వాడీ అనుబంధ సంఘాలు (ఏఐటీయూసీ, సీఐటీయూ, ఎఫ్‌టీయు) నాయకులు కలిసి సమ్మె నోటీసు అందించారు. రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ, శౌరమ్మ, రమాదేవి, జ్యోతి, గంగాదేవి పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కోసం ప్రార్థన

పట్నంబజారు, న్యూస్‌టుడే: ప్రపంచ శాంతి కోసం క్రైస్తవులంతా ఐక్యమత్యంతో సంగీతం ద్వారా దేవుని ప్రార్థించినట్లు చర్చి ఫాదర్ దాసరి కిరణ్ అన్నారు. క్రైస్తవ రాష్ట్ర నాయకులు చుక్కా ఇగ్నేషియన్ చంద్రపాల్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నగరంపాలెంలోని సీఎస్ఐ చర్చి గ్రౌండ్‌లో ఆర్‌సీఎం, ఏఐఎల్‌సీ, సీఎస్ఐ, బాపిస్టు సంఘాల గాయకుల బృందం గీతాలాపన చేశారు. నగరంలోని సంఘాల సభ్యులు సుమారు 250మంది ఒకే వేదికపై కలిసి ఐక్యతతో ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఫాదర్లు, పాస్టర్లు, సిస్టర్లు, క్రైస్తవ పెద్దలు పాల్గొన్నారు. కార్యక్రమంలో బాబురావు, చుక్కా విల్సన్, సతీష్‌బాబు, గాబ్రీయులు, వీసా దివ్యాంజలి తదితరులు పాల్గొన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ మాధురి ప్రవీణ్ సంగీతాన్ని అందించారు.

దేవుని ఆరాధన చేస్తున్న క్రైస్తవులు

పోలీసు సంఘ నూతన డైరీ ఆవిష్కరణ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పోలీసు అసోసియేషన్ 2026 నూతన డైరీని మంగళవారం ఎస్పీ వకుల్ జిందాల్ ఆవిష్కరించారు. అసోసియేషన్ సభ్యులు చేస్తున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు లక్ష్మయ్య, కరిముల్లా పాల్గొన్నారు.

వ్యవసాయ సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రాధాకృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు, వెంకటరామయ్య, మాల్యాద్రి, అంజిబాబు, హనుమంతరావు

గుంటూరు నేరవార్తలు: ఏపీ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు రాధాకృష్ణమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం సహకార శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల ఐక్యవేదిక నిరసన వ్యక్తం చేసింది. వారికి ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు మాల్యాద్రి, అంజిబాబు, హనుమంతరావు మద్దతు ప్రకటించారు. ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, జేఏసీ నాయకుడు వెంకటరామయ్య మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రతి ఐదు సంవత్సరాలకు వేతన సవరణ చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఫిబ్రవరి 16న చేపట్టే సమ్మెలో పాల్గొంటామని హెచ్చరించారు.

వీఆర్వోలకు పదోన్నతుల్లో న్యాయం చేయాలి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జీవో 154 ప్రకారం వీఆర్వోలకు పదోన్నతుల్లో న్యాయం చేయాలని ఏపీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసన్నకుమార్.. కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవలను కలిసి వినతిపత్రం అందించారు. ప్రస్తుతమున్న ఖాళీల్లో 40 శాతం వీఆర్వోలకు పదోన్నతులు ఇవ్వడం ద్వారా భర్తీ చేయాలని కోరారు.

పేరుకే పోలీసు పోస్టులు

నగరంలోని ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేసిన పోలీసు పోస్టులు నిరుపయోగంగా మారుతున్నాయి. నాజ్ సెంటర్, మార్కెట్ సెంటర్, పాతబస్టాండు సెంటర్‌లలో గతేడాది అధికారులు ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీసుల కోసం వీటిని ఏర్పాటు చేశారు. పర్యవేక్షణ లేక అవి నిరుపయోగంగా మారాయి. వాటిల్లో మందుబాబులు సేద తీరుతున్నారు. - న్యూస్‌టుడే, పట్నంబజారు

ప్రమాదకరంగా ఉంది.. పట్టించుకోండి

గుంటూరువారితోట ప్రధాన రహదారి పక్కన నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ప్రాంతంలో విద్యుత్తు ఫీజు బాక్స్ ప్రమాదభరితంగా ఉంది. మూత ఊడిపోయి కరెంటు తీగలు బయటకు వచ్చి రోడ్డుపై వెళ్లే వారికి అందేంత ఎత్తులో ఉన్నాయి. విద్యుత్తు విభాగం అధికారులు వెంటనే ఫీజు బాక్స్‌ను సరిచేయించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ

రహదారిపై వ్యర్థాలు.. దుర్గంధంతో ఇబ్బందులు

సీతానగర్ నుంచి రెడ్డిపాలెం గూడ్స్‌షెడ్డుకు వెళ్లే మార్గంలో రహదారిపై వ్యర్థాలు పేరుకుపోయి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు వాపోతున్నారు. దోమల బెడద, చెత్త నుంచి వస్తున్న దుర్గంధం భరించ లేకపోతున్నామని అసహనం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, నెహ్రూనగర్

క్రమశిక్షణే విద్యార్థుల ఉన్నతికి సోపానం

విజేతలకు బహుమతులు అందజేస్తున్న మైలా అంజయ్య

పట్నంబజారు, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని యాదవ హైస్కూల్ సెక్రటరీ మైలా అంజయ్య ఆకాంక్షించారు. పాత గుంటూరులోని యాదవ హైస్కూల్‌లో మంగళవారం 79వ వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన అంజయ్య మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు కన్నెబోయిన రాజ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలు ఎంచుకొని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం క్రీడల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు సభికుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రత్నాకర్, సురేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీపీఎస్, ఎల్ఆర్ఎస్‌లపై దృష్టి పెట్టండి

మాట్లాడుతున్న సీపీ రాంబాబు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: అక్రమ భవన నిర్మాణాల క్రమబద్ధీకరణ పథకం (బీపీఎస్), ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)పై సిబ్బంది దృష్టి సారించాలని జీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం సిటీ ప్లానర్ రాంబాబు సూచించారు. మంగళవారం కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ ఆదేశాల మేరకు బీపీఎస్, ఎల్ఆర్ఎస్‌లపై వార్డు సచివాలయాల వారీగా సమీక్ష సమావేశం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ ఇంకా పలు వార్డు సచివాలయాల పరిధిలో సర్వే వెంటనే పూర్తి చేసేలా దృష్టి సారించాలని ఆదేశించారు. బీపీఎస్‌కు మార్చి 12, ఎల్ఆర్ఎస్‌కు ఏప్రిల్ 23 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. బీపీఎస్ పూర్తయ్యాక కూడా అక్రమ కట్టడాలుంటే చట్ట ప్రకారం చర్యలుంటాయని సంబంధిత యజమానులకు తెలియజేయాలన్నారు. ఇప్పటి వరకు 900పైగా బీపీఎస్ దరఖాస్తులు రాగా 55 పరిష్కరించామన్నారు. సమావేశంలో డీసీపీ సూరజ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రజక వృత్తిదారులకు రక్షణ చట్టం చేయండి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: రజక వృత్తిదారులకు సామాజిక రక్షణ చట్టం అమలుకు జీవో జారీ చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం గుంటూరులోని కార్యాలయంలో జిల్లా నాయకుల సమావేశం నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రజక వృత్తిదారుల సంక్షేమానికి రూ. వెయ్యి కోట్లు మంజూరు చేయాలని కోరారు. ఫిబ్రవరిలో నిర్వహించనున్న చలో అసెంబ్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు కొండయ్య, కోటేశ్వరరావు, కైలాసం, రాంబాబు పాల్గొన్నారు.

12న దేశవ్యాప్త సమ్మె

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల పిలుపు మేరకు ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెలోకి వెళ్తున్నట్లు చెప్పారు. మంగళవారం యూనియన్ నాయకులు కమిషనర్ మయూర్ అశోక్‌ను కలిసి సమ్మె నోటీసును అందజేశారు. పది గంటల పని విధానం రద్దు చేయాలని, మున్సిపల్ ఒప్పంద కార్మికులను క్రమబద్ధీకరించాలని, శాశ్వత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన వారి స్థానంలో కుటుంబ సభ్యులను విధుల్లోకి తీసుకునే ప్రక్రియ అమలు చేయాలని, పొరుగుసేవల కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని తెలిపారు. యూనియన్ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, నగర ఉపాధ్యక్షులు సిరంశెట్టి మంగమ్మ, సహాయ కార్యదర్శి రామాంజనేయులు, కోటేశ్వరరావు, యేసురత్నం, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఏఈ అప్పలనాయుడు, ఆర్ఐ ఫయాజ్, కల్యాణ మండపాల కేర్‌టేకర్ వీర్రాజులకు జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్ షోకాజ్ నోటీసులిచ్చారు. మంగళవారం ఆయన పాత గుంటూరు, యాదవ బజారు, బాలాజీనగర్, ఎల్బీనగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధుల్లో అంకితభావం, సమగ్ర అవగాహనతో పని చేయాలని.. నిర్లక్ష్యంగా ఉంటే చర్యలుంటాయని హెచ్చరించారు. మురుగునీటి కాలువలకు సమాంతరంగా తాగునీటి పైపులైన్లు ఉండటానికి వీల్లేదన్నారు. పాతగుంటూరులో యూజీడీ పైపులైను పనులను పరిశీలించారు. తాగునీటి పైపులైను, ఇతర వివరాలను స్థానిక ఏఈని అడగ్గా... ఆయన చెప్పలేకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. వివరాలు తనకు అందించాలని డీఈఈని ఆదేశించారు. అభివృద్ధి పనులన్నింటినీ ఏఈలు, మౌలిక సదుపాయాల కార్యదర్శులు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. యాదవబజారులోని శ్రీకృష్ణ కల్యాణ మండపం అద్దె విషయంపై అవగాహన లేదన్న ఆర్ఐ ఫయాజ్, వివరాల నమోదులో నిర్లక్ష్యంగా ఉన్న కేర్‌టేకర్ వీర్రాజులకు షోకాజ్ నోటీసులిచ్చారు. ఎస్ఈ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ అశోక్, ఆర్వో సాదిక్‌పాషా తదితరులు పాల్గొన్నారు. ☛ బస్టాండ్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను కమిషనర్ మయూర్ అశోక్ పరిశీలించారు. మౌలిక సదుపాయాల అవసరం ఉంటే నోడల్ అధికారుల దృష్టికి తేవాలని సూచించారు.

మద్యం తాగి వాహనాలు నడిపినవారిపై కేసులు

తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ సి.ఐ.అశోక్‌కుమార్

పట్నంబజారు, న్యూస్‌టుడే: డొంక రోడ్డు సెంటర్లో మంగళవారం రాత్రి తూర్పు విభాగపు ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురిపై కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి, అపరాధరుసుం వసూలు చేస్తామన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

పట్నంబజారు, న్యూస్‌టుడే: విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ సూచించారు. కాకానిరోడ్డులోని సిమ్స్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వాహనాలు నడిపేటప్పుడు శిరస్త్రాణం ధరించాలన్నారు. ఒకే వాహనంపై ముగ్గురు ప్రయాణించరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై రవీంద్రబాబు, కళాశాల నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన గ్రామ రెవెన్యూ అధికారుల సంఘు కార్యవర్గం

గ్రామ రెవెన్యూ సంఘు జిల్లా అధ్యక్షుడిగా ఆనందరావు

పట్నంబజారు: జిల్లా గ్రామ రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘ నూతన కార్యవర్గాలను మంగళవారం రెవెన్యూభవన్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పల్నాడు జిల్లా వీఆర్వోల సంఘ నాయకులు చారి, రామారావు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ముఖ్యఅతిథులుగా ఏపీఆర్ఎస్ఏ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, కార్యదర్శి వెంకట్రావు, ఏపీ రెవెన్యూ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోన ఆంజనేయప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనుపమ హాజరయ్యారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య మాట్లాడుతూ సమస్యలను ఉద్యోగులు ఐక్యంగా పరిష్కరించుకోవాలన్నారు. ఫిబ్రవరి 5న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న అమరావతి జేఏసీ ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో భువనేశ్వరి, కొండయ్య, శ్యామ్ పాల్గొన్నారు. ☛ జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడిగా పిడుగు ఆనందరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా షేక్ ఆయూబ్, ఉపాధ్యక్షులుగా ఎం.కోటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, పి.మాల్యాద్రి, కె.నాగేశ్వరరావు, కె.గోపి, ఎ.లీల, జనరల్ సెక్రటరీలుగా టీసీహెచ్ రామారావు, టి.సుధాకర్‌రావు, ఎస్.కోకిలరావు, పి.శ్రీనివాసరావు, కె.మల్లేశ్వరరావు, డి.శ్రీనివాసరావు, నరేష్, బి.శిరీష, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా షేక్ మౌలాలి, కట్టా సత్యానందం, పులి భాస్కరరావు, బి.వెంకటేశ్వరరావు, షేక్ రఫీ, ప్రభాకర్, శివజ్యోతి ఎన్నికయ్యారు. ☛ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షునిగా మనోహర రాజన్, సహాధ్యక్షుడిగా రవిబాబు, ఉపాధ్యక్షుడిగా మరియదాసు, కార్యదర్శిగా నాగేశ్వరరావు, కోశాధికారిగా షేక్ కరీమున్నీసా, సంయుక్త కార్యదర్శిగా యశోద ఎన్నికయ్యారు.

హామీల అమలుకు దశలవారీగా పోరాటం

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: కూటమి ఎన్నికలకు ముందు ఉద్యోగస్తులకు ఇచ్చిన హామీల అమలు కోసం ఎస్టీయూ దశలవారీగా పోరాటాలకు సిద్ధమవుతోందని నాయకులు తెలిపారు. మంగళవారం కంకరగుంట గేటు ఎస్టీయూ భవన్‌లో ఎస్టీయూ పోరాటాల కరపత్రాన్ని నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్‌సుధీర్‌బాబు మాట్లాడుతూ పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేస్తామని, సీపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా రోడ్ మ్యాప్ ప్రకటిస్తామని, రూ.34 వేల కోట్ల పెండింగ్ బకాయిలు చెల్లిస్తామని హామీలు ఇచ్చినా నేటికీ అమలు చేయలేదన్నారు. జనవరి 30న మండలస్థాయిలో తహసీల్దార్లకు వినతులు అందజేస్తామని చెప్పారు. కరపత్రం ఆవిష్కరణలో ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు డి.పెదబాబు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌కే బాజీ, వై.శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

నాగజ్యోతిని అభినందిస్తున్న సూర్యనారాయణ, రాఘవరావు, శివశంకరరావు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

పట్నంబజారు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని చలమయ్య కళాశాల కార్యదర్శి కర్పూరపు సూర్యనారాయణ అన్నారు. చలమయ్య కళాశాలలో బీకాం చివరి ఏడాది చదువుతున్న తుపాకుల నాగజ్యోతి ఈ నెల 18న ఇండియన్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ హరిద్వార్‌లో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జాతీయస్థాయిలో గోల్డ్ మెడల్, జూనియర్ స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ఇండియా పతకం సాధించింది. సూర్యనారాయణ మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థుల్ని ప్రోత్సహించేందుకు కాలేజీ యాజమాన్యం ముందుంటుందన్నారు. కళాశాల అధ్యక్షుడు పచ్చిపులుసు రాఘవరావు మాట్లాడుతూ క్రీడల వల్ల విద్యార్థుల్లో మేధాశక్తి పెరుగుతుందని తెలిపారు. మంగళవారం కాలేజీలో ఏర్పాటు చేసిన అభినందన సభలో నాగజ్యోతిని సత్కరించారు. మాజేటి ప్రసాద్, మహంకాళి శ్రీనివాసరావు, సాధు శివ శంకరరావు, ఎ.శ్రీధర్ పాల్గొన్నారు.

జనసేన నాయకురాలినంటూ మోసాలు

మంగళగిరి గ్రామీణం: తాను జనసేన నాయకురాలినని, ఉద్యోగం ఇప్పిస్తానని హైదరాబాద్‌కు చెందిన సుమలత తనను మోసం చేసిందని గుంటూరుకు చెందిన ప్రస్తుతం నిడమర్రులో నివాసం ఉంటున్న స్వర్ణలత పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళగిరి గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తనకు పరిచయస్థుడైన రాజు అనే వ్యక్తి ద్వారా తన సమాచారం తీసుకుని సదరు మహిళ తనకు ఎస్ఆర్ఎం వర్సిటీలో ఉద్యోగం ఇప్పిస్తానని గతేడాది రెండు విడతలుగా రూ.53,700 తీసుకుందని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. గట్టిగా ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని ఆమె పోలీసులకు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదైంది. కాగా, మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గత నెల బేతపూడి సాంబయ్య అనే వ్యక్తిని రూ.1,13,000లకు, ఈ నెల 21న 1,83,000లకు మరొకరిని సుమలత మోసగించినట్లు కేసులు నమోదయ్యాయి.

(c) eenadu

గుంటూరు పశ్చిమ

ప్రజలకు అండగా ఉండడమే ప్రభుత్వ లక్ష్యం

సీఎం సహాయ నిధి చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే మాధవి

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. పశ్చిమ తెదేపా కార్యాలయంలో 47 మంది బాధితులకు రూ.91,31,362 సీఎం సహాయ నిధి(సీఎంఆర్‌ఎఫ్) చెక్కులను బాధితులకు మంగళవారం అందజేశారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ ఇప్పటి వరకు గుంటూరు పశ్చిమంలో రూ.6,05,50,820 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బాధితులకు ఇచ్చినట్లు తెలిపారు.

★ ట్రాన్స్‌జెండర్ల ఉపాధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. మహిళా గ్రీవెన్స్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం వికాస్ ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మహిళా గ్రీవెన్స్‌లో చిట్టీ మోసాలు, గంజాయి వినియోగం, ఈవ్ టీజింగ్, వీధి దీపాలు వంటి సమస్యలు వచ్చాయని తెలిపారు.

జనసేన నాయకురాలినంటూ మోసాలు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: తాను జనసేన నాయకురాలినని, ఉద్యోగం ఇప్పిస్తానని హైదరాబాద్‌కు చెందిన సుమలత తనను మోసం చేసిందని గుంటూరుకు చెందిన ప్రస్తుతం నిడమర్రులో నివాసం ఉంటున్న స్వర్ణలత పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళగిరి గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తనకు పరిచయస్థుడైన రాజు అనే వ్యక్తి ద్వారా తన సమాచారం తీసుకుని సదరు మహిళ తనకు ఎస్‌ఆర్‌ఎం వర్సిటీలో ఉద్యోగం ఇప్పిస్తానని గతేడాది రెండు విడతలుగా రూ.53,700 తీసుకుందని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. గట్టిగా ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని ఆమె పోలీసులకు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదైంది. కాగా, మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గత నెల బేతపూడి సాంబయ్య అనే వ్యక్తిని రూ.1,13,000లకు, ఈ నెల 21న 1,83,000లకు మరొకరిని సుమలత మోసగించినట్లు కేసులు నమోదయ్యాయి.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80086 22566, 97042 53525, 80085 74897

? శాంతినగర్‌లోని కాలువల వెంబడి పిచ్చి మొక్కలు అధికంగా ఉండడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. వాటిని తొలగించండి. **-స్థానికులు.** ✔ పారిశుద్ధ్య కార్మికులను పంపి పిచ్చి మొక్కలు తొలగింపజేస్తాం. **– అంగడి వెంకటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్.** ? కృష్ణబాబు కాలనీలో కాలువల్లో పూడిక రోజూ తీయడంలేదు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. **– స్థానికులు.** ✔ రోజూ కాలువలు శుభ్రపర్చేలా చర్యలు తీసుకుంటాం. **– బుల్లయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ -న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

దివ్యాంగులకు ఇంటి వద్దే రేషన్

దివ్యాంగులకు ఇంటి వద్దే రేషన్ అందిస్తున్న జేసీ అశుతోష్ శ్రీవాస్తవ

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: 65 సంవత్సరాలు దాటిన వృద్ధులతో పాటు దివ్యాంగులకు ఇంటి వద్దే రేషన్ పంపిణీ చేస్తున్నామని జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామంలో దివ్యాంగులకు, వృద్ధులకు మంగళవారం ఇంటి వద్ద రేషన్ అందించారు. జేసీ మాట్లాడుతూ ప్రతి నెలా 26 నుంచి 30వ తేదీ వరకు ఇంటింటికీ రేషన్ పంపిణీ జరుగుతుందని చెప్పారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రతినెలా రేషన్ అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో పి.కోమలి పద్మ తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని లిఫ్ట్‌లు.. పడాల్సిందే అగచాట్లు

సర్వజనాసుపత్రిలో రెండు నెలలుగా ఇదే పరిస్థితి

నగరంపాలెం, న్యూస్‌టుడే

జీజీహెచ్ అత్యవసర వైద్య సేవల విభాగంలో పని చేయని లిఫ్ట్‌లు

గుంటూరు సర్వజనాసుపత్రికి వస్తే మెరుగైన వైద్యం అందుతుందనే నమ్మకం. అధునాతన సౌకర్యాలు.. నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉండడంతో అరుదైన శస్త్రచికిత్సలు చేస్తుంటారు. అందుకే ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు పరిసర జిల్లాల నుంచి రోజూ నాలుగైదు వేల మంది రోగులు, వారి సహాయకులు వస్తుంటారు. అయితే ఇక్కడ లిఫ్ట్‌లు పని చేయకపోవడంతో రోగులకు ఇక్కట్లు తప్పడంలేదు. నెలలుగా ఇదే పరిస్థితి నెలకొన్నా పట్టించుకునేవారు లేకపోయారు.

సర్వజనాసుపత్రిలోని అత్యవసర వైద్య సేవల విభాగంలో కీలకమైన ట్రామా, న్యూరో, కార్డియాలజీ విభాగాలు ఉన్నాయి. మూడు అంతస్తులు కలిగిన అత్యవసర వైద్య సేవల విభాగంలో రోగుల అవసరార్థం తొలుత ఐదు లిఫ్ట్‌లు ఏర్పాటు చేశారు. ప్రారంభంలో వాటి నిర్వహణ బాగానే ఉన్నా రానురాను వదిలేయడంతో తరచుగా మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో రోగులు మూడంతస్తులు ఎక్కి వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఐదేళ్ల కిందట ఐదు లిఫ్ట్‌లో వైద్యులకు వినియోగించే ఒకటి పూర్తిగా మూసివేశారు. దీంతో వినియోగంలో నాలుగు మాత్రమే ఉన్నాయి. అవి కూడా అడపాదడపా పాడవడం.. తాత్కాలికంగా మరమ్మతులు చేయించేవారు. రెండు నెలల నుంచి నాలుగు లిఫ్ట్‌లు పూర్తిగా మూసివేయడంతో అత్యవసర వైద్యసేవల విభాగానికి వచ్చే రోగులు, సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

☛ మొదటి అంతస్తులో శస్త్రచికిత్సల థియేటర్లు, రెండో అంతస్తులో గుండె సంబంధిత వ్యాధుల విభాగం, మూడో అంతస్తులో నరాల సంబంధిత వ్యాధుల విభాగాలు ఉన్నాయి.

☛ వార్డుల్లో ఇన్‌పేషెంట్‌గా చేరిన వారికి వైద్యులు వ్యాధి నిర్ధారణ పరీక్షలు రాయడంతో.. వాటిని చేయించేందుకు పాతభవనం, అత్యవసర వైద్యసేవల విభాగంలోని గ్రౌండ్ ఫ్లోరుకు మెట్ల మార్గాన్నే రావాలి. దీంతో రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు మెట్లపై కొంతసేపు సేద తీరి.. తర్వాత ఎక్కాల్సి వస్తోందని రోగుల సహాయకులు వాపోతున్నారు. లిఫ్ట్‌ల గురించి అడిగితే.. పైన రెండు అంతస్తుల నిర్మాణం జరుగుతోందంటున్నారని, కనీసం ప్రత్యామ్నాయం చూపడమో.. లేకపోతే కనీసం రెండింటిని వినియోగించేలా చూస్తే బాగుండేదని అంటున్నారు.

అదనపు అంతస్తుల నిర్మాణం కారణంగానే..

జీజీహెచ్ అత్యవసర వైద్యసేవల విభాగం పైన మరో రెండు అంతస్తుల నిర్మాణం జరుగుతోంది. పైఅంతస్తులకు కూడా లిఫ్ట్‌లు అనుసంధానం చేసేందుకు తాత్కాలికంగా నిలుపుదల చేశాం. పనులు వేగంగా సాగుతున్నాయి. పనులు పూర్తయిన తర్వాత ఐదు అంతస్తులకు లిఫ్ట్‌లు అనుసంధానం చేసి రోగులకు అందుబాటులోకి తీసుకొస్తాం.

- బి.వెంకటేశ్వరరావు, సీఎస్‌ఆర్‌ఎంవో

కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో): టమాట 14, వంగ 24, బెండ 29, పచ్చిమిర్చి 36, కాకర 40, బీర 42, క్యాలీఫ్లవర్ 25, క్యాబేజి 20, క్యారెట్ 28, దొండ 48, బంగాళదుంప 22, ఉల్లిపాయలు 25, గోరుచిక్కుళ్లు 36, దోస 36, సొర 14, పొట్ల 26, అరటికాయ 10, పెద్దచిక్కుళ్లు 54, చామదుంప 23, బీట్‌రూట్ 26, కీరదోసకాయ 39, బీన్స్ 64, క్యాప్సికమ్ 54, కొత్తిమీర 20, ఆకు కూరలు 10, నిమ్మకాయలు 30, అల్లం 75, వెల్లుల్లి 160. **- న్యూస్‌టుడే, పట్టాభిపురం**

వీఆర్వోలకు ఉద్యోన్నతుల్లో న్యాయం చేయాలి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జీవో 154 ప్రకారం వీఆర్వోలకు పదోన్నతుల్లో న్యాయం చేయాలని ఏపీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసన్నకుమార్.. కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవలను కలిసి వినతిపత్రం అందించారు. ప్రస్తుతమున్న ఖాళీల్లో 40 శాతం వీఆర్వోలకు పదోన్నతులు ఇవ్వడం ద్వారా భర్తీ చేయాలని కోరారు. సీనియారిటీ జాబితాలో అర్హతలు ఉంటేనే పదోన్నతి ఇవ్వాలని విన్నవించారు. నిర్ణీత గడువులోగా శాఖాపరమైన పరీక్షలు నిర్వహించి.. ఉత్తీర్ణులు కాని వారిని రివర్షన్ చేయాలన్నారు. గతంలో మినహాయింపు ఇచ్చిన వారిని కూడా రివర్షన్ చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

అనుబంధ సంఘాలకు నాయకుల నియామకం

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: పశ్చిమ నియోజకవర్గం తెదేపా అనుబంధ విభాగాలకు నాయకులను నియమించినట్లు ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. తెలుగు మహిళ అధ్యక్షురాలుగా ముత్తినేని శివలీల, ప్రధాన కార్యదర్శిగా చెంబేటి మణికుమారి, తెలుగు యువత అధ్యక్షులుగా షేక్ జనత్‌హుస్సేన్, ప్రధాన కార్యదర్శి మాగులూరి అశోక్‌చౌదరి, బీసీ సెల్ అధ్యక్షులుగా ఉప్పతల సాంబశివరావు, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు చాపల, వాణిజ్య విభాగం అధ్యక్షులుగా కొత్త మాసు సురేష్, ప్రధాన కార్యదర్శిగా బత్తిని శ్రీను, మైనారిటీ సెల్ అధ్యక్షులుగా పఠాన్ అస్మతుల, ప్రధాన కార్యదర్శిగా షేక్ మహ్మద్ రఫీలు నియమితులయ్యారు.

నారాయణ స్తోత్ర పఠనంతో అంతర్గత శాంతి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: నారాయణ స్తోత్ర పఠనంతో భక్తుల్లో అంతర్గత శాంతి, ఆధ్యాత్మిక రక్షణ కలుగుతుందని సుప్రసిద్ధ ప్రవచనకర్త కేవీ కోటేశ్వరరావు అన్నారు. బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై మంగళవారం ఆదిశంకరాచార్య రచించిన నారాయణ స్తోత్రంపై ప్రవచనం చేశారు. శ్రీమహావిష్ణువును కీర్తించే అత్యంత మహిమాన్వితమైన స్తోత్రం ఇదన్నారు. నారాయణ నారాయణ జయ గోవింద హరే అనే పల్లవితో ప్రారంభమై, విష్ణువు దివ్య రూపాలను, గుణాలను వర్ణిస్తూ కష్టాలను, పాపాలను తొలగిస్తుందన్నారు.

ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాల్సిందే

యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం వద్ద బ్యాంకు ఉద్యోగుల నిరసన

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: బ్యాంకు ఉద్యోగులకు ఐదు రోజుల పని విధానం ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జీటీ రోడ్డులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ 2015 నుంచి అనేక పోరాటాల ఫలితంగా ఐదు రోజుల పని విధానం ఒప్పందం జరిగిందని, రెండేళ్లు దాటుతున్నా ప్రభుత్వ అనుమతి కావాలని కాలయాపన చేస్తున్నారన్నారు. ఆర్బీఐ, ఎస్‌బీఐ, నాబార్డు, ఇన్సూరెన్స్, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఇప్పటికే ఐదు రోజుల పని విధానాన్ని పాటిస్తున్నారన్నారు. ఒక్క బ్యాంకింగ్ రంగంలోనే ఒప్పందం జరిగినా అమలు చేయడంలేదన్నారు. బ్యాంకుల్లో దాదాపు రెండు లక్షల ఖాళీలున్నా భర్తీ చేయకపోవడంతో ఉద్యోగులపై పని ఒత్తిడి పెరిగి వ్యక్తిగత, వృత్తి పరమైన జీవితం మధ్య అసమతుల్యత ఏర్పడటంతో అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. తక్షణమే ఒప్పందాన్ని అమలు చేయాలని, లేకపోతే ఉద్యమానికి శ్రీకారం చుడతామని ప్రకటించారు. నిరసనలో సంఘ నాయకులు జయకుమార్, కిశోర్ కుమార్, బాషా, కోటిరెడ్డి, కల్యాణ్, రామకృష్ణ, సాంబశివరావు, రవిచంద్రారెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా అరికట్టరూ..!

రామన్నపేట ఒకటో లైను నాలుగో అడ్డ రోడ్డులో ప్రధాన పైపులైను పగిలిపోయింది. ఇక్కడ మంచినీటి పైపులైను లీకవడంతో మంచినీరు మురుగు కాలువలోకి చేరుకుంటుంది. రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది, తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆ ప్రాంతవాసులు గోడు వెళ్లబోసుకుంటున్నారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన ఫలితం లేదంటున్నారు. ఇప్పటికైనా జీఎంసీ అధికారులు స్పందించి పైపులైనుకు మరమ్మతులు నిర్వహించి ప్రాణాధార వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, పట్టాభిపురం**

తేనీరు కాదు.. తాగునీరే..

కావేరినగర్ నందికట్ల కాంప్లెక్స్‌లోని నివాస గృహాల్లో రంగు మారిన నీరు

కావేరినగర్ ప్రాంత వాసులకు తాగునీటి కష్టాలు తీరడంలేదు. 7వ లైన్‌లో నీటి సరఫరా సక్రమంగా జరగపోగా.. వస్తున్న నీరు సైతం బురద రంగులో ఉండడంతో తాగలేకపోతున్నామని ఆ ప్రాంతవాసులు పేర్కొంటున్నారు. దుర్వాసన కూడా వస్తుండడంతో ఇంటి అవసరాలకు కూడా వాడుకోవడానికి వీలు కావడం లేదంటున్నారు. తరచూ ఇదే సమస్య వస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఆ నీరు తాగితే.. రోగాల బారిన పడే అవకాశముందని, అధికారులు సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

ఉన్నా లేనట్లే.. నగదు రావట్లే..



జీజీసీఎస్ బ్యాంకు ఏటీఎం ఉన్నా ప్రజలకు ఉపయోగపడంలేదు. అరండల్‌పేట రెండో లైన్‌లో జీజీసీఎస్ బ్యాంకు ప్రధాన కార్యాలయం ఉంది. కార్యాలయ ప్రాంగణంలో బ్యాంకు ఖాతాదారుల సౌకర్యార్థం ఏటీఎం ఏర్పాటు చేశారు. చిన్నపాటి మరమ్మతులు వచ్చినా సిబ్బంది పట్టించుకోవడంలేదు. దూరప్రాంతాల నుంచి నగదు తీసుకుందామని వచ్చేవారు ఏటీఎం మూతపడి ఉండటంతో నిరాశగా వెనుదిరగాల్సి వస్తోంది. రెండు నెలలుగా ఇది మూతపడి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి ఏటీఎంను అందుబాటులోకి తీసుకురావాలని ఖాతాదారులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, గుంటూరు నగరం**

రహదారిపైనే కుప్పలు.. రాకపోకలకు అవస్థలు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే

రోడ్డుకు అడ్డంగా పోసిన కంకర

ప్రధాన వాణిజ్య ప్రాంతంగా పేరున్న లక్ష్మీపురంలో చేపట్టిన పనులతో గత నెల రోజులుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లక్ష్మీపురంలోని బ్యాంక్ ఆఫ్ బరోడా పక్క వీధిలో ఇసుక, కంకర, సిమెంట్ రోడ్డుపైనే నిల్వ చేశారు. గుత్తేదారు సిమెంట్ రోడ్డు, కాల్వల నిర్మాణం కోసం వినియోగిస్తున్న సామగ్రిని ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉన్న ప్రాంతంలో నిల్వ చేసుకోవాలి. అలాంటిది ప్రజల రాకపోకలు సాగించే రోడ్డుపైనే ఇసుక, కంకర గుట్టలు నిల్వ చేశారు. సిమెంట్ బస్తాలు రోడ్డుపైనే పెట్టారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలకు నెలరోజులుగా ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక, కంకర గుట్టలు దాటే క్రమంలో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రాకపోకలకు ఆటంకంగా ఉన్న నిర్మాణ సామగ్రిని తీసివేయాలని ప్రజలు కోరుతున్నారు.

ముగ్గురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

అధికారులకు ఆదేశాలిస్తున్న కమిషనర్ మయూర్ అశోక్

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఏఈ అప్పలనాయుడు, ఆర్‌ఐ ఫయాజ్, కల్యాణ మండపాల కేర్‌టేకర్ వీర్రాజులకు జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్ షోకాజ్ నోటీసులిచ్చారు. మంగళవారం ఆయన పాతగుంటూరు, యాదవ బజారు, బాలాజీనగర్, ఎల్బీనగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధుల్లో అంకితభావం, సమగ్ర అవగాహనతో పనిచేయాలని.. నిర్లక్ష్యంగా ఉంటే చర్యలుంటాయని హెచ్చరించారు. మురుగునీటి కాలువలకు సమాంతరంగా తాగునీటి పైపులైన్లు ఉండటానికి వీల్లేదన్నారు. పాతగుంటూరులో యూజీడీ పైపులైను పనులను పరిశీలించారు. తాగునీటి పైపులైను, ఇతర వివరాలను స్థానిక ఏఈని అడగ్గా... ఆయన చెప్పలేకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. వివరాలు తనకు అందించాలని డీఈఈని ఆదేశించారు. అభివృద్ధి పనులన్నింటినీ ఏఈలు, మౌలిక సదుపాయాల కార్యదర్శులు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. యాదవబజారులోని శ్రీకృష్ణ కల్యాణ మండపం అద్దె విషయంపై అవగాహన లేదన్న ఆర్‌ఐ ఫయాజ్, వివరాల నమోదులో నిర్లక్ష్యంగా ఉన్న కేర్‌టేకర్ వీర్రాజులకు షోకాజ్ నోటీసులిచ్చారు. ఎస్ఈ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ అశోక్, ఆర్వో సాదిక్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

★ బస్టాండ్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను కమిషనర్ మయూర్ అశోక్ పరిశీలించారు. మౌలిక సదుపాయాల అవసరం ఉంటే నోడల్ అధికారుల దృష్టికి తేవాలని సూచించారు.

రైతు క్షేమంగా ఉంటేనే దేశం సుభిక్షం

మాట్లాడుతున్న కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: రైతు క్షేమంగా ఉంటేనే దేశ సుభిక్షంగా ఉంటుందని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి తెలిపారు. గుంటూరులోని భాజపా జిల్లా కార్యాలయంలోని వాజ్‌పేయీ భవన్‌లో కిసాన్ మోర్చా జిల్లా విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు తుల్లిమిల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కుమారస్వామి మాట్లాడుతూ రైతులకు సమస్యలుంటే కిసాన్ మోర్చా నాయకులు సత్వరం స్పందించి పరిష్కారం చూపాలన్నారు. పార్టీ బలోపేతం చేయడానికి గ్రామ కమిటీలు వేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా భాజపా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపిశ్రీనివాస్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి.సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శులు దొడ్డ నాగరాజు, చరక కుమార్ గౌడ్, స్పైసెస్ బోర్డు సభ్యుడు కొత్తూరి సుబ్బారావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వి.గంగాధర్, పార్లమెంట్ సంయోజక్ భీమినేని చంద్రశేఖర్‌లు ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు దేసు సత్యనారాయణ, భజరంగ్ రామకృష్ణ, కె.నారాయణ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వాసుదేవ నాయుడు, విమలాదేవి, మేరీ సరోజిని, శివయ్య, కార్యాలయ కార్యదర్శి కుందూరు నాగేశ్వరావు, జిల్లా అధ్యక్షులు రాధా మాధవి(మహిళా మోర్చా), శ్రీనివాస్ నాయక్(ఎస్టీ మోర్చా), రామారావు(ఓబీసీ మోర్చా), సాంబశివరావు(మైనార్టీ మోర్చా), నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసమానతల నిర్మూలనకు పోరాడిన కర్పూరీ ఠాకూర్



పారిశ్రామికవేత్త రమేష్‌బాబుకు పురస్కారం అందిస్తున్న నాయకులు

గోరంట్ల, న్యూస్‌టుడే: సామాజిక న్యాయం కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు జన్‌నాయక్ కర్పూరీ ఠాకూర్ అని పలువురు నాయకులు కొనియాడారు. నగరాలు ఐడీ ఆసుపత్రి సమీపంలో నాయీబ్రాహ్మణ నంద యువసేన ఆధ్వర్యంలో కర్పూరీ ఠాకూర్ జయంతి సభ మంగళవారం నిర్వహించారు. సభలో ప్రముఖ పారిశ్రామికవేత్త రమేష్ బాబు, విద్యావేత్త విశ్వకుమార్ సేన్, భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపి శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు. సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రతినిధి కర్పూరీ ఠాకూర్.. ఆటంకాలను అధిగమించి, దీక్షతో శ్రమించి, సమాజాభివృద్ధికి పాటుపడ్డారన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక స్థితిగతులతో సంబంధం లేకుండా అవకాశాలు పొందాలన్న లక్ష్యంతో సమాజాన్ని పీడిస్తున్న వ్యవస్థాగత అసమానతలు నిర్మూలించడానికి పట్టుదలతో కృషి చేశారన్నారు. నాయీబ్రాహ్మణ నంద యువసేన రాష్ట్ర అధ్యక్షుడు బాబ్జీనంద మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి జన్‌నాయక్ కర్పూరీ ఠాకూర్ స్మారక పురస్కారం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ పారిశ్రామికవేత్త రమేష్‌బాబుకు అవార్డు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు తాడివలస దేవరాజు, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైకాపా పతనానికి యువగళం నాంది

కేకు కోస్తున్న తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, కార్పొరేటర్ కోటేశ్వరరావు

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: వైకాపాకు ప్రతిపక్ష హోదా రాకుండా చేయడంలో మంత్రి నారా లోకేశ్ ప్రారంభించిన యువగళం పాదయాత్ర నాంది పలికిందని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. లోకేశ్ ప్రారంభించిన యువగళం యాత్ర మంగళవారానికి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా కొరిటెపాడులోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కోశారు. కనపర్తి మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో ఆర్థిక నేరస్థుడికి.. స్మార్ట్ పొలిటీషియన్‌కు మధ్య తేడా ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరాంప్రసాద్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నగరపాలకసంస్థ: మంత్రి నారా లోకేశ్ పాదయాత్ర మూడేళ్లు పూర్తవ్వడంతో పశ్చిమ తెదేపా కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి కేక్ కోసి అభిమానులకు తినిపించారు. ఆయన చేసిన పాదయాత్ర క్యాడర్‌లో నూతన ఉత్సాహం, స్ఫూర్తి నింపిన ఓ చరిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు.

యువగళం పాదయాత్ర మూడేళ్లు పూర్తయిన సందర్భంగా కేకు కోస్తున్న పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, మిర్చియార్డు ఛైర్మన్ అప్పారావు

మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

సభ్యులతో మాధవి, ఉమెన్స్ వింగ్ ఛైర్‌పర్సన్ డాక్టర్ మమత, సభ్యురాలు జయశ్రీ తదితరులు

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: మహిళా సాధికారత సాధించడంతో పాటు వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఏపీ ఛాంబర్స్) సెంట్రల్ జోన్ ఉమెన్స్ వింగ్ ఆధ్వర్యంలో గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌లో ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కార్యశాలను నిర్వహించారు. మహిళలు స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించడానికి నిర్వహించిన వర్క్‌షాప్‌లో 'డిజైనర్ థ్రెడ్ బ్యాంగిల్స్', 'డిజైనర్ సారీ టాజిల్స్' (చీర కుచ్చులు) తయారీపై 40 మంది శిక్షణ పొందారు. కార్యక్రమానికి 'రోటరీ ప్రేరణ' అసోసియేట్ పార్ట్‌నర్‌గా వ్యవహరించింది. పాల్గొన్న వారికి స్టార్టప్ కిట్‌లను అందజేసింది. ఏపీ ఛాంబర్స్ సెంట్రల్ జోన్ వైస్ ఛైర్‌పర్సన్ సక్కు మాధవి, ఉమెన్స్ వింగ్ ఛైర్‌పర్సన్ డాక్టర్ మమత రాయపాటి, ఉమెన్స్ వింగ్ సభ్యురాలు జయశ్రీ, ఏపీ ఛాంబర్స్ స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ ఛైర్‌పర్సన్ రాధిక, ఈవెంట్స్ అండ్ ప్రోగ్రాం కమిటీ ఛైర్‌పర్సన్ డి.అపర్ణ, రోటరీ ప్రేరణ అధ్యక్షురాలు రిష్విక, కార్యదర్శి అమృత, కోశాధికారులు అనురూప, స్రవంతి పాల్గొన్నారు.

భార్య, పిల్లల అదృశ్యంపై ఫిర్యాదు

గుంటూరు నగరం: భార్య, పిల్లలు కనిపించడంలేదని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. అరండల్‌పేట పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనగర్‌కు చెందిన పత్తిపాటి నాగమల్లేశ్వరి, కుమారుడు రామేశ్వర్, కుమార్తె వెన్నెలలు ఈనెల 25వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. భార్య, పిల్లల కోసం సమీప ప్రాంతాల్లో వెతికినా.. బంధువులను విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో నాగమల్లేశ్వరి భర్త పత్తిపాటి శివ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కృష్ణబాజీబాబు తెలిపారు.

బీపీఎస్‌పై దృష్టి పెట్టండి

నగరపాలక సంస్థ: అక్రమ భవన నిర్మాణాల క్రమబద్ధీకరణ పథకం (బీపీఎస్), ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)పై సిబ్బంది దృష్టి సారించాలని జీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం సిటీప్లానర్ రాంబాబు సూచించారు. మంగళవారం కౌన్సిల్ హాల్‌లో బీపీఎస్, ఎల్ఆర్ఎస్‌లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఆవిష్కరణలపై దృష్టిసారించాలి

నమూనాలు పరిశీలిస్తున్న డాక్టర్ నరసింహరాజు, ప్రిన్సిపల్ తదితరులు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థులు ఆవిష్కరణలపై దృష్టిసారించాలని డాక్టర్ నరసింహరాజు అన్నారు. చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో డిజైన్ థింకింగ్, క్రిటికల్ థింకింగ్, ఇన్నోవేషన్ డిజైన్ అంశంపై రెండు రోజులు జరగనున్న వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన నరసింహరాజు మాట్లాడుతూ.. కేవలం పుస్తకజ్ఞానంతోనే కాకుండా సమస్యలను గుర్తించే సామర్థ్యం, సృజనాత్మక ఆలోచన, నూతన ఆవిష్కరణలపై దృష్టిసారించాలన్నారు. అనంతరం ప్రాజెక్టుల తయారీపై మార్గనిర్దేశం చేశారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మురళీమోహన్, జగదీష్, కార్యదర్శి గోపాలకృష్ణ, కోశాధికారి డాక్టర్ కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ సంఘ జిల్లా అధ్యక్షుడిగా ఆనందరావు

నూతనంగా ఎన్నికైన సంఘ కార్యవర్గం

పట్నంబజారు, న్యూస్‌టుడే: జిల్లా గ్రామ రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం రెవెన్యూభవన్‌లో నిర్వహించారు. పల్నాడు జిల్లా వీఆర్వోల సంఘ నాయకులు చారి, రామారావు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ముఖ్యఅతిథులుగా ఏపీఆర్ఎస్ఏ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్, కార్యదర్శి వెంకట్రావు, ఏపీ రెవెన్యూ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోన ఆంజనేయప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనుపమ హాజరయ్యారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య మాట్లాడుతూ సమస్యలను ఉద్యోగులు ఐక్యంగా పరిష్కరించుకోవాలన్నారు. ఫిబ్రవరి 5న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న అమరావతి జేఏసీ ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో భువనేశ్వరి, కొండయ్య, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

★ జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడిగా పిడుగు ఆనందరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా షేక్ ఆయూబ్, ఉపాధ్యక్షులుగా ఎం.కోటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, పి.మాల్యాద్రి, కె.నాగేశ్వరరావు, కె.గోపి, ఎ.లీల, జనరల్ సెక్రటరీలుగా టీసీహెచ్ రామారావు, టి.సుధాకర్‌రావు, ఎస్.కోకిలరావు, పి.శ్రీనివాసరావు, కె.మల్లేశ్వరరావు, డి.శ్రీనివాసరావు, నరేష్, బి.శిరీష, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా షేక్ మౌలాలి, కట్టా సత్యానందం, పులి భాస్కరరావు, బి.వెంకటేశ్వరరావు, షేక్ రఫీ, ప్రభాకర్, శివజ్యోతి ఎన్నికయ్యారు.

★ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షునిగా మనోహర రాజన్, సహాధ్యక్షుడిగా రవిబాబు, ఉపాధ్యక్షుడిగా మరియదాసు, కార్యదర్శిగా నాగేశ్వరరావు, కోశాధికారిగా షేక్ కరీమున్నీసా, సంయుక్త కార్యదర్శిగా యశోద ఎన్నికయ్యారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణోత్సవం

కల్యాణ క్రతువులో దంపతులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బ్రాడీపేట రెండో లైనులోని ఓంకార క్షేత్రంలో శ్రీరామ నామ సప్తాహం జరుగుతోంది. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఓంకార క్షేత్ర పాలక మండలి ఉపాధ్యక్షుడు ఘంటసాల వీరకుమార్, చెమిటిగంటి రామకృష్ణ శాస్త్రి దంపతులు కల్యాణ క్రతువు నిర్వహించారు. ఉదయం బ్రాడీపేట పురవీధుల్లో నగర సంకీర్తనతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం పద్మనాభశర్మ భాగవతార్ బృందం సీతా కల్యాణం హరికథా గానం చేశారు. కార్యక్రమాల్లో పాలక మండలి కార్యదర్శి నంబూరు శ్రీమన్నారాయణమూర్తి, సభ్యులు బలభద్రపాత్రుని ఉదయశంకర్, బలభద్రపాత్రుని రాధాకృష్ణ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

(c) eenadu

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – తాడికొండ

బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రాంతీయ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ – రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ – నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

Aster Ramesh HOSPITALS

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Hospitality Partner: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Man of the Series: Hero
Digital Partner: ఈనాడు.నెట్
TV Partner: ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్, ఈ FM Mee FM
Organised by: ఈనాడు ఉత్సాహం క్లబ్

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - I జూనియర్స్: మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్సర్లతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులకే ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్ జట్టు

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - I జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సులతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

విజేత రాయలసీమ రాకర్స్ జట్టు

గ్రౌండ్-2లో సీనియర్స్ : సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ · చరణ్ జిత్ · ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-I (జూనియర్స్)

మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్

మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)

మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్

మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

నూతన వసతిగృహ నిర్మాణానికి విరాళం

హరేంద్రనాథ్ చౌదరి, కోటేశ్వరరావులకు రూ.6 లక్షలు విరాళం చెక్కు అందజేస్తున్న ముక్తా ప్రభాకర్

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు జేకేసీ కళాశాల రోడ్డులో కమ్మజన సేవాసమితి నిర్మిస్తున్న నూతన వసతి గృహానికి ఉన్నవ గ్రామస్థుడు ఆడిటర్ ముక్తా ప్రభాకర్ రూ.6 లక్షలు విరాళాన్ని సమితి గౌరవ అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు, అధ్యక్షుడు మల్లెల హరేంద్రనాథ్ చౌదరిలకు మంగళవారం అందజేశారు. ముక్తా ప్రభాకర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ముక్తా వెంకట సుబ్బయ్య, బాపమ్మ, సోదరుడు ముక్తా కోటేశ్వరరావుల గౌరవార్థం ఈ మొత్తం అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. సమితి అధ్యక్షుడు హరేంద్రనాథ్‌చౌదరి మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరం నుంచే నూతన వసతిగృహాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి కన్నెగంటి బుచ్చయ్యచౌదరి, కోశాధికారి కావూరి రవిచంద్ర, పాలకవర్గ సభ్యులు వడ్లమూడి శివరామకృష్ణయ్య, పట్టాభి సీతారామారావు, మద్రిపూడి సీతారామయ్య, గౌరవ సలహాదారు వంకాయలపాటి బలరామకృష్ణయ్య, గోరంట్ల పున్నయ్యచౌదరి, పెద్ది సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముక్తా ప్రభాకర్‌ను సత్కరించారు.

ఆచార్య కృపాచారికి వెంకట్రామయ్య జాతీయ సాహితీ పురస్కారం

ఆచార్య కృపాచారికి తుమ్మల సాహితీ పురస్కారం ప్రదానం చేస్తున్న డాక్టర్ బాబు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మంగళవారం తెనాలి కవిరాజాపార్కులో నిర్వహించిన ప్రజాకవి తుమ్మల వెంకట్రామయ్య జాతీయ సాహితీ పురస్కార ప్రదాన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సభకు అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు అధ్యక్షత వహించారు. ప్రముఖ సాహితీవేత్త ముత్తేవి రవీంద్రనాథ్, అరసం ఉపాధ్యక్షుడు కనపర్తి బెన్‌హర్ , అయినాల మల్లేశ్వరరావు, షేక్ అబ్దుల్ హకీంజానీ ప్రసంగించారు. స్వాతంత్ర్య సమరయోధుడు వడ్లమూడి గోపాలకృష్ణయ్య, వడ్లమూడి వెంకట లక్ష్మమ్మ ఫౌండేషన్, కళల కాణాచి తెనాలి గౌరవాధ్యక్షుడు డాక్టర్ బాబు ఆర్.వడ్లమూడి, ఆచార్య కృపాచారికి వెంకట్రామయ్య జాతీయ సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

లేఔట్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలోని హౌసింగ్ లేఔట్లలో నిర్మించిన ఇళ్లలో ప్రజలు నివాసం ఉండేలా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలు నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ హౌసింగ్ లేఔట్లలో మంచి నీరు, విద్యుత్తు, రహదారులు తదితర సదుపాయాలను ప్రాధాన్య క్రమంలో ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు అందించాలన్నారు. గతంలో వివిధ మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగించిన నిధుల వివరాలు అందించాలని సూచించారు. లేఔట్ల వారీగా లబ్ధిదారులకు కేటాయించినవి, కేటాయించిన వాటిలో నిర్మాణాలు ప్రారంభించినవి, పూర్తయినవి, కేటాయించకుండా ఖాళీగా ఉన్న ప్లాట్ల వివరాలను మ్యాప్‌లతో నివేదించాలన్నారు. ఆప్షన్-3లో నిర్మించిన ఇళ్లలో స్టేజ్, నాణ్యతలో తేడాలుంటే కాంట్రాక్టర్లతో వెంటనే సరిచేసేలా హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, నగర కమిషనర్ కె.మయూర్ అశోక్, తెనాలి ఇన్‌ఛార్జి సబ్‌కలెక్టర్ లక్ష్మీకుమారి, డీఆర్వో ఎన్.ఎస్.కె.ఖాజావలి, హౌసింగ్ పీడీ ప్రసాద్, ఆర్డీవో శ్రీనివాసరావు, తెనాలి మున్సిపల్ కమిషనర్ జె.ఆర్.అప్పలనాయుడు, తహసీల్దార్లు సుభాని, వెంకటేశ్వర్లు, క్షమరాణి, నగరపాలక సంస్థ ఎస్ఈ సుందరరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని ప్రేమిస్తూ.. దైవాన్ని స్మరిస్తూ

మేడికొండూరు, న్యూస్‌టుడే: వృద్ధ భక్తుడు ఏకంగా మూడేళ్ల పాటు సైకిల్ యాత్ర చేపట్టి అబ్బుర పరుస్తున్నారు. మొత్తంగా 6 వేల కిలో మీటర్లు మేర వివిధ ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన మొత్తం 50 దేవాలయాలు సందర్శించాలని ఆయన సంకల్పించారు. మద్రాసుకు చెందిన 60 ఏళ్ల దేవరాజ్ గతేడాది నవంబరు 27వ తేదీ రామేశ్వరం నుంచి నేపాల్ వరకు యాత్ర ప్రారంభించారు. మొత్తం మూడేళ్ల పాటు 6,000 కిలో మీటర్లు యాత్ర చేయనున్నారు. ఇప్పటి వరకు 1,000 కి.మీ మేర పూర్తి చేశారు. మేడికొండూరు మండలం మీదుగా మంగళవారం ఆయన విజయవాడ ఇంద్రకీలాద్రి వెళ్లారు. కొంతమంది భక్తులు దారి వెంబడి ఉచితంగా భోజనం, వసతి కల్పిస్తున్నారని, రాత్రికి ఆలయాల్లో విశ్రాంతి తీసుకుంటున్నానని ఆయన చెప్పారు. ప్రజల్లో దైవభక్తి, దేశ భక్తి పెంపొందించాలనే లక్ష్యంతో ఈ యాత్ర చేపట్టినట్లు వివరించారు.

31న ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సమావేశం

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం ఈనెల 31వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. నూతనంగా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీని జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేయడంతో కలెక్టర్ తమీమ్ అన్సారియా అధ్యక్షతన తొలి సమావేశాన్ని నిర్వహించనున్నారు. కమిటీ సభ్యులుగా నియమితులైన అనధికార సభ్యులు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొంటారు.

ఉపాధి పథం నైపుణ్య సాధనం

కోర్సుల రన్‌వేపై కెరియర్ టేకాఫ్

కలల కెరియర్ అందుకోవాలంటే కోర్సుల వారధి నిర్మించుకోవాలి. ఉద్యోగాల రీత్యా ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్న విమానయాన రంగంలోకి ప్రవేశించేందుకు ఎన్నో దారులున్నాయి. ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్హతలతో వీటిలో ప్రవేశించవచ్చు. కొన్ని హోదాలు పొందడానికి అదనపు శిక్షణ కావాలి. ఎంచుకున్న మార్గాన్ని బట్టి కోర్సు ఎంపిక జరగాలి.

విమానయాన రంగంలో ఎక్కువ ఉద్యోగాలు 3 విభాగాల్లో ఉన్నాయి. అవి..

1. టెక్నికల్ ఉద్యోగాలు
2. మేనేజ్‌మెంట్ హోదాలు
3. సేవల విభాగంలో కొలువులు

మరో ఐదేళ్లలో అంటే 2030 నాటికి భారత పౌర విమానరంగం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద మార్కెట్‌గా అవతరించనుంది. ఈ నేపథ్యంలో మూడు విభాగాల్లోనూ నైపుణ్యాలున్న సిబ్బంది అవసరం ఎక్కువగా ఉంది. ఖాళీలు ఎక్కువగా ఉన్నప్పటికీ, శిక్షణ పొందినవారు తక్కువ మందే ఉన్నారు. విమానయాన కోర్సుల శిక్షణకు మౌలిక సదుపాయాల కల్పన ప్రధాన అడ్డంకిగా ఉండటమే ఇందుకు కారణం. పైలట్ లాంటి కోర్సుల శిక్షణకు తగిన సౌకర్యాలు లేకపోతే అనుమతులు లభించవు.

పైలట్ (కమర్షియల్) ట్రెయినింగ్

కమర్షియల్ పైలట్ లైసెన్స్ (సీపీఎల్)గా పిలిచే ఈ కోర్సులో చేరడానికి మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో ప్లస్2/ఇంటర్మీడియట్ కనీస విద్యార్హత. వయసు 17 ఏళ్లు ఉండాలి. దేశవ్యాప్తంగా పలు సంస్థలు పైలట్ శిక్షణ అందిస్తున్నాయి.

గ్రౌండ్ స్టాఫ్ ఆపరేషన్స్

ఇంటర్ విద్యార్హతతో ఎయిర్‌పోర్ట్ గ్రౌండ్ సర్వీసెస్‌లో ఏడాది కాలపరిమితి ఉన్న డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ తరహా కోర్సుల్లో ప్రవేశానికి వివిధ సంస్థలు ఉమ్మడిగా నిర్వహిస్తోన్న ఏఎంఈ సెట్ రాయవచ్చు. ఇతర పరీక్షలతోనూ ప్రవేశం పొందవచ్చు.

ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజినీరింగ్ (ఏఎంఈ)

ఎయిర్‌లైన్స్‌లో అత్యంత డిమాండ్ ఉన్న ఈ హోదాను సాధించాలంటే డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) అనుమతి పొందిన ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజినీరింగ్ లైసెన్స్ కోర్సు చేయాలి. ఇంటర్ ఎంపీసీ విద్యార్థులు అర్హులు. దేశంలో పలు సంస్థలు ఈ కోర్సును అందిస్తున్నాయి.

కేబిన్ క్రూ

విమానం లోపల సేవలందించే సిబ్బందిగా పనిచేయడానికీ కోర్సులున్నాయి. ఇంటర్మీడియట్ తర్వాత కేబిన్ క్రూ, ఎయిర్ హోస్టెస్‌లలో శిక్షణ పొందినవారు కేబిన్ సిబ్బంది పోస్టులకు దరఖాస్తు చేయవచ్చు. ఆరు నెలలు/ ఏడాది వ్యవధితో పలు ప్రైవేటు సంస్థలు ఈ కోర్సును అందిస్తున్నాయి. కొన్ని విమానయాన సంస్థలూ ఈ శిక్షణ అందించి, నేరుగా ఉద్యోగంలోకి తీసుకుంటున్నాయి.

పై మూడు మార్గాలూ నేరుగా వివిధ విమానయాన సంస్థల్లో పనిచేసేందుకు ఉద్దేశించినవి. విమాన రాకపోకలకు మౌలిక సదుపాయాలు కల్పించే ఎయిర్‌పోర్టులు, గ్రౌండ్ ఆపరేషన్స్ విభాగాల్లో సేవలందించే కొలువులూ ఉన్నాయి..

ఏవియేషన్, ఎయిర్‌పోర్ట్ మేనేజ్‌మెంట్

ఇందులో నేరుగా విమానాశ్రయ నిర్వహణలో పనిచేసే ఉద్యోగాలుంటాయి. అలాగే వివిధ విమానయాన సంస్థలు ఎయిర్‌పోర్టుల్లో నిర్వహించే కార్యకలాపాల్లో పాల్గొనే ఉద్యోగాలు యువతను ఆకర్షిస్తున్నాయి. ఈ హోదాలు పొందడానికి బీబీఏ- ఏవియేషన్ మేనేజ్‌మెంట్, బీఎస్సీ- ఏవియేషన్, ఎయిర్‌పోర్ట్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా, పీజీ కోర్సుల్లో ఏవైనా పూర్తి చేయాలి. దేశ వ్యాప్తంగా పలు సంస్థలు వీటిని అందిస్తున్నాయి.

కార్గోలోనూ అవకాశాలు

పౌర విమానయాన రంగంతో పాటు ఎయిర్ కార్గో (ఆకాశ మార్గాన సరకు రవాణా రంగం) కూడా శరవేగంగా వృద్ధి చెందుతోంది. సరకు రవాణా, నిర్వహణలో ఆసక్తి ఉన్న యువతకు మంచి అవకాశాలున్నాయి. కార్గో హ్యాండ్లింగ్ (సరకు నిర్వహణ), గ్రౌండ్ స్టాఫ్ (క్షేత్రస్థాయి సిబ్బంది), సరకు సరఫరా వ్యవస్థ పర్యవేక్షణలో వివిధ స్థాయి ఉద్యోగాలను విమానయాన సరకు రవాణా సంస్థలు అందిస్తున్నాయి.

క్షేత్రస్థాయి కార్యకలాపాల (ఆపరేషన్స్, గ్రౌండ్ కంట్రోల్ హ్యాండ్లింగ్) విభాగంలో కార్గో ఏజెంట్స్, లోడ్ ప్లానర్స్, స్టోరింగ్ బాధ్యతల నిర్వహణలో ఉద్యోగావకాశాలు తరచూ వస్తున్నాయి. అలాగే, కార్గో ఆపరేషన్స్ మేనేజర్లు, స్టోర్ ఎగ్జిక్యూటివ్స్, హెచ్.ఆర్. బిజినెస్ పార్ట్‌నర్స్ లాంటి హోదాలు కార్గో మేనేజ్‌మెంట్, అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఉంటున్నాయి. లాజిస్టిక్స్, సప్లయ్ చెయిన్ విభాగంలో సరకు రవాణా ప్రణాళిక, సమన్వయ బాధ్యతల పర్యవేక్షణకు భారీ ఎత్తున సిబ్బందిని తీసుకుంటున్నారు. సాధారణంగా ఈ హోదాలన్నిటికీ ఇంటర్ కనీస విద్యార్హత. ఉన్నత స్థాయి హోదాలకు డిగ్రీ కావాలి. అయితే విద్యార్హతలతో పాటు ప్రభావవంతమైన భావవ్యక్తీకరణ, పనివేళల రీత్యా షిఫ్టుల్లో పనిచేసే ఆసక్తి, సరకు రవాణా విషయంలో లోతైన పరిజ్ఞానం, రవాణా విధివిధానాలపై అవగాహన, లాజిస్టిక్స్ సాఫ్ట్‌వేర్ నైపుణ్యం ఉంటే కార్గో కంపెనీలు మంచి ప్యాకేజీ ఆఫర్ చేస్తున్నాయి.



ప్రతి రంగంలోనూ కృత్రిమ మేధ (ఏఐ) సింహభాగాన్ని ప్రభావితం చేస్తోంది. అయితే విమానయాన రంగంలో మాత్రం దాని పాత్ర సాంకేతిక విభాగాలకే పరిమితం. అందువల్ల ఇందులో ఏటా సిబ్బంది అవసరం పెరుగుతోంది. ఆసక్తి ఉన్నవారు విమానయాన రంగంలోకి నిశ్చింతగా ప్రవేశించి కెరియర్ పరంగా గగన వీధుల్లో విహరించవచ్చు.

యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

వేతనాలు

- ✦ పైలట్ శిక్షణ పొందినవారికి రూ.12 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ప్రారంభంలో వార్షిక వేతనాలు అందుతాయి.
- ✦ కేబిన్ క్రూ సిబ్బందికి రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షల వార్షిక వేతనాలు సంస్థలు ఇస్తున్నాయి.
- ✦ ఎయిర్‌క్రాఫ్ట్ నిర్వహణ సిబ్బంది విద్యార్హతలతో పాటు తగిన కౌశలాలు సాధిస్తే ఏడాదికి రూ.6 లక్షలు - రూ.10 లక్షల మధ్య ప్యాకేజీ దక్కుతోంది.
- ✦ ఏవియేషన్ మేనేజ్‌మెంట్‌లో బీబీఏ పూర్తిచేసిన వారికి రూ.5 - రూ.12 లక్షల మధ్య వార్షిక వేతనాన్ని విమానయాన సంస్థలు ఆఫర్ చేస్తున్నాయి.
- ✦ ఎయిర్ లైన్స్ క్షేత్రస్థాయి కార్యకలాపాల్లో పాలుపంచుకునే సిబ్బందికి రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వేతనాలిస్తున్నాయి.

చదువు

■ e-mail: edc@eenadu.in

ఎంఏ లింగ్విస్టిక్స్ కోర్సు చదువుతున్నాను. ఇది పూర్తయిన తర్వాత ఎలాంటి ఉద్యోగాలు ఉంటాయి. - జమీరుద్దీన్

■ ఎంఏ లింగ్విస్టిక్స్ భాషను శాస్త్రీయంగా అధ్యయనం చేసే పీజీ ప్రోగ్రాం. ఇది భాషల నిర్మాణం, ఉచ్చారణ, అర్థం, సమాజంతో భాషల సంబంధం, భాషా సాంకేతికత లాంటి అంశాలపై లోతైన అవగాహనను అందిస్తుంది. ఈ కోర్సు పూర్తిచేసిన వారికి విద్య, పరిశోధన, పరిపాలన, మీడియా, ఐటీ లాంటి రంగాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి. భాషా శిక్షణ సంస్థల్లో ట్రెయినర్, కమ్యూనికేషన్ స్కిల్స్ కోచ్‌గానూ పనిచేయవచ్చు. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులుగా అవకాశాలుంటాయి. నెట్ లేదా సెట్ అర్హతతో డిగ్రీ కళాశాలల్లో, పీహెచ్‌డీ పూర్తిచేస్తే విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కొనసాగవచ్చు.

ఎంఏ లింగ్విస్టిక్స్‌తో ఎలాంటి ఉద్యోగాలు?

◗ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాషా పరిశోధనా సంస్థలు, సాహిత్య అకాడమీలు, భాషా సర్వే సంస్థల్లో రిసెర్చ్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ ఫెలో, భాషా శాస్త్ర నిపుణులుగా పనిచేయవచ్చు. నిఘంటు తయారీ, భాషా డాక్యుమెంటేషన్, అంతరించిపోతున్న భాషలపై పరిశోధన లాంటి రంగాల్లో లింగ్విస్టిక్స్‌కు ప్రాధాన్యం ఉంది.

ఎంఏ లింగ్విస్టిక్స్‌తో పాటు జర్నలిజం చదివితే మీడియా, ప్రచురణ రంగంలో సబ్ ఎడిటర్, కంటెంట్ రైటర్, స్క్రిప్ట్ రైటర్, ప్రూఫ్ రీడర్ లాంటి ఉద్యోగాలు లభిస్తాయి. పుస్తక ప్రచురణ సంస్థల్లో మాన్యుస్క్రిప్ట్ ఎడిటింగ్, ట్రాన్స్‌లేషన్ లాంటి పనులూ చేయవచ్చు.

◗ ప్రైవేటు రంగ ఉద్యోగాలతో పాటు కొన్ని ప్రభుత్వ ఉద్యోగాలూ ఎంఏ లింగ్విస్టిక్స్ విద్యార్థులకు అందుబాటులో ఉంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో అనువాదకులు, భాషా నిపుణులు, ప్రచార విభాగాల్లో కంటెంట్ ఆఫీసర్ లాంటి పోస్టులకు అర్హత ఉంటుంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

వీఎన్ఐటీలో ఉద్యోగాలు

విశ్వేశ్వరయ్య నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఎన్ఐటీ) నాగ్‌పుర్.. నాన్ టీచింగ్ విభాగాల్లో పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- లైబ్రేరియన్: 01
- సీనియర్ సైంటిఫిక్/టెక్నికల్ ఆఫీసర్: 02
- సైంటిఫిక్/టెక్నికల్ ఆఫీసర్: 03
- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్: 01
- సూపరింటెండెంట్: 05
- లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్: 01
- జూనియర్ ఇంజినీర్: 01
- టెక్నికల్ అసిస్టెంట్: 08
- సీనియర్ అసిస్టెంట్: 02
- సీనియర్ టెక్నీషియన్: 03
- జూనియర్ అసిస్టెంట్: 03
- టెక్నీషియన్: 10
- ఆఫీస్ అటెండెంట్/ల్యాబ్ అటెండెంట్: 05

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్మీడియట్, బ్యాచిలర్ డిగ్రీ, బీఈ/బీటెక్, ఎమ్మెస్సీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

వేతన శ్రేణి: నెలకు రూ.18,000- రూ.1,44,200.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 01.03.2026. **వెబ్‌సైట్:** https://vnit.ac.in/

హెచ్‌సీఎల్‌లో

హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్), కోల్‌కతా వర్క్ మెన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- వర్క్ మెన్: 18

అర్హత: పోస్టులను అనుసరించి పదోతరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీతో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: 01.01.2026 నాటికి 40 ఏళ్లు మించరాదు. ఎస్సీ, ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీకి మూడేళ్లు సడలింపు ఉంటుంది.

వేతన శ్రేణి: నెలకు రూ.28,120 - రూ.55,620.

దరఖాస్తు ఫీజు: రూ 500. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఫీజు లేదు.

ఎంపిక: రాత పరీక్ష, ట్రేడ్ టెస్టులతో

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 25.02.2026

వెబ్‌సైట్: https://www.hindustancopper.com/Page/Career_New

(c) eenadu

గుంటూరు పశ్చిమ

ప్రజలకు అండగా ఉండడమే ప్రభుత్వ లక్ష్యం

సీఎం సహాయ నిధి చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే మాధవి

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. పశ్చిమ తెదేపా కార్యాలయంలో 47 మంది బాధితులకు రూ.91,31,362 సీఎం సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) చెక్కులను బాధితులకు మంగళవారం అందజేశారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ ఇప్పటి వరకు గుంటూరు పశ్చిమంలో రూ.6,05,50,820 సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు ఇచ్చినట్లు తెలిపారు.

★ ట్రాన్స్‌జెండర్ల ఉపాధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. మహిళా గ్రీవెన్స్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం వికాస్ ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మహిళా గ్రీవెన్స్‌లో చిట్టీ మోసాలు, గంజాయి వినియోగం, ఈవ్ టీజింగ్, వీధి దీపాలు వంటి సమస్యలు వచ్చాయని తెలిపారు.

జనసేన నాయకురాలినంటూ మోసాలు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: తాను జనసేన నాయకురాలినని, ఉద్యోగం ఇప్పిస్తానని హైదరాబాద్‌కు చెందిన సుమలత తనను మోసం చేసిందని గుంటూరుకు చెందిన ప్రస్తుతం నిడమర్రులో నివాసం ఉంటున్న స్వర్ణలత పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళగిరి గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తనకు పరిచయస్థుడైన రాజు అనే వ్యక్తి ద్వారా తన సమాచారం తీసుకుని సదరు మహిళ తనకు ఎస్ఆర్ఎం వర్సిటీలో ఉద్యోగం ఇప్పిస్తానని గతేడాది రెండు విడతలుగా రూ.53,700 తీసుకుందని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. గట్టిగా ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని ఆమె పోలీసులకు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదైంది. కాగా, మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో గత నెల బేతపూడి సాంబయ్య అనే వ్యక్తిని రూ.1,13,000లకు, ఈ నెల 21న 1,83,000లకు మరొకరిని సుమలత మోసగించినట్లు కేసులు నమోదయ్యాయి.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80086 22566, 97042 53525, 80085 74897

? శాంతినగర్‌లోని కాలువల వెంబడి పిచ్చి మొక్కలు అధికంగా ఉండడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. వాటిని తొలగించండి. **-స్థానికులు.** ✔ పారిశుద్ధ్య కార్మికులను పంపి పిచ్చి మొక్కలు తొలగింపజేస్తాం. **– అంగడి వెంకటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్.** ? కృష్ణబాబు కాలనీలో కాలువల్లో పూడిక రోజూ తీయడంలేదు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. **– స్థానికులు.** ✔ రోజూ కాలువలు శుభ్రపర్చేలా చర్యలు తీసుకుంటాం. **– బుల్లయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ -న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

దివ్యాంగులకు ఇంటి వద్దే రేషన్

దివ్యాంగులకు ఇంటి వద్దే రేషన్ అందిస్తున్న జేసీ అశుతోష్ శ్రీవాస్తవ

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: 65 సంవత్సరాలు దాటిన వృద్ధులతో పాటు దివ్యాంగులకు ఇంటి వద్దే రేషన్ పంపిణీ చేస్తున్నామని జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామంలో దివ్యాంగులకు, వృద్ధులకు మంగళవారం ఇంటి వద్ద రేషన్ అందించారు. జేసీ మాట్లాడుతూ ప్రతి నెలా 26 నుంచి 30వ తేదీ వరకు ఇంటింటికీ రేషన్ పంపిణీ జరుగుతోందని చెప్పారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రతినెలా రేషన్ అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్‌వో పి.కోమలి పద్మ తదితరులు పాల్గొన్నారు.

ధర వరలు

కృష్ణనగర్ రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో): టమాట 14, వంగ 24, బెండ 29, పచ్చిమిర్చి 36, కాకర 40, బీర 42, క్యాలీఫ్లవర్ 25, క్యాబేజీ 20, క్యారెట్ 28, దొండ 48, బంగాళదుంప 22, ఉల్లిపాయలు 25, గోరుచిక్కుడు 36, దోస 36, సొర 14, పొట్ల 26, అరటికాయ 10, పెద్దచిక్కుడు 54, చామదుంప 23, బీట్‌రూట్ 26, కీరదోసకాయ 39, బీన్స్ 64, క్యాప్సికమ్ 54, కొత్తిమీర 20, ఆకుకూరలు 10, నిమ్మకాయలు 30, అల్లం 75, వెల్లుల్లి 160. - న్యూస్‌టుడే, పట్టాభిపురం

పనిచేయని లిఫ్ట్‌లు.. పడాల్సిందే అగచాట్లు

సర్వజనాసుపత్రిలో రెండు నెలలుగా ఇదే పరిస్థితి

నగరంపాలెం, న్యూస్‌టుడే

గుంటూరు సర్వజనాసుపత్రికి వస్తే మెరుగైన వైద్యం అందుతుందనే నమ్మకం. అధునాతన సౌకర్యాలు.. నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉండటంతో అరుదైన శస్త్రచికిత్సలు చేస్తుంటారు. అందుకే ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు పరిసర జిల్లాల నుంచి రోజూ నాలుగైదు వేల మంది రోగులు, వారి సహాయకులు వస్తుంటారు. అయితే ఇక్కడి లిఫ్టులు పని చేయకపోవడంతో రోగులకు ఇక్కట్లు తప్పడంలేదు. నెలలుగా ఇదే పరిస్థితి నెలకొన్నా పట్టించుకునేవారు లేకపోయారు.

సర్వజనాసుపత్రిలోని అత్యవసర వైద్య సేవల విభాగంలో కీలకమైన ట్రామా, న్యూరో, కార్డియాలజీ విభాగాలు ఉన్నాయి. మూడు అంతస్తులు కలిగిన అత్యవసర వైద్య సేవల విభాగంలో రోగుల అవసరాలు తీరేలా ఐదు లిఫ్టులు ఏర్పాటు చేశారు. ప్రారంభంలో వాటి నిర్వహణ బాగానే ఉన్నా రానురాను పట్టించుకోకపోవడంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో రోగులు మూడంతస్తులు ఎక్కి వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఐదేళ్ల కిందట ఐదు లిఫ్ట్‌ల్లో వైద్యులు వినియోగించే ఒకటి పూర్తిగా మూలనపడింది. దీంతో వినియోగంలో నాలుగు మాత్రమే ఉన్నాయి. అవి కూడా అడపాదడపా పాడవడం.. తాత్కాలికంగా మరమ్మతులు చేయించేవారు. రెండు నెలల నుంచి నాలుగు లిఫ్టులు పూర్తిగా మూసివేయడంతో అత్యవసర వైద్యసేవల విభాగానికి వచ్చే రోగులు, సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

☛ మొదటి అంతస్తులో శస్త్రచికిత్సల థియేటర్లు, రెండో అంతస్తులో గుండె సంబంధిత వ్యాధుల విభాగం, మూడో అంతస్తులో నరాల సంబంధిత వ్యాధుల విభాగాలు ఉన్నాయి.

☛ వార్డుల్లో ఇన్‌పేషెంట్‌గా చేరిన వారికి వైద్యులు వ్యాధి నిర్ధారణ పరీక్షలు రాయడంతో.. వారిని చేయించేందుకు పాతభవనం, అత్యవసర వైద్యసేవల విభాగంలోని గ్రౌండ్ ఫ్లోర్‌కు మెట్ల మార్గాన రావాలి. దీంతో రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు మెట్లపై కొంతదూరం నడిచే సరికి.. తీవ్ర ఆయాసంతో ఇబ్బంది పడుతున్నారు. లిఫ్టుల గురించి అడిగితే పైన రెండు అంతస్తుల నిర్మాణం జరుగుతోందంటున్నారని, ప్రత్యామ్నాయం చూపకుండా లిఫ్టులను నిలిపివేయడం సరికాదని బాధితులు అంటున్నారు.

జీజీహెచ్ అత్యవసర వైద్య సేవల విభాగంలో పని చేయని లిఫ్టులు

అదనపు అంతస్తుల నిర్మాణం కారణంగానే..

జీజీహెచ్ అత్యవసర వైద్యసేవల విభాగం పైన మరో రెండు అంతస్తుల నిర్మాణం జరుగుతోంది. పైఅంతస్తుల్లోనూ లిఫ్టులు అనుసంధానం చేసేందుకు తాత్కాలికంగా నిలుపుదల చేశాం. పనులు వేగంగా సాగుతున్నాయి. పనులు పూర్తయిన తర్వాత ఐదు అంతస్తులకు లిఫ్టులు అనుసంధానం చేసి రోగులకు అందుబాటులోకి తీసుకొస్తాం. **- జి.వెంకటేశ్వరరావు, సీఎస్ఆర్ఎంఓ**

వీఆర్వోలకు ఉద్యోగోన్నతుల్లో న్యాయం చేయాలి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జీవో 154 ప్రకారం వీఆర్వోలకు పదోన్నతుల్లో న్యాయం చేయాలని ఏపీ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసన్నకుమార్, కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవలను కలిసి వినతిపత్రం అందించారు. ప్రస్తుతమున్న ఖాళీల్లో 40 శాతం వీఆర్వోలకు పదోన్నతులు ఇవ్వడం ద్వారా భర్తీ చేయాలని కోరారు. సీనియారిటీ జాబితాలో అర్హతలు ఉంటేనే పదోన్నతి ఇవ్వాలని విన్నవించారు. నిర్ణీత గడువులోగా శాఖపరమైన పరీక్షలు నిర్వహించి.. ఉత్తీర్ణులు కాని వారిని రివర్ట్ చేయాలని కోరారు. గతంలో మినహాయింపు ఇచ్చిన వారిని కూడా రివర్ట్ చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

అనుబంధ సంఘాలకు నాయకుల నియామకం

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: పశ్చిమ నియోజకవర్గం తెదేపా అనుబంధ విభాగాల నాయకులను నియమించినట్లు ఎమ్మెల్యే గల్లా మాధవి తెలిపారు. తెలుగు మహిళ అధ్యక్షురాలుగా మత్తినేని శివలీల, ప్రధాన కార్యదర్శిగా చెంబేటి మణికుమారి, తెలుగు యువత అధ్యక్షుడుగా షేక్ జనత్‌హుస్సేన్, ప్రధాన కార్యదర్శి మంగళగిరి అశోక్‌చౌదరి, బీసీ సెల్ అధ్యక్షుడుగా ఉప్పుతల సాంబశివరావు, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు చాపల, వాణిజ్య విభాగం అధ్యక్షులుగా కొత్తమాసు సురేష్, ప్రధాన కార్యదర్శిగా బత్తిని శ్రీను, మైనారిటీ సెల్ అధ్యక్షులుగా ఫరూన్ ఆస్తుతుల, ప్రధాన కార్యదర్శిగా షేక్ మహ్మద్ రఫీలు నియమితులయ్యారు.

నారాయణ స్తోత్ర పఠనంతో అంతర్గత శాంతి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: నారాయణ స్తోత్ర పఠనంతో భక్తుల్లో అంతర్గత శాంతి, ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుందని ప్రవచనకర్త కేవీ కోటేశ్వరరావు అన్నారు. బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై మంగళవారం ఆదిశంకరాచార్య రచించిన నారాయణ స్తోత్రంపై ప్రవచనం చేశారు. శ్రీమహావిష్ణువు కీర్తనే అత్యంత మహిమాన్వితమైన స్తోత్రం అన్నారు. నారాయణ నారాయణ జయ గోవింద హరే అనే పల్లవితో ప్రారంభమై, విష్ణువు దివ్య రూపాలను, గుణాలను వర్ణిస్తూ కష్టాలను, పాపాలను తొలగిస్తుందన్నారు.

ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాల్సిందే

యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం వద్ద బ్యాంకు ఉద్యోగుల నిరసన

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: బ్యాంకు ఉద్యోగులకు ఐదు రోజుల పని విధానం ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జీటీ రోడ్డులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ 2015 నుంచి అనేక పోరాటాల ఫలితంగా ఐదు రోజుల పని విధానం ఒప్పందం జరిగిందని, రెండేళ్లుగా ప్రభుత్వ ఆమోదం కోసం కాలయాపన చేస్తున్నారన్నారు. ఆర్బీఐ, ఎల్ఐసీ, నాబార్డ్, ఇన్సూరెన్స్, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఇప్పటికే ఐదు రోజుల పని విధానాన్ని పాటిస్తున్నారన్నారు. ఒక్క బ్యాంకింగ్ రంగంలోనే ఒప్పందం జరిగినా అమలు చేయడంలేదన్నారు. బ్యాంకుల్లో దాదాపు రెండు లక్షల ఖాళీలున్నా భర్తీ చేయకపోవడంతో ఉద్యోగులపై పని ఒత్తిడి పెరిగి వ్యక్తిగత, వృత్తి పరమైన జీవితం మధ్య అసమతుల్యత ఏర్పడడంతో అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. తక్షణమే ఒప్పందాన్ని అమలు చేయాలని, లేకపోతే ఉద్యమానికి శ్రీకారం చుడతామని ప్రకటించారు. నిరసనలో సంఘ నాయకులు జయకుమార్, కిశోర్ కుమార్, బాషా, కోటిరెడ్డి, కల్యాణ్, రామకృష్ణ, సాంబశివరావు, రవిచంద్రారెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా అరికట్టరూ..!

రామన్నపేట ఒకటో లైను నాలుగో అడ్డరోడ్డులో ప్రాణధార వృథాగా పోతుంది. ఇక్కడ మంచినీటి పైపులైను లీకవడంతో మంచినీరు మురుగు కాలువలోకి చేరుకుంటుంది. రోజులుగా ఇదే పరిస్థితి నెలకొందని, తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆ ప్రాంతవాసులు గోడు వెళ్లబోసుకుంటున్నారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అతీగతీ లేదంటున్నారు. ఇప్పటికైనా జీఎంసీ అధికారులు స్పందించి పైపులైనుకు మరమ్మతులు నిర్వహించి ప్రాణధార వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, పట్టాభిపురం**

తేనీరు కాదు.. తాగునీరే..

కావేరినగర్ నందికట్ల కాంప్లెక్స్‌లోని నివాస గృహాల్లో రంగు మారిన నీరు

తెలికంనగర్ ప్రాంత వాసులకు తాగునీటి కష్టాలు తీరడంలేదు. 7వ లైన్‌లో నీటి సరఫరా సక్రమంగా జరగకపోగా.. వస్తున్న నీరు సైతం బురద రంగులో ఉండటంతో తాగలేకపోతున్నామని ఆ ప్రాంతవాసులు పేర్కొంటున్నారు. దుర్వాసన కూడా వస్తుండడంతో ఇంటి అవసరాలకు కూడా వాడుకోవడానికి వీలు కావడం లేదంటున్నారు. తరచూ ఇదే సమస్య వస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఆ నీరు తాగితే.. రోగాల బారిన పడే అవకాశముందని, అధికారులు సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

ఉన్నా లేనట్లే.. నగదు రావట్లే..



జీడీసీసీ బ్యాంకు ఏటీఎం ఉన్నా ప్రజలకు ఉపయోగపడటంలేదు. అరండల్‌పేట రెండో లైన్‌లో జీడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయం ఉంది. కార్యాలయ ప్రాంగణంలో బ్యాంకు ఖాతాదారుల సౌకర్యార్థం ఏటీఎం ఏర్పాటు చేశారు. చిన్నపాటి మరమ్మతులు వచ్చినా సిబ్బంది పట్టించుకోవడంలేదు. దూరప్రాంతాల నుంచి నగదు తీసుకుందామని వచ్చేవారు ఏటీఎం మూతపడి ఉండటంతో నిరాశగా వెనుదిరగాల్సి వస్తోంది. రెండు నెలలుగా ఇది మూతపడి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి ఏటీఎంను అందుబాటులోకి తీసుకురావాలని ఖాతాదారులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, గుంటూరు నగరం**

రహదారిపైనే కుప్పలు.. రాకపోకలకు అవస్థలు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే

రోడ్డుకు అడ్డంగా పోసిన కంకర

ప్రధాన వాణిజ్య ప్రాంతంగా పేరున్న లక్ష్మీపురంలో చేపట్టిన పనులతో గత నెల రోజులుగా ప్రజలు ఇబ్బదులు పడుతున్నారు. లక్ష్మీపురంలోని బ్యాంకు ఆఫ్ బరోడా పక్క వీధిలో ఇసుక, కంకర, సిమెంట్ రోడ్డుపైనే నిల్వ చేశారు. గుత్తేదారుడు సిమెంట్ రోడ్లు, కాల్వల నిర్మాణం కోసం వినియోగిస్తున్న సామగ్రిని ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉన్న ప్రాంతంలో నిల్వ చేసుకోవాలి. అలాంటిది ప్రజలు రాకపోకలు సాగించే రద్దీ రోడ్లపైన ఇసుక, కంకర గుట్టలుగా నిల్వ చేశారు. సిమెంట్ బస్తాలు రోడ్డుపైనే పెట్టారు. దీంతో ఈమార్గంలో రాకపోకలకు నెలరోజులకు పైగా ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇసుక, కంకర గుట్టలు దాటే క్రమంలో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రాకపోకలకు అడ్డుగా ఉన్న నిర్మాణ సామగ్రిని తీసేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ముగ్గురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

అధికారులకు ఆదేశాలిస్తున్న కమిషనర్ మయూర్ అశోక్

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఏఈ అప్పలనాయుడు, ఆర్ఐ ఫయాజ్, కల్యాణ మండపాల కేర్‌టేకర్ వీర్రాజులకు జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్ షోకాజ్ నోటీసులిచ్చారు. మంగళవారం ఆయన పాతగుంటూరు, యాదవ బజారు, బాలాజీనగర్, ఎల్బీనగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధుల్లో అంకితభావం, సమగ్ర అవగాహనతో పనిచేయాలని.. నిర్లక్ష్యంగా ఉంటే చర్యలుంటాయని హెచ్చరించారు. మురుగునీటి కాలువలకు సమాంతరంగా తాగునీటి పైపులైన్లు ఉండటానికి వీల్లేదన్నారు. పాతగుంటూరులో యూజీడీ పైపు లైను పనులను పరిశీలించారు. తాగునీటి పైపు లైను, ఇతర వివరాలను స్థానిక ఏఈని అడగ్గా... ఆయన చెప్పలేకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. వివరాలు తనకు అందించాలని డీఈఈని ఆదేశించారు. అభివృద్ధి పనులన్నింటినీ ఏఈలు, మౌలిక సదుపాయాల కార్యదర్శులు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. యాదవబజారులోని శ్రీకృష్ణ కల్యాణ మండపం అద్దె విషయంపై అవగాహన లేదన్న ఆర్ఐ ఫయాజ్, వివరాల నమోదులో నిర్లక్ష్యంగా ఉన్న కేర్‌టేకర్ వీర్రాజులకు షోకాజ్ నోటీసులిచ్చారు. ఎస్ఈ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ అశోక్, ఆర్వో సాదిక్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

★ బస్టాండ్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను కమిషనర్ మయూర్ అశోక్ పరిశీలించారు. మౌలిక సదుపాయాల అవసరం ఉంటే నోడల్ అధికారుల దృష్టికి తేవాలని సూచించారు.

రైతు క్షేమంగా ఉంటేనే దేశం సుభిక్షం

మాట్లాడుతున్న కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: రైతు క్షేమంగా ఉంటేనే దేశ సుభిక్షంగా ఉంటుందని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి తెలిపారు. గుంటూరులోని భాజపా జిల్లా కార్యాలయంలోని వాజ్‌పేయీ భవన్‌లో కిసాన్ మోర్చా జిల్లా విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు తుల్లిమిల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కుమారస్వామి మాట్లాడుతూ రైతులకు సమస్యలుంటే కిసాన్ మోర్చా నాయకులు సత్వరం స్పందించి పరిష్కారం చూపాలన్నారు. పార్టీ బలోపేతం చేయడానికి గ్రామ కమిటీలు వేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా భాజపా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపిశ్రీనివాస్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.వి.సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శులు దొడ్డ నాగరాజు, చరక కుమార్ గౌడ్, స్పైసెస్ బోర్డు సభ్యుడు కొత్తూరి సుబ్బారావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వి.గంగాధర్, పార్లమెంట్ సంయోజక్ భీమినేని చంద్రశేఖర్‌లు ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు దేసు సత్యనారాయణ, భజరంగ్ రామకృష్ణ, కె.నారాయణ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వాసుదేవ నాయుడు, విమలాదేవి, మేరీ సరోజిని, శివయ్య, కార్యాలయ కార్యదర్శి కుందూరు నాగేశ్వరావు, జిల్లా అధ్యక్షులు రాధా మాధవి(మహిళా మోర్చా), శ్రీనివాస్ నాయక్(ఎస్టీ మోర్చా), రామారావు(ఓబీసీ మోర్చా), సాంబశివరావు(మైనార్టీ మోర్చా), నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అసమానతల నిర్మూలనకు పోరాడిన కర్పూరీ ఠాకూర్

పారిశ్రామికవేత్త రమేష్‌బాబుకు పురస్కారం అందిస్తున్న నాయకులు

గోరంట్ల, న్యూస్‌టుడే: సామాజిక న్యాయం కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు జన్‌నాయక్ కర్పూరీ ఠాకూర్ అని పలువురు నాయకులు కొనియాడారు. నగరాలు ఐడీ ఆసుపత్రి సమీపంలో నాయీబ్రాహ్మణ నంద యువసేన ఆధ్వర్యంలో కర్పూరీ ఠాకూర్ జయంతి సభ మంగళవారం నిర్వహించారు. సభలో ప్రముఖ పారిశ్రామికవేత్త రమేష్‌బాబు, విద్యావేత్త విష్ణుకుమార్ సేన్, భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గోపి శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు. సమాజంలోని అత్యంత వెనుకబడిన వర్గానికి కర్పూరీ ఠాకూర్.. ఆటంకాలను అధిగమించి, దీక్షతో శ్రమించి, సమాజాభివృద్ధికి పాటుపడ్డారన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక స్థితిగతులతో సంబంధం లేకుండా అవకాశాలు పొందాలన్న లక్ష్యంతో సమాజాన్ని పీడిస్తున్న వ్యవస్థాగత అసమానతలు నిర్మూలించడానికి పట్టుదలతో కృషి చేశారన్నారు. నాయీబ్రాహ్మణ నంద యువసేన రాష్ట్ర అధ్యక్షుడు బాబ్జినంద మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి జన్‌నాయక్ కర్పూరీ ఠాకూర్ స్మారక పురస్కారం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ పారిశ్రామికవేత్త రమేష్‌బాబుకు అవార్డు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు తాడివలస దేవరాజు, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైకాపా పతనానికి యువగళం నాంది

కేకు కోస్తున్న తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, కార్పొరేటర్ కోటేశ్వరరావు

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: వైకాపాకు ప్రతిపక్ష హోదా రాకుండా చేయడంలో మంత్రి నారా లోకేశ్ ప్రారంభించిన యువగళం పాదయాత్ర నాంది పలికిందని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. లోకేశ్ ప్రారంభించిన యువగళం యాత్ర మంగళవారానికి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా కొరిటెపాడులోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కోశారు. కనపర్తి మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో ఆర్థిక నేరస్థుడికి.. స్మార్ట్ పొలిటీషియన్‌కు మధ్య తేడా ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరాంప్రసాద్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నగరపాలకసంస్థ: మంత్రి నారా లోకేశ్ పాదయాత్ర మూడేళ్లు పూర్తవ్వడంతో పశ్చిమ తెదేపా కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే గల్లా మాధవి కేక్ కోసి అభిమానులకు తినిపించారు. ఆయన చేసిన పాదయాత్ర క్యాడర్‌లో నూతన ఉత్సాహం, స్ఫూర్తి నింపిన ఓ చరిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు.

యువగళం పాదయాత్ర మూడేళ్లు పూర్తయిన సందర్భంగా కేకు కోస్తున్న పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, మిర్చియార్డు ఛైర్మన్ అప్పారావు

మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

సభ్యులతో మాధవి, ఉమెన్స్ వింగ్ ఛైర్‌పర్సన్ డాక్టర్ మమత, సభ్యురాలు జయశ్రీ తదితరులు

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: మహిళా సాధికారత సాధించడంతో పాటు వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఏపీ ఛాంబర్స్) సెంట్రల్ జోన్ ఉమెన్స్ వింగ్ ఆధ్వర్యంలో గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌లో ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కార్యశాలను నిర్వహించారు. మహిళలు స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించడానికి నిర్వహించిన వర్క్‌షాప్‌లో 'డిజైనర్ థ్రెడ్ బ్యాంగిల్స్', 'డిజైనర్ సారీ టాజిల్స్' (చీర కుచ్చులు) తయారీపై 40 మంది శిక్షణ పొందారు. కార్యక్రమానికి 'రోటరీ ప్రేరణ' అసోసియేట్ పార్టనర్‌గా వ్యవహరించింది. పాల్గొన్న వారికి స్టార్టప్ కిట్‌లను అందజేసింది. ఏపీ ఛాంబర్స్ సెంట్రల్ జోన్ వైస్ ఛైర్‌పర్సన్ సక్కు మాధవి, ఉమెన్స్ వింగ్ ఛైర్‌పర్సన్ డాక్టర్ మమత రాయపాటి, ఉమెన్స్ వింగ్ సభ్యురాలు జయశ్రీ, ఏపీ ఛాంబర్స్ స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ ఛైర్‌పర్సన్ రాధిక, ఈవెంట్స్ అండ్ ప్రోగ్రాం కమిటీ ఛైర్‌పర్సన్ డి.అపర్ణ, రోటరీ ప్రేరణ అధ్యక్షురాలు రిష్విక, కార్యదర్శి అమృత, కోశాధికారులు అనురూప, ప్రవంతి పాల్గొన్నారు.

భార్య, పిల్లల అదృశ్యంపై ఫిర్యాదు

గుంటూరు నగరం: భార్య, పిల్లలు కనిపించడంలేదని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. అరండల్‌పేట పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనగర్‌కు చెందిన పత్తిపాటి నాగమల్లేశ్వరి, కుమారుడు రామేశ్వర్, కుమార్తె వెన్నెలలు ఈనెల 25వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. భార్య, పిల్లల కోసం సమీప ప్రాంతాల్లో వెతికినా.. బంధువులను విచారించినా ఆచూకీ తెలియకపోవడంతో నాగమల్లేశ్వరి భర్త పత్తిపాటి శివ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కృష్ణబాజీబాబు తెలిపారు.

బీపీఎస్‌పై దృష్టి పెట్టండి

నగరపాలక సంస్థ: అక్రమ భవన నిర్మాణాల క్రమబద్ధీకరణ పథకం (బీపీఎస్), ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)పై సిబ్బంది దృష్టి సారించాలని జీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం సిటీప్లానర్ రాంబాబు సూచించారు. మంగళవారం కౌన్సిల్ హాల్‌లో బీపీఎస్, ఎల్ఆర్ఎస్‌లపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఆవిష్కరణలపై దృష్టిసారించాలి

నమూనాలు పరిశీలిస్తున్న డాక్టర్ నరసింహరాజు, ప్రిన్సిపల్ తదితరులు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థులు ఆవిష్కరణలపై దృష్టిసారించాలని డాక్టర్ నరసింహరాజు అన్నారు. చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో డిజైన్ థింకింగ్, క్రిటికల్ థింకింగ్, ఇన్నోవేషన్ డిజైన్ అంశంపై రెండు రోజులు జరగనున్న వర్క్‌షాప్ మంగళవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన నరసింహరాజు మాట్లాడుతూ.. కేవలం పుస్తకజ్ఞానంతోనే కాకుండా సమస్యలను గుర్తించే సామర్థ్యం, సృజనాత్మక ఆలోచన, నూతన ఆవిష్కరణలపై దృష్టిసారించాలన్నారు. అనంతరం ప్రాజెక్టుల తయారీపై మార్గనిర్దేశం చేశారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మురళీమోహన్, జగదీష్, కార్యదర్శి గోపాలకృష్ణ, కోశాధికారి డాక్టర్ కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ రెవెన్యూ సంఘ జిల్లా అధ్యక్షుడిగా ఆనందరావు

నూతనంగా ఎన్నికైన సంఘ కార్యవర్గం

పట్నంబజారు, న్యూస్‌టుడే: జిల్లా గ్రామ రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం రెవెన్యూభవన్‌లో నిర్వహించారు. పల్నాడు జిల్లా వీఆర్వోల సంఘ నాయకులు చారి, రామారావు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ముఖ్యఅతిథులుగా ఏపీఆర్ఎస్ఏ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్, కార్యదర్శి వెంకట్రావు, ఏపీ రెవెన్యూ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోన ఆంజనేయప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనుపమ హాజరయ్యారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మయ్య మాట్లాడుతూ సమస్యలను ఉద్యోగులు ఐక్యంగా పరిష్కరించుకోవాలన్నారు. ఫిబ్రవరి 5న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న అమరావతి జేఏసీ ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో భువనేశ్వరి, కొండయ్య, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

★ జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడిగా పిడుగు ఆనందరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా షేక్ ఆయూబ్, ఉపాధ్యక్షులుగా ఎం.కోటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, పి.మాల్యాద్రి, కె.నాగేశ్వరరావు, కె.గోపి, ఎ.లీల, జనరల్ సెక్రటరీలుగా టీసీహెచ్ రామారావు, టి.సుధాకర్‌రావు, ఎస్.కోకిలరావు, పి.శ్రీనివాసరావు, కె.మల్లేశ్వరరావు, డి.శ్రీనివాసరావు, నరేష్, బి.శిరీష, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా షేక్ మౌలాలి, కట్టా సత్యానందం, పులి భాస్కరరావు, బి.వెంకటేశ్వరరావు, షేక్ రఫీ, ప్రభాకర్, శివజ్యోతి ఎన్నికయ్యారు.

★ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షునిగా మనోహర రాజన్, సహాధ్యక్షుడిగా రవిబాబు, ఉపాధ్యక్షుడిగా మరియదాసు, కార్యదర్శిగా నాగేశ్వరరావు, కోశాధికారిగా షేక్ కరీముల్లా, సంయుక్త కార్యదర్శిగా యశోద ఎన్నికయ్యారు.

కనుల పండువగా సీతారాముల కల్యాణోత్సవం

కల్యాణ క్రతువులో దంపతులు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బ్రాడీపేట రెండో లైనులోని ఓంకార క్షేత్రంలో శ్రీరామ నామ సప్తాహం జరుగుతోంది. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఓంకార క్షేత్ర పాలక మండలి ఉపాధ్యక్షుడు ఘంటసాల వీరకుమార్, చెమిటిగంటి రామకృష్ణ శాస్త్రి దంపతులు కల్యాణ క్రతువు నిర్వహించారు. ఉదయం బ్రాడీపేట పురవీధుల్లో నగర సంకీర్తనతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం పద్మనాభశర్మ భాగవతార్ బృందం సీతా కల్యాణం హరికథా గానం చేశారు. కార్యక్రమాల్లో పాలక మండలి కార్యదర్శి నంబూరు శ్రీమన్నారాయణమూర్తి, సభ్యులు బలభద్రపాత్రుని ఉదయశంకర్, బలభద్రపాత్రుని రాధాకృష్ణ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఈనాడు
అమరావతి
కృష్ణా
బుధవారం జనవరి 28, 2026

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హోంమంత్రి అనిత, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే గద్దె, సీపీ, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

మత్తు వలదురా.. భవిత కలదురా..

మాదకద్రవ్యాలను తరిమేస్తాం: సీపీ రాజశేఖరబాబు

స్కేటింగ్‌తో సందడి చేసిన చిన్నారులు

నా కుమారుడిని మార్చారు: అంజమ్మ

మాదకద్రవ్యాలకు అలవాటు పడిన నా కుమారుడిని పోలీసులు మార్చారు. మంచి మనిషిగా చేసి నాకు అప్పగించారు. ఇప్పుడు చక్కగా పని చేసుకుంటున్నాడు. సంతోషంగా ఉంది. నున్న పోలీసుల సహకారం లేకపోతే నా కుమారుడు నాకు దక్కేవాడు కాదు. నా కుమారుడిలా ఎవరూ బాధ పడకూడదన్న ఆలోచనతో ఇలా ముందుకు వచ్చి చెబుతున్నానని అంజమ్మ వివరించారు.

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: యువత మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి నిర్వీర్యం అవుతోందని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయాలకు అనుగుణంగా మాదకద్రవ్యాలను నామరూపాలు లేకుండా చేయాలని నిర్ణయించామన్నారు. మంగళవారం సాయంత్రం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి 'డ్రగ్స్‌పై దండయాత్ర' పేరుతో 34 రోజుల మహిళా పోలీసుల సైకిల్‌యాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రులు వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు మాదకద్రవ్యాలతో జరిగే నష్టాలు తెలియాలన్న హోంమంత్రి సూచన మేరకు ఉద్యమంలా చేపట్టామన్నారు. ఐదుగురు మహిళా పోలీసు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవడం అభినందనీయమన్నారు.

★ కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలను ఎంత త్వరగా కట్టడి చేయగలిగితే అంత వేగంగా సమాజం బాగుపడుతుందని వివరించారు. ఈగల్ టీమ్స్ ద్వారా కట్టడి చేయడమే కాకుండా ఐవీఆర్ఎస్ కాల్ చేసి ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నారని వివరించారు. సైకిల్‌యాత్ర వెళ్లిన అన్ని మండలాల్లో ఇంతే ఉత్సాహంగా నిర్వహించి మాదకద్రవ్యాలను జిల్లా నుంచి తరిమివేయడానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ★ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారిని డ్రోన్ పైలట్లుగా తీర్చిదిద్దారని, తాజాగా డ్రగ్స్‌పై దండయాత్రకు మహిళా పోలీసు సిబ్బంది ముందుకు వచ్చారన్నారు. ★ విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల కట్టడి అనేది పోలీసుల బాధ్యత మాత్రమే కాదని ప్రజలు కూడా దానికి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. గత ప్రభుత్వం పసి పిల్లలకు సైతం డ్రగ్స్ అలవాటు చేసిందని, సభలు, సమావేశాలకు గంజాయి ప్యాకెట్లు ఇచ్చి యువతను తీసుకొచ్చిందన్నారు. సైకిల్ యాత్రలో పాల్గొంటున్న మహిళా పోలీసులకు మంత్రులు జెర్సీలను ఆవిష్కరించి అందజేశారు. కార్యక్రమం టీజర్‌ను రిమోట్ నొక్కి విడుదల చేశారు.

ఆద్యంతం ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. ఈ కార్యక్రమానికి నగరంలోని పలు కళాశాలలు, పాఠశాలలకు చెందిన విద్యార్థులు సైకిల్ యాత్రలో పాల్గొనేందుకు ఉత్సుకత చూపారు. సైకిళ్లతో సహా స్టేడియంకు విచ్చేశారు. వేల మందితో సభా ప్రాంగణం కిక్కిరిసింది. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. సైకిల్ యాత్ర నిర్వహించే ఐదుగురు మహిళా సిబ్బందిని చూసి యువత హర్షధ్వానాలు చేశారు. అనంతరం సైకిల్ యాత్ర ఇందిరాగాంధీ స్టేడియం నుంచి బెంజి సర్కిల్ వరకు.. అక్కడ నుంచి ఇందిరా గాంధీ స్టేడియంకు చేరుకుంది.

ఇందిరాగాంధీ స్టేడియంలో సభకు హాజరైన ప్రజలు

పకడ్బందీగా ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణ

విజయవాడ సిటీ: నగరంలో ఈ నెల 31 వరకు ఏపీపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బిషప్ అజరయ్య బాలికోన్నత పాఠశాల, పటమట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జూనియర్ అధ్యాపకులు (లైబ్రేరియన్ సైన్స్), ఏఈఈ (సివిల్), ఉద్యానశాఖాధికారి, సహాయ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు తదితర 17 నోటిఫికేషన్ల ద్వారా వెల్లడించిన పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తొలి రోజు మంగళవారం 24 పరీక్ష కేంద్రాల్లో 5,718 మందికి గాను 2,056 మంది అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు.

ప్రశ్నపత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

బెజవాడకు తెచ్చేలోపే.. ప్రాణాలు పోతున్నాయ్..!

- ☛ జాతీయ రహదారులపై ట్రామాకేర్ సెంటర్లే లేవు
- ☛ జగ్గయ్యపేట, నందిగామ, గన్నవరం, పామర్రుల్లో పెట్టరేం?

'ఉమ్మడి కృష్ణాలోని ఎన్‌హెచ్ 65, 16.. ప్రధాన జాతీయ రహదారులపై ఏ పెద్ద ప్రమాదం జరిగినా.. క్షతగాత్రులను విజయవాడకు తేవడం తప్ప.. మరో దారి లేదు. ఎన్‌హెచ్ 65పై.. జగ్గయ్యపేట నుంచి బందరు వరకు 149 కిలోమీటర్లు. ఈ మధ్యలో ఎక్కడ తీవ్ర ప్రమాదం జరిగినా.. విజయవాడకు పరుగెత్తాల్సిందే. చెన్నై-కోల్‌కతా ఎన్‌హెచ్ 16పై.. విజయవాడ నుంచి బొమ్మలూరు టోల్‌గేట్ వరకు 55.02 కిమీ. ఈ మధ్యలోనూ ఒక్క అత్యవసర వైద్య చికిత్సా కేంద్రం లేదు. ఈ జాతీయ రహదారులను ఆనుకుని.. జగ్గయ్యపేట, నందిగామ, గన్నవరం, పామర్రు, ఉయ్యూరుల్లో.. ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటు ప్రతిపాదనలు.. ఏళ్లుగా అమలుకాలేదు.'

80 కిలోమీటర్లు మరణ వేదన..

ఎన్‌హెచ్-65లో.. జగ్గయ్యపేట నుంచి విజయవాడకు 82.02 కిమీ. ఈమధ్యలో నిత్యం ప్రమాద ఘంటికలు మోగుతున్నా.. జగ్గయ్యపేట, నందిగామల్లో సీహెచ్‌సీలు తప్ప పెద్ద ఆసుపత్రుల్లేవు. ఓ మోస్తరు గాయాలైనా స్థానికంగా చికిత్స అందిస్తున్నారు. ★ తీవ్రత మేరకు.. జగ్గయ్యపేట-80, పెనుగంచిప్రోలు-70, నందిగామ-50 కిమీల దూరం నుంచి.. బెజవాడ తెస్తున్నారు. కనీసం గంట-గంటన్నర తప్పదు. ఈలోగా బతకాల్సిన వాళ్లు సకాలంలో చికిత్స అందక చనిపోతున్నారు.

2017లో ముళ్లపాడు వద్ద వంతెన పైనుంచి కిందకు పడిపోయిన బస్సు

పరిశీలన

పెనుగంచిప్రోలు మండలం ముళ్లపాడు వద్ద జాతీయ రహదారిపై ఓ ట్రావెల్స్ బస్సు కొన్నేళ్ల కిందట డివైడర్‌ను ఢీకొని.. పైవంతెన మీద నుంచి కింద కాలువలో పడింది. 11 మంది అక్కడే చనిపోగా.. 30 మంది తీవ్రంగా గాయాలపాలయ్యారు. రాత్రిపూట ప్రమాదం జరగడం, దగ్గర్లో ట్రామాకేర్ సెంటర్ లేక.. క్షతగాత్రులు, మృతదేహాలను అక్కడి నుంచి 72 కిమీ దూరంలో విజయవాడకు తీసుకురావాల్సి వచ్చింది.

- ఈనాడు, అమరావతి

బాబోయ్.. బందరు దారి

విజయవాడ నుంచి బందరుకు 68 కిమీ. ఎన్‌హెచ్ 65ను ఆనుకుని ఒక్క అత్యవసర వైద్య చికిత్సా కేంద్రం లేదు. ★ పామర్రు నుంచి విజయవాడకు 44.01, బందరుకు 26.08 కిమీ. కంకిపాడు- పామర్రు మధ్యలో ఏ తీవ్రప్రమాదం జరిగినా.. విజయవాడకు లేదంటే బందరుకు తరలించాల్సిందే. కనీసం 30-60 నిమిషాలు తప్పదు. మధ్యలో నాలుగైదు ట్రామాకేర్ సెంటర్లు అవసరం. తీవ్ర ప్రమాదాలు జరిగే.. బ్లాక్ స్పాట్‌లూ ఎక్కువే. ★ గుడివాడలో ఏరియా ఆసుపత్రి ఉన్నా.. వెళ్లేందుకు సరైన దారిలేదు. ఒకవేళ తీసుకెళ్లినా సీరియస్ కేసులు బెజవాడకే పంపేస్తున్నారు. ★ పామర్రులో సీహెచ్‌సీ ఉన్నా.. వైద్య వసతులేవు. దీనిని 100 పడకల సెంటర్‌గా మార్చాలి. ★ ఉయ్యూరులో 30 పడకల సీహెచ్‌సీని ట్రామాకేర్ సెంటర్‌గా మార్చొచ్చు.

నందిగామలో అత్యవసరం..

నందిగామ సీహెచ్‌సీ జాతీయ రహదారి పక్కనే ఉంది. 24 మంది వైద్యులున్నారు. నిత్యం ఓపీ 400పైనే ఉండగా.. 10-15 ప్రమాద కేసులు వస్తున్నాయి. తీవ్ర కేసులైతే.. విజయవాడ పంపేస్తారు. ఈ సీహెచ్‌సీని 100 పడకలకు పెంచి రూ.33 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. ★ ఇక్కడ ట్రామాకేర్ సెంటర్ పెడితే.. జగ్గయ్యపేట నుంచి కంచికచర్ల వరకు ఉపయోగం. ★ గౌరవరం దగ్గర ట్రామాకేర్ సెంటర్ కట్టాలని స్థలాన్వేషణ జరిగినా కార్యరూపం దాల్చలేదు.

అధిక ట్రాఫిక్ ఉన్నా అంతే..

★ గన్నవరంలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు ప్రతిపాదన ఏళ్లుగా ఉంది. ఇక్కడ 30 పడకల సీహెచ్‌సీ ఉన్నా.. సాధారణ సేవలకే పరిమితం. విజయవాడ-హనుమాన్‌జంక్షన్ మధ్యలో పెద్ద ప్రమాదం జరిగినా.. విజయవాడ తేవాల్సిందే. అధిక ట్రాఫిక్ నేపథ్యంలో.. తీవ్ర గాయాలైన వారిని ఆసుపత్రికి తెచ్చేలోపే ప్రాణాలుపోయే వీలుంది.

జిల్లాల వారీగా డీఎస్సీ శిక్షణ కేంద్రాలు

గొల్లపూడి, న్యూస్‌టుడే : డీఎస్సీ అభ్యర్థుల కోసం జిల్లాల వారీగా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. గొల్లపూడిలోని బీసీ భవన్‌లో రెండో విడత సివిల్ సర్వీసెస్ శిక్షణ కేంద్రాన్ని మంత్రి మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. సివిల్ సర్వీసెస్ శిక్షణకు 700 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 96 మంది ఎంపికయ్యారని వెల్లడించారు. మొదటి దఫా వంద మందికి శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. అభ్యర్థులందరికీ నాణ్యమైన భోజనం, ఆరోగ్య భద్రత, వసతితో కూడిన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో మరో దఫా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాల వారీగా బీసీ భవనాలను నిర్మాణం చేస్తామన్నారు. అనంతరం అభ్యర్థులకు అవసరమైన మెటీరియల్‌ను అందజేశారు. బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అభ్యర్థులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

ముందస్తు చర్యలతో.. మాతృ మరణాలు నివారించాలి

ప్రసూతి మరణాలపై సమీక్షిస్తున్న కలెక్టర్ బాలాజీ

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: జిల్లాలో మాతృ మరణాలు లేకుండా అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డీకే బాలాజీ వైద్యారోగ్యశాఖాధికారులకు సూచించారు. ప్రసూతి మరణాలపై మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఇటీవల రెండు ప్రసూతి మరణాలకు సంబంధించిన కారణాలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ హైరిస్క్ ప్రెగ్నెంట్ కేసుల విషయంలో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని, ప్రాణనష్టం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులకు సంబంధించి ఎటువంటి ఫిర్యాదులొచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డా.యుగంధర్, డీసీహెచ్ఎస్ డా.శేషు, ఇమ్యునైజేషన్ అధికారి ప్రేమ్‌చంద్, డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఎన్జీవో ప్రతినిధి కరెడ్ల సుశీల పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి..

జిల్లాలోని రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. రాష్ట్ర సచివాలయం నుంచి మంగళవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జయలక్ష్మి నిర్వహించిన వీసీకి కలెక్టర్ హాజరయ్యారు. భూసమస్యలు, పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం, మ్యుటేషన్, పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ, కుల ధ్రువీకరణ పరిశీలన తదితర అంశాలకు సంబంధించి జిల్లాలో పురోగతిని వారికి వివరించారు. రెవెన్యూ క్లినిక్‌లకు వచ్చే అర్జీలు, రీసర్వేకు సంబంధించి గుడివాడ, మచిలీపట్నం డివిజన్ల పరిధిలో అధికంగా ఉన్న జాయింట్ ఎల్పీఎంలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్వో చంద్రశేఖరరావు, కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, తదితరులు వీసీలో పాల్గొన్నారు.

WE MANUFACTURE AND SUPPLY APPAREL
FOR BULK ORDER QUANTITES
REGULAR WEAR
- RELIGIOUS WEAR
- TOPS
- BOTTOMS
- UNDERGARMENTS
- NIGHT WEAR
FOR MEN & WOMEN
BOYS & GIRLS
VIJAYAWADA-AP
8977796538

నవ్విపోదురుగాక.. నాకేమని..!

వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన పేర్నిపై మరో కేసు

ఈనాడు, అమరావతి, మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే

కేసు మీద కేసు నమోదవుతున్నా మాజీ మంత్రి, పేర్ని వెంకట్రామయ్య(నాని) తీరు మాత్రం మారడం లేదు. ఇష్టమొచ్చినట్లు నోరుజారడం.. కార్యకర్తలను రెచ్చగొట్టడం.. పైకి నీతులు చెప్పటం ఆయనకు అలవాటైపోయింది. తాజాగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయంపై తెదేపా నాయకులు అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ దిలీప్‌కుమార్, పార్టీ నాయకులు పిప్పళ్ల వెంకటకాంతారావులు కృష్ణా జిల్లా ఇనగుదురుపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. పేర్ని వ్యాఖ్యల ఫొటోలు, క్లిప్పింగులు పోలీసులకు అందించారు. దీనిపై బీఎన్ఎస్‌లోని 196(1), 351(2), 352(2), 353(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుపై తీవ్ర వ్యాఖ్యలు..

★ చాట్రాయ్ మండలం చిన్నంపేటలో జనవరి 25న జరిగిన వైఎస్సార్ విగ్రహావిష్కరణ బహిరంగ సభలో పేర్ని మాట్లాడుతూ 'తిరుపతి లడ్డూ ప్రసాదంపై అబద్ధాలు చెప్పిన చంద్రబాబు నాలుకపై దబ్బళం కాల్చి గుచ్చాలి. ఆయనది మనిషి జన్మో కాదో తెలియదు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ శరీరమంతా వాతలు పెట్టాలి. పవన్‌కల్యాణ్ రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను కడిగి శుద్ధి చేయాలి. చంద్రబాబు ఏదైనా అనగానే పవన్, భాజపా బుర్రకథలో వంతపాడే వారిలా మారుతున్నారు. వేంకటేశ్వరస్వామి మిమ్మల్ని విడిచి పెట్టడు' అంటూ అడ్డూ అదుపు లేకుండా మాట్లాడారు.

ఫిర్యాదు అందజేస్తున్న దిలీప్‌కుమార్, కాంతారావు తదితరులు

నేనింతే మారనంతే

★ కూటమి అధికారం చేపట్టిన నాటి నుంచి పేర్ని నాని నోరు అదుపు తప్పిందనడానికి అనేక ఉదాహరణలున్నాయి. ★ గతంలో తమ పార్టీ నగర అధ్యక్షుడిని అక్రమంగా అరెస్టు చేశారంటూ అనుచరులతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి రచ్చ చేశారు. అంతు చూస్తా అంటూ సీఐని బెదిరించారు.

★ పామర్రులో జరిగిన ఓ సమావేశంలో 'రప్పా..రప్పా నరుకుతాం.. చీకట్లో కన్నుకొడితే పని అయిపోవాలి' అంటూ పార్టీ నేతలను, శ్రేణులను రెచ్చకొట్టే వ్యాఖ్యలు చేయడం పెద్ద దుమారం రేగింది. ★ జడ్పీ ఛైర్మన్ కారు దాడి విషయంలో రాష్ట్రమంతా మనవాళ్లతో గోల చేయించండి అంటూ ఆయన మాట్లాడిన ఫోన్ సంభాషణలు వైరల్ అయ్యాయి. ★ మెడికల్ విద్యార్థుల పరీక్షల సమయంలో పోలీసులు చెప్పినా వినకుండా ధర్నా పేరుతో దాదాగిరి చేశారు. ★ ఇలా నిత్యం వివాదాస్పద వ్యాఖ్యలతో పేర్ని నాని తెరమీదకు వస్తూనే ఉన్నారు.

పెట్టుబడుల పేరుతో వ్యాపారికి టోకరా

మూడు నెలల్లో రూ.74.2 లక్షల మేర మోసం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: క్లాస్‌మేట్‌నంటూ పరిచయం పెంచుకుని బిట్‌కాయిన్ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఒక వ్యాపారికి సైబర్ నేరస్థులు టోకరా వేశారు. 3 నెలల కాలంలో ఒక వ్యాపారి నుంచి పెట్టుబడులు, రకరకాల పన్నులు పేరు చెప్పి రూ.74.2 లక్షల మేర వసూలు చేసి నిలువునా ముంచేశారు. పెట్టుబడుల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నా సైబర్ నేరస్థులు ఏదో రూపంలో మోసాలు చేస్తూనే ఉన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి...గొల్లపూడికి చెందిన ఒకరు(36) వ్యాపారం చేస్తుంటారు. ఈయనకు 2025 సెప్టెంబరు నెలలో వాట్సాప్ ద్వారా ఒక యువతి క్లాస్‌మేట్ అని పరిచయం చేసుకున్నారు. తన పేరు క్రితికారెడ్డి అని, యూకేలో ఉంటానని తెలిపారు. అప్పటినుంచి వారు వాట్సాప్‌లో ఛాటింగ్ చేసుకునేవారు. ఈ క్రమంలో బిట్‌కాయిన్ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే పెద్ద మొత్తంలో లాభాలు వస్తాయని చెప్పి కొన్ని స్క్రీన్ షాట్లు పెట్టారు. వాటిని చూసి ఆకర్షితులైన వ్యాపారి రూ.20 లక్షల పెట్టుబడి పెట్టారు. భారీగా లాభాలు కనిపించడంతో వాటిని తీసుకునేందుకు ప్రయత్నించగా అవి రాలేదు. రూ.20 లక్షలు ఏఎంఎల్ ట్యాక్స్ కడితే విత్‌డ్రా చేసుకోవచ్చనడంతో వారి మాటలు నమ్మి మరో రూ.20 లక్షలు కట్టారు. ఆ తరువాత మార్జినల్ ట్యాక్స్, అడిషనల్ ట్యాక్స్, వీఐపీ ఫీజు పేరు చెప్పి మరో రూ.34.2 లక్షలు వసూలు చేశారు. మోసపోయినట్లు గ్రహించి ఫిర్యాదు చేయగా సైబర్ క్రైం పోలీసులు కేసు పెట్టి దర్యాప్తు చేస్తున్నారు.

జినేష్.. శిబులకు ముగిసిన కస్టడీ

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో నిందితులు జినేష్, శిబులకు మంగళవారంతో మూడు రోజుల కస్టడీ ముగిసింది. వీరిని విజయవాడలోని ఎక్సైజ్ కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. వీరిని న్యాయాధికారి లెనిన్ బాబు ఎదుట హాజరుపర్చగా.. రిమాండ్‌కు ఆదేశించారు. అనంతరం వారిని విజయవాడ కారాగారానికి తరలించారు. గోవాలోని డిస్టలరీల నుంచి స్పిరిట్‌ను తీసుకుని బాలాజీకి సరఫరా చేసినట్లు మూడు రోజుల విచారణలో ప్రధానంగా వెల్లడించినట్లు తెలిసింది. శిబు ద్వారా బాలాజీకి అందజేసినట్లు విచారణలో వెల్లడించాడు. కోర్టు ఆదేశాల మేరకు నిందితులను ఈనెల 25 నుంచి కస్టడీకి తీసుకున్న సంగతి తెలిసిందే.

గడువులోపు గృహ నిర్మాణాలు పూర్తవ్వాలి

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగిసేలోపు పేదలకు కేటాయించిన గృహ నిర్మాణాల పనులు ఉగాది నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బందరు కలెక్టరేట్‌లో మంగళవారం గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్షించిన ఆయన పలు సూచనలు చేశారు. ఎంపీడీవోలు, గృహ నిర్మాణ సంస్థ ఇంజినీర్లు సమన్వయంతో లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఈ నెల 8న సమీక్ష నిర్వహించినా సరైన పురోగతి లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కృత్తివెన్ను, నందివాడ, గుడివాడ, ఉయ్యూరు తదితర మండలాల్లో ఎటువంటి పురోగతి లేకపోవడాన్ని ప్రశ్నించారు. పెడన మండలంలో చేసిన పనికి మించి బిల్లులు చెల్లించడం సరైన పద్ధతి కాదంటూ హెచ్చరిస్తూ బాధ్యులకు నోటీసులు జారీ చేయాలని చెప్పారు. అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని చక్కదిద్దాలన్నారు.

విధుల్లో జూనియర్.. అక్రమాల్లో సీనియర్!

గ్రామీణ నీటిసరఫరా శాఖలో ఉద్యోగి హవా

ఈనాడు, అమరావతి

గ్రామీణ నీటి సరఫరా శాఖలో.. అతనో జూనియర్ అసిస్టెంట్. అక్రమాల్లో, అడ్డగోలు వ్యవహారాల్లో మాత్రం.. సూపర్ సీనియర్. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం చేయాల్సిన పనులను నిబంధనలకు విరుద్ధంగా చేస్తూ భారీగా దండుకుంటున్నాడు. అవినీతి ఆరోపణలున్న ఉద్యోగులను సైతం మాయ చేసి పీఎఫ్, ఎరియర్స్ రప్పిస్తున్నాడు.

ఇదండీ లెక్క... ★ ఒకే ఉద్యోగి పేరుతో రెండుసార్లు ఎరియర్స్ దరఖాస్తు చేసి దోపిడీ మొదలు పెట్టాడు. కొంతకాలం కిందట ఓ ఉద్యోగికి రూ.8.75 లక్షల ఎరియర్స్ కోసం దరఖాస్తు చేశారు. ఆ సొమ్ము ఉద్యోగి ఖాతాలో జమయినా మళ్లీ ఆ సొమ్ము గురించి దరఖాస్తు చేసి దస్త్రం నడిపించారు. ఆఖరి నిమిషంలో ఖజానా శాఖ అధికారులు గుర్తించడంతో అక్రమం బట్టబయలైంది.

అడుగడుగునా అవినీతి... ★ ఎన్టీఆర్ జిల్లా సరిహద్దు ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ఆ ఉద్యోగికి ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంపై అవగాహన ఉంది. ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్, జిల్లా కార్యాలయాల్లో ఉద్యోగులకు ప్రయోజనాలు రప్పించే ప్రక్రియ చేసేందుకు సిబ్బంది ఉంటారు. కొందరు పని భారం తప్పించుకునేందుకు సదరు జూనియర్ అసిస్టెంట్‌కు ఏళ్లుగా ఆ పనులు అప్పగించి చేయిస్తున్నారు. నిబంధనల ప్రకారం అధికారుల లాగిన్ బయట వారికి తెలియకూడదు.. ఈ ఉద్యోగికి మాత్రం రెండు జిల్లాల్లో బోలెడు మంది అధికారుల లాగిన్లు తెలుసు. ★ ఇదే అదునుగా వ్యాపారం మొదలుపెట్టాడు. ఉద్యోగులకు ఎరియర్స్ దరఖాస్తు చేసినప్పుడు చిన్నచిన్న సాంకేతిక లోపాలను వాడుకోవడం.. ఖజానా శాఖలో కొందరు అధికారులకు మామూళ్ల ఎర వేయడంతో భారీగా దోచుకున్నాడు. ★ ఇతను గుడివాడలో పని చేస్తున్నప్పుడు కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో చేసిన పనుల బిల్లుల దస్త్రం కదలాలంటే రూ.20 వేలు మామూళ్లు ఇవ్వాలని ఓ గుత్తేదారుడిని డిమాండ్ చేశారు. ఆయన నిరాకరించడంతో బిల్లుల నమోదులో కొర్రీలు పెట్టి కోత వేయడంతో గుత్తేదారుడితో వివాదం రేగింది.

ఐదేళ్లు హద్దే లేదు...

★ సదరు ఉద్యోగి వైకాపా వీరాభిమాని.. గత ప్రభుత్వ పాలనలో హద్దు లేకుండా పేట్రేగిపోయారు. తనకు మంత్రులు... రాష్ట్రస్థాయి అధికారులు తెలుసని మభ్యపెట్టి దోచేశాడు. అనిశా తనిఖీల్లో పట్టుబడిన వారు, అవినీతి ఆరోపణల్లో విచారణలు ఎదుర్కొంటున్న వారికి నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగానంతర ప్రయోజనాలు ఇప్పించి వారి నుంచి భారీగా కమీషన్లు దండుకుంటున్నాడు. కొంత కాలం కిందట ఏసీబీకి పట్టుబడిన ఓ ఈఈకి అక్రమంగా ప్రయోజనాలు రప్పించాడు. ★ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అవినీతి ఆరోపణలతో విచారణ ఎదుర్కొంటున్న ఓ విశ్రాంత ఎస్ఈకి ఉద్యోగ విరమణ ప్రయోజనాల కోసం ప్రస్తుతం విధులకు ఎగనామం పెట్టి పైరవీలు చేస్తున్నాడు.



(c) eenadu

అంతర పంటలు.. అధిక ప్రయోజనాలు

రైతేరాజు

కంచికచర్ల, న్యూస్‌టుడే

తోటలో రాజశేఖర్

మూస పద్ధతులకు భిన్నంగా వ్యవసాయంలో కొత్త విధానాలు ఆచరిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా చేసి చూపిస్తున్నారు వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన రైతు **వెంపటి రాజశేఖర్.** 4 ఎకరాల పొలంలో మామిడి, జామ సాగు చేపట్టిన ఆయన పంట కాలం వృథాగా మారకుండా ఖరీఫ్ సీజన్‌లో సాళ్ల మధ్యలో పెసర సాగు చేపట్టారు. వరదల కారణంగా కొంత పంట నష్టపోయినా నిరాశ చెందలేదు.

★ పెసర కోత అనంతరం పండ్ల మొక్కల మధ్యలో కూరగాయల సాగు చేపట్టాలని నిర్ణయించుకున్నారు. అందుకు పొలాన్ని సిద్ధం చేశాక మొక్కల మధ్య ఖాళీల్లో టమాట నారు వేశారు. నాలుగెకరాల పండ్ల తోటలో ఇలా టమాట నారు సుమారు ఎకరా ఉంటుంది. ఇందుకు ఖర్చు పెట్టింది రూ.15 వేలు మాత్రమే. టమాట నారు ఎత్తు పెరిగాక సాళ్ల మధ్య ఖాళీ స్థలంలో ఇతర కాయగూరల సాగు చేపట్టేలా ప్రణాళికలు రూపొందించారు. ఇలా పండ్ల తోటలో అంతర పంటలు పండిస్తే సాగు ఖర్చు సగానికి సగం తగ్గుతుందని ఆయన తెలిపారు. పండ్ల మొక్కలకు పురుగు, చీడపీడలు ఆశించకుండా వాడే రసాయనాలే కాయగూరల మొక్కలకు సరిపోతాయని, వాటికి ప్రత్యేకంగా పిచికారీ చేసే పని ఉండదని చెప్పారు. పండ్ల మొక్కలకు అందించే నీరే కాయ గూరలకు సరిపోతుందని పేర్కొన్నారు. పండ్ల తోటలకు అందించే ఎరువులే కాయగూరలకు పనికి వస్తాయని, వాటి ద్వారా దిగుబడి అధికంగా ఉంటుందని చెప్పారు.

ప్రశ్న: పొద చిక్కుడు రకాలు, విత్తే సమయం, నేల తయారీ, విత్తే దూరం గురించి వివరించండి?

– జి.శ్రీనివాస్, రైతు, యండకుదురు

సమాధానం : పొదరకం అర్కాజయ. ఇది విత్తిన 50- 60 రోజులకు కోతకు వస్తుంది. కాయలు పొట్టిగా, ముదురు ఆకుపచ్చ రంగులో ఉంటాయి. నేల తయారీకి నేలను పదును వచ్చే వరకు 4- 5 సార్లు దుక్కి దున్ని చదును చేయాలి. విత్తే ముందు కిలో విత్తనానికి గ్రాము కార్బండిజమ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి. నైట్రోజన్‌ను స్థాపించే రైజోబియం కల్చర్‌తో విత్తనశుద్ధి చేయాలి. (కిలో విత్తనానికి 200 గ్రాముల రైజోబియం కల్చర్ కలపాలి). విత్తనాలను పొద రకాలను ఖరీఫ్‌లో అయితే 60× 30 సెం.మీ., వేసవిలో అయితే 45×15 సెం.మీ. దూరంలో నాటాలి. వేసవిలో జనవరి, ఫిబ్రవరి కాలాల్లో విత్తుకోవచ్చు. పొద రకానికి ఎకరాకు 16 కిలోలు విత్తవచ్చు. కాయలు లేతగా ఉన్నప్పుడే కోయాలి. పూతకు వచ్చిన 2-3 వారంలో కాయలు కోతకు సిద్ధంగా ఉంటాయి.

- వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల

-ఘంటసాల, న్యూస్‌టుడే

సేంద్రియ పెరటి సాగు.. ఆరోగ్యం బాగు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

పెరటి మొక్కలకు వేస్ట్ డీకంపోజ్ ద్రావణాన్ని పిచికారీ చేస్తున్న రామకోటేశ్వరరావు

ఇంటి ఆవరణలో కొద్దిపాటి స్థలంలో సేంద్రియ విధానంలో పండ్లు, కూరగాయలు సాగు చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు మాగల్లుకు చెందిన మాచారపు రామకోటేశ్వరరావు. పదేళ్లుగా ఇంటి ముందున్న సెంటున్నర స్థలంలో ఆయన వంగ, బెండ, గోంగూర, పాలకూర, తోటకూర, చిక్కుడు, బ్రకోలి, కాకర, కొత్తిమీర, అల్లం సాగు చేస్తున్నారు. వారంలో రెండుసార్లు మొక్కలకు తెగుళ్లు సోకకుండా వేస్ట్ డీకంపోజ్ ద్రావణం, పులిసిన మజ్జిగ పిచికారీ చేస్తున్నారు. పురుగు మందు పిచికారీ చేయకుండా సేంద్రియ విధానంలో కాసిన కూరగాయలను ఇంట్లో వాడుతున్నారు. మిగిలిన కూరగాయలు, ఆకుకూరలను ఇరుగు పొరుగు వారికి ఇస్తున్నారు.

పెరట్లో కాసిన సపోట కాయలు కోస్తున్న వెంకటేశ్వరరావు, పద్మ

★ తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన కట్టా వెంకటేశ్వరరావు, పద్మ దంపతులు తమ ఇంటి ఆవరణను పండ్లతోటగా మార్చారు. ఇంటి ముందు 15 సెంట్ల స్థలంలో సపోట, అరటి, మామిడి, జామ, దానిమ్మ, కొబ్బరి మొక్కలు పెంచారు. వీటితో పాటు వంగ, బెండ, సొర, టమాట, చిక్కుడు తదితర కూరగాయ మొక్కలు పెంచుతున్నారు. పదేళ్లుగా సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, పండ్ల మొక్కలను సాగు చేస్తున్నారు. చీడపీడల నివారణకు మొక్కలకు జీవామృతం పిచికారీ చేస్తున్నారు. మొక్కల పాదుల్లో పశువుల ఎరువు వేసి నీరు అందిస్తున్నారు. ఇంట్లో కూరకు పెరటి కాయగూరలను ఉపయోగిస్తున్నారు. మొక్కలను వానరాలు పాడు చేయకుండా రూ.1.30 లక్షలతో పెరటి చుట్టూ రక్షణగా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు.

సూపర్ నేపియర్ పోషకాల సిరి

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : సూపర్ నేపియర్ గడ్డి సాగుతో పశుగ్రాసం కొరత తీరుతుందని.. ఇందులో పశువులకు అవసరమయ్యే పోషకాలు పుష్కలంగా లభిస్తాయని మండల వ్యవసాయాధికారిణి శ్రీదేవి తెలిపారు. ఆమె సూచనలు ఇలా.. పాడి పశువులకు రోజుకు 30 కిలోల గ్రాసం అందిస్తే ఆరోగ్యంగా ఉండి.. పాలు కూడా పెరుగుతాయి. ఈ గడ్డిని వినియోగిస్తే ఇతర దాణాల వ్యయం తగ్గుతుంది. ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు అవుతుంది. వీటిని సాగు చేస్తున్న రైతుల నుంచి కణుపులు సేకరించి నాటుకోవచ్చు. ఎకరాకు అయిదు వేల కణుపులు సరిపోతాయి. వీటిని నాటే ముందు చివికిన పశువుల ఎరువు భూమిలో వేసుకోవాలి. బోదెలను తయారు చేసుకోవాలి. ఒక్కో బోదెకు రెండు అడుగులు, మొక్కల మధ్య ఒకటిన్నర అడుగుల దూరం ఉండేలా నాటుకోవాలి. నాటిన 45 నుంచి 50 రోజుల మధ్య మొదటి కోత వస్తుంది. తర్వాత 15 రోజులకు ఒకసారి కోసుకోవచ్చు. కోత తర్వాత యూరియా వేస్తే బాగా ఎదుగుతుంది. ఎకరాలో పెరిగే గడ్డితో 10 పశువులను మేపవచ్చు. ఈ గడ్డి పశువులకు అందిస్తే ఆరోగ్యంగా ఉంటాయి.

సూపర్ నేపియర్ గడ్డి

మొక్కజొన్నలో జింక్ లోపం నివారణ చర్యలు

పొన్నూరు, న్యూస్‌టుడే: మొక్కజొన్నలో జింక్ లోపం నివారణ చర్యలను వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు రామకోటేశ్వరి సూచించారు. మొక్కజొన్న పైరు 20 నుంచి 25 రోజుల దశలో మొక్క పైనుంచి రెండు, మూడు ఆకుల మొదలు భాగంలో ఈ లక్షణాలు కనిపిస్తాయి. ఆకు ఈనె మధ్య భాగాలు పాలిపోయి పసుపు, తెలుపు రంగుగా మారతాయి. కణుపుల మధ్య దూరం తగ్గిపోవడంతో మొక్కలు చిన్నవిగా అవుతాయి. మొక్కలు ఎదుగుదల లేకపోవడంతో దిగుబడులపై ప్రభావం చూపుతాయి. మొక్కల్లో కొత్తగా వచ్చిన ఆకులకు జింక్ సరిగా అందకపోవడంతో అవి తెల్లగా మారతాయి. జింక్ లోప నివారణకు క్రమం తప్పకుండా సేంద్రియ ఎరువులు వాడాలి. 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటరు నీటిలో కలిపి 4 నుంచి 5 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

పోటీ పడ్డారు.. సృజన చాటారు

బహుమతులు అందుకున్నవారితో డీఈవో, డీవైఈవో తదితరులు

పోటీలకు హాజరైన విద్యార్థులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: పోటీతత్వంతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు అన్నారు. మచిలీపట్నంలోని రుస్తుంబాద నగరపాలక సంస్థ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈనాడు, ఈటీవీ ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ స్థాయి ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. ‘నీటి సంరక్షణ, నిర్వహణ-ప్రతి నీటిబొట్టు విలువైనది’ అనే అంశంపై చిత్రలేఖన పోటీలు, మాతృభాష ప్రాముఖ్యత, దాని పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై వ్యాసరచన, ఆరోగ్యమే మహాభాగ్యం, మానసిక, శారీరక ఆరోగ్యానికి పాటించాల్సిన ఆహారపు అలవాట్లు, జీవనశైలి అంశాలపై ఉపన్యాసం, కరెంట్ అఫైర్స్ విభాగంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. మొత్తం నాలుగు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో బందరు నగరంతోపాటు గూడూరు మండలంలోని పలు పాఠశాలల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులు డివిజన్ స్థాయి పోటీలకు హాజరయ్యారు. ఈ పోటీలకు మంచి స్పందన లభించింది. అర్హత సాధించిన విద్యార్థులు అందరూ డివిజన్ స్థాయి పోటీల్లో కూడా ప్రతిభ చాటుకునేందుకు తరలివచ్చారు.

విజేతలకు డీఈవో, మచిలీపట్నం డీవైఈవో బీఎస్సీ శేఖర్‌సింగ్‌లు అతిథులుగా పాల్గొని బహుమతులు అందజేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను చాటుకునేందుకు పోటీలు దోహదపడతాయని ఆయన డీవైఈవో సంస్థలు ఏటా విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించేలా పోటీలు నిర్వహించి బహుమతులు అందించడం ప్రశంసనీయమన్నారు. వివిధ పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారు డివిజన్ స్థాయి అర్హత సాధించనందున, పోటీల్లో పాల్గొన్న వారంతా విజేతలేనన్నారు. పాఠశాల హెచ్ఎం ఇందిరాదేవి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతలు వీరే (ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు)

వ్యాసరచన పోటీల్లో : వై.వెంకటేశ్వరమ్మ (9వ తరగతి, జడ్పీహెచ్ఎస్, గూడూరు), అబ్దుల్‌ఖుద్దూస్(10వ తరగతి, శ్రీరామకృష్ణ ఇంగ్లీషు మీడియం స్కూల్, మచిలీపట్నం), సీహెచ్ వాహినీ అక్షయ(8వ తరగతి, బాలాజీవిద్యాలయం, మచిలీపట్నం).

చిత్రలేఖనంలో : జి.శ్రావణి(జీవీఎన్ఆర్ మున్సిపల్ హైస్కూల్, మచిలీపట్నం), ఎం.లాస్యప్రియాంక్ (8వ తరగతి, జడ్పీహెచ్ మల్లవోలు, గూడూరు మండలం), ఆర్.అక్షర(10వ తరగతి, కేంద్రీయ విద్యాలయం, మచిలీపట్నం).

ఉపన్యాస విభాగంలో : ఎస్.వాగ్దేవి (8వ తరగతి, రుస్తుంబాద బాలికల ఉన్నతపాఠశాల), హెచ్.కృతి (8వ తరగతి, బాలాజీ విద్యాలయం, మచిలీపట్నం), జి.జోషిత (9వ తరగతి, జవహర్ పబ్లిక్‌స్కూల్, మచిలీపట్నం).

క్విజ్ పోటీల్లో.. కేవీహెచ్ఎస్ఆర్ జయంత్(9వ తరగతి, మాస్టర్ ఇ.కె బాలభాను విద్యాలయం, మచిలీపట్నం), బి.భానుప్రణీత్‌నాయక్ (9వ తరగతి, బాలాజీ విద్యాలయం, మచిలీపట్నం), బి.సాయిమనస్విని (8వ తరగతి, శ్రీచైతన్యస్కూల్) విద్యార్థులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. విశ్రాంత ఉపాధ్యాయులు బీఎస్‌వీ రమేష్, కేవీఎన్ ఉమాకోటేశ్వరి, ఉపాధ్యాయుడు కె.ఏడుకొండలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

విజయవాడ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా సీతా మహాలక్ష్మి

కాసాని సీతా మహాలక్ష్మి

కౌతవరం (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే : మండలంలోని కౌతవరం 1వ వార్డుకు చెందిన కాసాని సీతా మహాలక్ష్మిని స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా నియమిస్తూ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఆదేశాలు జారీ చేశారు. 2012 నుంచి గుడివాడ కోర్టులో న్యాయవాద వృత్తి కొనసాగిస్తున్న ఆమె గుడివాడ న్యాయవాదుల సంఘ మహిళా కార్యదర్శిగా మూడుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికై బాధ్యతలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందించడమే కాకుండా కుమార్తె పేరిట సేవాట్రస్ట్ నిర్వహిస్తూ సేవా కార్యక్రమాలు చేపట్టారు.

దాతల సాయం.. సమకూరింది భవనం

నిర్మించిన భోజనశాల

మొవ్వ (కూచిపూడి), న్యూస్‌టుడే: మొవ్వ పీఎంశ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాతల సాయంతో అన్నపూర్ణమ్మ భోజనశాల నిర్మించారు. గ్రామానికి చెందిని డాక్టర్ తాతినేని గోపాలరావు, బీనా దంపతులు అందించిన రూ.50 లక్షలతో తాతినేని సుబ్బయ్య, అన్నపూర్ణమ్మ భోజనశాల నిర్మించారు. 31న తమిళనాడు మాజీ గవర్నర్ పి.ఎస్.రామమోహనరావు, కలెక్టర్ డి.కె.బాలజీ, ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాతో దీన్ని ప్రారంభింపజేస్తున్నట్లు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తాతినేని శరత్‌కుమార్ తెలిపారు.

చిన్న నాటి కల.. తీర్చుకున్నారిలా

కూచిపూడి, న్యూస్‌టుడే

చిన్ననాట పోలీస్ దుస్తుల్లో సోదరులు

పురస్కారాలు అందుకున్న సోదరులు సుభాకర్, సురేష్

ఆ అన్నదమ్ములకు చిన్ననాటి నుంచి పోలీస్ కావాలనేది కోరిక. పెద్దయ్యాక అది తీర్చుకుని.. ఒకే వేదికపై ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి మండలం కె.సముద్రపుగట్టుకు చెందిన వి.రామకృష్ణ రైతు. ఆయన భార్య చంద్రావతి గృహిణి. వీరికి సుభాకర్, సురేష్ కుమారులు. కుమారులకు చిన్నప్పటి నుంచి పోలీస్ కావాలన్నది కల. చిన్న నాటే పోలీస్ యూనిఫాంలో ఫొటోలు కూడా దిగారు. తర్వాత సుభాకర్ బీఎస్సీ బీఈడీ చేశారు. చిన్నబ్బాయి వి.సురేష్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చదివారు. కల తీర్చుకునేందుకు ఇద్దరు కుమారులు కష్టపడి చదివారు. దేహదారుఢ్య పోటీలకు కసరత్తు చేశారు. ఈ నేపథ్యంలో పెద్ద కుమారుడు సుభాకర్ 2009 బ్యాచ్‌లో ఎస్సైగా ఎంపికై తూర్పు గోదావరి జిల్లా కడియంలో మొదటి పోస్టింగ్ తీసుకున్నారు. పదోన్నతిపై కృష్ణా జిల్లా ఎస్‌బీ సీఐగా పని చేసి ప్రస్తుతం పామర్రు సీఐగా ఉన్నారు. అన్న బాటలోనే తమ్ముడు వి.సురేష్‌కు 2012 బ్యాచ్ ఎస్సైగా తూర్పు గోదావరి జిల్లా గండేపల్లిలో మొదటి పోస్టింగ్ కాగా.. బదిలీపై హనుమాన్ జంక్షన్ ఎస్సైగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఒకే వేదికపై ఉత్తమ సేవా పురస్కారాలు అందుకోవటం ఒక అనుభూతితో పాటు ఆనందాన్ని కలిగించిందని, చిన్ననాటి ఆలోచనలు కూడా గుర్తుకు వచ్చాయని వారు తెలిపారు.

రూ.కోటి కట్నం తీసుకురా

సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి తప్పని వరకట్న వేధింపులు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: పెళ్లై ఏడు సంవత్సరాలు దాటినా..రూ.కోటి అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తున్న భర్తపై ఒక యువతి మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రామవరప్పాడుకు చెందిన యువతి (38) అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేసేవారు. 2018లో టాటానగర్‌కు చెందిన కుంద స్వరాజ్‌ను వివాహం చేసుకున్నారు. అప్పట్లో కట్నం కింద రూ.కోటి ఇచ్చారు. తరువాత వీరు అమెరికా వెళ్లి అక్కడ స్థిరపడ్డారు. 2019లో మరో రూ.40 లక్షలు ఇచ్చారు. ఆతరువాత అమెరికాలో ఉన్న ఆస్తులన్నీ అమ్మేసి ఇండియా వచ్చేసి రామవరప్పాడులో నివాసం ఏర్పరుచుకున్నారు. ఈ క్రమంలో 2025 జనవరి 16న ఆమెపై హత్యాయత్నం చేయబోగా.. తప్పించుకున్నారు. అనంతరం తిరిగి అమెరికా వెళ్లినా..అక్కడా వేధింపులు తప్పలేదు. వారంతా మళ్లీ ఇండియాకు రాగా ఇంకా రూ.కోటి అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తుండటంతో మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

పోలీసులు బాధితులను మోసం చేశారు

బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి, సుబ్బారావు తదితరులు

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : బాధితులు అన్యాయం జరిగిందని, పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయిస్తే.. పోలీసులే తప్పుడు నివేదిక రాసి బాధితులతో సంతకాలు చేయించి మోసం చేయడం దారుణమని... కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు ఆరోపించారు. దళిత, బహుజన, కార్మిక సంఘాల జేఏసీ సభ్యులు ఉప్పులూరి ఘటన దాడి బాధితులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నలుగురు బాధితులు తమపై జరిగిన దాడిని వివరించారు. అనంతరం మాల్యాద్రి, సుబ్బారావు, పులే అంబేడ్కర్ సాధికార సమితి నాయకుడు అప్పారావు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడాల్సిన పోలీసులే కోడి పందేల బరి నిర్వాహకులకు లోబడి బాధితులకు అన్యాయం చేస్తున్నారన్న సంగతి, వారు రాసిన రిపోర్టు, కట్టిన సెక్షన్లు చూస్తే ప్రతి ఒక్కరికి అర్థం అవుతుందన్నారు. దళిత, బహుజన, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బాధితులకు పక్షాన న్యాయ పోరాటం చేస్తామని పేర్కొన్నారు. 31న తోట్లవల్లూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధితుల కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా చేయబోతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా పోలీసులు బరి నిర్వాహకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పలు సంఘాల నాయకులు కాసాని గణేష్‌బాబు, అప్పలరాజు, కొండలబాబు, యేసోబు, డేవిడ్‌రాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బోల్తా కొట్టించిన వేగం.. ఇద్దరికి ప్రమాదం..

పెడన, న్యూస్‌టుడే: వేగంగా వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టి బోల్తా పడిన ఘటన వడ్లమన్నాడు-శింగరాయపాలెం రహదారిపై మండంలోని చేవేంద్రపాలెం సెంటర్‌లో మంగళవారం ఉదయం జరిగింది. బాపట్లకు చెందిన గంటా కాంతారావు (68) తమ కారుపై కలిదిండి వెళ్తున్న క్రమంలో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టి పంట బోదెలోకి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ముదినేపల్లి మండలం చేవూరుకు చెందిన లింగవరపు సుధాకర్(72), లింగవరపు నాగేశ్వరమ్మలు తీవ్రగాయాలతో మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆటో డ్రైవర్ మద్దుల అశోక్‌కుమార్, మరో ప్రయాణికుడు స్వల్పగాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్సై గంట్ల సత్యనారాయణ సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. అంతకముందు వడ్లమన్నాడు సమీపంలో కారు స్వల్ప ప్రమాదానికి గురైందని, అక్కడి వ్యక్తులు బైక్‌లపై వెంబడిస్తున్నారన్న ఆందోళనలో కారు నడుపుతున్న యజమాని కాంతారావు చేవేంద్రపాలెం సెంటర్‌లో మలుపును అంచనా వేయకుండా వేగంగా వచ్చి ఆటోను ఢీకొన్నట్లు ప్రత్యక్షసాక్షులు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

అంత్యక్రియలు నిలిపివేసిన పోలీసులు

గుడివాడ, న్యూస్‌టుడే : స్నేహితుడి మృతిపై అనుమానం ఉందని ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేయగా అంత్యక్రియలకు శ్మశానంలో సిద్ధంగా ఉన్న మృతదేహాన్ని గుడివాడ వన్ టౌన్ పోలీసులు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని శ్రీరామపురానికి చెందిన సబ్బాని వెంకటేశ్వరరావు 26న వెంకటేశ్వర రెస్టు హోమ్ రోడ్డులో పడి ఉన్నాడని అతని రెండో కుమారుడు కేశవరావుకు స్థానికులు తెలిపారు. అతడు వెళ్లి సమీపంలోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే వెంకటేశ్వరరావు మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. దీంతో కుటుంబ సభ్యులు మంగళవారం అంత్యక్రియలకు మృతదేహాన్ని పుల్లలపాడు శ్మశానవాటికకు తరలించారు. అయితే కొలుసు నాగరాజా అనే వ్యక్తి ఎస్పీ, వన్ టౌన్ పోలీసులకు తన స్నేహితుడు వెంకటేశ్వరరావు మృతిపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదు చేశాడు. పోలీసులు రంగ ప్రవేశం చేసి మృతదేహాన్ని మరణ కారణం తెలుసుకోవడానికి ప్రభుత్వాసుపత్రికి తరలించి పరీక్షలు చేయించారు. ఈమేరకు వన్ టౌన్ ఎస్సై వైవీవీ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకటేశ్వరరావుది ఆత్మహత్య అని, దీనికి కారణం వైకాపా సానుభూతి పరుడైన ఓ దస్తావేజు లేఖరి అంటూ ప్రచారం సాగుతోంది.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -143 రిటైల్ ధర 170 చికెన్ విత్ స్కిన్ - 247 చికెన్ స్కిన్‌లెస్ - 281.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 162, 171, 182 చికెన్ విత్ స్కిన్ - 314 చికెన్ స్కిన్‌లెస్ - 324.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

చల్లపల్లి: పర్యావరణానికి హాని కలిగించే ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని స్వచ్ఛ చల్లపల్లి రథ సారథులు డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్- డాక్టర్ టి.పద్మావతి దంపతులు సూచించారు. మంగళవారం చల్లపల్లి వివేకానంద డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చల్లపల్లి- మచిలీపట్నం జాతీయ రహదారిలో శ్రమదానం చేశారు. ప్రిన్సిపల్ పెమ్మసాని రమేష్‌బాబు, విశ్రాంత ప్రిన్సిపల్ తగిరిశ సాంబశివరావు, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి ఎన్.శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి బాటలో ఆగిన ఊపిరి

అమృతరావు మృతదేహం

నాగాయలంక, న్యూస్‌టుడే : సముద్రంలో చేపల వేటకు వెళ్లి జాలరి మృతి చెందాడు. అవనిగడ్డ మత్స్యశాఖ ఏడీ ప్రతిభ వివరాల మేరకు.. బర్రంకుల గ్రామానికి చెందిన గురిందపల్లి అమృతరావు (55) సొర్లగొంది గ్రామానికి చెందిన గ్రామానికి కొప్పనాతి వెంకటేశ్వరరావు బోటులో ఆరుగురు కళాసీలతో కలసి సోమవారం బందరు సమీపంలోని సముద్రంలోకి వేటకు వెళ్లారు. అర్ధరాత్రి అమృతరావు కడలిలో వల విసిరి లాగుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయాడు. పడిన ప్రాంతంలో మిగిలిన జాలర్లు వెతగ్గా కొద్దిసేపటికి మృతదేహం కనిపించింది. మంగళవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.రాజేష్ తెలిపారు.

బాలికతో అసభ్య ప్రవర్తన: ఉపాధ్యాయుడికి జైలు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ మంగళవారం న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. మచిలీపట్నం పాతరామన్నపేటకు చెందిన ఓ బాలిక ఓ ప్రైవేటు స్కూల్లో 10వ తరగతి చదువుతోంది. అదే స్కూల్లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న వి.నాగరాజు ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. అతని తీరుపై బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇనుగుదురుపేట పోలీస్ స్టేషన్‌లో 2017 డిసెంబరు 12న కేసు నమోదైంది. దీనిపై విచారణ నిర్వహించగా నిందితుడిపై నేరం రుజువు కావడంతో వివిధ సెక్షన్ల కింద ఆరు నెలల జైలు శిక్ష, రూ.16వేలు జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి జి.వెంకటేశ్వర్లు తీర్పు చెప్పారు. శిక్షలు అన్నీ ఏకకాలంలో అమలు చేయాలని తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున ప్రత్యేక పీపీ మాదివాడ నరసింహారావు వాదనలు వినిపించారు.

ఆల్ ఇండియా ట్రేడ్ పరీక్ష దరఖాస్తులకు గడువు నేడు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా ట్రేడ్ పరీక్ష (ఎ.ఐ.టి.టి)- 2026కు హాజరు కావడానికి ప్రైవేటు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో కనీసం మూడేళ్లు వివిధ ట్రేడుల్లో పని చేస్తున్న అభ్యర్థులు ప్రభుత్వ ఐటీఐలో పరీక్షలు రాయడానికి అవకాశం ఉందని తెలిపారు. నైపుణ్యం కలిగిన అభ్యర్థులు ఈ ఏడాది జులైలో జరగనున్న ట్రేడ్ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విజయవాడ ప్రభుత్వ ఐటీఐలో రూ.500 చెల్లించి దరఖాస్తు పొందాలని తెలిపారు. పూరించిన దరఖాస్తులను ఈనెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఐటీఐలో ఇవ్వాలని, పూర్తి వివరాలకు 94906-39639 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ

ద్వాదశ ప్రదక్షిణల్లో స్వామి

మోపిదేవి, న్యూస్‌టుడే : మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామిని పల్లకి కొలువుదీర్చి ధ్వజస్తంభం చుట్టూ 12 ప్రదక్షిణలు వైభవంగా నిర్వహించారు. 12 రకాల వాయిద్యాల నాదాలను స్వామికి వినిపించారు. అనంతరం పుష్పశయ్యాలంకృత పర్యంకసేవ చేశారు. అయిదు రోజులు పూజలందుకుని అలసినందున లాలి, జోల పాటలు పాడారు.

ఆసక్తితో విద్య అభ్యసిస్తే ప్రగతి

రాష్ట్ర రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తిని సన్మానిస్తున్న విజయా అకాడమీ ఛైర్మన్, గొర్రెపాటి రంగనాథ బాబు

చల్లపల్లి, న్యూస్‌టుడే : నా దేశం- నా ఊరికి సేవ చేయాలనే తపన కలిగిన మహోన్నత వ్యక్తి.. ప్రవాస భారతీయుడు గొర్రెపాటి రంగనాథ బాబు అని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.మధుమూర్తి అన్నారు. చల్లపల్లిలోని విజయా అకాడమీ 45వ వార్షికోత్సవం మంగళవారం స్థానికంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మధుమూర్తి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో మార్కులు అనే పరుగు పందెంలో నిత్యం పరుగెడుతున్నారని, ప్రశాంత వాతావరణంలో ఆసక్తితో విద్య అభ్యసించాలన్నారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. విజయా అకాడమీ ఛైర్మన్ గొర్రెపాటి రంగనాథ బాబు, కుమార్తెలు పల్లవి, మాధవి డెల్సిగ్నోర్ కేకు కోశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గొర్రెపాటి వెంకటరామకృష్ణ, సర్పంచి పైడిపాముల కృష్ణకుమారి, ఉప సర్పంచి ముమ్మనేని నాని, ప్రిన్సిపల్ నాగళ్ల భీమారావు, రాష్ట్ర రైతు నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ పాల్గొన్నారు.

29న వేటూరి సాహితీ సదస్సు

పెదకళ్లేపల్లి (మోపిదేవి), న్యూస్‌టుడే : ఈనెల 29న వేటూరి సుందరామమూర్తి 90వ జయంతి సందర్భంగా ఆయన స్వగ్రామమైన పెదకళ్లేపల్లిలో దుర్గా పార్వతి సమేత నాగేశ్వరస్వామి దేవాలయం వద్ద వేటూరి సాహితీ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ వెల్లడించారు.

యువగళం పాదయాత్రకు మూడేళ్లు

అవనిగడ్డ, న్యూస్‌టుడే : రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మలుపు తిప్పి, కూటమి ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర పోషించిన రాష్ట్ర ఐటీ, విద్యామంత్రి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర ప్రారంభమై మంగళవారం నాటికి మూడేళ్లు పూర్తయిందని తెదేపా నేతలు పేర్కొన్నారు. స్థానిక లంకమ్మ ఆలయంలో వారు ఈ సందర్భంగా పూజలు చేశారు. లోకేశ్ భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, మండలి రామమోహన్‌రావు, బండే రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక దరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 87907 41166

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్. ✆ 81422 92071

REAL ESTATE

PLOT FOR SALE

TADIGADAPA

తాడిగడప చైతన్య కాలేజీ 100Ft రోడ్డులో పంచమర్తి అనురాధ గారి విల్లాస్ రోడ్డులో 200& 250 గజాల ఉడా లేఔట్ ప్లాటులు అమ్మకం. ✆92907 63488

TO LET

COMMERCIAL

1600SFt & 1100SFt for Offices in 2nd Floor, Near Hotel Fortune Murali Park MG Road, Vijayawada. ✆ 87904 35283.

JOBS

బ్యాంకు అనుబంధ సంస్థలో పనిచేయుటకు మేనేజర్స్ కావలెను. అర్హత: RTD, VRS, టీచర్స్ కావలెను. ✆ 83175 95259.

రైస్ మిల్ & ప్లాంట్ ఆపరేటర్స్ కావలెను. అనుభవజ్ఞులైన వెల్డింగ్, రిపేర్ తెలిసిన ఆపరేటర్స్ కావలెను. Contact No: ✆ 80962 46099.

లక్ష్మీభవానీ ఏజెన్సీస్ భవానీపురం నందు Degree, MBA+Tally Accounts 15K-18K, OC అభ్యర్థులు కావలెను. ✆ 94408 39728, 90320 89366

విజయవాడ మెట్రోపాలిటన్ హోటల్ వారికి స్టాఫ్ కావలెను. ఫ్రంట్ ఆఫీసు అసిస్టెంట్ (Male) ★ హౌస్‌కీపింగ్ సూపర్‌వైజర్ (Need) Hotel Experience ★ హౌస్‌కీపింగ్ బాయ్స్ ★ సెక్యూరిటి గార్డు ★ ఆకర్షణీయమైన జీతం. ✆ 72888 85598

విజయవాడలో క్రొత్తగా ప్రారంభిస్తున్న ఏజెన్సీ నందు కంప్యూటర్ ఆపరేటర్స్/ టెలీకాలర్స్/ ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్/ సోషల్ మీడియా ఆపరేటర్స్ కావలెను. Qua: ఇంటర్ టు డిగ్రీ. ✆ 93943 71987.

IVY Overseas, విజయవాడ బ్రాంచ్‌లో పనిచేయుటకు బ్యాక్ ఎండ్ స్టాఫ్ Freshers (M/ F) కావలెను. Qul: డిగ్రీ, B.Tech. ✆ 99666 05638

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹ 1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

(c) eenadu

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

భద్రరాజు సేవలు మరువలేనివి

పెదచందాల (కృత్తివెన్ను), న్యూస్‌టుడే: గరిశపూడి పంచాయతీ పెదచందాల గ్రామానికి చెందిన రాధారంగా మిత్ర మండలి అధ్యక్షుడు బాడిత రామశ్రీను సత్యనారాయణ (భద్రరాజు) చేసిన సేవలు మరువలేనివని రాధారంగా మిత్ర మండలి తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు, జనసేన నాయకుడు బుల్లెట్ ధర్మారావు అన్నారు. బాడిత రామశ్రీను సత్యనారాయణ ఇటీవల గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. మంగళవారం భద్రరాజు స్వగృహానికి వెళ్లి పిల్లల చదువు నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. గరిశపూడి సర్పంచి నాగిడి నాగార్జున, కమిటీ సభ్యులు వన్నెంరెడ్డి ప్రసాద్, బత్తిన రమేష్, గుడిసేవ విజయకుమార్, దాసి రాజేష్, తోట ప్రకాశరావు, కాజా మణికంఠ పాల్గొన్నారు.

ధర వరలు

రైతుబజారు: టమాట 17, వంగ 24, బెండ 30, పచ్చిమిర్చి 30, కాకర 36, క్యాబేజీ 18, క్యారెట్ 32, దొండ 40, బంగాళదుంప 23, ఉల్లి పాయలు 24, గోరుచిక్కుడు 32, దోస 38, సొర 10, అరటికాయ 7.6, చిక్కుళ్లు 40, బీర 26, చామదుంప 26, మునగ 12/10, కంద 42, బీట్ రూట్ 26, కీరదోస 40, బీన్స్ 58, క్యాప్సికం 60, అలసందలు 30, చిలకడ దుంప 32, కొత్తిమీర 12/06, పుదీనా 15/05 బుధవారం రైతుబజారుకు సెలవు. గురువారం ఉదయం 7 గంటల వరకు ఈ ధరలు వర్తిస్తాయి. –మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే

సినిమాలు

రేవతి: భర్తమహాశయులకువిజ్ఞప్తి
మినీరేవతి: అనగనగా ఒకరాజు
సిరికృష్ణ: మనశంకరవరప్రసాద్
-మచిలీపట్నం (గొడుగుపేట)

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

❖ నగరంలోని వలందపాలెం ప్రధాన రహదారి పక్కన చెత్త, వ్యర్థాలతో నిండిపోవడంతో స్థానికులతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్యను ఆ ప్రాంతవాసులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తీసుకురాగా అధికారులకు వివరించడంతో సిబ్బందిని పంపి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించి, చెత్త వేయకుండా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

❖ నగరంలోని సుకర్లాబాద ఆర్పీఎం చర్చి సమీపంలో ప్రధాన డ్రెయిన్‌లో వ్యర్థాలు మేటవేసుకుపోయాయి. పూడిక తొలగించకపోవడంతో మురుగు పారుదలకు ఆటంకంగా మారింది. స్థానికులు మేమున్నాం మీకుతోడుగా దృష్టికి తీసుకురాగా అధికారులకు వివరించడంతో స్పందించి పూడిక తొలగించేలా చర్యలు తీసుకున్నారు. –మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

ప్రభుత్వ ఆస్పత్రిలో విద్యార్థులకు వైద్యసేవలు

గూడూరు, న్యూస్‌టుడే: రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని కంకటావ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులను వాహనంలో మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించారు. మల్లవోలు పీహెచ్‌సీ వైద్యులు తరుణ్‌శంకర్ ఆదేశాలతో వివిధ అనారోగ్య సమస్యలు ఉన్న విద్యార్థులను గుర్తించి మెరుగైన సేవలు అందించేందుకు ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు సిబ్బంది తెలిపారు.

అనుకుంటే మీరు.. అవస్థలు తీరు..

నాడు-నేడు బడుల్లో పూర్తికాని పనులు

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను

పరిశీలన

వైకాపా హయాంలో నాడు..నేడు అంటూ హడావుడిగా పలు పాఠశాలల్లో చేపట్టిన పనులు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ప్రధానంగా అదనపు తరగతి భవనాలు అందుబాటులోకి రాకపోవడంతో విద్యార్థులు ఉన్న గదుల్లోనే కిక్కిరిసి కూర్చోవాల్సి వస్తోంది. కొన్ని కటిక నేలపై, చెట్లకింద, వరండాల్లో చదువులు సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అవసరమైన ప్రతిపాదనలు చేశారు. ఇప్పటివరకు ఎలాంటి కదలిక లేవపోవడంతో విద్యార్థుల అవస్థలపై 'న్యూస్‌టుడే' బృందం పరిశీలన కథనం.

✪ **బందరు నగరం** రైలుపేట నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో 250 మంది విద్యార్థులు ఉన్నారు. అదనపు తరగతి గదుల భవన నిర్మాణం చివరిదశలో ఆగిపోయింది. అసంపూర్తి భవనంలోనే తరగతులు సాగించాల్సి వస్తోంది. ✪ **చిలకలపూడి** పాండురంగ నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో 750 మంది విద్యార్థులు చదువుతున్నారు. దాతల సహకారంతో భవన నిర్మాణ పనులు చేపట్టారు. స్థలంపై కొందరు కోర్టును ఆశ్రయించడంతో పనులు పునాదుల దశలోనే ఆగిపోయాయి. ✪ **బందరు మండలం** ఎస్ఎన్ గొల్లపాలెం ఉన్నత పాఠశాలలో భవనం తరచుగా పెచ్చులూడి పడడంతో ఉపాధ్యాయులు ఆ భవనాన్ని ఖాళీ చేశారు. నాడు..నేడు పథకంలో నిర్మించిన మరో భవనం అసంపూర్తిగా మిగిలిపోయింది. దీంతో ఉన్న ఒక భవనంలోనే 150 మందికి తరగతులు నిర్వహించాల్సిన దుస్థితి దాపురించింది.

నాచుగుంట: ఇంటి వరండాలో తరగతులు

● **బంటుమిల్లి మండలంలో** 19 పాఠశాలలో అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఇప్పటికీ 8 పాఠశాలలో ఎక్కడి పనులక్కడే నిలిచిపోయాయి. ● అర్తమూరు పంచాయతీ నాచుగుంట ప్రాథమిక పాఠశాలకు భవనం లేక సామాజిక భవనంలో 3, 4, 5 తరగతులు నిర్వహిస్తున్నారు. నాడు-నేడులో చేపట్టిన భవనం అసంపూర్తిగా ఆగిపోయింది. ఇక్కడ 38 మంది విద్యార్థులున్నారు. ఇక 1, 2 తరగతులను సమీపంలోని ఇంటి వరండాలో నిర్వహిస్తున్నారు. పెడన, కృత్తివెన్ను మండలాల్లోని అనేక పాఠశాలల్లో చేపట్టిన పనులు ఇలా అసంపూర్తిగానే మిగిలిపోయాయి.

బందరు మండలం ఎస్ఎన్ గొల్లపాలెంలో శిథిల భవనం పక్కన అసంపూర్తి నిర్మాణం

● **గూడూరు మండలంలో** 15కు పైగా పాఠశాలలను ఎంపిక చేసి పనులు చేపట్టగా వీటిలో పలు పాఠశాలల్లో అదనపు తరగతి భవనాలు ఉన్నాయి. గూడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి భవనం చివరి దశలో ఆగిపోయింది. ● ఆర్వేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి భవనం అసంపూర్తిగా ఆగిపోయింది. పాఠశాలలో 52మంది విద్యార్థులు ఇరుకు గదుల్లోనే సర్దుకుంటున్నారు. ● కంచాకోడూరు ప్రాథమిక పాఠశాల భవనం చివరి దశలో ఆగిపోయింది. తలుపులు, కిటికీలు పెడితే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

ఇలా చేస్తే సరి.. ✪ పాఠశాలలకు మరో మూడు నెలల్లో సెలవులు వస్తాయి. ఈలోగా ప్రతిపాదనలు రూపొందించాలి. ✪ నిధులు రాగానే మెటీరియల్ సిద్ధం చేసుకుని సెలవుల్లో పనులు పూర్తిచేస్తే వచ్చే విద్యా సంవత్సరానికైనా విద్యార్థులకు అవస్థలు తప్పుతాయి.

స్టడీ మెటీరియల్ అందజేత

పోడు, లక్ష్మీపురం (కృత్తివెన్ను), న్యూస్‌టుడే: జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో అందిస్తున్న ప్రేరణ స్ఫూర్తి స్టడీ మెటీరియల్‌ను వినియోగించుకుని పదో తరగతి విద్యార్థులంతా మంచి మార్కులు సంపాదించాలని జడ్పీటీసీ సభ్యురాలు మైలా రత్నకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని లక్ష్మీపురం, పోడు జడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులు ఈ పుస్తకాలు అందించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో నిర్వహించిన వార్షికోత్సవంలో ఉపన్యసించారు. జిల్లా పరిషత్ నిధులు 2021 నుంచి అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఒక్కో పుస్తకం రూ.400 చొప్పున పది విద్యార్థులకు మండల వ్యాప్తంగా అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో-1 అన్వర్‌జానీ, ఎంఈవో-2 ఎస్‌కేడీవీ ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయులు వీరాంజనేయులు, జగన్మోహనరావు, ఉపాధ్యాయులు వీరాస్వామి, వెంకట్, సుబ్రహ్మణ్యం, మురళీకృష్ణ, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్లు తమ్ముర్రామజోగి, కొప్పర్తి భాస్కరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరివిలో పశు ఆరోగ్య శిబిరం

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: పెడన మండలం ఉరివి గ్రామంలో పశు ఆరోగ్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. పశువులకు టీకాలు అందజేశారు. పరీక్షలు జరిపి మందులిచ్చారు. కార్యక్రమంలో జేఈవో ఎం.సూరిబాబు, గోపాలమిత్ర ఎన్.వెంకటేశ్వరరావు, ఏహెచ్ఏ కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికత అందిపుచ్చుకోవాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

బంటుమిల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రతి ఒక్కరూ సాంకేతికతను అందిపుచ్చుకొని నైపుణ్యం సాధించాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. బంటుమిల్లిలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం హెచ్ఎం పద్మజ అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. మంత్రి నారా లోకేశ్ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి చేస్తున్న కృషిని, అమలు చేస్తున్న సంక్షేమ, విద్యా బోధన విధానాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థుల ఆటపాటలు, నృత్యాలతో సందడి నెలకొంది.

రహదారి భద్రత.. యువత బాధ్యత

పెడన, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదాల నియంత్రణను యువత తమ బాధ్యతగా గుర్తించాలని మచిలీపట్నం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) సిద్ధిఖ్ సూచించారు. ఈనెల 1న ప్రారంభమై 31 వరకు జరగనున్న రహదారి భద్రత మాసోత్సవాల్ని పురస్కరించుకుని నందమూరు వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో రవాణా శాఖ మంగళవారం సదస్సు నిర్వహించింది. రోడ్డు ప్రమాదాల్లో అధికంగా 17-35 ఏళ్లలోపు వారు చనిపోతున్నారని, 65 శాతం హెల్మెట్లు, సీటుబెల్టులు ధరించకపోవటం, మితిమీరిన వేగం కారణంగా జరుగుతున్నాయని చెప్పారు. ఈ తరహా ప్రమాదాల్ని కట్టడి చేసేందుకు ఇంజినీరింగ్ విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రమాదాల్లో క్షతగాత్రులను రక్షించిన యువతను ప్రోత్సహించాలన్న లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం రోడ్ మహావీర్ పథకాన్ని ప్రవేశపెట్టిందని, రూ.25వేల నగదు, సర్టిఫికెట్‌ను కలెక్టర్ ద్వారా అందజేస్తున్నారని తెలిపారు. సదస్సులో సహాయ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సోనిశ్రీ, కరస్పాండెంట్ కాకి కుమారబాబు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డా.రాజా రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంవీఐ సిద్ధిఖ్, చిత్రంలో ఏఎంవీఐ, కళాశాల ప్రతినిధులు

అనర్థాన్ని కళ్లకు కట్టారు..

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ బంటుమిల్లి ప్రాజెక్టు ఆధ్వర్యంలో మచిలీపట్నం పెరేడ్ గ్రౌండ్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన బాల్య వివాహ నిషేధ స్టాల్ జిల్లాలో మొదటి స్థానాన్ని సాధించింది. పెడన పట్టణానికి చెందిన అంగన్‌వాడీ బాలలతో బాల్య వివాహాన్ని ప్రతిబింబించేలా ఈ స్టాల్ ఏర్పాటు చేశారు. అదే సమయంలో పోలీసులు దాడులు జరిపి నియంత్రించడం, ఆ తర్వాత చట్టపరమైన చర్యలు తదితర అంశాలను కళ్లకు కట్టారు. ఈ స్టాల్ జిల్లాలో మొదటి స్థానాన్ని పొందినట్టు బంటుమిల్లి ప్రాజెక్ట్ సీడీపీవో సముద్రవేణి చెప్పారు. –పెడన, న్యూస్‌టుడే

ఘనంగా లేడీయాంప్తిల్ పాఠశాల వార్షికోత్సవం

పాల్గొన్న లంకిశెట్టి బాలాజీ, విజయలక్ష్మి, విద్యార్థులు

మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: లేడీయాంప్తిల్ బాలికల పాఠశాల 137వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ ఒక గృహిణి విద్యావంతురాలైతే ఆ ఇల్లు విశ్వవిద్యాలయం అవుతుందన్న జవహర్‌లాల్ నెహ్రూ మాటలను గుర్తు చేశారు. అన్ని రంగాల్లో అగ్రస్థానంలో ఉన్న మహిళల స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. జిల్లా విశ్రాంత ఉపవిద్యాశాఖాధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యారంగంలో క్రమశిక్షణ ఉన్న పాఠశాలగా లేడీయాంప్తిల్ గుర్తింపు పొందిందన్నారు. విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల హెచ్ఎం శ్రీరామ, లేడీయాంప్తిల్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి మాట్లాడారు. క్రీడల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉయ్యూరు డిపో మేనేజర్ శివరామకృష్ణ, పోపూరి శ్యాంసుందర్ పాల్గొన్నారు.

మాట్లం(కృత్తివెన్ను), న్యూస్‌టుడే: విద్యార్థులంతా ఇష్టపడి చదివితే మంచి మార్కులు వస్తాయని ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని మాట్లం జడ్పీ ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు వీడ్కోలు సభతో పాటు, వార్షికోత్సవాన్ని కలిపి నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

మాట్లం: పది విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఈ మలుపులు.. ప్రమాదాలకు తలుపులు

గూడూరు మండలం రామరాజుపాలెం అడ్డరోడ్డు నుంచి మల్లవోలు వెళ్లే ప్రధాన రహదారిలో వివిధ ప్రాంతాల్లో ఉన్న మలుపులు ప్రమాదకరంగా మారాయి. మల్లవోలు, ఐదుగుళ్లపల్లి, పోలవరం, రామన్నపేట తదితర గ్రామాల ప్రజలు ఈ రోడ్డు వెంబడే రాకపోకలు సాగిస్తారు. అధికారులు స్పందించి సూచికలు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు. -గూడూరు, న్యూస్‌టుడే

పాడైన వేదిక..బాగుజేస్తే వేడుక

బందరు నగరం ప్రధాన పార్కు ప్రాంగణంలో ఉన్న కళావేదిక అధ్వానంగా తయారైంది. వివిధ సంస్థల ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు ఇక్కడ నిర్వహించేవారు. సాయంత్రమైతే పెద్ద స్క్రీన్‌తో ఉన్న టీవీ ద్వారా కార్యక్రమాలను వీక్షించేవారు. వేదిక పైకప్పు కూలడంతో ఇలా రాడ్లు మాత్రం మిగిలాయి. దీనిని అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. - మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే

విరజిమ్మితే నీరు..విరబూసేను అందాలు

బందరు నగరం మూడుస్తంభాల కూడలిలో నీటి ఫౌంటెన్ చూడముచ్చటగా ఉండేది. పర్యవేక్షణ లేక అలంకారప్రాయంగా మారింది. ఫౌంటెన్ పైపులు ఊడిపోయాయి. మచిలీపట్నం- విజయవాడ రహదారి కావడంతో నిత్యం వేల మంది రాకపోకలు సాగిస్తారు. ఫౌంటెన్‌ను అందుబాటులోకి తెస్తే కూడలికి మళ్లీ కళ వస్తుంది. - మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

మూతబడిన కేంద్రం..సేవలు దూరం

మచిలీపట్నం ప్రధాన రైల్వే స్టేషన్ దూరంగా ఉండడంతో ప్రయాణికులు టికెట్లు రిజర్వేషన్ చేయించుకునేందుకు 2007లో నగరంలోని రైతుబజారు సమీపంలో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కొన్నేళ్లు ఈ కేంద్రం పనిచేసినా తర్వాత వివిధ కారణాలతో మూతపడింది. దీనిపై ఎంపీ బాలశౌరితో పాటు పలువురు రైల్వే ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. దీన్ని వినియోగంలోకి తేవాలని ప్రయాణికులు కోరుతున్నారు. - మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

గోడు వినండి.. జమ్ము తీయండి..

మండల పరిధిలోని వసంతరాయుడు కోడు (మురుగు కాలువ) సమస్య పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. సుమారు 7 కి.మీ ఉన్న ఈ కాలువ పరిధిలో నారాయణపురం, అర్తమూరు, మణిమేశ్వరం తదితర గ్రామాలకు చెందిన వందల ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. కాలువలో జమ్ము పెరిగి నీరు ముందుకు పారడం లేదు. జమ్ము తొలగించాలని రైతులు కోరుతున్నారు. -బంటుమిల్లి, న్యూస్‌టుడే

విద్యుత్తు సమస్యలా... ఫోన్ చేయండి..

విద్యుత్ సరఫరా ఆగితే చాలు ఎక్కడ పోయింది. ఎంతసేపటికి వస్తుందో అని ఆరా తీయడం ప్రారంభిస్తాం. కానీ గాలులు వీచినప్పుడు చెట్ల కొమ్మలు విరిగి పడడం, ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్యలు తలెత్తడం, ఫ్యూజులు పోవడం ఇలా విద్యుత్ సరఫరా ఆగిపోవడానికి అనేక కారణాలు ఉంటాయి. సమస్య ఏదైనా... సరఫరా లోపం ఎక్కడున్నా సమాచారం తెలుసుకోవడమే కాదు, సమస్య పరిష్కారం కోసం ఫిర్యాదు చేసేందుకు ప్రతి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటరు ఉంటుంది. ఆ కేంద్రానికి కేటాయించిన ఫోన్ నంబరుకు 24 గంటల్లో ఎప్పుడైనా ఫోన్ చేయవచ్చు. బందరు, పెడన నియోజకవర్గాల్లో ఉన్న విద్యుత్తు ఉపకేంద్రాలు, ఫ్యూజ్‌ఆఫ్‌కాల్ కేంద్రాల ఫోన్ నంబర్ల గురించి తెలుసుకుందాం. - న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

సెక్షన్స్	ఫ్యూజ్‌ఆఫ్‌కాల్	ఏఈ
డీ–1 సెక్షన్	08672–222374	94408 12149
డీ–2 సెక్షన్	08672–223755	94408 12151
డీ–3సెక్షన్	08672–222241	94408 12148
బందరు రూరల్	94910 52103	94408 12150
చిన్నాపురం	94906 15630	94405 93267
గూడూరు	94906 15636	94408 12153
పెడన	94906 15632	94408 12152
బంటుమిల్లి	94906 15633	94408 17569
కృత్తివెన్ను	94906 15635	94408 14273

కవిపురం-గురివిందగుంట రహదారి పూర్తి

పెడన, న్యూస్‌టుడే: పెడన మండలం కవిపురం-గురివిందగుంటల మధ్య రూ.81లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో పనులు పూర్తికాక రాకపోకలకు గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 1.7 కి.మీ మేర రోడ్డును పూర్తి చేసినట్లు ఏఈ ధర్మయ్య చెప్పారు. ఎంపీడీవో అరుణకుమారి, మండల పరిషత్తు ప్రత్యేక ఆహ్వానితుడు రాజులపాటి అచ్యుతరావు తదితరులు నూతన రహదారిని పరిశీలించారు.

పారిశుద్ధ్యాన్ని మెరుగ్గా నిర్వహించాలి

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: శిక్షణలో నేర్చుకున్న అంశాలను జోడించి మచిలీపట్నంలో మరింత మెరుగ్గా పారిశుద్ధ్య పనులు చేపట్టేలా కృషి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు అన్నారు. హైదరాబాద్‌లో పారిశుద్ధ్య శిక్షణ కార్యక్రమంలో పాల్గొని వచ్చిన ఎనిమిది మంది శానిటేషన్ సెక్రటరీలకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు.

భోజనం బాగుందా.. అన్ని వసతులు ఉన్నాయా?

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: అన్ని వసతులు ఉన్నాయా...భోజనం బావుంటుందా అంటూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీఆర్ కృష్ణయ్య విద్యార్థినులను ఆరా తీశారు. మంగళవారం సాయంత్రం ఆయన నగరంలోని బుట్టాయిపేట బీసీ కళాశాల బాలికల వసతిగృహాన్ని తనిఖీ చేశారు. వసతి గృహ పరిసరాలతో పాటు భోజనశాల, భోజన నిర్వహణ తీరు తదితరాలను పరిశీలించారు. అనంతరం బాలికలకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. వసతి గృహంలో ఎలాంటి సమస్యలు ఉన్నా సంస్థ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. న్యాయవాది చీలి మునలయ్య పాల్గొన్నారు.

భోజనం పరిశీలిస్తున్న న్యాయమూర్తి కేవీఆర్ కృష్ణయ్య

మండల పరిషత్తు ఉద్యోగులకు సత్కారం

సత్కారం పొందిన ఉద్యోగులతో అధికారులు

పెడన, న్యూస్‌టుడే: గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాలను అందుకున్న ఉద్యోగులను స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం అధికారులు సత్కరించారు. వికసిత్ భారత్ ఏపీవో వజీర్, టైపిస్ట్ విజయకుమారి, పంచాయతీ కార్యదర్శి చాపరాల రాజేశ్, అటెండర్ సీతాకుమారిలు ప్రశంసాపత్రాలను అందుకన్నారు. ఈ నలుగురు అంకితభావంతో విధులు నిర్వర్తించారని ఎంపీడీవో అరుణకుమారి ప్రశంసించారు.

400 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ

గూడూరు, పెడన, న్యూస్‌టుడే: పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో గూడూరుకు చెందిన ప్రత్యేక అవసరాల విద్యార్థిని అమీనాతబస్సుమ్ ప్రతిభచాటుకుంది. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఆమె 400 మీటర్ల పరుగు విభాగంలో ప్రథమ స్థానం సాధించి తన సత్తాచాటుకుంది. ఈ ఘనత సాధించిన విద్యార్థినిని డీఈవో యూవీ సుబ్బారావు, సమగ్రశిక్షా ఏపీసీ కుముదినిసింగ్, డీవైఈవో శేఖర్‌సింగ్, ఎమ్యీవో పి.సుబ్రహ్మణ్యం, సహిత విద్య సమన్వయకర్త కె.ఏడుకొండలు, పాఠశాల హెచ్ఎం విజయకుమారి అభినందించారు. ఆమెను ప్రోత్సహించిన ఐఈఆర్పీలు పి.రమాదేవి, సాజినీబేగం, పి.బేబీషాలిని, అబ్దుల్‌హమీద్‌లను ప్రశంసించారు.

బహుమతి అందుకున్న విద్యార్థినితో ఐఈఆర్పీలు

అనుమతి అడగం.. అడ్డంగా కట్టేస్తాం..

న్యూస్‌టుడే, పెడన

పురోగతిలో షెడ్డు పనులు..

ఎక్కడ: పెడన-గుడివాడ రహదారిపై స్థానిక వైజంక్షన్ సమీపంలో నిషేధిత భూమిలో అనధికార కట్టడం చేపట్టారు.

ఏమిటీ: సర్వే నం.341 లోని కొంత భూమిలో గతంలో అనధికార లేఔట్ ఏర్పాటు చేశారు. పట్టణంలో విజిలెన్స్ బహిర్గతం చేసిన 43 అనధికార లేఔట్లలో ఇది ఒకటి. ఫలితంగా ఈ లేఔట్‌ను 22ఎగా ప్రకటించి నిషేధిత జాబితాలో చేర్చారు.

ఇబ్బంది: పెడన-లక్ష్మీపురం 216హెచ్ జాతీయ రహదారి 150 అడుగుల రోడ్డు విస్తరణలో ఉంది. ఈ లేఔట్‌లో భవన నిర్మాణాలకు మున్సిపల్ ప్లాన్లు మంజూరు కావు. అసలు లైసెన్స్‌డ్ టౌన్ ప్లానర్(ఎల్‌టీపీ) లాగిన్ అనుమతించదు. అయినా అతిక్రమించి కడుతున్నారు.

అధికారుల చర్యలు: దీనిపై 2వ సచివాలయ ప్లానింగ్ కార్యదర్శి తాళ్ల సాయిదుర్గ రెండుసార్లు నోటీసులిచ్చినా స్పందన లేదు. దీనిపై టౌన్ ప్లానింగ్ అధికారి(టీపీవో) స్పందిస్తూ బుధవారం ఈ కట్టడాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పెళ్లి రోజు వేడుక.. వృద్ధులకు తోడుగా..

జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు దంపతులు తమ పెళ్లి రోజును మంగళవారం వృద్ధాశ్రమంలో జరుపుకొన్నారు. స్నేహాలయ వృద్ధాశ్రమంలో జరిగిన కార్యక్రమంలో వృద్ధులకు కావాల్సిన నిత్యావసర వస్తువులు, మిఠాయిలు, పండ్లు అందజేశారు. వృద్ధుల కష్టసుఖాలను విన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ దంపతులు మాట్లాడుతూ హంగులు, ఆర్భాటాల మధ్య వేడుకల కంటే వృద్ధుల ముఖాల్లో చిరునవ్వులు చూడడం తమ జీవితంలో మరచిపోలేని అనుభూతి అన్నారు. –భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే

ఆక్రమణ తొలగింపు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని ఐదో డివిజన్ పరిధి వరలక్ష్మీ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్నారని స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగం ఉద్యోగులు, సిబ్బంది, పోలీసులతో కలిసి అక్కడకు వెళ్లి జేసీబీతో ఆక్రమణ తొలగించారు. అసిస్టెంట్ సిటీప్లానర్ హరిప్రసాద్ తదితరులు దగ్గరుండి పర్యవేక్షించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడడం చట్టరీత్యా నేరమన్నారు.

ఏఆర్ ఎస్సైలు షానజీర్, నాగరాజు
గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా సేవా పురస్కారాన్ని అందుకుంటున్న అధ్యాపకుడు నాగేశ్వరరావు, మత్స్యశాఖ సహాయకురాలు రమ్య

సేవకు సత్కారం.. ప్రతిభకు పురస్కారం

మచిలీపట్నం కార్పొరేషన్, పెడన గ్రామీణ, న్యూస్‌టుడే: నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో మచిలీపట్నంకు చెందిన ఏఆర్ ఎస్సైలు ఎండీ షానజీర్, కె.నాగరాజు ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు చేతులమీదుగా పురస్కారాలు అందుకోవడంపై పలువురు అభినందనలు తెలిపారు.

బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

యూనియన్ బ్యాంకు ఎదుట నాయకులు, ఉద్యోగుల నిరసన

మచిలీపట్నం (గొడుగుపేట): బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటూ పలువురు నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం నగరంలోని పలు బ్యాంకుల ఎదుట ఉద్యోగులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు టి.చంద్రపాల్, మాజేటి శ్రీనివాసరావు, ఎండీ కరీముల్లా, గంగాధర్‌ప్రసాద్ తదితరులు సంఘీభావం ప్రకటించారు.

పెడనలో మూతపడిన బ్యాంకులు

పెడన: అఖిల భారత బ్యాంక్ యూనియన్ల ఐక్యవేదిక పిలుపు మేరకు పెడనలో మంగళవారం ప్రభుత్వ రంగ బ్యాంకులను మూసివేశారు. వారానికి ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో ఉద్యోగులు ఈ సమ్మె నిర్వహించారు. బ్యాంకులు గత శనివారం నుంచి వరుసగా నాలుగు రోజులు మూతపడడంతో వాణిజ్య కేంద్రమైన పెడనలో ఆర్థిక లావాదేవీలు నిలిచిపోయాయి. బ్యాంకుల సమ్మె సమాచారం తెలియక పలువురు ఖాతాదారులు వచ్చి వెనుతిరిగి వెళ్లడం కన్పించింది.

'వారికి నైతిక విలువల్లేవ్'

భాస్కరపురం, న్యూస్‌టుడే: రాజకీయాల్లో నైతిక విలువలు లేని వ్యక్తులు పేర్ని నాని, జోగి రమేష్ అని బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి.ఫణికుమార్ ధ్వజమెత్తారు. సమావేశంలో రామలింగేశ్వరస్వామి దేవస్థానం పాలకవర్గ సభ్యుడు నిమ్మగడ్డ శ్రీధర్ పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి
మంచితనం, మమతానురాగాలు మాకు పంచి, ఆత్మీయత అనుబంధాలతో అందరి హృదయాలలో సుస్థిర స్థానాన్ని ఏర్పరుచుకొని మా ఉజ్వల భవిష్యత్ కొరకు అహర్నిశలు శ్రమించిన కీ॥శే॥ చన్నంశెట్టి సత్యంబాబు గారి ఆకస్మిక మరణం మాకు ఎన్నటికీ తీరని లోటు. దివికేగిన వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...
కీ॥శే॥ చన్నంశెట్టి సత్యంబాబు గారు
Executive Engineer SDSTPS, APPDCL/APGENCO, Nelaturu, NELLORE
చేవేంద్ర - పెడన మండలం
జననం: 09-08-1970 - మరణం: 18-01-2026
భార్య: చన్నంశెట్టి వెంకట రత్నకుమారి
కుమారుడు: చన్నంశెట్టి ప్రశాంత్‌బాబు
తండ్రి: చన్నంశెట్టి వెంకటనారాయణ
మరియు కుటుంబ సభ్యులు

(c) eenadu

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: మరమ్మతుల నిమిత్తం బుధవారం పలుచోట్ల విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ రాజు తెలిపారు. ఉదయం 8 నుంచి 12 గంటల వరకు సరఫరాకు అంతరాయం ఉందని మంగళవారం ఓ ప్రకటనలో చెప్పారు. చిక్కవరం, కొత్తగూడెం, బీబీగూడెం, కొండపావులూరు, గోపవరపుగూడెం, గొల్లనపల్లి పంచాయతీల పరిధిలోని వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

కానూరు, న్యూస్‌టుడే: కానూరు పరిధిలో మరమ్మతుల నిమిత్తం విద్యుత్తు సరఫరాకు బుధవారం అంతరాయం కలగనుంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మురళీనగర్, బల్లెంవారివీధి, సుబ్బారావు లేఔట్, కమలమ్మ బజారు పరిసర ప్రాంతాల్లో సరఫరా నిలివేస్తున్నట్లు ఈఈ హరిబాబు ప్రకటనలో తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందన: ✦ పెనమలూరు- చోడవరం ప్రధాన రహదారిలో వీధి దీపాలు వెలగడం లేదని గ్రామస్థులు సోమవారం 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా గ్రామ కార్యదర్శి అహ్మద్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కార్యదర్శి మంగళవారం ఏడు దీపాలు ఏర్పాటు చేయించి సమస్య పరిష్కరించారు. ✦ గంగూరు మసీదు వీధిలోని విద్యుత్తు స్తంభం ఒకటి తుప్పు పట్టి ప్రమాదకరంగా మారింది. ఈ విషయమై గ్రామానికి చెందిన షాబుద్దీన్ 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా ట్రాన్స్‌కో అధికారులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. స్పందించిన ఏఈ సూర్యనారాయణరాజు మంగళవారం పాత ఇనుప స్తంభాన్ని తొలగించారు. కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయించారు.✦ గంగూరులో కుళాయిల నుంచి నలకలతో నిండిన నీరు వస్తోందంటూ స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా సోమవారం గ్రామకార్యదర్శి ప్రకాష్‌నాథ్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కార్యదర్శి మంగళవారం గ్రామంలోని మూడు ట్యాంకులను శుభ్రం చేయించి, బ్లీచింగ్ చల్లించారు. – న్యూస్‌టుడే, పెనమలూరు

29న సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

ఇందుపల్లి (గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే: ఉంగుటూరు మండలం ఇందుపల్లిలో శిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని ఈనెల 29న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉదయం ఆరు గంటల నుంచే ప్రత్యేక పూజలు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన. . బాబా గ్రామోత్సవం ఉంటుందని, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఉన్నాయని చెప్పారు.

దారి కమ్మేసి.. ఆనక అమ్మేసి..

☆ కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలు ☆ చోద్యం చూస్తున్న అధికారులు

కంకిపాడు, న్యూస్‌టుడే

ప్రభుత్వ స్థలాలను రక్షించుకోవాల్సిన అవసరాన్ని ఈ ఉదంతం స్పష్టం చేస్తుంది. కంకిపాడు ప్రధాన కూడలిలో విజయవాడ-మచిలీపట్నం (బందరు రోడ్డు) పక్కన అత్యంత విలువైన ప్రభుత్వ భూమి ఉంది. దీనిలో విశాలమైన పడమర భాగం పోలీస్ శాఖకు దఖలు కాగా.. సర్కిల్, హౌస్ ఆఫీసర్ కార్యాలయాలు, అధికారులు, సిబ్బంది క్వార్టర్స్ నిర్మించారు. ఇక రహదారివైపు

పోలీస్ సర్కిల్ భవనం చుట్టూ దుకాణాలు

ఉన్న స్థలంలో కొందరు దాదాపు 20 దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. వ్యాపార కూడలిగా మారడం, స్థలం విలువ

44 సంవత్సరాలుగా ✆ 81252 65651 ✆ 0866 2471617, 2477470

ఆటలు ● పాటలు ● రోబోటిక్స్ ● క్రియేటివ్ లెర్నింగ్ ● డ్రోన్ తయారీ ● 3డి ప్రింటింగ్ ● LKG to 10th

డాన్ బాస్కో స్కూల్

Affiliated to CBSE

గుడివాడ రోడ్, ఆటోనగర్ కాలనీ ఎదురు, విజయవాడ-7.

అమాంతం పెరగడంతో అప్పటి ఆక్రమణదారులు ఇతరులకు అమ్ముకున్నారు. ఇలా ఒక్కో దుకాణం మూడు నాలుగు చేతులు మారింది. కొనుగోలుదారులు తాజాగా పాతవి, రేకుల షెడ్ల స్థానే ఆర్‌సీసీ భవనాలను నిర్మించుకున్నారు. భవిష్యత్తులో ఖాళీ చేయాల్సి వస్తుందనే 'ముందుచూపు'తో పట్టాల్లేని లోపాలను ఆసరాగా 'సంపూర్ణ హక్కుల పత్రాలు' సిద్ధం చేసుకున్నారు. ఒక్కో దుకాణంపై నెలకు రూ.8 వేలు నుంచి రూ.15 వేల వరకు యజమానులకు వస్తోంది. దీంతో ఏది ఏమైనా న్యాయస్థానాల్ని ఆశ్రయించైనా 'తీర్పు' తమవైపే ఉండేవిధంగా సమాయత్తమయ్యారు.

కిం కర్తవ్యం..?: 20 ఏళ్ల కిందట నిర్మించిన క్వార్టర్ల భవన సముదాయం శిథిల కాగా నాలుగేళ్ల కిందట తొలగించారు. ఈ స్థలంలో సుమారు రూ.2 కోట్ల అంచనాతో నమూనా(మోడల్) సర్కిల్ కార్యాలయ భవన నిర్మాణం చేపట్టారు. మరో రూ.50 లక్షల విలువైన ఆధునాత సౌకర్యాల పరికరాలు అందుబాటులోకి రానున్నాయి. భవన నిర్మాణం ముగింపు దశకు చేరుకోగా.. ఇప్పుడు దారి గుర్తుకు వచ్చింది. భారీ భవనానికి ఇరుకైన మార్గంపై ఉన్నతాధికారులు ఆరా తీశారు. దారి విస్తరణకు మూడు దుకాణాలనైనా తొలగిస్తే బాగుంటుందని భావించారు. ఇది తెలిసిన దుకాణ యజమానులు సంఘటితమయ్యారు. చిన్న బొర్డుల స్థానే కొత్తగా పెద్దవాటిని ఏర్పాటు చేశారు. సంప్రదింపుల ద్వారా సమస్య పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, అధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నారని తెలుస్తోంది.

ఇప్పటికైనా కళ్లు తెరిస్తే మేలు

కంకిపాడు గ్రామ కూడలిలోని అత్యంత విలువైన స్థలాల్లో 50 శాతం ప్రభుత్వానికి చెందినవే. వీటిలో ఇప్పటికే చాలావరకు అన్యాక్రాంతమయ్యాయి. మిగతా స్థలాలనైనా రక్షించుకోకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు ఉంటాయనే ఎదురవుతాయనే వాస్తవాన్ని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు గుర్తించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

చెత్త ఇవ్వండి.. నిత్యావసరాలు పొందండి

ముదునూరు(ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే: ఇంట్లో ఉన్న పొడి చెత్తను స్వచ్ఛ రథంలో వేసి నిత్యావసరాలు తీసుకోవాలని ఉయ్యూరు ఎంపీపీ సిహెచ్ కల్పన అన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో స్వచ్ఛ రథం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. ఈ సందర్భంగా మంగళవారం ముదునూరులో జెండా ఊపి ప్రారంభించారు. గ్రామాలను స్వచ్ఛంగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎంపీడీవో జీసస్ శేషగిరిరావు పేర్కొన్నారు. సర్పంచులు మువ్వా వెంకట నాగలక్ష్మి, సూరపనేని శేష వర ప్రసాద్, జాన్ బాషా, వైస్ ఎంపీపీ స్వర్ణకుమారి, ఎంపీటీసీ బి.గంగారత్నం, కూటమి నాయకులు వెంకట కుటుంబరావు, జ్ఞానశేఖర్ పాల్గొన్నారు.

స్వచ్ఛ రథాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

అధిక పురుగు మందుల వినియోగంతో అనర్థం

పెనమలూరు, న్యూస్‌టుడే: అధిక పురుగుమందుల వినియోగం అనారోగ్యానికి దారితీస్తుందని రైతులు గుర్తించాలని... తగ్గించి... పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం... సిబ్బందితో కలిసి పొలాల్లో పర్యటించి, పెసర పంటలు పరిశీలించారు.

ఆలయం పేరు ఖరారు

ప్రొద్దుటూరు (కంకిపాడు), న్యూస్‌టుడే : విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి ప్రొద్దుటూరు పరిధిలో నిర్మించిన శ్రీవారి ఆలయానికి 'శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానం'గా పేరు ఖరారు చేసినట్లు ఆలయ నిర్మాణ కర్త భీమవరపు శేషమ్మ మూర్తి కుమారుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 18 నుంచి ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. వచ్చే నెల 21న ఉదయం 10.44 గంటలకు విగ్రహాలు, శిఖరం, జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహణ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

కొనకళ్ల బుల్లయ్యకు సన్మానం

కానూరు, న్యూస్‌టుడే: కోస్టల్ ప్రాంతంలో ఆక్వా కల్చర్ అభివృద్ధిలో మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, ఆయన సోదరుడు బుల్లయ్య పాత్ర కీలకమని ఇండియన్ ఓం చైర్మన్ మాజాల సత్యనారాయణ అన్నారు. మంగళవారం కానూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం బుల్లయ్యను సన్మానించారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

వేడుకల ఏర్పాట్లను వివరిస్తున్న కమిటీ అధ్యక్షుడు ప్రసాద్

ఉయ్యూరు, న్యూస్‌టుడే: వీరమ్మతల్లి తిరునాళ్లలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఉయ్యూరు ఆర్డీవో హేల షారోన్ పేర్కొన్నారు. స్థానిక ఉత్సవ ప్రాంగణంలో మంగళవారం ప్రభుత్వ శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో ఆమె మాట్లాడారు. మంచినీరు, పారిశుద్ధ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలని, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా పోలీసు శాఖ తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రధానంగా సీసీ కెమెరాల ఏర్పాటుపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ విషయంలో ప్రణాళికాయుతంగా ఉండాలన్నారు. విద్యుత్తు సరఫరాలో షార్ట్‌సర్క్యూట్ లేకుండా ఆ శాఖ నిశితంగా పరిశీలన చేయాలన్నారు. తిరునాళ్ల 15 రోజులు తీసుకుంటున్న చర్యలు, జాగ్రత్తలను ఆలయ కమిటీ అధ్యక్షుడు పి.వీరవెంకటప్రసాద్ అధికారులకు వివరించారు. గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాస్, ఉయ్యూరు తహసీల్దారు సురేష్‌కుమార్, పట్టణ సీఐ రామారావు, ఎంపీడీవో మల్లి కాసులు పాల్గొన్నారు. ✦ తిరునాళ్లకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన పోలీసు అధికారులతో సమీక్షించారు.

భక్తులకు అన్నదానం

హనుమాన్‌జంక్షన్: స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. హనుమాన్ జంక్షన్‌కు చెందిన నాగమణిబాబు, సుధారాణిల కుమార్తె సుప్రజ పుట్టినరోజు సందర్భంగా దంపతుల 350 మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈవో తారకేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరం పంచాయతీకి సేవా పురస్కారం

ఉత్తమ ప్రజా సేవలందిస్తున్న విభాగంలో గన్నవరం పంచాయతీకి సేవా పురస్కారం లభించింది. మచిలీపట్నంలోని పోలీసు పరేడ్ మైదానంలో సోమవారం జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ డీకే బాలాజీ చేతుల మీదుగా పురస్కారాన్ని ఇన్‌ఛార్జి సర్పంచి పాలడుగు నాని అందుకున్నారు. – న్యూస్‌టుడే, గన్నవరం గ్రామీణం

శివారు కాలనీపై చిన్నచూపు

నిడమానూరు న్యూస్‌టుడే: నిడమానూరులో సౌజన్య రోడ్డు నుంచి నారాయణపురం కాలనీ వరకు ఉన్న ప్రధాన రోడ్డు ప్రజలకు శాపంగా మారింది. ఆరేళ్లుగా ఈ రోడ్డు దుస్థితి మారలేదు. ఈ రోడ్డులో సుమారు 500 కుటుంబాలు నివసిస్తున్నాయి. ప్రతి రోజూ వందలాది వాహనాలు ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డుపై గుంతలు పడటంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు మురుగులో నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి. వర్షం పడిన సమయాల్లో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మురుగు వ్యవస్థ లేక మురుగు నిలు ఎక్కువగా ఉంది. ప్రజా సమస్యల పరిష్కారానికి... చూసి వెళ్తున్నారు తప్ప సమస్యలు పరిష్కరించడం లేదు. ఇప్పటికైనా శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

రోడ్డుపై మురుగు

దారి సరిచేయండి

కంకిపాడు (గ్రామీణం), న్యూస్‌టుడే: కంకిపాడు ఆర్టీసీ బస్టాండ్‌లోకి ప్రయాణికులు వచ్చే మార్గం మూసివేశారు. గతంలో ప్రయాణికులు నిత్యం ఈ మార్గాన్ని వినియోగించారు. తరచూ వ్యర్థాలతో నిండడంతో ప్రయాణికులు బస్సులు వచ్చిపోయే దారిని వినియోగించారు. ఇప్పుడు ఇంక ఇనుప మెట్ల రెయిలింగ్ పెట్టడంతో పూర్తిగా దారి మూసివేసినట్లయ్యింది. బస్సులు వచ్చిపోయే మార్గంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో ఇప్పటికైనా సరిచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్‌షెల్టర్ ఉండి ఏం ప్రయోజనం?

గొడవర్రు (కంకిపాడు), న్యూస్‌టుడే: కంకిపాడు-రొయ్యూరు రహదారి గొడవర్రు పీఏసీఎస్ సమీప బస్‌షెల్టర్ వ్యర్థాలు, చెత్తాచెదారంతో నిరుపయోగంగా మారింది. దాతలు రూ.లక్షలతో నిర్మించారు. నిర్వహణ బాధ్యతను ఎవరూ తీసుకోకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. అధికారులు స్పందించి శుభ్రం చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఎట్టకేలకు పూర్తి చేశారు

కంకిపాడు: కంకిపాడు మండల పరిషత్ సమావేశ భవనం ఎట్టకేలకు పూర్తయింది. రూ.25లక్షల అంచనాతో ఏడేళ్ల కిందట శంకుస్థాపన చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో నిధుల కొరతతో పునాది దశలోనే నిర్మాణం ఆగిపోయింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అదనపు నిధులు మంజూరు చేసి ఎట్టకేలకు పూర్తి చేశారు. రూ.40లక్షల వ్యయంతో కంకిపాడు-కేసరపల్లి రహదారి నుంచి మండల పరిషత్ వరకు సిమెంట్ రోడ్డు పనులూ పూర్తయ్యాయి. వీటిని త్వరలోనే ప్రారంభించడానికి కసరత్తు చేస్తున్నట్లు ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి తెలిపారు.

సామాజిక స్థలాలపై నివేదిక కోరిన పీఆర్ కమిషనర్

గండిగుంట(ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే: గండిగుంటలో 9 ఎకరాల లేఔట్లలో ఉన్న సామాజిక స్థలాలు, రహదారులు స్వాధీనం చేసుకున్న విషయంపై కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి విచారణ చేసి నివేదిక సమర్పించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ పీఆర్ కృష్ణతేజ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని మంగళవారం సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు. ఈ విషయమై తాను కమిషనర్ కృష్ణతేజ, పంచాయతీ రాజ్ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

కారును ఢీకొన్న టిప్పర్

బెలూన్లు తెరుచుకోవడంతో తప్పిన ప్రమాదం

కంకిపాడు (గ్రామీణం, న్యూస్‌టుడే): కంకిపాడు-ఉప్పులూరు ప్రధాన రహదారిలో సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో కారును టిప్పర్ ఢీకొంది. ఈ క్రమంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొంది. కారులోని ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. కంకిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం చోరీ

పెనమలూరు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తాన్ ఖాన్ అనే మహిళ సోమవారం రాత్రి తమ ఇంటి ముందు నిలిపి పడుకున్నారు. తిరిగి మంగళవారం ఉదయం చూడగా వాహనం కనిపించలేదు. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్ నాగరాజుకు నివాళి

కానూరు, న్యూస్‌టుడే: బస్సు నడుపుతూ గుండె నొప్పితో ప్రాణాలు కోల్పోయిన ఆర్టీసీ డ్రైవర్ కె.నాగరాజు(38) మృతదేహం మంగళవారం మధ్యాహ్నం తాడిగడపలోని వసంతనగర్‌కు తీసుకొచ్చారు. శుక్రవారం రాత్రి విధులకు వెళుతున్నానని చెప్పి వెళ్లిన భర్త ఇలా మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అనంతరం నాగరాజు అంత్యక్రియలు నిర్వహించారు.

బ్యాంకు ఉద్యోగుల ధర్నా

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఐదు రోజుల బ్యాంకింగ్ విధానం అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బ్యాంకు యూనియన్ల ఐక్యవేదిక ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట ఉద్యోగులు మంగళవారం ధర్నా చేశారు. ఐక్యవేదిక లోకల్ కార్యదర్శి కె.దివ్యతేజశ్వని, ఏ.నారాయణ, విజయభాస్కర్, నాగభూషణం, హేమంత్‌కుమార్, రామకృష్ణ ఉన్నారు.

నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

విద్యతోనే సమాజంలో గుర్తింపు

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న శ్రీనివాసరావు, హెచ్‌ఎం నాగవేణి తదితరులు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ట్రస్ట్ ప్రతినిధి కందిమళ్ల శ్రీనివాసరావు అన్నారు. ముస్తాబాద్ జడ్పీ హైస్కూల్ డైమండ్ జూబ్లీ వేడుకలు పురస్కరించుకుని పాఠశాలలో విద్యార్థులకు కందిమళ్ల సరస్వతి ఛారిటబుల్ ట్రస్ట్ తరఫున పలు వితరణ కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు 70 మందికి పరీక్ష అట్టలు ఇచ్చారు. క్విజ్, డ్రాయింగ్, పాటలు, వక్తృత్వ, పరుగు, వ్యాసరచన పోటీలు నిర్వహించి 54 మంది విజేతలను ఎంపిక చేశారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి ఉపకరణాలను ట్రస్ట్ ఛైర్మన్ పంపిణీ చేశారు. హెచ్‌ఎం ఎస్.నాగవేణి, బొద్దనపల్లిశర్మ, కందిమళ్ల యగ్నేష్ వర్మ, ఉపాధ్యాయులు రాజగోపాల్, జి.రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

పోరంకి, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని తెదేపా సీనియర్ నాయకుడు అనుమోలు ప్రభాకరరావు అన్నారు. మంగళవారం పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ప్రిన్సిపల్ సుమలత, ఛైర్మన్ రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. ☛ తాడిగడప జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు అందించారు. ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ పించన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కటికల క్రిస్టోఫర్, ప్రిన్సిపల్ కనకదుర్గ, ఛైర్మన్ అప్పారావు, బీవీరావు తదితరులు పాల్గొన్నారు.

పోరంకి: బహుమతులు అందిస్తున్న అనుమోలు ప్రభాకరరావు, పాల్గొన్న ప్రిన్సిపల్ సుమలత తదితరులు

పాల ఉత్పత్తి పెంచడమే ధ్యేయం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: పాల ఉత్పత్తి పెంచడమే ప్రధాన ధ్యేయమని విజయ డెయిరీ సంస్థ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. హనుమాన్‌జంక్షన్ క్లస్టర్ పరిధిలోని పాల సంఘాల అధ్యక్షులకు మంగళవారం స్థానిక కాకాని వెంకటరత్నం భవనంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ పశువుల్లో పునరుత్పత్తి లోపం ఏర్పడిందని, వధశాలలకు విక్రయించే ధోరణి పెరిగిందన్నారు. దీనిని నివారించేందుకు ఓ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి, కృత్రిమ గర్భధారణ ద్వారా గేదె ఈనిన వంద రోజుల్లో తిరిగి చూడి కట్టేలా పూర్తి స్థాయిలో పర్యవేక్షిస్తున్నామన్నారు. ఇందుకోసం అధిక దిగుబడినిచ్చే మేలుజాతి వీర్యం రూ.50కే రైతు ఇంటి వద్దకే సరఫరా చేసేలా వ్యవస్థను రూపొందించామన్నారు. రానున్న మూడేళ్లలో జిల్లాలో రోజుకు 3 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి సాధించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. జీఎం పారీ హజర్వేల్, పశువైద్య నిపుణుడు ప్రసాద్‌లింగం, పాలకవర్గ సభ్యురాలు శనగల వెంకట శివజ్యోతి, క్లస్టర్ మేనేజర్ మాగంటి హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చలసాని ఆంజనేయులు

నటుడికి సత్కారం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: హనుమాన్‌జంక్షన్‌కు చెందిన నటుడు దావులూరి భగవాన్‌ను స్థానిక కాకాని కల్యాణ మండపంలో విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు ఆధ్వర్యంలో సత్కరించారు. సింహరాశితో సినీ రంగప్రవేశం చేసిన భగవాన్ లెజెండ్, శ్రీమంతుడు, అఖండ-2 వంటి 25 చిత్రాల్లో నటించారని, తాజాగా రామ్‌చరణ్ నటిస్తున్న పెద్ది సినిమాలోనూ కీలక పాత్ర పోషిస్తుండటం గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. యలమంచిలి శ్రీరామచంద్రమూర్తి, నందిగం స్వామి, చలసాని రాజా, మిక్కిలినేని ఈశ్వరరావు, హనుమంతు నాగేశ్వరరావు, గొంది శరత్, పర్వతనేని రంగారావు, తదతరులు పాల్గొన్నారు.

భగవాన్‌ని సత్కరిస్తున్న చలసాని ఆంజనేయులు, తదితరులు

తిప్పనగుంటలో పశువైద్య శిబిరం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: తిప్పనగుంటలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. అంపాపురం పశువైద్యాధికారిణి అనామిక ఆధ్వర్యంలో పశువులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. సహకార సంఘం ఛైర్మన్ మాదల శ్రీనివాసరావు శిబిరాన్ని ప్రారంభించారు. పాల సంఘం అధ్యక్షుడు రంగారావు, సామ్రాజ్యం, పార్వతి, బాబూరావు, రఘు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి

ఉయ్యూరు, న్యూస్‌టుడే: సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర కోర్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగ్గా జగదీష్, అసోసియేట్ ఛైర్మన్ పిల్లి హరీశ్ డిమాండ్ చేశారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర కోర్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం హామీల్లో పది శాతం కూడా అమలు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా గణన విధుల్ని కేవలం సచివాలయ ఉద్యోగులకే కేటాయించడం సరికాదన్నారు. జేఏసీ కో-ఛైర్మన్ చేవూరి వెంకటేశ్వరరావు, జిల్లా నాయకులు సతీష్, సుకుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో సచివాలయ ఉద్యోగులు

యాదవుల అభివృద్ధికి కృషి

కానూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో యాదవుల ఐక్యతకు, అభివృద్ధికి కృషి చేద్దామని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు సి. నారాయణ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం కానూరులో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘంలోని పేద, మధ్య తరగతి విద్యార్థులకు వృత్తి నైపుణ్యంలో శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేలా చేస్తామని చెప్పారు. భవన నిర్మాణం, వసతి గృహాల ఏర్పాటుకు ప్రభుత్వంలోని యాదవ పెద్దల ద్వారా ప్రయత్నిస్తామన్నారు. వెంకట సత్యనారాయణ యాదవ్, అనంత రామయ్య, కొలుసు మోహన్, పెద్దిబోయిన శ్రీనివాస్, పాల్గొన్నారు.

సమావేశంలో నారాయణ యాదవ్ తదితరులు

కార్మికుల ప్రయోజనాలు కాపాడాలని వినతి

హనుమాన్‌జంక్షన్: అసంఘటిత రంగ కార్మికుల ప్రయోజనాల కోసం సంక్షేమ మండలిని అమల్లోకి తీసుకురావాలని సీఐటీయూ నాయకుడు ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. ప్రపంచ ఎలక్ట్రీషియన్ దినోత్సవం సందర్భంగా మంగళవారం హనుమాన్‌జంక్షన్ కూడలిలో జెండా ఎగురవేశారు. అనంతరం ప్రైవేటు విద్యుత్తు కార్మికులతో కలిసి ప్రదర్శన నిర్వహించారు.

ఎలక్ట్రీషియన్ల ప్రదర్శన

లక్ష్మీతిరుపతమ్మ మహోత్సవాలు ప్రారంభం

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: పాతగన్నవరంలోని లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో అమ్మవారి వార్షిక కల్యాణ మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎన్ఆర్ఐ దంపతులు కొనసాని శేఖర్‌బాబు, అరుణలు.. లక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భీష్మ ఏకాదశి సందర్భంగా భగవద్గీత పారాయణం నిర్వహించామని ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు. భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విశేషాలంకరణలో అమ్మవారు

పూజలు చేస్తున్న మహిళలు

ఉత్సాహంగా ఆత్మీయ సమ్మేళనం

సమావేశమైన పూర్వ విద్యార్థులు

మంతెన (కంకిపాడు), న్యూస్‌టుడే : మండలంలోని మంతెన జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1975-76 సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో కలుసుకుని నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను స్మరించుకున్నారు. పూర్వ విద్యార్థుల్లో ఒకరైన అన్నే సంజీవరావు విద్యార్థులకు ఉపకరణాలు, మిఠాయిలు పంపిణీ చేసి సైకిల్ స్టాండ్ ఏర్పాటు నిమిత్తం రూ.10వేలు అందజేశారు. వంగర కోటయ్య, నెక్కలపూడి బాలప్రసాద్, ముసునూరు శారద, దుర్గాభవాని పాల్గొన్నారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాలు

కానూరు: క్రీడలతో నాయకత్వ లక్షణాలు బలపడతాయని పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ కొండపల్లి శివాజీబాబు అన్నారు. మంగళవారం కళాశాలలో జేఎన్‌టీయూ సెంట్రల్ జోన్ ఇంటర్ కాలేజ్ టోర్నమెంటు, యూనివర్సిటీ టీమ్ సెలక్షన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రెండు రోజులు 40 ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 350 మంది క్రీడాకారులు నెట్ బాల్, బాస్కెట్‌బాల్, చెస్, ఇతర పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.



పోటీలు ప్రారంభిస్తున్న శివాజీబాబు

శ్రద్ధాంజలి

ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించి ఉన్నత విద్యను అభ్యసించి అంచలంచెలుగా ఎదిగిన సరస్వతీ పుత్రుడు, ఆత్మీయుడు మా శ్రేయోభిలాషి

శ్రీ సుంకర ధర్మేంద్రబాబు గారి

ఆకస్మిక మరణానికి చింతిస్తూ వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ..

మొక్కపాటి శ్రీధర్, మొక్కపాటి శేఖర్

తాడిగడప తెలుగు యువత

(c) eenadu

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

రోడ్డు నిర్మాణానికి భూముల పరిశీలన

ఎదురుమొండి (నాగాయలంక), న్యూస్‌టుడే : కృష్ణానది వరదలకు భారీగా కోతకు గురైన ఎదురు మొండి పంచాయతీలోని గొల్లమంద- జింకపాలెం జడ్పీ రహదారిని పునర్నిర్మాణానికి మంగళవారం మచిలీపట్నం ఆర్డీవో పోతురాజు, పంచాయతీరాజ్ ఎస్ఈ రమణారావులతో కలసి ఆ ప్రాంతంలోని రైతుల భూములను పరిశీలించారు. రహదారి ఏర్పాటుకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చొరవతో ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ రూ.13.8 కోట్లు మంజూరు చేశారు. రహదారి వేసేందుకు రైతుల నుంచి భూమి కొనాల్సి ఉంది. ఈ ప్రాంతంలో ఎకరా మార్కెట్ విలువ రూ.3.88 లక్షలుగా ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. ఎంత భూమి కావాలో నివేదిక రూపొందించి జిల్లా అధికారులకు నివేదించనున్నారు. పంచాయతీరాజ్ డీఈఈ మోజెస్, తహసీల్దార్ వీరాంజనేయ ప్రసాద్, ఏఈ ఎ.సంజీవకుమార్, వీఆర్వో మేడికొండ భీష్మం, గోవిందరాజులు, గ్రామ ప్రముఖులు కన్నా వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పామర్రు యూనిట్ నూతన కార్యవర్గ ఎన్నిక

పామర్రు, పెదపారుపూడి: ఏపీజీఈఏ పామర్రు కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవమైనట్లు శాఖ జిల్లా అధ్యక్షుడు రాము, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. వారు మాట్లాడుతూ జిల్లా ఉపాధ్యక్షుడు కోటేశ్వరరావు సహాయ ఎన్నికల అధికారిగా నియమించారన్నారు. మెహరున్నీసా బేగం అధ్యక్షురాలిగా, విజయ్‌కుమార్ గౌరవ అధ్యక్షుడిగా, ఆంజనేయులు ప్రధాన కార్యదర్శిగా, శివనాగమణి కోశాధికారిగా ఎన్నికయ్యారన్నారు. ఏపీజీఈఏ మాజీ అధ్యక్షుడు ఏసుబాబు ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేశారు.

కూటమి ప్రభుత్వంలో రహదారులకు మహర్దశ

పామర్రు, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం రహదారుల నిర్మాణాలు వేగంగా చేపడుతుందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మంగళవారం స్థానిక పుల్లేటి మలుపు వద్ద స్థానిక 11, 12 వార్డుల్లో 'ప్రగతి పథంలో పామర్రు' కార్యక్రమంలో వచ్చిన అర్జీల మేరకు వెంటనే స్పందించి రూ.10 లక్షల వ్యయంతో రహదారి నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ గణేష్, పట్టణ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, కార్యదర్శి రామాంజనేయులు, వెంకట సుధాకర్‌రెడ్డి, లాజరస్, అనితారెడ్డి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

చరిత్రహీనులు అవుతారు

గుడివాడ న్యూస్‌టుడే : రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని విమర్శిస్తే చరిత్ర హీనులవుతారని తెదేపా నేత పిన్నమనేని సాంబయ్య, బీసీ నేత కొలుసు నాగరాజు పేర్కొన్నారు. స్థానిక ప్రజావేదికలో వారు విలేకర్లతో మాట్లాడుతూ చాట్రాయి మండలంలో మాజీ మంత్రి పేర్ని నాని ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పేర్ని నాని నీతులు వల్లించడం మానుకోవాలని చెప్పారు. కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, బీసీ నేతలు వసంతవాడ దుర్గారావు, నెరుసు కాశీ, గొర్ల శ్రీలక్ష్మీ, పంచుమర్తి శ్రీనివాసరావు, హరిబాబు, ప్రభు, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్స్ డే

అవనిగడ్డ, న్యూస్‌టుడే : స్థానిక ప్రైవేటు ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎలక్ట్రీషియన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధాన రహదారి మార్గంలో సంఘ పతాకాన్ని సంఘ అధ్యక్షుడు ఆరవా రామమోహన రావు ఆవిష్కరించారు.

కృత్రిమమేధదే భవిత

గుడివాడ, న్యూస్‌టుడే : రాను కాలమంతా కృత్రిమ మేధదే అని. విద్యార్థులు దీనిలో ఉత్తమ నైపుణ్యాలు సాధించాలని మిరిఫిక్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ విజయవాడ ఎండీ బండి ప్రేమ్‌కుమార్, మెంటార్ కె.రఘునందన్ పేర్కొన్నారు. స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ, అండ్ ఏజీకే ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఐదు రోజుల జాతీయ కార్యశాల ప్రారంభించారు. సిబ్బంది పాల్గొన్నారు.

కూడళ్లు.. మృత్యు ఘంటికలు

నాలుగేళ్లలో 173 ప్రమాదాలు

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే

విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి పామర్రు నియోజకవర్గం పరిధిలో దాదాపు 22 కిలోమీటర్లు ఉండగా పమిడి ముక్కల మండలం మంటాడ నుంచి ప్రారంభమై పామర్రు మీదుగా మొవ్వ మండలం నిడుమోలు వరకు ఉంటుంది. ఈ క్రమంలో సదరు రహదారిపై కేవలం పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలో గల 16 కిలోమీటర్లలో నాలుగేళ్లలో 173 రోడ్డు ప్రమాదాలు సంభవించగా వాటిలో 84 మంది మృత్యువాత పడగా, 190 మంది గాయపడ్డారు. జాతీయ రహదారి అధికారులు పలు చోట్ల రోడ్లపై ఏర్పాటు చేయాల్సిన అండర్ పాస్‌లు, అప్రోచ్ రోడ్ల నిర్మాణాలు, బ్లింక్ లైట్లు, హెచ్చరిక బోర్డులు సమయానుకూలంగా పోవడం ఒక కారణం కాగా, అతి వేగం, రహదారి భద్రతా నిబంధనలు పాటించక పోవడం ప్రమాదాలకు కారణాలుగా నిలుస్తున్నాయి.

ప్రమాదాలు ఎక్కువ జరిగే జుఝువరం కూడలి

☛ కనుమూరు యూటర్న్ వద్ద నుంచి రోడ్డుకు ఇరువైపులా దాదాపు వంద మీటర్ల వరకు బ్లాక్ స్పాట్‌గా ఉంది.

☛ కురుమద్దాలి పెట్రోలు బంకు నుంచి సామ్ ఆక్వా వరకు, మరో వైపు పెట్రోలు బంకు నుంచి పై వంతెన వరకు ఉన్న ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

☛ బల్లిపర్రు కూడలి నుంచి కె హోటల్ వరకు, దానికి ఎదురుగా ఉన్న రోడ్డులో బల్లిపర్రు కూడలి నుంచి రెండో రోడ్డు కటింగ్ వరకు బ్లాక్ స్పాట్‌గా ఉంది.

☛ కొండిపర్రు అడ్డరోడ్డు వద్ద రోడ్డు ఆటు వైపు కటింగ్ వరకు, ఇటువైపు కటింగ్ వరకు, జాలయ్య మిల్లు నుంచి 14వ మైలు రాయి వరకు ప్రమాదాలు నిలయాలయ్యాయి.

☛ జుఝువరం సెంటర్ డేంజర్ జోన్‌గా ఉండగా, నెమ్మలూరు బెల్ కంపెనీ సమీపంలో ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

☛ పామర్రు- దిగమర్రు జాతీయ రహదారిపై కొత్త పెద మద్దాలి ఇటుక బట్టీల సమీపంలో, అడ్డాడ, కొమరవోలు పరిధిలో ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

రోడ్డు ప్రమాదాలను పరిశీలిస్తే

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	గాయపడ్డవారు
2022	38	14	38
2023	53	26	50
2024	41	22	61
2025	41	22	42

ఏమేం చేయాలంటే..

☛ విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై వీధి దీపాలు ఉన్నప్పటికీ అవి వెలగడం లేదు. వెలిగేలా చూడాలి.

☛ కనుమూరు, జుఝువరం, బల్లిపర్రు సెంటర్లలో అండర్ పాస్‌లు ఏర్పాటు చేయాలి. అదే విధంగా ఆయా ప్రాంతాల్లో అప్రోచ్ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలి.

☛ నియోజకవర్గ పరిధిలో గుర్తించిన బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. గుంతలు లేకుండా చూడాలి.

☛ మంటాడ, కురుమద్దాలి, పామర్రు అండర్ పాస్‌ల వద్ద కొద్దిపాటి వర్షాలకే ఆ ప్రాంతాలు చెరువులా మారుతున్నాయి. నీరు పోయే మార్గం లేక రోజుల తరబడి నీరు అక్కడే నిల్వ ఉంటున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. నీరు పోయే మార్గం ఏర్పాటు చేయాలి.

పార్టీలకు అతీతంగా వైద్యసాయం

అవనిగడ్డ, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అనారోగ్యంతో బాధపడేవారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వైద్య సాయం అందిస్తుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. మంగళవారం ఆయన కార్యాలయంలో 81 మందికి రూ.52,41,102 చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి పేదల వైద్యానికి సాయం అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణానికి విరాళం

కోడూరు : కోడూరులో నిర్మిస్తున్న శివ రామకృష్ణ క్షేత్రం నిర్మాణానికి కోడూరు లక్ష్మణ హెయిర్ స్టైల్ సెలూన్ యజమాని కోడూరు లక్ష్మీనారాయణ, జైశ్రీమన్నారాయణ మ్యూజికల్ బ్యాండ్ పార్టీ వారు కలిసి రూ.27 వేలను ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం స్థానిక శివాలయ ఆవరణలో అందించారు. దాతలను కమిటీ వారు సన్మానించారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్లు కృష్ణా జిల్లా మోపిదేవి మండలం పెద్దకళ్ళేపల్లి గ్రామ కాపురస్తులు నంద్యాల రాంబాబు గారి కుమారుడు 1) సాయి కృష్ణ మరియు కుమార్తె 2) గాయిత్రి, W/o. తాడివాక నాగబాబు గార్ల సంజాయిషీ ప్రకారము యావన్మందికీ తెలియజేయునది.

కృష్ణా జిల్లా చల్లపల్లి గ్రామ Rs.No.129/3 లో య. 0.10 సెంట్లకు **హద్దులు. తూర్పు:** చంద్ర శశాంక, **పడమర:** కొక్కిలిగడ్డ సుబ్బారావు, **ఉత్తరం:** చోరగుడి శ్రీనివాసరావు, **దక్షిణం:** R&B రోడ్డు హద్దుగా గల నివేశన స్థలమును దాని యజమానులు మరియు అనుభవదారులైన చల్లపల్లి 1వ వార్డు కాపురస్తులు 1) చోరగుడి శ్రీరాములు గారి భార్య భాగ్యాలు@ భాగ్యం కుమారుడు 2) జాన్ మరియు కుమార్తె కొమ్ము చంటి గారి భార్య 3) కొమ్ము పద్మ గార్ల వద్ద నుండి ఖరీదు చేయుటకు నిర్ణయించుకొనియున్నందున సదరు ఆస్తిపైన ఏవిధములైన ఆక్షేపణలు మరియు Claim లు ఉన్న యెడల వెంటనే ఈ క్రింది వారిని 3 రోజులలో సంప్రదించి తెలియజేయగలరు. గడువు దాటి వచ్చిన అభ్యంతరములు పరిశీలింపబడవు.

ఇట్లు

మత్తి వెంకటేశ్వరరావు M.A., B.L.
అడ్వకేటు, అవనిగడ్డ
సెల్: 9440368858

చీకటి పడితే చిందులేస్తున్నారు

స్థానిక ఏడో వార్డులో రూ.17.50 లక్షల అంచనా విలువతో సుమారు ఐదేళ్ల క్రితం వైకాపా ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించిన వెల్‌నెస్ కేంద్రం (ఆరోగ్య ఉప కేంద్రం) పైకప్పు, గోడలు పూర్తయి ముగింపు దశలో నిలిచింది. దీనికి తలుపులు లేక గదుల్లో మందుబాబులు నిత్యం మద్యం తాగి సీసాలను పగల గొడుతున్నారు. రాత్రి పూట కేకలు వేస్తున్నారు. ఆవరణలోకి సీసాలు విసిరేస్తున్నారు. భవన నిర్మాణానికి అంచనా విలువ సరిపోక పనులు నిలిచాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా నిధులు మంజూరు చేసి, భవన నిర్మాణం పూర్తి చేస్తే ప్రజలకు ఉపయోగపడుతుందని ప్రజలు సూచించారు. **- అవనిగడ్డ, న్యూస్‌టుడే**

నిలిచిన నిర్మాణం

నాగాయలంక కేంద్రంగా ఇసుక దందా

నాగాయలంక, న్యూస్‌టుడే : నాగాయలంక కృష్ణా తీరంలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. తీరంలో ఇసుక తవ్వి అమ్ముకుంటున్నారు. ఇసుకను పడవల్లో రవాణా చేస్తున్నారు. వారం రోజులుగా నాగాయలంక కేంద్రంగా ఇది సాగుతోంది. ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్టకు అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆసుపత్రిలో నాణ్యమైన సేవలు

గుడివాడ, న్యూస్‌టుడే : గుడివాడ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్సు ప్రకారం మెరుగైన సేవలను రోగులకు అందిస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఇందిరాదేవి పేర్కొన్నారు. స్థానిక ఆసుపత్రిలో ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం ఈ నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్సు ధ్రువపత్రం పొందడానికి అనుగుణంగా ఆసుపత్రిలో పారిశుద్ధ్యం, ఓపీ, ఐపీ సేవలు మెరుగు పరిచినట్లు చెప్పారు.

ఏడీఈకి ఘన సత్కారం

సుబ్రహ్మణ్యేశ్వరరావును సత్కరిస్తున్న అభిమానులు

అవనిగడ్డ, న్యూస్‌టుడే : స్థానిక విద్యుత్తు శాఖ ఏడీఈ నడకుదిటి సుబ్రహ్మణ్యేశ్వరరావుకు గణతంత్ర వేడుకల్లో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా అగ్ని కుల క్షత్రియ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. యూత్ ఫోర్స్ జాతీయ అధ్యక్షుడు కొప్పనాతి నరసింహారావు, లంకే యుగంధర్, సీహెచ్ నరసింహారావు, సైకం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఐదు రోజుల పని దినాలు అమలు చేయాల్సిందే

అవనిగడ్డ : నిరసన తెలుపుతున్న బ్యాంకు అధికారులు, ఉద్యోగులు

అవనిగడ్డ, నాగాయలంక, న్యూస్‌టుడే : వారానికి ఐదు రోజులు పని దినాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ ఫ్రోమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన శాఖ ఎదుట, నాగాయలంకలో బ్యాంకు అధికారులు, ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక, మోపిదేవి, చల్లపల్లి, ఘంటసాల, మొవ్వ మండలాలకు చెందిన బ్యాంకు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పెదకళ్లేపల్లి ఖ్యాతి ఇనుమడింపజేయండి

పెదకళ్లేపల్లి (మోపిదేవి), న్యూస్‌టుడే : సరస్వతి పుత్రులకు భవిష్యత్తు ఉంటుందని, ఇంకా నేర్చుకోవాలన్న తపన నేటి విద్యార్థుల మనసులో నాటుకుపోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. పెదకళ్లేపల్లి జడ్పీ, ఆదర్శ ప్రాథమిక పాఠశాలల వార్షికోత్సవం మంగళవారం హెచ్ఎం ఘంటా ఉమ అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థులు పోటీపడి చదివి గ్రామానికి గుర్తింపు తీసుకురావాలన్నారు. దాతల సాయంతో 500 మంది విద్యార్థులకు సమకూర్చిన ప్రతిభా బహుమతులను ఎమ్మెల్యే, ఆహ్వానితులు, దాతలు, గ్రామ ప్రముఖుల పాల్గొని అందించారు. తొలుత సర్పంచి అరజా సంధ్యా రాణి జాతీయ పతకాన్ని ఎగురవేశారు. విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి. ఎంఈవోలు రమణ, గోపాల్, తహసీల్దార్ హరనాథ్, డి. వెంకటేశ్వరరావు, కొల్లూరు వెంకటేశ్వరరావు, సాయిబాబు, సీతా రామాంజనేయులు, ఆషా దేవి, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆహ్వానితులు

ఘనంగా జడ్పీ పాఠశాల వార్షికోత్సవం

బహుమతులు పొందిన విద్యార్థులతో మండల అధికారులు

ఘంటసాల, న్యూస్‌టుడే : ఘంటసాల జడ్పీ పాఠశాల 80వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్య, క్రీడలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అతిథులను సత్కరించారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి. జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకటరామకృష్ణ, గొరుముచ్చు నాంచారయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ గొరుముచ్చు అరుణ్‌కుమార్, సర్పంచి బి.వెంకటేశ్వరమ్మ, తహసీల్దార్ బి.విజయప్రసాద్, ఎస్సై వేమన చందన, ఎంఈవో-2 మహ్మద్ మోమిన్, ప్రధానోపాధ్యాయిని ఎం.శ్రీరంగవల్లి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే : చిన్నారులు విద్యను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు అంధకారమవుతుందని ఎస్ఎంసీ ఛైర్మన్ దివ్య అన్నారు. మంగళవారం కొత్త పెదమద్దాలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వేడుకలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు శివరామప్రసాద్ మాట్లాడుతూ.. విద్య విలువైందని నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు.

ఐనపూరు (పమిడిముక్కల) : ఐనపూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. వివిధ పోటీల్లో విజేతలకు ఐనపూరు ఎంపీటీసీ సభ్యుడు వీర్ల ఆదిశేషు, ప్రధానోపాధ్యాయుడు బహుమతులు అందజేశారు. తమ్మన వేణుగోపాలరావు, ఎంపీటీసీ సభ్యుడు ఆది శేషు, విద్యాకమిటీ ఛైర్మన్ శివ నాగ భవానీ పాల్గొన్నారు.

బహుమతి ప్రదానంలో తమ్మన, వీర్ల

రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాకారుడి మృతికి సంతాపం

ఘంటసాల, న్యూస్‌టుడే : కొత్తపల్లికి చెందిన రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాకారుడు అరవపల్లి సాంబశివరావు (78) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాకారులు నిమ్మగడ్డ శ్రీను, జంబో, రమేష్ నాయుడు చిట్టూరు స్టాలిన్ తదితర క్రీడాకారులతో కలసి వివిధ పోటీల్లో పాల్గొని పలు పతకాలు, ప్రశంసా పత్రాలు పొందారు. ఆయన మృతదేహాన్ని పలువురు ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు సందర్శించి సంతాపం తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

కార్మికుల కోసం పోరాడిన గూడపాటి

గుడివాడ, న్యూస్‌టుడే : జీవితమంతా కార్మికుల హక్కుల కోసం పోరాడిన నాయకుడు గూడపాటి సువిశేశ్వరరావు అని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సువిశేశ్వరరావు (92) స్థానిక పెద ఎరుకపాడులోని ఆయన స్వగృహంలో మంగళవారం మృతి చెందారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, పలువురు నేతలు మృతదేహానికి నివాళి అర్పించారు.

ఇష్టంగా చదివి ఎదగండి

జ్యోతి వెలిగిస్తున్న మండవ వెంకటరత్నం, రత్నగిరిరావు

కూచిపూడి, న్యూస్‌టుడే : ప్రతి విద్యార్థి కష్టపడి ఇష్టంతో చదివి ఉన్నతులుగా రాణించాలని పామర్రు శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజా అన్నారు. మొవ్వ మండలం కూచిపూడి సిద్ధేంద్ర ఓరియంటల్ జడ్పీ పాఠశాలలో 57వ వార్షికోత్సవాలు మంగళవారం నిర్వహించారు. హెచ్ఎం అనుపల్లవి భువనేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో, చదువులో ఉన్నతులుగా రాణించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. సర్పంచి వెంకటరమణ విజయలక్ష్మి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామలింగేశ్వరరావు, ఎమ్మెల్యే గురువు రవిశేఖర్, ఏఎంసీ ఛైర్మన్ శివరామయ్య, రోటరీ ఉపాధ్యక్షులు అమర బాలేశ్వరరావు, ఎస్సై సురేష్, గొట్టిపాటి సాయి ఫౌండేషన్ నేత సాయి, ఎస్ఎంసీ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, వైస్ ఛైర్మన్ విజయ పాల్గొన్నారు.

★ మొవ్వ పీఎంశ్రీ మండవ కనకయ్య జడ్పీ పాఠశాల 80 వార్షికోత్సవాన్ని మండవ వెంకటరత్నం, పీఎస్ఎస్ అధ్యక్షుడు మండవ రత్నగిరిరావు ప్రారంభించారు. హెచ్ఎం ఉమాశ్రీ అధ్యక్షతన ముందుగా విద్యార్థులు స్వాగత నృత్యం చేశారు. విద్యా, క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. పాఠశాలలో వెంకటరత్నం రూ.25 వేలు అందించగా ఏర్పాటు చేసిన గేటును ప్రారంభించారు. సర్పంచి పూర్ణచంద్రరావు, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు పరిశుద్ధరాజు, నాయకులు కోటేశ్వరరావు, పూర్ణచంద్రరావు, పూర్వ విద్యార్థిని లక్ష్మీ నీలవేణి, బుజ్జి కోటేశ్వరరావు, శేషగిరి రావు (యూఎస్ఏ), నాగేశ్వరరావు, మంగమ్మ, వేణగోపాలరావు పాల్గొన్నారు.

23 ఎకరాల గడ్డి బూడిద పాలు

బొడ్డపాడు (తోట్లవల్లూరు), న్యూస్‌టుడే : బొడ్డపాడులో రైతు కాశీ విశ్వేశ్వరరావుకు చెందిన 23 ఎకరాల గడ్డి కాలిపోయి రైతుకు రూ.4 లక్షల వరకు నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న రొయ్యూరు గ్రామానికి చెందిన దాత ఉప్పులూరి గోపాలకృష్ణ కాశీకి ఎకరం గడ్డిని మంగళవారం అందజేశారు. సర్పంచి శివశంకర్, వెంకటరత్న చౌదరి, విజయ రామ్మోహన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పూలతో విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ

ఘంటసాల, న్యూస్‌టుడే : ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో మహిళలకు పూలతో విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణను మంగళవారం ప్రారంభించారు. పువ్వులతో పలు రకాల ఉత్పత్తులను తయారు చేయవచ్చని కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి.కృష్ణవేణి పేర్కొన్నారు. ఆ పద్ధతులు వివరించారు. శాస్త్రవేత్తలు రేవతి, యశ్వంత్‌కుమార్, ఘంటసాల, ఘంటసాలెం, చిలకలపూడి, దేవరకోట, వేములపల్లి మహిళలు శిక్షణలో పాల్గొన్నారు.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) అవనిగడ్డ

EP No. 3/2023 in O.S. No. 26/2018

Between

గాదె సత్యనరసింహారావు .... DHR

VS

1) బడే లంకేశ్వరి (డైడ్), 2) తాతా వీర వెంకటేశ్వరరావు, 3) మండలి మాధవి, 4) బండె యాన్సి, 5) కమ్మిలి గోవర్ధన .... JDR's

(JDR's 3 to 5 are added as per the orders in I.A No. 31/2021, Dt.:9-12-21)

వేలం ప్రకటన

పై నంబరు తనఖా దావాలో వాది / DHR డిక్రీ పొందిన దర్మిలా పై నెంబరు E.P.ని తనఖా బాకీ వసూలు నిమిత్తం తనఖా ఆస్తి అయిన అనగా మొదటి JDR సంపూర్ణ స్వాధీన హక్కు, భుక్తంతో ఉండి, ఆమె మరణానంతరం 3 to 5 JDRలకు సంక్రమించినటువంటి కృష్ణా జిల్లా, అవనిగడ్డ మండలం, అవనిగడ్డ గ్రామ పంచాయితీ మరియు అవనిగడ్డ S.R.O. పరిధిలో ఉన్న సర్వే నంబరు 38లోని 172 చ॥గ॥ (య.11.04 సెంట్లలో) స్థలము మరియు అందులో R.C.C. బిల్డింగ్ కట్టుట నిమిత్తం ఫౌండేషన్ వేసి ఉన్న ఈ దిగువ తెలిపిన హద్దులు అనగా **తూర్పు:** 1st JDR యొక్క సరిహద్దు గోడ 70 అడుగులు, **దక్షిణం :** అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కాలేజి యొక్క సరిహద్దు గోడ 22 అడుగులు, **పడమర :** రెడ్డెాత్తు వెంకటేశ్వరరావు గారి సరిహద్దు గోడ 70 అడుగులు మరియు **ఉత్తరం :** గ్రామ పంచాయితీ వారి రోడ్డు 22 అడుగుల మధ్యన ఉన్న ఆస్తిని ది. 19-02-2026 నాడు పైన తెలిపిన కోర్టునందు ఉదయం 10:30ని॥ లగాయతు వేలము జరుపబడునని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది. కావున వేలంలో ఎవరైననూ పైన తెలిపిన ఆస్తిని కొనుగోలు నిమిత్తం, సదరు వేలంలో పాల్గొనవచ్చునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

వేలం తేది: 19-02-2026
Further hearing : 26-02-2026
Ameena Value : 20,00,000/-
(EC దాఖలా ఎట్టి అన్యాక్రాంతములు లేవు, శ్రీ కోర్టువారి ఉత్తర్వులననుసరించి)

ఇట్లు, న్యాయవాది
పేర్ల రామచంద్రరావు, M.Com., B.L., అడ్వకేట్, అవనిగడ్డ

నేటి నుంచి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవాలు

చల్లపల్లి, న్యూస్‌టుడే : చల్లపల్లి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో 48వ వార్షిక కల్యాణ మహోత్సవాలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చల్లపల్లి మండల విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సత్యదేవుని 73వ బ్రహ్మోత్సవాలు..

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే : స్థానిక సంతరోడ్డులో రెండో అన్నవరంగా ప్రసిద్ధి చెందిన శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి 73వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ఫిబ్రవరి 3 వరకు నిర్వహించనున్నారు. ఆలయం వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు.

పద్మశ్రీ అవార్డు రావడం దివిసీమకే గర్వకారణం

అవనిగడ్డ, న్యూస్‌టుడే : దివిసీమలోని టేకుపల్లి వాస్తవ్యుడు వెంపటి కుటుంబ శాస్త్రికి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రదానం చేయడం దివిసీమకే గర్వకారణమని ఆయన శిష్యులు, దివిసీమ కవుల తరఫున డాక్టర్ గుడిసేవ విష్ణు ప్రసాద్ మంగళవారం హర్షం వ్యక్తం చేశారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు 29న

కోడూరు, న్యూస్‌టుడే : భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని 19 ఏళ్లుగా కొనసాగుతున్న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను 29న హంసలదీవిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహించనున్నట్లు హైందవ సంఘ అధ్యక్షుడు నిర్వాహకుడు మోపిదేవి చక్రవర్తి తెలిపారు. దంపతులు పాల్గొనాలని కోరారు.

అవీ ఇవీ

కూచిపూడిలో సిద్ధేంద్రయోగి జయంతోత్సవం 29న

కూచిపూడి, న్యూస్‌టుడే : అఖిల భారత కూచిపూడి నాట్యకళా మండలి ఆధ్వర్యంలో సిద్ధేంద్ర యోగి జయంతోత్సవాన్ని గురువారం సాయంత్రం నిర్వహించనున్నట్లు నాట్యకళా మండలి అధ్యక్ష కార్యదర్శులు హరనాథ శాస్త్రి, మృత్యుంజయలు మంగళవారం తెలిపారు.

మినుములో కాండం గజ్జి తెగులు

రైతులకు వివరిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

వడ్లమన్నాడు (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే : ప్రస్తుతం మినుము పైరులో కాండం గజ్జి ఆశించిందని, రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఘంటశాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సుధారాణి, నవీన్ సూచించారు. మంగళవారం మండలంలోని వడ్లమన్నాడులో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు క్షేత్ర పరిశీలన చేశారు. ఏవో సునీల్, ఉప సర్పంచి గరికపాటి రాంబాబు, తెదేపా నేతలు పెన్నేరు రమేశ్, గరికపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

పామర్రు గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని ఉరుటూరు శివారు పాత నల్లకుంటలో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ద్వారా నడుపుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల 2026- 2027 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశాలకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఫిబ్రవరి 19 చివరి గడువు అని చెప్పారు.

వేధింపుల నివారణపై అవగాహన సదస్సు

పామర్రు, న్యూస్‌టుడే : చిన్నారులపై లైంగిక వేధింపుల నివారణపై జిల్లా మెడికల్ అండ్ హెల్త్ అధికారి యుగంధర్, ఆర్‌బీఎస్‌కే అధికారిణి హిమబిందు నేతృత్వంలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో కనుమూరు పీహెచ్‌సీ వైద్యుడు జమీర్‌ఖాన్ పాల్గొని మాట్లాడుతూ.. చిన్నారులపై లైంగిక దాడులు జరగడానికి గల కారణాలు, అవి జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. జమీగొల్వేపల్లి పీహెచ్‌సీ మారుతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

30 నుంచి వేడుకలు

కూచిపూడి, న్యూస్‌టుడే : మొవ్వలో వేణగోపాలస్వామి ఆలయంలో స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు 30 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహిస్తున్నట్లు ఈవో సుబ్బారావు తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

పులిగడ్డ (అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖ ద్వారా పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు స్ఫూర్తి పేరుతో రూపొందించిన పుస్తకం ఉపయుక్తంగా ఉంటుందని ఎంపీపీ తుంగల సుమతి చెప్పారు. స్థానిక గురుకులంలో విద్యార్థులకు పుస్తకాలను ఆమె ప్రజాప్రతినిధులు, ఆచార్యుల బృందంతో కలిసి మంగళవారం పంపిణీ చేశారు. సర్పంచి దాసరి విజయ్‌కుమార్, వైఎస్ ఎంపీపీ పిచ్చేశ్వరరావు, ఉప సర్పంచి మండలి వెంకటేశ్వరరావు, ప్రధానాచార్యుడు జాన్, అచార్యులు పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి

జననం 15-06-1965 — మరణం 14-01-2026

కీ॥శే॥ చాపల వెంకటేశ్వరరావు గారు
నాలి గ్రామము, నాగాయలంక మండలం

అందరినీ చిరునవ్వుతో పలకరిస్తూ.. అందరి మంచి కోరే మంచి మనసున్న మనిషి శ్రీ చాపల వెంకటేశ్వరరావు గారి మరణం మాకు తీరని లోటు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని సదా భగవంతుని ప్రార్థిస్తూ.. అశ్రునయనాలతో..

భార్య: సముద్ర లంకమ్మ
కుమారుడు: చాపల రామకృష్ణ - కోడలు: విజిత
మరియు కుమార్తెలు, అల్లుళ్ళు, మనుమళ్ళు, మనుమరాండ్రు

పెద్దకర్మ: ది. 28-01-2026 బుధవారం, నాగాయలంక మండలం, నాలి గ్రామములోని మా స్వగృహము నందు జరుపబడును. కావున తెలియజేయడమైనది.

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – తాడికొండ

బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Hospitality Partner: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Man of the Series: Hero
Digital Partner: ఈనాడు.నెట్
TV Partner: ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్, ఈ FM Mee FM
Organised by: ఈనాడు ఉత్తరం క్లబ్

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - I జూనియర్స్ : మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్స్‌లతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులు చేసి ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్ జట్టు

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - I జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సులతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

విజేత రాయలసీమ రాకర్స్ జట్టు

గ్రౌండ్-2లో సీనియర్స్ : సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ · చరణ్ జిత్ · ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-I (జూనియర్స్)

మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)

మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

కనులపండువగా అమ్మవారి పల్లకీల ఊరేగింపు

రంగుల మండపంలో తిరుపతమ్మ, సహ దేవతల విగ్రహాలు

విగ్రహాలను తీసుకురావడానికి జగ్గయ్యపేట వెళుతున్న పల్లకీలు

పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: రంగుల మహోత్సవంలో భాగంగా శ్రీతిరుపతమ్మ, సహదేవతల విగ్రహాలను జగ్గయ్యపేట నుంచి తీసుకురావడానికి పల్లకీలు మంగళవారం రాత్రి పెనుగంచిప్రోలు నుంచి బయలుదేరాయి. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలను ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు తీసుకెళ్లారు. అనంతరం ప్రధాన వీధుల గుండా జగ్గయ్యపేటకు పయనమయ్యాయి. మహిళలు పెద్దసంఖ్యలో తరలి వచ్చి పల్లకీల వద్ద వారులు పోసి పూజలు చేశారు. ఎస్ఐ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెనుగంచిప్రోలుకు తిరుగు పయనం.. జగ్గయ్యపేటలో విడది చేసిన గోపయ్య సమేత తిరుపతమ్మ, సహదేవతల విగ్రహాలకు రంగులు వేసే ఘట్టం పూర్తి కావడంతో బుధవారం ఉదయం ఐదు గంటలకు పెనుగంచిప్రోలుకు తీసుకెళ్లడానికి ఆలయ ఈవో మహేశ్వరరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యుడు చుంచు రమేష్‌బాబు, సభ్యులు, అధికారులు ఏర్పాట్లు చేశారు. పల్లకీలు జగ్గయ్యపేట నుంచి చిల్లకల్లు, భీమవరం, లింగగూడెం గ్రామాల మీదుగా పెనుగంచిప్రోలు ఆలయం వద్దకు తీసుకురానున్నారు.

పల్లకీల్లో విగ్రహాల వరుస ఇలా.. మొదటి పల్లకీలో తిరుపతమ్మ, రెండో పల్లకీలో గోపయ్య స్వామి, మూడో పల్లకీలో ఉన్నఊరు అంకమ్మ, నాలుగో పల్లకీలో వినుకొండ అంకమ్మ, ఆతర్వాత తిరుపతమ్మ, గోపయ్య స్వాముల ఉత్సవ మూర్తులు, మల్లయ్యస్వామి, చంద్రమ్మ, మద్ది రావమ్మ, పెద్దమ్మ, గుర్రపు వాహనాన్ని తీసుకొస్తారు.

భారీ పోలీసు బందోబస్తు: గతంలో జరిగిన ఘర్షణలు, భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు ఆధ్వర్యంలో డీసీపీ లక్ష్మీనారాయణ, ఇతర పోలీసు అధికారుల పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉపాధ్యాయుల నియామకాల ప్రక్రియ యాజమాన్యాలకే ఇవ్వాలి

ప్రాస్మా రాష్ట్ర కమిటీ డిమాండ్

మాట్లాడుతున్న ప్రభాకరరావు, చిత్రంలో రవిచంద్రశేఖర్, రవీంద్ర తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రయివేటు ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను యాజమాన్యాలకే ఇవ్వాలని ప్రైవేటు ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (ప్రాస్మా) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం విజయవాడలోని ఒక హోటల్లో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ప్రభాకరరావు, కె.రవిచంద్రశేఖర్ మాట్లాడారు. ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకాలను గత ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారమే నిర్వహించాలని, ఈ విషయంలో న్యాయస్థానాల ఆదేశాలను కూటమి ప్రభుత్వం అమలు చేయకపోవడం సరి కాదన్నారు. గత ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా ఆయా ఎయిడెడ్ పాఠశాలల కరస్పాండెంట్లు ఇప్పటికే నియామక ప్రక్రియ ప్రారంభించారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 85 ఎయిడెడ్ పాఠశాలల్లో న్యాయస్థానాల ఆదేశాల మేరకు నియామక ప్రక్రియ పూర్తయ్యిందని, అయితే విధానపరమైన కారణాలు చూపుతూ ప్రభుత్వం దాదాపు అయిదు నెలల పాటు ప్రక్రియ నిలిపేసిందని చెప్పారు. పాఠశాలల యాజమాన్యాలతో సంప్రదింపులు లేకుండా కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ) ద్వారా నియామకాలు చేపడతామని ప్రకటించిందని, ఇది న్యాయస్థానాలు, గత ప్రభుత్వ ఉత్తర్వులకు పూర్తిగా వ్యతిరేకం అన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. సీబీటీ పరీక్షల నిర్వహణ చట్ట విరుద్ధమైంది కనుక..వెంటనే ఆ ప్రక్రియ ఆపాలని, లేనిపక్షంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు ఎం.రవీంద్రబాబు, జవహర్‌రాజు, నరేష్, రామచంద్ర రాజు, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం.. గంటల వ్యవధిలో ఆచూకీ లభ్యం

పెనమలూరు, రామవరప్పాడు: బాలుడి అదృశ్యంతో పెనమలూరు పోలీసులు హైరానాకు గురయ్యారు. నాలుగు ప్రత్యేక బృందాలు, పటమట, విజయవాడ నగర, ట్రాఫిక్ పోలీసులు జల్లెడ పట్టగా ఆఖరుకు ఫిర్యాదు అందిన రెండు గంటల్లోనే రామవరప్పాడులో అతడి ఆచూకీ కనిపెట్టారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం.. చిలక మోహిత్ ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం గండేపల్లిలోని తన అమ్మమ్మ విజయమ్మ వద్ద తన సోదరుడితో కలిసి ఉంటూ మూడో తరగతి చదువుతున్నాడు. తన అమ్మమ్మ, సోదరుడితో కలిసి సోమవారం కానూరులోని పెద్దమ్మమ్మ ఇంటికి వచ్చాడు. పెద్దమ్మమ్మ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడంతో కుటుంబ సభ్యులందరూ మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. ఇంట్లో మోహిత్, సోదరుడు మాత్రమే ఉండగా వీరు స్థానికంగా ఆటలాడుకుంటున్న క్రమంలో మోహిత్ దారి తప్పిపోయి ఇంటికి చేరుకోలేకపోయాడు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో కుటుంబ సభ్యులు ఆసుపత్రి నుంచి తిరిగి రాగా.. మోహిత్ అదృశ్యమైనట్లు తెలుసుకున్నారు. ఆ ప్రాంతంలో గాలించినా ఫలితం లేకపోవడంతో సాయంత్రం నాలుగున్నరకు వీరు పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నగర, ట్రాఫిక్ పోలీసులకు మోహిత్ ఫొటోలు పంపి అంతటా అప్రమత్తం చేశారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలించారు. ఈలోగా సీఐ వెంకటరమణ నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి కానూరు, పటమట, ఆటోనగర్, ప్రసాదంపాడు ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. సాయంత్రం ఆరున్నరకు మోహిత్‌ను రామవరప్పాడు వద్ద ట్రాఫిక్ పోలీసులు గుర్తించి సీఐ వెంకటరమణకు సమాచారం అందించారు. సీఐ వెంటనే అక్కడకు వెళ్లి బాలుడిని స్టేషన్‌కు తీసుకువచ్చి తల్లిదండ్రులు వెంకట్, లక్ష్మిలకు అప్పగించారు.

పిల్లల విక్రయం కేసులో ముగిసిన పోలీస్ కస్టడీ

గవర్నర్‌పేట: పిల్లల విక్రయం కేసులో నిందితురాలు కవిత పోలీస్‌కస్టడీ మంగళవారం ముగిసింది. ముంబయికి చెందిన ఈమెను పిల్లల విక్రయం కేసులో భవానీపురం పోలీసులు అరెస్టు చేశారు. ఈమె నుంచి మరింత సమాచారం నిమిత్తం కస్టడీకి ఇవ్వాలని కోరగా రెండు రోజుల పోలీసుల కస్టడీకి ఇచ్చారు. పోషించలేని తల్లిదండ్రుల నుంచి మాత్రమే పిల్లలను తాను తీసుకుని బలగం సరోజినికి అప్పగించినట్లు విచారణలో వెల్లడించారు. మంగళవారంతో కస్టడీ ముగియగా ఆమెను సీఎంఎం కోర్టులో హాజరుపరిచారు. అనంతరం ఆమెను రాజమహేంద్రవరం కేంద్ర కారాగానికి తరలించారు.

ఉపాధి పథం
నైపుణ్య సాధనం

కోర్సుల రన్‌వేపై కెరియర్ టేకాఫ్

కలల కెరియర్ అందుకోవాలంటే కోర్సుల వారధి నిర్మించుకోవాలి. ఉద్యోగాల రీత్యా ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్న విమానయాన రంగంలోకి ప్రవేశించేందుకు ఎన్నో దారులున్నాయి. ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్హతలతో వీటిలో ప్రవేశించవచ్చు. కొన్ని హోదాలు పొందడానికి అదనపు శిక్షణ కావాలి. ఎంచుకున్న మార్గాన్ని బట్టి కోర్సు ఎంపిక జరగాలి.

విమానయాన రంగంలో ఎక్కువ ఉద్యోగాలు 3 విభాగాల్లో ఉన్నాయి. అవి..

1. టెక్నికల్ ఉద్యోగాలు
2. మేనేజ్‌మెంట్ హోదాలు
3. సేవల విభాగంలో కొలువులు

మరో ఐదేళ్లలో అంటే 2030 నాటికి భారత పౌర విమానరంగం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద మార్కెట్‌గా అవతరించనుంది. ఈ నేపథ్యంలో మూడు విభాగాల్లోనూ నైపుణ్యాలున్న సిబ్బంది అవసరం ఎక్కువగా ఉంది. ఖాళీలు ఎక్కువగా ఉన్నప్పటికీ, శిక్షణ పొందినవారు తక్కువ మందే ఉన్నారు. విమానయాన కోర్సుల శిక్షణకు మౌలిక సదుపాయాల కల్పన ప్రధాన అడ్డంకిగా ఉండటమే ఇందుకు కారణం. పైలట్ లాంటి కోర్సుల శిక్షణకు తగిన సౌకర్యాలు లేకపోతే అనుమతులు లభించవు.

పైలట్ (కమర్షియల్) ట్రెయినింగ్

కమర్షియల్ పైలట్ లైసెన్స్ (సీపీఎల్)గా పిలిచే ఈ కోర్సులో చేరడానికి మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో ప్లస్2/ఇంటర్మీడియట్ కనీస విద్యార్హత. వయసు 17 ఏళ్లు ఉండాలి. దేశవ్యాప్తంగా పలు సంస్థలు పైలట్ శిక్షణ అందిస్తున్నాయి.

గ్రౌండ్ స్టాఫ్ ఆపరేషన్స్

ఇంటర్ విద్యార్హతతో ఎయిర్‌పోర్ట్ గ్రౌండ్ సర్వీసెస్‌లో ఏడాది కాలపరిమితి ఉన్న డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ తరహా కోర్సుల్లో ప్రవేశానికి వివిధ సంస్థలు ఉమ్మడిగా నిర్వహిస్తోన్న ఏఎంఈ సెట్ రాయవచ్చు. ఇతర పరీక్షలతోనూ ప్రవేశం పొందవచ్చు.

వేతనాలు

✦ పైలట్ శిక్షణ పొందినవారికి రూ.12 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ప్రారంభంలో వార్షిక వేతనాలు అందుతాయి.

✦ కేబిన్ క్రూ సిబ్బందికి రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షల వార్షిక వేతనాలు సంస్థలు ఇస్తున్నాయి.

✦ ఎయిర్‌క్రాఫ్ట్ నిర్వహణ సిబ్బంది విద్యార్హతలతో పాటు తగిన కౌశలాలు సాధిస్తే ఏడాదికి రూ.6 లక్షలు - రూ.10 లక్షల మధ్య ప్యాకేజీ దక్కుతోంది.

✦ ఏవియేషన్ మేనేజ్‌మెంట్‌లో బీబీఏ పూర్తిచేసిన వారికి రూ.5 - రూ.12 లక్షల మధ్య వార్షిక వేతనాన్ని విమానయాన సంస్థలు ఆఫర్ చేస్తున్నాయి.

✦ ఎయిర్ లైన్స్ క్షేత్రస్థాయి కార్యకలాపాల్లో పాలుపంచుకునే సిబ్బందికి రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వేతనాలిస్తున్నాయి.

ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజినీరింగ్ (ఏఎంఈ)

ఎయిర్‌లైన్స్‌లో అత్యంత డిమాండ్ ఉన్న ఈ హోదాను సాధించాలంటే డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) అనుమతి పొందిన ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజినీరింగ్ లైసెన్స్ కోర్సు చేయాలి. ఇంటర్ ఎంపీసీ విద్యార్థులు అర్హులు. దేశంలో పలు సంస్థలు ఈ కోర్సును అందిస్తున్నాయి.

కేబిన్ క్రూ

విమానం లోపల సేవలందించే సిబ్బందిగా పనిచేయడానికీ కోర్సులున్నాయి. ఇంటర్మీడియట్ తర్వాత కేబిన్ క్రూ, ఎయిర్ హోస్టెస్‌లలో శిక్షణ పొందినవారు కేబిన్ సిబ్బంది పోస్టులకు దరఖాస్తు చేయవచ్చు. ఆరు నెలలు/ ఏడాది వ్యవధితో పలు ప్రైవేటు సంస్థలు ఈ కోర్సును అందిస్తున్నాయి. కొన్ని విమానయాన సంస్థలూ ఈ శిక్షణ అందించి, నేరుగా ఉద్యోగంలోకి తీసుకుంటున్నాయి.

పై మూడు మార్గాలూ నేరుగా వివిధ విమానయాన సంస్థల్లో పనిచేసేందుకు ఉద్దేశించినవి. విమాన రాకపోకలకు మౌలిక సదుపాయాలు కల్పించే ఎయిర్‌పోర్టులు, గ్రౌండ్ ఆపరేషన్స్ విభాగాల్లో సేవలందించే కొలువులూ ఉన్నాయి..

ఏవియేషన్, ఎయిర్‌పోర్ట్ మేనేజ్‌మెంట్

ఇందులో నేరుగా విమానాశ్రయ నిర్వహణలో పనిచేసే ఉద్యోగాలుంటాయి. అలాగే వివిధ విమానయాన సంస్థలు ఎయిర్‌పోర్టుల్లో నిర్వహించే కార్యకలాపాల్లో పాల్గొనే ఉద్యోగాలు యువతను ఆకర్షిస్తున్నాయి. ఈ హోదాలు పొందడానికి బీబీఏ- ఏవియేషన్ మేనేజ్‌మెంట్, బీఎస్సీ- ఏవియేషన్, ఎయిర్‌పోర్ట్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా, పీజీ కోర్సుల్లో ఏదైనా పూర్తి చేయాలి. దేశ వ్యాప్తంగా పలు సంస్థలు వీటిని అందిస్తున్నాయి.

కార్గోలోనూ అవకాశాలు

పౌర విమానయాన రంగంతో పాటు ఎయిర్ కార్గో (ఆకాశ మార్గాన సరకు రవాణా రంగం) కూడా శరవేగంగా వృద్ధి చెందుతోంది. సరకు రవాణా, నిర్వహణలో ఆసక్తి ఉన్న యువతకు మంచి అవకాశాలున్నాయి. కార్గో హ్యాండ్లింగ్ (సరకు నిర్వహణ), గ్రౌండ్ స్టాఫ్ (క్షేత్రస్థాయి సిబ్బంది), సరకు సరఫరా వ్యవస్థ పర్యవేక్షణలో వివిధ స్థాయి ఉద్యోగాలను విమానయాన సరకు రవాణా సంస్థలు అందిస్తున్నాయి.

క్షేత్రస్థాయి కార్యకలాపాల (ఆపరేషన్స్, గ్రౌండ్ కంట్రోల్ హ్యాండ్లింగ్) విభాగంలో కార్గో ఏజెంట్స్, లోడ్ ప్లానర్స్, స్టోరింగ్ బాధ్యతల నిర్వహణలో ఉద్యోగావకాశాలు తరచూ వస్తున్నాయి. అలాగే, కార్గో ఆపరేషన్స్ మేనేజర్లు, స్టోర్ ఎగ్జిక్యూటివ్స్, హెచ్.ఆర్. బిజినెస్ పార్టనర్స్ లాంటి హోదాలు కార్గో మేనేజ్‌మెంట్, అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఉంటున్నాయి. లాజిస్టిక్స్, సప్లయ్ చెయిన్ విభాగంలో సరకు రవాణా ప్రణాళిక, సమన్వయ బాధ్యతల పర్యవేక్షణకు భారీ ఎత్తున సిబ్బందిని తీసుకుంటున్నారు. సాధారణంగా ఈ హోదాలన్నిటికీ ఇంటర్ కనీస విద్యార్హత. ఉన్నత స్థాయి హోదాలకు డిగ్రీ కావాలి. అయితే విద్యార్హతలతో పాటు ప్రభావవంతమైన భావవ్యక్తీకరణ, పనివేళల రీత్యా షిఫ్టుల్లో పనిచేసే ఆసక్తి, సరకు రవాణా విషయంలో లోతైన పరిజ్ఞానం, రవాణా విధివిధానాలపై అవగాహన, లాజిస్టిక్స్ సాఫ్ట్‌వేర్ నైపుణ్యం ఉంటే కార్గో కంపెనీలు మంచి ప్యాకేజీ ఆఫర్ చేస్తున్నాయి.



ప్రతి రంగంలోనూ కృత్రిమ మేధ (ఏఐ) సింహభాగాన్ని ప్రభావితం చేస్తోంది. అయితే విమానయాన రంగంలో మాత్రం దాని పాత్ర సాంకేతిక విభాగాలకే పరిమితం. అందువల్ల ఇందులో ఏటా సిబ్బంది అవసరం పెరుగుతోంది. ఆసక్తి ఉన్నవారు విమానయాన రంగంలోకి నిశ్చింతగా ప్రవేశించి కెరియర్ పరంగా గగన వీధుల్లో విహరించవచ్చు.

యస్.వి. సురేష్
సంపాదకుడు,
ఉద్యోగ సోపానం

చదువు

■ **e-mail:** edc@eenadu.in

ఎంఏ లింగ్విస్టిక్స్‌తో ఎలాంటి ఉద్యోగాలు?

ఎంఏ లింగ్విస్టిక్స్ కోర్సు చదువుతున్నాను. ఇది పూర్తయిన తర్వాత ఎలాంటి ఉద్యోగాలు ఉంటాయి. - **జమీరుద్దీన్**

■ ఎంఏ లింగ్విస్టిక్స్ భాషను శాస్త్రీయంగా అధ్యయనం చేసే పీజీ ప్రోగ్రాం. ఇది భాషల నిర్మాణం, ఉచ్చారణ, అర్థం, సమాజంతో భాషల సంబంధం, భాషా సాంకేతికత లాంటి అంశాలపై లోతైన అవగాహనను అందిస్తుంది. ఈ కోర్సు పూర్తిచేసిన వారికి విద్య, పరిశోధన, పరిపాలన, మీడియా, ఐటీ లాంటి రంగాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి. భాషా శిక్షణ సంస్థల్లో ట్రెయినర్, కమ్యూనికేషన్ స్కిల్స్ కోచ్‌గానూ పనిచేయవచ్చు. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులుగా అవకాశాలుంటాయి. నెట్ లేదా సెట్ అర్హతతో డిగ్రీ కళాశాలల్లో, పీహెచ్‌డీ పూర్తిచేస్తే విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కొనసాగవచ్చు.

◗ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాషా పరిశోధనా సంస్థలు, సాహిత్య అకాడమీలు, భాషా సర్వే సంస్థల్లో రిసెర్చ్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ ఫెలో, భాషా శాస్త్ర నిపుణులుగా పనిచేయవచ్చు. నిఘంటు తయారీ, భాషా డాక్యుమెంటేషన్, అంతరించిపోతున్న భాషలపై పరిశోధన లాంటి రంగాల్లో లింగ్విస్టిక్స్‌కు ప్రాధాన్యం ఉంది.

ఎంఏ లింగ్విస్టిక్స్‌తో పాటు జర్నలిజం చదివితే మీడియా, ప్రచురణ రంగంలో సబ్ ఎడిటర్, కంటెంట్ రైటర్, స్క్రిప్ట్ రైటర్, ప్రూఫ్ రీడర్ లాంటి ఉద్యోగాలు లభిస్తాయి. పుస్తక ప్రచురణ సంస్థల్లో మాన్యుస్క్రిప్ట్ ఎడిటింగ్, ట్రాన్స్‌లేషన్ లాంటి పనులూ చేయవచ్చు.

◗ ప్రైవేటు రంగ ఉద్యోగాలతో పాటు కొన్ని ప్రభుత్వ ఉద్యోగాలూ ఎంఏ లింగ్విస్టిక్స్ విద్యార్థులకు అందుబాటులో ఉంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో అనువాదకులు, భాషా నిపుణులు, ప్రచార విభాగాల్లో కంటెంట్ ఆఫీసర్ లాంటి పోస్టులకు అర్హత ఉంటుంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్,
కెరియర్ కౌన్సెలర్

వీఎన్ఐటీలో ఉద్యోగాలు

విశ్వేశ్వరయ్య నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఎన్ఐటీ) నాగ్‌పుర్.. నాన్ టీచింగ్ విభాగాల్లో పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- లైబ్రేరియన్: 01
- సీనియర్ సైంటిఫిక్/టెక్నికల్ ఆఫీసర్: 02
- సైంటిఫిక్/టెక్నికల్ ఆఫీసర్: 03
- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్: 01 ● సూపరింటెండెంట్: 05
- లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్: 01
- జూనియర్ ఇంజినీర్: 01 ● టెక్నికల్ అసిస్టెంట్: 08
- సీనియర్ అసిస్టెంట్: 02 ● సీనియర్ టెక్నీషియన్: 03
- జూనియర్ అసిస్టెంట్: 03 ● టెక్నీషియన్: 10
- ఆఫీస్ అటెండెంట్/ల్యాబ్ అటెండెంట్: 05

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్మీడియట్, బ్యాచిలర్ డిగ్రీ, బీఈ/బీటెక్, ఎమ్మెస్సీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
వేతన శ్రేణి: నెలకు రూ.18,000- రూ.1,44,200.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 01.03.2026. **వెబ్‌సైట్:** https://vnit.ac.in/

హెచ్‌సీఎల్‌లో

హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్), కోల్‌కతా వర్క్ మెన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- వర్క్ మెన్: 18

అర్హత: పోస్టులను అనుసరించి పదోతరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీతో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: 01.01.2026 నాటికి 40 ఏళ్లు మించరాదు. ఎస్సీ, ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీకి మూడేళ్లు సడలింపు ఉంటుంది.
వేతన శ్రేణి: నెలకు రూ.28,120 - రూ.55,620.
దరఖాస్తు ఫీజు: రూ 500. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఫీజు లేదు.
ఎంపిక: రాత పరీక్ష, ట్రేడ్ టెస్టులతో
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 25.02.2026
వెబ్‌సైట్: https://www.hindustancopper.com/Page/Career_New

(c) eenadu

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హోంమంత్రి అనిత, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే గద్దె, సీపీ, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

మత్తు వలదురా.. భవిత కలదురా..

మాదకద్రవ్యాలను తరిమేస్తాం: సీపీ రాజశేఖరబాబు

స్కేటింగ్‌తో సందడి చేసిన చిన్నారులు

నా కుమారుడిని మార్చారు: అంజమ్మ

మాదకద్రవ్యాలకు అలవాటు పడిన నా కుమారుడిని పోలీసులు మార్చారు. మంచి మనిషిగా చేసి నాకు అప్పగించారు. ఇప్పుడు చక్కగా పని చేసుకుంటున్నాడు. సంతోషంగా ఉంది. నున్న పోలీసుల సహకారం లేకపోతే నా కుమారుడు నాకు దక్కేవాడు కాదు. నా కుమారుడిలా ఎవరూ బాధ పడకూడదన్న ఆలోచనతో ఇలా ముందుకు వచ్చి చెబుతున్నానని అంజమ్మ వివరించారు.

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: యువత మాదకద్రవ్యాలకు బానిసలుగా మారి నిర్వీర్యం అవుతోందని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయాలకు అనుగుణంగా మాదకద్రవ్యాలను నామరూపాలు లేకుండా చేయాలని నిర్ణయించామన్నారు. మంగళవారం సాయంత్రం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి 'డ్రగ్స్‌పై దండయాత్ర' పేరుతో 34 రోజుల మహిళా పోలీసుల సైకిల్‌యాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రులు వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు మాదకద్రవ్యాలతో జరిగే నష్టాలు తెలియాలన్న హోంమంత్రి సూచన మేరకు ఉద్యమంలా చేపట్టామన్నారు. ఐదుగురు మహిళా పోలీసు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవడం అభినందనీయమన్నారు.

★ కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలను ఎంత త్వరగా కట్టడి చేయగలిగితే అంత వేగంగా సమాజం బాగుపడుతుందని వివరించారు. ఈగల్ టీమ్స్ ద్వారా కట్టడి చేయడమే కాకుండా ఐవీఆర్ఎస్ కాల్ చేసి ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నారని వివరించారు. సైకిల్‌యాత్ర వెళ్లిన అన్ని మండలాల్లో ఇంతే ఉత్సాహంగా నిర్వహించి మాదకద్రవ్యాలను జిల్లా నుంచి తరిమివేయడానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ★ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారిని డ్రోన్ పైలట్లుగా తీర్చిదిద్దారని, తాజాగా డ్రగ్స్‌పై దండయాత్రకు మహిళా పోలీసు సిబ్బంది ముందుకు వచ్చారన్నారు. ★ విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల కట్టడి అనేది పోలీసుల బాధ్యత మాత్రమే కాదని ప్రజలు కూడా దానికి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. గత ప్రభుత్వం పసి పిల్లలకు సైతం డ్రగ్స్ అలవాటు చేసిందని, సభలు, సమావేశాలకు గంజాయి ప్యాకెట్లు ఇచ్చి యువతను తీసుకొచ్చిందన్నారు. సైకిల్ యాత్రలో పాల్గొంటున్న మహిళా పోలీసులకు మంత్రులు జెర్సీలను ఆవిష్కరించి అందజేశారు. కార్యక్రమం టీజర్‌ను రిమోట్ నొక్కి విడుదల చేశారు.

ఆద్యంతం ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. ఈ కార్యక్రమానికి నగరంలోని పలు కళాశాలలు, పాఠశాలలకు చెందిన విద్యార్థులు సైకిల్ యాత్రలో పాల్గొనేందుకు ఉత్సుకత చూపారు. సైకిళ్లతో సహా స్టేడియంకు విచ్చేశారు. వేల మందితో సభా ప్రాంగణం కిక్కిరిసింది. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. సైకిల్ యాత్ర నిర్వహించే ఐదుగురు మహిళా సిబ్బందిని చూసి యువత హర్షధ్వానాలు చేశారు. అనంతరం సైకిల్ యాత్ర ఇందిరాగాంధీ స్టేడియం నుంచి బెంజి సర్కిల్ వరకు.. అక్కడ నుంచి ఇందిరాగాంధీ స్టేడియంకు చేరుకుంది.

ఇందిరాగాంధీ స్టేడియంలో సభకు హాజరైన ప్రజలు

పకడ్బందీగా ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణ

ప్రశ్నపత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

విజయవాడ సిటీ: నగరంలో ఈ నెల 31 వరకు ఏపీపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. బిషప్ అజరయ్య బాలికోన్నత పాఠశాల, పటమట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జూనియర్ అధ్యాపకులు (లైబ్రేరియన్ సైన్స్), ఏఈఈ (సివిల్), ఉద్యానశాఖాధికారి, సహాయ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు తదితర 17 నోటిఫికేషన్ల ద్వారా వెల్లడించిన పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తొలి రోజు మంగళవారం 24 పరీక్ష కేంద్రాల్లో 5,718 మందికి గాను 2,056 మంది అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు.

బెజవాడకు తెచ్చేలోపే.. ప్రాణాలు పోతున్నాయ్..!

☛ జాతీయ రహదారులపై ట్రామాకేర్ సెంటర్లే లేవు
☛ జగ్గయ్యపేట, నందిగామ, గన్నవరం, పామర్రుల్లో పెట్టరేం?

'ఉమ్మడి కృష్ణాలోని ఎన్‌హెచ్ 65, 16.. ప్రధాన జాతీయ రహదారులపై ఏ పెద్ద ప్రమాదం జరిగినా.. క్షతగాత్రులను విజయవాడకు తేవడం తప్ప.. మరో దారి లేదు. ఎన్‌హెచ్ 65పై.. జగ్గయ్యపేట నుంచి బందరు వరకు 149 కిలోమీటర్లు. ఈ మధ్యలో ఎక్కడ తీవ్ర ప్రమాదం జరిగినా... విజయవాడ పరుగెత్తాల్సిందే. చెన్నై-కోల్‌కతా ఎన్‌హెచ్ 16పై.. విజయవాడ నుంచి బొమ్ములూరు టోల్‌గేట్ వరకు 55.02 కి.మీ. ఈ మధ్యలోనూ ఒక్క అత్యవసర వైద్య చికిత్సా కేంద్రం లేదు. ఈ జాతీయ రహదారులను ఆనుకుని.. జగ్గయ్యపేట, నందిగామ, గన్నవరం, పామర్రు, ఉయ్యూరుల్లో.. ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటు ప్రతిపాదనలు.. ఏళ్లుగా అమలుకాలేదు.'

80 కిలోమీటర్లు మరణ వేదన..

ఎన్‌హెచ్-65లో.. జగ్గయ్యపేట నుంచి విజయవాడకు 82.02 కి.మీ. ఈమధ్యలో నిత్యం ప్రమాద ఘంటికలు మోగుతున్నా.. జగ్గయ్యపేట, నందిగామల్లో సీహెచ్‌సీలు తప్ప పెద్ద ఆసుపత్రుల్లేవు. ఓ మోస్తరు గాయాలైతే స్థానికంగా చికిత్స అందిస్తున్నారు. ★ తీవ్రత మేరకు.. జగ్గయ్యపేట-80, పెనుగంచిప్రోలు-70, నందిగామ-50 కిమీల దూరం నుంచి.. బెజవాడ తెస్తున్నారు. కనీసం గంట-గంటన్నర తప్పదు. ఈలోగా బతకాల్సిన వాళ్లూ సకాలంలో చికిత్స అందక చనిపోతున్నారు.

2017లో ముళ్లపాడు వద్ద వంతెన పైనుంచి కిందకు పడిపోయిన బస్సు

పరిశీలన

పెనుగంచిప్రోలు మండలం ముళ్లపాడు వద్ద జాతీయ రహదారిపై ట్రావెల్స్ బస్సు కల్వర్టు కిందకు డ్రైవరును ఢీకొని.. వంతెన మీద నుంచి కింద కాలువలో పడింది. 11 మంది అక్కడే చనిపోగా... 30 మంది తీవ్రంగా గాయాలపాలయ్యారు. రాత్రిపూట ప్రమాదం జరగడం, దగ్గరలో ట్రామాకేర్ సెంటర్ లేక.. క్షతగాత్రులను, మృతదేహాలను అక్కడి నుంచి 72 కిమీ దూరంలో విజయవాడకు తీసుకురావాల్సి వచ్చింది.

- ఈనాడు, అమరావతి

బాబోయ్.. బందరు దారి

విజయవాడ నుంచి బందరుకు 68 కిమీ. ఎన్‌హెచ్ 65ను ఆనుకుని ఒక్క అత్యవసర వైద్య చికిత్సా కేంద్రం లేదు. ★ పామర్రు నుంచి విజయవాడకు 44.01, బందరుకు 26.08 కిమీ. కంకిపాడు- పామర్రు మధ్యలో ఏ తీవ్రప్రమాదం జరిగినా.. విజయవాడకు లేదంటే బందరుకు తరలించాల్సిందే. కనీసం 30-60 నిమిషాలు తప్పదు. మధ్యలో నాలుగైదు ట్రామాకేర్ సెంటర్లు అవసరం. తీవ్ర ప్రమాదాలు జరిగే.. బ్లాక్ స్పాట్లు ఎక్కువే. ★ గుడివాడలో ఏరియా ఆసుపత్రి ఉన్నా.. వెళ్లేందుకు సరైన దారిలేదు. ఒకవేళ తీసుకెళ్లినా సీరియస్ కేసులు బెజవాడకే పంపేస్తున్నారు. ★ పామర్రులో సీహెచ్‌సీ ఉన్నా.. వైద్య వసతుల్లేవు. దీనిని 100 పడకల సెంటర్‌గా మార్చాలి. ★ ఉయ్యూరులో 30 పడకల సీహెచ్‌సీని ట్రామాకేర్ సెంటర్‌గా మార్చొచ్చు.

నందిగామలో అత్యవసరం...

నందిగామ సీహెచ్‌సీ జాతీయ రహదారి పక్కనే ఉంది. 24 మంది వైద్యులున్నారు. నిత్యం ఓపీ 400పైనే ఉంటోంది.. 10-15 ప్రమాద కేసులు వస్తున్నాయి. తీవ్ర కేసులైతే.. విజయవాడ పంపేస్తారు. ఈ సీహెచ్‌సీని 100 పడకలకు పెంచి రూ.33 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. ★ ఇక్కడ ట్రామాకేర్ సెంటర్ పెడితే.. జగ్గయ్యపేట నుంచి కంచికచర్ల వరకు ఉపయోగం. ★ గౌరవరం దగ్గర ట్రామాకేర్ సెంటర్ కట్టాలని స్థలసేకరణ జరిగినా కార్యరూపం దాల్చలేదు.

అధిక ట్రాఫిక్ ఉన్నా అంతే..

★ గన్నవరంలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు ప్రతిపాదన ఏళ్లుగా ఉంది. ఇక్కడ 30 పడకల సీహెచ్‌సీ ఉన్నా.. సాధారణ సేవలకే పరిమితం. విజయవాడ-హనుమాన్‌జంక్షన్ మధ్యలో పెద్ద ప్రమాదం జరిగినా.. విజయవాడ తేవాల్సింది. అధిక ట్రాఫిక్ నేపథ్యంలో.. తీవ్ర గాయాలైన వారిని ఆసుపత్రికి తెచ్చేలోపే ప్రాణాలుపోయే వీలుంది.

జిల్లాల వారీగా డీఎస్సీ శిక్షణ కేంద్రాలు

అభ్యర్థులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

గొల్లపూడి, న్యూస్‌టుడే : డీఎస్సీ అభ్యర్థుల కోసం జిల్లాల వారీగా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. గొల్లపూడిలోని బీసీ భవన్‌లో రెండో విడత సివిల్ సర్వీసెస్ శిక్షణ కేంద్రాన్ని మంత్రి మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. సివిల్ సర్వీసెస్ శిక్షణకు 700 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 96 మంది ఎంపికయ్యారని వెల్లడించారు. మొదటి దఫా వంద మందికి శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. అభ్యర్థులందరికీ నాణ్యమైన భోజనం, ఆరోగ్య భద్రత, వసతితో కూడిన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో మరో దఫా శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాల వారీగా బీసీ భవనాలను నిర్మాణం చేస్తామన్నారు. అనంతరం అభ్యర్థులకు అవసరమైన మెటీరియల్‌ను అందజేశారు. బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, ఇతర అధికారులు పాల్గొన్నారు.

433 జలజీవన్ మిషన్ పనులు పూర్తి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో సురక్షిత తాగునీటిని పంపిణీ చేసేందుకు జలజీవన్ మిషన్ కింద 534 పనులు మంజూరు కాగా, వీటిలో ఇప్పటివరకు 433 పూర్తయ్యాయని, 101 పనులు పురోగతిలో ఉన్నాయని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఆ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో తాగునీటి సరఫరాపై మంగళవారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ..రక్షిత పథకాల ద్వారా తాగునీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. క్లోరినేషన్ చేయడంతోపాటు పరీక్షలు నిర్వహించాలని సూచించారు. పరిశుభ్రమైన తాగునీటిని మాత్రమే అందించాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలు, పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంచాయతీల్లో తాగునీటి బైలాజికల్ పరీక్షల తేదీ, నివేదిక వివరాలను తప్పనిసరిగా బోర్డులపై ప్రదర్శించాలన్నారు. జడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, డీపీవో పి.లావణ్యకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సి.హెచ్.తిరుమలకుమార్, డీఏవో విజయకుమారి, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, డీఈవో చంద్రకళ, ఐసీడీఎస్ పీడీ రుక్సానా సుల్తానా బేగం తదితరులు పాల్గొన్నారు.

WE MANUFACTURE AND SUPPLY APPAREL
FOR BULK ORDER QUANTITES
REGULAR WEAR
● RELIGIOUS WEAR
● TOPS
● BOTTOMS
● UNDERGARMENTS
● NIGHT WEAR
FOR MEN & WOMEN
BOYS & GIRLS
VIJAYAWADA-AP
8977796538

మీరు ఆక్రమిస్తే... మేము చూస్తుంటాం

నగరంలోని లబ్బీపేట వై.వి.రావు హాస్పిటల్ రోడ్డును ప్రజా ధనం వినియోగించి అభివృద్ధి చేశారు. ఆ రోడ్డుపై ఓ ఫంక్షన్ హాలు వద్ద 'నో పార్కింగ్ ఏపీ ట్రాఫిక్ పోలీస్' పేరుతో బోర్డు పెట్టారు. వాటికి తాళ్లు కట్టి కొంతమేర రహదారి ఆక్రమించారు. ఫలితంగా రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు ఫంక్షన్లు, సమావేశాలు నిర్వహించినప్పుడు అక్కడ ద్విచక్రవాహనాలు నిలుపుతున్నారని స్థానికులు చెబుతున్నారు. రహదారిని పార్కింగ్ స్థలంగా వినియోగించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. - **విజయవాడ సిటీ, న్యూస్‌టుడే**

విధుల్లో జూనియర్.. అక్రమాల్లో సీనియర్!

గ్రామీణ నీటిసరఫరా శాఖలో ఉద్యోగి హవా

ఈనాడు, అమరావతి

గ్రామీణ నీటి సరఫరా శాఖలో.. అతనో జూనియర్ అసిస్టెంట్. అక్రమాల్లో, అడ్డగోలు వ్యవహారాల్లో మాత్రం.. సూపర్ సీనియర్. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం చేయాల్సిన పనులను నిబంధనలకు విరుద్ధంగా చేస్తూ భారీగా దండుకుంటున్నాడు. అవినీతి ఆరోపణలున్న ఉద్యోగులను సైతం మాయ చేసి పీఎఫ్, ఎరియర్స్ రప్పిస్తున్నాడు.

ఇదండీ లెక్క... ★ ఒకే ఉద్యోగి పేరుతో రెండుసార్లు ఎరియర్స్ దరఖాస్తు చేసి దోపిడీ మొదలు పెట్టాడు. కొంతకాలం కిందట ఓ ఉద్యోగికి రూ.8.75 లక్షల ఎరియర్స్ కోసం దరఖాస్తు చేశారు. ఆ సొమ్ము ఉద్యోగి ఖాతాలో జమయినా మళ్లీ ఆ సొమ్ము గురించి దరఖాస్తు చేసి దస్త్రం నడిపించారు. ఆఖరి నిమిషంలో ఖజానా శాఖ అధికారులు గుర్తించడంతో అక్రమం బట్టబయలైంది.

అడుగడుగునా అవినీతి... ★ ఎన్టీఆర్ జిల్లా సరిహద్దు ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ఆ ఉద్యోగికి ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంపై అవగాహన ఉంది. ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్, జిల్లా కార్యాలయాల్లో ఉద్యోగులకు ప్రయోజనాలు రప్పించే ప్రక్రియ చేసేందుకు సిబ్బంది ఉంటారు. కొందరు పని భారం తప్పించుకునేందుకు సదరు జూనియర్ అసిస్టెంట్‌కు ఏళ్లుగా ఆ పనులు అప్పగించి చేయిస్తున్నారు. నిబంధనల ప్రకారం అధికారుల లాగిన్ బయట వారికి తెలియకూడదు.. ఈ ఉద్యోగికి మాత్రం రెండు జిల్లాల్లో బోలెడు మంది అధికారుల లాగిన్లు తెలుసు. ★ ఇదే అదునుగా వ్యాపారం మొదలుపెట్టాడు. ఉద్యోగులకు ఎరియర్స్ దరఖాస్తు చేసినప్పుడు చిన్నచిన్న సాంకేతిక లోపాలను వాడుకోవడం.. ఖజానా శాఖలో కొందరు అధికారులకు మామూళ్ల ఎర వేయడంతో భారీగా దోచుకున్నాడు. ★ ఇతను గుడివాడలో పని చేస్తున్నప్పుడు కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో చేసిన పనుల బిల్లుల దస్త్రం కదలాలంటే రూ.20 వేలు మామూళ్లు ఇవ్వాలని ఓ గుత్తేదారుడిని డిమాండ్ చేశారు. ఆయన నిరాకరించడంతో బిల్లుల నమోదులో కొర్రీలు పెట్టి కోత వేయడంతో గుత్తేదారుడితో వివాదం రేగింది.

ఐదేళ్లు హద్దే లేదు...

★ సదరు ఉద్యోగి వైకాపా వీరాభిమాని.. గత ప్రభుత్వ పాలనలో హద్దు లేకుండా పేట్రేగిపోయారు. తనకు మంత్రులు... రాష్ట్రస్థాయి అధికారులు తెలుసని మభ్యపెట్టి దోచేశాడు. అనిశా తనిఖీల్లో పట్టుబడిన వారు, అవినీతి ఆరోపణల్లో విచారణలు ఎదుర్కొంటున్న వారికి నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగానంతర ప్రయోజనాలు ఇప్పించి వారి నుంచి భారీగా కమీషన్లు దండుకుంటున్నాడు. కొంత కాలం కిందట ఏసీబీకి పట్టుబడిన ఓ ఈఈకి అక్రమంగా ప్రయోజనాలు రప్పించాడు. ★ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అవినీతి ఆరోపణలతో విచారణ ఎదుర్కొంటున్న ఓ విశ్రాంత ఎస్ఈకి ఉద్యోగ విరమణ ప్రయోజనాల కోసం ప్రస్తుతం విధులకు ఎగనామం పెట్టి పైరవీలు చేస్తున్నాడు.

అటవీ పర్యాటకానికి పెరుగుతున్న ఆదరణ

ఇబ్రహీంపట్నం గ్రామీణం: అమరావతికి గేట్ వేలా ఉన్న మూలపాడు అటవీ పరిసరాలను ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళిక రూపొందించి ఎంపీ కేశినేని చిన్నితో కలిసి సీఎం చంద్రబాబుకు సమర్పించనున్నట్లు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తెలిపారు. ఎంపీ చిన్ని, కూటమి నాయకులు, పర్యాటక, అటవీ, పురావస్తు శాఖ అధికారులతో కలిసి మూలపాడులోని నగరవనం, అటవీ ప్రాంతాన్ని ఆయన మంగళవారం పరిశీలించి మాట్లాడారు. అటవీ పర్యాటకానికి ఆదరణ పెరుగుతున్నందున ఎక్కువ మందిని ఆకర్షించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ నేపథ్యంలో విజయవాడ, రాజధాని అమరావతికి సమీపంలో మూలపాడు ఉండటంతో అభివృద్ధికి కీలకంగా మారిందన్నారు. తెదేపా హయాంలో ప్రారంభమైన అభివృద్ధి.. నేడు కూడా కొనసాగించడంతో ఇక్కడ నగరవనం ఏర్పాటు, సీతాకోక చిలుకల పార్కు, పచ్చని చెట్ల మధ్యలో వివిధ జాతులకు చెందిన పక్షుల సంచారంతో పర్యాటక ప్రాంతానికి నాంది పలికిందని వివరించారు. 300 హెక్టార్ల అటవీ శాఖ భూమిలో త్వరలో జంగిల్ సఫారీ, పక్షుల ప్రపంచం, జూ పార్కుతో పాటు మరిన్ని ట్రెక్కింగ్ పాయింట్లను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం చేపట్టనున్న అభివృద్ధి పనులతో రానున్న కృష్ణా పుష్కరాల నాటికి ఈ ప్రాంతం రూపురేఖలు మారనున్నాయన్నారు. మైలవరం భాజపా, జనసేన బాధ్యులు బాలకోటేశ్వరరావు, అక్కల గాంధీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నవ్విపోదురుగాక.. నాకేమని..!

వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన పేర్నిపై మరో కేసు

ఈనాడు, అమరావతి, మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే

కేసు మీద కేసు నమోదవుతున్నా మాజీ మంత్రి, పేర్ని వెంకట్రామయ్య(నాని) తీరు మాత్రం మారడం లేదు. ఇష్టమొచ్చినట్లు నోరుజారడం.. కార్యకర్తలను రెచ్చగొట్టడం.. పైకి నీతులు చెప్పటం ఆయనకు అలవాటైపోయింది. తాజాగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన విషయంపై తెదేపా నాయకులు అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ దిలీప్‌కుమార్, పార్టీ నాయకులు పిప్పళ్ల వెంకటకాంతారావులు కృష్ణా జిల్లా ఇనగుదురుపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. పేర్ని వ్యాఖ్యల ఫొటోలు, క్లిప్పింగులు పోలీసులకు అందించారు. దీనిపై బీఎన్ఎస్‌లోని 196(1), 351(2), 352(2), 353(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుపై తీవ్ర వ్యాఖ్యలు..

★ చాట్రాయ్ మండలం చిన్నంపేటలో జనవరి 25న జరిగిన వైఎస్సార్ విగ్రహావిష్కరణ బహిరంగ సభలో పేర్ని మాట్లాడుతూ 'తిరుపతి లడ్డూ ప్రసాదంపై అబద్ధాలు చెప్పిన చంద్రబాబు నాలుకపై దబ్బళం కాల్చి గుచ్చాలి. ఆయనది మనిషి జన్మోకాదో తెలియదు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ శరీరమంతా వాతలు పెట్టాలి. పవన్‌కల్యాణ్ రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను కడిగి శుద్ధి చేయాలి. చంద్రబాబు ఏదైనా అనగానే పవన్, భాజపా బుర్రకథలో వంతపాడే వారిలా మారుతున్నారు. వేంకటేశ్వరస్వామి మిమ్మల్ని విడిచి పెట్టడు' అంటూ అడ్డూ అదుపు లేకుండా మాట్లాడారు.

ఫిర్యాదు అందజేస్తున్న దిలీప్‌కుమార్, కాంతారావు తదితరులు

నేనింతే మారనంతే

★ కూటమి అధికారం చేపట్టిన నాటి నుంచి పేర్ని నాని నోరు అదుపు తప్పిందనడానికి అనేక ఉదాహరణలున్నాయి. ★ గతంలో తమ పార్టీ నగర అధ్యక్షుడిని అక్రమంగా అరెస్టు చేశారంటూ అనుచరులతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి రచ్చ చేశారు. అంతు చూస్తా అంటూ సీఐని బెదిరించారు. ★ పామర్రులో జరిగిన ఓ సమావేశంలో 'రప్పా..రప్పా నరుకుతాం.. చీకట్లో కన్నుకొడితే పని అయిపోవాలి' అంటూ పార్టీ నేతలను, శ్రేణులను రెచ్చకొట్టే వ్యాఖ్యలు చేయడం పెద్ద దుమారం రేగింది. ★ జడ్పీ ఛైర్మన్ కారు దాడి విషయంలో రాష్ట్రమంతా మనవాళ్లతో గోల చేయించండి అంటూ ఆయన మాట్లాడిన ఫోన్ సంభాషణలు వైరల్ అయ్యాయి. ★ మెడికల్ విద్యార్థుల పరీక్షల సమయంలో పోలీసులు చెప్పినా వినకుండా ధర్నా పేరుతో దాదాగిరి చేశారు. ★ ఇలా నిత్యం వివాదాస్పద వ్యాఖ్యలతో పేర్ని నాని తెరమీదకు వస్తూనే ఉన్నారు.

పెట్టుబడుల పేరుతో వ్యాపారికి టోకరా

మూడు నెలల్లో రూ.74.2 లక్షల మేర మోసం

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: క్లాస్‌మేట్‌నంటూ పరిచయం పెంచుకుని బిట్‌కాయిన్ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఒక వ్యాపారికి సైబర్ నేరస్థులు టోకరా వేశారు. 3 నెలల కాలంలో ఒక వ్యాపారి నుంచి పెట్టుబడులు, రకరకాల పన్నులు పేరు చెప్పి రూ.74.2 లక్షల మేర వసూలు చేసి నిలువునా ముంచేశారు. పెట్టుబడుల పేరుతో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నా సైబర్ నేరస్థులు ఏదో రూపంలో మోసాలు చేస్తూనే ఉన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి...గొల్లపూడికి చెందిన ఒకరు(36) వ్యాపారం చేస్తుంటారు. ఈయనకు 2025 సెప్టెంబరు నెలలో వాట్సాప్ ద్వారా ఒక యువతి క్లాస్‌మేట్ అని పరిచయం చేసుకున్నారు. తన పేరు క్రితికారెడ్డి అని, యూకేలో ఉంటానని తెలిపారు. అప్పటినుంచి వారు వాట్సాప్‌లో ఛాటింగ్ చేసుకునేవారు. ఈ క్రమంలో బిట్‌కాయిన్ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే పెద్ద మొత్తంలో లాభాలు వస్తాయని చెప్పి కొన్ని స్క్రీన్ షాట్లు పెట్టారు. వాటిని చూసి ఆకర్షితులైన వ్యాపారి రూ.20 లక్షల పెట్టుబడి పెట్టారు. భారీగా లాభాలు కనిపించడంతో వాటిని తీసుకునేందుకు ప్రయత్నించగా అవి రాలేదు. రూ.20 లక్షలు ఏఎంఎల్ ట్యాక్స్ కడితే విత్‌డ్రా చేసుకోవచ్చనడంతో వారి మాటలు నమ్మి మరో రూ.20 లక్షలు కట్టారు. ఆ తరువాత మార్జినల్ ట్యాక్స్, అడిషనల్ ట్యాక్స్, వీఐపీ ఫీజు పేరు చెప్పి మరో రూ.34.2 లక్షలు వసూలు చేశారు. మోసపోయినట్లు గ్రహించి ఫిర్యాదు చేయగా సైబర్ క్రైం పోలీసులు కేసు పెట్టి దర్యాప్తు చేస్తున్నారు.

జినేష్.. శిబులకు ముగిసిన కస్టడీ

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో నిందితులు జినేష్, శిబులకు మంగళవారంతో మూడు రోజుల కస్టడీ ముగిసింది. వీరిని విజయవాడలోని ఎక్సైజ్ కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. వీరిని న్యాయాధికారి లెనిన్ బాబు ఎదుట హాజరుపర్చగా.. రిమాండ్‌కు ఆదేశించారు. అనంతరం వారిని విజయవాడ కారాగారానికి తరలించారు. గోవాలోని డిస్టలరీల నుంచి స్పిరిట్‌ను తీసుకుని బాలాజీకి సరఫరా చేసినట్లు మూడు రోజుల విచారణలో ప్రధానంగా వెల్లడించినట్లు తెలిసింది. శిబు ద్వారా బాలాజీకి అందజేసినట్లు ఇంటరాగేషన్‌లో వెల్లడించాడు. కోర్టు ఆదేశాల మేరకు నిందితులను ఈనెల 25 నుంచి కస్టడీకి తీసుకున్న సంగతి తెలిసిందే.

(c) eenadu

అంతర పంటలు.. అధిక ప్రయోజనాలు

రైతేరాజు

కంచికచర్ల, న్యూస్‌టుడే

తోటలో రాజశేఖర్

మూస పద్ధతులకు భిన్నంగా వ్యవసాయంలో కొత్త విధానాలు అవలంబిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా చేసి చూపిస్తున్నారు వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన రైతు వెంపటి రాజశేఖర్. 4 ఎకరాల పొలంలో మామిడి, జామ సాగు చేపట్టిన ఆయన పంట కాలం వృథాగా మారకుండా ఖరీఫ్ సీజన్‌లో సాళ్ల మధ్యలో పెసర సాగు చేపట్టారు. వడదెబ్బ కారణంగా కొంత పంట నష్టపోయినా నిరాశ చెందలేదు.

★ పెసర కోత అనంతరం పంట మొక్కల మధ్యలో కూరగాయల సాగు చేపట్టాలని నిర్ణయించుకున్నారు. అందుకు పొలాన్ని సిద్ధం చేశారు. మొక్కల మధ్య ఖాళీలో టమాట నారు వేశారు. నాలుగెకరాల పంట తోటలో ఇలా టమాట నారు సుమారు ఎకరా ఉంటుంది. ఇందుకు ఖర్చు పెట్టింది రూ.15 వేలు మాత్రమే. టమాట నారు ఎత్తు పెరిగాక సాళ్ల మధ్య ఖాళీ స్థలంలో ఇతర కాయగూరల సాగు చేపట్టేలా ప్రణాళికలు రూపొందించారు. ఇలా పంట తోటలో అంతర పంటలు పండిస్తే సాగు ఖర్చు సగానికి సగం తగ్గుతుందని ఆయన తెలిపారు. పంట మొక్కలకు పురుగు, చీడపీడలు ఆశించకుండా వేప రసాయనాలతో కాయగూరల మొక్కలకు సరిపోతాయని, వాటికి ప్రత్యేకంగా పిచికారీ చేసే పని ఉండదని చెప్పారు. పంట మొక్కలకు అందించే నీరే కాయ గూరలకు సరిపోతుందని పేర్కొన్నారు. పంట తోటలకు అందించే ఎరువులే కాయగూరలకు పనికి వస్తాయని, వాటి ద్వారా దిగుబడి అధికంగా ఉంటుందని చెప్పారు.

రైతు ప్రశ్న? నిపుణుల జవాబు

ప్రశ్న: పొద చిక్కుడు రకాలు, విత్తే సమయం, నేల తయారీ, విత్తే దూరం గురించి వివరించండి?

- జి.శ్రీనివాస్, రైతు, యండకుదురు

సమాధానం: పొదరకం అర్కజయ. ఇది విత్తిన 50- 60 రోజులకు కోతకు వస్తుంది. కాయలు పొట్టిగా, ముదురు ఆకుపచ్చ రంగులో ఉంటాయి. నేల తయారీ సమయంలో నేలను వదును వచ్చే వరకు 4- 5 సార్లు దుక్కి దున్ని చదును చేయాలి. విత్తే ముందు కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండిజమ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి. నైట్రోజన్‌ను స్థాపించే రైజోబియం కల్చర్‌తో విత్తనశుద్ధి చేయాలి. (కిలో విత్తనానికి 200 గ్రాముల రైజోబియం కల్చర్ కలపాలి). విత్తనాలను పొద రకాలను ఖరీఫ్‌లో అయితే 60× 30 సెం.మీ., వేసవిలో అయితే 45×15 సెం.మీ. దూరంలో నాటాలి. వేసవిలో జనవరి, ఫిబ్రవరి కాలాల్లో విత్తుకోవచ్చు. పొద రకానికి ఎకరాకు 16 కిలోల విత్తనం. కాయలు లేతగా ఉన్నప్పుడే కోయాలి. పూతకు వచ్చిన 2-3 వారాలలో కాయలు కోతకు సిద్ధంగా ఉంటాయి.

- వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల

-ఘంటసాల, న్యూస్‌టుడే

సేంద్రియ పెరటి సాగు.. ఆరోగ్యం బాగు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

పెరటి మొక్కలకు వేస్ట్ డీకంపోజ్ ద్రావణాన్ని పిచికారీ చేస్తున్న రామకోటేశ్వరరావు

ఇంటి ఆవరణలో కొద్దిపాటి స్థలంలో సేంద్రియ విధానంలో పండ్లు, కూరగాయలు సాగు చేసే ధ్యాస నిలుస్తున్నారు మాగల్లుకు చెందిన మాదారపు రామకోటేశ్వరరావు. పశువుల ఇంటి ముందున్న సెంటున్నర స్థలంలో ఆయన వంగ, బెండ, గోంగూర, పాలకూర, తోటకూర, చిక్కుడు, బ్రకోలి, కాకర, కొత్తిమీర, అల్లం సాగు చేస్తున్నారు. వారంలో రెండుసార్లు మొక్కలకు తెగుళ్ల సోకకుండా వేస్ట్ డీకంపోజ్ ద్రావణం, పులిసిన మజ్జిగ పిచికారీ చేస్తున్నారు. పురుగు మందు పిచికారీ చేయకుండా సేంద్రియ విధానంలో కాసిన కూరగాయలను ఇంట్లో వాడుతున్నారు. మిగిలిన కూరగాయలు, ఆకుకూరలను ఇరుగు పొరుగు వారికి ఇస్తున్నారు.

పెరట్లో కాసిన సపోట కాయలు కోస్తున్న వెంకటేశ్వరరావు, పద్మ

★ తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన కట్టా వెంకటేశ్వరరావు, పద్మ దంపతులు తమ ఇంటి ఆవరణను పండ్లతోటగా మార్చారు. ఇంటి ముందు 15 సెంట్ల స్థలంలో సపోట, అరటి, మామిడి, జామ, దానిమ్మ, కొబ్బరి మొక్కలు పెంచారు. వీటితో పాటు వంగ, బెండ, సొర, టమాట, చిక్కుడు తదితర కూరగాయ మొక్కలు పెంచుతున్నారు. పదేళ్లుగా సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, పండ్ల మొక్కలను సాగు చేస్తున్నారు. చీడపీడల నివారణకు మొక్కలకు జీవామృతం పిచికారీ చేస్తున్నారు. మొక్కల పాదుల్లో పశువుల ఎరువు వేసి నీరు అందిస్తున్నారు. ఇంట్లో కూరకు పెరటి కాయగూరలను ఉపయోగిస్తున్నారు. మొక్కలను వానరాలు పాడు చేయకుండా రూ.1.30 లక్షలతో పెరటి చుట్టూ రక్షణగా సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు.

సూపర్ నేపియర్ పోషకాల సిరి

సూపర్ నేపియర్ గడ్డి

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: సూపర్ నేపియర్ గడ్డి సాగుతో పశుగ్రాసం కొరత తీరుతుంది.. ఇందులో పశువులకు అవసరమయ్యే పోషకాలు పుష్కలంగా లభిస్తాయని మండల వ్యవసాయాధికారిణి శ్రీదేవి తెలిపారు. ఆమె సూచనలు ఇలా... పాడి పశువులకు రోజుకు 30 కిలోల గ్రాసం అందిస్తే ఆరోగ్యంగా ఉండి.. పాలు కూడా పెరుగుతాయి. ఈ గడ్డిని వినియోగిస్తే ఇతర దాణాల వ్యయం తగ్గుతుంది. ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు అవుతుంది. వీటిని సాగు చేస్తున్న రైతుల నుంచి కణుపులు సేకరించి నాటుకోవచ్చు. ఎకరాకు అయిదు వేల కణుపులు సరిపోతాయి. వీటిని నాటే ముందు దుక్కిని ఎరువు పశువుల ఎరువు భూమిలో వేసుకోవాలి. బోదెలను తయారు చేసుకోవాలి. ఒక్కో బోదెకు రెండు అడుగులు, మొక్కల మధ్య ఒకటిన్నర అడుగుల దూరం ఉండేలా నాటుకోవాలి. నాటిన 45 నుంచి 50 రోజుల మధ్య మొదటి కోత వస్తుంది. తర్వాత 15 రోజులకు ఒక సారి కోసుకోవచ్చు. కోత తర్వాత యూరియా వేస్తే బాగా ఎదుగుతుంది. ఎకరాలో పెరిగే గడ్డితో 10 పశువులను మేపవచ్చు. ఈ గడ్డి పశువులకు అందిస్తే ఆరోగ్యంగా ఉంటాయి.

మొక్కజొన్నలో జింక్ లోపం నివారణ చర్యలు

పొన్నూరు, న్యూస్‌టుడే: మొక్కజొన్నలో జింక్ లోపం నివారణ చర్యలను వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు రామకోటేశ్వరి సూచించారు. మొక్కజొన్న పైరు 20 నుంచి 25 రోజుల దశలో మొక్క పైనుంచి రెండు, మూడు ఆకుల మొదలు భాగంలో ఈ లక్షణాలు కనిపిస్తాయి. ఆకు ఈనె మధ్య భాగాలు పాలిపోయి పసుపు, తెలుపు రంగుగా మారతాయి. కణుపుల మధ్య దూరం తగ్గిపోవడంతో మొక్కలు చిన్నవిగా అవుతాయి. మొక్కలు ఎదుగుదల లేకపోవడంతో దిగుబడులపై ప్రభావం చూపుతాయి. మొక్కల్లో కొత్తగా వచ్చిన ఆకులకు జింక్ సరిగా అందకపోవడంతో అవి తెల్లగా మారతాయి. జింక్ లోప నివారణకు క్రమం తప్పకుండా సేంద్రియ ఎరువులు వాడాలి. 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను లీటరు నీటిలో కలిపి 4 నుంచి 5 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

అతివ మలిచే అపురూప బొమ్మ

కొండపల్లి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

బొమ్మలు తయారు చేస్తున్న మహిళలు

ఆకాశంలో సగం.. అందరిలో సగం అంటున్న మహిళలు ఇప్పుడు కొండపల్లి బొమ్మల ఖ్యాతిలో మేము సైతమంటూ ప్రాధాన్యత చాటుకుంటున్నారు. నాలుగు శతాబ్దాల చరిత్ర కలిగిన కొండపల్లి కొయ్య బొమ్మల తయారీ కళను తరతరాలకు చెందిన కళాకారులు కాపాడుకుంటూ వస్తున్నారు. ఓ సామాజిక వర్గానికి చెందిన వారు ఆ కళను కొన్ని తరాల కిందట అందిపుచ్చుకుని రాణిస్తున్నారు. అయితే ఈ మధ్య కాలంలో యువకులు, యువతులు బొమ్మల కళను వృత్తిగా మార్చుకొని అరంగేట్రం చేశారు. బొమ్మల తయారీలో తమ కళను ప్రదర్శిస్తున్నారు. గతంలో బొమ్మలకు రంగులు అందడం మాత్రమే చేసే మహిళలు ప్రస్తుతం చెక్కను బొమ్మగా మార్చి ఆకృతులను అద్దేలా సిద్ధహస్తులుగా మారారు. తయారీలోనే కాకుండా అమ్మకాల్లో సైతం తమ ప్రాధాన్యతను కనబరుస్తున్నారు. మరి కొందరు ఆన్‌లైనులో బొమ్మల విక్రయాలు చేస్తూ తమ సత్తా చాటుకుంటున్నారు. నేటి మహిళ ఎందులోనూ ఎక్కడా తక్కువ కాదంటూ తమ ప్రతిభను కనబరుస్తున్నారు.

మహిళా సంఘాల ఆధ్వర్యంలో... : మహిళా, పొదుపు సంఘాల మహిళలు ప్రస్తుతం ఈ కళలో చొచ్చుకుపోతున్నారు. పొదుపు సంఘ మహిళలు బొమ్మల తయారీతో పాటు మార్కెటింగ్, నూతన ఆవిష్కరణలకు నాంది పలికారు. అందులో భాగంగానే అనేక చోట్ల బొమ్మల విక్రయాలను ఏర్పాటు చేసి విస్తృత పరుస్తున్నారు. కొయ్య బొమ్మల కళాకారిణులను మెప్మాతో పాటు పర్యాటక శాఖ ప్రోత్సహిస్తోంది. జిల్లా కలెక్టర్ లక్ష్మీశ స్వయంగా కళాకారిణులను ప్రోత్సహించాలని, వారి ఉత్పత్తులను సిటీ మాల్స్‌లో అమ్మకాలు చేయాలని సూచించారు. ఈ క్రమంలోనే ఇటీవల యూరోపియన్ అంబాసిడర్‌ను తీసుకువచ్చి మహిళా కళాకారిణుల చేతి నైపుణ్యాన్ని చూపించారు.

ఆన్‌లైన్‌లోనూ..: గతంలోనే ఆన్‌లైన్ మార్కెట్‌లోకి కొండపల్లి బొమ్మ ప్రవేశించింది. ప్రస్తుతం మహిళా సంఘాలు సైతం ఆన్‌లైన్ మార్కెట్‌ను సద్వినియోగం చేసుకుంటున్నారు. వ్యక్తిగత ఆర్డర్లతో పాటు గ్రూపులుగా ఏర్పడి అమ్మకాలు చేస్తున్నారు.

రుణాలకు అవకాశం

మెప్మా ఆధ్వర్యంలో సంఘ మహిళలకు రుణాలు వర్తిస్తున్నాయి. వీటితో పాటు కొండపల్లి బొమ్మల కళాకారిణులు సంఘాలుగా ఏర్పడిన నేపథ్యంలో వారికి రుణాల్కై సిఫారస్సు చేస్తాం. ఇప్పటికే కొందరు ఆ ప్రయత్నాల్లో ఉన్నారు. - శ్రీధర్, మెప్మా సిటీ మేనేజర్

దుర్గమ్మ సేవలో ఆదాయపు పన్ను శాఖ చీఫ్ కమిషనర్

ఎం.అనిల్‌కుమార్‌కు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న అధికారులు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఆదాయపు పన్నుశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఎం.అనిల్‌కుమార్ దర్శించుకున్నారు. మంగళవారం ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు సాదరస్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. వేదపండితులు అమ్మవారి ఆశీర్వచనాన్ని అందజేసి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని ఆయనకు అందజేశారు.

కేంద్ర మంత్రి పూజలు

శోభాకరంద్లాజేకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ అధికారి

విజయవాడ వన్‌టౌన్: ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మను కేంద్ర కార్మిక, ఉపాధి, సూక్ష్మ, చిన్న, మధ్య, తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆమెకు ఆలయ అధికారులు అధికార లాంఛనాలతో స్వాగతం పలికారు. ఆమె అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.వేద పండితులు ఆశీర్వచనాన్ని అందజేశారు. ఆలయ అధికారులు ఆమెకు అమ్మవారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందజేశారు.

కేంద్రం అంగీకరించిన నిబంధనలు అమలు చేయాల్సిందే

విజయవాడ వన్‌టౌన్: ఏపీటీబీఈఎఫ్ 12వ ద్వైపాక్షిక ఒప్పందం, తొమ్మిదో జాయింట్ నోట్‌లో అంగీకరించిన నిబంధనలను కేంద్రం అమలు చేయాల్సిందేనని బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎన్.సుబ్బారావు అన్నారు. పాతబస్తీ ఆర్‌ఆర్ అప్పారావుపేటలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం ఆవరణలో మంగళవారం ధర్నా నిర్వహించారు. నాడు అంగీకరించిన నిబంధనలను అమలుచేయడంలో ప్రభుత్వం వివక్షత చూపుతోందని ఆరోపించారు. వారానికి ఐదు రోజులు పనిదినాన్ని అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నగర నాయకుడు వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ.. రెండు నెలలుగా బ్యాంకు ఉద్యోగులు, అధికారులు, ఐబీఏ ఛైర్మన్, ఆర్థిక మంత్రి, కేంద్ర ప్రధాన కార్మిక కమిషనర్‌లకు అనేకసార్లు బ్యాంకు ఉద్యోగుల సంఘాలు వినతులు అందించినా పెడచెవిన పెట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ కార్యదర్శి రమేష్‌బాబు, బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ సభ్యులు రాధాకృష్ణ, వడయవార్లు, రామ్ బెల్లారి, నరసింహం, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

జోగి రమేశ్‌ను చూసి నవ్వుతున్న జనం

తప్పులు చేయకుంటే జగన్ బ్యాచ్‌కు భయమెందుకు?

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

ఈనాడు, అమరావతి : 'కల్తీ మద్యం కేసులో ఇరుక్కున్న జోగి రమేశ్ బీసీ కార్డు ఉపయోగించడం చూసి జనం నవ్వుతున్నారు. కులం పేరుతో చేసిన తప్పుల నుంచి తప్పించుకోవడం కుదరదు. భువనమ్మను అసెంబ్లీ సాక్షిగా అవమానించారు. మాస్క్ అడిగినందుకు డాక్టర్ సుధాకర్‌ను వేధించి ప్రాణం పోయేలా చేశారు. ఎంతో మంది ఎస్టీ, ఎస్సీ, బీసీలపై తప్పుడు కేసులు బనాయించి జైల్లో వేధించారు. వైకాపా అయిదేళ్ల అసమర్థ పాలనలో అడ్డగోలుగా తప్పులు చేశారు. బాధ్యతగా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హెచ్చరించినా లెక్క చేయలేదు. ఇప్పుడు కేసుల రూపంలో ఫలితం అనుభవిస్తున్నారు. ఇందులో మా ప్రమేయం ఏమీ లేదు. జగన్ హయాంలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరుగుతోంది. మరికొందరు గజదొంగలు బయటికొస్తారు. ఎలాంటి తప్పులు చేయకుంటే జగన్ బ్యాచ్‌కు అంత భయం ఎందుకు?' అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. విజయవాడ పరిధిలోని గొల్లపూడి బీసీ భవన్‌లో బీసీ కార్పొరేషన్ ఛైర్మన్లతో మంత్రి మంగళవారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

బీసీలకు పెద్దపీట వేస్తున్న కూటమి

'బీసీల ప్రగతికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం. రక్షణ చట్టం తీసుకొచ్చేందుకు కార్పొరేషన్ ఛైర్మన్ల అభిప్రాయాలు తీసుకునేందుకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాం. ఛైర్మన్ల సూచనలను సీఎం దృష్టికి తీసుకెళ్తాం. బీసీలకు శాశ్వత ఆర్థిక భరోసా కల్పించేలా ఆదరణ 3.0 తీసుకొస్తున్నాం. అన్ని జిల్లా కేంద్రాల్లో బీసీ భవన్లు నిర్మిస్తాం. వసతి గృహాలు, విద్యాలయాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం. పోటీ పరీక్షలకు స్టడీ సర్కిళ్ల ద్వారా శిక్షణ ఇప్పిస్తాం'మని మంత్రి తెలిపారు. రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ రెడ్డి అనంతకుమారి, పలువురు కార్పొరేషన్ ఛైర్మన్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులను ఆసుపత్రికి తరలిస్తే నగదు బహుమతులు

మాట్లాడుతున్న జేటీసీ మోహన్, చిత్రంలో ట్రాఫిక్ డీసీపీ షిరీన్‌బేగం, ఏసీపీ రామచంద్రరావు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని సకాలంలో ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడడంలో కీలకపాత్ర పోషించిన వారికి నగదు బహుమతులు, చట్టపరంగా రక్షించే నిబంధనలు ఉన్నాయని రవాణా శాఖ సంయుక్త కమిషనర్ ఎ.మోహన్, ట్రాఫిక్ డీసీపీ షిరీన్‌బేగం పేర్కొన్నారు. మహాత్మాగాంధీరోడ్డులోని కేఎస్ వ్యాస్ కాంప్లెక్సులో రహదారి భద్రతపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల చట్టంలో వచ్చిన కొత్త సవరణలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులను ఆసుపత్రుల్లో చేర్చినప్పుడు వారికి చట్టపరమైన ఇబ్బందులు ఉండవని, వారిని ప్రశ్నలతో వేధించరని తెలిపారు. అదే విధంగా గుర్తు తెలియని వాహనం ఢీకొని మరణించిన హిట్ అండ్ రన్ కేసులో బాధితులకు పరిహారం అందించే వెసులుబాటు ఉందన్నారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై మరింతగా అవగాహన, బాధ్యత పెంపొందించేలా అధికారులు పని చేయాలని కోరారు. ఏసీపీ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌జీఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడిగా విద్యాసాగర్ ఎన్నిక

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని శిర్డీలో ఈనెల 23వ తేదీ నుంచి 26 వరకు జరిగిన ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(ఏఐఎస్‌జీఈఎఫ్) 18వ జాతీయ మహాసభల్లో ఏపీఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. దేశ వ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి మహాసభలకు హాజరైన ఉద్యోగ సంఘాల ప్రతినిధుల సమక్షంలో మహాసభల ముగింపు దశలో ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సుమారు 80 లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘంలో జాతీయ ఉపాధ్యక్ష పదవి ఏపీకి దక్కడంపై ఉద్యోగ సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

పికిల్ బాల్ లీగ్‌లో ప్రతిభ

కార్తీక్, గోపాల్ జోడీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: గురునానక్‌నగర్‌లోని పికిల్ అండ్ బ్రూ కోర్టుల్లో ఈ నెల 26వ తేదీన జరిగిన జీరో లిమిట్స్ పికిల్ బాల్ లీగ్ టోర్నీలో నగరానికి చెందిన కె.డోలా గోపాల్, ఆర్.కార్తీక్ జోడీ రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ట్రోఫీ సొంతం చేసుకున్న క్రీడాకారులను పలువురు అభినందించారు.

రూ.కోటి కట్నం తీసుకురా

సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి తప్పని వరకట్న వేధింపులు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: పెళ్లై ఏడు సంవత్సరాలు దాటినా..రూ.కోటి అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తున్న భర్తపై ఒక యువతి మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రామవరప్పాడుకు చెందిన యువతి (38) అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేసేవారు. 2018లో టాటానగర్‌కు చెందిన కుందు స్వరాజ్‌ను వివాహం చేసుకున్నారు. అప్పట్లో కట్నం కింద రూ.కోటి ఇచ్చారు. తరువాత వీరు అమెరికా వెళ్లి అక్కడ స్థిరపడ్డారు. 2019లో మరో రూ.40 లక్షలు ఇచ్చారు. ఆతరువాత అమెరికాలో ఉన్న ఆస్తులన్నీ అమ్మేసి ఇండియా వచ్చేసి రామవరప్పాడులో నివాసం ఏర్పరుచుకున్నారు. ఈ క్రమంలో 2025 జనవరి 16న ఆమెపై హత్యాయత్నం చేయబోగా.. తప్పించుకున్నారు. అనంతరం తిరిగి అమెరికా వెళ్లినా..అక్కడా వేధింపులు తప్పలేదు. వారంతా మళ్లీ ఇండియాకు రాగా ఇంకా రూ.కోటి అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తుండటంతో మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -143 రిటైల్ ధర 170 చికెన్ విత్ స్కిన్ - 247 చికెన్ స్కిన్‌లెస్ - 281.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 162, 171, 182 చికెన్ విత్ స్కిన్ - 314 చికెన్ స్కిన్‌లెస్ - 324.

శతాబ్దాల కోటకు పర్యాటక వైభవం తీసుకొస్తాం

పవిత్ర సంగమం వద్ద కేకు కోస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, తెదేపా నాయకులు

కొండపల్లి, న్యూస్‌టుడే : శతాబ్దాల చరిత్ర కలిగిన కొండపల్లి కోటకు పర్యాటకంగా పూర్వ వైభవం తీసుకొస్తామని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ అన్నారు. వీరు కొండపల్లి కోట, పవిత్ర సంగమం ప్రాంతాలను మంగళవారం పరిశీలించి మాట్లాడారు. తెదేపా హయాంలో కోటలో లేజర్ షో తదితరాలు ఉండేవని గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో అనేక మంది పర్యాటకులు నిత్యం కోటను సందర్శించుకునే వారన్నారు. వైకాపా ప్రభుత్వంలో పర్యాటక రంగానికి సంబంధించి అన్ని కార్యక్రమాలు దాదాపుగా అడుగంటాయన్నారు. తిరిగి కూటమి ప్రభుత్వంలో వాటిని తిరిగి మనుగడలోకి తెస్తామన్నారు. వీటిని వెలుగులోకి తీసుకురావాలకుంటున్నామన్నారు. రాష్ట్రంలో కొండపల్లి కోట అతి పెద్ద చారిత్రక కట్టడమైనందున అమరావతికి సమీపంలోని దీన్ని ముఖ్యమైన పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం నుంచి కొండపైకి ఉన్న టీవీ టవర్ రోడ్డునే కాకుండా గతంలో ఉన్న రాళ్ల మెట్ల మార్గం, ఐరన్ ఓర్ దారిని పరిశీలించి అటవీ శాఖ ఆధ్వర్యంలో ఈ పర్యాటక ప్యాకేజీలో పవిత్ర సంగమాన్ని కలుపుకొంటామన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను పునరుద్ధరించి దానికి కూడా పూర్వ వైభవం తెస్తామన్నారు. అనంతరం మంత్రి లోకేశ్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేసిన పాదయాత్ర మూడేళ్లు పూర్తి కావడంతో సంగమం వద్ద కేకు కోశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

చిక్కిన చిట్టీల కేసు నిందితుడు

★ నిర్బంధించిన బాధితులు ★ విడిపించిన పోలీసులు

పటమట, న్యూస్‌టుడే: చిట్టీల పేరుతో రూ.కోట్లు వసూలు చేసి పరారీలో ఉన్న నిందితుడు బాధితులకు చిక్కడంతో రామలింగేశ్వరనగర్‌లో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. విజయవాడ రామలింగేశ్వరనగర్‌కు చెందిన కోటేశ్వరమ్మ భర్త ఆర్టీసీ డ్రైవర్. వారికి ఇద్దరు పిల్లలు. స్థానికులతో పరిచయాలు పెంచుకుని కొన్నేళ్లుగా ఆమె చిట్టీలు వేయించింది. కొంత కాలం నమ్మకంగా సొమ్ము చెల్లించడంతో ఎక్కువమంది చిట్టీలు కట్టారు. అకస్మాత్తుగా గత ఏడాది జులై 18వ తేదీ అర్ధరాత్రి కుటుంబ సభ్యులతో పాటు కోటేశ్వరమ్మ పరారైంది. దీనిపై బాధితులు పటమట పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కోటేశ్వరమ్మ(ఏ1), ఆమె భర్త వెంకటేశ్వరరావు(ఏ3), కుమార్తె శ్రావణి(ఏ2), కుమారుడు రాజా రాఘవేంద్రరావు(ఏ4)లపై కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న వెంకటేశ్వరరావు మంగళవారం రాత్రి ఎన్టీఆర్ కాంప్లెక్స్ వద్ద బాధితులకు కనిపించాడు. అతన్ని రామలింగేశ్వరనగర్ తీసుకొచ్చి నిర్బంధించారు. విషయం తెలుసుకున్న సీఐ పవన్ కిషోర్ సిబ్బందితో కలిసి వెళ్లి వెంకటేశ్వరరావును విడిపించారు. డబ్బులు చెల్లిస్తేనే అతన్ని వదులుతామని ఆందోళనకు దిగారు. సీఐ బాధితులకు నచ్చజెప్పి అతన్ని స్టేషన్‌కు తీసుకువెళ్లారు.

చురుగ్గా జీవన ప్రమాణ ధ్రువీకరణ ప్రక్రియ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: విజయవాడ తూర్పు డివిజన్ (గాంధీనగర్) సబ్ ట్రెజరీ కార్యాలయ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల జీవన ప్రమాణ ధ్రువీకరణ నమోదు(రెన్యువల్) కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, కుటుంబ పింఛనుదారులు ఫిబ్రవరి 28 లోగా జీవన ప్రమాణ ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంది. ఈక్రమంలో గాంధీనగర్‌లోని సబ్ ట్రెజరీ కార్యాలయం వద్ద ఇందుకు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి నమోదు చేస్తున్నారు. కార్యాలయ పనివేళల్లో రోజూ 60 నుంచి 100 మంది వరకు ఇక్కడ ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్నారు. తూర్పు డివిజనల్ సబ్ ట్రెజరీ పరిధిలో మొత్తం 16,284 మంది ఉండగా, వీరిలో మంగళవారం వరకు 9,470 మంది నమోదయ్యారు. ఇంకా 6,814 మంది నమోదు కావాల్సి ఉందని ఏటీవో కత్తుల వీరబాబు తెలిపారు. ఫిబ్రవరి నెలాఖరు వరకు గడువు ఉన్న దృష్ట్యా మిగతా వారు త్వరితగతిన నమోదు చేసుకోవాలని సూచించారు.

ఆల్ ఇండియా ట్రేడ్ పరీక్ష దరఖాస్తులకు గడువు నేడు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా ట్రేడ్ పరీక్ష (ఎ.ఐ.టి.టి)- 2026కు హాజరు కావడానికి ప్రైవేటు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో కనీసం మూడేళ్లు వివిధ ట్రేడుల్లో పని చేస్తున్న అభ్యర్థులు ప్రభుత్వ ఐటీఐలో పరీక్షలు రాయడానికి అవకాశం ఉందని తెలిపారు. నైపుణ్యం కలిగిన అభ్యర్థులు ఈ ఏడాది జులైలో జరగనున్న ట్రేడ్ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విజయవాడ ప్రభుత్వ ఐటీఐలో రూ.500 చెల్లించి దరఖాస్తు పొందాలని తెలిపారు. పూరించిన దరఖాస్తులను ఈనెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఐటీఐలో ఇవ్వాలని, పూర్తి వివరాలకు 94906-39639 నంబరులో సంప్రదించాలని సూచించారు.

సమయపాలనలో రైల్వే డివిజన్ అత్యుత్తమ పనితీరు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: రైళ్ల సమయపాలనలో విజయవాడ డివిజన్ అత్యుత్తమ పనితీరు కనబర్చి మొదటి స్థానంలో నిలిచిందని విజయవాడ రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 86.43శాతం సమయపాలన నమోదు చేసిందన్నారు. షెడ్యూల్ చేసిన 179 మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో 170 రైళ్లు సమయానికి లేదా ముందుగానే వచ్చాయన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరించడం వల్ల ఇది సాధ్యపడిందని చెప్పారు. ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలు చేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్ దేవదాయ ధర్మదాయ శాఖ

ఇ ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా లింగాల గ్రామం, వత్సవాయి మండలం, ఎన్.టి.ఆర్. జిల్లా నందు శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవాలయ అభివృద్ధి పనులు చేయుటకు రూ.340.00 లక్షలకు టెండరు పిలుచుట జరుగుచున్నది. ఇతర వివరములకు వెబ్ సైట్ www.apeprocurement.gov.in నందు చూడగలరు.

ఇట్లు: ఛైర్మన్

కొట్టి పడేసి.. దోచేసి..

గంజాయి బ్యాచ్ సభ్యుడి దురాగతం

కిందపడిన బాధితుడు శ్రీనివాస్

చిట్టినగర్, న్యూస్‌టుడే: గంజాయి బ్యాచ్ సభ్యుడు ఓ వ్యక్తిని కొట్టి కిందపడేసి ఆయన దగ్గరున్న నగదును దోపిడీచేసిన ఘటన చిట్టినగర్‌లో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం టేనర్‌పేట, పంపింగ్ బూస్టర్ ప్రాంతంలో బుగ్గిన శ్రీనివాస్ (56) నివాసం ఉంటున్నాడు. తాపీ పనులు చేస్తుండే ఆయన మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో చిట్టినగర్ నుంచి నగరాల సీతారామస్వామి మహాలక్ష్మి అమ్మవారి గుడి వెనుక రోడ్డులో వస్తున్నాడు. మంగం పాపారావు భవనం ప్రాంతానికి రాగానే ఓ గంజాయి బ్యాచ్ సభ్యుడు శ్రీనివాస్‌ని అడ్డగించి డబ్బులు ఇవ్వమని అడిగాడు. తన వద్ద లేవని చెప్పిన శ్రీనివాస్‌ను ఇస్తావా లేదా అంటూ అడ్డగించి కొట్టి కింద పడేసి జేబులో ఉన్న రూ.2000, చరవాణి తీసుకొని పరారయ్యాడు. దోపిడీకి పాల్పడిన యువకుడికి సుమారు 20 సంవత్సరాలు ఉంటాయని, పసుపు చొక్కా ధరించి ఉన్నాడని చెబుతున్నారు. కొత్తపేట పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ విషయమై సీఐ చిన కొండలరావుని వివరణ కోరగా బాధితుడు బాగా మద్యం తాగి ఉన్నాడని సిబ్బంది చెప్పారని, సీసీ ఫుటేజీ పరిశీలించి తగిన చర్యలు చేపడతామని చెప్పారు.

91.9FM Vijayawada Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 87907 41166

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్. ✆ 81422 92071

REAL ESTATE

PLOT FOR SALE

TADIGADAPA

తాడిగడప చైతన్య కాలేజీ 100Ft రోడ్డులో పంచమర్తి అనురాధ గారి విల్లాస్ రోడ్డులో 200& 250 గజాల ఉడా లేఔట్ ప్లాటులు అమ్మకం. ✆92907 63488

TO LET

COMMERCIAL

1600SFt & 1100SFt for Offices in 2nd Floor, Near Hotel Fortune Murali Park MG Road, Vijayawada. ✆ 87904 35283.

JOBS

బ్యాంకు అనుబంధ సంస్థలో పనిచేయుటకు మేనేజర్స్ కావలెను. అర్హత: RTD, VRS, టీచర్స్ కావలెను. ✆ 83175 95259.

రైస్ మిల్ & ప్లాంట్ ఆపరేటర్స్ కావలెను. అనుభవజ్ఞులైన వెల్డింగ్, రిపేర్ తెలిసిన ఆపరేటర్స్ కావలెను. Contact No: ✆ 80962 46099.

లక్ష్మీభవానీ ఏజెన్సీస్ భవానీపురం నందు Degree, MBA+Tally Accounts 15K-18K, OC అభ్యర్థులు కావలెను. ✆ 94408 39728, 90320 89366

విజయవాడ మెట్రోపాలిటన్ హోటల్ వారికి స్టాఫ్ కావలెను. ఫ్రంట్ ఆఫీసు అసిస్టెంట్ (Male) ★ హౌస్‌కీపింగ్ సూపర్‌వైజర్ (Need) Hotel Experience ★ హౌస్‌కీపింగ్ బాయ్స్ ★ సెక్యూరిటీ గార్డ్స ★ ఆకర్షణీయమైన జీతం. ✆ 72888 85598

విజయవాడలో క్రొత్తగా ప్రారంభిస్తున్న ఏజెన్సీ నందు కంప్యూటర్ ఆపరేటర్స్/ టెలీకాలర్స్/ ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్/ సోషల్ మీడియా ఆపరేటర్స్ కావలెను. Qua: ఇంటర్ టు డిగ్రీ. ✆ 93943 71987.

IVY Overseas, విజయవాడ బ్రాంచ్‌లో పనిచేయుటకు బ్యాక్ ఎండ్ స్టాఫ్ Freshers (M/ F) కావలెను. Qul: డిగ్రీ, B.Tech. ✆ 99666 05638

BOOK YOUR COLOUR CLASSIFIED ₹ 1200/- (5 Lines) PH: 98496 97616

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందన: ★ తిరువూరు పట్టణం 14వ వార్డులోని డ్రెయిన్లలో మట్టి, చెత్త పేరుకుందని స్థానికుడు ప్రభాకరరావు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ పారిశుద్ధ్య కార్మికులను పంపించి డ్రెయిన్లను శుభ్రం చేయించారు.
★ తిరువూరు పట్టణం 16వ వార్డులోని డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికుడు అరుణ్ కుమార్ 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ పారిశుద్ధ్య కార్మికులను పంపించి డ్రెయిన్లను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించి సమస్య పరిష్కరించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు**
★ నరసాపురంలోని యాదవుల బజారులో చెత్తను తొలగించక పోవడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈవో జి.స్వాతి స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయించి సమస్య పరిష్కరించారు. నివాసితులు సంతోషం వ్యక్తం చేశారు. **- న్యూస్‌టుడే, విస్సన్నపేట**

కేజీబీవీ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా విజయసుందరి

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయానికి ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా ఆంగ్లం సీఆర్టీ ఎన్.విజయసుందరిని నియమిస్తూ సమగ్ర శిక్షా జిల్లా ఏపీసీ ఎం.రజనీ కుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అఖిల భారత బాల్‌బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపిక

తిరువూరు, న్యూస్‌టుడే : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని కె.రమ్య అఖిల భారత బాల్‌బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్ అబూ బకర్ మంగళవారం తెలిపారు. ఫిబ్రవరి 11 నుంచి 15 వరకు తమిళనాడు దిండిగల్‌లోని అన్నా విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న పోటీల్లో కృష్ణ విశ్వవిద్యాలయం తరఫున ఆమె పోటీలో పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు ఆమెను అభినందించారు.

విజేతలకు బహుమతుల అందజేత

గంపలగూడెం : మండలంలోని తునికిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవం నాడు బాలబాలికలకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతులు అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు పీవీఎస్‌పీ.శర్మ తెలిపారు. గ్రామ తెదేపా నాయకుడు చిరుమామిళ్ల అమరేంద్ర పంపిణీకి అవసరమైన బహుమతులకు రూ.5 వేలు విరాళం అందజేశారని చెప్పారు. ఎస్ఎంసీ సభ్యులు, గ్రామస్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడిగా యుగంధర్

ఇబ్రహీంపట్నం, గంపలగూడెం, న్యూస్‌టుడే : విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు పరిషత్ రాష్ట్ర కోశాధికారి దుర్గాప్రసాద్ రాజు తెలిపారు. పరిషత్ జిల్లా సమావేశం ఇబ్రహీంపట్నంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడిగా గంపలగూడేనికి చెందిన నారెళ్ల యుగంధర్, ఉపాధ్యక్షుడిగా దశరథ, కార్యదర్శులుగా వాచస్పతి, వెంకటేశ్వరరావులను నియమించినట్లు ఆయన చెప్పారు. అనంతరం గంపలగూడెం, మైలవరం, జి.కొండూరు మండల సమితి అధ్యక్షులు, ఉపాధ్యక్షులను నియమించినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

శత శాతం ఫలితాల సాధనే లక్ష్యం

మండలానికో ప్రత్యేకాధికారిని నియమించిన ప్రభుత్వం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, గుంటుపల్లి, న్యూస్‌టుడే

పదో తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇప్పటికే జిల్లాల్లో వంద రోజుల ప్రణాళిక పకడ్బందీగా అమలు చేస్తోంది. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేలా ప్రత్యేకాధికారులను నియమించి బాధ్యతలు అప్పగించింది.

పర్యవేక్షణ ఇలా..: రెవెన్యూ, ఇతర శాఖలకు చెందిన అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించారు. వీరు పాఠశాలలను తనిఖీ చేసే సమయంలో 20 అంశాలను పరిశీలించి తనిఖీ నోట్‌లో నమోదు చేయాలని పేర్కొంది.

విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం, ప్రత్యేకాధికారి, సీఆర్‌పీలు

- ప్రధానంగా విద్యార్థుల హాజరును పరిశీలించాలి.
- సిలబస్ పూర్తి కాకపోతే కారణాలు తెలుసుకుని అందులో నమోదు చేయాలి.
- పాఠశాలల్లో నిర్వహించిన నెలవారీ పరీక్షల్లో 60 శాతం తక్కువ మార్కులొచ్చిన విద్యార్థులకు గ్రేడ్లు నిర్ణయించాలి.
- చిన్నారులు రాసిన జవాబు పత్రాలను పరిశీలించి సంబంధిత ఉపాధ్యాయులు, విద్యార్థులతో చర్చించాలి.
- పాఠశాల హెచ్ఎం, ఎంఈవో, డిప్యూటీ ఎంఈవోలను సమన్వయం చేసుకుంటూ వంద రోజుల ప్రణాళికను మెరుగ్గా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారా? లేదా అన్న అంశాలను పరిశీలించి నమోదు చేయాలి.
- సబ్జెక్టు వారీగా విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయడం, ఇతర అంశాలు అమలయ్యేలా పర్యవేక్షించాలి.
- రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల నిర్వహణ తదితర అంశాలను తనిఖీ చేయాలి.
- పాఠశాలకు రాని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి క్రమం తప్పకుండా వచ్చేలా చూడాలి.
- చివరిగా తమ అభిప్రాయాలను ఆ పత్రంలో నమోదు చేయాల్సి ఉంది.

జిల్లాలోని మండలాలు : 17
ఉన్నత పాఠశాలలు : 519
వీటిలో పది విద్యార్థులు : బాలురు 14,184, బాలికలు 13,613 మంది
ప్రభుత్వం నియమించిన ప్రత్యేకాధికారులు : 17 మంది

రోలర్ స్కేటింగ్‌లో సత్తా

దానియేల్‌ను అభినందిస్తున్న సందీప్ ఇన్నారెడ్డి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : గుంటుపల్లి డాన్‌బాస్కో పాఠశాలలో సీబీఎస్ఈ 4వ తరగతి చదువుతున్న విద్యార్థి పోతల విజయ్ దానియేల్ రోలర్ స్కేటింగ్‌లో జాతీయ స్థాయిలో పలు విజయాలు సాధించాడు. ఈ మేరకు ఆ పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం ఆ విద్యార్థిని అభినందించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫాదర్ సందీప్ ఇన్నారెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేద్దాం

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అర్జున్ రాజు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : డ్రగ్స్ రహిత రాష్ట్రాన్ని నిర్మించడానికి ఈ నెల 27 నుంచి మార్చి 1వ తేదీ వరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 510 కి.మీ జరిగే 'డ్రగ్స్‌పై దండయాత్ర' సైకిల్ ర్యాలీ కార్యక్రమానికి సంఘీభావంగా మంగళవారం విస్సన్నపేటలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై యం.అర్జున్ రాజు మాట్లాడుతూ మద్యం మత్తుకు బానిస కావద్దని, డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దామని విద్యార్థులు, స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం పలు కళాశాలలకు చెందిన 45 మంది విద్యార్థులు విజయవాడలో జరిగిన సైకిల్ ర్యాలీకి తరలి వెళ్లారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలోని పోలీస్ స్టేషన్ నుంచి బోసుబొమ్మ సెంటర్ వరకు ర్యాలీని నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించారు. సీఐ గిరిబాబు, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి.. సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మైలవరం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో అభివృద్ధితో కూడిన సంక్షేమాన్ని అమలు చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని స్థానిక శాసన సభ్యుడు వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని కీర్తిరాయునిగూడెంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రహదారి నిర్మాణ పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. నారా లోకేశ్ చేసిన యువగళం పాదయాత్ర మూడేళ్లు పూర్తి చేసుకోవడాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కేకును కోసి, శుభాకాంక్షలు తెలిపారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

కీర్తిరాయునిగూడెంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి ఎ.రామ్మోహనరావు(గాంధీ), తెదేపా మండల అధ్యక్షుడు జె.వేణుగోపాల్‌రెడ్డి, తెదేపా నాయకుడు ఎం.నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని పలు కార్యాలయాలను ఆర్డీవో కె.మాధురి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. మందుల నిల్వలు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. ఆసుపత్రిలో శుభ్రత పాటించాలని, ప్రతి రోజు హాజరు పట్టీలో సిబ్బంది సంతకాలు చేయాలని సూచించారు. వైద్యాధికారులు వి.శృతి, భార్గవి పాల్గొన్నారు. తదుపరి పీఏసీఎస్‌లో అన్నదాతలకు ఎరువుల పంపిణీ, దస్త్రాల నిర్వహణను పరిశీలించి రైతులతో మాట్లాడారు. గంపలగూడెంలో ప్రస్తుతం ఖాళీ చేసిన తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించి భవనం మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఆమె వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

గంపలగూడెం పీహెచ్‌సీలో శుభ్రతపై వైద్యులకు సూచనలిస్తున్న ఆర్డీవో మాధురి

ఎత్తిపోతల నిర్వహణకు నిధులు కేటాయించాలని వినతి

జి.కొండూరు, న్యూస్‌టుడే : తారకరామా ఎత్తిపోతల పథకం నిర్వహణకు ప్రభుత్వం తక్షణమే రూ.5 కోట్ల నిధులు కేటాయించాలని రాష్ట్ర కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య కోరారు. మండలంలోని కవులూరులో రైతు చెరుకూరి శ్రీనివాసరావు నివాసంలో మంగళవారం నిర్వహించిన రైతు సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం రైతుల సమక్షంలో తారకరామా ఎత్తిపోతల సమస్యలు, పరిష్కారాలకు సంబంధించి జమలయ్య రాసిన పుస్తకావిష్కరణ చేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ చేస్తున్న రైతులు, నాయకులు

అచ్చంరాజుకు ఉత్తమ మార్గదర్శి అవార్డు

రాజవరం(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని రాజవరానికి చెందిన తెదేపా నాయకుడు చెన్నపై అచ్చంరాజు పీ- 4లో స్ఫూర్తిగా సేవలందించినందుకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా అచ్చంరాజును గ్రామస్థులు మంగళవారం అభినందించారు.

ఉద్యాన అధికారిగా నరేంద్ర కుమార్

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండలంలో ఉద్యాన అధికారిగా పని చేస్తున్న నరేంద్ర కుమార్ జిల్లా కలెక్టర్.లక్ష్మీశ, విజయవాడ సీపీ.రాజశేఖరబాబు చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు.

లేబర్ కోడ్‌లను తిప్పికొట్టాలి

తిరువూరు, న్యూస్‌టుడే : కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను తిప్పికొట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.సీహెచ్.సుప్రజ అన్నారు. తిరువూరు పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. నాయకులు వెంకటేశ్వరావు, వరలక్ష్మి, భద్రం, బాబు, పద్మ, వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న సుప్రజ, పక్కన నేతలు

రైతులకు అందుబాటులో యూరియా

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని నాలుగు పీఏసీఎస్‌లు, ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో 71 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం కూనపరాజుపర్వలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వరరావు, వ్యవసాయ సహాయకురాలు దివ్య, దమయంతి, రైతులు పాల్గొన్నారు.

లేగదూడల ప్రదర్శన

మైలవరం, న్యూస్‌టుడే : పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని దాసుళ్లపాలెంలో లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. దూడల పోషణ, సంరక్షణ, యాజమాన్యం, వ్యాధుల నియంత్రణ అంశాలపై శాస్త్రీయ పద్ధతుల్లో దూడల పెంపకంపై అవగాహన కల్పించారు. అత్యుత్తమ లక్షణాలు కలిగిన దూడలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. పశు సంవర్ధక శాఖ ఏడీ హరిహరనాథ్, డాక్టర్ హరిత, పుల్లూరు పశువైద్యాధికారి సుమంత్ రెడ్డి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యత.. నిర్లక్ష్యమే ఇక!

కొండపల్లి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

సామాజిక బాధ్యతలో భాగంగా పరిశ్రమలు చేసిన పలు కార్యక్రమాలు నిర్లక్ష్యపు మాటున నిర్వీర్యమవుతున్నాయి. ప్రజా ప్రయోజనకరమైన పరికరాలు, వస్తువులతో పాటు పచ్చదనం వృథాగా మారిపోయాయి. అప్మెల్(ఆంధ్రప్రదేశ్ హెవీ మిషనరీ ఎలక్ట్రానిక్ లిమిటెడ్) సీఎస్ఆర్(సామాజిక నిధుల)లో భాగంగా ఖరీదైన సోలార్ వీధి దీపాలను కొండపల్లి పంచాయతీగా ఉన్నప్పుడు అందించింది. ఆ సమయంలోనే ఎన్టీటీపీఎస్ సంస్థ రోడ్ల వెంట మొక్కలు నాటి వాటి నిర్వహణ అప్పటి పంచాయతీలైన ఇబ్రహీంపట్నం, కొండపల్లికి అప్పగించింది. అయితే పంచాయతీలుగా ఉన్నప్పుడు వీటి నిర్వహణ సక్రమంగానే నడిచినా కాలక్రమేణ రెండు మేజర్ పంచాయతీలు పురపాలికగా మారాయి. ఈ క్రమంలో సోలార్ దీపాల కాంతులు నిలిచిపోగా, రహదారుల వెంట నాటిన చెట్లు దాదాపుగా ఎండిపోయాయి.

నిరుపయోగంగా సోలార్ వీధి దీపం

దొంగిలించారు : కొండపల్లి నుంచి ఈలప్రోలుకు రాకపోకలు సాగించేందుకు రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఈలప్రోలు గ్రామస్థులు అప్పట్లో కోరారు. దీంతో అప్పటి కొండపల్లి పాలకవర్గం ఆ ప్రాంతంలో సోలార్ దీపాలను సీఎస్ఆర్ నిధులతోనే ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో కొంతకాలం తర్వాత దీపాలకు ఉన్న బ్యాటరీలను కొందరు దొంగిలించారు. దీంతో నాటి నుంచి నేటి వరకూ ఈ ప్రాంతం చీకటిమయంగా ఉంటోంది. రాత్రి సమయాల్లో వాహనాల వెలుగులే తప్ప మరొకటి కనిపించవు.

మరమ్మతులు నిర్వహిస్తే మేలు

సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటైన సోలార్ దీపాలు పంచాయతీ పాలనలో వెలిగాయి. ఆ తర్వాత అవి మరమ్మతులకు గురై నిరుపయోగంగా మారాయి. వాటిని బాగు చేయిస్తే పురపాలిక వీధుల్లో వెలుగులు రావడంతో పాటు విద్యుత్తు భారం తగ్గుతోంది. పంచాయతీ పాలనలోనే ఎన్టీటీపీఎస్ రోడ్ల పక్కన మొక్కలు నాటింది. అయితే వాటి నిర్వహణ సంస్థ చేయకుండా పంచాయతీలకు వదిలేసింది. **- అమ్మాజీ, మాజీ సర్పంచి**

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

అవకాశం ఉంటే సోలార్ దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. దీంతో పాటు ఇతర పరిశ్రమలు కూడా ముందుకొచ్చి సీఎస్ఆర్ నిధులతో సోలార్ వెలుగులు పురపాలిక అంతా ఏర్పాటు చేసేలా కౌన్సిల్ సమావేశంలో చర్చిస్తాం. **- వెంకటరత్నం, ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్**

సందడిగా వీడ్కోలు సమావేశాలు

రామచంద్రాపురం : కృష్ణారెడ్డి దంపతులను సత్కరిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పెనుగొలను : నృత్యం చేస్తున్న బాలికలు

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని పెనుగొలను జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పది విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు సందేశమిచ్చారు. బాలబాలికలు నృత్యాలతో అలరించారు.

రామచంద్రాపురం(ఎ.కొండూరు), న్యూస్‌టుడే : మండలంలోని రామచంద్రాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పది విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ మార్గదర్శి అవార్డు అందుకున్న తెదేపా నాయకుడు గడ్డి కృష్ణారెడ్డి, రోజారాణి దంపతులను ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు. ఎంఈవో కేశవరావు తదితరులు పాల్గొన్నారు. కృష్ణారెడ్డి దంపతులను ఎమ్మార్పీఎస్ మండల నాయకులు ఎం.ఏలియాబాబు, కె.కృష్ణ, బి.వెంకటరత్నం తదితరులు కూడా సత్కరించి అభినందించారు.

IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE -CUM-XII ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS MEDCHAL - MALKAJGIRI DISTRICT AT KUKATPALLY
O.S. No. 663 of 2024
Between:
Vanga Sundara Rami Reddy ...Plaintiff
AND
Sri Bandi Nageswara Rao and Others. ....Defendants
To
1. Sri. Bandi Nageswara Rao (Died per LR's)
2. Smt. Bandi Murali Krishna.
3. Smt. Bandi Kusuma.
Both the D 2 & 3 are residing at: Flat No. 502, Sri Sai Bhaskara Enclave, Beside Durga Gym, Canal Road, Srinivasa Nagar, Gollapudi - 521 228. NTR District, Andhra Pradesh.
(Defendants)
Please take notice that the above O.S. is filed for recovery of money against you both the Defendant No. 2 & 3 and the same is posted on 10-02-2026 at 10:30 am for your appearance. You may appear either in person or through an advocate before the said court and said date, failing which the matter will be decided ex-parte as per the law.
(BY THE ORDER OF THE COURT)
P. VENKAT RAMANA - MBA, LL.B, LL.M
DAYANAND PATIL - B.Com LL.B.
Advocates
Plot No. 820, GR. Floor, Pragathinagar, Bachupally (M) Medchal Malkajgiri Dist. Hyderabad-90. TG.
Mobile # 99482 70260

వైభవంగా రాజశ్యామలాదేవి నవరాత్రోత్సవాలు

కంభంపాడు (ఎ.కొండూరు), న్యూస్‌టుడే : మండలంలోని కంభంపాడు శివాలయంలో నిర్వహిస్తున్న రాజశ్యామలాదేవి నవరాత్రోత్సవాలు మంగళవారం ముగిశాయి. గంగా విజయదుర్గ సమేత నాగమల్లేశ్వర స్వామి గుడిలో తొమ్మిది రోజుల పాటు విజయదుర్గాంబ అమ్మవారిని రాజశ్యామలాదేవిగా అలంకరించి ఉత్సవాలను నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదగాలి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : చిన్నతనం నుంచే విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని రెడ్డిగూడెం ఎంఈవో పి.రమేష్‌బాబు సూచించారు. మంగళవారం నిర్వహించిన నాగులూరు జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలో ఆయన పాల్గొని మాట్లాడారు. డాక్టర్ అరుణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, 2024-25 విద్యా ఏడాదిలో పది పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన కె.సుధీర్‌కు కె.విజయబాబు బంగారు పతకం అందించారు. కె.రవిబాబు రూ.10 వేలు నగదు బహుమతి ఇచ్చినట్లు హెచ్ఎం తెలిపారు.

నాగులూరు : మాట్లాడుతున్న ఎంఈవో రమేష్‌బాబు

జి.కొండూరు, న్యూస్‌టుడే : వెలగలేరు చనుమోలు ఫకీర్రాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.పద్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పండ్ల కవర్లతో నాణ్యమైన దిగుబడి

మామిడి పూతలు పరిశీలిస్తున్న ఉద్యాన అధికారులు

మైలవరం, రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మామిడి కాయలకు పండ్ల కవర్లను ఉపయోగించడం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని నూజివీడు మామిడి పరిశోధనా కేంద్రం కీటక శాస్త్రవేత్త జి.శాలిరాజు సూచించారు. మంగళవారం నియోజకవర్గంలో పలు గ్రామాల్లోని మామిడి తోటలను ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్(ఫ్రూట్స్) ఎం.దేవమునిరెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి బాలాజీ కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. తోటల్లో పూతలు, వాటిని ఆశించే పురుగులు, చీడపీడలపై రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉద్యాన అధికారి సొహైల్ అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

అయిదు రోజుల పని విధానం అమలు చేయండి

గంపలగూడెం, ఎ. కొండూరు : మండలంలోని నెమలి, గంపలగూడెం, ఊటుకూరు, వినగడప, పెనుగొలను, గోసవీడు, తోటమూలలోని వాణిజ్య, గ్రామీణ, సహకార బ్యాంకుల ఉద్యోగులు మంగళవారం జరిగిన సమ్మెలో పాల్గొన్నారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ పిలుపు మేరకు తమ సమస్యల పరిష్కారానికి అధికారులు, ఉద్యోగులు సమ్మె చేయడంతో బ్యాంకులు పని చేయలేదు. దీంతో ఖాతాదారుల ఆర్థిక లావాదేవీలు నిలిచాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బ్యాంకుల్లో అయిదు రోజుల పని విధానం అమలు చేయాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని బ్యాంకు ఉద్యోగుల ప్రాంతీయ ఐక్యవేదిక కన్వీనర్ బెల్లంకొండ లీలా హనుమత్ ప్రసాద్ తెలిపారు.

తిరువూరులో నినాదాలు చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరులోని పలు బ్యాంకుల ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ల్యాప్‌టాప్ అందజేత

మైలవరం, న్యూస్‌టుడే : దివ్యాంగురాలైన ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థిని కె.జ్ఞాపికశ్రీకి రూ.80 వేల విలువైన ల్యాప్‌టాప్‌ను ప్రవాస భారతీయుడు ఎస్.శశిధర్ రెడ్డి సహకారంతో మంగళవారం స్థానిక మదర్ థెరిసా ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ వితరణ చేశారు. ట్రస్ట్ కార్యదర్శి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఏకాగ్రత అవసరం

మూలపాడు: విద్యార్థినికి స్టడీ మెటీరియల్ అందిస్తున్న జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ శ్రీదేవి ★ మైలవరంలో..

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : పది పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఉమ్మడి కృష్ణా జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ గరికపాటి శ్రీదేవి అన్నారు. మంగళవారం మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలోని పది విద్యార్థులకు ఆమె స్టడీ మెటీరియల్‌ను అందజేసి వారితో మాట్లాడారు. పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఏకాగ్రత అవసరమని చెప్పారు. వంద రోజుల ప్రణాళికను పూర్తి స్థాయిలో అమలు చేసి, వంద శాతం ఫలితాలను సాధించేలా విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్ఎం డేవిడ్ రాక్‌ఫెల్లర్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

★ గుంటుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచి కవిత పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మైలవరం: స్థానిక బాలికోన్నత, మండలంలోని చంద్రగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. మైలవరంలో జడ్పీటీసీ సభ్యుడు తిరుపతిరావు, సర్పంచి మంజుభార్గవి, ఎస్ఎంసీ అధ్యక్షుడు బాబూరావు, హెచ్ఎం రాజశేఖర్, చంద్రగూడెంలో సొసైటీ అధ్యక్షుడు రోశాలు, హెచ్ఎం జి.శివపార్వతి, కమిటీ ఛైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చక్రాల కుర్చీ వితరణ

జి.కొండూరు, న్యూస్‌టుడే : చెవుటూరు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా కొనసాగుతున్న పోతురాజు వాసు, కిరణ్ వారి తాతయ్య, అమ్మమ్మ వేములకొండ లక్ష్మీనారాయణ, వెంకాయమ్మ దంపతుల జ్ఞాపకార్థం రూ.7 వేలు సమకూర్చి అదే పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థి సంకటి సంపత్ కుమార్‌కు చక్రాల కుర్చీ అందించారు. దీన్ని పాఠశాల హెచ్ఎం ఎ.రమాదేవి చేతుల మీదుగా మంగళవారం పాఠశాల ఆవరణలో విద్యార్థికి ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు దాతలను అభినందించారు.

చికిత్స పొందుతూ సంక్షేమ సహాయకుడి మృతి



రామకృష్ణ (పాత చిత్రం)

మాధవరం (ఎ.కొండూరు), న్యూస్‌టుడే : మండలంలోని మాధవరం గ్రామ సచివాలయంలో సంక్షేమ సహాయకుడిగా పని చేస్తున్న దునక రామకృష్ణ(50) హృదయ సంబంధిత వ్యాధితో మంగళవారం మృతి చెందారు. ఆయన శనివారం విధుల్లో ఉండగానే అస్వస్థతకు గురి కావడంతో విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని స్వస్థలమైన మైలవరం తరలించారు. మాధవరం సర్పంచి, సచివాలయ ఉద్యోగులు మైలవరంలో రామకృష్ణ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సిటి యూనియన్ బ్యాంక్ లిమిటెడ్
CUB Trust and Excellence SINCE1904
డోర్ నెం: 5-123/1, , నూజివీడు రోడ్, గూడవల్లి రాజ్యలక్ష్మి టవర్స్, మైలవరం - 521230, యన్.టి.ఆర్. జిల్లా. సెల్: 93840 29490

బంగారు నగల వేలము ప్రకటన

ఈ దిగువ ఉదహరించిన ఖాతాదారులు తమ బంగారు ఆభరణముల హామీపై తీసుకొనిన అప్పును తిరిగి చెల్లించమని రిజిష్టరు డిమాండ్ నోటీసు, రిజిష్టర్డు కాషన్ అండ్ డిఫాల్ట్ నోటీసు మరియు రిజిష్టరు వేలం నోటీసులు ద్వారా తెలియపరచిన దరిమిలా సదరు అప్పును తీర్చనందున సదరు ఆభరణములు, వస్తువులు అవి "ఉన్నవి ఉన్నట్లుగా" ప్రాతిపదికన బ్యాంకు నిబంధనల ప్రకారం తేది: 04-02-2026 బుధవారం మ. 1 గంటకు మా బ్రాంచి ఆవరణములో బహిరంగ వేలము వేయబడును. ఈ నోటీసు ఖాతాదారుడు మరణించినయెడల వారి వారసులకు ఈ క్రింది ప్రకటన పూర్వకంగా తెలియజేయడమైనదిగా భావించవలెను. ఏ విధమైన కారణం చూపకనే వేలం షరతులు మార్చుటకు గాని, వేలం వాయిదా వేయుటకు గాని, రద్దు చేయుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. హెచ్చు పాటదారుడు మొత్తం పాట సొమ్మును అదే రోజు చెల్లించి వస్తువులను పొందవలెను. లేనియెడల ధరావత్తు కోల్పోవుదురు. వేలం ద్వారా లభించిన డబ్బులను మీ యొక్క ఖాతాలో జమపరచడం జరుగుతుంది. ఇందులి ఖాతాదారునికి మా బ్యాంకులో మిగతా ఏమైనా ఉన్నచో పై బాకీ పోగా మిగిలిన సొమ్మును మా ఖాతాకు సర్దుబాటు చేయబడును.

వ నెం	లోన్ ఖాతా నెం	లోన్ తేది	ఖాతాదారుని పేరు చిరునామా	బరువు (గ్రాలలో)
1.	502112146018110	26-06-2024	షేక్ గాలిషరీఫ్, S/o. గన్నె సైదా 1-45, వెల్వడం, మైలవరం మైలవరం మండలం - 521230	44.2
2.	502112146020431	30-09-2024		30.8
3.	502112146020436	30-09-2024		15.8

స్థలం: మైలవరం
తేది: 28-01-2026
సం/- బ్రాంచి మేనేజరు
సిటి యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, నూజివీడు రోడ్, మైలవరం-521230

(c) eenadu

విజయవాడ తూర్పు

ఉద్యోగ అవకాశాలపై అవగాహన

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో రెగ్యులేటరీ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో 'గ్లోబల్ రెగ్యులేటరీ అఫైర్స్, కెరీర్ అవకాశాలు' అనే అంశంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. హైదరాబాద్‌లోని పారెక్సెల్‌లో రెగ్యులేటరీ అఫైర్స్ అసోసియేట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.చరణ్ సూర్యతేజ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్లోబల్ రెగ్యులేటరీ అఫైర్స్ రంగంలో అవకాశాలు, అంతర్జాతీయ నియంత్రణ ప్రమాణాలు, ఫార్మసీ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు తదితర అంశాల గురించి వివరించారు. ప్రిన్సిపల్ ఆచంట సునీత, రెగ్యులేటరీ విభాగాధిపతి ఎన్‌కే అజేగం తదితరులు పాల్గొన్నారు.

భక్తితో రాజశ్యామలదేవి నవరాత్రులు

కృష్ణలంక, న్యూస్‌టుడే: పీఎన్‌బీఎస్ సమీపంలోని త్రిశక్తి పీఠం కాళీమాత ఆలయంలో ఈ నెల 19 నుంచి మొదలైన శ్రీరాజశ్యామలదేవి నవరాత్రులు మంగళవారం పూర్ణాహుతితో ముగిశాయి. అందులో భాగంగా కాళీమాతను రాజశ్యామల దేవిగా అలంకరించారు. మంగళవారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం రాజశ్యామల హోమాన్ని నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యదర్శి కె.జగదీష్ కుమార్, సభ్యులు బీహెచ్ విజయకిరణ్, జి.సత్యం తదితరులు పర్యవేక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM 80085 74652

స్పందన: ★ 4వ డివిజన్ గురునానక్ రోడ్డు డాన్‌బాస్కో స్కూల్ ఎదురుగా భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగుతోందని స్థానిక నివాసి నాగేశ్వరరావు మేమున్నాం... మీకు తోడుగా ద్వారా ఏఈ దీక్షిత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో పూడిక తీయించారు.

★ 11వ డివిజన్ ఏపీఐఐసీ కాలనీ 11-201/10 విద్యుత్ స్తంభం నిక్కస్తు దీపం వెలగడం లేదని స్థానిక నివాసి రాంబాబు మేమున్నాం...మీకు తోడుగా ద్వారా ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు.

★ మూడో డివిజన్ శ్రీరామచంద్రనగర్, బాయన బాబూజీ రహదారి కలిసే ప్రాంతంలో దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానిక నివాసి రేణుక మేమున్నాం... మీకు తోడుగా ద్వారా మలేరియా అధికారి హెచ్.శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో ఆయిల్ బాల్స్, మందులు చల్లించారు.

- న్యూస్‌టుడే, కరెన్సీనగర్

వ్యాపారం ఇంతింతై.. ఆదాయం మరింతై..!

విజయవాడ సిటీ, కృష్ణలంక, పటమట - న్యూస్‌టుడే

మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేసి ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు. కుటుంబ పోషణలో భాగస్వాములవుతున్నారు. వ్యాపారాలు ప్రారంభించి మొదట్లో ఒడుదొడుకులు ఎదుర్కొని.. అధిగమించారు. ప్రస్తుతం ఆశించిన ఆదాయం పొందుతున్నారు. తోటి మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

కుమారుడిని బీటెక్ చదివించా

భర్త కాశీశ్వరరావు మార్కెట్‌లో పని చేసే వారు. ఉమ్మడి కుటుంబం. కేవలం ఆయన సంపాదన సరిపోయేది కాదు. పది వరకే చదివాను. ఆశించిన ఉద్యోగం రాదని డ్వాక్రా సంఘంలో చేరా. మొదట రూ.20 వేల రుణం పొంది రోల్డ్‌గోల్డ్ నగలు కొని ఇంటింటికీ వెళ్లి విక్రయించాను. తరువాత హోల్‌సేల్‌గా వీటిని కొని అమ్మాను. బ్యాంకు రుణంతో సుమారు పదేళ్ల కిందట ఫ్యాన్సీ స్టోర్ ఏర్పాటు చేశాను. వ్యాపారం పుంజుకుంది. కుమారుడిని బీటెక్ వరకు చదివించా. కుటుంబానికి ప్రధాన పోషకురాలినయ్యా. కుటుంబాలు ఎలా నెట్టుకురావాలో తెలియని పరిస్థితి నుంచి ఆర్థిక ఇబ్బందులు లేని స్థితికి చేరుకున్నా. - నామాల సుజాత, రాణిగారితోట

44 సంవత్సరాలుగా ✆ 81252 65651 ✆ 0866 2471617, 2477470
ఆటలు ● పాటలు ● రోబోటిక్స్ ● క్రియేటివ్ లెర్నింగ్ ● డ్రోన్ తయారీ ● 3డి ప్రింటింగ్ ● LKG to 10th
డాన్ బాస్కో స్కూల్
Affiliated to CBSE
గురునానక్ రోడ్, ఆటోనగర్ కాలనీ ఎదురుగా, విజయవాడ-7.

ఓర్పుతో వ్యాపారం చేస్తేనే రాణిస్తాం

ఎంబీఏ చదివాను. ఓ ప్రైవేట్ సంస్థలో కొలువు సాధించాను. చిన్న పిల్లలు కావడం వల్ల మానేశాను. సొంతంగా మా ఇంటి వద్దే బేకరీ ఉత్పత్తుల తయారీ ప్రారంభించాను. రెండేళ్లుగా వ్యాపారం చేస్తున్నాను. కొత్తలో ఆర్డర్లు లేవని ఆందోళన చెందకుండా ఓర్పు, నేర్పుతో ఉంటేనే రాణిస్తాం. ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకుంటేనే ఆదాయం పెరుగుతుంది. ప్రస్తుతం నెలకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు రాబడి వస్తోంది. త్వరలో బీట్‌రూట్, క్యారెట్ మాల్ట్ తయారీ మొదలు పెడతా. ఫలితంగా ఆదాయం పెరుగుతుంది. సొంతంగా వ్యాపారం నిర్వహించి కుటుంబ పోషణలో భాగం కావడం చాలా ఆనందంగా ఉంది.

- కె.రమ్య, మొగల్రాజపురం

కుటుంబానికి అండగా నిలుస్తున్నా...

మా ఆయన ప్రైవేటు ఉద్యోగి. ఆయన సంపాదన సరిపోవడం లేదని స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపా. మూడేళ్ల కిందట కుట్టులో ఉచితంగా శిక్షణ తీసుకున్నా. తరువాత నిర్వాహకులే ఉచితంగా మిషన్ కూడా అందజేశారు. కుట్టుపై పట్టు సాధించి పటమటలో టైలరింగ్ దుకాణం ప్రారంభించా. అన్ని ఖర్చులు పోగా... నెలకు సుమారు రూ.15 వేల నుంచి రూ. 20 వేల వరకు మిగులుతోంది. ప్రస్తుతం కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తున్నా.

- వి.లిల్లీ, న్యూఆర్టీసీ కాలనీ

బీసీలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

పటమట, న్యూస్‌టుడే: రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి కనీసం రూ.20 వేల కోట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.మారేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్టీసీ కాలనీలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కుల సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ సబ్ ప్లాన్‌లో కేటాయించిన బడ్జెట్ కేవలం బీసీ వర్గాలకే కేటాయించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీల అభివృద్ధి కోసం బ్యాంకులతో సంబంధం లేకుండా నేరుగా రుణాలు అందించే విధానాన్ని అమలు చేయాలని అన్నారు. బీసీ సంక్షేమ వసతి గృహాల సంఖ్యను జనాభా నిష్పత్తికి అనుగుణంగా పెంచి, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. బీసీ కులవృత్తుల అభివృద్ధికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని, ఆదరణ పథకాన్ని పునరుద్ధరించి అర్హులైన లబ్ధిదారులకు అందించాలని పేర్కొన్నారు.

స్పందించారు.. గుంత పూడ్చారు..

పటమట, న్యూస్‌టుడే: అయ్యప్పనగర్ - యనమలకుదురు రోడ్డులో న్యూఆర్టీసీ కాలనీకి వెళ్లే కూడలి వద్ద భారీ గుంత పడింది. వాహనదారులు ఇబ్బంది పడేవారు. దీనిపై ఈ నెల 13న 'ఈనాడు'లో 'గుంతతో అవస్థలు' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు గుంతను పూడ్చారు.

పొదుపు మహిళకు రేషన్ దుకాణం

పటమట, న్యూస్‌టుడే: కృష్ణలంకకు చెందిన బాణాల రమణమ్మకు స్వయం సహాయం సంఘం విభాగంలో రేషన్ దుకాణాన్ని కేటాయించారు. మంగళవారం అశోక్‌నగర్‌లోని తన కార్యాలయంలో ఆమెకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ నియామక ఉత్తర్వులు అందజేశారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఏఎస్‌వో వెంపటి శ్రీనివాస్‌రావు, ఆర్ఐ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ అభివృద్ధికి కౌన్సిల్ అడ్డుగోడ

స్థానిక సమస్యలు వింటున్న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే రామ్మోహన్

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: లోకేశ్ యువగళం పాదయాత్ర ద్వారా రాష్ట్రంలో రాక్షస పాలన పోయింది కానీ, మున్సిపల్ కౌన్సిల్‌లో మాత్రం పోలేదని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. నాలుగో డివిజన్ సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో రూ.13 లక్షల వ్యయంతో నిర్మించే రహదారికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఎంపీ మాట్లాడుతూ.. యువగళం పాదయాత్రకు మూడేళ్లు పూర్తయినట్లు తెలిపారు. పాదయాత్రలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలు పరిష్కరించేందుకు మంత్రి లోకేశ్ నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. నగరాభివృద్ధికి కీలకమైన డీపీఆర్‌లను మున్సిపల్ కౌన్సిల్ తిరస్కరించడం దురదృష్టకరమని అన్నారు. విజయవాడ అభివృద్ధికి కౌన్సిల్ అడ్డుగోడగా మారిందని విమర్శించారు. ఈ నెల 31వ తేదీలోపు డీపీఆర్‌లు అందుబాటులోకి రానున్నాయని, ప్రధాన సమస్యలన్నింటికీ పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ.. కౌన్సిల్‌లో వైకాపా సభ్యులు ప్రతి పనికి అడ్డు పడుతున్నారని విమర్శించారు. నగరాభివృద్ధికి కావాల్సిన నిధులు ఇచ్చేందుకు సీఎం సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, వల్లపట్ల గోపాలకృష్ణ, ఎన్నేని వేదవ్యాస్, చనుమోలు సురేష్, బాయన వెంకట్రావు, మండవ వెంకటేశ్వరరావు, ఈఈ సామ్రాజ్యం, ఏఈ దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మె జయప్రదానికి పిలుపు

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కృష్ణలంక, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైఫల్యం కారణంగా భవన నిర్మాణ కార్మికులు సంక్షోభంలోకి వెళ్లారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు అన్నారు. ఫిబ్రవరి 12 దేశ వ్యాప్త సమ్మె జయప్రదాన్ని కాంక్షిస్తూ... రాణిగారితోట సీఐటీయూ కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల హామీలు నెరవేర్చకుండా.. కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను మోసగించిందని ఆరోపించారు. కేంద్రం లేబర్ కోడ్లను ప్రవేశపెట్టి కార్మికులకు తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. జాతీయ సార్వత్రిక సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం నాయకులు పి.నరసింహారావు, సుబ్బారెడ్డి, శ్రీనివాసరావు, ఏడుకొండలు, గురుమూర్తి, ఎల్లారావు, చెన్నకేశవరావు పాల్గొన్నారు.

ఐక్యత పెంపునకు పోటీలు దోహదం

విజేతలకు బహుమతులు అందజేస్తున్న కాశీనాథ్, రంగారావు తదితరులు

కృష్ణలంక, న్యూస్‌టుడే: ప్రజల మధ్య ఐక్యత పెంపొందించేందుకు ఆటల పోటీలు దోహదపడతాయని డాక్టర్ హర్షవర్ధన్ అన్నారు. సంక్రాంతి సందర్భంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15వ తేదీల్లో కృష్ణలంక 21వ డివిజన్‌లో మహిళలకు ముగ్గులు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. సోమవారం కల్పన ప్రింట్ రోడ్డులో విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక ప్రముఖులు మాట్లాడుతూ.. సంప్రదాయాలను ముందుకు తీసుకెళ్లేందుకు పోటీలు దోహదపడతాయని అన్నారు. భవిష్యత్తులోనూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల శాస్త్రీయ, పాశ్చాత్య నృత్యాలు, కోలాటం అలరించాయి. నాయకులు దోనేపూడి కాశీనాథ్, దమ్మాలపాటి రంగారావు, తుర్లపాటి మల్లేశ్వరరావు, లక్ష్మీనారాయణ, సోమయాజులు, పి.నరసింహమూర్తి, పల్లెంపాటి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారం

సీపీ, కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న అజయ్ కుమార్, కిరణ్

పటమట, న్యూస్‌టుడే: గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక స్టేడియంలో జరిగిన వేడుకల్లో పటమటకు చెందిన పరుచూరి అజయ్ కుమార్ చేసిన సేవలకు గాను 'సామాజిక సేవా పురస్కారాన్ని, సాంకేతిక పరిజ్ఞానంతో పదుల సంఖ్యలో మిస్సింగ్ కేసులు ఛేదించిన పటమట స్టేషన్ కానిస్టేబుల్ మురాల కిరణ్.. డీజీపీ కమండేషన్ డిస్క్ బ్రాంజ్ మెడల్‌ను సీపీ రాజశేఖర్‌బాబు, కలెక్టర్ లక్ష్మీశ నుంచి అందుకున్నారు. మంగళవారం పటమట స్టేషన్‌లో కిరణ్‌ను సన్మానించారు.

మహనీయుల జీవిత చరిత్రలు స్ఫూర్తిదాయకం

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: మహనీయుల జీవిత చరిత్ర చదివి, వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలని విశాఖ ఇండస్ట్రీస్ ఎండీ జి.సరోజా వివేకానంద అన్నారు. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో పీబీ సిద్ధార్థ కళాశాలలో మంగళవారం సదస్సు నిర్వహించారు. సరోజా మాట్లాడుతూ.. ఎ.ఐ. పూర్తి ప్రత్యామ్నాయం కాదని, యువత సాంకేతిక, ఆంగ్ల నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కష్టపడే వారికి కచ్చితంగా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. భారతీయ పరిశ్రమల సమాఖ్య విజయవాడ ఛాప్టర్ అధ్యక్షురాలు వి.నాగలక్ష్మి మాట్లాడుతూ.. పరిశ్రమల రంగంలోనూ మహిళలు ముందుకెళ్లాలని కోరారు. భారతీయ పరిశ్రమల సమాఖ్య ఉపాధ్యక్షుడు కోటగిరి అభినవ్, డీన్ ఆచార్య రాజేశ్ సి. జంపాల పాల్గొన్నారు.

CHANGE OF NAME
I, VIKASH RAMANLAL JAIN (Old Name), S/o. RAMANLAL, resident of Flat No.1207, GEV RADHA MADHAV,Polyclinic Rd,VIJAYAWDA-520010 A.P. I have changed my name as VIKASH KUMAR RAMANLAL (New Name), S/o, RAMANLAL Hereafter my name is known as VIKASH KUMAR RAMANLAL (New Name), S/o. RAMANLAL.

దెబ్బతిన్న పైకప్పు.. విద్యార్థులకు ముప్పు

సిద్ధార్థ వైద్య కళాశాల హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరాయి. అవి 20 ఏళ్ల కిందట నిర్మించినవి. ప్రస్తుతం పైకప్పు పెచ్చులూడి పడుతోంది. కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. ఫలితంగా వైద్య విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని, లేదంటే కొత్త భవనాలు నిర్మించాలని కోరుతున్నారు. - విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే

రహదారిపైనే కార్లు..రాకపోకలకు ఇక్కట్లు

భూపేష్‌గుప్తానగర్ కరకట్ట, బాలాజీ నగర్ మధ్య రోడ్డులో కార్లు పార్కింగ్ చేస్తున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది రోడ్డు శుభ్రం చేయడానికి, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన వారు కార్లను తెచ్చి పార్కింగ్ చేసి మళ్లీ తీసుకెళ్లడం లేదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. - కృష్ణలంక, న్యూస్‌టుడే

పెరుగుతున్న మొక్కలు.. తొలగిస్తే మేలు

జాతీయ రహదారిపై పకీర్‌గూడెం సమీపంలోని పైవంతెన పక్కన పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి. వాటిని తొలగించడం లేదు. వాటి వేర్లు గోడల్లోకి చొచ్చుకుపోతున్నాయి. గోడలు నెర్రలిచ్చే అవకాశం ఉంది. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మించిన వంతెన దెబ్బతింటుందని, అధికారులు స్పందించి వాటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

10వ వర్ధంతి

కీ॥శే॥ పాతూరి నేతాజీ గారు
మరణం: 17-02-2016
ప్రేమ, మంచితనం, మమతానురాగాలకు మారుపేరుగా మా అందరి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన మీరు మమ్మల్ని వీడి 10 సం॥ గడిచిననూ మీ జ్ఞాపకాలను మరువలేకున్నాము. సదా మీ స్మృతులతో...
స్నేహితులు, బంధువులు, కుటుంబ సభ్యులు

అభివృద్ధి పనులకు స్థాయీసంఘం ఆమోదం

సమావేశంలో పాల్గొన్న మేయర్ భాగ్యలక్ష్మి, అధికారులు, సభ్యులు

భవానీపురం, న్యూస్‌టుడే: విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీసంఘం సభ్యులు ఆమోదం తెలిపారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన నగరపాలక సంస్థ స్థాయీసంఘ సాధారణ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. సర్కిల్-1 పరిధిలోని 44వ డివిజన్ బైపాస్ రోడ్డు నుంచి లేబర్ కాలనీకి వెళ్లే రహదారి వెంబడి కాలువను రూ.35 లక్షల వ్యయంతో నిర్మాణానికి ఆమోదించారు. రామరాజ్యనగర్‌లోని నగరపాలక సంస్థ భవనం శ్లాబు నిర్మాణం, మరమ్మతులు చేపట్టేందుకు రూ.34 లక్షలు కేటాయిస్తూ నిర్ణయించారు. భవానీపురం 40వ డివిజన్ గాంధీబొమ్మ రోడ్డులో బీటీ రోడ్డు, కాలువల నిర్మాణానికి రూ.49లక్షలు, మైనంపాటి వారి వీధిలో రూ.26 లక్షలతో సిమెంటు రహదారి నిర్మాణానికి తీర్మానించారు. మాజీ సైనికోద్యోగులు మహబూబ్ బాషా, పి.సుధాకర్, టి.అంకమ్మరావు, ఈ.లింగయ్య, ఎ.ప్రసాదరావులకు ఇంటి పన్ను మినహాయింపునిస్తూ తీర్మానించారు. నగరంలోని పలు డివిజన్లలో పలువురికి నీటి కుళాయి కనెక్షన్ లేకపోయినా పన్ను వస్తున్నట్లుగా నిర్వాసితులు నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వాటిపై విచారణ చేసిన అధికారులు బకాయిలను రద్దు చేస్తూ, నీటి పన్ను రాకుండా స్థాయిసంఘంలో తీర్మానం చేశారు. నగరపాలక సంస్థలోని నీటి సరఫరా విభాగం ఉద్యోగి ఉప్పు దుర్గారావు అనారోగ్యంతో చనిపోగా భార్య ఉప్పు వరాలుకు రూ.2లక్షలు చెల్లించేలా, భూగర్భ డ్రైనేజీ కార్మికుడు సతీష్‌బాబు చనిపోగా భార్య భానుప్రియకు రూ.2లక్షలు ఇచ్చేలా నిర్ణయించారు. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు వీలుగా టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లు ఇచ్చేందుకు రూ.40 లక్షలు కేటాయించారు. నగరపాలక సంస్థలోని మైదానాల్లో క్రీడల్లో శిక్షణ పొందేందుకు సభ్యత్వ రుసుములు ఆటను బట్టి రూ.500 నుంచి రూ.1500 వరకు నిర్ధారించారు. నెలవారీ రుసుమును రూ.300 నుంచి రూ.వెయ్యిగా నిర్ణయించారు. నగరపాలక సంస్థకు చెందిన పాత విధానంలోని దుకాణాల లీజు ఒప్పందాలు రద్దు చేసి నూతన విధానంలో కేటాయించి అద్దె వసూలు చేసేలా నిర్ణయించారు. వివిధ విభాగాల అధికారులు, స్థాయీసంఘం సభ్యులు పాల్గొన్నారు.

అన్నయ్యపై అలిగి.. ఇల్లు వదిలెళ్లిన చెల్లి..

కృష్ణలంక, న్యూస్‌టుడే: అన్నయ్యతో గొడవ పడి అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయిన చెల్లి ఆచూకీని గంటల వ్యవధిలో పోలీసులు కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించిన ఘటన కృష్ణలంక పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... కృష్ణలంక ప్రాంతానికి చెందిన ముఠా కార్మికుడికి ఇద్దరు పిల్లలు. కుమారుడు ఇంటర్మీడియట్, కుమార్తె 9వ తరగతి చదువుతున్నారు. అన్నయ్యకు, చెల్లికి మంగళవారం ఉదయం ఇంట్లో గొడవ జరిగింది. అలిగిన ఆమె తండ్రి చరవాణి తీసుకుని ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లిపోయింది. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పరిసరాల్లో గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో కృష్ణలంక పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సీసీ కెమెరాల సాయంతో బాలిక పీఎన్‌బీఎస్‌కు వెళ్లి కనిగిరి డిపో బస్సెక్కినట్లు గుర్తించారు. బస్సు గుంటూరు బస్‌స్టేషన్ దాటినట్లు తెలుసుకున్నారు. బస్సు డ్రైవర్ తిరుపతయ్యకు ఫోన్ చేసి విషయం చెప్పారు. బాలిక ఫొటోను వాట్సప్‌లో అతడికి పంపించారు. ఆ బాలిక తన బస్సులో ఉన్నట్లు డ్రైవర్ తెలిపారు. వెంటనే స్థానిక పోలీసులు ఒంగోలు పోలీసులకు అప్రమత్తం చేశారు. బస్సు ఒంగోలు బస్‌స్టేషన్‌కు చేరాక అక్కడి పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకొని పీఎస్‌కు తరలించారు. బాలిక కుటుంబ సభ్యులతో కృష్ణలంక పోలీసులు ఒంగోలు చేరుకున్నారు. ఆమెను తల్లిదండ్రులకు అప్పగించారు.

'ఎస్‌డీఎం సిద్ధార్థ' బాల్‌బ్యాడ్మింటన్ జట్టుకు అభినందన

క్రీడాకారిణులతో వీవీఎస్ కుమార్, హేమవెంకటలక్ష్మి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఈ నెల 24న నందిగామ కేవీఆర్ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన కృష్ణా వర్సిటీ అంతర్ కళాశాలల మహిళా బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తమ కళాశాల జట్టు విన్నర్ ట్రోఫీ కైవసం చేసుకుందని స్థానిక ఎస్‌డీఎం సిద్ధార్థ మహిళా ప్రిన్సిపల్ వీవీఎస్ కుమార్ తెలిపారు. కె.ఉమామహేశ్వరి, ఎ.శ్రీరజిని, పి.భువనేశ్వరి వర్సిటీ జట్టులో స్థానం సాధించారని వివరించారు. వారు వచ్చే నెల 11 నుంచి చెన్నైలోని అన్నా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగే ఆలిండియా అంతర్ వర్సిటీ పోటీల్లో ఆడుతారని పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో జట్టు సభ్యులు, పీడీ ఎన్.హేమవెంకటలక్ష్మిలను కళాశాల కన్వీనర్ సీహెచ్ కృష్ణారావు, అధ్యాపకులు అభినందించారు.

కూటమి గెలుపులో పాదయాత్రది కీలక పాత్ర

కేక్ తినిపిస్తున్న తెదేపా నాయకుడు

ఆటోనగర్, న్యూస్‌టుడే: ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందారంటే.. అందులో మంత్రి లోకేశ్ చేసిన యువగళం పాదయాత్ర కీలక పాత్ర పోషించిందని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరామ్ గౌడ్ అన్నారు. లోకేశ్ చేపట్టిన పాదయాత్రకు మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆటోనగర్‌లోని తెదేపా కార్యాలయంలో మంగళవారం తెదేపా నేతలు కేక్ కోశారు. నాయకులు పామర్తి కిషోర్ బాబు, గొల్లపూడి నాగేశ్వరరావు, జాస్తి సురేష్, బెజవాడ నజీర్, బత్తుల దుర్గారావు, యార్లగడ్డ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తుకు పునాది యువగళం

చుట్టుగుంట, న్యూస్‌టుడే: యువశక్తిని రాజకీయ శక్తిగా మలిచిన చారిత్రాత్మక ఉద్యమం యువగళమని తెదేపా నేత గద్దె క్రాంతికుమార్ పేర్కొన్నారు. స్థానిక 6వ డివిజన్ విశాలాంధ్ర రోడ్డు ప్రాంతంలో మంగళవారం ఆయన పర్యటించారు. డివిజన్‌లో అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువనేత లోకేశ్ యువత తరపున గళమెత్తి, అధికార దుర్వినియోగంపై రాజీలేని పోరాటం చేసిన నాయకుడని కొనియాడారు. కూటమి ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు చూపించడం, పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. యువత గొంతుగా మారిన లోకేశ్‌ని చూసి వైకాపా నాయకులకు భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. యువగళం రాష్ట్ర రాజకీయాల్లో ఓ మైలు రాయిగా నిలిచిందని పేర్కొన్నారు. అనంతరం ఎం.పద్మజకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు, నిత్య సువార్త చర్చి అభివృద్ధి కోసం పాస్టర్ యోహాన్‌కు రూ.10 వేలు తన సొంత నిధులు అందజేశారు. నాయకులు పడాల గంగాధర్, పొనుగుమాటి మోహనరావు, మొకర సోమినాయుడు, సగరపు అప్పారావు, సప్పా శ్రీనివాస్, మొకరపు గురునాథం, వడ్డి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో బలవన్మరణం

పటమట, న్యూస్‌టుడే: అప్పుల బాధతో బార్బర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విశాలాంధ్ర రోడ్డులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. విశాలాంధ్ర రోడ్డుకు చెందిన కుమార్(40) సెలూన్ షాపు నడుపుతూ జీవనం సాగిస్తుంటారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమార్‌కు సుమారు రూ.10 లక్షల వరకు అప్పు ఉంది. మానసిక ఒత్తిడికి గురవుతూ మంగళవారం షాప్‌నకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండిపోయారు. భార్య పనికి వెళ్లింది. సాయంత్రం పాఠశాల నుంచి కుమార్తె వచ్చే సరికి ఇంట్లో తండ్రి ఉరి వేసుకుని ఉన్నాడు. ఆమె పెద్దగా కేకలు వేయగా.. స్థానికులు వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య బుజ్జి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు మాచవరం సీఐ వెంకట రమణ తెలిపారు.

రహదారిపై ఇంజిన్ ఆయిల్ లీక్

కృష్ణలంక, న్యూస్‌టుడే: కృష్ణలంక ఎం హోటల్ సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం ప్రయాణిస్తున్న వాహనం నుంచి ఉన్నట్టుండి ఇంజిన్ ఆయిల్ లీకై రహదారిపై పడుతోంది. స్థానికులు గమనించి డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. అప్పటికే ఆయిల్ రహదారిపై పడడంతో వాహనాలు జారి ప్రమాదాలు తలెత్తే అవకాశం ఉందని గమనించిన 5 ట్రాఫిక్, కృష్ణలంక పోలీసులు ఇసుక పోశారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

మానసిక ఆరోగ్యానికి ఆటలు దోహదం

విజయవాడ వైద్యం: సిద్ధార్థ వైద్య కళాశాలలో మహిళల కోసమని ప్రత్యేకంగా వాలీబాల్ కోర్టు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని ప్రిన్సిపల్ ఏడుకొండలరావు తెలిపారు. మంగళవారం ఆయన వాలీబాల్ కోర్టును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.... మానసిక ఆరోగ్యం పెంచేందుకు కోర్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
హోమ్ లోన్ సెంటర్-2 (ఆర్‌ఎసిపిసి-2), డి.నెం.54-15-1/బి, యలమంచిలి కాంప్లెక్స్, వెంకటేశ్వర నగర్, విజయవాడ-520 008.

స్వాధీనత ప్రకటన
APPENDIX IV (రూలు-8(1) (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం-2002 ప్రకారం భారతీయ స్టేట్ బ్యాంక్, సాంబమూర్తిరోడ్ బ్రాంచి, విజయవాడ, యన్‌టిఆర్ జిల్లా యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు, సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క సెక్షన్ 13(12) 3వ నిబంధన క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపు నోటీసులో తెలిపిన ఋణము మొత్తము ది.24-10-2025వ తేదీ నాటికి మొత్తము బకాయి రూ.55,80,326/- (అక్షరాల యాభైఐదులక్షల ఎనభైవేల మూడువందల ఇరవైఆరు రూపాయిలు మాత్రమే) (ఏవైన చెల్లింపులు వుంటే తగ్గించగా) మరియు ది.25-10-2025 నుండి తదుపరి వడ్డీ, ఖర్చులతో సహా చెల్లించమని కోరుతూ ఋణగ్రహీత: **1) శ్రీ యామలమాడ వీర వెంకటేశ్వరరావు, 2) శ్రీమతి యామలమాడ కోటేశ్వరమ్మ**, తండ్రి: వీర రాఘవులు, 61-10/3-11ఎ, నాగేంద్ర నగర్, కృష్ణలంక, గంగానమ్మ గుడి దగ్గర, విజయవాడ-520013, (అకౌంట్ నెంబర్లు హెచ్‌యల్: 42548284974, టాప్‌అప్ యోనో: 44103678392) వీరిని కోరుతూ ది:24-10-2025 వ తేదీన డిమాండు నోటీసును మరియు ది.07-11-2025న పత్రికా ప్రకటన ప్రచురించడమైనది.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు రూల్ "8"తో చదువుకొనవలసిన సదరు చట్టం ద్వారా సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన స్థిరాస్తిని సెక్యూరిటీ ఇంట్రెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 ప్రకారం ఈ దిగువ సంతకందారు **ది:22-01-2026**న స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీతలకు/హామీదారు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఈ స్థిరాస్తితో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని, ఏవేని లావాదేవీలు జరిపిన పక్షంలో అవి భారతీయ స్టేట్ బ్యాంక్ యొక్క ఛార్జీకి మొత్తం బకాయి రూ.55,80,326/- (ఏవైన చెల్లింపులు వుంటే తగ్గించగా) మరియు ది.25-10-2025 నుండి తదుపరి వడ్డీ + ఖర్చులు మొదలగువాటికి లోబడి ఉంటాయని ఋణగ్రహీతకు/హామీదారుకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియపరచటమైనది.

ఋణగ్రహీతలు సదరు చట్టంలో సబ్ సెక్షన్(8) ఆఫ్ సెక్షన్ 13 ప్రకారం తనఖా ఆస్థిని గడువులోపల విడిపించుకొనుటకు గాను దృష్టి సారించవలసి ఉన్నది.

స్థిరాస్థి వివరము
యన్‌టిఆర్ జిల్లా, విజయవాడ, పటమట, రామలింగేశ్వర నగర్, నాగేంద్ర నగర్, ప్రస్తుత డోర్ నెం.61-10/1-12, తదుపరి డోర్ నెం.61-10/3-9, పాత డోర్ నెం.61-10/1-5, ప్రస్తుత అసెస్‌మెంట్ నెం.1073127582, తదుపరి అసెస్‌మెంట్ నెం.254844, పాత అసెస్‌మెంట్ నెం.33700ఎ/15, మునిసిపల్ వార్డు నెం.32/2, ఆర్‌యస్ నెంబర్లు 35/2, 41/1, 41/2 లోని 127.77 చ॥గ॥ల విస్తీర్ణములో గ్రౌండ్ ఫ్లోర్ ప్లింత్ ఏరియా 990 చ॥అడుగులు, మొదటి అంతస్థు ప్లింత్ ఏరియా 990 చ॥అడుగులు & రెండవ అంతస్థులోని టైటిల్ హౌస్ ప్లింత్ ఏరియా 90 చ॥అడుగులు కలిగిన ఆర్‌సిసి భవనము శ్రీమతి యామలమాడ కోటేశ్వరమ్మ గారికి చెందిన రిజిష్టర్డ్ సేల్‌డీడ్ నెం.18119/2023, తేది:28-12-2023, పటమట జెయస్‌ఆర్ఓ, విజయవాడ, యన్‌టిఆర్ జిల్లా. హద్దులు: తూర్పు: అత్యాల కనకదుర్గ యొక్క ఆస్థి, దక్షిణం: మునిసిపల్ రోడ్డు, పడమర: మునిసిపల్ రోడ్డు, ఉత్తరం: పామర్తి వెంకటేశ్వరరావు యొక్క ఆస్థి.

తేది : 22-01-2026
ప్రదేశం: విజయవాడ
అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందన: ☛ లింగాలపాడులో రహదారుల వెంట వ్యర్థాలతో అపరిశుభ్రంగా ఉందని స్థానికులు మేమున్నాం మీకుతోడుగా ద్వారా పంచాయతీ కార్యదర్శి సీతారామిరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన పారిశుద్ధ్య కార్మికులతో వ్యర్థాలను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. ☛ అడవిరావులపాడులో డ్రైనేజీలో మురుగునీరు ప్రవహించడంలేదని స్థానికులు పంచాయతీ కార్యదర్శి సురేష్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన స్పందించి పారిశుద్ధ్య కార్మికులతో డ్రైనేజీలో పూడిక తీయించారు. ☛ రామచంద్రాపురం సొసైటీ కార్యాలయం ఎదురుగా కాలువలో మురుగునీరు పారడం లేదని స్థానికులు పంచాయతీ కార్యదర్శి ఆకుల హనుమంతరావు దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన పారిశుద్ధ్య కార్మికులతో పూడిక తీయించారు. **- న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం**

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

నందిగామ గ్రామీణం: మాగల్లు మునేటి వద్ద 33కేవీ విద్యుత్తు లైన్ జంపర్ తెగిపోవడంతో మంగళవారం ఏడుపల్లె గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నందిగామ నుంచి విద్యుత్తు లైన్ ద్వారా తొర్రగుడిపాడు ఉపకేంద్రానికి విద్యుత్తు సరఫరా అవుతుంది. జంపర్ తెగి మాగల్లు, కొందూరు, రామిరెడ్డిపల్లి, సోమవరం తదితర గ్రామాలకు సరఫరా నిలిచింది. ఏఈ పూర్ణచంద్రరావు పర్యవేక్షణలో మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించారు.

నందిగామ

•నందిగామ •జగ్గయ్యపేట

పెరిగిన అమ్మవారి ఆదాయం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: స్థానిక తిరుపతమ్మ దేవాలయం వద్ద పలు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు బహిరంగ వేలంపాటలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో మంగళవారం ఈవో మహేశ్వరరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యుల సమక్షంలో టెండర్ కమ్ బహిరంగ వేలంపాటలు నిర్వహించారు. వీటిలో గత ఏడాది కంటే రూ.22,18,217 ఆదాయం పెరిగిందని ఆలయ ఈవో తెలిపారు. దీనిలో భక్తులు అమ్మవారికి సమర్పించే వస్త్రాలు పోగు చేసుకునే లైసెన్స్ హక్కు పాట గత ఏడాది రూ.66లక్షలు కాగా.. ఈసారి రూ.72.63 లక్షలకు పెరిగింది. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో నిమ్మకాయలు, వాహన పూజల సామగ్రి విక్రయ పాట గత ఏడాది రూ.6.81 లక్షలు కాగా.. ఈసారి 7.63 లక్షలకు పెరిగింది. దేవాలయం వద్ద పూలు, పూలదండల విక్రయ పాట గత ఏడాది రూ.3.11 లక్షలు ఉండగా.. ఈసారి రూ. 4.71 లక్షలకు చేరింది. అలాగే మరికొన్నింటి ద్వారా ఆదాయం లభించింది.

ఈ-నారీ.. ప్రగతి భేరి!

ఆర్థిక లావాదేవీల నిర్వహణపై అవగాహన

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే

డ్వాక్రా సంఘాల్లో మహిళలకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహనకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, గ్రామాభివృద్ధి శాఖ సీఆర్పీలను ఎంపికచేసి ఈ-నారీ శిక్షణ ఇచ్చింది. ఐదుగురు బాగుంటే పొదుపు సంఘాల్లో మహిళలు ఆర్థిక చైతన్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహనకు ఉపయోగపడేలా తర్ఫీదు ఇచ్చారు. ప్రతి మండలంలో ఇలా శిక్షణ ఇచ్చారు. గ్రామైక్య సంఘాల్లో 25 కంటే ఎక్కువ సంఘాల నుంచి ముగ్గుర్ని తక్కువ ఉన్న సంఘాల నుంచి ఇద్దరిని, 25 సీఆర్పీలుగా ఎంపిక చేశారు.

చందర్లపాడులో శిక్షణకు హాజరైన డ్వాక్రా సభ్యులు

నందిగామ నియోజకవర్గంలో సుమారు 4వేల సంఘాల్లో 40వేల మంది డ్వాక్రా సభ్యులుగా ఉన్నారు. వీరిలో 7వందల మందిని ఈ-నారీలుగా ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు. నందిగామ మండలంలో 182 మందిని ఎంపిక చేసి ఈనెల 20, 21, 23, 24 తేదీల్లో శిక్షణ ఇచ్చారు. చందర్లపాడులో 170మందికి శిక్షణ ఇచ్చారు. పదో తరగతి ఉత్తీర్ణత అయిన 18-45 ఏళ్లలోపు సభ్యులను ఎంపిక చేశారు.

నిర్వహించాల్సిన విధులు..: ఒక్కో సీఆర్పీ తనకు కేటాయించిన పది డ్వాక్రా సంఘాల సభ్యులకు సాంకేతిక పరిజ్ఞానంపై చైతన్యం కల్పించాలి. ప్రతి మహిళ సెల్‌ఫోన్ నంబరు సేకరించాలి. సభ్యుల వారీగా మొబైల్ ఐడీలు రూపొందించి పుస్తకాల్లో రాయాలి. ప్రతి నెలా సంఘ సభ్యుల సమావేశం, పుస్తకాలు రాసే విధానం, మన డబ్బులు.. మన యాప్‌పై శిక్షణ ఇవ్వాలి. ఈ యాప్‌ను ప్రతి సభ్యురాలి ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయించి ఉపయోగించేలా శిక్షణ ఇవ్వాలి. ప్రతి నెలా పది సంఘాలకు తప్పనిసరిగా జియోఫెన్సింగ్, ఎఫ్ఆర్ఎస్ ఉపయోగించి సమావేశం నిర్వహించాలి. పుస్తకాల్లో వివరాలు రాయించాలి. గత నెలకు సంబంధించిన పొదుపు సంఘంలో సొమ్ముల వివరాలను యాప్‌లో చెక్ చేయించాలి. ఇలా ఆరు మాసాలు ప్రతి గ్రామంలో ప్రతి సంఘంతో చేయించాలి. మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరుకు సహాయపడాలి.

ఇలా చేయకూడదు..: ఈ-నారీలు డ్వాక్రా సంఘ పుస్తకాలు, సమావేశాన్ని తమవద్ద ఉంచుకోకూడదు. సంఘానికి చెందిన నగదు చెల్లింపులు, జమ చేయకూడదు. సభ్యులు చేసిన చెల్లింపులు ఒకరివి మరొకరికి, వేరొక నిధులకు మళ్లించకూడదు. డ్వాక్రా సంఘంలోని సభ్యుల నుంచి డబ్బులు తీసుకోకూడదు. వారిపై పెత్తనం చేయడం, చులకనగా చూడకూడదు. సంఘాల సమాచారం, వారి వ్యవహారాలను బహిర్గతం చేయకూడదు.

మాదక ద్రవ్యాల జోలికెళ్లొద్దు

ర్యాలీలో ఏసీపీ తిలక్, సీఐ లచ్చునాయుడు

నందిగామ, న్యూస్‌టుడే: విద్యార్థులు, యువకులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్థానిక ఏసీపీ బాలగంగాధర్ తిలక్ కోరారు. విజయవాడలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న డ్రగ్స్‌పై దండయాత్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు నందిగామ నుంచి విద్యార్థులు సైకిల్ ర్యాలీగా వెళ్లారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ర్యాలీని ఏసీపీ ప్రారంభించారు. నందిగామలో అవగాహన ర్యాలీ చేశారు. సీఐ లచ్చునాయుడు, ఎస్సైలు మహతి, సూర్యవంశీ, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్ల, న్యూస్‌టుడే: డ్రగ్స్ వినియోగానికి వ్యతిరేకంగా పలు కళాశాలల విద్యార్థులతో కలిసి కంచికచర్లలో భారీ ర్యాలీ నిర్వహించారు. నందిగామ గ్రామీణ సీఐ డి. చవాన్ ఎస్సైలు పి. విశ్వనాథ్, అభిమన్యు, నాని నరేందర్, పోలీస్ సిబ్బంది, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ శుకశ్యామలాంబ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయం స్వామి కల్యాణ మహోత్సవాలకు ముస్తాబైంది. బుధవారం ఉదయం 10.08 గంటలకు స్వామి వారిని పెండ్లికుమారునిగా అలంకరణ చేస్తారు. 29న స్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి లలిత త్రిశతినామార్చన అలంకరణ చేసి కుంకుమార్చన చేస్తారు. 30న అమ్మవారికి గజలక్ష్మీదేవి అలంకరణ, రాత్రి 7.30 గంటలకు స్వామి వారికి శేష వాహనసేవ, 31న అమ్మవారికి వారాహీదేవి అలంకరణ, రాత్రి 9.30 గంటలకు ఎదురుకోలోత్సవం, రాత్రి 11.05 గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. ఫిబ్రవరి 1న అమ్మవారికి కనకదుర్గాదేవి అలంకరణ, సాయంత్రం 5.15 గంటలకు స్వామివారి ఉత్సవ మూర్తులకు రథోత్సవం నిర్వహిస్తారు. రథం తిరునాళ్లుగా పిలిచే ఈ వేడుకను వీక్షించడానికి చుట్టు పక్కల గ్రామాల భక్తులు భారీగా తరలివస్తారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళీరాఘవకుమార్ రూ.10 లక్షలు వెచ్చించి రథానికి ఇనుప చక్రాలు తయారు చేయించి ఏర్పాటు చేశారు. 2న అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరణ చేస్తారు. 3, 4, 5 తేదీల్లో రాత్రి 7గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు, స్వామివారికి పవళింపు సేవలు నిర్వహిస్తారు.

ఉత్సవమూర్తులు

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ప్రకటన

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: చిల్లకల్లు ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న నాలుగు కార్యకర్తలు, ఏడు ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఫిబ్రవరి 5లోపు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో సత్యవతి తెలిపారు. కార్యకర్త పోస్టులకు సంబంధించి విలియంపేట, గోపినేనిపాలెం, పోచవరం(ఎస్సీ) రంగుబజార్(బీసీ-ఈ)లకు, హెల్పర్‌కు చిల్లకల్లు(బీసీ-ఏ) శనగపాడు, పోచవరం(ఎస్సీ) మక్కపేట(బీసీ-డీ) మంగొల్లు(2 పోస్టులు) బండిపాలెం(ఓసీ)లకు కేటాయించినట్లు తెలిపారు.

పాఠశాలకు మైక్ బహూకరణ

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మల్కాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆ గ్రామ ఎన్ఆర్ఐ(అమెరికా) రాయపూడి కిరణ్‌కుమార్ రూ.18 వేలు విలువ చేసే మైక్ బహూకరించారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచి విద్యాసాగర్, గ్రామ పెద్దలు ప్రధానోపాధ్యాయుడు దుర్గాప్రసాద్‌కు అందించారు.

కార్మికుల సమ్మె విజయవంతానికి పిలుపు

నందిగామ, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్మికులు ఫిబ్రవరి 12న దేశ వ్యాప్త సమ్మె చేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కటారపు గోపాల్ తెలిపారు. నందిగామలో మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్స్ సంఘం ప్రతినిధులు సమ్మె నోటీసు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు, ఇతర వర్గాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయని చెప్పారు. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం దేశంలో 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందని ఆరోపించారు. సమ్మెలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నందిగామ అంగన్‌వాడీ వర్కర్స్ సంఘ కార్యదర్శి కొల్లి సరళ, ప్రతినిధులు విజయ, సుజాత, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు ఇస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్, కార్యదర్శి సరళ, ప్రతినిధులు

విద్యుత్తు నియంత్రిక పరిశీలన

కంచికచర్ల, న్యూస్‌టుడే: స్థానిక అరుంధతీ కాలనీలో విద్యుత్తు శాఖ అధికారులు ఏర్పాటు చేసిన నియంత్రిక ప్రమాదకరంగా ఉందంటూ స్థానికులు తెలిపారు. దీంతో 'నివాసాల మధ్య నియంత్రిక' శీర్షికతో ఈ నెల 27న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన ఆ శాఖ అధికారులు కాలనీలోని నియంత్రికను పరిశీలించారు. నిబంధనల ప్రకారమే దీనిని ఏర్పాటు చేశారని ఆ శాఖ అధికారులు పేర్కొన్నారు. నియంత్రికను ప్రభుత్వ స్థలంలోనే ఏర్పాటు చేశామని తెలిపారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు

కంచికచర్ల నుంచి నక్కలంపేట మీదుగా బైపాస్‌కు వెళ్లే దేవినేని వెంకటరమణ రహదారి సుమారు 3 కిలోమీటర్ల మేర అధ్వానంగా మారింది. అడుగడుగునా భారీ గుంతలతో తారు తేలి వాహనదారులకు నిత్యం నరకాన్ని చూపిస్తోంది. గత నెలలో వరి గడ్డి రవాణా చేస్తున్న ట్రాక్టర్‌పై నుంచి ఒక వ్యక్తి గుంతలో జారిపడి మరణించిన సంగతి తెలిసిందే. నాటి తెదేపా ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ రహదారిని గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ఐదేళ్లలో మరమ్మతులు చేయలేదు. కూటమి సర్కారు స్పందించి ఈ రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కంచికచర్ల**

అసంపూర్తిగా రైతుసేవా భవనం

మండలంలోని రాఘవాపురంలో రైతు సేవా కేంద్రం భవనం అసంపూర్తిగా నిర్మించారు. గత వైకాపా ప్రభుత్వంలో రూ.21 లక్షలతో నిర్మాణ పనులు ప్రారంభించారు. స్లాబు వరకు నిర్మించి వదిలేశారు. ప్రస్తుతం సొసైటీ భవనంలో వీఏఏ విధులు నిర్వహిస్తున్నారు. ఆర్ఎస్‌కే భవనాన్ని పూర్తి చేయించాలని రైతులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం**

తెరుచుకోని సంపద కేంద్రం

మండలంలో సంపద కేంద్రాల నిర్వహణ అధ్వానంగా ఉంది. గత తెదేపా ప్రభుత్వం గ్రామాల్లో వీటిని నిర్మించింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వీటి నిర్వహణను పూర్తిగా విస్మరించింది. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వీటిని అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశాలిచ్చినా క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా కన్పిస్తున్నాయి. కునికినపాడు పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన సంపద తయారీ కేంద్రాన్ని వినియోగించకుండా వదిలేశారు. మరోపక్క రహదారుల పక్కన చెత్తను తగలపెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కునికినపాడు(కంచికచర్ల)**

సేవలకు పురస్కారం

నందిగామ గ్రామీణం: జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలో దాములూరు ఎంపీపీ స్కూల్ స్వచ్ఛ పాఠశాలగా ఎంపికైంది. ఈ సందర్భంగా విజయవాడలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ప్రధానోపాధ్యాయుడు ముల్లంగి శ్రీనివాసరావుకు కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖర బాబు ప్రశంసాపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు. ఆవరణలో మొక్కల పెంపకం, మరుగుదొడ్ల నిర్వహణ బాగుండడంతో ఈ బడిని స్వచ్ఛ పాఠశాలగా ఎంపిక చేశారు.

కలెక్టర్, సీపీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న హెచ్ఎం శ్రీనివాసరావు

రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో సత్తా

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో నందిగామ శ్రీవిద్య ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని డైరెక్టరు మేకల రాము, ప్రిన్సిపల్ చిన్నజోష్ మంగళవారం తెలిపారు. వడ్లమూడి బ్రదర్స్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 26న గొల్లపూడి పోసాని నరసింహారావుచౌదరి ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారని చెప్పారు. ఇందులో బి.పవన్‌కల్యాణ్, ఎం.జైరామకృష్ణ, ఎస్కే సోహేల్ మొదటి బహుమతితో పాటు రూ.10 వేలు నగదు బహుమతి అందుకున్నారని తెలిపారు. వీరిని పాఠశాల అధ్యక్షుడు కందుల మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్ రాము, ప్రిన్సిపల్ చిన్నజోష్

చెస్ టోర్నీలో చిన్నారుల ప్రతిభ

నందిగామ గ్రామీణం: నందిగామ కాకతీయ అపోలో పాఠశాలకు చెందిన ఇద్దరు చిన్నారులు రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ పోటీల్లో ప్రతిభ చూపారు. ఈ నెల 26న విజయవాడ సింగ్‌నగర్ గుజ్జల సరళాదేవి కల్యాణ మండపంలో రామకృష్ణ చెస్ అకాడమీ నిర్వహించిన పోటీల్లో పాఠశాల విద్యార్థులు అండర్-9 విభాగంలో టి.దేవాన్షి మూడో స్థానం, టి.తుషార తొమ్మిదో స్థానం సాధించారు. మంగళవారం వీరిని పాఠశాల ఛైర్మన్ కాపా రవీంద్రనాథ్, వైస్ ఛైర్మన్ భారతి, డైరెక్టర్లు కార్తికేయ, సుష్మ, స్ఫూర్తి, ప్రిన్సిపల్ సత్యమూర్తి, ప్రధానోపాధ్యాయుడు పి.రాఘవులు, కోచ్ టి.త్రివేణి అభినందించారు.

'పది' విద్యార్థులకు అభ్యసన సామగ్రి అందజేత

విద్యార్థులతో వెంకటేశ్వరరావు

నందిగామ గ్రామీణం: మండలంలోని రుద్రవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్ఫూర్తి స్టడీమెటీరియల్‌ను జడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు, సర్పంచి ముప్పాళ్ల జాన్‌కోటయ్య మంగళవారం పంపిణీ చేశారు. జిల్లాపరిషత్తు నిధులతో ఈ అభ్యసన సామగ్రి రూపొందించారు. ప్రధానోపాధ్యాయుడు బత్తిన అరుణకిషోర్, ఉపాధ్యాయులు బి.అరుణకుమార్, పీవీ సురేష్ పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని జడ్పీటీసీ సభ్యురాలు ఊట్ల నాగమణి, మాజీ ఎంపీపీ వేగినేటి గోపాలకృష్ణమూర్తి కోరారు. స్థానిక స్వామి పుల్లయ్య మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు స్ఫూర్తి స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. పాఠశాల స్థలదాత స్వామి గోపాలరావు మాట్లాడుతూ పెనుగంచిప్రోలుకు ప్రత్యేకంగా వసతిగృహాన్ని మంజూరు చేస్తే మరో 3.50 ఎకరాలకు ఉచితంగా ఇస్తానని ప్రకటించారు.

అమ్మవారికి సారె సమర్పణ

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని రంగుల మండపంలో గోపయ్య సమేత తిరుపతమ్మకు కాకతీయ కమ్మ సేవా సమితి సభ్యులు మంగళవారం సారె సమర్పించారు. అనంతరం రంగుల మండపంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నెట్టెం స్వర్ణ, జయశ్రీ, పద్మజ, శైలజ, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించరేం?

న్యూస్‌టుడే, పెనుగంచిప్రోలు

పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్ వద్ద విజయవాడ రోడ్డుపై అడ్డదిడ్డంగా వాహనాలు పెట్టడం వల్ల ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. అయినా పోలీసులు అభ్యంతరం చెప్పట్లేదు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోకపోవడం వల్ల పరిస్థితి మరింత ఘోరంగా మారింది. దీంతో దుకాణాల ముందే ద్విచక్ర వాహనాలు, ఆటోలు పెట్టి తీయట్లేదు. బస్సులు, ఇతర వాహనాలు వచ్చినా అతికష్టం మీద వెళ్లాల్సిందే. దీంతో పోలీస్ స్టేషన్ సెంటర్‌లో నరకయాతన అనుభవిస్తున్నారు. తిరుపతమ్మ అమ్మవారి ఆలయానికి రోజూ పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ఇక ఉత్సవాలు సమయంలో భారీగా వాహనాల్లో వస్తుంటారు. నాలుగు రోడ్లు కలిసి స్టేషన్ సెంటర్ మీదుగానే ఆలయం వద్ద వాహనాలు రాకపోకలు జరుగుతున్నాయి. ఇంతటి ప్రధాన సెంటర్ రోడ్డుకు ఇరుపక్కలా ఆక్రమణలతో ఇరుకుగా మారింది. గత తెదేపా ప్రభుత్వంలో 33 అడుగుల వెడల్పులో రహదారి విస్తరణ చేశారు. ఇరువైపులా డ్రెయిన్ నిర్మించారు. ప్రస్తుతం కాలువలు కన్పించట్లేదు. వాటిని ఆక్రమించి దుకాణాలు పెట్టారు. రోడ్ల పైనే తోపుడు బండ్లు పెట్టి వ్యాపారాలు చేస్తున్నారు. ఇక్కడ దుకాణాలు, హోటళ్ల ముందు రోడ్డుపై వాహనాలు పెట్టి గంటలు తరబడి తీయట్లేదు. కనీసం బస్సులు వచ్చినా అడ్డంగా ఉన్న బండ్లు తీయని దుస్థితి నెలకొంది. ఇక్కడే ప్రయాణికులు విజయవాడ వైపు బస్సుల్లో ఎక్కేందుకు వేచి ఉంటారు. విజయవాడ, జగ్గయ్యపేట రోడ్ల వెంటనే సీరియల్‌గా ఆటోలను పార్కింగ్ చేస్తున్నారు. దీని వల్ల వాహనాలు, జనం వెళ్లటానికి ఇబ్బందిపడుతున్నారు. ప్రతి శుక్ర, ఆదివారాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. ఇప్పటికైనా పోలీసు అధికారులు ఇక్కడ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీసుస్టేషన్ వద్ద రోడ్డుపై అడ్డంగా వాహనాలు

ఉత్సాహంగా పాఠశాలల వార్షికోత్సవం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు జ్వాలాప్రసాద్, డీవైఈవోగా నియమితులైన గురునాథం, ఎంఈవో-2 ఎం.పద్మ, ఎస్ఎంసీ ఛైర్మన్ ఎం.శ్రీనివాసరావు, తెదేపా పట్టణ అధ్యక్షుడు ఏచూరి రాము, దాత పూజారి రాజేష్ ముఖ్యఅతిథులుగా హాజరై చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులిచ్చారు. విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. ✦ మాగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని ఎ.మాధవీలత విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ✦ జొన్నలగడ్డ జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం, పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని షేక్ ఖాజాబీ, పీఈటీ వేల్పుల భూషణం, బండారు శ్రీనివాసరావు, సీహెచ్.శేషగిరి, ఎ.సీతామహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మాగల్లులో విద్యార్థులతో ప్రధానోపాధ్యాయిని మాధవీలత

నందిగామలో బాలికల జానపద నృత్యం

మహిళల ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం

వత్సవాయి: మహిళలు తమ ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ తెలిపారు. వత్సవాయిలో మంగళవారం జయప్రద ఫౌండేషన్ ఛైర్మన్, టీడీ జనార్దన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షా శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం రోగులకు మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఒమేగా వైద్యశాల ఆధ్వర్యంలో 80 మందికి పరీక్షలు చేయగా 22 మందికి క్యాన్సర్ అనుమానిత లక్షణాలు ఉన్నట్లు నిర్ధారించారు. అదే విధంగా డాక్టర్ శ్రీహర్ష వ్యాస్కులర్ సెంటర్ వైద్యులు వెరికోస్ వెయిన్స్ పరీక్షలు 201 మందికి చేశారు. శైలజ మాట్లాడుతూ ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా మహిళలు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. పలు రకాల క్యాన్సర్లు మహిళలను తీవ్ర అనారోగ్యానికి గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫౌండేషన్ సీఈవో చెరుకూరి చాముండేశ్వరీ, వైద్యుడు గుత్తికొండ శ్రీహర్ష, అను ఒమేగా ఆసుపత్రి డాక్టర్ ఆదిత్య, అమర్, డాక్టర్ హరికృష్ణ, వాణి, కో-ఆర్డినేటర్ వెంకటనరసింహారావు, నాయకులు రాంబాబు, రామారావు, కృష్ణవేణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ

ఘనంగా ఎలక్ట్రీషియన్స్ దినోత్సవం

జగ్గయ్యపేట గ్రామీణం, కంచికచర్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద ఎలక్ట్రీషియన్ల భవనంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్ల దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఎడిసన్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

✦ విద్యుత్తు సమస్యల పరిష్కారంలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్లు తమవంతు పాత్ర పోషిస్తున్నారని వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోగంటి బాబు అన్నారు. జాతీయ ఎలక్ట్రీషియన్ల దినోత్సవం సందర్భంగా కంచికచర్ల, వీరులపాడు మండల ప్రైవేటు ఎలక్ట్రీషియన్ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో కంచికచర్లలో మంగళవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఎడిసన్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

ఈనాం భూ సమస్యలు పరిష్కరించండి

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరిలోని చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో ఐఏఎస్ అధికారి జి.జయలక్ష్మిని మంగళవారం ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మర్యాదపూర్వకంగా కలిసి ఈనాం భూ సమస్యలపై వినతిపత్రం అందించారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈనాం భూముల సమస్యలపై చర్చించారు. ఈనాం భూముల విషయంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక ఇబ్బందులను, భూ హక్కులపై ఉన్న అనిశ్చితి కారణంగా ఏర్పడుతున్న సామాజిక, ఆర్థిక సమస్యలను అధికారికి తాతయ్య వివరించారు. స్పందించిన ఐఏఎస్ అధికారి పరిశీలించి వీలైనంత త్వరగా సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ నోటిఫికేషన్ రద్దుకు డిమాండ్

జుజ్జూరు (వీరులపాడు), న్యూస్‌టుడే: బాహ్యవలయ రహదారి(ఓఆర్ఆర్) భూసేకరణ నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని రైతు వ్యవసాయ కార్మిక సంఘం సమన్వయ కమిటీ రాష్ట్ర నాయకుడు ఎ. వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల పరిధి జుజ్జూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆయన రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఏమాత్రం ఉపయోగపడని ఓఆర్ఆర్ కోసం వారి భూములు ఇవ్వాలనడం ప్రభుత్వానికి తగదన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వం 250 మీటర్ల వెడల్పుతో ఓఆర్ఆర్ నిర్మించాలంటోందని, వ్యవసాయం, పశుగ్రాసంపై ఆధారపడి జీవించే రైతుల పరిస్థితి అగమ్యగోచరమేనని ప్రశ్నించారు. పొన్నవరం, జగన్నాథపురం, నరసింహారావుపాలెం, జుజ్జూరు, చెన్నారావుపాలెం గ్రామాల రైతులు పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయం వద్ద రైతుల నిరసన

కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఎస్టీయూ నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటానికి సిద్ధం

కంచికచర్ల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు ఆర్థికపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ఎస్టీయూ పోరాటం చేస్తుందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేముల భిక్షమయ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం కార్యాచరణ కరపత్రాలను స్థానిక మండల వనరుల కేంద్రం వద్ద సంఘం నాయకులతో కలిసి ఆయన ప్రదర్శించారు. దశలవారీ పోరాటానికి ఉపాధ్యాయులు సిద్ధంగా ఉండాలని అన్నారు. 12వ వేతన సంఘం వెంటనే ఏర్పాటు చేయాలని, 30 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం సీనియర్ నాయకుడు శేషం గోపాలరావు, మండల అధ్యక్షుడు మందా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటున్ను M/s. Harahara Infrastructure Private Limited తరఫున డైరెక్టర్ అయిన ఎన్.టి.ఆర్. జిల్లా, నందిగామ మండలం, గోళ్ళమూడి గ్రామం, డోర్ నెం. 2/8 నందు నివాసముంటున్న అల్లంనేని కోటేశ్వరరావు గారి కుమారుడైన అల్లంనేని అయ్యప్ప గారి నుండి సంజాయిషీ పొంది యావన్మందికీ ఈ క్రింది విధముగా తెలియజేయడమైనది.

నా క్లయింటు, ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ఎన్.టి.ఆర్.జిల్లా, వీరులపాడు మండలం, జుజ్జూరు గ్రామము, గాంధీ బొమ్మ సెంటర్, డోర్ నెం.5-84/1రు నందు నివాసముంటున్న పోకల యల్లమందయ్య గారి కుమారుడైన (1) పోకల కోటేశ్వరరావు, వీరి కుమారుడు మరియు కుమార్తె అయిన (2) పోకల దుర్గారావు (3) పోకల దుర్గాభవాని అను వారల నుండి కొనుగోలు చేయుటకు నిర్ణయించుకుని, వారితో ఒక ఒప్పందము చేసుకునియున్నారు. సదరు షెడ్యూలు దాఖలా స్థిరాస్తితో పాటు మరి కొంత ఆస్తి అనగా మొత్తము య. 2.26సెంట్లు భూమిని పైన తెల్పిన 1వ వారైన పోకల కోటేశ్వరరావు గారి తండ్రి అయిన పోకల యల్లమందయ్య గారు వారి పేరున కంచికచర్ల సబ్‌రిజిస్ట్రారు వారి ఆఫీసులో నెం.506/1985రుగా రిజిష్టరు కాబడిన విక్రయ దస్తావేజు ద్వారా పొందియున్నారు. సదరు పోకల యల్లమందయ్య గారు ది.18-05-2005న ఇంటెస్టేటుగా మరణించినారు. దర్మిలా సదరు లేటు యల్లమందయ్య గారి కుమారులైన పైన తెల్పిన 1వ వారు అయిన పోకల కోటేశ్వరరావు, వారి సోదరులు కలిపి పైన తెల్పిన ఆస్తిని ఇప్పటికి సుమారు 20 సం॥ల క్రిందట మూజువాణీగా పంచుకునియున్నారు. షెడ్యూలు దాఖలా స్థిరాస్తి పైన తెల్పిన 1వ వారు అయిన పోకల కోటేశ్వరరావు గారి వాటాకు రాబడినది. షెడ్యూలు దాఖలా ఆస్తి పోకల కోటేశ్వరరావు గారికి వారసత్వముగా రాబడినందున పైన తెల్పిన వారిలో 2, 3 వారలకు కూడా వారసత్వ హక్కులు కలిగియున్నారు.

కావున షెడ్యూలు దాఖలా స్థిరాస్తులపై ఎవరికైననూ ఏవిధమైన అభ్యంతరములు, తనఖాలు, కోర్టు జప్తులు, హామీలు, బ్యాంకు ష్యూరిటీలు, భాగలబ్ద తగాయిదాలు, హక్కులు వగైరా ఉన్నయెడల ఈ ప్రకటన తేదీ నుండి 15 (పదిహేను) రోజులలోపు తగు ఆధారములతో వ్రాతపూర్వకముగా ఈ దిగువ అడ్రసుకు రిజిష్టర్డు పోస్ట్ తిరుగు రశీదు ద్వారా తెలియపరచగలరు. సదరు గడువు లోపు ఎవరినుండైనా ఏవిధమైన అభ్యంతరములు వగైరా రాని యెడల నా క్లయింటు షెడ్యూలు దాఖలా స్థిరాస్తి నిర్వివాద ఆస్తిగా భావించి పైన తెలిపిన వారి నుండి రిజిస్టరు విక్రయ దస్తావేజు ద్వారా పొందగలరు. గడువు అనంతరము వచ్చే అభ్యంతరములు వగైరా పరిగణలోనికి తీసుకొనబడవు మరియు నా క్లయింటును బైండ్ చేయజాలవు.

షెడ్యూలు: లోగడ కృష్ణా జిల్లా, ప్రస్తుతం ఎన్.టి.ఆర్. జిల్లా, వీరులపాడు మండలం, కంచికచర్ల సబ్‌రిజిస్ట్రారు వారి యిలాకా, జుజ్జూరు గ్రామము, ఆర్.యస్.నెం.543/3 దాఖలా య. 0.74 శెంట్లు శేరీ మెరక భూమికి **హద్దులు: తూర్పు :** దోనేపూడి వెంకటేశ్వరరావు గారి భూమి, **దక్షిణం:** డొంక, **పడమర:** రామిశెట్టి పెదపిచ్చయ్య మరియు రామిశెట్టి చినపిచ్చయ్య గారల భూమి, **ఉత్తరం :** నాదెళ్ళ వెంకటరమణ గారి భూమి.

యీ నాలుగు హద్దుల మధ్య య. 0.74 శెంట్లు శేరీ మెరక భూమి మరియు యావత్ యీజ్‌మెంట్ హక్కులతో సహా..

ఇట్లు: **గుడిపాటి కృష్ణ,** అడ్వకేట్ & నోటరీ, హెచ్.ఐ.జి. 479, న్యూ హెచ్.బి. కాలనీ, భవానిపురం, విజయవాడ- 520 012, సెల్ నెం. 98662 15405

(c) eenadu

విజయవాడ పశ్చిమ

దాతకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న పుష్పకుమారి తదితరులు

నిత్యాన్నదానానికి విరాళం

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిర్వహించే అన్నదానానికి గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కృష్ణాయపాలేనికి చెందిన రమేష్‌చౌదరి, పుష్పకుమారి దంపతులు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. మంగళవారం ఆలయ అధికారులకు నగదు అందజేయగా, వారికి దర్శనం కల్పించి అమ్మవారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

? చిట్టినగర్ విశ్వబ్రాహ్మణ కల్యాణమండపం పక్కనే రోడ్డుపై చెత్త దర్శనమిస్తోంది. - **శాంతిశ్రీ, స్థానికురాలు** ✔ తరలించేందుకు చర్యలు తీసుకుంటాం. - **నరసింహారావు, స్థానిక శానిటరీ అధికారి**

స్పందన: పాత రాజరాజేశ్వరీపేట రైల్వేట్రాక్ వెంట ఉన్న వీధిలో రోడ్డుపై చెత్త తరలించడం లేదని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా'కు సమాచారం ఇచ్చారు. దీనిపై మంగళవారం వార్త ప్రచురితమైంది. స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో చెత్తను తరలించారు. - **విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే**

విజయవాడ సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్‌గా కాసాని సీతామహాలక్ష్మి

కొతవరం (గుడ్లవల్లేరు): మండలంలోని కొతవరం 1వ వార్డుకు చెందిన కాసాని సీతామహాలక్ష్మిని స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా నియమిస్తూ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఆదేశాలు జారీ చేశారు. 2012 నుంచి గుడివాడ కోర్టులో న్యాయవాద వృత్తి కొనసాగిస్తున్న ఆమె గుడివాడ న్యాయవాదుల సంఘ మహిళా కార్యదర్శిగా మూడుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికై బాధ్యతలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందించడమే కాకుండా కుమార్తె పేరిట సేవాట్రస్ట్ నిర్వహిస్తూ సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెను న్యాయవాదులు అభినందించారు.

కష్టాలను కొండెక్కించరూ!

న్యూస్‌టుడే, విజయవాడ వన్‌టౌన్

పాతబస్తీ కొండ ప్రాంతాలలో పైకి ఎక్కేందుకున్న మెట్లన్నీ సుమారు 35 ఏళ్ల కిందట నిర్మించినవే. అప్పటి నుంచి ఇప్పటి వరకు కనీసం మరమ్మతులు లేకపోవడంతో ప్రజలు వాటి మీద నడవలేక ప్రమాదాలకు గురవుతున్నారు. శిథిలావస్థకు చేరిన మెట్ల మార్గం కారణంగా రాత్రులు ఇంటికి చేరుకునే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు.

పాతబస్తీ కొండ ప్రాంతాలలో పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలు నివసిస్తుంటారు. వారంతా ఉదయం నగరంలో ఉదయాన్నే కూలి పనికి వెళ్లి రాత్రికి ఇంటికి చేరుకుంటారు. ధ్వంసమైన మెట్ల కారణంగా ప్రమాదాలకు లోనవుతున్నారు. పాతబస్తీ బ్రాహ్మణ వీధి అడ్డరోడ్డు, మల్లికార్జునపేట ఆకుల వారి వీధి, ఉప్పరవాగు కొండ ప్రాంత మెట్లు, సుబ్రహ్మణ్యేశ్వరాలయం కొండ ప్రాంతం, కొత్తపేట పోతిన ఆదియ్య వీధి, నెహ్రూబొమ్మ కూడలి శ్రీనివాస్ మహల్ కొండ ప్రాంతం, కొత్తపేట రాజారిగి వారి వీధి, వాగు సెంటర్ వద్రపేట

కొత్తపేట కొండ ప్రాంతంలో రాజాగిరి వీధి మెట్ల మార్గం పూర్తిగా ధ్వంసమైందిలా..!

కొండ ప్రాంతాలు, వించిపేట నాగేంద్రస్వామి వారి ఆలయం కొండ ప్రాంతం, రెల్లి వీధి కొండ ప్రాంతాలలో ఈ సమస్యలు అధికంగా ఉన్నాయి.

వివరాలు:	
కొండ ప్రాంతాలున్న డివిజన్లు:	7
ఇక్కడ నివసించే జనాభా:	39,000
మెట్లకు మరమ్మతులు చేసింది:	35 ఏళ్ల క్రితం

2014–2019 మధ్య కాలంలో విజయవాడ కార్పొరేషన్‌లో అప్పటి మేయర్ కోనేరు శ్రీధర్ సారథ్యంలోని కౌన్సిల్ కొండ ప్రాంతాల అభివృద్ధికి తీవ్రంగా కృషి చేసింది. 2018 కాలంలో పాతబస్తీలోని కొండ ప్రాంతాల మెట్లమార్గం అభివృద్ధికి నడుం బిగించారు. 2019లో తెదేపా ప్రభుత్వం పోయి వైకాపా ప్రభుత్వం అధికారం చేపట్టింది. అప్పటి నుంచి మెట్ల మార్గాల అభివృద్ధికి గ్రహణం పట్టింది. తెదేపా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఫలితంగా మెట్ల మార్గాల అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వమైనా స్పందించి మెట్లమార్గాన్ని అభివృద్ధి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కూర్చోలేరు.. నిలబడలేరు!

బస్సు షెల్టర్లు లేక ప్రయాణికుల ఇక్కట్లు

న్యూస్‌టుడే, చిట్టినగర్

పశ్చిమ నియోజకవర్గంలో అధిక శాతం పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలే జీవిస్తున్నారు. బతుకు తెరువు కోసం వివిధ పనులకు బయటకు వెళ్లేందుకు బస్సులను ఆశ్రయిస్తుంటారు. అవి ఆగే చోట బస్ షెల్టర్లు లేకపోవడంతో కూర్చోలేక.. నిల్చోలేక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. మట్టి పనులకు వెళ్లే కార్మికులు సామగ్రిని నెత్తినపెట్టుకొనే నిరీక్షించాల్సి వస్తోంది. కనీస మౌలిక సదుపాయాల కల్పనలో ఆర్టీసీ పట్టించుకోకపోవడంతో అవస్థలు తప్పడం లేదంటూ కొందరు ప్రయాణికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

బస్ షెల్టర్లు లేక రోడ్ల మీద నిల్చొన్న కూలీలు

ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలు

సాయిరాం థియేటర్ సెంటర్, ఆంజనేయ వాగు, కేబీఎన్ కళాశాల వద్ద, కృష్ణవేణి మార్కెట్ ఎదురు, సొరంగం వైపు, కబేళా, విద్యాధరపురం, క్వారీ సెంటర్, కుమ్మరిపాలెం సెంటర్, సితారా సెంటర్, ఊర్మిళానగర్, తదితర ప్రాంతాలు

రోడ్డు మీదే నిల్చోవాలి: బి.సుజాత, గృహిణి

కూటమి ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. బస్సుల్లో రద్దీ పెరిగింది. ఇంటి నుంచి రోడ్డు మీదకు వచ్చి బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. బస్ షెల్టర్లు లేవు. ఎండలోనే నిలబడుతున్నాం. ప్రధాన బస్టాప్‌ల్లో బస్‌షెల్టర్లు నిర్మించి నీడ కల్పించాలి.

దాతల సాయం తీసుకోవచ్చు: జి.రామకృష్ణారావు

ప్రైవేటు ఉద్యోగాలు చేసే మాలాంటి వారితోపాటు అధిక శాతం విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లోనే పాఠశాలకు వెళ్లి వస్తున్నారు. వెళ్లడానికి, రావడానికి ఇలా ఎండలో నిలబడి విలవిలలాడి పోతుంటే, వర్షాకాలం తడిసిపోయి అనారోగ్యం పాలవుతున్నాం. స్వచ్ఛంద సంస్థలు, దాతల సాయం తీసుకుని బస్‌షెల్టర్ల నిర్మాణం చేపట్టే దిశగా ఆలోచన చేస్తే మేలు.

అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం ఆమోదం

భవానీపురం, న్యూస్‌టుడే: విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీసంఘం సభ్యులు ఆమోదం తెలిపారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన నగరపాలక సంస్థ స్థాయీసంఘ సాధారణ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. సర్కిల్-1 పరిధిలోని 44వ డివిజన్ ప్రైవేట్ రోడ్డు నుంచి లేబర్ కాలనీకి వెళ్లే రహదారి వెంబడి కాలువను రూ.35 లక్షల వ్యయంతో నిర్మాణానికి ఆమోదించారు. రామరాజ్యనగర్‌లోని నగరపాలక సంస్థ భవనం శిథిలావస్థలో ఉండటంతో మరమ్మతులు చేపట్టేందుకు రూ.34 లక్షలు కేటాయిస్తూ నిర్ణయించారు. భవానీపురం 40వ డివిజన్ గాంధీబొమ్మ రోడ్డులో బీటీ రోడ్డు, కాలువల నిర్మాణానికి రూ.49లక్షలు, మైనంపాటి వారి వీధిలో రూ.26 లక్షలతో సిమెంటు రహదారి నిర్మాణానికి తీర్మానించారు. మాజీ సైనికోద్యోగులు మహబూబ్ బాషా, పి.సుధాకర్, టి.అంకమ్మరావు, ఈ.లింగయ్య, ఎ.ప్రసాదరావులకు ఇంటి పన్ను మినహాయింపునిస్తూ తీర్మానించారు. నగరంలోని పలు డివిజన్లలో పలువురికి నీటి కులాయి కనెక్షన్ లేకపోయినా పన్ను వసూలు చేస్తున్నారని నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వాటిపై విచారణ చేసిన అధికారులు బకాయిలను రద్దు చేస్తూ, నీటి పన్ను రాయడం స్థాయీసంఘంలో తీర్మానం చేశారు. నగరపాలక సంస్థలోని నీటి సరఫరా విభాగం ఉద్యోగి ఉప్పు దుర్గారావు అనారోగ్యంతో చనిపోగా భార్య ఉప్పు వరలక్ష్మికి రూ.2లక్షలు చెల్లించేలా, భూగర్భ డ్రైనేజీ కార్మికుడు సతీష్‌బాబు చనిపోగా భార్య భానుప్రియకు రూ.2లక్షలు ఇచ్చేలా నిర్ణయించారు. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు వీలుగా టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లు ఇచ్చేందుకు రూ.40 లక్షలు కేటాయించారు. నగరపాలక సంస్థలోని మైదానాల్లో క్రీడల్లో శిక్షణ పొందేందుకు సభ్యత్వ రుసుములు ఆటను బట్టి రూ.500 నుంచి రూ.1500 వరకు నిర్ణయించారు. నెలవారీ రుసుము రూ.300 నుంచి రూ.వెయ్యిగా నిర్ణయించారు. నగరపాలక సంస్థకు చెందిన పాత విధానంలోని దుకాణాల వేలం ఒప్పందాలు రద్దు చేసి నూతన విధానంలో కేటాయించి అద్దె వసూలు చేసేలా నిర్ణయం తీసుకున్నారు. వివిధ విభాగాల అధికారులు, స్థాయీసంఘ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న మేయర్ భాగ్యలక్ష్మి, అధికారులు, సభ్యులు

దుర్గమ్మ సేవలో ఎంపీ కేశినేని కుటుంబం

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మను మంగళవారం ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ మర్యాదలతో అధికారులు సాదర స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. దర్శన అనంతరం ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందజేశారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలని దుర్గమ్మను వేడుకున్నట్లు ఆయన వివరించారు.

ఆశీర్వచన మండపంలో శివనాథ్ దంపతులు, ఇతర కుటుంబ సభ్యులు

తెదేపా జిల్లా కార్యదర్శిగా నియామకం

చిట్టినగర్, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ బలోపేతానికి సైనికుడిలా పనిచేస్తానని ఎన్టీఆర్ జిల్లా తెదేపా కార్యదర్శిగా నూతనంగా ఎంపికైన పిళ్లా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం జిల్లా కార్యదర్శిగా ఆయనను పార్టీ ప్రకటించిన నేపథ్యంలో తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించారంటూ తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎం.పి కేశినేని శివనాథ్, జిల్లా అధ్యక్షురాలు గద్దె అనూరాధ, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి లోకేశ్‌కు జ్ఞాపిక అందిస్తున్న పిళ్లా శ్రీనివాసరావు

షెల్టర్ హోంలను సద్వినియోగం చేసుకోవాలి

భవానీపురం, న్యూస్‌టుడే: నిరాశ్రయుల కోసం నిర్మించిన షెల్టర్ హోంలను సద్వినియోగం చేసుకోవాలని యూసీడీ ప్రాజెక్టు అధికారి పి.వెంకటనారాయణ పేర్కొన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో యూసీడీ అధికారులు మంగళవారం పరిశీలించారు. వెంకటనారాయణ మాట్లాడుతూ రాత్రి వేళ కాలిబాటలు, రహదారులపై అనేక మంది నిరాశ్రయులు నిద్రపోతున్నారని పేర్కొన్నారు. అటువంటి వారి కోసం షెల్టర్ హోంలను నిర్మించాలని గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు అయోధ్యనగర్, సీతన్నపేట, మరమ్మిడి మార్కెట్‌లోని వీఎం రంగా సామాజిక భవనం, జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీలోని సామాజిక భవనంలో షెల్టర్ హోంలను తాత్కాలికంగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నగర పరిధిలో రహదారి వెంబడి నిద్రించే నిరాశ్రయులను గుర్తించి ఎన్‌జీవోలు, యూసీడీ సిబ్బంది సహకారంతో వసతి గృహాలకు తరలిస్తున్నామన్నారు.

రహదారి పక్కన నిద్రపోతున్న వారితో మాట్లాడుతున్న యూసీడీ అధికారులు

మంత్రికి సన్మానం

భవానీపురం, న్యూస్‌టుడే: ఏపీ బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్ సన్మానించారు. భవానీపురంలోని రాకేష్ నివాసానికి మంత్రి మంగళవారం వచ్చారు. ఆమెను కుటుంబసభ్యులతో కలిసి సన్మానం చేశారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

అజిత్‌సింగ్‌నగర్: విజయవాడ మధ్య నియోజకవర్గం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీవో డి.జ్యోత్స్న ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని 57, 58, 59, 60, 61 డివిజన్లలో ఖాళీలు ఉన్నట్లు, ఆసక్తి కలిగిన వారు కానూరులోని సీడీపీవో కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

రైళ్లలో అపరిశుభ్రత..ప్రయాణికుల ఇబ్బందులు

దూర ప్రాంతాల రైళ్లల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంటోంది. బోగీల్లోని నీటి కుళాయిలు, మరుగుదొడ్లలో అపరిశుభ్రత నెలకొనడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లలోనే ఎక్కువగా ఈ పరిస్థితి తలెత్తుతోంది. చాలా రైళ్లలో నీళ్లు రాకపోవడం, ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం, దుర్వాసన వెదజల్లడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. రైళ్లు విజయవాడలో ఆగినప్పుడు ఇక్కడి సిబ్బంది నిర్వహణ పనులు చేస్తున్నా మార్గం మధ్యలో సమస్యలు మొదలవుతున్నాయి. బోగీల్లో నీటి సమస్య ఎక్కువగా ఉంటుండటంతో మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు అవస్థలు తప్పడం లేదు. ఫిర్యాదు నంబర్లకు చేసినా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంటోందని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రైల్వేస్టేషన్**

లోయలోకి దూసుకెళ్లిన కారు

అయిదుగురు విద్యార్థులకు గాయాలు

హుకుంపేట, న్యూస్‌టుడే: మంచు.. అతి వేగం కారణంగా పర్యాటకుల కారు ఒకటి అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లింది. హుకుంపేటలో మంగళవారం చోటుచేసుకున్న ఈ ప్రమాదం వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడలో బీటెక్ చదువుతున్న అయిదుగురు విద్యార్థులు పాడేరు మండలం వంజంగి కొండల్లో మంచు అందాలు చూసి అరకులోయ అందాలు చూసేందుకు కారులో వెళ్తున్నారు. తాడిపుట్టు గ్రామం సమీపంలో హైవేలో కుక్క అడ్డంగా వచ్చిందని... దానిని తప్పించబోయి రహదారి పక్కనే ఉన్న లోయలోకి కారు దూసుకెళ్లింది. కారులో ఉన్న బీటెక్ విద్యార్థులు రోహిత్, రేవంత్, సంపత్, ముకేశ్ అభిషేక్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. తోటి ప్రయాణికులు వీరిని పాడేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

తాడిపుట్టు సమీపంలో చోటుచేసుకున్న ప్రమాదం

ఘనంగా ముగిసిన క్రైస్తవ సమైక్యత ఉత్సవాలు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతబస్తీ వించిపేట సీఎస్ఐ చర్చిలో వారం రోజులుగా కొనసాగిన క్రైస్తవ సమైక్యతవార దినోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. చర్చి పాస్టర్ రెవ.కరుణానిధి మంగళవారం ఈ విషయాలను వెల్లడించారు. నగరంలో ఉన్న క్రైస్తవులందరూ ఈ ప్రార్థనల్లో పాల్గొన్నారని తెలిపారు.

పాల్గొన్న విశ్వాసులు

మాతృభాషతో మనోవికాసం

చిట్టినగర్, న్యూస్‌టుడే: మాతృభాషతో మనోవికాసం సాధ్యం అవుతుందని సాహితీవేత్త, బంటుమిల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు జి.బి.ఆనంద్‌కుమార్ అన్నారు. కొత్తపేట కేబీఎన్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో భాషా నైపుణ్యాలు- మాతృభాషా వినియోగం అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఉత్తమ ఉచ్ఛరణతో వ్యక్తుల్ని ప్రభావితం చేయవచ్చన్నారు. ఇతరులు చెప్పే విషయాల్ని శ్రద్ధగా, సంపూర్ణంగా విన్న అనంతరమే స్పందించాలన్నారు. మాతృభాషపై పట్టు సాధిస్తే ఇతర భాషల అధ్యయనం తేలిక అవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కృష్ణవేణి, తెలుగు విభాగాధిపతి నాగరాజు, వైస్ ప్రిన్సిపల్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సాహితీవేత్త ఆనంద్‌కుమార్

జాతీయ శిక్షణకు అజిత్‌సింగ్‌నగర్ ఉపాధ్యాయుడు

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే: అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎం.కె.బేగ్ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడు మైనం హుస్సేన్ జాతీయ స్థాయి సమృద్ధి కార్యక్రమంలో పాల్గొంటున్నారు. నూతన విద్యా విధానంలో భాగంగా జాతీయ విద్య పరిశోధన, శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్‌టీ)తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లోని రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో మంగళవారం ప్రారంభమైంది. ఈనెల 29 వరకు జరగనుంది. ఆర్ట్ ఎడ్యుకేషన్‌ను బోధనలో భాగం చేస్తూ పాటలు, చిత్రలేఖనం, క్రాఫ్ట్, నృత్యం, గానం, ధ్వని వంటి అంశాల ద్వారా పాఠ్యాంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించే అంశంపై ఈ కార్యక్రమం జరుగుతోంది. మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో హుస్సేన్ పాల్గొని కళాశాలలోని విద్యార్థులకు ఆర్ట్ ఆధారిత బోధన విధానాలను పరిచయం చేశారు.

చిత్రలేఖనం ప్రదర్శనలో హుస్సేన్

అపరిశుభ్రంగా కాలువ

భవానీపురం, న్యూస్‌టుడే: జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీలోని పంట కాలువ అపరిశుభ్రంగా ఉంది. కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త పేరుకుపోయి ఉంటున్నాయి. దోమలు పెరిగి స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాలువ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సినిమాలు

మన శంకరవరప్రసాద్‌గారు: అలంకార్, జీ-3(రాజ్-యువరాజ్), ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), నవరంగ్, స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), సాయిరామ్, సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటెల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు)

నారీ నారీ నడుమ మురారి: ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటెల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు)

అనగనగా ఒకరాజు: అలంకార్, జీ-3(రాజ్-యువరాజ్), జయరామ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్ (బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటెల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్ (పటమట), పవర్ వన్ మాల్ (కానూరు)

భర్త మహాశయులకు విజ్ఞప్తి: జీ-3(రాజ్-యువరాజ్), ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటెల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు)

ది రాజాసాబ్: ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణాకాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటెల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు)

- విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే

చెస్ విజేత మల్లేశ్వరరావు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: అజిత్‌సింగ్‌నగర్‌లోని గుజ్జుల సరళాదేవి కల్యాణ మండపంలో రాష్ట్ర చెస్ సంఘం, రామకృష్ణ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల చెస్ పోటీల్లో జె.మల్లేశ్వరరావు విజేతగా నిలిచాడు. ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర బిల్డింగ్, ఇతర నిర్మాణాల అడ్వైజరీ కమిటీ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. అవకాశం ఉన్నంత వరకు క్రీడాకారులు, క్రీడలను ప్రోత్సహించే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ చెస్ సంఘం కార్యదర్శి వై.సుమన్ మాట్లాడుతూ నగరంలో 92 మంది అంతర్జాతీయ ఫిడే రేటింగ్ క్రీడాకారులతో కలిపి సుమారు 400 మంది క్రీడాకారులతో టోర్నీ విజయవంతమైందన్నారు. కార్యక్రమంలో తాళ్లూరి శ్రీనివాసరావు, ఎ.రామకృష్ణ, టి.నరేష్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఏడు రౌండ్లకుగాను జె.మల్లేశ్వరరావు ఏడు పాయింట్లతో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా.. కె.భవన్, పి.హరీష్ సాయిరామ్‌లు 6.5 పాయింట్లతో సమానంగా నిలవడం ద్వారా ప్రోగ్రెసివ్ స్కోర్ ఆధారంగా వరుసగా ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు.

విజేతలతో రఘురామరాజు, సుమన్, శ్రీనివాసరావు, రామకృష్ణ

ఆకతాయి చేష్టలు

భవానీపురం, న్యూస్‌టుడే: సందర్శకులు కూర్చునేందుకు వీలుగా ఏర్పాటు చేసిన బల్లలను కొందరు ఆకతాయిలు విరగ్గొడుతున్నారు. నదీతీరం వెంబడి పున్నమి, భవానీఘాట్‌ల వద్ద సిమెంటు బల్లలను ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళ నగరవాసులు నదీతీరానికి కుటుంబసమేతంగా వచ్చి కాసేపు కూర్చుని వెళ్తుంటారు. అయితే...కొందరు ఆకతాయిలు ఒడ్డున ఏర్పాటు చేసిన సిమెంటు బల్లలను విరగ్గొడుతున్నారు. సందర్శకులకు ఇబ్బందిగా ఉంటుంది. ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని సందర్శకులు కోరుతున్నారు.

నమ్మించి మోసం.. రెండు క్రేన్లు మాయం

చిట్టినగర్, న్యూస్‌టుడే: సమీప బంధువు నమ్మించి మోసం చేశాడని ఓ వ్యక్తి కొత్తపేట పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇస్లాంపేటకు చెందిన ఉస్మాన్ ఖాన్ తుక్కు ఇనుము వ్యాపారం చేస్తున్నాడు. ఇంకెనాళ్లు ఈ వ్యాపారం చేస్తావు.. నేను చెప్పినట్లు చేస్తే ఆదాయం బాగా వస్తుందని బంధువైన సయ్యత్ అలీ నమ్మించాడు. 2023 ఫిబ్రవరిలో 2 క్రేన్‌లు ఫైనాన్స్‌పై తీసుకుని ప్రతి నెలా రెండింటికి రూ.80 వేలు ఇచ్చేలా ఇద్దరు ఒప్పందం చేసుకున్నారు. 2023 డిసెంబరు వరకు డబ్బులు ఇచ్చాడు. అక్కడి నుంచి డబ్బులు ఇవ్వక పోగా, క్రేన్‌లు అద్దెకు పెట్టానని చెబుతూ దాటవేస్తూ వచ్చాడు. మోసపోయినట్లు గ్రహించిన ఉస్మాన్‌ఖాన్ 2025 జులైలో పోలీస్ కమిషనర్‌కి ఫిర్యాదు చేస్తే పటమట పోలీస్‌స్టేషన్‌కి పంపారు. కేసు వాపసు తీసుకుంటే పెద్దల సమక్షంలో మాట్లాడుకుందామని సయ్యద్ అలీ చెప్పాడు. అదే ఏడాది ఆగస్టులో మహంతిపురం కృష్ణవేణి క్లాత్ మార్కెట్ వద్ద ఉండగా సయ్యద్ అలీ, మరొక వ్యక్తి వచ్చి డబ్బులు, క్రేన్‌లు ఇవ్వనంటూ కత్తి చూపించి బెదిరించారు. అతని నుంచి తనకు, కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని, మోసగించిన సయ్యద్ అలీపై తగిన చర్యలు తీసుకోవాలని ఉస్మాన్‌ఖాన్ కొత్తపేట పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు సీఐ చిన కొండలరావు తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

పొంచి ఉన్న ప్రమాదం

మొంథా తుపాన్ సమయంలో సయ్యద్ అప్పలస్వామి కళాశాల వెనుక కొండప్రాంతంలో ఉన్న ఓ ఇంటి ముందు గోడ, ఇల్లు కుంగిపోయాయి. ఎక్కడ ఇల్లు కూలుతుందోనన్న భయంతో పూల వ్యాపారం చేసే విజయ్‌కుమార్ ఇల్లు ఖాళీ చేసి వేరే చోట ఉంటున్నారు. అధికారులు, నాయకులు వచ్చి చూసి వెళ్లినా తర్వాత పట్టించుకోలేదు. ఎప్పుడు కూలిపడిపోతుందనే భయంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు సదరు ప్రాంతాన్ని పరిశీలించి ప్రమాదం జరగక ముందే తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, చిట్టినగర్**

ఎలక్ట్రీషియన్లను ఆదుకోవాలి

అజిత్‌సింగ్‌నగర్: బుడమేరు వరదల కారణంగా కొంతమంది ఉపాధి కోల్పోయి కూలి పనులకు వెళుతున్న పరిస్థితి ఏర్పడిందని ఎలక్ట్రీషియన్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో ఎలక్ట్రీషియన్లను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. మంగళవారం స్థానిక లూనా సెంటర్‌లో విజయవాడ ప్రయివేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ 50వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. విద్యుత్ బల్బును కనుగొన్న థామస్ ఆల్వా ఎడిసన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మోషే, పోలిచర్ల శంకర్, వర్రీ రాధ, బెంజిమెన్, రాజు, సన్నీ పాల్గొన్నారు.

ధర వరలు

వంకాయలు-24, టమాట-16, బెండ-30, పచ్చిమిర్చి-30, కాకర-36, బీర-26/34, క్యాలీఫ్లవర్-15/20, క్యాబేజీ-18, క్యారెట్-32, దొండ-40, బంగాళాదుంప-22, ఉల్లిపాయలు-24, గోరుచిక్కుళ్లు-32, దోస-28/38, సొర-10, పొట్ల-30, అరటికాయ-7/6, చామదుంప-24, అల్లం-72, మునగ-10/12, ఆకుకూరలు (కట్ట)-2.50, కంద-42, బీట్‌రూట్-26, కీరదోస-40, బీన్స్-58, క్యాప్సికమ్-60, చింతకాయలు-60, నిమ్మ (డజను)-18/24, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/22 (నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. **–ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ.**

విజయవాడ సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్‌గా కాసాని సీతామహాలక్ష్మి

కౌతవరం (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని కౌతవరం 1వ వార్డుకు చెందిన కాసాని సీతా మహాలక్ష్మిని స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా నియమిస్తూ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఆదేశాలు జారీ చేశారు. 2012 నుంచి గుడివాడ కోర్టులో న్యాయవాద వృత్తి కొనసాగిస్తున్న ఆమె గుడివాడ న్యాయవాదుల సంఘ మహిళా కార్యదర్శిగా మూడుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికై బాధ్యతలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందించడమే కాకుండా కుమారై పేరిట సేవాట్రస్ట్ నిర్వహిస్తూ సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెను న్యాయవాదులు అభినందించారు.

30న నిరుద్యోగ భేరీ

గాంధీనగర్: ఈనెల 30న విజయవాడలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి తలపెట్టిన నిరుద్యోగ రణభేరీకి పెద్దఎత్తున నిరుద్యోగులు, యువత తరలిరావాలని సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు యుగంధర్, పరుచూరి రాజేంద్రబాబు పిలుపునిచ్చారు. మంగళవారం దాసరి భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఔషధ మాఫియా విచ్చలవిడిగా పెరిగిపోతోందని, ఫార్మసీ నిరుద్యోగ వృత్తి నిపుణుల సర్టిఫికెట్లు అద్దెకు తీసుకొని వారి పేరుపై లైసెన్సులు పొంది ఔషధ దుకాణాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లంక గోవిందరాజులు, నగర సహాయ కార్యదర్శి మోహన ప్రసాద్, గాడి అజయ్, గాలి షైనీ, సరోజిని పాల్గొన్నారు

కేఎస్ వ్యాస్‌కు ఘన నివాళి

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: ఐపీఎస్ అధికారి కె.ఎస్.వ్యాస్ వర్ధంతి సందర్భంగా మహాత్మాగాంధీరోడ్డులోని కేఎస్ వ్యాస్ విగ్రహానికి పలువురు పోలీస్ అధికారులు నివాళులర్పించారు. ఆయనతో పనిచేసిన మధుసూదన్‌రావు, సాయిరాం, కోమాకుల శివాజీ, రవి తదితరులు కేఎస్ వ్యాస్ అంకితభావాన్ని, ఆయన సేవలను కొనియాడారు. గ్రేహౌండ్స్ స్థాపించినప్పుడు కిందిస్థాయి ఉద్యోగి ప్రతి ఒక్కరితో మమేకమై వారిని ఉత్సాహ పరిచేవారని గుర్తు చేసుకున్నారు. ఆయన ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు.

హామీలు వెంటనే నెరవేర్చాలి

గాంధీనగర్: ప్రభుత్వం ఇచ్చిన దీర్ఘకాలిక హామీలు వెంటనే నెరవేర్చాలని కెనరా బ్యాంకు అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కె.రవికుమార్ డిమాండ్ చేశారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్లు ఇచ్చిన సమ్మె పిలుపులో భాగంగా మంగళవారం ధర్నాచౌక్‌లో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ దేశాన్ని ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడంలో బ్యాంకు ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తున్నారని, సిబ్బంది నిరంతర కృషిని గుర్తించి ఐదు రోజుల బ్యాంకింగ్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు. యూనియన్ల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏపీ మెడికల్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ

గాంధీనగర్: ఏపీ మెడికల్ కౌన్సిల్ ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ డాక్టర్స్ ఫోరం తరఫున పోటీ చేస్తున్నట్లు డాక్టర్ పొట్లూరి వెంకటాచలపతి, డాక్టర్ ఉప్పల పావని తెలిపారు. మంగళవారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మ్యానిఫెస్టోని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ డాక్టర్లకు ప్రత్యేక సౌకర్యాలు, వైద్యులకు ప్రత్యేక సహాయ విభాగం ఏర్పాటు చేస్తామని చెప్పారు. డాక్టర్లకు ప్రత్యేక సెల్ ఏర్పాటు, వైద్యులపై దాడులను అరికట్టేందుకు మెడికో లీగల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

పేదల ఇళ్లకు కొత్త హంగులు

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే

అజిత్‌సింగ్‌నగర్, రామ్‌నగర్ కాలనీలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం బ్లాకులకు కొత్త హంగులు సమకూరుతున్నాయి. ఈ బ్లాకుల్లో మొత్తం 128 ఫ్లాట్లు ఉన్నాయి. గత తెదేపా ప్రభుత్వ హయాంలో వీటి నిర్మాణం ప్రారంభించారు. ఈ తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో పనులు ప్రారంభించి దాదాపు ఎనిమిదేళ్లు కావడంతో నిర్మాణాలు పాడవుతున్నాయి. వీటికి నూతన రూపురేఖలు సమకూర్చి పేదలకు అందజేసేందుకు పనులు చేపట్టారు. ఇందుకు రూ.1.2 కోట్లు వెచ్చిస్తున్నారు.

గతంలో వచ్చిన బుడమేరు వరదల ప్రభావంతో పాటు ఆకతాయిల అసాంఘిక కార్యకలాపాలతో ఈ ఇళ్లు తీవ్రంగా పాడయ్యాయి. కూటమి ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించేలా పేద కుటుంబాలకు కేటాయించేందుకు ఇళ్లకు మరమ్మతులు చేపడుతోంది. రామ్‌నగర్ కాలనీలోని 24, 25, 26, 28 బ్లాకుల పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా ఇళ్లలో టైల్స్, తలుపులు, కిటికీలు, వాడుకనీటి లైన్లు, మరుగుదొడ్లు, కబోర్డులు, విద్యుత్తు లైన్లను పునరుద్ధరించారు. ప్రతి ఇంటికీ నేరుగా తాగునీరు చేరేలా నూతన లైన్లు ఏర్పాటు చేశారు. లోపల రంగులు వేసి నూతన రూపం తీసుకొచ్చారు. అలాగే బ్లాకుల మధ్య పూలమొక్కలు నాటుకునేలా ఖాళీ స్థలంలో నాలుగు వైపులా కాంక్రీట్ నిర్మాణాలు, రెండు వైపులా సిమెంట్ కాంక్రీట్ ర్యాంపులు ఏర్పాటు చేశారు. డ్రెయినేజీ పైపు కింద భాగంలో వృథానీరు తొలగించేలా నిర్మాణం, బ్లాకులోకి ప్రవేశమార్గం వద్ద గేటును ఏర్పాటు చేశారు. ఈ పనులతో పేదల నివాసాలకు భద్రతతోపాటు మెరుగైన సౌకర్యాలు, నూతన రూపురేఖలు ఏర్పడుతున్నాయి. ఇక విద్యుత్తు వైరింగ్ పెండింగ్‌లో ఉందని, మరో రెండు నెలల్లో ఈ పనులు పూర్తి చేయనున్నట్లు ప్రాజెక్టు ఏఈ ఆరేపల్లి నాగమల్లేశ్వరరావు తెలిపారు.

25వ బ్లాక్‌కు గేటు అమర్చి..రంగులు వేస్తున్నారిలా..

డ్రెయినేజీ పైప్‌లైన్లు, పూల మొక్కలు ఏర్పాటుకు సిద్ధం చేసిన ప్రాంతం

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునర్నిర్మాణానికి కృషి

మాచవరం, న్యూస్‌టుడే: భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునర్నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హామీ ఇచ్చారు. మాచవరం డౌన్‌లో విజయవాడ ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, జాతీయ ఎలక్ట్రీషియన్ డే పురస్కరించుకొని మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ కార్మికుల కోసం అసోసియేషన్లు చేస్తున్న కృషిని అభినందించారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో విజయవాడ ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ సంఘం మాజీ గౌరవాధ్యక్షుడు మలిసెని నారాయణప్రసాద్, రాష్ట్ర సంఘం అధ్యక్షుడు డీవీ సత్యనారాయణ, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వై.శంకరరావు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమానికి నగర అధ్యక్షుడు కె.శ్రీరామారావు అధ్యక్షత వహించగా.. రాష్ట్ర, నగర కార్యవర్గ మాజీ సభ్యులను అతిథులు సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ఎలక్ట్రీషియన్లను ప్రభుత్వం ఆదుకోవాలి

అజిత్‌సింగ్‌నగర్: బుడమేరు వరదల కారణంగా కొంతమంది ఎలక్ట్రీషియన్లు ఉపాధి కోల్పోయి కూలి పనులకు వెళుతున్న పరిస్థితి ఏర్పడిందని ఎలక్ట్రీషియన్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో ఎలక్ట్రీషియన్లను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. మంగళవారం స్థానిక లూనా సెంటర్‌లో విజయవాడ ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ 50వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. విద్యుత్ బల్బును కనుగొన్న థామస్ ఆల్వా ఎడిసన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మోషే, పోలిరెడ్డి శంకర్, వర్రీ రాజ్, బెంజిమిన్, రాజు, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఎడిసన్ చిత్రపటానికి నివాళులు అర్పించిన ఎలక్ట్రీషియన్లు

విజేతలతో అతిథులు రఘురామరాజు, సుమన్, శ్రీనివాసరావు, రామకృష్ణ

చెస్ విజేత మల్లేశ్వరరావు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: అజిత్‌సింగ్‌నగర్‌లోని గుబ్బల సరళాదేవి కల్యాణ మండపంలో రాష్ట్ర చెస్ సంఘం, రామకృష్ణ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ తెలుగు రాష్ట్రాల చెస్ పోటీల్లో జె.మల్లేశ్వరరావు విజేతగా నిలిచారు. ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర బిల్డింగ్, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మన్ గొట్టిముక్కల రఘురామరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు, క్రీడలను ప్రోత్సహించే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ చెస్ సంఘం కార్యదర్శి కె.సుమన్ మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లో 92 మంది అంతర్జాతీయ ఫిడే రేటింగ్ క్రీడాకారులతో కలిపి సుమారు 400 మంది క్రీడాకారులతో టోర్నీ విజయవంతమైందన్నారు. కార్యక్రమంలో తాళ్లూరి శ్రీనివాసరావు, ఎ.రామకృష్ణ, టి.నరేష్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఏడు రౌండ్లకుగాను జె.మల్లేశ్వరరావు ఏడు పాయింట్లతో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకొన్నారు. కె.బసవ, పి.హరీష్ సాయిరామ్‌లు 6.5 పాయింట్లతో సమానంగా నిలవడం ద్వారా ప్రోగ్రెస్ స్కోర్ ఆధారంగా వరుసగా ద్వితీయ, తృతీయ బహుమతులను గెలుపొందారు.

డ్రెయినేజీ సమస్య తీర్చండి

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: 23వ డివిజన్ గోపు రామచంద్రరావు వీధిలో భూగర్భ డ్రెయినేజీ పొంగి పొర్లుతోందని, సమస్యను పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ నెల్లిబండ బాలస్వామికి స్థానికులు విజ్ఞప్తి చేశారు. రోడ్డుపై మురుగునీరు చేరడంతో వీధిలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. ఈ వీధిలో పైప్‌లైను పూడి పోయిందని, దానికి ప్రత్యామ్నాయ లైను వేయాలని కోరారు. వెంటనే బాలస్వామి స్పందించి నగరపాలకసంస్థ అధికారులతో మాట్లాడి రెండో పైప్‌లైనును సూచించారు. త్వరలో పనులను ప్రారంభించేలా చూస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు.

కార్పొరేటర్ బాలస్వామికి వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

సీపీతో డీసీపీ మర్యాదపూర్వక భేటీ

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: అడ్మిన్ డీసీపీగా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తయిన సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబును డీసీపీ కె.జి.వి. సరిత మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నేర పరిశోధన, నియంత్రణలో సాంకేతికతను ఉపయోగించుకోవడమే కాకుండా పోలీసులే తన కుటుంబం అనుకుంటూ వారి సంక్షేమం కోసం పాటుపడుతున్న సీపీ వద్ద పని చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. సీపీకి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

అజిత్‌సింగ్‌నగర్: ఫీడర్ మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ, నూకాలమ్మ గుడి సెంటర్, సెయింట్ ఆన్స్ పాఠశాల రోడ్డు, స్మైల్ హాస్పిటల్ రోడ్డు, ఆంధ్రపత్రిక కాలనీ, వశిష్ట కాలనీ, ఆంధ్రప్రభ కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపి వేయనున్నట్లు ఈఈ పి.రవీంద్రబాబు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రజల ఐక్యతకు క్రీడలు దోహదం

కృష్ణలంక, న్యూస్‌టుడే: ప్రజల మధ్య ఐక్యత పెంపొందించేందుకు ఆటల పోటీలు దోహదపడతాయని డాక్టర్ హర్షవర్ధన్ అన్నారు. సంక్రాంతి సందర్భంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15వ తేదీల్లో కృష్ణలంక 21వ డివిజన్‌లో మహిళలకు ముగ్గుల, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. సోమవారం కల్పన థ్రింట్ రోడ్డులో విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక ప్రముఖులు మాట్లాడుతూ.. సంప్రదాయాలను ముందుకు తీసుకెళ్లేందుకు పోటీలు దోహదపడతాయన్నారు. భవిష్యత్తులోనూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు శాస్త్రీయ, పాశ్చాత్య నృత్యాలు, కోలాటం అలరించాయి. దోనేపూడి కాశీనాథ్, దమ్ములూరి రంగారావు, తుర్లపాటి మల్లేశ్వరరావు, లక్ష్మీనారాయణ, సోమయాజులు, పి.నరసింహమూర్తి, పల్లెంపాటి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

NAME CHANGE NOTICE

I, ROWTHULA TEJA SAINATH, S/o Rowthula Veerababu, Hereby inform that my name was earlier written as ROWTHULA TEJA VEERA VENKATA DURGA SAINATH in my records. I have now changed my name to ROWTHULA TEJA SAINATH and shall henceforth be known and identified by the new name for all purposes.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే: విజయవాడ మధ్య నియోజకవర్గం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీవో డి.జ్యోత్స్న ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని 57, 58, 59, 60, 61 డివిజన్లలో ఖాళీలు ఉన్నట్లు, ఆసక్తి కలిగిన వారు కానూరులోని సీడీపీవో కార్యాలయంలో సంప్రదించాలని ఆమె కోరారు.

అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం ఆమోదం

భవానీపురం, న్యూస్‌టుడే: విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీసంఘం సభ్యులు ఆమోదం తెలిపారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన నగరపాలక సంస్థ స్థాయీసంఘ సాధారణ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. సర్కిల్-1 పరిధిలోని 44వ డివిజన్ బైపాస్ రోడ్డు నుంచి లేబర్ కాలనీకి వెళ్లే రహదారి వెంబడి కాలువను రూ.35 లక్షల వ్యయంతో నిర్మాణానికి ఆమోదించారు. రామరాజ్యనగర్‌లోని నగరపాలక సంస్థ భవనం శ్లాబు నిర్మాణం, మరమ్మతులు చేపట్టేందుకు రూ.34 లక్షలు కేటాయిస్తూ నిర్ణయించారు. భవానీపురం 40వ డివిజన్ గాంధీబొమ్మ రోడ్డులో బీటీ రోడ్డు, కాలువల నిర్మాణానికి రూ.49లక్షలు, మైనంపాటి వారి వీధిలో రూ.26 లక్షలతో సిమెంటు రహదారి నిర్మాణానికి తీర్మానించారు. మాజీ సైనికోద్యోగులు మహబూబ్ బాషా, పి.సుధాకర్, టి.అంకమ్మరావు, ఈ.లింగయ్య, ఎ.ప్రసాదరావులకు ఇంటి పన్ను మినహాయింపునిస్తూ తీర్మానించారు. నగరంలోని పలు డివిజన్లలో పలువురికి నీటి కుళాయి కనెక్షన్ లేకపోయినా పన్ను వస్తున్నట్లుగా నిర్వాసితులు నగరపాలక సంస్థ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వాటిపై విచారణ చేసిన అధికారులు బకాయిలను రద్దు చేస్తూ, నీటి పన్ను రాకుండా స్థాయిసంఘంలో తీర్మానం చేశారు. నగరపాలక సంస్థలోని నీటి సరఫరా విభాగం ఉద్యోగి ఉప్పు దుర్గారావు అనారోగ్యంతో చనిపోగా భార్య ఉప్పు వరాలుకు రూ.2లక్షలు చెల్లించేలా, భూగర్భ డ్రైనేజీ కార్మికుడు సతీష్‌బాబు చనిపోగా భార్య భానుప్రియకు రూ.2లక్షలు ఇచ్చేలా నిర్ణయించారు. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు వీలుగా టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లు ఇచ్చేందుకు రూ.40 లక్షలు కేటాయించారు. నగరపాలక సంస్థలోని మైదానాల్లో క్రీడల్లో శిక్షణ పొందేందుకు సభ్యత్వ రుసుములు ఆటను బట్టి రూ.500 నుంచి రూ.1500 వరకు నిర్ధారించారు. నెలవారీ రుసుమును రూ.300 నుంచి రూ.వెయ్యిగా నిర్ణయించారు. నగరపాలక సంస్థకు చెందిన పాత విధానంలోని దుకాణాల లీజు ఒప్పందాలు రద్దు చేసి నూతన విధానంలో కేటాయించి అద్దె వసూలు చేసేలా నిర్ణయించారు. వివిధ విభాగాల అధికారులు, స్థాయీసంఘం సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న మేయర్ భాగ్యలక్ష్మి, అధికారులు, సభ్యులు

యువ కళాకారులను ప్రోత్సహించాలి

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: నాటకరంగంలోకి యువ కళాకారులను ప్రోత్సహించాలని శారద కళా సమితి అధ్యక్షుడు డోగిపర్తి శంకర్రావు అన్నారు. తపస్వి కల్చరల్ ఆర్ట్స్, ఆంధ్రనాటక కళాసమితి, డాక్టర్ నందమూరి తారక రామారావు కళాపరిషత్, కొడాలి బ్రదర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏపీ సృజనాత్మక సమితి సౌజన్యంతో రెండో రోజు నిర్వహించిన తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో తొలుత డి.కామేశ్వరి మూలకథగా డి.వినయ్ దర్శకత్వం వహించిన 'కన్నీటికి విలువెంత' నాటికను బి.వి.కె.క్రియేషన్, కాకినాడ బృందం ప్రదర్శించింది. అనంతరం ప్రముఖ కథ, నాటక రచయిత వల్లూరు శివప్రసాద్‌ను 'తపస్వి' కళాసేవ పురస్కారంతో సత్కరించారు. రెండో నాటికగా 'వాస్తవం' నాటికను మైత్రి కళానిలయం' విజయవాడ బృందం ప్రదర్శించింది. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రముఖ వ్యాపారవేత్త కొడాలి నాగేశ్వరరావు, మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ సూర్యదేవర హరికృష్ణ మాట్లాడుతూ నాటకరంగం అభివృద్ధికి కృషి చేస్తున్న కళాకారులను అభినందించడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో తపస్వి గౌరవాధ్యక్షుడు వేమూరి నాగేశ్వర శర్మ, వ్యవస్థాపకుడు సూర్యదేవర జగన్నాథరావు, కోశాధికారి బాయన శ్రీనివాసరావు, ఆంధ్ర నాటక కళాసమితి అధ్యక్షుడు నన్నపనేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కన్నీటికి విలువెంత నాటికలో ఒక సన్నివేశం

జాతీయ శిక్షణకు అజిత్‌సింగ్‌నగర్ ఉపాధ్యాయుడు

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే: అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎం.కె.బేగ్ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడు మైనం హుస్సేన్ జాతీయ స్థాయి సమృద్ధి కార్యక్రమంలో పాల్గొంటున్నారు. నూతన విద్యా విధానంలో భాగంగా జాతీయ విద్య పరిశోధన, శిక్షణ మండలి(ఎన్‌సీఆర్‌టీ)తొలిసారిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లోని రీజినల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో మంగళవారం ప్రారంభమైంది. ఈనెల 29 వరకు జరగనుంది. ఆర్ట్ ఎడ్యుకేషన్‌ను బోధనలో భాగం చేస్తూ పాటలు, చిత్రలేఖనం, క్రాఫ్ట్, నృత్యం, గానం, ధ్వని వంటి అంశాల ద్వారా పాఠ్యాంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించే అంశంపై ఈ కార్యక్రమం జరుగుతోంది. మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో హుస్సేన్ పాల్గొని కళాశాలలోని విద్యార్థులకు ఆర్ట్ ఆధారిత బోధన విధానాలను పరిచయం చేశారు.

చిత్రలేఖనం ప్రదర్శనలో హుస్సేన్

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళా భారతి, తెలుగు కళావాహిని ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానంద కళావేదికపై మంగళవారం నిర్వహించిన సినీ సంగీత విభావరి సంగీత ప్రియులను మైమరిపించింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్వమాత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు నిడుమోలు రమా సత్యనారాయణ మాట్లాడుతూ సంగీత కార్యక్రమాలతో కళాకారులను అభినందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి గాయకుడికి అవకాశం రావాలని, వారి ఎదుగుదలకు పట్టుదలతో కృషిచేయాలని సూచించారు. అనంతరం గాయకులు పాడిన సినీ గేయాలు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో ప్రముఖ గాయకురాలు కె.అన్నపూర్ణ, సంగీత విద్వాంసురాలు అశ్వినికుమారిలను సత్కరించారు. కె.డేవిడ్ రాజు, సిహెచ్.చిట్టిబాబు, వి.వి.వీరభద్రరావు, జోషి, శింగంశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రమా సత్యనారాయణ

షెల్టర్ హోంలను సద్వినియోగం చేసుకోవాలి

భవానీపురం, న్యూస్‌టుడే: నిరాశ్రయుల కోసం నిర్మించిన షెల్టర్ హోంలను సద్వినియోగం చేసుకోవాలని యూసీడీ ప్రాజెక్టు అధికారి పి.వెంకటనారాయణ పేర్కొన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో యూసీడీ అధికారులు మంగళవారం పరిశీలించారు. వెంకటనారాయణ మాట్లాడుతూ రాత్రి వేళ కాలిబాటలు, రహదారులపై అనేక మంది నిరాశ్రయులు నిద్రపోతున్నారని పేర్కొన్నారు. అటువంటి వారి కోసం షెల్టర్ హోంలను నిర్మించాలని గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు అయోధ్యనగర్, సీతన్నపేట, మామిడి మార్కెట్‌లోని వీఎం రంగా సామాజిక భవనం, జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీలోని సామాజిక భవనంలో షెల్టర్ హోంలను తాత్కాలికంగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నగర పరిధిలో రహదారి వెంబడి నిద్రించే నిరాశ్రయులను గుర్తించి ఎన్‌జీవోలు, యూసీడీ సిబ్బంది సహకారంతో వసతి గృహాలకు తరలిస్తున్నామన్నారు.

రహదారి పక్కన నిద్రపోతున్న వారితో మాట్లాడుతున్న యూసీడీ అధికారులు

ప్రకటన

[illegible]

ESECOLAS(APP)/35/2018-JA(ES)-KCO

[illegible]

ఎం.కోటినాగయ్య, న్యాయవాది

విజయవాడ, ది. 27-01-2026 Cell: 98656 61358

ప్రకటన

[illegible]

శ్రీనివాస్ పాటిల్, అడ్వకేట్

ఫోన్ నెం.: 0866-2438901

ది. 27-01-2026

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 98496 97616

సిటి యూనియన్ బ్యాంక్ లిమిటెడ్

డోర్ నెం: 29-36-18, మల్లాదివారి వీధి, మ్యూజియం రోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ-2. ఫోన్: 93462 04818

బంగారు నగల వేలం ప్రకటన

[illegible]

వ.నెం	లోన్ ఖాతా నెం	లోన్ తేది	ఖాతాదారుని పేరు చిరునామా	బరువు (గ్రాములలో)
1.	502112035013250	24-04-2025	[illegible]	28.60
2.	502112035013645	16-06-2025	[illegible]	14.10

స్థలం: విజయవాడ
తేది: 28-01-2026
సం/- బ్రాంచి మేనేజరు

SBI భారతీయ స్టేట్ బ్యాంక్

హోమ్ లోన్ సెంటర్-2 (ఆర్ఏసీపీసీ-2), డి.నెం.54-15-1/బి, యలమంచిలి కాంప్లెక్స్, వెంకటేశ్వర నగర్, విజయవాడ-520 008.

స్వాధీనత ప్రకటన

APPENDIX IV (రూలు-8(1)) (స్థిరాస్తి కొరకు)

[illegible]

తేది: 22-01-2026
ప్రదేశం: విజయవాడ
అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - తాడికొండ

బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

Title Sponsor
ధనిక్ భారత్ విద్యా సంస్థలు
IIT-JEE | NEET
Protein Partner
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ
(Non-Govt. Public Charitable Trust)
Hospitality Partner
CITY Chalapathi Institute of Technology
AUTONOMOUS
MOTHADAKA CAMPUS
Gift Partner
KL (DEEMED TO BE UNIVERSITY)
Man of the Series
Hero
Digital Partner
ఈనాడు.net
TV Partner
Organised by

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - I జూనియర్స్ : మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్సులతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులు చేసి ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్ జట్టు

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - I జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

విజేత రాయలసీమ రాకర్స్ జట్టు

గ్రౌండ్-2లో సీనియర్స్: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జీత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ · చరణ్ జీత్ · ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-I (జూనియర్స్)

మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్

మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)

మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్

మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

కనులపండువగా అమ్మవారి పల్లకీల ఊరేగింపు

రంగుల మండపంలో తిరుపతమ్మ, సహ దేవతల విగ్రహాలు

విగ్రహాలను తీసుకురావడానికి జగ్గయ్యపేట వెళుతున్న పల్లకీలు

పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: రంగుల మహోత్సవంలో భాగంగా శ్రీతిరుపతమ్మ, సహదేవతల విగ్రహాలను జగ్గయ్యపేట నుంచి తీసుకురావడానికి పల్లకీలు మంగళవారం రాత్రి పెనుగంచిప్రోలు నుంచి బయలుదేరాయి. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలను ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు తీసుకెళ్లారు. అనంతరం ప్రధాన వీధుల గుండా జగ్గయ్యపేటకు పయనమయ్యాయి. మహిళలు పెద్దసంఖ్యలో తరలి వచ్చి పల్లకీల వద్ద వారులు పోసి పూజలు చేశారు. ఎస్ఐ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెనుగంచిప్రోలుకు తిరుగు పయనం.. జగ్గయ్యపేటలో విడిది చేసిన గోపయ్య సమేత తిరుపతమ్మ, సహదేవతల విగ్రహాలకు రంగులు వేసే ఘట్టం పూర్తి కావడంతో బుధవారం ఉదయం ఐదు గంటలకు పెనుగంచిప్రోలుకు తీసుకెళ్లడానికి ఆలయ ఈవో మహేశ్వరరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యుడు చుంచు రమేష్‌బాబు, సభ్యులు, అధికారులు ఏర్పాట్లు చేశారు. పల్లకీలు జగ్గయ్యపేట నుంచి చిల్లకల్లు, భీమవరం, లింగగూడెం గ్రామాల మీదుగా పెనుగంచిప్రోలు ఆలయం వద్దకు తీసుకురానున్నారు.

పల్లకీల్లో విగ్రహాల వరుస ఇలా.. మొదటి పల్లకీలో తిరుపతమ్మ, రెండో పల్లకీలో గోపయ్య స్వామి, మూడో పల్లకీలో ఉన్నఊరు అంకమ్మ, నాలుగో పల్లకీలో వినుకొండ అంకమ్మ, ఆతర్వాత తిరుపతమ్మ, గోపయ్య స్వాముల ఉత్సవ మూర్తులు, మల్లయ్యస్వామి, చంద్రమ్మ, మద్ది రావమ్మ, పెద్దమ్మ, గుర్రపు వాహనాన్ని తీసుకొస్తారు.

భారీ పోలీసు బందోబస్తు: గతంలో జరిగిన ఘర్షణలు, భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు ఆధ్వర్యంలో డీసీపీ లక్ష్మీనారాయణ, ఇతర పోలీసు అధికారుల పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉపాధ్యాయుల నియామకాల ప్రక్రియ యాజమాన్యాలకే ఇవ్వాలి

ప్రాస్మా రాష్ట్ర కమిటీ డిమాండ్

మాట్లాడుతున్న ప్రభాకరరావు, చిత్రంలో రవిచంద్రశేఖర్, రవీంద్ర తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రయివేటు ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను యాజమాన్యాలకే ఇవ్వాలని ప్రైవేటు ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (ప్రాస్మా) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం విజయవాడలోని ఒక హోటల్లో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ప్రభాకరరావు, కె.రవిచంద్రశేఖర్ మాట్లాడారు. ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకాలను గత ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారమే నిర్వహించాలని, ఈ విషయంలో న్యాయస్థానాల ఆదేశాలను కూటమి ప్రభుత్వం అమలు చేయకపోవడం సరి కాదన్నారు. గత ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా ఆయా ఎయిడెడ్ పాఠశాలల కరస్పాండెంట్లు ఇప్పటికే నియామక ప్రక్రియ ప్రారంభించారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 85 ఎయిడెడ్ పాఠశాలల్లో న్యాయస్థానాల ఆదేశాల మేరకు నియామక ప్రక్రియ పూర్తయ్యిందని, అయితే విధానపరమైన కారణాలు చూపుతూ ప్రభుత్వం దాదాపు అయిదు నెలల పాటు ప్రక్రియ నిలిపేసిందని చెప్పారు. పాఠశాలల యాజమాన్యాలతో సంప్రదింపులు లేకుండా కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ) ద్వారా నియామకాలు చేపడతామని ప్రకటించిందని, ఇది న్యాయస్థానాలు, గత ప్రభుత్వ ఉత్తర్వులకు పూర్తిగా వ్యతిరేకం అన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. సీబీటీ పరీక్షల నిర్వహణ చట్ట విరుద్ధమైంది కనుక..వెంటనే ఆ ప్రక్రియ ఆపాలని, లేనిపక్షంలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు ఎం.రవీంద్రబాబు, జవహర్‌రాజు, నరేష్, రామచంద్ర రాజు, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం.. గంటల వ్యవధిలో ఆచూకీ లభ్యం

పెనమలూరు, రామవరప్పాడు: బాలుడి అదృశ్యంతో పెనమలూరు పోలీసులు హైరానాకు గురయ్యారు. నాలుగు ప్రత్యేక బృందాలు, పటమట, విజయవాడ నగర, ట్రాఫిక్ పోలీసులు జల్లెడ పట్టగా ఆఖరుకు ఫిర్యాదు అందిన రెండు గంటల్లోనే రామవరప్పాడులో అతడి ఆచూకీ కనిపెట్టారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం.. చిలక మోహిత్ ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం గండేపల్లిలోని తన అమ్మమ్మ విజయమ్మ వద్ద తన సోదరుడితో కలిసి ఉంటూ మూడో తరగతి చదువుతున్నాడు. తన అమ్మమ్మ, సోదరుడితో కలిసి సోమవారం కానూరులోని పెద్దమ్మమ్మ ఇంటికి వచ్చాడు. పెద్దమ్మమ్మ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడంతో కుటుంబ సభ్యులందరూ మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. ఇంట్లో మోహిత్, సోదరుడు మాత్రమే ఉండగా వీరు స్థానికంగా ఆటలాడుకుంటున్న క్రమంలో మోహిత్ దారి తప్పిపోయి ఇంటికి చేరుకోలేకపోయాడు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో కుటుంబ సభ్యులు ఆసుపత్రి నుంచి తిరిగి రాగా.. మోహిత్ అదృశ్యమైనట్లు తెలుసుకున్నారు. ఆ ప్రాంతంలో గాలించినా ఫలితం లేకపోవడంతో సాయంత్రం నాలుగున్నరకు వీరు పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నగర, ట్రాఫిక్ పోలీసులకు మోహిత్ ఫొటోలు పంపి అంతటా అప్రమత్తం చేశారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలు పరిశీలించారు. ఈలోగా సీఐ వెంకటరమణ నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి కానూరు, పటమట, ఆటోనగర్, ప్రసాదంపాడు ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. సాయంత్రం ఆరున్నరకు మోహిత్‌ను రామవరప్పాడు వద్ద ట్రాఫిక్ పోలీసులు గుర్తించి సీఐ వెంకటరమణకు సమాచారం అందించారు. సీఐ వెంటనే అక్కడకు వెళ్లి బాలుడిని స్టేషన్‌కు తీసుకువచ్చి తల్లిదండ్రులు వెంకట్, లక్ష్మిలకు అప్పగించారు.

పిల్లల విక్రయం కేసులో ముగిసిన పోలీస్ కస్టడీ

గవర్నర్‌పేట: పిల్లల విక్రయం కేసులో నిందితురాలు కవిత పోలీస్‌కస్టడీ మంగళవారం ముగిసింది. ముంబయికి చెందిన ఈమెను పిల్లల విక్రయం కేసులో భవానీపురం పోలీసులు అరెస్టు చేశారు. ఈమె నుంచి మరింత సమాచారం నిమిత్తం కస్టడీకి ఇవ్వాలని కోరగా రెండు రోజుల పోలీసుల కస్టడీకి ఇచ్చారు. పోషించలేని తల్లిదండ్రుల నుంచి మాత్రమే పిల్లలను తాను తీసుకుని బలగం సరోజినికి అప్పగించినట్లు విచారణలో వెల్లడించారు. మంగళవారంతో కస్టడీ ముగియగా ఆమెను సీఎంఎం కోర్టులో హాజరుపరిచారు. అనంతరం ఆమెను రాజమహేంద్రవరం కేంద్ర కారాగానికి తరలించారు.

చదువు

■ **e-mail:** edc@eenadu.in

ఉపాధి పథం
నైపుణ్య సాధనం

కోర్సుల రన్‌వేపై కెరియర్ టేకాఫ్

కలల కెరియర్ అందుకోవాలంటే కోర్సుల వారధి నిర్మించుకోవాలి. ఉద్యోగాల రీత్యా ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్న విమానయాన రంగంలోకి ప్రవేశించేందుకు ఎన్నో దారులున్నాయి. ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్హతలతో వీటిలో ప్రవేశించవచ్చు. కొన్ని హోదాలు పొందడానికి అదనపు శిక్షణ కావాలి. ఎంచుకున్న మార్గాన్ని బట్టి కోర్సు ఎంపిక జరగాలి.

విమానయాన రంగంలో ఎక్కువ ఉద్యోగాలు 3 విభాగాల్లో ఉన్నాయి. అవి..

1. టెక్నికల్ ఉద్యోగాలు
2. మేనేజ్‌మెంట్ హోదాలు
3. సేవల విభాగంలో కొలువులు

మరో ఐదేళ్లలో అంటే 2030 నాటికి భారత పౌర విమానరంగం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద మార్కెట్‌గా అవతరించనుంది. ఈ నేపథ్యంలో మూడు విభాగాల్లోనూ నైపుణ్యాలున్న సిబ్బంది అవసరం ఎక్కువగా ఉంది. ఖాళీలు ఎక్కువగా ఉన్నప్పటికీ, శిక్షణ పొందినవారు తక్కువ మందే ఉన్నారు. విమానయాన కోర్సుల శిక్షణకు మౌలిక సదుపాయాల కల్పన ప్రధాన అడ్డంకిగా ఉండటమే ఇందుకు కారణం. పైలట్ లాంటి కోర్సుల శిక్షణకు తగిన సౌకర్యాలు లేకపోతే అనుమతులు లభించవు.

పైలట్ (కమర్షియల్) ట్రెయినింగ్

కమర్షియల్ పైలట్ లైసెన్స్ (సీపీఎల్)గా పిలిచే ఈ కోర్సులో చేరడానికి మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో ప్లస్2/ఇంటర్మీడియట్ కనీస విద్యార్హత. వయసు 17 ఏళ్లు ఉండాలి. దేశవ్యాప్తంగా పలు సంస్థలు పైలట్ శిక్షణ అందిస్తున్నాయి.

గ్రౌండ్ స్టాఫ్ ఆపరేషన్స్

ఇంటర్ విద్యార్హతతో ఎయిర్‌పోర్ట్ గ్రౌండ్ సర్వీసెస్‌లో ఏడాది కాలపరిమితి ఉన్న డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ తరహా కోర్సుల్లో ప్రవేశానికి వివిధ సంస్థలు ఉమ్మడిగా నిర్వహిస్తోన్న ఏఎంఈ సెట్ రాయవచ్చు. ఇతర పరీక్షలతోనూ ప్రవేశం పొందవచ్చు.

వేతనాలు

✦ పైలట్ శిక్షణ పొందినవారికి రూ.12 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ప్రారంభంలో వార్షిక వేతనాలు అందుతాయి.

✦ కేబిన్ క్రూ సిబ్బందికి రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షల వార్షిక వేతనాలు సంస్థలు ఇస్తున్నాయి.

✦ ఎయిర్‌క్రాఫ్ట్ నిర్వహణ సిబ్బంది విద్యార్హతలతో పాటు తగిన కౌశలాలు సాధిస్తే ఏడాదికి రూ.6 లక్షలు - రూ.10 లక్షల మధ్య ప్యాకేజీ దక్కుతోంది.

✦ ఏవియేషన్ మేనేజ్‌మెంట్‌లో బీబీఏ పూర్తిచేసిన వారికి రూ.5 - రూ.12 లక్షల మధ్య వార్షిక వేతనాన్ని విమానయాన సంస్థలు ఆఫర్ చేస్తున్నాయి.

✦ ఎయిర్ లైన్స్ క్షేత్రస్థాయి కార్యకలాపాల్లో పాలుపంచుకునే సిబ్బందికి రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు వేతనాలిస్తున్నాయి.

ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజినీరింగ్ (ఏఎంఈ)

ఎయిర్‌లైన్స్‌లో అత్యంత డిమాండ్ ఉన్న ఈ హోదాను సాధించాలంటే డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) అనుమతి పొందిన ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజినీరింగ్ లైసెన్స్ కోర్సు చేయాలి. ఇంటర్ ఎంపీసీ విద్యార్థులు అర్హులు. దేశంలో పలు సంస్థలు ఈ కోర్సును అందిస్తున్నాయి.

కేబిన్ క్రూ

విమానం లోపల సేవలందించే సిబ్బందిగా పనిచేయడానికీ కోర్సులున్నాయి. ఇంటర్మీడియట్ తర్వాత కేబిన్ క్రూ, ఎయిర్ హోస్టెస్‌లలో శిక్షణ పొందినవారు కేబిన్ సిబ్బంది పోస్టులకు దరఖాస్తు చేయవచ్చు. ఆరు నెలలు/ ఏడాది వ్యవధితో పలు ప్రైవేటు సంస్థలు ఈ కోర్సును అందిస్తున్నాయి. కొన్ని విమానయాన సంస్థలూ ఈ శిక్షణ అందించి, నేరుగా ఉద్యోగంలోకి తీసుకుంటున్నాయి.

పై మూడు మార్గాలూ నేరుగా వివిధ విమానయాన సంస్థల్లో పనిచేసేందుకు ఉద్దేశించినవి. విమాన రాకపోకలకు మౌలిక సదుపాయాలు కల్పించే ఎయిర్‌పోర్టులు, గ్రౌండ్ ఆపరేషన్స్ విభాగాల్లో సేవలందించే కొలువులూ ఉన్నాయి..

ఏవియేషన్, ఎయిర్‌పోర్ట్ మేనేజ్‌మెంట్

ఇందులో నేరుగా విమానాశ్రయ నిర్వహణలో పనిచేసే ఉద్యోగాలుంటాయి. అలాగే వివిధ విమానయాన సంస్థలు ఎయిర్‌పోర్టుల్లో నిర్వహించే కార్యకలాపాల్లో పాల్గొనే ఉద్యోగాలు యువతను ఆకర్షిస్తున్నాయి. ఈ హోదాలు పొందడానికి బీబీఏ- ఏవియేషన్ మేనేజ్‌మెంట్, బీఎస్సీ- ఏవియేషన్, ఎయిర్‌పోర్ట్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా, పీజీ కోర్సుల్లో ఏదైనా పూర్తి చేయాలి. దేశ వ్యాప్తంగా పలు సంస్థలు వీటిని అందిస్తున్నాయి.

కార్గోలోనూ అవకాశాలు

పౌర విమానయాన రంగంతో పాటు ఎయిర్ కార్గో (ఆకాశ మార్గాన సరకు రవాణా రంగం) కూడా శరవేగంగా వృద్ధి చెందుతోంది. సరకు రవాణా, నిర్వహణలో ఆసక్తి ఉన్న యువతకు మంచి అవకాశాలున్నాయి. కార్గో హ్యాండ్లింగ్ (సరకు నిర్వహణ), గ్రౌండ్ స్టాఫ్ (క్షేత్రస్థాయి సిబ్బంది), సరకు సరఫరా వ్యవస్థ పర్యవేక్షణలో వివిధ స్థాయి ఉద్యోగాలను విమానయాన సరకు రవాణా సంస్థలు అందిస్తున్నాయి.

క్షేత్రస్థాయి కార్యకలాపాల (ఆపరేషన్స్, గ్రౌండ్ కంట్రోల్ హ్యాండ్లింగ్) విభాగంలో కార్గో ఏజెంట్స్, లోడ్ ప్లానర్స్, స్టోరింగ్ బాధ్యతల నిర్వహణలో ఉద్యోగావకాశాలు తరచూ వస్తున్నాయి. అలాగే, కార్గో ఆపరేషన్స్ మేనేజర్లు, స్టోర్ ఎగ్జిక్యూటివ్స్, హెచ్.ఆర్. బిజినెస్ పార్టనర్స్ లాంటి హోదాలు కార్గో మేనేజ్‌మెంట్, అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఉంటున్నాయి. లాజిస్టిక్స్, సప్లయ్ చెయిన్ విభాగంలో సరకు రవాణా ప్రణాళిక, సమన్వయ బాధ్యతల పర్యవేక్షణకు భారీ ఎత్తున సిబ్బందిని తీసుకుంటున్నారు. సాధారణంగా ఈ హోదాలన్నిటికీ ఇంటర్ కనీస విద్యార్హత. ఉన్నత స్థాయి హోదాలకు డిగ్రీ కావాలి. అయితే విద్యార్హతలతో పాటు ప్రభావవంతమైన భావవ్యక్తీకరణ, పనివేళల రీత్యా షిఫ్టుల్లో పనిచేసే ఆసక్తి, సరకు రవాణా విషయంలో లోతైన పరిజ్ఞానం, రవాణా విధివిధానాలపై అవగాహన, లాజిస్టిక్స్ సాఫ్ట్‌వేర్ నైపుణ్యం ఉంటే కార్గో కంపెనీలు మంచి ప్యాకేజీ ఆఫర్ చేస్తున్నాయి.

ప్రతి రంగంలోనూ కృత్రిమ మేధ (ఏఐ) సింహభాగాన్ని ప్రభావితం చేస్తోంది. అయితే విమానయాన రంగంలో మాత్రం దాని పాత్ర సాంకేతిక విభాగాలకే పరిమితం. అందువల్ల ఇందులో ఏటా సిబ్బంది అవసరం పెరుగుతోంది. ఆసక్తి ఉన్నవారు విమానయాన రంగంలోకి నిశ్చింతగా ప్రవేశించి కెరియర్ పరంగా గగన వీధుల్లో విహరించవచ్చు.

యస్.వి. సురేష్
సంపాదకుడు,
ఉద్యోగ సోపానం

ఎంఏ లింగ్విస్టిక్స్ కోర్సు చదువుతున్నాను. ఇది పూర్తయిన తర్వాత ఎలాంటి ఉద్యోగాలు ఉంటాయి. **- జమీరుద్దీన్**

■ ఎంఏ లింగ్విస్టిక్స్ భాషను శాస్త్రీయంగా అధ్యయనం చేసే పీజీ ప్రోగ్రాం. ఇది భాషల నిర్మాణం, ఉచ్చారణ, అర్థం, సమాజంతో భాషల సంబంధం, భాషా సాంకేతికత లాంటి అంశాలపై లోతైన అవగాహనను అందిస్తుంది. ఈ కోర్సు పూర్తిచేసిన వారికి విద్య, పరిశోధన, పరిపాలన, మీడియా, ఐటీ లాంటి రంగాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి. భాషా శిక్షణ సంస్థల్లో ట్రెయినర్, కమ్యూనికేషన్ స్కిల్స్ కోచ్‌గానూ పనిచేయవచ్చు. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులుగా అవకాశాలుంటాయి. నెట్ లేదా సెట్ అర్హతతో డిగ్రీ కళాశాలల్లో, పీహెచ్‌డీ పూర్తిచేస్తే విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కొనసాగవచ్చు.

ఎంఏ లింగ్విస్టిక్స్‌తో ఎలాంటి ఉద్యోగాలు?

◗ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాషా పరిశోధనా సంస్థలు, సాహిత్య అకాడమీలు, భాషా సర్వే సంస్థల్లో రిసెర్చ్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ ఫెలో, భాషా శాస్త్ర నిపుణులుగా పనిచేయవచ్చు. నిఘంటు తయారీ, భాషా డాక్యుమెంటేషన్, అంతరించిపోతున్న భాషలపై పరిశోధన లాంటి రంగాల్లో లింగ్విస్టిక్స్‌కు ప్రాధాన్యం ఉంది.

ఎంఏ లింగ్విస్టిక్స్‌తో పాటు జర్నలిజం చదివితే మీడియా, ప్రచురణ రంగంలో సబ్ ఎడిటర్, కంటెంట్ రైటర్, స్క్రిప్ట్ రైటర్, ప్రూఫ్ రీడర్ లాంటి ఉద్యోగాలు లభిస్తాయి. పుస్తక ప్రచురణ సంస్థల్లో మాన్యుస్క్రిప్ట్ ఎడిటింగ్, ట్రాన్స్‌లేషన్ లాంటి పనులూ చేయవచ్చు.

◗ ప్రైవేటు రంగ ఉద్యోగాలతో పాటు కొన్ని ప్రభుత్వ ఉద్యోగాలూ ఎంఏ లింగ్విస్టిక్స్ విద్యార్థులకు అందుబాటులో ఉంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో అనువాదకులు, భాషా నిపుణులు, ప్రచార విభాగాల్లో కంటెంట్ ఆఫీసర్ లాంటి పోస్టులకు అర్హత ఉంటుంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్,
కెరియర్ కౌన్సెలర్

వీఎన్ఐటీలో ఉద్యోగాలు

విశ్వేశ్వరయ్య నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఎన్ఐటీ) నాగ్‌పూర్.. నాన్ టీచింగ్ విభాగాల్లో పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- లైబ్రేరియన్: 01
- సీనియర్ సైంటిఫిక్/టెక్నికల్ ఆఫీసర్: 02
- సైంటిఫిక్/టెక్నికల్ ఆఫీసర్: 03
- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్: 01 ● సూపరింటెండెంట్: 05
- లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్: 01
- జూనియర్ ఇంజినీర్: 01 ● టెక్నికల్ అసిస్టెంట్: 08
- సీనియర్ అసిస్టెంట్: 02 ● సీనియర్ టెక్నీషియన్: 03
- జూనియర్ అసిస్టెంట్: 03 ● టెక్నీషియన్: 10
- ఆఫీస్ అటెండెంట్/ల్యాబ్ అటెండెంట్: 05

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్మీడియట్, బ్యాచిలర్ డిగ్రీ, బీఈ/బీటెక్, ఎమ్మెస్సీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
వేతన శ్రేణి: నెలకు రూ.18,000- రూ.1,44,200.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 01.03.2026. **వెబ్‌సైట్:** https://vnit.ac.in/

హెచ్‌సీఎల్‌లో

హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ (హెచ్‌సీఎల్), కోల్‌కతా వర్క్ మెన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- వర్క్ మెన్: 18

అర్హత: పోస్టులను అనుసరించి పదోతరగతి, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీతో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: 01.01.2026 నాటికి 40 ఏళ్లు మించరాదు. ఎస్సీ, ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీకి మూడేళ్లు సడలింపు ఉంటుంది.
వేతన శ్రేణి: నెలకు రూ.28,120 - రూ.55,620.
దరఖాస్తు ఫీజు: రూ 500. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఫీజు లేదు.
ఎంపిక: రాత పరీక్ష, ట్రేడ్ టెస్టులతో
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 25.02.2026
వెబ్‌సైట్: https://www.hindustancopper.com/Page/Career_New

(c) eenadu

సైకత శిల్పాల ఏకలవ్యుడు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే

పట్టుదల, ఆసక్తి ఉండే సాధించలేనిది ఏదీ లేదు. అందుకు తార్కాణం ఎస్.రాయవరం మండలం వాకపాడు శివారు బంగారమ్మపాలెంకు చెందిన కారే స్టీఫెన్. ఈ యువకుడు సముద్రతీరంలో సైకత శిల్పాలు రూపొందించడంలో శభాష్ అనిపించుకుంటున్నాడు. ఎటువంటి శిక్షణ లేకుండా, చిత్రలేఖనంపై ఆసక్తితో ఈ కళను నేర్చుకోవడం విశేషం. గతేడాది డిసెంబర్‌లో ఒడిశాలోని ప్రముఖ పర్యాటక కేంద్రం కోణార్క్‌లో జరిగిన 15వ అంతర్జాతీయ సాండ్ ఆర్ట్ ఫెస్టివల్‌లో పాల్గొని అబ్బురపరిచే సైకత శిల్పాలను రూపొందించి రూ. 40 వేల నగదు బహుమతి అందుకున్నాడు.

ఒడిశాలో స్టీఫెన్ రూపొందించిన సైకత శిల్పం

బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన కారే సోమేష్, చిన్నతల్లి దంపతుల కుమారుడు స్టీఫెన్. ఇతనికి అక్క, తమ్ముడు ఉన్నారు. సోమేష్ మత్స్యకారుడు, చిన్నతల్లి గృహిణి. చిన్నప్పటి నుంచి పెన్సిల్ ఆర్ట్‌పై ఆసక్తి ఉన్న స్టీఫెన్ ఇంటర్ పూర్తిచేసి, చిత్రలేఖనంలో రెండేళ్ల శిక్షణ తీసుకున్నాడు. 2023లో ఒకరోజు స్నేహితులతో కలిసి గ్రామంలో తీరంలో ఉండగా, ఇసుకతో బొమ్మ రూపొందించడానికి ప్రయత్నించాడు. శిల్పానికి దేహం అనుకున్నట్లే వచ్చినా ముఖరూపు సరిగ్గా రాలేదు. దీంతో ఈ కళలో మరింత రాణించడానికి వీలుగా శిక్షణ తీసుకోవాలనుకున్నాడు. ఒడిశాలోని శిక్షణ కేంద్రానికి వెళ్లగా.. వయసు ఎక్కువగా ఉందని, శిక్షణ ఇవ్వడానికి నిరాకరించారు. అయినప్పటికీ నిరాశ చెందకుండా సొంతంగా సైకత శిల్పాలను మెరుగ్గా తయారు చేయడం నేర్చుకున్నాడు. తీరంలో గాలి తీవ్రత, వాతావరణ మార్పులు వంటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా, సహనంతో ఒక్కో శిల్పాన్ని సుమారు నాలుగు గంటలపాటు కష్టపడి రూపుదిద్దుతున్నాడు. స్వయంకృషితో ఈ కళపై మరింత పట్టు సాధించి గతేడాది డిసెంబర్‌లో కోణార్క్‌లో జరిగిన పోటీలో అందరి దృష్టిని ఆకర్షించాడు. ఇక్కడ ప్రముఖ సైకతశిల్పి సుదర్శన్ పట్నాయక్ ప్రశంసలు సైతం అందుకున్నాడు. ఇటీవల గ్రామంలో వల్లభేశ్వరస్వామి జాతర సందర్భంగా స్టీఫెన్ రూపొందించిన వల్లభేశ్వర స్వామి సైకత శిల్పం అందరినీ ఆకట్టుకుంది.

ప్రోత్సాహం అందించాలి

దేశ, విదేశాల్లో జరిగే సాండ్ ఆర్ట్ పోటీల్లో పాల్గొనాలనే కోరిక ఉంది. కానీ తగిన ప్రోత్సాహం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాను. పోటీల్లో పాల్గొనేందుకు ప్రభుత్వం ఆర్థికంగా సాయం అందిస్తే మన ప్రాంతం సత్తా చాటుతాను. ఈ కళలో మరింత మెరుగ్గా రాణిస్తూ, మరికొంతమందికి శిక్షణ ఇవ్వాలనేది లక్ష్యం. – స్టీఫెన్

అదరహో!
జిల్లావ్యాప్తంగా పలు పాఠశాలల్లో మంగళవారం వార్షికోత్సవాలు సందడిగా నిర్వహించారు. బాలికలు సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. నాతవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి ఆడిపాడారు. – నాతవరం, న్యూస్‌టుడే

పారిశ్రామిక శోభ

పరిశ్రమల ఏర్పాటులో భాగంగా నక్కపల్లి మండలంలో చేపడుతున్న మౌలిక సదుపాయాల కల్పన మొదటి దశ పనులు జోరుగా సాగుతున్నాయి. దాదాపు ఏడాది కాలంలో మూడొంతులకుపైగా ప్రధాన పనులు పూరిచేశారు. ప్రస్తుతం చేసిన పనులతో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోయాయి.

నక్కపల్లి, న్యూస్‌టుడే

రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, అమలాపురం, డీఎల్‌పురం, చందనాడ తదితర గ్రామాల పరిధిలో పరిశ్రమల నిమిత్తం దాదాపు 4300 ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. వీటిని ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్, బల్క్‌డ్రగ్ పార్కుకు ప్రభుత్వం కేటాయించింది. ఏడాది క్రితం బల్క్‌డ్రగ్ పార్కుకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయగా, అప్పటినుంచి మౌలిక సదుపాయాల కల్పన పనులు మొదలయ్యాయి. ఇక్కడ మూడు దశల్లో పనులు చేయడానికి వీలుగా ఏపీఐఐసీ దాదాపు రూ. 511 కోట్లు కేటాయించింది. తొలిదశలో భారీ రహదారులు, కాలువలు, పరిపాలన భవనాలు, వంతెనలు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు, తాగునీటి పైపుల తదితర పనులు చేపట్టారు. ప్రస్తుతం ఈ పనులన్నీ చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటికే రహదారులు, కాలువల నిర్మాణాలు 95 శాతానికి పైగా పూర్తి చేశారు. డీఎల్‌పురం మొదలుకుని రాజయ్యపేట వరకు చేపట్టిన పనులతో ఈ ప్రాంతం గుర్తుపట్టలేని విధంగా కొత్త

బోయపాడు వద్ద రహదారుల కూడలి

శోభను సంతరించుకుంది. సగటున ప్రతి రోడ్డు దాదాపు 100 అడుగుల వెడల్పుతో ఉంది. మూడు అడుగుల వెడల్పున కాలువలు నిర్మించారు. అమలాపురం, మూలపర్ర, డీఎల్‌పురం ప్రాంతాల్లో ఉప్పుటేరును దాటేందుకు వీలుగా చేపట్టిన నాలుగు వంతెనలు వేగంగా నిర్మిస్తున్నారు. ఒక్కో వంతెన 20 అడుగుల ఎత్తు, 50 అడుగుల వెడల్పు ఉండగా.. 75 మీటర్ల పొడవుతో రెండు, 100 మీటర్లు, 110 మీటర్లు చొప్పున ఒక్కోటి కడుతున్నారు. ఇవి సగానికిపైగా పూర్తి చేశారు. రాజయ్యపేట, బోయపాడు సమీపంలో పరిపాలన భవనాల పనులు చేస్తున్నారు. దీంతో పాటే తాగునీటి ట్యాంకుల నిర్మాణం సాగుతోంది. ఒక్కోటి సుమారు 30 లక్షల లీటర్ల సామర్థ్యంలో డీఎల్‌పురం, రాజయ్యపేటలో నిర్మిస్తున్నారు. మరో రెండు నిర్మాణాలు మొదలు కావల్సి ఉంది.

జరుగుతున్న పనులిలా..

రోడ్ల పొడవు: 16.2 కిలోమీటర్లు
పూర్తి చేసింది: 15.5 కిలోమీటర్లు

కాలువల పొడవు: 32.4 కిలోమీటర్లు
పూర్తి చేసింది: 31 కిలోమీటర్లు

తాగునీటి పైపులైను నిర్మాణం: 32.4 కిలోమీటర్లు
పూర్తి చేసింది: 23.1కిలోమీటర్లు

వాటర్ ట్రీట్మెంట్ ప్లాంటు సామర్థ్యం: 3.1 కోట్ల లీటర్లు
పని జరిగింది: 60 శాతం

వంతెనలు: 4
పని పూర్తి: 50శాతం

తాగునీటి ట్యాంకులు: 4
పనులు జరుగుతున్నవి: 2

మార్చికి తొలిదశ పూర్తి

ప్రభుత్వ ఆదేశాలతో మౌలిక సదుపాయాల పనులు యుద్ధప్రాతిపదికన చేయిస్తున్నాం. గతంలో ఆందోళన కారణంగా కొంత జాప్యం జరిగింది. ప్రస్తుతం చేస్తున్న తొలి దశ పనులు మార్చికి పూర్తి చేసే లక్ష్యంతో సాగుతున్నాం. – **నరసింహారావు, ఏపీఐఐసీ జెడ్.ఎం.**

వసతిగృహ విద్యార్థులూ.. 'విజయీభవ'

నర్సీపట్నం, న్యూస్‌టుడే

పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతోంది. ఈసారి శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్న లక్ష్యంతో పాఠశాలల్లో ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తూ తరగతులు నిర్వహిస్తున్నారు. వసతిగృహాల్లోనూ ఉత్తీర్ణత శాతం వందకు తగ్గకుండా ఉండేందుకు సంక్షేమాధికారులు ప్రయత్నిస్తున్నారు. విద్యార్థుల్లో పరీక్షలంటే భయం, ఒత్తిడిని తగ్గించేందుకు వసతిగృహాల్లో 'విజయీభవ' కార్యక్రమానికి సన్నాహాలు చేస్తున్నారు.

✦ ఏటా సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో పదో తరగతి పరీక్షలకు ముందు ఈ కార్యక్రమం చేపడుతున్నారు. ఈ ఏడాది ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలన్న లక్ష్యంతో విజయీభవకు ప్రాధాన్యం పెరిగింది. విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు దోహదపడేలా కార్యక్రమం అమలుకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి.

నర్సీపట్నం హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులు

✦ జిల్లాలోని 19 హాస్టళ్లలో 367 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. వీరికి వంద రోజుల ప్రణాళిక అమలవుతోంది. ఇందులో భాగంగా ఎ, బి, సి, డి గ్రేడులుగా విభజించారు. రాత్రి 10.00 గంటల వరకు, వేకువజామున 5 గంటల నుంచి చదివిస్తున్నారు. కలెక్టర్, సంబంధిత అధికారులు ప్రత్యేక తరగతులను రోజూ జూమ్‌లో పర్యవేక్షిస్తున్నారు. గ్రేడు 'డి'లో 60 మంది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో వారంతా 'సి' గ్రేడులోకి వచ్చారని చెబుతున్నారు. పరీక్షల నాటికి వీరంతా 'బి' గ్రేడులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.

✦ విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేసే చర్యలు సంతృప్తికరంగా ఉన్నా.. వారిలో నెలకొన్న భయం, ఒత్తిడి ఆందోళనకు గురిచేస్తోంది. పరీక్షలు సమీపిస్తుండటంతో కొందరు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. అభద్రతా భావం పెరుగుతోంది. వీటన్నింటిని నుంచి బయటపడేసి పరీక్షలు బాగా రాసేలా ఫిబ్రవరి మొదటి వారంలో విజయీభవ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. విద్యార్థులందరికీ పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, స్టేషనరీ అందజేయనున్నారు. పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి, మానసిక ప్రశాంతతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చదివింది మరిచిపోకుండా ఉండటం తదితర అంశాలపై కౌన్సిలింగ్ ఇవ్వనున్నట్లు సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి రామానందం పేర్కొన్నారు.

తొలి ఉత్సవం.. కొత్త ఉత్సాహం

అచ్యుతాపురం, నెహ్రూచౌక్, (అనకాపల్లి) న్యూస్‌టుడే:

జిల్లా ఏర్పడిన తరవాత మొదటిసారిగా జరుగుతున్న అనకాపల్లి ఉత్సవాలకు అధికారులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 30, 31 తేదీల్లో జరగనున్న ఉత్సవం ప్రజల గుండెల్లో నిలిచిపోయే విధంగా నిర్వహించేందుకు యంత్రాంగం సంసిద్ధమైంది. వేడుకల ప్రారంభానికి కొండకర్ల ఆవ వేదిక కానుంది. సహజసిద్ధ అందాలతో ఉన్న ఈ ఆవ వద్ద చకచకా పనులు చేపడుతున్నారు. ఆవ వద్ద నీటిపై తేలియాడే రబ్బరు వంతెనను ముస్తాబు చేస్తున్నారు. పువ్వుల ప్రదర్శన, బాణసంచా వెలుగులు, ఫుడ్‌స్టాల్స్, బోటు షికారు, పిల్లల ఆటప్రాంగణం, ఆవ చరిత్రను వివరించే గైడ్లు, ఫొటో గ్యాలరీలు, ప్రవేశ ద్వారాన్ని నిర్మిస్తున్నారు. వీటితోపాటు కేరళ తరహా బోట్లను రప్పిస్తున్నారు. వీటిని ఆవ మధ్యలో ఉంచి పర్యాటకులకు కొత్త అనుభూతిని కల్పించనున్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు.

కొండకర్ల వద్ద నీటిపై తేలియాడే రబ్బరు వంతెన

● పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం సముద్ర తీరంలో సేదతీరడానికి సాయంకాల కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ సముద్రంలో క్రీడలను నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన స్పీడ్ బోట్లను తీసుకొస్తున్నారు. బీచ్‌వాలీబాల్, కబడ్డీ పోటీలను ఏర్పాటు చేశారు. గృహ, ఆట వస్తువులు, రుచికరమైన ఆహార పదార్థాలను విక్రయించే స్టాల్స్‌ను తీరంలో ఏర్పాటు చేయనున్నారు. స్వీయచిత్రాలను తీసుకోవడానికి ప్రత్యేక బూత్‌లను ఏర్పాటు చేశారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా బయో టాయిలెట్లను సిద్ధం చేస్తున్నారు.

● అనకాపల్లిలో ఉత్సవాల ముగింపు సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియంలో సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 10 గంటలవరకు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్నివాల్స్‌తో పాటు యువతీ, యువకుల ప్రతిభను ప్రోత్సహించే కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులకు ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవాన్ని విజయవంతం చేయడానికి ఒక్కో విభాగానికి ఒక్కో అధికారిని పర్యవేక్షకులుగా నియమించారు. పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, తాగునీరు, రవాణా, రోడ్లు, సాంస్కృతిక కార్యక్రమాలకు బాధ్యతలు అప్పగించి ఎక్కడా ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి... కొండకర్ల ఆవకు ఒక వాహనం వెళ్తే మరో వాహనం తప్పుకోవడానికి వీలులేకుండా ఆవకు రోడ్డు ఉంది. ఉత్సవాల సందర్భంగా కొంతవరకు రోడ్డు పక్క తుప్పలు తొలగించినా వందల సంఖ్యలో వచ్చే వాహనాలకు సరిపోయే పరిస్థితి లేదు. ప్రస్తుతం ఉన్న 10 అడుగుల సిమెంటు రోడ్డుకు రెండువైపులా మట్టితో అంచులను తూతూమంత్రంగా పూడ్చించారు. వాహనం రోడ్డు అంచు దిగితే పైకి రావడానికి వీలులేకుండా ఉంది. వాహనాల పార్కింగ్‌కు సువిశాల స్థలాన్ని గుర్తించాలి. ఆవలో రబ్బరు వంతెనపైకి కేసారి ఎక్కువ మంది చేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

భూముల మార్కెట్ విలువ పెంపునకు సన్నద్ధం!

నర్సీపట్నం అర్బన్, మాకవరపాలెం, న్యూస్‌టుడే: భూముల మార్కెట్ విలువలు పెరగనున్నాయి. పెరిగిన ధరలు ఫిబ్రవరి ఒకటి నుంచి అమలు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో క్షేత్ర పరిశీలన చేసి ఎక్కడెక్కడ ఎంత సవరించాలన్నది అంచనాకు వచ్చారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులతో కూడిన కమిటీ ఆమోదానికి పంపారు. అభ్యంతరాలేవీ రాకుంటే ఈ ప్రతిపాదనలకు ఆమోదం లభించనుంది. నర్సీపట్నం మున్సిపాలిటీలో మార్కెట్ విలువ 13 నుంచి 20 శాతం పెంచారు. పెదబొడ్డేపల్లి, బలిఘట్టం, నర్సీపట్నం పరిధిలోని కొన్ని ప్రదేశాల్లో ఇటీవల కాలంలో వాణిజ్యం గణనీయంగా పెరిగింది. ఇలాంటి చోట్ల విలువ అధికంగా పెంచారు.

★ రోలుగుంట మండలంలో 13 శాతం, గొలుగొండ మండలంలో 14 శాతం, మాకవరపాలెం మండలంలో నాలుగు, రావికమతం మండలం ఏడు గ్రామాల్లో పది శాతం చొప్పున సవరించారు.

★ నర్సీపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఏటా రూ. 22 కోట్ల నుంచి రూ. 24 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. తాజా పెంపుదల వల్ల కనీసం రూ. ఐదు కోట్ల వరకు ఆదాయం పెరుగుతుందని అంచనా.

★ గతంలో భూముల మార్కెట్ విలువలు పెరుగుతున్నాయంటే వారం, పది రోజుల ముందు నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కిటకిటలాడుతుంది. ఈసారి అలాంటి సందడేమీ కనిపించడం లేదు. కొంతకాలంగా భూముల కొనుగోళ్లు పెద్దగా లేకపోవడమే ఇందుకు కారణంగా కనిపిస్తోంది. మార్కెట్ విలువల పెంపు నిర్ణయాన్ని కొన్నినెలల పాటు వాయిదా వేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అష్టదిగ్బంధంలో అచ్యుతాపురం

అచ్యుతాపురం అష్టదిగ్బంధంలో చిక్కుకుంది. పైవంతెన నిర్మాణ పనుల కారణంగా ఇప్పుడు కూడలి దాటి వెళ్లడం పెద్ద పరీక్షలా మారింది. నెలన్నర క్రితం ప్రత్యేక ఆర్థిక మండలి రోడ్డు మూసివేశారు. ఇప్పుడు అనకాపల్లి వైపు రోడ్డునూ పూర్తిగా మూసేశారు.

స్టాపర్లను రోడ్డుకు అడ్డంగా పెట్టి మూసివేసిన సెజ్, అనకాపల్లి రోడ్డు

కనీసం ద్విచక్రవాహనాలు, పాదచారులు సైతం వెళ్లడానికి అవకాశం లేకుండా చేశారు. ఇప్పుడు అనకాపల్లి నుంచి ప్రత్యేక ఆర్థిక మండలికి వెళ్లేవారు కూడలి దాటడానికి 3 కిలోమీటర్లు చుట్టూతిరిగి ప్రయాణం చేయాల్సి వచ్చింది. దీంతోపాటు అచ్యుతాపురం-కొండకర్ల మధ్య చెట్లను తొలగించి మరోప్రాంతానికి తీసుకెళ్లే పనుల కారణంగా సగం రహదారి మూసేశారు. మదుతూరు, కొండకర్ల, బంగారయ్యపాలెం వద్ద భారీగా ట్రాఫిక్ స్తంభించి కంపెనీల ఉద్యోగులు రాత్రి 11 గంటలు దాటినా అచ్యుతాపురం దాటలేకపోయారు. పైవంతెన పనుల వల్ల ట్రాఫిక్ స్తంభిస్తుందని ముందుగానే ఊహించినా ప్రత్యామ్నాయ మార్గాలు సిద్ధం చేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.
– అచ్యుతాపురం, న్యూస్‌టుడే

31న గవరపాలెం గౌరీపరమేశ్వరుల జాతర

అనకాపల్లి, న్యూస్‌టుడే: ఈనెల 31న గవరపాలెం శ్రీగౌరీపరమేశ్వరుల జాతర నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ఛైర్మన్ కొణతాల సంతోష అప్పారావు నాయుడు తెలిపారు. దీనికి సంబంధించిన గోడ ప్రతులను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ కొణతాల మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్సవంలో 45 స్టేజ్ ప్రోగ్రాంలు ఏర్పాటు చేశామన్నారు. కోల్‌కతా విద్యుత్తు అలంకరణ, బాణాసంచా విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయని తెలిపారు. ఈనెల 28న వందలాది పిండివంటలతో అమ్మవారికి సారె ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఈనెల 29న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని చెప్పారు. గవరపాలెం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో ఉదయం 8 గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశంలో కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, ప్రతినిధులు పి.వి.రమణ, దాడి కృష్ణ, సూరిశెటి నరసింగరావు, కొణతాల మహాలక్ష్మినాయుడు, పెంటకోట వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

గోడపత్రిక విడుదల చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

చూపండి స్థలాలు.. మోగేను గుడిగంటలు

ఆలయాల నిర్మాణానికి టీటీడీ ఆర్థిక సాయం

నర్సీపట్నం, న్యూస్‌టుడే

గ్రామాల్లోని కాలనీల్లో ఆలయాల నిర్మాణానికి రంగం సిద్ధమవుతోంది. గ్రామ గ్రామాన ప్రజల్లో భక్తి భావానికి తోడు శాంతి సామరస్యాలు వృద్ధి చెందేలా తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఈ గుడులకు ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ప్రజా ప్రతినిధులు, దాతలు వీటి కోసం స్థలం కేటాయిస్తే తక్షణం సొమ్ము మంజూరు కానుంది. స్థలం ఎక్కువ ఉంటే రూ. 20 లక్షల వరకు సాయం అందుతుంది. వీటిపై అందిన మార్గదర్శకాలతో ఇప్పటికే దేవాదాయశాఖ అధికారులు ఎమ్మెల్యేల సహకారంతో అనువైన స్థలాల సేకరణకు సన్నాహాలు చేస్తున్నారు.

▌ తితిదే ఆధ్వర్యంలో శ్రీవాణి భజన మండపం పథకం కింద గ్రామానికి ఒకటి చొప్పున ఈ గుడులు నిర్మించనున్నారు. గత నవంబరు నెలలో దీనికి సంబంధించిన ఆదేశాలు అధికారులకు అందాయి. వీటిలో ప్రత్యేక నమూనా పొందుపరిచారు. ఇందులో ఆలయానికి అందజేసే స్థలం, గ్రామం తదితర అన్ని వివరాలు పేర్కొంటూ ప్రతిపాదనలు పంపాల్సిందిగా కోరారు. ఇవి తప్పనిసరిగా ఎమ్మెల్యేల అనుమతితో మాత్రమే మంజూరు కానున్నాయి. దాతలు సైతం ముందుకు వచ్చి స్థలాల ప్లాన్లు, జీపీఎస్ ఫొటోలతో శాసన సభ్యుల లేఖను జత చేసి ఇవి పంపవచ్చు. గ్రామకంఠాల్లోని స్థలాలకు ప్రాధాన్యం లభిస్తుంది.

▌ గ్రామాల్లోని ఎస్సీ, బీసీ, మత్స్యకార కాలనీల్లో ఇవి నిర్మించాల్సి ఉంది. హిందూ దేవతలైన శ్రీ వేంకటేశ్వరుడు, శ్రీరాముడు, శివుడు, ఇతర గ్రామ దేవతల గుడులను ఈ పథకం కింద నిర్మించుకోవచ్చు. స్థలం అయిదు సెంట్ల వరకు ఉంటే ఆలయం కట్టడానికి రూ. 10 లక్షలు, ఎనిమిది సెంట్ల కంటే ఎక్కువుంటే రూ. 15 లక్షలు, పది సెంట్లకు మించి ఉంటే రూ. 20 లక్షల వరకు తితిదే సొమ్ము మంజూరు చేయనుంది. వైకాపా హయాంలో రూ. పది లక్షల రూపాయల చొప్పున మాత్రమే నిధులు అందజేశారు. వీటితో జిల్లాలో చేపట్టిన సుమారు 200 గుడుల పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. జిల్లాలోని ఎమ్మెల్యే అందరితోనూ వీటి గురించి చర్చించి సహకారం కోరామని జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ **సుధారాణి** తెలిపారు. ముందుకు వచ్చే దాతలు తమను సంప్రదించవచ్చని చెప్పారు.

కాంక్రీట్ నీళ్లపాలు.. నాణ్యత నవ్వులపాలు!

పిక్క, సిమెంట్ కలిపిన కాంక్రీట్ వేసేటపుడు కాలువలో నీరు లేకుండా చూసుకోవాలి. కాలువలో నిండా నీరున్నా తోడకుండా.. అందులో కాంక్రీట్ పోస్తూ పనులు చేయడం మాత్రం చోడవరంలోనే కనిపిస్తుంది. చోడవరం నుంచి లక్ష్మీపురం వెళ్లే మార్గంలో రహదారికి ఇరువైపులా ప్రస్తుతం సీసీకాలువల నిర్మాణం చేపట్టారు. తవ్విన మట్టి మళ్లీ కాలువలో పడుతున్నా, అందులో నీరు నిల్వ ఉన్నా ఏ మాత్రం లెక్క చేయకుండా పనులు చేసుకుంటూ పోతున్న గుత్తేదారు తీరుపై స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం గమనార్హం.
– చోడవరం, న్యూస్‌టుడే

వెంకన్న ఆలయ ప్రధానార్చకుడికి మెమో

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాక వెంకన్న ఆలయ ప్రధానార్చకుడికి తిరుమల తిరుపతి దేవస్థానం ఏఈఓ మెమో జారీ చేశారు. మంత్రి అనిత ఉపమాక వెంకన్న ఆలయానికి సమీక్ష నిమిత్తం సోమవారం రాగా, ప్రధానార్చకుడు రాకపోవడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో దీనిపై వివరణ కోరుతూ పై అధికారులు ప్రధానార్చకుడికి మెమో ఇచ్చారు. మంత్రి సమీక్షకు వచ్చినప్పుడు అధికారుల నుంచి ఎలాంటి అనుమతి లేకుండా సెలవు తీసుకోవడంపై మూడు రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని స్పష్టం చేశారు.

సోముదేవుపల్లి గట్టు నిర్మాణానికి రూ. 9.95 కోట్లు

కోతకు గురైన సోముదేవుపల్లి గట్టు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఎస్.రాయవరం మండలం పెనుగొల్లు శివారు సోముదేవుపల్లి వద్ద ఆరేళ్ల క్రితం కోతకు గురైన వరాహ నది కుడిగట్టు పటిష్ఠతకు నిధుల మంజూరుకు పరిపాలన అనుమతులు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గట్టు పటిష్ఠతకు భారీ నిధులు అవసరం కావడంతో మంత్రి అనిత తన పరిధిలోని విపత్తుల నిర్వహణ శాఖ ద్వారా నిధుల మంజూరుకు జలవనరుల శాఖకు ప్రతిపాదనలు పంపించారు. దీంతో గట్టు నిర్మాణానికి ఎస్‌డీఎంఎఫ్ నిధులు రూ. 9.95 కోట్ల మంజూరుకు పరిపాలనా అనుమతులు ఇస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి జి. సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయం ప్రిన్సిపల్ రాజేశ్వరి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2013 సెప్టెంబర్ 1 నుంచి 2017 ఆగస్టు మధ్య.. బీసీ, ఓసీ విద్యార్థులు 2015 సెప్టెంబర్ 1 నుంచి 2017 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ / గుర్తింపు పొందిన పాఠశాలల్లో నాలుగో తరగతి చదువుతున్న వారు, పదో తరగతి రెగ్యులర్ విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఐదో తరగతిలో 80 సీట్లు, ఇంటర్మీడియట్ ఎంపీసీలో 40, బైపీసీలో 40 సీట్లు ఉన్నాయన్నారు. మార్చి 1న ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఆసక్తి ఉన్న ఫిబ్రవరి 19లోగా ఆన్‌లైన్‌లో చేసుకోవాలని సూచించారు. సమీపంలోని గురుకుల విద్యాలయాల్లో సంప్రదించినా దరఖాస్తు చేసేందుకు సిబ్బంది సహకారం అందిస్తారని పేర్కొన్నారు.

(c) eenadu

అనకాపల్లి ఉత్సవాలు విజయవంతం చేయండి

ఏర్పాట్లు పరిశీలిస్తున్న అయ్యన్న, కొణతాల, కలెక్టరు

అనకాపల్లి, న్యూస్‌టుడే: ఈనెల 30, 31 తేదీల్లో తొలిసారిగా అనకాపల్లి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఉత్సవాలు నిర్వహించే ఎన్టీఆర్ బెల్లం మార్కెట్, ఎన్టీఆర్ ఆటస్థలం ప్రాంతాలను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కలెక్టరు విజయకృష్ణన్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావుతో కలిసి ఆయన పరిశీలించారు. అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లాలోని మూడు ప్రాంతాల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మార్కెట్ యార్డులో పుష్పప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. ఎన్టీఆర్ ఆటస్థలంలో 30న సినీ గాయని సునీత, 31న రామ్ మిరియాల సంగీత విభావరి, స్థానిక కళాకారులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. రోజు సాయంకాలం 7.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కార్యక్రమాలు ఉంటాయన్నారు. నూకాలమ్మ ఆశీస్సులతో ఇక్కడి నుంచి ప్రదర్శనగా బయలుదేరి ఉత్సవాలను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో పర్యాటకశాఖ ప్రాంతీయ సంచాలకురాలు కల్యాణి, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, ఆర్డీఓ ఆయిషా, డీఎస్పీ శ్రావణి, జోనల్ కమిషనర్ చక్రవర్తి పాల్గొన్నారు.

అచ్యుతాపురరం: ప్రజలంతా ఆనందంగా, హాయిగా జీవించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఉత్సవాలను నిర్వహిస్తోందని అయ్యన్న అన్నారు. కొండకర్ల ఆవలో అనకాపల్లి ఉత్సవాల ఏర్పాట్లను మంగళవారం కలెక్టర్ విజయకృష్ణన్, ఎలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్‌తో కలిసి పరిశీలించారు. స్థానికత ఉట్టిపడేలా ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. నాయకులు రాజాన సన్యాసినాయుడు, గొంతిన భక్తసాయిరాం, జనపరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టాక్‌టైమ్ చాలా మిగిలిపోయింది

కొండకర్ల ఆవలో ఉత్సవ ఏర్పాట్లను సభాపతి అయ్యన్నపాత్రుడు పరిశీలిస్తున్న సందర్భంగా శాసనసభ సమావేశాలపై అయ్యన్న, ఎమ్మెల్యే విజయకుమార్ మధ్య సరదా సంభాషణ కలెక్టర్ విజయకృష్ణన్‌తోపాటు పలువురిని నవ్వించింది. సభలో ఎంత టైమ్ ఇచ్చినా ఇంకా ఏదో మాట్లాడుతానని రెడీ అయిపోతావ్ ఎందుకని ఎమ్మెల్యేను స్పీకర్ ప్రశ్నించారు. నియోజకవర్గం ఏర్పడిన తరవాత 40 ఏళ్లపాటు ఎమ్మెల్యేలు ఏమీ మాట్లాడకుండా ఉండిపోయారని, చాలా టాక్‌టైమ్ మిగిలిపోయిందన్నారు. వారందరి టాక్‌టైమ్ తనకు బదిలీ అయ్యిందని అందుకే మాట్లాడుతున్నానని ఎమ్మెల్యే బదులివ్వడంతో అంతా ఒక్కసారిగా నవ్వుకున్నారు.

అందరి సంక్షేమమే లక్ష్యం

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అందరి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ పక్కాగా నిబంధనలు పాటించాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కలెక్టర్ విజయ్‌కృష్ణన్ కోరారు. అనకాపల్లిలో మంగళవారం ఆర్టీసీ, రవాణా, పోలీస్ శాఖల సంయుక్త నిర్వహణలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన రహదారి భద్రతా వాక్‌థాన్ 2026ను ప్రారంభించి సామూహిక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబంధనలు పాటించడంతో పాటు వాటిని పర్యవేక్షిస్తున్న వ్యవస్థలకు సహకరించాలని కోరారు. నిబంధనల అమల్లో అధికారులు కఠినంగా ఉండాలన్నారు. లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులను కోరారు. పిల్లలకు వాహనాలు కొనే సమయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రయాణాలు ప్రమాదాలకు దారితీయకుండా చూసుకోవాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్టు వినియోగించాలన్నారు. డ్రైవింగ్‌లో సెల్‌ఫోన్ వినియోగించొద్దని, మన వల్ల, మన వాహనం వల్ల ఇతరులకు ఎటువంటి హాని, ఇబ్బంది లేకుండా చూసుకోవాలని బాధ్యత అందరిపై ఉందన్నారు. గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, రవాణా సీఐ ప్రేమ్‌కుమార్, జిల్లా ప్రజారవాణా అధికారి ప్రవీణ, ఆర్టీసీ, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్.ఒ.సి.నెం: 91/2025/ఎ1 తే. 27-01-2026 దీ.

బహిరంగ వేలం ప్రకటన

యలమంచిలి పురపాలక సంఘం

యలమంచిలి పురపాలక సంఘంనకు సంబంధించిన 2026-2027 సం॥నకు అనగా తే. 01.04.2026 నుండి తే. 31.03.2027దీ ఈ దిగువ తెలిపిన గుత్తలు తే. 04-02-2026దీ ఉదయం 11.30 గం॥లకు కమిషనరు వారిచేగాని, లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని పురపాలక సంఘం ఆవరణలో బహిరంగ వేలం వేయబడును. హెచ్చుపాటపై మొత్తం పాటపై 18% జి.ఎస్.టి చెల్లించవలెను. వేలంపాటలో పాల్గొనదలచిన వారు నిర్ణీత సమయంలో డిపాజిట్ చెల్లించి మరియు సాల్వెన్సీ సర్టిఫికెట్‌తోపాటు ఇ.సి ఒరిజినల్ డాక్యుమెంట్స్ దాఖలు చేసి [illegible]

క్ర.సం	వేలం వివరము	ధరావత్తు రూ॥లు	పాట్యేచిన ప్రభుత్వ పత్రం
1	కోలాటాని వారపు సంత మరియు పచ్చల సంత ఆశీలు వసూలు చేసుకొను హక్కు తేది.01-04-2026 నుండి 31-03-2027 వరకు	రూ॥ 5,00,000/-	రూ॥ 5,00,000/-
2	మేకల కబేళాలో ఆశీలు వసూలు చేసుకొను హక్కు తేది.01-04-2026 నుండి 31-03-2027 వరకు	రూ॥ 10,000	రూ॥ 20,000/-

షరతులు: [illegible]

కమీషనరు యలమంచిలి పురపాలక సంఘం.

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – తాడికొండ

బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజినల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET

Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) NECC

Hospitality Partner: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS

Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)

Man of the Series: Hero

Digital Partner: ఈనాడు.నెట్ ETV BHARAT

TV Partner: ETV ఆంధ్రప్రదేశ్

Organised by ఈనాడు ఉత్సవం క్లబ్

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - I జూనియర్స్ : మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్స్‌లతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులు చేసి ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - I జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సులతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

సీనియర్స్ విన్నర్స్ రాయలసీమ రాకర్స్

గ్రౌండ్-2లో సీనియర్స్ : సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ చరణ్ జిత్ ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-I (జూనియర్స్)

మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్

మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)

మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్

మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

బ్యాంకు ఉద్యోగుల ధర్నా

కొత్తూరు, లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: వారానికి ఐదు రోజుల పనిదినాలను తక్షణం అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో అనకాపల్లి భారతీయ స్టేట్‌బ్యాంకు ప్రధాన శాఖ, యూనియన్ బ్యాంకు వద్ద ప్లకార్డులతో మంగళవారం ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కాండ్రేగుల హరికృష్ణ మాట్లాడుతూ జాతీయ బ్యాంకుల్లో సుమారు రెండు లక్షలకు పైగా ఖాళీలను భర్తీ చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల భద్రత, పదోన్నతులకు చర్యలు తీసుకోవాలన్నారు. 12వ వేతన ఒప్పందాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు. సంఘ ప్రతినిధులు గోపి, శ్రీదేవి, రమణమూర్తి, శ్రీనివాస్, అప్పారావు, రాము, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ వద్ద నిరసనలో బ్యాంకు ఉద్యోగులు

పుణ్యస్నానాలకు పక్కాగా ఏర్పాట్లు

తీరంలో ఏర్పాట్లపై చర్చిస్తున్న అధికారులు, నాయకులు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: రేవుపోలవరం తీరంలో ఆదివారం జరిగే మాఘపౌర్ణమి పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు కల్పించాల్సిన ఏర్పాట్లపై మండల స్థాయి అధికారులు మంగళవారం సమీక్షించారు. తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీఓ మీనా కుమారి, ఎస్సై విభీషణరావు, తెదేపా మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, కొరుప్రోలు పీఏసీఎస్ ఛైర్మన్ గుర్రం రామకృష్ణ తీరంలో పర్యటించారు. పడవలు, గజ ఈతగాళ్లు, విద్యుద్దీపాలు, తాగునీరు, బయో మరుగుదొడ్లు, మహిళలు దుస్తులు మార్చుకోవడానికి గదులు, వైద్య శిబిరాలు, పోలీసు కంట్రోల్ రూం ఏర్పాటు, వాహనాల పార్కింగ్‌పై చర్చించి, ఆయా శాఖల అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ ఆదినారాయణ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రయోజనాలకు పెద్దపీట

పాయకరావుపేట, న్యూస్‌టుడే: విద్యార్థుల ప్రయోజనాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెదేపా మండల శాఖ అధ్యక్షుడు చించలపు ప్రదీప్ అన్నారు. పట్టణంలోని కె.హెచ్.వాడ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం వీటిని అందజేశారు. సైకిళ్లను హోంమంత్రి వంగలపూడి అనిత సమకూర్చిన విషయం తెల్సిందే. కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు, నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విలియంకేరీ, తెదేపా పట్టణ శాఖ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు పాల్గొన్నారు.

సైకిళ్లు అందజేస్తున్న నాయకులు

చురుగ్గా ఓటర్ల మ్యాపింగ్

కలెక్టరేట్, న్యూస్‌టుడే: గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు పోలింగ్ బూత్ ఏజెంట్లను నియమించి ఆ వివరాలను అందజేయాలని జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల జాబితా నవీకరణ ప్రక్రియపై నిర్వహించిన సమావేశంలో డీఆర్‌ఓ మాట్లాడారు. జిల్లాలో 1529 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, ప్రతిచోటా ఏజెంట్‌ను నియమించాలన్నారు. ప్రస్తుతం ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ వేగంగా జరుగుతోందన్నారు. ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపులు, సవరణల విషయంలో బూత్ అధికారులతో సమన్వయంతో ఉండాలన్నారు. జిల్లాలో 12,98,331 మంది ఓటర్లు కాగా, వీరిలో పురుషులు 6,31,486, స్త్రీలు 6,66,816.. ట్రాన్స్‌జెండర్స్ 29 మంది ఉన్నారని తెలిపారు. 7542 మందిని నూతన ఓటర్లుగా చేర్చామన్నారు. అనంతరం ఎస్పీ కార్యాలయం ఆవరణలో ఉన్న ఈవీఎం గోదాంను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఉప తహసీల్దార్ ముజీర్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్వో సత్యనారాయణ

నేడు 'భారత్- న్యూజిలాండ్' టీ-20 మ్యాచ్

సాధనలో పాల్గొన్న అక్షర్‌పటేల్, అర్షదీప్‌సింగ్

విశాఖక్రీడలు, న్యూస్‌టుడే : 'భారత్- న్యూజిలాండ్' జట్ల మధ్య నాలుగో టీ-20 మ్యాచ్ బుధవారం నగరంలోని ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ★ మంగళవారం స్టేడియంలో, 'బి' మైదానంలో క్రికెటర్లు సాధన చేశారు. తక్కువ ధర కలిగిన టికెట్లు దాదాపుగా అమ్ముడయ్యాయని, అధిక ధర కలిగిన టికెట్లు కొన్ని మాత్రమే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని ఏసీఏ వర్గాలు పేర్కొన్నాయి.

★ మ్యాచ్ సందర్భంగా బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ట్రాఫిక్ మళ్లింపు అమల్లో ఉంటుందని, వాహనదారులు సహకరించాలని పోలీసులు సూచించారు. మ్యాచ్ వీక్షించడానికి వచ్చే వారిలో వీవీఐపీ పాసులు కలిగిన వారు ఎన్‌హెచ్-16 స్టేడియం వరకు వెళ్లి 'ఏ' మైదానం లోపల 'పీ-1' పార్కింగ్ వద్ద, వీఐపీ పాసులు కలిగిన వారు స్టేడియం 'బి' గ్రౌండ్ లోపల 'పీ-2' పార్కింగ్ వద్ద, ఇతర టికెట్లు కలిగిన వారు వైజాగ్ కన్వెన్షన్ సమీప 'పీ-3' పార్కింగ్ వద్ద వాహనాలను నిలపాలన్నారు. సాధారణ ప్రేక్షకులు సాంకేతిక ఇంజినీరింగ్ మైదానంలోని 'పీ-4' పార్కింగ్ వద్ద, ఏఎస్ నగర్ ఆరో వార్డు జీవీఎంసీ పార్కు-1లో, జీవీఎంసీ పార్కు-2లో, రత్నగిరి కాలనీ సమీప జీవీఎంసీ పార్కు-3లో పార్కింగ్ చేసుకోవాలని సూచించారు.

మహిళల కబడ్డీ పోటీల విజేత విశాఖ

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: అంకుపాలెం గ్రామంలో దుర్గాంబిక తీర్థం సందర్భంగా మూడురోజుల నుంచి జరుగుతున్న రాష్ట్రస్థాయి మహిళల, పురుషుల కబడ్డీ పోటీలు మంగళవారం రాత్రితో ముగిశాయి. ఈ పోటీలలో విశాఖ మహిళల జట్టు ప్రథమస్థానంలో నిలిచింది. తర్వాత స్థానాల్లో విజయనగరం, అనకాపల్లి జిల్లాల జట్లు విజేతలుగా గెలుపొందాయి. పురుషుల విభాగంలో ప్రథమస్థానంలో కృష్ణాజిల్లా, ద్వితీయ స్థానంలో తూర్పుగోదావరి, తృతీయ స్థానంలో విశాఖ జిల్లాల జట్లు నిలిచాయి. ఎమ్మెల్యే రాజు పాల్గొని విజేతలకు నగదు బహుమతులను అందించారు. ఈ పోటీలు ఏపీ కబడ్డీ అసోసియేషన్ సీఈఓ వీరలంకయ్య, ఏపీ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి పద్మజాబాల, ఆర్గనైజన్ కార్యదర్శి వి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగాయి.

విశాఖ - విజయనగరం మహిళల జట్ల మధ్య తుదిపోరు

అయితంపూడి విద్యార్థినికి ఉత్తమ క్యాడెట్ అవార్డు

గవర్నర్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న రేవతి

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: అయితంపూడికి చెందిన కరణం రేవతి విద్యార్థినికి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఎన్‌సీసీ క్యాడెట్ అవార్డు లభించింది. అమరావతిలో జరిగిన గణతంత్ర వేడుకల పరేడ్‌లో పాల్గొని గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా అవార్డు అందుకుంది. రేవతి ప్రస్తుతం నూజివీడు ట్రిపుల్ ఐటీలో బీటెక్ చదువుతోంది. రెండునెలల్లో సీ సర్టిఫికెట్ పూర్తవుతున్న సందర్భంలో అమరావతిలో ప్రభుత్వం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో గవర్నర్‌కు సీనియర్ అండర్ ఆఫీసర్‌గా సెల్యూట్ చేసే అవకాశం దక్కింది. అవార్డు స్వీకరించడంపై కుటుంబసభ్యులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భూవివాదంలో ఒకరి అరెస్టు

కశింకోట, న్యూస్‌టుడే: మోసయ్యపేటలో భూవివాదానికి సంబంధించి చట్టాన్ని అతిక్రమించిన వ్యక్తిని మంగళవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కె. లక్ష్మణరావు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఈనెల 19న గ్రామానికి చెందిన అమ్మదమ్ములు భూవివాదంలో ఘర్షణ పడి 21న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించారు. గొడవకు కారణమైన మడిపి రామును అరెస్టు చేసినట్లు తెలిపారు.

ట్రాక్టరు ఢీకొని ఒకరి దుర్మరణం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రధాన రహదారిలో ఎస్‌బీఐ బ్రాంచి-2 ఎదురుగా ట్రాక్టరు ఢీ కొన్న ప్రమాదంలో మంగళవారం రాత్రి ఒకరు దుర్మరణం చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. పేటలోని రాజుగారిబీడుకు చెందిన కె.సుబ్బారావు (56) ద్విచక్ర వాహనంపై బంధువుల అబ్బాయితో కలిసి ఇంటికి వెళ్తున్నారు. ఎస్‌బీఐ దాటిన తర్వాత వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్బారావు సంఘటన స్థలంలోనే మృతిచెందారు.. వెనుక కూర్చున్న యువకుడు ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. సుబ్బారావుకు ఇద్దరు పిల్లలున్నారు. రాజుగారిబీడులోని అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నారు. మృతదేహాన్ని నక్కపల్లి ఆసుపత్రికి తరలించారు.

కాలిన గాయాలతో వృద్ధురాలి మృతి

అనకాపల్లి, న్యూస్‌టుడే: అగ్నిప్రమాదంలో తీవ్రగాయాలకు గురైన కాపుశెట్టి వరహాలమ్మ (81) మంగళవారం మృతి చెందారు. కాపుశెట్టివానిపాలేనికి చెందిన ఈమె ఈనెల 23న వంట చేస్తుండగా చీరకు నిప్పుఅంటుకుంది. తీవ్రగాయాలు కావడంతో కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మరణించారు. ఈ కేసును గ్రామీణ ఎస్ఐ రవికుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

బోటు దొంగిలించిన వ్యక్తి అరెస్టు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: బోటు దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ అప్పన్న తెలిపారు. రాజవరంలో సముద్రపు ఒడ్డున ఉంచిన ముత్తు జగదీష్‌కు చెందిన బోటు.. దానిలో ఉంచిన డీజిల్, వలతో ఈ నెల 21న ఎత్తుకుపోయారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజవరం తీరప్రాంతంలో మంగళవారం ఉదయం అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని పట్టుకున్నారు. మధ్యవర్తుల సమక్షంలో విచారించగా కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం మూలపేటకు చెందిన సత్తిబాబుగా గుర్తించారు. అతనే బోటు ఎత్తుకుపోయినట్లు అంగీకరించాడని సీఐ అప్పన్న తెలిపారు. మూలపేటలో దాచి ఉంచిన బోటును స్వాధీనం చేసుకుని నిందితుడు సత్తిబాబు ఎలమంచిలి కోర్టుకు హాజరుపర్చినట్లు చెప్పారు.

స్వాధీనం చేసుకున్న బోటుపై సీఐ అప్పన్న

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	135	130
లైవ్	162	150
డ్రెస్డ్	235	270
స్కిన్‌లెస్	267	280

EENADU Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ లోనుల్లో ఉన్న బంగారాన్ని విడిపించి అధిక ధరకు కొనుగోలు చేయబడును. ✆ 9348488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ లోనుల్లో ఉన్న బంగారాన్ని విడిపించి అధిక మార్కెట్ ధరకు కొనబడును. ✆ 9908545224.

REAL ESTATE

FLAT FOR SALE

KURMANNAPALEM

2nd Sale 1220 Sft 3BHK Semi Furnished Flat for Immediate sale opp. to Kurmannapalem RadioStation (Behind HP Petrol Bunk) Carparking Avail. ✆ 7013388590, 9038985646.

TAGARAPUVALASA

2 BHK & 3 BHK Flats for Sale, Beside ANITS College, Tagarapuvalasa. ✆ 96429 78696, 94406 75916.

LAND FOR SALE

GENERAL

పూసపాటిరేగ 'మం' [illegible] 1/2KM [illegible] ✆ 9440255187.

PLOT FOR SALE

ATCHYUTAPURAM

DTCP Approved Plot (1120 Sq.Yds) Cheemalapalli, Atchutapuram, Vizag. Contact Phone: 9923879631

GAJUWAKA

426Sqyds N/F (54X72) Plot for Sale [illegible] Cont: 9441089274

JOBS

Special Recruitment for Retd.Employees. Those who are Interested to work as freelancing in a very reputed Org.Plz Come with your Credentials ✆7702999763 for getting Decent Package.

Wanted Marketing Executive for Promoting Our Building Material Products in Vizag Attractive Salary + Incentive Contact Ph: 9703009555.

L&T Valves — At L&T Valves DEALER'S PLACE WANTED — WANTED Accountant & Sales Engineer — 1) We are looking for a full-time Male / Female ACCOUNTANT who can independently handle all types of accounting and GST-related work. Minimum 3-4 yrs experience as an accountant in a distribution company. Good knowledge of Tally & Excel. Age: Between 35 to 40 yrs, within city limits. 2) we are looking Male Dynamic SALES ENGINEER having Degree in B.E.Mech or equivalent and having field experience of industrial products and can travel and having his own Bike. Interested candidates send your CV to: sales@apsales.in Ph: 98491 48481

WANTED MARKETING EXE. COURIER PICK-UP BOYS COMPUTER OPERATORS For International Couriers @ Vizag/HYD/Banglore Branches SVES COURIER & CARGO Near Diamond Park, Vizag. 9291901303

ACCOUNTING

Accountant required sal: 15k to 20k seethammadhara tax consultant office male 3 years exp any audit firm. ✆ 9866001488, 9866390999

గమనిక [illegible]

[illegible] ✆ 9355558899.

[illegible] MVP [illegible] 9 to 6:30, [illegible] 8885555513.

[illegible] 8886571718.

[illegible] 10,000 [illegible] 7.30 to 6PM [illegible] 8328539794, 8121755558.

[illegible] Ct: 8885886899.

[illegible] Contact No: 80962 46099.

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

రాజా: **రాజాసాబ్,** వెంకటేశ్వర: **భర్త మహాశయులకు విజ్ఞప్తి,** సత్యనారాయణ స్క్రీన్1: **అనగనగా ఒకరాజు,** స్క్రీన్2, పర్తిసాయి, రామచంద్ర: **మన శంకర వరప్రసాద్‌గారు,** షిర్డిసాయి: **నారీనారీ నడుమమురారి**
అచ్యుతాపురం: శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: **మన శంకర వరప్రసాద్‌గారు** స్క్రీన్-2: **నారీనారీ నడుమమురారి**

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఎం.జగన్నాథపురం, యర్రవరం, మళ్లవరం, ఉప్పవరం, నరేంద్రపురం గ్రామాలకు బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్తంభాల మార్పుకోసం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ రాజశేఖర్, ఏఈ భానుప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న అచ్యుతాపురంలో విద్యుత్తు సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఈఈ.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

రాంబిల్లి, న్యూస్‌టుడే: నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి జి.దేవుడునాయుడు డిమాండు చేశారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం రామకృష్ణ అధ్యక్షతన కమిటీ సమావేశంలో మాట్లాడారు.

మధ్యాహ్న భోజనం

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలిలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజనానికి విద్యార్థినులు బారులుదీరారు. అందరూ ఒకేసారి భోజనానికి రావడంతో ఎక్కువ సమయం నిరీక్షించాల్సి వచ్చింది. ఈ పాఠశాలలో 694 మంది చదువుతుండగా వీరిలో 602 మంది భోజనం చేయడానికి ఆసక్తి చూపారు. వీరంతా భోజనం కోసం ఇలా లైన్లో వేచి ఉన్నారు. వడ్డించడానికి ఒకే కౌంటర్ కావడంతో ఈ పరిస్థితి ఎదురవుతోంది. ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేస్తే అందరికీ సకాలంలో భోజనాలు అందుతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

భోజనం కోసం బారులుదీరిన విద్యార్థినులు

ప్రమాదమని తెలిసినా..

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్తూరు నరసింగరావుపేట జాతీయ రహదారిపై పలువురు వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారి మధ్యలో ఉన్న గ్రిల్స్ మధ్య నుంచి రహదారిని దాటుతూ ప్రమాదాల్లో చిక్కుతున్నారు. అటు నుంచి ఇటు రావడానికి మారేడిపూడి వద్ద యూ టర్న్ ఉన్నప్పటికీ అంతదూరం వెళ్లలేక చాలా మంది డివైడర్ దాటి రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో వేగంగా వచ్చే వాహనాలు ఢీకొట్టడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. రవాణా, పోలీసు అధికారులు వీరిపై నిఘా పెంచాలని కోరుతున్నారు.

డివైడర్‌పై నుంచి వస్తున్న వాహనదారులు

కంపోస్టు యార్డుకు స్థలాల అన్వేషణ

అనకాపల్లి, కశింకోట, న్యూస్‌టుడే: పట్టణం నడిబొడ్డున ఉన్న కంపోస్టు యార్డు తరలింపునకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందు కోసం స్థలాలను అన్వేషిస్తున్నారు. కంపోస్టు యార్డు అవసరం లేదని కేవలం తరలింపు కేంద్రం ఉంటే సరిపోతుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం అనకాపల్లి పట్టణంలో రోజుకు 80 నుంచి 90 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. వీటిని ఇక్కడ నుంచి లారీలపై విశాఖ తరలిస్తున్నారు. ఏరోజు చెత్తను ఆరోజే తరలిస్తామని అధికాలు చెబుతున్నారు. ఈ మేరకు కొద్దిపాటి స్థలం ఉన్నా సరిపోతుందని చెబుతున్నారు. మండలంలోని కొన్ని ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. పట్టణం నడిబొడ్డును జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఆవరణలోనే కంపోస్టు యార్డు ఉంది. దీనివలన కార్యాలయంకు వచ్చే ప్రజలతో పాటు దీన్ని ఆనుకొని ఉన్న జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, చుట్టుపక్కల ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లో కంపోస్టు యార్డు సమస్యను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రస్తావించారు.

జోనల్ కార్యాలయ ఆవరణలో చెత్త

గత కొన్నేళ్లగా పట్టణంలోని చెత్తను జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఆవరణలో వేస్తున్నారు. దీన్ని ఇక్కడ నుంచి తరలిస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఈమేరకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ గత కొంత కాలంగా దీనిపై దృష్టిపెట్టారు. ఈ సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని స్థానికులు ఆశిస్తున్నారు.

ఉత్సవాన్ని విజయవంతం చేసే బాధ్యత అధికారులదే..

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: జిల్లా ఏర్పడిన తరువాత మొదటిసారిగా జరుగుతున్న ఉత్సవాన్ని విజయవంతం చేసే బాధ్యత అధికారులదేనని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. కొండకర్లలో ఈనెల 30న జరిగే ఉత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం అధికారులతో ఆయన కొండకర్లలో సమీక్షించారు. సంస్కృతీ, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. స్థానిక కళాకారులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. హరిపాలెం ఉన్నత పాఠశాల వెనుక నుంచి కొండకర్ల, బంగారయ్యపాలెం వరకు రోడ్డును అభివృద్ధి చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు.

అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

రాంబిల్లి: విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని మండల మెరైన్ సీఐ ఎస్.సింహాద్రినాయుడు కోరారు. కొత్తపట్నం ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎస్.ఐ. బి.హెచ్‌వీఎస్ రాజుతో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం ఎ.శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి కొత్తూరులోని మండిమాంబ ఆలయ సమీపంలో ఉన్న వేపచెట్టును ఓ యువకుడు తొలగిస్తున్న సమయంలో ఇది పడి తమ వాహనాలు దెబ్బతిన్నాయని అపార్ట్‌మెంట్ ప్రతినిధులు ధర్మ, బాల్కి, శ్రీనివాస్ జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. పెద్దకు మరమ్మతులు చేయించాలని కోరారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ల దినోత్సవం

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ప్రైవేట్ విద్యుత్తు పనివార్ల సంఘం ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్ల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎలక్ట్రికల్ దుకాణ యజమానులు పార్థసారధి, సురేష్ జెండాను ఆవిష్కరించి, కేక్ కోసి సంఘ సభ్యులకు తినిపించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.కొండయ్య, ఉపాధ్యక్షుడిగా డి.వెంకట గణేష్, కార్యదర్శిగా పి.మాధవ, గౌరవాధ్యక్షుడిగా పి.సత్తిబాబు ఎన్నికయ్యారు.

30న విజయవాడలో నిరుద్యోగ రణభేరి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఈ నెల 30న విజయవాడలో నిరుద్యోగ రణభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు తెలిపారు. అనకాపల్లి సీపీఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో రణభేరి గోడ, కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు రేకా సంతోష్, గౌతం, వినయ్, కృష్ణ, లోవరాజు, లీలధర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

▪ అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాలు గుంటూరులో ఈ నెల 29 నుంచి నాలుగు రోజుల పాటు జరుగుతాయని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, కాళ్ల తేలయ్యబాబు, ఎస్ బ్రహ్మాజీ, సత్యనారాయణ తెలిపారు. సీపీఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు.

బాధ్యులపై చర్యలకు డిమాండ్

నక్కపల్లి, న్యూస్‌టుడే: చందనాడ పరిధిలో తనకు చెందిన భూమిని కొందరు అక్రమంగా క్రయ, విక్రయం చేశారని దీనిపై చర్యలు తీసుకోవాలంటూ కాకినాడకు చెందిన వుండ్రు గోవింద్ మంగళవారం ఆర్డీఓ వీవీ రమణకు ఫిర్యాదు చేశారు. తనకు 6.48ఎకరాల భూమిలో ఎకరా భూమిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అమలాపురానికి చెందిన మరో మహిళకు అక్రమంగా విక్రయించారన్నారు. తాను విదేశాల్లో ఉండటంతో భూమిని బంధువులు పర్యవేక్షిస్తున్నారన్నారు. దీనిపై విచారణ చేస్తామని ఆర్డీఓ వెల్లడించారు.

జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఎస్.రాయవరం మండలం బంగారమ్మపాలెం గ్రామానికి చెందిన నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు కలెక్టర్‌కు లేఖ రాశారు. పలు ఉద్యమాలు, పోరాటాలు చేసినా పట్టించుకునే నాథుడే లేరన్నారు. మత్స్యకారులు జీవనోపాధిని కోల్పోయారన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకొని వీరి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

విద్యార్థిని అభినందిస్తున్న ఛైర్‌పర్సన్ బత్తుల అనూరాధ తదితరులు

కశింకోట, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు కశింకోట సెయింట్‌జాన్స్ ఆంగ్లమాధ్యమ పాఠశాలలో 7వ తరగతి విద్యార్థి వై.లిషిత్ రోషన్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రూపానంది తెలిపారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఖోఖో అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్ 14 విభాగంలో సత్తాచాటి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. ఈనెల 31 నుంచి హరియాణా రాష్ట్రంలోని కురుక్షేత్రంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. ఇతనిని, కోచ్ సీహెచ్‌ఎల్ఎం శ్రీనివాస్‌ను అభినందించారు.

సరదా మాటున ప్రమాదం..!

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: సముద్రాన్ని చూస్తే అందరికీ ఆనందమే.. అలల వెనుక ఉన్న ప్రమాదాన్ని కుడా గుర్తించాలి. రేవుపోలవరం తీరంలో నిత్యం పర్యాటకుల తాకిడి పెరుగుతోంది. ఇక్కడ రాళ్లపైకి వెళ్లొద్దని మెరైన్ పోలీసులు చెబుతున్నా, పర్యాటకులు పట్టించుకోవడంలేదు. తరచూ ఇదే ప్రాంతంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా సెల్ఫీల కోసం ఇలా ప్రమాదకరంగా రాళ్లపైకి వెళ్తున్నారు. మంగళవారం కొంత మంది పర్యాటకులు రాళ్లపై ఫొటోల కోసం ప్రమాదకరంగా నిల్చున్నారు. కుటుంబ పెద్దలు లోపలికి వెళ్లొద్దని చెబుతున్నా, ఫొటోల కోసం వినిపించుకోలేదు.

శిథిల భవనంలోనే విధులు

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పాయకరావుపేటలోని మండల విద్యాశాఖ కార్యాలయం శిథిలావస్థలో ఉంది. ఈ భవనం నిర్మించి ఏళ్లు గడుస్తున్నా మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో స్లాబ్ పైభాగం పూర్తిగా పాడైపోయింది. ఈ కారణంగా చినుకుపడితే స్లాబ్ కారుతోంది. దీంతో విలువైన కంప్యూటర్లు, రికార్డులు తడిచిపోతున్నాయి. సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఈ భవనంలో విధి నిర్వహణలో ఉన్న వారిపై స్లాబ్ పెచ్చులూడి పడింది. త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. అధికారులు, పాలకులు సమస్యపై దృష్టిసారించి కొత్త భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

అనకాపల్లి గ్రామీణం, నెహ్రూ చౌక్, న్యూస్‌టుడే: పాఠశాలల వార్షికోత్సవాలు వాడవాడలా మంగళవారం నిర్వహించారు. అనకాపల్లి జీవీఎంసీ పట్టణ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నృత్యాలు అలరించాయి. తారకరామకాలనీ జడ్పీ పాఠశాలలో విద్యార్థులు నృత్యాలు చేస్తూ అందరిలో ఉత్సాహం నింపారు.

అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక, న్యూస్‌టుడే: అచ్యుతాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రదర్శన ఆకట్టుకుంది. రాంబిల్లిలో నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. ఆటల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. మునగపాకలో పదోతరగతి విద్యార్థులకు భరోసా ఇస్తూ వీడ్కోలు పలికారు.

తారకరామకాలనీ పాఠశాలలో విద్యార్థినుల నృత్యాలు

అనకాపల్లి జీవీఎంసీ బాలికల పాఠశాలలో..

పెదబోదుగల్లంలో..

పాయకరావుపేటలో..

ఎలమంచిలిలో హాజరైన బాలికలు

అచ్యుతాపురంలో..

గణపర్తి ఉన్నత పాఠశాలలో..

ధర్మవరం-అగ్రహారంలో..

వసతిగృహంలో నాగుపాము

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోట సమగ్ర సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహంలో మంగళవారం మధ్యాహ్నం నాగుపాము హల్‌చల్ చేసింది. వసతిగృహం ఆవరణలో ఉన్న మీటరుబోర్డులో సుమారు 8 అడుగుల నాగుపాము పడగవిప్పి బుసలు కొట్టింది. సిబ్బంది గమనించి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకొని పాములు పట్టే వడ్డాది ఆనంద్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన ఇక్కడికి చేరుకొని పామును చంపివేశారు.

ఆకట్టుకున్న లేగదూడల ప్రదర్శన

నక్కపల్లి, న్యూస్‌టుడే: రమణయ్యపేటలో మంగళవారం నిర్వహించిన లేగదూడల ప్రదర్శన ఆకట్టుకుంది. రాష్ట్రీయ గోకుల మిషన్ ఆధ్వర్యాన చినదొడ్డిగల్లు ఆసుపత్రి పశు వైద్యాధికారి పి.కీర్తి ఆధ్వర్యంలో పాడిరైతులు సుమారు 50 లేగదూడలను ప్రదర్శనకు తీసుకువచ్చారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. వైద్యులు ఎస్.శ్రీనివాసరావు, వీరరాజు మాణిక్యం పాల్గొన్నారు.

ప్రదర్శనకు తెచ్చిన లేగదూడలు

భక్తిశ్రద్ధలతో విజయాంజనేయస్వామి తీర్థం

అనకాపల్లి గ్రామీణం, ఎలమంచిలి గ్రామీణం, కశింకోట, కోటవురట్ల, న్యూస్‌టుడే: శంకరంలో మంగళవారం విజయాంజనేయస్వామి తీర్థం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి భారీగా భక్తులు స్వామిని దర్శించుకోవడానికి తరలివచ్చారు. జంపపాలెంలో మరిడిమాంబ అమ్మవారి జాతరను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటాలు, భజనలు ఏర్పాటు చేశారు. కశింకోట మండలం గురువు భీమవరంలో గంగాదేవీ అమ్మవారి పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చింతలపాలెంలో శ్రీషిర్డిసాయిబాబా తీర్థం ఘనంగా జరిగింది. సుంకపూరులో నలమారమ్మతల్లి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారి గరగలను వీధుల్లో ఊరేగించారు.

శంకరంలో..

ఆత్మీయ కలయిక

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాక జడ్పీ పాఠశాలలో 1971-72లో పదో తరగతి విద్యార్థులు మంగళవారం కుటుంబ సమేతంగా అందనాపల్లి భగీరథ ఆలయ ప్రాంగణంలో కలుసుకొన్నారు. నాటి తీపి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. సాయంత్రం వరకు సరదగా గడిపారు. బీవీ రమణ, బొడ్డేడ సత్యనారాయణ, రామారావు, ఆడారి సూరిబాబు, జగన్నాథరావు నాయుడు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722 | పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726

పాయకరావుపేట గ్రామీణం, అరట్లకోటలో ప్రధాన రహదారికి ఆనుకుని చర్చికి సమీపంలో చెత్త వ్యర్థాలు వేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతమంతా అపరిశుభ్రంగా ఉంటోంది. **- స్థానికులు,** ✓: సమస్యపై కార్యదర్శితో చర్చించి చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. **- డేవిడ్, డిప్యూటీ ఎంపీడీవో**

శ్రీరాంపురం సమీపంలో సాగునీటి స్లూయిస్‌లకు గేట్లు లేవు. దీంతో వచ్చే సీజన్‌కు సాగునీటికి ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి ఉంది. అధికారులు సమస్య పరిష్కరించాలి. **- దివాణం, రైతు,** ✓: నిధులు మంజూరైన వెంటనే స్లూయిస్‌లు బాగు చేస్తాం. **- సురేష్‌కుమార్, డీఈ**

అనకాపల్లి, న్యూస్‌టుడే అనకాపల్లి సంతోషిమాత కోవెల రహదారి గోతులు ఎక్కువగా ఉన్నాయి. **- ఆళ్ల రామచంద్రరావు, అనకాపల్లి**, ✓: రహదారిని బాగు చేయిస్తాం. **- కె.చక్రవర్తి, జోనల్ కమిషనర్**

ఎలమంచిలి, న్యూస్‌టుడే ఎలమంచిలి పంట కాలువలోకి ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పోస్తున్నారు. సాగునీరు కలుషితమవుతోంది. **- ఎ.రమణబాబు ఎలమంచిలి,** ✓: కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు పోయకుండా నిఘా పెడతాం. **- పల్లా శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

ఎలమంచిలి, న్యూస్‌టుడే ఎలమంచిలి వై జంక్షన్ వద్ద రోడ్డుపై పెద్ద గోతుల పడ్డాయి. వీటిని పూడ్చివేయాలి. **- ఎం.ఏసు, ఎలమంచిలి,** ✓: ప్రమాదాలు జరగకుండా గోతులను పూడ్చిస్తాం. **- ప్రసాదరాజు, కమిషనర్**

అచ్యుతాపురం, న్యూస్‌టుడే అచ్యుతాపురం వారపుసంతలో తాగునీరు, మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నాం. **- శ్రీనివాసరావు, అనకాపల్లి,** ✓: మరుగుదొడ్లు నిర్మించి తాగునీటిని ఏర్పాటు చేస్తాం. **- శైలజారాణి, పంచాయతీ కార్యదర్శి**

విద్యార్థినులకు వితరణ

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలో జీవీఎంసీ పట్టణ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు వేల్పులవీధికి చెందిన దొడ్డి సరస్వతమ్మ తన సొంత నిధులు రూ. 25 వేలతో ఫైల్స్‌ను పంపిణీ చేశారు. తమ భర్త జ్ఞాపకార్థం ప్రతి ఏడాది విద్యార్థులు సహాయం అందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఎంఈఓ కోటేశ్వరరావు, హెచ్ఎం రుధిరరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సామగ్రిని అందిస్తున్న సరస్వతమ్మ



(c) eenadu

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య **ఆడి1:** నారి నారి నడుమ మురారీ, భర్త మహాశయులకు విజ్ఞప్తి, **ఆడి2:** మన శంకర వర ప్రసాద్ గారు, **ఆడి3:** అనగా అనగా ఓ రోజు, **ఆడి4:** మన శంకర వర ప్రసాద్ గారు, **రాజు:** మన శంకర వరప్రసాద్ గారు, భర్త మహాశయులకు విజ్ఞప్తి, **బంగార్రాజు:** అనగా అనగా ఓ రోజు **చోడవరం:** **సాయిలక్ష్మి:** భర్త మహాశయలకు విజ్ఞప్తి, **శ్రీ సాయిలక్ష్మి:** రాజాసాబ్, అనగనగా ఒకరాజు, **పూర్ణా:** మన శంకర వర ప్రసాదు గారు

విద్యుత్తు సరఫరా నిలుపుదల నేడు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: రాజాం ఉపకేంద్రం నుంచి పెదమదిన ఫీడర్ పరిధిలో గ్రామాలకు బుధవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. ఆర్డీఎస్ఎస్ పనుల నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు. పెదమదిన, చినమదిన, కొండపాలెం, కె.పి.అగ్రహారం, గున్నెంపూడి, అయితంపూడి, పైడంపేట గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులందరూ గమనించాలని కోరారు.

నైపుణ్యాల పెంపుతో మెరుగైన అవకాశాలు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వడ్డాది జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా మంగళవారం స్థానిక విద్యుత్తు ఉపకేంద్రాన్ని సందర్శించారు. వృత్తి విద్యా నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఉపాధ్యాయులు తెలిపారు. వృత్తివిద్యపై విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయిని ప్రసన్నకళ, వృత్తి విద్య ఉపాధ్యాయుడు గంగాధర్ పాల్గొన్నారు.

వైభవంగా తలుపులమ్మ జాతర

గొలుగొండ, న్యూస్‌టుడే: ఏటిగైరంపేటలో తలుపులమ్మ జాతర మహోత్సవం మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. 20 గ్రామాల ప్రజలు ఊరేగింపుగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. నర్సీపట్నం - చింతపల్లి మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

కొత్తవీధి రోడ్డుకు మంచిరోజులు

తారువేయాల్సిన కొత్తవీధి-పెదబొడ్డేపల్లి రహదారి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నర్సీపట్నం ప్రధాన రహదారిపై ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఉపయోగపడే పెదబొడ్డేపల్లి-కొత్తవీధి రోడ్డుకు మోక్షం లభిస్తోంది. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన ఈ రోడ్డు పనులు కొన్ని చోట్ల అసంపూర్తిగా ఉండిపోయాయి. వాటిని ఇప్పుడు పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పెదబొడ్డేపల్లి డాన్ బాస్కో కళాశాల సమీపంలోని ఎస్సీ కాలనీ నుంచి పెద్దచెరువు వరకు తారు రోడ్డు వెచ్చించేందుకు రూ.32 లక్షలు ఖర్చు చేయనున్నారు. తారువేయడానికి వీలుగా పనులు ఇప్పటికే పూర్తి చేశారు.

★ శ్మశానం నుంచి ఆర్అండ్‌బీ బంగ్లా వరకు రోడ్డుకు ఇరువైపులా రూ.44.87 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులు దాదాపు 90శాతం పూర్తయ్యాయి. మిగతా పనులన్నీ పూర్తయ్యాక రూ.53 లక్షల ఖర్చుతో తారు రోడ్డు వేయనున్నారు. ఈ పనులన్నీ మార్చి ఆఖరుకల్లా పూర్తి చేయాలన్నది లక్ష్యం. పనులు పూర్తయితే పెదబొడ్డేపల్లి నుంచి ప్రధాన రహదారి మీదుగా నర్సీపట్నం ప్రయాణించాల్సిన అవసరం లేకుండా కొత్తవీధి రోడ్డు నుంచి నర్సీపట్నం వేంకటేశ్వరస్వామిగుడి వద్ద చింతపల్లి రోడ్డుకు చేరుకోవచ్చు. ఇటీవల ప్రధాన రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు అధికమవుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గంగా ఇది ఉపయోగపడనుంది.

తాగునీటి కష్టాలు తొలగనున్నాయ్

ఖండివరం కాలనీలో నిర్మాణంలో రక్షిత మంచినీటి పథకం

గత ప్రభుత్వంలో కాలనీల పేరిట ఊళ్లను నిర్మిస్తున్నామని జబ్బలు చరిచారు. వాస్తవానికి మౌలిక సదుపాయాల కల్పనకు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కొత్తగా ఇల్లు కట్టుకొని అందులో నివాసముంటున్నవారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో కూటమి ప్రభుత్వం ఇలాంటి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించింది.

చీడికాడ మండలం ఖండివరంలో జగన్ సర్కార్ పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించడం తప్ప ఎలాంటి కనీస వసతులు సమకూర్చకపోవడంతో కాలనీవాసులు నిత్యం అవస్థలు పడుతున్నారు. కాలనీ సమస్యలపై ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రాధాన్యత క్రమంలో తొలిగా 20వేల లీటర్ల సామర్థ్యంగల పథకం నిర్మాణానికి రూ.24 లక్షల నిధులు మంజూరు చేయించారు. మంచినీటి పథకం నిర్మాణానికి కూటమి సర్కారు చొరవ తీసుకోవడంతో జగనన్న కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, చీడికాడ

పనులు వేగవంతం..

ఖండివరం వద్ద కాలనీలో నిర్మిస్తున్న రక్షిత మంచినీటి పథకం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సంబంధిత శాఖ మండల అధికారులు దగ్గరుండి పనులను చేయిస్తున్నారు. ఈ పనులను వేగవంతం చేయడానికి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.- ప్రకాశరావు, ఆర్‌డబ్ల్యూఎస్, డీఈఈ, మాడుగుల

బోరుసామగ్రి కొనుగోలు

రావికమతం, న్యూస్‌టుడే: గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు ఎన్ని ఉన్నా తాగునీటి అవసరాలకోసం స్థానికులు చేతిబోర్లవైపే చూస్తున్నారు. 28గ్రామ పంచాయతీల పరిధిలో 918 వరకు చేతిబోర్లు ఉండగా ఇటీవల మరో 250 వరకూ కొత్తవి తీయించారు. వేసవి కారణంగా తాగునీటికి ఇబ్బంది లేకుండా పాడైన బోరును 24 గంటల్లోగా బాగు చేయించేందుకు ముందుగానే సామగ్రిని సిద్ధం చేస్తున్నారు. ★ వేసవి అవసరాలు తీరేలా మండల పరిషత్తు నిధులు రూ.10 లక్షలతో చేతి బోరు సామగ్రిని కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం తొలివిడతలో మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో సామగ్రిని కొనుగోలు చేశారు. పైపులు, స్టాండ్లు తదితర సామగ్రిని మండల పరిషత్ కార్యాలయానికి తీసుకొచ్చారు. ఎంపీడీఓ మహేష్ మాట్లాడుతూ తొలివిడతలో రూ.5లక్షల ఖర్చుతో సామగ్రి కొనుగోలు చేసినట్లు తెలిపారు.

బోరు సామగ్రిని దించుతున్న సిబ్బంది

కేశవస్వామి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామి దేవాలయంలో బుధవారం నుంచి వార్షిక కల్యాణోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ప్రత్యేక పూజలతోపాటు గురువారం ధ్వజారారోహణ, రాత్రి కేశవస్వామి కల్యాణం నిర్వహించనున్నారు. ప్రతి రోజూ వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను వచ్చే నెల 4వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు అర్చకులు సీతారామాచార్యులు తెలిపారు.

విధిగా 75 రోజుల ప్రణాళిక అమలు

రోలుగుంట, న్యూస్‌టుడే: విద్యాశాఖ నిర్దేశించినట్లు ప్రాథమిక స్థాయిలో తెలుగు, ఆంగ్లం, గణితం తదితర సబ్జెక్టుల్లో సామర్థ్యం మెరుగుపరిచేందుకు జనరల్ ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ ప్రణాళిక అమలు చేయాలని ఎంఈఓ జాన్‌ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని జె.పి.అగ్రహారం, కొమరవోలు పాఠశాలలను జీఎఫ్ఎల్ఎన్ తీరూతెన్నులు పరిశీలించి ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. వీటిలో వెనకబడిన వారికి 75రోజుల ప్రణాళిక అమలుచేయాలని సూచించారు. ఇందుకుగానూ ప్రత్యేకశ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.

అ వీ ఇ వీ

చక్రాల కుర్చీలు అందజేత

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: సామాజిక బాధ్యత కింద క్రెడిట్ యాక్సిస్ గ్రామీణ్ లిమిటెడ్ ఇండియా ఫౌండేషన్ యాజమాన్యం నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రికి నాలుగు స్ట్రెచర్లు, ఆరు చక్రాల కుర్చీలను సమకూర్చింది. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు చింతకాయల పద్మావతి, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్వీఎస్ సుధాశారదకు వీటిని అందజేశారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: పంచాయతీలో అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలంటూ ఎ.కొత్తపల్లి గ్రామ సర్పంచి చింతల సత్య వెంకటరమణ రెవెన్యూ అధికారులను కోరారు. గ్రామంలో అక్రమ నిర్మాణాలపై పాలకవర్గ సభ్యులతో కలిసి ఆయన మంగళవారం డీటీ అప్పారావుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

కేజీబీవీలో తనిఖీలు

మాడుగుల, న్యూస్‌టుడే: మండలంలో సాగరం వద్ద ఉన్న కేజీబీవీని నియోజకవర్గ ప్రత్యేక అధికారిణి ఎం.ఆశాదేవి మంగళవారం తనిఖీ చేశారు. కూరగాయలు, వంటషెడ్డులో పరిశుభ్రతను పరిశీలించారు. బాలికలను పాఠ్యాంశాలపై పలు ప్రశ్నలు అడిగారు. విద్యాభివృద్ధిపై సంతృప్తి వ్యక్తం చేశారు.

నిరాశతో వెనుదిరిగిన ఖాతాదారులు

చోడవరం పట్టణం: దేశవ్యాప్త బ్యాంకు ఉద్యోగుల సమ్మెలో భాగంగా చోడవరంలో బ్యాంకులు మంగళవారం మూతపడ్డాయి. స్టేట్‌బ్యాంక్, యూనియన్‌బ్యాంక్, బ్యాంక్‌ఆఫ్‌బరోడా తదితర బ్యాంక్‌లు తెరుచుకోలేదు. ఐదురోజుల పనిదినాలు కల్పించాలని సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. బ్యాంకుకు వచ్చిన ఖాతాదారులు వెనుదిరిగారు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: డిమాండ్ల సాధనకై ఉద్యోగులు చేస్తున్న సమ్మె కారణంగా మంగళవారం చౌడువాడ, కె.కోటపాడు, ఆనందపురం పలు బ్యాంకులు మూతపడ్డాయి.

రోజ్‌వుడ్ కలప పట్టివేత

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నర్సీపట్నం అటవీ సిబ్బంది గొలుగొండ మండలం ఏటిగైరంపేట వద్ద సోమవారం కారులో నాలుగు రోజ్‌వుడ్ మంచాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిని తరలిస్తున్న సీలేరుకు చెందిన షేక్ అనిఫాను అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై మంగళవారం విడుదల చేసినట్లు రేంజ్ అధికారి రాజేశ్వరరావు చెప్పారు. స్వాధీనం చేసుకున్న కలప 0.791 సీఎంటీలుగా లెక్కించామన్నారు. దీని విలువ రూ.1.11 లక్షలు ఉంటుందన్నారు. నేరం రుజువైతే నిందితుడికి మూడు నుంచి ఐదేళ్ల జైలు, రూ.3 లక్షల వరకు జరిమానా విధించే ఆస్కారముందన్నారు.

కొలతలు వేస్తున్న అటవీ సిబ్బంది

తాండవ రహదారికి మోక్షం

తాండవ రహదారి అభివృద్ధికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. సభాపతి అయ్యన్నపాత్రుడు ఈ రహదారికి రూ.3.5 కోట్లు మంజూరు చేయించారు. రోడ్డు పనులకు ఈ నెల 31న శంకుస్థాపన చేయనున్నారు. గతంలో ఈ రహదారి జలవనరుల శాఖ పరిధిలో ఉండేది. ఆ శాఖలో నిధుల కొరత కారణంగా ఆర్అండ్‌బీ పరిధిలోకి తీసుకువచ్చి తాజాగా నిధులు మంజూరు చేయించారు. నాతవరం నుంచి తాండవ గురుకుల వసతి గృహం వరకు ఏడు కి.మీ. దూరం రెండు వరసల రహదారి నిర్మించనున్నారు. - న్యూస్‌టుడే, నాతవరం

తాండవ రోడ్డు ప్రస్తుత దుస్థితి ఇలా...

గమనించకుంటే ప్రమాదమే!

జి.కోడూరులో రెండువైపులా తవ్వి వదిలేసిన రహదారి

రావపల్లి నుంచి జి.కోడూరు, కోటవురట్ల మండలం చౌడువాడ, ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు వెళ్లే దారిలో వంతెనలకు ఇరువైపులా రక్షణ గోడలు లేవు. జి.కోడూరు సరిహద్దులో గెడ్డపై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా ఉంది. గెడ్డలో ఉన్న కొబ్బరి చెట్టు ఆకులు వంతెన సరిహద్దు కనిపించకుండా మూసేశాయి. జి.కోడూరులో కాలువ నిర్మాణానికి సుమారు 500 అడుగుల దూరం రోడ్డు పక్కగా తవ్వి మూడు నెలలుగా వదిలేశారు. అధికారులు స్పందించి ప్రమాదాలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మాకవరపాలెం

కాలువలు నిర్మించరూ..

చీడికాడ మండలం వీరభద్రపేట పంచాయతీ కొండెంపూడిలో సిమెంటు కాలువలు లేకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోయి దుర్వాసన వ్యాప్తి చెందుతూ, దోమలు ప్రబలుతున్నాయి. దీంతో తరచూ అనారోగ్యానికి గురవుతున్నామని వాపోతున్నారు. పాఠశాల సమీపంలోని రోడ్డులోనూ మురుగు సమస్య వెంటాడుతోంది. దీనిపై అధికారులు స్పందించి కాలువలు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. - చీడికాడ, న్యూస్‌టుడే

పాఠశాల సమీపంలోని సిమెంటు రోడ్డుపై మురుగు

నిద్దరోతున్న నిఘా నేత్రాలు

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పని చేయని సీసీ కెమెరా

దారి దోపిడీలు, రోడ్డు ప్రమాదాలు, కొట్లాట ఘటనలకు సంబంధించిన ఆధారాల కోసం ప్రధాన రహదారులు, దుకాణాలు, పెట్రోలు బంకులు, నివాసాల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పోలీసు అధికారుల దర్యాప్తునకు ఎంతగానో ఉపకరిస్తాయి. పోలీసు శాఖ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసి నిఘా నేత్రాలు పని చేయడం లేదు. మాకవరపాలెం ఆర్టీసీ బస్టాండు వద్ద మూడు రోజుల కిందట తెల్లవారుజామున పెద్దశెట్టి సత్యనారాయణ (75)ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సీసీ కెమెరా పనిచేయకపోవడంతో ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించడం కష్టమైంది. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి సీసీ కెమెరాలను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరముంది. - న్యూస్‌టుడే, మాకవరపాలెం

ధ్వజస్తంభం ఏర్పాటుకు విరాళం

విరాళం అందజేస్తున్న దాతలు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: కోమళ్లపూడి గ్రామంలో శివ పార్వతుల విగ్రహాల వద్ద ధ్వజస్తంభం ఏర్పాటుకు దాతలు విరాళం అందించారు. పెదపూడి మాజీ ఎంపీటీసీ సభ్యుడు రుత్తల రాము, టి.అర్జాపురం సర్పంచి ఫాల్గుణ కలిసి ధ్వజస్తంభం నిర్మాణానికి రూ. 2లక్షల నగదును మంగళవారం విశాఖడెయిరీ డైరెక్టరు గేదెల సత్యనారాయణకు అందజేశారు.

★ వడ్డాది కొత్తూరులో నూతనంగా నిర్మిస్తున్న పద్మనాభ సీతారామాలయ నిర్మాణానికి దాతలు విరాళాలు అందిస్తున్నారు. విశాఖ నగరానికి చెందిన లోటస్ స్వీట్ ఇంజినీరింగ్ వ్యాపారవేత్త నవీన్ దంపతులు రూ. 2 లక్షలు అందించారు. ఈ నిధులతో ఆలయంపై దశవతారాల విగ్రహాలను ఏర్పాటు చేయించనున్నట్లు తెలిపారు.

సీతయ్యపేటలో..

జి.కోడూరు పాఠశాలలో నృత్యం

చినపాచిలిలో విద్యార్థుల ప్రదర్శన

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

విద్యాశాఖ ఆదేశాల మేరకు పలు హైస్కూళ్లలో మంగళవారం వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాలు సందడిగా నిర్వహించారు. నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో విద్యార్థులు సాంస్కృతిక, సాంకేతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. - న్యూస్‌టుడే బృందం

వేములపూడి మోడల్ స్కూల్‌లో సామగ్రి అందజేస్తున్న హెచ్‌ఎం సంధ్య

ఘనంగా దుర్గాంబిక తీర్థమహోత్సవం

పోటీలో పరుగులు తీస్తున్న గుర్రం

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: అంకుపాలెంలో దుర్గాంబిక తీర్థ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ఉదయం నుంచి భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం ఎడ్ల, గుర్రం పరుగు పోటీలను నిర్వహించారు. గుర్రం పరుగుల పోటీల్లో ప్రథమ స్థానంలో చోడమాంబిక శ్రీరాంపట్నం విక్రామ్ విజేతగా నిలిచింది. ఎడ్లపరుగు పోటీల్లో ప్రథమస్థానంలో వెంకటకొమలి (లెక్కలవానిపాలెం), ముమ్మిన కనకరాజు (నర్సయ్యపేట) ముమ్మిన రామకృష్ణ (నర్సయ్యపేట) మిగతా స్థానాల్లో కెఎల్‌బిపేట, వాయలపాడు, లెక్కలవానిపాలెం, కొండ్రం విజేతలుగా నిలిచాయి.

రేషన్‌దుకాణం ఏర్పాటు చేయాలని ధర్నా

నినాదాలు చేస్తున్న గిరిజనులు

మాడుగుల, న్యూస్‌టుడే : శంకరం పంచాయతీలో శివారు గ్రామాలు తాడివలస, రావిపాలెం, గొప్పురు, మామిడిపాలెం గ్రామాల సమీపంలో రేషన్ దుకాణం లేక ఉరకగెడ్డ దాటి కృష్ణంపాలెం చేరాల్సి వస్తోంది. వరదలు వస్తే సరకులు తెచ్చుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నామని ఆయాగ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థుల సౌకర్యార్థం గొప్పురు వద్ద దుకాణం ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, సీపీఎం మండల నాయకుడు ఇరటా నర్సింహమూర్తి, కార్లి భవాని ఆధ్వర్యంలో మంగళవారం మామిడిపాలెం వద్ద ధర్నా చేశారు.

12న సార్వత్రిక సమ్మె

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లతో శ్రామిక మహిళలు మరింత దోపిడీకి గురవుతారని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. కాఫీ క్యూరింగ్ సెంటర్‌లో పనిచేస్తున్న మహిళలతో మంగళవారం సమావేశమయ్యారు. కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు ఫిబ్రవరి 12న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు అడిగర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు

సినిమా చిత్రీకరణ సందడి

మాకవరపాలెం, న్యూస్‌టుడే: చామంతిపురంలో 'చీమ్ టపా డుమ్ డుమ్' సినిమా చిత్రీకరణ సందడి నెలకొంది. ఉయ్యాల జంపాల, సీతమ్మ అందాలు.. రామయ్య సిత్రాలు సినిమాల డైరెక్టర్ శ్రీనివాస్ గవిరెడ్డి హీరోగా నటులు గోకరాజు రమణ, ప్రభావతి, కమెడియన్ లక్ష్మణ్‌పై మంగళవారం ఓ సన్నివేశం చిత్రీకరించారు.

తారుమిక్సింగ్ ప్లాంట్ వద్ద ఆందోళన

రావికమతం, న్యూస్‌టుడే: కొత్తకోటలో గ్రామంలో తీవ్రమైన కాలుష్యాన్ని వెదజల్లుతూ ప్రజలను అనారోగ్యానికి హాని కలిగిస్తున్న తారు మిక్సింగ్ ప్లాంట్‌ను అక్కడి నుంచి తొలగించాలని స్థానికులు డిమాండు చేస్తున్నారు. ఈ మేరకు గాంధీనగర్, ఉగ్గిన వీధి, ప్రకాష్ నగర్‌కు చెందిన మహిళలు ప్లాంట్‌వద్ద ఆందోళనకు దిగారు. తారురోడ్డు నిర్మాణాల్లో భాగంగా కొత్తకోట ప్రకాష్‌నగర్‌కు వెళ్లే దారిలో నివాసగృహాల మధ్యలో గుత్తేదారు రెండేళ్ల కిందట దీన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఆదర్శమూర్తికి అశ్రునివాళి

జననం: 03-10-1937

మరణం: 18-01-2026

కీ॥శే॥ డా॥ చావ నీలకంఠేశ్వర గురునాథ ప్రసాద్ గారు

Retd. AD (AH), నర్సీపట్నం

మంచికి మారుపేరు, సహనశీలి, మానవత్వం, పెద్దరికం మూర్తీభవించిన మహోన్నత వ్యక్తిగా చిరునవ్వుల పలుకరింపుతో అందరి హృదయాలలో సుస్థిరస్థానం పొంది మాకు ఆదర్శంగా నిలిచి మీరు మానుండి దూరమైన మీ మధురస్మృతులు ప్రతిక్షణం మా మదిలో మెదులుతూనే ఉంటాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవుని ప్రార్థిస్తూ...

మీ దివ్య ఆశీస్సులతో మరియు మీ తీపి జ్ఞాపకాలతో...

కుమారులు: చావ వెంకట ఫణికుమార్, చావ కిషోర్

కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు

పెద్దకర్మ తేది: 28-01-2026 బుధవారం పెదబొడ్డేపల్లి, చోడవరం రోడ్, Opp. పెట్రోల్ బంకు, నర్సీపట్నంలో మా స్వగృహమునందు జరుగును.

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743	చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74740	చీడికాడ - 80085 74742

నర్సీపట్నం, న్యూస్‌టుడే: పట్టణంలోని 14వ వార్డులో వై కూడలి నుంచి జోగినాథునిపాలెం వెళ్లే రోడ్డు పక్కన పొలాల్లో సెప్టిక్ ట్యాంకు వాహన సిబ్బంది వ్యర్థాలను పారబోస్తున్నారు. - శ్రీనివాస్, స్థానికుడు ✓: నిఘా ఏర్పాటు చేసి బాధ్యులను పోలీసులకు అప్పగిస్తాం. - చిట్టిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నర్సీపట్నం

స్పందనకు వందనం

దేవరాపల్లి, న్యూస్‌టుడే: పెదనందిపల్లి గ్రామంలో కల్వర్టుపై విరిగిపోయిన సిమెంటు పలకల స్థానంలో కొత్తవి వేశారు. ఈ పలకలు విరిగిపోవడంతో ప్రమాదాలు జరుగుతున్న విషయాన్ని 'ఈనాడు' 'మేమున్నాం మీకు మీతోడు' ద్వారా వెలుగులోకి తెచ్చింది. దీనిపై పెదనందిపల్లి సర్పంచి, పంచాయతీ అభివృద్ధి అధికారి స్పందించి సమస్యకు పరిష్కారం చూపారు.

విద్యుత్తు సంస్థ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

ఎంపీడీఓతో మాట్లాడుతున్న జన్నవరం సర్పంచి సన్యాసిరావు తదితరులు

చోడవరం, న్యూస్‌టుడే: విద్యుత్తు అధికారులు నిర్లక్ష్యధోరణితో వ్యవహరిస్తున్నారంటూ మండల సమావేశంలో పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చోడవరం మండల పరిషత్ సమావేశం మంగళవారం ఎంపీపీ గాడి కాసు అధ్యక్షతన జరిగింది. సర్పంచులు కోన లక్ష్మి చంద్రరావు, గాడి అప్పారావు, చప్పాగెడ్డ మాణిక్య అర్జున్ మాట్లాడుతూ గ్రామ ప్రథమ పౌరులను పట్టించుకోవడం లేదంటూ వాపోయారు. గ్రామంలో సర్పంచికి తెలియకుండా విద్యుత్తు లైన్లు మార్చేస్తున్నారంటూ సభ దృష్టికి తెచ్చారు. చేతులు తడిపితేనే పనులు చేస్తున్నారంటూ ఆరోపించారు. చోడవరం ఎంపీటీసీ సభ్యుడు కరుణకుమార్ రాజు మాట్లాడుతూ రబీలో వరి విత్తనాలు రైతులకు అందించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. బెన్నవోలు సర్పంచి మూడెడ్ల శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల హాజరుశాతం తగ్గిపోవడంపై కారణమేంటంటూ ప్రశ్నించారు. అంగన్‌వాడీ సమస్యలపై పుత్రేవు శ్యామ్, పాలెంనాయుడు మాట్లాడారు. ఇంటిపన్నుల విషయమై జరిగిన చర్చలో జన్నవరంలో ఓమహిళకు అన్యాయం జరుగుతుందంటూ ఎంపీడీఓ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై విచారణ జరపాలని ఎంపీడీఓ స్వామి సిబ్బందిని ఆదేశించారు. ఇంటిపన్నుల వసూలులో సర్పంచులు సహకరించాలని ఎంపీడీఓ స్వామి కోరారు. ఎంపీడీఓ సీతారామస్వామి, మండల పరిషత్తు ఉపాధ్యక్షులు బైన ఈశ్వరకుమారి, శరగడం లక్ష్మి రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్తు కార్మికుల ర్యాలీ

చోడవరం: విద్యుత్తు బల్బు కనిపెట్టిన థామస్ ఎడిసన్ జయంతి సందర్భంగా పట్టణంలో ఎలక్ట్రీషియన్-డే ఘనంగా నిర్వహించారు. చోడవరం, పరిసర ప్రాంతాలకు చెందిన ఎలక్ట్రీషిన్లంతా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. కొత్తూరు కూడలిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. అనంతరం యడ్లవీధిలో సమావేశమై పలు తీర్మానాలు చేసుకొని ఎడిసన్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. సిద్ధి వినాయక ప్రైవేట్ ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్, భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నూకాలమ్మ కోవెల నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణ ప్రధాన రహదారి మీదుగా మళ్లీ కోవెలవద్ద ముగిసింది. సంఘ అధ్యక్షుడు కె.కల్యాణ గంగాధర్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో కార్యదర్శి దాడి శివకుమార్, సంయుక్త కార్యదర్శి కోన మధు, కోశాధికారి చప్పా పెంటారావు, గౌరవాధ్యక్షుడు కోరుకొండ బ్రహ్మానందం, గిరి పాల్గొన్నారు.

మానవహారంగా కార్మికులు

ఆదర్శమూర్తికి అశ్రునివాళి



మంచికి మారుపేరుగా నిలిచి కుటుంబ ఉన్నతికై అహర్నిశలు శ్రమించి మా నుండి భౌతికంగా దూరమైనందుకు చింతిస్తూ... మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ..

కీ॥శే॥ వెన్నా నెహ్రూ గారు

ప్రముఖ మిఠాయిలు వ్యాపారస్తులు, దేవాంగ సంఘం ప్రెసిడెంట్, నర్సీపట్నం

జననం: 17-1-1959 మరణం: 18-1-2026

భార్య: వెన్నా ధనలక్ష్మి

కుమారుడు - కోడలు: వెన్నా శేషుకుమార్ - లావణ్య

మనుమరాలు: వెన్నా దీక్షితా

కుమార్తె - అల్లుడు: కటకం వరలక్ష్మి - గిరిధర్

మనుమరాళ్ళు: జాహ్నవి, శ్రీనీహారిక

అక్కయ్య - బావ: దొంతంశెట్టి వీరవేణి - వరప్రసాద్ (లేటు)

మేనల్లుళ్ళు: సుబ్బారావు, శివప్రసాద్

తమ్ముడు - మరదలు: వెన్నా వెంకటరమణమూర్తి - లక్ష్మి

తమ్ముడి కుమారుడు - కోడలు: వెన్నా శ్రీహరికాంత్ - దీపికా

మరియు బంధుమిత్రులు

పెద్దకర్మ: 28-1-2026 బుధవారం నర్సీపట్నం వెంకునాయుడుపేట సాయిబాబా గుడి వెనుక మా స్వగృహము నందు జరుగును.

పెందుర్తి

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్
స్క్రీన్-1: అనగనగా ఒకరాజు
స్క్రీన్-2: మన శంకర వరప్రసాద్ గారు

నరవ యూపీహెచ్‌సీకి రూ.కోటి మంజూరు

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే: నరవలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) నిర్మాణానికి ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి సంబంధిత మొత్తాన్ని కేటాయించినట్లు పేర్కొంది. సంబంధిత నిధులతో ఆసుపత్రి భవన సమస్య తీరడమే కాక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సామగ్రి సమకూరుతుందని, సిబ్బంది నియామకానికి మార్గం సుగమం అవుతుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఫోన్ చేయండి.. సమస్య తెలపండి

పెందుర్తి జోనల్ కమిషనర్‌తో 'ఫోన్‌ఇన్' రేపు

ఈనాడు తోడు

వేపగుంట, న్యూస్‌టుడే: పెందుర్తి నియోజకవర్గం, జీవీఎంసీ పెందుర్తి జోనల్ కార్యాలయం పరిధిలోని 93, 94, 95, 96, 97 వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఆయా ప్రాంతాల ప్రజలు జోనల్ కమిషనర్ హెచ్.శంకరరావు దృష్టికి తీసుకువెళ్లేందుకు 'ఈనాడు' అవకాశం కల్పిస్తోంది. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, అర్హులైన వారికి అందని సంక్షేమ పథకాలు తదితర వాటిపై జెడ్సీకి నేరుగా తెలియజేస్తే ఆయన తగు సమాధానాలు ఇస్తారు.

తేదీ: 29-01-2026 (గురువారం)
సమయం: ఉదయం 9.00 నుంచి 10.30 గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబరు: 93472 79909

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం కళాకారుల కాలనీలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. –సీహెచ్ అప్పారావు, సబ్బవరం ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందితో చెత్త తొలగిస్తాం. – పి. ఆనందరావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం.

?: సబ్బవరం నుంచి చినగొల్లలపాలెం వెళ్లే రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరి రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. –పి.తాతారావు, సబ్బవరం ✓: ఈ సమస్యపై మండల సమావేశంలో చర్చించి తగిన చర్యలు చేపడతాం. –బోకం సూర్యకుమారి, ఎంపీపీ.

వేపగుంట, న్యూస్‌టుడే: ?: పురుషోత్తపురం ఎస్సీకాలనీ ప్రధాన కాలువలో చెత్త పేరుకుపోయింది. –కృష్ణారావు, స్థానికుడు ✓: కాలువలను శుభ్రం చేయించి సమస్య పరిష్కరిస్తాం. –ప్రసాదరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండలం భరణికం సమీపంలో కల్వర్టు రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. రాత్రుళ్లు వాహనదారులు భయాందోళనకు చెందుతున్నారు. – నాగరాజు, పరవాడ ✓: ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాం. – రమేశ్‌నాయుడు, ఎంపీడీవో, పరవాడ

ముత్యాలమ్మపాలెం తీరానికి మహర్దశ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం తీరానికి రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ పండగ వాతావరణం రానుంది. విశాఖ ఉత్సవ్‌లో భాగంగా ఈనెల 30, 31 తేదీల్లో రెండు రోజుల పాటు తీరం వద్ద బీచ్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. 2002లో అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో ఇక్కడ వసంత్‌ మేళా పేరిట ఫెస్టివల్ నిర్వహించి సినీ, టీవీ కళాకారులతో సాంస్కృతిక, జానపద ప్రదర్శనలు, బీచ్‌క్రీడలు పెద్దఎత్తున నిర్వహించారు. కూటమి ప్రభుత్వంలో ఇక్కడ మరోసారి సందడి నెలకొంటుందని తెలిసి స్థానికులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

✓ ఈ తీరం వద్ద 3 కి.మీ. పొడవు గల విశాలమైన ప్రకృతి సహజసిద్ధ ఇసుకతిన్నెలు, దట్టమైన సరుగుడు తోటలు, జీడిమామిడి, సరుగుడు తోటలు, ఇసుక తెన్నెలు, ఉప్పుటేరు.. పర్యాటకుల మనసును కట్టిపడేస్తాయి. ఇక్కడ అలలు తక్కువగా ఉన్నందున సముద్ర స్నానాలకు అనువుగా ఉంటుంది. అందుకే కార్తిక మాసం, శివరాత్రి, మాఘపౌర్ణమి రోజుల్లో జనం తాకిడి అధికంగా ఉంటుంది. సింహాద్రి ఎన్టీపీసీ, ఫార్మాసిటీ, హిందుజా పవర్‌ప్లాంటు, మెడ్‌టెక్ జోన్ వంటి పారిశ్రామిక సంస్థల ఏర్పాటుతో ఏటా పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది.

ఈ ఉత్సవ్‌లో భాగంగా భారీ వేదికపై సినీ, టీవీ కళాకారులతో సాంస్కృతిక నృత్య, జానపద, సంప్రదాయ ప్రదర్శనలు, బీచ్ కబడ్డీ, వాలీబాల్ పోటీలతో పాటు స్పోర్ట్స్, సాహస క్రీడలు తదితర వాటిని నిర్వహించనున్నారు. ఫుడ్‌స్టాల్స్ ఉంటాయి. దీన్ని విజయవంతం చేయడానికి అధికారుల బృందంతో కూడిన కమిటీలను ఏర్పాటు చేశారు.

✓ ఈ తీరం పర్యాటకంగా అభివృద్ధి చెందాలంటే ఉప్పుటేరులో బోటుషికారుకు ఫైబర్ బోట్ల ఏర్పాటు, ఉప్పుటేరు దాటడానికి వీలుగా వంతెన నిర్మాణం, బీచ్‌లో బెంచీలు, సిమెంట్ బల్లల ఏర్పాటు వంటివి జరగాలి. ఎల్ఈడీ దీపాలు, పార్కులు, ఆట పరికరాలు, బీచ్‌రోడ్డు విస్తరణ, ఆర్వో ప్లాంటు, మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకోవడానికి గదులు, విశ్రాంతి భవనాలు నిర్మించాలి. గతంలో రాజా కృష్ణప్ప, ఒక్కడు మిగిలాడు తదితర సినిమాల్లో కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు.

కూటమి ప్రభుత్వం ఇక్కడ బీచ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయడం సంతోషకరం. ఇలాంటి వేడుక జరగడం వల్ల ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందడంతో పాటు ఎంతోమందికి ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ వేడుకలను విజయవంతం చేయాలి.
–చింతకాయల సుజాత, సర్పంచి, ముత్యాలమ్మపాలెం

బీచ్ ఫెస్టివల్ విజయవంతం చేయాలి

ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, చిత్రంలో ఎమ్మెల్యే రమేశ్‌బాబు, కలెక్టర్ విజయకృష్ణన్

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం తీరం వద్ద ఈనెల 30, 31 తేదీల్లో నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని స్పీకర్ చింతకాయల అయన్నపాత్రుడు అన్నారు. ఈ మేరకు తీరంలో జరుగుతున్న ఏర్పాట్లను మంగళవారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి ఆయన పర్యటించారు. ప్రజలు కుటుంబ సమేతంగా తరలివచ్చి తిలకించేందుకు వీలుగా ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా అధికారులంతా సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజలు సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ వేడుకలు నిర్వహిస్తోందన్నారు. సర్పంచి చింతకాయల సుజాత, స్థానిక నాయకులు మాసవరపు అప్పలనాయుడు, పైలా జగన్నాథరావు, చింతకాయల ముత్యాలు, కన్నూరు వెంకటరమణ, బొద్దపు శ్రీనివాసరావు, వియ్యపు చిన్నా, నగిరెడ్డి చిన్నారావు, రవి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



ఉపకార వేతనాల చెక్కును అందజేస్తున్న విశాఖ ఫార్మాసిటీ ఎండీ లాల్‌కృష్ణ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. రాంకీ కమర్షియల్ హబ్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో 140 మంది ప్రతిభ గల విద్యార్థులకు ఉపకార వేతనాల కింద రూ.12,33,500 మొత్తాన్ని విశాఖ ఫార్మాసిటీ సంస్థ ఎండీ డాక్టర్ లాల్‌కృష్ణ చేతులమీదుగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాంకీ ఫౌండేషన్ అందిస్తున్న ఈ ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని తద్వారా మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సాంబశివరావు, శ్రీకాంత్, గిరిధర్ రావు, రాజేశ్వరి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఎట్టకేలకు రహదారికి మరమ్మతులు

బీటీ లేయర్ పనులు జరుగుతున్న దృశ్యం

స్పందనకు వందనం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సినిమాహాల్ కూడలిలో శిథిల రహదారికి ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. కొంతకాలంగా ఈ రోడ్డుపై గుంతలు పడడంతో వెట్‌మిక్స్ వేసి వదిలేశారు. వాహనాల రాకపోకల సమయంలో పెద్దఎత్తున దుమ్ము ఎగిరిపడడంతో స్థానికులతో పాటు వాహన చోదకులు, దుకాణదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యపై 'అసంపూర్తి రహదారితో అవస్థలు' శీర్షికన ఈనెల 27వ తేదీన 'ఈనాడు'లో వెలువడిన కథనానికి బోత్రా కంపెనీ ప్రతినిధులు స్పందించారు. రహదారిపై బీటీ లేయర్ వేసి సమస్యను పరిష్కరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అ వీ ఇ వీ

హత్య కేసు నిందితులకు రిమాండ్

వేపగుంట, న్యూస్‌టుడే: మేహాద్రి రిజర్వాయర్ దిగువ భాగంలో కొత్తమ్మతల్లి అమ్మవారి ఆలయ సమీప నిర్మానుష్య ప్రదేశంలో గుంటూరు కల్యాణ్ చక్రవర్తి అనే యువకుడు హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులు వినోద్‌కుమార్, మనోజ్‌లను మంగళవారం పెందుర్తి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా ఈ హత్య ఉద్దేశపూర్వకంగానే జరిగిందని మృతుడి కుటుంబీకులు చేసిన ఆరోపణలపై విచారణ చేపడుతున్నట్లు సీఐ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు.

పెందుర్తి సీహెచ్‌సీలో హెచ్‌బీఏ1సీ వైద్య పరీక్షలు చేయాలి

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌బీఏ1సీ (మూడు నెలల మధుమేహ సగటు తెలియజేసే పరీక్ష) పరీక్ష సదుపాయం అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం పెందుర్తి యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు అల్లం కృష్ణారావు, వై.కామరాజు కోరారు. జిల్లాలోని భీమునిపట్నం, గోపాలపట్నం, అగనంపూడి సీహెచ్‌సీలలో ఈ సదుపాయం ఉన్నప్పటికీ పెందుర్తిలో లేకపోవడమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత సదుపాయం ఇక్కడ లేకపోవడంతో వ్యయప్రయాసలకు గురి కావాల్సి వస్తోందని, ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

యాదవ మహాసభ ఉపాధ్యక్షుడిగా 'అల్లు'

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పెదగంట్యాడకు చెందిన అల్లు రమణారావు యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు చింక నారాయణరావు యాదవ్ నియామక ఉత్తర్వులు జారీచేశారు. బీసీల సమస్యలపై దశాబ్దాలుగా పనిచేస్తున్నందుకు ఈ పదవి కల్పించినట్లు పేర్కొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

సంపత్ వినాయకుడు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం వాడచీపురుపల్లి పంచాయతీ పందివానిపాలెంలో బుధవారం శ్రీసంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు, దర్శనాలు; మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన, సాయంత్రం ఊరేగింపు, పరస, రాత్రి సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ వేడుకలను విజయవంతం చేయాలని వారు కోరారు.

31 వరకు ఇగ్నోలో ప్రవేశాలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో 2026 విద్యాసంవత్సరానికి డిప్లమో, డిగ్రీ, పీజీ కోర్సుల్లో దూరవిద్యతోపాటు, ఆన్‌లైన్‌లో ప్రవేశాలు ఈనెల 31 వరకు జరుగుతాయని సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. టూరిజం, నర్సింగ్, డెయిరీ టెక్నాలజీ, ఆక్వా కల్చర్, వ్యవసాయం, జర్నలిజం, న్యాయవిద్య కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఫీజులు ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు డిగ్రీ కోర్సుల్లో 50శాతం ఫీజు రాయితీ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ignouadmission.samarth.edu.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఇదేం రహదారి..? అధికారులపై మేయర్ ఆగ్రహం

కార్పొరేషన్, న్యూస్‌టుడే : స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవానికి హాజరైన మేయర్ పీలా శ్రీనివాసరావు స్టేడియం ప్రాంగణంలో నిర్మించిన బీటీ (బ్యుటమినస్) రహదారిని పరిశీలించి, ఇంజినీరింగ్ అధికారులపై మండి పడ్డారు. పనుల్లో నాణ్యత లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారిపై రోలింగ్ చేయకుండా వదిలేయడంతో, పాత రహదారిపై ఉన్న లేయర్ పక్కకు జరిగిపోవడంతో పాటు, పిక్క ఊడిపోవడానికి సిద్ధంగా ఉంది. ప్రజాధనంతో చేపట్టే పనుల్లో పర్యవేక్షణ పెంచాలని, వెంటనే అధికారులంతా తీరు మార్చుకోవాలని మేయర్ హెచ్చరించారు.

వీధి దీపాలకు మోక్షమెప్పుడో..

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరంలోని ప్రధాన మార్గంలో కొన్నేళ్లుగా రహదారి మధ్య దీపాలు వెలగక స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కుక్కల బెడద కారణంగా రాత్రి వేళ రాకపోకలకు భయాందోళన చెందుతున్నామని పలువురు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి విభాగినుల్లోని వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఈ బోరు ఉన్నా..లేనట్లే..

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట ఎస్సీబీసీ కాలనీలో బోరు బావిని పట్టించుకోకుండా రోడ్డు నిర్మించేశారు. దాంతో ఇది అందుబాటులో ఉన్నా నిరుపయోగమే. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు ఈ చేతి పంపును వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రంథాలయ భవనం పూర్తి చేయరూ..

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం నాయుడుపాలెం పంచాయతీ మెట్టపాలెంలో గ్రంథాలయ భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులను బిల్లులు సకాలంలో రాకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు మిగిలిన పనులు పూర్తి చేయించి దీన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పరవాడలో కుక్కల బెడద

పరవాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం పరవాడలో కుక్కల బెడద అధికంగా ఉంది. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే పిల్లలు, వృద్ధులు భయపడుతున్నారు. ఇవి ద్విచక్రవాహనదారులను వెంబడించడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. వీటి నియంత్రణకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కస్తూర్బా పాఠశాలల సిబ్బందికి శిక్షణ

మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావు నాయుడు

సబ్బవరం, న్యూస్‌టుడే: జిల్లాలోని కస్తూర్బా విద్యాలయాలు సమర్థంగా పనిచేస్తూ ఫలితాల సాధనలో ముందంజలో ఉన్నాయని జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు అన్నారు. సబ్బవరంలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం ఏర్పాటు చేసిన కేజీబీవీల వార్డెన్లు, ప్రత్యేకాధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులను అన్ని విధాలా ప్రోత్సహించి తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై వారికి వివరించారు. జీసీడీవో జమీమా, మాస్టర్ ట్రైనర్లు శకుంతల, గీత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విద్యార్థుల వీడ్కోలు వేడుక

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తిలోని పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక ఘనంగా జరిగాయి. ప్రధానోపాధ్యాయిని సీహెచ్.చిన్నమ్మాయి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో ఎంఈవో-1 సువర్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని, మంచి నడవడికతో భవిష్యత్తు లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా జిల్లాస్థాయి గణతంత్ర వేడుకల్లో సంప్రదాయ నృత్యాలతో అలరించిన విద్యార్థులను ఎంఈవో సువర్ణ అభినందించారు.

గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో సువర్ణ, ఉపాధ్యాయులు

తిక్కవానిపాలెంలో పశువైద్య శిబిరం

బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఏడీ రామకృష్ణ తదితరులు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం తిక్కవానిపాలెం గ్రామంలో మంగళవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. పరవాడ పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు కీర్తి రామకృష్ణ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. వాడచీపురుపల్లి పశువైద్యాధికారి సురేశ్‌కుమార్ తదితరులు మూగజీవాలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పశువైద్య సిబ్బంది పద్మ, నూకరత్నం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కాలువల పనుల్లో ఫోకస్

నాణ్యతకు తిలోదకాలు!

బీసీ కాలనీలో పాత కాలువ గట్టుపై కాంక్రీటుతో నిర్మిస్తున్నారిలా..

వేపగుంట, న్యూస్‌టుడే: జోనల్ కార్యాలయ ఇంజినీరింగు విభాగం అధికారులు చేయిస్తున్న పలు అభివృద్ధి పనులపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పనుల్లో నాణ్యత లోపించడం, పర్యవేక్షణ లేకపోవడంతో సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. 94వవార్డు బీసీ కాలనీలో రెండు రోజులుగా కాలువ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆయా పనుల తీరు అధ్వానంగా ఉండడంతో ప్యాచ్ వర్కులు చేస్తున్నారా? కొత్త కాలువలు నిర్మిస్తున్నారా? అని సంబంధిత గుత్తేదారుడ్ని స్థానికులు ప్రశ్నించగా సరిగా స్పందించకపోవడంతో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. కాంక్రీట్‌లో ఇసుక శాతం ఎక్కువగా ఉంటోందని, ఇలాగైతే కాలువలు ఎంత కాలం నిలుస్తాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అప్పలనర్సయ్యకాలనీ, గంగిరెడ్లకాలనీ, ఎరుకల కాలనీల్లో చేపట్టిన కాలువ గట్ల పనుల్లోనూ నాణ్యత ప్రశ్నార్థకంగానే ఉన్నట్లు సంబంధిత ప్రాంతాల వారు అంటున్నారు. తక్షణమే జోనల్ కమిషనర్ స్పందించి ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించి, తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నాగేశ్వరరావు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి భవిత కేంద్రం సహిత విద్య ఉపాధ్యాయుడు బి.ఎ.వి.నాగేశ్వరరావుకు జిల్లా స్థాయి ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఈ మేరకు సోమవారం నగరంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ హరేంధిరప్రసాద్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పెందుర్తి ఎంఈవోలు సువర్ణ, మధుమూర్తి తదితరులు నాగేశ్వరరావును అభినందించారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (డీఎస్ఎన్ఎల్‌యూ)లోని నలుగురు ఉద్యోగులు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. వీరిలో డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ దీప్తి, బి.మాధురి, డాక్టర్ లీలాకుమారి ఉన్నారు. ఈ సందర్భంగా ఉప కులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసే వారికి తప్పక గుర్తింపు లభిస్తుందంటూ అవార్డులు పొందిన వారిని అభినందించారు.

డీఎస్ఎన్ఎల్‌యూ ఉద్యోగులను అభినందిస్తున్న వీసీ సూర్యప్రకాశరావు

రంగోత్సవ్ పోటీల్లో ఆరిపాక విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులకు ధ్రువపత్రాలు అందిస్తున్న రవీంద్రబాబు తదితరులు

సబ్బవరం, న్యూస్‌టుడే: ఈనెల 23న విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి రంగోత్సవ్ పోటీల్లో సబ్బవరం మండలం ఆరిపాక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం.జె. రవీంద్రబాబు తెలిపారు. ఈ నెల 21న భీమునిపట్నం డైట్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో లఘు నాటికల విభాగంలో ప్రథమ స్థానం పొంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. విజయవాడలో జయహో భారత్-వికసిత్ భారత్ లఘునాటిక ప్రదర్శించి తృతీయ స్థానం దక్కించుకున్నారన్నారు. మంగళవారం జరిగిన పాఠశాల వార్షికోత్సవంలో 7, 8 తరగతులకు చెందిన సంబంధిత విద్యార్థినులు ఎం.కుసుమ, ఎస్.కోమలి, ఎ.ధనుశ్రీ, ఎస్.గ్రీష్మలతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయిని రామలక్ష్మిని, పాఠశాల కమిటీ ఛైర్మన్ మళ్ల యోగి, ఉపాధ్యాయులు అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు పాఠశాల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ముగిసిన శ్యామా నవరాత్రి ఉత్సవాలు

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం దేవీపురంలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న శ్యామా నవరాత్రి వేడుకలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు, రాజశ్యామల సహస్ర నామావళి హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం

వాడచీపురుపల్లి (పరవాడ), న్యూస్‌టుడే: పరవాడ మండలం తిక్కవానిపాలెం గ్రామంలో మంగళవారం శ్రీఆంజనేయస్వామి తీర్థం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచే స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఈ సందర్భంగా ముగ్గులు, శ్లోకాలు, పద్యాల పోటీలు నిర్వహించారు. అన్న సమారాధన ఏర్పాటు చేశారు. పరసలో కోలాటం, సాము గరిడీలు, భజనలు, డాన్స్ బేబీ డాన్స్ తదితర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

హోమ పూజలో పాల్గొన్న భక్తులు

సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: విశాఖ శారదాపీఠంలో జరుగుతున్న వార్షిక మహోత్సవాల్లో భాగంగా మంగళవారం సుబ్రహ్మణ్య స్వామికి విశేష అభిషేకాలు జరిగాయి. ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో పండితులు సుబ్రహ్మణ్య హోమం నిర్వహించారు. సాయంత్రం వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ వల్లీ కల్యాణం జరిగింది. రాజశ్యామల సహిత చండీయాగంలో భక్తులు పాల్గొని జగన్మాతను సేవించారు. ఈ ఉత్సవాలు బుధవారంతో ముగుస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఘనంగా అమ్మవారి పరస

బంగారమ్మ తల్లి

లక్ష్మీపురం(వేపగుంట), న్యూస్‌టుడే: లక్ష్మీపురం పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దైవాలైన దుర్గమ్మ, బంగారమ్మ అమ్మవార్ల పరస మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని పసుపు కుంకుమలతో మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఘనంగా పరస నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కోటనరవ, వేపగుంట ప్రాంతాల్లోని పైడిమాంబ అమ్మవార్ల పరసలు కూడా మంగళవారం ఘనంగా జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అజనగిరిలో..: సబ్బవరం, న్యూస్‌టుడే: 88వ వార్డు నంగినారపాడు శివారు అజనగిరిలో మంగళవారం పంచముఖ ఆంజనేయస్వామి తీర్థం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం కోలాటం, తప్పెటగుళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కమిటీ ప్రతినిధులు ఇంతి వెంకటరమణ, నారపిని అప్పలరాజు, పోలీసు, దేముడుబాబు, బొడ్డపల్లి తాతబాబు, గంగరాజు, సూరిబాబు చెట్టి శ్రీను, కృష్ణ, రాంబాబు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పూజలందుకున్న పంచముఖ ఆంజనేయ స్వామి

PUBLIC NOTICE

All the public are hereby inform you that, my client Pilla Venkata Narasimha Patrudu S/o Pilla Venkata Ramaiah Patrudu intend to purchase below mentioned schedule property from Paila Nagamani W/o P. Sama Sundara Rao, if any issue or objection to this property please be reported within 15 days from the date of this publication.

SCHEDULE

All that the piece and parcel of site measuring 155 sq.yds. or 130.018 sq.mts. (Eastern Part) out of 311 sq.yds., together with RCC slabbed house thereon consisting of Stilt Floor measuring 1400 Sft., Ground Floor measuring 1400 Sft. First Floor measuring 1400 Sft., Second Floor measuring 1400 Sft. and Third Floor measuring 200 Sft., bearing Door No.13-107, Municipal Assessment No.1086419932, with Electricity Sc. Nos. 1164252292 002232 situated at Plot No.132 of the Layout Approved by VUDA vide B.L.P. No. 11/2000 and final L.P.No.16/2001, covered by S.No.144/6 of Chinamushidiwada Village, within the limits of Greater Visakhapatnam Municipal Corporation, Visakhapatnam and Pendurthi Registration Sub District and the property bounded by : **EAST:** Plot No.131 site.; **SOUTH:** 80 Feet wide Road.; **WEST:** Part of site belongs to Velaganati Satya Nagar Narasimha.; **NORTH:** Plot No. 127 site.
MEASUREMENTS: East wing: 70.0 feet or 21.33 mts.; **South wing:** 20.0 feet or 6.09 mts.; **West wing:** 70.0 feet or 21.33 mts. **North wing:** 20.0 feet or 6.09 mts.

PANDU VAMSIKRISHNA, B.A.,B.L.
ADVOCATE
D.No. 49-46-23/1, 2nd Floor, Akkayyapalem,
VISAKHAPATNAM-530016. **Cell: 7788991789**

(c) eenadu

ఈనాడు
అనంతపురం
బుధవారం జనవరి 28, 2026

రుణం మార్గం... చిరు వ్యాపారులకు వరం

చేయూత ఎలా ?

నగర, పట్టణాల్లో ఉన్న వీధి వ్యాపారులకు క్రెడిట్ కార్డులు అందజేసి ఎవరి పూచీకత్తు లేకుండా సొమ్ము పొందడం, అనంతరం సకాలంలో చెల్లింపులు చేస్తూ రోజువారీ వ్యాపారాలు చేసుకొని మిగిలిన సొమ్ము ఉంచుకొని అప్పు తీసుకున్న దాన్ని చెల్లించడానికి దారి చూపడం. జిల్లా కేంద్రంలో లాంఛనంగా ప్రారంభించి ఐదుగురికి ప్రయోగాత్మకంగా క్రెడిట్ కార్డులను అందించారు.

ఎవరు అర్హులు

నగర, పురపాలికల్లో వీధుల్లో పలు రకాల వ్యాపారాలు చేసుకొనే వారు.

పొందే వీలు ఎక్కడ: నగర, పురపాలికల్లోని మెప్మా విభాగాలను సంప్రదించి క్రెడిట్ కార్డులు పొందొచ్చు.

ఎంతమందికి: నగరంలో 974 మంది వీధి వ్యాపారులకు అందిస్తారు.

ఎంత మొత్తంలో: రూ.2.43 కోట్లు అందజేసేందుకు అర్హులను గుర్తించారు.

అశోక్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: పీఎం స్వనిధి, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సంయుక్తంగా చిరు వ్యాపారులకు డిజిటల్ ఫలాలను చేరువ చేసే ఒరవడికి శ్రీకారం చుట్టారు.

అందించే బ్యాంకులు: కెనరా, యూనియన్, స్టేట్, ఇండియన్ ఓవర్‌సీస్, ఇండియన్, పంజాబ్ నేషనల్ బ్యాంకు ఇవన్నీ పీఎం స్వనిధి 2.0లో.. వీధి వ్యాపారులు ఆర్థిక సాధికారత కోసం 2.0లో మొదట రూ.15 వేలు, రెండో విడత రూ.25 వేలు, మూడో విడత రూ.50 వేలు పొందొచ్చు.

ప్రాంతం	వీధివ్యాపారులు	లక్ష్యం	దరఖాస్తు
అనంతపురం	1938	1530	974
తాడిపత్రి	1064	633	387
గుత్తి	527	445	272
గుంతకల్లు	1592	1237	497
కళ్యాణదుర్గం	1030	696	116
రాయదుర్గం	595	404	109

ప్రయోజనాలెన్నో

✦ చిరు వ్యాపారులు వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లకుండా రుణంతోపాటు క్రెడిట్ కార్డు ద్వారా అదనంగా పొందొచ్చు.
✦ మొదట రూ.10 వేలు నుంచి రూ.30 వేల వరకు రుణం పొందొచ్చు.
✦ డిజిటల్ లావాదేవీల ద్వారా రుణం చెల్లించిన వారికి 7శాతం వడ్డీ రాయితీ
✦ వడ్డీలేని కాలపరిమితి 20 నుంచి 50 రోజులు. ఈఎంఐకి మార్చుకోవచ్చు.
✦ డిజిటల్ లావాదేవీలకు క్యాష్‌బ్యాక్ ప్రతి 3 నెలలకు రూ.400.

అన్ని విధాలా..

రూ.50 వేలు రుణం పొందిన వారు క్రెడిట్ కార్డు ద్వారా అదనంగా రూ.30 వేలు పొందొచ్చు. నమ్మకం, క్రమం తప్పకుండా చెల్లించే ప్రతి ఒక్కరికీ ఉపయుక్తం. లక్ష్యం మేరకు వీధి వ్యాపారులందరికీ అందజేస్తాం. డిజిటల్ ఫలాలు అందరికీ అందుతాయన్న నమ్మకం ఉంది. **- విశ్వజ్యోతి, మెప్మా పీడీ**

భూ రీసర్వేలో అలసత్వం తగదు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న భూ రీసర్వేలో ఏ దశలోనూ అలసత్వం చూపొద్దని ఇన్‌ఛార్జి కలెక్టర్ స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా అధికారులతో మాట్లాడుతూ భూ రీసర్వేపై రైతులకు ముందుగా చెప్పాలి. గ్రామాల్లో ప్రచారం నిర్వహించాలన్నారు. రెవెన్యూ క్లినిక్‌కు వచ్చే అర్జీలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. డీఆర్‌ఓ మాలోల, కేఆర్‌సీసీ ఉప కలెక్టర్ తిప్పేనాయక్, కలెక్టరేట్ సమన్వయాధికారి యుగేశ్వరిదేవి, ఏడీ రూప్లానాయక్, తదితరులు పాల్గొన్నారు.

నన్ను కాస్త తలకెక్కించుకోండి!

✤ గతేడాది నవంబరు 26న రాత్రి 11 గంటల సమయంలో అనంత నగరానికి చెందిన కాసిఫ్, అబ్దుల్ రహీం కలిసి బైక్‌పై సైపుల్లా బ్రిడ్జి వద్ద వేగంగా వెళ్తూ ఫుట్‌పాత్‌ను ఢీకొట్టారు. కాసిఫ్ తల ఫుట్‌పాత్‌పై ఉన్న సిమెంట్ దిమ్మెలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. హెల్మెట్ పెట్టుకుని ఉంటే గాయాలతో బయటపడేవాడు.

✤ ఉరవకొండ మండలం ములగిరిపల్లెకు చెందిన అజయ్ మూడు నెలల కిందట స్వగ్రామం నుంచి ఉరవకొండకు వస్తుండగా చిన్న ముష్టూరు వద్ద జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు బలమైన గాయాలై చనిపోయాడు.

ఓ అన్నా.. తమ్ముడూ ఒక్కసారి ఇటువైపు చూడండి. నేను మీ శిరస్త్రాణాన్ని(హెల్మెట్). ప్రాణం విలువ మీకంటే నాకే బాగా తెలుసు. కేవలం నన్ను ధరించకపోవడం వల్లే ఏటా వందలమంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. హెల్మెట్ పెట్టుకోవాలని పోలీసులు ప్రమాణం చేయిస్తున్నా.. విరివిగా ప్రచారం చేస్తున్నా చాలామందిలో మార్పు కనిపించడం లేదు. నన్ను ధరించకుండా ప్రమాదాల్లో చనిపోయిన వారిలో యువకులే అధికం. మూడేళ్లలో 458 మంది కేవలం నన్ను ధరించకపోవడం వల్లే ప్రమాదాల్లో మృత్యువాతపడ్డారు. వీరిలో ఏ ఒక్కరైనా నా విలువను గుర్తించి ఉంటే నేడు వారి కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండేవారు. అందుకే ఇప్పటికైనా మారండి. నన్ను గుర్తించండి. నా మాట విని నన్ను కాస్తా తలకెక్కించుకోండి.
- ఈనాడు, అనంతపురం

అపోహలు వద్దు సుమా..!

నన్ను ధరిస్తే జుట్టు ఊడిపోతుందని చాలా మంది యువతీ, యువకులు భయపడుతుంటారు. అదంతా అపోహ మాత్రమే. ఈ విషయం ఇప్పటికే వైద్యపరంగా రుజువైంది. ధరిస్తే జుట్టును ఎండ, కాలుష్యం బారి నుంచి కాపాడతాను. అందుకే అపోహలు విడిచిపెట్టి ధైర్యంగా నన్ను ధరించండి. నన్ను ఎంచుకునేటప్పుడు నాణ్యత విషయంలో రాజీ పడొద్దు. ఐఎస్ఐ మార్కు చూసి కొనండి.

నన్ను ధరించకపోవడంతో ప్రాణాలు కోల్పోయినవారు..

ఏడాది	మరణాలు
2023	159
2024	143
2025	156

నెలాఖరులోపు పదోన్నతుల ప్రక్రియ పూర్తి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఈనెలాఖరులోపు అన్ని కేడర్ల వారికి పదోన్నతుల కల్పించాలి. ఇందులో ఏమాత్రం జాప్యం చేయవద్దని ఇన్‌ఛార్జి కలెక్టర్ విష్ణు చరణ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష జరిపారు. నాన్ సెలెక్షన్ పోస్టులను నిబంధనల ప్రకారం భర్తీ చేయాలి. అన్ని శాఖలతోనూ సమన్వయం చేసేందుకు డీఆర్‌ఓను నోడల్ అధికారిగా నియమించామని తెలిపారు. కలెక్టరేట్ నుంచి సంప్రదింపులు చేసేందుకు ప్రతి శాఖ కార్యాలయంలోనూ ఒక నోడల్ అధికారిని నియమించాలన్నారు. కలెక్టరేట్‌లోనూ కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

అరటిగెలను చూపుతున్న అధికారులు

తక్కువ కోతల్లోనే ఎక్కువ దిగుబడి

రాప్తాడు, న్యూస్‌టుడే

సంకల్పం: అరటి సాగులో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న అనంత జిల్లా రైతులను మరింత ప్రోత్సాహకాలు కల్పించాలని..

ప్రయోగం...

గొందిరెడ్డిపల్లి దగ్గర ఇండస్ట్రియల్ ఏరియాలోని ఎలైట్ బయో టెక్నాలజీ టిష్యూకల్చర్ విధానంలో ల్యాబ్‌లో ఉత్పత్తి చేసిన మొక్కలను రైతులు సాగు చేయగా మంచి దిగుబడి వచ్చింది.

ల్యాబ్‌లో..: ఇజ్రాయెల్‌లో పండే పొడవైన అరటి గెలను.. ఇక్కడి ఉద్యానశాఖ అధికారులు సిబ్బందితో టిష్యూకల్చర్ విధానంలో ల్యాబ్‌లో పెంచారు. ఈ మొక్కను ధర్మవరపు మురళి.. ఎమ్మెల్యే సునీతకు మంగళవారం అందించారు. ఈ రకం సాగును ప్రోత్సహించాలని కోరారు.

ఇండస్ట్రియల్ యూనిట్ల అభివృద్ధితో..

'స్థానిక ఇండస్ట్రియల్ ఏరియాలోని అరటి ఉత్పత్తి యూనిట్లను మరింత అభివృద్ధి చేస్తే రైతుల డిమాండ్ మేరకు సరఫరా చేయవచ్చు. ప్రత్యేకంగా ఈ మొక్కను ఇజ్రాయెల్ నుంచి అరటి గడ్డలను దిగుమతి చేసుకుని ఇక్కడ టిష్యూకల్చర్ పద్ధతిలో ఉత్పత్తి చేయడం అభినందనీయం. బయట మార్కెట్ కంటే తక్కువ ధరకు, అధిక దిగుబడి, కాయ నాణ్యత, గెల పొడవు బాగుంటాయి. ఎకరాకు 35 టన్నులు దిగుబడితోపాటూ, తక్కువ కోతల్లో ఎక్కువ దిగుబడి సాధ్యం. ఇండస్ట్రియల్ యూనిట్లను అభివృద్ధి చేస్తే ఎంతోమందికి ఉపాధి లభిస్తుంది. **- ఎమ్మెల్యే పరిటాల సునీత**

పేరు చందా.. తీరు దందా!

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే: గుత్తి మండలంలోని తొండపాడులోని రంగనాథస్వామి ఆలయంలో పలు అక్రమాలు వెలుగుచూస్తున్నాయి.

ఆలయ ప్రతిష్ఠకు భంగం

దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్న అద్దె గదుల సొమ్మును కొందరు వసూలు చేసుకుంటున్నారు. 4 నెలల నుంచి ఆలయంలో టికెట్ పద్ధతి అమల్లోకి తెచ్చారు. గతంలో ఆలయంలో ఈ పద్ధతి లేదు. భక్తులు, అర్చకులు అభ్యంతరాలు వ్యక్తం చేసినా టికెట్లను విక్రయిస్తున్నారు

● డిసెంబరు 30న తొండపాడు రంగనాథ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఘనంగా నిర్వహించారు. వందల కొద్దీ భక్తులు తరలివచ్చారు. ఆలయ అధికారులు, సిబ్బంది టికెట్ పద్ధతి పెట్టారు.

● నిబంధనల ప్రకారం టికెట్ విధానం పెట్టాలంటే దేవాదాయ శాఖ కమిషనర్, ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరి. కానీ అనుమతి లేకుండానే వైకుంఠ ఏకాదశికి వందల్లో

చందా పేరుతో ఏర్పాటు చేసిన బోర్డు

టికెట్లు అమ్మారు. ఒక్కో టికెట్టు ధర రూ.100 పెట్టి మరీ వసూలు చేశారు. భక్తుడికి ఓ టికెట్ ఇవ్వాలి. ముగ్గురుంటే ముగ్గురికి ఒకే టికెట్‌లో రూ.300 అని రాసి ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రంగనాథ స్వామి పేరుతో రసీదు పేపర్లు సిద్ధం చేశారు. భక్తులంతా ప్రభుత్వమే టికెట్లు పెట్టిందని అనుకున్నారు. కొన్ని గంటల్లోనే వెయ్యికి పైగా టికెట్లు విక్రయించారు. మొత్తంగా ఇలా రూ.43 వేలు వసూలు చేసినట్లు చెబుతున్నారు.

టికెట్‌కు అనుమతి రాలేదు

వైకుంఠ ఏకాదశికి టికెట్ పెట్టాలని దేవాదాయ శాఖ కమిషనర్ నుంచి అనుమతి రాలేదు. చందా పేరుతో టికెట్లు విక్రయించాం. వచ్చే బ్రహ్మోత్సవాలకు టికెట్ ఇచ్చి వసూలు చేయాలని నిర్ణయించుకున్నాం. **- శోభ, తొండపాడు, ఆలయ ఈవో**

పిల్లల్లో మా బిడ్డను చూసుకుంటాం..

● పేద విద్యార్థులకు ఆర్థిక సాయం ● ప్రవాస భారతీయుడి ఉదారత

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: ఆర్జించిన సొమ్ములో అంతో ఇంతో అభాగ్యులకు అందించి అందులో సార్థకతను వెతుక్కునే వారు సమాజానికి స్ఫూర్తిదాయకమే. ఈ కోవలో తెలంగాణ రాష్ట్రం, పెద్దపల్లి జిల్లా, కొత్తపల్లి గ్రామానికి చెందిన దాత డాక్టరు కేశవరెడ్డి ఒకరు. తనవంతుగా పలువురు విద్యార్థులకు సాయం అందిస్తున్నారు.

సేవ కొనసాగిస్తాం..

మా కుమారుడిని పిల్లల్లో చూసుకుంటూ ప్రతిభ గల పేద విద్యార్థులను గుర్తించి ఫౌండేషన్ ద్వారా చదివిస్తున్నాం. ఛైర్మన్, సభ్యుల సహకారంతో సాధ్యమైంది. భవిష్యత్తులో రూ.కోటి డిపాజిట్ చేసి.. వచ్చిన వడ్డీ డబ్బుతో సేవలను కొనసాగించాలనే ప్రణాళిక ఉంది..
- డాక్టర్ కేశవరెడ్డి, ఫిజిషియన్, అమెరికా

ఆర్థిక సాయం ఎలా?

స్థిర నివాసం : అమెరికాలో టెక్సాస్‌లో (ఫిజిషియన్‌గా) స్థిరపడ్డారు.

ప్రేరణ: కేశవరెడ్డి, భారతి దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు రాజేశ్ మరణించడంతో అతని పేరుపై రాజ్ ఫౌండేషన్‌ను స్థాపించారు. అమెరికాలో ఉంటూ ఏడాదికి రూ.9 లక్షల వరకు పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నారు.

కార్యవర్గంలో ఎవరెవరు?: 2018లో రాజ్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. విశ్రాంత స్టేట్ బ్యాంకు మేనేజర్ ఛైర్మన్‌గా గోపాల్‌నాయుడు, వైస్ ఛైర్మన్ ఆర్‌కే నాయుడు, కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా రామపుల్లయ్య, నరసింహం, రాకేశ్, నటరాజ్ సభ్యులు.

విద్యార్థినికి నోటు పుస్తకాలు అందిస్తున్న ఫౌండర్ కేశవరెడ్డి, ఛైర్మన్ గోపాల్‌నాయుడు

ప్రతిభ విద్యార్థుల దత్తత

దత్తత: గుంతకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు మండలాలకు చెందిన 23 మంది విద్యార్థులను..

కోర్సులు: ఇంటర్, బీఫార్మసీ, డిగ్రీ, బీటెక్, ఎంబీబీఎస్, నర్సింగ్ కోర్సులను చదవిస్తున్నారు.

ఒక్కో విద్యార్థికి : ఏడాదికి రూ.15 వేలు నుంచి రూ.40 వేల వరకు ఫీజుల బట్టి కళాశాలలకు చెల్లిస్తున్నారు.

ఉపకారవేతనాలు సైతం : 23 మంది విద్యార్థుల్లో 15 మంది చదువుకుంటున్నారు. ఎనిమిది మంది ఉద్యోగాలు తెచ్చుకున్నారు. స్కూల్స్, కళాశాల్లో చదువుకుంటున్న ప్రతిభ విద్యార్థులకు మార్కులను బట్టి ఏడాదికి రూ.5వేల నుంచి రూ.10 వేల వరకు ఉపకార వేతనాలను అందిస్తున్నారు. ఇప్పటివరకు రూ.60 లక్షల ఖర్చు చేశారు.

పాపంపేటలో సిమెంటు రహదారి పనులు

పనులు చేయకపోతే.. నిధులు వెనక్కి!

రూ.80 కోట్ల అంచనాలపై నీలినీడలు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఇటీవల మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని సవరించింది. పేరు మార్పుతో పాటు పనుల నాణ్యత, నిధుల వినియోగంలో పారదర్శకతను తీసుకురావాలన్నదే ప్రధాన లక్ష్యం. కొత్త పథకం అమలు చేసే ముందు పాత పథకం కింద చేపట్టిన పనుల పూర్తి చేయడానికి కేంద్రం షరతు విధించింది. వచ్చే మార్చి 10లోగా పనులు పూర్తి చేసి.. ఎఫ్‌టీఓలను నివేదించి బిల్లుల మంజూరుకు స్లాట్ బుక్ చేసుకోవాలి. అలా చేయకుంటే నిధులు వెనక్కి మళ్లే అవకాశం ఉంది. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈక్రమంలో పనులు పూర్తి చేయకుంటే బిల్లులు రావడం గగనమే. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తేనే పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.

✦ ఉపాధి హామీ పథకం కింద ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.6 కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకు విడుదలయ్యాయి. ఈనిధులతో సిమెంటు రహదారులు, డ్రైనేజీ, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, సచివాలయ భవనాలు, రైతు వికాస కేంద్రాల భవనాలు నిర్మాణాల్లో ఉన్నాయి.

అందరి సహకారంతో..

ఉపాధి హామీ నిధులతో పనులన్నీ వందశాతం పూర్తి చేయాలంటే పాత పనులన్నీ జాబితాలో తొలగించాలి. ఆలస్యం చేస్తే నిధులన్నీ మురిగిపోయే ప్రమాదముంది. పనులు పూర్తి కావాలంటే అందరి సహకారంతోనే సాధ్యమవుతుంది.
- కె.లక్ష్మీనారాయణ, పంచాయతీరాజ్ డీఈఈ

పాతవి రద్దు చేస్తేనే..

ఉపాధి పథకం కింద గ్రామాల్లో చేపట్టిన పనులు వందల సంఖ్యలో ఆగిపోయాయి. పనులు ఇంకా ప్రగతి ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తున్నారు. ఒక గ్రామంలో పది పనుల్లోపు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి అవకాశం ఉంటుంది. ఉదాహరణకు అనంతపురం గ్రామీణ మండలంలో రూ.1.99 కోట్లకు సంబంధించి మస్టర్ చేయాలి. కక్కలపల్లి కాలనీ, కురగుంట, చిన్నంపల్లి, పూలకుంట గ్రామాల్లో రూ.1.02 కోట్లకు మాత్రమే మస్టర్లు సిద్ధం చేశారు. పాత పనులు రద్దు చేయకపోతే రూ.1.99 కోట్లు వెనక్కి పోయే ప్రమాదముంది. ఇలా ఒక మండలంలో కాదు... ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఇదే సమస్య ఉంది.

✤ రాప్తాడు మండలంలో 2017-25 మధ్య కాలంలో 525 పనులు చేపట్టారు. వాటిల్లో చాలావరకు వివిధ దశల్లో ఆగిపోయాయి. వాటిని జాబితాల నుంచి తొలగించడమా.. లేక పూర్తి చేయాలి. అలా కాకుంటే ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరైన పనులు చేయడం సాధ్యం కాదు. మస్టర్ నమోదు చేయడం కుదరదని అధికారులు చెబుతున్నారు. గృహనిర్మాణం, ఉద్యాన శాఖల ద్వారా చేయించిన పనులకు మాత్రం మినహాయించారు.

హనుమంత వాహనంపై దర్శనమిస్తున్న ఖాద్రీశుడు

మధ్వనవమి వేడుక

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల ఆరంభానికి సూచికగా మంగళవారం మధ్వనవమి వేడుక వైభవంగా నిర్వహించారు. ఫిబ్రవరి 27న బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. దీంతో స్వామివారు వేడుకలకు ఆహ్వానం పలుకుతూ హనుమంత వాహనంపై పురవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

భూగర్భ జలం.. పుష్కలం!

భూగర్భ జలాల అంతర్గత ప్రవాహాలు ఎవరికీ అంతుబట్టవు. ఒక్కోచోట 1000 అడుగులు వేసినా నీటిచుక్క పడదు. మరోచోట అరడుగులలో 30 బోర్లు వేసినా నీరు తరగవు. నీటి లభ్యత ఉంటే రైతులు ఆనందానికి అవధి ఉండదు. కలిసి వచ్చిన అదృష్టాన్ని ఐక్యంగా నిలిచి తరాల నుంచి ఫలాలను పొందుతున్నారు పరిగి మండలం లోని పెన్నా పరీవాహక ప్రాంతాల రైతులు.

లభ్యత ఇలా: పైడేటి గ్రామ సమీపాన పెన్నానదిలో 6 అడుగుల వ్యవధిలో ఒక చోట పది, మరోచోట 30 దాకా ఫిల్టర్ బోర్లకు అందించేంతగా నీటి లభ్యత ఉంది. పైడేటి, తిరుమల దేవరపల్లి, గణపతిపల్లి, రొద్దం మండలం మరవపల్లి, కలిపి, పెద్దమంతూరులలో వరి, మల్బరీ, మొక్కజొన్న, జొన్న, రాగి, పూల తోటలు, నేపియర్ గడ్డి పండిస్తున్నారు.

ఒకేచోట 10 ఫిల్టర్ బోర్లు

80, 90 అడుగుల్లో

ఒక కిలో మీటరు నుంచి రెండు కిలోమీటర్ల మేర పీవీసీ పైపులు ఏర్పాటు చేసుకుని పంట పొలాలకు సాగు నీటిని తరలిస్తున్నారు. 2022-24 సంవత్సరాల్లో పెన్నా, జయమంగళి నదులు వరద నీరు ప్రవహించడంతో ఆయా నదుల్లో భూగర్భజలాలు వృద్ధి చెందాయి. 80 నుంచి 90 అడుగుల్లోనే నీరు లభ్యమవుతోంది. గ్రామాల్లోని రైతులు ఎవరూ పట్టింపులకు పోకుండా నదిలో ఫిల్టర్ బోర్లను ఏర్పాటు చేసుకుని వివిధ రకాల పంటలను సాగు చేసుకుంటున్నారు. **- న్యూస్‌టుడే, కొడిగెనహళ్లి (పరిగి)**

ఆలోచనల్ని అంకుర సంస్థలుగా మార్చండి

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను సద్వినియోగం చేసుకొని యువత తమ ఆలోచనలు అంకుర సంస్థలుగా రూపొందించడానికి కృషి చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ విష్ణుచరణ్ పేర్కొన్నారు. జేఎన్‌టీయూలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో ఎంటర్‌ప్రెన్యూషిప్, స్కిల్ డెవలప్‌మెంట్‌పై 5 రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ఆరంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌ఛార్జి కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక కుటుంబం- ఒక వ్యాపారవేత్త అనే లక్ష్యంతో ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేశారన్నారు. వ్యాపారవేత్తలు, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ప్రపంచబ్యాంకు నిధులతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ విష్ణుచరణ్

అవకాశం అందిపుచ్చుకోండి

వ్యాపార ఆలోచనలు విజయవంతం అయ్యే వరకూ ఇన్నోవేషన్ హబ్ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వంతో పాటు పరిశ్రమలు, విద్యాసంస్థలు, పెట్టుబడిదారుల కలయికతో నడిచే ఒక సంస్థ ఇది అన్నారు. విద్యార్థులందరూ ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఇష్టమైన రంగంలో వ్యాపారకోణాన్ని ఆవిష్కరించాలన్నారు. ఇన్నోవేషన్ హబ్ సీఈవో హఫీజ్‌బాష, అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం సీఈవో చంద్రమౌళి, శిక్షకులు వసుంధర, వేణుగోపాల్ పాల్గొన్నారు.

పొజిషన్ సర్టిఫికెట్‌కు.. లంచం

హిందూపురం, న్యూస్‌టుడే : నివాసం ఉన్న ఇంటికి అన్ని అర్హతలు ఉన్నా పొజిషన్ సర్టిఫికెట్ జారీకి రూ.8వేల లంచం డిమాండ్ చేసిన వీఆర్వో హరిత, డబ్బు తీసుకుంటూ వీఆర్ఏ రామాంజినేయులు అవినీతి నిరోధక శాఖ అధికారులకు మంగళవారం పట్టుబడ్డారు. కిరికెరకి చెందిన జయచంద్రకుమార్ పక్కా గృహాన్ని కొనుగోలు చేశాడు. ఆ ఇంటికి బ్యాంకు నుంచి రుణం తీసుకోవాలని పొజిషన్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేయగా వీఆర్‌వో హరిత ధ్రువపత్రం జారీకి నిరాకరించి రూ.8వే లుఇవ్వాలని డిమాండ్ చేసింది. జయచంద్రకుమార్ అనిశా అధికారులను సంప్రదించాడు. ఆమె వీఆర్ఏ రామాంజినప్పను డబ్బులు తెమ్మని పంపింది. అతడికి డబ్బులు ఇస్తుండగా అధికారులు వీఆర్ఏను పట్టుకొన్నారు.

గారాలపట్టి.. తైక్వాండోపై దృష్టి

తల్లిదండ్రుల కష్టాన్ని కళ్లారా చూసిన విద్యార్థులు వారి శ్రమ వృథా కానీయకుండా చిన్నతనం నుంచే క్రీడల్లో ఉన్నత స్థానాలకు చేరుకొని తల్లిదండ్రుల కల సాకారం దిశగా అడుగేస్తోంది.

భవ్యశ్రీ

పేరు: భవ్యశ్రీ, నివాసం : తాడిపత్రి జయగనర్ కాలనీలో

తల్లిదండ్రులు, వృత్తి : శ్రీహరిరెడ్డి, రజని దంపతులు. కుమార్తె భవ్యశ్రీ నాలుగో తరగతి చదువుతోంది. తండ్రి టీ స్టాల్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కుమార్తెకు మెరుగైన విద్య అందిస్తూ తైక్వాండోలోనూ ఐదేళ్లుగా శిక్షణ ఇప్పిస్తున్నారు.

ప్రతిభ : గతంలో హైదరాబాద్‌లో జాతీయ స్థాయి క్యాడెట్ తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటి అందరి దృష్టిలో పడింది. ఇప్పటి వరకు రాష్ట్రస్థాయిలో 4 బంగారు పతకాలు, జిల్లా స్థాయిలో 6 పతకాలు సాధించింది. **లక్ష్యం :** భవిష్యత్తులో క్రీడా కోటాలో ప్రభుత్వ కొలువు సాధించడమే లక్ష్యంగా ఉన్నట్లు భవ్యశ్రీ చెబుతోంది..
- న్యూస్‌టుడే, తాడిపత్రి

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: ఓటు వజ్రాయుధం లాంటిదని దుర్వినియోగం చేసుకుంటే అధోగతి తప్పదని పలువురు వక్తలు హెచ్చరించారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు 'మై భారత్ మై ఓటు' అనే నినాదంతో విద్యార్థులు, పలువురు కలిసి ప్రదర్శన చేశారు. ఓటీపీఆర్ఐ నుంచి ప్రారంభించిన ఈ ప్రదర్శన నగరంలోని ప్రాంతాల్లో నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త జి.మమత, జేఎన్‌టీయూ ఓటీపీఆర్ఐ డైరెక్టర్ సుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ గోపీనాథ్, యూఎన్ఓ యువజన సమన్వయకర్త బి.భరత్, మై భారత్ కార్యక్రమ బాధ్యుడు జి.శ్రీనివాసులు, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ రమేష్, జీవన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారి లహరి, ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు, అధికారులు

సెంట్రల్ వర్సిటీలో కొత్త కోర్సులు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : విద్యా విధానంలో మార్పులు నిత్య నూతనం. ఇటీవల కాలంలో వస్తున్న అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా సెంట్రల్ వర్సిటీలో కొన్ని కొత్త కోర్సులను పరిచయం చేస్తున్నారు.

మాట్లాడుతున్న వీసీ కోరి

ప్రస్తుతం కొనసాగుతున్నవి?: పీజీ 15 కోర్సులు, యూజీ 9 కోర్సులు, డిప్లొమో కోర్సులున్నాయి.

కొత్తగా : మూడు పీజీ కోర్సులైన ఎమ్మెస్సీ జీనోమిక్ సైన్స్, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎంసీఏను కొత్తగా ప్రవేశ పెడుతున్నాం. మరికొన్ని కోర్సులను అత్యాధునిక డిజిటల్ విధానంలో తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. **- పాత్రికేయ సమావేశంలో వీసీ కోరి**



(c) eenadu

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – తాడికొండ

బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ – రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ – నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Hospitality Partner: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Man of the Series: Hero
Digital Partner: ఈనాడు.నెట్, ETV BHARAT
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ – I జూనియర్స్: మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ – రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్స్‌లతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులు చేసి ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ – I జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గాప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

సీనియర్స్ విన్నర్స్ రాయలసీమ రాకర్స్

గ్రౌండ్-2లో సీనియర్స్ : సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ చరణ్ జిత్ ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-I (జూనియర్స్)
మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)
మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ – నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

సింహవాహనంపై దేవదేవుడు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: కొండమీద వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీవారు సతీసమేతంగా సింహవాహన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామంలో వెలసిన ఆలయంలో ఉదయం నుంచే అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో గ్రామ పెద్దలు, అర్చకులు శ్రీవారిని సతీసమేతంగా సింహవాహన అలంకరణ చేసి గ్రామోత్సవం ద్వారా పుర వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తులు స్వామికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం స్వామి శేషవాహన అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని అర్చకులు తెలిపారు.

నేత్రపర్వంగా అంజన్న ప్రాకారోత్సవం

ప్రాకారోత్సవంలో భక్తులు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ప్రాకారోత్సవం మంగళవారం రాత్రి నేత్రపర్వంగా సాగింది. ఉదయం నుంచి ఆలయంలో స్వామి మూలవిరాట్‌కు విశేష పూజలు నిర్వహించారు. రాత్రి 7గంటలకు స్వామి ఉత్సవమూర్తిని పల్లకిలో ఉంచి వేదపండితులు, అర్చకులు పూజలు చేశారు. తర్వాత ఆలయం చుట్టూ ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఈవో విజయరాజు, ఆలయ పర్యవేక్షకులు రామమోహన, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

వైభవంగా రంగనాథుడి ఊరేగింపు

సింహ వాహనంపై రంగనాథుడు

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే: గుత్తి మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన ప్రసిద్ధ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి రెండో రోజు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం వేదపఠనము నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి సింహవాహనంపై ప్రతిష్ఠించారు. అర్చకులు రవికుమార్, లిఖిల్ వర్మ, ఉదయ్ కుమార్‌లు ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, అర్చనలు, మహా మంగళ హారతి, పంచామృతాభిషేకం చేశారు. సాయంత్రం రంగనాథ స్వామిని చిన్న రథంపై ప్రతిష్ఠించి గ్రామ సమీపంలోని జమ్మి చెట్టు వరకు ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

మధ్యవర్తిత్వంతోనే కేసుల పరిష్కారం

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

అనంతపురం (మూడోరోడ్డు), న్యూస్‌టుడే: మధ్యవర్తిత్వంతోనే సులభంగా కేసులను పరిష్కరించుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ.భీమారావు అన్నారు. న్యాయవాదులకు ఐదు రోజుల పాటు నిర్వహించే శిక్షణా తరగతులను ఆయన మంగళవారం జిల్లా కోర్టులో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 31 వరకు తరగతులు నిర్వహిస్తామన్నారు. న్యాయవాదులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చెన్నై, అలహాబాద్ నుంచి వచ్చిన అధ్యాపకులు అనూప్‌కుమార్ శ్రీవాస్తవ, శశిదేవి తర్ఫీదు ఇస్తారన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ధర్మసింగ్ నాయక్, న్యాయవాదులు పాల్గొన్నారు.

కోర్టు ఉద్యోగాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి దరఖాస్తు గడువును ఈనెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ.భీమారావు ఒక ప్రకటనలో తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్, ప్రింట్ ఆఫీసు, రికార్డు అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాల కోసం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

బీటెక్ సెమిస్టర్ పరీక్ష ఫలితాల విడుదల

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ పరిధిలో నిర్వహించిన బీటెక్ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. బీటెక్ ద్వితీయ సంవత్సరం ఒకటి, రెండు సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల చేశారు. పరీక్షల విభాగం సంచాలకులు నాగప్రసాద్‌నాయుడు, శివకుమార్, శారద ఫలితాలు విడుదల చేశారు.

ఒకేషనల్ విద్యార్థులకు ప్రయోగపరీక్షలు

అనంతపురం విద్య: ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు మంగళవారం ప్రయోగ పరీక్షలు ఆరంభమయ్యాయి. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం ప్రయోగ పరీక్షలు జరిగాయి. 10 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 414 మందికి 389 మంది హాజరయ్యారు. 25 మంది గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 371 మందికి 362 మంది హాజరయ్యారు. 9 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల కన్వీనర్, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి వెంకటరమణనాయక్ 2 కేంద్రాలు, డీవీఈవో గురువయ్య 2 కేంద్రాలు తనిఖీ చేశారు.

30న అనంతలో పురపాలక కమిషనర్ల ప్రాంతీయ సమావేశం

అనంత నగరపాలక: రాయలసీమ పరిధిలో ఉన్న 42 పురపాలక కమిషనర్ల ప్రాంతీయ సమావేశం ఈనెల 30న నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని పురపాలకశాఖ పరిపాలనా సంచాలకులు సంపత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జేఎన్‌టీయూ ఆడిటోరియంలో నిర్వహిస్తారు. సమావేశానికి పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ, పురపాలకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ హాజరు కానున్నారు. ఆయా నగర, పురపాలకల్లో చేపట్టాల్సిన తాగునీరు, శానిటేషన్, ఆస్తి పన్నులు వసూళ్లు, కుక్కల ఆపరేషన్లు, అన్న క్యాంటీన్ల నిర్వహణ, రోడ్లలో గుంతలకు మరమ్మతులు, బీపీఎస్, టిడ్కో, చేపట్టే సరికొత్త అంశాలపై సమీక్ష ఉంటుంది.

రోడ్డు సేఫ్టీ మిషన్ ప్రారంభం

రోడ్డు భద్రతకు సంబంధించిన గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్పీ జగదీశ్, ఇన్‌ఫ్లుయెన్సర్లు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: రహదారి భద్రతా నియమాలను పాటిస్తే ప్రమాదాలను నియంత్రించవచ్చని ఎస్పీ జగదీశ్ పేర్కొన్నారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పనకు ఉద్దేశించిన ‘రోడ్డు సేఫ్టీ మిషన్’ను మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కాన్ఫరెన్సు హాలులో ప్రారంభించారు. ఈ కార్యక్రమం జిల్లాలో 31 వరకు నిర్వహించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులతో పాటు ప్రభుత్వ శాఖలు, ఎన్జీవోలు, విద్యాసంస్థలు, వ్యాపారులు, మీడియా, యువజన సంఘాలు భాగస్వామ్యం కావాలన్నారు. జిల్లా పరిధిలోని అన్ని రహదారులపై 34 బ్లాక్‌స్పాట్లు, 27 ప్రమాదకర ప్రాంతాలు ఉన్నాయన్నారు. అతివేగం, హెల్మెట్లు, సీటు బెల్టు ధరించకపోవడం, మొబైల్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్... తదితరాలు ప్రమాదాలకు కారణాలుగా గుర్తించామన్నారు. ఎక్కువగా మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 12 సమయంలో జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అశ్వని మణిదీప్, డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్టీవో సురేశ్‌నాయుడు పాల్గొన్నారు.

ఉపాధిపై ‘వికసిత్’ దాడి : సీపీఐ

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: పాత ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్రం తీసుకొచ్చిన వీబీ జీరామ్‌జీ చట్టాన్ని రద్దుచేసి, పాత చట్టాన్ని కొనసాగించాలని సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 1 నుంచి 8 వరకు సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ప్రచార ఆందోళనలు, 9న ఏపీవో కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం నీలం రాజశేఖర్‌రెడ్డి భవనంలో ఆయా పార్టీ నాయకులు గోడపత్రాలు ఆవిష్కరించారు. నాయకులు నారాయణస్వామి, కేశవరెడ్డిలు మాట్లాడుతూ.. గ్రామీణ కష్టజీవులకు వెన్నుదన్నుగా నిలిచిన ఉపాధి చట్టాన్ని రద్దుచేసి సందిగ్ధంలో పడేసిందన్నారు. దశాబ్దాలుగా కమ్యూనిస్టు పార్టీలు, వ్యవసాయ కార్మిక సంఘాల పోరాటాలతో 2004లో ఉపాధి హామీ చట్టం చేశారన్నారు. అలాంటి మహత్తర పథకాన్ని మోదీ ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. సహాయ కార్యదర్శి మల్లికార్జున, రంగయ్య, పెద్దయ్య, సూర్యనారాయణ పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అంకితభావంతో విధుల్లో రాణించాలి : డీఆర్ఎం

డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ట్రైన్ మేనేజరు

గుంతకల్లు, న్యూస్‌టుడే : ప్రయాణికుల సురక్షిత ప్రయాణం కోసం భద్రతా విభాగాల్లో పనిచేసే సిబ్బంది చాలా అప్రమత్తంగా ఉండాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, ఏడీఆర్ఎం సుధాకర్ అన్నారు. డివిజన్‌లో నెలరోజుల కాలంలో రైలు ప్రమాదాలు జరగకుండా నిలువరించిన ఎనిమిది మంది సిబ్బందికి మంగళవారం మ్యాన్ ఆఫ్ ద మంత్ కింద ప్రశంసాపత్రాలను అందజేశారు. సిబ్బంది రైలు పట్టాల వెల్డింగులు విరిగిన వాటిని గుర్తించడం, రైలు పట్టాల్లోని పగుళ్లను, రైలు చక్రాల ఇరుసులు దెబ్బతిని ఉండడం వంటి వాటిని గుర్తించి ప్రమాదాలను నిలువరించారన్నారు. ట్రైన్ మేనేజర్లు శ్రీరాం సూరిబాబు, వెంకటేశ్వర్‌రెడ్డి, పాయింట్స్‌మెన్లు దినేశ్‌కుమార్ రెడ్డి, రాజ్‌కుమార్ గుప్తా, ట్రాక్‌మెన్లు గంగాధర్ నాయక్, గ్యాసుద్దీన్ అన్సారీ, హకీకత్, ఉలిగన్నలు ప్రశంసాపత్రాలను అందుకున్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ డీఓఎం శ్రావణ్‌కుమార్, కోఆర్డినేషన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఖాతాలో రూ.6 లక్షలు మాయం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని జంతులూరు గ్రామంలో రాము అనే యువకుడి బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.6 లక్షలను పలు దఫాలుగా తమ ఖాతాలకు మళ్లించుకున్నారు. రాము ప్రైవేట్ సంస్థలో పని చేస్తూ భార్య, కుమారుడితో కలిసి జంతులూరులో నివాసం ఉంటున్నాడు. బుక్కరాయసముద్రంలో ఇంటి స్థలం కొనుగోలు చేయడానికి తాను దాచుకున్న డబ్బులతో పాటు, స్నేహితుల వద్ద కొంత అప్పు చేసిన డబ్బు బ్యాంకు ఖాతాలో ఉంచుకున్నాడు. కాగా 15 రోజుల కిందట కాలికి ప్రమాదం జరగడంతో నడవలేని స్థితిలో ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈక్రమంలో 24, 26వ తేదీల్లో సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్‌లో రాము సెల్‌ఫోన్‌ను హ్యాక్ చేసి అతని బ్యాంకు ఖాతానుంచి దశలవారీగా రూ.6 లక్షలు తమ ఖాతాలకు మళ్లించారు. డబ్బులు డ్రా అయినట్లు సెల్‌కు మెసేజ్‌లు రావడంతో రాము సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు. సైబర్ నేరగాళ్ల సెల్‌ఫోన్ నంబరు ఆధారంగా వారిని గుర్తించే పనిలో ఉన్నామని సీఐ పుల్లయ్య తెలిపారు.

EENADU Classifieds
JOBS

గూడ్స్ ఆటో డ్రైవర్ - 1 No. (టౌన్‌లో డెలివరీ చేయుటకు) Tally బిల్లింగ్ person -1 no. సేల్స్ పర్సన్స్ - 2 No's కావలెను. Con: 9703402722

మా ఆఫీస్ నందు వర్క్ చేయుటకు యువతి, యువకులు కావలెను. Q: 10th to డిగ్రీ. శాలరీ 08K to 30K. Contact: 9703131570

అనంతపురంలోని ప్రముఖ Jr. కాలేజిలో Maths/ Physics/ Chemistry/ Botany/ Zoology/ Civics/ Economics/ Commerce/ Sanskrit/ English Sr & JR Faculty, Accountant, Computer Operator Hostel Incharge, Receptionist, Wardens, Attender, MEOs కావలెను. ✆ 9704271270

అనంతపురం, ధర్మవరం టౌన్‌లో ఎడ్యుకేషన్ ఆఫీసులో జాబ్ చేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. Q:Any డిగ్రీ, జీతం: 10K-15K + ఇన్సెంటివ్స్ ✆ 7416471633

ATP మారుతినగర్ నందు 8వ తరగతి బాబుకు సాయంత్రం 6-8 ట్యూషన్ చెప్పడానికి హోమ్ ట్యూటర్ కావలెను. సెల్: 8142221239.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU Classifieds 5 లైన్ల ప్రకటన రూ.395/- మాత్రమే
తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...
వివరాలకు : 8008709784
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

ఆరేళ్లుగా మిరప.. రాబడికి లేదు కొదవ!

ముదిగుబ్బ, న్యూస్‌టుడే : ఆరేళ్లుగా మిరప సాగులో మెలుకువలు పాటిస్తూ అధిక లాభాలను పొందుతున్నారు ముదిగుబ్బ మండలంలోని సిద్దన్నగారిపల్లికి చెందిన రైతు నారాయణస్వామి. తనకున్న 1.25 ఎకరాల్లో ఆగస్టులో మిరప సాగు చేశారు. గార్లదిన్నె మండలంలోని ఓ నర్సరీ నుంచి హాట్‌షాట్‌వన్ రకానికి చెందిన మిరప మొక్కలను ఒక మొక్క రూ.1తో 17 వేల మొక్కలు కొనుగోలు చేశారు. ముందుగా పేడ ఎరువులు చల్లించి ఐదుమడకలతో భూమిని దున్నించారు. రోటావేటర్, టిల్లర్‌తో చదును చేసి బోదులు ఏర్పాటు చేసి డ్రిప్పు పద్ధతిలో సాగు చేశారు.

తెగుళ్ల నివారణ ఇలా...

మిరపలో ఆకు ముడత, తామర పురుగు, తెల్లనల్లి తెగుళ్లు వ్యాపించాయి. ఇమిడాక్లోప్రిడ్, స్పైనటోరామ్, డైకోఫాల్ తదితర మందులు పిచికారీ చేయడంతో తెగుళ్లను నివారించారు. దీంతో కాయ నాణ్యతతో పాటు దిగుబడి బాగా వచ్చింది. మొక్క కొనుగోలు నుంచి సేద్యం, కూలి, ఎరువులు, మందుల కోసం రూ.1.50 లక్షలు పెట్టుబడికే ఖర్చు చేశారు.

60 రోజుల్లో కోతకు...

మొక్క నాటిన 60 రోజులకు అక్టోబర్‌లో దిగుబడి ప్రారంభమైంది. మొదటి కోతలో 52 కిలోలవి 52 మూటలు, రెండో కోతలో 46 మూటలు, ఇలా మొత్తం ఐదు కోతల్లో 18 టన్నులు దిగుబడి వచ్చింది. టన్ను రూ.14 వేల నుంచి అత్యధికంగా రూ.20వేల వరకు స్థానిక వ్యాపారులకు విక్రయించారు. ఇప్పటి వరకు మొత్తం దిగుబడి విక్రయించగా రూ.4.50 లక్షల రాబడి వచ్చింది. పెట్టుబడి ఖర్చులు పోయి రూ.3 లక్షలు లాభం మిగిలింది. ఇంకా 10 కోతల దిగుబడి వస్తుందని, ధరలు ఇలానే కొనసాగితో మరో రెండు లక్షలు వరకు లాభం వస్తుందని రైతు ఆశాభావం వ్యక్తం చేశారు.

దిగుబడి చూపుతున్న రైతు నారాయణస్వామి

అలసంద, పెసర పంటలు సాగు చేశారా?

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: రబీ వ్యవసాయ సీజన్‌లో అనంత జిల్లాలో అలసంద, పెసర సాగు చేసిన రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని రెడ్డిపల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లీశ్వరి తెలిపారు. ప్రధానంగా తెల్లదోమలు, పల్లాకు తెగులు వ్యాపించి పంటను నాశనం చేస్తాయన్నారు. దీంతో దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందన్నారు. తెల్లదోమల నివారణకు రైతులు వేపనూనె 5 మి.లీ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయడంతో పాటు ట్రైజోఫాస్ 1.5 మి.లీ, ఎసిఫేట్ ఒక గ్రాము లీటరు నీటికి పిచికారీ చేయాలి. పల్లాకు తెగులు నివారణకు రైతులు ప్రొఫినోఫాస్ 1.5 మి.లీ, అసిటామిప్రిడ్ 0.2 గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే తెగులు అదుపులోకి వస్తుందని శాస్త్రవేత్త తెలిపారు.

పల్లాకు తెగులు బారిన పడిన పెసరపంట

రైతేరాజు

చిట్కా

సమస్య-సమాధానం

నారాయణస్వామి శాస్త్రవేత్త

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: రబీ వ్యవసాయ సీజన్‌లో వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతులు పంటల సాగులో ఎలాంటి సందేహాలున్నా రేకులకుంట వ్యవసాయ శాస్త్రవేత్త నారాయణ స్వామి చరవాణి నంబరు : 62812 84235కు ఫోన్‌చేసి తగిన సలహాలు, సూచనలు పొందవచ్చు.

సమస్య : పొద్దుతిరుగుడు పంటకు పొగాకు లద్దె పురుగు తెగులు సోకింది. ఈ తెగులును ఎలా అరికట్టాలి.-వెంకటేష్, పెద్ద వడుగూరు

సమాధానం: పొద్దుతిరుగుడు పంటలో పొగాకు లద్దె పురుగులు గుర్తించిన వెంటనే రైతులు నోవాలురాన్ ఒక మి.లీ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే తెగులు అదుపులోకి వస్తుంది.

సమస్య : అరెకరం విస్తీర్ణంలో గోంగూర సాగు చేస్తున్నాం. ఆకులపై తెల్లటి మచ్చలు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యను ఎలా అధిగమించాలి.-మునిస్వామి, రేకులకుంట

సమాధానం: గోంగూర ఆకులపై తెల్లటి మచ్చలు, చారలు ఉంటే దీన్ని పొడ తెగులుగా గుర్తించాలి. వెంటనే రైతులు మెటలాక్సిన్ 3 గ్రాములు, మాంకోజెబ్ 3 గ్రాముల లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే తెగులు అదుపులోకి వస్తుంది.

లాభాల చామంతి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: చామంతి పూల సాగు ఆ రైతు ఇంట లాభాల సిరులు కురిపిస్తోంది. కళ్యాణదుర్గానికి చెందిన ఆంజనేయులు ఐదుకల్లు రోడ్డులో తనుకున్న ఎకరాలో చామంతి పంట సాగు చేస్తూ అధిక ఆదాయం ఆర్జిస్తున్నాడు. ఎకరాలో పూర్ణిమ, సెంటల్ అనే రకాలకు చెందిన తెలుపు, పసుపు, చాక్లెట్ రంగు చామంతి పూల సాగు చేపట్టారు.

- కర్ణాటకలోని చిత్రదుర్గం జిల్లా నాకినేటి గ్రామంలోని నర్సరీ నుంచి ఒక్కో మొక్క రూ.1.50లతో 8వేల మొక్కలకు రవాణా రూ.13 వేలు, పాలిథిన్ కవర్ల ఒక గట్ట రూ.2,500 వేలతో రూ.7 వేలు, కలుపు, పురుగు మందులకు రూ.15వేలు, రోజుకి ముగ్గురు కూలీలకు రూ.750 తదితర వాటితో కలిసి రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. సాగు చేసిన 45 రోజులకే పంట చేతికి రాగా రెండు నెలల వరకు దిగుబడి రానుంది. రోజు 60 కిలోల చామంతి పువ్వులు కోతకు వస్తున్నాయి.

విపణిలో ఆశాజనకంగా ధర

చామంతి పువ్వులకు మార్కెట్లో రూ.70-100 ధర పలుకుతోంది. పండగ, ఇతరత్రా శుభకార్యాలు ఉన్నప్పుడు కిలో రూ.200 ధర ఉంటుంది. రోజుకు రూ.3 వేల నుంచి రూ.4వేల వరకు ఆదాయం వస్తోంది. ఇప్పటి వరకు రూ. 1.20 లక్షల వరకు రాబడి సమకూరింది. ఇంకా పది రోజులు పంట కాలం ఉంటుందని రైతు చెబుతున్నారు.

చామంతి పూల తోట

సస్యరక్షణ చర్యలు ఇలా..

పది రోజులకోసారి డ్రిప్, పురుగు మందులు, వేరుకుళ్లు రాకుండా ట్రైకోడర్మన్, సూరోమోనోజ్ మందును పంట నాటిన 20 రోజులకోసారి రెండు సార్లు మాత్రమే డ్రిప్ ద్వారా పంటకు వదలాలి. లద్దె పురుగు సోకకుండా రోగార్, అసిఫెట్ మందు 30-40 మి.లీ. 20 లీటర్ల నీటిలో కలిపి 10 రోజులకోసారి పంటకు పిచికారీ చేయాలి. తద్వారా పంట ఆశించిన స్థాయిలో చేతికొస్తుందని, స్వల్పకాలిక పంట ఎంతో ఊరటనిస్తోందని రైతు చెబుతున్నారు.

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

గోడ ప్రతులు విడుదల చేస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

నిరుద్యోగ రణభేరికి తరలిరండి

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: నిరుద్యోగ రణభేరికి భారీ ఎత్తున యువత తరలి రావాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కొట్రేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఐ పార్టీ కార్యాలయంలో రణభేరికి సంబంధించిన గోడ ప్రతులను విడుదల చేశారు. ఈ నెల 30న విజయవాడలో ఛలో విజయవాడ పేరుతో సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు, నాయకులు నాగయ్య, శంకర్, సురేశ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దేవమ్మతల్లి కుంభోత్సవం

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని ఏళంజి గ్రామంలో మంగళవారం రాత్రి దేవమ్మ దేవర మహోత్సవంలో భాగంగా కుంభోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, పుష్పాలంకరణ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుంభాలను ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చారు. భక్తులు భారీ ఎత్తున పాల్గొని మొక్కులను తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక బందోబస్తును నిర్వహిస్తున్నట్లు ఎస్సై నబిరసూల్ తెలిపారు.

ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: కంబదూరులోని ప్రధాన రహదారిపై మురుగు పారుతోంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

– శ్రీనివాసులు, స్థానికుడు

సమస్య: కంబదూరు మండలంలోని అండేపల్లి గ్రామంలో తాగు నీటి సమస్య వేధిస్తోంది. కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లైనా చేయాలి.

– మారుతి, గ్రామస్థుడు

సమాధానాలు: పై రెండు గ్రామాలలో ఉన్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తాం. - **మహేశ్, పంచాయతీ కార్యదర్శి, కంబదూరు**

– న్యూస్‌టుడే, కంబదూరు

నిఘానేత్రాలకు ఏమైంది?

ఉరవకొండ, న్యూస్‌టుడే: ప్రస్తుతం సీసీ కెమెరాలకు చాలా ప్రాధాన్యం ఉంది. వాటి ద్వారా చాలా ఘటనలకు సంబంధించిన అంశాలను పోలీసులు సులభంగా ఛేదిస్తున్నారు. అయితే ఉరవకొండలో ప్రధాన రహదారులు, వీధుల్లో ఉన్న సీసీ కెమెరాలు పని చేయక నిఘా కష్టమవుతోంది. గతంలో పట్టణంలో వివిధ ప్రదేశాల్లో సుమారు 20 పైగా ప్రాంతాల్లో పోలీసులు ప్రజల సహకారంతో ఏర్పాటు చేశారు. తీగలు తెగిపోవడం, ఇతర సాంకేతిక సమస్యల వల్ల చాలా కాలంగా మరమ్మతులకు గురయ్యాయి. ఎక్కువ కాలం నిరుపయోగంగా మారడంతో కెమెరాలు పనికి రాకుండా పోయాయి. దీని కారణంగా రోడ్డు ప్రమాదాలు, చోరీల కేసులు ఛేదించడానికి ఇక్కట్లు ఎదురవుతున్నాయి. కొన్ని చోట్ల ప్రభుత్వం ఏర్పాటు చేసిన మ్యాట్రిక్స్ కెమెరాలు ఉన్నా, వాటిలో నమోదు అయిన అంశాలు స్థానికంగా చూసుకోవడానికి అవకాశం లేదు.

అనంతపురం - బళ్లారి జాతీయ రహదారిలోని మూడు రోడ్ల కూడలిలో నిరుపయోగంగా మారిన సీసీ కెమెరాలు

నిఘాకు ఎదురవుతున్న ఇబ్బందులు

వారం క్రితం పట్టణంలోని ఓ టీకేఫ్‌లో జరిగిన దొంగతనం, పోలీస్‌స్టేషన్ సమీపంలో ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటనలు ఆయా దుకాణాల్లోని కెమెరాల్లో నమోదయ్యాయి. కానీ ప్రధాన దారుల్లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో తరవాత దొంగలు ఎటు వెళ్లారో గుర్తించడానికి అవకాశం లేకుండాపోయింది. వీటితో పాటు రోడ్డు ప్రమాదాలకు కారణమైన గుర్తు తెలియని వాహనాలను తెలుసుకోవడం కూడా కష్టమవుతోంది. ఇలాంటి ఘటనలు చాలానే ఉన్నాయి. అధికారులు చొరవ తీసుకుని, ప్రజా భాగస్వామ్యంతో వాటిని తిరిగి అందుబాటులోకి తీసుకు వచ్చే దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఉరవకొండ సీఐ మహానందిని వివరణ కోరగా సీసీ కెమెరాలను తిరిగి అందుబాటులోకి తీసుకొచ్చే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజల సహకారంతో ముందుకు సాగుతామన్నారు.

సురక్షితమైన తాగునీరు అందించడమే ధ్యేయం

బెళుగుప్ప, న్యూస్‌టుడే: ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడానికి మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని బెళుగుప్ప, గంగవరం, అంకంపల్లి గ్రామాల్లో ప్రజలకు నీటిని అందించే మంచినీటి ట్యాంకులలో ఆటోక్లోరినేషన్‌తో, యువీ కిరణాల మిషన్లను అమర్చుతున్నామన్నారు. ఆస్ట్రేలియాకు చెందిన ఎన్ఆర్ఐల సహకారంతో ఒక్కొక్క ట్యాంకు వద్ద రూ.35 లక్షల వ్యయం గల మిషన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా ట్యాంకుల చుట్టూ ఉన్న కంప చెట్లను పంచాయతీ సిబ్బందితో కలిసి మంగళవారం తొలగించినట్లు వివరించారు. త్వరలోనే ట్యాంకుల వద్ద మిషన్లు అమర్చే పనులు మొదలవుతాయని వెల్లడించారు. తాగునీటిని అందించడానికి ప్రత్యేక చొరవ చూపడంతో ఈ సందర్భంగా మూడు గ్రామాల ప్రజలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో మున్సిపల్ ఛైర్‌పర్సన్ భర్త సోమశేఖర్‌తో కలిసి వార్డు విజిట్ కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికి తిరుగుతూ వార్డులో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. సమస్యలను అధికారులు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ, తెదేపా నాయకులు

అర్హులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలి

కణేకల్లు, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో కణేకల్లులో సర్వే నెం.40, 41లలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థల పట్టాలను రద్దు చేయకుండా ప్రస్తుతం అర్హులైన వారికి స్థలాలు చూపించి పట్టాలు పంపిణీ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో కలిసి మంగళవారం స్థానిక అంబేడ్కర్ కూడలి నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ఆందోళన చేపట్టారు. నిబంధనల పేరిట గతంలో ఇచ్చిన పట్టాలను లాక్కునే ప్రయత్నం చేయవద్దని రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. సీపీఐ తాలూకా కార్యదర్శి నాగార్జున, మండల కార్యదర్శి నాగార్జున, సహాయ కార్యదర్శి శర్మాస్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా గంధం ఊరేగింపు

కణేకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని జక్కలవడికి గ్రామంలో జరిగే వన్నూరుస్వామి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గంధం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రార్థనలు చేసి, గంధం ఊరేగింపు చేపట్టారు. భక్తులు విశేషంగా గంధం వేడుకలలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం వేకువజామున ఉరుసు ఊరేగింపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు దుర్గం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు ఛైర్‌పర్సన్ పోరాళ్లు శిల్ప అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు రాయదుర్గం కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నియంత్రికలు ఇవ్వడంలేదని రైతుల ఆందోళన

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్త విద్యుత్తు నియంత్రికలు మంజూరు చేయాలని రాయదుర్గం పట్టణంలోని విద్యుత్తుశాఖ కార్యాలయం వద్ద పెట్రోల్ బాటిల్‌తో ముగ్గురు రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. మండలంలోని మెచ్చిరి గ్రామానికి చెందిన ఎల్లప్ప, బొమ్మక్కపల్లి గ్రామానికి చెందిన రైతులు బొమ్మేశ్, సురేశ్‌లు గత రెండేళ్ల క్రితం విద్యుత్తు కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. నేటికీ నియంత్రికలు ఇవ్వకుండా రాయదుర్గం విద్యుత్తుశాఖ ఏఈ బాలచంద్ర కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ, వేధిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కన్నా వెనుక దరఖాస్తు చేసుకున్న రైతులకు ఇచ్చారన్నారు. దీంతో తమ పంటలు ఎండిపోతున్నాయని నిరసన వ్యక్తం చేశారు. ఏఈ అందుబాటులో లేకపోవడంతో తాము ఆత్మహత్యకు పాల్పడతామంటూ రైతులు హెచ్చరించారు. విషయం తెలుసుకున్న రాయదుర్గం అర్బన్ సీఐ జయనాయక్ విద్యుత్తు కార్యాలయం వద్దకు చేరుకొని ఏఈని పిలిపించి రైతులతో మాట్లాడించారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ విషయమై రాయదుర్గం విద్యుత్తుశాఖ ఏఈ బాలచంద్రను సంప్రదించగా కొత్త నియంత్రికల మంజూరు కోసం ఉన్నతాధికారులకు వివరించామన్నారు. పది రోజుల్లో రైతులకు కొత్తవి మంజూరు చేస్తామన్నారు అని వెల్లడించారు.

విద్యుత్తుశాఖ కార్యాలయం ముందు పెట్రోల్ బాటిల్‌తో ఆందోళన చేస్తున్న రైతులు

పశుపతినాథ ఆలయ అభివృద్ధికి సహకరించండి

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని చదం గ్రామ సమీపంలో లింగాలబండపై వెలసిన పురాతన పశుపతినాథస్వామి ఆలయ అభివృద్ధి, పునరుద్ధరణ పనులను స్థానిక భక్తుల సహకారంతో చేపట్టేందుకు వీలుగా అనుమతులు ఇవ్వాలని రాష్ట్ర టూరిజంశాఖ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్‌కు రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు విన్నవించారు. విజయవాడలోని ఆయన కార్యాలయంలో మంగళవారం సాయంత్రం వినతిపత్రం అందజేశారు. భారతదేశంలో నేపాల్ తర్వాత రాయదుర్గం ప్రాంతంలో వెలసిన పశుపతినాథుని ఆలయానికి ఎంతో విశిష్టత ఉన్నట్లు తెలిపారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా ఒక సందర్భంలో రాయదుర్గంలోని పశుపతినాథుని ఆలయం గురించి ప్రస్తావించడంతో ఈదేవాలయానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. ఇటీవల సీఎం చంద్రబాబుకు దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కాలవ విజ్ఞప్తిపై అజయ్ జైన్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

మంత్రి లోకేశ్‌కు అభినందనలు తెలుపుతున్న కాలవ

యువగళానికి మూడేళ్లు..

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: నారా లోకేశ్ మూడేళ్ల క్రితం చేపట్టిన యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయ చరిత్రను తిరగరాసిందని రాయదుర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు కొనియాడారు. యువగళం పాదయాత్ర మూడేళ్లు పూర్తి చేసుకున్న శుభ సందర్భంలో మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో మంగళవారం లోకేశ్‌కు కాలవ అభినందనలు తెలిపారు.

నూతన పీఆర్సీకి డిమాండ్

వజ్రకరూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం పీఆర్సీ నియమించి, ఐఆర్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫిక్ డిమాండ్ చేశారు. వజ్రకరూరు మండలంలో మంగళవారం ఏపీటీఎఫ్ మండల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల ఉపాధ్యాయుల జీతాలు జీవితాల్లో ఎలాంటి మార్పు కనపడటంలేదని 2023 జూలై 1నాటికి అమలు కావాల్సిన నూతన పీఆర్సీ ప్రభుత్వం నియమించలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ఉరవకొండ మండలశాఖ అధ్యక్షుడు భాస్కర్, హనుమప్ప, మున్నా తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు బాధ్యతల అప్పగింత

ఉరవకొండ, న్యూస్‌టుడే: గత ఏడాది కాలంగా ఉరవకొండ గవిమఠం ఇన్‌ఛార్జి ఏసీగా కొనసాగిన దేవదాయ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాణి ఎట్టకేలకు ఆ శాఖ జిల్లా సహాయ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్‌కు మంగళవారం బాధ్యతలు అప్పగించారు. ఆయనను దేవదాయ కమిషనర్ ఇక్కడ పూర్తి అదనపు బాధ్యతలు కింద ఏసీగా నియమించారు. ఈనెల 23న బాధ్యతలు తీసుకోవడానికి రాగా, రాణి కొంత సమయం కోరడంతో ఆయన వెనుదిరిగిన విషయం తెలిసిందే. అయితే ఆమె జిల్లా దేవదాయశాఖ కార్యాలయానికి వెళ్లి, ఆయనకు బాధ్యతలు అప్పగించడంతో ఆ విషయంలో నెలకొన్న సంగ్ధిత తొలగింది. మరో 15 రోజుల్లో ప్రారంభం కానున్న మఠం బ్రహ్మోత్సవాలను విజయవంతంగా పూర్తి చేయడంపై దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు.

‘దౌర్జన్యం చేయడం తగదు’

కణేకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని ఆదిగానిపల్లి గ్రామంలో బలవంతపు మత ప్రచారం అడ్డుకున్న గ్రామస్థులపై ప్రచారకులు కొందరు రౌడీల్లా ప్రవరిస్తూ, దౌర్జన్యం చేసిన తీరును వీహెచ్‌పీ నాయకులు ఖండించారు. సోమవారం జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ.. వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షులు దేవిరెడ్డిపల్లి రాజేష్ మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రచారకులలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న వ్యక్తి, మరో ఇద్దరు నానా దుర్భాషలాడి ఇష్టారాజ్యంగా ప్రవర్తించడం తగదన్నారు.

మట్టి దిబ్బలతో ప్రమాదాలు

కళ్యాణదుర్గం నుంచి కన్నేపల్లికి వెళ్లే రహదారిలో పట్టణ సమీపాన రోడ్డుకిరువైపులా మట్టి దిబ్బలు ఉండటంతో ప్రమాదకరంగా మారింది. పట్టణంలో పాత ఇళ్ల నిర్మాణం జరుగుతుండగా అక్కడి వ్యర్థ మట్టిని ట్రాక్టర్లతో తీసుకొచ్చి ఇక్కడ వేస్తున్నారు. దీని వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. వీటిని తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

నిరుపయోగంగా ట్యాంకు

విడపనకల్లు మండలం పెద్ద కొట్టాలపల్లి గ్రామంలో దాదాపు ఆరు నెలలుగా మినీ ట్యాంకు నిరుపయోగంగా మారింది. మోటారు మరమ్మతులకు గురికావడంతో నీటి సరఫరా ఆగిపోయింది. వీధుల్లో ఉన్న రెండు మినీ ట్యాంకులు వృథాగా మారాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి మోటారు మరమ్మతులు చేయించి నీటి సమస్య తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, విడపనకల్లు

మురుగు తొలగించరూ..

వజ్రకరూరు మండలం గడేహోతూరు గ్రామం బస్టాండు పక్కన ఉన్న బీసీ కాలనీలో మురుగు కాలువలు లేక సిమెంటు దారిపై మురుగు ప్రవహిస్తోంది. దీంతో దోమలు ఉద్ధృతి ఎక్కువగా ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, వజ్రకరూరు

శ్రీధరఘట్ట సహకార సంఘానికి అవార్డు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: శ్రీధరఘట్ట సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు రసాయన ఎరువుల పంపిణీ, రైతుల వద్ద వరిధాన్యం రికార్డు స్థాయిలో కొనుగోలు చేయడంతో అవార్డు వచ్చినట్లు సీఈవో నాగరాజు, సింగిల్ విండో అధ్యక్షుడు ఎర్రిస్వామి తెలిపారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.14.93 కోట్లను 48 గంటల్లోనే రైతుల ఖాతాలకు జమ చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా సహకార సంఘం డీసీవో అరుణకుమారి అవార్డును వీరికి అందజేశారు.

ఎస్కేఆర్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఉరవకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని కరిబసవస్వామి రిక్రియేషన్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ప్రతినిధులు మంగళవారం తెలిపారు. క్లబ్ ఉపాధ్యక్షుడిగా ఎర్రిస్వామి నాయుడు, కార్యదర్శిగా శ్రీరాములునాయక్, సహాయ కార్యదర్శిగా న్యాయవాది తుకారామ్, కార్యవర్గ సభ్యులుగా నాగరాజు, నాగభూషణం, ఎర్రిస్వామి, రాజశేఖర్, రమేశ్ ఎన్నికయినట్లు తెలిపారు. క్లబ్ అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని గుత్తేదారులకు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని పలు కాలనీల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రి వెనుక రహదారి నిర్మాణ పనులతో పాటు ఆక్రమణలు తొలగింపు, క్యూరింగ్ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. దారులు, మురుగు కాలువలు నాణ్యంగా, గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సురేశ్, ఏఈ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి

విద్యార్థులకు అభినందనలు

శెట్టూరు, న్యూస్‌టుడే: శెట్టూరు మండలం యాటకల్లు ఉన్నతపాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్థులు మంగళవారం అభినందించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా అనంతపురం పరేడ్ మైదానంలో సాంస్కృతిక కార్యక్రమంలో అత్యుత్తమ ప్రదర్శనకు జిల్లాస్థాయి మొదటి బహుమతి లభించిందని, కలెక్టర్, ఎస్పీల చేతుల మీదుగా ప్రశంసా పత్రం, షీల్డ్‌ను అందజేశారని హెచ్.ఎం చంద్రమౌళి పేర్కొన్నారు.

రీసర్వేపై రెవెన్యూ అధికారులు, సిబ్బందికి శిక్షణ

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం రీసర్వేపై జారీ చేసిన ఉత్తర్వులు అమలు చేయాలని రెవెన్యూ అధికారులు, సిబ్బందికి కళ్యాణదుర్గం ఆర్డీవో వసంతబాబు సూచించారు. రాయదుర్గం పట్టణంలోని డ్వామా కార్యాలయంలో ఐదు మండలాల రెవెన్యూ అధికారులకు రీసర్వే విధివిధానాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. రైతుల భూసమస్యలు, వెబ్ ల్యాండ్‌పై సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. శిక్షణ తరగతులలో నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్‌లు, కళ్యాణదుర్గం ఇన్‌స్పెక్టర్ సర్వే అధికారులు, మండల రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌లు, మండల ఆర్ఐలు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రాయదుర్గం డ్వామా కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఆర్డీవో వసంతబాబు

కార్మిక చట్టాలు రద్దు చేయాలి

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా కార్మిక వర్గానికి నష్టం కలిగించే నాలుగు చట్టాలను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు, కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కమిషనర్, సీఐకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వచ్చే నెల 12వ తేదీన నిర్వహిస్తున్న సమ్మెకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ తాలూకా కార్యదర్శి మల్లికార్జున, మున్సిపల్ కార్మికులు రాము, సిద్దేశ్వర, మల్లేశ్, తిప్పేస్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై నాయకుల ఆందోళన

కుందుర్పి, న్యూస్‌టుడే: కుందుర్పి మండల తహసీల్దార్ ఓబులేశు సామాన్యులు, దళితుల సమస్యల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, ఇబ్బందులకు గురిచేస్తున్నారని శీగలపల్లి గ్రామానికి చెందిన దళితులు, మహిళలకు మద్దతుగా, ఎంఆర్‌పీఎస్ ఓవర్గం నాయకుల అధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ప్రధాన ద్వారంకు అడ్డుగా కూర్చొని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని శీగలపల్లి గ్రామంలో పలువురు దళితులకు 2023లో అప్పటి ప్రభుత్వం ఇంటి స్థలాలకు పట్టాలు ఇచ్చారన్నారు. దాంతో ఇంటి స్థలాలు తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇళ్లనిర్మాణం చేయకపోవడంతో సంవత్సరాలుగా స్థలానికి పక్కనున్న బీసీ వర్గాల వారు ఆక్రమించుకున్నారని తెలిపారు. పది రోజుల క్రితం కళ్యాణదుర్గం ఆర్డీవో వసంత్‌బాబుకు ఫిర్యాదు చేయగా, పరిశీలించి న్యాయం చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించినట్లు తెలిపారు. అయినా ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పట్టించుకోలేదని వారు అన్నారు. దాంతో మరో వర్గం ఎంఆర్‌పీఎస్ నాయకులు అక్కడకు చేరుకుని, తహసీల్దార్‌కు మద్దతుగా వాదనకు దిగారు. దాంతో ఇరువర్గాల నాయకులు బాహాబాహీకి దిగడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న ఎస్సై మహేష్ పోలీసు సిబ్బందితో చేరుకుని ఇరువర్గాలను పక్కకు పంపించారు. సమస్యపై తహసీల్దార్‌తో చర్చించారు. రెండు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో దళితులు, నాయకులు ఆందోళన విరమించారు.

‘పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయండి’

మాట్లాడుతున్న వైకాపా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, పక్కన మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ మంత్రి శైలజనాథ్, మాజీ ఎంపీ తలారి రంగయ్య తదితరులు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని వైకాపా నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీనివాస కళ్యాణ మండపంలో వైకాపా నియోజకవర్గం స్థాయి సంస్థాగత నిర్మాణ సమావేశం నిర్వహించారు. మాజీ ఎంపీ, నియోజకవర్గం సమన్వయకర్త రంగయ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి పార్టీ జిల్లా ముఖ్యనేతలు హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామం, వార్డులోనూ సమర్థవంతమైన కమిటీలను ఏర్పాటు చేసి పార్టీని క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే: కూడేరు మండలం పి.నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చిన్న బొజ్జన్న అనే రైతుకు చెందిన గడ్డివాము మంగళవారం సాయంత్రం దగ్ధం అయ్యింది. విద్యుదాఘాతంతోనే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు బాధితుడు తెలిపాడు. వారు గుర్తించే లోపు మంటల అధికం కావడంతో ఆర్పడానికి అవకాశం లేకుండా పోయిందన్నాడు. దీంతో 8 ట్రాక్టర్ల పశుగ్రాసంతో పాటు బిందు సేద్య పైపులు కాలిపోయాయి. మంటల్లో చిక్కుకుని ఆవు దూడ కూడా మృతి చెందింది. రూ.2లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత కుటుంబం తెలిపింది.

ఉపాధి హామీ పథకం పునరుద్ధించాలి

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు, పేద రైతులకు, వలస కూలీలకు ఉపాధి కల్పించే జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని పునరుద్ధరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ‘వీబీ జీ రామ్ జీ’కి వ్యతిరేకంగా ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి లోకేష్, సభ్యులు వెంకటేష్, గంగాధర, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటిద్దాం

విడపనకల్లు, న్యూస్‌టుడే: విడపనకల్లు పోలీసు స్టేషన్‌లో ఎస్సై ఖాజాహుసేన్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ పోస్టర్లు విడుదల చేశారు.

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరిస్తే ప్రాణాలకు రక్షణగా ఉంటుందని డీఎస్పీ రవిబాబు, రవాణాశాఖ ప్రాంతీయ అధికారి రమేశ్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా మంగళవారం పట్టణ పోలీసు స్టేషన్ వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. వారితో పాటు సీఐ హరినాథ్, ఆర్టీసీ డీఎం రామచంద్ర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

బెళుగుప్ప: పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలలో తరలించరాదని డ్రైవర్లకు ఎస్సై శివ సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాలపై మండల కేంద్రంలో మంగళవారం ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఉరవకొండ: పోలీస్‌స్టేషన్ వద్ద రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ మహానంది

కళ్యాణదుర్గం: మాట్లాడుతున్న రవాణాశాఖ ప్రాంతీయ అధికారి రమేశ్

కణేకల్లు, న్యూస్‌టుడే: రహదారి భద్రతా నియమాలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలని ఎస్సై నాగమధు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రోడ్డు సేఫ్టీ మిషన్‌లో భాగంగా పెట్రోలు బంకు, ద్విచక్ర వాహన షోరూం యజమానులు, మండల ఎంఈఓలతో కలిసి సమావేశం నిర్వహించారు.

ఉరవకొండ: ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం కీలకం అని ఉరవకొండ సీఐ మహానంది పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద వాటి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు.

డి.హీరేహాళ్: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం డి.హీరేహాళ్ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి స్థానిక మండల స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు, నాయకులతో కలిసి రోడ్డు భద్రత నియమాలపై అవగాహన పోస్టర్లను విడుదల చేశారు.

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంవీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.

● మనం ప్రయాణించే సమయంలో వేగం కన్నా గమ్యానికి క్షేమంగా చేరుకోవడమే ముఖ్యమని యూపీఎస్ సీఐ జయనాయక్ తెలిపారు. పాత బస్టాండు ఆవరణలో ఆటో డ్రైవర్లు, ప్రజలకు అవగాహన కల్పించారు.

కణేకల్లు: వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

రాయదుర్గం: సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ విశ్వనాథరెడ్డి

(c) eenadu

గుంతకల్లు

• గుంతకల్లు • శింగనమల • తాడిపత్రి

పాపం.. ఎంత కష్టం!

మనీషా, యశోద

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే : ఆ దంపతులు ఇద్దరు సంతానంతో ఆనందంగా గడుపుతుండగా విధి చిన్న చూపు చూసింది. అనారోగ్య కారణాలతో కన్నోళ్లు దూరం కావడంతో ఆ పిల్లల పరిస్థితి దయనీయంగా మారింది. అన్నమయ్య జిల్లా ప్రొద్దుటూరు మండలంలోని గోపారం గ్రామానికి చెందిన మద్దిలేటి గుత్తి మండలంలోని పూలకుంట గ్రామానికి చెందిన మీనాక్షిని 18 ఏళ్ల కిందట వివాహం చేసుకున్నాడు. దంపతులిద్దరూ దినసరి కూలీలు. వీరికి మనీషా, యశోద కుమార్తెలు. నలుగురితో ఆనందంగా సాగుతున్న కుటుంబాన్ని కష్టాలు చుట్టుముట్టాయి.

కరోనాతో కుటుంబం తలకిందులు

2020లో కరోనా ప్రభావంతో ఇంటి యజమాని మృతిచెందాడు. కుటుంబ భారం మీనాక్షిపై పడింది. ఇద్దరు కుమార్తెలే సర్వస్వం అనుకొని ఆమె తల్లి చెంతకు చేరింది. పెద్దకుమార్తె చదువుమానేసి తల్లితోపాటు కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తూ వచ్చింది. ఇలాంటి పరిస్థితిలో మరో పిడుగు లాంటి వార్త వినాల్సి వచ్చింది. తల్లి మీనాక్షికి కిడ్నీలు పని చేయడం లేదని వైద్యులు ధ్రువీకరించారు. డయాలసిస్ తప్పదని చెప్పారు. ఈక్రమంలో ఆరోగ్యం క్షీణించి ఈనెల 5న మృత్యుఒడికి చేరింది. మనీషా, యశోద వారి అవ్వ వద్ద తలదాచుకుంటూ కష్టంగా జీవనం సాగిస్తున్నారు.

రేకుల షెడ్డే వైద్యశాల!

షెడ్డులో విధులు నిర్వహిస్తున్న వైద్యుడు

యాడికి, న్యూస్‌టుడే : రాయలచెరువులోని పీహెచ్‌సీలో మౌలిక వసతులు కరవయ్యాయి. 2017లో ఇక్కడి ఉప కేంద్రాన్ని ప్రాథమిక వైద్య కేంద్రంగా మార్చారు. చుట్టు పక్కల 20 గ్రామీణ ప్రాంతాల నుంచి రోజూ వందకు పైగా రోగులు వస్తుంటారు. గదులన్నీ పెచ్చులూడాయి. తప్పని పరిస్థితుల్లో రేకుల షెడ్డు కింద వైద్యం అందిస్తున్నారు. నూతన భవన నిర్మాణాలు పిల్లర్ల దశలోనే ఆగిపోయాయి. దీనిపై రాయలచెరువు వైద్యుడు దేవరాజన్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా నూతన భవన నిర్మాణాల విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే పనులు పూర్తి చేయిస్తామన్నారు.

బదిలీ ఉద్యోగులకు సత్కారమాల

యల్లనూరు, న్యూస్‌టుడే : యల్లనూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే ఉద్యోగులు బదిలీ కావడంతో వారిని మంగళవారం ఘనంగా సన్మానించారు. బదిలీ అయిన శ్రీనివాస్ ప్రసాద్, గౌరీదేవి, శ్రీదేవిలు విధుల్లో అంకిత భావంతో రాణించాలని డాక్టర్ లోకేశ్ పేర్కొన్నారు. అనంతరం వైద్య సిబ్బంది కలిసి బదిలీ ఉద్యోగులను సన్మానించారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

కళాశాలలో తనిఖీ చేస్తున్న డీవీఈవో గురువయ్యశెట్టి

తాడిపత్రి, న్యూస్‌టుడే : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రవేశపెట్టిన సంకల్ప ప్రోగ్రాంను అందరూ పాటించాల్సిందేనని ఈవీఈవో గురువయ్య శెట్టి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న రెండో ప్రీ ఫైనల్ పరీక్షలు, మధ్యాహ్న భోజనం, హాజరు పట్టిక వంటివి పరిశీలించారు. ప్రిన్సిపల్ వెంకటనారాయణ, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

యువతరం.. సేవాపథం!

గతంలో ఎయిడ్స్ డే సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తాడిపత్రి, న్యూస్‌టుడే: యువత లక్ష్యంతో సాగాలని అప్పట్లో స్వామి వివేకానంద తన ప్రసంగాలతో చైతన్యం తీసుకొచ్చారు. దీన్నే అక్షరాల నిజం చేస్తూ తాడిపత్రిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు సేవా తలంపుతో ముందుకెళ్తున్నారు. ఎన్‌ఎస్‌ఎస్ సభ్యత్వం తీసుకుని సామాజిక సేవ వైపు అడుగులేస్తున్నారు. 100 మంది వాలంటీర్లుగా చేరి పురపాలికలోనే కాకుండా గ్రామాల్లో తిరుగుతూ పర్యావరణం- పరిశుభ్రత, మొక్కలు నాటడం వంటివి విరివిగా చేస్తున్నారు.

సమాజం కోసం.. భాగస్వామ్యం

పలు సేవా కార్యక్రమాల్లో యువత భాగస్వామ్యంగా బాగా ఉంటోంది. సమాజ సేవ కోసం అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మొక్కలు నాటడం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడంలో ముందు ఉంటున్నారు. **- శ్రీధర్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి**

ప్రజాహిత కార్యక్రమాలివిగో..

- మనిషిని పట్టిపీడిస్తున్న ఎయిడ్స్, పల్స్ పోలియో దినోత్సవాల సందర్భాల్లో పల్లెలు, పట్టణాల్లో చైతన్య కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తుంటారు.
- ప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా వైద్య, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తుంటారు.
- తాడిపత్రిలో ఏ ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగినా తోపులాటలు జరగకుండా భక్తులకు సేవలందిస్తున్నారు. భక్తులకు తాగునీరు, అన్నదానం, ప్రసాదాల పంపిణీ కార్యక్రమాల్లో తమ వంతు సేవలందిస్తూ అందరితో ప్రశంసలందుకుంటున్నారు.
- కాలనీలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో పచ్చని మొక్కలు నాటుతూ పరిశుభ్రతకు నాంది పలుకుతున్నారు.

పంచ్ కొడితే పతకమే!

నాగమోక్షిత

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రి పరిధి గన్నెవారిపల్లి కాలనీకి చెందిన నాగేంద్ర, లక్ష్మీదేవి కుమార్తె నాగమోక్షిత. ఎనిమిదో తరగతి చదువుతోంది. తండ్రి ఫొటోగ్రాఫర్‌గా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కుమార్తె ఆసక్తిని గుర్తించి ఐదేళ్లుగా ఉదయం, సాయంత్రం సమయాల్లో తైక్వాండో, మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇప్పిస్తున్నారు. గతేడాది ఝార్ఖండ్‌లో జరిగిన తైక్వాండో జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి కాంస్య పతకం, మరో రెండు సార్లు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటింది. నాలుగు సార్లు రాష్ట్రస్థాయిలో బంగారు పతకాలు, జిల్లా స్థాయిలో 8 పతకాలు సాధించడం విశేషం. చిన్న వయసులోనే బ్లాక్ బెల్టు సాధించింది. అంతర్జాతీయ స్థాయిలో దేశం తరఫున బంగారు పతకం సాధించాలన్నదే తన లక్ష్యమని చెబుతున్నారు.

చింత... తీరేలా చింతకాయలు

గడిచిన పదేళ్లలో ఎన్నడూ లేనంతగా చింతచెట్లకు కాయలు విరగ్గాశాయి. గుంతకల్లు మండలం పులగుట్టపల్లి గ్రామం వద్ద రైతుకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా పెంచుకున్న చింత చెట్టుకు కాపు బాగా వచ్చింది. ఇదే ప్రాంతంలో చాలా చెట్లు ఇదే మాదిరి కాయలతో నిండుగా ఉన్నాయి. విపణిలో చింతపండు టన్ను రూ.20 వేలకు పైగా పలుకుతోంది. దీంతో రైతులకు కాసుల పంట పండుతోంది.

–న్యూస్‌టుడే, గుంతకల్లు

పేరుకే మున్సిపాలిటీ కాలనీలు!

ఏళ్లుగా అభివృద్ధి శూన్యం

సిద్ధేశ్వరనగర్‌లో అధ్వానంగా కంకర రోడ్డు

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు మున్సిపాలిటీలోని సిద్ధేశ్వరనగర్, బీటీ పక్కీరప్ప కాలనీల్లో ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా తాగునీరు, మురుగునీటి కష్టాలు అన్నీఇన్నీ కావు. కాలనీల్లో పిల్లలు ఆడుకోవడానికి ఉద్యానం లేని పరిస్థితి ఉంది.

● ఆయా కాలనీల్లో మురుగు నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు కాలువలు నిర్మించినా ఆ నీరు కాలనీల నుంచి బయటకు వెళ్లడానికి ఏర్పాట్లు చేయకపోవడంతో మురుగంతా ఇళ్ల మధ్యలో ఆగుతోంది. ప్రజలు ఒకవైపు దుర్వాసనతో మరోవైపు దోమలతో అవస్థ పడుతున్నారు. జనం రోగాల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. మురుగు కాలువలను సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. కొన్ని వీధుల్లో సిమెంటు రోడ్డు, మురుగు కాలువలను ఏర్పాటు చేయలేదు.

● కుళాయిలకు నాలుగు, ఐదు రోజులకోసారి నీటిని సరఫరా చేస్తుండటంతో తాము నీటికోసం ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పురపాలిక	: గుంతకల్లు
కాలనీలు	: సిద్ధేశ్వరనగర్, బీటీ పక్కీరప్ప కాలనీ
నివాస గృహాలు	: 1500
కాలనీల్లోని జనాభా	: 4 వేలు

సౌకర్యాలు కల్పిస్తాం

రెండు కాలనీల్లోని సమస్యలను పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఎక్కడెక్కడ ఇబ్బందులున్నాయో తెలుసుకుని నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిస్తాం. అక్కడి నుంచి అనుమతులు రాగానే రోడ్లు, మురుగు కాలువలను నిర్మిస్తాం. **- హరికృష్ణ, ఏఈ**

రహదారి భద్రతా నియమాలు పాటిద్దాం

గుంతకల్లు పట్టణం : కసాపురం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రోడ్డు భద్రతపై అధికారులు సమావేశం నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసులు, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజాబాబు, గ్రామీణ సీఐ ప్రవీణ్‌కుమార్ పెట్రోల్ బంకుల యజమానులు, వ్యాపార సముదాయ నిర్వాహకులు, డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణకు గాను అవగాహన కల్పిస్తూ ఫ్లెక్సీలను విడుదల చేశారు. ఎస్సైలు వెంకటస్వామి, బాలముని పాల్గొన్నారు.

తాడిపత్రి: ర్యాలీగా పోలీసులు, రవాణాశాఖ అధికారులు

తాడిపత్రి : రహదారి భద్రత అందరి బాధ్యత అని తాడిపత్రి పట్టణ సీఐ ఆరోహణరావు, ఎంవీఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. తాడిపత్రిలోని పట్టణపోలీస్‌స్టేషన్ కూడలిలో రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహించారు. ఎస్సైలు గౌస్‌బాషా, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మేమున్నాం.... మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

సమస్య: గుంతకల్లులో కూరగాయల మార్కెట్లో ఎగువన మరుగుదొడ్ల పక్కన చెత్తకుప్ప పేరుకుపోయింది. ఇక్కడ పారిశుద్ధ్య పనులు చేయడం లేదు. **- కిరణ్**

సమాధానం: వీలైనంత త్వరగా పరిసరాల్లోని చెత్తాచెదారాన్ని తొలగించి సమస్యను పరిష్కరిస్తాం. **- రాజు, శానిటేషన్ కార్యదర్శి, 18వ సచివాలయం.** – న్యూస్‌టుడే గుంతకల్లు పట్టణం

చెన్నంపల్లి సర్పంచిపై చర్యలకు డిమాండ్

బుక్కరాయసముద్రం: చెన్నంపల్లి సర్పంచి మల్లికార్జునపై మండల అభివృద్ధి అధికారులు చర్యలు తీసుకోవాలని చెన్నంపల్లి వాల్మీకి దేవాలయ కమిటీ సభ్యులు మంగళవారం ఎంపీడీవో కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించారు. కమిటీ సభ్యులు పెద్దన్న మాట్లాడుతూ ప్రైవేట్ భూమిలో సర్పంచి అక్రమంగా బోరువేసి పంచాయతీకి నీరు వదలాలని పంచాయతీ తీర్మానం చేశాడన్నారు. బోరు వేసి పంచాయతీ నిధులు కూడా డ్రా చేశాడన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ల దినోత్సవం

మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలో ఎలక్ట్రీషియన్ల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆ అసోసియేషన్ కార్యాలయంలో కేకు కోసి సంబరాలు జరుపుకొన్నారు. అనంతరం తాడిపత్రి అసోసియేషన్‌ను ఏకగ్రీవంగా ఎంపికచేశారు. అధ్యక్షుడిగా హుస్సేన్‌బాషా, ఉపాధ్యక్షుడిగా అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా రంగనాథబాబు, కార్యదర్శులుగా శ్రీధర్, అల్లాబకాష్ తదితరులను ఎంపిక చేశారు.

సంపద సృష్టిపై ప్రత్యేక దృష్టి

మిడుతూరులో చెత్తనిల్వ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జడ్పీసీఈవో శివశంకర్

పెద్దవడుగూరు: చెత్తనిల్వ కేంద్రాల ద్వారా వచ్చే సంపద సృష్టిపై ప్రత్యేక దృష్టి పెంచాలని పంచాయతీ సిబ్బందికి జడ్పీ సీఈవో శివశంకర్ సూచించారు. మండలంలోని మిడుతూరు గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన చెత్తనిల్వ కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆయన గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశువైద్యశిబిరంలో పాల్గొని పశువులకు మందులను వేశారు. ఆయన వెంట ఎంపీడీవో బారన్‌సాహెబ్, పశువైద్యుడు రమేష్, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, తెదేపా నాయకుడు రమేష్‌యాదవ్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గార్లదిన్నె : కృష్ణాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థుల భద్రత కోసం మంగళవారం నిఘా నేత్రాలను ఏర్పాటు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, గ్రామస్థుల సహకారంతో ఎస్సై గౌస్‌బాషా ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

యాడికి : బోయరెడ్డిపల్లి సమీపంలో అదానీ సిమెంటు పరిశ్రమలోని కాలనీలో ఓ కుటుంబం నివసిస్తోంది. గత రెండు రోజుల క్రితం కాలనీలోని ఇంటి నుంచి బయటికి వెళ్లిన గృహిణి తిరిగి రాలేదు. భర్త ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

గార్లదిన్నె గ్రామీణం : బూదేడు గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు మాజీ సర్పంచి రామన్న, వెంకటరాముడు, వెంకటనాయుడు కలిసి రాతపుస్తకాలు, పలకలు, సంచులు, పెన్నులు, అట్టలను మంగళవారం పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు వీరేశ్వరాచారి, పాఠశాల ఛైర్మన్ వెంకటేష్, సభ్యులు పాల్గొన్నారు.

గుంతకల్లు పట్టణం : ప్రతిభ గల పేద విద్యార్థులకు రాజ్‌ఫౌండేషన్ ఆర్థికంగా చేయూతనిస్తుందని ఫౌండర్ కేశవరెడ్డి, ఛైర్మన్ గోపాల్‌నాయుడు పేర్కొన్నారు. గుంతకల్లులో శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో మంగళవారం రాజ్‌ఫౌండేషన్ వ్యవస్థాపకులు కేశవరెడ్డి, ఛైర్మన్ గోపాల్‌నాయుడుకార్యదర్శి శ్రీనివాసులు విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు.

పెద్దవడుగూరు: ఆవులాంపల్లికి చెందిన పోతుల కేశవరెడ్డికి తెదేపా నాయకత్వం జిల్లా అధికార ప్రతినిధిగా ఎంపిక చేయడంపై మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నాయకులు నారాయణస్వామి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు చిరంజీవులు, మాజీ కన్వీనర్ వెంకటరామిరెడ్డి, సత్య, శివయాదవ్ పాల్గొన్నారు.

గార్లదిన్నె : వైకాపా పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని వైకాపా జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. గార్లదిన్నెలో మంగళవారం నిర్వహించిన శింగనమల నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. పార్టీ సమన్వయకర్త శైలజానాథ్, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరెడ్డి, పెద్దారెడ్డి, వజ్రం భాస్కరరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నీటి బోరు.. మరమ్మతులు చేయరూ!

గుంతకల్లులోని రైల్వేకు చెందిన వివేకానందనగర్ కాలనీలోని తాగు నీటి బోరు పని చేయడం లేదు. దీన్ని రైల్వే కుటుంబాల అవసరాల నిమిత్తం ఏర్పాటు చేశారు. స్థానికులు కుళాయిల నుంచి సకాలంలో నీరు సరఫరా కాని సమయాల్లో వినియోగించేవారు. కొంత కాలంగా పని చేయకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి బోరును వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

–న్యూస్‌టుడే, గుంతకల్లు

కాస్త చూడండయ్యా!

శింగనమల మండల కేంద్రం నుంచి గోవిందరాయుని పేట గ్రామం వరకు రహదారి గుంతలమయంగా ఉంది. రహదారి పొడవునా తారు లేచిపోయి అధ్వానంగా ఉంది. కంకర తేలి ఉండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం మండల కేంద్రానికి పలు పనుల నిమిత్తం వచ్చే వారంతా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, శింగనమల

అసంపూర్తిగా కాలువ పనులు

తాడిపత్రిలోని అంబేడ్కర్‌నగర్‌లో మురుగు కాలువ నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఆయా పనులను గత వైకాపా ప్రభుత్వంలో రూ.48లక్షలతో చేపట్టారు. కాలనీలోని లలితా మెగామాల్ వద్ద నుంచి బస్టాండు వరకు పనులు జరిగాయి. ఆ పనులు పూర్తి కాకుండానే గుత్తేదారులు వదిలేసి వెళ్లిపోయారు. పనులు నాసిరకంగా జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై మున్సిపల్ ఏఈ తేజను వివరణ కోరగా పనులను పునః ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. –న్యూస్‌టుడే, తాడిపత్రి

కూలకముందే స్పందించండి!

గుంతకల్లులోని శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన తాగు నీటి ఉపరితల ట్యాంకు కూలేందుకు సిద్ధంగా ఉంది. దీన్ని సుమారు వందేళ్ల కిందట అందుబాటులోకి తెచ్చారు. ఇప్పుడది వినియోగంలో లేదు. కాకపోతే దాన్ని తొలగించకుండా ఉండటంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతునారు. రైల్వే అధికారులు చొరవ తీసుకొని ట్యాంకును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, గుంతకల్లు

ఉపాధి కూలీల వెతలు పట్టించుకోండి

నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

పామిడి: కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరును వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)గా మార్చడాన్ని నిరసిస్తూ ఏపీ మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఏపీ మహిళ సమాఖ్య అధ్యక్షురాలు పార్వతీ ప్రసాద్, నియోజకవర్గ అధ్యక్షురాలు షారీన్‌బీ, మహమ్మద్‌బీ, సువర్ణ, రమీజా పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

గుంతకల్లు: కూటమి ప్రభుత్వ ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెదేపా పట్టణ ఇన్‌ఛార్జి నారాయణస్వామి, పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్ అన్నారు. ఎమ్మెల్యే జయరాం చొరవతో మంగళవారం పట్టణంలోని కథలగేరిలో హైదరాబాదుకు చెందిన ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి చెందిన వైద్యుల తోడ్పాటుతో కంటి పరీక్ష శిబిరం జరిగింది. యాదవ ఫెడరేషన్ డైరెక్టరు మస్తాన్‌యాదవ్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

లారీ డ్రైవరు ఆత్మహత్య

గార్లదిన్నె, న్యూస్‌టుడే: మండలంలోని కనుంపల్లి సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవరు రాజేష్‌కుమార్(32) మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇతను తన మార్వల్ సర్వీసులో మరో డ్రైవరుతో కలిసి బెంగళూరు వైపు వెళ్తుండగా అటువైపు వెళ్తున్న మరో వాహనం కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మధుర జిల్లా లోకియా మండలానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

గుత్తి: గుత్తిమండలంలోని బేతాపల్లికి చెందిన లక్ష్మి(10) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. గ్రామానికి చెందిన శ్రీనివాసులు, రామాంజనేయులు వరుసకు అన్నదమ్ములు. వీరిద్దరు మద్యం తాగి ఘర్షణకు పాల్పడ్డారు. శ్రీనివాసులు తన అన్న రామాంజనేయులను హత్య చేయాలని నిర్ణయించుకుని ఇంటికి వెళ్లి పెట్రోలు పోసి నిప్పుపెట్టాడు. ఈఘటనలో రామాంజనేయులు భార్య, కుమారుడు మంటల నుంచి బయటపడ్డారు. ఇంట్లో ఉన్న లక్ష్మి నిప్పంటుకొని తీవ్రంగా గాయపడింది. బాలికను కర్నూలు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందిందని పోలీసులు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో ఉందన్నారు.

అడవికి నిప్పు.. మానవాళికి ముప్పు

శింగనమల, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అడవులకు నిప్పు పెట్టడం వల్ల మానవాళికి, జంతువులకు ముప్పు ఏర్పడుతుందని తహసీల్దార్ శేషారెడ్డి, అటవీ అధికారి రామమోహన్ అన్నారు. ఈమేరకు మంగళవారం కరపత్రాలను విడుదల చేశారు. ఎవరైనా అడవికి నిప్పు పెటినట్లు సమాచారం అందిస్తే, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. నిప్పు పెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'నేరస్థులను ఉపేక్షించం'

పుట్లూరు(యల్లనూరు), న్యూస్‌టుడే : పుట్లూరు, యల్లనూరు మండలాల్లో ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పుట్లూరు సీఐ సత్యబాబు హెచ్చరించారు. పుట్లూరు మండలం గరుగుచింతరపల్లి గ్రామానికి చెందిన మంజుల నవీన్ అనే రౌడీ షీటర్‌పై పీడీ యాక్ట్ నమోదు చేశామన్నారు. ఇలాంటి వారిని ఉపేక్షించేది లేదని, నేరచరిత్ర ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపైనా ప్రజలు నేరుగా ఫిర్యాదు చేయాలని సీఐ సూచించారు.

సంకల్పమే పండింది!

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : ఆ రైతు పొలంలో నీరు పడకపోయినా అతని సంకల్పం గొప్పది. ఎలాగైనా తన పొలంలో సిరులు పడించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. అకుంఠిత దీక్షతో అనుకున్నది సాధించాడు. రైతు తన పొలం నుంచి నాలుగు కి.మీ దూరంలో బోరు వేసి అక్కడి నుంచి సాగునీటిని అందించి బొప్పాయి పంటలో మంచి దిగుబడి అందుకున్నాడు. అప్పేచెర్ల గ్రామానికి చెందిన వెంకటరమణ తనకున్న పన్నెండు ఎకరాల పొలంలో ఎక్కడ బోర్లు వేసినా చుక్కనీరు పడలేదు. వ్యవసాయం చేయాలన్న కోరిక బలంగా ఉండటంతో గ్రామ సరిహద్దుల్లో బోరు వేసి అక్కడి నుంచి పైపులైను ద్వారా తన పొలం వద్దకు గుంత బావిలో నీటిని మళ్లించాడు. బిందు పరికరాల ద్వారా పొలానికి నీరందించారు.

రూ. 24 లక్షల పెట్టుబడితో

బొప్పాయి సాగుకు రూ. 24లక్షలు పెట్టుబడి పెట్టారు. ఎనిమిది ఎకరాల్లో రబీ సీజన్‌లో వేరుసెనగ పంట వేయగా, 4.5 ఎకరాల్లో రెడ్ లేడీ రకం బొప్పాయి పంటను సాగు చేశాడు. ఇప్పటికే 16 టన్నుల పంటను తీశాడు. కిలో రూ.15 చొప్పున విక్రయించగా మొదట్లోనే పెట్టిన పెట్టుబడి రూ.2.5 లక్షలు వచ్చింది. ప్రస్తుతం రాబోయే దిగుబడులతో మిగులుబాటు వస్తుందని రైతు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. పడిన కష్టం కనిపించడం లేదని రైతు వెంకటరమణ ఆనందంగా చెబుతున్నారు.

సాగు చేసిన బొప్పాయి తోట

వెంకటరమణ

రేపు హుండీ కానుకల లెక్కింపు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో 29న గురువారం హుండీ కానుకలను లెక్కింపు ఉంటుందని డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. భక్తుల సమర్పించిన హుండీల్లోని కానుకల లెక్కింపు ఆరోజు ఉదయం 8గంటలకు ప్రారంభమవుతుందని ఈవో తెలిపారు.

బ్యాంకర్ల నిరసన బాట

గుత్తి, న్యూస్‌టుడే : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం గుత్తిలో బ్యాంకర్లు ఆందోళన నిర్వహించారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ యూనియన్లు ఇచ్చిన పిలుపు మేరకు గుత్తి, గుత్తి ఆర్.ఎస్.లతోపాటు ఎస్‌బీఎస్, యూనియన్ బ్యాంకు, కెనరా బ్యాంకు ఉద్యోగులు, అధికారులు సమ్మె చేపట్టారు. సమ్మెలో భాగంగా వారు ఎస్‌బీఐ గుత్తి బ్రాంచి వద్ద ఆందోళన చేశారు. తమకు ఐదురోజుల పనివిధానాన్ని అమలు చేయాలని డిమాండు చేశారు.

గుంతకల్లు : దేశవ్యాప్త బ్యాంకు ఉద్యోగుల ఆందోళనా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని బ్యాంకుల ఉద్యోగులు అందరూ కలిసి రైల్వేజంక్షన్ రోడ్డు పక్కనున్న ఎస్బీఐ వద్ద ధర్నా చేశారు.

గుత్తిలోని ఎస్‌బీఐ వద్ద ఆందోళన చేస్తున్న బ్యాంకర్లు

(c) eenadu

అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్ బాలస్వామి

నగరపాలక అంశాలపై శిక్షణకు సహాయ కలెక్టర్

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: నగరపాలకలో శిక్షణ పొందితే పలు అంశాలపై అవగాహన ఏర్పడుతుంది. ఈ క్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ శిక్షణ పొందడానికి రెండు వారాల పాటు ఇక్కడ పర్యవేక్షిస్తారు. మంగళవారం ఆయన నగరపాలకకు చేరుకోవడంతో కమిషనర్ బాలస్వామి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. నగరపాలకలో జరిగే పలు అంశాలు, నిర్ణయాలు, పాలకవర్గం తదితర అంశాలను వివరించారు.

అనంతపురం

•అనంతపురం •రాప్తాడు

కార్మికుల సమ్మె నోటీసు

అనంత నగరపాలక: ఫిబ్రవరి 12న మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దేశ వ్యాప్త సమ్మె చేస్తున్నామని అందుకు సంబంధించి తాము సమ్మెలో పాల్గొంటున్నామని సీఐటీయూ మున్సిపల్ కార్మిక సంఘం నేతలు నాగరాజు, గోపాల్, తిరుమలేశులు పేర్కొన్నారు. సమ్మె నోటీసును మంగళవారం నగర కమిషనరు బాలస్వామికి అందజేశారు.

కుటుంబాన్ని ఆదుకోండి

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్న శ్రీరాములు ఇటీవల అనారోగ్యం మరణించాడు. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని టైంస్కేల్ ఉద్యోగుల సంఘం నాయకులు చంద్రశేఖర్‌నాయుడు, నారాయణప్ప మంగళవారం ఇన్‌ఛార్జి వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబులకు వినతి పత్రం అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

శ్రీనివాస్‌నగర్: 8008573000
మూడోరోడ్: 8008573002
ఆజాద్‌నగర్: 9652620265

సమస్య: నగరంలోని మారుతీనగర్ నాలుగో క్రాస్‌లో నాగలక్ష్మి సమీపం కాలువల్లో మురుగు నిండిపోయి, బయటకు పొంగుతోంది. **- సువర్ణ, మారుతీనగర్**

సమస్య: నగరంలోని విద్యారణ్యనగర్ ఎయిడెడ్ పాఠశాల ఎదుట ప్రధాన రహదారిలో చెత్త కుండీని ఐదేళ్ల సిబ్బంది తీసుకెళ్లారు. దీంతో చెత్తంతా రహదారిపైనే వేస్తున్నారు. పందులు, కుక్కలు వాటిని చెల్లాచెదరు చేస్తున్నాయి. **- రాజశేఖర్, వాహనదారుడు**

సమస్య: రాంనగర్‌లోని సిరి అపార్ట్‌మెంట్ పరిసరాల్లో 18 రోజులుగా కుళాయిలకు నీరు రావడంలేదు. **- మురళీకృష్ణ, స్థానికుడు**

సమస్య: రాంనగర్‌లోని సేతు పాఠశాల రహదారిలో మురుగు కాలువలు నిర్మించలేదు. మట్టి కాలువల్లో మురుగు పారుతుండటంతో దుర్వాసన వస్తోంది. **-అంజనేయులు, నారాయణ స్వామి, విజయప్రసాద్, శేఖర్-రాంనగర్**

సమాధానం: సిబ్బందిని పంపించి, కాలువల్లో మురుగు పారేలా చర్యలు తీసుకుంటాం. చెత్త కుప్పలు తొలగిస్తాం, కుళాయిలకు నీరు అందేలా చూస్తాం. **(పై ప్రశ్నలకు ఇన్‌ఛార్జి ప్రజారోగ్య అధికారి నరసింహా సమాధానం ఇచ్చారు)**

– న్యూస్‌టుడే : రాంనగర్(అనంతపురం)

చోరీ ఘటనల్లో..

కేసు నమోదుకు.. ఆలస్యమెందుకు?

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ఇళ్లు, కార్యాలయాలు, ఆసుపత్రుల్లో వాహనాలను పార్కింగ్‌లో పెట్టి తర్వాత వచ్చి చూస్తే.. అక్కడ వాహనం ఉంటుందని చెప్పలేని పరిస్థితి. ముఖ్యంగా ద్విచక్ర వాహనాల చోరీలు రోజూ గుర్తువుతున్నాయి. వాహనం కనిపించలేదని పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన వెంటనే కేసు నమోదు చేయరు. ఎక్కడైనా దొంగ పట్టుబడితే ఆగమేఘాలపై కేసులు నమోదు చేస్తున్నారు. రెండేళ్లలో పలు పోలీసు స్టేషన్లల్లో వందల సంఖ్యలో అపహరణ కేసులు నమోదు అంతంత మాత్రమేనని సమాచారం.

కేస్‌స్టడీ 1: నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన వెంకటేశ్ ఇంటి ముందు పెట్టిన డియో ద్విచక్ర వాహనం గతేడాది డిసెంబరు మొదటి వారంలో అపహరణకు గురైంది. బాధితుడు మరుసటి రోజే పోలీసుస్టేషన్‌లో వాహనానికి సంబంధించిన వివరాలతో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు. కానీ కేసు నమోదు చేయలేదు. దీంతో బాధితుడు స్టేషన్ చుట్టూ తిరిగి విసిగిపోయాడు. ఈ నెల 5న ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల..పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయలేదు అని వివరించారు.

కొన్ని రోజులు గడిస్తేనే..

బండి పోయిందని బాధితులు చెప్పిన వివరాలతో కేసు నమోదు చేయరు. కొన్నిరోజులు గడవాలి తర్వాత ఫిర్యాదు స్వీకరిస్తారు. ఏదైనా కేసు నమోదైతే వెంటనే పరిష్కరించాలి, ఆ వివరాలను క్రైం సమీక్షలో వెల్లడించాలి. కేసు నమోదే చేయకపోతే సమీక్షలో చెప్పాల్సిన అవసరం ఉండదనే ఆలోచనతోనే పోలీసులు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

దృష్టి సారించని ఉన్నతాధికారులు

గత ఏడాది అనంతపురం సబ్‌డివిజన్ పరిధిలో ఓ స్టేషన్‌కు చెందిన పోలీసులకు దొంగ దొరకగానే ఐదు పోలీస్ స్టేషన్ల పరిధిలో పది కేసులు ఒకేసారి నమోదయ్యాయి. ఇదివరకు జిల్లాలో దొంగలు దొరకడంలేదా ఏమో.. నమోదు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కొన్ని స్టేషన్లలో ఒక్కకేసూ లేదంటున్నారంటే అపహరణలు జరగలేదా లేక జరిగినా నమోదు చేయలేదా? అనే సందేహాలు రేకెత్తుతున్నాయి. గత రెండేళ్లలో జిల్లా వ్యాప్తంగా వందలాది ఘటనలు జరగ్గా పదుల సంఖ్యల్లోనే ఫిర్యాదులు నమోదు కావడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని బాధితులు కోరుతున్నారు.

కుళాయి వద్ద క్యూలో విద్యార్థులు

మోటారు మరమ్మతులా.. అయితే మాకేంటి!

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో బీసీ వసతి గృహం విద్యార్థులకు నీటి కష్టాలు తప్పడం లేదు. విద్యుత్తు మోటారు కాలిపోవడంతో శనివారం విద్యార్థులు నానా అవస్థలు పడ్డారు. వసతి గృహంలో దాదాపు 250 మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. ఈ సమస్యతో కళాశాల ఆవరణానికి వెళ్లి విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అక్కడ ఉన్న ఒక్క కుళాయితోనే విద్యార్థులు ఆరుబయట స్నానాలు చేశారు. విద్యుత్తు మోటారు మరమ్మతు చేయాల్సిన వసతి గృహం సిబ్బంది అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. మరోవైపు సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

తెరపై ఈనాడు

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే : గౌరి **: రాజాసాబ్,** గాయత్రి : **బోర్డర్-2,** నీలిమ : **అనగనగా ఒక రాజు,** శాంతి, త్రివేణి : **మన శంకర వరప్రసాద్..** సుధా : **భర్త మహాశయులకు విజ్ఞప్తి,** ఎస్వీ సినిమా, గౌతమి : **నారీ నారీ నడుమ మురారి.**

కాయగూరల ధరలు

అరవిందనగర్(అనంతపురం), న్యూస్‌టుడే: (అనంతపురం పాతూరు మార్కెట్లో ధరలు కిలో రూ.లలో) టమాటాలు 20, రెండోరకం 10, ఉల్లిగడ్డలు 35, రెండోరకం 25, బంగాళాదుంపలు 35, మిరపకాయలు 35, బెండకాయలు 20, వంకాయలు 20, ముల్లంగి 20, బీట్‌రూట్ 40, బీరకాయలు 40, కాకరకాయలు 40, చౌళేకాయలు 30, క్యాప్సికమ్ 35, చిక్కుడుకాయలు 35, అనపకాయలు 40, క్యారెట్ 40, బీన్స్ 40, క్యాబేజీ 40, మునగకాయలు 60, నిమ్మకాయలు (వంద)250, అల్లం 75.

త్వరలో అన్ని కాలనీలకు తాగునీరు

స్టాడింగ్ కమిటీ సమావేశంలో సమస్యలపై చర్చ

అనంత నగరపాలక, న్యూస్‌టుడే : నగరంలో కొన్ని ప్రాంతాలకు బ్లూ పైపుల ద్వారా అందించి మరికొన్ని ప్రాంతాలకు ఎందుకు అందివ్వలేక పోతున్నారని నగరపాలక స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు సమస్యను లేవనెత్తారు. మంగళవారం మేయర్ వసీం ఛాంబర్లో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. నగరపాలకకు సంబంధించిన బడ్జెట్‌ను సమావేశంలో ఆమోదించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ నగరంలోని పాతూరు, వినాయకనగర్, శ్రీకృష్ణదేవరాయనగర్ తదితర ప్రాంతాల్లోని ప్రజలకు బ్లూపైపుల ద్వారా తాగునీరు అందివ్వాలని కోరగా త్వరలోనే సరఫరా చేస్తామని కమిషనరు బాలస్వామి తెలిపారు. పలు ప్రాంతాల్లో రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు పూర్తిగా సాగడం లేదని తెలపగా.. * నగరపాలకకు సమకూరే ఆదాయ వనరుల నుంచి అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉండటంతో ఫిబ్రవరి, మార్చి నెలల్లో పన్నులు ఎక్కువగా వసూళ్లు అయ్యే అవకాశం ఉండటంతో త్వరలోనే టెండర్లు పిలిచి పనులను ప్రారంభిస్తామని కమిషనరు హామీ ఇచ్చారు. బడ్జెట్‌లో కొన్ని అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరగా.. సంబంధిత వివరాలను కమిషనరు విపులీకరించారు. పలు సంస్థల నుంచి నిధులు తీసుకురావడానికి థర్డ్ పార్టీ నియామకం చేపట్టే అంశాన్ని ఎస్ఈ రాజశేఖర్ వివరించారు.

మాట్లాడుతున్న మేయర్ వసీం, అధికారులు, సభ్యులు

యువగళం పాదయాత్రకు మూడేళ్లు..

కేకు కోస్తున్న అనంతపురం అర్బన్ తెదేపా నాయకులు

రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే : తెదేపా యువనేత, మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర మూడేళ్లు పూర్తి అయిన సందర్భంగా మంగళవారం అనంతపురం అర్బన్ తెదేపా కార్యాలయంలో నాయకులు సంబరాలు చేసుకున్నారు. లోకేశ్ నిలువెత్తు ఫ్లెక్సీ కట్టి కేకు కోశారు. వారు మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో లోకేశ్ ఇచ్చిన హామీలను నెరవేర్చి చరిత్ర సృష్టించారన్నారు. నగరాధ్యక్షుడు సుధాకర్‌యాదవ్, తెదేపా రాష్ట్ర కార్యదర్శులు బుగ్గయ్యచౌదరి, ఆదినారాయణ, సరిపూటి రమణ, సాకే లక్ష్మీనరసింహ, రాజారావు, పవన్‌కుమార్, తేజస్విని, అలివేలమ్మ, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ఆత్మకూరు: స్థానిక మండల ప్రజాపరిషత్తు కార్యాలయ ఆవరణంలో మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీ సాదాసీదాగా సాగింది. 2024-25లో ఉపాధి హామీ పథకం ద్వారా జరిగిన పనులపై నెల రోజులుగా గ్రామాల్లో సీఆర్పీలు తనిఖీలు నిర్వహించారు. మండలవ్యాప్తంగా దాదాపు రూ.15కోట్లతో సీసీరోడ్లు, గృహనిర్మాణాలు, గోకులం షెడ్లు వంటివి చేపట్టగా పలు పనుల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నట్లు సీఆర్పీలు వివరాలను నివేదించారు. అందులో రూ.57,367కి చెందిన పనులు పూర్తి చేయకుండా బిల్లులు చెల్లించడంతో ఈ నగదును జరిమాన లేదా పనులు పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. డ్వామా పీడీ సలీమ్ భాషా, అదనపు సంచాలకులు సుధాకర రెడ్డి, ఏపీడీ చెన్నకేశవులు, విజిలెన్స్ అధికారి శ్రీనివాసులు, ఎంపీడీవో లక్ష్మీనరసింహ, విభిన్న నారాయణ స్వామి, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

మహిళా పాఠకులు పెరగాలి

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: జిల్లాలోనే ఏకైక మహిళా గ్రంథాలయానికి మహిళలు మరింత మంది పాఠకులు పెరిగే విధంగా అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచుతామని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వెంకట్ పేర్కొన్నారు. మంగళవారం అనంతపురంలోని రైతు బజార్ వద్ద ఆదిమూర్తి నగర్‌లో ఉన్న మహిళా, బాలల గ్రంథాలయాన్ని పరిశీలించారు. చిన్నపిల్లలు, మహిళలకు అవసరం అయిన పుస్తకాలు మరిన్ని అందుబాటులో ఉంచాలన్నారు. పుస్తక పఠనం పట్ల ఆసక్తి రగిలించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ, గ్రంథాలయ అధికారి శ్రీపతి పాల్గొన్నారు.

మహిళా, బాలల గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న ఛైర్మన్ వెంకట్

నిరసన ప్రదర్శనలో మాట్లాడుతున్న నాయకులు శంకర్, చంద్రమోహన్ తదితరులు

ఐదు రోజుల పని విధానానికి డిమాండ్

అరవిందనగర్: వారానికి ఐదు రోజుల పని దినాల విధానం అమలుకు పదేళ్ల క్రితం బ్యాంకు ఉద్యోగుల సంఘాలు, ఐబీఏ మధ్య ఒప్పందం కుదిరింది. అయితే ఇప్పటికీ అమలు చేయకపోవడం బాధాకరమని బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి సంజయ్‌రాం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో స్థానిక ఇండియన్ బ్యాంకు ప్రధాన శాఖ ఆవరణలో బ్యాంకు అధికారులు, సిబ్బంది నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ విధానం అమలు కోరుతూ ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వాలకు నివేదించినా స్పందనలేదన్నారు. ఇండియన్ బ్యాంకు శాఖ కార్యాలయం నుంచి గడియార స్తంభం వరకు నిరసన ప్రదర్శన సాగింది. ఎస్‌బీఐ ఎస్‌సీబీఐ నాయకులు ఖాదర్ భాష, ఏఐబీఏసీ, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ చంద్ర మోహన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, సునీత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురు చేరిక

ఉమానగర్: కాంగ్రెస్‌పార్టీతోనే అన్ని వర్గాలకు సముచిత స్థానం లభిస్తుందని ఆ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దాదాగాంధీ పేర్కొన్నారు. పాతూరులోని ఆసార్ వీధికి చెందిన మౌలానా చిస్తీ ఉల్ ఖాద్రీ సాహెబ్ ఆధ్వర్యంలో సుమారు 50 కుటుంబాలు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరాయి. డీసీసీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..పార్టీని బలోపేతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. జాకీర్‌హుసేన్, శర్మాస్‌వలి, వాసు, ఐఎంఎం బాష పాల్గొన్నారు.

కాలం చెల్లి.. కాలుష్యం పెంచి

అరవింద్ నగర్‌లో ఓ వ్యక్తి తన ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్నాడు. కాలం చెల్లిన వాహనం అవ్వడంతో గొట్టం నుంచి పొగ విపరీతంగా బయటకు వస్తోంది. దీంతో పక్కన వెళుతున్న పాదచారులు ఆ కాలుష్యాన్ని పీల్చలేక ముక్కు మూసుకుంటున్నారు. పైగా బండిపై పోలీసు అని రాసి ఉంది. ఇలా ఇంకా ఎన్ని కాలం చెల్లిన వాహనాలు ఉన్నాయో! వీటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

-ఈనాడు అనంతపురం

కుళ్లిన వ్యర్థాలతో ముక్కు మూసుకోవాల్సిందే!

అరవిందనగర్: నగరానికి ప్రధాన కూరగాయల మార్కెట్‌లోకి వెళ్లాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సిందే. గేటు ముందర అపరిశుభ్రత , దుర్వాసన నిత్యం తాండవిస్తోంది. దీంతో కొనడానికి వెళ్లిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు వ్యాపారులు కూరగాయల వ్యర్థాలను అక్కడ పారేస్తారు. వాటిని తినడానికి వచ్చిన పశువుల మధ్య ఘర్షణలు జరిగి పలువురిని పొడిచి, గాయాలు చేసిన ఘటనలు అనేకం. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా పారిశుద్ధ్య కార్మికులు కుళ్లిన వ్యర్థాలను తొలగించాలని, మూగజీవాలు మార్కెట్లోకి వెళ్లకుండా పరిష్కారమార్గం చూపాలని నగరపాలక సంస్థ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

జేఎన్‌టీయూ పూర్వవిద్యార్థి భారత్‌దర్శన్ యాత్ర

జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావుతో పూర్వవిద్యార్థి కమోడర్ గౌతంనేగీ

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన పూర్వవిద్యార్థి, విశ్రాంత నేవీ ఉద్యోగి కమోడోర్ గౌతంనేగీ భారత్‌దర్శన్ పేరుతో నవంబరు 5న దేహ్రాదూన్‌లో కారు యాత్ర ప్రారంభించారు. ఇప్పటి వరకు 14వేల కి.మీలు ప్రయాణం చేయగా.. మరో 2 నెలలు యాత్ర సాగనున్నట్లు తెలిపారు. 25వేల కిలోమీటర్లు ప్రయాణించనున్నట్లు చెప్పారు. ఆయన మంగళవారం జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావును మర్యాదపూర్వకంగా కలిశారు. వీసీ ఆయన యాత్రను అభినందించారు.

పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయండి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాంనగర్: ఉపాధి హామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించాలి. ఎక్కడా కూలీల నుంచి ఒక్క ఫిర్యాదు రాకూడదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులను ఆదేశించారు. ఉపాధి పనులపై మంగళవారం అనంతపురం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పనులను తక్షణమే పూర్తి చేసి, కొత్త పనులపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి కింద 55 మంది లబ్ధిదారులకు రూ.23 లక్షలు చెక్కులు పంపిణీ చేశారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

రాప్తాడు: అనంతపురం నగరంలోని హరిహర దేవాలయం సమీపంలోని ఓ ప్రైవేట్ వసతి గృహంలో ఇటీవల ఓ యువతి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. బాధిత కుటుంబాన్ని వారి స్వగ్రామమైన గొల్లపల్లిలో మంగళవారం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత వెళ్లి పరామర్శించారు. వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులకు రూ.20వేలు ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా కన్వీనర్ కొండప్ప, కార్యదర్శి శ్రీనివాసులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మాఘమాస పూజ శోభాయమానం

ఆత్మకూరు: పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శోభాయమానంగా మాఘమాస పూజలు సాగుతున్నాయి. ఆది, మంగళవారాల్లో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయంలో ఆదివారం నిర్వహిస్తున్న హోమాల్లో పాల్గొనే భక్తుల సంఖ్య పెరిగింది. ఈ క్రమంలో మంగళవారం స్వామి వారికి ప్రత్యేకంగా అర్చన, పాలాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, స్వర్ణకవచ సేవ కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలోని మంజునాథ స్వామి వారిని ప్రత్యేక పూలతో అలంకరించారు.

బైండోవర్ సొమ్ము వసూలు

అనంత నేరవార్తలు: పుట్లూరు మండలం గరుగుచింతలపల్లి గ్రామానికి చెందిన మంజుల నవీన్‌పై రౌడీ షీటు ఉంది. ఇతను 2014 నుంచి ఇప్పటి వరకు 12 నేరాలకు పాల్పడ్డాడు. వివిధ నేరాలకు పాల్పడుతూ ప్రజాశాంతికి భంగం కలిగిస్తుండటంతో 2023లో పీడీ యాక్టు ప్రయోగించి జైలుకు తరలించారు. బయటికొచ్చాక ముందస్తు చర్యల్లో భాగంగా సత్ప్రవర్తనతో కొనసాగేందుకు పుట్లూరు మండల తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయించారు. ఆ సందర్భంగా రూ.50వేలకు ష్యూరిటీ బాండ్లు ఇచ్చాడు. అయినప్పటికీ అతను పాత పంథానే కొనసాగించాడన్న నేపథ్యంలో చర్యలు తీసుకోవాలని కోరుతూ పుట్లూరు సీఐ సత్యబాబు తహసీల్దార్‌కు లేఖ రాశారు. దీంతో మంజుల నవీన్ నుంచి బైండోవర్ సొమ్మును కట్టించుకున్నారు.

జాబ్‌క్యాలెండర్ అమలు చేయాలి

ఎస్కేయూ: జాబ్‌క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేయాలని ఐక్యవిద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్కేయూ ముఖద్వారం వద్ద ఆ విద్యార్థి సంఘం నాయకులు నిరసన కార్యక్రమం చేశారు. ఇప్పటికీ క్యాలెండర్ విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీపీఎస్సీ ద్వారా ఉద్యోగ ప్రకటనలు జారీ చేయాలన్నారు. వైఎస్ఆర్ విద్యార్థి సంఘం హేమంత్, ఏఐఎస్ఎఫ్ రమణయ్య, ఎన్ఎస్‌యూఐ చంద్రశేఖర్, విద్యార్థులు అమర్‌నాథ్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ..

రోడ్డు ప్రమాదాలకు తావివ్వకూడదు

ఆత్మకూరు: వాహనదారులు ఎక్కడా రోడ్డు ప్రమాదాలకు తావివ్వకూడదని ఎస్సై గౌతమ్ పేర్కొన్నారు. మంగళవారం రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా వాహనదారులతో సమావేశాన్ని నిర్వహించారు. వాహనాలను నడిపే సమయంలో విధిగా నియమాలు పాటించాలని.. కారు చోదకులు సీటు బెల్టు, ద్విచక్రవాహనదారులు శిరస్త్రాణం ధరించాలని వివరించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం విద్య: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి కోరారు. మంగళవారం రుద్రంపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్టీయూ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. పీఆర్సీ ప్రకటన ఆలస్యమవుతున్నందున 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుమంగళి, అశ్వర్థకుమార్, తిప్పయ్య, వేణు, రవీంద్ర, గురివిరెడ్డి తదితరులు సంఘీభావం తెలిపారు.

29 నుంచి వీరశైవ సమాజ వాణిజ్య సదస్సు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: అంతర్జాతీయ వీరశైవ సమాజ వాణిజ్య సదస్సు ఈ నెల 29 నుంచి బెంగళూరులో నిర్వహించనున్నట్లు జిల్లా వీరశైవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.ఈశ్వర్‌ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు ఎం.తిప్పేస్వామిలు తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు రాష్ట్రంలోని వీరశైవులు హాజరు కావాలని వారు కోరారు.

అనంత యువకుడికి గైడెన్స్ పురస్కారం

సినీ నటి కావ్య థాపర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వీరాగర్జన్..

కమలానగర్, న్యూస్‌టుడే : ఇండియన్ ఐకాన్ అవార్డ్స్‌లో భాగంగా అనంతపురం నగరానికి చెందిన కాలేజ్ క్యాంప్ సీఈఓ వీరాగర్జన్‌కు బెస్ట్ ఎడ్యుకేషనల్ కెరియర్ గైడెన్స్ అవార్డును హైదరాబాద్‌లో మంగళవారం అందుకున్నట్లు తెలిపారు. విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా తమ క్యాంపస్‌లో కెరియర్ గైడెన్స్‌పై ఇస్తున్న శిక్షణకు గుర్తింపు రావటం ఆనందంగా ఉందన్నారు.

తీగలతో పొంచి ఉన్న ప్రమాదం

కమలానగర్: నగరంలో కమలానగర్‌కు ఓ ప్రత్యేకత ఉంది. ఎక్కువ మొత్తంలో వ్యాపార సముదాయం ఉండటంతో నిత్యం వేల మంది జన సంచారం ఇక్కడే ఉంటుంది. సెల్ ఫోన్, దుస్తుల దుకాణాలు, ఇంటి నిర్మాణం నుంచి గృహ ప్రవేశం చేసే వరకు కావలసిన వస్తువులు అన్నీ కమలానగర్‌లో లభిస్తాయని అందరికీ తెలుసు. ఇక్కడ దాదాపు 10వేల వరకు వివిధ రకాల దుకాణాలు ఉన్నాయి. కొంత మంది నిర్లక్ష్యం వల్ల స్తంభాలకు విద్యుత్తు, టెల్ ఫోన్ తీగలు గుట్టలు గుట్టలుగా ఉండటంతో ప్రమాదకరంగా మారాయి. కనీస వసతులు లేక నిత్యం ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఒక్క డీసీఎంఎస్ రోడ్డులో విద్యుత్తు, టెల్ ఫోన్ స్తంభాలు కలిపి దాదాపు 40 వరకు ఉండగా, ఇందులో 15 స్తంభాలకు ఇలా ప్రమాదకరంగా తీగలను ఉంచారు. సంబంధిత అధికారులు కమలానగర్‌లో సమస్యలపై దృష్టి సాధించాల్సి ఉంది.



డీసీఎంఎస్ కార్యాలయ సమీపంలో విద్యుత్తు స్తంభానికి అస్తవ్యస్తంగా టెలిఫోన్ వైర్లను చుట్టారు. గాలి వీచిన సమయంలో నిప్పురవ్వలు వస్తున్నాయని, తరచూ విద్యుత్తు అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు వాపోతున్నారు.

డీసీఎంఎస్ రోడ్డు వివేక మొబైల్స్ దుకాణం వద్ద ఇలా విద్యుత్తు స్తంభానికి తీగలు గుట్టలుగా ఉన్నాయి. ఇటీవల తీగలు జారీ వాహనదారుడిపై పడటంతో సురేష్ అనే యువకుడు గాయపడ్డాడు. దుకాణదారులు వాటి సరిచేసే ప్రయత్నం చేశారు. ఇలాంటి ప్రమాదాలను అడ్డుకట్ట వేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వీర జవాన్ మురళీనాయక్ తల్లిదండ్రులకు రూ.లక్ష చెక్కును అందిస్తున్న హార్మోనిసిటీ ప్రతినిధులు

మురళీనాయక్ త్యాగం స్ఫూర్తిదాయకం

బళ్లారిరోడ్డు, న్యూస్‌టుడే : జవాన్ మురళీనాయక్ దేశం కోసం చేసిన త్యాగం స్ఫూర్తిదాయకమని అనంతపురం జిల్లా హార్మోనిసిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ నెల 26న 77వ గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని వీర జవానును గుర్తు చేసుకుంటూ హార్మోనిసిటీ గెట్ నుంచి అందులోనే ఉన్న క్లాక్ టవర్ వరకు ప్రతినిధులు, అతని తల్లిదండ్రులు, ప్రజలతో కలిసి సాయంత్రం క్యాండిల్ ర్యాలీ చేపట్టారు. మురళీనాయక్ తల్లిదండ్రులకు రూ.లక్ష చెక్కును అందించారు. హార్మోనిసిటీకి వెళ్లే దారికి మురళీనాయక్ దారిగా నామకరణం చేశారు. అనంతరం గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందించారు.

సందేశాత్మక చిత్రాలు అవసరం

కమలానగర్, న్యూస్‌టుడే : ప్రస్తుత సమాజంలో ప్రజలకు ఉపయోగపడే సందేశాత్మక చిత్రాలు రావాలని నగర్ రూరల్ పోలీసు స్టేషన్ సీఐ శేఖర్, అనంతపురం ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు రషీద్‌బాష, విశ్రాంత ప్రిన్సిపల్ మురళీధర్‌రావు, ప్రొఫెసర్ సుధాకర్‌బాబు పేర్కొన్నారు. నగరంలోని కేఎంటీ ఫంక్షన్ హాలులో మంగళవారం 8వ అనంత షార్ట్ ఫిలిం ఫెస్టివల్ వేడుకలను కళాకారులతో కలిసి నిర్వహించారు. ట్రాఫిక్ అవగాహనలో భాగంగా నిర్లక్ష్యం అనే లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. సమాచార హక్కుపై రూపొందించిన లఘు చిత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ వేడుకల్లో దాదాపు 150 లఘు చిత్రాలు రాగా వాటిలో 50 ఎంపిక చేశారు. సామాజిక మాధ్యమాల్లో రాణిస్తున్న 20 మంది యూట్యూబర్స్, ప్రతిభ కనబరిచిన నటులకు, సాంకేతిక నిపుణులకు 18 విభాగాల్లో ఈ నెల 31న రాంనగర్‌లోని రాజు గార్డెన్‌లో బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు.

లఘుచిత్ర పోస్టర్‌ను విడుదల చేస్తున్న నిర్వాహకులు

(c) eenadu

చామంతి.. విరబూసే కాంతి

చిత్రంలో కనిపిస్తున్న వెలుగులు ఓ చామంతి తోటలోవి. కలకడ మండలం ఎనుగొండపాళ్యంకు చెందిన చంద్రశేఖర్‌నాయుడు నాలుగు ఎకరాల భూమిలో చామంతి సాగు చేస్తున్నారు. వాటిలో 60 వేల మొక్కలు నాటారు. ఉగాది పండగను దృష్టిలో ఉంచుకొని విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేసి వినూత్న పద్ధతి అవలంబిస్తున్నారు. విద్యుత్తు బల్బుల ఏర్పాటుతో మొక్కలు పెరిగి దిగుబడి బాగా వస్తుందని రైతు చెబుతున్నారు. ఇప్పటి వరకు రూ.5 లక్షలు ఖర్చు చేశామన్నారు. - **న్యూస్‌టుడే, ములకలచెరువు**

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: నేరుగా వచ్చే భక్తులకు పది గంటల్లో, రూ.300 టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. సోమవారం శ్రీవారిని 75,791 మంది భక్తులు దర్శించుకోగా రూ.3.77 కోట్ల హుండీ కానుకలు లభించాయి. ● శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు 12 వేల సర్వదర్శన టోకెన్లు జారీ చేశారు. వీరికి బుధవారం మధ్యాహ్నం నుంచి రాత్రి పది గంటల వరకు దర్శనం కానుంది. మెట్టు మార్గంలోని నడకదారి భక్తులకు మరో రెండు వేల టోకెన్లు జారీ చేశారు.

మదనపల్లెలో టెండర్

■ బిల్లుల జాప్యంతో గుత్తేదారుల అనాసక్తి
■ ఎక్కడికక్కడ ఆగిపోతున్న అభివృద్ధి పనులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: కోట్ల రూపాయల విలువైన పనులు చేయడానికి కౌన్సిల్ ఆమోదం తెలిపినా.. ఖజానాలో నిధులు మెండుగా ఉన్నా.. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు పనులు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. బిల్లుల చెల్లింపులో జాప్యమే వారి నిర్లిప్తతకు కారణమవుతోంది. దీంతో మదనపల్లె పురపాలికలో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. ఈ ప్రొక్యూర్‌మెంట్‌లో పనులు చేపట్టడానికి టెండర్లు ఆహ్వానిస్తే గుత్తేదారుల నుంచి స్పందన కరవవుతోంది. రీటెండర్లు పిలిచినా ప్రయోజనం లేక డబ్బుతో పాటు సమయం వృథా అవుతోంది.

నిధుల వివరాలిలా..
పనులు: 209
వ్యయం: రూ.10.96 కోట్లు

మదనపల్లె: టిప్పు సుల్తాన్ మైదానం సమీపంలో జరుగుతున్న కాలువ పనులు

బిల్లు మంజూరుకు ఏళ్లు

పని పూర్తిచేసిన గుత్తేదారుడు బిల్లు తీసుకోవాలంటే ఏళ్ల సమయం పడుతోంది. జూన్ నుంచి ఇప్పటి వరకు పురపాలిక సంఘంలో రూ.3.31 కోట్ల వ్యయంతో 40 పనులు చేయించారు. ఇందులో గుత్తేదారులకు రూ.10 కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది.

రీటెండర్లతో సరి

ఒక పనికి రీటెండర్ నిర్వహించడానికి నిబంధనల ప్రకారం 3-4 నెలల సమయం పడుతోంది. మదనపల్లెలో 150 పనులకు రీటెండర్లు నిర్వహించారంటే పురపాలికలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒకప్పుడు పనులు చేయడానికి అంచనా వ్యయం కన్నా తక్కువకు చేస్తామని పోటీ పడిన గుత్తేదారులు ప్రస్తుతం అంచనా వ్యయానికి కూడా చేయడానికి ఎందుకు ఆసక్తి చూపడం లేదో అధికారులు గుర్తించి. . లోపాన్ని చక్కదిద్దాల్సి ఉంది.

యూసీ ఎలా పంపుతారో?

15వ ఆర్థికసంఘం వంటి నిధులతో నిర్ణీత సమయంలో పనులు చేయకుంటే నిధులు వెనక్కి వెళ్తాయి. ఏటా ఈ పనులకు యూసీ పంపించాలి. అసలు పనులే జరగకుంటే యూసీ ఎలా పంపుతారో అధికారులకే తెలియాలి.

నోటీసులిస్తున్నా స్పందన కరవు.. సీఎంఎఫ్ఎస్ ద్వారా గుత్తేదారుల ఖాతాల్లోకి నగదు జమ అవుతుంది. ఇందులో కాస్త జాప్యం జరుగుతోంది. పనులు నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని వారికి నోటీసులిచ్చాం. అయినా వారి నుంచి స్పందన లేదు. - **శ్రావణి, డీఈఈ**

స్విమ్స్‌లో డయాబెటిక్ ఫుట్ క్లినిక్ ప్రారంభం

☛ ఫిబ్రవరి 3 వరకు సేవలు

క్లినిక్‌లో పరీక్షలు చేసుకుంటున్న సంచాలకుడు ఆర్‌వీ కుమార్

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: స్విమ్స్ - శ్రీ పద్మావతి హాస్పిటల్‌లో డయాబెటిక్ ఫుట్ క్లినిక్ సేవలు ప్రారంభించినట్లు సంచాలకుడు ఆర్‌వీ కుమార్ తెలిపారు. మధుమేహంతో పాదాల నరాలు పనిచేయకపోవడం, రక్త ప్రసరణ తగ్గడం, పాదాల చర్మం రంగు మారడం, గాయాలు తగ్గకపోవడం, తిమ్మిర్లు, పాదాల్లో వేడి.. వాపు, దుర్వాసన వంటి లక్షణాలు ఉంటే డయాబెటిక్ ఫుట్ క్లినిక్ వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ క్లినిక్ ఫిబ్రవరి 3వ తేదీ వరకు కొనసాగుతుందని, రోజూ మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు సేవలు అందిస్తామని ఫుట్ క్లినిక్ అధ్యక్షుడు డాక్టర్ హరిప్రసాద్ తెలిపారు. ఫిబ్రవరి 4 తర్వాత వచ్చే ప్రతి మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల పాటు క్లినిక్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

రాయలసీమ తొలి జాతరకు సన్నద్ధం

ముస్తాబవుతున్న గంగమ్మ ఆలయం

అలంకరణలో గంగమ్మ

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రాయలసీమ జిల్లాల్లో తొలి జాతరగా మదనపల్లె మండలంలోని సీటీఎంలో జరిగే గంగమ్మ సంబరాలకు పేరుంది. ఫిబ్రవరి ఒకటి నుంచి నాలుగో తేదీ వరకు జరిగే జాతరలో పలు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో ఆలయాన్ని కమిటీ సభ్యులు ముస్తాబు చేస్తున్నారు. క్యూలైన్లు, తాగునీరు, మరుగుదొడ్లు, నీడ సౌకర్యం భక్తులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. దాత పేరం లక్ష్మన్న సహకారంతో ఆలయ ఆవరణలో పైకప్పు ఏర్పాటు చేస్తున్నారు. ఆవరణలో రెండు మండపాలు నిర్మిస్తున్నారు.

ఆర్చరీలో పతకాల పంట

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: లక్కిరెడ్డిపల్లె మండలం అనంతపురం పంచాయతీ ఈడిగపల్లెకు చెందిన చింతమాను అభినయ్ ఆర్చరీలో పసిడి పతకాల పంట పండించాడు. ఈ నెల 22వ తేదీ నుంచి 26 వరకు మహారాష్ట్రలోని అలీబాగ్‌లో జరిగిన నేషనల్ ఫీల్డ్ ఇండోర్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో అండర్-19 విభాగంలో అభినయ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించి రెండు పసిడి, ఒక రజత పతకాలు గెలుపొందాడు. తమ కుమారుడిని ప్రోత్సహించిన గురువు చెన్నకేశవులుకు విద్యార్థి తండ్రి హరి కృతజ్ఞతలు తెలిపారు.

వ్యర్థాలు కాసులు కురిపించేలా..

■ ఐఐటీ విద్యార్థుల పరిశోధన

రోజురోజుకూ పీల్చే గాలి మొదలు తినే ఆహారం, తాగే నీరు కలుషితమవుతుండటంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించడంతో పాటు వ్యర్థాలతో కాసులు కురిపించే పరిశోధనతో సత్ఫలితాలు సాధిస్తున్నారు తిరుపతి ఐఐటీ విద్యార్థులు. - **న్యూస్‌టుడే, ఏర్పేడు**

● ఐఐటీలోని పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ విభాగం ఆచార్యులు ప్రొఫెసర్ నిప్పట్లపల్లి నరసమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులు పలు పరిశోధనలు చేసి కలుషిత నీటిని తాగునీరుగా మార్చడంతో పాటు వ్యర్థాలను వినియోగంలోకి తెస్తున్నారు.

స్లాగ్ నిర్వహణతో సత్ఫలితాలు

పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను చిన్న ముక్కలుగా చేసి.. రసాయనాల్లో వేసి.. స్లాగ్ నిర్వహణతో శుద్ధి చేస్తారు. ఆపై అధునాతన పద్ధతుల్లో తక్కువ ఖర్చుతో వినియోగంలోకి తెస్తారు.

వస్త్ర పరిశ్రమకు అనువుగా

వస్త్ర పరిశ్రమల్లోని మౌలిక వసతులు సరిగా లేని డైయింగ్ క్లస్టర్లు పర్యావరణ పరిరక్షణకు సవాళ్లు విసురుతున్నాయి. ఈ క్రమంలో ఉక్కు, మెటలర్జికల్ పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను స్లాగ్ ప్రభావంతో ఖనిజ సంపన్న ఉపరితల రంగులను ఎలక్ట్రోక్యాటలిస్ట్, ఫొటోక్యాటలిస్ట్ సామర్థ్యాన్ని ప్రదర్శించేందుకు వీలుంటుంది. ఈ విధానంతో టెక్స్‌టైల్స్ డైయింగ్ క్లస్టర్‌కు ఎంతగానో ఉపయోగపడుతుంది.

సేంద్రియ ఎరువుల తయారీ

పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలతో వ్యవసాయానికి ఉపయోగపడే సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్నాం. ఇదే రీతిలో మరిన్ని పరిశోధనలతో వికసిత్ భారత్‌లో భాగస్వాములుగా మారుతాం. - **ప్రొఫెసర్ నిప్పట్లపల్లి నరసమ్మ, ఐఐటీ ఆచార్యులు**

కెమెరా నిఘా.. డ్రోన్ నీడ

■ సాంకేతికత వినియోగంతో శేషాచలం రక్షణ
■ స్మగ్లర్ల ఆగడాలకు అడ్డుకట్ట
■ వన్యప్రాణుల సంచారంపైనా దృష్టి

శేషాచలం అడవులపై మూడో కన్ను నిఘా పెట్టింది. ఎర్రచందనం చెట్ల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. స్మగ్లర్లకు అడ్డుకట్ట వేయడంతోపాటు.. ఎర్రచందనం చెట్ల నరికివేతను జీరో ఫెల్లింగ్ స్థాయికి తీసుకొచ్చేందుకు అటవీ శాఖ, ఏపీ టాస్క్‌ఫోర్స్ బలగాలు నిరంతరం శ్రమిస్తున్నాయి. - **న్యూస్‌టుడే, పీలేరు గ్రామీణ, తిరుపతి (జీవకోన)**

జిల్లాలో ఐదేళ్ల వివరాలు పరిశీలిస్తే..
నమోదైన కేసులు: **206**
పట్టుబడిన దుంగలు: **78,787 కిలోలు**
స్మగ్లర్లు: **514**
సీజ్ చేసిన వాహనాలు: **193**

సిబ్బందికి శిక్షణ

శేషాచలం అడవుల రక్షణ, భద్రత వ్యవస్థల నిర్వహణ, వన్యప్రాణుల కదలికలపై నిఘా ఏర్పాటు చేయడం కోసం డ్రోన్ల ప్రయోగాన్ని అటవీశాఖ కొన్నేళ్లుగా చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీన్ని విజయవంతం చేయడానికి కూటమి సర్కారు ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. డ్రోన్ సాంకేతికత వినియోగానికి ఇతరులపై ఆధార పడకుండా, అటవీశాఖ అధికారులు, సిబ్బందికే ప్రత్యేక శిక్షణ ఇప్పించింది. ఎర్రచందనం కోసం స్మగ్లర్లు నిత్యం ఉపయోగించే ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లలో రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

సిద్ధమవుతున్న ప్రతిపాదనలు

ప్రస్తుతం తిరుపతి డివిజన్ పరిధి ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లలో సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశాం. భారీ స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి, కెమెరాల పర్యవేక్షణ, డ్రోన్ల ప్రయోగ కార్యక్రమాలు నిర్వహించాలి. రాష్ట్ర ప్రభుత్వానికి అటవీశాఖ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. - **సాయిబాబా, తిరుపతి జిల్లా అటవీఅధికారి**

పూర్తి స్థాయిలో..

● 200 కి.మీ.ల పరిధిలోని 35 పాయింట్లలో జీపీఎస్‌తో పనిచేసే 40 కెమెరాలను ఏర్పాటు చేశారు. ● వన్యప్రాణుల గణన కోసం మరో 70 లైవ్ కెమెరాలు అమర్చారు. ● 5 మైక్రో డ్రోన్లు, ఒక థర్మల్ డ్రోన్‌ను ఉపయోగిస్తున్నారు. ఈ డ్రోన్ 400 మీటర్ల ఎత్తులో 1 - 5 కి.మీ. వరకు అడవిని కవర్ చేస్తుంది. ● తిరుపతి, తిరుమలలోని బేస్ కేంద్రాల ద్వారా డ్రోన్లు, లైవ్ కెమెరాలను నిరంతరం పర్యవేక్షిస్తారు. ● ఎక్కడ స్మగ్లర్లు కనిపించినా, అడవుల్లోకి అన్యులు ప్రవేశిస్తున్నా బేస్ స్టేషన్ నుంచి తక్షణమే అటవీ, టాస్క్‌ఫోర్స్ బలగాలకు సమాచారం వెళ్తుంది.

భారత్- కివీస్ మ్యాచ్ స్కోరర్‌గా జిల్లావాసి

రామకృష్ణ

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: విశాఖపట్నంలో ఈ నెల 28న జరగనున్న భారత్ - న్యూజిలాండ్ టీ20 మ్యాచ్‌కు స్కోరర్‌గా వాల్మీకిపురం క్రికెట్ క్లబ్ (వీసీసీ) క్రీడాకారుడు, చిత్తూరు జిల్లా ఏసీఏ ప్యానెల్ స్కోరర్ రామకృష్ణ ఎంపికయ్యారని ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్‌కుమార్ మంగళవారం తెలిపారు. రామకృష్ణ స్వగ్రామం వాల్మీకిపురం. ఇక్కడే క్రికెట్ ఆడుతూ.. చిత్తూరు జిల్లా, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ పరీక్షల్లో ఎంపికై పదేళ్లుగా స్కోరర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈయన ఎంపిక పట్ల ఏసీఏ సంయుక్త కార్యదర్శి విజయకుమార్, చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి, కార్యదర్శి సతీష్ యాదవ్, కోచ్ సునీల్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

నిరసన వ్యక్తం చేస్తున్న బ్యాంకు సిబ్బంది

బ్యాంకు ఉద్యోగుల విధుల బహిష్కరణ

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: బ్యాంకులకు వారంలో అయిదు రోజుల పని దినాలు కల్పించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. పట్టణంలోని అన్ని ప్రభుత్వ బ్యాంకుల ఉద్యోగులు మంగళవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. సీటీఎం రోడ్డులోని ఎస్బీఐ ప్రధాన కార్యాలయం ఎదుట ప్లకార్డులు ప్రదర్శించారు. నాయకులు శశికళ, సందీప్, సంతోష్, రవికిరణ్ మాట్లాడుతూ.. మూడేళ్ల క్రితం బ్యాంకు యూనియన్లతో ప్రభుత్వం చర్చించి అయిదు రోజుల పనిదినాల అమలుకు హామీ ఇచ్చిందని, నేటికీ అడుగులు పడలేదన్నారు. బ్యాంకు ఉద్యోగులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. ఉద్యోగులు నరసింహులు నాయక్, రవి కుమార్, వల్లి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకర్మ

కీ॥శే॥ శ్రీమతి డా॥ యం. శ్రీదేవి రెడ్డి
MS(General Surgeon), DNB, FRCS,
Surgical Gastroenterologist

వైద్య రంగంలో ఎన్నో మైలురాళ్ళను దాటి, పేద ప్రజలే దైవంగా భావించి, ఎంతోమందికి వైద్యసేవలు అందించి, మరెంతోమందికి ఉపాధిమార్గం చూపించి, విద్యాదాతగా, ఆరోగ్య ప్రదాతగా, మృధుస్వభావిగా అందరి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన మార్గదర్శకురాలు **శ్రీమతి డా॥ యం. శ్రీదేవిరెడ్డి** గారు 17-01-2026వ తేది శనివారం సా॥ 6గం॥లకు స్వర్గస్తులైనారు.

తదుపరి వీరి **శుభస్వీకరణ** 29-01-2026వ తేది గురువారం ఉ॥ 10 గం॥లకు ఐతేపల్లి, తిరుపతి - బెంగళూరు హైవే, చంద్రగిరి సమీపంలో, డా॥ శ్రీదేవి రెడ్డి గార్డన్స్ నందు జరుగునని తెలియజేయడమైనది. వారి పవిత్ర ఆత్మకు శాంతిచేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ ...

అశ్రునయనాలతో ...
భర్త : **వెంకట్ రెడ్డి మొసలి**, కుమారుడు : **పృథ్వీకర్ రెడ్డి మొసలి**
కుమార్తె : **డా॥ ప్రీతికా రెడ్డి**, అల్లుడు : **నూతనకాల్వ ప్రశేన్ కుమార్ రెడ్డి**
మనవళ్ళు : **ఇహ్రాన్ రెడ్డి, కైరవ్ రెడ్డి**
వియ్యంకులు : **నూతనకాల్వ అమర్‌నాథ్ రెడ్డి - రేణుకా రెడ్డి**
మాజీ మంత్రి వర్యులు, శాసనసభ్యులు, పలమనేరు
పెద్దిరెడ్డి చెంగల్‌రెడ్డి, ఎ. అమరనాథ్ రెడ్డి, తలపల
మరియు **కుటుంబ సభ్యులు**

Mobile :
+91 91078 99999
+91 91077 99999

ఫిబ్రవరి నుంచి మార్కెట్ విలువ పెంపు

వివరాలు వెల్లడిస్తున్న డీఆర్ వెంకట రమణమూర్తి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో ఫిబ్రవరి నుంచి భూముల మార్కెట్ విలువ పెంపునకు చర్యలు చేపట్టామని డీఆర్ వెంకట రమణమూర్తి పేర్కొన్నారు. మంగళవారం మదనపల్లె సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. భూ రిజిస్ట్రేషన్ల సమయంలో విక్రయాలు చేపట్టే వారి వద్ద ఉన్న దస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఆరోపణలకు తావు లేకుండా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలన్నారు. పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోని భూముల విలువ 10 నుంచి 15 శాతం పెంచనున్నట్లు చెప్పారు. మార్కెట్ రివిజన్ కమిటీ ఛైర్మన్ జేసీ తుది నిర్ణయం మేరకు ధరల్లో పెంపు ఉంటుందన్నారు. అన్నమయ్య జిల్లాలో చిత్తూరు, పీకేఎం పట్టణాభివృద్ధి సంస్థలు ఉన్నాయన్నారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణకు ముందు 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండేవని, ప్రస్తుతం తొమ్మిది ఉన్నాయన్నారు. మదనపల్లెలో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటును పరిశీలిస్తున్నట్లు చెప్పారు. సబ్‌రిజిస్ట్రార్ గురుస్వామి, సిబ్బంది ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

పోలీసులకు క్రమశిక్షణే ప్రాణం: ఎస్పీ

రాయచోటి, న్యూస్‌టుడే: పోలీసు వృత్తి ఉద్యోగం మాత్రమే కాదు.. ప్రజల నమ్మకాన్ని కాపాడే బాధ్యత అని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. మంగళవారం రాయచోటిలోని పోలీసు కార్యాలయంలో ఏఆర్ పోలీసులకు నిర్వహిస్తున్న మొబిలైజేషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పోలీసులు విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని.. క్రమశిక్షణ, సామర్థ్యమే ప్రాణమని తెలిపారు. సాంకేతికత, నైపుణ్యాన్ని జోడించినప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. పలు రకాల డ్రిల్లులు, ఆయుధాల వాడకం, విధులపై శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(పరిపాలన) ఎం.వెంకటాద్రి, ఏఆర్ డీఎస్పీ డి.ఏడుకొండలరెడ్డి, ఆర్ఐలు వి.జె.రామకృష్ణ, ఎం.పెద్దయ్య, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.

పేల్చి పిప్పిచేస్తున్నా..!

☛ అక్రమ తవ్వకాలతో తరుగుతున్న గుట్టలు
☛ అడవిపల్లె రిజర్వాయర్‌కు ముప్పు!



కొండల్లో కొట్టిన రాళ్లు

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే: రాళ్ల కోసం అక్రమంగా తవ్వుతున్నారు.. ప్రాజెక్టు సమీపంలోనే జిలెటిన్ స్టిక్స్‌తో పేల్చుతున్నారు.. సహజ సంపద తరిగిపోతోందని.. పట్టపగలే ఇదంతా జరుగుతోందని.. ఎప్పుడు ఏ ప్రమాదం వాటిల్లుతోందని ఆందోళన చెందుతున్నట్లు ప్రజలు వాపోతున్నా జిల్లా యంత్రాంగం పట్టనట్లు వ్యవహరిస్తోంది.

కంభంవారిపల్లె మండలం తీతవగుంటపల్లె పంచాయతీలో అడవిపల్లె హంద్రీ - నీవా రిజర్వాయర్ చుట్టుపక్కల ఉన్న గుట్టలను అక్రమంగా కొట్టి తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు తరలిస్తున్నారు. రిజర్వాయర్ రెండు కొండల మధ్య నిర్మించారు. రాళ్లు కొట్టుకుంటూ పోతే భవిష్యత్తులో రిజర్వాయర్‌కు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.

ఆందోళనలో గ్రామస్థులు, రైతులు

గ్రామాలకు సమీపంలో రాళ్లు కొడుతుండటంతో ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు. రాళ్లను జిలెటిన్ స్టిక్స్‌తో పేల్చడంతో పెద్ద పెద్ద శబ్దాలు వస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో జిలెటిన్ స్టిక్స్ ఆలస్యంగా పేలుతుండటంతో ఎప్పుడేం జరుగుతుందోనని ప్రజలు, జీవాల పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు. గుట్టలు తరిగిపోవడం, జిలెటిన్ స్టిక్స్‌తో పేల్చడంతో పర్యావరణానికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది.

అడ్డుకోవాలి

అక్రమ మైనింగ్ కారణంగా భవిష్యత్తులో అడవిపల్లె రిజర్వాయర్‌కు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది. రాళ్లతో పాటు వర్షానికి మట్టి కరిగిపోతోంది. అధికారులు దీన్ని అడ్డుకోవాలి. - **రామాంజులు, భాజపా మండల అధ్యక్షుడు**

కఠిన చర్యలు తీసుకుంటాం

అడవిపల్లె రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ నిర్వహిస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం. మైనింగ్ అధికారులు సైతం తరచూ దాడులు చేస్తున్నారు. - **నరేంద్ర కుమార్, తహసీల్దార్**

(c) eenadu

నేత్రపర్వం.. శ్రీవారి చక్రస్నానం

చక్రస్నానం నిర్వహిస్తున్న వేదపండితులు

తంబళ్లపల్లె, ములకలచెరువు, న్యూస్‌టుడే: తంబళ్లపల్లె మండలంలోని కోసువారిపల్లిలో ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయ వార్షిక బ్రహోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో చివరి ఘట్టం శ్రీవారి చక్రస్నానం మంగళవారం భక్తుల కోలాహలం మధ్య వైభవంగా సాగింది. వేద పండితులు కృష్ణప్రసాద్ భట్టార్, రమేష్ శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించి నిత్య కైంకర్యాలు పూర్తి చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా వసంతోత్సవం నిర్వహించి మాడవీధుల్లో ఊరేగించారు. వాహన మండపంలో మంగళవాయిద్యాల నడుమ సుదర్శన చక్రతాళ్వార్‌ను ఏర్పాటు చేసి చక్రస్నానం నిర్వహించారు. తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, ఏఈవో గోపీనాథ్, తితిదే సిబ్బంది నగేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

బోర్డు సభ్యుడి దృష్టికి సమస్యలు: శ్రీప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయం అభివృద్ధికి కృషి చేస్తానని తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి హామీ ఇచ్చారు. వసంతోత్సవంలో పాల్గొన్న ఆయన దృష్టికి కూటమి నాయకులు సమస్యలను తీసుకువెళ్లారు. కల్యాణ మండపం శిథిలస్థితికి చేరిందని, కొత్తది నిర్మించాలని కోరారు. మరో ఇద్దరు వేద పండితులను నియమించాలని, కోనేరు, సిబ్బంది వసతి గృహాలు మంజూరు చేయాలన్నారు.

తెప్పపై శ్రీపార్థసారథి స్వామివారి కటాక్షం

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: గోవిందరాజ స్వామివారి తెప్పోత్సవాల్లో భాగంగా రెండోరోజు మంగళవారం సాయంత్రం శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీపార్థసారథి స్వామివారు భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామివారు ఉభయ దేవేరులతో కలిసి తెప్పపై ఐదు చుట్లు విహరించి భక్తులకు అభయమిచ్చారు. బుధవారం శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు దర్శనమివ్వనున్నారు. పెద్దజీయర్, చిన్నజీయర్, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో నారాయణచౌదరి, సూపరింటెండెంట్లు చిరంజీవి, శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనంజయ పాల్గొన్నారు.

‘కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు తగవు’

మాట్లాడుతున్న భానుప్రకాశ్‌రెడ్డి, నరసింహారెడ్డి

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ ముందుకెళ్తున్న కూటమి ప్రభుత్వంపై వైకాపా నాయకులు ఉద్దేశపూర్వకంగా అసత్య ఆరోపణలు చేస్తున్నారని తితిదే పాలకమండలి సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మదనపల్లె సొసైటీ కాలనీలోని భాజపా కార్యాలయంలో నాయకులతో సమావేశమయ్యారు. ఐదేళ్ల వైకాపా పాలన అవినీతి, అక్రమాలతో ముగిసిందని, అలాంటి వారు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తిరుమల నుంచే ప్రక్షాళన ప్రారంభించారన్నారు. వైకాపా పాలనలో ఆలయాలు, విగ్రహాలు ధ్వంసమయ్యాయన్నారు. భగవంతునిపై వైకాపా నాయకులు చేసిన అపచారానికి వారు 11 సీట్లకు పరిమితం అయ్యారన్నారు. తితిదే ఆధ్వర్యంలో ఐదు వేల ఆలయాలు నిర్మించనున్నట్లు భానుప్రకాశ్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో భాజపా నాయకుడు సీహెచ్.నరసింహారెడ్డి, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వై.ప్రశాంత్, ఎ.కృష్ణమూర్తి, పి.నరేంద్రరెడ్డి, ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.ఆనంద్, ఒ.కిరణ్‌కుమార్, మోహన, పురుషోత్తం పాల్గొన్నారు.

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

EENADU SPORTS LEAGUE 2025

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – తాడికొండ: బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Hospitality Partner: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Man of the Series: Hero
Digital Partner: ఈనాడు.నెట్ · TV Partner: ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్, ఈ FM Mee FM · Organised by ఈనాడు క్రీడా క్లబ్

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - 1 జూనియర్స్: మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్సర్లతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులు చేసి ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - 1 జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

సీనియర్స్ విన్నర్స్ రాయలసీమ రాకర్స్

గ్రౌండ్-2లో సీనియర్స్ : సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ · చరణ్ జిత్ · ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-1 (జూనియర్స్)
మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)
మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపల్ రమాదేవితో బహుమతులు సాధించిన విద్యార్థులు

ఈనాడు పోటీలతో ప్రతిభ గుర్తింపు

విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించేందుకు ‘ఈనాడు’ కొన్నాళ్లుగా పోటీలు నిర్వహిస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకొని పోటీ పరీక్షల్లో రాణించాలని శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ పేర్కొన్నారు. చిన్నచిన్న తప్పులతో కొందరు విజేతలు కాలేకపోయారని, వాటిని సరి చేసుకొని ముందుకు వెళ్లాలని విద్యార్థులకు సూచించారు. మదనపల్లెలోని శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో మంగళవారం ‘ఈనాడు- ఈటీవీ’ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ప్రతిభ పాటవ పోటీలు జరిగాయి. వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం, ఉపన్యాసం పోటీల్లో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. **వ్యాసరచనలో** పీఎం అర్చనారెడ్డి, ఎం.హేమంత్‌కుమార్ (10వ తరగతి, జ్ఞానజ్యోతి), ఎస్.తమన్న (10వ తరగతి, విద్యోదయ) విజేతలుగా నిలిచారు. **చిత్రలేఖనం:** మహమ్మద్ సిద్దిక్ (10వ తరగతి, జ్ఞాన జ్యోతి), కె.నౌరిన్ (9వ తరగతి, గౌతమ్ పాఠశాల), ఎన్.హర్షిత (7వ తరగతి, రాయలసీమ). **ఉపన్యాసం:** ఎం.మిస్బాఅంజూమ్ (9వ తరగతి, పీపుల్‌ట్రీ), ఎన్.మిచేలీరావ్ (7వ తరగతి, విజయభారతి), వి.దీపిక (9వ తరగతి, రాయలసీమ), **క్విజ్:** పి.సుష్మరాజ్ (9వ తరగతి, జ్ఞానోదయ), డి.రాజేంద్ర (10వ తరగతి, రాయలసీమ), ఒ.జ్యోతిష్‌యాదవ్ (8వ తరగతి, విజయభారతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రిన్సిపల్ రమాదేవితో కలిసి కరస్పాండెంట్ గురుప్రసాద్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. న్యాయనిర్ణేతలుగా జి.సుజాత, ఎస్.మాధవి, కె.అనుషా వ్యవహరించారు.

- న్యూస్‌టుడే, మదనపల్లె విద్య, గ్రామీణం, పట్టణం

ఆర్డీవో శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులతో విజేతలు

ప్రతిభా పాటవ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉన్నత లక్ష్యాలతో ఉత్తమ ఫలితాలు

ఉత్సాహంగా ఈనాడు- ఈటీవీ రీజనల్ ప్రతిభ పోటీలు

రాయచోటి, రాయచోటి గ్రామీణ,న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించడానికి కృషి చేయాలని ఆర్డీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. రాయచోటిలోని సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాలలో మంగళవారం ‘ఈనాడు’ ఆధ్వర్యంలో రీజనల్ స్థాయి ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాసం, క్విజ్ విభాగాల్లో పోటీలు జరిగాయి **వ్యాసరచనలో** మహమ్మద్ సాహిల్ (ఏడో తరగతి, ఎస్వీ విద్యా మందిర్), శ్రీ తేజ (పదో తరగతి, వీఆర్ హైస్కూల్), గ్లోరి (ఏడో తరగతి, సంగీత స్కూల్), **చిత్ర లేఖనం విభాగంలో..** మఖ్తుంబీ (తొమ్మిదో తరగతి, దివ్య తేజ స్కూల్), కుసుమ తేజ (ఎనిమిదో తరగతి, వీఆర్ హైస్కూల్), బేబి (తొమ్మిదో తరగతి, సందీప్ స్కూల్), **ఉపన్యాసం విభాగంలో..** తస్నీమ్ (ఎనిమిదో తరగతి, దివ్యతేజ స్కూల్), ప్రతిష్ఠిత (తొమ్మిదో తరగతి, దివ్య తేజ స్కూల్), ఇక్రా (తొమ్మిదో తరగతి, భారతి విద్యామందిర్ హైస్కూల్), **క్విజ్ పోటీల్లో..** లిఖిత (పదో తరగతి, వీఆర్ హైస్కూల్), చరణ్ (తొమ్మిదో తరగతి, భారతి విద్యామందిర్ హైస్కూల్), సయ్యద్ ఫర్హాన్ (ఏడో తరగతి, శ్రీ విద్యా భారతి స్కూల్) వరుస విజేతలుగా నిలిచారు. వీరికి ఆర్డీవో శ్రీనివాస్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం శివారెడ్డి, రవి శంకర్, విక్రమ్ పాల్గొన్నారు.

వందశాతం ఈక్రాప్ నమోదు లక్ష్యం

ఈక్రాప్ నమోదు పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ జిల్లా అధికారి శివనారాయణ

ములకలచెరువు, న్యూస్‌టుడే: జిల్లాలో వంద శాతం ఈక్రాప్ నమోదు పూర్తి చేయాలని, విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మద్దినాయునిపల్లి, వేపూరికోటలో ఈక్రాప్ నమోదును పరిశీలించారు. రీసర్వేలో లోపాలతో ఈక్రాప్ పూర్తి చేయలేకపోయామని పలువురు రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. విషయం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి చర్యలు చేపడతామని డీఏవో తెలిపారు. ఏడీఏ రమేష్, ఏవో స్రవంతి, సిబ్బంది ఉన్నారు.

బహిరంగ ప్రకటన

అన్నమయ్య జిల్లా, లక్కిరెడ్డిపల్లి మండలం, అనంతపురం గ్రామం, శ్రీ గంగమ్మ దేవత దేవస్థానమునకు చెందిన, జాతర సందర్భంగా దేవస్థానము నిధులచే ఐరన్ బారికేడ్స్, షామియానాలు, చలవ పందిళ్లు, పుష్ప అలంకరణ, విద్యుత్ దీప అలంకరణ, వంట పాత్ర సామాన్లు, వగైరాలకుగాను కొటేషన్లు ఆహ్వానించడమైనది. ఆసక్తిగలవారు సదరు కొటేషన్లను 03.02.2026వ తేదీ లోపల కార్యనిర్వహణాధికారి, కార్యాలయం నందు అందజేయవలెనని తెలపడమైనది. మిగతా వివరములకు కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయము నందు అడిగి తెలుసుకొనవచ్చును.

ఇట్లు కె.శ్రీనివాసులు, గ్రేడ్-I, కార్యనిర్వహణాధికారి, సెల్ 9989793906.

2వ సారి బహిరంగ వేలము ప్రకటన

అన్నమయ్య జిల్లా, లక్కిరెడ్డిపల్లి మండలం, అనంతపురం గ్రామం, శ్రీ గంగమ్మ దేవత దేవస్థానమునకు చెందిన, జాతర సందర్భంగా టోల్‌గేట్ వసూలు చేసుకొనుహక్కు మరియు విడి దినముల యందు పూలు విక్రయించుకొను హక్కు, ఐస్‌క్రీమ్స్ అంగడి పెట్టుకొనుహక్కు, టోల్‌గేట్ వసూలు చేసుకొను హక్కులకు 03.02.2026 తేదీన మంగళవారం ఉదయము 10.00 గంటలకు బహిరంగ వేలము జరపబడును. ఆసక్తిగలవారు బహిరంగ వేలము ప్రకటన కరపత్రములో ముద్రించబడిన వేలము షరతులకు లోబడి వేలములో పాల్గొనవచ్చును. మిగతా వివరములకు కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయము నందు అడిగి తెలుసుకొనవచ్చును.

ఇట్లు కె.శ్రీనివాసులు, గ్రేడ్-I, కార్యనిర్వహణాధికారి, సెల్ 9989793906.

డిజిలక్ష్మి కటాక్షం.. మగువలకు దూరం

మదనపల్లెలో అమలుకు నోచుకోని పథకం

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం డిజిలక్ష్మి పథకాన్ని తెరమీదకు తెచ్చింది. పురపాలికలో దీని అమలులో జాప్యం జరుగుతోంది. స్వయం సహాయక సంఘాల్లోని అర్హులైన మహిళలను ఎంపిక చేసి వారితో మినీ మీ సేవా కేంద్రాలు ఏర్పాటు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సాధారణ డిజిటల్ సేవా కేంద్రాలు నిర్వహించే లక్ష్యంగా డిజిలక్ష్మి- సీఎస్‌సీ కేంద్రాలను పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

జిల్లా కేంద్రంలో వివరాలు..
వార్డులు: 35
స్వయం సహాయక సంఘాలు: 2,238
సభ్యులు: 22,380 మంది
ఎస్ఎల్ఎఫ్‌లు: 69
ఏర్పాటు చేయాల్సిన డిజిలక్ష్మిలు: 69
ఇప్పటివరకు ఏర్పాటు: సున్నా

ఒక్కరూ ఎంపిక కాలేదు

ఎస్ఎల్ఎఫ్ స్థాయిలో స్వయం సహాయక సంఘాల్లో విద్యావంతులైన సభ్యులు డిజిలక్ష్మి కియోస్క్ కేంద్రాల ఏర్పాటుకు అర్హులు. పొదుపు సంఘాల్లో ఉంటూ డిగ్రీ విద్యార్హత, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన వారిని ఎంపిక చేస్తారు. మదనపల్లెలో 69 డిజిలక్ష్మిలను గుర్తించాల్సి ఉంది. ఇప్పటివరకు ఒక్కరినీ ఎంపిక చేయలేదు. కియోస్క్ కేంద్రాల నిర్వహణకు బ్యాంకులు రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షలు వరకు రుణాలు ఇస్తాయి.

పట్టణ ప్రజలకు సేవలు..

డిజిలక్ష్మి కియోస్క్ కేంద్రాల ద్వారా బ్యాంకింగ్, బీమా, ఆరోగ్య సేవలు, వ్యవసాయం, ప్రయాణం, పన్నుల చెల్లింపు, రైల్వే, బస్ టికెట్ల బుకింగ్ తదితర 250 సేవలు అందనున్నాయి. కియోస్క్ కేంద్రాలను పురపాలికల్లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. మదనపల్లెలో ఈ పథకం మరుగున పడింది.

ఉత్తర్వులకు ఎదురుచూపు

మదనపల్లె పురపాలికలో డిజిలక్ష్మిలు ఎంపిక జరగలేదు. మొత్తం 69 ఎస్ఎల్ఎఫ్‌లున్నాయి. ఒక్కో ఎస్ఎల్ఎఫ్‌కు ఒక్క డిజిలక్ష్మి కియోస్క్ కేంద్రం ఏర్పాటు చేయాలి. దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఉత్వరులు అందిన తర్వాత చర్యలు తీసుకుంటాం.

- మధుసూధనరెడ్డి, సీఎంఎం, మెప్మా, మదనపల్లె

గణిత ఫోరం కాలమానిని ఆవిష్కరణ

క్యాలెండర్లు చూపుతున్న డీఈవో, ఉపాధ్యాయులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: ఏపీ గణిత ఫోరం 2026 క్యాలెండర్‌ను డీఈవో సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. డీఈవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డీవైఈవో లోకేశ్వర్‌రెడ్డి, ఎంఈవోలు రాజగోపాల్, ప్రభాకర్‌రెడ్డి, ఏపీఎంఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నామా చంద్రశేఖర్, రాష్ట్ర సభ్యుడు మోహన్, జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, ఆర్థిక కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌నాయుడు, మహమ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూఏ క్రికెట్ జట్టుకు ముగిసిన శిక్షణ

కళాశాల డైరెక్టర్ రామలింగారెడ్డి, అధ్యాపకులతో క్రీడాకారులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: మదనపల్లె ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న జేఎన్‌టీయూఏ విశ్వవిద్యాలయ క్రికెట్ జట్టు శిక్షణ మంగళవారం ముగిసింది. నైపుణ్యం సాధించిన 16 మందిని ఎంపిక చేసినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 5 వరకు మైసూర్‌లో జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయ క్రికెట్ పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడాకారులతో పాటు ఇద్దరు శిక్షకులు వెళ్లనున్నట్లు చెప్పారు. ఎంపికైన వారిని ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాయుడు, అధ్యాపకులు అభినందించారు.

నకిలీ పత్రాలతో పాస్‌పోర్టుకు యత్నించిన వ్యక్తికి జైలు

రాయచోటి ఠాణాలో నిందితుడిని చూపుతున్న పోలీసులు

రాయచోటి, న్యూస్‌టుడే: నకిలీ పత్రాలతో పాస్‌పోర్టు పొందేందుకు యత్నించిన కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. రాయచోటి పట్టణం అలీమాబాద్‌వీధికి చెందిన షేక్ వసీం అక్రమ్ 2023లో ఈసీఎన్ఆర్ పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేశాడు. పదో తరగతి మార్కుల మెమోను ఫోర్జరీ చేసి నకిలీ పత్రాలను అసలైనవిగా నమ్మించేందుకు యత్నించగా అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి సాక్ష్యాధారాలతో కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. నేరారోపణ రుజువు కావడంతో రాయచోటిప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి టి.సుయోధన నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్పీ ధీరజ్‌కునుబిల్లి తెలిపారు.

విశ్రాంత ఉపాధ్యాయిని మెడలో గొలుసు చోరీ

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: విశ్రాంత ఉపాధ్యాయిని మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు లాక్కెళ్లిన ఘటన మదనపల్లె పట్టణంలో మంగళవారం రాత్రి జరిగింది. రెడ్డిస్ కాలనీకి చెందిన జయలక్ష్మి సూపర్‌మార్కెట్‌లో సరకులు కొనుగోలు చేసి వెళ్తుండగా ద్విచక్ర వాహనంలో వచ్చిన ఇద్దరు ఆమె మెడలోని 22 గ్రాముల బంగారు గొలుసు లాగేశారు. ఆమె కింద పడటంతో గొలుసుతో పాటు దుండగులు పరారయ్యారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

వ్యవసాయ రంగాభివృద్ధికి ఒప్పందం

తిరుపతి (వ్యవసాయం), న్యూస్‌టుడే: వ్యవసాయ, అనుబంధ రంగాల్లో చిరు, మధ్యతరహా పరిశ్రమల స్థాపనలో రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం, శిక్షణ ఇచ్చేందుకు వ్యవసాయ కళాశాల విశ్రాంత అధ్యాపకులు ముందుకు రావడం అభినందనీయమని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ ఉపకులపతి డా.ఆర్.శారద జయలక్ష్మీదేవి అన్నారు. వారు ఏర్పాటు చేసిన ఎఫ్.ఐ.ఆర్.ఇ.పి. (ఫైనాన్షియల్ ఇంక్లూషన్ రూరల్ ఆంత్రపెన్యూర్ ప్రమోషన్) ట్రస్ట్, వర్సిటీ మధ్య మంగళవారం పరస్పర అవగాహన ఒప్పందం జరిగింది. ఇకపై గ్రామీణ, మహిళా రైతులు, వ్యవసాయ విద్యార్థుల ఆదాయం పెంపునకు మార్గదర్శనం ఇస్తూ వర్సిటీ విస్తరణ కార్యక్రమాలు, నైపుణ్య శిక్షణలో వారు భాగస్వామ్యం వహిస్తారన్నారు.

EENADU Classifieds

EDUCATION

విజయవాడలో BPT/B.Sc., MLT- మేనేజ్‌మెంట్ కోటా సీట్లు- తక్కువ ఫీజు- కొన్నిసీట్లు కలవు. Affiliated to Dr.NTR యూనివర్సిటీ. ✆ 7680065835.

DISTANCE EDUCATION

10th/Inter, BA, B,Com., B.Sc,BBA, BCA, BLIS, MA,M.Com, M.Sc, MCA, MBA,MLIS, Dip, B.Tech, M.Tech, Ph.D, BNYS, BPT, Pharmacy, LLB, BA LLB. 9032030124.

THE EENADU WAY CLASSIFIEDS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/-
Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే
తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290
మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

JOBS

ADMISSION Pro for Om Narayana EM High School Q: any Degree. S: 15 to 30K +Incentives. TPT, Anmh, NLR Dt. ✆ 8106891985.

తిరుపతి నందు ఆఫీసులో పనిచేయుటకు ఆఫీసు బాయ్స్, క్లర్కులు కావలెను. ఆకర్షణీయ జీతం కలదు. Cont: 99489 55539.

E-KART నందు అర్జెంటుగా M/F కావలెను. Qly: Inter, Any Degree. Sal: 15,000/-. Online are Available. 9014120139.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

రాయచోటి

• రాయచోటి • పీలేరు

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

కలికిరి, న్యూస్‌టుడే: మండలంలోని బాలికోన్నత పాఠశాల వార్షికోత్సవం ప్రధానోపాధ్యాయురాలు జయమ్మ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వివిధ ఆట-పాటలు, వ్యాసరచన, వక్తృత్వ, నృత్య పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు, అవార్డులు ప్రదానం చేశారు.

విద్యార్థినులకు బహుమతులు అందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు జయమ్మ, ఉపాధ్యాయులు

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

కంభంవారిపల్లి (న్యూస్‌టుడే) : పది, ఇంటర్మీడియట్ విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈవో రెడ్డి బాషా అన్నారు. మంగళవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో పది, ఇంటర్మీడియట్ విద్యార్థుల వీడుకోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శీనూ నాయక్, వైస్ ప్రిన్సిపల్ బాలాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మూడే సూర్యుడునాయక్, ప్రధానోపాధ్యాయుడు గంగిరెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని దేవళంపల్లె ఉన్నత పాఠశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు.

మాట్లాడుతున్న సీఐ రాఘవరెడ్డి

కష్టపడి చదివితే ఉత్తమ భవిష్యత్తు

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: విద్యార్థులకు పదో తరగతి పునాది, ఇక్కడ బాగా కష్టపడి చదివితే రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్తును అందుకోవచ్చని సర్కిల్ సీఐ రాఘవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పదోతరగతి విద్యార్థులకు వీడుకోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు పరీక్షలకు ఒత్తిడి లోనవకుండా రాయాలన్నారు. విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఉమామహేశ్వరి, ఎంఈవో వెంకటలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్మశానం, గ్రామ కంఠం ఆక్రమణపై ఫిర్యాదు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని ముడుపులవేముల పంచాయతీ కుమ్మరపల్లెకు చెందిన ఒక వ్యక్తి గ్రామ సమీపంలోని శ్మశానం, గ్రామ కంఠం ఆక్రమించి ప్లాట్లు వేశారని గ్రామస్థులు మంగళవారం తహసీల్దార్ శివ కుమార్‌కు ఫిర్యాదు చేశారు.

అభివృద్ధి పనులు.. ప్రమాదాల అడుగులు

ఇష్టానుసారంగా గుంతల తవ్వకం

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: పురపాలక పరిధిలోని అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. తాగునీటి పైపులైన్లు మరమ్మతుల పేరిట సీసీ రోడ్లను ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. ఓ వైపు ప్రభుత్వం సీసీ రోడ్లు లేని ప్రాంతాల్లో రోడ్లు నిర్మిస్తుంటే.. మరో వైపు అధికారుల నిర్లక్ష్యం కారణంగా సీసీ రోడ్లను అడ్డంగా తవ్వేస్తున్నారు. దీంతో దారులు గుంతలతో దర్శనమిస్తున్నాయి. ఎక్కడ ఏ గుంత ఉంటుందో అర్థం కాక ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు.

మౌలిక వసతుల కరవు..

పురపాలక పరిధిలో 34 వార్డులు, సుమారు 31 వేల నివాసాలు ఉన్నాయి. లక్షా 20 వేల వరకు జనాభా ఉన్నారు. గత పది సంవత్సరాలుగా పట్టణం విస్తరిస్తోంది. కాని దానికి తగ్గట్టు మౌలిక వసతుల కల్పనలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. తాగునీటి పైపులైన్లు, కుళాయి కనెక్షన్లు, భవన నిర్మాణదారులు ఇతర పనుల కోసం రహదారులను ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. అనంతరం గోతులను పూడ్చకుండా అలాగే వదిలేస్తున్నారు. దీంతో అంతర్గత రహదారులపై వాహనాలు నడపాలంటే వాహనదారులు వణికిపోతున్నారు.

పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వద్ద గుంత పక్కనే నడుస్తున్న విద్యార్థులు

నిధులు వృథా

ముఖ్యంగా కొత్తపేట, కె.రామాపురం, ఎస్ఎన్ కాలనీ, బోస్‌నగర్, కొత్తపల్లె, రవిహాల్ వెనుక ప్రాంతం, పాత రాయచోటి, డిస్ రెడ్డెన్న వీధి, సాయిరాం వీధి, చర్చివీధి, బేతల్ కాలని తదితర ప్రాంతాల్లో ఎక్కువగా ఈ పరిస్థితి కనిపిస్తుంది. రహదారుల అభివృద్ధికి 14,15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చినప్పటికీ గత వైకాపా హయాంలో పనులు చేపట్టకపోవడం, ఆ నిధులను వేరే పనులకు వినియోగించారు. పురపాలక పరిధిలో 146 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 109 కి.మీ మాత్రమే నిర్మాణం చేపట్టారు. ఇంకా 37 కి.మీ మేర సీసీ రోడ్లు నిర్మించాల్సి ఉంది. రూ.కోట్ల ప్రజాధనం వృథా అవుతోంది. ఉన్నతాధికారులు స్పందించి ఓ ప్రణాళిక ప్రకారం పైపులైన్ల మరమ్మతులు చేసేలా పుర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

పురపాలక పరిధిలో పైపులైన్ల మరమ్మతుల కోసం గుంతలు తవ్వుతున్నారు. వాటిని వెంటనే నాణ్యతతో పూడ్చి వేయాలని అధికారులకు సూచించాం. అనుమతులు లేకుండా రోడ్లను తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటాం.

- రవి, కమిషనర్ రాయచోటి

మంత్రి సవితతో కార్పొరేషన్ల ఛైర్మన్లు

మంత్రి సవితను కలిసిన కార్పొరేషన్ల ఛైర్మన్లు

సంబేపల్లె, న్యూస్‌టుడే: ఆదరణ 3.0, కార్పొరేషన్ రుణాలు, వివిధ బీసీ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితతో చర్చించినట్లు రాపాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ నాగేశ్వరనాయుడు, జంగమ కార్పొరేషన్ ఛైర్మన్ చంద్రశేఖర్లు తెలిపారు. మంగళవారం విజయవాడ గొల్లపూడి బీసీ వెల్ఫేర్ భవన్‌లో సత్యనారాయణ ఐఏఎస్, భీమశంకర్ జనరల్ మేనేజర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నట్లు వారు తెలిపారు. ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె

బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పట్టణంలోని స్థానిక స్టేట్ బ్యాంకు ఎదుట చేపట్టిన ధర్నాకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, నాయకులు రవీంద్రారెడ్డి, శ్రావణి, శ్రీనివాసులు, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. **పీలేరు:** బ్యాంకులకు వారంలో ఐదు రోజులు పనిదినాలుగా నిర్ణయించిన ఒప్పందాన్ని అమలు చేయాలని పీలేరు ఎస్బీఐ ప్రధాన మేనేజరు కార్తీక్ భరద్వాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం పీలేరులోని అన్ని బ్యాంకుల ఉద్యోగులు ఎస్బీఐ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఎస్బీఐ బెబోరావు, యూనియన్ సురేష్, డీసీసీబీ త్యాగరాజు, ప్రసాదు, శిరీష పాల్గొన్నారు. **కలకడే:** యూనియన్ బ్యాంక్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్‌ల సిబ్బంది మంగళవారం సమ్మె చేయడంతో బ్యాంకులు మూత పడ్డాయి. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. **సంబేపల్లె:** ఉద్యోగుల సమ్మె కారణంగా సంబేపల్లె భారతీయ స్టేట్ బ్యాంకు మంగళవారం మూతపడింది. ఇప్పటికే ఈనెల 24న నాల్గవ శనివారం, 25న ఆదివారం, 26న గణతంత్ర దినోత్సవం అధికారిక వరుస సెలవులు రాగా మంగళవారం సమ్మె కారణంగా నాలుగు రోజులు మూతబడ్డాయి.

నేడు హుండీ లెక్కింపు

గుర్రంకొండ, న్యూస్‌టుడే: మండలంలోని శ్రీరెడ్డెమ్మదేవత ఆలయ హుండీని నేడు ఛైర్మన్ లంకిపల్లె రాజన్ననాయుడు సమక్షంలో లెక్కిస్తున్నట్లు ఈవో మంజుల మంగళవారం తెలిపారు. హుండీ లెక్కింపులో పాల్గొనే వారు ఆలయ నిబంధనల మేరకు నడుచుకోవాలన్నారు. సంప్రదాయ దుస్తుల్లో రావాలని కోరారు.

ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తప్పవని ఈవోఆర్డీ సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వాల్మీకిపురంలోని హోటళ్లను పంచాయతీ ఈవో రవీంద్రనాథ్‌తో కలిసి ఈవోఆర్డీ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆహార పదార్థాల నాణ్యతపై ఆరా తీశారు. ఇడ్లీ తయారీలో ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నారని, ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. ఇలాంటి చర్యలకు హోటల్ యజమానులు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు నట్టల నివారణ చికిత్స చేస్తున్న పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటమునినాయుడు

పశు ఆరోగ్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

కలికిరి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం పశుపోషణ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటమునినాయుడు సూచించారు. మంగళవారం కలికిరి మండలం చీకటిపల్లె, పారపట్ల కురవపల్లె, రంగనాథపురం గ్రామాల్లో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 200 పశువులకు, వెయ్యి గొర్రెలు, 50 దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. సుమారు 30 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్సలు, 25 పశువులకు సాధారణ చికిత్సలు చేశామని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ కీర్తి, డాక్టర్ గిరినాథ్‌రెడ్డి, మహల్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **చిన్నమండెం:** సి.పాలిమేరపల్లె గ్రామం బెస్తపల్లెలో మంగళవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని పశువైద్యుడు టి.భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పశుబీమా గురించి అవగాహన కల్పించారు.

తగిన మోతాదులో యూరియా వాడాలి

కలకడ, న్యూస్‌టుడే: వరి పైరు సాగులో యూరియా అధికంగా వాడితే అగ్గితెగులు వస్తుందని వ్యవసాయాధికారి శ్రీనివాస్ సూచించారు. మండలంలోని గుడిబండలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పొలాల వద్ద రైతులకు పలు సూచనలు చేశారు. ఎకరా పొలానికి 30 కిలోల యూరియా వాడితే సరిపోతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌కే సిబ్బంది చందన, అనిల్, ఇంద్రజ, అమృత్, రైతులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం

పుంగనూరు గ్రామీణ: అప్పులబాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చౌడేపల్లె మండలం భయప్పల్లెలో చోటు చేసుకుంది. కె.రామచంద్ర పలువురి వద్ద అప్పులు తీసుకున్నారు. వారంతా అడగటంతో తీర్చే దారిలేక మంగళవారం పురుగు మందు తాగారు. ఆయనను కుటుంబ సభ్యులు గుర్తించి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డ్రైవర్ నిద్రమత్తుతో ప్రమాదం

ములకలచెరువు: డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతో టమాట లోడుతో వెళ్తున్న మినీ వాహనం అదుపుతప్పిన రోడ్డు పక్కకు దూసుకుపోయింది. ములకలచెరువు మండలంలోని చీకుచెట్టుపల్లి సమీపంలో డ్రైవర్ ప్రేమ్ నిద్రమత్తులో ఉండటంతో వాహనం కాలువలోకి దూసుకుపోయింది. కొన్ని టమాటాలు నేలపాలయ్యాయి. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

తెదేపాకు కార్యకర్తే అధినేత

రాయచోటి, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీకి కార్యకర్తే అధినేత అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరూపించారని రాజంపేట పార్లమెంట్ తెదేపా అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్‌బాబు తెలిపారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన పార్లమెంట్ కమిటీల వర్క్‌షాప్‌నకు ఆయన హాజరయ్యారు. జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు.

థామస్ ఆల్వా ఆదర్శప్రాయుడు

పీలేరు, న్యూస్‌టుడే: ఎలక్ట్రీషియన్లకు శాస్త్రవేత్త థామస్ ఎడిసన్ ఆదర్శప్రాయులని మంగళవారం ఎలక్ట్రీషియన్‌డే సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బలరాం అన్నారు. మంగళవారం పీలేరు వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద థామస్ ఎడిసన్ చిత్రం బ్యానర్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో రసూల్‌బాషా, షణ్ముగం, మస్తాన్, ఈశ్వర్, మహేష్, రాజేంద్ర పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్ మరిచారు.. హెచ్చరిక అమర్చారు

పూర్వపు జిల్లా కేంద్రమైన రాయచోటిలోని రింగ్ రోడ్డు విస్తరణ పనులు ఇటీవల చేశారు. బీసీ కాలనీ వద్ద పైపులైన్లు వెళ్లే మార్గంలో గేట్ వాల్వ్‌లు ఏర్పాటు చేసేందుకు పెద్ద గుంత ఏర్పాటు చేశారు. నెలల తరబడి మ్యాన్‌హోల్ ఏర్పాటు చేయకపోవడంతో వేగంగా వచ్చే వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి. అధికారులు కేవలం హెచ్చరిక బోర్డులు అడ్డుపెట్టి వదిలేశారు. ఈ మార్గంలో కడప, మదనపల్లె, చిత్తూరు, అనంతపురం, పులివెందుల, బెంగళూరు ప్రాంతాలకు వెళ్లే వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. అధికారులు గుర్తించి వెంటనే మ్యాన్‌హోల్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.- **న్యూస్‌టుడే, రాయచోటి**

పాలన మారింది.. పర్యవేక్షణ కొరవడింది

❖ పాత కలెక్టరేట్ భవనాల గోడల్లో పెరుగుతున్న మొక్కలు

రాయచోటి, న్యూస్‌టుడే: మూడున్నరేళ్ల పాటు జిల్లా అధికార యంత్రాంగానికి నీడనిచ్చి పరిపాలనకు అనువైన భవనం ఇది. అన్ని శాఖలు ఒకే భవన సముదాయంలో ఉండడంతో ప్రజలకు ఎంతో అనుకూలంగా ఉండేది. జిల్లా ప్రథమ పౌరుడు కలెక్టర్ ఈ కార్యాలయంలోనే విధులు నిర్వహించడంతో అప్పట్లో అధికారులు భవనాల నిర్వహణ సక్రమంగా చూసుకునే వారు. గత డిసెంబరు 29న జిల్లా కేంద్రం మదనపల్లెకు మార్పు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. ఈ దశలో ఆ భవనాలలో విధులు నిర్వహించే సిబ్బంది ఖాళీ చేసి మదనపల్లెకు మకాం మార్చారు. ఇటీవల భవనాల వైపు చూసే వారు లేకపోవడంతో వెనుక వైపు గోడలలో చెట్లు మొలిచాయి. వాటిని తొలగించకపోవడంతో భవనంపైకి పాకుతూ గోడలలోకి పాకడంతో గోడలు నాణ్యత దెబ్బతింటోంది. పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించకపోతే భవన సముదాయం గోడలు దెబ్బతిని కూలే ప్రమాదం ఉంది. అధికారులు చర్యలు తీసుకొని చెట్లను తొలగించి గోడలకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పాత కలెక్టరేట్ భవనం వెనుక భాగంలో పెరిగిన మొక్కలు

పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: భాజపాలో కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని తితిదే బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం తిరుమల పర్యటన సందర్భంగా నూతనంగా ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన నిమ్మనపల్లె పురుషోత్తం కలిశారు. ఆయన్ను శాలువాతో సన్మానించారు. చల్లపల్లె నరసింహారెడ్డి, పులి నరేంద్రరెడ్డి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ కమిటీని నియమించాలి

పీలేరు గ్రామీణ: ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ కమిటీని నియమించాలని ఆపస్ జిల్లా సహాధ్యక్షుడు పచ్చార్ల సుధాకర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కుప్పంలో ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ చేతుల మీదుగా ఆపస్ డైరీలు, క్యాలండర్లను ఆవిష్కరించారు.

ప్రజల ఆశాకిరణం మంత్రి లోకేశ్

రాయచోటి, న్యూస్‌టుడే: ప్రజల ఆశా కిరణం మంత్రి నారా లోకేశ్ అని తెదేపా రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా చెప్పారు. యువగళం పాదయాత్ర నిర్వహించి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం రాయచోటిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కేక్ కోసి కార్యకర్తలకు పంచి పెట్టి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు నరసింహనాయుడు, రామచంద్ర, కొండారెడ్డి, హర్షద్‌రోఫా, సాంబశివారెడ్డి, శేఖర్‌రెడ్డి, అంజాద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కేక్ కోసి కార్యకర్తలకు పంచుతున్న తెదేపా రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా

ముమ్మరంగా సాగుతున్న రైతు బజారు పనులు

చిన్నమండెం, న్యూస్‌టుడే: మండలంలోని సంత వీధిలో రైతు బజారు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఏళ్ల తరబడి ప్రతి శుక్రవారం ఈ ప్రాంతంలో వారపు సంత జరుగుతోంది. గ్రామ పంచాయతీకి వారపు సంత ద్వారా ఆదాయమున్నా వసతులు కల్పించలేదు. వారపు సంతను రైతు బజారుగా మార్చేందుకు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఉపాధి కింద రూ.20లక్షల నిధులు మంజూరు చేయించడంతో పాటు గత నెల ఆరో తేదీ భూమి పూజ చేశారు. పంచాయతీరాజ్ ఇంజినీరు హర్షవర్దన్‌రెడ్డి పనులను దగ్గరుండి చేయిస్తున్నారు. మొత్తం 24 దుకాణాలు పెట్టుకొనేందుకు షెడ్లను నిర్మిస్తున్నామని జేఈ తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికీ తప్పకుండా అవగాహన కలిగి ఉండాలని ఎస్సై శోభ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో శక్తి టీం ఆధ్వర్యంలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

CHANGE OF NAME

I, MAJEED SHAHEENA (Old Name), W/o MAJEED GHOUSE MOHIDDIN, R/o 23/123-D, Jamiya Masjeed, Rayachoty, Annamayya Dist, A.P. I Changed my name to MAJEED SHAIK SHAHEEN. Henceforth, I will be known as MAJEED SHAIK SHAHEEN, W/o MAJEED SHAIK GHOUSE MOHIDDIN (New Name)

CHANGE OF NAME

I, MAJEED GHOUSE MOHIDDIN (Old Name), R/o 23/123-D, Jamiya Masjeed, Rayachoty, Annamayya Dist, A.P. I Changed my name to MAJEED SHAIK GHOUSE MOHIDDIN. Hence forth, I will known as MAJEED SHAIK GHOUSE MOHIDDIN (New Name)

దారంతా గుంతలమయం

గుర్రంకొండ, న్యూస్‌టుడే: మండలంలోని సరిమడుగు పంచాయతీ సుబ్బిరెడ్డిగారిపల్లె నుంచి గుండ్లగుట్టతాండకు వెళ్లే రహదారి పూర్తిగా గుంతలుపడి, వాహనచోదకులకు ఇబ్బందిగా తయారైంది. రాకపోకలకు అంతరాయంగా ఉంది. రహదారంతా గోతులు ఏర్పడి, కంకర తేలి పాదాచారులు సైతం నడవలేని పరిస్థితి. అధికారులు చొరవ తీసుకుని మరమ్మతులు చేయాలని స్థానికులు వాపోతున్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

పుంగనూరు, న్యూస్‌టుడే: పుంగనూరు పీఆర్ అతిథి గృహం ఆవరణలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్వీఐ సుప్రియ తెలిపారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నీటి పథకం మరమ్మతులు

గాలివీడు, న్యూస్‌టుడే: గాలివీడు మండలంలోని వడిశలవంకపల్లిలోని మంచినీటి పథకానికి మరమ్మతులు చేసి నీటి సమస్యను పరిష్కరించారు. ఇంకెన్నాళ్లీ నీటి కష్టాలు అనే శీర్షికన 'ఈనాడు'లో ఈ నెల 22న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు.

స్పందనకు వందనం

పేరు తొలగింపు

కలికిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వం మారి రెండేళ్లు అయినా మండలంలోని పల్లవోలులో నిర్మించిన భవన సముదాయంపై వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రం అనే కొనసాగిస్తున్నారు. అయితే పాత పేరునే కొనసాగించడంపై స్థానికుల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయని ఈ నెల 2న ఇంకా అదే పేరు. . మారని తీరు అనే శీర్షికన ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన కార్యదర్శి నవాజ్ ఆధ్వర్యంలో సిబ్బంది పాత పేరును తొలగించారు.

ఐఈఆర్పీలకు పూర్తిస్థాయి పేస్కేల్ అమలు చేయాలి

రాయచోటి, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షాలో పని చేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులు(ఐఈఆర్పీ)లకు పూర్తి స్థాయి ప్రత్యేక పే స్కేల్ అమలు చేయాలని అసోసియేషన్ నాయకులు జనార్దన్ తెలిపారు. మంగళవారం నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరాజుకు వినతి పత్రం అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఐఈఆర్టీల సమస్యను తెలియజేసి పరిష్కారానికి కృషి చేస్తామని శ్రీనివాసరాజు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరాజుకు వినతి పత్రం అందజేస్తున్న ఐఈఆర్పీలు

చిన్ననీటి వనరులపై నిర్లక్ష్యమేల?

❖ మరమ్మతులు నోచుకోని చెక్‌డ్యాంలు

చిన్నమండెం, న్యూస్‌టుడే: మండల కేంద్రం సమీపంలోని బాలికల ఉన్నత పాఠశాల వెనుక భాగంలో మాండవ్య నదిలో వాటర్‌షెడ్ కింద నిర్మించారు. ఐదేళ్ల కిందట కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరద నీటిలో తెగి సగం వరకు కొట్టుకుపోయింది. దీంతో పాటు నదిలో కేశాపురం నుంచి తూర్పుపల్లి వరకు నిర్మించిన చెక్‌డ్యాంల్లో ఒకటి మినహా అన్ని నేడు తెగిపోయి దర్శనమిస్తున్నాయి. ఈ ఏడాది భారీ వర్షాలు కురిసి నది పారినా ఎక్కడ చుక్క నీరు నిలబడలేదు. రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన ఇవి మరమ్మతులు లేక నేడు వెక్కిరిస్తున్నాయి.

చిన్నమండెం సమీపంలో మాండవ్య నదిలో సగం కొట్టుకుపోయిన చెక్‌డ్యాం

ఎక్కడికి వెళ్లినా ఇలానే..

నరసింహస్వామి ఆలయ సమీపంలో కొండమూల వంకలో వాటర్‌షెడ్ కింద నిర్మించారు. దీంతో పాటు మరో మూడు నిర్మించారు. ఇవన్నీ 2021లో వర్షాలకు కొట్టుకుపోయాయి. కొన్ని చోట్ల ఉన్న రాళ్లను కూడా కొందరు మాయం చేశారు. ఇలాంటి చిన్న నీటి వనరులు సక్రమంగా ఉండి ఉంటే నేడు సమీప ప్రాంతాల పరిధిలోని బోరు బావుల్లో వేసవిలోనూ నీటి కొరత వచ్చే అవకాశమే ఉండేది కాదు. రాయచోటి ప్రాంతంలో ఎక్కడికి వెళ్లినా ఇలాంటివి కనపడతాయి.

వైకాపా నిర్లక్ష్యం..

వర్షపునీటిని నిలిపి భూమిలోకి ఇంకింపచేస్తేనే భూగర్భజలాలు పుష్కలంగా ఉంటాయి. ఒక్క చిన్నమండెం మండలంలోనే 20 వరకు చిన్న, పెద్ద చెక్‌డ్యాంలు పాడైపోయాయి. మాండవ్య నదిలో, కొండమూల వంకతో పాటు పలు గ్రామీణ ప్రాంతాల పరిధిలో ఇవి ఉన్నాయి. గత ప్రభుత్వం మాత్రం చిన్ననీటి వనరుల మరమ్మతులు, కొత్తవి నిర్మించడం వంటి వాటిపై నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఈ ఏడాది మంచి వర్షాలు కురిసి మాండవ్య నది ప్రవహించి చెరువులు నిండాయి. కానీ చెక్‌డ్యాంలకు మరమ్మతులు లేకపోవడంతో వర్షపునీరు నిలబడే అవకాశమే లేకుండా పోయింది. ఈ దుస్థితి భూగర్భజలాల మీద ఉండే అవకాశాలు లేకపోలేదు. వచ్చే వేసవిలోనైనా పనులు చేపట్టాలని పరిసర ప్రాంతాల రైతులు కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై మండల ఇంజినీరు బాబును వివరణ కోరగా కొన్ని చెక్‌డ్యాంల పనుల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రభుత్వం ఆదేశాలు ఇస్తే పూర్తి స్థాయిలో మరమ్మతులు చేస్తామన్నారు.

మదనపల్లె

• మదనపల్లె • తంబళ్లపల్లె • పుంగనూరు

సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధికి కృషి చేద్దామని ఎంపీపీ నరసింహులు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన అధ్యక్షతన నిమ్మనపల్లె మండల సమావేశం నిర్వహించారు. పదవిలో ఉన్న వారు పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. అనంతరం మండల స్థాయి అధికారులు ప్రగతిని వివరించారు. ఉప ఎంపీపీ జయప్రకాశ్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు పి.వెంకటరమణ, తహసీల్దారు తపస్విని, ఎంపీడీవో ఫక్రుద్దీన్‌సాహెబ్, ఏవో రమేశ్ బాబు, డిప్యూటీ ఎంపీడీవోలు బాలరాజు, లక్ష్మీపతి యాదవ్ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

రూ.3.30 కోట్లతో రోడ్ల పనులు ప్రారంభం

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి రూ. కోట్లలో నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో రూ.18 కోట్లతో పనులు చేసినట్లు చెప్పారు. మంగళవారం బండకిందపల్లె, అడవిలోపల్లె మీదుగా బొమ్మనచెరువు వరకు రూ.3.30 కోట్లతో సీసీ, బీటీ రోడ్ల పనులకు శిలాఫలకం ఆవిష్కరించారు. గత అయిదేళ్ల పాలనలో వైకాపా ప్రభుత్వం రోడ్ల నిర్వహణను పట్టించుకోలేదని, కూటమి వచ్చాక గుంతలు లేకుండా చేశామని ఎమ్మెల్యే అన్నారు. ర.భ శాఖ ఈఈ అరవిందాదేవి, ఎంపీడీవో మస్రూర్, ఏఎంసీ డైరెక్టర్ మున్నా, వేణు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో అభివృద్ధి సాధ్యం

పెద్దతిప్పసముద్రం: కూటమి పాలనలో అభివృద్ధి సాధ్యమని, మండలంలో దశల వారీగా సిమెంటు రోడ్ల పనులు చేస్తున్నట్లు ఏఎంసీ మాజీ ఛైర్మన్ పి.శ్రీనాథరెడ్డి అన్నారు. చెన్నరాయునిపల్లెలోని చెన్నకేశవ స్వామి ఆలయం సమీపంలో సిమెంటు రోడ్డు పనులను సర్పంచి శారద మంగళవారం ప్రారంభించారు. ఎంపీడీవో ప్రతాప్‌రెడ్డి, తెదేపా మండల కన్వీనరు ఆనంద్‌రెడ్డి, గ్రామస్థులు ఉన్నారు.

అందినంత తవ్వుకో.. దొరికినంత దోచుకో

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

పుంగనూరు, న్యూస్‌టుడే: కొత్త జిల్లాలో మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. అనుమతులు లేకుండా కొందరు అక్రమంగా తవ్వకాలు సాగించి ప్రకృతి సంపదను తరలించుకు పోతున్నారు. రియల్టర్లు, ఇటుక బట్టీల నిర్వాహకులు ఇష్టానుసారంగా తవ్వేస్తున్నారు. రోజూ నిరంతరం వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలు గ్రామాల ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు.

రాత్రికి రాత్రే తరలింపు..

పుంగనూరు, మదనపల్లె నియోజకవర్గాల్లో ఎక్కువగా గుట్టలు తవ్వేస్తున్నారు. ప్రస్తుతం చెరువు, కుంటల్లో నీరు చేరడంతో కొండలు, గుట్టలపై పడుతున్నారు. పట్టణ సమీపంలో లేఅవుట్ల పనులు జోరుగా సాగుతుండటంతో గ్రావెల్ అవసరం ఏర్పడుతోంది. దీంతో హిటాచ్‌లు, టిప్పర్లతో రాత్రికి రాత్రే వందల లోడ్ల మట్టిని తరలిస్తున్నారు. అనధికారిక బెదిరింపులు ఎక్కువ కావడంతో అధికారులు పట్టించుకోవడం లేదు. సామాన్యులు మట్టి తీసుకువెళ్లాలంటే లేనిపోని నిబంధనలు విధిస్తున్నారని, పెద్దలను మాత్రం పట్టించుకోకుండా, యథేచ్ఛగా వదిలేస్తున్నారని పలువురు వాపోతున్నారు.

పుంగనూరు- మదనపల్లె మార్గంలో మట్టి తవ్వకాలు

◗ **చర్యలు చేపడతాం..** పుంగనూరు తహసీల్దారు రాము వద్ద ప్రస్తావించగా.. అక్రమ తవ్వకాలపై నిఘా పెంచుతామని, అనుమతులు లేకుండా తవ్వితే కేసులు నమోదు చేస్తామని తెలియజేశారు.

ఈ ప్రాంతాల్లో అధికం..

◗ పుంగనూరు నియోజకవర్గంలో చెర్లోపల్లె, చదళ్ల, అక్కుంట, సుగాలిమిట్ట, అమినిగుంట, చింతమాకులపల్లె, భీమ్లేరు మార్గాల్లో మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి.

◗ మదనపల్లె నియోజకవర్గంలో చీకలబైలు, కొళ్లబైలు, బీకేపల్లె, సీటీఎం రోడ్డు, పోతబోలు, చిప్పిలి, అంకిశెట్టిపల్లె మార్గాల పరిధిలో మట్టిని తవ్వేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో బాహాటంగా జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

◗ ఎర్రమట్టికి పట్టణాల్లో డిమాండ్ అధికంగా ఉంది. దీంతో ఒక్కో టిప్పర్ ఎర్రమట్టి ధర రూ.10 వేలకు పైగా పలుకుతోంది. కొండ ప్రాంతాల్లో 20 అడుగుల లోతు వరకు తవ్వకాలు సాగించి తరలిస్తున్నారు.

◗ నిర్ణీత లోతు వరకు కాకుండా అవసరం మేరకు తవ్వేస్తున్నారు. కొన్ని చోట్ల విద్యుత్తు స్తంభాలు సైతం ప్రమాదస్థితిలో ఉన్నాయి. అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

నేడు ఉచిత వైద్యశిబిరం

పుంగనూరు, న్యూస్‌టుడే: పుంగనూరు పీఆర్ అతిథి గృహం ఆవరణలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే సుధీర్ తెలిపారు. రోజ్ బ్లడ్ మాత్రో వాల్లో భాగంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పట్టణం, గ్రామీణ మండలాలకు చెందిన ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

మదనపల్లె పట్టణం: 80085 74611
తంబళ్లపల్లె: 94416 29636
పుంగనూరు: 80085 74622
(10 AM TO 1 PM)

? పుంగనూరు పరిధిలోని షిర్డీసాయినగర్‌లో రోడ్డుపై గొయ్యి ఏర్పడింది. - **రమణారెడ్డి** ✦ పరిశీలించి గొయ్యి పూడుస్తాం. - **మహేశ్, డీఈఈ - న్యూస్‌టుడే, పుంగనూరు**

? పెద్దతిప్పసముద్రం సంతబజారులో వారం రోజులుగా నీటి సమస్య ఏర్పడింది. బోరు మోటారు పాడైంది. - **రాజు** ✦ రెండు రోజుల్లో మోటారు బాగు చేస్తాం. - **షబీనా, పంచాయతీ కార్యదర్శి - పెద్దతిప్పసముద్రం గ్రామీణం**

? కందుకూరు టౌన్‌లోని దండువీధిలో నీటి ట్యాంకు పైపులు పగిలిపోవడంతో నీరు వృథా అవుతోంది. - **ఇమ్రాన్** ✦ తాగునీటి సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తాం. - **బాలచంద్రాచారి ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్** ? పెద్దతిప్పసముద్రం సంత బజారులో రెండు వారాలుగా తాగు నీటి సమస్య నెలకొంది. - **రామకృష్ణ** ✦ రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం. - **షబీనా, కార్యదర్శి - న్యూస్‌టుడే, పెద్దతిప్పసముద్రం**

మంగళంలో పారిశుద్ధ్య చర్యలు

పుంగనూరు గ్రామీణం: మంగళం గ్రామంలో పారిశుద్ధ్య సమస్యను అధికారులు పరిష్కరించారు. ఈనెల 24న ఈనాడులో వార్త ప్రచురితమవగా ఎంపీడీవో అప్పాజీ, కార్యదర్శి మహేష్‌కుమార్ స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు.

కొండ కాలువ శుభ్రం

మదనపల్లె గ్రామీణం: వేంపల్లెలో కొండ కాలువ శుభ్రత పనులు చేపట్టారు. వేంపల్లె చెరువు వరకు విస్తరించి ఉన్న కాలువలో వ్యర్థాలు వేయడంతో సమస్యలు ఏర్పడుతున్నాయని వార్త ప్రచురించగా సర్పంచి ఆదమ్మ, కార్యదర్శి బాలాజీ స్పందించి చర్యలు చేపట్టారు.

ఉపాధ్యాయుల పోరాటాలకు పిలుపు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, ఆర్థిక సమస్యలను పరిష్కరించలేదని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి, పి.మధుసూదన్ అన్నారు. ఇకపై దశల వారీ పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఈనెల 30న తహసీల్దారు కార్యాలయాల్లో వినతిపత్రాల అందజేత, ఫిబ్రవరి 12న కలెక్టరేట్ ఎదుట ధర్నా, ఫిబ్రవరి 25న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలోని అంకిశెట్టిపల్లె పరిధిలో ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమిస్తున్నారని రెవెన్యూ అధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. బెంగళూరు రహదారి సమీపంలో 60 సెంట్ల భూమి ఉందని, 20 సెంట్లకు పైగా చదును చేశారన్నారు. అక్కడ గ్రామకంఠం భూమి ఉందని, పరిశీలిస్తామని ఆర్ఐ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.

రైతులకు అందుబాటులో యూరియా

రొంపిచెర్ల, న్యూస్‌టుడే: మండలంలో రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని ఏవో శ్రావణి తెలిపారు. ప్రస్తుతం ఇద్దరు డీలర్ల వద్ద 950 బస్తాలు ఉన్నాయన్నారు. యూరియా ధర రూ.270గా ఉందని, డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు చేపడతామన్నారు. **నిమ్మనపల్లె:** వెంగంవారిపల్లె రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం రైతులు ఎగబడ్డారు. 200 బస్తాలు ఉండగా, ఎక్కువ మంది రావడంతో ఏవో మంజుల టోకెన్లు ఇచ్చి పంపించారు.

పంట పొలాలపై ఏనుగుల దాడి

కల్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని దేవళంపేట పంచాయతీలోని పంట పొలాలపై రెండు ఏనుగులు దాడి చేశాయి. చిన్ననగరికి చెందిన జి.వెంకటరమణ, శివరామ్, సీతారామయ్య, దిగువమూర్తివారిపల్లెకు చెందిన నరసింహులు, శివయ్య పొలాల్లోని మామిడి చెట్లను ధ్వంసం చేసి కొమ్మలు విరిచేశాయి.

తాత్కాలిక పనులతో నిధుల వృథా

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా కాలువల నిర్మాణాలు చేపడుతున్నారని సీపీఐ నాయకులు సాంబశివ, మురళి ఆరోపించారు. మంగళవారం జేసీ శివనారాయణశర్మకు ఫిర్యాదు చేశారు. కౌన్సిల్ అనుమతి లేకుండా కదిరిరోడ్డులో తాత్కాలికంగా కాలువ నిర్మిస్తున్నారని, మాస్టర్ ప్లాన్‌లో భాగంగా రోడ్డు వెడల్పు చేయాల్సి ఉందన్నారు. ఆ పనులు ప్రారంభిస్తే కాలువ తొలగించాల్సి ఉందని, ప్రజాధనం వృథా అవుతుందన్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: అప్పులబాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చౌడేపల్లె మండలం భయప్పల్లెకు చెందిన కె.రామచంద్ర గ్రామంలో పలువురి వద్ద అప్పులు తీసుకున్నారు. వారంతా అడగటంతో తీర్చే దారిలేక మంగళవారం పురుగు మందు తాగారు. ఆయనను కుటుంబ సభ్యులు గుర్తించి పుంగనూరు ఆసుపత్రికి తరలించారు. ✤ **మదనపల్లె నేరవార్తలు:** పట్టణంలోని ఎస్టేట్‌కు చెందిన డిగ్రీ విద్యార్థి (19) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. మంగళవారం విష ద్రావణం తాగి అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు.

శిథిల బస్టాండులో భయం భయం

పుంగనూరు పురపాలక పరిధిలోని పుంగమ్మ చెరువు కట్టపై బైరెడ్డిపల్లె మార్గంలో నిర్మించిన బస్సు షెల్టరు బీటలు వారింది. వెనుక వైపు గోడలు పడిపోతుండగా.. ముందు వైపు పెచ్చులూడి పడుతున్నాయి. దీంతో ప్రయాణికులు భయం భయంగా నిరీక్షిస్తున్నారు. షెల్టరును తొలగించి కొత్తది నిర్మించాలని కోరుతున్నారు.
- **న్యూస్‌టుడే, పుంగనూరు**

మలుపులో పొంచిఉన్న ప్రమాదం

నిమ్మనపల్లె మండలం బాలినాయునిపల్లె- నిమ్మనపల్లె రహదారిలో ప్రమాదకర మలుపులు చోదకులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఒకేచోట రెండు, మూడు ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణించే మార్గంలో చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, నిమ్మనపల్లె**

గుంత.. ప్రయాణికులకు చింత

పుంగనూరు మండలంలోని ముడిపాపనపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే మార్గంలో రోడ్డుపై భారీ గుంత ఏర్పడింది. దీంతో ప్రయాణికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళల్లో కనిపించకపోవడంతో ఒక్కసారిగా అదుపు తప్పుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి గుంత పూడ్చాలని పలువురు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణం**

పెద్దూరుకు మురుగు స్వాగతం

చౌడేపల్లె మండలంలోని మర్రిమాకులపల్లె, పెద్దూరు, గజ్జలవారిపల్లె గ్రామాల ముఖద్వారం వద్ద మురుగు నిలిచిపోతోంది. గజ్జలవారిపల్లెలోని మురుగు ఈ ప్రాంతానికి చేరి సమస్య ఏర్పడుతోంది. దీని సమీపంలోనే బస్టాప్ ఉండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కాలువ కల్వర్టు కప్పేయడంతో నీరు నిలిచిపోతోందని, సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.
- **న్యూస్‌టుడే, చౌడేపల్లె**

ప్రమాణాలు పాటిస్తే ప్రశంసలు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే: పాఠశాలల్లో స్వచ్ఛత ప్రమాణాలు పాటిస్తే ప్రశంసలు దక్కుతాయని తితిదే బోర్డు సభ్యుడు భానుప్రసాద్ అన్నారు. పట్టణంలోని విజయభారతి పాఠశాల ప్రభుత్వం అందజేసిన స్వచ్ఛ ఏవమ్ హరిత్ విద్య రేటింగ్ పురస్కారానికి ఎంపికైంది. సంబంధిత ప్రశంసాపత్రాన్ని ఛైర్మన్ డాక్టర్ ఎన్.సేతు, ప్రిన్సిపల్ నిశ్చితకు ఆయన అందజేశారు. పాఠశాలల్లో నీరు, హ్యాండ్‌వాష్, మరుగుదొడ్ల నిర్వహణ, పరిసరాల శుభ్రత, పర్యావరణ రక్షణ, క్రమశిక్షణ అంశాల్లో పాఠశాల జాతీయ స్థాయిలో రేటింగ్ సాధించిందన్నారు. భాజపా నాయకులు నరసింహారెడ్డి, అజంతుల్లాఖాన్ ఉన్నారు.

నిశ్చితకు ప్రశంసాపత్రం ఇస్తున్న భానుప్రసాద్

విగ్రహాల ఏర్పాటుకు విరాళం

పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: బూర్లపల్లెలోని రామాలయంలో నూతన విగ్రహాల ఏర్పాటుకు బి.కొత్తకోట మండలంలోని శీతివారిపల్లెకు చెందిన భీమిగాని పద్మనాభరెడ్డి చేయూత అందించారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. బెంగుళూరులో పవర్ వాటర్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్థాపించిన ఆయన రూ.55,212 డీడీ రూపంలో ఆర్థిక సాయం అందజేశారని చెప్పారు.

రైతుల అభ్యున్నతికి ప్రాధాన్యం

ములకలచెరువు, న్యూస్‌టుడే: సింగిల్ విండో ద్వారా రైతులకు సకాలంలో రుణాలిచ్చి వారి అభ్యున్నతికి కృషి చేస్తామని సోంపల్లి సింగిల్ విండో ఛైర్మన్ జి.త్యాగరాజు అన్నారు. మంగళవారం ములకలచెరువు కార్యాలయం తెదేపా నాయకులతో కలిసి క్యాలెండర్లు ఆవిష్కరించి రైతులకు పంపిణీ చేశారు. గతంలో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని సూచించారు. సురేష్, రమణ, నరసింహారెడ్డి, రామాంజులు ఉన్నారు.

డ్రైవర్ నిద్రమత్తుతో ప్రమాదం

ములకలచెరువు, న్యూస్‌టుడే: డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతో టమాట లోడుతో వెళ్తున్న మినీ వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకుపోయింది. అనంతపురం నుంచి వాహనం పలమనేరు బయలుదేరింది. చీకుచెట్టుపల్లి సమీపంలో డ్రైవర్ ప్రేమ్ నిద్రమత్తులో ఉండటంతో కాలువలోకి దూసుకుపోయింది. కొన్ని టమాటాలు నేలపాలయ్యాయి. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

అనాథకు అంత్యక్రియలు

మదనపల్లె వైద్యం: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో ఇటీవల మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి మంగళవారం హెల్పింగ్ మైండ్స్ సంస్థ నిర్వాహకుడు అబుబకర్ సిద్దిక్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. సంబంధిత వ్యక్తి బంధువులు రాకపోవడంతో రెండో పట్టణ పోలీసులు సంస్థ నిర్వాహకుడికి సమాచారం ఇచ్చారు. వారు హిందూ శ్మశాన వాటికలో ఖననం చేశారు.

160 మందికి వైద్య పరీక్షలు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: మండలంలోని ఉలవలవారిపల్లెలో మంగళవారం తిరుపతికి చెందిన రమాదేవి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి చెందిన వైద్యబృందం ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. 160 మందికి ఆరోగ్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. మెరుగైన వైద్యం కోసం 20 మందిని రిఫర్ చేశారు. వైద్యులు ఆర్.రఘు, ప్రాంతీయ మేనేజరు ఎల్లయ్య, తెదేపా నాయకులు తాతప్ప, రంగారెడ్డి, భాస్కర్, హరినాథ్, రాఘవరెడ్డి, జీవీరమణ, రవీంద్ర పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే ధ్యేయం

పదవులు పొందిన వారిని సన్మానిస్తున్న శ్రీరామ్‌చినబాబు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికల్లో తెదేపా గెలుపు ఏకపక్షం కావాలని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు పేర్కొన్నారు. నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పట్టుదలతో పనిచేయాలన్నారు. ఇటీవల పార్టీ పదవులు పొందిన నాయకులను సత్కరించారు. పార్టీ కోసం కష్టపడిన వారిని అధినేత చంద్రబాబునాయుడు, లోకేశ్ విస్మరించరని, సముచిత స్థానం కల్పిస్తారన్నారు. స్థానిక ఎన్నికల్లో అడ్డదారుల్లో గెలుపొందాలనే వైకాపాను మండల స్థాయిలో అడ్డుకోవాలన్నారు. మదనపల్లె, రామసముద్రం మండలాల అధ్యక్షులు శ్రీనివాసులు, విజయగౌడ్, పట్టణాధ్యక్షుడు ఎన్.అరుణ్ తేజ, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు ముద్దుకృష్ణమనాయుడు, నాగూర్‌వలీ, ప్రణయ్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.

దారులు దారుణం.. ప్రయాణం నరకం

రాళ్లు తేలి అధ్వానంగా మారిన ములకలచెరువు- తంబళ్లపల్లి రోడ్డు

ములకలచెరువు, న్యూస్‌టుడే: తంబళ్లపల్లె నియోజకవర్గంలో పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.

❖ ములకలచెరువు నుంచి తంబళ్లపల్లె వెళ్లే తారు రోడ్డు పొడవు సుమారు 24 కిలోమీటర్లు. మొత్తం గుంతలే కనిపిస్తున్నాయి. కంకర లేచిపోవడంతో ములకలచెరువు నుంచి నాయునిచెరువుపల్లి, గుండాలవారిపల్లి రోడ్లదీ ఇదే పరిస్థితి.

❖ పీటీఎం మండలంలో మద్దయ్యగారిపల్లి నుంచి కందుకూరు రోడ్డు దారుణంగా ఉంది. కందుకూరు- చేలూరు, పీటీఎం- అంకిరెడ్డిపల్లి, సాలేవాండ్లపల్లి రోడ్లు ఇటీవల వర్షాలకు పాడయ్యాయి. రంగసముద్రం- ములకలచెరువు రోడ్డు గుంతలుగా మారింది.

❖ బి.కొత్తకోట- బడికాయలపల్లి, రంగసముద్రం, పెద్దపాళ్యం మార్గాల్లో ప్రయాణమంటేనే ప్రయాణికులు భయపడుతున్నారు. పర్యాటక కేంద్రం కాండ్లమడుగు నుంచి కొత్తకోటకు వెళ్లే రహదారులు గోతులుగా మారడంతో పలువురు ఇబ్బందులు పడుతున్నారు.

మరమ్మతులు చేస్తున్నాం.. ములకలచెరువు- తంబళ్లపల్లె రోడ్డు బాగుకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు చేస్తాం. ప్రభుత్వం ఆదేశాల మేరకు మిగిలిన రోడ్ల పనులు చేపడతాం.
- **అరవిందాదేవి, ర.భ.శాఖ ఈఈ, మదనపల్లె**

ఎలక్ట్రీషియన్ల దినోత్సవం

పుంగనూరు, న్యూస్‌టుడే: పుంగనూరు పీఆర్ అతిథి భవనం ఆవరణలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్ల సంఘ జెండాను విద్యుత్తుశాఖ ఏడీఈ శ్రీనివాసులు ఎగురవేశారు. ఎలక్ట్రీషియన్ల దినోత్సవం సందర్భంగా నాయకులు సంబరాలు చేశారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నిరసన

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: దళిత కుటుంబాన్ని బెదిరించిన వారిపై కేసులు నమోదు చేయాలని రాయలసీమ మాలమహానాడు ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, జిల్లా అధ్యక్షుడు ఎం.మోహన్ డిమాండు చేశారు. మంగళవారం నిమ్మనపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. ఊసలదిన్ని గ్రామస్థుడు కందూరు భరత్‌ను పారేశువారిపల్లెకు చెందిన కొందరు కులంపేరుతో దూషించడంతో పాటు దాడికి పాల్పడ్డారు. నాటు తుపాకులున్నాయని, కాల్చిపారేస్తామని హెచ్చరించినట్లు చెప్పారు. బెదిరించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

బహుమతి అందజేస్తున్న ఎంఈవో తాతయ్య

కల్లూరు, సదుం, న్యూస్‌టుడే: మండలంలోని కల్లూరు, సదుం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాలు మంగళవారం నిర్వహించారు. బాగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని, పాఠశాలలు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎంఈవోలు సిద్ధరామయ్య, పి.తాతయ్య, నటరాజన్, దామోదర, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ అష్రాఫ్ సూచించారు. అనంతరం విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో అలరించారు.

విద్యార్థుల బాధ్యత తల్లిదండ్రులదే

రొంపిచెర్ల, న్యూస్‌టుడే: విద్యార్థుల భవిష్యత్తును తల్లిదండ్రులు బాధ్యతగా తీసుకొని పాఠశాలకు పంపించాలని చిత్తూరు డీవైఈవో ఇందిరాదేవి సూచించారు. మంగళవారం రొంపిచెర్ల ఆదర్శ పాఠశాల 8వ వార్షికోత్సవం నిర్వహించారు. ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు రోజూ పాఠశాలకు వస్తేనే విద్యపై ఆసక్తి కలుగుతుందన్నారు. ఎంఈడీవో మధుసుదన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి అలవాట్లను అలవర్చుకుంటే, ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. ఎంఈవో శ్రీనివాసులు, ప్రిన్సిపల్ ఆర్.ప్రదీప్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి సహకారం

విద్యా సామగ్రి అందజేస్తున్న తులసీరామ్, డాక్టరు హేమారాణి

కల్లూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం పాఠశాలల్లో పేద విద్యార్థులకు సహకారం అందజేస్తామని తులసీరామ్ ఫౌండేషన్ అధినేత తులసీరామ్, ఆయన సతీమణి డాక్టరు హేమారాణి పేర్కొన్నారు. అమెరికా అశ్వబున్ హైస్కూల్ విద్యార్థులు, ఫౌండేషన్ తరపున వెంకటదాసరిపల్లె, బి.ఎం.కొత్తూరు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 98 మంది విద్యార్థులకు రూ.80 వేలు విలువైన సామగ్రి అందజేశారు. ఎంఈవోలు సిద్ధరామయ్య, పి.తాతయ్య, హెచ్‌ఎంలు లీలావతి, శ్రీలక్ష్మి, ఎం.బాబయ్య, నాగార్జున, రాము, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.
● **కల్లూరు:** ఎల్లంకివారిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో 50 ఏళ్ల క్రితం చదువుకున్న జ్యోతీశ్వర్‌పిళ్లై రూ.10 లక్షలతో మినీ ఆడిటోరియం నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఆమెను గ్రామస్థులు, హెచ్‌ఎం అభినందించారు.

(c) eenadu

ఈనాడు
బాపట్ల
బుధవారం జనవరి 28, 2026

కోటప్పకొండ తిరునాళ్లకు జోరుగా ఏర్పాట్లు

క్యూల వద్ద తాటాకులతో చలువ పందిళ్లు

కోటప్పకొండ తిరునాళ్లకు జోరుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. గతంతో పోలిస్తే ఈసారి ముందుగానే పనులు ప్రారంభించారు. కొండపై చలువ పందిళ్లు ఎప్పుడూ మహాశివరాత్రికి మూడు రోజుల ముందు వేసేవారు. ఈసారి పదిహేను రోజుల ముందుగానే ఆ పనులు మొదలుపెట్టారు. ఉచిత దర్శనంతో పాటు రూ.100, రూ.200 టికెట్ల క్యూలైన్లలో తాటాకులతో పందిళ్లు వేస్తున్నారు. ప్రధాన ఆలయానికి రంగులద్దుతున్నారు. నరసరావుపేట పట్టణంతో పాటు కోటప్పకొండకు వెళ్లే దారుల్లో డివైడర్లు, కల్వర్టులకు రంగులు వేస్తున్నారు.
–ఈనాడు, నరసరావుపేట

7న జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

గుంటూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లాపరిషత్తు స్థాయీ సంఘ సమావేశాలు ఫిబ్రవరి 7వ తేదీ ఉదయం 10.30 గంటలకు గుంటూరులోని జిల్లాపరిషత్తు కార్యాలయంలో జరుగుతాయని సీఈవో వి.జ్యోతిబసు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాపరిషత్తు ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తారు. జడ్పీ ఉపాధ్యక్షుడు శొంఠిరెడ్డి నర్సిరెడ్డి అధ్యక్షతన 3వ స్థాయీ సంఘం, తెనాలి జడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమా ప్రణతి, జడ్పీ ఉపాధ్యక్షురాలు బత్తుల అనురాధల అధ్యక్షతన 5, 6 స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని వివరించారు.

పర్యవేక్షణ కరవు.. అక్రమాలకు నెలవు

న్యూస్‌టుడే, బాపట్ల

అద్దంకి ప్రకాశం జిల్లాలో కలవడంతో ఐదు నియోజకవర్గాలతో జిల్లా చిన్నదైంది. అన్ని నియోజకవర్గాలు ఒకే పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో లేవు. బాపట్ల పట్టణాభివృద్ధి సంస్థ(బావుడా) పరిధిలో కేవలం బాపట్ల, రేపల్లె మాత్రమే ఉన్నాయి. కీలకమైన చీరాల, పర్చూరు ప్రాంతాలు ఇంకా ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ కిందే ఉన్నాయి. వేమూరు పూర్తిగా సీఆర్డీఏలోకి వెళ్లిపోయింది. ఒంగోలు నుంచి ఔడా అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో తీరంలో అక్రమ కట్టడాల నిర్మాణం జోరుగా సాగుతోంది. సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నా నిర్మాణదారులపై చర్యలు తీసుకోవటం లేదు.

రెండు నియోజకవర్గాలకే పరిమితమైన బావుడా

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

జిల్లా ఆవిర్భావం తర్వాత 2022 డిసెంబరులో బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాలు, కాకుమాను, పెదనందిపాడు మండలాలతో బావుడాను అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. చీరాల, పర్చూరు, అద్దంకి ప్రాంతాలు ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోనే ఉండిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత బావుడా నుంచి కాకుమాను, పెదనందిపాడు మండలాలు, వేమూరు నియోజకవర్గాన్ని పూర్తిగా తప్పించి సీఆర్డీఏలో తిరిగి కలిపారు. బాపట్ల, రేపల్లె పట్టణాలతోపాటు ఏడు మండలాలకే బావుడా పరిమితమైంది. అద్దంకి నియోజకవర్గం

తీరంలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న కట్టడం

తిరిగి ప్రకాశం జిల్లాలో కలిసింది. బాపట్ల, చీరాల తీర ప్రాంతాలు పర్యాటకంగా వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. చీరాల, వేటపాలెం మండలాల్లోని తీరంలో పెద్దసంఖ్యలో రిసార్టులు నిర్మిస్తున్నారు. వీటిలో చాలావాటికి అనుమతులు ఉండటం లేదు. కొందరు అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా..

సీఆర్‌జెడ్ మినహా జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలు బావుడా పరిధిలో ఉంటే భారీ, బహుళ అంతస్తుల నిర్మాణంపై అధికారుల పర్యవేక్షణ ఉంటుంది. మౌలిక వసతుల అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు మంజూరు చేయించటానికి అవకాశం ఉంటుంది. అనుమతులు లేని కట్టడాలపై పర్యవేక్షణ పెంచి ఆరంభంలోనే అడ్డుకుంటారు. అక్రమ నిర్మాణాలను నిరోధించవచ్చని నిర్మాణ రంగ నిపుణులు అంటున్నారు. చీరాల, పర్చూరు ప్రాంతాలను బావుడా పరిధిలోకి తీసుకురావాలని అధికారులు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. బావుడాను విస్తరించి అభివృద్ధి పనులు చేపట్టడానికి నిధులు, అనుమతులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు సంస్థ ఛైర్మన్ సలగల రాజశేఖరబాబు తెలిపారు. త్వరలో సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

కొన్నేళ్లకు మాయం.. ఎన్నేళ్లకు నిర్మాణం!

న్యూస్‌టుడే, పెదపులివర్రు (భట్టిప్రోలు), కొల్లూరు

పోతార్లంకలో కోతకు గురైన పంట భూమి

నదీ గర్భంలో కలిసిపోతున్న పంట భూములు

కృష్ణానదికి వరదలొస్తే రైతులకు పంట నష్టంతోపాటు కొన్నిచోట్ల భూమి కోతకు గురవుతోంది. విలువైన భూములు నదీ గర్భంలో కలిసిపోతున్నాయి. దీంతో నదీ సమీపంలో పొలాలు ఉన్న రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా కొల్లూరు మండలంలో పోతార్లంక, పెసర్లంక, తిప్పలకట్ల, భట్టిప్రోలు మండలంలో ఓలేరు, పెసర్లంక గ్రామాలకు చెందిన పంట పొలాలు కాలక్రమేణా నదిలో కలుస్తున్నాయి. అయిదు లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తే పొలాలు కోతకు గురవుతున్నాయి. వందల ఎకరాల్లోనే రైతులు భూములు కోల్పోయారు. నీటి ప్రవాహం తగ్గినప్పుడు సమీప పొలాల్లో ఇసుక మేటలు వేస్తోంది. 1992లో నదీ ప్రాంతంలో పొలాలు ఉన్నచోట గోడ నిర్మించాలని ప్రతిపాదనలు తయారు చేశారు. ఇప్పటివరకు ఎలాంటి పనులు జరగలేదు. నది వెంబడి సారవంతమైన భూములు కావడంతో రైతులు అరటి, పసుపు, కంద, బొప్పాయి వంటి పంటలు సాగు చేస్తున్నారు.

నష్టపోతున్న రైతులు

నదీ ప్రవాహంతో పంట భూములు కోతకు గురవుతుండటంతో చిన్న, సన్నకారు రైతులు నష్టపోతున్నారు. గత ఏడాది వరద నీరు అధికంగా విడుదల చేయడంతో వందల ఎకరాల్లో ఇసుక మేట వేసింది. ఆ భూములను ఇప్పటికీ రైతులు సాగు చేయలేని దుస్థితి. ముఖ్యంగా భట్టిప్రోలు మండల పరిధిలో పెదపులివర్రు, అక్కివారిపాలెం, కోళ్లపాలెం గ్రామాలకు చెందిన రైతులు నష్టపోతున్నారు. వీరు తక్కువ విస్తీర్ణంలోనే పంటలు సాగు చేసి జీవనం సాగిస్తుంటారు. పొలాలు ఇసుక మేటలతో ఉండటంతో సాగులోకి తీసుకురావటానికి చాలా కష్టపడాల్సి వస్తోందని, భూసారం దెబ్బతింటుందని వాపోతున్నారు.

నిధులు కేటాయిస్తేనే..

నది వెంబడి పంట పొలాలు ఉన్న చోట గ్రోయిన్స్ నిర్మాణం చేస్తేనే రైతులకు మేలు కలుగుతుంది. గతంలో కోతకు గురైన పంట పొలాలను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి వెళ్లడం తప్ప ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. రూ.లక్షలు ఖరీదు చేసే భూములు కోతకు గురవుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం కొంత నిధులు కేటాయిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఈవిషయమై నది పరిరక్షణ శాఖ జేఈ విజయ్‌రాజ్ మాట్లాడుతూ నది అంచు వెంబడి గ్రోయిన్స్ నిర్మాణానికి అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపామని తెలిపారు. నిధులు మంజూరైతే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

ఎయిమ్స్‌లో జీనోమిక్ సీక్వెన్సింగ్ ప్రయోగశాల

ఈనాడు – అమరావతి

ప్రత్యేక యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ డేటా తయారీపై కసరత్తు

మంగళగిరి ఎయిమ్స్‌లో జీనోమిక్ సీక్వెన్సింగ్ ప్రయోగశాల ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ప్రత్యేక యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ డేటా తయారీ దిశగా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. మన్ కీ బాత్‌లో ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఎయిమ్స్ వర్గాలు ఈ మేరకు కసరత్తు మొదలుపెట్టాయి. యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) 21వ శతాబ్దంలో ఎదురవుతున్న అత్యంత తీవ్రమైన ప్రజారోగ్య సవాళ్లలో ఒకటి. కాలక్రమేణా కొన్ని సూక్ష్మజీవులు సహజంగానే మార్పులకు లోనై, వాటిని నశింపజేయడానికి రూపొందించిన మందులకు లొంగకుండా మొండిగా మారతాయి. అప్పుడు మందులు పనిచేయవు. ఈ పరిస్థితి వైద్య సేవలను సంక్లిష్టం చేయడమే కాకుండా.. అత్యంత తీవ్రస్థితిలో ఉన్న రోగుల్లో ప్రతికూల ఫలితాల ప్రమాదాన్ని పెంచుతోంది.

డబ్ల్యూహెచ్‌వో హెచ్చరిక.. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) సైతం ఏఎంఆర్‌ను ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న తొలి పది ప్రజారోగ్య ముప్పుల్లో ఒకటిగా గుర్తించింది. 2021 గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ అధ్యయనం ప్రకారం, బ్యాక్టీరియల్ ఏఎంఆర్ ప్రపంచవ్యాప్తంగా సుమారు 47.1 లక్షల మరణాలకు కారణం కాగా, అందులో 11.4 లక్షల మరణాలు నేరుగా రెసిస్టెంట్ ఇన్ఫెక్షన్ల వల్ల సంభవించాయన్నది సారాంశం.

ప్రధాని పిలుపుతో అడుగులు

ప్రపంచానికి ఏఎంఆర్ ఎలా ముప్పుగా పరిణమిస్తోందో 'మన్ కీ బాత్'లో ఇటీవల నరేంద్రమోదీ వివరించారు. వైద్య అధ్యయన సంస్థలు ఈ పరిస్థితిలో మార్పు దిశగా తమవంతు కృషి చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ఆ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ జాతీయ కార్యాచరణ ప్రణాళిక ఏఎంఆర్ 2.0లో భాగంగా మంగళగిరి ఎయిమ్స్ వర్గాలు కొన్ని కీలక అడుగులు వేస్తున్నాయి. క్లినికల్ మైక్రోబయాలజీ విభాగం నేతృత్వంలో బలమైన యాంటీమైక్రోబియల్ స్టీవార్డ్‌షిప్ కార్యక్రమాలు, 247 ఆధునిక నిర్ధారణ సేవలు, నిరంతర శిక్షణ కార్యక్రమాలు, ఇన్ఫెక్షన్ నియంత్రణ చర్యలు, ప్రిస్క్రిప్షన్ ఆడిట్లు, కచ్చితత్వ ఆధారిత యాంటీబయోటిక్ రిపోర్టింగ్ తదితర అంశాల ద్వారా ఏఎంఆర్‌పై దృష్టి పెట్టారు. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా ఏఎంఆర్ డేటాబేస్‌ను నిర్మించేందుకు జీనోమిక్ సీక్వెన్సింగ్ ప్రయోగశాల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. తద్వారా దేశానికీ ఏఎంఆర్ డేటా రూపొందించడానికి మార్గం సుగమం చేయనున్నట్లు చెబుతున్నారు. ఇప్పటివరకు భారతదేశం పాశ్చాత్య దేశాల సమాచారం (ఏఎంఆర్ డేటా) పైనే ఆధారపడి అధ్యయనం చేస్తుండగా.. యాంటీ మైక్రోబియల్స్‌కు సంబంధించిన ఎపిడెమియాలజికల్ కట్ ఆఫ్ విలువలు (ఈసీఓఎఫ్ఎఫ్ఎస్) దేశీయంగా అభివృద్ధి చేయడానికి ఇది దోహదపడనుంది.

జాతీయ రహదారిలో రక్షణ కరవు

ఈపూరుపాలెం, తోటవారిపాలెం (చీరాల గ్రామీణం): జాతీయ రహదారిలో కాలువలు, చెరువులకు ఇరువైపులా ప్రమాదాలు జరగకుండా రెయిలింగ్ ఏర్పాటు చేస్తారు. భూమిలో ఇనుప గడ్డర్లు పాతి.. అడ్డంగా ఇనుప రెయిలింగ్ నిర్మిస్తారు. ప్రయాణికుల రక్షణ కోసం నిర్మించిన వీటికి రక్షణ లేకుండా పోయింది. ఇనుప బోల్టులు ఊడతీసి, గుర్తుతెలియని వ్యక్తులు రెయిలింగ్ అపహరించారు. చీరాల మండలం ఈపూరుపాలెం-తోటవారిపాలెం మధ్య కుందేరు వద్ద ఇటీవల ఈసంఘటన చోటుచేసుకుంది. దాదాపు పది మీటర్ల మేర రెయిలింగ్‌ను తీసుకెళ్లడంతో వాహన చోదకులకు రక్షణ కొరవడింది. అయినా ఎన్‌హెచ్ అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో వీరి వాహనాలు నిరంతరం పహరా కాసేవి. అందుకు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించారు. ఈమధ్య వీరి జాడ కనిపించడం లేదు. అధికారులు ఇకనైనా ఎన్‌హెచ్‌పై పర్యవేక్షణ పెంచాలని పలువురు కోరుతున్నారు.

పనితీరు మార్చుకోకపోతే సహించం: కలెక్టర్

అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న వినోద్‌కుమార్

యద్దనపూడి, న్యూస్‌టుడే: అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి, ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలందించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం యద్దనపూడి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెబ్‌ల్యాండ్‌లో నమోదైన వినతులు, పరిష్కార దస్త్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందిపై అసహనం వ్యక్తం చేసి, పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్జీదారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. సిబ్బంది, అధికారులు పనితీరు మార్చుకోకపోతే సహించేది లేదన్నారు. ఈ సందర్భంగా శిథిలావస్థకు చేరిన రెవెన్యూ భవనం గదులను పరిశీలించి, దస్త్రాలకు రక్షణ లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. తహసీల్దార్ రవికుమార్, డీటీ విష్ణు, వీఆర్వోలు ఉన్నారు.

ఏఎల్ఎస్ వాహనం, (అంతర చిత్రంలో) వెంటిలేటర్

108 అంబులెన్స్‌లో వెంటిలేటర్ వసతి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేదలకు 108 సేవలు మరింత దగ్గరయ్యేలా చర్యలు చేపట్టింది. కాల్ వచ్చిన 20 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరేలా ప్రణాళికలు రూపొందించింది. జిల్లా వ్యాప్తంగా 26 వరకు ఇటువంటి వాహనాలున్నాయి. ఇటీవల కొత్తగా అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు (ఏఎల్ఎస్) వాహనాలు తీసుకొచ్చారు. అన్నింట్లో ఆక్సిజన్ సౌకర్యం ఉంటుంది. వీటిల్లో మాత్రం ఆక్సిజన్‌తో పాటు వెంటిలేటర్, ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫిబ్రిలేటర్ (ఏఈడీ) పరికరాలు ఏర్పాటు చేశారు. అకస్మాత్తుగా గుండె ఆగిపోయినప్పుడు విద్యుత్తు షాక్ ఇవ్వడం ద్వారా గుండె లయను పునరుద్ధరించి, ప్రాణాలు కాపాడే పరికరం ఏఈడీ. ప్రస్తుతం ఇటువంటి వాహనాలు చీరాలతో పాటు జిల్లా కేంద్రమైన బాపట్ల పరిసర ప్రాంతాల్లో ఉంచారు. వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న వ్యక్తిని ఒకచోట నుంచి మరొక ప్రాంతానికి తీసుకెళ్లడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. – ఎంజీసీ కాలనీ (చీరాల అర్బన్), న్యూస్‌టుడే

పది విద్యార్థులూ.. మీరే స్టార్లు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణతకు కూటమి ప్రభుత్వం ప్రణాళికాయుత చర్యలు తీసుకుంటోంది. ఉన్నత చదువులతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు తొలిమెట్టుగా ఉండే పది పరీక్షల్లో ఉత్తీర్ణతతో కలిగే ప్రయోజనాలపై అవగాహన పెంపొందించి వారు మంచి మార్కులతో పాస్ అయ్యేలా చూస్తోంది. మొన్నటివరకు విద్యార్థులకు మార్కులకు అనుగుణంగా ఏ, బీ, సీ, డీ గ్రేడ్లు ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ విధానంలో మార్పు చేసి వాటికి బదులు స్టార్లుగా విద్యార్థుల్ని విభజించారు. ప్రత్యేక తరగతులతో రైజింగ్ స్టార్లను షైనింగ్ స్టార్లుగా తీర్చిదిద్దుతున్నారు.

ప్రత్యేక తరగతులతో మంచి ఫలితాలు

- వంద రోజుల ప్రణాళికలో భాగంగా రోజూ సాయంత్రం వేళ ఒక పాఠ్యాంశంలో 20 మార్కులకు పరీక్ష నిర్వహిస్తున్నారు. అన్ని పాఠ్యాంశాల్లో వచ్చిన మార్పులతోపాటు ఇప్పటివరకు జరిగిన పరీక్షల్లో వచ్చిన మార్కులకు అనుగుణంగా విద్యార్థులను షైనింగ్, రైజింగ్ స్టార్లుగా విభజించారు.
- ఏ, బీ గ్రేడ్ విద్యార్థులను షైనింగ్ స్టార్స్‌గా, సీ, డీ గ్రేడ్‌లలో ఉన్నవారిని రైజింగ్ స్టార్స్‌గా మార్పు చేశారు.
- రైజింగ్ స్టార్స్‌ను షైనింగ్ స్టార్స్‌గా తీర్చిదిద్దేలా ప్రణాళికాయుత బోధన చేస్తున్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను గుర్తిస్తూ సులువుగా అర్థమయ్యేలా బోధన చేస్తున్నారు. పదిలో నూరు శాతం ఉత్తీర్ణతకు చేస్తున్న కృషి మంచి ఫలితాలను ఇస్తున్నట్లు డీఈవో రామారావు చెప్పారు.

ఇదో పొలిమేర రోడ్డు కథ!

చీరాల, న్యూస్‌టుడే : ఏ ప్రాంతంలోనైన పొలిమేర రోడ్డు అంటే ఊరికి చివరన ఉంటుంది. ఊళ్లోకి వచ్చే, వెళ్లే చివరి రహదారిని పొలిమేర రోడ్డు అని పిలుస్తారు. కానీ చీరాలలో మాత్రం అందుకు భిన్నం. పట్టణానికి మధ్యలో రైల్వేస్టేషన్ నుంచి గడియారస్తంభం కూడలికి వెళ్లే ముఖ్య రహదారిని పొలిమేర రోడ్డు అంటారు. నేటితరానికి రహదారి పేరు తెలుసు కానీ దాని చరిత్ర తెలియదు. అదేంటో తెలుసుకుందాం.. వందేళ్ల క్రితం చీరాల, పేరాల రెండు పంచాయతీలుగా ఉండేవి. నల్లగాంధీ బొమ్మ కేంద్రంగా చుట్టూ ఉన్న ప్రాంతం చీరాలని, పేరాల కూడలి చుట్టూ ఉన్న ప్రాంతం పేరాలగా ఉండేది. రెండింటికి వేర్వేరుగా పాలనా వ్యవస్థలు ఉండేవి. ఈ రెండు ఊర్లకు మధ్యలోనిదే ఈ రహదారి. ఇది చీరాల, పేరాలను వేరుచేస్తోంది. దీంతో ఈ మార్గాన్ని పొలిమేర రోడ్డు అని పిలిచేవారు. 1920లో బ్రిటీష్ పాలకులు రెండు పంచాయతీలను కలిపి పురపాలక సంఘం చేశారు. దీన్ని నిరసిస్తూ రెండు గ్రామాల ప్రజలు ఆందోళన చేశారు. దీంతో మున్సిపాలిటీని రద్దు చేయడంతో తిరిగి రెండు పంచాయతీలుగా ఉన్నాయి. కాలక్రమేణా జనాభా పెరగడంతో రెండు ఊర్లు కలిసిపోయాయి. 1948లో తిరిగి పురపాలక సంఘం ఏర్పడింది. దీంతో మొత్తం ఒక్క పట్టణమైంది. పొలిమేర రోడ్డు కాస్తా పట్టణం మధ్యలో రహదారిగా మారింది.

ప్రతి ఇంటికి మహోత్సవాల దీవెనలు

పెదకాకాని, న్యూస్‌టుడే: బైబిల్ మిషన్ మహోత్సవాల దీవెనలు ప్రతి ఇంటికి చేరాలని మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యూల్ కిరణ్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహిస్తున్న 88వ బైబిల్ మిషన్ మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి.

ఆశీర్వాదం అందిస్తున్న రెవరెండ్ శామ్యూల్ కిరణ్, పాల్గొన్న విశ్వాసులు

తొలుత విజయవాడ బైబిల్ మిషన్ సంగీత బృందం ప్రత్యేక భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం ఆయన వాక్యోపదేశం చేస్తూ.. దేవుని కృపతో గృహాల్లో భద్రత, శాంతి కలుగుతుందని, కుటుంబాలు ఐక్యతతో సమృద్ధిగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. మహోత్సవాల నిర్వహణకు ఆటంకాలు వచ్చినప్పటికీ దేవుడు మార్గం సరళం చేశారన్నారు. ప్రత్యక్షం, పరోక్షంగా సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 24 నుంచి 26 వరకు బైబిల్ మిషన్ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రెవరెండ్లు ఇమ్మాన్యుయేల్ దేవదాస్, లూథర్‌బాబు, ఆగమనరావు, రవి దైవ సందేశాలు అందించారు. గవర్నింగ్ బాడీ సభ్యులు పాల్గొన్నారు.

నిజాయతీకి నిలువెత్తు రూపం భగవంతరావు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రాజకీయాల్లో నిజాయితీగా పనిచేసిన మాజీ మంత్రి అనగాని భగవంతరావు ఎందరికో ఆదర్శంగా నిలిచారని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. రేపల్లె అనగాని భగవంతరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఆయన శతజయంతి ఉత్సవాలు నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో పేదలు, రైతుల అభివృద్ధికి ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చేందుకు కృషి చేశారన్నారు. ఆయన చూపిన మార్గంలో తానూ నడుస్తూ ప్రజాసేవకు అంకితమై నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానని తెలిపారు. విద్యార్థులు మహనీయుల జీవిత చరిత్ర చదివి మంచిని గ్రహించాలని సూచించారు. భగవంతరావు జీవిత చరిత్రను పుస్తకరూపంలో ఆవిష్కరించడం అభినందనీయమన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఆర్థికశాఖను సమర్థంగా నిర్వహించిన నేత భగవంతరావు అన్నారు. ఆదాయానికి మించి ఖర్చు చేయరాదని చెప్పి అప్పట్లో రాష్ట్రం అప్పుల్లో చిక్కుకోకుండా కీలకంగా వ్యవహరించారని తెలిపారు. సామాన్యుడు అసామాన్యుడిలా ఎదిగి రాజకీయాల్లో మర్చిపోలేని గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. భగవంతరావు చేసిన సేవలను గుర్తు చేస్తూ పలువురు మాట్లాడారు. తొలుత ప్రజల మనిషి అనగాని భగవంతరావు పుస్తకాన్ని నాయకులు ఆవిష్కరించారు. అతిథులను సత్కరించారు. కుటుంబ సభ్యులు మదన్‌మోహనరావు, సీతాదేవి, జయశ్రీ, పుస్తక రచయిత పేరం జయశీలరావు, వల్లీశ్వర్, జయప్రకాష్, విజయకుమార్, ప్రిన్సిపల్ రవిచంద్రకుమార్ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ చేస్తున్న మంత్రి సత్యప్రసాద్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు

స్వయం ఉపాధి కోర్సుల్లో మహిళలకు ఉచిత శిక్షణ

గుంటూరు: స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణకు జిల్లాలోని నిరుద్యోగ మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా మహిళా ప్రగతి ప్రాంగణం మేనేజర్ రమణశ్రీ తెలిపారు. ఫ్యాబ్రిక్ పెయింటింగ్, చిరుధాన్యాల స్నాక్స్ తయారీ, మార్కెటింగ్ కోర్సుల్లో శిక్షణకు పదో తరగతి విద్యార్హత కలిగిన వారు అర్హులన్నారు. అభ్యర్థినుల వయసు 18 నుంచి 40 ఏళ్లలోపు ఉండాలన్నారు. వివరాలకు గుంటూరులోని జిల్లా పరిషత్తు కార్యాలయం ఎదుట ఉన్న మహిళా ప్రగతి ప్రాంగణంలోగానీ, 83339 21371 నంబరులోగానీ సంప్రదించాలన్నారు.

తరతరాల సంప్రదాయం.. వీరంగం

శిక్షణ పొందుతున్న కావూరు గ్రామస్థులు

కావూరు (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: చిలకలూరిపేట ప్రాంతంలోని పలు గ్రామాల్లో శివరాత్రి సందర్భంగా సందడి నెలకొంటుంది. పండగకు నెల రోజుల ముందు నుంచే ప్రభలు నిర్మించే గ్రామాల్లో కొంతమంది ప్రత్యేక నియమాలు పాటిస్తూ భక్తిశ్రద్ధలతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ప్రధానంగా కావూరు గ్రామం నుంచి కొండకు ప్రభ తరలించే ముందు ఏటా వీరంగం ఆడటం ఆనవాయితీ. గ్రామంలోని యువకుల నుంచి పెద్దల వరకు పది నుంచి 15 మంది బృందంగా ఏర్పడి ఒక్క పొద్దు (ఒక్కపూట భోజనం అదీ శాకాహారం) ఆచరిస్తూ వీరంగం సాధన చేస్తారు. నెల రోజుల పాటు ఆధ్యాత్మిక చింతనలో గడుపుతారు. వీరికి గ్రామంలోని జంగందేవర శరభ.. శరభ అంటూ వీరంగం వేసే శిక్షణ ఇస్తారు. శిక్షణ తీసుకున్న వారంతా శివరాత్రి ముందురోజు ప్రభ గ్రామం నుంచి కొండకు బయల్దేరగానే కుంభం పోసిన తరువాత శరభ.. శరభ అంటూ ప్రభ ముందు వీరంగం ఆడుతూ భక్తిని చాటుకుంటారు.

ఏఎన్‌యూలో ఆచార్యుడైనా..



కావూరు గ్రామానికి చెందిన **కందుల ధనుంజయ్** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా పనిచేస్తున్నారు. ఈయన ప్రభ పండగను తన ఊరి కార్యక్రమంగా భావిస్తారు. శివరాత్రికి నెల రోజుల ముందు నుంచే నియమనిష్ఠలు ఆచరిస్తూ వీరంగం శిక్షణ పొందుతున్నారు. అందరితో కలిసిపోయి ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. పూర్వీకుల ఆచారాలను గౌరవించడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన చెబుతున్నారు.

పొలం పనులు చూసుకుంటూ..

గ్రామానికి చెందిన **మద్దాలి శివకోటి** తన పొలం పనులు చూసుకుంటూనే భక్తిశ్రద్ధలతో ప్రభ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. గ్రామంలో యువకులతో కలిసి వీరంగం శిక్షణ పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం కోటయ్యస్వామి కల్పించిన అవకాశంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పెద్దకర్మ
(తేదీ: 29-1-2026)



ప్రముఖ వైద్యులు, సేవాభావానికి మారుపేరైన డాక్టర్ కొమ్మినేని లక్ష్మయ్య నాయుడు గారు తేదీ: 15-1-2026 నాడు స్వర్గస్థులయ్యారు. వైద్య వృత్తిలో నిష్ఠ, నైతికత, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచి, పేద-ధనిక భేదం లేకుండా అందరికీ సేవలందించిన వారి జీవితం అనేక మందికి ఆదర్శప్రాయం.
జననం: 12-06-1938
మరణం: 15-1-2026
డా॥ డాక్టర్ కొమ్మినేని లక్ష్మయ్య నాయుడు గారు
(Dr. KL నాయుడు)
HIG, BHEL, R.C.Puram
వారి వియోగం కుటుంబానికి మాత్రమే కాకుండా, సమాజానికి కూడా తీరని లోటు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా భగవంతుణ్ణి ప్రార్థిస్తూ... అశ్రునయనాలతో...
భార్య: కొమ్మినేని లక్ష్మీ సుశీల
కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు
కార్యక్రమం: తేదీ: 29-1-2026 గురువారం, శ్రీ కన్వెన్షన్ సెంటర్, Opp: D Mart, ముంబయి హైవే, రామచంద్రాపురం, BHEL, HYD. ✆ 9848484800

(c) eenadu

మనోవికాసానికి పోటీలు దోహదం

ప్రాంతీయ స్థాయి 'ఈనాడు- ప్రతిభ' పాటవ పోటీలు

విజేతలుగా నిలిచి బహుమతులు అందుకున్న విద్యార్థులు

హాజరైన బాలబాలికలు

బాపట్ల, న్యూస్‌టుడే బృందం: ఈనాడు ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలుగులోకి తెచ్చి వారిలో మనోవికాసానికి దోహదం చేస్తాయని ఆర్డీవో గ్లోరియా అన్నారు. పట్టణంలోని రైస్‌మిల్లర్ల సంఘం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన 'ఈనాడు' ప్రతిభా పాటవ ప్రాంతీయ స్థాయి పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, ఉపన్యాస పోటీల్లో విజేతలుగా నిలిచేందుకు తమ ప్రతిభ ప్రదర్శించారు. బహుమతి ప్రదానోత్సవ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్డీవో మాట్లాడుతూ విద్యతో పాటు సాంస్కృతిక, కళా పోటీల్లో పాల్గొనడం వల్ల పోటీతత్వం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. తహసీల్దారు సలీమా మాట్లాడుతూ సాధన, కష్టపడి కృషి చేయటం ద్వారా విజయాలు దక్కుతాయన్నారు. కమిషనర్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ పోటీల్లో గెలవలేదని విద్యార్థులు నిరుత్సాహం చెందరాదన్నారు. నైపుణ్యాలు పెంచుకుని గెలవటానికి ప్రయత్నించాలన్నారు. పట్టణ సీఐ రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులు టీవీలు చూస్తూ, సెల్‌ఫోన్లో సామాజిక మాధ్యమాల్లో, వీడియో గేమ్‌లు ఆడుతూ సమయాన్ని వృథా చేయరాదన్నారు. వ్యాసరచనలో విద్యార్థులు జి.వెంకట సింధు వివేక ఫాస్టర్ పాఠశాల విద్యార్థిని విజేతగా నిలిచింది. ఎస్‌కే ఫర్హానా సుమయ కర్లపాలెం హైవెండ్ పాఠశాల విద్యార్థిని ద్వితీయ, ఎస్‌కే షీమా కౌసర్ లిటిల్ ఏంజెల్స్ ఉన్నత పాఠశాల విద్యార్థిని తృతీయ స్థానం సాధించింది. చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు ఎ.అశ్లేష(వివేక ఫాస్టర్) ప్రథమ, కె.వరలక్ష్మి(హైవెండ్ కర్లపాలెం) ద్వితీయ, పి.మీరా జాస్మిన్(లిటిల్ ఏంజెల్స్) తృతీయ స్థానంలో నిలిచారు. ఉపన్యాస పోటీల్లో సీహెచ్ భార్గవ సాయినాథ్ (లిటిల్ ఏంజెల్స్) ప్రథమ, కె.భార్గవి(శ్రీ భార్గవి ఉన్నత పాఠశాల), ద్వితీయ, ఎస్‌కే ఆయేషా(లిటిల్ ఫ్లవర్) తృతీయ స్థానం సాధించారు. క్విజ్ పోటీల్లో బి.ప్రణీత్(శ్రీచైతన్య ఉన్నత పాఠశాల) ప్రథమ, ఎస్‌కే సర్ఫహజ్ పాషా(బాపట్ల పబ్లిక్ స్కూల్) ద్వితీయ, ఎస్‌కే అనాస్(హైవెండ్ పాఠశాల) తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు ఆర్డీవో, తహసీల్దారు, పురపాలక కమిషనర్, పట్టణ సీఐ బహుమతులు ప్రదానం చేశారు. రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ నారాయణభట్టు, ప్రముఖ యోగా గురువు అల్లాడి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండోలో ప్రతిభ

పతకాలు గెలిచిన చిన్నారులు రంజయు లోచన్, నిక్షిప్త విజయ్‌తో ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల, న్యూస్‌టుడే: రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ఏఆర్ కానిస్టేబుల్ మల్లెల విజయ్‌బాబు కుమార్తె రంజయు లోచన్, కుమారుడు నిక్షిప్త విజయ్ ప్రతిభ చూపి రజత, కాంస్య పతకాలు గెలిచారు. తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పసిడి పతకాలు సాధించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులను ఎస్పీ ఉమామహేశ్వర్ అభినందించారు. ఆయన మాట్లాడుతూ చిన్న వయసుల్లోనే జాతీయ స్థాయి పోటీల్లో చిన్నారులు పతకాలు గెలవటం అభినందనీయమన్నారు. చిన్నారుల తండ్రి, కానిస్టేబుల్ మల్లెల విజయ్‌బాబు, కోచ్ సురేష్ పాల్గొన్నారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
A.P. Greening and Beautification Corporation Municipal Administration & Urban Development Department.
Andhra Pradesh Greening & Beautification corporation invites for the 2 works through E- Procurement platform costing form 21 Lakhs to 38.75 Lakhs for further details please see E-Procurement web site
Managing Director
APG&BC

శ్రీ సత్తెమ్మతల్లి దేవస్థానము
మాదిపాడు (గ్రా), అచ్చంపేట (మం), పల్నాడు జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
మాదిపాడు (గ్రా), అచ్చంపేట (మం), పల్నాడు జిల్లా శ్రీ సత్తెమ్మతల్లి దేవస్థానము పునఃనిర్మాణము కొరకు టెండర్లు ప్రకటన చేయడమైనది. మిగిలిన వివరముల కొరకు https://tender.apeprocurement.gov.in లో చూడవచ్చు.
సం॥ప్ర – కార్యనిర్వహణాధికారి
శ్రీ సత్తెమ్మతల్లి దేవస్థానము
మాదిపాడు (గ్రా), అచ్చంపేట (మం), పల్నాడు జిల్లా

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్‌ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – తాడికొండ

బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్‌ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రాంతీయ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

Aster Ramesh HOSPITALS We'll Treat You Well
EENADU SPORTS LEAGUE 2025
Title Sponsor
ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner
NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Hospitality Partner
CiTY Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Gift Partner
KL (DEEMED TO BE UNIVERSITY)
Man of the Series
Hero
Digital Partner ఈనాడు.నెట్
TV Partner ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్
ఈ FM Mee FM
Organised by ఈనాడు

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - I జూనియర్స్ : మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్స్‌లతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులకే ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్ జట్టు

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - I జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సులతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

విజేత రాయలసీమ రాకర్స్ జట్టు

గ్రౌండ్-2లో సీనియర్స్ : సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ చరణ్‌జిత్ ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-I (జూనియర్స్)
మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)
మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

ప్రజల్లో నూరుశాతం సానుకూలత సాధించాలి

బాపట్ల, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల సేవలపై ప్రజా సానుకూలత వంద శాతం సాధించేందుకు ఎంపీడీవోలు, కార్యదర్శులు, ఏపీఎంలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛ భారత్ మిషన్ పనులు, పింఛన్ల పంపిణీపై ప్రజా సానుకూలతలో యద్దనపూడి మండలం ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. మిగిలిన మండలాల అధికారులు ఆ మండలాన్ని ఆదర్శంగా తీసుకుని పని చేయాలన్నారు. ఎంపీడీవోను అభినందించారు. వేటపాలెం, రేపల్లె, చెరుకుపల్లి మండలాలు చివరి రెండు స్థానాల్లో ఉండటంపై అధికారులను ఆరా తీశారు. పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆదేశించారు. డీపీవో ప్రభాకరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు, డీఆర్డీఏ పీడీ సింగయ్య, డీటీవో అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

రెవెన్యూ సేవలపై సీసీఎల్‌ఏ వీసీ

బాపట్ల, న్యూస్‌టుడే: రెవెన్యూ సంబంధిత సేవలపై మంగళగిరి నుంచి సీసీఎల్ఏ జయలక్ష్మి నిర్వహించిన వీసీలో క్యాంపు కార్యాలయం, కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వినోద్‌కుమార్, భావన పాల్గొన్నారు. పీజీఆర్ఎస్ అర్జీలు, మ్యుటేషన్, రీసర్వే, పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ, కుల ధ్రువీకరణ పత్రాల జారీ తదితర అంశాలపై ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, సీజీఎల్ఏ జయలక్ష్మి సమీక్ష నిర్వహించారు. జిల్లాలో రెవెన్యూ సేవల మెరుగుదల, అర్జీలు, దస్త్రాలు వేగంగా పరిష్కరిస్తూ చేపట్టిన చర్యలను కలెక్టర్, జేసీ వివరించారు. సర్వే, భూ రికార్డుల ఏడీ ఆల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామాలయ వార్షికోత్సవం

మంత్రి మనోహర్‌కు వేంకటేశ్వరస్వామి ప్రతిమ అందజేస్తున్న జనసేన నాయకులు

ఆలపాడు(చుండూరు), న్యూస్‌టుడే: చుండూరు మండలం ఆలపాడులోని రామాలయం వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సీతారాముల కల్యాణాన్ని మంగళవారం నిర్వహించారు. కల్యాణాన్ని చూడడానికి స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వారు ఆలయానికి వచ్చి స్వామి వారికి విశేషపూజలు చేశారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్ని వేదపండితుల ఆశీర్వాదం తీసుకున్నారు. స్థానికులు, జనసేన నాయకులు శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రతిమ అందజేసి ఆయన్ను సత్కరించారు. జనసేన నాయకులు తోటకూర రమణరావు, శివయ్య, అమ్మిశెట్టి వాసు, ఎ.శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎస్సైలకు పోస్టింగ్

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లా వీఆర్‌లో ఉన్న ఇద్దరు ఎస్సైలకు పోస్టింగ్ ఇస్తూ ఎస్పీ ఉమామహేశ్వర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సై టి.శ్రీనివాసరావుకు అడవులదీవి పీఎస్, ఎస్సై పి.వెంకటేశ్వరరెడ్డికి చీరాల వన్ టౌన్ పీఎస్‌లో పోస్టింగ్ ఇచ్చారు. అడవులదీవి పీఎస్ ఎస్సైగా పని చేస్తున్న బి.బాబురావును పీసీఆర్ బాపట్లకు బదిలీ చేశారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్నమీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును.(స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph : 8142292071.

TO LET

COMMERCIAL

గుంటూరు అరండల్‌పేట 11/2 లో 1200 Sft, లాలాపేట జిన్నాటవర్ సెంటర్‌లో 1800 Sft గల కమర్షియల్ బిల్డింగ్స్ ఆఫీసులకు, బ్యాంకులకు అద్దెకు ఇవ్వబడును. ✆ 99637 75262.

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

JOBS

Wanted Front Desk for Solar Systems, min 1 year exp, Office: SVN Colony, Guntur. 91777 21607.

Kesava Techno hub hearing Marketing Executive Qul: Degree, 1 to 2 Years Sales & Marketing Exp, Sal: 13k - 18k, GNT. 8712126699.

TATA కంపెనీలో లైఫ్ & హెల్త్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ మరియు టీమ్ లీడర్లు కావలెను. మీ శ్రమకు తగిన ఆదాయం + ఫారిన్ ట్రిప్స్ కలవు. ✆ 98480 83351.

శ్రీరామ్ చిట్స్ గుంటూరు జిల్లాలోని అన్ని మండల ఏరియాలలో పనిచేయుటకు ఇన్‌ఛార్జ్ కావలెను. 91000 42655.

రైస్ మిల్ & ప్లాంట్ ఆపరేటర్స్ కావలెను. అనుభవజ్ఞులైన వెల్డింగ్, రిపేర్ తెలిసిన ఆపరేటర్స్ కావలెను. Contact No: ✆ 80962 46099.

ప్రముఖ ఫైనాన్షియల్ సర్వీసెస్ గుంటూరు నందు పనిచేయుటకు పదవతరగతి విద్యార్హతతో వివాహిత స్త్రీలకి ఆఫీసు అసిస్టెంట్ జాబు చేయుటకు పోస్టులు కలవు. ✆ 90309 93895, 86396 89939.

తెనాలిలో ప్రముఖ సంస్థకు MS Officeలో అనుభవం గల లేడీ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. ఫోన్: 86869 35606.

DDU - GKY ట్రైనింగ్ సెంటర్, ఫిరంగిపురం నందు టెలికాలర్స్, PRO's, వార్డెన్స్, కంప్యూటర్ ఫ్యాకల్టీ, ఇంగ్లీష్ ఫ్యాకల్టీ, బ్రాడ్ బ్యాండ్ టెక్నీషియన్ కావలెను. భోజన వసతి కలదు. 99512 79786, 70137 86905.

గుంటూరులో గల కాలేజి నందు పనిచేయుటకు 25 సంవత్సరాల పైబడిన ఇంటర్, డిగ్రీ చదివిన రెసిడెన్షియల్ లేడి వార్డెన్ కావలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 81224 61164.

DRIVERS

లగ్జరీ కార్లు నడిపించగల డ్రైవర్లకు గోల్డెన్ ఛాన్స్! ప్రముఖ సంస్థలో స్థిరమైన ఉద్యోగం, 40 లోపు వయస్సు, 5 సం॥ల అనుభవం, ఆకర్షణీయమైన జీతం, గుంటూరు పరిసర ప్రాంతాలవారికే ప్రాధాన్యత. ఫో: 7075476853.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి:
8008510541

గ్రావెల్ వాహనాల్ని అడ్డుకున్న గ్రామస్థులు

అనంతవరం(యద్దనపూడి), న్యూస్‌టుడే: అధికలోడుతో వాహనాలు వేగంగా రాకపోకలు సాగించడంతో తమ గృహాలు బీటలు వారుతున్నాయంటూ గ్రామస్థులు ఆందోళనకు దిగారు. యద్దనపూడి మండలం అనంతవరంలో మంగళవారం రాత్రి మార్టూరు నుంచి పసుమర్రు వైపు ఎర్రమట్టిని తరలిస్తున్న భారీ టిప్పర్లను స్థానికులు గ్రామ వీధుల్లో నిలిపివేశారు. ఇష్టానుసారంగా భారీ వాహనాలను ఈ మార్గంలో నడపడంతో చిన్నారులు, గ్రామస్థులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

తెల్లవారుజామున ఇంట్లోకి చొరబడి చోరీ

చీరాల అర్బన్: పట్టణ పరిధి ఎంజీసీ కాలనీలోని ఓ ఇంట్లోకి మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు చొరబడి బంగారు నగలు చోరీ చేశారు. పోలీసుల కథనం ప్రకారం... కాలనీలో బచ్చు వెంకట సుబ్బసత్య రామాంజనేయులతో పాటు ఇద్దరు సోదరిమణులు నివాసం ఉంటారు. వీరిలో ఒకరు నెల్లూరులో ఉద్యోగం చేస్తారు. ఉద్యోగ నిమిత్తం వెళ్లేందుకు ఆమె తెల్లవారుజామున లేచి తలుపులు తీసి లైట్లు వేశారు. ఈ సమయంలో సోదరుడు బయటకు వచ్చినప్పుడు ముగ్గురు వ్యక్తులు లోపలికి చొరబడి అతనిపై దాడిచేసి, మెడలో ఉన్న గొలుసును బలంగా లాగడంతో అది తెగి కింద పడిపోయింది. వెంటనే లోపలికి వెళ్లి ఒక సోదరి మెడలో ఉన్న రెండు బంగారు గొలుసులు, ఒక గాజు లాక్కొని వెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ సుబ్బారావు తెలిపారు. డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించి, చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా దొంగలను గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు.

నేలబావిలో పడి బాలుడి మృతి

సాయి మణికంఠారెడ్డి

బాపట్ల, న్యూస్‌టుడే: నేలబావిలో ప్రమాదవశాత్తూ పడి బాలుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని దరివాద కొత్తపాలెంలో చోటు చేసుకుంది. శంకర్‌రెడ్డి కుమారుడు పిట్టు సాయిమణికంఠారెడ్డి (8) పురపాలక ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం ఆడుకోవడానికి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి రాత్రయినా తిరిగి రాలేదు. తల్లిదండ్రులు కంగారు పడి కుమారుడు కోసం వెతికారు. పట్టణ పోలీసులకు తండ్రి ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం సమీపంలోని నేలబావి లోపల నీటిలో విద్యార్థి మృతదేహం పైకి తేలడంతో గుర్తించారు. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కొడుకు బావిలో పడి చనిపోవడంతో అమ్మానాన్నలు కన్నీరుమున్నీరుగా విలపించారు. తొలుత అతడి మృతిపై కుటుంబసభ్యులు సందేహం వ్యక్తం చేశారు. బావిలోకి ఎవరైనా తోసి ఉంటారని అనుమానించారు. పోలీసుల దర్యాప్తులో ప్రమాదవశాత్తూ ఘటన జరిగినట్లు తేలిందని పట్టణ సీఐ రాంబాబు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

91.9 FM Vijayawada
ఈ FM 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
80080 03297

ఎవరి కోసం బతకాలయ్యా..!

★ ఓ తల్లి ఆవేదన ★ నరసరావుపేటలో ఇంటర్ విద్యార్థి బలవన్మరణం

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: 'కుమారుడు చిన్న వయసులో ఉండగానే భర్త చనిపోయారు. అయినా ధైర్యం కూడగట్టుకుని ఎన్నో ఆశలతో ఉన్న ఎకరం పొలం సాగు చేసుకుంటూ వచ్చిన డబ్బులతో కుమారుడిని చదివించుకుంటున్నా. పెద్ద చదువులు చదువుతాడని ఎన్నో కలలు కన్నా. భగవంతుడు నా కలలను కల్లలు చేశాడు.. చేతికి అందొచ్చిన ఒక్కగానొక్క కుమారుడు ఉరేసుకుని మృతి చెందాడు. ఇక ఎవరి కోసం బతకాలి' అంటూ ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరుకు చెందిన హైమావతి రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. వివరాలిలా.. పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణ శివారు రావిపాడు రోడ్డులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న కూరాకుల బాలకోటిరెడ్డి (18) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కళాశాల వద్దకు వచ్చిన విద్యార్థి తల్లి మాట్లాడుతూ సోమవారం రాత్రి తన కుమారుడు ఫోన్ చేసి తినుబండారాలు పంపాలని కోరాడని.. మంగళవారం ఉదయం 9 గంటలకు బాలకోటిరెడ్డికి బాగాలేదని, వెంటనే రావాలని కళాశాల నుంచి ఫోన్ వచ్చిందని.. అంతలోనే మృతి చెందాడని చెప్పారని ఆవేదన వెలిబుచ్చారు. కళాశాలలో కొందరు విద్యార్థులతో గొడవ జరుగుతోందని ఇటీవల ఫోన్‌లో చెప్పాడని, తన కుమారుడి మృతికి అదే కారణమై ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. తాము రాక ముందే తమ కుమారుడిని ఆసుపత్రికి తరలించారని.. కళాశాల యాజమాన్యంపై అనుమానాలున్నాయన్నారు. సమాచారం అందుకున్న గ్రామీణ పోలీసులు అక్కడికి చేరుకొని బాలకోటిరెడ్డి మృతికి కారణాలపై విచారించారు. విద్యార్థి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు. బాలకోటిరెడ్డికి నాలుగు నెలల కిందట హెర్నియా ఆపరేషన్ జరిగిందని, ఆ బాధ తట్టుకోలేక ఉరేసుకొని మృతి చెందాడని కళాశాల వర్గాలు చెబుతున్నాయి.

బాలకోటిరెడ్డి (పాత చిత్రం)

దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

బాపట్ల, న్యూస్‌టుడే: ఇంకొల్లు మండలం నాగండ్లలో ఈ నెల 17న బీసీలపై దాడులు చేసిన వారిపై హత్యాయత్నం సెక్షన్ల కేసులు నమోదు చేయాలని కోరుతూ బాధితులు, బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ సమీపంలో రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. మహిళ కయ్యాల శ్రావణి మాట్లాడుతూ సంక్రాంతి రోజు బీసీలు గ్రామంలో నిర్వహించ తలపెట్టిన చెన్నకేశవస్వామి గ్రామోత్సవాన్ని కొందరు కావాలని అడ్డుకోవటానికి ఆటంకాలు సృష్టించారన్నారు. 16న తమ కాలనీలో స్లో బైక్ పోటీలు జరుగుతుండగా కార్యక్రమాన్ని ఆపి దాడి చేయాలని చూశారన్నారు. 17న తమ ఇళ్లపైకి వచ్చి దాడులు చేసి కయ్యాల సింగయ్యను గాయపరిచారన్నారు. 15 మంది గాయపడ్డారని తెలిపారు. ఈ మేరకు ఎస్పీ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. నిందితులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హామీ ఇవ్వటంతో ధర్నా విరమించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 143, రిటైల్ ధర - 170, చికెన్ విత్‌స్కిన్ - 247, చికెన్ స్కిన్‌లెస్ - 281.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -143 రిటైల్ ధర 170 చికెన్ విత్ స్కిన్ - 247 చికెన్ స్కిన్‌లెస్ - 281.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 155, 164, 175 చికెన్ విత్ స్కిన్ - 300 చికెన్ స్కిన్‌లెస్ - 310.

నిబంధనల మేరకే.. విద్యుత్తు సరఫరా నిలిపివేత

మార్టూరు, న్యూస్‌టుడే: మండలంలోని లక్కవరంలో విద్యుత్తు సరఫరా నిలుపుదలపై సంస్థ ఉన్నతాధికారుల ఆదేశాలనే పాటించామని ఏఈ ఆంజనేయులు మంగళవారం తెలిపారు. లక్కవరానికి చెందిన టి.ఆత్మ తన ఇంటికి కరెంటు నిలుపుదల చేయడంపై అధికారులను తప్పుపట్టడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 200 యూనిట్లు ఉచితంగా వాడుకుంటున్నా రూ.30,626 బిల్లు చెల్లించాల్సి ఉందన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

2న బుద్ధునితో నా ప్రయాణం నాటక ప్రదర్శన

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బుద్దిస్ట్ సొసైటీ ప్రతినిధులు

రేపల్లె అర్బన్: రేపల్లె ఎంపీపీ హాల్లో ఫిబ్రవరి 2న సాయంత్రం 6.30 గంటలకు బుద్ధునితో నా ప్రయాణం- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలుగు నాటక ప్రదర్శన అందరూ తిలకించాలని న్యాయవాదులు, బుద్దిస్ట్ సొసైటీ ఆల్ ఇండియా బాపట్ల జిల్లా ప్రతినిధులు కోరారు. మంగళవారం రేపల్లె తాలూకా సెంటర్లో అంబేడ్కర్ విగ్రహం ఎదుట కరపత్రాలు ఆవిష్కరించారు. రచయిత బొర్రా గోవర్ధన్, ఎంపీపీ సహకారంతో హైదరాబాద్ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత నాటక ప్రదర్శన జరుగుతుందన్నారు.

విద్యుత్తు కార్మికుల దినోత్సవం

రేపల్లె అర్బన్: రేపల్లె ప్రైవేటు ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యుత్తు కార్మికుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ప్రైవేటు ఎలక్ట్రీషియన్ సంఘానికి ప్రభుత్వం సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలన్నారు. అర్హులకు రుణాలు ఇచ్చి ఆదుకోవాలని, నివేశన స్థలం మంజూరు చేయాలని కోరారు. ఓల్డ్ టౌన్ నుంచి ఇసుకపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు.

సకాలంలో టీకాలు వేయించండి

జి.ఎన్.పాలెం (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: మహిళలు, పిల్లలకు సకాలంలో టీకాలు వేయాలని చందోలు పీహెచ్‌సీ వైద్యురాలు చంద్రిక అన్నారు. ఖాజీపాలెం, జి.ఎన్.పాలెం ఆరోగ్య ఉపకేంద్రాల వద్ద బుధవారం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ఆమె మాట్లాడారు. ఏయే సమయంలో ఏయే టీకాలు వేయాలన్న విషయమై వివరించి తెలియజేశారు.

బడేవారిపాలెంలో తాగునీటి సమస్య

తుర్పుపాలెం (చెరుకుపల్లి (గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని తుర్పుపాలెం పంచాయతీ పరిధిలోని బడేవారిపాలెంలో తాగునీటి సమస్య ఉత్పన్నమైనా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో పంచాయతీ చేతి పంపు ఒక్కటీ లేకపోవడం, తాగునీటి పైప్‌లైన్ కూడా సరిలేకపోవడంతో రక్షిత మంచినీరు అందరికీ అందడం లేదు. ఇళ్లవద్ద కొళాయిలు కూడా ఒకటి, రెండు మినహా లేకపోవడం ఇబ్బందికి అద్దం పడుతోంది. స్థానికులు శుద్ధ నీటిని బయట నుంచి వాహనాల ద్వారా తెప్పించుకోవాల్సి వస్తోంది. దీంతో సామాన్యుడు సైతం తాగునీటి కొనుగోలు చేసి తాగడం భారంగా మారిందని సత్యనారాయణ అనే యువకుడు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్యను అధికారులకు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోవడం దారుణమన్నారు. అధికారులు తమ గ్రామంలో పర్యటించి సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

స్పందన: వీధిలైట్లకు మరమ్మతులు.. **భట్టిప్రోలు, న్యూస్‌టుడే:** భట్టిప్రోలు రథం బజారు వెనుక ప్రాంతంలో వీధిలైట్లు వెలగడం లేదని ఈ నెల 26న మేమున్నాం.. మీకు తోడుగా శీర్షిక ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు మంగళవారం ఆ ప్రాంతంలో మరమ్మతులకు గురైన లైట్లను బాగు చేశారు.

బాపట్లలో నినాదాలు చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

వారానికి ఐదు రోజులే పనిచేస్తామని డిమాండ్

బాపట్ల, బాపట్ల వెస్ట్, రేపల్లె, చెరుకుపల్లి, న్యూస్‌టుడే: బ్యాంకు ఉద్యోగులకు వారానికి ఐదు రోజుల పని దినాల విధానాన్ని అమలు చేయాలని బ్యాంకు ఉద్యోగుల సంఘం నేతలు బలగాని సుబ్బారావు, పువ్వాడ యలమంద డిమాండ్ చేశారు. బ్యాంకు ఉద్యోగులపై కేంద్ర ప్రభుత్వం పని భారం తగ్గించాలని కోరుతూ మంగళవారం సమ్మె చేశారు. సూర్యలంక రోడ్డు నుంచి ఎంజీ రోడ్డు వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. వారు మాట్లాడుతూ కేంద్రం తీసుకువస్తున్న నాలుగు లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తున్నామన్నారు. పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు వారానికి ఐదు రోజులు మాత్రమే పని చేస్తున్నాయని తెలిపారు. ఇదే విధానాన్ని బ్యాంకు ఉద్యోగులకు అమలు చేయాలని కోరారు. ఉద్యోగుల సంఘం నేతలు మహమ్మద్ రియాజ్, గొజాల కామరాజు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. రేపల్లె ఎస్బీఐ మెయిన్ బ్యాంకు ఎదుట ఉద్యోగులు నిరసన చేశారు. రేపల్లె సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. నిరసన కారణంగా చెరుకుపల్లి మండలంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులు మూతపడ్డాయి.

అనగాని భగవంతరావుకు నివాళి

భగవంతరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళిఅర్పిస్తున్న కుటుంబీకులు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఆర్థిక శాఖ మాజీ మంత్రి అనగాని భగవంత రావు శతజయంతి సందర్భంగా రేపల్లెలో మంగళవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుమార్తెలు జయశ్రీ, సీతాదేవి, మనుమరాలు మంజు, తెదేపా నాయకులు నాగమల్లేశ్వరరావు, ప్రభాకరరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యకు చెక్!

రూ.70 కోట్లతో సిమెంటు కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు

బాపట్ల, న్యూస్‌టుడే

విద్యానగర్‌లో రహదారిపై పారుతున్న మురుగు

జిల్లా కేంద్రం బాపట్లలో ముంపు, మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి అడుగులు పడుతున్నాయి. పట్టణంలో వరద, మురుగు నీటి కాలువల నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. హడ్కో నుంచి ప్రభుత్వం రుణం తీసుకుని పురపాలికకు తొలి దశలో రూ.30 కోట్లు మంజూరు చేయనుంది. నిర్మాణ పనులు చేపట్టటానికి సర్వే చేస్తున్నారు.

అనారోగ్యం పాలైతే వేలల్లో ఖర్చు.. బాపట్ల తీర ప్రాంత పట్టణం. తుపానులు, వాయుగుండాల ముప్పు ఎక్కువ. భారీవర్షాలు కురిసే సమయంలో పట్టణంలో 40 శాతం కాలనీలు ముంపు బారినపడుతున్నాయి. పీఎం ఆవాస్ యోజన అర్బన్ కింద ప్యాడిసన్‌పేట, బేతనీకాలనీ, మూలపాలెంలో కొత్తగా రెండు వేల గృహాలు నిర్మించారు. పేదలు నివసించే ఈ కాలనీల్లో మురుగు కాలువలు లేవు. ఏడాదిలో ఐదారు నెలలు ఇళ్ల చుట్టూ నీరు నిలిచి దుర్వాసన, విష పురుగుల సమస్యతో అల్లాడిపోతున్నారు. విద్యానగర్, రాజీవ్‌గాంధీ కాలనీ, రైలుపేట, విజయలక్ష్మీపురం, జగన్నాథపురం, కొత్తపేట, హయ్యర్‌నగర్, శారదాపురికాలనీ, ఇస్లాంపేట, వెస్లీకాలనీ నగర్, ఇస్లాంపేటతో పాటు నూతనంగా అభివృద్ధి చెందిన కాలనీల్లో వరద, మురుగు నీటి కాలువలు లేవు. మురుగు రోడ్లపై పారి పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. దోమల సమస్య ఎక్కువగా ఉండి డెంగీ, మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రజలు ఈ జ్వరాల బారినపడి చికిత్సకు రూ. వేలల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సమస్య తీవ్రతను పురపాలక మంత్రి నారాయణ దృష్టికి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తీసుకెళ్లారు. నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

❖ పురపాలక ఇంజినీరింగ్ అధికారులు చేసిన ప్రాథమిక సర్వేలో సిమెంటు కాలువల నిర్మాణానికి రూ.70 కోట్ల నిధులు కావాల్సి ఉంటుందని అంచనా వేశారు. నివేదికను పురపాలక ఉన్నతాధికారులకు అందజేశారు. అంత పెద్ద మొత్తంలో ఒకేసారి నిధులు విడుదల చేయటం కష్టమని మూడు దశల్లో వరద, మురుగునీటి కాలువల నిర్మాణం చేపట్టాలని ప్రజారోగ్య శాఖ ఇంజినీరింగ్ అధికారులు సూచించారు. తొలి విడతలో రూ.30 కోట్లు, రెండు, మూడు దశల్లో రూ.40 కోట్లు మంజూరు చేస్తామని ప్రతిపాదించారు. జన సాంద్రత ఎక్కువగా ఉన్న, మురుగు సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో తొలి దశలో సిమెంటు కాలువల నిర్మాణం చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు తుది సర్వే చేసి డీపీఆర్ తయారు చేస్తున్నారు. దీనిని డీఎంఏ, ప్రజారోగ్య శాఖ ఈఎన్‌సీకి సమర్పించి ఆమోదం రాగానే టెండర్లు పిలిచి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు.

పంటను పరిశీలిస్తున్న ఏడీఏ లక్ష్మీ

మొక్కజొన్నలో తెగుళ్లు నివారించండి

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: మొక్కజొన్నలో ఆశించే తెగుళ్లను ముందుగానే గుర్తించి నివారించాలని రేపల్లె వ్యవసాయ శాఖ సంచాలకురాలు ఎ.లక్ష్మీ అన్నారు. మండలంలోని పెదపులివర్రు, సూరేపల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కత్తెర పురుగును గుర్తించాలన్నారు. లార్వా దశలో ఆకు తలపై వై ఆకారంలో మచ్చ ఉంటుందని, దీన్ని గుర్తించి నివారణకు తగిన మందులను వాడాలని సూచించారు.

కుంచాలవారిపాలెం (చెరుకుపల్లి (గ్రామీణ): అపరాల సాగులో పల్లాకు తెగులు నివారించాలని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫారూక్ రైతులకు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాంభొట్లపాలెం, కుంచాలవారిపాలెంలో ఆయన రైతులతో క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు.

ఈ-పంట నమోదు చేయించుకోవాలి

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రబీ సీజనులో పంట సాగు చేసిన రైతులు ఈ-క్రాప్ బుకింగ్‌తో పాటు ఈకేవైసీ చేయించాలని ఏవో మహేష్‌బాబు కోరారు. రేపల్లె మండలం గుడ్డికాయలంక, పిరాట్లంకలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

రాష్ట్రస్థాయి డాడ్జ్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రతిభ చూపిన విద్యార్థులతో డైరెక్టర్ కొలసాని విష్ణుప్రసాద్

కొల్లూరు, న్యూస్‌టుడే: ఒంగోలులోని చీమకుర్తి భాష్యం ఉన్నత పాఠశాలలో జనవరి 22 నుంచి 24 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి 18వ డాడ్జ్‌బాల్ సీనియర్ ఛాంపియన్ షిప్‌లో శ్రీరామ సైనిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారని పాఠశాల డైరెక్టర్ కొలసాని తులసీ విష్ణుప్రసాద్, ప్రిన్సిపల్ కొలసాని శ్రీకాంత్ తెలిపారు. వివిధ జిల్లాల నుంచి ఈ పోటీల్లో పాల్గొనగా బాపట్ల జిల్లా ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, ఆ జట్టులో తమ పాఠశాల విద్యార్థులు ఉండటం విశేషమన్నారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులు కె.ధీరజ్, యు.జిష్ణునాథ్, యు.జస్వంత్, జి.విహాన్, డి.జస్వంత్, కె.అవినాష్ రెడ్డి, కె.సుదర్శన్‌రెడ్డి, కె.హేమంత్, బి.షణ్ముఖతేజ, టి.సందీప్, జి.లోకేష్‌నాయక్, ఎస్.కె.మాకిల్ షోయబ్, ఓక్ జస్విన్ రాష్ట్ర జట్టుకు ఎంపికై జాతీయ స్థాయిలో ఆడనున్నారని వివరించారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ఏపీజీఈఏ రేపల్లె కార్యవర్గం ఎంపిక

రేపల్లె అర్బన్: రేపల్లె 4, 5 సచివాలయంలో మంగళవారం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రేపల్లె పట్టణ కార్యవర్గం ఎంపిక జరిగినట్లు జిల్లా అధ్యక్షుడు రోశయ్య తెలిపారు. అధ్యక్ష, కార్యదర్శులుగా రాజేష్‌బాబు, రాఘవరావుతో పాటు 13 మందిని సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులను సత్కరించారు.

అధ్యక్షుడు రాజేష్‌బాబుతో కార్యవర్గ సభ్యులు

బీసీ రుణాల మంజూరులో నిర్లక్ష్యం తగదు

మాట్లాడుతున్న శంకరరావు

బాపట్లటౌన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో బీసీ రుణాలను మంజూరు చేయటంలో ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.శంకరరావు అన్నారు. పట్టణంలోని పద్మశాలి సేవాసంఘం భవనంలో మంగళవారం ఆయన మాట్లాడారు. బీసీలకు పెద్ద పీట వేస్తామన్న కూటమి ప్రభుత్వం మాటల్లో చిత్తశుద్ధి లేదన్నారు. బీసీల సమస్యలు పరిష్కరిస్తామన్న సీఎం చంద్రబాబు మాట నిలబెట్టుకోవాలన్నారు. త్వరలో బాపట్లలో రాష్ట్రస్థాయి బీసీ గర్జన నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఇంకొల్లు మండలంలో బీసీలపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. బీసీల రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

పెదపూడి, (అమృతలూరు), న్యూస్‌టుడే: పెదపూడి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులకు దాత మంగళవారం భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన వెల్జన్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత జ్ఞాపకార్థం గ్రామానికి చెందిన షేక్ ఖాశిం(చినస్వామి) సహకారంతో 120 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. ప్రధానోపాధ్యాయిని లక్ష్మి దాతకు కృతజ్ఞతలు తెలిపారు. వేమూరు మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి పాల్గొన్నారు.

అతిథి గృహ పరిసరాలు శుభ్రం

ఈనాడు కథనానికి స్పందన

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే: ఎన్నో ఏళ్లుగా అపరిశుభ్రంగా ముళ్లపొదలతో విష సర్పాలకు నిలయంగా ఉన్న పిట్టలవానిపాలెం జలవనరుల శాఖ అతిథి గృహం పరిసరాలు ఎట్టకేలకు శుభ్రం చేశారు. గత ఏడాది డిసెంబరు 22న 'అతిథి గృహం.. స్థానికుల్లో భయం' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ వినోద్ కుమార్ 24న అతిథి గృహం పరిసరాలను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. అతిథి గృహాన్ని ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేద్దామన్నారు. స్పందించిన అధికారులు అతిథి గృహం చుట్టూ ఉన్న ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు తొలగించి కొబ్బరి, మామిడి, పనస, నేరేడు చెట్లకు సున్నం వేశారు.

నాణ్యత డొల్ల.. రోడ్లు గుల్ల

నిర్మించిన కొన్ని రోజులకే మరమ్మతులు

గూడవల్లి (చెరుకుపల్లి (గ్రామీణ), న్యూస్‌టుడే: తీరప్రాంతాన్ని తెనాలితో అనుసంధానం చేసే గూడవల్లి - పాంచాళవరం - అమృతలూరు ఆర్అండ్‌బీ రహదారి అధ్వానంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పల్లె పండగ కార్యక్రమం కింద 2025 సంక్రాంతికి రోడ్డు మరమ్మతులు చేయిస్తామన్నారు. కానీ ఈ రోడ్డుకు మేలో రూ.18 లక్షల వ్యయంతో తూతూ మంత్రంగా మరమ్మతులు నిర్వహించి అధికారులు చేతులు దులుపుకొన్నారు. మంగళవారం రోడ్డు బాగు చేయాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. రేపల్లె, నగరం, చెరుకుపల్లి, భట్టిప్రోలు మండలాలకు చెందిన దాదాపు 1.45లక్షల మందికి, 85 గ్రామాల ప్రజలకు ఈ మార్గం తెనాలి వెళ్లేందుకు దగ్గరి మార్గం. ఈ అనుసంధానం మార్గం గూడవల్లి నుంచి పాంచాళవరం వరకు 7 కి.మీ ఉంది. ఈ మార్గం పూర్తిగా పాడైంది. తారు కొట్టుకుపోయి రాళ్లు లేచాయి. రాయిగుంట చెరువు వద్ద ఖరీఫ్‌లో నీరు పారుదల లేక రైతులు వంతెన వద్ద తవ్వి వదిలేశారు. దీంతో ఇక్కడ రోడ్డు మూసుకుపోయి గుంత ప్రమాదంగా మారింది. అధికారులు ఈ వేసవిలో అయినా నూతన రహదారి వేయాలని తీరప్రాంత ప్రజలు కోరుతున్నారు.

రాయిగుంట చెరువు సమీపంలో పడిన గుంత

నగరం, భావాజీ పాలెం, (నిజాంపట్నం), న్యూస్‌టుడే: మూడు మండలాలను అనుసంధానించే ప్రధాన రహదారి నిర్మించిన మూడు నెలల్లోనే మరమ్మతులకు ఎదురు చూస్తోంది. పిట్టలవానిపాలెం ఆర్అండ్‌బీ రహదారి నుంచి పెదపల్లి నుంచి నిజాంపట్నం వరకు ఇటీవల రూ. 10 లక్షలతో తారు రోడ్డు నిర్మించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడంతో నిర్మించిన మూడు నెలల్లోనే రోడ్డు గుల్ల అయిందని స్థానికులు విమర్శిస్తున్నారు. పది కాలాల పాటు ఉండాల్సిన రహదారి మూడు నెలల్లో కొట్టుకుపోవడం ఏమిటని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవో బొర్రా శ్రీనివాస్ మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

అధ్వానంగా పెదపల్లి రోడ్డు

సంపద కేంద్రాలు వినియోగంలోకి తేవాలి

పోతనకట్టవారిపాలెం (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే: మండలంలో వినియోగంలో లేని సంపద కేంద్రాలను ఉపయోగించుకునేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు ఎంపీడీవో శేఖర్‌బాబు తెలిపారు. ఖాజీపాలెం, పోతనకట్టవారిపాలెంలోని సంపద కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. తక్షణం కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. మండలంలో నిర్మాణం పూర్తయి వినియోగంలోకి రాని కేంద్రాలన్నింటినీ సత్వరం వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

అమృతలూరు, న్యూస్‌టుడే: అమృతలూరు జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలు, ఈ ఏడాది ఇప్పటి వరకు జరిగిన పరీక్షల్లో తొలి మూడుస్థానాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉత్తమ సేవా అవార్డుకు ఎంపికైన మండల విద్యా వనరుల కేంద్రం డేటా ఎంట్రీ ఆపరేటర్ యలవర్తి కోటేశ్వరరావును ఉపాధ్యాయులు సత్కరించారు. వేమూరు మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ పూర్ణకుమారి, ప్రధానోపాధ్యాయుడు నిరీక్షణరావు, ఎస్ఎంసీ ఛైర్మన్ వినయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

29న సర్వసభ్య సమావేశం

నిజాంపట్నం: నిజాంపట్నం మండల సర్వసభ్య సమావేశం 29న మండల పరిషత్తు కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో నాగలక్ష్మి తెలిపారు. సమావేశానికి ఎంపీపీ మోపిదేవి విజయ నిర్మల అధ్యక్షత వహించి అభివృద్ధి పనులపై సమీక్షిస్తారని, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

చెరువులో చెట్ల తొలగింపు

బాపట్ల టౌన్: స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రలో భాగంగా పట్టణంలోని 14 వార్డు హనుమంతరావు కాలనీలో మాణిక్యమ్మ చాకలి చెరువులో చెట్లు తొలగింపు కార్యక్రమం మంగళవారం కమిషనర్ జి.రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. వార్డులోని సమస్యలపై స్థానికులు ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మకు ఫిర్యాదు చేయడంతో సమస్యలు వెంటనే పరిష్కరించమని ఆయన అధికారులను ఆదేశించారు. స్పందించిన అధికారులు చెరువును శుభ్రం చేశారు.

31 నుంచి విలేకరులకు పునశ్చరణ తరగతులు

బాపట్ల, న్యూస్‌టుడే: సీఆర్ ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో పట్టణంలోని కమ్మజన సేవా సమితి కల్యాణ మండపంలో ఈ నెల 31, ఫిబ్రవరి 1 వరకు గ్రామీణ విలేకరులకు రెండ్రోజుల పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్ రెండ్రోజులు బాపట్లలో పర్యటించి పునశ్చరణ తరగతుల్లో ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు.

కుక్కల బెడద.. నియంత్రించకుంటే ఆపద

పెరుగుతున్న బాధితులు

మోదుకూరు, వలివేరు, చుండూరు, న్యూస్‌టుడే: వేమూరు సామాజిక వైద్యశాలకు నెలకు 40 నుంచి 50మంది కుక్క కాటు బాధితులు వచ్చి వైద్య సేవలు చేయించుకుంటున్నారు. గతంలో నెలకు 20మంది బాధితులు ఉంటే ప్రస్తుతం అది రెట్టింపయ్యింది. ఇలాంటి పరిస్థితి ఇక్కడ ఒక్కచోటే కాదు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కుక్క కాటు బాధితులు రోజు రోజుకు పెరిగిపోతున్నారని ప్రజలు చెబుతున్నారు. నివారణ చర్యలు చేపట్టకపోతే వీధుల్లో తిరిగేందుకు భయపడాల్సిన పరిస్థితులు ఎదురవుతాయని అంటున్నారు. నియోజకవర్గంలో 89 గ్రామ పంచాయతీలు ఉండగా, ఒక సామాజిక వైద్యశాల, 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. గత ఐదేళ్ల కాలంలో గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువైంది. అవి వీధుల్లో సంచరిస్తూ చిన్నారుల నుంచి, వృద్ధుల వరకు దారిన పోయి వచ్చే వారిని కరుస్తున్నాయి. ఇటీవల కాలంలో వీటి నివారణ గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో వీటి సంతతి పెరిగింది. చర్యలు చేపట్టాల్సిన అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సమస్యపై పశుసంవర్ధక శాఖ అధికారి జనార్ధనరావు మాట్లాడుతూ కుక్కల నియంత్రణ ఆయా పంచాయతీలు చేపట్టాలని, వాటిని పట్టుకుని పసువుల ఆసుపత్రికి తీసుకొచ్చి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించాలని, ప్రజలు సైతం సామాజిక బాధ్యతగా తీసుకుని కుక్కల సంతతి పెరగకుండా ఉండేందుకు సహకరించాలని తెలిపారు.

వైభవంగా కల్యాణోత్సవాలు ప్రారంభం

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని టీనగర్‌లో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం వార్షిక కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. 31న శాంతి హోమం, ఫిబ్రవరి ఒకటిన గరుడోత్సవం జరుగుతాయని తెలిపారు.

పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

చెట్లు కొట్టివేత.. కట్ట బలహీనం

న్యూస్‌టుడే, బాపట్ల టౌన్

చెట్లు కొట్టిన తర్వాత తుమ్మ మొద్దులు

పేరలి డ్రెయిన్ మీద రెండు వైపులా కట్టల మీద ఉన్న తుమ్మ చెట్లను కొన్ని రోజుల నుంచి తొలగిస్తున్నారు. గత కలెక్టర్ వెంకట మురళి ఆదేశాల మేరకు డ్రైనేజీ మీద ఉన్న తుమ్మ, చిల్ల చెట్లు తొలగించాలని గత ఏడాది బాపట్ల కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో వేలం పాట నిర్వహించారు. బాపట్ల హైయ్యర్ నగర్‌కు చెందిన సలగల రాజా రూ.3 లక్షలకు పాట దక్కించుకున్నారు. ఈనేపథ్యంలో డ్రైనేజీ శాఖ వారు అతడికి ఫిబ్రవరి 1 వరకు చెట్లు కొట్టుకునేందుకు అనుమతులిచ్చారు.

కాలువకు ముప్పు... రైతుల ఆందోళన

ఇదిలా ఉండగా కాలువ కట్ట మీద ఎన్నో ఏళ్లనుంచి ఉన్న తుమ్మ, చిల్ల చెట్లు తొలగించడంపై కాలువ సమీప గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. దశాబ్దాల నుంచి కాలువ కట్టలకు సహజ రక్షణగా ఉన్న పెద్ద తుమ్మ చెట్లను తొలగిస్తే వర్షాకాలంలో కట్టలు బలహీనమవుతాయని ఆందోళన చెందుతున్నారు. తుపానులు వస్తే ఇసుక కట్టలు త్వరగా కోసుకుపోయి గండ్లు పడతాయి. పేరలి డ్రెయిన్‌కు గండి పడితే ప్రమాదం ఊహించ లేనంత ఉంటుంది. అధికారులు కాలువ కట్టలపై చెట్లను రక్షించాల్సింది పోయి వారే వేలం నిర్వహించి చెట్లు నరికించి వేయడం సరికాదని రైతులు అంటున్నారు. కట్టలను ఆక్రమించడమే కాక ఇసుకను రాత్రివేళల్లో తరలిస్తారని మరుప్రోలువారిపాలెం గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై డ్రైనేజీ శాఖ ఏఈఈ భార్గవి మాట్లాడుతూ గత కలెక్టర్ ఆదేశాల మేరకు వేలం నిర్వహించామని, ఈ విషయాన్ని సమీప గ్రామాల కార్యదర్శులకు, రెవెన్యూ అధికారులకు తెలిపామన్నారు.

బాలల సాంస్కృతిక ప్రదర్శన

పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక

జంపని (వేమూరు), న్యూస్‌టుడే: జంపని ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు గడచిన రోజుల్లో జరిగిన మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. బాలబాలికలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రధానోపాధ్యాయుడు బదరీనారాయణ పాల్గొన్నారు.

అభయాంజనేయుడికి ప్రత్యేక పూజలు

పర్చూరు, న్యూస్‌టుడే: స్థానిక వై జంక్షన్ వద్ద గల శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయంలో దగ్గుబాటి హితేష్ చెంచురామ్ ప్రత్యేక పూజలు చేశారు. ఇటీవల ఆలయ అభివృద్ధికి ఎంపీ పురందేశ్వరి, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావుతో పాటు వారి కుమారుడు హితేష్ చెంచురామ్ రూ.5 లక్షల నగదు అందించారు. మంగళవారం గుడికి వచ్చిన ఆయనకు అర్చకులు, అభివృద్ధి కమిటీ సభ్యులు స్వాగతం పలికారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

బాపట్ల: పట్టణంలోని డీఎంపల్లికి చెందిన 22 ఏళ్ల యువతి ఈ నెల 26న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు యువతి అదృశ్యంపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాంబాబు తెలిపారు.

రూ.3 లక్షలతో పార్కు నిర్మాణం

పార్కులో ఆడుకుంటున్న చిన్నారులు

ఉల్లిపాలెం (నగరం), న్యూస్‌టుడే: బడి ఈడు చిన్నారులను సెల్ ఫోన్లకు దూరం చేసి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటపాటలకు దగ్గర చేసే ప్రయత్నం చేశారు ఉల్లిపాలెం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయ దంపతులు. గ్రామానికి చెందిన నారాయణం వికనసాచార్య జానకీదేవీ దంపతులు. వృత్తిరీత్యా ఉపాధ్యాయులుగా సేవలందించిన వీరు విద్యార్థుల కోసం మంచి పని చేయాలని సంకల్పించారు. ఆటపాటలతో మానసిక ఉల్లాసం పొందాల్సిన చిన్నారులు సెల్‌ఫోన్లకు ఆకర్షితులై పెడదోవ పడుతున్నారని గ్రహించారు. సుమారు రూ.3 లక్షలతో పార్కు నిర్మించారు. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన దంపతులు ప్రభుత్వాధికారుల సహకారంతో పార్కు నిర్మించి గ్రామానికి అంకితం చేశారు. గ్రామంలోని చిన్నారులు ఉదయం, సాయంత్రం వేళలతో పాటు సెలవు రోజుల్లోనూ పార్కుకు వచ్చి ఆటపాటలతో శారీరక వ్యాయామంతో పాటు మానసిక ఉల్లాసం పొందుతున్నారు. సొంత నిధులతో పార్కు నిర్మించడం సంతోషంగా ఉందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శౌచాలయానికి తలుపులు బిగించరూ..

మండలంలోని పిట్టువారిపాలెం సచివాలయం సమీపంలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో రూ.3 లక్షలతో నిర్మించిన సామూహిక మరుగుదొడ్డి నిరుపయోగంగా మారింది. తలుపులు ఊడిపోగా.. నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో సచివాలయ సిబ్బందితో పాటు సచివాలయానికి వస్తున్న అవసరాల నిమిత్తం వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మరుగుదొడ్డిని అందుబాటులోకి తీసుకురావాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. **-న్యూస్‌టుడే, పిట్టువారిపాలెం(పిట్టలవానిపాలెం)**

ఈఎస్ఐ ఆసుపత్రి సౌకర్యం కల్పించండి

బాపట్ల వెస్ట్, న్యూస్‌టుడే: ప్రైవేటు విద్యుత్తు కార్మికులకు బాపట్లలో ఈఎస్ఐ ఆసుపత్రి సౌకర్యం కల్పించాలని ప్రైవేటు విద్యుత్తు కార్మికుల సంఘం నేత తిరుమలశెట్టి సాంబశివరావు కోరారు. పట్టణంలోని ప్రైవేటు విద్యుత్తు కార్మికుల కార్యాలయంలో ఎలక్ట్రీషియన్ డేను మంగళవారం నిర్వహించారు. విద్యుత్తు బల్బు కనిపెట్టిన థామస్ అల్వా ఎడిసన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

(c) eenadu

చీరాల

•చీరాల •పర్చూరు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల: 915484713 వేటపాలెం: 8008574099
చీరాల గ్రామీణం: 6309994673 పర్చూరు: 9063144743
మార్టూరు: 8008574106 ఇంకొల్లు: 8008574102
చినగంజాం: 8008574103

స్పందన: చినగంజాం: కడవకుదురు పరిధిలోని పాతపాడు గ్రామంలో వీధి దీపాలు వెలగడం లేదని ఈ నెల 24న 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి స్థానికులు తెచ్చారు. స్పందించిన గ్రామ కార్యదర్శి పి.శ్రీనివాసరావు మంగళవారం పంచాయతీ ఒప్పంద విద్యుత్తు సిబ్బందిని పంపించి, వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు. సమస్యను పరిష్కరించారు. ✦ సంతరావూరు చెరువు వద్ద ఇదే సమస్యతో స్థానికులు ఈ నెల 25న తీసుకురాగా, స్పందించిన గ్రామ కార్యదర్శి కె.కృపారావు ఒప్పంద వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు.

వేటపాలెం, న్యూస్‌టుడే: కొత్తపేట వివేకానంద కాలనీ మండల పరిషత్ పాఠశాల సమీపంలో వీధిదీపం వెలగడం లేదని ఈ 24న స్థానికులు తీసుకొచ్చారు. స్పందించిన పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు సిబ్బంది చేత అక్కడ లైటు బాగు చేయించారు.

కాలువ పనులు తిరిగి ప్రారంభం

ఈనాడు స్పందన

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: చీరాల పట్టణం రామ్‌నగర్ వైపు వారి వీధిలో నిలిచిన డ్రైనేజీ నిర్మాణ పనులను పురపాలక అధికారులు ప్రారంభించారు. 'రహదారిపైనే మురుగు ప్రవాహం' అన్న శీర్షికతో మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఛైర్మన్ మించాల సాంబశివరావు స్పందించారు. వెంటనే ఇంజినీరింగ్ అధికారులను పంపించారు. మురుగునీటి పక్కనున్న కాలువకు మళ్లించి, పనుల్లో వేగం పెంచారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేస్తామని ఛైర్మన్ పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన

సైకిల్ స్టాండ్‌ను ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

అనంతవరం (యద్దనపూడి), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధన అందుతోందని, ఇందుకు దాతలు తోడ్పాటు అభినందనీయమని ఎంఈవో చిలుకూరి గోపి, ప్రధానోపాధ్యాయుడు ఎం.రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని అనంతవరం కేవీవీ ఉన్నత పాఠశాల బాలల కోసం రూ.6 లక్షలతో ఎల్ఎం ఆటోటెక్ వారు అభివృద్ధి చేసిన సైన్స్ ల్యాబ్, డిజిటల్ ల్యాబ్, సైకిల్ స్టాండ్‌లను మంగళవారం ఆ సంస్థ ప్రతినిధి కె.శ్రీనివాసరావు ప్రారంభించారు. జన చైతన్య హౌసింగ్ వారు రూ.3 లక్షలతో రూ.3 వేల చదరపు అడుగుల ప్లాట్‌ఫాంను సమకూర్చడం విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు చేరువైనట్లు కొనియాడారు.

ఉత్తమ అధికారులకు సత్కారం

చినగంజాం, న్యూస్‌టుడే: ఉత్తమ సేవలతో గణతంత్ర వేడుకల సందర్భంగా జిల్లా కేంద్రంలో కలెక్టర్ వినోద్‌కుమార్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని తహసీల్దార్ జె.ప్రభాకరరావు, ఎంఈవో-1 బి.అజయ్‌బాబులను యూటీఎఫ్ శాఖ నాయకులు మంగళవారం సాయంత్రం ఆయా కార్యాలయాల్లో సత్కరించారు. ఎస్.పాపారావు, కుర్రా రామారావు, వెంకట్, మెట్టు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుపై అవగాహన

చిమటావారిపాలెం, విజినంపాడు (యద్దనపూడి), న్యూస్‌టుడే: రైతులు ప్రభుత్వం అమలుచేస్తున్న రాయితీ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని ఏవో కుమారి కోరారు. మంగళవారం చిమటావారిపాలెం, విజినంపాడు గ్రామాల్లో ఈ-పంట నమోదుపై అవగాహన కలిగించారు.

మహిళలు.. ఉపాధి సిరులు

అడుసుమల్లి, నూతలపాడు(పర్చూరు), స్వర్ణ(కారంచేడు), న్యూస్‌టుడే

ఆ మహిళలు ఉపాధి మార్గాలతో కుటుంబాల ఆర్థిక వృద్ధికి దోహదపడుతూ అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అతివల ప్రగతే ధ్యేయంగా రుణాలు మంజూరు చేస్తుండటంతో వాటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా మహిళలు కుటీర పరిశ్రమలతో స్వయం ఉపాధి పొందుతున్నారు.

కుటుంబానికి అండగా

నా పేరు షేక్ హసీనా. కారంచేడు మండలం స్వర్ణ గ్రామం. స్వయం సహాయ సంఘమైన బిస్మిల్లా గ్రూపులో సభ్యురాలిని. గతంలోనూ బ్యాంకు రుణం తీసుకుని కిరాణా దుకాణం నెలకొల్పాను. సీడ్ క్యాపిటల్ కింద రూ.40 వేలను మళ్లీ రుణం పొంది పూర్తిస్థాయిలో దుకాణంలో ప్రజలకు అవసరమైన సరకులు ఏర్పాటుచేసి, వ్యాపారం చేస్తున్నా. దీంతో నెలకు సుమారు రూ.12 వేల ఆదాయం పొందుతున్నా. నా భర్త సంపాదనతో పాటు నాకు వచ్చే ఆదాయంతో కుటుంబానికి ఆర్థిక భరోసా లభించింది.

పరదాల వ్యాపారం చేస్తూ..

నా పేరు భుక్యా చిన్ని. పర్చూరు మండలం అడుసుమల్లి గ్రామంలోని తిరుపతమ్మ తల్లి స్వయం సహాయక గ్రూపు సభ్యురాలిని. బ్యాంక్ లింకేజీ కింద రూ.2 లక్షలు, స్త్రీ నిధి కింద రూ.లక్ష రుణాలు పొందాను. చిన్నప్పటి నుంచి టైలరింగ్ చేస్తున్నా. దీంతో వ్యాపారం పెంచుకునేందుకు పరదాల ఎంతో అవసరమని గుర్తించా. రుణాలు పొందిన నగదుతో ప్లాస్టిక్ పరదాలు దిగుమతి చేసుకుని, కుట్టి అమ్మకం చేస్తున్నా. తద్వారా నెలకు రూ.20 వేలకు పైగా సంపాదిస్తూ కుటుంబానికి అండగా నిలుస్తున్నా. రుణాలు ఎంతగానో దోహదపడ్డాయి.

లాభదాయకంగా గొర్రెల పెంపకం

నా పేరు రాపూరి రేణుక. మాది పర్చూరు మండలం నూతలపాడు. గ్రామానికి చెందిన ఈశ్వరీదేవి స్వయం సహాయక గ్రూపు సభ్యురాలిని. స్త్రీ నిధి కింద రూ.లక్ష రుణం పొందాను. వాటితో ఎనిమిది గొర్రె పిల్లలు కొనుగోలు చేసి పెంచడంతో అవి ఇప్పుడు 25 గొర్రెలకు చేరాయి. వాటిని విక్రయిస్తూ వచ్చిన ఆదాయంతో కుటుంబ పోషణతో పాటు రుణాలను తిరిగి చెల్లిస్తూ పిల్లలను చదివించడంలో భర్తకు అండగా నిలుస్తున్నా.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

ప్రభుత్వం మహిళా సాధికారత లక్ష్యంగా స్వయం సహాయక సంఘాల్లోని గ్రూపు సభ్యులకు రుణాలు అందిస్తోంది. స్త్రీ నిధి, బ్యాంక్ లింకేజీ, ఉన్నతి, సామాజిక పెట్టుబడి నిధి, పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ కింద వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు పొందే అవకాశం ఉంది. మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలి.

– ఏపీఎంలు కె.రామకృష్ణ, టి.మోహనరావు, పర్చూరు, కారంచేడు

గోదాముల పరిశీలన

అడుసుమల్లి(పర్చూరు), న్యూస్‌టుడే: అడుసుమల్లిలోని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ గోదాములను మంగళవారం కారంచేడు తహసీల్దార్ జి.నాగరాజు తనిఖీ చేశారు. గోదాముల్లో నిల్వ ఉన్న ప్రజాపంపిణీ నిత్యావసర సరకుల వివరాలు నమోదు చేసుకుని, రికార్డులు చూశారు. వెంట ఆర్ఐ జగదీష్ ఉన్నారు.

అధ్యయన సామగ్రి అందజేత

కొత్తపేట(వేటపాలెం), న్యూస్‌టుడే: కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 197 మంది పదోతరగతి విద్యార్థులకు అధ్యయన సామగ్రి (స్టడీ మెటీరియల్)ని ఐత్తుల చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, విశ్రాంత ప్రధానాచార్యుడు ఐత్తుల బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు నాగేంద్రరావు, హనుమంతరావు, డేవిడ్ పాల్గొన్నారు.

పార్టీ ఏజెంట్ల జాబితా అందజేయండి

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: బూత్ స్థాయి పార్టీ ఏజెంట్ల జాబితాను త్వరలో అందజేయాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు కోరారు. చీరాల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వివిధ పార్టీల నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. చీరాల పట్టణం, చీరాల గ్రామీణం, వేటపాలెం మండలాల పరిధిలోని 6, 7, 8 ఫారాల కింద ఈసారి 326 దరఖాస్తులు రాగా.. ఇప్పటివరకు 135 పరిష్కారమయ్యాయని, మరో 191 పరిశీలనలో ఉన్నట్లు వివరించారు. చీరాల, వేటపాలెం తహసీల్దార్లు గోపీకృష్ణ, గీతారాణి, పురపాలక కమిషనర్ డానియల్ పాల్గొన్నారు.

బాలికకు బహుమతి అందిస్తున్న మురళీ వరప్రసాద్

నిరుపేద విద్యార్థులను ప్రోత్సహిస్తాం

ఈపూరుపాలెం(చీరాల గ్రామీణం), న్యూస్‌టుడే: నిరుపేద ప్రతిభ ఉన్న విద్యార్థులకు నగదు బహుమతులు అందించి ప్రోత్సహించనున్నట్లు కలాం మురళీ సేవా ట్రస్టు వ్యవస్థాపకుడు, విశ్రాంత డీఈవో శ్రీవత్స అంధ మురళీవరప్రసాద్ పేర్కొన్నారు. చీరాల మండలం ఈపూరుపాలెం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభలో మాట్లాడారు. ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్ఎం హనోర పాల్గొన్నారు.

అభయాంజనేయుడికి ప్రత్యేక పూజలు

పర్చూరు, న్యూస్‌టుడే: స్థానిక వై.జంక్షన్ వద్ద గల శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయంలో దగ్గుబాటి హితేష్ చెంచురామ్ ప్రత్యేక పూజలు చేశారు. ఇటీవల ఆలయ అభివృద్ధికి ఎంపీ పురందేశ్వరి, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావుతో పాటు వారి కుమారుడు హితేష్ చెంచురామ్ రూ.5 లక్షల నగదు అందించారు. మంగళవారం గుడికి వచ్చిన ఆయనకు అర్చకులు, అభివృద్ధి కమిటీ సభ్యులు స్వాగతం పలికారు.

పూజలు చేస్తున్న హితేష్ చెంచురామ్

కాలువలు లేక రోడ్డుపైనే మురుగు

పాతచెన్నై రహదారిపై ఇలా..

ఇంకొల్లు పంచాయతీలో ప్రధాన రహదారులకు ఇరువైపులా కాలువలు లేక మురుగు నీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. పాతచెన్నై రహదారిలో ఆఫీసర్స్ క్లబ్ నుంచి మార్కెట్ యార్డు వరకు, కడవకుదురు రోడ్డులో సినిమా హాళ్ల కూడలి నుంచి మధురా నగర్ వరకు, ముప్పవరం రోడ్డులో జెండా చెట్టు కూడలి నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు కాలువల నిర్మాణం జరగలేదు. పైరహదారులన్నీ ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్నందున పంచాయతీ వీటి నిర్మాణాల జోలికి వెళ్లడంలేదు. గృహాలు, వాణిజ్య సంస్థల ముందు ఆక్రమణల కారణంగా కాలువలు పూర్తిగా పూడిపోయాయి. కొన్నిచోట్ల కాలువల ఆనవాళ్లు కనిపించకుండా చేశారు. రెండేళ్ల క్రితం పాతచెన్నై రహదారిని సీసీ రోడ్డుగా మార్చారు. ఆ సమయంలో నిధులు కొరత కారణంగా మురుగు కాలువలు నిర్మించకుండా వదిలేశారు. గ్రామంలో మరోసారి ఆక్రమణలు తొలగించనిదే కాలువల నిర్మాణం జరిగేలా కనిపించడంలేదు. **- న్యూస్‌టుడే, ఇంకొల్లు**

ఐదు రోజుల పనిదినాలకు డిమాండ్

చీరాల: ప్రదర్శన నిర్వహిస్తున్న బ్యాంకు ఉద్యోగులు

చీరాల, వేటపాలెం, ఇంకొల్లు, మార్టూరు, యద్దనపూడి, న్యూస్‌టుడే: బ్యాంకింగ్ రంగంలో ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం ఉద్యోగులు సమ్మె చేపట్టి, చీరాల పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా నేతలు దీవెన్‌బాబు, కిషోర్‌బాబు, బ్రహ్మయ్య, వసంతరావు తదితరులు మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగాన్ని కేంద్రం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. గతంలో ఐదు రోజుల పనిదినాల అమలును పరిశీలిస్తామని హామీ ఇచ్చారని, రెండేళ్లు గడిచిన నేటికి అమలుకు నోచుకోలేదన్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలన్నారు. ✦ వేటపాలెం, పందిళ్లపల్లి, కొత్తపేట ప్రాంతాల్లోని అన్ని శాఖల బ్యాంకుల లావాదేవీలు స్తంభించాయి. విషయం తెలియని ఖాతాదారులు వచ్చి వెనుదిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. ✦ ఇంకొల్లులో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎస్‌బీఐ ప్రధాన, పట్టణ శాఖలు, యూనియన్, కెనరా, పీడీసీసీ, ఏపీజీబీ బ్యాంకు ఉద్యోగులు సుభాని, మౌలాలి, శ్రీనివాసరావు, కృష్ణప్రసాద్, రాజశేఖర్ పాల్గొన్నారు. ✦ యద్దనపూడి, మార్టూరు ప్రాంతాల్లోని వివిధ బ్యాంకుల సేవలు అందక ఖాతాదారులు అవస్థలు పడ్డారు.

విద్యతోనే వికాసం

కారంచేడు, న్యూస్‌టుడే: విద్య ద్వారానే సమాజ వికాసం సాధ్యమని గౌతమబుద్ధ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు చుండూరి రామయ్య చెప్పారు. కారంచేడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ ఏడాది 6నుంచి 10వ తరగతి వరకు జరిగే పరీక్షల్లో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థులకు తన వంతు రూ.10 వేలను ఆర్థికసాయం అందజేస్తానని ప్రవాసాంధ్రుడు తాళ్లూరి పూర్ణచంద్రరావు ప్రకటించారు. ఎంఈవో ఎంవీ సత్యనారాయణ, సర్పంచి బాలిక శివపార్వతి, హెచ్ఎంలు సామ్రాజ్యం, బాలప్రసాద్ పాల్గొన్నారు. కారంచేడు మండలం కొడవలివారిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు.

వేటపాలెం: నృత్యం చేస్తున్న బాలికలు

కోనంకి (మార్టూరు), న్యూస్‌టుడే: బాలలు విద్యతో పాటు ఆటల పోటీల్లో ప్రతిభచాటి ఉన్నతంగా ఎదగాలని హెచ్ఎం సుధారాణి కోరారు. మంగళవారం మండలంలోని కోనంకి ఉన్నత పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. చిన్నారుల ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకతను చాటాయి. ఉపాధ్యాయులు, పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

వేటపాలెం, న్యూస్‌టుడే: బాలికోన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు వేడుకను ఘనంగా నిర్వహించారు. పరీక్షల్లో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఉపాధ్యాయులు ఆశీర్వదించారు. అనంతరం బాల బాలికలు వేర్వేరుగా చేసిన నృత్యాలు సభికులను ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయిని దేవరకొండ సరోజిని, ఉపాధ్యాయులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

విద్యార్థికి ధ్రువపత్రం అందజేస్తున్న ఛైర్మన్ సాంబశివరావు

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోండి

చీరాల, న్యూస్‌టుడే: విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకొని దాని కోసం ప్రణాళికాబద్ధంగా కష్టపడాలని మున్సిపల్ ఛైర్మన్ ఎం.సాంబశివరావు సూచించారు. మంగళవారం ఎన్ఆర్‌పీఎం, ఏఆర్ఎం, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో నిర్వహించిన ఫేర్‌వెల్ కార్యక్రమాల్లో ఛైర్మన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు అట్ట, పెన్నులు అందజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు సాల్మన్‌రాజ్, వెంకటేశ్వరరావు, కృష్ణమోహన్, పాల్గొన్నారు.

SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**
రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032
బ్రాంచ్ : శ్రీ మంజునాథ కాంప్లెక్స్, ఎల్ఐసి ఆఫీస్ ఎదురు, కనిగిరి రోడ్డు, కందుకూరు, ప్రకాశం జిల్లా -523105 (ఎ.పి), website: www.shriramfinance.in

భౌతికంగా స్వాధీనత ప్రకటన రూలు 8(1) ప్రకారం (స్థిరాస్తిపై)

విషయము: లోన్ అకౌంట్ నెం. KNDKRTF2201270003

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (సెకండ్) యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారం **M/s. శ్రీ మంజునాథ కాంప్లెక్స్, ఎల్ఐసి ఆఫీస్ ఎదురు, కనిగిరి రోడ్డు, కందుకూరు, ప్రకాశం జిల్లా -523105 (ఎ.పి)**, యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13(12) కు అనుబంధమైన రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీతలను కోరుతూ **25-02-2023** తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయబడినది. **ఋణగ్రహీతలు :**
1) బొప్పూడి అనీత, భర్త: శ్రీకాంత్, డి.నెం.4-132, దక్షిణం బజార్, బొబ్బేపల్లి గ్రామం, మార్టూరు మండలం, ప్రకాశం జిల్లా.
2) బొప్పూడి శ్రీకాంత్, తండ్రి: హరిబాబు, డి.నెం.4-132, దక్షిణం బజార్, బొబ్బేపల్లి గ్రామం, మార్టూరు మండలం, ప్రకాశం జిల్లా.
3) పావులూరి శ్రీనాథ్, తండ్రి: రాంబాబు, డి.నెం.1-93/1, మెయిన్‌రోడ్, బల్లికురవ మండలం, ప్రకాశం జిల్లా.
4) బొపూడి శివ కోటేశ్వరరావు, తండ్రి: హరిబాబు, డి.నెం.4-132, దక్షిణం బజార్, బొబ్బేపల్లి గ్రామం, మార్టూరు మండలం, ప్రకాశం జిల్లా.
వారు ఈ నోటీసులో పేర్కొన్న చెల్లించవలసిన మొత్తము, రూ.45,39,084/- (అక్షరాల నలభై ఐదు లక్షల ముప్పై తొమ్మిది వేల ఎనభై నాలుగు రూపాయలు మాత్రమే) వడ్డీ మరియు జరిమానాలతో గల కాంట్రాక్ట్యువల్ చార్జీలతో కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా ఈ నోటీసు జారీ చేయడమైనది.
ఋణగ్రహీతలు తమ బకాయిలను పూర్తిగా చెల్లించడంలో విఫలమైనందున, వారికి మరియు సాధారణ ప్రజలందరికీ ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ క్రింద సంతకం చేసిన అధీకృత అధికారి, సదరు (చట్టం) లోని సెక్షన్ 13(4) ప్రకారం **16-09-2023** తేదీన సదరు ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా, సదరు భూమి ఖాళీగా ఉన్నందున, మా కార్యనిర్వాహక సిబ్బంది సహాయంతో సదరు (చట్టం) లోని రూల్ 8(1) మరియు రూల్ 9 ప్రకారం, ఈ రోజు అనగా **24-01-2026** న నేరుగా సదరు ఆస్తి యొక్క భౌతిక స్వాధీనాన్ని అధీకృత అధికారి చేపట్టారు.
సదరు ఈ ఆస్తి విషయమై సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకించి ఋణగ్రహీతలకు హెచ్చరించడమేమనగా ఈ ఆస్తి పై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా ఈ నోటీసులో పేర్కొన్న చెల్లించవలసిన **రూ.45,39,084/- (అక్షరాల నలభై ఐదు లక్షల ముప్పై తొమ్మిది వేల ఎనభై నాలుగు రూపాయలు మాత్రమే) మరియు తదుపరి జమకూడు వడ్డీ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులతో కలిపి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారి ఛార్జీకి లోబడి ఉండునని తెలియపరచడమైనది.

స్థిరాస్తి వివరములు

షెడ్యూలు ఆస్తి దస్తావేజు నెం. **262/2022,** ప్రకారం **బొప్పూడి అనీత, భర్త: శ్రీకాంత్ పేరుతో కలదు.** ప్రకాశం జిల్లా, ఒంగోలు రిజిస్ట్రేషన్ జిల్లా, మార్టూరు సబ్ జిల్లా, బల్లికురవ మండలం, కొణిదెన శివారు, నక్కబొక్కలపాడు గ్రామ పంచాయతి, కొణిదెన గ్రామ సర్వే నెం.810/ఎ1ఎ లోని మొత్తం విస్తీర్ణం ఎకరాలు 17.42 సెంట్లు ఇందులో మార్పు తరువాత కొణిదెన గ్రామ సర్వేనెం.810/ఎ1ఎ2 నందలి ఎకరా 1.20 సెంట్ల స్థలం ఇది 5808 చ॥గజాలకు సమానం. దీనికి **హద్దులు: తూర్పు:** పి. శ్రీనివాసరావు గారి భూమి, **దక్షిణం:** అమ్మకం దారుల భూమి, **పడమర:** డి. వెంకటేశ్వర్లు మరియు వి. ప్రసాద్ గారి భూమి, **ఉత్తరం:** యం. సత్యవతి గారి భూమి. ఈ సరిహద్దుల మధ్యగల ఎకరం 1.25 సెంట్ల భూమి.

తేది : 24.01.2026 సం/- అధీకృత అధికారి,
ప్రదేశం : కందుకూరు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**
రిజిష్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
బ్రాంచ్ ఆఫీస్: డి.నెం.9-333, పెంట్యాల ప్లాజా, బ్యాంక్ ఆఫ్ ఇండియా పైన, గీతా మందిరం ఎదురుగా, అద్దంకి, ప్రకాశం జిల్లా - 523201.

లాంఛనాత్మక స్వాధీనత ప్రకటన

మేము, మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" గా పిలువబడినది, ఇది శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనం చేయబడి, ఎన్.సి.ఎల్.టి బెంచ్-II చెన్నై వారి ది. 09.11.2022 నాటి ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది. ఆ తర్వాత (ది. 30.11.2022 నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ) ప్రకారం శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పేరు మార్చుకోవడానికి ఆమోదం పొందినది, కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్ చేయబడిన సంస్థ. అంతేకాకుండా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ వ్యాపారం చేయడానికి రిజిస్టర్ చేయబడింది. రిజిస్టర్డ్ కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఏ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై - 600032 నందు కలదు.
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్.ఎఫ్.ఎల్) యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సదరు చట్టం) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (సదరు రూల్స్) యొక్క రూల్ 3తో చదువుకోవల్సిన సదరు చట్టంలోని సెక్షన్ 13 (12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ సదరు డిమాండ్ నోటీసులలో తెలిపిన మొత్తమును తిరిగి చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలకు డిమాండ్ నోటీసులను జారీ చేశారు. వాటి వివరాలు దిగువ పట్టికలో పేర్కొనబడినవి.
ఋణగ్రహీతలు సదరు మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైనారు, కావున ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుకోవల్సిన సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **24 జనవరి 2026న** లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకోవడమైనది.

ఋణగ్రహీత మరియు హామీదారుల యొక్క పేరు మరియు చిరునామా	డిమాండ్ నోటీసు ప్రకారం బకాయియున్న మొత్తం:
1. షేక్ నాగూర్ వలి, తండ్రి: ఖాదర్ వలి, డి.నెం. 4-68, గర్నెపూడి గ్రామం, పర్చూరు (మండలం), ప్రకాశం జిల్లా-523171. **2. షేక్ ఖాదర్ వలి,** తండ్రి: మాబుసుభాని, డి.నెం. 4-68, గర్నెపూడి గ్రామం, పర్చూరు (మండలం), ప్రకాశం జిల్లా-523171. **3. పఠాన్ యాకూబ్ వలి,** తండ్రి: ఖాదర్ వలి, హెచ్.నెం. 2-9-బి, బొద్దేపల్లి (గ్రామం), మార్టూరు (మండలం), ప్రకాశం జిల్లా-523301.	ఋణ ఖాతా నెం. **ADDAKTF2001300015** ద్వారా రూ. 34,97,607/- (అక్షరాలా ముప్పై నాలుగు లక్షల తొంభై ఏడు వేల ఆరు వందల ఏడు రూపాయలు మాత్రమే) చెల్లించాలి. డిమాండ్ నోటీసు తేదీ: **29-09-2025**

ఆస్తి వివరములు

ప్రకాశం జిల్లా, ఒంగోలు రిజిస్ట్రేషన్ జిల్లా, పర్చూరు మండలం, గర్నెపూడి గ్రామం మరియు పంచాయతీ, గర్నెపూడి సర్వే నెం: 306/6 లో గల డి. నెం: 4-68 లో ఉన్న ఖాళీ స్థలం. **హద్దులు: తూర్పు:** గుట్ట శివయ్య గారి భూమి, **పడమర:** పంచాయతీ బజార్, **ఉత్తరం:** తంగెళ్ళ సాహెబ్ గారి ఇల్లు, **దక్షిణం:** షేక్ ఖాసిం గారి ఇల్లు. పై హద్దుల మధ్య గల 120 చదరపు గజాలు లేదా 100.8 చదరపు మీటర్లు విస్తీర్ణం కలిగిన భూమి మరియు దానికి సంబంధించిన అన్ని రకాల సులభ హక్కులు మరియు అనుబంధ హక్కులు కలిగి ఉన్నది. ఈ ఆస్తి డాక్యుమెంట్ నెం. 163/2020 ప్రకారం షేక్ నాగూర్ వలి, తండ్రి: ఖాదర్ వలి పేరు మీద నమోదై ఉన్నది.
ఈ నోటీసు ద్వారా సాధారణ ప్రజానీకమంతటికీ ఇందుమూలంగా హెచ్చరిక చేయునది ఏమనగా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్.ఎఫ్.ఎల్) యొక్క అధీకృత అధికారి పైన తెలిపిన స్థిరాస్తి చట్టబద్ధ లాంఛనాత్మకంగా స్వాధీన చేపట్టినందున, ఈ నోటీసు అందిన తర్వాత శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్.ఎఫ్.ఎల్) యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా, ఋణగ్రహీతలు లేదా ఎవరేని వ్యక్తి ఈ నోటీసులో పైన తెలిపిన ఏదేని సెక్యూర్డ్ ఆస్తిని అమ్మకం, లీజు లేదా మరే విధంగానైనా లావాదేవీ జరపడం ద్వారా బదిలీ చేయడం / అన్యాక్రాంతం చేయరాదు.

తేదీ: 24-01-2026 అధీకృత అధికారి
ప్రదేశం: అద్దంకి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి

పర్చూరు: మండల పరిధిలోని అన్ని దేవాలయాలు, మసీదులు, చర్చిల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై పులి గోపి సూచించారు. గ్రామాల్లోని పలు దేవాలయాలు, మసీదులు, చర్చిలను ఆయన మంగళవారం పరిశీలించి, భద్రతపై ఆయా కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. ఈనెలాఖరులోపు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

వేటపాలెం: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం చల్లారెడ్డిపాలెంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువుల్లో వచ్చే వ్యాధుల గురించి వివరించడంతో పాటు వాటి నివారణకు తీసుకోవాల్సిన సూచనలను వైద్యులు అందజేశారు. నులిపురుగు మందులు, ఖనిజ లవణ మిశ్రమాలు పశుపోషకులకు పంపిణీ చేశారు. ఆ శాఖ డిప్యూటీ డైరెక్టరు డాక్టరు టీఆర్‌కే ప్రసాద్, జిల్లా పశువైద్యాధికారి డాక్టరు వేణుగోపాల్, చీరాల సహాయ సంచాలకులు డాక్టరు సజ్జా చిట్టిబాబు, వేటపాలెం పశువైద్యాధికారి శర్మిత భాగ్యశ్రీ పాల్గొన్నారు. చీరాల మండలం ఈపూరుపాలెం పంచాయతీ పరిధి బోయినవారిపాలెంలో నిర్వహించిన శిబిరంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వాదం చాటాలి

పర్చూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వాదాన్ని గ్రామగ్రామాన చాటాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య చెప్పారు. మంగళవారం స్థానిక హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.సురేంద్ర, రాష్ట్ర నాయకులు విజయ్‌కుమార్, సుధాకర్, జిల్లా అధ్యక్షుడు ఆర్.కోటి పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

ఇంకొల్లు: నాగండ్లలో బలహీన వర్గాలపై జరిగిన దాడికి నిరసనగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య మాట్లాడుతూ దాడిచేసిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకుమారికి వినతిపత్రం అందజేశారు. వెంకట్రావు, పి.వెంకట్రావు, శ్రీనివాసరావు, కొండయ్య, శ్రీను, అంజయ్య, యేసయ్య, భాను పాల్గొన్నారు.

అపీ ఇవీ

శనగ దిగుబడులకు విత్తన ఎంపిక ముఖ్యం

పావులూరు (ఇంకొల్లు): శనగలో దిగుబడులు పెరగాలంటే విత్తన ఎంపిక ముఖ్యమని వ్యవసాయాధికారిణి మేరమ్మ పేర్కొన్నారు. పావులూరులో మంగళవారం శనగ దిగుబడులు సస్యరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచి లూథియమ్మ, వ్యవసాయ సహాయకులు కిషోర్, ధీరజ్, రైతులు పాల్గొన్నారు. ✦ మండలంలోని పోతినవారిపాలేనికి చెందిన అభ్యుదయ రైతు పోతిన వెంకట్రావు సాగుచేస్తున్న నూతన మినుము వంగడాన్ని కారంచేడు మండల వ్యవసాయధికారి నాగరాజు పరిశీలించారు. వెంకట్రావు తమిళనాడు పరిశోధనా కేంద్రం నుంచి తీసుకొచ్చిన తిరుపతి బ్లాక్‌గ్రామ్ (టీబీజి) 141 రకం మినుము ఐదెకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం కాపు దశకు చేరగా పరిశీలించారు.

కారంచేడు: మండలంలోని పోతినేనివారిపాలెంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. గ్రామంలో ఈ ఏడాది రైతులు చేపట్టిన నూతన రకమైన ఎన్‌బీఈజీ 857 శనగ పంటను ఏవో ఎం.నాగరాజు పరిశీలించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పర్చూరు, కారంచేడు, చినగంజాం, న్యూస్‌టుడే: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించేంత వరకు రీ సర్వే విధులు నిలుపుదల చేస్తున్నట్లు పర్చూరు, కారంచేడు మండల గ్రామ సర్వేయర్లు మంగళవారం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కారంచేడులో తహసీల్దార్ జి.నాగరాజుకు, పర్చూరులో డిప్యూటీ తహసీల్దార్ సుధారాణి, రీ సర్వే డీటీ అరుణకు వినతిపత్రాలు అందించారు. గ్రామ సంఘం రాష్ట్ర కార్యవర్గ పిలుపు మేరకు రీ సర్వేలో విధులు నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. సర్వేయర్లు వసంతకుమార్, నవీన్, ప్రత్యూష, ప్రవల్లిక, గోపికృష్ణ, లీలానందు, సుమంత్, సతీష్, ప్రసాద్ పాల్గొన్నారు. ✦ చినగంజాంలో తహసీల్దార్ జె.ప్రభాకరరావుకు వీఆర్వోలు మంగళవారం వినతి పత్రం అందజేశారు. నాగేశ్వరరావు, పద్మ, శ్రీదేవి, మునీర్, దానియేలు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ ప్రభాకరరావుకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్వోలు

తహసీల్దార్ కోర్టులో యువకుల బైండోవర్

చీరాల గ్రామీణం: మద్యం తాగి....బైకులపై తిరుగుతూ.. కళాశాల యువతులు, మహిళలను కొంతకాలంగా ఇబ్బందులకు గురిచేస్తున్న ఏడుగురు యువకులను మంగళవారం చీరాల తహసీల్దార్ కోర్టులో బైండోవర్ చేయించారు. ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు.. చీరాల మండలం తోటవారిపాలెం పంచాయతీ బండారు నాగేశ్వరరావు కాలనీలో కొందరు యువకులు మద్యం తాగుతూ.. తరచూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. వీరిని పోలీసులు అదుపులోకి తీసుకుని తహసీల్దార్ గోపీకృష్ణ ముందు హాజరుపర్చారు. తహసీల్దార్ వీరిని హెచ్చరించి, వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేసినట్లు తెలిపారు.

కుర్చీలు, బల్లలు వితరణ

కారంచేడు, న్యూస్‌టుడే: తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే రెవెన్యూ క్లినిక్‌లో సిబ్బంది, ప్రజలు కూర్చునేందుకు తన వంతు సాయంగా కుర్చీలు, బల్లలను గ్రామానికి చెందిన యార్లగడ్డ సురేష్ అందజేశారు. దాతను తహసీల్దార్ జి.నాగరాజు, సిబ్బంది అభినందించారు.

SHRIRAM Finance **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్**
రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032
బ్రాంచ్ : శ్రీ మంజునాథ కాంప్లెక్స్, ఎల్ఐసి ఆఫీస్ ఎదురు, కనిగిరి రోడ్డు, కందుకూరు, ప్రకాశం జిల్లా -523105 (ఎ.పి), website: www.shriramfinance.in

భౌతికంగా స్వాధీనత ప్రకటన రూలు 8(1) ప్రకారం (స్థిరాస్తిపై)

విషయము: లోన్ అకౌంట్ నెం. KNDKRTF2102260001

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (సెకండ్) యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారం **M/s. శ్రీ మంజునాథ కాంప్లెక్స్, ఎల్ఐసి ఆఫీస్ ఎదురు, కనిగిరి రోడ్డు, కందుకూరు, ప్రకాశం జిల్లా -523105**, యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13(12) కు అనుబంధమైన రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీతలను కోరుతూ **23-12-2023** తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయబడినది. **ఋణగ్రహీతలు :**
1) వేముల మల్లిఖార్జున్, తండ్రి: దిబ్బయ్య, నివాసము డి.నెం.6-103, యంయస్‌డి నగర్, మార్టూరు (పోస్ట్ & మం), ప్రకాశం జిల్లా.
2) వేముల మాధవి, భర్త: మల్లిఖార్జున్, నివాసము డి.నెం.6-103, యంయస్‌డి నగర్, మార్టూరు (పోస్ట్ & మం), ప్రకాశం జిల్లా.
3) కొల్లా వీరబ్రహ్మం, తండ్రి: వీరాస్వామి, డి.నెం. 12-141, గన్నవరం రోడ్, మార్టూరు (పోస్ట్ & మం), ప్రకాశం జిల్లా.
వారు ఈ నోటీసులో పేర్కొన్న చెల్లించవలసిన మొత్తము, **రూ.38,84,197/- (అక్షరాల ముప్పై ఎనిమిది లక్షల ఎనభై నాలుగు వేల నూట తొంభై ఏడు రూపాయలు మాత్రమే) వడ్డీ మరియు జరిమానాలతో గల కాంట్రాక్ట్యువల్ చార్జీలతో** కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా ఈ నోటీసు జారీ చేయడమైనది.
ఋణగ్రహీతలు తమ బకాయిలను పూర్తిగా చెల్లించడంలో విఫలమైనందున, వారికి మరియు సాధారణ ప్రజలందరికీ ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ క్రింద సంతకం చేసిన అధీకృత అధికారి, సదరు (చట్టం) లోని సెక్షన్ 13(4) ప్రకారం **07-02-2024** తేదీన సదరు ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా, సదరు భూమి ఖాళీగా ఉన్నందున, మా కార్యనిర్వాహక సిబ్బంది సహాయంతో సదరు (చట్టం) లోని రూల్ 8(1) మరియు రూల్ 9 ప్రకారం, ఈ రోజు అనగా **24-01-2026** న నేరుగా సదరు ఆస్తి యొక్క భౌతిక స్వాధీనాన్ని అధీకృత అధికారి చేపట్టారు.
సదరు ఈ ఆస్తి విషయమై సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకించి ఋణగ్రహీతలకు హెచ్చరించడమేమనగా ఈ ఆస్తి పై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా ఈ నోటీసులో పేర్కొన్న చెల్లించవలసిన **రూ.38,84,197/- (అక్షరాల ముప్పై ఎనిమిది లక్షల ఎనభై నాలుగు వేల నూట తొంభై ఏడు రూపాయలు మాత్రమే) మరియు తదుపరి జమకూడు వడ్డీ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులతో కలిపి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారి ఛార్జీకి లోబడి ఉండునని తెలియపరచడమైనది.

స్థిరాస్తి వివరములు

షెడ్యూలు ఆస్తి దస్తావేజు నెం.6088/2021 ప్రకారం **వేముల మల్లిఖార్జున్, తండ్రి: దిబ్బయ్య, వేముల మాధవి, భర్త: మల్లిఖార్జున్ పేరుతో కలదు.**
షెడ్యూలు-1 : గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, నరసరావుపేట సబ్ జిల్లా, సంతమాగులూరు మండలం, సంతమాగులూరు శివారు, పాతమాగులూరు గ్రామ పంచాయితీ, సంతమాగులూరు గ్రామ అకౌంట్స్ సర్వే డి.నెం.57/ఎ నందలి మొత్తం విస్తీర్ణం ఎకరాలు 2.19 సెంట్లు దీనిని సబ్-డివిజన్ చేసిన తరువాత సర్వే డి.నెం.57/ఎ3 గా మార్చబడిన ఇందులో ఎకరాలు 0.50 సెంట్ల ఈ స్థలము యొక్క కొలతలు తూర్పు నుండి పడమరకు 162.5 అడుగులు మరియు ఉత్తరం నుండి దక్షిణానికి 311 అడుగులు మొత్తం విస్తీర్ణం ఎకరములు 0.50 సెంట్లు లేదా 0.2023 హెక్టార్ల స్థలమునకు **హద్దులు: తూర్పు:** కంభంపాటి సురేష్‌బాబు@ రూబెన్ మరియు ఇరతుల వద్ద నుండి కొనుగోలు చేసిన భూమి, **పడమర:** పైయ్యావుల నాగేంద్ర, నాగార్జున రెడ్డి మరియు ఇతరుల భూమి, **ఉత్తరం:** ఎడమకంటి రాజేశ్వరి వద్ద నుండి వేముల మల్లిఖార్జున కొనుగోలు చేసిన భూమి. **దక్షిణం:** జెట్టి వెంకయ్య వద్ద కొనుగోలు చేసిన భూమి.
షెడ్యూలు-2 : గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, నరసరావుపేట సబ్ జిల్లా, సంతమాగులూరు మండలం, సంతమాగులూరు శివారు, పాతమాగులూరు గ్రామ పంచాయితీ, సంతమాగులూరు గ్రామ అకౌంట్స్ సర్వే డి.నెం.57/ఎ నందలి మొత్తం విస్తీర్ణం ఎకరాలు 2.19 సెంట్లు దీనిని సబ్‌డివిజన్ చేసిన తరువాత సర్వే డి.నెం.57/ఎ4 గా మార్చబడిన ఇందులో ఎకరాలు 0.50 సెంట్ల ఈ స్థలము యొక్క కొలతలు తూర్పు నుండి పడమరకు 162.5 అడుగులు మరియు ఉత్తరం నుండి దక్షిణానికి 311 అడుగులు మొత్తం విస్తీర్ణం ఎకరములు 0.50 సెంట్లు లేదా 0.2023 హెక్టార్ల స్థలమునకు **హద్దులు: తూర్పు:** కంభంపాటి సురేష్‌బాబు @ రూబెన్ మరియు ఇరతుల వద్ద నుండి కొనుగోలు చేసిన భూమి, **పడమర:** కొనుగోలు దారు వేముల మల్లిఖార్జున్ భూమి, **ఉత్తరం:** కంభంపాటి సురేష్‌బాబు @ రూబెన్ మరియు ఇరతుల నుండి కొనుగోలు చేసిన భూమి. **దక్షిణం:** ఎడమకంటి బాలమద్దిలేటి రెడ్డి వద్ద నుండి వేముల మాధవి కొనుగోలు చేసిన భూమి.

తేది : 24.01.2026 సం/- అధీకృత అధికారి,
ప్రదేశం : కందుకూరు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

(c) eenadu

తెప్పోత్సవం.. నేత్రోత్సవం

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తిరుపతి గోవిందరాజస్వామివారి తెప్పోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం సాయంత్రం రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ పార్థసారథిస్వామి వారు భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామి వారు ఉభయ దేవేరులతో కలిసి తెప్పపై ఐదు చుట్లు విహరించి భక్తులకు అభయమిచ్చారు. అనంతరం ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగారు. బుధవారం కల్యాణ వేంకటేశ్వర స్వామివారు తెప్పలపై భక్తులను అనుగ్రహించనున్నారు. ఈ సందర్భంగా తితిదే హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో భజనలు, హరికథ, సంగీత కార్యక్రమాలు నిర్వహించారు.

నెలాఖరులో సీఎం కుప్పం రాక

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్, పక్కన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎస్పీ తుషార్ డూడి, కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్..

మూడు రోజుల పర్యటన ఖరారు

కుప్పం, కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెలాఖరులో కుప్పం రానున్నారు. ఈ నెల 30, 31, ఫిబ్రవరి 1న ఆయన సొంత నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తారు. ఈ మేరకు అధికారులు ప్రాథమిక షెడ్యూలును రూపొందించారు.

- 30న శుక్రవారం గుడుపల్లె మండలం అగస్త్య విజ్ఞాన కేంద్రంలోని హెలిపాడ్‌కు సీఎం చేరుకుంటారు. స్థానికంగా కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం.. కుప్పం మున్సిపాలిటీ పరిధిలో పర్యటిస్తారు. ఏపీ పర్యాటక పున్నమి హోటల్‌ను పునఃప్రారంభిస్తారు. పట్టణ బైపాస్ మార్గంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. శాంతిపురం మండలం శివపురంలోని స్వగృహంలో రాత్రి బస చేస్తారు.
- 31న ప్రజల నుంచి వినతులు స్వీకరణ, కంగుందిలో పర్యాటక అభివృద్ధి పనుల పరిశీలన అనంతరం శాంతిపురం మండలం తులసినాయనపల్లె వద్ద ప్రజావేదిక సభలో పాల్గొంటారు. ఈ-సైకిళ్ల పంపిణీ, నూతన పింఛన్లను అందజేస్తారు.
- ఒకటో తేదీ ఉదయం ప్రజల నుంచి వినతుల స్వీకరణ అనంతరం.. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో సమీక్ష తర్వాత తుమ్మిశి రోడ్డులోని హెలిపాడ్‌కు చేరుకొని తిరుగుపయనమవుతారు.

ఏర్పాట్లపై సమీక్ష

పర్యటన ఏర్పాట్లపై మంగళవారం కడా కార్యాలయంలో ఎమ్మెల్సీ శ్రీకాంత్, ఎస్పీ తుషార్ డూడి, కడా డైరెక్టర్ వికాస్ మర్మత్‌తో కలిసి సమీక్షించారు. అంతకుముందు సీఎం పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలో పాల్గొంటారని, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారన్నారని పేర్కొన్నారు. సామాజిక భద్రతా పింఛన్ పంపిణీ చేస్తారని, వ్యవసాయ, అనుబంధ రంగాలపై సంబంధించి ప్రత్యేక సమీక్ష ఉంటుందని వివరించారు. హంద్రీ-నీవా, సంజీవని ప్రాజెక్టు సంబంధించిన నివేదికలు అధికారులు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె

ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: తమ సమస్యల పరిష్కారం కోరుతూ బ్యాంకు ఉద్యోగులు మంగళవారం సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ నేతలు మాట్లాడుతూ బ్యాంకులు వారంలో ఐదు రోజులు పని చేసేలా ఆర్‌బీఐ ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. పని దినాలను తగ్గించి.. ఉద్యోగుల పని గంటలను పెంచాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శేఖర్, శ్రీహరి, వినోద్, విగ్నేష్, చలపతి, గంగిరెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుకున్నోళ్లే చిక్కుతున్నారు

సైబర్ నేరగాళ్ల వలలో విద్యావంతులు

- చిత్తూరు నగరానికి చెందిన ఓ వైద్యుడికి టెలికాం సంస్థ నుంచి మాట్లాడుతున్నామని ఫోన్ చేశారు. మీ ఆధార్‌కార్డుతో లెక్కలేనన్ని ఫోన్‌నంబర్లు యాక్టివ్‌లో ఉన్నాయని, వాటిని తొలగించడానికి వివరాలు కావాలనడంతో పూర్తి వివరాలను ఇచ్చేశారు. వాటి ఆధారంగా సైబర్ నేరగాళ్లు నకిలీ వారెంట్‌ను సృష్టించారు. అదే వైద్యునికి వీడియో కాల్ చేసి చూపించారు. తాము ఈడీ, సీబీఐ నుంచి మాట్లాడుతున్నామని, మాదకద్రవ్యాల కేసులో ఉన్నారని బెదిరించారు. వాటి నుంచి ఎలాంటి సమస్య లేకుండా బయటపడాలంటే కొంత నగదు చెల్లించాలని నమ్మించారు. ఇలా సుమారు రూ.90 లక్షలు చెల్లించారు. ఆఖరకు మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు.
- పూతలపట్టు మండలానికి చెందిన ఓ యువతి ఎంబీఏ చదివి.. ఆరు నెలలు స్టాక్‌మార్కెట్ కోర్సు చేశారు. ఇటీవల ఓ ప్రైవేటు బ్యాంకు ప్రచారంలో స్టాక్స్ కొనుగోలు చేసి లాభాలు పొందొచ్చని వచ్చింది. వాటికి ఆకర్షితురాలైన యువతి మొదట్లో రూ.2 వేలు పెట్టుబడి పెట్టారు.. రెట్టింపు ఆదాయం వచ్చినట్లు సదరు సైట్‌లో కనిపించింది. విడతల వారీగా రూ.32 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. చివరకు లాభాలు విత్ డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా.. కుదరకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించారు.

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: ఇలా సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుతున్న వారిలో 90 శాతం విద్యావంతులు, ఉద్యోగస్తులే ఉంటున్నారు. డబ్బులు ఊరికే రావని తెలిసినా.. అత్యాశకు పోయి మోసపోతున్నారు. షేర్ మార్కెట్లలో పెట్టుబడులంటూ.. డిజిటల్ అరెస్టులని.. నకిలీ లింకులు పంపించి సైబర్ నేరస్థులు ఆర్థికంగా దోచుకుంటున్నారు. అలా దాటిన సొమ్మును ఆన్‌లైన్ గేమింగ్ ఖాతాలకు వెంటనే బదిలీ చేస్తున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

- టెక్నాలజీని వినియోగించే వారు జాగ్రత్తలు పాటించాలి
- రిజిస్టర్ కాని సంస్థలో పెట్టుబడులు పెట్టకూడదు.
- డిజిటల్ అరెస్టులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండవు
- చరవాణులు, టెలిగ్రామ్‌లో వచ్చే లింకులు, ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయవద్దు.

వారిపైనే దృష్టి

బ్యాంకు ఖాతాల్లో డబ్బులు.. ఫిక్సిడ్ డిపాజిట్లు ఉన్న వారిపైనే సైబర్ నేరగాళ్లు దృష్టిసారిస్తున్నారు. విశ్రాంత ఉద్యోగులను డిజిటల్ అరెస్టుల పేరుతో భయపెట్టి బ్యాంకులో ఉన్న నగదు కాజేస్తున్నారు. పిల్లలు విదేశాల్లో ఉంటే ఒంటరిగా ఉన్న వృద్ధుల బ్యాంకు ఖాతాలపై నిఘా పెడుతున్నారు. షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని బుట్టలో వేసుకుంటున్నారు.

వెంటనే అప్రమత్తమైతే..

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులను లేదా 1903 నంబరు ఆశ్రయించాలి. రెండు గంటలోపు పోలీసులను సంప్రదిస్తే కాజేసిన మొత్తాన్ని తిరిగి పొందవచ్చు. కనీసం 24 గంటల్లో స్పందించినా ప్రయత్నించవచ్చు. వారు మీ ఖాతా నుంచి ఏ ఖాతాకు డబ్బు జమైందో గుర్తించి.. అందులోని నగదును ఫ్రీజ్ చేస్తారు. ఆలస్యం చేస్తే.. బదిలీ చేయించుకున్న మొత్తాన్ని ఇతరుల ఖాతాలకు మళ్లించే అవకాశం ఉంటుంది.

వివరాలు	2024	2025
కేసులు	22	19
దోపిడీ (కోట్లు)	3.35	7.63
రికవరీ (కోట్లు)	0.23	1.73

ఈ నంబర్లకు ఫిర్యాదు చేయండి

టోల్ ఫ్రీ: 1930, అత్యవసర: 112
వాట్సప్: 80999 99977

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటల్లో, రూ.300 ఎస్ఈడీ టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో దర్శనం లభించనుంది. సోమవారం శ్రీవారిని 75,791 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.3.77 కోట్లు హుండీ కానుకలు లభించాయి. తిరుపతిలో శ్రీవారి దర్శనానికి సంబంధించి శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు 12 వేల టోకెన్లు జారీ చేశారు. వీరికి బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం కానుంది. శ్రీవారి మెట్టు నడకదారి భక్తులకు 2 వేల టోకెన్లు జారీ చేశారు.

మాయ చేసి.. మాయం చేసి..

- కాగితాల్లోనే ఆడిట్ అభ్యంతరాలు
- జడ్పీలో కనిపించని దస్త్రాలు

న్యూస్‌టుడే, చిత్తూరు(మిట్టూరు)

ప్రజల నుంచి పన్నుల రూపంలో వచ్చే ఆదాయం, ప్రభుత్వం వివిధ పద్దుల కింద ఇచ్చే నిధుల వ్యయంలో స్థానిక సంస్థలు పారదర్శకత పాటించడం లేదు.. చేసే పనులకు, రాస్తున్న లెక్కలకు పొంతన ఉండటం లేదు.. గత వైకాపా పాలనలో 2023-24లో జిల్లా పరిషత్‌లో నిధుల ఖర్చులకు సంబంధించి రికార్డులే లేవని ఆడిట్‌శాఖ గుర్తించింది.. నిబంధనలు అతిక్రమించి ఇష్టానుసారంగా నిధులు ఖర్చు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

దస్త్రాలే లేవట..?

జడ్పీలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన దస్త్రాలే లేవని, తామెలా అందజేయగలమంటూ జడ్పీ అధికారులు.. ఆడిట్ శాఖ అధికారులకు చెప్పినట్లు సమాచారం. జడ్పీకి విడుదలైన నిధులు, ఖర్చులు, ఆదాయం తదితర వివిధ విభాగాల దస్త్రాలు మాయమైనట్లు తెలిసింది.

ఎప్పటికైనా పరిష్కరించుకోవాల్సిందే..

అభ్యంతరాలను ఎప్పటికైనా పరిష్కరించుకోవాల్సిందే. లేకుంటే ఆ సమయంలో విధుల్లో ఉన్న అధికారులకు ఇబ్బందులు తప్పవు. జిల్లా ఆడిట్ శాఖ ద్వారా ఇప్పటికే జడ్పీ అధికారులకు నోటీసులు ఇచ్చాం. స్పందించకపోతే రాష్ట్ర స్థాయి అధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకుంటాం.
–గోవిందప్ప, ఆర్‌డీడీ, ఆడిట్ శాఖ

మాకేం సంబంధం.. బదులివ్వలేం..

ఎప్పుడో జరిగిన పాలనాపరమైన తప్పిదాలు, అక్రమాలతో మాకేం సంబంధం.. ఇప్పుడు మేం బదులివ్వలేమంటూ 2023-24 ఆడిట్ అభ్యంతరాలపై జిల్లా పరిషత్ అధికారులు సమాధానాలు చెబుతున్నారని ఆడిట్ అధికారులు పేర్కొంటున్నారు. జడ్పీ అధికారులకు గతేడాది ఏప్రిల్‌లో జారీ చేసిన ఆడిట్ శాఖ నోటీసులు కాగితాలకే పరిమితమయ్యాయి. సదరు అభ్యంతరాలపై జడ్పీ నుంచి నేటికీ సమాధానాలు లేవు.

రూ.28.88 కోట్లకు లెక్కల్లేవు..?

గత పాలనలో జిల్లాకు చెందిన అప్పటి మంత్రికి వీరవిధేయుడిగా వ్యవహరిస్తూ నాయకుల కనుసన్నల్లో కొనసాగిన విశ్రాంత సీఈవో పలు అవినీతి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు అప్పట్లోనే వెల్లువెత్తాయి. 2023-24లో ఎన్నడూ లేనంతగా 90 అభ్యంతరాలకు సంబంధించి రూ.22.88 కోట్లకు లెక్కల్లేవని ఆడిట్ శాఖ ధ్రువీకరించింది. అభ్యంతరాలకు సంబంధించి దస్త్రాలు అందజేసి మూడు నెలల్లో పరిష్కరించుకోవాలి. అయినా జడ్పీ అధికారుల్లో కదలిక లేదు.

ఇష్టానుసారంగా ఖర్చు..

ఆర్థిక సంఘం నిధులను ఇష్టానుసారంగా ఖర్చు చేశారు. పనులకు సంబంధించి ప్రొసీజర్ ల్యాప్స్, సరైన దస్త్రాలు లేనట్లు ఆడిట్ శాఖ గుర్తించింది. జడ్పీ ప్రావిడెంట్ ఫండ్ విభాగంలో రికార్డు లేకపోవడం గమనార్హం. వడ్డీ చెల్లింపులు, రీయింబర్స్‌మెంట్, క్యాష్ బుక్ నిర్వహణే లేదు. జీఎస్టీ, వ్యాట్, ఐటీ, క్యాసీ తదితర పన్నుల రూపంలో సమకూరిన రూ.25 లక్షలు ప్రభుత్వానికి జమ చేయలేదని అభ్యంతరాల్లో పేర్కొన్నారు.

రోడ్డు విస్తరణకు రూ.18.30 కోట్లు మంజూరు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కుప్పం మండల పరిధిలోని మల్లానూరు నుంచి అడవిబుడుగూరు మీదుగా తమిళనాడు సరిహద్దు వరకు ఉన్న 7.2 కి.మీ రోడ్డు విస్తరణకు రూ.18.30 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

స్విమ్స్‌లో డయాబెటిక్ ఫుట్ క్లినిక్

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: స్విమ్స్ - శ్రీ పద్మావతి హాస్పిటల్‌లో డయాబెటిక్ ఫుట్ క్లినిక్ సేవలు ప్రారంభించినట్లు సంచాలకులు డాక్టర్ ఆర్‌వీ కుమార్ పేర్కొన్నారు. ఎండోక్రైనాలజి, జనరల్ సర్జరీ, సీటీ సర్జరీ విభాగాల ఆధ్వర్యంలో సేవలు కొనసాగుతాయని తెలిపారు. మధుమేహంతో పాదాల నరాలు పనిచేయకపోవడం, రక్త ప్రసరణ తగ్గిపోవడం, పాదాల చర్మం రంగు మారడం, గాయాలు తగ్గకపోవడం, తిమ్మిర్లు, పాదాల్లో వేడి.. వాపు, దుర్వాసన వంటి లక్షణాలు ఉంటే డయాబెటిక్ ఫుట్ క్లినిక్ వైద్యులను సంప్రదించాలని తెలిపారు. విభాగం అధ్యక్షుడు డాక్టర్ హరిప్రసాద్ మాట్లాడుతూ.. ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు క్లినిక్ కొనసాగుతుందని తెలిపారు. ప్రతి మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల పాటు క్లినిక్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

పేటమిట్టకు ఉత్తమ పంచాయతీ అవార్డు

పూతలపట్టు, న్యూస్‌టుడే: పేటమిట్ట సర్పంచి గల్లా రాధాకృష్ణ గణతంత్ర దినోత్సవం రోజున దిల్లీలో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎస్పీ సింగ్ చేతుల మీదుగా ఉత్తమ పంచాయతీ అవార్డును అందుకున్నారు. పంచాయతీలో రాజన్న ట్రస్టు ఆధ్వర్యంలో భూగర్భ మురుగు కాలువలు, పశువైద్యశాల ఏర్పాటు చేశారు. ఇంటింటికీ తాగునీటి సరఫరాతో పాటు ఆర్వో ప్లాంటు ద్వారా శుద్ధజలాలు అందిస్తున్నారు. వంద శాతం ఇంటి పన్ను వసూలు, సీసీ రోడ్లు, ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు తదితర పనులతో పంచాయతీ ప్రగతి పథంలో ఉందని సర్పంచి పేర్కొన్నారు.

104FM Tirupati

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

వైభవంగా పశువుల పండగ

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం పశువుల పండగ వైభవంగా జరిగింది. గ్రామదేవతల ఆలయాల వద్ద అమ్మవారికి అంబలి నివేదించి ప్రత్యేక పూజలు చేశారు. పశువులను రంగుల పుష్పాలతో అలంకరించి స్థానిక ఆలయాల వద్ద పూజలు చేసి ఊరేగించారు. శెట్టిపల్లెలో గంగమ్మ ఆలయం వద్ద పశువులకు సామూహికంగా పూజలు చేశారు. శ్రీచౌడేశ్వరీదేవి ఆలయానికి పొంగళ్లు తీసుకెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ పొలిమేర్లలో అమ్మవారి శిరస్సును అలంకరించి బాణవేడుకలు, డప్పువాయిద్యాలతో గ్రామ వీధుల్లో ఊరేగించారు.

చౌడేశ్వరీదేవి ఆలయం వద్దకు పొంగళ్లు తీసుకెళ్తున్న మహిళలు

తప్పులు.. చిక్కులు

జిల్లాలో ఇప్పటికీ తొలగని రీ సర్వే సమస్యలు

జగన్ పాలనలో హడావుడిగా చేసిన రీ సర్వే ఇప్పటికీ అన్నదాతల్లో ఆందోళనను కలిగిస్తోంది. అప్పట్లో హక్కుదారుల సమ్మతి లేకుండా వేగంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని భావించడంతోనే భూమి విస్తీర్ణం, పేర్లు, ఫొటోలు తప్పుగా ముద్రించి యాజమాన్య హక్కు పత్రాలు పంపిణీ చేశారు. వాటిపై జగన్ ఫొటోను ఉంచడంపై అప్పట్లోనే రైతుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వచ్చాయి. అయినా లెక్క పెట్టకుండా వాటిని పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అప్పటి తప్పిదాలను సరిదిద్దడానికి ‘రీ సర్వే గ్రామసభ’లు నిర్వహించినా పైపైనే విచారణ చేసి మమ అనిపించారు.

జగన్ హయాంలో ఆయన ఫొటోతో ఇచ్చిన పాసు పుస్తకం

రుణాలు అందక..

రీ సర్వే జరిగిన గ్రామాల్లో జగన్ పాలనలో సర్వే నంబర్ల స్థానంలో ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్‌పీఎం)ను ప్రవేశపెట్టారు. అప్పట్లో ఐదాగురు రైతులకు కలిపి ఒకే ఎల్‌పీఎం కేటాయించారు. దాంతో వారికి పంట రుణాలూ రాని పరిస్థితి. ఒకవేళ భూమిని ఎవరికైనా విక్రయిద్దామన్నా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంక్షేమ పథకాలు కూడా అందలేదు. గతంలో ఈ సమస్య పరిష్కారానికి రూ.500 రుసుము చెల్లించాల్సి ఉండగా కూటమి ప్రభుత్వం రూ.50 ఇస్తే చాలని పేర్కొంది. అన్నదాతలు ఎవరైనా ముందుకు రాకపోతే రెవెన్యూ యంత్రాంగమే గుర్తించి వాటిని చక్కదిద్దాలని ఉన్నతాధికారులు చెప్పినా క్షేత్ర స్థాయిలో అమలు కాలేదు. ఇటీవల పంపిణీ చేసిన పాసు పుస్తకాల్లోనూ ఇవే పునరావృతం కావడంతో రైతులు తిరస్కరించారు.

రెవెన్యూ క్లినిక్‌లలోనైనా పరిష్కరిస్తేనే

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు. యంత్రాంగం ఈ కార్యక్రమంలో రీ సర్వేకు సంబంధించి వచ్చిన అర్జీలనైనా పరిష్కరిస్తే అన్నదాతలకు చిక్కులు తప్పుతాయి. ఇది సరిగ్గా జరుగుతుందా? లేదా? అని ఉన్నతాధికారులు కూడా పర్యవేక్షించాలి.

వైకాపా హయాంలో రీ సర్వే పూర్తయిన గ్రామాలు:	319
విస్తీర్ణం:	3.02 లక్షల ఎకరాలు
సమస్యలపై వచ్చిన అర్జీలు:	13,498

ఈనాడు- చిత్తూరు

(c) eenadu

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - తాడికొండ

బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Hospitality Partner: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Man of the Series: Hero
Digital Partner: ఈనాడు.నెట్ TV Partner: ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్, ఈ FM Organised by ఈనాడు

విజయనందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - 1 జూనియర్స్: మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్స్‌లతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులు చేసి ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - 1 జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ్ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సులతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

గ్రౌండ్-2లో సీనియర్స్ : సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

సీనియర్స్ విన్నర్స్ రాయలసీమ రాకర్స్

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ చరణ్ జిత్ ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-1 (జూనియర్స్)

మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్

మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)

మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్

మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

క్రీడల్లో మెరికలు

● రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: క్రీడలు.. విద్యార్థి శారీరక మానసికోల్లాసానికి దోహదం చేస్తాయి.. చదువుతో పాటు క్రీడల్లో సత్తా చాటుతున్నారు పలువురు విద్యార్థులు.. రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో సత్తా చాటారు.. పతకాలు సాధించి జిల్లాకు ప్రతిష్ఠను తీసుకొచ్చారు.. జాతీయ స్థాయిలోనూ ప్రాతినిధ్యం వహిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

సాధన చేస్తున్న విద్యార్థులు (పాత చిత్రం)

ఆటలో దివ్యం..

దివ్య.. చిత్తూరులోని ఎం.అగ్రహారం జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన తనకు క్రీడలంటే ఎంతో ఆసక్తి. శిక్షకుల ప్రోత్సాహంతో హాకీలో సాధన చేస్తూ నైపుణ్యాన్ని సాధించింది. నెల్లూరులో గత నెలలో జరిగిన అండర్-17 స్కూల్స్ గేమ్స్ హాకీలో కాంస్యం సాధించింది.

శెభాష్ అరుణ్..

అరుణ్‌కుమార్.. చిత్తూరులోని ఎం.అగ్రహారం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. వ్యాయామ శిక్షకుల స్ఫూర్తితో హాకీ క్రీడపై మక్కువ పెంచుకుని గత రెండేళ్లుగా సాధన చేస్తున్నాడు. జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో సత్తాచాటి జిల్లా జట్టులో చోటు దక్కించుకున్నాడు. గతనెలలో కడపలో జరిగిన అండర్-17 స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీల్లోనూ సత్తా చాటాడు.

నెట్‌బాల్‌లో మేటిగా..

వైష్ణవ్.. చిత్తూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. అటు చదువు, ఇటు నెట్‌బాల్ క్రీడలో సాధన చేస్తూ ప్రతిభ ని రూపించుకుంటున్నాడు. గతేడాది అన్నమయ్య జిల్లా మదనపల్లెలో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-17 గేమ్స్ నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకి ఎంపికై రాష్ట్ర స్థాయి పోటీ ల్లో కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు.

నాణ్యతగా ఆర్‌డీఎస్ఎస్ పనులు

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ 24 గంటల పాటు త్రీఫేజ్ విద్యుత్తు సరఫరాకు కేంద్ర ప్రభుత్వం ఆర్‌డీఎస్ఎస్(రీవ్యాప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం)కు శ్రీకారం చుట్టింది. పనులు నాణ్యతగా.. వేగవంతంపై దృష్టి సారించాలని ఏపీఎస్పీడీసీఎల్ సీజీఎం(ప్రాజెక్ట్స్) రమణాదేవి పేర్కొన్నారు. మంగళవారం జిల్లాలోని నగరి, గంగాధరనెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాల్లో జరుగుతున్న ఆర్‌డీఎస్ఎస్ పనులను పరిశీలించారు. సీజీఎం మాట్లాడుతూ నాణ్యతలో రాజీలేదని.. నిర్దేశిత పరిమాణాల్లో పనులు చేపట్టాలన్నారు. పనుల పురోగతిపై కన్‌స్ట్రక్షన్ ఇంజినీర్లతో సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా కన్‌స్ట్రక్షన్ విభాగం ఈఈ భాస్కర్‌నాయుడు, ఇంజినీర్లు, గుత్తేదారు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పనులు పరిశీలిస్తున్న ఏపీఎస్పీడీసీఎల్ సీజీఎం రమణాదేవి

గణనాథుడి సేవలో ప్రముఖులు

ఆదాయ పన్నుశాఖ అప్పిలేట్ ట్రైబ్యునల్ ఛైర్మన్ సీవీ బదంగ్‌కు చిత్రపటాన్ని ఇస్తున్న ఈవో కిశోర్

కాణిపాకం, న్యూస్‌టుడే: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని తిరుపతి బర్డ్స్ డైరక్టర్ డాక్టర్ జగదీశ్, ఆదాయ పన్నుశాఖ అప్పిలేట్ ట్రైబ్యునల్ ఛైర్మన్ సీవీ బదంగ్ మంగళవారం వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్ద ప్రముఖులకు ఛైర్మన్ మణినాయుడు, ఈవో పెంచల కిశోర్ స్వాగతం పలికారు. మూలవిరాట్టు దర్శన అనంతరం వారికి స్వామి వారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. పండితులు వేదాశీర్వచనం చేశారు. ఏఈవోలు రవీంద్రబాబు, ధనపాల్, సూపరింటెండెంట్ వాసు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కానిస్టేబుల్‌కు నగదు రివార్డు

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: కుప్పం ఎక్సైజ్ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేష్‌కు... మంగళవారం కుప్పంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ నగదు రివార్డు అందించారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంతో పాటు కేసుల ఛేదనలో ప్రతిభ కనబరిచినందుకు ఈ రివార్డు అందించినట్లు ఆయన తెలిపారు.

208 విద్యుత్తు సమస్యలు గుర్తింపు

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ఆదేశాల మేరకు జిల్లాలో మంగళవారం నిర్వహించిన 'కరెంటోళ్ల జనబాట' కార్యక్రమంలో 208 సమస్యలను అధికారులు గుర్తించినట్లు జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. సర్వీసు లైన్లు, 11కేవీ లైన్లు, ఎల్‌టీ లైన్లు మార్పు, సరఫరాలో అంతరాయాలు తదితర సమస్యలను గుర్తించామని..19 సమస్యలను తక్షణమే పరిష్కరించామన్నారు. మిగిలిన 189 సమస్యలను నిర్ణీత గడువు లోగా పరిష్కరించనున్నామని ఆయన తెలిపారు.

ఏపీ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా సురేష్‌యాదవ్

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్ర బీసీ నాయకత్వం తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించిందని సురేష్‌యాదవ్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి రాజీలేని పోరాటం చేస్తామన్నారు. ఈ సందర్భంగా బీసీ నేతలు కృష్ణయ్య, మహేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

'రాజకీయ కక్షతోనే దుకాణాల తొలగింపు'

పెనుమూరు, న్యూస్‌టుడే: రాజకీయ కక్షతోనే పెనుమూరు బస్టాండు సమీపంలోని దుకాణాలను తొలగించారని మాజీ డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి అన్నారు. మంగళవారం ఆయన బస్టాండు వద్ద తొలగించిన వైకాపాకు చెందిన వారి దుకాణాలను పరిశీలించారు. పెనుమూరులో బస్టాండు, వాణిజ్య సముదాయాన్ని వైకాపా హయాంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాణిజ్య సముదాయం ఏర్పాటుకు తెదేపా నేతలు కూడా సమ్మతించారన్నారు. ప్రస్తుతం ఉన్న వారికి ఇచ్చిన తర్వాతే ఇతరులకు దుకాణాలు ఇవ్వాలని అందరూ కలిసి నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కొన్ని కారణాలతో దుకాణాల ప్రారంభం వాయిదా పడిందన్నారు. ప్రభుత్వం మారడంతో అసంబద్ధంగా వేలం పాట నిర్వహించారన్నారు. తొలగించిన దుకాణదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర కార్యదర్శి దయాసాగర్‌రెడ్డి, మండల వైకాపా అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, మాజీ అధ్యక్షుడు సురేష్‌రెడ్డి, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ ద్రాక్షాయణి పాల్గొన్నారు. ఉద్రిక్తతలు తలెత్తకుండా చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ ఆధ్వర్యంలో నలుగురు సీఐలు, ఎనిమిది మంది ఎస్సైలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వనితలకు లక్ష్మీ కటాక్షం

● మెప్మాలో శిక్షణతో పట్టణాల్లో ఉపాధి

పుత్తూరు, న్యూస్‌టుడే: పట్టణ ప్రాంత మహిళల ఉపాధి పొందేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.. అక్షరాస్యులైన వారిని ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నారు.. తద్వారా వారు కుటుంబానికి అండగా నిలిచేలా పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే తర్ఫీదునిచ్చి డిజిటల్ లక్ష్మిలుగా ఎంపిక చేశారు.

పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలో డిజిటల్ లక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నారు. మెప్మా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా 45 మందికి గాను ప్రస్తుతం 15 మందికి శిక్షణ అందించారు. వారు ఇంటి వద్ద నుంచే ప్రజలకు అవసరమైన 166 రకాల సేవలు అందిస్తారు. చరవాణి రీఛార్జి, పాన్, ఆధార్ నవీకరణ, కరెంటు బిల్లుల వసూలు, బీమా చెల్లిస్తారు. ఆయా విభాగాలను బట్టి కమీషన్ రూపంలో వారికి ఆదాయం చేకూరుతుంది. ఎటొచ్చీ నెలకు కనిష్ఠంగా ఒక్కో డిజిలక్ష్మికి సరాసరి నెలకు రూ.30 వేల వరకు ఆదాయం సమకూర్చాలనేది ప్రభుత్వం సంకల్పం.

స్వయం సహాయక సంఘ సభ్యులు

మరింత మందికి అవకాశం దక్కేలా..

పుత్తూరు పురపాలిక సంఘంలో మొత్తం 1,194 పొదుపు సంఘాలు ఉండగా, 11,190 మంది వరకు సభ్యులు ఉన్నారు. కేవలం పురపాలక సంఘాల్లో ఆసక్తి ఉన్న పొదుపు మహిళలను మాత్రమే ఎంపిక చేశారు. ఇంకా ఆసక్తి, అర్హత ఉన్న వారెవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని మెప్మా అధికారులు సూచిస్తున్నారు. పట్టణంలో వారి కోసం వినియోగదారుల సేవా కేంద్రాన్ని త్వరలో ప్రారంభించనున్నారు. పురపాలక సంఘ కమిషనర్ సహకారంతో పుత్తూరులో సేవా కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని సిటీ మిషన్ మేనేజరు సునీత చెప్పారు. ఇప్పటికే శిక్షణ పూర్తి చేశామని, 15 మంది కేంద్రాలు ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు వచ్చారని, బ్యాంకర్లతో మాట్లాడి రుణాలు ఇప్పిస్తున్నామని ఆమె తెలిపారు. త్వరలోనే సదరు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

సమస్యల పరిష్కారానికి దశల వారీగా ఉద్యమం

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి దశల వారీగా ఉద్యమం చేపడుతున్నట్లు ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పురుషోత్తంనాయుడు తెలిపారు. స్థానిక ఎస్టీయూ భవన్‌లో మంగళవారం సాయంత్రం ఎస్టీయూ ఉద్యమ కార్యాచరణకు సంబంధించిన కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. మెరుగైన వేతన సవరణ అమలు చేస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం విస్మరించిందని వాపోయారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవరాజులరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 30న అన్ని మండలాల్లో తహసీల్దార్లకు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 10న కలెక్టరేట్ల వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు గంటా మోహన్, చంద్రన్, ప్రహసిత్, రాధాకుమారి పాల్గొన్నారు.

ఆటో బోల్తా... 12 మంది విద్యార్థులకు గాయాలు

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: రాగిమానుపెంట మార్గంలోని రాళ్లవంక వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 12 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. వీరిలో తీవ్రంగా గాయపడిన ఇద్దరి విద్యార్థులకు బంగారుపాళ్యం ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి చిత్తూరు వైద్యశాలకు తరలించారు. సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు... వేపనపల్లె నుంచి రాగిమానుపెంట జడ్పీ ఉన్నత పాఠశాలకు 12 మంది విద్యార్థులతో వస్తున్న ఆటో ఎదురుగా వచ్చిన ప్రైవేటు పాఠశాల బస్సును ఢీకొని బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న మహేంద్ర, చరణ్, దిలీప్, పూర్ణలతోపాటు మరో ఎనిమిది మంది గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన దిలీప్, పూర్ణలను చిత్తూరు వైద్యశాలకు తరలించారు. బాధితులను జిల్లా విద్యాశాఖాధికారి రాజేంద్రప్రసాద్, ఏపీసీ వెంకటరమణ పరామర్శించారు. ఆటో డ్రైవరు చలపతిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రమాద స్థలంలో బోల్తా పడిన ఆటో

గాయపడిన విద్యార్థులు పూర్ణ, దిలీప్

లోకేశ్ పాదయాత్ర రాజకీయ నవశకానికి నాంది

కాణిపాకం, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ మూడేళ్ల కిందట చేపట్టిన 'యువగళం' పాదయాత్ర రాజకీయ నవశకానికి నాంది పలికిందని శాప్ ఛైర్మన్ అమినేని రవినాయుడు పేర్కొన్నారు. పాదయాత్ర చేపట్టి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా కాణిపాకం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయం వద్ద మంగళవారం కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకుని మాట్లాడారు. 2023లో కుప్పంలో పాదయాత్రకు తొలి అడుగు వేసినట్లు గుర్తుచేశారు. 226 రోజులు 3132 కి.మీ. దూరం చేపట్టిన పాదయాత్రలో పలు సమస్యలను గుర్తించి ప్రభుత్వం వచ్చిన వెంటనే వాటికి పరిష్కార మార్గం చూపిన ఘనత లోకేశ్‌కు దక్కిందన్నారు. ఆలయ ఏఈవో రవీంద్రబాబు, తెదేపా మండల అధ్యక్షుడు గంగారపు హరిబాబునాయుడు, ఆలయ మాజీ ఛైర్మన్ కేసీ మధుసూధన్‌రావు, తిరుపతి గంగమ్మ ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్, కాపు కార్పొరేషన్ డైరక్టర్ తోట వాసుదేవన్, నాయకులు, కార్యకర్తలు, పాదయాత్ర వాలంటీర్లు పాల్గొన్నారు.

కాణిపాకం ఆలయం వద్ద కొబ్బరికాయల కొట్టి మొక్కు తీర్చుకుంటున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు, చిత్రంలో ఆలయ ఛైర్మన్ మణినాయుడు

మామిడిలో సస్యరక్షణ చర్యలు

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు పడ్డాయని, ఇది మామిడి పంటపై తీవ్ర ప్రభావం చూపుతుందని, రసం పీల్చు పురుగులు, శిలీంద్రాలు ఆశించి దిగుబడి నష్టపరిచే అవకాశం ఉందనిరాస్ కేవీకే శాస్త్రవేత్తలు సుధాకర్, డా.శ్రీనివాసులు తెలిపారు. సస్యరక్షణ చర్యలను మంగళవారం వెల్లడించారు. తోటల్లో పూత ఒకేసారి రావడానికి మల్టి-కె 10 గ్రా, సూక్ష్మపోషక మిశ్రం 5 గ్రాములు చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. తేనెమంచు పురుగు, నల్లమచ్చ తెగులు, బూడిద తెగులు నివారణకు క్లోరిపైరిఫాస్ 50ఈసీ ఒక మి.లీ., వేపనూనె 3 మి.లీ, డైథేన్ ఎం45, బావిస్టిన్ (సాప్) 2 గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. మొగ్గదశ నుంచి పచ్చిపూత దశలో ఉన్న తోటల్లో తేనెమంచు, నల్లమచ్చ పురుగు, బూడిద తెగులు నివారణకు అసిఫేట్, బుప్రొఫెజిన్ 1.5 గ్రా, హెక్సాకొనజోల్ 5శాతం ఈసీ 1 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. వచ్చిన పూత ఎక్కువగా పిందె పట్టడానికి సూక్ష్మపోషక మిశ్రమాన్ని 5 గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు.

పూత దశలో ఉన్న మామిడి తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వ్యవసాయ రంగాభివృద్ధికి ఒప్పందం

తిరుపతి (వ్యవసాయం), న్యూస్‌టుడే: వ్యవసాయ, అనుబంధ రంగాల్లో చిరు, మధ్యతరహా పరిశ్రమల స్థాపనలో రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం, శిక్షణ ఇచ్చేందుకు వ్యవసాయ కళాశాల విశ్రాంత అధ్యాపకులు ముందుకు రావడం అభినందనీయమని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ ఉపకులపతి డా.ఆర్.శారద జయలక్ష్మీదేవి అన్నారు. వారు ఏర్పాటు చేసిన ఎఫ్.ఐ.ఆర్.ఇ.పి. (ఫైనాన్షియల్ ఇంక్లూషన్ రూరల్ ఆంత్రప్రెన్యూర్ ప్రమోషన్) ట్రస్ట్, వర్సిటీ మధ్య మంగళవారం పరస్పర అవగాహన ఒప్పందం జరిగింది. ఇకపై గ్రామీణ, మహిళా రైతులు, వ్యవసాయ విద్యార్థుల ఆదాయం పెంపునకు మార్గదర్శనం ఇస్తూ వర్సిటీ విస్తరణ కార్యక్రమాలు, నైపుణ్య శిక్షణలో వారు భాగస్వామ్యం వహిస్తారన్నారు. రిజిస్ట్రార్ ఎం.వి.రమణ, విశ్రాంత అధ్యాపకులు చంద్రారెడ్డి, హేమంత్‌కుమార్, పి.సుధాకర్, నాగార్జున, రామమూర్తి, వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వర్సిటీ అధికారులు, విశ్రాంత అధికారుల ట్రస్ట్ సభ్యులు

ప్రకృతి అద్భుతమైన ఇంజినీర్

తిరుపతి (మంగళం), న్యూస్‌టుడే: ప్రకృతి ఓ అద్భుతమైన ఇంజినీరని, జీవవ్యవస్థలు సమస్యలను ఎలా పరిష్కరిస్తాయో గమనించడం ద్వారా మన భూమికి మేలు చేసే స్థిరమైన సాంకేతికతలను మనం సృష్టించవచ్చునని తిరుపతి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐజర్) డైరెక్టర్ ప్రొఫెసర్ శాంతను భట్టాచార్య తెలిపారు. తిరుపతి ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో మంగళవారం నూతనంగా ఏర్పాటు చేసిన బయోమిమిక్రీ గ్యాలరీ- ప్రకృతి స్ఫూర్తి సైన్స్ గ్యాలరీని అటవీశాఖ తిరుపతి సర్కిల్ సీఎఫ్ సి.సెల్వం, బెంగళూరులోని విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం డైరెక్టర్ సాజు భాస్కరన్‌తో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్యాలరీలోని గబ్బిలాలకు సంబంధించిన ఎకోలొకేషన్ ప్రక్రియ ఆధారంగా దృష్టిలోపం ఉన్నవారి కోసం రూపొందించిన అల్ట్రాకేన్, తామర ఆకుల నీటి వికర్షణ గుణాలను ప్రదర్శించే ఇంటరాక్టివ్ ఎగ్జిబిట్లను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. సైన్స్ సెంటర్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ కె.శ్రీనివాసన్‌ప్రహ్లాద తదితరులు పాల్గొన్నారు.

గ్యాలరీని పరిశీలిస్తున్న తిరుపతి ఐజర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య, సీఎఫ్ సెల్వం

EENADU eClassifieds

EDUCATION

విజయవాడలో BPT/B.Sc., MLT- మేనేజ్‌మెంట్ కోటా సీట్లు- తక్కువ ఫీజు- కొన్నిసీట్లు కలవు. Affiliated to Dr.NTR యూనివర్సిటీ. ✆ 7680065835.

DISTANCE EDUCATION

10th/Inter, BA, B.Com., B.Sc,BBA, BCA, BLIS, MA,M.Com, M.Sc, MCA, MBA,MLIS, Dip, B.Tech, M.Tech, Ph.D, BNYS, BPT, Pharmacy, LLB, BA LLB. 9032030124.

JOBS

ADMISSION Pro for Om Narayana EM High School Q: any Degree. S: 15 to 30K +Incentives. TPT, Anmh, NLR Dt. ✆ 8106891985.

తిరుపతి నందు ఆఫీసులో పనిచేయుటకు ఆఫీసు బాయ్స్, క్లర్కులు కావలెను. ఆకర్షణీయ జీతం కలదు. Cont: 99489 55539.

E-KART నందు అర్జెంటుగా M/F కావలెను. Qly: Inter, Any Degree. Sal: 15,000/-. Online are Available. 9014120139.

THE EENADU CLASSIFIEDS WAY

B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/- Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే

తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు

వివరాలకు... 80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి B/W: రూ. 600 Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

ఏనుగుల దాడులు నియంత్రించండి: ఎమ్మెల్యే

గుడిపాల, న్యూస్‌టుడే: పంట పొలాలపై ఏనుగుల దాడులను నియంత్రించేందుకు అటవీశాఖ అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. మంగళవారం సాయంత్రం ముత్తువాళ్లూరులో ఏనుగులు ధ్వంసం చేసిన అరటి, కొబ్బరి, ఇతర పంటలను పరిశీలించారు. అనంతరం ఎంపీపీ కార్యాలయం వద్ద స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అందించిన తోపుడు బండ్లను గొల్లమడుగు, చిత్తపార, సి.బండపల్లె, 189.కొత్తపల్లె, 197.రామాపురం, బసవాపల్లె గ్రామ పంచాయతీలకు పంపిణీ చేశారు. గుడిపాల ఆది ఆంధ్రవాడలో నిర్వహించిన ఓంశక్తి పూజల్లో పాల్గొన్నారు. ఆయన వెంట డీఎఫ్‌వో సుబ్బరాజ్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో శిరీష, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, సింగిల్‌విండో ఛైర్మన్ ప్రతాప్ నాయుడు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు ధనసింగ్, ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం యాదవ్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలాజీ, సుమతి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పూతలపట్టు: మండలంలోని సంజీవరాయనిపల్లె అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ శ్రీరామకోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలు ఉన్నాయని చెప్పారు. ఫిబ్రవరి 19లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపించాలన్నారు. వివరాలకు చరవాణిల సంఖ్య 9949109367, 6300362689ను సంప్రదించాలని కోరారు.

కాణిపాకం: విరాళం అందిస్తున్న దాత రామచంద్రరావు కుటుంబ సభ్యులు

నిత్యాన్నదాన పథకానికి విరాళం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి అనంతపురం పట్టణానికి చెందిన రామచంద్రరావు రూ.1,01,116 డీడీని ఆలయ ఏఈవో రవీంద్రబాబుకు మంగళవారం అందజేశారు. దాత, కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలను అందజేశారు. పండితులు వేదాశీర్వచనం చేశారు.

పెరుగుతున్న నిర్లక్ష్యం

తవణంపల్లె, న్యూస్‌టుడే: పుణ్యసముద్రం పంచాయతీ భవనంపై రావి చెట్టు పెరుగుతుంది. ప్రస్తుతం సచివాలయ వ్యవస్థ రావడంతో పంచాయతీ కార్యాలయ సిబ్బంది కె.పట్నం సచివాలయానికి వెళ్లిపోయారు. వేరుసెనగ విత్తన కాయలు, యూరియా పంపిణీ చేసే సమయంలో పంచాయతీ కార్యాలయాన్ని ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం ఈ భవనం పైభాగంలో రావి చెట్టు పెరుగుతోంది. ఈ చెట్టు ఇలాగే పెరిగితే భవనం దెబ్బతినే ప్రమాదముంది. అధికారులు చర్యలు తీసుకుని చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నాడు ఆగి.. నేడు కొనసాగి

అండర్ డ్రైనేజీ కాలువ నిర్మాణంలో భాగంగా తవణంపల్లె మండలం తొడతర గ్రామంలో వైకాపా హయాంలో పనులు చేసి మధ్యలో నిలిపివేశారు.

దీంతో మురుగు అంతా వీధుల్లోనే ప్రవహిస్తుండేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మిగిలిన పనులను శరవేగంగా చేస్తున్నారు. గతంలో కేవలం ప్రధాన వైపు వేసి వదిలేయగా ప్రస్తుతం వీధుల్లో కాలువలు తవ్వడం, ఉన్న కాలువలను శుభ్రం చేసి వాటిల్లో కొత్తగా పైపులు వేసే పనులు చేస్తున్నారు.
- ఈనాడు, చిత్తూరు

మెరిసి.. మురిపించి

నిత్యం గ్రామాల్లోని చెత్త సేకరించి సంపద సృష్టించే చెత్త సేకరణ కేంద్ర భవనం విద్యుదీపాల వెలుగులో మెరిసిపోతోంది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకావేరిరాజుపురం పంచాయతీలోని ఈ కేంద్రాన్ని సర్పంచి గాలి మహేష్‌నాయుడు విద్యుదీపాలతో సుందరంగా అలంకరింపజేయడంతో ఆకట్టుకుంటోంది. నిత్యం చెత్తతో ఉండే ఈ కేంద్రం కనీసం ఒక్కరోజయినా వెలిగిపోవాలనే ఉద్దేశంతో ఇలా దీపాలంకరణ చేశామని సర్పంచి తెలిపారు. మెరిసి పోతున్న కేంద్రాన్ని చూసి గ్రామస్థులు అభినందించారు. **-న్యూస్‌టుడే, పాలసముద్రం**

ముందస్తు ప్రణాళికతో విజయం

కార్వేటినగరం: ముందస్తు ప్రణాళికతో చదవడమే విజయ రహస్యమని ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం నిర్వహించిన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల 78వ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. పరీక్షలు, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు

కార్వేటినగరం, న్యూస్‌టుడే: తమిళ తైమాసం మంగళవారం సందర్భంగా కార్వేటినగరంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని తిరుప్పరకుండ్రం సుబ్రహ్మణ్యస్వామిగా అలంకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యలు పరిష్కరించండి

దక్షిణ రైల్వే డీఆర్‌ఎం శైలేంద్రసింగ్‌కు వినతి అందజేస్తున్న విజయబాబు

పుత్తూరు, న్యూస్‌టుడే: నగరి నియోజకవర్గంలో రైల్వే సమస్యలు పరిష్కరించాలని దక్షిణ రైల్వే డీఆర్‌ఎం శైలేంద్రసింగ్‌కు మంగళవారం కలిసి వినతి పత్రం అందజేసినట్లు తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు తెలిపారు. పుత్తూరు పట్టణంలోకి గేటు పుత్తూరు వాసులు రాకపోకలు సాగించాలంటే ఇబ్బందిగా ఉందని, స్థానిక ద్రౌపదిదేవి సమేత శ్రీధర్మరాజుల ఆలయం ఎదురుగా అండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరినట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించి 2.50 మీటర్ల అండర్ బ్రిడ్జి ఏర్పాటుకు డీఆర్‌ఎం హామీ ఇచ్చారన్నారు. ఆయన వెంట రవినాయుడు, మణికంఠ పాల్గొన్నారు.

ఈ భవనాలు అందుబాటులోకి వచ్చేనా..?

పాఠశాల భవనాల మూసివేత

వేల్కూరులో శిథిలావస్థలో భవనం

న్యూస్‌టుడే, గంగాధరనెల్లూరు

నియోజకవర్గ పరిధి ఆరు మండలాల్లో ఆంగ్ల విద్యా బోధనపై పేద, మధ్యతరగతి కుటుంబాల మోజుతో ఏటా పదుల సంఖ్యలో ప్రాథమిక పాఠశాలలు మూసివేస్తున్నారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన పాఠశాల భవనాలు నిరుపయోగంగా ఉండటంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

నియోజకవర్గంలో 69 భవనాలు..

నియోజకవర్గ పరిధి ఆరు మండలాల్లో పదేళ్లుగా విద్యార్థుల కొరతతో 69 ప్రాథమిక పాఠశాలలు మూతబడ్డాయి. ప్రతి పాఠశాలకు రూ.లక్షల వ్యయంతో పక్కా భవనం, ప్రహరీ తదితర వసతులు ఉన్నాయి. మూసివేశాక అసలు ఈ భవనాల గురించి పట్టించుకోక పోవడంతో నిరుపయోగమై శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని గ్రామాల్లో పలుకుబడి కలిగిన రాజకీయ నేతలు సొంత అవసరాలకు వీటిని వినియోగించడం, మరికొన్ని గ్రామాల్లో ఆక్రమణకు గురవడమేకాక అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి.

కొరత ఎక్కడంటే..

ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో డ్వాక్రా మహిళలు, రైతులు, యువజన సంఘాలు ప్రతి నెలా పలుమార్లు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. వీరి సమావేశాలకు భవన వసతి లేక ఆలయాల ఆవరణ, చెట్ల కింద, రహదారుల పక్కన ఎండకు, వానకు అవస్థలు పడుతూ కొనసాగిస్తున్నారు. అక్కడ తాగునీరు, మరుగుదొడ్డి తదితర వసతులు లేక అవస్థ పడుతున్నారు. మరోవైపు రైతులు పండించిన పంటలు నిల్వ చేయడానికి గిడ్డంగులు లేక మండల కేంద్రాల్లో రూ.వేలల్లో అద్దె చెల్లించి ప్రైవేటు గోదాములు వినియోగిస్తున్నారు. అధికారులు స్పందించి మూసేసిన పాఠశాల భవనాలకు అవసరమైన మరమ్మతులు చేసి గ్రామాల్లో డ్వాక్రా, రైతు, యువజన సంఘాల సమావేశాలకు, పంటలు నిల్వ చేయడానికి తక్కువ అద్దెతో గోదాములను చిన్న, సన్నకారు రైతులకు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తెస్తాం..

మూసివేసిన పాఠశాల భవనాల్లోని ఆక్రమణలు తొలగించి అవసరమైన మరమ్మతులు చేసి పంచాయతీలకు అప్పగిస్తాం. పంచాయతీ ఆధ్వర్యంలో డ్వాక్రా, రైతు, యువజన సంఘాల సమావేశాలకు, నామమాత్రపు అద్దెతో రైతులకు గోదాములుగా అందజేస్తాం.
- మనోహర్‌గౌడ్, ఎంపీడీవో, జీడీనెల్లూరు

నిరుపయోగంగా ముష్టిపల్లె పాఠశాల భవనం

యూ-టర్న్, రోడ్డు క్రాసింగ్ ఏర్పాటు చేయాలని వినతి

పుత్తూరు, నగరి, న్యూస్‌టుడే: తిరుపతి-చెన్నై జాతీయ రహదారి నగరి నియోజకవర్గంలోని ఎన్‌హెచ్-716 కేఎం అగ్రహారం వద్ద యూటర్న్, రోడ్డు క్రాసింగ్ ఏర్పాటు చేయాలని చెన్నై ఎన్‌హెచ్ఏఐ పీడీ రవీంద్రరావును మాజీ మంత్రి ఆర్కే రోజా మంగళవారం కలిసి వినతి అందజేశారు. యూ-టర్న్ లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. నగరి మున్సిపల్ ఛైర్మన్ నీలమేఘం, నాయకులు రవీంద్ర పాల్గొన్నారు.

లాడ్జీల్లో నమోదు పుస్తకాల చోరీ

కాణిపాకం, న్యూస్‌టుడే: కాణిపాకంలోని పలు ప్రైవేటు లాడ్జీల్లో గుర్తు తెలియని వ్యక్తి నమోదు పుస్తకాలను చోరీ చేసిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... గుర్తుతెలియని వ్యక్తి కాణిపాకంలోని లాడ్జీల కౌంటర్ల వద్ద ఎవరూ లేని సమయం చూసి లాడ్జీలకు వచ్చే వారి వివరాల నమోదు పుస్తకాలను చోరీ చేశాడు. ఈ విషయాన్ని లాడ్జీ యజమానులు మంగళవారం ఉదయం సీసీ ఫుటేజీల ద్వారా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

సచివాలయంలో... గుడిపాల, న్యూస్‌టుడే: మండలంలోని పేయనపల్లె సచివాలయంలో చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు. పేయనపల్లె రైల్వే గేట్ సమీపంలోని సచివాలయ భవన తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి పగులగొట్టి అందులోని ల్యాప్‌టాప్, మూడు ప్రింటర్లు అపహరించారని అధికారుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందు మూలముగా యావన్మందికీ తెలియజేయడం ఏమనగా: నా కక్షిదారు మెస్సర్స్ శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, తిరుపతి బ్రాంచి 2 మేనేజర్ వారు ఇచ్చిన బోగట్టా ప్రకారము ఈ క్రింది కనిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తి ఐరాల మండలం, కాణిపాకం పోస్టు, కాకర్లవారిపల్లె ఇంటి నెం. 2-4లో యుండు జి.క్రిష్ణయ్య నాయుడుగారి భార్య జి.రేవతి గారికి చెందినదనియు, సదరు ఆస్తిని రిజిస్టరు తనఖా చేయించుకొని సదరు జి.రేవతి గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి ఈ క్రింద కనిన షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి హక్కులు, ఛార్జీలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 5 దినములలోగా ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా [illegible]

షెడ్యూలు

[illegible]

SCHEDULE-II

Chittoor District- Chittoor Sub-District, Irala Mandal- Kanipakam, Gram Panchayat-44, Kanipakam Village Accounts.
1. S.No. 282/9c (Old No. 282/9) - dry -1.09 acres in this 0.20 acres, East : Bari, South : Share of G.Seshadri Naidu, West : C-Schedule land in S.No. 282/10, North : Land of Srinivasulu Naidu, 2. S.No. 282/10A (Old No. 282/10)- dry - 0.51 acres in this 0.39 acres, **East :** Land of G.Seshadri Naidu, **West & North :** Land of Gali Seshadri Naidu, **South :** Land of Visalakshamma (0.59 Cents conversation land)
Present boundaries for items 1 and 2 as per VRO, Certificate : **East :** Common Passage, **West :** Land of G.Hemadri Naidu, **North :** Land of G.Subramanyam Naidu and Thulasamma, **South :** Land of G.Hemdri Naidu and G.Seshadri Naidu.

సం/- **జి.వి.సుబ్బయ్య,** బి.ఎ., బి.ఎల్., అడ్వకేట్,
డి.నెం.8/114/2, రాయల్ నగర్, ఆర్.సి.రోడ్డు, తిరుపతి. సెల్ నెం: 94402 02564

చిత్తూరు (జిల్లా పంచాయతీ): ఎమ్మెల్యే జగన్మోహన్‌తో ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు

పుత్తూరు: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్ల సమస్యలు పరిష్కరిస్తాం

చిత్తూరు (జిల్లా పంచాయతీ): ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్ల సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ హామీనిచ్చారు. మంగళవారం ఎలక్ట్రీషియన్ డే సందర్భంగా జిల్లా ఎలక్ట్రీషియన్ అండ్ ప్లంబర్స్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాయకులు, సభ్యులు ఎమ్మెల్యేను కలిసి సత్కరించారు. **పుత్తూరు:** ప్రైవేటు ఎలక్ట్రీషియన్ల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. పుత్తూరు పట్టణంలోని శ్రీద్రౌపదిదేవి సమేత శ్రీధర్మరాజుల ఆలయంలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్లు వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈడీ హరిబాబు, ఏఈలు జయసాయి, భాస్కరరాజు, మాజీ ఎంపీపీ ఏలుమలై, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యుగంధర్, శ్రీద్రౌపదిదేవి ఆలయ ఛైర్మన్ కృష్ణప్పమొదలియార్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలను మలుపుతిప్పిన యువగళం

సురేంద్ర కుమార్

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: నారా లోకేశ్ యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయాలను మలుపుతిప్పి గేమ్ ఛేంజర్‌గా నిలిచినట్లు తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

నాయకుల సంబరాలు

కేకు కోస్తున్న నాయకులు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నాయకులు మంగళవారం సంబరాలు చేసుకున్నారు. స్థానిక తెదేపా కార్యాలయంలో తెదేపా రాష్ట్ర అధికార ప్రతనిధి సప్తగిరిప్రసాద్ ఆధ్వర్యంలో కేకు కోశారు. నాయకులు మేషక్, మధుయాదవ్, గోవిందు, జైపాల్, రామచంద్రయ్య, జ్యోతి పాల్గొన్నారు. **పెనుమూరు:** మూడేళ్ల కిందట నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర రాష్ట్రంలో పెను మార్పు తెచ్చిందని మాజీ ఎంపీపీ, తెదేపా జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వి.హరిబాబునాయుడు అన్నారు.

ఈ-సంజీవని ప్రాజెక్టు విజయవంతం చేయండి

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే ఈ సంజీవని ప్రాజెక్టును విజయవంతం చేయాలని జిల్లా వైద్యాధికారిణి సుధారాణి తెలిపారు. మండలంలోని తుంబకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలి

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని డీఈవో రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన పాఠశాల వార్షికోత్సవ సమావేశంలో ఆయన ప్రసంగించారు. పదోతరగతి పరీక్షలో ఉత్తమ ఫలితాలను సాధించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా సమగ్ర శిక్షా అధికారి వెంకట్రమణ, సర్పంచి రమాదేవి, హెచ్‌ఎం రాజేంద్రన్, సింగిల్ విండో ఛైర్మన్ హేమచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు సాధించాలి

కార్వేటినగరం: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ సభ్యుడు పొన్నా యుగంధర్ అన్నారు. మంగళవారం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు నాదమునిరెడ్డి, పీడీ కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నియామకం

నియామక పత్రం అందుకుంటున్న బాలకృష్ణ

నింద్ర, న్యూస్‌టుడే: మండలం శ్రీరామాపురం గ్రామానికి చెందిన బాలకృష్ణ అఖిల భారతీయ కోలీ ముదిరాజ్ ఏపీ యువజన విభాగం అధ్యక్షుడిగా ఎంపికైనట్లు తెలిపారు. అఖిల భారతీయ కోలీ ముదిరాజ్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు దుడం రెడ్డిబాబు చేతుల మీదుగా నియామకపత్రం విజయవాడలో జరిగిన సదస్సులో అందుకున్నట్లు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పదవిని అప్పగించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తమ జాతికి విశిష్ట సేవలు అందజేస్తామని బాలకృష్ణ తెలిపారు.

సమస్యల పరిష్కారానికే జనబాట

పూతలపట్టు: గ్రామాల్లో నెలకొన్న విద్యుత్తు సమస్యల పరిష్కారం కోసమే కరంటోళ్ల జనబాట నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ సీజీఎం కృష్ణారెడ్డి తెలిపారు. కరెంటోళ్ల జనబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం పేటమిట్ట, పోటుకనుమ గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ప్రకృతి సేద్యం రైతులను గుర్తించండి

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: నిర్దేశించిన గ్రామాల్లో ప్రకృతి సేద్యం విస్తరణకు రైతులను గుర్తించి.. పేర్లు నమోదు చేయాలని ప్రకృతి వ్యవసాయ పథకం జిల్లా పథక మేనేజరు శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా కార్యాలయంలో క్షేత్రస్థాయి అధికారులతో సమీక్షించారు. రానున్న రోజుల్లో ప్రకృతి సేద్యం పంట ఉత్పత్తులకు మంచి డిమాండు ఉంటుందన్నారు. జిల్లాలో ప్రకృతి సేద్యం బయో ఉత్పత్తులు, పంట ఉత్పత్తుల విక్రయాలకు 249 దుకాణాల ఏర్పాటు లక్ష్యంగా నిర్ణయించామని.. నిర్ణీత రోజుల్లో దుకాణాలను ప్రారంభించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎఫ్ఎంటీసీలు, క్షేత్రస్థాయి అధికారులు పాల్గొన్నారు.

భాజపా సీనియర్ నేత మణినాయుడు మృతి



చిత్తూరు (క్రీడలు), న్యూస్‌టుడే: భాజపా సీనియర్ నేత మణినాయుడు(78) మంగళవారం ఆకస్మికంగా మృతి చెందారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా ఉద్యోగ విరమణ చేసిన ఈయన భాజపాలో చేరి చిత్తూరు నగర అధ్యక్షుడిగా, భాజపా మేధావుల ఫోరం జిల్లా కన్వీనర్‌గా వ్యవహరించారు. ఆయన మృతదేహాన్ని పలు పార్టీల నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

మాట్లాడుతున్న డ్వామా పీడీ రవికుమార్

ఉపాధి పథకంలో రూ.62,350 రికవరీ

పూతలపట్టు, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకంలో జరిగిన అవకతవకలు గుర్తించి రూ.62,350 రికవరీకి ఆదేశించినట్లు డ్వామా పీడీ రవికుమార్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో సామాజిక తనిఖీ ప్రజావేదికను మంగళవారం నిర్వహించారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త వాటిని నాటకపోవడం, ఫాం బండ్స్ ఏర్పాటు చేసి కన్పించకుండా పోయిన రైతులకు నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. జాబ్‌కార్డు దారులందరికీ పని కల్పించాలని.. పూర్తైన పనులకు వెంటనే మస్టర్‌లో నమోదు చేసి బిల్లులు అప్‌లోడ్ చేయాలని వివరించారు.

అక్రమ గేట్ వసూళ్లు నిలిపేయాలి

పుత్తూరు : పుత్తూరు పురపాలిక పరిధిలో వీధి విక్రయదారుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న అక్రమ గేట్ వసూళ్ల తక్షణమే నిలిపివేయాలని ఏపీ వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శివకుమార్, నవీన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావును కలిసి వినతి అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మహేష్, నాయకులు నవీన్‌కుమార్, నజీర్, వీధి విక్రయదారులు పాల్గొన్నారు.



క్రీడల్లో మహారాణులు

● రాణిస్తున్న విద్యార్థినులు

ఐరాల, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి అటు పాఠశాలకు.. ఇటు తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకొస్తున్నారు.. గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో చదువుతున్నా పట్టణ పాఠశాలలకు దీటుగా క్రీడా పోటీల్లో మేటిగా పతకాలు సాధిస్తున్నారు.. ఇదీ పూతలపట్టు నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినుల విజయగాథ.

అంతర్జాతీయ పోటీలే లక్ష్యం..

బంగారుపాళ్యానికి చెందిన వెంకటేశు ప్రైవేటు ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. భార్య రమాదేవి. వీరి కుమార్తె దీప్తి చదువుతో పాటు క్రీడల్లో రాణించి మంచిపేరు తెచ్చుకుంటోంది. క్రీడలపై ఉన్న ఆసక్తితో ఖోఖోలో తర్ఫీదు పొందింది. విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 ఖోఖో పోటీల్లో బంగారు పతకం, తిరుపతిలో జరిగిన శాప్ పోటీల్లో కాంస్యం, రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు, కాంస్య పతకాలు కైవసం చేసుకుంది. బెంగళూరులో జరిగిన జూనియర్ జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఒక ఏడాదిలో నాలుగు పతకాలు సాధించింది. అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనడమే తన లక్ష్యమని పేర్కొంది.

జాతీయ స్థాయి పోటీల్లో..

యాదమరికి మండలం ఎగువ పాతపాళ్యానికి చెందిన రైతు సిద్ధి లింగమూర్తి కుమార్తె కావ్య యాదమరి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. క్రీడలపై ఉన్న మక్కువతో ఉపాధ్యాయుల వద్ద ఫెన్సింగ్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకుంది. పాఠశాలలో రోజువారీ శిక్షణ పొంది అమలాపురంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పతకాలు చేజిక్కించుకుంది. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడమే తన ధ్యేయమని తెలిపింది.

ఉన్నత ఉద్యోగంలో చేరతా..

పూతలపట్టు మండలం బందార్లపల్లెకు చెందిన రైతు పెరుమాళ్లు, గృహిణి అరుణల కుమార్తె ఎ.పవిత్ర.. పూతలపట్టు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. క్రీడల్లో చాలా చురుగ్గా పాల్గొంటోంది. సాఫ్ట్‌బాల్ క్రీడల్లో జాతీయ స్థాయిలో అండర్-14, అండర్-19లో పాల్గొంది. మహారాష్ట్రలో జరిగిన జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించింది. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్, సైక్లింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంది. క్రీడల కోటాలో ఉన్నత ఉద్యోగం సాధిస్తానని పేర్కొంది.

పలమనేరు

•పలమనేరు •కుప్పం

ఆకస్మిక తనిఖీ

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని కాకతోపు యూపీహెచ్‌సీని జిల్లా అదనపు డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలో సంజీవని కార్యక్రమానికి సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. ఇంటర్‌నెట్, కంప్యూటర్ పరికరాల పనితీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి జయశంకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న వెంకటప్రసాద్

వన్యప్రాణులు, మనుషల రక్షణే ధ్యేయంగా పని చేస్తున్నాం

పలమనేరు, న్యూస్‌టుడే: ముఖాముఖి వన్యప్రాణులు, మనుషల ప్రాణాల రక్షణే ధ్యేయంగా కృషి చేస్తున్నామని చిత్తూరు డీఎఫ్‌వో సుబ్బరాజు పేర్కొన్నారు. ప్రస్తుతం ఏనుగుల దాడుల నుంచి ప్రజల ప్రాణాలతో పాటు, పంటలను రక్షించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆయన అన్నారు. ఆ విషయాలను న్యూస్‌టుడే ముఖాముఖిలో తెలిపారిలా..

డీఎఫ్‌వో సుబ్బరాజు

? ఏనుగుల కట్టడికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు

✔ ఏనుగులు గ్రామాలు, పంటలపై దాడులు చేయకుండా వాటి కట్టడికి సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటివరకు మొత్తం 18 కి.మీ దూరం కంచె నిర్మాణం పూర్తయింది. మరో 4 కి.మీ దూరం ప్రతిపాదనలు సిద్ధం చేశాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

? ఇప్పటివరకు రైతులకు ఎంత నష్టపరిహారం చెల్లించారు..

✔ ఏనుగుల దాడుల కారణంగా పంట నష్టంతో పాటు ప్రాణ నష్టానికి ఇప్పటివరకు రూ.కోటి వరకు పరిహారం చెల్లించాం.

? ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారా..

✔ ప్రమాదాల బారిన పడి ఈ ఏడాదిలో రెండు ఏనుగులు మృత్యువాత పడ్డాయి. ఏనుగుల ప్రాణనష్టం జరగకుండా ప్రజల్లో కూడా అవగాహన పెంచడానికి ప్రయత్నిస్తున్నాం. ఎక్కడెక్కడ ఏనుగులు ఆహారం కోసం చూస్తుంటాయనే విషయాలు గుర్తించి వాటి కదలికలు పరిశీలిస్తున్నాం.

? కుంకీ ఆపరేషన్ జరుగుతోందా..

✔ కుంకీ ఆపరేషన్లు ఆపలేదు. ఇంకా కొనసాగుతాయి. అయితే వాటి అవసరం ఎంత వరకు ఉంటుందో అంత వరకు ఉపయోగిస్తాం. గతేడాది సెప్టెంబరు, అక్టోబరులో కుంకీలతో అడవి ఏనుగుల దాడులు నివారించాం.

? పరిహారం పెంచాలనే ప్రతిపాదన ఉందా..

✔ ఏనుగుల దాడుల్లో నష్టపోయిన వారికి ఇచ్చే పరిహారం ఒక్కోచోట ఒక్కో రకంగా ఉండదు. జీవో ప్రకారమే అన్ని ప్రాంతాల్లో పరిహారం ఇస్తాం. దేశవ్యాప్తంగా ఇప్పుడు ఉన్న నిబంధనల మేరకు ఇస్తున్నాం. నష్టపరిహారం పెంచాలనే ప్రతిపాదన ప్రభుత్వానికి పంపి వారు ఆమోదిస్తే అమలు చేస్తాం.

? వేటగాళ్ల నియంత్రణ

✔ ప్రస్తుతం అడవి మాంసం కోసం వేటగాళ్లు విద్యుత్తు తీగలు ఏర్పాటు చేస్తున్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇటీవల ఏనుగు మృతికి సంబంధించి విద్యుత్తు తీగలు అమర్చిన ముగ్గురిపై కేసు కూడా నమోదు చేశాం.

చేయకపోయినా చేసినట్టు.. అంతా కనికట్టు

❖ ఉపాధి పథకంలో భారీగా అక్రమాలు
❖ రూ.21లక్షల అవినీతి గుర్తింపు

వి.కోట, న్యూస్‌టుడే: చేయని పనులు చేసినట్లు చూపారు.. రూ.లక్షలు కొల్లగొట్టారు. ఎవరు పట్టుకోలేరని బరితెగించారు. హంద్రీ-నీవా జలాలతో చెరువులు మొరవ వెళ్లిన తర్వాత ఆ చెరువు కింద ఉపాధి పనులు చేసినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. కానీ వారు చేసిన పొరపాటే వారిని దోషులుగా పట్టించింది. ఈ పనుల్లో భారీగా అవినీతి జరిగిందని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో కలెక్టరు విచారణకు ఆదేశించారు. వాస్తవాలు నిగ్గుతేల్చడంతో మండల ఉపాధి హామీ సిబ్బందిపై కేసులు నమోదు చేశారు.

డ్వామా విచారణలో నిజాలు

వి.కోట మండలంలో ఉపాధి హామీ పథకంలో భారీగా అవకతవకలు జరిగాయని జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. దీంతో కుప్పం ఏపీడీ రవికుమార్‌ను విచారణకు ఆదేశించింది. క్షేత్రస్థాయిలో ఉపాధి బృందం విచారణ నిర్వహించగా నిజాలు బయటపడ్డాయి. ఆ విషయాలను కలెక్టరుకు డ్వామా అధికారులు నివేదించారు. వాస్తవాలు గుర్తించిన కలెక్టరు శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వి.కోట కీలపల్లె చెరువు

కీలపల్లె చెరువులో ఏం జరిగింది..?

మండల కేంద్రంలోని వి.కోట కీలపల్లె చెరువు కింద ఉపాధి హామీ పథకంలో పనులు జరిగినట్లు జనవరి 13న మస్టరు పేమెంట్ జరిగింది. ఇక్కడ ఫిష్‌పాండ్, మినీ ట్యాంకు, పూడికతీత పనులు జరిగినట్లు మస్టరులో నమోదు చేశారు. ఇక్కడ దాదాపు రూ.39లక్షల పనులకు అంచనా వేశారు. ఇందులో రూ.21లక్షలు నిధులు కూడా స్వాహా చేశారు.

కేసులు నమోదు

ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడ్డ ఏపీవో రవికుమార్, టెక్నికల్ అసిస్టెంట్ ఉషశ్రీ, క్షేత్ర సహాయకుడు ఉదయ్‌కుమార్‌తో పాటు మరికొందరిపై వి.కోట పోలీసు స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. వీరి నుంచి దుర్వినియోగం అయిన నగదును రికవరీ చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

మరిన్ని అవకతవకలకు అవకాశం

క్షేత్రస్థాయిలో డ్వామా అధికారులు విచారణ నిర్వహిస్తే... ఇప్పటివరకు జరిగిన ఉపాధి పనుల్లో మరిన్ని అవకతవకలు బయటపడే అవకాశం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

వేడుకగా మద్వనవమి పూజలు

బైరెడ్డిపల్లె: తీర్థం గ్రామంలోని శ్రీరాఘవేంద్రస్వామి ఆలయంలో మంగళవారం మద్వనవమి పూజలు వేడుకగా జరిగాయి. అర్చకులు రమేష్‌ఆచార్యులు స్వామివారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణతో అర్చనలు జరిపారు. శ్రీగురురాజా సేవాసమితి ఆధ్వర్యంలో మధ్వాచార్యుల చిత్రపటాన్ని ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే విజయమే

సరస్వతీ పూజలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: విద్యార్థులు పాఠశాల దశలోనే ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం సాధించగలరని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ అనిత పేర్కొన్నారు. పాఠశాలలో మంగళవారం పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. సర్వమత సమ్మేళనంతో రూపొందించిన ఓం చిత్రం చుట్టూ విద్యార్థులు కొవ్వొత్తులు వెలిగించి సరస్వతీదేవి చిత్రపటానికి పూజలు చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టర్ సుమిత్‌కుమార్ నుంచి పురస్కారం అందుకుంటున్న రేఖ

తహసీల్దార్‌కు అభినందన

గంగవరం, న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖలో ఉత్తమ సేవలు అందించిన గంగవరం తహసీల్దార్ రేఖకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. సోమవారం జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ సుమిత్‌కుమార్ నుంచి పురస్కారాన్ని అందుకున్నారు. తోటి ఉద్యోగులు మంగళవారం అభినందనలు తెలిపారు.

కొత్తపల్లెలో ఎన్ఎస్ఎస్ శిబిరం

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: ద్రవిడ విశ్వవిద్యాలయంలోని ఎన్ఎస్ఎస్ 2వ యూనిట్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని వీసీ ఆచార్య దొరస్వామి, రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. గుడుపల్లె మండలం అగరం కొత్తపల్లెలో వారం రోజులపాటు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఎన్ఎస్ఎస్ అధికారి వెంకటస్వామి, వాలంటీర్లు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌కు సత్కారం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సబ్ రిజిస్ట్రార్‌గా అవార్డు అందుకున్న కుప్పం సబ్ రిజిస్ట్రార్ సత్యనారాయణను తెదేపా నాయకులు మంగళవారం సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ మణి, వినోద్, నాయకులు మునిరత్నం, భరణి, ప్రభు, సుందర్ పాల్గొన్నారు.

హంస వాహనంపై శ్రీధ్యానాభిరామస్వామి

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: దాసార్లపల్లె సమీపంలోని కార్వేటికొండపై వెలసిన శ్రీధ్యానాభిరామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో మంగళవారం హంస వాహనంపై స్వామివారు విహరించారు. ఉత్సవమూర్తులను హంస వాహనంపై కొలువుదీర్చి ఆలయం చుట్టూ ఊరేగించారు. రాత్రి స్వామివారి ఉత్సవమూర్తులకు శయనోత్సవ పూజలు నిర్వహించారు. ఉభయదారులుగా సిగిరిపల్లె, దాసార్లపల్లె గ్రామస్థులు స్వామివారి సేవలో పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కల్లూరు, సదుం, న్యూస్‌టుడే: మండలంలోని కల్లూరు, సదుం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాలు మంగళవారం నిర్వహించారు. బాగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని, పాఠశాలలు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఎంఈవోలు సిద్ధరామయ్య, పి. తాతయ్య, నటరాజన్, దామోదర, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ ఆఘాన్ సూచించారు. అనంతరం విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో అలరించారు.

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

పర్యటిస్తూ.. సమస్యలు పరిష్కరిస్తూ..!

పలమనేరు, న్యూస్‌టుడే: పలమనేరు విద్యుత్తు సబ్ డివిజన్ పరిధిలోని తెల్లగుంట్లపల్లె, పందిగారిపల్లె గ్రామాల్లో మంగళవారం 'కరెంటోళ్ల జనబాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్థుల సమస్యలు తెలుసుకుని అప్పటికప్పుడే పరిష్కరించారు. రెండు గ్రామాల్లో కొత్తగా వేసిన రోడ్లలో వీధిదీపాల కోసం స్తంభాలు నాటించాలని పలువురు కోరారు. స్పందించిన ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ స్తంభాలు మంజూరు చేశారు. కార్యక్రమంలో పుంగనూరు ఈఈ శ్రీనివాసమూర్తి, పలమనేరు డీఈఈ జీవన్‌కుమార్, ఏఈ అర్జున్ పాల్గొన్నారు.

పొదల్లో దాగినది

మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు నిర్వహణ, పర్యవేక్షణ లేక దుస్థితికి చేరుతున్నాయి. మండలంలోని తెట్టుమిట్ట గ్రామంలో నిర్మించిన నీటి తొట్టె చుట్టూ పిచ్చిమొక్కలు పెరగడంతో కనిపించకుండా పోయింది. పంచాయతీ అధికారులు స్పందించి నీటి తొట్టెను వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, గంగవరం

అదనపు భవనం.. అర్ధంతర నిర్మాణం

శాంతిపురం మండలం కోనేరుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో వైకాపా హయాంలో నాడు-నేడు నిధులతో చేపట్టిన అదనపు భవన నిర్మాణం ఇప్పటికీ పూర్తికి నోచుకోలేదు. ముగింపు దశ పనులు ఆగిపోవడంతో.. తరగతి గదుల కొరత వల్ల విద్యార్థులకు అసౌకర్యం ఎదురవుతోంది. ఆరుబయట, చెట్ల నీడన తరగతుల నిర్వహణతో ఇబ్బందులు తప్పడంలేదని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాల్సిందిగా కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, శాంతిపురం

సిద్ధమవుతున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం

కుప్పం పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. అందులో భాగంగానే కుప్పం పట్టణం బైపాస్ మార్గంలోని ఓ ప్రైవేటు భవనంలో ఏర్పాటు చేస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. కడా ఆధ్వర్యంలో పనులు చురుకుగా సాగుతున్నాయని... పనులు దాదాపు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు.

- న్యూస్‌టుడే, కుప్పం పట్టణం

జిల్లాలో యూరియా కొరత లేదు

బైరెడ్డిపల్లె, పెద్దపంజాణి, న్యూస్‌టుడే: జిల్లాలో యూరియా కొరత లేదని వ్యవసాయశాఖ జేడీ మురళి పేర్కొన్నారు. బైరెడ్డిపల్లె రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేసి వ్యవసాయశాఖ సిబ్బందితో చర్చించారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా యూరియా కొరత లేదని స్పష్టం చేశారు. రబీ సీజను పంటల కోసం ప్రస్తుతం 2500 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. జిల్లాకు త్వరలో మరో 700 మెట్రిక్ టన్నుల యూరియా రానుందని వివరించారు. ఎక్కడైనా యూరియా అవసరమైతే రైతు సేవా కేంద్రం సిబ్బంది తెప్పించుకుని పంపిణీ చేయాలని సూచించారు. వ్యవసాయశాఖ సిబ్బంది ఫిబ్రవరి 15వ తేదీ లోపు వంద శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో గీతాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

✦ అధికంగా పంటలకు యూరియా వాడకం కారణంగా పంటలకు నష్టం వాటిల్లుతుందని మండల వ్యవసాయాధికారిణి హేమలత అన్నారు. వ్యవసాయశాఖ సిఫారసు చేసిన మేరకే పంటలకు యూరియా వాడుకోవాలన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ

భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

కుప్పం గ్రామీణ, న్యూస్‌టుడే: గోనుగూరు సమీపంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి రూ. 50 లక్షలతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మంగళవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో పీకేఎం ఉడా ఛైర్మన్ సురేష్‌బాబు, మండల అధ్యక్షుడు రాజగోపాల్, క్లస్టర్ ఇన్‌ఛార్జి శ్రీనివాసులు, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, నాయకులు సంతోష్, మంజునాథ్ పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న సుధారాణి

రికార్డుల పరిశీలన

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించే లక్ష్యంతో వైద్యులు, సిబ్బంది పని చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి సుధారాణి పేర్కొన్నారు. బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. టాటా సంజీవని డిజిటల్ నర్వ్ సెంటర్ (డీఐఎన్‌సీ) అమలుపై సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆస్పత్రిలోని పరికరాలను పరిశీలించారు. మాతాశిశు సంరక్షణ సేవలు, రికార్డుల నివేదికలను పరిశీలించి సిబ్బందితో చర్చించారు. వైద్యులు ప్రవీణ, విజయ్‌చందర్, హెచ్ఈ సావిత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యం

కుప్పం పట్టణం: విద్యార్థులు ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా చదవాలని ఎంఈవో-2 రాజారామ్ పేర్కొన్నారు. స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. క్రీడలు, చదువులు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

విద్యార్థినికి బహుమతి అందిస్తున్న రాజారామ్

'ప్రతి కార్యకర్త మైటీడీపీ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి'

రామకుప్పం, న్యూస్‌టుడే: ప్రతి కార్యకర్త మైటీడీపీ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని తెదేపా మండల అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షుడు ఆనందరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తెదేపా మండల కార్యాలయంలో ఈ-సైకిల్, మైటీడీపీ యాప్ రిజిస్ట్రేషన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు కామరాజనాయక్, భాస్కర్, ఆదిల్‌బాషా, మురళి పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు మద్దతు

పలమనేరు, న్యూస్‌టుడే: తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ బ్యాంకు యూనియన్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పలమనేరు బ్యాంకు ఉద్యోగులు నిరసన తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్టేట్ బ్యాంకు ఎదురుగా ఆందోళన చేపట్టారు. సీపీఎం నాయకుడు ఓబుల్‌రాజు మాట్లాడుతూ.. ఐదు రోజుల బ్యాంకింగ్ విధానాన్ని అమలు చేయాలని కోరారు.

క్రమశిక్షణతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

గుడుపల్లె, న్యూస్‌టుడే: క్రమశిక్షణ విద్యార్థి దశ నుంచి పాటిస్తేనే ఉజ్వల భవిష్యత్తుకు చేరుకుంటారని కుప్పం గ్రామీణ సీఐ మల్లేశ్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని యామగానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదువులపై ఆసక్తి చూపుతూ అనుకున్న లక్ష్యాలు చేరుకోవాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

పలమనేరు, న్యూస్‌టుడే: **సమస్య:** పట్టణంలోని సారాయి అంగడి వీధిలో కాలువలు మురుగుతో పేరుకుపోయి అధ్వానంగా ఉన్నాయి. **- స్థానికులు**

సమాధానం: సమస్యను పరిష్కరిస్తాం. **- కమిషనర్**

కుప్పం పట్టణం: సమస్య: పట్టణంలోని ప్యాలెస్ రోడ్డు కూడలిలో వీధిదీపాలు ఏర్పాటు చేసేందుకు గుంతలు తవ్వారు. పూడ్చకుండా రాళ్లను అడ్డుగా పెట్టారు. **- లోకేశ్**

సమాధానం: వీధి దీపాలను త్వరితగతిన ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. గుంతలు పూడ్చుతాం. **- శ్రీనివాసరావు, కమిషనర్**

కాలనీలో పారిశుద్ధ్య పనులు

స్పందనకు వందనం

పలమనేరు: శ్రీనగర్‌కాలనీలో మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వీధిలో కాలువలు అధ్వానంగా ఉండటంతో సమస్యపై 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. దీంతో అధికారులు శుభ్రత పనులు చేయించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

సరస్వతమ్మ (పాత చిత్రం)

గంగవరం, న్యూస్‌టుడే: మండలంలోని బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిలోని నాలుగు రోడ్ల వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వృద్ధురాలు మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పలమనేరు మండలం కుర్మాయి గ్రామానికి చెందిన సరస్వతమ్మ(60) నాలుగు రోడ్ల కూడలి వద్ద నడుచుకుంటూ వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శిరస్త్రాణం తప్పనిసరి

గంగవరం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని సీఐ ప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక మదనపల్లె రోడ్డులో ద్విచక్ర వాహన తనిఖీలు చేపట్టారు. శిరస్త్రాణం ఆవశ్యకతను వాహనదారులకు వివరించారు.

అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చౌడేపల్లె మండలం భయప్పల్లెలో చోటు చేసుకుంది. గ్రామంలో పలువురి వద్ద కె.రామచంద్ర అప్పులు తీసుకున్నారు. వారంతా అడగటంతో తీర్చే దారిలేక మంగళవారం పురుగు మందు తాగారు. అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు గుర్తించి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వరుసగా ఐదేళ్లు అగ్రస్థానంలోనే..!

పలమనేరు, న్యూస్‌టుడే: పంట ఉత్పత్తుల మార్కెట్ సెస్ వసూళ్లలో పలమనేరు మార్కెట్ కమిటీ అగ్రస్థానంలో నిలిచింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రథమస్థానంలో ఉండగా రాయలసీమలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఐదు సంవత్సరాలు వరుసగా వసూళ్లలో పలమనేరు జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లాలో 10 మార్కెట్ కమిటీలు ఉంటే ఏటా ప్రభుత్వం వీరికి వసూళ్ల విషయంలో లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి మార్కెట్ ఫీజు లక్ష్యం రూ. 2.75 కోట్లు కాగా పలమనేరు మార్కెట్ కమిటీ రూ. 3.02 కోట్లు సాధించింది. 2022-23లో రూ. 2.65 కోట్లు లక్ష్యం కాగా రూ. 2.68 కోట్లు సాధించింది. ఇలా వరుసగా 5 సంవత్సరాలు పలమనేరు అగ్రగామిలో నిలిచినట్లు మార్కెట్ కమిటి కార్యదర్శి సంజీవ్‌కుమార్ తెలిపారు.

మార్కెట్ కమిటీ కార్యాలయం

సంవత్సరం	టార్గెట్ (రూ.లక్షలు)	వసూలు (రూ.లక్షలు)
2021-22	263	155
2022-23	265	268
2023-25	275	302
2024-25	302	329
2025-26	360	374

(c) eenadu

కాకినాడలో క్రికెట్ స్టేడియం

ఈనాడు, కాకినాడ: కాకినాడ నగరంలో కొత్త క్రీడా మైదానం చేరబోతుంది. సర్పవరంలోని భావన్నారాయణ స్వామి ఆలయానికి చెందిన 16.55 ఎకరాల భూమిని దీని నిర్మాణానికి కేటాయించారు. జిల్లా కలెక్టర్ పేరున 33 ఏళ్లకు లీజు ప్రాతిపదికన కేటాయిస్తూ ప్రభుత్వ ఎక్స్‌అఫీషియో కార్యదర్శి హరి జవహర్ లాల్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఏడాదికి ఎకరాకు రూ.50 వేల చొప్పున లీజు చెల్లించాలి. ప్రతి మూడేళ్లకు ఈ మొత్తాన్ని 33 శాతం పెంచాలని పేర్కొన్నారు. సర్పవరంలోని సర్వే నంబరు 113, 115లలో భూమి కేటాయించారు.

16.55 ఎకరాల దేవాదాయ భూముల కేటాయింపు

స్టేడియానికి వెళ్లే దారి నిర్మాణానికి మరో 4,900 చదరపు అడుగులు కేటాయించారు.

మెరుగైన సౌకర్యాలతో..

క్రికెట్ స్టేడియం కోసం భావన్నారాయణస్వామి భూములను కేటాయించడం వల్ల అన్నివిధాలా అభివృద్ధికి అవకాశం కలగనుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. భూములకు లీజు డబ్బులు వెల్లువెత్తడంతో పాటు ఆక్రమణలకు అవకాశం ఉండదు. చుట్టుపక్కల మౌలిక సదుపాయాలు సమకూరుతాయి. క్రీడాకారులకు మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయి.

రెండు స్టేడియంలు నిర్మిస్తాం..

కాకినాడలో రంజీ, టెస్ట్ క్రికెట్ పోటీలు నిర్వహించేలా స్టేడియం నిర్మించనున్నాం. నగరంలో ఎక్కడా భూములు లేవు. సర్పవరంలో దేవాదాయ భూములు అనుకూలంగా ఉండడంతో ఈ ప్రతిపాదన పెట్టి మంజూరు చేయించుకున్నాం. ఇక్కడ రెండు స్టేడియంలతో పాటు అత్యాధునిక వసతులతో ఇతర క్రీడల నిర్వహణకు నిర్మాణాలు చేపడతాం.

- సానా సతీష్‌బాబు, రాజ్యసభ సభ్యులు

నేడు మాణిక్యాంబ సమేత భీమేశ్వరుడి కల్యాణం

ద్రాక్షారామ: ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి కల్యాణ వేదిక నిర్మాణంచేయడం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ బ్రహ్మ దేవులపల్లి పవిత్రసుబ్రహ్మణ్య ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కల్యాణం నిర్వహించనున్నారు. ఒకే వేదికపై మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి, లక్ష్మీ సమేత నారాయణస్వామి, పండిత సమేత శ్రీసూర్యేశ్వరస్వామి వార్లకు ఏకకాలంలో కల్యాణం జరుపుతున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా 70 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు రామచంద్రపురం సీఐ వెంకటనారాయణ తెలిపారు. మంగళవారం వేదిక ప్రాంతాన్ని ఆయన ఆధ్వర్యంలో పరిశీలించారు. కల్యాణంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ దంపతులు పాల్గొంటారని ఆలయ ఈవో దుర్గాభవాని తెలిపారు.

దివ్యధామం.. అవని తేజం

అంతర్వేదిలో విద్యుద్దీపాలంకరణలో ఆలయ శోభ

నేడే లక్ష్మీనృసింహుని దివ్య కల్యాణోత్సవం

న్యూస్‌టుడే, అంతర్వేది, మామిడికుదురు

అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం విశేషార్చనలు వేడుకగా జరిగాయి. హనుమద్వాహనం, సింహవాహనాలపై ఉభయదేవేరులతో కొలువుదీరిన స్వామిని భక్తజన గోవింద నామస్మరణల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు అభయ ప్రదానం చేస్తూ కదలివచ్చిన దేవదేవుడి మంగళమూర్తులను అంతా దర్శించుకున్నారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలో వేద పఠనంతో జరిగిన నారసింహ సుదర్శన యాగంలో అనేకమంది దంపతులు పాల్గొన్నారు. తీర్థ స్థలిలో పలు దుకాణాలు ఏర్పాటుకావడంతో సందడి నెలకొంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆవరణంతా కళకళలాడింది.

సింహ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం

నేటి వేడుకకు ఏర్పాట్లు

స్వామివారి దివ్య కల్యాణోత్సవాన్ని బుధవారం రాత్రి 1.56 గంటలకు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. కల్యాణ వేదిక చుట్టూ పటిష్ఠంగా రక్షణ వలయాన్ని ఏర్పాటు చేశారు. కల్యాణ ఘట్టాలను చూసేలా ఎల్‌ఈడీ తెరలను అమర్చారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు 50 సీసీ కెమెరాలు, ప్రత్యేక కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేశారు. స్వామి వారి దర్శనాలకు సంబంధించి ప్రత్యేకంగా క్యూలైన్లు సిద్ధం చేశారు. ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ రాహుల్‌మీనా బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించి పోలీసు అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ భక్తులకు కల్పించిన ఏర్పాట్లను సంబంధిత అధికారులతో పరిశీలించారు.

అత్యవసర వేళ.. హెల్ప్‌లైన్ నంబర్లు

08862 243500
08862 243502
సఖినేటిపల్లి ఎస్సై 94407 96566
రాజోలు సీఐ 94407 96526

☛ ఆలయ ప్రాంగణం, తీర్థ స్థలి, సముద్ర స్నానాల వద్ద పోలీసు కంట్రోల్ రూమ్‌లు ఉన్నాయి. భక్తులు అక్కడ అవసరమైన సమాచారాన్ని అడిగి తెలుసుకోవచ్చు.

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో.. జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పోటీలు నేడు

న్యూస్‌టుడే, శ్యామలా సెంటర్: 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయి జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు బుధవారం జరగనున్నాయి. రాజమహేంద్రవరం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతాయి. గత నాలుగు నెలలుగా రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, తుని, మండపేట, కొవ్వూరు పట్టణాల్లోని 23 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాసం, క్విజ్ పోటీలు జరిగాయి. ప్రతి కళాశాల నుంచి నాలుగు విభాగాల్లో ముగ్గురు చొప్పున జిల్లా స్థాయి పోటీలకు హాజరవుతారు. విద్యార్థులు ఉదయం 9 గంటల కల్లా కేంద్రానికి చేరుకోవాలని నిర్వాహకులు సూచించారు.

వేదిక: ఆర్ట్స్ కళాశాల, రాజమహేంద్రవరం | సమయం: ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 వరకు

చీకటి మాటున దందా

వైనతేయ తీరం నుంచి మట్టి తరలింపు

న్యూస్‌టుడే, మామిడికుదురు

లంక గ్రామాలను ఒకవైపు నదీ కోత కబళిస్తుంటే మరోపక్క అక్రమంగా తవ్వి తరలిస్తున్న మట్టితో మరింత ఆందోళన రేగుతోంది. వైనతేయ నదీ తీరాన్ని ఆనుకుని ఉన్న లంకల్లో ఈ దందా గోప్యంగా సాగిపోతోంది. బయటకు పొక్కితే చాలు కొద్ది రోజులు ఆగినట్టే ఆగి తరలింపులకు మళ్లీ సిద్ధమవుతున్నారు. దీనివల్ల లంక భూములకు పెను ప్రమాదం పొంచి ఉందని అక్కడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెదపట్నంలంక తీరంలో మట్టి తవ్విన ప్రదేశం

గోప్యంగా తరలింపు

వైనతేయ నదీ తీరంలోని పెదపట్నం లంక శివారులోని భూముల్లో ఇటీవల రాత్రి సమయాల్లో పొక్లెయిన్లతో తవ్వి ట్రాక్టర్ల ద్వారా నాలుగైదు రోజుల పాటు మట్టిని యథేచ్ఛగా తరలించేశారు. ట్రాక్టర్ మట్టికి రూ.2100 వరకు వసూలు చేసి స్థానికంగా ఉన్న ఇటుక బట్టీలకు సరఫరా చేశారు. స్థానికుల నుంచి అసంతృప్తి వ్యక్తం కావడంతో తాత్కాలికంగా నిలిపివేశారు. లంక గ్రామాల్లో దాదాపు 40 వరకు బట్టీలున్నాయి. వాటికి మొన్నటివరకు పి.గన్నవరం మండలంలోని లంకగ్రామాల నుంచి మట్టి అక్రమంగా సరఫరా అయ్యేది. రాత్రి సమయాల్లో స్థానికంగా తరలింపులు జరిగేవి. పెదపట్నంలోని మధ్య భూములను ఆనుకుని ఉన్న పి.గన్నవరం మండలం మానేపల్లిలంకకు చెందిన భూముల్లో మట్టిని తవ్వి తరలించడం వల్ల దాని ప్రభావంతో తమ భూములు కోతబారిన పడి నదీగర్భంలో కలిసిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందారు.

ఇటుకబట్టీల వద్ద గుట్టలుగా..

లంక గ్రామాల్లో ఉన్న ఇటుక బట్టీల వద్ద ఎప్పటికప్పుడు మట్టిగుట్టలు కనిపిస్తున్నాయి. రాత్రికి రాత్రే మళ్లీ పుట్టుకొస్తున్నాయి. లంక గ్రామాల్లోంచి మట్టిని తీయడం గానీ, బయట నుంచి లోపలికి తీసుకురావడం గానీ చేయకూడదన్న నిబంధనలకు తిలోదకాలు ఇచ్చేశారు. వీటిపై పూర్తిస్థాయి నిఘా పెట్టామని మామిడికుదురు తహసీల్దార్ పి.సునీల్‌కుమార్ తెలిపారు.

సేవలు ఆన్‌లైన్.. పరికరాలు ఆఫ్‌లైన్

సచివాలయాల్లో ఇదీ తీరు..

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

అమలాపురం మండలం ఈదరపల్లి సచివాలయానికి రెండు కంప్యూటర్లు అందించారు. అందులో ఒకటి పనిచేయక సేవల్లో జాప్యం జరుగుతోంది. జిల్లాలోని ఏ సచివాలయంలో చూసినా ఇదే తీరు.

నాసిరకమే కారణమా..?

వైకాపా పాలనలో కాసులకు కక్కుర్తిపడి నాసిరకం పరికరాలను అందించడంతో అవి మొరాయిస్తున్నాయి. సిబ్బంది సైతం వీటిని పట్టించుకోవడం లేదు. కొన్నిచోట్ల ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో అమలాపురం, రామచంద్రపురం పురపాలక సంఘాలతో పాటు ముమ్మిడివరం నగర పంచాయతీ ఉన్నాయి. వీటి పరిధిలోని 439 సచివాలయాల్లో 3,374 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఒక్కో సచివాలయానికి రెండు కంప్యూటర్లు, ఒక యూపీఎస్, ఒక ప్రింటర్, లామినేషన్ యంత్రాన్ని అందించారు. కొన్ని పనిచేస్తుండగా.. మరికొన్ని పాడయ్యాయి. కంప్యూటర్లే ఎక్కువ చోట్ల పాడైపోయిన పరిస్థితి ఉంది. కొన్నిచోట్ల మాత్రం యూపీఎస్‌లు, ప్రింటర్లు మూలకు చేరాయి.

సేవల్లో జాప్యం..

సచివాలయాలకు ధ్రువపత్రాలు, రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు, ఇంటి స్థలాల కోసం ఎక్కువ మంది ప్రజలు వస్తున్నారు. సచివాలయాల్లోని కంప్యూటర్లు పనిచేయకపోవడంతో పంచాయతీల్లో ఉన్నవాటిని వినియోగిస్తున్నారు. ఒక్కోసారి అవీ మొరాయిస్తుండటంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

నివేదించకుండా..

సచివాలయాల్లో ఏదైనా పరికరం పనిచేయకపోతే ఉన్నతాధికారులకు నివేదించాలి. చాలా మంది ఉద్యోగులు విస్మరిస్తున్నారు. ప్రింటర్లు పనిచేయనిచోట ఇటీవలే కొత్తవి పంపించారు. మార్చికల్లా ప్రతీ సచివాలయానికి కొత్త కంప్యూటర్లు, పరికరాలను అందించేలా ప్రభుత్వం సిద్ధం చేస్తుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

ఏకీకృత సర్వేకు సాంకేతిక తిప్పలు

❖ జిల్లాలో 14.12 శాతం మాత్రమే పూర్తి ❖ సర్వర్ మొరాయింపుతో ఇక్కట్లు

గ్రామ, వార్డు సచివాలయాలు	: 439
మొత్తం కుటుంబాలు	: 4,93,236
సర్వే పూర్తయిన కుటుంబాలు	: 69,678

ముమ్మిడివరం: వైకాపా ప్రభుత్వంలో కుటుంబ గణన (హౌస్ హోల్డ్ సర్వే), మ్యాపింగ్ చేశారు. దీంట్లో వాలంటీర్లను భాగస్వామ్యం చేయడం.. హడావుడిగా చేపట్టడంతో తప్పిదాలు జరిగాయి. ప్రభుత్వ పథకాల లబ్ధి, ఎంపిక విషయంలో అవి నేటికీ వెంటాడుతున్నాయి. వాటిని సరిదిద్దడానికి కూటమి ప్రభుత్వం యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే-2025 (యూఎఫ్ఎస్-2025)కు శ్రీకారం చుట్టింది. గత ఏడాది డిసెంబరు 20న ప్రారంభించిన ఈ సర్వే సాంకేతిక సమస్యలతో నత్తనడకన సాగుతోంది. 4.93 లక్షల కుటుంబాల వివరాలు ప్రత్యేక యాప్‌లో నిక్షిప్తం చేయాల్సి ఉంది. ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకోగా 14.12 శాతం మాత్రమే చేశారు.

వివరాలు నమోదు చేస్తున్న సచివాలయ సిబ్బంది

అధిక సమయం పడుతూ..

కుటుంబ వివరాల నమోదు, డాక్యుమెంట్లు స్కాన్ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేసేందుకు ఎక్కువ సమయం పడుతోంది. సిగ్నల్ లేని చోట సర్వర్ మొరాయించి రోజూ 3-4 గంటలు సమస్యే.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సర్వే వేగంగా పూర్తిచేసేందుకు చర్యలు చేపడతామని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ విజయ్ తెలిపారు.

రైతేరాజు
అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

వందశాతం ఉత్తీర్ణతకు కృషి

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.నాగేశ్వరరావు సూచించారు. మార్చిలో జరగనున్న పరీక్షల్లో విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండే విధంగా సబ్జెక్టు నిపుణులు తయారు చేసిన ఆడియో, వీడియో క్లిప్పింగులను మంగళవారం డీఈవో ప్రారంభించారు. పదో తరగతిలో ఒకటి, రెండు మార్కుల ప్రశ్నలపై విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే విధంగా ఆడియో, వీడియో క్లిప్పింగులను తయారు చేశారు. ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ బీర హనుమంతరావు, జిల్లా సైన్సు అధికారి సుబ్రహ్మణ్యం, వివిధ సబ్జెక్టుల నిపుణులు పాల్గొన్నారు.

క్లిప్పింగులను ప్రారంభిస్తున్న డీఈవో నాగేశ్వరరావు

సౌరవిద్యుత్తు కనెక్షన్లు పెంచాలి

అమలాపురం కలెక్టరేట్: జిల్లాలో 200 యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగదారులకు ఏప్రిల్ నాటికి సోలార్ విద్యుత్తు కనెక్షన్లు ఏర్పాటు పూర్తి చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ట్రాన్స్‌కో అధికారులతో పీఎం సూర్యఘర్ పథకంపై సమీక్ష నిర్వహించారు. అధిక విద్యుత్తు లోడు ఉన్న గ్రామాలను రెండు సెక్టార్లుగా విభజించి గృహ అవసరాలు, వ్యవసాయ కనెక్షన్ల వారీగా విద్యుత్తు సరఫరా చేయాలని సూచించారు. విద్యుత్తు శాఖ ఎస్ఈ రాజేశ్వరి, అధికారులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధి కొరవడి.. చెత్తశుద్ధి నిలిచి

వెంటాడుతున్న డంపింగ్ యార్డ్ సమస్య

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

అమలాపురం పురపాలక సంఘం పరిధిలో రోజువారీగా పోగవుతున్న చెత్త, ఇతర వ్యర్థాలను నిత్యం బైపాస్ రహదారిలోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అక్కడ స్థలం కొరత కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిల్వచేసేందుకు స్థలం లేక సిబ్బంది రహదారులు, మురుగు కాలువల పక్కన పారబోస్తున్నారు.

మొదలుకాని శుద్ధి ప్రక్రియ

ఇక్కడి డంపింగ్ యార్డులో రోజూ 10 టన్నుల చెత్తను కాల్చి బూడిద చేసేందుకు సీఎస్ఆర్ నిధులు రూ.5 కోట్లతో ప్లాస్మా యంత్రాన్ని ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ అనుమతులు ఇచ్చారు. దీనికి సంబంధించిన పనులను గత ఏడాది డిసెంబరు మొదటి వారంలో ప్రారంభించారు. జనవరి నెలాఖరు నాటికి నిర్మాణం పూర్తి చేసి చెత్త శుద్ధి ప్రక్రియ చేపడతామని తెలిపారు. ఇప్పటికీ అక్కడ పనులు ప్రారంభం కాలేదు.

అమలాపురం డంపింగ్ యార్డులో మధ్యలో నిలిచిన ప్లాస్మా కేంద్రం

త్వరితగతిన అందుబాటులోకి..

ప్లాస్మా కేంద్రాన్ని ఈ నెలాఖరు నాటికి అందుబాటులోకి తీసుకురావాలనుకున్నాం. కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఈ ప్రక్రియ ఆలస్యమవుతోంది. త్వరలోనే పూర్తి చేసి చెత్తను శుద్ధి చేసేలా చర్యలు తీసుకుంటాం. **-నిర్మల్ కుమార్, పురపాలిక కమిషనర్**

అటకెక్కిన భూ సేకరణ

డంపింగ్ యార్డు నిర్వహణకు సంబంధించి మరికొన్ని ఎకరాల భూమిని సేకరించేందుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిపాదనలు పెట్టారు. ఈ ప్రక్రియ ప్రారంభించి సుమారు ఏడాదిపైనే కావస్తోంది. ఇప్పటి వరకు ఎలాంటి పురోగతీ లేదు. పట్టణంలో సేకరిస్తున్న వ్యర్థాలు నిల్వచేసేందుకు డంపింగ్ యార్డులో భూమి అందుబాటులో లేకుండా పోయింది. ఆ వ్యర్థాలకు నిప్పు పెడుతుండటంతో సమీప నివాసాల వారిని పొగ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

వివరాలు: వార్డులు: 30 ● జనాభా: 70వేలు ● రోజువారీ చెత్త: 34 టన్నులు ● తడిచెత్త: 24 ట.. ● పొడి చెత్త: 8 ట.. ● ప్లాస్టిక్ వ్యర్థాలు: 2 ట..

కరివేపాకు కిలో రూ.100

రాజోలు: కరివేపాకు ధరకు రెక్కలొచ్చాయి. సాధారణంగా కిలో రూ.30 ఉండే ధర నెల రోజులుగా రూ.100 వరకు పలుకుతోంది. ఏ దుకాణంలోనైనా కూరగాయలు కొంటే కొసరుగా వచ్చే కరివేపాకును ఇప్పుడు ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోందని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ఇటీవల అధిక మంచు కారణంగా కృష్ణా జిల్లాలో పంటలు దెబ్బతిని దిగుబడి తగ్గడంతో ఈ పరిస్థితి నెలకొందని వర్తకులు చెబుతున్నారు.

WANTED
Wanted D.T.P. Operators (Ad Designers)
for a reputed, Hyderabad based Accredited Advertising Agency to work in Hyderabad.
Cont: Mr. B.V.Rao, Punjagutta-Hyd.
8885530470

ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై ప్రత్యేక దృష్టి

అమలాపురం కలెక్టరేట్: ప్రభుత్వ ప్రాధాన్య అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ సూచించారు. మంగళవారం రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై రాష్ట్ర ప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా వివరాలు సేకరిస్తోందన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్‌లలో వస్తున్న భూ సంబంధిత సమస్యలను తక్షణం పరిష్కార మార్గాలు చూపాలన్నారు.

పుంగనూరు పెయ్య.. భలే ఉందయ్యా

మామిడికుదురు పరిధి కొర్లగుంట రోడ్డులోని రుద్రా శ్రీనివాసరావుకు చెందిన దేశవాళీ ఆవుకు రెండో ఈతలో మంగళవారం 20 అంగుళాల ఎత్తున్న తెల్లని పుంగనూరు పెయ్య దూడ పుట్టింది. గత ఏడాది జనవరిలో తొలి ఈతలో గిత్తదూడ పుట్టింది. తక్కువ ఎత్తు ఉండే ఈ జాతి ఆవులు అధిక పోషక విలువలున్న పాలను ఇస్తాయని, తక్కువ దాణా తీసుకోవడంతో పాటు ప్రశాంత స్వభావంతో ఉంటాయని మామిడికుదురు మండలం పశువైద్యాధికారి చేగొండి శ్రీరామ్ తెలిపారు. ఇంట్లో పెంచుకునేందుకు చాలామంది ఇష్టపడతారని వివరించారు. దేశవాళీ ఆవులకు బ్రీడింగ్ మార్పుతో పుంగనూరు ఆవులు పుడతాయన్నారు.

పుంగనూరు పెయ్యతో తల్లి ఆవు

- న్యూస్‌టుడే, మామిడికుదురు

'హలో లోకేశ్' పేరిట మమేకం

జేఎన్‌టీయూకేలో విద్యార్థులతో ముఖాముఖికి ఏర్పాట్లు

ఈనాడు, కాకినాడ
న్యూస్‌టుడే, గాంధీనగర్, సర్పవరం

కాకినాడ జేఎన్‌టీయూలో ఈ నెల 30న విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ పర్యటనకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. రూసా నిధులతో నిర్మించిన పీజీ విద్యార్థుల వసతి గృహాన్ని మంత్రి ప్రారంభించనున్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులను పరిశీలించి వారితో ఆలోచనలు పంచుకోనున్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 'హలో లోకేశ్' పేరిట విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. వీసీ ఛాంబర్ ఎదురుగా ఖాళీ స్థలంలో జర్మన్ హంగర్ టెంట్‌తో భారీ వేదికను సిద్ధం చేస్తున్నారు. క్యాంపస్ ఆవరణలో పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. అసంపూర్తిగా నిలిచిన కల్వర్టు, కాలువల పనులు పట్టాలెక్కిస్తున్నారు.

ప్రారంభానికి సిద్ధమైన పీజీ విద్యార్థుల వసతిగృహం

కార్యకర్తలతో సమావేశమై..

కాకినాడ గ్రామీణ నియోజకవర్గ తెదేపా కార్యకర్తలతో లోకేశ్ సమావేశం కానున్నారు. పార్టీ బలోపేతం, కూటమిలో సమర్థంగా పనిచేయడంపై దిశానిర్దేశం చేస్తారు. ఉత్తమ కార్యకర్తలను సత్కరిస్తారు. మంత్రి పర్యటనకు సంబంధించి ఎంపీ సానా సతీష్‌బాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి ఏర్పాట్లు పరిశీలించారు.

తీరనున్న వసతి సమస్య..

జేఎన్‌టీయూలో ఏటా వేల మంది విద్యార్థులు బీటెక్, ఎంటెక్‌లోని వివిధ కోర్సుల్లో చేరుతున్నారు. వీరికి సరిపడా వసతి సౌకర్యం లేక బయటే గదులు అద్దెకు తీసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం రూసా పథకంలో సుమారు రూ.10 కోట్లతో పీజీ విద్యార్థులకు వసతిగృహం మంజూరు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో సమకూర్చాలి. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం సొమ్ము ఇవ్వక నిర్మాణంలో జాప్యం జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక వసతిగృహాన్ని పూర్తిచేశారు.

కోరమాండల్ ఆసుపత్రికి..

కోరమాండల్ ఇంటర్నేషనల్ కంపెనీ తమ ట్రస్ట్ ద్వారా చాలాకాలంగా ఆసుపత్రి నిర్వహిస్తోంది. పేదలకు నామమాత్రపు రుసుముతో వైద్యసేవలు అందిస్తోంది. ఈ ఆసుపత్రిని ఆధునికీకరించి మరిన్ని వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఈ నూతన భవనాన్ని మంత్రి లోకేశ్ ప్రారంభించనున్నారు.

దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్
హైదరాబాద్, విశాఖపట్నం & కాకినాడకు సమీపంలో ఉన్న మా బల్క్ డ్రగ్ పరిశ్రమ ప్రొడక్షన్ విభాగంలో పనిచేయుటకు ఈ క్రింది అర్హతలు, శారీరక ధారుడ్యం మరియు మంచి ఆరోగ్యం గల అభ్యర్థులు కావలెను.

2022 TO 2025 PASSED OUT & 2026 PURSUING CANDIDATES

Job Title	Qualification	Age	Stipend (P.M)
Trainee Supervisor / Graduate Apprentice	B.Sc. Chemistry	20-25 yrs	Rs. 18,000/-
	B.Pharmacy B.Tech - Chemical / Instrumentation / Mech	20-25 yrs	Rs. 20,000/-
	M.Sc. (Organic Chemistry/ Analytical Chemistry)	20-25 yrs	Rs. 22,000/-
	M.Pharmacy (QA & RA)	20-25 yrs	Rs. 24,000/-

గమనిక : పైన తెలిపిన కోర్సులు పూర్తి చేసిన మరియు ఆఖరి సంవత్సరం చివరి సెమిస్టర్ చదువుతున్న అభ్యర్థులు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు జిరాక్స్ కాపీలను తీసుకుని ఈ క్రింది ప్రదేశాలలో జరుగు ఇంటర్వ్యూకు హాజరు కాగలరు. ఎంపిక కాబడిన అభ్యర్థులు షిఫ్టులలో పనిచేయవలసి ఉంటుంది.

02-02-2026	VINANDA DEGREE COLLEGE, Balaji Road, TUNI
03-02-2026	GBR DEGREE & PG COLLEGE, ANAPARTHI
03-02-2026	VSM DEGREE & PG COLLEGE, RAMACHANDRAPURAM
04-02-2026	YRL DEGREE COLLEGE, SAMARLAKOTA
05-02-2026	SRI VENKATESWARA COLLEGE OF ARTS & SCIENCE, Bhupaiah Agraharam Road, AMALAPURAM
06-02-2026	IDEAL COLLEGE OF ARTS & SCIENCE, Indrampalem, KAKINADA
06-02-2026	PR GOVERNMENT COLLEGE, Opp. MC Lauren High School, KAKINADA
07-02-2026	JNTU-K SCHOOL OF PHARMACEUTICAL SCIENCES & TECHNOLOGIES, KAKINADA
07-02-2026	PYDA COLLEGE OF PHARMACY (on the way to Yanam) PATAVALA
09-02-2026	GOVERNMENT COLLEGE OF AUTONOMOUS, Central Jail Road, Y.Junction, RAJAHMUNDRY
10-02-2026	ADARSA COLLEGE OF PHARMACY, G.KOTHAPALLI
10-02-2026	SAMHITHA DEGREE COLLEGE, Tadithota, RAJAHMUNDRY
10-02-2026	GIET SCHOOL OF PHARMACY, RAJAHMUNDRY

Interested candidates should report to the venue on or before 10.30 am
సదుపాయాలు : 1) బ్యాచ్‌లర్స్‌కు ఉచిత వసతి, 2) ఉచిత యూనిఫాం, 3) అర్హులైన వారికి PF, ESI ఇవ్వబడును. 4) భోజన ఖర్చులో రాయితీ.
MALE CANDIDATES ONLY

(c) eenadu

అంతర్వేది ఉత్సవాలకు పటిష్ఠ బందోబస్తు: ఐజీ

అంతర్వేది: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించేందుకు మంగళవారం విచ్చేసిన ఆయన ముందుగా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఉత్సవాల్లో ముఖ్య ఘట్టాలైన కల్యాణం, రథోత్సవం, చక్రవారి స్నానం సమయాల్లో సుమారు 5 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. క్యూలైన్లు, కల్యాణ మండపంలోని గ్యాలరీలు, సముద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. సుమారు 1500 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాహుల్ మీనా, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

'సోనోవిజన్ లక్కీడ్రా'లో విజేతలకు బహుమతులు

విజేతలను ప్రకటిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

టి.నగర్, ఏవీఏ రోడ్డు: రాజమహేంద్రవరంలోని సోనోవిజన్ కొనుగోలుదారులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన లక్కీడ్రాలో విజేతలను ఎంపిక చేసింది. మంగళవారం సాయంత్రం కోటిపల్లి బస్టాండ్ వద్ద సోనోవిజన్ షోరూమ్‌లో జరిగిన కార్యక్రమంలో రాజమహేంద్రవరం గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పాల్గొన్నారు. ఆయన చేతుల మీదుగా లక్కీ డ్రా విజేతలను ఎంపిక చేశారు. ఎన్. సాయికుమార్ (ఆర్యాపురం) మారుతీ ఆల్టో కారు గెలుపొందారు. జి.శారదాదేవి (వీవర్స్ కాలనీ) ఎల్ఈడీ టీవీ సొంతం చేసుకొన్నారు. ఆర్.రాజా (బలభద్రపురం) రిఫ్రిజరేటర్ దక్కించుకొన్నారు. ఎం.ఆంజనేయులుకు(కానవరం) వాషింగ్‌మిషన్ లభించింది. షోరూమ్ మేనేజింగ్ పార్టనర్ పి భాస్కరమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు శుభాభినందనలు

శ్రీ పి.వి.రామకృష్ణారెడ్డి, B.Tech.

శ్రీ P.S.రాజ్‌కుమార్, AMIE
Dy. E.E., PRI సబ్‌డివిజన్, అమలాపురం

శ్రీ K.V.కృష్ణంరాజు, M.Tech.
Dy. E.E., PRI సబ్‌డివిజన్, రాజోలు

శ్రీ రవికుమార్, DCE
మండల ఇంజినీరింగ్ అధికారి, మలికిపురం

శ్రీ T.రాజేష్, B.Tech.
A.E.E., PR సబ్‌డివిజన్, అమలాపురం

శ్రీ B.దుర్గాదండేలరావు, M.Tech.
A.E.E., PIU, అమలాపురం

శ్రీ K.శ్రీనివాసరావు, B.Sc.
డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్, PR డివిజన్, అమలాపురం

శ్రీ B.సుధాకర్, M.A.,
జూనియర్ అసిస్టెంట్ PR డివిజన్, అమలాపురం

శ్రీమతి Ch.సుజాత, B.Tech.
A.E.E. PR డివిజన్, అమలాపురం

శ్రీ V.రాధాకృష్ణ, B.Tech.
మండల ఇంజినీరింగ్ అధికారి, ఉప్పలగుప్తం

77వ గణతంత్ర దినోత్సవం సందర్భముగా డా॥ B.R.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉత్తమ పురస్కారాలలో భాగంగా జిల్లా కలెక్టర్ శ్రీ రావిరాల మహేష్‌కుమార్ గారి చేతులమీదుగా "బెస్ట్ సర్వీస్" అవార్డులు స్వీకరించిన మా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులకు ఇవే మా హృదయపూర్వక శుభాకాంక్షలు.

అన్యం రాంబాబు, M.Tech., MBA (Ph.D)
Dy.E.E., పంచాయతీరాజ్ సబ్‌డివిజన్ (PIU), అమలాపురం
State Organising Secretary, APPRD ఇంజినీర్స్ అసోసియేషన్

P.V.శ్రీనివాసరావు — Dy.E.E., PRI సబ్‌డివిజన్, ముమ్మిడివరం, మండలం ఇంజినీరింగ్ అధికారులు & సబ్‌డివిజన్ సిబ్బంది
V.చంద్రశేఖర్ — Dy.E.E., PRI సబ్‌డివిజన్, P.గన్నవరం, మండలం ఇంజినీరింగ్ అధికారులు & సబ్‌డివిజన్ సిబ్బంది
A.V.సూర్యనారాయణ — Dy.E.E., PRI సబ్‌డివిజన్, కొత్తపేట, మండలం ఇంజినీరింగ్ అధికారులు & సబ్‌డివిజన్ సిబ్బంది
T.సురేష్ కుమార్ — Dy.E.E. PRI సబ్‌డివిజన్, మండపేట, మండలం ఇంజినీరింగ్ అధికారులు & సబ్‌డివిజన్ సిబ్బంది
K.శ్రీనివాస్ — Dy.E.E. PRI సబ్‌డివిజన్, రామచంద్రపురం, మండలం ఇంజినీరింగ్ అధికారులు & సబ్‌డివిజన్ సిబ్బంది
AEEలు & PIU సిబ్బంది, PR డివిజన్ కార్యాలయ సిబ్బంది
అల్లాడి వెంకటరమణ — కాంట్రాక్టర్, అమలాపురం
బల్ల బ్రహ్మాజీ — కాంట్రాక్టర్, బండారులంక
సామ సత్యనారాయణ (చిన్ని), కాంట్రాక్టర్, అమలాపురం
బొంతు బాలకృష్ణ — కాంట్రాక్టర్, ఈదరపల్లి
పితాని సత్యనారాయణ & ప్రవీన్ — కాంట్రాక్టర్, తొత్తరమూడి
గంధం బ్రహ్మానందం — కాంట్రాక్టర్, సుధాపాలెం
P.దామోదరరెడ్డి — ప్రాజెక్ట్ కాంట్రాక్టర్, రావులపాలెం
దాసరి బాల సుబ్రమణ్యం — కాంట్రాక్టర్, కామనగరువు
ఎ.వి.కె.వి.భాస్కర్ (జయబాబు) — కాంట్రాక్టర్, నంగవరం
రాయపురెడ్డి శ్రీనివాసరావు — కాంట్రాక్టర్, సుధాపాలెం
జాలెం రాంబాబు & కృష్ణ — కాంట్రాక్టర్స్, దేవగుప్తం
కొల్లాటి వీరాస్వామినాయుడు — కాంట్రాక్టర్, గోపాయిలంక
మెట్ల బాబి — కాంట్రాక్టర్, కొమరిగిరిపట్నం
M.నాగిరెడ్డి — ప్రాజెక్ట్ కాంట్రాక్టర్, రావులపాలెం
M.ఆంజనేయరెడ్డి — ప్రాజెక్ట్ కాంట్రాక్టర్, రావులపాలెం
రాజులపూడి గణేష్ కుమార్ — కాంట్రాక్టర్, కామనగరువు

వెంకన్న సన్నిధిలో ఆధ్యాత్మిక శోభ

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం మంగళవారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో శోభిల్లింది. ఉదయం ప్రభాత సేవ, గోపూజ, అష్టోత్తర శతనామార్చన, కల్యాణం తదితర కార్యక్రమాలు అర్చకులు కనుల పండువగా నిర్వహించారు. ఏర్పాట్లను దేవస్థానం ఈవో నల్లం సూర్య చక్రధరరావు పర్యవేక్షించారు.

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – తాడికొండ

బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Hospitality Partner: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Man of the Series: Hero
Digital Partner: ఈనాడు.నెట్
TV Partner: ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్, ఈ FM Mee FM
Organised by ఈనాడు

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - I జూనియర్స్: మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్స్‌లతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులు చేసి ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - I జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సులతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

సీనియర్స్ విన్నర్స్ రాయలసీమ రాకర్స్

గ్రౌండ్-2లో సీనియర్స్ : సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ | చరణ్ జిత్ | ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-I (జూనియర్స్)
మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)
మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

ఏకాదశరుద్రుల సీమ.. కోనసీమ

వీరేశ్వరస్వామి ఆలయానికి వచ్చిన స్వామీజీలు

అంబాజీపేట: ఏకాదశ రుద్రులు కొలువైన కోనసీమ పుణ్యసీమగా భాసిల్లుతోందని రుషికేష్‌కు చెందిన హరహర నందస్వామీజీ అన్నారు. ఉత్తరాదికి చెందిన స్వామీజీల బృందం ఏకాదశ రుద్రుల ఆలయాలను మంగళవారం సందర్శించారు. ఏకాదశరుద్రులు భారతదేశం మొత్తం మీద ఒక్క కోనసీమలోనే ఉన్నారన్నారు. ఈ ఆలయాలకు 476 సంవత్సరాల విశిష్టత ఉందన్నారు. అనంతరం ముక్కామలలోని కంచికామకోటిపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శైవాగమ పాఠశాలను సందర్శించి.. సంతృప్తిని వ్యక్తంచేశారు.

వాడపల్లిలో నేటి పూజలు

● కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వరుని ఆలయంలో బుధవారం ఉదయం 5 గంటలకు ప్రభాత సేవ, మేలుకొలుపు, వేంకటేశ్వర సహిత లక్ష్మీఐశ్వర్య హోమం, ద్రవిడ వేదపారాయణం, నివేదన. ● ఆరు గంటలకు గోపూజ, అష్టోత్తర నామార్చన పూజలు, దర్శనాలు ప్రారంభం. ● 11 గంటలకు నిత్య కల్యాణం. ● 12 గంటలకు అర్చన. ● మధ్యాహ్నం ఒంటిగంట నుంచి విరామం, సాయంత్రం 4 నుంచి దర్శనాలు ప్రారంభం. ● సాయంత్రం 6 గంటలకు అర్చన, 7.30కు నైవేద్యం, 8 గంటలకు పవళింపు సేవ.

\- న్యూస్‌టుడే, వాడపల్లి(ఆత్రేయపురం)

హుండీ ఆదాయం లెక్కింపు

అయినవిల్లి, న్యూస్‌టుడే: అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయంలో మంగళవారం దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో హుండీలు తెరిచి ఆదాయం లెక్కించారు. 49 రోజులకు గాను రూ.30,01,285, 14 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్లు ఏసీ సత్యనారాయణరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజోలు గ్రూపు దేవాలయాల ఈవో ప్రసాద రాజు, భక్తులు పాల్గొన్నారు.

అయిదేళ్లకే నూరేళ్లు నిండిపోయాయా..

● చైనా మాంజాకు బలైన చిన్నారి తల్లిదండ్రుల రోదనలు
● అంబాజీపేటలో విషాదఛాయలు

అంబాజీపేట, న్యూస్‌టుడే: ఈ నెల 26న హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో చైనా మాంజా మెడకు చుట్టుకుని చిన్నారి నిశ్వికాదిత్య(5) మృతితో స్వగ్రామం అంబాజీపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. అక్కడి నుంచి మృతదేహాన్ని తీసుకువస్తున్న సమాచారంతో కుటుంబ సభ్యులు, బంధువులు పెద్దఎత్తున చేరుకున్నారు. మంగళవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత మృతదేహం చేరుకోవడంతో ఆ ప్రాంతం రోదనలతో నిండిపోయింది. అయిదేళ్లకే నూరేళ్లు నిండిపోయాయా అంటూ విలపించిన తీరు అక్కడున్న వారిని కలచివేసింది. చిన్నారి తల్లిదండ్రులు రాంసాగర్, పద్మావతిని ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. సంక్రాంతి పండగకు స్వగ్రామం వచ్చి సరదాగా గడిపిన వీరు ఈ నెల 23న తిరిగి హైదరాబాద్ వెళ్లారు. కొన్ని రోజులు ఇక్కడే ఉంటే ఈ ఘోరం జరిగేది కాదేమోనని కుటుంబ సభ్యులు వాపోతున్నారు.

పదేళ్ల క్రితమే వెళ్లి..

అంబాజీపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పక్కన ఉన్న పులిదిండి సత్యస్వామి రెండవ కుమారుడు రాంసాగర్, పద్మావతి దంపతులు పదేళ్ల క్రితమే ఉద్యోగ రీత్యా హైదరాబాద్ వెళ్లారు. అప్పటి నుంచి అక్కడే ఉంటున్నారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. చిన్నమ్మాయి నిశ్వికాదిత్య అక్కడే ఎల్‌కేజీ చదువుతోంది. కూకట్‌పల్లి జాతీయ రహదారిలోని సుమిత్రానగర్‌లో మెడకు మాంజా చుట్టుకోవడంతో చిన్నారి ప్రాణాలు కోల్పోయింది.

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). ✆ 83338 33368

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph : 8142292071.

శ్రీసాయి గోల్డ్ తాకట్టులో ఉన్న బంగారం ఏ బ్యాంక్/ప్రైవేట్ సంస్థల నుండి అయినా విడిపించి ఆరోజు మార్కెట్ రేటుకి కొనబడును. స్పాట్ క్యాష్ 94933 38823.

EDUCATION

విజయవాడలో BPT/ B.Sc., MLT- మేనేజ్‌మెంట్ కోటా సీట్లు- తక్కువ ఫీజు- కొన్నిసీట్లు కలవు. Affiliated to Dr. NTR యూనివర్సిటీ. ✆ 7995945835.

REAL ESTATE

FLAT FOR SALE

KAKINADA CITY

కాకినాడ, RTO ఆఫీస్ మెయిన్‌రోడ్ నందు ప్రముఖ అపార్ట్‌మెంట్‌లో 1060 Sft. సెకండ్ సేల్. S/F, కార్‌పార్కింగ్, లిఫ్ట్ సౌకర్యాలతో అమ్మకము. Cont: 97057 48052

EENADU e Classifieds

PLOT FOR SALE

KAKINADA CITY

KKD, గంగనాపల్లి 100+100 చ॥గ॥ EF రెడీగా ఇల్లు కట్టుకొనుటకు గజం 16K, కలెక్టర్ ఆఫీస్ దగ్గర 2BHK ఫ్లాట్స్16L Only. 8985804011,9440303936.

JOBS

ఫ్యాక్టరీలో తేలికపాటి పని చేయుటకు యువతి/ యువకులు కావలెను. 9 గంటలు డైలీ పని ఉండును. నెలకు రెండు ఆదివారములు సెలవు. సంప్రదించండి: 9000557999.

ADB రోడ్డుకి దగ్గరగా రంగంపేట వద్ద RUDA అప్రూవ్డ్ వెంచర్ మార్కెటింగ్‌కై టీం ఉన్న లీడర్లు కావలెను. మంచి కమీషన్+ ఇన్సెంటివ్స్. ✆ 6302626576.

రైస్ మిల్ & ప్లాంట్ ఆపరేటర్స్ కావలెను. అనుభవజ్ఞులైన వెల్డింగ్, రిపేర్ తెలిసిన ఆపరేటర్స్ కావలెను. Contact No: ✆ 80962 46099.

SECURITY GUARDS

రాజమండ్రి మరియు పరిసర ప్రాంతాలలో సెక్యూరిటీకి సంబంధించి గార్డులు, సూపర్‌వైజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు కావలెను. ✆ 96525 29724, 93468 62560.

కాకినాడ మరియు వాకలపూడి ఏరియాలో సెక్యూరిటీ గార్డ్‌లు స్త్రీలు మరియు పురుషులు కావలెను. PF మరియు ESI ఉచిత భోజన సౌకర్యం కలదు. ✆ 9949826283

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-15 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

స్వగ్రామానికి మృతదేహం

అమలాపురం కలెక్టరేట్: మామిడికుదురు మండలం ముత్యాలపాలేనికి చెందిన **బోసుపాముల మరియమ్మ** (48) అనారోగ్యంతో గల్ఫ్‌లో మృతి చెందారు. ఆమె ఇటీవల స్వగ్రామానికి వచ్చి తిరిగి వెళ్లారు. అనారోగ్యానికి గురై పని ప్రదేశంలో మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు వచ్చేందుకు సహాయం అందించాలని మరియమ్మ కుటుంబ సభ్యులు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ కేంద్రాన్ని ఆశ్రయించారు. స్పందించిన అధికారులు గల్ఫ్‌లో ప్రతినిధులతో సంప్రదించి మృత దేహాన్ని మంగళవారం స్వగ్రామానికి తెప్పించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గుత్తేదారుడిపై వైకాపా నాయకుడి దాడి

అమలాపురం పట్టణం: వైకాపా నాయకుడు దొంగ చిన్నా తనపై దాడి చేసినట్లు పురపాలక సంఘంలో గుత్తేదారుడు కడలి శ్రీనివాస్ మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వీరబాబు తెలిపారు. అమలాపురం బస్‌స్టాండ్ నుంచి ఈదరపల్లి వంతెన రోడ్డులో మురుగుకాలువలో డీఈ సత్యనారాయణ పర్యవేక్షణలో గుత్తేదారుడు కడలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రైవేట్ సిబ్బంది పూడికల తొలగింపు పనులు చేట్టారు. 25వ వార్డు వైకాపా కౌన్సిలర్ దొంగ సుధారాణి భర్త చిన్నా ఆ పనులను అడ్డుకున్నారు. ఆ సందర్భంగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దొంగ చిన్నా అక్కడే ఉన్న సిమెంట్ పలకతో శ్రీనివాస్ మోకాళ్లపై కొట్టారు. పోలీసులు చిన్నాను అదుపులోకి తీసుకున్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	18,000
పాతకాయ: గండేరా	32,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	29,500
గటగట	27,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	18,000-20,000
కొత్త (పచ్చి) కాయ	16,000-18,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	143-00
రిటైల్ లైవ్	170-00
డ్రెస్డ్	247-00
స్కిన్‌లెస్	281-00

రైతేరాజు

సేంద్రియ విధానం.. ఆచరిస్తే అమోఘం

న్యూస్‌టుడే, మోతుగూడెం

పోలవరం జిల్లా చింతూరు మండలం గూడూరు గ్రామానికి చెందిన గిరిజన రైతు దూబి లక్ష్మయ్య సేంద్రియ వ్యవసాయంలో రాణిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. రెండెకరాల్లో వరి, ఎకరాలో మినుములు, పెసలు పండిస్తున్నారు. ఎటువంటి రసాయన ఎరువులు వినియోగించకపోవడంతో చాలామంది వీటి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

తోట వద్దకే వచ్చి ఆకుకూరలు కొనుగోలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

స్ఫూర్తి

మరో పది సెంట్లలో కూరగాయలు

పది సెంట్ల భూమిలో పలు రకాల ఆకు, కూరగాయల పంటలను పండిస్తున్నారు. వీటికి సేంద్రియ ఎరువులు, కషాయాలను పిచికారీ చేయడంతో 20 రోజులకే పంట చేతికి వస్తుంది. తాజా సరకు కావడంతో గ్రామం, చుట్టుపక్కల అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, వసతి గృహాల నిర్వాహకులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మిగిలినవి వారపు సంతలో విక్రయిస్తున్నారు.

కషాయాల తయారీ, విక్రయం

కషాయాలు, ద్రావణాలను స్వయంగా తయారు చేసుకుంటున్నారు. వీటిలో కొన్ని సొంతానికి వినియోగించుకోవడంతో పాటు తక్కువ ధరకు ఇతర రైతులకు విక్రయిస్తున్నారు. దాదాపు వంద మంది వరకు ఈయన వద్ద కొనుగోలు చేస్తున్నారు. విత్తనశుద్ధికి బీజ, ఘన జీవామృతాలు, భూమిలో సూక్ష్మజీవుల వృద్ధికి ద్రవజీవామృతం, పంట తొలిదశలో పట్టే చిన్న, పెద్ద పురుగుల నివారణకు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, టమాటా, మిర్చి, వంగ, బెండ, గోరుచిక్కుడు పంటల్లో ఆకుముడత పురుగు నివారణకు ఆవు మూత్రంతో వావిలాల కాషాయం తదితరాలు తయారు చేసి విక్రయిస్తున్నారు.

ఆదాయం ఇలా..

వరి, మినుములు, పెసలు, కూరగాయలు, ఆకుకూరల పంటలతో పాటు కషాయాల అమ్మకాల ద్వారా ఖర్చులు పోను నెలకు రూ.25 వేల వరకు ఆదాయం పొందుతున్నట్లు లక్ష్మయ్య తెలిపారు.

పొగాకులో తెగుళ్ల బెడద

తెగులు సోకి వాడిపోయిన పొగాకు మొక్క

తెలుసుకుందాం..

గోపాలపురం, న్యూస్‌టుడే: వర్జీనియా పొగాకు తోటల్లో ఈ సీజన్‌లో వచ్చే తెగుళ్లలో ఆకుముడత, నల్లకాడ ప్రధానమైనవి. వాటి నివారణకు సరైన చర్యలు తీసుకోకపోతే చాలానష్టం వస్తుంది. దిగుబడితో పాటు నాణ్యత లోపిస్తుందని గోపాలపురం వేలం కేంద్రం నిర్వహణాధికారి కేవల్ రామ్‌మీనా తెలిపారు. ● ఆకుముడత నివారణకు తోట చుట్టూ జొన్న, మొక్కజొన్నను కంచెలా రెండు వరుసల్లో వేసుకోవాలి. వ్యాధికి కారణమైన తెల్లదోమను అరికట్టేందుకు జిగురు అట్టలను హెక్టారుకు 15 చొప్పున అక్కడక్కడ ఏర్పాటు చేయాలి. పొలంలో ముందుగా ఇమిడోక్లోపిడ్ ఎస్ఎల్ 3 మి.లీ.ను 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ● నల్లకాడ తెగులు తరచూ వస్తుంటే పంటమార్పిడి చేయడం మంచిది. నాట్లు వేసింది. మొదలు తోటలో తేమ ఎక్కువగా ఉంటే నీటితడులు బాగా తగ్గించాలి. వ్యాధి నివారణకు రెడిమెల్ 20 గ్రా. మందును 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

వరిలో నత్రజని ప్రధాన పోషకం

అయినవిల్లిలో ఎదిగిన వరిచేను

అయినవిల్లి, న్యూస్‌టుడే: వరిలో నత్రజని మొక్క పెరిగేందుకు, దుబ్బు కట్టేందుకు ఉపయోగ పడుతుందని అయినవిల్లి ఏవో శోభ తెలిపారు. దీని లోపం వల్ల ఎదురయ్యే సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. నత్రజని లోపిస్తే వరిదుబ్బు ఎదుగుదల తగ్గి పసుపు పచ్చగా మారి ఆకులు ఎండి పోతాయి. ఒకవేళ ఎక్కువైతే పైరు ఏపుగా పెరిగి ఆకులు నీలిరంగుతో కూడిన ముదురాకు పచ్చ రంగు కలిగి ఉంటాయి. దీంతో పంట ఆలస్యంగా కోతకు వస్తుంది. రోగనిరోధక శక్తి తగ్గి పురుగులు, తెగుళ్లు ఆశిస్తాయి. రబీలో ఎకరాకు 72 కిలోల నత్రజని వేయడం ద్వారా ఆశించిన దిగుబడులు పొందొచ్చు. పైరు కీలక దశలో మాత్రమే వేయాలి. వేయాల్సిన మొత్తాన్ని మూడు భాగాలుగా విభజించి మొదటి భాగం ఆఖరి దమ్ము లేదా నాట్లు వేసే సమయంలోను, మరోభాగం పిలక తొడిగి దుబ్బువేసే సమయంలోనూ, మిగిలినది అంకురం ఏర్పడిన దశలోను వేయాలి. దీనివల్ల బాగా దుబ్బులు చేసి వెన్నుల సంఖ్య, గింజల సంఖ్య పెరిగి మంచి దిగుబడులు వస్తాయి.

మొక్కజొన్నలో కాండం తొలుచు పురుగు నివారణ

మీ కోసం

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: ప్రస్తుతం మొక్కజొన్నలో కాండంతొలుచు పురుగు అధికంగా ఆశిస్తోంది. దిగుబడులు గణనీయంగా తగ్గి రైతులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. పురుగు ఉద్ధృతిని గుర్తించే విధానం, నివారణ చర్యల గురించి ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకటనరసింహారావు వివరించారు. పురుగు చిన్నదశలో ఆకుల పత్రహరితం తింటాయి. క్రమంగా కాండం లోపలికి చేరి తినడం వల్ల ఆకులు విచ్చుకున్న తరువాత గుండుసూదిలాంటి రంధ్రాలు వరుస క్రమంలో కనిపిస్తాయి. లార్వా ఎదిగి అంకురాన్ని తినడం వల్ల మొక్క చనిపోయి ఎండిపోతుంది. దీనిని 'డెడ్‌హార్ట్'గా పేర్కొంటారు. ఒక్కొక్క మొక్కలో రెండు నుంచి మూడు పురుగులు కనిపిస్తాయి.

మొక్కజొన్న పంటకు ఆశించిన కాండం తొలుచు పురుగు

నివారణ చర్యలు

● పొలం చుట్టూ 3, 4 వరుసల్లో ఎర పంటగా వేసుకుని 45 రోజుల తరువాత తీసివేయాలి. పురుగు ఆశించిన మొక్కలను నాశనం చేయాలి. అంతర పంటగా అపరాలు వేస్తే కాండం తొలిచే పురుగులకు సహజ శత్రువుల సంఖ్య పెరుగుతుంది. ● ట్రైకోగ్రామా కిలోనిస్ పరాన్నజీవి గుడ్లను ఎకరాకు 2, 3 ట్రైకోకార్డుల రూపంలో రెండు విడతలుగా విడుదల చేయాలి. ● మోనోక్రోటోఫాస్ లీటరు నీటికి 1.6 మిల్లీలీటర్ల చొప్పున ఎకరాకు 320 మిల్లీలీటర్ల మందు కలిపిన ద్రావణాన్ని పైరు మొలకెత్తిన 10 నుంచి 12 రోజులకు పిచికారీ చేయాలి. ● పురుగు ఉద్ధృతి ఎక్కువగా ఉంటే కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఎకరాకు 3 కేజీల చొప్పున పైరు మొలకెత్తిన 25 నుంచి 30 రోజులకు ఆకుల సుడులలో వేయాలి.

(c) eenadu

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

ముస్తాబవుతున్న రక్షిత పథకం

తాగునీటి ట్యాంకు వద్ద ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

సఖినేటిపల్లి: ఈ నెల 30న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అంతర్వేది పర్యటనలో భాగంగా ప్రారంభించబోయే అంతర్వేదిదేవస్థానం సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ముస్తాబు చేస్తున్నారు. ఇప్పటికే ఆర్డీవో మాధవి, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పల్లిపాలెం మినీహార్బర్‌లో ఉన్న హెలిప్యాడ్‌ను పరిశీలించారు. హార్బర్ నుంచి ప్రధాన రహదారికి వచ్చే రోడ్లను శరవేగంగా వేశారు. నాలుగు గ్రామాల్లోని 30 వేల మందికి తాగునీరు అందించడానికి రూ.17.83 కోట్లతో నిర్మించిన తాగునీటి పథకం చెరువు చుట్టూ ఇనుప కంచె వేసి, ఫిల్టర్ భవనాలు, ఓవర్‌హెడ్ ట్యాంకు తదితర వాటిని రంగులతో తీర్చిదిద్దుతున్నారు.

వేగంగా అన్న క్యాంటీన్ నిర్మాణం

రాజోలులో తుది మెరుగులు దిద్దుకుంటున్న భవనం

రాజోలు, న్యూస్‌టుడే: రాజోలులో అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. పేద ప్రజలకు రూ.5కే కడుపునిండా అన్నం పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చేపట్టిన ఈ పథకంలో నిర్మిస్తున్న భవన పనులు తుది దశకు చేరాయి. నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన రాజోలులో నిత్యం కోర్టు పనులు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలకు అధిక సంఖ్యలో వచ్చే పేదలకు ఇది ఉపయుక్తంగా ఉంటుంది. ఫిబ్రవరి మొదటి వారంలో క్యాంటీన్‌ను ప్రారంభిస్తామని జిల్లా ప్రజారోగ్య, ఇంజినీరింగ్ విభాగం ఈఈ ఎం.టి.హుస్సేన్ తెలిపారు.

దశాబ్దాల కల.. సాకారమయ్యేదెన్నడో..

– న్యూస్‌టుడే, మలికిపురం

మలికిపురం మండలం తూర్పుపాలెంలో శంకరగుప్తం మేజరు డ్రెయిన్‌పై 6.50 కిలోమీటరు వద్ద రూ.4.30 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వంతెన పనులు నేటికీ పూర్తికాలేదు. దశాబ్దాల నాటి గ్రామ ప్రజల కల ఎప్పటికి సాకారమవుతుందో తెలియని పరిస్థితుల్లో తీవ్ర నిరాశలో ఉన్నారు. తూర్పుపాలెం, గూడపల్లిపల్లిపాలెం గ్రామాలను కలుపుతూ ఉన్న ఈ కాలిబాట వంతెన 25 ఏళ్ల క్రితమే శిథిలమై కుప్పకూలింది. దీంతో పడవపైనే రేవు దాటేవారు. అప్పటి నుంచి ఇక్కడ శాశ్వత వంతెన నిర్మించాలన్న డిమాండ్‌తో నాయకులు, ప్రజలు పోరాటాలు చేశారు. ఈ క్రమంలో అప్పటి లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి 2001లో దీని నిర్మాణానికి శంకుస్థాపన చేసినా కార్యాచరణకు నోచుకోలేదు. అనంతరం 2017 ఏప్రిల్ 4న అప్పటి ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావు పనులకు శంకుస్థాపన చేశారు.

ఏడాదిన్నర తర్వాత కదలిక..

వంతెన పనులు 2017లో ప్రారంభమై దాదాపు పూర్తయ్యాయి. అనుసంధాన రహదారుల పనులు ప్రారంభించకుండానే 2019 ఫిబ్రవరి 14న హడావుడిగా ప్రారంభించేశారు. 2019లో వైకాపా ప్రభుత్వం వచ్చాక పట్టించుకోలేదు. దీనికితోడు పేరు ఖరారు విషయంలో రెండు వర్గాల మధ్య

ఎనిమిదిన్నరేళ్లుగా అసంపూర్తిగా తూర్పుపాలెం వంతెన

విభేదాలు తలెత్తడం శాపంగా మారింది. ఈ కారణంతో గూడపల్లిపల్లిపాలెం వైపు అనుసంధాన రహదారి పూర్తయినా తూర్పుపాలెం వైపున పూర్తవ్వలేదు. దీంతో పట్టెలనిచ్చెన ఏర్పాటు చేసుకుని రైతులు రాకపోకలు సాగించారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం వచ్చాక 2024 ఆగస్టులో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఇరువర్గాలతో మాట్లాడటంతో తూర్పుపాలెం వైపు అనుసంధాన రహదారి నిర్మాణానికి వెసులుబాటు కలిగి వంతెన నుంచి కింది వరకు ఇరువైపుల రక్షణ గోడల నిర్మాణం పూర్తయ్యింది. మట్టి పూడ్చే కార్యక్రమం ప్రారంభమయ్యే సమయంలో మళ్లీ వంతెన పేరు విషయంలో వివాదం ఏర్పడి ఒకవర్గం వారు అడ్డంగా కంచె కట్టేయడంతో పనులు నిలిచిపోయాయి. ఏడాదిన్నర తర్వాత ఇటీవల అనుసంధాన రహదారికి మట్టితో పూడ్చి రోడ్డు నిర్మాణానికి సిద్ధం చేశారు. వంతెన నుంచి గ్రామంలోని రోడ్డువరకు అనుసంధాన రహదారి ఏర్పాటుకు కంచె తొలగించి రైతులు సహకరిస్తారా అన్నది ప్రశ్నగా మారింది. వంతెన నిర్మాణం పూర్తయి ఇంకా వినియోగంలోకి రాకుండానే వంతెనపై రావి, మర్రి మొక్కలు మొలిచాయి. వీటిని తొలగించి రోడ్డు ఏర్పాటు చేయాల్సి ఉంది.

ప్రజలకు ఎంతో లాభం

వంతెన పూర్తయి వినియోగంలోకి వస్తే గూడపల్లిపల్లిపాలెం, తూర్పుపాలెం గ్రామాల ప్రజలకు ప్రయాణ, రవాణా సౌకర్యాలు మెరుగవుతాయి. ముఖ్యంగా తూర్పుపాలెం లోని రైతులకు ఇది బాగా ఉపయోగపడుతుంది. ఈ గ్రామాలకు జగ్గన్నపేట కూడలి దగ్గరవుతుంది.

రెండు నెలల్లో పూర్తవుతాయి

తూర్పుపాలెం వంతెన నిర్మాణ పనులు మరో రెండు నెలల్లో పూర్తవుతాయి. అప్రోచ్ రోడ్లకు సంబంధించి రక్షణగోడల మధ్య మట్టి పూడిక పనులు పూర్తయ్యాయి. ఇరువైపుల నాలుగు మీటర్ల వెడల్పుతో స్లాబ్‌వేసి వంతెన రోడ్డుపై వేరింగు కోట్ వేయడంతో పనులు పూర్తవుతాయి.
– ఆనందకిరణ్, ఏఈ, జలవనరుల శాఖ(డ్రెయినేజీ విభాగం)

జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు అర్హత

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: మండలంలోని మహర్షి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో 8, 9 తరగతులు చదువుతున్న మాగాపు వెంకటశ్రీనివాసకుమార్, కొప్పిశెట్టి సృజన్‌లు నాందేడ్‌లో ఈ నెల 28 నుంచి 31 వరకు జరగనున్న జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు డైరెక్టర్ ఎన్‌వీ రామరాజు మంగళవారం తెలిపారు. ఈ విద్యార్థులు ఇటీవల పాలకోడేరు మండలం శృంగవృక్షంలో రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరఫున పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు చెప్పారు. వీరిని డైరెక్టర్‌తో పాటు పలువురు అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట:90323 93884

స్పందనకు వందనం

డ్రెయిన్‌లో పూడికతీత

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: ఈతకోట డ్రెయిన్‌లో పూడిక పేరుకుపోయి దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతుండటంతో సమస్యను పంచాయతీ కార్యదర్శి శర్మ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. సిబ్బందితో పూడిక తీయించారు.

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: తాడిపూడి గ్రామంలోని డ్రెయిన్‌లో పూడిక పేరుకుపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని సర్పంచి ముదునూరి సుబ్బలక్ష్మి వద్ద ప్రస్తావించగా శుభ్రం చేయించారు.

వ్యర్థాల తొలగింపు

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: కొమరాజులంకలో రోడ్డుపక్కనే చెత్తాచెదారం పేరుకుపోవడంతో రాకపోకల సమయాల్లో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లడంతో సిబ్బందితో తొలగించారు.

ఈ-నారీతో సంఘాల్లో పారదర్శకత

కొత్తపేట, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల్లో ఆర్థిక లావాదేవీల్లో పారదర్శకత పెంపొందించడంతో పాటు సభ్యుల నమ్మకాన్ని మరింత బలపరిచేందుకు ఈ-నారీ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతుందని ఏపీఎం ధనరాజు అన్నారు. మంగళవారం కొత్తపేట మహిళా సమాఖ్య కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డ్వాక్రా సంఘాల సంస్థాగత నిర్మాణం, అభివృద్ధి, బ్యాంకు లింకేజీ, జీవనోపాధుల పెంపుదల వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీసీ విజయలక్ష్మి, టి.చంద్రలీల, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు కూడలిలో నినదిస్తున్న కార్మికులు

డిమాండ్ల సాధనకు ఎలక్ట్రీషియన్ల ర్యాలీ

రాజోలు, మామిడికుదురు, న్యూస్‌టుడే: తమ డిమాండ్ల సాధన కోసం ప్రైవేటు ఎలక్ట్రీషియన్లు నిరసన ర్యాలీ చేపట్టారు. పి.గన్నవరం మండలం వాడ్రేవుపల్లి నుంచి మామిడికుదురు మీదుగా శివకోటి లాకుల వరకు ద్విచక్ర వాహనాలతో ర్యాలీ చేశారు. జనవరి 27న ఎలక్ట్రీషియన్ డే గా ప్రకటించాలని, రద్దు చేసిన సంక్షేమ పథకాలను అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు మామిడిశెట్టి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బత్తుల జనార్దనరావు, జిల్లా ఉపాధ్యక్షుడు చాగంటి బాబులు, రాంబాబు, రామారావు, కట్టా ఏసుబాబు, చాగంటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో బంగారు పతకాలు

విజేత విద్యార్థులతో ఉపాధ్యాయులు

మలికిపురం: సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ రీసెర్చ్-పుణె సంస్థ అంతర్జాతీయ స్థాయిలో వర్చువల్‌గా నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో బట్టేలంక జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నందిని వారణాసి, బోణం హేమని, యడ్ల హేమంత్, పాలిపి సవిత, ఆదుర్తి అక్షర, కొమ్ముల ఆదిత్యలు బంగారు పతకాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు ఎన్.వి.వి.హనుమంతరావు తెలిపారు. వీరితో పాటు పాల్గొన్న పలువురికి ప్రశంసాపత్రాలు దక్కాయన్నారు.

నేడే గజమాల యాత్ర

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ మహాగజమాల యాత్రకు తరలి రావాలని గజమాల వ్యవస్థాపకుడు చింతా మహానాగరాజు, కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. కృష్ణమ్మ జన్మస్థలమైన ఓడలరేవులో బుధవారం ఉదయం 9 గంటల నుంచి యాత్ర ప్రారంభమై అమలాపురం(పేరూరు) వైజంక్షన్ మీదుగా తాటిపాక, శివకోడు, లక్కవరం, మలికిపురం మీదుగా అంతర్వేది చేరుకుంటుందని తెలిపారు. సాయంత్రం కృష్ణమ్మ విగ్రహానికి గజమాల వేసి మరో గజమాల స్వామి వారికి అలంకరించి పూజలు చేస్తామని వివరించారు.

అంతర్వేదిలో ఉత్సవమూర్తుల ఊరేగింపు

అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం విద్యుత్తు కాంతులతో కళకళలాడుతోంది. కల్యాణోత్సవాల్లో భాగంగా మూడోరోజు భక్తులతో కిటకిటలాడింది. మధ్యాహ్నం, రాత్రి ఉత్సవమూర్తులను హనుమద్వాహనం, సింహ వాహనంపై కొలువుదీర్చి అలంకారోత్సవం నిర్వహించి మాడ వీధుల్లో బాజాభజంత్రీలు, బాణసంచా కాల్పులతో ఊరేగించారు. కల్యాణం తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు తరలివచ్చి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాటాకు షెడ్లలో సేదతీరుతున్నారు. పంచాయతీ రాజ్ శాఖ అధికారులు కల్యాణ మండపం చుట్టూ బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే అన్ని శాఖల అధికారులు అంతర్వేది చేరుకుని ఏర్పాట్లను పరిశీలించారు. స్కౌట్ విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు సేవల్లో నిమగ్నమయ్యారు. భక్తులకు ఉచితంగా భోజనం పంపిణీ చేయడానికి సుమారు 60 సత్రాలు సిద్ధం చేశారు. దీంతో అంతర్వేదిలో ఆధ్యాత్మిక సందడి నెలకుంది.

హనుమద్వాహనంపై స్వామివారి గ్రామోత్సవం

పోలీసులకు సూచనలిస్తున్న డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ రాహుల్‌మీనా

అభివృద్ధి పనులకు కార్యాచరణ

అంబాజీపేట, న్యూస్‌టుడే: అంబాజీపేట మార్కెట్ కమిటీ పరిధిలోని గ్రామాల్లో రైతుల కోసం అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళిక తయారు చేశామని ఛైర్మన్ చిట్టూరి శ్రీనివాసు అన్నారు. పాలకవర్గ సమావేశం మంగళవారం కార్యదర్శి ఐ.రమేష్ అధ్యక్షతన జరిగింది. పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించుకునేందుకు వీలుగా లింకురోడ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

డాక్యుమెంట్ పోయినది

నేను అనగా కొవ్వూరి ఆదిరెడ్డి, తండ్రి: వెంకటరెడ్డి, ఊబలంక గ్రామం, రావులపాలెం మండలం నివాసిని. 12-01-2026న మా ఇంటి నుండి ఆత్రేయపురంలో గల బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో మా తాతగారైన కొవ్వూరి ఆదిరెడ్డి పేరిట గల ఒరిజినల్ డాక్యుమెంట్ నెం.956/1984 తేది. 26-06-1984 గలది పడిపోయినది. ఆత్రేయపురం చేరుకునే మార్గంలో ఎంత వెతికినా సదరు ఒరిజినల్ డాక్యుమెంట్ దొరకలేదు. ఎవరికైనా దొరికిన ఎడల తెలియజేయగలరు.
931143 9999

అంచు కుంగి.. వాహనాలు జారి

లొల్ల గ్రామంలోని వంతెన అప్రోచ్ రోడ్డుమీదుగా అమలాపురం, బొబ్బర్లంక ర.భ రాష్ట్రీయ రహదారిపైకి వచ్చే సిమెంట్ రోడ్డు అంచు దిగబడి ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు మీదుగా వేలమంది రాకపోకలు సాగిస్తుంటారు. ఒక్కోసారి వాహనాలు అదుపు తప్పి అంచు గోతుల్లో పడిపోయి గాయాలు పాలవుతున్నారు. సమస్యను ర.భ డీఈ రాజేంద్ర వద్ద ప్రస్తావించగా మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం

గోడలు విరిగి.. ప్రమాదకరంగా మారి

ముక్కామల లాకు వద్ద రావులపాలెం-అమలాపురం ప్రధాన పంటకాలువపై వంతెన రక్షణ గోడలు ధ్వంసమయ్యాయి. వేగంగా వచ్చే వాహనాలు అదుపుతప్పితే నేరుగా ప్రధాన పంటకాలువలోకి వెళ్లే ప్రమాదం ఉంది. దీనిపై సర్పంచి బండారు వెంకటలక్ష్మిని వివరణ కోరగా ఆయా శాఖల అధికారులకు ఇక్కడి సమస్యను వివరించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, అంబాజీపేట

సైకిల్ షెడ్డు.. కూలితే అంతే..

పి.గన్నవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వద్ద సుమారు రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఆర్.సి.సి. సైకిల్ షెడ్డు ప్రమాదకరంగా ఉంది. పూర్తిగా పిల్లర్ల మీదే ఆధారపడి ఉంది. పిట్టగోడ కడితే దాని ద్వారా మరింత బలం చేకూరుతుంది. స్లాబు బరువు ఎక్కువగా ఉందని పంచాయతీరాజ్‌శాఖ ఇంజినీరింగ్ అధికారులు వివరించారు. ప్రమాదకరంగా ఉన్న ఈ షెడ్డును పరిశీలన చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పి.గన్నవరం

నిరంతర వెలుగులే!

లొల్ల, ఉచ్చిలి తదితర గ్రామాల ప్రధాన రహదారుల చెంత ఉన్న వీధిదీపాలు పగలూ, రాత్రి తేడా లేకుండా వెలుగుతున్నాయి. అక్కడక్కడ ఒక్కో విద్యుత్తు స్తంభానికి రెండేసి బల్బులు అమర్చారు. వీలున్న మేరకు విద్యుత్తు పొదుపుగా ఉపయోగించుకోవాలని, వృథాకు తావులేకుండా చూడాలని అధికారులు కోరుతున్నా స్పందన లేదు. ఈ విషయాన్ని ఎంపీడీవో బీకేఎస్ఎస్ వెంకటరామన్ వద్ద ప్రస్తావించగా వెంటనే సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం



అవీ ఇవీ అన్నీ

అవార్డు గ్రహీతలకు సన్మానం

సఖినేటిపల్లి, రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: ఓటర్ల దినోత్సవం, రిపబ్లిక్‌డే సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ చేతుల మీదగా అవార్డులు అందుకున్న వీఆర్వో కె.రామకృష్ణ(గొంది), వీఆర్‌ఏ సత్యనారాయణ(గొంది), వీఎస్ టి.సుధీర్‌లను తహసీల్దార్ వెంకటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది అంతర్వేది రెవెన్యూ అతిథి గృహంలో ఘనంగా సన్మానించారు. ః రావులపాడు విద్యుత్తు లైన్‌మేన్ చాముండేశ్వరరావు(చంటి) ఎస్.ఇ రాజేశ్వరి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

అయినవిల్లి: అంకితభావంతో పనిచేసినవారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని డీడీవో రాజేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పలువురు సిబ్బందికి ఉత్తమ సేవా పత్రాలు అందించారు. కలెక్టర్ చేతల మీదుగా పురస్కారం అందుకున్న ఎంపీడీవో సరోవర్‌రావును సన్మానించారు.

సౌండ్ సిస్టమ్ బహూకరణ

రాజోలు, న్యూస్‌టుడే: తాటిపాక జడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులైన కట్టా కుటుంబీకులు మంగళవారం రూ.20 వేలు విలువ గల సౌండ్ సిస్టమ్‌ను ప్రధానోపాధ్యాయుడు పుట్టా సుబ్బారావుకు అందజేశారు.

మూతపడిన వాణిజ్య బ్యాంకులు

ఆత్రేయపురం: వారానికి అయిదు రోజుల పనిదినాలు వర్తింపజేయాలని కోరుతూ ర్యాలి, రాజవరం, లొల్ల, ఆత్రేయపురం గ్రామాల్లో గల పలు వాణిజ్య బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేశారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మెలో పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి వితరణ

రిబ్బన్ కత్తిరించి సామగ్రి అందిస్తున్న దాత చిట్టిబాబు

మలికిపురం: పడమటిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, గ్రామానికి చెందిన తాడి చిట్టిబాబు పాఠశాలకు రూ.1.20 లక్షల విలువైన 50 కుర్చీలు, వాటర్‌ప్రూఫ్ షామియానా, తరగతి గదుల్లో ఉపాధ్యాయులకు ఉపయోగపడే 5 టేబుళ్ల తదితర సామగ్రిని సమకూర్చారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో వీటిని ప్రధానోపాధ్యాయుడు శ్రీపాద శివసుందరసూర్యశర్మ, పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా దాతను సన్మానించి అభినందించారు. సర్పంచి ఆకుల మాధవీనాగలక్ష్మి, ఎంపీటీసీ దొండపాటి సుజాత, ఎస్ఎంసీ ఛైర్మన్ పామర్తి మురళీకృష్ణ, బోణం శ్రీనివాసరావు, ముత్యాల తాతంబాబు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటం

రావులపాలెంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

మామిడికుదురు, రావులపాలెం పట్టణం, రాజోలు, రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: పన్నెండో పీఆర్సీని ఏర్పాటు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, బకాయిలను వెంటనే చెల్లించాలన్న పలు డిమాండ్ల సాధన కోసం దశల వారీ పోరాటాన్ని చేపడుతున్నట్లు ఎస్టీయూ మామిడికుదురు మండల శాఖ పేర్కొంది. ఈ మేరకు సంఘ నాయకులు స్థానిక మండల విద్యావనరుల కేంద్రం వద్ద మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 30న తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేస్తామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కారుపల్లి కల్యాణ్ బాబు, మండల అధ్యక్ష, కార్యదర్శులు చిక్కం రవికుమార్, నేల వెంకటేశ్వరరావు, కొమ్ముల వీరరాఘవరావు, బొండాడ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు. ✦ రావులపాలెం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కె.వి.శేఖర్, మండలాధ్యక్షుడు అడపా శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు పి.మరియన్‌రాజు, కరుణ, ఉమాకాంతం, రాజశేఖర్, రామారావు, భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ✦ రాజోలు మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద కరపత్రాన్ని ఆవిష్కరించారు. రాజోలు మండల శాఖ అధ్యక్షుడు యెల్లమిల్లి ప్రసాద్, సమన్వయ అధ్యక్షుడు రాపాక రామకృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి గటిగంటి శ్రీనివాస్, యేడిద రాంబాబు, అన్నంనీడి నారాయణరావు పాల్గొన్నారు.

రాజోలులో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

స్వచ్ఛ ఏవంలో బట్టేలంక పాఠశాల ఎంపిక

మలికిపురం: స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ రేటింగ్‌లో జిల్లా స్థాయిలో ఉత్తమ పాఠశాలగా బట్టేలంక ప్రాథమిక పాఠశాల ఎంపికైనట్లు ఎంఈవో ఎం.విజయలక్ష్మి మంగళవారం చెప్పారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఉల్లూరి బుజ్జిబాబును ఎంఈవోలు ఎం.విజయశ్రీ, వైవీవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు సన్మానించి అభినందించారు.

నిధుల గోల్‌మాల్.. రైతుల గగ్గోలు

చింతలూరులో ఆందోళన చేస్తున్న రైతులు

ఆలమూరు, న్యూస్‌టుడే: చింతలూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో గతంలో జరిగిన నిధుల గోల్‌మాల్ వ్యవహారం రైతుల మెడకు చుట్టుకుంది. అప్పట్లో నిధులు మాయం చేసినవారు కేవలం సస్పెన్షన్‌కు మాత్రమే గురయ్యారు. ఈ అంశంతో సంబంధంలేని రైతులకు మాత్రం ఇక్కట్లు తలెత్తాయి. దీంతో వారంతా లబోదిబోమంటూ మంగళవారం నిరసనకు దిగారు. వివరాల్లోకి వెళితే.. గత ప్రభుత్వ హయాంలో చింతలూరు సొసైటీకి సంబంధించి రూ.1.20 కోట్లు మాయమైనట్లు తేలడంతో సీఈవో నాగరాజును విధుల నుంచి తప్పించారు. అతని వద్ద నుంచి పైసా కూడా రికవరీ చేయలేకపోయారు. తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించకపోవడంతో తాజాగా 70 మంది రైతుల భూములను బ్లాక్‌లిస్టులో పెట్టినట్లు నోటీసులు అందాయి. తీసుకున్న రుణాలు రూ.51 లక్షలు చెల్లించామని, రసీదులు సైతం పొందామని వారంతా మొరపెట్టుకున్నారు. రుణ ఖాతాల్లో సొమ్ము జమకాలేదని, మొత్తం చెల్లించాలని, అంతవరకు భూముల లావాదేవీలు నిలిపివేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వాటిపై సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రెడ్‌మార్క్ పెట్టడంతో రైతులు ఆందోళన బాట పట్టారు.

ఉన్నతాధికారుల పాత్రపై అనుమానం

సొసైటీ నిధుల మాయం కావడంతో పాటు విచారణలో సైతం వింతలు జరిగాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చింతలూరులో జరగాల్సిన విచారణ రావులపాలెం సొసైటీలో జరిగిందన్నారు. ఆ సమయంలోనే సొసైటీ రికార్డులు మాయమవ్వడం గమనార్హం. రికార్డులు మాయమైతే క్రిమినల్ కేసులు పెట్టకుండా తూతూమంత్రంగా విచారణ ముగించారని, కేవలం సస్పెన్షన్‌తో సరిపెట్టడంపై ఉన్నతాధికారుల పాత్ర ఉందని ఆరోపిస్తున్నారు.

(c) eenadu

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం • రామచంద్రపురం

బ్యాడ్మింటన్, ఈత శిక్షణకు ఎంపికలు

యానాం, న్యూస్‌టుడే: భారతీయ క్రీడాప్రాధికార సంస్థ (శాయ్) యానాం శిక్షణ కేంద్రంలో 2026-27 సంవత్సరానికి బ్యాడ్మింటన్, ఈత విభాగాల్లో శిక్షణకు అర్హులైన అభ్యర్థుల ఎంపికకు ఈ నెల 29, 30 తేదీల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు సెంటర్ ఇన్‌ఛార్జి ఉదయకుమార్ తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు జాతీయ స్థాయిలో ఏ రాష్ట్రం నుంచైనా క్రీడాకారులు ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చు న్నారు. బ్యాడ్మింటన్ శిక్షణకు 12- 18, ఈత విభాగంలో 12-16 ఏళ్ల మధ్య బాలురు అర్హులన్నారు. ఈత నేర్చుకునే బాలికలకు వసతి సదుపాయం ఉంటుందన్నారు. ఇతర వివరాలకు ఇండోర్ స్టేడియంలోని శాయ్ సెంటర్ నంబర్లు 98662 39009(బ్యాడ్మింటన్), 88851 76888(ఈత) సంప్రదించాలని తెలిపారు.

అమ్మవారికి వెండి వామహస్తం అందజేత

యానాం, న్యూస్‌టుడే: యానాం బైపాస్ రోడ్డులో వెలసిన దొడ్డి గంగమ్మతల్లి అమ్మవారికి కోన వెంకటరామయ్య(జాజిబాబు), సత్యసుభద్రాదేవి దంపతులు మంగళవారం పూజలు నిర్వహించి కిలో వెండితో తయారు చేసిన వామహస్తం, కుంకుమ భరిణను సమర్పించారు. ఆలయ అర్చకులు పూజలు చేసి అమ్మవారి చేతికి అమర్చారు. ఆలయ ధర్మకర్తలు కోన వీరవెంకట రామచంద్రరావు, సూరిబాబు, దేవ, మల్లికార్జునరావు, భైరవస్వామి పాల్గొన్నారు.

పోటీలకు యానాం క్రీడాకారుల పయనం

పోటీలకు ఎంపికైన విద్యార్థులు

యానాం, న్యూస్‌టుడే: తమిళనాడు రాష్ట్రం ఈరోడ్‌లో బుధవారం నుంచి జరిగే 70వ జాతీయ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు యానాం క్రీడాకారులు ఏడుగురు వెళ్లినట్లు బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ కార్యదర్శి కాపగంటి అనురాగ ఆదర్శ శేషసుమన్ తెలిపారు. భారత బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పుదుచ్చేరి తరఫున వీరు పాల్గొంటున్నారన్నారు. బాలుర విభాగంలో బండి కుశల్ వెంకటసుచిత్, బొమ్మిడి ఇతాష్ కృష్ణ, చోడి గుణశ్యామ్ ప్రతాప్, పాలెపు యోమంత్ గంగాధర భరత్, బాలికల విభాగంలో జువ్వల బాలశ్రీ నిత్య, ఆర్. నిశృత, ఎన్. నాగలక్ష్మిఆరాధ్య పాల్గొంటున్నారన్నారు. వీరికి రీజెన్సీ వ్యాయామోపాధ్యాయుడు బొట్టా శ్రీనివాస్, రాయపురెడ్డి విజయ్ శిక్షణ ఇచ్చారు.

స్కేటింగ్‌లో ఆనంద్ ప్రతిభ

ఆనంద్ వివేక్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం జడ్పీ బాలుర పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి కాండ్రేగుల ఆనంద్ వివేక్ స్కేటింగ్‌లో రికార్డు సాధించాడని ప్రధానోపాధ్యాయుడు భమిడిపాటి వెంకట సాయి రామకృష్ణ తెలిపారు. హెచ్‌ఎం రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాలలో ఆ విద్యార్థిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం స్కేటింగ్ రింగ్‌లో జరిగిన ఏషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఆనంద్ గంటా 26 నిమిషాల, 26 సెకన్లు నిర్విరామంగా స్కేటింగ్ చేసి యూఎస్‌ఏ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడన్నారు. కార్యక్రమంలో గణేశ్వరరావు, తోట రవి, విష్ణుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూడలేకనే ఆరోపణలు

ఎమ్మెల్యే ఆనందరావును సత్కరిస్తున్న వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చేస్తున్న అభివృద్ధిని చూడలేకనే కొందరు ఆరోపణలు చేస్తున్నారని నీటి సంఘ అధ్యక్షుడు బండారు వెంకటేశ్వరరావు అన్నారు. తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే ఆనందరావును వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తెదేపా, జనసేన, భాజపా నాయకులు సత్కరించారు. అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, బోణం సత్యవరప్రసాద్, నల్లా సుబ్బారావు, కంచిపల్లి అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

అత్యవసరమైతే.. అగచాట్లే..!

❑ రైతు సేవా కేంద్రాల్లో కనిపించని మరుగుదొడ్లు

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం, ఉప్పలగుప్తం

● అమలాపురం మండలం సమనసలోని రైతు సేవా కేంద్రంలో నిత్యం జిల్లా ఉన్నతాధికారులు సమావేశాలు నిర్వహిస్తున్నారు. 50 మందికి పైగా వ్యవసాయశాఖ సిబ్బంది ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు. ఈ భవనానికి మరుగుదొడ్లు లేకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ సేవా కేంద్రం పక్కనే మరుగుదొడ్లు నిర్మించాలని ప్రతిపాదించినా ఇంకా సాకారం కాలేదు.

● ఉప్పలగుప్తం మండలంలోని ఎనిమిది రైతు సేవా కేంద్రాలకు భవనాలున్నాయి. వీటిలో ఏ భవనంలోనూ మరుగుదొడ్లు ఏర్పాటు చేయలేదు. కొన్నింటిలో మహిళా ఉద్యోగులు పనిచేస్తుండగా.. మరికొన్నింటిలో పురుష, మహిళ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గత వైకాపా పాలనలో రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా కేంద్రాల పేరుతో ఏర్పాటు చేసిన భవనాల్లో మరుగుదొడ్లను విస్మరించారు. అమలాపురం నియోజకవర్గంలోని అమలాపురం గ్రామీణం, అల్లవరం, ఉప్పలగుప్తం పరిధిలో సుమారు 50 వరకు రైతు సేవా కేంద్రాలున్నాయి. కొన్ని భవన నిర్మాణాలు వైకాపా పాలనలో పూర్తయితే.. మరికొన్ని నేటికీ అందుబాటులోకి రాక పరాయిపంచనే విధులు నిర్వహిస్తున్నారు.

వసతులులేని గోపవరం రైతు సేవా కేంద్రం

మహిళా ఉద్యోగులకు యాతన

రైతు సేవా కేంద్రాల్లో చాలా వరకు మహిళా ఉద్యోగులు పనిచేస్తున్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో వారంతా తీవ్ర అవస్థలు పడుతున్నారు. అత్యవసర సమయంలో కొందరు సమీపంలోని సచివాలయం, వెల్‌నెస్ కేంద్రాలకు వెళుతుంటే.. మరికొందరు సేవా కేంద్రాల సమీపంలోని ఇళ్లలో బతిమాలుకోవాల్సిన దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో రైతు సేవా కేంద్రాల్లో మరుగుదొడ్లు నిర్మించాలనే ప్రతిపాదనను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సిద్ధం చేయగా.. అవి కాగితాలకే పరిమితమయ్యాయి.

ఆదేశాలు రాలేదు

గత ప్రభుత్వంలో ప్రతి గ్రామంలోని రైతు సేవా కేంద్రాలను నిర్మించాలని తలపెట్టారు. అది కొంతమేర వరకు మాత్రమే సాధ్యమైంది. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళా ఉద్యోగులతోపాటు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు నిర్మించే విషయంపై ఎలాంటి ఆదేశాలు రాలేదు.
–ప్రవీణ్, కుమార్‌బాబు, ఏవోలు అమలాపురం, ఉప్పలగుప్తం

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
ఉ 10 - మ 1
అమలాపురం పట్టణం: 79939 35935, గ్రామీణం: 91000 20948 అల్లవరం: 91548 46718, ముమ్మిడివరం: 80085 74166 కాట్రేనికోన: 79950 67044 ఉప్పలగుప్తం: 91548 46716

అమలాపురం కళసం సెంటర్‌లో మురుగుకాలువ పూడికలను జేసీబీతో తొలగిస్తున్న సిబ్బంది

స్పందనకు వందనం

సమస్య: అమలాపురం కళశం సెంటర్‌లో మురుగుకాలువలో పూడికలను తొలగించి అక్కడే వదిలివేశారు. దుర్వాసన వస్తోంది. -నాయుడు, వ్యాపారి

సమస్య: గాంధీబజార్ ప్రధాన రహదారి మురుగుకాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు చెత్త పేరుకుపోయి మురుగు ముందుకు కదలడం లేదు. - చిట్టిబాబు, స్థానికుడు

సమస్య: సినిమారోడ్డు దుమ్ము, ధూళితో నిండిపోయింది. గాలికి ధూళి లేవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. -శ్రీనివాస్, వ్యాపారి

సమస్య: శ్రీరామపురం రహదారిలో చుట్టుపక్కల వారు చెత్త వేస్తున్నారు. నివారణ చర్యలు తీసుకోవాలి. - వెంకటేశ్వరరావు, స్థానికుడు

పరిష్కారం: కలశం సెంటర్, గాంధీబజార్, సినిమారోడ్డు, శ్రీరామపురం సమస్యలపై సచివాలయ కార్యదర్శులు స్పందించారు. పురపాలక సిబ్బందితో వాటిని తొలగింపజేశారు. మురుగుకాలువ, రహదారులపై చెత్త వేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.
–న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

పూడిక తీశారు.. చెత్తను తరలించారు

సమస్య: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని బాలయోగికాలనీ ప్రాంతంలో డ్రెయిన్లు పూడిపోవడంతో నీరు దిగువకు వెళ్లక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.
-కె.సత్యనారాయణ, స్థానికుడు

సమస్య: ముమ్మిడివరంలోని 17వ వార్డు రజక వీధిలోని డ్రెయిన్‌లో చెత్త పేరుకుపోవడంతో మురుగు దిగువకు దిగడం లేదు.
-సీహెచ్ నాగేశ్వరరావు, స్థానికుడు

పరిష్కారం: నగర పంచాయతీ పరిధిలోని పారిశుద్ధ్య సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి సమస్యలను పరిష్కరించారు. – న్యూస్‌టుడే, ముమ్మిడివరం

రక్తదాన శిబిరం

రామచంద్రపురం ఆర్టీసీ కార్మికులతో డిపో మేనేజర్ భాస్కరరావు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో డీపీటీవో ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో రామచంద్రపురం ఆర్టీసీ డిపోనకు చెందిన 27 మంది గ్యారేజీ, కార్యాలయం సిబ్బంది, డ్రైవర్లు, కండెక్టర్లు పాల్గొని రక్తదానం చేసినట్లు డిపో మేనేజర్ పి.భాస్కరరావు వెల్లడించారు. రోటరీ ఇంటర్నేషనల్, రెడ్ క్రాస్ సంయుక్తంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశాయన్నారు. ఈ సందర్భంగా దాతలకు ధ్రువపత్రాలు అందజేశారు.

చంద్రశేఖర్‌కు నివాళి

నివాళి అర్పిస్తున్న విద్యా సంస్థ ఉద్యోగులు, అభిమానులు

యానాం, న్యూస్‌టుడే: రీజెన్సీ సిరామిక్స్ పరిశ్రమ అధ్యక్షుడు కేసీ చంద్రశేఖర్ 14వ వర్ధంతిని మెట్టకూరు రీజెన్సీ పబ్లిక్‌స్కూల్, యానాం ఓల్డేజ్‌హోంలలో మంగళవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు నిర్వహించారు. ఎంతోమంది పేద విద్యార్థుల చదువులకు సహాయపడుతూ మానవత్వానికి ప్రతీకగా నిలిచిన చంద్రశేఖర్, విద్యాసంస్థల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని వక్తలు కొనియాడారు. ప్రధానోపాధ్యాయుడు టీవీఎస్ఎస్‌వీ ప్రసాదరావు, రీజెన్సీ కళాశాల ప్రిన్సిపల్ మార్తాండప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఓల్డేజ్‌హోంలో వృద్ధులకు భోజన వితరణ చేశారు. ● రీజెన్సీ స్టాఫ్, వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ మచ్చా మురళీమోహన్ వర్ధంతిని పరిశ్రమ ప్రధానగేటు వద్ద కార్మికులు నిర్వహించారు. మురళీమోహన్ చిత్రపటానికి అతడి భార్య దుర్గ పూలమాల వేసి నివాళి అర్పించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దివ్వా శేషుబాబ్జీ, యూనియన్ కార్యదర్శి విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి భూమిపూజ

భూమిపూజ చేస్తున్న ఎంపీపీ, వాసంశెట్టి సత్యం

పామర్రు: వైకాపా హయాంలో ఛిద్రమైన రోడ్లు, ప్రధాన, గ్రామీణ రహదారులను ఆధునికీకరిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతోందని తెదేపా నాయకుడు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. కె. గంగవరం మండలం ఎర్రపోతవరం, బాలాంత్రం, తాళ్లపోడు గ్రామాల్లో రూ. 76లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారులకు మంగళవారం ఆయన భూమిపూజ చేశారు. మంత్రి సుభాష్ కృషితో వస్తున్న నిధులతో రామచంద్రపురం నియోజకవర్గంలో రహదారుల వ్యవస్థ బాగుపడుతోందన్నారు. కూటమి నాయకులు, ఎంపీపీ పంపన నాగమణి, గ్రామకమిటీ అధ్యక్షులు రాయపురెడ్డి విశ్వేశ్వర సీతారామయ్య బాబు, తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదాన్ని తిప్పికొట్టాలి

అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ఆర్‌పీఐ నాయకులు

ముమ్మిడివరం : మతోన్మాదాన్ని తిప్పికొట్టి.. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ బాలకృష్ణ అన్నారు. ముమ్మిడివరంలోని డా. బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాలు వద్ద ఆర్‌పీఐ జిల్లా కన్వీనర్ చీకురుమిల్లి శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం రాజ్యాంగ దినోత్సవ సభ నిర్వహించారు. ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఎం ఋషి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్య, వైద్య రంగాన్ని ప్రైవేటీకరణ చేస్తూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఆ రంగాలను దూరం చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా వేణుగోపాల్, డి.రామకృష్ణ, జి.జ్ఞానప్రకాష్, బి.సత్యనారాయణ, పంతగడ నరసింహమూర్తి, జనిపల్లి చిన్ని, పి. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'రహదారి అలైన్‌మెంట్ మార్పు చేయాలి'

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: పేరూరు నుంచి రావులపాలెం వరకు విస్తరించనున్న 216ఈ జాతీయ రహదారి అలైన్‌మెంట్‌లో మార్పు చేయాలని అవిడి, పలివెల, ఖండ్రిగ గ్రామస్థులు కోరారు. తమకు ఉన్న కొద్దిపాటి భూములు జాతీయ రహదారి విస్తరణలో కోల్పోవడంతో జీవనోపాధి కోల్పోతున్నామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి జాతీయ రహదారి అలైన్‌మెంట్‌లో మార్పు చేయాలని కోరారు.

బైపాస్‌రోడ్డు పేరు మార్చొద్దని వినతి

అమలాపురం పట్టణం: అమలాపురం పురపాలక సంఘ పరిధిలోని 13వ వార్డులో గొల్లగూడెం బైపాస్‌రోడ్డు పేరు మార్చవద్దని పలువురు కోరారు. ఈ మేరకు అమలాపురం మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్‌కు ఆ ప్రాంత ప్రజలు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రూపేష్, సత్తిబాబు, సూర్యనారాయణ, శ్రీనివాస్, నాని తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణ సహాయం పెంపు

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరిలో ఎస్సీలకు, ఇతరులకు ఇచ్చే ఉచిత గృహ నిర్మాణ సహాయం పెంచనున్నట్లు లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీలకు ఇంత వరకు రూ. 6.25 లక్షలు ఇస్తుండగా ఈ మొత్తాన్ని రూ. 7 లక్షలకు, ఇతరులకు ఇచ్చే సహాయం రూ. 5 లక్షలు నుంచి రూ. 6.25 లక్షలకు పెంచుతున్నామన్నారు. ఎటువంటి ప్రభుత్వ సహాయం పొందని ఇంటిపెద్దగా ఉన్న మహిళలకు ఇచ్చే నెలవారీ సహాయాన్ని రూ. 1000 నుంచి రూ. 2,500కు ఈ నెల నుంచి పెంచామన్నారు. వృద్ధులు, వితంతువులు, దిక్కులేని మహిళలకు ఇచ్చే పింఛను అదనంగా రూ. 500 పెంచామన్నారు. ఐటీ పార్కు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

యానాం, న్యూస్‌టుడే: అగ్నిప్రమాదాలు సంభవించిన సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించి ధైర్యంగా ఎలా అదుపుచేయాలో యానాం అగ్నిమాపకశాఖ అధికారులు మంగళవారం వివరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా అగ్నిప్రమాదాల గురించి అధికారులు బలసాడి ప్రసాద్, కృష్ణారావు, వీరభద్రరావు, రాజశేఖర్, శ్రీనివాస్ వివరించారు.

ఔషధ దుకాణంలో మంటలు

అల్లవరం: బోడసకుర్రు వైనతేయ వారధికి సమీపంలోని ఔషధ దుకాణంలో ఫ్రిజ్ పేలడంతో అగ్ని ప్రమాదం జరిగింది. కొక్కిరిమెట్టి గోపాలకృష్ణ స్థానికంగా మందుల దుకాణం నిర్వహిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం దుకాణం మూసి వేసి భోజనానికి వెళ్లారు. ఆ సమయంలో అందులోనిఫ్రిజ్ ఒక్కసారిగా పేలడంతో మంటలు వ్యాపించి ఔషధాలు కాలి బూడిదయ్యాయి.

తలుపు ఇలా.. రక్షణ ఎలా..?

చల్లపల్లి-2 పరిధిలోని పర్రపేట సచివాలయాన్ని ఆరేళ్లుగా పాత సామాజిక భవనంలో నిర్వహిస్తున్నారు. ఒక తలుపుచెక్క కింద భాగంలో దెబ్బతినడంతో ఇలా మందులు బాక్సులను అడ్డుగా ఉంచారు. విలువైన కంప్యూటర్లు, ఇతర ముఖ్య దస్త్రాలు ఉండే సచివాలయాలోకి ఎలుకలు వచ్చి పాడు చేసే ప్రమాదం ఉంది. అర్ధంతరంగాన నిలిచిన భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలని పలువురు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

అసంపూర్తిగా వదిలేశారు

చెయ్యేరులో గత ప్రభుత్వహయాంలో చేపట్టిన గ్రామసచివాలయ భవన నిర్మాణం సగంలోనే నిలిచిపోయింది. నాలుగేళ్ల క్రితం పంచాయతీ పక్కన ఈ భవన నిర్మాణం చేపట్టగా మొదటి అంతస్తు ఓపెన్ స్లాబ్ వేశాక వదిలేశారు. సచివాలయ కార్యకలాపాలను పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. ఈ నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవచూపాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కాట్రేనికోన

గ్రామదేవత జాతర

ఉప్పలగుప్తం: గొల్లవిల్లిలోని సత్తెమ్మతల్లి జాతర మహోత్సవాలు మంగళవారం ఘనంగా జరిపారు. గరగనృత్యాలు, డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి గ్రామోత్సవం, తీర్థం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన చేశారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం

కాట్రేనికోన : పార్వతీసమేత కుండలేశ్వరాలయంలో క్షేత్రపాలకుడు రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణమహోత్సవం బుధవారం నుంచి ఆరు రోజులపాటు నిర్వహించనున్నారు. మొదటిరోజు విఘ్నేశ్వరపూజ, గ్రామోత్సవం, స్వామివారి కల్యాణోత్సవం ఉంటుందని అర్చకులు కాళ్లకూరి కామేశ్వరరావు తెలిపారు. మిగిలిన అయిదు రోజులు ప్రత్యేక కార్యక్రమాలు, పూజలు ఉంటాయని ఆయన తెలిపారు.

చెయ్యేరులో.. చిన అంతర్వేదిగా పేరుగాంచిన చెయ్యేరులో శ్రీదేవి భూదేవి సమేత అభినవ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అంతర్వేదిలో మాదిరిగానే ఇక్కడ కల్యాణోత్సవం, తీర్థం నిర్వహిస్తారు. కల్యాణోత్సవం అనంతరం సంస్కృతిక కార్యక్రమాలు, తీర్థం జరుగుతాయి.

వీఆర్వోలపై పని ఒత్తిడి తగ్గించాలి

అమలాపురం గ్రామీణం: వీఆర్వోలపై పని ఒత్తిడి కోరుతూ అమలాపురం తహసీల్దార్ వి.ఎస్.దివాకర్‌కు వీఆర్వోల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కె. వెంకటగణేష్, అంకన రాజేష్, సత్యనారాయణ, మాచిరాజు వాసు, వినోద్, పల్లి రాంబాబు, రఘు పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్స్ డే

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ద్రాక్షారామ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో మంగళవారం ఎలక్ట్రీషియన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దాదాపు 200 మంది ఎలక్ట్రీషియన్లు పాల్గొని గ్రామంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం జరిగిన సమావేశానికి వాసంశెట్టి సత్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎలక్ట్రీషియన్లు సంఘ భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పెద్దిరెడ్డి గంగరాజు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రహదారి

యానాం పట్టణంలోని గొల్లలవీధి నుంచి విష్ణాలయం వీధికి వెళ్లే మార్గం మలుపులో రహదారిపై సిమెంటు పలక తొలగించడంతో వాహన చోదకులు, బాటసారులకు ప్రమాదం పొంచి ఉంది. పలుచోట్ల కాలువలపై సిమెంటు బల్లలు లేకపోయినా, విరిగిపోయి ప్రమాదకరంగా ఉన్నా పురపాలక అధికారులు స్పందించడం లేదు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, యానాం

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

పామర్రు: వరిసాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని, ఎరువులు తగిన మోతాదులోనే వాడాలని మండల వ్యవసాయాధికారి ఎ.సద్గురుమూర్తి సూచించారు. మండలంలోని ఊడిమూడి, కోటిపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. యూరియాను మూడు కోటాలుగా 20, 45, 60 రోజులకొక బస్తా చొప్పున వేయాలన్నారు. రైతులు వెంటూరి వీర్రాఘవ చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

గురువులకు పూర్వవిద్యార్థుల సన్మానం

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: ఎన్.కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు 2000-01లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు రూ. 16వేలు విలువచేసే సౌండ్ సిస్టమ్‌ను మంగళవారం అందజేశారు. రిపబ్లిక్ డే సందర్భంగా సోమవారం స్థానిక పాఠశాలలో కలిసి వారికి చదువు చెప్పిన గురువులను సన్మానించారు. అప్పటి గురువుల్లో ప్రస్తుత డ్వామా పీడీ మధుసూదనరావు, కోళ్ల తాతారావు, చంద్రశేఖర్, రమణ, రాయి శ్రీను తదితరులు ఉన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె

నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: బ్యాంకు ఉద్యోగులు మంగళవారం సమ్మెలో పాల్గొన్నారు. అమలాపురంలో ప్రభుత్వరంగ బ్యాంకుల సంఘాల ఉద్యోగులు, సిబ్బంది సమ్మె నిర్వహించారు. ప్రతి శనివారం సెలవు ప్రకటించాలని డిమాండ్ చేశారు. యూనియన్ ఫోరం ఆఫ్ బ్యాంకు సంఘం జిల్లా కార్యదర్శి వై.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపిక

రామచంద్రపురం : జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో రామచంద్రపురం వికాస్ జూనియర్ కళాశాల విద్యార్థి మేడిశెట్టి జశ్వంత్ రాష్ట్రం తరఫున పాల్గొననున్నారు. ప్రిన్సిపల్ ఝాన్సీ లక్ష్మిబాయి, కోచ్ కె. నాగార్జున తెలిపిన వివరాలు ప్రకారం కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

వినియోగదారులపై భారం మోపొద్దు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: ట్రూఅప్ ఛార్జీలతో విద్యుత్తు వినియోగదారులపై అధిక భారం మోపొద్దని రామచంద్రపురం రైతు విభాగం నాయకులు కె.త్రినాధరెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సమస్యలను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మన్ పి.వి.ఆర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం ఏపీఈఆర్సీ నిర్వహించిన బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఈఈ కె.రత్నాలరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. కేటగిరి-2 సర్వీసులు చిన్న చిన్న కుటీర పరిశ్రమలకు ఇచ్చే సమయంలో వెసులుబాటులు కల్పిస్తూ వేగంగా కనెక్షన్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు కొత్త కనెక్షన్లు ఇచ్చే సమయంలో వేగం పెంచడంతో పంట ఇబ్బందులు ఉండవని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు టన్ కీ బేస్ రూ. 5లక్షల లోపు ఇవ్వాలని కోరారు.

సమన్వయంతో పని చేయాలి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: వైకాపాను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ కోరారు. అమలాపురం వాసర్ల గార్డెన్‌లో శ్రీకాంత్ ఆధ్వర్యంలో వైకాపా నియోజకవర్గ సంస్థాగత నిర్మాణ సమావేశం మంగళవారం నిర్వహించారు. పార్టీలో రాష్ట్ర అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ వైకాపా ప్రతి కార్యకర్త, నాయకుడు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న పినిపే శ్రీకాంత్

(c) eenadu

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో.. జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పోటీలు నేడు

న్యూస్‌టుడే, శ్యామలాసెంటర్: 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయి జూనియర్ కళాశాలల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు బుధవారం జరగనున్నాయి. రాజమహేంద్రవరం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతాయి. గత నాలుగు నెలలుగా రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, తుని, మండపేట, కొవ్వూరు పట్టణాల్లోని 23 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాసం, క్విజ్ పోటీలు జరిగాయి. ప్రతి కళాశాల నుంచి నాలుగు విభాగాల్లో ముగ్గురు చొప్పున జిల్లా స్థాయి పోటీలకు హాజరవుతారు. విద్యార్థులు ఉదయం 9 గంటల కల్లా కేంద్రానికి చేరుకోవాలని నిర్వాహకులు సూచించారు.

వేదిక: ఆర్ట్స్ కళాశాల, రాజమహేంద్రవరం **సమయం:** ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 వరకు

నిబంధనలు పాటిస్తే.. ప్రమాదాలు దూరం

రాజానగరం, న్యూస్‌టుడే: రహదారిపై ప్రయాణించేటప్పుడు నిబంధనలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని జిల్లా రవాణాశాఖ అధికారి ఆర్. సురేష్ అన్నారు. భూపాలపట్నంలో రాజమహేంద్రి ఇంజినీరింగ్ కళాశాలలో 'రోడ్డు భద్రత'పై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చరవాణి మాట్లాడుతూ రహదారిపై ప్రయాణించవద్దన్నారు. ఎంవీఐ ఎం. రవికుమార్ మాట్లాడుతూ రోడ్డు భద్రతకు సంబంధించిన మౌలిక నియమాలు వివరించారు.

గోదావరిలో తోడేళ్లు..!

యథేచ్ఛగా తవ్వకాలు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: గోదావరిలో ఇసుక తవ్వకాలు ఆగడం లేదు. నదీ తీరాన్ని ఆనుకొని ఓపెన్ రీచ్‌లు మినహా మిగిలిన అన్ని ర్యాంపుల్లో ఇదే వ్యవహారం నడుస్తోంది. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఇటీవల కలెక్టర్ బదిలీ కావడం.. కొత్తగా వచ్చిన కలెక్టర్ శిక్షణ కోసం వెళ్లడంతో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. ప్రతి ర్యాంపులో రాత్రీ పగలు తేడా లేకుండా నదిలోని ఇసుకను తోడేస్తున్నారు. గత కలెక్టర్ ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపారు. ఇసుక లారీలను తనిఖీలు చేయించి, కేసులు నమోదు చేయించారు. ఒక సందర్భంలో తెల్లవారు జామున గోదావరి మధ్యలో అనధికారికంగా తవ్వకాలు చేస్తున్న బోట్లను పట్టుకున్న ఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో అనధికారికంగా ఎక్కడ పడితే అక్కడ ఇసుక నిల్వ చేస్తున్నారు.

నిఘా

ఉపాధికి గండి...

● జిల్లాలో గోదావరి పరివాహక ప్రాంతాలైన ధవళేశ్వరంలో 8, కోటిలింగాల రేవు 4, కాతేరు 5, కొవ్వూరు 3, పక్కిలంక 2, తాళ్లపూడి 4 చొప్పున ర్యాంపులున్నాయి.

● ఒక్కొక్క నావపై 10 నుంచి 15 మంది కూలీలు ప్రతీ రోజు పనులు చేస్తారు. గోదావరి తీరాన్ని ఇసుక తవ్వకాలను నమ్ముకొని వెయ్యి కుటుంబాల వరకు జీవనోపాధి పొందుతున్నాయి. అక్రమ తవ్వకాలతో వీరు ఉపాధి కోల్పోతున్నారు.

ఇసుక రీచ్ వద్ద లారీ

బిల్లులు లేకుండానే..

కనీసం లారీలకు బిల్లులు లేకుండా ఇసుక రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. సీతానగరం, రఘుదేవపురం, వేమగిరి వంటి ఓపెన్ ర్యాంపులతో పాటు మిగిలిన చోట్ల కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ప్రతి బిల్లు నుంచి ప్రభుత్వానికి రూ.350 చెల్లించాలి. ఈ నిధులతో ఆయా పంచాయతీల పరిధిలో మౌలిక వసతుల కల్పించాలి. జిల్లాలో రోజూ రూ.10 లక్షలకు పైగా బిల్లులు స్వాహా అవుతున్నాయి. ర్యాంపుల్లో రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్, పోలీసులు నిరంతర పర్యవేక్షణ ఉండాలి. గతంలో వీఆర్వో, పోలీసులు, సచివాలయం బృందాలుగా ఉండి నిత్యం పర్యవేక్షణ చేసేవారు. సీసీ కెమెరాలు, వే-బ్రిడ్జిలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వీటన్నింటికి స్వస్తి పలకడంతో యథేచ్ఛగా రవాణా సాగుతోంది.

నది సమతుల్యతకు దెబ్బ

● ఈ బోటు గోదావరి మధ్యలో ఒకే సారి 15 అడుగుల పైగా గొయ్యి పెడుతుంది. దీని వల్ల సుడి గుండాలు ఏర్పడి నది సమతుల్యత దెబ్బ తింటుంది.

అక్రమాలకు పాల్పడిన విశ్రాంత పంచాయతీ కార్యదర్శులపై చర్యలు

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: అనధికార అపార్ట్‌మెంట్ల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసిన ఆరోపణలపై అనపర్తి, బొమ్మూరు, హుకుంపేట విశ్రాంత గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎం.శివపార్వతి, మేడపాటి బాబు, బి.రామ శ్రీనివాసేల పెన్షన్‌లో రెండేళ్లపాటు 5శాతం నిలిపివేస్తూ కమిషనర్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. వీరు రాజమహేంద్రవరం గ్రామీణం, అనపర్తి, కాకినాడ గ్రామీణం, పిడింగొయ్యి, హుకుంపేట, బొమ్మూరు గ్రామ పంచాయతీల్లో పని చేసినప్పుడు నిబంధనలకు విరుద్ధంగా అపార్ట్‌మెంట్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారన్న ఆరోపణలు రుజువు కావడంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ముగ్గురికీ పెన్షన్‌లో కోత విధించారు.

పాలనా సౌలభ్యానికి కసరత్తు

కొత్త పంచాయతీల ఏర్పాటుకు ప్రతిపాదనలు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: గ్రామీణ పాలనలో కీలకమైన పంచాయతీ వ్యవస్థలో మార్పులు తీసుకురావడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగా పంచాయతీ కేంద్రానికి దూరంగా ఉండి పాలనాపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న శివారు ప్రాంతాలను కొత్త పంచాయతీలుగా మార్చేందుకు, మరికొన్ని శివారు ప్రాంతాలను సమీప పంచాయతీల్లో విలీనం చేయాలని భావిస్తోంది.

6 మండలాల పరిధిలో..

జిల్లాలో 299 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. శివారు ప్రాంతాలను పంచాయతీలుగా ఏర్పాటు చేయడం, కొన్నింటిని సమీప పంచాయతీల్లో విలీనం చేసేందుకు స్థానిక ప్రజల అభిప్రాయాలు స్వీకరించి నిర్ణయాలు తీసుకోవాలని నిర్ణయించారు. ఇప్పటికే జిల్లాలోని పలు శివారు ప్రాంతాల్లో గ్రామసభల ద్వారా ప్రజాభిప్రాయం సేకరించారు. ఆరు మండలాల పరిధిలోని 11 పంచాయతీల్లో ఏడు ప్రాంతాలను విభజించి వాటికి కొత్తగా పంచాయతీ హోదా, మరొక ప్రాంతాన్ని సమీప పంచాయతీలో విలీనానికి ప్రతిపాదించి ఆ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపించారు.

ఏప గ్రామాలంటే..

● గోకవరం మండలంలోని కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని పోలవరం ప్రాజెక్టు ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, ఆర్.ఎర్రంపాలెం పరిధిలోని పెంటపల్లి, వెదురుపాక పరిధిలోని బావాజీపేటను విభజించి వాటికి కొత్తగా హోదా కల్పించేందుకు ప్రతిపాదించారు.

● కడియం మండలంలోని కడియపులంక పంచాయతీ పరిధిలోని వెంకయ్యమ్మపేటను విభజించి పంచాయతీ హోదా ఇవ్వాలని ప్రతిపాదించారు.

● గోపాలపురం మండలంలోని వెళ్లచింతలగూడెం పంచాయతీ పరిధిలోని పెద్దాపురాన్ని విభజించి కొత్త హోదాకు ప్రతిపాదించారు.

● పెరవలి మండలంలోని ఖండవల్లి పంచాయతీ పరిధిలోని లంకమాలపల్లి విభజనకు ప్రతిపాదించారు.

● ఉండ్రాజవరం మండలంలోని సూర్యారావుపాలెం, సత్యవాడ, వడ్లూరు పంచాయతీ పరిధిలోని రెడ్డిచెరువు ప్రాంతాన్ని విభజించి కొత్తగా హోదాకు ప్రతిపాదించారు.

● నల్లజర్ల మండలంలోని అనిమినిలంక- చాగరిసమేటు పంచాయతీ పరిధిలోని అనిమినిలంకను సమీప పంచాయతీలో విలీనానికి ప్రతిపాదించారు.

దివ్య ధామం.. ధరణి తేజం

నేడే లక్ష్మీనృసింహుని కల్యాణోత్సవం

న్యూస్‌టుడే, అంతర్వేది, మామిడికుదురు

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం విశేషార్చనలు అత్యంత వేడుకగా జరిగాయి. హనుమద్వాహనం, సింహ వాహనాలపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చి భక్తజన గోవింద నామస్మరణల నడుమ పురవీధుల్లో ఆధ్యాత్మిక కోలాహలంతో ఊరేగించారు. భక్తులకు అభయ ప్రదానం చేస్తూ కదలివచ్చిన దేవదేవుని మంగళమూర్తులను భక్తిపారవశ్యంతో దర్శించుకున్నారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలో వేదపారాయణంతో జరిగిన శ్రీనారసింహ సుదర్శన యాగంలో అనేకమంది దంపతులు పాల్గొన్నారు. తీర్థ స్థలిలో పలు దుకాణాలు ఏర్పాటు కావడంతో సందడి నెలకొంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆవరణంతా కళకళలాడింది.

సింహ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం

అంతర్వేదిలో విద్యుద్దీపాలంకరణలో ఆలయ శోభ

అత్యవసర వేళ హెల్ప్‌లైన్ నంబర్లు

08862 243500
08862 243502
సఖినేటిపల్లి ఎస్సై
94407 96566
రాజోలు సీఐ
94407 96526

పూర్తయిన ఏర్పాట్లు

స్వామివారి దివ్య కల్యాణోత్సవాన్ని బుధవారం రాత్రి 1.56 గంటలకు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. కల్యాణ వేదిక చుట్టూ పటిష్ఠమైన రక్షణ వలయాన్ని ఏర్పాటు చేశారు. కల్యాణ మట్టాలను చూసేలా ఎల్ఈడీ తెరలను అమర్చారు. 50 సీసీ కెమెరాలు, ప్రత్యేక కంట్రోల్ వ్యవస్థ ఏర్పాటయ్యాయి. స్వామివారి దర్శనాలకు సంబంధించి ప్రత్యేకంగా క్యూలైన్లు సిద్ధం చేశారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ భక్తులకు కల్పించిన ఏర్పాట్లను సంబంధిత అధికారులతో పరిశీలించారు.

☛ ఆలయ ప్రాంగణం, తీర్థ స్థలి, సముద్ర స్నానాల వద్ద పోలీసు కంట్రోలు రూమ్‌లున్నాయి. భక్తులు అక్కడ అవసరమైన సమాచారాన్ని అడిగి తెలుసుకోవచ్చు.

పట్టణాలకు బృహత్తర రూపం..!

ప్రణాళికల అమలుకు సర్కారు ఉత్తర్వులు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని పురపాలిక పరిధిలో కొత్త మాస్టర్ ప్లాన్ అమలుకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, రామచంద్రపురం పురపాలికలకు కొత్త మాస్టర్ ప్లాన్ కోసం గతంలోనే ప్రతిపాదనలు పంపారు. రాజమహేంద్రవరం మినహాయించి మిగిలిన పురపాలికల్లో ప్రతిపాదనలు ఆమోదించారు. నిడదవోలు 47.00, కొవ్వూరు 36.63, రామచంద్రాపురం 43.94 చ.కి.మీ చొప్పున మాస్టర్ ప్లాన్‌లకు అనుమతి లభించింది. గతంలో వీటికి డ్రాఫ్ట్ ప్లాన్‌ను సిద్ధం చేయగా, అభ్యంతరాలు కూడా స్వీకరించారు.

చిక్కులు వీడని నగర ప్రణాళిక

రాజమహేంద్రవరం మాస్టర్ ప్లాన్‌కు సంబంధించి అభ్యంతరాలు స్వీకరించినా ఇంకా పెండింగ్‌లోనే ఉంది. 2015లో రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు కొత్త మాస్టర్ ప్లాన్ అమలు చేశారు. కానీ దీనికి ముందుగా ఉమ్మడి జిల్లాలో గుడా (గోదావరి అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పడటంతో ఆ ప్లాన్‌ను పక్కనపెట్టారు. గత వైకాపా సర్కారు గుడా స్థానంలో రుడాను తెరపైకి తెచ్చింది. దీంతో మాస్టర్ ప్లాన్‌కు చిక్కులు ఏర్పడ్డాయి.

పట్టణీకరణ దిశగా అడుగులు

పురపాలిక పరిధిలో చుట్టుపక్కల గ్రామాలను మాస్టర్ ప్లాన్‌లో చేర్చారు. దీంతో గ్రామాల్లో అర్బన్ డెవలప్‌మెంటు విధానంలో పట్టణీకరణ ప్రక్రియ నాంది పలికినట్టయింది. కొవ్వూరులో 1991లోని ప్రతిపాదనల ఆధారంగా 1993లో బృహత్తర ప్రణాళిక అమలైంది. ఇప్పటి వరకు అదే అమలులో ఉంది. పట్టణ పరిధిలో 40, 60, 80, 100 అడుగుల రోడ్లు ప్రణాళికలోకి వచ్చాయి. ఇప్పుడు ఉన్న విస్తీర్ణం ఆధారంగా ఆయా మార్గాలను విస్తరించాల్సి ఉంది. 2027లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు రోజూ లక్ష మంది యాత్రికులు, భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారని అంచనా. ఈ నేపథ్యంలోనే మాస్టర్‌ప్లాన్ ద్వారా పలు అభివృద్ధి పనులు పట్టాలెక్కుతాయి.

రైతేరాజు అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

ఇదేం పోకడ బ్రో...

ఈ చిత్రంలో ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు హెల్మెట్లు ధరించి వెళ్తుండడంలో ఆశ్చర్యం ఏమి ఉందని మీరు అనుకోవచ్చు. పరిశీలనగా చూస్తే ద్విచక్రవాహనం ముందుకు సాగితే ఓ యువకుడు వాహనం వెనుకకు తిరిగి కూర్చున్నాడు. ఏమరపాటుగా చూసినా వ్యక్తులు ద్విచక్రవాహనం ముందుకు వెళ్తుందా ? వెనుకకు వెళ్తుందా ? అన్న సందేహం కలుగుతుంది. అతను చరవాణిని కూడా చూసుకుంటూ ముందుకు సాగాడు. జాతీయ రహదారి పై ఇదో రకమైన విన్యాసమంటూ వాహనదారులు వ్యాఖ్యానించారు. ఈ దృశ్యం దివాన్‌చెరువు వద్ద న్యూస్‌టుడే కెమెరాకు చిక్కింది. - న్యూస్‌టుడే, రాజానగరం

ఇంటర్ ప్రయోగ పరీక్షలు ప్రారంభం

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా (ఒకేషనల్) ప్రయోగాల పరీక్షలు మంగళవారం జిల్లాలో 9 కేంద్రాల్లో ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రథమ, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు జరిగాయి. ప్రథమ సంవత్సర విద్యార్థులు 582కు 493, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 606కు 550 మంది హాజరయ్యారని జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారిణి ఐ.శారద తెలిపారు.

నిర్మించారు.. నిరీక్షిస్తున్నారు..!

'ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్' లబ్ధిదారులకు తప్పని వెతలు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

జిల్లాలో ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్‌లో భాగంగా గతంలో చేపట్టిన గృహనిర్మాణాలకు సంబంధించిన బిల్లులు రూ.40 కోట్లు నేటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ఉద్దేశపూర్వకంగా గత వైకాపా ప్రభుత్వం నిలిపేసిన బిల్లుల కోసం ఇప్పటికీ గృహలబ్ధిదారులు ఎదురుచూస్తూనే ఉన్నారు. సొంతస్థలం ఉండి ఇల్లు నిర్మించుకునే వారికి 2016 నుంచి 2019 మధ్య ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ కింద అప్పటి తెదేపా ప్రభుత్వం జిల్లాలోని ఆయా మండలాల్లో 1,16,218 గృహాలు మంజూరు చేసింది. ఒక్కొక్క ఇంటికి రూ.2 లక్షల చొప్పున నాలుగు దశల్లో బిల్లులు చెల్లించేది.

దేవరపల్లి: వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

జిల్లాలో రెవెన్యూ డివిజన్ల వారీగా పరిశీలిస్తే

రెవెన్యూ డివిజన్	మొత్తం గృహాలు	పెండింగ్ బిల్లులు (రూ.కోట్లలో)
రాజమహేంద్రవరం	10,313	20.55
కొవ్వూరు	9,912	19.45

● జిల్లాలో మంజూరైన గృహాల్లో 2019 నాటికి 36,734 పూర్తయ్యాయి. బేస్‌మెంట్, పల్లర్స్, రూఫ్, స్లాబ్ దశలో ఉన్న మరో 79,475 నిర్మాణాలకు కలిపి అప్పటివరకు అప్‌లోడ్ అయిన బిల్లులకు సంబంధించి రూ.362.67 కోట్లు చెల్లించారు.

● ఇంతలో ప్రభుత్వం మారి వైకాపా అధికారంలోకి రావడంతో మిగతా పెండింగ్ బిల్లులకు గ్రహణం పట్టింది. రూ.40 కోట్ల బిల్లులు నిలిపేశారు. 4,187 మంది లబ్ధిదారులు అప్పులు చేసి నిర్మాణాలు పూర్తి చేశారు.

సర్వే చేసినా

పెండింగ్ బిల్లులపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించి సర్వే చేయించింది. అధికారులు లబ్ధిదారులతో మాట్లాడి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత గతేడాదిని ప్రభుత్వానికి నివేదిక అందించారు. అయితే ఇప్పటివరకు ఇంకా పెండింగ్ బిల్లులు మంజూరు కాలేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

కాకినాడకు క్రికెట్ స్టేడియం

16.55 ఎకరాల దేవాదాయ భూముల కేటాయింపు

ఈనాడు, కాకినాడ: కాకినాడ సిగలో కొత్త క్రీడా మైదానం చేరబోతుంది. సర్పవరంలోని భావన్నారాయణ స్వామి ఆలయానికి చెందిన 16.55 ఎకరాల భూమిని కేటాయించారు. జిల్లా కలెక్టర్ పేరున 33 ఏళ్లకు లీజు ప్రాతిపదికన కేటాయిస్తూ ప్రభుత్వ ఎక్స్‌అఫీషియో కార్యదర్శి హరి జవహర్‌లాల్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఏటా ఎకరాకు రూ.50 వేల చొప్పున లీజు చెల్లించాలి. ప్రతి మూడేళ్లకు ఈ మొత్తాన్ని 33 శాతం పెంచాలని పేర్కొన్నారు. సర్పవరంలోని సర్వే నంబర్ 113, 115లలో భూమి కేటాయిస్తూనే అక్కడికి వెళ్లేందుకు సీసీ రోడ్డు నిర్మాణానికి మరో 4,900 చదరపు అడుగులు కేటాయించారు.

మెరుగైన సౌకర్యాలతో..

క్రికెట్ స్టేడియం కోసం భావన్నారాయణ స్వామి భూములను కేటాయించడం వల్ల అభివృద్ధికి అవకాశం కలగనుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. భూములకు లీజు డబ్బులు పెరగడంతో పాటు ఆక్రమణలకు అవకాశం ఉండదు. చుట్టుపక్కల మౌలిక సదుపాయాలు సమకూరుతాయి. 'కాకినాడలో రంజీ, ఫస్ట్ క్లాస్ క్రికెట్ పోటీలు నిర్వహించేలా స్టేడియం నిర్మించనున్నాం. అత్యాధునిక వసతులతో ఇతర క్రీడల నిర్వహణకు తగినట్లు నిర్మాణాలు చేపడతాం.' అని రాజ్యసభ సభ్యులు సతీష్‌బాబు అన్నారు.

'హలో లోకేశ్' పేరిట మమేకం

జేఎన్‌టీయూలో విద్యార్థులతో ముఖాముఖికి ఏర్పాట్లు

ఈనాడు, కాకినాడ
న్యూస్‌టుడే, గాంధీనగర్, సర్పవరం

కాకినాడ జేఎన్‌టీయూలో ఈ నెల 30న విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ పర్యటనకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. రూసా నిధులతో నిర్మించిన పీజీ విద్యార్థుల వసతి గృహాన్ని మంత్రి ప్రారంభించనున్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులను పరిశీలించి వారితో ఆలోచనలు పంచుకోనున్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 'హలో లోకేశ్' పేరిట విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. వీసీ ఛాంబర్ ఎదురుగా ఖాళీ స్థలంలో జర్మన్ హంగర్ టెంట్‌తో భారీ వేదికను సిద్ధం చేస్తున్నారు. క్యాంపస్ ఆవరణలో పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. అసంపూర్తిగా నిలిచిన కల్వర్టు, కాలువల పనులు పట్టాలెక్కిస్తున్నారు.

ప్రారంభానికి సిద్ధమైన పీజీ విద్యార్థుల వసతిగృహం

కార్యకర్తలతో సమావేశమై..

కాకినాడ గ్రామీణ నియోజకవర్గ తెదేపా కార్యకర్తలతో లోకేశ్ సమావేశం కానున్నారు. పార్టీ బలోపేతం, కూటమిలో సమర్థంగా పనిచేయడంపై దిశానిర్దేశం చేస్తారు. ఉత్తమ కార్యకర్తలను సత్కరిస్తారు. మంత్రి పర్యటనకు సంబంధించి ఎంపీ సానా సతీష్‌బాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి ఏర్పాట్లు పరిశీలించారు.

తీరనున్న వసతి సమస్య..

జేఎన్‌టీయూలో ఏటా వేల మంది విద్యార్థులు బీటెక్, ఎంటెక్‌లోని వివిధ కోర్సుల్లో చేరుతున్నారు. వీరికి సరిపడా వసతి సౌకర్యం లేకపోవటే గదులు అద్దెకు తీసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం రూసా పథకంలో సుమారు రూ.10 కోట్లతో పీజీ విద్యార్థులకు వసతిగృహం మంజూరు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో సమకూర్చాలి. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం సొమ్ము ఇవ్వకనిర్మాణంలో జాప్యం జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక వసతిగృహాన్ని పూర్తిచేశారు.

కోరమాండల్ ఆసుపత్రికి..

కోరమాండల్ ఇంటర్నేషనల్ కంపెనీ తమ ట్రస్ట్ ద్వారా చాలాకాలంగా ఆసుపత్రి నిర్వహిస్తోంది. పేదలకు నామమాత్రపు రుసుముతో వైద్యసేవలు అందిస్తోంది. ఈ ఆసుపత్రిని ఆధునికీకరించి మరిన్ని వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఈ నూతన భవనాన్ని మంత్రి లోకేశ్ ప్రారంభించనున్నారు.

జ్ఞాపకార్థ కూడిక: ది.29-01-2026 గురువారం, ఉ.10.00 గంటలకు మా స్వగృహమునందు Opp: Shalom Church, Near CTRI Autostand, CTRI Bhaskar Nagar, రాజమండ్రి. సెల్: 99858 28738

దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్

హైదరాబాద్, విశాఖపట్నం & కాకినాడకు సమీపంలో ఉన్న మా బల్క్ డ్రగ్ పరిశ్రమ ప్రొడక్షన్ విభాగంలో పనిచేయుటకు ఈ క్రింది అర్హతలు, శారీరక ధారుఢ్యం మరియు మంచి ఆరోగ్యం గల అభ్యర్థులు కావలెను.

2022 TO 2025 PASSED OUT & 2026 PURSUING CANDIDATES

Job Title	Qualification	Age	Stipend (P.M)
Trainee Supervisor / Graduate Apprentice	B.Sc. Chemistry	20-25 yrs	Rs. 18,000/-
	B.Pharmacy B.Tech - Chemical / Instrumentation / Mech	20-25 yrs	Rs. 20,000/-
	M.Sc. (Organic Chemistry/ Analytical Chemistry)	20-25 yrs	Rs. 22,000/-
	M.Pharmacy (QA & RA)	20-25 yrs	Rs. 24,000/-

గమనిక : పైన తెలిపిన కోర్సులు పూర్తి చేసిన మరియు ఆఖరి సంవత్సరం చివరి సెమిస్టర్ చదువుతున్న అభ్యర్థులు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు జిరాక్స్ కాపీలను తీసుకుని ఈ క్రింది ప్రదేశాలలో జరుగు ఇంటర్వ్యూకు హాజరు కాగలరు. ఎంపిక కాబడిన అభ్యర్థులు షిఫ్టలలో పనిచేయవలసి ఉంటుంది.

02-02-2026	VINANDA DEGREE COLLEGE Balaji Road, TUNI
03-02-2026	GBR DEGREE & PG COLLEGE ANAPARTHI
03-02-2026	VSM DEGREE & PG COLLEGE RAMACHANDRAPURAM
04-02-2026	YRL DEGREE COLLEGE SAMARLAKOTA
05-02-2026	SRI VENKATESWARA COLLEGE OF ARTS & SCIENCE Bhupaiah Agraharam Road, AMALAPURAM
06-02-2026	IDEAL COLLEGE OF ARTS & SCIENCE Indrampalem, KAKINADA
06-02-2026	PR GOVERNMENT COLLEGE Opp. MC Lauren High School, KAKINADA
07-02-2026	JNTU-K SCHOOL OF PHARMACEUTICAL SCIENCES & TECHNOLOGIES, KAKINADA
07-02-2026	PYDA COLLEGE OF PHARMACY (on the way to Yanam) PATAVALA
09-02-2026	GOVERNMENT COLLEGE OF AUTONOMOUS Central Jail Road, Y.Junction, RAJAHMUNDRY
10-02-2026	ADARSA COLLEGE OF PHARMACY G.KOTHAPALLI
10-02-2026	SAMHITHA DEGREE COLLEGE Tadithota, RAJAHMUNDRY
10-02-2026	GIET SCHOOL OF PHARMACY RAJAHMUNDRY

Interested candidates should report to the venue on or before 10.30 am

సదుపాయాలు : 1) బ్యాచ్‌లర్స్‌కు ఉచిత వసతి, 2) ఉచిత యునిఫాం, 3) అర్హులైన వారికి PF, ESI ఇవ్వబడును. 4) భోజన ఖర్చులో రాయితీ.

MALE CANDIDATES ONLY

మధురమే... మధురమే... మధురమే...
ఈ క్షణములు ఇంకా మధురమే...
పదవీ విరమణ శుభాకాంక్షలు

మీ కుటుంబసభ్యులు, మీ బంధుమిత్రులు, మీ ఆఫీసులో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా! అయితే వారికి అందించండి, అభినందన చందనాలు. వారి భావి జీవితం సుఖమయంగా సాగాలని ఆకాంక్షిస్తూ, ఈనాడు ద్వారా వారికి అందించండి, పదవీ విరమణ శుభాకాంక్షలు.

మరిన్ని వివరాలకు : 80085 97607



అంతర్వేది ఉత్సవాలకు పటిష్ఠ బందోబస్తు: ఐజీ

అంతర్వేది: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించేందుకు మంగళవారం విచ్చేసిన ఆయన ముందుగా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఉత్సవాల్లో ముఖ్య ఘట్టాలైన కల్యాణం, రథోత్సవం, చక్రవారి స్నానం సమయాల్లో సుమారు 5 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. క్యూలైన్లు, కల్యాణ మండపంలోని గ్యాలరీలు, సముద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. సుమారు 1500 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాహుల్ మీనా, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

'సోనోవిజన్ లక్కీడ్రా'లో విజేతలకు బహుమతులు

టి.నగర్, ఏవీఏ రోడ్డు: రాజమహేంద్రవరంలోని సోనోవిజన్ కొనుగోలుదారులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన లక్కీడ్రాలో విజేతలను ఎంపిక చేసింది. మంగళవారం సాయంత్రం కోటిపల్లి బస్టాండ్ వద్ద సోనోవిజన్ షోరూమ్‌లో జరిగిన కార్యక్రమంలో రాజమహేంద్రవరం గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పాల్గొన్నారు. ఆయన చేతుల మీదుగా లక్కీ డ్రా విజేతలను ఎంపిక చేశారు. ఎన్. సాయికుమార్ (ఆర్యాపురం) మారుతీ ఆల్టో కారు గెలుపొందారు. జి.శారదాదేవి (వీవర్స్ కాలనీ) ఎల్ఈడీ టీవీ సొంతం చేసుకొన్నారు. ఆర్.రాజా (బలభద్రపురం) రిఫ్రిజరేటర్ దక్కించుకొన్నారు. ఎం.ఆంజనేయులుకు(కానవరం) వాషింగ్‌మిషన్ లభించింది. షోరూమ్ మేనేజింగ్ పార్టనర్ పి భాస్కరమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలను ప్రకటిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

అంచెలంచెలుగా ఎదిగిన భాష్యం విద్యా సంస్థలు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: 'భాష్యం' విద్యా సంస్థల రజతోత్సవం రాజమహేంద్రవరంలోని మార్గాని ఎస్టేట్స్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎస్ఎల్ హెల్త్‌కేర్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ మెంటార్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ 25 ఏళ్లుగా భాష్యం విద్యా సంస్థలు తల్లిదండ్రుల విశ్వాసాన్ని చూరగొంటూ అంచెలంచెలుగా ఎదిగాయన్నారు. పూర్వ విద్యార్థి, ప్రముఖ దర్శకుడు బాబి మాట్లాడుతూ నిబద్ధత, కఠోరశ్రమతో భాష్యం విద్యా సంస్థలు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ తమదైన ముద్ర వేశాయన్నారు. ఆ వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని అదే పంథాలో విద్యా సంస్థలను మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ ముందుకు నడిపిస్తారనడంలో సందేహం లేదన్నారు. విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో నిర్వహించిన విద్యా సంస్థల రజతోత్సవం మర్చిపోలేని జ్ఞాపకమన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు ఉన్నత విద్య అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి డాక్టర్ సీహెచ్ దుర్గ సౌగంధి, విద్యా సంస్థల వైస్‌ఛైర్మన్ భాష్యం హనుమంతరావు, ముఖ్య సలహాదారులు మైఖేల్‌రాజ్, ఉభయగోదావరి జిల్లాల జెడ్ఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న డాక్టర్ గన్ని భాస్కరరావు
చిత్రంలో విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ తదితరులు

ఏకాదశరుద్రుల సీమ.. కోనసీమ

అంబాజీపేట: ఏకాదశ రుద్రులు కొలువైన కోనసీమ పుణ్యసీమగా భాసిల్లుతోందని రుషికేష్‌కు చెందిన హరహర నందస్వామీజీ అన్నారు. ఉత్తరాదికి చెందిన స్వామీజీల బృందం ఏకాదశ రుద్రుల ఆలయాలను మంగళవారం సందర్శించారు. ఏకాదశ రుద్రులు భారతదేశం మొత్తంమీద ఒక్క కోనసీమలోనే ఉన్నారన్నారు. ఈ ఆలయాలకు 476 సంవత్సరాల విశిష్టత ఉందన్నారు. అనంతరం ముక్కామలలోని కంచికామకోటిపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శైవాగమ పాఠశాలను సందర్శించి.. సంతృప్తిని వ్యక్తంచేశారు.

వీరేశ్వరస్వామి ఆలయానికి వచ్చిన స్వామీజీలు

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

EENADU SPORTS LEAGUE 2025

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - తాడికొండ: బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Hospitality Partner: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Man of the Series: Hero
Digital Partner: ఈనాడు.net TV Partner: ETV Bharat, ETV ఆంధ్రప్రదేశ్, Mee FM
Organised by ఈనాడు

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - I జూనియర్స్: మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్సర్లతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులు చేసి ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - I జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ్ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

గ్రౌండ్-2లో సీనియర్స్: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

సీనియర్స్ విన్నర్స్ రాయలసీమ రాకర్స్

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ చరణ్ జిత్ ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-I (జూనియర్స్)
మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)
మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

బీసీలపై దాడులు తగవు

బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్

కత్తిపూడిలో బాధితుడితో రామచంద్రయాదవ్

శంఖవరం, న్యూస్‌టుడే: బీసీలపై దాడులు తగవని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ అన్నారు. కత్తిపూడిలో ఇటీవల దాడికి గురైన ముత్తిన రామకృష్ణను మంగళవారం ఆయన నివాసంలో పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు బీసీలకు రక్షణగా తెస్తానన్న చట్టం హామీ నేటికి అందుబాటులోకి రాలేదన్నారు. రాష్ట్రంలో నిత్యం బీసీలపై దాడులు జరుగుతున్నాయన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు నిందితులకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. పోలీసులు తక్షణమే స్పందించి బాధ్యులపై కేసు నమోదు చేసి నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం బాధితుడికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 50 వేలు సహాయం అందించారు. బీసీవై పార్టీ నాయకురాలు అనూషయాదవ్, శీరం శ్రీను, బర్ల శ్రీనివాస్, దేవర శ్రీను తదితరులు ఉన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

అయినవిల్లి, న్యూస్‌టుడే: అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయంలో మంగళవారం దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో హుండీలు తెరిచి ఆదాయం లెక్కించారు. 49 రోజులకు గాను రూ. 30,01,285, 14 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్లు ఏసీ సత్యనారాయణరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజోలు గ్రూపు దేవాలయాల ఈవో ప్రసాదరాజు, భక్తులు పాల్గొన్నారు.

పారదర్శకతతో పోస్టుల భర్తీ

సాంబమూర్తినగర్(కాకినాడ): కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో పారా మెడికల్ పోస్టుల నియామక ప్రక్రియ పూర్తి పారదర్శకతతో కొనసాగుతోందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ తెలిపారు. జనరల్ డ్యూటీ అటెండెంట్, డ్రైవర్, ఓటీ టెక్నీషియన్, ఈఈజీ టెక్నీషియన్, డయాలసిస్ టెక్నీషియన్ తదితర పోస్టుల నియామక ప్రక్రియ మెరిట్ ఆధారంగా మాత్రమే నిర్వహిస్తామన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	18,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	32,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	29,500
గటగట	27,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	18,000-20,000
కొత్త (పచ్చి) కాయ	16,000-18,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	143-00
రిటైల్ లైవ్	170-00
డ్రెస్డ్	247-00
స్కిన్‌లెస్	281-00

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

ఆరు నెలల పిల్లాడిని అమ్మేశారు

- వ్యసనాలకు బానిసైన వ్యక్తి దురాగతం
- నిందితుడికి సహకరించిన భార్య

గోపాలపురం, న్యూస్‌టుడే: వ్యసనాలకు బానిసై.. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యక్తి తాను సహజీవనం సాగిస్తున్న మహిళకు పుట్టిన ఆరు నెలల పిల్లాడిని అమ్మేశాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందడంతో నిందితుడితోపాటు ఆయనకు సహకరించిన భార్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై పి.మనోహర్ మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోపాలపురం మండలం వాదాలకుంటకు చెందిన జొన్నకూటి వీరయ్య, చిన్నారి భార్యభర్తలు. వీరయ్య చిట్యాలకు చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆమెకు ఆరు నెలల కిందట బాబు పుట్టాడు. వీరయ్య చెడు వ్యసనాలకు బానిసై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. వీటి నుంచి బయటపడేందుకు భార్యతో కలిసి సహజీవనం సాగిస్తున్న మహిళకు పుట్టిన పిల్లాడిని దేవరపల్లికి చెందిన టి.సురేష్ ద్వారా రూ.5 లక్షలకు విక్రయించేందుకు పథకం వేశారు. ఇందులో భాగంగా ఈ నెల 19న మధ్యవర్తికి పిల్లాడిని అప్పగించి రూ.1.50 లక్షలు అడ్వాన్స్ తీసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పిల్లాడి తల్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు స్పందించి మధ్యవర్తి వద్ద పిల్లాడిని తీసుకొచ్చి ఆమెకు అప్పగించారు. నిందితుడు జొన్నకూటి వీరయ్య, అతని భార్య చిన్నారిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అయిదేళ్లకే నూరేళ్లూ నిండిపోయాయా..

- చైనా మాంజాకు బలైన చిన్నారి తల్లిదండ్రుల రోదనలు
- అంబాజీపేటలో విషాదఛాయలు

అంబాజీపేట, న్యూస్‌టుడే: ఈ నెల 26న హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో చైనా మాంజా మెడకు చుట్టుకుని చిన్నారి నిశ్వికాదిత్య(5) మృతితో స్వగ్రామం అంబాజీపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. అక్కడి నుంచి మృతదేహాన్ని తీసుకువస్తున్న సమాచారంతో కుటుంబ సభ్యులు, బంధువులు పెద్దఎత్తున చేరుకున్నారు. మంగళవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత మృతదేహం చేరుకోవడంతో ఆ ప్రాంతం రోదనలతో నిండిపోయింది. అయిదేళ్లకే నూరేళ్లు నిండిపోయాయా అంటూ విలపించిన తీరు అక్కడున్న వారిని కలచివేసింది. చిన్నారి తల్లిదండ్రులు రాంసాగర్, పద్మావతిని ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. సంక్రాంతి పండగకు స్వగ్రామం వచ్చి సరదాగా గడిపిన వీరు ఈ నెల 23న తిరిగి హైదరాబాద్ వెళ్లారు. కొన్ని రోజులు ఇక్కడే ఉంటే ఈ ఘోరం జరిగేది కాదేమోనని కుటుంబ సభ్యులు వాపోతున్నారు.

ఉరేసుకుని డ్రైవర్ బలవన్మరణం

హైదరాబాద్, న్యూస్‌టుడే: కారు డ్రైవర్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హైదరాబాద్‌లోని పేట్‌బషీరాబాద్ సీఐ కె.విజయవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా బత్తులవారిపేట గ్రామానికి చెందిన శ్రీనుబాబు (26) సుచిత్ర కూడలి వెన్నెలగడ్డకు వచ్చి నివసిస్తున్నాడు. యువకుడు స్థానికంగా కారు డ్రైవర్‌గా పని చేసేవాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం తెల్లవారుజామున తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వచ్చి పరిశీలించి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సేంద్రియ విధానం.. ఆచరిస్తే అమోఘం

న్యూస్‌టుడే, మోతుగూడెం

పోలవరం జిల్లా చింతూరు మండలం గూడూరు గ్రామానికి చెందిన గిరిజన రైతు దూభి లక్ష్మయ్య సేంద్రియ వ్యవసాయంలో రాణిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. రెండెకరాల్లో వరి, ఎకరాలో మినుములు, పెసలు పండిస్తున్నారు. ఎటువంటి రసాయన ఎరువులు వినియోగించకపోవడంతో చాలామంది వీటి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

తోట వద్దకే వచ్చి ఆకుకూరలు కొనుగోలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

స్ఫూర్తి

మరో పది సెంట్లలో కూరగాయలు

పది సెంట్ల భూమిలో పలు రకాల ఆకు, కూరగాయల పంటలను పండిస్తున్నారు. వీటికి సేంద్రియ ఎరువులు, కషాయాలను పిచికారీ చేయడంతో 20 రోజులకే పంట చేతికి వస్తుంది. తాజా సరకు కావడంతో గ్రామం, చుట్టుపక్కల అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, వసతి గృహాల నిర్వాహకులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మిగిలినవి వారపు సంతలో విక్రయిస్తున్నారు.

కషాయాల తయారీ, విక్రయం

కషాయాలు, ద్రావణాలను స్వయంగా తయారు చేసుకుంటున్నారు. వీటిలో కొన్ని సొంతానికి వినియోగించుకోవడంతో పాటు తక్కువ ధరకు ఇతర రైతులకు విక్రయిస్తున్నారు. దాదాపు వంద మంది వరకు ఈయన వద్ద కొనుగోలు చేస్తున్నారు. విత్తనశుద్ధికి బీజ, ఘన జీవామృతాలు, భూమిలో సూక్ష్మజీవుల వృద్ధికి ద్రవజీవామృతం, పంట తొలిదశలో పట్టే చిన్న, పెద్ద పురుగుల నివారణకు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, టమాటా, మిర్చి, వంగ, బెండ, గోరుచిక్కుడు పంటల్లో ఆకుముడత పురుగు నివారణకు ఆవు మూత్రంతో వావిలాల కాషాయం తదితరాలు తయారు చేసి విక్రయిస్తున్నారు.

ఆదాయం ఇలా..

వరి, మినుములు, పెసలు, కూరగాయలు, ఆకుకూరల పంటలతో పాటు కషాయాల అమ్మకాల ద్వారా ఖర్చులు పోను నెలకు రూ.25 వేల వరకు ఆదాయం పొందుతున్నట్లు లక్ష్మయ్య తెలిపారు.

రైతేరాజు

పొగాకులో తెగుళ్ల బెడద

గోపాలపురం, న్యూస్‌టుడే: వర్జీనియా పొగాకు తోటల్లో ఈ సీజన్‌లో వచ్చే తెగుళ్లలో ఆకుముడత, నల్లకాడ ప్రధానమైనవి. వాటి నివారణకు సరైన చర్యలు తీసుకోకపోతే చాలానష్టం వస్తుంది. దిగుబడితో పాటు నాణ్యత లోపిస్తుందని గోపాలపురం వేలం కేంద్రం నిర్వహణాధికారి కేవల్ రామ్‌మీనా తెలిపారు. ● ఆకుముడత నివారణకు తోట చుట్టూ జొన్న, మొక్కజొన్నను కంచెలా రెండు వరుసల్లో వేసుకోవాలి. వ్యాధికి కారణమైన తెల్లదోమను అరికట్టేందుకు జిగురు అట్టలను హెక్టారుకు 15 చొప్పున అక్కడక్కడ ఏర్పాటు చేయాలి. పొలంలో ముందుగా ఇమిడాక్లోపిడ్ ఎస్ఎల్ 3 మి.లీ.ను 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ● నల్లకాడ తెగులు తరచూ వస్తుంటే పంటమార్పిడి చేయడం మంచిది. నాట్లు వేసింది. మొదలు తోటలో తేమ ఎక్కువగా ఉంటే నీటితడులు బాగా తగ్గించాలి. వ్యాధి నివారణకు రెడిమెల్ 20 గ్రా. మందును 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

తెగులు సోకి వాడిపోయిన పొగాకు మొక్క

తెలుసుకుందాం..

వరిలో నత్రజని ప్రధాన పోషకం

అయినవిల్లి, న్యూస్‌టుడే: వరిలో నత్రజని మొక్క పెరిగేందుకు, దుబ్బు కట్టేందుకు ఉపయోగ పడుతుందని అయినవిల్లి ఏవో శోభ తెలిపారు. దీని లోపం వల్ల ఎదురయ్యే సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. నత్రజని లోపిస్తే వరిదుబ్బు ఎదుగుదల తగ్గి పసుపు పచ్చగా మారి ఆకులు ఎండిపోతాయి. ఒకవేళ ఎక్కువైతే పైరు ఏపుగా పెరిగి ఆకులు నీలిరంగుతో కూడిన ముదురాకు పచ్చ రంగు కలిగి ఉంటాయి. దీంతో పంట ఆలస్యంగా కోతకు వస్తుంది. రోగనిరోధక శక్తి తగ్గి పురుగులు, తెగుళ్లు ఆశిస్తాయి. రబీలో ఎకరాకు 72 కిలోల నత్రజని వేయడం ద్వారా ఆశించిన దిగుబడులు పొందొచ్చు. పైరు కీలక దశలో మాత్రమే వేయాలి. వేయాల్సిన మొత్తాన్ని మూడు భాగాలుగా విభజించి మొదటి భాగం ఆఖరి దమ్ము లేదా నాట్లు వేసే సమయంలోను, మరోభాగం పిలక తొడిగి దుబ్బువేసే సమయంలోనూ, మిగిలినది అంకురం ఏర్పడిన దశలోను వేయాలి. దీనివల్ల బాగా దుబ్బులు చేసి వెన్నుల సంఖ్య, గింజల సంఖ్య పెరిగి మంచి దిగుబడులు వస్తాయి.

అయినవిల్లిలో ఎదిగిన వరిచేను

మొక్కజొన్నలో కాండం తొలుచు పురుగు నివారణ

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: ప్రస్తుతం మొక్కజొన్నలో కాండంతొలుచు పురుగు అధికంగా ఆశిస్తోంది. దిగుబడులు గణనీయంగా తగ్గి రైతులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. పురుగు ఉద్ధృతిని గుర్తించే విధానం, నివారణ చర్యల గురించి ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకటనరసింహారావు వివరించారు. పురుగు చిన్నదశలో ఆకుల పత్రహరితం తింటాయి. క్రమంగా కాండం లోపలికి చేరి తినడం వల్ల ఆకులు విచ్చుకున్న తరువాత గుండుసూదిలాంటి రంధ్రాలు వరుస క్రమంలో కనిపిస్తాయి. లార్వా ఎదిగి అంకురాన్ని తినడం వల్ల మొక్క చనిపోయి ఎండిపోతుంది. దీనిని 'డెడ్‌హార్ట్'గా పేర్కొంటారు. ఒక్కొక్క మొక్కలో రెండు నుంచి మూడు పురుగులు కనిపిస్తాయి.

మొక్కజొన్న పంటకు ఆశించిన కాండం తొలుచు పురుగు

మీ కోసం

నివారణ చర్యలు

● పొలం చుట్టూ 3, 4 వరుసల్లో ఎర పంటగా వేసుకుని 45 రోజుల తరువాత తీసివేయాలి. పురుగు ఆశించిన మొక్కలను నాశనం చేయాలి. అంతర పంటగా అపరాలు వేస్తే కాండం తొలిచే పురుగులకు సహజ శత్రువుల సంఖ్య పెరుగుతుంది. ● ట్రైకోగ్రామా కిలోనిస్ పరాన్నజీవి గుడ్లను ఎకరాకు 2, 3 ట్రైకోకార్డుల రూపంలో రెండు విడతలుగా విడుదల చేయాలి. ● మోనోక్రోటోఫాస్ లీటరు నీటికి 1.6 మిల్లీలీటర్లు చొప్పున ఎకరాకు 320 మిల్లీలీటర్లు మందు కలిపిన ద్రావణాన్ని పైరు మొలకెత్తిన 10 నుంచి 12 రోజులకు పిచికారీ చేయాలి. ● పురుగు ఉద్ధృతి ఎక్కువగా ఉంటే కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఎకరాకు 3 కేజీల చొప్పున పైరు మొలకెత్తిన 25 నుంచి 30 రోజులకు ఆకుల సుడులలో వేయాలి.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). ✆ 83338 33368

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నది విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph : 8142292071.

శ్రీసాయి గోల్డ్ తాకట్టులో ఉన్న బంగారం ఏ బ్యాంక్/ప్రైవేట్ సంస్థల నుండి అయినా విడిపించి ఆరోజు మార్కెట్ రేటుకి కొనబడును. స్పాట్ క్యాష్ 94933 38823.

EDUCATION

విజయవాడలో BPT/ B.Sc., MLT- మేనేజ్‌మెంట్ కోటా సీట్లు- తక్కువ ఫీజు- కొన్నిసీట్లు కలవు. Affiliated to Dr. NTR యూనివర్సిటీ. ✆ 7995945835.

REAL ESTATE

FLAT FOR SALE

KAKINADA CITY

కాకినాడ, RTO ఆఫీస్ మెయిన్‌రోడ్ నందు ప్రముఖ అపార్ట్‌మెంట్‌లో 1060 Sft. సెకండ్ సేల్. S/F, కార్‌పార్కింగ్, లిఫ్ట్ సౌకర్యాలతో అమ్మకము. Cont: 97057 48052

PLOT FOR SALE

KAKINADA CITY

KKD, గంగనాపల్లి 100+100 చ||గ|| EF రెడీగా ఇల్లు కట్టుకొనుటకు గజం 16K, కలెక్టర్ ఆఫీస్ దగ్గర 2BHK ఫ్లాట్స్16L Only. 8985804011,9440303936.

JOBS

ఫ్యాక్టరీలో తేలికపాటి పని చేయుటకు యువతీ/ యువకులు కావలెను. 9 గంటలు డైలీ పని ఉండును. నెలకు రెండు ఆదివారములు సెలవు. సంప్రదించండి: 9000557999.

ADB రోడ్డుకి దగ్గరగా రంగంపేట వద్ద RUDA అప్రూవ్డ్ వెంచర్ మార్కెటింగ్‌కై టీం ఉన్న లీడర్లు కావలెను. మంచి కమీషన్+ ఇన్సెంటివ్స్. ✆ 6302626576.

రైస్ మిల్ & ప్లాంట్ ఆపరేటర్స్ కావలెను. అనుభవజ్ఞులైన వెల్డింగ్, రిపేర్ తెలిసిన ఆపరేటర్స్ కావలెను. Contact No: ✆ 80962 46099.

SECURITY GUARDS

రాజమండ్రి మరియు పరిసర ప్రాంతాలలో సెక్యూరిటీకి సంబంధించి గార్డులు, సూపర్‌వైజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు కావలెను. ✆ 96525 29724, 93468 62560.

కాకినాడ మరియు వాకలపూడి ఏరియాలో సెక్యూరిటీ గార్డ్‌లు స్త్రీలు మరియు పురుషులు కావలెను. PF మరియు ESI ఉచిత భోజన సౌకర్యం కలదు. ✆ 9949826283

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-15 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

రాజమహేంద్రవరం

పెన్షనర్ల సమస్యలకు సత్వర పరిష్కారం

ధవళేశ్వరం, మోరంపూడి: ధవళేశ్వరం పెన్షనర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక దినోత్సవాన్ని సంఘ అధ్యక్షుడు ధర్మరాజు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా ఖజానా అధికారి (డీటీవో)సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పెన్షనర్ల సమస్యలకు సత్వర పరిష్కారం చేస్తున్నామని, ఎటువంటి ఇబ్బంది కలిగినా స్వయంగా వచ్చి కలవచ్చని తెలిపారు. జిల్లాలో 9 వేల మంది పెన్షనర్లు ఉండగా సుమారు 6 వేల మందికి జీవిత ప్రమాణ పత్రం విధిలా చేసిన డీఆర్ వారి ఖాతాల్లో జమయ్యాయన్నారు.

చురుగ్గా విద్యుత్తు లైన్ల పనులు

రాజానగరం, న్యూస్‌టుడే: దివాన్‌చెరువు వద్ద పై వంతెన నిర్మాణంలో భాగంగా విద్యుత్తు సౌకర్యానికి సంబంధించిన పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. దివాన్ చెరువు నుంచి రాజానగరం వైపు వెళ్లే జాతీయ రహదారికి సంబంధించి పై వంతెన పనుల్లో భాగంగా విద్యుత్ టవర్లు ఇప్పటికే ఏర్పాటు చేశారు. వాటికి ఎనిమిది విద్యుత్ వైర్లు ఏర్పాటు పనులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దివాన్‌చెరువు కూడలి వద్ద జాతీయ రహదారి పైకి ఎవరూ రాకుండా ఉండేందుకు స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేశారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

సమావేశంలో పాల్గొన్న కేంద్ర కార్మిక సంఘాల నాయకులు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై తమ పోరాటం కొనసాగుతుందని కేంద్ర కార్మిక సంఘాల నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కేంద్ర కార్మిక సంఘాల సన్నాహక సమావేశం నిర్వహించారు. నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా, వ్యవసాయ కార్మిక సంఘాలు సంయుక్తంగా వచ్చేనెల 12న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని తీర్మానించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు, ఐఎఫ్‌టీయూ నాయకుడు వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడారు. కేంద్రప్రభుత్వం అమలులోకి తెచ్చిన లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే నెల 4న జిల్లా కేంద్రంలో ఉమ్మడి సదస్సు నిర్వహించడంతోపాటు, 12న జరిగే సమ్మె డిమాండ్లపై ప్రచారం నిర్వహిస్తామన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్.ఎస్.మూర్తి, టి.అరుణ్, రామచంద్రరావు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రంలో పాఠం.. విజ్ఞాన వికాసం..!

దేవీచౌక్, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు తమ విజ్ఞాన నైపుణ్యాన్ని మెరుగుపరుచుకునే విధంగా కళాశాల యాజమాన్యం ప్రత్యక్ష పాఠాలు నేర్పిస్తోంది. కళాశాల జంతుశాస్త్ర విభాగానికి చెందిన విద్యార్థులను వివిధ ప్రాంతాల్లోని క్షేత్రస్థాయి పరిశీలనకు తీసుకెళ్తున్నారు. జంతుశాస్త్ర, ఆక్వాకల్చర్ గ్రూపులకు చెందిన పీజీ, యూజీ విద్యార్థులను ఏటా సుమారు 15 క్షేత్ర స్థాయి పర్యటనలు చేస్తున్నారు. ఒక్కో బృందంలో 40 మంది విద్యార్థులు ఉండే విధంగా పర్యటనలు కొనసాగుతున్నాయి. కడియంలోని ఫిషరీస్ కేంద్రం, తాళ్లరేవులోని చేపల చెరువుల పరిశీలన, మారేడుమిల్లిలోని జంతు వైవిధ్యం, బలభద్రపురంలోని కేంద్ర మంచినీటి వనరుల అధ్యయన కేంద్రం వంటి ప్రాంతాలకు తీసుకెళుతున్నారు.

కడియంలోని చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

పక్షుల జీవన విధానంపై అవగాహన

ఇటీవల చేసిన క్షేత్ర స్థాయి పర్యటన వల్ల పక్షుల జీవనవిధానం తెలుసుకున్నాం. దీర్ఘ తరగతిగదిలో నేర్చుకోలేం. చెట్లమీద గూళ్లు ఎలా కడతాయి, పిల్లలను ఏ విధంగా పెంచుతాయో తెలిసింది. పర్యావరణం బాగున్నచోట ఎక్కువ పక్షులు నివాసం ఉంటాయి. వి.బాలాశ్రీ లాస్య, ఎమ్మెస్సీ ప్రథమ సంవత్సరం

ప్రత్యక్షంగా చూసి..

రాజమహేంద్రవరం సమీపంలోని దోసకాయలపల్లికి విద్యార్థులను వెళ్లి అటవీశాఖ సహకారంతో పక్షుల జీవనవిధానంపై అధ్యయనం చేశాం. క్షేత్రస్థాయి పర్యటనతో తరగతిగదిలో నేర్చుకున్నదానికి అనుగుణంగా ప్రత్యక్షంగా చూసి తెలుసుకుంటున్నాం.

పరిశోధనలకు అవకాశం

పరిశోధన రంగంపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు క్షేత్ర పర్యటనలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. పక్షులపై పరిశోధనలు చేసే వారికి ప్రయోజనం. ఈ పర్యటనలో పక్షుల రకాలు, వాటి జీవన విధానం, ఆహార అలవాట్లు, ఏకో సిస్టం తెలుసుకున్నాను. తరగతిగదిలో పాఠాలకు ప్రత్యక్షంగా చూసి నేర్చుకున్నవి వ్యత్యాసం తెలిసింది. - డి.జీవన్, ఎమ్మెస్సీ, ప్రథమ సంవత్సరం

పాఠాలకు అనుబంధంగా

సిలబస్‌లోని పాఠాలకు అనుబంధంగా క్షేత్ర పర్యటనలు ఉంటున్నాయి. మాకు టూరిజం అనే పాఠం ఉంది. క్షేత్ర పర్యటనల వల్ల కొత్త విషయాలు తెలుస్తాయి. పక్షులు తమ పిల్లలను ఎలా కాపాడుకుంటాయో ప్రత్యక్షంగా చూశాం. చెరువుల్లో ఉండే పక్షుల గురించి తెలిసింది. నిజ్జంగా మాత్రమే వీటిని గమనించాలి. - ఎస్.శ్రేయ, బీఎస్సీ, ద్వితీయ సంవత్సరం

వాతావరణానికి అనుగుణంగా ఆవాసం

దోసకాయలపల్లి పర్యటనలో 30 రకాల పక్షులను చూడగలిగాను. అటవీశాఖ అధికారుల బైనాక్యులర్ ద్వారా పక్షుల జీవన విధానం వివరించారు. అక్కడి పక్షులకు, నగరంలో ఉండే పక్షులకు తేడా తెలుసుకున్నాం. ఆహారం, అనువైన వాతావరణం ఎక్కడ ఉంటే అక్కడ పక్షులు నివాసం ఏర్పరచుకుంటాయి. - పి.గీతా శ్రీహర్షిత, ఎమ్మెస్సీ ప్రథమ సంవత్సరం

అభివృద్ధి పనులు ప్రజల్లోకి తీసుకెళ్లాలి: ఎమ్మెల్యే ఆదిరెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

టీనగర్: ప్రజల కోసం ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధి పనులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మంగళగిరిలో తెదేపా కార్యాలయంలో పార్లమెంటరీ కమిటీ శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడటంతోపాటు, వాస్తవాలను చాటిచెప్పడంలోనూ సోషల్ మీడియా సైనికుల పాత్ర కీలకమన్నారు. రానున్న రోజుల్లో మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీ నృసింహస్వామి కల్యాణం

● నేడు నిజరూప దర్శనం

స్వామివారి ఊరేగింపు

కల్యాణ అలంకరణలో..

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : కోరుకొండరోడ్డు సింహాచలనగర్‌లో కొలువైన శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామివారి క్షేత్రంలో చందన యాత్ర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం సాయంత్రం అర్చకుడు అవసరాల శ్రీకిరణ్‌స్వామి ఆధ్వర్యంలో ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. ఆలయ మండపంలో ప్రత్యేకంగా వేసిన వేదికపై దేవేరీ సమేత స్వామికి పట్టువస్త్రాలతో అలంకరించి ఆలయ ధర్మకర్తలు కాళెపు సూర్యసింహాచలం, కాళెపు నాగేశ్వరరావు దంపతులు తిరుకల్యాణ వేడుక వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై తిలకించారు. ● బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాతం, ఆరాధన, చందనోత్తరణ, సువర్ణ పుష్పార్చన నిర్వహించి ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నృసింహస్వామి నిజరూప దర్శనం కల్పిస్తారు. రాత్రి 8 గంటలకు అష్టోత్తర శతకలశాభిషేకం, 9 గంటలకు చందన సమర్పణ, తీర్థగోష్ఠి ఉంటాయి.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె

ఏవీఏ రోడ్డు, మోరంపూడి, న్యూస్‌టుడే: ఐదు రోజుల పనిదినాలు బ్యాంకింగ్ వ్యవస్థలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త ఒక రోజు సమ్మె కార్యక్రమంలో భాగంగా ఎస్బీఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు మంగళవారం కంబాలచెరువు బ్రాంచ్ వద్ద ధర్నా నిర్వహించారు. యూఎఫ్‌బీయూ నాయకులు లక్ష్మీపతి రావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన సీఎల్సీ సమావేశంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (డీఎఫ్ఎస్) వారు బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ఎల్ఐసీ, ఆర్బీఐ, సెబీ వంటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఐదు రోజుల పనిదినాలు అమలు చేస్తూ బ్యాంకులకు అమలు చేయకపోవడం అన్యాయమని అన్నారు. పేరుకుపోయిన మాట్లాడుతూ పనిదినాల నిమిత్తం దశాబ్దకాలం కిందట సానుకూల ఒప్పందం కుదిరినప్పటికీ అమలు చేయలేదని, ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ప్రభుత్వ ప్రైవేటు రంగ బ్యాంకు ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు.

నిరసన కార్యక్రమంలో సంఘ నాయకులు

విజేతలతో పాఠశాల ఉపాధ్యాయులు

రంగోత్సవ్ పోటీల్లో విద్యార్థులకు బహుమతులు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: ముంబయికి చెందిన రంగోత్సవ్ ఆన్‌లైన్‌లో నిర్వహించిన జాతీయస్థాయి ఆర్ట్స్ పోటీల్లో నెహ్రూనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారని ప్రధానోపాధ్యాయుడు జి.ఆశాకిరణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయిదు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు బహుమతులు సాధించారన్నారు.

హామీల అమలు కోసం ఎస్టీయూ దశలవారీ పోరాటం

రాజానగరం: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఇచ్చిన హామీలను ఇప్పటికైనా అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ ఎస్.జె.త్రినాథ్‌బాబు, రాజానగరం మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండి ధర్మరాజు, సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ పీఆర్సీ కమిటీ ఏర్పాటు, 30 శాతం మధ్యంతర భృతి మంజూరు, బకాయి ఉన్న నాలుగు డీఏల తక్షణ మంజూరు, సీపీఎస్ రద్దు, పదవీ విరమణ అనంతరం మరుసటి రోజే పెన్షన్ చెల్లింపు తదితర సమస్యలపై దశలవారీ పోరాటాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. దశలవారీ పోరాటంలో భాగంగా ఈ నెల 30వ తేదీన మండలస్థాయిలో తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. ఫిబ్రవరి 10న అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల వద్ద ధర్నా, అదే నెల 25న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి చేరుకోవాలి

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: విద్యార్థినులు క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి చేరాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి సూచించారు. మంగళవారం నగరంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలికల వసతి గృహాలను సందర్శించి విద్యార్థినుల సమస్యలు తెలుసుకున్నారు. వసతి సదుపాయాలు, ఆహార పట్టిక ప్రకారం భోజనం అందిస్తున్నారా అని ఆరా తీశారు. చదువుతోనే మంచి భవిష్యత్తుకు పునాది పడుతుందని సూచించారు. క్రమశిక్షణ, సహనశీలత అలవర్చుకోవాలన్నారు.

వంట గది పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి

వసతి గృహాల్లో ఏమైనా సమస్యలు ఉన్నా లేదా న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ హెల్ప్‌లైన్ నంబరు 15100ను సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడిగింపు

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే : జిల్లా కోర్టులో వివిధ పోస్టులకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 30 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ముందుకెళ్లని మురుగు

మురుగు రోడ్డుపైనే నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. స్థానిక జాతీయ రహదారి నుంచి జే.ఎన్. రోడ్డులోని లోలుగు నగర్ పార్క్‌కు వెళ్లే దారిలో మురుగు వెళ్లే మార్గంలేక రోడ్డు మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

రహదారులపైనే వ్యర్థాలు

వీరభద్రపురంలో రోడ్లపై ఉన్న చెత్త ఇది. ప్లాస్టిక్ వ్యర్థాలు మూగజీవాలకు ప్రాణాంతకంగా మారుతున్నాయి. అధికారులు ఎన్నిసార్లు హెచ్చరించినా ఇష్టానుసారం ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. స్థానిక వీరభద్రపురంలోని కస్తూరిబా వృద్ధాశ్రమం వీధిలో రోడ్డుపైనే వ్యర్థాలు వేయడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే వాటిని తొలగించి వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

–దేవీచౌక్, న్యూస్‌టుడే

పొంచి ఉన్న ప్రమాదం

నగరంలో నిత్యం రద్దీగా ఉండే ఆనంద్ నగర్ రోడ్డులో పాదచారులకు, వాహనదారులకు విరిగిన పలకల రూపంలో ప్రమాదం పొంచి ఉంది. రోడ్డు మలుపులో నడి మధ్యన ఉన్న మ్యాన్‌హోల్ పలక విరిగి పూర్తిగా పాడై ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాది మంది విద్యార్థులు, పాదచారులు, వాహనాలు ప్రయాణించే మార్గం ఇది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

విషకీటకాలకు ఆవాసం

స్థానిక తూర్పు రైల్వే స్టేషన్ రోడ్డులోని ఆవ కాలనీలో గృహసముదాయాల చెంత నిరుపయోగంగా మారిన పార్కు స్థలమిది. ఉద్యానం కోసం కేటాయించిన ఈ స్థలం అభివృద్ధికి నోచుకోకపోవడంతో తుప్పలు, పిచ్చిమొక్కలు పెరిగి విషకీటకాలకు ఆవాసంగా మారింది. ఈ పార్కు స్థలం చుట్టూ ఉన్న గృహసముదాయాల్లో వందల కుటుంబాలు నివాసముంటున్నాయి. తరచూ పాములు ప్లాట్లలోకి వచ్చేస్తున్నాయని నివాసితులు వాపోతున్నారు.

–న్యూస్‌టుడే, వీఎల్‌పురం

దస్తావేజు పోయినది

రాజమహేంద్రవరం గ్రామ కాపురస్తులు గద్దాడ దైవ వర ప్రసాద్, తండ్రి: (లేట) వీర్రాజు అనువారికి తూర్పు గోదావరి జిల్లా, రాజమహేంద్రవరం పట్టణంలో, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వార్డు సం. 24, మదన్‌సింగు పేట, డోర్ నం. 44-4-3 వద్ద ఉన్న 151 చదరపు గజాల విస్తీర్ణంలో నివాస భూమి మరియు దానిపై నిర్మితమైన ఆర్.సి.సి భవనాన్ని కలిగిన ఆస్తికి యజమానిగా ఉన్నారు. సదరు గెద్దాడ దైవ వర ప్రసాద్ గారు, పైన పేర్కొన్న ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్ నెంబర్: 4291/1999, తేదీ: 20-09-1999, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, రాజమహేంద్రవరం నందు నమోదు చేయబడిన పత్రాలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కంబాలచెర్వు శాఖలో కుదువగా ఉంచి రుణం పొందియున్నారు. ప్రస్తుతం ఆ శాఖలో ఆ ఒరిజినల్ పత్రాలు కనబడుట లేదు. కావున, ఈ పత్రాలు ఎవరికైనా లభించిన యెడల, దయచేసి వాటిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కంబాలచెర్వు శాఖకు అందజేయవలసిందిగా కోరడమైనది.

CHIEF MANAGER
State Bank of India
Kambalachervu Branch,
Rajahmundry

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

మాట్లాడుతున్న ఏపీ ఎన్జీజీవో జిల్లా అధ్యక్షుడు మాధవరావు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: జిల్లాలో వివిధ శాఖల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ ఎన్జీజీవో సంఘ పట్టణ యూనిట్లు కృషి చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మీసాల మాధవరావు సూచించారు. ఏపీ ఎన్జీజీవో జిల్లా సంఘ కార్యవర్గ తొలి సమావేశం మంగళవారం రాజమహేంద్రవరంలోని ఎన్జీజీవో భవనంలో జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన మాధవరావు మాట్లాడారు. ఏపీ ఎన్జీజీవో సంఘంలో రాష్ట్ర వ్యాప్తంగా 1.20 లక్షల మంది ఉద్యోగులకు సభ్యత్వం ఉందన్నారు. త్వరలో జరగనున్న రాష్ట్ర సంఘ ఎన్నికల్లో విద్యాసాగర్, డి.వి.రమణల నాయకత్వానికి మద్దతు తెలియజేస్తూ సమావేశంలో తీర్మానించారు. జిల్లా కార్యదర్శి సి.హెచ్.విజయకృష్ణ, కోశాధికారి సత్యనారాయణరాజు, రాజమహేంద్రవరం, ధవళేశ్వరం, అనపర్తి, కోరుకొండ, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం యూనిట్‌ల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'మహిళలకు కొరవడిన భద్రత'

మాట్లాడుతున్న శీలం పసమ్మ

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: కేంద్రంలో మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను, అత్యాచారాలను అరికట్టడంలో విఫలమయ్యాయని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు శీలం పసమ్మ ఆరోపించారు. స్థానిక మావో భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అనసూయ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో మహిళలకు రూ.1500 ఇస్తామన్న హామీని ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.విజయ, కోశాధికారి ఎస్‌కే రజియా, నాయకులు నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంతో అధిక లాభాలు

కడియం, న్యూస్‌టుడే: యూరియా స్థానంలో ప్రకృతి సేద్య విధానాలు అవలంబిస్తే రైతులకు అధిక లాభాలు కలుగుతాయని జిల్లా ప్రకృతి వ్యవసాయ మేనేజర్ బొర్రా తాతారావు, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ జయరామలక్ష్మి సూచించారు. మురమండ గ్రామంలోని వట్టికూడి దత్తుడు వ్యవసాయ క్షేత్రంలో రైతులకు నానో యూరియా, నానో డీఏపీలతో పాటు ద్రవరూపంలోని జీవామృతం వంటి ప్రకృతి సేద్య పద్ధతులను మంగళవారం వివరించారు. మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ యూరియా ఎక్కువగా వినియోగిస్తే పంట కణజాలం మెత్తగా మారి చీడపీడలు ఆశించడంతో రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదముందన్నారు. వ్యవసాయ పంటలో డ్రోన్‌తో పిచికారీ విధానాల పనితీరుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి దుర్మరణం

కోరుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని దోసకాయలపల్లిలో చెట్టుపై నుంచి పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ ఎస్.శ్రీనివాసు వివరాలు ఇలా ఉన్నాయి. ఇదే గ్రామానికి చెందిన మేకా త్రిమూర్తులు(42) మంగళవారం ఒక తోటలో చెట్టు ఎక్కి పనస కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఆదిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. త్రిమూర్తులుకు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

కోరుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని పశ్చిమ గోనగూడెంకు చెందిన కొయ్యా గెరటమ్మ(65) చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 23న తెల్లవారుజామున తన ఇంటి పొయ్యి వద్ద చలిమంట కాగుతుండగా ప్రమాదవశాత్తు చీరకొంగుకు నిప్పంటుకుని శరీరం అంతా కాలిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త పుష్పరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

బూడిదైన వలసజీవుల రెక్కలకష్టం

కడియం, న్యూస్‌టుడే: వారంతా అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం గున్నెపూడి గ్రామానికి చెందిన వలసజీవులు. దాదాపు 12 కుటుంబాల వారు దశాబ్దాల తరబడి జిల్లాకు వచ్చి వ్యవసాయ పనులు చేసుకుంటూ తిరిగి స్వగ్రామాలకు బయలుదేరడం పరిపాటిగా మారింది. ఈ 24 మంది వలసజీవులు మురమండ, మాధవరాయుడుపాలెం, జేగురుపాడు గ్రామాల్లో వ్యవసాయ పనులు చేసేందుకు తరలివచ్చారు. కడియం మండలం మాధవరాయుడుపాలెం గ్రామ శివారులో తాటాకిల్లును నివాసంగా ఏర్పాటు చేసుకున్నారు. మరో రెండు రోజుల్లో పనులు పూర్తి చేసుకుని తిరిగి వెళ్లే క్రమంలో వీరు నివాసముంటున్న తాటాకిల్లు విద్యుదాఘాతం వల్ల సోమవారం అగ్నికి ఆహుతైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ ప్రమాదంలో కష్టపడి దాచుకున్న సుమారు రూ.6.50లక్షలు బూడిద కాగా రెండు ద్విచక్రవాహనాలు పూర్తిగా కాలిపోవడంతో వారంతా నిరాశ్రయులై కట్టుబట్టలతో మిగిలారు. కొందరు రైతులు నగదు ఇవ్వాల్సి ఉండగా వారి చేలోపే రెక్కల కష్టం పూర్తిగా ఆవిరైందని విలపించారు. బాధితులను ఆ గ్రామ సర్పంచి అన్నందేవుల చంటి పరామర్శించారు. ఎమ్మెల్యే గోరంట్ల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. వారికి తాత్కాలిక ఆశ్రయంతో పాటు భోజన సదుపాయం కల్పించారు.

చేతివృత్తులతో ఆర్థిక స్వావలంబన

మహిళకు కుట్టుమిషన్ అందిస్తున్న గుబ్బల రాంబాబు

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: సమాజంలో మహిళలు చేతివృత్తుల ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించడానికి అవకాశం లభిస్తుందని స్వర్ణాంధ్రా సేవా సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు అన్నారు. మంగళవారం సాయంత్రం లాలాచెరువులోని వృద్ధాశ్రమ ప్రాంగణంలో కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న నిరుపేద కుటుంబానికి చెందిన వెంకటలక్ష్మికి కుట్టుమిషన్ అందించారు. ఈ సందర్భంగా గుబ్బల రాంబాబు మాట్లాడుతూ తమ సంస్థలో కుట్టుశిక్షణ పొందిన 680 మంది నిరుపేద మహిళలకు ఉచితంగా మిషన్లు అందించామన్నారు. త్వరలో 15మందికి కుట్టుమిషన్లు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. మహిళలు స్వయం ఉపాధి సాధించడానికి కుట్టు, మగ్గం, బ్యూటీషియన్, కంప్యూటర్ కోర్సులను ఉచితంగా అందిస్తున్నామని, శిక్షణలో చేరాలనుకున్న మహిళలు తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్

ఫోర్ట్ గేట్ బ్రాంచ్, రాజమండ్రి-533104. ఫోన్ నెం.: 0883-2475682

స్వాధీనతా ప్రకటన

(అనుబంధం -IV సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 యొక్క రూల్ 8(1) ప్రకారం)

(స్థిరాస్తుల కొరకు)

దిగువ సంతకందారుడు ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, ఫోర్ట్ గేట్ బ్రాంచ్, రాజమండ్రి అధీకృత అధికారి వారు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 (చట్టం 2002 యొక్క 54) మరియు 2002 నాటి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనల 2002 లోని నిబంధన 3తో చదువుకొనేలా చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద లభించిన అధికారాలను వినియోగించుకొని దిగువ పేర్కొన్న ఋణగ్రహీత/ హామీదారు / సహ-దరఖాస్తుదారుల కు నోటీసులో తెలిపిన బకాయి నోటీసు అందిన 60 రోజుల లోగా చెల్లించమని కోరుతూ ఈ దిగువ తెలిపిన తేదీన డిమాండ్ నోటీసు ఇవ్వడమైనది.

సదరు బకాయి మొత్తాన్ని ఋణగ్రహీత/ హామీదారు / సహ-దరఖాస్తుదారులు చెల్లించనందు వలన క్రింద వివరించిన ఆస్తులను సదరు నిబంధనలులోని నిబంధన 8 తో చదువుకొనే చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద లభించిన అధికారాలను వినియోగించుకొని ఈ దిగువ తెలిపిన తేదీన క్రింది సంతకందారుడు స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీత/ హామీదారు / సహ-దరఖాస్తుదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తులు విడిపించుకొనుటకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సబ్ సెక్షన్ (8) తో సెక్షన్ 13 లోని నిబంధనలు గమనించగలరు.

సదరు ఆస్తులతో ఎవ్వరూ ఎలాంటి వ్యవహారం చేయరాదని మరియు ఒక వేళ ఎవ్వరైనా సదరు ఆస్తులతో వ్యవహారం చేసినచో ఋణగ్రహీతలు చెల్లించాల్సిన బకాయి మొత్తం మరియు దానిపై గల వడ్డీ మొత్తాలకు ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్, ఫోర్ట్ గేట్ బ్రాంచ్, రాజమండ్రి వారి ఛార్జికి లోబడి ఉండునని ముఖ్యంగా ఋణగ్రహీత / హామీదారు / సహ-దరఖాస్తుదారుల కు మరియు ప్రజలకు ఇందుమూలముగా హెచ్చరించడమైనది.

నోటీసు, ఋణగ్రహీత/ హామీదారు / సహ-దరఖాస్తుదారు & స్థిరాస్తుల వివరములు

వ.నెం.	ఫోర్ట్ గేట్ బ్రాంచ్, రాజమండ్రి-533104. ఫోన్ నెం.: 0883-2475682
1)	ఋణగ్రహీత పేర్లు : పూసరల వెంకట లక్ష్మి నరసింహారావు (12111), తండ్రి : పుల్లయ్య, డి.నెం.9-25-70, గుండు వారి వీధి, రాజమండ్రి-533101, తూ.గో.జిల్లా, ఆం.ప్ర. బకాయి సొమ్ము : తేది.31.10.2023 నాటికి చెల్లించవలసిన బకాయి MORT లోన్ ఖాతా నెం.7219 కు చెంది రూ.26,74,138/- (అక్షరాల ఇరవై ఆరు లక్షల డెబ్బై నాలుగు వేల నూట ముప్పై ఎనిమిది రూపాయలు మాత్రమే) మరియు తేది.01-11-2023 నుండి జమకూడు తదుపరి వడ్డీ+ ఇతర ఖర్చులతో సహా కలిపి చెల్లించవలెను. డిమాండ్ నోటీసు తేది : 07.11.2023 స్వాధీనం తీసుకున్న తేది : 23.01.2026 షెడ్యూలు ఆస్తుల వివరములు : డాక్యుమెంట్ నెం: 2755/1957, తేది 22-05-1957 ప్రకారం రాజమండ్రి వాస్తవ్యులు పూసరల వెంకట లక్ష్మి నరసింహారావు, తండ్రి : పుల్లయ్య గారికి చెందిన ఆస్తి : తూర్పు గోదావరి జిల్లా, జిల్లా రిజిస్ట్రార్ ఆఫీస్, రాజమండ్రి పరిధిలో, రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, వార్డు నెం.6, టి.ఎస్. నెం.95, రాజమండ్రి, గుండు వారి వీధి లోని డోర్ నెం.9-25-70 గాగల ఇంటి భవనము స్థలం 175.72 చదరపు గజాల విస్తీర్ణమునకు హద్దులు : తూర్పు : ఉమ్మడి దారి--18.45 మీటర్లు, దక్షిణం : ఉమ్మడి దారి--9.50 మీటర్లు, పడమర : పి.వి. రావు గారి ఆస్తి--18.45 మీటర్లు, ఉత్తరం : రోడ్డు--10.60 మీటర్లు. పై సరిహద్దుల లోపల 175.72 చదరపు గజాల విస్తీర్ణం ఉంది.
2)	ఋణగ్రహీత పేర్లు : శ్రీ పోతుల వీరబాబు, తండ్రి : వీర్రాజు, డి.నెం.43-16-8, టౌను తాతాలు కళ్యాణ మండపం దగ్గర, కొత్తపేట, రాజమండ్రి-533101, తూ.గో.జిల్లా, ఆం.ప్ర. బకాయి సొమ్ము : MORT లోన్ ఖాతా నెం.7303 కు చెంది తేది.30.06.2025 నాటికి రూ.10,30,562/- (అక్షరాల పది లక్షల ముప్పై వేల ఐదు వందల అరవై రెండు రూపాయలు మాత్రమే) మరియు తేది.01-07-2025 నుండి జమకూడు తదుపరి వడ్డీ+ ఇతర ఖర్చులతో సహా కలిపి చెల్లించవలెను. డిమాండ్ నోటీసు తేది : 08.07.2025 స్వాధీనం తీసుకున్న తేది : 23.01.2026 షెడ్యూలు ఆస్తుల వివరములు : రిజిస్టర్డ్ గిఫ్ట్ డీడ్ డాక్యుమెంట్ నెం:1023/2004, తేదీ 16-02-2004 ప్రకారం, తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ పరిధి, రాజమండ్రి అర్బన్ మండలం, రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, 24వ వార్డు, కంచుమర్తి వారి వీధి, శ్యామలాంబ గుడి పుంత రోడ్డుకు ఉత్తర వైపున ఉన్న శ్రీ పోతుల వీరబాబుకు చెందిన, టి.ఎస్.నెం: 1895, డోర్ నెం: 24/735, సి.ఎస్.నెం: 43-15-8, డోర్ నెం: 24/735ఎ, సి.ఎస్. నెం: 45-15-9, కూల్చివేయబడిన పూరిల్లు మరియు పెంకుల ఇల్లు మరియు అందులో నిర్మించిన డాబా ఇల్లు ఉన్న ప్రస్తుత డోర్ నెం: 43-16-8 మరియు 43-16-8/1 స్థలం హద్దులు : తూర్పు : పోతుల రాము ఆస్తి---22.0 అడుగులు, దక్షిణం : ఈ ఆస్తి యొక్క గోడ---10.0 అడుగులు, పడమర : పోతుల సత్యనారాయణ ఆస్తి---22.0 అడుగులు, ఉత్తరం : రోడ్డు---10.0 అడుగులు. పై సరిహద్దుల లోపల 24.44 చదరపు గజాలు లేదా 20.43 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న స్థలం మరియు దానిపై గల అన్ని హక్కులతో సహా.

తేది : 23.01.2026
ప్రదేశం : రాజమండ్రి

సం/- అధీకృత అధికారి
ది ఆర్యాపురం కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్

(c) eenadu

కోరుకొండ ఎంఈవోకు సత్కారం

కోరుకొండ, న్యూస్‌టుడే: ఉత్తమ సేవలు అందించి అవార్డు అందుకున్న కోరుకొండ ఎంఈవో టి.కుశలవదొరను పీఆర్‌టీయూ నాయకులు మంగళవారం సన్మానించారు. గణతంత్ర వేడుకల్లో ఇన్‌ఛార్జి కలెక్టర్ మేఘా స్వరూప్ చేతులమీదుగా ఉత్తమ సేవా ప్రశంసాపత్రం అందుకున్న నేపథ్యంలో ఎమ్మార్సీ కార్యాలయం వద్ద సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శివన్నారాయణ, సాదే రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన సభలో ఉపాధ్యాయులు ఆయనను శాలువా, పూలమాలలతో సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు పల్లా రాజారావు, ఎంఈవో- 2 సుజాత, బి.సాంబశివరావు, సింగారపు వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలతో పారదర్శకత

కోరుకొండ: గ్రామాల్లో జరిగిన పనులపై సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించడం ద్వారా పారదర్శకత ఉంటుందని జిల్లా విజిలెన్స్ అధికారిణి(డీవీవో) కె.రత్నకుమారి అన్నారు. కోరుకొండ మండల ప్రజాపరిషత్తు కార్యాలయం ఆవరణలో మంగళవారం జరిగిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాల వారీగా జరిగిన పనులకు సంబంధించి వివరాలను సభలో వివరించారు. 1,066 పనులకు గాను రూ.17.97 కోట్లు నిధులు ఖర్చు అయినట్లు వివరించారు. రూ.1.24 లక్షలు మేర పనుల్లో వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారు. ఈ నగదును రికవరీ చేయాలని నిర్ణయించారు. పీడీ ఎ.నాగమహేశ్వరరావు, ఏపీడీ బి.రాంప్రసాద్, ఎస్కే ఖాదర్ భాషా తదితరులు పాల్గొన్నారు.

వేగంగా విద్యుత్తు లైన్ల పనులు

రాజానగరం, న్యూస్‌టుడే: దివాన్‌చెరువు వద్ద పై వంతెన నిర్మాణంలో భాగంగా విద్యుత్తు సౌకర్యానికి సంబంధించిన పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. దివాన్‌చెరువు నుంచి రాజానగరం వైపునకు వెళ్లే జాతీయ రహదారికి సంబంధించి పై వంతెన పనుల్లో భాగంగా విద్యుత్తు టవర్లు ఇప్పటికే ఏర్పాటు చేశారు. వాటికి ఎనిమిది విద్యుత్తు వైర్లు ఏర్పాటును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దివాన్‌చెరువు కూడలి వద్ద జాతీయ రహదారి పైకి ఎవరూ రాకుండా ఉండేందుకు స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేశారు. సర్వీస్ రహదారి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

ధవళగిరి జనార్దనుడి కల్యాణ సిరి

● 28 నుంచి వచ్చేనెల 2 వరకు జరగనున్న మహోత్సవాలు
● పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోన్న అధికారులు

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: అఖండ గోదావరి నదీ తీరాన ధవళేశ్వరం గ్రామంలో ధవళగిరిపై కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ జనార్దన స్వామి కల్యాణ మహోత్సవాల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ధవళగిరిపై ఈనెల 28 నుంచి వచ్చే నెల 2 వరకు వైభవంగా ఉత్సవాలు నిర్వహించనున్నారు. మాఘశుద్ధ ఏకాదశి నుంచి పౌర్ణమి మధ్యలో స్వామికి ప్రత్యేకంగా జరిపే ఈ క్రతువులను

శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ జనార్దన స్వామి

చూసేందుకు రెండు కళ్లూ చాలవు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనేందుకు వస్తారు. ఈ ఆలయం చుట్టూ మౌనంగా మూడు సార్లు ప్రదక్షిణ చేస్తే కోరిన కోరికలు నెరవేరతాయని భక్తుల నమ్మకం. ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానం పాలకమండలి, దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 29న భీష్మ ఏకాదశి పర్వదినం రోజున మధ్యాహ్నం 3.30 గంటలకు స్వామి వారి రథోత్సవం ప్రారంభమవుతుంది. అదే రోజు రాత్రి 9.30 గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు.

వైవిధ్యం.. రథోత్సవం

స్వామి వారి కల్యాణ మహోత్సవానికి ముందు జరిపే రథోత్సవాన్ని చూసేందుకు భక్తులు భారీగా ఇక్కడికి వస్తుంటారు. దేవస్థానం నుంచి రథం వీధి మీదుగా పోలీస్‌స్టేషన్ వరకు ఈ రథోత్సవం జరుగుతుంది. రథంపై కట్టే గొడుగును అరటి పండ్లతో కొట్టేందుకు యువత పోటీ పడతారు.

స్వామివారి రథం

ఈ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఇలా చేయడం చాలా కాలంగా ఆనవాయితీగా వస్తోంది. గొడుగుకు అరటిపండ్లు తగిలితే శుభం జరుగుతుందని భక్తులు నమ్ముతారు. ● ఈనెల 29న నిర్వహించనున్న రథోత్సవం సాగే రహదారి మొత్తం సిమెంటు రోడ్డుగా మారడంతో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ధవళేశ్వరం సీఐ టి.గణేష్ సూచించారు. రథాన్ని లాగే వారు 60 మందికి మించకుండా, వారందరూ ఒకే రకమైన వస్త్రాలు ధరించే విధంగా చర్యలు తీసుకున్నామని అన్నారు. భద్రత దృష్ట్యా 30 మీటర్ల పొడవు ఉన్న రథాన్ని లాగే తాడును 20 మీటర్లకు కుదించినట్లు చెప్పారు. రథం సాగే రహదారి మొత్తం రోప్ పార్టీలను ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు.

వేడుకగా శ్రీవారి తిరు కళ్యాణం

బొమ్మూరు, న్యూస్‌టుడే: బొమ్మూరు వేంకటగిరి కొండపై వేంచేసిన శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో 26వ తిరు కళ్యాణ మహోత్సవం మంగళవారం వేడుకగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, కామిని ప్రసాద్ చౌదరి, లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఉదయం మూలమూర్తికి అభిషేకాలు, అర్చనలను ప్రధాన అర్చకుడు శ్రీకృష్ణ పరమాత్మ చేశారు. సలాది వెంకటేశ్వరావు, సురేఖ దంపతులు కళ్యాణ కర్తలుగా వ్యవహరించారు. బ్రహ్మశ్రీ కాళ్ళకూరి సూర్యశ్రీ ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు జరిపారు. స్వామివారి కల్యాణాన్ని వీక్షించడానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. మధ్యాహ్నం లక్ష తులసి పూజలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. కళ్యాణ వేడుకల్లో తెదేపా వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోరంట్ల రఘురామ్ కిరణ్, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ పాల్గొన్నారు. స్వామి కళ్యాణం, భజన, కోలాటాలతో వేంకటగిరి కొండ స్వామి నామస్మరణతో మార్మోగింది.

అంతరాలయంలో స్వామివారు

రంగోత్సవ్ పోటీల్లో విద్యార్థులకు బహుమతులు

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: ముంబయికి చెందిన రంగోత్సవ్ ఆన్‌లైన్‌లో నిర్వహించిన జాతీయస్థాయి ఆర్ట్స్ పోటీల్లో నెహ్రూనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారని ప్రధానోపాధ్యాయుడు జి.ఆశాకిరణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయిదు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు బహుమతులు సాధించారన్నారు.

దరఖాస్తులకు గడువు పొడిగింపు

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: జిల్లా కోర్టులో వివిధ పోస్టులకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 30 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

'మహిళలకు కొరవడిన భద్రత'

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: కేంద్రంలో మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను, అత్యాచారాలను అరికట్టడంలో విఫలమయ్యాయని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు శీలం సుధారాణి ఆరోపించారు. స్థానిక మావో భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అనసూయ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో మహిళలకు రూ.1500 ఇస్తామన్న హామీని ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.విజయ, కోశాధికారి ఎస్కే రజియా తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి నెలాఖరుకు పనులు పూర్తిచేయాలి

రాజానగరం: ఫిబ్రవరి నెలాఖరు నాటికి ఉపాధి హామీ పనులు పూర్తి చేయాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రాజానగరంలో మంగళవారం సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద రూ.56.01 కోట్ల అంచనాతో 192 పనులు మంజూరు అయ్యాయన్నారు. వాటిలో 109 పనులు పూర్తి చేశారని, మిగిలిన 63 పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. సుమారు 20 భవన నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని అందులో మూడు భవనాలు ఎంపీ ల్యాడ్స్ నిధుల కింద మంజూరైనవి కూడా ఉన్నాయన్నారు. వాటి నిర్మాణ పనుల వేగం పెంచాలన్నారు. ఈ పనుల్లో 11 కమ్యూనిటీ హాళ్లు, మూడు హెల్త్ క్లినిక్‌లు, రెండు గ్రంథాలయ భవనాలు, ఒక మల్టీపర్పస్ హెల్త్ బిల్డింగ్, ఒక గ్రామ పంచాయతీ భవనం ఉన్నాయన్నారు. వచ్చే నెలాఖరు నాటికి ఆయా భవనాల నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. రూ.3.25 కోట్లతో నాబార్డ్ నిధులతో మంజూరైన సీతానగరం - పురుషోత్తపట్నం రహదారి పనులు వెంటనే ప్రారంభించాలన్నారు.

ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

అభివృద్ధి పనులు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

టి.నగర్: ప్రజల కోసం ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధి పనులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళగిరిలో తెదేపా కార్యాలయంలో పార్లమెంటరీ కమిటీ శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడటంలోనూ, వాస్తవాలను చాటిచెప్పడంలోనూ సోషల్ మీడియా సైనికుల పాత్ర కీలకమన్నారు.

ప్రకృతి సేద్యంతో అధిక లాభాలు

కడియం, న్యూస్‌టుడే: యూరియా స్థానంలో ప్రకృతి సేద్య విధానాలు అవలంబిస్తే రైతులకు అధిక లాభాలు కలుగుతాయని జిల్లా ప్రకృతి వ్యవసాయ మేనేజర్ జొన్నా తాతారావు, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ జయరామలక్ష్మి సూచించారు. మురమండ గ్రామంలోని వట్టికూడి దత్తుడు వ్యవసాయ క్షేత్రంలో రైతులకు నానో యూరియా, నానో డీఏపీలతో పాటు ద్రవరూపంలోని జీవామృతం తదితర ప్రకృతి సేద్య పద్ధతులను మంగళవారం వివరించారు. మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ యూరియా ఎక్కువగా వినియోగిస్తే పంట కణజాలం మెత్తగా మారి చీడపీడలు ఆశించడంతో రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదముందన్నారు. వ్యవసాయ పంటలో డ్రోన్‌తో పిచికారీ విధానాలు పరిశీలిస్తూ రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో యూరియా పిచికారి విధానాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అన్నసమారాధనకు విరాళం

కడియం, న్యూస్‌టుడే: మండలంలోని కడియపులంక గ్రామదేవత సోమాలమ్మ ఆలయం వద్ద మంగళవారం జరిగిన అన్నసమారాధనకు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు రూ.లక్ష విరాళం ప్రకటించారు. మంగళవారం ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆయనకు ఘనస్వాగతం పలికింది. ఈ సందర్భంగా జరిగిన అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు వడ్డించారు.

యాగంటి ఆలయాభివృద్ధికి వితరణ

యాగంటి (బనగానపల్లి (గ్రామీణం), న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా బనగానపల్లి మండలం యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన శ్రీనివాస్ కుటుంబసభ్యులు రూ.10,116 విరాళం అందించారు. మంగళవారం ఆలయ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా దాతలు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు దాతలను సంప్రదాయబద్ధంగా సత్కరించి, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

హామీల అమలు కోసం ఎస్టీయూ దశలవారీ పోరాటం

రాజానగరం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఇచ్చిన హామీలను ఇప్పటికైనా అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ ఎస్.జె.త్రినాథ్‌బాబు, రాజానగరం మండలశాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బండి ధర్మరాజు, సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ పీఆర్సీ కమిటీ ఏర్పాటు, 30 శాతం మధ్యంతర భృతి మంజూరు, బకాయి ఉన్న నాలుగు డీఏలు తక్షణ మంజూరు, సీపీఎస్ రద్దు, పదవీ విరమణ అనంతరం మరుసటి రోజే పెన్షన్ చెల్లింపు తదితర సమస్యలపై దశలవారీ పోరాటాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. దశలవారీ పోరాటంలో భాగంగా ఈ నెల 30వ తేదీన మండలస్థాయిలో తహసీల్దార్లకు వినతి పత్రాలు అందజేస్తామన్నారు. ఫిబ్రవరి 10న అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద ధర్నా, అదే నెల 25న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ. 10 - మ. 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

ధవళేశ్వరం: 91212 29057 కడియం: 91212 29062
బొమ్మూరు: 91549 78039 మోరంపూడి: 94935 92696
రాజానగరం: 98492 36167 కోరుకొండ: 80085 74213

సమస్య: మురుగు పారడం లేదు

బొమ్మూరు ప్రశాంతి నగర్‌లో సీసీ డ్రెయిన్ కుంగి మురుగు పారడం లేదు. కొన్నేళ్లుగా ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దోమల బెడద తీవ్రంగా ఉంది. – దుర్గ, స్థానికుడు

సమాధానం: సమస్య మా దృష్టికి వచ్చింది. నిలిచిన మురుగును తొలగించి కొత్త డ్రెయిన్ ఏర్పాటు చేస్తాం. – కాశీ, గ్రామకార్యదర్శి, బొమ్మూరు

– న్యూస్‌టుడే, బొమ్మూరు

పెన్షనర్ల సమస్యలకు సత్వర పరిష్కారం

ధవళేశ్వరం, మోరంపూడి, న్యూస్‌టుడే: ధవళేశ్వరం పెన్షనర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక దినోత్సవాన్ని సంఘ అధ్యక్షుడు యర్రమోతు ధర్మరాజు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. 36వ వ్యవస్థాపక దినోత్సవానికి జిల్లా ఖజానా అధికారి (డీటీవో) ఎన్.సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పెన్షనర్ల సమస్యలకు సత్వర పరిష్కారం చేస్తున్నామని, ఎటువంటి ఇబ్బంది కలిగినా స్వయంగా వచ్చి కలవచ్చని తెలిపారు. జిల్లాలో 9 వేల మంది పెన్షనర్లు ఉండగా సుమారు 6 వేల మందికి ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన డీఆర్ వారి ఖాతాల్లో జమయ్యాయని, మిగిలిన వారికి ఈ నెలాఖరులోగా జమవుతాయని చెప్పారు. మరో అతిథి సీఐ టి.గణేశ్ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు తమ సమీపంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా మా దృష్టికి తీసుకువచ్చి సహకరిస్తే మరిన్ని సేవలు అందించగలమని అన్నారు. మైత్రీ పోలీస్ వ్యవస్థలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమానికి సీనియర్ సభ్యులు ఒగ్గు వెంకట రామారావు, కొంజెర్ల వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

అతిథులను సన్మానించి జ్ఞాపికను అందజేసిన పెన్షనర్స్ సంఘ సభ్యులు

గుంతలు పూడ్చండి సారూ..

పిడింగొయ్యి పంచాయతీ పిడింగొయ్యి గ్రామంలో ప్రధాన రహదారి భారీ గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. భారీ వాహనాల వల్ల నేల కుంగి గుంత ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా తాత్కాలికంగా క్వారీ బూడిద జల్లి వదిలేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. గుంతల్లో నీరు చేరటం వల్ల గుంత పరిమాణం కనిపించక ప్రమాదాలకు గురవుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మోరంపూడి

స్పందించారు.. సీసీ రహదారి ప్రారంభించారు

ఈనాడు కథనానికి స్పందన

రాజానగరం, న్యూస్‌టుడే: పాలచర్ల - గాడాల మధ్య సీసీ రహదారి నిర్మాణం ప్రారంభించి చురుకుగా నిర్వహిస్తున్నారు. 'పనులు చతికిలబడి.. వాహనాలు తిరగబడి' శీర్షికన ఈనాడులో ఈ నెల 21న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి సంబంధిత కాంట్రాక్టర్‌తో పనులు ప్రారంభించారు. పల్లెపండగ కార్యక్రమం కింద గత ఏడాది జులై నెలలో రూ.కోటి నలభై లక్షల అంచనా వ్యయంతో ఈ రహదారి పనులు ప్రారంభించగా.. రోడ్డు తవ్వేసి వదిలేయడంతో రాళ్లు లేచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల ఓ వ్యక్తి కుమారుడిని తీసుకుని కారులో పాఠశాలకు బయలుదేరి వెళ్తున్న సమయంలో ఈ రహదారిపై రాళ్లు తేలిఉండటంతో కారు రోడ్డు పక్కన డ్రెయిన్‌లో పల్టీలు కొట్టింది. అదృష్టవశాత్తు స్వల్ప గాయాలతో విద్యార్థి బయటపడ్డాడు. ఇదే విషయాన్ని ఈనాడు ప్రచురించడంతో అధికారులు స్పందించి, సీసీ రోడ్డు నిర్మాణాన్ని వేగంగా చేస్తున్నారు.

పాలచర్ల - గాడాల మధ్య నిర్మిస్తున్న సీసీ రహదారి

క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి చేరుకోవాలి

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: విద్యార్థినులు క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి చేరాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మీ సూచించారు. మంగళవారం నగరంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలికల వసతి గృహాలను సందర్శించి విద్యార్థినుల సమస్యలు తెలుసుకున్నారు. వసతి సదుపాయాలు, ఆహార పట్టిక ప్రకారం భోజనం అందిస్తున్నారా అని ఆరా తీశారు. చదువుతోనే మంచి భవిష్యత్తుకు పునాది పడుతుందని సూచించారు. వసతి గృహాల్లో ఏమైనా సమస్యలు ఉన్నా లేదా న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ హెల్ప్‌లైన్ నంబరు 15100ను సంప్రదించాలని సూచించారు.

వంట గది పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మీ

మున్సిపల్ ఆర్వోగా రవి

మండపేట, న్యూస్‌టుడే: మండపేట మున్సిపల్ రెవెన్యూ అధికారిగా మాచిరాజు రవి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. 2014-2019 సంవత్సరాల కాలంలో మండపేటలో సీనియర్ అసిస్టెంట్‌గా ఆయన పనిచేసి అమలాపురం, భీమవరం మున్సిపాలిటీలకు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఆర్వోగా పనిచేసిన జేవీఎస్ శాస్త్రి గత నెలలో పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో రవి నియమితులయ్యారు.

ఆవిరైన వలసజీవుల రెక్కలకష్టం

కడియం, న్యూస్‌టుడే: వారంతా అనకాపల్లి జిల్లా బుచ్చయ్యపేట మండలం గున్నెపూడి గ్రామానికి చెందిన వలసజీవులు. దాదాపు 12 కుటుంబాల వారు దశాబ్దాల తరబడి జిల్లాకు వచ్చి వ్యవసాయ పనులు చేసుకుంటూ తిరిగి స్వగ్రామాలకు బయలుదేరడం పరిపాటిగా మారింది. ఈ 24 మంది వలసజీవులు మురమండ, మాధవరాయుడుపాలెం, జేగురుపాడు గ్రామాల్లో వ్యవసాయ పనులు చేసేందుకు తరలివచ్చారు. కడియం మండలం మాధవరాయుడుపాలెం గ్రామ శివారులో ఓ పాకను నివాసంగా ఏర్పాటు చేసుకున్నారు. మరో రెండు రోజుల్లో పనులు పూర్తి చేసుకుని తిరిగి వెళ్లే క్రమంలో వీరు నివాసముంటున్న తాటాకిల్లు విద్యుదాఘాతం వల్ల సోమవారం అగ్నికి ఆహుతైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ ప్రమాదంలో కష్టపడి దాచుకున్న సుమారు రూ.6.50 లక్షలు బూడిద కాగా రెండు ద్విచక్రవాహనాలు పూర్తిగా కాలిపోవడంతో వారంతా నిరాశ్రయులై కట్టుబట్టలతో మిగిలారు. కొందరు రైతులు నగదు ఇవ్వాల్సి ఉండగా వారిచ్చేలోపే రెక్కల కష్టం పూర్తిగా ఆవిరైందని విలపించారు. బాధితులను ఆ గ్రామ సర్పంచి అన్నందేవుల చంటి పరామర్శించారు. ఎమ్మెల్యే గోరంట్ల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. వారికి తాత్కాలిక ఆశ్రయంతో పాటు భోజన సదుపాయం కల్పించారు.

కాలిబూడిదైన తాటాకిల్లు

బ్యాంకు ఉద్యోగుల ఒక రోజు సమ్మె

ఏవీఏ రోడ్డు, మోరంపూడి, న్యూస్‌టుడే: ఐదు రోజుల పని దినాలు బ్యాంకింగ్ వ్యవస్థలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త ఒక రోజు సమ్మె కార్యక్రమంలో భాగంగా ఎస్బీఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు మంగళవారం కంబాలచెరువు బ్రాంచ్ వద్ద ధర్నా నిర్వహించారు. యూఐబీయూ నాయకులు లక్ష్మీపతిరావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన సీఎల్‌సీ సమావేశంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (డీఎఫ్ఎస్) వారు బ్యాంకు ఉద్యోగుల డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ సమ్మె చేసినట్టు తెలిపారు. ఎల్ఐసీ, ఆర్బీఐ, సెబీ వంటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో ఐదు రోజుల పనిదినాలు అమలు చేస్తూ బ్యాంకులకు అమలు చేయకపోవడం అన్యాయమని అన్నారు. పెరిశాస్త్రి మాట్లాడుతూ పనిదినాల నిమిత్తం దశాబ్దకాలం క్రితం సానుకూల ఒప్పందం కుదిరినప్పటికీ అమలు చేయలేదని, ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకు ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు.

నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సంఘ నాయకులు

జాతరలో అశ్లీల నృత్యాలు

● ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన.. పోలీసుల ఆరా

గోకవరం, న్యూస్‌టుడే: ఒక జాతరలో అశ్లీల నృత్యాలు నిర్వహించగా ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలివీ.. గోకవరం మండలం తంటికొండ గ్రామంలో గత మంగళవారం రాత్రి ఓ అమ్మవారి జాతరను నిర్వహించారు. జాతర ముసుగులో ట్రాక్టర్లపై మహిళలతో అశ్లీల నృత్యాలు చేయించారు. ఈ నృత్యాలకు సంబంధించిన కొన్ని వీడియోలు బయటకువచ్చాయి. దీంతో ఈ విషయాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకొని విచారణ చేపట్టారు. ట్రాక్టర్లతో పాటు నిర్వాహకులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేస్తున్నట్లు సమాచారం. అయితే దీనిపై ఏ విధమైన వివరాలు వెల్లడించలేదు.

పాత తుంగపాడు విద్యార్థులకు డీఈఓ అభినందన

రాజానగరం: దక్షిణ భారత రాకెట్రీ ఛాలెంజ్ పోటీల్లో పాల్గొని ప్రథమ బహుమతి గెలుచుకున్న రాజానగరం మండలం పాతతుంగపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. వినూత్నంగా ఆలోచించి నూతన ఆవిష్కరణలకు నాంది పలికిన విద్యార్థులు జి.కొండబాబు, కె.వంశీ భానుడు, కె.వి.వి.దుర్గాప్రసాద్, యు.ఈశ్వర వినాయక్‌ల ప్రతిభను ప్రశంసిస్తూ మరిన్ని నూతన ఆవిష్కరణలకు ఈ అవార్డు ప్రేరణగా నిలవాలన్నారు. ఇందుకు సహకరించిన గైడ్ ఉపాధ్యాయులు బి.శ్రీను, జి.అరుణ్‌కుమార్‌ను అభినందించారు. హెచ్ఎం కమలదాస్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రాజెక్ట్ నమూనా ప్రదర్శించిన విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో వాసుదేవరావు

చెట్టుపై నుంచి పడి వ్యక్తి దుర్మరణం

కోరుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని దోసకాయలపల్లిలో చెట్టుపై నుంచి పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ ఎస్.శ్రీనివాసు వివరాలు ఇలా ఉన్నాయి. ఇదే గ్రామానికి చెందిన మేకా త్రిమూర్తులు(42) మంగళవారం ఒక తోటలో చెట్టు ఎక్కి పనసకాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు భార్య ఆదిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

623 మందే పెరిగారు !

● రాజానగరం నియోజకవర్గంలో ఓటర్ల పరిస్థితి

రాజానగరం, న్యూస్‌టుడే: ప్రజాస్వామ్య దేశంలో ఓటరే రారాజు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదవ్వడమే కాకుండా ఆ హక్కును అన్ని ఎన్నికల్లో తప్పనిసరిగా వినియోగించుకోవాలని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలు కోరుతున్నాయి. ముఖ్యంగా నిర్ణీత వయసు దాటిన యువతను ఓటరుగా నమోదు కావాలని, ఓటుహక్కు ఆవశ్యకతను వివరిస్తున్నాయి. మై ఇండియా మై ఓట్ నినాదంతో ఓటరు చైతన్యానికి విస్తృత ప్రచారం చేస్తున్నారు. కాని రాజానగరం నియోజకవర్గంలో 2024లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల నాటి ఓటరు జాబితాతో ప్రస్తుత జాబితా పోల్చితే కేవలం 623 మంది ఓటర్లు మాత్రమే పెరిగారు.

25.01.2026 నాటికి నియోజకవర్గంలోని ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
సీతానగరం	29,260	30,118	3	59,381
కోరుకొండ	31,896	33,042	1	64,939
రాజానగరం	45,820	46,600	3	92,423

మహిళలదే ఆధిపత్యం..

ఓటరు నమోదు ప్రక్రియ నిరంతరంగా జరుగుతున్నప్పటికీ వివరాల నమోదుకు సంబంధితులు ఉత్సాహం చూపడంలేదని అధికారులు భావిస్తున్నారు. రాజానగరం నియోజకవర్గంలో మహిళల ఆధిపత్యం కొనసాగుతోంది. జనాభా పరంగా వీరి సంఖ్య ఎక్కువ కాగా ఓటర్లుగా కూడా వీరిదే అగ్రస్థానంలో నిలుస్తోంది. నియోజకవర్గంలో 2024 ఎన్నికల్లో 2,16,120 మంది ఓటర్లు ఉండగా 25 జనవరి 2026 నాటికి నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య 2,16,743కు చేరుకుంది. ఇటీవల కొత్తగా చేరిన 623 మంది ఓటర్లకు గుర్తింపు కార్డు అందించనున్నారు.

దరఖాస్తు ప్రక్రియ ఇలా

18 ఏళ్ల వయసు నిండిన వారు ఓటు నమోదుకు అర్హులు కొత్తగా నమోదుతో పాటు మార్పులు, చేర్పులకు పోలింగ్‌స్థాయి బూత్ అధికారులు, పంచాయతీ, వార్డు, మండల కార్యాలయాలు, మీ సేవా కేంద్రాలు, కళాశాలల్లో దరఖాస్తు ఫారాలు పొందవచ్చు. ఓటర్ హెల్ప్‌లైన్ యాప్, voters.eci.gov వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చు. ఏదైనా సందేహాలు ఉంటే 1950 టోల్ ఫ్రీ నెంబరులో సంప్రదించవచ్చు.

కార్యక్రమాలు చేపడుతున్నాం..

ఓటుహక్కుపై అవగాహన కల్పించడంతో పాటు ఓటరుగా నమోదు చేసుకునే వారిని ప్రోత్సహించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. అర్హత గల యువకులంతా ఓటరుగా నమోదై ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరచాలి.
– జి.ఎ.ఎల్.ఎస్.దేవి, తహసీల్దార్, రాజానగరం

అగ్నిప్రమాదంలో గాయపడ్డ వృద్ధురాలి మృతి

కోరుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని పశ్చిమ గోనగూడెంకు చెందిన కొయ్యా గెరటమ్మ(65) చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 23న తెల్లవారుజామున తన ఇంటి పొయ్యి వద్ద చలిమంట కాగుతుండగా ప్రమాదవశాత్తు చీరకొంగుకు నిప్పంటుకుని శరీరం అంతా కాలిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త పుష్పరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

అవార్డుగ్రహీతకు శుభాభినందనలు

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి, తన విశేషమైన సేవలకు గుర్తింపుగా 77వ గణతంత్ర దినోత్సవం నాడు జిల్లా కలెక్టర్ గారి చేతులమీదుగా ఉత్తమ అవార్డును స్వీకరించిన కోరుకొండ MPDO శ్రీ B.అశోక్‌కుమార్ గార్కి మరియు సీనియర్ సహాయకులు శ్రీ K.ఫణికుమార్ గార్కి మా శుభాకాంక్షలు.

కోరుకొండ MPDO ఆఫీస్ సిబ్బంది

కోరుకొండ మండల పంచాయతీ కార్యదర్శులు అందరూ

శ్రీ గోడాడ గోషాయి మఠం
దేవదాయ-ధర్మదాయ శాఖ, పుష్కరాల రేవు, రాజమహేంద్రవరం
భూమి కౌలు హక్కు టెండర్ కం బహిరంగ వేలము ప్రకటన

తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం నగరం మరియు మండలంలో వేంచేసియున్న శ్రీ గోడాడ గోషాయి మఠం యొక్క పూర్తి హక్కు భుక్తమైనటువంటి తూర్పుగోదావరి జిల్లా, సీతానగరం మండలం, కాటవరం గ్రామంలో ఆర్.యస్.నెం.191లో య.20.13 సెంట్లు మరియు ఆర్.యస్.నెం. 269 లో 31.55 1/2 సెంట్లు వెరశి మొత్తం య.51.68 1/2 సెంట్లు మెరక భూమిని 16 ప్రతులుగాను సేద్యం చేసుకుని అనుభవించే హక్కును గూర్చి దేవదాయ ధర్మదాయశాఖ ఉన్నతాధికారులు ఆమోదపు ఉత్తర్వులకు లోబడి ది.12/02/2026వ తేదీ గురువారం ఉదయం 11.00 గంటలకు కాటవరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శ్రీ తనిఖీదారు దేవదాయ ధర్మదాయ శాఖ రాజమహేంద్రవరం వారి సమక్షమున మఠం కార్యనిర్వహణాధికారిణి వారిచే టెండర్ కం బహిరంగ వేలం పాట నిర్వహించబడును కావున ఆసక్తి గలవారు పాల్గొనవలసినదిగా తెలియపరచడమైనది.

కాటవరం, ది.27-01-2026. **కార్యనిర్వహణాధికారిణి,** గ్రేడ్-1, 9059922816

కొవ్వూరు
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

పదో తరగతి ఉత్తీర్ణతపై దృష్టి

కొవ్వూరు పట్టణం: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పదో తరగతి ఫలితాలు పునాది వేస్తాయని కొవ్వూరు డీవైఈవో దిలీప్‌కుమార్ అన్నారు. కుమారదేవంలోని గురుకుల పాఠశాలను మంగళవారం పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు బోధన, ప్రత్యేక తరగతులు, ఉత్తీర్ణత అంశాలపై చర్చించారు. విద్యార్థులతో మాట్లాడారు. కొవ్వూరు డివిజన్ ఆదర్శంగా నిలిచేలా కార్యాచరణ చేపడుతున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు అల్పాహారం అందజేత

గోపాలపురం, న్యూస్‌టుడే: గోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో సాయంత్రం వేళ ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి చదువుతున్న 125 మంది విద్యార్థులకు మండల సహాయ గణాంకాధికారి జోడల వెంకటేశ్వరరావు మంగళవారం అల్పాహారం అందించారు. ఉపాధ్యాయులు జెస్సీ, ప్రసాద్, సీఆర్పీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తాగునీటి ఇక్కట్లు

ఉండ్రాజవరం: మండలంలోని కె.సావరం తదితర పాఠశాలల్లో ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి యంత్రాలు మూలనపడటంతో సమీపంలోని ఆర్వో ప్లాంట్ల నుంచి తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తోందని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామని ఎంఈవో శారద జ్యోత్స్న తెలిపారు.

పల్లెల్లో పారిశుద్ధ్య పనులు

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: మండలంలోని కాల్దరి తదితర గ్రామాల్లోని డ్రెయిన్లలో మంగళవారం పూడిక తీత పనులు చేపట్టి, దోమల నిర్మూలన మందు పిచికారీ చేయించారు. ఎంపీడీవో మడిపల్లి శ్రీనివాసరావు, ఆయా పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులు పనులు పర్యవేక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు: తాళ్లపూడి: 80085 74498
ఉ. 10 - మ. 1 ఉండ్రాజవరం: 80085 74503, నల్లజర్ల: 97011 37112

లీకులు సరి చేశారు.. స్పందనకు వందనం

తాళ్లపూడి: మండలంలోని మలకపల్లిలోని ఎస్సీ ప్రాంతంలో పైపులైన్ లీకై తాగునీరు వృథాగా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను సర్పంచి రావూరి రాజేశ్వరి, ఇన్‌ఛార్జి కార్యదర్శి కామేశ్వరి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి లీకులు సరి చేయించారు.

పలకలు దెబ్బతిని పాట్లు..

సమస్య: పెద్ద ఆంజనేయస్వామి విగ్రహం ఎదురుగా క్రిస్టియన్‌పేట వీధిలో మొదలు ఆనుకుని కాలువలో డ్రెయిన్లపై సిమెంటు పలకలు ప్రమాదకరంగా మారాయి. ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.
- కె.శ్రీనివాస్, క్రిస్టియన్‌పేట

సమాధానం: డ్రెయిన్లపై ప్రమాదకరంగా ఉన్న పలకలను తొలగించి కొత్తవి అమర్చేందుకు చర్యలు తీసుకుంటాం.
- సందీప్, మున్సిపల్ ఏఈ

మురుగు పారక అవస్థలు..

సమస్య: జనిపిరెడ్డిపేట ఆంజనేయస్వామి గుడి సమీపం, పక్క వీధుల్లో మురుగు పారుదల వ్యవస్థ సక్రమంగా లేదు. డ్రెయిన్ల వెంబడి పిచ్చిమొక్కలతో మురుగు పారడం లేదు.
- ఎస్.నాగరాజు, కొవ్వూరు

సమాధానం: డ్రెయిన్లను శుభ్రం చేయించి మురుగు పారుదల సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం. - సీహెచ్ వెంకటేశ్వర్లు, పురపాలక కమిషనర్
- న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

రాకపోకలకు ఇబ్బందులు..

సమస్య: మండల పరిషత్తు కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారి ఆనుకుని ఉన్న కొన్ని దుకాణాల కార్యకలాపాలు రోడ్డుపై నిర్వహిస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- టి.గంగారావు, గోపాలపురం

సమాధానం: రోడ్డు పక్కన వ్యాపారం చేస్తున్న దుకాణాదారులకు ఇప్పటికే పంచాయతీ ద్వారా నోటీసులు ఇచ్చాం. రహదారిపై రాకుండా చూసుకోవాలని మరోసారి హెచ్చరిస్తాం.
- ఎంపీడీవో, జి.రాజ్‌మనోహర్
- న్యూస్‌టుడే, గోపాలపురం

కొనేవారు లేక.. ఇటుక తరలక..
నష్టాల ఊబిలో బట్టీల యజమానులు

గోపాలపురం, న్యూస్‌టుడే: ఇటుక వ్యాపారం గత కొద్ది నెలల నుంచి సంక్షోభంలో కూరుకుపోయింది. నష్టాల నుంచి బయటపడేందుకు తయారీదారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. కొవ్వూరు డివిజన్ పరిధిలో తాళ్లపూడి, గోపాలపురం, దేవరపల్లి, నిడదవోలు నల్లజర్ల మండలాల పరిధిలో నాణ్యత కలిగిన మట్టి, మంచి పద్ధతులు ఎక్కువగా అందుబాటులో ఉండటంతో బట్టీలు ఏర్పాటు చేసి ఏటా కోట్ల సంఖ్యలో ఇటుకలు ఉత్పత్తి చేస్తుంటారు.

బట్టీలో నిల్వ ఉన్న ఇటుకలు

చివరికి ముగుస్తుంది. వీటి తయారీకి ఆదిక ప్రాంతాల నుంచి వలస కూలీలు వస్తుంటారు. అయితే గత ఏడాది తయారు చేసిన ఇటుకలు బయటకు వెళ్లక వ్యాపారస్తులు నష్టాల్లో ఉండటంతో వలస కూలీలకు పనులు లేవని చెబుతున్నారు. ఈ కారణాల వల్ల ఇటుకల రవాణా చేసే వాహనాల కార్మికులు, రోజువారీ కూలీలపై భారం పడుతోంది.

ముహూర్తాలు లేక..

గత కొన్ని నెలలుగా గృహాల నిర్మాణానికి ముహూర్తాలు లేకపోవడం, ప్రభుత్వం ద్వారా ఇళ్ల మంజూరు కాకపోవడంతో ఇటుకల కొనుగోళ్లు ఆగిపోయాయి. ఏటా డిసెంబరులో ఇటుక తయారీ ప్రక్రియ ప్రారంభమై మే

శాపంగా మారిన సిమెంటు ఇటుక..

గత కొంతకాలంగా ఇటుక తయారీకి వినియోగించే ముడి పదార్థాల ధరలు పెరగడంతో దాని ప్రభావం ఉత్పత్తి వ్యయంపై పడింది. ఒక్కో ఇటుక తయారీకి రూ.5 వ్యయం అవుతుంది. తరుగు పోను కనీసం రూ.6పై బడి విక్రయిస్తే ఖర్చులు వస్తాయని చెబుతున్నారు. అధికంగా నిల్వ ఉండటంతో రూ.6 కంటే తక్కువ ధరకు ఇచ్చినా ఎవరు కొనడానికి ముందుకు రావడం లేదు. పలు చోట్ల సిమెంట్ ఇటుక బట్టీలు ఏర్పాటు చేయడంతో అరకొరగా నిర్మాణాలు చేసే వారు వాటిని కొనుగోలు చేస్తున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ పని, తక్కువ ఖర్చు కావడంతో వాటివైపు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం ఇటుక తయారీ వ్యాపారం ప్రశ్నార్థకంగా మారింది.

ఖర్చులు రావడం కష్టం...

కొన్ని నెలల నుంచి ఇటుక వ్యాపారం చాలా కష్టంగా ఉంది. రెండేళ్ల కిందట తయారు చేసిన ఇటుకలు చాలా వరకు బట్టీల్లోనే నిల్వ ఉన్నాయి. అవి బయటకు వెళ్తే తప్ప మా సొమ్ము తిరిగొచ్చే పరిస్థితి లేదు. గత రెండేళ్లుగా కనీసం ఖర్చులు రాక ఇబ్బంది పడుతున్నాం.
–వెంకటేశ్వరరావు, వ్యాపారి, గోపాలపురం

మూడు రోజులు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: డొమ్మేరు విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో 11 కేవీ కావవరం ఫీడరులో అభివృద్ధి పనులు చేపడుతున్నందున ఈనెల 28, 29, 30 తేదీల్లో సరఫరాలో అంతరాయం కలగనుందని ఆ శాఖ ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. వ్యవసాయ కనెక్షన్లకు తెల్లవారుజాము 4 నుంచి 9, మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా అందిస్తామన్నారు.

నాలుగు గ్రామాల్లో నేడు..

నిడదవోలు: నిడదవోలు పట్టణ పరిధిలో 33 కేవీ కాకతీశ్వరం లైను పనుల నిమిత్తం ఈనెల 28న విద్యుత్తు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈఈ తెలిపారు. ఈ కారణంగా కంసాలిపాలెం, కాటకోటేశ్వరం, ఉనకరమిల్లి, సూరాపురంలో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరా అంతరాయం కలుగుతుందన్నారు. వ్యవసాయ బోర్లకు ఉదయం 4 నుంచి 8.30 గంటల సరఫరా ఇస్తామన్నారు.

పురస్కార గ్రహీతలకు సత్కారం

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ పురస్కారం అందుకున్న తాడిపర్రు వీఆర్వో వేమ శ్రీరాములను మండల రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం తెదేపా, జనసేన, భాజపా మండలశాఖ అధ్యక్షులు సింహాద్రి రామకృష్ణ, వీరమళ్ల బాలాజీ, కొప్పిసెట్టి సత్యనారాయణ, తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ సత్కరించారు. రెవెన్యూ పనులు, నీటి తీరువా వసూళ్లలో ఆయన పనితీరును కొనియాడారు.

నిడదవోలు: ఉత్తమ పురస్కారం అందుకున్న ఎంపీడీవో టి.వి.సత్యనారాయణను మండల పరిషత్తు సిబ్బంది, కార్యదర్శులు మంగళవారం సత్కరించారు. డిప్యూటీ ఎంపీడీవో టి.గోపాలకృష్ణ, మనోజ్‌ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నల్లజర్ల: అనారోగ్యంతో బాధపడుతున్న పోతినీడుపాలేనికి చెందిన ఉషాకిరణ్‌ను గతంలో ఆయన పని చేసిన నల్లజర్లలోని డాల్ఫిన్ వాటర్ ప్లాంట్ యాజమాన్యం, ఉద్యోగులు మంగళవారం పరామర్శించి రూ.12 వేలు ఆర్థిక సాయం అందించారు.

శాస్త్రోక్తంగా శ్యామలా నవరాత్రులు

కొవ్వూరు పట్టణం: శ్యామలా నవరాత్ర ఉత్సవాలు మంగళవారం శాస్త్రోక్తంగా ముగిశాయి. గోష్పద క్షేత్రంలోని జ్ఞాన సరస్వతిదేవికి సహస్రనామార్చన, మూల మంత్ర హోమం, సరస్వతి మేధా సూక్త హోమం చేశారు. సాయంత్రం అమ్మవారికి అష్టోత్తరం, ఉపచార పూజలు పూర్తి చేశారు. మహిళా భక్తులు సామూహిక లలితా సహస్ర నామ పారాయణ, పూజల అనంతరం సరస్వతిదేవికి విశేషాలంకరణలు చేశారు.

జ్ఞాన సరస్వతిదేవికి పూజలు చేస్తున్న భక్తులు

వెంకన్న కల్యాణోత్సవం ప్రారంభం

నిడదవోలు: స్థానిక జనిపిరెడ్డిపేటలో కొలువై ఉన్న అలివేలు మంగా పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా స్వామివారిని పెండ్లి కుమారుడిని చేయడం, నీరాజన మంత్ర పుష్పాలు, ప్రధాన హోమం నిర్వహించారు. ఈనెల 29న కల్యాణం నిర్వహించనున్నారు.

ప్రత్యేకాలంకరణలో స్వామి

ప్రాణ రక్షణకే భద్రత నిబంధనలు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: వాహనం నడిపేటప్పుడు ఒకరి నిర్లక్ష్యం ఓ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేస్తుందని కొవ్వూరు ఎంవీఐ కేవీ శివప్రసాద్ అన్నారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా పంగిడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంవీఐ మాట్లాడుతూ అనుభవం, లైసెన్సు లేకుండా పిల్లలకు వాహనాలను ఇచ్చి తల్లిదండ్రులు బయటకు పంపించకూడదన్నారు. రహదారి నిబంధనలు, మార్గదర్శకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. రహదారి ప్రమాదాలు జరిగే తీరును వివరించి భద్రత చిహ్నాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఏఎంవీఐ లక్ష్మీప్రవీణ, ప్రధానోపాధ్యాయుడు మంగెన శ్రీరామారావు, లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు రాచూరి శ్రీనివాస్, జనసేన నాయకుడు చౌటుపల్లి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంవీఐ కేవీ శివప్రసాద్

జాతీయస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఎంపిక

చాగల్లు, న్యూస్‌టుడే: జాతీయస్థాయి బీచ్ వాలీబాల్ పోటీలకు ఊనగట్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయుడు కె.గంగాధరరావు తెలిపారు. గత నెల 19, 20వ తేదీల్లో బాపట్లలోని సూర్యలంక బీచ్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాఠశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. వీరిలో తొమ్మిదో తరగతి విద్యార్థిని పి.లాస్య, ఏడో తరగతి చదువుతున్న కె.హనీ ఉత్తమ ప్రతిభ కనబరచడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. ఈనెల 28 నుంచి కోల్‌కతాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడు ఎన్.వి.రమణ, తదితరులు అభినందించారు.

ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

మూగజీవాలతో ప్రేమగా మెలగాలి

చాగల్లు: మూగజీవులపట్ల దయ, ప్రేమతో మెలగాలని మండల పశు వైద్యాధికారి యు.ముఖేష్ విద్యార్థులకు సూచించారు. జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా చాగల్లులోని పలు పాఠశాలల్లో మూగజీవాల సంరక్షణపై మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఐక్యంగా సంఘాన్ని పటిష్ఠం చేసుకోవాలి

నిడదవోలు: నిడదవోలులో ప్రైవేటు ఎలక్ట్రీషియన్లు అండ్ ప్లంబర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ ఎలక్ట్రీషియన్ల దినోత్సవం నిర్వహించారు. కాపు కల్యాణ మండపంలో సంఘ జెండాను జి.గోపి ఆవిష్కరించారు. అనంతరం గణపతికూడలి నుంచి గణేష్‌చౌక్‌కూడలి, పంగిడి రోడ్డు మీదుగా విద్యుత్తు సబ్‌స్టేషన్ వరకు ద్విచక్ర వాహన ప్రదర్శన నిర్వహించారు. సభ్యులంతా ఐక్యంగా ఉండి సంఘాన్ని పటిష్ఠం చేసుకోవాలని సీఐటీయూ నాయకుడు జువ్వల రాంబాబు సూచించారు. వచ్చే నెల 12న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వి.చంద్రమౌళి, జి.సురేష్, గెడ్డం కుమార్, ముప్పిడి వెంకటేశ్వర్లు, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఎలక్ట్రీషియన్స్, ప్లంబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ద్విచక్ర వాహన ప్రదర్శన

మున్సిపల్ ఆర్డీ చెప్పినా అంతేనా..?

పురపాలక ప్రాంతీయ సంచాలకులు సీహెచ్ నాగనరసింహారావు ఈ నెల 22న మధ్యాహ్నం కొవ్వూరు మీదుగా విజయవాడ వెళుతూ మెరకవీధి దాటాక గామన్ వంతెన వరకు రాష్ట్ర రహదారి పొడవునా రెండు అంగుళాల మేర ఇసుక, మట్టి పేరుకుపోవడాన్ని గమనించారు. కమిషనర్‌కు ఫోను చేసి ప్రమాదకరంగా మారిన వాటిని తొలగించాలని ఆదేశాలిచ్చారు. దీంతో విభాజకాన్ని ఆనుకుని ఉన్న ఇసుక, మట్టిని కుప్పలుగా పోగు పెట్టారు. సుమారు వారం రోజులైనా వాటిని అక్కడ నుంచి తొలగించలేదు. దీంతో ద్విచక్ర వాహన చోదకులు రోడ్డు పక్కగా వెళితే జారిపడి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా పురపాలక అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

దెబ్బతిన్న తొట్టెలు.. మూలకు చేరిన రిక్షాలు

గోష్పద క్షేత్రం, భక్తాంజనేయస్వామి ఆలయం సమీపం తదితర ప్రాంతాల్లో చెత్త వేసేందుకు ఏర్పాటు చేసిన తొట్టెలు దెబ్బతిన్నాయి. కొన్నిచోట్ల చెత్త తరలించే రిక్షాలు మరమ్మతులకు గురయ్యాయి. అసలే పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ అంతంతమాత్రం. తొట్టెలు, రిక్షాలు సక్రమంగా లేకపోవడంతో సేకరణ, తరలింపు ప్రక్రియ అధ్వానంగా మారుతోంది. చిన్నపాటి మరమ్మతులు తక్షణం చేయించడమో కొత్త పరికరాలు, యంత్రాలను కొనుగోలు చేయడమో చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ అంశాన్ని కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

చెత్త తొలగక.. దుర్వాసన వీడక

దేవరపల్లి చంద్రబాబు నాయుడు కాలనీలోని వినాయక గుడి ఎదురుగా ఉన్న మురుగు కాలువ చెత్త చెదారంతో మూసుకుపోయింది. సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు విద్యార్థులు ఇటుగా రాకపోకలు సాగిస్తుంటారు. వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వస్తోందని విద్యార్థులతోపాటు స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యను డిప్యూటీ ఎంపీడీవో వై.రాజారావు దృష్టికి తీసుకెళ్లగా రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు. - న్యూస్‌టుడే, దేవరపల్లి

మార్జిన్ కోత.. ప్రమాదాల వాత

ఉండ్రాజవరంలోని సుధీంద్రబాబు ఆశ్రమం నుంచి తణుకు వెళ్లే ప్రధాన రహదారిలో సుబ్బారాయుడు కాలువ ప్రాంతంలో మార్జిన్ కోతకు గురైంది. దీనిని గుర్తించలేక వాహనదారులు పక్కకు వెళ్లినప్పుడు బోదెలోకి దూసుకుపోయే ప్రమాదం పొంచి ఉంది. రాత్రి వేళలో మరీ ఇబ్బందికరంగా ఉంటోందని స్థానికులు అంటున్నారు. మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. ఈ విషయం ర.భ.శాఖ ఏఈ శ్రీనివాస్ దృష్టికి తీసుకు వెళ్లగా పరిశీలించి మరమ్మతులు చేయిస్తామన్నారు.– న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

పురపాలక కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుందరబాబు

హక్కులను హరించే కోడ్‌లను రద్దు చేయాలి

కొవ్వూరు పట్టణం: కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పురపాలక కార్యాలయం వద్ద మంగళవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఫెడరేషన్ అధ్యక్షుడు భూపతి రవీంద్ర అధ్యక్షత వహించగా సుందరబాబు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక సంస్కరణల పేరుతో లేబర్ కోడ్‌లను రద్దు చేసి 44 చట్టాలను రాజ్యాంగ బద్ధంగా అమలు చేయాలన్నారు. హక్కులను హరించే కోడ్‌ల రద్దు కోసం సీఐటీయూతో సహా 14 కేంద్ర కార్మిక సంఘాలు ఒక రోజు సమ్మెను చేపట్టనున్నామన్నారు. కార్మిక సంఘ నాయకులు పూజారి వాసు, అల్లం వెంకటలక్ష్మి, మీసాల శివశంకర జ్యోతి, వడ్డాది శ్యామ్, కారంకి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వేగనిరోధకాలు.. మూణ్నాళ్ల ముచ్చటే

నిడదవోలు: స్థానిక సంతమార్కెట్ అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు సిమెంట్ రోడ్డుపై ద్విచక్ర వాహనాల వేగానికి కళ్లెం చేసేందుకు ఏర్పాటు చేసిన వేగ నిరోధకాలు వారం రోజుల్లోనే దెబ్బతిన్నాయి. ఈ రహదారిపై ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గతంలో కౌన్సిలర్ ఉసురుమర్తి జాన్‌బాబు మున్సిపల్ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో నాలుగు వేగ నిరోధకాలు ఏర్పాటు చేయగా రెండు ప్రాంతాల్లో అక్కడక్కడ అప్పుడే దెబ్బతిన్నాయి. పనుల తీరుపై స్థానికులు, వాహనదారుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయం పురపాలక ఏఈ హేమంత్ వద్ద ప్రస్తావించగా 20 నుంచి 30 టన్నుల సామర్థ్యం మేరకు వేగ నిరోధకాలు ఏర్పాటు చేశామని, 30 టన్నులపైనే బరువు గల వాహనాల రాకపోకల కారణంగా దెబ్బతిన్నాయన్నారు. ఒకటి, రెండు రోజుల్లో వాటికి మరమ్మతులు చేస్తామన్నారు.

ప్రకృతి సేద్యంతో లాభాలు

కడియం: యూరియా స్థానంలో ప్రకృతి సేద్య విధానాలు అవలంబిస్తే రైతులకు అధిక లాభాలు కలుగుతాయని జిల్లా ప్రకృతి వ్యవసాయ మేనేజర్ బొర్రా తాతారావు, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ జయరామలక్ష్మి సూచించారు. మురమండ గ్రామంలోని వట్టికూడి దత్తుడు వ్యవసాయ క్షేత్రంలో రైతులకు నానో యూరియా, నానో డీఏపీలతో పాటు ద్రవ రూపంలోని జీవామృతం వంటి ప్రకృతి సేద్య పద్ధతులను మంగళవారం వివరించారు. పంటలో డ్రోన్‌తో పిచికారీ విధానాల పనితీరుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్, వ్యవసాయ సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిధులున్నా.. సాగని నిర్మాణాలు
కౌన్సిలర్లు వత్తిడితెస్తేనే పనులు

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు పురపాలికలో కొన్ని అభివృద్ధి పనులు నిధుల మంజూరుకే పరిమితమవుతున్నాయి. కౌన్సిలర్లు చొరవ తీసుకుంటే తప్ప ఏళ్లు గడుస్తున్నా అవి పట్టాలెక్కడం లేదు. పూర్తి కావడం లేదు. ఉదాహరణకు పట్టణంలోని రెండో వార్డు అన్నపూర్ణనగర్‌లో రహదారి లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ విషయం కౌన్సిలర్ ఆలమూరి భారతి అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. రెండేళ్ల కిందట సుమారు రూ.10 లక్షలు నిధులు మంజూరు చేసి టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. తర్వాత ఏదో సాకు చూపుతూ పనులు చేపట్టలేదు. కౌన్సిల్ సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోవడంతో గతేడాది ఆగస్టు 29న జరిగిన కౌన్సిల్ మీటింగ్‌లో కమిషనర్, ఛైర్మన్లకు రాజీనామా లేఖలు అందజేసి రోడ్డు నిర్మించే వరకు తాను సమావేశాలకు తాను హాజరుకానంటూ వెళ్లిపోయారు. అనంతరం జరిగిన రెండు సమావేశాలకు ఆమె హాజరు కాలేదు. అధికారులు ఆమెను కలిసి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో తర్వాత జరిగిన సమావేశానికి హాజరయ్యారు. అనంతరం రహదారి పనులు చేపట్టి పూర్తి చేశారు. 9వ వార్డులో జెండాలవీధి, సోలోమాన్ వీధిలో డ్రెయిన్లతోపాటు సీసీ రహదారి నిర్మాణానికి మూడేళ్ల కిందట పురపాలక సంఘ సాధారణ నిధుల నుంచి రూ.10 లక్షలు, 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.8.20 లక్షలు విడుదల చేశారు. అయినా పనుల నిర్మాణం జరగక పోవడంతో ఆ వార్డు కౌన్సిలర్ ఉసురుమర్తి జాన్‌బాబు పలు సమావేశాల్లో అధికారుల దృష్టికి తీసుకురావడంతో పాటు, గత సమావేశంలో అధికారుల తీరుపై ధ్వజమెత్తడంతో డ్రెయిన్ నిర్మాణం పూర్తి చేశారు. త్వరలో రహదారి నిర్మాణం చేపడతామని ఏఈ హేమంత్ తెలిపారు.

అన్నపూర్ణనగర్‌లో ఇటీవల నూతనంగా నిర్మించిన సీసీ రహదారి

‘మహిళలకు కొరవడిన భద్రత’

శ్యామలా సెంటర్: కేంద్రంలో మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను, అత్యాచారాలను అరికట్టడంలో విఫలమయ్యాయని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు శీలం పసమ్మ ఆరోపించారు. స్థానిక మావో భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అనసూయ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో మహిళలకు రూ.1500 ఇస్తామన్న హామీని ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.విజయ, కోశాధికారి ఎస్‌కే రజియా, నాయకులు నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీలు స్వాధీనం

దేవరపల్లి, న్యూస్‌టుడే: ఎటువంటి బిల్లులు లేకుండా తెలంగాణకు ఇసుక తరలిస్తున్న రెండు లారీలను జిల్లా భూగర్భ గనులశాఖ ఏడీ డి.ఫణిభూషన్ రెడ్డి మంగళవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు. దేవరపల్లిలోని డైమండ్ జంక్షన్ సమీపంలో సిబ్బందితో తనిఖీ చేస్తుండగా వీటిని గమనించారు. డ్రైవర్లను వే బిల్లు వివరాలు అడగగా తమ వద్ద లేవని సమాధానం ఇచ్చారన్నారు. ఈ రెండు లారీలపై గతంలోనే తెలంగాణలో ఎఫ్ఐఆర్ నమోదైందని, ఏపీఎస్ఎంఎస్ పోర్టల్‌లో వాటిని బ్లాక్ చేశామన్నారు. వాటిని దేవరపల్లి పోలీస్ స్టేషన్‌లో అప్పగించామన్నారు. ఈ దాడుల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు మనీష, శైలజ, గనులు, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సేవకులకేవీ సౌకర్యాలు
గ్లౌజులకూ నోచుకోక వ్యాధులతో సతమతం

న్యూస్‌టుడే, చాగల్లు, నిడదవోలు

పల్లెలను పరిశుభ్రంగా తీర్చిదిద్దే స్వచ్ఛ సేవకులు కనీస సౌకరాలు సమకూరడం లేదు. ఆప్రాన్లు, రెయిన్ కోట్లు, బూట్లు, సబ్బులు, కొబ్బరి నూనె, మాస్కులకు నోచుకోవడం లేదు. చలిలో వణుకుతూనే పని చేయాల్సి వస్తోంది. పారిశుద్ధ్య కార్మికులు, స్వచ్ఛ సేవకులు, హరిత రాయబారులు(గ్రీన్ అంబాసిడర్స్).. ఇలా పేర్లు మారుతున్నాయే తప్ప తమ జీవితాలు మెరుగుపడడం లేదని వారు వాపోతున్నారు. కొవ్వూరు డివిజన్ పరిధిలోని మూడు నియోజక వర్గాల్లోని 9 మండలాల్లో 800 మంది హరిత రాయబారులుగా విధులు నిర్వహిస్తున్నారు. శాశ్వత ప్రాతిపదికన నియామకాలు నిలిచిపోవడంతో వీరంతా ఒప్పంద విధానంలోనే పని చేస్తున్నారు. వీరికి దుస్తులు, ఉపకరణాలు, కాస్మోటిక్స్ అందించాల్సిన బాధ్యత ఆయా పంచాయతీలపైనే ఉంది. కొన్ని పంచాయతీల్లో మూడు నెలలకు అందాల్సినవి నాలుగైదు నెలలకైనా అందుతున్నా.. మరికొన్ని పంచాయతీల్లో అదీలేదు. చాగల్లు మండలం మార్కొండపాడు, మల్లవరం, చంద్రవరంలో ఈ పరిస్థితి ఉంది. కొవ్వూరు, తాళ్లపూడి మండలాల్లోనూ అంతే.

ఎదురు చూపులే మిగిలాయి..

ఏటా సంక్రాంతికి పారిశుద్ధ్య కార్మికులకు సన్మానాలు, రెండు జతల దుస్తులు, చెప్పులు, ఇతర సామగ్రి అందించే వారు. ఈ ఏడాది ఏ ఒక్క చోట కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేతనంలో కొంత వైద్యానికి..

కొంతమంది పారిశుద్ధ్య కార్మికులు చర్మ సంబంధ వ్యాధులతో సతమతమవుతున్నారు. వేతనంలో కొంత వైద్యానికి వెచ్చించాల్సి వస్తోందని వారంటున్నారు.

మర్కొండపాడులో చెత్త సేకరిస్తున్న స్వచ్ఛ సేవకులు

ఉపకరణాలు అందించి.. అవగాహన కల్పిస్తాం

పారిశుద్ధ్య కార్మికులకు ఆయా పంచాయతీలు బూట్లు, సబ్బులు, కొబ్బరి నూనె తదితరాలు సకాలంలో అందించేలా చర్యలు తీసుకుంటాం. కొన్నిచోట్ల ఇస్తున్న వాటిని కార్మికులు సక్రమంగా వినియోగించడం లేదని తెలుస్తోంది. దీంతో వ్యాధులకు ఆస్కారం కలుగుతోంది. వాటి వినియోగంపైనా అవగాహన కల్పిస్తాం. – స్లీవారెడ్డి, డీడీవో, కొవ్వూరు

జూదరుల అరెస్టు

తాళ్లపూడి: అన్నదేవరపేట శివారులో మంగళవారం జూదం ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని, రూ.4,850 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

(c) eenadu

మండపేట

•మండపేట •అనపర్తి

భక్తిశ్రద్ధలతో కృత్తిక నక్షత్ర పూజలు

మండపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని జనార్దనస్వామి ఆలయ ప్రాంగణంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కృత్తిక నక్షత్రం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు అయినవిల్లి స్వామినాథశర్మ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేశారు.

లక్ష్మీగణపతి ఆలయానికి విరాళం

బిక్కవోలు, న్యూస్‌టుడే: బిక్కవోలులోని శ్రీలక్ష్మీగణపతి ఆలయానికి మంగళవారం భక్తులు రూ.50,000 విరాళంగా అందించారని ఆలయ ఈవో భాస్కర్ తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన కాకరపర్తి వెంకట సుబ్రహ్మణ్యం, వెంకట నాగమణి దంపతులు ఆలయంలో నిత్యాన్నదాన నిమిత్తం విరాళం అందించారని వెల్లడించారు.

ఆలయ ఉద్యోగికి విరాళం అందిస్తున్న భక్తులు

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
మండపేట: 80085 74183 ద్వారపూడి: 98490 93850
అనపర్తి: 95333 66637 అంగర: 97044 16418
రాయవరం: 80085 74185

వీధుల్లో అంధకారం

సమస్య: మండపేట మండలం ఏడిద గ్రామ రహదారిలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.
– కె.సుబ్బారావు, ఏడిద

స్పందనకు వందనం

సమాధానం: సమస్యను పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాస్‌కి తెలియజేయగా వెంటనే స్పందించారు. సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయించారు.
– న్యూస్‌టుడే, ద్వారపూడి

పైపులైన్.. వృథా ప్రయాసేనా..?

• పలు ప్రాంతాలకు అందని తాగునీరు

మండపేట, న్యూస్‌టుడే

మండపేట పట్టణంలో దాదాపు అయిదు దశాబ్దాలుగా రక్షితనీటి సరఫరా కొనసాగుతున్నా అప్పటి నుంచి వీరభద్రపురంతో పలు ప్రాంతాల ప్రజలు ఆ నీటికి నోచుకోవడం లేదు. ఇటీవల కాలంలో పైపులైన్ ఏర్పాటుచేసినా వ్యక్తిగత కుళాయి కనెక్షన్లు లేవనే కారణంతో సరఫరా నిలిపివేశారు. వీరభద్రపురం పట్టణంలోని పంటకాలువకు ప్రధాన రహదారికి అవతల వైపున్న కారణంగా నేరుగా పైపులైను ఏర్పాటు చేయడం సమస్యగా భావించి ఊరుకున్నారు. పట్టణంలోని ఒకటో వార్డు పరిధిలో ఉన్న ఈ ప్రాంతంలో 100కి పైగా కుటుంబాల వారు ఉంటున్నారు. ప్రాథమిక పాఠశాలతో పాటు పలు ఇతర సదుపాయాలు ఉన్నప్పటికీ పట్టణవాసులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలకు మాత్రం నోచుకోలేదు. స్థానికుల వినతిపై దాదాపు ఏడేళ్ల క్రితం రూ.40 లక్షలతో పెదకాలువ వంతెనపై నుంచి ర.భ. శాఖ రోడ్డు కింద వీరభద్రపురం వరకు పైపులైను వేసి వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కుళాయి ఏర్పాటుచేశారు. కొంత కాలం పాటు తాగునీరు సరఫరా చేసినా తరవాత నిలిపివేశారు. ప్రస్తుతం పైపులైన్ ద్వారా నీటి సరఫరా పూర్తిగా నిలిపివేయడంతో పైపులైన్ వేసినా అక్కరకు రాకుండా పోయింది. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీ వెచ్చించిన నిధులు వృథా వ్యయమయ్యాయి.

నిరుపయోగంగా మారిన వీరభద్రపురం మెయిన్ పైపులైన్

ఇంటింటికి ఏర్పాటు..

వీరభద్రపురంలో దశాబ్దాలుగా రక్షితనీరు సరఫరా లేకపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై స్థానికులు అలవాటు పడ్డారు. దీంతో కుళాయి నీరు వచ్చినా అవగాహన లేక పట్టుకోవడంలో ఆసక్తి చూపలేదు. సమీపంలోనే గోదావరి పంటకాలువ ఉండడంతో బోర్ల ద్వారా తాగునీటిని సమకూర్చుకున్నారు. గతంలో వంతెన నిర్మాణంలో భాగంగా పంటకాలువకు నీటిని విడుదల చేయకపోవడంతో అప్పట్లో భూగర్భ జలాలు తగ్గి తాగు నీటికి ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆయా సమయాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు.

సమీప భవిష్యత్‌లో ఇబ్బంది..

వీరభద్రపురంలో ప్రస్తుతం కనెక్షన్లు అయిదే ఉన్నాయి. భవిష్యత్తులో భూగర్భ జలాలు కలుషితమై తాగునీటికి పనికిరావనే ఉద్దేశంతో అమృత్ పథకంలో భాగంగా ఉపరితల నీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. దీని కోసం ధవళేశ్వరం నుంచి భారీ పైపులైన్ ఏర్పాటుచేసి గోదావరి నీటిని సరఫరా చేస్తారు. మధ్యలో పైపులు అనుసంధానం చేసి ఆయా ప్రాంతాల్లో నీటిని ఒడబోసి క్లోరిన్ కలిపి సరఫరా చేస్తాం. ఈ ప్రక్రియ పూర్తయితే ప్రతి ఇంటికి తప్పనిసరిగా పైపులైన్ ద్వారా తాగునీరు అందుతుంది.
– టి.వి.రంగారావు, మున్సిపల్ కమిషనర్, మండపేట

మున్సిపల్ ఆర్వోగా రవి

మండపేట, న్యూస్‌టుడే: మండపేట మున్సిపల్ రెవెన్యూ అధికారిగా మాచిరాజు రవి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. 2014-2019 సంవత్సరాల కాలంలో మండపేటలో సీనియర్ అసిస్టెంట్‌గా ఆయన పనిచేసి అమలాపురం, భీమవరం మున్సిపాలిటీలకు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఆర్వోగా పనిచేసిన జేవీఎస్ శాస్త్రి గత నెలలో పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో రవి నియమితులయ్యారు.

పురస్కార గ్రహీతలకు సత్కారం

మండపేట, న్యూస్‌టుడే: మండపేట పట్టణ విద్యుత్ ఏఈ ముని ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమలాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ బి.రాజేశ్వరి నుంచి ఆయన అవార్డు స్వీకరించారు. ఇటీవల గాలివాన సమయంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి సరఫరా పునరుద్ధరించడంలో కీలకపాత్ర పోషించారు. అలాగే జూనియర్ లైన్‌మెన్ వెంకన్నబాబు ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. వీరిని అధికారులు, సిబ్బంది మంగళవారం సత్కరించారు.

పాఠశాలకు సామగ్రి అందజేత

రంగంపేట, న్యూస్‌టుడే: రంగంపేటలోని శ్రీవుండవిల్లి సత్యనారాయణ మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి హైదరాబాద్‌లో శాస్త్రవేత్తగా స్థిరపడిన వుండవిల్లి జగదీష్‌కుమార్ మంగళవారం పాఠశాలను సందర్శించారు. పాఠశాలకు అవసరమైన బీరువా, ఫ్యాన్లు, గ్రంథాలయానికి పుస్తకాలు, సామగ్రిని ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథికి భార్య దుర్గావీరలక్ష్మితో కలిసి అందించారు. తాతయ్య జగ్గారావు జ్ఞాపకార్థం తండ్రి కాశీశ్వరరావు సూచనతో ఏటా పదో తరగతిలో ప్రతిభచూపే విద్యార్థులకు రూ.10 వేల నగదు బహుమతి అందిస్తానని ప్రకటించారు. ఉపసర్పంచి బదిరెడ్డి దుర్గారావు, సీఆర్పీ ఎల్.శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



హెచ్ఎం పార్థసారథికి సామగ్రి అందిస్తున్న జగదీష్

పది విద్యార్థులకు వీడ్కోలు

రాయవరం, న్యూస్‌టుడే: మండలంలోని వెంటూరు, చెల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు సభ ఏర్పాటుచేశారు. ప్రధానోపాధ్యాయులు డి.సత్తిరాజు, రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ కసే సుకన్య సత్కరించారు.

చెల్లూరులో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న విద్యార్థులు

తీర్థం.. భక్తజన పరవశం

అంగర, న్యూస్‌టుడే: కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లిలో కొలువైన సుంకరవారి సత్తెమ్మ తల్లి సంబరం మంగళవారం రాత్రి వైభవంగా సాగింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి మహిళలు అమ్మవారికి చీరలు, రవికెలు, గాజులు, పసుపు, కుంకుమలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రామంలోని ప్రధాన రహదారులు విద్యుత్తు దీపాలతో శోభిల్లాయి. జాతరలో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి నిఘా వ్యవస్థను కట్టుదిట్టం చేశారు.

ఘనంగా భావనారుషి కల్యాణం

పెదపూడిలోని భద్రావతి సమేత భావనాఋషి కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం జరిపించి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక మండపంలో కల్యాణం జరిపించారు. గణపతి పూజ, రక్షాబంధనం, కన్యాదానం, సుముహూర్తం, మాంగల్యధారణ మొదలైన తంతులను అర్చకులు వివరిస్తూ కల్యాణం పూర్తిచేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఫిబ్రవరి 4వ తేదీన ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాదాలు అందిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

సాయిబాబా ఆలయంలో లక్షపత్రి పూజలు

పెదపూడిలోని సాయిబాబా ఆలయంలో మంగళవారం శ్రీసాయి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా లక్షపత్రి పూజలు నిర్వహించారు. బాబాకు పంచామృతాభిషేకాలు, నిత్య పూజలు అనంతరం దంపతుల సమక్షంలో ప్రత్యేక పూజలు జరిపించారు. మహిళలు సాయి నామ పారాయణం చేశారు. బాబాను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

కుంకుమపూజలో భక్తులు

రాజశ్యామలాదేవికి కుంకుమ పూజలు

బిక్కవోలు: కొంకుదురు బుడతల మామిడిలో నిర్వహిస్తున్న రాజశ్యామల నవరాత్రి సహిత సౌరయాగంలో భాగంగా మంగళవారం అమ్మవారికి వేదపండితులు కుంకుమ పూజలు చేయించారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి విచ్చేసిన భక్తులతో వేదపండితులు రమణశర్మ, భాస్కరశర్మ ఆధ్వర్యంలో పండితులు శ్యామల సహస్రనామ పారాయణం చేయించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంచారు.



పూజలందుకున్న గట్లమ్మతల్లి

వైభవంగా గట్లమ్మతల్లి తీర్థం

రాయవరం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, భక్తుల నీరాజనాలందుకుంటున్న కురకాళ్లపల్లి గ్రామదేవత గట్లమ్మతల్లి తీర్థం మంగళవారం వైభవంగా నిర్వహించారు. పాడి పంటలను కాపాడాలని, చిన్నారులను చల్లగా చూడాలని కోరుతూ చీర, సారె, పసుపు, కుంకుమలు అమ్మవారికి సమర్పించారు. జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

హుండీ ఆదాయం లెక్కింపు

మండపేట గ్రామీణం. మండపేట మండలం కేశవరం గ్రామంలో ప్రసిద్ధిచెందిన గణపతిరాజుస్వామి హుండీ ఆదాయాన్ని దేవాదాయ శాఖ అధికారి ఆర్.రామ్‌బాలాజీప్రసాద్ సమక్షంలో మంగళవారం లెక్కించారు. ఇటీవల జరిగిన జాతర అనంతరం రూ.5,09,725 ఆదాయం సమకూరినట్లు ఈవో వుండమట్ల రాజేష్ తెలిపారు. ఆలయ కమిటీ ఛైర్మన్ ఆళ్ల రాజు, ఎంపీపీ వుండమట్ల వాసు, తెదేపా మండల శాఖ అధ్యక్షుడు కర్రి తాతారావు, దేవాదాయ సిబ్బంది, ఆలయ సేవకులు పాల్గొన్నారు.

నల్లమిల్లి వీఆర్వోకి..

రంగంపేట: రంగంపేట మండలం నల్లమిల్లికి చెందిన వీఆర్వో వెంకటరావు జిల్లాస్థాయిలో ఉత్తమ బూత్ లెవెల్ అధికారిగా ఎంపికై ఇటీవల విజయవాడలో పురస్కారం అందుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయనను కూటమి నాయకులు చింతలపూడి పోతురాజు, కొండపల్లి సత్తిరాజు, లంక దుర్గాప్రసాద్, రెవెన్యూ సిబ్బంది సత్కరించారు.

పసలపూడిలో పశు వైద్య శిబిరం

రాయవరం: మండలంలోని పసలపూడిలో మంగళవారం పశు వైద్య శిబిరాన్ని సర్పంచి కడలి పద్మావతి ప్రారంభించారు. పశు వైద్యాధికారి పి.విజయ్ పశువులకు గర్భకోశ వ్యాధి, చూలు, ఎద పరీక్షలు నిర్వహించారు. పశు పోషకులకు దాణా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు సత్తి వెంకటకృష్ణారెడ్డి, మల్లిడి సూర్రెడ్డి, అనసూరి శ్రీనివాసరావు, నల్లమిల్లి వెంకన్నబాబు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

పెదపూడి, న్యూస్‌టుడే: పెదపూడి మండలం కరకుదురు బాప్టిస్ట్ చర్చి పాస్టర్లు డా.వి.జోసెఫ్, పాల్‌జీ తిలక్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో రెటీనా, కొయ్య కుండ, కంటి శుక్లాలు, చూపు మందగించడం తదితర అంశాలతో వచ్చిన వారికి పరీక్షలు చేశారు. వీరిలో 50 మందికి కళ్లజోళ్లు అందించాలని 30 మందికి ఆపరేషన్లు చేయాలని నిర్ణయించారు.

కరకుదురు చర్చిలో కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు

అమరావతి తరలిన తెదేపా నాయకులు

బిక్కవోలు, న్యూస్‌టుడే: తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అమరావతిలో మంగళవారం నిర్వహించిన పార్లమెంట్ నియోజవర్గాల తెదేపా కార్యవర్గ సభ్యుల సమావేశానికి స్థానిక నాయకులు పలువురు హాజరయ్యారు. అనపర్తి నియోజకవర్గం నుంచి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు అడబాల వెంకటరావు, కోశాధికారి పలివెల కామరాజు (బుజ్జి) అధికార ప్రతినిధులు దూళ్ల ధర్మరాజు, పి.సోమరాజు సమావేశంలో పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పలు విషయాలపై దిశానిర్దేశం చేశారని వారు వివరించారు. పార్టీ పటిష్ఠతకు తీసుకోవాల్సిన చర్యలు, పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో వ్యవహరించాల్సిన తీరుపై అవగాహన కల్పించారని చెప్పారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

అధికార బదలాయింపునకు రంగం సిద్ధం

బిక్కవోలు, న్యూస్‌టుడే: భూ సంబంధిత సమస్యలు చిన్నవే అయినా వాటిని పరిష్కరించాల్సింది పెద్ద అధికారి కావడంతో ఏళ్ల తరబడి పెండింగ్‌లో పడిపోతున్నాయి. కలెక్టరేట్‌తో పాటు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా కొలిక్కి రావడం లేదు. ప్రభుత్వాలు మారినా సమస్యలు పరిష్కారం కావడం లేదని రైతులు, భూ యజమానులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గోరుచుట్టుపై రోకలిపోటులా గత వైకాపా ప్రభుత్వం అమలుచేసిన రీసర్వే, ఇతరత్రా సర్వేలతో మరిన్ని సమస్యలు పెరిగాయి. దీంతో ప్రజాప్రతినిధులు, అధికారులు ఎక్కడికెళ్లినా రైతులు వీటిపైనే అడుగుతున్నారు. ఎక్కడ సమావేశాలు నిర్వహించినా భూ సంబంధిత సమస్యలే సింహభాగం అవుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సమస్య తీవ్రంగా ఉండడంతో పరిష్కారానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా 22ఏ సమస్య పరిష్కారానికి జాయింట్ కలెక్టర్ పరిధి నుంచి ఆర్డీవో పరిధిలోకి మార్పు చేశారు. అలాగే వివిధ భూ సమస్యలను తహసీల్దారు పరిష్కరించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

17 అధికారాల బదిలీ..

కలెక్టరేట్‌తో పాటు జిల్లావ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లు, ఇతరత్రా అధికారిక సమావేశాల్లో అత్యధికంగా దరఖాస్తులు, వినతులు భూ సమస్యలపైనే వస్తున్నాయి. వాటన్నింటినీ జాయింట్ కలెక్టరే పరిష్కరించాల్సి రావడంతో తీవ్ర జాప్యం అనివార్యమవుతోంది. ఈ అంశాన్ని గుర్తించిన ప్రభుత్వం ఆర్డీవో, తహసీల్దార్లకు 17 అధికారాలు బదలాయిస్తూ ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీచేసింది. ఆర్డీవోలకు ఏడు, తహసీల్దార్లకు పది అధికారాలు సమకూరాయి. ఎల్‌పీఎల సవరణ, రీసర్వేలో తప్పులు సరిదిద్దడం, వివాదాస్పద భూముల పరిష్కారం, ఆర్‌వోఆర్, మ్యుటేషన్, కొత్త సర్వే నంబర్ల కేటాయింపు తదితర అధికారాలను ఆర్డీవోలకు బదిలీచేశారు. నకిలీ సర్వే నంబర్ల తొలగింపు, భూసేకరణ, కేటాయింపు, మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులకు భూముల కేటాయింపు సివిల్, రెవెన్యూ కోర్టులు ఇచ్చిన ఆదేశాలతో భూముల వివరాల్లో మార్పులు.. చేర్పులు తదితర అధికారాలను తహసీల్దార్లకు అప్పగించారు. గతంలో ఆయా అధికారాలన్నీ వీరి చేతుల్లోనే ఉండేవి. అక్రమాలు పెరుగుతాయని, భూ వివాదాల్లో ఆర్డీవో, తహసీల్దార్ల జోక్యం పెరుగుతోందనే ఫిర్యాదులతో ఏకంగా జాయింట్ కలెక్టర్లకు ప్రభుత్వం అధికారాలు బదలాయించింది. దీనివల్ల ఆయా సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని గుర్తించి అధికారాల వికేంద్రీకరణకు అనుమతులు మంజూరు చేసింది. దీంతో భూ సంబంధిత సమస్యలకు స్థానికంగానే పరిష్కార మార్గాలు అందుబాటులోకి రావడంతో రైతులు, భూ యజమానులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిన బ్యాంకుల సేవలు

అంగర, న్యూస్‌టుడే: బ్యాంకు ఉద్యోగుల సమ్మె కారణంగా మంగళవారం ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో సేవలకు అంతరాయం ఏర్పడింది. కపిలేశ్వరపురం మండలంలోని అంగర, నేలటూరు, కోరుమిల్లి, టేకి, కపిలేశ్వరపురం గ్రామాల్లోని బ్యాంకులన్నీ మూతపడడంతో ఖాతాదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నాలుగో శనివారం, ఆదివారం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం వరుసగా సెలవులు రావడంతో మూడు రోజులుగా లావాదేవీలు నిలిచిపోయాయి. నాలుగో రోజైన మంగళవారం సమ్మెతో సేవలు స్తంభించాయి.

కపిలేశ్వరపురంలో ఉద్యోగుల సమ్మెతో మూతపడ్డ బ్యాంకు

శతాబ్ది రథశాల కూల్చివేత

• త్వరలో నూతన శాలలోకి రథం

మండపేట, న్యూస్‌టుడే: మండపేట పట్టణంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీజనార్దన స్వామి ఆలయంలో అభివృద్ధి.. ఆధునికీకరణ పనుల్లో భాగంగా 100 సంవత్సరాల క్రితం నిర్మించిన రథశాలను సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కూల్చివేశారు. భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే రథోత్సవానికి ప్రతి సంవత్సరంలానే ఆదివారం రథసప్తమి తిథి సందర్భంగా రథాన్ని బయటకి తరలించారు. సర్వాంగ సుందరంగా రథాన్ని అలంకరించే పనులు ప్రారంభించారు. పాత రథశాల వెనుక నూతన నిర్మాణం దాదాపు పూర్తయిన నేపథ్యంలో దీన్ని వాడుకలోకి తెచ్చేందుకు వీలుగా పాత కట్టడాన్ని నేలమట్టం చేశారు. భీష్మ ఏకాదశితో రథోత్సవం ముగిసిన అనంతరం రథాన్ని కొత్తశాలలోకి తరలిస్తారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఆలయం వద్ద ప్రహరీ నిర్మాణం ప్రారంభిస్తారు. ఎన్నో ఏళ్లుగా కొనసాగిన రథశాలను కూల్చివేయడంతో దాన్నే ఆశ్రయంగా చేసుకున్న పావురాలు ఎగిరిపోయాయి. వాటి గుడ్లు, పిల్లలు శిథిలాల కింద చిక్కుకుపోగా వాటి కోసం శిథిలాలపై చక్కర్లు కొడుతున్నాయి. మరో వైపు ఆధునికీకరణ పనుల్లో భాగంగా ఆలయానికి మెయిన్‌రోడ్డు వైపున్న దుకాణ సముదాయాన్ని తొలగించి అక్కడ కల్యాణ మండప నిర్మాణం ప్రారంభించారు. ఈ పనులను త్వరలోనే పూర్తి చేయనున్నారు.

శిథిలాల వెనుక నూతన రథశాల

ప్రకృతి సేద్యంతో అధిక లాభాలు

కడియం, న్యూస్‌టుడే: యూరియా స్థానంలో ప్రకృతి సేద్య విధానాలు అవలంబిస్తే రైతులకు అధిక లాభాలు కలుగుతాయని జిల్లా ప్రకృతి వ్యవసాయ మేనేజర్ బొర్రా తాతారావు, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ జయరామలక్ష్మి సూచించారు. మురమండ గ్రామంలోని వట్టికూడి దత్తుడు వ్యవసాయ క్షేత్రంలో రైతులకు నానో యూరియా, నానో డీఏపీలతో పాటు ద్రవ రూపంలోని జీవామృతం వంటి ప్రకృతి సేద్య పద్ధతులను మంగళవారం వివరించారు. మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ యూరియా ఎక్కువగా వినియోగిస్తే పంట కణజాలం మెత్తగా మారి చీడపీడలు ఆశించడంతో రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదముందన్నారు. పంటలో డ్రోన్‌తో పిచికారీ విధానాల పనితీరుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులతో డీవైఈవో రామలక్ష్మణమూర్తి, ఉపాధ్యాయులు

వాలీబాల్ పోటీల్లో రాయవరం జట్టుకు ప్రథమ స్థానం

రాయవరం: మండపేట నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీల్లో రాయవరం జడ్పీ పాఠశాల క్రీడాకారులు ప్రథమస్థానంలో నిలిచారు. మంగళవారం పాఠశాల హెచ్ఎం విప్పర్తి శాంతి సునీత మాట్లాడుతూ ఏడిదలో జరిగిన వాలీబాల్ పోటీల్లో 28 జట్లు పాల్గొనగా మండపేట వికాస్ పాఠశాల జట్టుపై విజయంతో విజేతగా నిలిచిందని చెప్పారు. క్రీడాకారులను రామచంద్రపురం డీవైఈవో ప్రత్తి రామలక్ష్మణమూర్తి, ఎంఈవో-2 యరమాటి సూర్యనారాయణ, రాయవరం గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ వుండవిల్లి రాంబాబు, ఎస్ఎంసీ ఛైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు (చిన్ని) తదితరులు అభినందించారు. కార్యక్రమంలో పీఈటీలు చిక్కాల అజ్జిబాబు, కె.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్తు కార్మికుల ర్యాలీ

రాయవరం, న్యూస్‌టుడే: థామస్ ఆల్వా ఎడిసన్ విద్యుత్తు బల్బుపై పేటెంట్ పొందిన సందర్భాన్ని పురస్కరించుకుని పలువురు ఎలక్ట్రీషియన్లు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఎలక్ట్రీషియన్స్, ప్లంబర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్మికులు కేకు కోశారు. సంఘం అధ్యక్షుడు బేరా దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులు గండి చంద్రశేఖర్, పొట్నూరి రాంబాబు, సంయుక్త కార్యదర్శి నేకూరి నానిబాబు, కోశాధికారి చంద్రమళ్ల సంజయ్‌రాజు, జిల్లా సంఘం సభ్యులు లంక వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

రాయవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్తు కార్మికులు

మండపేట గ్రామీణం: మండపేట మండలం ద్వారపూడి గ్రామంలో మంగళవారం శ్రీరాజ్యలక్ష్మి బంగారమ్మ ఎలక్ట్రికల్ వైరింగ్, ప్లంబింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా మండపేట ఏడీఈ సీహెచ్.శ్రీధర్ హాజరయ్యారు. థామస్ ఆల్వా ఎడిసన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ద్వారపూడి ఏఈ డి.రవికుమార్, అసోసియేషన్ అధ్యక్షుడు ఉంగరాల రామకృష్ణ, కార్యదర్శి దాసరి ధనరాజు, గరికిపాటి వీరబాబు, కర్రి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వడిశలేరులో వ్యక్తి అదృశ్యం

రంగంపేట, న్యూస్‌టుడే: రంగంపేట మండలం వడిశలేరుకి చెందిన కొల్లం అబ్బులు అదృశ్యంపై మంగళవారం రంగంపేట పోలీసులు కేసు నమోదుచేశారు. గత ఏడాది నవంబరు 7వ తేదీన తాపీమేస్త్రి పని నిమిత్తం రాజమహేంద్రవరం వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాలేదని భార్య కొల్లం మేరీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివప్రసాద్ తెలిపారు.

అందుబాటులో యూరియా

పెదపూడి: రబీ పంటల సాగుకు అవసరమయ్యే యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయాధికారి ఎన్.సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం పెదపూడి మండలం పెద్దాడ గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులతో ఆయన మట్లాడారు. అన్ని గ్రామాల ఆర్ఎస్‌కె, సొసైటీల వద్ద ఎరువు అందుబాటులో ఉంచామన్నారు. అవసరానికి మాత్రమే వాడాలని, అధికంగా వాడితే అనర్థాలు ఎదురవుతాయని పేర్కొన్నారు. తప్పనిసరిగా ఈపంట నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దోమల నివారణకు మందు పిచికారీ

మండపేట: పట్టణంలోని పలు ప్రాంతాల్లో దోమలు విజృంభిస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాయంత్రమైతే ఇళ్లపైకి దండెత్తుతున్నాయనే ఫిర్యాదులతో మున్సిపల్ అధికారులు రంగంలోకి దిగారు. మంగళవారం 1, 3, 4, 13, 14, 17, 18, 20, 22, 23, 24 29 వార్డుల్లో పారిశుద్ధ్య సిబ్బందితో మందు పిచికారీ చేయించారు. ఆయా వార్డుల్లో డ్రైనేజీలు, మురుగునీటి కుంటల్లో లార్వా సంహార చర్యలు చేపట్టారు. కమిషనర్ టి.వి.రంగారావు ఆదేశాలతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్తిరాజు పర్యవేక్షణ పనులు పర్యవేక్షించారు.

క్రీడల్లో కపిలేశ్వరపురం విద్యార్థుల ప్రతిభ

అంగర: మండపేట మండలం ఏడిదలో ఇటీవల జరిగిన నామాల వీర్రాజు, సీతారత్నం స్మారక నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో కపిలేశ్వరపురం సర్వారాయ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. మూడు రోజుల పాటు వివిధ అంశాల్లో జరిగిన పోటీల్లో విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారని ప్రధానోపాధ్యాయుడు వంగా శ్రీనివాస్ తెలిపారు. మొత్తం 47 పాఠశాలల నుంచి 1200 మంది విద్యార్థులు పాల్గొన్న పోటీల్లో క్రికెట్, వాలీబాల్, ఖోఖో, పరుగు, లాంగ్‌జంప్, డిస్కస్‌త్రో క్రీడల్లో విద్యార్థులు విజేతలుగా నిలిచారని పేర్కొన్నారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, వారికి శిక్షణనిచ్చిన వ్యాయామోపాధ్యాయుడు రవికుమార్‌ను అభినందించారు.

(c) eenadu

ఆందోళన చేపట్టిన బ్యాంకు ఉద్యోగులు

'సమ్మె'ట పోటు

దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు చేపట్టిన సమ్మెలో భాగంగా మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా బ్యాంకులు మూతపడ్డాయి. వేలాది కోట్ల రూపాయల లావాదేవీలు స్తంభించాయి. ఈనేపథ్యంలో ఉద్యోగులు విధులు బహిష్కరించి నినాదాలు రాసిన అట్టముక్కలు చేతబట్టి ప్రదర్శనలు నిర్వహించారు.

-న్యూస్‌టుడే, బెంగళూరు

మూతపడిన బ్యాంకు

నలుగురికి కఠిన కారాగార శిక్ష

బెళగావి, న్యూస్‌టుడే: బెళగావి శివార్లలోని పాంహౌస్‌కు 2025 మే 10న ఒక బాలిక (16)ను తీసుకెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడిన నలుగురు నిందితులకు ఫాస్ట్ ట్రాక్ న్యాయస్థానం కఠిన శిక్షను విధించింది. బాలికతో బలవంతంగా మద్యం తాగించి, అత్యాచారానికి పాల్పడ్డారని బాలిక తల్లి తిలకవాడి ఠాణాలో ఫిర్యాదు చేసింది. సాకిబ్ బేగ్ ఫయాజ్ నిజామి (22), రవి సిద్ధప్ప నాయ్కోడి (34)లకు జీవిత ఖైదు, ఇద్దరు బాలలకు తలా 20 ఏళ్ల కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. అత్యాచారం అనంతరం బాలిక మెడలోని ఒక తులం బంగారు గొలుసును కూడా నిందితులు దోచుకున్నారు. వారిలో ఒకరు స్థానిక ఠాణాలో ఇన్‌స్పెక్టర్ అని గుర్తించారు. పాంహౌస్‌ను బాడుగకు ఇచ్చిన ఆరోపణలపై రోహన్ రాజేశ కుమార పాటిల్ (23), అశుతోష్ మారుతి పాటిల్ (25) అనే యువకులపై విచారణ కొనసాగుతోందని తిలకవాడి ఠాణా పోలీసులు తెలిపారు.

డేటా చౌర్యంపై కేసు నమోదు

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: రూ.87 కోట్ల విలువైన డేటా చౌర్యానికి సంబంధించి అశుతోష్ నిగమ్‌పై వైట్‌ఫీల్డ్ సైబర్ ఠాణాలో కేసు నమోదైంది. మారతహళ్లిలోని అమెరికన్ సాఫ్ట్‌వేర్ ల్యాబ్ కంపెనీ పరిశోధన విభాగంలో అశుతోష్ ఒకప్పుడు సీనియర్ మేనేజరుగా పని చేశారు. విధుల్లో 2020 ఫిబ్రవరి 1న చేరిన ఆయన గత ఏడాది అక్టోబరు 11న అత్యంత రహస్యమైన సోర్స్ కోడ్, ఇతర రహస్య దాఖలాలను తన వ్యక్తిగత ఈమెయిల్‌కు పంపించుకున్నారు, వాటి విలువ భారతీయ నగదులో రూ.87 కోట్లని సంస్థ యాజమాన్య ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో ఆయన నేరం వెలుగులోకి రావడంతో గత డిసెంబరు 3న విధుల నుంచి తప్పించారు. అశుతోష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ, ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అతనికి నోటీసులు ఇస్తున్నామని సైబర్ ఠాణా పోలీసులు తెలిపారు.

వీడని అలజడి.. చర్చ పక్కదారి

దిగువ సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

గవర్నర్ ప్రసంగం..అబ్కారి మంత్రి రాజీనామాలపై సభలో రభస

ఈనాడు, బెంగళూరు: అధికార పక్షానికి గవర్నర్ ప్రసంగం.. మన్‌రేగా వ్యవహారం, విపక్షానికి అబ్కారి మంత్రి రాజీనామా. ఈ రెండు అంశాలే మూడు రోజులుగా విధానసభ సమావేశాలను కుదిపేశాయి. వరుస సెలవుల తర్వాత మంగళవారం సభ ప్రారంభం కాగా ఎప్పటిలాగానే విపక్ష సభ్యులు ఆందోళన బాట పట్టారు. తమ రాజకీయ అంశాలపై అధికార విపక్షాలు విధానసభ బయట ఆందోళనకు దిగటంతో సభ ప్రకటిత సమయానికి రెండున్నర గంటల ఆలస్యంగా ప్రారంభమైంది. మిగిలింది మూడు రోజులే కావటంతో వడివడిగా ప్రశ్నోత్తరాలు, కాలింగ్ అటెన్షన్ కార్యకలాపాలు, ఆపై గవర్నర్ ప్రసంగంపై చర్చలతో సభ వాయిదా పడింది.

ఎగువ సభలో మాట్లాడుతున్న మంత్రి బైరతి సురేశ్

అంతా అయోమయం

ఈ నెల 22న ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగం వ్యవహారంపై సభ ఓ స్పష్టతకు రాలేకపోతోంది. స్పీకర్ యు.టి.ఖాదర్ రూలింగ్ ఇచ్చినా అధికార, విపక్ష సభ్యుల్లో గందరగోళం కొనసాగుతునూ ఉంది. గవర్నర్ తన ప్రసంగాన్ని కేవలం మూడు వాక్యాల్లో ముగించి చివరకు జై హింద్, జై కర్ణాటక అంటూ బయటకు వెళ్లగా ఈ చర్య రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమని నేటికీ అధికార కాంగ్రెస్ ఆరోపిస్తూనే ఉంది. ఓ వైపు ఆరోపిస్తూనే గవర్నర్ ప్రసంగాన్ని సభలో ప్రవేశపెట్టిన సర్కారు ఆపై అభినందన తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టారు. అంటే ఈ ప్రసంగ పాఠాన్ని ప్రభుత్వం ఆమోదించినట్లేనని విపక్ష సభ్యులు పదేపదే ప్రశ్నిస్తున్నారు. మంగళవారం కూడా ఇదే అంశంపై విపక్ష నేత ఆర్.అశోక్, సీనియర్ సభ్యులు సురేశ్‌కుమార్ మరోసారి గుర్తు చేశారు. ప్రసంగంలోని పూర్తి సారాంశాన్ని ఆమోదించిన సర్కారు అందులోని కీలక అంశాలపై చర్చకు అవకాశం కల్పించటమే గందరగోళానికి కారణమైంది. పైగా రాష్ట్ర ప్రథమ పౌరులు, రాజ్యాంగ వ్యవస్థల పరిరక్షకులైన గవర్నర్‌ను విమర్శించే హక్కు సభ్యులకు లేదని కూడా సభా నియమాలు చెబుతున్నాయి. ఈ సమయంలో స్పీకర్ జోక్యం చేసుకుని ఇకపై చర్చల సమయంలో గవర్నర్ నడత గురించి కాకుండా రాజ్యాంగ నిబంధనల గురించే చర్చించాలి రూలింగ్ ఇచ్చారు.

సభ్యులకు సూచనలు ఇస్తున్న యూటీ ఖాదర్

పొన్నణ్ణ ప్రారంభం..ప్రదీప్ ప్రసంగం

కాంగ్రెస్ న్యాయ సలహాదారులు, ఎమ్మెల్యే పొన్నణ్ణ గవర్నర్ ప్రసంగ తీర్మానంపై చర్చను ప్రారంభించగా, మరో ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ ఈ ప్రసంగాన్ని ఆమోదించారు. ఈ సందర్భంగా పొన్నణ్ణ మాట్లాడుతూ రాజ్యాంగంలోని 176 ప్రకారం గవర్నర్ మంత్రివర్గం ఆమోదించిన ప్రసంగాన్ని చదవాల్సిందేనని మరోసారి ప్రకటించారు. ఇదే రాజ్యాంగంలోని 282 ప్రకారం కొత్త సంవత్సరంలో తొలి సభలో రాష్ట్ర ప్రగతి, ఆశయాల గురించి రాజ్యాంగ బద్ధంగా ఎన్నుకొన్న మంత్రివర్గం ఆమోదించిన ప్రసంగాన్ని, అందులోని ప్రజా ప్రయోజన అంశాలను తప్పకుండా చదవాల్సిందేనన్నారు. ప్రజల కోసం తన ప్రభుత్వం ఏం చేస్తుందో చదవకపోవటం సభను అవమానించినట్లేనని పలు రాష్ట్రాల గవర్నర్లపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులను ఉటంకిస్తూ పొన్నణ్ణ ప్రస్తావించారు. ఈ సమయంలో విపక్ష సభ్యులు అభ్యంతరం చెప్పగా పలుమార్లు సభకు అంతరాయం కలిగింది. ముఖ్యమంత్రి, హోంమంత్రులు జోక్యం చేసుకుని గవర్నర్ చర్యలను కాకుండా రాజ్యాంగంలో ఏముందో సభకు తెలియజెప్పాల్సిన బాధ్యత మాపై ఉందన్నారు.

ప్రగతి పథం

దిగువ సభలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్

ఓ వైపు భారీ గ్యారంటీలకు నిధులు సమకూరుస్తూనే ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి బాట పట్టిందని పొన్నణ్ణతో పాటు ప్రదీప్ ఈశ్వర్‌లు తమ ప్రసంగంలో ప్రస్తావించారు. గ్యారంటీలతో 1.4కోట్ల మందికి నేరుగా నగదు జమ, మహిళలు గృహలక్ష్మి సొమ్ముతో వ్యక్తిగత అవసరాల కంటే సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. మరోవైపు రైతులకు రూ.20 వేల కోట్ల పరిహారం, చెరకు, మొక్కజొన్నకు మద్దతుధర, గత 12 ఏళ్లలో రూ.6 లక్షల కోట్ల విలువైన జాతీయ ఉపాధి హామీ పథకాల ద్వారా ఉపాధి కల్పన, ఒక్క ఏడాదిలోనే రూ.50 వేల కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల వంటికి రాష్ట్రం చేపడుతోంది. ఆర్థిక సంఘం సిఫార్సు చేసినా, రాజ్యాంగ చట్టాలున్నా కేంద్రం వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా రాష్ట్రంపై రూ.6 వేల కోట్ల వరకు అదనపు భారాన్ని మోపే ప్రయత్నం చేస్తోంది. ఓ రాష్ట్రంపై ఆర్థిక భారాన్ని మోపే ఏ కార్యక్రమమైనా అమలు చేసే ముందు ఆ రాష్ట్రంతో చర్చించాలన్న కనీస బాధ్యత కేంద్రం విస్మరించినట్లు ఆరోపించారు. ఇదే సమయంలో ప్రదీప్ ఈశ్వర్ మాట్లాడుతూ జీవితంలో చూడలేమని అనుకున్న దేవాలయాలను సందర్శించే అదృష్టం 'శక్తి' పథకం ద్వారా మహిళలకు దక్కింది. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, అంకురాలకు ప్రోత్సాహకాలు, జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు శిక్షణ వంటి వినూత్న కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు.

ఎమ్మెల్యేల హక్కులకు రక్షణ

ఈనాడు, బెంగళూరు: సభలో ప్రస్తావించిన అంశాలపై బయట రాద్ధాంతం చేసేందుకు అవకాశం కల్పించకుండా ఇకపై ఎమ్మెల్యేల హక్కులకు రక్షణ కల్పించేలా నిబంధనలు కట్టుదిట్టం చేస్తామని స్పీకర్ హామీ ఇచ్చారు. మంగళవారం చర్చల సమయంలో శూన్యవేళ భాజపా సభ్యులు సురేశ్ కుమార్ మాట్లాడుతూ గత గురువారం తాను మంత్రి బైరతి సురేశ్‌పై చేసిన వ్యాఖ్యను ఉపసంహరించుకున్నట్లు ప్రకటించినా కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు నా ఇంటి వద్ద గొడవ చేస్తూ తన కుటుంబ సభ్యులను బెదిరించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి బదులిస్తూ ఇకపై ఎవరికీ ఇలాంటి సమస్య రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సంఘటనను ఎమ్మెల్యేల హక్కుల రక్షణ సమితికి సిఫార్సు చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

దిగువ సభలో మాట్లాడుతున్న మంత్రి కృష్ణ బైరేగౌడ

ఇసుక దందాలో అందరి పాత్ర

రాష్ట్రవ్యాప్తంగా ఇసుక దందా యథేచ్ఛగా సాగుతోందని హోంమంత్రి డా.జి.పరమేశ్వర్ అన్నారు. జేడీఎస్ సభ్యురాలు కరెమ్మ నాయక్ తనపై ఇసుక ముఠా సభ్యులు దాడులకు పాల్పడుతున్నారు. రాత్రి వేళ్లల్లో అక్రమంగా ఇసుక తరలింపు కారణంగా మహిళలకు భద్రత లేకుండా పోతోందని ఆరోపించారు. తన ఇంటిపైనా ఈ ముఠా సభ్యులు దాడికి తెగబడ్డారని ఆవేదన వెళ్లగక్కారు. ఈ సమయంలో హోంమంత్రి బదులిస్తూ ఇసుక అక్రమ వ్యాపారాల్లో అన్ని పార్టీల పాత్ర ఉందన్నారు. ఈ వ్యవహారం భూగర్భ విజ్ఞానశాఖ పరిధిలోకి వస్తుంది. ఫిర్యాదు చేస్తేనే పోలీసులు జోక్యం చేసుకుంటారన్నారు. ఇసుక అక్రమ తరలింపును నియంత్రించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. పేకాట, జూదం వంటి కార్యకలాపాలను నియంత్రించటంతో పాటు కరెమ్మకు ప్రత్యేక భద్రతను కల్పిస్తామని హామీ ఇచ్చారు.

మంత్రి రాజీనామాకు పట్టు

సభ మొదలు కాగానే విపక్ష సభ్యులు అబ్కారి మంత్రి తిమ్మాపుర రాజీనామా డిమాండ్‌తో ఆందోళన చేపట్టారు. రూ.6వేల కోట్ల అక్రమాల వీడియోలు సభలో ప్రవేశపెడతామన్నారు. గతంలో ఆరోపణలు బయటపడిన వెంటనే మంత్రి నాగేంద్ర నుంచి రాజీనామా తీసుకున్నా ఈ మంత్రిపై చర్య తీసుకోరెందుకని విపక్ష నేత ఆర్.అశోక్ ప్రశ్నించారు. తాను రాజీనామా చేయను. కానీ సభకు వివరణ ఇస్తానని మంత్రి తిమ్మాపుర సవాలు చేశారు. ఈ సమయంలో స్పీకర్ కలగజేసుకుని ఈ అంశంపై ప్రత్యేక చర్చకు అవకాశం కల్పిస్తామనటంతో విపక్ష సభ్యులు ఆందోళన విరమించారు.

మరిన్ని అంశాలు..

పేదల పాలిట అయిదు గ్యారంటీలతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అందరి గుండెల్లో ఉన్నారని ప్రకటించిన ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ భాజపా చేస్తున్న రామజపాన్ని పరోక్షంగా విమర్శించారు. ఇదే సమయంలో తనకు ఓ కల వచ్చింది. అందులో జాతిపిత ఎవరంటే నేను మహాత్మాగాంధీ అని రాశాను. కానీ భాజపా సభ్యులు అప్పుడు జేపీ నడ్డా.. నేడు నవీన్ అని రాశారని చెబుతూ సభలో నవ్వులు పూయించారు.

బోనులో చిరుత

చిక్కింది చిరుత

హుబ్బళ్లి, న్యూస్‌టుడే: విమానాశ్రయం చుట్టుపక్కల గత ఏడాది డిసెంబరు 17 నుంచి దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్న చిరుత ఎట్టకేలకు బోనులో పడింది. విమానాశ్రయం, కార్వార రోడ్డు, సుతగట్టి, గామనగట్టి, సత్తూరు చుట్టుపక్కల నివాసులకు నాలుగైదు సార్లు చిరుత కనిపించింది. మైసూరు, బెళగావి, గదగ, బన్నేరుఘట్ట జాతీయ ఉద్యానం నుంచి అటవీ శాఖ సిబ్బంది, పశువైద్య నిపుణులు బృందాలుగా వీడి, డ్రోన్ల సాయంతో గాలింపు చేపట్టారు. చిరుత కోసం నాలుగు బోన్లతో పాటు 25 చోట్ల కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేశారు. ఒక బోనులో ఉంచిన ప్రాణిని తినేందుకు వచ్చి అది బోనులో పడిందని గుర్తించారు. చిరుతను అడవిలో విడిచి పెట్టేందుకు అధికారుల అనుమతి కోసం వేచి చూస్తున్నామని హుబ్బళ్లి వలయ అటవీశాఖ అధికారి ఆర్ఎస్ ఉప్పార తెలిపారు.

గవర్నర్‌ను అవమానిస్తారా?

ధ్వజమెత్తిన కాషాయదళం

విధానసౌధ ఆవరణలో మహాత్ముని విగ్రహం వద్ద దళ, భాజపా నేతలు

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే: అధికార పార్టీ నేతలు గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్‌ను అవమానించారని ఆరోస్తూ భాజపా, దళ్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు విధానసౌధ ఆవరణలోని మహాత్ముని విగ్రహం వద్ద మంగళవారం ధర్నాకు దిగారు. గవర్నర్‌ను అవమానించి ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రభుత్వం తూట్లు పొడించిందని భాజపా అధ్యక్షుడు బీవై విజయేంద్ర దుయ్యబట్టారు. ఉభయ సభల సభ్యులను ఉద్దేశించి ప్రసంగించేందుకు వచ్చిన గవర్నర్‌తో గతంలో ఎన్నడూ లేని విధంగా అనుచితంగా వ్యవహరించిన నేతలపై చర్యలు తీసుకోవాలని నేతలు నినాదాలు చేశారు. ఎక్సైజ్ శాఖలో చోటు చేసుకున్న కుంభకోణంపైనా దర్యాప్తునకు ఆదేశించి, మంత్రి ఆర్‌బీ తిమ్మాపురను మంత్రివర్గం నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ధృతరాష్ట్రుని తరహాలో కళ్లు మూసుకుని కూర్చున్నారని విపక్ష నేత అశోక్ దుయ్యబట్టారు. మంత్రి రాజీనామా చేసేంత వరకు తమ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ప్రభుత్వం వీబీ జీరామ్ జీ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగారని విమర్శించారు. ఆందోళనలో గోపాలయ్య, అశ్వత్థ నారాయణ, శరవణ, సురేశ్ గౌడ, ఎం.కృష్ణప్ప, గాలి జనార్దన రెడ్డి, సీటీ రవి, సునీల్ కుమార్, చలువాది నారాయణ స్వామి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దాచాల్సిన సొమ్ము.. దోచేశారు!

బెంగళూరులో క్యాష్ లోడింగ్ ఏటీఎం సిబ్బంది చేతివాటం

ఈనాడు, బెంగళూరు: బ్యాంకుల ఏటీఎంలలో నగదు నింపే ఓ సంస్థ ఉద్యోగులు ఓ ప్రణాళిక ప్రకారం ఈ సొమ్మును కాజేసిన సంఘటన బెంగళూరులో వెలుగుచూసింది. మంగళవారం కోరమంగల పోలీసు స్టేషన్‌లో హిటాచి పేమెంట్ సర్వీస్ ఉద్యోగులు ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఫిర్యాదు ప్రకారం హిటాచి పేమెంట్ సర్వీస్ సంస్థలో పని చేస్తున్న ప్రవీణ్, ధనశేఖర్, రామక్క, వరుణ్ హరీశ్ కుమార్‌లు రూ.1.38 కోట్ల నగదును వేర్వేరు సందర్భాల్లో ఏటీఎంలో నింపకుండా దారి మళ్లించారు. ఓసారి రూ.80 లక్షలు, మరోసారి రూ.57 లక్షలను ఈ సిబ్బంది దారి మళ్లించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సొమ్ము ఏటీఎంలో నింపలేదని రెండు వారాల క్రితమే గుర్తించినా వారిని మా కంపెనీ పరిధిలోనే దర్యాప్తు చేసి సొమ్ము రాబట్టాలనుకున్నాం. వీరు విధులకు రాకపోవటంతో ఫిర్యాదు చేస్తున్నట్లు పోలీసులకు వివరించారు. ఈ రెండు సంఘటనలపై వేర్వేరుగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను గాలించే పని ప్రారంభించారు. మంగళవారం దక్షిణ కన్నడలోనూ ఇదే తరహా దోపిడీ వ్యవహారం వెలుగుచూసింది. ఉప్పినంగడి పోలీసు స్టేషన్ పరిధిలోని బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖలో జాయింట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న సిబ్బంది ఒకరు ఈ బ్యాంకు ఏటీఎంలో జమ చేయాల్సిన రూ.71.41 లక్షలు కాజేసినట్లు స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు నిందితుడిని గుర్తించేందుకు పోలీసులు రంగంలో దిగారు. గతేడాది బెంగళూరులో ఆర్‌బీఐ అధికారుల ముసుగులో రూ.7.11 కోట్ల సొమ్మును దోచుకున్న సంఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. ఆ సమయంలోనూ ఏటీఎం కస్టోడియన్ కంపెనీ వాహనాన్ని పట్టపగలే దోచుకున్న విషయం సంచలనంగా మారింది.

అర్జీని తోసిపుచ్చిన న్యాయస్థానం

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే: భాజపా నాయకుడు, ధార్వాడ గ్రామ పంచాయతీ సభ్యుడు యోగీశ్ గౌడ హత్య కేసులో 15వ నిందితుడు, ఎమ్మెల్యే వినయ్ కులకర్ణి వేసుకున్న బెయిలు అర్జీని ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ కేసులో 21 మంది నిందితుల్లో 20 మందికి బెయిలు ఇచ్చారని, వినయ్‌కు కూడా బెయిలు ఇవ్వాలని కోరుతూ ఆయన తరపు న్యాయవాది కోరారు. సాక్ష్యుల విచారణ పూర్తి కావలసిన నేపథ్యంలో బెయిలు ఇవ్వకూడదని సీబీఐ తరపు న్యాయవాది వాదనలను జస్టిస్ సునీల్ దత్ యాదవ్ పరిగణనలోకి తీసుకుని బెయిలు అర్జీని తోసిపుచ్చారు. సర్వోన్నత న్యాయస్థానంలో బెయిలు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తీర్పు రిజర్వు

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే: కల్ట్ సినిమా బ్యానర్‌ను తొలగించారని నగరసభ కమిషనర్ అమృతాగౌడను బెదిరించిన ఆరోపణలపై అరెస్టయిన కాంగ్రెస్ మాజీ నాయకుడు రాజీవ్ గౌడ వేసుకున్న బెయిలు అర్జీపై శిడ్లఘట్ట జేఎంఎఫ్‌సీ న్యాయస్థానం తీర్పు రిజర్వు చేశామని ప్రకటించింది. కేరళ, కర్ణాటక సరిహద్దుల్లో రాజీవ్‌గౌడను సోమవారం రాత్రి అరెస్టు చేశారు. చిక్కబళ్లాపురకు తీసుకువచ్చి వైద్య పరీక్షలు చేయించి, న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. విచారణ నిమిత్తం ఆయనను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడ్ని అరెస్టు చేసిన శిడ్లఘట్ట ఇన్‌స్పెక్టర్ ఆనంద్ కుమార్, చిక్కబళ్లాపుర సైబర్ ఠాణా ఇన్‌స్పెక్టర్ సూర్యప్రకాశ్ నేతృత్వంలోని సిబ్బందిని ఎస్పీ కుశాల్ చౌక్సే అభినందించారు.

విద్యార్థులకు అస్వస్థత

శివమొగ్గ, న్యూస్‌టుడే: భద్రావతి తాలూకా అరళిహళ్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఇచ్చిన మాత్రలు వికటించాయి. రక్తహీనతను అడ్డుకునేందుకు ఇచ్చిన మాత్రలు వేసుకున్న వారిలో 59 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారిని చికిత్స కోసం భద్రావతి తాలూకా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పాఠశాలలో మొత్తం 200మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. మొదటి విడతలో మాత్రలు వేసుకున్న వారు వాంతులు చేసుకుంటూ, కడుపు నొప్పి వచ్చిందని చెప్పడంతో మిగిలిన వారికి మాత్రలు ఇవ్వలేదు. కాలం చెల్లిన మాత్రలతోనే సమస్య వచ్చిందని ప్రాథమిక విచారణలో గుర్తించారు. చికిత్స అనంతరం విద్యార్థులు కోలుకున్నారని తాలూకా విద్యాశాఖ అధికారి నాగేంద్రప్ప తెలిపారు. దీనిపై దర్యాప్తునకు ఆదేశించామని చెప్పారు.

కదం తొక్కిన కాంగ్రెస్

వీబీజీ రామ్‌జీపై పెల్లుబుకిన ఆందోళన



వేదికపై నినాదాలు రాసిన అట్టముక్కలు ప్రదర్శిస్తున్న సిద్ధరామయ్య, డీకే శివకుమార్, జార్జ్, వీరప్ప మొయిలీ, సూర్జేవాలా, సలీం అహ్మద్, శ్రీనివాస్ తదితరులు

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే: వీబీ జీ రామ్ జీ పథకానికి గతంలో ఉన్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంగా పేరు మార్చేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. 'నరేగా బచావ్ సంగ్రామ్ - లోకభవన్ చలో' పేరిట, కేంద్ర ప్రభుత్వ తీరును ఖండిస్తూ స్వాతంత్ర్య ఉద్యానవనంలో యువ కాంగ్రెస్ సమితి, కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ సమితి కార్యకర్తలు, నేతలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, పార్టీ వ్యవహారాల బాధ్యుడు రణదీప్ సింగ్ సూర్జేవాలాలతో కలిసి మంగళవారం నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. కర్ణాటకలోని ఆరు వేల గ్రామ పంచాయతీలకు మహాత్ముని పేరును నామకరణం చేస్తామని, రానున్న బడ్జెట్ సమావేశాల్లో అధికారికంగా ప్రకటిస్తామని సిద్ధరామయ్య తెలిపారు. మహాత్ముడ్ని నాథూరామ్ గాడ్సే హత్య చేశాడని, ఇప్పుడు సంఘపరివార్ కుమ్మక్కై నరేగా పథకం పేరు మార్చి మహాత్ముడ్ని రెండోసారి హత్య చేశారని దుయ్యబట్టారు. గ్రామానికి ఒక పాఠశాల, ఒక సహకార సంఘం, పంచాయతీ ఉండాలన్న మహాత్ముని కలను తమ ప్రభుత్వం సాకారం చేస్తుందన్నారు. భాజపా నాయకులు తమ నివాసాలు, కార్యాలయాల్లో మహాత్ముని చిత్రాన్ని ఉంచుకునేందుకు అర్హత కోల్పోయారని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ విమర్శించారు. గ్రామాల్లో పేదరికాన్ని తొలగించే దిశలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు తీసుకువచ్చిన పథకంలో నిబంధనలు మార్పు చేయడం, నిధుల కోత, పని రోజుల కోతతో పేదలకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేసిందని దుయ్యబట్టారు. కొత్త పథకాన్ని రద్దు చేయాలని ఎన్‌డీఏ మిత్రపక్షం నాయకుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా కేంద్రాన్ని హెచ్చరించారని చెప్పారు. ఆందోళన అనంతరం గవర్నర్ గహ్లోత్‌కు పార్టీ నేతలు వినతి పత్రాన్ని అందజేశారు.

తలపాగా చుట్టుకుంటున్న సిద్ధరామయ్య

ఆందోళనలో పాల్గొన్న మహిళా కార్యకర్తలు

తలపాగా.. అదిరెనుగా!

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పును వ్యతిరేకిస్తూ స్వాతంత్ర్య ఉద్యానవనంలో అధికార పార్టీ నిర్వహించిన ధర్నాలో సిద్ధరామయ్య తలకు చకచకా పాగా చుట్టుకున్నారు. తలపాగా కట్టుకునేందుకు ఇబ్బంది పడుతున్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రి సహాయపడ్డారు. అంతకు మునుపు పార్టీ వ్యవహారాల బాధ్యుడు సూర్జేవాలా చుట్టిన తువ్వాలు జారిపోవడంతో శివకుమార్‌కు ముఖ్యమంత్రి సహకరించారు. స్వాతంత్ర్య ఉద్యానవనం నుంచి లోక్‌భవన్ వెళ్తున్న ఆందోళనకారులను దారి మధ్యలోనే పోలీసులు అడ్డుకున్నారు. ముందుకు దూసుకొస్తున్న ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేసి, హైగ్రౌండ్స్ ఠాణాకు తరలించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను, జాతీయ గీతాన్ని గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ అవమానించారని ఆరోపిస్తూ యువ కాంగ్రెస్ సమితి ప్రతినిధులు గవర్నర్, భాజపా నాయకుల ఫొటోలు ఉన్న మాస్కులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రసంగిస్తున్న సమయంలో 'డీకేశి సీఎం.. డీకేశి సీఎం' అంటూ నినాదాలు చేస్తున్న కార్యకర్తలపై సిద్ధరామయ్య ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. కార్యకర్తలను మౌనంగా ఉండాలంటూ గద్దించారు.

కేంద్రానికి వినతి పంపించాం

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: నరేగా పథకం పేరు మార్పు, నిధుల కోతతో కర్ణాటకకు అన్యాయం జరుగుతుందని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. జీఎస్టీ పన్ను వసూళ్లలోనూ కర్ణాటకకు పూర్తి వాటా రావడం లేదని గవర్నర్ గహ్లోత్‌కు తెలిపామని చెప్పారు. చలో రాజ్‌భవన్ పేరిట నిర్వహించిన ఆందోళనలో భాగంగా లోకభవనకు వెళ్లి గవర్నర్‌కు ఫిర్యాదు అందించారు.

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర నేతల నుంచి వినతిపత్రం అందుకుంటున్న గవర్నర్

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

ఆంధ్రప్రదేశ్ నిధులిస్తే.. రాష్ట్రం నిలిపేసింది!

- రూ.10 కోట్లు ఎందుకు ఆపారు?
- బోర్డు కార్యదర్శి ఆర్థికశాఖకు లేఖ

బళ్లారి, న్యూస్‌టుడే: కర్ణాటక-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల బహుళార్థ సాధక ప్రాజెక్టయిన తుంగభద్ర జలాశయం క్రస్ట్ గేట్లు మార్పు కోసం నియమించిన సిబ్బంది వేతనం, రవాణా, ఇతర ఖర్చుల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన రూ. 35.62 కోట్లలో రూ. 10కోట్లను కర్ణాటక ప్రభుత్వం నిలిపివేసిందని తుంగభద్ర బోర్డు కార్యదర్శి ఓ. ఆర్. కె. రెడ్డి ఆరోపించారు. ఈ విషయమై ఆయన రాష్ట్ర ఆర్థికశాఖ అదనపు ప్రధాన కార్యదర్శికి ఒక లేఖ రాశారు. ఈ లేఖ 'న్యూస్‌టుడే'కి లభించింది. ఈ లేఖను తుంగభద్ర మండలి ఛైర్మన్‌కు కూడా పంపారు. జలాశయాలు గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు జనవరి 22న తుంగభద్ర జలాశయం సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ. 10 కోట్లను ఉపసంహరించుకున్నారని, దీని వల్ల పనులు మరింత ఆలస్యం కావచ్చని హెచ్చరించారు. తాజాగా బోర్డు కార్యదర్శి రాసిన లేఖ కన్నయ్యనాయుడు పేర్కొన్న విషయాలకు బలాన్ని చేకూరుస్తోంది.

తుంగభద్ర జలాశయం

లేఖలో ఏముంది..

తుంగభద్ర ఆయకట్టు నిర్వహణ, కుడి కాలువ (ఎల్లెల్సీ) కాలువలు మరమ్మతులు, ఇతర ఖర్చుల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏటా రూ. 390.66 కోట్లు అందిస్తుంది. ఈసారి క్రస్ట్‌గేట్ల ఏర్పాటుకు అవసరమైన సామగ్రి, కొనుగోలు కోసం 2025 నవంబరు 26న కర్ణాటక సంరక్షణలో ఉన్న తుంగభద్ర బోర్డు ఖాతాకు రూ. 20కోట్లు బదిలీ చేసింది. ఆ సమయంలో కర్ణాటక కూడా ఈ ఖాతాకు రూ. 10 కోట్లు బదిలీ చేసింది. సిబ్బంది వేతనాలు, రవాణా, ఇతర ఖర్చుల కోసం తుంగభద్ర మండలి ఖాతాకు ఏపీ ప్రభుత్వం డిసెంబరు 17న రూ. 35.62 కోట్లు అందించింది. రాష్ట్ర ప్రభుత్వం తన కోశాగార శాఖకు రూ. 25.62 కోట్లు మాత్రమే జమ చేయాలని ఆదేశించింది.

ముందు ఏపీ ప్రభుత్వమే వ్యయాన్ని భరించాలి

ఆయకట్టుకు సంబంధించిన అన్ని ఖర్చులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొదట భరించాలి. తర్వాత తుంగభద్ర మండలిని నియంత్రించే కేంద్ర జల సంఘం రాష్ట్రాల మధ్య ఖర్చులను పంపిణీ చేస్తుంది. దీని ప్రకారం ఆంధ్రప్రభుత్వం ఇప్పటికే రూ. 55.62 కోట్లు చెల్లించింది.

అధికారులు నేరుగా మాట్లాడలేరు

తుంగభద్ర జలాశయం గేట్లు విషయంలో నిధుల కొరతపై నేరుగా మాట్లాడలేరు. కాబట్టి నేనే చెప్పాల్సి వచ్చింది. నన్ను నిందించడానికి బదులు కర్ణాటక ప్రభుత్వం తన వంతు బాధ్యతగా మూల్యం చెల్లించాలి. - కన్నయ్య నాయుడు, ఇంజినీరింగ్ నిపుణుడు

రోడ్డు ప్రమాదంలో నిండు గర్భిణి మృతి

డాక్టర్. మమతారాణి

మట్టెవాడ(వరంగల్), న్యూస్‌టుడే: మరో 15 రోజుల్లో పుట్టబోయే బిడ్డ కోసం ఆ తల్లి ఎన్నో కలలు కంది. మరి కొద్ది రోజుల్లో ఇద్దరం కాస్త ముగ్గురం అవుతామన్న ఆ వైద్య దంపతుల ఆశలను రోడ్డు ప్రమాదం చిదిమేసింది. వరంగల్ నగరంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నిండు గర్భిణి మృతిచెందారు. మట్టెవాడ ఎస్సై శివకృష్ణ కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం కలబురగి జిల్లా చించోలి మండలం బత్తంపల్లి గ్రామానికి చెందిన డాక్టర్. ఎస్. మమతారాణి (33) వరంగల్ హంటర్ రోడ్డులోని ఫాదర్ కొలంబో ఆసుపత్రిలో వైద్యురాలు (జనరల్ మెడిసిన్)గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమెకు గతేడాది నారాయణపేట జిల్లాకు చెందిన డాక్టర్ రాఘవేంద్రతో వివాహమైంది. ప్రస్తుతం రాఘవేంద్ర కాకతీయ మెడికల్ కళాశాలలో పీజీ చదువుతున్నారు. సోమవారం రాత్రి మమతారాణి విధులు ముగించుకొని హంటర్‌రోడ్డు మీదుగా భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో ఏడు మోరీల కూడలి వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన టిప్పర్ బలంగా ఢీకొట్టడంతో భార్యాభర్తలు కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో 9 నెలల గర్భిణి మమతారాణి తీవ్రంగా గాయపడింది. ఆమెను స్థానికుల సాయంతో భర్త నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు అర్ధరాత్రి మృతిచెందారు. కట్టుకున్న భార్య, కడుపులో బిడ్డ మృతిచెందడంతో రాఘవేంద్ర గుండెలవిసేలా రోదించారు. ఫిబ్రవరి 10న డెలివరీ తేదీ ఉండటంతో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి డా. మమతారాణి సెలవుకు దరఖాస్తు చేసుకున్నట్లు ఫాదర్ కొలంబో ఆసుపత్రి డైరెక్టర్ ఫాదర్ గాదె చిన్నప్పారెడ్డి తెలిపారు. నిర్లక్ష్యం, అతివేగంగా లారీ నడిపిన జార్ఖండ్‌కు చెందిన టిప్పర్ డ్రైవర్ అన్సారీని మట్టెవాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు అన్సారీపై మంగళవారం కేసు నమోదు చేశారు.

భార్య వెళ్లిపోయిందని ఆత్మహత్య

దావణగెరె, న్యూస్‌టుడే: వివాహమైన రెండు నెలల్లోనే భార్య మరో యువకునితో వెళ్లి పోయిందన్న వ్యథతో హరీశ్ (32) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గుమ్మనూరుకు చెందిన బాధితుడు రాసిన లేఖను దావణగెరె గ్రామీణ ఠాణా పోలీసులు స్వాధీనపరుచుకున్నారు. వివాహమైన కొద్ది రోజులకే తన భార్య తప్పుడు ఆరోపణలు చేసిందని, తనను హత్య చేస్తామని భార్య, అత్తింటి వారు బెదిరించారని ఆత్మహత్యకు ముందు రాసిన లేఖలో బాధితుడు పేర్కొన్నారు. తాను చేయించిన వివాహం ఇలా విషాదాంతమైందని లేచిపోయిన గృహిణి మేనమామ రుద్రేశ్ (55) కూడా తన ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నారు. రెండు కేసులను దావణగెరె గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నిందితుల అరెస్టు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకల సందర్భంలో చిన్న విషయానికే గొడవ పెట్టుకుని సుశాంత్ (35) అనే యువకుడిని హత్య చేసి, పరారైన నలుగురు నిందితులను దొడ్డబళ్లాపుర ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు బాశెట్టిహళ్లి వినాయకనగరకు చెందిన వారు. సిగరెట్టు అంటించుకునేందుకు అగ్గిపెట్టె ఇవ్వాలని కోరగా, తన వద్ద లేదని సుశాంత్ చెప్పాడు. దుకాణానికి వెళ్లి అగ్గిపెట్టె తీసుకురావాలని ఒత్తిడి చేయగా, తానెందుకు తీసుకురావాలని ప్రశ్నించాడు. ఉజ్వల్ ప్రసాద్, ప్రిన్స్, సూరజ్‌రామ్, ఒక బాలుడు కలిసి అతన్ని వెంటాడి దాడిచేశారు. ఒక భవంతి రెండవ అంతస్తు నుంచి కిందకు తోసి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన బాధితుడ్ని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేలోగా మరణించాడు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా గాలింపు చేపట్టి మూడు వారాల అనంతరం నిందితులను అరెస్టు చేశారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: తన కుమారుడి నుంచి ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసిన తదుపరి రోజే వెంకోబా హంచినాళ (50) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. కొప్పళ జిల్లా కనకగిరి తాలూకా వరుణఖేడ గ్రామంలోని పొలంలో అతని మృతదేహాన్ని సోమవారం రాత్రి గుర్తించారు. ఆస్తి పంపకాలకు సంబంధించి, తన కుమారుడు బెదిరిస్తున్నాడని పోలీసులకు అతను ఫిర్యాదు చేశాడు. తన కుమారుని మరణానికి మనవడు, అతని భార్య, కోడలే కారణమని, విషాహారం పెట్టి హత్య చేశారని కనకగిరి ఠాణాలో వెంకోబా తల్లి సూరమ్మ ఫిర్యాదు చేసింది.

ఆందోళనలపై ఆంక్షల కత్తి

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే: రెండున్నరేళ్లుగా పెంచిన వేతన బకాయిల విడుదల, వేతన పెంపు, ఉద్యోగ భద్రత తదితర డిమాండ్లతో ఆర్టీసీ ఉద్యోగులు గురువారం 'బెంగళూరు చలో'కు పిలుపునిచ్చారు. విధులకు గైర్హాజరై, ఆందోళనలో పాల్గొంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ అక్రం పాషా హెచ్చరించారు. ప్రయాణికులకు రవాణా సేవల్లో సమస్య ఎదురైతే సిబ్బందికి వేతన కోతతో పాటు, ఇతర చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురు కాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని అక్రం పాషా వెల్లడించారు.

విలేకరులతో మాట్లాడుతున్న మఠాధిపతి

మఠం ఆస్తి కబ్జాకు ప్రయత్నం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: చిక్కబళ్లాపుర తాలూకా స్కందగిరి పర్వత సానువుల్లో ఉన్న ఓంకార జ్యోతి మఠం, ట్రస్టు ఆస్తులను కబ్జా చేసేందుకు హుళిమావు మాజీ కార్పొరేటర్ లక్ష్మీనారాయణ, మరికొందరు ప్రయత్నిస్తున్నారని మఠాధిపతి ఉమామహేశ్వర స్వామి ఆరోపించారు. తన అనుచరులతో మఠంలోకి అక్రమంగా వచ్చి, తనపై, చిన్న స్వాములు భక్తులపై లక్ష్మీనారాయణ దాడి చేసి పరారయ్యారని ఆక్రోశించారు. సీసీ కెమెరాల ఫుటేజ్‌తో సహా ఫిర్యాదు చేసినా, పోలీసులు ఇప్పటి వరకు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మఠం ప్రతినిధులు, భక్తులతో కలిసి మంగళవారం ఇక్కడ నిర్వహించిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సుమారు 26 ఏళ్ల క్రితం మరియప్ప అనే వ్యక్తి 2 ఎకరాల 12 గుంటల్లో మఠాన్ని నెలకొల్పారని, ఆయన అనంతరం ఆయన భార్య సాధ్వి జయమ్మ మఠం బాధ్యతలు చేపట్టారని తెలిపారు. మఠాధిపతిగా తనకు పట్టాభిషేకం చేసి, పీఠానికి జయమ్మ గౌరవ అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు మఠం ఆస్తులను కబ్జా చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను పోలీసులు, ప్రభుత్వం అడ్డుకోవాలని కోరారు. దీనిపై తాము న్యాయ పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు.

దూషిస్తే పరువు నష్టం కేసు దాఖలు చేస్తా

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే: బిగ్‌బాస్ కన్నడ రియాల్టీ షో విజేత నటరాజ్ అలియాస్ గిల్లి, అతని అభిమానులు తనను కించపరుస్తూ వ్యాఖ్యలు చేస్తున్నారని కడబమ్స్ సతీశ్ అలియాస్ డాగ్ సతీశ్ ఆరోపించారు. తనకు ప్రాణహాని తలపెడతానని బెదిరించిన ఎనిమిది మందిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారని తెలిపారు. తనను కించపరుస్తూ వ్యాఖ్యలు, పోస్టులు పెట్టిన వారిపై రూ. ఒక కోటికి పరువునష్టం కేసు దాఖలు చేస్తానని హెచ్చరించారు.

బుల్లితెర నటి, ఆమె భర్తపై దాడి

బెంగళూరు (రామమూర్తినగర), న్యూస్‌టుడే: బుల్లితెర నటి కావ్యాగౌడ, ఆమె భర్త సోమశేఖర్‌పై ఆమె బంధువులు దాడి చేశారు. ప్రేమ, నందీశ్, వారి అనుచరులు తమ ఇద్దరిపై దాడి చేశారని వారు రామమూర్తి నగర ఠాణాలో ఫిర్యాదు చేశారు. తన భర్తపై కత్తితో దాడి చేసిన సోమశేఖర్, తనపై అత్యాచారానికి పాల్పడతానని బెదిరించాడని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

తేరువీధిలో మధ్వాచార్యుల రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో.. మధ్వనవమి వేడుకలు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: ధార్మిక ప్రపంచానికి మధ్వాచార్యులు అందించిన సేవలు అనన్యమని ప్రవచనకారులు ప్రసంగించారు. మధ్వనవమిని పురస్కరించుకుని మంగళవారం సత్యనారాయణ పేట రాఘవేంద్ర మఠంలో విశేష పూజలు చేశారు. మధ్వాచార్యుల చిత్రపటాన్ని పూజించి రథంలో ఊరేగించారు. తేరువీధి రాఘవేంద్ర స్వామి మఠంలోనూ విశేష పూజలు జరిపి నగర ప్రధాన వీధిలో రథోత్సవం నిర్వహించారు. వ్యాసరాజ మఠంలో మధ్వనవమి వేడుకలు ఆచరించారు. మధ్వసంఘం ఆధ్వర్యంలో భూతరాజ ఆలయంలో ప్రవచనం, సంస్థాన పూజలు, స్వామీజీ ఆశీర్వాద భాషణం తదితర కార్యక్రమాలు ఆచరించారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో మఠాల వ్యవస్థాపకులు, కమిటీ సభ్యులు, భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కళలను ప్రోత్సహించాలి

మండ్య, న్యూస్‌టుడే: జానపద కళలను ప్రోత్సహించేందుకు ప్రముఖ దేవాలయాలు ముందుకు రావాలని ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనాథ్ పిలుపునిచ్చారు. మేలుకోటె యతిరాజదాసర్ గురుపీఠం నిర్వహించిన జానపద మేళా ముగింపు వేడుకల్లో మాజీ మంత్రి సీఎస్ పుట్టరాజుతో కలిసి పాల్గొన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన కేఆర్ నీలకంఠ, సునీల్ కుమార్, చెన్నమాదేగౌడ, కుమార్‌లను సత్కరించి మాట్లాడారు. రామానుజుల కర్మభూమి మేలుకోటెలో గత 27 ఏళ్లుగా జానపద ఉత్సవాలను నిర్వహిస్తున్న గురుపీఠం ప్రతినిధులను అభినందించారు. స్థానాచార్యుడు శ్రీనివాస నరసింహన్ గురూజీ, గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షుడు జయరామేగౌడ, చరిత్రకారుడు ఆచార్య శల్పపిళ్లై అయ్యంగార్, స్థానిక సంతానరామన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సత్కారం అందుకున్న సాధకులతో వేదిక ప్రతినిధులు, డాక్టర్ శ్రీనాథ్ తదితరులు

ఆయన పగటి కలలు కంటారు

దావణగెరె, న్యూస్‌టుడే: కేంద్ర మంత్రి కుమారస్వామి ప్రత్యేక వ్యక్తి అంటూనే వక్ఫ్ శాఖ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ చురకలు అంటించారు. అందరిలాగా ఆయన రాత్రుల్లో కలలు కనరని, పగటి కలలు కంటుంటారని ఎద్దేవా చేశారు. దావణగెరెలో విలేకరులతో సోమవారం మాట్లాడుతూ 2028లో తామే అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేసిన కుమారస్వామి 2013, 2019, 2023లో ఏమైందో గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. సిద్ధరామయ్య జనతాదళ్‌లో ఉన్నప్పుడు 59 సీట్లు పొందిన దళ్, ఆయన పార్టీ వీడిన అనంతరం 19 సీట్లకే పరిమితమైన విషయాన్ని మర్చిపోయారా అని ప్రశ్నించారు. మాజీ ప్రధాని దేవేగౌడ వందేళ్లు జీవించాలని కోరుకుంటున్నానని తెలిపారు. తాను కాంగ్రెస్‌లో మంత్రిగా ఉన్నా, తనకు దేవేగౌడ రాజకీయ గురువు అన్నారు. భాజపాలో చేరి ఆయన తప్పు చేశారని, భవిష్యత్తులో ఏమవుతుందో వేచి చూడాలని పేర్కొన్నారు.

బస్సు, ద్విచక్ర వాహనం ఢీ: ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

సిరుగుప్ప, న్యూస్‌టుడే: బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. పట్టణ శివార్లోని తెక్కలకోట పోలీసు ఠాణా పరిధిలో సిద్ధప్పనగర్ వద్ద మంగళవారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై వస్తున్న శివలింగమ్మ(18), అభిలాష్(18)లను కల్యాణ కర్ణాటక బస్సు ఢీకొనడంతో ఇద్దరు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. విద్యార్థులు కురుకళ్లి గ్రామానికి చెందిన వారు. శివలింగమ్మ గురుమహర్షి కళాశాలలో ప్రథమ సంవత్సరం బీఏ చదువుతోంది. ఆమె ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో పరీక్ష పూర్తి చేసుకుని బయటకు రాగా, అదే గ్రామానికి చెందిన ఐటీఐ విద్యార్థి అభిలాష్ తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకున్నాడు. కళాశాల నుంచి వీరి ద్విచక్రవాహనం ప్రధాన రహదారిలోకి రాగానే బస్సు ఢీకొంది. ప్రమాదస్థలంలోనే వీరిద్దరూ ప్రాణాలు వదిలారు. విషయం తెలిసిన వెంటనే భాజపా యువ మోర్చా అధ్యక్షుడు ఎం.ఎస్.సిద్ధప్ప పటేల్ ప్రాంతానికి చేరుకుని మృతదేహాలను అంబులెన్స్‌లో సిరుగుప్ప ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసేందుకు ఆసుపత్రి శవాగారంలో దేహాలను ఉంచారు. ప్రమాద సమాచారాన్ని బాధిత కుటుంబసభ్యులకు తెక్కలకోట పోలీసుస్టేషన్‌లో తెలియపరిచారు.

సిద్ధప్పనగర్ వద్ద ప్రమాదంలో మృతి చెందిన విద్యార్థులు

విద్యార్థి అభిలాష్

విద్యార్థిని శివలింగమ్మ

ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు

రాయచూరు: మాదిగ సామాజిక వర్గంలోని ప్రతిభావంత విద్యార్థులకు ఫిబ్రవరి 14వ తేదీ ప్రతిభా ప్రోత్సాహకాలను ప్రదానం చేస్తామని నవరత్న యువక సంఘం ముఖ్యుడు కె.పి.అనిల్‌కుమార్ వెల్లడించారు. ఆయన మంగళవారం పత్రికాభవన్‌లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. 2024-25 విద్యా సంవత్సరంలో పది, పీయూసీ, డిగ్రీ, స్నాతకోత్తర కోర్సుల్లో ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులైన వారికి ఏటా ప్రోత్సాహకాలు అందజేస్తున్నామని వివరించారు. అర్హులైన విద్యార్థులు వ్యక్తిగత వివరాలు, మార్కుల, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు నకళ్లు, రెండు ఫొటోలు, ఫిబ్రవరి 8 లోపు దళితవాడలోని సముదాయ భవనంలో ఇవ్వాలని సూచించారు. సమావేశంలో అధ్యక్షుడు శరణప్ప, సభ్యులు ఆంజనేయ, చంద్ర భండారి, హులిగప్ప, జనార్దన్ హళ్లిబెంచి, వెంకటేష్, ఈరేశ్, నాగరాజ్ పాల్గొన్నారు.

రాయచూరు ఉత్సవం.. సైకిల్ ర్యాలీ

రాయచూరు : రాయచూరు ఉత్సవ్‌ను పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన సైకిల్ సవారీ పోటీలకు ఉత్తమ స్పందన లభించింది. సైకిల్ సంఘం సభ్యులు, విద్యార్థులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక మహాత్మాగాంధీ మైదానంలో ఉదయం 6 గంటలకు జిల్లా అదనపు పాలనాధికారి శివానంద జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. బసవేశ్వర కూడలి, జిల్లా పంచాయతీ కార్యాలయం, కనకదాసు సర్కిల్, వ్యవసాయ విజ్ఞాన వర్సిటీ మీదుగా ర్యాలీ తిరిగి మైదానానికి చేరింది. నిర్వాహకులు విజేతల పేర్లను ప్రకటించారు. ప్రథమ బహుమతి బెల్లం ప్రకాశ్‌కు రూ. 10 వేలు, ద్వితీయ బహుమతి రాఘవేంద్ర గుప్తకు రూ. 5 వేలు, తృతీయ బహుమతి సణ్ణ వీరేశ్‌కు రూ. 3 వేలు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేశారు.

కళా బృందాల ప్రదర్శన

ఆకట్టుకున్న జానపద కళా ప్రదర్శనలు

పల్లకీ మోస్తున్న మంత్రి చెలువరాయస్వామి

మండ్య, న్యూస్‌టుడే: రథ సప్తమిని పురస్కరించుకుని గత ఆదివారం నుంచి మేలుకోటెలో ఏర్పాటు చేసిన జానపద కళా ప్రదర్శనలకు మంగళవారం తెరపడింది. మొదటి రోజు ఉత్సవాల్లో సూర్యమండల వాహనంపై చెలువనారాయణ స్వామి ఉత్సవమూర్తినితో నిర్వహించిన ఊరేగింపులో మంత్రి చెలువరాయస్వామి, ఎమ్మెల్యే దర్శన్ పుట్టణ్ణయ్య, ముడా మాజీ అధ్యక్షుడు రాజీవ్ పాల్గొన్నారు. పల్లకీ సేవల్లో వీరు పాల్గొన్నారు. కేరళ నుంచి చండ వాద్యాలతో పాటు కర్ణాటకలోని వివిధ ప్రాంతాల నుంచి 60కు పైగా కళా బృందాలు ఉత్సవాల్లో పాల్గొన్నాయి. మేలుకోటెతో పాటు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో స్థానికులు ఉత్సవాల్లో పాల్గొన్నారని స్థానీకం నాగరాజ్ అయ్యంగార్ సాంస్కృతిక వేదిక ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాలకు కన్నడ, సాంస్కృతిక శాఖ మద్దతు పలికింది.

ఉభయ సభలకు సభ్యుల గైర్హాజరు

ఎగువసభలో మాట్లాడుతున్న మంత్రి తిమ్మాపూర్
దిగువ సభలో మాట్లాడుతున్న హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: మంగళవారం మధ్యాహ్నం వరకు ఉభయ సభలకు సభ్యులు గైర్హాజరయ్యారు. అధికారులు, సిబ్బంది, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, విధానపరిషత్తు అధ్యక్షుడు తదితరులు మాత్రమే ఉదయం సభల్లో కనిపించారు. నరేగా పథకం పేరు మార్పును ఖండిస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు స్వాతంత్ర్య ఉద్యానంలో ధర్నాలో పాల్గొనగా, భాజపా, దళ్ నేతలు విధానసౌధ ఆవరణలోని మహాత్ముని విగ్రహం వద్ద ధర్నాకు దిగడంతో శాసనసభ సమావేశాలకు గైర్హాజరు కావలసి వచ్చింది. ఎక్సైజ్ శాఖలో అక్రమాలకు సంబంధించి చర్చకు అవకాశం కల్పిస్తామని స్పీకర్ ప్రకటించిన అనంతరం విపక్ష సభ్యులు తమ ధర్నాను విరమించారు. విపక్షాలకు బదులివ్వవలసిన మంత్రులు సమావేశాలకు గైర్హాజరవుతున్నారని విపక్ష నేత అశోక్ ఆరోపించారు. సభకు రాని మంత్రుల పేర్లను అశోక్ చదివి వినిపించారు. ఎక్సైజ్ శాఖలో రూ. 2500 కోట్ల మేర అక్రమాలు జరిగాయని ఎగువ సభలో విపక్ష నేత చలువాది నారాయణ స్వామి ఆరోపించారు. ప్రతి ఏటా రూ. 6 వేల కోట్లను వసూలు చేస్తున్నా, ఖజానాకు పూర్తి స్థాయిలో నిధులు జమకావడం లేదన్నారు. సమావేశాలను ఆలస్యంగా ప్రారంభించడం సభ సంప్రదాయాన్ని అగౌరవపరచినట్లు కాదని ఎగువ సభ అధ్యక్షుడు బసవరాజ హొరట్టి స్పష్టం చేశారు. అన్ని పార్టీల సభ్యులు ఆలస్యంగా సభను ప్రారంభించాలని కోరడంతో జాప్యం జరిగిందన్నారు. పంట బీమా పరిధికి కొబ్బరి సాగును తీసుకువస్తున్నామని సభ్యుడు చిదానందగౌడ ప్రశ్నకు వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయ స్వామి బదులిచ్చారు. శిడ్లఘట్ట నగర సభ కమిషనర్‌ను దూషించిన రాజీవ్‌గౌడను న్యాయమూర్తి న్యాయనిర్బంధానికి పంపించారని, అతన్ని కాపాడేందుకు కాంగ్రెస్ నేతలు ఎవరూ ప్రయత్నించడం లేదని ఎగువ సభకు మంత్రి భైరతి సురేశ్ స్పష్టం చేశారు. దిగువ సభలో విపక్ష సభ్యుల ఆరోపణలకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తీవ్రస్వరంలోనే బదులిచ్చారు.

దొరికిన పులి పిల్ల

చామరాజనగర, న్యూస్‌టుడే: నంజేదేవనపుర గ్రామంలో ఒక పులి పిల్ల దొరికింది. సోమవారం రాత్రి అటవీశాఖ ఉంచిన బోనులో ఒక పులి, ఒక పిల్ల చిక్కాయి. మరో పులిపిల్లను మంగళవారం ఉదయం పట్టుకున్నారు. తల్లి పులి వద్దకు ఈ పిల్లను కూడా చేర్చారు. త్వరలో వీటిని స్థానిక అడవిలో విడిచి పెడతామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

బెంగళూరులో అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే: బెంగళూరు అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 6 వరకు కొనసాగే చిత్రోత్సవాలకు రాజాజీనగర లులుమాల్‌లోని సినీ పోలీస్ మల్టీప్లెక్స్, బనశంకరి 2వ స్టేజ్‌లోని సుచిత్ర ఫిలిం సొసైటీ, కర్ణాటక చలనచిత్ర కళాకారుల సంఘం ఆవరణలోని థియేటర్‌లో చిత్రాలను ప్రదర్శించనున్నారు. విధానసౌధ మెట్ల వద్ద ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారం సాయంత్రం 5 గంటలకు చిత్రోత్సవాలను ప్రారంభించనున్నారు.

EENADU Classifieds

JOBS

Required Civil Site Supervisors/ Engg/ Diploma with or without Experience. Location Karnataka. Contact: 9347083151.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్ళారి : 9121167525

బెంగుళూరు : 9121167527

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

'మా ఊళ్లోనూ తవ్వండి'

యాదగిరి, న్యూస్‌టుడే: మా ఊళ్లో తవ్వకాలు చేపడితే లక్కుండి కన్నా ఎక్కువ నిధులు లభిస్తాయని యాదగిరి జిల్లా హుణసగి తాలూకా కె ముదనూర గ్రామస్థులు పేర్కొన్నారు. తమ గ్రామంలో తవ్వకాలు జరిపితే బంగారం, వెండి, వజ్ర వైఢూర్యాల నిధులు ఉంటాయని ధీమా వ్యక్తం చేశారు. పదకొండో శతాబ్దంలో శ్రేష్ఠ వచనకారుడు దేవరదాసిమయ్య జన్మ స్థలమైన కె. ముదనూరులో 101 దేవాలయాలు 101 శివలింగాలు లభించాయి. రామతీర్థ, లక్ష్మణ తీర్థ, గుండు తీర్థ, చక్కెర తీర్థ, మరళు తీర్థ, హాలు తీర్థ, సంగమ తీర్థ అనే ఏడు తీర్థాలు ఉండగా, వాటిల్లో ఏడాది మొత్తం నీరు ప్రవహిస్తుంది. గ్రామంలో ఇటీవల ఒక ఇంటి నిర్మాణానికి పునాదులు తీస్తుండగా 18 ప్రాచీన శాసనాలు లభించాయి. వాటిని అధికారులకు అప్పగించినా, సరిగ్గా సంరక్షించలేదని ఆరోపించారు. పురావస్తు శాఖ అధికారులతో కలిసి తమ గ్రామంలోనూ తవ్వకాలు చేపట్టాలని గ్రామస్థులు కోరారు.

టీజర్ విడుదల

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: హ్యాట్రిక్ హీరో శివరాజ్ కుమార్ అనారోగ్యం బారిన పడి అమెరికాలో శస్త్రచికిత్స చేయించుకున్నారు. పూర్తిగా కోలుకున్న ఆయన చిత్రాలలో నటిస్తున్నారు. శివకుమార్ కుమార్ జీవనయానాన్ని 'సర్వైవర్' పేరిట డాక్యుమెంటరీ సిద్ధమవుతోంది. గీతా పిక్చర్స్ బ్యానర్‌పై ప్రదీప్ శాస్త్రి ఈ డాక్యుమెంటరీకి దర్శకత్వం వహించారు. దీనికి సంబంధించిన టీజర్‌ను నటుడు శివరాజ్‌కుమార్ సోమవారం విడుదల చేశారు.

మరో పోలీసు అధికారిపై బదిలీ వేటు

నగర కొత్త డీఎస్పీగా ఐపీఎస్ అధికారి

బదిలీ అయిన ఐజీపీ వర్తికా కటియార్

బళ్లారి, న్యూస్‌టుడే: జనవరి 1న కాంగ్రెస్-భాజపా కార్యకర్తల మధ్య ఘర్షణ, అల్లర్లు, కాల్పులతో ఓ కాంగ్రెస్ సామాన్య కార్యకర్త మృతిచెందిన విషయం భాజపాకు ప్రధాన అస్త్రంగా మారింది. దీనిపై బళ్లారి జిల్లాలోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా శాంతిభద్రతలు లోపించాయనే ఆరోపణలు పెరిగిపోతున్నాయి. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టిన ముఖ్యమంత్రి శాంతిభద్రతలను నియంత్రణలోకి తీసుకుని రావడానికి పోలీస్ అధికారులపై బదిలీ వేటు వేస్తున్నారు. ఎస్పీగా పవన్ నెజ్జూరు బాధ్యతలు తీసుకున్న మరుసటి రోజే సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. బళ్లారి జిల్లా పోలీస్ విభాగం ఐజీపీ వర్తికా కటియార్‌ను కూడా బదిలీ చేసింది. ఈ ఇద్దరు పోలీస్ అధికారులు స్థానాల్లో సీఎం భద్రత, నిఘా వర్గాల విభాగంలో ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి డా. పి. ఎస్. హర్షను బళ్లారి పోలీస్ విభాగం ఐజీపీగా ఈ నెల 7న నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తరకన్నడ, కొడగు ఎస్పీగా, నిఘా విభాగం ఎస్పీగా విధులు నిర్వహించి ప్రజ్వల్ రేవణ్ణ కేసును దర్యాప్తు చేసిన ఎస్పీ సుమన్ పెన్నేకర్‌ను బళ్లారి ఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ నెల 8న బాధ్యతలు స్వీకరించారు. అదే క్రమంలో నగర డీఎస్పీగా ఉన్న చంద్రకాంత్ నందారెడ్డిని బదిలీ చేస్తూ ఆయన స్థానంలో యస్ కుమార్ శర్మను నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది.

నగరంలో శాంతి భద్రతలు లోపించడానికి డీఎస్పీ కారణమా?

బళ్లారిలో శాంతిభద్రతలు, మట్కా, పేకాట, క్లబ్బులు, గంజాయి, మాదక ద్రవ్యాలు రవాణా, రేషన్ బియ్యం నల్లబజార్‌కు తరలింపు తదితర అక్రమాలు ఇష్టారాజ్యంగా జరగడానికి నగర డీఎస్పీ చంద్రకాంత్ నందారెడ్డి మెతక వైఖరే కారణమని నగర వాసులే కాకుండా ప్రతిపక్ష పార్టీ అయినా భాజపా మొదటి నుంచి ఆరోపిస్తోంది. జనవరి 1న కూడా అల్లర్లు, కాల్పులు, ఘర్షణలు జరగడానికి నగర డీఎస్పీ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపిస్తున్నారు. సాయంత్రం ఘర్షణ తర్వాత రాత్రి 9 గంటలకు ఎమ్మెల్యే వాల్మీకి కూడలికి వచ్చి, సుమారు వేయిమందికి పైగా కార్యకర్తలు, అభిమానులతో మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి ఇంటి ముందుకు రాకుండా వాల్మీకి కూడలిలోనే నియంత్రణ చేసి ఉంటే ఘర్షణకు అవకాశం ఉండేది కాదు. ఎమ్మెల్యే వాల్మీకి కూడలి నుంచి ప్రదర్శనగా వస్తున్న సమయంలో డీఎస్పీ చంద్రకాంత్ నందారెడ్డి వెంట తీసుకుని వస్తున్నట్లు వీడియోలు భాజపా విడుదల చేసింది. డీఎస్పీని సస్పెండ్ చేయాలి. లేకుంటే తక్షణమే బదిలీ చేయాలని పట్టుపట్టింది. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి, నగర డీఎస్పీగా ఐపీఎస్ అధికారిని నియమించింది.

సస్పెన్షన్‌కు గురైన ఎస్పీ పవన్ నెజ్జూరు

నూతన డీఎస్పీగా యస్ కుమార్ శర్మ

2023 ఐ.పి.ఎస్ బ్యాచ్‌కు చెందిన యస్ కుమార్ శర్మ తుమకూరు సబ్ డివిజన్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. నగరంలో లోపించిన శాంతిభద్రతలు, అక్రమాలను అరికట్టడానికి యువ ఐపీఎస్ అధికారిని ప్రభుత్వం నియమించింది. ఏఎస్పీగా పదోన్నతి పొందినా. ..బళ్లారి నగర డీఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

బళ్ళారి
● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

భక్తిశ్రద్ధలతో మల్లికార్జునుడికి పూజలు

పూజలు చేస్తున్న శివ స్వాములు

మాన్వి, న్యూస్‌టుడే : సిరివార పట్టణం లోని సుత్తూరుమఠంలో శివరాత్రిని పురస్కరించుకుని శ్రీశైలమల్లికార్జునుడి శివ స్వాముల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువు సోమశేఖరయ్యస్వామి సమాధి వద్ద పూజలు చేశారు. విజయ మహంతేశస్వామి సుత్తూరుమఠం, స్థానిక ప్రముఖులతో 70 మంది మాలధారులు పాల్గొన్నారు.

మహా సంఘసంస్కర్త శివయోగి సిద్ధరామేశ్వరులు

కొప్పళలో శివయోగి చిత్రపటానికి పుష్పార్చన చేస్తున్న ఇమ్మడి సిద్ధరామేశ్వరస్వామి

గంగావతి, న్యూస్‌టుడే: శివయోగి సిద్ధరామేశ్వరులు సమాజం లోని అసమానతలపై గళమెత్తిన గొప్ప సంఘసంస్కర్త అని బోవి గురుపీఠం పీఠాధిపతి సిద్ధరామేశ్వరస్వామి అన్నారు. ఆయన మంగళవారం కొప్పళలో సిద్ధరామేశ్వర జయంతిలో పాల్గొని మాట్లాడారు. తన వచనాలతో ఆయన సమాజంలో వెలుగులు నింపారన్నారు. తన కులవృత్తితో ఆయన పలు చెరువులు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వడ్డెర్ల సంఘం అధ్యక్షుడు సుంకప్ప మాలగిత్తి, ప్రతినిధులు మాస్తెప్ప, రామణ్ణ అళవండి, లక్ష్మణ పూజార్ పాల్గొన్నారు.

బాల గౌరవ పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

బళ్లారి, న్యూస్‌టుడే: కర్ణాటక బాల వికాస్ అకాడమీ-2024-25, 2025-26 ఏడాదిలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక విజయాలు సాధించిన 18 ఏళ్ల పిల్లలకు 'బాల గౌరవ పురస్కారం' కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. పిల్లలు క్రీడలు, సంగీతం, నృత్యం, బహుముఖ ప్రజ్ఞ, నటన, చిత్రలేఖనం, సైన్స్ పరిశోధన వంటి ఏదైనా రంగాల్లో అసాధారణ విజయాలు సాధించిన వారై అర్హులు. ఆ పిల్లలు అకాడమీ బాలగౌరవ పురస్కారానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంబంధిత అధికారి తెలిపారు. ఆసక్తి గల బాలురు పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను ఫిబ్రవరి 20 లోపు కర్ణాటక బాల వికాశ అకాడమీ యోజనాధికారి కార్యాలయం, కె. హెచ్. బి.కాలనీ, లక్కమ్మనహళ్లి, దర్వాడ జిల్లా-580004కు సంప్రదించాలన్నారు.

పట్టు పెంపకంలో పురస్కారానికి..

హొసపేటె, న్యూస్‌టుడే: పట్టు పెంపకంలో ప్రగతి సాధించిన రైతులకు పురస్కారం ప్రదానం చేయటానికి దరఖాస్తులను ఆహ్వానించామని పట్టు పెంపకం శాఖ సహాయక సంచాలకుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులు సమర్పించే రైతులు కనీస ఎకరా పొలంలో పట్టు పెంపకం చేసుండాలి. ఎకరానికి కనీసం 500 కిలోల పట్టగూళ్లను పెంచుండాలి. అలాంటి వారు ఫిబ్రవరి 5లోగా దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

సమ్మెబాట పట్టిన ఉద్యోగులు

➤ మూతపడిన బ్యాంకులు ➤ ఏటీఎంల్లో నెలకొన్న రద్దీ

నిరసన తెలుపుతున్న బ్యాంకు సంఘాల సభ్యులు, ఉద్యోగులు

బళ్లారి, న్యూస్‌టుడే: ఏళ్ల తరబడి ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బ్యాంకు ఉద్యోగులు వివిధ సంఘాల నేతృత్వంలో మంగళవారం విధులు బహిష్కరించి సమ్మె బాటపట్టారు. దీంతో ప్రభుత్వరంగ బ్యాంకులన్నీ మూతపడ్డాయి. బ్యాంకు ఖాతాదారులు ఇబ్బందులు పడ్డారు. ఏటీఎంలు రద్దీగా కనిపించాయి. బ్యాంకు వివిధ సంఘాలతో పాటు కార్మిక సంఘాల సభ్యులు ఆర్.ఘనమల్లి, సూరాజ్, ఎఫ్.మంజుల, డి.రామకృష్ణ, ప్రవీణ్‌కుమార్, శివరాజ్, సి.ఐ.టి.యు.కార్యదర్శి సత్యబాబు, దేవానంద, డాక్టర్.ప్రమోద్, కర్ణాటక గ్రామీణ బ్యాంకు నుంచి శరణగౌడ పాటిల్, ప్రదీప్ తదితరులు సభ్యులు, ఉద్యోగులు ఎస్.బి.ఐ ప్రధానశాఖ ముందు నిరసన తెలిపి, అక్కడ నుంచి స్టేషన్ రహదారి మీదుగా గడిగి చెన్నప్ప కూడలికి చేరుకుని ఆందోళన చేపట్టారు. సభ్యులు మాట్లాడుతూ వారంలోని ఏడు రోజుల్లో ఐదు రోజులు పని చేస్తాం. వారానికి రెండు రోజుల సెలవివ్వాలని డిమాండ్ చేశారు. వారంలో ఆరు రోజులకు కేటాయించిన సమయాన్ని ఈ ఐదు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. దీనిపై ఇప్పటికే కేంద్ర ఆర్థికమంత్రి కూడా సానుకూలంగా స్పందించినా.. రెండేళ్లుగా పక్కన పెట్టారని విమర్శించారు. పదేళ్లుగా ఉన్న డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కేంద్ర కమిటీ ఆదేశాలు మేరకు విధులు బహిష్కరించి సమ్మెబాట పట్టినట్లు తెలిపారు. అనంతరం గడిగి చెన్నప్ప కూడలి నుంచి నగరంలో పలు ప్రధాన కూడళ్ల మీదుగా ఎస్.బి.ఐ బ్యాంకుకు చేరుకుని నిరసన తెలిపారు. ప్రైవేట్ బ్యాంకులు మినహా మిగిలిన జాతీయ, గ్రామీణ బ్యాంకులు మూతపడటంతో చాలా వరకు ఆర్థిక లావాదేవీలు స్తంభించాయి. సాయంత్రానికి నగదు అయిపోవడంతో ఏటీఎంలు కూడా మూతపడ్డాయి.

కర్ణాటక గ్రామీణ బ్యాంకు అధ్యక్షుడికి వినతిపత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

బళ్లారి, న్యూస్‌టుడే: కర్ణాటక గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు, అధికారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కర్ణాటక గ్రామీణ బ్యాంకు ముందు సమ్మెలో పాల్గొని నిరసన తెలిపారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ (యూఎఫ్‌బీయూ)కు మద్దతు ప్రకటిస్తూ సంఘం సభ్యులు శరణగౌడ బీరాదార్, ప్రదీప్, కీర్తిరాజ్ హెడ్కల్, గంగణ్ణ పత్తార్ తదితరులు బ్యాంకు అధ్యక్షుడికి వినతిపత్రం అందించారు.

కాంగ్రెస్ సామాజిక మాధ్యమం జిల్లాధ్యక్షుడి నియామకం

ఎర్రిస్వామి

హొసపేటె, న్యూస్‌టుడే: కాంగ్రెస్ సామాజిక మాధ్యమ విభాగం విజయనగర జిల్లాధ్యక్షుడిగా బి.ఎర్రిస్వామిని నియమిస్తూ ఆ విభాగం రాష్ట్రాధ్యక్షుడు సిద్ధహళ్లేగౌడ ఆదేశాలు జారీ చేశారు. యువజన కాంగ్రెస్‌లో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తున్న ఆయన చురుకుదనాన్ని గుర్తించి బాధ్యతలు అప్పగించామని రాష్ట్రాధ్యక్షుడు ఆదేశాల్లో తెలిపారు. ఎర్రిస్వామిని పలువురు కాంగ్రెస్ నాయకులు అభినందించారు.

విజ్ఞానమేళాలో అత్యుత్తమ ప్రదర్శనకు పురస్కారం

ఉత్తమ గణిత ఉపాధ్యాయ పురస్కారం అందుకుంటున్న ఆనంద్ ఆశ్రిత్

గంగావతి, న్యూస్‌టుడే: దక్షిణ భారత విజ్ఞాన మేళాలో కొప్పళ బాలికల ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఆనంద్ ఆశ్రిత్‌కు ఉత్తమ గణిత ఉపాధ్యాయ పురస్కారం లభించింది. ఈ విజ్ఞానమేళా తెలంగాణలోని సంగారెడ్డిలో ఈ నెల 19 నుంచి 23 వరకు నిర్వహించారు. ఆరు రాష్ట్రాలకు చెందిన 60 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వృత్తాల పరికల్పన సిద్ధాంతాలను ఆయన నమూనాలతో ప్రదర్శించినందుకు ఆయనకు ఈ పురస్కారం లభించింది. ఉపాధ్యాయుడి సాధనను కొప్పళ జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర్‌గౌడ ప్రశంసించారు.

పాఠశాలకు కుర్చీల కానుక

విద్యార్థుల కోసం దాతలు అందించిన సామగ్రి

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: శ్రీరామనగర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల్లోని ఒకటి నుంచి మూడో తరగతి విద్యార్థుల కోసం దాతలు కుర్చీలు వితరణ చేశారు. రామ సుబ్బయ్యనాయుడు రూ.11 వేలు, గ్రామ పంచాయతీ సభ్యుడు మహబూబ్ రూ.11 వేలు, నిర్మల తుంగభద్ర అభియాన్ ప్రతినిధులు రూ. 13,100, క్లీన్ అండ్ గ్రీన్ ఫోర్స్ సభ్యులు ఇతర దాతలు అందించిన రూ. 15 వేలు మొత్తం రూ.50 వేలతో 70 కుర్చీలు, 20 బల్లలు ఇచ్చారు.

చోరీ సొత్తు యజమానికి అప్పగింత

యజమాని మహంతేశ్‌కు వెండి వస్తువులను అప్పగిస్తున్న పీఎస్ఐ మహేశ్ గౌడ

చెళ్లకెర (చిత్రదుర్గ), న్యూస్‌టుడే: హిరియూరు తాలూకా మేటికుర్కి గ్రామానికి చెందిన మహంతేశ్ ఇంట్లో చోరీకి గురైన సుమారు రూ.2.50 లక్షల విలువ గల 1.300 కిలోల వెండి వస్తువులను యజమానికి పోలీసు అధికారులు అప్పగించారు. మంగళవారం హిరియూరులోని రూరల్ పోలీసు ఠాణా కార్యాలయంలో సబ్ ఇన్‌స్పెక్టర్ మహేశ్ గౌడ మహంతేశ్‌కు వెండి చెంబు, లోటాలు తదితర వస్తువులను ఇచ్చారు. గత సంవత్సరం మహంతేశ్ ఇంట్లో చోరీకి గురైన వస్తువులను నిందితుల వద్ద నుంచి స్వాధీనం చేసుకొని కోర్టు అనుమతితో అతనికి అప్పగించినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

29న శ్రీనివాస కల్యాణం

సాలుంచిమర క్యాంపు (కారటగి), న్యూస్‌టుడే: కారటగి తాలూకా సాలుంచిమర క్యాంపులోని శ్రీనివాస ఆలయంలో 29న శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నారు. కల్యాణోత్సవంలో భాగంగా మంగళవారం అంకురార్పణ, ధ్వజారోహణం, గరుడ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు జరిగాయి. విగ్రహాలను అలంకరించి వివిధ పూజలు ఆచరించారు. 29న శ్రీనివాస కల్యాణం, సామూహిక వివాహాలు జరుగుతాయని ఆలయ సమితి ప్రతినిధులు తెలిపారు. వచ్చే నెల 3 వరకు ఆలయంలో ధార్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం
పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

27-01-2026 (ఉ. 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1603.96	1618.46
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	000	000
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	530	11,136
నీటి నిల్వ (టి.ఎం.సి)	27.082	57.119
గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు)	వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు	

వైభవంగా కోటి కుంకుమార్చనలు

అభిషేక పూజలు చేస్తున్న భక్తులు

సింధనూరు, న్యూస్‌టుడే: చన్నళ్లి సమీపంలోని గణేశ్ క్యాంపులో శతచండీ, మహారుద్ర సమేత కోటి కుంకుమార్చనలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. 11 రోజుల పాటు తలపెట్టిన ఈ పూజా కార్యక్రమాలకు తాలుకా వ్యాప్తంగా అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఈ వేడుకలు ఈ నెల 29 వరకూ జరగనున్నాయి. మా క్యాంపులో లక్కమ్మదేవి గుళ్లో కొలువుతీరి 70 ఏళ్లుగా మమ్మల్ని కామధేనువు కాపాడుతోందని క్యాంపు జనం మహిమాన్వితురాలి గొప్పతనాన్ని చాటుతున్నారు. వేడుకల్లో భాగంగా మంగళవారం వేద పండితులు శ్రీ సిద్ధి, బుద్ధి సమేత మహాగణపతి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా ఆచరించారు. 28న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం, 29న లక్ష బిల్వార్చన, మహా పూర్ణాహుతి, అదే రోజు సాయంత్రం శివ పార్వతుల కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు క్యాంపు ప్రజలు వెల్లడించారు.

ఉత్సవాన్ని విజయవంతం చేద్దాం

గోడపత్రికలను విడుదల చేస్తున్న అధికారులు

సిరివార, (మాన్వి) : ఫిబ్రవరి 5 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న రాయచూరు ఉత్సవాన్ని విజయవంతంగా చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ అశోక్ పవార్ సూచించారు. జిల్లా ఉత్సవ ప్రచార పత్రికలను, గోడపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో ఉత్సవం నిర్వహణ విషయమై ప్రజలతో మాట్లాడాలని, అందరూ పాల్గొనేటట్లు చూడాలని సూచించారు. మూడు రోజుల ఉత్సవంలో కన్నడతనం ఉట్టిపడేవిధంగా కార్యక్రమాల రూపకల్పన జరుగుతుందన్నారు. జిల్లా యంత్రాంగం విడుదల చేసిన క్యూఆర్ కోడ్‌ని వినియోగించుకుని పేర్లని నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ పంచాయతీ అధ్యక్షుడు హాజిచౌద్రి, ఉపాధ్యక్షురాలు లక్ష్మీ, ముఖ్యాధికారి సురేష్ శెట్టి, టీపీఈఓ శశిధర్‌స్వామి, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆరిఫ్‌మియా, ఎస్ఐ అజ్మీర్‌పాషా పాల్గొన్నారు.

దొడ్డ బసవేశ్వర జాతరకు 30 క్వింటాళ్ల బియ్యం

వాహనంలో తరలిస్తున్న బియ్యం

కంప్లి, న్యూస్‌టుడే: విజయనగర జిల్లా హగరి బొమ్మనహళ్లి తాలూకా నందీపురలో 28న జరగనున్న శ్రీగురు దొడ్డ బసవేశ్వర జాతర, సామూహిక వివాహాల అన్న సంతర్పణకు కంప్లి నుంచి మంగళవారం 30 క్వింటాళ్ల బియ్యం పంపించారు. కంప్లి, బెళగోడు హాళ గ్రామాల భక్తులు వాహనంలో బియ్యాన్ని తరలించారు. కె.ఎం.హేమయ్య స్వామి, గరడి వీరణ్ణ, అంగడి వీరభద్రప్ప, నందీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయన మాట మంచి బాట

సవితా మహర్షి చిత్ర పటంతో ఊరేగింపు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: సవితా మహర్షి జయంతిని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. సముదాయం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ప్యాటి ఆంజనేయ స్వామి దేవస్థానం నుంచి సవితా మహర్షి చిత్రపటంతో పట్టణ ప్రధాన రహదారులు, కూడళ్ల మీదుగా తాలూకా క్రీడా మైదానం వరకు ఊరేగింపు నిర్వహించారు. సవితా సమాజం తాలూకా అధ్యక్షుడు వీరేంద్ర మాట్లాడుతూ ఆదర్శ సమాజ నిర్మాణానికి కృషి చేసిన మహనీయుడు సవితా మహర్షి జయంతిని ప్రభుత్వం ఏటా జనవరి 25న ఆచరిస్తుందన్నారు. ఆయన సందేశాలను ప్రజలకు చేరవేసి తాము కూడా ఆ మార్గంలో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. గౌరవ అధ్యక్షుడు ప్రకాశ్, ఉపాధ్యక్షుడు యోగిరాజ్, కార్యదర్శి అంబరీశ్, కోశాధికారి జగదీశ్, సమాజం సభ్యులు పాల్గొన్నారు.

మే లోగా గేట్లు బిగించరూ!

తుంగభద్ర మండలి కార్యదర్శి రామకృష్ణారెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న రైతు సంఘం ప్రముఖులు

హొసపేటె, న్యూస్‌టుడే: ఇచ్చిన గడువు ప్రకారం మే లోగా తుంగభద్రకు కొత్త గేట్ల బిగింపు పనులు పూర్తి చేయాలని కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం, హరిత సేన ప్రముఖులు తుంగభద్ర మండలి కార్యదర్శి రామకృష్ణారెడ్డిని కోరారు. మంగళవారం వారు కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రాధ్యక్షుడు మాధవరెడ్డి మాట్లాడుతూ 2025-26లో రబీ పంటలకు నీరివ్వకపోవడంతో ఆయకట్టు రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూశారు. ఈ ఏడాదిలో మే నెలలోగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గేట్ల బిగింపు పనులు పూర్తి చేసి ఖరీఫ్‌కు తొందరగా సాగునీరు విడుదల చేయాలని కోరారు. రెండూ రాష్ట్రాల నుంచి కావాల్సినంత నిధులు విడుదల చేయించి, పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రముఖులు వెంకట చైతన్య, రాఘవేంద్ర, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

నాయకనహట్టి తిరునాళ్లకు రూ.10 లక్షల నిధులు

సమీక్ష సభను ప్రారంభించిన జిల్లా బాధ్యమంత్రి సుధాకర్

చెళ్లకెర (చిత్రదుర్గ): రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన తాలూకాలోని నాయకనహట్టి తిప్పేరుద్రస్వామి తిరునాళ్ల కార్యక్రమాల ఏర్పాట్లు చేసుకోవడానికి రూ.10 లక్షల నిధుల్ని సమకూర్చినట్లు స్థానిక ఎమ్మెల్యే ఎన్వై గోపాలకృష్ణ తెలిపారు. సోమవారం సాయంత్రం నాయకనహట్టిలో నిర్వహించిన తిప్పేరుద్రస్వామి తిరునాళ్ల ఏర్పాట్ల సమీక్ష సభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఫిబ్రవరి 27 నుంచి మార్చి 9 వరకు తిరునాళ్ల కార్యక్రమాలు జరుగనున్నట్లు తెలిపారు. మార్చి 6న బ్రహ్మ రథోత్సవం నిర్వహించగలరన్నారు. సభలో చెళ్లకెర ఎమ్మెల్యే టి రఘుమూర్తి, చిత్రదుర్గ ఎమ్మెల్యే కెసి వీరేంద్ర, జిల్లా పాలనాధికారి వెంకటేశ్, ఎస్పీ రంజిత్‌కుమార్ బండారు, అదనపు జిల్లా పాలనాధికారి కుమారస్వామి, దేవాలయం సీఈఓ గంగాధర్, పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు మంజుల పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్ పేరుతో రూ.16.82 లక్షలకు టోకరా

బళ్లారి, న్యూస్‌టుడే: స్టాక్ మార్కెట్లో అధిక లాభాలు ఇస్తామని చెప్పి నగరానికి చెందిన ఓ వ్యక్తిని రూ.16.82లక్షలు మోసం చేశారు. సోమవారం బళ్లారి సీఈఎన్(సైబర్ ఎకనామిక్, నార్కోటిక్స్) పోలీస్‌స్టేషన్‌లో ఈ కేసు నమోదైంది. ఫిర్యాదుదారుడి వాట్సప్‌లో గత నెలలో తెలియని నంబరు నుంచి స్టాక్ మార్కెట్‌కు సంబంధించిన ప్రకటన వచ్చింది. దానిపై క్లిక్ చేసిన వ్యక్తి ఒక గ్రూపులో చేరాడు. అక్కడ స్టాక్ మార్కెట్ గురించి సమాచారం వస్తున్నట్లు చెప్పారు. ఆపై 15 శాతం లాభం ఇస్తానని ప్రలోభపెట్టి రూ. 16,82,047 దశల వారీగా డిపాజిట్ చేశాడు. అయితే ఇది మోసపూరిత నెట్‌వర్క్ అని తెలుసుకున్న వ్యక్తి సీఈఎన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదురుడు తన బంధువుల నుంచి కూడా డబ్బు తీసుకొని అందులో పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తోంది. దీనిపై సీఈఎన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

తల్లిని కడతేర్చిన తనయుడు

చంద్రవ్వ

లింగసుగూరు, (మాన్వి) : ముద్గల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జక్కేరుమడు తండాకు చెందిన కుమార్ అనే యువకుడు భార్యతో కలిసి బెంగళూరు పనిచేసుకుంటున్నాడు. డబ్బు అవసరమైనప్పుడు తండాకు వచ్చి తల్లి చంద్రవ్వ (45)తో డబ్బులు తీసుకుని వెళ్లేవాడు. ఆదివారం గ్రామానికి వచ్చిన కుమార్ రూ.2 లక్షల కావాలంటూ తల్లితో గొడవపడి ఇంటి పైరేకులు బద్దలు కొట్టి వెళ్లిపోయాడు. సోమవారం మద్యం సేవించి తల్లివద్దకు వచ్చి.. తాను బెంగళూరు వెళ్లిపోవాలని డబ్బులివ్వాలని ఒత్తిడి తెచ్చి..ఆవేశంతో తల్లి జుట్టుపట్టుకుని ఈడ్చుకుంటూ ఆమె తలకు గోడకేసి మోదాడు. తర్వాత రాయితో తలపై గట్టిగా కొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయింది. రాయచూరు ఎస్పీ అరుణాంగ్షుగిరి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ముద్గల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని కుమార్‌ను అరెస్టు చేశారు.

కోర్టు ఆదేశాల మేరకు న్యాయం చేయాలి

బళ్లారి: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ శాఖాధికారులు నిబంధనలు పాటిస్తూ దళిత, గిరిజనులకు న్యాయం చేయాలని పి.టి.సి.ఎల్ చట్టం భూమి వంచితర పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం నగరంలో ఆందోళన నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అదనపు జిల్లా పాలనాధికారి మహమ్మద్ ఝుబేరకు అందజేసి సమస్యలను వివరించారు. గతంలో దళిత, గిరిజన రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన భూమిని వేర్వేరు వ్యక్తులకు విక్రయించుకున్నా వాటిని తిరిగి వారికే చేయించాలని కోర్టు ఆదేశాలు స్పష్టంగా ఉన్నా రెవెన్యూ శాఖాధికారులు కోర్టు నిబంధనలు పాటించడం లేదని ఆరోపించారు. కోర్టు ఆదేశాలను రెవిన్యూశాఖాధికారులు మరోసారి పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. సిద్ధన్న తదితరులు పాల్గొన్నారు.

జీపీ సభ్యుల అధికార వ్యవధి పొడిగించాలని వినతి

శాసనసభ్యుడు నాగరాజుకు వినతిపత్రం అందిస్తున్న గ్రామ పంచాయతీ సమాఖ్య మాజీ సభ్యులు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీ సభ్యుల అధికార వ్యవధి పొడిగించి గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందించాలని గ్రామ పంచాయతీ మహా సమాఖ్య ప్రతినిధులు శాసనసభ్యుడు బి.ఎం. నాగరాజుని కోరారు. సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాగేవాడీ పంపాపతి ఆధ్వర్యంలో సభ్యులు సోమవారం శాసనసభ్యుడు బి.ఎం.నాగరాజుని కలిసి మార్చి చివరి నాటికి పంచాయతీల అధికారం పూర్తవుతుంది. దీంతో పంచాయతీలో అభివృద్ధి పనులు స్తంభిస్తాయి. 2020లో కోవిడ్‌తో పంచాయతీల అధికారం పూర్తయినప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కేపీసీసీ అధ్యక్షుడు ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ నాడు ప్రతిపక్ష నేతల హోదాలో పంచాయతీ సభ్యుల అధికార గడువు పొడిగించాలని నాటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని శాసనసభ్యుడు బి.ఎం.నాగరాజుకి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వివిధ పంచాయతీల అధ్యక్షులు, సభ్యులు రారావి యల్లప్ప, వీరేశ్, బసవరాజ్, సణ్ణరామణ్ణ, ఉప్పళప్ప, హనుమంత ఇతర సభ్యులు పాల్గొన్నారు.

గూడ్స్ ఆటోను ఢీకొన్న బస్సు

8 మంది విద్యార్థులకు గాయాలు

దెబ్బతిన్న ఆటో

చెళ్లకెర (చిత్రదుర్గ), న్యూస్‌టుడే: విద్యార్థులను ఎక్కించుకొని వేగంగా ప్రయాణిస్తున్న గూడ్స్ ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో 8 మంది గాయపడినట్లు పోలీసు అధికారులు తెలిపారు. మంగళవారం వారు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని శరణబసవేశ్వర ఉన్నత పాఠశాలకు చెందిన 16 మంది విద్యార్థులను గూడ్స్ ఆటోలో ఎక్కించుకొని ఆటల మైదానానికి తీసుకెళ్తున్నారు. బస్సు డిపో నుంచి బస్టాండుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొంది. దీంతో ఆటోలోని 8 మంది విద్యార్థులకు గాయాలు తగిలాయి. వెంటనే వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఘటనా స్థలాన్ని అదనపు జిల్లా ఎస్పీ శివకుమార్ సందర్శించారు. పట్టణ పోలీసు ఠాణాలో కేసును నమోదు చేసుకొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై..

ఉన్నతాధికారులతో ఐజీపీ సమావేశం

ఉక్కుపాదం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి పోలీస్ విభాగం ఐజీపీ పి.ఎస్.హర్ష నేతృత్వంలో జిల్లాకు చెందిన సీనియర్ పోలీస్ అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇకపై చట్ట వ్యతిరేక కార్యకలాపాలను సమూలంగా అరికట్టాలని సూచించారు. సోమవారం బళ్లారి వైద్య కళాశాల, పరిశోధన కేంద్రం క్రీడామైదానంలో మంత్రి రహీంఖాన్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో నగరంలో మాదక ద్రవ్యాలు విక్రయాలు, మట్కా, పేకాట, క్లబ్‌లు, రేషన్ బియ్యం అక్రమంగా నల్లబజార్‌కు తరలిపోవడంపై విలేకరులు ప్రశ్నలు వర్షం కురిపించారు. పోలీసువిభాగానికి అసలైన సవాలుగా మారిన ఈ అంశాలపై ఐజీపీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని జిల్లా పోలీసుఅధికారి సుమన్ పెన్నేకర్, ఏఎస్పీలు రవికుమార్, నవీన్‌కుమార్, నగర డీఎస్పీ చంద్రకాంత్ నందారెడ్డితో తదితర అధికారులతో సమావేశం నిర్వహించారు. గంజాయితో పాటు మాదకద్రవ్యాలను రవాణా చేసేవారు, విక్రయించే వారిని గుర్తించాలి. కళాశాల ప్రధానాచార్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఆహ్వానించి మాదకద్రవ్యాలు, గంజాయి వంటి వాటిపై అవగాహన కల్పించాలి. ఈ దందా విద్యా సంస్థల్లో చొరబడకుండా జాగ్రత్త పడాలని గట్టిగా సూచించాలి. మట్కా, పేకాట, క్లబ్బులను మూసివేయించాలన్నారు.

★ **కేసులు నమోదు కన్నా నిరూపణ ముఖ్యం:** ఇలాంటి కేసుల్లో నమోదు, అరెస్టు, నగదు, వస్తువుల స్వాధీనంతో పాటు కోర్టులో నిరూపణ అయ్యేలా పోలీస్‌శాఖ సమర్థంగా వ్యవహరించాలి. దీనికి అదనంగా దర్యాప్తు నిర్వహించాలని ఐజీపీ సూచించారు.

★ **ఎన్‌సీబీతో కూడా చర్చ:** దేశంలోని అత్యున్నత మాదకద్రవ్యాల చట్టం అమలు సంస్థ, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్.సి.బి) ఈ విషయంలో సహకారం కోరినట్లు ఐజీపీ అధికారులకు తెలిపారు. ఈ విషయంపై లోతైన జ్ఞానం ఉన్న సీఐడీ సహా రాష్ట్రంలోని బృందాలను సంప్రదించాలని వారికి సూచించినట్లు తెలిపారు.

ప్రజల సహకారం చాలా ముఖ్యం

మాదకద్రవ్యాల నియంత్రణ కోసం శాఖాధికారులు, సిబ్బందిని బలోపేతం చేయడంతో పాటు, ప్రజలు నుంచి సమాచారాన్ని పొందడానికి ప్రయత్నిస్తున్నాం. ప్రజలు వాట్సప్ నంబర్‌కు సమాచారం పంపొచ్చు. లేదా వారి జిల్లా పోలీసువిభాగానికి కాల్ చేసి సమాచారం అందించొచ్చు. - **పి.ఎస్. హర్ష, ఐజీపీ, బళ్లారి పోలీస్ విభాగం**

అందరి సహకారంతో అభివృద్ధి

పాఠశాల సమితి నూతన అధ్యక్షుడు తిప్పేస్వామి

కంప్లి, న్యూస్‌టుడే: అందరి సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని 10. ముద్దాపుర ఎల్లమ్మ క్యాంపు పాఠశాల అభివృద్ధి సమితి నూతన అధ్యక్షుడు దమ్మూరు తిప్పేస్వామి తెలిపారు. పాఠశాల ఆవరణలో మంగళవారం జరిగిన విద్యార్థులు తల్లిదండ్రుల సమావేశంలో అభివృద్ధి సమితి కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. ఉపాధ్యక్షుడిగా దొడ్డ నింగప్ప వాల్మీకి ఇతర సభ్యులు ఎన్నికయ్యారు. ప్రధానోపాధ్యాయుడు వెంకోబప్ప, కరవే (నారాయణ గౌడ) తాలూకా అధ్యక్షుడు బళె మల్లికార్జున, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవం మరపురాని మైలురాయి

స్వర్ణోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రమేశ్‌నాయుడు, పూర్వ విద్యార్థులు

సింధనూరు, న్యూస్‌టుడే: ఏ సంస్థకైనా 50 వసంతాల పర్యటన ఓ మైలురాయి. ఇంతటి సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో అనుభూతులు, జ్ఞాపకాలు పెనవేసుకుని ఉంటాయని బళ్లారి విమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్.సంగప్ప అన్నారు. సింధనూరు సమీపంలోని శ్రీపురం కూడలిలో గల బాలాజీ ఉన్నత పాఠశాల్లో మంగళవారం స్వర్ణోత్సవ వేడుకను ఆచరించింది. సంస్థ యాజమాన్యం ఈ వేడుకకు దేశ విదేశాల్లో ఉన్న పూర్వ విద్యార్థులను ఆహ్వానించి వారి తల్లిదండ్రులనూ సత్కరించింది. కార్యక్రమాన్ని సంస్థ వ్యవస్థాపకుడు రమేశ్‌నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..లాభాపేక్ష లేకుండా విలువలతోనే ఈ సంస్థను నడిపించానన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పూర్వ విద్యార్థి డాక్టర్ సంగప్ప ఈ బడి మాకు ఎన్నో నేర్పింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంస్థ కార్యదర్శి ఆనంద నాయుడు మాట్లాడుతూ..మా పెద్దలు మాకు అందించిన ఈ సంస్థ స్వర్ణోత్సవ మైలురాయిని దాటడం ఆనందంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో అరుణ్ నాయుడు, ప్రధానోపాధ్యాయిని జరీనా బేగం, ఉపాధ్యాయులు దేవేంద్రప్ప, నిషాద్ పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

ఆంధ్రప్రదేశ్ నిధులిస్తే.. రాష్ట్రం నిలిపేసింది!

- రూ.10 కోట్లు ఎందుకు ఆపారు?
- బోర్డు కార్యదర్శి ఆర్థికశాఖకు లేఖ

గేట్లను అమరుస్తున్న నిపుణులు

బళ్లారి, న్యూస్‌టుడే

కర్ణాటక-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల బహుళార్ధ సాధక ప్రాజెక్టయిన తుంగభద్ర జలాశయం క్రస్ట్ గేట్లు మార్పు కోసం నియమించిన సిబ్బంది వేతనం, రవాణా, ఇతర ఖర్చుల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన రూ. 35.62 కోట్లలో రూ. 10కోట్లను కర్ణాటక ప్రభుత్వం నిలిపివేసిందని తుంగభద్ర బోర్డు కార్యదర్శి ఓ.ఆర్.కె. రెడ్డి ఆరోపించారు. ఈ విషయమై ఆయన రాష్ట్ర ఆర్థికశాఖ అదనపు ప్రధాన కార్యదర్శికి ఒక లేఖ రాశారు. ఈ లేఖ 'న్యూస్‌టుడే'కి లభించింది. ఈ లేఖను తుంగభద్ర మండలి ఛైర్మన్‌కు కూడా పంపారు. జలాశయాలు గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు జనవరి 22న తుంగభద్ర జలాశయం సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.10 కోట్లను ఉపసంహరించుకున్నారని, దీని వల్ల పనులు మరింత ఆలస్యం కావచ్చని హెచ్చరించారు. తాజాగా బోర్డు కార్యదర్శి రాసిన లేఖ కన్నయ్యనాయుడు పేర్కొన్న విషయాలకు బలాన్ని చేకూరుస్తోంది.

తుంగభద్ర జలాశయం

లేఖలో ఏముంది

తుంగభద్ర ఆయకట్టు నిర్వహణ, కుడి కాలువ (ఎల్లెల్సీ) కాలువలు మరమ్మతులు, ఇతర ఖర్చుల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏటా రూ.390.66 కోట్లు అందిస్తుంది. ఈసారి క్రస్ట్‌గేట్ల ఏర్పాటుకు అవసరమైన సామగ్రి, కొనుగోలు కోసం 2025 నవంబరు 26న కర్ణాటక సంరక్షణలో ఉన్న తుంగభద్ర బోర్డు ఖాతాకు రూ.20కోట్లు బదిలీ చేసింది. ఆ సమయంలో కర్ణాటక కూడా ఈ ఖాతాకు రూ.10 కోట్లు బదిలీ చేసింది. సిబ్బంది వేతనాలు, రవాణా, ఇతర ఖర్చుల కోసం తుంగభద్ర మండలి ఖాతాకు ఏపీ ప్రభుత్వం డిసెంబరు 17న రూ.35.62 కోట్లు అందించింది. రాష్ట్ర ప్రభుత్వం తన కోశాగార శాఖకు రూ. 25.62 కోట్లు మాత్రమే జమ చేయాలని ఆదేశించింది.

ముందు ఏపీ ప్రభుత్వమే వ్యయాన్ని భరించాలి

ఆయకట్టుకు సంబంధించిన అన్ని ఖర్చులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మొదట భరించాలి. తర్వాత తుంగభద్ర మండలిని నియంత్రించే కేంద్ర జల సంఘం రాష్ట్రాల మధ్య ఖర్చులను పంపిణీ చేస్తుంది. దీని ప్రకారం ఆంధ్రప్రభుత్వం ఇప్పటికే రూ.55.62 కోట్లు చెల్లించింది.

అధికారులు నేరుగా మాట్లాడలేరు



తుంగభద్ర జలాశయం గేట్లు విషయంలో నిధుల కొరతపై నేరుగా మాట్లాడలేరు. కాబట్టి నేనే చెప్పాల్సి వచ్చింది. నన్ను నిందించడానికి బదులు కర్ణాటక ప్రభుత్వం తన వంతు బాధ్యతగా మూల్యం చెల్లించాలి

- కన్నయ్య నాయుడు, ఇంజినీరింగ్ నిపుణుడు

భార్య వెళ్లిపోయిందని ఆత్మహత్య

దావణగెరె, న్యూస్‌టుడే: వివాహమైన రెండు నెలల్లోనే భార్య మరో యువకునితో వెళ్లిపోయిందన్న వ్యథతో హరీశ్ (32) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గుమ్మనూరుకు చెందిన బాధితుడు రాసిన లేఖను దావణగెరె గ్రామీణ ఠాణా పోలీసులు స్వాధీనపరుచుకున్నారు. వివాహమైన కొద్ది రోజులకే తన భార్య తప్పుడు ఆరోపణలు చేసిందని, తనను హత్య చేస్తామని భార్య, అత్తింటి వారు బెదిరించారని ఆత్మహత్యకు ముందు రాసిన లేఖలో బాధితుడు పేర్కొన్నారు. తాను చేయించిన వివాహం ఇలా విషాదాంతమైందని లేచిపోయిన గృహిణి మేనమామ రుద్రేశ్ (55) కూడా తన ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నారు. రెండు కేసులను దావణగెరె గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

హత్యకేసులో నిందితుల అరెస్టు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకల సందర్భంలో చిన్న విషయానికే గొడవ పెట్టుకుని సుశాంత్ (35) అనే యువకుడిని హత్య చేసి, పరారైన నలుగురు నిందితులను దొడ్డబళ్లాపుర ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు బాశెట్టిహళ్లి వినాయకనగరకు చెందిన వారు. సిగరెట్టు అంటించుకునేందుకు అగ్గిపెట్టె ఇవ్వాలని కోరగా, తన వద్ద లేదని సుశాంత్ చెప్పాడు. దుకాణానికి వెళ్లి అగ్గిపెట్టె తీసుకురావాలని ఒత్తిడి చేయగా, తానెందుకు తీసుకురావాలని ప్రశ్నించాడు. ఉజ్వల్ ప్రసాద్, ప్రిన్స్, సూరజ్‌రామ్, ఒక బాలుడు కలిసి అతన్ని వెంటాడి దాడిచేశారు. ఒక భవంతి రెండవ అంతస్తు నుంచి కిందకు తోసి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన బాధితుడ్ని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించేలోగా మరణించాడు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా గాలింపు చేపట్టి మూడు వారాల అనంతరం నిందితులను అరెస్టు చేశారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: తన కుమారుడి నుంచి ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసిన తదుపరి రోజే వెంకోబా హంచినాళ (50) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. కొప్పళ జిల్లా కనకగిరి తాలూకా వరుణఖేడ గ్రామంలోని పొలంలో అతని మృతదేహాన్ని సోమవారం రాత్రి గుర్తించారు. ఆస్తి పంపకాలకు సంబంధించి, తన కుమారుడు బెదిరిస్తున్నాడని పోలీసులకు అతను ఫిర్యాదు చేశాడు. తన కుమారుని మరణానికి మనవడు, అతని భార్య, కోడలే కారణమని, విషాహారం పెట్టి హత్య చేశారని కనకగిరి ఠాణాలో వెంకోబా తల్లి సూరమ్మ ఫిర్యాదు చేసింది.

ఆందోళనలపై ఆంక్షల కత్తి

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే: రెండున్నరేళ్లుగా పెంచిన వేతన బకాయిల విడుదల, వేతన పెంపు, ఉద్యోగ భద్రత తదితర డిమాండ్లతో ఆర్టీసీ ఉద్యోగులు గురువారం 'బెంగళూరు చలో'కు పిలుపునిచ్చారు. విధులకు గైర్హాజరై, ఆందోళనలో పాల్గొంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ అక్రం పాషా హెచ్చరించారు. ప్రయాణికులకు రవాణా సేవల్లో సమస్య ఎదురైతే సిబ్బందికి వేతన కోతతో పాటు, ఇతర చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురు కాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని అక్రం పాషా వెల్లడించారు.

ఆలయాల్లో కళలను ప్రోత్సహించాలి

మండ్య, న్యూస్‌టుడే: జానపద కళలను ప్రోత్సహించేందుకు ప్రముఖ దేవాలయాలు ముందుకు రావాలని ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనాథ్ పిలుపునిచ్చారు. మేలుకోటె యతిరాజదాసర్ గురుపీఠం నిర్వహించిన జానపద మేళా ముగింపు వేడుకల్లో మాజీ మంత్రి సీఎస్ పుట్టరాజుతో కలిసి పాల్గొన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన కేఆర్ నీలకంఠం, సునీల్ కుమార్, చెన్నమాదేగౌడ, కుమార్‌లను సత్కరించి మాట్లాడారు. రామానుజుడి కర్మభూమి మేలుకోటెలో గత 27 ఏళ్లుగా జానపద ఉత్సవాలను నిర్వహిస్తున్న గురుపీఠం ప్రతినిధులను అభినందించారు. స్థానాచార్యుడు శ్రీనివాస నరసింహన్ గురూజీ, గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షుడు జయరామేగౌడ, చరిత్రకారుడు ఆచార్య శల్వపిళ్లై అయ్యంగార్, స్థానికం సంతానరామన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సత్కారం అందుకున్న సాధకులతో వేదిక ప్రతినిధులు, డాక్టర్ శ్రీనాథ్ తదితరులు

రోడ్డు ప్రమాదంలో నిండు గర్భిణి దుర్మరణం

మట్టెవాడ(వరంగల్), న్యూస్‌టుడే: మరో 15 రోజుల్లో పుట్టబోయే బిడ్డ కోసం ఆ తల్లి ఎన్నో కలలు కంది. మరికొద్ది రోజుల్లో ఇద్దరం కాస్త ముగ్గురం అవుతామన్న ఆ వైద్య దంపతుల ఆశలను రోడ్డు ప్రమాదం చిదిమేసింది. వరంగల్ నగరంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నిండు గర్భిణి మృతిచెందారు. మట్టెవాడ ఎస్సై శివకృష్ణ కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం కలబురగి జిల్లా చించోలి మండలం బత్తంపల్లి గ్రామానికి చెందిన డాక్టర్. ఎస్. మమతారాణి (33) వరంగల్ హంటర్‌రోడ్డులోని ఫాదర్ కొలంబో ఆసుపత్రిలో వైద్యురాలు (జనరల్ మెడిసిన్)గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమెకు గతేడాది నారాయణపేట జిల్లాకు చెందిన డాక్టర్ రాఘవేంద్రతో వివాహమైంది. ప్రస్తుతం రాఘవేంద్ర కాకతీయ మెడికల్ కళాశాలలో పీజీ చదువుతున్నారు. సోమవారం రాత్రి మమతారాణి విధులు ముగించుకొని హంటర్‌రోడ్డు మీదుగా భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో ఏడు మోరీల కూడలి వద్దకు రాగానే వెనుక నుంచి వచ్చిన టిప్పర్ బలంగా ఢీకొట్టడంతో భార్యాభర్తలు కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో 9 నెలల గర్భిణి మమతారాణి తీవ్రంగా గాయపడింది. ఆమెను స్థానికుల సాయంతో భర్త నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు అర్ధరాత్రి మృతిచెందారు. కట్టుకున్న భార్య, కడుపులో బిడ్డ మృతిచెందడంతో రాఘవేంద్ర గుండెలవిసేలా రోదించారు. ఫిబ్రవరి 10న డెలివరీ తేదీ ఉండటంతో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి డా.మమతారాణి సెలవుకు దరఖాస్తు చేసుకున్నట్లు ఫాదర్ కొలంబో ఆసుపత్రి డైరెక్టర్ ఫాదర్ గాదె చిన్నప్పారెడ్డి తెలిపారు. నిర్లక్ష్యం, అతివేగంగా లారీ నడిపిన జార్ఖండ్‌కు చెందిన టిప్పర్ డ్రైవర్ అన్సారీని మట్టెవాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు అన్సారీపై మంగళవారం కేసు నమోదు చేశారు.

మమతారాణి (పాతచిత్రం)

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	45
క్యారెట్-	50
బీరకాయలు-	55
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	30
సొరకాయ-	45
దొండకాయలు-	45
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	72
కాకర కాయలు-	55
టమాటా(నాటు)-	35
టమాటా-	25
గుమ్మడి-	35
ఆలుగడ్డ-	35
ఉల్లి(మేలురకం)-	40
ఉల్లి(సాధారణ)-	35
వెల్లుల్లి-	180
సాంబారు ఉల్లి-	165
బీట్‌రూట్-	55
వంకాయలు-	55
బెండకాయలు-	55
ముల్లంగి-	55
నిమ్మకాయ-	120
పండ్లు, ఫలాలు ధరలు	
వాషింగ్టన్ ఆపిల్-	395
సిమ్లా ఆపిల్-	255
గ్రీన్ ఆపిల్-	345
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్-	65
బొప్పాయి-	35
ఆరంజి-	115
బత్తాయి-	55

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

ఆయన పగటి కలలు కంటారు

దావణగెరె, న్యూస్‌టుడే: కేంద్ర మంత్రి కుమారస్వామి ప్రత్యేక వ్యక్తి అంటూనే వక్ఫ్ శాఖ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ చురకలు అంటించారు. అందరిలాగా ఆయన రాత్రుళ్లు కలలు కనరని, పగటి కలలు కంటుంటారని ఎద్దేవా చేశారు. దావణగెరెలో విలేకరులతో సోమవారం మాట్లాడుతూ 2028లో తామే అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేసిన కుమారస్వామి 2013, 2019, 2023లో ఏమైందో గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. సిద్ధరామయ్య జనతాదళ్‌లో ఉన్నప్పుడు 59 సీట్లు పొందిన దళ్, ఆయన పార్టీ వీడిన అనంతరం 19 సీట్లకే పరిమితమైన విషయాన్ని మర్చిపోయారా అని ప్రశ్నించారు. మాజీ ప్రధాని దేవేగౌడ వందేళ్లు జీవించాలని కోరుకుంటున్నానని తెలిపారు. తాను కాంగ్రెస్‌లో మంత్రిగా ఉన్నా, తనకు దేవేగౌడ రాజకీయ గురువు అన్నారు. భాజపాలో చేరి ఆయన తప్పు చేశారని, భవిష్యత్తులో ఏమవుతుందో వేచి చూడాలని పేర్కొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న మఠాధిపతి

మఠం ఆస్తి కబ్జాకు ప్రయత్నం

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: చిక్కబళ్లాపుర తాలూకా స్కందగిరి పర్వత సానువుల్లో ఉన్న ఓంకార జ్యోతి మఠం, ట్రస్టు ఆస్తులను కబ్జా చేసేందుకు హుళిమావు మాజీ కార్పొరేటర్ లక్ష్మీనారాయణ, మరికొందరు ప్రయత్నిస్తున్నారని మఠాధిపతి ఉమామహేశ్వర స్వామి ఆరోపించారు. తన అనుచరులతో మఠంలోకి అక్రమంగా వచ్చి, తనపై, చిన్న స్వాములు భక్తులపై లక్ష్మీనారాయణ దాడి చేసి పరారయ్యారని ఆక్రోశించారు. సీసీ కెమెరాల ఫుటేజ్‌తో సహా ఫిర్యాదు చేసినా, పోలీసులు ఇప్పటి వరకు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మఠం ప్రతినిధులు, భక్తులతో కలిసి మంగళవారం ఇక్కడ నిర్వహించిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సుమారు 26 ఏళ్ల క్రితం మరియప్ప అనే వ్యక్తి 2 ఎకరాల 12 గుంటల్లో మఠాన్ని నెలకొల్పారని, ఆయన అనంతరం ఆయన భార్య సాధ్వి జయమ్మ మఠం బాధ్యతలు చేపట్టారని తెలిపారు. మఠాధిపతిగా తనకు పట్టాభిషేకం చేసి, పీఠానికి జయమ్మ గౌరవ అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇప్పుడు మఠం ఆస్తులను కబ్జా చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను పోలీసులు, ప్రభుత్వం అడ్డుకోవాలని కోరారు. దీనిపై తాము న్యాయ పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు.

దూషిస్తే పరువు నష్టం కేసు దాఖలు చేస్తా

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే: బిగ్‌బాస్ కన్నడ రియాల్టీ షో విజేత నటరాజ్ అలియాస్ గిల్లి, అతని అభిమానులు తనను కించపరుస్తూ వ్యాఖ్యలు చేస్తున్నారని కడబమ్స్ సతీశ్ అలియాస్ డాగ్ సతీశ్ ఆరోపించారు. తనకు ప్రాణహాని తలపెడతానని బెదిరించిన ఎనిమిది మందిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారని తెలిపారు. తనను కించపరుస్తూ వ్యాఖ్యలు, పోస్టులు పెట్టిన వారిపై రూ. ఒక కోటికి పరువునష్టం కేసు దాఖలు చేస్తానని హెచ్చరించారు.

బుల్లితెర నటి, ఆమె భర్తపై దాడి

బెంగళూరు (రామమూర్తినగర), న్యూస్‌టుడే: బుల్లితెర నటి కావ్యాగౌడ, ఆమె భర్త సోమశేఖర్‌పై ఆమె బంధువులు దాడి చేశారు. ప్రేమ, నందీశ్, వారి అనుచరులు తమ ఇద్దరిపై దాడి చేశారని వారు రామమూర్తి నగర ఠాణాలో ఫిర్యాదు చేశారు. తన భర్తపై కత్తితో దాడి చేసిన సోమశేఖర్, తనపై అత్యాచారానికి పాల్పడతానని బెదిరించాడని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

కళా బృందాల ప్రదర్శన

ఆకట్టుకున్న జానపద కళా ప్రదర్శనలు

మండ్య, న్యూస్‌టుడే: రథ సప్తమిని పురస్కరించుకుని గత ఆదివారం నుంచి మేలుకోటెలో ఏర్పాటు చేసిన జానపద కళా ప్రదర్శనలకు మంగళవారం తెరపడింది. మొదటి రోజు ఉత్సవాల్లో సూర్యమండల వాహనంపై చెలువనారాయణ స్వామి ఉత్సవమూర్తితో నిర్వహించిన ఊరేగింపులో మంత్రి చెలువరాయస్వామి, ఎమ్మెల్యే దర్శన్ పుట్టణ్ణయ్య, ముడా మాజీ అధ్యక్షుడు రాజీవ్ పాల్గొన్నారు. పల్లకీ సేవల్లో వీరు పాల్గొన్నారు. కేరళ నుంచి చండ వాద్యాలతో పాటు కర్ణాటకలోని వివిధ ప్రాంతాల నుంచి 60కు పైగా కళా బృందాలు ఉత్సవాల్లో పాల్గొన్నాయి. మేలుకోటెతో పాటు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో స్థానికులు ఉత్సవాల్లో పాల్గొన్నారని స్థానీకం నాగరాజ్ అయ్యంగార్ సాంస్కృతిక వేదిక ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాలకు కన్నడ, సాంస్కృతిక శాఖ మద్దతు పలికింది.

పల్లకీ మోస్తున్న మంత్రి చెలువరాయస్వామి

ఉభయ సభలకు సభ్యుల గైర్హాజరు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: మంగళవారం మధ్యాహ్నం వరకు ఉభయ సభలకు సభ్యులు గైర్హాజరయ్యారు. అధికారులు, సిబ్బంది, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, విధానపరిషత్తు అధ్యక్షుడు తదితరులు మాత్రమే ఉదయం సభల్లో కనిపించారు. నరేగా పథకం పేరు మార్పును ఖండిస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు స్వాతంత్ర్య ఉద్యానంలో ధర్నాలో పాల్గొనగా, భాజపా, దళ్ నేతలు విధానసౌధ ఆవరణలోని మహాత్ముని విగ్రహం వద్ద ధర్నాకు దిగడంతో శాసనసభ సమావేశాలకు గైర్హాజరు కావలసి వచ్చింది. ఎక్సైజ్ శాఖలో అక్రమాలకు సంబంధించి చర్చకు అవకాశం కల్పిస్తామని స్పీకర్ ప్రకటించిన అనంతరం విపక్ష సభ్యులు తమ ధర్నాను విరమించారు. విపక్షాలకు బదులివ్వవలసిన మంత్రులు సమావేశాలకు గైర్హాజరవుతున్నారని విపక్ష నేత అశోక్ ఆరోపించారు. సభకు రాని మంత్రుల పేర్లను అశోక్ చదివి వినిపించారు. ఎక్సైజ్ శాఖలో రూ.2500 కోట్ల మేర అక్రమాలు జరిగాయని ఎగువ సభలో విపక్ష నేత చలువాది నారాయణ స్వామి ఆరోపించారు. ప్రతి ఏటా రూ.6 వేల కోట్లను వసూలు చేస్తున్నా, ఖజానాకు పూర్తి స్థాయిలో నిధులు జమకావడం లేదన్నారు. సమావేశాలను ఆలస్యంగా ప్రారంభించడం సభ సంప్రదాయాన్ని అగౌరవపరచినట్లు కాదని ఎగువ సభ అధ్యక్షుడు బసవరాజ హొరట్టి స్పష్టం చేశారు. అన్ని పార్టీల సభ్యులు ఆలస్యంగా సభను ప్రారంభించాలని కోరడంతో జాప్యం జరిగిందన్నారు. పంట బీమా పరిధికి కొబ్బరి సాగును తీసుకువస్తున్నామని సభ్యుడు చిదానందగౌడ ప్రశ్నకు వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయస్వామి బదులిచ్చారు. శిడ్లఘట్ట నగర సభ కమిషనర్‌ను దూషించిన రాజీవ్‌గౌడను న్యాయమూర్తి న్యాయనిర్బంధానికి పంపించారని, అతన్ని కాపాడేందుకు కాంగ్రెస్ నేతలు ఎవరూ ప్రయత్నించడం లేదని ఎగువ సభకు మంత్రి భైరతి సురేశ్ స్పష్టం చేశారు. దిగువ సభలో విపక్ష సభ్యుల ఆరోపణలకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తీవ్రస్వరంలోనే బదులిచ్చారు.

దిగువ సభలో మాట్లాడుతున్న హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్

ఎగువసభలో మాట్లాడుతున్న మంత్రి తిమ్మాపూర్

దొరికిన పులి పిల్ల

చామరాజనగర, న్యూస్‌టుడే: నంజేదేవనపుర గ్రామంలో ఒక పులి పిల్ల దొరికింది. సోమవారం రాత్రి అటవీశాఖ ఉంచిన బోనులో ఒక పులి, ఒక పిల్ల చిక్కాయి. మరో పులిపిల్లను మంగళవారం ఉదయం పట్టుకున్నారు. తల్లి పులి వద్దకు ఈ పిల్లను కూడా చేర్చారు. త్వరలో వీటిని స్థానిక అడవిలో విడిచి పెడతామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

బెంగళూరులో అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే: గురువారం నుంచి బెంగళూరు అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 6 వరకు కొనసాగే చిత్రోత్సవాలకు రాజాజీనగర లులుమాల్‌లోని సినీ పోలీస్ మల్టీప్లెక్స్, బనశంకరి 2వ స్టేజ్‌లోని సుచిత్ర ఫిలిం సొసైటీ, కర్ణాటక చలనచిత్ర కళాకారుల సంఘం ఆవరణలోని థియేటర్‌లో చిత్రాలను ప్రదర్శించనున్నారు. విధానసౌధ మెట్ల వద్ద ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారం సాయంత్రం 5 గంటలకు చిత్రోత్సవాలను ప్రారంభించనున్నారు.

EENADU Classifieds

JOBS

Required Civil Site Supervisors/ Engg/ Diploma with or without Experience. Location Karnataka. Contact: 9347083151.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలను ఇచ్చుటకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.

బళ్ళారి : 9121167525

బెంగుళూరు : 9121167527

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

'మా ఊళ్లోనూ తవ్వండి'

యాదగిరి, న్యూస్‌టుడే: మా ఊళ్లో తవ్వకాలు చేపడితే లక్కుండి కన్నా ఎక్కువ నిధులు లభిస్తాయని యాదగిరి జిల్లా హుణసగి తాలూకా కె ముదనూర గ్రామస్థులు పేర్కొన్నారు. తమ గ్రామంలో తవ్వకాలు జరిపితే బంగారం, వెండి, వజ్ర వైఢూర్యాల నిధులు ఉంటాయని ధీమా వ్యక్తం చేశారు. పదకొండో శతాబ్దంలో శ్రేష్ఠ వచనకారుడు దేవరదాసిమయ్య జన్మ స్థలమైన కె. ముదనూరులో 101 దేవాలయాలు 101 శివలింగాలు లభించాయి. రామతీర్థ, లక్ష్మణ తీర్థ, గుండు తీర్థ, చక్కెర తీర్థ, మరళు తీర్థ, హాలు తీర్థ, సంగమ తీర్థ అనే ఏడు తీర్థాలు ఉండగా, వాటిల్లో ఏడాది మొత్తం నీరు ప్రవహిస్తుంది. గ్రామంలో ఇటీవల ఒక ఇంటి నిర్మాణానికి పునాదులు తీస్తుండగా 18 ప్రాచీన శాసనాలు లభించాయి. వాటిని అధికారులకు అప్పగించినా, సరిగ్గా సంరక్షించలేదని ఆరోపించారు. పురావస్తు శాఖ అధికారులతో కలిసి తమ గ్రామంలోనూ తవ్వకాలు చేపట్టాలని గ్రామస్థులు కోరారు.

టీజర్ విడుదల

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: హ్యాట్రిక్ హీరో శివరాజ్ కుమార్ అనారోగ్యం బారిన పడి అమెరికాలో శస్త్రచికిత్స చేయించుకున్నారు. పూర్తిగా కోలుకున్న ఆయన చిత్రాలలో నటిస్తున్నారు. శివకుమార్ కుమార్ జీవనయానాన్ని 'సర్వైవర్' పేరిట డాక్యుమెంటరీ సిద్ధమవుతోంది. గీతా పిక్చర్స్ బ్యానర్‌పై ప్రదీప్ శాస్త్రి ఈ డాక్యుమెంటరీకి దర్శకత్వం వహించారు. దీనికి సంబంధించిన టీజర్‌ను నటుడు శివరాజ్‌కుమార్ సోమవారం విడుదల చేశారు.

మరో పోలీసు అధికారిపై బదిలీ వేటు

నగర కొత్త డీఎస్పీగా ఐపీఎస్ అధికారి

బళ్లారి, న్యూస్‌టుడే: జనవరి 1న కాంగ్రెస్-భాజపా కార్యకర్తల మధ్య ఘర్షణ, అల్లర్లు, కాల్పులతో ఓ కాంగ్రెస్ సామాన్య కార్యకర్త మృతి చెందిన విషయం భాజపాకు ప్రధాన అస్త్రంగా మారింది. దీనిపై బళ్లారి జిల్లాలోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా శాంతిభద్రతలు లోపించాయనే ఆరోపణలు పెరిగిపోతున్నాయి. దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టిన ముఖ్యమంత్రి శాంతిభద్రతలను నియంత్రణలోకి తీసుకుని రావడానికి పోలీస్ అధికారులపై బదిలీ వేటు వేస్తున్నారు. ఎస్పీగా పవన్ నెజ్జూరు బాధ్యతలు తీసుకున్న మరుసటి రోజే సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. బళ్లారి జిల్లా పోలీస్ విభాగం ఐజీపీ వర్తికా కటియార్‌ను కూడా బదిలీ చేసింది. ఈ ఇద్దరు పోలీస్ అధికారులు స్థానాల్లో సీఎం భద్రత, నిఘా వర్గాల విభాగంలో ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి డా. పి. ఎస్. హర్షను బళ్లారి పోలీస్ విభాగం ఐజీపీగా ఈ నెల 7న నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తరకన్నడ, కొడగు ఎస్పీగా, నిఘా విభాగం ఎస్పీగా విధులు నిర్వహించి ప్రజ్వల్ రేవణ్ణ కేసును దర్యాప్తు చేసిన ఎస్పీ సుమన్ పెన్నేకర్‌ను బళ్లారి ఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ నెల 8న బాధ్యతలు స్వీకరించారు. అదే క్రమంలో నగర డీఎస్పీగా ఉన్న చంద్రకాంత్ నందారెడ్డిని బదిలీ చేస్తూ ఆయన స్థానంలో యస్ కుమార్ శర్మను నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది.

బదిలీ అయిన ఐజీపీ వర్తికా కటియార్

నగరంలో శాంతి భద్రతలు లోపించడానికి డీఎస్పీనే కారణమా ?

బళ్లారిలో శాంతిభద్రతలు, మట్కా, పేకాట, క్లబ్బులు, గంజాయి, మాదక ద్రవ్యాలు రవాణా, రేషన్ బియ్యం నల్లబజార్‌కు తరలింపు తదితర అక్రమాలు ఇష్టారాజ్యంగా జరగడానికి నగర డీఎస్పీ చంద్రకాంత్ నందారెడ్డి మెతక వైఖరే కారణమని నగర వాసులే కాకుండా ప్రతిపక్ష పార్టీ అయినా భాజపా మొదటి నుంచి ఆరోపిస్తోంది. జనవరి 1న కూడా అల్లర్లు, కాల్పులు, ఘర్షణలు జరగడానికి నగర డీఎస్పీ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపిస్తున్నారు. సాయంత్రం ఘర్షణ తర్వాత రాత్రి 9 గంటలకు ఎమ్మెల్యే వాల్మీకి కూడలికి వచ్చి, సుమారు వేయిమందికి పైగా కార్యకర్తలు, అభిమానులతో మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి ఇంటి ముందుకు రాకుండా వాల్మీకి కూడలిలోనే నియంత్రణ చేసి ఉంటే ఘర్షణకు అవకాశం ఉండేది కాదు. ఎమ్మెల్యే వాల్మీకి కూడలి నుంచి ప్రదర్శనగా వస్తున్న సమయంలో డీఎస్పీ చంద్రకాంత్ నందారెడ్డి వెంట తీసుకుని వస్తున్నట్లు వీడియోలు భాజపా విడుదల చేసింది. డీఎస్పీని సస్పెండ్ చేయాలి. లేకుంటే తక్షణమే బదిలీ చేయాలని పట్టు పట్టింది. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి, నగర డీఎస్పీగా ఐపీఎస్ అధికారిని నియమించింది.

సస్పెన్షన్‌కు గురైన ఎస్పీ పవన్ నెజ్జూరు

నూతన డీఎస్పీగా యస్ కుమార్ శర్మ

2023 ఐ.పి.ఎస్ బ్యాచ్‌కు చెందిన యస్ కుమార్ శర్మ తుమకూరు సబ్ డివిజన్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. నగరంలో లోపించిన శాంతిభద్రతలు, అక్రమాలను అరికట్టడానికి యువ ఐపీఎస్ అధికారిని ప్రభుత్వం నియమించింది. ఏఎస్పీగా పదోన్నతి పొందినా.. ..బళ్లారి నగర డీఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

(c) eenadu

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

శ్రీపట్లదమ్మ కూడలి ఏర్పాటు

వేడుకల్లో ఎమ్మెల్యే సోమశేఖర్, సురేశ్ తదితరులు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : యశ్వంతపుర విధానసభా క్షేత్రం కెంచెనహళ్లి కూడలికి శ్రీపట్లదమ్మ కూడలిగా ఎమ్మెల్యే ఎస్.టి. సోమశేఖర్ నామకరణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధార్మిక, సాంస్కృతిక మూలాలను కాపాడుకోవాలని, గ్రామదేవత పట్లదమ్మదేవి ప్రజల ఆరాధ్యదేవత అన్నారు. ఈ సందర్భంగా పట్లదమ్మదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రముఖులు కెంచనహళ్లి సురేశ్, శ్రీనాథ్, మంజునాథ్, మధు, స్థానిక గ్రామ పెద్దలు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మధ్వనవమి వేడుకలు

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : జయనగర నంజనగూడు రాఘవేంద్రస్వామి ఆలయంలో మంగళవారం ఆలయ వ్యవస్థాపకుడు ఆర్. కె. వాదీంద్రచార్యులు, ధర్మాధికారి కృష్ణగుండాచార్యుల నేతృత్వంలో ఆంజనేయస్వామికి శ్రీవాయుస్తుతి పునశ్చరణ, మధు-తేనే అభిషేకం, సామూహిక పవమానహోమాన్ని నిర్వహించారు. సర్వమూల గ్రంథాలతో పల్లకీలో ఊరేగింపు, జగద్గురు శ్రీమధ్వాచార్యుల చిత్రపటంతో రథోత్సవం వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. విద్వాన్ సుధీంద్రచార్యులతో ప్రవచన పురాణం ఏర్పాటు చేశారు.

జగద్గురు మధ్వాచార్యుల చిత్ర పటంతో రథోత్సవం

హోసూరు కబుర్లు

భూస్వాధీనానికి వ్యతిరేకంగా రైతుల ఆందోళన

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు ప్రాంతంలో అభివృద్ధి పేరుతో సారవంతమైన భూములను స్వాధీనం చేసుకుంటూ.. రైతులను మోసం చేస్తున్నారని ఆరోపిస్తూ రైతు సంఘాల ఆధ్వర్యంలో హోసూరు, వేపనహళ్లి, డెంకణీకోట తదితర ప్రాంతాల్లో సమావేశాలు, ధర్నాలు, ఆందోళనలు కొనసాగాయి. మంగళవారం హోసూరు శివారు దక్షిణ పినాకినినదీ తీరంలోని కూళ్లు గ్రామంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరిశ్రమలు, నాలెడ్జ్ సెంటరు, భారత్ మాల ప్రాజక్టు, సిప్‌కాట్ సంస్థల ఏర్పాటుకు రైతుల వ్యవసాయ భూములను కబళించిన డీఎంకే ప్రభుత్వాన్ని తొలిగించాలని, రైతు కుటుంబాల మీద రాష్ట్ర ప్రభుత్వం గొడ్డలి వేటు వేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే స్వాధీనం చేసుకున్న భూములకు పరిహారం చెల్లించకుండా మోసం చేస్తున్నారన్నారు. హోసూరు సమీపంలోని కర్ణాటక ప్రాంతంలో అధిక మొత్తంలో పరిహారం ఇస్తుండగా ఇక్కడ తక్కువగా ఇవ్వడం ఎంతవరకు సమంజసమని రైతు సంఘాల ప్రతినిధులు నిలదీశారు.

సమావేశంలో రైతు సంఘం ప్రతినిధి

హాజరైన రైతులు, ప్రజలు

విశ్రాంత ఉద్యోగుల ఆందోళన

డెంకణీకోట, న్యూస్‌టుడే : డెంకణీకోట తాలూకా కార్యాలయం ముందు వివిధ శాఖలకు చెందిన విశ్రాంత ఉద్యోగుల తమ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ఆందోళనబాట పట్టారు. మధ్యాహ్న భోజన ఆర్గనైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, దిన కూలీలు, గ్రంథాలయ ఉద్యోగులు, సహాయకులకు కనీస వేతనం రూ.7850 నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఉచిత ఆరోగ్య సౌకర్యాలు కల్పించాలని కోరారు. తాలూక అధ్యక్షుడు మునిరాజు, జిల్లా కార్యదర్శి కార్యదర్శి రాజామణి, ప్రధాన కార్యదర్శి వెంకటరాజు, పళనిస్వామి, అరుళ్, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

బాజపాపై వేసిన పోస్టర్ తొలగింపు

డెంకణీకోట, న్యూస్‌టుడే : అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నందున కొన్ని రోజుల కిందట మదురై మదురాంధగంలో భాజపా, అన్నాడీఎంకే కూటమి నేతలు సమావేశం నిర్వహించారు. ప్రధాని మోదీ పాల్గొన్న ఆ సమావేశంలో ఎన్‌డీఏ డబుల్ ఇంజిన్ అని, కూటమిని ఓడించడం డీఎంకే వల్ల కాదని మోదీ ప్రకటించారు. ఈ అంశంపై కొందరు డెంకణీకోట పట్టణంలో డబుల్ ఇంజిన్. . డబ్బా ఇంజిన్ అని పోస్టర్లను అంతికించారు. ఈ పోస్టర్లను మంగళవారం భాజపా శ్రేణులు తొలగించాయి. వీటిని అతికించిన వారి మీద చర్యలు తీసుకోవాలని డెంకణీకోట పోలీసులకు భాజపా నాయకులు ఫిర్యాదు చేశారు.

ఏనుగు దాడిలో అధికారికి గాయాలు

డెంకణీకోట: హోసూరు, డెంకణీకోట అటవీ ప్రాంతాల్లో వన్యమృగాల సర్వే జరుగుతోంది. మంగళవారం డెంకణీకోట దడిక్కల్ కల్లుపల్లి అడవి వద్ద అటవీశాఖ గార్డు ఉత్తిరకుమార్ సర్వే చేస్తుండగా ఒంటరి ఏనుగు అతనిపై దాడి చేసి గాయపరిచింది. సహచర అధికారులు అతన్ని డెంకణీకోటకు తీసుకెళ్లి మెరుగైన చికిత్స కోసం కృష్ణగిరి ఆసుపత్రికి తరలించారు.

నాలుగు రోజుల్లో రెండు లక్షల మంది భక్తులు

మంగళూరు, న్యూస్‌టుడే : కుక్కె సుబ్రహ్మణ్య క్షేత్రాన్ని గత నాలుగు రోజుల్లో రెండు లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. నాలుగు రోజులకు హుండీ ఆదాయం రూ.4 కోట్లు దాటి ఉంటుందని దేవాదాయ శాఖ అధికారులు అంచనా వేశారు.

ఉద్యోగుల సమ్మెతో స్తంభించిన లావాదేవీలు

నినాదాలు చేస్తున్న సంఘాల ప్రతినిధులు

చిత్రదుర్గ, న్యూస్‌టుడే : మూడు రోజుల వరుస సెలవుల తర్వాత నాల్గో రోజు మంగళవారం కూడా బ్యాంకు ఉద్యోగుల సమ్మెతో పట్టణంలో బ్యాంకింగ్ సేవలకు అంతరాయం ఏర్పడింది. బ్యాంకుల ఉద్యోగులు స్థానిక ఎస్‌బీఐ వద్ద నిరసన తెలిపారు. వారానికి 5 రోజుల పని దినాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులను చేత పట్టి పట్టణ వీధుల్లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు.

తుమకూరు: వారంలో 5 రోజుల పనిదినాలు అమలు చేయాలని దేశవ్యాప్తంగా మంగళవారం చేపట్టిన సమ్మెలో భాగంగా మంగళవారం స్థానిక ఎస్‌బీఐ వద్ద ఉద్యోగ సంఘాల నాయకులు ఆందోళన నిర్వహించారు. పదేళ్లుగా బ్యాంకింగ్ సేవలకు ఆమోదం తెలుపకుండా జాప్యం చేస్తోందని కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు కె.ఎన్.వాదిరాజు, శంకరప్ప, సర్వమంగళ, సతీశ్‌రామ్, నారాయణ్‌అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ వద్ద ఆందోళన చేపట్టిన ఉద్యోగులు

మానసికశాంతికి ధ్యానమొక్కటే మార్గం

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : మానసిక శాంతికి, జీవన ప్రశాంతతకు ధ్యానం ఒక్కటే మార్గమని, మనసులోని అశాంతుల నుంచి బైట పడటానికి ఇదే సరైన దారి దీపమని ధర్మస్థల ధర్మాధికారి వీరేంద్రహెగ్గడే పేర్కొన్నారు. బెంగళూరులోని క్వాంటమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధర్మస్థలలోని అమృత వర్షిణి హాల్లో ధ్యాన మహాయజ్ఞాన్ని నిర్వహించారు. మంగళవారం ముగింపు సమవేశానికి హెగ్గడే అధ్యక్షత వహించి ప్రసంగించారు. మనసు సదా చంచలంగా ఉంటుందని, మనస్సును ధ్యానం ద్వారా నియంత్రించవచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సాయి కీర్తినాథ స్వామీజీ, బి.శివరామప్ప, దివ్యయోగ మిత్రం సుబ్బుభయ్యా, ధర్మస్థల శాంతివన ట్రస్టు యోగా డైరెక్టర్ శశికాంత్ జైన్, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

జ్ఞాపికతో హెగ్గడేను సత్కరిస్తున్న నిర్వాహకులు

8 లక్షల మంది లాల్‌బాగ్ సందర్శన

బెంగళూరు (జయనగర) : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జనవరి 15-26 వరకు నిర్వహించిన ఫలపుష్ప ప్రదర్శనను 8.10 లక్షల మంది వీక్షించారని ఉద్యానశాఖ అధికారుల వెల్లడించారు. సందర్శకులు, స్టాళ్ల యజమానుల బాడుగ ద్వారా రూ.2.74 కోట్ల ఆదాయం సమకూరింది. ఫలపుష్ప ప్రదర్శనకు 2.93 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. తేజస్వి రచించిన పుస్తకాలు 13 వేల ప్రతులు విక్రయం అయ్యాయి. కువెంపు కుమార్తె తారణి, అల్లుడు చిదానందగౌడ, రెండవ కుమార్తె ఇందుకళ, తేజస్వి కుటుంబ సభ్యులు కేపీ సుశ్మిత, కేపీ ఈశాన్య వీక్షించి, సంతృప్తి వ్యక్తం చేశారని ఉద్యానశాఖ అధికారి డాక్టర్ జగదీశ్ వెల్లడించారు.

జండా వందనం చేస్తున్న ప్రముఖులు, విద్యార్థులు

పుస్తకావిష్కరణలో బెల్లూరు శంకరనారాయణ్, ద్వారకనాథ్, తదితరులు

దేశ సమైక్యతకు మూలం రాజ్యాంగం

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : ఉజిరేలోని ఎస్‌డీఎం జూనియర్ కళాశాలలో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ధర్మాధికారి హెగ్గడే వ్యక్తిగత కార్యదర్శి వీరూశెట్టి అధ్యక్షత వహించి పతాక వందనం గావించారు. ఏకత్వం, సమానత్వం సమైక్యతలోనే ప్రజాస్వామ్యం నిలబడుతుందన్నారు. మన దేశం భిన్నత్వంలో ఏకత్వం గల దేశమని, ప్రజలందరూ సమైక్యంగా సామూహికంగా ఉంటేనే లక్ష్యాన్ని సాధించవచ్చని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సునిల్ పండిత్, దైహిక శిక్షకుడు లక్ష్మణ్‌జీ, తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు (కెంగేరి), న్యూస్‌టుడే : బసవనగుడిలోని ఆచార్య పాఠశాల శిక్షణ ట్రస్టు, ఏపీఎస్ సమూహ సంస్థ కళాశాల మైదానంలో గణతంత్ర వేడుకలను వైభవంగా ఆచరించారు. రాజగురు బెల్లూరు శంకరనారాయణ ద్వారకానాథ్ ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులకు దేశం సంక్షేమం, అభివృద్ధి అనే మనోభావాన్ని పెంచుకోవాలని, హక్కుల నుంచి కర్తవ్యాలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఈ సందర్భంగా ఏపీఎస్ అధ్యక్షుడు విష్ణు ఆలంపల్లి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రస్టు సమూహ సంస్థల ప్రధాన కార్యదర్శి ఎ.ప్రకాశ్, సంయుక్త కార్యదర్శి పి. కృష్ణ, కోశాధికారి కె.ఎస్.అఖిలేశ్‌బాబు, ఎ.ఆర్.మంజునాథ్, సి.నాగరాజ్ పాల్గొన్నారు.

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : రామచంద్రపురలోని అంబేడ్కర్ దళిత వెనుకబడిన మైనార్టీ వర్గాల సంక్షేమాభివృద్ధి సమితి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎస్ఎస్ నేత వెంకటరత్నం అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి నేతలు ప్రకాశ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : యలహంక నీలకంఠేశ్వర తెలుగు ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధి సమితి ప్రధాన కార్యదర్శి వై.వెంకటనారాయణ విద్యార్థులతో కలిసి జాతీయ జెండాను ఎగురవేసి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రెడ్డిరాణి తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : హుబ్బళ్లిలోని కేశ్వాపుర బాలభవన్ ఆవరణలో ఏర్పాటు చేసిన గణతంత్ర దినోత్సవంలోస్వర్ణ గ్రూపు సీఎండీ డాక్టర్ చిగరుపాటి వి.ఎస్.వి.ప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపమేయర్ ఉమా ముకుంద, ప్రసాద్ కరినంది, మనోజ్ జైన్, హెచ్.ఆర్.నరగుంద, గురప్పమడ్డి తదితరులు

జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్, అధికారులు

జెండాను ఎగురవేస్తున్న చిగరుపాటి ప్రసాద్ తదితరులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : వివేకానగర ప్రభుత్వ తెలుగు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గణతంత్ర దినోత్సవంలో ప్రముఖ హోటల్స్ ఛైర్మన్ రవిచందర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో విశ్రాంతి తెలుగు ఉపాధ్యాయుడు రంగస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పావగడ, న్యూస్‌టుడే : మహాత్మాగాంధీ క్రీడా మైదానంలో గణతంత్ర దినోత్సవ దినోత్సవంలో స్థానిక ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేశ్ జెండా వందనం చేశారు. రాజ్యాంగం 1950 జనవరి 26న అమల్లోకి రావడంతో సమానతలు తొలిగాయని, ఈ రోజును ఏటా పండగలా జరుపుకొంటున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. తహశీల్దార్ వై.రవి, ఈఓ మధుసూదన్, బీఈఓ రేణుకమ్మ, తాలూకా అధికారులు, కాంగ్రెస్ నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకల్లో రవిచందర్, రంగస్వామినాయుడు తదితరులు

అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పదాధికారులు

జెండా వందనంలో ప్రముఖులు, విద్యార్థులు

మంచి పోలీసుకు వీడ్కోలు

పావగడ, న్యూస్‌టుడే : పట్టణంలోని న్యాయాలయంలో పోలీసు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించిన జిన్నాపుర గంగాధర అనే పోలీసు కానిస్టేబుల్ ఇటీవల కొప్పళ జిల్లాకు బదిలీ అయ్యాడు. ఈయన కొన్నేళ్లుగా అందరితో మంచిగా ఉంటూ బదిలీ కావడంతో గంగాధర్‌ను న్యాయాలయంలో న్యాయమూర్తులు వి. మాదేశ, సి.ఎస్.మునిరత్నమ్మ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.రంగనాథ్, కార్యదర్శి హెచ్.చంద్రప్ప, ప్రభుత్వ న్యాయవాది సణ్ణీరప్ప, రమేశ్‌బాబు, న్యాయవాదులు రమేశ్‌బాబు, జయసింహ, కానిస్టేబుల్ మహేశ్, గాదిలింగనగౌడ, న్యాయాలయ సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

కానిస్టేబుల్ గంగాధరను సత్కరిస్తున్న కోర్టు సిబ్బంది

దక్షిణ భారతంలో హృతిక్‌కు ఐదో స్థానం

పావగడ, న్యూస్‌టుడే : తాలూకాలోని అరసికెరె గ్రామ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న హెచ్.హృతిక్ తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా కొల్లూరులో ఐదు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ విజ్ఞాన సదస్సులో పాల్గొని దక్షిణ భారతదేశంలో ఐదో స్థానం పొందాడు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, తెలంగాణ రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్నారు. 'ఏదైనా వాహనం పాఠశాల లేదా ఆసుపత్రి దగ్గరకు వచ్చినపుడు, భవనాల్లో ప్రమాదం జరిగినపుడు వెంటనే సెన్సార్ల ద్వారా తెలియచేసే సైన్స్ మాదిరిని' హృతిక్ ప్రదర్శించి ఐదో స్థానంలో నిలిచాడు. మధుగిరిలో జరిగిన గణతంత్ర దినోత్సవంలో మధుగిరి ఎమ్మెల్యే కె.ఎన్.రాజన్న, డీడీపీఐ మాధవరెడ్డి, విద్యాశాఖాధికారి వేదమూర్తి, బీఈవో హనుమంతరాయప్ప, డీవైఎస్పీ మంజునాథ ఘనత సాధించిన హృతిక్, దిశనిర్దేశం చేసిన గురువు రేణుకారాజ్‌ను సత్కరించారు. పావగడ బీఈఓ రేణుకమ్మ, విద్యాశాఖాధికారులు హృతిక్‌కు అభినందనలు తెలిపారు. తన మేధస్సుతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

హృతిక్‌ను సత్కరిస్తున్న మాజీ మంత్రి రాజన్న, తదితరులు

ఘనంగా పురంధరదాసుల ఆరాధనోత్సవాలు

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : నగరంలోని సాంస్కృతిక కళాసంస్థ శ్రీపద్మావతి కళానికేతన్ ఆధ్వర్యంలో త్యాగరాజ, పురంధరదాసుల ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వయ్యాలికావల్ తెలుగు విజ్ఞానసమితి ఆవరణలోని శ్రీకృష్ణదేవరాయ ఆడిటోరియంలో సంగీత కీర్తనల్లో చింతలపల్లి జలజాప్రసాద్, చింతలపల్లి మంగళా భాస్కర్, స్మితాదేవసింహ, భారతీ వెంకటేశ్, జయశ్రీ, చింతలపల్లి వి.శ్రీనివాస్, విద్వాన్ సోమశేఖర్, శ్రీలక్ష్మి, కమలా ప్రాణేశ్, సరస్వతి రమేశ్ తదితర కర్ణాటక సంగీత విద్వాంసులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా విద్యా వాచస్పతి విశ్వాసంతోశ్ భారతీ శ్రీపాద, కల్లమభట, సంస్థ ప్రధాన పోషకుడు, తెలుగు విజ్ఞానసమితి అధ్యక్షుడు ఎ.రాధాకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు. కచేరీకి ముందు త్యాగరాజ చిత్రపటాన్ని ఊరేగించారు. ముఖ్య అతిథులను, విద్వాంసులను సంస్థ నిర్వాహకులు జి. వేణుగోపాల్ దంపతులు సత్కరించారు.

త్యాగరాజు చిత్రపటం ఊరేగింపు

ఆలయ సమీపంలో నెర్రెలు

గదగ: లక్కుండిలో నిధి కోసం పురావస్తుశాఖ అధికారుల సమక్షంలో కార్మికులు తవ్వకాలను కొనసాగించారు. మరో వైపు కోటె వీరభద్రేశ్వర దేవాలయం ముందు భాగంలో భూమి, గోడల్లో నెర్రెలు కనిపించాయి. తీసిన గుంతల్లో మట్టి పెళ్లలు పడే అవకాశం ఉండడంతో కొన్ని బ్లాక్‌లలో తవ్వకాలను తాత్కాలికంగా నిలిపివేశారు. యంత్రోపకరణాలను ఉపయోగించి తవ్వకాలు కొనసాగించాలని అధికారులు తీర్మానించారు.

మాంసం విక్రయాలపై నిషేధం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : సర్వోదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మాంసం విక్రయాలపై నిషేధాన్ని విధిస్తూ గ్రేటర్ బెంగళూరు ప్రాధికార ఆదేశాలను జారీ చేసింది. మహాత్ముడిని గౌరవిస్తూ మాంసం విక్రయాలు, ప్రాణివధపై పూర్తి నిషేధం ఉంటుందని అధికారులు తెలిపారు.

ఇద్దరు అంతరాష్ట్ర దొంగల అరెస్టు

తుమకూరు, న్యూస్‌టుడే : రాత్రి వేళల్లో చోరీలు పాల్పడుతున్న ఇద్దరు అంతరాష్ట్ర దోపిడీదార్లను అరెస్టు చేసి వాని నుంచి రూ.3.15 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లాకు చెందిన పెద్దనేని వంశీ, ఎల్. లక్ష్మీపతిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

మరో ముగ్గురు..

బెంగళూరు (మహాలక్ష్మి లేఅవుట్), న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్న ఆరోపణలపై ముగ్గురిని అరెస్టు చేశామని సుబ్రహ్మణ్యపుర ఠాణా పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి నాలుగు కిలోల గంజాయి, 37 గ్రాముల ఎండీఎంఏ, 35 గ్రాముల నల్ల మందు జప్తు చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

అపహరణకు విఫలయత్నం

బెంగళూరు (గ్రామీణం): ఆనేకల్ తాలూకా ఇండ్లవాడి కూడలి వద్ద కుమార్ అనే యువకుడ్ని అపహరించేందుకు కొందరు ప్రయత్నించారు. అతనిపై దాడి చేసి కారులోకి బలవంతంగా ఎక్కించుకునేందుకు ఎనిమిది మంది విఫలయత్నం చేశారు. బాధితుడు కేకలు వేయడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు.

బలహీన వర్గాల అభివృద్ధికి విద్యే ఆధారం

చిత్రదుర్గ, న్యూస్‌టుడే : వెనుకబడిన వర్గాల ప్రజల అభివృద్ధి దిశలో పయనించాలంటే విద్య ఒక్కటే ఆధారమని అదనపు జిల్లా పాలనాధికారి కుమారస్వామి పేర్కొన్నారు. మంగళవారం సవితా మహర్షి జయంతి సందర్భంగా జిల్లా పాలనాధికారి కార్యాలయంలో కుమారస్వామి మహర్షి చిత్రపటానికి పుష్పార్చన చేసి నివాళులర్పించి మాట్లాడారు. వెనుకబడిన వర్గాల విద్యార్థులు ప్రభుత్వం కల్పించిన సదుపాయాలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉన్నత చదువులు చదివి మంచి పదవులను పొందాలన్నారు. కార్యక్రమంలో కన్నడ సంస్కృతి శాఖ సహాయక డైరెక్టర్ గుర్నాథ్, కూడా అధ్యక్షుడు తాజ్‌పీర్, తిప్పేస్వామి, ఎన్‌డీ కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటానికి పుష్పార్చన చేస్తున్న కుమారస్వామి

ఉత్కంఠభరితంగా ఎడ్లబండ్ల పోటీలు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : ఏడాది పూర్తి పొలం పనుల్లో మునిగి తేలే రైతులకు కాస్తా వినోదాన్ని కల్పించే నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఎడ్లబండ్ల పోటీలు వారిలో ఉత్సాహాన్ని నింపింది. చిక్కమగళూరుకు చెందిన తేగూరు గ్రామంలో ప్రతి ఏడాదిమాదిరిగానే ఎడ్లబండ్ల పోటీలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన ఎద్దుల బండ్ల పోటీదారులు పాల్గొనడం విశేషం. పోటీదారుడు గజేంద్ర మాట్లాడుతూ 15 ఏళ్ల నుంచి తాను ఎద్దులను సాకుతున్నానని, విజేత కావడం తనకు ఆనందంగా ఉందన్నారు.

పోటీల్లో తలపడిన ఎడ్లబండ్లు

తైక్వాండోలో సత్తా చాటిన పూజశ్రీ

బెంగళూరు (పీణ్యాదాసరహళ్లి), న్యూస్‌టుడే : కోరమంగళలోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 24 నుంచి జరుగుతున్న రాష్ట్ర తైక్వాండో సబ్ జూనియర్ బ్లాక్‌బెల్ట్ విభాగంలో చిక్కబానువార పురసభ పరిధిలో నివసిస్తున్న బీఎం చిక్కణ్ణ కుమార్తె డాక్టర్ పూజశ్రీ రెండు బంగారు పతకాలు, వ్యక్తిగత పోటీల్లో రెండు కాంస్య పతకాలను సాధించింది. శిక్షకుడు నవీన్‌కుమార్ మార్గదర్శకత్వంలో సాధన చేసిన ఈమె ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించినట్లు తండ్రి చిక్కణ్ణ హర్షం వ్యక్తం చేశారు.

శిక్షకుడు నవీన్‌కుమార్‌తో పూజశ్రీ

ఫుట్‌బాల్ పోటీల్లో కర్ణాటక విజయం

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : ఖేలో ఇండియా దక్షిణ భారత క్వాలిఫైయింగ్ ఫుట్‌బాల్ బాలికల విభాగంలో కర్ణాటక జట్టు 8-0 గోల్స్ ఆధిక్యంతో ప్రత్యర్థి ఆంధ్రప్రదేశ్ జట్టుపై విజయం సాధించింది. మంగళవారం రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం మైదానంలో జరిగిన పోటీలో విజేత జట్టుకు సుభద్ర ఐదు గోల్స్ సాధించి సహ ఆటగాళ్లకు స్ఫూర్తి ఇచ్చింది. గౌరినింగనగౌడ పాటీల్, అన్వీజోషి, ప్రణీత తలా ఒక గోల్ తీశారు. మరో పోటీలో పాండిచ్చేరి జట్టు 20-0 గోల్స్‌తో అండమాన్ జట్టుపై నెగ్గింది. పాండిచ్చేరి జట్టుకు రాజేశ్వరి ఏడు, మహాదేవి నాలుగు, ఎం.శివశ్రీ మూడు, సబియా, శుభ చెరో రెండు, ఇశాంతిక ఒక గోల్ సాధించి విజయాన్ని సాధించారు.

కర్ణాటక-ఆంధ్రా జట్ల మధ్య జరుగుతున్న పోటీ

'క్రీడలు క్రమశిక్షణను పెంపొందిస్తాయి'

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : క్రికెట్ ఆట కేవలం మైదానానికి పరిమితమైంది కాదని, భారత కర్ణాటక క్రికెట్ సంఘం ఉపాధ్యక్షుడు సుజీత్ సోమసుందర్ అభిప్రాయపడ్డారు. మైసూరు సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయ క్రికెట్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రముఖులు మమతారాణి అగర్వాల్, బి.సురేశ్, సి.ఇజబెల్లోరమర్, సంతోశ్‌కుమార్, సి.రేవణ్ణ తదితరులు పాల్గొన్నారు. 132 విశ్వవిద్యాలయాల విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారు. ఫిబ్రవరి 5న ఫైనల్ పోటీలు జరగనున్నాయి.

బ్యాటింగ్ చేస్తున్న సుజీత్‌సోమసుందర్

IN THE COURT OF PRINCIPAL DISTRICT JUDGE, KURNOOL (A.P.)
M.V.O.P.No.301/2025

Kuruva Peddaiah @Kuruva Rama Peddaiah -Petitioner
-Versus-
K.Veera Swamy & 2 Others -Respondents

NOTICE TO 1ST RESPONDENT

K.Veera Swamy, S/o. Karuppa Swamy, Hindu, Proprietor of Sri Vigneswara Transport No.6368, Rishi Nilaya, near Govindappa Layout, Subash Nagar, Nelamangala, Bangalore - 562123.

The petitioner has filed the above case seeking for compensation of Rs.12,00,000/- for the injuries, he has sustained in the Lorry Accident bearing No.KA-52-B-0303 belonging to 1st respondent that occurred on 27.12.2024 near Neravada Village, Kurnool District. A.P., the above case posted on 23.02.26 for the appearance of the 1st respondent. Hence the 1st respondent is directed to appear the Hon'ble Court on 23.02.2026 10.30 A.M. either in person or through Advocate. As otherwise the matter will heard as exparte.

By order
Sd/- B.Lokeshwar Reddy
Advocate
H.No.44-137, Prakash Nagar, Kurnool. Cell: 94403 56140

IN THE COURT OF PRINCIPAL DISTRICT JUDGE, KURNOOL(A.P.)
M.V.O.P.No.300/2025

Gayatri Minor Rep by Natural Guardian Father G Madhu - Petitioner
-Versus-
K.Veera Swamy & 2 Others - Respondents

NOTICE TO 1ST RESPONDENT

K.Veera Swamy, S/o.Karuppa Swamy, Hindu, Proprietor of Sri Vigneswara Transport No.6368, Rishi Nilaya, near Govindappa Layout, Subash Nagar, Nelamangala, Bangalore- 562123.

The minor petitioner has filed the above case seeking for compensation of Rs. 3,00,000/- for the injuries, she has sustained in the Lorry Accident bearing No. KA-52-B-0303 belonging to 1st respondent that occurred on 27.12.2024 near Neravada Village, Kurnool District, A.P., the above case posted on 23.02.26 for the appearance of the 1st respondent. Hence the 1st respondent is directed to appear the Hon'ble Court on 23.02.2026 10.30A.M. either in person or through Advocate. As otherwise the matter will heard as exparte

By order
Sd/- B.Lokeshwar Reddy,
Advocate,
H.No. 44-137, Prakash Nagar, Kurnool. Cell: 94403 56140

IN THE COURT OF PRINCIPAL DISTRICT JUDGE, KURNOOL(A.P.)
M.V.O.P.No. 299/2025

K.Ashwin Minor Rep by Natural Guardian Father K Peddaiah - Petitioner
-Versus-
K.Veera Swamy & 2 Others - Respondents

NOTICE TO 1ST RESPONDENT

K.Veera Swamy, S/o.Karuppa Swamy, Hindu, Proprietor of Sri Vigneswara Transport No.6368, Rishi Nilaya, near Govindappa Layout, Subash Nagar, Nelamangala, Bangalore- 562123.

The minor petitioner has filed the above case seeking for compensation of Rs. 2,00,000/- for the injuries, he has sustained in the Lorry Accident bearing No. KA-52-B-0303 belonging to 1st respondent that occurred on 27.12.2024 near Neravada Village, Kurnool District, A.P., the above case posted on 23.02.26 for the appearance of the 1st respondent. Hence the 1st respondent is directed to appear the Hon'ble Court on 23.02.2026 10.30A.M. either in person or through Advocate. As otherwise the matter will heard as exparte

By order
Sd/- B.Lokeshwar Reddy,
Advocate,
H.No. 44-137, Prakash Nagar, Kurnool. Cell: 94403 56140

IN THE COURT OF PRINCIPAL DISTRICT JUDGE, KURNOOL (A.P.)
M.V.O.P.No.298/2025

K.Shiva Kumar Minor Rep by Natural Guardian Father K.Maddileti -Petitioner
-Versus-
K.Veera Swamy & 2 Others -Respondents

NOTICE TO 1ST RESPONDENT

K.Veera Swamy, S/o. Karuppa Swamy, Hindu, Proprietor of Sri Vigneswara Transport No.6368, Rishi Nilaya, near Govindappa Layout, Subash Nagar, Nelamangala, Bangalore - 562123.

The Minor petitioner has filed the above case seeking for compensation of Rs.40,00,000/- for the injuries, She has sustained in the Lorry Accident bearing No.KA-52-B-0303 belonging to 1st respondent that occurred on 27.12.2024 near Neravada Village, Kurnool District. A.P., the above case posted on 23.02.26 for the appearance of the 1st respondent. Hence the 1st respondent is directed to appear the Hon'ble Court on 23.02.2026 10.30 A.M. either in person or through Advocate. As otherwise the matter will heard as exparte.

By order
Sd/- B.Lokeshwar Reddy
Advocate
H.No.44-137, Prakash Nagar, Kurnool. Cell: 94403 56140

(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

భక్తిశ్రద్ధలతో విఠలకృష్ణ సంస్థాన పూజ

బలభీమ విగ్రహానికి పుష్పాలంకరణ

మాన్వి, న్యూస్‌టుడే: హట్టి బంగారు గని సమీపంలోని వందలి గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వందలి బలభీమ దేవస్థానంలో మంగళవారం హనుమ, భీమ, విఠలకృష్ణ సంస్థాన పూజ, వివిధ ధార్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే దేవస్థానంలో సంస్థానపూజ కార్యక్రమాలు మొదలయ్యాయి. కణ్వమఠం పీఠాధిపతి విద్యాకణ్వవిరాజ్ తీర్థశ్రీపాదంగళ్ సాన్నిధ్యంలో ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. సంజీవమూర్తి దేవస్థానం నుంచి శోభాయాత్ర నిర్వహించారు. భక్తులకు ముద్రాధారణ చేశారు. హట్టి, లింగసుగూరు, దేవదుర్గ, రాయచూరు తాలూకాల నుంచి భక్తులు హాజరయ్యారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు

పాత్రికేయులకు వివరిస్తున్న అనిల్

రాయచూరు, న్యూస్‌టుడే: మాదిగ సామాజిక వర్గంలోని ప్రతిభావంత విద్యార్థులకు ఫిబ్రవరి 14వ తేదీ ప్రతిభా ప్రోత్సాహకాలను ప్రదానం చేస్తామని నవరత్న యువక సంఘం ముఖ్యుడు కె.పి.అనిల్‌కుమార్ వెల్లడించారు. ఆయన మంగళవారం పత్రికాభవన్‌లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. 2024-25 విద్యా సంవత్సరంలో పది, పీయూసీ, డిగ్రీ, స్నాతకోత్తర కోర్సుల్లో ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులైన వారికి ఏటా ప్రోత్సాహకాలను అందజేస్తున్నామని వివరించారు. అర్హులైన విద్యార్థులు వ్యక్తిగత వివరాలు, మార్కులు, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు నకళ్లు, రెండు ఫొటోలు, ఫిబ్రవరి 8 లోపు దళితవాడలోని సముదాయ భవనంలో ఇవ్వాలని సూచించారు. సమావేశంలో అధ్యక్షుడు శరణప్ప, సభ్యులు ఆంజినేయ, చంద్ర భండారి, హులిగప్ప, జనార్దన్ హళ్లిబెంచి, వెంకటేష్, ఈరేశ్, నాగరాజ్ పాల్గొన్నారు.

సవితా మహర్షి బోధనలు అనుసరణీయం

ప్రసంగిస్తున్న వీరహనుమాన్

మహర్షి చిత్రపటానికి పుష్పార్చన

రాయచూరు, న్యూస్‌టుడే: నగరంలో మంగళవారం సవితా మహర్షి జయంతిని వైభవంగా నిర్వహించారు. గోవిందరావు పెట్రోలు బంకు దగ్గర చిత్రపటం ఊరేగింపును నగర పాలక సంస్థ ఉప కమిషనర్ సంతోష్‌రాణి ప్రారంభించారు. ప్రముఖ రహదారుల మీదుగా కొనసాగిన ఊరేగింపు రంగమందిరాన్ని చేరుకుంది. అక్కడ ప్రముఖులు పుష్పార్చన చేసి నివాళులర్పించారు. సాహితీవేత్త వీరహనుమాన్ ఉపన్యసిస్తూ మెరుగైన సమాజం కోసం మహర్షి చేసిన బోధనలు అన్ని కాలాలకు అనుసరణీయమని పేర్కొన్నారు. అపార జ్ఞానాన్ని కల్గిన, సవితా సమాజం మూలపురుషుడైన మహర్షి తన సందేశాలతో రుగ్మతలు, మూఢ విశ్వాసాలపై ప్రజలను చైతన్య పరిచిన సంఘ సంస్కర్తగా గుర్తింపు పొందారన్నారు. విద్య, ఆర్థిక, సామాజికంగా వెనుకబడ్డ సవితా సమాజం ప్రజలు ప్రభుత్వ సౌలభ్యాలను సద్వినియోగం చేసుకుని రాణించాలని ఆకాంక్షించారు. జిల్లా పాలనాధికారి కార్యాలయం తహసీల్దార్ పరశురామ్, నగర పాలక సంస్థ రెవెన్యూ అధికారి నరసింహారెడ్డి, సవితా వర్గం ముఖ్యులు గోవిందు, సుమా గస్తీ, నాగరాజ్, రామచేంద్ర ఇటగి, భీమేష్ పాల్గొన్నారు.

నవోదయలో ఎంఆర్‌ఐ స్కానింగ్ యంత్రం

ఆధునిక యంత్రం

రాయచూరు: నవోదయ వైద్య ఆసుపత్రిలో అత్యాధునిక 3 టి ఎంఆర్‌ఐ స్కానింగ్ యంత్రాన్ని సోమవారం సాయంత్రం వైద్య విద్యాశాఖ, జిల్లా బాధ్య మంత్రి డాక్టర్ శరణప్రకాశ్ పాటిల్ ప్రారంభించారు. మంత్రి ప్రసంగిస్తూ 3 టి ఎంఆర్‌ఐ రోగాన్ని త్వరగా, ఖచ్చితంగా నిర్ధారించేందుకు సహకరిస్తుందని, గతంలో కంటే మెరుగైన వైద్య సేవలు లభ్యమవుతాయన్నారు. నవోదయ సంస్థ దూరదృష్టితో ఆలోచించి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నవోదయ విద్యా సంస్థల ఛైర్మన్ సుంకి రాజేంద్రరెడ్డి మాట్లాడుతూ జిల్లా ప్రజలకు ప్రపంచ స్థాయి వైద్య సౌలభ్యాలను అందించేందుకు కట్టుబడి ఉన్నామని, ఇందులో భాగంగానే కొత్త యంత్రాన్ని అమర్చినట్లు తెలిపారు. రిజిస్ట్రార్ డాక్టర్ తాడిపత్రి శ్రీనివాస్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ దేవానంద్, ఉప ప్రిన్సిపల్ డాక్టర్ ఆనంద్, కాంగ్రెస్ నాయకులు రవి, జయణ్ణ పాల్గొన్నారు.

తల్లిని కడతేర్చిన తనయుడు

చందవ్వ

లింగసుగూరు, (మాన్వి): ముద్గల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జక్కేరుమడు తండాకు చెందిన కుమార్ అనే యువకుడు భార్యతో కలిసి బెంగళూరులో పనిచేసుకుంటున్నాడు. డబ్బు అవసరమైనప్పుడు తండాకు వచ్చి తల్లి చందవ్వ (45)తో డబ్బులు తీసుకుని వెళ్లేవాడు. ఆదివారం గ్రామానికి వచ్చిన కుమార్ రూ.2 లక్షల కావాలంటూ తల్లితో గొడవ పడి ఇంటి పైకప్పు బద్దలు కొట్టి వెళ్లిపోయాడు. సోమవారం మద్యం సేవించి తల్లివద్దకు వచ్చి.. తాను బెంగళూరు వెళ్లిపోవాలని డబ్బులివ్వాలని ఒత్తిడి తెచ్చి.. ఆవేశంతో తల్లి జుట్టుపట్టుకుని ఈడ్చుకుంటూ ఆమె తలకు గోడకేసి మోదాడు. తర్వాత రాయితో తలపై గట్టిగా కొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయింది. రాయచూరు ఎస్పీ అరుణాంగ్షుగిరి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ముద్గల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని కుమార్‌ను అరెస్టు చేశారు.

వీడని అలజడి .. చర్చ పక్కదారి

దిగువ సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

ఈనాడు, బెంగళూరు: అధికార పక్షానికి గవర్నర్ ప్రసంగం.. మన్‌రేగా వ్యవహారం, విపక్షానికి అబ్కారి మంత్రి రాజీనామా. ఈ రెండు అంశాలే మూడు రోజులుగా విధానసభ సమావేశాలను కుదిపేశాయి. వరుస సెలవుల తర్వాత మంగళవారం సభ ప్రారంభం కాగా ఎప్పటిలాగానే విపక్ష సభ్యులు ఆందోళనబాట పట్టారు. తమ రాజకీయ అంశాలపై అధికార విపక్షాలు విధానసభ బయట ఆందోళనకు దిగటంతో సభ ప్రకటిత సమయానికి రెండున్నర గంటల ఆలస్యంగా ప్రారంభమైంది. మిగిలింది మూడు రోజులే కావటంతో వడివడిగా ప్రశ్నోత్తరాలు, కాలింగ్ అటెన్షన్ కార్యకలాపాలు, ఆపై గవర్నర్ ప్రసంగంపై చర్చలతో సభ వాయిదా పడింది.

అంతా అయోమయం

ఈ నెల 22న ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగం వ్యవహారంపై సభ ఓ స్పష్టతకు రాలేకపోతోంది. స్పీకర్ యు.టి.ఖాదర్ రూలింగ్ ఇచ్చినా అధికార, విపక్ష సభ్యుల్లో గందరగోళం కొనసాగుతునూ ఉంది. గవర్నర్ తన ప్రసంగాన్ని కేవలం మూడు వాక్యాల్లో ముగించి చివరకు జై హింద్, జై కర్ణాటక అంటూ బయటకు వెళ్లగా ఈ చర్య రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమని నేటికీ అధికార కాంగ్రెస్ ఆరోపిస్తూనే ఉంది. ఓ వైపు ఆరోపిస్తూనే గవర్నర్ ప్రసంగాన్ని సభలో ప్రవేశపెట్టిన సర్కారు ఆపై అభినందన తీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టారు. అంటే ఈ ప్రసంగ పాఠాన్ని ప్రభుత్వం ఆమోదించినట్లేనని విపక్ష సభ్యులు పదే పదే ప్రశ్నిస్తున్నారు. మంగళవారం కూడా ఇదే అంశంపై విపక్ష నేత ఆర్.అశోక్, సీనియర్ సభ్యులు సురేశ్‌కుమార్ మరోసారి గుర్తు చేశారు. ప్రసంగంలోని పూర్తి సారాంశాన్ని ఆమోదించిన సర్కారు అందులోని కీలక అంశాలపై చర్చకు అవకాశం కల్పించటమే గందరగోళానికి కారణమైంది. పైగా రాష్ట్ర ప్రథమ పౌరులు, రాజ్యాంగ వ్యవస్థల పరిరక్షకులైన గవర్నర్‌ను విమర్శించే హక్కు సభ్యులకు లేదని కూడా సభా నియమాలు చెబుతున్నాయి. ఈ సమయంలో స్పీకర్ జోక్యం చేసుకుని ఇకపై చర్చల సమయంలో గవర్నర్ నడత గురించి కాకుండా రాజ్యాంగ నిబంధనల గురించే చర్చించాలి రూలింగ్ ఇచ్చారు.

దిగువ సభలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్

పొన్నణ్ణ ప్రారంభం..ప్రదీప్ ప్రసంగం

కాంగ్రెస్ న్యాయ సలహాదారులు, ఎమ్మెల్యే పొన్నణ్ణ గవర్నర్ ప్రసంగ తీర్మానంపై చర్చను ప్రారంభించగా, మరో ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ ఈ ప్రసంగాన్ని ఆమోదించారు. ఈ సందర్భంగా పొన్నణ్ణ మాట్లాడుతూ రాజ్యాంగంలోని 176 ప్రకారం గవర్నర్ మంత్రివర్గం ఆమోదించిన ప్రసంగాన్ని చదవాల్సిందేనని మరోసారి ప్రకటించారు. ఇదే రాజ్యాంగంలోని 282 ప్రకారం కొత్త సంవత్సరంలో తొలి సభలో రాష్ట్ర ప్రగతి, ఆశయాల గురించి రాజ్యాంగ బద్ధంగా ఎన్నుకొన్న మంత్రివర్గం ఆమోదించిన ప్రసంగాన్ని, అందులోని ప్రజా ప్రయోజన అంశాలను తప్పకుండా చదవాల్సిందేనన్నారు. ప్రజల కోసం తన ప్రభుత్వం ఏం చేస్తుందో చదవకపోవటం సభను అవమానించినట్లేనని పలు రాష్ట్రాల గవర్నర్లపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులను ఉటంకిస్తూ పొన్నణ్ణ ప్రస్తావించారు. ఈ సమయంలో విపక్ష సభ్యులు అభ్యంతరం చెప్పగా పలుమార్లు సభకు అంతరాయం కలిగింది. ముఖ్యమంత్రి, హోంమంత్రులు జోక్యం చేసుకుని గవర్నర్ చర్యలను కాకుండా రాజ్యాంగంలో ఏముందో సభకు తెలియజెప్పాల్సిన బాధ్యత మాపై ఉందన్నారు.

గవర్నర్‌ను అవమానిస్తారా?

● ధ్వజమెత్తిన కాషాయదళం

విధానసౌధ ఆవరణలో మహాత్ముని విగ్రహం వద్ద దళ, భాజపా నేతలు

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే: అధికార పార్టీ నేతలు గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్‌ను అవమానించారని ఆరోస్తూ భాజపా, దళ్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు విధానసౌధ ఆవరణలోని మహాత్ముని విగ్రహం వద్ద మంగళవారం ధర్నాకు దిగారు. గవర్నర్‌ను అవమానించి ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రభుత్వం తూట్లు పొడించిందని భాజపా అధ్యక్షుడు బీవై విజయేంద్ర దుయ్యబట్టారు. ఉభయ సభల సభ్యులను ఉద్దేశించి ప్రసంగించేందుకు వచ్చిన గవర్నర్‌తో గతంలో ఎన్నడూ లేని విధంగా అనుచితంగా వ్యవహరించిన నేతలపై చర్యలు తీసుకోవాలని నేతలు నినాదాలు చేశారు. ఎక్సైజ్ శాఖలో చోటు చేసుకున్న కుంభకోణంపైనా దర్యాప్తునకు ఆదేశించి, మంత్రి ఆర్‌బీ తిమ్మాపురను మంత్రివర్గం నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ధృతరాష్ట్రుని తరహాలో కళ్లు మూసుకుని కూర్చున్నారని విపక్ష నేత అశోక్ దుయ్యబట్టారు. మంత్రి రాజీనామా చేసేంత వరకు తమ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ప్రభుత్వం వీబీ జీరామ్ జీ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగారని విమర్శించారు. ఆందోళనలో గోపాలయ్య, అశ్వత్థ నారాయణ, శరవణ, సురేశ్ గౌడ, ఎం.కృష్ణప్ప, గాలి జనార్దన రెడ్డి, సీటీ రవి, సునీల్ కుమార్, చలువాది నారాయణ స్వామి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాయచూరు ఉత్సవం.. సైకిల్ ర్యాలీ

బయలుదేరిన ఔత్సాహికులు

ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో విజేతలు

రాయచూరు, న్యూస్‌టుడే: రాయచూరు ఉత్సవ్‌ను పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన సైకిల్ సవారీ పోటీలకు ఉత్తమ స్పందన లభించింది. సైకిల్ సంఘం సభ్యులు, విద్యార్థులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక మహాత్మాగాంధీ మైదానంలో ఉదయం 6 గంటలకు జిల్లా అదనపు పాలనాధికారి శివానంద జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. బసవేశ్వర కూడలి, జిల్లా పంచాయతీ కార్యాలయం, కనకదాసు సర్కిల్, ఎస్పీ కార్యాలయం, యరమరాస్, బైపాస్ రహదారి, యక్లాసపూరు, వ్యవసాయ విజ్ఞాన విశ్వవిద్యాలయం మీదుగా సైకిల్ ర్యాలీ తిరిగి మైదానానికి చేరింది. నిర్వాహకులు ముగ్గురు విజేతల పేర్లను ప్రకటించారు. ప్రథమ నగదు బహుమతి బెల్లం ప్రకాశ్‌కు రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రాఘవేంద్రగుప్తకు రూ.5 వేలు, తృతీయ బహుమతి సణ్ణ వీరేశ్‌కు రూ.3 వేలు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేశారు.

హరిప్రసాద్ తీరు గర్హనీయం

నిరసన ప్రదర్శనలో భాజపా నాయకులు

రాయచూరు, న్యూస్‌టుడే: అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ గహ్లోత్‌ను అడ్డుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్సీ హరిప్రసాద్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని 'భాజపా యువమోర్చా' డిమాండ్ చేసింది. జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, శంకరరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామచంద్ర నేతృత్వంలో ప్రతినిధులు మంగళవారం ఇక్కడి అంబేడ్కర్ కూడలి వద్ద ప్రదర్శన చేపట్టారు. హరి ప్రసాద్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా ఆదర్శంగా ఉండాల్సిన ఎమ్మెల్సీ ప్రవర్తించిన తీరు ఎంత మాత్రం సరికాదని పేర్కొన్నారు. రాజ్యాంగ బద్ధంగా నియమించిన గవర్నర్‌పై అగౌరవంగా వ్యవహరించడం తగదని హితవు పలికారు. కార్యక్రమంలో ప్రతినిధులు మంచాల భీమణ్ణ, బండేశ్ వల్కందిన్ని, లక్ష్మణ్, విజయకుమార్, కార్తీకరెడ్డి, వాణి, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

సైబర్ ఠాణాలో కేసు నమోదు

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే: కర్ణాటక పోలీసు డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎంఏ సలీంను లక్ష్యంగా చేసుకుని తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్న ఆరోపణలపై హిందూ సంఘాల నాయకుడు పునీత్ కెరెహళ్లిపై సైబర్ ఠాణా పోలీసులు కేసు నమోదు చేశారు. సోలదేవనహళ్లి సమీపంలోని శ్వేతా ఫాం, దాని చుట్టుపక్కల భూములు డీజీపీ బినామీ ఆస్తి అని ప్రచారం చేస్తున్నట్లు గుర్తించి ఇచ్చిన ఫిర్యాదుతో సైబర్ ఠాణాలో కేసు నమోదైంది.

బ్యాంకుల సమ్మె విజయవంతం

బసవేశ్వర కూడలిలో మూతపడిన బ్యాంకు

రాయచూరు, న్యూస్‌టుడే: ఐదు రోజుల పనిని నిర్ణయించాలని కోరుతూ రాయచూరులో బ్యాంకులు చేపట్టిన సమ్మె విజయవంతమైంది. అధికారులు, ఉద్యోగులు మంగళవారం విధులను బహిష్కరించి స్థానిక మహాత్మగాంధీ కూడలి వద్ద ప్రదర్శన చేపట్టారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు శనివారం సెలవును ప్రకటించాలని డిమాండ్ చేశారు. డిజిటల్ బ్యాంకింగ్ వ్యవస్థ వల్ల రెండు రోజులు వరుస సెలవులు ఉన్నా ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని ఉద్యోగ సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయకపోతే రాబోవు రోజుల్లో ఆందోళనను ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు. మూడు రోజుల సెలవుల తర్వాత నాల్గో రోజు బ్యాంకులు తెరవనందున ప్రజలకు అగచాట్లు తప్పలేదు.

పూజలు చేస్తున్న శివమాధారులు

వైభవంగా మల్లికార్జునుడికి పూజలు

మాన్వి, న్యూస్‌టుడే: సిరివార పట్టణంలోని సుత్తూరుమఠంలో శివరాత్రిని పురస్కరించుకుని శ్రీశైలమల్లికార్జునుడి శివమాల ధరించిన మాలాధారుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువు సోమశేఖరయ్యస్వామి సమాధి వద్ద పూజలు చేశారు. విజయ మహాంతేశస్వామి సుత్తూరుమఠం, స్థానిక ప్రముఖులతో 70 మంది మాలాధారులు పాల్గొన్నారు.

ఉత్సవాన్ని విజయవంతం చేద్దాం

గోడపత్రికలను విడుదల చేస్తున్న అధికారులు

సిరివార, (మాన్వి): ఫిబ్రవరి 5 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న రాయచూరు ఉత్సవాన్ని విజయవంతంగా చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ అశోక్ పవార్ సూచించారు. జిల్లా ఉత్సవ ప్రచార పత్రికలను, గోడ పత్రాలను విడుదల చేసి మాట్లాడారు. జిల్లాలోని ప్రతి గ్రామంలో ఉత్సవ నిర్వహణ విషయమై ప్రజలతో మాట్లాడాలని, అందరూ పాల్గొనేటట్లు చూడాలని సూచించారు. మూడు రోజుల ఉత్సవంలో కన్నడతనం ఉట్టిపడేవిధంగా కార్యక్రమాల రూపకల్పన జరుగుతుందన్నారు. జిల్లా యంత్రాంగం విడుదల చేసిన క్యూఆర్ కోడ్‌ని వినియోగించుకుని పేర్లని నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ పంచాయతీ అధ్యక్షుడు హాజి చౌద్రి, ఉపాధ్యక్షురాలు లక్ష్మీ, ముఖ్యాధికారి సురేష్ శెట్టి, టీపీఈఓ శశిధర్‌స్వామి, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆరీఫ్‌మియా, ఎస్ఐ అజ్మీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అస్వస్థత

శివమొగ్గ: భద్రావతి తాలూకా అరళిహళ్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఇచ్చిన మాత్రలు వేసుకున్న వారిలో 59 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారిని భద్రావతి తాలూకా ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. మాత్రలు వేసుకున్న వారు వాంతులు చేసుకుంటూ, కడుపు నొప్పి వచ్చిందని చెప్పడంతో మిగిలిన వారికి మాత్రలు ఇవ్వలేదు. కాలం చెల్లిన మాత్రలతోనే సమస్య వచ్చిందని ప్రాథమిక విచారణలో గుర్తించారు. విద్యార్థులు కోలుకున్నారని తాలూకా విద్యాశాఖ అధికారి నాగేంద్రప్ప తెలిపారు. దీనిపై దర్యాప్తునకు ఆదేశించామని చెప్పారు.

అర్జీని తోసిపుచ్చిన న్యాయస్థానం

బెంగళూరు (కృష్ణరాజపురం): భాజపా నాయకుడు, ధార్వాడ గ్రామ పంచాయతీ సభ్యుడు యోగీశ్ గౌడ హత్య కేసులో 15వ నిందితుడు, ఎమ్మెల్యే వినయ్ కులకర్ణి వేసుకున్న బెయిలు అర్జీని ఉన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. ఈ కేసులో 21 మంది నిందితుల్లో 20 మందికి బెయిలు ఇచ్చారని, వినయ్‌కు కూడా బెయిలు ఇవ్వాలని కోరుతూ ఆయన తరపు న్యాయవాది కోరారు. సాక్ష్యుల విచారణ పూర్తి కావలసిన నేపథ్యంలో బెయిలు ఇవ్వకూడదని సీబీఐ తరపు న్యాయవాది వాదనలను జస్టిస్ సునీల్ దత్ యాదవ్ పరిగణనలోకి తీసుకుని బెయిలు అర్జీని తోసిపుచ్చారు. సర్వోన్నత న్యాయస్థానంలో బెయిలు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'రైతుల నడక ఆలమట్టి వైపు'

పాత్రికేయులతో మాట్లాడుతున్న పాటిల్

రాయచూరు: కృష్ణా న్యాయాధీకరణ (ట్రైబ్యునల్) తీర్పును అమలు చేసి, మూడో దశ నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ ఫిబ్రవరి 9న 'రైతుల నడక-ఆలమట్టి జలాశయం వైపు' పేరుతో ఆందోళనా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని రాజ్యరైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంత్ పాటిల్ వెల్లడించారు. ఆయన మంగళవారం పత్రికాభవన్‌లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. తొలుత ముద్దేబిహాళ్‌లో వివిధ జిల్లాల రైతులతో సమావేశమై, అక్కడి నుంచి ఆలమట్టికి చేరుకుని సభ నిర్వహిస్తామన్నారు. రైతు సంఘాలు, మఠాధిపతులు మద్దతు పలకాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ, మహారాష్ట్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నందునే ఆలమట్టి ఎత్తు పెంచలేకపోతున్నారన్నారు. కేంద్రం, కర్ణాటక సర్కారు పొరుగు రాష్ట్రాలను ఒప్పించాలని కోరారు.

అన్నదాతకు కన్నీళ్లు తెప్పిస్తున్న ఉల్లి

రాయచూరులో అమ్మకానికి ఉంచిన ఉల్లి

రాయచూరు, న్యూస్‌టుడే: తల్లి మాదిరే ఉల్లి మేలు చేస్తుందంటారు. ప్రస్తుతం ఉల్లి సాగుచేసిన రైతులకు నష్టం కల్గుతోంది. వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాల విపణిల్లో సీజన్ ఆరంభం నుంచి ధర స్థిరంగా ఉండక, గిట్టుబాటు ధర లేక ఆర్థికంగా నష్టపోతున్నారు. రాయచూరు ఏపీఎంసీలో జనవరి 20న నాణ్యమైన గడ్డ క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.2080, మాదిరి రూ.1580 పలికింది. మంగళవారం మార్కెట్‌లో 624 క్వింటాళ్ల విక్రయాలు జరిగాయి. గరిష్ఠంగా రూ.1535, మాదిరి రూ.1100కు విక్రయించుకున్నారు. ఈ వారంలో రూ.435 నుంచి రూ.500 పడిపోయింది. నిరుడు ఇదే వేళ రూ.2 వేల వరకు ధర పలికింది. జిల్లాలోని మాన్వి, సింధనూరు, దేవదుర్గ, లింగసూగూరు తాలూకా, యాదగిరి జిల్లా అన్నదాతలు రాయచూరు ఏపీఎంసీకు ఉల్లిని తీసుకొస్తున్నారు. తెలంగాణ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కర్షకులు రాయచూరులో రేటు లభిస్తుందన్న గంపెడాశతో వస్తున్నారు. ఇక్కడ పతనమైన ధర చూసి కంగుతింటున్నారు. తిరిగి తీసుకెళ్లితే అయ్యే రవాణా ఛార్జీలను భరించలేక నష్టానికి అమ్ముకుంటున్నారు. రాయచూరు జిల్లాలో సంభవించిన అతివృష్టికి దిగుబడులు కోల్పోయారు. ఆశించిన ధర ఉండటం లేదు. దీంతో రెండు విధాల నష్టపోతున్నామని వాపోతున్నారు. రేటు దైవాధీనమైనందున రాయచూరు తాలూకాలో ఉల్లి విస్తీర్ణం క్రమేపి తగ్గుతోంది.

దిగుబడులు పుష్కలంగా వచ్చినా

ఈసారి పంట దిగుబడి పెరిగింది. ఎకరాకు 50 కిలోలు పండింది. 130 సంచులను తెచ్చా. ప్రతిసారి హైదరాబాద్‌కు పంటను తీసుకెళ్లేవాళ్లం. రాయచూరులో గిట్టుబాటు లభిస్తుందని తొలిసారి ఇక్కడికి వచ్చాను. ధర పతనం కుంగ తీసింది.

\- కె.వెంకటేష్ (కంసనపల్లి, నారాయణపేట జిల్లా)

కొనుగోలు కేంద్రాలు ఎందుకు తెరవరో

కుమారస్వామి సీఎంగా ఉన్నప్పుడు కొనుగోలు కేంద్రాలు తెరిచారు. వరి ధాన్యం, పత్తి, కంది, జొన్న, శెనగ పంటల కేంద్రాలను తెరిచారు. ఉల్లి సేకరణ కేంద్రాలను తీయాలని ఒత్తిడి తెచ్చినా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయం. రైతులను ఆదుకునేందుకు సర్కారు ఎందుకు ముందుకు రాదో అర్థం కావడం లేదు. జిల్లా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం బాధాకరం. క్వింటాల్‌కు రూ.2500 నుంచి రూ.3 వేలు ఖరారు చేయాలి. ఈ సారి ఎరువుల ధరలు అమాంతంగా పెరిగినందున ప్రస్తుత రేటు సరిపోదు.

\- లక్ష్మణగౌడ (జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు)

తీర్పు రిజర్వు చేశాం

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే: కల్ట్ సినిమా బ్యానర్‌ను తొలగించారని నగరసభ కమిషనర్ అమృతాగౌడను బెదిరించిన ఆరోపణలపై అరెస్టయిన కాంగ్రెస్ మాజీ నాయకుడు రాజీవ్‌గౌడ వేసుకున్న బెయిలు అర్జీపై శిడ్లఘట్ట జేఎంఎఫ్‌సీ న్యాయస్థానం తీర్పు రిజర్వు చేశామని ప్రకటించింది. కేరళ, కర్ణాటక సరిహద్దుల్లో రాజీవ్‌గౌడను సోమవారం రాత్రి అరెస్టు చేశారు. చిక్కబళ్లాపురకు తీసుకువచ్చి వైద్య పరీక్షలు చేయించి, న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. విచారణ నిమిత్తం ఆయనను అదుపునకు తీసుకున్నారు. నిందితుడ్ని అరెస్టు చేసిన శిడ్లఘట్ట ఇన్‌స్పెక్టర్ ఆనంద్ కుమార్, చిక్కబళ్లాపుర సైబర్ ఠాణా ఇన్‌స్పెక్టర్ సూర్యప్రకాశ్ నేతృత్వంలోని సిబ్బందిని ఎస్పీ కుశాల్ చౌక్సే అభినందించారు.

'పార్టీ వీడితే దేశద్రోహమా'

హాసన, న్యూస్‌టుడే: జనతాదళ్‌ను వీడితే దేశద్రోహం ఎలా అవుతుందని ఎమ్మెల్యే శివలింగేగౌడ పేర్కొన్నారు. శివలింగేగౌడ దళ్‌ను వీడి, కాంగ్రెస్‌లో చేరి ఎమ్మెల్యే అయ్యారని, పార్టీకి ద్రోహం చేశారని కేంద్ర మంత్రి కుమారస్వామి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. గతంలో యడియూరప్పకు ముఖ్యమంత్రి స్థానం ఇస్తానని చేసిన దాన్ని మోసం అనరా అని ప్రశ్నించారు. దళ్‌లో ఉన్నప్పుడు కుటుంబానికి పెద్దపీట వేస్తూ ఇతర నాయకులను మీరు నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తనకు మంత్రిగా బాధ్యతలు అప్పగిస్తారన్న నమ్మకం ఉందన్నారు.

వాహనం బోల్తా .. నలుగురికి తీవ్ర గాయాలు

గాజులపల్లెఆర్.ఎస్(మహానంది): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లా మహానంది మండలం గాజులపల్లెఆర్.ఎస్-మహానందిఫారం మధ్య పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం మలుపులో భక్తుల వాహనం బోల్తా పడింది. నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్‌కు చెందిన 9 మంది భక్తులు మంగళవారం రాత్రి మహానందికి వచ్చి దర్శనం చేసుకున్నారు. ఆలయం మలుపులోని వేగ నియంత్రికలను గమనించకపోవడంతో వీరి బోలేరో వాహనం బోల్తా పడింది. అందులోని విశ్రాంత ఇంజినీరు శ్రీకాంత్, పవిత్ర, రూప, ప్రభావతి తీవ్రంగా, మరో ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు. 108 వాహనం సిబ్బంది అత్యవసర వైద్యం అందించి నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

27-01-2026 (ఉ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1603.96	1618.46
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	000	000
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	530	11,136
నీటి నిల్వ (టి.ఎం.సి)	27.082	57.199

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

నలుగురికి కఠిన కారాగార శిక్ష

బెళగావి, న్యూస్‌టుడే: బెళగావి శివార్లలోని ఫాంహౌస్‌కు 2025 మే 10న ఒక బాలిక (16)ను తీసుకువెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడిన నలుగురు నిందితులకు ఫాస్ట్ ట్రాక్ న్యాయస్థానం కఠిన శిక్షను విధించింది. బాలికతో బలవంతంగా మద్యం తాగించి, అత్యాచారానికి పాల్పడ్డారని బాలిక తల్లి తిలకవాడి ఠాణాలో ఫిర్యాదు చేసింది. సాకిబ్ బేగ్ పయాజ్ నిజామి (22), రవి సిద్ధప్ప నాయ్కోడి (34)లకు జీవిత ఖైదు, ఇద్దరు బాలలకు తలా 20 ఏళ్ల కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. అత్యాచారం అనంతరం బాలిక మెడలోని ఒక తులం బంగారు గొలుసును కూడా నిందితులు దోచుకున్నారు. వారిలో ఒకరు స్థానిక ఠాణాలో ఇన్‌స్పెక్టర్ అని గుర్తించారు. ఫాంహౌస్‌ను బాడుగకు ఇచ్చిన ఆరోపణలపై రోహన రాజేశ కుమార పాటిల్ (23), అశుతోష మారుతి పాటిల్ (25) అనే యువకులపై వచ్చిన ఆరోపణలపై విచారణ కొనసాగుతోందని టిలకవాడి ఠాణా పోలీసులు తెలిపారు.

డేటా చౌర్యంపై కేసు నమోదు

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: రూ.87 కోట్ల విలువైన డేటా చౌర్యానికి సంబంధించి అశుతోశ్ నిగమ్‌పై వైట్‌ఫీల్డ్ సైబర్ ఠాణాలో కేసు నమోదైంది. మారతహళ్లిలోని అమేడియస్ సాఫ్ట్‌వేర్ ల్యాబ్ కంపెనీ పరిశోధన విభాగంలో అశుతోశ్ ఒకప్పుడు సీనియరు మేనేజరుగా పని చేశారు. విధుల్లో 2020 ఫిబ్రవరి 1న చేరిన ఆయన గత ఏడాది అక్టోబరు 11న అత్యంత రహస్యమైన సోర్స్ కోడ్, ఇతర రహస్య దాఖలాలను తన వ్యక్తిగత ఈమెయిల్స్‌కు పంపించుకున్నారని, వాటి విలువ భారతీయ నగదులో రూ.87 కోట్లని సంస్థ యాజమాన్య ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో ఆయన నేరం వెలుగులోకి రావడంతో గత డిసెంబరు 3న విధుల నుంచి తప్పించారు. అశుతోశ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ, ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అతనికి నోటీసులు ఇస్తున్నామని సైబర్ ఠాణా పోలీసులు తెలిపారు.

(c) eenadu

అంగన్‌వాడీ చిన్నారుల దుస్తుల సాయం పెంపు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రభుత్వం అంగన్‌వాడీ బాలల దుస్తులు, చెప్పులకు సంబంధించిన ఆర్థిక సాయం పెంచింది. బాలురకు అందించిన రూ.100లను రూ.175గా, బాలికలకు రూ. 150 నుంచి రూ. 250లకు పెంచారు. మహిళా శిశు సంక్షేమ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రి ప్రభాతిపరిడ మంగళవారం భువనేశ్వర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ మారుతిదేవి పథకం కింద ప్రభుత్వం నిధులు కేటాయించినట్లు తెలిపారు.

బడికి దూరం.. భవిత భారం

ఆ గ్రామంలో చిన్నారులు మూడేళ్లుగా బడికి దూరం కావడం ఆందోళన కలిగిస్తోంది. ముంపు గ్రామాల జాబితాలో ఉన్న గ్రామంలో పాఠశాలను మూసివేయడంతో చిన్నారులు చదువుకు నోచుకోకపోవడం వారి భవిష్యత్‌కు శాపంగా మారుతోంది. బొలంగీర్ జిల్లాలోని దిగువ సుక్టేల్ ప్రాజెక్టు నిర్మాణం ప్రభావిత గ్రామమైన కుమియాపాలిలో ఈ దుస్థితి నెలకొంది. పునరావాసం పేరుతో గ్రామంలో ఉన్న పాఠశాలను సుమారు మూడేళ్ల కిందట మూసివేసినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. కొన్ని కుటుంబాలు గతంలోనే ఖాళీ చేసి వెళ్లిపోగా 70కి పైగా కుటుంబాలు డిమాండ్లు నెరవేర్చే వరకు కదిలేది లేదని తేల్చిచెప్పాయి. అధికారులు సైతం వీరి డిమాండ్లను దాదాపుగా పెడచెవిన పెట్టడంతో చిన్నారుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. గ్రామంలో 35 మందికి పైగా 6 ఏళ్ల నుంచి 14 ఏళ్లలోపు చిన్నారులు గత మూడేళ్లుగా బడిబాట పట్టలేక ఇళ్లవద్దే ఉంటున్నారు. ప్రాజెక్టు నిర్మాణం ఇప్పట్లో పూర్తయ్యేలా కనిపించని నేపథ్యంలో చిన్నారుల చదువుకు ఏదైనా మార్గం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఇది విద్యా హక్కు ఉల్లంఘన కింద వస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

- న్యూస్‌టుడే, రాయగడ పట్టణం

వైవిధ్యానికి ప్రతీక గిరిజనం

మేళాలో గిరిజనులు తయారు చేసిన ఉత్పత్తులు తిలకిస్తున్న మోహన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: గిరిజనులు వైవిధ్యానికి ప్రతీక అని, వేల సంవత్సరాలుగా తమ సంప్రదాయాలు, సంస్కృతికి కట్టుబడి దేశ ప్రగతిలో క్రియాశీల పాత్ర పోషిస్తున్నారని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి చెప్పారు. భువనేశ్వర్ యూనిట్-1 పరిధిలోని గిరిజన మైదానంలో 'ఆదివాసీ మేళా-2026' 8 రోజుల ఉత్సవాలు, ప్రదర్శన సోమవారం రాత్రి సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశాలో 62 తెగల గిరిజనులున్నారని, వారంతా సమైక్యతకు అద్దం పడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వారి విద్యాప్రమాణాలు, ఉపాధి కల్పనకు ప్రాధాన్యతిస్తున్నాయని చెప్పారు. అమల్లో ఉన్న కార్యక్రమాల గురించి విపులంగా వివరించారు. ఆదివాసీల ఉత్పత్తులు ప్రోత్సాహించడానికి ప్రభుత్వం తరచు మేళాలు నిర్వహిస్తోందని, గతేడాది భువనేశ్వర్‌లో జరిగిన ప్రదర్శనలో రూ.9 కోట్లు విక్రయాలు జరగ్గా, ఈ ఏడాదిలో రెట్టింపు అవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నిత్యానంద గొండ్, ఆదివాసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి బి.పరమేశ్వరన్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సారి ఏర్పాటైన మేళాలో 1140 మంది గిరిజనులు పాల్గొంటుండగా, 325 స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీ) 109 స్టాళ్లు చేపట్టాయి. మేళాలో గిరిజనుల ఇళ్ల నమూనాలు ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.

రాజ్యసభ.. అవకాశం ఎవరికి?

సమీర్ మహంతి, బిశ్వేశ్వర టుడు, గోలక్ మహాపాత్ర, మన్మోహన్ సామల్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కొద్ది రోజుల్లో రాజ్యసభ ఎన్నికలు జరగనుండగా, ఆశావహుల పైరవీలు మొదలయ్యాయి. నాలుగు స్థానాలు ఖాళీ అవుతున్న నేపథ్యంలో భాజపా మూడు సీట్లు నిలబెట్టుకునేందుకు వ్యూహం రచిస్తోంది.

■ శాసనసభలో ఉన్న సంఖ్యాబలం ప్రకారం భాజపా ఖాతాకు రెండు, బిజద ఒక స్థానం ఖాయం కాగా నాలుగో స్థానంపైనే అందరి దృష్టి ఉంది. ఈ స్థానం నిలబెట్టుకొనే సంఖ్యాబలం భాజపా, బిజద, కాంగ్రెస్‌లకు లేదు. గెలిచే పరిస్థితి లేకపోయినా అభ్యర్థిని బరిలోకి దింపుతామని పీసీసీ అధ్యక్షుడు భక్తచరణ్ దాస్ పునరుద్ఘాటిస్తున్నారు. దీనిపై ఏఐసీసీ నాయకత్వంతో చర్చలు జరుపుతున్నామని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితిలో నాలుగో సీటు సొంతం చేసుకోవాలంటే భాజపా, బిజదలు ఏకాభిప్రాయంతో అభ్యర్థిని బరిలోకి దింపాల్సి ఉంది.

■ 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజద అధికారం కోల్పోయిన తర్వాత ఆ పార్టీలో గ్రూపులు పెరిగాయి. అధినేత నవీన్‌పట్నాయక్ ఆదేశాలను ఆ పార్టీలో నేతలు బేఖాతరు చేస్తున్నారు. లక్ష్మణ రేఖ దాటుతున్నారు. అధికారంలో ఉన్న భాజపాకు కలిసొచ్చే అంశమే ఇది. ఇప్పటికే ఎంతో మంది బిజద నేతలు కమలదళంలో చేరిన సంగతి తెలిసిందే. నవీన్ అధికారంలో ఉన్న సమయంలో రెండు పార్టీల మధ్య లోపాయికారీ అవగాహన ఉండేది.

■ భాజపా రాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షుడు సమీర్ మహంతి, కేంద్ర మాజీ మంత్రి బిశ్వేశ్వర టుడు, భాజపా రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు గోలక్ మహాపాత్ర, ప్రస్తుత పార్టీ అధ్యక్షుడు మన్మోహన్ సామల్‌లు రాజ్యసభలో బెర్తులు ఖాయం చేసుకునేందుకు తమ ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇప్పుడు పరిస్థితి లేదు. నేతలు పరస్పర విమర్శలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నాలుగో స్థానం కోసం ఏకాభిప్రాయానికి వస్తారన్న అవకాశం లేకపోవచ్చని పరిశీలకులంటున్నారు.

క్రాస్ ఓటింగ్ జరగొచ్చు?

నాలుగో స్థానం కోసం భాజపా మద్దతులో ఒక ప్రముఖ నేత ఇండిపెండెంటుగా పోటీ చేసే అవకాశం ఉంది. క్రాస్ ఓటింగ్ తథ్యం. బిజద అసంతృప్త ఎమ్మెల్యేలు క్రియాశీలక పాత్ర పోషిస్తారన్న ప్రచారం ఉంది. నాలుగో సీటు భాజపా సొంతమవుతుందని, ఇందులో ఎలాంటి సందేహాలు లేవని, వేచి చూడాలని రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సామల్ సోమవారం రాత్రి భువనేశ్వర్‌లో విలేకరులకు తెలిపారు. త్వరలో కేంద్ర ఎన్నికల సంఘం(సీఈసీ) రాజ్యసభ ఎన్నికల తేదీలు ప్రకటించనుండగా రాష్ట్ర రాజకీయ చిత్రపటంలో ఆసక్తికరమైన పరిణామాలకు అవకాశం ఉందని పరిశీలకులంటున్నారు.

డిజిటల్ అరెస్టు అన్నారు.. రూ.30 లక్షలు కాజేశారు..

పోలీసుల అదుపులో నిందితుడు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: డిజిటల్ అరెస్టు పేరిట ఓ మహిళ నుంచి సైబర్ నేరగాళ్లు రూ.30 లక్షలు కాజేశారు. సైబర్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భువనేశ్వర్‌కు చెందిన ఓ మహిళ వినియోగిస్తున్న సిమ్‌కార్డు వివిధ నేరాలతో ముడిపడి ఉందని నిందితులు ఆమెను బెదిరించారు. ట్రాయ్ అధికారులుగా బాధితురాలిని నమ్మించి పలు దఫాలుగా రూ.30 లక్షలను వేర్వేరు ఖాతాల్లోకి జమ చేయించారు. మోసపోయినట్లు గ్రహించిన బాధితురాలు సైబర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల్లో ఒకరైన ఉత్తరప్రదేశ్‌కు చెందిన జి.చిరంజీవిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి రెండు చరవాణులు, ఏటీఎం కార్డు, చెక్‌బుక్, పాన్‌కార్డు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు.

మార్చిలో కొత్త పార్టీ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బహిష్కృత కాంగ్రెస్ నేత మహమ్మద్ ముఖిం మార్చిలో కొత్త పార్టీ ప్రారంభించనున్నారు. మంగళవారం కటక్‌లో విలేకరులతో సమావేశం నిర్వహించిన ముఖిం.. పార్టీకి రెండు పేర్లు పరిశీలిస్తున్నామన్నారు. ఒడిశా జనతా కాంగ్రెస్ లేదా ఒడిశా లోక్ కాంగ్రెస్ పేర్లలో ఒకటి ఖరారు చేస్తామన్నారు. ఈ నెల 30న మహిళా సమావేశం, ఫిబ్రవరి 5న కృషక్ సమావేశాలకు ఏర్పాట్లు చేస్తామన్నారు. సమృద్ధ ఒడిశా ధ్యేయంగా ఏర్పడనున్న ప్రాంతీయ పార్టీ రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఉద్యమిస్తుందని చెప్పారు. కుమార్తె కటక్ బారాబటి కాంగ్రెస్ ఎమ్మెల్యే సోఫియా ఫిర్దౌస్ ముఖిం ట్రస్ట్ సభ్యురాలిగా తాము చేపట్టే కార్యక్రమాల్లో పాల్గొంటుందన్నారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి జైలు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష విధించినట్లు ప్రభుత్వ న్యాయవాది రాజేష్‌కుమార్ మిశ్ర మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు ఠాణా పరిధిలోని సంతపేట వీధికి చెందిన నిందితుడు బి.చంద్రశేఖర్(55) పర్లాఖెముండి పట్టణంలో నివసిస్తూ ఓ బస్సులో పని చేసేవాడు. 2024 సెప్టెంబర్ 15 రాత్రి గణేశుని విగ్రహం నిమజ్జన సమయంలో ఐదేళ్ల బాలికపై అత్యాచారం చేసినట్లు బాలిక తండ్రి ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఈ కేసును పోక్సో న్యాయస్థానం నుంచి న్యాయమూర్తి బిబుప్రసాద్ పండా విచారణ చేపట్టి నిందితుడికి జైలు శిక్ష విధించినట్లు వివరించారు.

మండీల్లో అవకతవకలకు వ్యతిరేకంగా బంద్‌కు పిలుపు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: అన్నదాతలకు మండీల్లో అన్యాయం జరుగుతోందని, మిల్లర్లు వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రభుత్వం సకాలంలో టోకెన్లు కేటాయించకపోవడంతో ధాన్యం విక్రయాలకు అంతరాయం ఏర్పడుతోందన్న కారణాలతో నవనిర్మాణ కృషక్ సంఘటన్ బుధవారం(28న) ఒడిశా బంద్‌కు పిలుపిచ్చింది. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బంద్ కొనసాగుతుందని, వాహనాల రాకపోకలు, దుకాణాలు మూతపడనున్నాయి. అన్నిచోట్లా రైతులు నిరసన తెలుపుతారని సంఘటన్ ప్రతినిధులు మంగళవారం భువనేశ్వర్‌లో విలేకరులకు చెప్పారు. మరోవైపు బంద్‌కు రాష్ట్ర కాంగ్రెస్ మద్దతిస్తున్నట్లు పీసీసీ అధ్యక్షుడు భక్తచరణ్‌దాస్ మంగళవారం భువనేశ్వర్‌లో విలేకరులకు తెలిపారు. అన్నదాతల ఇబ్బందులు, కాలుష్య ధ్రువపత్రాల పేరిట ప్రభుత్వ దోపిడీ, క్షీణించిన శాంతి భద్రతలు, మహిళలపై అత్యాచార ఘటనలకు నిరసనగా కాంగ్రెస్ అన్నిచోట్లా బంద్ నిర్వహిస్తుందని, అత్యవసర సేవలు మినహా, మిగతావన్నీ బంద్‌లో అంతర్భాగమని చెప్పారు.

సమస్యలు విని.. పరిష్కారానికి చొరవ చూపి

అర్జీదారుల నుంచి సమస్య వింటున్న కమిషన్ అధ్యక్షురాలు బబితా పాత్ర్, సభ్యులు, ఇతర అధికారులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడు: ఒడిశా రాష్ట్ర బాలల హక్కుల సంరక్షణ కమిషన్ (ఓఎస్‌సీపీసీఆర్) ఆధ్వర్యంలో మంగళవారం బ్రహ్మపురలో నిర్వహించిన క్యాంపు కోర్టు, ప్రజా వినతులకు విశేష స్పందన లభించింది. బ్రహ్మపుర సబ్‌కలెక్టరు కార్యాలయం ఆవరణలోని సమావేశ మందిరంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిర్వహించిన ఇందులో నాలుగు వందల పైగా అర్జీలు స్వీకరించారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై బాలల హక్కులు, విద్య, సంరక్షణ, భద్రత తదితర సమస్యలపై కమిషన్‌కు వినతులు అందించారు. ఓఎస్‌సీపీసీఆర్ అధ్యక్షురాలు బబితా పాత్ర్ పాల్గొన్నారు. ఆమె సమస్యలు విని పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. శిబిరంలో కమిషన్ సభ్యులు సుజాతా నాయక్, మనస్మిత ఖుంటియా, గంజాం జిల్లా అదనపు పాలనాధికారి ప్రమోద్ కుమార్ పృష్టి, ఓఎస్‌సీపీసీఆర్ న్యాయ కన్సల్టెంట్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా సామాజిక సంక్షేమ అధికారి, జిల్లా శిశు భద్రతా అధికారి, జిల్లా సామాజిక భద్రతా అధికారి, శిశు సంక్షేమ కమిటీ, జిల్లా విద్యాధికారి తదితర విభాగాల అధికారులు హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన మహిళలతో సబ్ కలెక్టరు కార్యాలయం ఆవరణ కిక్కిరిసింది.

గులాబీ సాగు.. లాభాలు బాగు

దశమంత్‌పూర్‌లో లాభాలు అందించే గులాబీ

న్యూస్‌టుడే, సిమిలిగుడ

కొరాపుట్ జిల్లాలో పండే కాఫీ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన విషయం తెలిసిందే. ప్రస్తుతం గిరిజనులు పండించే గులాబీలకు ఆ స్థాయిలో గుర్తింపు వస్తోంది. ప్రభుత్వం ఐటీడీఏ, పలు స్వచ్ఛంద సంస్థలు అందించే ప్రోత్సాహంతో కొరాపుట్ జిల్లా స్వయం సహాయం సహాయక సంఘం మహిళలు మంచి ఫలితాలు సాధిస్తున్నారు. కొరాపుట్ సబ్ డివిజన్ పరిధిలో దశమంత్‌పూర్ సమితి పూరీ మొండా, మలింగ, జోడీ, సిమిలిగుడ సమితి మాలిడోలి యంబ, పొట్టంగి సమితి సిపాయిపుట్ గ్రామాల్లో మహిళలు గులాబీలు పండిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

బంగాళాదుంపల సాగుతో ప్రారంభించి

పూరీ మొండా గ్రామంలో రెండు స్వయం సహాయక సంఘాల మహిళలు మూడేళ్ల కిందట బంగాళాదుంప సాగుతో వ్యవసాయాన్ని ప్రారంభించారు. వ్యవసాయానికి నీటి వనరుల కొరత కారణంగా కేవలం ఖరీఫ్ సీజన్‌లో వీటిని పండిస్తూ వచ్చారు. మిగతా సమయాల్లో పప్పు జాతి పంటలు పండించినా పెద్దగా ప్రయోజనం కనిపించలేదు. ఐటీడీఏ అధికారులు గ్రామాన్ని సందర్శించి మహిళల ఆసక్తిని గమనించారు. వ్యవసాయానికి అనుకూలంగా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని భావించి, సంబంధిత విభాగం అధికారులను సంప్రదించారు. దాంతో గ్రామంలో లిఫ్ట్ ఇరిగేషన్ పాయింట్లను ఏర్పాటు చేసి వ్యవసాయానికి నీరు అందేలా కృషి చేశారు. గులాబీ పూలను పండించాలని అధికారులు సూచించారు. గ్రామానికి చెందిన మా కంట బౌసినీ సంఘాల ద్వారా రెండు గ్రామాల్లో 20 ఎకరాల్లో గులాబీ సాగు ప్రారంభించారు. మంచి లాభాలు పొందడంతో పూలతో పాటు గులాబీ ఆయిల్ తయారుచేసి విక్రయిస్తున్నారు. అధికారుల ప్రోత్సాహం బాగుందని అందుకే తాము రాణించినట్లు మహిళా సంఘానికి చెందిన పద్మ హియల్ అన్నారు. వీరి ఆదర్శంతో సిమిలిగుడ, పొట్టంగి సమితులకు గులాబీ పంటను విస్తరించి, మంచి ఫలితాలు సాధించారు.

ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కృషి.. ఈ సాగుతో మహిళలకు మంచి లాభాలు వస్తున్నాయి. ఒక్కొక్క మహిళకు రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు ఆదాయం (ఒక బృందానికి 1.20 లక్షలు) వచ్చింది. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన అనేక సంస్థలను సంప్రదించాం. అక్కడికి గులాబీ నూనెను ఎగుమతి చేసేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయి. త్వరలో ఇక్కడ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తాం - ఐటీడీఏ పీఏ తపన్‌కుమార్ నాయక్ అన్నారు.

పులి వేషధారుల విన్యాసాలు

తీరం.. హోరెత్తింది..!

● ఘనంగా ప్రారంభమైన ఉత్సవాలు

గోపాలపూర్, న్యూస్‌టుడే: గోపాల్‌పూర్ తీర సంబరాల అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం సాయంత్రం స్థానిక కళాశాల నుంచి సంబరాల వేదిక వరకు కాగడాల యాత్ర సాగింది. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి బిభూతి భూషణ్‌జెనా, గంజాం జిల్లా పాలనాధికారి వి.కీర్తివాసన్, ఇతర ఉన్నతాధికారులు, వేలాది మంది ప్రజలు పాదయాత్రగా వేదిక వరకు చేరుకున్నారు. సర్వత్రా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. గంజాం జిల్లాకు చెందిన తరాతరిణి, బాగ్దేవి, బాలకుమారి శక్తిపీఠాల నుంచి తెచ్చిన కాగడాలను వేదిక వద్ద ఉంచారు.

ఆకట్టుకున్న పులివేషాల, కర్రసాము.. గంజాం జిల్లా ప్రాచీన వైభవానికి అద్దం పట్టే కత్తి, కర్ర సాములు కళాకారులు ప్రదర్శించారు. పులి వేషాలు, అష్టప్రహరీ నామ సంకీర్తనలు ఆకట్టుకున్నాయి.

● ఈ సందర్భంగా మంత్రి జెనా 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ యాత్రలు ఉత్కళీయ సంస్కృతిలో అంతర్భాగం కాగా, ఆరంభంలో ఆధ్యాత్మిక వేడుకలు చేపట్టడం మన ప్రాచీన పరంపరగా చెప్పారు.

జ్యోతి స్థాపన చేస్తున్న మంత్రి బిభూతి, కలెక్టర్ కీర్తివాసన్‌లు

వీధి నాటిక.. చైతన్య దీపిక

గంజాం జిల్లా రళవలోని సంకల్ప సీనియరు సెకండరీ పాఠశాల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై మంగళవారం వీధి నాటిక ప్రదర్శన, చైతన్య ర్యాలీ జరిగాయి. స్థానిక ఉత్కళ కూడలిలో విద్యార్థులు యముడు, చిత్రగుప్తుడు తదితర వేషధారణలు ధరించి రోడ్డు భద్రతపై ప్రదర్శించిన నాటిక ప్రజల్ని ఆకట్టుకుంది. అనంతరం పాఠశాల ఎన్‌సీసీ, స్కౌట్ విద్యార్థులు రోడ్డు భద్రతపై ప్రజా చైతన్యానికి ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధానాచార్యురాలు పద్మాలయ దాస్ చౌధురి పర్యవేక్షణలో జరిగిన ఆయా కార్యక్రమాల్లో పలువురు బోధనా సిబ్బంది, బ్రహ్మపురలోని వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

-న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం

సైకత శిల్పాలు.. దేశ భక్తి గీతాలు

భరతమాత సైకత శిల్పం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని రవీంద్ర మండపం వేదికగా సోమవారం రాత్రి ప్రదర్శితమైన 'భారతీయం' అందరినీ అలరించింది. గణతంత్ర ఉత్సవాల నేపథ్యంలో భాష, సాంస్కృతిక శాఖ చేపట్టిన కార్యక్రమంలో ప్రముఖ గాయకులు శైలభామ మహాపాత్ర్, నజియా ఆలం, సుధాకర్ మిశ్ర, కార్తిక సాహు, శిరలి ఘోష్, బిరలారథ్, సంగ్రాం మహంతి, సౌరవ్ కుమార్ సాహు, కుమార్ దిలీప్, సస్మితా బిశ్వాల్, లిప్సా మహాపాత్ర్, సాగర్‌జెనా, యశస్విని నాయక్ తదితరులు దేశభక్తి గీతాలు ఆలపించి అలరించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సంగ్రామం నాటి ఫొటోలు, ఖాదీ వస్త్రాల ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో యువజన క్రీడలు, సాంస్కృతిక శాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్, శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి బిజయ్‌కేతన్ ఉపాధ్యాయ, సంస్కృతి విశ్వవిద్యాలయం(భువనేశ్వర్) ఉపకులపతి ఆచార్య ప్రసన్నకుమార్ స్వాయిన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

లోక్‌భవన్‌లో 'ఎట్ హోం'

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని లోక్‌భవన్‌లో సోమవారం రాత్రి 'ఎట్ హోం' కార్యక్రమం జరిగింది. ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి, శాసనసభాపతి సురమాపాఢి, ఇతర మంత్రులు, స్వాతంత్ర్య సమరయోధులు, వివిధ రంగాల ప్రముఖులు, పాత్రికేయులు పాల్గొన్నారు. అందర్నీ లోక్‌భవన్ యంత్రాంగం సాదరంగా ఆహ్వానించింది. గవర్నరు వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో మహనీయుల త్యాగాలు, స్వతంత్ర భారత్ సాధించిన విజయాల గురించి హరిబాబు చెప్పారు. 'ఎట్ హోం' వేడుక రాత్రి వరకు కొనసాగింది.

అలరించిన 'మేరీ జాన్.. హిందూస్థాన్'

యువతుల ఆదివాసీ నృత్యం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపురకు చెందిన సాంస్కృతిక, క్రీడ, సామాజిక సంస్థ 'క్రాంతి' ఆధ్వర్యంలో సోమవారం రాత్రి 'మేరీ జాన్ హిందూస్థాన్' పేరిట నిర్వహించిన దేశభక్తి సాంస్కృతికోత్సవాలు ప్రేక్షకుల్ని విశేషంగా అలరించాయి. నగర శివారున ప్రభుత్వ ఐటీఐ ఆవరణలోని ఆడిటోరియంలో నిర్వహించిన దీనికి నిర్వాహక సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ దేవానంద దాస్ అధ్యక్షత వహించారు. విద్యావేత్త డాక్టర్ కిశోర్‌హరి బడత్యా, ఐఎస్‌ఆర్డీ స్వచ్ఛంద సంస్థ సంచాలకుడు సుధీర్ సాబత్‌లు అతిథులుగా పాల్గొన్నారు. క్రాంతి సంస్థతోపాటు గంజాం జిల్లాలోని వివిధ సంస్థలకు చెందిన వందలాది మంది విద్యార్థులు దేశభక్తి నృత్యాలు, గీతాలతో ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించారు. ప్రధానంగా 'ఆపరేషన్ సిందూర్' నృత్య రూపకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేడుకల్లో వివిధ పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. అంతకుముందు చిన్నారులతో జగన్నాథుని ముందు జ్యోతిని వెలిగించి వేడుకలు ప్రారంభించారు.

తెరిస్తే కేంద్రం.. వ్యాపారులకు ప్రయోజనం

● దుకాణాల కేటాయింపుపై అలుముకుంటున్న నీలినీడలు

లోపల దుకాణ సముదాయం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో రూ.76.55 లక్షలతో నిర్మించిన ఫుడ్ కోర్టు అక్కరకు రావడం లేదు. అల్పాహారం, ఫాస్ట్‌ఫుడ్ విక్రయాలను ఒకచోట చేర్చాలనే ఉద్దేశంతో ప్రారంభించిన ఈ భవనం ఇంతవరకు వినియోగంలోకి రాలేదు. ఇందులో ఉన్న దుకాణాల కేటాయింపుపై నీలినీడలు అలుముకుంటుండటంతో ఆశావాహులకు నిరాశ తప్పటం లేదు. దీంతో ఇప్పటికీ చాలామంది రహదారులు పక్కన, ఫుట్‌పాత్‌లపై విక్రయాలు కొనసాగిస్తున్నారు. వర్చువల్ విధానం ద్వారా ముఖ్యమంత్రి దీనిని ప్రారంభించి 6 నెలల పూర్తి కావస్తున్నప్పటికీ వినియోగంలోకి రాకపోవడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. దుకాణాల కేటాయింపు వెనక రాజకీయ కోణం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దుకాణాలు తెరుచుకోకపోవడంపై ఇంకా సందిగ్ధత నెలకొంది. కోర్టు లోపల ఆహ్లాదకర వాతావరణం నడుమ మొత్తం 16 దుకాణాలు నిర్మించారు. రహదారిపై విక్రయాలతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో వాటికి చెక్ పెట్టేందుకు నిర్మించిన దీన్ని ప్రారంభించకపోవడంతో స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే కేటాయిస్తాం

ఈ విషయమై పురపాలక సంస్థ కార్యనిర్వాహణ అధికారి మాట్లాడుతూ త్వరలోనే దుకాణాల కేటాయింపు జరగనుందన్నారు. అందుబాటులో ఉన్న దుకాణాల కంటే అధిక సంఖ్యలో దరఖాస్తులు రావడంతో సమస్య మొదలైందన్నారు. ఈ నేపథ్యంలో త్వరలోనే లాటరీ విధానం ద్వారా విక్రేతలకు దుకాణాలు కేటాయించనున్నట్లు తెలిపారు. ఆ దిశగా ప్రక్రియలు కొనసాగుతున్నాయని, కొద్ది రోజుల్లో సమస్య పరిష్కారం కానుందన్నారు. స్థానిక రింగు రోడ్డులో నిర్మించిన దీని ప్రారంభంపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఆ దిశగా చర్యలు తీసుకోవాలని పురపాలక సంస్థకు జిల్లా యంత్రాంగం దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.

హాకీ విజేత వేదాంత కళింగ లాన్సర్స్

కళింగ లాన్సర్స్ క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న సీఎం మాఝి. చిత్రంలో మంత్రి సూర్యవంశీ తదితరులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని కళింగ మైదానంలో ఈ నెల 17 నుంచి 26 వరకు జరిగిన హాకీ ఇండియా లీగ్ టోర్నీ -2026 సోమవారం రాత్రి ముగిసింది. ఇందులో వేదాంత కళింగ లాన్సర్స్ జట్టు ఘన విజయం సాధించింది. తుదిపోరులో వేదాంత కళింగ లాన్సర్స్ జట్టు క్రీడాకారులు 3 - 2 గోల్స్‌తో రాంచీ రాయల్స్ జట్టు క్రీడాకారులపై గెలుపొంది విజేతలుగా నిలిచారు. ముగింపు రోజు ముఖ్యఅతిథిగా హాజరైన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఫైనల్ మ్యాచు చివరి ఆటను చూసి క్రీడాకారులను ప్రోత్సహించారు. తర్వాత విన్నర్, రన్నర్ జట్లకు ట్రోఫీలు, నగదు పురస్కారాలు అందజేశారు. విజేత జట్టుకు రూ.3 కోట్ల పురస్కారం ప్రదానం చేశారు. ఇరు జట్ల క్రీడాకారులను సీఎం మాఝి అభినందించారు. కార్యక్రమంలో క్రీడల మంత్రి సూర్యవంశీ సూరజ్, హాకీ ఇండియా అధ్యక్షుడు దిలీప్ తిర్కీ, ఆసియా హాకీ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు భోలానాథ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. ఫైనల్ మ్యాచు చూసేందుకు వచ్చిన వివిధ పాఠశాల, కళాశాలల విద్యార్థులు, క్రీడాకారులతో మైదానం కిక్కిరిసింది.

అంకితభావంతో విధులు నిర్వర్తించండి

వైద్యులను సత్కరిస్తున్న డాక్టర్ తిరుపతి, అతిథులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రోగుల అందించే సేవలు పరమార్థం కావాలని, వైద్యులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని హైటెక్ వైద్య, విద్యాసంస్థల గ్రూపుల అధినేత డాక్టర్ తిరుపతి పాణిగ్రహి చెప్పారు. సోమవారం రాత్రి హైటెక్ వైద్యకళాశాల ఆసుపత్రి ఆవరణలో గణతంత్ర వేడుకలు పురస్కరించుకుని సత్కార కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ తిరుపతి భువనేశ్వర్‌లోని ప్రముఖ వైద్యులను సత్కరించారు. కార్యక్రమంలో అమెరికాకు చెందిన డాక్టర్ పంచానన్ శత్పథి, హైటెక్ మేనేజింగ్ ట్రస్టీ సురేష్‌కుమార్ పాణిగ్రహి, ఇతర వైద్యులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

(c) eenadu

'రేడియో డొంగర్' ప్రారంభించిన సింగ్‌దేవ్

కొరాపుట్, సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్ వ్యవసాయ క్షేత్రంగా పేరు పొందిన దయానిధి గూడ గ్రామంలో స్థానిక స్వచ్ఛంద సంస్థ ప్రగతి ఆధ్వర్యంలో గిరిజన రైతులకు వ్యవసాయ రంగంలో ప్రాంతీయ భాషలో సహకరించేందుకు ఏర్పాటుచేసిన రేడియో డొంగర్‌ను ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్‌దేవ్ ప్రారంభించారు. అనంతరం రేడియోలో తన సందేశాన్ని అందజేశారు. ● కొరాపుట్ జిల్లా పోలీసు విభాగం ఆధ్వర్యంలో జరిగిన సైబర్ భద్రతపై జిల్లా అవగాహన ప్రదర్శనలో సిమిలిగుడ కళాశాలకు బహుమతుల పంట పండింది. ఇటీవల నిర్వహించిన ప్రదర్శనలో కళాశాల విద్యార్థులు పాల్గొని వివిధ పోటీల్లో బహుమతులు గెలుచుకున్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా పోలీస్ పరేడ్ మైదానంలో కనకవర్ధన్ సింగ్ దేవ్, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురామ్ మచ్చో, కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్, ఎస్పీ రోహిత్ వర్మ, వారిని అభినందించారు.

మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్, కలెక్టర్

బ్యాడ్మింటన్ విజేతలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక వైకుంఠనగర్‌లోని స్పోర్ట్స్ ఎరీనా ఇండోర్ హాల్లో ఎనిమిదో జేబీ స్మారక అంతర్ మీడియా బ్యాడ్మింటన్ పోటీలు సోమవారం రాత్రి ముగిశాయి. ఇందులో సింగిల్స్ తుదిపోరులో శిబిరామ్ పండా విజేత, ప్రఫుల్ల చంద్ర బెహరా రన్నర్‌గా నిలిచారు. డబుల్స్ కేటగిరీలో విన్నర్‌గా మానస్ రంజన్ బిశోయ్, స్వాధీన్ సాహుల జోడీ, రన్నర్‌గా మృత్యుంజయ సాహు, ప్రఫుల్ల చంద్ర బెహరాల జోడీ నిలిచింది. మహిళా కేటగిరీలో మొదటి మూడు స్థానాల్లో బనితా బెహరా, జ్యోత్స్న కుమారి సాహు, స్మితాలి స్నిగ్ధలు నిలిచారు. ముగింపు కార్యక్రమంలో అతిథులుగా హాజరైన బ్రహ్మపుర అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు ఆర్.మురళీ మోహన్, కార్పొరేటర్లు డి.కరుణాకర్, ప్రదీప్‌కుమార్ శతృథి, నీల కంఠ సాహు, త్రిపతి పాత్ర్, రంజిత బెహరా, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధి మితెన్ భుయ్య విన్నర్, రన్నర్‌లకు బహుమతులు, పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

బహుమతులతో విన్నర్, రన్నర్‌లు. చిత్రంలో క్లబ్ ప్రతినిధులు

వసతిగృహంలో సమస్యలపై ఆరా

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సిమిలిగుడ సమితి కంటి గ్రామంలో ఉన్న ఆశ్రమ పాఠశాలను పొట్టంగి ఎమ్మెల్యే రామ్ చంద్ర కడం మంగళవారం మధ్యాహ్నం సందర్శించారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహం, వంటగది, పడకలు స్థితి పరిశీలించారు. అక్కడ ఇద్దరు విద్యార్థులు జ్వరంతో బాధపడుతుండగా వారితో మాట్లాడి ఆరోగ్య విషయంపై ఆరా తీశారు. జిల్లా పరిషత్ సభ్యులు మోహన్ జానీ, యువజన నేత జగదీష్ పాల్గొన్నారు. ★ సిమిలిగుడ సమితి కంటికు చెందిన దేవ్‌మాలి ఐకానిక్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి గ్రామీణ స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. పొట్టంగి ఎమ్మెల్యే రామ్‌చంద్ర కడం ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలు ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో 16 జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు.

జ్వరం బారిన పడిన విద్యార్థినితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడం

అప్రమత్తంగా ఉండండి.. నేరగాళ్లకు చిక్కొద్దు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: నేరాల బారిన పడకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ అన్నారు. సాయిప్రియనగర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన అమో పోలీసు సమితి కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత రోజుల్లో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, వాటి బారిన పడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. గతేడాది రాయగడలో 28 కేసులు నమోదు కాగా, వాటిలో 25 పరిష్కరించినట్లు స్వాతి గుర్తు చేశారు. కేసుల పరిష్కారంలో చొరవ చూపిన పోలీసులను వేదికపై సత్కరించారు. ఎస్డీపీవో గౌరహర సాహు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ స్వాతి, వేదికపై సాహు తదితరులు

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు అవసరం

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: నేరాలు నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రహి అన్నారు. పట్టణ ఆదర్శ రాణా ప్రాంతంలో పురపాలక శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎస్పీ జేకే పండా మాట్లాడుతూ పట్టణంలోని 12 చోట్ల 26 కెమెరాలను ఏర్పాటు చేశామని, ఇవి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. అదనపు జడ్పీ కార్యనిర్వహణాధికారి పృథ్వీరాజ్ మండల్, పురపాలక అధ్యక్షురాలు నిర్మల శెఠి, ఎస్‌డీపీవో మాధవా నంద నాయక్, లక్ష్మణ్ ముర్మూ పాల్గొన్నారు.

రిమోట్ ద్వారా సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రూపేష్, ఎస్పీ జేకే పండా

సమస్యల పరిష్కారానికి వినతులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా రాయగడ సమితి ఎస్.కరడాసింగి పంచాయతీ కార్యాలయంలో కలెక్టర్ అక్షయ్ సునీల్ అగర్వాల్ అధ్యక్షతన మంగళవారం వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. 75 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ జేకే పండా, అదనపు జడ్పీ కార్యనిర్వహణ అధికారి పృథ్వీరాజ్ మండల్, జిల్లా ముఖ్య వైద్యాధికారి ఎంఎం అలీ పాల్గొన్నారు. అనంతరం పంచాయతీలో ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు.

ఫిర్యాదును పరిశీలిస్తున్న కలెక్టర్ అక్షయ్ సునీల్ అగర్వాల్

వైద్య, రక్తదాన శిబిరాలకు స్పందన

రాయగడ పట్టణం, రాయగడ, ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: రాయగడ కళింగ వైశ్య సంఘం మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. విజయనగరం నుంచి ఇద్దరు వైద్యులు వచ్చి చికిత్స అందించినట్లు సంఘం అధ్యక్షుడు కింతలి అమర్‌నాథ్ పేర్కొన్నారు. ★ పారిశ్రామికవాడ కేకే పూర్ మనోరంజన్ కేంద్రంలో ధాసుబెల్లి ఫౌండేషన్, వానవాసి కల్యాణ ఆశ్రమం వారు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో 40 యూనిట్ల రక్తం సేకరించారు. ★ ఖరగ్‌పూర్‌లోని తొమ్మిదో వార్డులో సిద్ధి వినాయక సేవా మండల్, న్యూ స్టార్ బాయ్స్ క్లబ్ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో 45 యూనిట్ల రక్తం సేకరించామని తెలిపారు.

విజ్ఞాన ప్రదర్శనకు అభినందన

కొరాపుట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల ప్రాంగణంలో జీవన శైలి విధానాల మార్పులపై విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో 14 సమితుల నుంచి విద్యార్థులు ఎంపికైన ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనను స్థానికులు అభినందించారు.

సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

రాయగడ గ్రామీణం: కొలనార సమితిలో కలెక్టర్ అశుతోష్ కులకర్ణి అధ్యక్షతన వినతుల స్వీకరణ జరిగింది. ఇందులో 53 ఫిర్యాదులు అందాయి. వాటిని పరిష్కరించాలని అశుతోష్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ స్వాతి ఎస్ కుమార్ పాల్గొన్నారు.

స్పందనలో 48 అర్జీల స్వీకరణ

వినతులు నమోదు చేసుకుంటున్న పాలనాధికారి సత్యవాన్

జయపురం, న్యూస్‌టుడే: జయపురం పట్టణం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జరిగిన స్పందన కార్యక్రమంలో 48 వినతులు స్వీకరించారు. కలెక్టర్ మనోజ్ సత్యవాన్, సబ్‌కలెక్టర్ సస్యరెడ్డి ఫిర్యాదులను నమోదు చేసుకొని, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కాగడాకు విశేష పూజలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గోపాలపూర్ తీర సంబరాల నేపథ్యంలో గంజాం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మంగళవారం కాగడా యాత్ర తరాతరిణి శక్తిపీఠం నుంచి బయలుదేరింది. తొలుత శక్తిపీఠంలో దేవతామూర్తుల సన్నిధిలో కాగడా వెలిగించి, విశేష పూజలు జరిపారు. అనంతరం రథంపై ఉంచి గోపాలపూర్ సంబరాలు జరుగుతున్న ప్రాంతానికి చేర్చారు. ప్రజలు ఘన స్వాగతం పలికారు. కళ్లికోట ఎమ్మెల్యే పూర్ణ చంద్ర సెఠి, ఛత్రపురం సబ్ కలెక్టరు సుభాశీష్ బరాల్, పురుషోత్తంపూర్ తహసీల్దారు తదితరులు పాల్గొన్నారు.

మా తరాతరిణి సన్నిధిలో కాగడాను వెలిగించి పూజలు

దివ్యాంగ విద్యార్థులకు సాయం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని ఆంధ్రా సాంస్కృతిక సమితి(ఏసీఏ) ప్రతినిధులు నగరంలోని అంధ, మూగ, బధిర విద్యార్థులకు మంగళవారం పళ్లు, మిఠాయి, ఇతర ఉపకరణాలు వితరణ చేశారు. కార్యక్రమంలో ఏసీఏ అధ్యక్ష కార్యదర్శులు గన్నవరపు ఆనందరావు, రాయప్రోలు సత్యసాయి తదితరులు పాల్గొన్నారు.

సీకే నాయుడు క్రికెట్ టోర్నీ విజేత ఒడిశా

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఒడిశా క్రికెట్ సంఘం (ఓసీఏ) తరఫున సంబల్‌పూర్‌లో జరిగిన కర్నల్ సీకే నాయుడు ట్రోఫీ అండర్-23 అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నీ సోమవారం ముగిసింది. సంబల్‌పూర్‌లోని వీర్ సురేంద్ర సాయి మైదానంలో సోమవారం నిర్వహించిన తుది పోరులో ఒడిశా జట్టు 18 పరుగుల తేడాతో హరియాణా జట్టుపై గెలుపొందింది. ఈ మ్యాచులో ఒడిశా జట్టు బ్యాట్స్‌మెన్ సుజల్ కె సింగ్ 156 పరుగులు చేయగా, బౌలర్ అసుతోష్ మరాండి 5 వికెట్లు సాధించి మ్యాచు విజయానికి తోడ్పడ్డారు.

బ్యాట్స్‌మెన్ సుజల్ కె సింగ్

బ్యాంకు ఉద్యోగుల సమ్మె

ఖరగ్‌పూర్‌లో..

పర్లాఖెముండి: ఎస్బీఐ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న సిబ్బంది

రాయగడలో..

రాయగడ గ్రామీణం, పర్లాఖెముండి, ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: వారానికి ఐదు రోజుల పాటు పని దినాల విధానాన్ని వెంటనే అమలు చేయాలంటూ బ్యాంకు సిబ్బంది మంగళవారం ఎస్బీఐ కార్యాలయాల ఎదుట నిరసన చేశారు. తమ డిమాండ్ పరిష్కారం కాకపోతే రానున్న రోజుల్లో ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.

పారా ఫెన్సింగ్‌లో పతకాలు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: ఒడిశా పారా క్రీడల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి పారా ఫెన్సింగ్ పోటీల్లో గంజాంకు చెందిన ముగ్గురు క్రీడాకారులు పతకాలు సాధించారు. భువనేశ్వర్‌లోని నయాపల్లిలోని పాత క్రీడా శాఖ భవనం ఇండోర్ స్టేడియంలో ఏర్పాటైన ఇందులో పురుషుల ఏ కేటగిరీలో ఛత్రపురానికి చెందిన వి.రమేష్ రావు రెండు పసిడి పతకాలు గెలుచుకోగా ఇదే విభాగంలో హింజిలికాటుకు చెందిన నికు ప్రధాన్ బీ-3 కేటగిరీలో మూడు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. మహిళా విభాగంలో ఛత్రపురానికి చెందిన మాల్తి పనొరె మూడు పసిడి పతకాలు దక్కించుకున్నారు.

పసిడి పతకాలతో రమేష్ రావు: చిత్రంలో రాష్ట్ర సంఘం అధ్యక్షుడు

యువ ఉత్సవాలకు భంజవిహార్ జట్టు

ప్రయాణమైన భంజవిహార్ విద్యార్థులు

గోపాలపూర్: బాలేశ్వర్‌లోని ఫకీర్ మోహన్ విశ్వవిద్యాలయం వేదికగా 39వ తూర్పు రాష్ట్రాల వర్సిటీల యువజనోత్సవాలు బుధవారం(28) నుంచి ప్రారంభం కానుండగా బ్రహ్మపుర విశ్వవిద్యాలయం(భంజవిహార్) తరఫున 38 మంది విద్యార్థులు సోమవారం రాత్రి బాలేశ్వర్ ప్రయాణమయ్యారు. భంజవిహార్, ఛత్రపురం, బలిగుడ, చికిటి, సిటీ కళాశాలల నుంచి ఎంపికైన వీరు వృక్షనృత్య, క్విజ్, వ్యాసరచన, శాస్త్రీయ, జానపద, ఆధునిక నృత్యాలు, గానం, పోస్టర్ మేకింగ్, రంగోళి తదితర 15 విభాగాల్లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు.

మెరుగైన సేవలు అందించండి

ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న మంత్రి గొండ్

రాయగడ పట్టణం: జిల్లా కేంద్రాసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నిత్యానంద గొండ్ ఆరా తీశారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా రాయగడకువచ్చిన ఆయన ఆసుపత్రికి వెళ్లి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వారి యోగ క్షేమాలను తెలుసుకున్నారు. భాజపా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు బి. లక్ష్మి, కౌన్సిలర్ మంజుల మినియక పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో సిమిలిగుడకు పతకాలు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లో ఉత్కల్ కరాటే స్కూల్ ఆధ్వర్యంలో 25న జరిగిన 37వ జాతీయ కరాటే పోటీల్లో సిమిలిగుడ క్రీడాకారులు పతకాలు సాధించారు. జాతీయ పోటీల్లో సిమిలిగుడ ఉత్కల్ కరాటే స్కూల్ నుంచి దిబేష్ కుమార్ బెహెరా స్వర్ణ, శుభమ్ నాయక్ కాంస్య పతకాలు సాధించారు. వారిని కరాటే సంఘం కార్యదర్శి గౌరీ మహంతి, అధ్యక్షుడు హరప్రసాద్ పట్నాయక్, కొరాపుట్ జిల్లా క్రీడా కార్యదర్శి దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

గౌరీ, హర ప్రసాద్, రాజేంద్రతో విజేతలు దిబేష్, శుభమ్ నాయక్‌లు

తైక్వాండో క్రీడాకారుల ప్రతిభ

క్రీడాకారులతో అకాడమీ కార్యదర్శి కార్తీక్ చంద్ర మహాపాత్ర్

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి తైక్వాండో అకాడమీకి చెందిన క్రీడాకారులు రాజస్థాన్ జైపూర్‌లోని సవాయ్ మాన్సింగ్ క్రీడా మైదానంలో ఇటీవల జరిగిన పోటీల్లో పర్లాఖెముండి నుంచి నలుగురు క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో సువర్ణ సాహు వెండి పతకం, అను స్మిత మాలిక్ కాంస్యం పతకాలు సాధించినట్లు అకాడమీ కార్యదర్శి, శిక్షకుడు కార్తీక్ చంద్ర మహాపాత్ర్ తెలిపారు. మంగళవారం పట్టణానికి చేరుకోవడంతో వారికి అకాడమీ సభ్యులు స్వాగతం పలికారు.

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు సన్మానం

రాయగడ, న్యూస్‌టుడే: సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను పూజించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని రాయగడ ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్ సభ్యులు అన్నారు. సోమవారం రాత్రి రామలింగేశ్వర ఆలయ కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులను సన్మానించి, వారి ఆశీస్సులు పొందారు. అధ్యక్షుడు మోహన్ శ్రీహరి, కార్యదర్శి కింతలి శ్రీధర్, కోశాధికారి లాడి సూరజ్, కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు కింతలి అమర్‌నాథ్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపైనే వారపు సంత

నవరంగపూర్, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపైనే వారపు సంత నిర్వహించడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి, పలు ప్రమాదాలు జరుగుతున్నాయని నవరంగపూర్ జిల్లా పపదహండి సమితి మైదల్‌పూర్ వాసులు ఆవేదన చెందుతున్నారు. ప్రతి మంగళవారం జాతీయ రహదారి-26 పైనే సంత జరుగుతుందని, దీనికి వేలసంఖ్యలో జనాలు వస్తారని, ఆ ప్రాంతం రద్దీగా మారుతోంది. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, సంత ఏర్పాటుకు ప్రత్యేక స్థలం కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.

సొంత గూటికి పంచాయతీ సభ్యులు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రెండు రోజుల కిందట బిజదను విడిచి భాజపాలో చేరిన బిసంకటక్ సమితికి చెందిన పంచాయతీ సభ్యులు మంగళవారం తిరిగి బిజదలోకి వచ్చేశారు. వారిని బిసంకటక్‌లో జరిగిన పార్టీ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర సాధారణ కార్యదర్శి సుధీర్ దాస్ పార్టీ కండువాలతో స్వాగతం పలికారు.

పంచాయతీ సభ్యులతో సుధీర్ దాస్

బిజదలోకి చేరికలు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: పంచాయతీ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో పలు పార్టీల్లో చేరికలు కొనసాగుతున్నాయి. మంగళవారం కాశీనగర్ సమితి కరడ పంచాయతీలోని డీ జైపూర్ గ్రామానికి చెందిన 20 కుటుంబాలు బిజద తీర్థం పుచ్చుకున్నారు. వీరిని ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రహి, జడ్పీ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, సమితి అధ్యక్షురాలు బల్ల సాయమ్మ పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు.

పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రూపేష్, జడ్పీ అధ్యక్షుడు గవర తిరుపతిరావు

భాజపాలో చేరిన సమితి సభ్యురాలు

బ్రహ్మపుర నగరం: గంజాం జిల్లా పాత్రపురం సమితిలోని ఖరణిపడ పంచాయతీ సమితి సభ్యురాలు అమితా ప్రధాన్ బిజదను వీడి మంగళవారం భాజపాలో చేరారు. చికిటి ఎమ్మెల్యే మనోరంజన్ ధ్యాన్ సామంత్రాయ్ ఆమెకు భాజపా కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు.

పిండివంటల పోటీకి మంచి స్పందన

రాయగడ, గుణుపురం: గుణుపురం వంశధార వసంతోత్సవంలో భాగంగా పిండి వంటల పోటీలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయ వంటలను తయారు చేసి పోటీలో ఉంచారు. అధ్యక్షుడు అక్షయ్‌దాస్, మాజీ ఎమ్మెల్యే త్రినాథ్ గొమంగో తదితరులు హాజరయ్యారు.

ఆత్మరక్షణ శిక్షణ శిబిరం

ఐఐసీను సన్మానిస్తున్న ప్రధానాచార్యులు ప్రశాంత్ తదితరులు

కాశీనగర్: పట్టణంలోని శ్రీరామ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఆత్మరక్షణ శిక్షణ శిబిరాన్ని ఐఐసీ త్రినాథ్ సెఠి ప్రారంభించారు. ప్రమాదకర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడుకోవడానికి ఈ శిక్షణ సహాయపడుతుందని ఆయన అన్నారు. ప్రధానాచార్యుడు ప్రశాంత్ పాల్గొన్నారు.

అపూర్వ కలయిక

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా పపదహండి సమితి లాల్‌బహదూర్ ఉన్నత పాఠశాలలో 1997లో మెట్రిక్ చదువుకున్న విద్యార్థులు మంగళవారం స్థానిక మృగవిహార్‌లో కలుసుకున్నారు. జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. మరో వారం రోజుల తరువాత రక్తదాన శిబిరం, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

లాల్‌బహదూర్ ఉన్నత పాఠశాలలో 1997లో మెట్రిక్ చదువుకున్న విద్యార్థులు

బిజద కార్యకర్తల ఆందోళన

కొరాపుట్, న్యూస్‌టుడే: కొరాపుట్‌లో బిజద జిల్లా కార్యకర్తలు నిరసన ర్యాలీ నిర్వహించి ఆందోళన చేపట్టారు. రాష్ట్రప్రభుత్వం తాజాగా కాలుష్య ధ్రువ పత్రాలపై తీసుకున్న చర్యలను వ్యతిరేకిస్తూ ఆందోళన చేపట్టారు. నియమాలు ప్రజలకు అనువైనవిగా ఆచరణకు వీలుగా ఉండాలని, కాని ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజావ్యతిరేకంగా ఉన్నాయని ఆరోపిస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్‌కు వినతిపత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే రఘురాం పడాల్, జడ్పీ ఛైర్మన్ సుస్మితా మెలక, పార్టీ జిల్లా అధ్యక్షుడు జిను హిక్కాక, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరసన ర్యాలీలో పాల్గొన్న బిజద కార్యకర్తలు, నాయకులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

గాయపడిన యువకుడిని వైద్య కళాశాలకు తరలిస్తున్న దృశ్యం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందిన ఘటన సిమిలిగుడ సమితి కుందిలి హైస్కూల్ వద్ద మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. పొట్టంగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రాలోని అరకు ప్రాంతానికి చెందిన నలుగురు స్నేహితులు రెండు ద్విచక్ర వాహనాలపై మంగళవారం ఉదయం దేవ్‌మాలి పర్వతానికి విహారయాత్రకు వచ్చారు. సాయంత్రం తిరిగి వెళ్తుండగా కుందిలి హైస్కూల్ వద్ద ఆంధ్రా ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేస్తూ ఎదురుగా వస్తున్న ఓ వ్యాన్‌ను ఢీకొనడంతో పండు(21) అనే యువకుడు మృతి చెందగా, ప్రశాంత్(22), జేమ్స్(22)లు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు కుందిలి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. చికిత్స పొందుతూ జేమ్స్ మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ప్రశాంత్‌ను కొరాపుట్‌లోని లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాలకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో పసికందు మృతదేహం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా దిగపొహండి ఠాణా పరిధిలో భీష్మగిరి గ్రామంలోని పెద్ద చెరువులో మంగళవారం ఓ ఆడ పసికందు మృతదేహం కలకలం రేపింది. ఉదయం చెరువుకు స్నానాలకు వెళ్లిన గ్రామస్థులు గుర్తించారు. బహుశా గుర్తు తెలియని వారు మృతి చెందిన రోజుల పసికందును చెరువులో పడేసి ఉంటారని అనుమానిస్తున్నారు. పోలీసులు వివరాలు ఆరా తీస్తున్నారు.

ఖొర్ద్రాయిలో అగ్ని ప్రమాదం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బాలేశ్వర్ జిల్లా ఖొగ్రాయిలో మంగళవారం తెల్లవారు జాము 3 గంటలకు అగ్నిప్రమాదం జరిగింది. బజారువీధిలోని మార్కెట్ కాంప్లెక్స్‌కు చెందిన అయిదు దుకాణాలు మంటల్లో ఆహుతయ్యాయి. రూ. లక్షల్లో ఆస్తినష్టం కలిగింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ మూలంగా ఈ ఘటన జరిగింది. అగ్నిమాపక జవానులు చేరుకుని మంటలు నియంత్రణలోకి తెచ్చారు.

ఇంటిపైకి నాటుబాంబు విసిరిన దుండగులు

నాటుబాంబు ధాటికి దెబ్బతిన్న ప్రహరీ

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా ఛత్రపురం ఠాణా పరిధిలో చికలఖండి గ్రామంలోని జి.కామరాజు రెడ్డి అనే వ్యక్తి ఇంటి వెనకవైపు సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వారు నాటుబాంబుతో దాడి చేసి పారిపోయారు. పేలుడు ధాటికి ఇంటి ప్రహరీ, ఇతర నిర్మాణాలు దెబ్బతిన్నాయి. ఇంట్లోని పలు సామగ్రి ధ్వంసమైంది. ఇంట్లో పడుకుని ఉన్న కామరాజు మరో ఇద్దరు కుటుంబ సభ్యులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఛత్రపురం పోలీసు స్టేషన్ అధికారులు మంగళవారం గ్రామానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. దాడికి కారణాలు తెలియరాలేదు.

పశువుల శాలలో అగ్ని ప్రమాదం: రెండు ఆవులు సజీవ దహనం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా హింజిలికాటు పోలీసు స్టేషన్ పరిధిలో అడపడ గ్రామంలోని అరుణ్ మహాపాత్ర్, నబీన్ మహాపాత్ర్‌ల ఇంటికి సమీపంలోని పశువుల శాలలో సోమవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. రెండు ఆవులు సజీవ దహనం కాగా, ద్విచక్ర వాహనం, రెండు సైకిళ్లు దగ్ధమయ్యాయి. పోలీసులు మంగళవారం గ్రామానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

అడవి పంది దాడిలో..

కొంధమాల్ జిల్లా జి.ఉదయగిరి సమితిలో లింగాగడ పంచాయతీ సమీపంలోని శ్రీకళా ఘాట్ రోడ్డులో సోమవారం సాయంత్రం అడవి పంది దాడిలో ముగ్గురు మహిళలు గాయపడ్డారు. డాకపాల గ్రామానికి చెందిన సశ్మితా మల్లిక్ (35), కానబాగిరి గ్రామానికి చెందిన అప్సర ప్రధాన్ (60), నిరజిని ప్రధాన్ (60)లు. జి.ఉదయగిరి ఆరోగ్య కేంద్రంలో చికిత్సకు చేర్పించారు. వీరిలో తీవ్ర గాయాలైన అప్సర ప్రధాన్‌ను ఫుల్బాణీలోని జిల్లా ఆసుపత్రికి తరలించారు. సశ్మితా మల్లిక్ భర్త బపి మల్లిక్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై గ్రామానికి తిరిగి వస్తుండగా.. శ్రీకళా ఘాటీ రోడ్డులో వారి వాహనం మరమ్మతుకు గురైంది. దీంతో భర్త బైక్ ప్లగ్ తీసి శుభ్రపరుస్తుండగా, భార్య సశ్మితా రహదారి పక్కన నిల్చుని ఉంది. సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి వచ్చిన అడవి పంది సశ్మితపై దాడి చేసింది. అదే సమయంలో కట్టెలు మోసుకుని అటుగా వస్తున్న అప్సర, నిరజినిలపైనా దాడి చేసి అడవిలోకి పారిపోయింది.

బాధితులకు చరవాణుల అందజేత

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పోలీసు జిల్లా ఆధీనంలోని వివిధ ఠాణాల పరిధుల్లో పోగొట్టుకున్న, చోరీకు గురైన 71 చరవాణులను మంగళవారం బాధితులకు అందజేశారు. బ్రహ్మపురలోని సైబర్ నేరాలు, ఆర్థిక మోసాల ఠాణా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు ఎస్పీ అలోక్ కుమార్ జెనా ఇతర అధికారులు పాల్గొని బాధితులకు చరవాణులను అందజేశారని బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం. ఒక ప్రకటనలో తెలిపారు.

ఖరగ్‌పూర్‌లో...

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఖరగ్‌పూర్ డివిజన్‌లో గల పలు రైల్వే స్టేషన్లలో ప్రయాణికులు పోగొట్టుకున్న చరవాణులను రైల్వే పోలీసులు రికవరీ చేశారు. వందకు పైగా రికవరీ చేసిన వాటిని బాధితులకు అందజేసినట్లు ఓ ప్రకటనలో తెలిపారు.

జిల్లాలో పీఎం వీడీవీసీ కేంద్రాలు: 68 | **సమకూర్చిన నిధులు: దాదాపు రూ.10 కోట్లు** | **సభ్యులు : 20,400 మంది**

వికసించని వన్‌ధన్..!

న్యూస్‌టుడే, హరిపురం (మందస)

మందస మండలం పట్టులోగాంలో మూతపడిన కేంద్రం

మహిళలకు ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన మంత్రి వన్‌ధన్ వికాస కేంద్రాలను ఐదేళ్ల కిందట నెలకొల్పింది. ఒక్కో యూనిట్‌కు రూ.5 నుంచి రూ.15 లక్షల వరకు కేటాయించి జీడి ప్రాసెసింగ్, నూనె, పిండి మిల్లుల యంత్ర సామగ్రిని సమకూర్చింది. ఒక్కో కేంద్రంలో 300 మందిని సభ్యులుగా భాగస్వామ్యం చేసి కేంద్రాల నిర్వహణకు మార్గదర్శకాలను ప్రవేశపెట్టింది. ప్రారంభించిన రెండేళ్లకే అగమ్యగోచరంగా మారాయి. సభ్యులకు సరైన అవగాహన లేకపోవడంతో చాలాచోట్ల మూతపడ్డాయి.

● అవగాహన లేమితో వృథాగా రూ.కోట్ల విలువైన సామగ్రి

మూతపడ్డాయి..

యంత్రాల నిర్వహణ పెట్టుబడితో కూడింది. ఇవి మరమ్మతులకు గురయ్యాక వాటిని బాగు చేయడానికి పెట్టుబడి లేక మహిళలు అలానే వదిలేశారు. నెలల తరబడి యంత్రాలు వాడకుండా ఉంచడంతో పాడయ్యాయి. మందస మండలం కొండలోగాం పంచాయతీ పట్టులోగాంలో రూ.15 లక్షలతో ఏర్పాటైన జీడి ప్రాసెసింగ్ కేంద్రం ఏడాది బాగా నడిచింది. బాయిలర్, మరి కొన్ని ఇతర భాగాలు పాడవ్వడంతో మూతపడింది. చీపి, సాబకోట, కిల్లోయిలో పిండి మిల్లులు ఆరు నెలలకే పాడై మూతపడ్డాయి.

నిర్వహణ ఇలా..

సభ్యులు వారి పొలాల్లో పండించిన వాణిజ్య పంటలు నేరుగా విక్రయించడం ద్వారా గిట్టుబాటు ధర దక్కదు. అందుకని ఈ కేంద్రాల్లో సమకూర్చిన యంత్రాల ద్వారా, పిండి, పప్పు చేసి విక్రయించి లాభాలు ఆర్జించొచ్చు. సొంత పంటలే కాక ఇతరుల వద్ద కొనుగోలు చేసి లాభాలు పొందొచ్చు. పక్క రైతుల నుంచి పంట కొనుగోలు చేయడానికి పెట్టుబడి లేక మహిళలు అలా చేయలేకపోతున్నారు.

వాడకుండా వదిలేయడంతోనే.. 'వన్‌ధన్ వికాస కేంద్రాల నిర్వహణపై గతంలో మహిళలకు శిక్షణ ఇచ్చాం. పంట ఉత్పత్తులను కొద్దిరోజుల్లో వ్యాపార వస్తువులుగా తయారుచేసి విక్రయిస్తున్నారు. ఆ తర్వాత యంత్రాలు ఎక్కువ రోజులు వాడకుండా ఉంచేస్తున్నారు. దీంతో పాడవుతున్నాయి. అలా జరగకుండా ప్రణాళికలు తయారు చేస్తాం' అని డీఆర్‌డీఏ డీపీఎం రమణ తెలిపారు.

కాలుష్యం వ్యాప్తి.. ఇంతేనా గతి!

పాలకొండ-పార్వతీపురం ప్రధాన రహదారిలోని ఏలాం కూడలిలో ప్రమాదం పొంచి ఉంది. ఈ కూడలిలో పాత వస్తువులు కొనుగోలు చేసే దుకాణాలు ఉన్నాయి. వాహనాల టైర్లు కాల్చివేయడంతో మంటలు, పొగ కాలుష్యం ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోనే పలు వ్యాపార దుకాణాలు ఉండడంతో ప్రమాదాలకు అవకాశం ఉంది. తీవ్ర పొగ వ్యాపించడంతో అవస్థలు పడాల్సి వస్తోందని, ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వ్యాపారులు ప్లాస్టిక్, టైర్లు కాల్చకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రంగారావు తెలిపారు. -న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

నిలిచిన నీటి సరఫరా

పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ నగరపంచాయతీ పరిధిలో రెండు ప్రధాన రక్షిత పథకాల పరిధిలో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. గోపాలపురం గ్రామ సమీపంలో రక్షిత పథకాలకు తాగునీటిని సరఫరా చేస్తున్న పైపులైన్లను మంగళవారం ఉదయం ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో పైపులు పగిలిపోయాయి. పట్టణంలోని 9, 10, 11, 12, 13, 14, 15, 16, 17, 18 వార్డుల పరిధిలోని ప్రజలకు నీటి సరఫరా లేక అవస్థలు తప్పడంలేదు. ప్రస్తుతం నగరపంచాయతీ సిబ్బంది బాగు చేస్తున్నట్లు కమిషనర్ రత్నరాజ్ తెలిపారు.

స్వచ్ఛ చదువులు.. హరిత పరిసరాలు..

న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాలు తీర్చిదిద్దడంతో పాటు ఉన్నత పాఠశాలల్లో ఎకో క్లబ్‌లు ఏర్పాటు ద్వారా పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా సమగ్ర శిక్షా పర్యవేక్షణలో ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేసింది. వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి కార్యక్రమాలు చేపడుతున్నారు.

బుడుమూరు జడ్పీ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో విద్యార్థులు

● సమగ్ర శిక్షా పర్యవేక్షణలో జాతీయ హరిత దళం ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలల్లో ప్రతి తరగతి నుంచి ఇద్దరు విద్యార్థులు, ఓ ఉపాధ్యాయుడితో కూడిన ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 450 ఉన్నత పాఠశాలలుండగా 6,750 మంది విద్యార్థులు ఇందులో నమోదయ్యారు.

ఇవీ కార్యక్రమాలు...

- స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాల్లో భాగస్వామ్యం.
- పర్యావరణంపై తోటి విద్యార్థులు, పౌరులకు అవగాహన కల్పించడం కోసం ర్యాలీల నిర్వహణ.
- మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడంపై అవగాహన కల్పించడం.
- భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడకుండా ఉండేందుకు పొదుపుగా వినియోగించడంపై అవగాహన.
- తడి, పొడి చెత్తను వేరు చేయడం గురించి వివరించడం.
- పర్యావరణ హిత జీవన శైలిని ప్రతిఒక్కరూ అలవర్చుకునేలా ప్రత్యేక కార్యక్రమాలు.
- పర్యావరణంపై అంశాల వారీగా సదస్సులు.

విద్యార్థులకు అంశాలవారీగా బాధ్యతలు అప్పగించాం. పర్యావరణ పరిరక్షణ అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. మొక్కల పెంపకం, వర్మీకంపోస్టు నిర్వహణ తదితర అంశాలపై పాఠశాల స్థాయిలోనే విద్యార్థులతో అమలు చేయిస్తున్నాం. - **పూజారి గోవిందరావు, జాతీయ హరిత దళం, జిల్లా సమన్వయకర్త**

అంబరాన్నంటిన.. సిరిమాను సంబరం

● గంట ఆలస్యంగా ఉత్సవం ప్రారంభం ● సుమారు రెండు లక్షలమంది భక్తుల హాజరు

చదురుగుడి పూజలందుకుంటున్న పోలమాంబ

మక్కువ, సాలూరు, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత శంబర పోలమాంబ జాతరలో ప్రధాన ఘట్టం సిరిమాను సంబరం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాధవ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మధ్యాహ్నం 3:45 గంటలకు నడివీధిలోని సిరిమాను వద్దకు అమ్మవారి ఘటాలు చేరుకున్నాయి. సంప్రదాయంగా ఉత్సవ కమిటీ ఛైర్మన్ నైదాన తిరుపతిరావు, కమిటీ సభ్యులు, నాయుడు, కరణం కుటుంబ సభ్యులు పూజారిని మేళతాళాలతో సిరిమాను వద్దకు 4.10గంటలకు తీసుకు వచ్చారు. 4.30కు పూజారి భాస్కరరావు సిరిమాను అధిరోహించి ఉత్సవం ప్రారంభించారు. గిరిడ, నాయుడు, కరణం ఇళ్లకు సిరిమాను వెళ్లగా పూజలందించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ, పనుకు, గొల్ల, కొండ తదితర వీధుల్లో సిరిమాను ఉత్సవం సాగింది. భారీ సంఖ్యలో భక్తులు పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. వనం, చదురుగుడులలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి

గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కుటుంబ సభ్యులతో కలిసి పోలమాంబకు పట్టువస్త్రాలు సమర్పించారు. కూటమి పాలనలో ప్రజలంతా సుఖ, సంతోషాలతో ఉండాలని, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని కోరుకున్నట్లు తెలిపారు. క్యూలైన్లలో ఉన్న భక్తులతో మాట్లాడి ఏర్పాట్లపై ఆరా తీశారు. మంత్రికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికిన దేవాదాయశాఖ అధికారులు అమ్మవారి చిత్రపటం, వస్త్రాలు అందించారు.

అలరించిన నృత్యాలు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోల సమావేశం మంగళవారం నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. హెచ్ఎం డి.నాగభూషణరావు, ఉపాధ్యాయులు బి.శంకరరావు, రమేష్, నారాయణరావు, బాబూరావు, నిరీక్షణ తదితరులు విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

ఇంకెన్నాళ్లు.. ఇంకుతున్నాయ్ కన్నీళ్లు..

కదలని తోటపల్లి, మడ్డువలస కాలువల నిర్మాణ పనులు

న్యూస్‌టుడే, లావేరు

జిల్లాలోని మెట్ట ప్రాంతం ఎచ్చెర్ల నియోజకవర్గం. ఇక్కడ పంటలు వర్షాధారంగానే సాగు చేస్తారు. ఈ నేపథ్యంలో తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టుల నుంచి సాగునీరు తీసుకొచ్చే పనులకు గత తెదేపా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తర్వాత వచ్చిన పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. కాలువలు నిర్మించినా మధ్యలోనే వదిలేయడంతో నీరందని దుస్థితి.

రణస్థలం: కొండములగాం సమీపంలోని పనికిరాని మొక్కలతో నిండిపోయిన తోటపల్లి ప్రధాన కాలువ

● మడ్డువలస ప్రాజెక్టు ద్వారా 13 ఏళ్ల కిందట లావేరు, జి.సిగడాం, ఎచ్చెర్ల, పొందూరు మండలాల్లో కాలువలు తవ్వి వదిలేశారు. నేటికీ చుక్కనీరు రాలేదు. ఒక్క జి.సిగడాం మండలానికి తప్ప మిగిలిన చోట్ల కలగానే మిగిలిపోయింది. పూర్తిస్థాయిలో నీళ్లొస్తే సుమారు 35 వేల ఎకరాల్లో పంటలు పండించుకోవచ్చు.

ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధిలోని లావేరు, రణస్థలం, ఎచ్చెర్ల, జి.సిగడాం మండలాలున్నాయి. ఈ ప్రాంతాల గుండా తోటపల్లి, మడ్డువలస, నారాయణపురం ప్రాజెక్టుల పరిధిలో కుడి కాలువలు నిర్మించి సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. అయితే పూర్తిస్థాయిలో నిర్మాణ పనులు చేపట్టకపోవడం, నిర్వహణ గాలికి వదిలేయడంతో ఎందుకు పనికిరాకుండా పోయాయి. తోటపల్లి ప్రాజెక్టు ద్వారా గత ఏడేళ్లుగా లావేరు మండలానికి చుక్కనీరు రాలేదు. ఈసారి కూడా అదే దుస్థితి. సాగునీరొస్తే ప్రత్యక్షంగా 11 వేల ఎకరాలు, పరోక్షంగా మరో 8 వేల ఎకరాలకు నీరందే అవకాశముంది. దీంతో పాటు చెరువులు నింపుకోవచ్చు.

● తోటపల్లి ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందాల్సిన ఆయకట్టు (ఎకరాల్లో)

మండలం	ఆయకట్టు
రణస్థలం	21,590
లావేరు	11,008
జి.సిగడాం	6,373

ప్రతిపాదనలు పంపాం.. తోటపల్లి కాలువకు పలుచోట్ల మరమ్మతులు చేపట్టాల్సింది. ఖరీఫ్‌లో రణస్థలం మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు విడుదల చేశాం. కాలువ పరిధిలో పూడికతీత కోసం రూ.65 లక్షలతో ప్రతిపాదనలు పంపించాం. లావేరు మండల పరిధిలో కాలువ తవ్వకాలు పూర్తి చేయాల్సి ఉంది. రూ.63 కోట్లతో పలుచోట్ల కాలువ తవ్వకాలు చేపట్టాల్సింది. - **లావణ్య ప్రియదర్శిని, డీఈఈ, తోటపల్లి జలాశయం**

పాఠకులకు తప్పని పాట్లు!

పాలకొండ శాఖా గ్రంథాలయానికి వెళ్లాలంటే అవస్థలు తప్పడం లేదు. ప్రధాన ద్వారం చెంతనే మురుగు పేరుకుపోవడంతో రాకపోకలు సాగించడానికి తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోందని పలువురు పాఠకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాంగణంలో రక్షిత మంచినీటి పథకం ఉండడంతో జలాన్ని ట్యాంకరులోకి నింపే సమయంలో ఇలా నీరు వృథా అయి మురుగుగా మారుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సమస్యను పరిష్కరిస్తామని నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజ్ తెలిపారు. -న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

● సాలూరు మండలం కరాసువలస కేజీబీవీలో ఏఎన్ఎం పోస్టు ఖాళీగా ఉంది. ఒక్కటే అయినా స్థానికంగా పోటీ నెలకొంది. దీంతో అభ్యర్థులంతా నాయకులతో కలిసి ఓ కీలక ప్రజాప్రతినిధిని కలుస్తున్నారు. దరఖాస్తు ప్రక్రియ పూర్తయ్యాక మాట్లాడదామని చెప్పినట్లు తెలుస్తోంది. ఎవరికీ హామీ ఇవ్వలేదని ఓ నాయకుడు వెల్లడించారు'

● విజయనగరం జిల్లాలో నాలుగు అటెండర్ పోస్టులు మాత్రమే ఉండగా.. 430 మందికి పైగా దరఖాస్తు చేశారు. వీరంతా ఎమ్మెల్యేలను కలుస్తున్నారు. ఓ మండలంలో కీలక నాయకుడు రూ.10 వేల చొప్పున వసూలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

కేజీబీవీ అభ్యర్థినులకు కాసుల పరీక్ష

- పోస్టు దక్కాలంటే పైసలు ఇవ్వాల్సిందే
- క్షేత్రస్థాయి నాయకుల నయా దందా

దరఖాస్తులు అందిస్తున్న అభ్యర్థినులు

న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం, పార్వతీపురం పట్టణం

కొన్నేళ్ల నుంచి కేజీబీవీల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయలేదు. కూటమి ప్రభుత్వం రాకతో ఎట్టకేలకు కదలిక వచ్చింది. ప్రాంతాల వారీగా ప్రకటన వెలువడింది. విజయనగరం జిల్లాలో ఇప్పటికే దరఖాస్తు ప్రక్రియ ముగియగా.. మన్యం జిల్లాలో ఈనెల 23 నుంచి ప్రారంభమైంది. ఇదే అదనుగా కొందరు క్షేత్రస్థాయి నాయకులు రంగంలోకి దిగారు. అభ్యర్థినుల నుంచి పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారు. కొన్నింటికి మార్కుల అవసరం లేకపోవడం, కేవలం మౌఖిక పరీక్ష ఆధారంగా ఎంపికలు జరగనుండడంతో సిఫార్సులు సాగుతున్నాయి.

స్వీకరణకు ముందే..

మన్యంలో 21 విద్యాలయాల్లో వృత్తివిద్య ఇన్‌స్ట్రక్టర్-2, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్-8, ఏఎన్ఎం-2, అకౌంటెంట్-1, పార్ట్‌టైం టీచర్స్-2, వార్డెన్-1, హెడ్ కుక్-1, సహాయ కుక్-8, చౌకీదార్ విభాగంలో ఒక పోస్టు భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఈనెల 23 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఫిబ్రవరి ఒకటితో గడువు ముగియనుంది. ఇప్పటికే నాయకులు, ప్రజాప్రతినిధులకు సిఫార్సులు పెరిగాయి. ఇక్కడ పలువురి నుంచి రూ.20 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పారదర్శకంగా భర్తీ చేపడతామని ఏపీసీ తేజేశ్వర రావు వెల్లడించారు. కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ ఎంపిక చేస్తుందని, ఎవరికీ నగదు ఇవ్వాల్సిన అవసరం లేదని చెప్పారు.

భారీగా దరఖాస్తులు..

విజయనగరం జిల్లాలోని 27 కేజీబీవీల్లో 73 ఖాళీలున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 5 నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. టైపు-3 విభాగంలో 46 పోస్టులకు 1,702, టైపు-4 కింద 27 ఖాళీలకు గానూ 436 మంది పోటీలో నిలిచారు. ఎక్కువ మంది కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్‌పై ఆసక్తి చూపారు. పరిశీలన అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

విజయనగరం జిల్లాలో ఇలా..

పోస్టు పేరు	ఖాళీలు	దరఖాస్తులు
వృత్తివిద్య ఇన్‌స్ట్రక్టర్లు	10	139
కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు	12	576
ఏఎన్ఎం	07	169
అటెండర్	04	437
వంట పనివారు	05	154
వాచ్ ఉమెన్	01	30
స్కావెంజర్లు	07	197
పార్ట్‌టైమ్ టీచర్లు	07	78
వార్డెన్	04	102
కుక్	11	163
చౌకీదారులు	05	93

వినియోగదారుల హక్కులపై పాఠశాలల్లో అవగాహన

పార్వతీపురం, న్యూస్‌టుడే: పాఠశాలల్లో వినియోగదారుల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని యంత్రాంగం నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లా స్థాయిలో కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ప్రత్యేకంగా ఒక ఉపాధ్యాయుడికి నోడల్ అధికారిగా బాధ్యతలు అప్పగించింది. పౌరసరఫరాలు, వినియోగదారుల హక్కుల పరిరక్షణ శాఖ విద్యార్థి దశలోనే వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తులో ఆ చట్టాన్ని సక్రమంగా అమలుచేసే దిశగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. దీనిపై పాఠశాల విద్యాశాఖకు చేసిన సూచన మేరకు చర్యలు తీసుకున్నారు. ప్రతి పాఠశాలలో వారంలో కనీసం ఒకసారి వినియోగదారుల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా ప్రణాళికను అమలు చేయాలని సూచించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా నోడల్ అధికారిగా పార్వతీపురం పట్టణంలోని కేపీఎం హైస్కూల్ సాంఘిక శాస్త్ర సహాయకుడు వి.లక్ష్మునాయుడిని నియమించినట్లు చెప్పారు. విద్యార్థుల్లో చైతన్యం కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని లక్ష్మునాయుడు తెలిపారు.

ప్రయోగ పరీక్షలు ప్రారంభం

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఇంటర్ మీడియట్ ప్రయోగ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి విడతలో వృత్తి విద్యా కోర్సు విద్యార్థులకు నిర్వహిస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు బ్యాచ్‌లకు పరీక్ష జరిగింది. ఉదయం 24 పరీక్ష కేంద్రాల్లో 1,641 మందికి గాను 1,540 మంది హాజరయ్యారు. 101 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 21 కేంద్రాల్లో 1,489 మందికి 1,433 మంది హాజరయ్యారు. 56 మంది గైర్హాజరయ్యారు. సీసీ కెమెరాల నిఘాలో పక్కాగా పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకున్నట్లు డీఐఈవో నాగేశ్వరరావు తెలిపారు.

కొత్తది కట్టకపోయినా.. ఉన్నది కాపాడండి..

- న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం తహసీల్దారు కార్యాలయ భవనం పైకప్పు నుంచి పెంకులు అడపాదడపా పడుతుండటంతో సిబ్బందితోపాటు లబ్ధిదారులూ భయాందోళన చెందుతున్నారు. ఇది అత్యవసర సేవా శాఖ. విపత్తు వస్తే, ఎక్కడ ఏమవుతుందోనని పరుగులు తీసి, ప్రజలను కాపాడేందుకు శ్రమ పడుతుంటారు. అలాంటి శాఖా కార్యాలయానికే భారీ వర్షం కురిసినా, గట్టిగా గాలి వీచినా తొలి ప్రమాదమంటే పరిస్థితి అర్థం చేసుకోండి. ఏ గదిలో ఏ పెంకు రాలుతుందో, పైన ఏర్పాటుచేసిన దూలాలు ఎప్పుడు పడతాయో తెలియని దుస్థితి.

బ్రిటిష్ పాలనలో కచేరీగా వినియోగించిన భవనం.. నేటికీ సేవలు

★ ఈ కట్టడాన్ని బ్రిటిష్ పాలనలో కచేరీ భవనంగా వినియోగించేవారు. తర్వాత యూనియన్ ఆఫీసుగా మారింది. ఆపై తహసీల్దారు కార్యాలయం, రెవెన్యూ కార్యాలయం, మళ్లీ తహసీల్దారు కార్యాలయంగా రూపాంతరం చెందింది. బయట పెట్టిన నామఫలకాలు, సేవలు మారుతున్నా భవనం అభివృద్ధి చెందడం లేదు. కూల్చేసి మళ్లీ కడితే, తక్కువ కాలం మన్నిక ఉంటుందని, ఉన్న దాన్నే పటిష్ఠంగా చూసుకుంటే, దశాబ్దాలపాటు సేవలు అందిస్తుందని విశ్రాంత ఇంజినీరింగ్ నిపుణులు సూచించడంతో పైపై మరమ్మతులు చేసేవారు.

★ గతేడాది తుపాను సమయంలో ఇచ్ఛాపురం వచ్చిన జిల్లా సంయుక్త కలెక్టరు (ఇన్‌ఛార్జి కలెక్టరు హోదాలో) ఫర్మాన్ అహ్మద్ ఖాన్ కార్యాలయ భవనాన్ని, అంతర్గత రోడ్డును పరిశీలించారు. ఇలా ఉంటే ఎలా అని ఆర్డీవో, ఇతర అధికారులను ప్రశ్నించి.. చక్కదిద్దాలని సూచించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ సమస్యపై తహసీల్దారు ఎన్.వెంకటరావు స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, అభివృద్ధి పనులు చేపట్టడానికి కృషి చేస్తామన్నారు.

★ కోతుల కారణంగా పెంకులు విరిగిపడుతున్నాయి. ముఖ్యంగా లబ్ధిదారులు వేచి ఉండే వరండా గదులన్నీ ప్రమాదకరంగా మారాయి. గతేడాది పైకప్పు పెంకులు రాలిపడటంతో సిబ్బంది, ప్రజలు అటుగా వెళ్లకుండా కర్రలతో అడ్డుకట్ట వేశారు. ప్రస్తుతం కలెక్టర్ వసతి భవనానికి పునరుద్ధరణ పనులు చేస్తున్నారు. దీంతోపాటు కార్యాలయ వరండాను రూపు మార్చి, రేకులతో అయినా పునర్నిర్మాణం చేస్తే ప్రమాదాలు నివారించొచ్చని పలువురు సూచిస్తున్నారు. భవనం వెలుపల ఉన్న స్థలంలో వరండాను విస్తరిస్తే, కార్యాలయ, ఇతర సమావేశాలకు వినియోగించుకోవచ్చని క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

దోమ తెరలు అందేదెప్పుడో..?

పార్వతీపురం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం కీటక జనిత వ్యాధుల నివారణ చర్యల్లో భాగంగా ప్రతి నాలుగైదు ఏళ్లకు ఒకసారి తైవాన్ నుంచి రసాయన దోమ తెరలను తెప్పించి మలేరియా పీడిత ప్రాంతాల్లో సరఫరా చేసేది. గతంలో జిల్లాలో నాలుగు లక్షలకు పైగా దోమ తెరలు పంపిణీ చేశారు. ఈ ఏడాది మళ్లీ వీటిని సరఫరా చేయాల్సి ఉన్నా.. ఇంకా రాలేదు. మరోపక్క జిల్లాకు 3.57 లక్షల దోమతెరలు అవసరమని వైద్య ఆరోగ్యశాఖ ప్రతిపాదనలు పంపించింది. ఆ మేరకు అందుబాటులోకి వస్తే జిల్లాలో ప్రభావిత ప్రాంతాల్లో ప్రతి ఇంటికి పంపిణీ చేసే అవకాశం ఉంటుంది.

245 గ్రామాలకు అవసరం..

తక్షణ అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వమే దోమ తెరలను కొనుగోలు చేసి పంపిణీ చేయాలని నిర్ణయించింది. మొదటిగా ఏఎస్ఆర్, మన్యం జిల్లాలకు ప్రాధాన్యం ఇచ్చి.. పంపించేందుకు చర్యలు చేపట్టాలని భావించారు. హైరిస్కు గ్రామాల్లో పంపిణీ చేయాలని యోచిస్తున్నారు. మన్యం జిల్లాకు సంబంధించి 245 గ్రామాల్లో 62,706 దోమ తెరలు అవసరమని ప్రతిపాదించారు. ఇవి చేరితే మలేరియా వ్యాప్తి కొంతవరకు అరికట్టేందుకు సహకరించే వీలుంటుంది.

నియంత్రణకు కృషి ఇలా..

జిల్లాలో మలేరియా కేసుల నియంత్రణకు యంత్రాంగం చేస్తున్న కృషికి ఫలితాలు వస్తున్నాయి. గతంలో కంటే 2025 డిసెంబరు, 2026 జనవరిలో నమోదైన కేసుల సంఖ్య తగ్గింది. ఒకప్పుడు ఎక్కడైనా పాజిటివ్ వస్తే.. నియంత్రణ యంత్రాంగం మాత్రమే స్పందించేది. ఇప్పుడు పంచాయతీ పాలన, వైద్య ఆరోగ్యశాఖ, ఎంపీడీవోలు, తహసీల్దార్లు భాగస్వాములుగా నిలిచి నివారణకు అడుగులు వేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

హైరిస్కు గ్రామాల్లో దోమ తెరల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. 62 వేల పైచిలుకు రావాల్సి ఉంది. కేంద్రం నుంచి కూడా ఈ ఏడాది సరఫరా కావాల్సి ఉంది. వచ్చిన వెంటనే పంపిణీ చేస్తాం. - మణి, జిల్లా మలేరియా నియంత్రణాధికారి

అందం.. ఆనందం

వీరఘట్టం, న్యూస్‌టుడే: వీరఘట్టం మండలపరిషత్తు కార్యాలయం సుందరంగా మారింది. కార్యాలయం వరండాలో వివిధ రకాల మొక్కలు నాటారు. పరిసరాలు శుభ్రం చేయడంతో పలువురిని ఆకట్టుకుంటోంది.

అధికారులు చూడరు.. నాణ్యత పట్టించుకోరు

బొబ్బిలి, న్యూస్‌టుడే: బొబ్బిలి పురపాలిక పరిధిలోని రాణిమల్లమ్మదేవి పార్కు అభివృద్ధి పనుల్లో నాణ్యత కొరవడుతోంది. రెండు ప్యాకేజీల కింద సుమారు రూ.5 లక్షల చొప్పున చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, ప్రహరీ పనులు చేపడుతున్నారు. కీలకమైన కాంక్రీట్ పనుల్లో లోపాలు బయటపడుతున్నాయి. ఆరంభంలోనే ఇంజినీర్లు నిర్లక్ష్యం చూపితే శాశ్వతంగా ఎలా ఉంటాయనే ప్రశ్న ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

పార్కు చుట్టూ వాకింగు ట్రాక్ అభివృద్ధిలో భాగంగా ఓ వైపు ప్రహరీ, మరోవైపు రక్షణ గోడ నిర్మిస్తున్నారు. ప్రహరీకి గోతులు తవ్వి స్తంభాలు వేసే పనులు ప్రారంభించారు. గోతుల్లో మెటల్‌తో కూడిన కాంక్రీటు వేయాల్సిఉంది. అలా కాకుండా సాధారణ మెటల్ వేసి, ఆపై పూతగా కాంక్రీటు మిశ్రమం వేస్తున్నారు. మిల్లరుతో కాంక్రీటు మిశ్రమం కలపాలి. అలా కాకుండా కూలీలతో కలిపి వేసేస్తున్నారు. దీనివల్ల నాణ్యత ఏ మేరకు ఉంటుందో ప్రశ్నార్థకం. కాంక్రీటు పనులు చేపట్టే సమయంలో ఇంజినీర్లు విధిగా ఉండాలి. కానీ ఎవరూ ఉండడంలేదు.

గతంలో నిర్మించిన రక్షణ గోడ కూలిపోయిందిలా..

రూ.11 లక్షలు వృథా..

రాణిమల్లమ్మదేవి పార్కు చుట్టూ రక్షణగోడ, కల్వర్టు పనులు గతంలో సుమారు రూ.11 లక్షలతో చేపట్టారు. పదేళ్లు కాకముందే గోడ విరిగిపోయింది. కల్వర్టు నాసిరకం కావడంతో కుంగిపోయింది. ఇష్టారాజ్యంగా చేపట్టడంతో పాడయ్యాయి. నిధులు వృథా అయ్యాయే తప్ప ప్రయోజనం లేదు. మళ్లీ వాటి స్థానంలో కొత్త పనులు చేపట్టారు. నాణ్యత లేకుంటే వాటి మాదిరిగానే పోయే అవకాశం ఉంది. రాణిమల్లమ్మదేవి చెరువులో నిత్యం నీరు ఉంటోంది. కలకాలం ఉండాలంటే నిర్మాణం చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం.. కాంక్రీటు మిశ్రమంతో కూడిన మెటల్ గోతుల్లో వేయాలి. అలా వేయకపోవడంతో వేసిన మెటల్ తీయించి, మళ్లీ కాంక్రీటు వేయాలని చెప్పాం. పనుల్లో నాణ్యత లోపిస్తే ఊరుకునేది లేదు. చిన్న చిన్న పనులు కావడంతో మిల్లరు వాడలేకపోతున్నారు. సాధ్యమైనంతవరకు వినియోగించేలా చర్యలు తీసుకుంటాం. - **కోటేశ్వరరావు, ఏఈ, బొబ్బిలి పురపాలిక**

మోక్షాన్ని ప్రసాదించు మురుగా..

తై మాస కృత్తిక సందర్భంగా చెన్నై పాడిలోని తిరువలిదాయం తిరువల్లీశ్వరస్వామి ఆలయానికి పాల బిందెలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

నోటికి శూలం, వివిధ వేషధారణల్లో..

చర్మానికి కొక్కీలు గుచ్చుకుని క్రేన్‌కు వేలాడుతున్న దృశ్యం

వెళ్లాలని లేకున్నా.. కనుమరుగవుతున్నా..

☛ ముగియనున్న పాంబన్ పాత వంతెన ప్రస్థానం ☛ కొత్త బ్రిడ్జి నిర్మాణంతో తొలగింపునకు చర్యలు

కొత్త వంతెన పక్కనున్న పాత బ్రిడ్జి

దేశంలోనే తొలి సముద్ర సేతు.. పాంబన్ పాత వంతెన. కోట్లాది మందిని తన మీదుగా తీసుకెళ్లి.. వందలాది తుపాన్లను తట్టుకుని.. ఎన్నో కెమెరాలకు అందంగా చిక్కిన ఈ వంతెన.. ఇప్పుడు వీడ్కోలు అంటోంది. మనసుల్లో చెరగని ముద్ర వేసి.. ఓ మధుర జ్ఞాపకంగా కనుమరుగు అవుతానని చెబుతోంది. అంతటి ఘనత ఉన్న ఈ పాత వంతెనకు మాటలొస్తే ఏం చెబుతుందో తెలుసుకుందాం.. - ఈనాడు-చెన్నై

నాకన్నా అందమైన కొత్త వర్టికల్ వంతెన నా పక్కకే వచ్చింది. అద్భుతంగా ఉంది. నా సేవలు ఉండవని అదొచ్చినప్పుడు అర్థమైంది. సముద్రపు నీటిలో ఉన్న నాక్కూడా ఎందుకో కన్నీళ్లొస్తున్నాయి. ఇంకొన్ని రోజుల్లో కడలి నుంచి వెళ్లి ఎక్కడ పడిపోతాననే బాధ వేధిస్తోంది. ఇన్నాళ్లూ 'గ్రేట్' అన్న చాలా నోళ్లు నా గురించి మర్చిపోతారనే ఆలోచన నన్నెంతో గాబరాగా ఉంచుతోంది. అసలు నేనెలా వచ్చాను, ఎలా ఎదిగాను, ఇక్కడివారు నన్నెలా ప్రేమించారు.. ఇవన్నీ గుర్తుచేసుకుంటే.. కొంత ఆనందం, కొంత బాధ కలుగుతోంది.

లండన్‌లో తయారై..

నన్ను తీసుకొచ్చింది బ్రిటిష్ పాలకులు. శ్రీలంకకు సరకు రవాణా చేసేందుకు మండపం-రామేశ్వరం మధ్య సముద్రంపై నిర్మించాలని 1870లోనే ఆలోచించారు. నిర్మాణాలు మాత్రం 1911 ఆగస్టులో మొదలుపెట్టారు. నౌకలు వచ్చినప్పుడు తెరచుకునేందుకు వీలుగా ఉండే భాగాల్ని మాత్రం బ్రిటిష్ ఇంజినీర్లు లండన్‌లోనే తయారు చేయించారు. అక్కడి నుంచి వేలాది కి.మీ మేర నౌకల్లో తీసుకొచ్చారు. మూడేళ్లలోపే నిర్మాణం పూర్తిచేశారు. 1914 ఫిబ్రవరి 24న నన్ను ప్రారంభించారు. భారతదేశంలో తొలి సముద్ర సేతును నేనే. అప్పట్లో దేశంలోనే పొడవైన వంతెన మార్గం సైతం నాదే.

నౌకలతో అనుబంధం

చిన్న కిటుకు. రెండాకులు తెరచుకున్నట్లుగా నన్ను తెరిచి నౌకలు వెళ్లేలా ఇన్నాళ్లూ మీరూ చూశారు. ఈ రెండు భాగాల్లో ఒక్కో భాగం 415 టన్నులుంటుంది. రెండువైపులా తెరవడానికి కనీసం 24మంది అవసరమొచ్చేది. తెరచుకునేందుకు 45 నిమిషాలు పట్టేది. ఒక్కోవైపు భాగాన్ని 81 డిగ్రీల దాకా తెరిచేవారు. నౌకలు వెళ్లే ప్రతిసారీ ఇలాగే చేసేవారు. అలా నౌకలతో నాకెంతో అనుబంధం ఏర్పడింది.



పాత వంతెనను పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

గాయాలు.. గుర్తులు

బ్రిటిష్ పాలకులు నన్ను నిర్మించిన తర్వాత నా ఆనందం అంతా ఇంతా కాదు. అది 1964లో ఆవిరైంది. అప్పట్లో వచ్చిన పెద్ద తుపాను నన్ను దెబ్బతీసింది. అదే సమయంలో ధనుష్కోడి రైల్వేలైన్ కొట్టుకుపోవడం, రైల్లో ఉన్న సుమారు 200మంది ప్రయాణికులు అక్కడికక్కడే మృత్యువాతపడటం మిక్కిలి బాధగా అనిపించింది. అప్పటి వరకు బాగా పనిచేసిన నేను.. జబ్బున పడినట్లయింది. ఎన్నో మరమ్మతులు చేయాల్సి వచ్చింది. 2009లో ప్రముఖ ఇంజినీర్ శ్రీధరన్ నేతృత్వంలో అద్భుతంగా పనులు జరిగాయి. సరకు రవాణా రైళ్లు సైతం నా మీదుగా వెళ్లేలా సామర్థ్యాన్ని పెంచారు. 2013లో తిరిగి కొంత భాగం ప్రమాదానికి గురైంది. కోల్‌కతాకు చెందిన ఓ నౌక నన్ను ఢీకొనడంతో మళ్లీ మరమ్మతు చేయాల్సి వచ్చింది. బ్రిడ్జిపై ప్రధాన ద్వార భాగాల్ని మార్చేందుకు 2016లో అప్పటి రైల్వే మంత్రిత్వ శాఖ రూ.25కోట్లను మంజూరు చేసింది. 65.23 మీ పొడవున్న ద్వారాల స్థానంలో 66 మీటర్ల పొడవున్న కొత్త ద్వారాల్ని ఏర్పాటు చేసింది. అప్పట్లో 2018 డిసెంబరు నుంచి 2019 మార్చి వరకు రైళ్ల రాకపోకల్ని ఆపేశారు. బ్రిటిష్ పాలకులు మీటర్‌గేజ్ రైలు పట్టాల్ని వేయగా.. 2007 నుంచి బ్రాడ్‌గేజ్ పట్టాలొచ్చాయి.

మహా అంటే మూడు నెలలు

ఇప్పుడు నా పనైపోయిందని తెలుస్తూనే ఉంది. పట్టుకుంటే పొట్టులా రాలిపోతున్నాను. ఎవరైనా పట్టుకుంటే రాలిపోతానని, మరింత అంద విహీనంగా మారుతానేమోనని భయపడుతున్నాను. రైల్వే అధికారులూ ఇదే చెప్పారు. 'ఈ వంతెనను ఇక తొలగిద్దాం' అనేశారు. ఆ మాట విని ఏడుపు ఆపుకోలేకపోయా. మెల్లిగా తుది వీడ్కోలు సంకేతాలు ఇచ్చేశారు. 2022 డిసెంబర్ నుంచి రైళ్ల రాకపోకల్ని ఆపేశారు. అంతకు ముందు కొత్త వర్టికల్ వంతెన నిర్మాణం కోసం 2020లోనే కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసింది. ఏకంగా రూ.535 కోట్లతో అత్యాధునిక వంతెన కట్టేసింది. 2025 ఏప్రిల్ నుంచి రైళ్ల రాకపోకల్ని అనుమతించింది. ఇన్నాళ్లూ రైళ్లను మోసిన నేను, ఇప్పుడు రైళ్లను చూస్తున్నాను. అలసిపోయాను. కళ్లు మూతపడిపోతున్నాయి. మహా అంటే.. 3, 4 నెలల్లో నన్ను తీసి పడేస్తారు. దేనికైనా ముగింపు తప్పదు కదా.. నా సంగతీ అంతే.

పోటీ ప్రారంభిస్తున్న పళనిసామి

జల్లికట్టు పోటీల్లో మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల సాయం

☛ ఈపీఎస్ ప్రకటన

విల్లివాక్కం, న్యూస్‌టుడే: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే అధికారంలోకి వస్తే జల్లికట్టు పోటీలలో ఎద్దులు పొడిచి మృతి చెందిన క్రీడాకారుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థికసాయం అందజేస్తామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి హామీ ఇచ్చారు. నామక్కల్ సాలప్పాళయంలో మంగళవారం జరిగిన జల్లికట్టు పోటీని ఆయన ప్రారంభించారు. ఇందులో 600 ఎద్దులు, 400 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎడప్పాడి మాట్లాడుతూ.. జల్లికట్టు పూర్వీకులు పారంపర్య క్రీడ అని, యువకులు ఎద్దులను లొంగదీసి తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవడం సాహసమని ప్రశంసించారు. అన్నాడీఎంకే అధికారంలోకి వచ్చిన వెంటనే జల్లికట్టు పోటీల్లో ఎద్దులు ఢీకొని మృతి చెందిన క్రీడాకారుల కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థికసాయం అంజేయనున్నట్టు పేర్కొన్నారు. పోటీలో పాల్గొనడానికి పేర్లు నమోదు చేసుకున్న వారికి, ఎద్దులను లెక్కగట్టి ప్రభుత్వం తరఫున బీమా చేయనున్నట్టు తెలిపారు.

విద్యుదుత్పత్తికి అంతరాయం

పొన్నేరి, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ జిల్లా మీంజూరు సమీపం అత్తిపట్టులోని ఉత్తర చెన్నై థర్మల్ విద్యుత్తు కేంద్రంలోని 3 గ్రిడ్లలో 1830 మెగావాట్ల ఉత్పత్తి జరుగుతోంది. రెండో నెంబరు గ్రిడ్‌లో భారీ నీటి ఆవిరి పైపుల్లో మంగళవారం పగుళ్లు ఏర్పడటంతో 600 మెగావాట్ల ఉత్పాదనకు అంతరాయం కలిగినట్లు అధికారులు తెలిపారు.

కమనీయం.. కుండలపై భరతనాట్యం

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: కోయంబత్తూరు కళాక్షేత్రకు చెందిన 51మంది విద్యార్థినులు కుండలపై నిలబడి భరతనాట్యం చేసి ప్రపంచ రికార్డు సృష్టించారు. సాంప్రదాయ భరతనాట్య కళ గురించి అవగాహన కల్పించే విధంగా గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కోయంబత్తూరు జిల్లా పొళ్లాచ్చి సమీపం ఆనైమలై వద్ద ఉన్న శ్రీ సత్యేంద్ర సిద్ధర్ పీఠంలో కార్యక్రమం జరిగింది. 51 మంది పాఠశాల, కళాశాల విద్యార్థినులు పాల్గొని 30 నిమిషాలపాటు భక్తి, దేవారం, సెమ్మొళి పాటలకు కుండలపై నిలబడి భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. ఇది గ్లోబల్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందింది.

కుండలపై నాట్యం చేస్తున్న విద్యార్థినులు

గ్రామీణ అధ్యాపకులకు ఉచిత ఏఐ శిక్షణ

వడపళని, న్యూస్‌టుడే: కేంద్ర విద్యాశాఖలోని 'స్వయం ప్లస్'తో కలిసి ఐఐటీఎం ప్రవర్తక్ టెక్నాలజీస్ దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అధ్యాపకులకు కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్-ఏఐ)లో ఉచిత శిక్షణ అందించనుంది. 1 నుంచి 12వ తరగతి వరకు 'ఏఐ ఫర్ ఎడ్యుకేటర్స్ కే 12 టీచర్స్' సర్టిఫికేషన్ కోర్సు ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ప్రారంభమవుతుంది. జనవరి 31వ తేదీ లోగా https:///iitmpravartak.org.in/AI_Educators_K12_teachers లింకు ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని ఐఐటీ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. కోర్సు గురించి ఐఐటీఎం ప్రవర్తక్ టెక్నాలజీస్ ఫౌండేషన్ చీఫ్ నాలెడ్జ్ ఆఫీసర్ బాలమురళి అంకర్ మాట్లాడుతూ.. ఏఐ విద్య భవిష్యత్తును వేగంగా మారుస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఉపాధ్యాయులకు ఇంగ్లిషులో 40 గంటలపాటు వర్చువల్, ప్రొక్టోర్డ్ విధానంలో ఉంటుందని, గ్రామీణ ప్రాంతాల నుంచి ముందుగా వచ్చి శిక్షణ తీసుకునే 500 మందికి సర్టిఫికేషన్ రుసుములో రాయితీ ఉంటుందని పేర్కొంది.

ఆధ్యాత్మికవేత్త, సామాజికవేత్త, రాజకీయవేత్త దివంగత స్వామి సహజానంద జయంతి సందర్భంగా గిండిలోని లోక్‌భవన్‌లో మంగళవారం ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న గవర్నర్ ఆర్.ఎన్.రవి - న్యూస్‌టుడే, చెన్నై

పురుషులకు సాటిగా మహిళలు బయటకు రావాలి

☛ ఉన్నత పదవులను అధిరోహించాలి ☛ ముఖ్యమంత్రి పిలుపు

చెన్నై, న్యూస్‌టుడే: పురుషులకు సాటిగా మహిళలు ఇళ్ల నుంచి బయటకు రావాలని, ఉన్నత పదవులను అధిరోహించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ పిలుపునిచ్చారు. చెన్నై నందంబాక్కంలోని ట్రేడ్ సెంటర్‌లో మంగళవారం జరిగిన 'ప్రపంచ మహిళా శిఖరాగ్ర సదస్సు-2026'ను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళల ఉపాధి అవకాశాలు, భద్రత పథకమైన 'టీఎన్-వీ-సేఫ్' పథకాన్నీ ప్రారంభించారు. మహిళలు 'విడియల్ పయనం' కింద ఉచిత బస్సు ప్రయాణాలు చేపట్టడానికి అనువుగా 10 పింక్ బస్సులు, మహిళల భద్రత కోసం మహిళా పోలీసులకు వాహనాలు, మహిళలకు పింక్ ఆటోలు అందజేసి సేవలను ప్రారంభించారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగంలో మహిళలకు భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి సహకారాన్ని బలోపేతం చేసేలా యూఎన్‌డీపీ, ఐపీఈ గ్లోబల్, పలు పరిశ్రమ సంస్థలతో అవగాహన ఒప్పందాలపై ముఖ్యమంత్రి సమక్షంలో సంతకాలు జరిగాయి. 'నాన్ ముదల్వన్' పథకం కింద నైపుణ్య శిక్షణ పొందిన విద్యార్థినులకు ఉద్యోగ నియామక ఉత్తర్వులను, అంబేడ్కర్ పారిశ్రమిక ఔత్సాహికుల పథకం, సీఎం అరైజ్ పథకం, కలైజ్ఞర్ హస్తకళా పథకం వంటి పలు పథకాల కింద పరిశ్రమలు నెలకొల్పేందుకు మహిళలకు రుణాలను అందజేశారు.

వాహనాలను ప్రారంభిస్తున్న స్టాలిన్

ఉద్యోగినులు రాష్ట్రంలోనే అధికం

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... దేశంలోనే ఎక్కువ సంఖ్యలో మహిళలు ఉద్యోగాలకు వెళ్లే రాష్ట్రంగా తమిళనాడు ఉందన్నారు. పలు ప్రైవేటు సంస్థలు ఉద్యోగావకాశాల్లో నిర్ణీత శాతాన్ని మహిళా కార్మికులకు కేటాయించడాన్ని ప్రారంభించాయని తెలిపారు. రూ.1,185 కోట్ల ప్రపంచ బ్యాంకు ఆర్థిక సాయంతో తమిళనాడు మహిళా ఉపాధి అవకాశాలు, భద్రత పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. మహిళల అభ్యున్నతి కోసం డీఎంకే హయాంలలో పలు పథకాలను ప్రవేశపెట్టినట్లు, అదే బాటలో ప్రస్తుతం తన నేతృత్వంలోని ప్రభుత్వమూ నడుస్తున్నట్లు వెల్లడించారు. ఉద్యోగాలకు వెళ్లే మహిళలకు వారి పిల్లలను, ఇంట్లోని వృద్ధులను పర్యవేక్షించడమే ప్రధాన సమస్యగా ఉంటుందని, దానిని నివృత్తి చేసేలా సురక్షితమైన కేంద్రాలను ఈ పథకం అందించడం ప్రశంసనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, మంత్రులు అన్బరసన్, గీతా జీవన్, మా.సుబ్రమణియన్, ఎంపీలు తమిళచ్చి తంగపాండియన్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి మురుగానందం తదితరులు పాల్గొన్నారు.

రుణాల చెక్కులను అందజేస్తున్న దృశ్యం

కూటమి పాలనపై ఎన్నికల తర్వాత నిర్ణయం

☛ అన్బుమణి



ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో అన్నాడీఎంకే-భాజపా కూటమిలో పీఎంకే అన్బుమణి వర్గం స్థానం పొందింది. ఈ కూటమిలో పీఎంకేకు సీట్లు ఇంకా ఖరారు కాలేదు. కానీ పోటీ చేయడానికి వెయ్యి మందికిపైగా దరఖాస్తులు సమర్పించారు. వారికి మంగళవారం పనైయూర్‌లోని పార్టీ కార్యాలయంలో అన్బుమణి ముఖాముఖి నిర్వహించారు. అనంతరం అన్బుమణి విలేకరులతో మాట్లాడుతూ... ఎన్డీయేలోకి ఓపీఎస్‌ని తీసుకొచ్చేందుకు చర్చలు జరుపుతున్నామని చెప్పారు. ఇంకా మరికొన్ని పార్టీలు రానున్నాయని తెలిపారు. ప్రతిపక్షాలు గత ఎన్నికల్లో విడిపోవడంతోనే డీఎంకే గెలిచిందన్నారు. వేరుపడిన పార్టీలన్నీ కలిసిపోవడంతో ప్రస్తుతం డీఎంకే భయాందోళన చెందుతోందని విమర్శించారు. కూటమి పాలన గురించి ఎన్నికల తర్వాత నిర్ణయిస్తామన్నారు.

కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే సుందరం కన్నుమూత

సుందరం (పాతచిత్రం)

ప్యారిస్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే సుందరం(72) అనారోగ్యంతో కన్నుమూశారు. శివగంగై జిల్లా కారైక్కుడి సమీపం కోట్టైయూర్‌కి చెందిన ఆయన కాంగ్రెస్ పార్టీ తరఫున కారైక్కుడి శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి 1996-2001, 2006-2011 కాలాల్లో ఎమ్మెల్యేగా గెలిచారు. ఈ నేపథ్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను కుటుంబీకులు సోమవారం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ కారులోంచి దిగుతుండగా కిందపడ్డారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వెళ్లిన నేపథ్యంలో హఠాన్మరణం చెందారు.

సెంగోట్టైయన్‌ను ఎలా చేర్చుకున్నారు?

☛ టీటీవీ దినకరన్

ప్యారిస్, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే అవినీతి పార్టీ అయితే సెంగోట్టైయన్‌ను టీవీకేలో ఎలా చేర్చుకున్నారని టీవీకే అధ్యక్షుడు విజయ్‌ను ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ ప్రశ్నించారు. మదురైలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... తాను, సెంగోట్టైయన్ 1986 నుంచి స్నేహితులమని, ఆయన టీవీకేలోకి వెళ్లే విషయం కూడా తనకు చెప్పారన్నారు. తానూ రావాలని ఇష్టపడ్డారని చెప్పారు. ఎన్డీయేలో చేరే ముందు, తర్వాత సెంగోట్టైయన్‌తో మాట్లాడినట్లు తెలిపారు. రాజకీయం అంటేనే కుట్రలతో నిండి ఉంటుందని, వాటిన్నింటినీ దాటుకుని ఆరోగ్యకరమైన స్నేహం ఉండాలన్నారు. టీవీకే వైఖరి అర్థం కాలేదన్నారు. రానున్న ఎన్నికల్లో ఎన్డీయే, డీఎంకే మధ్యే పోటీ ఉంటుందని తెలిపారు.

ప్రధానిని కించపరిచిన డీఎంకే: నయినార్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాజకీయాల్లో అనాగరిక జ్ఞానం త్వరలో కనుమరుగవుతుందని ప్రధాని మోదీపై డీఎంకే కార్యవర్గ సభ్యుడు చేసిన అవమానకర వ్యాఖ్యలను భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఖండించారు. ఆ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... ఈరోడ్ జిల్లాలో జరిగిన పార్టీ కార్యక్రమంలో ప్రధాని మోదీ గురించి డీఎంకే రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి కాశీముత్తు మాణిక్యం అభ్యంతకర, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాజకీయ అనాగరిక జ్ఞానం త్వరలో నాశనం అవుతుందని దేశంలో అత్యున్నత పదవిలో ఉన్న నాయకుడి గురించి బహిరంగ సభలో కించపరిచేవిధంగా మాట్లాడడం, దానికి చుట్టూ ఉన్నవారు చప్పట్లు కొట్టి నవ్వడం డీఎంకే క్రూరమైన స్వభావాన్ని వెల్లడిస్తుందన్నారు. ప్రధాని గురించి అనుచితంగా మాట్లాడటం నుంచి ప్రధానికి హత్యా బెదిరింపులు చేయడం వరకు హద్దులు దాటి ప్రవర్తిస్తున్న డీఎంకే నీచమైన స్వభావాన్ని ఇకపై సహించలేమని చెప్పారు. కాశీముత్తు మాణిక్యం వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు.

రిజిస్ట్రేషన్లశాఖలో కీలక మార్పులు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్లశాఖలో కీలక మార్పులు చేసింది. గతేడాది ఏప్రిల్‌లో ప్రవేశపెట్టిన డీడ్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇకపై దస్తావేజుల రిజిస్ట్రేషన్ సమయంలో అసలు డాక్యుమెంట్లు తప్పనిసరి. పూర్వీకుల ఆస్తుల విషయంలో ఒరిజినల్ పత్రాలు లేకుంటే రెవెన్యూ శాఖ పట్టాను సమర్పించాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఆస్తిని తనఖా పెడితే తన ఖాదారు నుంచి నిరభ్యంతర ధ్రువపత్రం పొందాలి. ఒకవేళ అసలు దస్తావేజులు లేకుంటే పోలీసులకు ఫిర్యాదు చేసి సర్టిఫికెట్ సమర్పించాలి. పత్రాలు కనిపించకుంటే దాని వివరాలను స్థానిక వార్తా పత్రికల్లో ప్రకటించి కాపీని సమర్పించాలి. దీంతోపాటు భూమి రిజిస్ట్రేషన్ విభాగంలో తీసుకొచ్చిన కీలక మార్పుల గురించి తెలుసుకోవడానికి కాగిత రహిత ఆన్‌లైన్ డాక్యుమెంట్ సమర్పణ వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఇందుకోసం ఆస్తిని బదిలీ చేసే వ్యక్తి, స్వీకరించే వ్యక్తి గుర్తింపును ఎస్ఎంఎస్ లేదా ఆధార్ ద్వారా స్వీకరించిన వేలిముద్రల ద్వారా ధ్రువీకరిస్తారు.

పళనిసామి పకడ్బందీ ప్రణాళిక

☛ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహం ☛ రాష్ట్ర వ్యాప్తంగా క్షేత్రస్థాయి సర్వే

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా కొన్ని నెలల సమయమే ఉంది. అన్ని పార్టీలు పొత్తులు ఖరారు చేసే పనుల్లో ఉన్నాయి. అధికార పార్టీ డీఎంకే.. కాంగ్రెస్, వీసీకే, డీఎండీకే, కమ్యూనిస్టు పార్టీలతో దుర్భేద్యంగా ఉంది. అయితే ఈసారి ఎలాగైనా డీఎంకేను నిలువరించి అధికారం కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే ఉంది. ఆ ఉద్దేశంతోనే భాజపాతో జతకట్టింది. ఎడప్పాడి పళనిసామి నేతృత్వంలోని ఎన్డీయేలో పీఎంకే, ఏఎంఎంకే, టీఎంసీ తదితర పార్టీలున్నాయి. ఇంకా కొన్ని పార్టీలు చేరే అవకాశం ఉంది. ఇప్పటికే అన్నాడీఎంకే తరఫున పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్న ఆశావహులకు ముఖాముఖి కూడా జరుగుతోంది. ఇదిలా ఉండగా ఈసారి ఎలాగైనా విజయం సాధించి తీరాలనే లక్ష్యంతో ఈపీఎస్ వ్యూహాలు రచిస్తున్నారు.

- న్యూస్‌టుడే, సైదాపేట

ప్రైవేటు సంస్థల సాయం

పార్టీ నిర్వాహకుల సమాచారాన్ని నమ్మకుండా దిల్లీ కేంద్రంగా ఉండే ముఖ్య రాజకీయ వర్గాలు, ప్రముఖ ప్రైవేటు అధ్యయన సంస్థల సాయంతో రాష్ట్ర వ్యాప్తంగా క్షేత్రస్థాయి సర్వే ప్రారంభించినట్లు సమాచారం. అన్నాడీఎంకే బలం పార్టీ కార్యకర్తలే అయినా అంతర్గత విభేదాలు, పక్షపాత సమాచారాన్ని తప్పించుకునేందుకు ఈపీఎస్ ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో మూడు ముఖ్య అంశాలను ప్రధానంగా చేసుకుని సర్వే జరుగుతున్నట్లు సమాచారం.

డిజిటల్ వార్ రూమ్

జాతీయ స్థాయిలో ఎన్నికల నిర్వహణలో అనుభవం కలిగిన దిల్లీ సంస్థలతో అన్నాడీఎంకే ఓ అత్యాధునిక డిజిటల్ వార్ రూమ్ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇందులో ప్రతి బూత్‌లో ఉండే అనుకూల, ప్రతికూల అంశాలను అధ్యయనం చేసి దానికి తగ్గట్లు మైక్రో టార్గెట్ పద్ధతిలో ప్రచార వ్యూహాలు అమలు చేసుందుకు ఈపీఎస్ నిర్ణయించారు. ఈ పద్ధతిలో వారసత్వ లేక వ్యక్తిగత పలుకుబడి కంటే డేటా ప్రకారం సీటు ఇవ్వాలని ఈపీఎస్ భావిస్తున్నారు. తద్వారా పలు నియోజకవర్గాల్లో కొత్త వారికి చోటు దక్కే అవకాశం ఉందని అంచనా. డీఎంకే బలం, విజయ్ రాక తదితర పరిస్థితుల మధ్య కచ్చితమైన డేటా లేకుండా ఎన్నికలు ఎదుర్కోవడం ప్రమాదమని ఈపీఎస్ భావిస్తున్నారు. కావున ఈ సర్వే ఫలితాలు విడుదలైన తర్వాత అన్నాడీఎంకేలో రెండో విడత నాయకులు, అభ్యర్థుల జాబితా, ప్రచార వ్యూహాల్లో భారీ మార్పులు చోటుచేసుకుంటాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈపీఎస్ నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి, డిజిటల్ వార్ రూమ్ సర్వేలు ఎంతమేర పనిచేస్తాయో వేచి చూడాలి.

మూడు ప్రధాన అంశాలు

ప్రజల మానసిక స్థితి, డీఎంకే ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయం, ముఖ్యంగా మహిళా హక్కుల మొత్తం తదితర ప్రకటనల గురించి ప్రజల నిజమైన అభిప్రాయం, ఏయే ప్రాంతాల్లో అధికార పార్టీపై ఎక్కువ అసంతృప్తి ఉంది అనేది మొదటిది. రెండోది అభ్యర్థుల ఎంపిక. ప్రతి నియోజకవర్గంలో ప్రజల దగ్గర పలుకుబడి, మంచి పేరుతో పాటు విజయావకాశాలు ఉండే అభ్యర్థులు ఎవరు, ప్రస్తుత మాజీ మంత్రులు, ఎమ్మెల్యేల రేటింగ్ ఏమిటి అనేది తెలుసుకోవడం. మూడోది కూటమి బలం, భాజపా తదితర పార్టీలతో కూటమి ఏర్పాటు చేయటం వల్ల ఓట్ల శాతంలో ఎలాంటి మార్పు ఉంటుంది, అలాగే నటుడు విజయ్ ఏయే జిల్లాల్లో అన్నాడీఎంకే ఓట్లను కొల్లగొట్టే అవకాశం ఉంది తదితర విషయాలపై ప్రధానంగా సర్వే నిర్వహిస్తున్నట్లు సమాచారం.

ఫిబ్రవరి 1 నుంచి తమిళ్‌నాడు తలైకునియాదు ప్రచార పర్యటన

చెన్నై, న్యూస్‌టుడే: డీఎంకే తరఫున ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 'తమిళ్‌నాడు తలైకునియాదు' పేరిట రాష్ట్రంలోని అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో ప్రచారాన్ని చేపట్టనుంది. పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ విడుదల చేసిన ప్రకటనలో... ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన జనవరి 20న జరిగిన జిల్లా కార్యదర్శుల సమావేశంలో నెరవేర్చిన తీర్మానం మేరకు 'తమిళ్‌నాడు తలైకునియాదు' పేరిట ప్రచారం ఫిబ్రవరిలో ప్రారంభం కానుందని తెలిపారు. ఇందుకోసం స్టాలిన్ ఎంపిక చేసిన 20 మంది స్టార్ ప్రచారకర్తలు ఫిబ్రవరి నెలంతటా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ముమ్మరంగా ప్రచార పర్యటన చేపట్టనున్నారని పేర్కొన్నారు. స్టార్ ప్రచారకర్తలు, వారు పర్యటించనున్న నియోజకవర్గాల వివరాలను వెల్లడించారు.

(c) eenadu

మారిషస్ మురుగన్ ఆలయంలో తైపూసం ఉత్సవాలు

రాష్ట్రం నుంచి బయల్దేరిన గాయకుల బృందం

విమానాశ్రయంలో తమిళనాడు బృందం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: మారిషస్‌లోని మురుగన్ ఆలయంలో నిర్వహించనున్న తైపూసం ఉత్సవాల్లో భక్తి గీతాలను ఆలపించడానికి ఆ దేశ ప్రభుత్వం అభ్యర్థన మేరకు రాష్ట్ర ప్రభుత్వం తమిళనాడు నుంచి 7మంది సభ్యులతో కూడిన బృందాన్ని మంగళవారం అక్కడకు పంపింది. మారిషస్ ఆఫ్రికా ఖండంలో ఓ చిన్న ద్వీపం. భారత సంతతి ప్రజలు ఇక్కడ ఎక్కువగా నివసిస్తుండగా అందులో అధిక సంఖ్యలో తమిళులు ఉన్నారు. ఇదిలా ఉండగా అక్కడ నిర్మించిన మురుగన్ ఆలయంలో ఏటా తైపూసం ఉత్సవాలు 10 రోజులపాటు ఘనంగా నిర్వహిస్తారు. ఆ మేరకు ఫిబ్రవరి 1న తేదీ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో పాల్గొని మురుగన్ భక్తి పాటలను ఆలపించడానికి గాయకులు, ఆర్కెస్ట్రాను మారిషస్ పంపాలని అక్కడి ప్రభుత్వం తమిళనాడు ప్రభుత్వాన్ని కోరింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర కళలు, సాంస్కృతిక శాఖ తరఫున ఏడుగురితో కూడిన బృందాన్ని పంపింది.

కల్తీ పసుపు గురించి ఫిర్యాదు చేయండి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ఇళ్లలో ఉపయోగించే పసుపు కల్తీగా అనిపిస్తే ఫిర్యాదు చేయవచ్చని ఆహార భద్రతాశాఖ సూచించింది. ఇటీవల కల్తీ పసుపు మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నట్టు వార్తలు వచ్చాయి. ముఖ్యంగా రంగు కోసం కృత్రిమ వర్ణద్రవ్యం, హానికరమైన రంగులు, అచ్చమైన పసుపుతో మిథనాల్, లెడ్ క్రోమైట్, సున్నపు పొడి, అడవి పసుపు కలుపుతున్నారని సమాచారం. దీని వలన కడుపునొప్పి, వికారం, జీర్ణ సమస్యలు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పసుపు నాణ్యత నిర్ధారణ గురించి ఆహార భద్రతా అధికారులు మాట్లాడుతూ.. మార్కెట్లో అమ్మే పసుపు పూర్తిగా కల్తీ కాదని, కొన్నిచోట్ల ఇలా ఉండవచ్చని తెలిపారు. ఇంట్లో ఉపయోగించే పసుపు నాణ్యతను గుర్తించడానికి ఓ గ్లాసు నీటిలో చిటికెడు కలిపి పరీక్షించవచ్చన్నారు. కాసేపటికి గ్లాసు కింది భాగానికి వెళ్లిపోతే అందులో కల్తీ లేదని, అలా కాకుండా నీటిపై తేలుతూ ఉంటే అందులో కల్తీ జరిగినట్టు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. పసుపు పొడి నాణ్యతపై అనుమానం ఉంటే ఆహార భద్రతాశాఖకు 94440 42322 అనే ఫోన్ నంబరుకు తెలియజేయవచ్చని చెప్పారు. లేకుంటే తమ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, దాని ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పీయూలో అంతర్జాతీయ సింపోజియం

అతిథులతో నిర్వాహకులు, విద్యార్థులు

అన్నానగర్, న్యూస్‌టుడే: పాండిచ్చేరి యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లా' లో ఇండో-ఫ్రెంచ్ సినర్జీస్‌పై అంతర్జాతీయ సింపోజియాన్ని నిర్వహించారు. స్కూల్ ఆఫ్ లా డీన్ ప్రొఫెసర్ కలైసెల్వం అతిథులకు స్వాగతం పలికారు. ఇంటర్నేషనల్ రిలేషన్స్ విభాగ డీన్, ప్రొఫెసర్ ఎస్.విక్టర్ ఆనంద్ కుమార్ అధ్యక్షత వహించి ప్రత్యేక ప్రసంగం చేశారు. ఇండో-ఫ్రాన్స్ దేశాల మధ్య చారిత్రక సంబంధాలను వివరించారు. కార్యక్రమంలో ఫ్రాన్స్‌కు చెందిన 'యూపీఈసీ' న్యాయశాస్త్ర విభాగం డీన్ ప్రొఫెసర్ లారెంట్ గామెట్, ఫ్రెంచ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాండిచ్చేరి డైరెక్టర్ ప్రొఫెసర్ రెనాడ్ కొల్సన్ తదితర ప్రముఖులు పాల్గొని ప్రసంగించారు.

మెట్రో మార్గంలో భద్రతా తనిఖీలు

పూందమల్లి, వడపళని మధ్య ఫిబ్రవరి 11 నుంచి 13 వరకు

- న్యూస్‌టుడే, వడపళని

చెన్నై మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశ నాలుగో మార్గంలోని పూందమల్లి నుంచి వడపళని వరకు ఫిబ్రవరి 11 నుంచి 13వ తేదీ వరకు కమిషనర్ ఆఫ్ మెట్రో రైల్ సేఫ్టీ(సీఎంఆర్ఎస్) తుది భద్రతా తనిఖీలు నిర్వహించనుంది. తనిఖీ అనంతరం రెండు రోజుల్లో అనుమతి అందగానే ప్రజా సేవలకు మార్గం సుగమం కానుంది. మూడో మార్గం మాదవరం నుంచి సిప్కాట్, నాలుగో మార్గంలో పూందమల్లి నుంచి లైట్‌హౌస్, ఐదో మార్గంలో మాదవరం నుంచి షోళింగనల్లూర్ వరకు జరుగుతున్న పనుల్లో నాలుగో మార్గంలోని కొంత భాగం నెల రోజుల్లో ప్రారంభం కానుంది.

పూందమల్లి - పోరూర్ మార్గం

పరిశీలన తర్వాతే అనుమతి

మెట్రో రైలు ప్రయాణికులకు తుది తనిఖీ చాలా కీలకమైందని సీఎంఆర్ఎల్ అధికారులు పేర్కొన్నారు. సీఎంఆర్ఎస్ బృందం స్టేషన్లలో అందుబాటులో ఉన్న భద్రతా సౌకర్యాలను పరిశీలిస్తుందని, తర్వాతనే అనుమతి రానుందని తెలిపారు. తనిఖీ ఆధారంగానే నడపవలసిన రైళ్ల సంఖ్య, వ్యవధిపై (ఫ్రీక్వెన్సీ) తుది నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. పూందమల్లి నుంచి పోరూర్ వరకు ఆరు నిమిషాల వ్యవధితో 9 నుంచి 10 రైళ్లు నడపాలనేది సీఎంఆర్ఎల్ ఆలోచనగా ఉందని, పోరూర్ నుంచి వడపళని వరకు వ్యవధి తక్కువగా ఉంటుందని, సీఎంఆర్ఎస్ ఇచ్చే సిఫారసు, ఆమోదానికి తగినట్టు నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

రెండు రోజుల్లో దరఖాస్తు

లిఫ్టులు, ఎస్కలేటర్లు మధ్యలో ఆగితే అత్యవసర తరలింపులు, మంటలు చెలరేగినప్పుడు, టికెటింగ్ గేట్లు ఆటోమేటిక్‌గా పని చేస్తున్నాయా? లేదా?, స్టేషన్లలో అగ్నిమాపక పరికరాలు, ప్లాట్‌ఫాం స్క్రీన్ తలుపులు, ప్రయాణికులకు సమాచార వ్యవస్థ పనితీరును సీఎంఆర్ఎస్ బృందం ఆ మూడు రోజుల్లో తనిఖీ చేయనుంది. పూందమల్లి నుంచి పోరూర్ వరకున్న రైలు మార్గానికి దరఖాస్తుతో పాటు మొదటి బ్యాచ్ పత్రాలను సీఎంఆర్ఎస్‌కు సమర్పించామని, పోరూర్ నుంచి వడపళని వరకున్న మార్గానికి రెండో విడత దరఖాస్తును రెండు రోజుల్లో అందజేస్తామని సీఎంఆర్ఎల్ అధికారులు పేర్కొంటున్నారు. అన్ని రకాల తనిఖీలు పూర్తయిన తర్వాత తుది భద్రతా ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేస్తారని, అందగానే సేవలు ప్రారంభిస్తామని తెలిపారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వడపళని, న్యూస్‌టుడే: విద్యుత్తుశాఖ చేపడుతున్న మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సెంబియం, ఆయపాక్కం ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలగనుంది. ఈ మేరకు విద్యుత్తు శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది.

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ జిల్లా కుంజలం సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీతంజేరి, అమ్మంబాక్కం, కుంజలం, నెల్వాయ్, ప్లేసపాళ్యం, అల్లికుళి, ఎస్ఆర్ కుప్పం, వి.కోట, ఒదప్పై, కమ్మవారుపాళ్యం, కచ్చూరు తదితర ప్రాంతాల్లో విద్యుత్తు ఉండదు.

స్టాలిన్ ఉండగా రాష్ట్రంలో భాజపాకు స్థానం లేదు

కరుణాస్

ప్యారిస్, న్యూస్‌టుడే: స్టాలిన్ జీవించి ఉండగా తమిళనాడులో భాజపాకు స్థానం లేదని ముక్కులత్తోర్ పులిప్పడై అధ్యక్షుడు, నటుడు కరుణాస్ తెలిపారు. విరుదునగర్ జిల్లా సాత్తూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తమిళనాడులో భాజపా కాలు పెట్టకూడదనే గత లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకేతో కూటమి ఏర్పాటు చేసుకున్నట్లు పేర్కొన్నారు. పార్టీ పెట్టిన కొద్ది రోజులకే ముఖ్యమంత్రి కావాలని విజయ్ దురాశ పడుతున్నారని, ఆయన కొన్న విదేశీ కారుకే ఆదాయపన్ను చెల్లించలేదని, దీనిని రాష్ట్ర ప్రజలు మరచిపోలేదన్నారు. ఈపీఎస్‌పై ఎన్నో ఆరోపణలు చేసిన టీటీవీ దినకరన్ నేడు ఆయన కూటమిలోనే చేరడం హాస్యాస్పదమన్నారు.

ప్రభుత్వాస్పత్రి భవనం ప్రారంభం

వైద్య పరికరాలను పరిశీలిస్తున్న మంత్రులు ఈవీ వేలు, సుబ్రమణియన్

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు జిల్లా గుడియాత్తంలో రూ.44.84 కోట్ల వ్యయంతో నూతన ప్రభుత్వాసుపత్రి భవనం నిర్మించారు. దీనిని సోమవారం రాత్రి మంత్రులు ఈవీ వేలు, మా.సుబ్రమణియన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్రమణియన్ మాట్లాడుతూ... ఆస్పత్రిలో 2021లో పడకల సంఖ్య 190కి పెంచామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో దీనిని జిల్లా ప్రధాన ఆస్పత్రిగా స్థాయి పెంచామని, ఆ మేరకు అదనపు భవనాలను నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సెంథిల్ కుమార్, జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి, ఎంపీ కదిర్ ఆనంద్, ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, అములు విజయన్, మేయర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

డీఎంకేతో కలిసి పనిచేయడం నేటి అవసరం

తిరుమావళవన్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: ప్రస్తుత పరిస్థితుల్లో డీఎంకేతో కలిసి పనిచేయడం అవసరమని వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ పేర్కొన్నారు. టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి సతీమణి వత్సల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కడలూర్ జిల్లా చిదంబరం సమీపం కీరప్పాళ్యంలోని అళగిరి నివాసంలో ఆమె చిత్రపట ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఇందులో పాల్గొన్న తిరుమావళవన్ చిత్రపటాన్ని ఆవిష్కరించి విలేకరులతో మాట్లాడుతూ.. తమది బలమైన కూటమి అని, విచ్ఛిన్నం చేయడానికి కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. నేడు తమిళనాడును ముంచెత్తుతున్న ప్రమాదాన్ని అడ్డుకోవడంలో కాంగ్రెస్ కీలకపాత్ర పోషించాల్సి ఉందన్నారు. ప్రస్తుత తరుణంలో రాష్ట్రంలో డీఎంకే నేతృత్వంలోని కూటమి పటిష్ఠంగా ఉందని, ఆ కూటమితో వీసీకే కలిసి పనిచేయడం నేటి అవసరమని తెలిపారు.

తిరుప్పరంకుండ్రం వ్యవహారం

దీపం వెలిగించేందుకు నిబంధనలు రద్దు చేయాలి

ప్యారిస్, న్యూస్‌టుడే: మదురై తిరుప్పరంకుండ్రం కొండపై దీపం వెలిగించేందుకు విధించిన నిబంధనలకు నిషేధం విధించాలని కోరుతూ సుప్రీంకోర్టులో రామ.రవికుమార్ తరఫున అప్పీల్ దాఖలైంది. కొండపై ఉన్న స్తంభంపై దీపం వెలిగించాలని న్యాయమూర్తి జస్టిస్ జీఆర్ స్వామినాథన్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనంలో 26 అప్పీళ్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ జరిపిన న్యాయమూర్తులు జస్టిస్ జయచంద్రన్, జస్టిస్ రామకృష్ణన్ ధర్మాసనం.. స్తంభంపై ఆలయం తరఫున దీపం వెలిగించాలని, కొండపై ఉన్న స్మారక చిహ్నాలను పరిరక్షించేలా కేంద్ర పురావస్తుశాఖ నిబంధనలు తీసుకురావాలని, కార్తిక దీపోత్సవాల సమయంలో ఆలయం తరఫున దీపం వెలిగించాలని, ఆలయ అధికారులతో వెళ్లేందుకు భక్తులకు అనుమతి ఇవ్వకూడదని మొదలైన నిబంధనలు విధించారు. ఈ నేపథ్యంలో ఈ నిబంధనలకు నిషేధం విధించాలని కోరుతూ సుప్రీంకోర్టులో రామ.రవికుమార్ తరఫున అప్పీల్ దాఖలైంది. అందులో.. ద్విసభ్య ధర్మాసనం విధించిన నిబంధనలు రాజ్యాంగం ఇచ్చిన హక్కులకు విరుద్ధంగా ఉన్నాయని, కావున హైకోర్టు న్యాయమూర్తులు జారీ చేసిన ఉత్తర్వులకు నిషేధం విధించాలని తెలిపారు.

పర్యావరణ పరిరక్షకులకు పురస్కారాలు

గవర్నర్ ఆర్‌ఎన్ రవితో పురస్కార గ్రహీతలు

చెన్నై, న్యూస్‌టుడే: గణతంత్ర వేడుకల సందర్భంగా లోక్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురికి పురస్కారాలు, విద్యార్థులకు బహుమతులను గవర్నర్ ప్రదానం చేశారు. గిండిలోని లోక్‌భవన్‌లో సోమవారం సాయంత్రం జరిగిన 'ఎట్ హోమ్' కార్యక్రమంలో సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణకు ఉత్తమ భాగస్వామ్యం అందించిన ఐదుగురికి గవర్నర్ పురస్కారాలు ప్రదానం చేసి అభినందించారు. రాజ్యాంగం, భారతీయ భాషల దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఆంగ్లం, తమిళ భాషల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

డి.జ్ఞానసుందరం మృతికి సంతాపం

చెన్నై: తమిళ సాహితీవేత్త డి.జ్ఞానసుందరం మృతికి గవర్నర్ ఆర్.ఎన్.రవి సంతాపం ప్రకటించారు. ఆయన తన 'ఎక్స్'లో... జ్ఞానసుందరం మృతి ఆవేదన కలిగించిందని, విశిష్ట తమిళ, వైష్ణవ సంప్రదాయాల కోసం ఆయన తన జీవితకాలం అంకితం చేసిన ఉత్తమ మేధావి అన్నారు. బృహత్ కావ్యాలైన రామాయణం, కంబ రామాయణం, దివ్య ప్రబంధాలకు తన జీవితకాలమంతా అందించిన కృషి తమిళ సంప్రదాయానికి వన్నె తెచ్చాయని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు సానుభూతి ప్రకటించారు.

ప్లాస్టిక్ సంచుల్లోని వేడి ఆహార పదార్థాలతో గర్భస్థ శిశువుకి హాని కలుగుతుందా?

ప్యారిస్, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ సంచుల్లో వేడిగా ఉన్న టీ, కాఫీ, సాంబార్ మొదలైన వాటిని ఉంచి తాగడం, తినడం వలన గర్భంలో ఉన్న శిశువుకి హాని కలుగుతుందా? లేదా? అనే విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్రంగా పరిశీలించి నివేదిక దాఖలు చేయాలని మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. మద్రాసు హైకోర్టులో అడవులు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కేసులు విచారించే న్యాయమూర్తులు జస్టిస్ సతీష్‌కుమార్, జస్టిస్ భరతచక్రవర్తిలతో కూడిన ప్రత్యేక ధర్మాసనంలో ప్లాస్టిక్ సంచుల్లో వేడి వేడి టీ, కాఫీ, సాంబర్, మొదలైన ఆహార పదార్థాలు ఉంచి శరీరంలోకి తీసుకోవడం వలన ప్లాస్టిక్‌లోని బిస్ఫినాల్-ఎ అనే మైక్రో ప్లాస్టిక్ కణాలు గర్భంలో ఉన్న శిశువుకు హాని కలిగిస్తాయని ఓ ప్రైవేటు వర్సిటీ చేపట్టిన అధ్యయన నివేదికను సమర్పించారు. ఈ నేపథ్యంలో ఈ కేసు సోమవారం మళ్లీ విచారణకు వచ్చింది. అప్పుడు ప్రభుత్వం తరఫున.. మైక్రో ప్లాస్టిక్ కణాల వల్ల మానవుల ఆరోగ్యానికి ముప్పు ఉందా? లేదా? అనే విషయమై అధ్యయనం చేసేందుకు ఐఐటీఎం సహకారాన్ని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం తరఫున నివేదిక దాఖలు చేసేందుకు గడువు కోరారు. అప్పుడు న్యాయమూర్తులు.. వేడి ఆహార పదార్థాలు ప్లాస్టిక్ సంచుల్లో ఉంచి తింటే మానవుల ఆరోగ్యానికి, ముఖ్యంగా గర్భిణులకు హాని కలుగుతుందా? లేదా? అనే విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధ్యయనం చేసి నివేదిక దాఖలు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.

వారణాసి-ఎర్నాకులం ప్రత్యేక రైలు

వడపళని, న్యూస్‌టుడే: తిరున్నావయలో 'మాఘ మహోత్సవం' భక్తుల రద్దీ దృష్ట్యా వారణాసి - ఎర్నాకులం జంక్షన్ ప్రత్యేక రైలు నడుపుతున్నట్టు దక్షిణ రైల్వే మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

- 04358 వారణాసిలో 30వ తేదీ 16.30కు బయలుదేరి మూడో రోజు ఎర్నాకులం జంక్షన్ చేరుతుంది. ఈ రైలు పెరంబూరు, కాట్పాడి, జోలార్‌పేట్టై, సేలం మీదుగా వెళ్తుంది. బుధవారం నుంచి రిజర్వేషన్లు ప్రారంభమవుతాయి.
- **దారి మళ్లింపు...** దిల్లీ కిషన్‌గంజ్ స్టేషను యార్డులో రీమోడలింగ్ పనులు జరుగుతున్నందున 16302 శ్రీ వైష్ణో దేవి కత్రా - చెన్నై సెంట్రల్ 28న 22.30కు బయలుదేరే రైలు షకుర్‌బస్తీ, దయ బస్తీ, పటేల్ నగర్, దిల్లీ సఫ్దర్‌జంగ్, ఒక్లా మీదుగా నడుస్తుంది. ప్రయాణికుల కోసం దిల్లీ సఫ్దర్‌జంగ్‌లో ఐదు నిమిషాలు ఆగుతుంది.

రాష్ట్రంలోనే మహిళలపై కేసులెక్కువ

అన్బుమణి

గిండి, న్యూస్‌టుడే: మణిపూర్‌తో పోలిస్తే తమిళనాడు మహిళలకు భద్రత ఉందని ముఖ్యమంత్రి స్టాలిన్ చెప్పిన విషయాన్ని పీఎంకే నేత అన్బుమణి ఖండించారు. మణిపూర్‌తో పోల్చితే తమిళనాడులోనే మహిళలపై ఎక్కువ కేసులున్నాయని ఆయన ఆరోపించారు. గతేడాది జులైలో గుమ్మిడిపూండిలో 8 ఏళ్ల బాలికపై లైంగిక దాడి, నవంబరులో 3న కోయంబత్తూరులో కళాశాల విద్యార్థినిపై అత్యాచారం, 19న రామేశ్వరంలో ప్రేమను నిరాకరించినందుకు యువతిపై కత్తితో దాడి, 27న తంజావూరులో ఉపాధ్యాయిని హత్య లాంటి ఘటనలెన్నో ఉన్నాయని ఆయన అన్నారు. గత నాలుగేళ్లలోనే మహిళల హత్య కేసులు 217 నమోదవగా, 7 అత్యాచార కేసులున్నాయని అన్బుమణి అన్నారు.

శంకర మఠానికి మూడు ఏనుగుల అప్పగింత

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం శంకర మఠానికి చెందిన మూడు ఏనుగులను అటవీశాఖ సోమవారం మఠం మేనేజర్ సుందరేశ అయ్యర్‌కు అప్పగించింది. కాంచీపురం సమీపం కోనేరికుప్పం ప్రాంతంలో శంకర మఠానికి సొంతమైన ఏనుగుల సంరక్షణ కేంద్రం ఉంది. ఇక్కడ ఏనుగుల సంరక్షణకు మావటి లేని కారణంగా 2019లో మఠానికి సొంతమైన జయంతి, సంధ్య, ఇందూ అనే మూడు ఏనుగులను ఎంఆర్ పాళ్యంలో ఉన్న అటవీశాఖకు సొంతమైన ఏనుగుల సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఈ మూడు ఏనుగులను శంకర మఠానికి అప్పగించాలని గత నెల 24వ తేదీ మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు అటవీశాఖ అధికారులు సోమవారం లారీల్లో మూడు ఏనుగులను తీసుకొచ్చి సాయంత్రం మఠం మేనేజర్ సుందరేశ అయ్యర్‌కు అప్పజెప్పారు.

మేనకోడలికి సారెగా 480 వరి విత్తన రకాలు

సంస్కృతి, సాంప్రదాయంపై మేనమామ అవగాహన

వరి విత్తనాలను సారెగా అందజేస్తున్న అయ్యనార్

అందజేసిన విత్తనాలు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరి ఆరోగ్యశాఖలో అసిస్టెంట్ హెల్త్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న అయ్యనార్ తన సోదరి కుమార్తె రజస్వల వేడుకలో 480 రకాల సాంప్రదాయ వరి వంగడాలను సారెగా అందజేసి ప్రత్యేకంగా నిలిచారు. ఈ వేడుక విల్లియనూర్‌లో మంగళవారం జరిగింది. అయ్యనార్‌కు తమిళ సంప్రదాయాలు, వారసత్వాన్ని కాపాడాలని తాపత్రయం ఉంది. గత 30ఏళ్లుగా పూర్వీకులు ఉపయోగించిన ఇత్తడి, రాగి, కలప, బంకమట్టితో చేసిన వస్తువులను సేకరించి పునరుద్ధరిస్తున్నారు. భావితరానికి తెలియజేసేలా కళాశాలలు, పలు కార్యక్రమాలలో ప్రదర్శిస్తున్నారు. దీని గురించి అయ్యనార్ మాట్లాడుతూ... ప్రాచీనత, సంప్రదాయం, సంస్కృతి, వారసత్వాన్ని ప్రజలు మర్చిపోకుండా మళ్లీ మననం చేసుకునేలా శుభ సందర్భాలలో సాంప్రదాయ అంశాలను జోడిస్తున్నట్లు తెలిపారు. ఇది కేవలం ఓ వేడుక మాత్రమే కాకుండా అవగాహన కార్యక్రమంగా ఉండాలనే ఆలోచనతో తాను 480 రకాల సాంప్రదాయ వరి వంగడాలను ప్రదర్శించానని చెప్పారు. దేశంలో 2వేల కంటే ఎక్కువ సాంప్రదాయ వరి విత్తన రకాలు ఉన్నాయని చాలామందికి తెలియదన్నారు.

విద్యార్థినులకు గర్భాశయ క్యాన్సర్ నిరోధక వ్యాక్సిన్

నాలుగు జిల్లాల్లో పథకం ప్రారంభం

చెన్నై, న్యూస్‌టుడే: ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థినులకు గర్భాశయ క్యాన్సర్ నిరోధక వాక్సిన్ వేసే పథకాన్ని తొలి విడతగా 4 జిల్లాలకు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. రాష్ట్రంలో మహిళలను అత్యధికంగా బాధిస్తున్న రొమ్ము క్యాన్సర్‌కు తర్వాతి స్థానంలో గర్భాశయ క్యాన్సర్ ఉన్నట్లు గుర్తించారు. హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిల్లోమా వైరస్) కారణంగా ఏర్పడే ఈ క్యాన్సర్‌ను హెచ్‌పీవీ వ్యాక్సిన్ ద్వారా నిరోధించగలరు. ఆ మేరకు 14ఏళ్ల బాలికలకు దశలవారీగా 3,38,649 మందికి ఈ వ్యాక్సిన్‌ను వేయాలని లక్ష్యాన్ని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఏడాది రూ.36 కోట్లను కేటాయించింది. గర్భాశయ క్యాన్సర్ తీవ్రత ఎక్కువగా ఉన్న ధర్మపురి, పెరంబలూర్, తిరువణ్ణామలై, అరియలూర్ జిల్లాలను తొలి విడతగా ఎంపిక చేసి అక్కడి ప్రభుత్వ, ప్రభుత్వ సంబంధిత పాఠశాలల్లో చదివే 30,209 మంది విద్యార్థినులకు ఈ వ్యాక్సిన్‌ను వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. చెన్నై నందంబాక్కంలోని ట్రేడ్ సెంటర్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్ పథకం తొలివిడతను ప్రారంభించారు. తర్వాత దశలవారీగా ఇతర జిల్లాలకు పథకాన్ని విస్తరించనున్నారు. కార్యక్రమంలో భాగంగా తమిళనాడు క్యాన్సర్ కేర్ మిషన్ కార్యాచరణ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, మంత్రులు అన్బరసన్, గీతా జీవన్, మా.సుబ్రమణియన్, ఎంపీ తమిళచ్చి తంగపాండియన్ తదితరులు పాల్గొన్నారు.

పథకాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

తమ్ముడు రాజకీయాలకు కొత్త

విజయ్‌పై ఖుష్బూ విమర్శలు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తమ్ముడు రాజకీయాలకు కొత్త అని భాజపా నాయకురాలు ఖుష్బూ విజయ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. రెండు రోజుల క్రితం మామల్లపురంలో జరిగిన టీవీకే సర్వసభ్య సమావేశంలో ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ తొలిసారిగా అన్నాడీఎంకేపై విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రజలు డీఎంకే, అన్నాడీఎంకేకు మార్చిమార్చి అధికారం కట్టబెట్టి ప్రస్తుతం ఒత్తిడిలో ఉన్నారని, దుష్టశక్తి డీఎంకే, అవినీతి శక్తి అన్నాడీఎంకే తమిళనాడునే పాలించకూడదని విమర్శలు చేశారు. ఆయన వ్యాఖ్యలను అన్నాడీఎంకే నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలో భాజపా నాయకురాలు, సినీనటి అయిన ఖుష్బూ మాట్లాడుతూ... వేదికపై ఉన్నప్పుడు వీరోచిత మాటలు మాట్లాడాలన్నారు. తమ్ముడు రాజకీయాలకు కొత్త అని పేర్కొన్నారు. అన్నాడీఎంకే వారు రాజకీయాల్లోకి నిన్న, మొన్న రాలేదని, అన్నా, ఎంజీఆర్, జయలలిత, ఈపీఎస్ వంటి బలమైన మూలాలు కలిగిన పార్టీ అని, లొంగిపోవాల్సిన అవసరం లేదన్నారు.

కరియమాణిక్య పెరుమాల్ ఊరేగింపు

ఊత్తుకోట, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ జిల్లా ఊత్తుకోట సమీపం పోందవాక్కంలోని ప్రసిద్ధ కరియమాణిక్య పెరుమాల్ ఆలయంలో తైమాస ఉత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా స్వామివారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు.

అశ్వ వాహనంపై స్వామివారు

వైభవంగా తై కృత్తిక వేడుకలు

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో తై మాస కృత్తిక సందర్భంగా మంగళవారం ఆలయంలోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి సన్నిధిలో మూలమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు నిర్వహించారు. తర్వాత 1008 మంది భక్తులు కావళ్లతో వచ్చి మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

తిరువణ్ణామలై: 1008 కావళ్లతో వచ్చిన భక్తులు

తిరుత్తణి: తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణిలోని ప్రసిద్ధ మురుగన్ ఆలయంలో మంగళవారం తై కృత్తిక సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే కొండపైకి చేరుకున్నారు. సుమారు మూడు గంటలపాటు క్యూలో నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ మాడ వీధులన్నీ కిక్కిరిశాయి. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు.

తిరుత్తణి: అలంకరణలో శ్రీ వల్లీ దేవసేన సమేత స్వామివారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు

ఘనంగా ప్రభుత్వ పాఠశాల 70 వసంతాల వేడుక

ఉపాధ్యాయులతో పూర్వ, ప్రస్తుత విద్యార్థులు

టీనగర్, న్యూస్‌టుడే: సేలం జిల్లా తమ్మంపట్టిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన ప్లాటినం జూబ్లీ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం నిర్వాహకులు భారీ ఎత్తున కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 1956లో ప్రారంభమైన ఈ పాఠశాల, ఈ ప్రాంతంలోని వేలాదిమంది గ్రామీణ విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారిని ఉన్నత శిఖరాలకు చేర్చడంలో కీలకపాత్ర పోషించింది. ఈ 70ఏళ్ల ప్రయాణంలో పాఠశాల సాధించిన విజయాలను ఈ వేడుకలో గుర్తు చేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన గతంలో ఇక్కడ పనిచేసిన 104 మంది ఉపాధ్యాయులను వేదికపై సన్మానించారు.

మృతుల కుటుంబాలకు ప్రభుత్వ సాయం ప్రకటన

చెన్నై, న్యూస్‌టుడే: తూత్తుకుడి జిల్లా మాపిళ్లైయూరణి గ్రామానికి చెందిన తిరుమణి(13), నరేన్ కార్తిక్(12), కేథరిన్(12) సోమవారం సాయంత్రం స్థానిక సిలువైపట్టి మొట్టైగోపురం బీచ్‌లో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతై మరణించారు. ఘటనపై ముఖ్యమంత్రి స్టాలిన్ దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల తల్లిదండ్రులు, బంధువులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.3లక్షల చొప్పున సీఎం పబ్లిక్ రిలీఫ్ ఫండ్ నుంచి అందించాలని అధికారులను ఆదేశించారు.

డీఎంకే మేనిఫెస్టోపై ప్రజలకు నమ్మకం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: డీఎంకే మేనిఫెస్టోపై ప్రజలు నమ్మకం పెట్టుకున్నారని డీఎంకే ఎంపీ, మేనిఫెస్టో రూపకల్పన కమిటీ సభ్యురాలు కనిమొళి పేర్కొన్నారు. తంజావూర్‌లో మంగళవారం తంజావూర్ సెంట్రల్, ఈస్ట్, వెస్ట్, తిరువారూర్, మైలాడుదురై, నాగై జిల్లాలకుగాను మేనిఫెస్టో రూపకల్పన కమిటీ సమావేశం జరిగింది. దీనికి కనిమొళి నేతృత్వం వహించి అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ... కమిటీ మొదట హోసూర్ వెళ్లి అక్కడున్న కార్మికులు సహా అందరి అభిప్రాయాలను సేకరించిందని చెప్పారు. ఇక్కడ రైతులు, వ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగులు తదితర అన్ని వర్గాలవారు తమ తమ అభిప్రాయాలను వెల్లడించి వినతులుగా సమర్పించారని తెలిపారు. అన్నాడీఎంకే మేనిఫెస్టో ఇప్పటికే విడుదలై ఉండవచ్చని, కానీ అందులో ఏది నెరవేరదని ప్రజలకు బాగా తెలుసన్నారు. డీఎంకే మేనిఫెస్టోపై ప్రజలు నమ్మకంతో ఉన్నారన్నారు.

సరకు లారీని అడ్డుకున్న ఏనుగు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడ్ జిల్లా సత్యమంగళం పులుల అభయారణ్యం ఆసనూర్ నుంచి కేర్‌మాళం వెళ్లే రోడ్డు దట్టమైన అటవీ ప్రాంతంలో ఉంది. అడవి నుంచి బయటకు వచ్చే ఏనుగులు ఆ మార్గంలో వచ్చే చెరకు లారీలను అడ్డుకుని చెరకు గడలను లాక్కొని తింటూ వాహన చోదకులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం కేర్‌మాళం నుంచి సత్యమంగళం వైపు వెళ్తున్న సరకు లారీని ఓ అడవి ఏనుగు అడ్డుకుంది. దీంతో డ్రైవర్ భయాందోళన చెందాడు. చెరకు గడల కోసం వెతికి లేకపోవడంతో వెనుదిరిగింది.

లారీ వైపు వస్తున్న ఏనుగు

(c) eenadu

ఐదుగురు దర్శకులతో ఒవెల్స్

టైటిల్ లుక్

చెన్నై, న్యూస్‌టుడే: ఐదుగురు దర్శకులతో, ఐదు కథలతో వైవిధ్య భరితంగా రూపొందుతున్న చిత్రం 'ఒవెల్స్'. ఆంగ్ల భాష అచ్చులైన 'ఏ, ఈ, ఐ, ఓ, యు'ల తొలి అక్షరాలతో వచ్చే అనుభూతులైన ఆట్రాక్షన్ (ఆకర్షణ), ఎమోషన్ (భావోద్వేగం), ఇంటిమేసీ (సాన్నిహిత్యం), ఆబ్సెషన్ (యావ), అన్‌కండిషనల్ (బేషరతు)లే ప్రధాన కథాంశాలుగా ఈ చిత్రం రూపొందుతుండటంతో దానికి 'ఒవెల్స్'గా టైటిల్ ఖరారు చేశారు. ఒక్కో అనుభూతికి సంబంధించిన సన్నివేశాలను ఒక్కో దర్శకుడు చూపనున్నారు. దిలీప్‌కుమార్, సంగీత్‌నాథ్, హేమంత్‌కుమార్, సంతోష్ రవి, జగన్ రాజేంద్రన్ దర్శకత్వం వహించారు. చిత్రంలో యూగి సేతు, చిన్ని జయంత్, సంయుక్త విశ్వనాథన్, రాజ్ అయ్యప్ప, దీపక్ పరమేశ్, తెలుగు నటుడు నందు, భరత్ బొప్పన్న, శరత్‌రవి, విజయశ్రీ, కాజల్ చౌదరి, సిందు కుమరేశన్ తదితరులు ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. నిర్మాత గుణా శేకర్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. చిత్రం టైటిల్ లుక్‌ను సోమవారం విడుదల చేశారు.

రౌడీ అండ్ కో టీజర్ పోస్టరు విడుదల

చెన్నై, న్యూస్‌టుడే: సిద్ధార్థ్, రాశీ ఖన్నా జంటగా నటించిన చిత్రం 'రౌడీ అండ్ కో'. యోగిబాబు, రెడిన్ కింగ్స్లే, సునీల్‌రెడ్డి, ప్రాంక్‌స్టర్ రాహుల్, విటివిగణేష్, వరుణ్ తదితరులు ఇతర ముఖ్యపాత్రల్లో నటించారు. కార్తిక్ జి.క్రిష్ రచన, దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్న చిత్రాన్ని ప్యాషన్ స్టూడియోస్ పతాకంపై సుధన్ సుందరం నిర్మించారు. ఈ చిత్రం టీజర్ పోస్టరును చిత్రబృందం విడుదల చేసింది. టీజర్ పోస్టరు కాన్సెప్ట్ సరికొత్తగా ఉండటం గమనార్హం. చిత్రీకరణ పనులు ముగిసి నిర్మాణానంతర పనులు కొనసాగుతున్నాయి.

ఫోర్త్ ఫ్లోర్ తొలి సింగిల్...

చెన్నై: సుందరపాండి దర్శకత్వంలో ఆరి అర్జునన్, దీప్తిక జంటగా నటించిన చిత్రం 'ఫోర్త్ ఫ్లోర్'. ఇతర ముఖ్యపాత్రల్లో పవిత్ర, దర్శకుడు సుబ్రమణియ శివ, తలైవాసల్ విజయ్, ఆదిత్య, కదిర్ తదితరులు ఇతర ముఖ్యపాత్రల్లో నటించారు. సస్పెన్స్, థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రం ఫిబ్రవరిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తొలి సింగిల్ 'ఒలగా ఓలయా'ను చిత్ర బృందం విడుదల చేసింది.

సిలంబాట్టం ఫిబ్రవరి 6న రీరిలీజ్

చెన్నై, న్యూస్‌టుడే: శింబు సినీ ప్రస్థానంలో కీలక మలుపుగా ఉన్న చిత్రాల్లో ఒకటి 'సిలంబాట్టం'. లక్ష్మీ మూవీ మేకర్స్ పతాకంపై మురళీధరన్, రంగరాజన్ సంయుక్తంగా నిర్మించిన 2008లో విడుదలైన ఈ చిత్రం యాక్షన్, మాస్‌గా సినీ ప్రేక్షకులను అలరించింది. ఎస్.శరవణన్ దర్శకత్వంలోని ఈ చిత్రానికి యువన్ శంకర్‌రాజా సంగీతం బలాన్ని అందించింది. ప్రస్తుతం నేటి డిజిటల్ హంగులతో అభివృద్ధి చేసి చిత్రాన్ని ఫిబ్రవరి 6న రీరిలీజ్ చేయనున్నట్లు చిత్రబృందం ప్రత్యేక పోస్టరు ద్వారా ప్రకటించింది.



శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చిల్డ్రన్స్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన

చెన్నై, న్యూస్‌టుడే: దక్షిణ చెన్నై ప్రాంతాల్లోని పిల్లలకు ఉన్నత వైద్య సేవలు అందించడానికి అనువుగా గిండిలోని కింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ ప్రాంగణంలో స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించనున్నట్లు 2024-25 ఏడాది ఆరోగ్యశాఖ పద్దుల్లో ప్రకటించారు. ఆ మేరకు రూ.417.07 కోట్ల వ్యయంతో 750 పడకలతో చేపట్టనున్న పిల్లల స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం మంగళవారం జరిగింది. తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయం తరఫున కింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్ పాల్గొని నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

ఘనంగా అప్పా పైత్తియం స్వామి గురుపూజ

టీనగర్, న్యూస్‌టుడే: సేలం జిల్లా శూరమంగళంలోని సద్గురు అప్పా పైత్తియం స్వామి 26వ వార్షిక గురుపూజ సోమవారం ఘనంగా జరిగింది. పుదుచ్చేరి రాష్ట్ర ముఖ్యమంత్రి రంగసామి కుల దైవంగా పూజించే స్వామివారికి సేలంలో ప్రత్యేక ఆలయం నిర్మిస్తున్నారు. ప్రతిరోజు పూజలు జరుగుతుంటాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు.

స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కనులపండువగా రథోత్సవం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నామక్కల్ జిల్లా పరమత్తివేలూర్ సమీపం పాండమంగళంలోని ప్రసిద్ధ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ రథోత్సవం సోమవారం రాత్రి కనుల పండువగా జరిగింది. వేలాది మంది భక్తులు పాల్గొని రథాన్ని లాగారు. ఆలయంలో ఈ నెల 18వ తేదీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 25వ తేదీ సాయంత్రం కల్యాణోత్సవం నిర్వహించారు. సోమవారం ఉదయం రథోత్సవం ప్రారంభమైంది. ఈ నెల 30వ తేదీ తీర్థవారి, తిరుమంజనం, వసంత ఉత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

రథాన్ని లాగుతున్న భక్తులు

కమల్‌హాసన్‌తో శ్రీలంక డిప్యూటీ హైకమిషనరు భేటీ

కమల్‌తో గణేశనాథన్ గీతీశ్వరన్

చెన్నై, న్యూస్‌టుడే: ఎంఎన్ఎం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కమల్‌హాసన్‌తో చెన్నైలోని శ్రీలంక డిప్యూటీ హైకమిషనరు గణేశనాథన్ గీతీశ్వరన్ మంగళవారం భేటీ అయ్యారు. ఆళ్వార్‌పేటలోని ఎంఎన్ఎం కార్యాలయంలో మంగళవారం కమల్‌హాసన్‌ను గణేశనాథన్ గీతీశ్వరన్, ఆయన సతీమణి కిరుత్తిగా దేవి, శ్రీలంక పోలీసుశాఖ మాజీ ఎస్ఎస్‌పీ గణేశనాథన్, ఇతర దౌత్యాధికారులు కలిశారు. ఈ భేటీ మర్యాదపూర్వకంగా జరిగినట్లు ఎంఎన్ఎం అధిష్ఠానం తెలిపింది. ఈ సందర్భంగా శ్రీలంకలో ప్రస్తుత అభివృద్ధి పనులు గురించి కమల్‌హాసన్‌కు వివరించారని, ఈ భేటీ ఇరువర్గాల అవగాహన, సహకారం, ప్రాంతీయపరమైన సత్సంబంధాలను మరింత బలోపేతం చేసేలా ఉందని వెల్లడించింది. వెంట ఎంఎన్ఎం ఉపాధ్యక్షుడు మౌర్య, ప్రధానకార్యదర్శి అరుణాచలం, కార్యదర్శి సెందిల్ ఆరుముగం ఉన్నారు.

రహదారులను ఆక్రమించి మతపరమైన నిర్మాణాలు చేపట్టడం సరికాదు

మద్రాసు హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: రహదారులను ఆక్రమించి మతపరమైన భవనాలు నిర్మించడాన్ని సమర్థించడం కుదరదని మద్రాసు హైకోర్టు తెలిపింది. చెన్నై తిరువిక నగర్‌కి చెందిన శరత్ ఆ ఇంటి ముందున్న వీధిని ఆక్రమించి వేలాంకణ్ణి మాతా విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు పిటిషన్ దాఖలైంది. అదేవిధంగా ఆ నిర్మాణానికి చట్టవిరుద్ధంగా విద్యుత్తు కనెక్షన్ పొందినట్లు, ఈ విషయమై కార్పొరేషన్‌కి ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టలేదని తెలుపుతూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను జస్టిస్ లక్ష్మీనారాయణన్ విచారించారు. ఆ భవనాన్ని తొలగించే విషయమై తగిన ఉత్తర్వులు జారీచేయాలని కార్పొరేషన్‌ను ఆదేశించారు. రహదారుల్లో మతపరమైన నిర్మాణాలకు ఏ వ్యక్తికీ హక్కు లేదని సుప్రీంకోర్టు, మద్రాసు హైకోర్టు ఇదివరకే తీర్పు ఇచ్చిందని గుర్తు చేసిన న్యాయమూర్తి.. ఇలాంటి ఆక్రమణలను మతపరమైన మనోభావాలు అని చెప్పి సమర్థించడం కుదరదని పేర్కొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె

గిండి, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు మంగళవారం సమ్మె చేశారు. మూడు రోజులు బ్యాంకులకు ప్రభుత్వ సెలవులు ఉండగా, మంగళవారం సమ్మెతో మరో రోజు బ్యాంకులు మూతపడ్డాయి. లావాదేవీలు ఆగిపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారానికి 5 రోజులు మాత్రమే పని దినాలు ఉండాలని, అవసరమైతే రోజూ 40 నిమిషాలు అదనంగా విధుల్లో ఉంటామనే డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం అంగీకరించాలని డిమాండ్ చేశారు. అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సి.హెచ్.వెంకటాచలం ఆధ్వర్యంలో సమ్మె జరిగింది.

✦ **కోయంబత్తూరు, న్యూస్‌టుడే:** వారానికి ఐదు రోజుల పని దినాలు తదితర డిమాండ్ల సాధనకు దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు మంగళవారం సమ్మె చేపట్టారు. కోయంబత్తూరులో జరిగిన ఆందోళనలో దాదాపు 5వేల మంది బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు. రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రాంగణంలో 500మందికి పైగా ఉద్యోగులు గుమిగూడి డిమాండ్లపై నినాదాలు చేశారు. సమ్మె వలన కోయంబత్తూరులోనే దాదాపు రూ.5వేల కోట్ల వాణిజ్య నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఉద్యోగులకు పనిభారం పెరిగిందని, తమ డిమాండ్లను నెరవేర్చకుంటే సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. ✦ **వేలూరు:** వేలూర్ జిల్లా వేలూర్ నగరంలోని అన్నాసాలైలో ఉన్న ఓ ప్రభుత్వరంగ బ్యాంకు ఎదుట మంగళవారం ఆల్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తరఫున పలు డిమాండ్ల సాధనకు ఆందోళన జరిగింది. కేంద్ర ప్రభుత్వం పని దినాలు ఐదు రోజులకు కుదించాలని, పని భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.

కోయంబత్తూరు: ఆందోళనలో పాల్గొన్న ఉద్యోగులు ● వేలూరులో...

తాబేళ్ల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

టీనగర్, న్యూస్‌టుడే: సముద్ర పర్యావరణ వ్యవస్థలో కీలకమైన సముద్ర తాబేళ్లను కాపాడేందుకు తమిళనాడు ప్రభుత్వం భారీ పథకాన్ని చేపట్టింది. మత్స్యకారుల జీవనోపాధికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా, వేట సమయంలో మత్స్యకారుల వలల్లో చిక్కుకుని తాబేళ్లు మరణించకుండా రూ.6.40 కోట్ల వ్యయంతో ప్రత్యేక పరికరాలను ఉచితంగా పంపిణీ చేస్తోంది. ఏటా జనవరి ఒకటి నుంచి 30వ తేదీ వరకు సముద్ర తాబేళ్ల సంతానోత్పత్తి కాలం. ఆ సమయంలో తాబేళ్లు గుడ్లు పెట్టడానికి తీరానికి వస్తుంటాయి. జాలర్లు వాడే పెద్ద లాగుడు వలల్లో ఇవి చిక్కుకుని శ్వాస ఆడక మరణిస్తున్నాయి. దీనిని అరికట్టడానికి కొచ్చిలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ సాయంతో రూపొందించిన ప్రత్యేకమైన టెడ్ పరికరాలను వలలకు అమర్చుతున్నారు. ఈ పరికరం వల్ల చేపలు వలలోనే ఉంటాయి. కానీ, పొరపాటున చిక్కుకున్న తాబేళ్లు మాత్రం సురక్షితంగా బయటకు వెళ్లిపోతాయి. ఈ తరహా పరికరాలను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,663 మెకనైజ్డ్ బోట్లకు ఉచితంగా అందజేస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది.

సెలవులివ్వని 40 సంస్థలపై కఠిన చర్యలు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలకు తిరువళ్లూరు జిల్లాలోని కొన్ని ప్రైవేటు సంస్థలు సెలవు ఇవ్వకుండా కార్మికులతో పని చేయిస్తున్నట్లు కార్మిక సంక్షేమశాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటాచలపతికి ఫిర్యాదులందాయి. ఆయన సంబంధించి ఆయన నేతృత్వంలో అధికారుల బృందం దర్యాప్తు చేయగా 40 సంస్థలు నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలింది. దీంతో ఆయా సంస్థల యాజమాన్యాలపై కఠిన చర్యలు చేపట్టనున్నట్లు వెంకటాచలపతి మంగళవారం తెలిపారు.

బధిర విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: పది, ప్లస్‌టూ చదువుతున్న బధిర విద్యార్థుల కోసం తిరువళ్లూరులోని సీఎస్ఐ గౌడి మహోన్నత పాఠశాలతో పాటు జిల్లాలోని 8 కేంద్రాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. తిరువళ్లూర్‌లోని గౌడి పాఠశాలలో జిల్లా కలెక్టర్ ప్రతాప్ మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులతో కూర్చుని పాఠాలు విన్నారు.

విద్యార్థులతో కూర్చొని పాఠాలు వింటున్న కలెక్టర్ ప్రతాప్

సముద్రంలో గల్లంతై ముగ్గురు బాలుర మృతి

ప్యారిస్, న్యూస్‌టుడే: సముద్రంలో గల్లంతై ముగ్గురు బాలురు మృతిచెందిన ఘటన తూత్తుకుడిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తూత్తుకుడి జాకీర్ హుస్సేన్ నగర్‌కి చెందిన ఆరుముగం కుమారుడు శ్రీకార్తిక్(12), వనరాజన్ కుమారుడు తిరుమణి(13), కదిరేశన్ కుమారుడు ముగేంద్రన్(12) తదితర 12 మంది బాలురు సోమవారం తాళముత్తునగర్ బీచ్‌కి వెళ్లారు. సముద్రంలో దిగి స్నానం చేస్తుండగా రాక్షస అలల్లో నలుగురు బాలురు చిక్కుకుని గల్లంతయ్యారు. అందులో ఓ బాలుడిని జాలరి కాపాడాడు. మిగిలిన వారి కోసం పోలీసులు, తీర గస్తీ దళం గాలించింది. మృతదేహాలను బయటకుతీసి పోస్టుమార్టానికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు...

నుజ్జునుజ్జయిన సరకు వాహనం

విల్లివాక్కం: నామక్కల్ నగర ప్రాంతంలో మంగళవారం వేకువజామున లారీ, సరకు వ్యాను ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు... తిరుచ్చి నుంచి నామక్కల్ వైపు వెళ్తున్న ఓ లారీ నామక్కల్-తిరుచ్చి రోడ్డులో రైల్వే వంతెనపై మంగళవారం వేకువజామున వెళ్తుండగా వెనుక వస్తున్న సరకు వ్యాను అదుపుతప్పి లారీని బలంగా ఢీకొట్టింది. అనంతరం పక్కకు తిరగడంతో అటుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తగిలింది. బైక్‌పై ఉన్న ముగ్గురు వ్యక్తులు కిందపడి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సరకు వ్యాను డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని నామక్కల్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో సరకు వ్యాను డ్రైవర్ నిద్ర మత్తు కారణంగానే ప్రమాదం జరిగినట్లు తేలింది. మృతుల వివరాలు తెలియలేదు. దర్యాప్తు కొనసాగుతోంది.

తలపై నాపరాయి పడి మూడేళ్ల బాలిక...

వేలూరు: తిరుపత్తూరు జిల్లా ఆంబూరులోని సిలపురం ప్రాంతానికి చెందిన వాహిద్, సౌజియా దంపతులు. వీరికి నలుగురు సంతానం. ఇదిలా ఉండగా వీరి కుటుంబం మూడు రోజుల క్రితం రఫిక్ నగర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు దిగారు. సోమవారం రాత్రి సౌజియా స్థానికంగా ఉన్న దుకాణానికి వెళ్లింది. ఆ సమయంలో నాలుగో కుమార్తె హబియా తస్కిన్(3) ఇంటి బయట తలుపు గేటు వద్ద ఆడుకుంటోంది. ఈ క్రమంలో గేటుపైన అమర్చిన నాపరాయి ప్రమాదవశాత్తు బాలిక తలపై పడటంతో తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు వెంటనే ఆంబూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఖైదీ...

రెడ్‌హిల్స్: చెన్నై ట్రిప్లికేన్‌కు చెందిన జోసఫ్(49) అనే వ్యక్తి గంజాయి తరలిస్తుండగా పోలీసులు ఇటీవల అరెస్టు చేసి పుళల్ జైల్లో ఉంచారు. అతనికి ఈనెల 21న గుండెపోటు రావడంతో చెన్నై స్టాన్లీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు.

ఎన్‌కౌంటర్‌లో రౌడీషీటర్ మృతి

సబ్ ఇన్‌స్పెక్టరుకు కత్తి గాయాలు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: పెరంబలూర్ సమీపంలో మంగళవారం తెల్లవారు జామున పోలీసులు జరిపిన ఎన్‌కౌంటర్‌లో ప్రముఖ రౌడీషీటర్ అళగురాజా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మదురై కామరాజపురానికి చెందిన షణ్ముగవేల్ కుమారుడు కలిముత్తు అలియాస్ వెళ్లైకాళి(30) ప్రముఖ రౌడీషీటర్. ఇతనిపై హత్య, హత్యాయత్నం, గంజాయి రవాణా తదితర కేసులున్నాయి. 10 మంది పోలీసులు ఈనెల 23వ తేదీ దిండుక్కల్, పుదుక్కోట మేజిస్ట్రేట్ కోర్టుల్లో అతన్ని హాజరుపరచి 24వ తేదీ పోలీస్ వాహనంలో పుళల్ జైలుకు తీసుకెళ్తున్నారు. చెన్నై-తిరుచ్చి రహదారిపై పెరంబలూర్ జిల్లా తిరుమంతూర్ సమీపం ఎరైయూర్ టోల్‌గేట్ వద్ద ఓ రెస్టరెంట్‌లో పోలీసులు భోజనం చేయడానికి దిగారు. అప్పుడు అక్కడకు 2 కార్లలో వచ్చిన 15మందితో కూడిన ముఠా నాటు బాంబులు విసిరి వెళ్లైకాళిని హత్య చేయడానికి యత్నించింది. అదృష్టవశాత్తు అతను తప్పించుకున్నాడు. సబ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రన్ తుపాకీతో కాల్పులు జరపడంతో పారిపోయింది. నాటు బాంబులు విసిరిన ఘటనలో పోలీసులు మరుదుపాండి, వినేష్‌కుమార్, రెస్టరెంట్‌కు వచ్చిన ఓ న్యాయవాది, ఓ రౌడీ గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి మంగళమేడు పోలీసులు దర్యాప్తు చేపట్టి మదురై ఎగువ అనుపనది ప్రాంతానికి చెందిన కొట్టు రాజా అలియాస్ అళగురాజా(30) సహా ముగ్గురిని అరెస్టు చేసి విచారించారు. తిరుమంతూర్ టోల్‌గేట్ సమీపంలోని అటవీ ప్రాంతంలో కత్తులు, నాటు బాంబులు దాచినట్లు తెలియడంతో మంగళంమేడు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నందకుమార్ నేతృత్వంలో సిబ్బంది మంగళవారం తెల్లవారుజామున అళగురాజాను తీసుకుని ఆ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ దాచిన ఆయుధాలు, నాటు బాంబులను స్వాధీనం చేసుకుంటుండగా అళగురాజా ఓ నాటు బాంబును పోలీసులపై విసిరాడు. తరువాత కున్నం పోలీస్ స్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ శంకర్‌పై కత్తితో దాడి చేసి పారిపోవడానికి యత్నించాడు. దీంతో ఇన్‌స్పెక్టర్ నందకుమార్ తుపాకీతో అళగురాజాపై కాల్పులు జరిపాడు. కత్తిపోట్లకు గురైన సబ్ ఇన్‌స్పెక్టర్ శంకర్, కాల్పుల్లో గాయపడిన రౌడీషీటర్ అళగురాజాను పెరంబలూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో అళగురాజా మృతి చెందాడు. పోలీసులు ఉన్నతాధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చికిత్స పొందుతున్న సబ్ ఇన్‌స్పెక్టర్‌ను పరామర్శించారు. అళగురాజాపై 3 హత్య కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

అళగురాజా (పాతచిత్రం)

ప్రియుడికి వీడియో కాల్ చేసి మహిళా న్యాయవాది ఆత్మహత్య

అనీషా (పాతచిత్రం)

మామల్లపురం, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే కళ్లకురిచ్చి ఉత్తర యూనియన్ కార్యదర్శి రాజశేఖర్ కుమార్తె అనీషా(25) గత ఐదేళ్లుగా ఓఎంఆర్ రోడ్డులోని యాగాటూర్ ప్రాంతంలో ఉన్న బహుళ అంతస్తుల భవనంలోని ఓ ఇంట్లో ఉంటూ కేళంబాక్కంలోని ఓ ప్రైవేట్ న్యాయ కళాశాలలో ఇటీవల కోర్సు పూర్తిచేసి బార్ కౌన్సిల్‌లో పేరు నమోదుకు దరఖాస్తు చేసుకుంది. తర్వాత చెన్నైలోని ఓ ప్రైవేట్ లీగల్ అడ్వైజరీ సంస్థలో ఉద్యోగంలో చేరింది. ఈ క్రమంలో చెన్నై అడయార్ ప్రాంతంలోని ఓ జిమ్‌కు వెళ్తున్న సమయంలో నిత్యానందం అనే యువకుడితో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఇదిలా ఉండగా ఆదివారం అర్ధరాత్రి అనీషా తన ప్రియుడికి వీడియో కాల్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చెప్పి తన గదిలో ఫ్యానుకు ఉరేసుకుంది. వెంటనే విషయాన్ని నిత్యానందం అక్కడున్న కాపలాదారుడి గదికి ఫోన్ చేసి చెప్పాడు. కపలాదారులు భవనంలోని అన్ని గదుల్లో తనిఖీ నిర్వహించి సోమవారం సాయంత్రం అనీషా ఉన్న గది తలుపులు పగులగొట్టారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి నిత్యానందాన్ని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడి మరణాన్ని తట్టుకోలేక తండ్రి...

క్రైం కార్నర్

పళ్లిపట్టు: తిరువళ్లూర్ జిల్లా పళ్లిపట్టు సమీపం రామచంద్రాపురం గ్రామానికి చెందిన రాజేంద్రన్(55) కూలీ. ఈయనకు భార్య సెల్వి(50), కుమారుడు గుహన్ ఉన్నారు. ఇతను భారత సైన్యంలో పనిచేశారు. రెండేళ్ల క్రితం ఇంటి గొడవల్లో విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో తండ్రి రాజేంద్రన్ మనోవేదనకు గురయ్యారు. రెండు రోజుల క్రితం కుమారుడి రెండో వర్ధంతి జరిగింది. మరింత ఆవేదనకు గురైన రాజేంద్రన్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంగళవారం విషం తాగారు. ఇరుగుపొరుగువారు పళ్లిపట్టు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం తిరుత్తణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పళ్లిపట్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత్తుపదార్థాలు విక్రయిస్తున్న దంపతుల అరెస్టు

బాబు, విజయలక్ష్మి

అన్నానగర్, న్యూస్‌టుడే: మత్తుపదార్థాలు విక్రయిస్తున్న దంపతులను పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై ఓట్టేరి కందసామి ఆలయ వీధిలో సోమవారం పోలీసులు గస్తీ నిర్వహించారు. అప్పుడు అక్కడ సంచితో అనుమానాస్పదంగా కనిపించిన మహిళ సహా ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారు అక్రమంగా మద్యం సీసాలు, గుట్కా అమ్ముతున్నట్లు తెలిసింది. వారు స్థానికంగా ఉంటున్న బాబు(56), అతని భార్య విజయలక్ష్మి(53)గా గుర్తించి అరెస్టు చేశారు. వారి నుంచి 25 మద్యం సీసాలు, 5.4 కిలోల గుట్కా, 100 గ్రాముల మావా స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇద్దరిని కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించారు.

చోరీకి పాల్పడిన 17 ఏళ్ల బాలుడు...

అన్నానగర్: కేరళకు చెందిన చంషీర్(52) అనే వ్యక్తి చెన్నై కోయంబేడులోని జవహర్‌లాల్ నెహ్రూ రోడ్డు, 100 అడుగుల రోడ్ జంక్షన్‌లో ఉన్న ఓ టీ దుకాణంలో క్యాషియర్‌గా పనిచేస్తున్నారు. గత 23వ తేదీ రాత్రి పనివారికి ఇవ్వాల్సిన జీతం రూ.68,450 ఓ డబ్బాలో పెట్టి దుకాణానికి తాళం వేసి వెళ్లారు. మరుసటిరోజు ఉదయం వచ్చి చూడగా షట్టర్ తెరచి ఉంది. డబ్బాలో ఉన్న నగదు కనిపించలేదు. ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టి దుకాణంలో పనిచేస్తున్న అసోం రాష్ట్రానికి చెందిన 17ఏళ్ల బాలుడిని అరెస్టు చేశారు. అతని నుంచి రూ.60 వేలు స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తు అనంతరం బాలుడిని జువైనల్ కోర్టులో హాజరుపరచి హోంకు తరలించారు.

లారీ డ్రైవర్‌పై పెట్రోల్ బాంబు దాడి

దాడిలో ధ్వంసమైన డ్రైవరు సీటు

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: తెన్‌కాశి జిల్లా ఆలంకుళం తాలూకాలో 15కి పైగా రాళ్ల క్వారీలున్నాయి. ఇక్కడి నుంచి ఖనిజ సంపద ట్రక్కుల ద్వారా తమిళనాడు, కేరళలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తారు. చాలావరకు లారీలు గ్రామీణ ప్రాంతాల గుండా వెళ్లడంతో రోడ్లు దెబ్బతింటున్నాయి. దీంతో గ్రామాల ప్రజలు చాలా ఏళ్లుగా అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మరుదంపుత్తూరులోని ఓ క్వారీ నుంచి కేరళకు ఖనిజాలు తీసుకెళ్తున్న లారీ సోమవారం అర్ధరాత్రి అంబేడ్కర్ నగర్ వద్దకు రాగా గుర్తుతెలియని వ్యక్తులు అడ్డుకుని పెట్రోల్ బాంబు విసిరారు. దాడిలో డ్రైవర్ సుబ్రమణియన్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం మేరకు ఆలంకుళం పోలీసులు అక్కడకు చేరుకుని సుబ్రమణియన్‌ను తిరునెల్వేలి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలిస్తున్నారు.

చెన్నై విమానాశ్రయంలో స్వల్ప అగ్నిప్రమాదం

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలోని టెర్మినల్-2 వద్ద విమానాలు బయలుదేరే ప్రాంతంలోని పత్రాలు భద్రపరిచే ఎయిర్‌లైన్స్ సంస్థ కార్యాలయం సమీపంలో మంగళవారం స్వల్ప అగ్నిప్రమాదం సంభవించింది. మంటలను త్వరగా అదుపు చేశామని, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. విమాన రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగలేదని, మంటలు ప్రయాణికులు సంచరించే ప్రాంతాలు, మౌలిక సదుపాయాలుండే చోటుకు వ్యాపించలేదని, టెర్మినల్-2 నుంచి విమానాలు ఎప్పటిలాగానే నడిచాయని పేర్కొన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట రూ.5 కోట్ల మోసం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరి రెయిన్‌బో నగర్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త వాట్సప్‌కు వచ్చిన సందేశంలో ఆన్‌లైన్ ట్రేడింగ్ ద్వారా అధిక లాభాలు పొందవచ్చని ఉంది. దీంతో అందులోని ఫోన్ నంబరును వ్యాపారవేత్త సంప్రదించారు. అవతలి వారు పంపిన లింక్‌పై క్లిక్ చేసి రూ.5వేలు పెట్టుబడి పెట్టగా రూ.3వేలు లాభం వచ్చింది. దీంతో పలు విడతలుగా సుమారు రూ.5 కోట్ల వరకు పెట్టుబడి పెట్టారు. ఈ క్రమంలో ఆదాయాన్ని తన బ్యాంకు ఖాతాకు బదిలీ చేయడానికి యత్నించగా కుదరలేదు. దీంతో మోసపోయినట్లు గ్రహించి పుదుచ్చేరి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుదువ దుకాణానికి కన్నం వేసి నగల చోరీ

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూర్ జిల్లా తామరైపాక్కానికి చెందిన బుద్ధారామ్ ఎర్రైయూరులో నగల కుదువ దుకాణం నిర్వహిస్తున్నారు. ఈయన సోమవారం రాత్రి దుకాణాన్ని మూసి మంగళవారం ఉదయం తెరిచేందుకు వెళ్లారు. దుకాణం వెనుక భాగంలో గోడకు కన్నం వేసి ఉండటాన్ని గమనించారు. దీంతో బీరువాను పరిశీలించగా 8 సవర్ల బంగారు నగలు, అర కిలో వెండి ఆభరణాలు, రూ.20వేల నగదు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎలక్ట్రిక్ స్కూటర్ కొన్న 10 రోజులకే మరమ్మతు

వినియోగదారుకు రూ.1.60 లక్షలు చెల్లించాలని కోర్టు తీర్పు

టీనగర్, న్యూస్‌టుడే: కొత్తగా కొనుగోలు చేసిన ఎలక్ట్రిక్ స్కూటర్ పది రోజులకే మొరాయించడం, షోరూం నిర్వాహకులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంతో మనస్తాపానికి గురైన ఓ మహిళకు వినియోగదారుల కోర్టు ఇటీవల ఊరటనిచ్చే తీర్పు చెప్పింది. స్కూటర్ ధరతో పాటు నష్టపరిహారంగా మొత్తం రూ.1.60 లక్షలు చెల్లించాలని కోర్టు ఆదేశించింది. రాష్ట్రంలో తిరునెల్వేలి జిల్లా వీరవనల్లూర్ సమీపం కీళాకుళం గ్రామానికి చెందిన తులసీరామ్ భార్య పూర్ణిమ(28) గత ఏడాది జనవరి 14వ తేదీ పాళయంగోట్టయ్‌లోని ఓ ప్రైవేటు బైక్ షోరూంలో రూ.1.19 లక్షలు వెచ్చించి కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్‌ను కొనుగోలు చేశారు. ఆ సమయంలో బ్యాటరీకి 37 నెలల వారెంటీ ఉంటుందని, అద్భుతంగా పనిచేస్తుందని షోరూం సిబ్బంది చెప్పారు. కానీ, కొన్న పది రోజులకే స్కూటర్ స్టార్ట్ చేయడంలో సమస్యలు ఎదురయ్యాయి. దీనిపై షోరూం యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా వారు సరిగా స్పందించలేదు. కొన్ని వారాల తర్వాత బ్యాటరీ అసలు ఛార్జ్ కాలేదు. కంపెనీ కార్యాలయానికి ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. విసిగిపోయిన పూర్ణిమ కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారించిన తిరునెల్వేలి జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఛైర్మన్ పిరవి పెరుమాళ్, సభ్యురాలు షణ్ముగ ప్రియ బెంచ్ తీర్పునిచ్చింది. కంపెనీ సేవల్లో లోపం స్పష్టంగా ఉన్నందున స్కూటరు అసలు ధర రూ.1.19 లక్షలు తిరిగి చెల్లించాలని, వినియోగదారుకు కలిగిన మానసిక క్షోభకు రూ.25 వేల నష్ట పరిహారం చెల్లించాలని, కోర్టు ఖర్చుల నిమిత్తం మరో రూ.10 వేలు మొత్తం రూ.1.60 లక్షలను 45 రోజుల్లోపు చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఒకవేళ గడువులోగా చెల్లించకపోతే తొమ్మిది శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని ఆదేశించింది.

'విజయ్ అవినీతిపరుడు'

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: విజయ్ అవినీతిపరుడని అన్నాడీఎంకే మాజీ మంత్రి దిండుగల్ శీనివాసన్ ఆరోపించారు. ఆయన మంగళవారం దిండుగల్‌లో విలేకరులతో మాట్లాడుతూ... ఎన్నికలు సమీపిస్తుండటంతో ముఖ్యమంత్రి స్టాలిన్ మహిళలకు అనేక పథకాలు ప్రవేశపెట్టి నాటకాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. మగలిర్ ఉరిమైతొగై పథకం కింద రూ.వెయ్యి ఇచ్చి నిత్యావసర వస్తువుల ధరలు పెంచేశారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులను డీఎంకే ప్రభుత్వం మోసగిస్తుందన్నారు. ఇప్పటివరకు పరిపాలించిన పార్టీలు అవినీతిమయమని టీవీకే అధ్యక్షుడు విజయ్ అంటున్నారని, అయితే తన సినిమా విడుదల సందర్భంగా సినిమా థియేటర్లలో దొంగతనంగా టికెట్లు విక్రయించిన విజయ్ ప్రస్తుతం ఒక్క పైసా కూడా అవసరం లేదని చెబుతుండటం హాస్యాస్పదమన్నారు. ఆదాయపన్ను సరిగా చెల్లించకపోవడంతో రూ.కోటిన్నర జరిమానా విధించారని, దీన్నిబట్టి అవినీతిపరుడు విజయ్ అని ప్రజలకు అర్థమవుతోందని తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

ఈనాడు
ఏలూరు
బుధవారం జనవరి 28, 2026 5

సుందరగిరికి కల్యాణ శోభ

రేపటి నుంచి ఉత్సవాలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రకృతి అందాలతో భక్తులకు స్వాగతం పలికే సుందర గిరి లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రం కల్యాణ మహోత్సవాలకు ముస్తాబవుతోంది. ద్వారకాతిరుమల చిన వెంకన్న దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురం సుందర గిరిపై ఈ ఉత్సవాలు ఈ నెల 29 నుంచి వచ్చే నెల 3 వరకు వైభవంగా సాగనున్నాయి. ఇప్పటికే ఆలయానికి రంగులు వేసి విద్యుద్దీప అలంకరణలు చేశారు. చలువ పందిళ్లు, తాత్కాలిక క్యూలైన్ల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. కల్యాణ మండపాన్ని ముస్తాబు చేస్తున్నారు. దిగువ నుంచి కొండపైకి వెళ్లే మార్గానికి ఇరువైపులా విద్యుద్దీపాలంకరణలు చేస్తున్నారు.

లక్ష్మీనరసింహస్వామి

తాత్కాలిక క్యూలైన్ల ఏర్పాటు

ముఖ్య కార్యక్రమాలు ఇలా.. ✦ 29న ఉదయం స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేయడం. సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణ. ✦ 30న నిత్య పూజలు, హోమాలు, బలిహరణ. ✦ 31న ఉదయం 11.10 గంటలకు స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం. ✦ ఫిబ్రవరి 1న సాయంత్రం 6గంటలకు గరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం. ✦ 2న ఉదయం పూర్ణాహుతి. సాయంత్రం చక్ర అవరోహణం. ✦ 3న రాత్రి శేషవాహనంపై ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

గురుకులం పిలుస్తోంది!

దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం

పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే: పేద పిల్లలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల ద్వారా ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందిస్తోంది. ఉచిత వసతి, భోజనం, ఏకరూప దుస్తులు, రాత, పాఠ్యపుస్తకాలు, ఇతరత్రా సదుపాయాలు కల్పిస్తోంది. ఇక్కడి విద్యార్థులు ప్రతిభ చాటుతూ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపుతుండటంతో.. గురుకులాల్లో ప్రవేశాలకు ఏటా పోటీ పెరుగుతోంది.

జిల్లాలో మొత్తం ఆరు.. జిల్లాలో మొత్తం 6 గురుకుల విద్యాలయాలున్నాయి. ఒక్కో గురుకులంలో 80 చొప్పున ఐదో తరగతిలో మొత్తం 480 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు. ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ, బైపీసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో గ్రూపులో 40 చొప్పున సీట్లు భర్తీ చేయనున్నారు. 2026-27 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. విద్యార్థులు ఫిబ్రవరి 19లోపు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎక్కడెక్కడ అంటే.. బాలురు: పెదవేగి, చింతలపూడి **బాలికలు:** వట్లూరు, పోలసానిపల్లి, జంగారెడ్డిగూడెం, ద్వారకాతిరుమల

అర్హతలివే.. ఐదో తరగతి ప్రవేశాలకు 11 ఏళ్లలోపు, ఇంటర్ ప్రథమ ఏడాదిలో 17 ఏళ్లలోపు వయసుండాలి. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. లక్ష మించరాదు. అర్హులు apgpcet.apcfss.in లో దరఖాస్తు చేసుకోవాలి. స్టడీ ధ్రువపత్రం, ఆధార్, ఫొటో, ఫోన్ నంబరు దగ్గర ఉంచుకోవాలి.

❖ ఇది పాలకొల్లు పరిధిలోని ఎస్‌కేజే ఉన్నతపాఠశాల ప్రహరీ. మొంథా తుపాను సమయంలో చెట్టు కూలి పడటంతో ఇలా దెబ్బతింది. అప్పటినుంచి బాగు చేయించినవారు లేరు. అత్యవసరంగా పునర్నిర్మించడం విద్యార్థుల భద్రత దృష్ట్యా అవసరం. ఈ పని పూర్తికి ప్రతిపాదనలను ప్రధానోపాధ్యాయుడు లీప్ యాప్‌లో నమోదు చేశారు. త్వరలో దాతల సహకారంతో పూర్తి చేయడానికి కృషి చేస్తున్నారు.

దాతలే నిర్మాతలు!

❖ బడి అవసరాలన్నీ లీప్ యాప్‌లో నమోదు
❖ కార్పొరేట్ నిధుల కోసం ప్రయత్నాలు

పాలకొల్లు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లోని అత్యవసరాలతో పాటు కొన్ని వసతులను వచ్చే విద్యాసంవత్సరం నాటికి కల్పించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. దాతలు, కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతలో భాగంగా అందించే నిధులతో ఇలాంటి పనులు పూర్తిచేయడానికి రంగం సిద్ధం చేసింది. మన బడి-మన బాధ్యత కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలో చేపట్టాల్సిన ఆయా పనుల వివరాలను లీప్‌యాప్‌లో ఇప్పటికే నమోదు చేయించింది.

ప్రధానోపాధ్యాయులదే బాధ్యత: లీప్ యాప్‌లో నమోదు చేసిన పనుల వివరాలను ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు, దాతల దృష్టికి తీసుకెళ్తున్నారు. పాఠశాల, గ్రామపరిధిలో ఉన్న పారిశ్రామికవేత్తలను కలిసి వారి సాయం కోరనున్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు, తాగునీటి వసతి, ల్యాబ్ సౌకర్యాలు, కంప్యూటర్లు, స్మార్ట్‌బోర్డులు, క్రీడా మైదానాల అభివృద్ధి, ప్రహరీల నిర్మాణం, తరగతిగదుల నిర్మాణం వంటివి లీప్‌యాప్‌లో నమోదుచేసిన పనుల్లో ఉన్నాయి. దాతల సౌలభ్యాన్ని బట్టి నిధుల మంజూరుకు ఉన్న అవకాశాన్ని అనుసరించి కనీస వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. పెద్ద సంస్థల భాగస్వామ్యం లభిస్తే తరగతి గదులు కూడా నిర్మించే అవకాశం ఉంది.

వేగంగా పనులు: జిల్లాలో అన్ని ప్రభుత్వ పురపాలిక, జిల్లాపరిషత్ పాఠశాలల నుంచి వేగంగా ప్రతిపాదనలు లీప్ యాప్‌లో నమోదయ్యాయి. రూ.కోట్లలో నిధులు అవసరమని అధికారులు గుర్తించారు. ఏ బడి పరిధిలో పనులను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడే పర్యవేక్షించాల్సి ఉందని సమగ్రశిక్ష జిల్లా సమన్వయకర్త శ్యామ్‌సుందర్ వివరించారు.

● ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు **3,068**
● విద్యార్థులు **2.10 లక్షలు**

ప్రమాదం మాట వినిపించని రోజేదీ?

ఈనాడు-ఏలూరు

శిరస్త్రాణం ధరించకుండా ప్రమాదవశాత్తు పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్న వాహనచోదకులెందరో. జిల్లాలో సగటున రోజుకు 3 నుంచి 6 ప్రమాదాలు ఇలా జరుగుతున్నాయి. గాయాలపాలై చనిపోయిన ఉదంతాలూ ఉంటున్నాయి. అసలు ప్రమాదం మాట వినిపించని రోజంటూ ఉండదంటే అతిశయోక్తి కాదు. సరిపడా సిబ్బంది లేరనే సాకుతో ట్రాఫిక్ నిబంధనల అమలును పోలీసు, రవాణాశాఖలు విస్మరిస్తున్నాయి. రాష్ట్రంలో రహదారి ప్రమాదాలు అధికంగా చోటుచేసుకుంటున్న జిల్లాల్లో ఏలూరు ఒకటి.

ఉంటే ప్రాణాలు దక్కేవి

శిరస్త్రాణం వెంట తెచ్చుకుని అది పెట్టుకోకుండా ప్రమాదాల్లో చిక్కుకుంటున్నారు. మృత్యువాత పడిన, తీవ్రంగా గాయపడిన ఘటనలు ఉంటున్నాయి. కలపర్రు నుంచి గుండుగొలను వరకు జాతీయ రహదారిలో ఏడాదిలో 10-15 మరణాలు, 100కు పైగా క్షతగాత్రులను చూస్తున్నామని జిల్లా పోలీసు విభాగంలోని డీటీఆర్‌బీ యంత్రాంగం, 108 అంబులెన్స్ సిబ్బంది చెప్పారు.

శిరస్త్రాణం ధరించకుండా వేగంగా దూసుకెళ్లడం, రాంగ్‌రూట్‌లో వెళ్లిపోవడం, లైసెన్సు లేకుండా, చరవాణి మాట్లాడుతూ నడపడం తదితర ఉల్లంఘనలకు పాల్పడటం నిత్యం కనిపిస్తూనే ఉన్నాయి. ఏటా జిల్లా వ్యాప్తంగా ఈ కేసులు 50 వేలకు పైగా ఉంటున్నాయి. కఠిన చర్యలతోనే మార్పు సాధ్యమంటున్నారు నిపుణులు.

జరిమానాలతో సరి: శిరస్త్రాణం ఉండి ధరించని వారు కొందరైతే అసలు అది లేని వారు ఇంకొందరు. మెడ తిరగదని, మెడ సమస్యలొస్తాయని, ఊపిరాడదని, తన పక్క నుంచి వెళ్లే వాహనాలు కనిపించవు అని చాలా మంది బండికే వేలాడదీసి సరిపెడుతున్నారు. పోలీసుల వాహన తనిఖీల్లో చిక్కితే జరిమానాలు కట్టి వెళ్లిపోతున్నారు.

రహదారి నిబంధనల అమలు అంతంతే!

శిరస్త్రాణం ధరించేవారేరీ...

నిపుణుల సూచనలివీ

✦ శిరస్త్రాణం ధరించకపోతే జరిమానా విధింపుతో పాటు కొన్ని రోజులు వాహనాన్ని జప్తు చేయాలి.
✦ పదేపదే పట్టుబడుతూ, ప్రమాదాలు చేస్తుంటే ఏడాది పాటు వాహనం నడపకుండా ఆంక్షలు విధించాలి.
✦ సచివాలయాల వారీగా వీటి వివరాలు మహిళాపోలీసులకు, స్టేషన్ పోలీసులకిస్తే నిఘా పెడితే కొంత మార్పు వస్తుంది.
✦ రహదారులపై భారీ వాహనాల వేగాన్ని స్పీడ్ గన్నులు, కెమెరాలతో గుర్తించి జరిమానాలు వేస్తున్న మాదిరి శిరస్త్రాణం పెట్టుకోని వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తే కొంత కట్టడి అవుతుంది.

ఏలూరు జిల్లాలో 2025లో నమోదైన కేసుల వివరాలు

✶ శిరస్త్రాణం ధరించని, లైసెన్సు లేకుండా, ముగ్గురు నడపడం, రాంగ్‌రూట్‌లో వెళ్తూ పట్టుబడిన కేసులు :62642
✶ విధించిన అపరాధ రుసుములు :రూ.3.08 కోట్లు

బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు

వెళ్తున్నాం.. మళ్లీ వస్తాం

ఏలూరు జాతరకు దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన బంధుమిత్రులంతా మంగళవారం స్వస్థలాలకు బయల్దేరి వెళ్లారు. దాంతో పాత, కొత్త బస్టాండ్లు, రైల్వేస్టేషను ప్రయాణికులతో కిటకిటలాడాయి. కొన్ని ప్రాంతాలకు తక్కువ బస్సులు రావడంతో.. వాటిని ఎక్కేందుకు పోటీపడ్డారు. **- న్యూస్‌టుడే, ఏలూరు గ్రామీణ**

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్ 6లో

పులి గండం తప్పినట్లేనా?


కాలువ వెంబడి పాదముద్రలు

పులి దాడిలో చనిపోయిన దున్నపోతును పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది

కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: వారం రోజులుగా మన్యంతోపాటు మైదాన ప్రాంతమైన కొయ్యలగూడెం మండలంలో ప్రజలను భయాందోళనలకు గురి చేసిన పులి అడవి బాట పట్టినట్లు తెలుస్తోంది. సోమవారం సాయంత్రం వరకు కొయ్యలగూడెం మండలంలోని దిప్పకాయలపాడు, మర్రిగూడెం, బిల్లిమిల్లి గ్రామాల పొలాల వద్ద సంచరించిన పులి రాత్రి కొత్తబాట పట్టింది. వెళ్తూ మార్గమధ్యలో ఒక దున్నపోతుపై దాడి చేసి చంపింది. అనంతరం పడమటి కాలువ మీదుగా మహదేవపురం బుట్టాయగూడెం మండలంలోని అమ్మపాలెం అక్కడి నుంచి గత్తరు వాగు మీదుగా లంకపల్లి వరకు వెళ్లినట్లు స్థానికులు, అటవీశాఖ సిబ్బంది పాదముద్రలను బట్టి గుర్తించారు. వెనుదిరిగి వెళ్తూ కండ్రికగూడెం సమీపంలో పొలంలో కట్టేసిన దున్నపోతును చంపింది. లంకపల్లి వరకు వెళ్లింది కనుక అక్కడి నుంచి అభయారణ్యం కావడంతో లోపలకి వెళ్లిపోయినట్లేనని భావిస్తున్నారు. ఒక వేళ అక్కడి నుంచి మరో దారికి మళ్లుతుందేమోనని దాని కదలికలను గుర్తించేందుకు లంకపల్లి వద్ద ట్రాపింగ్ కెమెరాలను అమర్చినట్లు అటవీ సిబ్బంది తెలిపారు. మరో రెండు రోజులపాటు పులి సంచారంపై నిఘా ఉంచి ఎటువంటి కదలికలు లేకపోతే భయాందోళనలు ఉండవని భావిస్తున్నారు.

మూడు రోజుల తర్వాత.. పులి సంచారంతో గత మూడు రోజులుగా రైతులు పొలాలకు వెళ్లే మార్గం లేకుండా పోయింది. దిప్పకాయలపాడు, కన్నాపురం, బిల్లిమిల్లి, మర్రిగూడెం, చంద్రాయగూడెం, కండ్రిగగూడెం తదితర గ్రామాల రైతులు ఎట్టకేలకు మంగళవారం తమ పొలాలకు వెళ్లారు. సోమవారం రాత్రి ఈ ప్రాంతం నుంచి పులి వెళ్లిపోయినట్లు గుర్తించిన అనంతరం పొలాలకు వెళ్లామని గెడా సత్తిబాబు, కామినేని ఆనంద్‌కుమార్ తెలిపారు.

పశ్చిమలో ఫ్లో బస్సు

సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు పరిచయం

ఫ్లో బస్సు

పాలకోడేరు, న్యూస్‌టుడే: పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన యువ స్టార్టప్ క్రొవ్విడి మధులాష్‌బాబు రూపొందించిన ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్(ఫ్లో) బస్సు తొలిసారి జిల్లాలో అడుగు పెట్టింది. సుమారు రూ.కోటితో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే ప్రయోగశాలగా దీన్ని తీర్చిదిద్దారు. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థులకు ఈ ప్రయోగశాల ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేశారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించాలనే లక్ష్యంతో మధులాష్‌బాబు తొలిసారిగా బస్సును మంగళవారం జిల్లాకు తీసుకొచ్చారు. కాళ్ల మండలం పెదఅమిరం క్యాంపు కార్యాలయంలో ఉపసభాపతి కనుమూరు రఘు రామకృష్ణరాజు బస్సును ప్రారంభించారు. బస్సు లోపల ప్రయోగశాలను ఆయన నిశితంగా పరిశీలించారు. ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని మధులాష్‌బాబు, ఫ్లో టీమ్ సభ్యులు రఘురామకు వివరించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు ఆధునిక పరిజ్ఞానాన్ని పరిచయం చేయాలని ఆయన ఫ్లో బృందానికి సూచించారు.

బస్సు లోపలి ల్యాబ్ పరిశీలిస్తున్న ఉప సభాపతి రఘురామకృష్ణరాజు

డీఆర్‌డీఏ పీడీగా విజయలక్ష్మి

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్‌గా టీవీ విజయలక్ష్మిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పీడీ ఆర్.విజయరాజును పంచాయతీరాజ్ శాఖలోని డీఎల్‌డీవో మాతృ విభాగానికి పంపిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆయన స్థానంలో గుంటూరు జిల్లా డీఆర్‌డీఏ పీడీగా విధులు నిర్వర్తిస్తున్న విజయలక్ష్మిని డిప్యుటేషన్‌పై నియమించింది.

మెప్మాకు రాజబాబు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఎం.రాజబాబును నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పీడీ పోస్టు ఖాళీగా ఉండగా. విజయవాడలోని రాష్ట్ర ఆడిట్ విభాగంలో డిప్యూటీ డైరెక్టర్ కేడర్‌లో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాజబాబును డిప్యుటేషన్‌పై నియమించింది.

తమ్మిలేరు.. ఆపేవారు లేరు!

ఈనాడు-ఏలూరు

ఏదో కొండగుట్టలు.. మారుమూల ప్రాంతాలు.. జన సంచారం లేని నిర్మానుష్య ప్రదేశాల్లో మట్టి తవ్వకాలు చేస్తుంటే అది యంత్రాంగానికి తెలియకపోవచ్చు అనుకోవచ్చు. కానీ ఉదయం లేచింది మొదలు రాత్రి వరకు ఆ ప్రధాన రహదారిలో(ఏలూరు-చింతలపూడి) కొన్ని వందల మంది ప్రభుత్వ ఉద్యోగులు రాకపోకలు సాగిస్తారు. వారే కాదు కలెక్టర్, ఎస్పీ, జేసీ తదితర ఉన్నతాధికారులు ఏలూరు నుంచి పెదవేగి, లింగపాలెం, చింతలపూడి వంటి ప్రధాన కేంద్రాలకు వెళ్లి వచ్చేందుకు ఇదే మార్గం. కనీసం ఆ ఉన్నతాధికారులకైనా అటుగా ప్రయాణించేటప్పుడు 'తమ్మిలేరు'ను చెరబట్టి యథేచ్ఛగా పొక్లెయిన్ వంటి యంత్రాలతో మట్టిని తీసి లారీలు, ట్రాక్టర్లలో తరలిస్తుంటే కనిపించలేదా? కనిపించినా పట్టించుకోలేదా అనేది ప్రశ్నార్థకమవుతోంది.

ఏలూరుకు సమీపంలో కవ్వగుంట వద్ద చింతలపూడి ప్రధాన రహదారికి సమీపంలో పొక్లెయిన్ల సాయంతో మట్టిని తవ్వేసి ట్రాక్టర్లతో రవాణా సాగించడాన్ని పరిశీలిస్తే ఇది కొన్ని నెలలుగా చేస్తున్నారనేది స్పష్టమౌతోంది.

✪ రేయింబవళ్లు తమ్మిలేరులో తాత్కాలికంగా రహదారి ఏర్పాటు చేసుకుని తవ్వకాలు సాగిస్తున్నారు. ఇక్కడి నుంచి లారీలు దుగ్గిరాల ప్రధాన రహదారిలో కలుస్తాయి. అక్కడి నుంచి శనివారపుపేట మీదుగా ఏలూరు నగరంలోకి ప్రవేశిస్తున్నాయి. ఒక్కో లారీకి రూ.5 వేల నుంచి 6 వేలు సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే కొన్ని వేల లారీల మట్టిని మాఫియా కొల్లగొట్టేసింది. అక్కడి గోతుల లోతును పరిశీలిస్తే కొన్ని లక్షల క్యూబిక్‌మీటర్ల మట్టి తరలించి రూ.కోట్లలో సొమ్ము చేసుకుని ఉండొచ్చని సమాచారం. ప్రమాదవశాత్తు వర్షాకాలం నీళ్లు చేరి ఆ గోతుల్లో దిగితే అంతే సంగతులు. ఇంత జరుగుతున్నా ఇటు ఏలూరు, అటు పెదవేగి తహసీల్దార్లు, ఆర్డీవో ఎవరి నుంచీ స్పందన లేదు. కనీసం ఆ ఊళ్లో ఉండే వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులకు ఈ తవ్వకాలు పట్టకపోవటం ఆశ్చర్యమేస్తోంది.

అనుమతులు లేవు : ఈ తవ్వకాల గురించి జిల్లా గనుల శాఖ అధికారి పాపారావు దృష్టికి తీసుకెళ్లి ఏమైనా అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నిస్తే ..'అది తమ్మిలేరు కదా? దానిలో తవ్వకాలే నిషేధం. అసలు ఎలా అనుమతులిస్తాం. తవ్వకాలే జరపకూడదు. బుధవారం మా శాఖ విజిలెన్స్ అధికారులను పంపి విచారణ చేయిస్తాం' అని వివరించారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె విజయవంతం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: వారానికి అయిదు రోజుల పని దినాలు అమలు చేయాలని యూఎఫ్‌బీయూ జిల్లా కన్వీనర్ కాళే శ్రీనివాసరావు, రీజినల్ కార్యదర్శి విమల్ డిమాండ్ చేశారు. నగరంలో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్(యూఎఫ్‌బీయూ) ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన బ్యాంకు ఉద్యోగుల సమ్మె విజయవంతమైంది. ఉద్యోగులు, సిబ్బంది విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. యూనియన్ బ్యాంకు ప్రధాన కార్యాలయం ఎదుట భారీ ఎత్తున ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ.. బ్యాంకులకు శని, ఆదివారాల్లో సెలవు ప్రకటించాలన్నారు. ఐబీఏతో కుదిరిన ఒప్పందాలు అమలు చేయాలని కోరారు. నాయకులు కేజే సత్యనారాయణ, డీఎన్‌వీడీ ప్రసాద్, కిశోర్, నారాయణరావు, లక్ష్మణ్, కిరణ్, ఎ.అప్పలరాజు, పి.కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

తికమక పెట్టిన ఇంజినీర్లు

ఆగ్రహించిన మంత్రి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు నియోజకవర్గంలో అభివృద్ధి పనుల సమీక్షలో మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ విభాగాల ఇంజినీరింగ్ అధికారులు మంత్రిని తికమక పెట్టేందుకు యత్నించడంతో మంత్రి పార్థసారథి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నూజివీడు ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా సీసీ రహదార్లు, డ్రెయినేజీ, తాగు నీటి సమస్యలపై పలు ప్రశ్నలను మంత్రి సంధించారు. పొంతన లేని సమాధానాలు వారు చెబుతుండటంతో అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు. లెస్ టెండర్లు వేసి పనుల్లో జాప్యం చేస్తున్న గుత్తేదారులను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని ఆదేశించారు. మార్చి నెలలోపు పనులు పూర్తి చెయ్యకపోతే టెండర్లు రద్దు చేయిస్తానని హెచ్చరించారు. పట్టణంలో అభివృద్ధి నిమిత్తం రూ.15 కోట్లు కేటాయించగా సెంటర్ లైటింగ్, శ్మశానం వద్ద ప్రహరీ నిర్మాణం చేపట్టాలని, ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తీసుకున్న చర్యలు తదితరాలపై మున్సిపల్ కమిషనర్, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో చర్చించారు.

గంగానమ్మకు కళా నీరాజనం

ఏలూరు తంగెళ్లమూడిలో గంగానమ్మ జాతర నేత్రపర్వంగా కొనసాగుతోంది. మంగళవారం మేడలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక సాయిబాబా ఆలయ నిర్వాహకులు, భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. సాయంత్రం మేడల ప్రాంగణంలో వేదికపై నాట్యాచార్య గండికోట రాజేశ్ శిష్య బృందం ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. **న్యూస్‌టుడే, ఏలూరు ఆధ్యాత్మికం**

అధికారుల బాధ్యతారాహిత్యం తగదు: ఘంటా

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో కొందరు అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుండటం తగదని జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అసహనం వ్యక్తం చేశారు. స్థానిక జిల్లా పరిషత్తు కార్యాలయంలో ఏలూరు, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల డీపీవోలు, డీఎల్పీవోలతో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల డీపీవోలు గైర్హాజరవడంపై ఛైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామాల్లో పారిశుద్ధ్య లోపాలు, చెత్త డంపింగ్, వ్యర్థాల నిల్వలు తదితరాలపై దృశ్య రూపకం ప్రదర్శించారు. ఆమె మాట్లాడుతూ.. పల్లెల పరిశుభ్రతకు అధికారులు పెద్దపీట వేయాలని ఆదేశించారు. సీఈవో ఎం.శ్రీహరి, డీపీవో కె.అనురాధ, డీఎల్పీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ (Divi's)

హైదరాబాద్, విశాఖపట్నం & కాకినాడకు సమీపంలో ఉన్న మా బల్క్ డ్రగ్ పరిశ్రమ ప్రొడక్షన్ విభాగంలో పనిచేయుటకు ఈ క్రింది అర్హతలు, శారీరక ధారుఢ్యం మరియు మంచి ఆరోగ్యం గల అభ్యర్థులు కావలెను.

2022 TO 2025 PASSED OUT & 2026 PURSUING CANDIDATES

Job Title	Qualification	Age	Stipend (P.M)
Trainee Supervisor / Graduate Apprentice	B.Sc. Chemistry	20-25 yrs	Rs. 18,000/-
	B.Pharmacy B.Tech - Chemical / Instrumentation / Mech	20-25 yrs	Rs. 20,000/-
	M.Sc. (Organic Chemistry/ Analytical Chemistry)	20-25 yrs	Rs. 22,000/-
	M.Pharmacy (QA & RA)	20-25 yrs	Rs. 24,000/-

గమనిక : పైన తెలిపిన కోర్సులు పూర్తి చేసిన మరియు ఆఖరి సంవత్సరం చివరి సెమిస్టర్ చదువుతున్న అభ్యర్థులు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు జిరాక్స్ కాపీలను తీసుకుని ఈ క్రింది ప్రదేశాలలో జరుగు ఇంటర్వ్యూకు హాజరు కాగలరు. ఎంపిక కాబడిన అభ్యర్థులు షిఫ్టులలో పనిచేయవలసి ఉంటుంది.

02-02-2026	SIR C.R. REDDY PG COLLEGE (PG Seminar Hall), ELURU
03-02-2026	SHRI VISHNU COLLEGE OF PHARMACY BHIMAVARAM
03-02-2026	KGRL COLLEGE OF PHARMACY BHIMAVARAM
04-02-2026	DR. CSN DEGREE & PG COLLEGE (AUTONOMOUS) BHIMAVARAM
04-02-2026	DNR DEGREE & PG COLLEGE BHIMAVARAM
05-02-2026	SRI YN COLLEGE HRD Center, NARASAPURAM
05-02-2026	BRR & GKR CHAMBERS DEGREE COLLEGE PALAKOLLU
06-02-2026	JOGAIAH INSTITUTE OF TECHNOLOGY & SCIENCES, (Kalagampudi) PALAKOLLU
06-02-2026	SVKP & DR. K.S.RAJU ARTS & SCIENCE COLLEGE PENUGONDA
07-02-2026	DRG GOVT. DEGREE & PG COLLEGE PENTAPADU
07-02-2026	SCIM GOVT. DEGREE & PG COLLEGE TANUKU
09-02-2026	AKRG COLLEGE OF PHARMACY NALLAJERLA
09-02-2026	CSTS GOVT. KALASALA JANGAREDDIGUDEM
11-02-2026	ABN & PRR COLLEGE OF SCIENCE KOVVURU

Interested candidates should report to the venue on or before 10.30 am

సదుపాయాలు : 1) బ్యాచ్‌లర్స్‌కు ఉచిత వసతి, 2) ఉచిత యూనిఫాం, 3) అర్హులైన వారికి PF, ESI ఇవ్వబడును. 4) భోజన ఖర్చులో రాయితీ.

MALE CANDIDATES ONLY

పచ్చని సంసారంలో చిచ్చు పెడుతున్న పంతాలు... పట్టింపులు

నూజివీడు, న్యూస్‌టుడే: కొత్తగా పెళ్లయిన జంటలు.. పెళ్లీడుకొచ్చిన పిల్లలున్న దంపతులు.. కలిసి ఉండలేమంటూ విడాకులకు సిద్ధమవుతున్నారు. తన మాటే చెల్లుబాటు కావాలనే ఆలోచన, సర్దుకుపోలేని మనస్తత్వంతో అధికశాతం కాపురం మావల్ల కాదంటూ పోలీసు స్టేషన్‌కు వస్తున్నారని నూజివీడు డీఎస్పీ వివరించారు. వీరి గొడవలతో పిల్లలు మానసికంగా నలిగిపోతున్నారని గుర్తించలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరికి వారు తమ పంతం నెగ్గాలంటూ మొండితనంగా వ్యవహరించటమే కాపురంలో కలతలకు కారణమని విశ్లేషిస్తున్నారు. పరస్పరం చర్చించుకుంటే చాలా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని సూచించారు. జిల్లాలో గతేడాది భార్యలపై 985 మంది రాక్షసంగా ప్రవర్తించినట్లు గుర్తించారు. 2024లో ఈ సంఖ్య 738 ఉంటే.. 2025లో 247 పెరగడం పరిస్థితి తీవ్రతకు అర్థం పడుతోంది.

ఆగిరిపల్లికి చెందిన యువతి అదే ప్రాంత యువకుడితో రెండేళ్ల క్రితం వివాహమైంది. అప్పటికే అతడికి 2 వివాహాలైనట్లు తెలియడంతో గొడవలు మొదలయ్యాయి. మోసం చేసి తనను పెళ్లి చేసుకున్నాడని బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. జిల్లాలో ఆలుమగలు గొడవలతో రోజూ 20-30 ఫిర్యాదులు వస్తాయని అధికారులు చెబుతున్నారు. నాలుగు గోడల మధ్య పరిష్కరించుకోవాల్సిన అంశాలతో పోలీసు స్టేషన్ గుమ్మం తొక్కుతున్నారని పోలీసు అధికారులు విశ్లేషిస్తున్నారు.

సరదాగా సాగే సంసారంలో గిల్లికజ్జాలు.. చిలిపి తగాదాలు సాధారణం. ఇవి భార్యాభర్తల మధ్య అన్యోన్యత పెంచేందుకు అవసరమంటారు మనస్తత్వ విశ్లేషకులు. వేరు కాపురం పెట్టేందుకు ఇష్టపడని, తన మాట వినని భర్తలకు బుద్ధి చెప్పాలని గృహహింస ఫిర్యాదు, తప్పుడు కేసులు పెడుతున్న మహిళలూ ఉన్నారు. జిల్లాలో మహిళా పోలీస్ స్టేషన్లలో 2025లో 1000కి పైగా కేసులు నమోదయ్యాయి.

మనస్పర్థలకు ఇవే మూలం..

వీటిని విశ్లేషించిన పోలీసులు భార్యా భర్తలు మధ్య చిచ్చు పెడుతున్న 5 అంశాలను గుర్తించారు. వాటిలో వివాహేతర సంబంధాలు, భార్యా పిల్లల్ని వదిలేసి తిరిగే భర్తలు, నిత్యం మద్యం మత్తులో మునిగి భార్య, పిల్లల్ని వేధించటం, వరకట్నం వేధింపులు, ఇరువైపులా కుటుంబసభ్యుల అనవసరమైన జోక్యం. ఆ తరువాతి స్థానాల్లో అభిప్రాయ భేదాలు, అహంకార ధోరణితో చేతులారా కాపురాన్ని నాశనం చేసుకుంటున్నవి ఉన్నాయి.

☛ భార్యాభర్తల గొడవలకు అవే కారణాలు
☛ కౌన్సెలింగ్‌తో 30 శాతం జంటల్లో మార్పు

వేధిస్తే.. జైలు తప్పదు..

పోలీసు అధికారులు.. మానసిక నిపుణుల పర్యవేక్షణలో భార్యా భర్తలకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇస్తున్నాం. దీంతో 30 శాతం మంది జంటలు కలిసిపోతున్నాయి. వరకట్నం, మద్యం మత్తు, వివాహేతర సంబంధాలతో భార్యను చిత్రహింసలు పెడుతున్నట్లు గుర్తిస్తే జైలుకు వెళ్లక తప్పదు.

-కేవీవీఎన్‌వీ ప్రసాద్, డీఎస్పీ, నూజివీడు

(c) eenadu

కుటుంబానికి అండగా... ఆదాయం మెండుగా

- అంతర్జాలం వేదికగా దుస్తుల విక్రయం
- సాంకేతికతతో వ్యాపారులుగా రాణిస్తున్న గృహిణులు

కైకలూరు, మండవల్లి, న్యూస్‌టుడే: అంతర్జాలాన్ని వేదికగా చేసుకుని మహిళలు ఆర్థికవేత్తలుగా రాణిస్తున్నారు. మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తూ మగవారితో పోటీ పడుతున్నారు. ప్రస్తుతం సాంకేతికత విస్తరిస్తున్న తరుణంలో అంతర్జాల వేదికగా అనేక వ్యాపారాలు రూపుదిద్దుకుంటున్నాయి. వీటిని ఆసరాగా వేసుకుని గృహిణులు కుటుంబ పోషణకు మేము సైతం అంటు ముందుకు సాగారు. అంతర్జాలాన్ని వినియోగిస్తూ ఫ్యాన్సీ వస్తువులు, దుస్తులు, ఒక గ్రాము గోల్డ్ వస్తువులు విక్రయాలు చేస్తూ ఆదాయాన్ని సమకూర్చుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

అంతర్జాలంలో విక్రయానికి ఉంచిన చొక్కాలు

పెట్టుబడి లేకుండానే... ప్రస్తుత కాలంలో చిరు వ్యాపారం చేయాలన్నా రూ.50 వేల నుంచి లక్ష వరకు ఖర్చు అవుతోంది. ఈ గృహిణులు ఇంటి వద్దనే ఉంటూ వాట్సాప్, ముఖపుస్తకం, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాలను ప్రచార సాధనాలుగా మార్చుకుని స్నేహితులు, బంధువర్గాలను ఈ గ్రూపుల్లో చేర్చి వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నారు. విక్రయించిన దుస్తులు, ఫ్యాన్సీ నగల విక్రయాల్లో దుకాణ సంస్థలకు నగదు చెల్లించగా కమీషన్ నగదును నేరుగా వ్యక్తిగత ఖాతాకు జమ చేస్తున్నారు. మరికొందరు నేరుగా ఇతర రాష్ట్రాల నుంచి దుస్తులు దిగుమతి చేసుకుని విక్రయించి అమ్మకాలు సాగిస్తున్నారు. ఇలా నెలకు సుమారు రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులు తొలగాయి

నా భర్త ఓ ప్రైవేటు సంస్థలో చిరుద్యోగి సంపాదన కుటుంబ పోషణకే సరిపోతుంది. ఇద్దరి పిల్లల భవిష్యత్తు దృష్ట్యా నా భర్తకు సహకరించాలని ఓ దుస్తుల దుకాణ సంస్థ సహకారంతో అంతర్జాలంతో దుస్తుల విక్రయాలు ప్రారంభించా. తొలుత కొన్ని ఒడుదొడుకులు ఎదురైనా ప్రస్తుతం వ్యాపారం అభివృద్ధి చెందింది. దీంతో ఆర్థిక ఇబ్బందులు తొలగి ధైర్యం ఏర్పడింది. నా భర్త సహకారం మరువలేనిది. **- ఎస్.నాగలక్ష్మి, కైకలూరు**

డ్వాక్రా రుణాలతో..

భర్త చనిపోయిన తరువాత నాకు దుస్తుల వ్యాపారం ఆసరాగా మారింది. మూడేళ్లుగా ఆన్‌లైన్‌లో చిన్నగా చీరల వ్యాపారాన్ని ప్రారంభించారు. క్రమంగా డ్వాక్రా రుణాలను పొందుతూ ప్రస్తుతానికి మండవల్లి దుకాణాన్ని నెలకొల్పి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దుస్తులను విక్రయిస్తున్నాను. ఇద్దరు కుమారులు మంచి ఉద్యోగాల్లో పనిచేస్తున్నారు. ఒకరి అవసరం లేకుండా నా కాళ్లపై నేను ముందుకు సాగుతున్నాను. **- గుడివాడ జ్యోతి, మండవల్లి**

శ్రీవారి పుష్కరిణిలో తేలిన చేపలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి పుష్కరిణి(మాధవకుంట)లో చేపలు మృతి చెందాయి. అవి నీటిపై తేలుతూ దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పంచాయతీ సిబ్బంది వాటిని తొలగించారు. పంచాయతీ చెరువును దేవస్థానం తీసుకుని పుష్కరిణిగా అభివృద్ధి చేసి అందులో వాటర్ ఫౌంటేన్ కూడా ఏర్పాటు చేసింది. అయితే ఇటీవల కాలంలో దేవస్థానం అధికారులు దాని నిర్వహణ గాలికొదిలేశారు. గతంలో కొందరు చేప పిల్లలను తీసుకొచ్చి వేశారని, ఈ నేపథ్యంలోనే అందులో చేపలు పెరిగాయని గ్రామస్థులు చెబుతున్నారు.

అయితే మంగళవారం అందులోని చేపలన్నీ మృతి చెందాయి. ఎవరో విషప్రయోగం చేసి ఉంటారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇందులో ఎవరో చేపలు పెంచుతున్నారని, ఎవరైనా విష ప్రయోగం చేసి ఉంటారని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. దేవస్థానం డీఈ సూర్యనారాయణ మాట్లాడుతూ చేపలు వర్షాలకు కొట్టుకొచ్చి అందులో పెరిగాయన్నారు. పుష్కరిణి పక్కన పంచాయతీ బోరు వేసినపుడు గ్యాస్ వాటర్ అందులోకి వదలడం వల్ల చేపలు చనిపోయాయని తెలిపారు.

సర్వే వేగవంతం చేయండి: కలెక్టర్

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సర్వే, సచివాలయాల పనితీరుపై మంగళవారం ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. సచివాలయాలు పరిధిలోని ప్రతి కుటుంబ వివరాలను యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే యాప్‌లో నమోదు చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది రోజూ ముఖ ఆధారిత హాజరు తప్పనిసరిగా వేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సర్వేకి వెళ్లిన సమయంలోనూ ఆన్‌లైన్‌లో హాజరు వేయాలని స్పష్టం చేశారు. జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి, ఎంపీడీవోలు, పురపాలక, నగరపాలక సంస్థల కమిషనర్లు పాల్గొన్నారు.

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - తాడికొండ

బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Hospitality Partner: CITY Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Man of the Series: Hero
Digital Partner: ఈనాడు.నెట్
TV Partner: ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్, ఈ FM Mee FM
Organised by ఈనాడు

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - 1 జూనియర్స్ : మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్స్‌లతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులు చేసి ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - 1 జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సులతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

సీనియర్స్ విన్నర్స్ రాయలసీమ రాకర్స్

గ్రౌండ్-2లో సీనియర్స్ : సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ చరణ్ జిత్ ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-1 (జూనియర్స్)	గ్రౌండ్-2 (సీనియర్స్)
మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్	మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్	మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

యువత నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: కొత్త సాంకేతికతను బలోపేతం చేయడంలో పదవీ విరమణ చేసిన శాస్త్రవేత్తల పాత్ర ఎంతో కీలకమని, యువత వాటిని అందిపుచ్చుకోవాలని సీఎస్ఐఆర్ ఎన్‌పీఎల్ విశ్రాంత చీఫ్ సైంటిస్ట్ డా. జి.భగవన్నారాయణ తెలిపారు. మంగళవారం నూజివీడు ట్రిపుల్ ఐటీలో జాతీయ క్వాంటం కంప్యూటింగ్ వర్క్ షాప్‌ను డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్‌తో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా భగవన్నారాయణ మాట్లాడుతూ క్వాంటం కంప్యూటింగ్ ప్రాథమిక సూత్రాలు, కృత్రిమ మేధస్సు(ఏఐ) మిషన్ లెర్నింగ్‌లో దాని వినియోగాలు, వివిధ క్యూబిట్ సాంకేతికతలు, క్వాంటం కంప్యూటింగ్ ప్రాయోగిక అంశాలపై తన అనుభవాలను విద్యార్థులకు వివరించారు. డైరెక్టర్ అమరేంద్రకుమార్ మాట్లాడుతూ ఎదుగుతున్న క్వాంటం సాంకేతికతలపై జాతీయ స్థాయి అకడమిక్ కార్యక్రమాన్ని నిర్వహించిన సాంకేతిక బృందాన్ని అభినందించారు. పరిశోధన ఆవిష్కరణలో క్వాంటం కంప్యూటింగ్ ప్రాధాన్యం వేగంగా పెరుగుతోందన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో క్వాంటం ఇన్నోవేషన్ సెంటర్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ వర్క్ షాపు జనవరి 31వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమ కన్వీనర్ జి.దుర్గబాబు, సహ కన్వీనర్లు యు.పావని, పి.వినోద్, ఎ.బ్రహ్మస్వాములు, ఎ.సుధీర్‌కుమార్ ఉన్నారు.

జ్యోతి వెలిగిస్తున్న విశ్రాంత శాస్త్రవేత్త భగవన్నారాయణ, డైరెక్టర్ అమరేంద్రకుమార్

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

మధ్యవర్తిత్వంపై అవగాహన అవసరం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: న్యాయస్థాన కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వం ప్రధానమని, దీనిపై న్యాయవాదులకు అవగాహన అవసరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి అన్నారు. స్థానిక జిల్లా న్యాయస్థాన ప్రాంగణంలో న్యాయవాదుల శిక్షణ తరగతులను మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. న్యాయస్థానాల్లో కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజీ యోగ్యమైన కేసుల్లో ఇరు పక్షాలకు మధ్యవర్తిత్వం నిర్వర్తించి పరిష్కరించాలన్నారు. మద్రాసు హైకోర్టుకు చెందిన ఆర్.విజయ కమల, సత్యరావు శిక్షణనిస్తారని, అవకాశాన్ని న్యాయవాదులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి యు.ఇందిరా ప్రియదర్శిని, లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డైరెక్టర్ నియామకానికి నిరీక్షణ

ఇన్‌ఛార్జుల పాలనలో నిట్

ఈనాడు డిజిటల్, ఏపీ నిట్: ఇదిగో పరీక్షలు నిర్వహించారు... అవిగో ముఖాముఖిలు జరిగాయి... ఇంకేముంది ఏపీ నిట్ డైరెక్టర్ వచ్చేస్తారంటూనే నాలుగేళ్లు గడిచిపోయాయి. అవినీతి ఆరోపణలతో నిట్ డైరెక్టర్ వైదొలిగినప్పటి నుంచి శాశ్వత డైరెక్టర్ నియామకం జరగలేదు. ఇన్‌ఛార్జుల పాలనలోనే నడుస్తుండటంతో త్వరితగతిన నిర్ణయాలు తీసుకోలేక, నిధుల సమీకరణకు, పోస్టుల భర్తీతోపాటు పాలనాపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని కొందరు ఆచార్యులు వాపోతున్నారు.

తాడేపల్లిగూడెం పట్టణంలో 2015లో ప్రారంభమైన ఏపీ నిట్ సువిశాల ప్రాంగణం, పక్కా భవనాలతో రాష్ట్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నూతన కోర్సులతో పాటు పరిశోధన ప్రాజెక్టుల్లో ప్రత్యేక ముద్ర వేసింది. అవినీతి ఆరోపణలపై సీఎస్పీ రావును డైరెక్టర్ పదవి నుంచి తొలగించిన అనంతరం నాగ్పూర్ నిట్ డైరెక్టర్ ప్రమోద్ పడోలే, ఆపై హైదరాబాద్‌లోని ఐఐటీ డైరెక్టర్ బి.శ్రీనివాసమూర్తిని ఇన్‌ఛార్జులుగా చేశారు. తర్వాత పుణె నిట్‌కు చెందిన దిలీప్ పేష్వేను పూర్తిస్థాయి డైరెక్టర్‌గా నియమించినా వ్యక్తిగత కారణాలతో ఆయన బాధ్యతలు చేపట్టలేదు. ప్రస్తుతం రాయ్‌పూర్ ఎన్ఐటీ డైరెక్టర్ ఎన్‌వీ రమణారావు ఇన్‌ఛార్జ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఏడాదైనా.. నిబంధనల ప్రకారం 15 ఏళ్లకు పైగా అనుభవం ఉన్నవారిని నియమిస్తారు. ఇందుకోసం గతేడాది డైరెక్టర్ పోస్టు భర్తీకి కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేసింది. సుమారు 80 మంది ప్రొఫెసర్లు పోటీపడ్డారు. వారికి ముఖాముఖిలు సైతం నిర్వహించారు. డిసెంబరు నెలాఖరులోనే శాశ్వత డైరెక్టర్ వస్తారని ప్రచారం జరిగినా జనవరి దాటింది. దాంతో ఎప్పుడొస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

మున్సిపల్ ఆఫీస్, పాలకొల్లు

ఆర్.ఓ.సి.నెం. 12/2026/ఇ1 ది. 27-01-2026

ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు

పాలకొల్లు పురపాలక సంఘ పరిధిలోని వివిధ వార్డులలో APUFIDC సాఫ్ట్ లోన్ నిధులతో మరియు పురపాలక సంఘ సాధారణ నిధులు వివిధ అభివృద్ధి పనులు చేపట్టుటకు గాను 36 - పనులకు అంచనాలు విలువ సుమారు రూ. 5,07,25,000/- లతో ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండరు కోరడమైనది. టెండరు షెడ్యూలు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెట్ నందు ది. 29-01-2026వ తేదీ సాయంత్రం గం. 04-00 ని.ల నుండి లభించును.

బిడ్ డాక్యుమెంట్ ప్రారంభ తేదీ : 29-01-2026 సాయంత్రం గం. 04.00 ని.లకు
బిడ్ డాక్యుమెంట్ డౌన్లోడ్ ముగింపు తేదీ : 13-02-2026 సాయంత్రం గం. 03.00 ని.లకు
ప్రైస్ బిడ్ తెరచు తేదీ : 13-02-2026 సాయంత్రం గం. 03.30 ని.లకు

మిగిలిన వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెట్ www.tender.apeprocurement.gov.in లేదా కమిషనరు, పాలకొల్లు పురపాలక సంఘము, పాలకొల్లు, పశ్చిమగోదావరి జిల్లా వారిని సంప్రదించగలరు.

సం/- కమిషనరు, పాలకొల్లు పురపాలక సంఘం

అయితే ఆక్రమణలు.. లేదంటే తవ్వకాలు

మాయమవుతున్న సాగునీటి చెరువులు

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: వందల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువులు క్రమంగా కనుమరుగవుతుండటంతో వాటిపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు సాగు నీరందక నానా అవస్థలు పడుతున్నారు. వైకాపా ఐదేళ్ల పాలనలో ఆ పార్టీ నాయకులు చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో గ్రావెల్, మట్టి తవ్వకాలు చేయడంతో తూముల వద్దకు నీరు వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని కర్షకులు చెబుతున్నారు.

ఒకపక్క ఆక్రమణలు, మరో పక్క తూములలోతు కంటే ఎక్కువ లోతులో కందకాలు తవ్వడంతో చెరువులు మొత్తం అధ్వాన స్థితికి చేరాయి. చింతలపూడి, టి.నరసాపురం మండలాల సరిహద్దులో 300 ఎకరాల విస్తీర్ణంలో 3 వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో నందమూరి విజయసాగర్ ప్రాజెక్టు నిర్మించారు. గత అయిదేళ్లలో ప్రాజెక్టు చెరువును పట్టించుకున్న దాఖలాలు లేవు. చెరువు గట్టు మొత్తం పెద్ద వృక్షాలు పెరిగి అభయారణ్యాన్ని తలపిస్తోంది. ఆయకట్టుకు నీటిని వదిలే మూడు తూముల్లోని లాకులు తుప్పుపట్టి నీరు వృథాగా పోతుంది.

ఆక్రమణకు గురైన పెద్ద చెరువు

తూముల వద్ద చెట్లు పెరిగిపోవడంతో చెరువులో నీరున్నా ఆయకట్టుకు వెళ్లే పరిస్థితి లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. చెరువు పైభాగం కొమ్ముగూడెం శివారులో సుమారు వంద ఎకరాలకుపైనే ఆక్రమించి నాలుగు అడుగుల మేర మెరకచేసి ఇంజిన్లు, బోరుబావులు ఏర్పాటు చేసి సాగు చేస్తున్నా.. పట్టించుకున్న నాథుడు లేరు. వారిలో కొంతమందికి పట్టాలు ఉండటం గమనార్హం. చెరువు మధ్యలో పట్టాలు ఎవరిచ్చారో దేవుడికే తెలియాలని సమీపంలోని అన్నదాతలు వాపోతున్నారు.

తుప్పుపట్టిన సామగ్రి

నందమూరి విజయసాగర్ ప్రాజెక్టు నుంచి బంధంచర్ల, జగ్గవరం, రాజుపోతేపల్లి, తెడ్లం గ్రామాలకు సాగునీటిని అందించేందుకు ఇరవై ఏళ్ల కిందట రూ.కోట్లు ఖర్చు చేసి పైపులైన్లు వేసి ప్రాజెక్టు సమీపంలో షెడ్డు, బావి నిర్మించి విద్యుత్తు సౌకర్యం కల్పించారు. అప్పటి నుంచి చెరువులో పూర్తి నీటి సామర్థ్యం లేకపోవడంతో ఒక్కసారి కూడా ఎత్తిపోతల పథకం పైపులైన్ల ద్వారా నీటిని సరఫరా చేసింది లేదు. దీంతో రూ.కోట్లు విలువైన మోటార్లు, పైపులైన్లు, ఇతర విలువైన సామగ్రి తుప్పుపట్టిపాడైపోయాయి.

ప్రతిపాదనలు పంపాం

చెరువు అభివృద్ధికి రూ.3.50 కోట్లు అవసరం అవుతుందని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. చెరువు ఆక్రమణలపై సర్వే చేసి తొలగిస్తాం.
- అనిల్‌కుమార్, జలవనరులశాఖ జేఈ

క్రీస్తు గీతాలు ఆలపిస్తున్న మహిళలు

ప్రజల జీవితాల్లో వెలుగులు

నాచుగుంట(ఉంగుటూరు), న్యూస్‌టుడే: ఏసుక్రీస్తు ప్రేమ విశ్వమంతా వ్యాపించి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిందని బైబిల్ మిషన్ అధ్యక్షుడు రెడరెండ్ పి.సజీవరావు అన్నారు. నాచుగుంటలో బైబిల్ మిషన్ మహా సభలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సుదూర ప్రాంతాల నుంచి విశ్వాసులు తరలివచ్చారు. మిషన్ ఉపాధ్యక్షుడు ఎ.దైవరావు, కార్యదర్శి వైఐడీ ఇమ్మానుయేలు, సంయుక్త కార్యదర్శి జీఆర్ ఇమ్మానుయేలు రాజుతో కలిసి సజీవరావు సభా ప్రాంగణానికి చేరుకుని తొలి సందేశమిచ్చారు. ప్రసన్నకుమార్, వినోద్‌బాబు, నోవా, విజయ్‌కుమార్ ప్రసంగించారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు డిమాండ్

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఎర్రా రాంబాబు అధ్యక్షత వహించారు. రమణారావు మాట్లాడుతూ.. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు కొండలరావు, అప్పారావు, ఆదికృష్ణ, రాజు, నాగరాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రమణారావు

ఇంటర్ వృత్తివిద్య ప్రయోగ పరీక్షలు ప్రారంభం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలో ఇంటర్మీడియట్ వృత్తివిద్య ప్రయోగ పరీక్షలు మంగళవారం ప్రశాంత వాతావరణలో ప్రారంభమయ్యాయి. మొత్తం పది కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. తొలి రోజు 1,504కి 1,320 మంది హాజరయ్యారు. మిగతా 184 మంది గైర్హాజరయ్యారని ఆర్ఐవో యోహాన్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -143 రిటైల్ ధర 170 చికెన్ విత్ స్కిన్ - 247 చికెన్ స్కిన్‌లెస్ - 281. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 162, 171, 182 చికెన్ విత్ స్కిన్ - 314 చికెన్ స్కిన్‌లెస్ - 324.

కారు ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

తాళ్లమూడి(పెదపాడు), న్యూస్‌టుడే: వృద్ధురాలిని కారు ఢీకొనడంతో.. అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై ఆర్.శ్రీను కథనం మేరకు.. తాళ్లమూడికి చెందిన వీరమాచినేని సీతామహాలక్ష్మి(64) మంగళవారం సాయంత్రం ఇంట్లోని చెత్త పారబోసేందుకు రోడ్డు దాటుతున్నారు. విజయవాడ నుంచి ఏలూరు వైపు వెళ్తున్న కారు ఆమెను వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో సీతామహాలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలికపై బాలుడి అత్యాచారం

దెందులూరు, న్యూస్‌టుడే: బాలికపై బాలుడు అత్యాచారం చేసిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. దెందులూరుకు చెందిన ఓ బాలిక స్థానికంగా మూడో తరగతి చదువుతోంది. సోమవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాలకు సెలవు ఇచ్చారు. తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లడంతో చిన్నారి ఇంట్లో ఒంటరిగా ఉందన్న విషయాన్ని గమనించిన పదో తరగతి చదువుతున్న బాలుడు ఆమెపై అత్యాచారం చేశాడు. తల్లిదండ్రులు ఇంటికొచ్చే సరికి బాలిక నీరసంగా పడుకొని ఉండటంతో.. ఏమైందని వారు ఆరా తీశారు. వారికి విషయం చెప్పడంతో.. దెందులూరు సీహెచ్‌సీకి తీసుకెళ్లి పరీక్షలు చేయించారు. వైద్యులు స్కానింగ్ పరీక్షలు చేసి.. రిపోర్టులు పరిశీలించినానంతరం అత్యాచారం జరిగినట్లుగా నిర్ధారించారు. విషయం బయటకు పొక్కడంతో బాలుడు, అతడి కుటుంబ సభ్యులు ఇంటికి తాళమేసి పరారయ్యారు. ఈ ఘటనపై బాధిత తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసినానంతరం తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా బాలల సంరక్షణాధికారిణి సూర్యచక్రవేణి తెలిపారు.

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

నేడు వాసవీశాంతిధామ్‌లో వార్షికోత్సవం

వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: వాసవీశాంతిధామ్‌లో కన్యకా పరమేశ్వరి అమ్మవారి 90 అడుగుల పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ 7వ వార్షికోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు అఖిల భారత వాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్టు అధ్యక్షుడు పి.ఎన్ గోవింద రాజులు తెలిపారు. మంగళవారం స్థానిక వాసవీ శాంతిధామ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ కోరికను మన్నించి పెనుగొండను వాసవీ పెనుగొండగా మార్చినందుకు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం అమ్మవారి ఆలయంలో నూతనంగా నిర్మించిన సంకల్ప మందిరాన్ని ప్రారంభించనున్నామన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధర కొనబడును. (స్పాట్ క్యాష్). ✆ 83338 33368

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును (స్పాట్ క్యాష్). Ph : 8142292071.

JOBS

✆ 93921 80560.

Contact No: ✆ 80962 46099.

✆ 78932 35972.

✆ 99895 35241.

EDUCATION

విజయవాడలో BPT/B.Sc., MLT- ... Affiliated to Dr.NTR యూనివర్సిటీ. ✆ 7995945835.

REAL ESTATE

FLAT FOR SALE

TP గూడెం ఏలూరు ... 2BHK 301 ... 1000sft ... సంప్ర: 98665 29233.

LAND FOR SALE

2 ఎకరాల 20 సెంట్ల ... 8500405678, 9885912559

గమనిక

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

నెక్ సూచించిన కోడ్ల గ్రిడ్ ధర ... సంప్రదించండి: 08819-224254

ఏలూరు

రథం తయారీకి ప్రవాసాంధ్రుడి విరాళం

చెక్కు అందజేస్తున్న రామకృష్ణారావు దంపతులు

కైకరం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: కైకరం సుందర సీతారామస్వామి కళింగ రామాలయానికి గ్రామానికి చెందిన ప్రవాసాంధ్రుడు సనపల రామకృష్ణారావు, భానుమతి దంపతులు రూ.1,00,116 విరాళమిచ్చారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో కమిటీ సభ్యులు అప్పారావు, శ్రీనివాస్, రాంప్రసాద్, గణేశ్‌కు మంగళవారం అందజేశారు. రథం తయారీకి నగదు వినియోగించాలని కోరారు.

మెరిసిన పెదవేగి విద్యార్థులు

గవర్నర్ నుంచి ట్రోఫీ అందుకుంటున్న సునిత్‌కుమార్

పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే: అమరావతిలో నిర్వహించిన గణతంత్ర దిన వేడుకల కవాతులో పెదవేగి గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. తొమ్మిదో తరగతి చదువుతున్న సునిత్‌కుమార్ బృందానికి కెప్టెన్‌గా వ్యవహరించి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ నుంచి ట్రోఫీ అందుకున్నారు. మరో తొమ్మిది మంది సభ్యులుగా పాల్గొన్నారు. ఈ బృందానికి పీడీ జయరాజు సమన్వయకర్తగా వ్యవహరించారు. ప్రథమ స్థానం సాధించిన బృందాన్ని పలువురు అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు గ్రామీణం:	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

పెదపాడు, న్యూస్‌టుడే: ? స్థానిక సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల వద్దనున్న ప్రధాన రహదారిపై ఎత్తుగా వేగ నిరోధకాలు ఏర్పాటు చేశారు. వీటిని దాటలేక కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల ఇంజిన్లు ఆగిపోతున్నాయి. ఫలితంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. - కొండపల్లి శ్రీరామ్‌కుమార్, ఏలూరు

✔ వేగ నిరోధకాల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారి నుంచి అనుమతులు రాగానే తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. - శేషుకుమార్, ర.భ.శా. ఏఈ

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: ? స్థానిక ప్రాథమిక పాఠశాల-2 అంబేడ్కర్ విగ్రహ సమీప వీధుల్లోని మురుగు కాలువలు చెత్తా చెదారంతో నిండిపోయాయి. ఫలితంగా దుర్వాసన రావడంతో పాటు దోమల బెడద తీవ్రంగా ఉంది. - లక్ష్మణ్, స్థానికుడు

✔ సమస్య మా దృష్టికి రాలేదు. పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువలను శుభ్రం చేయిస్తాం. - స్వామి, డిప్యూటీ ఎంపీడీవో

ఎట్టకేలకు మట్టి దిబ్బల తొలగింపు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: స్థానిక రామకృష్ణాపురంలోని మినీ బైపాస్, కృష్ణా కాలువ పక్కన, జూట్ మిల్లు నుంచి శివాలయం వరకున్న బైపాస్ అంచుల్లో పేరుకుపోయిన మట్టి దిబ్బలను ఎట్టకేలకు తొలగించారు. 'కాలువల్లేక.. చెత్త తొలగించక!' శీర్షికన ఈ నెల 18న 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు. మినీ బైపాస్ అంచుల్లోని మట్టి దిబ్బలు, చెత్తా చెదారాలను పొక్లెయిన్‌తో తొలగించి ట్రాక్టర్ల ద్వారా తరలించారు.

కిసాన్ సభను విజయవంతం చేద్దాం

భీమడోలు, న్యూస్‌టుడే: గుంటూరు వేదికగా ఈ నెల 29న నిర్వహిస్తున్న అఖిల భారత కిసాన్ సభ జాతీయ సమావేశాలను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పూళ్లలో మంగళవారం రైతులతో సమావేశమై మాట్లాడారు. నాయకులు శ్రీరామచంద్రమూర్తి, ఎం.శివశంకర్, ఎ.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పన్నులు కట్టక.. పనులు సాగక!

గ్రంథాలయాలకు బకాయిల భారం

పరిశీలన

ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనం పైకప్పు పెచ్చులూడగా.. దాని కిందే పాఠకులు చదువుకుంటున్న దృశ్యమిది. దీన్ని 1960లో ప్రారంభించారు. 55 ఏళ్లకు పైగా సేవలందించి.. ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. గోడలు బీటలు వారాయి. భవనం దెబ్బతినడంతో.. పాఠకులు జాగ్రత్త వహించాలని ఏడాది కిందట ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం గమనార్హం.

ఉంగుటూరు శాఖా గ్రంథాలయం కిటికీలకు తలుపుల్లేకపోవడంతో.. బరకాలు అడ్డుగా కట్టిన చిత్రమిది. ప్రస్తుతం భవనం పైకప్పు దెబ్బతింది. వర్షాకాలంలో శ్లాబు లీకై వర్షపు నీరు ఉరుస్తోంది. మరుగుదొడ్డికి తలుపులు నిర్మించాల్సి ఉంది. పంచాయతీల నుంచి సెస్ రూపంలో సుమారు రూ.10 లక్షలు పైగా బకాయిలు రావల్సి ఉంది.

ఏలూరు ఆర్ఆర్ పేట, ఉంగుటూరు- న్యూస్‌టుడే: విజ్ఞాన భాండాగారాలైన గ్రంథాలయాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. సరిపడా నిధుల్లేక.. సెస్సులు చెల్లించక.. సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రజల నుంచి పంచాయతీలు, పురపాలక, నగరపాలక సంస్థలు పన్నులు వసూలు చేస్తున్నా.. అందులో గ్రంథాలయాల సెస్సులను ఖాతాల్లో జమ చేయడం లేదు. ఏలూరు నగరపాలక సంస్థ రూ.11 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉండటం గమనార్హం.

రాజ్యమేలుతున్న అసౌకర్యాలు.. కూటమి ప్రభుత్వం తరచూ ఉద్యోగ ప్రకటనలు జారీ చేస్తోంది. ప్రైవేట్ శిక్షణ కేంద్రాల్లో చేరలేని నిరుద్యోగులు గ్రంథాలయాలపై ఆధారపడి సన్నద్ధమవుతున్నారు. శిథిల, అద్దె భవనాలు, అంతర్జాల సౌకర్యం, మరుగుదొడ్లు లేకపోవడం, చెదలు పట్టిన పుస్తకాలు, సిబ్బంది కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. 'సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం. సెస్సు బకాయిలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం' అని ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబు తెలిపారు.

ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో ఇదీ పరిస్థితి..

శాఖా గ్రంథాలయాలు: ఉంగుటూరు, భీమడోలు, పూళ్ల, గుండుగొలను, నిడమర్రు, గణపవరం, పిప్పర, దెందులూరు, పోతునూరు, పెదవేగి, పెదపాడు, చాటపర్రు.

జిల్లా: ఏలూరు రెండో పట్టణం, ఎస్బీఐ ప్రధాన శాఖ పక్కన

మహిళా: ఏలూరు 12 పంపుల కూడలి

బాలలు: ఏలూరు ఒకటో పట్టణం వైఎంహెచ్ఏ హాల్ పక్కన

పీ4తో పేదల జీవితాల్లో వెలుగులు

చివరి దశకు చేరుకున్న ఇంటి ముందు పత్సమట్ల, రామారావు

నల్లమాడు (ఉంగుటూరు), న్యూస్‌టుడే: పీ4తో పేదల జీవితాల్లో కూటమి ప్రభుత్వం వెలుగులు నింపుతోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. నల్లమాడుకు చెందిన దివ్యాంగురాలు జలాది లక్ష్మి కుటుంబాన్ని గతేడాది డిసెంబరు 1న సీఎం చంద్రబాబు సమక్షంలో ఉంగుటూరు గ్రీన్ ఏసియా ఇంపెక్స్ పరిశ్రమ అధినేత పసుపులేటి వెంకట రామారావు దత్తత తీసుకున్నారు. అసంపూర్తిగా నిలిచిన లక్ష్మి ఇంటిని పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. నిర్మాణ పనులను మార్గదర్శి రామారావుతో కలిసి ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. వారి వెంట నాయకులు సుధీర్, అయ్యప్ప, వెంకట నారాయణస్వామి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించండి



ఉద్యోగోన్నతి పత్రాలు ఇస్తున్న భానుప్రతాప్, పెదబాబు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కమిషనర్ భానుప్రతాప్, కో-ఆప్షన్ సభ్యుడు పెదబాబు సూచించారు. నగరపాలక సంస్థలో బిల్ కలెక్టర్లుగా పని చేస్తున్న ఎ.గంగాధరరావు, ఎం.లాల్ చంద్రశేఖర్, జి.వి.శివరామకృష్ణకు సీనియార్టీ జాబితా అనుసరించి జూనియర్ అకౌంటెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ మేయర్ నూర్జహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. వారికి సంస్థ కార్యాలయంలో కమిషనర్ ఉద్యోగోన్నత పత్రాలు అందజేశారు.

● పడమరవీధి గంగానమ్మ జాతర ఏర్పాట్లను కమిషనర్ భానుప్రతాప్, కో-ఆప్షన్ సభ్యుడు పెదబాబు మంగళవారం పరిశీలించారు. భక్తులకు కల్పించనున్న సదుపాయాలు, కొత్తబండ ఊరేగింపు ప్రాంతాల్లో చేపట్టాల్సిన జాగ్రత్త చర్యలను ఆలయ కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

జేసీకి అర్జీ ఇస్తున్న నాయకులు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యుత్తు మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. స్థానిక కలెక్టరేట్‌లో జేసీ అభిషేక్ గౌడ, విద్యుత్తు భవన్‌లో ఎస్ఈ సాల్మన్‌రాజును మంగళవారం వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ.. జిల్లాలో 4 వేల మందికి పైగా విద్యుత్తు మీటర్ రీడర్లు విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు తీసుకొస్తున్న నేపథ్యంలో.. వారి పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైందన్నారు. నాయకులు శ్రీనివాసరావు, దుర్గారావు, మురళీబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొలువులు భర్తీ చేయాలి

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో 25 శాతం కొలువులను ఉద్యోగుల కోటా ప్రకారం భర్తీ చేయాలని ఆ సంఘ నాయకులు డీఎన్‌వీడీ ప్రసాద్, టి.గంగరాజు విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌లో డీఆర్వో విశ్వేశ్వరరావు, జిల్లా సహకార శాఖాధికారి ఎ.శ్రీనివాసును మంగళవారం వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు.

వసతుల్లేక.. ఉండలేక..

పెదవేగి మండలం దిబ్బగూడెం లక్ష్మీపురం పేదల కాలనీలో సదుపాయాలు మృగ్యమయ్యాయి. కాలనీలో ముళ్ల చెట్లు మొలిచి చిట్టడవిని తలపిస్తున్నాయి. కాలనీకి దారి పక్కన పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో.. రాకపోకలు సాగించేందుకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. వీధి దీపాలు సైతం లేకపోవడంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. - న్యూస్‌టుడే, లక్ష్మీపురం(పెదవేగి)

అద్దె ముద్దు.. సొంతం వద్దు

గణపవరం మండలం ముప్పర్తిపాడు ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయ భవనం నిరుపయోగంగా ఉందని.. అందులోకి కేంద్రాన్ని మార్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తామని సెక్టార్ పర్యవేక్షకురాలు చంద్రావతి తెలిపారు. - న్యూస్‌టుడే, గణపవరం

గట్టుంది.. చెత్తతో నిండింది

ఏలూరు మినీ బైపాస్ సమీప తపాలా కాలనీలోని కృష్ణా కాలువ వెంబడి చెత్త, వ్యర్థాలు వదిలేస్తున్నారు. వాటిని రోజుల తరబడి తొలగించకపోవడంతో గుట్టలా పేరుకుపోతున్నాయి. కొందరు ఆకతాయిలు నిప్పు పెడుతుండటంతో.. ఆ ప్రాంతాన్ని పొగ కమ్మేస్తోంది. ఫలితంగా ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. - న్యూస్‌టుడే, ఏలూరు నగరం

పొదలు పెరిగి.. ఆందోళన రేగి!



గణపవరం మండలం అర్ధవరం మంచినీటి ట్యాంకు సమీప విద్యుత్తు పరివర్తకంపై పిచ్చి పొదలు పెరిగాయి. సిమెంటు రహదారిని ఆనుకొని పరివర్తకం ఉండటం.. చిన్నపాటి గాలికే నిప్పురవ్వలు పడుతుండటంతో.. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగక ముందే పొదలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గణపవరం

మురుగు.. రోడ్డుపై పరుగు

నిడమర్రులో బాల వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారిలో డ్రెయినేజీ అస్తవ్యస్తంగా ఉంటోంది. పూడికతీత లేక కాలువలు లేకపోవడంతో.. మురుగు నీరంతా రోడ్డుపైకి చేరుతోంది. దీంతో దుర్వాసన రావడంతో పాటు దోమల బెడద అధికంగా ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య సిబ్బందిని పంపి మురుగు తొలగించేలా చూడాలని పంచాయతీ కార్యదర్శి సంజీవరావు తెలిపారు. - న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం

ఉత్సాహంగా.. ఉల్లాసంగా

బొమ్మిడి (ఉంగుటూరు), న్యూస్‌టుడే: బొమ్మిడి జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉప్పాకపాడుకు చెందిన పూర్వ విద్యార్థిని రాకుర్తి జయలలిత పాఠశాల అభివృద్ధికి రూ.50 వేలు విరాళమిచ్చారు.

పెదపాడు: స్థానిక ఉన్నత పాఠశాలలో మంగళవారం అట్టహాసంగా వార్షికోత్సవం నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రాలతో హాజరై సందడి చేశారు. క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం తదితర పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

పెదపాడు: నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నిడమర్రు గ్రామీణం: చానమిల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవానికి ఎంపీడీవో విజయకుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

సుస్థిర జీవనోపాధితో మహిళా సాధికారత

మాట్లాడుతున్న డీపీఎం విజయ

దెందులూరు, న్యూస్‌టుడే: సుస్థిర జీవనోపాధితో మహిళలు సాధికారత సాధించాలని.. తదనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని డీఆర్‌డీఏ ఐబీ డీపీఎం విజయ అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో విజన్ షెడ్యూల్ 3పై మంగళవారం శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఏలూరు, కామవరపుకోట ఏపీఎంలు నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం హాజరై వివిధాంశాలపై అవగాహన కల్పించారు. దెందులూరు ఎంపీడీవో వీరప్రతాప్, ఏపీఎం సురేశ్‌కుమార్ సభ్యులకు సూచనలిచ్చారు. ద్వారకాతిరుమల, నిడమర్రు, దెందులూరు, ఆగిరిపల్లి, నూజివీడు, ముదినేపల్లి, కైకలూరు మండలాల ఏపీఎంలు, సీసీలు, అకౌంటెంట్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: చాటపర్రు విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు, తీగల మరమ్మతు కారణంగా బుధవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ కె.అంబేడ్కర్ తెలిపారు. చాటపర్రు, బాబుఖాన్‌గూడెం, ఆటోనగర్, మల్కాపురం, రాయల్ సిటీ, సాయినగర్, కొక్కిరాయిలంక, పైడిచింతపాడు గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

పెదవేగి(పెదపాడు): భోగాపురం విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతుల దృష్ట్యా బుధవారం మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదని అంబేడ్కర్ తెలిపారు. ఉదయం 4 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వ్యవసాయ విద్యుత్తు సరఫరా చేయనున్నట్లు చెప్పారు.

ఉంగుటూరు: అక్కుపల్లిగోకవరం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ తెలిపారు. ఉదయం 5 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వ్యవసాయ విద్యుత్తు సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

సివంగితో పోటీ.. పరుగులో మేటి!

జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్న యువతులు

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: వారు పేదింట్లో జన్మించారు. ఓవైపు చదువు.. మరోవైపు పరుగులో రాణిస్తున్నారు. తమ కలల సాకారానికి, జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు వడివడిగా అడుగులేస్తున్నారు. ఏలూరు అల్లూరి సీతారామరాజు క్రీడా మైదానంలో.. శాప్ ఆధ్వర్యాన శిక్షకురాలు జి.కృష్ణకుమారి వద్ద సాధన చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో మెరిసిన క్రీడాకారిణులపై కథనం.

ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యం

నా పేరు వడ్డిపల్లి రంజని. నాన్న శ్రీనివాసరావు వ్యవసాయ కూలీ. అమ్మ భారతి గృహిణి. ఏలూరు కొటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నా. మూడేళ్లుగా పరుగులో నిత్య సాధన చేస్తున్నా. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ పొందుతున్నా. ఇటీవల బాపట్ల జిల్లా చీరాలలో నిర్వహించిన దక్షిణ ప్రాంతీయ స్థాయి పోటీల్లో 400, 200 మీటర్ల విభాగాల్లో రజతం, కాంస్య పతకాలు సాధించా. గుంటూరు వేదికగా జరిగిన జూనియర్ జాతీయ స్థాయి పోటీల్లో 400, 200 మీటర్ల విభాగాల్లో రజతం, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నా.

పోలీసు కొలువే ధ్యేయం

నా పేరు బర్రి నీలిమ. నాన్న నాగరాజు మత్స్యకారుడు. అమ్మ చంద్రకళ గృహిణి. ఏలూరులో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. మూడేళ్లుగా అథ్లెటిక్స్‌లో శిక్షణ పొందుతున్నా. తొలి నుంచి పరుగుపై దృష్టి పెట్టి.. నిత్యం శ్రమిస్తున్నా. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రజత పతకాలు సొంతం చేసుకున్నా. 2025-26లో బెంగళూరులో నిర్వహించిన అఖిల భారత విశ్వవిద్యాలయ స్థాయి 400 మీటర్ల పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచా. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొస్తా. క్రీడా కోటాలో పోలీసు కొలువు సాధించడమే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్నా.

కార్మిక సమస్యల పరిష్కారంలో విఫలం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ లైసెన్స్‌డ్ పోర్టర్స్ సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్, వేములరాంబాబు డిమాండ్ చేశారు. స్థానిక కొత్త బస్టాండ్ సమీప సంఘ కార్యాలయంలో మంగళవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడు తమ్మిశెట్టి రమణయ్య అధ్యక్షత వహించారు. కార్మిక హక్కుల సాధనకు ఏఐటీయూసీ కృషి చేస్తోందని వారు పేర్కొన్నారు. గౌరవాధ్యక్షుడు హేమశంకర్, ఉపాధ్యక్షుడు ఎర్రయ్య, వెంకటేశ్, అబ్రహం, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

విద్యార్థులకు సూచనలిస్తున్న శ్రీను

పెదపాడు, న్యూస్‌టుడే: సైబర్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఆర్.శ్రీను సూచించారు. స్థానిక సెయింట్ ఆగస్టీన్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బాలికల రక్షణకు రూపొందించిన పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆపద వేళ టోల్‌ఫ్రీ నంబరు 112కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము :: దేవాదాయ ధర్మదాయ శాఖ

శ్రీ రాట్నాలమ్మ అమ్మవారి దేవస్థానము

రాట్నాలకుంట (గ్రా), పెదవేగి (మం), ఏలూరు జిల్లా.

టెండర్ ప్రకటన

లెటర్ నెం. 172/26. తేది: 24.01.2026

ది 01-04-2026 నుండి 05-04-2026 వరకు తిరుణాళ్ళ ఉత్సవములలో వివిధ పనులు చేయు నిమిత్తం సీల్డు టెండర్లు కొరకు ప్రకటన. 1) తాటి ఆకులతో చలువ పందిర్లు - 2 వేయుటకు 2). స్టేజి వద్ద స్త్రీలకు బారిగేట్లు ఏర్పాటు చేయుటకు 3). అన్న సమారాధనకు (20 వేలమందికి) టిప్ టాప్ సామాగ్రి (షామియానా, పందిర్లతో సహా) సప్లయి చేయుటకు 4) శ్రీ అమ్మవారి కోనేరు (సుమారు 0.50 సెంట్లు) చెరువు క్లీన్ చేసి నీరు నింపుట 5). తిరుణాళ్ళ ఉత్సవముల కార్యక్రమములు ఫోటోలు, వీడియో తీయుటకు 6). కాయగూరలు సప్లయి చేయుటకు 7). పాలు పెరుగు సప్లయి చేయుటకు, 8) వంట గ్యాస్/వంట చెరుకు సప్లయి చేయుటకు 9). వంట మేస్త్రి మరియు క్యాటరింగ్ సిబ్బంది సప్లయి చేయుటకు 10) శ్రీ అమ్మవారికి పూల అలంకరణ కొరకు 11). బ్యాండు/సన్నాయి మేళం గ్రామోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమములు నిర్వహించుట కొరకు కళాకారులను సప్లయి చేయుటకు. 12). ఆరోగ్యము/ పారిశుద్ధ్యము పని వారలను సప్లయి చేయుటకు. 13). సి.సి.టివి కెమెరాలు ఏర్పాటు చేయుటకు టెండరు షెడ్యూలును ది: 26-01-2026వ తేదీ ఉదయం 9:00ల నుండి 04-02-2026 వ తేది మధ్యాహ్నం గం.1:00ల వరకు కార్యాలయములో పొందవచ్చును. పైన తెలిపిన టెండర్లు సీల్డు కవరులలో పెట్టి కార్యనిర్వహణాధికారి, శ్రీ రాట్నాలమ్మ అమ్మవారి దేవస్థానము వారికి ది. 04-02-2026 వ తేదిన మధ్యాహ్నం గం.1:00 లోపు అందజేయవలెను. అదేరోజు మధ్యాహ్నం గం. 4:00 లకు దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులు హాజరైన టెండరుదార్ల సమక్షములో కార్యనిర్వహణాధికారిచే టెండర్లు తెరువబడును. టెండరుదారులు అగ్రిమెంటు ఇవ్వవలెను. ప్రతి టెండరుకు రూ.250/- లు ధరావతు చెల్లించవలెను. టెండరు షెడ్యూలు కొరకు, మిగిలిన వివరముల కొరకు ఆఫీసు పనివేళలలో తెలుసుకొనగలరు.

శ్రీ మన్నే శ్రీనివాసరావు, ఛైర్మన్ మరియు ధర్మకర్తల మండలి

సం/- యన్. సతీష్ కుమార్, కార్యనిర్వహణాధికారి, సెల్: 96405 95351

రాట్నాలకుంట, తేది: 24-01-2026

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము :: దేవాదాయ ధర్మదాయ శాఖ

శ్రీ రాట్నాలమ్మ అమ్మవారి దేవస్థానము

రాట్నాలకుంట (గ్రా), పెదవేగి (మం), ఏలూరు జిల్లా.

టెండర్ ప్రకటన

లెటర్ నెం. 172/26. తేది: 24.01.2026

ది 01-04-2026 నుండి 05-04-2026వ తేది వరకు జరుగుచున్న శ్రీ అమ్మవారి వార్షిక తిరుణాళ్ళ ఉత్సవములలో తాత్కాలిక విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేయు నిమిత్తం సీల్డు టెండర్లు కొరకు ప్రకటన. 1) శ్రీ అమ్మవారి అంతరాలయము, గర్భాలయము, అమ్మవారి గుడి, అనివేటి మండపములను వివిధ రకముల సీరియల్ దండలు, ఫ్యాన్సీ లైట్స్ (ట్రిక్ లైట్స్), డే లైట్స్ తో విద్యుత్ దీపాలంకరణం చేయుట. 2) శ్రీ అమ్మవారి ప్రాకార మండపము పై భాగము మరియు క్రింద భాగములలో సీరియల్ దండలు, ఫ్యాన్సీ లైట్స్ (ట్రిక్ లైట్స్), డే లైట్స్ తో విద్యుత్ దీపాలంకరణం చేయుట. 3) శ్రీ అమ్మవారి దేవస్థానము కోనేరు చుట్టూ మరియు హంస వాహనము వివిధ హంగులతో విద్యుత్ దీపాలంకరణ చేయుట. 4) శ్రీ అమ్మవారి దేవస్థానము ముందు భాగములో గల ఖాళీ ప్రదేశములో భారీ లైటింగ్ సెట్టింగ్స్ మరియు కళావేదిక అలంకరణ చేయుట. 5) శ్రీ రామలింగేశ్వర స్వామి వారి దేవస్థానము, అంతరాలయము, గర్భాలయము, ముఖ మండపము మరియు నవగ్రహ మండపములు, ప్రహరి గోడ వివిధ రకముల సీరియల్ దండలు, ఫ్యాన్సీ లైట్స్ (ట్రిక్ లైట్స్), డే లైట్స్ తో విద్యుత్ దీపాలంకరణం చేయుట. 6) శ్రీ అమ్మవారి దేవస్థానము నుండి రాయన్న పాలెం పోవు మార్గము మరియు పెదవేగి గ్రామము పోవు మార్గములలో స్వాగతం పలుకుతూ అమ్మవారి కట్ అవుట్ లతో ఇరువైపులా వివిధ రకముల సీరియల్ దండలు, ఫ్యాన్సీ లైట్స్(ట్రిక్ లైట్స్), డే లైట్స్ తో విద్యుత్ దీపాలంకరణం చేయుట. 7) శ్రీ అమ్మవారి తిరునాళ్ళలో జరుగు వివిధ రకముల సాంస్కృతిక కార్యక్రమములకు భారీ సౌండ్ సిస్టం ఏర్పాటు చేయుట. 8) శ్రీ అమ్మవారి దేవస్థానమునకు సంబంధించిన కాలక్షేప మండపము, గెస్ట్ హౌస్ (షాపింగ్ కాంప్లెక్స్), అన్నసమారాధన జరుగు ప్రదేశములలో సీరియల్ దండలు, ఫ్యాన్సీ లైట్స్ (ట్రిక్ లైట్స్), డే లైట్స్‌తో విద్యుత్ దీపాలంకరణం చేయుట. 9) అమ్మవారి గ్రామోత్సవములో లైటింగ్ మరియు జనరేటర్ ఏర్పాటు చేయుటకు 10) శ్రీ అమ్మవారి గ్రామోత్సవము కార్యక్రమములో సాంస్కృతిక కార్యక్రమములకు భారీ సౌండ్ సిస్టం ఏర్పాటు చేయుట.

పై పనులు చేయుటకు టెండర్లను దాఖలు చేయు వ్యక్తులు/ సంస్థలు షెడ్యూలును ది. 26-01-2026వ తేది ఉదయం 9:00ల నుండి 04-02-2026వ మధ్యాహ్నం గం. 1.00 వరకు కార్యాలయము పనివేళలలో రూ.250/- లు చెల్లించి టెండరు షెడ్యూలు పొందవచ్చును. అదే రోజు సాయంత్రం గం. 4.00 ని.లకు దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారుల మంజూరు ఉత్తర్వులకు లోబడి హాజరైన టెండరుదార్ల సమక్షములో కార్యనిర్వహణాధికారిచే టెండర్లు తెరువబడును. టెండరుదారులు అగ్రిమెంటు ఇవ్వవలెను. ప్రతి టెండరుకు రూ.500/- లు ధరావత్తు చెల్లించవలెను. టెండరు షెడ్యూలు కొరకు, మిగిలిన వివరముల కొరకు ఆఫీసు పనివేళలలో తెలుసుకొనగలరు.

శ్రీ మన్నే శ్రీనివాసరావు, ఛైర్మన్ మరియు ధర్మకర్తల మండలి

సం/- యన్.సతీష్ కుమార్, కార్యనిర్వహణాధికారి, సెల్: 96405 95351

రాట్నాలకుంట, తేది: 24-01-2026

ఏలూరు సినిమాలు

అంబిక డీలక్స్	మన శంకర వరప్రసాద్ గారు
అంబిక మినీ	మన శంకర వరప్రసాద్ గారు
సాయి బాలాజీ	మన శంకర వరప్రసాద్ గారు
బాలాజీ	రాజాసాబ్
సత్యనారాయణ 1	మన శంకర వరప్రసాద్ గారు
సత్యనారాయణ 2	అనగనగా ఒక రాజు
సత్యనారాయణ 3	భర్త మహాశయులకు విజ్ఞప్తి
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	మన శంకర వరప్రసాద్ గారు
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	మన శంకర వరప్రసాద్ గారు
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	అనగనగా ఒక రాజు
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	భర్త మహాశయులకు విజ్ఞప్తి
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	మన శంకర వరప్రసాద్ గారు
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	అనగనగా ఒక రాజు

రాజుకున్నా నిప్పు.. కలగదా కనువిప్పు!

కలగా అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు

ఎనిమిదేళ్లలో ప్రమాదాలు	: 114
ఆస్తి నష్టం విలువ	: రూ.148.6 లక్షలు

గణపవరం, న్యూస్‌టుడే: మండల కేంద్రం గణపవరంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన దశాబ్దాలుగా కాగితాలకే పరిమితమైంది. ఏదైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే దూర ప్రాంతాల నుంచి అగ్నిమాపక యంత్రాలొచ్చి మంటలు అదుపు చేయాల్సి పరిస్థితి గణపవరం, నిడమర్రు మండలాల్లో నెలకొంది. గణపవరానికి కొల్లేరుకు చెందిన గ్రామాలతో పాటు ఉండి మండలానికి చెందిన పలు గ్రామాలు కలిపి 40 వరకు అనుబంధంగా ఉంటాయి. అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు 25 కి.మీ. దూరంలోని తాడేపల్లిగూడెం, 20 కి.మీ. దూరంలోని అత్తిలి నుంచి అగ్నిమాపక వాహనాలు రావాల్సి ఉంటుంది. ఈలోగా నష్ట తీవ్రత పెరుగుతోంది.

కాగితాలకే పరిమితం: ఉంగుటూరు నియోజక వర్గంలోని భీమడోలులో అగ్నిమాపక కేంద్రం ఉండగా.. అదికాస్త దెందులూరు, ద్వారకాతిరుమల మండలాలకు అనుబంధంగా ఉంటోంది. మిగతా మండలాలకు ప్రయోజనం లేకుండా ఉంది. ప్రతి 20వేల మంది జనాభాకు ఒక అగ్నిమాపక కేంద్రం ఉండాలన్న నిబంధన ఉన్నా.. ప్రభుత్వాలు వాటిని అమలు చేయడం లేదు. గణపవరం, నిడమర్రు, ఉండి మొత్తం జనాభా 1.50 లక్షలు వరకు ఉన్నారు.

ఇటీవల గణపవరంలో ఇళ్ల మధ్య ఓ దుకాణంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అప్రమత్తమైన స్థానికులు వెంటనే అత్తిలి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సిబ్బంది 20 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చేటప్పటికి నష్ట తీవ్రత పెరిగిపోయింది.

స్థలమున్నా.. పడని అడుగు..: గణపవరానికి అనుబంధంగా ఉన్న గ్రామాల్లో ఎక్కువ శాతం తాటాకు, జమ్ము, కిక్కిస గడ్డితో నిర్మించినవి ఉండటంతో వేసవిలో తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. కేంద్రం ఏర్పాటుకు అవసరమైన స్థలం, మౌలిక వసతులు గణపవరంలో ఉన్నా అడుగు ముందుకు పడటం లేదు. 'గణపవరంలో అగ్నిమాపక కేంద్రం మంజూరుపై అధికారులతో చర్చించాం. మంజూరు కాగానే ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై నిర్ణయం తీసుకుంటాం' అని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తెలిపారు.

పోలవరం
•పోలవరం • చింతలపూడి

మద్ది క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం భక్తులు పోటెత్తారు. స్వామికి తమలపాకులతో పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ముఖమండపం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం ఒక్కరోజే వివిధ సేవల రూపేణా రూ.2,07,755 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో చందన తెలిపారు.

దర్శనం కోసం బారులుదీరి ఇలా..

భానుశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపల్

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం సీహెచ్ఎస్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని భానుశ్రీ జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శిశుసంక్షేమ శాఖ నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో తృతీయ స్థానం సాధించి జేసీ అభిషేక్ గౌడ నుంచి జ్ఞాపిక ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాల ఆవరణలో ప్రిన్సిపల్ ఎస్.ప్రసాదరావు, ఇతర అధ్యాపకులు ఆమెను అభినందించారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను స్థానిక సొసైటీ ఛైర్మన్ రేగంటి రాంబాబు మంగళవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. రూ. 50 లక్షలతో గ్రామంలోని అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు రాంబాబు తెలిపారు. భవిష్యత్తులో మిగతా రహదారులు కూడా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచి కస్సే శ్రీహరిరావు, మాజీ సర్పంచి రేగంటి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో నాణ్యమైన దిగుబడులు

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: రైతులు పంటల సాగులో సరైన యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కె.గంగాధరం సూచించారు. దర్భగూడెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. తెగుళ్ల నివారణకు సేంద్రియ ఎరువుల వినియోగం సత్ఫలితాలు ఇస్తాయన్నారు.

నేటి నుంచి విద్యుత్తు కోతలు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: బండిచల్లలోని విద్యుత్తు ఉపకేంద్రంలో ఆర్డీఎస్ఎస్ పనులు జరుగుతున్నందున ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి మూడో తేదీ వరకు రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు జంగారెడ్డిగూడెం విద్యుత్తు ఈఈ పీర్‌అహ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఔరా.. అతివలు..!

ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు పొదుపు సంఘాలు చేయూత ఇస్తున్నాయి. మెప్మా ఆధ్వర్యంలో బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకుంటున్న మహిళలు సొంతంగా వ్యాపారాలు నిర్వహిస్తూ.. కుటుంబానికి తోడ్పాటు అందిస్తున్నారు. తమ పిల్లలను చదివించుకుంటూ.. మరో పక్క విజయవంతంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.

సాంబ్రాణి కడ్డీలు తయారు చేస్తూ..

‘ఎనిమిదేళ్లుగా పొదుపు సంఘంలో సభ్యురాలిని. నా కాళ్ల మీద నేను నిలబడాలని తొలుత చిన్నగా సాంబ్రాణి కడ్డీలు తయారు చేసేదాన్ని. ఈ క్రమంలోనే కొంత నగదు బయట నుంచి తీసుకొచ్చి స్థానికంగా పూజా సామగ్రి దుకాణం ఏర్పాటు చేశా. దీనికి తోడు సంఘం తరపున ఏడాది కిందట రూ.2 లక్షలు మంజూరు కావడంతో దుకాణంలోకి మరింత సరకు తెప్పించా. సొంతగా ఆవు పేడ, సాంబ్రాణితో కలిపిన కడ్డీలను తయారు చేస్తూ.. ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నా. రానున్న రోజుల్లో వ్యాపారాన్ని మరింత విస్తరిస్తా. నెలకు రూ.30 వేలకు పైగా ఆర్జిస్తున్నా.’ - **యడ్లపల్లి లక్ష్మి ఇందిరా**

నెలకు రూ.50 వేల వరకు..

‘పిండి వంటలు తయారు చేసి విక్రయించాలనే ఆలోచన వచ్చింది. దీంతో నాలుగేళ్ల కిందట ఓ దుకాణాన్ని అద్దెకు తీసుకుని చిన్నగా వ్యాపారాన్ని ప్రారంభించా. తర్వాత ఆదరణ బాగుండటంతో అరిసెలు, జంతికలు, కజ్జికాయలు, బొబ్బట్లు తదితర పిండి వంటలను సిద్ధం చేసి విక్రయిస్తున్నా. ఇటీవల రూ.లక్ష రుణం తీసుకుని సరకులను కొనుగోలు చేసి నిల్వ ఉంచుకున్నా. నెలకు రూ.50 వేల వరకూ ఆదాయం వస్తోంది. దీనిపై వచ్చిన ఆదాయంతో ఇద్దరు పిల్లలను చదివిస్తున్నా.’ - **లాలం గంగాభవాని**

కుటుంబానికి చేయూత..

‘నా భర్త మెకానిక్. మాకు ఇద్దరు సంతానం. వారిని చదివించేందుకు, కుటుంబాన్ని నెట్టుకొచ్చేందుకు గతంలో ఇబ్బందులు పడ్డాం. దీంతో పొదుపు సంఘం ద్వారా రూ.2 లక్షలు రుణం తీసుకుని కర్రీ పాయింట్ ఏర్పాటు చేశా. నెలకు రూ.25 వేలు వరకూ ఆదాయం పొందుతున్నా. ప్రస్తుతం భర్తకు చేదోడువాదోడుగా ఉంటూ కుటుంబానికి ఆసరాగా నిలవడం ఆనందంగా ఉంది.’ - **జల్లిపల్లి కృష్ణకుమారి, జంగారెడ్డిగూడెం**

10 AM to 1 PM
మేమున్నాం..
మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం: 80085 74478
కొయ్యలగూడెం: 80085 74947
చింతలపూడి: 76759 19086

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: ? చింతలపూడి పట్టణం మెయిన్ వీధిలో మురుగు నీరు ప్రవహించడం లేదు. దీనివల్ల దుర్వాసనతోపాటు దోమలు విజృంభిస్తున్నాయి. - **నజీర్, స్థానికుడు.**

✔మురుగు నిల్వకుండా చర్యలు తీసుకుంటాం. దోమల నివారణకు మందు పిచికారీ చేస్తాం. - **రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్.**

? చింతలపూడి ఎన్‌ఎస్‌ఎన్ కాలనీకి వెళ్లే రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగి ఇబ్బందికరంగా మారింది. రాత్రి వేళల్లో విషసర్పాలు సంచరిస్తున్నాయి. - **అప్పారావు, స్థానికుడు.**

✔రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి సమస్య పరిష్కరిస్తాం. - **రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్.**

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: ? సీతానగరం ప్రధాన మార్గానికి ఇరువైపులా డ్రెయిన్లు లేక మురుగునీరు రహదారిపై ప్రవహిస్తోంది. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. - **నాగేశ్వరరావు, సీతానగరం.**

✔మురుగు రాకుండా చర్యలు తీసుకుంటాం. - **కావేశ్వరి, ఎంపీడీవో.**

? చింతలపూడి పట్టణం ఛాప్స్ నగర్‌లో కొన్నిచోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో ఇబ్బంది పడుతున్నాం. - **రాఘవరావు, స్థానిక యువకుడు.**

✔వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేస్తాం. - **రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్.**

? మారుతీనగర్‌లో కోతుల బెడదతో ఇబ్బంది పడుతున్నాం. నివాసాల వద్ద మొక్కలు, ఇతర సామాన్లు పాడు చేస్తున్నాయి.
- **రామకృష్ణ, సామాజిక కార్యకర్త.**

✔కోతుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.
- **రాంబాబు, నగర పంచాయతీ కమిషనర్**

పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

చింతలపూడి, న్యూస్‌టుడే: పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తను తెదేపా గౌరవించి వారికి సముచిత స్థానం కల్పిస్తుందని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. మండలంలోని ఫాతిమాపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే రోషన్ కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెదేపాలో కార్యకర్తలకు ఎప్పుడూ తొలి ప్రాధాన్యం ఉంటుందన్నారు. వచ్చే పంచాయతీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో తెదేపా మండల అధ్యక్షుడు చింతం విష్ణు, జనసేన మండల అధ్యక్షుడు చీదరాల మధుబాబు, తాళ్లూరి చంద్రశేఖరరెడ్డి, రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు సత్కారం

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా ఉత్తమ ఉద్యోగి పురస్కారాన్ని అందుకున్న బుట్టాయగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల ప్లస్‌లో పనిచేస్తున్న గ్రంథాలయ సహాయకురాలు సున్నం వెంకటలక్ష్మిని పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రుల కమిటీ ప్రతినిధులు మంగళవారం ఘనంగా సన్మానించారు.

టి.నరసాపురం, న్యూస్‌టుడే: ఉత్తమ సేవలకు తప్పక గుర్తింపు లభిస్తుందని తెదేపా రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి నుంచి ఉత్తమ సీఈవోగా పురస్కారం పొందిన మల్లుకుంట పీఏసీఎస్ సీఈవో సత్యనారాయణను మంగళవారం ఆయనతోపాటు ఆ సంఘ అధ్యక్షుడు సాయివినయ్ అభినందించారు.

విద్యతోనే జీవితంలో ఉన్నతి

విజేతలకు బహుమతులు అందిస్తున్న బొరగం, తదితరులు

పోలవరం, న్యూస్‌టుడే: వివిధ రంగాల్లో మహిళలు ఉన్నత స్థితికి చేరుకోవడానికి విద్య అవసరమన్న విషయాన్ని బాలికలు దృష్టిలో ఉంచుకుని పరీక్షల్లో మంచి తెచ్చుకోవాలని ట్రైకార్ సంస్థ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. బొడిగూడెం ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం పదో తరగతి బాలికల వీడ్కోలు సమావేశంలో బొరగం పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గూటాల జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎన్.సత్యనారాయణ, జె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపాలి

జంగారెడ్డిగూడెం పట్టణం, కామవరపుకోట, న్యూస్‌టుడే: ఎలక్ట్రికల్ వర్కర్ల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ అన్నారు. జంగారెడ్డిగూడెంలోని ధర్మన్న స్మారక భవనంలో ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎలక్ట్రికల్ డే సందర్భంగా కేక్ కోశారు. కామవరపుకోటలో కూడా ఎలక్ట్రికల్ వర్కర్ల సమావేశం నిర్వహించారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

ఈనాడు కథనాలకు స్పందన

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుకు అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం ‘లక్కవరంలో పడకేసిన పారిశుద్ధ్యం’ శీర్షికన ‘ఈనాడు’లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి కొండలరావు ఆధ్వర్యంలో గ్రామంలోని మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టడంతోపాటు పేరుకుపోయిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించారు.

హమ్మయ్య..ప్రమాదం తప్పించారు

‘చూడకుంటే ప్రమాదం’ శీర్షికన ఈ నెల 22న ‘ఈనాడు’లో ప్రచురితమైన కథనానికి కన్నాపురం పంచాయతీ కార్యదర్శి చెంచమ్మ స్పందించారు. గ్రామంలోని యూనియన్ బ్యాంకు ఎదురుగా ఉన్న రహదారిలో డ్రెయిన్‌పై దెబ్బతిని ప్రమాదకరంగా మారిన సిమెంటు పలకలకు పంచాయతీ సిబ్బంది మరమ్మతులు చేశారు. వాటిని సరి చేసి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా సిమెంట్‌తో ఫ్లోరింగ్ చేశారు. - **కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే:**

కోటలో ట్రాఫిక్ కష్టాలు

కామవరపుకోటలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది. ప్రధానంగా చెక్‌పోస్టు సెంటర్‌లో రహదారిని ఆనుకుని ఉన్న మద్యం దుకాణం వద్ద, ఇండియన్ బ్యాంక్ వద్ద రద్దీ కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. తడికలపూడి కోనేరు సెంటరు, కళ్లచెరువు ప్రధాన వీధిలో రహదారులపైనే దుకాణాలు నిర్వహిస్తుండటంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకొనే అవకాశం ఉండటం లేదు. దీనికితోడు చెవులు చిల్లులు పడేలా హారన్‌లు మోగిస్తూ వెళ్లే వాహనాల కారణంగా శబ్ద కాలుష్యం ఏర్పడుతోంది. ఈ పరిస్థితిపై తడికలపూడి ఎస్సై చెన్నారావు ‘న్యూస్‌టుడే’తో మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. -**న్యూస్‌టుడే, కామవరపుకోట**

పగలే వెలుగులు.. రాత్రులు చీకట్లు..!

మరమ్మతులకు గురవుతున్న వీధి దీపాలు

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలంలోని పలు గ్రామాల్లో వీధి దీపాలు నిరంతరం వెలుగులు విరజిమ్ముతున్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా వెలగటంతో ఆయా పంచాయతీలకు విద్యుత్తు బిల్లులు భారంగా మారుతున్నాయి. ప్రధానంగా మండలంలోని పుట్లగట్లగూడెం, కేతవరం, వేగవరం, తాడువాయి, శ్రీనివాసపురం, లక్కవరం, దేవులపల్లి, మైసన్నగూడెం, నిమ్మలగూడెం, పుట్లగట్టగూడెం తదితర గ్రామాల్లో సమస్య తీవ్రంగా ఉంది. ఆయా గ్రామాల పరిధిలో వీధి దీపాలకు మూడో వైరు లేకపోవడంతో నిరంతరం వెలుగుతూనే ఉంటున్నాయని పంచాయతీ సిబ్బంది చెబుతున్నారు.

శ్రీనివాసపురంలో పగటిపూట ఇలా..

నిధుల కొరత కారణంగా మూడో లైన్ వేసేందుకు జాప్యం జరుగుతుంది. వీధి దీపాలు నిరంతరం వెలగడం వల్ల తొందరగా పాడైపోతుండటంతో పలు ప్రాంతాల్లో చీకట్లోనే మగ్గుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో విష పురుగులు సంచరిస్తున్నాయని పలు గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వీధి దీపాలు మరమ్మతులకు గురైన చోట్ల నూతనంగా ఏర్పాటు చేయడంతోపాటు పగటి పూట వెలగకుండా ఎక్కడికక్కడ కంట్రోల్ బాక్సులను (సీపీఎంఎస్) ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ‘వీధి దీపాలు పగడిపూట వెలగకుండా చర్యలు తీసుకోవడంతోపాటు మరమ్మతులకు గురైన వాటిని మారుస్తాం’ అని డీఎల్పీవో ఎ.సుబ్బరాయన్ తెలిపారు.

రాళ్లు తేలిన రహదారి

లింగపాలెం మండలం భోగోలు నుంచి నర్సన్నపాలెం వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. గత అయిదేళ్లుగా మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. భోగోలు నుంచి నర్సన్నపాలెం, తిమ్మక్కపాలెం, కొత్తపల్లి మీదుగా మండల కేంద్రానికి ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారి రాళ్లుతేలి భయానకంగా మారటంతో ఈ మార్గంలో ప్రయాణం అంటేనే ప్రజలు భయపడుతున్నారు. రైతులు పొలం పనుల నిమిత్తం ఈ మార్గంలోనే ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని, నిధులు వచ్చిన వెంటనే పనులు చేపడతామని పంచాయతీరాజ్ ఏఈ జగన్నాథం తెలిపారు. -**న్యూస్‌టుడే, భోగోలు(చింతలపూడి)**

ప్రధానోపాధ్యాయిని, డిప్యూటీ వార్డెన్‌కు తిరిగి పోస్టింగ్‌లు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: ఓ విద్యార్థిని గర్భం దాల్చిన ఘటనలో సస్పెన్షన్‌కు గురైన ప్రధానోపాధ్యాయిని, డిప్యూటీ వార్డెన్‌లను తిరిగి విధుల్లోకి తీసుకున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ కేఆర్‌పురం ఉప సంచాలకుడు జగన్నాథరావు తెలిపారు. విధుల పట్ల అలసత్వం చూపారన్న కారణంతో వీరిని గత నెల ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ప్రధానోపాధ్యాయిని గంగారత్నంను వేలేరుపాడు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా, డిప్యూటీ వార్డెన్ జోగాయమ్మను పాలకుంట పాఠశాల గ్రేడ్-2 తెలుగు పండిట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

జీలుగుమిల్లిలో నేడు ప్రజావేదిక

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం కింద 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు మండలంలో చేసిన పనులపై ఇటీవల జరిపిన సామాజిక తనిఖీల్లో గుర్తించిన అంశాలపై జీలుగుమిల్లి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం ప్రజావేదికను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి తెలిపారు. ఉదయం 10 గంటలకు సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

కామవరపుకోట, న్యూస్‌టుడే: మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ చేసిన ఘటన కామవరపుకోట మండలం జీలకర్రగూడెంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లూరి గాంధీ, ధర్మలింగేశ్వరి దంపతులు కిరాణా దుకాణం నిర్వహిస్తుంటారు. నిత్యంలానే దుకాణం మూసివేసి పడుకున్న వీరికి అర్ధరాత్రి దాటాక ఇంటి తలుపు చప్పుడు అయింది. గాంధీ స్వల్ప అనారోగ్యంతో ఉండటంతో అతని భార్య ధర్మలింగేశ్వరి తలుపు తెరవడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలోని సుమారు రెండు కాసుల బంగారపు గొలుసు తెంచుకొని పారిపోయారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ సుభాశ్, ఎస్సై పి.చెన్నారావు, క్లూస్‌టీం వారు మంగళవారం ఉదయం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం

6వ వార్డు ఎంపీపీ పాఠశాలకు మైకు అందిస్తున్న సత్తిపండు, ఇతర నాయకులు

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతున్నాయని పలువురు తెదేపా నాయకులు అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణం 6వ వార్డులోని ఎంపీపీ పాఠశాలకు మంగళవారం తెదేపా సీనియర్ నాయకులు పరిమి సత్తిపండు మైక్‌సెట్ అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో జరిగిన సమావేశంలో సత్తిపండును అభినందించారు. స్థానిక ఉప్పలమెట్ట ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు తెదేపా 19వ వార్డు కార్యదర్శి కొడవటి సత్యనారాయణ భోజనం కంచాలు అందించారు.

పొదుపు పథకాలతో భవిష్యత్తుకు భరోసా

చిన్న మొత్తాల పొదుపుపై అవగాహన కల్పించి కరపత్రాలు అందజేస్తున్న వీరభద్రరావు

పోలవరం, న్యూస్‌టుడే: తపాలశాఖ పొదుపు పథకాలతో ప్రజల భవిష్యత్తుకు ఎంతో భరోసా కల్పిస్తుందని కొవ్వూరు అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎ.వీరభద్రరావు అన్నారు. చిన్న మొత్తాల పొదుపు గురించి రెండు రోజులపాటు ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని మంగళవారం పోలవరంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రమాద బీమా పథకం గురించి ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. పోలవరం సబ్‌పోస్టు మాస్టర్ శ్రీనివాసరావు, తపాలా ఉద్యోగులు పాల్గొన్నారు.

కొత్తపైడిపాక పునరావాసకాలనీ ఎంపీయూపీ పాఠశాల ప్రహరీ గేట్ల స్థానంలో ఇలా..

తడికల బడి.. రక్షణ కొరవడి

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం పంచాయతీ పరిధి ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతంలోని పైడిపాక నిర్వాసితుల కోసం పునరావాసకాలనీ నిర్మించారు. అందులో నిర్వాసితులకు ఇళ్లతోపాటు పాఠశాల, పంచాయతీ భవనం, అంగన్‌వాడీ, సామాజిక భవనాలు నిర్మించారు. మండల పరిషత్ పాఠశాల భవనం చుట్టూ ప్రహరీ నిర్మించిన ఇంజినీరింగ్ అధికారులు గేట్లు పెట్టకుండా వదిలేశారు. ముంపు గ్రామం ఖాళీ చేసి నిర్వాసితులు పునరావాస కాలనీకి వచ్చి దశాబ్దం దాటింది. రాత్రి సమయంలో పాఠశాలలోకి ఎవరూ వెళ్లకుండా ఉపాధ్యాయులు తడికలు అడ్డుపెట్టినా ప్రయోజనం కనిపించడం లేదు. చీకటి పడిన తర్వాత మందుబాబులు లోపలికి వెళ్లి వారి కార్యక్రమాలు కొనసాగించడంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం అధికారులు గేట్లు ఏర్పాటు చేయించాలని కోరుతున్నారు.

ప్రత్యేక పంచాయతీ చేయండి

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: పునరావాస కాలనీని ప్రత్యేక పంచాయతీగా చేయాలని నిర్వాసిత కాలనీ కమిటీ సభ్యుడు బద్దె ప్రేమ్‌కుమార్ కోరారు. జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి పంచాయతీ పరిధిలోని పునరావాసకాలనీలో నిర్వాసితుల కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...2022 గోదావరి వరదల సమయంలో వేలేరుపాడు, కుక్కునూరు, పోలవరం మండలాలకు సంబంధించి సుమారు 800 కుటుంబాలు చల్లవారిగూడెం పునరావాసానికి వచ్చాయని అన్నారు. నాటి నుంచి సరైన ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ప్రత్యేక పంచాయతీ చేస్తే కనీస అవసరాలు తీరతాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

బ్యాంకు ఉద్యోగుల నిరసన

జంగారెడ్డిగూడెం పట్టణంలో ..

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు పిలుపు మేరకు జంగారెడ్డిగూడెం పట్టణంలోని బ్యాంకుల వద్ద ఉద్యోగులు మంగళవారం నిరసన ప్రదర్శనలు చేశారు. అనంతరం ద్విచక్ర వాహనాలపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బ్యాంకు ఉద్యోగులు మాట్లాడుతూ...బ్యాంకింగ్ రంగ ఉద్యోగులకు వారానికి ఐదురోజులు మాత్రమే పనిదినాలు ఉండాలని గత కొన్ని సంవత్సరాలుగా తాము పోరాటం చేస్తున్నామని వెల్లడించారు.

రక్షిత జలం.. చిన్నారులకు దూరం

అంగన్‌వాడీ కేంద్రాల్లో తీరని ఇబ్బందులు

జంగారెడ్డిగూడెం గ్రామీణ, కొయ్యలగూడెం గ్రామీణ, టి.నరసాపురం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు సొంత భవనాలు ఉన్న చోట ప్రభుత్వం నీటి శుద్ధి యంత్రాలు అందజేసింది. చాలా చోట్ల వాటిని అలంకారప్రాయంగా గోడలకు అమర్చి వదిలేశారు. సక్షం పథకంలో భాగంగా 2024లో జంగారెడ్డిగూడెం, చింతలపూడి, కొయ్యలగూడెం ఐసీడీఎస్ పరిధిలోని జంగారెడ్డిగూడెం, ద్వారకాతిరుమల, కామవరపుకోట, చింతలపూడి, టి.నరసాపురం, లింగపాలెం, కొయ్యలగూడెం, పోలవరం మండలాల్లో మొత్తం 605 అంగన్‌వాడీ కేంద్రాలకు గాను సొంత భవనాలున్న 228కి మాత్రమే అవి మంజూరయ్యాయి. వాటిలో తాగునీటి ట్యాంకుకు పైపులైను వేసి, నీటి శుద్ధి యంత్రానికి నీటి సరఫరా చేయాల్సి ఉంది. విద్యుత్తు, నీటి సరఫరాలో ఇబ్బందులు వల్ల వేగవరం, ఏపిగుంట, బిల్లిమిల్లి తదితర గ్రామాల్లో శుద్ధి యంత్రాలు నిరుపయోగంగా మారాయి. దీంతో చిన్నారులకు తాగునీటిని అంగన్‌వాడీ సిబ్బందే సరఫరా చేస్తున్నారు.

ఐసీడీఎస్ పరిధిలో	అంగన్‌వాడీలు	సక్షం అంగన్‌వాడీ కేంద్రాలు
జంగారెడ్డిగూడెం	219	119
చింతలపూడి	218	66
కొయ్యలగూడెం	168	43

ఏపిగుంటలో నీటి శుద్ధి యంత్రం ఇలా..

వారంలో పూర్తి చేయిస్తాం..

అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉన్న చోట దాదాపుగా నీటి శుద్ధియంత్రాలు అమర్చారు. అద్దె భవనాలు, షెడ్లు ఉన్నచోట కూడా వాటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నాం. వారం రోజుల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి సమస్య పరిష్కరిస్తాం.

- **సత్యవతి, ఐసీడీఎస్ పీవో, చింతలపూడి.**

అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి రైతులకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చేసిన సేవలకు గుర్తింపుగా ఏలూరు కలెక్టర్ శ్రీమతి వెట్రిసెల్వి గారి చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్న జంగారెడ్డిగూడెం డివిజన్ ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీ పీర్ అహ్మద్ ఖాన్ గార్కి
డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీ U.సుబ్బారావు గార్కి
ఇవే నా హృదయ పూర్వక శుభాకాంక్షలు.
అల్లూరి చంద్రశేఖర్
పొగాకు బోర్డ్ 18 నెంబరు వేలం కేంద్రం డైరెక్టర్

(c) eenadu

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

పట్టుదలతో చదివితేనే ఉన్నత స్థానం

మాట్లాడుతున్న ఎంఈవో ఆనంద్‌కుమార్

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు పట్టుదలతో చదివితేనే జీవితంలో ఉన్నత స్థానం లభిస్తుందని, ప్రతి ఒక్కరు ఓ ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకుని ఆ దిశగా ప్రయత్నించి విజయం సాధించాలని ఎంఈవో కె. ఆనంద్ కుమార్ తెలిపారు. ఆగిరిపల్లి మండలం నూగొండపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం వేడుకగా నిర్వహించారు. పాఠశాలకు గ్రామానికి చెందిన ఎం. కనకయ్య ప్రింటర్‌ను బహూకరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయుడు జె. వెంకటేశ్వరావు, ఎస్ఎంసీ ఛైర్మన్ వై. సువర్ణబాబు, నాయకులు మట్టా వేణు తదితరులు పాల్గొన్నారు.

తొట్టె ఉంది.. నీళ్లేవి?

పల్లె పండగలో భాగంగా పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.34,951తో పశువుల కోసం నీటి తొట్టె నిర్మించి గత ఏడాది జులై 21న ప్రారంభించారు. నీటి సౌకర్యం ఏర్పాటు చేయక పోవడంతో నిరుపయోగంగా మారింది. అధికారులు పరిశీలించి పంచాయతీ పరిధిలోని పైపు లైనును తొట్టెకు అమర్చి నీటిని నింపి పశువుల దాహార్తిని తీర్చాలని స్థానికులు కోరుతున్నారు. -ఈనాడు, ఏలూరు. న్యూస్‌టుడే, ఆగిరిపల్లి

నేత్రపర్వంగా కార్తికేయుడి కల్యాణం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటరులోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి జన్మ నక్షత్రం కృత్తికను పురస్కరించుకుని మంగళవారం శాంతి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. సుమారు 20 మంది దంపతులు పీటల మీద కూర్చుని వేద పండితుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ క్రతువు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆంజనేయుడికి వెండి కిరీటం

ఆవకూరు (కలిదిండి), న్యూస్‌టుడే: ఆవకూరులోని అభయాంజనేయస్వామి వారికి సాంబశివరావు, నారింది దామోదరరావుల ఆర్థిక సాయంతో తయారు చేయించిన వెండి కిరీటం ఆలయ అర్చకుడు స్వర్ణ నానికి మంగళవారం అందించారు. ఆలయ చైర్‌పర్సన్ చలమలశెట్టి లక్ష్మీపార్వతి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. జి.రామచంద్రరావు, చలమలశెట్టి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

చిన్నశేష వాహనంపై శోభనాచలుడు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: మాఘ మాస రథ సప్తమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి చిన్న శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారి కల్యాణ మండపంలో ఆగిరిపల్లికి చెందిన నాగిరెడ్డి పాప అప్పారావు దంపతులు, ఆగిరిపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శాంతి, నిత్యకల్యాణ మహోత్సవాలను అర్చకులు వేదాంతం శేషుబాబు, జి.అనంత కృష్ణలు వైభవంగా నిర్వహిం

• ఆగిరిపల్లి మండలం అడవినెక్కలానికి చెందిన ఓ గృహిణి చరవాణికి 10 రోజుల క్రితం ఓ సందేశం వచ్చింది. దీనిపై క్లిక్ చేస్తే మీ ఖాతాలో రూ.5 వేలు జమ అవుతాయనేది దాని సందేశం. దానిని తెరవగా కొన్ని నిమిషాల వ్యవధిలోనే ఖాతాలో ఉన్న రూ.50 వేలు మాయమయ్యాయి.

• 'మొదట ఇది నకిలీ అనుకున్నా.. కానీ నిజంగా నాకు రూ.5వేలు వచ్చింది. మీరూ ప్రయత్నించి చూడండి..' ఇటీవల సామాజిక మాధ్యమాల ద్వారా ఫోన్‌పే పేరుతో లింక్ రూపంలో వచ్చిన సందేశం ఇది. దానిపై క్లిక్ చేస్తే డబ్బులు వస్తాయంటూ నమ్మిస్తున్నారు.

రూ.5 వేలు వచ్చాయంటూ.. వల

★ సామాజిక మాధ్యమాల్లో మోసగాళ్ల సందేశాలు ★ సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

అడవినెక్కలం(ఆగిరిపల్లి), న్యూస్‌టుడే

ఇటువంటి మోసపూరితమని, వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు చెబుతున్నారు. సైబర్ నేరగాళ్లు మోసం చేసేందుకు ఇటువంటి లింక్‌లను సృష్టించి దానికి ఆకర్షణీయమైన సందేశం పెట్టి సామాజిక మాధ్యమాల్లో పెడుతున్నారు. వాటిని నమ్మి ఎవరైనా క్లిక్ చేస్తే వెంటనే వారి చరవాణి హ్యాక్ అవుతుంది. తర్వాత దానికి అనుబంధంగా ఉన్న బ్యాంకు ఖాతాల నుంచి సమాచారం సైబర్ నేరగాళ్ల చేతిలోకి వెళ్లిపోతుంది. వెంటనే ఖాతా ఖాళీ చేస్తున్నారు.

సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్న సందేశం

ఊరికే డబ్బులు రావు...

పండగైనా, మరే ఇతర రోజుల్లో నైనా డబ్బు, బహుమతులను ఎవరూ ఊరికే ఇవ్వరు. ఉత్తినే డబ్బులు వస్తాయని లింక్‌లు పంపిస్తే వాటిని ఎటువంటి పరిస్థితుల్లోనూ తెరవ వద్దని పోలీసులు, బ్యాంకు అధికారులు హెచ్చరిస్తున్నారు. మీకు తెలిసిన వ్యక్తులు అలాంటి వాటిని పంపించినా నమ్మవద్దని చెబుతున్నారు.

తక్షణం ఫిర్యాదు చేయండి...

లింక్‌లను తెరచి డబ్బు పోగొట్టుకోవద్దు. అలా ఎవరైనా మోసపోతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. 1930కు ఫోన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. డబ్బులు ఎవరూ ఊరకనే ఇవ్వరనే విషయాన్ని గుర్తించాలి. ఇటువంటి సందేశాలను ఇతరులకు పంపించినా నేరగాళ్లకు సహకరించినవారు అవుతారు. -కేవీవీఎన్‌వీ ప్రసాద్, డీఎస్పీ, నూజివీడు

ఆక్రమణలు తొలగిస్తే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్, వేదికపై వినూత్న, వీరయ్య

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆటోలను నియంత్రించి, ఆక్రమణలు తొలగిస్తే నూజివీడు ట్రాఫిక్ సమస్య పరిష్కారం అయినట్లేనని నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం నూజివీడులో ట్రాఫిక్ అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని సబ్‌కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమయ్యే ప్రదేశాల గురించి వివరించారు. పండ్ల మార్కెట్‌ను ఎన్నెస్పీ స్థలంలో ఏర్పాటు, రైతు బజారు వద్ద ఖాళీగా ఉన్న స్థలంలో చిన్న చిన్న వ్యాపారులను తరలించడం వంటి విషయాలు చర్చకు వచ్చాయి. ఆర్టీసీ బస్సులను ఎక్కడ పడితే అక్కడ ఆపడంపై చర్చించారు. బస్ షెల్టర్లు అసాంఘిక శక్తులకు అడ్డాగా మారాయని, డిపో మేనేజర్ సిబ్బంది ఏమి చేస్తున్నారని సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న ప్రశ్నించారు. డిపో మేనేజర్ గైర్హాజరు అవడాన్ని తప్పు పట్టారు.

ఉదయం 8 గంటల్లోపే.. పట్టణంలో లారీలు, ఆటో లోడింగ్, అన్‌లోడింగ్‌కు ఉదయం 8 గంటల లోపు సాయంత్రం 7 గంటల తరువాత అనుమతించాలని సబ్‌కలెక్టర్ అన్నారు. అతిక్రమిస్తే కేసులు నమోదు చేయాలని ఎంవీఐ, పోలీసులకు సూచించారు. ఎన్నెస్పీ అధికారులతో మాట్లాడి పండ్ల మార్కెట్‌ను అక్కడ ఏర్పాటు చేయడంపై చర్చించాలని కమిషనర్‌కు సూచించారు. పండ్ల మార్కెట్ బోర్డును అక్కడ ఏర్పాటు చేయాలని తెలిపారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు ముత్యాల కామేశ్ పలు అంశాలను ప్రస్తావించారు. మున్సిపల్ కమిషనర్ వీరయ్య, సీఐ సత్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఫిబ్రవరి 15లోపు ఈ సమస్యలన్నింటికి పరిష్కారం చూపాలని చర్చించి సమావేశం ముగించారు.

రైతు ఆత్మహత్యల్లేకుండా చూడాలి: సబ్‌కలెక్టర్

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: రైతులు ఆత్మహత్యలు చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత సీడ్ కంపెనీలు, ఆర్గనైజర్లపై ఉందని నూజివీడు సబ్‌కలెక్టరు బొల్లిపల్లి వినూత్న స్పష్టం చేశారు. మంగళవారం నూజివీడు సబ్‌కలెక్టరు కార్యాలయంలో మొక్కజొన్న సీడ్ కంపెనీల ఆర్గనైజర్లు, ప్రతినిధులతో వ్యవసాయ శాఖ, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టరు మాట్లాడుతూ ఆయా కంపెనీల సీడ్ ఆర్గనైజర్లు రైతుల వివరాలను ఆర్ఎస్‌కేల్లో విధిగా నమోదు చేయాలన్నారు. ఆర్గనైజర్లు విధిగా ప్రొడక్షన్ ప్లాన్ అందించాలని సూచించారు. వ్యవసాయశాఖ జేడీ హబీబ్ బాషా మాట్లాడుతూ నూజివీడు డివిజన్ పరిధిలో 16వేల ఎకరాల్లో సీడ్ పత్తి సాగు అవుతోందని తెలిపారు. మల్టీ నేషనల్, నేషనల్ కంపెనీలు కారణంగానే రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉత్పత్తి చేసినప్పుడు మార్కెటింగ్ చేయాల్సిన బాధ్యత కంపెనీలదేనని స్పష్టం చేశారు. సీపీపీ నుంచి సీహెచ్.రామారావు, ఎన్.నరసింహులు కంపెనీలు రైతులను ఏ విధంగా మోసం చేస్తున్నాయో వివరించారు.

ఆలయాల ప్రాముఖ్యాన్ని కాపాడాలి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఆలయాలకు నియమితులైన నూతన పాలకమండలి సభ్యులు ఆలయాల ప్రాముఖ్యాన్ని కాపాడాలని, వాటి ఆస్తులను పరిరక్షించాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. వడాలిలోని చిన్న పూరీగా ప్రసిద్ధి చెందిన సుభద్ర బలరామ సహిత జగన్నాథస్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన నూతన పాలకమండలి ప్రమాణస్వీకారం, అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మాజీ జడ్పీటీసీ సభ్యురాలు వీరమల్లు రత్నకుమారిని ఆలయ ఛైర్‌పర్సన్‌గా ఎన్నుకొని ప్రమాణస్వీకారం చేయించారు. పాలకమండలి సభ్యులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అంతకు ముందుకు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, తెదేపా నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కూటమి నాయకులు, ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేసిన పాలక మండలితో ఎమ్మెల్యే కామినేని

అమరావతి అభివృద్ధికి అందరూ బాసటగా నిలవాలి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: అమరావతి అభివృద్ధికి అందరూ బాసటగా నిలవాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కోరారు. వడాలిలో మంగళవారం 'అమరావతికి జీవం పోద్దాం.. రూ.116 సాయం చేద్దాం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అమరావతి అభివృద్ధిలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేయాలని రూ.116 సాయం చేసే ఆలోచన వైద్య విద్యార్థిని వైష్ణవికి రావడం అభినందనీయమన్నారు. అనంతరం సీఆర్‌డీఏ క్యూఆర్ కోడ్ ద్వారా విరాళాన్ని ఇచ్చారు. వైష్ణవి తండ్రి, వైద్యుడు మనోజ్ ఆయన కాళ్లు కడిగి సత్కరించారు.

భూముల విలువలు పరిశీలించిన కమిషనర్, రిజిస్ట్రార్

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: పురపాలక సంఘం పరిధిలో పలు ప్రదేశాల్లో భూముల విలువల్లో వ్యత్యాసాలను నూజివీడు మున్సిపల్ కమిషనర్ వీరయ్య, సబ్ రిజిస్ట్రార్ ఫణిరాజ్‌లు మంగళవారం పరిశీలించారు. పట్టణంలోని బోర్వంచ రహదారిలో రిజిస్ట్రేషన్ వ్యాల్యూ రూ.10 వేలు ఉంటే అక్కడ రూ.33 వేలు నమోదైంది. ఇటువంటివి పట్టణ పరిధిలో అనేకం ఉన్నాయి. ఆయా ధరలు సవరించాలని అధికారులకు పలు ఫిర్యాదులు అందాయి. మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు కౌన్సిల్ సమావేశంలో సబ్‌రిజిస్ట్రార్, కమిషనర్ వెంటనే చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. ఎట్టకేలకు రిజిస్ట్రేషన్, మున్సిపల్ అధికారులు కలిసి మూడు సంవత్సరాల తరువాత ఆయా ప్రదేశాలను పరిశీలించారు. బోర్వంచ రోడ్డులోని శ్రీనగర్ కాలనీ, గాంధీనగర్, పాత స్టేట్ బ్యాంకు రోడ్డు, మస్జిద్ బజారు ఏరియా, రజకపేట, పెద్ద బజారు సెంటరు, గొడుగువారిగూడెం తదితర సెంటర్లలో రెసిడెన్షియల్ ప్రాంతానికి కమర్షియల్ రేట్లు నమోదయ్యాయి. వీటన్నింటిని మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ అప్పినేని వెంకట నరసింహారావు, సీనియర్ అసిస్టెంట్ సందీప్, ఆయా సచివాలయాల అడ్మిన్లు పరిశీలించారు. వీటన్నింటిని మార్పులు, చేర్పులు చేస్తామని అధికారులు తెలిపారు.

వాణిజ్య ప్రాంతాలుగా నమోదైన ప్రాంతంలో ఆరా తీస్తున్న అధికారులు

శిక్షల కన్నా భద్రతే మిన్న

కైకలూరు, న్యూస్‌టుడే: శిరస్త్రాణం లేని ద్విచక్ర వాహన చోదకులకు శిక్షలు విధించడం కంటే భద్రతే ముఖ్యమని శిక్షణ ఐపీఎస్ అధికారి జయశర్మ పేర్కొన్నారు. కైకలూరు టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద సీఐలు రామకృష్ణ, రవికుమార్‌తో కలిసి మంగళవారం శిరస్త్రాణంపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించని వాహనదారులకు అపరాధ రుసుము వేయకుండా వారితో వాటిని కొనుగోలు చేయించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో శిరస్త్రాణం లేకపోవడంతో ఎక్కువ మంది ప్రాణాలను కోల్పోయారని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఉప్పుటేరు వద్ద వాహనదారులకు రూరల్ ఎస్.ఐ. రాంబాబు శిరస్త్రాణంపై అవగాహన కల్పించారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం నూజివీడులో పలు బ్యాంకుల ఉద్యోగులు సమ్మె చేశారు. మధ్యాహ్నం ప్లకార్డులతో స్థానిక ఎస్‌బీఐ వద్దకు వచ్చి నినాదాలు చేశారు. వీరికి సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు.

బడికి సహకారం అభినందనీయం

కైకలూరు, న్యూస్‌టుడే: విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు, దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని వైస్ ఎంపీపీ గుంగుల వెంకటనర్సమ్మ, సర్పంచి భట్రాజు శివాజీ అన్నారు. మండలంలోని తామరకొల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన దిల్లీ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ వెలివల చంద్రశేఖరరావు రూ. 2.50 లక్షల వ్యయంతో విద్యార్థుల సౌకర్యార్థం రేకుల షెడ్డు నిర్మించారు. ఈ క్రమంలో గ్రామస్థులు, ఉపాధ్యాయులతో కలిసి దాత మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖరరావును సత్కరించి అభినందనలు తెలిపారు. అంతకు ముందు పాఠశాల వార్షికోత్సవం నిర్వహించగా పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

షెడ్డు ప్రారంభిస్తున్న దాత చంద్రశేఖరరావు, వైస్ ఎంపీపీ, సర్పంచి

సినిమాలు

నూజివీడు పట్టణం

- సత్యనారాయణ — అనగనగా ఒక రాజు
- సత్యనారాయణ మినీ — రాజాసాబ్
- ద్వారక సినిమాస్ స్క్రీన్ 1 — భర్త మహాశయులకు విజ్ఞప్తి
- ద్వారక సినిమాస్ స్క్రీన్ 2 — మన శివశంకరవరప్రసాద్ గారు
- ద్వారక సినిమాస్ స్క్రీన్ 3 — నారీ నారీ నడుమ మురారి

ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్ — మన శివశంకరవరప్రసాద్ గారు

కైకలూరు: శ్రీవిజయలక్ష్మి జీ3 — రాజాసాబ్
- మాగంటి సినిమాస్ — అనగనగా ఒక రాజు
- శ్రీవెంకటరమణ సినిమాస్ — మన శివశంకరవరప్రసాద్ గారు

ముదినేపల్లి: పూర్ణిమ — నారీ నారీ నడుమ మురారి

భాజపాను క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలి

అమరావతి(కలిదిండి), న్యూస్‌టుడే: దేశానికి వెన్నెముకగా నిలుస్తున్న భాజపాను క్షేత్ర స్థాయి నుంచి మరింత బలోపేతం చేసుకోవాల్సిన బాధ్యత శ్రేణులపై ఉందని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చిట్టూరి రవీంద్ర తెలిపారు. అమరావతి, పడమటిపాలెం గ్రామాల్లో భాజపా మండల అధ్యక్షుడు అంకాల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం బూత్ కమిటీ సమావేశాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని తెలిపారు. ఏపీలో కూటమి ప్రభుత్వ భాగస్వామంలో భాజపా పాత్రను వివరించాలన్నారు. భాజపా మండల ప్రధాన కార్యదర్శి పంచకర్ల సాంబశివరావు, నాయకులు బండారు వెంకటరాజు, సూదాబత్తుల రాధాకుమారి, పి.వీర సత్యం తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి అందజేత

కోరుకొల్లు (కలిదిండి), న్యూస్‌టుడే : కోరుకొల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 80 మంది పదో తరగతి విద్యార్థులకు విశ్రాంత హెచ్.ఎం. నరహరిశెట్టి శ్రీహరి దంపతులు మంగళవారం పరీక్ష సామగ్రి అందించారు. పదేళ్లుగా ఏటా వీటిని అందిస్తున్నట్లు శ్రీహరి తెలిపారు. పది పరీక్షల్లో అత్యధిక మార్కులు తెచ్చుకునే చిట్కాలు విద్యార్థులకు వివరించారు. హెచ్.ఎం. ఎస్.రాము, సీఆర్పీ సీహెచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సూర్యఘర్‌పై నిరుద్యోగ యువతకు శిక్షణ

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఐటీఐలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పీఎం సూర్యఘర్‌పై నిరుద్యోగ యువతకు శిక్షణ అందించారు. నోడల్ అధికారి సాయిరాం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. 9 రోజుల ఉచిత శిక్షణతో సోలార్ వెండర్స్‌గా నిరుద్యోగులను తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు.

31న మండల సమావేశం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి మండల సర్వ సభ్య సమావేశం ఈ నెల 31న మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోళ్ల అనూష అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.భార్గవి తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారంతో తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె సూచించారు.

మారుమూల ప్రాంతాలకు విస్తరిస్తే మేలు

'స్త్రీశక్తి'తో మహిళలకు ఆర్థిక భరోసా

ఆగిరిపల్లిలో బస్సు ఎక్కుతున్న మహిళలు

నూజివీడు, న్యూస్‌టుడే

మహిళల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఏడాదిలోపు అమలు చేశారు. మహిళలు ఇంటి నుంచి బయటకు వెళ్లే సమయంలో ఆర్థికపరంగా పురుషులపై ఆధారపడకుండా ఉండేందుకు ఈ పథకాన్ని రూపకల్పన చేశారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఆసుపత్రులకు వెళ్లే రోగులకు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులకు ఉచిత బస్సు ప్రయాణం వరంలా మారింది. అయితే మారుమూల ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని మహిళలు కోరుతున్నారు.

భారం తగ్గింది...

ఆగిరిపల్లి నుంచి విజయవాడ వెళ్లాలంటే రూ.50 చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడు ఉచితంగా ప్రయాణిస్తుండటం ఆనందంగా ఉంది. ఆసుపత్రులకు వెళ్లేందుకు, దూర ప్రాంతాల్లోని బంధు మిత్రులను కలుసుకునేందుకు ఉపయోగకరంగా ఉంటుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న చంద్రబాబుకు మహిళలందరూ రుణపడి ఉంటారు. - చారుగుండ్ల కృష్ణవేణి, ఆగిరిపల్లి

నెలకు రూ.3 వేలు ఆదా..

చదువుల నిమిత్తం నిత్యం రాకపోకలు సాగిస్తున్నాం. ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణంతో ఎంతో ఊరట లభించింది. గతంలో రోజుకు నేను రూ.120 చొప్పున ఛార్జీలు చెల్లించేదాన్ని. ఉచిత ప్రయాణంతో నెలకు రూ.3 వేలకు పైగా ఆదా అవుతోంది. - నల్లమోతు ప్రిన్సీ గోల్డ్, విద్యార్థిని

ఎంతో ఉపయుక్తం...

పనుల కోసం పలు గ్రామాలకు రాకపోకలు సాగిస్తున్నాం. ప్రభుత్వం మారినప్పుడల్లా బస్సు ఛార్జీలు పెంచడంతో ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని అమలు చేస్తోంది. అది పేదలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఇది పేదల ప్రభుత్వం అనడంలో సందేహం లేదు. - దేవరపల్లి ఉమ, ఈదులగూడెం

ఆర్టీసీ బస్సుల్లో రక్షణ..

ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించాలంటే చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చాలా రక్షణగా ఉంటుంది. నెలకు రూ.4 వేలు వరకు ఆదా అవుతోంది. - బీవీఎస్ లక్ష్మి, ఉపాధ్యాయిని

32 ఏళ్ల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ విజయం 32 ఏళ్ల ఉద్యమ పోరాట ఫలితమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య అన్నారు. ముదినేపల్లిలో మంగళవారం మాదిగల విజయోత్సవ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మాదిగలు సమాజంలో గౌరవంగా బతకాలంటే ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలన్నారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా మాదిగల హక్కుల పరిరక్షణకు పాదయాత్ర నిర్వహిస్తానన్నారు. చర్మ కార్మికులు, డప్పు కళాకారులకు నెలకు రూ.6 వేల పింఛను, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో బాధితులకు రూ. 20 లక్షల పరిహారం, అయిదు ఎకరాల సాగు భూమి, ఇళ్ల స్థలం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పాఠశాలల్లో వార్షికోత్సవాలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: ఎస్ఆర్ఆర్ జడ్పీహెచ్ పాఠశాల 135వ వార్షికోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయిని డీవీఎల్ పుష్పలత పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, తహసీల్దారు భద్రు, జడ్పీ వైస్ ఛైర్మన్ జి. కృష్ణంరాజు, డీవైఈవో పీఎస్ సుధాకర్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, వార్డు కౌన్సిలర్ కందుల సత్యనారాయణ,

మండవల్లిలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఎస్ఆర్ఆర్ జడ్పీహెచ్ పాఠశాలలో విజేతలతో అధికారులు, నాయకులు

ఎంఈవో-2 జమలయ్య, పూర్వ విద్యార్థి మిర్యాల కృష్ణ కిశోర్, ఎస్ఎంసీ ఛైర్మన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. విద్య, క్రీడలు మొదలైన అంశాల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందించారు.

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు జడ్పీ బాలికోన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు.

మండవల్లి, న్యూస్‌టుడే: జీవితంలో ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటికోసం విద్యార్థులు నిత్యం కృషి చేయాలని మండవల్లి లోకుమూడి జడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్ఎం శ్రీనివాస్, వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆయా పాఠశాలల్లో మంగళవారం వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

పశువుల వ్యాధులపై జాగ్రత్త తప్పనిసరి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: పశువుల వ్యాధుల పట్ల నిర్లక్ష్యం తగదని, అనారోగ్య లక్షణాలు కనిపించగానే పశు వైద్యులకు చూపించి చికిత్సలు అందించాలని పశు వైద్యాధికారిణి క్రాంతికుమార్ సూచించారు. కొర్రగుంటపాలెంలో మంగళవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. మొత్తం 75 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, 45 పశువులకు డీవార్మింగ్ చేశారు. నాయకులు బత్తుల రవి, తూము రవి, నిమ్మకాయల సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి గిరిజ, ఏహెచ్ఏ మంగాదేవి, నారాయణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కైకలూరు, న్యూస్‌టుడే: జాతీయ రహదారి-165 విస్తరణ పనుల నేపథ్యంలో పల్లెవాడ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో బుధవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్తు శాఖ ఈఈ జీబీ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్తు కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3.00 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. గృహ, వాణిజ్య, పరిశ్రమల వినియోగదారులు, ఆక్వా రైతులు సహకరించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

'పేర్ని నాని మానసిక స్థితి పరీక్షించుకోవాలి'

కైకలూరు, న్యూస్‌టుడే: మాజీ మంత్రి, వైకాపా నేత పేర్ని నాని బీసీ వర్గానికి చెందిన మంత్రులపై మతి తప్పిన మాటలు మాట్లాడుతున్నారని, ఆయన మానసిక స్థితిపై వైద్యులను సంప్రదించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుబోయిన శ్రీనివాస్ అన్నారు. చాట్రాయిలో జరిగిన ఓ సభలో మంత్రి పార్థసారథిపై నాని చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం ఆయన కార్యాలయంలో మాట్లాడారు. మంత్రులు కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్‌లపై నోరు పారేసుకోవడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు.

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే మాజీ మంత్రి పేర్ని నాని అసత్య ఆరోపణలు చేస్తున్నారని నియోజకవర్గ తెదేపా సమన్వయ కమిటీ సభ్యుడు మడుపల్లి గోపాల్ అన్నారు. మంగళవారం ఆగిరిపల్లి తెదేపా కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు.

ఉత్సవాల్లో.. అశ్లీల నృత్యాలా?

నిర్వాహకులను హెచ్చరిస్తున్న ఎస్సై శుభశేఖర్

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి ఉత్సవాల సందర్భంగా రథోత్సవంలో అశ్లీల నృత్యాలకు ప్రయత్నించడం వివాదాస్పదంగా మారింది. ఏటా రథోత్సవంలో భక్తి గీతాలు, కోలాటాలు, సంప్రదాయ నృత్యాలు నిర్వహించడం ఆనవాయితీ. అయితే ఈసారి సంప్రదాయ కార్యక్రమాలతో పాటు అశ్లీల నృత్యాలకు ప్రయత్నించడంతో ఎస్సై కె.శుభశేఖర్ స్పందించి వాటిని అడ్డుకుని నిలిపేయించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తుల మనోభావాలు దెబ్బ తీసేలా కార్యక్రమాలు నిర్వహించడం తగదని నిర్వాహకులపై ఎస్సై ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దేవాదాయ శాఖ అధికారులు, ఉత్సవ కమిటీ వారు చర్యలు చేపట్టాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

తిరుమల, ద్వారకా తిరుమలకు కూరగాయల సరఫరా

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు నుంచి ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రాలైన తిరుమల తిరుపతి దేవస్థానం, ద్వారకా తిరుమలకు దాతలు కూరగాయలను వితరణగా అందించారు. మంగళవారం పట్టణ ఎస్ఐ నాగేశ్వరరావు, రైతు నక్కా సత్యనారాయణలు వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పూజల అనంతరం ఈ వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. తిరుపతికి 13 టన్నులు, ద్వారకా తిరుమలకు 4 టన్నుల కూరగాయలను తరలించినట్లు చెప్పారు.

కేంద్ర ప్రభుత్వ అవార్డు వచ్చేందుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతాభివందనములు

దేశ రాజధాని ఢిల్లీలో కేంద్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ రాజీవ్ రంజన్ సింగ్ గారి చేతుల మీదుగా అవార్డు అందుకున్న దృశ్యం

నూజివీడు మండలం, రావిచర్ల గ్రామ సర్వతోముఖాభివృద్ధికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వ అవార్డు పొందేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఇవే నా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు.

కాపా శ్రీనివాసరావు
నూజివీడు AMC మాజీ ఛైర్మన్
సర్పంచ్ - రావిచర్ల

(c) eenadu

దివ్యధామం.. అవని తేజం

నేడు లక్ష్మీనృసింహుని దివ్య కల్యాణోత్సవం

న్యూస్‌టుడే, అంతర్వేది, మామిడికుదురు

విద్యుద్దీపాలంకరణలో ఆలయ శోభ

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం విశేషార్చనలు వేడుకగా జరిగాయి. హనుమద్వాహనం, సింహవాహనాలపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చి భక్తజనం గోవింద నామస్మరణల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు అభయ ప్రదానం చేస్తూ కదలివచ్చిన దేవదేవుడి మంగళమూర్తులను అంతా దర్శించుకున్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆవరణంతా కళకళలాడింది.

వేడుకకు ఏర్పాట్లు

స్వామివారి దివ్య కల్యాణోత్సవాన్ని బుధవారం రాత్రి 1.56 గంటలకు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. కల్యాణ వేదిక మొత్తం పటిష్ఠంగా రక్షణ వలయాన్ని ఏర్పాటు చేశారు. కల్యాణ ఘట్టాలను చూసేలా ఎల్‌ఈడీ తెరలను అమర్చారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు 50 సీసీ కెమెరాలు, ప్రత్యేక కంట్రోల్ వ్యవస్థ ఏర్పాటయ్యాయి. స్వామివారి దర్శనాలకు సంబంధించి ప్రత్యేకంగా క్యూలైన్లు సిద్ధం చేశారు.

సింహ వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం

అత్యవసర వేళ..

హెల్ప్‌లైన్ నంబర్లు
08862 243500
08862 243502
సఖినేటిపల్లి ఎస్సై
94407 96566
రాజోలు సీఐ
94407 96526

☛ ఆలయ ప్రాంగణం, తీర్థ స్థలి, సముద్ర స్నానాల వద్ద పోలీసు కంట్రోల్ రూమ్‌లు ఉన్నాయి. భక్తులు అవసరమైన సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

ఇంటర్ ప్రయోగ పరీక్షలు ప్రారంభం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ వృత్తి విద్య (ఒకేషనల్) ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు (ప్రాక్టికల్స్) మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 31 వరకు ఇవి కొనసాగుతాయి. తొలి రోజు 8 కేంద్రాల్లో ఉదయం 641 మందికి గాను 566 మంది, మధ్యాహ్నం 554 మందికి 531 మంది విద్యార్థులు హాజరయ్యారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో సజావుగా సాగాయని జిల్లా ఇంటర్ విద్య అధికారి వి. కేశవరావు తెలిపారు. జనరల్ విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు ప్రయోగ పరీక్షలను నిర్వహిస్తారు.

ఆలయాల భూములు.. ఆన్‌లైన్‌లో మాయం

ఈనాడు, కాకినాడ: దేవుని భూములంటే అందరికీ అలుసే. కబ్జాలు చేయడం, రికార్డులు తారుమారు చేయడం.. దస్త్రాలు మార్చుకోవడం ఆక్రమణదారులకు సాధారణమైంది. జిల్లాలో ఏకంగా 744 ఎకరాలకు పైగా ఆలయాల భూములు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. వెబ్‌ల్యాండ్‌లోనూ యాజమాన్య హక్కులు మార్చేసుకున్నారు. రీసర్వేలోనూ తక్కువగానే చూపిస్తున్నారు. భూములు ఎక్కడున్నాయో గుర్తించి వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని దేవాదాయశాఖ అధికారులు రెవెన్యూ ఉన్నతాధికారులను కోరుతున్నారు..

జిల్లాలో వెబ్‌ల్యాండ్‌లో కనిపించని 744 ఎకరాలు

ఈనాడు పరిశీలన

తూరంగిలోని తూరంగేశ్వరస్వామి భూముల్లో ఆక్రమణలు తొలగించి దేవాదాయ శాఖ ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు

● జిల్లాలో చిన్న, పెద్ద దేవాలయాలకు దాతలు ఇచ్చిన భూములు 9,694 ఎకరాలున్నాయి. పూర్వపు రెవెన్యూ దస్త్రాలు ఐఎఫ్‌ఆర్ (ఇనాం ఫెయిర్ రికార్డు), ఇనాం-బి రిజిస్టర్లలో ఇవన్నీ నమోదై ఉన్నాయి. వెబ్‌ల్యాండ్‌లో 8,950 ఎకరాలే ఆన్‌లైన్‌లో కనిపిస్తున్నాయి. 744 ఎకరాలకు పైగా నమోదు కాలేదు. మరో 260 ఎకరాలు పరాధీనమే. ఎవరి కబ్జాలో ఉన్నాయో సమాచారం లేదు. రీసర్వేలో విస్తీర్ణం తగ్గించి చూపారని, సవరించి వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని ఇటీవల రెవెన్యూ క్లినిక్‌లో ఫిర్యాదు చేశారు.

ఎవరి ఆక్రమణలో ఉన్నట్లు..

● కాకినాడ పట్టణంలో దేవాదాయ భూములు 28.33 ఎకరాలుంటే 11.93 ఎకరాలే వన్‌బీ వెబ్‌ల్యాండ్‌లో కనిపిస్తున్నాయి. మిగతా 16.40 ఎకరాలు అన్యాక్రాంతమే. ● రౌతులపూడి మండలంలో 265.43 ఎకరాలకు 241.51 ఎకరాలు నమోదు చేశారు. ఇంకా 8.34 ఎకరాలు చేయాల్సి ఉంది. మొత్తం ఆన్‌లైన్ చేసినా ఇంకా 15 ఎకరాలు గల్లంతైనట్లే.

● కాకినాడ గ్రామీణంలో దేవాలయాలకు 375.70 ఎకరాలున్నాయి. వాటిలో 270.68 ఎకరాలు వన్‌బీలో కనిపిస్తున్నాయి. మరో 25.63 ఎకరాలు నమోదు చేయాల్సి ఉంది. అలా కలిపినా 295 ఎకరాలే అవుతాయి. మిగతా 80 ఎకరాల మాటేమిటి?

● పెదపూడి, ఏలేశ్వరం, కిర్లంపూడి మండలాల్లో రికార్డుల్లో ఉన్న భూములకు ఆన్‌లైన్‌లో నమోదు చేసినవాటికి 20 నుంచి 40 ఎకరాల వ్యత్యాసం కనిపిస్తోంది.

● సర్పవరం భావనారాయణ స్వామి ఆలయానికి చెందిన 225.01 ఎకరాలు ఇనాం-బి రిజిస్టర్‌లో ఉన్నాయి. క్షేత్రస్థాయిలో కబ్జాదారుల చేతుల్లోనే ఉంది. చాలా నిర్మాణాలు జరిగిపోయాయి. ● కాజులూరు మండలం కొల్లంకలో ఇనాం సర్వీసు భూములు 30.16 ఎకరాలు. ఇవన్నీ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయి ● కరప మండలం ఎండమూరులోని వేంకటేశ్వర స్వామి ఆలయ భూములు 3.61 ఎకరాలు పరాధీనంలో ఉన్నాయి.

పరాధీనంలో 258.78 ఎకరాలు..

భూముల పరిరక్షణకు ఆదేశించారు

దేవాదాయ భూముల విస్తీర్ణంలో వ్యత్యాసాలు, ఆన్‌లైన్‌లో నమోదుకాని వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం. ఆలయ భూముల పరిరక్షణ చేపట్టాలని తహసీల్దార్లకు కలెక్టర్ ఆదేశించారు. ప్రస్తుతం ఆ ప్రక్రియ జరుగుతోంది.

-నాగేశ్వరరావు, జిల్లా దేవాదాయశాఖ అధికారి, కాకినాడ

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో.. జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పోటీలు నేడు

న్యూస్‌టుడే, క్వారీసెంటర్: 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయి జూనియర్ కళాశాలల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు బుధవారం జరగనున్నాయి. రాజమహేంద్రవరం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతాయి. గత నాలుగు నెలలుగా రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం, తుని, మండపేట, కొవ్వూరు పట్టణాల్లోని 23 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాసం, క్విజ్ పోటీలు జరిగాయి. ప్రతి కళాశాల నుంచి నాలుగు విభాగాల్లో ముగ్గురు చొప్పున జిల్లా స్థాయి పోటీలకు హాజరవుతారు. విద్యార్థులు ఉదయం 9 గంటల కల్లా కేంద్రానికి చేరుకోవాలని నిర్వాహకులు సూచించారు.

వేదిక: ఆర్ట్స్ కళాశాల, రాజమహేంద్రవరం | **సమయం:** ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 వరకు

'హలో లోకేశ్' పేరిట మమేకం

ఈనాడు, కాకినాడ
న్యూస్‌టుడే, గాంధీనగర్, సర్పవరం

జేఎన్‌టీయూకేలో విద్యార్థులతో ముఖాముఖికి ఏర్పాట్లు

కాకినాడ జేఎన్‌టీయూలో ఈ నెల 30న విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ పర్యటనకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. రూసా నిధులతో నిర్మించిన పీజీ విద్యార్థుల వసతి గృహాన్ని మంత్రి ప్రారంభించనున్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులను పరిశీలించి వారితో ఆలోచనలు పంచుకోనున్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 'హలో లోకేశ్' పేరిట విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. వీసీ ఛాంబర్ ఎదురుగా ఖాళీ స్థలంలో జర్మన్ హ్యాంగర్ టెంట్‌తో భారీ వేదికను సిద్ధం చేస్తున్నారు. క్యాంపస్ ఆవరణలో పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. అసంపూర్తిగా నిలిచిన కల్వర్టు, కాలువల పనులు పట్టాలెక్కిస్తున్నారు.

ప్రారంభానికి సిద్ధమైన పీజీ విద్యార్థుల వసతిగృహం

తీరనున్న వసతి సమస్య..

కాకినాడ జేఎన్‌టీయూలో ఏటా వేల మంది విద్యార్థులు బీటెక్, ఎంటెక్‌లోని వివిధ కోర్సుల్లో చేరుతున్నారు. వీరికి సరిపడా వసతి సౌకర్యం లేక బయటే గదులు అద్దెకు తీసుకుని రాకపోకలు సాగిస్తూ అవస్థలు పడుతున్నారు. నాలుగేళ్ల క్రితం రూసా పథకంలో సుమారు రూ.10 కోట్లతో పీజీ విద్యార్థులకు వసతిగృహం మంజూరు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో సమకూర్చాలి. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం సొమ్ము ఇవ్వకనిర్మాణంలో జాప్యం జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక వసతిగృహాన్ని పూర్తిచేశారు.

కోరమాండల్ ఆసుపత్రికి..

కోరమాండల్ ఇంటర్నేషనల్ కంపెనీ తమ ట్రస్ట్ ద్వారా చాలాకాలంగా ఆసుపత్రి నిర్వహిస్తోంది. పేదలకు నామమాత్రపు రుసుముతో వైద్య సేవలు అందిస్తోంది. ఈ ఆసుపత్రిని ఆధునికీకరించి మరిన్ని వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఈ నూతన భవనాన్ని మంత్రి లోకేశ్ ప్రారంభించనున్నారు.

కార్యకర్తలతో సమావేశమై..

కాకినాడ గ్రామీణ నియోజకవర్గ తెదేపా కార్యకర్తలతో లోకేశ్ సమావేశం కానున్నారు. పార్టీ బలోపేతం, కూటమిలో సమర్థంగా పనిచేయడంపై దిశానిర్దేశం చేస్తారు. ఉత్తమ కార్యకర్తలను సత్కరిస్తారు. ఎంపీ సానా సతీష్‌బాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి ఏర్పాట్లు పరిశీలించారు.

31లోగా ఉద్యోగులకు పదోన్నతులు

కాకినాడ కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉద్యోగులకు పదోన్నతులు ఎప్పటికప్పుడు సాకారం కానున్నాయి. దీనికి సంబంధించి నియమించిన జిల్లాస్థాయి నోడల్ అధికారి, డీఆర్వో జె.వెంకటరావు, జిల్లాస్థాయి అధికారులతో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా శాఖల్లో అర్హులైన వారందరికీ ఈనెల 31 లోగా ఉద్యోగోన్నతులు కల్పించాలని ఆదేశించారు. అనంతరం డీఆర్వో వెంకటరావు అధికారులతో సమీక్షించారు. రెండు రోజుల్లో జాబితాను సమర్పించాలని సూచించారు.

తేల్చేశారు!

ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణాలు సక్రమమేనట!

న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

గత ప్రభుత్వంలో జగనన్న కాలనీ లే-ఔట్లలో గుత్తేదారుల ద్వారా జిల్లాలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత, నిబంధనలు అన్నీ సక్రమమేనని అధికారులు తేల్చేశారు. అప్పట్లో వైకాపాకు అనుకూలంగా ఉన్న కొంత మంది గుత్తేదారులు, నాయకులతో ఆప్షన్-3 కింద గృహ నిర్మాణాలు చేపట్టడానికి ఆమోదించారు. కాకినాడ జేఎన్‌టీయూ ఇచ్చిన ఆకృతుల ప్రకారం కొంత మంది నిర్మాణాలు చేపట్టలేదని, నాణ్యతకు తిలోదకాలిచ్చారని పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి.

కొమరగిరి లే-ఔట్‌లో నిర్మాణాలు

ఇంజినీర్లతో తనిఖీ

కూటమి ప్రభుత్వం వచ్చాక.. రాష్ట్ర వ్యాప్తంగా ఆప్షన్-3 కింద గుత్తేదారులు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, గృహ నిర్మాణ సంస్థ ఇంజినీర్ల ద్వారా తనిఖీ చేయించారు. మూడు నెలల కిందట జిల్లాలోని గొల్లప్రోలు పట్టణం, కాకినాడ గ్రామీణం, కాకినాడ నగరం, సామర్లకోట, పెద్దాపురం పట్టణాల్లో నిర్మించిన ఇళ్లను, వివిధ దశల్లో ఉన్న గృహాలను పరిశీలించి, నివేదిక ఇచ్చారు. వీటిలో చేపట్టిన నిర్మాణాలన్నీ సక్రమమేనని ధ్రువీకరించడం గమనార్హం. మూడు నెలలపాటు నిలిచిపోయిన నిర్మాణాలు మళ్లీ ఊపందుకోనున్నాయి.

● కాకినాడ అర్బన్ లబ్ధిదారులకు సంబంధించి కొమరగిరి లే-ఔట్‌లో ఇళ్ల నిర్మాణం చేపట్టిన ఒక గుత్తేదారు మధ్యలో ఆపేసి పత్తాలేకుండా పోయారు. ఈ విషయంలో ఇప్పటికీ చర్యల్లేవు.

● ఆరు చోట్ల 9,446 ఇళ్ల నిర్మాణాలను గుత్తేదారులకు అప్పగించగా, ఇప్పటికి 373 గృహాలు నూరుశాతం పూర్తి చేశారు. 9,115 వివిధ దశల్లో ఉన్నాయి. చాలా వరకు పునాది దశలోనే ఆగిపోయాయి.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

మండలం	మంజూరు	పూర్తయినవి
గొల్లప్రోలు	52	1
కాకినాడ గ్రామీణం	74	0
కాకినాడ అర్బన్	258	0
కాకినాడ అర్బన్(కొమరగిరి)	8,018	283
సామర్లకోట	473	14
పెద్దాపురం	571	75

● ఆప్షన్-3 నిర్మాణాలను ఉగాది నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని గృహనిర్మాణ సంస్థ పీడీ సత్యనారాయణ తెలిపారు.

రైతేరాజు

అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

జంతు కొవ్వు కరిగించి.. క్రూడ్‌ఆయిల్ మరిగించి

ధర్మవరంలో కల్తీ వంట నూనె కలకలం

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ, ఎస్సై

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో కల్తీ వంట నూనె తయారీ కేంద్రంపై మంగళవారం ప్రత్తిపాడు పోలీసులు దాడి చేసి, కీలక సూత్రధారిని అరెస్టు చేశారు. కేసు వివరాలను పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు వెల్లడించారు. ధర్మవరం హైవే సమీపంలోని ప్రతాప్‌సింగ్‌కు చెందిన రేకుల షెడ్డులో పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలేనికి చెందిన బండారు ఫణిప్రసాద్.. మరో 8 మంది సాయంతో గత నాలుగు నెలలుగా జంతు కొవ్వును కరిగించి, క్రూడ్ ఆయిల్‌తో మరిగించి ఈ నూనె తయారు చేస్తున్నాడు. పిఠాపురం, చెందుర్తికి చెందిన ఏడిద విజయ్‌కుమార్, ఆరుగుల సురేష్‌కుమార్‌ల నుంచి జంతుకొవ్వును, కాకినాడ లైట్ హౌస్ ప్రాంతానికి చెందిన చిట్టిబాబు నుంచి క్రూడ్‌ఆయిల్‌ను కొనుగోలు చేస్తున్నాడు.

ఇక్కడి నుంచి ఇచ్ఛాపురానికి..

కల్తీ వంటనూనెను ఎఫ్‌కే పాలెంలోనే నిందితుడు తయారు చేసి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం శ్రీవెంకటేశ్వర ట్రేడర్స్ యజమాని సంతోషి శ్రీనివాస్, రాజమహేంద్రవరంలోని ఎండీ ఇర్ఫాన్‌లతో ఒప్పందం కుదుర్చుకుని సరఫరా చేసేవాడు. ఆ గ్రామంలో పరిస్థితులు సానుకూలంగా లేకపోవడంతో ధర్మవరం వచ్చాడు. తాటిపర్తి గ్రామానికి చెందిన నామా నాగూరు, నామా నానిబాబులను నియమించుకుని కల్తీ నూనె తయారు చేయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ప్రత్తిపాడు ఎస్సై లక్ష్మీకాంతం బృందం దాడి చేసి నిందితుడిని అరెస్టు చేశారు. 56 డబ్బాల్లో నిల్వ ఉంచిన 840 కిలోల నూనె, 60 కిలోల క్రూడ్ ఆయిల్, గ్యాస్ సిలిండర్లు, ఇతర తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఫణిప్రసాద్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని, మిగతా నిందితులను పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్సై లక్ష్మీకాంతం, సిబ్బంది ఉన్నారు.

'దివ్య'మైన సాయం

త్వరలో మూడు చక్రాల మోటారు సైకిళ్ల పంపిణీ

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పదో తరగతి ఉత్తీర్ణులై కళాశాల విద్య చదువుతున్న, స్వయం ఉపాధి యూనిట్లు నిర్వహిస్తున్న దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం మూడు చక్రాల మోటారు సైకిళ్లు త్వరలో ఇవ్వనుంది. నియోజకవర్గానికి 10 చొప్పున జిల్లాకు 70 వాహనాలను కేటాయించారు. రూ.లక్ష నుంచి రూ.1.25 లక్షల విలువైన వీటిని అర్హులైన వారికి పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో ఏడు నియోజకవర్గాల నుంచి 137 మంది దరఖాస్తు చేశారు. వీరిలో 70 మందిని ఎంపిక చేయనున్నారు. 50 శాతం పురుషులు, 50 మహిళలకు కేటాయించనున్నారు.

నియోజకవర్గం	దరఖాస్తులు
కాకినాడ నగరం	13
కాకినాడ గ్రామీణం	18
పిఠాపురం	23
ప్రత్తిపాడు	26
తుని	23
జగ్గంపేట	20
పెద్దాపురం	14

జిల్లా స్థాయిలో ఏర్పాటైన కమిటీకి జేసీ ఛైర్మన్‌గా, డీఆర్‌డీఏ పీడీ, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ, గిరిజన సంక్షేమాధికారి, ఐసీడీఎస్ పీడీ, జీజీహెచ్ ఆర్థో సర్జన్, ఆర్టీవో సభ్యులుగా, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఏడీ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ మందిరంలో దరఖాస్తుదారుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ నిర్వహించనున్నారు. ఇక్కడ అర్హులను ఎంపిక చేసి ప్రభుత్వానికి పంపిస్తారు.

ఈ పత్రాలు తీసుకురావాలి...

హాజరయ్యే అభ్యర్థులు డ్రైవింగ్ లైసెన్స్, విద్యార్హత పత్రాలు, స్వయం ఉపాధి నిర్ధారణ పత్రం(ఎంపీడీవో ధ్రువీకరణ), సదరమ్ ధ్రువ పత్రం, రూ.3 లక్షలు లోపు ఉన్న ఆదాయ ధ్రువపత్రం తీసుకురావాలని దివ్యాంగుల శాఖ ఏడీ ఏవై శ్రీనివాస్ సూచించారు. 70 శాతం దివ్యాంగత్వం ఉన్నవారు అర్హులని తెలిపారు.

కాకినాడకు క్రికెట్ స్టేడియం

16.55 ఎకరాల దేవాదాయ భూముల కేటాయింపు

ఈనాడు, కాకినాడ: కాకినాడ సిగలో కొత్త క్రీడా మైదానం చేరబోతుంది. సర్పవరంలోని భావన్నారాయణ స్వామి ఆలయానికి చెందిన 16.55 ఎకరాల భూమిని దీని నిర్మాణానికి కేటాయించారు. జిల్లా కలెక్టర్ పేరున 33 ఏళ్లకు లీజు ప్రాతిపదికన కేటాయిస్తూ ప్రభుత్వ ఎక్స్‌అఫీషియో కార్యదర్శి హరిజవహర్‌లాల్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఏడాదికి ఎకరాకి రూ.50 వేల చొప్పున లీజు చెల్లించాలి. ప్రతి మూడేళ్లకు ఈ మొత్తాన్ని 33 శాతం పెంచాలని పేర్కొన్నారు. సర్వే నంబర్ 113, 115లలో భూమితో పాటు, అక్కడికి వెళ్లేందుకు సీసీ రోడ్డు నిర్మాణానికి మరో 4,900 చ.అడుగులు కేటాయించారు. స్టేడియం కోసం భావన్నారాయణస్వామి భూములను కేటాయించడంతో లీజు డబ్బులు పెరగడంతో పాటు ఆక్రమణలకు అవకాశం ఉండదు. క్రీడా వసతులతో పాటు చుట్టుపక్కల సదుపాయాలు సమకూరుతాయి.

రెండు స్టేడియాలు నిర్మిస్తాం..

కాకినాడలో రంజీ, ఫస్ట్ క్లాస్ క్రికెట్ పోటీలు నిర్వహించేలా స్టేడియం నిర్మించనున్నాం. నగరంలో ఎక్కడా భూములు లేవు. సర్పవరంలో దేవాదాయ భూములు అనుకూలంగా ఉండడంతో ఈ ప్రతిపాదన పెట్టి మంజూరు చేయించగలిగాం. ఇక్కడ రెండు స్టేడియంలతో పాటు అత్యాధునిక వసతులతో ఇతర క్రీడల నిర్వహణకు తగినట్లు నిర్మాణాలు చేపడతాం.

- సానా సతీష్‌బాబు, రాజ్యసభ సభ్యుడు

ఆలస్యంగా అన్నం.. అలమటించే బాల్యం

గొల్లప్రోలు నగర పంచాయతీ, మండలంలోని పలు గ్రామాల పాఠశాలల్లో విద్యార్థులు మంగళవారం మధ్యాహ్న భోజనం గంటపాటు ఆలస్యం కావడంతో అల్లాడిపోయారు. ప్రాథమిక పాఠశాలల్లో రోజూ ఉదయం 11.45 గంటలకు, ఉన్నత పాఠశాలల్లో 12.10కి మధ్యాహ్న భోజనం వడ్డిస్తారు. ఆ సమయానికి కంచాలు చేతిలో పట్టుకుని భోజనశాల వద్దకు వచ్చిన విద్యార్థులకు అన్నం ఇంకా రాలేదని సిబ్బంది చెప్పారు. గొల్లప్రోలుతో పాటు తాటిపర్తి, చేబ్రోలు, చినజగ్గంపేట, చెందుర్తి, వన్నెపూడి, కొడవలి ప్రాథమిక పాఠశాలలకు ఆలస్యంగా భోజనం వచ్చింది. దీనిపై ఎంఈవో శ్రీనివాసరావు, ఎంఈవో-2 శివప్రసాద్ ఆరా తీశారు. డీఈవోకు నివేదిక అందజేసినట్లు చెప్పారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

నాలుగు నుంచి మూడో స్థానంలోకి

ఐవీఆర్‌ఎస్‌లో మెరుగుపడిన అన్నవరం

అన్నవరం, న్యూస్‌టుడే: ఆలయాలకు వచ్చే భక్తులకు అందుతున్న సౌకర్యాలపై ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవీఆర్‌ఎస్ ద్వారా భక్తుల నుంచి అభిప్రాయ సేకరణలో అన్నవరం మూడో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని ఏడు ప్రధాన దేవస్థానాల పరిధిలో నవంబరులో ఆరోస్థానం, డిసెంబరులో నాలుగో స్థానంలో ఉంది. ఈ నెల గణాంకాల్లో మూడో స్థానంలో నిలవగా మొదటి రెండు స్థానాల్లో ద్వారకాతిరుమల, కాళహస్తి ఆలయాలు నిలిచాయి. తర్వాత స్థానాల్లో కాణిపాకం, సింహాచలం, విజయవాడ, శ్రీశైలం ఆలయాలు ఉన్నాయి.

ఇదీ లెక్క

విభాగం	సంతృప్తి	అసంతృప్తి	స్థానం
అన్ని సేవలపై సరాసరి	74.1	25.9	3
దర్శనం సంతృప్తికరంగా జరిగిందా	68.5	31.5	2
తాగునీటి సదుపాయం	71.4	28.6	3
ప్రసాదం తాజాగా, రుచిగా	82.3	17.7	3
పారిశుద్ధ్యం	66.9	33.1	6

ఇంకా చక్కదిద్దాలి..

ఏడు ప్రధాన దేవాలయాలతో పోల్చితే ర్యాంకింగ్ మెరుగుపడినా ఇంకా చక్కదిద్దాల్సినవి చాలా ఉన్నాయి. ప్రసాదం రుచి, తాజా విషయంలో భక్తుల నుంచి సంతృప్తి శాతం గత నెలతో పోల్చితే మెరుగుపడింది. తాగునీటి సరఫరా మెరుగుపడింది. దర్శనం భక్తులకు సంతృప్తికరంగా జరిగేలా ప్రణాళిక చేయాలి. ఈ విషయంలో అసంతృప్తి శాతం ఎక్కువగా ఉంది. పారిశుద్ధ్యం మెరుగుపడాలి.

పాఠం చెబుతారు.. పని నేర్పిస్తారు..!

– న్యూస్‌టుడే, గొల్లప్రోలు, పిఠాపురం

జిల్లాలోని 34 పీఎంశ్రీ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు

చదువుతోపాటు వృత్తి విద్యా కోర్సుల్లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. సామాజిక, ఆధునిక పరిస్థితులకు అనుగుణంగా వృత్తి విద్యాకోర్సులను జిల్లాలోని 34 పీఎంశ్రీ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. విద్యార్థులు తాము ఎంపిక చేసుకున్న అంశాల్లో తర్ఫీదు అందిస్తుండడంతో చక్కగా నేర్చుకుంటున్నారు.

● జిల్లాలో మూడు విడతలుగా ఎంపిక చేసిన 29 ఉన్నత, అయిదు రెసిడెన్షియల్ పాఠశాలల్లో వృత్తి విద్య నేర్పేందుకు అవసరమైన ఉపకరణాలతో ప్రత్యేక ల్యాబ్‌లు నెలకొల్పారు. ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆటోమొబైల్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కంప్యూటర్, బ్యూటీ అండ్ వెల్‌నెస్, సైన్స్ ల్యాబ్‌లు అందుబాటులో ఉంచారు. గణితం, జీవశాస్త్రం, భౌతికశాస్త్రాలకు సంబంధించి స్టెమ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతోంది. ఒక్కో పాఠశాలకు రూ.5 లక్షలతో కంప్యూటర్ ల్యాబ్, రూ.2.24 లక్షలతో 427 ఉపకరణాలు, క్రీములతో బ్యూటీ అండ్ వెల్‌నెస్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. మరోపక్క పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు కుట్టు, చిత్రలేఖనం నేర్పుతున్నారు.

గొల్లప్రోలులో కంప్యూటర్ శిక్షణ

పాఠశాలలకు నిధుల వెల్లువ

పీఎంశ్రీ పాఠశాలలుగా ఎంపికైన ఉన్నత పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో వృత్తివిద్యా కోర్సులు నిర్వహించేందుకు ల్యాబ్‌ల ఏర్పాటుతో పాటు అవసరమైన ఇతర వసతులు కల్పించేందుకు నిధులు కేటాయించారు. విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు ఆట స్థలాల అభివృద్ధికి రూ.5 లక్షల చొప్పున నిధులు కేటాయించగా, లాంగ్‌జంప్, వాలీబాల్, 200 మీటర్ల పరుగుకు ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో 8 శాతం మంది విజ్ఞాన, విహారయాత్రలకు వెళ్లేందుకు నిధులు సమకూర్చారు. పాఠశాల వార్షికోత్సవాలు నిర్వహించేందుకు ఒక్కో పాఠశాలకు రూ.50 వేల చొప్పున నిధులు మంజూరయ్యాయి.

ఉత్సాహంగా పాల్గొంటున్నారు..

పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలల్లో కంప్యూటర్, బ్యూటీ అండ్ వెల్‌నెస్, సైన్స్ ఇతర ల్యాబ్‌లు ఏర్పాటయ్యాయి. విద్యార్థులుఉత్సాహంగా నేర్చుకుంటున్నారు. - సూర్యప్రకాశరెడ్డి, హెచ్‌ఎం, జడ్పీ బాలికోన్నత పాఠశాల, గొల్లప్రోలు

దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్

హైదరాబాద్, విశాఖపట్నం & కాకినాడకు సమీపంలో ఉన్న మా బల్క్ డ్రగ్ పరిశ్రమ ప్రొడక్షన్ విభాగంలో పనిచేయుటకు ఈ క్రింది అర్హతలు, శారీరక ధారుడ్యం మరియు మంచి ఆరోగ్యం గల అభ్యర్థులు కావలెను.

2022 TO 2025 PASSED OUT & 2026 PURSUING CANDIDATES

Job Title	Qualification	Age	Stipend (P.M)
Trainee Supervisor / Graduate Apprentice	B.Sc. Chemistry	20-25 yrs	Rs. 18,000/-
	B.Pharmacy B.Tech - Chemical / Instrumentation / Mech	20-25 yrs	Rs. 20,000/-
	M.Sc. (Organic Chemistry/ Analytical Chemistry)	20-25 yrs	Rs. 22,000/-
	M.Pharmacy (QA & RA)	20-25 yrs	Rs. 24,000/-

గమనిక : పైన తెలిపిన కోర్సులు పూర్తి చేసిన మరియు ఆఖరి సంవత్సరం చివరి సెమిస్టర్ చదువుతున్న అభ్యర్థులు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు జిరాక్స్ కాపీలను తీసుకుని ఈ క్రింది ప్రదేశాలలో జరుగు ఇంటర్వ్యూకు హాజరు కాగలరు. ఎంపిక కాబడిన అభ్యర్థులు షిఫ్ట్‌లలో పనిచేయవలసి ఉంటుంది.

02-02-2026	VINANDA DEGREE COLLEGE Balaji Road, TUNI
03-02-2026	GBR DEGREE & PG COLLEGE ANAPARTHI
03-02-2026	VSM DEGREE & PG COLLEGE RAMACHANDRAPURAM
04-02-2026	YRL DEGREE COLLEGE SAMARLAKOTA
05-02-2026	SRI VENKATESWARA COLLEGE OF ARTS & SCIENCE Bhupaiah Agraharam Road, AMALAPURAM
06-02-2026	IDEAL COLLEGE OF ARTS & SCIENCE Indrampalem, KAKINADA
06-02-2026	PR GOVERNMENT COLLEGE Opp. MC Lauren High School, KAKINADA
07-02-2026	JNTU-K SCHOOL OF PHARMACEUTICAL SCIENCES & TECHNOLOGIES, KAKINADA
07-02-2026	PYDA COLLEGE OF PHARMACY (on the way to Yanam) PATAVALA
09-02-2026	GOVERNMENT COLLEGE OF AUTONOMOUS Central Jail Road, Y.Junction, RAJAHMUNDRY
10-02-2026	ADARSA COLLEGE OF PHARMACY G.KOTHAPALLI
10-02-2026	SAMHITHA DEGREE COLLEGE Tadithota, RAJAHMUNDRY
10-02-2026	GIET SCHOOL OF PHARMACY RAJAHMUNDRY

Interested candidates should report to the venue on or before 10.30 am

సదుపాయాలు : 1) బ్యాచ్‌లర్స్‌కు ఉచిత వసతి, 2) ఉచిత యూనిఫాం, 3) అర్హులైన వారికి PF, ESI ఇవ్వబడును. 4) భోజన ఖర్చులో రాయితీ.

MALE CANDIDATES ONLY

(c) eenadu

'సోనోవిజన్ లక్కీడ్రా'లో విజేతలకు బహుమతులు

విజేతలను ప్రకటిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

టి.నగర్, ఏవీఏ రోడ్డు: రాజమహేంద్రవరంలోని సోనోవిజన్ కొనుగోలుదారులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన లక్కీడ్రాలో విజేతలను ఎంపిక చేసింది. మంగళవారం సాయంత్రం కోటిపల్లి బస్టాండ్ వద్ద సోనోవిజన్ షోరూమ్‌లో జరిగిన కార్యక్రమంలో రాజమహేంద్రవరం గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పాల్గొన్నారు. ఆయన చేతుల మీదుగా లక్కీ డ్రా విజేతలను ఎంపిక చేశారు. ఎన్. సాయికుమార్ (ఆర్యాపురం) మారుతీ ఆల్టో కారు గెలుపొందారు. జి. శారదాదేవి (వీవర్స్ కాలనీ) ఎల్ఈడీ టీవీ సొంతం చేసుకొన్నారు. ఆర్. రాజా (బలభద్రపురం) రిఫ్రిజరేటర్ దక్కించుకొన్నారు. ఎం. ఆంజనేయులుకు (కానవరం) వాషింగ్ మిషన్ లభించింది. షోరూమ్ మేనేజింగ్ పార్టనర్ పి భాస్కర మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకతతో పోస్టుల భర్తీ

సాంబమూర్తినగర్(కాకినాడ): కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో పారా మెడికల్ పోస్టుల నియామక ప్రక్రియ పూర్తి పారదర్శకతతో కొనసాగుతోందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ. విష్ణువర్ధన్ తెలిపారు. జనరల్ డ్యూటీ అటెండెంట్, డ్రైవర్, ఓటీ టెక్నీషియన్, ఈఈజీ టెక్నీషియన్, డయాలసిస్ టెక్నీషియన్ తదితర పోస్టుల నియామక ప్రక్రియ మెరిట్ ఆధారంగా మాత్రమే నిర్వహిస్తామన్నారు.

భారతీయ స్టేట్ బ్యాంక్
RASMECCC & SARC, నూకాలమ్మ గుడి వీధి, రామారావుపేట, కాకినాడ - 533 004

ముందస్తు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 యొక్క 8(5) & (6) నిబంధన క్రింద

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద **భారతీయ స్టేట్ బ్యాంక్, RASMECCC & SARC, కాకినాడ** యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుకోవల్సిన సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సదరు నోటీసులు అందిన తేది నుండి 60 రోజుల లోపు ఆ నోటీసులో పేర్కొనబడిన **హౌసింగ్ లోన్ అకౌంట్ నెం. 38068436899 నకు రూ.17,36,478/-** (పదిహేడు లక్షల ముప్పైఆరు వేల నాలుగు వందల డెబ్బైఎనిమిది రూపాయలు మాత్రమే) మరియు **ఎస్.బి.ఐ. ఋణరక్ష లోన్ అకౌంట్ నెం. 38093290642 రూ.1,46,417/-** (ఒక లక్షా నలభైఆరు వేల నాలుగు వందల పదిహేడు రూపాయలు మాత్రమే) అంగీకరించిన **మొత్తం రూ.18,82,895/-** (పద్దెనిమిది లక్షల ఎనభైరెండు వేల ఎనిమిది వందల తొంభైఐదు రూపాయలు మాత్రమే) ది. 11-09-2025 వరకు మరియు తదుపరి వడ్డీ, న్యాయపరమైన మరియు ఇతర ఖర్చులతో తిరిగి చెల్లించవలసినదిగా **ఋణగ్రహీతలు : (1) శ్రీమతి బొబ్బిలి రాజ్యలక్ష్మి,** భర్త : బొబ్బిలి రాజేశ్వరరావు, డోర్‌నెం. 14-168, తెలుకుల వీధి, టెక్కలి, శ్రీకాకుళం - 532201, **(2) శ్రీ బొబ్బిలి వరుణ్ కుమార్,** తండ్రి :బొబ్బిలి రాజేశ్వరరావు, డోర్‌నెం. 14-168, తెలుకుల వీధి, టెక్కలి, శ్రీకాకుళం - 532201 **అధీకృత అధికారి, భారతీయ స్టేట్ బ్యాంక్, RASMECCC & SARC, కాకినాడ వారిచే ది.11-09-2025న డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.**

ఋణగ్రహీత సొమ్మును నిర్దిష్ట సమయములోగా తిరిగి చెల్లించుటలో విఫలమైనందున దిగువ సంతకందారుడు సదరు రూల్స్ యొక్క రూల్ 8(1)తో చదుకొనవలసిన సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ ఋణగ్రహీతలు తనఖా చేసిన ఆస్తిని లాంఛనంగా స్వాధీనపరచుకోవడం జరిగింది. రూలు 8(2) క్రింద కావాల్సిన విధంగా **స్వాధీనత నోటీసు 17-11-2025న జారీచేయబడినది మరియు 23-11-2025న ఈనాడు మరియు ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలలో ప్రచురించడమైనది.**

ముఖ్యంగా ఋణగ్రహీతలకు ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా, ఋణగ్రహీతలు బ్యాంకుకు బకాయిపడిన మొత్తాలను ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా చెల్లించనిచో దిగువ వివరించిన ఆస్తిని టెండర్లు / కొటేషన్లు ద్వారా బహిరంగ వేలంలో విక్రయించబడుతుందని ఇందుమూలంగా తెలియజేస్తూ నోటీసు జారీచేయడమైనది.

తనఖా పెట్టబడిన స్థిరాస్థి వివరములు

బొబ్బిలి రాజేశ్వరరావుగారి భార్య శ్రీమతి బొబ్బిలి రాజ్యలక్ష్మి గారికి చెందిన రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం. 11400/2018 తేది 13-11-2018 గల ఆస్తి

తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, తాళ్ళరేవు సబ్ రిజిస్ట్రీ తాళ్ళరేవు మండలం, జి. వేమవరం గ్రామ పంచాయితీ, జి.వేమవరం గ్రామం, ఎస్.నెం. 289/2,3లో ఎ.2.79 సెంట్ల మొత్తం విస్తీర్ణంలో సి.నెం. 275/2016/ఆర్.1. టి.ఎల్.పి నెం. 32/2016/ఆర్ నెంబరుతో టౌన్ & కంట్రీ ప్లానింగ్ రీజనల్ & డిప్యూటీ డైరెక్టర్, రాజమండ్రి వారిచే అనుమతి పొందిన లేఅవుట్ ప్లాట్ కొరకు విభజించబడిన ప్లాట్ నెం.29, 165 చ॥గ॥ (137.96 చ॥మీ॥) **స్థలమునకు హద్దులు (సేల్ డీడ్‌లో పొందుపరచిన విధంగా) తూర్పు :** 33'-00" లేదా 10.05 చ॥మీ. ప్లాట్ నెం.28 స్థలం, **పడమర :** 33'-00" లేదా 10.05 చ॥మీ. 33 అడుగుల రోడ్డు, **ఉత్తరం :** 45'-00" లేదా 13.72 చ॥మీ. 33 అడుగుల రోడ్డు, **దక్షిణం :** 45'-00" లేదా 13.72 చ॥మీ. ప్లాట్ నెం. 30 స్థలం.

తేది : 22-01-2026 (సం.) అధీకృత అధికారి
ప్రదేశం : కాకినాడ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

భారతీయ స్టేట్ బ్యాంక్
RASMECCC & SARC, నూకాలమ్మ గుడి వీధి, రామారావుపేట, కాకినాడ - 533 004

ముందస్తు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 యొక్క 8(5) & (6) నిబంధన క్రింద

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద **భారతీయ స్టేట్ బ్యాంక్, RASMECCC & SARC, కాకినాడ** యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుకోవల్సిన సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సదరు నోటీసులు అందిన తేది నుండి 60 రోజుల లోపు ఆ నోటీసులో పేర్కొనబడిన **(Education Loan A/c. No. 37798380896)** కు ది.20-02-2025 నాటికి **రూ.14,21,968.00** [illegible] ... 5-4-28, ముమ్మిడివారి వీధి, సూర్యారావుపేట, కాకినాడ - 533 003, [illegible] ... కాకినాడ - 533 004. హామీదారులు : [illegible] ... కాకినాడ - 533 016 వారికి అధీకృత అధికారి, భారతీయ స్టేట్ బ్యాంక్, RASMECCC & SARC, కాకినాడ వారిచే ది.20-02-2025న డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది. ది.19-03-2025న ఈనాడు మరియు ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలలో ప్రచురించడమైనది.

ఋణగ్రహీత సొమ్మును నిర్దిష్ట సమయములోగా తిరిగి చెల్లించుటలో విఫలమైనందున దిగువ సంతకందారుడు సదరు రూల్స్ యొక్క రూల్ 8(1)తో చదుకొనవలసిన సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ ఋణగ్రహీతలు తనఖా చేసిన ఆస్తిని లాంఛనంగా స్వాధీనపరచుకోవడం జరిగింది. రూలు 8(2) క్రింద కావాల్సిన విధంగా **స్వాధీనత నోటీసు 21-05-2025న జారీచేయబడినది మరియు 23-05-2025న ఈనాడు మరియు ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలలో ప్రచురించడమైనది.**

ముఖ్యంగా ఋణగ్రహీతలకు ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా, ఋణగ్రహీతలు బ్యాంకుకు బకాయిపడిన మొత్తాలను ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా చెల్లించనిచో దిగువ వివరించిన ఆస్తిని టెండర్లు / కొటేషన్లు ద్వారా బహిరంగ వేలంలో విక్రయించబడుతుందని ఇందుమూలంగా తెలియజేస్తూ నోటీసు జారీచేయడమైనది.

తనఖా పెట్టబడిన స్థిరాస్థి వివరములు

[illegible] డాక్యుమెంట్ నెం. 7477/1983, ది. 18-08-1983 ప్రకారం.

[illegible]

ఐటమ్ నెం. 1 (440.36 చ॥గ॥లు)

తూర్పు : 46'.00 [illegible] **పడమర :** 47'06" [illegible] **ఉత్తరం :** 84'00" [illegible] **దక్షిణం** 82'00" [illegible] ఖాళీ స్థలము మరియు ఐటమ్ 1

ఐటమ్ నెం.2 (116.26 చ॥గ॥ల సడక మార్గం కొరకు) :

తూర్పు : 69'00" ప్రస్తుతం వున్న భవనం, **పడమర :** 69'06" ఖాళీ స్థలం, **ఉత్తరం :** 15'04" ఐటమ్ నెం.1కి చెందిన ఆస్థి; **దక్షిణం :** 15'.00" సిసి.రోడ్డు

పైన పేర్కొన్న సరిహద్దులలో వున్న ఆర్.సి.సి. భవనం అన్ని సౌలభ్య హక్కులతో సహా

తేది : 22-01-2026 (సం.) అధీకృత అధికారి
ప్రదేశం : కాకినాడ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - తాడికొండ: బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, ఉత్కంఠభరిత హోరాహోరీ నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) NECC
Hospitality Partner: Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Gift Partner: KL (DEEMED TO BE) UNIVERSITY
Man of the Series: Hero
Digital Partner: ఈనాడు.నెట్
TV Partner: ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్, ఈ FM
Organised by ఈనాడు

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - I జూనియర్స్: మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్సర్లతో 42 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులు చేసి ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించారు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - I జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

గ్రౌండ్-2లో సీనియర్స్: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వరుణ్‌తేజ్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 87 పరుగులు చేశారు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశారు.

సీనియర్స్ విన్నర్స్ రాయలసీమ రాకర్స్

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ చరణ్ జిత్ ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-I (జూనియర్స్)
మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)
మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

'బీసీలపై దాడులు తగవు'

బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్

కత్తిపూడిలో బాధితుడితో రామచంద్రయాదవ్

శంఖవరం, న్యూస్‌టుడే: బీసీలపై దాడులు తగవని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ అన్నారు. కత్తిపూడిలో ఇటీవల దాడికి గురైన ముత్తిన రామకృష్ణను మంగళవారం ఆయన నివాసంలో పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు బీసీలకు రక్షణగా తెస్తానన్న చట్టం హామీ నేటికి అందుబాటులోకి రాలేదన్నారు. రాష్ట్రంలో నిత్యం బీసీలపై దాడులు జరుగుతున్నాయన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు నిందితులకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. పోలీసులు తక్షణమే స్పందించి బాధ్యులపై కేసు నమోదు చేసి నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం బాధితుడికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 50 వేలు సహాయం అందించారు. బీసీవై పార్టీ నాయకురాలు అనూషయాదవ్, శీరం శ్రీను, బర్ల శ్రీనివాస్, దేవర శ్రీను తదితరులు ఉన్నారు.

'పితృకార్యాలు అడ్డుకుంటే సహించం'

పిఠాపురం: కొన్ని కులాలకు చెందినవారు వైష్ణవ సంప్రదాయం ప్రకారం పితృకార్యాలను చాత్తాదా వైష్ణవులతో జరిపించుకుంటారని, వాటిని అడ్డుకుంటే సహించేదిలేదని అషుగయ మనవాళ మహాముని పరవస్తు పీఠాధిపతి శ్రీరామానుజ జీయర్ స్వామీజీ హెచ్చరించారు. మంగళవారం పిఠాపురంలో చాత్తాద వైష్ణవులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పాదగయ క్షేత్రంలో విష్ణు పాదాలున్నాయని పితరులకు పిండ ప్రదానానికి దూరప్రాంతాల నుంచి వస్తుంటారన్నారు. ఆలయంలోకి తీసుకువెళ్లేటప్పుడు ప్రైవేట్ పురోహిత సంఘమైన ఉమాకుక్కుటేశ్వరస్వామి బ్రాహ్మణ సమాఖ్య తమను అడ్డుకుని పంపించేస్తోందన్నారు. విష్ణుపాదాల వద్ద వైష్ణవ పురోహితుడు కార్యక్రమం చేయిస్తుంటే వారికి వచ్చిన నష్టమేంటని ప్రశ్నించారు. తమపై వివక్ష చూపడం సరికాదన్నారు.

హత్యకేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

మసీదు సెంటర్ (కాకినాడ): మహిళ హత్య కేసులో ముగ్గురు నిందితులను కాకినాడ పోర్టు పోలీసులు అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కి తరలించారు. పోర్టు సీఐ పి.సునీల్‌కుమార్ కథనం ప్రకారం.. ఈ నెల 18న అర్ధరాత్రి సమయంలో డెయిరీఫాంసెంటర్‌కు చెందిన పిల్లి జయప్రకాష్ తన స్నేహితులు వనమాడి రాజు, ఓలేటి లక్ష్మణ్‌లతో కలిసి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో అదే ప్రాంతానికి చెందిన గూడె మౌళి శరత్, అతని స్నేహితులు ఇద్దరు కలిసి ఈ యువకులతో గొడవ పడ్డారు. ఆ కేకలు విని జయప్రకాష్ తల్లి చక్రమ్మ, తండ్రి వీరవెంకట సత్యనారాయణ అక్కడకు వచ్చి సర్దిచెప్పే యత్నం చేశారు. ఈ క్రమంలో చక్రమ్మ, రాజు, లక్ష్మణ్‌లపై నిందితులు కత్తితో దాడి చేశాడు. గాయపడిన ముగ్గురినీ ఆసుపత్రికి తరలించగా, చక్రమ్మ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేశారు. దర్యాప్తునకు ఎస్పీ బిందుమాధవ్, ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ పర్యవేక్షణలో పోర్టు సీఐ పి.సునీల్‌కుమార్, ఎస్సైలు సతీష్‌బాబు, కనకదుర్గ, ప్రకాష్, స్టేషన్ సిబ్బందితో నాలుగు బృందాలు ఏర్పాటు చేశారు. నిందితులు కాకినాడ రేచర్లపేటకి చెందిన ముడపాక దుర్గాప్రసాద్(25), డెయిరీఫాంసెంటర్‌కు చెందిన గూడె మౌళి శరత్ అలియాస్ శరత్ సాయి(20), జె.రామారావుపేటకి చెందిన పాలెపు సతీష్(30)లను ఈ నెల 26న మధ్యాహ్నం కుంభాభిషేకం రేవు వద్ద అరెస్ట్ చేశారు. నిందితులపై రౌడీషీట్ తెరిచామని సీఐ తెలిపారు. హత్యకు ఉపయోగించిన రెండు కత్తులు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె విజయవంతం

ర్యాలీగా వెళ్తున్న ఉద్యోగులు, సంఘాల నాయకులు

గాంధీనగర్: బ్యాంకు ఉద్యోగుల ఐదురోజుల పని విధానాన్ని డిమాండ్ చేస్తూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ యూఎఫ్‌బీయూ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ రంగ, ప్రైవేట్, ప్రాంతీయ, గ్రామీణ, సహకార బ్యాంకుల ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బ్యాంకుల ఉద్యోగులు కాకినాడ మెయిన్‌రోడ్డులోని యూనియన్ బ్యాంకు రీజనల్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన తెలియజేశారు. అనంతరం మెయిన్ రోడ్డు నుంచి సూపర్ బజార్ వరకూ ర్యాలీ నిర్వహించారు. యూఎఫ్‌బీయూ కన్వీనర్ కె.ఆదినారాయణమూర్తి మాట్లాడుతూ గత ఏడాది కుదిరిన ఒప్పందాన్ని కేంద్రం అమలు చేయాలన్నారు. ఏపీ యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జేఎన్‌వి. శ్రీనివాసు, సాంబశివరావు, చంద్రశేఖర్, ఏపీయూబీఈఏ నాయకులు దుర్గాప్రసాద్, రంజిత్, రంజి, శ్యామ్, ఎస్‌బీఐ ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ నాయకులు మధుసూదన్, ఆయా సంఘాల నాయకులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	18,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	32,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	29,500
గటగట	27,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	18,000-20,000
కొత్త (పచ్చి) కాయ	16,000-18,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	143-00
రిటైల్ లైవ్	170-00
డ్రెస్డ్	247-00
స్కిన్‌లెస్	281-00

త్రుటిలో తప్పిన ప్రమాదం

సామర్లకోట: సామర్లకోట-కాకినాడ రోడ్డులోని ఇండియన్ పెట్రోలు బంకులో పెట్రోలు దిగుమతి చేస్తుండగా ట్యాంకర్‌కు మంటలు వ్యాపించాయి. సకాలంలో సిబ్బంది అప్రమత్తమై మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. మంగళవారం ఇక్కడికి వచ్చిన ట్యాంకర్‌లోంచి పెట్రోల్‌ను బంకులోకి దిగుమతి చేసేందుకు సిబ్బంది పైపులు అమర్చుతుండగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. సిబ్బంది, వాహనదారులు పరుగులు తీశారు. అప్రమత్తమైన సిబ్బంది ఇసుక, అగ్నిమాపక పరికరాలతో మంటలు అదుపు చేశారు.

సేంద్రియ విధానం.. ఆచరిస్తే అమోఘం

న్యూస్‌టుడే, మోతుగూడెం

పోలవరం జిల్లా చింతూరు మండలం గూడూరు గ్రామానికి చెందిన గిరిజన రైతు దూభి లక్ష్మయ్య సేంద్రియ వ్యవసాయంలో రాణిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. రెండెకరాల్లో వరి, ఎకరాలో మినుములు, పెసలు పండిస్తున్నారు. ఎటువంటి రసాయన ఎరువులు వినియోగించకపోవడంతో చాలామంది వీటి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

తోట వద్దకే వచ్చి ఆకుకూరలు కొనుగోలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

స్ఫూర్తి

మరో పది సెంట్లలో కూరగాయలు

పది సెంట్ల భూమిలో పలు రకాల ఆకు, కూరగాయల పంటలను పండిస్తున్నారు. వీటికి సేంద్రియ ఎరువులు, కషాయాలను పిచికారీ చేయడంతో 20 రోజులకే పంట చేతికి వస్తుంది. తాజా సరకు కావడంతో గ్రామం, చుట్టుపక్కల అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, వసతి గృహాల నిర్వాహకులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మిగిలినవి వారపు సంతలో విక్రయిస్తున్నారు.

కషాయాల తయారీ, విక్రయం

కషాయాలు, ద్రావణాలను స్వయంగా తయారు చేసుకుంటున్నారు. వీటిలో కొన్ని సొంతానికి వినియోగించుకోవడంతో పాటు తక్కువ ధరకు ఇతర రైతులకు విక్రయిస్తున్నారు. దాదాపు వంద మంది వరకు ఈయన వద్ద కొనుగోలు చేస్తున్నారు. విత్తనశుద్ధికి బీజ, ఘన జీవామృతాలు, భూమిలో సూక్ష్మజీవుల వృద్ధికి ద్రవజీవామృతం, పంట తొలిదశలో పట్టే చిన్న, పెద్ద పురుగుల నివారణకు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, టమాటా, మిర్చి, వంగ, బెండ, గోరుచిక్కుడు పంటల్లో ఆకుముడత పురుగు నివారణకు ఆవు మూత్రంతో వావిలాల కాషాయం తదితరాలు తయారు చేసి విక్రయిస్తున్నారు.

ఆదాయం ఇలా..

వరి, మినుములు, పెసలు, కూరగాయలు, ఆకుకూరల పంటలతో పాటు కషాయాల అమ్మకాల ద్వారా ఖర్చులు పోను నెలకు రూ.25 వేల వరకు ఆదాయం పొందుతున్నట్లు లక్ష్మయ్య తెలిపారు.

రైతేరాజు

పొగాకులో తెగుళ్ల బెడద

గోపాలపురం, న్యూస్‌టుడే: వర్జీనియా పొగాకు తోటల్లో ఈ సీజన్‌లో వచ్చే తెగుళ్లలో ఆకుముడత, నల్లకాడ ప్రధానమైనవి. వాటి నివారణకు సరైన చర్యలు తీసుకోకపోతే చాలానష్టం వస్తుంది. దిగుబడితో పాటు నాణ్యత లోపిస్తుందని గోపాలపురం వేలం కేంద్రం నిర్వహణాధికారి కేవల్ రామ్‌మీనా తెలిపారు.

తెగులు సోకి వాడిపోయిన పొగాకు మొక్క

తెలుసుకుందాం..

- ఆకుముడత నివారణకు తోట చుట్టూ జొన్న, మొక్కజొన్నను కంచెలా రెండు వరుసల్లో వేసుకోవాలి. వ్యాధికి కారణమైన తెల్లదోమను అరికట్టేందుకు జిగురు అట్టలను హెక్టారుకు 15 చొప్పున అక్కడక్కడ ఏర్పాటు చేయాలి. పొలంలో ముందుగా ఇమిడోక్లోపిడ్ ఎస్ఎల్ 3 మి.లీ.ను 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- నల్లకాడ తెగులు తరచూ వస్తుంటే పంటమార్పిడి చేయడం మంచిది. నాట్లు వేసింది. మొదలు తోటలో తేమ ఎక్కువగా ఉంటే నీటితడులు బాగా తగ్గించాలి. వ్యాధి నివారణకు రెడిమెల్ 20 గ్రా. మందును 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

వరిలో నత్రజని ప్రధాన పోషకం

అయినవిల్లి, న్యూస్‌టుడే: వరిలో నత్రజని మొక్క పెరిగేందుకు, దుబ్బు కట్టేందుకు ఉపయోగ పడుతుందని అయినవిల్లి ఏవో శోభ తెలిపారు. దీని లోపం వల్ల ఎదురయ్యే సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. నత్రజని లోపిస్తే వరిదుబ్బు ఎదుగుదల తగ్గి పసుపు పచ్చగా మారి ఆకులు ఎండిపోతాయి. ఒకవేళ ఎక్కువైతే పైరు ఏపుగా పెరిగి ఆకులు నీలిరంగుతో కూడిన ముదురాకు పచ్చ రంగు కలిగి ఉంటాయి. దీంతో పంట ఆలస్యంగా కోతకు వస్తుంది. రోగనిరోధక శక్తి తగ్గి పురుగులు, తెగుళ్లు ఆశిస్తాయి. రబీలో ఎకరాకు 72 కిలోల నత్రజని వేయడం ద్వారా ఆశించిన దిగుబడులు పొందొచ్చు. పైరు కీలక దశలో మాత్రమే వేయాలి. వేయాల్సిన మొత్తాన్ని మూడు భాగాలుగా విభజించి మొదటి భాగం ఆఖరి దమ్ము లేదా నాట్లు వేసే సమయంలోను, మరోభాగం పిలక తొడిగి దుబ్బువేసే సమయంలోనూ, మిగిలినది అంకురం ఏర్పడిన దశలోను వేయాలి. దీనివల్ల బాగా దుబ్బులు చేసి వెన్నుల సంఖ్య, గింజల సంఖ్య పెరిగి మంచి దిగుబడులు వస్తాయి.

అయినవిల్లిలో ఎదిగిన వరిచేను

మొక్కజొన్నలో కాండం తొలుచు పురుగు నివారణ

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: ప్రస్తుతం మొక్కజొన్నలో కాండంతొలుచు పురుగు అధికంగా ఆశిస్తోంది. దిగుబడులు గణనీయంగా తగ్గి రైతులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. పురుగు ఉద్ధృతిని గుర్తించే విధానం, నివారణ చర్యల గురించి ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకటనరసింహారావు వివరించారు. పురుగు చిన్నదశలో ఆకుల పత్రహరితం తింటాయి. క్రమంగా కాండం లోపలికి చేరి తినడం వల్ల ఆకులు విచ్చుకున్న తరువాత గుండుసూదిలాంటి రంధ్రాలు వరుస క్రమంలో కనిపిస్తాయి. లార్వా ఎదిగి అంకురాన్ని తినడం వల్ల మొక్క చనిపోయి ఎండిపోతుంది. దీనిని 'డెడ్‌హార్ట్'గా పేర్కొంటారు. ఒక్కొక్క మొక్కలో రెండు నుంచి మూడు పురుగులు కనిపిస్తాయి.

మొక్కజొన్న పంటకు ఆశించిన కాండం తొలుచు పురుగు

మీ కోసం

నివారణ చర్యలు

- పొలం చుట్టూ 3, 4 వరుసల్లో ఎర పంటగా వేసుకుని 45 రోజుల తరువాత తీసివేయాలి. పురుగు ఆశించిన మొక్కలను నాశనం చేయాలి. అంతర పంటగా అపరాలు వేస్తే కాండం తొలిచే పురుగులకు సహజ శత్రువుల సంఖ్య పెరుగుతుంది.
- ట్రైకోగ్రామా కిలోనిస్ పరాన్నజీవి గుడ్లను ఎకరాకు 2, 3 ట్రైకోకార్డుల రూపంలో రెండు విడతలుగా విడుదల చేయాలి.
- మోనోక్రోటోఫాస్ లీటరు నీటికి 1.6 మిల్లీలీటర్లు చొప్పున ఎకరాకు 320 మిల్లీలీటర్లు మందు కలిపిన ద్రావణాన్ని పైరు మొలకెత్తిన 10 నుంచి 12 రోజులకు పిచికారీ చేయాలి.
- పురుగు ఉద్ధృతి ఎక్కువగా ఉంటే కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఎకరాకు 3 కేజీల చొప్పున పైరు మొలకెత్తిన 25 నుంచి 30 రోజులకు ఆకుల సుడులలో వేయాలి.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). ✆ 83338 33368

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నది విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph : 8142292071.

శ్రీసాయి గోల్డ్ తాకట్టులో ఉన్న బంగారం ఏ బ్యాంక్/ప్రైవేట్ సంస్థల నుండి అయినా విడిపించి ఆరోజు మార్కెట్ రేటుకి కొనబడును. స్పాట్ క్యాష్ 94933 38823.

EDUCATION

విజయవాడలో BPT/ B.Sc., MLT- మేనేజ్‌మెంట్ కోటా సీట్లు- తక్కువ ఫీజు- కౌన్సిలింగ్ కలవు. Affiliated to Dr. NTR యూనివర్సిటీ. ✆ 7995945835.

REAL ESTATE

FLAT FOR SALE

KAKINADA CITY

కాకినాడ, RTO ఆఫీస్ మెయిన్‌రోడ్ నందు ప్రముఖ అపార్ట్మెంట్‌లో 1060 Sft. సెకండ్ సేల్. S/F, కార్‌పార్కింగ్, లిఫ్ట్ సౌకర్యాలతో అమ్మకము. Cont: 97057 48052

PLOT FOR SALE

KAKINADA CITY

KKD, గంగనాపల్లి 100+100 చ॥గ॥ EF రెడీగా ఇల్లు కట్టు కొనుటకు గజం 16K, కలెక్టర్ ఆఫీస్ దగ్గర 2BHK ఫ్లాట్స్16L Only. 8985804011,9440303936.

JOBS

ఫ్యాక్టరీలో తేలికపాటి పని చేయుటకు యువతీ/ యువకులు కావలెను. 9 గంటలు డైలీ పని ఉండును. నెలకు రెండు ఆదివారములు సెలవు. సంప్రదించండి: 9000557999.

ADB రోడ్డుకి దగ్గరగా రంగంపేట వద్ద RUDA అప్రూవ్డ్ వెంచర్ మార్కెటింగ్‌కై టీం ఉన్న లీడర్లు కావలెను. మంచి కమీషన్+ ఇన్సెంటివ్స్. ✆ 6302626576.

రైస్ మిల్ & ప్లాంట్ ఆపరేటర్స్ కావలెను. అనుభవజ్ఞులైన వెల్డింగ్, రిపేర్ తెలిసిన ఆపరేటర్స్ కావలెను. Contact No: ✆ 80962 46099.

SECURITY GUARDS

రాజమండ్రి మరియు పరిసర ప్రాంతాలలో సెక్యూరిటీకి సంబంధించి గార్డులు, సూపర్‌వైజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు కావలెను. ✆ 96525 29724, 93468 62560.

కాకినాడ మరియు వాకలపూడి ఏరియాలో సెక్యూరిటీ గార్డ్‌లు స్త్రీలు మరియు పురుషులు కావలెను. PF మరియు ESI ఉచిత భోజన సౌకర్యం కలదు. ✆ 9949826283

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. **5-15** పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కాకినాడ

కచేరి చేస్తున్న శ్రీనివాసు

సమ్మోహనంగా సంగీత కచేరి

గాంధీనగర్, న్యూస్‌టుడే: సంగీత విద్వత్సభ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం సూర్యకళామందిరంలో నక్కపల్లికి చెందిన ఉప్పలపు శ్రీనివాస్ మాండోలిన్ సంగీత కచేరీ రసరమ్యంగా సాగింది. పలు రాగాలు, కృతులను మాండోలిన్‌పై పలికించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంది. వయోలిన్‌పై రాంచరణ్, మృదంగంపై సాయికృష్ణ, పాడ్స్‌పై సాయిప్రకాష్‌లు సంగీత సహకారం అందించారు. తొలుత సంగీత కార్యక్రమాలను రాయవరపు జగన్నాథరావు, సంజీవరావు, లక్ష్మీకాంతం, రాజ్‌కుమార్ ప్రారంభించారు.

బాలల సంరక్షణ కేంద్రాల నమోదు తప్పనిసరి

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: బాలల సంరక్షణ కేంద్రాలు నడుపుతున్న సంస్థలు, వ్యక్తులు.. తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ జిల్లా పర్యవేక్షణాధికారి వై.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా చట్టం కింద లైసెన్సులు తీసుకున్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందేనన్నారు. సంబంధిత పత్రాలు ఫిబ్రవరి 13లోగా జిల్లా పర్యవేక్షణాధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు 90301 53369, 85550 60818 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ర్యాలీలో పాల్గొన్న క్రెగ మెమోరియల్ బాప్టిస్టు చర్చి ప్రతినిధులు, పాస్టర్లు, సంఘ నాయకులు

సీబీసీఎన్‌సీ ఆస్తులు పరిరక్షించాలి

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: సీబీసీఎన్‌సీ సంస్థ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని క్రెగ్ బాప్టిస్టు చర్చి కార్యదర్శి ఎం.వినోద్‌కుమార్ అన్నారు. కాకినాడ బాలాజీచెరువులోని చర్చి నుంచి కలెక్టరేట్ వరకూ శాంతియుత ర్యాలీని మంగళవారం నిర్వహించారు. అనంతరం ఇన్‌ఛార్జి కలెక్టర్ అపూర్వభరత్‌కు వినతి పత్రం అందజేశారు. వినోద్ కుమార్ మాట్లాడుతూ సీబీసీఎన్‌సీ ద్వారా అనేక విద్యాలయాలు, వైద్యకళాశాలలు, ఆసుపత్రులు నిర్మించారని, ప్రస్తుతం ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయని పేర్కొన్నారు. వీటిని రక్షించేందుకు ఇక్కడ నుంచి తొలి అడుగు వేశామని చెప్పారు. పాస్టర్లు డి.వరప్రసాద్, రంజిత్‌కుమార్, జోసెఫ్ బెన్ని, కార్యవర్గ సభ్యులు, కాపరులు, సంఘ విశ్వాసులు, స్థానిక సిటీ పాస్టర్ ఫెలోషిప్ నాయకులు పాల్గొన్నారు.

సామాజిక భవన స్థలాన్ని కాపాడండి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు నగర పంచాయతీలో 15వ వార్డులో సామాజిక భవనానికి ప్రతిపాదించిన స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరారు. వారు మంగళవారం ఇన్‌ఛార్జి కలెక్టర్ అపూర్వభరత్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో ఇక్కడ బీసీలకు సామాజిక భవనం నిర్మించడానికి స్థలాన్ని కేటాయించారని, దీన్ని ఇప్పుడు మరొకరికి ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఎటువంటి గొడవలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు.

పేదలబియ్యం పక్కదారిపై చర్యలు చేపట్టండి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో పేదల బియ్యం పక్కదారి పట్టకుండా కఠిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్, భాజపా సీనియర్ నాయకుడు వై.మాలకొండయ్య కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో ఇన్‌ఛార్జి కలెక్టర్, జేసీ అపూర్వభరత్‌ను మర్యాద పూర్వకంగా కలిసి, సమస్యలను వివరించారు.

5న ఏపీ జేఏసీ అమరావతి మహాసభ

కాకినాడ కలెక్టరేట్: ఏపీ జేఏసీ అమరావతి ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఫిబ్రవరి 5న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న మహాసభను విజయవంతం చేయాలని కాకినాడ జిల్లా ఛైర్మన్ పితాని త్రినాథరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

మహిళలకు యోగాలో ఉచిత శిక్షణ

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: రామారావుపేటలోని ఆదిగురు యోగాపీఠం ఆధ్వర్యంలో మహిళలకు ఫిబ్రవరి 1 నుంచి ఏప్రిల్ 30 వరకూ ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని సద్గురు సచ్చిదానంద యోగి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9121292233 నంబరులో సంప్రదించాలని చెప్పారు.

మహారాజశ్రీ కాకినాడ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో

SOP No. 21/2025

Between
Matta Sarada Lakshmi and Others ...Petitioners

and

1) Prohibition & Excise Superintendent
2) Matta Suneetha
Aged: 35 Years, Housewife, D.No. 18-8-9, 2nd Street, Lingampeta, Rajahmundry ...Respondents

సదరు పై నెంబరు గ్రంథమున మట్టా శ్రీనివాసరావు గారు మరణించినందున వారికి వారసులుగా ఇందలి పిటీషనర్సు అయిన Matta Sarada Lakshmi, Matta Srihari Sai, Matta Sai Sravavni వార్లకు Succession Certificate జారీ చేయించగలందులకు పిటీషను దాఖలు చేసియున్నారు. కావున లోకులెల్లరకు ఆక్షేపణలు ఉన్నయెడల ది. 5-2-2026 ఉదయం 10.30 గం॥లకు పై కోర్టువారి ఎదుట తెలియపరచుకొనవచ్చును.

N.S.R.N.Chowdary, M.A., B.L.
Advocate, # 10-7-34, Dhanyam Raju Apartments,
కాకినాడ, Ramaraopeta, Kakinada-533 001
ది. 24-01-2026. Cell: 98482 22565.

ఆపద వేళ.. ఆదుకునేలా!

రోటరీ సహకారంతో ఆర్టీసీ బస్టాండులో రక్తదాన శిబిరం

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారు, ఆసుపత్రుల్లో చికిత్సలు, కాన్పులు తదితర సందర్భాల్లో సకాలంలో రక్తం అందక ఎంతోమంది ప్రాణాపాయస్థితిలోకి వెళుతున్నారు. ఈ నేపథ్యంలో అత్యవసర సమయాల్లో రక్తం అవసరమైన వారికి మేమున్నామని.. కాకినాడ ఆర్టీసీ డిపో అధికారులు, ఉద్యోగులు భరోసానిస్తున్నారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో మంగళవారం రక్తదాన శిబిరాన్ని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు, డిపో అసిస్టెంట్ కమిషనర్ ఎంయూవీ మనోహర్ ప్రారంభించారు. సుమారు 125 మంది ఈ శిబిరంలో రక్తదానం చేశారు. అసిస్టెంట్ మేనేజర్లు బాలకృష్ణ, మాలిమ్‌బాషా, తుని, ఏలేశ్వరం, రాజోలు డిపో మేనేజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతగా ముందుకు రావాలి

కాకినాడ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాను. తలసేమియా చిన్నారులకు ఎంతో మందికి రక్తకొరత ఏర్పడుతోంది. సకాలంలో అందక ఎంతోమంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిని అధిగమించాలంటే ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా స్పందించాలి. ఇటీవల తోటి ఉద్యోగి బంధువుకు రక్తం అవసరమైతే వెంటనే వెళ్లి ఇచ్చాను.

-బి.పెదబాబు, కాకినాడ డిపో

రక్తదానంతో ఆరోగ్యంగా ఉంటాం..

ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయడం వల్ల మరో ముగ్గురికి ప్రాణదానం చేయవచ్చు. నేను ఇప్పటివరకు 15 సార్లు రక్తదానం చేశా. సకాలంలో రక్తం దొరక్క ఎంతోమంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా యువత ముందుకు రావాలి. తోటి ఉద్యోగులకు దీనిపై అవగాహన కల్పిస్తున్నా.

-మాలిమ్‌బాషా, అసిస్టెంట్ మేనేజర్, కాకినాడ డిపో

సమాజసేవపై ఆసక్తి

కాకినాడ ఆర్టీసీ డిపోలో హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాను. సమాజ సేవపై ఆసక్తితో స్వచ్ఛందంగా తరచూ ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొంటాను. ప్రతి ఏడాది కాకినాడ డిపోలో నిర్వహించే శిబిరంలో పాల్గొంటాను. ఇప్పటికి 21 సార్లు రక్తదానం చేశాను. ఎంతోమందికి ఆపదలో ఇది ఉపయోగపడుతుంది.

- మద్దూరి రామారావు

ప్రజల్లో చైతన్యం అవసరం

రక్తదానంపై ప్రజల్లో అపోహలు తొలగాలి. చైతన్యం తీసుకురావాలి. ముఖ్యంగా యువత ముందుకు రావాలి. ఇప్పటికి 10 సార్లు రక్తదానం చేశారు. ఈ మహాయజ్ఞంలో నేను భాగస్వామిని కావడం నా ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది. రక్తదానం ప్రాణదానంతో సమానం.

-బి.ఏసుబాబు, జిల్లా అగ్నిమాపక అధికారి, కాకినాడ

క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే వనమాడి

క్రీడలతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపు

గాంధీనగర్, న్యూస్‌టుడే: క్రీడలు విద్యార్థుల జీవితంలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు అన్నారు. మహాదాత మల్లాడి సత్యలింగ నాయకర్ వర్ధంతిని పురస్కరించుకుని జగన్నాథపురం ఎంఎస్ఎన్ ఛారిటీస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో విద్యార్థులు, సిబ్బందికి మంగళవారం క్రీడా సంబరాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సిబ్బందికి నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌లో ఎమ్మెల్యే బ్యాటింగ్ చేసి ఉత్సాహపరిచారు. విద్యార్థులకు పరుగుపందెం, క్రికెట్, షాట్‌పుట్, కబడ్డీ, మ్యూజికల్ ఛైర్ వంటి పోటీలు నిర్వహించారు. ఛారిటీస్ ఛైర్మన్ మల్లాడి కార్తిక్ నాయకర్, ఈవో చాగంటి సురేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ కార్యవర్గాల ఎన్నిక

నూతన కార్యవర్గాలతో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ నగర నియోజకవర్గం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్), మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పీ) నూతన కార్యవర్గాలు ఎన్నికయ్యాయి. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కాకినాడ ఇన్‌ఛార్జి ఎస్.వాసుదేవరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి, కాకినాడ కో-ఇన్‌ఛార్జి పి.చిన్నబాబు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బాబూజగ్జీవన్‌రామ్ సామాజిక భవనంలో సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షుడిగా తుమ్మపల్లి సంతోశ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాదా రవికాంత్, అధికార ప్రతినిధిగా ఇరుసుమండ సాయికృష్ణ, ఉపాధ్యక్షులుగా అడ్డాల సూరిబాబు, పువ్వల దిలీప్‌కుమార్, వల్లూరి సూర్యచంద్ర, ప్రధాన కార్యదర్శిగా పలివెల దుర్గాప్రసాద్, కార్యదర్శులుగా కొమ్మూకూరి అఖిల్, పలపాట భాగ్యరాజ్, నేకూరి అనిల్‌కుమార్, ప్రచార కార్యదర్శిగా డి.రవికుమార్, కోశాధికారి ఏడిద రాహుల్ ఎన్నికయ్యారు. ఎంఎస్‌పీ నగర అధ్యక్షుడిగా పలపాటి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మిరయాల రాజు, అధికారి ప్రతినిధిగా కొమ్మూకూరి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా పువ్వల కనకరాజు, బొడపాటి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా తాటిపూడి వెంకటేశ్, కార్యదర్శులుగా కాపవరపు చంద్రరావు, మాధవరపు అర్జున్, ప్రచార కార్యదర్శిగా ఏకే బాబు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డోకుబుర్ర భద్రం, వల్లూరి సత్తిబాబు, పలివెల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

12న సార్వత్రిక సమ్మెకు సహకరించాలి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: దేశంలోని 45కోట్ల మంది కార్మికులు, రైతుల హక్కుల కోసం ఈ నెల 12న తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు జిల్లాలో సహకారం అందించాలని కేంద్ర కార్మిక సంఘాలు కోరాయి. ఈ మేరకు మంగళవారం ఇన్‌ఛార్జి కలెక్టర్ అపూర్వభరత్‌కు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎన్‌టీయూసీ ఏపీ, తెలంగాణ కార్యనిర్వాహక కార్యదర్శి తాళ్లూరి రాజు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కోశాధికారి గుబ్బల ఆదినారాయణ సమ్మె నోటీసు అందజేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 8 గంటల పనిదినాలు అమలు చేయాలని, రవాణా రంగంలో పెంచిన చలానాలు, టోల్‌గేట్, బీమా, ఫిట్‌నెస్ ఛార్జీలు తగ్గించాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇన్‌ఛార్జి కలెక్టర్ అపూర్వభరత్‌కు నోటీసు అందజేస్తున్న ప్రతినిధులు

సాంబమూర్తినగర్(కాకినాడ): కార్మిక శాఖ ఉప కమిషనర్(ఇన్‌ఛార్జి) వలీ, కాకినాడ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ కమిషనర్ మనోహర్‌లకు ఆయా సంఘాల నాయకులు సమ్మె నోటీసులు అందజేశారు.

అధిక వేగమే ప్రమాదాలకు కారణం

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాలు జరగడానికి అధిక వేగంతో వాహనాలు నడపడమే ప్రధాన కారణమని కాకినాడ ట్రాఫిక్-1 సీఐ ఎన్.రమేష్ తెలిపారు. మంగళవారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక జగన్నాథపురం, వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ స్కూల్ పిల్లలను 6ప్లస్1 మాత్రమే ఆటోల్లో తీసుకువెళ్లాలన్నారు. ఇరువైపులా స్కూల్ బ్యాగ్స్, క్యారేజ్ బ్యాగ్‌లు తలిగించకూడదని చెప్పారు. వాహనాలను ఎక్కడిపడితే అక్కడ నిలపకుండా, ప్రయాణికులను రోడ్డు మధ్యలో దించకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. ఎస్సై బోసుబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత భవిష్యత్తు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: విద్యతోనే ఉన్నత భవిష్యత్తు సాధ్యమని అర్బన్ ఎంఈవో చెవ్వూరి రవి అన్నారు. స్థానిక గాంధీనగర్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయుడు పీవీ సత్యనారాయణరాజు, విద్యా కమిటీ ఛైర్మన్ అక్కరపు శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీనివాస్ కృష్ణమోహన్, రవిశంకర్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి శుద్ధి ప్లాంటు పూర్తికి చర్యలు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: ఏటిమొగలో అసంపూర్తిగా మిగిలిన మురుగునీటి శుద్ధి ప్లాంట్ (ఎస్టీపీ) నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ ఎన్‌వీవీ సత్యనారాయణ అన్నారు. వార్డు పర్యటనలలో భాగంగా మంగళవారం ఏటిమొగ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. సమస్యను కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఎంహెచ్‌వో డా.పృథ్వీచరణ్, ఈఈ ఆదినారాయణ, శానిటరీ పర్యవేక్షకుడు రాంబాబు తదితరులున్నారు.

'యువగళం' మూడో వార్షికోత్సవం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం లోకేశ్ యువజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. స్థానిక సంతచెరువు కార్యాలయంలో ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బు మహిళా కార్యకర్తలతో కలిసి కేకు కోశారు. పేదలకు అన్నదానం చేశారు.

ఉగాదికి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉగాది నాటికి జిల్లాలో 13,588 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించిందని హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో ఆయన ఈఈ, డీఈఈ, ఏఈఈలతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో చేపట్టిన పీఎంఏవై-1.0, పీఎంఏవై-2.0 ఇళ్ల నిర్మాణాల ప్రగతిని సమీక్షించారు. ఎప్పటికప్పుడు వీటిపై సమీక్షిస్తామని, రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారని, ఇంజినీర్లు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తాజాగా పట్టణాల్లో పీఎంఏవై-2.0 కింద 2005 గృహాలు మంజూరు అయ్యాయని, నెలాఖరులోగా వీటిని గ్రౌండింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యనిర్వాహక ఇంజినీర్లు ఎల్.శ్రీనివాసరావు, కేవీఎస్ఎన్ రెడ్డి, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్లు నాగభూషణం, సువర్ణరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న పీడీ సత్యనారాయణ, హాజరైన ఇంజినీర్లు

క్వాంటమ్ కంప్యూటింగ్‌తో విప్లవాత్మక మార్పులు

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: భవిష్యత్తులో క్వాంటమ్ కంప్యూటింగ్‌తో విప్లవాత్మక మార్పులు వస్తాయని నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్ర, కంప్యూటర్ సైన్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో 'డీకోడింగ్ ది క్వాంటం కంప్యూటర్, ఏ జర్నీ ఫ్రం బేసిక్స్ టు బేక్ త్రూస్' అంశంపై రెండు రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాపును మంగళవారం ప్రారంభించారు. ప్రిన్సిపల్ డా.వి.అనంతలక్ష్మి మాట్లాడుతూ క్వాంటమ్ సాంకేతికత భవిష్యత్తు పరిశోధనలు, ఉద్యోగ అవకాశాల్లో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. క్వాంటమ్ రీసెర్చ్ సైంటిస్ట్ డా.జ్ఞాన్ యల్లా, పులివెందుల జేఎన్టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఎస్.దామోదరయ్య రీసోర్స్ పర్సన్లుగా పాల్గొన్నారు. వివిధ అంశాలను వివరించారు. వైస్ ప్రిన్సిపల్ డా.ఎం.సువర్చల, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎం.వసంతలక్ష్మి, కన్వీనర్ డా.బి.సూర్యనారాయణ దేవర, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్.నాగ సుబ్రహ్మణ్యేశ్వరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అనంతలక్ష్మి

(c) eenadu

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

చూపును పరీక్షిస్తున్న వైద్యుడు

నేత్ర వైద్యశిబిరానికి స్పందన

పెదపూడి: మండలంలోని కరకుదురులో బాప్టిస్ట్ చర్చి పాస్టర్లు డా.వి.జోసెఫ్, పాల్‌జీ తిలక్ ఆధ్వర్యంలో మంగళవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. 50 మందికి కళ్లజోళ్లు అందించాలని పేర్కొన్నారు. మరికొందరికి వెంటనే ఆపరేషన్లు చేయాలని నిర్ణయించారు. కొందరికి ఉచితంగా మందులు అందించారు.

సాయిబాబా ఆలయంలో లక్షపత్రి పూజలు

పెదపూడి, న్యూస్‌టుడే: పెదపూడిలోని సాయిబాబా ఆలయంలో మంగళవారం శ్రీసాయి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా లక్షపత్రి పూజలు నిర్వహించారు. మహిళలు సాయి నామ పారాయణం చేశారు. అనంతరం బాబాను భక్తులు ప్రత్యేక అలంకరణలో దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందరికీ అందించారు.

ప్రత్యేక అలంకరణలో సాయిబాబా →

కౌన్సిల్.. సౌకర్యాలు నిల్..!

● తూతూమంత్రంగా సమావేశాలు ● సభ్యులు నిలదీసినా.. తొలగని సమస్యలు

పురపాలిక: పిఠాపురం
● కౌన్సిల్ సభ్యులు, వార్డులు: 30
❖ జరిగిన సమావేశాలు: 57
✦ ఈ నెల సమావేశం: 31న

❒ ప్రధాన సమస్య: కౌన్సిల్ సభ్యులంతా పట్టణంలో పారిశుద్ధ్య సమస్యపై ప్రతి నెలా అధికారులను నిలదీస్తున్నారు. మొదటి నుంచీ పారిశుద్ధ్య కార్మికుల కొరత ఉందని, అదనంగా వార్డుకో కార్మికుడి చొప్పున 30 మందిని నియమించాలని కోరుతున్నారు. నేటికీ అధికారులు నియమించలేదు. ఇక్కడి పారిశుద్ధ్య సమస్యపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు.

గొల్లప్రోలులో గత సమావేశంలో ప్రశ్నిస్తున్న సభ్యులు

నగర పంచాయతీ: గొల్లప్రోలు
● : 20
❖ : 57
✦ : 31న

❒ : నగర పంచాయతీ భవనం శిథిలమైంది. కొత్తది నిర్మించాలని సభ్యులంతా పోరాటం చేస్తున్నారు. రూ.50 లక్షలు మంజూరైనా.. స్థలం లేక నిర్మాణం చేపట్టలేదు. ఇప్పటికైనా స్థలసేకరణ చేసి, ప్రజలకు, అధికారులకు, సభ్యులకు అనువుగా ఉండేలా భవనం నిర్మించాల్సిఉంది. మంచినీటి సమస్య పరిష్కారం నేటికీ పూర్తి కాలేదు. పైపులైన్ నిర్మాణం మధ్యలో ఆగిపోయింది.

పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురం పురపాలికలతోపాటు గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిల్ సభ్యుల పదవీకాలం మార్చి 19తో ముగియనుంది. ఇప్పటివరకు 57 సాధారణ సమావేశాలు నిర్వహించారు. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో జరిగే మూడు సమావేశాల్లో మాత్రమే వీరికి ఆయా వార్డుల్లో సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంది. – న్యూస్‌టుడే, పిఠాపురం, గొల్లప్రోలు, పెద్దాపురం, సామర్లకోట

పురపాలిక: సామర్లకోట
● : 31
❖ : 57
✦ : 31న

❒ : సామర్లకోటలో శ్మశాన వాటికల చుట్టూ ప్రహరీలు నిర్మించాలని సభ్యులు తొలినుంచీ అడుగుతున్నారు. కొన్ని పూర్తికాగా ముఖ్యమైన పిఠాపురం-సామర్లకోట రోడ్డులోని పశువులమ్మగుడి దగ్గర వాటికకు నిర్మాణం జరగలేదు. దాంతో జనం ఇబ్బందిపడుతున్నారు. నిధులు వెచ్చించాల్సిఉంది.

పురపాలిక: పెద్దాపురం
● : 29
❖ : 57
✦ : 29న

❒ : పెద్దాపురంలో పాత మంచినీటి పైపులైన్ తొలగించి, కొత్తది ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. గోదావరి జలాలు అందించాలని అడుగుతున్నారు. మూడు కిలోమీటర్లకు సంబంధించిన ఈ పనులు మొదలుపెట్టి మధ్యలో వదిలేశారు. దాంతో నిత్యం పైపులు పగిలి, నీరు కలుషితమయ్యే సమస్య ఉంది. దీనిపై దృష్టి సారించాలి.

సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని వినతి

పెద్దాపురం: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ మంగళవారం పెద్దాపురం ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్రైవేటు ఎలక్ట్రికల్స్ వర్కర్స్ యూనియన్ నిరసన తెలిపింది. అంతకు ముందు పట్టణంలో నల్ల జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతి పత్రం అందజేశారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు చింతల సత్యనారాయణ, అధ్యక్ష, కార్యదర్శులు తాడిశెట్టి గంగా, సుధాకర్, పెదిరెడ్ల విష్ణు పాల్గొన్నారు.

బాలల హక్కులు పరిరక్షిద్దాం

శిక్షణలో మాట్లాడుతున్న పీడీ లక్ష్మి

సామర్లకోట: మిషన్ శక్తి పథకాలపై అధికారులు, సిబ్బంది అవగాహన పెంచుకుని బాలల హక్కుల పరిరక్షణకు క్షేత్ర స్థాయిలో కృషి చేయాలని స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీ లక్ష్మి సూచించారు. సామర్లకోటలో ఉష ఆధ్వర్యంలో సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, మిషన్ శక్తి, చైల్డ్ లైన్, వన్‌స్టాప్ సిబ్బంది, ఎంఎస్‌కేలకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ప్రేమ జంటకు వివాహం



సామర్లకోట: సామర్లకోట బలుసులపేటకు చెందిన వడ్డి రమేష్, భీమవరంపేటకు చెందిన శీలి నవదీపిక ప్రేమించుకున్నారు. పెళ్లికి పెద్దలు ఒప్పుకోలేదు. సాయంకోరిన వారిద్దరినీ మంగళవారం సీఐ కృష్ణభగవాన్ మండల మేజిస్ట్రేట్ చంద్రశేఖర్‌రెడ్డి వద్ద హాజరుపర్చారు. వారి అంగీకారంతో అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు, కౌన్సిలర్ నేతల హరిబాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మేజర్లైన వారిద్దరికీ వివాహం జరిపించారు.

అవార్డులతో మరింత బాధ్యత

పిఠాపురం: ప్రభుత్వం ఇచ్చే అవార్డుల్లో ఉద్యోగుల్లో మరింత బాధ్యత పెరుగుతుందని గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం కాకినాడలో జరిగిన గణతంత్ర వేడుకల్లో కేఈ డీఈ సంతోష్‌కుమార్, ఏఈ భవానీ ప్రశంసాపత్రాలు అందుకోగా మంగళవారం వారిని పిఠాపురం జలవనరులశాఖ కార్యాలయం వద్ద సన్మానించారు. సునీల్‌కుమార్ మాట్లాడుతూ అంకితభావం, నిబద్ధతతో పనిచేస్తే ప్రతి ఉద్యోగికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రైతుల సమస్యల పరిష్కారానికి, కాలువల అభివృద్ధికి రూ.కోట్ల నిధులు ఇస్తున్నారన్నారు. డీసీలు కృష్ణచైతన్య, గోపాలకృష్ణ, వీరాస్వామి, సత్యనారాయణ, నాగసత్తులు, ఈఈ శేషగిరిరావు పాల్గొన్నారు.

డీఈ, ఏఈలను సత్కరిస్తున్న సునీల్‌కుమార్ తదితరులు

వ్యక్తిత్వ వికాసానికి పాఠశాల గొప్ప వేదిక

సమావేశంలో మాట్లాడుతున్న పురపాలిక ఛైర్‌పర్సన్ అరుణ

సామర్లకోట: విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి పాఠశాల గొప్ప వేదికని సామర్లకోట పురపాలిక ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. మంగళవారం అయోధ్యరామపురంలోని పీఎంశ్రీ బచ్చు ఫౌండేషన్ పురపాలిక ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ప్రధానోపాధ్యాయుడు సాయిరామకృష్ణ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ఫ్లోర్, ఎంఈవో లక్ష్మీదేవి, పి.పుల్లయ్య హాజరయ్యారు.

స్థలం కోరుతూ ధర్నా

పెద్దాపురం: దమ్ముపేటలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కోరుతూ ఏపీ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో కాలనీకి చెందిన వ్యక్తి మృతదేహంతో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆ సంఘం నేత వీరాంజనేయులు మాట్లాడారు.

వార్షికోత్సవం.. వినోదాత్మకం

గొల్లప్రోలు, కరప: : గొల్లప్రోలు పీఎంశ్రీ బాలికోన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు మంగళవారం జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులు సందడి చేశారు. సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. నృత్య నాటికలు, అభినయగీతాలు ప్రదర్శించారు. పోటీల్లో విజేతలకు హెచ్‌ఎం సూర్యప్రకాశ్‌రెడ్డి, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. చేబ్రోలు పీఎంశ్రీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు కూడా ఘనంగా జరిగాయి. ● క్రమశిక్షణతో చదవాలని డిప్యూటీఈవో సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. కరప జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవోలు బులిశ్వరవేణి, ప్రతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు బాలికోన్నత పాఠశాలలో నృత్యం

కరప జడ్పీ ఉన్నత పాఠశాలలో విన్యాసం

వాకలపూడిలో విద్యార్థినికి మొక్క ఇస్తున్న ఎమ్మెల్యే నానాజీ

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

సర్పవరం: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు, నిపుణులైన ఉపాధ్యాయులతో మెరుగైన విద్యావిధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని, పదో తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించాలని కోరుకుంటున్నామని ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. మంగళవారం వాకలపూడి జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం శ్రీనివాసకుమార్ పాల్గొన్నారు.

కదిరి లక్ష్మీనరసింహుని రథోత్సవానికి భారీ తాడు సిద్ధం

తాళ్లరేవు, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా కదిరి లక్ష్మీనరసింహస్వామి రథోత్సవంలో వినియోగించే భారీ తాడు తయారీ మంగళవారం పూర్తి చేసినట్లు ఇక్కడి తాళ్ల వ్యాపారి సామా సూర్యప్రకాష్ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో ఇక్కడి తాళ్ల కలుపుల కార్మికులు నిర్వహిస్తున్నారు. కొబ్బరి, నైలాన్ తాళ్లు తయారు చేస్తారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఆలయాల వ్యాపారులు ఇక్కడికి వచ్చి వీటిని కొనుగోలు చేస్తారు. ఆలయాల రథోత్సవాలకు ఇక్కడే ప్రత్యేకంగా తాళ్లను తయారు చేయించి తీసుకెళ్తారు. యంత్రాల సాయం లేకుండా కార్మికుల శ్రమతోనే భారీ తాళ్లను తయారు చేయడం ఇక్కడి ప్రత్యేకత. ఇక్కడ తయారు చేసిన 400 అడుగుల పొడవైన భారీ తాడును కదిరి లక్ష్మీనరసింహ ఆలయానికి పంపుతామని సూర్యప్రకాష్ చెప్పారు.

తాళ్లరేవులో కొబ్బరి తాడు తయారు చేసిన కార్మికులతో వ్యాపారి సామా సూర్యప్రకాష్

అలరించిన విద్యార్థులు

కాజులూరు, న్యూస్‌టుడే: కాజులూరు ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు మార్ని విష్ణుమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్, సభ్యులు ప్రసంగించారు. సాంస్కృతిక, జానపద కళలు, విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికి తీస్తాయని మార్ని విష్ణుమూర్తి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి.

వ్యాయామంతో ఆరోగ్యం పదిలం

సర్పవరం: రోజూ నియమిత సమయంలో వ్యాయామం చేయడం, పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యం పదిలంగా ఉంటుందని హోమియోపతి వైద్యుడు సరిది సూర్యకిరణ్ తెలిపారు. కాకినాడ బోటుక్లబ్ ఉద్యానంలో మంగళవారం వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం, ఆరోగ్య అవగాహన సదస్సులో సూర్యకిరణ్ పాల్గొని ఉచితంగా మందులు అందించారు. రత్నప్రసాదరావు, శ్రీధర్, సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

మురుగు కదిలేదెలా చెప్పండి

పిఠాపురం మండలం గోకివాడ గ్రామంలోని ఎస్సీకాలనీలో మురుగునీరు పోయే మార్గం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొత్తగా నిర్మించిన డ్రెయినేజీలకు అవుట్‌లెట్లు లేకపోవడంతో నీరు నిలిచి దోమల వ్యాప్తి, దుర్వాసన వస్తోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈవోపీఆర్డీ రామకృష్ణను వివరణ కోరగా చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

నిరంతరం వెలుగులేల..

కరప మండలం ఉప్పలంకలో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతుండడంతో ఎంతో విలువైన విద్యుత్తు వృథా అవుతోందని గ్రామస్థులు విమర్శిస్తున్నారు.

వందలాది యూనిట్ల విద్యుత్తు వృథా అవుతుండడంతో పాటు పంచాయతీకి రూ.వేలల్లో బిల్లులు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఏఈ ఈశ్వర్‌ప్రసాద్ చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కరప

చెత్త ఇలా ఉండాల్సిందేనా..

గొల్లప్రోలు మండలం తాటిపర్తి నుంచి చినజగ్గంపేటకు వెళ్లే మార్గంలో రోడ్డుపక్కన చెత్త పేరుకుపోయి సమీప ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. గ్రామంలో సేకరించిన చెత్తను ఇక్కడే వేస్తుండడంతో డంపింగ్‌యార్డ్‌లా మారింది. దుర్వాసన, దోమలతో రోగాలు ప్రబలే పరిస్థితులు ఏర్పడ్డాయి. తొలగిస్తామని డిప్యూటీ ఎంపీడీవో కుమార్ తెలిపారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

ఆదమరిస్తే.. అపాయమేగా..

గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న పంట కాలువ రక్షణ గోడ సగ భాగం కూలి ప్రమాదకరంగా ఉంది. వాహనదారులు ఆదమరిస్తే కాలువలోకి దూసుకుపోయే ప్రమాదం పొంచిఉంది. ప్రమాదాలు జరక్కుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు. నిధులకు ప్రతిపాదనలు పంపామని ర.భ.శాఖ ఏఈ లోవరాజు తెలిపారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

గదుల్లో భయం.. మైదానంలో గడ్డి

కొత్త కొరింగ జడ్పీ ఉన్నత పాఠశాల భవనం రంగులు వెలిసిపోయి వెలవెలబోతోంది. గదుల్లో పెచ్చులూడుతున్నాయి. క్రీడా మైదానమంతా దట్టమైన గడ్డితో పాములు, కీటకాలకు నిలయంగా మారింది. కొత్తకొరింగ, పాత కొరింగ గ్రామాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, తాళ్లరేవు

మహిళలు, పిల్లల రక్షణకు ప్రత్యేక చట్టాలు

గొల్లప్రోలు: మహిళలు, పిల్లల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని గొల్లప్రోలు ఎస్సై రామకృష్ణ తెలిపారు. చేబ్రోలులో మంగళవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమంలో స్థానికులతో మాట్లాడారు. చట్టాలపై అవగాహన కల్పించారు.

ఎలక్ట్రీషియన్‌ల సంక్షేమానికి కృషి

పిఠాపురం: ఎలక్ట్రీషియన్‌ల సంక్షేమానికి యూనియన్ కృషి చేస్తుందని ఆ సంఘ అధ్యక్షుడు వియ్యపు రామన్నరాజు పేర్కొన్నారు. మంగళవారం పిఠాపురంలో ఎలక్ట్రీషియన్ డే నిర్వహించారు. సీనియర్లను సత్కరించి, బహుమతులు అందించారు. గణేస్, సత్యశ్రీనివాస్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 | మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325, పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

సమస్య: కొత్తపల్లి గ్రామం గాదులదొడ్డిలో రెండు వీధి కుళాయిలు పాడైపోయి తాగు నీరు వృథాగా పోతోంది. **- వీరబాబు**

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణకు చెప్పగా సిబ్బందితో మరమ్మతులు చేయించారు.
– న్యూస్‌టుడే, కొత్తపల్లి

సమస్య: పిఠాపురం విద్యుత్తునగర్‌లో రోడ్లపై చెత్తకుప్పలు, డ్రెయినేజీల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. **- రాంబాబు**

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ప్రభాకర్‌కు చెప్పగా ఆ ప్రాంతంలో కార్మికులతో శుభ్రం చేయించారు.
– న్యూస్‌టుడే, పిఠాపురం

సమస్య: కరప మండలం కూరాడ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ వద్ద స్థానికులు చెత్త, వ్యర్థాలు వేస్తున్నారు. **- మురశి**

పరిష్కారం: పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్‌కు చెప్పగా పారిశుద్ధ్య సిబ్బందితో వ్యర్థాలు తొలగించారు. – న్యూస్‌టుడే, కరప

సమస్య: గొల్లప్రోలు కొత్తపేట శివారులో రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయి ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. **- స్థానికులు**

పరిష్కారం: ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ సిబ్బందితో చెత్త తొలగింపజేశారు.
– న్యూస్‌టుడే, గొల్లప్రోలు

సమస్య: రాజుగారివీధిలో రహదారిపై చెత్తకుప్పలు ఉన్నాయి. వాటిని తొలగించడానికి చర్యలు తీసుకోవాలి. **- ఆంజనేయులు**

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణకు తెలుపగా కార్మికులతో తొలగించారు.
– న్యూస్‌టుడే, పెద్దాపురం

సమస్య: కాకినాడ అర్బన్ పరిధి గొడారిగుంట శాస్త్రినగర్‌లోని మురుగు కాలువల్లో పూడిక తీయడం లేదు. **- అప్పారావు**

పరిష్కారం: పారిశుద్ధ్య బాధ్యుడు జగన్ దృష్టికి తీసుకువెళ్లగా సిబ్బందితో శుభ్రం చేయించారు. – న్యూస్‌టుడే, రమణయ్యపేట

సామాజిక అంశాలపై సాగిన నాటికలు

గొల్లప్రోలు, పెద్దాపురం: తాటిపర్తిలో శ్రీమార్కండేయ నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో 19వ ఉభయ తెలుగురాష్ట్రాల స్థాయి నాటికల పోటీల్లో సోమవారం రాత్రి తొలి ప్రదర్శనగా తాడేపల్లి అరవింద ఆర్ట్స్ సభ్యులు 'దేవుణ్ణి చూశా..!' నాటిక ప్రదర్శించారు. గంగోత్రిసాయి దర్శకత్వం వహించారు. ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ సభ్యులు ప్రదర్శించిన 'రాత' నాటిక ఆలోచింపజేసింది. దీనికి పి.శ్రీనివాసరావు రచన. దర్శకత్వం వహించారు. ● ఉత్తమ ప్రదర్శనగా 'అసత్యం' : పెద్దాపురం మండలం చంద్రమాంపల్లిలో స్నేహ ఆర్ట్స్ నాటిక పరిషత్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు సోమవారం అర్ధరాత్రి ముగిశాయి. పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా చైతన్య కళాస్రవంతి(విశాఖపట్నం) వారి 'అసత్యం' నాటిక ఎంపికైంది. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా గోవాడ క్రియేషన్స్(హైదరాబాద్)వారి 'అమ్మ చెక్కిన బొమ్మ', తృతీయ ఉత్తమ ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్(గుంటూరు) వారి 'ఇది అతని సంతకం' నిలిచాయి. నిర్వాహకులు బహుమతులు అందించారు.

పెద్దాపురం: ఉత్తమ ప్రదర్శనగా 'అసత్యం' నాటికకు బహుమతి ప్రదానం

దేవుణ్ణి చూశా..! నాటికలో సన్నివేశం

జనసేన కమిటీల ఏర్పాటుకు నామినేషన్ల స్వీకరణ

చేబ్రోలులో నామపత్రాల పరిశీలన

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాల్లో జనసేన పార్టీ వార్డు ఇన్‌ఛార్జుల ఎన్నికకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. చేబ్రోలులోని జనసేన పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. వార్డు ఇన్‌ఛార్జుల నియామకానికి పోటీ చేసే జనసైనికులు నామినేషన్ రూపంలో పేర్లు నమోదు చేసుకోవాలని మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. అక్కడి నుంచి వచ్చిన ప్రతినిధులు ఈ రెండు పట్టణాల్లో వార్డుల వారీగా నామినేషన్ల స్వీకరణతో కోలాహలం నెలకొంది. ఇంతవరకు గొల్లప్రోలులోని నాలుగు వార్డులకు నాలుగేసి చొప్పున, మిగిలిన వార్డులకు రెండేసి చొప్పున నామినేషన్లు వచ్చాయి. పిఠాపురంలో ఒక్కొక్క వార్డుకు నాలుగైదు నామినేషన్లు రాగా అన్ని వార్డుల్లోనూ పోటీ నెలకొన్నట్లు చెబుతున్నారు. గొల్లప్రోలులో 20 వార్డులకు, పిఠాపురంలో 30 వార్డులకు జనసేన ఇన్‌ఛార్జులను ప్రస్తుతం ఉన్న కౌన్సిలర్ల రిజర్వేషన్ కేటగిరి మాదిరిగా ఎన్నిక చేయాలని నిర్ణయించారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎన్నికలు జరుగుతాయన్నారు. పర్యవేక్షకులుగా జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ చేబ్రోలులోని పవన్‌కల్యాణ్ నివాసానికి వస్తారన్నారు.

ఆరోగ్యంగా తిందాం.. ఆనందంగా ఉందాం

ప్రకృతి వ్యవసాయంతో మేలు

– న్యూస్‌టుడే, పిఠాపురం

పిఠాపురం నియోజకవర్గంలో ప్రకృతి సాగు విస్తీర్ణం పెంచేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. రైతు సాధికారత సంస్థ ఆధ్వర్యంలో నిత్యం అవగాహన సదస్సులు నిర్వహిస్తూ, ఆసక్తి గల రైతులను గుర్తిస్తున్నారు. ఇందులో ముఖ్యంగా డ్వాక్రా సంఘాల మహిళలకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. వ్యవసాయంతో పాటు ఇళ్ల వద్ద కూరగాయల సాగు విధానాలనుసైతం వివరిస్తున్నారు. ఇందుకోసం ప్రతి మండలానికి 'నేచురల్ ఫార్మింగ్ మాస్టర్' శిక్షకుల ఆధ్వర్యంలో, పీఆర్పీలు, సీఆర్పీలు పని చేస్తున్నారు. డ్వాక్రా మహిళలు, రైతులతో ఈ సాగు చేయిస్తున్నారు. వారు పండించిన ఉత్పత్తులనుసైతం అధికారులే మార్కెటింగ్ చేస్తున్నారు. నాణ్యమైన ఉత్పత్తులు, మెరుగైన దిగుబడులు సాధించేలా సహకారం అందిస్తున్నారు. ముఖ్యంగా విషతుల్యం కాని ఉత్పత్తులు లక్ష్యంగా ప్రకృతి సాగు బాట పట్టిస్తున్నారు. జిల్లా సమన్వయకర్త గణేష్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతున్నాయి.

సేంద్రియ పంటలకు కషాయం తయారీ

ఈ గ్రామాల్లో..

● పిఠాపురం మండలంలో నరసింగపురం, కోలంక, పి.రాయవరం, రాపర్తి, భోగాపురం, బి.పత్తిపాడు, విరవ, మంగితుర్తి, విరవాడ, జల్లూరు, జములపల్లి, కందరాడ, పి.తిమ్మాపురం, వెల్దుర్తి. ● గొల్లప్రోలు మండలంలో చేబ్రోలు, దుర్గాడ, ఏకే మల్లవరం, ఏపీ మల్లవరం, ఎ.విజయనగరం, కొడవలి, తాటిపర్తి, గొల్లప్రోలు. ● కొత్తపల్లి మండలంలో గోర్స, కలవలదొడ్డి, నిదానందొడ్డి, కొండెవరం, యండపల్లి, నాగులాపల్లి, మూలపేట, యు.కొత్తపల్లి, కొమరగిరి, కుతుకుడుమల్లి తదితర 33 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు ఉన్నాయి.

గౌరవ వేతనం ఇస్తున్నారు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నందుకు రైతు సాధికారత సంస్థ ద్వారా రూ.6 వేల గౌరవ వేతనం అందిస్తున్నారు. సేంద్రియ ఎరువు తయారీ, సాగు విధానం మేం వివరిస్తాం. మహిళా సంఘాలతో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేయించి, ఇంటికి అవసరమైన కూరగాయలు సాగు చేయిస్తున్నాం. అదనపు దిగుబడి ఉంటే మార్కెట్లో విక్రయాలు చేయిస్తున్నాం. - జగదీశ్వరి, చేబ్రోలు

పెట్టుబడి తగ్గింపే లక్ష్యం

వ్యవసాయంలో పెట్టుబడి, విషతుల్య ఆహార ఉత్పత్తుల తగ్గింపే లక్ష్యంగా ఈ సాగును ప్రోత్సహిస్తున్నాం. నేను గతంలో 5 ఏళ్లు ప్రకృతి వ్యవసాయం చేశా. అదే అనుభవంతో నన్ను సీఆర్పీగా ఎంపిక చేశారు. నిత్యం గ్రామాల్లో రైతులు, మహిళలకు అవగాహన కల్పిస్తున్నా. రైతులు కూడా ఆసక్తి చూపిస్తున్నారు.
- పి.గంగాపార్వతి, నరసింగపురం

బాలల సంరక్షణ కేంద్రాల నమోదు తప్పనిసరి

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: బాలల సంరక్షణ కేంద్రాలు నడుపుతున్న సంస్థలు, వ్యక్తులు.. చట్టప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఈ విషయాన్ని బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ జిల్లా పర్యవేక్షణాధికారి వై.చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పేరు మార్పు

కాకినాడ జిల్లా, సామర్లకోట మండలం, వేట్లపాలెం గ్రామానికి చెందిన బోడా నాగ వీరరాఘవ అనూరాధ అనే నేను నా చిన్నతనంలో ఎస్‌బీఐలో నా కుటుంబీకులు తెరిచిన ఖాతాలో బోడా వీరరాఘయమ్మగా నమోదు చేసియున్నారు. నా అసలు పేరు నాగ వీరరాఘవ అనూరాధ గా ధ్రువీకరిస్తూ నా స్కూల్ సర్టిఫికెట్స్ జతచేయుచున్నాను.

(c) eenadu

భీష్మ ఏకాదశి వేళ.. అన్నవరంలో ఏర్పాట్లు

అన్నవరం: ఈ నెల 29న భీష్మ ఏకాదశి, ఫిబ్రవరి 1న మాఘ పౌర్ణమి పర్వదినాల్లో సత్యదేవుని దర్శనానికి విచ్చేసే భక్తులకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. పెద్దాపురం ఆర్డీవో శ్రీరమణి, ఛైర్మన్ రోహిత్, ఈవో త్రినాథరావు, వివిధ శాఖలు, విభాగాల అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. భీష్మ ఏకాదశి రోజున సుమారు 10 వేల వ్రతాలు జరుగుతాయని అంచనా. సుమారు 50 వేల మందికి పైగా భక్తులు వస్తారని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెల్లవారుజామున 12.30 గంటల నుంచి వ్రతాలు ప్రారంభించనున్నారు. రెండు గంటల నుంచి సర్వదర్శనాలకు అనుమతించనున్నారు. భద్రత, సీసీ కెమెరాల పర్యవేక్షణ, అన్నదాన నిరోధక ఏర్పాట్లు, నీటి సరఫరా, రవాణా, వైద్య సేవలు, ట్రాఫిక్, పార్కింగ్, పరిశుభ్రత తదితర అంశాలపై చర్చించారు. సత్యగిరి నుంచి రత్నగిరికి ఉచిత రవాణా ఏర్పాట్లు చేస్తున్నారు.

తుని

•తుని •ప్రత్తిపాడు •జగ్గంపేట

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవం

తొండంగి: ఏవీనగరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సహిత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం బుధవారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయని ఆలయ ఛైర్మన్ యనమల నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. బుధవారం రాత్రి హారతి, గణపతిపూజ, సాయినాథునికి అభిషేకం, పల్లకిసేవ, సర స్వతిదేవి పూజ, గురువారం సుప్రభాతసేవ, 108 అష్టోత్తర కలశ మహా సంప్రోక్షణ, లక్షతులసి పూజాకార్యక్రమాలు ఉంటాయన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో నేడు మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు డిప్యూటీ చాన్సలర్ సతీష్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఆదిత్య విద్యాసంస్థల వ్యవస్థాపకులు నల్లమిల్లి శేషారెడ్డి పుట్టినరోజు సందర్భంగా ప్రతి ఏటా జనవరి 28న మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066

ఉ. 10 - మ. 1

వీధులు శుభ్రం చేశారు..

స్పందనకు స్పందన

తొండంగి మండలంలోని పలు వీధుల్లో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. చెత్త తొలగించాలని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తెచ్చారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. సిబ్బందితో చెత్త కుప్పలు తీయించి సమస్య పరిష్కరించారు.

కాలువలు నిర్మించాలి

సమస్య: కత్తిపూడి గ్రామంలో పాత కొత్తూరులో కాలువలు లేక ఇబ్బందిగా ఉంది. - కృష్ణ, స్థానికుడు

సమాధానం: గ్రామంలో కాలువల అవసరాన్ని గుర్తించి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం. తాత్కాలికంగా సమస్య లేకుండా చేస్తాం. - సుధాకర్, కార్యదర్శి, కత్తిపూడి

న్యూస్‌టుడే, శంఖవరం

జారనీయొద్దు.. బంగారు కాలం..!

న్యూస్‌టుడే-ప్రత్తిపాడు, ఏలేశ్వరం

• ప్రత్తిపాడులో 'ట్రామా కేర్' దస్త్రాలతో సరి..

జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రత్తిపాడు సీహెచ్‌సీ అందించే వైద్యసేవలు కీలకం. కత్తిపూడి నుంచి ఎర్రవరం వరకూ 29 కి.మీ. మేర ఎక్కడ రోడ్డు ప్రమాదం జరిగినా, నాలుగు మండలాల్లో ఎక్కడ అత్యవసర వైద్యానికి ఇక్కడికే రావాలి. ప్రాథమిక చికిత్స తర్వాత కాకినాడ జీజీహెచ్‌కి తరలిస్తారు. ఇందుకు 36 కి.మీ. ప్రయాణించాలి. ట్రామా కేర్ సెంటరు అందుబాటులో లేకపోవడం వల్ల క్షతగాత్రులు ప్రాణాలమీదకి వస్తోంది. మెడికో లీగల్ కేసుల (ఎంఎల్‌సీ) నమోదు మినహా ఈ ఆసుపత్రి ట్రామా కేర్ వెలితి. రోడ్డు ప్రమాదాలప్పుడు ప్రత్తిపాడు సీహెచ్‌సీకి తీసుకురావడానికి అరగంట నుంచి గంట సమయం పడుతుంది. మెరుగైన చికిత్స కోసం కాకినాడ తరలించేటప్పటికి ప్రమాదం జరిగినప్పటి నుంచి దాదాపుగా గంటన్నర నుంచి రెండు గంటలకు తక్కువ పట్టదు. గోల్డెన్ అవర్.. ఇంతలోనే గడిచిపోతోంది.

ఇదీ దైన్యం..

జిల్లాలో ప్రత్తిపాడు పోలీస్ సర్కిల్ పరిధిలోని హైవే పొడవు ఎక్కువ. ప్రమాద కూడళ్లూ చిన్నంపేట, ధర్మవరం, రాచపల్లి అడ్డరోడ్డు, వన్నెపూడి, చెందుర్తి, కత్తిపూడి, నెల్లిపూడి కూడళ్లు బ్లాక్ స్పాట్లు ఉన్నాయి. 2024లో 98 రోడ్డు ప్రమాదాలు జరిగితే 46 మంది మృతిచెందారు. 2025లో 76 ప్రమాదాల్లో 50 మంది ప్రాణాలు కోల్పోయారు. మార్గమధ్యలో మృతి చెందిన ఘటనలూ వీటిలో ఉన్నాయి.

ప్రతిపాదనలకే పరిమితం

కాకినాడ జీజీహెచ్, తుని ఏరియా ఆసుపత్రుల్లో ట్రామా కేర్ ఉండాలి. ప్రత్తిపాడు సీహెచ్‌సీలో ఏర్పాటు చేయడం వల్ల తలకు తప్ప ఏ ప్రదేశంలో తీవ్రగాయమైనా వైద్యం చేసే అవకాశం ఉంటుంది.

ప్రత్తిపాడు సీహెచ్‌సీ

స్పెషలిస్టు వైద్యులు, సర్జన్లు, బ్లడ్‌బ్యాంకుతో సహా 40 మందితో ట్రామా కేర్ ప్రాణాలను నిలబెడుతుంది. ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల పరిధిలో ఎందరో క్షతగాత్రులకు ప్రాణాలు నిలుస్తాయి. రెండేళ్ల కిందటే ప్రతిపాదనలు వెళ్లాయి. ప్రత్తిపాడు సీహెచ్‌సీ 50 పడకల ఆసుపత్రిలో భాగంగా అదనపు భవనాలు నిర్మాణంలో ఉన్నాయి.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

తుని: మహిళలు ఆర్థికంగా ఎదగాలని పురపాలక ఛైర్‌పర్సన్ నార్ల భువన సుందరి అన్నారు. కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో సాధన పట్టణ మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం జరిగింది. గత వార్షిక ప్రణాళికపై చర్చించారు. మెప్మా జిల్లా ఇన్‌ఛార్జి పీడీ కనకరాజు, సీఎంఎం, టీఎల్, ఆర్పీ, సీవో, దీపం పాల్గొన్నారు. 30న ఉదయం 11 గంటలకు ఛైర్‌పర్సన్ అధ్యక్షతన తుని కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వెంకట్రావు తెలిపారు.

ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మె

గండేపల్లి: ఫిబ్రవరి 12న సీఐటీయూ చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలంటూ సీఐటీయూ సభ్యులు తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. కొత్త కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా సమ్మెచేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. చంద్రావతి, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలపై దాడులను అరికట్టాలి

జగ్గంపేట గ్రామీణం: రాష్ట్రంలో మైనార్టీలు, క్రైస్తవులపై దాడులు, అరాచకాలు పెరుగుతున్నాయని వైకాపా క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ అన్నారు. జగ్గంపేట వైకాపా కార్యాలయంలో మంగళవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. కూటమి పాలనలో రెడ్‌బుక్ పేరుట జరుగుతున్న అరాచకాలకు ముగింపు పలకాలన్నారు. గ్రామాల్లో పురాతన ప్రార్థన మందిరాలు, అనంతరంలో పాస్టర్లపై దాడులు, బెదిరింపులకు దిగడం తగదన్నారు. వీటికి బాధ్యులైన వారిపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు. క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.జాన్‌వెస్లీ, జిల్లా అధ్యక్షుడు జడాల జామువాగిరి, రాష్ట్ర కార్యదర్శి మర్రా శ్రీధర్ పాల్గొన్నారు.

ఐదు రోజుల పనిదినాలు కోరుతూ సమ్మె

ప్రత్తిపాడు, తుని, జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఐదు రోజుల పనిదినాలు కోరుతూ బ్యాంకు ఉద్యోగులు మంగళవారం సమ్మె చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. దీంతో సేవలు నిలిచిపోయాయి. సమ్మె విషయం తెలియక కొందరు వినియోగదారులు బ్యాంకులకు వెళ్లి వెనుదిరిగాల్సి వచ్చింది. బ్యాంకు సమ్మెతో లావాదేవీలు స్తంభించాయి. ఉద్యోగులు మాట్లాడుతూ.. వారానికి 5 పనిదినాలు ఉండాలన్నారు. పని ఒత్తిడి లేకుండా సిబ్బందిని పెంచాలన్నారు. అన్ని బ్యాంకుల ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. పెన్షనర్ల సంఘం మద్దతు తెలిపింది.

తునిలో నిరసన వ్యక్తం చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

సార్లంక అగ్నిప్రమాదంలో ఎస్సై సేవలకు గుర్తింపు

రౌతులపూడి: గణతంత్ర వేడుకల్లో ఇన్‌ఛార్జి కలెక్టర్ అపూర్వ భరత్, ఎస్పీ బిందుమాధవ్‌ల నుంచి ఎస్సై వెంకటేశ్వరరావు ప్రశంసాపత్రాన్ని పొందారు. ఇటీవల సార్లంకలో జరిగిన అగ్నిప్రమాదంలో ప్రాణనష్టం జరగకుండా సహాయక చర్యల్లో పాల్గొని యంత్రాంగాన్ని సమన్వయం చేసినందుకు ఈ అవార్డు దక్కింది. పలువురు ఎస్సైకు మంగళవారం అభినందనలు తెలిపారు.

కార్మిక మండలిని పునరుద్ధరించాలి

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని నవయుగ ఎలక్ట్రీషియన్స్, రివైండింగ్ అండ్ ప్లంబింగ్ వర్కర్స్ అసోసియేషన్ డిమాండ్ చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్ డేను నిర్వహించారు. సంఘ ప్రతినిధులు ఎడిసన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం అందజేశారు.

క్వాంటమ్ కంప్యూటింగ్‌పై కార్యశాల

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో మంగళవారం నుంచి సమాచార సాంకేతిక (ఐటీ), డేటాసైన్స్ ఆధ్వర్యంలో క్వాంటం కంప్యూటింగ్‌పై కార్యశాల ప్రారంభమైంది. అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఎం శ్రీ పాఠశాల వార్షికోత్సవం

తొండంగి: తొండంగి పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్ఎం కె.సత్యనారాయణ, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సాంస్కృతిక అకడమిక్ స్పోర్ట్స్, వార్షికోత్సవం ఘనంగా జరిగాయి. 'పది' విద్యార్థులకు వీడ్కోలు వేడుకను నిర్వహించారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

తుని గ్రామీణం: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తెదేపా నాయకులు, తాండవ షుగర్సు మాజీ ఛైర్మన్ సుర్ల లోవరాజు సూచించారు. క్యారమ్స్ టోర్నమెంట్ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు.

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు

జగ్గంపేట గ్రామీణం: రోడ్లపై, ఖాళీప్రదేశాల్లో చెత్త వేయవద్దని ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. నెల్లూరు కాలనీలో ఉదయం 6 గంటలకు కార్యక్రమం పర్యవేక్షణ పరిశీలించారు. రోడ్లపై, కాలువల్లో చెత్త, వ్యర్థాలు వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామీణ కుటుంబ సర్వేకు గడువు ఫిబ్రవరి 10

తుని గ్రామీణం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పథకాలను అమలు చేసేందుకు చేపట్టిన కుటుంబ సర్వేను ఫిబ్రవరి 10లోగా పూర్తి చేయాలని డిప్యూటీ ఎంపీడీవో మరిడయ్య సూచించారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

అవీ ఇవీ అన్నీ

4న చలో రౌతులపూడి

రౌతులపూడి: పారుపాకలో ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలని డిమాండ్‌తో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు ఫిబ్రవరి 4న చలో రౌతులపూడికి పిలుపునిచ్చారు. రౌతులపూడిలో సామిరెడ్డి నారాయణమూర్తి ఆధ్వర్యంలో ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి బంగార్రాజు, జిల్లా కార్యదర్శి జనార్దన్ తదితరులు మంగళవారం సమావేశమయ్యారు. ఉపాధి హామీ చట్టాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని వారు ఆరోపించారు.

మాట్లాడుతున్న కాకినాడ రామారావు

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

కిర్లంపూడి: రాష్ట్రంలో రజకులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్రప్రభుత్వం వారిని ఎస్సీ జాబితాలో చేర్చేలా చర్యలు చేపట్టాలని రజక చైతన్య సేవాసంఘ రాష్ట్ర అధ్యక్షుడు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి కాకినాడ రామారావు కోరారు. బూరుగుపూడి గ్రామంలో రజకుల సంక్రాంతి పండగ అనంతరం నిర్వహించుకునే బల్లల పండగలో రామారావు మంగళవారం పాల్గొన్నారు. నాయకులు పాటంశెట్టి రవి, కుంచె తాతాజీ, మత్సరాజ సహకారసంఘం ఛైర్మన్ మొర్లా సత్తిబాబు, గురజాపు సత్తిబాబు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

యథావిధిగా 'నరేగా' కొనసాగించాలి

ఏలేశ్వరం: ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో ఏలేశ్వరంలో మంగళవారం ప్రదర్శన జరిగింది. సీపీఎం నాయకుడు పాకలపాటి సోమరాజు, సీఐటీయూ నాయకులు దయామణి, వెంకటలక్ష్మి, దోనెపూడి లక్ష్మి తదితరులు నాయకత్వం వహించారు. ఇంటింటికీ ఉపాధి కల్పించేలా చట్టం అమలు చేయాలని నినాదాలు చేశారు. గోడ పత్రికలు ఆవిష్కరించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కోటనందూరు: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేటు ఆసుపత్రులు అనుమతులు తీసుకుని వైద్య సేవలు అందించాలని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో అరుణ అన్నారు. డివిజనల్ వైద్యాధికారిణి ప్రశాంతితో కలిసి కోటనందూరు మండలంలోని ప్రైవేటు ఆసుపత్రులపై మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కోటనందూరు పీహెచ్‌సీ సిబ్బందితో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. వైద్యులు యామిని, రాజశేఖర్ ఈ తనిఖీల్లో పాల్గొన్నారు.

తనిఖీ నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

మినీవ్యాన్ కార్మికులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే

జగ్గంపేట గ్రామీణం: మినీవ్యాన్, గూడ్స్ వాహనాలపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులను అన్ని విధాల ఆదుకుంటానని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హామీ ఇచ్చారు. గోకవరం రోడ్డులోని శివశక్తి మినీ, గూడ్స్ వ్యాన్ల అసోసియేషన్ అధ్యక్షుడు పీలా మహేష్ ఆధ్వర్యంలో సభ్యులు ఇర్రిపాకలో ఎమ్మెల్యే స్వగృహానికి చేరుకుని మర్యాదపూర్వకంగా కలిశారు. వ్యాన్లు నిలుపుదల చేసేందుకు స్థలం, కార్మికులు విశ్రాంతి తీసుకునేందుకు భవనం లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా అన్నివిధాల సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రతినిధులు మండపాక వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, గంగాధర్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను సత్కరిస్తున్న సభ్యులు

మంచినీటి కొళాయివద్ద మురుగు

తుని గ్రామీణ మండలం దొండవాక గ్రామంలోని అంగన్‌వాడీ భవనం వద్ద ఉన్న మంచినీటి ట్యాంకు కొళాయి వద్ద మురుగు కదలడం లేదు. సమీపంలో ఉన్న మురుగుకాలువ పూర్తిగా మూసుకుపోవడంతో మురుగునీరు ముందుకు సాగే పరిస్థితి లేదు. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తుని గ్రామీణం

వానరాలతో హడలిపోతున్న జనం

పొలాల్లో పంటలకు నష్టం కలిగిస్తున్నాయనే కారణాలతో రైతులు కోతులను తరిమేస్తుంటే అవి గ్రామాల్లోకి చేరి భయాందోళన కలిగిస్తున్నాయి. గండేపల్లి మండల కేంద్రంలో కోతులు బెడద ఎక్కువగా ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. ఉదయం, నుంచి సాయంత్రం వరకు ఇళ్లపైనే తిష్ట వేసి, బెదిరిస్తుంటే మీదకు తిరగబడి దాడి చేస్తున్నాయి. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, గండేపల్లి

సొంత ఇల్లు ఆశలు ఆవిరి

పేదల సొంతింటి కల గత ప్రభుత్వ నిర్వాకంతో ఆవిరైంది. జగనన్న కాలనీల పేరుతో అలవికాని ప్రదేశాల్లో ఇళ్ల స్థలాలు సేకరించి నిరుపేదలకు ఇచ్చారు. తుప్పలు, డొంకలు, కొండలు గుట్టల మధ్య జగపతినగరం గ్రామశివారున సుమారు 200మంది ఇచ్చిన స్థలాల్లో కొందరు ధైర్యంచేసి పునాదులు నిర్మించుకున్నారు. వాటికి పూర్తిస్థాయిలో అప్పటి ప్రభుత్వ సహకారం కరవవ్వడంతో నిర్మాణాలు ముందుకు సాగలేదు. దీంతో లబ్ధిదారుల ఆశలు అడియాస అయ్యింది. కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిదులు, అధికారులు నిలిచిపోయిన ఇళ్లను పూర్తిచేసుకునేందుకు సహకారం అందించాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కిర్లంపూడి,

అతివేగమా.. నా దుస్థితి చూడు..!

హైవేపై అతివేగమా.. అయితే ఒక్కసారి నా దుస్థితి చూడండి అంటూ కనిపిస్తున్న ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారును తుని రూరల్ పోలీసులు రోడ్డుపక్కన ప్రమాద హెచ్చరికగా ఏర్పాటు చేయడం విశేషం. వి.కొత్తూరు జాతీయ రహదారి సమీపంలోని పోలీసు స్టేషన్ సమీపంలో మూడేళ్లుగా పలు ఘోరరోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇటీవల ఆదే ప్రాంతంలో ట్రావెల్ బస్సు లారీని ఢీకొనడంతో డ్రైవర్ మృతి చెందగా మరో ముగ్గురు ప్రయాణికులు గాయపడ్డారు. దీంతో ప్రమాద హెచ్చరికగా ఈ కారును రోడ్డు పక్కన ప్రదర్శనగా ఉంచారు. ప్రదర్శనకు ఉంచిన కారు ప్రమాదంలో గతంలో ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. - న్యూస్‌టుడే, తుని గ్రామీణం

సీలేరులో గంజాయి స్వాధీనం

సీలేరు, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం సీలేరు ఇన్‌టెక్ కూడలి వద్ద ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తున్న ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై యాసీన్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఈ వివరాలు వెల్లడించారు. ఇన్‌టెక్ కూడలి వద్ద ఉదయం వాహన తనిఖీలో భాగంగా ఓ ద్విచక్ర వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, ప్యాకింగ్ చేసిన 35 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. దీని విలువ సుమారు రూ.అయిదు లక్షలు ఉంటుందన్నారు. రౌతులపూడి మండలం శృంగవరం గ్రామానికి చెందిన బి.శ్రీను ఒడిశాలోని పసుపులంక సమీపాన ఏనుగురాయి వద్ద దీన్ని కొనుగోలు చేసి మైదాన ప్రాంతానికి తరలిస్తుండగా పట్టుబడ్డారని ఎస్సై తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని గంజాయి, ద్విచక్ర వాహనం సీజ్ చేశామని, రూ.600 నగదు, చరవాణి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై యాసీన్ తెలిపారు.

వ్యాపారుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

తుని గ్రామీణం: వ్యాపారుల సమస్యలను పరిష్కరించడంపై నూతన కార్యవర్గ సభ్యులు దృష్టిసారించాలని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు సూచించారు. తుని ఛాంబర్ ఆఫ్ కామర్సు నూతన కార్యవర్గ సభ్యులు తేటగుంటలో మంగళవారం మాజీ మంత్రి యనమలను మర్యాదపూర్వకంగా కలిశారు. అధ్యక్షుడు కారుమూరి భద్రరావు, జట్ల లక్ష్మీనారాయణరెడ్డి తదితర కార్యవర్గ సభ్యులు, ఛాంబర్ పెద్దలు నర్సే శివాజీ, తటపర్తి రాజా ఉన్నారు.

యనమలను కలిసిన ఛాంబర్ ఆఫ్ కామర్సు నూతన కార్యవర్గ సభ్యులు

ఎట్టకేలకు ట్యాంకర్ బయటకొచ్చింది..!

తుని పట్టణం, తొండంగి, న్యూస్‌టుడే: ఏవీ నగరం శివారు పంట కాలువలో బోల్తాపడ్డ ట్యాంకర్‌ను క్రేన్ల సహాయంతో మంగళవారం బయటకు తీశారు. 21న బోల్తాపడ్డ ట్యాంకర్‌లో విలీన హైడ్రోక్లోరిక్ ఆమ్లం ఉందని పరీక్షల్లో స్పష్టమైందని పీసీబీ ఈఈ సూర్యకళ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ట్యాంకర్ మూతలు తెరుచుకోకపోవడంతో యంత్రాంగం ఊపిరిపీల్చుకున్నారు. వారం రోజుల తర్వాత వాహనాన్ని బయటకు తీశారు. 60 టన్నుల లారీ కాలువ ఊబిలో కూరుకుపోయింది. ఇరువైపులా పూడ్చి భారీ క్రేన్ల సహాయంతో బయటకు తీశారు. 60 మీటర్లు పూడ్చిన కాలువను యథాతథస్థితికి తీసుకురావడానికి మట్టి తొలగింపు పనులు చేపడుతున్నామని ఎంపీడీవో సాయి నవీన్, తెలిపారు.

పంట కాలువలో నుంచి క్రేన్లతో ట్యాంకర్‌ను బయటకు తీస్తూ..

ఏ కంపెనీ నుంచి వచ్చిందో..!

ట్యాంకర్ ఏ కంపెనీ, ఎక్కడ నుంచి, ఈ మార్గంలో ఎందుకు వచ్చిందన్నది స్పష్టత రాలేదు. లారీ ఈఎంఐ బకాయిలు ఉండటంతో డ్రైవర్ మార్గమధ్యలో నిలిపివేసేందుకు ఇటువైపు వెళ్తుండగా ప్రమాదం జరిగిందని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ప్రమాదం జరిగిన తరవాత డ్రైవర్ గురించి, లారీ యజమాని గురించి విచారణ చేసినా ఎటువంటి ఆధారం లభించలేదు. దీనిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు గ్రామ వీఆర్వో దుర్గాప్రసాదరావు ఫిర్యాదు చేశారు.

పశువుల బీమాతో మేలు

ఏలేశ్వరం: పాడి రైతులు నష్టపోకుండా పశువుల బీమా చేయించుకోవాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. పెద్దనాపల్లిలో శిబిరాన్ని ప్రారంభించారు.

కోటనందూరు: కె.ఎ.మల్లవరంలో మంగళవారం పశు వైద్యశిబిరం నిర్వహించి పశువులకు వైద్య చికిత్సలు చేసి, పాడి రైతులకు మందులు అందించినట్లు వైద్యాధికారి రత్నతేజ అన్నారు.

సంక్షిప్త వార్తలు

త్వరలో గ్రామ, అనుబంధ కమిటీల ఏర్పాటు

గండేపల్లి: నియోజకవర్గంలో ఒక్కో మండలంలోనూ ప్రతి మంగళవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తానని వైకాపా ఇన్‌ఛార్జి తోట నరసింహం అన్నారు. గండేపల్లిలో మండల వైకాపా అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ చౌదరి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో గ్రామ కమిటీలు, అనుబంధ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, తోట రాంజీ, మూర్తి ఉన్నారు.

పాస్టర్లను ఆదుకుంటాం

జగ్గంపేట గ్రామీణం: కూటమి ప్రభుత్వంలో పాస్టర్లను అన్నివిధాల ఆదుకుంటామని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. జగ్గంపేటలో మంగళవారం నిర్వహించిన పాస్టర్ల ఐక్యవేదిక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జాన్ వెస్లీ, జోసఫ్, పులి ప్రసాద్ పాల్గొన్నారు.

యథావిధిగా 'నరేగా' కొనసాగించాలి

ఏలేశవరం: ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో ఏలేశ్వరంలో మంగళవారం ప్రదర్శన జరిగింది.

పేలుళ్లపై స్థానికుల ఆందోళన

తుని గ్రామీణం: కుమ్మరిలోవ సమీపంలో జరుగుతున్న పోలవరం కాలువ బ్లాస్టింగ్ పనులతో తుని పట్టణం ఒకటో వార్డులోని కొండపై నివాసం ఉంటున్న ప్రజలు తమ ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కుమ్మరిలోవ సమీపంలో జరుగుతున్న పోలవరం కాలువ పనుల్లో మట్టిని తరలిస్తున్న లారీలను మంగళవారం నిలిపివేసి ఆందోళన చేపట్టారు. దీంతో పోలవరం కాలువ ఈఈ గోవింద్ సంఘటన స్థలానికి వచ్చి ప్రజలకు ఇబ్బందులు లేకుండా కంట్రోల్ బ్లాస్టింగ్‌తో పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

రావులమ్మ జాతర.. శెట్టిబలిజపేట సంబరం

జగ్గంపేట గ్రామీణం: గ్రామదేవత శ్రీరావులమ్మతల్లి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం శెట్టిబలిజపేట సంబరం ఘనంగా నిర్వహించారు. బాణసంచా పేల్చి సందడి చేశారు. జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ రావులమ్మ అమ్మవారికి పూజలు నిర్వహించారు.

దుకాణంలో అగ్నిప్రమాదం..

శెట్టిబలిజపేట సంబరాల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. బాణసంచా పేల్చుతున్న సందర్భంలో ఒక తారాజువ్వ వ్యాపారి తేజారామ్‌కి చెందిన దుకాణం రెండో అంతస్తులో ఉన్న ప్లాస్టిక్, థర్మాకోల్ షీట్లలో పడడంతో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఫైర్ స్టేషన్ ఎస్ఎఫ్ఓ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేశారు.

సన్‌ఫుడ్స్ పరిశ్రమలో..

గండేపల్లి: నాయకంపల్లి శివారున ఉన్న ఎస్‌కే ఆగ్రో పరిశ్రమలో మంగళవారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించినట్లు పెద్దాపురం అగ్నిమాపకశాఖ అధికారి శ్రీహరి జగనాథ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమలో జీడిపిక్కల తొక్కలను ఉడికించి ఆయిల్ తీసే బాయిలర్స్ పొంగి మోటార్‌పై పడడంతో ప్రమాదం సంభవించిందన్నారు.

చిన్నారులకు వైద్య భరోసా

శంఖవరం, రౌతులపూడి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రభుత్వం ఆటపాటలతో కూడిన విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తోంది. కేంద్రాల వద్ద ఆడుకుంటున్న సమయాల్లో కిందపడడం, ఇతర చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు వస్తూ ఉంటాయి. ఇలాంటి సమయాల్లో కార్యకర్తలు వెంటనే వారిని తీసుకుని సమీపంలో ఉన్న పీహెచ్‌సీలకు పరుగులు తీస్తుంటారు. ఇకపై వారికి ప్రాథమిక వైద్యం అందించేందుకు అవసరమైన మెడికల్ కిట్లను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే అన్ని ఐసీడీఎస్ ప్రాజెక్టులకు ఇవి చేరాయి.

కిట్‌లో ఉండే వస్తువులివీ..

ప్రతి కిట్‌లో 11 రకాల మందులు, చేతుల శుభ్రతకు క్రిమిసంహారక ద్రావణం, కట్టు కట్టేందుకు రోల్ బ్యాండేజ్, దూది ఉన్నాయి. గాయాలైతే మందులు ఉన్నాయి. ఏ ఔషధం ఎలా, ఎంత మోతాదులో వాడాలో నియమాలు ఉన్నాయి. చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు ఈ కిట్లలో ఉన్నాయి.

అంగన్‌వాడీ కేంద్రాలకు చేరిన కిట్

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని రెండు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో..

	ప్రత్తిపాడు ప్రాజెక్టు		శంఖవరం ప్రాజెక్టు	
	ప్రత్తిపాడు	ఏలేశ్వరం	శంఖవరం	రౌతులపూడి
అంగన్‌వాడీ కేంద్రాలు	82	59	57	59
చిన్నారులు	3186	2815	2157	2006
గర్భిణులు	355	346	269	248
బాలింతలు	387	304	244	214

అన్ని కేంద్రాలకు చేరవేశాం

జిల్లా నుంచి వచ్చిన మెడికల్ కిట్లను ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు చేరవేశాం. అంగన్‌వాడీ కార్యకర్తలకు వీటి వినియోగంపై శిక్షణ ఇచ్చాం. మారుమూల గ్రామాల నుంచి ఆసుపత్రులకు రావాలంటే రవాణా సదుపాయం ఉండదు. అలాంటిచోట్ల ఈ కిట్లు ఉపయోగపడతాయి.

– వెంకటలక్ష్మి, సీడీపీవో శంఖవరం ప్రాజెక్టు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ప్రత్తిపాడు వారి కోర్టులో

EP No.24/2016 OS No.88/2009

Between:

గోళ్ల సూరరాజు అనే బాబ్జి ...DHR

మరియు

రేలంగి కనకరత్నం, W/o సూర్యనారాయణ, R/o ధర్మవరం, ప్రత్తిపాడు మండలం ...JDR

పై నెంబరు డిక్రీ బాకీకి జడ్జిమెంట్ డెటార్ తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తి పై కోర్టు వారి సమక్షములో ది.16-02-2026వ తేదీన ఉదయం గం.10.30 ని॥ల లగాయితు బహిరంగ వేలం జరుపబడును. ఆసక్తి గలవారు వేలం పాటలో పాల్గొనవచ్చును. మిగతా వివరములకు డిక్రీ హోల్డర్ గారి అడ్వకేట్ ఆఫీసునందు గాని, పై కోర్టు నజారత్ ఆఫీసునందు గాని తెలియజేయబడును.

వేలం కాబడు షెడ్యూలు ఆస్తి వివరములు

తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, ప్రత్తిపాడు మండలం, ధర్మవరం గ్రామ పంచాయతీ, ధర్మవరం గ్రామంలో బంగాళా ఇల్లు డోర్ నెం.4-60కి హద్దులు, వివరములు: **తూర్పు:** చిమ్మశెట్టి చంద్రరావు గారి ఇల్లు; **ఉత్తరం:** చింతల లోవరాజు గారి ఇల్లు; **పడమర:** రోడ్డు; **దక్షిణం:** కుప్పల రమణ గారి ఇల్లు. సదరు హద్దుల మధ్య ఇంటికి మామూలు ఈజిమెంట్ హక్కులతో సహా.

శ్రీమతి A.సుగుణ, న్యాయవాది
తోటవీధి, ప్రత్తిపాడు, కాకినాడ జిల్లా
Cell: 98660 45389

(c) eenadu

వేరుసెనగ

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వేరుసెనగ ధర బంగారం రేటులా దూసుకెళ్తోంది. ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం రికార్డు ధర పలికింది. క్వింటా గరిష్ఠ ధర రూ.13,100 పలికింది. మధ్యస్థ ధర రూ.9,900 కనిష్ఠ ధర రూ.5,577లకు వ్యాపారులు కొన్నారు. గత ఏడాది డిసెంబరు 12వ తేదీన క్వింటా రూ.8,120 ఉండగా.. 45 రోజుల్లో రూ.13 వేలు దాటింది. దిగుబడులు తగ్గడంతో సంక్రాంతి తరవాత ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి.

గుట్టకింద భూతాలు

కబ్జాకు పాల్పడిన స్థలంలో రోడ్డు, మురుగు కాల్వల నిర్మాణం

ఆదోని పట్టణంలో 'భూమాఫియా' రెచ్చిపోతోంది.. తాజాగా పట్టణ శివారులోని బైపాస్ రహదారి పక్కనున్న రూ.కోట్ల విలువైన భూమిని ఓ పార్టీ నాయకుడు కబ్జా చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. పట్టణ శివారులో నెట్టేకల్లు ఆంజనేయస్వామి విగ్రహం నుంచి ఆలూరు రహదారి వరకు బైపాస్ రహదారి నిర్మించారు. ఒక్కసారిగా రహదారికి ఇరువైపులా భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో ఎక్కడ ఖాళీ జాగా కనిపిస్తే అక్కడ వాలిపోతున్నారు.

● రహదారి పక్కనే మండిగిరి పరిధిలోని సర్వే నంబరు-586లో 24.23 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. సెంటు రూ.5- రూ.8 లక్షలు పలుకుతోంది. ఆ సర్వే నంబరులో ఖాళీగా ఉన్న 20-30 సెంట్ల భూమిపై ఓ నేత కన్నుపడింది. ఎంచక్కా రోడ్డు, డ్రైనేజీలు నిర్మించారు. ఆక్రమించిన స్థలం విలువ రూ.2 కోట్ల వరకు ఉంటుందని అంచనా. "భూమి కబ్జాకు గురైనట్లు మా దృష్టికి వచ్చింది.. పరిశీలించి.. ఉన్నతాధికారులకు నివేదిక పంపించాము" సర్వేయర్ ఈశ్వర్ పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, ఆదోని ఎన్జీఓ కాలనీ

పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మంత్రి లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ తెదేపా అధ్యక్షురాలు కృష్ణమ్మ

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: తెదేపా బలోపేతానికి సమష్టిగా పనిచేయాలని.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెదేపా జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పార్లమెంటు కమిటీల కార్యవర్గాలకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పార్లమెంటు కమిటీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు తదితరుల విధులు, బాధ్యతలను వివరించారు. పార్లమెంటరీ కమిటీలు సమర్థంగా పనిచేస్తూ పార్టీని, ప్రభుత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలని నేతలు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు, నంద్యాల పార్లమెంటు నియోజకవర్గాల తెదేపా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, గౌరు చరితారెడ్డి, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు, ఉపాధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్యం విషమిస్తోంది

● చెత్తలో కలుస్తున్న బయో వ్యర్థాలు
● పెద్దాసుపత్రి అధికారుల పర్యవేక్షణ కరవు

కర్నూలు సర్వజనాసుపత్రిలో ప్రజారోగ్యానికి 'నిప్పు' పెడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో బయోవ్యర్థాలు కాల్చేస్తున్నారు. ఆస్పత్రిలో నిత్యం మూడు వేలమందిగా ఓపీ ఉంటుంది. పదుల సంఖ్యలో శస్త్రచికిత్సలు చేస్తుంటారు. ఈ క్రమంలో సాధారణ(జనరల్), బయో వ్యర్థాలు భారీగా ఉత్పత్తవుతుంటాయి. వీటిని శాస్త్రీయంగా వేరుచేయాలి. బయో వ్యర్థాలను జాగ్రత్తగా కవర్లలో చెట్లమల్లాపురం వద్దనున్న డంప్ యార్డుకు పంపాల్సి ఉంది. వైద్యాలయంలో పర్యవేక్షణ కరవవడంతో అస్తవ్యస్తంగా కలిపేసి నిప్పు పెడుతున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు వైద్యాలయం

వ్యర్థాలకు నిప్పు పెట్టి ఆర్పుతున్న సిబ్బంది

వ్యర్థాలు	నెలకు (టన్నుల్లో)
జనరల్	60
బయో	3

ఇలా డబ్బాల్లో వేసి..

● **పసుపు:** మానవ వ్యర్థాలు, కలుషిత దూది, విషపూరిత వ్యర్థాలు, గడువు ముగిసిన మందులు
● **ఎరుపు:** సిరంజిలు, ఐవీ సెట్, చేతి తొడుగులు, రక్తం, మూత్రం బ్యాగులు, డయాలసిస్ కిట్
● **తెలుపు:** సూదులు, బ్లేడ్లు, శస్త్రచికిత్స బ్లేడ్లు
● **నీలం:** ఔషధ సీసాలు, ఇంప్లాంట్స్, కత్తెర. (వార్డుల్లో ఏర్పాటు చేసిన డబ్బాల్లో వేయాలి)

నిర్వహణకు రూ.80 లక్షలు

● వైద్యశాలలో 20 నుంచి 30 శాతం బయో వేస్టేజీని సాధారణ వ్యర్థాలతో కలిపి తరలిస్తున్నారు. రోజూ సుమారు వంద కిలోల బయో వ్యర్థాలు రావాల్సి ఉండగా.. 60 నుంచి 70 కిలోలు మాత్రమే వస్తుండటం గమనార్హం.
● ఆస్పత్రిలో పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించిన గుత్తేదారుడికి ప్రతి నెలా రూ.80 లక్షలు చెల్లిస్తున్నా నిర్వహణ మాత్రం అధ్వానంగా ఉంటోంది. అధికారులు పట్టించుకోకపోవడంతో గుత్తేదారుడు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

రెండు నెలలుగా ఇదే పరిస్థితి

● ఆస్పత్రిలోని పారిశుద్ధ్య కార్మికులు జనరల్ వేస్టేజీలో బయో వ్యర్థాలు కలిపేస్తున్నారని.. నిబంధనలు పాటించడం లేదంటూ నగరపాలక సిబ్బంది వ్యర్థాలను తరలించడం మానేశారు. ఇదే విషయమై నగరపాలక అధికారులు తాఖీదులిచ్చారు. 'జనరల్ వేస్టేజీలో బయో వ్యర్థాలు కలుస్తున్నాయి.. సక్రమ పద్ధతిలో వేరు చేస్తేనే డంప్ యార్డుకు తీసుకెళ్తామని ఆసుపత్రిలోని పారిశుద్ధ్య నిర్వాహకులకు తేల్చి చెప్పాం. కానీ వారు పట్టించుకోకపోవడంతో మేము తరలించడం మానేసినట్లు'' నగరపాలక ఆరోగ్య అధికారి డా.నాగప్రసాద్ బాబు అన్నారు.
● నగరపాలక సిబ్బంది తీసుకెళ్లకపోవడంతో ఆస్పత్రి ఆవరణలో వ్యర్థాలు పెద్ద ఎత్తున పేరుకుపోతున్నాయి. వాటికి ఏకంగా నిప్పు పెడుతున్నారు. ఇది ప్రమాదకరమని తెలిసినా పట్టించుకోవడం లేదు. ఇది పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. విష వాయువులు వెలువడి రోగుల ప్రాణాలకూ ముప్పు ఏర్పడుతోంది.

పోస్టులు 133 దరఖాస్తులు 16,412

కస్తూర్బా విద్యాలయాల(కేజీబీవీ) ఆదర్శ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఒకేషనల్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, అటెండర్, వాచ్‌మెన్ తదితర పోస్టులకు సంబంధించి ఒప్పంద ప్రాతిపదికన నియామకానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతేడాది డిసెంబరు 3వ తేదీ నుంచి 11వ తేదీ వరకు అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. దీనికి అనూహ్య స్పందన లభించింది. వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. నెల దాటినా ప్రక్రియ ముందుకు సాగడం లేదు. – న్యూస్‌టుడే, కర్నూలు విద్య, నంద్యాల విద్య

కొరవడిన స్పష్టత

● దరఖాస్తు ప్రక్రియ పూర్తైనప్పటి నుంచి నేటి వరకు నియామకాలపై స్పష్టత లేకపోవడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. నియామక ప్రక్రియలో మార్పులు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై స్పష్టత వచ్చిన వెంటనే అర్హుల జాబితా ప్రకటించే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.
● నంద్యాల జిల్లా పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టులకు సంబంధించి వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని ఇప్పటివరకు స్క్రూటినీ చేయకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏ పోస్టుకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయన్న స్పష్టత కూడా కానరావడం లేదు.

జిల్లాలో అత్యధికం

జిల్లా	ఖాళీలు	దరఖాస్తులు
కర్నూలు	77	8,912
నంద్యాల	56	7,500

కర్నూలు జిల్లాలో టైప్-3 కింద ఖాళీగా ఉన్న బోధనేతర పోస్టుల కోసం పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా అటెండర్ పోస్టుకు 1,768 మంది, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్‌కు 1,732 మంది దరఖాస్తులు అందజేశారు. నెల రోజులు దాటినా ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోకపోవడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

ఆందోళనబాట

హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి(ఎన్‌హెచ్ 44) నిర్వహణ దారి తప్పింది.. నగర శివారులో కేసీ కాల్వ వద్ద సర్వీసు రోడ్డు వేయకుండా వదిలేశారు. సుంకేసుల, మునగాలపాడు, నిడ్జూరు, జి.సింగవరం, ఎదురూరు, ఆర్.కొంతలపాడు తదితర ప్రాంతాలకు వెళ్లే వారు అపసవ్య దిశలో (యూటర్న్) వెళ్తున్నారు. ఈ క్రమంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్వీసు రోడ్డు వేయాలని వాహనదారులు విన్నవించారు.

– ఈనాడు, కర్నూలు



కేసీ కాల్వ వద్ద సర్వీసు రోడ్డు నిర్మించకుండా వదిలేశారు ఇలా

సూర్యప్రభ వాహనంపై తేజోమూర్తి

కర్నూలు నగరంలోని సంకల్‌బాగ్ హరిహరక్షేత్రంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామివారు మంగళవారం సూర్యప్రభ వాహనంపై ఊరేగారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 10 గంటలకు కల్యాణం నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ సంఘం నగర అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షుడు చెరువు వెంకట దుర్గాప్రసాద్ తెలిపారు.

– న్యూస్‌టుడే, కర్నూలు ఆధ్యాత్మికం

తుంగభద్రలో ఇసుక తోడేళ్లు



కర్నూలు మండలం మునగాలపాడు, పంచలింగాల ప్రాంతాల మీదుగా ప్రవహించే తుంగభద్ర నదితో పాటు లక్ష్మీపురం వద్ద హంద్రీ నదిలో అక్రమార్కులు ఇసుకను ఇష్టానుసారంగా తరలించేస్తున్నారు. వంతెనల పిల్లర్లను ఆనుకుని తవ్వకాలు చేస్తుండటంతో పెను ప్రమాదం పొంచి ఉంది. – ఈనాడు కర్నూలు

జన గణనకు కసరత్తు

● తొలిసారిగా డిజిటల్ విధానంలో..

జన గణనకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. రెండు దశల్లో చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. గృహాల జాబితాల తయారీకి, ఇంటింటా సర్వే నిర్వహణకు సంబంధించి ఇప్పటికే ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్ర, జిల్లా, డివిజన్, మున్సిపల్ స్థాయి అధికారుల నియామకానికి ఆదేశాలు జారీ చేశారు. తొలిసారిగా డిజిటల్ విధానంలో చేపట్టనున్నారు.

జిల్లా	సచివాలయాలు	కుటుంబాలు
కర్నూలు	672	7,37,221
నంద్యాల	516	5,84,665

● జిల్లాలో ముఖ్య జన గణన అధికారిగా కలెక్టర్ వ్యవహరిస్తారు. అదనపు ముఖ్య జన గణన అధికారిగా జాయింట్ కలెక్టర్ (జేసీ), జిల్లా జన గణన అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) ఉంటారు.
● రాష్ట్రంలో జనాభా లెక్కల సేకరణ నిమిత్తం గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని వినియోగించాలని కలెక్టర్లను ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామ, వార్డు సచివాలయాలను మూడు కేటగిరీలుగా వర్గీకరించారు.
● సచివాలయాల్లో సాధారణ విధులు, నిర్దిష్ట విధులకు వేర్వేరు సిబ్బందిని కేటాయించారు. ఈ ప్రక్రియను సచివాలయాల ప్రక్షాళనలో భాగంగా చేపట్టారు. సచివాలయ సిబ్బందిని హేతుబద్ధీకరించడం, బదిలీ చేయడం జరుగుతుంది. 2026 జూన్ 10 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది.

– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

నల్లమలలో ట్రాఫిక్ కట్టడి

● ఘాట్ రోడ్డులో నిబంధనలు కఠినతరం
● సరకు రవాణా వాహనాల మళ్లింపు
● ఫిబ్రవరి 1 నుంచి నంద్యాల మీదుగా..

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీశైల మల్లన్న క్షేత్రం ముస్తాబవుతోంది.. శ్రీభ్రమరాంబ మల్లికార్జునుల దర్శనార్థం వివిధ రాష్ట్రాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలొస్తారు.. కొందరు అడవి దారిలో నడుచుకొంటూ.. మరికొందరు వాహనాల్లో ఆత్మకూరు-దోర్నాల మధ్య ఘాట్ రోడ్డులో వెళ్తారు.. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 'ఘాట్' రోడ్డులో సరకు రవాణా వాహనాలపై నిషేధం విధించారు.

– న్యూస్‌టుడే, ఆత్మకూరు

ఘాట్‌లో నిలిచిన లారీలు

● ఫిబ్రవరి 1 నుంచి 20వ తేదీ వరకు విజయవాడ, గుంటూరు వైపు అధిక లోడ్‌తో వచ్చే వాహనాలు కర్నూలు, నంద్యాల, గిద్దలూరు, మీదుగా మళ్లించనున్నారు. ఆత్మకూరులోని నంద్యాల మలుపు వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనాలు నంద్యాల వైపు మళ్లిస్తారు.
● "గూడ్స్ వాహనాల్లో ప్రయాణిస్తున్న భక్తులు, వాహన చోదకులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తున్నాం.. నిబంధనలు అతిక్రమిస్తే రూ.25వేల నుంచి రూ.50వేల వరకు జరిమానా విధిస్తామని అధికారులు ప్రకటించారు. పట్టుబడితే డ్రైవర్ లైసెన్స్, పర్మిట్‌ను రద్దు చేసి వాహనాన్ని సీజ్ చేస్తాం.. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణం చేయడం చట్టరీత్యా నేరం.. గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులతో ఆత్మకూరు, నందికొట్కూరు దారిలో వస్తే కేసులు నమోదు చేస్తామని' ' ఆత్మకూరు ఎంవీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

● ఘాట్ రోడ్డులో ప్రయాణ సమయంలో వాహనాలు మొరాయిస్తే భక్తులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు సన్నిపెంట, దోర్నాల మెకానిక్‌లు, రికవరీ వాహనాలు, వాటి నంబర్లు అందుబాటులో ఉంచారు. సున్నిపెంట మెకానిక్‌లు 89850 31712, 97045 78781, దోర్నాల మెకానిక్‌లు 91008 05326, 99665 00535, రికవరీ వాహనాలు 95157 01600, 85004 93934.

ప్రయోగ పరీక్షలు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ఇంటర్ ఒకేషనల్ వార్షిక ప్రాక్టికల్స్ మంగళవారం ప్రారంభమైనట్లు ఆర్ఐవో లాలెప్ప తెలిపారు. మొదటి ఏడాదిలో 1,313 మందికి 1,236 మంది హాజరయ్యారు. రెండో ఏడాది విద్యార్థుల్లో 1,081 మందికి 1,062 మంది హాజరయ్యారన్నారు.

స్లాట్‌మూశారు.. వసూళ్ల గేట్లెత్తారు

● డోన్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో దందా

ఉమ్మడి జిల్లాలో భూములు, స్థలాల విలువ పెంచే ప్రయత్నంలో ప్రభుత్వం ఉంది. ఈ క్రమంలో ఫిబ్రవరి 1 నుంచి రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరిగే అవకాశం ఉంటుంది. పాత ధరల ప్రకారం ఈ నెల 31 వరకే రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం ఉంది. దీంతో వినియోగదారులు రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. దీన్ని ఆసరా చేసుకొని దళారులు దందాకు తెరతీశారు. రిజిస్ట్రేషన్ స్లాట్లను బ్లాక్ చేశారు. నాలుగు రోజుల వ్యవధిలో ఒక్క స్లాట్ లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, వెల్దుర్తి, డోన్

ఒక్కోదానిపై రూ.రెండు వేలు

● నమోదైన స్లాట్స్‌ను పునరుద్ధరించేందుకు (రీషెడ్యూల్) హద్దుల వివరాలు మార్చుకునే అవకాశం ఉంది. వినియోగదారుడు సరైన సమయానికి రాలేదనే కారణం చూపి పునరుద్ధరణకు రూ.200 రుసుము అదనంగా చెల్లించాలి.
● స్లాట్ బుకింగ్‌కు రూ.600, రీషెడ్యూల్‌కు రూ.200, బ్లాక్ చేసిన రోజు డిమాండ్‌ను బట్టి అదనంగా రూ.3వేలు తీసుకొంటున్నారు. రూ.800 ఖర్చులు పోనూ ఒక స్లాట్‌కు రూ.2,200 వరకు అదనపు ఆదాయం సమకూరుతుంది. నిత్యం 39 స్లాట్లకు సుమారు రూ.80 వేల ఆదాయం వస్తుంది.

దళారులే దిక్కయ్యారు

● ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఛార్జీలు పెరగనుండటంతో ఆలోపు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని చాలా మంది వినియోగదారులు కార్యాలయానికి వస్తున్నారు. దీన్ని ఆసరా చేసుకొని దళారులు ముక్కుబడిగా అంతర్జాలంలో హద్దులు నమోదు చేసి రూ.600 రుసుము చెల్లించి స్లాట్స్‌ను బ్లాక్ చేశారు. డోన్ కార్యాలయం పరిధిలో ఒక్క స్లాట్ ఖాళీగా లేకపోవడం గమనార్హం.
● గడువు దాటితే.. గజం ధర రూ.2400 ఉన్న వాటికి పది శాతం పెంచినా రూ.2,640కు చేరుతుంది. ఈ లెక్కన ఒక సెంటుపై అదనంగా రూ.10వేల భారం పడుతుంది. ముందే రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వినియోగదారులు కార్యాలయానికి పరుగులు తీస్తున్నారు. స్లాట్లు లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయిస్తున్నారు.

నిత్యం 39 వరకు..

● డోన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో వెల్దుర్తి, డోన్, కృష్ణగిరి మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల పరిధిలోని పలువురు తమ ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయించుకొనేందుకు డోన్ కార్యాలయానికి వెళ్తుంటారు.
● దళారీ వ్యవస్థ లేకుండా ప్రజలకు మేలు చేసేందుకు ప్రభుత్వం స్లాట్ బుకింగ్ వ్యవస్థను తీసుకొచ్చింది. నిత్యం 10:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు 39 స్లాట్స్ బుక్ చేసుకొనే అవకాశం ఉంది.
● స్లాట్ బుక్ చేసుకోవడానికి రూ.600 రుసుము చెల్లించాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన భూముల హద్దులు నమోదు చేస్తే అంతర్జాలంలో తేదీల వారీగా సమయం కేటాయిస్తారు.

బాలికల రక్షణకు పోక్సో ఈ-బాక్స్

కళాశాల.. కార్యాలయం.. ప్రయాణ ప్రాంగణం.. ఇలా నిత్యం ఎక్కడో ఓ చోట విద్యార్థినులు, మహిళలు, బాలికలు లైంగిక వేధింపులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని బయటకు చెప్పుకోలేక.. పోలీసు స్టేషన్‌కు వెళ్లడానికి వెనకాడుతుంటారు. ఈ నేపథ్యంలో బాధితులు ఇంటి నుంచే ఫిర్యాదు చేసేలా మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ పోక్సో ఈ-బాక్స్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.

● ఈ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. స్క్రీన్‌పై కనిపించే ఎర్రరంగు బటన్‌ను నొక్కాలి. ఇందులో ప్లే గ్రౌండ్, స్కూల్, స్కూల్ బస్, ఫ్యామిలీ మెంబర్, ఫోన్ వంటి ఐచ్ఛికాలు కనిపిస్తాయి.
● మీరు ఎక్కడైనా లైంగిక వేధింపులకు గురి అయితే ఆ ఐచ్ఛిక చిత్రంపై క్లిక్ చేయాలి. ఆ తర్వాత పేరు, ఈ-మెయిల్ ఐడీ, చరవాణి సంఖ్య, ఘటన వివరాలు నమోదు చేయాలి.
● ఫిర్యాదు పోక్సో చట్టం కింద నమోదు అవుతుంది.. ప్రత్యేక బృందాలు పరిశీలించి ఆ వివరాలను జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారులకు పంపిస్తారు. బాలల సంరక్షణ విభాగం అధికారులు పూర్తి పారదర్శకతతో విచారణ చేపడతారు.
● ప్రతి ఫిర్యాదుకు ఓ నంబరు కేటాయిస్తారు. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతారు. – న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

వైద్య కళాశాల విద్యార్థుల ప్రతిభ

నీట్ సూపర్ స్పెషాలిటీ (డీఎం) ప్రవేశ పరీక్షలో కర్నూలు సర్వజన ఆసుపత్రి పీజీ విద్యార్థులు సత్తాచాటారు. డా.విష్ణుశ్రీకర్‌రెడ్డి 65వ ర్యాంకు (స్టేట్ టాపర్), డా.ఉదయ్‌శంకర్ 125, డా.వినీతారెడ్డి 210, డా.అంబటి తేజేశ్వరరెడ్డి 324, డా.ఆర్.శిరీష 378, డా.అనంత్‌నివేష్ 668, డా.మహమ్మద్ సర్ఫరాజ్ 926, డా.పవన్‌కల్యాణ్ 936వ ర్యాంకు సాధించారు. వీరితోపాటు డా.సాయిచరణ్, డా.మహేంద్రబాబు, డా.అనిల్ కుమార్, డా.సాయిహరీష్‌రెడ్డిలు ప్రతిభ చూపారు. వీరిని ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టినరసమ్మ అభినందించారు. – న్యూస్‌టుడే, కర్నూలు వైద్యాలయం

వచ్చే నెల 13 వరకు కేసీకి నీరు

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే: కేసీ కాల్వ పరిధిలో 56-150 కి.మీ వరకు సాగులో ఉన్న పంటలకు ఫిబ్రవరి 13వ తేదీ వరకు మల్యాల, ముచ్చుమర్రి పథకాల నుంచి నీటి విడుదల ఉంటుందని జలవనరుల శాఖ ముఖ్య ఇంజినీరు (సీఈ) కె.కబీర్‌బాషా తెలిపారు. కర్నూలులోని కార్యాలయంలో మంగళవారం సంబంధిత ఇంజినీర్లతో సమీక్షించారు. కేసీ కాలువ కింద సాగులో ఉన్న పంటల వివరాలను ఎస్ఈ బాలచంద్రారెడ్డి వివరించారు. అనంతరం సీఈ మాట్లాడుతూ ప్రస్తుతమున్న పంటలను కాపాడేందుకు నీటి విడుదల చేయాలన్న మంత్రి నిమ్మల ఆదేశాలమేరకు నీటిని విడుదల చేస్తామని, కొత్తగా సాగు చేసే పంటలకు నీటి విడుదల ఉండదని స్పష్టం చేశారు. నీటిని పొదుపుగా వాడుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. తూడిచెర్ల డిస్ట్రిబ్యూటరీ సిస్టం ద్వారా 600 క్యూసెక్కులకు తగ్గకుండా విడుదల చేయాలన్నారు. ముచ్చుమర్రి నుంచి 4 పంపుల ద్వారా 900, మల్యాల వద్ద రెండు పంపుల ద్వారా 650 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోందని కేసీసీ ఈఈ ప్రతాప్ తెలిపారు.

ఎర్రనేలలో.. సుజల స్రవంతి

● 190 రోజులు.. 40.109 టీఎంసీలు

పశ్చిమ ప్రాంత వాసులు ఏటా జనవరి చివరి వారం నుంచి నీటి కోసం అగచాట్లు పడేవారు. కాల్వ విస్తరణతో హంద్రీనీవా సుజల స్రవంతి పరవళ్లు తొక్కుతోంది.. వివిధ రకాల పంటలతో అక్కడి నేలలు పచ్చని దుప్పటిని కప్పుకొన్నట్లు కనిపిస్తున్నాయి. పంట చివరి నాటికి సాగు నీరు అందే పరిస్థితి ఉండటంతో అన్నదాతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 'కూటమి' ప్రభుత్వం వచ్చిన తర్వాత హంద్రీనీవా కాల్వలో 3,850 క్యూసెక్కులు వెళ్లేలా 'కట్ట'దిట్టం చేశారు. గతేడాది జులై 17న సీఎం చంద్రబాబు మల్యాల ఎత్తిపోతల నుంచి నీటివిడుదల ప్రారంభించారు. అప్పటి నుంచి ఈనెల 27 తేదీ వరకు 40.109 టీఎంసీలు వదిలారు.

– న్యూస్‌టుడే, కర్నూలు జలమండలి, పత్తికొండ



యడవలి వద్ద హంద్రీనీవా కాల్వ ఒడ్డున విద్యుత్తు మోటార్లు, పైపులు

లక్షణంగా సాగు నీరు

● కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హంద్రీనీవా కాల్వ విస్తరణపై దృష్టి సారించింది. మల్యాల నుంచి 216 కి.మీ. వరకు మూడు ప్యాకేజీలుగా విభజించి రూ.830 కోట్లు వెచ్చించారు. ఈ కాల్వ ఉమ్మడి కర్నూలు జిల్లాలో 134 కి.మీ. మేర విస్తరించి ఉంది.
● అధికారికంగా కేటాయించిన 40 టీఎంసీల కంటే మరో 11 టీఎంసీల నీటిని వినియోగించుకునే అవకాశం దక్కింది. దీంతో 1.10 లక్షల ఎకరాలకు అదనంగా సాగు నీరు అందించే పరిస్థితి వచ్చింది. " కాల్వ నుంచి పైపు లైన్ వేసుకొన్నా.. ఈ ఏడాది రెండు పంటలు పండిస్తున్నాం.. ప్రస్తుతం రెండెకరాల్లో వేరుసెనగ సాగు చేశా. మరో నెల రోజుల పాటు నీరొదిలితే పంట చేతికందుతుందని'' మద్దికెరకు చెందిన మురళీ పేర్కొన్నారు.

ఆరు నియోజకవర్గాలకు ఆసరా

● కృష్ణగిరి వద్ద ప్రస్తుతం ఆరు పంపుల ద్వారా 2,600 క్యూసెక్కులు ఎత్తిపోస్తున్నారు. అదేవిధంగా లక్కసాగరం నుంచి 68 చెరువులకు 1.238 టీఎంసీల నీటిని తరలిస్తున్నారు. నీటి ఆధారంగా ప్రస్తుతం వేరుసెనగ, ఉల్లి, కూరగాయలు సాగు చేశారు.
● హంద్రీనీవా ప్రధాన కాల్వ నందికొట్కూరు, పాణ్యం, కర్నూలు, పత్తికొండ, ఆలూరు, డోన్ నియోజకవర్గాల్లోని పలు గ్రామాల మీదుగా వెళ్తోంది. ఎక్కడా పంట కాల్వలు నిర్మించలేదు. కేవలం దేవనకొండ మండలంలో కొంత వరకు తవ్వి వదిలేశారు.
● రైతులు ప్రధాన కాల్వ ఒడ్డున మోటార్లు పెట్టి 2 నుంచి 3 కి.మీ.మేర పైపులైన్లు వేసుకొని నీటిని తీసుకెళ్తున్నారు. ' 'కాల్వ విస్తరణ పనులు పూర్తయిన వెంటనే 300 పైపులు కొనుగోలు చేసి భూమి లోపల వేశారు.. 3 కి.మీ. మేర తీసుకెళ్తా.. ఇందుకు రూ.6 లక్షల వరకు ఖర్చు అయ్యింది.. పంటలకు సాఫీగా నీళ్లు అందుతున్నాయని'' మద్దికెరకు చెందిన హనుమంతు సంతోషం వ్యక్తం చేశారు.

ఏడాది	రోజులు	టీఎంసీలు
2025-26	190	40.109
2024-25	222	28.198
2023-24	215	21.367
2022-23	242	23.684
2021-22	200	26.831

● మల్యాల నుంచి ఎత్తిపోసిన కృష్ణా జలాలు



(c) eenadu

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – తాడికొండ: బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని తాడికొండ వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET

Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)

Hospitality Partner: Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS

Gift Partner: KL UNIVERSITY (DEEMED TO BE UNIVERSITY)

Man of the Series: Hero

Digital Partner: ఈనాడు.net

TV Partner: ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్

Organised by ఈనాడు

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - 1 జూనియర్స్: మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ – రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్సర్లతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులు చేసి ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - 1 జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

గ్రౌండ్-2లో సీనియర్స్: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వరప్రసాద్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

సీనియర్స్ విన్నర్స్ రాయలసీమ రాకర్స్

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ చరణ్ జిత్ ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-1 (జూనియర్స్)

మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్

మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)

మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్

మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

వెంటాడుతున్న గండాలు

మంత్రాలయం- బెంగళూరు ప్రధాన రహదారి అది. నిత్యం వేలాది వాహనాలు తిరుగుతుంటాయి. రాత్రి సమయంలో భారీ వాహనాలు వేగంగా వెళ్తుండటంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆస్పరి నుంచి పత్తికొండ వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఆస్పరి నుంచి పత్తికొండకు 14 కి.మీ. దూరం ఉన్న ఈ దారిలో ఆస్పరి సమీపంలో దాబా వద్ద కంకరతేలి గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గుంతలు పూడ్చి ప్రమాదాలు నివారించాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆస్పరి

కుటుంబ సర్వేలో పురోగతి తప్పనిసరి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో పురోగతి తీసుకురావాలని కలెక్టర్ డా. ఎ.సిరి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలను ఆదేశించారు. కుటుంబ సర్వే, అక్షరాంధ్ర కార్యక్రమాలపై మంగళవారం టెలీ కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. కుటుంబ సర్వేకు సంబంధించి కర్నూలు అర్బన్, ఆదోని అర్బన్‌లో పురోగతి తక్కువగా ఉందని చెప్పారు. సర్వేలో తగ్గిన మండలం పూర్తిగా వెనుకబడి ఉందని అసహనం వ్యక్తం చేశారు. అక్షరాంధ్ర కార్యక్రమానికి సంబంధించిన పనులు దాదాపు ముగింపు దశకు వచ్చాయని, మిగిలిన చిన్నపాటి పనులను వచ్చే రెండు, మూడు రోజుల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో 1,61,000 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, ఇందులో విఫలమైతే సంబంధిత మండల అధికారులు బాధ్యత వహిస్తారన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్సులో జడ్పీ సీఈవో నాసర రెడ్డి, వయోజన విద్య డీడీ చంద్రశేఖర్‌రెడ్డి, డీఆర్డీఏ పీడీ రమణారెడ్డి, మెప్మా పీడీ శ్రీనివాసులు, డీఈవో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులకు అక్రిడిటేషన్ల మంజూరు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: పాత్రికేయులకు రెండేళ్ల కాలపరిమితితో అక్రిడిటేషన్లు మంజూరయ్యాయి. స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్, ఛైర్మన్ డా.ఎ.సిరి అధ్యక్షతన జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగింది. కమిటీ కన్వీనర్, సమాచార శాఖ డీడీ జయమ్మ, కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి 2027 డిసెంబరు 31వ తేదీ వరకు రెండేళ్ల కాలపరిమితితో అర్హులైన 600 మందికిపైగా పాత్రికేయులకు అక్రిడిటేషన్లను మంజూరు చేస్తూ ఆమోదించారు.

రిజిస్ట్రేషన్లలో పారదర్శకత అవసరం

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే: రిజిస్ట్రేషన్లు పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని కలెక్టర్ డా. ఎ.సిరి ఆదేశించారు. డబుల్ రిజిస్ట్రేషన్లు జరగకుండా ఈసీని, దస్తావేజులను నిశితంగా పరిశీలించి పక్కాగా రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. అబ్బాసనగర్‌లోని కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సంబంధించి కంప్యూటర్‌లో వివరాల నమోదు, సేల్ డీడీల స్వీకరణ, దస్తావేజుల తయారీ విధానాన్ని పరిశీలించారు. ఇన్‌ఛార్జి జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్, ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ వరప్రసాద్‌కు పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన ప్రజలతో మాట్లాడారు. స్లాట్ బుకింగ్ ప్రకారం నిర్ణీత సమయంలోనే రిజిస్ట్రేషన్ చేస్తున్నారా, దస్తావేజులు సకాలంలోనే ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.

రిజిస్ట్రేషన్ విధానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ డా.ఎ.సిరి

మోసగాడితో అప్రమత్తంగా ఉండండి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : కర్నూలుకు చెందిన కొత్తకాపు రాజశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేరు చెప్పి వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలను బెదిరింపులకు గురిచేయడమేకాక అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నారని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. అతనితో మంత్రికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. మంత్రితో సన్నిహిత సంబంధం ఉందని.. మంత్రి కార్యాలయంతో అనుబంధం ఉన్న వ్యక్తినని చెప్పుకొంటూ ప్రజలను మభ్యపెడుతున్నట్లు పలు ఫిర్యాదులు మంత్రి కార్యాలయానికి అందుతున్న నేపథ్యంలో ఈ ప్రకటన విడుదల చేసినట్లు పేర్కొంది. అతడిని ఎవరూ నమ్మి మోసపోవద్దని కోరింది.

కర్నూలు గ్రామీణ ఎంపీపీ తొలగింపు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: కర్నూలు గ్రామీణ మండల పరిషత్ అధ్యక్షురాలు డి.వెంకటేశ్వరమ్మను పదవి నుంచి తొలగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంపీపీ పదవి నుంచి తొలగించేందుకు గత నెల రెండో తేదీన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి ఆమోదం లభించింది. ఈ నేపథ్యంలో ఎంపీపీని తొలగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది.

శ్రీమఠంలో ఘనంగా మధ్వ నవమి వేడుకలు

మంత్రాలయం గ్రామీణం(కౌతాళం), న్యూస్‌టుడే: మంత్రాలయం శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో మంగళవారం మధ్వ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో మధ్వాచార్యుల పూర్వావతారమైన ఆంజనేయ స్వామికి విశేష పూజలు చేశారు. అనంతరం స్వర్ణ రథంలో మధ్వాచార్యుల ప్రతిమను ఉంచి మఠం ప్రాకారంలో అశేష భక్తుల నడుమ వైభవంగా ఊరేగించారు. అంతకుముందు గ్రామదేవత మంచాలమ్మకు, రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీమఠం మేనేజరు ఎస్కే. శ్రీనివాసరావు, సహాయ మేనేజరు నరసింహమూర్తి, వ్యాసరాజాచార్, కుర్డి జయతీర్థ ఆచార్ తదితరులు పాల్గొన్నారు.

రథంపై మధ్వాచార్యుల ప్రతిమకు పూజలు చేస్తున్న పీఠాధిపతి, రథోత్సవానికి హాజరైన అశేష భక్తజనం

ఐదు రోజుల పనిదినాలు కల్పించాలి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: వారానికి ఐదు రోజుల పని దినాలు కల్పించాలని వివిధ బ్యాంకుల అధికారులు, ఉద్యోగులు డిమాండు చేశారు.

ఆందోళనలో పాల్గొన్న వివిధ బ్యాంకుల ఉద్యోగులు

పని ఒత్తిడికి గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ పిలుపు మేరకు నగరంలోని ఎస్బీఐ ప్రధాన శాఖ వద్ద ప్రభుత్వ రంగ, ప్రైవేటు, గ్రామీణ, కోఆపరేటివ్ బ్యాంకుల అధికారులు, ఉద్యోగులు మంగళవారం ఒక రోజు సమ్మె నిర్వహించారు. బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూఎఫ్‌బీయూ కన్వీనర్ ఇ.నాగరాజు, ఏఐబీఈఏ నాయకుడు అనిల్‌కుమార్‌రెడ్డి, ఎల్లయ్య, వాసుదేవరెడ్డి, జియావుర్ రెహమాన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరం పరిష్కరించండి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌లలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ డా.ఎ.సిరి అధికారులను ఆదేశించారు. ఆమె మంగళవారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆర్డీవోలు, తహసీల్దార్లు, మండల సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. వచ్చిన దరఖాస్తులను తహసీల్దార్లు సమగ్రంగా పరిశీలించి త్వరగా సమస్యలు పరిష్కరించాలని సూచించారు. డ్రాఫ్ట్ పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ, ఈకేవైసీపై సమీక్ష చేస్తామని, పొరపాట్లకు తావు లేకుండా సక్రమంగా చేయాలని జేసీ నూరల్ ఖమర్ పేర్కొన్నారు. రీసర్వేలో భాగంగా భూ విస్తీర్ణంలో తేడాలు లేకుండా చూడాలన్నారు. వీడియో కాన్ఫరెన్సులో కేఆర్ఆర్సీ ఉప కలెక్టర్ నాగప్రసన్న లక్ష్మి, తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, శ్రీనాథ్, ప్రకాష్‌బాబు, సర్వే ఏడీ కె.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ANDHRA PRADESH EDUCATION & WELFARE INFRASTRUCTURE DEVELOPMENT CORPORATION: KURNOOL

"e-Procurement Short Tender Notice"

Tender is invited from the eligible contractors for NIT **No. 57 to 65/EE/EWIDC/KRNL/AE/2025-26 (2nd & 4th Calls), Dt. 28.01.2026** for 2 No's SWRSC works, 1 No shopping complex repair work, 6 No S.W.Hostels works pertaining to Kurnool and Nandyal Districts within Est. Cost below Rs.30.00 Lakhs **Start Date 28.01.2026 at 03.00 PM and Last date of receipt of tenders may be viewed in E-Procurement platform.**

Note: For further details can be viewed at https://tender.apeprocurement.gov.in or contact. Cell: (99853 28413 and 97047 01688).

Sd/- Executive Engineer, APEWIDC, Kurnool.

Andhra Pradesh Industrial Infrastructure Corporation Limited.
(An undertaking of A.P. Govt.)
O/o. Zonal Manager, Zonal Office, APIIC Ltd., Kallur, Kurnool District, Andhra Pradesh - 518003.

'e'Procurement Notice

Tender Notice No. 01/ZM/APIIC/KNL/2025-26 Dt: 27.01.2026

Zonal Manager, APIIC Ltd., Kurnool invites bid for the following work.

T.N.No.01: Name of work: Request for proposal for selection of Consultant for Preparation of Detailed Project Report, for Summer Storage Tank (SST) of 4205 ML capacity near Meedivemula (V), Orvakal (M), Kurnool District in Andhra Pradesh.

Date Of Publication :27-01-2026 at 08.00 PM

Last date for submission of bids :03-02-2026 at 3.00 PM

The details of tender notice and bid document can be downloded form website: **www.apeprocurement.gov.in** (or) **https://tender.apeprocurement.gov.in**

Sd/- Zonal Manager, APIIC Ltd., Kurnool.

పబ్లిక్ నోటీసు

కర్నూలు జిల్లా, కర్నూలు మండలము, మునగాలపాడు గ్రామ పరిధిలోని సర్వేనెంబరు 154 మరియు 155లలోని ఎ. 20.00 సెంట్ల భూమి గౌరవ హైకోర్టు ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి W.P. 5775/2021 నందు యిచ్చిన కోర్టు తీర్పు ప్రకారము 1. దాసరి ప్రకాశ్ 2. ఎస్.శ్రీనివాసగౌడు 3. ఎం.మనిబాబు 4. సి.బాలచంద్రారెడ్డి మరియు 5. వై.రాజశేఖర్‌రెడ్డి గారికి D.No.6635/2025 (5 ఎకరములు), D.No.6636/2025 (5 ఎకరములు), D.No.6637/2025 (5 ఎకరములు) మరియు D.No.6638/2025 (5 ఎకరములు), వెరసి ఎ. 20.00 ఎకరములు రిజిష్టరు అయినది.

04.08.2025 G.P.A. చేయించుకున్న 1. పాణ్యం నాగేశ్వరరెడ్డి 2. జి.ప్రతాప్‌రెడ్డి మరియు 3. కైప శివరామిరెడ్డి గారి తరపున 25.01.2026వ తేదీన వారి అడ్వకేట్ జి.శ్రీనివాసులు యిచ్చిన పబ్లిక్ నోటీసు నందు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కర్నూలు కోర్టువారు O.S. 71-2013 కేసులో 20.08.2019 తేదీనాడు, వారికి G.P.A. చేసిన వారికి అనుకూలంగా తీర్పు యిచ్చివున్నారు అని తెలిపినారు. కానీ ఆ కేసుకు సంబంధించి షెడ్యూల్ ఆస్తి వివరములు, G.P.A. లో కనబరచిన ఆస్తి వివరములకు సంబంధించినవి కావు.

మునగాలపాడు గ్రామమునకు సంబంధించిన సర్వే నెంబరు 154 మరియు 155లలోని మొత్తము భూమి ఎ. 38.86 సెంట్లు. పైన తెలిపిన 1. పాణ్యం నాగేశ్వరరెడ్డి 2. జి.ప్రతాప్‌రెడ్డికి మరియు 3. కైప శివరామిరెడ్డికి G.P.A. D.No.8935/2025, D.No.8936/2025 మరియు D.No.8937/2025 రిజిస్ట్రేషన్ చేసేనాటికి సదరు Shaik Apsar Hussain ఇతరులతో కలిసి పైన తెలిపిన రెండు సర్వే నెంబర్లలో మొత్తము భూమిని ఎ. 38.86 అమ్మివేసి Registration చేయటము జరిగింది. S.Mohammed Basha మరి ఇద్దరితో కలిసి దాఖలు చేసిన Partition suit 0.3.22/2021 Kurnool, 1st Addl. జిల్లా కోర్టులో పెండింగ్‌లో వున్నది.

మా క్లైంట్లకు 1. Shaik Tahera Begum 2. Shaik Mahaboob Basha 3. Shaik Abdul Magbol మరియు 4. Shaik Vali Basha గార్లు రూ. 5,00,000/- (రూపాయలు ఐదు లక్షలు) తీసుకొని 5వ తేదీ అక్టోబరు నెల 2020వ సంవత్సరమున ఎ. 20.00 సెంట్లకు, భూమి స్వాధీన విక్రయ ఖరారు రాసి యిచ్చి వున్నారు.

కావున యిందుమూలంగా తెలియజేయటము ఏమనగా మా క్లైంట్లు ఎ. 20.00 సెంట్ల భూమిని గౌరవ హైకోర్టు ఉత్తర్వుల మేరకు Registration చేసుకోవడము జరిగినది. కావున ఈ ఎ. 20.00 సెంట్ల భూమి నందు మా క్లైంట్లకు సంపూర్ణ హక్కులు కలిగి ఉన్నారు. కొందరూ తప్పుడు దస్తావేజులు సృష్టించి పైన తెలిపిన భూమిని అమ్మజూపుతున్నారు కావున ఈ ప్రకటన ద్వారా అందరికీ తెలియజేయడమైనది.

ఇట్లు:- డి.శ్రీనివాసులు, అడ్వకేట్, కర్నూలు. సెల్ : 98491 09654

కుప్పకూలిన విద్యుత్తు స్తంభాలు

★ తప్పిన పెను ప్రమాదం ★ త్రుటిలో బయటపడిన బాలుడు

స్తంభం పడుతున్నట్లు తెలుసుకుని పరుగులు తీస్తున్న బాలుడు ★ త్రుటిలో తప్పించుకుని..

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : కర్నూలు అశోక్‌నగర్ పరిధిలోని పాలకొట్టాల కాలనీలో మంగళవారం ఉదయం 7.30 గంటల సమయంలో రెండు విద్యుత్తు స్తంభాలు కుప్పకూలాయి. ఓ బాలుడు త్రుటిలో తప్పించుకుని ప్రాణాలు కాపాడుకున్నాడు. కాలనీలో కాల్వల నిర్మాణం కోసం నగరపాలక అధికారులు గుత్తేదారుడికి పనులు అప్పగించారు. అతను గుంతలు తీసే పనులు ప్రారంభించారు. విద్యుత్తు స్తంభాలు ఆనుకుని తవ్వించారు. దీంతో పట్టు తప్పడం.. తీగల భారం తట్టుకోలేక ఒకదాని వెంట మరో స్తంభం కూలిపోయింది. అదే సమయంలో ఆ రోడ్డులో తమ కుటుంబంతో కలిసి వెళుతున్న ఓ వాహన చోదకుడు, పాఠశాలకు వెళ్తున్న బాలుడు.. స్థానికుల అరుపులు విని చాకచక్యంగా ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మొదట ఒక స్తంభం నిదానంగా నేలవాలగా.. తీగల భారంతో రెండో స్తంభం పడిపోయింది. చిన్నపాటి అగ్గిరవ్వలు రేగడంతో స్థానికులు భయాందోళన చెందారు. నగరపాలక, విద్యుత్తు శాఖ అధికారుల మధ్య సమన్వయం లేకపోవటంతో ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న విద్యుత్తు సిబ్బంది వెంటనే సరఫరా ఆపేసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం నూతన స్తంభాలు ఏర్పాటు చేసి సరఫరా పునరుద్ధరించారు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరలవుతోంది. విద్యుత్తు స్తంభం నేలకొరిగే సమయంలో ఓ బాలుడు చాకచక్యంగా తప్పించుకొని వెళుతుండటాన్ని చూసిన నెటిజన్లు శెభాష్ అంటున్నారు. బాలుడు అప్రమత్తమై తప్పించుకుంటున్న వైనాన్ని చూసి అభినందిస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువ రైతు దుర్మరణం

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: పశువులకు మేత వేసేందుకు వెళ్లిన యువ రైతు రామాంజి(25) ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతిచెందిన విషాద ఘటన మంగళవారం రాత్రి ఆదోని మండలం పెద్దతుంబళం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన రామాంజికి భార్య సంధ్య, ఓ కుమారుడు ఉన్నారు. వాము దొడ్డిలో ఉన్న పశవులకు మేత పెట్టేందుకు వెళ్లిన రామాంజి ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు తగిలి అపస్మారక స్థితిలోకి చేరారు. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అందించినా ఫలితం లేకుండా పోయింది. రామాంజి మృతిచెందిన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. భార్య సంధ్య గర్భిణి కావడంతో ఆమె పుట్టింట్లో ఉంటున్నారు.

రామాంజి (పాతచిత్రం)

గోశాలకు చేరిన గోవులు

ఆదోని పాతపట్టణం, ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని నియోజకవర్గంలో అక్రమంగా కబేళాకు తరలిస్తున్న గోవులను కాపాడి, గోశాలకు అప్పగించినట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బసవన్నగౌడ్ తెలిపారు. ఓ టెంపోలో మంగళవారం గోవులను కబేళాకు తరలిస్తున్నారనే సమాచారంతో కడితోట గ్రామం వద్ద వాహనాన్ని అడ్డుకున్నారు.

పెట్టుబడి పేరుతో మోసం

■ బ్యాంకు డిప్యూటీ మేనేజరుకు రూ.15 లక్షల టోకరా

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: షేర్ మార్కెట్‌లో క్రయవిక్రయాల వాట్సప్ గ్రూపులో చేరిన ఓ బ్యాంకు డిప్యూటీ మేనేజరు మధ్యవర్తులను నమ్మి మోసపోయిన ఘటన ఆళ్లగడ్డలో జరిగింది. ఆయన డబ్బు జమ చేసిన ఖాతాలో నుంచి మధ్యవర్తులు డబ్బులు మాయం చేశారు. ఆన్‌లైన్లో డబ్బులు ఉన్నట్లు కన్పించేలా చూపి రూ.లక్షలు కాజేశారు. కోవెలకుంట్లలో ఓ ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకు డిప్యూటీ మేనేజరుగా పనిచేస్తున్న ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన సురేష్.. లాభాలు ఎక్కువగా వస్తాయన్న ప్రచారాన్ని నమ్మి ఒక ప్రైవేటు కంపెనీలో విడతలవారీగా రూ. 15,40,000 షేర్ల రూపంలో పెట్టుబడిగా పెట్టారు. ఆన్‌లైన్లో షేర్లు ఉన్నట్లు, వాటితో లాభాలు పొందుతున్నట్లు కనిపించడంతో తన డబ్బు భద్రంగా ఉందని ఆయన భావించేవారు. ఈ మధ్యనే డబ్బును విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా సాధ్యపడలేదు. తనను మోసం చేసినట్లు ఆయన గ్రహించి పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పట్టణ సీఐ యుగంధర్ ఐటీ(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) కేసు నమోదు చేశారు. డబ్బులు పెట్టుబడి పెట్టే సమయంలో అన్ని విషయాలు నిర్ధారించుకున్నాకే ముందుకు వెళ్లాలని సీఐ సూచించారు.

EENADU Classifieds

EDUCATION

COACHING CENTRES

కర్నూలులో శ్రీ వెంకటసాయి కోచింగ్ సెంటర్ (SI, PC, SSC, RRB Group-2)లో రిసెప్షనిస్ట్, ఆఫీసు బాయ్ కావలెను. ✆ 90148 03964, 93466 34795.

REAL ESTATE

ఓర్వకల్లు ఇండస్ట్రీయల్ ఏరియాలో వెంచర్స్ కలవు. కర్నూలు టౌన్ లో హౌసెస్, అపార్ట్‌మెంట్స్, విల్లాస్ కలవు. శివ: 99636 19327.

మణికంఠ హోమ్స్ వారి లక్ష్మీగ్రీన్ వ్యాలి పసుపుల గ్రామ పరిధిలో నూతన వెంచర్ నందు ప్లాట్లు & ఇండ్లు కట్టించి బ్యాంక్ లోన్ సౌకర్యంతో ఇవ్వబడును. శ్రీరామ్: 99853 43829.

JOBS

Required Civil Site Supervisors/ Engg/ Diploma with or without Experience. Location Karnataka. Contact: 93470 83151.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాసులు కథనం మేరకు.. కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన కృష్ణమూర్తి కుమారుడు ప్రదీప్ రామ్(19) బ్రాహ్మణతాంగేల్ సమీపంలోని శ్రీకృష్ణ హాస్టల్‌లో ఉంటూ స్థానికంగా ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఈఈఈ చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం కళాశాలకు వెళ్లి హాస్టల్‌కి వచ్చిన ప్రదీప్ రామ్ తన గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హాస్టల్ యాజమాన్యం ఇచ్చిన సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రదీప్ రామ్ (దాచిన చిత్రం)

పరిశ్రమలో గ్యాస్ లీక్

■ ముగ్గురికి గాయాలు

ఉలిందకొండ (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే : కల్లూరు మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో కొత్తగా నిర్మించిన రిలయన్స్ బయోగ్యాస్ సోపాన్ కంపెనీలో ప్రమాదం చోటుచేసుకుంది. గ్యాస్ లీకవడంతో ముగ్గురు యువకులు గాయపడ్డారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. గ్యాస్ ఉత్పత్తి చేసే ప్లాంటు వద్ద పనిచేసే క్రమంలో ఒక్కసారిగా గ్యాస్ లీకైంది. కల్లూరు మండలం నాయకల్లు గ్రామానికి చెందిన బోయ మహేశ్, వడ్డె చంద్రమోహన్, ఉలిందకొండ గ్రామానికి చెందిన చాకలి సురేంద్ర గాయపడగా వెంటనే వారిని నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న యువకుల తల్లిదండ్రులు తీవ్రంగా విలపించారు. ఈ ఘటనతో కంపెనీ సమీపంలో నివసిస్తున్న ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన చాకలి సురేంద్ర

డివైడర్ దాటి దూసుకెళ్లిన బస్సు

○ ప్రయాణికులకు తప్పిన పెను ప్రమాదం

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే: పుదుచ్చేరి నుంచి హైదరాబాద్ వెళుతున్న కావేరి ప్రైవేటు ట్రావెల్స్ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. మండల పరిధిలోని బి.తాండ్రపాడు టీవీ 9 కాలనీ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్‌ను దాటి పక్కనున్న రోడ్డులోకి వెళ్లింది. ఆ సమయంలో ఆ మార్గంలో ఎలాంటి వాహనాలు రాకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద సమయంలో బస్సులో 29 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. వారిని మరో బస్సులో ఎక్కించి పంపేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ప్రైవేటు బస్సు

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

ఆదోనిలో బ్యాంకు ఉద్యోగుల సమ్మె

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో మంగళవారం బ్యాంకు ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఉద్యోగులు సమ్మె కార్యక్రమం చేపట్టారు. స్థానిక కెనరా బ్యాంకు నుంచి ఎస్‌బీఐ బ్యాంకు వరకు బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఎన్‌సీబీఈ నాయకులు రవికుమార్, రాజశేఖర్, ఏఐబీఈఏ నాయకులు నాగరాజు, గాయత్రి, మోహన్, హనుమన్న, ప్రఫుల్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ కార్యదర్శులు కె.లక్ష్మి, కె.సుజాత, సురేశ్‌బాబు, జగన్, మంజునాథ్, సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, గోపాల, లింగన్న, సాయి, లక్ష్మన్న పాల్గొన్నారు.

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ స్టేట్ బ్యాంకు ఉద్యోగులు మంగళవారం బ్యాంకు ఎదుట ఆందోళన నిర్వహించారు. వారి సమ్మెకు సీఐటీయూ నాయకులు సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి యం.రవిచంద్ర, స్టేట్ బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

మద్దమ్మ జాతరలో కబడ్డీ పోటీలు

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెర గ్రామ దేవత మద్దమ్మ జాతర పురస్కరించుకొని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఫిబ్రవరి 2న రాయలసీమ స్థాయి అండర్-19 కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు బహుమతులు ఉంటాయన్నారు. ఫిబ్రవరి 4న రాష్ట్ర స్థాయి రాతి దూలం లాగుడు పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73822

మద్దికెర, న్యూస్‌టుడే: ?: మద్దికెరలోని కేంద్ర ప్రాథమిక పాఠశాల సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద వ్యర్థాలు పేరుకు పోయాయి. **- జయరాముడు, మద్దికెర**
✔: పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటాం.
- సుధాకర్, పంచాయతీ కార్యదర్శి, మద్దికెర

హాలహర్వి, న్యూస్‌టుడే: ?: గ్రామంలో నీటి వృథా కాకుండా అదనపు నీటి ట్యాంకును ఏర్పాటు చేసి, సమస్యను పరిష్కరించండి. **- బొలగోటప్ప, బొలగోట**
✔:అవసరమైన నీటి ట్యాంకుల ఏర్పాటు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం.
- రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, విరుపాపురం

చిప్పగిరి, న్యూస్‌టుడే: ?: చిప్పగిరి మండలం, బంటనహాల్‌లో నిర్మించిన తాగునీటి ట్యాంకును ఏడాదిగా శుభ్రం చేయలేదు. నీరు దుర్వాసన వస్తోంది. ట్యాంకును శుభ్రం చేయాలి. **- రంగన్న, బంటనహాల్** ✔:తాగునీటి ట్యాంకులను గ్రామ సిబ్బందితో శుభ్రం చేయిస్తాం. **- సుశీలమ్మ, సర్పంచి బంటనహాల్, చిప్పగిరి మండలం**

ఉపాధ్యాయులకు టెట్ మినహాయించాలి

దేవనకొండ, న్యూస్‌టుడే: పాత పింఛను విధానం పునరుద్ధరించాలని, సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ఆప్టా అధ్యక్షుడు కాకి ప్రకాశ్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కప్పట్రాళ్ల, కరివేముల, కొత్తపేట, దేవనకొండ, మాచాపురం పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మాట్లాడారు. ఫిబ్రవరి 5వ తేదీన చలో దిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలను ఉపాధ్యాయులకు అందజేశారు.

బురుజులలో పశువైద్య శిబిరం

బురుజుల (మద్దికెర), న్యూస్‌టుడే: పశువులకు వచ్చే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి లక్ష్మణ్ పేర్కొన్నారు. బురుజులలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. వాటికి అవసరమైన మందులు పంపిణీ చేసినట్లు ఆయన చెప్పారు.

సిద్ధేశ్వరస్వామి రథోత్సవం నేడు

హొళగుంద, న్యూస్‌టుడే: హొళగుంద కొండ గుహలో స్వయంభు సిద్ధేశ్వరస్వామి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం మహారథోత్సవం, 29న లంకాదహనం, చేయనున్నారు. పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య ఆధ్వర్యంలో ఆలూరు సీఐ వెంకటచలపతి, హొళగుంద ఎస్సై దిలీప్‌కుమార్ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

హోసూరు వీరభద్రేశ్వరుని కల్యాణం నేడు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ మండలం హోసూరులో వెలసిన భద్రకాళి వీరభద్రేశ్వరస్వామి కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవాల నిర్వాహకులు తెలిపారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 8.30 నుంచి గం.9.30 వరకు కల్యాణోత్సవం ఉంటుందన్నారు. సాయంత్రం 5 గంటలకు ఉత్సవ మూర్తుల ఊరేగింపులో భాగంగా రథోత్సవం ఉంటుందన్నారు.

నేర్పు ఉన్నా.. నేర్పేవారు లేరు

★ నిరుపయోగంగా ఇండోర్ స్టేడియం
★ వెనుకబడిపోతున్న క్రీడాకారులు

దెబ్బతిన్న జిమ్ ఉపకరణాలు

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో యువతకు శిక్షణ ఇచ్చి వారిని రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొని ఉన్నతమైన క్రీడాకారులను తయారుచేయాలన్న ఉద్దేశంతో 2016లో అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో ఇండోర్ స్టేడియం నిర్మించారు. మొదట్లో అక్కడ కోచ్ (క్రీడా శిక్షకుడు)ను నియమించి క్రీడాకారులకు మెలకువలు నేర్పించారు. వైకాపా ఐదేళ్ల పాలనలో క్రీడాకారులకు ఆదరణలేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం ఇక్కడ కోచ్ కూడాలేరు. ఇలాగైతే గ్రామీణ క్రీడాకారులు ఆటలు ఆడేదెప్పుడో అని క్రీడాభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా శిక్షకుడిని నియమించాలని కోరుతున్నారు.

చెంతనే సౌకర్యాలు

ఆలూరు ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.3కోట్లు వెచ్చించారు. ఇక్కడ షటిల్ ఉడ్ కోర్టు, వ్యాయామశాల (జిమ్), బాస్కెట్‌బాల్, టేబుల్ టెన్నిస్ కోసం ప్రత్యేకంగా ఓ గది, ఏదైనా క్రీడలు జరిగితే ఇక్కడికి వచ్చిన క్రీడాకారులు విశ్రాంతి తీసుకునేందుకు గదులు (పెవిలియన్) నిర్మించారు. షటిల్ ఉడ్ కోర్టు, జిమ్ కోసం ప్రత్యేకంగా మరో రూ.5 లక్షలు వెచ్చించారు. ఈ క్రీడా ప్రాంగణం ద్వారా గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతీయువకులు వీటిని సద్వినియోగం చేసుకొని రాష్ట్రం, దేశం తరపున క్రీడల్లో రాణించేలా వారికి తర్ఫీదు ఇవ్వాలన్నదే ఈ క్రీడా ప్రాంగణాల ఉద్దేశం. కొన్నేళ్లుగా శిక్షకుడు లేక పరికరాలన్నీ నిరుపయోగంగా మారాయి. స్థానికంగా ఉండే కొంత మంది ఉద్యోగులు, యువకులు రోజూ కాలక్షేపం కోసం ఆడటం తప్ప.. పోటీల్లో పాల్గొనేలా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చే వారు లేరు.

బాస్కెట్‌బాల్ శిక్షణలో క్రీడాకారులు

అద్దెతో ఆదాయం

క్రీడాప్రాంగణానికి సంబంధించి ఐదు అద్దె భవనాలు ఉన్నాయి. వాటి నుంచి ప్రతి నెలా రూ.40 వేలకు పైగా ఆదాయం వస్తోంది. క్రీడా విభాగం అధికారులు మాత్రం కేవలం అద్దె వసూలు చేసుకునేందుకు మాత్రమే వస్తారు తప్ప మిగిలిన సమయంలో వాటిని గురించి పట్టించుకునే నాథుడే కరవయ్యారు. ఇప్పటికైనా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు గుర్తించి ఇక్కడ శిక్షకుడిని నియమించాలని క్రీడాకారులు, క్రీడాభిమానులు కోరుతున్నారు.

శిక్షకులు లేక.. చితంత తీరక

ఆలూరుతో పాటు చుట్టుపక్కల మండలాల విద్యార్థులకు బాస్కెట్‌బాల్, షటిల్ ఉడ్‌కోర్టు, టేబుల్ టెన్నిస్ గది ఉన్నాయి. శిక్షకుడు లేకపోవడంతో విద్యార్థులు, యువకులు ఎవరూ ముందుకు రావడంలేదు. విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి ఉంటేనే రాణించే అవకాశం ఉంటుంది.

రహదారిపై గుంత పూడ్చివేత

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారులోని శంకర్‌నగర్ ముఖద్వారంలో 167వ జాతీయ రహదారిపై తవ్విన గుంతను పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పూడ్చివేయించారు. ఈ ప్రాంతంలో నీటి వాల్వ్ పనుల కోసం గుంత తవ్వారు. వాహనదారుల ఇబ్బందులపై ఈ నెల 27న 'ఈనాడు'లో ప్రచురితమైన 'నడిరోడ్డులో ప్రమాదాల కుప్ప' అనే చిత్ర కథనానికి పురపాలక కమిషనర్ కృష్ణ స్పందించారు. సిబ్బందికి సూచించి, గుంతపూడ్చివేయించారు.

పశ్చిమాన బంగారు పంటలు పండించాలి

తుగ్గలి, న్యూస్‌టుడే: పశ్చిమ ప్రాంత రైతులంతా బంగారు పంటలు పండించాలనే ఉద్దేశంతో సాగునీటి పథకాల ఏర్పాటుపై దృష్టి సారించినట్లు పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. తుగ్గలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.30 లక్షలతో ఆయుష్ వైద్యశాల భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన ప్రజాదర్బారు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. హంద్రీనీవా కాలువకు కుడి ఎడమ కాలువలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు చేపట్టామన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకొనేందుకు కొత్తగా 'మన ఊరికి.. మన ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని తుగ్గలి గ్రామం నుంచి చేపట్టామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సహకారంతో తుగ్గలిలో రూ.1.30 కోట్లతో సిమెంట్ రహదారులు వేశామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి రవి, ఎంపీడీవో విశ్వమోహన్, తహసీల్దారు రవి, నాయకులు నాగేంద్ర, వెంకటపతి, శివరాముడు, మనోహర్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బారులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

వెలుగులు నింపిన మహనీయుడు థామస్

దేవనకొండ, న్యూస్‌టుడే: చీకట్ల నుంచి వెలుగులు నింపిన మహనీయుడు థామస్ అల్వా ఎడిసన్ అని సీఐ వేణుగోపాల్ పేర్కొన్నారు. జాతీయ ఎలక్ట్రీషియన్ దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం కార్యాలయ ఆవరణలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్, మోటారు రివైండర్స్, ప్లంబింగ్ కార్మికులు సమావేశమయ్యారు. కార్యక్రమంలో లేబర్ అధికారిణి లక్ష్మీ, విద్యుత్తు అధికారులు సుంకన్న, రంజాన్, యూనియన్ నాయకులు చాంద్‌బాషా, వీరేశప్ప, రమేష్, రెహమాన్, శాంతికుమార్, గుప్తా, నరేశ్, రమేష్, హుసేన్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

దేవనకొండ: సమావేశంలో మాట్లాడుతున్న సీఐ వేణుగోపాల్

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జాతీయ ఎలక్ట్రీషియన్ డే సందర్భంగా థామస్ అల్వా ఎడిసన్ జయంతి పురస్కరించుకొని ఆలూరులోని వాసవి కల్యాణ మండపంలో కార్మికులు సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఏఎస్సై చంద్రశేఖర్, సంఘం నాయకులు కాశీం, ఏకాంబరం, అంజిరెడ్డి మాట్లాడారు.



చెన్నకేశవుని ఉత్సవం.. పల్లెల్లో సంబరం

కప్పట్రాళ్ల, పి.కోటకొండ(దేవనకొండ) న్యూస్‌టుడే: దేవనకొండ మండలం కప్పట్రాళ్ల రక్షిత అడవుల్లో వెలసిన కౌలుట్ల చెన్నకేశవ స్వామి ఆలయం జిల్లాలో ప్రసిద్ధి చెందింది. జనవరి 28 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఇక్కడ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. 28న పర్వతారోహణం, విశ్వక్సేన పూజ, భేరీపూజ, ధ్వజారోహణం, తదితర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 29న ధ్వజారోహణం, 30న శేషవాహనం, 31న స్వామి వారి కల్యాణం వేకువ జామున కనుల పండువగా జరపనున్నారు. ఫిబ్రవరి 1న సాయంత్రం స్వామి వారి రథోత్సవం, 2న వసంతోత్సవం, చక్రస్నానం, మహా మంగళహారతి నిర్వహిస్తారని ఆలయ అధికారులు తెలిపారు. జిల్లాలో నలుమూలల నుంచి భక్తులు బ్రహ్మోత్సవాలకు హాజరవుతారని, అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి వీరయ్య తెలిపారు.

కౌలుట్ల చెన్నకేశవ స్వామి మూలవిరాట్టు

ఘనంగా మద్వ నవమి పూజలు

కోటఅశ్వర్థనగర్ (ఆదోని పాత పట్టణం), న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారులోని కోట అశ్వర్థనగర్‌లో కొలువుదీరిన మంత్రాలయం గురు రాఘవేంద్ర స్వామి అనుబంధ ఆలయమైన కోట మంగరాయ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం మద్వనవమి పూజలు వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం, అర్చనలు చేశారు. అలంకార బ్రాహ్మణులను సత్కరించి, భక్తి ప్రవచన కార్యక్రమం నిర్వహించి.. ఆలయ ఆవరణలో రథోత్సవం చేపట్టారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ విచారణకర్త నకాతే శ్యాంప్రసాద్, మాధవరం గోపి, మేనేజరు భీమ్‌సేన్ రావు, అర్చకులు గురురాజ్‌చార్, ఎస్‌డీ.గిరి, దేశాయ్ చక్రవర్తి, మధుసూదన్, వాదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో కోట మంగరాయ ఆంజనేయస్వామి

ఈపీఎఫ్‌పై అవగాహన అవసరం

మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మధుసూదన్‌రావు

కేంద్ర ప్రభుత్వ పథకం నిధి ఆప్‌కో నికత్ కార్యక్రమంలో భాగంగా పత్తికొండలో మంగళవారం ఏర్పాటు చేసిన ఈపీఎఫ్ అవగాహన సదస్సులో మాట్లాడారు. దీనివల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో పీఎఫ్ కార్యాలయ అధికారి ఎ.ఆదినారాయణ, కేపీఆర్ మైత్రి ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు రామ్మోహన్, ఆయా పాఠశాలల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: వివిధ ప్రైవేటు, ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని రకాల సంస్థల్లో పనిచేసే సిబ్బంది ప్రతి ఒక్కరూ పీఎఫ్ నెంబరు తీసుకోవాలని కర్నూలు పీఎఫ్ కార్యాలయ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి మధుసూదన్‌రావు అన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

చిప్పగిరి, న్యూస్‌టుడే: ఈ-పంట నమోదు చేసుకోవాలని ఏడీఏ చంగల్‌రాయుడు, ఏవో శ్రీరాం ప్రవీణ్ చెప్పారు. గుమ్మనూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వారు రైతులకు అవగాహన కల్పించారు. రబీలో సాగు చేసిన పంట వివరాలను నమోదు చేసుకోవాలని రైతులను వారు కోరారు.

ఘనంగా గురుకుల పాఠశాల వార్షికోత్సవం

వెల్దుర్తి, న్యూస్‌టుడే: స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ లక్ష్మీ ప్రసూన, పాఠశాల కమిటీ ఛైర్మన్ బాబురావ్ ఆధ్వర్యంలో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డీసీవో శ్రీదేవి, జిల్లా రవణా డిప్యూటీ కమిషనర్ శాంతకుమారి, ఎంఈవో ఇందిర హాజరయ్యారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు బలరాంగౌడ్, నాయకులు సుధాకర్‌గౌడ్, గోపాల్‌గౌడ్, బజారి, ఈవోఆర్డీ రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గిరక బండి లాగుడు పోటీలు

బొమ్మిరెడ్డిపల్లి(వెల్దుర్తి), న్యూస్‌టుడే: బొమ్మిరెడ్డిపల్లి గ్రామంలో పామయ్యతాత తిరునాల సందర్భంగా ఏర్పాటు చేసిన గిరక బండి లాగుడు పోటీలను మండల తెదేపా నాయకుడు బొమ్మిరెడ్డిపల్లి సుబ్బరాయుడు ప్రారంభించారు. పోటీల్లో విజేత వృషభాల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందించారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడినట్లు ఎంపీపీ రంగమ్మ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సభ ఏర్పాటు చేయగా 16 మంది ఎంపీటీసీలకు గానూ కేవలం నలుగురు ఎంపీటీసీలు మాత్రమే హాజరు కావడంతో సభను వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ ప్రకటించారు. అన్ని శాఖల అధికారులు హాజరు అయ్యారు.

బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రచారం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఏపీ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో భాగంగా తనను సభ్యురాలిగా గెలిపించాలని కోరుతూ.. పత్తికొండ న్యాయవాదులకు అభ్యర్థిని అపర్ణ లక్ష్మి కోరారు. పత్తికొండ న్యాయవాదుల సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

తెగిపడిన విద్యుత్తు తీగలు..

హొళగుంద ప్రధాన రహదారి, వాల్మీకి వృత్తం కూడలి నుంచి నిత్యం వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. దీంతో పాటు రైతులు ట్రాక్టర్లలలో పశుగ్రాసాన్ని తరలిస్తుంటారు. మంగళవారం జొన్నసొప్పను తరలించు క్రమంలో తగిలి, విద్యుత్తు తీగలు తెగిపడిపోవడంతో, స్థానికులు, రైతులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే విద్యుత్తు సిబ్బందికి సమాచారాన్ని తెలపడంతో, విద్యుత్తు సరఫరా ఆపివేయడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్తు సిబ్బంది సంఘటన స్థలాన్ని చేరుకుని మరమ్మతులను చేపట్టారు. సీసీ రహదారి పనులు చేపట్టడంతో, రహదారి ఎత్తుగా, తీగలు కిందకు కావడంతో స్తంభాల ఎత్తును పెంచాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, హొళగుంద

వనం కాదు.. కత్రవాగు

ఇదేదో వనం అనుకుంటే పొరపాటే.. హాలహర్వి మండలం బేవినహల్ గ్రామ శివారులో ప్రవహిస్తున్న కత్రవాగు. అనంతపురం జిల్లా పరిధిలో పలు గ్రామాల నుంచి వర్షం నీరు ఇందులోకి చేరుతుంది. అలాంటి వాగుపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. నిండా చెట్లు పెరిగి వనంగా మారింది. భారీ వర్షలు కురిసినప్పుడు నీటి ప్రవాహం ముందుకు సాగక ఇరువైపులా పొలాలు గట్లు కోతలకు గురవుతున్నాయి. దీంతో రైతులు ఏటా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులు స్పందించి చెట్లు తొలగించి వాగు శుభ్రం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, హాలహర్వి

పల్లె దారుల్లో కంకర రాళ్లు

తుగ్గలి మండలం బొల్లవానిపల్లికి వెళ్లే రహదారి దుస్థితి. పలు పల్లెలకు ఇలాంటి దారులే దిక్కు. రాళ్లు తేలి, గుంతల మయంగా మారి, ప్రయాణానికి గ్రామీణులు నిత్యం అష్టకష్టాలు పడుతున్నారు. పగిడిరాయి గ్రామం నుంచి బొల్లవానిపల్లి, రాంపురం గ్రామం నుంచి రాంపురం కొట్టాల గ్రామాలకు వెళ్లే రహదారుల్లో రహదారుల్లో ప్రయాణం నరకమే. మజరా గ్రామాల నుంచి పంచాయతీ కేంద్రాలకు వెళ్లాలంటే.. సాహసం చేయాల్సిందేనని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, తుగ్గలి

హోసూరు.. ఆకు కూరలకు పేరు

★ పాతికేళ్లుగా క్రయవిక్రయాలు
★ ఆదర్శంగా నిలుస్తున్న గ్రామ మహిళలు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: తెలతెల వారుతుండగానే పత్తికొండ కూరగాయల మార్కెట్‌లో ఆకుకూరల మూటలతో ప్రత్యక్షమవుతారు. హోసూరు అంటేనే.. తాజా ఆకు కూరల చిరునామాగా మారింది. గ్రామానికి చెందిన సుమారు 30 మందికి పైగా మహిళలు నిత్యం పత్తికొండ కూరగాయల మార్కెట్‌లో ఆకు కూరలు విక్రయిస్తూ వ్యాపారాలు సాగిస్తున్నారు. సుమారు 25 ఏళ్లకు పైగా ఇదే వ్యాపకంగా ఎంచుకొని కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. కొందరు మహిళలు తమ కున్న పొలాల్లో కొంత మేర వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు స్వయంగా సాగు చేసి విక్రయిస్తుండగా.. మరికొందరు ఇతర రైతుల వద్ద కొనుగోలు చేసి విక్రయిస్తున్నారు.

పత్తికొండ కూరగాయల మార్కెట్‌లో ఆకు కూరలు విక్రయిస్తున్న హోసూరు మహిళలు

ఆరోగ్యం.. ఆదాయం..

ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ఆకుకూరల పట్ల ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. వారి ఆసక్తిని పసిగట్టిన మహిళలు రెండు దశాబ్దాలకు పైగా ఈ వ్యాపారాన్నే కొనసాగిస్తున్నారంటే.. వారికి ఆదాయం ఆశాజనకంగా ఉండటమే. వారి కుటుంబాల్లో రైతులు ఇతర కూరగాయలు పండించి గుంతకల్లు, గుత్తి, ఆదోని, కోడుమూరు, కర్నూలు, హైదరాబాద్, దిల్లీ, ముంబయి తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తూ.. లాభాలు గడిస్తున్నారు. మహిళలు మాత్రం క్రమం తప్పకుండా పత్తికొండ కూరగాయల మార్కెట్‌లో తోటకూర, పాలకూర, చుక్కకూర, కొత్తిమీర, మెంతికూర, కరివేపాకు, అల్లం, మునగకాయలు, నిమ్మకాయలు తదితరాలు విక్రయిస్తున్నారు. పండగలు, పబ్బాల సమయంలో అధిక మోతాదులో తెచ్చి, అందుబాటు ధరలకు విక్రయిస్తూ మంచి ఆదరణ పొందుతున్నారు.

రైతుల నుంచి కొని..

- రామక్క, హోసూరు

గ్రామంలో ఆకు కూరలు సాగు చేస్తున్న రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి పత్తికొండ మార్కెట్‌లో విక్రయిస్తున్నా. సుమారు 25 ఏళ్లుగా ఆకు కూరల వ్యాపారం చేస్తున్నా. నెలకు రూ.20వేలకు పైగా ఆదాయం వస్తోంది. ఆకు కూరలే మా జీవనాధారంగా మారింది. వచ్చిన ఆదాయం కుటుంబ అవసరాలకు ఇస్తూ.. నా వంతు బాధ్యత నెరవేరుస్తున్నా.

సొంతంగా సాగు చేస్తూ..

- పద్మావతి, ఆకు కూరల వ్యాపారి

మాకున్న పొలంతో పాటు మరి కొంత కౌలుకు తీసుకొని ఆకు కూరలు, కూరగాయలు సాగు చేస్తున్నాం. మా కుటుంబ యజమాని కూరగాయల వ్యాపారం చేస్తే.. నేను 20 ఏళ్లుగా ఆకు కూరలు అమ్ముతున్నా. లాభనష్టాలతో సంబంధం లేకుండా.. ఆకు కూరల వ్యాపారంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. నెలకు కనీసం రూ.25వేల ఆదాయం వస్తోంది. కుటుంబంలోని వారంతా కూరగాయలు, ఆకుకూరల సాగుచేస్తూ.. వ్యాపారం చేస్తున్నాం.

ఊరిపేరు అడిగి మరీ కొంటారు

- మద్దిలేటమ్మ, హోసూరు

ఉదయం లేచి, తాజా కూరలతో పత్తికొండ మార్కెట్‌కు చేరుకుంటాం. స్థానికులే కాకుండా వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలు, ఉద్యోగులు, మహిళలు హోసూరు గ్రామం పేరు అడిగి మరీ.. ఆకు కూరలు కొనేందుకు ఆసక్తి చూపుతారు. రైతుల నుంచి కూరగాయాలు, ఆకు కూరలు కొనుగోలు చేసి, 20 ఏళ్లకు పైగా వ్యాపారం చేస్తున్నాం. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు, పండగల సమయంలో ఆకుకూరలకు మంచి గిరాకీ ఉంటుంది. హోసూరు కొత్తిమీర అంటేనే దిల్లీ వరకు పేరుంది.

(c) eenadu

ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ భార్గవి

ముగతి(నందవరం), న్యూస్‌టుడే: సైబర్ నేరాల నియంత్రణకు చట్టాల కంటే ముందు ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని డీఎస్పీ భార్గవి సూచించారు. మంగళవారం ముగతి గ్రామంలో ఏపీ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. తక్కువ సమయంలో ఎక్కువ లాభాల ఆశతోనే సైబర్ మోసాలకు గురవుతున్నారని అన్నారు. సీఐ చిరంజీవి మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై తిమ్మారెడ్డి, తెదేపా రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ముగతి ఈరన్నగౌడ్, భార్గవ్ యాదవ్, గ్రామ అధ్యక్షులు గుగ్గిరి నరసింహులు, సోమేశ్ యాదవ్, కడబూరి, కొండారెడ్డి, అక్బర్‌బాషా, చాకలి రామకృష్ణ, నాగరాజు, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

పులికనుమ నుంచి నీటి విడుదల

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: పులికనుమ ప్రాజెక్టు ద్వారా ఈనెల 29న ఎల్లెల్సీ కాల్వకు సాగునీరు విడుదల చేస్తున్నట్లు ఏఈ సంజీవ కుమార్ మంగళవారం తెలిపారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యాం ద్వారా ఎల్లెల్సీకి సాగు నీరు నిలిపి వేయడంతో రబీ పంటలు ఎండిపోయే దుస్థితి ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పులికనుమ ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు 8008573824
కోడుమూరు 9885988357
కౌతాళం 8008574913

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ?: మండల పరిధిలోని తారాపురం గ్రామంలో చాలా రోజుల నుంచి మురుగు కాల్వలు శుభ్రం చేయడం. **-అంజినయ్య, తారాపురం.** ✔: గ్రామంలో నెలకొన్న అపరిశుభ్రత సమస్యను గ్రామ కార్యదర్శి, సర్పంచి దృష్టికి తీసుకెళ్తాం. **-ప్రభావతిదేవి, ఎంపీడీవో, పెద్దకడబూరు.** నందవరం, న్యూస్‌టుడే: ?: మిట్టాసోమాపురంలో రెండు రోజులకు ఒక్కసారి తాగు నీరు సరఫరా చేస్తున్నారు. **- రామకృష్ణ, గ్రామస్థుడు** ✔: రోజు వచ్చేలా చూస్తాం. **-బాలకృష్ణ, ఏఈ**

పూడిక.. దుర్వాసన వీడక

◆ సిబ్బంది కొరతతో వేధిస్తున్న పారిశుద్ధ్య సమస్య

మునెప్పనగర్‌లో నిండిపోయిన మురుగు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: మురుగు కాల్వలో పూడికతో దుర్వాసన వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల ముందు ఉన్న డ్రైనేజీలు నిండిపోవడంతో వాసన భరించలేని పరిస్థితి. సిబ్బంది కొరతతో పారిశుద్ధ్య పనుల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో పెరిగిన జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో వీధుల్లో కాలువలు నిండిపోతున్నా పట్టించుకోవడం లేదు.

చేనేతపురిలో నెలకు ఒకరోజే

పట్టణంలో జనాభా 1.35లక్షలకు చేరింది. విస్తీర్ణం పెరిగినా అందుకు తగ్గట్లు కార్మికుల సంఖ్య లేకపోవడంతో కాలనీలో మురుగు కాల్వలు అధ్వాన స్థితికి చేరాయి. ఇసుక, మట్టి, ప్లాస్టిక్ కవర్లు కాల్వలో పేరుకుపోతున్నాయి. రోజూ కాల్వను శుభ్రం చేసేందుకు సిబ్బంది లేకపోవడంతో.. కార్మికుడు నెలకు ఒక రోజు శుభ్రం చేస్తున్నారు. కొన్ని వీధుల్లో అయితే రెండు నెలలకు ఒకసారి శుభ్రం చేసి చేతులు దులుపుకుంటున్నారు. వీటిపై ప్రతి రోజూ ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారు. కుళ్లిన, కంపు వాసన భరించలేక పోతున్నామని కాలనీవాసులు పేర్కొన్నారు. దీంతో ప్రజలకు అంటువ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్, దగ్గు, జ్వరం, జలుబు ఇతర వ్యాధుల బారినపడుతున్నారు. కనీసం 15 రోజులకు ఒకసారి కాల్వలు శుభ్రం చేయించాలంటే అదనపు సిబ్బందిని నియమించాల్సి ఉంటుంది. కానీ వీటిని పట్టించుకోవడం లేదనే ఆరోపణలు చేస్తున్నారు.

ప్రతి కార్మికుడికి 350 ఇళ్ల చెత్త సేకరణ

ప్రతి కార్మికుడు 350 ఇళ్ల చెత్త సేకరణ చేయాలని ఆదేశించారు. దూరంగా ఉండడంతో ఇంటింటికి తిరిగేందుకు కార్మికులకు ఒకరోజు సాధ్యం కావడం లేదు. అంతేకాక ఆయా కాలనీల్లో బ్లాక్ అయిన కాల్వలను వీరే పూడిక తొలగించాలి.

పట్టణం: ఎమ్మిగనూరు **వార్డులు:** 34
చిన్న మురుగుకాల్వలు: 220 కిలోమీటర్లు
పెద్దవి: 23 కిలోమీటర్లు
పారిశుద్ధ్య కార్మికులు: 175సిబ్బంది
కొరత: 30 మంది
ఏటా పారిశుద్ధ్య నిర్వహణకు ఖర్చు: రూ.2కోట్లు

పనులు ఎక్కువ కావడంతో పాటు, కాల్వల పొడువునా శుభ్రం చేసేందుకు సిబ్బంది కొరత నెలకొంది. ప్రధానంగా మల్లారవీధి, ముగతి పేట, ఎన్టీఆర్ కాలనీ, శాంతినగర్, మునెప్పనగర్, రాధాకృష్ణ, పంపన్నగౌడ్, లక్ష్మీపేట, చౌడేశ్వరి వీధి, సుల్తాన్‌మసీదు వీధి, వడ్డేవీధి, రామయ్యకొట్టాల, సోమప్పనగర్, క్విబుల్లా కాలనీలో ఉన్న డ్రైనేజీలు పూడికతో నిండిపోయాయి. వీటిని నెలకు ఒకసారి శుభ్రం చేయడంతో సమస్య నెలకొంది.

కాల్వలను శుభ్రం చేయిస్తాం
- గంగిరెడ్డి, పురపాలక కమిషనర్ ఎమ్మిగనూరు

కాల్వలను రెగ్యులర్‌గా శుభ్రం చేయించేందుకు కృషి చేస్తాం. సిబ్బందితో కాల్వలను శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. సిబ్బంది కొరతపై అధికారులకు విన్నవించాం.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అందరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని దైవందిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం వైద్య పరీక్షలు చేయాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, ఎన్‌సీడీసీడీ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ మహేశ్వర ప్రసాద్, డాక్టర్ అపర్ణ, హరీష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటం

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోడుమూరు ఎస్టీయూ మండల అధ్యక్షుడు తిక్కన్న డిమాండు చేశారు. మంగళవారం ఎస్టీయూ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. దశల వారి పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి హెచ్. తిమ్మన్న, రాఘవేంద్ర, శేఖర్ పాల్గొన్నారు.

పశు సంచారం ప్రమాదకరం

గోనెగండ్లలో దేవాలయాల ఆవులు రహదారిపై సంచరిస్తూ.. ప్రజలు రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. ఫలితంగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతూ.. ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారు. దుకాణాల దగ్గర ఉన్న వాహనాల్లోని సరకులను ఆవులు తింటున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. వాటికి ఆలయాల వద్ద ప్రత్యేక గోశాల ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. **- న్యూస్‌టుడే, గోనెగండ్ల**

గుంత నిండి.. నీరు కలుషితం

మండలంలోని తిమ్మందొడ్డి గ్రామానికి సుంకేసుల నుంచి గొట్టం మార్గం ద్వారా శుద్ధ జలం అందిస్తున్నారు. తిమ్మందొడ్డి బస్టాండులో తాగునీటి గొట్టం మార్గానికి రంధ్రాలు పడటంతో నీటితో గుంత నిండిపోయి నీరు కలుషితమవుతోంది. ఇప్పటికైనా సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తక్షణమే స్పందించి రంధ్రం పడిన తాగునీటి గొట్టాలకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, తిమ్మందొడ్డి (సి.బెళగల్)**

పట్టించుకోరు.. పనులు చేపట్టరు

ఎమ్మిగనూరు-కోసిగి రహదారి నిత్యం రద్దీగా ఉంటోంది. అడుగుకో గుంత ఏర్పడడంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కొత్త రహదారి కోసం భూమి పూజ చేసినా ఇంకా పనులు చేపట్టలేదు. ఎమ్మిగనూరు-కోసిగి రహదారి కంబళదిన్నె వరకు రోడ్డు పనులు చేపట్టనున్నారు. రూ.7 కోట్లతో చేపట్టిన పనులకు భూమి పూజ చేసి వదిలేశారు. గుంతల రహదారిలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. **-న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు**

విలువైన యంత్రం నిరుపయోగం

ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోజూ ఓపీ 500 నుంచి 700లకు వరకు ఉంటుంది. రోగుల రక్త పరీక్షల కోసం 800ల నుంచి 1500 వరకు నమూనాలు సేకరిస్తారు. రక్త నమూనాలను సురక్షితంగా పరీక్షించేందుకు దాదాపు రూ.1.50లక్షల విలువైన సియో సేఫ్టీ ప్రాసెసింగ్ యంత్రం కేటాయించారు. యంత్రం ఆసుపత్రికి వచ్చినా స్థలం లేక మూలన పెట్టారు. దీంతో విలువైన యంత్రం ఉన్నా ఉపయోగం లేకుండా పోతోంది. **-న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు నేరవార్తలు**

సంక్షిప్త సమాచారం

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పప్పు సెనగలో పంట కోత ప్రయోగాలను కోడుమూరు, వెంకటగిరిలలో వ్యవసాయ సిబ్బంది చేపట్టారు. రబీ పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.

సి.బెళగల్, న్యూస్‌టుడే: బ్రాహ్మణదొడ్డి గ్రామంలో ఇంటి పన్నుల వసూలు లక్ష్య సాధనకు సచివాలయం సిబ్బంది కృషి చేయాలని డిప్యూటీ ఎంపీడీవో మహేశ్వరీ అన్నారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: మున్సిపాలిటీలో పని చేసే కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ తాలూకా ప్రధాన కార్యదర్శి రాముడు డిమాండు చేశారు. పుర కమిషనర్ గంగిరెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు.

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు నానో యూరియా, డీఏపీ పిచికారీ చేసుకోవడం వల్ల మంచి దిగుబడులు పొందవచ్చునని మండల వ్యవసాయాధికారి శివశంకర్ అన్నారు. బనవాసి, మల్కాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 29వ తేదీన నిర్వహిస్తున్నట్లు పురపాలక కమిషనర్ గంగిరెడ్డి వెల్లడించారు.

సి.బెళగల్, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కష్టపడి చదవాలని మండల పరిషత్ పర్యవేక్షకుడు(ప్రత్యేకాధికారి) శ్రీనివాసులు పేర్కొన్నారు. బురాన్‌దొడ్డిలో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం హకీం బాషా అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు.

సి.బెళగల్, న్యూస్‌టుడే: చింతమానుపల్లె గ్రామంలో బుధవారం మారెమ్మ దేవర ఉత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్తు దీపాలతో దేవాలయాన్ని అలంకరించారు.

మంత్రాలయం గ్రామీణం(కౌతాళం), న్యూస్‌టుడే: అపరిచిత కాల్స్, వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని మంత్రాలయం సీఐ రామాంజులు తెలిపారు. రాఘవేంద్రపురం కాలనీలో ప్రజలతో సమావేశమయ్యారు.

సి.బెళగల్, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఎస్సై వేణుగోపాల్ రాజ్ తెలిపారు. సి.బెళగల్‌లో ఎస్సీ, బీసీ బాలుర వసతిగృహాల్లో సంక్షేమాధికారులు భాస్కర్, రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో మాట్లాడారు.

కోసిగి, న్యూస్‌టుడే: కొల్మాన్‌పేట శివారులో జూదం ఆడుతున్న 13 మంది వ్యక్తులను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు కోసిగి ఎస్సై రమేష్ రెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.14130 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఎమ్మిగనూరు,న్యూస్‌టుడే: పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రిలో గతంలో పని చేసిన సుధాపై చర్యలను ప్రభుత్వం ఉపసంహరణ చేసినట్లు మంగళవారం ప్రకటించింది.

చెరువులో మృతదేహం లభ్యం

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గుడేకల్ చెరువు ఎల్లెల్సీ కాల్వ తూము వద్ద మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు గ్రామీణ ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. సుమారు 25నుంచి 35సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. నీలం రంగు చొక్కా ధరించి ఉన్నట్లు చెప్పారు. వివరాలు తెలిస్తే గ్రామీణ పోలీసులకు 91211 01148 నంబరుకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

నేడు హాల్వి సిద్ధేశ్వరుడి రథోత్సవం

మంత్రాలయం గ్రామీణం(కౌతాళం), న్యూస్‌టుడే: కౌతాళం మండలంలోని హాల్వి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వర స్వామి జాతర బుధవారం నిర్వహించనున్నారు. సాయంత్రం నిర్వహించే రథోత్సవానికి భారీగా భక్తులు రానున్నారు.

బంగారం శ్రీరంగస్వామికి బ్రహ్మోత్సవం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: దేవిబెట్ట గ్రామంలో వెలసిన బంగారం శ్రీరంగ స్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. 27వ తేదీన రాత్రి శ్యావ, 28వ తేదీన బిందెసేవ, 29వ తేదీన ప్రభావళి మహోత్సవం, సాయంత్రం మహారథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. 30న పారువేట కార్యక్రమం, పల్లకి మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శ్రీరంగస్వామికి ప్రత్యేక పూజలు

వైభవంగా వసంతప్ప వేడుకలు

చింతమానుపల్లె (సి.బెళగల్), న్యూస్‌టుడే: మండలంలోని చింతమానుపల్లె గ్రామంలోని వసంతప్ప ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అందంగా అలంకరించిన ఎద్దుల బండిలో మేళతాళాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగి వసంతప్ప ఆలయాన్ని సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు.

ఎద్దుల బండితో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోండి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలని నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఆనంద్, ఎంపీడీవో రాముడు తెలిపారు. కోడుమూరు వివేకనంద డిగ్రీ కళాశాలలో గురువారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కొత్త బస్టాండు సమీపంలో ఉదయం 10 గంటల నుంచి మొదలవుతుందని కళాశాల ప్రతినిధి గోట్ల శేఖర్ తెలిపారు. పదో తరగతి, ఆపై విద్యార్హతలున్న వారు ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు.

యువత అభివృద్ధే ధ్యేయం

గూడూరు గ్రామీణం,న్యూస్‌టుడే: యువత అభివృద్ధే ధ్యేయంగా మంత్రి నారా లోకేశ్ ముందుకు సాగుతున్నారని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. మంత్రి లోకేశ్ యువగళం పాదయాత్ర చేపట్టి మూడు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా మంగళవారం కేకు కోసి సంబరాలు చేసుకున్నారు.

ఎమ్మెల్యే దస్తగిరికి కేకు తినిపిస్తున్న కార్యకర్త

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

నృత్య ప్రదర్శన చేస్తున్న పాఠశాల విద్యార్థులు

గూడూరు గ్రామీణం,న్యూస్‌టుడే: మండలంలోని జిల్లా పరిషత్ బాలికలు, బాలుర ఉన్నత పాఠశాలల వార్షికోత్సవాన్ని పాఠశాలల హెచ్‌ఎంలు సారధి శర్మ, రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. భాస్కర్, రాజశేఖరప్ప, జయలక్ష్మీ, జ్యోతి, మంజుల, ఆలీబాష, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట (సి.బెళగల్), న్యూస్‌టుడే: కొత్తకోట ఉన్నత పాఠశాల విద్యార్థులు భవిష్యత్తుల్లో ఉన్నత స్థానాల్లో రాణించాలని ఎంఈవో2 ఆదమ్‌బాషా పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన వార్షికోత్సవం సమావేశంలో పాల్గొన్నారు.

నీటి సరఫరా నిలిపివేత

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలో ఫిల్టర్ బెడ్ వాల్స్ మరమ్మతుల కారణంగా పట్టణంలో ఎస్‌ఎంటీకాలనీ, రాఘవేంద్ర, లక్ష్మీపేట, రాధాకృష్ణ, నెహ్రూనగర్, తదితర కాలనీలో తాగునీటి సరఫరాను మంగళవారం నిలిపివేశామని డీఈ నీరజా తెలిపారు. బుధవారం సాయంత్రం మళ్లీ నీటిని సరఫరా చేస్తున్నట్లు ప్రకటించారు.

ఉపాధ్యాయుల హామీలను నెరవేర్చాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అడివన్న డిమాండు చేశారు. ఎస్టీయూ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఇచ్చిన హామీలపై ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 30వ తేదీన మండల కార్యాలయాల ఎదుట ధర్నా చేస్తామన్నారు. నాయకులు వెంకటేశ్వర్లు, రాముడు,రామచంద్ర, ఎల్లప్ప, బాబయ్య, తులసీరామ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బ్యాంకు ఎదుట ఉద్యోగుల ధర్నా

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: బ్యాంకు ఉద్యోగులకు ఐదు రోజుల పని దినాలు కల్పించాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ నాయకులు నరేంద్ర అన్నారు. బ్యాంకు ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు నరసప్ప, సాగర్, రాజేశ్వరి, రాజశేఖర్, మహేష్, ఉసేనప్ప పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థికి సత్కారం

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గుడేకల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి తాయన్న జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల నరసరావుపేటలో జరిగిన ఎస్జీఎఫ్ ఫుట్‌బాల్ ఛాంపియన్ ట్రోఫీ పోటీలో సత్తా చాటాడు. సర్పంచ్ నరసమ్మ, వీరశైవ సంఘం కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ రుద్రగౌడ్, ప్రధానోపాధ్యాయుడు నరసప్ప, వ్యాయామ ఉపాధ్యాయుడు విద్యార్థిని సన్మానించారు.

కార్మికులకు పని భారం తగ్గించాలి

గూడూరు, న్యూస్‌టుడే: కార్మికులకు పని భారం తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. నగర పంచాయతీలో సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి జే మోహన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రాజశేఖర్, సుందరాజు, మాధవకృష్ణయ్య, ఉసేంద్ర, నాగరాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

పల్లీ పరుగులు

● రికార్డు స్థాయిలో పలుకుతున్న ధర

రైతును సన్మానిస్తున్న మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి చంద్రమౌళి, కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: జిల్లా పశ్చిమ ప్రాంతంలో వేరుసెనగ అధికంగా సాగయ్యేది. పెట్టుబడులు పెరిగి గిట్టుబాటుకాక రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లారు. సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. దీంతో ఈసారి వేరుసెనగ ధర రికార్డుస్థాయిలో పలుకుతోంది. సాగు చేసిన రైతులకు ఊరటనిస్తోంది. నాలుగేళ్ల క్రితం మిరప లాగా.. వేరుసెనగ క్వింటా ధర ఎగబాకి రూ.13వేలు దాటింది. సాగు చేసిన రైతులు ధర చూసి మురిసిపోతున్నారు.

సాగు విస్తీర్ణం తగ్గింది

జిల్లా పశ్చిమ ప్రాంతంలోని ఎమ్మిగనూరు, గోనెగండ్ల, పెద్దకడబూరు, కోసిగి, దేవనకొండ తదితర మండలాల్లో ఈసారి రబీలో 12వేల ఎకరాల్లో సాగైంది. గుజరాత్, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో అధిక వర్షాలతో ఖరీఫ్‌లో దిగుబడులు తగ్గాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ వేరుసెనగ నష్టాలతో ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లారు. సాగు గణనీయంగా తగ్గిందని వ్యాపారులు పేర్కొంటున్నారు. జనవరిలో తెలంగాణ మార్కెట్లో 40వేల నుంచి 50వేల క్వింటాళ్లు, మన రాష్ట్రంలో 40వేల క్వింటాళ్లు మార్కెట్లకు వచ్చేవని వ్యాపారులు పేర్కొన్నారు. సాగు తగ్గి 15 వేల నుంచి 20వేల క్వింటాళ్లే వస్తున్నాయన్నారు. కడప, బళ్లారి, హైదరాబాద్, చెన్నై, గుంటూరు, బెంగళూరు వ్యాపారులు ఎమ్మిగనూరు మార్కెట్‌కు వచ్చి వేరుసెనగ దిగుబడులు కొంటున్నారు. దీంతో రోజూ రూ.వేలల్లో ధర పెరుగుతుంది.

క్వింటా రూ.13,100

ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.13,100, మధ్యస్థ ధర, రూ.9,900 కనిష్ఠ ధర, రూ.5,577లకు వ్యాపారులు కొన్నారు. మార్కెట్‌కు 73 మంది రైతులు 1,898 వేరుసెనగ బస్తాలు అమ్మకానికి తెచ్చారు. గోనెగండ్ల మండలం ఎర్రబాడుకు చెందిన సత్యనారాయణరెడ్డి 2.30ఎకరాల్లో వేరుసెనగ వేయగా 30క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. క్వింటా రూ.13,100కు కొన్నారు. పెట్టుబడి లక్ష రుపాయలు వచ్చిందన్నారు. ఈ ధర మునుపెన్నడూ చూడలేదన్నారు. సత్యనారాయణరెడ్డి దిగుబడులు అధిక ధరకు అమ్ముడుపోవడంతో మార్కెట్ ప్రత్యేకశ్రేణి కార్యదర్శి చంద్రమౌళి, కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు శాలువ కప్పి పూలమాల వేసి సన్మానించారు.

నెల	క్వింటా గరిష్ఠ ధర
2026 జనవరి 11	రూ.8,920
2026 జనవరి 13	రూ.9,050
2026 జనవరి 21	రూ.10,001
2026జనవరి 25	రూ.10,940
2026జనవరి 27	రూ.13,100

ఈ ధర ఎన్నడూ చూడలేదు -రామాంజనేయులు, చిన్నమర్రివీడు

ఎకరన్నర వేరుసెనగ వేయగా రూ.35వేల ఖర్చు వచ్చింది. క్వింటా ధర రూ.10,850. పెట్టుబడులు పోను రూ.లక్ష మిగిలింది. 50 సంవత్సరాలుగా వేరుసెనగ వేస్తున్నా. ఈ ధర ఎన్నడూ చూడలేదు. ఇంత ధర పలకడం చాలా ఆనందంగా ఉంది.



కర్నూలు

• కర్నూలు • పాణ్యం

సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ విశ్వనాథ్, హాజరైన అధికారులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేస్తున్నామని కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. నగరపాలక కార్యాలయంలో మంగళవారం 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు కాలనీలకు చెందిన ప్రజలు సమస్యలు విన్నవించారు. మొత్తం 27 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్యాధికారి డా.నాగప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించుకోకుంటే చర్యలు

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : నగరంలోని అక్రమ, అనధికార కట్టడాలను తప్పనిసరిగా క్రమబద్ధీకరించాల్సిందేనని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. ఆయన మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ప్లానింగ్ కార్యదర్శులతో సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ అనధికార కట్టడాలను గుర్తించాలని సూచించారు. పలు అంశాలపై ఆయన సమీక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) కర్నూలు : 80085 52632, కర్నూలు గ్రామీణం : 85010 05408 ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ : ?: కర్నూలు ఎ.క్యాంపులో మురుగు కాలువలు వ్యర్థాలతో నిండిపోయాయి. ఇబ్బందులు పడుతున్నాం. – చంద్ర

?: కృష్ణానగర్, అబ్బాసనగర్‌లలో దోమల బెడద అధికంగా ఉంది. తగిన చర్యలు చేపట్టాలి. – స్థానికులు

✔: వ్యర్థాలను తొలగించేలా చూస్తాం. ఫాగింగ్ చేయిస్తాం. – నగరపాలక సంస్థ అధికారులు

పరిశ్రమలతో ఉద్యోగావకాశాలు

కర్నూలు బి.క్యాంపు, వీఆర్ కాలనీ, న్యూస్‌టుడే: జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుతో ఎలక్ట్రీషియన్లకు ఉపాధి లభిస్తుందని మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ అన్నారు. నగరంలోని అంబేడ్కర్ భవనంలో మంగళవారం ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ విద్యుత్ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా సభ్యత్వం తీసుకున్న వారికి గుర్తింపు కార్డులను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్ల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

క్షతగాత్రులను తరలిస్తే నగదు ప్రోత్సాహం

ప్రతిజ్ఞ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని మొదటి గంటలోగా ఆసుపత్రికి తరలిస్తే ప్రభుత్వం రూ.25 వేల నగదు ప్రోత్సాహం అందిస్తుందని జిల్లా రవాణా శాఖ ఉప కమిషనర్ శాంతకుమారి తెలిపారు. వ్యక్తిగతంగా ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ప్రాంతీయ రవాణాధికారి ఎల్.భరత్‌చవాన్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మన్సూరుద్దీన్, మోటారు వాహన తనిఖీ అధికారులు మల్లికార్జున, ఆర్‌వీ మధుసూదన్, రవీంద్రకుమార్, నాగరాజునాయక్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో శివారు.. సమస్యలతో పోరు

☛ దశాబ్దాలైనా సమకూరని సీసీ రోడ్లు, మురుగు కాలువలు ☛ అవస్థలు పడుతున్న ప్రజలు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : కర్నూలు నగర పరిధి రోజురోజుకు విస్తరిస్తోంది. శివారు కాలనీల్లో జనాభా వేగంగా పెరుగుతోంది. ఈ ప్రాంతాల్లో మౌలిక వసతులు కరవై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నంద్యాల చెక్‌పోస్టు ప్రాంతం, దిన్నెదేవరపాడు వెళ్లే రోడ్డుతో పాటు రాయలసీమ విశ్వవిద్యాలయం ప్రాంతాల్లో సరైన రహదారులు లేవు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో జనావాసాలు, ఖాళీ స్థలాల్లో మురుగు నిల్వ చేరి దుర్వాసన, దోమల సమస్యలు వేధిస్తున్నాయి. చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి అపరిశుభ్రత తాండవిస్తోంది. ఇళ్ల నిర్మాణ సమయంలో అనుమతుల కోసం నగరపాలక అధికారులు రుసుములు కట్టించుకుంటున్నా.. ఇక్కడ అభివృద్ధి పనులు చేపట్టడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● బి.క్యాంప్ నుంచి దిన్నెదేవరపాడుకు వెళ్లే మార్గంలో ఉన్న మహాలక్ష్మి నగర్, రామచంద్రానగర్‌లో వందల సంఖ్యలో ఇళ్లు వెలిశాయి. వేలాది మంది ప్రజలు నివసిస్తున్నారు. ఇక్కడ ఎక్కువ శాతం ప్రభుత్వ ఉద్యోగులే నివసిస్తున్నారు. ఈ కాలనీలో మట్టిదారులే దిక్కయ్యాయి. నగరపాలక అధికారులు మురుగు కాలువలు కూడా ఏర్పాటు చేయలేదు. వీధిదీపాలు కూడా పూర్తిస్థాయిలో లేవు. గుంతలమయమై, కంకర తేలిన మట్టిరోడ్లపై రాకపోకలు సాగించడం కష్టంగా ఉందని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక అధికారులు స్పందించి కనీసం సీసీ రోడ్లు, మురుగుకాలువలు నిర్మించాలని కోరుతున్నారు.

ఈ మట్టిరోడ్డు మైభవన్ నుంచి నవభారత్ బీఈడీ కళాశాలకు వెళ్లే మార్గంలోనిది. ఈ ప్రాంతంలో జనం ఇళ్లు నిర్మించుకుని ఏళ్లు గడుస్తున్నా సీసీరోడ్లు కరవయ్యాయి.

అధ్వానంగా ఉన్న ఈ మురుగు కాలువ మహాలక్ష్మినగర్‌లో కొత్తగా నిర్మించుకున్న ఇళ్లకు వెళ్లే మార్గంలో ఉంది. ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు కాకపోవడంతో స్థానికులే కచ్చా కాలువ తవ్వుకున్నారు. ఇందులో మురుగు నిలుస్తుండటంతో దోమల సమస్య తీవ్రంగా వేధిస్తోందని స్థానికులు వాపోతున్నారు.

స్తంభాలకు దీపాలు వేయాలి

- సుజాత, మహాలక్ష్మినగర్

నగర శివారులో ప్రశాంతంగా ఉంటుందనే ఉద్దేశంతో రెండేళ్ల కిందట మహాలక్ష్మినగర్‌లో ఇల్లు నిర్మించుకున్నాం. ఇక్కడ రోడ్లు, కాలువలు లేవు. వీధిదీపాలు కూడా లేకపోవడంతో రాత్రిళ్లు చిమ్మచీకటి అలుముకుంటోంది. ఇంటి నుంచి బయటికి రావాలంటే భయంగా ఉంది. దొంగల బెడద అధికంగా ఉంది. నగరపాలక అధికారులు కనీసం వీధిదీపాలైనా ఏర్పాటు చేయాలి.

సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ డా.ఎ.సిరి

బాల కార్మికులను పునరావాస కేంద్రాలకు తరలించాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: చైల్డ్ లేబర్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా బాల కార్మికులను గుర్తించి వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ఆదేశించారు. బాల కార్మికుల వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, పునరావాసంపై జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాల కార్మికులను సరఫరా చేసే మధ్యవర్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గత 3 నెలల్లో ఎన్ని కేసులు నమోదు చేశారని కార్మిక శాఖ అధికారిని ప్రశ్నించగా ప్రతి బుధవారం "ఆపరేషన్ ముస్కాన్", ఇతర తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఇద్దరిని పట్టుకున్నామని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ కేవలం బుధవారం మాత్రమే కాకుండా వారంలో వేర్వేరు రోజుల్లో ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. కార్మికశాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ పీడీ విజయ, సాంఘిక సంక్షేమశాఖ అధికారిణి రాధిక, ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ జుబేదాబేగం, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారిణి శారద పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిందే

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరంలో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ హెచ్చరించారు. వెంకటరమణ కాలనీ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం పరిశీలించారు. రహదారులు నిర్మించిన చోట నేల కుంగిపోవడం, గుంతలు ఏర్పడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

తొలగించరు.. ప్రమాదాలు నివారించరు

కర్నూలులోని సంతోష్‌నగర్ లోకాయుక్త కార్యాలయం ఎదురుగా జాతీయ రహదారి విభాగిని మధ్యలో విరిగిన విద్యుత్తు దీపం స్తంభం ప్రమాదకరంగా ఉంది. దీనికి సకాలంలో తొలగించాల్సి ఉన్నా జాతీయ రహదారి అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఇకనైనా స్పందించి దీనిని తొలగించాల్సిన అవసరం ఉంది. – ఈనాడు, కర్నూలు

కేసీ.. మూసీని తలపించి

కర్నూలులోని కేసీ కాలువ మూసీని తలపిస్తోంది. ఇటీవల సుంకేసుల నుంచి నీటి సరఫరా ఆపేశారు. ప్రస్తుతం వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. స్థానికులు సైతం చెత్తాచెదారాలు వేస్తుండటంతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. పెద్దఎత్తున దుర్గంధం వస్తుండటంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలి. – ఈనాడు, కర్నూలు

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

ముగతి(నందవరం), న్యూస్‌టుడే: సైబర్ నేరాల నియంత్రణకు చట్టాల కంటే ముందు ప్రజల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని డీఎస్పీ భార్గవి సూచించారు. మంగళవారం ముగతి గ్రామంలో ఏపీ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. తక్కువ సమయంలో ఎక్కువ లాభాల ఆశతోనే సైబర్ మోసాలకు గురవుతున్నారని అన్నారు. సీఐ చిరంజీవి మాట్లాడుతూ.. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై తిమ్మారెడ్డి, తెదేపా రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు ముగతి ఈరన్నగౌడ్, భార్గవ్ యాదవ్, గ్రామ అధ్యక్షులు గుగ్గిరి నరసింహులు, సోమేష్ యాదవ్, కరుబూరి, కొండారెడ్డి, అక్బర్‌పాషా, చాకలి రామకృష్ణ, నాగరాజు, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో సూచనలు ఇస్తున్న డీఎస్పీ భార్గవి

హుసేనాపురం వద్ద బండ్ల గణేశ్‌కు ప్రతిమ అందజేస్తున్న తితిదే పాలకమండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్

పాదయాత్రకు సంఘీభావం

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: సినీ నిర్మాత బండ్ల గణేశ్ చేపట్టిన తిరుమల పాదయాత్ర మంగళవారం ఓర్వకల్లు మండలంలోకి ప్రవేశించింది. హుసేనాపురంలో తితిదే పాలకమండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్ ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపిక అందజేశారు. తెలుగు మహిళలు ఆయనకు హారతి పట్టారు. తెదేపా మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, సహకారం సంఘం అధ్యక్షుడు సుధాకరరావు, నాయకులు మోహన్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి తదితరులు ఆయనకు సంఘీభావం తెలిపారు. ఎస్సై సునీల్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సంక్షిప్త వార్తలు

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : భూ సంపత్తుల శాఖ ఆధ్వర్యంలో గుజరాత్ రాష్ట్రం గాంధీనగర్‌లో నిర్వహించనున్న నక్షా శిక్షణ సదస్సులో పాల్గొనేందుకు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ వెళ్లనున్నారు. ఈనెల 29, 30 తేదీల్లో దీన్‌దయాళ్ సర్వే, ఆదాయ పరిపాలనా సంస్థలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: ఓర్వకల్లులోని మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఏపీ రైతు సంఘం డైరీ, రైతు లోకం మాస పత్రికను ఏవో మధుమతి మంగళవారం ఆవిష్కరించారు. రైతు సంఘం మండల కార్యదర్శి సుధాకర్, సీపీఐ మండల కార్యదర్శి రమేష్, నాయకులు వలి, గుండాలు నాయక్, మధు, తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోడుమూరు ఎస్టీయూ మండల అధ్యక్షుడు తిక్కన్న డిమాండు చేశారు. మంగళవారం ఎస్టీయూ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. దశల వారి పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు.

ఉలిందకొండ (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకానికి మహాత్మాగాంధీ పేరు కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండు చేశారు. కల్లూరు మండల పరిధి ఉలిందకొండ గ్రామంలో మంగళవారం ఉపాధి కూలీలతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: గూడూరు మండలం పొన్నకల్లు గ్రామంలో ఓ బాలిక వివాహం విషయంలో ఓ ప్రజాప్రతినిధి జోక్యం చేసుకోవడం తగదంటూ ఆ మండల వాల్మీకి బోయ సంఘం నాయకులు మంగళవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు.

యువగళం యాత్ర.. ఓ అద్భుత ఘట్టం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధి కోసం మంత్రి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఒక అద్భుత ఘట్టమని సివిల్ సప్లై కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మహేష్ నాయుడు పేర్కొన్నారు. యువగళం పాదయాత్ర మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాయలసీమ విశ్వవిద్యాలయం వద్ద ఆర్‌యూ విద్యార్థులు కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూ వద్ద నినాదాలు చేస్తున్న విద్యార్థులు

తైక్వాండో పోటీల్లో ప్రతిభ

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: జాతీయస్థాయి తైక్వాండో ఫెడరేషన్ కప్ పోటీల్లో రిడ్జి పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు జరిగిన పోటీల్లో పాఠశాల విద్యార్థులు పర్ణిక, మధులత, శరణ్య పాల్గొని ప్రతిభ చాటారు. పాఠశాల ఆవరణలో మంగళవారం విద్యార్థులను సీఈవో జి.గోపినాథ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కో సీఈవో సౌమ్య, పాఠశాల డీన్ రాజేంద్రన్, ప్రిన్సిపల్ రాజ్‌కమల్, హెచ్‌వోడీ నాగేంద్ర, శ్రీనివాస్, శిక్షకుడు సుందర్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన వారితో నిర్వాహకులు తదితరులు

బంగారు గొలుసు అపహరణ

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును దుండగులు అపహరించారు. ఆదోని పరిధిలోని ఎరిగేరికి చెందిన లింగన్న అనారోగ్య సమస్యలతో రెండు వారాల నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం రాత్రి ఆయన భార్య లక్ష్మి రోగి వార్డులోని వరండాలో పడుకున్నారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో దుండగులు ఆమె మెడలోని గొలుసును సగం కత్తిరించుకొని ఉడాయించారు. ఉదయం సీసీ కెమెరాల పుటేజీ పరిశీలించగా ఇద్దరు దుండగులు దొంగలించిన దృశ్యాలు కనిపించాయి. బాధితురాలి కుమారుడు రవి కర్నూలు మూడో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఏపీఎన్జీవో నేతలకు సన్మానం

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: ఏపీఎన్జీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన జవహర్, కాశన్నను ఏపీ హంస నగర అధ్యక్షుడు గోవిందు తదితరులు మంగళవారం నగరంలోని ఎన్జీవో కార్యాలయంలో సన్మానించారు. గోవిందు మాట్లాడుతూ మెడికల్ ఎంప్లాయిస్ సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో ఎన్జీవోస్ అసోసియేషన్‌తో కలిసి పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ హంస కార్యదర్శి చక్రిధర్, ఎన్జీవో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, కోశాధికారి నాయుడు, జిల్లా సంయుక్త కార్యదర్శి కేసీహెచ్ కృష్ణుడు, నగర ఉపాధ్యక్షుడు సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

సంఘం నేతలను సన్మానిస్తున్న ప్రతినిధులు

రహదారిపై ఆగిపోయిన బస్సు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలు మండలం మునగాలపాడు కేసీ కాలువ వద్ద 44వ నంబరు జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున భారతి ప్రైవేటు ట్రావెల్స్ బస్సుకు ప్రమాదం తప్పింది. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు బస్సు వెళ్తుండగా ఒక్కసారి మరమ్మతులకు గురవడంతో డ్రైవర్ అప్రమత్తమై రహదారి పక్కన ఆపేశారు. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి పంపారు. హైవే నిర్వహణ సిబ్బంది బస్సు చుట్టూ సూచికలు ఏర్పాటు చేశారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు.

ప్రజలపై భారం మోపొద్దు

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: ప్రజలపై భారాలు మోపే ఆలోచనను విరమించుకోవాలని వివిధ పార్టీల నాయకులు కోరారు. కర్నూలు దిన్నెదేవరపాడు సమీపంలోని ఏపీఈఆర్‌సీ కార్యాలయంలో మంగళవారం ఏపీఈఆర్‌సీ ఛైర్మన్ పి.వెంకటరామరెడ్డి అధ్యక్షతన నాలుగో రోజు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 71 మంది వినియోగదారులు పాల్గొని తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు గురువయ్య, అయూబ్‌ఖాన్, సీజీఎం ఉమాపతి, ఏపీఈఆర్‌సీ సెక్రటరీ కృష్ణ, కర్నూలు జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈ (ఆపరేషన్స్) ఆర్.ప్రదీప్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభిప్రాయాన్ని ఛైర్మన్‌కు విన్నవిస్తున్న వినియోగదారుడు

విశ్వపూజిత.. కూచిపూడిలో విజేత

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : కర్నూలుకు చెందిన విశ్వపూజిత కూచిపూడి నృత్యంలో అద్భుత ప్రతిభ చూపుతోంది. నృత్యంపై ఆసక్తితో ఐదేళ్ల నుంచే శిక్షణ తీసుకుంటోంది. నిత్యం సాధన చేస్తూ అభినయంలో పరిణతి సాధించింది. పోటీలు, ప్రదర్శనల్లో రాణిస్తూ ప్రశంసలు, పురస్కారాలు అందుకుంటోంది.

120 ప్రదర్శనలు

నగరంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన యు.వీరశేఖర్, సంగీత దంపతుల కుమార్తె యు.విశ్వపూజిత. ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది. సంప్రదాయ కళలపై మక్కువతో కొన్నేళ్లుగా స్థానిక ప్రభుత్వ శారద సంగీత, నృత్య కళాశాలలో శిక్షణ పొందుతోంది. కూచిపూడి నృత్యంలో సర్టిఫికేట్ కోర్సు పూర్తిచేసింది. డిప్లొమా కోర్సులో ప్రవేశం పొందింది.

● ఇప్పటి వరకు ఈ విద్యార్థిని వివిధ ప్రాంతాల్లో 120 నృత్య ప్రదర్శనలు ఇచ్చింది. ఎనిమిదేళ్ల వయసులోనే విజయవాడలో నిర్వహించిన 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు' ప్రదర్శనలో నృత్యం చేసి ప్రశంసాపత్రం అందుకుంది. రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో బ్రహ్మోత్సవాలు, ఇతర పర్వదినాల సందర్భంగా నృత్య ప్రదర్శనలు ఇస్తోంది. పలు పోటీల్లో విజేతగా నిలిచి బహుమతులు అందుకుంది. కూచిపూడి కళాకారిణిగా జాతీయస్థాయి గుర్తింపు తెచ్చుకోవాలన్నదే తన లక్ష్యమని చెబుతోంది విశ్వపూజిత.

ఐఎస్‌వో ప్రతినిధుల పర్యటన

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: నగరంలోని సి.క్యాంపు రైతుబజారును ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ (ఐఎస్‌వో) సంస్థ ప్రతినిధులు శివయ్య, ఇతర సభ్యులు మంగళవారం పరిశీలించారు. సి.క్యాంపు రైతుబజారుకు ఐఎస్‌వో గుర్తింపు ఇచ్చేందుకు అవసరమైన పారామీటర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఆ సంస్థ ప్రతినిధులు వచ్చినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి తెలిపారు. అనంతరం ఐఎస్‌వో ప్రతినిధులు రైతుబజారు నిర్వహణకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ అధికారిణి కల్యాణి, హార్టికల్చర్ కన్సల్టెంట్ శివకుమార్, ఆ సంస్థ ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వివరాలు తెలుసుకుంటున్న ఐఎస్‌వో ప్రతినిధులు, అధికారులు

ఏఆర్ అదనపు ఎస్పీ కృష్ణమోహన్‌ను సన్మానించిన అధికారులు

ఏఆర్ అదనపు ఎస్పీకి సత్కారం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : జాతీయ స్థాయి పోలీసు సేవా పతకం సాధించిన పోలీసు శాఖ ఆర్మ్‌డ్ రిజర్వ్ అదనపు ఎస్పీ సింగాల కృష్ణమోహన్‌ను మంగళవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఏఆర్ డీఎస్పీ ప్రసాద్, ఆర్‌ఐలు నారాయణ, జావెద్, పోతలరాజు, ఆర్ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

హామీలను వెంటనే నెరవేర్చాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అడివన్న డిమాండు చేశారు. ఎస్టీయూ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఇచ్చిన హామీలపై ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 30వ తేదీన మండల కార్యాలయాల ఎదుట ధర్నా చేస్తామన్నారు. నాయకులు వెంకటేశ్వర్లు, రాముడు,రామచంద్ర, ఎల్లప్ప, బాబయ్య, తులసీరామ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

(c) eenadu

ఈనాడు మార్కాపురం

బుధవారం 28 జనవరి 2026 5

ఒంగోలులో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ట్రాఫిక్ ఉల్లంఘనులు!

◆ గతేడాది చెల్లించిన జరిమానా రూ.2.02 కోట్లు

ట్రాఫిక్ నిబంధనల అతిక్రమణల్లో జిల్లా ప్రత్యేక ఘనత సాధించింది. వాహన చోదకులు ఏటా రెట్టింపు ఉల్లంఘనలతో తమ రికార్డులను తామే బ్రేక్ చేసుకుంటూ దూసుకుపోతున్నారు. పోలీసు నివేదికలే ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి.

- న్యూస్‌టుడే, ఒంగోలు నేరవిభాగం

కనీస నిబంధనలూ పట్టవు...

రోడ్డుపైకి వచ్చే ప్రతి వాహనదారుడు విధిగా డ్రైవింగ్ లైసెన్సు, రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, బీమా పత్రం కలిగి ఉండాలి. నిబంధనలకు అనుగుణంగా నంబరు ప్లేటు ఉండాలి. ద్విచక్ర వాహన చోదకుడైతే శిరస్త్రాణం, కార్లు వంటి వాహనాలైతే సీటుబెల్టు విధిగా ధరించాలి. ఇంతవరకు బాగానే ఉన్నా ఎక్కువమంది చోదకులు ఈ సాధారణ నిబంధనలను సైతం ఉల్లంఘిస్తున్నారు. వీటికితోడు ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, అతి వేగం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. మైనర్ల డ్రైవింగ్ సైతం సాధారణంగా మారింది. ఈ విషయమై ఏటా పెద్ద సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి.

కట్టనంటే కుదరదు...

ఈ-చలానే కదా, మీరు జరిమానా వెయ్యండి. . మా దగ్గర డబ్బులున్నప్పుడో, మాకు వీలైనప్పుడెప్పుడో కడతాం అంటే కుదరదు. ట్రాఫిక్ ఉల్లంఘనల విషయంలో గతంలో మాదిరిగా పోలీసులు వ్యవహరించడం లేదు. పెండింగ్ చలాన్ల విషయంలో కఠినంగానే ఉంటున్నారు. 2024లో 35.33 శాతం మేరకు వసూలు చేస్తే... 2025లో ఏకంగా 88.83 శాతం మేర కట్టించారు. దీన్నిబట్టి చలాన్ల విషయంలో ఎంత దూకుడుగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతుంది. ఈ విషయంలో రాష్ట్ర హైకోర్టు సైతం జిల్లా పోలీసుల ప్రయత్నాలను ప్రశంసించడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ కూడా జరిమానాల చెల్లింపులో పురోగతికి కారణమని పోలీసులు చెబుతున్నారు.

సంవత్సరం	చలాన్లు	జరిమానా వసూలు (రూ.కోట్లలో)
2024	36,588	0.86
2025	71,129	2.02

స్మార్ట్ బైక్... ప్రమాదాలకు చెక్!

గణతంత్ర దినోత్సవంలో భాగంగా తర్లుపాడు మండలం చెన్నారెడ్డిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన ప్రమాదాలు నిరోధించే 'స్మార్ట్ బైక్' సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో ఉండే ప్రత్యేక సెన్సార్లు నిర్ణీత దూరంలో ఉన్న అడ్డంకిని గుర్తించి చోదకుడిని అప్రమత్తం చేస్తాయి. వెనుక నుంచి అదుపుతప్పి వచ్చే వాహనాల విషయంలోనూ ఇదే విధంగా సూచనలు చేస్తాయి. ఉపాధ్యాయులు రవిశేఖర్ రెడ్డి, నరసింహారావు సహకారంతో విద్యార్థినులు సీహెచ్ శ్రీదివ్య, జి.గాయత్రి ఈ పరికరాన్ని రూపొందించారు. **- న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం**

రూ.300 కోట్లు... రికవరీ చేస్తారా?

• వైకాపా హయాంలో పీడీసీసీబీలో అక్రమాలు
• 20 శాఖలు... 2,211 మందికి నోటీసులు

గత వైకాపా ప్రభుత్వం... ది ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (పీడీసీసీబీ)ను అక్రమాలకు అడ్డాగా మార్చింది. కొందరు నాయకుల ప్రోద్బలంతో అప్పటి అధికారులు కనీస నిబంధనలు పాటించకుండా రూ.కోట్లలో రుణాలు మంజూరు చేశారు. తిరిగి చెల్లించని రుణ ఖాతాలు వేలల్లో ఉన్నాయంటే వ్యవహారం ఏస్థాయిలో సాగిందో అర్థం చేసుకోవచ్చు. కూటమి సర్కారు వచ్చాక చేపట్టిన విచారణలో ఒక్కో బాగోతమూ వెలుగు చూస్తోంది. **- న్యూస్‌టుడే - ఒంగోలు నగరం**

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు

పట్టణ శాఖల్లోనే అధికం...

2019-24 మధ్య అప్పటి వైకాపా ప్రభుత్వ హయాంలో పీడీసీసీబీలో భారీ ఎత్తున చోటుచేసుకున్న అక్రమాలపై గత కొద్దిరోజులుగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో జిల్లాస్థాయి అధికారులతో త్రిమెన్ కమిటీ వేసి విచారణ జరిపారు. తీవ్రత ఎక్కువగా ఉండడంతో శాఖాపరంగా సమగ్ర విచారణ అవసరమని రాష్ట్ర సహకార శాఖకు వారు తెలియజేయడంతో... మూడు నెలల క్రితం ఆ శాఖ అడిషనల్ డైరెక్టర్ గౌరీశంకర్‌ను విచారణాధికారిగా నియమించారు. విచారణలో భాగంగా బ్యాంకులో రుణాలు తీసుకుని దీర్ఘకాలంగా చెల్లించని వారి జాబితాను వెలికితీశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 20 బ్యాంకు శాఖల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ రుణాలు ఇచ్చినట్లు ప్రాథమికంగా గుర్తించారు. రూ.లక్షల్లో మొత్తం తీసుకుని ఒక్క వాయిదా చెల్లించని ఖాతాలు సైతం వేలల్లో ఉన్నట్లు తేలింది.

అడ్డగోలుగా మంజూరు...

సాధారణంగా స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇవ్వాలంటే జిల్లా సహకార అధికారి నుంచి అనుమతి తీసుకోవాలి. అదేమీ లేకుండానే పెద్ద సంఖ్యలో రుణాలిచ్చారు. కస్టమ్ హైరింగ్ సెంటర్లు (వ్యవసాయ పరికరాలు), షిప్ అంత్ర, కర్షక మిత్ర, జగనన్న పాలవెల్లువ, దీవెన, జాయింట్ లయబిలిటీ గ్రూపులు (జేఎల్‌జీ), ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోలు తదితరాలకు కనిష్ఠంగా రూ.50 వేల నుంచి గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు అందజేశారు. వీటిలో రెండు మూడేళ్లయినా రికవరీ లేని వాటిని గుర్తించారు. మొత్తం 2,211 మందికి నోటీసులు జారీ చేశారు. ఈ రుణాలిచ్చేందుకు సహకరించిన నాటి బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది వివరాలు సైతం సేకరించారు. ప్రస్తుతం రికవరీ ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది చర్చనీయాంశంగా మారింది.

ఒక్క కిస్తీ కూడా చెల్లించని రుణాలు రూ.300 కోట్లకు పైగా ఉన్నట్లు సమాచారం. పట్టణ శాఖల్లోనే బినామీ రుణాలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. మరోవైపు... ఒంగోలు టౌన్ శాఖలో అక్రమాలకు పాల్పడిన అధికారిపై చర్యలు లేకపోగా పదోన్నతి కల్పించడం గమనార్హం.

21 మండలాలు... వందశాతం హాజరు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా (అద్దంకి, కందుకూరు మినహా) పరిధిలోని 21 మండలాల్లో మంగళవారం... ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు వందశాతంగా నమోదైంది. మొత్తం 38 మండలాల్లో ఇప్పటివరకు ఇంత హాజరు నమోదు కాలేదు. టీచర్లతో పాటు పిల్లలూ పూర్తిస్థాయిలో బడికి రావడం విశేషం. ఈ మేరకు ఆయా మండలాల ఎంఈవోలు అభినందనలు తెలుపుతూ విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి సమాచారం పంపారు.

13 మంది ఆర్ఐలకు పోస్టింగ్‌లు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాకు చెందిన 13 మంది సీనియర్ సహాయకులు (రెండేళ్ల సర్వీసు పూర్తయిన వారు)కు... ఖాళీగా ఉన్న మండల తహసీల్దార్ కార్యాలయాల్లో ఆర్ఐలుగా పోస్టింగ్‌లు ఇచ్చారు. ఆర్.ఐ.గా రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఆరుగురిని... కలెక్టరేట్‌తో పాటు, రెవెన్యూ కార్యాలయాల్లో సీనియర్ సహాయకులుగా నియమించారు. ఈ మేరకు కలెక్టరేట్ నుంచి మంగళవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి.

రాఘవుడికి అంజన్న సేవ

మార్కాపురంలో గుండ్లకమ్మ నదీ తీరాన వెలసిన శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. మంగళవారం... ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి... స్వామి వారు రామావతారంలో హనుమంత వాహనంపై విహరించారు. ఈ సందర్భంగా మహిళల కోలాట ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

- న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం

మన ఘన రాజ్యాంగం

భారత రాజ్యాంగంలోని పీఠిక నకలు ప్రతులివి. ఒంగోలు పీవీఆర్ పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ కళాపరిషత్ ఉత్సవాల ప్రాంగణంలో సంస్కార భారతి వారు వీటిని ప్రదర్శనకు ఉంచారు. రాజ్యాంగ వజ్రోత్సవాల సందర్భంగా రచనలో భాగమైన మహనీయులను స్మరిస్తూ... మన సాంస్కృతిక వారసత్వ విలువలను గుర్తుచేస్తూ వీటిని అందుబాటులోకి తెచ్చారు.

- న్యూస్‌టుడే, ఒంగోలు సాంస్కృతికం

దోమలపైకి డ్రోన్

ఒంగోలు నగరంలో దోమల ఉత్పత్తిని అరికట్టేందుకు కార్పొరేషన్ వారు ప్రయోగాత్మకంగా డ్రోన్ వినియోగించారు. మంగళవారం... పోతురాజు కాలువ, ప్రధాన మురుగు తటాకాల్లో యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రారంభించారు. కార్మికులు వెళ్లలేని చోట దీంతో మందులు పిచికారీ చేయనున్నట్లు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, మేయర్ సుజాత తెలిపారు.

- న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

మార్కాపురం ఎస్‌బీఐ వద్ద నినాదాలు చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు, కార్మిక సంఘాల నేతలు

బ్యాంకు ఉద్యోగుల నిరసన

మార్కాపురం, న్యూస్‌టుడే: బ్యాంకులకు అయిదు రోజుల పని దినాలు కల్పించాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకింగ్ యూనియన్స్ (యుఎఫ్‌బీఐ) ఆధ్వర్యంలో మార్కాపురంలో మంగళవారం ధర్నా చేపట్టారు. దీంతో అన్ని బ్యాంకులూ మూతపడ్డాయి. కార్మిక సంఘాల వీరికి మద్దతు పలికాయి. ఈ సందర్భంగా ఎస్‌బీఐ నుంచి గడియార స్తంభం కూడలి వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్, జిల్లా కార్యదర్శి షేక్ కాశిం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.కె.ఎం.రఫి తదితరులు మాట్లాడుతూ... అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్థిక, బీమా సంస్థలు వారానికి అయిదు రోజులు మాత్రమే పని చేస్తున్నందున... బ్యాంకులకూ అదే విధానాన్ని వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకు సంఘం ప్రతినిధులు కె.కాశిరెడ్డి, రాజానాయక్, రమణారెడ్డి, అబ్దుల్లా, కృష్ణ, ఆదినారాయణ, హరిబాబు, శ్రీను, అశోక్, దయాకర్, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

నల్లమలకు అడవి దున్నల కళ

• 150 ఏళ్ల తరువాత సంచారం
• సంరక్షణకు అటవీ శాఖ చర్యలు

మాంసాహార జంతువుల్లో అడవికి రాజు సింహమైతే... శాకాహార జీవుల్లో దానికి సరితూగగలిగేది అడవి దున్న (ఇండియన్ బైసన్/గౌర్). పులి, సింహం, చిరుతలను సైతం ఎదిరించే శక్తి దీని సొంతం. 150 ఏళ్ల క్రితం నల్లమల అటవీ ప్రాంతంలో ఇవి పెద్ద సంఖ్యలో ఉండేవి. తరువాతి కాలంలో వీటి జాడ కానరావడం లేదు. గాలికుంటు, ఇతర ప్రమాదకర వ్యాధులు ప్రబలి అంతరించిపోయాయన్నది అటవీ శాఖ అధికారుల మాట. అటువంటి దున్నలు కొత్త కొద్ది నెలలుగా అక్కడక్కడా కనిపిస్తుండడంతో వాటి సంరక్షణ దిశగా అడుగులు పడుతున్నాయి.

- న్యూస్‌టుడే, మార్కాపురం, పెద్దదోర్నాల

మార్కాపురం మండలం భూపతిపల్లె సమీపంలో కనిపించిన అడవి దున్న

పాపికొండల నుంచి రాక...?

నంద్యాల డివిజన్ పచ్చర్ల అటవీ ప్రాంతంలో గత ఏడాది తొలిగా ఇది కనిపించింది. తరువాత ఆత్మకూరు పరిధిలోని బైర్లూటి, నాగులూటి; గిద్దలూరు డివిజన్ గుండ్లబ్రహ్మేశ్వరం; దిగువమెట్ట ప్రాంతాల్లో ఇవి దర్శనమిచ్చాయి. ఇటీవల కాలంలో యర్రగొండపాలెం టీఆర్ చెరువు బీట్, కొలుకుల ప్రాంతంలో వీటి సంచారాన్ని గుర్తించినట్లు మార్కాపురం అటవీ క్షేత్ర అధికారి పిచ్చిరెడ్డి, డీఆర్వో నాగరాజుగౌడ్ తెలిపారు. నాలుగు రోజుల క్రితం మార్కాపురం మండలం భూపతిపల్లె పరిసరాల్లోకి ఓ దున్న వచ్చింది. గ్రామస్థుల హడావుడితో సమీప అడవిలోకి వెళ్లిపోయింది. కర్ణాటకలోని తుంగభద్ర ప్రాంతం లేదా పాపికొండల నుంచి ఇవి వస్తున్నట్లు అంచనా వేస్తున్నారు.

1867 వరకు నల్లమలలో వేల సంఖ్యలో అడవి దున్నలు సంచరించేవని అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం గెజిట్‌లో పేర్కొంది. మార్కాపురం అటవీ డివిజన్ కార్యాలయంలో ఇప్పటికీ ఈ ప్రతి ఉంది.

అనుకూల వాతావరణం...

ఈ దున్నలు ముదురు గడ్డి, లేత వెదురు చిగుళ్లను ఆహారంగా తీసుకుంటాయి. ఇలాంటి మైదానాలు నల్లమలలో విస్తారంగా ఉండడంతో వాటి సంతతి పెంచేందుకు అటవీ శాఖ నిర్ణయించింది. అందులో భాగంగా గుండ్లబ్రహ్మేశ్వరం, నంద్యాల జిల్లా ఆత్మకూరు అభయారణ్యంలో వంద ఎకరాల్లో ప్రత్యేకంగా ఎన్‌క్లోజర్లు ఏర్పాటు చేస్తోంది. పాపికొండలు, మధ్యప్రదేశ్‌లో అడవి దున్నలు ఎక్కువగా ఉండడంతో అక్కడి నుంచి ఒక్కో విడతలో 40 చొప్పున మూడు విడతల్లో 120 తెచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు. వీటిని నెల రోజుల పాటు ఎన్‌క్లోజర్లలో సంరక్షించి ఇక్కడి వాతావరణానికి అలవాటు పడేలా చేస్తారు. అనంతరం అడవిలోకి విడిచి పెట్టాలన్నది కార్యాచరణ.

ముదురు గడ్డి పైభాగాన్ని దున్నలు తింటే... కొత్తగా మొలిచే లేతగడ్డి జింకలు, దుప్పులకు ఆహారంగా ఉపయోగపడుతుంది. తద్వారా వాటికీ మేలు కలుగుతుందని భావిస్తున్నారు.

పశు మాంసం ఎగుమతి!

జంతువధ జరుగుతున్న రేకుల షెడ్డు

ఫ్రీజర్‌లో నిల్వ చేసిన మాంసం

ప్రకాశం, బాపట్ల జిల్లాల సరిహద్దుగా ఉన్న అద్దంకి మండలం ధర్మవరం నుంచి యథేచ్ఛగా పశు మాంసం రవాణా అవుతోంది. గ్రామంలోని కొండను ఆనుకుని ప్రత్యేకంగా రేకుల షెడ్డు వేసి ఈ వ్యవహారం సాగిస్తున్నారు. జంతు చర్మాలను ఒలిచి అక్కడే ఆరబెడుతున్నారు. మాంసాన్ని ముక్కలుగా చేసి ఫ్రీజర్లలో నిల్వ చేసి... రాత్రి వేళల్లో ఐస్ బాక్సుల్లో తరలిస్తున్నారు. ఇక్కడి వ్యర్థాలను కొన్ని చేపల చెరువులకూ తరలిస్తున్నట్లు సమాచారం. తీవ్ర దుర్వాసన వెలువడుతుండడం, పదుల సంఖ్యలో కుక్కలు తిష్ఠ వేస్తుండడంతో అటుగా వెళ్లేందుకు స్థానికులు భయపడుతున్నారు. ఈ విషయమై బాపట్ల జిల్లా పశువైద్యాధికారి బి.వేణుగోపాల్‌ను సంప్రదించగా... మాంసం ఎగుమతికి ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని చెప్పారు. ఆహార భద్రతాధికారి ప్రణీత్ స్పందిస్తూ పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, అద్దంకి**

చిక్కులు లేకుండా పక్కాగా రీసర్వే

◆ నాలుగో విడతకు ప్రణాళికాబద్ధంగా కసరత్తు

రోవర్, ట్యాబ్‌తో సర్వే చేస్తున్న సిబ్బంది

భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా రీ సర్వే చేపట్టేందుకు అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందించింది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని లోపాలు సరిచేసి, తప్పులు దొర్లకుండా క్షేత్రస్థాయి సిబ్బందికి దిశా నిర్దేశం చేసింది. నాలుగో విడతగా ఉమ్మడి జిల్లాలోని 36 మండలాలు.. 123 గ్రామాల పరిధిలోని 3.95 లక్షల ఎకరాల్లో ఈ ప్రక్రియ చేపట్టేందుకు చర్యలు తీసుకుంది.

ఈనాడు, ఒంగోలు

గతంలో తప్పుల తడక...

గతంలో చేపట్టిన రీసర్వే సమస్యలు నేటికీ వెన్నాడంతో రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. జాయింట్ ఎల్పీఎంల కారణంగా వారు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. మరోవైపు ఒక సర్వే నంబరులో ఎకరానికి 95 సెంట్లు తగ్గినట్లు చూపితే... మరొకరి దాంట్లో సర్వే నంబర్లే తప్పుగా నమోదు చేశారు. ఇలాంటి ఉదంతాలు కోకొల్లలుగా ఉన్నాయి. ప్రస్తుతం... ఈ తప్పిదాలను సరిచేసే ప్రయత్నం చేస్తున్నారు. ప్రతి వారం రెవెన్యూ క్లినిక్‌లు నిర్వహించి ఒక్కొక్కటిగా సమస్యలు పరిష్కరిస్తున్నారు.

ప్రక్రియ మార్చారిలా...

గతంలో రైతు వచ్చినా రాకున్నా సర్వే చేసుకుంటూ వెళ్లిపోయేవారు. ఇప్పుడు రైతును రప్పించి చేస్తారు. తొలుత గ్రామాల వారీగా ప్రభుత్వ, పట్టా భూములు ఎన్ని ఉన్నాయన్నది అంచనా వేస్తారు. దస్త్రాల ప్రకారం క్షేత్రస్థాయిలో సర్వే చేస్తారు. తరువాత ప్రతి ఒక్కరి భూమి వివరాలు సర్వే చేసి నమూనా (డ్రాఫ్ట్) ఆర్వోఆర్ ఇస్తారు. ఇందులో తప్పులు లేవని నిర్ధారించాకే తుదిగా పట్టాదారు పాస్ పుస్తకం ముద్రిస్తారు. సర్వే జరిగే రోజుల్లో వీఆర్వో, సర్వేయరు వేరే విధులు చేపట్టకుండా సర్వే మాత్రమే చేపట్టేలా ఆదేశాలు జారీచేశారు.

క్షేత్రస్థాయిలోనే పరిష్కారం...

గతంలో ఏదైనా భూ వివాద పరిష్కారం జిల్లా సంయుక్త కలెక్టర్ స్థాయిలో ఉండేది. దీంతో పరిష్కారానికి చాలా సమయం పట్టేది. ఇప్పుడు మ్యుటేషన్ కరెక్షన్, ఎల్పీఎం, సర్వే నంబరు తప్పులు, జీరో, నోషనల్ ఖాతా, రెండు ఖాతాలు.. తదితరాలు పరిష్కరించే బాధ్యత జేసీ నుంచి ఆర్డీవో, తహసీల్దార్లకు బదలాయించారు. గతంలో దొర్లిన తప్పులను సరిచేసేందుకు... నియోజకవర్గానికి రెండు గ్రామాలను ఎంపిక చేసి ప్రతి ఖాతాను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఆ మేరకు కొత్త పాసుపుస్తకం ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ప్రజల ఇబ్బందులు తొలగించడమే లక్ష్యంగా రెవెన్యూ యంత్రాంగం తీవ్రంగా శ్రమిస్తోందని ప్రకాశం జిల్లా జేసీ రోణంకి గోపాలకృష్ణ తెలిపారు.

డయాలసిస్ బాధితులకు గతంలో 108 ద్వారా ఉచిత రవాణా సౌకర్యం అందుబాటులో ఉండేది. గత ఏడాది నవంబరు నుంచి ఈ సేవలు అందకపోవడంతో వారంతా వ్యయప్రయాసలకు గురవుతున్నారు. సమస్య తీవ్రంగా ఉన్న వారి పరిస్థితి మరీ దయనీయం. ప్రత్యేకంగా ఆటోల్లో వచ్చేందుకు రూ.వందల్లో చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి తమ ఇక్కట్లు తీర్చాలని వారు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే - కనిగిరి**

కనిగిరి కేంద్రంలో డయాలసిస్ చేయించుకుంటున్న బాధితులు

మూత్రపిండం... రవాణా గండం!

● 108 సేవలు నిలిచి బాధితుల వెతలు

పెరుగుతన్న తీవ్రత...

ఉమ్మడి జిల్లాలో ఒంగోలు, కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, వై.పాలెం, కందుకూరులో మొత్తం తొమ్మిది డయాలసిస్ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో రోజూ 724 మందికి పైగా కిడ్నీ బాధితులు సేవలు పొందుతున్నారు. నెల్లూరు, గుంటూరు, కర్నూలు, కడప జిల్లాల నుంచి సైతం మరో 300 మంది వరకు వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. రెండేళ్ల వ్యవధిలో 224 మంది బాధితులు పెరిగారంటే సమస్య తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వీరిలో ఎక్కువ మంది వారంలో రెండు నుంచి నాలుగు సార్లు డయాలసిస్ చేయించుకోవాల్సిన వారే ఉన్నారు. ఏమాత్రం అశ్రద్ధ చేసినా ప్రాణాపాయం తప్పదు.

అదనపు భారం...

బాధితుల్లో ఎక్కువ మంది నిరుపేదలు, గ్రామీణ ప్రాంతాల వారే ఉన్నారు. ఆయా గ్రామాల నుంచి జిల్లా, డివిజన్ కేంద్రాల్లో ఉన్న డయాలసిస్ సెంటర్లకు వచ్చి వైద్యం చేయించుకోవాలి. గతంలో 108 వాహనాల్లో వీరిని తీసుకెళ్లేవారు. ప్రస్తుతం ఆ అవకాశం లేకపోవడంతో సొంత ఖర్చులతో వెళ్లాల్సి వస్తోంది. పీసీపల్లి మండలం అన్నపురెడ్డిపల్లికి చెందిన చల్లా రమణమ్మ గత నాలుగేళ్లుగా కనిగిరి కేంద్రంలో డయాలసిస్ చేయించుకుంటున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోలోనే రావాల్సి వస్తోంది. తోడుగా మరొకరి సాయం అవసరం కావడంతో నెలకు రూ.మూడు వేలు ఛార్జీలకే అవతున్నాయని వాపోతున్నారు. కనిగిరి మండలం చిన ఇర్లపాడుకు చెందిన ముద్దా అబ్రహందీ ఇదే పరిస్థితి. నెలకు ఎనిమిది సార్లు డయాలసిస్ చేయించుకునేందుకు రానూపోనూ ఛార్జీలకే రూ.2 వేలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కనిగిరి డయాలసిస్ కేంద్రం మేనేజర్‌ను సంప్రదించగా... సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చేపడుతున్న పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులపై జిల్లాలోని మండల అధికారులతో మంగళవారం నిర్వహించిన వీక్షణ సమావేశంలో మాట్లాడారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా నిధులను పూర్తిస్థాయిలో వినియోగించడంపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు గృహ నిర్మాణాలు పూర్తయ్యేలా పర్యవేక్షించాలన్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల కోసం అవసరమైన స్థలాలను త్వరగా గుర్తించాలన్నారు. సమావేశంలో జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో ఓబులేసు పాల్గొన్నారు.

WE MANUFACTURE AND SUPPLY APPAREL
FOR BULK ORDER QUANTITES
REGULAR WEAR
● RELIGIOUS WEAR
● TOPS
● BOTTOMS
● UNDERGARMENTS
● NIGHT WEAR
FOR MEN & WOMEN
BOYS & GIRLS
VIJAYAWADA-AP
8977796538

(c) eenadu

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – తాడికొండ

బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపం లోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET

Protein Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)

Hospitality Partner: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS

Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)

Man of the Series: Hero

Digital Partner: ఈనాడు.నెట్ TV Partner: ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్

Organised by ఈనాడు

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - I జూనియర్స్ : మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్స్‌లతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులు చేసి ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - I జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సులతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

సీనియర్స్ విన్నర్స్ రాయలసీమ రాకర్స్

గ్రౌండ్-2లో సీనియర్స్ : సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ చరణ్ జిత్ ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-I (జూనియర్స్)
మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)
మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

శవం పూడ్చిన స్థలం పరిశీలన

గానుగపెంట ఎస్సీ కాలనీవాసులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వెంకటశివరామిరెడ్డి

ఈనాడు కథనానికి స్పందన

తర్లుపాడు, న్యూస్‌టుడే: పిల్లలు చదువుకునే పాఠశాల ఆవరణలో తండ్రి శవాన్ని పూడ్చిన సంఘటనపై జనవరి 26వ తేదీన 'ఈనాడు' పత్రికలో 'పాఠశాల ఆవరణలో శవం పూడ్చివేత' అనే కథనం ప్రచురితమైంది. దీంతో మంగళవారం యంత్రాంగం మొత్తం గానుగపెంట చేరింది. అందులో భాగంగా మార్కాపురం జిల్లా సబ్ కలెక్టర్ వెంకటశివరామిరెడ్డి తోపాటు తహసీల్దార్ కె.కె.కిశోర్ కుమార్, ఎంఈవో సుజాత ఆర్ఐ సురేష్, వీఆర్వో కోటేశ్వరి, పంచాయతీ అధికారి రామాంజనేయరెడ్డి సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. ఈ క్రమంలో గ్రామస్థులతోపాటు పాఠశాల ప్రధానోపాధ్యాయుడి నుంచి సబ్ కలెక్టర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సంఘటనను పరిశీలించేందుకు వచ్చిన సబ్ కలెక్టర్‌కు ఎస్సీ కాలనీ వాసులు చుట్టుముట్టి పిల్లలు చదువుకునే పాఠశాల పరిసరాల్లో శవం పూడ్చడమేమిటంటూ ఆగ్రహించారు. జనావాసం ఉండే ప్రాంతంలో, పిల్లలు ఆడుకునే స్థలాల్లో ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలు చేయడమేమిటంటూ అధికారులను ప్రశ్నించారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు శాంతించాలని సరైన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రెవెన్యూ అధికారులను ఆదేశిస్తూ పరిసరాలు మొత్తం సర్వే చేసి పూర్తి వివరాలతో నివేదిక తయారు చేసిన తనకు పంపాలని కోరారు. అందులో భాగంగా మండల తహసీల్దార్, సర్వేరు, వీఆర్వోలు కలిసి సర్వేచేసి ఇచ్చిన నివేదికను సబ్ కలెక్టర్‌కు పంపుతున్నట్లు తెలిపారు.

కాటంరాజు తిరునాళ్లకు సహకరించండి

ఉప కలెక్టర్ వెంకట శివరామిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాటంరాజు దేవస్థానం కమిటీ సభ్యులు

మార్కాపురం, న్యూస్‌టుడే: ప్రముఖ వేనూతల కాటంరాజు తిరునాళ్ల మార్చి 18వ తేదీన జరగనుందని ఇందుకు ప్రభుత్వ సహకారం అందించాలని దేవస్థాన కమిటీ సభ్యులు ఇన్‌ఛార్జి ఉప కలెక్టర్ వెంకట శివరామిరెడ్డిని కలిసి విన్నవించారు. మంగళవారం స్థానిక ఉప కలెక్టర్ కార్యాలయంలో కాటంరాజు దేవస్థానం కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కాటంరాజు తిరునాళకు 1.50 లక్షల మంది భక్తులు వస్తారన్నారు. భక్తుల సౌకర్యార్థం కమిటీ వారికి తోడ్పాటుగా వివిధ ప్రభుత్వశాల వారి సహకారాన్ని అందించాలని కోరారు. చరిత్రలో ఎంతో ప్రసిద్ధి చెందిన కాటంరాజు గంగాభవాని దేవస్థానానికి ప్రాముఖ్యం ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే లక్ష మంది కంటే ఎక్కువ భక్తులు వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు గుమ్మా గంగరాజు, మాజీ అధ్యక్షుడు పీఎల్‌పీయాదవ్, కమిటీ సభ్యులు చిన్న వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, శ్రీనివాస్, గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు

ఎన్నికల హామీల అమలుకు దశల వారీ ఉద్యమం

మార్కాపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) దశల వారీగా ఉద్యమాలకు శ్రీకారం చుట్టిందని మార్కాపురం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.కె.ఎస్.ప్రసాద్, ఆర్.దేశానాయక్‌లు అన్నారు. మంగళవారం స్థానిక పూల సుబ్బయ్య శాంతిభవన్‌లో ఎస్టీయూ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యమాలకు సంబంధించి ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండు ఏళ్లు కావస్తున్నప్పటికీ ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా హామీల అమలుకు కృషి చేయాలన్నారు. ఈ నెల 30న మండల కేంద్రాల్లో అధికారులకు వినతిపత్రాలు, వచ్చే నెల 10న కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, 25న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కె.యర్రయ్య, గాలెయ్య, యూసఫ్ షరీఫ్, ఖాదర్‌బాషా, పలు మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

గోడలపై వేసిన కళా చిత్రాలు

మార్కాపురానికి 'కళాత్మక' సొబగులు

న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం: కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లాకు అధికారులు నూతన సొబగులు అద్దుతున్నారు. జిల్లా రాకతో ఇతర ప్రాంతాల నుంచి మార్కాపురం పట్టణానికి రాకపోకలు పెరిగాయి. అధికారులు నిత్యం ఒంగోలు, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి మార్కాపురానికి పనుల నిమిత్తం వస్తూ పోతున్నారు. ఎవరూ లేనప్పుడు, రానప్పుడు పట్టణ శుభ్రత, గోడల అభివృద్ధి గురించి ఎవరూ దృష్టి సారించకపోవచ్చు. కానీ జిల్లా కేంద్రం కావడంతో పరిసర ప్రాంతాలు కూడా శుభ్రంగా అందంగా కనిపించాలి. అందుకనే పట్టణంలోని గోడలపై మన కళలను ప్రతిబింబిస్తూ చిత్రాలు గీస్తున్నారు. వీటిని చూసిన ప్రజలు నూతనోత్తేజాన్ని పొందుతున్నారు. పట్టణ ప్రధాన మార్గాల్లోని గోడలపై చిత్రీకరించిన కళాత్మక రూపాలను చరవాణుల్లో బంధించుకొని, సెల్ఫీలు తీసుకుని షేర్ చేసుకుంటున్నారు. జిల్లా కేంద్రం కావడంతో మార్కాపురం రూపురేఖలు వేగంగా మారుతున్నాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రాజమాతంగిగా జగదాంబ

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: శ్యామల నవరాత్రుల్లో భాగంగా పట్టణంలోని జగదాంబ అమ్మవారు తొమ్మిదో రోజైన మంగళవారం రాజమాతంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

29న ఉద్యోగ మేళా

ఒంగోలు గ్రామీణం: జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో స్థానిక పాత రిమ్స్‌లోని ఉపాధి కార్యాలయ ఆవరణలో ఈ నెల 29న ఉదయం 10 గంటలకు ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారిణి కె.రమాదేవి తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగి, 10వ తరగతి, ఐటీఐ, ఇంటర్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసినవారు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి కలిగిన వారు తమ ధ్రువీకరణ పత్రాలతోపాటు, ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణం, ఫ్లాట్ నెం.U1, కామాక్షి లేక్‌వ్యూ అపార్ట్మెంట్, ఆర్.ఆర్.ట్యాంక్ దగ్గర, నివాసం, **వీరిశెట్టి హుస్సేనయ్య గారి కుమారుడు వీరిశెట్టి కృష్ణ** అను వారు నాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

నా క్లయింట్ కు రావలసిన బకాయిల గురించి ఒంగోలు జూనియర్ సివిల్ జడ్జి మొబైలు కోర్టులో **O.S No. 475/2022** న **దుంపా వేంకటేశ్వర రెడ్డి** పై ప్రామిసరీ నోటు బాకీ గురించి దావా దాఖలు చేయగా అది విచారణ నిల్వలో వుండి వున్నది. అదే విధంగా ఒంగోలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో **O.S No. 141/2019** న, **నల్లూరి పద్మ** పైన అగ్రిమెంట్ ప్రకారం ఆస్తిని విక్రయం చేయవల్సినదిగా దావా దాఖలు చేయగా అది విచారణ నిల్వలో వుండి వున్నది.

నా క్లయింట్ పై పైన పేర్కొన్న దుంపా వెంకటేశ్వరరెడ్డి, సంతనూతలపాడు వాసి, నా క్లయింట్‌ను ఇబ్బంది పెట్టవలెనని తలంపుతో అతని అనుచరులైన బొడ్డుకామేశ్వరరావు, సంతనూతలపాడు వాసి వగైరాలతో కలిసి అక్రమముగా నా క్లయింట్ పై **O.S No. 63/2025** న ఒంగోలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో దావా దాఖలు చేసి రూ.20 లక్షలు బాకీ వున్నదని, నా క్లయింట్ సంతకం ఫోర్జరీ చేసి దావా దాఖలు చేయగా నా క్లయింట్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వారిని కలిసి పై వారలు చేసిన కుటిలయత్నములను గురించి పోలీసు అధికారులకు తెలిపి వున్నాడు.

నా క్లయింట్ గతంలో 1993-1996 సంవత్సరాల మధ్య లారీలు కొనుగోలు నిమిత్తము ప్రైవేట్ వ్యక్తుల నుండి ఫైనాన్స్ పొందినపుడు హామీగా నా క్లయింట్ సంతకం చేసిన ఖాళీ బ్యాంకు చెక్కులు, సంతకం చేసిన ఖాళీ ప్రామిసరీ నోట్లు, మరియు సంతకం చేసిన కొన్ని ఖాళీ స్టాంప్ పేపర్లు ఫైనాన్స్ వారికి ఇచ్చివున్నాడు, దరిమిలా ఫైనాన్స్ బాకీలన్నీ చెల్లించి వున్నాడు. కొన్ని కారణముల వలన పైన తెలిపిన సంతకం చేసిన డాక్యుమెంట్స్ నా క్లయింట్‌కు వాపసు ఇచ్చి యుండలేదు.

నా క్లయింట్ గత 15 సంవత్సరాల నుండి ఎవ్వరి వద్ద, ఎటువంటి రుణం తీసుకొనటం కానీ, ప్రామిసరీ నోట్లు వ్రాయించి ఇవ్వడం గాని జరుగలేదు. నా క్లయింట్ యొక్క శత్రువులైన వారు నా క్లయింటును ఆర్థికంగా ఇబ్బంది పెట్టవలెనని తలంపుతో ఇతరుల సహకారంతో తప్పుడు కేసులు నమోదు చేయుటకు ప్రయత్నించుచున్నట్లుగా తెలియవచ్చినది. కావున యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై వారలు, వారి అనుచరులు గాని, మరెవ్వరైన నా క్లయింట్ పై తప్పుడు దావాలు వేసిన ఎడల అట్టి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొనగలడని, వారు చట్టప్రకారం శిక్షకు గురికావలసి వస్తుందని హెచ్చరించడమైనది.

స్థలం : ఒంగోలు
తేది : 27-01-2026

ఇట్లు: పి.యస్.వి. సత్యనారాయణ రెడ్డి
అడ్వకేట్, జిల్లా కోర్టు సెంటర్, ఒంగోలు,
సెల్: 9390411081

సైన్సు ప్రాజెక్టు ప్రదర్శనలో పొదిలి విద్యార్థి ప్రతిభ

విద్యార్థిని, ఉపాధ్యాయుడిని అభినందిస్తున్న మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి చక్కా ధర్మతేజ సైన్సు ప్రాజెక్టు ప్రదర్శనలో దక్షిణ భారత దేశ స్థాయిలో ద్వితీయస్థానం సాధించాడు. ఇటీవల హైదరాబాదులో జరిగిన ప్రదర్శనలో పాల్గొన్నాడు. ఇతను పదో తరగతి చదువుతున్నాడు. వ్యక్తిగత ప్రాజెక్టుల ప్రదర్శనలో తాను తయారుచేసిన 'బయో ప్లాస్టిక్ ఫ్రం కిచెన్ వేస్ట్' ప్రాజెక్టుకు రెండో బహుమతి అందుకున్నాడు. ఇతనికి పాఠశాల బయాలజీ ఉపాధ్యాయుడు ఎస్కే పీరా అహమ్మద్ మార్గనిర్దేశం చేశారు. బయోప్లాస్టిక్‌తో ప్రమాదరహిత వస్తువుల తయారు చేయవచ్చని నిరూపించాడు. ఇంట్లో వంటగదిలోని కూరగాయలు, ఇతరత్రా వ్యర్థాలను ఉపయోగించి పర్యావరణ రహిత ప్లాస్టిక్‌ను తయారు చేశారు.

మానవాళికి ఆరోగ్యదాయకం

అరటితొక్కలు, వివిధ రకాల కూరగాయల తొక్కల మిశ్రమానికి గ్లిజరిన్, వెనిగర్‌తో కలిపి ప్లాస్టిక్ తయారు చేస్తారు. దానితో చిన్నారులు ఆడుకునే బొమ్మలు, ఇతరత్రా వస్తువులు తయారుచేయడం వల్ల మానవాళి ఆరోగ్యానికి హానికరం కాకుండా ఉంటాయన్నది ఈ ప్రాజెక్టు ముఖ్య లక్ష్యం. విద్యార్థి ధర్మతేజ, ఉపాధ్యాయుడు అహ్మద్‌ను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, డిప్యూటీ డీఈవో ఎం.శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయురాలు కరిమూన్‌బీబీ, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల నిరసన

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: ఒంగోలు ట్రిపుల్ ఐటీ కళాశాలను ఒంగోలులోనే కొనసాగించాలని ఎస్ఎన్ పాడులోని ఆ కళాశాల విద్యార్థులు మంగళవారం ఆందోళన చేపట్టారు. తరగతులు బహిష్కరించి, విద్యార్థి జేఏసీ నాయకులతో కలిసి ట్రిపుల్ ఐటీ కనిగిరి వద్దు... ఒంగోలు ముద్దు.. అంటూ నినాదాలు చేశారు. ముందుగా కళాశాల ఆవరణలో ర్యాలీ చేసి పరిపాలన కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గేటు వద్దకు వచ్చి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి నేలపైనే బైఠాయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. ట్రిపుల్ ఐటీ కళాశాలను కనిగిరి ప్రాంతానికి మారిస్తే వచ్చేది చదువు కాదని, రోగాలతో ఇబ్బందులు పడాలన్నారు. కళాశాల నడవాలంటే రోజుకు 15 లక్షల లీటర్ల నీరు అవసరమన్నారు. అక్కడ ఫ్లోరైడ్ సమస్య ఉన్నందున విద్యార్థుల జీవితాలను బలిచేస్తారా అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలోని దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు కనిగిరి వద్దనున్న బల్లిపల్లికి వెళ్లాలంటే ఎలా కుదురుతుందన్నారు. అక్కడ రవాణా సౌకర్యం సక్రమంగా లేదని తెలిపారు. ప్రాంగణ ఎంపికలు నిర్వహించేందుకు కంపెనీలు సైతం వచ్చే పరిస్థితి ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్, కె.రాజీవ్ పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం మేలైన మార్గం

ఒంగోలు న్యాయవిభాగం: మధ్యవర్తిత్వం ద్వారా ఇరువర్గాల కక్షిదారులు కేసులు పరిష్కరించుకుంటే సత్వర న్యాయం పొందవచ్చని ఇన్‌ఛార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ టి.రాజ్యలక్ష్మి సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన న్యాయవాదులకు మంగళవారం 40 గంటల శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. న్యాయస్థానాల్లో అపరిష్కృత కేసులకు మధ్యవర్తిత్వంలో శిక్షణ పొందిన న్యాయవాదులు సమర్థవంతంగా వ్యవహరించి కక్షిదారుల అంగీకారంతో పరిష్కారమార్గాలను చూపాలన్నారు. దీనివల్ల ఇరువర్గాల వారూ విజయం సాధించినట్లేనన్నారు. వారికి సమయంతోపాటు డబ్బు ఆదా అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ తిరుమలరావు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.హేమలత, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్కే ఇబ్రహీం షరీఫ్, మధ్యవర్తిత్వం శిక్షణ నిపుణులు ఎస్.అరుణాచలం, ఎస్.పద్మ పాల్గొన్నారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 143, రిటైల్ లైవ్ - 170, చికెన్ విత్ స్కిన్ - 247, చికెన్ స్కిన్‌లెస్- 281

డీఈవో త్రిపురాంతక ఆలయాల సందర్శన

ఆశీర్వచనం తీసుకుంటున్న డీఈవో

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక మంగళవారం త్రిపురాంతకం ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. త్రిపురాంతకేశ్వరునికి అభిషేకాలు, బాలా త్రిపుర సుందరీదేవి వద్ద కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయాల అర్చకులు ఆమెకు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందించారు. ఆమె వెంట ఎంఈవోలు కేటీ మల్లికార్జున నాయక్, టి.రాజశేఖరెడ్డి ఉన్నారు.

వెలిగొండ పనులు వేగవంతం చేయాలి

కంకరను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

పెద్దదోర్నాల: వెలిగొండకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.సోమయ్య ప్రభుత్వాన్ని కోరారు. దోర్నాల మండలం గంటవానిపల్లె సమీపంలో జరుగుతున్న వెలిగొండ ఫీడర్ కెనాల్ పనులను సీపీఎం ప్రతినిధి బృందం మంగళవారం పరిశీలించారు. 2026 జూన్ చివరి నాటికి పనులు పూర్తి చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు కావాలంటే రూ.రెండు వేల కోట్లు నిధులు మంజూరు చేయాలన్నారు. నిర్వాసితులకు పరిహారం అందజేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి దుగ్గెంపుడి తిరుపతి రెడ్డి, మండల నాయకుడు గోదా దావీద్, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు గంగిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలికపై మేనత్త భర్త లైంగికదాడి

❖ పోక్సో కేసు నమోదు

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: మానసిక పరిస్థితి సరిగా లేని 13 ఏళ్ల బాలికపై లైంగికదాడి చేసిన ఆమె మేనత్త భర్తపై ఒంగోలు మహిళా పోలీసుస్టేషన్‌లో పోక్సో చట్టం కింద మంగళవారం కేసు నమోదైంది. ఈ ఘటన ఒంగోలు రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతంలో సోమవారం జరిగింది. బాలిక తల్లిదండ్రులు పనుల నిమిత్తం బయటకు వెళ్లగా ఒక్కతే ఇంటిలో ఉంది. ఆ సమయంలో ఆమె మేనత్త భర్త అయిన ఎం.వెంకటేశ్వర్లు ఆమెను తినుబండారాలు ఇస్తానని చెప్పి ఇంటిలోకి పిలిచి లైంగికదాడి చేశాడు. రాత్రి తన తల్లిదండ్రులు ఇంటికి వచ్చిన తర్వాత బాలిక ముభావంగా ఉండటాన్ని గుర్తించి ఏం జరిగిందని ప్రశ్నించారు. మామ దుశ్చర్యను ఆమె వెల్లడించింది. దీంతో వారు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు నిందితుడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రానైట్ క్వారీ కార్మికుడి మృతి

సంఘటనా స్థలంలో మృతుడు

బల్లికురవ: మండలంలోని మల్లాయపాలెం పంచాయతీ పరిధిలోని ఓ గ్రానైట్ క్వారీలో పనిచేసే వలస కార్మికుడు మృతి చెందాడు. ఎస్సై నాగరాజు కథనం ప్రకారం మధ్యప్రదేశ్‌కు చెందిన రమేష్ కేవత్ (48) సోమవారం పని ముగించుకుని క్వారీ సమీపంలోని నివాసంలో భోజనం చేసి నిద్రపోయాడు. మంగళవారం ఉదయం సహచర కార్మికులు నిద్ర లేపగా ఎంతకీ లేవలేదు. చూస్తే నోటి వెంట నురగ వచ్చి చనిపోయి కనిపించాడు. వెంటనే కార్మికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతునికి గతంలో మూర్ఛ వ్యాధి ఉన్నట్లు ఎస్సై తెలిపారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి...

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: రహదారి వెంబడి ఉన్న రైలింగ్‌ను ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చదలవాడ వద్ద చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిపాడు మండలం నాగన్నపాలేనికి చెందిన పైనం రమేష్(43), తన ద్విచక్ర వాహనంపై ఉప్పుగుండూరు నుంచి ఒంగోలు వైపు 216వ జాతీయ రహదారిపై వెళుతున్నారు. ఈ క్రమంలో చదలవాడ వద్ద వాహనం అదుపుతప్పి రహదారి పక్కనున్న రైలింగ్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకొన్న ఎస్సై రజియా సుల్తానా సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. రమేష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. విషయం తెలియగానే వారంతా గుండెలవిసేలా రోదించారు.

గన్నేరు కాయలు తిని...

పామూరు, న్యూస్‌టుడే: పామూరులోని శివాలయం సమీపంలో గన్నేరు కాయలు తిని మహిళ మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఏఎస్సై జిలాని భాష తెలిపిన వివరాల ప్రకారం కోమటిగుంట్ల రాధ మనస్తాపానికి గురై గన్నేరు కాయలు తిని తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక సీహెచ్‌సీకి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం మరో ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు సంతానం ఉన్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph : 8142292071.

EDUCATION

విజయవాడలో BPT/B.Sc., MLT- మేనేజ్‌మెంట్ కోటా సీట్లు- తక్కువ ఫీజు- కొన్నిసీట్లు కలవు. Affiliated to Dr.NTR యూనివర్సిటీ. ✆ 7995945835.

JOBS

రాయల్‌మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, ఒంగోలు నందు పనిచేయుటకు అనుభవం కల్గిన Opthalmology Doctors మేల్/ఫీమేల్ నర్సింగ్ స్టాఫ్, OT అసిస్టెంట్, PRO కావలెను. ✆ 9618800333, 9618460006.

CMR **జ్యూయలరీకి** ★సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ ★బిల్లింగ్ సెక్షన్ ★ మార్కెటింగ్ హెడ్స్‌గా పని చేసేందుకు యువకులు కావలెను. Cont: 9160974916, 9912121403

రైస్ మిల్ & ప్లాంట్ ఆపరేటర్స్ కావలెను. అనుభవజ్ఞులైన వెల్డింగ్, రిపేర్ తెలిసిన ఆపరేటర్స్ కావలెను. Contact No: ✆ 80962 46099.

శ్రీరామ్‌చిట్స్ ఒంగోలు బ్రాంచ్ నందు పనిచేయుటకు మార్కెటింగ్ & రికవరీ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీ: 16వేలు +ఇన్సెంటివ్స్. అ:ఏదైనా డిగ్రీ, టూవీలర్ తప్పనిసరి. వ: 32సం|| లోపు. సంప్ర|| 9030689662

ఒంగోలు మరియు పొదిలి APSRTC బస్టాండ్ CCTV లో పనిచేయుటకు ఎలక్ట్రీషియన్ & టెక్నీషియన్ కావలెను. Con: రాజేష్:-98669 42544.

3 నుండి 8వ తరగతి వరకు ఇంగ్లీషు, మ్యాథ్స్, సైన్స్ (E.M)లో బోధించుటకు టీచర్స్ మరియు బస్ డ్రైవర్, ఆయా కావలెను. వెంటనే శ్రీవాణీనికేతన్, కరవది, ఒంగోలు (మం). ✆9949217836

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు ను వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కనిగిరి

• కనిగిరి • గిద్దలూరు

ఎండ మండుతోంది.. పంట ఎండుతోంది

కేంద్రం గేటుకు తాళాలు వేసిన దృశ్యం

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే

గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాల్లోని పరివర్తకాలు మరమ్మతులకు గురైతే గిద్దలూరు విద్యుత్తు ఉపకేంద్రం ఆనుకుని ఉన్న ఎస్‌పీఎంలో బాగు చేసి గత అక్టోబరు నెల వరకు రైతులకు అందజేసేవారు. ఈ కేంద్రం నిర్వహణ చేపట్టే గుత్తేదారుడి ఒప్పందం గత ఏడాది అక్టోబరు చివరితో ముగిసింది. అప్పటి నుంచి జిల్లా విద్యుత్తు శాఖ అధికారులు నూతన గుత్తేదారుడికి బాధ్యతలు అప్పగించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు.

◗ మూలకు చేరిన ఎస్‌పీఎం కేంద్రం

ప్రస్తుతం పొలాల్లోని పరివర్తకాలు మరమ్మతులకు గురైతే రైతులు సాగుచేసిన పంటలకు నీటి తడులు సకాలంలో అందించలేక అవస్థలు పడుతున్నారు. ఎండలు కూడా ముదురుతున్నాయి. అత్యవసరమైతే కంభం వెళ్లి సొంత నిధులతో బాగు చేయించి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రవాణాకే రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. కాలిపోయిన పరివర్తకాలను తెచ్చేందుకు ఎస్‌పీఎంకు లారీ ఉన్నప్పటికీ సకాలంలో రాకపోవడంతో రైతులకు భారం తప్పడం లేదు.

అనుమతి కోసం పంపాం

ఎస్‌పీఎం నిర్వహణ కోసం గుత్తేదారుడితో ఒప్పందం చేసుకుని ఉన్నతాధికారుల అనుమతి కోసం విజయవాడలోని కార్పొరేట్ కార్యాలయానికి దస్త్రం పంపాం. అక్కడి నుంచి వచ్చిన వెంటనే కేంద్రాన్ని తెరిచి పరివర్తకాలను బాగు చేసేలా చూస్తాం. – పద్మావతి, ఎస్‌పీఎం ఏడీఈ

రైతులు లేరు.. బజారే ఉంది

❖ గిట్టుబాటు కావడం లేదని ఖాళీ

కనిగిరి, న్యూస్‌టుడే

మూసి ఉన్న స్టాల్స్

గత అయిదేళ్ల వైకాపా పాలనలో రైతులు.. చిరు వ్యాపారుల బాధలు పట్టించుకోలేదు. కనీసం వారికి ఉపయోగపడే ఒక్క పని కూడా చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కనిగిరి పట్టణంలో రైతు బజారు ఏర్పాటు చేసింది. నాణ్యమైన కూరగాయలు, ఇతర ఉత్పత్తులు చౌకధరలకే లభించేందుకు వీలుగా తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో రూ.1.10 కోట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధులతో నిర్మించారు. రైతులు.. చిన్న వ్యాపారుల కోసం స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. అయితే.. గిట్టుబాటు కావడం లేదంటూ ఖాళీ చేసి వెళ్లిపోయారు. దీంతో బజారు కళ్ల వెలవెలబోతోంది.

నాలుగు నెలల క్రితం ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి బజారు ప్రారంభించారు. తొలినాళ్లలో అన్నదాతలు, చిరు వ్యాపారులు పోటీ పడి 44 స్టాల్స్‌ను దక్కించుకున్నారు. తర్వాత వ్యాపారాలు లేవని సాకుతో వారంతా వెళ్లిపోయారు. ప్రస్తుతం అయిదు స్టాల్స్‌లో మాత్రమే కూరగాయలు విక్రయిస్తున్నారు. ఇక్కడి నుంచి వెళ్లిపోయిన చిరువ్యాపారులు, రైతులు పట్టణంలోని రోడ్లపై, ఫుట్‌పాత్‌లపై దుకాణాలు పెట్టుకుని మంచుకు తడుస్తూ, ఎండకు ఎండుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యాపారం చేసుకుంటున్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు తక్కువ అద్దెకు స్టాల్స్ ఇస్తామంటున్నా ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో 39 స్టాల్స్ మూత పడ్డాయి. చిరు వ్యాపారులందరినీ ఒకే చోటుకు తీసుకురావడానికి వ్యవసాయ మార్కెట్, పురపాలక అధికారుల మధ్య సమన్వయం లోపించడంతో ఈ పరిస్థితి నెలకొందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరో వైపు రోడ్ల వెంబడి, ఫుట్‌పాత్‌లను, మున్సిపల్ స్థలాలను ఆక్రమించి వ్యాపారులు చేస్తుండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

అందరినీ మళ్లీ తీసుకొస్తాం

రైతుబజారులో చిరు వ్యాపారులు, రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాం. కానీ కొందరు రోడ్ల వెంబడి, పురపాలక స్థలాలను ఆక్రమించి ఫుట్‌పాత్‌లపై పెట్టి విక్రయిస్తున్నారు. రెండు మూడు రోజుల్లో వారిని ఖాళీ చేయించి అందరూ రైతుబజారులో విక్రయించుకునేలా చూస్తాం. – సువర్ణకుమార్, కనిగిరి టీపీవో

డీఎస్సీ స్టడీ మెటీరియల్ అందజేత

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: గిద్దలూరు గ్రంథాలయానికి అర్థవీడు మండలానికి చెందిన చేయూత ఫౌండేషన్ నిర్వాహకులు ఎన్.రామసుబ్బారెడ్డి డీఎస్సీ స్టడీ మెటీరియల్ మంగళవారం అందజేశారు. గిద్దలూరు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గొటిక రవీంద్రనాథరెడ్డి, గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి, విశ్రాంత ఉపాధ్యాయులు డి.వి.పిచ్చయ్య, రామరెడ్డి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

కనిగిరి : 8008574114
గిద్దలూరు పట్టణం : 8008574135

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

అర్థవీడు, న్యూస్‌టుడే

?: బొల్లుపల్లినాయిని చెరువు తూము లీకేజీతో నీరంతా వృథా అవుతోంది. దీనికి మరమ్మతులు చేయాలి. – నగేష్, బొల్లుపల్లి

✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం.– శ్రీను నాయక్ జేఈ, నీటి పారుదల శాఖ, అర్థవీడు

?: మాగుటూరు పెద్దవాగుపై ఉపాధి హామీ పథకంలో చెక్‌డ్యామ్‌లు నిర్మించాలి. తద్వారా వరద నీటిని నిల్వ చేసి భూగర్భ జలాల పెంపునకు సహకరించాలి.
–చెంచయ్య, మాగుటూరు

✓: ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే నిర్మాణాలు చేపడతాం.
– శ్రీనివాసరెడ్డి, ఏపీవో, అర్థవీడు

అడవులకు నిప్పు పెట్టడం నేరం

అర్థవీడు, న్యూస్‌టుడే: అడవులకు నిప్పు పెట్టడం చట్టరీత్యా నేరమని అటవీ శాఖ డీఆర్వో ప్రసాద్‌రెడ్డి అన్నారు. మిట్టమీదిలిపల్లిలో వన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అడవులకు నిప్పు పెట్టడం వల్ల విలువైన అటవీ సంపద నాశనమవుతుందని, మూగజీవులు ప్రాణాపాయ స్థితిలో పడతాయన్నారు. దీనిపై పశుకాపరులు అవగాహన కలిగి ఉండాలని కోరారు. దొనకొండ, మార్కాపురం బీట్ అధికారులు కొండలరావు, కల్పన పాల్గొన్నారు.

గ్రామీణులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పారిశుద్ధ్యం, నీటి సరఫరాలో అశ్రద్ధ తగదు

కనిగిరి, న్యూస్‌టుడే: పారిశుద్ధ్యం, నీటి సరఫరా విషయంలో అశ్రద్ధ చేయవద్దని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీధర్ సూచించారు. చింతలపాలెం, శంకవరం, ఎస్సీ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. వీధి దీపాలు, మురుగు కాలువలు శుభ్రంగా లేవని ఫిర్యాదులు వస్తున్నాయని, వాటి విషయంలో శ్రద్ధ వహించాలని ఆదేశించారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు దృష్టికి తీసుకొస్తున్నారు. గ్యాంగ్ వర్క్ ద్వారా ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమం చేపట్టాలని, మంచినీటి పథకాలను శుభ్రం చేయించాలన్నారు. అనంతరం అన్న క్యాంటీన్ తనిఖీ చేశారు. పేదలకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయక్ రహీల్ పాల్గొన్నారు.

పైసలొస్తేనే బాగు.. అప్పటి వరకు ఆగు

తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి అక్కపల్లి వెళ్లే రహదారిపై ఇటుక బట్టీల వద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారిలో పోట్లవీడు, ఆకవీడు, జేపీ చెరువు, అక్కపల్లి తదితర గ్రామాల ప్రజలు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని.. నిధులు మంజూరైన వెంటనే బాగు చేయిస్తామని రోడ్లు భవనాల శాఖ డీఈ రాంబాబు తెలిపారు. – న్యూస్‌టుడే, కంభం

చెక్క ముక్క.. ఆగుతుందా నీటి చుక్క

గిద్దలూరు పురపాలకలోని కొప్పువారివీధి చివరలో రాధాకృష్ణ సత్సంగం వద్ద ఇనుప పైపులైను తుప్పు పట్టింది. కుళాయిలకు నీటిని వదిలిన సమయంలో ఆ ప్రదేశంలో నీరు లీకై మురుగు కాలువల్లోకి వృథాగా పోతోంది. పురపాలక సిబ్బంది శాశ్వత మరమ్మతులు చేయకుండా లీకును అరికట్టడానికి చెక్క ముక్కను అడ్డుగా ఉంచారు. అయినా నీరు పోతూనే ఉంది. – న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో ఎస్‌టీయూ నాయకులు

అభ్యసన సామగ్రి అందజేత

కంభం, న్యూస్‌టుడే: మండలంలోని పలు ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఎస్‌టీయూ నాయకులు మంగళవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. సంఘం మండల అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు, నాయకుడు ఎస్ఎండీ ఇబ్రహీం మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ ఆధ్వర్యంలో యూపీ నరసింహారెడ్డి చారిటబుల్ ట్రస్టు సహకారంతో మెటీరియల్ రూపొందించినట్లు తెలిపారు.

గిద్దలూరు పట్టణం: ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి జనవరి 1 సందర్భంగా నాయకులు, అధికారులు అందజేసిన రాత పుస్తకాలు, అట్టలు, పెన్నులను స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. తెదేపా నాయకుడు కృష్ణకిశోర్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ బైలడుగు బాలయ్య, కౌన్సిలర్లు గడ్డం భాస్కర్‌రెడ్డి, లొక్కు రమేష్ పాల్గొన్నారు.

రక్తదానంపై అపోహలు వద్దు

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: రక్తదానంపై అపోహలు వీడి ఆరోగ్యవంతులందరూ ముందుకు రావాలని పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పాలుగుళ్ల భార్గవరెడ్డి సూచించారు. గిద్దలూరు సూర్యా విద్యానికేతన్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు 25 మంది రక్తదానం చేశారు. పాఠశాల అధినేతలు డి.జి.బ్రహ్మానందరెడ్డి, పద్మావతి పాల్గొన్నారు.

గిద్దలూరులో నినాదాలు చేస్తున్న వీఆర్వోలు

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గిద్దలూరు మండల రెవెన్యూ ఉద్యోగులు వర్క్‌టూ రూల్ పాటించారు. సాయంత్రం అయిదు గంటలకు విధులు ముగించుకొని కార్యాలయం బయటకు వచ్చారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకూ వర్క్ టూ రూల్ అమలు చేస్తామని జిల్లా వీఆర్వో సంఘం అధ్యక్షుడు వై.పి.రంగయ్య అన్నారు. నాయకులు వెంకటరామయ్య, రాజశేఖర్‌రెడ్డి, అచ్చయ్య, స్వర్ణ పాల్గొన్నారు. ◗ రాచర్ల, న్యూస్‌టుడే : రాచర్లలో తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడు శ్రీరాం రంగయ్య, వీఆర్వోలు వినతిపత్రం అందజేశారు.

గుర్తింపు సంఖ్య తప్పనిసరి

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: పట్టాదారు పాసుపుస్తకం కలిగిన ప్రతి రైతు రైతు సేవా కేంద్రాల్లో గుర్తింపు సంఖ్య నమోదు చేయించుకోవాలని ఏవో పి.మధుబాబు సూచించారు. చింతలపాలెం, కొండబోయినపల్లిలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ-పంట నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు. వీఏఏ ఎన్.రమేష్ పాల్గొన్నారు. ● బేస్తవారపేట, న్యూస్‌టుడే: పంటలకు ఎరువులను అవసరమైన మేర మాత్రమే వాడుకోవాలని ఏవో అబ్దుల్ రఫిక్ సూచించారు. పొలం పిలుస్తోందిలో భాగంగా గంటాపురం, చెరుకుపల్లిలో యూరియా అధికంగా వాడటం వల్ల కలిగే అనర్థాలను రైతులకు వివరించారు. కంది మద్దతు ధరను ప్రభుత్వం రూ.8 వేలుగా నిర్ణయించిందని చెప్పారు. ●వెలిగండ్ల, న్యూస్‌టుడే: ప్రతి రైతు ఈ-పంట నమోదు చేయించుకోవాలని తెదేపా మండల అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి కోరారు. తెదేపా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు కోరారు. రైతులకు యూరియా అందుబాటులో ఉందన్నారు.

క్రీడా దుస్తుల వితరణ

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: అంబవరం ఉన్నత పాఠశాలలో 35 మంది విద్యార్థులకు ఎ.కొత్తపల్లి సర్పంచి ముప్పాళ్ల శ్యామల రూ.26 వేలు విలువ చేసే క్రీడా దుస్తులను అందించారు. దాతకు ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎం షరీఫ్, పీడీ వై.కరుణాకర్, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

లభించని గల్లంతైన వ్యక్తి ఆచూకీ

కంభం, న్యూస్‌టుడే: స్థానిక చెరువులో ఆదివారం ఈతకు వెళ్లి గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభించలేదు. గట్టున ఉన్న చెప్పుల ఆధారంగా కాటమాల అశోక్‌కుమార్‌గా భావించి గల్లంతైన వ్యక్తి భార్య అంకమ్మ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

ఉద్యోగులకు ఉత్తమ పురస్కారాలు

జేసీ నుంచి అవార్డు అందుకుంటున్న తహసీల్దార్ జయలక్ష్మి, డీఎం మహమ్మద్ సయానాబేగం

కనిగిరి, న్యూస్‌టుడే: మార్కాపురంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన కనిగిరి తహసీల్దార్ నర్రా జయలక్ష్మి, ఆర్టీసీ డీఎం మహమ్మద్ సయానాబేగంకు జేసీ పులి శ్రీనివాసులు ప్రశంసాపత్రాలు అందజేశారు.

బేస్తవారపేట: ఉత్తమ అవార్డు అందుకున్న బేస్తవారపేట ఎస్సీ బాలికల వసతి గృహ సంరక్షకురాలు సీహెచ్ స్వర్ణలతను అంబేడ్కర్ ఆశయ సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుల్లా చిన్న సుబ్బయ్య ఆధ్వర్యంలో తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు.

కంభం: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పురస్కారాలు అందుకున్న జూనియర్ సహాయకుడు ఎం.విజయ్, ఆర్ఐ ఆంజనేయులు, వీఆర్వోలు మస్తాన్‌వలి, డిప్యూటీ, గ్రామ సర్వేయర్లు వై.శ్రీవాణి, సురేష్‌లను తహసీల్దార్ కిరణ్, డీటీ శ్రీనివాస్ సత్కరించారు.

కంభంలో ప్రశంసాపత్రాలు అందుకున్న వారికి సత్కారం

గౌస్ ఖాన్‌కు జ్ఞాపిక అందజేత

ఉర్దూ ఉపాధ్యాయుడికి..

కంభం, న్యూస్‌టుడే: తెలంగాణ ఇస్లామియా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో 26న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 'మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై' కవితా సంపుటి పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి రాష్ట్రంలోని కవులు రాసిన కవితల్లో స్థానిక మండల పరిషత్తు ఉపాధ్యాయుడు మహమ్మద్ గౌస్ ఖాన్ కవితకు ప్రశంసలు దక్కగా నిర్వాహకులు సత్కరించారు.

ఆర్థిక సాయం అందజేత

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: సీతారాంపురం జడ్పీ పాఠశాలలో 2022-2024లో పదో తరగతిలో మెరుగైన మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించి చదువుకుంటున్న ఏడుగురు విద్యార్థులకు గ్రామానికి చెందిన దాత డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరెడ్డి రూ.2 వేల చొప్పున అందజేశారు. ఏటా పాఠశాలలో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక సాయం అందిస్తానని ఆయన ప్రకటించారు. సర్పంచి రవీంద్ర వాణిరెడ్డి విద్యార్థులకు పరీక్ష సామగ్రి కోసం రూ.12 వేలు ఇచ్చారు. హెచ్ఎం పద్మావతి, ఎంఈవోలు పెద్దిరాజు, రమణయ్య, మాజీ ఎంఈవో నాగిరెడ్డి, ఎంఈవోల సంఘం జిల్లా అధ్యక్షుడు రామిరెడ్డి పాల్గొన్నారు.

కనిగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి తెదేపా కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న పార్లమెంటరీ స్థాయి శిక్షణ తరగతుల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో కలిసి కనిగిరి ఎమ్మెల్యే, తెదేపా ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొన్నారు.

12న సమ్మె

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: వచ్చే నెల 12న చేపడుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో తాము పాల్గొంటున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులరెడ్డి, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సూర్యచంద్రకు కార్మికులు, ఆశా వర్కర్లు సమ్మె నోటీసులు అందజేశారు.

బస్సు తిప్పాలని వినతి

కనిగిరి, న్యూస్‌టుడే: వెలిగండ్ల మండలం వెదుళ్ల చెరువుకు కనిగిరి డిపో నుంచి బస్సులు నడపాలని సర్పంచి తాతపూడి సురేష్‌బాబు మంగళవారం డీఎం సయనాబేగంను కలిసి వినతిపత్రం అందజేశారు.

గిద్దలూరు స్టేట్ బ్యాంకు వద్ద నిరసన

అనారోగ్యాల బారిన ఉద్యోగులు

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: బ్యాంకు ఉద్యోగులకు వారానికి ఐదు రోజులు మాత్రమే పనిదినాలు కేటాయించాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ సంఘం నాయకుడు రంగప్రసాద్ డిమాండ్ చేశారు. గిద్దలూరు స్టేట్ బ్యాంక్ ఆవరణలో జరిగిన సమ్మెలో ఉద్యోగులు పాల్గొన్నారు. సరైన విశ్రాంతి లేక ఉద్యోగులు అనారోగ్యాల బారిన పడుతున్నారని తెలిపారు. యూనియన్ బ్యాంకు మేనేజర్ ఫరూక్, సంఘ నాయకుడు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

కనిగిరి, న్యూస్‌టుడే: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ డిపోలో ఉద్యోగుల పిల్లలకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. డీఎం సయానాబేగం మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకతను ప్రోత్సహించడంతో పాటు సామాజిక అవగాహన కల్పించేందుకు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన బాలిక రిషాన్‌కు జిల్లా స్థాయిలో జరిగే కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి, ప్రశంసాపత్రం అందజేస్తామని డీఎం తెలిపారు.


చిత్రాలను ప్రదర్శిస్తున్న పిల్లలు

విద్యార్థి దశలో కీలకం పది

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు అనురాధ

పీసీపల్లి, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన మలుపు అని ఎంపీడీవో కృష్ణారావు, ఎంఈవోలు శ్రీనివాసులు, సంజీవ్ అన్నారు. పీసీపల్లి, పెదఇర్లపాడు, గుంటుపల్లి, పెద అలవలపాడు, మురుగమ్మి, నేరేడుపల్లి ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. తెదేపా మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య పాల్గొన్నారు.

కనిగిరి: కనిగిరి మున్సిపాలిటీలోని మోడల్ పాఠశాలల వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు తులసి పద్మావతి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు.

కంభం: పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని సర్పంచి మాదా సుభద్ర, మాజీ సర్పంచి నారిశెట్టి వీరమ్మ పేర్కొన్నారు. తురిమెళ్ల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం జరిగింది. ప్రధానోపాధ్యాయుడు షేక్ మొయినుద్దీన్, ప్రిన్సిపల్ సోని, స్థల దాత కుమారుడు పి.నాగేశ్వరరావు, ఎంఈవోలు అబ్దుల్ సత్తార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బేస్తవారపేట: బేస్తవారపేట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు అనురాధ పాల్గొన్నారు.

హెచ్ఎన్‌పాడు: నృత్యం చేస్తున్న బాలికలు

హనుమంతునిపాడు: సీతారాంపురం జడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, ఎంఈవోలు పెద్దిరాజు, రమణయ్య, విశ్రాంత ఎంఈవో నాగిరెడ్డి పాల్గొన్నారు.

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: సి.నాగులవరం జడ్పీ ఉన్నత, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఎంఈవో రాజాల కొండారెడ్డి పాల్గొన్నారు.



(c) eenadu

వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, విద్యార్థుల సందడి

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో సాగాలి

పొదిలి, న్యూస్‌టుడే: విద్యార్థులు మంచి లక్ష్యం నిర్దేశించుకుని సాధనకు సాగాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చెప్పారు. మంగళవారం పొదిలి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు కరిమూన్‌బీబీ అధ్యక్షతన జరిగిన వార్షికోత్సవ సభలో పాల్గొని మాట్లాడారు. కూటమి పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగుపడ్డాయని, వాటిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పాఠశాలలో ఆడిటోరియం పైకప్పు, నీటి సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు తయారు చేయించి ఆగస్టు 15 నాటికి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సైన్సు ప్రాజెక్టులో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనపర్చిన చక్రి, దర్శితేజ, క్విజ్‌లో జిల్లా స్థాయి ప్రథమ స్థానంలో నిలిచిన సుదర్శన్‌లను నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఆటలపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ఆటా పాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పొదిలి సీఐ రాజేష్‌కుమార్, తహసీల్దార్ కృష్ణారెడ్డి, కమిషనర్ ఎ. మారుతీరావు, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు, తెదేపా నాయకులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల, జడ్పీ ఉన్నత పాఠశాల, ఉప్పలపాడు జడ్పీ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో వార్షికోత్సవం నిర్వహించారు.

జోసెఫ్‌ను అభినందిస్తున్న ఎంఈవోలు, గ్రామస్థులు, ఉన్నత పాఠశాలలో నిర్మించిన షెడ్డు

ఉపాధ్యాయుడు జోసెఫ్ సేవలు అభినందనీయం

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: తాను చదువులు చెప్పే పాఠశాలలో సొంత నిధులు వెచ్చించి విద్యార్థులకు షెడ్డును నిర్మించి మంచి మనసును చాటుకున్నారు ఓ ఉపాధ్యాయుడు. మార్కాపురం మండలంలోని జమ్మనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు బి.ఎ.జోసెఫ్ పాఠశాలలో చేరినప్పటినుంచి విద్యార్థుల ఉన్నతి కోసం శ్రమిస్తూ, జీతంలోని కొంతభాగంతో వారికి మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ఉదారత ప్రదర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలలో రూ.2 లక్షలు నిధులు ఖర్చుచేసి షెడ్డు నిర్మించారు. మంగళవారం మండల విద్యాధికారులు రాందాస్‌నాయక్, శ్యాంబాబు రేకుల షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు జోసెఫ్ మాస్టారు కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మస్తాన్, పాఠశాల కమిటీ ఛైర్మన్ పావని జయసుధ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గిద్దలూరు మండల రెవెన్యూ ఉద్యోగులు వర్క్‌టూ రూల్ పాటించారు. సాయంత్రం ఐదు గంటలకు విధులు ముగించుకొని కార్యాలయం బయటకు వచ్చారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకూ వర్క్ టూ రూల్ అమలు చేస్తామని జిల్లా వీఆర్వో సంఘం అధ్యక్షుడు పి.పి.రంగయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరామయ్య, రాజశేఖర్‌రెడ్డి, అచ్చయ్య, స్వర్ణ పాల్గొన్నారు.

రాచర్ల, న్యూస్‌టుడే :డిమాండ్లు నెరవేర్చాలని రాచర్లలో తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడు శ్రీరాం రంగయ్య, వీఆర్వోలు వినతిపత్రం అందజేశారు.

సార్వత్రిక సమ్మెలో పాల్గొంటాం

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: వచ్చే నెల 12న చేపడుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో తాము పాల్గొంటున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులరెడ్డి, పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సూర్యచంద్రిక కార్మికులు, ఆశా వర్కర్లు సమ్మె నోటీసులు అందజేశారు. పోరాటాలు తప్పవన్నారు.

బస్సు సర్వీసులకు వినతి

కనిగిరి, న్యూస్‌టుడే: వెలిగండ్ల మండలం వెదుళ్ల చెరువుకు కనిగిరి డిపో నుంచి బస్సులు నడపాలని సర్పంచి తాతపూడి సురేష్‌బాబు మంగళవారం డీఎం సయనాబేగంను కలిసి వినతిపత్రం అందజేశారు. బస్సులు అందుబాటులో లేక ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

మార్కాపురం

•మార్కాపురం •యర్రగొండపాలెం

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మార్కాపురం గ్రామీణం: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడినట్లు మార్కాపురం మండలం రాయవరం గ్రామంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వెంకటరమణ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా ఫిబ్రవరి 19 వరకు సమర్పించవచ్చని ఆమె అన్నారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైటు గానీ, పాఠశాలలో గానీ సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

పద్మశ్రీ ప్రకటించడం హర్షణీయం

పొదిలి, న్యూస్‌టుడే: శ్రీకంచి కామకోటి శంకర విద్యాలయ ఛైర్మన్ వెంపటి కుటుంబ శాస్త్రికి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించడం సంతోషకరమని పొదిలి శంకర విద్యాలయ బోర్డు సభ్యులు మాచవరపు మణిశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సాహితీవేత్తగా, శ్రీచంద్రశేఖర సరస్వతి విశ్వమహా విద్యాలయ వైస్‌ఛాన్సలర్‌గా పనిచేస్తున్నారన్నారు.

మెలకువలు ముఖ్యం.. మార్కులు ఖాయం

పదో తరగతి పరీక్షలు మార్చి 16 నుంచి ప్రారంభం కాబోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 28,632 మంది పరీక్షలు రాయనున్నారు. సంవత్సరం అంతా చదివింది ఒక ఎత్తు.. చివరి మూడు నెలలు చదివింది ఒక ఎత్తు. పరీక్షలకు ఇక కొద్ది రోజులు మాత్రమే ఉన్నాయని చెప్పాలి. ఇలాంటి తరుణంలో పదో తరగతి విద్యార్థులు భయాన్ని వీడి మెలకువలు పాటిస్తే అత్యుత్తమ మార్కులు సాధిస్తారని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా కష్టం అనుకుంటున్న గణితం, భౌతికశాస్త్రం, ఆంగ్ల సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించవచ్చని సబ్జెక్టు నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలు.. న్యూస్‌టుడే, మార్కాపురం పట్టణం:

☛ పది విద్యార్థులకు సబ్జెక్టు నిపుణుల సూచనలు

పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

నిత్య జీవిత ఉదాహరణలతో పోల్చుకోండి

విద్యార్థులకు భౌతికశాస్త్రం కష్టంగా అనిపించినా ఆయా అంశాలను మన నిత్యజీవితంలో జరిగే ఉదాహరణలకు అన్వయించడం ద్వారా ఎక్కువ కాలం గుర్తుంచుకోవచ్చు. అన్ని పాఠాలపై పట్టు అవసరం. అయితే 1,2,10,11 పాఠాలను మరింత సాధన చేయాలి. అదే విధంగా కార్బన్ కాంపౌండ్ విధానాన్ని చదివితే మంచి మార్కులు పొందవచ్చు. -ఎస్.విజయభారతి, భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలు, జడ్పీబాలికల ఉన్నత పాఠశాల, మార్కాపురం

ఎక్కువసార్లు సాధన చేయాలి

గణితం సబ్జెక్టులో బలహీనంగా ఉన్న విషయాలను గుర్తించి వాటిపై పట్టు సాధించేందుకు ఎక్కువసార్లు సవిరణాత్మక సాధన చేయాలి. 100 రోజుల ప్రణాళికను అనుసరిస్తూ నమూనా పథకం ద్వారా ముందుకు సాగాలి. 8 మార్కుల ప్రశ్నల విభాగంలో వాస్తవ సంఖ్యలు, సంభావ్యత, నిరోధక జ్యామితి, సాంఖ్యక శాస్త్రం, రెండు చరరాసులు, శాఖీయ సమీకరణాల జత చాప్టర్ల నుంచి ప్రశ్న ఎలా వచ్చినా రాసే విధంగా సిద్ధం కావాలి. - వి.ఆంజనేయులు, గణితశాస్త్ర ఉపాధ్యాయులు, జడ్పీబాలుర ఉన్నత పాఠశాల, మార్కాపురం

సెక్షన్ ఎ, బి, సీలను ఎక్కువ చదవాలి

ఇంగ్లిష్ సబ్జెక్టులో సెక్షన్ ఏ,బీ,సీలను ఎక్కువగా ప్రిపేర్ కావాలి. సెక్షన్ ఏలో కాంప్రహెన్షన్, ప్యాసేజ్‌లను చూసి జాగ్రత్తగా రాసుకోవడం ద్వారా 30 మార్కులు సాధించవచ్చు. సెక్షన్ బీలో గ్రామర్, ఒకాబులరీ చదవడం ద్వారా ఎక్కువ మార్కులొస్తాయి. సెక్షన్ సీలో సృజనాత్మక, వ్యక్తీకరణలో ప్రాథమిక నిర్మాణమైన లెటర్ రైటింగ్, డైరీ ఎంట్రీ, సమాచార పద్ధతులను ఉపయోగించడం, లెటర్ అంతా ఒకే పేజీలో వచ్చేటట్లు రాస్తే మంచి మార్కులకు అవకాశం ఉంటుంది. - ఎస్‌కె.రుక్సానా ఫర్వీన్, ఇంగ్లీషు ఉపాధ్యాయురాలు, జడ్పీబాలికల ఉన్నత పాఠశాల

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
యర్రగొండపాలెం : 8008552658

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే:

?: పట్టణంలోని మాచర్ల రహదారి ఆంజనేయ స్వామి విగ్రహం ఎదురుగా అపరిశుభ్రత నెలకొంది. మూగజీవాలు చనిపోయినా అక్కడి నుంచి తొలగించడంలేదు. పారిశుద్ధ్య చర్యలు కరవై దుర్గంధం వ్యాపిస్తోంది. వెంటనే చర్యలు తీసుకోగలరు. – వెంకటసుబ్బయ్య, స్థానికుడు

✓: పంచాయతీ సిబ్బందిని పంపించి పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. దోమలు వ్యాప్తిచెందకుండా, సమస్య లేకుండా చేస్తాం. – యలకా శ్రీను, పంచాయతీ కార్యదర్శి

కొనకనమిట్ల, న్యూస్‌టుడే:

?: నాగిరెడ్డిపల్లె - వెలిగొండ మార్గం మధ్య సాగర్ నీళ్ల సరఫరా పైపులైన్ పగిలి కొన్నాళ్లుగా తాగునీరు వృథా అవుతోంది. వెంటనే చర్యలు తీసుకోగలరు. – రమేష్, గార్లదిన్నె

✓: రెండు రోజుల్లో పైపులైన్ మరమ్మతులు చేయిస్తాం. శ్రీకాంత్, గ్రామీణ నీటిసరఫరా ఏఈ

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే:

?: పట్టణంలో పందుల విహారం ఎక్కువగా ఉంది. దీంతో ప్రజలకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో ఉన్న పెద్ద నీళ్ల ట్యాంక్ వద్ద వీటి సంచారం ఎక్కువగా ఉంటోంది. వీటి పరిష్కారం విషయంలో మున్సిపల్ సిబ్బంది తీవ్రంగా నిర్లక్ష్యం వహిస్తున్నారు. పలు మార్లు కౌన్సిల్ సమావేశంలో చెప్పినా పట్టించుకొన్న నాథుడే లేకపోయాడు. కనీసం ఇప్పుడైనా పట్టించుకోండి. – ఐ.రమేష్, పట్టణవాసి

✓: సమస్య మా దృష్టికి వచ్చింది. దీనిపై సిబ్బందితో చర్చించి పందుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడతాం. పందులను పట్టణంలో వదలకుండా వారికి నోటీసులు అందజేస్తాం. – డీవీఎస్.నారాయణరావు, మున్సిపల్ కమిషనర్, మార్కాపురం

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే:

?: పట్టణంలోని పడమటి జబారులో పలుచోట్ల వీధిదీపాలు పనిచేయడంలేదు. రాత్రివేళ ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే బాగు చేయించాలి: – సుబ్బారావు, స్థానికుడు

✓: మరమ్మతులు చేయించే ఏర్పాటు చేస్తాం. అవసరమైతే కొత్తవి వేయించే విధంగా చూస్తాం. – రామసుబ్బయ్య, పీఎస్, వై.పాలెం.

బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పొదిలి: బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని బ్యాంకు యూనియన్ల ఐక్య వేదిక నాయకులు నాగేంద్రబాబు అన్నారు. మంగళవారం పొదిలి ఎస్‌బీఐ బ్రాంచి ఎదుట ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బ్యాంకు ఉద్యోగులకు వారానికి ఐదు రోజుల పనిదినాన్ని అమలు చేయాలన్నారు. బ్యాంకు యూనియన్ల ఐక్య వేదిక పిలుపు మేరకు ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నట్లు చెప్పారు. వీరికి సీఐటీయూ నాయకులు ఎన్.వెంకటేశ్వరరెడ్డి, బి.కోటేశ్వరరావు, నగేష్‌లు మద్దతుగా పాల్గొన్నారు. బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రతినిధులు జగదీష్, బాబు, వాసు, నరసింహారావు, రాజేశ్వరరావు, ఆంజనేయులు, పవన్, విజయ, అన్నపూర్ణ, పొదిలి, మర్రిపూడి, కొనకనమిట్ల మండలాల్లోని బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఎదుట నినాదాలు చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

రైతులతో మాట్లాడుతున్న ఏవో జవహర్‌లాల్‌నాయక్

సస్యరక్షణ చర్యలపై అవగాహన

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: మిరప, వేరుసెనగ పంటల సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై మండల వ్యవసాయాధికారి జవహర్‌లాల్‌నాయక్ అవగాహన కల్పించారు. పెద్దబొమ్మలాపురం, బోడేనాయక్‌తండాలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మిరప, వేరుసెనగ పంటలను ఆయన పరిశీలించారు. ఆశించిన చీడ పురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈవో చైతన్యకుమార్, వీఏఏ పరిపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు తాత్కాలికం.. గుంతలు నిరంతరం

ఒంగోలు - పొదిలి మధ్యలో ఉన్న ఈ మూసి వంతెనపై గుంతలు పడి కంకర లేచి ప్రమాదకరంగా మారింది. భారీ వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో తాత్కాలిక మరమ్మతులు చేయించినా నెల రోజులకే మళ్లీ యథాస్థితికి వస్తోంది. గుంతలు చూడక పోయినా, ఏ మాత్రం పట్టుతప్పినా జారి పడక తప్పడంలేదు. ఈ మార్గంలో నిత్యం జిల్లా ఉన్నతాధికారులు రాకపోకలు సాగిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వంతెన వరకైనా పూర్తిస్థాయిలో తారురోడ్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. పొదిలి, న్యూస్‌టుడే:

కొనకనమిట్లలో కలుషిత నీటి సరఫరా

కొనకనమిట్ల, న్యూస్‌టుడే: సాగర్ నిల్వ ట్యాంకు వద్ద గ్రామాలకు సరఫరా చేసే వాటర్ ఫిల్టర్లు మరమ్మతులకు గురికావడంతో కలుషితమైన నీరు సరఫరా అవుతోంది. కొనకనమిట్ల, ఎదురాళపాడు, వద్దిమడుగు, మర్రిపాలెం, చౌటపల్లె తదితర గ్రామాల్లో పది రోజులుగా కలుషితమైన, రంగుమారిన నీరు సరఫరా జరుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వద్దిమడుగు ట్యాంకు మూడు నెలలుగా శుభ్రం చేయక నీరు కలుషితం కావడంతో ప్రజలకు ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ విషయమై పలు మార్లు పంచాయతీ, గ్రామీణ నీటి సరఫరా అధికారులకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. చేసేది లేక రూ.10 చెల్లించి శుద్ధినీరు కొనుగోలు చేస్తున్నామన్నారు.

పైపుల్లో వచ్చిన రంగుమారిన నీరు

ఈ రోడ్డుపై ఎలా వెళ్లాలి సారూ..

వై.పాలెం మండలంలోని వెంకటాద్రిపాలెం నుంచి పునరావాస చెంచు కాలనీ, సంఘంతండా, గండిచెరువుకు వెళ్లే రోడ్డు దుస్థితి ఇది. చూడ్డానికి తారురోడ్డే. ఇరువైపులా కంపచెట్లు ఇలా అల్లుకుపోయాయి. వాహనదారులు వెళ్తుంటే కొమ్మలు, వాటి ముళ్లు గుచ్చుకుంటున్నాయి. రోడ్డు వేసిన ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారులు నిర్వహణ పనులు గాలికొదిలేశారు. ఫలితంగా వ్యవసాయ ఉత్పత్తులు రవాణా చేసేందుకు ఇబ్బందులు తప్పడంలేదని రైతులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులైనా స్పందించి చిల్లచెట్లు తొలగించాలని ప్రజలు, రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. యర్రగొండపాలెం, న్యూస్‌టుడే:

విశ్వనాథపురంలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న హెచ్‌ఎం

పెద్దదోర్నాల: విద్యార్థినికి జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపల్ సరళ

కస్తూర్బా పాఠశాల్లో పాల్గొన్న బాలికలు

వార్షికోత్సవ వేళ.. విద్యార్థుల ఆనందహేల

● ఉల్లాసంగా సాగిన కార్యక్రమాలు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: వై.పాలెంలో ప్రభుత్వ ఉన్నత, కస్తూర్బా బాలికల పాఠశాలల్లో మంగళవారం ఆనందోత్సవాల మధ్య వార్షికోత్సవాలు నిర్వహించారు. విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మార్కాపురం జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక అన్నారు. వై.పాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల జరిగిన వార్షికోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఎండీ ఖాసీం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ఆంజనేయులు, మల్లునాయక్, ఇందిరాప్రసాద్, ఎం.భాస్కర్ విద్యార్థులు పాల్గొన్నారు.

● కస్తూర్బాలో ముఖ్య అతిథిగా సీఐ అజయ్ కుమార్ పాల్గొన్నారు. ప్రిన్సిపల్ తిరుమలదేవి అధ్యక్షత వహించారు.

క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలి

పెద్దదోర్నాల: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని మోట్ల మల్లికార్జునపురం ఏపీ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సరళ కోరారు. ఆ పాఠశాలలో మంగళవారం వార్షికోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా చదువు, ఆటలు, పాటల పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

త్రిపురాంతకం గ్రామీణం: మండలంలోని మేడపి, త్రిపురాంతకం, గణపవరం, విశ్వనాథపురం, రామసముద్రం జడ్పీ పాఠశాలల్లో వార్షికోత్సవాలతో పాటు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈవోలు కేటీ మల్లికార్జున నాయక్, టి.రాజశేఖరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఈ పోలీసు స్టేషన్‌కు ఎస్సై కావలెను!

న్యూస్‌టుడే, పొదిలి:

పొదిలి పోలీసుస్టేషన్‌కు ఎస్సై పోస్టు భర్తీ చేయకపోవడంతో పర్యవేక్షణ గాడి తప్పుతోంది. దొంగలు, ఆకతాయిలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జిల్లా నడికూడలిగా ఉన్న మండలం పొదిలి. గత నెల 28న ఓ వ్యాపారిపై చెయ్యి చేసుకోవడంతో ఉన్నతాధికారులు అప్పటి ఎస్సై వి.వేమనను వీఆర్‌కు పిలిపించారు. సుమారు నెల రోజులు కావస్తున్నా కొత్తగా ఎస్సైని నియమించలేదు.

గతంలో ఎప్పుడూ లేదు: ఇన్ని రోజులు గతంలో ఈ స్టేషన్ ఎస్సై పోస్టు ఖాళీగా ఎప్పుడూ లేదని పలువురు సిబ్బంది తెలిపారు. వివిధ పనులపై పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలో ట్రాఫిక్, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల ప్రొటోకాల్, నైట్‌బీట్, శాంతిభద్రతల సమస్యలపై నిత్యం అప్రమత్తంగా ఉండాల్సిన అధికారి పోస్టు నెల రోజులుగా ఖాళీగా ఉంది. తరచూ పొదిలి సీఐ ఎం.రాజేష్‌కుమార్ పట్టణంలో ట్రాఫిక్, ఇతరత్రా సమస్యలపై దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే నగర పంచాయతీ కమిషనర్ ఎ.మారుతీరావుతో కలిసి ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలకు ఉపక్రమించారు. ఉన్నతాధికారులు స్పందించి ఖాళీగా ఉన్న పొదిలి ఎస్సై పోస్టును భర్తీ చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

యూరియాకు ఎలాంటి కొరతా లేదు

న్యూస్‌టుడే, త్రిపురాంతకం గ్రామీణం:

వెల్లంపల్లి పీఏసీఎస్ వద్ద రైతులకు యూరియా అందిస్తున్న సిబ్బంది

యూరియాకు ఎలాంటి కొరత లేదని మండలంలో ఇంకా 200 టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి బి.సంగమేశ్వరెడ్డి తెలిపారు. యూరియా కొరత ఉందంటూ రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ఆయన స్థానికంగా మాట్లాడారు.

2,534 హెక్టార్లలో పంటల సాగు

మండలంలో 2,534 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేయగా ప్రధానంగా మొక్కజొన్న 1550 హెక్టార్లు, వరి 828 హెక్టార్లు, పత్తి 123 హెక్టార్లలో సాగైందన్నారు. వెల్లంపల్లి, విశ్వనాథపురం, మేడపి గ్రామాల్లో ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగు చేశారని ఆయన తెలిపారు. ఇందుకుగాను 2,126 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఆర్ఎస్కేలు, పీఏసీఎస్‌ల ద్వారా 350 మెట్రిక్ టన్నులను సరఫరా చేశామన్నారు.

● ప్రైవేటు డీలర్లకు 800 మెట్రిక్ టన్నులను ఇచ్చామన్నారు. మొత్తంగా 1150 మెట్రిక్ టన్నులను అందించగా ఇంకా 200 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. మరో 132 టన్నులకు ఇండెంట్ పెట్టామన్నారు. ప్రైవేటు దుకాణాల వద్ద గ్రామ వ్యవసాయ సహాయకులను నిఘా ఉంచి రైతులకు అవసరమైనంత మేర యూరియాను అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించండి

మార్కాపురం గ్రామీణం: విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె ఎర్రయ్య కోరారు. మార్కాపురం మండలంలోని తిప్పాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎస్టీయూ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. గ్రామస్థుడు రెడ్డెం చిన్నగాలిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రాఘవరెడ్డి ఆర్థిక నిధులతో ఈ పుస్తకాల వితరణ జరిగింది. ఈ సందర్భంగా ఎర్రయ్య మాట్లాడుతూ ఎస్టీయూ విద్యార్థులు మంచి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కష్టపడి చదవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దిల్షాద్‌బేగం, ఉపాధ్యాయులు నారాయణ, బ్రహ్మయ్య, అమీర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

శుద్ధ జలం.. జనానికి దూరం

న్యూస్‌టుడే, పెద్దదోర్నాల, త్రిపురాంతకం గ్రామీణం:

జిల్లాలో గ్రామీణ ప్రాంతాలు, గూడేల్లో ప్రజల దాహార్తి తీర్చే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన 'జల జీవన్ మిషన్' నిర్వహణ సక్రమంగా లేక పడకేస్తోంది. దీంతో ప్రజలు దాహార్తి కోసం ప్రత్యామ్నాయ మార్గాలు అనుసరించాల్సి వస్తోంది. అంతేకాదు పథకం కింద ఏర్పాటుచేసిన పైపులు, ఇతర పరికరాలు వృథాగా మారుతున్నాయి. అందుకు తాజా ఉదాహరణగా నిలుస్తున్నాయి పెద్దదోర్నాల, త్రిపురాంతకం పరిధి పరికరాలు..

☛ పడకేసిన పథకం

లేళ్లపల్లిలో కుళాయిలు ఊడిపోయిన పైపు లైన్

చెంచు గిరిజనుల కోసమని..

పెద్దదోర్నాల పరిధి చింతల చెంచు గిరిజన గూడెంలోని చెంచు గిరిజనులకు శుద్ధజలం అందించాలనే లక్ష్యంతో అటవీశాఖ శుద్ధజల కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. దానిని మూడేళ్ల క్రితం అట్టహాసంగా ప్రారంభించగా మొదట్లో బాగున్నా కొద్ది రోజులు గిరిజనులకు నీరందించి మూసివేశారు. దీంతో అది మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. దాని పర్యవేక్షణ కోసం వ్యక్తిని నియమించకపోవడమే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పెద్దదోర్నాల: నిరుపయోగంగా శుద్ధజల కేంద్రం

రూ.70 లక్షలు వెచ్చించారు..

త్రిపురాంతకం మండలంలోని 9 గ్రామాల్లో చేపట్టిన జలజీవన్ మిషన్ పథకం అధికారుల పర్యవేక్షణ కొరవడి పడకేసింది. గొల్లపల్లి సాగర్ తాగునీటి నిల్వ జలాశయం నుంచి పథకం పరిధిలోని గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులకు నీరు సరఫరా అయ్యే ప్రధాన పైపులైన్లు దెబ్బతిన్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో మూడేళ్ల క్రితం రూ.70లక్షలతో బిగించిన పైపులైన్లు, కుళాయిలు అలంకారప్రాయంగా మారడం పట్ల గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మార్కాపురం గ్రామీణం: మండలంలోని కొండేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో నేటి నుంచి (బుధవారం) 4 రోజులపాటు పగటిపూట విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు మండల ఏఈ నాగేంద్రరెడ్డి తెలిపారు. మండలంలో జరుగుతున్న ఆర్డీఎస్ఎస్ పనుల నిమిత్తం కొండేపల్లి, గోరుగుంతలపాడు గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంటు కోత ఉండబోతోందని, ప్రజలు సహకరించాలని ఆయన అన్నారు.

అడవులకు నిప్పు పెట్టడం నేరం

అర్థవీడు, న్యూస్‌టుడే: అడవులకు నిప్పు పెట్టడం చట్టరీత్యా నేరమని అటవీ శాఖ డీఆర్వో ప్రసాద్‌రెడ్డి అన్నారు. మిట్టమీదిలిపల్లిలో వన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అడవులకు నిప్పు పెట్టడం వల్ల విలువైన అటవీ సంపద నాశనమవుతుందని, మూగజీవులు ప్రాణాపాయ స్థితిలో పడతాయన్నారు. దీనిపై పశుకాపరులు అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో దొనకొండ, మాగుటూరు బీట్ అధికారులు కొండలరావు, కల్పన పాల్గొన్నారు.

(c) eenadu

13వ తేదీ వరకు కేసీకి నీరు

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే: కేసీ కాల్వ పరిధిలో 56-150 కి.మీ వరకు సాగులో ఉన్న పంటలకు ఫిబ్రవరి 13వ తేదీ వరకు మల్యాల, ముచ్చుమర్రి పథకాల నుంచి నీటి విడుదల ఉంటుందని జలవనరుల శాఖ ముఖ్య ఇంజినీరు (సీఈ) కె.కబీర్‌పాషా తెలిపారు. కర్నూలులోని కార్యాలయంలో మంగళవారం సంబంధిత ఇంజినీర్లతో సమీక్షించారు. కేసీ కాలువ కింద సాగులో ఉన్న పంటల వివరాలను ఎస్‌ఈ బాలచంద్రారెడ్డి వివరించారు. అనంతరం సీఈ మాట్లాడుతూ ప్రస్తుతమున్న పంటలను కాపాడేందుకు నీటి విడుదల చేయాలన్న మంత్రి నిమ్మల ఆదేశాలమేరకు నీటిని విడుదల చేస్తామని, కొత్తగా సాగు చేసే పంటలకు నీటి విడుదల ఉండదని స్పష్టం చేశారు. నీటిని పొదుపుగా వాడుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. కాలువ వెంబడి లస్కర్లు, ఏఈఈలను నిరంతరం విధుల నిర్వహించేలా బాధ్యతలు అప్పగించాలని, విధుల్లో నిర్లక్ష్యం చేసే వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తూడిచెర్ల డిస్ట్రిబ్యూటరీ సిస్టం ద్వారా 600 క్యూసెక్కులను తగ్గకుండా విడుదల చేయాలన్నారు. ముచ్చుమర్రి నుంచి 4 పంపుల ద్వారా 900, మల్యాల వద్ద రెండు పంపుల ద్వారా 650 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోందని కేసీసీ ఈఈ ప్రతాప్ తెలిపారు. ఈ సమావేశంలో కర్నూలు డీఈఈ ఎన్.ప్రసాదరావు, నంద్యాల డీఈఈ రవికుమార్, ఏఈఈలు భరత్‌కుమార్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేరుసెనగ

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వేరుసెనగ ధర బంగారం రేటులా దూసుకెళ్తోంది. ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం రికార్డు ధర పలికింది. క్వింటా గరిష్ఠ ధర రూ.13,100 పలికింది. మధ్యస్థ ధర రూ.9,900, కనిష్ఠ ధర రూ.5,577లకు వ్యాపారులు కొన్నారు. గత ఏడాది డిసెంబరు 12వ తేదీన క్వింటా రూ.8,120 ఉండగా.. 45 రోజుల్లో రూ.13వేలు దాటింది. దిగుబడులు తగ్గడంతో సంక్రాంతి తరువాత ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి.

పట్టు తప్పితే
పొట్టున పెట్టుకుంటుంది

వరి పొట్టును పలు వాహనాల్లో పరిమితికి మించి తరలిస్తున్నారు. రవాణా ఖర్చులు కలిసొస్తాయన్న ఉద్దేశంతో వ్యాపారులు ఇలా చేస్తున్నారు. వాహనానికి ఇరువైపులా గోతాలు ఏర్పాటు చేయడంతోపాటు ఎత్తుగా పొట్టు వేసి రవాణా చేస్తున్నారు. ఫలితంగా ఇరుకు రహదారుల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. బండిఆత్మకూరులో ఇలాంటి వాహనాలు నిత్యం తిరుగుతుంటాయి. వాహనం ఏమాత్రం అదుపు తప్పినా.. పొట్టు జారి కింద పడినా పెను ప్రమాదం జరిగే అవకాశముంది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

మహా ప్రణాళిక.. ఆచరణలో మెలిక

పేరుకే గొప్ప.. జర్మన్‌షెడ్లు

పరిశీలన

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు చేపడుతున్న ఏర్పాట్లలో అంచనాలు తప్పుతున్నాయి. కలెక్టర్ ఆదేశించిన పనులు వేగం పెరగలేదు. ఇంజినీరింగ్ ప్రణాళికల్లో పొరపాట్లు వెలుగుచూస్తున్నాయి. పది రోజుల్లో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. పనులు చేపట్టడానికి గతేడాది నవంబరులో టెండర్లు పిలిచారు. ధర్మకర్తల మండలి ప్రమేయం లేకుండా పిలవడంతో వాయిదా వేసి, రెండోసారి టెండర్లు పిలిచారు. దీంతో కొంత సమయం కోల్పోవాల్సి వచ్చింది.

1,64,314 చ.అ విస్తీర్ణంలో తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేయడానికి ప్రణాళికలు రూపొందించారు. గంగాధర మండపం వద్ద 44,550 చ.అ విస్తీర్ణం(దాదాపు ఎకరం) స్థలంలో జర్మన్ షెడ్లు నిర్మించాలని భావించారు. కానీ వాసవీ సత్రం గోడ వైపు జర్మన్ షెడ్లు నిర్మించి, లింగాయత్ సత్రం వైపు గుడారాలతో వేసి మమ అనిపించారు. గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు మిగిలిన ఖాళీ ప్రదేశాల్లో షామియానాలతో తాత్కాలిక వసతి కల్పించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కైలాసద్వారం, హఠకేశ్వరం వద్ద జర్మన్ షెడ్ల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది.

⏩ హఠకేశ్వరం, పాలధార-పంచధార, కైలాసద్వారం, క్లాక్‌రూం,

మట్టి వేసి మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దాల్సిన గణేష్ సదన్ ఎదురుగా ఉన్న పార్కింగ్ ప్రదేశం

మెడికల్ క్యాంప్ షెడ్, తాత్కాలిక అన్నదానం, గంగాధర మండపం-నంది మండపం, అదనపు లడ్డూ విక్రయ కేంద్రాలు, చంద్రావతి కల్యాణ మండపం, 30 పడకల తాత్కాలిక ఆసుపత్రి, ఇంజినీరింగ్ స్టోర్, సీహెచ్‌సీ కల్యాణ కట్ట వద్ద జర్మన్‌షెడ్లు నిర్మిస్తున్నారు. 1,00,482 చ.అ. విస్తీర్ణంలో ఏర్పాటుకు టెండర్లు పిలిచారు. ప్రస్తుతం గంగాధర మండపం, క్లాక్‌రూం, 30 పడకల తాత్కాలిక వైద్యశాల, క్యూలైన్ల వద్ద మాత్రమే నిర్మించారు.

పార్కింగ్ ప్రదేశాల్లో సమస్యలే

బ్రహ్మోత్సవాలకు ఎక్కువగా వినియోగంలో ఉండేది గణేష్ సదన్ ఎదురుగా ఉన్న బస్, కార్ పార్కింగ్ ప్రదేశాలు. సుమారు 20 ఎకరాల్లో తాత్కాలిక బస్ పార్కింగ్ ప్రదేశాల్లో ఇప్పటివరకు పిచ్చిమొక్కలను తొలగించి, డోజర్‌తో చదును చేశారు. పిచ్చిమొక్కలను తొలగించినా, పాదరక్షలు లేకుండా నడిచే భక్తుల కాళ్లకు మొక్కల మొదళ్లు గుచ్చుకునే అవకాశముంది.

క్షేత్ర పరిధిలోని వేగనియంత్రికల వద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాటిని పూడ్చకుండా దేవస్థానం ఇంజినీర్లు థర్మో ప్లాస్టిక్ హర్డ్ పెయింట్ వేశారు. ముఖద్వారం నుంచి సున్నిపెంట వరకు వాహనాలకు అసౌకర్యంగా మారింది.

"ఈనెల 31లోపు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటాం. వేగనియంత్రికలకు మరమ్మతులు చేయిస్తాం. పార్కింగ్ ప్రదేశాల్లో కావాల్సిన ఏర్పాట్లు చేస్తామని" ఈవో ఎం.శ్రీనివాసరావు తెలిపారు..

పోస్టులు 133
దరఖాస్తులు 16,412

కర్నూలు విద్య, నంద్యాల విద్య, న్యూస్‌టుడే : కస్తూర్బా విద్యాలయాలు(కేజీబీవీ), ఆదర్శ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఒకేషనల్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లు, అటెండర్లు, వాచ్‌మెన్లు తదితర పోస్టులకు సంబంధించి ఒప్పంద పద్ధతిలో నియామకానికి చర్యలు చేపట్టింది. గతేడాది డిసెంబరు 3వ తేదీ నుంచి 11వ తేదీ వరకు అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. దీనికి అనూహ్య స్పందన లభించింది. వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. నెల దాటినా ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

కొరవడిన స్పష్టత

జిల్లా	ఖాళీలు	దరఖాస్తులు
కర్నూలు	77	8,912
నంద్యాల	56	7,500

● దరఖాస్తు ప్రక్రియ పూర్తైనప్పటి నుంచి నేటి వరకు నియామకాలపై స్పష్టత లేకపోవడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. నియామక ప్రక్రియలో మార్పులు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై స్పష్టత వచ్చిన వెంటనే అర్హుల జాబితా ప్రకటించే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

● నంద్యాల జిల్లా పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టులకు సంబంధించి వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని ఇప్పటివరకు స్క్రూటినీ చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏ పోస్టుకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయన్న స్పష్టత కూడా కానరావడం లేదు.

కర్నూలులో అత్యధికం

కర్నూలు జిల్లాలో టైప్-3 కింద ఖాళీగా ఉన్న బోధనేతర పోస్టుల కోసం పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా అటెండర్ పోస్టుకు 1,768 మంది, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్‌కు 1,732 మంది దరఖాస్తులు అందజేశారు. నెల రోజులు దాటినా ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోకపోవడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లా కేంద్రంలో ఆక్రమణల తొలగింపు

■ పుర సమావేశంలో నిర్ణయం

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ఆక్రమణలు తొలగించాలని పదో వార్డు కౌన్సిలర్ అబ్దుల్‌మజీద్, 12వ వార్డు కౌన్సిలర్ శ్యాంసుందర్‌లాల్ డిమాండ్ చేశారు. పురపాలక కార్యాలయంలో పురపాలక ఛైర్‌పర్సన్ మాబున్నిసా అధ్యక్షతన మంగళవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మొదట అజెండాలోని 13 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పలువురు కౌన్సిలర్‌లు వార్డులోని సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. 10, 12 వార్డు కౌన్సిలర్లు మాట్లాడుతూ.. వారం రోజుల క్రితం నంద్యాల పట్టణంలోని 10, 12వ వార్డుల్లో కాల్వలపై ఉన్న ఆక్రమణలు తొలగించారని, దీన్ని కొనసాగించాలని కోరారు. పురపాలక ఇంజినీరు గురప్పయాదవ్ సమాధానమిస్తూ.. ఇది నిరంతరం జరిగే ప్రక్రియ అని.. మూడు నెలల వ్యవధిలో పట్టణమంతా ఆక్రమణలు తొలగిస్తామన్నారు. 3, 4, 7, 26వ వార్డుల కౌన్సిలర్లు దోమలు, కుక్కలు, రహదారుల సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. 31, 30 వార్డు కౌన్సిలర్లు సిబ్బంది తక్కువగా ఉన్నారని, దోమలు అధికంగా ఉన్నాయన్నారు. 19వ వార్డు కౌన్సిలర్ తమ వార్డులో గతేడాది వేసవిలో పైపులైన్ నిర్మాణం కోసం భూమి పూజ చేసి.. ఇప్పటివరకు పనులు కాలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. వీధి దీపాలు వెలగడం లేదని సచివాలయ సిబ్బందికి తెలియజేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఛైర్‌పర్సన్ ఆదేశాల మేరకు ఇంజినీరు సంబంధిత సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసు ఇస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఇంజినీర్లు నాగభూషన్‌రెడ్డి, పవన్‌కుమార్, టౌన్‌ప్లానింగ్ అధికారి నరసింహమూర్తి, శానిటరీ అధికారులు మురళీధర్, లక్ష్మీనారాయణ, ఏఈలు హిమబిందు, బాబువలి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం బుక్కేస్తున్నారు

■ గాడితప్పిన నిర్వహణ ■ వెలుగుచూస్తున్న అక్రమాలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే:

● బనగానపల్లిలో కోడిగుడ్లు పక్కదారి పట్టడంతో కొలిమిగుండ్ల ఇన్‌ఛార్జి ఎంఈవో-1ను ఇటీవల సస్పెండ్ చేశారు. మరో మండలంలో మధ్యాహ్న భోజన బియ్యం విక్రయించిన విషయం విద్యాశాఖలో కలకలం రేపింది.

● ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం నిర్వహణ దారి తప్పుతోంది. కర్నూలు జిల్లాలో 2,55,718 మంది, నంద్యాలలో 1,30,269 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. శనివారం మినహా ఐదు రోజులు కోడిగుడ్లు ఇవ్వాలి.. వారానికి మూడు సార్లు చిక్కీలు.. ఒక్కో విద్యార్థికి వారానికి మూడు రోజులు 150 మిల్లీలీటర్ల రాగిజావ అందించాలి. ప్రాథమిక పాఠశాల విద్యార్థికి 100 గ్రాముల బియ్యం , ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు 150 గ్రాముల చొప్పున ఇవ్వాలి. గుత్తేదారులు, కొందరు అధికారులు కలిసి పథకానికి తూట్లు పొడుస్తున్నారు.

నంద్యాలలోని పద్మావతినగర్ మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలకు మూడు నెలలుగా కోడిగుడ్లు వారానికి ఒక్కసారి కాకుండా ఎప్పుడు పడితే అప్పుడూ సరఫరా అవుతున్నాయి.

లెక్క తప్పిన సరఫరా

కోడిగుడ్లు నెలలో నాలుగు సార్లు.. వారికోసారి సరఫరా చేయాలి. కొన్ని పాఠశాలలో పది రోజులకోసారి సరఫరా చేస్తున్నారు. నంద్యాలతోపాటు బనగానపల్లి, కోవెలకుంట్ల, ఆత్మకూరు, నందికొట్కూరు ప్రాంతాల్లో నెలకు మూడు సార్లే ఇస్తున్నారు. సరఫరా సక్రమంగా లేదని ఇటీవల ప్రధానోపాధ్యాయులు ఫిర్యాదు చేశారు.

పర్యవేక్షణ కరవు

⏩ విద్యార్థులకు అందిస్తున్న భోజనంపై విద్యాధికారులు దృష్టి సారించాలి. చాలా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తమ పరిధి కాదనే భావనలో ఉన్నారు. చాలా చోట్ల చిక్కీలు నాణ్యతగా ఉండడం లేదు. కోడిగుడ్లు చిన్నవిగా సరఫరా అవుతున్నాయి.

⏩ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 75నుంచి 80 గ్రాములు, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు 120 గ్రాముల బియ్యం మాత్రమే ఇస్తున్నారు. ఆ రోజు విద్యార్థులు ఎంతమంది ? ఆ మేరకు వండాం–? వండడానికి ముందు, తర్వాత ఆహార పరిమాణాన్ని గమనించడం లేదు.

⏩ పాఠశాలలకు కోడిగుడ్లు, చిక్కీల సరఫరాను దక్కించుకొన్న గుత్తేదారుడు మరొకరికి సబ్ కాంట్రాక్టు ఇచ్చారు. సదరు వ్యక్తి నాణ్యతకు పాతర వేస్తున్నారు. పాఠశాలలకు సరఫరా చేసే గుడ్లపై గుర్తు ఉండాలి. కానీ కొన్నిసార్లు ఉండటం లేదు.

జన గణనకు కసరత్తు

■ తొలిసారిగా డిజిటల్ విధానంలో..

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: జన గణనకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది. రెండు దశల్లో చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. గృహాల జాబితాల తయారీకి, ఇంటింటా సర్వే నిర్వహణకు సంబంధించి ఇప్పటికే ఉత్తర్వులు వెలువడ్డాయి. రాష్ట్ర, జిల్లా, డివిజన్, మున్సిపల్ స్థాయి అధికారుల నియామకానికి ఆదేశాలు జారీ చేశారు. తొలిసారిగా డిజిటల్ విధానంలో చేపట్టనున్నారు.

జిల్లా	సచివాలయాలు	కుటుంబాలు
కర్నూలు	672	7,37,221
నంద్యాల	516	5,84,665

✦ జిల్లాలో ముఖ్య జన గణన అధికారిగా కలెక్టర్ వ్యవహరిస్తారు. అదనపు ముఖ్య జన గణన అధికారిగా జాయింట్ కలెక్టర్ (జేసీ), జిల్లా జన గణన అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) ఉంటారు.

✦ రాష్ట్రంలో జనాభా లెక్కల సేకరణ నిమిత్తం గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని వినియోగించాలని కలెక్టర్లను ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామ, వార్డు సచివాలయాలను మూడు కేటగిరీలుగా వర్గీకరించారు.

✦ సచివాలయాల్లో సాధారణ విధులు, నిర్దిష్ట విధులకు వేర్వేరు సిబ్బందిని కేటాయించారు. ఈ ప్రక్రియను సచివాలయాల ప్రక్షాళనలో భాగంగా చేపట్టారు. సచివాలయ సిబ్బందిని హేతుబద్ధీకరించడం, బదిలీ చేయడం జరుగుతుంది. 2026 జూన్ 10 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది.

నల్లమలలో ట్రాఫిక్ కట్టడి

■ ఘాట్ రోడ్డులో నిబంధనలు కఠినతరం
■ సరకు రవాణా వాహనాల మళ్లింపు
■ ఫిబ్రవరి 1 నుంచి నంద్యాల మీదుగా

ఘాట్‌లో నిలిచిన లారీలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: శివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీశైల మల్లన్న క్షేత్రం ముస్తాబవుతోంది.. శ్రీభ్రమరాంబ మల్లికార్జునుల దర్శనార్థం వివిధ రాష్ట్రాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలొస్తారు.. కొందరు అడవి దారిలో నడుచుకొంటూ.. మరికొందరు వాహనాల్లో ఆత్మకూరు-దోర్నాల మధ్య ఘాట్ రోడ్డులో వెళ్తారు.. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 'ఘాట్' రోడ్డులో సరకు రవాణా వాహనాలపై నిషేధం విధించారు.

⏩ ఫిబ్రవరి 1 నుంచి 20వ తేదీ వరకు విజయవాడ, గుంటూరు వైపు అధిక లోడ్‌తో వచ్చే వాహనాలను కర్నూలు, నంద్యాల, గిద్దలూరు, మీదుగా మళ్లించనున్నారు. ఆత్మకూరులోని నంద్యాల మలుపు వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనాలు నంద్యాల వైపు మళ్లిస్తారు.

⏩ "గూడ్స్ వాహనాల్లో ప్రయాణిస్తున్న భక్తులు, వాహన చోదకులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తున్నాం.. నిబంధనలు అతిక్రమిస్తే రూ.25వేల నుంచి రూ.50వేల వరకు జరిమానా విధిస్తాం.. పట్టుబడితే డ్రైవర్ లైసెన్స్, పర్మిట్‌ను రద్దు చేసి వాహనాన్ని సీజ్ చేస్తాం.. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణం చేయడం చట్టరీత్యా నేరం.. గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులతో ఆత్మకూరు, నందికొట్కూరు దారిలో వస్తే కేసులు నమోదు చేస్తామని'' ఆత్మకూరు ఎంవీఐ సత్యనారాయణరెడ్డి తెలిపారు.

⏩ ఘాట్ రోడ్డులో ప్రయాణ సమయంలో వాహనాలు మొరాయిస్తే భక్తులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు సన్నిపెంట, దోర్నాల మెకానిక్‌లు, రికవరీ వాహనాలు, వాటి నంబర్లు అందుబాటులో ఉంచారు. సున్నిపెంట మెకానిక్‌లు 89850 31712, 97045 78781, దోర్నాల మెకానిక్‌లు 91008 05326, 99665 00535, రికవరీ వాహనాలు 95157 01600, 85004 93934.

లోపలి పేజీల్లో

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్ 6

స్లాట్‌మూశారు.. వసూళ్ల గేటెత్తారు

ఉమ్మడి జిల్లాలో భూముల, స్థలాల విలువ పెంచే ప్రయత్నంలో ప్రభుత్వం ఉంది. ఈ క్రమంలో ఫిబ్రవరి 1 నుంచి రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరిగే అవకాశం ఉంటుంది. పాత ధరల ప్రకారం ఈ నెల 31 వరకే రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం ఉంది. దీంతో వినియోగదారులు రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. దీన్ని ఆసరా చేసుకొని దళారులు దందాకు తెరతీశారు. రిజిస్ట్రేషన్ స్లాట్లను బ్లాక్ చేశారు. వివిధ అవసరాల నిమిత్తం డోన్ కార్యాలయానికి వెళ్తున్న ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. ఒక్క స్లాట్ లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, వెల్దుర్తి, డోన్

ఒక్కోదానిపై రూ.రెండు వేలు

● నమోదైన స్లాట్స్‌ను పునరుద్ధరించేందుకు (రీషెడ్యూల్) హద్దుల వివరాలు మార్చుకునే అవకాశం ఉంది. వినియోగదారుడు సరైన సమయానికి రాలేదనే కారణం చూపి పునరుద్ధరణకు రూ.200 రుసుము అదనంగా చెల్లించాలి.

● స్లాట్ బుకింగ్‌కు రూ.600, రీషెడ్యూల్‌కు రూ.200, బ్లాక్ చేసిన రోజు డిమాండ్‌ను బట్టి అదనంగా రూ.3వేలు తీసుకొంటున్నారు. రూ.800 ఖర్చులు పోనూ ఒక స్లాట్‌కు రూ.2,200 వరకు అదనపు ఆదాయం సమకూరుతుంది. నిత్యం 39 స్లాట్లకు సుమారు రూ.80 వేల ఆదాయం వస్తుంది.

దళారులే దిక్కయ్యారు

● ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఛార్జీలు పెరగనుండటంతో ఆలోపు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని చాలా మంది వినియోగదారులు కార్యాలయానికి వస్తున్నారు. దీన్ని ఆసరా చేసుకొని దళారులు మొక్కుబడిగా అంతర్జాలంలో హద్దులు నమోదు చేసి రూ.600 రుసుము చెల్లించి స్లాట్స్‌ను బ్లాక్ చేశారు. డోన్ కార్యాలయం పరిధిలో ఒక్క స్లాట్ ఖాళీగా లేకపోవడం గమనార్హం.

● గడువు దాటితే.. గజం ధర రూ.2400 ఉన్న వాటికి పది శాతం పెంచినా రూ.2,640కు చేరుతుంది. ఈ లెక్కన ఒక సెంటుపై అదనంగా రూ.10వేల భారం పడుతుంది. ముందే రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వినియోగదారులు కార్యాలయానికి పరుగులు తీస్తున్నారు. స్లాట్లు లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయిస్తున్నారు.

నిత్యం 39 మాత్రమే

● డోన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో వెల్దుర్తి, డోన్, కృష్ణగిరి మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల పరిధిలోని పలువురు తమ ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయించుకొనేందుకు డోన్ కార్యాలయానికి వెళ్తుంటారు.

● దళారీ వ్యవస్థ లేకుండా ప్రజలకు మేలు చేసేందుకు ప్రభుత్వం స్లాట్ బుకింగ్ వ్యవస్థను తీసుకొచ్చింది. నిత్యం 10:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు 39 స్లాట్స్ బుక్ చేసుకొనే అవకాశం ఉంది.

● స్లాట్ బుక్ చేసుకోవడానికి రూ.600 రుసుము చెల్లించాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన భూముల హద్దులు నమోదు చేస్తే అంతర్జాలంలో తేదీల వారీగా సమయం కేటాయిస్తారు.

బాలికల రక్షణకు
పోక్సో ఈ-బాక్స్

నంద్యాల రైతు నగరం, న్యూస్‌టుడే: కళాశాల.. కార్యాలయం.. ప్రయాణ ప్రాంగణం.. ఇలా నిత్యం ఎక్కడో ఓ చోట విద్యార్థినులు, మహిళలు, బాలికలు లైంగిక వేధింపులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని బయటకు చెప్పుకోలేక.. పోలీసు స్టేషన్‌కు వెళ్లడానికి వెనకాడుతుంటారు. ఈ నేపథ్యంలో బాధితులు ఇంటి నుంచే ఫిర్యాదు చేసేలా మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ పోక్సో ఈ-బాక్స్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.

✦ ఈ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. స్క్రీన్‌పై కనిపించే ఎర్రరంగు బటన్‌ను నొక్కాలి. ఇందులో ప్లే గ్రౌండ్, స్కూల్, బ్లాక్‌మెయిల్, స్కూల్ బస్, ఫ్యామిలీ మెంబర్, ఫోన్ వంటి ఐచ్ఛికాలు కనిపిస్తాయి.

✦ మీరు ఎక్కడైనా లైంగిక వేధింపులకు గురి అయితే ఆ ఐచ్ఛిక చిత్రంపై క్లిక్ చేయాలి. ఆ తర్వాత పేరు, ఈ-మెయిల్ ఐడీ, చరవాణి సంఖ్య, ఘటన వివరాలు నమోదు చేయాలి.

✦ ఫిర్యాదు పోక్సో చట్టం కింద నమోదు అవుతుంది.. ప్రత్యేక బృందాలు పరిశీలించి ఆ వివరాలను జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారులకు పంపిస్తారు. బాలల సంరక్షణ విభాగం అధికారులు పూర్తి పారదర్శకతతో విచారణ చేపడతారు.

✦ ప్రతి ఫిర్యాదుకు ఓ నంబరు కేటాయిస్తారు. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతారు.

విద్యకు ప్రాధాన్యం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. బొమ్మలసత్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌ను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. వంట గదిలోని పరిశుభ్రత, భోజన నాణ్యతను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్ఠికాహారం అందేలా సూచనలు చేశారు.

కాటేసిన కరెంటు

పీర్ల ఖాసీం సా (పాత చిత్రం)

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: శుభకార్యం జరగాల్సిన ఆ ఇంట చీకట్లు కమ్ముకొన్నాయి.. ఐదేళ్ల కిందట ఇంటి యజమాని మృతిచెందగా ఇంటికి పెద్ద దిక్కుగా నిలిచిన పెద్ద కుమారుడిని మృత్యువు కరెంటు రూపంలో వెంటాడింది. వచ్చేనెలలో పెళ్లి పీటలెక్కాల్సిన యువ రైతు విద్యుదాఘాతంతో ప్రాణాలు విడిచారు. ఆళ్లగడ్డ మండలం బాచేపల్లెకు చెందిన పీర్ల ఖాసీం సా(24) మొక్కజొన్న పంటకు నీళ్లు పెట్టేందుకు తల్లి బీబీతో కలిసి వెళ్లారు. పారను భుజంపై పెట్టుకుని వెళ్తుండగా పొలంలో విద్యుత్తు తీగలు తగిలాయి.. వెంటనే విద్యుదాఘాతానికి గురయ్యారు. తల్లి కాపాడేందుకు యత్నించినా ఫలితం లేకుండా పోయింది. విద్యుదాఘాతంతో ఖాసీం సా అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. ఖాసీం సా డిగ్రీ పూర్తి చేసి వ్యవసాయం చేస్తున్నారు. ఇటీవల నిశ్చితార్థం అయ్యింది. వచ్చేనెలలో వివాహం జరపాలని నిశ్చయించారు. తండ్రి పెద్ద ఖాసీంసా ఐదేళ్ల కిందట మృత్యువాతపడ్డారు.

ఎర్రనేలలో.. సుజల స్రవంతి

● 190 రోజులు.. 40.109 టీఎంసీలు

పశ్చిమ ప్రాంత వాసులు ఏటా జనవరి చివరి వారం నుంచి నీటి కోసం అగచాట్లు పడేవారు. కాల్వ విస్తరణతో హంద్రీనీవా సుజల స్రవంతి పరవళ్లు తొక్కుతోంది.. వివిధ రకాల పంటలతో అక్కడి నేలలు పచ్చని దుప్పటిని కప్పుకొన్నట్లు కనిపిస్తున్నాయి. పంట చివరి నాటికి సాగు నీరు అందే పరిస్థితి ఉండటంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 'కూటమి' ప్రభుత్వం వచ్చిన తర్వాత హంద్రీనీవా కాల్వలో 3,850 క్యూసెక్కులు వెళ్లేలా 'కట్ట'దిట్టం చేశారు. గతేడాది జులై 17న సీఎం చంద్రబాబు మల్యాల ఎత్తిపోతల నుంచి నీటివిడుదల ప్రారంభించారు. అప్పటి నుంచి ఈనెల 27 తేదీ వరకు 40.109 టీఎంసీలు వదిలారు.

– న్యూస్‌టుడే, కర్నూలు జలమండలి, పత్తికొండ

యడవలి వద్ద హంద్రీనీవా కాల్వ ఒడ్డున విద్యుత్తు మోటార్లు, పైపులు

లక్షణంగా సాగు నీరు

● కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హంద్రీనీవా కాల్వ విస్తరణపై దృష్టి సారించింది. మల్యాల నుంచి 216 కి.మీ. వరకు మూడు ప్యాకేజీలుగా విభజించి రూ.830 కోట్లు వెచ్చించారు. ఈ కాల్వ ఉమ్మడి కర్నూలు జిల్లాలో 134 కి.మీ. మేర విస్తరించి ఉంది.

● అధికారికంగా కేటాయించిన 40 టీఎంసీల కంటే మరో 11 టీఎంసీల నీటిని వినియోగించుకునే అవకాశం దక్కింది. దీంతో 1.10 లక్షల ఎకరాలకు అదనంగా సాగు నీరు అందించే పరిస్థితి వచ్చింది. " కాల్వ నుంచి పైపులైన్ వేసుకొన్నా.. ఈ ఏడాది రెండు పంటలు పండిస్తున్నాం.. ప్రస్తుతం రెండెకరాల్లో వేరుసెనగ సాగు చేశా. మరో నెల రోజుల పాటు నీరొదిలితే పంట చేతికందుతుందని'' మద్దికెరకు చెందిన మురళీ పేర్కొన్నారు.

ఆరు నియోజకవర్గాలకు ఆసరా

● కృష్ణగిరి వద్ద ప్రస్తుతం ఆరు పంపుల ద్వారా 2,600 క్యూసెక్కులు ఎత్తిపోస్తున్నారు. అదేవిధంగా లక్కసాగరం నుంచి 68 చెరువులకు 1.238 టీఎంసీల నీటిని తరలిస్తున్నారు. నీటి ఆధారంగా ప్రస్తుతం వేరుసెనగ, ఉల్లి, కూరగాయలు సాగు చేశారు.

● హంద్రీనీవా ప్రధాన కాల్వ నందికొట్కూరు, పాణ్యం, కర్నూలు, పత్తికొండ, ఆలూరు, డోన్ నియోజకవర్గాల్లోని పలు గ్రామాల మీదుగా వెళ్తోంది. ఎక్కడా పంట కాల్వలు నిర్మించలేదు. కేవలం దేవనకొండ మండలంలో కొంత వరకు తవ్వి వదిలేశారు.

● రైతులు ప్రధాన కాల్వ ఒడ్డున మోటార్లు పెట్టి 2 నుంచి 3 కి.మీ.మేర పైపులైన్లు వేసుకొని నీటిని తీసుకెళ్తున్నారు. ' 'కాల్వ విస్తరణ పనులు పూర్తయిన వెంటనే 300 పైపులు కొనుగోలు చేసి భూమి లోపల వేశారు.. 3 కి.మీ. మేర తీసుకెళ్తా.. ఇందుకు రూ.6 లక్షల వరకు ఖర్చు అయ్యింది. . పంటలకు సాఫీగా నీళ్లు అందుతున్నాయని'' మద్దికెరకు చెందిన హనుమంతు సంతోషం వ్యక్తం చేశారు.

ఏడాది	రోజులు	టీఎంసీలు
2025-26	190	40.109
2024-25	222	28.198
2023-24	215	21.367
2022-23	242	23.684
2021-22	200	26.831

● మల్యాల నుంచి ఎత్తిపోసిన కృష్ణాజలాలు



(c) eenadu

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - తాడికొండ

బ్యాటర్ల జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor
ధనిక్ భారత్ విద్యా సంస్థలు
IIT-JEE | NEET

Protein Partner
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)

Hospitality Partner
City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS

Gift Partner
KL (DEEMED TO BE UNIVERSITY)

Man of the Series
Hero

Digital Partner
ఈనాడు.నెట్

TV Partner
ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్

Organised by

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - 1 జూనియర్స్: మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్సులతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులు చేసి ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - 1 జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్సులతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్దార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సులతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

గ్రౌండ్-2లో సీనియర్స్: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జీత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సులతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

సీనియర్స్ విన్నర్స్ రాయలసీమ రాకర్స్

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ సార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ చరణ్ జీత్ ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-1 (జూనియర్స్)

మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్

మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)

మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్

మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

ఆదాయ లక్ష్యాలు వంద శాతం అధిగమించాలి

సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రధాన ఆదాయ వనరులైన ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, రిజిస్ట్రేషన్లు, రవాణా శాఖలకు కేటాయించిన వార్షిక ఆదాయ లక్ష్యాలు వందశాతం సాధించేలా కాకుండా అధిగమించే దిశగా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆదాయ వనరుల పెంపుపై మంగళవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేటాయించిన లక్ష్యాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదన్నారు. మైనింగ్ శాఖకు సవరించిన ఆర్థిక లక్ష్యం రూ.250.5 కోట్లు కాగా.. డిసెంబరు చివరి వరకు కేవలం రూ.178 కోట్లు మాత్రమే సాధించారన్నారు. వాణిజ్య పన్నుల శాఖకు ఈ ఏడాది జనవరి వరకు ఉన్న లక్ష్యం రూ. 618.31 కోట్లకు గాను ఇప్పటివరకు రూ. 496.02 కోట్లు మాత్రమే సాధించారన్నారు. రిజిస్ట్రేషన్ల శాఖ లక్ష్యాన్ని రూ. 230 కోట్లకు పెంచుతామని సబ్ రిజిస్ట్రార్లు పేర్కొన్నారు. రవాణా శాఖ లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేయాలన్నారు.

రవాణా శాఖ మెరుగైన సేవలు అందించాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా రవాణా శాఖ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం రవాణా శాఖ సేవలపై ఆమె డీటీసీ, ఆర్టీవోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏజెంట్ల ద్వారా వాహన రిజిస్ట్రేషన్లు చేయించి వాహనదారుల నుంచి అధిక డబ్బులు వసూలు చేయరాదన్నారు. వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు అన్ని ఆన్‌లైన్ ద్వారా జరగాలన్నారు. వాహన రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, పన్నుల విధింపు, లైసెన్సుల మంజూరు నిబంధనల ప్రకారం చలానా కట్టించాలన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ వద్దు

పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ సునీల్ షొరాణ్

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో రాజీలేకుండా విధులు నిర్వహించి భౌతికదాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సునీల్ షొరాణ్ ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆయన జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు, వాటి స్థితిగతులు, నమోదైన కేసుల్లో నిందితుల అరెస్టు, దర్యాప్తు పురోగతిపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేర నియంత్రణకు కృషి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, మహిళలపై జరిగే దాడులపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా పట్టుకొని సొత్తు రికవరీ చేయాలన్నారు. తరచూ నేరాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ ఉపయోగించి జిల్లా బహిష్కరణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కోర్టులో పెండింగ్ కేసులను త్వరగా ట్రయల్‌కు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఏఎస్పీలు యుగంధర్‌బాబు, మందజావళి ఆల్ఫోన్స్, డీఎస్పీలు ప్రమోద్, రామంజినాయక్, శ్రీనివాస్, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

బైపాస్ రహదారి నిర్మాణానికి భూసేకరణ : ఆర్డీవో

గడివేముల, న్యూస్‌టుడే : గడివేములలో బైపాస్ రహదారి నిర్మాణం కోసం భూమి సేకరిస్తున్నట్లు ఆర్డీవో విశ్వనాథ్ తెలిపారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బైపాస్ రహదారిని మంజూరు చేయించారు. రహదారి నిర్మాణం కోసం సేకరిస్తున్న భూములను ఆర్డీవో మంగళవారం పరిశీలించారు. రెవెన్యూ, వ్యవసాయశాఖ, ఆర్‌అండ్‌బీ అధికారులు సంయుక్తంగా భూములను పరిశీలించారు. మూడు కిలోమీటర్ల మేర రహదారి నిర్మిస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు. సుమారు 21 ఎకరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. తహసీల్దారు వెంకటరమణ, వ్యవసాయాధికారి పవన్‌కుమార్, ఆర్‌అండ్‌బీ డీఈ సురేష్‌బాబు, ఏఈ మనోధర్, సహకార సంఘం అధ్యక్షుడు దేశం సత్యనారాయణరెడ్డి, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని గాలికొదిలేశారు - మాజీ మంత్రి బుగ్గన

మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: 'రాష్ట్రంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించకుండా రైతాంగాన్ని గాలికొదిలేసి.. ఏఐ టెక్నాలజీ అంటూ తిరగడం కూటమి నాయకుల చేతగానితనమని' రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. వైకాపా ఆధ్వర్యంలో డోన్ సమీపంలోని ఓ కన్వెన్షన్‌హాల్‌లో మంగళవారం నియోజకవర్గ స్థాయి పార్టీ సంస్థాగత నిర్మాణ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా మాజీ మంత్రితో పాటు వైకాపా నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు దేశం సుధాకర్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డోన్, బేతంచెర్ల ఎంపీపీలు రాజశేఖర్‌రెడ్డి, బుగ్గన నాగభూషణంరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్లు సప్తశైల రాజేష్, చలంరెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ శ్రీరాములు, వైకాపా మండల, పట్టణ అధ్యక్షులు సోమేష్‌యాదవ్, మల్లికార్జునరెడ్డి, నాయకులు జాకీర్‌హుస్సేన్, బద్దల్ రాజ్‌కుమార్, పోస్టు ప్రసాద్, రాజా మురళి, రామచంద్రుడు, వైకాపా ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్ర ఓ చరిత్ర

మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లి, న్యూస్‌టుడే: యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో ఓ చరిత్ర సాధించిందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. యువగళం పాదయాత్ర మూడేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో మంగళవారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మంత్రి నారా లోకేశ్‌కు ప్రత్యేక ఆత్మీయ అభినందనలు తెలిపారు. బనగానపల్లిలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపి సామాన్య ప్రజల్లో విశ్వాసాన్ని నింపిన చరిత్ర పాదయాత్రకు ఉందన్నారు. కాలినడకన రాష్ట్రంలోని పల్లెల్లో తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకొని ముందుకు కదిలిన చరిత్రాత్మక ఘట్టం యువగళం పాదయాత్ర అని మంత్రి బీసీ కొనియాడారు.

భ్రమరాంబాదేవికి బంగారు హారం కానుక

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే : శ్రీశైల మహాక్షేత్రంలోని శ్రీభ్రమరాంబాదేవికి మంగళవారం నంద్యాలకు చెందిన ఎల్.పార్థసారథి గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి 10 గ్రాముల బంగారు హారాన్ని కానుకగా సమర్పించారు. బంగారు హారన్ని దేవస్థానం ఛైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, పర్యవేక్షకులు జి.రవికి అందజేశారు. దాతలకు ఆలయ ప్రాంగణంలో అర్చకులు, వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు.

దేవస్థానం ఛైర్మన్‌కు హారాన్ని అందజేస్తున్న భక్తులు

పెట్టుబడి పేరుతో మోసం

★ బ్యాంకు డిప్యూటీ మేనేజరుకు రూ.15 లక్షల టోకరా

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: షేర్ మార్కెట్‌లో క్రయవిక్రయాల వాట్సప్ గ్రూపులో చేరిన ఓ బ్యాంకు డిప్యూటీ మేనేజరు మధ్యవర్తులను నమ్మి మోసపోయిన ఘటన ఆళ్లగడ్డలో జరిగింది. ఆయన డబ్బు జమ చేసిన ఖాతాలో నుంచి మధ్యవర్తులు డబ్బులు మాయం చేశారు. ఆన్‌లైన్లో డబ్బులు ఉన్నట్లు కన్పించేలా చూపి రూ.లక్షలు కాజేశారు. కోవెలకుంట్లలో ఓ ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకు డిప్యూటీ మేనేజరుగా పనిచేస్తున్న ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన సురేష్.. లాభాలు ఎక్కువగా వస్తాయన్న ప్రచారాన్ని నమ్మి ఒక ప్రైవేటు కంపెనీలో విడతల వారీగా రూ. 15,40,000 షేర్ల రూపంలో పెట్టుబడిగా పెట్టారు. ఆన్‌లైన్లో షేర్లు ఉన్నట్లు, వాటితో లాభాలు పొందుతున్నట్లు కనిపించడంతో తన డబ్బు భద్రంగా ఉందని ఆయన భావించేవారు. ఈ మధ్యనే డబ్బును విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా సాధ్యపడలేదు. తనను మోసం చేసినట్లు ఆయన గ్రహించి పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పట్టణ సీఐ యుగంధర్ ఐటీ(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) కేసు నమోదు చేశారు.

కర్ణాటక భక్తుల వాహనం బోల్తా..

నలుగురికి తీవ్ర గాయాలు

గాజులపల్లెఆర్.ఎస్(మహానంది), న్యూస్‌టుడే: మండలం గాజులపల్లెఆర్.ఎస్-మహానందిఫారం గ్రామాల మధ్యనున్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం సమీపంలోని మలుపులో భక్తుల వాహనం బోల్తా పడింది. నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్‌కు చెందిన 9మంది భక్తులు మంగళవారం రాత్రి మహానందికి వచ్చి దర్శనం చేసుకున్నారు. అనంతరం శ్రీశైలం వెళ్తున్నారు. ఆంజనేయస్వామి ఆలయం మలుపులోని వేగ నియంత్రికలను గమనించకపోవడంతో వీరి బోలేరో వాహనం బోల్తా పడింది. అందులోని విశ్రాంత ఇంజినీరు శ్రీకాంత్, పవిత్ర, రూప, ప్రభావతి తీవ్రంగా, మరో ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు. అటుగా వెళ్తున్న వారు తక్షణం స్పందించి వాహనంలోని వారిని బయటకు తీశారు. 108 వాహనం సిబ్బంది అత్యవసర వైద్యం అందించి నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వాగులో పడి యువకుడి మృతి

ఓబులంపల్లె (ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ మండలంలోని ఓబులంపల్లె గ్రామంలో వాగులో పడి యువకుడి మృత్యువాత పడ్డారు. గ్రామానికి చెందిన హనీఫ్, షబానాల ఏకైక కుమారుడు షరీఫ్(16) పదో తరగతి పూర్తి చేసి తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. మంగళవారం తమ పశువులు మేపేందుకు తుండ్ల వాగు పరిసరాలకు వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో పడి గల్లంతయ్యాడు. పశువులు ఇంటికి వెళ్లినప్పటికీ షరీఫ్ రాకపోవడంతో కుటుంబీకులు వెళ్లి వాగు పరిసరాల్లో చూడగా చెప్పులు కనిపించాయి. దీంతో నీటిలో దిగి గాలించడంతో మృతదేహం లభ్యమైంది.

బ్యాంక్ ఆఫ్ బరోడా बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda నంద్యాల బ్రాంచ్,

బస్ స్టాండ్ రోడ్, ఎమ్ఎస్ఆర్ కాంప్లెక్స్, నంద్యాల -518501, ఫోన్ నెం. 91542 85321

స్వాధీనం చేసుకున్న వాహనాల ఇ-వేలం కోసం బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకమునకు మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలు/ హామీదారులకు తెలియజేయునది ఏమనగా పార్టీలు అమలు చేసిన తనఖా / ఋణ ఒప్పందం కింద సంక్రమించిన అధికారాలను ఉపయోగించి, క్రింద పేర్కొన్న తనఖాలో ఉన్న మోటారు వాహనాలు బ్యాంక్ తిరిగి స్వాధీనం చేసుకున్న / జప్తు చేయబడిన మరియు క్రింద పేర్కొన్న ఖాతా/ఖాతాలలో బకాయిలను వసూలు చేయడానికి వాహనం "ఎక్కడ ఉందో అలాగే", "ఎక్కడ ఉందో అలాగే" మరియు "ఏది ఉందో అలాగే" ప్రాతిపదికన విక్రయించబడునని ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

క్ర నెం.	ఋణగ్రహీత/లు/హామీదారు / తనఖాదారు/లు పేరు & చిరునామా	వాహనం తయారీ మోడల్ ఆర్‌టిఓ రిజిస్టర్డ్ నెం. రిజిస్టర్డ్ తేదీ	రిజర్వు ధర, ధరావతు (ఇఎమ్‌డి),బిడ్ పెంపుదల	(ఇఎమ్‌డి) డిపాజిట్ చేయవలసిన ఖాతా నెం. : ఐఎఫ్‌యస్ కోడ్ : బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ :	వాహనం పార్కింగ్ చేసిన యార్డ్ వివరములు
1)	శ్రీ పి.అశోక్ కుమార్, తండ్రి: పి.రామదాసు, ఇంటి.నెం.121/3, క్రింది అంతస్తు, నారాయణాద్రి హాస్పిటల్ దగ్గర, తిరుపతి - 517501, A/c No.s: 31450600021464, 31450600021465, 31450600021616 31450400000087 మొత్తం బకాయిలు తేది. రూ.87,33,651 + తదుపరి వడ్డీ మరియు ఇతర ఛార్జీలు	Make: ASHOK LEYLAND LTD Model: STAGE CARRIAGES Body Type: SALOON Colour: WHITE BLUE YELLOW Fuel: DIESEL, Reg no:AP39 UP 9037 Date of registration: 21/06/2023 Chassis No: MB1PBEHD8PEMK3766 Engine No: PMEZ403802, Seating capacity: 51	రిజర్వు ధర: Rs.15,30,000 EMD:Rs.1,53,000 బిడ్ పెంపుదల మొత్తం : Rs.15,000	A/c # 75650015181869 (EMD to be deposited through Baanknet portal) A/c Name: SARFAESI Auction Proceeds A/c IFSCode:BARB0VJ KURN (5th letter ZERO) Bank of Baroda, Ballary Road Kurnool Branch	M/s.Padmanabhaiah Parking Yard, Thummur, Naidupet, Tirupati District-524126 (13.9000 ⁰ N / 79.9000 ⁰ E)
2)		Make: ASHOK LEYLAND LTD Model: STAGE CARRIAGES Body Type: SALOON Colour: WHITE BLUE YELLOW Fuel: DIESEL,Reg no:AP39 UP 9038 Date of registration: 21/06/2023 ChassisNo: MB1PBEHD7PEMK2902 Engine No: PMEZ403191 Seating capacity: 51	రిజర్వు ధర: Rs.15,30,000 EMD: Rs.1,53,000 బిడ్ పెంపుదల మొత్తం : Rs.15,000	A/c # 75650015181869 (EMD to be deposited through Baanknet portal) A/c Name: SARFAESI Auction Proceeds A/c IFSCode:BARB0VJ KURN (5th letter ZERO) Bank of Baroda, Ballary Road Kurnool Branch	M/s.Padmanabhaiah Parking Yard, Thummur, Naidupet, Tirupati District-524126 (13.9000 ⁰ N / 79.9000 ⁰ E)
3)	శ్రీ బోనం పక్కీరయ్య, తండ్రి: పెద్ద పక్కీరయ్య , ఇంటి.నెం.6-74, పెండేకంటి నగర్ సంజమాల, నంద్యాల జిల్లా- 518165, A/c No.s: 31450600021645 31450600021646,31450400000103 మొత్తం బకాయిలు తేది. రూ.81,20,083 + తదుపరి వడ్డీ మరియు ఇతర ఛార్జీలు	Make: ASHOK LEYLAND LTD Model: STAGE CARRIAGES Body Type: SALOON Colour: WHITE YELLOW BLUE Fuel: DIESEL Reg no: AP39 VA 0125 Date of registration: 05/08/2023 Chassis No: MB1PBEHD8PENJ8327 Engine No: NBEZ422602 Seating capacity: 56	రిజర్వు ధర: Rs.15,30,000.00 EMD: Rs.1,53,000 బిడ్ పెంపుదల మొత్తం : Rs.15,000.00	A/c # 75650015181869 (EMD to be deposited through Baanknet portal) A/c Name: SARFAESI Auction Proceeds A/c IFS Code: BARB0VJKURN (5th letter ZERO) Bank of Baroda, Ballary Road Kurnool Branch	M/s. Jashwika Yard, Beside Buggarameswara-Jammlamadugu Road, Kanala, Nandyala (15.428103/78.459450)
4)	శ్రీమతి పగిడి జయమ్మ, భర్త : పి.శేఖర్, ఇంటి.నెం.9-144/1, రామకృష్ణాపురం, బనగానపల్లె, నంద్యాల జిల్లా - 518176, A/c No.s: 31450600021462 31450600021463 31450400000098 మొత్తం బకాయిలు తేది. రూ.77,25,656 + తదుపరి వడ్డీ మరియు ఇతర ఛార్జీలు	Make: ASHOK LEYLAND LTD Model: STAGE CARRIAGES Body Type: SALOON Colour: GREEN AND WHITE Fuel: DIESEL, Reg no:AP39 UQ 0235 Date of registration: 26/06/2023 Chassis No: MB1PBEHD6PEMK3703 Engine No: PMEZ403047 Seating capacity: 56	రిజర్వు ధర: Rs.15,30,000 EMD:Rs.1,53,000 బిడ్ పెంపుదల మొత్తం : Rs.15,000	A/c # 75650015181869 (EMD to be deposited through Baanknet portal) A/c Name: SARFAESI Auction Proceeds A/c IFSCode:BARB0VJ KURN (5th letter ZERO) Bank of Baroda, Ballary Road Kurnool Branch	M/s.Jashwika Yard, Beside Buggarameswara-Jammlamadugu Road, Kanala, Nandyala (15.428103/78.459450)
5)		Make: ASHOK LEYLAND LTD Model: OMINIBUS Body Type: SALOON Colour: GREEN AND WHITE Fuel: DIESEL, Reg no:AP39 UQ 0236 Date of registration: 26/06/2023 Chassis No: MB1PBEHD8PEMK3704 Engine No: PMEZ404290 Seating capacity: 56	రిజర్వు ధర: Rs.15,30,000 EMD: Rs.1,53,000 బిడ్ పెంపుదల మొత్తం : Rs.15,000	A/c # 75650015181869 (EMD to be deposited through Baanknet portal) A/c Name: SARFAESI Auction Proceeds A/c IFSCode:BARB0VJ KURN (5th letter ZERO) Bank of Baroda, Ballary Road Kurnool Branch	M/s.Jashwika Yard, Beside Buggarameswara-Jammlamadugu Road, Kanala, Nandyala (15.428103/78.459450)
6)	శ్రీ పిడతల రామదాసు, ఇంటి.నెం. 8/210/174, రామకృష్ణాపురం, బనగానపల్లె నంద్యాల జిల్లా - 518176 A/c No.: 31450600024020 మొత్తం బకాయిలు తేది. రూ.46,97,421 + తదుపరి వడ్డీ మరియు ఇతర ఛార్జీలు	Make: ASHOK LEYLAND LTD Model: GOODS CARRIAGE-HMV Body Type: OPEN, Colour: NP Fuel: DIESEL, Reg no:AP39 VE 9975 Date of registration: 03/02/2024 Chassis No: MB1NECHD5RRPR6505 Engine No: PCHZ434284 Seating capacity: 3	రిజర్వు ధర: Rs.18,00,000 EMD: Rs.1,80,000 బిడ్ పెంపుదల మొత్తం : Rs.15,000	A/c # 75650015181869 (EMD to be deposited through Baanknet portal) A/c Name: SARFAESI Auction Proceeds A/c IFS Code: BARB0VJKURN (5th letter ZERO) Bank of Baroda, Ballary Road Kurnool Branch	M/s. Jashwika Yard, Beside Buggarameswara-Jammlamadugu Road, Kanala, Nandyala (15.428103/78.459450)
7)	శ్రీమతి పిడతల ఈశ్వరమ్మ, ఇంటి.నెం. 8/210/1,రామకృష్ణాపురం, బనగానపల్లె నంద్యాల జిల్లా - 518176 A/c No.: 31450600024021 మొత్తం బకాయిలు తేది. రూ.46,89,525 + తదుపరి వడ్డీ మరియు ఇతర ఛార్జీలు	Make: ASHOK LEYLAND LTD Model: GOODS CARRIAGE-HMV Body Type: OPEN Colour: CANDY WHITE Fuel: DIESEL, Reg no:AP39 VE 9976 Date of registration: 03/02/2024 Chassis No: MB1NECHD9RRPR6961 Engine No: PCHZ434352 Seating capacity: 3	రిజర్వు ధర: Rs.17,60,000 EMD: Rs.1,76,000 బిడ్ పెంపుదల మొత్తం : Rs.15,000	A/c # 75650015181869 (EMD to be deposited through Baanknet portal) A/c Name: SARFAESI Auction Proceeds A/c IFS Code: BARB0VJKURN (5th letter ZERO) Bank of Baroda, Ballary Road Kurnool Branch	M/s. Jashwika Yard, Beside Buggarameswara-Jammlamadugu Road, Kanala, Nandyala (15.428103/78.459450)

పైన తెలిపిన అన్ని వాహనాలు ఇ-వేలం తేది, సమయం : తేది.02-03-2026, సోమవారం మధ్యాహ్నం గం.02.00 నుండి సాయంత్రం గం.06.00 వరకు

వాహనం తనిఖీ తేదీ & సమయం: పార్కింగ్ యార్డ్ వద్ద తేది.28-01-2026 నుండి తేది.28-02-2026 ఉదయం గం.10.30 ని.ల నుండి సాయంత్రం గం.04.00 గం.ల వరకు

విక్రయానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం ఆన్‌లైన్ ఆక్షన్ పోర్టల్ https://baanknet.com ను సందర్శించగలరు ఆసక్తి గల బిడ్డర్లు శ్రీ చంద్రయ్య గారిని మొబైల్ నెం. 9100549279 నందు సంప్రదించవచ్చును.

తేది: 27-01-2026, ప్రదేశం: నంద్యాల సం/- అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

ఉద్యోగ ప్రకటన

S.L.N PARTLY AIDED HIGH SCHOOL

Mandaloor(V), Rudravaram(M), Nandyal(Dist)

Rc.No.: 8841/B4/2024 Date: 27.01.2026

కర్నూలు జిల్లా విద్యాశాఖాధికారి వారు మా పాఠశాలకు క్రింద పేర్కొనబడిన ఖాళీగా ఉన్న ఎయిడెడ్ పోస్టులను భర్తీ చేయుటకు అనుమతి ఇచ్చి ఉన్నారు. కావున అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి. దరఖాస్తు నకలుతో పాటు ఉపాధి నమోదు పత్రం జత పరచవలెను.

https://cse.ap.gov.in/aided Recruitment Notification

ఖాళీ పోస్టుల వివరాలు

క్రమ సంఖ్య	పోస్ట్ వివరాలు	ఖాళీల సంఖ్య	రోస్టర్ పాయింట్ నెంబర్
1	S.A.(Social)	1	1-OC(GENERAL)

ఎంపిక విధానం:

1. డిపార్ట్‌మెంటు నామినీచే ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేయబడును.
2. వయోపరిమితి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉంటుంది.
3. ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్హతలు కలిగి ఉండవలెను.
4. TET (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు మాత్రమే అర్హులు.

దరఖాస్తు స్వీకరణకు చివరి తేది: 06-02-2026

ఇట్లు: కరస్పాండెంట్

మృతదేహం లభ్యం

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: పొన్నాపురం కేసీ కాల్వలో ఈతకు వెళ్లి గల్లంతైన యువకుడు శ్రీనివాసులు(24) మృతదేహం లభ్యమైనట్లు గ్రామీణ సీఐ ఈశ్వరయ్య తెలిపారు. మృతదేహాన్ని నంద్యాల వైద్యశాలకు తరలించారు.

ANDHRA PRADESH EDUCATION & WELFARE INFRASTRUCTURE DEVELOPMENT CORPORATION: KURNOOL

"e-Procurement Short Tender Notice"

Tender is invited from the eligible contractors for NIT **No. 57 to 65/EE/EWIDC/KRNL/AE/2025-26 (2nd & 4th Calls), Dt. 28.01.2026** for 2 No's SWRSC works, 1 No shopping complex repair work, 6 No S.W.Hostels works pertaining to Kurnool and Nandyal Districts within Est. Cost below Rs.30.00 Lakhs **Start Date 28.01.2026 at 03.00 PM and Last date of receipt of tenders may be viewed in E-Procurement platform.**

Note: For further details can be viewed at https://tender.apeprocurement.gov.in or contact. Cell: (99853 28413 and 97047 01688).

Sd/- Executive Engineer, APEWIDC, Kurnool.

Andhra Pradesh Industrial Infrastructure Corporation Limited.

APIIC The Future is Here

(An undertaking of A.P. Govt.)

O/o. Zonal Manager, Zonal Office, APIIC Ltd., Kallur, Kurnool District, Andhra Pradesh - 518003.

'e'Procurement Notice

Tender Notice No. 01/ZM/APIIC/KNL/2025-26 Dt: 27.01.2026

Zonal Manager, APIIC Ltd., Kurnool invites bid for the following work.

T.N.No.01: Name of work: Request for proposal for selection of Consultant for Preparation of Detailed Project Report, for Summer Storage Tank (SST) of 4205 ML capacity near Meedivemula (V), Orvakal (M), Kurnool District in Andhra Pradesh.

Date Of Publication :27-01-2026 at 08.00 PM

Last date for submission of bids :03-02-2026 at 3.00 PM

The details of tender notice and bid document can be downloded form website: **www.apeprocurement.gov.in** (or) **https://tender.apeprocurement.gov.in**

Sd/- Zonal Manager, APIIC Ltd., Kurnool.

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపాల్ జిల్లా జడ్జి కోర్టు, కర్నూలు

E.P.No.43/2011 in A.A.No.228/2010

Between:

M/s Shriram Transport Finance Co Ltd,. Rep. by Authorised GPA Holder B.Hari Krishna Chary .. **Claimant/Decree Holder**

-Versus-

Om Sai Constructions Its Managing partner A.B.V. Suresh and another **...Respondents/Judgement Debtors**

JDr No.1

Om Sai Constructions it's Managing partner A.B.V.Suresh S/o A.Lakshmi Narayana settee, Hindu, H.No.1-151-A9/1, Near RTC Busstand, Nandikotkur, Nandyal.

బహిరంగ వేలం ప్రకటన

సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా తెలియజేయడమేమనగా పై EP నెంబరు పిటిషన్లో కనబరచిన పిటిషన్దారు / డిక్రీ హోల్డర్, ఈ క్రింది కనబరచిన షెడ్యూలు ఆస్తిని తమ యొక్క బాకీ మొత్తమును రాబట్టుకొనుటకు గాను పై పిటిషన్ జిల్లా కోర్టు నందు దాఖలు చేసి సదరు పిటిషన్ దాఖలా ఆస్తిని కోర్టు వారి ద్వారా వేలమునకు తీసుకొని వచ్చుటకు ఆర్డరు పొందియున్నారు. సదరు కోర్టువారి వేలము 17-02-2026 తేదిన కర్నూలు జిల్లా ప్రిన్సిపాల్ జడ్జిగారి కోర్టు ఆవరణములో పై తేదీనాడు బహిరంగ వేలము ఈ క్రింద కనబరచిన షెడ్యూలు దాఖల ఆస్తిని వేలము వేయబడును. ఎవరైనా సదరు వేలం నందు పాల్గొని క్రింది షెడ్యూలు దాఖల ఆస్తిని కొనుగోలు చేయవచ్చునని తెలియజేడయమైనది. కర్నూలు జిల్లా ప్రిన్సిపాల్ జడ్జి కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ప్రకటించడమైనది.

Schedule of Jdr. No.1 Property Details (A.B.V.SURESH)

The house and open site situated Nandikotkur Village bearing No. 1/151/A9/1 in Sub-Registration District of Nandikotkur and Registration District of Kurnool (Old) present Nadyal District and the House and Open site is bounded as follows: **North:** A.Guruvaiah and A.Rama Murthy open site, **South:** the open site belongs to A.Krishna Murthy, **East:** Public Rasta and **West:** Open site belongs to APSRTC. The Total site measurements is **East to West:** 68 Feets, **North to South:** 76 Feets. **Total:** 574 Sq. Yards.

The RCC House constructed in the above measured open site bearing H.No. 1-151/A 9/1 measurements as follows: **East to West:** 68 feets, **North to South:** 38 feets, **Total:** 2584 Sq. feets

Measure of 1st floor of the house as follows: **East to West:** 14 feets, **North to South:** 36 feets. **Total:** 504 Sq. feets

DHR Value: Rs.12,00,000/-

Ameena Value: Rs.68,00,000/-

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

Hearing Date:17-02-2026

C.Lokeswaraiah & K.Narasimhulu

D.HR తరపు న్యాయవాదులు, కర్నూలు

EENADU Classifieds

EDUCATION

COACHING CENTRES

కర్నూలులో శ్రీ వెంకటసాయి కోచింగ్ సెంటర్ (SI, PC, SSC, RRB Group-2)లో రిసెప్షనిస్ట్, ఆఫీసు బాయ్ కావలెను. ✆ 90148 03964, 93466 34795.

REAL ESTATE

ఓర్వకల్లు ఇండస్ట్రియల్ ఏరియాలో వెంచర్స్ కలవు. కర్నూలు టౌన్ లో హౌసెస్, అపార్ట్‌మెంట్స్, విల్లాస్ కలవు. శివ: 99636 19327.

మణికంఠ హోమ్స్ వారి లక్ష్మీగ్రీన్ వ్యాలీ పసుపుల గ్రామ పరిధిలో నూతన వెంచర్ నందు ప్లాట్లు & ఇండ్లు కట్టించి బ్యాంక్ లోన్ సౌకర్యంతో ఇవ్వబడును. శ్రీరామ్: 99853 43829.

JOBS

Required Civil Site Supervisors/ Engg/ Diploma with or without Experience. Location Karnataka. Contact: 93470 83151.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నంద్యాల
• నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

ఉత్తమ ఉద్యోగులతో కమిషనరు రమేష్‌బాబు

ఉత్తమ ఉద్యోగుల సేవలు ఆదర్శనీయం

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారి సేవలు ఆదర్శనీయమని కమిషనర్ రమేష్‌బాబు పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన సీనియర్ అసిస్టెంట్ యుగంధర్, అసిస్టెంట్ ఇంజినీరు షాహీదాబాషా, శానిటరీ ఇన్‌స్పెక్టరు జీవన్ కుమార్‌లను శాలువా, పూలమాలలతో సత్కరించారు. పట్టణ ప్రణాళిక అధికారి రామకృష్ణ, ఉద్యోగులు ప్రసాద్ పాల్గొన్నారు.

పంచాయతీకి రూ.4.31 లక్షల ఆదాయం

వెలుగోడు, న్యూస్‌టుడే: పట్టణంలోని గ్రామ పంచాయతీ వాణిజ్య సముదాయానికి ఈవోఆర్డీ మురహరి, ఈవో నరేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం ఏడాది వేలం నిర్వహించారు. గులాంబాషా, సయ్యద్ ఉస్మాన్ వలి, మీర్జా అబ్దుల్లాబేగ్, నవీన్ సాలు వాణిజ్య సముదాయ గదులను దక్కించుకున్నారు. వేలంలో గ్రామపంచాయతీకి రూ.4.31 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) నందికొట్కూరు: 94403 61729 ఆత్మకూరు: 90149 09024 నంద్యాల: 98853 28120

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ?: ద్వారకా సాయి నగర్‌లో రెండు వీధి దీపాలు వెలగడం లేదు. – రాముడు, స్థానికుడు. ✔: వీధి దీపానికి మరమ్మతులు చేయిస్తాం. – షాహీదాబాషా, పురపాలక ఏఈ.

?: తోటగేరి నుంచి జమ్ములమ్మ దేవాలయానికి వెళ్లే మార్గంలోని కాల్వలో మురుగు, వ్యర్థాలు పేరుకుపోయాయి. – రమణ, స్థానికుడు. ✔: కాల్వలో పూడిక తొలగిస్తాం. – జీవన్, శానిటరీ ఇన్‌స్పెక్టరు.

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని జ్ఞానాపురం కాల్వలు శుభ్రం చేయడం లేదు. దోమల బెడద అధికంగా ఉంది. ఇబ్బందులు పడుతున్నాం. –యేసు, స్థానికుడు. ?: పట్టణంలోని చాబోలు రహదారిలో భూమానగర్‌లో కాల్వలు శుభ్రం చేయడం లేదు. దోమల బెడద అధికంగా ఉంది. – నాగన్న ?: పట్టణంలోని విజయనగర్‌కాలనీలో కుక్కల బెడద అధికమైంది. – రాజేష్ ✔: కాల్వలు శుభ్రం చేయించి, స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయిస్తాం. త్వరలో కుక్కలు పట్టించి సమస్య పరిష్కరిస్తాం. – లక్ష్మీనారాయణ శర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: ?: మండలంలోని గోరుకల్లు, కొండజూటూరు గ్రామాల్లో దోమల బెడద ఎక్కువై అవస్థలు పడుతున్నాం. – సాధిక్, రంజిత్ ✔: గ్రామాల్లో దోమల మందు పిచికారీ చేయిస్తాం. – వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎంపీడీవో, పాణ్యం

మెరుగైన వైద్యం అందించాలి

వెలుగోడు, న్యూస్‌టుడే: ఆసుపత్రికి రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సీహెచ్‌సీలో సుమారు రూ.10 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన ఎక్స్‌రే యూనిట్‌ను మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. సీహెచ్‌సీలో డీవోపోటు నిత్యం వైద్యులు అందుబాటులో ఉండి రోగులకు సరైన చికిత్సలు అందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీడీవో అమ్మర్లు, వైద్యాధికారులు సులోచన, ఇక్రంఅలీఖాన్, సాయిప్రదీప్, భానుప్రతాప్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

వెలుగోడు, న్యూస్‌టుడే: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన వార్షికోత్సవ కార్యక్రమంలో మంగళవారం పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదవాలి, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం వసతి గృహంలోని విద్యార్థుల పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, తెదేపా నాయకులు అబ్దుల్లాపు శేషిరెడ్డి, మండ్ల శంకర్‌రెడ్డి, అమీర్‌హంజా, డాక్టరు, జాకీర్‌హుసేన్, ఖలీల్ ఖాన్, ఎల్లాల కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

అపరిశుభ్రం పెరిగి.. దోమల దాడి

☛ నంద్యాల పట్టణంలో ప్రజల ఇబ్బందులు

నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలో దోమల బెడద తీవ్రంగా ఉండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పట్టణంలో మొత్తం 42 వార్డుల్లో దాదాపు 3లక్షల జనాభా నివసిస్తున్నారు. జిల్లా కేంద్రంగా మారడంతో చుట్టుపక్కల గ్రామాలు, ఇతర ప్రాంతాల నుంచి పలువురు నంద్యాలలో నివాసం ఏర్పాటు చేసుకున్నారు. దీంతో జనాభా పెరగడంతోపాటు కాల్వల కొరత, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పారిశుద్ధ్య సమస్యలు ఎక్కువై దోమలు ప్రజలపై దాడి చేస్తున్నాయి.

● పట్టణంలోని బస్టాండు ప్రాంతం, అంజుమన్‌వీధి, నక్కలవీధి, ఉప్పరిపేట, బైర్మల్‌వీధి, ఫరూక్‌నగర్, గడివాటిగడ్డ, నిలిబీడ, సలీంనగర్, బంగారుఅంగళ్ల వీధి, నడిగడ్డ, సలీంనగర్, రైతు నగర్, జగజ్జననీనగర్, సాయిబాబానగర్, ఎన్‌జీవో కాలనీల్లో నిత్యం పారిశుద్ధ్య సమస్యలతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. కాల్వల్లో

బస్టాండు సమీపంలో ప్రభుత్వ బాలికల పాఠశాల వద్ద కాల్వలో వ్యర్థాలు

చెత్తాచెదారం తొలగించకపోవడంతో రోడ్లపైకి మురుగు పారుతోంది. దోమల బెడదతో పాటు దుర్వాసన, రహదారిపై మురుగు పారడంతో అనారోగ్యం పాలవుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు.

కౌన్సిలర్ల ఏకరువు

దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారుల నిర్లక్ష్యం ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. నిత్యం వీధుల్లో దోమల నివారణ స్ప్రేయింగ్, ఫాగింగ్ చేయాల్సి ఉండగా... కంటితుడుపు చర్యగా అక్కడక్కడ ఫాగింగ్ మిషన్‌తో హడావిడి చేస్తున్నారు తప్ప ఉపయోగం లేదని కౌన్సిలర్లు మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ప్రశ్నించారు.

దోమలతో ఇబ్బంది పడుతున్నాం

– మహబూబ్, అంజుమన్‌వీధి

మురుగు కాల్వలు సరిగ్గా శుభ్రం చేయడం లేదు. దోమలు, దుర్వాసన వస్తుండడంతో ఇళ్లలో ఉండలేకపోతున్నాం. ఉదయం, రాత్రి వేళల్లో దోమలతో ఇబ్బంది పడుతున్నాం. గత నెల నుంచి దోమల బెడద అధికమైంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి కాల్వలు శుభ్రం చేసి దోమల మందు పిచికారీ చేయాలి.

ప్రత్యేక దృష్టి సారించాం

– లక్ష్మీనారాయణ శర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పట్టణంలో దోమలతో ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులు రావడంతో కమిషనర్ ఆదేశాలతో దోమల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాం. రోజూ ఆరు వార్డుల్లో ఏడు ఫాగింగ్, 18 స్ప్రేయింగ్ మిషన్లతో పిచికారీ చేస్తున్నాం. మిగిలిన మిషన్లకు మరమ్మతులు చేసి ప్రతి వీధిలో దోమల మందును పిచికారీ చేయిస్తాం. సచివాలయం సిబ్బందిని ప్రత్యేక బృందాలుగా తయారు చేసి నివారణ చర్యలు చేపడతాం.

వీధి దీపాల ఏర్పాటు

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే: ఓంకారం శివారులో ఉన్న నాయని చెరువు 'గిరిజన గూడెంలో చిరుత సంచారం' శీర్షికతో ఈనెల 27న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన అటవీ, పంచాయతీ అధికారులు మంగళవారం పరిశీలించారు. గూడెంలో వీధి దీపాలు లేక రాత్రి అంధకారం ఉంటుందని డిప్యూటీ ఎంపీడీవో పురుషోత్తం దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే గూడెం ఆవరణలో వీధి దీపాలు, అమర్చారు. అటవీ సిబ్బంది గూడెం ఆవరణలో రెండు నిఘా కెమెరాలు అమర్చినట్లు చెప్పారు.

స్పందనకు వందనం

నంది బాలోత్సవాలు విజయవంతం చేయాలి

నంద్యాల విద్య: నంది బాలోత్సవాలను విజయవంతం చేయాలని ఆహ్వాన కమిటీ ప్రధాన కార్యదర్శి గురుస్వామి, జిల్లా నాయకులు పీవీ ప్రసాద్, అరవింద్, తత్వ కోరారు. డీఈవో కార్యాలయంలో మంగళవారం డీఈవో జనార్దన్‌రెడ్డితో కలిసి ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు.

ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

నీటిశుద్ధి కేంద్రం.. నిరుపయోగం

మండలంలోని యాళ్లూరు ఉన్నత పాఠశాలలో 300 మంది విద్యార్థులున్నారు. తాగడానికి నీరు లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం రూ.3లక్షల నిధులతో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి కేంద్రం మరమ్మతులకు గురై 8నెలలకు పైగా పనిచేయడం లేదు. దీంతో విద్యార్థులు నీళ్ల కోసం పాట్లు పడుతున్నారు. వెంటనే ఉన్నతాధికారులు తగుచర్యలు తీసుకుని నీటిశుద్ధి కేంద్రం మరమ్మతులు చేయాల్సివుంది. – న్యూస్‌టుడే, యాళ్లూరు(గోస్పాడు)

కాల్వ పొంగి.. మురుగు పారి

నంద్యాల పట్టణం టౌన్‌హాల్ ఎదుట కాల్వ పొంగి మురుగు రహదారి పక్కన ప్రవహిస్తోంది. దీంతో టౌన్ హాల్ లోకి రాకపోకలకు, పక్కనే ఉన్న మూత్రశాలలకు వెళ్లడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాల్వలో పూడిక తీయించి, సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

పడితే ప్రాణాలు పోతాయ్

పట్టణ శివారులోని విజయ పాల ఉత్పత్తుల కర్మాగారం నుంచి మండలంలోని చాబోలు గ్రామానికి వెళ్లే రహదారిలో పంట కాల్వ వద్ద రోడ్డు కోతకు గురైంది. వర్షం వచ్చిన ప్రతిసారీ వర్షపు నీరు రోడ్డు వెంట ప్రవహిస్తూ.. కోతకు గురైంది. గత వైకాపా ప్రభుత్వం ఈ రహదారికి మరమ్మతులు చేపట్టకపోవడంతో కొన్నేళ్ల నుంచి రోడ్డు కోతకు గురవుతూ వచ్చి, ప్రమాదకరంగా మారింది. అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల గ్రామీణం

విద్యుత్తు అంతరాయం.. కొమ్మలు ప్రమాదకరం



గడివేముల కొర్రపోలూరు రహదారిలో ఉన్న విద్యుత్తు లైన్ తీగలకు చెట్టుకొమ్మలు తగులుతున్నాయి. అక్కడే ఉన్న విద్యుత్తు నియంత్రిక వద్ద కంపచెట్లు పెరిగాయి. గాలికి కొమ్మలు తగిలినప్పుడు సరఫరాలో అంతరాయం కలుగుతోందని రైతులు వాపోతున్నారు. విద్యుత్తు లైన్లు, నియంత్రికల వద్ద చెట్లు తొలగించాలని ఉన్నతాధికారుల ఆదేశాలున్నప్పటికీ.. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నట్లు విమర్శలున్నాయి. – న్యూస్‌టుడే, గడివేముల

సంక్షిప్త సమాచారం

శ్రీనగరం (మహానంది: మండలంలోని శ్రీనగరం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు నారిగడ్డి చిన్నమ్మకు రూ.10 వేల విలువ గల నిత్యావసర సరకులు మండల జనసేన నాయకులు డమాల చందుతోపాటు పలువురు అందజేశారు.

నందికొట్కూరు గ్రామీణం: పాములపాడు ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం జరగాల్సిన సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. మూడేళ్లుగా గౌరవ వేతనం అందకపోవడంతో ఎంపీటీసీ సభ్యులు హాజరు కాకపోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

మిడుతూరు: మిడుతూరులోని ఆదర్శ పాఠశాల వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మండల తెదేపా అధ్యక్షుడు కాతా రమేష్ రెడ్డి, సర్వోత్తమరెడ్డి, ఎంపీడీవో దశరథరామయ్య హాజరయ్యారు.

ఆత్మకూరు: నూతన లేబర్ చట్టాలను రద్దు కోసం ఫిబ్రవరి 12న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకయ్య, రమేష్‌బాబు, సీపీఐ కార్యదర్శి ప్రతాప్ అన్నారు.

ఆత్మకూరు: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై నారాయణరెడ్డి అన్నారు. ఆత్మకూరు ఎన్టీఆర్ కేవీకే స్టేడియం ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలు, కళాశాల విద్యార్థులతో స్టేడియం నుంచి నంద్యాల మలుపు వరకు ర్యాలీ నిర్వహించారు.

నంద్యాల రైతునగరం: ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించి, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఏసురత్నం, జిల్లా అధ్యక్షులు నాగమణి డిమాండు చేశారు. నంద్యాల డీఎంహెచ్‌వో వెంకటరమణను కలిసి మంగళవారం సీఐటీయూ నాయకులు సమ్మె నోటీసులు అందజేశారు.

గడివేముల: శ్రీదుర్గాభోగేశ్వరంలో మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై మంగళవారం తహసీల్దారు వెంకటరమణ, ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు.

గడివేముల: జీరామ్‌జీ చట్టం కూలీల ఉపాధికి ఉరివేయడం వంటిదని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహనాయక్ అన్నారు. గడివేములలో మంగళవారం ధర్నా కార్యక్రమం గోడపత్రికను ఆవిష్కరించారు.

పాణ్యం గ్రామీణం: పాణ్యంలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను వేగవంతంగా పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ శ్రీహరి గోపాల్ అన్నారు. మంగళవారం పాణ్యంలోని జగనన్న కాలనీలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు.

నంద్యాల రైతునగరం: ఎస్‌డీపీఐ యువజన విభాగమైన యంగ్ డెమోక్రాట్స్‌ను దేశవ్యాప్తంగా విస్తరించేందుకు రాష్ట్ర సంఘటన కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు యంగ్ డెమోక్రాట్స్ నేషనల్ సెల్ మీడియా కోఆర్డినేటర్ తాహిర్ హుస్సేన్ తెలిపారు. యవతలో ప్రజాస్వామ్య నాయకత్వ నిర్మాణంపై దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.

నంద్యాల గాంధీచౌక్: నంద్యాల పట్టణానికి చెందిన కవి సమద్‌ను ఇస్లామిక్ సాహిత్య వేదిక తెలంగాణ వారు హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన కవి సమ్మేళనం సన్మానించారు. ప్రవక్త మహ్మద్ హితబోధ అనే అంశంపై ఈయన వినిపించిన కవిత ఆకట్టుకుంది. అనంతరం ఆయన్ను తెలంగాణ రచయితల సంఘం నాగేశ్వరరావు, శంకరం, ఆచార్య గౌరిశంకర్, క్రాంతికృష్ణ సన్మానించారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యమొద్దు

కొత్తపల్లి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య హెచ్చరించారు. కొత్తపల్లిలోని ఎంపీడీవో కార్యాలయంలో

సమస్యలు వింటున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

మంగళవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. పలువురు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో మేరి, తెదేపా మండల కన్వీనర్ లింగస్వామిగౌడ్ పాల్గొన్నారు

కొత్తపల్లి: స్థానిక ఎన్నికల్లో సమష్టి కృషితో గెలుపు జెండా ఎగురవేద్దామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. కొత్తపల్లిలో మంగళవారం తెదేపా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ పని తీరుపై చర్చించారు. తెదేపా మండల కన్వీనర్ లింగస్వామిగౌడ్, నాయకులు నారపురెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు, కొక్కెరంచ, దుద్యాల, గువ్వలకుంట్ల గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ. 4.86లక్షల చెక్కులు మంగళవారం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పంపిణీ చేశారు.

కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఎస్టీయూ నాయకులు

పీఆర్సీ ఏర్పాటు చేయాలి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలని ఏపీ రాష్ట్రోపాధ్యాయ సంఘం జిల్లా సహాధ్యక్షుడు శివప్రసాద్, ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆత్మకూరు శ్రీరామ్‌నగర్ ప్రాథమిక పాఠశాల వద్ద మంగళవారం ఎస్టీయూ పోరాట కరపత్రాలను విడుదల చేశారు. 11వ పీఆర్సీ గడువు పూర్తయి 30 నెలలు గడిచినా 12వ పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయకపోవటం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ప్రభుత్వం తీవ్ర ఆందోళన కలిగిస్తుందన్నారు. డీఏ బకాయిలు, సరెండర్ లీవ్‌లు, పీఎఫ్, మెడికల్ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు.

రాష్ట్రస్థాయి దివ్యాంగ క్రీడల్లో నంద్యాల జట్టు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి పారా స్పోర్ట్స్ దివ్యాంగ క్రీడల్లో నంద్యాల జట్టు పాల్గొంటున్నట్లు దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, కార్యదర్శి రమణయ్య తెలిపారు. మంగళవారం సంఘం కార్యాలయంలో నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ సంఘం తరఫున క్రీడాకారులకు ఆర్థిక సహకారం అందజేసి సత్కరించారు. వారు మాట్లాడుతూ నెల్లూరులోని ఏపీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో నంద్యాల జిల్లా రుద్రవరానికి చెందిన గౌతమ్, ఆత్మకూరుకు చెందిన ఇమ్రాన్, వెంకటేశ్వరపురానికి చెందిన నవీన్, చిందుకూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు పాల్గొంటారన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలి

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి, వారి డిమాండ్లను నెరవేర్చాలని యూఎఫ్‌బీయూ నాయకులు జగదీష్, మస్తాన్, వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్‌బీఐ మెయిన్

నంద్యాల గాంధీచౌక్: నిరసనలో యూఎఫ్‌బీయూ నాయకులు

బ్రాంచ్ వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. రాజేష్, కిరణ్, సుజిత్, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు పట్టణం: ఆత్మకూరులో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంకు ప్రధాన బ్రాంచి ఎదురుగా నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులు గోవర్ధన్, నాగార్జున మాట్లాడారు. సీఐటీయూ నాయకులు రణధీర్, రాంనాయక్‌లు మద్దతు ప్రకటించారు.

సున్నిపెంట సర్కిల్: సున్నిపెంటలోని శ్రీశైలం, శ్రీశైలం ప్రాజెక్టు స్టేట్‌బ్యాంకు సిబ్బంది మంగళవారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. శ్రీశైలం బ్రాంచ్ మేనేజర్ భగవాన్, ఉద్యోగులు శివకుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు విద్యా ప్రమాణాలు పెంచాలి

మహానంది, న్యూస్‌టుడే: విద్యాప్రమాణాలు పెంచడానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. మహానందిలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు.

మహానంది గిరిజన ఆశ్రమ పాఠశాలలో కలెక్టర్ రాజకుమారి

ఇటీవల మహానందిలోని గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థి విజయ్‌కుమార్ మరణించిన ఘటనపై ఆరా తీశారు. పాఠశాలతో పాటు వసతి గదుల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యాప్రమాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఇటీవల సస్పెండ్ అయిన నాగమ్మ అనే ఉపాధ్యాయురాలు తనకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం హరికృష్ణ, పీఈటీ బాషా, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదోన్నతి పంచిపెట్టారు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: దేవాదాయశాఖలో పదోన్నతుల జారీ పట్టుతప్పుతోంది.. శ్రీకాళహస్తి దేవస్థానంలో అసిస్టెంట్ ఇంజినీర్(సివిల్)గా పని చేస్తున్న పి.చంద్రశేఖరశాస్త్రి 2022 జూన్‌లో సాధారణ బదిలీల్లో శ్రీశైలానికి వచ్చారు.. ఇక్కడ డీఈఈల కొరత సాకు చెప్పి ఇన్‌ఛార్జి డీఈఈ హోదా కల్పించారు.. పరిపాలనా సౌలభ్యం కోసమే పదోన్నతి కల్పించినట్లు అప్పట్లో జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన మాత్రం రెగ్యులర్ డీఈఈ తరహాలో వ్యవహారాలు నడిపిస్తున్నారు. అందుకు అధికారులు వత్తాసు పలుకుతున్నారు. చివరకు దేవాదాయశాఖ ప్రధాన కార్యాలయ అధికారులూ శాస్త్రి విషయంలో 'తప్పు'లో కాలేశారు. రాష్ట్ర వ్యాప్తంగా శ్రీవాణి ట్రస్ట్ నిధులతో భజన మండపాల నిర్మాణానికి కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధాన ఆలయాల్లో పని చేస్తున్న ఈఈ, డీఈఈలకు పనుల పర్యవేక్షణ బాధ్యత అప్పగించారు. శ్రీశైల దేవస్థానం ఏఈ పి.చంద్రశేఖర్ శాస్త్రిని డీఈఈగా పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

అక్రమ నిర్మాణాలు ఆపాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలోని 6, 7 వార్డుల్లో మాదిగలకు చెందిన భూముల్లో స్థిరాస్థి వ్యాపారులు చేపట్టిన అక్రమ నిర్మాణాలను ఆపాలని ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బాయికాటి బెనర్జీ, మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ నాయకులు బుచ్చర్ల నరసింహులు డిమాండు చేశారు. కలెక్టరేట్ కార్యాలయం ఎదుట, గాంధీ విగ్రహం వద్ద, 1వ పట్టణ పోలీసు స్టేషన్ ఎదుట మంగళవారం ఎంఎస్‌ఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ దళితుల పొలాల్లో అక్రమ వెంచర్లలో చేసిన రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలన్నారు. డి.నరసింహులు, రాము, నాగన్న, బన్ని, చంటి, వెంకటసుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల జయంతిని అధికారికంగా నిర్వహించాలి

నంద్యాల రైతునగరం, నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : శ్రీకృష్ణదేవరాయల జయంతిని అధికారికంగా నిర్వహించాలని కాప్స్ రాక్స్ జిల్లా అడ్మిన్ శ్రీనివాసులు, కోఆర్డినేటర్ మల్లికార్జున అన్నారు. కాప్స్ రాక్స్ కార్యాలయంలో శ్రీకృష్ణదేవరాయలు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సంఘం సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 2026 నూతన సంవత్సర కాలమానిని ఆవిష్కరించారు. అనంతరం కవి కొప్పుల ప్రసాద్‌ను సన్మానించారు. నాగేశ్వరయ్య, శ్రీను, తోటరామయ్య, వెంకటేశ్వర్లు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ పథకంపై కుట్ర'

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్రం కుట్ర పన్నుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి బాబాఫకృద్దీన్ ఆరోపించారు. సీపీఐ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. భూస్వామ్య, కార్పొరేట్ శక్తుల ఒత్తిడికి తలొగ్గి కేంద్రం పథకం పేరు మార్చి, కొత్త చట్టాలు తీసుకొచ్చిందని విమర్శించారు.

గిరిజన పాఠశాలను పరిశీలించిన సీఎండీ

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: సున్నిపెంటలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల(బాలుర)ను ఎస్పీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎల్.శివశంకర్ మంగళవారం పరిశీలించారు. గిరిజన గూడెల్లో విద్యుత్తు సమస్యలపై, శ్రీశైలం పరిధిలోని చెంచుగూడెల్లో విద్యుత్తు సమస్యలు తెలుసుకునేందుకు వచ్చినట్లు తెలిపారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఐటీడీఏ పీవో కె.వి.శివప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జయశంకర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుబ్రమణ్యం ఉన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎల్.శివశంకర్

అతివలకు ఆర్థిక భరోసా

☛ స్వయం ఉపాధితో రాణిస్తున్న పొదుపు మహిళలు

నందికొట్కూరు, న్యూస్‌టుడే : పొదుపు మహిళలు స్వయం ఉపాధితో రాణిస్తున్నారు.. సంఘాల్లో రుణం తీసుకుంటూ సద్వినియోగం చేసుకుంటున్నారు. . వివిధ వ్యాపారాలు ప్రారంభించి లాభాలు పొందుతున్నారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించుకుంటూ కుటుంబానికి అండగా నిలుస్తున్నారు.

చరవాణుల దుకాణంతో..

నందికొట్కూరు పట్టణం పురపాలక మెప్మాలోని కృష్ణవేణి పొదుపు సంఘంలో ఫాతిమా ఎనిమిదేళ్లుగా సభ్యురాలిగా ఉంటున్నారు. గతంలో నాలుగుసార్లు రూ. 50వేలు రుణం తీసుకొని, ఇంటి వద్దే చీరల దుకాణం నడిపేవారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా భార్యాభర్తలు కూలీ పనులకు వెళ్లి పిల్లలను చదివించుకుంటూ తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లిస్తూ ఉండేవారు. కూలీ పనులకు ప్రత్యామ్నాయంగా సెల్ దుకాణం ఏర్పాటు చేయాలనే ఆలోచన వారికి వచ్చింది. పొదుపు సంఘం నుంచి రూ.లక్ష రుణంతో కొత్త బస్టాండు సమీపాన దుకాణం ప్రారంభించారు. ప్రతినెలా రూ.15వేల నుంచి రూ. 20వేల వరకు ఆదాయం ఉంటుంది. భార్యాభర్తలు ఇరువురూ దుకాణం నిర్వహిస్తున్నారు. ముగ్గురు పిల్లలను చదివించుకుంటూ ఆనందంగా జీవనం సాగిస్తున్నారు.

చీరలు, కుట్టుతో జీవనం

పురపాలక సంఘంలోని మెప్మాలో భరత్ పొదుపు సంఘంలో మేరీ మూడేళ్లుగా సభ్యురాలిగా ఉంటున్నారు. సంఘం నుంచి రూ.లక్ష రుణం తీసుకున్నారు. ఇంటి వద్దే చీరల దుకాణంతోపాటు తనకొచ్చిన కుట్టు మిషన్ నిర్వహిస్తున్నారు. దుకాణంతోపాటు కుట్టు బాగా జరుగుతుండటంతో వ్యాపారం ముందుకు సాగుతోంది. భర్త లారీ డ్రైవరు. ఇద్దరు పిల్లలు చదువుతున్నారు. ఆర్థికంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా వ్యాపారం చేసుకుంటూ తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లిస్తున్నారు. నెలకు రూ.6వేల నుంచి రూ.10వేల వరకు లాభం వస్తుందని ఆమె చెబుతోంది.

● పొదుపు సంఘాల్లో చేరడంతో ఆర్థికాభివృద్ధితోపాటు కుటుంబంతో సంతోషంగా జీవనం సాగిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. గతంలో ఇచ్చే రూ.50వేల రుణం వ్యాపారం చేసుకునేందుకు సరిపోకపోవడంతో ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు రుణాలు ఇస్తుండడంతో వ్యాపారాలు చేసుకునేందుకు రుణాలు ఉపకరిస్తున్నాయని సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సిమెంట్‌నగర్‌లో వ్యక్తి ఆత్మహత్య

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని సిమెంట్‌నగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల పట్టణం సంజీవనగర్ కాలనీకి చెందిన మాదిగ పవన్‌కుమార్(38)కు సిమెంట్‌నగర్ గ్రామానికి చెందిన కవితతో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. పదేళ్ల క్రితం వారు సిమెంట్‌నగర్‌కు వచ్చి స్థిరపడ్డాడు. వీరికి కుమారుడు నాగరాజు, కుమార్తె దీక్షిత ఉన్నారు. పవన్‌కుమార్ మద్యానికి బానిసై కొన్ని రోజుల నుంచి పనికి వెళ్లడం లేదు. దీనికి తోడు తరచూ మద్యం తాగి వచ్చి భార్యా పిల్లలను కొడుతున్నాడు. ఇదే విధంగా భార్య కవితతో సోమవారం రాత్రి గొడవపడ్డాడు. దీంతో ఆమె పిల్లలతో సహా పుట్టింటికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకుండా వెళ్లిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన పవన్‌కుమార్ మనస్తాపంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం భార్యా పిల్లలు ఇంటికి వచ్చి చూడగా ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గమనించారు. ఘటనపై పోలీసులకు సమాచారమివ్వగా.. వారు ఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకొన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు హన్నుకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై నబీ తెలిపారు.

షార్టు సర్క్యూట్‌తో మంటలు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: సున్నిపెంటలోని ఖాదర్ హోటల్ సమీపంలో షార్టు సర్క్యూట్‌తో పాత సామాన్ల గూడెంలో మంగళవారం మంటలు చెలరేగాయి. సున్నిపెంటలోని ఖాదర్‌హోటల్ సమీపంలో మహ్మద్‌ఖాసీంకు చెందిన పాత సామాన్ల గూడెంలో విద్యుత్తు షార్టు సర్క్యూట్‌తో మంటలు చెలరేగినట్లు మహ్మద్‌ఖాసీం తెలిపారు. మంటలు అంటుకున్న ప్రాంతంలో ఖాళీ అట్టపెట్టెలు, నోట్‌బుక్స్ ఉన్నట్లు పేర్కొన్నారు. మంటలు విస్తరిస్తుండడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వెంటనే అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. దాదాపు రూ.లక్ష నష్టం ఉంటుందని ఆయన తెలిపారు. మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

(c) eenadu

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

బీసీల సంక్షేమానికి సహకారం

బనగానపల్లి: బీసీల సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తామని ఆ సంఘం జిల్లా కార్యదర్శి చల్లా మద్దిలేటి పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శిగా ఎంపికైన నేపథ్యంలో మంగళవారం బనగానపల్లిలో ఆయన్ను సంఘం నాయకులు సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరయాదవ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

పనుల్లో నాణ్యత పెంచాలి

దొర్నిపాడు: రానున్న ఏడాదిలో ప్రతి గ్రామంలో నిర్వహించే ఉపాధి పనుల్లో నాణ్యత పెంచాలని డ్వామా పీడీ సూర్యనారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యాప్తంగా పలు రకాల పనుల్లో జరిగిన అవకతవకల్లో దాదాపు రూ.40 వేలు డబ్బులను రికవరీ చేయించారు. ఏపీవో పరమేశ్వరుడు, ఏపీఈ రాజశేఖర్‌రెడ్డి, ఏపీడీ సాంబశివరావు పాల్గొన్నారు.

బస్సు సర్వీసుల పునరుద్ధరణకు చర్యలు

అవుకు: ఆగిపోయిన దూరప్రాంత బస్సు సర్వీసులను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు బనగానపల్లి డిపో మేనేజర్ శశిభూషణ్ తెలిపారు. సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటన్నతో కలిసి ఆయన మంగళవారం అవుకు బస్టాండును సందర్శించారు. ప్రయాణ ప్రాంగణంలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. ఆగిపోయిన బనగానపల్లి-నెల్లూరు, బనగానపల్లి- బెంగళూరు సర్వీసులు పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ?: యర్రగుంట్ల ఎస్సీ కాలనీలోని రెండు తాగునీటి తొట్లకు బిరడాలు ఏర్పాటు చేయాలి. **- వెంకటయ్య, స్థానికుడు** ✔: తాగునీటి తొట్లకు బిరడాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. **- శ్రీనివాసశర్మ, ఇన్‌ఛార్జి ఈవో, యర్రగుంట్ల**

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ?: మండలంలోని రహిమాన్‌పురం ఎస్సీ కాలనీలో వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. స్విచ్‌లను ఏర్పాటు చేస్తే బాగుంటుంది. **- కాలనీవాసులు** ✔: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం. **-మల్లికార్జున, డిప్యూటీ ఎంపీడీవో**

?: రహిమాన్‌పురంలో ఆరు స్తంభాలకు వరుసగా వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి సమయంలో ఇబ్బంది పడుతున్నాం. **- కాలనీవాసులు** ✔: పంచాయతీ కార్యదర్శికి చెప్పి వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. **- మల్లికార్జున, డిప్యూటీ ఎంపీడీవో**

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ?: కోవెలకుంట్లలోని కర్ర సుబ్బారెడ్డి కాలనీలో రహదారిని బాగుచేయండి. **- నాగరాజు, స్థానికుడు.** ✔: పరిశీలించి చర్యలు తీసుకుంటాం **- ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జి ఈవో**

ఆలయ మాన్యంలోని అక్రమమైనింగ్ పరిశీలన

పలుకూరు (బనగానపల్లి గ్రామీణం): బనగానపల్లి మండలం పలుకూరులోని రామేశ్వరస్వామి ఆలయ భూమిలో అక్రమార్కులు మైనింగ్ పనులు చేస్తుండటంతో దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ మోహన్, ఆలయ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డిలు మంగళవారం పరిశీలించారు. పెద్దసంఖ్యలో నాపరాయిని వెలికితీశారు. విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. దేవుని మాన్యాన్ని కొల్లగొడితే ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

మైనింగ్‌ను పరిశీలిస్తున్న దేవాదాయశాఖ అధికారులు

వారి వెంట ఆలయాధికారి బ్రహ్మానందరెడ్డి తదితరులు ఉన్నారు.

సేవలకు ఎల్లవేళలా గుర్తింపు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: కోవెలకుంట్ల పట్టణానికి చెందిన విక్కీ ఫౌండేషన్ నిర్వాహకుడు గోపిరెడ్డి ప్రతాప్‌రెడ్డి అలియాస్ విక్కీని దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. ఆయన చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి జిల్లా కలెక్టర్ గణతంత్ర వేడుకల్లో ఉత్తమ సేవా పురస్కారాన్ని అందించడంతో అభినందిస్తూ ఈ సన్మానం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఐకాస అధ్యక్షుడు అందనం దేవరాజు, చెన్నయ్య, రమణ, సుబ్బరాయుడు, మద్దిలేటి పాల్గొన్నారు.

తొలగిన లీకేజీ సమస్య

స్పందనకు వందనం

ఆర్‌ఎస్ రంగాపురం(బేతంచెర్ల),న్యూస్‌టుడే: మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురంలో 340బీ సర్వీసు రోడ్డు పక్కన తాగునీటి పైపు లీకేజీతో నిరంతరం నీరు వృథాగా పోతోంది. దీనిపై ఈనెల 26న 'ఈనాడు'లో 'వృథా నీరు.. కనిపించని తీరు' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్ పంచాయతీ కార్మికుడితో లీకేజీ పైపుకు మరమ్మతులు చేయించారు.

జాగా కనిపిస్తే పాగా

◆ పట్టణంలో యథేచ్ఛగా ఆక్రమణలు
◆ మొలకల వాగు వెంట ఇష్టారాజ్యంగా నిర్మాణాలు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డలో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు బంకు వేయడం, బాడుగకు ఇవ్వడం సర్వసాధారణమైంది. ప్రధాన రహదారిపై 80 అడుగులు ఉండాల్సిన దారి కాస్తా 50 నుంచి 60 అడుగులకు పరిమితమవుతోంది. పడకండ్ల వంతెన మొదలు మెయిన్ బజారు, పాత బస్టాండు, చర్చి రోడ్డు, టీబీ రోడ్డు, బస్టాండు రోడ్డు, కోవెలకుంట్ల రోడ్డు, ఎంపీడీవో కార్యాలయం వరకు రహదారులకు ఇరువైపులా ఆక్రమణలు ఉన్నాయి. కొందరు దుకాణాలు ఏర్పాటు చేసుకోగా.. మరికొందరు రేకుల షెడ్ వేసి బాడుగలకు ఇచ్చేస్తున్నారు. ఇక ప్రభుత్వాసుపత్రి వద్ద అయితే కాల్వలను సైతం ఆక్రమించుకుని బంకులు వేస్తున్నారు.

మొలకల వాగు పక్కన ఆక్రమణలు

సమస్య మరింత జటిలం

మరోవైపు పట్టణంలో ప్రధాన మురుగు కాల్వగా ఉన్న మొలకల వాగు ఆక్రమణలకు నెలవుగా మారింది. ఇది ఎస్వీ నగర్ వద్ద ప్రారంభమవుతుండగా.. ఏసునాథపురం, ఎల్ఎం కాంపౌండ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మినీ థియేటర్ మీదుగా బృందావనం కాలనీ దాటుకుని వక్కిలేరులో కలుస్తుంది. పట్టణంలో ఈ కాల్వనే చిన్న, మధ్య తరహా కాల్వలతో అనుసంధానమై మురుగునంతా బయటకు పంపుతుంది. దీని పక్కనే దాదాపు 15 అడుగుల ఖాళీ స్థలం ఉండగా ప్రస్తుతం కొన్ని అడుగులు మాత్రమే వదిలి మిగతాదంతా ఆక్రమించుకుంటున్నారు. కొందరైతే ఆధ్యాత్మిక నిర్మాణాల పేరుతో నాలుగు వైపులా గోడలు కట్టేస్తున్నారు. మినీ థియేటర్ సమీపంలో కాల్వ పక్కన స్థలాన్ని పూర్తిస్థాయిలో ఆక్రమించేశారు.

పారిశుద్ధ్యానికి అడ్డంకి

మొలకలవాగు గట్లు ఆక్రమణలకు గురి కావడంతో జేసీబీలతో కాల్వలోని పూడికను తొలగించే స్థితి లేదు. దీంతో మురుగు బయటకు వెళ్లక ఎల్ఎం కాంపౌండ్ మొదలుకుని సాగర్ వీధి, రామాలయం వీధి, జమున వీధి, ఖాన్‌ఖా, కంబగిరి వీధుల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈగలు, దోమల కారణంగా ప్రజారోగ్యం ప్రభావితమవుతోంది.

నిర్వహణ లేక ప్రజాధనం వృథా

కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఈ ప్రధాన మురుగు కాల్వకు నిర్వహణ లోపాలు శాపంగా మారాయి. దాదాపు 1.5 కి.మీ పొడవునా, పట్టణ నడిబొడ్డున నుంచి వెళ్తున్న ఈ కాల్వను సక్రమంగా నిర్వహిస్తే 60 శాతం సమస్యను పరిష్కరించినట్లే. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించకుంటే మున్ముందు ముప్పు తప్పదు.

కస్తూర్బా పీవోలకు శిక్షణ

ముత్యాలపాడు(చాగలమర్రి), న్యూస్‌టుడే: మండలంలోని ముత్యాలపాడులోని బర్డ్స్ పాఠశాల ఆవరణలో కర్నూలు జిల్లా ఎస్ఎస్ఏ పీవో నూకరాజు ఆధ్వర్యంలో మంగళవారం శిక్షణ తరగతులను నిర్వహించారు. కర్నూలు జిల్లాలోని కస్తూర్బా పీవోలకు తొలివిడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. తిరిగి ఫిబ్రవరి-2వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు నంద్యాల జిల్లాలోని కస్తూర్బా పీవోలకు శిక్షణ ఇస్తామని తెలిపారు.

మహిళల అభ్యున్నతికి కృషి చేయాలి

సంజామల: సంజామలలో మంగళవారం మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా కె.జ్యోతి, కార్యదర్శిగా పి.

నూతన కార్యవర్గ సభ్యులతో మహిళలు

కవిత, సహ కార్యదర్శులుగా లక్ష్మీదేవి, సుధలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వెలుగు మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా ప్రేమలక్ష్మి, కార్యదర్శిగా కావేరి, సహ కార్యదర్శులుగా సత్య, కస్తూరిలను సభ్యులు ఎన్నుకున్నారు.

బ్యాంకు పనిదినాలను తగ్గించాలని కోరుతూ సమ్మె

ఆళ్లగడ్డ: యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ పిలుపు మేరకు ఆళ్లగడ్డ బ్యాంకు ఉద్యోగులు ఒక రోజు సమ్మె చేశారు. ఇందులో భాగంగా వారు విధులను బహిష్కరించి నిరసన చేపట్టారు. 2022లో బ్యాంకులు వారానికి ఐదు రోజులే పని చేసేలా బ్యాంకు సంఘాలతో ఒప్పంద ఐబీఏ ఒప్పందం చేసుకుందని దాన్ని ఇంత వరకు అమలు చేయలేదన్నారు.

మూత వేస్తేనే ప్రమాదాలకు అడ్డుకట్ట

పట్టణంలోని మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మురుగు కాలువలు ప్రమాదకరంగా మారాయి. స్థానిక బసవన్న కట్ట వద్ద ప్రధాన మురుగు కాలువ వద్ద నిత్యం ఒక వాహనం ప్రమాదానికి గురై కాలువలో పడి గాయాలపాలవుతున్నారు. అధికారులు స్పందించి కాలువపై కనీసం బండలు పరచాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, చాగలమర్రి

కటికవాని కొండలు... ప్రమాదాలకు నిలయాలు

మండల పరిధిలోని యాగంటిపల్లె సమీపంలోని కటికవానికుంట కొండలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఈ కొండల మధ్య యాగంటి నుంచి మద్దిలేటి స్వామి ఆలయానికి వెళ్లేందుకు దగ్గరదారి కావడంతో నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మరోవైపు నేల కొండలు మద్దిలేటి స్వామి ఆలయం నుంచి వస్తున్న ఆటో బోల్తా పడి మహిళ చనిపోయింది. ఇక్కడ మలుపుల వద్ద కొన్ని చోట్ల రక్షణ గోడలు పడిపోయాయి. పెద్ద ప్రమాదాలు జరగకముందే సూచికలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, బనగానపల్లి

ప్రయాణ ప్రయాస

బేతంచెర్ల రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 1, 2వ ప్లాట్‌ఫాంలో ప్రయాణికులు కూర్చునేందుకు సరైన బల్లలు (బెంచీలు), తాగునీటి కుళాయిలు, శౌచాలయాలు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. పలుమార్లు ప్రజా ప్రతినిధులు, రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవు. స్టేషన్‌లో కనీస వసతులు కల్పించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, బేతంచెర్ల

అవార్డు గ్రహీతకు సన్మానం

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాస్థాయిలో గణతంత్రదినోత్సవం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్పీ చేతులమీదుగా ఏఈ నాగరాజు ఉత్తమ పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా హ్యాండ్స్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్కే ఖలీల్‌బాషా, సామాజిక కార్యకర్త పి.మహమ్మదరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జ్యోతిమిత్రమండలి ఆవరణలో ఆయనను సన్మానించారు.

వేణుగోపాల్‌గౌడ్ మృతికి న్యాయవాదుల సంతాపం

డోన్‌పట్టణం: పట్టణంలోని జీఆర్‌కాలనీలో ఉంటున్న బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది టీ.ఈ వేణుగోపాల్‌గౌడ్ (64) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ న్యాయవాది భౌతికకాయానికి పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శీలం భాస్కరనాయుడు, కార్యదర్శి మద్దయ్య, పలువురు న్యాయవాదులు గార్లపాటి మద్దిలేటి, శివరామకృష్ణ, రాగులరాముడు, కె.నారాయణ, బొంకూరి రవికుమార్, కృష్ణమూర్తి, ఎస్‌టి హరుణ్, కోట్ల మరికొందరు న్యాయవాదులు శ్రద్ధాంజలి ఘటించారు.

ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయులు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డలో మంగళవారం శ్రీ కృష్ణదేవరాయల జయంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీ సెంటరులోని శ్రీ కృష్ణ దేవరాయల విగ్రహానికి నివాళి అర్పించారు. తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆళ్లగడ్డలో కాపు భవన్ ఏర్పాటు చేయాలని, శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ తహసీల్దారు జ్యోతి రత్నకుమారి, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియలకు వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు.

ఉయ్యాలవాడ: ప్రతిమకు నివాళి అర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు

ప్రమాణస్వీకారం ఆలస్యంపై ఆగ్రహం

ఆళ్లగడ్డ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా మైలేరి సురేఖను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినా ఇంతవరకు ప్రమాణ స్వీకారం చేయించే పరిస్థితి లేకపోవడంపై బలిజ కులస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్‌గా ఎన్నికైన మైలేరి సురేఖ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిర్ణయానుసారంగా తనను ఛైర్మన్‌గా నియమిస్తూ ఆదేశాలు ఇచ్చారన్నారు. తన ప్రమాణ స్వీకారాన్ని ఎమ్మెల్యే ఆపడం బాధాకరమన్నారు. సాటి మహిళకు అవకాశం కల్పించకపోవడం సబబు కాదన్నారు. ఎమ్మెల్యే గెలుపులో బలిజలు ఎంతో కృషి చేశారని, వారికి వచ్చిన పదవిని అందకుండా చేయడం సరైన చర్య కాదన్నారు. ఇప్పటికైనా తన ప్రమాణ స్వీకారానికి సహకరించాలని కోరారు.

చాగలమర్రి: పట్టణంలో జెట్టి నాగరాజు, జెట్టి సుధాకర్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలో బలిజ సంఘం నాయకులు కృష్ణదేవరాయల చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రసాద్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: శ్రీకృష్ణదేవరాయల జయంతి సందర్భంగా ఉయ్యాలవాడలో బలిజ సంఘం నాయకులతో సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అర్జిగారి నరసింహుడు సమావేశమయ్యారు. రాయల పాలన గొప్పదనాన్ని కొనియాడారు. సంఘం మండలాధ్యక్షుడు వెంకట సుబ్బయ్య, మండల గౌరవాధ్యక్షుడు చిన్నరాముడు, ఉపాధ్యక్షులు ఉసేనయ్య, వెంకటస్వామి తదితరులు శ్రీకృష్ణదేవరాయల ప్రతిమకు నివాళి అర్పించారు.

సంక్షిప్త సమాచారం

చాగలమర్రి: ఉత్తమ తహసీల్దారుగా ప్రశంసాపత్రం అందుకున్న చాగలమర్రి తహసీల్దారు విజయ్‌కుమార్‌కు మంగళవారం ఘనంగా సన్మానించారు. స్థానిక కార్యాలయంలో తెదేపా రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు అన్సర్‌బాషా, నంద్యాల పార్లమెంటరీ బీసీ సెల్ స్పోక్స్ పర్సన్ సల్లానాగరాజు ఆధ్వర్యంలో ఆయన్ను సన్మానించారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ ఎలక్ట్రీషియన్స్ డేను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా థామస్ ఆల్వా ఎడిసన్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ముఖ్యఅతిథిగా జిల్లా కార్మిక అధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు.

డోన్‌పట్టణం: రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమించాల్సిన అవసరం ఉందని జనవిజ్ఞాన వేదిక, యూటీఎఫ్ నాయకులు బి.మాణిక్యంశెట్టి, ఎన్.నరసింహుడు, ఎన్ఎస్ బాబులు పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక డోన్ డివిజన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్ వద్ద ఉన్న డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి జేవీవీ, యూటీఎఫ్ నాయకులు నివాళి అర్పించారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తి అధ్యక్షతన పుస్తకాలను ఆవిష్కరించారు.

అవుకు: పశుపోషణ, పాడి పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని తెదేపా క్లస్టర్ నాయకుడు అరుణ్‌నాయక్ సూచించారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన శిబిరాన్ని ఆయన మంగళవారం ప్రారంభించి పలు విషయాలు వెల్లడించారు.

రాష్ట్రం కోసమే నాడు లోకేశ్ పాదయాత్ర

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో వైకాపా క్రూర పాలనతో ప్రజలు ఎంతో నష్టపోయారని, ఆ దుష్ట పాలన నుంచి ప్రజల్ని రక్షించేందుకే నారా లోకేశ్ పాదయాత్ర చేశారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. ఎండా వానలను లెక్క చేయకుండా వందల కి.మీలు పాదయాత్ర చేసి దాదాపు 100 నియోజకవర్గాల్లో లోకేశ్ పర్యటించారన్నారు. తాను కూడా యాత్రలో 33 రోజుల పాటు లోకేశ్‌తో నడిచానన్నారు. కూటమి ప్రభుత్వంలో ఓర్వకల్లులో పలు పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆళ్లగడ్డ బలిజలు కోరిన మేరకు నియోజకవర్గంలో మూడు కాపు భవన్లు, శ్రీ కృష్ణదేవరాయల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని, జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించాలన్న అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తానన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ధార్మిక చింతనతో జీవించాలి

మాట్లాడుతున్న జయదేవానందస్వామి

చెర్వుపల్లి(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు ధార్మిక చింతనతో జీవించాలని జయదేవానందస్వామి పేర్కొన్నారు. మండలంలోని చెర్వుపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో 5 రోజుల ధార్మిక కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తితిదే ధర్మ ప్రచార పరిషత్ కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి మాట్లాడుతూ.. శ్రీమద్‌రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై ధార్మిక ప్రవచనాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

యాగంటి ఆలయాభివృద్ధికి విరాళం

యాగంటి (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండలం యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన శ్రీనివాస్ కుటుంబసభ్యులు రూ.10,116 విరాళం ఆలయ సిబ్బందికి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు దాతలను సంప్రదాయబద్ధంగా సత్కరించి, ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, ఆలయ అర్చకులున్నారు.

నృసింహుని పార్వేటోత్సవం.. ఆనందభరితం

బాచాపురం(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అహోబిలం లక్ష్మీనృసింహస్వామి పార్వేటోత్సవం అంగరంగ వైభవంగా సాగుతోంది. ఊరూరా స్వామి పర్యటిస్తూ విశేష పూజలందుకుంటున్నారు. స్వామి పార్వేట పల్లకి మంగళవారం బాచాపురం గ్రామంలో కొలువుదీరింది. ఊర్లోని తెలుపులపై ప్రహ్లాదవరదస్వామి, జ్వాలా నృసింహస్వామి కొలువుదీరగా భక్తులు ఊరేగింపుగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. చిరుకానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పల్లకిని భుజాలపై మోస్తూ భక్తిని చాటుకున్నారు. స్వామి రాకతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. పల్లకి రాత్రి నాగిరెడ్డిపల్లెకు చేరుకుంది.

పూజలందుకుంటున్న ప్రహ్లాదవరద స్వామి, జ్వాలా నృసింహస్వామి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని వెంకటాపురం, గుమ్మకొండ గ్రామాల్లో

వెంకటాపురంలో రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి

మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రజలతో ముఖాముఖి సమావేశమయ్యారు. సమస్యలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. గుమ్మకొండ నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకు రోడ్డు కోసం రూ.2 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. రూ.10 లక్షల వ్యయంతో అబ్బిరెడ్డిపల్లె చెరువు నుంచి కాల్వ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. గ్రామస్థులు తెలిపిన సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు దశరథ రామిరెడ్డి, నాయకులు యోగానందరెడ్డి, మోహన్‌రెడ్డి, హనుమప్పనాయుడు, హరిశంకర్‌గౌడ్, రామిరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, బాలు, చంద్రుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రింగ్ రోడ్డు ప్రతిపాదనపై చర్చ

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని సాయిబాబా ఆలయం నుంచి బేతంచెర్ల రహదారి వరకు రింగ్ రోడ్డు ప్రతిపాదన కోసం ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ, తదితర శాఖల ఇంజినీరింగ్ అధికారులతో చర్చించారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, మైనర్ ఇరిగేషన్ వంటి పలు శాఖల అధికారులతో పాటు రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. ఇందులో అధికారులు తమ అభిప్రాయాలను, సాంకేతిక సూచనలను తెలిపారు. ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు ఆదేశించారు. సర్వే చేసి ప్రతిపాదనలను రూపొందించేందుకు రిపోర్టు అందించాలని సూచించారు.

విద్యార్థులు ఇష్టంతో చదువుకోవాలి

మహిళా ఉపాధ్యాయులతో బీసీ ఇందిరమ్మ

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఇష్టపడి చదువులో రాణించాలని తెదేపా నేత బీసీ ఇందిరమ్మ పేర్కొన్నారు. ఉపాధ్యాయ బృందానికి రూ.లక్ష విలువ చేసే 35 బెంచీలను అందించారు. స్థానిక పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు అధ్యక్షతన పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన తెదేపా నేత బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ.. పది విద్యార్థులు భయం వదిలి పరీక్షల్లో రాణించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు ఆమెను సన్మానించారు. చదువులో రాణిస్తున్న యనకండ్ల గ్రామానికి చెందిన దేవవర్షితను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

పాఠశాలల తనిఖీ

సంజామల: విద్యార్థులు సొంతంగా ప్రశ్నలకు జవాబులు రాసేలా విద్యను ఉపాధ్యాయులు బోధించాలని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు పేరుసోముల, కానాల, గిద్దలూరు గ్రామాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదోతరగతి విద్యార్థులతో చర్చించి అత్యుత్తమ మార్కులు సాధించేందుకు పాటించాల్సిన నియమాలను వివరించారు. మండల విద్యాధికారులు వెంకటరమణారెడ్డి, ఈశ్వరయ్య, కోవెలకుంట్ల మండల విద్యాధికారి వెంకటసుబ్బయ్య, సీఆర్పీ హుసేన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్‌నగర్‌లో వ్యక్తి ఆత్మహత్య

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని సిమెంట్‌నగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల పట్టణం సంజీవనగర్ కాలనీకి చెందిన మాదిగ పవన్‌కుమార్(38)కు సిమెంట్‌నగర్ గ్రామానికి చెందిన కవితతో 16 ఏళ్ల క్రితం వివాహమైంది. పదేళ్ల క్రితం వారు సిమెంట్‌నగర్‌కు వచ్చి స్థిరపడ్డాడు. వీరికి కుమారుడు నాగరాజు, కుమార్తె దీక్షిత ఉన్నారు. పవన్‌కుమార్ మద్యానికి బానిసై కొన్ని రోజుల నుంచి పనికి వెళ్లడం లేదు. దీనికి తోడు తరచూ మద్యం తాగి వచ్చి భార్యా పిల్లలను కొడుతున్నాడు. ఇదే విధంగా భార్య కవితతో సోమవారం రాత్రి గొడవపడ్డాడు. దీంతో ఆమె పిల్లలతో సహా పుట్టింటికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకుండా వెళ్లిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన పవన్‌కుమార్ మనస్తాపంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం భార్యా పిల్లలు ఇంటికి వచ్చి చూడగా ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గమనించారు. ఘటనపై పోలీసులకు సమాచారమివ్వగా.. వారు ఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకొన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తమ్ముడు హన్నుకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై నబీ తెలిపారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

భువన విజయం వేషధారణలో విద్యార్థులు, ఉపాధ్యాయుడు నాగరాజు

ఇల్లూరుకొత్తపేట(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని అప్పుడే చదువులో రాణిస్తారని పాఠశాల స్థలదాత కుటుంబసభ్యులు సురేశ్‌బాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని ఇల్లూరుకొత్తపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్‌రెడ్డి అధ్యక్షతన పాఠశాల వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన పాఠశాల స్థలదాత కుటుంబసభ్యులు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు బహుమతులు అందించారు.

బేతంచెర్ల, రుద్రవరం: బేతంచెర్ల మండలంలోని గొరుమానుకొండ ఆదర్శ పాఠశాల, రుద్రవరం ఆదర్శ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు, నృత్యాలు అలరించాయి.

మురుగు.. దారులపై పరుగు

■ కాలువలు లేక అధ్వానంగా పారిశుద్ధ్యం

ఈ చిత్రంలో కనిపిస్తున్నది డోన్ పాతపేటలోని కార్మికశాఖ కార్యాలయం ఎదుట ఉన్న తాత్కాలిక కాలువ. ఇది సరిగా లేకపోవడంతో మురుగునీరు సరిగా ప్రవహించే వీల్లేక రోడ్డుపైకి వస్తున్నాయి. దీంతో దారిలో నడిచేందుకు ఇబ్బందులు పడటంతో పాటు దోమల బెడద అధికమైందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. కాలనీల్లో మురుగునీరు రహదారులపై ప్రవహిస్తూ రోగాలకు నిలయంగా మారుతున్నాయి. కాలువలు లేకపోవడంతో శివారు ప్రాంతాల్లోని వీధులు బురదమయంగా దర్శనమిస్తున్నాయి. కాల్వల నిర్మాణాలు చేపట్టాలని పురపాలక పరిధిలోని పలు కాలనీల ప్రజలు పలుమార్లు పాలకులు, అధికారులకు విన్నవించుకుంటున్నా.. ఫలితం లేకుండా పోతోంది. ఇళ్లలో వినియోగించుకునే నీరంతా రహదారులపైకి చేరి సమస్యగా మారుతోంది. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా సీసీ డ్రైన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు.

పట్టణంలో 32 వార్డులకు గాను 16 వేలకు పైగా గృహాలున్నాయి. వాటిలో 75 వేలకు పైగానే జనాభా నివసిస్తోంది. పట్టణంలోని శ్రీనివాసనగర్, వైఎస్సార్ నగర్, శ్రీరామనగర్, జంగాల కాలనీ, చిగురుమానుపేట, త్రివర్ణకాలనీ, సుజాతమ్మనగర్, ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో కాల్వలు లేక మురుగంతా రోడ్లపైనే ప్రవహిస్తోంది. ఇళ్లలోని వృథా నీరంతా రోడ్లపైకి చేరుతూ అస్తవ్యస్తంగా మారుతున్నాయి.

రూ.కోటితో ప్రతిపాదనలు

పురపాలక పరిధిలోని పాతపేట, తారకరామానగర్, శ్రీనివాసనగర్, సుజాతమ్మనగర్, వైఎస్ఆర్ నగర్, పాతపేటలోని కార్మికశాఖ కార్యాలయం వీధిలో సీసీ డ్రైన్ల నిర్మాణాలు చేపట్టేందుకు మున్సిపల్ అధికారులు అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు రూపొందించారు. డీపీఆర్ అప్రువల్ కోసం కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) కార్యాలయానికి ఇటీవల నివేదించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ నిధులు త్వరలో మంజూరైతే అధికారులు ప్రతిపాదించిన ప్రాంతాల్లో సీసీ డ్రైన్ల నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉంటుంది.

(c) eenadu

ఈనాడు పల్నాడు
బుధవారం జనవరి 28, 2026

తరతరాల సంప్రదాయం.. వీరంగం

శిక్షణ పొందుతున్న కాపూరు గ్రామస్థులు

కాపూరు (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: చిలకలూరిపేట ప్రాంతంలోని పలు గ్రామాల్లో శివరాత్రి సందర్భంగా సందడి నెలకొంటుంది. పండగకు నెల రోజుల ముందు నుంచే ప్రజలు నిష్ఠగా ఉంటారు. కాపూరు గ్రామంలో కొంతమంది ప్రత్యేక నియమాలు పాటిస్తూ భక్తిశ్రద్ధలతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ప్రధానంగా కాపూరు గ్రామం నుంచి కొండకు ప్రభ తరలించే ముందు ఏటా వీరంగం ఆడటం ఆనవాయితీ. గ్రామంలోని యువకుల నుంచి పెద్దల వరకు పది నుంచి 15 మంది వీరంగంలో ఏర్పడి ఒక్క పొద్దు (ఒక్కపూట భోజనం లేదా శాకాహారం) ఆచరిస్తూ వీరంగం సాధన చేస్తారు. నెల రోజుల పాటు ఆధ్యాత్మిక చింతనలో గడుపుతారు. వీరికి గ్రామంలోని జంగం దేవర శరభ.. శరభ అంటూ వీరంగం వేసే శిక్షణ ఇస్తారు. శిక్షణ తీసుకున్న వారంతా శివరాత్రి ముందురోజు ప్రభ గ్రామం నుంచి కొండకు బయల్దేరగానే కుంభం పోసిన తరువాత శరభ.. శరభ అంటూ ప్రభ ముందు వీరంగం ఆడుతూ భక్తిని చాటుకుంటారు.

ఏఎన్‌యూలో ఆచార్యుడైనా..

కాపూరు గ్రామానికి చెందిన కందుల ధనుంజయ్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా పని చేస్తున్నారు. ఈయన ప్రభ పండుగ తన ఊరి కార్యక్రమంలో పాల్గొంటారు. మహాశివరాత్రికి నెల రోజుల ముందు నుంచే నియమనిష్ఠలు పాటిస్తూ వీరంగం శిక్షణ పొందుతున్నారు. అందరితో కలిసిపోయి ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. పూర్వీకుల ఆచారాలను గౌరవించడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన చెబుతున్నారు.

పొలం పనులు చూసుకుంటూ..

గ్రామానికి చెందిన మద్దాలి శివకోటి తన పొలం పనులు చూసుకుంటూనే భక్తిశ్రద్ధలతో ప్రభ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. గ్రామంలో యువకులతో కలిసి వీరంగం శిక్షణ పొందుతున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం కోటయ్యస్వామి కల్పించిన అవకాశంగా భావిస్తున్నట్లు ఆయన తెలిపారు.

కోటప్పకొండ తిరునాళ్లకు జోరుగా ఏర్పాట్లు

కోటప్పకొండ తిరునాళ్లకు జోరుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. గతంతో పోలిస్తే ఈసారి ముందుగానే పనులు ప్రారంభించారు. కొండపై చలువ పందిళ్లు ఎప్పుడూ మహాశివరాత్రి మూడు రోజుల ముందు వేసేవారు. ఈసారి పదిహేను రోజుల ముందుగానే ఆ పనులు మొదలుపెట్టారు. ఉచిత దర్శనంతో పాటు రూ.100, రూ.200 టికెట్ల క్యూలైన్లలో తాటాకులతో పందిళ్లు వేస్తున్నారు. ప్రధాన ఆలయానికి రంగులు అద్దుతున్నారు. నరసరావుపేట పట్టణంతో పాటు కోటప్పకొండకు వెళ్లే దారుల్లో డివైడర్లు, కల్వర్టులకు రంగులు వేస్తున్నారు. - ఈనాడు, నరసరావుపేట

పర్సంటేజీ ఇస్తేనే బిల్లులు!

2014-19 మధ్య చేసిన పనులకు ఇప్పుడు వసూళ్లు

ఈనాడు, నరసరావుపేట

పదేళ్ల కిందట పనులు చేసి రూ.లక్షల్లో అప్పుల పాలై వడ్డీలు చెల్లిస్తున్న గుత్తేదారుల సమస్యను గుర్తించిన కూటమి ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తే కొందరు అధికారులు పర్సంటేజీల పేరిట వసూళ్లకు పాల్పడుతున్నారు. అసలే నష్టపోయి ఉంటే అందులో కొంత మొత్తం ఇవ్వాలా? అని గుత్తేదారులు ఆవేదన చెందుతున్నారు. 2014- 19 మధ్య కాలంలో చేసిన పనులకు ప్రస్తుతం బిల్లులు మంజూరు చేశారు. వీటికి సంబంధించి జిల్లాలోని కొందరు ఎంపీడీవోలు ఆడిట్ పేరిట అందినకాడికి దండుకుంటున్నారు.

జిల్లాలో ఇలా..	
పూర్తయిన పనులు:	1,289
బిల్లులు:	రూ.20.14 కోట్లు
ఆన్‌గోయింగ్ పనులు:	1,230
బిల్లులు:	రూ.23.39 కోట్లు

ఆడిట్ పేరిట..

విభజిత ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా అధికారంలోకి వచ్చినప్పుడు చాలా మంది నాయకులు ఉపాధి హామీ పనులు దక్కించుకున్నారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, గోకులాలు వంటి పనులు చేపట్టారు. ఇందులో 2019 నాటికి కొన్ని పూర్తవగా.. కొన్ని మధ్యలో ఆగిపోయాయి. వెంటనే ఎన్నికలు రావడం.. ప్రభుత్వం మారడంతో బిల్లులు మంజూరుకాలేదు. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు విడుదల చేయలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రెండు రకాలుగా బిల్లులు విడుదల చేసింది. పూర్తయిన వాటికి వెంటనే బిల్లులు మంజూరు చేస్తూ.. ఆగిపోయిన వాటికి అధికారుల ద్వారా ఆడిట్ చేయించి బిల్లులు చెల్లిస్తోంది.

అప్పట్లో పనులు పూర్తయిన వాటికి సంబంధించి ఆరు నెలల కిందట ఎంపీడీవోలు బిల్లులు చేశారు. ఇలా బిల్లులు చేసి పైకి పంపించడానికి కొందరు 5 శాతం పర్సంటేజీలు వసూలుచేశారు. అప్పట్లో ఆగిన పనులకు సంబంధించి ఆడిట్ అధికారులు వస్తున్నారని చెప్పి మళ్లీ 2 శాతం పర్సంటేజీలు ఇవ్వాలని ఫోన్లు చేస్తున్నారని గుత్తేదారులు వాపోతున్నారు.

జిల్లాలోని ఓ మండలంలో రూ.10 లక్షలతో కర్మల సత్రం నిర్మించారు. ఆ పనులకు సంబంధించి బిల్లు చేయడానికి గుత్తేదారు ఆరు నెలల కిందట అధికారికి రూ.40 వేలు ఇవ్వాల్సి వచ్చింది. మళ్లీ ఇప్పుడు ఆడిట్ అధికారులు వస్తున్నారు. వారికి 2 శాతం పర్సంటేజీ ఇవ్వాలని సదరు అధికారి కోరుతున్నారు.

మరో మండల అధికారి బిల్లులు చేయడానికి ఆరు నెలల కిందట ఒక్కొక్కరి వద్ద 5 శాతం పర్సంటేజీలు వసూలు చేశారు. ఇప్పుడా అధికారి వేరే మండలానికి బదిలీ అయ్యారు. అక్కడ బిల్లుల మంజూరుకు పర్సంటేజీలు అడిగితే గుత్తేదారులు ఎదురుతిరిగారని తెలిసింది. ఇప్పటికే అప్పులపాలై వడ్డీలు కడుతున్నాం. పైసా ఇచ్చేది లేదని తెగేసి చెప్పారని సమాచారం.

ఆటోమేషన్.. ఉద్యాన సాగుకు ఊతం

ఆటోమేషన్‌తో పంటలకు సాగు నీరందించడంపై అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి ఆంజనేయులు

నరసరావుపేట, ఎన్టీఆర్ కాలనీ, మాచవరం, న్యూస్‌టుడే: ఉద్యాన పంటల సాగులో గేమ్ చేంజర్‌గా 'ఆటోమేషన్' సాంకేతిక పరిజ్ఞానాన్ని కూటమి ప్రభుత్వం ఆచరణలోకి తెచ్చింది. సూక్ష్మ సేద్యంలో సరికొత్త విధానం రైతులకు ఎంతో ఉపయుక్తంగా మారనుంది.

ఉపయోగాలు ఇలా.. ❖ మొబైల్ అప్లికేషన్ ద్వారా ఎక్కడి నుంచైనా పంటలకు నీరు పెట్టొచ్చు. ❖ అధిక శాతం నీరు, 25 శాతం ఎరువులు ఆదా అవుతాయి. కూలీల ఖర్చు సైతం తగ్గుతుంది. ❖ నీటి వృథాను అడ్డుకోవచ్చు. సమయం ఆదా అవుతుంది. ఈ విధానంలో సెన్సార్లు పని చేయడం, పర్యవేక్షణ చేయడం సులభం. అధిక ఉత్పాదకత సాధించవచ్చు. ❖ మనుషులతో పని లేకుండా రియల్ టైమ్‌లో పనిచేసే సోలెనాయిడ్ వాల్వ్‌లు, స్మార్ట్ సెన్సార్లు, కంట్రోలర్ వంటి పరికరాలు పెట్టినే షన్ సామర్థ్యాన్ని పెంచుతాయి. ❖ పెట్టుబడి తగ్గి నికర ఆదాయం పొందేందుకు అవకాశం ఉంటుంది.

రాయితీపై.. ఆటోమేషన్‌కు హెక్టారుకు రూ.40 వేల ఖర్చవుతుంది. చిన్న, మధ్యతరగతి, ఎస్సీ, ఎస్టీ రైతులకు హెక్టారుకు 55 శాతం, ఇతర రైతులకు 45 శాతం రాయితీ ఇస్తున్నారు.

బిందు, తుంపర సేద్య విధానంలో పంటలు సాగుచేసే రైతులకు ఆటోమేషన్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని జిల్లా సూక్ష్మనీటి సేద్యం అధికారి ఆంజనేయులు చెప్పారు. ఇప్పటికే యడ్లపాడు, నరసరావుపేట, క్రోసూరు మండలాల రైతులకు విజయవాడలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

లక్ష్యానికి మించి..

* జిల్లాలో ఈ ఏడాది సూక్ష్మ సాగు లక్ష్యం : 4 వేల హెక్టార్లు
* ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకున్న రైతులు : 5,098 మంది
* వారికి సంబంధించిన మొత్తం సాగు విస్తీర్ణం : 4,731 హెక్టార్లు
* రాయితీ పరికరాలు అందుకున్న రైతులు, విస్తీర్ణం : 1430 మంది, 1324 హెక్టార్లు
* ప్రాథమిక పరిశీలన పూర్తయిన రైతులు, విస్తీర్ణం : 3,674 మంది, 3,450 హెక్టార్లు

వంట గ్యాస్ సమస్యలా.. సాయం పొందండి

24 గంటలూ అందుబాటులో సేవలు

జిల్లాలో మొత్తం గ్యాస్ ఏజెన్సీలు : 51

వంటగ్యాస్ సిలిండర్లు : సుమారు 7.35 లక్షలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: వంట ఇంట్లో గ్యాస్ లీకవుతున్నట్లు గుర్తిస్తే ఎవరైనా ఆందోళనకు గురవడం సర్వసాధారణం. వంట గ్యాస్ లేకుండా ఏ పని ముందుకు కదలని రోజులివి. ఆ సమయంలో మెకానిక్ అందుబాటులో లేకుంటే తీవ్ర ఇబ్బందులు తప్పవు. ఇలాంటి సమస్యలు ఎదురైనప్పుడు కలవరం చెందకుండా టోల్‌ఫ్రీ నంబరు 1906కి కాల్ చేసి కావాల్సిన సహాయం పొందవచ్చు.

అత్యవసరంలో ఏం చేయాలంటే..

గ్యాస్ వాసన వస్తున్నట్లు గుర్తించిన వెంటనే సిలిండర్ రెగ్యులేటర్‌ను, ఇంట్లో విద్యుత్తు స్విచ్‌లను ఆపివేయాలి. అగ్గిపెట్టెలు, లైటర్ వంటివి వినియోగించకూడదు. తలుపులు, కిటికీలు తెరిచి ఉంచాలి. సురక్షిత ప్రదేశానికి వెళ్లి టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి గ్యాస్ లీకేజీ సమాచారాన్ని చేరవేయాలి.

సేవలిలా.. వారాలు, సెలవులు, పండగలతో పని లేకుండా నిత్యం 24 గంటలపాటు అత్యవసర సేవల విభాగాలు పనిచేస్తాయి. ఇండేన్ గ్యాస్ 1800 2333555, భారత్ గ్యాస్ 1800 224344 టోల్‌ఫ్రీ నంబర్లకు కాల్ చేసి సేవలు పొందొచ్చు. బహుళ భాషల్లో సేవలు అందిస్తుండటంతో మన సమస్యను వివరించే అవకాశం ఉంటుంది. అత్యవసర ఫిర్యాదుగా స్వీకరించి వీలైనంత త్వరగా సిబ్బందిని పంపించి ఉచితంగా సేవలందించే ఏర్పాట్లు చేస్తారు. ప్రమాదాలకు దూరంగా ఉచిత సేవలతో వంటగ్యాస్ ఇబ్బందుల నుంచి బయటపడవచ్చు.

చిరు వ్యాపారులకు ఆర్థిక చేయూత

క్రెడిట్ కార్డులు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

సత్తెనపల్లి, శివాలయం ఏరియా (పిడుగురాళ్ల), న్యూస్‌టుడే: పట్టణాల్లో రహదారుల వెంట వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులకు ఆర్థిక చేయూత అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పీఎం స్వనిధి 2.0 కింద బ్యాంకుల నుంచి వడ్డీలేని రుణాలు ఇవ్వడమే కాకుండా అత్యవసర సమయంలో వారికి ఆర్థిక అండగా నిలిచేలా క్రెడిట్ కార్డులు అందజేస్తోంది. దేశంలో కోటి మంది చిరువ్యాపారులకు క్రెడిట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 23న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. అందులో భాగంగా జిల్లాలో 995 మందికి క్రెడిట్ కార్డులు అందించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ❖ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ద్వారా వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇవ్వడమే కాకుండా బ్యాంకుల నుంచి రుణాలు అందేలా చూస్తున్నారు. ❖ పీఎం స్వనిధి 2.0లో తొలి విడత రూ.15 వేలు, రెండో విడత రూ.25 వేలు, మూడో విడత రూ.50 వేలు రుణంగా అందిస్తారు. ❖ క్రెడిట్ కార్డు ద్వారా తొలుత రూ.10 వేల ఆర్థిక భరోసానిస్తున్నారు. రూ.30 వేల వరకు పరిమితిని పెంచనున్నారు. రుణ వాయిదాలు నిర్ణీత గడువులోపు చెల్లిస్తే వడ్డీ ఉండదు. ❖ జిల్లాలో పీఎం స్వనిధి 2.0 కింద ఇప్పటివరకు 3,374 మంది వీధి వ్యాపారులు రూ.7.48 కోట్ల రుణాలను మూడు విడతల్లో తీసుకున్నారు. ❖ ఇప్పటికే 80 వరకు కార్డులను ప్రాసెస్ చేశారు. గుంటూరు నగర పంచాయతీకి తొలి విడతలో అవకాశం దక్కలేదు. రుణాలతో పాటు క్రెడిట్ కార్డులు అందజేసి చిరు వ్యాపారుల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మెప్మా పీడీ మురళీకృష్ణ తెలిపారు.

క్రెడిట్ కార్డుల పంపిణీ ఇలా..	
మున్సిపాలిటీ	లక్ష్యం
సత్తెనపల్లి	113
వినుకొండ	60
మాచర్ల	70
నరసరావుపేట	121
పిడుగురాళ్ల	236
చిలకలూరిపేట	394
దాచేపల్లి	1

పది విద్యార్థులూ.. మీరే స్టార్లు

ప్రత్యేక తరగతులతో మంచి ఫలితాలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణతకు కూటమి ప్రభుత్వం ప్రణాళికాయుత చర్యలు తీసుకుంటోంది. ఉన్నత చదువులతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు తొలిమెట్టుగా ఉండే పది పరీక్షల్లో ఉత్తీర్ణతతో కలిగే ప్రయోజనాలపై అవగాహన పెంపొందించి వారు మంచి మార్కులతో పాస్ అయ్యేలా చూస్తోంది. మొన్నటివరకు విద్యార్థులకు మార్కులకు అనుగుణంగా ఏ, బీ, సీ, డీ గ్రేడ్లు ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ విధానంలో మార్పు చేసి వాటికి బదులు స్టార్లుగా విద్యార్థుల్ని విభజించారు. ప్రత్యేక తరగతులతో రైజింగ్ స్టార్లను షైనింగ్ స్టార్లుగా తీర్చిదిద్దుతున్నారు..

❖ వంద రోజుల ప్రణాళికలో భాగంగా రోజూ సాయంత్రం వేళ ఒక పాఠ్యాంశంలో 20 మార్కులకు పరీక్ష నిర్వహిస్తున్నారు. అన్ని పాఠ్యాంశాల్లో వచ్చిన మార్పులతోపాటు ఇప్పటివరకు జరిగిన పరీక్షల్లో వచ్చిన మార్కులకు అనుగుణంగా విద్యార్థులను షైనింగ్, రైజింగ్ స్టార్లుగా విభజించారు. ❖ ఏ, బీ గ్రేడ్ విద్యార్థులను షైనింగ్ స్టార్స్‌గా, సీ, డీ గ్రేడ్‌లలో ఉన్నవారిని రైజింగ్ స్టార్స్‌గా మార్పు చేశారు. ❖ రైజింగ్ స్టార్స్‌ను షైనింగ్ స్టార్స్‌గా తీర్చిదిద్దేలా ప్రణాళికాయుత బోధన చేస్తున్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను గుర్తిస్తూ సులువుగా అర్థమయ్యేలా బోధన చేస్తున్నారు. పదిలో నూరు శాతం ఉత్తీర్ణతకు చేస్తున్న కృషి మంచి ఫలితాలను ఇస్తున్నట్లు డీఈవో రామారావు చెప్పారు.

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు స్టార్లుగా విభజన ఇలా..

పాఠ్యాంశం	మొత్తం	రైజింగ్	షైనింగ్
తెలుగు	12,497	2,385	10,112
ఆంగ్లం	13,076	1,957	11,119
హిందీ	13,503	3,649	9,854
గణితం	13,272	3,148	10,124
పీఎస్	13,259	3,296	9,963
బీఎస్	13,135	2,778	10,357
సోషల్	13,112	3,068	10,044

స్త్రీనిధి అక్రమాల అడ్డుకట్టకు చర్యలు

అందుబాటులోకి రికవరీ డిజిటల్ పేమెంట్ యాప్

సత్తెనపల్లి, అచ్చంపేట, న్యూస్‌టుడే

స్వయం సహాయక సంఘాలకు పెన్నిధిగా గత తెదేపా ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన స్త్రీనిధి వైకాపా హయాంలో అక్రమార్కుల పాలిట కల్పతరవుగా మారింది. డ్వాక్రా మహిళ ఆర్థిక సహాయం కోరిన 48 గంటల్లోపే రుణమిచ్చే వెసులుబాటును అవినీతిపరులు సద్వినియోగం చేసుకున్నారు. పొదుపు మహిళలకు తెలియకుండా వారి పేరిట రుణాలు తీసుకోవడం ఒక ఎత్తయితే.. సక్రమంగా అందిన రుణ బకాయిల వివరాలు వారికి చెప్పకుండా ఎక్కువ నగదు కట్టించుకుని వాటిని జేబుల్లో వేసుకోవడం చాలాచోట్ల జరిగింది. స్త్రీనిధి అక్రమాల అడ్డుకట్టకు కూటమి ప్రభుత్వం క్యాప్స్ పేరిట రీ పేమెంట్ యాప్‌ను అమల్లోకి తెచ్చింది.

❖ స్త్రీనిధి రికవరీ డిజిటల్ పేమెంట్ యాప్‌పై జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు. నూతన విధానంలో ప్రతి నెలా పొదుపు సభ్యులంతా వీవోఏ ద్వారా చెల్లింపులు జరపాలి. డబ్బు చెల్లించగానే విధిగా రశీదు ఇస్తారు. అందులో లావాదేవీలు, సంఘం, సభ్యురాలి పేరు, ఇప్పటివరకు చెల్లించింది, ఇంకా ఎంత బకాయి ఉందో తెలుసుకోవచ్చు. వాట్సాప్ ద్వారా చరవాణికి ఆ వివరాలు పంపే వెసులుబాటు ఉంది. సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉన్నవారు నేరుగా స్త్రీనిధి చెల్లింపులు చేయవచ్చు. స్త్రీనిధి రుణ కిస్తీ చెల్లించిన వారికి రశీదును విధిగా వీవోఏలు అందించాలని స్త్రీనిధి జిల్లా ఏజీఎం నరసింహారావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. డిజిటల్ లావాదేవీల ద్వారా అక్రమాలకు అడ్డుకట్ట వేస్తున్నట్లు వివరించారు.

జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరం ఇలా..

❖ స్త్రీనిధి రుణ పంపిణీ లక్ష్యం : రూ.122.58 కోట్లు
❖ రుణాలు అందించాల్సిన మహిళలు : 12,273 మంది
❖ ఇప్పటివరకు అందించిన రుణం : రూ.80.02 కోట్లు
❖ రుణం అందుకున్న సభ్యుల సంఖ్య : 9,573 మంది
(ఒక్కో సభ్యురాలికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అందించారు.)

బ్యాంకు ఉద్యోగుల నిరసన

వారంలో అయిదు రోజుల పనిదినాల అమలు తదితర డిమాండ్ల సాధనకు బ్యాంకు ఉద్యోగులు మంగళవారం జిల్లావ్యాప్తంగా సమ్మె చేపట్టారు. జిల్లా కేంద్రం నరసరావుపేటలోని అరండల్‌పేట బ్యాంకు కూడలిలో బైఠాయించి నిరసన తెలిపారు. - న్యూస్‌టుడే బృందం

ఒకేషనల్ ప్రయోగ పరీక్షలు ప్రారంభం

నరసరావుపేట అర్బన్: ఇంటర్మీడియట్ ఒకేషనల్ ప్రయోగ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 16 కేంద్రాల్లో 2154 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశారు. ఫిబ్రవరి 10 వరకు మూడు విడతల్లో పరీక్షలు కొనసాగుతాయని డీఈసీ సభ్యుడు వేణు తెలిపారు. తొలిరోజు 2 వేల మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. జనరల్ విద్యార్థులకు ఫిబ్రవరి ఒకటి నుంచి ప్రయోగ పరీక్షలు ప్రారంభిస్తామన్నారు.

శిరస్త్రాణంతోనే సురక్షితం

వినుకొండలో ఓ ప్రైవేటు అకాడమీ ఆధ్వర్యంలో స్కేటింగ్ శిక్షణ పొందుతున్న చిన్నారులు శిరస్త్రాణం ఆవశ్యకతను వివరిస్తూ జాతీయ జెండాలు చేతబట్టి పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి శివయ్య స్తూపం సెంటర్ వరకు మంగళవారం స్కేటింగ్ ప్రదర్శన నిర్వహించారు. హెల్మెట్ ధరించండి - ప్రాణాలు కాపాడుకోండి అంటూ చిన్నారులు వినూత్నంగా నిర్వహించిన కార్యక్రమం ప్రజలను ఆలోచింపజేసింది. ఈ సందర్భంగా వినుకొండ పట్టణ సీఐ ప్రభాకర్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం వాహనాలు నడిపితే ప్రమాదాల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. - న్యూస్‌టుడే, వినుకొండ రూరల్

ప్రభుత్వాసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: నరసరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ప్రారంభిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, దంత వ్యాధులకు సంబంధించిన సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రైవేటు వైద్య నిపుణులు వారానికి ఒక రోజు అందుబాటులో ఉండి సేవలు అందిస్తారని వివరించారు.

7న జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

గుంటూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లాపరిషత్తు స్థాయీ సంఘ సమావేశాలు ఫిబ్రవరి 7వ తేదీ ఉదయం 10.30 గంటలకు గుంటూరులోని జడ్పీ కార్యాలయంలో జరగనున్నాయని సీఈవో వి.జ్యోతిబసు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాపరిషత్తు ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తారు. జడ్పీ ఉపాధ్యక్షుడు శొంఠిరెడ్డి నర్సిరెడ్డి అధ్యక్షతన 3వ స్థాయీ సంఘం, తెనాలి జడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమా ప్రణతి, జడ్పీ ఉపాధ్యక్షురాలు బత్తుల అనురాధల అధ్యక్షతన 5, 6 స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని వివరించారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో మహిళలకు ఉచిత శిక్షణ

గుంటూరు, న్యూస్‌టుడే: స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణకు జిల్లాలోని నిరుద్యోగ మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా మహిళా ప్రగతి ప్రాంగణం మేనేజర్ బి.రమణశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాబ్రిక్ పెయింటింగ్, చిరుధాన్యాలతో స్నాక్స్ తయారీ, మార్కెటింగ్ కోర్సుల్లో శిక్షణకు పదో తరగతి విద్యార్హత కలిగినవారు అర్హులన్నారు. అభ్యర్థినుల వయసు 18 నుంచి 40 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. పూర్తి వివరాలకు గుంటూరులోని జిల్లా పరిషత్తు కార్యాలయం ఎదుట ఉన్న మహిళా ప్రగతి ప్రాంగణంలోగానీ, 83339 21371 నంబరులోగానీ సంప్రదించాలని సూచించారు.

వేగం.. తీస్తోంది ప్రాణం

పల్నాడులో పెరుగుతున్న ప్రమాదాలు

☛ ఇటీవల నాగార్జునసాగర్, దావుపల్లి రోడ్డులో బ్లాక్ స్పాట్‌లను డ్రోన్ ద్వారా ఓ కానిస్టేబుల్ చిత్రీకరిస్తూ రోడ్డుకు పక్కన ఉండగా.. ఆటో అతడిని ఢీకొంది. ఇది వేగంతోపాటు ఆటో డ్రైవింగ్ లోపాలను ఎత్తి చూపుతోంది.

☛ టీవీఎస్ వాహనంపై ఇద్దరు వెళుతుండగా.. మరో ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. టీవీఎస్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనకు నిర్లక్ష్యం, అతి వేగమే కారణమని తెలుస్తోంది.

☛ బైపాస్ నుంచి గురజాలకు వస్తున్న బస్సును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. వెనుక సీటులో కూర్చున్న ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు తీవ్రంగా గాయపడ్డారు. లారీ డ్రైవరు వేగాన్ని తగ్గించకపోవడంతో ప్రమాదం జరిగింది. కూడళ్ల వద్ద డిజైన్లు సరిగా లేవన్న విమర్శలు వినవస్తున్నాయి.

గురజాల, రాయవరం (మాచర్ల), గాంధీనగర్ (పిడుగురాళ్ల), నారాయణపురం (దాచేపల్లి), న్యూస్‌టుడే

గురజాల బైపాస్ వద్ద మలుపులు

పల్నాడులో రోడ్డు ప్రమాదాలు భయపెడుతున్నాయి. మాచర్ల, గురజాల నియోజకవర్గాల పరిధిలో రోడ్డు విస్తరణ, నాణ్యత పెంపు, జాతీయ రహదారుల నిర్మాణాలతో వేగం పెరిగి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పల్లెల దారుల నుంచి వాహనాలు జాతీయ రోడ్డు ఎక్కే క్రమంలో ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాదకర ప్రదేశాలను పోలీసులు, రవాణా శాఖ అధికారులు గుర్తించినా తగిన చర్యలు తీసుకోవడం లేదు. కొండమోడు నుంచి పిడుగురాళ్ల, దాచేపల్లి మీదుగా పొందుగల వరకు రాష్ట్రీయ రహదారి, నడికుడి నుంచి మాచర్ల వరకు, నాగార్జునసాగర్ నుంచి మాచర్ల మీదుగా వెల్దుర్తి మండలం దావుపల్లి వరకు జాతీయ రహదారులు నిర్మించారు. వీటిపై బ్లాక్ స్పాట్‌ల వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.

ఇవీ బ్లాక్ స్పాట్లు.. పిడుగురాళ్లలోని ఖలీల్ దాబా, తుమ్మలచెరువు చెట్టు, కొండమోడు, దాచేపల్లిలోని తంగెడ అడ్డరోడ్డు, పోస్టాఫీసు సెంటరు, నడికుడి జంక్షన్, గామాలపాడు, శ్రీనగర్, పొందుగల వద్ద అసంపూర్తి రాష్ట్రీయ రోడ్డు నిర్మాణంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు గుర్తించారు. అలాగే గురజాల, రెంటచింతల, మాచర్ల నుంచి జాతీయ రోడ్డుకు అనుసంధానంగా ఉండే ప్రదేశాలు, అంబాపురం సమీపాన, పాలువాయి గేటు వద్ద, రాయవరం జంక్షన్‌లో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. నాగార్జునసాగర్ నుంచి దావుపల్లి మధ్య ఇటీవల ప్రమాదాలు పెరిగాయి. మండాది బోడు, శిరిగిరిపాడు, సబ్‌స్టేషన్ల వద్ద బ్లాక్‌స్పాట్లు ఉన్నాయి. వీటితో పాటు మరో 34 ప్రదేశాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

పోలీసుల నిఘా పెరగాలి.. జిల్లాలోని పోలీసుస్టేషన్లలో సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది. లైసెన్సులు, శిరస్త్రాణ ధారణ విషయమై అరకొరగా తనిఖీలు చేస్తున్నారు. తెల్లవారుజామున డ్రైవర్లను అలర్ట్ చేసేందుకు ముఖం కడిగించడం వంటి చర్యలు చేపట్టడం లేదు. ప్రమాదం జరిగే ప్రదేశాల్లో సూచికలు ఏర్పాటు చేయాల్సి ఉంది. సీసీ కెమెరాలు అమర్చాలి. వేగ నియంత్రణపై దృష్టి పెట్టాలి.

పెద్దకర్మ
(తేది: 29-1-2026)

జననం: 12-06-1938
మరణం: 15-1-2026
కీ॥శే॥ డాక్టర్ కొమ్మినేని లక్ష్మయ్య నాయుడు గారు
(Dr. KL నాయుడు)
HIG, BHEL, R.C.Puram
ప్రముఖ వైద్యులు, సేవాభావానికి మారుపేరైన డాక్టర్ కొమ్మినేని లక్ష్మయ్య నాయుడు గారు తేది: 15-1-2026 నాడు స్వర్గస్తులయ్యారు. వైద్య వృత్తిలో నిష్ఠ, నైతికత, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచి, పేద- ధనిక భేదం లేకుండా అందరికీ సేవలందించిన వారి జీవితం అనేక మందికి ఆదర్శప్రాయం.
వారి వియోగం కుటుంబానికి మాత్రమే కాకుండా, సమాజానికి కూడా తీరని లోటు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా భగవంతుణ్ణి ప్రార్థిస్తూ.. అశ్రునయనాలతో..
భార్య: కొమ్మినేని లక్ష్మీ సుశీల
కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు
కార్యస్థలము: తేది: 29-1-2026 గురువారం, శ్రీ కన్వెన్షన్ సెంటర్, Opp: D Mart, ముంబయి హైవే, రామచంద్రాపురం, BHEL, HYD. ✆ 9848484800

(c) eenadu

ప్రజారోగ్యమే లక్ష్యంగా గ్రామ ఆరోగ్యదర్శిని

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రతి నెల మొదటి గురువారం గ్రామ ఆరోగ్యదర్శిని పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. కార్యక్రమ రూపకల్పనపై కలెక్టరేట్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజారోగ్యం, షోషకాహారంపై ప్రజల్లో అవగాహన కల్పించడం, సామాజిక ఆరోగ్య నిర్వహణను ప్రోత్సహించడమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఫిబ్రవరి 5న జిల్లా వ్యాప్తంగా మొదటి విడత గ్రామ ఆరోగ్య దర్శిని నిర్వహించాలని ఆదేశించారు. జీవనశైలిలో మార్పుల కారణంగా 80శాతం మంది మధుమేహం, రక్తపోటుకు గురవుతున్నారన్నారు. అనారోగ్యం వల్ల కుటుంబాలు పేదరికంలోకి వెళతాయని అవగాహన కల్పించాలన్నారు. చికిత్స కంటే నివారణ మేలని తెలపాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ రవి, డీపీవో నాగేశ్వరనాయక్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నకు నీరిచ్చి ఆదుకోండి

కలెక్టర్ కృతికాశుక్లా, జేసీతో సాగునీటి విషయమై చర్చిస్తున్న ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: నరసరావుపేట నియోజకవర్గంలో మొక్కజొన్న పంటలకు తక్షణమే సాగర్ జలాలను విడుదల చేయాలని ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు మంగళవారం కలెక్టర్ కృతికాశుక్లాను కలిసి విజ్ఞప్తి చేశారు. నరసరావుపేట, రొంపిచర్ల మండలాల్లో రైతులు ప్రధానంగా మొక్కజొన్న సాగు చేశారని, ఇప్పటికే ఒక్కో ఎకరాకు సుమారు రూ.50వేల వరకు పెట్టుబడి పెట్టారన్నారు. పంట కీలక దశకు చేరిందని, ఈ సమయంలో సాగు నీరు అందకపోతే రైతులకు తీవ్ర నష్టం తప్పదని వివరించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పంటకు తక్షణమే నీరు అవసరమని, లేకపోతే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. తక్షణమే స్పందించి సాగు నీరు ఇచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు. జేసీ సంజనాసింహా, ఆర్డీవో మధులత తదితరులు ఉన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో జాతీయ స్థాయికి ఎంపిక

హరి వెంకట హరికృష్ణ

శ్రీలత

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: చిలకలూరిపేట ఏఎంజీ పాఠశాల విద్యార్థులు థాంగ్ - టూ మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. 17ఏళ్ల బాలుర విభాగంలో 9వ తరగతి విద్యార్థి జిల్లేపోయిన హరి వెంకట హరికృష్ణ, 19ఏళ్ల బాలికల విభాగంలో 8వ తరగతి విద్యార్థిని మండ శ్రీలత అనకాపల్లి జిల్లా పరవాడ డి.ఎన్.ఎ. ఇండోర్ స్టేడియంలో డిసెంబరు నెలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ఈ ఘనత సాధించారు. దీంతో ఈనెల 30 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు దిల్లీలోని త్యాగరాజ స్టేడియంలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో మంగళవారం జరిగిన అభినందన సభలో డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి, ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి నరసింహారావు, పులు సురేష్, పద్మ, గోపి, శిరీష, వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కరీముల్లా, పల్నాడు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఖాదర్ మస్తాన్, స్వర్ణరాజు, వ్యాయామోపాధ్యాయులు రాజు, రాజేష్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం సభ్యులు థాంగ్- టు- మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు పిన్నెల్లిలో ఎస్సీ కమిషన్ సభ్యుల పర్యటన

మాచవరం, న్యూస్‌టుడే: మండలంలోని పిన్నెల్లికి ఎస్సీ కమిషన్ సభ్యులు బుధవారం రానున్నారు. మందా సాల్మన్ మృతిపై విచారణ నిర్వహించేందుకు ఐదుగురు సభ్యుల బృందం పర్యటించనుంది. సాల్మన్ హత్యను వైకాపా నాయకులు రాజకీయం చేస్తున్న నేపథ్యంలో కమిషన్ స్పందించి, నిజాలు తెలుసుకునేందుకు బాధిత కుటుంబంతో మాట్లాడనుంది. ఈ మేరకు స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించింది.

ఆచార్యులకు ఉద్యోగోన్నతులు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ కళాశాలలో 8 మంది బోధనాచార్యులకు ఉద్యోగోన్నతులు కల్పిస్తూ యూనివర్సిటీ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావుకు సీనియర్ ప్రొఫెసర్‌గా, డాక్టర్ వై.ఎస్. కిశోర్‌బాబుకు ప్రొఫెసర్‌గా, డాక్టర్ కె.విమల్‌కుమార్, డాక్టర్ ఎం.రవీంద్రబాబు, డాక్టర్ ఎ. గంగాధర్, డాక్టర్ జి. మాధవి అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగోన్నతులు పొందారు. డాక్టర్ ఐ.ఫణిసుష్మ (అకడమిక్ లెవల్), కళాశాల పీడీ డాక్టర్ జీపీ రాజు ఉద్యోగోన్నతులు పొందారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
A.P. Greening and Beautification Corporation Municipal Administration & Urban Development Department.
Andhra Pradesh Greening & Beautification corporation invites for the 2 works through E- Procurement platform costing form 21 Lakhs to 38.75 Lakhs for further details please see E-Procurement web site
Managing Director
APG&BC

శ్రీ సత్తెమ్మతల్లి దేవస్థానము
మాదిపాడు (గ్రా), అచ్చంపేట (మం), పల్నాడు జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
మాదిపాడు (గ్రా), అచ్చంపేట (మం), పల్నాడు జిల్లా శ్రీ సత్తెమ్మతల్లి దేవస్థానము పునఃనిర్మాణము కొరకు టెండర్లు ప్రకటన చేయడమైనది. మిగిలిన వివరముల కొరకు https://tender.apeprocurement.gov.in లో చూడవచ్చు.
సం॥ప్ర - కార్యనిర్వహణాధికారి
శ్రీ సత్తెమ్మతల్లి దేవస్థానము
మాదిపాడు (గ్రా), అచ్చంపేట (మం), పల్నాడు జిల్లా

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - తాడికొండ

బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రాంతీయ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

Aster Ramesh HOSPITALS We'll Treat You Well
EENADU SPORTS LEAGUE 2025
Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) NECC
Hospitality Partner: CITY Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Man of the Series: HERO
Digital Partner: ఈనాడు.నెట్
TV Partner: ETV
Mee FM
Organised by ఈనాడు

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - I జూనియర్స్ : మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్స్‌లతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులకే ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్ జట్టు

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - I జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

విజేత రాయలసీమ రాకర్స్ జట్టు

గ్రౌండ్-2లో సీనియర్స్: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ చరణ్ జిత్ ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-I (జూనియర్స్)
మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)
మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

చేతిరాత పోటీలో పసుమర్రు విద్యార్థిని ప్రతిభ

షేక్ అఫ్సా

పసుమర్రు (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: చిలకలూరిపేట మండలం పసుమర్రులోని మద్దికామయ్య జడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న షేక్ అఫ్సా గుంటూరు ఏసీ కళాశాలలో ఈ నెల 25న నిర్వహించిన రాష్ట్రస్థాయి చేతిరాత పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినిని హెచ్ఎం వై.హనుమంతరావు, ఎస్ఎంసీ కమిటీ ఛైర్మన్ కోట సుదర్శన్‌రావు, కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు గద్దే హరిబాబు, గ్రామ పెద్దలు అభినందించారు. పాఠశాలలో అత్యధిక హాజరు కలిగిన విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.1600 వంతున 12 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన బాబామస్తాన్‌వలి బహుమతులు అందజేశారు. ఆయన ఏటా నగదు బహుమతి అందిస్తుండటం గమనార్హం.

ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాగేశ్వరరావు

వినుకొండ, న్యూస్‌టుడే: భాజపా ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నూజండ్ల మండలానికి చెందిన ఎనుమల నాగేశ్వరరావు నియమితులయ్యారు. పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని ఆయన తెలిపారు. తన నియామకానికి సహకరించిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో పాటు ఇతర నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్బారావు, సీనియర్ నాయకులు గోళ్ల మస్తాన్ రావు తదితరులు ఆయనను పార్టీ స్థానిక కార్యాలయంలో మంగళవారం సన్మానించారు.

ఆలోచనల సంగమం.. అభివృద్ధికి మార్గం

నబీఖాన్‌ను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

విజయపురిసౌత్, న్యూస్‌టుడే: కామర్స్ విద్యార్థులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులను ఒకే వేదికపై తీసుకురావడంతో వారి ఆలోచనల సంగమం... అభివృద్ధికి మార్గంగా నిలిచిందని కామర్స్ కాన్‌క్లేవ్ -2026 కన్వీనర్లు పేర్కొన్నారు. ఏపీఆర్‌డీసీలో రెండురోజులపాటు నిర్వహించిన మెగా కామర్స్ కాన్‌క్లేవ్ విజయాన్ని సాధించిందని నిర్వాహకులు వంగా రాజేంద్రప్రసాద్, పి.వి.రమణకుమార్, చార్టాల రఘు, కేవీ రెడ్డి, జయశంకర్ తెలిపారు. కామర్స్ విద్యార్థులకు సరైన మార్గనిర్దేశం, అధ్యాపకుల సేవలకు గౌరవం, విద్యార్థుల అనుసంధానం బలోపేతం కావడానికి కాన్‌క్లేవ్ తోడ్పడిందన్నారు. మంగళవారం ముఖ్యఅతిథులుగా హాజరైన ఐసీఎస్ఐ మాజీ అధ్యక్షుడు హనుమంతరావు, ఐసీఏఐ సభ్యుడు తిరుపతయ్య, ఐసీఎంఏఐ కౌన్సిల్ సభ్యుడు విజయరంజన్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ ప్రిన్సిపల్, కామర్స్ అధ్యాపకుడు నబీఖాన్‌ను పూర్వవిద్యార్థులు ఘనంగా సన్మానించారు.

హోరాహోరీగా ఎడ్ల పోటీలు

ప్రథమ బహుమతి సాధించిన ఎడ్ల జత

రెంటచింతల, న్యూస్‌టుడే: రెంటచింతల తిరునాళ్ల సందర్భంగా జరుగుతున్న ఎడ్ల పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగుతున్నాయి. అన్నదాతల కేరింతలతో ప్రాంగణం మారుమోగుతోంది. మంగళవారం రెండు పళ్ల విభాగంలో నిర్వహించిన పోటీల్లో చుండూరు మండలం వేటపాలెం చెందిన అత్తోట శిరీషా చౌదరి జత 4,082.10 అడుగులతో ప్రథమ, ప్రకాశం జిల్లా ఉప్పుగుండూరు, ప్రత్తిపాడు మండలం దొండపాడుకు చెందిన సంయుక్త ఎడ్లు 3,880.2 అడుగులతో ద్వితీయ, నరసరావుపేట మండలం దొండపాడుకు చెందిన రాజశేఖర్ జత 3,603.1 అడుగులతో తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

వర్సిటీ క్రికెట్ జట్టులో చోటు

ప్రియతమ్

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక తిరుమల ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి కె.ప్రియతమ్ జేఎన్‌టీయూ కాకినాడ విశ్వవిద్యాలయం క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వై.వి.నారాయణ మంగళవారం తెలిపారు. త్వరలో మైసూరు జేఎస్ఎస్ సైన్సు అండ్ టెక్నాలజీ యూనివర్సిటీలో జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల క్రికెట్ పోటీల్లో జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ జట్టు తరపున పాల్గొంటాడన్నారు. విద్యార్థిని ప్రిన్సిపల్‌తో పాటు కళాశాల కార్యదర్శి రావెల సత్యనారాయణ, పీడీ హనుమంతరావు, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

వెయ్యి ఎకరాల్లో సేంద్రియ పంటలు

అమరావతి, న్యూస్‌టుడే: ఈ ఏడాది అమరావతి మండలంలో వెయ్యి ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయ పంటలు సాగు చేస్తున్నట్లు డీపీఎం అమలుకుమారి తెలిపారు. మంగళవారం మండల సమాఖ్య కార్యాలయంలో జాతీయ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ కార్యక్రమం నిర్వహించారు. డీపీఎం మాట్లాడుతూ ఎన్ఎంఎన్ఎఫ్ కింద మండలాన్ని ఏడు క్లస్టర్లుగా విభజించినట్లు తెలిపారు. క్లస్టర్ పరిధిలో బయో రిసోర్సు సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, కషాయాలు, ద్రావణాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఏపీఎం ఉషశ్రీ, ఎంటీ జయలక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీపీఎం అమలకుమారి

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 143, రిటైల్ ధర - 170, చికెన్ విత్‌స్కిన్ - 247, చికెన్ స్కిన్‌లెస్ - 281.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -143 రిటైల్ ధర 170 చికెన్ విత్ స్కిన్ - 247 చికెన్ స్కిన్‌లెస్ - 281.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 155, 164, 175 చికెన్ విత్ స్కిన్ - 300 చికెన్ స్కిన్‌లెస్ - 310.

బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఏఎన్‌యూ పరిధిలోని బీఈడీ కళాశాలలో ఫిబ్రవరి 5 నుంచి జరగాల్సిన మొదటి సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు సీఈ ఆలపాటి శివప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉన్నత విద్యామండలి నుంచి విద్యార్థుల ఆమోద ప్రక్రియ పూర్తి కాకపోవడం, కళాశాలలో ప్రవేశాలు కొనసాగుతుండటంతో పరీక్షలను వాయిదా వేసినట్లు అధికారులు వెల్లడించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

ఎవరి కోసం బతకాలయ్యా..!

- ఓ తల్లి ఆవేదన
- నరసరావుపేటలో ఇంటర్ విద్యార్థి బలవన్మరణం

బాలకోటిరెడ్డి (పాత చిత్రం)

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: 'కుమారుడు చిన్న వయసులో ఉండగానే భర్త చనిపోయారు. అయినా ధైర్యం కూడగట్టుకుని ఎన్నో ఆశలతో ఉన్న ఎకరం పొలం సాగు చేసుకుంటూ వచ్చిన డబ్బులతో కుమారుడిని చదివించుకుంటున్నా. పెద్ద చదువులు చదువుతాడని ఎన్నో కలలు కన్నా. భగవంతుడు నా కలలను కల్లలు చేశాడు.. చేతికి అందొచ్చిన ఒక్కగానొక్క కుమారుడు ఉరేసుకుని మృతి చెందాడు. ఇక ఎవరి కోసం బతకాలి' అంటూ ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరుకు చెందిన హైమావతి రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. వివరాలిలా.. నరసరావుపేట పట్టణ శివారు రావిపాడు రోడ్డులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న కూరాకుల బాలకోటిరెడ్డి (18) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కళాశాల వద్దకు వచ్చిన విద్యార్థి తల్లి మాట్లాడుతూ సోమవారం రాత్రి తన కుమారుడు ఫోన్ చేసి తినుబండారాలు పంపాలని కోరాడని.. మంగళవారం ఉదయం 9 గంటలకు బాలకోటిరెడ్డికి బాగాలేదని, వెంటనే రావాలని కళాశాల నుంచి ఫోన్ వచ్చిందని.. అంతలోనే మృతి చెందాడని చెప్పారని ఆవేదన వెలిబుచ్చారు. కళాశాలలో కొందరు విద్యార్థులతో గొడవ జరుగుతోందని ఇటీవల ఫోన్‌లో చెప్పాడని, తన కుమారుడి మృతికి అదే కారణమై ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. తాము రాక ముందే తమ కుమారుడిని ఆసుపత్రికి తరలించారని.. కళాశాల యాజమాన్యంపై అనుమానాలున్నాయన్నారు. సమాచారం అందుకున్న గ్రామీణ పోలీసులు అక్కడికి చేరుకొని బాలకోటిరెడ్డి మృతికి కారణాలపై విచారించారు. విద్యార్థి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తరలించారు. బాలకోటిరెడ్డికి నాలుగు నెలల కిందట హెర్నియా ఆపరేషన్ జరిగిందని, ఆ బాధ తట్టుకోలేక ఉరేసుకొని మృతి చెందాడని కళాశాల వర్గాలు చెబుతున్నాయి.

ఆమె చూపు శాశ్వతం


సీతారావమ్మ (పాత చిత్రం)

యడ్లపాడు, న్యూస్‌టుడే: తాను తనువు చాలించినా తన నేత్రాలు మరొకరికి చూపు ప్రసాదించాలన్న మాతృమూర్తి ఆకాంక్షను ఆమె కుమారులు నెరవేర్చారు. యడ్లపాడు మండలం ఉన్నవకు చెందిన కుర్రా సీతారావమ్మ(96) సోమవారం రాత్రి స్వగృహంలో కన్నుమూశారు. కడవరకు ఎటువంటి అనారోగ్య సమస్యలు దరిచేరని ఆమె కళ్లజోడు లేకుండా భగవద్గీత చదివేవారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు గుంటూరు జిల్లా పెదకాకానిలోని శంకర కంటి ఆసుపత్రి వైద్యులు వచ్చి మృతురాలి కళ్ల నుంచి కార్నియా సేకరించారు. కుటుంబ సభ్యులను గ్రామస్థులు అభినందించారు.

91.9FM Vijayawada ఈ FM 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
80080 03297

గంజాయి కేసులో ఇద్దరు మహిళలకు నాలుగేళ్ల జైలు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: గంజాయి కేసులో చిలకలూరిపేటకు చెందిన ఇద్దరు మహిళలకు నాలుగు సంవత్సరాల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ గుంటూరు మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి వి.ఎ.ఎల్.సత్యవాణి తీర్పునిచ్చారు. చిలకలూరిపేట ఎక్సైజ్ సీఐ కె.వినయ్‌కుమార్ తెలిపిన మేరకు వివరాలు.. 2018లో చిలకలూరిపేట పట్టణంలోని కేబీ రోడ్డులో గుత్తావారి పెట్రోల్‌బంక్ వద్ద 6.2 కిలోల గంజాయి కలిగి ఉన్న వి.రమణ, గాలం గిరిజ (గొల్లగూడెం, ప.గో.జిల్లా)ను అప్పటి ఎక్సైజ్ సీఐ బి.లత, సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపి ఛార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితులకు నాలుగేళ్ల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఏపీపీ వై.అశోక్‌వాణి ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్నమీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును.(స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph : 8142292071.

TO LET

COMMERCIAL

గుంటూరు అరండల్‌పేట 11/2 లో 1200 Sft, లాలాపేట జిన్నాటవర్ సెంటర్‌లో 1800 Sft గల కమర్షియల్ బిల్డింగ్స్ ఆఫీసులకు, బ్యాంకులకు అద్దెకు ఇవ్వబడును. ✆ 99637 75262.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

JOBS

Wanted Front Desk for Solar Systems. min 1 year exp, Office: SVN Colony, Guntur. 91777 21607.

Kesava Techno hub hearing Marketing Executive Qul: Degree, 1 to 2 Years Sales & Marketing Exp, Sal: 13k - 18k, GNT. 8712126699.

TATA కంపెనీలో లైఫ్ & హెల్త్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ మరియు టీమ్ లీడర్లు కావలెను. మీ శ్రమకు తగిన ఆదాయం + ఫారిన్ ట్రిప్స్ కలవు. ✆ 98480 83351.

శ్రీరామ్ చిట్స్ గుంటూరు జిల్లాలోని అన్ని మండల ఏరియాలలో పనిచేయుటకు ఇన్‌చార్జెస్ కావలెను. 91000 42655.

రైస్ మిల్ & ప్లాంట్ ఆపరేటర్స్ కావలెను. అనుభవజ్ఞులైన వెల్డింగ్, రిపేర్ తెలిసిన ఆపరేటర్స్ కావలెను. Contact No: ✆ 80962 46099.

ప్రముఖ ఫైనాన్షియల్ సర్వీసెస్ గుంటూరు నందు పనిచేయుటకు పదవతరగతి విద్యార్హతతో వివాహిత స్త్రీలకి ఆఫీసు అసిస్టెంట్ జాబు చేయుటకు పోస్టులు కలవు. ✆ 90309 93895, 86396 89939.

తెనాలిలో ప్రముఖ సంస్థకు MS officeలో అనుభవం గల లేడీ కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. ఫోన్: 86869 35606.

DDU - GKY ట్రైనింగ్ సెంటర్, ఫిరంగిపురం నందు టెలికాలర్స్, PRO's, వార్డెన్స్, కంప్యూటర్ ఫ్యాకల్టీ, ఇంగ్లీష్ ఫ్యాకల్టీ, బ్రాడ్ బ్యాండ్ టెక్నీషియన్ కావలెను. భోజన వసతి కలదు. 99512 79786, 70137 86905.

గుంటూరులో గల కాలేజి నందు పనిచేయుటకు 25 సంవత్సరాల పైబడిన ఇంటర్, డిగ్రీ చదివిన రెసిడెన్షియల్ లేడీ వార్డెన్ కావలెను. వివరములకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 81224 61164.

DRIVERS

లగ్జరీ కార్లు నడిపించగల డ్రైవర్లకు గోల్డెన్ ఛాన్స్! ప్రముఖ సంస్థలో స్థిరమైన ఉద్యోగం, 40 లోపు వయస్సు, 5 సం॥ల అనుభవం, ఆకర్షణీయమైన జీతం, గుంటూరు పరిసర ప్రాంతాలవారికీ ప్రాధాన్యత. ఫో: 7075476853.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడులో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

నరసరావుపేట

• నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

పట్టణ తాగునీటి పథకంపై సమావేశం

వినుకొండ, న్యూస్‌టుడే: యూఐడీఎఫ్ నిధులు రూ.210.34 కోట్లతో చేపట్టనున్న పట్టణ తాగునీటి పథకంపై ప్రజారోగ్యశాఖ అధికారులు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుతో మంగళవారం సమావేశమయ్యారు. గుంటూరులోని ఆయన కార్యాలయంలో ఎస్ఈ డి.శ్రీనివాసరావు, ఈఈ ఆర్వీ శ్రీనివాసరావు తదితరులు కలిసి ఈ ప్రాజెక్టులో చేపట్టనున్న పనులను తెలిపారు. ఎన్నెస్పీ కుడి ప్రధాన కాలువ నుంచి సింగరచెరువు వరకు పైపులైన్ల ద్వారా నీటి సరఫరాతో పాటు ఇతరత్రా చేపట్టే నిర్మాణాలపై చర్చించారు. ఇందుకు అవసరమైన ఇతర శాఖల అధికారుల సహకారం తీసుకోవాలని తన వంతు తోడ్పాటునందిస్తానని జీవీ వారికి హామీ ఇచ్చారు. పాలన అనుమతులు తీసుకొని త్వరగా టెండర్లు పూర్తి చేయాలని సూచించారు. జీడీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి మక్కెన మల్లికార్జునరావు సమావేశంలో పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? పట్టణంలో రాజీవ్ గృహకల్ప సముదాయంలో విద్యుద్దీపాలు వెలగడం లేదు. సాయంత్రమైతే ఆ ప్రాంతంలో అంధకారం అలుముకుని రాకపోకలకు ఇబ్బందిగా మారింది. **- శ్రీను** ✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి అవసరమైన స్తంభాలకు విద్యుద్దీపాలు అమర్చుతాం. **- అల్తాఫ్, పురపాలక సంఘం ఏఈ** – న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

విస్తరణకు దూరం.. వసతులు మృగ్యం

• జిల్లా కేంద్రంలో ప్రయాణికులకు అవస్థలు

ఎన్జీవో కాలనీ (నరసరావుపేట), న్యూస్‌టుడే

ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలం

నరసరావుపేట జిల్లా కేంద్రంగా ఏర్పాటు అయినప్పటి నుండి జనం తాకిడి క్రమేణా పెరిగింది. పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ 1987లో నిర్మించారు. అప్పటి నుండి ఎలాంటి విస్తరణకు నోచుకోలేదు. ప్రస్తుతం బస్టాండ్‌లో 12 ప్లాట్‌ఫారాలు ఉండగా డిపో పరిధిలో సొంత బస్సులు 58, అద్దెవి-28 ఉన్నాయి. ఇవి రోజుకు 33 వేల కిలోమీటర్ల దూరం రాకపోకలు సాగిస్తూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి. రోజూ ఇంధనానికి రూ.5 లక్షలు వెచ్చిస్తున్నారు. ఆదాయం రూ.13 లక్షలు వస్తోంది. కానీ బస్టాండ్‌లో సౌకర్యాలు కొరవడ్డాయి. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. బస్టాండ్‌ను విస్తరించి అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్సులు నిలిపేందుకు కష్టమే

స్త్రీశక్తి పథకం అమలులోకి వచ్చిన తర్వాత బస్టాండ్ నిత్యం ప్రయాణికులతో కిక్కిరిసిపోతుంది. దీంతో బస్టాండ్‌కు వచ్చిపోయే ప్రయాణికులకు సరైన వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ప్రయాణికులకు చాలినన్ని కుర్చీలు లేవు. చాలామంది గంటల తరబడి నిలబడి బస్సుల కోసం వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం ఉన్నప్పటికీ రద్దీకి తగినన్ని లేవు. 12 ప్లాట్‌ఫారంలే ఉండటంతో బస్సులు నిలిపేందుకు కష్టమవుతోంది.

స్థలం వినియోగించుకుంటే..

నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్ కింద సుమారు రెండున్నరెకరాల స్థలం ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఈ స్థలంలో 70 సెంట్లు లీజు పేరిట ఓ వైకాపా నాయకుడికి కట్టబెట్టారు. ఈ స్థలంలో పెట్రోలు బంకు నిర్మాణం చేపట్టాలని భావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ స్థలంలో నిర్మాణం ఆపేశారు. ఈ స్థలంలో ప్రభుత్వ, పబ్లిక్ సంయుక్త భాగస్వామ్యంతో (పీపీ విధానం) అత్యాధునిక షాపింగ్ కాంప్లెక్స్, మినీ థియేటర్లు, హోటళ్లు నిర్మించి అభివృద్ధి చేస్తే ఆర్టీసీకి మంచి ఆదాయంతో పాటు ప్రయాణికులకు వసతులు సమకూరుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. దీనిపై డీపీటీవో అజిత కుమారిని సంప్రదించగా బస్టాండ్ ఆధునికీకరణ ప్రతిపాదన ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. అదనంగా ఆరు ప్లాట్‌ఫారమ్‌ల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

పల్లెల్లో ప్రభల సందడి

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: మహా శివరాత్రి అనగానే మండలంలోని అన్ని గ్రామాల్లో పండగ వాతావరణం కనిపిస్తుంది. భక్తిశ్రద్ధలతో తిరునాళ్లకు ప్రభలు నిర్మించేందుకు సిద్ధమవుతుంటారు. మండలంలో యల్లమంద, గోనెపూడి, గురవాయిపాలెం, కాకాని, పెట్లూరివారిపాలెం, ఉప్పలపాడు తదితర గ్రామాల్లో ఏళ్ల నుంచి ప్రభలు కడుతున్నారు. పండగకు మరో 18 రోజులు మాత్రమే ఉండటంతో ప్రభల తయారీ పనులు వేగవంతం చేశారు. ప్రభల నిర్మాణానికి అవసరమైన సామగ్రి కొనుగోలు చేసే పనుల్లో కొందరు, మరికొందరు ప్రభలు కట్టే పనుల్లో ఉన్నారు. గ్రామాల్లోని చిన్నాపెద్దా అందరూ ప్రభలు నిర్మించే ప్రాంతానికి చేరుకొని ఆనందంగా పనులు చేస్తుండటంతో సందడి నెలకొంది.

ప్రభ నిర్మాణ పనుల్లో గోనెపూడి గ్రామస్థులు

రాజీ మార్గంలో కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

నరసరావుపేట లీగల్, న్యూస్‌టుడే: మార్చి 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీమార్గంలో కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా న్యాయాధికారులు వై.నాగరాజ, సి.హెచ్.వి.ఎన్ శ్రీనివాసరావు, వి.శరత్‌బాబు, డీఎల్ఎస్ఏ కార్యదర్శి జియావుద్దీన్ అన్నారు. కోర్టు ఆవరణలో పలు శాఖల అధికారులతో మంగళవారం వారు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇరుపక్షాల కక్షిదారులు కోర్టుకు వస్తే న్యాయాధికారులు చట్టపరంగా అన్ని అంశాలను వివరించి కేసు రాజీమార్గంలో పరిష్కారమయ్యేందుకు కృషి చేస్తారన్నారు. సివిల్ కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కారం అయ్యేలా న్యాయవాదులు కృషి చేయాలన్నారు. క్రిమినల్ కేసుల పరిష్కారంలో పోలీసు అధికారులు లేవనెత్తిన పలు సాంకేతికపరమైన అంశాలను న్యాయాధికారులు నివృత్తి చేశారు. సమావేశంలో స్థానిక న్యాయాధికారులు కె.మధుస్వామి, ఎన్.లావణ్య, ఆశీర్వాదంపాల్, సలోమి, ఏపీపీ కల్పన, డీఎస్పీ హనుమంతరావు, సీఐలు ఫిరోజ్, సుబ్బారావు, లోకనాథం, ఎస్సైలు, న్యాయవాదులు, పలు ఆర్థిక సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

సూచనలు చేస్తున్న జిల్లా న్యాయాధికారులు, హాజరైన పోలీసు అధికారులు

భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : చిలకలూరిపేట ఆర్యవైశ్య కల్యాణ మండపం ప్రాంగణంలోని శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. అగ్నిధ్యానం, నిత్యహోమం, బలిహరణ, మహాశాంతి హోమాలు చేశారు. అనంతరం హనుమంత్, గరుడ వాహన సేవలు చేసి భక్తుల దర్శనార్థం గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం చక్రస్నానం, పూర్ణాహుతి, అశ్వవాహన సేవ ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు డీఈఈ అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్థానిక ఎన్ఆర్‌టీ సెంటర్, పండరీపురం ప్రాంతాల్లో, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుభానినగర్ రాగన్నపాలెం, పురుషోత్తమపట్నం, అడ్డరోడ్డు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

‘యువగళం’.. చారిత్రక ఘట్టం

వినుకొండ, న్యూస్‌టుడే: తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ గతంలో చేపట్టిన యువగళం పాదయాత్ర దేశ రాజకీయాల్లో చారిత్రక ఘట్టంగా నిలిచిపోతుందని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. లోకేశ్ యువగళం చేపట్టి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా చీఫ్ విప్ కార్యాలయంలో మంగళవారం తెదేపా శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేకును నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన కట్ చేశారు. కార్యక్రమంలో జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, నేతలు పాల్గొన్నారు.

కేకు కోస్తున్న ఎమ్మెల్యే జీవీ

జీవీతో తెదేపా జిల్లా అధ్యక్షుడి భేటీ

వినుకొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులును వినుకొండలోని ఆయన నివాసంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు షేక్ జానీ సైదా మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈనెల 29న తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వానించారు. ఈసందర్భంగా జానీసైదాను జీవీ శాలువా కప్పి సన్మానించారు. వారి వెంట జీడీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి మక్కెన మల్లికార్జునరావు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి షమీమ్‌ఖాన్ ఉన్నారు.

పేదల ఇళ్ల భూములపై ఆర్డీవో విచారణ

వినుకొండ, న్యూస్‌టుడే: మండలంలో జాలలపాలెం వద్ద పట్టణ పేదల ఇళ్ల నిర్మాణానికి సేకరించిన భూముల కొనుగోలులో అక్రమాలు జరిగాయని అందిన ఫిర్యాదులపై ఆర్డీవో మధులత విచారణ చేపట్టారు. నరసరావుపేటలోని తన కార్యాలయంలో ఫిర్యాది, భాజపా జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మేడం రమేష్‌తో పాటు మూల్పూరి ఆగ్రోటెక్ ప్రతినిధి, గొట్టం పుల్లయ్య కుటుంబ సభ్యులు, తహసీల్దార్ సురేష్ నుంచి మంగళవారం వివరాలు సేకరించారు. మరోసారి సమావేశానికి రావాలని వారికి ఆమె సూచించారు.

పరుగెత్తితే స్టెంట్లు నిలబడవు

వినుకొండ, న్యూస్‌టుడే: ఏడు పదుల వయసులో పరుగు పందెంలో పాల్గొంటే గుండెకు వేసిన స్టెంట్లు నిలబడవని జీడీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి మక్కెన మల్లికార్జునరావు ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సోమవారం చేసిన వ్యాఖ్యలపై మక్కెన ఇలా స్పందించారు. తెదేపా కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆత్మ స్తుతి, పరనింద తప్ప ఆయనకు మరొకటి తెలియదన్నారు. తాను భూములు ఆక్రమించినట్లు చేసిన ఆరోపణలు రుజువు చేయాలని సవాల్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులును విమర్శించే అర్హత బొల్లాకు లేదన్నారు.

బొల్లాకు మక్కెన చురకలు

లోటుపాట్లు వెలికి తీస్తున్నాం

జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌లో గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలను వెలికితీస్తున్నామని సీఈవో నుంచి మేనేజర్ వరకు బాధ్యులపై చర్యలు తీసుకున్నామని మక్కెన తెలిపారు. తప్పులు జరగకుండా రైతులకు రుణాలు అందిస్తున్నామని, ఎరువులు, పురుగు మందులు తెప్పించి బాధ్యతతో పని చేస్తున్నామని ఆయన చెప్పారు. సమావేశంలో ఐడీసీ డైరెక్టర్ పెమ్మసాని నాగేశ్వరరావు, బొల్లాపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి పేరిం వెంకటనారాయణ, తెదేపా రాష్ట్ర కార్యదర్శి షమీమ్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విచారణ

ఈపూరు, న్యూస్‌టుడే: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిధులు దుర్వినియోగం అయ్యాయన్న ఆరోపణలపై నరసరావుపేట డీడీవో వెంకటరెడ్డి మంగళవారం విచారణ చేశారు. 2021-25 మధ్య మండల ప్రజా పరిషత్ సాధారణ, ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం అయ్యాయని క్రోసూరుకు చెందిన సామాజిక కార్యకర్త నర్రా పిచ్చయ్య ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టరు కృతికాశుక్లాకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఉమ్మడి గుంటూరు జడ్పీ సీఈవో వి.జ్యోతిబసు విచారణకు ఆదేశించారు. విచారణ అధికారిగా వచ్చిన డీడీవో వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇరు వర్గాల నుంచి వివరాలు సేకరించామని, నివేదికను సీఈవోకు అందజేస్తామని తెలిపారు. డీడీవో వెంట ఎంపీడీవో ఉమాదేవి, మండల స్వర్ణ గ్రామ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు పెరిగేలా చూడండి

యడ్లపాడు, న్యూస్‌టుడే: యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి బి.రవి మంగళవారం సందర్శించారు. అధికారులతో మాట్లాడి ఇన్‌పేషెంట్, అవుట్ పేషెంట్లకు అందిస్తున్న వైద్య సేవలు, పేషెంట్ల హాజరు శాతం గురించి తెలుసుకున్నారు. గర్భిణుల నమోదు తగ్గకుండా చూడాలని, ఆసుపత్రిలో కాన్పులు ఎక్కువగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గర్భిణికి ఆయుష్మాన్ భారత్ (అభా) ఐడీ నమోదు చేయాలన్నారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఫిబ్రవరి 7, 8 తేదీల్లో నిర్వహించనున్న కొండవీడు ఉత్సవాల్లో ఏర్పాటు చేయనున్న వైద్య శిబిరాల నిర్వహణకు సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో హెల్త్ యూనిట్ నిర్మాణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ భరద్వాజ, హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

వైద్యాధికారి డాక్టర్ భరద్వాజతో మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రవి

కాలువల్లో తూటుకాడ తొలగింపు

నూజండ్ల, న్యూస్‌టుడే: చివరి భూములకు నీరందించి పంటలను కాపాడేందుకు త్రిపురాపురం డీసీ ఛైర్మన్ గుంటిరెడ్డి రామచరావు చర్యలు చేపట్టారు. త్రిపురాపురం, కమ్మవారిపాలెం మేజర్లలో అల్లుకున్న తూటుకాడ తొలగించే కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. కాల్వ నిండా తూటుకాడ అల్లుకుపోవడంతో నీరు ముందుకు సాగక చివరి భూములకు నీరు చేరక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయకట్టులో సాగు చేసిన వరితో పాటు మిరప, పొగాకు మెట్ట పంటలను రక్షించడానికి అత్యవసరంగా ఈ పనులు చేపట్టామన్నారు.

కంకర తేలి.. ప్రమాదాలకు దారేసి..

నరసరావుపేట శివారున సత్తెనపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో ఇస్సపాలెం- ములకలూరు మధ్య గుంతలు పడి ప్రయాణం ప్రమాదకరంగా మారింది. కంకర రాళ్లు పైకి తేలి ఉన్నాయి. రాత్రిళ్లు ఈ మార్గంలో గుంతలు కనపడక వాహనాలు అదుపు తప్పి చోదకులు కింద పడి గాయాలపాలవుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా కనీసం గుంత పూడ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టలేదని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ ఏఈ సుమన్ సైమన్‌పాల్‌ను వివరణ అడగ్గా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి గుంతలు పూడ్చేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. – న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)

తవ్వి వదిలేస్తే ఎలా?

వినుకొండ పట్టణ శివారున ముట్లకుంట కాలనీలో వందకు పైగా ఇళ్లు ఉన్నాయి. గత తెదేపా ప్రభుత్వ హయాంలో 2014-19 మధ్య ఈ ప్రాంతంలో అంతర్గత రహదారులు సిమెంట్ కాంక్రీటుతో నిర్మించారు. ఆ తర్వాత తాగునీటి సరఫరా పైపులైన్ల ఏర్పాటుకు రహదారిని మధ్యలోకి తవ్వి వదిలేశారు. ఆ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో పూడ్చనందున రాత్రివేళ బైక్‌లు, ఆటోలు తోపుడుబండ్ల చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై మున్సిపల్ ఏఈఈ ఆదినారాయణను సంప్రదించగా త్వరలో కాలనీలో రహదారులకు ప్యాచ్ వర్క్ చేయిస్తామని తెలిపారు. **- న్యూస్‌టుడే, వినుకొండ**

పరిమితి మించితే అనర్థమే

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే:

వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకూడదని మోటారు వాహన తనిఖీ అధికారి ఎస్.గోపాల్ అన్నారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆటో, జీపు డ్రైవర్లకు అవగాహన కలిగిస్తూ వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా లైసెన్సులు, వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను కలిగి ఉండాలన్నారు. కండిషన్‌లో లేని వాహనాలు, మద్యం తాగి నడపడం ప్రమాదకరమని వివరించారు. ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ప్రారంభమైన ఆటోల ర్యాలీ చౌత్రా సెంటర్, కళామందిర్ కూడలి, గడియారస్తంభం వరకు కొనసాగింది. రవాణా, పోలీసు సిబ్బంది, ఆటో, జీపు డ్రైవర్లు పాల్గొన్నారు.

కొండ దారిలో మురుగు చింత

నరసరావుపేట పట్టణంలో కోటప్పకొండ వెళ్లే దారిలో ఓ మురుగు కాలువలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. రోజుల తరబడి వాటిని తొలగించకపోవడంతో దోమలు వృద్ధి చెంది రాత్రిళ్లు కంటి మీద కునుకు ఉండటం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఆ మార్గంలో రాకపోకలు సాగించాలంటే ముక్కు మూయాల్సిందేనని వాపోతున్నారు. శివరాత్రి ఉత్సవాలు సమీపిస్తున్న తరుణంలో పట్టణంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై పారిశుద్ధ్య అధికారిణి రమాదేవిని వివరణ కోరగా వెంటనే ఆ ప్రాంతానికి సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, నరసరావుపేట టౌన్**

నైతిక విలువలు తప్పనిసరి

వినుకొండ, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు ‘రైజ్ ఇండియా విజన్ 2047’ పేరుతో శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న కార్యక్రమం విజయవంతం చేయాలని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కోరారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ఈకార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. నియోజకవర్గంలోని అన్ని ఉన్నత పాఠశాలలో దీనిని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇష్టంగా చదవండి.. ఉన్నతంగా ఎదగండి

నరసరావుపేట సెంట్రల్, చిలకలూరిపేట పట్టణం, సంతగుడిపాడు (రొంపిచర్ల), వినుకొండ రూరల్, నూజండ్ల, శావల్యాపురం, న్యూస్‌టుడే

విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని జీవితంలో ముందుకు సాగాలని వక్తలు పిలుపునిచ్చారు. నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ నియోజకవర్గాల్లో పలు పాఠశాలల వార్షికోత్సవాలు మంగళవారం నిర్వహించారు. నరసరావుపేట మున్సిపల్ బాలికల హైస్కూలులో ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, ఎంఈవో నాగేశ్వరరావు, హెచ్ఎం మౌలాని పాల్గొన్నారు. వినుకొండ మండలం విఠంరాజుపల్లిలో ఓ పాఠశాల వార్షికోత్సవంలో ఎమ్మెల్యే ఆంజనేయులు పాల్గొన్నారు. చిలకలూరిపేట సుగాలీకాలనీలోని మున్సిపల్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి ఇష్టంగా చదువుకోవాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రొంపిచర్ల మండలం సంతగుడిపాడు, కొత్తపల్లి, వి.రెడ్డిపాలెం, మాచవరం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. నూజండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు రాఘవరావు పాఠశాలకు కావల్సిన అన్ని రకాల వసతులు సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. శావల్యాపురం మండలం వేల్పూరు, పోట్లూరు జడ్పీ పాఠశాల వార్షికోత్సవాలు ఘనంగా సాగాయి.

నూజండ్ల: విద్యార్థినుల నృత్య ప్రదర్శన

వినుకొండ: బాలికల భరతనాట్యం

రొంపిచర్ల: కేకు కోస్తున్న ఎంఈవో తదితరులు

కిల్కారీ సేవలపై అవగాహన

నరసరావుపేట అర్బన్, సెంట్రల్, న్యూస్‌టుడే: బాలింతలు, గర్భిణులకు కిల్కారీ సేవలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. బరంపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో డీసీఎం సురేష్, కిల్కారీ ప్రోగ్రాం అధికారి రాజు, డాక్టర్ భవిత పాల్గొని కిల్కారీ కాల్స్ ఉపయోగాలు వివరించారు. తల్లీ, బిడ్డ సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వాయిస్ కాల్స్ ద్వారా వస్తాయన్నారు. పౌష్టికాహారం, టీకాలు తదితర అంశాలు వివరిస్తారన్నారు. ఆ సేవలను ప్రతి గర్భిణీ, బాలింత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమస్య పరిష్కారానికి వినతి

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీసర్వేలో రొంపిచర్ల మండలం సుబ్బయ్యపాలెం గ్రామ పరిధిలోని 282 సర్వే నంబరులో సుమారు 80 ఎకరాలు 22-ఎ కింద నమోదు చేశారని, ఆ భూములపై అమ్మకాలు, కొనుగోలు, రిజిస్ట్రేషన్లు నిషేధించటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు చేసిన తప్పును సరిచేయాలని సుబ్బయ్యపాలెం సొసైటీ అధ్యక్షుడు ఇంటూరి ప్రసాదు ఆధ్వర్యంలో రైతులు కలెక్టర్ కృతికాశుక్లాను మంగళవారం రాత్రి కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చితెలిపినట్లు ఇంటూరి ప్రసాదు పేర్కొన్నారు.

శనగలో సస్యరక్షణ అవసరం

కావూరు(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: ప్రస్తుతం శనగ పంట పూత, కాయ దశల్లో ఉందని వేరుకుళ్లు తెగులు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్ సరిత రైతులకు సూచించారు. మండలంలోని కావూరు, లింగంగుంట్ల గ్రామాల్లో మంగళవారం క్షేత్రస్థాయిలో శనగ పంట పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. వేరుకుళ్లు తెగులు ఆశించకుండా 2 కిలో ట్రైకోడెర్మాపొడి, 4 కిలోల వేప చెక్కతో కలిపి 90 నుంచి 100 కిలోల పశువుల ఎరువులో 10 నుంచి 15 రోజులు వృద్ధి చేసి పొలంలో కలియదున్నాలన్నారు. మొక్కజొన్న పంట వివిధ దశల్లో ఉందని, ఎండుతెగులు నివారణకు మాంక్‌జెబ్ 500 గ్రాములు 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఏఈవో ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

అవీ ఇవీ

పశు వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

శావల్యాపురం, న్యూస్‌టుడే : మండలంలో వైకల్లు, చినకంచర్లలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించినట్లు పశు వైద్యాధికారులు పాలపర్తి గణేష్‌కుమార్, కె.కావ్య తెలిపారు. శిబిరంలో దూడలు, గేదెలు, మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు పంపిణీ చేయడంతో పాటు, గర్భకోశ సంబంధిత సమస్యలు, ఆరోగ్యం బాగాలేని పశువులకు చికిత్స అందించామన్నారు. ఆయా గ్రామ సర్పంచులు మద్దినేని ఆంజనేయులు, పూరేటి నాగేశ్వరరావు చేతుల మీదుగా పశు పోషకులకు ఉచితంగా మందులు అందచేశారు. కార్యక్రమంలో సిబ్బంది నాగేశ్వరరావు, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పడి లస్కర్ మృతి


శ్రీనివాస్‌రెడ్డి (పాత చిత్రం)

రొంపిచర్ల, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు కాలువలో పడి లస్కర్ మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి రొంపిచర్ల ఠాణా పరిధిలో జరిగింది. మండలంలో సంతగుడిపాడుకు చెందిన అనుముల శ్రీనివాస్ రెడ్డి (54) మాచవరం మైనర్ కాలువ పరిధిలో కొన్నేళ్లుగా లస్కర్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో విధుల్లో భాగంగా మంగళవారం రాత్రి మర్రిచెట్టుపాలెం సమీపంలోని మైనర్ కాలువపై ఉన్న సైఫన్ పైనుంచి నీటి సరఫరాను పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయారు. తలకు తీవ్రగాయాలయ్యాయి. అక్కడే ఉన్న రైతులు గుర్తించి బయటకు తీసి నరసరావుపేట పట్టణంలోని ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులకు గాయాలు

గణపవరం(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: నాదెండ్ల మండలం గణపవరం పరిధిలో కొత్తగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ఎదురుగా జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం రాజుపాలెం గ్రామానికి వెళ్తున్న పాలపర్తి కోటేశ్వరరావు, అతని భార్య దానమ్మ గణపవరం నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఇద్దరినీ 108 అంబులెన్సులో చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆదర్శ విద్యార్థులకు అభినందన

రొంపిచర్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర రాజధాని అమరావతిలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో వి.రెడ్డిపాలెం ఆదర్శ పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారని ప్రిన్సిపల్ డాక్టర్ బి.రవినాయక్ మంగళవారం తెలిపారు. విద్యార్థులు కె.రిషితేజ, పిచ్చియ్య, శివనీలకంఠారెడ్డి, యశ్వంత్, అబ్దుల్ కాలేషాతో పాటు గైడ్ టీమ్ శాంభవి, లక్ష్మీదుర్గాభవాని, నీలిమ, తేజస్విని 16 రోజుల పాటు శిక్షణ పొంది పరేడ్‌లో గవర్నర్‌కు గౌరవ వందనం సమర్పించే కవాతులో పాల్గొన్నారని వివరించారు. ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు వారిని అభినందించారు.

జామియా మసీదు పనుల పరిశీలన

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: పట్టణంలో నిర్మాణంలో ఉన్న జామియా మసీదు సముదాయ నిర్మాణ పనులను ఎమ్మెల్యే అరవిందబాబు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణ పనుల పురోగతిపై కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించాలని సూచించారు. గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు. ఆయన వెంట మసీదు కమిటీ సభ్యులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలకు దుప్పట్ల వితరణ

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ వైద్యశాలలో మంచాలపై వినియోగించే దుప్పట్లను న్యాయవాది శ్రీగిరిరాజు నాగేశ్వరరావు మంగళవారం వితరణ చేశారు. 300 దుప్పట్లను వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్‌కుమార్‌కు అప్పగించారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ కన్వీనర్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సభ్యులు డాక్టర్ భారతీదేవి, ఆర్ఎంవో ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మె

నరసరావుపేట అర్బన్, వినుకొండ, చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: వారంలో అయిదు రోజుల పనిదినాల అమలు తదితర డిమాండ్ల సాధనకు బ్యాంకు ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లాలో మంగళవారం సమ్మెకు దిగారు. దీంతో జిల్లాలో అన్ని ప్రభుత్వ బ్యాంకుల శాఖలు మూతబడ్డాయి. జిల్లా కేంద్రం నరసరావుపేటలో నిరసన తెలిపారు. ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. వినుకొండలో స్టేట్‌బ్యాంక్ నుంచి ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. చిలకలూరిపేట స్టేట్ బ్యాంక్ వద్ద నుంచి ఎన్ఆర్‌టీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి ఐబీఏ సిఫార్సు చేసిన 5రోజుల పని విధానం అమలు చేయాలని కోరారు.

చిలకలూరిపేట ఎస్‌బీఐ వద్ద ఉద్యోగుల నిరసన

వినుకొండలో ద్విచక్ర వాహన ర్యాలీ

(c) eenadu

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

గుళ్లపల్లిలో సోదాలు

తనిఖీలు చేస్తున్న పోలీసులు

నకరికల్లు, న్యూస్‌టుడే: మండలంలోని గుళ్లపల్లిలో మంగళవారం తెల్లవారుజామున డీఎస్పీ హనుమంతరావు ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 40 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు, గొడ్డళ్లు, రాడ్లు స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా సోదాలు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. సీఐ కిరణ్, ఎస్సై సతీష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయోగ పరీక్ష కేంద్రాలు అనుసంధానం

కేంద్రం వద్ద ఇంటర్ బోర్డు రాష్ట్ర పరిశీలకురాలు సౌజన్య

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: ఇంటర్ ప్రయోగ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని కేంద్రాలను రాష్ట్ర బోర్డు కార్యాలయంతో అనుసంధానం చేసినట్లు రాష్ట్ర పరిశీలకురాలు సౌజన్య తెలిపారు. పట్టణంలోని వేద, డాక్టర్ సీఎస్‌జీఎల్‌ఎం కళాశాలలో ఒకేషనల్ ప్రయోగ పరీక్షలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. సీసీ కెమెరాలతోపాటు తనిఖీ బృందాల నిఘా ఉంటుందన్నారు. పరీక్షల విభాగం జిల్లా అధికారిణి శైలజ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

? రెడ్డిగూడెం రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారి గుంతలమయంగా మారింది. **- శ్రీనివాసరావు, ఉప్పలపాడు**

✔ త్వరలో సిమెంటు రోడ్డు నిర్మిస్తాం. **- మిల్క్‌రాజ్, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, రాజుపాలెం**

వేసవిలో ఆలయ పనులు ప్రారంభిస్తాం

నిర్మాణ పనులకు ఉపయోగించే రాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

రెంటచింతల, న్యూస్‌టుడే: రాబోయే వేసవిలో సత్రశాల ఆలయ పునరుద్ధరణ పనులు ఆరంభిస్తామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి స్పష్టం చేశారు. ఫిబ్రవరి 15న సత్రశాలలో నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, మహిళలు బంగారం ధరించకుండా ఉత్సవాలకు రావాలని సూచించారు. కృష్ణానది ఘాట్‌లో మహిళల స్నానాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం నూతన ఆలయ నిర్మాణంలో వినియోగించనున్న రాళ్లను పరిశీలించారు. ఆర్డీవో మురళీకృష్ణ, కమిటీ ఛైర్మన్ పోలా శరత్‌కుమార్, ఈవో రామిరెడ్డి, ప్రముఖులు మల్లయ్య సుమంత్‌రెడ్డి, అబ్బిరెడ్డి, రామకృష్ణ, గురవారెడ్డి, ఎస్సై నాగార్జున పాల్గొన్నారు.

వైద్య సేవ.. పల్లెకు చేరువ

జానపాడు, కుమ్మరిపాలెం, పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: గ్రామీణులకు నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలను ఇంటి దగ్గరే అందించేందుకు కూటమి ప్రభుత్వం విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తోంది. పేదలు, వృద్ధులు, గర్భిణులు, పిల్లలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులు అందించడం, జ్వరం, షుగర్, బీపీ వంటివి ప్రారంభ దశలో గుర్తించి చికిత్స చేయడం, ప్రజారోగ్యంపై అవగాహన, టీకాల నిర్వహణకు విలేజ్ క్లినిక్‌లు దోహదం చేయనున్నాయి. పిడుగురాళ్ల మండలంలో ఐదు గ్రామాల్లో వీటి ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు, పీఎం అభియాన్ నిధుల నుంచి భవనాల నిర్మాణానికి రూ.1.98 కోట్లు, ప్రహరీలకు రూ.39 లక్షలు మంజూరు చేసింది.

ఏయే పనులు.. ఎంత నిధులు

మండలంలోని కోనంకి, గుత్తికొండ, జూలకల్లు, తుమ్మలచెరువు, జానపాడు గ్రామాల్లో విలేజ్ క్లినిక్‌ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. 15వ ఆర్థిక సంఘం నుంచి కోనంకి, గుత్తికొండకు రూ.36 లక్షలు చొప్పున కేటాయించారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తై భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. కోనంకిలో పనులు పూర్తి కావస్తున్నాయి. గుత్తికొండలో లింటల్ లెవల్ వరకు పనులు జరిగాయి. పీఎం అభియాన్ నుంచి జూలకల్లు, తుమ్మలచెరువు, జానపాడు గ్రామాలకు రూ.42 లక్షలు చొప్పున నిధులు వచ్చాయి. టెండర్ల ప్రక్రియ పూర్తయింది. పనులు చేపట్టాల్సి ఉంది. జూలకల్లులో భవనం ఉండటంతో అక్కడ నిర్మాణం చేపట్టడం లేదు. తుమ్మలచెరువు, జానపాడులో ప్రహరీలకు రూ.13 లక్షలు చొప్పున కేటాయించారు. భవనాల నిర్మాణం త్వరితగతిన జరిగితే పేదలకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి.

గుత్తికొండలో విలేజ్ క్లినిక్ భవన నిర్మాణం

గరుడ వాహనంపై లక్ష్మీనృసింహుడు

ఊరేగుతున్న స్వామి

మోర్జంపాడులో భక్తుల సందడి

మాచవరం, న్యూస్‌టుడే: లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా మంగళవారం మోర్జంపాడులో పొంజుసేవ ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై పుర వీధుల్లో ఊరేగించారు. గ్రామస్థులు స్వామికి అడుగడుగునా నీరాజనాలు, జలధారలతో స్వాగతం పలికారు. మాలధారులు, మహిళలు భక్తిగీతాలు ఆలపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు.

వైభవంగా అంజన్న తిరునాళ్ల

పిడుగురాళ్ల: పట్టణంలోని ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల సందర్భంగా మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వేదపండితులు పూర్ణాహుతి హోమాన్ని నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు వడ్డవల్లి సర్వేశ్వరరావు తదితరులు స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. మహిళల కోలాటం ఆకట్టుకుంది. బుధవారం సీతారాముల కల్యాణం, రథోత్సవం జరగనుంది.

ప్రసన్నాంజనేయస్వామి

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

మాచర్ల పట్టణం, న్యూస్‌టుడే: సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడంతోపాటు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని తెదేపా బూత్ ఏజెంట్లకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి సూచించారు. మంగళవారం ఏజెంట్లతో ప్రత్యేక సమావేశం పట్టణ పార్టీ అధ్యక్షుడు కొమెర దుర్గారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మధుసూదనరావు, కేశవరెడ్డి, చిన్న వెంకటరామిరెడ్డి, సైదయ్య, అస్గర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పట్టణంలో ప్రసన్నాంజనేయస్వామి రథోత్సవం సందర్భంగా బుధవారం మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 7 వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తహసీల్దారు కార్యాలయం, పోలీసుస్టేషన్ సెంటర్, ప్రజాశక్తినగర్, చెరువుకట్ట బజారు, అడితీల సెంటరు, జానపాడురోడ్డు, అంజిరెడ్డి ఆసుపత్రి, గంగమ్మగుడి, కుమ్మరిపాలెం ప్రాంతాల్లో సరఫరా నిలిపేస్తామన్నారు.

వార్షిక వేడుక.. ఆనంద దీపిక

పూర్వ విద్యార్థి, వైద్యుడు రత్తయ్యను సత్కరిస్తూ..

దొడ్లేరు జడ్పీ పాఠశాలలో బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పిడుగురాళ్లలో విద్యార్థినుల నృత్యం

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మస్తాన్ పుల్లారెడ్డి పాఠశాలలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథులుగా రోటరీక్లబ్ డిస్ట్రిక్ట్ అవార్డు జ్యూరీ సభ్యుడు పంగులూరి విష్ణుబాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉన్నతస్థాయికి ఎదుగుతారని చెప్పారు.

దొడ్లేరు(క్రోసూరు), అచ్చంపేట: ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని, విద్యార్థులు అన్నిరంగాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధించాలని క్రోసూరు మండలం దొడ్లేరు జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయిని జోస్‌మేరి తెలిపారు. మంగళవారం ఆమె దొడ్లేరు జడ్పీ పాఠశాల వార్షికోత్సవంలో మాట్లాడారు. విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

పెదకూరపాడు: ప్రభుత్వ పూర్వ విద్యార్థులు అందిస్తున్న తోడ్పాటుతో విద్యా ప్రమాణాలు పెంపొందుతాయని ఉపాధ్యాయులు కృషి చేయాలని పలువురు పేర్కొన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఎన్నారై భానుప్రకాష్, పూర్వ విద్యార్థులు డాక్టర్ రత్తయ్య, పఠాన్ వజీర్ ఖాన్, ప్రాఫిట్ షా కంపెనీ ఎండీ శివకోటేశ్వరరావు, ఎంఎస్ఎంఈ రాష్ట్ర డైరెక్టర్ గుడిపూడి చినరాజు, రాంగోపాలరావు, రమేష్, బ్రహ్మయ్య, గల్లా బాబు తదితరులను సత్కరించారు.

బ్యాంకు ఉద్యోగుల ఆందోళన

మాచర్ల పట్టణం: బ్యాంకు ఉద్యోగులకు వారానికి ఐదు రోజులే పనిదినాలు కొనసాగించాలని యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు యూనియన్ పిలుపుమేరకు మంగళవారం మాచర్లలో పలు బ్యాంకుల ఉద్యోగులు, సిబ్బంది నిరసన తెలియజేశారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

సత్తెనపల్లి: వివిధ డిమాండ్ల పరిష్కారానికి బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేయడంతో పట్టణంలోని ప్రధాన బ్యాంకులు మూతపడ్డాయి. వరుసగా మూడ్రోజులు బ్యాంకులు తెరుచుకోకపోవడంతో ఆర్థిక కార్యకలాపాలకు ప్రజలకు వెతలు తప్పలేదు. ఏటీఎం కేంద్రాల సేవలు చాలాచోట్ల ఆగిపోయాయి.

మాచర్లలో బ్యాంకు ఎదుట నిరసన

భట్రాజు కార్పొరేషన్‌కు నిధులివ్వరూ..!

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: భట్రాజు కార్పొరేషన్‌కు రూ.50 కోట్ల నిధులు కేటాయించాలని మంత్రి సవితను ఛైర్మన్ సరికొండ వెంకటేశ్వరరాజు కోరారు. మంగళవారం విజయవాడలోని బీసీ భవన్‌లో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.

మంత్రి సవితకు వినతిపత్రం అందజేస్తున్న వెంకటేశ్వరరాజు

పరీక్షల భయం వద్దు

మాచర్ల (కారంపూడి): విద్యార్థులు పరీక్షల భయం వీడి ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎంఈవో అల్లి సురేష్ అన్నారు. మంగళవారం మార్కెట్లోని బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ గతేడాది పాఠశాల విద్యార్థిని సమీర 596 మార్కులతో రాష్ట్రంలో ద్వితీయ స్థానం సాధించిందని, ఆమెను ఆదర్శంగా తీసుకుని చదవాలన్నారు. ప్రధానోపాధ్యాయిని ఉషా పాల్గొన్నారు.

పంటల పరిశీలన

మాచర్ల పట్టణం, న్యూస్‌టుడే: వ్యవసాయ శాస్త్రవేత్త నరేష్ మంగళవారం రాయవరం గ్రామంలో పర్యటించారు. కంది, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. తెగుళ్ల నివారణ చర్యలు రైతులకు వివరించారు. ఏవో మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

ఒరిజినల్ దస్తావేజు పోయినది

[illegible]

Ph: 90309 27429

నిర్మించి.. ప్రారంభం మరిచి

స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో రూ.48 లక్షల వ్యయంతో వైద్యఆరోగ్యశాఖ బ్లాక్ హెల్త్ యూనిట్ భవనం నిర్మించారు. ఆర్‌అండ్‌బి శాఖ దీని నిర్మాణం పూర్తి చేసి ఆరు నెలలు కావస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. దీనిని ప్రారంభిస్తే మండల ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువలోకి వస్తాయి. వైద్య ఆరోగ్య సిబ్బంది, రోగులకు సౌకర్యం ఉంటుంది. **- న్యూస్‌టుడే, అచ్చంపేట**

గుంతలు పూడ్చండయ్యా

గురజాల - పల్లె గుంత రహదారి అధ్వానంగా మారింది. గుంతలు ఏర్పడి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. వాహనచోదకులు నరకయాతన పడుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని చోదకులు, గ్రామీణులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ**

మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తాం

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: రాబోయే మూడు నెలల్లో జిల్లాలో అన్ని మండల స్థాయి కమిటీలను యాదవ సంఘం సహకారంతో ఏర్పాటు చేస్తామని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. మంగళవారం పట్టణంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విభజనంతరం అఖిల భారత యాదవ మహాసభ కార్యక్రమాలు నిర్వహించలేదని చెప్పారు. యాదవ మహాసభ రాష్ట్ర కమిటీ నూతనంగా ఏర్పాటు చేశారన్నారు. వచ్చే పదిహేను రోజుల్లో రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ యాదవ్ ఈ ప్రాంతానికి వస్తున్నారని చెప్పారు. ఏప్రిల్, మే నెలలో జిల్లా యాదవ మహాసభ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కమిటీల ఏర్పాటులో యాదవ సంఘం సభ్యులు సహకారం ఇవ్వాలని కోరారు.

నేడు మహాశివరాత్రిపై సమీక్ష

ఈనాడు కథనానికి స్పందన

అమరావతి, న్యూస్‌టుడే: అమరేశ్వరాలయంలో ఫిబ్రవరి 12 నుంచి 21 వరకు నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలపై అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమీక్ష సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. 'అమరేశ్వరుని ఉత్సవాలపై నిర్లక్ష్యం' శీర్షికన 'ఈనాడు'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు.

30న గురజాలలో.. గురజాల: మహాశివరాత్రిని పురస్కరించుకుని శివాలయాల వద్ద చేసే ఏర్పాట్లపై సమీక్ష సమావేశం ఈనెల 30న జరుగుతుందని ఆర్డీవో మురళీకృష్ణ తెలిపారు. గురజాల ఆర్డీవో కార్యాలయంలో జరిగే సమావేశంలో ఎమ్మెల్యే యరపతినేని పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో బ్రహ్మోత్సవాలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఫిరోజి రుషీంద్రుల మఠం వార్షిక ఆరాధన బ్రహ్మోత్సవాలు ఈ నెల 29, 30 తేదీల్లో జరగనున్నాయి. వేడుకలకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. ఛత్రపతి కళా పరిషత్ ఆధ్వర్యంలో 29న రాష్ట్రస్థాయి నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు మాజీ కౌన్సిలర్ భానోజీ తెలిపారు.

28న జాబ్‌మేళా

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 28న జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు అధికారి తమ్మాజీరావు తెలిపారు. 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, పెదకూరపాడు నియోజకవర్గ యువత వినియోగించుకోవాలని ప్రిన్సిపల్ రమాదేవి కోరారు. వివరాలకు శ్రీకాంత్ 94921 58153, సురేష్ 91005 66581 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అయ్యప్ప ఆలయానికి విరాళాలు

గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: చర్లగుడిపాడులో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్పస్వామి దేవస్థానానికి విరాళాలు అందజేశారు. గ్రామానికి చెందిన బొడ్డు పుల్లారావు రూ.25,116, బొడ్డు మాధవరావు రూ.25,116, కొల్లిపర సత్యన్నారాయణ రూ.10,116ను ఆలయ ధర్మకర్త వేముల విశ్వేశ్వరరావుకు మంగళవారం అందించారు.

యువగళం.. చారిత్రక ఘట్టం

పెదకూరపాడు, న్యూస్‌టుడే: తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తలపెట్టిన యువగళం పాదయాత్ర ఓ చారిత్రక ఘట్టమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. యువగళం పాదయాత్రకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళగిరి కేంద్ర కార్యాలయంలో మంగళవారం లోకేశ్‌ను కలిసి అభినందించారు. యువగళం పాదయాత్ర ద్వారానే వైకాపా ప్రభుత్వ వైఫల్యాలు వెలుగు చూశాయన్నారు. 2024 ఎన్నికల్లో విజయానికి పునాది వేసిందన్నారు.

లూథరన్ చర్చి వార్షికోత్సవం

ముటుకూరు(దుర్గి): ముటుకూరులోని లూథరన్ చర్చి వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. పాస్టర్ ఏసుదానం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చిని విద్యుత్తు బల్బులతో అలంకరించారు. రాత్రి నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎస్సీ కమిషన్ సభ్యుడు మేకల దాసును సంఘ పెద్దలు సత్కరించారు.

మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం పార్లమెంటు కమిటీ సమావేశం జరిగింది. ఇందులో పల్నాడు జిల్లా తెదేపా అధ్యక్షుడు షేక్ జానీసైదా తదితరులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, అమరావతి**

సైబర్ నేరాలతో జాగ్రత్త

దాచేపల్లి: సైబర్ నేరాలు పెరుగుతున్నాయి.. వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సీఐ భాస్కర్ తెలిపారు. మంగళవారం ముత్యాలంపాడులో గ్రామస్థులకు రోడ్డు భద్రత-సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచితులు పంపిన లింకులు ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు ఇతరులతో పంచుకోరాదని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీతారామశాస్త్రి సేవలు మరువలేనివి

సత్తెనపల్లి: నిరుపేదలకు సత్తెనపల్లి మాజీ సర్పంచి సీతారామశాస్త్రి అందించిన సేవలు మరువలేనివని వక్తలు అన్నారు. పట్టణంలోని తాలుకా సెంటర్‌లోని ఆయన విగ్రహం వద్ద మంగళవారం శాస్త్రి వర్ధంతి నిర్వహించారు. ఆయన కుమార్తెలు దమయంతి, అంబికా స్థానిక ఆదరణ వృద్ధాశ్రమంలో అన్నదానం, దుప్పట్లు పంపిణీ చేశారు. నాయకులు తాండవకృష్ణ, చెన్నకేశవరావు, శ్రీనివాసరావు, పెదకరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సాయం.. పాడి పోషణకు బలం

నారాయణపురం, తంగెడ (దాచేపల్లి), నెహ్రూనగర్, గురజాల గ్రామీణ, న్యూస్‌టుడే: పశు పోషణకు, పాడి రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 31 వరకు ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహిస్తోంది. పోషకుల ఇంటి ముంగిటికే వైద్య సేవలు అందిస్తోంది. ప్రతి మండలంలో రెండు ప్రత్యేక పశు వైద్య బృందాలు ఏర్పాటు చేసి, ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామాల్లో సేవలందించేలా ప్రణాళిక రూపొందించారు.

పోషకులకు భరోసా.. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పశు వైద్యశాలల్లో సేవలు అధ్వానంగా ఉండేవి. మందుల కొరత వేధించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక అన్ని ప్రభుత్వ పశు ఆసుపత్రులకు 35 రకాల మందులను పూర్తిస్థాయిలో సరఫరా చేసింది. వైద్యుల ద్వారా పశువులు, జీవాల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తూ.. వాటి నివారణకు టీకాలు అందిస్తున్నారు. అదే సమయంలో పశువుల పోషణ, సంరక్షణ, వ్యాధుల నివారణపై రైతులకు అవగాహన కల్పించేందుకు సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. పశువుల బీమా పథకాన్ని తిరిగి అమల్లోకి తెచ్చారు. పశుగ్రాసానికి 90 శాతం వరకు రాయితీ కల్పిస్తున్నారు.

శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

జిల్లాలో ఇలా..

గేదెలు, దున్నలు:	4,65,046
ఆవులు, ఎద్దులు:	65,072
గొర్రెలు:	4,69,424
మేకలు:	1,56,291

రైతులకు ముందస్తు సమాచారం.. శిబిరాల నిర్వహణకు ముందు రోజే ఆయా గ్రామాల్లో దండోరా వేయించి సమాచారం అందిస్తున్నామని దాచేపల్లి పశువైద్యాధికారి చెన్నయ్య తెలిపారు. ఈ అవకాశాన్ని పోషకులు సద్వినియోగం చేసుకుని తమ పశువుల ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంపై కేసు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: లారీ స్కూటీని ఢీకొన్న ఘటనలో మృతి చెందిన వ్యక్తి రెంటపాళ్ల గ్రామానికి చెందిన షేక్ పరీద్(57)గా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలపై ఎస్సై శివనాగరాజు మంగళవారం కేసు నమోదు చేశారు. రెంటపాళ్లకు చెందిన షేక్ పరీద్, పట్టణంలోని డ్రైవర్స్‌కాలనీలో బంధువు అనసూర్య ఇంటికి సోమవారం వచ్చాడు. ఆ తరువాత పరీద్‌ను కొండమోడులో దించటానికి అనసూర్య స్కూటీ తీసుకొని బయలుదేరి వెళ్లారు. గుంటూరురోడ్డులోని జంక్షన్‌లో లారీ స్కూటీని ఢీకొనడంతో పరీద్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా అనసూర్యకు తీవ్రగాయాలై కోమాలోకి వెళ్లింది.

చికిత్స పొందుతూ మృతి

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: చింతకాయలు కోసేందుకు చెట్టు ఎక్కి జారిపడి గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన చెన్నకేశవరావు(63) ఈ నెల 17న ఇంటి వద్ద చింతచెట్టు ఎక్కి కాయలుకోస్తూ జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు గుంటూరు సమగ్రాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

సాల్మన్ కుటుంబాన్ని ఆదుకోవాలి

మాచవరం, న్యూస్‌టుడే: మండలంలోని పిన్నెల్లిలో ప్రత్యర్థుల దాడిలో చనిపోయిన మందా సాల్మన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం బాధిత కుటుంబాన్ని నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు సంజయ్ మాదిగ, రమేష్ మాదిగ మాట్లాడుతూ బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం, పక్కా గృహం నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పోగొట్టుకున్న ఫోన్ల అప్పగింత

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితులకు పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావు మంగళవారం ఠాణాలో అందించారు. ఇటీవల చరవాణులు పోగొట్టుకున్న ఆరుగురి వివరాలు నమోదు చేశారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, దొంగతనానికి గురైనా వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సీఐ తెలిపారు.

మిరప పంట ధ్వంసం

పిడుగురాళ్ల: జూలకల్లు గ్రామానికి చెందిన నంద్యాల శివారెడ్డి మిరప పంటను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గ్రామానికి చెందిన వారే ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని బాధిత రైతు భావిస్తున్నారు.

శ్రీ అమరేశ్వర స్వామి వారి దేవస్థానము
అమరావతి-522 020, పల్నాడు (జిల్లా) ఆం.ప్ర.
Ph: 08645-255241, 96668 56255, email:eo_sast_amvt@yahoo.com

ఆర్.సి.నెం.06/2026, తేది: 27-01-2026
షార్ట్ టర్మ్ సీల్డు టెండర్లు కొరకు ప్రకటన

పల్నాడు జిల్లా, అమరావతి మండలం మరియు గ్రామములో వేంచేసియున్న శ్రీ అమరేశ్వర స్వామి వారి దేవస్థానమునకు సంబంధించిన మహా శివరాత్రి బ్రహ్మోత్సవములకు ప్రత్యేక ఏర్పాట్లు చేయు నిమిత్తం ఈ క్రింది తెలిపిన అత్యవసర పనులకు షార్ట్ టర్మ్ సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. సదరు అత్యవసర పనులు కొరకు టెండరు షెడ్యూలు ఫారములు **ది: 28-01-2026న బుధవారం ఉదయం 11.00 గంటల** నుండి దేవస్థానం కార్యాలయంలో ఒక్కొక్క టెండరు ఫారమునకు రూ 500/- చెల్లించి పొందవచ్చును. పూర్తి చేసిన టెండరు షెడ్యూల్ ఫారములను **ది: 02-02-2026న సోమవారము ఉదయము 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల** లోపు దేవస్థానం కార్యాలయము నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్స్ నందు దాఖలు చేయవలెను. షరతుల ప్రకారము ధరవత్తులు చెల్లించిన సీల్డు టెండర్లను అదే రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు టెండరుదారులు మరియు ధర్మకర్తల మండలి సభ్యుల సమక్షములో తెరువబడును. తక్కువ ధరలు నమోదు చేసిన టెండరుదారుల వివరములతో కూడిన నివేదికను తదుపరి ఆమోదపు ఉత్తర్వుల కొరకు కమీషనరు, దేవదాయ ధర్మదాయ శాఖ, గొల్లపూడి, విజయవాడ వారికీ పంపబడును. ఇతర వివరములు మరియు షరతులు తెలుసుకొనుటకు దేవస్థానం కార్యాలయము పని వేళలలో సంప్రదించి తెలుసుకొనగలరు.

వ. నెం.	మహా శివరాత్రి బ్రహ్మోత్సవముల టెండరు పనుల వివరములు	టెండరు పనుల కాలపరిమితి	టెండరు డిపాజిట్
1.	టెండరు షెడ్యూల్ దాఖలా ది: 15-02-2026న దేవస్థానంకు మరియు కళ్యాణ మండపమునకు పూల అలంకరణ & ది: 17-02-2026న దివ్య రథోత్సవము సందర్భంగా మహా రథమునకు పూల అలంకరణ ఏర్పాటు.	2 రోజులు ది: 15-02-2026 & 17-02-2026	రూ: 10,000/-
2.	టెండరు షెడ్యూల్ దాఖలా ప్రత్యేక బయో టాయిలెట్స్ ఏర్పాటు నిమిత్తం.	3 రోజులు ది:15-02-2026 నుండి ది: 17-02-2026	రూ: 5,000/-
3.	టెండరు షెడ్యూల్ దాఖలా ఫలహారములు మరియు భోజనాలు తయారు చేయు నిమిత్తం.	6 రోజులు ది:12-02-2026 నుండి ది: 17-02-2026	రూ: 5,000/-
4.	టెండరు షెడ్యూల్ దాఖలా ప్రత్యేక అలంకరణలు నిమిత్తం అవసరమైన పూల దండలు, పూల మాలలు, విడి పువ్వులు సప్లయి చేయు నిమిత్తం.	10 రోజులు ది:12-02-2026 నుండి ది:21-02-2026	రూ: 5,000/-
5.	టెండరు షెడ్యూల్ దాఖలా శానిటేషన్ సిబ్బందిని ఏర్పాటు చేయు నిమిత్తం.	10 రోజులు ది:12-02-2026 నుండి ది:21-02-2026	రూ. 5,000/-
6.	టెండరు షెడ్యూల్ దాఖలా దేవస్థానమునకు ప్రత్యేక విద్యుత్ అలంకరణ ఏర్పాటు చేయు నిమిత్తం.	10 రోజులు ది:12-02-2026 నుండి ది:21-02-2026	రూ: 10,000/-
7.	టెండరు షెడ్యూల్ దాఖలా దేవస్థానమునకు అవసరమైన షామియానాలు, వంట పాత్ర సామాగ్రి వగైరాలు సప్లయి చేయు నిమిత్తం.	10 రోజులు ది:12-02-2026 నుండి ది:21-02-2026	రూ: 10,000/-
8.	టెండరు షెడ్యూల్ దాఖలా నిర్దేశించిన ప్రదేశములలో మైక్ సెట్టు ఏర్పాటు చేయు నిమిత్తం.	10 రోజులు ది:12-02-2026 నుండి ది:21-02-2026	రూ: 5,000/-
9.	టెండరు షెడ్యూల్ దాఖలా వీడియె మరియు ఫొటోలు ఏర్పాటు నిమిత్తం.	10 రోజులు ది:12-02-2026 నుండి ది:21-02-2026	రూ. 5,000/-

శ్రీ స్వామి వారి సేవలో.......
శ్రీ రాజా వాసిరెడ్డి మురళి కృష్ణ ప్రసాద్
వంశ పారంపర్య ధర్మకర్త & ఛైర్మన్
అమరావతి, తేది: 27-01-2026

కె.రేఖ
సహాయ కమీషనరు
మరియు కార్యనిర్వహణాధికారి

ఈనాడు
పార్వతీపురం మన్యం
బుధవారం జనవరి 28, 2026

రేపు ఈనాడు జిల్లాస్థాయి ప్రతిభా పాటవ పోటీలు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయి జూనియర్ కళాశాలల ప్రతిభా పాటవ పోటీలకు రంగం సిద్ధమైంది. విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఏజీఎల్ డిగ్రీ కళాశాలలో గురువారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కానున్నాయి. గత నాలుగు నెలలుగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో వివిధ కేంద్రాల్లోని 16 కళాశాలల్లో వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాసం, క్విజ్ విభాగాల్లో కళాశాల స్థాయిలో(ప్రభుత్వ, ప్రైవేటు) పోటీలు జరిగాయి. ప్రతి నెలా ఒక్కో కళాశాల నుంచి నాలుగు విభాగాల్లో ముగ్గురు చొప్పున 12 మంది బహుమతులు అందుకుని జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. విజయనగరం, రాజాం, పాలకొండ, సాలూరు, పార్వతీపురం, బొబ్బిలి, గజపతినగరం కేంద్రాల్లోని 16 కళాశాలల నుంచి విద్యార్థులు సిద్ధమయ్యారు. గురువారం ఉదయం 9 గంటలకల్లా విద్యార్థులు వేదిక వద్దకు చేరుకోవాలి. పోటీల అనంతరం జిల్లా స్థాయి విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆ అమ్మాయి కేజీబీవీలో ఇంటర్ విద్యార్థిని..
కోర్సులో చేరిన తొలిరోజు నుంచే కష్టపడి చదివింది..
మరో రెండు రోజుల్లో ప్రయోగ పరీక్షలనగా..
అనారోగ్యంగా ఉందని అమ్మానాన్న ఇంటికి తీసుకొచ్చేశారు..
అయినా పట్టువీడలేదు.. మంగళవారం పరీక్షకు బయల్దేరింది..
ఆటో, బస్సు అందక.. ద్విచక్ర వాహనంపై వెళ్లే అవకాశం లేక..
సమయానికి కేంద్రానికి చేరుకోలేని నిస్సహాయ స్థితిలో
కష్టమంతా వృథా అయిందనే బాధలో ప్రాణం తీసుకోబోయింది.

చదువుల తల్లి.. ఎందుకీ పిచ్చిపని!

పార్వతీపురం పట్టణం, గ్రామీణం: ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించిన ఘటన పార్వతీపురం మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. ఇంటర్ వృత్తివిద్యా కోర్సు చదువుతున్న ఈమె సకాలంలో పరీక్షకు చేరుకోలేకపోయాననే వేదనతో ఎలుకల మందు తాగింది. కుటుంబీకులు అప్రమత్తమై జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

అవిశ్రాంత విధులు.. ఆగని పరుగు

● సంక్రాంతి పండగ అనంతరం రాజాం నుంచి విజయనగరానికి వస్తున్న బస్సులో చోదకుడు గురువులకు ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన బోల్తాపడింది. ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

● 2024లో పార్వతీపురం నుంచి కురుపాం వైపు 17 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్‌లో డ్రైవర్‌కు గుండెపోటు వచ్చింది. అప్రమత్తమై నందివానవలస వద్ద పక్కన నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

ఉమ్మడి జిల్లాలో ఇలాంటి ఘటనలు ఆందోళన రేపుతున్నాయి. పనిభారం, తీవ్ర ఒత్తిడి కారణంగా ఆర్టీసీ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. విధి నిర్వహణలో కొందరు.. ఇళ్ల వద్ద మరికొందరు మృతిచెందుతున్నారు. మన్యం జిల్లాలో గత ఏడాది(2025)లో వివిధ కారణాలతో 21 ఆర్టీసీ బస్సులు ప్రమాదాలకు గురయ్యాయి.

ఉద్యోగుల వివరాలు

డిపో	విధుల్లో సిబ్బంది
పార్వతీపురం	268
సాలూరు	204
పాలకొండ	255

ఆర్టీసీకి సిబ్బందికి తప్పని యాతన

న్యూస్‌టుడే, కొమరాడ

ఆర్టీసీలో సిబ్బంది కొరత ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న వారికి భారంగా మారింది. మన్యం జిల్లావ్యాప్తంగా 727 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. పని భారం.. మానసిక ఒత్తిడి.. వెరసి విధి నిర్వహణలో అనారోగ్యానికి గురవుతున్నారు. ఇది వారితో పాటు ప్రయాణికుల ప్రాణాల మీదకు తెస్తోంది.

మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత బస్సుల్లో రద్దీ పెరిగింది. 50 మంది పట్టే బస్సులో 150 మందికి పైగా ప్రయాణిస్తుండడంతో వాహన నియంత్రణ చోదకులకు కత్తిమీద సాముగా మారుతోంది.

విజయనగరం: విశ్రాంత గదిలో ఇదీ మంచాల తీరు

■ కిక్కిరిసిన బస్సుల్లో టికెట్లు ఇవ్వడం, ప్రయాణికుల వాగ్వాదాలు.. కండక్టర్లను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నాయి.

■ కొన్ని సందర్భాల్లో రోజుకు 12 నుంచి 15 గంటల పాటు పనిచేయాల్సిన పరిస్థితి. సరైన సమయానికి భోజనం లేకపోవడం, నిద్రలేమి కారణంగా పలువురు బీపీ, మధుమేహం, న్యుమోనియా, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్, వెన్నునొప్పి వంటి సమస్యల బారినపడుతున్నారు.

■ స్టీరింగ్ పట్టుకున్న స్థితిలోనే డ్రైవర్లు గుండెపోటుకు గురవుతున్నారు.

గదులే లేవు

పార్వతీపురం, సాలూరు, పాలకొండ డిపోల్లో ఎక్కడా విశ్రాంతి గదుల్లేక బస్సుల్లోనే నిద్రించాల్సిన దుస్థితి. దీంతో పలువురు నిద్రలేక అలసటకు గురవుతున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
- వెంకటేశ్వరరావు, ప్రజా రవాణా అధికారి

చదురుగుడిలో పోలమాంబ

సిరిమానోత్సవంలో భక్తులు

భక్తజనసిరి

అంబరాన్ని తాకిన శంబర ఉత్సవం

మక్కువ, సాలూరు, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత శంబర పోలమాంబ జాతరలో ప్రధాన ఘట్టమైన సిరిమాను సంబరం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం 3.45 గంటలకు ప్రధాన వీధిలోని సిరిమాను వద్దకు అమ్మవారి ఘటాలు చేరుకున్నాయి. సంప్రదాయంగా ఉత్సవ కమిటీ ఛైర్మన్ నైదాన తిరుపతిరావు, కమిటీ సభ్యులు, నాయుడు, కరణం కుటుంబ సభ్యులు పూజారిని మేళతాళాలతో సిరిమాను వద్దకు 4.10 గంటలకు తీసుకొచ్చారు. 4.30కు పూజారి భాస్కరరావు సిరిమాను అధిరోహించి ఉత్సవం ప్రారంభించారు. గిరిడ, నాయుడు, కరణం ఇళ్లకు సిరిమాను వెళ్లగా పూజలందించారు. భారీ సంఖ్యలో వనం, చదురుగుడులలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి సంధ్యారాణి, కుటుంబ సభ్యులు. చిత్రంలో ఎమ్మెల్యే జయకృష్ణ తదితరులు

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి

గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కుటుంబ సభ్యులతో కలిసి పోలమాంబకు పట్టువస్త్రాలు సమర్పించారు. కూటమి పాలనలో ప్రజలంతా సుఖ, సంతోషాలతో ఉండాలన్నారు. మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికిన అధికారులు అమ్మవారి చిత్రపటం, వస్త్రాలు అందించారు.

సిరిమానుకు మొక్కుతున్న కలెక్టర్, జేసీ, సబ్‌కలెక్టర్లు

అధికారుల పర్యవేక్షణ

కలెక్టర్ ప్రభాకరరెడ్డి, జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్లు వైశాలి, స్వప్నిల్ జగన్నాథ్ సంబరాన్ని పర్యవేక్షించారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఎస్పీ మాధవరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డ్రోన్, సీసీ కెమెరాలతో పర్యవేక్షించారు.


శ్రద్ధాంజలి
ప్రేమానురాగాలకు మారుపేరయిన మీరు మా నుండి భౌతికంగా దూరమైనారన్న నిజం నమ్మలేకున్నాము. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...
కీ॥శే॥ చప్ప రామారావు గారు
Rtd. డిప్యూటీ తహశీల్దార్
జననం: 20-07-1949 మరణం: 18-01-2026
తాళ్ళబురిడి, పార్వతీపురం
భార్య
స్వర్గీయ కనకరత్నం
కుమార్తెలు - అల్లుళ్లు
చప్ప ప్రభావతి - పెద్దింటి తిరుపతి
SA (Maths), ZPHS, పాచిపెంట SA (PS), ZPHS, తెర్లాం
చప్ప రామలక్ష్మి - గొట్టాపు వాసు
SGT, MPPS పెదిడి (HC) MEO-2, బొబ్బిలి
మనుమలు:
P. హరిసాయినాద్ B.Tech (IIT)
P. గాయత్రిచరణ్ (M.B.B.S)
B. జాజిప్రవళ్లిక Software Engg
B. పృధ్వి Sr. Manager, GAIL (India) Ltd.
పెద్దకర్మ: 28-01-2026 తాళ్ళబురిడిలో మా స్వగృహమునందు జరుపబడును

యువత జోష్..!

విద్యార్థినుల నృత్య ప్రదర్శన

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడి పశువైద్య కళాశాల మూడో వార్షికోత్సవం మంగళవారం రాత్రి సందడిగా జరిగింది. ముఖ్య అతిథిగా తిరుపతి శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం విద్యార్థి విభాగం డీన్ వి.వైకుంఠరావుతోపాటు కళాశాల అసోసియేట్ డీన్ ఎం.శ్రీను, గరివిడి కళాశాల విద్యార్థి విభాగం అధికారి వై.అంబేడ్కర్ పాల్గొన్నారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. 2024-25 విద్యా సంవత్సరంలో కళాశాల టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

వి.లక్ష్మునాయుడు

పార్వతీపురం, న్యూస్‌టుడే: పాఠశాలల్లో వినియోగదారుల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని యంత్రాంగం నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లా స్థాయిలో కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ప్రత్యేకంగా ఒక ఉపాధ్యాయుడికి నోడల్ అధికారిగా బాధ్యతలు అప్పగించింది. పౌరసరఫరాలు, వినియోగదారుల హక్కుల పరిరక్షణ శాఖ విద్యార్థి దశలోనే వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తులో ఆ చట్టాన్ని సక్రమంగా అమలుచేసే దిశగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. దీనిపై పాఠశాల విద్యాశాఖ చేసిన సూచన మేరకు చర్యలు తీసుకున్నారు. ప్రతి పాఠశాలలో వారంలో కనీసం ఒకసారి వినియోగదారుల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా ప్రణాళికను అమలు చేయాలని సూచించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా నోడల్ అధికారిగా పార్వతీపురం పట్టణంలోని కేపీఎం హైస్కూల్ సాంఘిక శాస్త్ర సహాయకుడు వి.లక్ష్మునాయుడిని నియమించినట్లు చెప్పారు. విద్యార్థుల్లో చైతన్యం కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని లక్ష్మునాయుడు తెలిపారు.

Dhanik Bharat Educational Institutions
— The Lloyd Group Initiative —
ధనిక్ భారత్ విద్యాసంస్థలు
INTER | IIT-JEE | NEET
HYDERABAD | VIJAYAWADA | GUNTUR | VIZAG
దశాబ్దాల తరబడి అభివృద్ధి చెందుతూ ఉన్న దేశంగానే మిగిలిపోతున్న భారతావనిని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనేదే ధనిక్ భారత్ మిషన్ యొక్క ఉద్దేశం. అందులో భాగమే ధనిక్ భారత్ విద్యాసంస్థల స్థాపన.
- విక్రం నారాయణరావు
చైర్మన్, ధనిక్ భారత్ విద్యాసంస్థలు.

Smt. Balalatha Mallavarapu
Director, Dhanik Bharat Educational Institutions
Former Deputy Director, Ministry of Defence,
Two Times Civils Ranker
9,10వ తరగతి విద్యార్థులకు బాలలత మేడం గారిని కలిసే గోల్డెన్ ఛాన్స్!
విద్యార్థులకు పదవ తరగతి తరువాత తమ కెరీర్‌ను ఎంపిక చేసుకునే ప్రస్థానంలో సందేహాలను నివృత్తి చెయ్యడానికి మీ ప్రాంతానికి వస్తున్న ధనిక్ భారత్ విద్యాసంస్థల డైరెక్టర్ బాలలత మేడం.
కెరీర్ గైడెన్స్ పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు...
ప్రతి విద్యార్థి తప్పక పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు...
29 జనవరి 2026 (అనగా రేపు)
విజయనగరం
సమయం: 9:30AM - 12:00PM
వేదిక: INSPIIRO SCHOOL, NEAR NCS THEATRE, VIZIANAGARAM.
శ్రీకాకుళం
సమయం: 5:00PM - 07:30PM
వేదిక: HOTEL BLUE EARTH, OPP FOREST OFFICE, SRIKAKULAM.
30 జనవరి 2026 (అనగా ఎల్లుండి)
పలాస
సమయం: 9:30AM - 12:00PM
వేదిక: SURYARAJ INN, K.T ROAD, PALASA-KASIBUGGA
పాతపట్నం
సమయం: 5:00PM - 07:30PM
వేదిక: K.S.M PLAZA (FUNCTION HALL) MAIN ROAD, PATHAPATNAM.
HYDERABAD 9555 82 5559 7032 30 5559
GUNTUR 9067 78 5559 9067 74 5559
VIJAYAWADA 9067 64 5559 9067 62 5559
VIZAG 9032 53 5559 9032 54 5559

(c) eenadu

ఆశల రబీ

రైతుల ఆసక్తితో పెరగనున్న విస్తీర్ణం

జిల్లాలోని రైతులు రబీ పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. సూర్యరశ్మి అధికంగా సోకడంతో చీడ పీడల బెడద తగ్గి ఖరీఫ్ కంటే ఇప్పుడే బాగా దిగుడులు వస్తాయన్న నమ్మకంతో మొగ్గు చూపుతున్నారు. సాధారణ విస్తీర్ణం 44,421 ఎకరాలు కాగా.. ఇప్పటివరకు 27,201 ఎకరాల్లో పంటలు వేశారు. ఈ ఏడాది అదనంగా సుమారు 2,500 ఎకరాల వరకు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

– న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

నాట్లు వేసేందుకు పొలం సిద్ధం చేస్తున్న రైతులు

రాయితీ విత్తనం.. కర్షకులకు వరం

వరి కోతల తర్వాత చాలా వరకు పొలాలను ఖాళీగా వదిలేయడంతో రైతులు అదనపు ఆదాయాన్ని కోల్పోతున్నారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం పప్పు ధాన్యాల సాగును ప్రోత్సహించి రాయితీపై విత్తనాలు అందజేసింది. మార్కెట్‌లో పప్పు ధాన్యాలకు గిరాకీ ఉండడంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు. గతంలో రాయితీ విత్తనాల పంపిణీ అంతంత మాత్రమే. కూటమి ప్రభుత్వం వీలైనంత ఎక్కువ మందికి ఇవ్వాలని సూచించింది. ఇందులో భాగంగా గిరిజన రైతులకు 90 శాతం, ఇతరులకు 35-50 శాతంతో అన్ని రకాలు కలిపి 1,148 క్వింటాళ్లు అందించారు. వేరుశనగ 548 క్వింటాళ్లు, మినుములు 392, పెసర 94, ఉలవలు 9, కట్టె జనుము 107, ఇంద్రావతి రకం రాగులు 8 క్వింటాళ్లు ఇప్పటికే పంపిణీ చేయడంతో చాలామంది సాగు పనులు ప్రారంభించారు.

సాగు ఇలా.. (ఎకరాల్లో)

పంట	సాధారణ విస్తీర్ణం	ఇప్పటి వరకు వేసింది
వరి	5,041	623
మొక్కజొన్న	14,419	14,579
అపరాలు	17,698	11,466
వేరుశనగ	467	262
నువ్వులు	7,350	00
కట్టెజనుము	2,000	1,965

పుష్కలంగా నీరు

ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో నదులు, కాలువలు, చెరువుల్లో నీరు ఉంది. బోరు బావుల్లో సైతం నీటి మట్టం ఆశాజనకంగా పెరిగింది. వీటి ఆధారంగా పంటలు సాగు చేపట్టారు. వరి సాధారణ విస్తీర్ణం 5,041 ఎకరాలు కాగా.. సాగునీటి వనరులు మెరుగుపడడంతో 6,500 వరకు సాగయ్యే అవకాశం ఉందని అంచనా.

సూచనలు పాటించాలి

ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సలహాలు పాటించి సాగులో ముందుకు సాగాలి. చీడపీడల నివారణపై దృష్టి సారిస్తే ఆశించిన మేర దిగుబడులు పొందవచ్చు. నువ్వుల సాగు ఫిబ్రవరి నుంచి చేపట్టనున్నారు. – ఆర్.అన్నపూర్ణ, జిల్లా వ్యవసాయాధికారిణి

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – తాడికొండ

బ్యాటర్ల జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET

Protein Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)

Hospitality Partner: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS

Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)

Man of the Series: Hero

Digital Partner: ఈనాడు.నెట్

TV Partner: ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్

Organised by: ఈనాడు క్రీడాతరంగ్ క్లబ్

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - 1 జూనియర్స్: మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ – రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్సలతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులకు చేతు ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించారు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - 1 జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సులతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

సీనియర్స్ విన్నర్స్ రాయలసీమ రాకర్స్

గ్రౌండ్-2లో సీనియర్స్ : సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ చరణ్ జిత్ ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-1 (జూనియర్స్)
మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)
మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

ప్రజల్లో అసంతృప్తి ఉండకూడదు

మాట్లాడుతున్న కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: రెవెన్యూ అంశాలపై ఐవీఆర్ఎస్ సర్వేలో ప్రజల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోందని కలెక్టర్ ఎస్. రాంసుందర్‌రెడ్డి పేర్కొన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా, క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. భూ యజమానులకు ఇబ్బందులు కలగకుండా, తప్పుల్లేని రెవెన్యూ రికార్డులను రూపొందించే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. జేసీ ఎస్. సేధు మాధవన్ మాట్లాడుతూ పాసు పుస్తకాల్లో వచ్చిన తప్పులను సరిదిద్దాలన్నారు. డీఆర్వో ఇ.మురళీ, ఆర్డీవో డి.కీర్తి, సర్వేశాఖ ఏడీ విజయకుమార్, విశ్రాంత ఉప కలెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రశంస

విద్యార్థినులు, ఉపాధ్యాయురాలిని అభినందిస్తున్న డీఈవో తదితరులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: దక్షిణ భారతదేశ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో సత్తా చాటిన విద్యార్థులు, ఉపాధ్యాయులను డీఈవో మాణిక్యం నాయుడు అభినందించారు. ఈనెల 19 నుంచి 23 వరకు తెలంగాణలో జరిగిన పోటీల్లో చీపురుపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు కె. లిఖిత స్వరాజ్, సీహెచ్.మనస్విని రూపొందించిన 'క్రాప్ డాక్టర్' ప్రాజెక్టు ద్వితీయ, కొట్టాం జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయిని పి.స్వప్న తయారు చేసిన 'హరిత ల్యాబ్' ప్రాజెక్టు తృతీయ స్థానం సాధించాయి. మంగళవారం నగరంలోని విద్యాశాఖ కార్యాలయంలో అధికారులు వారిని ప్రశంసించారు. ఉప విద్యాశాఖాధికారి కె.వి.రమణ, జిల్లా సైన్స్ అధికారి టి.రాజేష్ పాల్గొన్నారు.

అరకు ఉత్సవ్‌కు రారండోయ్

అరకులోయ, న్యూస్‌టుడే: చుట్టూ కొండలు.. ప్రకృతి సోయగాలే అరకుకు ఆకర్షణ. తెల్లవారు చలిదుప్పటి కప్పుకొనే అరకు చూడాలని ఎక్కడెక్కడి నుంచో పర్యాటకులు తరలివస్తారు. వారికి ఆహ్లాదంతోపాటు ఆనందం పంచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అలరించే సాంస్కృతిక కార్యక్రమాలు, ఉర్రూతలూగించే సాహస క్రీడలతో పర్యాటకులను ఆకట్టుకునేలా ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 1 వరకు అరకు ఉత్సవాలను నిర్వహిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం అధికారికంగా ఉత్సవాలను ప్రారంభించనున్నారు. ఉత్సవాలకు గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్‌తోపాటు మరో ఇద్దరు మంత్రులు కానున్నారు. అరకు ఉత్సవాల పోస్టర్‌ని కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దార్, డీఎస్పీ అభిషేక్ మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు.

సాహసికులూ సిద్ధం కండి

విశాఖ-అరకు ఘాట్ రహదారిపై గాలికొండ వ్యూపాయింట్ వద్ద ఔత్సాహికులతో ట్రెక్కింగ్‌ని ఈ నెల 30న ఏర్పాటు చేయనున్నారు.

❖ లోతేరు రహదారి నుంచి పద్మాపురం వరకు సైక్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నారు. 31న మారథాన్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొనదలచినవారి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

❖ హాట్ ఎయిర్ బెలూన్, పారా గ్లైడింగ్, పారా మోటరింగ్, హెలికాప్టర్ విహారాలు ఉంటాయి.

29 నుంచి నాలుగు రోజులపాటు సందడి

ప్రత్యేక ఆకర్షణలు

❖ 31న గాయని సునీతతో సంగీత విభావరి, ఒకటిన సంగీత దర్శకుడు తమన్ రాక
❖ ముగింపు కార్యక్రమంలో వివిధ రకాల డ్రోన్ల ప్రదర్శన ఉంటుంది.

సాంస్కృతిక సందడి

కార్నివాల్‌లో భాగంగా సుమారు 400 మంది కళాకారులు ప్రదర్శనలు ఇస్తున్నారు. మూడు రోజులపాటు ప్రతిరోజూ రాష్ట్రంలోని అన్ని గిరిజన ప్రాంతాల నుంచి వచ్చే కళాకారులతో గిరిజన సంప్రదాయ నృత్యాలు ఏర్పాటు చేస్తున్నారు. తప్పెటగుళ్లు, డప్పు వాద్యం, పులివేషాలు తదితరాలను ప్రదర్శిస్తారు.

★ పద్మాపురం ఉద్యానంలో ఫ్లవర్‌షో ఏర్పాటు చేయనున్నారు.

★ 30న హైదరాబాద్ నుంచి షహరీ బ్యాండ్ ప్రదర్శన ఉంటుంది.

సంప్రదాయాల పరిచయం

❖ దేశంలోని వివిధ గిరిజన ప్రాంతాల నుంచి వచ్చే హస్త కళాకారులతో స్టాళ్లు
❖ గిరిజన యువత ఫ్యాషన్ షో
❖ తిరుపతిలోని ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో గిరిజన వంటకాల తయారీపై అవగాహన కార్యక్రమం

పెరుమాళి సొసైటీపై మళ్లీ విచారణ?

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: తెర్లాం మండలం పెరుమాళి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పనితీరుపై మరోమారు విచారణ నిర్వహించనున్నారు. ఇప్పటికే కలెక్టర్ ఆదేశాల మేరకు సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్ డీఆర్వోకు సూచించినట్లు తెలుస్తోంది. ఆ సొసైటీలో పరిపాలనా పరమైన ఉల్లంఘనలు జరిగినట్లు పేర్కొంటున్నారు. గతంలో గ్రామానికి చెందిన సొసైటీ సభ్యుడు శివరామరాజు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. డివిజినల్ రిజిస్ట్రార్ క్షేత్రస్థాయికి వెళ్లి నివేదిక అందజేశారు. దీనిపై ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందక రీఓపెన్ చేశారు. పనితీరు బాగోకపోవడం, అర్హతగల సిబ్బంది లేరని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, లాభాలు వస్తున్నా సభ్యులకు డివిడెండ్లు ఇవ్వకపోవడం, పెట్రోల్ బంక్ నిర్వహణలో సిబ్బంది చేతివాటం.. తదితర అవకతవకలు ఉన్నట్లు అర్జీలో పేర్కొన్నారు.

❖ మంగళవారం స్థానిక సహకారశాఖ ఆడిట్ కార్యాలయంలో కమిటీ ఛైర్మన్, సీఈవో, సభ్యులు సమావేశమయ్యారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అభివృద్ధిపై చర్చించినట్లు జిల్లా సహకార అధికారి పి. రమేష్ తెలిపారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	270	280

ప్రశాంతంగా ప్రయోగ పరీక్షలు ప్రారంభం

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఇంటర్ మీడియట్ ప్రయోగ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలి విడతలో వృత్తి విద్యా కోర్సు విద్యార్థులకు నిర్వహిస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు బ్యాచ్‌లకు పరీక్ష జరిగింది. ఉదయం 24 పరీక్ష కేంద్రాల్లో 1,641 మందికి గాను 1,540 మంది, మధ్యాహ్నం 21 కేంద్రాల్లో 1,489 మందికి 1,433 మంది హాజరయ్యారు. సీసీ కెమెరాల నిఘాలో పక్కాగా పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకున్నట్లు డీఐఈవో నాగేశ్వరరావు తెలిపారు.

గడువు పెంపు

న్యాయవార్తా విభాగం: న్యాయసేవాధికార సంస్థలో ఖాళీల భర్తీకి ఇటీవల ప్రకటన విడుదలైంది. ఈనెల 27 వరకు దరఖాస్తులు ఆహ్వానించారు. వరుస సెలవుల నేపథ్యంలో 30 వరకు గడువు పెంచినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత తెలిపారు.

క్రమశిక్షణతో మెలగాలి

రేగిడి, వంగర, న్యూస్‌టుడే: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ అదనపు కార్యదర్శి సునీల్‌రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం రేగిడి మండలం ఉంగరాడ మెట్ట గురుకులాన్ని సందర్శించారు. ప్రభుత్వం ఏటా రూ.లక్షల్లో ఖర్చు చేస్తోందని, ఉన్నతంగా చదివి మంచి పేరు తీసుకురావాలన్నారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న తరుణంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వంటశాల పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ❖ అనంతరం వంగర మండలం మడ్డువలస అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న సునీల్‌రాజ్‌కుమార్

విడుదలయ్యాం.. వచ్చేస్తున్నాం..

బంగ్లాదేశ్‌లో చిక్కుకున్న మత్స్యకారులకు విముక్తి

భోగాపురం న్యూస్‌టుడే: జీవనోపాధికి సముద్రంలోకి వెళ్లి బంగ్లాదేశ్ చెరలో మూడు నెలలపాటు బిక్కుబిక్కుమంటూ గడిపిన జిల్లాకు చెందిన మత్స్యకారులకు ఎట్టకేలకు విముక్తి కలిగింది. బాగర్‌హాట్ జైలు నుంచి 23 మంది భారతీయ మత్స్యకారులు మంగళవారం విడుదలయ్యారు. వీరిలో విజయనగరం జిల్లాకు చెందిన తొమ్మిది మంది ఉన్నారు. ఇరుదేశాల ఉన్నతాధికారుల సమక్షంలో వారిని విడుదల చేశారు. దీనికి సంబంధించి న్యాయపరమైన డాక్యుమెంటేషన్ జిల్లా మేజిస్ట్రేట్ ఎదుట ఈస్ట్ కోస్ట్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఓనర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ పూర్తి చేశారు. అనంతరం భద్రత ఏర్పాట్ల మధ్య మత్స్యకారులను మోంగ్లా పోర్ట్‌కు తరలించారు. వీరి బోట్లు మరమ్మతులకు గురి కావడంతో బాగు చేసిన వెంటనే స్వదేశానికి పయనమవ్వనున్నారు. తమవారు తిరిగొస్తున్నారన్న వార్తతో తీరప్రాంత గ్రామాల్లో ఆనందం వెల్లివిరిసింది.

జైలు నుంచి విడుదలైన మత్స్యకారులు

మధ్యవర్తిత్వంతో త్వరితగతిన పరిష్కారం

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత

విజయనగరం న్యాయవార్తా విభాగం, న్యూస్‌టుడే: న్యాయస్థానాల పరిధిలో నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని, ఆ దిశగా వారికి న్యాయవాదులు అవగాహన కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత సూచించారు. విజయనగరంలోని జిల్లా న్యాయస్థానంలో మంగళవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులు వేగంగా పరిష్కారమవుతాయని చెప్పారు. నగదు, కాలాన్ని వృథా చేయకుండా ఇరువర్గాల వారు రాజీకి ముందుకు రావాలన్నారు. చెక్ బౌన్స్, ప్రమాద బీమా, పలు క్రిమినల్ కేసుల నుంచి బయటపడే అవకాశం ఉంటుందన్నారు. శిక్షకులు ఎ.ప్రమీల, ఎం.సిరాజ్ ప్రత్యేక సూచనలు చేశారు. న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

8న ప్రజ్ఞా వికాస పరీక్ష

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులకు భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 8న ప్రజ్ఞా వికాస పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ పేర్కొంది. నగరంలోని ఎల్‌బీజీ భవనంలో మంగళవారం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.చినబాబు, డి.రాము, సహాయ కార్యదర్శులు ఎస్.సోమేష్, వి.భారతి, బాలికల కన్వీనర్ ఆర్.శిరీష సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. వచ్చేనెల 3వ తేదీలోపు రూ.30 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

అధికారులపై అభియోగాల రద్దు

ఈనాడు, విజయనగరం: ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనుల్లో అయిదుగురు అధికారులు ఎదుర్కొన్న అభియోగాలను రద్దు చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో విజయనగరం ఎస్ఈ కె.కాంతిమతి, డీఈ ఎం.ఆనంద్(రిటైర్డ్), టెక్నికల్ అధికారి ఎ.వెంకటరామయ్య(విశ్రాంత), ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఎన్.మెహర్‌ప్రసాద్(విశ్రాంత), పే అండ్ అకౌంట్స్ అసిస్టెంట్ అధికారి ఎన్.నరేష్‌కుమార్(ప్రస్తుతం ఏలూరు) ఉన్నారు. భీమసింగి-ఎస్.కోట రోడ్డు విస్తరణకు 2009లో రూ.8 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టారు. ఇందులో అవకతవకలు జరిగాయని 2014-15లో విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. పనులకు అడ్డంకిగా ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ పైప్‌లైన్ తరలింపునకు రూ.2 లక్షలు అవుతుందని అప్పట్లో ప్రాథమిక అంచనా వేశారు. ప్రక్రియ పూర్తయ్యాక రూ.8 లక్షలు చెల్లించాలని కోరడంతో ఆ మేరకు విడుదలయ్యాయి. దీంతో అనుమానాలు రేకెత్తాయి. పదేళ్లుగా విచారణ సాగింది. దీనివల్ల పలువురు పదోన్నతులకు నోచుకోలేదు. అనుకూల నిర్ణయం వెలువడడంతో అధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పండగలా వచ్చాడు.. పుట్టెడు దుఃఖం మిగిల్చాడు

కిరణ్‌కుమార్ (పాతచిత్రం)

పార్వతీపురం, జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: అందరిలాగే సంక్రాంతికి సొంతూరు వచ్చాడు. ఆడుతూ, పాడుతూ గడిపాడు. పండగ సందడి ముగిసిన తర్వాత భార్యాబిడ్డలను వెంటపెట్టుకొని అత్తారింటికి వెళ్లాడు. వారంరోజులపాటు బంధువులు, మిత్రులతో ఆనందంగా గడిపి.. విధులకు వెళ్లాడు. అంతలోనే ఏమైందో ఏమో కానీ 25న ఆత్మహత్య చేసుకున్నాడు. జియ్యమ్మవలస మండలం కన్నపుదొరవలస గ్రామానికి చెందిన జి.కిరణ్‌కుమార్(41) బెంగళూరు విమానాశ్రయంలో సీఐఎస్ఎఫ్ హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఆదివారం ఎల్హంక రైల్వేస్టేషను సమీప పట్టాలపై బలవన్మరణానికి పాల్పడ్డారు. మంగళవారం ఉదయానికి ఆయన పార్థివదేహాన్ని స్వగ్రామం తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. రైతు గుంపస్వామి, విజయమ్మకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. ఇద్దరు కొడుకుల్ని చదివించి ప్రయోజకులను చేశారు. పెద్దకొడుకు గంగునాయుడు సీతానగరం మండలంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. చిన్నకొడుకు కిరణ్‌కుమార్ హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అతనికి బంధువుల అమ్మాయి పావనితో వివాహం చేశారు. వీరి పెద్ద బాబు యశ్వంత్‌నాయుడు పెద్దనాన్న వద్ద ఉంటూ పార్వతీపురంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. చిన్నకొడుకు సుస్విత్ నాయుడు బెంగళూరులోనే తల్లిదండ్రుల దగ్గర ఉంటూ ఒకటో తరగతి చదువుతున్నాడు. ఇలా సాఫీగా సాగిపోతున్న వీరి కుటుంబం కిరణ్‌కుమార్ ఆత్మహత్యతో శోకసంద్రమైంది.

సహ ఉద్యోగికి చెప్పి మరీ..

ఈనెల 13న సంక్రాంతి పండగకు కిరణ్‌కుమార్ కన్నపుదొరవలస వచ్చాడు. 15 వరకు గ్రామంలోనే ఉన్నారు. 16న పార్వతీపురం మండలం లక్ష్మీనారాయణపురంలోని అత్తవారింటికి భార్యాబిడ్డలతో వెళ్లి 21 వరకు ఉన్నారు. 22న బెంగళూరు చేరుకొని, 23న విమానాశ్రయంలో తిరిగి విధుల్లో చేరారు. 25న ఉదయం విధులకు వెళ్లి, మధ్యాహ్నానికి ఇంటికి చేరుకున్నారు. అంతలోనే ఒంట్లో నలతగా ఉందని, మూడురోజులు సిక్ లీవ్ పెట్టి వస్తానని చెప్పి వెళ్లారు. కాసేపటికి కార్యాలయంలో ఉద్యోగికి ఫోనుచేసి, తాను మరణిస్తున్నట్లు సమాచారం ఇచ్చినట్లు బంధువులు చెప్పారు. అంతలోనే రైలుపట్టాలపై పడి మృతిచెందారు.

EENADU e Classifieds

JOBS

Software Job Training in Vizianagaram Q: any Degree / BE / B.Tech / MCA / MSC / MBA any Year passout Cont: 7075909913.

1) Labourers (2) Production Operators (3) Maintenance Fitters (4) Sales- Executive (5) Office Clerk to work at AAC Bricks Factory, Bobbili Growth Centre. ✆ 6300568101.

HDFC ఫైనాన్షియల్ కన్సల్టెంట్స్ కావలెను. 10 to డిగ్రీ, జీతం: 15-30K, age: 25-55 y విజయనగరం జిల్లా అంతటా పనిచేయాలి. C:8919867018.

రైస్ మిల్ & ప్లాంట్ ఆపరేటర్స్ కావలెను. అనుభవజ్ఞులైన వెల్డింగ్, రిపేర్ తెలిసిన ఆపరేటర్స్ కావలెను. Contact No: ✆ 80962 46099.

VZM, ఆక్వాగార్డ్ షోరూంలో పనిచేయుటకు సిస్టం ఆపరేటర్ (F) కావలెను. సాయి వాటర్ సొల్యూషన్స్, M.G.రోడ్, 9AM-3PM & 3PM-9PM Cont: 9885980790

డెయిరీ ఫారంనందు పనిచేయుటకు అనుభవం కలిగిన భార్యాభర్త రెండు జంటలు కావలెను. ఇంటి సదుపాయం వసతి కల్పించబడును. Cont:94409 81322.

హేలాపురి ఫ్యామిలీ రెస్టారెంట్, RTC కాంప్లెక్స్‌దరి, VZMలో పనిచేయుటకు (పార్ట్‌టైం & ఫుల్‌టైం) వెయిటర్స్, కిచెన్ మేనేజర్, క్యాషియర్ కావలెను. ✆ 8978898343

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

ఈనాడు దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్లు) కొరకు సంప్రదించండి Cell: 80085 97609 ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి Cell: 80081 11237

(c) eenadu

ఇలాగేనా.. పారిశుద్ధ్య నిర్వహణ?

పాలకొండ పట్టణంలో అపారిశుద్ధ్యంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. కూడళ్లలో చెత్తను సకాలంలో తరలించకపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. ఇటీవల పాలకొండ వచ్చిన కలెక్టర్ ప్రభాకరరెడ్డి రెండు పూటలా చెత్తను తరలించాలని ఆదేశించినా, అమలు కావడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు. పరిశీలించి, చర్యలు తీసుకుంటామని పుర కమిషనర్ రత్నరాజ్ తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ

ఇలా.. వదిలేస్తారా?

సీతంపేట పీఎమ్మార్సీలో అధికారులు కుర్చీలు భద్రపరచకుండా వదిలేశారు. ఐటీడీఏ సమావేశ మందిరం కాక ముందు పీఎమ్మార్సీలో గ్రీవెన్స్‌తోపాటు, ఇతర సమావేశాలు జరిగేవి. అప్పట్లో వినియోగించిన ఇనుప కుర్చీలు, ఇతర సామగ్రి గదిలో పడేశారు. వాటిని ఉపయోగించకపోవడంతో తుప్పుపట్టి పూర్తిగా పాడవుతున్నాయి. వాటికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. వెంటనే పరిశీలిస్తామని ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు అన్నారు. – న్యూస్‌టుడే, సీతంపేట

సార్.. బోరుమంటున్నాయి

సుభద్ర పంచాయతీ పరిధి బడేవలస గ్రామంలో సుమారు 300 మంది ఉన్నారు. వీరికి తాగునీరు, ఇతర అవసరాల కోసం నాలుగు చేతిపంపులు ఏర్పాటు చేశారు. అయితే ఈ నాలుగు మరమ్మతులకు గురికావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బాగు చేయాలని మండల స్థాయి అధికారులకు తెలియజేసినప్పటికీ ఫలితం లేదని గ్రామ పెద్దలు గొంగాడ కృష్ణ, అప్పలనాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. మరమ్మతులు చేయిస్తామని పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. – న్యూస్‌టుడే, బలిజిపేట గ్రామీణం

కర్రల తడకే.. రక్షణ గేటు

సాలూరు మండలం కొత్తవలస పంచాయతీ గొందివలసలోని ప్రాథమిక పాఠశాల ఇది. ఇటీవల ప్రహరీ నిర్మించారు. కానీ ప్రధాన గేటును ఏర్పాటు చేయలేదు. దీంతో స్థానికులే ఇలా కర్రలు అడ్డుగా పెట్టారు. బడి ఆవరణలో కుక్కలు సంచరిస్తున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను నరేగా ఏపీఎం రామకృష్ణ వద్ద ప్రస్తావించగా.. బిల్లులు విడుదలైన వెంటనే పనులు చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

నిర్మించి.. పక్కన పెట్టారు

పెదబొండపల్లి, డీకేపట్నం పంచాయతీల్లో రైతు సేవా కేంద్రాల పనులు పూర్తయి రెండేళ్లు కావస్తోంది. విద్యుత్తు సరఫరా, మరుగుదొడ్ల వంటి చిన్నపాటి పనులు పూర్తిచేయక వినియోగానికి దూరంగా ఉంది. రంగులు వేసి సిద్ధం చేసిన భవనాన్ని ఏళ్లుగా వదిలేయడంతో పాడైపోతోంది. మరోపక్క సిబ్బంది అద్దె ఇళ్లలో సర్దుకుపోతున్నాయి. అధికారులతో చర్చించి, ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో కె.సత్యం చెప్పారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)	
పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? బుదురువాడ పంచాయతీ టేకులోవ కాలువల్లో చెత్త పేరుకుపోయింది. - **రాజయ్య** ● పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి, వెంటనే తొలగిస్తాం. - **పాపారావు, ఉప ఎంపీడీవో** –న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

? కురుపాం నుంచి రావాడ వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాలు పడేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. - **మిన్నారావు** ● చర్యలు చేపడతాం. - **సురేష్, పంచాయతీ ఈవో** – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

? పాలకొండ కార్గిల్ కూడలిలో ప్రయాణికులకు విశ్రాంతి భవనం లేదు - **జయలక్ష్మి** ● అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. –**మూర్తి**, డీఎం – న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

? మరిపివలస వసతి గృహం మురుగునీరు పరిసరాల్లోనే నిల్వ ఉంటోంది.- **వెంకటరమణ** ● చర్యలు తీసుకుంటాం. - **ప్రసాద్, ఎంపీడీవో** – న్యూస్‌టుడే, సీతానగరం

? పెదబొండపల్లి పంచాయతీ దిబ్బగుడ్డివలసలో అంగన్‌వాడీ కేంద్రానికి తలుపులు లేవు. - **అప్పలనర్సమ్మ** ● చర్యలు తీసుకుంటాం. - **రేఖారాణి, సీడీపీవో**

– న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

తాగునీటి వృథా అరికట్టారు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ వడమ కూడలిలో తాగునీటి వృథాకు ఎట్టకేలకు అడ్డుకట్ట పడింది. పైపు పగిలిపోవడంపై ఇటీవల 'ఈనాడు' 'మేమున్నాం..మీకు తోడుగా'లో వచ్చిన వార్తకు నగర పంచాయతీ అధికారులు స్పందించి సరి చేయించారు.

వీధి దీపాల ఏర్పాటు

స్పందనకు వందనం

సీతానగరం, న్యూస్‌టుడే: సీతానగరం ప్రధాన వీధి, కమలతోట పరిసరాల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజల ఇబ్బందులపై ఈనెల 11న 'ఈనాడు'లో వచ్చిన వార్తకు పంచాయతీ అధికారులు స్పందించారు. సర్పంచి తేరేజమ్మ ఆధ్వర్యంలో సుమారు 25 కొత్త దీపాలను అమర్చారు.

చెత్త తొలగింపు

పార్వతీపురం గ్రామీణం: నర్సిపురం రైల్వే స్టేషన్ సమీప ఖానా వద్ద కాలువలో పూడిక, చెత్త తొలగించారు. ఇక్కడ మురుగు నిలిచి, స్థానికుల ఇబ్బందిపై 'ఈనాడు'లో వచ్చిన కథనాలకు సర్పంచి బంగారమ్మ, కార్యదర్శి రామకృష్ణ స్పందించి.. పనులు చేయించారు.

పట్టించుకోరు.. పట్టుకోరు!

★ ఇటీవల పార్వతీపురం సంతలో కబేళాకు తరలించేందుకు ఆవుని సిద్ధం చేయగా.. అది అక్కడే దూడకు జన్మనిచ్చింది. అయినా వ్యాపారి కనికరం లేకుండా తల్లీబిడ్డను విడదీసి వాహనంలో తరలించేందుకు చూడగా స్థానిక యువకులు అడ్డుకున్నారు. అక్రమ రవాణా అని తేలడంతో అధికారులకు ఫిర్యాదు చేసినా.. చర్యలు లేవు.

కురుపాం సమీపంలో రాత్రి వేళ మూగజీవాల అక్రమ తరలింపు

యథేచ్ఛగా పశువుల అక్రమ రవాణా

చెక్ గేట్లు.. జిల్లాలు దాటించి వ్యాపారం

పశువుల అక్రమ రవాణాకు అంతు లేకుండా పోతోంది. నిబంధనలకు విరుద్ధంగా మన్యం జిల్లా నుంచి రోజుకు కనీసం 10 నుంచి 15 వాహనాలు సరిహద్దులు దాటుతున్నాయి. ముడుపుల అందజేత, పెద్దల ప్రమేయం ఉండటం, రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ఒకవేళ తప్పక పట్టుకున్నా.. జిల్లాస్థాయి అధికారుల నుంచి ఫోన్లు రావడంతో మిన్నకుండిపోతున్నారన్న విమర్శలున్నాయి. – న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, గ్రామీణం, గుమ్మలక్ష్మీపురం, కురుపాంగ్రామీణం

జిల్లాలో చిన్న, పెద్ద సంతలు 50 నుంచి 60 చోట్ల నిర్వహిస్తున్నారు. వీటిలో పశువుల విక్రయాలు 20 చోట్ల జరుగుతున్నాయి. పెద్ద సంతగా పార్వతీపురానికి గుర్తింపు ఉంది. అలాగే పక్కనే ఉన్న విజయనగరం జిల్లా మానాపురం సంత పశువుల విక్రయాలకు పేరున్నదే. ప్రతివారం జరిగే సంతల నుంచి అక్రమంగా వేలాది పశువులు కబేళాలకు తరలిపోతున్నాయి.

ఒడిశా నుంచి..

ఒడిశా సరిహద్దు నుంచి జిల్లా మీదుగా కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాలకు అక్రమంగా పశువులను తరలించడంలో పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారుతున్నాయి. వ్యాపారులు అన్నిస్థాయిల్లో ముడుపులు అందిస్తున్నారు. చెక్‌గేట్లు ఉన్నప్పటికీ.. పట్టుకోకుండా కొందరు.. పట్టుబడకుండా మరికొందరు ఏర్పాట్లు చేసుకొని వేరే మార్గాల్లో సునాయాసంగా గేట్లను దాటించి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ప్రధానంగా రాత్రుల్లో తంతు జరుగుతోంది. వాహనాల్లో కిక్కిరిసి ఎక్కించడంతో ఎన్నో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి.

లోపించిన సమన్వయం

పశుసంవర్ధక, పోలీసు శాఖల సమన్వయంతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి. కానీ వీరు కలిసి సాగిన దాఖలాలు లేవు. దీంతో ఈ అక్రమ వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్న చందంగా సాగుతోంది. తూతూమంత్రంగా ఒకటి, రెండు వాహనాలపై కేసులు నమోదు చేసి.. వందల వాహనాలను వదిలేస్తున్నారు.

జిల్లాలో.. నమోదైన కేసులు

సంవత్సరం	కేసులు
2022	13
2023	11
2024	42
2025	16

చర్యలు తీసుకుంటాం

పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేసి, పోలీసులకు అప్పగిస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. – మన్మథరావు, జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి

మా దారి.. రహదారి

ఆర్.వెంకంపేట ప్రధాన మార్గంలో ఏనుగులు

కరిరాజులు కంటిపై కునుకులేకుండా చేస్తున్నాయి. సోమవారం సీతానగరం మండలం గుమ్మిడివరం మీదుగా బొబ్బిలి మండలం రాజుపేట, సీతయ్యపేట, దిబ్బగూడవలస గ్రామ పరిసరాల్లో సంచరించిన ఏనుగులు మంగళవారం ఉదయం వెళ్లిన దారినే వెనుదిరిగాయి. ఆర్.వెంకంపేట ప్రధాన రహదారి గుండా కొండ పరిసరాలకు చేరాయి. ఈ మార్గంలో పొలాలకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ సిబ్బంది కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సీతానగరం

ఉచిత నేత్ర వైద్య శిబిరాలు

వీరఘట్టం, న్యూస్‌టుడే: వీరఘట్టం సత్యసాయి బాబా మందిరంలో మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 103 మందికి పరీక్షలు చేశారు. 58 మందిని శస్త్రచికిత్సకు పంపారు. నేత్ర వైద్య నిపుణుడు ఎస్.వివేకవర్ధన్, క్యాంప్ ఇన్‌ఛార్జి సీహెచ్ వెంకటరమణ ఉన్నారు. ★ కురుపాం గ్రామీణం: నేత్రాలయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రామకృష్ణ, కార్యదర్శి శశిపాండే సహకారంతో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల పరిధిలో నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. 35 మంది వృద్ధులకు శస్త్రచికిత్స అవసరమని గుర్తించి వాహనంలో ఆసుపత్రికి తరలించినట్లు జిల్లా నేత్రవైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి తెలిపారు.

వృద్ధురాలి కంటిని పరీక్షిస్తున్న వైద్యుడు

పోస్టుల భర్తీ పారదర్శకంగా చేపట్టాలి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలోని కేజీబీవీ పాఠశాలల్లో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ పారదర్శకంగా చేపట్టాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఖాళీ పోస్టుల భర్తీలో రిజర్వేషన్ ప్రకారం అర్హులకు అవకాశం కల్పించాలన్నారు. పోస్టుల భర్తీలో అవకతవకలు లేకుండా చూడాలని పేర్కొన్నారు.

వైభవం.. సిరిమానోత్సవం

తప్పిన అధికారుల అంచనా

పోలమాంబను దర్శించుకునేందుకు వెళ్తున్న విప్ జగదీశ్వరి

మక్కువ, సాలూరు, న్యూస్‌టుడే: శంబర పోలమాంబ సిరిమాను సంబరానికి అధికారుల అంచనాలు మించి భక్తులు హాజరయ్యారు. 2 లక్షల మందికిపైగా రాగా, 900 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆర్టీసీ 200 బస్సులు నడిపింది. మక్కువ దారులన్నీ భక్తులు, వాహనాలతో నిండాయి. క్యూలైన్లు, ఆరుబయట గంటల తరబడి భక్తులు ఎండలో వేచి ఉండాల్సి వచ్చింది. చిన్నారులకు పాలు, నీరు, ఉచిత ప్రసాదం అందించక పోవడంతో కలెక్టర్ సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. **ప్రముఖుల పూజలు..** అమ్మవారికి విప్ టి.జగదీశ్వరి, పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు రాజన్నదొర, శంబంగి వెంకట చిన్నప్పలనాయుడు, నాయకులు చిట్టి, పరమేశు తదితరులు పూజలు చేశారు. **వేడికి సొమ్మసిల్లిన భక్తులు..** టెంట్లు సరిపడా లేక ఎండలో నిల్చుని.. 13 మంది భక్తులు సొమ్మసిల్లారు. వీరిని పోలీసులు సమీపంలోని వైద్య శిబిరానికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారు. క్యూలైన్ల వద్ద కొంతమంది పోలీసులు చంటి పిల్లలతో వచ్చిన భక్తులతో దురుసుగా ప్రవర్తించడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఔట్‌గేట్ వద్ద పోలీసులు, భక్తుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. **ముత్యాలమ్మ పండగ..** మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్వగ్రామం కవిరపల్లిలో ముత్యాలమ్మ పండగ ఘనంగా నిర్వహించారు. మంత్రి అమ్మవారి ఘటాలను మోశారు. ఆపై అంజలి రథం తిప్పారు. ఆపై వీధుల్లో ఘటాలు ఊరేగించారు. **గరుగుబిల్లిలో..:** గరుగుబిల్లి: మరుపెంటలో చినశంబర పోలమ్మ జాతర జరిగింది. ప్రభుత్వ విప్ జగదీశ్వరి తల్లిని దర్శించుకున్నారు. సర్పంచి ఉరిటి నిర్మల, రామారావు దంపతులు తొలి పూజ చేశారు.

ప్రధాన వీధిలో ఘటాల ఊరేగింపు

క్రీడాకారులకు మంచి రోజులు

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: ఏజెన్సీలో ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నప్పటికీ.. సాధన చేసేందుకు సరైన మైదానం లేక మారుమూల పల్లెలకే పరిమితమవుతున్నారు. ఎల్విన్‌పేటలోని హెచ్ గ్రౌండు అభివృద్ధికి గతంలో రూ.2 కోట్లు మంజూరైనా వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పుడు కూటమి క్రీడలకు పెద్దపీట వేస్తూ.. మైదానం అభివృద్ధికి రూ.2.98 కోట్లు విడుదల చేసి, టెండర్లను ఆహ్వానించింది. మంజూరైన నిధులతో 400 మీటర్ల ట్రాకు, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ కోర్టులు, ఇండోర్ స్టేడియం పనులు పూర్తి చేయనున్నారు. దీంతో మరింత సాధన చేసి, క్రీడల్లో రాణించేందుకు అవకాశం ఉంటుందని గిరిజన క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తి అయితే పనులు ప్రారంభిస్తామని డీఎస్‌డీవో శ్రీధర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

చెట్టు పైనుంచి జారిపడి తీవ్ర గాయాలు

పార్వతీపురం పట్టణం, కొమరాడ, న్యూస్‌టుడే: చెట్టుపై నుంచి జారిపడటంతో వ్యక్తి గాయపడిన ఘటన కొమరాడ మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తుమరాడ గ్రామానికి చెందిన భాస్కరరావు కొమ్మలు కొట్టేందుకు చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడికి జిల్లా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

తారు ఊడుతోంది.. టైరు ఉండనంటోంది

పదమాయవలస రోడ్డు దుస్థితి..

రాళ్లు తేలిన అరసాడ రహదారి

బలిజిపేట మండలం అరసాడ, పదమాయవలస గ్రామాల నుంచి మండల కేంద్రానికి వెళ్లేందుకు నిర్మించిన తారు రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అరసాడ నుంచి మిర్తివలస కూడలి వరకు ఉన్న 4.6 కిలోమీటర్ల రహదారి పూర్తిగా తారు ఊడి.. రాళ్లు తేలిపోయింది. చోదకులు ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదమే. వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 5 కి.మీ మేర ఉన్న పదమాయవలస-వెంగాపురం మార్గం దుస్థితి ఇంతే. ప్రతిపాదనలు పంపుతామని అధికారులు చెబుతున్నారు. – న్యూస్‌టుడే, బలిజిపేట గ్రామీణం

ఆట స్థలంలో భవనం నిర్మించొద్దు

విద్యార్థుల నిరసన

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: గరుగుబిల్లి ఎంపీపీ పాఠశాలలో ఆటలు, ప్రార్థనకు ఉపయోగిస్తున్న స్థలంలో భవనం నిర్మించొద్దంటూ స్కూల్ కమిటీ ఛైర్మన్ టి.శంకరరావు విద్యార్థులతో కలిసి ఆందోళన చేపట్టారు. పాఠశాలలో ఎంఆర్సీ భవనం ఉండేది. అది శిథిలావస్థకు చేరడంతో తొలగించారు. ఆపై దాన్ని విద్యార్థుల ఆటపాటలకు వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరోచోట ఎంఆర్సీ భవనం నిర్మించాలని కోరుతున్నారు.

5 రోజుల పని దినాలు అమలు చేయాలి

పార్వతీపురం పట్టణం, పురపాలక, న్యూస్‌టుడే: వారానికి అయిదు రోజుల పని దినాలు అమలు చేయాలని బ్యాంకు ఉద్యోగులు డిమాండు చేశారు. మంగళవారం ఎస్‌బీఐ ప్రధాన శాఖ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను మూసేశారు. న్యాయమైన తమ సమస్యను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ప్రభుత్వరంగ బ్యాంకుల ఉద్యోగులు పాల్గొన్నారు. సమ్మె వల్ల బ్యాంకింగ్ సేవలకు అంతరాయం ఎదురైంది. నాలుగో శనివారం, ఆదివారం, సోమవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా బ్యాంకులు పని చేయలేదు. నాలుగో రోజు సమ్మెతో సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. ప్రధానంగా ఖాతాదారులు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.

బ్యాంకు ఉద్యోగుల ఆందోళన

నేడు విద్యుత్తుకు అంతరాయం

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ మండలం నవగాం విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఈఈ కె.విష్ణుమూర్తి తెలిపారు. నవగాం నుంచి జంపరకోట వరకు, అట్టలి, బెజ్జి, వాటపాగు, మంగళాపురం, అరదలి గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

నిలిచిన మంచినీటి సరఫరా

పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ నగర పంచాయతీ పరిధిలో రెండు ప్రధాన రక్షిత పథకాల నుంచి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. గోపాలపురం గ్రామ సమీపంలో రక్షిత పథకాలకు తాగునీటిని సరఫరా చేస్తున్న పైపులైన్లను మంగళవారం ఉదయం ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో పైపులు పగిలిపోయాయి. పట్టణంలోని 9, 10, 11, 12, 13, 14, 15, 16, 17, 18వ వార్డుల పరిధిలోని ప్రజలకు నీటి సరఫరా లేక అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం నగర పంచాయతీ సిబ్బంది మరమ్మతులు చేస్తున్నట్లు కమిషనర్ రత్నరాజ్ తెలిపారు.

పంట నష్టం పరిశీలన

సీతానగరం: గుమ్మిడివరం రెవెన్యూలో ఏనుగుల గుంపు ధ్వంసం చేసిన రైతు అప్పలనాయుడు మొక్కజొన్న పంటను ఏవో అవినాష్ పరిశీలించారు. నివేదికను డీఎఫ్‌వో ప్రసూనకు అందించనున్నట్లు చెప్పారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పెదపెంకి గ్రామంలో బోద వ్యాధి నిర్మూలనకు ప్రజలంతా పరిశుభ్రత పాటించాలని బలిజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి తెలిపారు. మంగళవారం గ్రామంలో అవగాహన కల్పించారు. ప్రధాన కాలువల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. సర్పంచి నగిరి పాపారావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్తు

మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో జ్ఞానప్రకాష్

సీతంపేట, న్యూస్‌టుడే: నైపుణ్యంతో కూడిన విద్యతోనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని డిప్యూటీ డీఈవో పి.నారాయుడు అన్నారు. సామరెల్లి బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో మాట్లాడారు. యూటీఎఫ్ సమకూర్చిన మోడల్ పేపర్స్‌ను విద్యార్థులకు అందజేశారు. హెచ్ఎం భాస్కరరావు, జీసీడీవో రాములమ్మ తదితరులు పాల్గొన్నారు. ● **జియ్యమ్మవలస:** ఆర్ఆర్‌బీపురం టీడబ్ల్యూ ఉన్నత పాఠశాలలో జరిగిన పది విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో గిరిజన సంక్షేమ డిప్యూటీ డీఈవో జ్ఞానప్రకాష్ పాల్గొన్నారు. గత ఏడాది మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఎంఈవో-2 శ్రీనివాసరావు, హెచ్ఎం ఎన్.తిరుపతిరావు, ఉపాధ్యాయులు ఉన్నారు. ● **పాలకొండ గ్రామీణం:** పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన పది విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. హెచ్ఎం డి.నాగభూషణరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

మోడల్ పేపర్స్‌తో సామరెల్లి పాఠశాల విద్యార్థులు

వ్యాప్తికి లేదు.. ప్రాప్తి

పాలకొండ, గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ పట్టణ ప్రధాన రహదారి విస్తరణ మరో మారు తెరపైకి వచ్చింది. దీనికి సంబంధించి పూర్తి నివేదికతో అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. ఇటీవల ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ రోడ్డు విస్తరణ ఆవశ్యకతను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకు వెళ్లిన సంగతి తెలిసిందే. దీంతో సీఎం పేషీ నుంచి విస్తరణపై సమగ్ర నివేదిక అందించాలని ఆర్అండ్‌బీ అధికారులకు ఆదేశాలు అందాయి. అధికారులు డీపీఆర్‌ను పంపారు.

రూ.17 కోట్లు అవసరం

ప్రస్తుత 60 అడుగుల విస్తీర్ణంలో ఉన్నప్పటికీ బీటీ రహదారి మాత్రం కేవలం 25 నుంచి 30 అడుగుల మేర మాత్రమే ఉంది. దీంతో 80 అడుగుల మేర విస్తరించేందుకు ప్రతిపాదనలు అందించారు. దీనికి రూ.17 కోట్లు వరకు అవసరమని నివేదికలో పొందుపర్చారు. ఈ మొత్తంతో రోడ్డు నిర్మాణం, విద్యుత్తు స్తంభాలు, ఇతర పనులు చేయనున్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా భవనాల తొలగింపు ప్రక్రియకు సంబంధించి అవసరమైన వారికి నిబంధనల మేరకు సహాయం అందించనున్నారు.

ప్రధాన రహదారిలో ట్రాఫిక్

చుట్టూ అభివృద్ధి

డివిజన్ కేంద్రమైన పాలకొండ పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందాయి. సమీపంలోని సీతంపేట ప్రధాన రహదారిని 4 లైన్లుగా ఇప్పటికే మార్పు చేశారు. వీరఘట్టం రోడ్డు సైతం విస్తరణకు నోచుకుంది. విజయనగరం జిల్లా రాజాం అభివృద్ధితో దూసుకుపోతోంది. పాలకొండకు మాత్రం ఆ పరిస్థితి లేదు. దీంతో రాకపోకలు సాగించే సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఈ మార్గం విస్తరణ కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం

పాలకొండ ప్రధాన రహదారికి సంబంధించి డీపీఆర్‌ను పంపాం. రూ.17 కోట్లు కావాలని నివేదించాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైతే.. విస్తరణకు చర్యలు తీసుకుంటాం.

–జగన్నాథం, డీఈ, ఆర్అండ్‌బీ

సమ్మెలో పాల్గొంటాం

పాలకొండ, న్యూస్‌టుడే: వచ్చే నెల 12న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటామని అంగన్‌వాడీ సంఘ జిల్లా అధ్యక్షురాలు బి.అమరవేణి పేర్కొన్నారు. ఈ మేరకు ఐసీడీఎస్ అధికారులకు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో శారద, జెస్సీ బాయి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: కురుపాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను మంగళవారం కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిశోర్‌చంద్రదేవ్ సందర్శించారు. ఇటీవల దాతల సహాయంతో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి ఉపాధ్యాయులు తెలిపారు. ఆపై కురుపాం గ్రామ దేవత శ్రీపైడిమారమ్మను దర్శించుకున్నారు. అనంతరం నూతన ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు.

అవార్డు గ్రహీతకు హార్దిక శుభాకాంక్షలు

బలిజిపేట మండల రైతుల శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తూ.. అధికారుల మన్ననలను పొందుతూ రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టరు గారి చేతుల మీదుగా ఉత్తమ అధికారి అవార్డు స్వీకరించిన మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు.

శ్రీ ఎస్. శివగణేష్ గారు
వ్యవసాయ అధికారి, బలిజిపేట మండలం

బలిజిపేట మండలంలోని ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారిక మందుల డీలర్లు, బలిజిపేట మండలం

(c) eenadu

పుంగనూరు పెయ్య.. భలే ఉందయ్యా

పుంగనూరు పెయ్యతో తల్లి ఆవు

మామిడికుదురు పరిధి కొర్లగుంట రోడ్డులోని రుద్రా శ్రీనివాసరావుకు చెందిన దేశవాళీ ఆవుకు రెండో ఈతలో మంగళవారం 20 అంగుళాల ఎత్తున్న తెల్లని పుంగనూరు పెయ్య దూడ పుట్టింది. గత ఏడాది జనవరిలో తొలి ఈతలో గిత్తదూడ పుట్టింది. తక్కువ ఎత్తు ఉండే ఈ జాతి ఆవులు అధిక పోషక విలువలున్న పాలను ఇస్తాయని, తక్కువ దాణా తీసుకోవడంతో పాటు ప్రశాంత స్వభావంతో ఉంటాయని మామిడికుదురు మండలం పశువైద్యాధికారి చేగొండి శ్రీరామ్ తెలిపారు. ఇంట్లో పెంచుకునేందుకు చాలామంది ఇష్టపడతారని వివరించారు. దేశవాళీ ఆవులకు బ్రీడింగ్ మార్పుతో పుంగనూరు ఆవులు పుడతాయన్నారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

నాలుగు నుంచి మూడో స్థానంలోకి

ఐవీఆర్ఎస్‌లో మెరుగుపడిన అన్నవరం

అన్నవరం: ఆలయాలకు వచ్చే భక్తులకు అందుతున్న సౌకర్యాలపై ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవీఆర్ఎస్ ద్వారా భక్తుల నుంచి అభిప్రాయ సేకరణలో అన్నవరం మూడో స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని ఏడు ప్రధాన దేవస్థానాల పరిధిలో నవంబరులో ఆరోస్థానం, డిసెంబరులో నాలుగో స్థానంలో ఉంది. ఈ నెల గణాంకాల్లో మూడో స్థానంలో నిలవగా మొదటి రెండు స్థానాల్లో ద్వారకాతిరుమల, శ్రీ కాళహస్తి ఆలయాలు నిలిచాయి.

ఇదీ లెక్క

విభాగం	సంతృప్తి	అసంతృప్తి	స్థానం
అన్ని సేవలపై సరాసరి	74.1	25.9	3
దర్శనం సంతృప్తికరంగా జరిగిందా	68.5	31.5	2
తాగునీటి సదుపాయం	71.4	28.6	3
ప్రసాదం తాజాగా, రుచిగా	82.3	17.7	3
పారిశుద్ధ్యం	66.9	33.1	6

మరింత మెరుగుపడాలి: ఏడు ప్రధాన దేవాలయాలతో పోల్చితే ర్యాంకింగ్ మెరుగుపడినా ఇంకా చక్కదిద్దాల్సినవి చాలా ఉన్నాయి. ప్రసాదం రుచి, తాజా విషయంలో భక్తుల నుంచి సంతృప్తి శాతం గత నెలతో పోల్చితే మెరుగుపడింది. తాగునీటి సరఫరా మెరుగుపడింది. దర్శనం భక్తులకు సంతృప్తికరంగా జరిగేలా ప్రణాళిక చేయాలి.

హలో లోకేశ్ పేరిట మమేకం

జేఎన్టీయూకేలో విద్యార్థులతో ముఖాముఖికి ఏర్పాట్లు

ఈనాడు, కాకినాడ: కాకినాడ జేఎన్టీయూలో ఈ నెల 30న విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ పర్యటనకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. రూసా నిధులతో నిర్మించిన పీజీ విద్యార్థుల వసతి గృహాన్ని మంత్రి ప్రారంభించనున్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులను పరిశీలించి వారితో ఆలోచనలు పంచుకోనున్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో హలో.. లోకేశ్ పేరిట క్యాంపస్ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. ఈ మేరకు వీసీ ఛాంబర్ ఎదురుగా ఖాళీ స్థలంలో జర్మన్ హంగర్ టెంట్‌తో భారీ వేదికను సిద్ధం చేస్తున్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణానికి సొబగులు అద్దుతున్నారు. క్యాంపస్ ఆవరణలో పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. అసంపూర్తిగా నిలిచిన కల్వర్టు, కాలువల పనులను పట్టాలెక్కిస్తున్నారు.

తీరనున్న వసతి సమస్య..

జేఎన్టీయూలో ఏటా వేల మంది విద్యార్థులు బీటెక్, ఎంటెక్‌లోని వివిధ కోర్సుల్లో చేరుతున్నారు. వీరికి సరిపడా వసతి సౌకర్యం విశ్వవిద్యాలయంలో లేకపోవడంతో విద్యార్థులు బయటే గదులు అద్దెకు తీసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. నాలుగేళ్ల కింద రూసా పథకంలో సుమారు రూ.10 కోట్లతో పీజీ విద్యార్థులకు వసతిగృహం మంజూరు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో ఈ నిధులను సమకూర్చాలి. కేంద్రం ఇచ్చినా అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం సొమ్ము ఇవ్వకపోవడంతో ఈ భవన నిర్మాణంలో జాప్యం జరిగింది. కూటమి

ఆలోచనల శుభారంభం.. ఆచరణతోనే అమృతఫలం

రంపచోడవరం, న్యూస్‌టుడే

పోలవరం జిల్లా ఏర్పాటుతో ప్రధాన కేంద్రమైన రంపచోడవరం అభివృద్ధి కానుంది. ఆ దిశగా కసరత్తు ప్రారంభమైంది. తొలుత కార్యాలయాలు, రహదారుల విస్తరణ, రవాణాపై దృష్టి సారించారు. ఆలోచనలను పక్కాగా అమలు చేస్తే ఏళ్ల నాటికి సమస్యలకు పరిష్కారం లభించనుంది. కొత్త వసతులు సమకూరే అవకాశం ఉంటుంది.

రహదారులు బాగుంటే బస్సులు..

లోతట్టు ప్రాంతాల గిరిజనులు రంపచోడవరం వచ్చేందుకు వాహన సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో గోకవరం డిపో నుంచి అధిక సంఖ్యలో బస్సులు తిరిగేవి. రహదారులు దెబ్బతిని రాళ్లు తేలిపోవడంతో కొన్ని సర్వీసులను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో ప్రాధాన్యాల ప్రకారం రోడ్లు బాగు చేయనున్నారు. ఏలేశ్వరం, నర్సీపట్నం, పాడేరు డిపోల నుంచి వివిధ సమయాల్లో సర్వీసులు తిప్పేలా కలెక్టర్ దినేష్‌కుమార్ చర్యలు చేపట్టారు.

కొత్త కార్యాలయాలు..

కలెక్టరేట్, ఎస్పీ ఇతర ప్రభుత్వ శాఖలకు పక్కా కార్యాలయాలు నిర్మించనున్నారు. వీటికోసం జేసీ స్మరణ్‌రాజ్ మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ విభాగాలను ఏర్పాటు చేసేందుకు స్థానిక పీఎంఆర్‌సీని పరిశీలించారు. భవనాల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పనపై ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. ఆ మేరకు అంచనాలు రూపొందిస్తున్నారు. ఈ వారంలో కొత్త కలెక్టర్ వచ్చే అవకాశం ఉండటంతో పూర్తి వసతులకు జేసీ, ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు.

వివిధ శాఖల కార్యాలయాల ఏర్పాటుకు సిద్ధమవుతున్న వైటీసీ కార్యాలయం

జిల్లా ప్రధాన కేంద్రంలో..

జిల్లా ప్రధాన కేంద్రమైన రంపచోడవరంలో అంబేడ్కర్ కూడలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, ఏరియా ఆసుపత్రి మీదుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు ఉన్న రహదారిని విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ రహదారిలో యూనియన్ బ్యాంకు, ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలతో పాటు ఏరియా ఆసుపత్రి, ఆహారశాలలు ఉన్నాయి. రద్దీ పెరుగుతున్న క్రమంలో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని రహదారిని విస్తరణతో పాటు విభాగినిని ఏర్పాటు చేయనున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు తొలగుతాయి.

విస్తరణ కానున్న అంబేడ్కర్ కూడలి-ప్రభుత్వ డిగ్రీ కళాశాల రోడ్డు

ప్రధాన ప్రాంతాల్లో సులభ్ కాంప్లెక్స్‌లు..

జిల్లాలో 12 మండలాల నుంచి వివిధ సమస్యలపై కలెక్టరేట్, ఎస్పీ, ఐటీడీఏ పీవో, సబ్‌కలెక్టర్, ఏఎస్పీ కార్యాలయాలు, ఏరియా ఆసుపత్రికి ప్రజలు వస్తారు. వీరితో పాటు దూరప్రాంతాల నుంచి వివిధ పనులపై రోజూ 1,000 నుంచి 1,500 మంది రాకపోకలు సాగిస్తారు. అత్యవసరానికి సులభ్ కాంప్లెక్స్‌లు వంటివి లేకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

గండిపోశమ్మ దర్శనాలకు ఏర్పాట్లు

దేవీపట్నం: ఎట్టకేలకు గోదావరి ఒడ్డున గండిపోశమ్మ అమ్మవారి దర్శనాలకు జోరుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. గోదావరి వరదల నేపథ్యంలో గత జులై 3న అమ్మవారి ఆలయం పూర్తిగా ముంపునకు గురవ్వడంతో అమ్మవారి దర్శనాలను ఆలయాధికారులు పూర్తిగా నిలిపేశారు. ప్రస్తుతం గోదావరిలో వరద శాంతించడంతో మంగళవారం నుంచి ఆలయం శుభ్రం పనులు జోరందుకున్నాయి. గుడి పరిసరాలతో పాటు వరదలకు కొట్టుకొచ్చిన చెత్తను తొలగిస్తున్నామని సిబ్బంది తెలిపారు. గోదావరి ఘాట్ నుంచి ఆలయం వరకు భక్తులు నడిచివెళ్లేలా మట్టి వేయిస్తున్నామన్నారు. మరో నాలుగు రోజుల్లో అమ్మవారి దర్శనాలు ప్రారంభమయ్యేలా సన్నాహాలు చేస్తున్నారు. ఏటా జనవరి నుంచి జూన్ వరకు రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి, మొక్కులు చెల్లించుకుంటారు.

తగ్గిన గోదావరి ఉద్ధృతి

సీతపల్లి వాగులో గోదావరి ఉద్ధృతి తగ్గడంతో గిరిజనులు రాకపోకలు సాగిస్తున్నారు. ఇందుకూరుపేటకు పనులపై వెళ్లడానికి గతంలో వి.రామన్నపాలెం, చొప్పకొండ, పాముగండి, డి.ఎన్.పాలెం పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల గిరిజనులు రంపచోడవరం మీదుగా గోకవరం నుంచి ఇందుకూరుపేట వెళ్లేవారు. ప్రస్తుతం ప్రవాహం తగ్గడంతో సీతపల్లి వాగులో సీతారం పరిసరాల నుంచి ద్విచక్రవాహనాలు, ఆటోల్లో ప్రయాణిస్తున్నారు.

దివ్యధామం.. అవని తేజం

నేడే లక్ష్మీనృసింహుని కల్యాణోత్సవం

హనుమద్వాహనంపై స్వామివారి గ్రామోత్సవం

న్యూస్‌టుడే, అంతర్వేది, మామిడికుదురు

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం విశేషార్చనలు అత్యంత వేడుకగా జరిగాయి. హనుమద్వాహనం, సింహ వాహనాలపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చి భక్తజనం గోవింద నామస్మరణల నడుమ పుర వీధుల్లో ఆధ్యాత్మిక కోలాహలంతో ఊరేగించారు. భక్తులకు అభయ ప్రదానం చేస్తూ కదలివచ్చిన దేవదేవుడి మంగళ మూర్తులను భక్తిపారవశ్యంతో అంతా దర్శించుకున్నారు. అంతకుముందు ఆలయ ప్రాంగణంలో వేదపఠనంతో జరిగిన శ్రీనారసింహ సుదర్శన యాగంలో అనేకమంది దంపతులు పాల్గొన్నారు. తీర్థ స్థలిలో పలు దుకాణాలు ఏర్పాటు కావడంతో సందడి నెలకొంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆవరణంతా కళకళలాడింది.

అంతర్వేదిలో విద్యుద్దీపాలంకరణలో ఆలయ శోభ

నేటి వేడుకకు ఏర్పాట్లు

స్వామివారి దివ్య కల్యాణోత్సవాన్ని బుధవారం రాత్రి 1.56 గంటలకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. కల్యాణ వేదిక చుట్టూ పటిష్ఠంగా రక్షణ వలయాన్ని ఏర్పాటు చేశారు. ఉత్సవాన్ని వీక్షించేందుకు ప్రత్యేక విభాగాలు సిద్ధమయ్యాయి. కల్యాణ ఘట్టాలను చూసేలా ఎల్ఈడీ తెరలను అమర్చారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు 50 సీసీ కెమెరాలు, ప్రత్యేక కంట్రోలు వ్యవస్థ ఏర్పాటయ్యాయి. స్వామివారి దర్శనాలకు సంబంధించి ప్రత్యేకంగా క్యూలైన్లు సిద్ధం చేశారు.

రైతేరాజు
అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం -6లో

ఎంతపని చేశావు నాన్న..?

★ విషాహారం తిని తండ్రి మృతి ★ నలుగురు కుమార్తెలకు అస్వస్థత

మద్యం మత్తులో నిన్ను నువ్వు మర్చిపోయావు..
అందరూ తినే అన్నంలో పిట్టల మందు కలిపావు..
తెలిసో.. తెలియకో నువ్వు తినేశావు..
పిల్లలం కదా ఆకలిగా ఉందని మేం కూడా తినేశాం..
ఇంతలోనే నువ్వు మాకు దూరమయ్యావు..
బొజ్జంతా నొప్పి.. నీరసంతో ఆసుపత్రి పాలయ్యాం..
నువ్వు లేక.. ఇల్లంతా బోసిపోయింది నాన్న..

కోసయ్య (పాతచిత్రం)

చింతూరు, న్యూస్‌టుడే: అతను మద్యం మత్తులో.. ఆహారంలో పిట్టల మందు కలిపాడు. దాన్ని తిని మృత్యువాత పడ్డాడు. విషయం తెలియక అదే ఆహారాన్ని తిని ఆరుగురు అస్వస్థతకు గురయ్యారు. ఈ విషాదకర ఘటన చింతూరు మండలం ఇర్కంపేటలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మడకం కోసయ్య(45)కు భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు. పోడు వ్యవసాయం, చిన్న చిన్న పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కొన్ని రోజులుగా మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తున్నారు. సోమవారం రాత్రి మద్యం తాగి ఇంటికొచ్చాడు. భార్య, పిల్లలపై అరుస్తూ ఇంట్లో నుంచి బయటకు పంపించేశాడు. అప్పటికే వండిన ఆహారంలో పిట్టల మందు కలిపి తిన్నాడు. అస్వస్థతకు గురవడంతో భార్య ఏడుగురాళ్లపల్లి పీహెచ్‌సీకి తరలించింది. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

కోసయ్య కుమార్తెలు

తెలియక అదే ఆహారం తిని ఆరుగురు ఆసుపత్రిపాలు..

కోసయ్యను ఆసుపత్రికి తరలించగా, ఇంట్లో పిల్లలు (మరియమ్మ, స్వప్న, మాధురి, సంజన)కు సాయంగా మృతుడి చెల్లి ఐతమ్మ, ఆమె కుమార్తె లక్ష్మిని ఉంచారు. రాత్రి అవ్వడంతో పిల్లలు ఆకలిగా ఉందని చెప్పడంతో మందు కలిపిన ఆహారాన్ని తెలియక వీరంతా తిన్నారు. ఉదయానికి వీరంతా అస్వస్థతకు గురవ్వడంతో ఏడుగురాళ్లపల్లి పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కోసయ్య మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీనిపై చింతూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆ పంటలపై అనాసక్తి వాణిజ్య సాగుపైనే ఆసక్తి

మన్యంలో పెరుగుతున్న మిర్చి, లంకపొగాకు, మొక్కజన్న

● గతంలో కూనవరం మండలంలో వరి, పప్పుదినుసులు కలిపి దాదాపు 5వేల ఎకరాల్లో పండించేవారు. ఇప్పుడు కేవలం 3వేల ఎకరాలకే పరిమితమైంది. మిర్చి, లంకపొగాకు, మొక్కజొన్న పంటల సాగు పెరిగింది. గతంలో కంటే రెట్టింపుగా దాదాపు 6వేల ఎకరాల్లో పండిస్తున్నారు. మిగిలిన మండలాల్లోనూ ఇదే పరిస్థితి.

కూనవరం, న్యూస్‌టుడే: ఒకప్పుడు మన్యంలో ఎటు చూసినా సంప్రదాయ పంటల సాగే కనిపించేది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి ఆఖరు వరకు వరి, మినుము, పెసర, కందులు, రాగులు, నువ్వులు వేసేవారు. ఏ గ్రామం వెళ్లినా ఈ పంటలు నిండుగా కనిపించేవి. మారిన గ్రామీణుల ఆర్థిక స్థితిగతులు, సాగుపై పెరిగిన అవగాహనలతో ఇందులో మార్పులు వచ్చాయి. లాభాలు అంతగా లేని సంప్రదాయ సాగులను వదిలి వాణిజ్య పంటలపై దృష్టి పెట్టారు.

పదేళ్లలో తగ్గిన పంటలు..

జిల్లాలో ఖరీఫ్, రబీ కలిపి సుమారు 90వేలకు పైగా ఎకరాల్లో వివిధ రకాల పంటలు పండిస్తున్నారు. పదేళ్ల క్రితం వరకు వరి, పప్పు దినుసుల పంటలే అధికంగా ఉండేవి. తరచూ నష్టాలు రావడంతో ఆసక్తి తగ్గింది.

జగ్గవరం సమీపంలో మొక్కజొన్న సాగు

పెద్దగా పెట్టుబడి అవసరం లేని కంది, పెసర, మినుము, రాగులు, నువ్వులు, బొబ్బర్లు వంటి పంటలు మారిన వాతావరణ పరిస్థితులను తట్టుకోలేక తెగుళ్ల బారిన పడి దిగుబడి గణనీయంగా తగ్గింది. వీటికి తోడు ఇటీవల పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావం, అధిక వర్షాలతో పంటలు వేయడం రెండు నెలలు ఆలస్యం అవుతోంది. దీంతో కర్షకులు ప్రత్యామ్నాయాల వైపు మళ్లారు.

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా

మారుతున్న అవసరాలకు అనుగుణంగా గిరిజన రైతులు వివిధరకాల వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకుంటున్నారు. అధికారుల సూచనలతో కొత్త పంటలు, యాజమాన్య పద్ధతులను తెలుసుకున్నారు. ఇదే సమయంలో చిన్న, సన్నకారు రైతుల ఆర్థిక పరిస్థితి కొంత మెరుగవ్వడంతో వాణిజ్య సాగులపై దృష్టి పెట్టారు. ప్రధానంగా మిర్చి, లంకపొగాకు, మొక్కజొన్న వేస్తున్నారు.

అవగాహన పెరిగింది..

గతంతో పోల్చితే సాగు విధానాలపై రైతులకు అవగాహన పెరిగింది. వరదలు, వర్షాలు కారణంగా ఖరీఫ్‌లో పంటలు వేయడం సాధ్యం కాకపోవడంతో వాణిజ్య పంటలకు మారుతున్నారు. సంప్రదాయ సాగుల్లో లాభాలు తక్కువగా ఉండడం మరో కారణం. ఇక్కడ వ్యవసాయం వర్షాధారం కావడంతో పంటలకు తడులు పెట్టుకునే అవకాశం లేక కొందరు సాగు చేయడం లేదు. – సీహెచ్.దేవి, ఏవో, కూనవరం

పనులు అడ్డుకుంటున్నారని ఆవేదన

రంపచోడవరం: తమకు కేటాయించిన ఇళ్ల స్థలాలను గుత్తేదారుడు అభివృద్ధి చేస్తుంటే కొంత మంది ఆటంకం కలిగిస్తున్నారని కృష్ణునిపాలెం పునరావాసకాలనీ వాసులు జేసీ స్మరణ్‌రాజ్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. పోలవరం ప్రాజెక్టులో ముంపునకు గురైన దేవీపట్నం మండలంలో 18 గ్రామాలకు చెందిన గిరిజనేతర నిర్వాసితులకు గోకవరం మండలం కృష్ణునిపాలెం పునరావాసకాలనీలో పునరావాసం కల్పించారన్నారు. అర్హులైన 85 మందికి అదే కాలనీలో ఇంటి పట్టాలు మంజూరు చేసి, ప్యాకేజీ సొమ్ముతో పాటు ఇంటి నిర్మాణానికి కూడా డబ్బులు ఇచ్చారన్నారు. డ్రెయిన్లు, మరుగుదొడ్లు, విద్యుత్తు సౌకర్యం, సీసీ రోడ్లకు ప్రభుత్వం రూ.6.50కోట్లు మంజూరు చేసిందన్నారు. కొంతమంది స్థానికులు పనులు అడ్డుకోవడంతో గుత్తేదారుడు పనులు నిలిపేశారన్నారు. తమకు రక్షణ కల్పించి, పనులు సజావుగా జరిగేలా చూడాలని కోరారు. కలిసిన వారిలో ఉండమట్ల వెంకటరత్నం, తొట్టా భాస్కరరావు, సిద్దా గంగాధర్, అల్లూరి వెంటక సత్యనారాయణరెడ్డి, కొడవటి వెంకటేశ్వరరావు, పోసియ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక వాహనాలకు అనుమతి తప్పనిసరి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మన్యంలోని పర్యాటక ప్రదేశాలకు సందర్శకులను తరలించే ప్రైవేటు ట్రావెల్స్ వాహనాలకు అనుమతులు ఉండాలని జిల్లా రవాణాశాఖ అధికారి ఆర్.రాజేశ్‌కుమార్ సూచించారు. మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సొంత వాహనాల్లో తరలిస్తూ వ్యాపారం చేస్తే చర్యలు తప్పవన్నారు. మారేడుమిల్లి మండలంలోని పుల్లంగి పంచాయతీ 'గుడిస', చావడికోట కొండలపైకి అనుమతి లేని వాహనాల్లో పర్యాటకులను తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అన్ని ట్రావెల్స్ వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు, డ్రైవర్ల లైసెన్సులు రెండు రోజుల్లో తమ కార్యాలయంలో అందజేయాలన్నారు. అన్ని శాఖలు సంయుక్తంగా నిర్ణయించిన ధరలకే నడపాలని, లేదంటే స్వాధీనం చేసుకుంటామన్నారు.

ఆడండోయ్.. పాడండోయ్..

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చదువుకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అందులో భాగంగానే అంగన్‌వాడీల బలోపేతం చేస్తున్నారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్‌గా మార్పు చేశారు. టీవీ పాఠాలు ప్రారంభించారు. పిల్లలకు ప్రాథమిక చికిత్స కోసం వైద్య కిట్లు ఇస్తున్నారు. తాజాగా కొత్త ఆట వస్తువులు సరఫరా చేస్తున్నారు. జిల్లాలో 8 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 1,024 అంగన్‌వాడీ కేంద్రాలుండగా వీటిలో 4,684 మంది ప్రీ స్కూల్ పిల్లలు ఉన్నారు.


రాజవొమ్మంగి అంగన్‌వాడీలో పిల్లలను ఆడిస్తున్న సిబ్బంది

ఇవీ ప్రయోజనాలు..

■ ఇందులో వివిధ రకాల పుస్తకాలు, బొమ్మలు, చార్టులు ఆట వస్తువులు ఉంటాయి. ■ రంగులను గుర్తించడం, చిత్రాలు గీయడం, వంటివి నేర్పిస్తారు. ■ తెలుగు, ఆంగ్ల అక్షరాలు, అంకెలు ఆటపాటలతో చెబుతారు. ■ పిల్లల్లో సృజన ప్రోత్సహించేలా, మేధోవికాసం కలిగించేలా, లెక్కలు సులువుగా నేర్చుకునేలా బోధిస్తారు. ■ డప్పులు, రింగులు వంటి వాటితో ఆడించడంతో వ్యాయామం చేసినట్లే.

జిల్లాకు చేరిన కిట్ల సంఖ్య

ప్రాజెక్టు	కిట్లు
రంపచోడవరం	156
రాజవొమ్మంగి	103
అడ్డతీగల	132
గంగవరం	55
మారేడుమిల్లి	107
చింతూరు	147
ఎటపాక	112
కూనవరం	173

ఒక్కో కిట్‌లో 11 రకాల ఆటసామగ్రి..

జిల్లాలో అన్ని కేంద్రాలకు కిట్‌లు అందజేశాం. ఒక్కోదాంట్లో 11 రకాల ఆట వస్తువులు ఉంటాయి. వీటితో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను బోధిస్తారు. వీటితో ఆడుకునేందుకు పిల్లలు రోజూ కేంద్రాలకు వచ్చేందుకు మక్కువ చూపిస్తారు. విద్యార్థుల గైర్హాజరు సంఖ్య తగ్గుతుంది. -ఝాన్సీ రాం పడాల్. పీడీ, ఐసీడీఎస్

సీలేరులో పనులు చకచకా.. పురస్కారాల పండగ

మోతుగూడెం, న్యూస్‌టుడే: సీలేరు విద్యుత్తు కాంప్లెక్స్ పరిధిలోని పొల్లూరు, డొంకరాయి, మాచ్‌ఖండ్ జల విద్యుత్తు కేంద్రాలకు అవార్డులు లభించాయి. డొంకరాయి (16 కి.మీ)పవర్ కెనాల్ పనులు నిర్దేశిత సమయం కంటే ముందుగా చేయడంతో పాటు ఆయా కేంద్రాల్లో ఫుల్‌లోడ్ అవర్స్‌లో విద్యుదుత్పత్తిని చేసినందుకు ఉత్తమ పనితీరు విభాగంలో పురస్కారాలు దక్కించుకున్నాయి. డొంకరాయి పవర్ కెనాల్ నిర్వహణ పనులను రెండు నెలల్లో ఎల్‌సీ ట్రాన్స్‌కో అధికారులు మంజూరు చేయగా, ఈ జలవిద్యుత్తు కేంద్రాల అధికారులు, కార్మికులు సమష్టిగా నెలలోపే పూర్తి చేశారు. మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం 2025-26 ఆర్థిక సంవత్సరం లక్ష్యం 657 మిలియన్ యూనిట్లు కాగా ఈనెల 22 నాటికే లక్ష్యాన్ని అధిగమించి అదనపు విద్యుదుత్పత్తి చేస్తున్నారు. దీంతో ఈ కేంద్రానికి ఉత్తమ ప్లాంట్ అవార్డు లభించింది. విజయవాడ విద్యుత్‌సౌధలో ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏపీ ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్, ఏపీ జెన్‌కో సంచాలకులు(జలవిద్యుత్కేంద్రాలు)సుజయ్ కుమార్ చేతులమీదుగా సీలేరు విద్యుత్తు కాంప్లెక్స్ ముఖ్య ఇంజినీర్ కేవీ రాజారావు అవార్డులు స్వీకరించారు.

100 అడుగుల లోయలోకి లారీ బోల్తా

మరొకరికి సాయం చేయడానికి డ్రైవర్ వెళ్లగా ప్రమాదం

చింతూరు, న్యూస్‌టుడే: బోల్తా పడిన లారీలోని డ్రైవర్‌కు సహాయం చేయడానికి మరో లారీ డ్రైవర్, సహాయకుడు వెళ్లారు. అంతలో వారి లారీ ఏకంగా లోయలోకి దూసుకెళ్లిన సంఘటన చింతూరు మారేడుమిల్లి ఘాట్ రహదారిలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. రాజమహేంద్రవరం నుంచి జగ్దల్‌పూర్ కొబ్బరి కాయల లోడుతో వెళ్తున్న లారీ కనకదుర్గ ఆలయం సమీపంలోని మూల మలుపు వద్ద ప్రధాన రహదారిపై అదుపు తప్పి బోల్తా పడింది. ఈ వాహనంలోని డ్రైవర్, క్లీనర్‌లకు చిన్న చిన్న గాయాలయ్యాయి. ఇదే సమయంలో రాజమహేంద్రవరం నుంచి మొక్కల లోడుతో వెళ్తున్న లారీని ఆపి మంచినీళ్లు అడిగారు. వారు మూలమలుపు తర్వాత పల్లంలో లారీని ఆపి, వాళ్లకు మంచినీళ్లు ఇచ్చేందుకు వెళ్లారు. అంతలో మొక్కల లోడు లారీ ముందుకు కదిలి సుమారు 100 అడుగుల లోయలోకి పడిపోయి పూర్తిగా ధ్వంసమైంది. అందులో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీనిపై మోతుగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూర్తిగా ధ్వంసమైన మొక్కల లోడు లారీ

బోల్తా పడిన కొబ్బరి కాయల వాహనం

మళ్లీ అదే మూల మలుపులో..

చింతూరు, మారేడుమిల్లి ఘాట్‌లోని మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రధానంగా రాత్రి సమయాల్లో నడుస్తున్న వాహనాలకు సవాలుగా మారాయి. మరోవైపు రాత్రిపూట మంచు కారణంగా చోదకులు రహదారిని సరిగ్గా అంచనా వేయలేకపోతున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గత నెలలో ఇదే ప్రాంతంలో బస్సు ప్రమాదం జరిగి 9 మంది మృత్యువాత పడ్డారు. సరిగ్గా అక్కడే ఈ ఘటన చోటుచేసుకుంది. ఇక్కడ ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో మూలమలుపు వద్ద సిమెంటు గోడ నిర్మించారు. ఇది ఉమ్మడి రాష్ట్రంలోనే పెద్ద గోడ. కానీ పలువురు వాహనచోదకులు ఈ గోడను ఢీకొని క్షతగాత్రులవుతున్నారు. ఒక్కసారిగా రోడ్డు పల్లంగా ఉండటం, ఆ వెంటనే మలుపు ఉండటమే ప్రధాన కారణం. ఘాటీ మార్గంలో ప్రమాదాల నివారణకు అధికారులు దృష్టి పెట్టాలని, ఈ ప్రాంతంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

(c) eenadu

అంతర్వేది ఉత్సవాలకు పటిష్ఠ బందోబస్తు: ఐజీ

అంతర్వేది: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించేందుకు మంగళవారం విచ్చేసిన ఆయన ముందుగా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఉత్సవాల్లో ముఖ్య ఘట్టాలైన కల్యాణం, రథోత్సవం, చక్రవారి స్నానం సమయాల్లో సుమారు 5 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. క్యూలైన్లు, కల్యాణ మండపంలోని గ్యాలరీలు, సముద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. సుమారు 1500 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాహుల్ మీనా, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

'సోనోవిజన్ లక్కీడ్రా'లో విజేతలకు బహుమతులు

టి.నగర్, ఏవీఏ రోడ్డు: రాజమహేంద్రవరంలోని సోనోవిజన్ కొనుగోలుదారులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన లక్కీడ్రాలో విజేతలను ఎంపిక చేసింది. మంగళవారం సాయంత్రం కోటిపల్లి బస్టాండ్ వద్ద సోనోవిజన్ షోరూమ్‌లో జరిగిన కార్యక్రమంలో రాజమహేంద్రవరం గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పాల్గొన్నారు. ఆయన చేతుల మీదుగా లక్కీ డ్రా విజేతలను ఎంపిక చేశారు.

విజేతలను ప్రకటిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

ఎన్. సాయికుమార్ (ఆర్యాపురం) మారుతీ ఆల్టో కారు గెలుపొందారు. జి.శారదాదేవి (వీవర్స్ కాలనీ) ఎల్ఈడీ టీవీ సొంతం చేసుకొన్నారు. ఆర్.రాజా (బలభద్రపురం) రిఫ్రిజరేటర్ దక్కించుకొన్నారు. ఎం.ఆంజనేయులుకు(కానవరం) వాషింగ్‌మిషన్ లభించింది. షోరూమ్ మేనేజింగ్ పార్టనర్ పి భాస్కరమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

అంచెలంచెలుగా ఎదిగిన భాష్యం విద్యా సంస్థలు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: 'భాష్యం' విద్యా సంస్థల రజతోత్సవం రాజమహేంద్రవరంలోని మార్గాని ఎస్టేట్స్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎస్ఎల్ హెల్త్‌కేర్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ మెంటార్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ 25 ఏళ్లుగా భాష్యం విద్యా సంస్థలు తల్లిదండ్రుల విశ్వాసాన్ని చూరగొంటూ అంచెలంచెలుగా ఎదిగాయన్నారు. పూర్వ విద్యార్థి, ప్రముఖ దర్శకుడు బాబి మాట్లాడుతూ నిబద్ధత, కఠోరశ్రమతో భాష్యం విద్యా సంస్థలు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ తమదైన ముద్ర వేశాయన్నారు. ఆ వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని అదే పంథాలో విద్యా సంస్థలను మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ ముందుకు నడిపిస్తారనడంలో సందేహం లేదన్నారు. విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో నిర్వహించిన విద్యా సంస్థల రజతోత్సవం మర్చిపోలేని జ్ఞాపకమన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు ఉన్నత విద్య అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి డాక్టర్ సీహెచ్ దుర్గ సౌగంధి, విద్యా సంస్థల వైస్‌ఛైర్మన్ భాష్యం హనుమంతరావు, ముఖ్య సలహాదారులు మైఖేల్‌రాజ్, ఉభయగోదావరి జిల్లాల జెడ్ఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న డాక్టర్ గన్ని భాస్కరరావు చిత్రంలో విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ తదితరులు

ఏకాదశరుద్రుల సీమ.. కోనసీమ

అంబాజీపేట: ఏకాదశ రుద్రులు కొలువైన కోనసీమ పుణ్యసీమగా భాసిల్లుతోందని రుషికేష్‌కు చెందిన హరహర నందస్వామీజీ అన్నారు. ఉత్తరాదికి చెందిన స్వామీజీల బృందం ఏకాదశ రుద్రుల ఆలయాలను మంగళవారం సందర్శించారు. ఏకాదశ రుద్రులు భారతదేశం మొత్తంమీద ఒక్క కోనసీమలోనే ఉన్నారన్నారు. ఈ ఆలయాలకు 476 సంవత్సరాల విశిష్టత ఉందన్నారు. అనంతరం ముక్కామలలోని కంచికామకోటిపీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శైవాగమ పాఠశాలను సందర్శించి.. సంతృప్తిని వ్యక్తంచేశారు.

వీరేశ్వరస్వామి ఆలయానికి వచ్చిన స్వామీజీలు

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – తాడికొండ

బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర చాలెంజర్స్ – రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ – నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Hospitality Partner: Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Man of the Series: Hero
Digital Partner: ఈనాడు.నెట్
TV Partner: ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్, ఈ FM Mee FM
Organised by ఈనాడు ఉత్సవ్ క్రీడ

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర చాలెంజర్స్

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - 1 జూనియర్స్: మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ – రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్సర్లతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులు చేసి ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - 1 జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సులతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

సీనియర్స్ విన్నర్స్ రాయలసీమ రాకర్స్

గ్రౌండ్-2లో సీనియర్స్ : సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ చరణ్ జిత్ ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-1 (జూనియర్స్)
మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)
మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

బీసీలపై దాడులు తగవు

బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్

కత్తిపూడిలో బాధితుడితో రామచంద్రయాదవ్

శంఖవరం, న్యూస్‌టుడే: బీసీలపై దాడులు తగవని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ అన్నారు. కత్తిపూడిలో ఇటీవల దాడికి గురైన ముత్తిన రామకృష్ణను మంగళవారం ఆయన నివాసంలో పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు బీసీలకు రక్షణగా తెస్తానన్న చట్టం హామీ నేటికి అందుబాటులోకి రాలేదన్నారు. రాష్ట్రంలో నిత్యం బీసీలపై దాడులు జరుగుతున్నాయన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు నిందితులకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. పోలీసులు తక్షణమే స్పందించి బాధ్యులపై కేసు నమోదు చేసి నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం బాధితుడికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 50 వేలు సహాయం అందించారు. బీసీవై పార్టీ నాయకురాలు అనూషయాదవ్, శీరం శ్రీను, బర్ల శ్రీనివాస్, దేవర శ్రీను తదితరులు ఉన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

అయినవిల్లి, న్యూస్‌టుడే: అయినవిల్లి సిద్ధివినాయకస్వామి ఆలయంలో మంగళవారం దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో హుండీలు తెరిచి ఆదాయం లెక్కించారు. 49 రోజులకుగాను రూ.30,01,285, 14 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్లు ఏసీ సత్యనారాయణరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజోలు గ్రూపు దేవాలయాల ఈవో ప్రసాదరాజు, భక్తులు పాల్గొన్నారు.

పారదర్శకతతో పోస్టుల భర్తీ

సాంబమూర్తినగర్(కాకినాడ): కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో పారా మెడికల్ పోస్టుల నియామక ప్రక్రియ పూర్తి పారదర్శకతతో కొనసాగుతోందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ తెలిపారు. జనరల్ డ్యూటీ అటెండెంట్, డ్రైవర్, ఓటీ టెక్నీషియన్, ఈఈజీ టెక్నీషియన్, డయాలసిస్ టెక్నీషియన్ తదితర పోస్టుల నియామక ప్రక్రియ మెరిట్ ఆధారంగా మాత్రమే నిర్వహిస్తామన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	18,000
పాతకాయ: గండేరా	32,500
గటగట	29,000
కొత్తకాయ: గండేరా	29,500
గటగట	27,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	18,000-20,000
కొత్త (పచ్చి) కాయ	16,000-18,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	5,000
కిలో	350

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	143-00
రిటైల్ లైవ్	170-00
డ్రెస్డ్	247-00
స్కిన్‌లెస్	281-00

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

ఆరు నెలల పిల్లాడిని అమ్మేశారు

- వ్యసనాలకు బానిసైన వ్యక్తి దురాగతం
- నిందితుడికి సహకరించిన భార్య

గోపాలపురం, న్యూస్‌టుడే: వ్యసనాలకు బానిసై.. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యక్తి తాను సహజీవనం సాగిస్తున్న మహిళకు పుట్టిన ఆరు నెలల పిల్లాడిని అమ్మేశాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందడంతో నిందితుడితోపాటు ఆయనకు సహకరించిన భార్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై పి.మనోహర్ మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోపాలపురం మండలం వాదాలకుంటకు చెందిన జొన్నకూటి వీరయ్య, చిన్నారి భార్యభర్తలు. వీరయ్య చిట్యాలకు చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆమెకు ఆరు నెలల కిందట బాబు పుట్టాడు. వీరయ్య చెడు వ్యసనాలకు బానిసై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. వీటి నుంచి బయటపడేందుకు భార్యతో కలిసి సహజీవనం సాగిస్తున్న మహిళకు పుట్టిన పిల్లాడిని దేవరపల్లికి చెందిన టి.సురేష్ ద్వారా రూ.5 లక్షలకు విక్రయించేందుకు పథకం వేశారు. ఇందులో భాగంగా ఈ నెల 19న మధ్యవర్తికి పిల్లాడిని అప్పగించి రూ.1.50 లక్షలు అడ్వాన్స్ తీసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పిల్లాడి తల్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు స్పందించి మధ్యవర్తి వద్ద పిల్లాడిని తీసుకొచ్చి ఆమెకు అప్పగించారు. నిందితుడు జొన్నకూటి వీరయ్య, అతని భార్య చిన్నారిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అయిదేళ్లకే నూరేళ్లూ నిండిపోయాయా..

- చైనా మాంజాకు బలైన చిన్నారి తల్లిదండ్రుల రోదనలు
- అంబాజీపేటలో విషాదఛాయలు

అంబాజీపేట, న్యూస్‌టుడే: ఈ నెల 26న హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో చైనా మాంజా మెడకు చుట్టుకుని చిన్నారి నిశ్వికాదిత్య(5) మృతితో స్వగ్రామం అంబాజీపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. అక్కడి నుంచి మృతదేహాన్ని తీసుకువస్తున్న సమాచారంతో కుటుంబ సభ్యులు, బంధువులు పెద్దఎత్తున చేరుకున్నారు. మంగళవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత మృతదేహం చేరుకోవడంతో ఆ ప్రాంతం రోదనలతో నిండిపోయింది. అయిదేళ్లకే నూరేళ్లు నిండిపోయాయా అంటూ విలపించిన తీరు అక్కడున్న వారిని కలచివేసింది. చిన్నారి తల్లిదండ్రులు రాంసాగర్, పద్మావతిని ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. సంక్రాంతి పండగకు స్వగ్రామం వచ్చి సరదాగా గడిపిన వీరు ఈ నెల 23న తిరిగి హైదరాబాద్ వెళ్లారు. కొన్ని రోజులు ఇక్కడే ఉంటే ఈ ఘోరం జరిగేది కాదేమోనని కుటుంబ సభ్యులు వాపోతున్నారు.

ఉరేసుకుని డ్రైవర్ బలవన్మరణం

హైదరాబాద్, న్యూస్‌టుడే: కారు డ్రైవర్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హైదరాబాద్‌లోని పేట్‌బషీరాబాద్ సీఐ కె. విజయవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా బత్తులవారిపేట గ్రామానికి చెందిన శ్రీనుబాబు (26) సుచిత్ర కూడలి వెన్నెలగడ్డకు వచ్చి నివసిస్తున్నాడు. యువకుడు స్థానికంగా కారు డ్రైవర్‌గా పని చేసేవాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం తెల్లవారుజామున తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వచ్చి పరిశీలించి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). ✆ 83338 33368

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph : 8142292071.

శ్రీసాయి గోల్డ్ తాకట్టులో ఉన్న బంగారం ఏ బ్యాంక్/ప్రైవేట్ సంస్థల నుండి అయినా విడిపించి ఆరోజు మార్కెట్ రేటుకి కొనబడును. స్పాట్ క్యాష్ 94933 38823.

EDUCATION

విజయవాడలో BPT/ B.Sc., MLT- మేనేజ్‌మెంట్ కోటా సీట్లు- తక్కువ ఫీజు- కొన్నిసీట్లు కలవు. Affiliated to Dr. NTR యూనివర్సిటీ. ✆ 7995945835.

REAL ESTATE

FLAT FOR SALE
KAKINADA CITY

కాకినాడ, RTO ఆఫీస్ మెయిన్‌రోడ్ నందు ప్రముఖ అపార్ట్మెంట్‌లో 1060 Sft. సెకండ్ సేల్. S/F, కార్‌పార్కింగ్, లిఫ్ట్ సౌకర్యాలతో అమ్మకము. Cont: 97057 48052

EENADU e Classifieds

PLOT FOR SALE
KAKINADA CITY

KKD, గంగనాపల్లి 100+100 చ||గ|| EF రెడీగా ఇల్లు కట్టుకొనుటకు గజం 16K, కలెక్టర్ ఆఫీస్ దగ్గర 2BHK ఫ్లాట్స్16L Only. 8985804011,9440303936.

JOBS

ఫ్యాక్టరీలో తేలికపాటి పని చేయుటకు యువతి/ యువకులు కావలెను. 9 గంటలు డైలీ పని ఉండును. నెలకు రెండు ఆదివారములు సెలవు. సంప్రదించండి: 9000557999.

ADB రోడ్డుకి దగ్గరగా రంగంపేట వద్ద RUDA అప్రూవ్డ్ వెంచర్ మార్కెటింగ్‌కై టీం ఉన్న లీడర్లు కావలెను. మంచి కమీషన్+ ఇన్సెంటివ్స్. ✆ 6302626576.

రైస్ మిల్ & ప్లాంట్ ఆపరేటర్స్ కావలెను. అనుభవజ్ఞులైన వెల్డింగ్, రిపేర్ తెలిసిన ఆపరేటర్స్ కావలెను. Contact No: ✆ 80962 46099.

SECURITY GUARDS

రాజమండ్రి మరియు పరిసర ప్రాంతాలలో సెక్యూరిటీకి సంబంధించి గార్డులు, సూపర్‌వైజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు కావలెను. ✆ 96525 29724, 93468 62560.

కాకినాడ మరియు వాకలపూడి ఏరియాలో సెక్యూరిటీ గార్డ్లు స్త్రీలు మరియు పురుషులు కావలెను. PF మరియు ESI ఉచిత భోజన సౌకర్యం కలదు. ✆ 9949826283

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-15 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

సేంద్రియ విధానం.. ఆచరిస్తే అమోఘం

న్యూస్‌టుడే, మోతుగూడెం

పోలవరం జిల్లా చింతూరు మండలం గూడూరు గ్రామానికి చెందిన గిరిజన రైతు దూభి లక్ష్మయ్య సేంద్రియ వ్యవసాయంలో రాణిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. రెండెకరాల్లో వరి, ఎకరాలో మినుములు, పెసలు పండిస్తున్నారు. ఎటువంటి రసాయన ఎరువులు వినియోగించకపోవడంతో చాలామంది వీటి కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

తోట వద్దకే వచ్చి ఆకుకూరలు కొనుగోలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

స్ఫూర్తి

మరో పది సెంట్లలో కూరగాయలు

పది సెంట్ల భూమిలో పలు రకాల ఆకు, కూరగాయల పంటలను పండిస్తున్నారు. వీటికి సేంద్రియ ఎరువులు, కషాయాలను పిచికారీ చేయడంతో 20 రోజులకే పంట చేతికి వస్తుంది. తాజా సరకు కావడంతో గ్రామం, చుట్టుపక్కల అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, వసతి గృహాల నిర్వాహకులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మిగిలినవి వారపు సంతలో విక్రయిస్తున్నారు.

కషాయాల తయారీ, విక్రయం

కషాయాలు, ద్రావణాలను స్వయంగా తయారు చేసుకుంటున్నారు. వీటిలో కొన్ని సొంతానికి వినియోగించుకోవడంతో పాటు తక్కువ ధరకు ఇతర రైతులకు విక్రయిస్తున్నారు. దాదాపు వంద మంది వరకు ఈయన వద్ద కొనుగోలు చేస్తున్నారు. విత్తనశుద్ధికి బీజ, ఘన జీవామృతాలు, భూమిలో సూక్ష్మజీవుల వృద్ధికి ద్రవజీవామృతం, పంట తొలిదశలో పట్టే చిన్న, పెద్ద పురుగుల నివారణకు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, టమాటా, మిర్చి, వంగ, బెండ, గోరుచిక్కుడు పంటల్లో ఆకుముడత పురుగు నివారణకు ఆవు మూత్రంతో వావిలాల కాషాయం తదితరాలు తయారు చేసి విక్రయిస్తున్నారు.

ఆదాయం ఇలా..

వరి, మినుములు, పెసలు, కూరగాయలు, ఆకుకూరల పంటలతో పాటు కషాయాల అమ్మకాల ద్వారా ఖర్చులు పోను నెలకు రూ.25 వేల వరకు ఆదాయం పొందుతున్నట్లు లక్ష్మయ్య తెలిపారు.

రైతేరాజు

పొగాకులో తెగుళ్ల బెడద

గోపాలపురం, న్యూస్‌టుడే: వర్జీనియా పొగాకు తోటల్లో ఈ సీజన్‌లో వచ్చే తెగుళ్లలో ఆకుముడత, నల్లకాడ ప్రధానమైనవి. వాటి నివారణకు సరైన చర్యలు తీసుకోకపోతే చాలానష్టం వస్తుంది. దిగుబడితో పాటు నాణ్యత లోపిస్తుందని గోపాలపురం వేలం కేంద్రం నిర్వహణాధికారి కేవల్ రామ్‌మీనా తెలిపారు. ● ఆకుముడత నివారణకు తోట చుట్టూ జొన్న, మొక్కజొన్నను కంచెలా రెండు వరుసల్లో వేసుకోవాలి. వ్యాధికి కారణమైన తెల్లదోమను అరికట్టేందుకు జిగురు అట్టలను హెక్టారుకు 15 చొప్పున అక్కడక్కడ ఏర్పాటు చేయాలి. పొలంలో ముందుగా ఇమిడాక్లోపిడ్ ఎస్ఎల్ 3 మి.లీ.ను 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ● నల్లకాడ తెగులు తరచూ వస్తుంటే పంటమార్పిడి చేయడం మంచిది. నాట్లు వేసింది. మొదలు తోటలో తేమ ఎక్కువగా ఉంటే నీటితడులు బాగా తగ్గించాలి. వ్యాధి నివారణకు రెడిమెల్ 20 గ్రా. మందును 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

తెగులు సోకి వాడిపోయిన పొగాకు మొక్క

తెలుసుకుందాం..

వరిలో నత్రజని ప్రధాన పోషకం

అయినవిల్లి, న్యూస్‌టుడే: వరిలో నత్రజని మొక్క పెరిగేందుకు, దుబ్బు కట్టేందుకు ఉపయోగ పడుతుందని అయినవిల్లి ఏవో శోభ తెలిపారు. దీని లోపం వల్ల ఎదురయ్యే సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. నత్రజని లోపిస్తే వరిదుబ్బు ఎదుగుదల తగ్గి పసుపు పచ్చగా మారి ఆకులు ఎండిపోతాయి. ఒకవేళ ఎక్కువైతే పైరు ఏపుగా పెరిగి ఆకులు నీలిరంగుతో కూడిన ముదురాకుపచ్చ రంగు కలిగి ఉంటాయి. దీంతో పంట ఆలస్యంగా కోతకు వస్తుంది. రోగనిరోధక శక్తి తగ్గి పురుగులు, తెగుళ్లు ఆశిస్తాయి. రబీలో ఎకరాకు 72 కిలోల నత్రజని వేయడం ద్వారా ఆశించిన దిగుబడులు పొందొచ్చు. పైరు కీలక దశలో మాత్రమే వేయాలి. వేయాల్సిన మొత్తాన్ని మూడు భాగాలుగా విభజించి మొదటి భాగం ఆఖరి దమ్ము లేదా నాట్లు వేసే సమయంలోను, మరోభాగం పిలక తొడిగి దుబ్బువేసే సమయంలోనూ, మిగిలినది అంకురం ఏర్పడిన దశలోను వేయాలి. దీనివల్ల బాగా దుబ్బులు చేసి వెన్నుల సంఖ్య, గింజల సంఖ్య పెరిగి మంచి దిగుబడులు వస్తాయి.

అయినవిల్లిలో ఎదిగిన వరిచేను

మొక్కజొన్నలో కాండం తొలుచు పురుగు నివారణ

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: ప్రస్తుతం మొక్కజొన్నలో కాండంతొలుచు పురుగు అధికంగా ఆశిస్తోంది. దిగుబడులు గణనీయంగా తగ్గి రైతులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. పురుగు ఉద్ధృతిని గుర్తించే విధానం, నివారణ చర్యల గురించి ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకటనరసింహారావు వివరించారు. పురుగు చిన్నదశలో ఆకుల పత్రహరితం తింటాయి. క్రమంగా కాండం లోపలికి చేరి తినడం వల్ల ఆకులు విచ్చుకున్న తరువాత గుండుసూదిలాంటి రంధ్రాలు వరుస క్రమంలో కనిపిస్తాయి. లార్వా ఎదిగి అంకురాన్ని తినడం వల్ల మొక్క చనిపోయి ఎండిపోతుంది. దీనిని 'డెడ్‌హార్ట్'గా పేర్కొంటారు. ఒక్కొక్క మొక్కలో రెండు నుంచి మూడు పురుగులు కనిపిస్తాయి.

మొక్కజొన్న పంటకు ఆశించిన కాండం తొలుచు పురుగు

మీ కోసం

నివారణ చర్యలు

● పొలం చుట్టూ 3, 4 వరుసల్లో ఎర పంటగా వేసుకుని 45 రోజుల తరువాత తీసివేయాలి. పురుగు ఆశించిన మొక్కలను నాశనం చేయాలి. అంతర పంటగా అపరాలు వేస్తే కాండం తొలిచే పురుగులకు సహజ శత్రువుల సంఖ్య పెరుగుతుంది. ● ట్రైకోగ్రామా కిలోనిస్ పరాన్నజీవి గుడ్లను ఎకరాకు 2, 3 ట్రైకోకార్డుల రూపంలో రెండు విడతలుగా విడుదల చేయాలి. ● మోనోక్రోటోఫాస్ లీటరు నీటికి 1.6 మిల్లీలీటర్లు చొప్పున ఎకరాకు 320 మిల్లీలీటర్లు మందు కలిపిన ద్రావణాన్ని పైరు మొలకెత్తిన 10 నుంచి 12 రోజులకు పిచికారీ చేయాలి. ● పురుగు ఉద్ధృతి ఎక్కువగా ఉంటే కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఎకరాకు 3 కేజీల చొప్పున పైరు మొలకెత్తిన 25 నుంచి 30 రోజులకు ఆకుల సుడులలో వేయాలి.

మేమున్నాం.. మీకు తోడుగా

రంపచోడవరం 9490877172 అడ్డతీగల 9491575045
ఉ. 10 - మ. 1 దేవీపట్నం 7673936636 గంగవరం 9493541083

సమస్య: ఆకుమామిడికోట వద్ద నిర్మించిన వంతెనపై రాళ్లు ఉన్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.
– కేండ్ర శంభురెడ్డి, ఆకుమామిడికోట

సమాధానం: రాళ్లు తొలగిస్తాం.
– ప్రదీప్, ఏఈ, ర.భ.శాఖ, మారేడుమిల్లి
– న్యూస్‌టుడే, మారేడుమిల్లి

సమస్య: రాజవొమ్మంగిలో విద్యానగర్ నుంచి రవీంద్రనగర్ వెళ్లే మార్గం అస్తవ్యస్తంగా ఉంది.
– త్రిమూర్తులు, రాజవొమ్మంగి

సమాధానం: అధికారులతో చర్చిస్తాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.
– యాగిరెడ్డి శ్యామలరావు, ఎంపీడీవో, రాజవొమ్మంగి
– న్యూస్‌టుడే, రాజవొమ్మంగి

సమస్య: అడ్డతీగల పోలీస్‌స్టేషన్, మార్కెట్ రోడ్డులో మురుగు రహదారిపై పారుతుంది.
– జయరాం, అడ్డతీగల

సమాధానం: చర్యలు చేపడతాం.
– రాంబాబు, పంచాయతీ కార్యదర్శి
– న్యూస్‌టుడే, అడ్డతీగల

అయితే శిథిలం.. లేదంటే పాకలు

మారేడుమిల్లి మండలంలోని పలు పాఠశాలల పరిస్థితి

ధారవాడలో పునాది స్థాయిలోనే

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: విద్యావంతులుగా తీర్చిదిద్దే సరస్వతీ నిలయాలు అందరి జీవితాల్లో ముఖ్య భూమిక పోషిస్తాయి. అటువంటివి మారేడుమిల్లి మండలంలోని పలు గిరిజన సంక్షేమ, ప్రాథమిక పాఠశాలలు కనీస సదుపాయాలు లేక దీనాలు పడుతున్నాయి. గిరిజన విద్యాభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నాం.. కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నాం.. అని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నప్పటికీ ఆ దిశగా అడుగులు పడడం లేదు. సొంత భవనాలు లేక.. ఉన్న భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యా బుద్ధులు నేర్చుకోవాల్సిన చిన్నారులు ప్రాథమిక స్థాయిలోనే నానా అవస్థలు పడుతున్నారు.

భవనాలు లేనివి

గిరిజన సంక్షేమ పాఠశాలలు	చదువుతున్న విద్యార్థులు
గుడిస	11
పాములమామిడి–2	11
తుర్రవాడ	12
వేజువాడ	09
కెచ్చెలవాడ	16
గొందివాడ	36
మూసూరు	22
దొరచింతలపాలెం	24
మండల పరిషత్ ప్రాథమిక..	
గుంపెనగండి	42
ఎగవలస	19
పొట్టవాడ	16
వైదపూడి	47
దారవాడ	45
పెద్దూరు	23

ఆయా పాఠశాలల దుస్థితి..

గుడిసెలో పాఠశాల భవనం

✦ మండలంలోని 14 పాఠశాలలకు ఇప్పటికీ పక్కా భవనాలు లేవు. ✦ గుడిస పర్యాటకంగా పేరొందింది. ఇక్కడ ఉన్న కొండను చూసేందుకు నిత్యం పర్యాటకులు దూర ప్రాంతాల నుంచి తరలి వస్తున్నారు. రోజురోజుకు ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతోంది. కానీ ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాలు మాత్రం మెరుగుపడడం లేదు. గిరిజన సంక్షేమ పాఠశాలను నేటికీ గుడిసెలోనే నిర్వహిస్తున్నారు. ఇక్కడ 11 మంది విద్యార్థులు చదువుతున్నారు. వాతావరణ పరిస్థితులను తట్టుకొని గుడిసెలోనే చిన్నారులు విద్యను అభ్యసిస్తున్నారు. ✦ గత ప్రభుత్వ హయాంలో ధారవాడలో పాఠశాల నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. పనులు ప్రారంభించి పునాది స్థాయిలోనే వదిలేశారు. దీంతో గత్యంతరం లేక ఓ ప్రైవేటు వ్యక్తి ఇంటిలో ప్రస్తుతం తరగతులు నిర్వహిస్తున్నారు. ✦ పెద్దూరు, దొరచింతలపాలెం పాఠశాలలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇక్కడ తరగతులు నిర్వహించేందుకు ఉపాధ్యాయులు భయాందోళన చెందుతున్నారు. పాఠశాలకు చిన్నారులను పంపించేందుకు తల్లిదండ్రులు ఇష్టపడడం లేదు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆవేదన చెందుతున్నారు. ✦ గొందివాడ పాఠశాలను అంగన్‌వాడీ భవనంలో కొనసాగిస్తున్నారు. ✦ మూసూరు, కెచ్చెలవాడ గ్రామాల్లో పాఠశాలలకు పక్కా భవనాలు లేవు. గ్రామస్థుల సహాయంతో పాకలు నిర్మించి అందులో తరగతులు నిర్వహిస్తున్నారు. ✦ అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా ఈ పిల్లలు నేటికీ శిథిల భవనాలు, పాకల్లోనే విద్యను అభ్యసిస్తున్నారని చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించి పక్కా భవనాలు నిర్మించాలని.. అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం..

మండలంలోని లోతట్టు గ్రామాల్లో పాఠశాలలకు భవనాలు లేకపోవడం వాస్తవమే. పరిస్థితిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ప్రతిపాదనలు వచ్చిన వెంటనే చర్యలు చేపడతాం.
– వి.ముత్యాలరావు, మండల విద్యాశాఖాధికారి-2, మారేడుమిల్లి

పాఠశాలకు వితరణ

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: నూతనంగా ఉద్యోగం సాధించిన రాజవొమ్మంగి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న 13 మంది ఉపాధ్యాయినిలు వారి మొదటి నెల జీతంలో కొంత భాగం వెచ్చించి రూ. 1.30 లక్షలతో మైక్ సెట్, స్పీకర్లు, ప్రముఖ తదితర సామగ్రిని కొనుగోలు చేసి పాఠశాలకు బహూకరించారు. ఈ మేరకు మంగళవారం ప్రిన్సిపల్ సత్యవేణికి సామగ్రిని అందజేశారు. సామగ్రి సమకూర్చిన ఉపాధ్యాయినులు ప్రణీత, సుగంధ, శిరీష, రాజేశ్వరి, ఉమ, అంజలి, సోనియా, సుజాత, విజయ, గీత, నిర్మల జ్యోతి, విజయలక్ష్మి, దేవీలను ప్రిన్సిపల్, విద్యార్థినుల తల్లిదండ్రులు అభినందించారు.

ప్రిన్సిపల్‌కు సామగ్రిని అందజేస్తున్న ఉపాధ్యాయినులు

విద్య, క్రీడల్లో రాణించాలి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు విద్య, క్రీడల్లో రాణించాలని మారేడుమిల్లి ఎంపీపీ పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ బొరగ త్రిత్వ దాసు అన్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం ఆమె చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏ. వీణాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మరమ్మతులు పూర్తి

ఈనాడు స్పందన

గంగవరం, న్యూస్‌టుడే: గంగవరం- గోకవరం ప్రధాన రహదారి పక్కన రక్షిత మంచినీటి పైపులైను లీకవడంతో మరమ్మతులు చేసేందుకు పంచాయతీ సిబ్బంది గొయ్యి తీశారు. దీంతో 'ప్రమాదకరంగా గొయ్యి' శీర్షికతో ఈ నెల 20న 'ఈనాడు' లో వార్త ప్రచురితమైంది. ఎట్టకేలకు పంచాయతీ కార్యదర్శి ఎ.శ్రీనివాస్, స్థానిక సర్పంచి కుమారి అఖ్యమ్మ స్పందించారు. మంగళవారం ఉదయం నుంచి సిబ్బందితో పైపులైను మరమ్మతు పనులు చేయించారు. మిగిలిన పనులు పూర్తి చేసి గొయ్యి పూడ్చుతామని 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

డిజిటల్ విద్యతో ఉపయుక్తం

చింతూరు, న్యూస్‌టుడే: మహిళలు సాధికారత సాధించేందుకు డిజిటల్ విద్య ఎంతో ఉపయోగపడుతుందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రత్న మాణిక్యం తెలిపారు. పీఎం ఉషా ఆర్థిక సహాయంతో బ్లాక్ బక్స్ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాలలో డిజిటల్ స్కిల్ ఫర్ ఉమెన్ సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు డిజిటల్ రంగంపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ కోర్సు ద్వారా డిజిటల్ వ్యవస్థలో మెలకువలు.. కంప్యూటర్ ఆధారిత సేవలు నేర్చుకొని డిజిటల్ రంగంపై పట్టు సాధించాలని కోరారు. వైస్ ప్రిన్సిపల్ శేఖర్, అధ్యాపకులు వెంకట్రావు, శకుంతల, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్

రికార్డుల నిర్వహణలో లోపాలుంటే చర్యలు

దేవరమునురు సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం: సచివాలయాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో బాపన్నదొర అన్నారు. మండలంలోని దేవరమునురు, పనసలపాలెం సచివాలయాలను ఆయన మంగళవారం సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, సర్వీస్ స్టేటస్, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, అక్షర ఆంధ్ర రిజిస్ట్రేషన్, సిటిజన్ ఈకేవైసీ, ఆధార్ క్యాంపులు, ఇతర సర్వేలకు సంబంధించినవి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రికార్డుల నిర్వహణలో లోపాలు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఆయా సచివాలయాల అభివృద్ధి అధికారులు, సిబ్బంది ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

చింతూరు, న్యూస్‌టుడే: దళిత మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని న్యాయవాది అవులూరి సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఏడుగురాళ్లపల్లిలో దళిత మహిళల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను పాఠశాలలకు పంపి విద్యపై ఆసక్తి కల్పించాలని పేర్కొన్నారు. మహిళల్లో జరుగుతున్న ఆరాచకాలను అడ్డుకునేందుకు మహిళా సంఘాలు కృషి చేయాలని తెలిపారు. అనంతరం మహిళా సంఘాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షురాలిగా గొంది సబ్బలక్ష్మి, కార్యదర్శి మరియమ్మ, కోశాధికారి నాగమణి, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, గౌరవ సలహాదారు అలివేలు, సభ్యులను ఎన్నుకున్నారు. దళిత సంఘం నాయకులు నాగేంద్ర, సుదర్శన్‌కుమార్, రజని, శ్రీనివాసరావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశమైన మహిళలు, నాయకులు

ఆర్ఓఎఫ్ఆర్ సర్వే కొనసాగించాలి

వినతి పత్రం అందజేస్తున్న రాము

ఎటపాక, న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మీపురం గ్రామ సచివాలయ పరిధిలోని పోడు భూములకు రెవెన్యూ, ఫారెస్ట్ సిబ్బంది ఆర్ఓఎఫ్ఆర్ సర్వే చేయకుండా ఆపారని.. వాటికి సర్వే చేపట్టాలని మంగళవారం తహసీల్దార్ శ్రీనివాసరావు, అటవీ శాఖ రేంజర్ మూర్తికి ఆర్ఓఎఫ్ఆర్ కమిటీ ఛైర్మన్ సవలం రాము వినతి పత్రాలు అందజేశారు. రెవెన్యూ, సచివాలయం సిబ్బందికి ప్రభుత్వపరమైన పనులు ఉండడంతో సర్వేలను ఆపారని పేర్కొన్నారు. తహసీల్దార్ స్పందించి త్వరలో సర్వే ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్లు రాము తెలిపారు.

స్తంభించిన బ్యాంకు సేవలు

గంగవరం: బ్యాంకు సిబ్బందికి ఐదు రోజులే పని దినాలు ఉండాలని బ్యాంకు సిబ్బంది చేపట్టిన బంద్ కారణంగా పోలవరం జిల్లా కేంద్రం రంపచోడవరంతో పాటు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో జాతీయ బ్యాంకులు స్తంభించిపోయాయి. మూడు రోజులుగా నిలిచిపోయిన బ్యాంకులు మంగళవారం కూడా తెరుచుకోకపోవడంతో ఖాతాదారులు ఇబ్బంది పడ్డారు. గంగవరంలోని భారతీయ స్టేట్ బ్యాంకు మూసి ఉండడంతో పలువురు ఖాతాదారులు మినీ బ్యాంకులు, ప్రైవేటు ఏటీఎం సెంటర్ల వద్ద బారులు తీరారు. చాలా సమయం వేచి ఉండి లావాదేవీలు చేశారు. గంగవరంలో స్టేట్ బ్యాంకు ఉన్నప్పటికీ ఏటీఎం ఏర్పాటు చేయలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

గంగవరంలో తెరుచుకోని భారతీయ స్టేట్ బ్యాంకు

వారం రోజులుగా తాగునీటికి అవస్థలు

ధ్వంసమైన పైపులైను

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్న మారేడుమిల్లిలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాల అదనపు భవనం నిర్మాణ పనుల్లో స్థానిక కొండపై ఉన్న ట్యాంకు నుంచి గ్రామంలోని ఇళ్లకు తాగునీటిని అందించే పైపులైను పగిలిపోయింది. పొక్లెయిన్ సహాయంతో పునాదులు తీయడంతో ఇలా జరిగింది. దీంతో వారం రోజులుగా సరఫరా నిలిచిపోయింది. తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు. సర్పంచ్ కొండా జాకబ్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. పైపులైను మరమ్మతులకు చర్యలు చేపట్టామని.. సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు.

కొండదేవత, శివపార్వతుల జాతర

మోతుగూడెం, న్యూస్‌టుడే: చింతూరు మండలం మోతుగూడెం పంచాయతీలోని ఒడి యాక్యాంపులో ఆదివాసి కొమరం భీమ్ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో కొండదేవత, శివపార్వతుల జాతర వైభవంగా జరుగుతోంది. కొండదేవతలు, శివపార్వతుల విగ్రహాలకు గ్రామ సమీపంలోని వాగులో స్నానం చేయించారు. అక్కడ నుంచి డప్పు, సన్నాయి వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో ఉంచారు. పూజారి కిలో జగన్ చేసిన విశేష పూజలు అనంతరం గ్రామస్థులు మొక్కులు చెల్లించి జాతర ప్రారంభించారు. గిరిజన భక్తులు నృత్యాలు చేశారు. థింసా నృత్యం చూపరులను ఆకట్టుకుంది. శివపార్వతుల నాటకాన్ని ఒరియా భాషలో ప్రదర్శించారు. చుట్టుపక్కల పది గిరిజన గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జాతర బుధవారం ఉదయంతో ముగుస్తుంది. భక్తులకు అన్నసమారాధన చేశారు. గ్రామపెద్దలు వంతల ప్రసాద్, బాబురావు, కిలో శంకర్ కొరా శుభ, మోతుగూడెం ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, పెసా కమిటీ ఉపాధ్యక్షుడు ఊలయ్య, తెదేపా నాయకులు కరణం శ్రీనుబాబు, బాబురావు, దారబాబు పాల్గొన్నారు.

జాతరలో కమిటీ నిర్వాహకులు, భక్తులు

నృత్యాలు చేస్తున్న గిరిజన మహిళలు

ఘనంగా ఎలక్ట్రీషియన్ దినోత్సవం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: థామస్ ఆల్వా ఎడిసన్ బల్బును కనిపెట్టారని, ప్రతిఒక్కరూ దానిపై ఆధారపడుతున్నారని మారేడుమిల్లి సర్పంచి కొండా జాకబ్ అన్నారు. మంగళవారం ప్రపంచ ఎలక్ట్రీషియన్ దినోత్సవం సందర్భంగా మారేడుమిల్లి ప్రైవేటు ఎలక్ట్రీషియన్ అండ్ ప్లంబర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. స్థానిక ప్రధాన కూడలిలో జెండాను సర్పంచి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ స్వశక్తితో ఆయా పనుల్లో ఆధునిక పరిజ్ఞానాన్ని సంపాదించుకుని, స్వయం ఉపాధి అవకాశాలను మెరుగు పరుచుకోవాలని కోరారు. జడ్పీటీసీ గొర్లె బాలాజీబాబు, వైస్ ఎంపీపీ రవికుమార్, ఉపసర్పంచి వీరబాబు, మాజీ ఎంపీటీసీ అనిల్‌ప్రసాద్, జనసేన అధ్యక్షుడు దుర్గాప్రసాద్, చంటి, డీఎస్‌కే, అనుదీప్, సుబ్బారెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు బాలురెడ్డి, జగజీవన్‌రావు, దైవదానం, సత్తిబాబు, పవన్‌బాబు, బెంజిమెన్, హఫీజ్ పాల్గొన్నారు.

మారేడుమిల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న సర్పంచి జాకబ్

రంపచోడవరం: రంపచోడవరం శ్రీవిజయ దుర్గా ప్రైవేటు ఎలక్ట్రీషియన్ అండ్ ప్లంబర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రెసిడెంట్ పోసిబాబు, వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్ మాట్లాడారు. ఎలక్ట్రీషియన్ల సమస్యలను ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు సురేష్, రమేష్, పండు, శివ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరంలో ర్యాలీలో పాల్గొన్న అసోసియేషన్ సభ్యులు

ఆటో, ద్విచక్రవాహనం ఢీ

ఒకరి మృతి.. పలువురికి తీవ్రగాయాలు

మచ్చా నాగేశ్వరరావు (పాతచిత్రం)

ఎటపాక, న్యూస్‌టుడే: ఆటో, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొని ఒకరు మృతిచెందిన, పలువురికి తీవ్రగాయాలైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎటపాక అడిషనల్ ఎస్సై రాధాకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కూనవరం గ్రామానికి చెందిన మచ్చా నాగేశ్వరరావు(27) ఇటీవల కొత్తగా ద్విచక్రవాహనం కొన్నాడు. వరుసకు అన్న కుమార్తె అయిన లావణ్యను తీసుకుని బండిపై భద్రాచలం నుంచి కూనవరం వెళ్తున్నారు. అదే సమయంలో కూనవరం మండలం పల్లూరుకు చెందిన షేక్ రహీం తన ఆటోలో ఆరుగురు ప్రయాణికులతో భద్రాచలం వైపు వెళ్తున్నారు. ఎటపాక మండలం బుట్టాయిగూడెం నాగులమ్మ ఆలయం సమీపంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ద్విచక్రవాహనం నుజ్జునుజ్జయి నాగేశ్వరరావుకు తీవ్రగాయాలయ్యాయి. వెనుక కూర్చున్న లావణ్యకు, ఆటోలో ఉన్న పలువురికి గాయాలయ్యాయి. వారందరినీ చికిత్స నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా నాగేశ్వరరావు మార్గమధ్యలోనే మృతిచెందారు. మృతుడి తండ్రి చనిపోగా తల్లి చిట్టెమ్మ, అక్క జ్యోతి ఉన్నారు. అతనికి వివాహం కాలేదు. ఒక్కగానొక్క కొడుకు దూరమవ్వడంతో తల్లి చిట్టెమ్మ రోదించిన తీరు అక్కడ ఉన్నవారిని కంటతడి పెట్టించింది. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

శబరిలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



చింతూరు: శబరి నదిలో గల్లంతైన యువకుడు చల్లా వెంకట రమణ(20) మృతదేహం మంగళవారం లభ్యమైంది. గత ఆదివారం నదిలో స్నానానికి దిగి గల్లంతయ్యాడు. ఎస్డీఆర్ఎఫ్ బృందం, స్థానిక గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో స్నానానికి దిగిన సమీపంలో శవమై తేలాడు. పోస్టుమార్టం నిమిత్తం చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అదుపు తప్పి గడ్డి ట్రాక్టర్ బోల్తా

గంగవరం: గంగవరం-కుసుమరాయి మధ్య జాతీయ రహదారి 516ఈలో అదుపుతప్పి గడ్డి ట్రాక్టర్ బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ బస్సును తప్పించబోయి గడ్డిలోడుతో ఉన్న ట్రాక్టర్ ట్రాలీ అదుపు తప్పి బోల్తా పడింది. జేసీబీ సాయంతో వాహనాన్ని పైకి లేపారు. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

జాతరలో అశ్లీల నృత్యాలు

గోకవరం: ఒక జాతరలో అశ్లీల నృత్యాలు నిర్వహించగా ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలివీ.. గోకవరం మండలం తంటికొండ గ్రామంలో గత మంగళవారం రాత్రి ఓ అమ్మవారి జాతరను నిర్వహించారు. జాతర ముసుగులో ట్రాక్టర్లపై మహిళలతో అశ్లీల నృత్యాలు చేయించారు. ఈ నృత్యాలకు సంబంధించిన కొన్ని వీడియోలు బయటకు వచ్చాయి. దీంతో ఈ విషయాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకొని విచారణ చేపట్టారు. ట్రాక్టర్లతో పాటు నిర్వాహకులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేస్తున్నట్లు సమాచారం.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంతో మేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి చక్రధర్ పేర్కొన్నారు. వయ్యేడులో మంగళవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పురుగు మందులు, ఎరువులు ఎక్కువగా వాడడంతో నేల సారం తగ్గుతుందన్నారు. నిపుణుల సూచనల మేరకే ఎరువులు వినియోగించాలని తెలిపారు. వచ్చే సీజన్ నుంచి పంట నమోదు చేసుకున్న వారికే యూరియా సరఫరా చేయడం జరుగుతుందన్నారు. రైతులు తప్పకుండా ఏపీ అగ్రిస్టాక్‌లో పేరు నమోదు చేయించుకోవాలని, లేకపోతే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నగదు జమకాదు అన్నారు. వివరాలకు సచివాలయంలో వీఏఏని సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో భవానీ, వీఏఏలు భరద్వాజ్, సాయి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏవో

అధ్వానంగా రహదారి

మారేడుమిల్లి-రంపచోడవరం ప్రధాన రహదారిలోని సున్నంపాడు నుంచి లోపలికి రామన్నవలస, తుర్రూరు గ్రామాలకు వెళ్లే రహదారి పరిస్థితి అధ్వానంగా ఉంది. ఏళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో పాటు రాళ్లు తేలిపోయాయి. దీంతో వాహనాలు తరచూ పాడైపోతున్నాయని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రహదారిని పునః నిర్మించేందుకు చర్యలు చేపట్టినప్పటికీ అటవీశాఖ అభ్యంతరాలు తెలపడంతో నిర్మాణం ముందుకు సాగడం లేదని గిరిజనులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖలు చర్చించి రహదారి నిర్మాణం చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, మారేడుమిల్లి

గిరిజన రైతుకు జాతీయస్థాయి గుర్తింపు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: ఉద్యాన పంటల (అరటి సాగు)లో అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించి అధిక దిగుబడులతో పాటు నాణ్యమైన పంటను సాధించిన కింద్రకు చెందిన గంప నాగరాజుకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఐసీఏఆర్-అఖిల భారత పండ్ల సమన్వయ పథకంలో భాగంగా అరటి పంటలో 'గ్రాండ్ నైన్' టిష్యూ కల్చర్ ద్వారా అరటి సాగు చేశారు. నాణ్యమైన దిగుబడి సాధించారు. జాతీయ స్థాయిలో ఆరుగురు గిరిజన రైతుల్లో నాగరాజు కూడా ఎంపికైనట్లు కొవ్వూరు ఉద్యాన విశ్వవిద్యాలయం సీనియర్ శాస్త్రవేత్త డా.రవీంద్ర కుమార్ తెలిపారు. ఫిబ్రవరి 9 నుంచి 12 వరకు దిల్లీలో జరిగే కార్యక్రమాల్లో వీరిని సత్కరించనున్నట్లు చెప్పారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

మోతుగూడెం, న్యూస్‌టుడే: గుర్తేడు మండలం డొంకరాయి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్ నాయక్ ఆధ్వర్యంలో తొమ్మిదో తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు గత కొన్నేళ్లుగా ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. పూర్వ విద్యార్థులు అన్ని తరగతుల విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. తొమ్మిది, పదో తరగతి విద్యార్థులు దేశభక్తి, శాస్త్రీయ పాటలకు నృత్యాలు చేసి అలరించారు. ఉన్నత లక్ష్యాలు, నిర్దేశించుకుని వాటిని సాధిస్తే గుర్తింపు, మెరుగైన భవిష్యత్తు ఉంటుందని పూర్వ విద్యార్థులు సూచించారు. అనంతరం అందరూ కలిసి సామూహిక భోజనాలు చేశారు.

పూర్వ విద్యార్థులను సన్మానించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

పరీక్ష సామగ్రితో..

ఏపీడీఏఎస్ఎస్ జిల్లా ఇన్‌ఛార్జిగా వెంకటరామకృష్ణ

రంపచోడవరం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో దేవాంగ అభ్యుదయ సేవా సంఘాన్ని విస్తృతపర్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు సంఘ రాష్ట్ర కన్వీనర్ గుత్తి త్యాగరాజు పేర్కొన్నారు. మంగళవారం ఆయన రంపచోడవరం వచ్చారు. ఈ సందర్భంగా సంఘ సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ దేవాంగ అభ్యుదయ సేవా సంఘం(ఏపీడీఏఎస్ఎస్) పోలవరం జిల్లా అధ్యక్షునిగా యర్రా వెంకటరామకృష్ణ(బాలాజీ శ్రీను)ను నియమించారు. ఈ సందర్భంగా కన్వీనర్ త్యాగరాజు మాట్లాడుతూ వెంకటరామకృష్ణ దేవాంగ సమాజ అభివృద్ధితో పాటు సేవా కార్యక్రమాలు, హక్కుల పరిరక్షణ కార్యక్రమాలను సమర్థంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

రంపచోడవరం: రాష్ట్రవ్యాప్తంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న ఒప్పంద రెసిడెన్షియల్ టీచర్స్(సీఆర్టీ)ను త్వరలో విడుదల చేయనున్న డీఎస్సీలో మినహాయించి నోటిఫికేషన్ ఇవ్వాలని కాంట్రాక్ట్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.రమేష్, ఉపాధ్యక్షులు మోహన్, వెంకటేష్ కోరారు. మంగళవారం వారు మంగళగిరిలో సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌లను కలిసి, వినతిపత్రం ఇచ్చినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 1,284 మంది సీఆర్టీలు పనిచేస్తున్నారన్నారు. త్వరలో విడుదల కానున్న డీఎస్సీలో తమను మినహాయించి నోటిఫికేషన్ విడుదల చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కలిసిన వారిలో యూనియన్ నాయకులు మూర్తి, వెంకట్, బాలు, శివజ్యోతి, పోసమ్మ, లక్ష్మణ్, కృష్ణారెడ్డి, కిషోర్, గోపాలకృష్ణ, రమేష్, మహేష్, శ్రీహరి, మధు, చంద్రశేఖర్, పుణ్యవతి, ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

హిందీ లోయర్, హయ్యర్ పరీక్షా తేదీల ప్రకటన

ఎటపాక, న్యూస్‌టుడే: దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో నిర్వహించే లోయర్, హయ్యర్ హిందీ పరీక్షల తేదీలు వెలువడినట్లు ప్రచార సభ కమిటీ సభ్యుడు, సీతాపురం జడ్పీ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయులు రవినాయక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 14, 15 తేదీల్లో పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఫీజు చెల్లించిన విద్యార్థులు పరీక్షకు సన్నద్ధం కావాలని సూచించారు. పరీక్షలు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో నిర్వహించడం జరుగుతుందన్నారు.

వైకాపా నాయకుడికి పరామర్శ

గోకవరం, న్యూస్‌టుడే: దాడిలో గాయపడి గోకవరం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పోలవరం జిల్లా రాజవొమ్మంగికి చెందిన వైకాపా నాయకుడు దాట్ల వెంకటేష్‌ను మంగళవారం ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మీ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. అనంతబాబు మాట్లాడుతూ.. గణతంత్ర వేడుకల్లో పాల్గొని కారులో తిరిగి ఇంటికి వెళుతున్న వెంకటేష్‌పై రాజవొమ్మంగి వద్ద గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారన్నారు. కారులో ఇంటికి తిరిగి వస్తున్న వారిని అడ్డగించి దాడికి పాల్పడడం దారుణమన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లానన్నారు.

(c) eenadu

ఈనాడు ప్రకాశం

బుధవారం 28 జనవరి 2026

ఒంగోలులో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ట్రాఫిక్ ఉల్లంఘనులు!

◆ గతేడాది చెల్లించిన జరిమానా రూ.2.02 కోట్లు

ట్రాఫిక్ నిబంధనల అతిక్రమణల్లో జిల్లా ప్రత్యేక ఘనత సాధించింది. వాహన చోదకులు ఏటా రెట్టింపు ఉల్లంఘనలతో తమ రికార్డులను తామే బ్రేక్ చేసుకుంటూ దూసుకుపోతున్నారు. పోలీసు నివేదికలే ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి.

- న్యూస్‌టుడే, ఒంగోలు నేరవిభాగం

కనీస నిబంధనలూ పట్టవు...

రోడ్డుపైకి వచ్చే ప్రతి వాహనదారుడు విధిగా డ్రైవింగ్ లైసెన్సు, రిజిస్ట్రేషన్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, బీమా పత్రం కలిగి ఉండాలి. నిబంధనలకు అనుగుణంగా నంబరు ప్లేటు ఉండాలి. ద్విచక్ర వాహన చోదకుడైతే శిరస్త్రాణం, కార్లు వంటి వాహనాలైతే సీటుబెల్టు విధిగా ధరించాలి. ఇంతవరకు బాగానే ఉన్నా ఎక్కువమంది చోదకులు ఈ సాధారణ నిబంధనలను సైతం ఉల్లంఘిస్తున్నారు. వీటికితోడు ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, అతి వేగం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. మైనర్ల డ్రైవింగ్ సైతం సాధారణంగా మారింది. ఈ విషయమై ఏటా పెద్ద సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి.

కట్టనంటే కుదరదు...

ఈ-చలానే కదా, మీరు జరిమానా వెయ్యండి. మా దగ్గర డబ్బులున్నప్పుడో, మాకు వీలైనప్పుడెప్పుడో కడతాం అంటే కుదరదు. ట్రాఫిక్ ఉల్లంఘనల విషయంలో గతంలో మాదిరిగా పోలీసులు వ్యవహరించడం లేదు. పెండింగ్ చలాన్ల విషయంలో కఠినంగానే ఉంటున్నారు. 2024లో 35.33 శాతం మేరకు వసూలు చేస్తే... 2025లో ఏకంగా 88.83 శాతం మేర కట్టించారు. దీన్నిబట్టి చలాన్ల విషయంలో ఎంత దూకుడుగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతుంది. ఈ విషయంలో రాష్ట్ర హైకోర్టు సైతం జిల్లా పోలీసుల ప్రయత్నాలను ప్రశంసించడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ కూడా జరిమానాల చెల్లింపులో పురోగతికి కారణమని పోలీసులు చెబుతున్నారు.

సంవత్సరం	చలాన్లు	జరిమానా వసూలు (రూ.కోట్లలో)
2024	36,588	0.86
2025	71,129	2.02

స్మార్ట్ బైక్... ప్రమాదాలకు చెక్!

గణతంత్ర దినోత్సవంలో భాగంగా తర్లుపాడు మండలం చెన్నారెడ్డిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన ప్రమాదాలను నిరోధించే 'స్మార్ట్ బైక్' సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. ఇందులో ఉండే ప్రత్యేక సెన్సార్లు నిర్ణీత దూరంలో ఉన్న అడ్డంకిని గుర్తించి చోదకుడిని అప్రమత్తం చేస్తాయి. వెనుక నుంచి అదుపుతప్పి వచ్చే వాహనాల విషయంలోనూ ఇదే విధంగా సూచనలు చేస్తాయి. ఉపాధ్యాయులు రవిశేఖర్ రెడ్డి, నరసింహారావు సహకారంతో విద్యార్థినులు సీహెచ్ శ్రీదివ్య, జి.గాయత్రి ఈ పరికరాన్ని రూపొందించారు. - న్యూస్‌టుడే, మార్కాపురం గ్రామీణం

రూ.300 కోట్లు... రికవరీ చేస్తారా?

- వైకాపా హయాంలో పీడీసీసీబీలో అక్రమాలు
- 20 శాఖలు... 2,211 మందికి నోటీసులు

గత వైకాపా ప్రభుత్వం... ది ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (పీడీసీసీబీ)ను అక్రమాలకు అడ్డాగా మార్చింది. కొందరు నాయకుల ప్రోద్బలంతో అప్పటి అధికారులు కనీస నిబంధనలు పాటించకుండా రూ.కోట్లలో రుణాలు మంజూరు చేశారు. తిరిగి చెల్లించని రుణ ఖాతాలు వేలల్లో ఉన్నాయంటే వ్యవహారం ఏస్థాయిలో సాగిందో అర్థం చేసుకోవచ్చు. కూటమి సర్కారు వచ్చాక చేపట్టిన విచారణలో ఒక్కో బాగోతమూ వెలుగు చూస్తోంది.

- న్యూస్‌టుడే - ఒంగోలు నగరం

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు

పట్టణ శాఖల్లోనే అధికం...

2019-24 మధ్య అప్పటి వైకాపా ప్రభుత్వ హయాంలో పీడీసీసీబీలో భారీ ఎత్తున చోటుచేసుకున్న అక్రమాలపై గత కలెక్టర్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో జిల్లాస్థాయి అధికారులతో త్రీమెన్ కమిటీ వేసి విచారణ జరిపారు. తీవ్రత ఎక్కువగా ఉండడంతో శాఖాపరంగా సమగ్ర విచారణ అవసరమని రాష్ట్ర సహకార శాఖకు వారు తెలియజేయడంతో... మూడు నెలల క్రితం ఆ శాఖ అడిషనల్ డైరెక్టర్ గౌరీశంకర్‌ను విచారణాధికారిగా నియమించారు. విచారణలో భాగంగా బ్యాంకులో రుణాలు తీసుకుని దీర్ఘకాలంగా చెల్లించని వారి జాబితాను వెలికితీశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో 20 బ్యాంకు శాఖల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ రుణాలు ఇచ్చినట్లు ప్రాథమికంగా గుర్తించారు. రూ.లక్షల్లో మొత్తం తీసుకుని ఒక్క వాయిదా చెల్లించని ఖాతాలు సైతం వేలల్లో ఉన్నట్లు తేలింది.

అడ్డగోలుగా మంజూరు...

సాధారణంగా స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇవ్వాలంటే జిల్లా సహకార అధికారి నుంచి అనుమతి తీసుకోవాలి. అదేమీ లేకుండానే పెద్ద సంఖ్యలో రుణాలిచ్చారు. కస్టమ్ హయరింగ్ సెంటర్లు (వ్యవసాయ పరికరాలు), షిఫ్ ఆంధ్ర, కర్షక మిత్ర, జగనన్న పాలవెల్లువ, దీవెన, జాయింట్ లయబిలిటీ గ్రూపులు (జేఎల్‌జీ), ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోలు తదితరాలకు కనిష్ఠంగా రూ.50 వేల నుంచి గరిష్ఠంగా రూ.20 లక్షల వరకు అందజేశారు. వీటిలో రెండు మూడేళ్లయినా రికవరీ లేని వాటిని గుర్తించారు. మొత్తం 2,211 మందికి నోటీసులు జారీ చేశారు. ఈ రుణాలిచ్చేందుకు సహకరించిన నాటి బ్యాంకు మేనేజర్లు, సిబ్బంది వివరాలు సైతం సేకరించారు. ప్రస్తుతం రికవరీకి ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది చర్చనీయాంశంగా మారింది.

ఒక్క కిస్తీ కూడా చెల్లించని రుణాలు రూ.300 కోట్లకు పైగా ఉన్నట్లు సమాచారం. పట్టణ శాఖల్లోనే బినామీ రుణాలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. మరోవైపు... ఒంగోలు టౌన్ శాఖలో అక్రమాలకు పాల్పడిన అధికారిపై చర్యలు లేకపోగా పదోన్నతి కల్పించడం గమనార్హం.

21 మండలాలు... వందశాతం హాజరు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా (అద్దంకి, కందుకూరు మినహా) పరిధిలోని 21 మండలాల్లో మంగళవారం... ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు వందశాతంగా నమోదైంది. మొత్తం 38 మండలాల్లో ఇప్పటివరకు ఇంత హాజరు నమోదు కాలేదు. టీచర్లతో పాటు పిల్లలూ పూర్తిస్థాయిలో బడికి రావడం విశేషం. ఈ మేరకు ఆయా మండలాల ఎంఈవోలకు అభినందనలు తెలుపుతూ విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి సమాచారం పంపారు.

13 మంది ఆర్ఐలకు పోస్టింగ్‌లు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాకు చెందిన 13 మంది సీనియర్ సహాయకులు (రెండేళ్ల సర్వీసు పూర్తయిన వారు)కు... ఖాళీగా ఉన్న మండల తహసీల్దార్ కార్యాలయాల్లో ఆర్ఐలుగా పోస్టింగ్‌లు ఇచ్చారు. ఆర్.ఐ.గా రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఆరుగురిని... కలెక్టరేట్‌తో పాటు, రెవెన్యూ కార్యాలయాల్లో సీనియర్ సహాయకులుగా నియమించారు. ఈ మేరకు కలెక్టరేట్ నుంచి మంగళవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి.

వైభవం... జ్వాలాముఖి గ్రామోత్సవం

ఒంగోలు నగరం పెళ్లూరులో కొలువుదీరిన జ్వాలాముఖి అమ్మవారి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం... చండీ హోమం, చతుర్వేద, లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. అమ్మవారి గ్రామోత్సవం కనులపండువగా సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన కళారూపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బుధవారం కల్యాణ మహోత్సవం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

- న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

మన ఘన రాజ్యాంగం

భారత రాజ్యాంగంలోని పీఠిక నకలు ప్రతులివి. ఒంగోలు పీవీఆర్ పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ కళాపరిషత్ ఉత్సవాల ప్రాంగణంలో సంస్కార భారతి వారు వీటిని ప్రదర్శనకు ఉంచారు. రాజ్యాంగ వజ్రోత్సవాల సందర్భంగా రచనలో భాగమైన మహనీయులను స్మరిస్తూ... మన సాంస్కృతిక వారసత్వ విలవలను గుర్తుచేస్తూ వీటిని అందుబాటులోకి తెచ్చారు.

- న్యూస్‌టుడే, ఒంగోలు సాంస్కృతికం

డ్రోన్‌తో దోమలపై యుద్ధం

ఒంగోలు నగరంలో దోమల ఉత్పత్తిని అరికట్టేందుకు కార్పొరేషన్ వారు ప్రయోగాత్మకంగా డ్రోన్ వినియోగించారు. మంగళవారం... పోతురాజు కాలువ, ప్రధాన మురుగు తటాకాల్లో యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రారంభించారు. కార్మికులు వెళ్లలేని చోట దీంతో మందులు పిచికారీ చేయనున్నట్లు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, మేయర్ సుజాత తెలిపారు.

- న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

బ్యాంకు ఉద్యోగుల నిరసన

ఒంగోలు కర్నూలురోడ్డు, న్యూస్‌టుడే: బ్యాంకులకు అయిదు రోజుల పనిదినాలు అమలు చేయాలన్న డిమాండ్‌తో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకింగ్ యూనియన్స్ (యుఎఫ్‌బీఐ) ఆధ్వర్యంలో ఒంగోలులో మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ కారణంగా అన్ని జాతీయ బ్యాంకులు మూతపడ్డాయి. మినీ స్టేడియం నుంచి ట్రంకురోడ్డు, బస్టాండ్, మంగమూరు రోడ్డు, కలెక్టరేట్ మీదుగా నెల్లూరు బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం యూనియన్ బ్యాంకు వద్ద నిర్వహించిన సమావేశంలో సంఘం కన్వీనర్ రాజీవ్ రతన్‌దేవ్ మాట్లాడారు. అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్థిక, బీమా సంస్థలు వారానికి అయిదు రోజులు మాత్రమే పని చేస్తున్నందున... బ్యాంకులకూ అదే విధానాన్ని వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సంఘం ప్రతినిధులు రాజేష్ ఖన్నా, శ్రీనివాసరావు, సుధాకర్‌రావు, కిషోర్ రెడ్డి, శ్రీధర్, ఉమశంకర్, బ్రహ్మానాయుడు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహన ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు

నల్లమలకు అడవి దున్నల కళ

- 150 ఏళ్ల తరువాత సంచారం
- సంరక్షణకు అటవీ శాఖ చర్యలు

మాంసాహార జంతువుల్లో అడవికి రాజు సింహమైతే... శాకాహార జీవుల్లో దానికి సరితూగగలిగేది అడవి దున్న (ఇండియన్ బైసన్/గౌర్). పులి, సింహం, చిరుతలను సైతం ఎదిరించే శక్తి దీని సొంతం. 150 ఏళ్ల క్రితం నల్లమల అటవీ ప్రాంతంలో ఇవి పెద్ద సంఖ్యలో ఉండేవి. తరువాతి కాలంలో వీటి జాడ కానరావడం లేదు. గాలికుంటు, ఇతర ప్రమాదకర వ్యాధులు ప్రబలి అంతరించిపోయాయన్నది అటవీ శాఖ అధికారుల మాట. అటువంటి దున్నలు గత కొద్ది నెలలుగా అక్కడక్కడా కనిపిస్తుండడంతో వాటి సంరక్షణ దిశగా అడుగులు పడుతున్నాయి.

- న్యూస్‌టుడే, మార్కాపురం, పెద్దదోర్నాల

మార్కాపురం మండలం భూపతిపల్లె సమీపంలో కనిపించిన అడవి దున్న

పాపికొండల నుంచి రాక...?

నంద్యాల డివిజన్ పచ్చర్ల అటవీ ప్రాంతంలో గత ఏడాది తొలిగా ఇది కనిపించింది. తరువాత ఆత్మకూరు పరిధిలోని బైర్లూటి, నాగులూటి; గిద్దలూరు డివిజన్ గుండ్లబ్రహ్మేశ్వరం; దిగువమెట్ట ప్రాంతాల్లో ఇవి దర్శనమిచ్చాయి. ఇటీవల కాలంలో యర్రగొండపాలెం టీఆర్ చెరువు బీట్, కొలుకుల ప్రాంతంలో వీటి సంచారాన్ని గుర్తించినట్లు మార్కాపురం అటవీ క్షేత్ర అధికారి పిచ్చిరెడ్డి, డీఆర్వో నాగరాజుగౌడ్ తెలిపారు. నాలుగు రోజుల క్రితం మార్కాపురం మండలం భూపతిపల్లె పరిసరాల్లోకి ఓ దున్న వచ్చింది. గ్రామస్థుల హడావుడితో సమీప అడవిలోకి వెళ్లిపోయింది. కర్ణాటకలోని తుంగభద్ర ప్రాంతం లేదా పాపికొండల నుంచి ఇవి వస్తున్నట్లు అంచనా వేస్తున్నారు.

1867 వరకు నల్లమలలో వేల సంఖ్యలో అడవి దున్నలు సంచరించేవని అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం గెజిట్‌లో పేర్కొంది. మార్కాపురం అటవీ డివిజన్ కార్యాలయంలో ఇప్పటికీ ఈ ప్రతి ఉంది.

అనుకూల వాతావరణం...

ఈ దున్నలు ముదురు గడ్డి, లేత వెదురు చిగుళ్లను ఆహారంగా తీసుకుంటాయి. ఇలాంటి మైదానాలు నల్లమలలో విస్తారంగా ఉండడంతో వాటి సంతతి పెంచేందుకు అటవీ శాఖ నిర్ణయించింది. అందులో భాగంగా గుండ్లబ్రహ్మేశ్వరం, నంద్యాల జిల్లా ఆత్మకూరు అభయారణ్యంలో వంద ఎకరాల్లో ప్రత్యేకంగా ఎన్‌క్లోజర్లు ఏర్పాటు చేస్తోంది. పాపికొండలు, మధ్యప్రదేశ్‌లో అడవి దున్నలు ఎక్కువగా ఉండడంతో అక్కడి నుంచి ఒక్కో విడతలో 40 చొప్పున మూడు విడతల్లో 120 తెచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు. వీటిని నెల రోజుల పాటు ఎన్‌క్లోజర్లలో సంరక్షించి ఇక్కడి వాతావరణానికి అలవాటు పడేలా చేస్తారు. అనంతరం అడవిలోకి విడిచి పెట్టాలన్నది కార్యాచరణ.

ముదురు గడ్డి పైభాగాన్ని దున్నలు తింటే... కొత్తగా మొలిచే లేతగడ్డి జింకలు, దుప్పులకు ఆహారంగా ఉపయోగపడుతుంది. తద్వారా వాటికీ మేలు కలుగుతుందని భావిస్తున్నారు.

పశు మాంసం.. వక్ర మార్గం

జంతువధ జరుగుతున్న రేకుల షెడ్డు

ఫ్రీజర్‌లో నిల్వ చేసిన మాంసం

ప్రకాశం, బాపట్ల జిల్లాల సరిహద్దుగా ఉన్న అద్దంకి మండలం ధర్మవరం నుంచి యథేచ్ఛగా పశు మాంసం రవాణా అవుతోంది. గ్రామంలోని కొండను ఆనుకుని ప్రత్యేకంగా రేకుల షెడ్డు వేసి ఈ వ్యవహారం సాగిస్తున్నారు. జంతు చర్మాలను ఒలిచి అక్కడే ఆరబెడుతున్నారు. మాంసాన్ని ముక్కలుగా చేసి ఫ్రీజర్లలో నిల్వ చేసి... రాత్రి వేళల్లో ఐస్ బాక్సుల్లో తరలిస్తున్నారు. ఇక్కడి వ్యర్థాలను కొన్ని చేపల చెరువులకూ తరలిస్తున్నట్లు సమాచారం. తీవ్ర దుర్వాసన వెలువడుతుండడం, పదుల సంఖ్యలో కుక్కలు తిష్ఠ వేస్తుండడంతో అటుగా వెళ్లేందుకు స్థానికులు భయపడుతున్నారు. ఈ విషయమై బాపట్ల జిల్లా పశువైద్యాధికారి బి.వేణుగోపాల్‌ను సంప్రదించగా... మాంసం ఎగుమతికి ఎవరికీ అనుమతులు ఇవ్వలేదని చెప్పారు. ఆహార భద్రతాధికారి ప్రణీత్ స్పందిస్తూ పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, అద్దంకి

చిక్కులు లేకుండా పక్కాగా రీసర్వే

◆ నాలుగో విడతకు ప్రణాళికాబద్ధంగా కసరత్తు

రోవర్, ట్యాబ్‌తో సర్వే చేస్తున్న సిబ్బంది

భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా రీ సర్వే చేపట్టేందుకు అధికార యంత్రాంగం ప్రణాళిక రూపొందించింది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని లోపాలు సరిచేసి, తప్పులు దొర్లకుండా క్షేత్రస్థాయి సిబ్బందికి దిశా నిర్దేశం చేసింది. నాలుగో విడతగా ఉమ్మడి జిల్లాలోని 36 మండలాలు.. 123 గ్రామాల పరిధిలోని 3.95 లక్షల ఎకరాల్లో ఈ ప్రక్రియ చేపట్టేందుకు చర్యలు తీసుకుంది.

ఈనాడు, ఒంగోలు

గతంలో తప్పుల తడక...

గతంలో చేపట్టిన రీసర్వే సమస్యలు నేటికీ వెన్నాడడంతో రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. జాయింట్ ఎల్పీఎంల కారణంగా వారు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు. మరోవైపు ఒక సర్వే నంబరులో ఎకరానికి 95 సెంట్లు తగ్గినట్లు చూపితే... మరొకరిదాంట్లో సర్వే నంబర్లే తప్పుగా నమోదు చేశారు. ఇలాంటి ఉదంతాలు కోకొల్లలుగా ఉన్నాయి. ప్రస్తుతం... ఈ తప్పిదాలను సరిచేసే ప్రయత్నం చేస్తున్నారు. ప్రతి వారం రెవెన్యూ క్లినిక్‌లు నిర్వహించి ఒక్కొక్కటిగా సమస్యలు పరిష్కరిస్తున్నారు.

ప్రక్రియ మార్చారిలా...

గతంలో రైతు వచ్చినా రాకున్నా సర్వే చేసుకుంటూ వెళ్లిపోయేవారు. ఇప్పుడు రైతును రప్పించి చేస్తారు. తొలుత గ్రామాల వారీగా ప్రభుత్వ, పట్టా భూములు ఎన్ని ఉన్నాయన్నది అంచనా వేస్తారు. దస్త్రాల ప్రకారం క్షేత్రస్థాయిలో సర్వే చేస్తారు. తరువాత ప్రతి ఒక్కరి భూమి వివరాలు సర్వే చేసి నమూనా (డ్రాఫ్ట్) ఆర్వోఆర్ ఇస్తారు. ఇందులో తప్పులు లేవని నిర్ధారించాకే తుదిగా పట్టాదారు పాస్ పుస్తకం ముద్రిస్తారు. సర్వే జరిగే రోజుల్లో వీఆర్వో, సర్వేయరు వేరే విధులు చేపట్టకుండా సర్వే మాత్రమే చేపట్టేలా ఆదేశాలు జారీచేశారు.

క్షేత్రస్థాయిలోనే పరిష్కారం...

గతంలో ఏదైనా భూ వివాద పరిష్కారం జిల్లా సంయుక్త కలెక్టర్ స్థాయిలో ఉండేది. దీంతో పరిష్కారానికి చాలా సమయం పట్టేది. ఇప్పుడు మ్యుటేషన్ కరెక్షన్, ఎల్పీఎం, సర్వే నంబరు తప్పులు, జీరో, నోషనల్ ఖాతా, రెండు ఖాతాలు.. తదితరాలు పరిష్కరించే బాధ్యత జేసీ నుంచి ఆర్డీవో, తహసీల్దార్లకు బదలాయించారు. గతంలో దొర్లిన తప్పులను సరిచేసేందుకు... నియోజకవర్గానికి రెండు గ్రామాలను ఎంపిక చేసి ప్రతి ఖాతాను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఆ మేరకు కొత్త పాసుపుస్తకం ఇచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. ప్రజల ఇబ్బందులు తొలగించడమే లక్ష్యంగా రెవెన్యూ యంత్రాంగం తీవ్రంగా శ్రమిస్తోందని ప్రకాశం జిల్లా జేసీ రోణంకి గోపాలకృష్ణ తెలిపారు.

డయాలసిస్ బాధితులకు గతంలో 108 ద్వారా ఉచిత రవాణా సౌకర్యం అందుబాటులో ఉండేది. గత ఏడాది నవంబరు నుంచి ఈ సేవలు అందకపోవడంతో వారంతా వ్యయప్రయాసలకు గురవుతున్నారు. సమస్య తీవ్రంగా ఉన్న వారి పరిస్థితి మరీ దయనీయం. ప్రత్యేకంగా ఆటోల్లో వచ్చేందుకు రూ.వందల్లో చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. అధికారులు స్పందించి తమ ఇక్కట్లు తీర్చాలని వారు కోరుతున్నారు. - న్యూస్‌టుడే - కనిగిరి

కనిగిరి కేంద్రంలో డయాలసిస్ చేయించుకుంటున్న బాధితులు

మూత్రపిండం... రవాణా గండం!

● 108 సేవలు నిలిచి బాధితుల వెతలు

పెరుగుతన్న తీవ్రత...

ఉమ్మడి జిల్లాలో ఒంగోలు, కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, వై.పాలెం, కందుకూరులో మొత్తం తొమ్మిది డయాలసిస్ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో రోజూ 724 మందికి పైగా కిడ్నీ బాధితులు సేవలు పొందుతున్నారు. నెల్లూరు, గుంటూరు, కర్నూలు, కడప జిల్లాల నుంచి సైతం మరో 300 మంది వరకు వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. రెండేళ్ల వ్యవధిలో 224 మంది బాధితులు పెరిగారంటే సమస్య తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వీరిలో ఎక్కువ మంది వారంలో రెండు నుంచి నాలుగు సార్లు డయాలసిస్ చేయించుకోవాల్సిన వారే ఉన్నారు. ఏమాత్రం అశ్రద్ధ చేసినా ప్రాణాపాయం తప్పదు.

అదనపు భారం...

బాధితుల్లో ఎక్కువ మంది నిరుపేదలు, గ్రామీణ ప్రాంతాల వారే ఉన్నారు. ఆయా గ్రామాల నుంచి జిల్లా, డివిజన్ కేంద్రాల్లో ఉన్న డయాలసిస్ సెంటర్లకు వచ్చి వైద్యం చేయించుకోవాలి. గతంలో 108 వాహనాల్లో వీరిని తీసుకెళ్లేవారు. ప్రస్తుతం ఆ అవకాశం లేకపోవడంతో సొంత ఖర్చులతో వెళ్లాల్సి వస్తోంది. పీసీపల్లి మండలం అన్నపురెడ్డిపల్లికి చెందిన చల్లా రమణమ్మ గత నాలుగేళ్లుగా కనిగిరి కేంద్రంలో డయాలసిస్ చేయించుకుంటున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోలోనే రావాల్సి వస్తోంది. తోడుగా మరొకరి సాయం అవసరం కావడంతో నెలకు రూ.మూడు వేలు ఛార్జీలకే అవతున్నాయని వాపోతున్నారు. కనిగిరి మండలం చిన ఇర్లపాడుకు చెందిన ముద్దా అబ్రహందీ ఇదే పరిస్థితి. నెలకు ఎనిమిది సార్లు డయాలసిస్ చేయించుకునేందుకు రానూపోనూ ఛార్జీలకే రూ.2 వేలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కనిగిరి డయాలసిస్ కేంద్రం మేనేజర్‌ను సంప్రదించగా... సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చేపడుతున్న పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులపై జిల్లాలోని మండల అధికారులతో మంగళవారం నిర్వహించిన వీక్షణ సమావేశంలో మాట్లాడారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా నిధులను పూర్తిస్థాయిలో వినియోగించడంపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు గృహ నిర్మాణాలు పూర్తయ్యేలా పర్యవేక్షించాలన్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల కోసం అవసరమైన స్థలాలను త్వరగా గుర్తించాలన్నారు. సమావేశంలో జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో ఓబులేసు పాల్గొన్నారు.

WE MANUFACTURE AND SUPPLY APPAREL
FOR BULK ORDER QUANTITES
REGULAR WEAR
- RELIGIOUS WEAR
- TOPS
- BOTTOMS
- UNDERGARMENTS
- NIGHT WEAR

FOR MEN & WOMEN
BOYS & GIRLS
VIJAYAWADA-AP
8977796538

(c) eenadu

విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి

విజేతలుగా నిలిచిన విద్యార్థులతో ఎంఈవో-2 సుబ్బారెడ్డి, న్యాయనిర్ణేతలు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకునేందుకు ప్రతిభా పాటవ పోటీలు ఎంతగానో దోహదపడతాయని కందుకూరు ఎంఈవో-2 కె.సుబ్బారెడ్డి అన్నారు. ప్రతి విద్యార్థిలో పోటీతత్వం పెరగాలని, అలాగని అపజయం పొలైతే కుంగిపోకుండా.. తిరిగి విజయం సాధించేందుకు పట్టుదలతో కృషిచేయాలని అన్నారు. స్థానిక ఓవీరోడ్డులోని శ్రీప్రతిభ మహిళా జూనియర్ కళాశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రాంతీయ స్థాయి ప్రతిభా పాటవ పోటీలు మంగళవారం నిర్వహించారు. క్విజ్ (సమకాలీన అంశాలు, జనరల్ నాలెడ్జ్), ఉపన్యాసం (ఆరోగ్యం, ఆహారపు అలవాట్లు), చిత్రలేఖనం(నీటి సంరక్షణ, నిర్వహణ), వ్యాసరచన(మాతృభాష ప్రాముఖ్యత, ప్రకృతిని పరిరక్షిద్దాం) అంశాలపై నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈవో మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ఉజ్వల భవిష్యత్తులో వారు ఉన్నత స్థాయికి ఎదిగేలా 'ఈనాడు' సంస్థ ఉద్దేశం కనిపిస్తోందన్నారు. సమాజానికి ఉపయోగపడే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు అభినందనలన్నారు. న్యాయనిర్ణేతగా వ్యవహరించిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జీవీ శేషగిరిరావు మాట్లాడుతూ కందుకూరు విద్యార్థులు జిల్లా స్థాయిలో రాణించి పాఠశాల, తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రతిభ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు, న్యాయనిర్ణేతలు ప్రకాశం ఉపాధ్యాయ ఇంగ్లిష్ కళాశాల ప్రొఫెసర్ కె.పావని, మాధవి పాల్గొన్నారు.

విజేతలు వీరే..: వ్యాసరచన: పి.సాయిపూజిత (శ్రీగౌతమ్ ఒలింపియాడ్) ప్రథమ, డి.సౌకత్ లాణి (బీఆర్ అక్షర) ద్వితీయ, ఎస్కే.నజీరా (శ్రీచైతన్య) తృతీయ. చిత్రలేఖనం: ఎ.వైష్ణవి (నాగార్జున) ప్రథమ, సిహెచ్ చైత్ర (శ్రీగౌతమ్) ద్వితీయ, పీవీ ప్రుద్వీసాయి (శ్రీవివేకా) తృతీయ. ఉపన్యాసం: డి.డింపుల్ (బీఆర్ అక్షర) ప్రథమ, బి.చేతన (నారాయణ ఒలింపియాడ్) ద్వితీయ, జి.మహేశ్వరి (కందుకూరి పబ్లిక్ స్కూల్) తృతీయ. క్విజ్: జి.చరణ్ (నాగార్జున) ప్రథమ, ఎస్ఆర్ అరవింద్ (అభ్యుదయ) ద్వితీయ, జి.గౌతమ్ (కేపీఎస్) తృతీయ స్థానాలు సాధించారు.

భారీ ఉపకార వేతనాలతో అమెరికాలో చదువు

❖ ఒంగోలుకు చెందిన విద్యార్థుల ఎంపిక

అభిశౌర్య

హమీద్

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఒంగోలు నగరానికి చెందిన ఇద్దరు విద్యార్థులు అమెరికాలోని ప్రముఖ విద్యాసంస్థ మిల్వాకీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ కోర్సు చదవడానికి భారీ ఉపకార వేతనాలు సాధించారు. ఉన్నత చదువుల ఆకాంక్ష సాకారం చేసుకున్నారు. లక్ష్మీనారాయణ మోహనకుమార్, ప్రభావతి దంపతుల కుమారుడు అభిశౌర్య నాలుగు సంవత్సరాల చదువు కోసం కంప్యూటర్ సైన్స్ విభాగంలో రూ.1.20 కోట్లు, షేక్ లియాఖత్, సల్మా దంపతుల కుమారుడు అబ్దుల్ హమీద్ రూ.కోటి స్కాలర్‌షిప్ సాధించారు. దీనికి ఇంటర్మీడియట్ మార్కులు, అంతర్జాతీయ స్థాయి పరీక్ష మార్కులు కొలమానంగా తీసుకొని స్కాలర్‌షిప్ ప్రకటించారు. ఎంపికైన విద్యార్థులను ఇన్సిట్యూట్ కెరీర్ కన్సల్టెన్సీ ఎండీ జి.వివేకానందమూర్తి అభినందించారు. సాధారణంగా భారత్‌లో బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ)లో సైన్స్, ఇంజినీరింగ్ కలిపి ఉంటాయి. అమెరికాలో మాత్రం ఈ రెండు సబ్జెక్టులు వేర్వేరు. యూఎస్‌లో ఎంఎస్ కంప్యూటర్ సైన్స్‌లో చేరదలచుకున్న భారతీయులు దీనికోసమే కంప్యూటర్ సైన్స్‌కు సంబంధించి ఒకటి, రెండు అదనపు సబ్జెక్టులు చదువుతారు.

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – తాడికొండ

బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ – రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Hospitality Partner: Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Man of the Series: Hero
Digital Partner: ఈనాడు.నెట్
TV Partner: ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్
Organised by: ఈనాడు ఈతరం క్లబ్

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - I జూనియర్స్: మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ – రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్సులతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులకు చేసి ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - I జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్సులతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ భార్గవ్ ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సులతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

సీనియర్స్ విన్నర్స్ రాయలసీమ రాకర్స్

గ్రౌండ్-2లో సీనియర్స్ : సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ చరణ్ జిత్ ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-I (జూనియర్స్)
మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)
మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

కెనరా బ్యాంక్ Canara Bank
भारत सरकार का उपक्रम A Government of India Undertaking
ప్రాంతీయ కార్యాలయం : ఒంగోలు
డి.నెం.37-1-407/12, 1వంతస్తు, భాగ్యనగర్ 2వ లైన్, ఒంగోలు-523001.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

టు:
1. M/s లాస్య శ్రీ గ్రానైట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిట్రిక్స్: శ్రీమతి గూడూరి అనురాధ, తండ్రి: వెంకట నరసయ్య, రిజిస్టర్డ్ ఆఫీస్: సర్వే నెం. 149-9బి, కర్నూల్ రోడ్డు, బుదవాడ గ్రామం, చీమకుర్తి మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 523226.
2. M/s శ్రీ లక్ష్మీ నరసింహ గ్రానైట్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న: i) మేనేజింగ్ పార్టనర్: శ్రీమతి గూడూరి అనురాధ, తండ్రి: వెంకట నరసయ్య మరియు ii) పార్టనర్: శ్రీ ఇంటూరి గోపి కృష్ణ తండ్రి: బుచ్చయ్య. రిజిస్టర్డ్ ఆఫీస్: సర్వే నెం. 152/1, బుదవాడ గ్రామం, చీమకుర్తి మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 523226.
3. శ్రీమతి గూడూరి అనురాధ, తండ్రి: వెంకట నరసయ్య, బుదవాడ గ్రామం, చీమకుర్తి మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 523253.
4. శ్రీ ఇంటూరి గోపి కృష్ణ తండ్రి: బుచ్చయ్య, బుదవాడ గ్రామం, చీమకుర్తి మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 523253.
5. M/s శ్రీ అంజనాద్రి గ్రానైట్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్: శ్రీ ఇంటూరి గోపి కృష్ణ, తండ్రి: బుచ్చయ్య, రిజిస్టర్డ్ ఆఫీస్: యస్‌వై నెం. 77/1 & 77/2, బుదవాడ గ్రామం, చీమకుర్తి మండలం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 523226.

డియర్ సర్ / మేడమ్,
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.
మా కెనరా బ్యాంక్, ఒంగోలు మంగమూర్ రోడ్డు బ్రాంచ్ నుండి M/s లాస్య శ్రీ గ్రానైట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిట్రిక్స్: శ్రీమతి గూడూరి అనురాధ, తండ్రి: వెంకట నరసయ్య (ఇక్కడ "ఋణగ్రహీత" గా సూచిస్తారు), 1) శ్రీమతి గూడూరి అనురాధ, తండ్రి: వెంకట నరసయ్య 2) శ్రీ ఇంటూరి గోపి కృష్ణ, తండ్రి: బుచ్చయ్య, 3) M/s శ్రీ లక్ష్మీ నరసింహ గ్రానైట్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న: i) మేనేజింగ్ పార్టనర్: శ్రీమతి గూడూరి అనురాధ, తండ్రి: వెంకట నరసయ్య మరియు ii) పార్టనర్: శ్రీ ఇంటూరి గోపి కృష్ణ, తండ్రి: బుచ్చయ్య మరియు 4) M/s శ్రీ అంజనాద్రి గ్రానైట్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్: శ్రీ ఇంటూరి గోపి కృష్ణ, తండ్రి: బుచ్చయ్య (ఇక్కడ "హామీదారులు" గా సూచిస్తారు) గార్లు పొందిన ఋణ సౌకర్యాల వివరములు:

లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం.	లోన్ మొత్తం మరియు లోన్ తేదీ	వడ్డీతో కలిపి తేదీ 21.01.2026 నాటికి బకాయి మొత్తం	వడ్డీ రేటు
MSME టర్మ్ లోన్ అకౌంట్ నెం. 170015051053	రూ. 2,30,00,000/- తేదీ: 18.12.2024	రూ. 2,09,16,678/-	12.45% p.a
MSME టర్మ్ లోన్ అకౌంట్ నెం. 170015184180	రూ. 46,00,000/- తేదీ: 18.12.2024	రూ. 37,91,836/-	12.45% p.a
MSME OD/OCC అకౌంట్ నెం.125007345911	రూ. 10,00,000/- తేదీ: 18.12.2024	రూ. 9,99,952/-	12.15% p.a

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ **సదరు ఋణాన్ని తేది.19.01.2026 న నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది.** అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా **రూ. 2,57,08,466/- (అక్షరాల రెండు కోట్ల యాభై ఏడు లక్షల ఎనిమిది వేల నాలుగు వందల అరవై ఆరు రూపాయలు మాత్రమే) +** తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది. SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

చరాస్తి : ఆంధ్రప్రదేశ్–523226, ప్రకాశం జిల్లా, చీమకుర్తి మండలం, బుదవాడ గ్రామం, సర్వే నెం.149/9B నందు అప్పటికే ఉన్న మరియు బ్యాంక్ ఫైనాన్స్‌తో కొనుగోలు చేసి, అమర్చిన మెషినరీ తనఖా ఉంచబడినవి.
టైటిల్ హోల్డర్ పేరు : M/s. లాస్య శ్రీ గ్రానైట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రాతినిధ్యం వహిస్తున్నవారు ప్రొప్రయిట్రిక్స్ శ్రీమతి గూడూరి అనురాధ, తండ్రి : వెంకట నరసయ్య.
స్థిరాస్తి : ఆస్తి నెం.1 : ప్రకాశం జిల్లా, చీమకుర్తి మండలం, చీమకుర్తి ఎస్ఆర్ఓ, బుదవాడ గ్రామం, సర్వే నెం.149/9B, సబ్ డివిజన్ తరువాత సర్వే నెం.149/9B1 నందు విస్తీర్ణం ఎకరా 0.81 1/2 సెంట్లు లేదా 3944.6 చ॥గ॥లు స్థలం ఇందులో 10440 చ॥అ॥లుతో 10 అ॥ల ఎత్తు గల ఎ.సి షీట్ రూఫ్ షెడ్ మరియు గ్రానైట్ కట్టింగ్ మరియు పాలిషింగ్ యూనిట్ కలదు. **హద్దులు : తూర్పు :** 40 అ॥ల రోడ్డు, **దక్షిణం :** శ్రీ సత్య గ్రానైట్ వారికి చెందిన స్థలం, **పడమర :** యశ్వన్ ఎక్స్‌పోర్ట్స్ వారి భూమి కొంతవరకు మరియు మరియు శ్రీ విష్ణు గ్రానైట్స్ కొంతవరకు, **ఉత్తరం :** సర్వే నెం.149/9 లోని గూడూరి వెంకట నరసయ్య మరియు ఇతరులకు చెందిన భూమి.
(రిజిస్టర్డ్ దాఖల్ డీడ్ డాక్యుమెంట్ నెం.4077/2022, తేది.03.11.2022 ఎస్ఆర్ఓ చీమకుర్తి)
టైటిల్ హోల్డర్ పేరు : శ్రీమతి గూడూరి అనురాధ, తండ్రి : వెంకట నరసయ్య.
ఆస్తి నెం.2 : ప్రకాశం జిల్లా, చీమకుర్తి మండలం, చీమకుర్తి ఎస్ఆర్ఓ, బుదవాడ గ్రామం, సర్వే నెం.152/1, సబ్ డివిజన్ తరువాత సర్వే నెం.152/1సి1 నందు విస్తీర్ణం ఎ. 0.38 సెంట్లు లేదా 1839.20 చ॥గ॥లు స్థలం ఇందులో 3960 చ॥అ॥లుతో 10 అ॥ల ఎత్తు గల ఎ.సి షీట్ రూఫ్ షెడ్ మరియు గ్రానైట్ కట్టింగ్ మరియు పాలిషింగ్ యూనిట్ కలదు. **హద్దులు : తూర్పు :** మీనాక్షి నాయుడు గారికి చెందిన భూమి, **దక్షిణం :** అతులూరి బ్రహ్మనాయుడు గారికి చెందిన భూమి, **పడమర :** లక్ష్మీ వెంకటేశ్వర ఎక్స్‌పోర్ట్స్ వారికి చెందిన భూమి, **ఉత్తరం :** 40 అ॥ల వెడల్పు రోడ్డు.
(రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.530/2015, తేది.06.04.2015 ఎస్ఆర్ఓ చీమకుర్తి)
టైటిల్ హోల్డర్ పేరు : M/s. శ్రీ లక్ష్మీ నరసింహా గ్రానైట్స్ ప్రాతినిధ్యం వహిస్తున్నవారు 1) మేనేజింగ్ పార్టనర్ శ్రీమతి గూడూరి అనురాధ, తండ్రి : వెంకట నరసయ్య మరియు 2) పార్టనర్ : శ్రీ ఇంటూరి గోపి కృష్ణ, తండ్రి : బుచ్చయ్య.
ఆస్తి నెం.3 : ప్రకాశం జిల్లా, చీమకుర్తి మండలం, చీమకుర్తి ఎస్ఆర్ఓ, బుదవాడ గ్రామం, సర్వే నెం.77/1 & 77/2 నందు విస్తీర్ణం ఎ. 0.52 1/2 సెంట్లు (ఎ. 0.25 1/2 సెంట్లు + ఎ.0.27 సెంట్లు) లేదా 2541 చ॥గ॥లులోని స్థలం ఇందులో 4000 చ॥అ॥లుతో 10 అ॥ల ఎత్తు గల ఎ.సి షీట్ రూఫ్ షెడ్ మరియు గ్రానైట్ కట్టింగ్ మరియు పాలిషింగ్ యూనిట్ కలదు. **హద్దులు : తూర్పు :** రేవంత్ గ్రానైట్స్ వారికి చెందిన భూమి, **దక్షిణం :** మేదరమెట్ల వెంకటేశ్వర్లు మరియు ఇతరులు చెందిన భూమి, **పడమర :** 40 అ॥ల వెడల్పు రోడ్డు, **ఉత్తరం :** ఈ ఆస్తి మరియు రేవంత్ గ్రానైట్స్‌కి చెందిన ఉమ్మడి రోడ్డు.
(రిజిస్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.3335/2021, తేది.03.09.2021 ఎస్ఆర్ఓ చీమకుర్తి)
టైటిల్ హోల్డర్ పేరు : M/s. శ్రీ అంజనాద్రి గ్రానైట్స్ ప్రాతినిధ్యం వహిస్తున్నవారు ప్రొప్రయిటర్ శ్రీ ఇంటూరి గోపి కృష్ణ, తండ్రి : బుచ్చయ్య.

తేది: 22.01.2026, ప్రదేశం: ఒంగోలు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

మిత్రులను బలిగొన్న ఈత సరదా

విగతజీవులుగా భరత్ కుమార్, వెంకటేష్

నాగులుప్పలపాడు: ఈత కోసమని వెళ్లిన ముగ్గురు స్నేహితుల్లో ఇద్దరు మృత్యువాత పడ్డారు. దీంతో వారి కుటుంబ సభ్యులు, బంధువులు రోదించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఒంగోలు గోపాల్‌నగర్‌కు చెందిన తోట భరత్ కుమార్(21) పూల దుకాణంలో పని చేస్తుంటాడు. కనపర్తి పంచాయతీ తోపుపాలేనికి చెందిన నలగర్ల జయకృష్ణ ఓ బంగారు దుకాణంలో పనిచేస్తున్నాడు. ఒంగోలు మరారిపాలేనికి చెందిన సాంబానీ వెంకటేష్(23) కార్పెంటర్. ఈ ముగ్గురూ స్నేహితులు. మంగళవారం ముగ్గురూ కలిసి నాగులుప్పలపాడు మండలంలోని అమ్మనబ్రోలు-వినోదరాయునిపాలెం మధ్య కనపర్తి ఎత్తిపోతల పథకం సైఫన్ సమీప పొలాల్లో పార్టీ చేసుకున్నారు. అనంతరం అక్కడ నుంచి వచ్చిన భరత్ ముందుగా సైఫన్‌లోకి ఈత కోసం దిగాడు. అతడు గల్లంతు కావడంతో కాపాడటానికి జయకృష్ణ, వెంకటేష్‌లు దూకారు. దీంతో ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. అటుగా ట్రాక్టర్‌పై వెళుతున్న స్థానికులు గుర్తించి జయకృష్ణను కండువా వేసి బయటకు సురక్షితంగా తీశారు. గల్లంతైన భరత్, వెంకటేష్‌లు మృతి చెందారు. ఈతగాళ్ల సాయంతో మృతదేహాలను బయటకు తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రజియా సుల్తానా తెలిపారు.

మధ్యవర్తిత్వం మేలైన మార్గం

న్యాయవాదుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌ఛార్జి జిల్లా జడ్జి రాజ్యలక్ష్మి తదితరులు

ఒంగోలు న్యాయవిభాగం: మధ్యవర్తిత్వం ద్వారా ఇరువర్గాల కక్షిదారులు కేసులు పరిష్కరించుకుంటే సత్వర న్యాయం పొందవచ్చని ఇన్‌ఛార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ టి.రాజ్యలక్ష్మి సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన న్యాయవాదులకు మంగళవారం 40 గంటల శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. న్యాయస్థానాల్లో అపరిష్కృత కేసులకు మధ్యవర్తిత్వంలో శిక్షణ పొందిన న్యాయవాదులు సమర్థవంతంగా వ్యవహరించి కక్షిదారుల అంగీకారంతో పరిష్కారమార్గాలను చూపాలన్నారు. దీనివల్ల ఇరువర్గాల వారూ విజయం సాధించినట్లేనన్నారు. వారికి సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ తిరుమలరావు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.హేమలత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్కే ఇబ్రహీం షరీఫ్, మధ్యవర్తిత్వం శిక్షణ నిపుణులు ఎస్.అరుణాచలం, ఎస్.పద్మ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణం, ప్లాట్ నెం. U1, కామాక్షి లేక్‌వ్యూ అపార్ట్మెంట్, ఆర్.ఆర్.ట్యాంక్ దగ్గర, నివాసం, **వీరిశెట్టి హుస్సేనయ్య గారి కుమారుడు వీరిశెట్టి కృష్ణ** అను వారు నాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా.
నా క్లయింట్ కు రావలసిన బకాయిల గురించి ఒంగోలు జూనియర్ సివిల్ జడ్జి మొబైలు కోర్టులో **O.S No. 475/2022** న **దుంపా వేంకటేశ్వర రెడ్డి** పై ప్రామిసరీ నోటు బాకీ గురించి దావా దాఖలు చేయగా అది విచారణ నిల్వలో వుండి వున్నది. అదే విధంగా ఒంగోలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోరులో **O.S No. 141/2019** న, **నల్లూరి పద్మ** పైన అగ్రిమెంట్ ప్రకారం ఆస్తిని విక్రయం చేయవల్సినదిగా దావా దాఖలు చేయగా అది విచారణ నిల్వలో వుండి వున్నది.
నా క్లయింట్ పై పైన పేర్కొన్న దుంపా వెంకటేశ్వరరెడ్డి, సంతనూతలపాడు వాసి, నా క్లయింట్‌ను ఇబ్బంది పెట్టవలెనని తలంపుతో అతని అనుచరులైన బొడ్డుకామేశ్వరరావు, సంతనూతలపాడు వాసి వగైరాలతో కలిసి అక్రమముగా నా క్లయింట్ పై **O.S No. 63/2025** న ఒంగోలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో దావా దాఖలు చేసి రూ.20 లక్షలు బాకీ వున్నదని, నా క్లయింట్ సంతకం ఫోర్జరీ చేసి దావా దాఖలు చేయగా నా క్లయింట్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వారిని కలిసి పై వారలు చేసిన కుటిలయత్నములను గురించి పోలీసు అధికారులకు తెలిపి వున్నాడు.
నా క్లయింట్ గతంలో 1993-1996 సంవత్సరాల మధ్య లారీలు కొనుగోలు నిమిత్తము ప్రైవేట్ వ్యక్తుల నుండి ఫైనాన్స్ పొందినప్పుడు హామీగా నా క్లయింట్ సంతకం చేసిన ఖాళీ బ్యాంకు చెక్కులు, సంతకం చేసిన ఖాళీ ప్రామిసరీ నోట్లు, మరియు సంతకం చేసిన కొన్ని ఖాళీ స్టాంప్ పేపర్లు ఫైనాన్స్ వారికి ఇచ్చివున్నాడు, దరిమిలా ఫైనాన్స్ బాకీలన్నీ చెల్లించి వున్నాడు. కొన్ని కారణముల వలన పైన తెలిపిన సంతకం చేసిన డాక్యుమెంట్స్ నా క్లయింట్‌కు వాపసు ఇచ్చి యుండలేదు.
నా క్లయింట్ గత 15 సంవత్సరాల నుండి ఎవ్వరి వద్ద, ఎటువంటి రుణం తీసుకొనటం కానీ, ప్రామిసరీ నోట్లు వ్రాయించి ఇవ్వడం గాని జరుగలేదు. నా క్లయింట్ యొక్క శత్రువులైన వారు నా క్లయింటును ఆర్థికంగా ఇబ్బంది పెట్టవలెనని తలంపుతో ఇతరుల సహకారంతో తప్పుడు కేసులు నమోదు చేయుటకు ప్రయత్నించుచున్నట్లుగా తెలియవచ్చినది. కావున యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై వారలు, వారి అనుచరులు గాని, మరెవ్వరైన నా క్లయింట్ పై తప్పుడు దావాలు వేసిన ఎడల అట్టి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొనగలడని, వారు చట్టప్రకారం శిక్షకు గురికావలసి వస్తుందని హెచ్చరించడమైనది.

స్థలం : ఒంగోలు
తేది : 27-01-2026
ఇట్లు: పి.యస్.వి. సత్యనారాయణ రెడ్డి
అడ్వకేట్, జిల్లా కోర్టు సెంటర్, ఒంగోలు,
సెల్: 9390411081

బాలికపై మేనత్త భర్త లైంగికదాడి

❖ పోక్సో కేసు నమోదు

ఒంగోలు నేరవిభాగం: మానసిక పరిస్థితి సరిగా లేని 13 ఏళ్ల బాలికపై లైంగికదాడి చేసిన ఆమె మేనత్త భర్తపై ఒంగోలు మహిళా పోలీసుస్టేషన్‌లో పోక్సో చట్టం కింద మంగళవారం కేసు నమోదైంది. ఈ ఘటన ఒంగోలు రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతంలో సోమవారం జరిగింది. బాలిక తల్లిదండ్రులు పనుల నిమిత్తం బయటకు వెళ్లగా ఒక్కతే ఇంటిలో ఉంది. ఆ సమయంలో ఆమె మేనత్త భర్త అయిన ఎం.వెంకటేశ్వర్లు ఆమెను తినుబండారాలు ఇస్తానని చెప్పి ఇంటిలోకి పిలిచి లైంగికదాడి చేశాడు. రాత్రి తన తల్లిదండ్రులు ఇంటికి వచ్చిన తర్వాత బాలిక ముభావంగా ఉండటాన్ని గుర్తించి ఏం జరిగిందని ప్రశ్నించారు. మామ దుశ్చర్యను ఆమె వెల్లడించింది. దీంతో వారు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు నిందితుడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి దుర్మరణం

నాగులుప్పలపాడు: రహదారి వెంబడి ఉన్న రైలింగ్‌ను ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చదలవాడ వద్ద చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మద్దిపాడు మండలం నాగన్నపాలేనికి చెందిన ఫైనం రమేష్(43), తన ద్విచక్ర వాహనంపై ఉప్పుగుండూరు నుంచి ఒంగోలు వైపు 216వ జాతీయ రహదారిపై వెళుతున్నారు. ఈ క్రమంలో చదలవాడ వద్ద వాహనం అదుపుతప్పి రహదారి పక్కనున్న రైలింగ్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకొన్న ఎస్సై రజియా సుల్తానా సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. రమేష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. విషయం తెలియగానే వారంతా గుండెలవిసేలా రోదించారు.

చరవాణిలో మాట్లాడుతూ బావిలో పడి యువకుడు..

కందుకూరు పట్టణం: బావిపై కూర్చొని చరవాణి మాట్లాడుతూ జారిపడి యువకుడు మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు. పట్టణంలోని యర్రగుంటపాలేనికి చెందిన దారా బ్రహ్మయ్య(30).. విశాఖపట్నం సమీపంలో బేల్దారి పనులు చేస్తుంటాడు. మూడు రోజుల క్రితం కందుకూరు వచ్చాడు. శనివారం రాత్రి ఫోన్ మాట్లాడుతూ శివారు ప్రాంతానికి వెళ్లి అక్కడున్న బావిపై కూర్చున్నాడు. ప్రమాదవశాత్తూ జారి అందులో పడిపోయాడు. మంగళవారం ఉదయం అతడి మృతదేహం బావిలో తేలడంతో స్థానికులు గమనించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్సై శివనాగరాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పరీక్ష నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్రానైట్ క్వారీ కార్మికుడు..

బల్లికురవ: మండలంలోని మల్లాయపాలెం పంచాయతీ పరిధిలోని ఓ గ్రానైట్ క్వారీలో పనిచేసే వలస కార్మికుడు మృతి చెందాడు. ఎస్సై నాగరాజు కథనం ప్రకారం మధ్యప్రదేశ్‌కు చెందిన రమేష్ కేవత్ (48) సోమవారం పని ముగించుకుని క్వారీ సమీపంలోని నివాసంలో భోజనం చేసి నిద్రపోయాడు. మంగళవారం ఉదయం సహచర కార్మికులు నిద్ర లేపగా ఎంతకీ లేవలేదు. చూస్తే నోటి వెంట నురగ వచ్చి చనిపోయి కనిపించాడు. వెంటనే కార్మికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతునికి గతంలో మూర్ఛ వ్యాధి ఉన్నట్లు ఎస్సై తెలిపారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

29న ఉద్యోగ మేళా

ఒంగోలు గ్రామీణం: జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో స్థానిక పాత రిమ్స్‌లోని ఉపాధి కార్యాలయ ఆవరణలో ఈ నెల 29న ఉదయం 10 గంటలకు ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా అధికారిణి కె.రమాదేవి తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగి, 10వ తరగతి, ఐటీఐ, ఇంటర్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసినవారు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి కలిగిన వారు తమ ధ్రువీకరణ పత్రాలతోపాటు, ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 143, రిటైల్ లైవ్ - 170, చికెన్ విత్ స్కిన్ - 247, చికెన్ స్కిన్‌లెస్- 281

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph : 8142292071.

EDUCATION

విజయవాడలో BPT/B.Sc., MLT- మేనేజ్‌మెంట్ కోటా సీట్లు- తక్కువ ఫీజు- కొన్నిసీట్లు కలవు. Affiliated to Dr.NTR యూనివర్సిటీ. ✆ 7995945835.

JOBS

రాయల్‌మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, ఒంగోలు నందు పనిచేయుటకు అనుభవం కల్గిన Opthalmology Doctors మేల్/ఫిమేల్ నర్సింగ్ స్టాఫ్, OT అసిస్టెంట్, PRO కావలెను. ✆ 9618800333, 9618460006.

CMR జ్యూయలరీకి ★సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ ★బిల్లింగ్ సెక్షన్ ★ మార్కెటింగ్ హెడ్స్‌గా పని చేసేందుకు యువకులు కావలెను. Cont: 9160974916, 9912121403

రైస్ మిల్ & ప్లాంట్ ఆపరేటర్స్ కావలెను. అనుభవజ్ఞులైన వెల్డింగ్, రిపేర్ తెలిసిన ఆపరేటర్స్ కావలెను. Contact No: ✆ 80962 46099.

శ్రీరామ్‌చిట్స్ ఒంగోలు బ్రాంచ్ నందు పనిచేయుటకు మార్కెటింగ్ & రికవరీ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీ: 16వేలు +ఇన్సెంటివ్స్. అ:ఏదైనా డిగ్రీ, టూవీలర్ తప్పనిసరి. వ: 32సం|| లోపు. సంప్ర|| 9030689662

ఒంగోలు మరియు పొదిలి APSRTC బస్టాండ్ CCTV లో పనిచేయుటకు ఎలక్ట్రీషియన్ & టెక్నీషియన్ కావలెను. Con: రాజేష్:-98669 42544.

3 నుండి 8వ తరగతి వరకు ఇంగ్లీషు, మ్యాథ్స్, సైన్స్ (E.M)లో బోధించుటకు టీచర్స్ మరియు బస్ డ్రైవర్, ఆయా కావలెను. వెంటనే శ్రీవాణీనికేతన్, కరవది, ఒంగోలు (మం). ✆9949217836

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
SHRIRAM Finance
ఆఫీస్ చిరునామా : జోనల్ ఆఫీస్, శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లేన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034.

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (సదరు చట్టం) లోని నిబంధనల క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్,2002 (సదరు చట్టం) యొక్క రూల్ 3తో చదువుకోవలసిన సదరు చట్టంలోని సెక్షన్ 13 (12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్ఎఫ్ఎల్), గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్‌సియుఎఫ్)గా పిలువబడేది. యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు డిమాండ్ నోటీసులో తెలిపిన మొత్తమును తిరిగి చెల్లించవలసిందిగా దిగువ పట్టికలోని వివరాలుగల ఋణగ్రహీతలకు డిమాండ్ నోటీసులను జారీ చేశారు.
ఋణగ్రహీతలు సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించనందున ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుకోవలసిన సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు దిగువ తెలిపిన ఆస్తిని ఈ క్రింది తేదీన స్వాధీన పరచుకున్నారు.

ఋణగ్రహీత పేరు మరియు చిరునామా	డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి	స్వాధీనత తేది
1) నాగులరామ్ రమ్యతేజ, తండ్రి: లక్ష్మీనారాయణ మూర్తి, డి.నెం.7-2-231/66, 1వ లైన్, నిరుపేదలపేట, బొంగరాలబీడు, గుంటూరు జిల్లా., 2.లక్ష్మీ నారాయణ మూర్తి, తండ్రి: చిన్న శ్రీరామ్, డి.నెం.7-2-231/66, 1వ లైన్, నిరుపేదలపేట, బొంగరాలబీడు, గుంటూరు జిల్లా., 3.రత్నగిరి పద్మజ, భర్త: కోటయ్య, డి.నెం.7-2-231/66, 1వ లైన్, నిరుపేదలపేట, బొంగరాలబీడు, గుంటూరు జిల్లా., 4.షేక్ సుల్తాన్, తండ్రి: మస్తాన్ వలి, డి.నెం.8-564, బుంగ బావి సెంటర్, సింగరాయకొండ, గుంటూరు జిల్లా.	ఋణ ఖాతా నెం. GNTR4TF2104280004 యొక్క రిఫరెన్సు క్రింద రూ.26,00,521/- (అక్షరాల ఇరవై ఆరు లక్షల అయిదు వందల ఇరవై ఒక రూపాయలు మాత్రమే) చెల్లించవలసి యున్నది. డిమాండ్ నోటీసు తేది : 25-10-2025	24 జనవరి, 2026

ఆస్తి వివరములు : రత్నగిరి పద్మజ గారికి చెందిన ఆస్తి : ప్రకాశం జిల్లా, సింగరాయకొండ సబ్ డిస్ట్రిక్ట్, సింగరాయకొండ రెవెన్యూ మండలం, ములగుంటపాడు గ్రామ పంచాయితీ ఏరియా, బ్లాక్ నెం.1, డోర్ నెం.1-63 ఉత్తరంవైపు, ములగుంటపాడు గ్రామం, పట్టా నెం.198, సర్వే నెం.108లోని ఎ.295.00, సర్వే నెం.108/3లోని 238 చ॥గ॥లు లేదా 199.92 చ॥మీ॥ల ఖాళీ స్థలం **హద్దులు : తూర్పు :** కల్వకూరి చిన్నయ్య గారి స్థలం-37.6 అ॥లు, **దక్షిణం:** కొమ్మన రమేష్ బాబు గారి స్థలం-56 అ॥లు, **పడమర :** బజార్ - 39 అ॥లు, **ఉత్తరం:** గాజుల జయంతి గారి స్థలం - 56 అ॥లు పైన తెలిపిన విస్తీర్ణం 238 చ॥గ॥లు లేదా 199.92 చ॥మీ॥ల ఖాళీ స్థలం మాత్రమే. (ఈ ఆస్తి డాక్యుమెంట్ నెం.526/2019, సింగరాయకొండ ప్రకారం కలదు)

సాధారణ ప్రజానీకమంతటికి కూడా ఈ నోటీసు ద్వారా హెచ్చరిక చేయునది ఏమనగా ఇందులో పైన తెలిపిన స్థిరాస్తిపై ఎస్ఎఫ్ఎల్ యొక్క అధీకృత అధికారి చట్టపరమైన స్వాధీనతను కలిగియున్నారు మరియు ఈ నోటీసు అందిన తర్వాత ఋణగ్రహీతలు లేదా ఎవరేని వ్యక్తి ఎస్ఎఫ్ఎల్ యొక్క ముందస్తు లిఖితపూర్వక సమ్మతి లేకుండా ఈ నోటీసులో పైన తెలిపిన ఏదేని సెక్యూర్డ్ ఆస్తిని అమ్మకం, లీజు లేదా మరే విధంగా బదిలీ చేయరాదు లావాదేవి జరుపరాదు / అన్యాక్రాంతం చేయరాదు.

ప్రదేశం : గుంటూరు, తేది : 24-01-2026 అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

కందుకూరు

● కందుకూరు ● కొండపి

వసతులు లేక.. బాధలు పడలేక!

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే

రాళ్లవాగు కాలువపై గొయ్యి

కాలనీ కష్టాలు

వార్డు: 18, 19
కాలనీలు: బూడిదపాలెం, సుబేదార్‌వీధి, కొత్తపేట, బంగారమ్మగుడి, ఆర్డీవో కార్యాలయం వెనుక, గోకరాజుపాలెం, బ్యాంకుబజారు
నివాసాలు: 1000
జనాభా: 3600

పట్టణ నడిబొడ్డున ఉన్న ప్రధాన కాలనీల్లో సైతం మౌలిక వసతుల సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో స్థానికులతో పాటు పట్టణ వాసులు, చుట్టుపక్కల గ్రామాలకు చెందినవారు రాకపోకలు సాగిస్తుంటారు. ● బూడిదపాలెం ప్రధాన వీధి వెంబడి కాలువలు శిథిలావస్థకు చేరాయి. ఈ దారిలో ఎప్పుడూ నిర్మాణాలు జరుగుతుంటాయి. వాటికి సంబంధించిన కంకర, ఇసుక, ఇటుక నిల్వలు రోడ్డుపై వేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. రాళ్ల వాగు వద్ద భూగర్భ డ్రెయినేజీ నిర్మించినా రోడ్డు మధ్యలో గుంతలు పూడ్చకుండా వదిలేశారు. ఓ వైపు వాహనాలు పార్కింగ్ కోసం వినియోగిస్తుండటంతో రాకపోకలకు తరచూ అంతరాయం కలుగుతోంది. అభివృద్ధి పనుల నిమిత్తం పగులగొట్టిన ప్రాంతాల్లో గోతులను సక్రమంగా పూడ్చటం లేదు. అల్ప విద్యుత్తు సమస్య దుకాణదారులను వేధిస్తోంది. దీనికి తోడు తరచూ సరఫరాలో అంతరాయం కలుగుతోందని వాపోతున్నారు. మాంసం దుకాణాలు ఉండటంతో వీధి కుక్కల సంచారం అధికంగా ఉంది. రాత్రి సమయంలో ఇటువైపు వెళ్లాలంటే భయంగా ఉంటుందని కాలనీ వాసులు వాపోతున్నారు. ● బ్యాంకు బజారు ప్రధాన వీధి అడుగడుగునా గతుకులమయంగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ దారిలో వ్యాపారులు వాహనాలను నిలుపుతుండటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు స్తంభాలకు తీగలు ఎక్కువై చిక్కుముడిగా ఉన్నాయి. మరమ్మతుల సమయంలో కష్టంగా ఉంటోందని చెబుతున్నారు. ● ఆర్డీవో కార్యాలయం వెనుక, బంగారమ్మగుడి ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ అంతంత మాత్రంగా ఉంది. మున్సిపల్, పోలీసు అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ నిర్మాణానికి విరాళం

గుడ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని చెమిడిదిపాడు బస్టాండు వద్ద ఏర్పాటు చేసే ఆంజనేయస్వామి విగ్రహ నిర్మాణానికి నెల్లూరు జిల్లా గూడూరు జై హనుమాన్ ట్రస్టు అధ్యక్షుడు జి.రామసుబ్బారెడ్డి రూ.50,000 విరాళంగా అందజేశారని నిర్వాహకులు హనుమంతరావు మంగళవారం తెలిపారు. త్వరలో ట్రస్టు ఆధ్వర్యంలో ఇంటింటికి రామ నామం, హనుమాన్ చాలీసా పారాయణం పుస్తకాలు అందజేస్తామని చెప్పారు.

నగదు అందజేస్తున్న రామసుబ్బారెడ్డి

పీఎంశ్రీ సహకారం.. వసతుల సాకారం!

గుడ్లూరు, న్యూస్‌టుడే:

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు పెరుగుతున్నాయి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం సహకారంతో పీఎంశ్రీ పథకాన్ని అమలు చేస్తోంది. కందుకూరు నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో ఆరు ఉన్నత పాఠశాలలను ఇందులో ఎంపిక చేశారు. వాటిలో సైన్సు ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, ఆటస్థలం వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు.

గుడ్లూరులో సైన్సు ప్రయోగశాల

రూపుదిద్దుకున్న క్రీడా మైదానం

ఒక్కోదానికి రూ.కోటి

ఒక్కో పాఠశాలకు సుమారు రూ.కోటి వ్యయం చేస్తున్నారు. గుడ్లూరు, కందుకూరు పట్టణం, కందుకూరు మండలం మాచవరం, లింగసముద్రం మండలం పెదపవని, ఉలవపాడు మండలం కరేడు ఉన్నత పాఠశాలలు, వలేటివారిపాలెం మండలం చుండి మోడల్ పాఠశాలలో సౌకర్యాలు కల్పిస్తున్నారు. జీవ, రసాయన శాస్త్ర ప్రయోగశాలలు ఏర్పాటు చేసి, వాటిలో పరికరాలు సమకూర్చారు. తద్వారా విద్యార్థులకు ప్రయోగాత్మక బోధన జరుగుతోంది. కొన్నిచోట్ల గ్రంథాలయాలు నిర్మిస్తున్నారు. ఇవి పూర్తయితే ఒక్కో చోట సుమారు రెండు వేల నుంచి అయిదు వేల పుస్తకాలు విద్యార్థులకు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. ప్రత్యేకంగా క్రీడా మైదానాలను అభివృద్ధి చేశారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ కోర్టులు, పరుగు మార్గం వంటివి ఏర్పాటు చేస్తున్నారు. స్కౌట్స్, గైడ్స్ కార్యకలాపాలు ప్రారంభించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పీఎంశ్రీ ఉపకరిస్తోంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

కందుకూరు: 70939 81624
కొండపి: 96424 56296

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

మర్రిపూడి, న్యూస్‌టుడే

?: మర్రిపూడి పంచాయతీ పొట్టిరెడ్డిపాలెం రామాలయం వీధిలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళ చీకట్లో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. –గురవయ్య, స్థానికుడు

✓: సిబ్బందిని పంపి మరమ్మతులు చేయిస్తాం. –నాయుడు, పంచాయతీ కార్యదర్శి

సిఫార్సు చేసిన మందులే పిచికారీ చేయాలి

టంగుటూరు, న్యూస్‌టుడే: పొగ తోటలను ఆశించిన పేనుబంక నివారణకు బోర్డు అధికారులు సిఫార్సు చేసిన పురుగు మందులనే పిచికారీ చేయాలని టంగుటూరు పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. జరుగుమల్లి, కొండపి మండలాల పరిధిలోని గ్రామాల్లో రైతులు సాగు చేసిన పొగాకు తోటలను మంగళవారం బోర్డు అధికారులు, సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపుగా పెరిగిన మల్లె కలుపును గుర్తించి.. రైతులంతా సామూహికంగా నిర్మూలించాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

కె.ఉప్పలపాడులో రైతులకు సూచనలు చేస్తున్న అధికారులు

రిక్షాకు తుప్పు.. ఎవరిదీ తప్పు!

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ పథకం కింద పంచాయతీలకు మూడు చక్రాల రిక్షాలను కేటాయించింది. మండలంలోని కలవల్ల పంచాయతీకి ఇచ్చిన రిక్షా తుప్పుపట్టి నిరుపయోగంగా ఉంది. కొద్దిపాటి మరమ్మతులు చేసి వినియోగించకుండా పక్కన పడేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రసం పీల్చే పురుగుల పనిపట్టండి

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: పత్తి, మిరప పంటల్లో రసం పీల్చే పురుగులైన తెల్లదోమ, నల్లి, పేనుబంక నివారణ చర్యలు చేపట్టాలని ఏవో అబ్దుల్‌రహీమ్, కేవీకే శాస్త్రవేత్త జ్యోతి తెలిపారు. మండలంలోని మాచవరం గ్రామంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సాగు చేసిన పంటలను వారు పరిశీలించారు. పురుగుల నివారణకు ఎకరానికి 20 చొప్పున పసుపురంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీవోఏ జగదీష్, సూరం చిరంజీవిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాల నిలుపుదల

లింగసముద్రం, న్యూస్‌టుడే: మండలంలోని పెదపవనిలో ప్రభుత్వ భూమిలో కొందరు వ్యక్తులు అక్రమంగా మట్టి తవ్వి విక్రయించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సర్వే నంబరు 563/3లోని ప్రభుత్వ భూమి నుంచి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మట్టిని పొక్లెయిన్‌తో తరలిస్తుండటంపై స్థానికులు కొందరు సోమవారం కందుకూరు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన స్థానిక రెవెన్యూ అధికారులను పంపి తవ్వకాలను నిలుపుదల చేయించారు. అయితే ఈ స్థలం తనదని వైకాపాకు చెందిన ప్రజాప్రతినిధి వాదిస్తుండటంతో వివాదం నెలకొంది. ఆర్ఐ రమణయ్య మాట్లాడుతూ అది ప్రభుత్వ భూమి అని తెలిపారు. గ్రావెల్ తరలిస్తుంటే నిలుపుదల చేసినట్లు వివరించారు.

కొత్తది నిరుపయోగం.. పాతది శిథిలం!

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కొండపి పంచాయతీ కట్టావారిపాలెం గ్రామ పాత సచివాలయ భవనంపై చెట్లు పెరుగుతున్నాయి. పురాతన భవనం కావడంతో చెట్లు పెరిగి గోడలకు పగుళ్లు ఏర్పడుతున్నాయి. ఏ సమయంలో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు.. నీరు లోపలకు రావడంతో పాటు దస్త్రాలు, కంప్యూటర్లు తడిసిపోతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. గ్రామంలో మరోచోట గత ప్రభుత్వంలో సుమారు రూ.40 లక్షలతో ప్రారంభించిన నూతన సచివాలయ భవనం పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులు కేటాయించి వాటిని పూర్తి చేయించింది. అయితే దాన్ని వినియోగంలోకి తేవకపోవడంతో సిబ్బంది పాత భవనంలోనే బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ శాఖ కొండపి ఏఈ ప్రసాద్ మాట్లాడుతూ నూతన సచివాలయ భవనాన్ని వారంలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కట్టావారిపాలెం సచివాలయంపై పెరిగిన చెట్లు

అయిదు రోజుల పనిదినాల హామీ నెరవేర్చాలి

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: అయిదు రోజుల పనిదినాల విధానాన్ని ప్రవేశపెట్టాలని బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ల పిలుపు మేరకు కందుకూరులో బ్యాంకు ఉద్యోగులు ప్రజా సంఘాల మద్దతుతో ఎస్బీఐ ప్రాంతీయ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ కూడలి వరకు ప్రదర్శన నిర్వహించారు. 12వ వేతన సవరణ ఒప్పంద సమయంలో అయిదు రోజుల పనిదినాలు అమలు చేస్తామని అంగీకరించి, నేడు చేయడం లేదని ఆరోపించారు. బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన కోరికను నెరవేర్చాలని కోరారు. ప్రతినిధులు ఎస్.అశోక్, డి.వెంకటేశ్వర్లు, కె.చరణ్‌తేజ, బి.కిరణ్‌కుమార్, పి.నరేష్, పి.కోటేశ్వరరావు, డి.కొండయ్య తదితరులు పాల్గొన్నారు. ● గుడ్లూరు: వారానికి అయిదు రోజులు పనిదినాలు కావాలంటూ సమ్మె చేస్తున్న బ్యాంకు ఉద్యోగులకు మద్దతుగా సీఐటీయూ నాయకులు స్థానిక కెనరా బ్యాంకు వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఉద్యోగులను ఇబ్బంది పెడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకయ్య, మల్లికార్జున, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న బ్యాంకు ఉద్యోగులు

పశుపోషకులకు అందుబాటులో ఉండండి

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: పశుపోషకులకు వైద్యులు అందుబాటులో ఉండాలని పశుసంవర్ధక శాఖ ఏడీ చెన్నకేశవులు తెలిపారు. వలేటివారిపాలెం పశువైద్యశాలలో వైద్యులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ గొర్రెలు, గేదెలకు పశుపోషకుల చేత బీమా చేయించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు సుధాకర్, మొగిలిచర్ల జేవీవో రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు ఇంతే.. పట్టించుకోరంతే..!

మండలంలోని మొగళ్లూరు ప్రధాన వీధిలో మురుగు కాలువల్లో కొంతకాలంగా పూడిక తీయడం లేదు. దీంతో వ్యర్థాలు పేరుకుపోయి.. మురుగు ఎక్కడికక్కడ రోజుల తరబడి నిలిచి దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా దోమల బెడద కూడా పెరిగిందని వాపోతున్నారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. గుడ్లూరు, న్యూస్‌టుడే

ప్రమాదానికి మలుపు!

కొండపి-జాళ్లపాలెం రహదారిలో కొండపి ఎస్సీ కాలనీ సమీపంలోని మలుపు ప్రమాదకరంగా మారింది. ఆ ప్రాంతంలో పిచ్చి చెట్లు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మలుపులో పెరిగిన చెట్లను తొలగించాలని వాహన దారులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్ మాట్లాడుతూ సిబ్బంది పంపి.. చెట్లు తొలగిస్తామని చెప్పారు. కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే

వృథా వెలుగులు!

గుడ్లూరు మండలం తెట్టు గ్రామంలో పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. భవిత పాఠశాల వీధి, మెయిన్ బజారు, జమాలగూర్ పాలెం, రామాయపట్నం మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో రాత్రింబవళ్లు వీధి వెలుగుతూనే ఉన్నాయి. కొన్ని చోట్ల దీపాలు లేక అంధకారం నెలకొంది. సమస్య పరిష్కరించాలని రోజుల తరబడి అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే



దారంతా గోతులే..!

వలేటివారిపాలెం-లింగసముద్రం మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డు గోతులతో అధ్వానంగా తయారైంది. దీంతో రాకపోకలు సాగించడం కష్టతరంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్డు ఇలా ఉంటే.. ప్రమాదాలు జరుగుతాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. లింగసముద్రం, న్యూస్‌టుడే

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం కొండపి-పెద్దకండ్లగుంట గ్రామాల మధ్య చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మర్రిపూడి మండలం అయ్యప్పరాజుపాలేనికి చెందిన బుర్రి రామారావు(44) అనే వ్యక్తి.. మంగళవారం ఉదయం కొండపి బాలికల గురుకుల పాఠశాలలో చదువుతున్న తన కుమార్తెను పలకరించేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చాడు. తిరిగి రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి వెళుతుండగా.. సంఘటనా స్థలం వద్ద రైతులు పొలాలకు నీరు పెట్టుకునేందుకు రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన పైపులపై నుంచి వాహనం దిగే క్రమంలో అదుపుతప్పడంతో కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో కొండపి సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యురాలు నాగమణి అప్పటికే రామారావు మృతిచెందినట్లు ధ్రువీకరించారు. అతడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు.

రామారావు

వైద్యం చేయించుకునేందుకు వచ్చి మహిళ..

మర్రిపూడి, న్యూస్‌టుడే: ఒంట్లో నలతగా ఉండటంతో చూయించుకునేందుకు వచ్చిన ఓ మహిళ ఉన్నట్టుండి కుప్పకూలి మృతిచెందిన సంఘటన మంగళవారం మర్రిపూడిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. రేగలగడ్డ గ్రామానికి చెందిన ఎస్.నారాయణమ్మ(56)కు అనారోగ్యంగా ఉండటంతో మర్రిపూడిలోని ఓ ఆర్ఎంపీ వద్ద చూయించుకునేందుకు వచ్చి ఆరుబయట కూర్చొంది. పక్కన ఉన్న వారితో మాట్లాడుతూ.. అక్కడే కుప్పకూలి చనిపోయింది. మహిళ కుటుంబ సభ్యులకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో వారి వచ్చి మృతదేహాన్ని తీసుకెళ్లారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరాయకొండ ఓవీ రోడ్డు వద్ద సోమవారం రాత్రి ఆటో అదుపుతప్పి బోల్తాపడిన సంఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలేటివారిపాలెం గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్‌కరీమ్.. తన కుటుంబ సభ్యులతో కలిసి సింగరాయకొండ నుంచి కందుకూరుకు ఆటోలో ప్రయాణిస్తున్నారు. స్థానిక గురుకుల పాఠశాల సమీపంలోకి రాగానే.. రోడ్డుపై నిలిపి ఉన్న లారీని తప్పించే క్రమంలో అదుపు తప్పి ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అబ్దుల్‌కరీమ్, మహిమూన్, నన్నేషా, చోదకుడు సింగయ్య రోడ్డుపై పడిపోవడంతో గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి క్షతగాత్రులను 108 వాహనంలో కందుకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఏరియా వైద్యశాల నుంచి మంగళవారం వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర తెలిపారు.

పెద్దపట్టపుపాలెంలో బాలికల నృత్య ప్రదర్శన

పొందూరులో..

గుడ్లూరులో విద్యార్థినులకు బహుమతులు అందజేత

విద్యతోనే సమాజాభివృద్ధి

ఉలవపాడు, న్యూస్‌టుడే: విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని డిప్యూటీ డీఈవో నరసింహారావు అన్నారు. మంగళవారం నిర్వహించిన ఉలవపాడు మండలం పెద్దపట్టపుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పిల్లలను బడికి పంపడం ద్వారా వారిలో క్రమశిక్షణ అలవడుతుందన్నారు. భవిష్యత్తులో ప్రయోజకులై.. అటు తల్లిదండ్రులకు ఇటు గ్రామాల అభివృద్ధికి ఉపయోగపడతారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో రమణయ్య, ప్రధానోపాధ్యాయుడు సలీంబాషా, విద్యా కమిటీ ఛైర్మన్ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. ● టంగుటూరు: మండలంలోని పొందూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ క్రీడల విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు పమిడి నాగేశ్వరరావు, కొల్లూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.
● పొన్నలూరు: స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఎంఈవో రవిచంద్రబాబు, నాయకులు పల్లపోతు ప్రసాద్, మండవ మురళి, రామయ్య, నేలపాటి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.
● గుడ్లూరు: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎంపీడీవో వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలన్నారు. బాలబాలికలు నృత్యాలతో అలరించారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు హరేరామ్, గోవర్ధన్, ప్రధానోపాధ్యాయుడు రామ్మోహన్, తెదేపా నాయకులు వేణు, వెంకటేశ్వర్లు, రాఘవులు, బ్రహ్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడండి

మర్రిపూడి, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ వాకా వెంకటరెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ వెంకటరెడ్డి, మర్రిపూడి ఎంపీటీసీ సభ్యుడు చిరంజీవి ఇటీవల వైకాపా నుంచి తెదేపా చేరిన నేపథ్యంలో సమావేశ నిర్వహణపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మొత్తం 11 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా.. అందరూ వైకాపా వారేకావడం, మిగిలిన తొమ్మిది మంది సమావేశంలో పాల్గొనకుండా చూడాలని ఆ పార్టీ అధిష్ఠానం నుంచి స్థానిక నాయకులకు ఆదేశాలు అందాయి. ఆ మేరకు సభ్యులపై ఒత్తిడి తెచ్చారు. అయితే అయ్యప్పరాజుపాలెం, కూచిపూడి ఎంపీటీసీ సభ్యులు జి.మాధవి, వరలక్ష్మి హాజరవడంతో కోరం సరిపోయి సమావేశం సజావుగా సాగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులంతా సమన్వయంతో పనిచేసి మండలానికి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గణతంత్ర వేడుకల్లో ప్రశంసాపత్రాలు అందుకున్న ఎంఈవో రంగయ్య, వైద్యాధికారి వీరబాబు, స్టాఫ్‌నర్స్ సుమతిలను సత్కరించి అభినందించారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరెడ్డి

ఐక్యంగా ఉంచడంలో రాజ్యాంగానిది కీలక పాత్ర

టంగుటూరు, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగంపై ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు అన్నారు. టంగుటూరు అంబేడ్కర్ పార్కులో మాల ఉద్యోగుల సంఘం, జేఏసీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ, అవగాహనపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ దేశంలో అనేక మతాలు, కులాలు ఉన్నప్పటికీ ప్రజలందరినీ ఐక్యంగా ఉంచడంలో రాజ్యాంగం కీలకపాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, వైకాపా, కాంగ్రెస్ నాయకులు హరిబాబు, సతీష్, ప్రభాకర్, రాము, కృష్ణారావు, శ్రీరాములు పాల్గొన్నారు.

పంచాయతీల్లో పరిశుభ్రత తప్పనిసరి

గుడ్లూరు, న్యూస్‌టుడే: సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయం వచ్చేలా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం పోట్లూరు పంచాయతీలో ఆయన పర్యటించారు. పారిశుద్ధ్యాన్ని పరిశీలించి.. మెరుగుపరచాలని ఆదేశించారు. హరితరాయబారులు తమకు కేటాయించిన ఇంటిని రోజూ సందర్శించాలన్నారు. వీధులు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ఇంటి పన్నులు ఆన్‌లైన్‌లో చెల్లించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ సుమలత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ● ఉలవపాడు: గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం ఉలవపాడులోని వీధులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారిగచేను సంఘం, ప్రధాన వీధులు, ఎస్సీ కాలనీ పరిసర ప్రాంతాలను పరిశీలించి చెత్త తరలింపు మరింత మెరుగ్గా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల ప్రజలు పలు సమస్యలను డీపీవో దృష్టికి తేగా.. వాటిని పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్, ఈవోఆర్డీ శ్రీనివాసరావు, సర్పంచి నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పోట్లూరులో మహిళలకు సూచనలిస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు

అనంతవరం సర్పంచి చెక్‌పవర్ రద్దు

టంగుటూరు, న్యూస్‌టుడే: టంగుటూరు మండలం అనంతవరం పంచాయతీ సర్పంచి యు.శివరామరాజు చెక్ పవర్ రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. నిధులు దుర్వినియోగం చేశారంటూ ఉపసర్పంచి కసుకుర్తి వెంకటేశ్వరరావు గతంలో ఫిర్యాదు చేశారు. వివిధ పద్దులపై రూ.25,19,896 అడ్డగోలుగా ఖర్చు చేశారని, ఈ వ్యవహారంలో ఆయనకు సహకరించిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని అందులో కోరారు. ఈ విషయమై 15 రోజుల్లో సమాధానం ఇవ్వాలని నోటీసులు ఇవ్వడంతో పాటు... మూడు నెలల పాటు తాత్కాలికంగా చెక్ పవర్ రద్దు చేస్తూ డీపీవో ఉత్తర్వులు ఇచ్చారు.

అద్దంకి

•అద్దంకి •దర్శి

చోదకులకు అవగాహన

జె.పంగులూరు, న్యూస్‌టుడే: మండలంలోని జాతీయ రహదారిపై బొల్లాపల్లి టోల్‌ప్లాజా సమీపం నుంచి అలవలపాడు డొంక వరకు రోడ్డు వెంబడి, దాబాల ముందు వాహనాలు నిలిపిన చోదకులకు ఎస్సై వినోద్‌బాబు మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వాహనాలు నిలపడం వల్ల తరచు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు.

రహదారికి మరమ్మతులు

ఈనాడు కథనానికి స్పందన

బల్లికురవ, న్యూస్‌టుడే: మండలంలోని మల్లాయపాలెం-వేమవరం మధ్య కూడలి నుంచి వేమవరం వరకు రహదారి గోతులమయంగా మారింది. దీనిపై 2న 'ఈనాడు'లో 'అవలే కూడలి.. అప్పై గుంత' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి మరమ్మతులు చేశారు. దీంతో ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రీసర్వే విధుల బహిష్కరణ

జె.పంగులూరు, న్యూస్‌టుడే: తమ న్యాయమైన కోర్కెలు నెరవేర్చే వరకు రీసర్వే విధుల్లో పాల్గొనబోమని మండలంలోని గ్రామ సర్వేయర్లు పేర్కొన్నారు. ఆ మేరకు తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ మంగళవారం పంగులూరు తహసీల్దార్ సింగారావుకు వినతిపత్రం అందజేశారు. మండల సర్వేయర్ ఐ. బాలాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన బ్యాంకుల కార్యకలాపాలు

అద్దంకి, న్యూస్‌టుడే: ఐదు రోజుల పనిదినాలను వెంటనే అమలు చేయాలని బ్యాంకు ఉద్యోగుల సంఘం నేత పెద్ది అరవింద్ అన్నారు. అద్దంకి ఎస్బీఐ ప్రధాన శాఖ ఎదుట ఉద్యోగులు నిరసన తెలిపారు.

తాళ్లూరు, న్యూస్‌టుడే: తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది మంగళవారం సమ్మెకు దిగడంతో తాళ్లూరు మండలంలోని బ్యాంకులు మూతపడ్డాయి.

పాఠ్యాంశాలపై పట్టు.. పది గట్టెక్కు

ఉత్తీర్ణత శాతం పెంచడమే లక్ష్యంగా ప్రణాళిక అమలు

న్యూస్‌టుడే, జె.పంగులూరు:

పదో తరగతి పరీక్షలకు పెద్దగా సమయం లేకపోవడంతో ఉత్తీర్ణత శాతం పెంచడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. వంద రోజుల ప్రణాళికలో పాఠ్యాంశాలపై పట్టు సాధించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు.

ప్రత్యేక పుస్తకాలు అందజేత

విద్యార్థులు ఏ రోజు ఏ పాఠం చదవాలి, ఏ యూనిట్ పరీక్ష రాయాలి అనే ప్రత్యేక పుస్తకాలను అందజేశారు. డిసెంబరు 6వ తేదీ నుంచి మార్చి 15వ తేదీ వరకు వంద రోజుల ప్రణాళికలను పక్కాగా అమలు చేస్తున్నారు. సాధన పరీక్షలో తక్కువ మార్కులు సాధించిన సీ, డీ గ్రేడ్ విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

పంగులూరు జడ్పీ పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

రోజూ పరీక్షలు నిర్వహిస్తున్నాం

వంద రోజులకు సంబంధించి ప్రణాళికతో కూడిన పుస్తకం అందజేశాం. తదనుగుణంగా ప్రతి రోజూ స్లిప్ టెస్ట్ అవర్లు పరీక్షలు నిర్వహిస్తున్నాం. లోపాలను సరిదిద్దుతున్నాం. ఈ ప్రణాళిక ఉత్తీర్ణత శాతం పెంచేందుకు చక్కగా ఉపయోగపడుతుంది.

- రావి శ్రీనివాసరావు, సైన్స్ ఉపాధ్యాయుడు

సాయంత్రం స్నాక్స్ అందించాలి

నాది కొండమూరు. నేను పంగులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి రోజు మాదిరి పరీక్షలు నిర్వహించడం వల్ల గణితం అంటే భయం తగ్గింది. పట్టు సాధిస్తున్నాం. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు జరుగుతున్నాయి. సాయంత్రం 4 గంటల సమయంలో స్నాక్స్ అందించే విధంగా ప్రభుత్వం, విద్యాశాఖ ఆలోచించాలి.

- బొగ్గవరపు బ్రహ్మేశ్వరి, కొండమూరు

చేతిరాత మెరుగుపడుతుంది

ఈ వంద రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి రోజు రాతపై తర్ఫీదు ఇవ్వడం జరుగుతుంది. పరీక్షలలో మంచి మార్కులు సాధించేందుకు చక్కగా రాయడం అవసరం. అందుకోసం సాధనతో చేతిరాత చక్కగా మారుతోంది తద్వారా మంచి మార్కులు సాధించేందుకు వీలుంటుంది. ప్రభుత్వం అందించిన ప్రశ్నావళి పుస్తకంతో పాటు జవాబులు పుస్తకం అందజేస్తే విద్యార్థులకు బాగుంటుంది.

- షేక్ అయేషా, పంగులూరు

పాఠశాలల వార్షికోత్సవాలు

బండివెలిగండ్లలో బాలికల నృత్య ప్రదర్శన

దర్శి, న్యూస్‌టుడే: దర్శి మండలం బండివెలిగండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం, పాఠశాల వార్షికోత్సవం మంగళవారం సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రధానోపాధ్యాయుడు జాన్‌వెస్లీ, ఉపాధ్యాయులు లక్ష్మీ రెడ్డి, ఆదిలక్ష్మి, కరీముల్లా, వినయ్, కిరణ్ కుమార్, శైలజ, పాఠశాల కమిటీ ఛైర్మన్ కంటా బాబు పాల్గొన్నారు.

తాళ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈవోలు సుబ్బయ్య, సుధాకరరావు పాల్గొన్నారు.

సజ్జాపురం (సంతమాగులూరు), న్యూస్‌టుడే: సజ్జాపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా నరసరావుపేట ఆర్టీసీ డిపో మేనేజరు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. గతేడాది పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులు సీహెచ్ శ్రీలక్ష్మి, సంజన, సీహెచ్ ప్రసన్నపావని, నితిన్‌పాల్, ఆర్. శ్రావణి, పి.రమ్యలకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. వీటిని ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు యలమందరావు, ఎన్.కోటేశ్వరరావు, వి.శ్రీనివాసరావు, బుజ్జి, కృష్ణ, జేఎస్ రావు సమకూర్చారు. రవికుమార్ అనే దాత పాఠశాలకు ఉపకరణాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చింతలపాటి హరినారాయణకృష్ణ, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎ.శేఖర్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముండ్లమూరు: మారెళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు, విద్యా కమిటీ ఛైర్మన్ పి.యల్లయ్య పాల్గొన్నారు.

బీరువా వితరణ

కురిచేడు, న్యూస్‌టుడే: పడమర వీరాయపాలేనికి చెందిన విశ్రాంత ఉద్యోగి పచ్చా పూర్ణ చంద్రరావు బోధనంపాడు ఉన్నత పాఠశాలకు బీరువాను అందజేశారు. ఆయన్ను ఎంఈవో వస్త్రాంనాయక్, ఉపాధ్యాయులు సత్కరించారు.

గంగవరం హైస్కూలు అభివృద్ధికి హామీ

తాళ్లూరు, న్యూస్‌టుడే: తూర్పుగంగవరం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ అధ్యక్షతన వార్షికోత్సవం జరిగింది. పూర్వ విద్యార్థి, గ్లోబల్ రెడీమిక్స్, గ్లోబల్ స్టోన్ క్రషర్స్ అధినేత జాష్టి రామబ్రహ్మం కుమారుడు శివ రూ.8 లక్షలతో మల్టీపర్పస్ డైనింగ్ హాల్, స్టడీ ప్లాట్‌ఫాంలు ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం శివ, పెద్దలను సొసైటీ అధ్యక్షుడు వి.సుబ్బయ్య, పీఎంసీ ఛైర్మన్ సురేష్ సత్కరించారు.

శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి దేవస్థానం
సింగరకొండ, అద్దంకి మం, ప్రకాశంజిల్లా

ఈ- టెండర్ ప్రకటన

శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి దేవస్థానం, సింగరకొండనకు తేది: 15-02-2026 నుండి 31.03.2027 వరకు కిరాణా సరుకులను సరఫరా చేయుటకు ఈ-టెండర్లు ఆహ్వానించడమైనది. మరిన్ని వివరముల కొరకు www.eprocurement.gov.in నందు చూడగలరు.

సదా శ్రీ స్వామి వారి సేవలో
సం/- సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ SHRIRAM Finance
రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032
బ్రాంచ్ : శ్రీ మంజునాథ కాంప్లెక్స్, ఎల్ఐసి ఆఫీస్ ఎదురు, కనిగిరి రోడ్డు, కందుకూరు, ప్రకాశం జిల్లా -523105 (ఎ.పి), website: www.shriramfinance.in

భౌతికంగా స్వాధీనత ప్రకటన రూలు 8(1) ప్రకారం (స్థిరాస్తిపై)

విషయము: లోన్ అకౌంట్ నెం.KNDKRTF2201270003

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (సెకండ్) యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారం **M/s. శ్రీ మంజునాథ కాంప్లెక్స్, ఎల్ఐసి ఆఫీస్ ఎదురు, కనిగిరి రోడ్డు, కందుకూరు, ప్రకాశం జిల్లా -523105 (ఎ.పి)**, యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13(12) కు అనుబంధమైన రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీతలను కోరుతూ **25-02-2023** తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయబడినది. **ఋణగ్రహీతలు :**
1) బొప్పూడి అనీత, భర్త: శ్రీకాంత్, డి.నెం.4-132, దక్షిణం బజార్, బొబ్బేపల్లి గ్రామం, మార్టూరు మండలం, ప్రకాశం జిల్లా.
2) బొప్పూడి శ్రీకాంత్, తండ్రి: హరిబాబు, డి.నెం.4-132, దక్షిణం బజార్, బొబ్బేపల్లి గ్రామం, మార్టూరు మండలం, ప్రకాశం జిల్లా.
3) పాపులూరి శ్రీనాథ్, తండ్రి: రాంబాబు, డి.నెం.1-93/1, మెయిన్‌రోడ్, బల్లికురప మండలం, ప్రకాశం జిల్లా.
4) బొపూడి శివ కోటేశ్వరరావు, తండ్రి: హరిబాబు, డి.నెం.4-132, దక్షిణం బజార్, బొబ్బేపల్లి గ్రామం, మార్టూరు మండలం, ప్రకాశం జిల్లా.
వారు ఈ నోటీసులో పేర్కొన **చెల్లించవలసిన మొత్తము, రూ.45,39,084/- (అక్షరాల నలభై ఐదు లక్షల ముప్పై తొమ్మిది వేల ఎనభై నాలుగు రూపాయలు మాత్రమే)** వడ్డీ మరియు జరిమానాలతో గల కాంట్రాక్చువల్ చార్జీలతో కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా ఈ నోటీసు జారీ చేయడమైనది.
ఋణగ్రహీతలు తమ బకాయిలను పూర్తిగా చెల్లించడంలో విఫలమైనందున, వారికి మరియు సాధారణ ప్రజలందరికీ ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ క్రింద సంతకం చేసిన అధీకృత అధికారి, సదరు (చట్టం) లోని సెక్షన్ 13(4) ప్రకారం **16-09-2023** తేదీన సదరు ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా, సదరు భూమి ఖాళీగా ఉన్నందున, మా కార్యనిర్వాహక సిబ్బంది సహాయంతో సదరు (చట్టం) లోని రూల్ 8(1) మరియు రూల్ 9 ప్రకారం, ఈ రోజు అనగా **24-01-2026** న నేరుగా సదరు ఆస్తి యొక్క భౌతిక స్వాధీనాన్ని అధీకృత అధికారి చేపట్టారు.
సదరు ఈ ఆస్తి విషయమై సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకించి ఋణగ్రహీతలకు హెచ్చరించడమేమనగా ఈ ఆస్తి పై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా ఈ నోటీసులో పేర్కొన్న చెల్లించవలసిన **రూ.45,39,084/- (అక్షరాల నలభై ఐదు లక్షల ముప్పై తొమ్మిది వేల ఎనభై నాలుగు రూపాయలు మాత్రమే) మరియు తదుపరి జమకూడు వడ్డీ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులతో కలిపి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారి ఛార్జికి లోబడి ఉండునని తెలియపరచడమైనది.

స్థిరాస్తి వివరములు

షెడ్యూలు ఆస్తి దస్తావేజు నెం. 262/2022, ప్రకారం **బొప్పూడి అనీత, భర్త: శ్రీకాంత్ పేరుతో కలదు.** ప్రకాశం జిల్లా, ఒంగోలు రిజిస్ట్రేషన్ జిల్లా, మార్టూరు సబ్ జిల్లా, బల్లికురవ మండలం, కొణిదెన శివారు, నక్కబొక్కలపాడు గ్రామ పంచాయతి, కొణిదెన గ్రామ సర్వే నెం.810/ఎ1ఎ లోని మొత్తం విస్తీర్ణం ఎకరాలు 17.42 సెంట్లు ఇందులో మార్పు తరువాత కొణిదెన గ్రామ సర్వేనెం.810/ఎ1ఎ2 నందలి ఎకరా 1.20 సెంట్ల స్థలం ఇది 5808 చ॥గజాలకు సమానం. **దీనికి హద్దులు: తూర్పు:** పి. శ్రీనివాసరావు గారి భూమి, **దక్షిణం:** అమ్మకం దారుల భూమి, **పడమర:** డి. వెంకటేశ్వర్లు మరియు వి. ప్రసాద్ గారి భూమి, **ఉత్తరం:** యం. సత్యవతి గారి భూమి. ఈ సరిహద్దుల మధ్యగల ఎకరం 1.25 సెంట్ల భూమి.

తేది : 24.01.2026 సం/- అధీకృత అధికారి,
ప్రదేశం: కందుకూరు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

కాలువ కట్ట ఆక్రమణకు యత్నం

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకిలో పాత రెవెన్యూ కార్యాలయం సమీపంలోని మురుగు కాలువ ఒడ్డు ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని పురపాలక ప్రణాళికా విభాగం అధికారులు మంగళవారం అడ్డుకున్నారు. మురుగు కాలువ ఒడ్డున చిన్న బడ్డీ బంకు నిర్వహించిన వ్యక్తులు అనంతరం తొలగించారు. అయితే తమ స్థలం అంటూ మధ్యాహ్నం శాశ్వత నిర్మాణ పనులు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న పురపాలక ప్రణాళికాధికారి లక్ష్మి వెంటనే స్పందించారు. సిబ్బందిని పంపించి నిర్మాణ పనులను నిలుపుదల చేయించారు.

నేడు పురపాలక బడ్జెట్ సమావేశం: అద్దంకి, న్యూస్‌టుడే : అద్దంకి పురపాలక సంఘం బడ్జెట్ అంచనాల సమావేశం బుధవారం జరుగుతుందని కమిషనర్ డి.రవీంద్ర తెలిపారు. ఛైర్‌పర్సన్ ఎల్.ఎస్తేరమ్మ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ఉంటుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

అద్దంకి: 94409 15704,
దర్శి: 9848 671678
మేదరమెట్ల: 79933 00506

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

దొనకొండ, న్యూస్‌టుడే

?: దొనకొండ మండలం మల్లంపేట ఎస్సీ కాలనీలో బోర్ ట్యాంకు కుళాయిలకు మూతలు లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది.

– బాలశౌరి, మల్లంపేట ఎస్సీ కాలనీ

✓: రెండ్రోజుల్లో ట్యాపులు ఏర్పాటు చేయిస్తాం.

–శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి

ఎవరి కోసం బతకాలయ్యా..!

● ఓ తల్లి ఆవేదన ● నరసరావుపేటలో ఇంటర్ విద్యార్థి బలవన్మరణం

బాలకోటిరెడ్డి

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: 'కుమారుడు చిన్న వయసులో ఉండగానే భర్త చనిపోయారు. అయినా ధైర్యం కూడగట్టుకుని ఎన్నో ఆశలతో ఉన్న ఎకరం పొలం సాగు చేసుకుంటూ వచ్చిన డబ్బులతో కుమారుడిని చదివించుకుంటున్నా. పెద్ద చదువులు చదువుతాడని ఎన్నో కలలు కన్నా. భగవంతుడు నా కలలను కల్లలు చేశాడు.. చేతికి అందొచ్చిన ఒక్కగానొక్క కుమారుడు ఉరేసుకుని మృతి చెందాడు. ఇక ఎవరి కోసం బతకాలి' అంటూ ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరుకు చెందిన హైమావతి రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. వివరాలిలా.. పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణ శివారు రావిపాడు రోడ్డులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న కూరాకుల బాలకోటిరెడ్డి (18) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కళాశాల వద్దకు వచ్చిన విద్యార్థి తల్లి మాట్లాడుతూ సోమవారం రాత్రి తన కుమారుడు ఫోన్ చేసి తినుబండారాలు పంపాలని కోరాడని. మంగళవారం ఉదయం 9 గంటలకు బాలకోటిరెడ్డికి బాగాలేదని, వెంటనే రావాలని కళాశాల నుంచి ఫోన్ వచ్చిందని.. అంతలోనే మృతి చెందాడని చెప్పారని ఆవేదన వెలిబుచ్చారు. కళాశాలలో కొందరు విద్యార్థులతో గొడవ జరుగుతోందని ఇటీవల ఫోన్‌లో చెప్పాడని, తన కుమారుడి మృతికి అదే కారణమై ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. తాము రాక ముందే తమ కుమారుడిని ఆసుపత్రికి తరలించారని.. కళాశాల యాజమాన్యంపై అనుమానాలు ఉన్నాయన్నారు. సమాచారం అందుకున్న గ్రామీణ పోలీసులు అక్కడికి చేరుకొని బాలకోటిరెడ్డి మృతికి కారణాలపై విచారించారు. విద్యార్థి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ SHRIRAM Finance
రిజిష్టర్డు కార్యాలయం : శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032
బ్రాంచ్ : శ్రీ మంజునాథ కాంప్లెక్స్, ఎల్ఐసి ఆఫీస్ ఎదురు, కనిగిరి రోడ్డు, కందుకూరు, ప్రకాశం జిల్లా -523105 (ఎ.పి), website: www.shriramfinance.in

భౌతికంగా స్వాధీనత ప్రకటన రూలు 8(1) ప్రకారం (స్థిరాస్తిపై)

విషయము: లోన్ అకౌంట్ నెం.KNDKRTF2102260001

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (సెకండ్) యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) ప్రకారం **M/s. శ్రీ మంజునాథ కాంప్లెక్స్, ఎల్ఐసి ఆఫీస్ ఎదురు, కనిగిరి రోడ్డు, కందుకూరు, ప్రకాశం జిల్లా -523105,** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13(12) కు అనుబంధమైన రూలు 3 ప్రకారం సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీతలను కోరుతూ **23-12-2023** తేదీన డిమాండ్ నోటీసు జారీ చేయబడినది. **ఋణగ్రహీతలు :**
1) వేముల మల్లికార్జున్, తండ్రి: దిబ్బయ్య, నివాసము డి.నెం.6-103, యంయస్‌డి నగర్, మార్టూరు (పోస్ట్ & మం), ప్రకాశం జిల్లా.
2) వేముల మాధవి, భర్త: మల్లికార్జున్, నివాసము డి.నెం.6-103, యంయస్‌డి నగర్, మార్టూరు (పోస్ట్ & మం), ప్రకాశం జిల్లా.
3) కొల్లా వీరబ్రహ్మం, తండ్రి: వీరాస్వామి, డి.నెం.12-141, గన్నవరం రోడ్, మార్టూరు (పోస్ట్ & మం), ప్రకాశం జిల్లా.
వారు ఈ నోటీసులో పేర్కొన **చెల్లించవలసిన మొత్తము, రూ.38,84,197/- (అక్షరాల ముప్పై ఎనిమిది లక్షల ఎనభై నాలుగు వేల నూట తొంభై ఏడు రూపాయలు మాత్రమే) వడ్డీ మరియు జరిమానాలతో గల కాంట్రాక్చువల్ చార్జీలతో కలిపి** నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా ఈ నోటీసు జారీ చేయడమైనది.
ఋణగ్రహీతలు తమ బకాయిలను పూర్తిగా చెల్లించడంలో విఫలమైనందున, వారికి మరియు సాధారణ ప్రజలందరికీ ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ క్రింద సంతకం చేసిన అధీకృత అధికారి, సదరు (చట్టం) లోని సెక్షన్ 13(4) ప్రకారం **07-02-2024** తేదీన సదరు ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా, సదరు భూమి ఖాళీగా ఉన్నందున, మా కార్యనిర్వాహక సిబ్బంది సహాయంతో సదరు (చట్టం) లోని రూల్ 8(1) మరియు రూల్ 9 ప్రకారం, ఈ రోజు అనగా **24-01-2026** న నేరుగా సదరు ఆస్తి యొక్క భౌతిక స్వాధీనాన్ని అధీకృత అధికారి చేపట్టారు.
సదరు ఈ ఆస్తి విషయమై సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకించి ఋణగ్రహీతలకు హెచ్చరించడమేమనగా ఈ ఆస్తి పై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా ఈ నోటీసులో పేర్కొన్న చెల్లించవలసిన **రూ.38,84,197/- (అక్షరాల ముప్పై ఎనిమిది లక్షల ఎనభై నాలుగు వేల నూట తొంభై ఏడు రూపాయలు మాత్రమే) మరియు తదుపరి జమకూడు వడ్డీ మరియు ఇతర ఖర్చులు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులతో కలిపి శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారి ఛార్జికి లోబడి ఉండునని తెలియపరచడమైనది.

స్థిరాస్తి వివరములు

షెడ్యూలు ఆస్తి దస్తావేజు నెం.6088/2021 ప్రకారం **వేముల మల్లికార్జున్, తండ్రి: దిబ్బయ్య, వేముల మాధవి, భర్త: మల్లికార్జున్ పేరుతో కలదు.**
షెడ్యూలు-1 : గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, నరసరావుపేట సబ్ జిల్లా, సంతమాగులూరు మండలం, సంతమాగులూరు శివారు, పాతమాగులూరు గ్రామ పంచాయితి, సంతమాగులూరు గ్రామ అకౌంట్స్ సర్వే డి.నెం.57/ఎ నందలి మొత్తం విస్తీర్ణం ఎకరాలు 2.19 సెంట్లు దీనిని సబ్-డివిజన్ చేసిన తరువాత సర్వే డి.నెం.57/ఎ3 గా మార్చబడిన ఇందులో ఎకరాలు 0.50 సెంట్ల ఈ స్థలము యొక్క కొలతలు తూర్పు నుండి పడమరకు 162.5 అడుగులు మరియు ఉత్తరం నుండి దక్షిణానికి 311 అడుగులు మొత్తం విస్తీర్ణం ఎకరములు 0.50 సెంట్లు లేదా 0.2023 హెక్టార్ల స్థలమునకు **హద్దులు: తూర్పు:** కంభంపాటి సురేష్‌బాబు@ రూబెన్ మరియు ఇరతుల వద్ద నుండి కొనుగోలు చేసిన భూమి, **పడమర:** పైయ్యావుల నాగేంద్ర, నాగార్జున రెడ్డి మరియు ఇతరుల భూమి, **ఉత్తరం:** ఎడమకంటి రాజేశ్వరి వద్ద నుండి వేముల మల్లికార్జున కొనుగోలు చేసిన భూమి. **దక్షిణం:** జెట్టి వెంకయ్య వద్ద కొనుగోలు చేసిన భూమి.
షెడ్యూలు-2 : గుంటూరు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, నరసరావుపేట సబ్ జిల్లా, సంతమాగులూరు మండలం, సంతమాగులూరు శివారు, పాతమాగులూరు గ్రామ పంచాయితి, సంతమాగులూరు గ్రామ అకౌంట్స్ సర్వే డి.నెం.57/ఎ నందలి మొత్తం విస్తీర్ణం ఎకరాలు 2.19 సెంట్లు దీనిని సబ్‌డివిజన్ చేసిన తరువాత సర్వే డి.నెం.57/ఎ4 గా మార్చబడిన ఇందులో ఎకరాలు 0.50 సెంట్ల ఈ స్థలము యొక్క కొలతలు తూర్పు నుండి పడమరకు 162.5 అడుగులు మరియు ఉత్తరం నుండి దక్షిణానికి 311 అడుగులు మొత్తం విస్తీర్ణం ఎకరములు 0.50 సెంట్లు లేదా 0.2023 హెక్టార్ల స్థలమునకు **హద్దులు: తూర్పు:** కంభంపాటి సురేష్‌బాబు @ రూబెన్ మరియు ఇరతుల వద్ద నుండి కొనుగోలు చేసిన భూమి, **పడమర:** కొనుగోలు దారు వేముల మల్లికార్జున్ భూమి, **ఉత్తరం:** కంభంపాటి సురేష్‌బాబు @ రూబెన్ మరియు ఇరతుల నుండి కొనుగోలు చేసిన భూమి. **దక్షిణం:** ఎడమకంటి బాలమద్దిలేటి రెడ్డి వద్ద నుండి వేముల మాధవి కొనుగోలు చేసిన భూమి.

తేది : 24.01.2026 సం/- అధీకృత అధికారి,
ప్రదేశం: కందుకూరు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రూ.4.20 లక్షలతో ఆర్వో ప్లాంటు ఏర్పాటు

ప్రారంభించిన లక్ష్మీనారాయణరెడ్డి, పద్మ దంపతులు

ముండ్లమూరు, న్యూస్‌టుడే: మారెళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో తాగునీటి సమస్య ఉండటంతో పూర్వ విద్యార్థి సుంకర వెంకారెడ్డి, తల్లిదండ్రులు లక్ష్మీనారాయణరెడ్డి, పద్మ, చిన్న కుమారుడు కోటిరెడ్డిలు రూ.4.20 లక్షలతో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశారు. దీన్ని లక్ష్మీనారాయణరెడ్డి దంపతులు మంగళవారం ప్రారంభించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, రంగారావు, విశ్రాంత ఉపాధ్యాయులు పాశం కృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతలకు సత్కారం

దర్శి, న్యూస్‌టుడే: ఉత్తమ సేవలందించినందుకు గాను దర్శి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ కార్యదర్శి పి.పద్మశేఖర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ వి.శ్రీకాంత్‌రెడ్డి ఒంగోలులో సోమవారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ రాజాబాబు చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు. మంగళవారం వారిని స్థానిక ఏఎంసీలో ఛైర్‌పర్సన్ నాగవేణి సుబ్బారావు సత్కరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మస్తాన్‌రావు, కపిల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

దర్శి, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పెట్టుబడి సాయం అందాలంటే ఈ-పంట నమోదు తప్పనిసరి అని ఏవో రాధ అన్నారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా మంగళవారం దర్శి మండలం బసిరెడ్డిపల్లిలో ఈ-పంట నమోదు కార్యక్రమం నిర్వహించారు. రైతుల చరవాణుల్లో ఏపీ ఏఐఎంఎస్ యాప్ ఇన్‌స్టాల్ చేయించి.. దాన్ని వినియోగించే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆత్మ బీటీఎం నాగభూషణం, పంచాయతీ కార్యదర్శి గోపాల్, వీహెచ్‌ఏ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

తాళ్లూరు, న్యూస్‌టుడే: ఫెర్టిగేషన్ పద్ధతిలో నీటిలో కరిగే ఎరువులను పంటలకు, మొక్కలకు అందించడం ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయని ఏవో బి.ప్రసాదరావు తెలిపారు. శివరాంపురం, మల్కాపురం, రజానగరంలో మంగళవారం వివిధ రకాల పంటలను ఆయన పరిశీలించి.. తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. పంట అవసరాలు, మొక్కల పెరుగుదల ఆధారంగా తగిన పరిమాణంలో ఎరువులు అందించాలన్నారు. వీఏఏ వెంకటరాజా, ఏహెచ్‌ఏ రాజేష్ పాల్గొన్నారు.

దర్శి, న్యూస్‌టుడే: చీడపీడల బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు విచక్షణారహితంగా రసాయన మందులు పిచికారీ చేస్తున్నారని, అవగాహన పెంచుకోవడం ద్వారా ఆర్థిక నష్టాన్ని తగ్గించుకోవచ్చని కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం, విజయవాడ సహ సంచాలకుడు కె.వీరయ్యచౌదరి అన్నారు. మంగళవారం దర్శి కేవీకేలో మానవ వనరుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సూచనలతో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా ఖర్చు తగ్గి, అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీ పీవో అనిల్‌కుమార్, కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్, ఏడీఏ బాలాజీనాయక్, ఏవో రాధ పాల్గొన్నారు.

అమృతమూర్తికి అశ్రునివాళి

ప్రేమ ఆప్యాయతానురాగాలను
మాకు పంచి కుటుంబ అభ్యున్నతికి
అహర్నిశలు కృషి చేసిన
మహోన్నత వ్యక్తి,
అమృతమూర్తి స్వర్గీయ
శ్రీమతి మోపర్తి లక్ష్మీకాంతమ్మ గారి
మరణం మాకు తీరని లోటు
మీ పవిత్ర ఆత్మకు
శాంతి చేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ...
బాధాతప్త హృదయాలతో
అంజలి ఘటిస్తూ..

కీ॥శే॥ శ్రీమతి మోపర్తి లక్ష్మీకాంతమ్మ గారు
W/o కీ.శే. మోపర్తి వెంకటసుబ్బయ్య గారు
రావినూతల, కొరిశపాడు (మం), ప్రకాశం జిల్లా.
మరణం: 14.01.2026

కుమారుడు - కోడలు: CA శేషారావు - భవానిదేవి
మనుమడు:- సందీప్ చౌదరి - ప్రత్యూషదేవి
మనుమరాలు:- డా॥ శ్రావణి చౌదరి (లేట్) - అశ్విన్‌కుమార్
మునిమనుమడు:- భార్గవ్‌రామ్ చౌదరి,
మునిమనుమరాళ్ళు: హర్షితచౌదరి, తన్విత చౌదరి
కుమార్తె- అల్లుడు:- కొర్రపాటి అన్నపూర్ణ - సుబ్బారావు
మనుమడు:- రవిశంకర్, మనుమరాలు:- పుష్పలత
మునిమనుములు,
మునిమనుమరాండ్రు
బంధుమిత్రులు మరియు శ్రేయోభిలాషులు

పెద్దకర్మ:- నేడు ది 28.01.2026 బుధవారం ప్రకాశం జిల్లా, కొరిశపాడు (మం), రావినూతల గ్రామంలోని మా స్వగృహమందు జరుగును.

(c) eenadu

ఒంగోలు

• ఒంగోలు • సంతనూతలపాడు

తాగునీరు.. రోడ్డుపాలు

ఒంగోలు నగరంలోని సంతపేట నుంచి అన్నవరప్పాడు వెళ్లే మార్గంలో వీనస్ కాలేజీ ఎదురుగా పైపులైన్ లీకేజీ కారణంగా నెలరోజులుగా నీరు వృథా అవుతుంది. కొళాయిలకు నీరు వదిలినప్పుడల్లా ఇదే పరిస్థితి. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ నీరంతా రోడ్డుపై నిలిచిపోతుండటంతో ద్విచక్ర వాహనదారులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. పాదచారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. **–న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్యరోడు**

తీయకుంటే.. వాగును మింగేస్తాయ్!

మద్దిపాడు మండలం పెదకొత్తపల్లికి వెళ్లే మార్గంలో ఉన్న ముదిగొండ వాగు పరిసరాలు వ్యర్థాలమయం అవుతున్నాయి. చెత్త నుంచి సంపద తయారు చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. అందుకు నిదర్శనమే ఈ చిత్రం. గ్రామంలో సేకరించిన వ్యర్థాలను వాగు నేలచప్టా రెండు వైపులా అంచుల్లో పారబోస్తున్నారు. ఈ మార్గం గుండా నిత్యం రాకపోకలు సాగించే వందల మంది దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి డేవిడ్‌ను వివరణ కోరగా.. పారిశుధ్య కార్మికులకు తెలియక ఆ ప్రాంతంలో పారబోశారని, తక్షణమే తొలగించి ఆ మార్గం గుండా పోయేవారికి దిగువ ప్రాంత రైతులకు ఇబ్బందులు లేకుండా చేస్తామని తెలిపారు. **–న్యూస్‌టుడే, మద్దిపాడు**

బాలోత్సవాలను విజయవంతం చేయాలి

చీమకుర్తి, న్యూస్‌టుడే: ఒంగోలులో ఫిబ్రవరి 7, 8 తేదీల్లో జరిగే ప్రకాశం బాలోత్సవాలను జయప్రదం చేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్ కోరారు. ఈ వేడుకల గోడప్రతులను మంగళవారం చీమకుర్తిలో ఆవిష్కరించారు. ఒంగోలులోని పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఉత్సవాలు జరగనున్నాయని చెప్పారు.

పొగాకు రైతులకు శిక్షణ

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: పొగాకు బోర్డు ఒంగోలు-2 వేలం కేంద్రం పరిధిలోని మాచవరంలో మంగళవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వేలం నిర్వహణాధికారిణి తులసి మాట్లాడుతూ.. పొగాకు పంటలో మల్లె ఉద్ధృతి ఎక్కువగా ఉందని, అలాంటి వాటిని తొలగించి కాల్చివేయడంతో కొంతమేరకు నివారించవచ్చన్నారు. ఆకు రెలుపు, క్యూరింగ్, గ్రేడింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శీతల గిడ్డంగుల్లో పొగాకు బేళ్లను నిల్వ చేయాలనుకునే రైతులు బోర్డు నుంచి ట్రాన్సిట్ నోట్ తీసుకోవాలని తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

చీమకుర్తి: మండలంలోని టి.గుడిపాడుకి చెందిన ఓ వివాహిత ఈ నెల 23 నుంచి కనిపించకుండా పోయిన విషయమై కేసు నమోదు చేసినట్లు సీఐ డి.ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నాచురోగ నివారణకు టీకాలు వేయండి

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: నాచురోగం వ్యాధితో జీవాలు మృత్యువాత పడుతున్నాయని, వ్యాక్సిన్ అందజేయాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు డిమాండ్ చేశారు. మంగళవారం గుమ్మళంపాడులో పెంపకం దారుల సమస్యలు పరిష్కరించాలంటూ పశుసంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసరెడ్డికి, పశువైద్యాధికారి కె.అనూరాధలకు వినతి పత్రం అందజేశారు.

క్రీడా సామగ్రికి దరఖాస్తులు చేసుకోండి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి క్రీడా సామగ్రి పంపిణీ కోసం జిల్లాలోని యువజన క్లబ్‌ల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు యువజన అధికారి ఏ.మహేంద్రరెడ్డి తెలిపారు. ఆసక్తి కలిగిన యువజన క్లబ్‌లు ఫిబ్రవరి 10వ తేదీలోపు స్థానిక పాత రిమ్స్‌లోని కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయులను ఆదుకోవాలి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జిల్లాలో 2004 సెప్టెంబర్ ఒకటి తరువాత సర్వీసులో చేరిన ఎయిడెడ్ టీచర్లకు ప్రాన్ నంబర్, ఆ తేదీ తరువాత చేరిన వారికి పీఎఫ్ నంబరు కేటాయించాలని ఎయిడెడ్ ఉపాధ్యాయ సంఘం టీచర్స్‌గిల్డ్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రావు, ప్రభాకరరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఈ నంబర్లు లేనందున ప్రభుత్వ ఆర్థిక ప్రయోజనాలు పొందడం ఇబ్బందిగా మారిందన్నారు. అదే విధంగా ఇతర పాఠశాల విద్యార్థులకు మాదిరిగానే ఎయిడెడ్‌లో చదివే వారికి అన్ని పథకాలు వర్తింపజేయాలని కోరారు.

చూడకుంటే.. ప్రాణం వదులుకున్నట్లే!

న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

ఒంగోలు నగరంలో అత్యంత రద్దీ మార్గం అది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాంటి చోట భారీ గుంతలు పడి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

పేర్నమిట్టవైపు నుంచి వచ్చే దారిలో ఇలా..

కనీస నిర్వహణ లేకపోవడంతో...

పరిశీలన

ఒంగోలు-కర్నూలు రహదారిలో పైవంతెన కింద, ఇరువైపులా రహదారి ఛిద్రమై వాహన చోదకులకు పరీక్షగా మారింది. ఆదమరచి ఎవరైనా వేగంగా వస్తే ఇక్కడ అదుపుతప్పి బోల్తా పడాల్సిందే. దాదాపు కొన్ని నెలలుగా ఈ సమస్య నెలకొంది. వంతెన వద్ద నుంచి పేర్నమిట్టవైపు వెళ్లే మార్గంలో సెయింట్ జేవియర్స్ స్కూలు వరకు, తూర్పువైపు నగరంలోకి వెళ్లే ప్రారంభంలో పెద్ద గుంతలు పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. వంతెనకు రెండు వైపులా సర్వీసు రహదారులు సైతం అధ్వానంగా మారాయి. ఈ రోడ్డు ఆర్ అండ్‌బీ పరిధిలో ఉండటంతో నిధులు అందుబాటులో లేక కనీస నిర్వహణ పనులు కూడా చేయడం లేదు. దీంతోపాటు నగరంలోని ఏకలవ్యనగర్ రోడ్డు, రంగారాయుడు చెరువు వద్ద నుంచి బండ్లమిట్టకు వెళ్లే మార్గం, గద్దలగుంట ప్రధాన రహదారులు సైతం గుంతలమయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. కొన్నిచోట్ల ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి చోదకులు గాయాలపాలవుతున్నారు.

కర్నూలు రోడ్డులో పైవంతెన కింద గుంతలు

మళ్లీ టెండర్లు పిలుస్తాం..

కర్నూలు రోడ్డు పై వంతెన వద్ద ఇరువైపులా సీసీ రోడ్డు వేయడానికి కార్పొరేషన్ సాధారణ నిధులు రూ.40 లక్షలతో మూడు సార్లు టెండర్లు పిలిచినా గుత్తేదార్లు రాలేదు. మరోసారి ప్రయత్నం చేస్తాం. నగరంలోని రహదారుల్లో మొదటి ప్యాకేజీ కింద 225 గుంతలు పూడ్చించాం. రెండో ప్యాకేజీలో 160 గోతులు పూడ్చడానికి పనులు చేపడతాం. ఏకలవ్యనగర్ రోడ్డును కొంత విస్తరణ చేసి సీసీ రోడ్డు వేయాలని నిర్ణయించాం. **–ఏసయ్య, మున్సిపల్ ఇంజినీర్**

బడి.. సందడే సందడి!

చీమకుర్తి, న్యూస్‌టుడే: వంద రోజుల ప్రణాళికను చక్కగా ఉపయోగించుకొని పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలను సాధించాలని ఒంగోలు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి చంద్రమౌళీశ్వర్ సూచించారు. మండలంలోని దేవరపాలెంలోని బూచేపల్లి కోటిరెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎంఈవో శివాజీ, ప్రధానోపాధ్యాయిని బి.శిరీషారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చీమకుర్తిలో మండల వనరుల కేంద్రంలో క్లస్టర్ ప్రధానోపాధ్యాయులతో డిప్యూటీ డీఈవో సమీక్ష నిర్వహించారు. ● **మద్దిపాడు:** మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం హెచ్ఎం మాల్యాద్రి అధ్యక్షతన జరిగింది. [illegible] పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. ● **ఒంగోలు గ్రామీణం:** మండలంలోని ఉలిచి జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో ఎంపీడీవో రాజశేఖర్ మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకు అమలు చేసిన వంద రోజుల ప్రణాళిక ద్వారా మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల కోలాట ప్రదర్శన

ఆలోచింపజేసిన అన్నదాత

నాటికలో ఓ సన్నివేశం

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ కళాపరిషత్ ఉత్సవాలు పదోరోజు మంగళవారం సందడిగా సాగాయి. స్థానిక పీవీఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతున్న వేడుకల్లో సంప్రదాయ నృత్య, కోలాట ప్రదర్శనలు, నాటికలు నగరవాసులు, కళాభిమానులను అలరించాయి. ముందుగా శింగరకొండ శ్రీప్రసన్నాంజనేయ నాదస్వర బృందం బాణీలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. మాస్టర్ జాస్తి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శంకరాపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోలాట ప్రదర్శన ఉర్రూతలూగించింది. అనంతరం చందూ నృత్య అకాడమీ విద్యార్థుల ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. అనంతరం ప్రదర్శించిన 'అన్నదాత' సాంఘిక నాటకం రైతు కష్టాలను కళ్లకుకట్టి అందరినీ ఆలోచింపజేసింది. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు, అన్నమనేని ప్రసాద్, శివ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్తు సరఫరాకు కృషి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారులకు సత్వర సేవలు అందించాలని వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు, విశ్రాంత న్యాయమూర్తి విక్టర్ ఇమ్మానుయేల్ ఆదేశించారు. స్థానిక రామనగర్‌లోని విద్యుత్తు భవన్‌లో మంగళవారం ఒంగోలు డివిజన్ స్థాయి విద్యుత్తు వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నిరంతర సరఫరాకు కృషి చేయాలని సూచించారు. ఈఈ ఎం.హరిబాబు, డీఈలు పాండు రంగారావు, శ్రీకాంత్, మోహనరావు, ఎస్ఏవో సుబ్బారావు పాల్గొన్నారు. ● దేశ వ్యాప్తంగా విద్యుత్తు రంగాన్ని ప్రైవేటీకరించే దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్తు చట్ట సవరణ బిల్లు నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు.

మాట్లాడుతున్న వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు విక్టర్ ఇమ్మానుయేల్

అన్న క్యాంటీన్‌లో శుభ్రత తప్పనిసరి

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: పేదలు భోజనం చేసే అన్న క్యాంటీన్ ప్రదేశంతోపాటు, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఆర్వో ఓబులేసు నిర్వాహకులను ఆదేశించారు. స్థానిక కొత్తపట్నం బస్టాండ్ సమీపంలోని అన్న క్యాంటీన్‌ను మంగళవారం తనిఖీ చేశారు. అక్కడే భోజనం చేసి నాణ్యత పరిశీలించారు. ప్లేట్లు వేడి నీటిలో శుభ్రం చేయడంతోపాటు, ఆహార నాణ్యత ఉండేలా చూడాలన్నారు. ఎటువంటి ఫిర్యాదులు లేకుండా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట నగరపాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఉన్నారు.

ప్రకటన

మా క్లయింటు బీరాంగూడ, అమీన్‌పూర్ మండలం, సంగారెడ్డిజిల్లా తెలంగాణ రాష్ట్రం కాపురస్థుడు బూర్సు సుబ్బారావు గారి కుమారుడు బూర్సు రాఘవేంద్రరావు గారి సంజాయిషి ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది తెలిపిన షెడ్యూలు దాఖలాస్థిని మా క్లయింటు తేది: 28-8-2025వ తేదీన త్రోవగుంట గ్రామం ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా ప్రకాశం జిల్లా అనువనివద్ద విక్రయ ఖరారు అగ్రిమెంటును వ్రాయించుకొని అందుకు బయనాగా రూ. 20,00,000/- (ఇరవై లక్షల రూపాయిలు) ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు త్రోవగుంట **A/c** కు ట్రాన్స్‌ఫర్ చేయుట ద్వారా చెల్లించి మిగిలిన పైకము అనగా క్రయధనము రూ 85,00,000/- (ఎనభై ఐదు లక్షలు రూపాయలు) 6నెలలు లోపల చెల్లింపు అని అగ్రిమెంటును వ్రాయించుకొని వున్నారు.

ఈ విషయములో ఏవరికైననూ ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల ఈ ప్రకటన వెలుబడిన 10 రోజులు లోపుల మా క్లయింటుకు గాని, లేదామాకుగాని వ్రాతపూర్వకంగాని, మీ లాయరు ద్వారాగాని తెలుపవలసినదిగా కోరుచున్నాము లేనియెడల ఈ విషయంలో ఎవర్వికి ఎట్టి ఆక్షేపణలు లేవని తీర్మానింపబడునని ఈ ప్రకటన ద్వారా తెలుపబడునది.

షెడ్యూలు: ప్రకాశం జిల్లా, ఒంగోలు స.రి యిలాకా, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, త్రోవగుంట గ్రామ సర్వే నెం:310/5రు లోని వ్యవసాయ భూమికి హద్దులు. **తూర్పు:** డొంక, **దక్షిణం:** కుంచా శేషయ్య గారి వ్యవసాయ భూమి, **పడమర:** కుంచా కోటయ్య గారి వ్యవసాయ భూమి, **ఉత్తరం:** కుంచా శేషయ్యగారి వ్యవసాయ భూమి.యీ హద్దులలోని య.1-13 సెంట్లు లేక 0.456 హెక్టార్ల భూమికి హద్దులు.

ఇట్లు: **Kappara Prabhakar,** B.com.,B.L
అడ్వకేట్, కొత్తపేట, ఒంగోలు, 9440560617

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
కొత్తపట్నం : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

?: కొత్తపట్నం మండలం అల్లూరు సాయినగర్ కాలనీలో ఎంతో కాలం నుంచి కాలువలు లేవు. –హైమవతి, స్థానికురాలి
✓: కాలువల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. –విజయ, పంచాయతీ కార్యదర్శి

?: పాదర్తి నుంచి కొత్తపట్నానికి వెళ్లే డొంక రోడ్డు క్రాంతి నగర్ వద్ద ఆక్రమణకు గురైంది. –హరిబాబు, స్థానికుడు
✓: కొలతలు వేయించి ఆక్రమణలను తొలగింపజేస్తాం. –రామానాయుడు, తహసీల్దార్

?: మద్దిపాడు పంచాయతీ పడమరపాలెం నుంచి జాతీయ రహదారికి వెళ్లే మార్గం గుంతలమయమైంది. –ఎం.గణేష్, మద్దిపాడు
✓: పంచాయతీ అధికారులతో మాట్లాడి బీటీ రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. – రవిబాబు, పంచాయతీరాజ్, ఏఈ

?: మద్దిపాడు మండలం కొలచనకోట రహదారి పక్కన కాలువలో నీరు చాలా కాలంగా నిల్వ ఉంది. దీనివల్ల వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. –ఈమని రవి, గ్రామస్థుడు
✓: నీటిని తొలగించి కాలువలు శుభ్రం చేయిస్తాం. దోమల నివారణ మందును ఫాగింగ్ చేయిస్తాం. – మీరా, పంచాయతీ కార్యదర్శి

–న్యూస్‌టుడే, కొత్తపట్నం, మద్దిపాడు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం నాగులుప్పలపాడు ఎస్సీ కాలనీలో రూ.1.5 కోట్లతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాల నిమిత్తం క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఎక్కడెక్కడ కాలువలు, రోడ్లు అవసరమనే విషయమై స్థానికులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. వైకాపా పాలనలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ డీఈ కృష్ణమోహన్, ఎలక్ట్రికల్ డీఈ హరిబాబు, ఎంపీడీవో రవికుమార్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, తెదేపా మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్లు, కాలువల నిర్మాణంపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

బహిరంగంగా మద్యం తాగితే చర్యలు

కొత్తపట్నం: కొత్తపట్నం శివారు మద్యం దుకాణం పరిసర ప్రాంతాల్లో కొందరు ఇష్టారాజ్యంగా మద్యం తాగి సీసాలు, తిను బండారాల పొట్లాలను అక్కడే వేసేస్తున్నారు. దీంతో ఎస్సై సుధాకర్ మంగళవారం అక్కడికి వెళ్లి పరిశీలించారు. అప్పటికే అక్కడున్న కొందరు మందుబాబులను పిలిపించి ఆ ప్రాంతంలో వ్యర్థాలను శుభ్రం చేయించారు. బహిరంగ ప్రదేశాల్లో కూర్చొని మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల నిరసన

ఆందోళన చేస్తున్న విద్యార్థులు, ఐకాస నాయకులు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: ఒంగోలు ట్రిపుల్ ఐటీ కళాశాలను ఒంగోలులోనే కొనసాగించాలని ఎస్ఎన్‌పాడులోని ఆ కళాశాల విద్యార్థులు మంగళవారం ఆందోళన చేపట్టారు. తరగతులు బహిష్కరించి, విద్యార్థి జేఏసీ నాయకులతో కలిసి ట్రిపుల్ ఐటీ కనిగిరి వద్దు... ఒంగోలు ముద్దు.. అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. ట్రిపుల్ ఐటీ కళాశాలను కనిగిరి ప్రాంతానికి మారిస్తే వచ్చేది చదువు కాదని, రోగాలతో ఇబ్బందులు పడాలన్నారు. కళాశాల నడవాలంటే రోజుకు 15 లక్షల లీటర్ల నీరు అవసరమన్నారు. అక్కడ ఫ్లోరైడ్ సమస్య ఉన్నందున విద్యార్థుల జీవితాలను బలిచేస్తారా అంటూ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్, కె.రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో కొనసాగించాలని వినతి..

ఒంగోలు నగరం: విద్యార్థుల సౌకర్యార్థం ట్రిపుల్‌ఐటీని ఒంగోలులోనే ఏర్పాటు చేయాలని కోరుతూ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు కొల్లా మధు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు వినతిపత్రం సమర్పించారు. నగరానికి 11 కిలోమీటర్ల దూరంలో ఉన్న యరజర్ల వద్ద ప్రభుత్వ స్థలంలో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

అందమైన అక్షరాలు.. కురిపిస్తాయి మార్కులు

న్యూస్‌టుడే, మద్దిపాడు

మా అమ్మాయి, అబ్బాయి బాగానే చదువుతారు.. ఎందుకోమరి ఆ స్థాయిలో వారికి మార్కులు మాత్రం రావడం లేదు.. అని పరీక్షా ఫలితాల వేళ కొందరు తల్లిదండ్రులు తరచూ అంటున్న మాటలివి. ప్రశ్న పత్రం సులభంగానే ఉంది. అన్నింటికీ సరిగానే జవాబులు రాశాను.. కానీ అనుకున్న స్థాయిలో మార్కులు సాధించలేకపోయామని ఎంతో మంది విద్యార్థులు నిరాశ చెందుతుంటారు. అందమైన అక్షరాలు రాయగలిగితే ఫలితాల్లో మెరుస్తారని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. త్వరలో ఇంటర్, పదో తరగతి పరీక్షలు మొదలు కానున్న నేపథ్యంలో వీటిపై విద్యార్థులంతా ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులు దిశానిర్దేశం చేస్తున్నారు. ఇటీవల మద్దిపాడులోని ఎంఈవో కార్యాలయంలో పదో తరగతి బాలబాలికలకు చేతిరాతపై ప్రత్యేక శిక్షణ సైతం ఇచ్చారు.

మద్దిపాడు ఎంఈవో కార్యాలయంలో చేతిరాతపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

జవాబులు ఎలా రాయాలంటే..

- మొదటిగా రాసే జవాబు అక్షరాలు గుండ్రంగా ఆకట్టుకునేలా రాయాలి. సమయం మించిపోతుందన్న ఆందోళన చెందవద్దు.
- రెండు పదాల మధ్య ఒక అక్షరం పట్టేంత ఖాళీ ఉంచి, రెండు వరుసల మధ్య అంగుళం దూరం వదలాలి.
- అంటుకున్నట్లు కాకుండా ప్రతి అక్షరం ఒకే పరిమాణంలో రాయాలి.
- కలాన్ని గట్టిగా పట్టుకుని రాయడం మంచిది కాదు.
- కొట్టివేయడం, దిద్దడం లాంటివి చేయరాదు.
- చిత్రపటాలను ఆకట్టుకునేలా గీసి, శీర్షికలు, ఉప శీర్షికలు స్పష్టంగా కనిపించాలి.
- గణితంలో సూత్రాలు, సమీకరణాలు కనిపించే విధంగా రాయాలి.
- పేజీ పై భాగంలో ఒక అంగుళం, ఎడమవైపు అదే స్థాయిలో మార్జిన్‌లకు వదిలిపెట్టాలి.



(c) eenadu

నెల్లూరు : ర్యాలీలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్ యాదవ్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు

కావలిలో ముందుకు సాగుతున్న భారీ ప్రదర్శన

లోకేశ్ యువగళం.. పెను సంచలనం

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: రాష్ట్ర చరిత్రలో జనవరి 27వ తేదీ అద్భుతమైన రోజని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు యువగళం- ప్రజాగళం ర్యాలీలు నిర్వహించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో తెదేపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీకి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, ప్రజలు తరలివచ్చారు. సర్వోదయ కళాశాల నుంచి మద్రాస్ బస్టాండ్ కూరగాయల మార్కెట్ వరకు జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ మాట్లాడారు. 2024 ఎన్నికల్లో తెదేపా జయకేతనం ఎగరవేసేందుకు యువగళం దోహదపడిందన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి హోదాలో ఒకే రోజు రూ. 27 కోట్లతో 240 పనులకు శంకుస్థాపన చేసిన కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిని అభినందించారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ.. యువగళం దేశ రాజకీయాల్లో పెను సంచలనం అన్నారు. ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, జడ్.శివప్రసాద్, కేతంరెడ్డి వినోద్‌కుమార్ రెడ్డి, భానుశ్రీ, కార్పొరేటర్లు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

30న బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు

నెల్లూరు(క్రీడా విభాగం): ఈ నెల 30న ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో అస్మిత అథ్లెటిక్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు ప్రకటనలో తెలిపారు. పోటీలు 14, 16 ఏళ్లలోపు బాలికలకేనని, ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని కోరారు.

బ్యాంకు ఉద్యోగుల ఆందోళన బాట

నెల్లూరు(నవాబుపేట), న్యూస్‌టుడే: ఐదు రోజుల పనిదినాల కోసం బ్యాంకు ఉద్యోగులు ఆందోళనబాట పట్టారు. దీంతో బ్యాంకులు మూతపడ్డాయి. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో ఎస్‌బీఐ ప్రధాన శాఖ వద్ద ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య సంయుక్త కార్యదర్శి ఉదయకుమార్ మాట్లాడారు. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్, యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు యూనియన్స్‌ మధ్య జరిగిన అవగాహన ఒప్పందాన్ని రెండేళ్ల కిందటే కేంద్ర ప్రభుత్వానికి పంపినా.. ఇప్పటి వరకు నిర్ణయం తీసుకోకపోవడం దారుణమన్నారు. వెంటనే వారానికి 5 రోజుల పనిదినాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐబీఈఏ నాయకులు రమణప్రసాద్, సుమన్, మృదుల, ఏఐబీవోసీ నాయకులు చైతన్య, జవహర్, ఎన్‌సీబీఈ నాయకులు సనత్ పాల్గొన్నారు.

ధర్నాలో బ్యాంకు ఉద్యోగులు

అడుగడుగునా లోపాలు.. గాలిలో ప్రాణాలు!

'రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు మరిన్ని సైన్ బోర్డులు అవసరం. నెల్లూరు బైపాస్‌లో 11 ప్రాంతాల్లో సోలార్ దీపాలు ఏర్పాటు చేయాలి. వీటితో పాటు 8 ప్రాంతాల్లో హైమాస్ట్ లైట్లు, 12 చోట్ల సోలార్ బ్లింకర్లు, 13 ప్రాంతాల్లో రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు తప్పనిసరి. పశువులు రోడ్డుపైకి రాకుండా ఉండేందుకు ప్రత్యేక పర్యవేక్షణతో పాటు.. ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది.' - ఇటీవల జరిగిన రోడ్డు భద్రతా సమావేశంలో పోలీసుల సిఫార్సులివి..

ఈనాడు, నెల్లూరు: అధికారులు ఉమ్మడి తనిఖీల్లో గుర్తించిన బ్లాక్‌స్పాట్ల వద్ద పరిస్థితులను చక్కదిద్దితే చాలా వరకు ప్రమాదాలను నివారించవచ్చు. ఈ దిశగా అన్ని శాఖల అధికారుల చొరవ అవసరం. కానీ, రోడ్డు భద్రతపై పలు సమావేశాలు నిర్వహిస్తున్న అధికారులు.. కేవలం నిర్ణయాలు తీసుకుని వదిలేస్తున్నారు. ఆచరణకు అడుగులు పడటం లేదు. చాలాచోట్ల అక్కడి లోపాలను గుర్తించేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేసినా కొంత మేరకు ఫలితం ఉంటుందని భావించినా.. అదీ జరగడం లేదు. ఫలితంగా రహదారులు నిత్యం రక్తమోడుతున్నాయి.

ఆత్మకూరు సమీపంలో ముంబయి జాతీయ రహదారిపై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన సూచికలు

రహదారులు	ప్రమాదాలు 2024	ప్రమాదాలు 2025	మరణాలు 2024	మరణాలు 2025	క్షతగాత్రులు 2024	క్షతగాత్రులు 2025
జాతీయ	413	293	249	266	487	407
రాష్ట్ర	169	117	81	48	183	115
ఇతర రోడ్లు	240	256	117	128	227	213

జాతీయ రహదారులపైనే అధికం

జిల్లాలో ఎన్‌హెచ్ 16, 67, 565, 167 బీజీ తదితర రహదారులు ఉండగా- వీటిపై రాత్రింబవళ్లు వాహనాలు రయ్‌మని దూసుకుపోతుంటాయి. ఈ క్రమంలో పలుచోట్ల సూచికలు సక్రమంగా కనిపించకపోవడం.. రహదారి నిర్మాణ లోపాల కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. మనుబోలు మండలం వీరంపల్లి క్రాస్ దగ్గర పరిస్థితే తీసుకుంటే.. పొదలకూరు నుంచి వచ్చే వాహనాలు జాతీయ రహదారిపైకి వచ్చేటప్పుడు అత్యంత ప్రమాదకర పరిస్థితులు ఎదురవుతున్నాయి. రోడ్డు ఓ వైపు ఎత్తుగా, మరోవైపు తగ్గుగా ఉండటమే ఇందుకు కారణం. ఈ లోపాల కారణంగా ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతూ.. పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. చాలా ప్రాంతాల్లో ఇదే తరహా పరిస్థితులు కనిపిస్తున్నాయి.

వీటిని అధిగమిస్తేనే..

అమలుకు నోచుకోని సిఫార్సులు

● జిల్లా వ్యాప్తంగా తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించారు. రహదారులు ఇరుకుగా ఉండటం.. వంపు ఎక్కువగా ఉండటం.. సైన్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడం.. రద్దీ ప్రాంతాల్లో వేగ నిరోధకాలు లేకపోవడం తదితరాలతో తరచూ దుర్ఘటనలు జరుగుతున్నట్లు నిర్ధారించారు.

● ప్రమాద ప్రాంతాల్లో సూచిక బోర్డుల ఏర్పాటు అత్యవసరం. నిర్మాణాన్ని చూసే ప్రభుత్వ శాఖలే.. ఖర్చును భరించాల్సి రావడంతో ఆసక్తి చూపడం లేదు. నిధుల కొరత ఎక్కువగా ఉండటంతో బోర్డుల ఏర్పాటు భారంగా మారింది.

● దీనిపై జిల్లా ఉపరవాణా కమిషనర్ బి.చందర్ మాట్లాడుతూ.. అన్ని శాఖల సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. గుర్తించిన లోపాలను చక్కదిద్దడంతో పాటు అవసరమైన చోట సూచికలు, సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తాం.

ఆలోచనలకు రెక్కలు.. ఉపాధికి బాటలు

సోలార్ డ్రయ్యర్‌తో ఆర్థికాభివృద్ధి

ఆమె ఆలోచనలతోనే ఆగిపోలేదు. వాటిని ఆచరణలో పెట్టేందుకు పట్టు వదలక ప్రయత్నించారు. ఆదిలో ఒడుదొడుకులు ఎదురైనా.. వెనుకడుగు వేయలేదు. ఒక్కొక్క ప్రతిబంధకాన్ని అధిగమించారు. ఎందరికో స్వయం ఉపాధిలో రాణిస్తూ.. మరో ఏడుగురికి ఉపాధి చూపుతున్నారు. దామవరపు ప్రసూన.

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: తోటపల్లి గూడూరు మండలం కృష్ణారెడ్డిపాళేనికి చెందిన దామవరపు ప్రసూన ఎంఏ బీఈడీ చదివారు. భర్త కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. ముగ్గురు బిడ్డలు. ఇంటిని చక్కదిద్దుకుంటూనే.. ఖాళీ సమయాల్లో తనవంతుగా చేదోడువాదోడుగా నిలవాలనే ఆలోచన చేశారు. స్వయం ఉపాధి వైపు అడుగులు వేశారు. విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ.. సోలార్ డ్రయ్యర్ గురించి తెలుసుకున్నారు. ఇంటి ఆవరణలోనే ఫుడ్ ప్రాసెస్ సంస్థను నెలకొల్పారు.

ఒడుదొడుకుల మధ్యనే..

ఫుడ్ ప్రాసెస్ సంస్థ ద్వారా 35 శాతం రాయితీతో రూ. 4.38 లక్షల బ్యాంకు రుణం తీసుకున్నారు. సొంత డబ్బు మరికొంత జోడించి.. గత ఏడాది జనవరిలో సోలార్ డ్రయ్యర్ ఏర్పాటు చేశారు. తొలుత ఉత్పత్తులు ఆశించిన రీతిలో రాణించలేదు. వాటిని కొనుగోలు చేసేవారు సక్రమంగా లేకపోవడం తదితర ఒడుదొడుకులు ఎదురయ్యాయి. వెనుకడుగు వేయకుండా మార్కెటింగ్‌పై దృష్టిసారించారు. నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో క్రమంగా ఆర్డర్లు పెరిగాయి.

క్రమ క్రమంగా..

ఇప్పటి వరకు టన్ను పచ్చి అరటి, టన్ను మునగాకు పొడి, క్యారట్, బీట్‌రూట్ తదితరాలను ఆర్డర్లపై తయారీ చేసి ఇచ్చారు. ముఖ్యంగా అల్లం 72 టన్నులు ఆరబెట్టి.. ఓ ఔషధ కంపెనీకి విక్రయించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈమె వద్ద ఏడుగురు ఉపాధి పొందుతున్నారు. సోలార్ డ్రయ్యర్ పెట్టుకుని జీవనోపాధి పొందాలంటే.. పూర్తిగా తెలుసుకోవడంతో పాటు మార్కెటింగ్‌పై అవగాహన పెంచుకోవాలని సూచిస్తున్నారు.

ఒక్క బస్సు.. ప్రయాణానికి పాట్లు

దుత్తలూరు- పామూరు మార్గంలో ప్రయాణికుల ఇబ్బందులకు దర్పణం ఈ చిత్రం. గతంలో ఈ మార్గంలో ఆర్టీసీ బస్సులతో పాటు ఆ సంస్థ అద్దె బస్సులు నడిచేవి. ఇటీవల హైర్ బస్సులను అధికారులు చాలా వరకు తగ్గించారు. దాంతో ప్రస్తుతం నడుస్తున్న బస్సుల్లోనే కిక్కిరిసి వెళుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఇటు సాధారణ ప్రయాణికులతో పాటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సు రాగానే కుస్తీ పట్టాల్సి వస్తోంది. ఫుట్‌బోర్డులపై ప్రమాదకర ప్రయాణం సర్వసాధారణమైంది. రద్దీకి తగిన విధంగా సర్వీసులు నడపాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, దుత్తలూరు

కొలువుకు స్వస్తి.. లాభాల సృష్టి

న్యూస్‌టుడే, నెల్లూరు(కలెక్టరేట్)

నెల్లూరు రూరల్ మండలం పెనుబర్తి గ్రామానికి చెందిన రైతు రవీంద్రరెడ్డి, రాజేశ్వరి కుమారుడు జశ్వంత్. నెల్లూరులో బీటెక్ పూర్తి చేసి హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరాడు. కుటుంబానికి దూరంగా ఉండటం.. ఉద్యోగంలోఒత్తిడి, ఒడుదొడుకులు తదితరాలతో ఉద్యోగం కన్నా వ్యవసాయమే మేలని తలచాడు. 2021లో కొలువుకు స్వస్తి చెప్పి పొలంబాట పట్టాడు. గ్రామంలో తమకున్న 40 ఎకరాల్లో రెండేళ్లుగా విభిన్నంగా వరి పంట పండిస్తున్నాడు. మరో 30 ఎకరాలు కౌలుకు తీసుకుని అందులోనూ వ్యవసాయం చేస్తున్నాడు.

డ్రోన్‌తో జశ్వంత్

చాలీచాలని జీతంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేయడం కంటే నేలతల్లిని నమ్ముకుంటే భవిష్యత్తు ఉంటుందని నిరూపించాడు ఆ యువకుడు. సాంకేతికతను జోడించి వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తున్నాడు జశ్వంత్. ఇతడి విజయప్రస్థానంపై 'ఈనాడు- ఈటీవీ' కథనం.

డ్రోన్ల ద్వారా ..

పంట మార్పిడి పద్ధతులతో పాటు కూలీలపై ఆధారపడకుండా ప్రభుత్వం ఇస్తున్న రెండు రాయితీ డ్రోన్లు కొనుగోలు చేసి.. కూలీల సమస్య ఉన్న గ్రామాల్లో వాటి ద్వారా సాయం అందిస్తున్నాడు. తక్కువ ధరకే డ్రోన్ల ద్వారా రోజుకు 150 ఎకరాల్లో మందు పిచికారీ చేస్తున్నాడు. కలివెలపాలెం, అనికేపల్లి, పొట్టెంపాడు, గొలగమూడి, మాదరాజుగూడూరు, పంపాలెం గ్రామాల్లో సాంకేతికతను ఉపయోగిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నాడు.

సంతృప్తికరంగా ఉంది

ప్రారంభంలో వ్యవసాయం ఇబ్బందిగా ఉన్నా.. ఇష్టపడి చేస్తే ఆదాయం వస్తుంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కన్నా.. ఇంటి వద్ద వ్యవసాయం చేస్తూ సాంకేతిక పరికరాల ద్వారా కూడా ఆదాయం పొందుతున్నా. – జశ్వంత్

సోమశిలకు 3,086 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయానికి మంగళవారం ఎగువ ప్రాంతాల నుంచి 3,086 క్యూసెక్కుల వరద వస్తోంది. దాంతో నీటి నిల్వ 71.031 టీఎంసీలకు చేరగా. నీటిమట్టం 326.860 అడుగులుగా నమోదైంది. -17, -18 రివర్స్ స్లూయిస్‌ల నుంచి 50, క్రస్ట్‌గేట్ల లీకేజీల ద్వారా 50, పవర్ టన్నల్ ద్వారా 2,250 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు.

ఏమనుకున్నా.. ఇది సాగునీటి కాలువే

నెల్లూరు బైపాస్‌లోని సాగునీటి కాలువ మురుగుకూపంగా మారింది. అక్కడి పరిస్థితిని చూస్తుంటే. మురుగునీటి నియంత్రణకు షట్టర్లను వినియోగిస్తున్నట్లు ఉంది. అధికారులు పరిస్థితిని చక్కదిద్దాల్సి ఉంది. – ఈనాడు, నెల్లూరు

ఉత్తరక్రియలు

శ్రీ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి గారు

ఆదరణ, ఆత్మీయతలతో అందరి హృదయాలలో కొలువైన మంచి మనిషి, స్నేహశీలి, నా భర్త గారైన

శ్రీ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి గారు

తేది: 15-01-2026 గురువారం స్వర్గస్తులైనారు.

పెద్దకర్మ: తేది: 29-01-2026 గురువారం ఉదయం 10 గంIIలకు కావలిలోని మా నివాసంలో వారి పెద్దకర్మ జరుగును. కావున తెలియజేయడమైనది.

ఇట్లు :
ధర్మపత్ని : కోటంరెడ్డి పద్మ
తమ్ముళ్లు : లేట్ కోటంరెడ్డి ద్వారకనాథరెడ్డి - విజితమ్మ
కోటంరెడ్డి అమరనాథరెడ్డి - శ్రీలత

సర్వే ప్రారంభించని సిబ్బందికి మెమోలు

సీతారామపురం, న్యూస్‌టుడే : ఏకీకృత సర్వే ప్రారంభించని 16 మంది సచివాలయ సిబ్బందికి మెమోలు జారీచేసినట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ వెల్లడించారు. సర్వే పురోగతిపై మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేయాలని ఆదేశించారు.

పన్ను వసూలు చేయనందుకు..

అనుమసముద్రంపేట: ఇంటి పన్ను వసూలులో నిర్లక్ష్యం వహించిన 10 మంది పంచాయతీ కార్యదర్శులకు అధికారులు మెమోలు జారీ చేశారు. డిప్యూటీ ఎంపీడీవో మునిరత్నం మాట్లాడుతూ ఇళ్ల పన్ను కనీసం 50 శాతం వసూలు చేయాలన్నారు. ఈమేరకు వసూలు చేయని ఏఎస్‌పేట, పొనుగోడు, పందిపాడు, పెద్దబ్బీపురం, కుప్పురుపాడు, రాజవోలు, దూబగుంట, జమ్మవరం, కావలిఎడవల్లి, అక్బరాబాద్ కార్యదర్శులకు మెమోలు ఇచ్చినట్లు తెలిపారు.

యూరియా.. ఇదేం తీరయా!

సొసైటీల వద్ద రైతుల పడిగాపులు

● సీతారామపురంలోని మారంరెడ్డిపల్లి సొసైటీలో యూరియా పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించారు. 400 బస్తాలు సిద్ధం చేయగా.. అంతకు నాలుగింతల మంది రైతులు తరలిరావడంతో గందరగోళం నెలకొంది. పోలీసులు వచ్చి అదుపు చేయాల్సి వచ్చింది. ఒక్కో రైతుకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేసినట్లు సీఈవో శ్రీనివాసులు తెలపగా... 400 బస్తాలకు ఇండెంట్ పంపించామని ఏవో చెన్నారెడ్డి తెలిపారు.

● కలువాయి మండలం తెలుగురాయపురం రైతు సేవా కేంద్రంలో తోపులాట జరిగింది. ఇచ్చిన వారికే ఇస్తున్నారని రైతుల మధ్య వివాదం తలెత్తగా.. అధికారులు యూరియా పంపిణీని నిలిపివేశారు. ఒకరిపై ఒకరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఏవో కళారాణి మాట్లాడుతూ.. రైతు సేవా కేంద్రానికి 400 బస్తాలు వచ్చిందని.. రైతుల మధ్య గొడవ జరగడంతో ఎవరికీ పంపిణీ చేయలేదని తెలిపారు. కలువాయి సొసైటీకి ఒక లోడు వచ్చిందని.. మరో లోడు కూడా వస్తుందని తెలిపారు.

జిల్లాలో యూరియా అవసరాలు.. వాటి కోసం రైతులు పడుతున్న ఇబ్బందులకు మంగళవారం జిల్లాలో చోటు చేసుకున్న పలు సంఘటనలు అద్దం పట్టాయి. అధికారులు తక్షణం దృష్టి సారించాల్సిన ఆవశ్యకతను చాటిచెబుతున్నాయి. రైతులు మాత్రం పక్కదారి పట్టడం వల్లే ఈ పరిస్థితులు నెలకొంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సంగం, సీతారామపురం, కలువాయి, న్యూస్‌టుడే: జిల్లాలో వర్షాలు పుష్కలంగా పడటంతో.. వరి సాగు భారీగా పెరిగింది. 3.43 లక్షల ఎకరాల్లో సాగవుతుందని అంచనా వేయగా. . ఇప్పటికే 3.15 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. దీంతో పాటు ఇతర పంటలకు 94,383 టన్నులు అవసరమవుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేయగా.. 92 వేల టన్నుల మేరకు వచ్చింది. అయినా రైతులకు పూర్తిస్థాయిలో అందలేదు. ఈ క్రమంలో వారు ఇబ్బందులు పడుతుండగా.. కొరత నేపథ్యంలో వ్యాపారులు సైతం ధరలు పెంచి విక్రయిస్తుండటం పరిస్థితిని సంక్లిష్టం చేస్తోంది.

సీతారామపురం : యూరియా కోసం వచ్చిన రైతులు

కంపెనీల జాప్యమేనట!

సంగంలోని సహకార సంఘం గోదాములో శనివారం నాటికే 400 బస్తాల యూరియా నిల్వ ఉంది. మంగళవారం వరకు రైతులకు దాన్ని పంపిణీ చేయలేదు. అన్నదాతలు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఇందుకు కంపెనీల నిర్వాకమే కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. ● ఈ పరిస్థితిపై వ్యవసాయశాఖ జేడీ సత్యవాణితో మాట్లాడగా.. డిస్పాచ్ సంఖ్య వచ్చేందుకు కనీసం 24 గంటల సమయం పడుతుంది. దాన్ని తగ్గించాలని కంపెనీలతో మాట్లాడుతున్నామని.. ఆందోళన చెందవద్దని రైతులకు సూచించారు.

కత్తులతో ఘర్షణ ఘటనలో ఏడుగురిపై కేసు

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: కత్తులతో స్వైర విహారం చేసి ఘర్షణకు పాల్పడిన ఘటనలో ఏడుగురిపై నెల్లూరుగ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. నెల్లూరుగ్రామీణం కోడూరుపాడు కల్తీ కాలనీలోని పాఠశాలలో సోమవారం సుశాంత్ గణతంత్ర వేడుకలు ముగించుకుని ఇంటికి వస్తుండగా.. మోహన్ అనే వ్యక్తి ఢీకొనడంతో చిన్న గొడవ జరిగింది. దీంతో మోహన్ ఫోను ద్వారా తన స్నేహితులైన జూపూడి మణికంఠ, కాకాని రాకేష్ అలియాస్ రాఖీ బాయి, బి.శ్రీనివాసులు అలియాస్ శీను, కాసు కల్యాణ్, ఉమ్మయ్య అలియాస్ ఉమ, భవానీలను పిలిపించాడు. వారందరూ వచ్చి సుశాంత్‌పై, అడ్డు వచ్చిన అతని అన్న హర్షవర్ధన్, స్నేహితుడు షేక్ అమీర్‌పై దాడికి పాల్పడ్డారు. చేతులు, కాళ్లతో కొట్టడంతో పాటు కత్తితో సుశాంత్‌పై దాడికి పాల్పడ్డారు. దీనిపై బాధితులు నెల్లూరుగ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనో బలం.. విజయ తీరం

అట్టహాసంగా రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలు

నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో మంగళవారం రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలు అట్టహాసంగా జరిగాయి. వివిధ జిల్లాల నుంచి దివ్యాంగ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొనగా- పరుగు పందెం, లాంగ్ జంప్, డిస్కస్ త్రో, షాట్‌పుట్ తదితరాల్లో పోటీలు నిర్వహించారు. పారా అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామస్వామి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాల్యాద్రినాయుడు, యాదగిరి, ఇతర జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.
– న్యూస్‌టుడే, నెల్లూరు(క్రీడా విభాగం)

పంచాయతీల కొత్త లెక్క!

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ)

ఉమ్మడి నెల్లూరు జిల్లా లెక్కల ప్రకారం 46 మండలాలు ఉండేవి. వీటి పరిధిలో 941 గ్రామ పంచాయతీలున్నాయి. అప్పటి వైకాపా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లా విభజనలో మార్పులు జరిగాయి. 46 మండలాలు 36కి తగ్గాయి. పాత జిల్లా నుంచి 10 మండలాలు వెళ్లిపోయాయి. పంచాయతీల్లో మార్పులొచ్చాయి. జిల్లాలో 941 పంచాయతీల్లో 311 తిరుపతి జిల్లాలో చేరి.. 630 ఉండిపోయాయి. విభజన పేరుతో కందుకూరు నియోజకవర్గం జిల్లాలో కలవడంతో అక్కడి నుంచి 5 మండలాలు జిల్లా పరిధిలోకి వచ్చి చేరాయి.

జిల్లా పంచాయతీల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

జిల్లాలో గ్రామ పంచాయతీల లెక్కలు మారిపోయాయి. ఇప్పటి వరకు రెండు సార్లు జిల్లా విభజన జరిగింది. నియోజకవర్గాలు, మండలాల్లో మార్పులుచేర్పులు చోటుచేసుకుని.. తుదిగా 700 పంచాయతీలు మిగిలాయి. గత వైకాపా పాలనలో జిల్లా విభజన జరిగింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కొత్త నిర్ణయంతో కందుకూరు డివిజన్‌లో అయిదు మండలాల పరిధిలోని పంచాయతీలు తిరిగి ప్రకాశం జిల్లా పరిధిలోకి వెళ్లిపోగా.. గూడూరు నియోజకవర్గంలోని మూడు మండలాలలోని పంచాయతీలు నెల్లూరు జిల్లాలో కలిశాయి.

కొత్తగా 70 రాక.. జిల్లా నుంచి వెళ్లేవి 92

వీటి పరిధిలోని 92 పంచాయతీలు కలిసి 630 కాస్త 722కు పెరిగాయి.

ప్రస్తుతం 700

కూటమి ప్రభుత్వం కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలపడంతో అప్పట్లో కలిసిన 92 పంచాయతీలు తిరిగి ఆ జిల్లాకు వెళ్లిపోయాయి. తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాల్లో గూడూరు, కోట, చిల్లకూరు తిరిగి జిల్లాలో కలవడంతో 70 పంచాయతీలు కలిశాయి. దీంతో జిల్లా పంచాయతీ స్వరూపం 700కి చేరింది. ఇందుకు సంబంధించిన జీవో విడుదలైంది. దీంతో జిల్లా పంచాయతీ అధికారులు దస్త్రాల్లో లెక్కలు మార్చుతున్నారు.

ఉత్తరక్రియలు

అల్లూరు వెంకట శోభమ్మ గారు
మరణం : 19-01-2026

మా అమ్మమ్మ గారైన
అల్లూరు వెంకట శోభమ్మ గారు
(W/o అల్లూరు అబ్బయ్యరెడ్డి (లేట్))
తేది : 19-01-2026 సోమవారం నాడు స్వర్గస్తులైనారు.
వారి పెద్దకర్మ తేది 29-01-2026 గురువారం పై కార్యక్రమము నెల్లూరు జిల్లా, కొడవలూరు మండలం, గండవరం గ్రామములోని మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.
ఇట్లు మనుమడు :
సన్నపరెడ్డి అనుదీప్‌రెడ్డి - శ్రావణి

(c) eenadu

ఇఫ్కో కిసాన్‌సెజ్‌లో 132 కేవీ విద్యుత్తు ఉపకేంద్రం : గొట్టిపాటి

కుడితిపాళెంలో సబ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి, వేమిరెడ్డి దంపతులు, ఎమ్మెల్సీ బీద

ఇందుకూరుపేట, బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్తు బిల్లులు తగ్గించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఇందుకూరుపేట మండలం కుడితిపాలెంలో నూతనంగా నిర్మించిన సబ్‌స్టేషన్‌ను ప్రారంభించి మాట్లాడారు. నాణ్యమైన విద్యుత్తు అందిచాలనే లక్ష్యంతో 200 సబ్‌స్టేషన్లు నిర్మాణంలో ఉన్నాయని పేర్కొన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ మెరుగైన విద్యుత్తు అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నాయకులు కళ్యాణ్‌రెడ్డి, కమలాకర్ రెడ్డి, పవన్‌రెడ్డి, వీరేంద్ర నాయుడు, పీఎల్ రావు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

❖ ఇఫ్కో కిసాన్‌సెజ్‌లో 132 కేవీ విద్యుత్తు ఉపకేంద్రం ఏర్పాటు చేస్తామని మంత్రి గొట్టిపాటి తెలిపారు. బుచ్చి మండలంలోని పంచేడులో రూ.3.37కోట్లతో నిర్మించిన సబ్‌స్టేషన్‌ను వేమిరెడ్డి దంపతులతో కలిసి ప్రారంభించారు. ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపుతాం

కోట పోలీసుస్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ అజిత వేజెండ్ల

కోట, చిల్లకూరు, న్యూస్‌టుడే: నిబంధనలు అతిక్రమించిన రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపుతున్నామని, అవసరమైతే పీడీ యాక్టు నమోదు చేస్తున్నామని ఎస్పీ అజిత వేజెండ్ల స్పష్టం చేశారు. కోట పోలీసు స్టేషన్‌ను ఆమె మంగళవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేసి దస్త్రాలను పరిశీలించారు. కేసుల వివరాలపై ఆరాతీశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. రౌడీషీటర్లను ముందస్తు బైండోవర్ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. 25 మందిపై పీడీ యాక్టు కేసులున్నాయని తెలిపారు. ప్రధాన కూడలి ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకొంటామని పేర్కొన్నారు. పోలీసు పనితీరు పరిశీలిస్తున్నామని, ఆరోపణలు వస్తే విచారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీ సీవ తదితరులు పాల్గొన్నారు. చిల్లకూరు పోలీసు స్టేషన్‌లో దస్త్రాలు పరిశీలించారు. విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

అవార్డు గ్రహీతకు హార్దిక శుభాకాంక్షలు

శ్రీ M.సత్యప్రకాశ్ గారు
డిప్యూటీ కమిషనర్, కమర్షియల్ టాక్స్, నెల్లూరు.

గణతంత్ర దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించినందున ఉత్తమ అవార్డు అందుకున్న శ్రీ M.సత్యప్రకాశ్ గారికి ఇవే మా హృదయపూర్వక శుభాకాంక్షలు.

SVS రాఘవేంద్రరావు (రఘు)
GST Advocate, నెల్లూరు

నేడు ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా

నెల్లూరు(విద్య): నగరంలోని వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్‌మేళా జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీధర్‌రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. పదోతరగతి, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, ఏదైనా డిగ్రీ చదివిన నిరుద్యోగ యువత అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాలకు 94944 56326, 63015 29271 నంబర్లను సంప్రదించాలన్నారు.

అవార్డు గ్రహీతలకు హార్దిక శుభాకాంక్షలు

శ్రీమతి D.వసుమతి గారు
District Panchayathi Officer, Nellore.

శ్రీ K.రామారావు గారు
P.D.O Gr-1 Vinjamuru Gram Panchayat

పంచాయతీరాజ్ & గ్రామీణ అభివృద్ధి శాఖలో విశిష్ట సేవలు అందించినందుకు ఉత్తమ అవార్డులు అందుకున్న శ్రీమతి డి.వసుమతి గారికి మరియు శ్రీ కె.రామారావు గారికి ఇవే మా హృదయపూర్వక శుభాకాంక్షలు.

వింజమూరు గ్రామ పంచాయతీ సిబ్బంది

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032.
బ్రాంచ్ ఆఫీస్: డి.నెం.26-2-7, 2వ అంతస్తు, పద్మావతి ప్లాజా, కెనరా బ్యాంక్ ప్రక్కన, ఏ.కె నగర్, నెల్లూరు.

లాంఛనాత్మకంగా స్వాధీనత ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ గా పిలువబడేది, ఎన్‌సిఎల్‌టి బెంచ్-II, చెన్నై, తేది: 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేది నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ ద్వారా) శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డ్ కంపెనీ అయి ఉన్నాము. మరియు రిజిస్టర్డ్ ఆఫీస్ కలిగి, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఏ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032.

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్.ఎఫ్.ఎల్) యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (సదరు చట్టం) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (సదరు రూల్స్) యొక్క రూల్ 3తో చదువుకోవల్సిన సదరు చట్టంలోని సెక్షన్ 13 (12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ సదరు డిమాండ్ నోటీసులలో తెలిపిన మొత్తమును తిరిగి చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలకు డిమాండ్ నోటీసులను జారీ చేశారు. వాటి వివరాలు దిగువ పట్టికలో పేర్కొనబడినవి.

ఋణగ్రహీతలు సదరు మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైనారు, కావున ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుకోవల్సిన సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **24 జనవరి 2026**న లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకోవడమైనది.

ఋణగ్రహీత యొక్క పేరు మరియు చిరునామా	డిమాండ్ నోటీసు ప్రకారం బకాయియున్న మొత్తం:
1. ఎం.కె రెడ్డి కార్స్ అండ్ రియల్ ఎస్టేట్స్ @ మెస్సర్స్ ఎం.కె రెడ్డి కార్స్ అండ్ బిల్డర్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ పార్టనర్ వి.ఎస్. మురళీకృష్ణ రెడ్డి, తండ్రి: సుబ్రహ్మణ్యం, సాయి దీప్ హైలాండ్స్ అపార్ట్‌మెంట్స్, మొదటి అంతస్తు, ప్లాట్ నెం: 002, వీధి నెం-433, సరస్వతి నగర్-2, నెల్లూరు, ఎస్.పి.ఎస్.ఆర్ నెల్లూరు జిల్లా-524001. **2. బి. సుధాభారతి రెడ్డి,** భర్త: వి.ఎస్.ఎం. కృష్ణా రెడ్డి, సాయి దీప్ హైలాండ్స్ అపార్ట్‌మెంట్స్, మొదటి అంతస్తు, ప్లాట్ నెం: 002, వీధి నెం-433, సరస్వతి నగర్-2, నెల్లూరు, ఎస్.పి.ఎస్.ఆర్ నెల్లూరు జిల్లా-524001.	ఋణ ఖాతా నెం. **1. NRTFNL110600061** **2. CTFNELL30001110** ద్వారా రూ. **4,84,70,713/-** (అక్షరాలా నాలుగు కోట్ల ఎనభై నాలుగు లక్షల డెబ్బై వేల ఏడు వందల పదమూడు రూపాయలు మాత్రమే) చెల్లించాలి. **డిమాండ్ నోటీసు తేది: 05-09-2024**

3. కె. విజయలక్ష్మి, భర్త: సనాతన రెడ్డి, నివాసం: ప్లాట్ నెం: 301, సి & బి అపార్ట్‌మెంట్, దర్గామిట్ట, నెల్లూరు.
4. వి.ఎస్. మురళీకృష్ణ రెడ్డి, తండ్రి: సుబ్రహ్మణ్యం రెడ్డి, సాయి దీప్ హైలాండ్స్ అపార్ట్‌మెంట్స్, మొదటి అంతస్తు, ప్లాట్ నెం: 002, వీధి నెం-433, సరస్వతి నగర్-2, నెల్లూరు, ఎస్.పి.ఎస్.ఆర్ నెల్లూరు జిల్లా-524001.
5. ఎం.ఎస్. భరత్ రెడ్డి, తండ్రి: వి.ఎస్.ఎం. కృష్ణ రెడ్డి, సాయి దీప్ హైలాండ్స్ అపార్ట్‌మెంట్స్, మొదటి అంతస్తు, ప్లాట్ నెం: 002, వీధి నెం-433, సరస్వతి నగర్-2, నెల్లూరు, ఎస్.పి.ఎస్.ఆర్ నెల్లూరు జిల్లా-524001.

ఆస్తి వివరము: నెల్లూరు జిల్లా, గూడూరు రిజిస్ట్రేషన్ జిల్లా, ముత్తుకూరు సబ్-జిల్లా, ముత్తుకూరు మండలం, తాళ్లపూడి గ్రామ పంచాయతీ, తాళ్లపూడి-వల్లూరు రెవెన్యూ గ్రామ ఖాతాలు, మాగాణీ సర్వే నెం. 166/4 లో మొత్తం విస్తీర్ణం ఎకరా 1.48 సెంట్లలో, ఎకరా 0.48 సెంట్లకు గాను, ఎకరా 0.16 సెంట్లు. సర్వే నెం. 167/2లో మొత్తం విస్తీర్ణం ఎకరా 1.17 సెంట్లలో, ఎకరా 0.65 సెంట్లు. సర్వే నెం. 166/2లో మొత్తం విస్తీర్ణం ఎకరా 0.65 సెంట్లలో, ఎకరా 0.14 సెంట్లు. సర్వే నెం. 166/3లో మొత్తం విస్తీర్ణం ఎకరా 0.14 సెంట్లలో, ఎకరా 0.08 సెంట్లు. సర్వే నెం. 167/1లో ఎకరా 0.05 సెంట్లు. పైన పేర్కొన్న సర్వే నెంబర్లలోని మొత్తం విస్తీర్ణం ఎకరా 1.08 సెంట్ల లలో ఎకరా 0.90 సెంట్ల భూమికి **హద్దులు: తూర్పు:** నాగేశ్వరరావు గారి మాగాణీ భూమి, **పడమర:** నెల్లూరు నుండి కృష్ణపట్నం వెళ్లే రోడ్డు, **ఉత్తరం:** కోట గురుబ్రహ్మం మరియు ఇతరుల భూమి, **దక్షిణం:** నందిమండలం హరనాథ రాజు గారి భూమి. పైన పేర్కొన్న హద్దుల మధ్య గల ఎకరా 0.90 సెంట్ల భూమి మాత్రమే, సాగునీటి హక్కులు మరియు ఇతర సమస్త సులభ హక్కులతో కలిపి ఉన్నది. పై షెడ్యూల్ ఆస్తులన్నీ వి.ఎస్. మురళీకృష్ణ రెడ్డి, తండ్రి: సుబ్రహ్మణ్యం రెడ్డి గారి పేరు మీద ఉన్నాయి.

ఈ నోటీసు ద్వారా సాధారణ ప్రజానీకమంతటికి ఇందుమూలంగా హెచ్చరిక చేయునది ఏమనగా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్.ఎఫ్.ఎల్) యొక్క అధీకృత అధికారి పైన తెలిపిన స్థిరాస్తి చట్టబద్ధ లాంఛనాత్మక స్వాధీన చేపట్టినందున, ఈ నోటీసు అందిన తర్వాత శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్.ఎఫ్.ఎల్) యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా, ఋణగ్రహీతలు లేదా ఎవరేని వ్యక్తి ఈ నోటీసులో పైన తెలిపిన ఏదేని సెక్యూర్డ్ ఆస్తిని అమ్మకం, లీజు లేదా మరే విధంగానైనా లావాదేవీ జరపడం ద్వారా బదిలీ చేయడం / అన్యాక్రాంతం చేయరాదు.

తేది: 24.01.2026
ప్రదేశం : నెల్లూరు-1

అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - తాడికొండ

బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Hospitality Partner: Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Man of the Series: Hero
Digital Partner: ఈనాడు.నెట్
TV Partner: ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్
Organised by: ఈనాడు

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - 1 జూనియర్స్: మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్సర్లతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులు చేసి ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - 1 జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

సీనియర్స్ విన్నర్స్ రాయలసీమ రాకర్స్

గ్రౌండ్-2లో సీనియర్స్: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ చరణ్ జిత్ ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-1 (జూనియర్స్)
మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)
మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్, తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

యువగళం స్ఫూర్తితో అభివృద్ధి కార్యక్రమాలు: బీద

నెల్లూరు (టౌన్), న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్ మూడేళ్ల క్రితం ప్రారంభించిన యువగళం స్ఫూర్తితో.. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 10 నియోజకవర్గాలతో పాటు.. కందుకూరు నియోజకవర్గంలోని ప్రభుత్వ, జడ్పీ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు 31,320 సైకిళ్లను పంపిణీ చేయనున్నట్లు వివరించారు. జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. 29 నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ప్రారంభించి యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తామన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేల సహకారంతో ఈ ఏడాది మార్చి 29న తెదేపా ఆవిర్భావ దినోత్సవం నాటికి పూర్తి చేస్తామని బీద తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రయోగ పరీక్షలు

పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐవో వరప్రసాదరావు

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఇంటర్ ప్రయోగ పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆరు కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం వృత్తి విద్యా కోర్సుల విద్యార్థులకు పరీక్షలు జరిగాయి. జిల్లా ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షకులు టి.వరప్రసాదరావు పలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం జరిగిన పరీక్షకు 194కి 159 మంది, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు జరిగిన పరీక్షకు 164కి 154 మంది హాజరయ్యారని తెలిపారు.

సేవలు విస్తరిస్తూ..
ఆదాయం పెరుగుతూ..!

న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

ఆర్టీసీకి ప్రజారవాణా ఆదాయం కొన్ని చోట్ల తగ్గినా.. కార్గో లాభాలు తెచ్చిపెడుతోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని డిపోల పరిధిలో అందుబాటులో ఉంచారు. క్రమంగా విస్తరిస్తూ ఆయా ప్రాంతాల్లో ఏజెంట్లను నియమించి డోర్ డెలివరీ సేవలను సైతం తీసుకొచ్చారు. మిగిలిన కార్గో సేవలతో పోలిస్తే ధరలు తక్కువగా ఉండడంతో ఎక్కువ మంది ఆర్టీసీ కార్గోను ఆశ్రయించడంతో ఆదాయపరంగా వృద్ధి సాధిస్తోంది.

పొరుగు రాష్ట్రాలకు సైతం...

జిల్లా నుంచి రాష్ట్రంలో ఏ ప్రాంతమైనా, పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, తెలంగాణకు సైతం సేవలు అందుబాటులోకి తెచ్చారు. ఆటో మొబైల్ సామగ్రి, చిన్న తరహా పరిశ్రమలు ఉత్పత్తి చేసిన వివిధ రకాల, వస్త్ర దుకాణాల పార్శిళ్లు, ఎలక్ట్రిక్ వస్తువులు, వాహనాల విడిభాగాలు వంటి పార్శిళ్లను ఏపీ నుంచి 24 కేవలం గంటల్లో పొరుగు రాష్ట్రాలకు చేరుస్తున్నాయి.

నెల్లూరు డిపోలో రవాణాకు సిద్ధంగా ఉన్న పార్శిళ్లు

మండలాల వారీగా ఏజెన్సీలు..

ప్రజలకు మరింత చేరువయ్యే క్రమంలో మండలాల వారీగా ఏజెన్సీలు నియమించడంతో పాటు ఇంటికే సేవలందించేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం వివిధ పాఠశాలలు, కళాశాలలకు పాఠ్యపుస్తకాలు, ప్రశ్నాపత్రాలను ఆర్టీసీ కార్గో ద్వారానే సరఫరా చేస్తోంది. ఇలా సేవలు విస్తృతం చేయడంతో రూ.కోట్లలో ఆదాయం వస్తోంది. నాలుగేళ్లలో పరిశీలిస్తే ప్రతి ఏడాది కోటి రూపాయలు మేర ఆదాయం పెరుగుతుండడం విశేషం.

నాలుగేళ్లుగా కార్గో విభాగంలో ఆదాయ వివరాలు (రూ.కోట్లలో)

సంవత్సరం	ఆదాయం
2021-22	6.37
2022-23	9.83
2023-24	11.52
2024-25	12.20

● నెల్లూరు డిపో-1 మేనేజర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆర్టీసీ వస్తు రవాణా సేవలను మరింత విస్తృతం చేయనున్నామని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలోని డిపోల పరిధిలో డోర్ డెలివరీ సౌకర్యాన్ని అన్ని ప్రాంతాలకు విస్తరించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు.

పథకాలతో ఆర్థికంగా అభివృద్ధి

మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

నెల్లూరు (టౌన్) : డీఆర్‌డీఏలో అమలవుతున్న పథకాల ద్వారా రుణాలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి తెలిపారు. మంగళవారం డీఆర్‌డీఏ కార్యాలయంలోని సమావేశమందిరంలో ఏపీఎంలు, సీసీఎస్‌లకు విజన్ బిల్డింగ్ మూడో మాడ్యూల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రతి గ్రామంలో పొదుపు సభ్యుల ద్వారా నడపబడే ఎంఎస్ఎంఈ యూనిట్లు కనిపించాలన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ. 15,444
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 1,23,552
వెండి గ్రాము :	రూ. 365.10

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	146
లేయర్	90
బ్రాయిలర్స్	256
బ్రాయిలర్స్‌స్కిన్‌లెస్	286
లేయర్ మాంసం	153

మెట్ట ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక : కలెక్టర్

సిమెంటు రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్

దుత్తలూరు, న్యూస్‌టుడే : జిల్లాలో మెట్ట ప్రాంతాలైన ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని కలెక్టర్ హిమాన్షు శుక్లా వెల్లడించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం దుత్తలూరు, వింజమూరు, కలిగిరి మండలాల అధికారులతో సమావేశం నిర్వహించారు. బీసీ కాలనీలో సిమెంటు రోడ్డు నాణ్యతను పరిశీలించారు. **వింజమూరు :** మండలంలోని నందిగుంటలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, బొమ్మరాజుచెరువులో నిమ్మ సాగును కలెక్టర్ హిమాన్షుశుక్లా పరిశీలించారు. **కలిగిరి :** విభిన్న పంటలు సాగు చేస్తే లాభాలు పొందొచ్చని కలెక్టరు హిమాన్షుశుక్లా సూచించారు. మండలంలోని నాగసముద్రంలో కూరగాయల పంటల సాగు, బిందు, తుంపర్ల సేద్యం, తైవాన్ స్ప్రేయర్ విధానాలను పరిశీలించారు.

జెన్‌కోలో పేలిన విద్యుత్తు నియంత్రిక

ముత్తుకూరు : మండలంలోని నేలటూరు పంచాయతీ పరిధిలో ఉన్న ఏపీ జెన్‌కో రెండో యూనిట్‌కు విద్యుత్తు సరఫరా చేసే నియంత్రిక మంగళవారం సాయంత్రం పేలింది. పెద్ద శబ్దం వచ్చి మంటలు చెలరేగాయి. కార్మికులు, ఉద్యోగులు ఆందోళన చెంది పరుగులు తీశారు. సురక్షితంగా బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం నేపథ్యంలో అధికారులు రెండో యూనిట్‌లో విద్యుదుత్పత్తిని పూర్తిగా నిలిపేశారు. ఎంత నష్టం జరిగిందన్న వివరాలు తెలియాల్సి ఉంది.

బాలికపై ఆటో డ్రైవర్ లైంగిక వేధింపులు

కోట, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లాచిట్టమూరు మండలానికి చెందిన బాలిక తల్లిదండ్రులతో గొడవపడి మంగళవారం అమ్మమ్మ ఊరికి బయల్దేరింది. కోట మండలం తిన్నెలపూడికి చెందిన పాల క్యాన్లు సరఫరా చేసే ఆటో డ్రైవర్ గమనించి ఊరికి తీసుకెళతానంటూ నమ్మించాడు. చిట్టమూరు మండలం కొత్తగుంట వద్ద వాహనంలో ఎక్కించుకున్నాడు. కాసేపటికి కోట మండలం కొండుగుంట పరిసర ప్రాంతంలో అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లాడు. లైంగిక వేధింపులకు పాల్పడడంతో బాలిక కేకలు వేస్తూ పరుగెత్తింది. స్థానికులు గమనించి కోట పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. సీఐ కిశోర్‌బాబు మాట్లాడుతూ ఫిర్యాదు మేరకు విచారిస్తున్నామని పేర్కొన్నారు.

సోలార్ కంచెపై పడి ఆర్టీసీ కండక్టర్ మృతి

ఉదయగిరి, న్యూస్‌టుడే : మండలంలోని జి.చెర్లోపల్లికి చెందిన **కుర్రా మధుసూదన్** (50) స్థానిక ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తూ ఉదయగిరిలో ఉంటున్నారు. స్వగ్రామంలో తనకున్న మామిడి తోటలో నువ్వు వేశారు. దీనికి నీరు పెట్టేందుకు మధ్యాహ్నం వెళ్లారు. ఆ సమయంలో పొలానికి ఉన్న విద్యుత్తు సోలార్ కంచెపై ప్రమాదవశాత్తు పడి మృతి చెందారు. ఈ విషయాన్ని ఎవరూ గుర్తించలేదు. ఉదయగిరి- సీతారామపురం మార్గంలో తిరిగే నైట్ అవుట్ సర్వీసుకు మధుసూదన్ విధులకు మంగళవారం రాత్రి హాజరుకావాల్సి ఉంది. రాకపోవడంతో ఆర్టీసీ అధికారులు ఫోన్ చేయగా స్పందన లేదు. దీంతో ఆర్టీసీ కార్మికులు ఉదయగిరిలో ఉండే ఇంటికి తెలిసిన వారిని పంపగా కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లినట్లు చెప్పారు. అనంతరం ఊరిలో ఉండే బంధువులకు ఫోన్ చేయగా డ్యూటీకి వెళ్లాల్సి ఉన్నందున ఉదయగిరికి వచ్చి ఉంటాడని సమాధానమిచ్చారు. ఊరిలో లేక, ఉదయగిరిలో లేకపోవడంతో పొలానికి వెళ్లి చూడగా సోలార్ కంచెపై పడి మృతి చెందినట్లు గుర్తించారు. ఎస్సై ఇంద్రసేనారెడ్డి వెళ్లి వివరాలు సేకరించారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(వేదాయపాలెం), న్యూస్‌టుడే: నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ టికెట్ బుకింగ్ కౌంటరు వద్ద గుర్తుతెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందారు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్సై ఎన్.హరిచందన మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. బులుగు రంగు గీతలు ఫుల్ హ్యాండ్స్ షర్ట్, బులుగు రంగు షాట్ ధరించి ఉన్నారు. మృతునికి 40 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు ఉంటుంది.

ప్లాట్‌ఫాంపై వృద్ధుడు..

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: నెల్లూరు సౌత్ రైల్వేస్టేషన్‌లో ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందారు. మృతుడికి 70 నుంచి 75 సంవత్సరాల మధ్య వయసు ఉంటుంది. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. బులుగు రంగు ఫుల్ హ్యాండ్స్ షర్ట్, నలుపు రంగు పంచె ధరించి ఉన్నారు. రైల్వే ఎస్సై హరిచందన మృతదేహాన్ని పరిశీలించారు.

EENADU Classifieds

AGRI BUSINESS

వరి ఎండుగడ్డి 1000 కట్టలు కావలెను. వివరాలకు సంప్రదించండి. Contact Cell : 94409 81322.

EDUCATION

DISTANCE EDUCATION

10th/Inter, BA, B.Com., B.Sc, BBA, BCA, BLIS, MA, M.Com, M.Sc, MCA, MBA, MLIS, Dip, B.Tech, M.Tech, Ph.D., BPT, Pharmacy, LLB, BA LLB. 9030030125

REAL ESTATE

HOUSE FOR SALE

ఇల్లు అమ్మబడును
నెల్లూరు బాలాజీ నగర్ గీతాంజలి స్కూలు రోడ్డులో 47 అం॥ స్థలంలో 44 అం॥ కట్టుబడి గల 2 అంతస్తుల ఇల్లు అమ్మబడును.
80748 16969
99498 94102

JOBS

Wanted Experienced Manager for a repurted hospital. Contact Number : 9866331257, 9866370961

Wanted Boy. Qualification: Degree. To work in Ashok Dental, Back side RTC, Nellore. Contact: 99494 14212

నెల్లూరు మిని బైపాస్ రోడ్డు TDP ఆఫీసు ఎదురుగా HP పెట్రోలు బంకులోకి పంపు బాయ్స్ / గర్ల్స్‌కావలెను. జీతం: 15000. ✆ 89199 23469, 83418 28889

CMR జ్యూయలరీకి ★సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ ★బిల్లింగ్‌సెక్షన్ ★ మార్కెటింగ్ హెడ్స్‌గా పనిచేసేందుకు యువకులు కావలెను. Cont: 9160974916, 9912121403

రైస్ మిల్ & ప్లాంట్ ఆపరేటర్స్ కావలెను. అనుభవజ్ఞులైన వెల్డింగ్, రిపేర్ తెలిసిన ఆపరేటర్స్ కావలెను. Contact No: ✆ 80962 46099.

ఫోర్స్ మోటార్స్ కంపెనీ షోరూం (నెల్లూరు, ఆత్మకూరు, సూళ్లూరుపేట) నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అమృత మోటార్స్, బుజబుజ నెల్లూరు. ✆ 9581299916, 9492934103

రియల్ ఎస్టేట్ ఆఫీస్‌లో పనిచేయుటకు 9-30AM-2-30 PM ఒకరు, 10 AM-6 PM వరకు ఒకరు కంప్యూటర్ తెలిసిన స్త్రీలు-2 కావలెను. ✆ 99665 05777

ప్రముఖ వెజిటేరియన్ హోటల్‌లో పని చేయుటకు ఉత్సాహవంతులైన సూపర్ వైజర్స్-4 No. (అనుభవం / ఫ్రెషర్స్) మరియు సప్లయర్స్, హెల్పర్స్-5 no's కావలెను. (M/F). ✆ 8885423099

SECURITY GUARDS

లేడీ/ జెంట్స్ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Nellore టౌన్‌లో పనిచేయుటకు 12 Hr. డ్యూటీ. జీతం : 13000/-. ✆ 72880 04477, 72880 04466

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు...
B/w 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
వివరాలకు..
నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 600
Colour : రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు ఆశిస్తున్నాం

సంగం: ఈ విద్యాసంవత్సరం పదోతరగతి పరీక్షల్లో 95 శాతం ఫలితాలు ఆశిస్తున్నామని డీఈవో ఆర్ బాలాజీరావు మంగళవారం సంగంలో తెలిపారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవానికి హాజరైన ఆయన మాట్లాడుతూ గతేడాది 83.58 శాతం రాగా, రాష్ట్రంలో 13వస్థానంలో నిలిచామన్నారు. ఈ సారి తొలి మూడు స్థానాలకు చేరుకునేలా ప్రణాళికలు చేపట్టామన్నారు. ప్రధానోపాధ్యాయులు పి.బుజ్జయ్య, ఆత్మకూరు డివిజన్ విద్యాశాఖాధికారి జానకిరాం, ఎంఈవో బి.మల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాచారం ఇవ్వాలని వినతి

బిట్రగుంట: బోగోలు మండలం అక్కిరాజువారికండ్రిక 924 సర్వే నంబర్ పరిసరాల్లో భూముల వివరాలు ఇవ్వాలని బోగోలు చెరువు సంఘం మాజీ అధ్యక్షుడు తొండు రవీంద్ర మంగళవారం బోగోలు తహసీల్దారు శ్రీనివాసులురెడ్డికి వినతి పత్రం అందించారు.

కావలి

•కావలి •ఉదయగిరి •ఆత్మకూరు

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి: ఏపీసీ

దగదర్తి, న్యూస్‌టుడే: విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించి అగ్రస్థానంలో నిలవాలని సమగ్ర శిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య అన్నారు. దగదర్తిలోని పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన వార్షికోత్సవంలో పాల్గొన్నారు. ఆయన వెంట ఎంఈవో సుధీర్, ప్రధానోపాధ్యాయురాలు వెంకటమారుతి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
కావలి : 80080 51666, 91548 46698
ఉదయగిరి : 80085 73944 ఆత్మకూరు: 8008573949

సమస్య: సంగం మండలం సిద్ధీపురంలో ఎస్సీ కాలనీలో వీధిదీపాలు ఏర్పాటు చేయలేదు. రాత్రి వేళల్లో పాదచారులు జాతీయరహదారి దాటాలంటే ప్రమాదకరంగా ఉంది.-శ్రీకాంత్, స్థానికుడు
సమాధానం: పరిశీలించి దీపాలు ఏర్పాటు చేస్తాం. – పాపారావు, జాతీయరహదారి ఏఈ – న్యూస్‌టుడే, సంగం

? అనంతసాగరం మండలం బొమ్మవరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో దోమల బెడద ఎక్కువగా ఉంది. ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. – రాజయ్య, గ్రామస్థుడు
✓ ఫాగింగ్ చేయిస్తాం.– తిరుపతయ్య, కార్యదర్శి – న్యూస్‌టుడే, అనంతసాగరం

? కావలి పురపాలక సంఘంలోని 30వ వార్డులో నాలుగు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. నిత్యావసరాలకు ఇబ్బందులు పడుతున్నాం. – కిషోర్, స్థానికుడు
✓ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. – సాయిరాం, డీఈ, కావలి పురపాలక సంఘం –న్యూస్‌టుడే, కావలి

పాదయాత్ర స్ఫూర్తిదాయకం: బీద

కావలి, న్యూస్‌టుడే: నాడు వైకాపా పాలన వ్యతిరేకంగా తమ యువ నేత, ప్రస్తుత రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ సాగించిన యువగళం పాదయాత్ర అందరికీ స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్సీ, తెదేపా జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రలో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పట్టణంలోని ఐలవ్ కావలి ఐకాన్ కూడలి నుంచి ప్రారంభమై నాడు యువగళం రెండు వేల కిలోమీటర్ల శిలాఫలకం ఉన్న మండలంలోని కొత్తపల్లి గ్రామం వరకు సాగింది. ఉదయగిరి వంతెన, ఇతర చోట్ల గజమాలలతో కార్యకర్తలు స్వాగతించారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తు ముఖ్యమంత్రి నారా లోకేశ్ అని ప్రకటించారు. కొత్తపల్లిలో యువగళం శిలాఫలకం వద్ద స్థానిక యువ నాయకులు రవీంద్ర ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు అలేఖ్య, తెదేపా రాష్ట్రకార్యదర్శి మొగిలి కల్లయ్య, బీసీసెల్ రాష్ట్ర నేతలు చెంచలబాబు, జెడ్.శివప్రసాద్, పొట్లూరి శ్రీనివాసులు, గుత్తికొండ కిశోర్, తుంపర్తి వాసు, తదితరులు పాల్గొన్నారు.

చర్చనీయాంశమైన ఎమ్మెల్యే వ్యాఖ్యలు: కొత్తపల్లి గ్రామంలో ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీశాయి. పార్టీలో పెద్దోళ్లతో ఇబ్బందులు పడుతున్నట్లు వ్యాఖ్యానించారు. అదేసమయంలో చిన్నోళ్లు అండగా ఉంటున్నారని తెలిపారు. ఎన్ని కష్టాలు వచ్చినా తన వెంట నడిచే వారిని కాపాడుకుంటానని స్పష్టం చేశారు.

బాలికకు విద్యా సామగ్రి ఇస్తున్న లోకేశ్

విద్యాసామగ్రి పంపిణీ

దగదర్తి: మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర చేసి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు ఆగ్రోస్ ఛైర్మన్ దివంగత మాలెపాటి సుబ్బానాయుడు కుమారుడు లోకేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని కట్టుబడిపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు తమ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. కట్టుబడిపాలెం ఉన్నత పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

ఊళ్లన్నారు.. కష్టాలు మిగిల్చారు

ఇళ్లన్నారు.. కాలనీలని చెప్పారు.. ఊళ్లు ఏర్పాటవుతాయని నాటి వైకాపా పాలకులు గొప్పలు పలికారు. పేదలకు ఇళ్లు ఇస్తామని చెప్పి జగనన్న కాలనీలు ఏర్పాటుచేశారు. లేఅవుట్లు వేసి సౌకర్యాల కల్పన పేరుతో రూ.కోట్లలో నిధులు ఖర్చు చేసినా.. ఏర్పాటుకాలేదు. లబ్ధిదారులకు స్థలాలిచ్చారు. ఇళ్లు నిర్మించుకున్నా రహదారులు, విద్యుత్తు, తాగునీరు తదితర సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో లేఅవుట్లలో ఇళ్లు నిర్మించక అడవులను తలపిస్తున్నాయి. కావలి, ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో జగనన్న లేఅవుట్లలో నెలకొన్న స్థితిపై 'న్యూస్‌టుడే' కథనం. –న్యూస్‌టుడే, అల్లూరు, వరికుంటపాడు, సంగం, దగదర్తి

దారీతెన్నూ లేని కాలనీ

అల్లూరులోని కాలనీలో సదుపాయాలు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అంతర్గత రోడ్లు లేకపోవడంతో నడక కూడా సాగడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. వీధిదీపాలు లేక రాత్రిళ్లు అంధకారంలో అవస్థలు పడుతున్నారు. తాగునీరు సరిపడా లేక దప్పికతో అలమటిస్తున్నారు. మాకు ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఇక్కడ నివాసం ఉండే వారు మండిపడుతున్నారు.

కాలనీవాసులు ఏర్పాటుచేసుకున్న బాట

కంప చెట్లతో అడవిలా..

వరికుంటపాడు లేఅవుట్‌లో 35 మందికి ఇంటి స్థలాలు మంజూరు చేశారు. వసతులు కల్పించి నివాసాలు ఉండేలా చేస్తామని నాడు పాలకులు చెప్పినా ఏవీ కలగలేదు. గుత్తేదారుకు అప్పగించడంతో పునాది స్థాయి వరకు ఇళ్లు నిర్మించి వదిలేశారు. దీంతో మూడేళ్లుగా ఖాళీగా ఉండడంతో కంప చెట్లు భారీగా పెరగడంతో అడవిలా మారింది. నిర్మాణాలు పూర్తి చేసి ఇవ్వాలని లబ్ధిదారులు అడుగుతుంటే.. గుత్తేదారు అందుబాటులో లేడని, ఎవరికి వారు నిర్మాణాలు చేసుకోవాలని.. బిల్లులు ఇస్తామని అధికారులు చెబుతున్నారు.

మంజూరు 340.... పూర్తయింది రెండే

సంగంలో వైకాపా ప్రభుత్వంలో మూడు లేఅవుట్ల పరిధిలో 340 ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో 290 ఇళ్ల నిర్మాణాన్ని గుత్తేదారుకు అప్పగించారు. 50 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించారు. మిగిలిన వాటిలో ఇద్దరు మాత్రమే ఇళ్లు నిర్మించారు. వారికి ఇప్పటివరకు బిల్లులు పూర్తిగా రాలేదు. మిగిలిన 338 అసంపూర్తిగా ఉండడంతో వాటిలో ముళ్ల చెట్లు పెరుగుతూ విషసర్పాలకు నిలయంగా మారాయి.

దయనీయంగా..

దగదర్తి మండలంలోని జగనన్న కాలనీల పరిస్థితి దయనీయంగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో జాతీయ రహదారి పక్కనే కొరుగుంట, దామవరం, ఉలవపాళ్ల, అనంతవరం కాలనీల్లో 364 ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. వీటిలో కొన్ని మాత్రమే పూర్తయ్యాయి. బిల్లులు రాకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. కాలనీల్లో పిచ్చి చెట్లు మొలిచాయి.

త్వరలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

అల్లూరు, న్యూస్‌టుడే : అల్లూరుపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాల (సుబ్బయ్య పాఠశాల) విద్యార్థులకు త్వరలో సైకిళ్లు పంపిణీ చేయనున్నట్లు డెల్టా ఆయకట్టు ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో నూతన సైకిళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూర ప్రాంత విద్యార్థులకు సౌకర్యం కోసం ట్రస్ట్ ద్వారా అందించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట మునిరాజా తదితరులు ఉన్నారు.

డీఎస్పీ పరిశీలన

వరికుంటపాడు, న్యూస్‌టుడే: మండలంలోని తూర్పురొంపిదొడ్ల పంచాయతీ బొనిగిరావులపాడులో ఆదివారం విద్యుదాఘాతానికి గురై మేకల గణేష్, తలపల రమేష్ మృతి చెందిన సంఘటనా స్థలాన్ని కావలి డీఎస్పీ శ్రీధర్ మంగళవారం పరిశీలించారు. విద్యుత్తు ఏప్రాంతం నుంచి సరఫరా అవుతుందని ఆరా తీశారు. స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దారు హేమంత్‌కుమార్, ఉదయగిరి సీఐ వెంకట్రావు, ఎస్సై రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు భాజపా నాయకుల పరామర్శ

వరికుంటపాడు, న్యూస్‌టుడే: మండలంలోని తూర్పురొంపిదొడ్ల ఎస్టీ కాలనీకి చెందిన యువకులు మేకల గణేష్, తలపల రమేష్ విద్యుదాఘాతానికి గురై మృతి చెందడం బాధాకరమని భాజపా మండల అధ్యక్షులు ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు మూలే బాలకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక నాయకులతో కలిసి మంగళవారం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ. 10 వేల నగదుతోపాటు బియ్యం బస్తాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డు శివారెడ్డి, మండల ఉపాధ్యక్షులు కోనేపల్లి అరుణారెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షులు సంకే కొండలరావు, కార్యదర్శి వెంకటకొండయ్య, కిసాన్ మోర్చా అధ్యక్షులు కర్నాటి ఆదినారాయణ్‌నాయుడు, బీసీ మోర్చా జనాపురం రత్నయ్య, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు గుడిమెట్ల రసూల్, ఎస్టీ మోర్చా అధ్యక్షులు చిరంజీవి, కార్యదర్శి లీలమ్మ, బత్తల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో తోపులాట

సిబ్బందితో వాగ్వాదానికి దిగిన రైతులు

అనంతసాగరం, న్యూస్‌టుడే: గ్రామంలోని ఒకటో సచివాలయం వద్ద మంగళవారం జరిగిన యూరియా పంపిణీ తోపులాటకు దారితీసింది. రెండు రోజుల క్రితం రైతు సేవా కేంద్రానికి లోడు రావడంతో మంచాలపల్లి రైతులకు వ్యవసాయాధికారులు సమాచారం అందించారు. సుమారు 100 మంది అనంతసాగరం, మంచాలపల్లి గ్రామాల రైతులు చేరుకోవడంతో తోపులాట జరిగింది. గతంలో అనంతసాగరం రైతులకు యూరియా అందించామని.. ఈసారి మంచాలపల్లి వారికి అందించనున్నట్లు తెలిపారు. దీనిపై అనంతసాగరం వాసులు వీపీఏతో వాగ్వాదానికి దిగారు. ఈ సీజన్లో మంచాలపల్లి గ్రామ రైతులు ఆలస్యంగా వరి నాట్లు వేయడంతో అందించలేదని సర్దిచెప్పడంతో రైతులు శాంతించారు.

'అప్పలరాజు అరెస్టు దారుణం'

ఉదయగిరి, న్యూస్‌టుడే : అనకాపల్లి జిల్లా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు, రైతు సంఘం కార్యదర్శి అప్పలరాజు అరెస్టు దారుణమని సీపీఎం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి కోడె రమణయ్య ఆక్షేపించారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో మంగళవారం కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కాకు విజయమ్మ, సీపీఎం నాయకులు వెంకటయ్య, ఫరుద్దీన్‌బాషా, నాగేశ్వరరావు, కామాక్షమ్మ, నాయబ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల నిరసన

కావలి, సంగం, వింజమూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని వివిధ బ్యాంకుల ఉద్యోగులు మంగళవారం నిరసన తెలిపారు. వారానికి అయిదురోజుల పనిదినాలపై గతంలో జరిగిన ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని బ్యాంకుల ఉద్యోగులు విధులు బహిష్కరించి పాల్గొన్నారు. సంగం, వింజమూరులోనూ ఉద్యోగులు ఆందోళన చేశారు. దీంతో బ్యాంకులు మూతపడ్డాయి.

ఒకరికి గాయాలు

దువ్వూరు (సంగం), న్యూస్‌టుడే: ముంబయి జాతీయ రహదారిపై దువ్వూరు శివారులో మత్స్యకార నివాసాల వద్ద ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో గాయాలయ్యాయి. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

కంపచెట్ల దారి.. రాకపోకలెలా?

మండలంలోని పెద్దపాడు నుంచి శిద్దనకొండూరుకు వెళ్లే దారిలో ఇరువైపులా ముళ్లచెట్లు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెట్లకొమ్మలు తగులుకొని వాహనదారులు గాయాలపాలవుతున్నారు. ఈ విషయమై పీఆర్ఏఈ రవీంద్రను వివరణ కోరగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, కలిగిరి

వైద్యాధికారులు లేక.. రోగుల అవస్థ

స్థానిక ఆసుపత్రిలో వైద్యులు రానందున మంగళవారం స్టాఫ్ నర్సులే దిక్కయ్యారు. 24 పంచాయతీలకు పీహెచ్‌సీ ఒక్కటే దిక్కు. దీన్ని తెలుసుకున్న స్థానిక సర్పంచి కొండెపోగు దిలీప్‌కుమార్, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం నాయకులు చల్లగాలి వెంకటమోహన్ పీహెచ్‌సీకి వెళ్లారు. రోగులకు స్టాఫ్‌నర్సు వైద్యం అందించడం చూశారు. దీనిపై వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నర్రవాడ వైద్యాధికారిని ఇన్‌ఛార్జిగా నియమించామని తెలిపారు.– న్యూస్‌టుడే, వరికుంటపాడు

స్తంభాలు నాటారు.. అనుసంధానం మరిచారు

కావలి మండలం తాళ్లపాలెం గ్రామం వద్ద విద్యుత్తు స్తంభాలు నాటి అనుసంధానం మరచిన దృశ్యమిది. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా అభివృద్ధి పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుంది. పూర్తిస్థాయిలో జరగడం లేదు. పనులన్నీ పూర్తిగా గ్రామాల్లో వివాదాలకు తావులేకుండా సమగ్ర రీతిలో చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కావలి

భౌబోయ్.. పిక్కలు పీకేస్తున్నాయ్!

ఇవి పట్టణంలోని 30వ వార్డు రైల్వే క్వార్టర్స్ వద్ద ఉన్న శునకాలు. రాత్రి వేళల్లో ఆ మార్గంలో వెళ్లే వారి వెంటపడుతున్నాయి. పట్టణంలోని చాలాచోట్ల ఇదే పరిస్థితి. పురపాలక పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ బషీర్ స్పందిస్తూ, సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, కావలి

గ్రామ పంచాయతీ కార్యాలయం - కలిగిరి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

టెండరు ప్రకటన

కలిగిరి మండలం, కలిగిరి గ్రామ పంచాయతీలోని రాజీవ్‌గాంధీ కూరగాయల మార్కెట్ నందు 11 షాపులకు వేలం పాటలు **తేది: 01-02-2026** నుండి **31-01-2027** సంవత్సరం వరకు ఒక్క సంవత్సరకాలం పాటు వేలముల కొరకు **తేది: 31-01-2026**న శనివారం ఉదయం 11.00 గంటలకు వేలంపాట నిర్వహించబడును. వేలంపాటలో పాల్గొనువారు ధరావతు చెల్లించి వేలంపాటలో పాల్గొనవలెను.

వేలంపాట వివరములు

వ.నెం.	వేలము వివరములు	ధరావతు
1.	1వ నెంబరు షాపునకు	రూ. 5,000/-
2.	మిగిలిన 10 షాపులకు ఒక్కొక్క షాపునకు ధరావతు	రూ. 20,000/-

వేలంపాటలో పాల్గొనదలచినవారు వివరములకు గ్రామ పంచాయతీ కార్యాలయం నందు సంప్రదించగలరు.

పంచాయతీ కార్యదర్శి, కలిగిరి గ్రామ పంచాయతి,
కలిగిరి మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

మోటార్‌సైకిల్ పడి వ్యక్తి మృతి

వింజమూరు: మోటార్‌సైకిల్ ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన గోతిలో పడి మండలంలోని బుక్కాపురానికి చెందిన బద్వేలు శ్రీనివాసులురెడ్డి (44) మృతి చెందారు. వింజమూరు- భట్టువారిపాలెం రోడ్డులో శ్రీ రాఘవేంద్ర ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మోటార్‌సైకిల్ కింద శవం ఉండగా పశువుల కాపరులు చూసి మంగళవారం పోలీసులకు సమాచారం అందించారు. సోమవారం మధ్యాహ్నం పడి ఉంటాడని భావిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న భార్య హైమావతి, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆయనకు ఇంజినీరింగ్, ఇంటర్ చదివే ఇద్దరు కుమారులున్నారు. స్వగ్రామం సీతారామపురం మండలం బసినేనిపలి కాగా.. మండలంలోని బుక్కాపురంలో వివాహం చేసుకుని ఇక్కడే ఉంటున్నారు.

గొడవ నేపథ్యంలో వృద్ధుడు..

కొండాపురం: మండలంలోని వెలిగండ్లకు చెందిన కందవరపు కొండయ్య (60) గొడవ నేపథ్యంలో గుండెపోటుకు గురై మంగళవారం మృతి చెందారు. ఎస్సై మాల్యాద్రి వివరాల మేరకు.. మృతుడితో తూర్పుయర్రబల్లి పంచాయతీ మన్నంవారిపల్లికి చెందిన సుధాకర్‌కు వారం రోజుల కిందట వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో సుధాకర్, అతని కుమారుడు మల్లికార్జున వెలిగండ్లలోని కొండయ్య ఇంటికి వెళ్లి మంగళవారం ప్రశ్నించారు. దీనిపై 100 నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడకు చేరుకునేసరికి తండ్రీకొడుకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆతరువాత కొద్దిసేపటికి కొండయ్య అపస్మారక స్థితికి వెళ్లడంతో తూర్పుఎర్రబల్లిలోని వైద్యశాలకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కావలికి తీసుకెళుతుండగా మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

అనంతసాగరం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన వైనమిది. పోలీసుల వివరాల మేరకు.. గౌరవరం గ్రామానికి చెందిన గార్లపాటి భార్గవ్ (32) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. సోమవారం కుటుంబ సభ్యులతో గొడవ పడి పొలాలకు వెళ్లి మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగారు. ఆత్మహత్య చేసుకుంటున్నట్లు కుటుంబ సభ్యులకు ఫోన్ చేశారు. ఎంతకీ రాకపోవడంతో పొలాలకు వెళ్లి చూడగా అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం భార్య అనూరాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సూర్యప్రకాశ్‌రెడ్డి తెలిపారు.

హుండీల గల్లంతు

సిద్దీపురం (సంగం): మండలంలోని సిద్ధీపురం ఎస్సీ కాలనీ పోలేరమ్మ మందిరంలో రెండు హుండీలు గల్లంతైనట్లు గ్రామస్థులు మంగళవారం కనుగొన్నారు. గతేడాది జనవరిలో జాతర తరువాత వాటిని లెక్కించలేదని, సుమారు రూ.20 వేల వరకు నగదు ఉంటుందని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాదయాత్రలో క్రేన్ తగిలి యువకుడికి గాయాలు

కావలి, న్యూస్‌టుడే: యువగళం స్ఫూర్తి పాదయాత్ర పేరిట మంగళవారం కావలిలో చేపట్టిన కార్యక్రమంలో అపశృతి చోటుచేసుకుంది. ఈ యాత్రలో ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డిని గజమాలతో సత్కరించేందుకు కార్యకర్తలు ఏర్పాట్లు చేశారు. ఇందుకు తీసుకొచ్చిన క్రేన్ కదిలేటప్పుడు బాలరాజు సాయిరాం అనే యువకుడు గాయపడగా.. 108 అంబులెన్స్‌లో ప్రాంతీయాసుపత్రికి తరలించి చికిత్స చేశారు. అతనిది గుడ్లూరు మండలంలోని నాయుడుపాలెం. వ్యక్తిగత పనిపై కావలికి వచ్చి తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.

ఉద్రిక్తంగా చేపల వేలం

పోలీసుల రంగ ప్రవేశం

జలదంకి, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీలోని నాలుగు చెరువుల్లో చేపల వేటకు మంగళవారం నిర్వహించిన బహిరంగ వేలం పాట ఉద్రిక్తతకు దారితీసింది. జలదంకి పెద్ద చెరువు, టంకంవారిపాలెం, తూర్పుదొరువు, లేదోట గంగమ్మ చెరువుకు సచివాలయం వద్ద ఈవోపీఆర్డీ లాలపరెడ్డి ఆధ్వర్యంలో పాట ఏర్పాటుచేయగా.. 23 మంది తలపడ్డారు. జలదంకి పెద్ద చెరువు, టంకంవారిపాలెం, తూర్పుదొరువుకు పాట సజావుగా జరిగింది. లేదోట గంగమ్మ చెరువుకు నిర్వహిస్తుండగా.. గ్రామ పంచాయతీ అధికారి వెంకటకృష్ణకు ఫోన్ రావడంతో నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో స్థానికులు వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈసమాచారంతో ఏఎస్సైలు హరిబాబు, సుబ్బారావు సిబ్బందితో వచ్చి సర్దుబాటు చేశారు. గత ఏడాది లేదోట గంగమ్మ చెరువు హక్కులు దక్కించుకున్న వ్యక్తి నిండుగా నీరు ఉండడంతో చేపలు పట్టుకోలేక నష్టపోయానని ఈసారి పట్టుకునే అవకాశం కల్పించాలని వేడుకోగా.. గ్రామస్థులు అంగీకరించలేదు.

వేలం ఆపడంపై వాగ్వాదానికి దిగిన గ్రామస్థులు

మైనింగ్ వాహనాల స్వాధీనం

దగదర్తి, న్యూస్‌టుడే: మండలంలోని తిరువీధిపాడులో గ్రావెల్ తరలిస్తున్న మూడు వాహనాలను మైనింగ్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. తిరువీధిపాడులోని సర్వే నెం. 118లో నెల్లూరుకు చెందిన భక్తవత్సలరెడ్డి కుటుంబ సభ్యులకు 105 ఎకరాల భూములున్నాయి. వాటిలో కొందరు తవ్వకాలు చేస్తుండగా కలెక్టరు, మైనింగ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ శాఖ ఏడీ వాణిశ్రీ ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి గ్రావెల్ లోడుతో వెళుతున్న మూడు టిప్పర్లను పట్టుకున్నారు. అనంతరం వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆర్ఐ ప్రియాంక, వీఆర్వో నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

ఆత్మకూరు:మండలంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలకు శ్రీసాంబశివ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆట్రస్టు ఛైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. సాతానుపల్లిలో వెంకటమ్మ(82), గొల్లపల్లిలో కృష్ణారెడ్డి(77), మహిమలూరులో నరసయ్య(81), సుబ్బమ్మ(70) మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు రూ.10 వేల వంతున అందజేశారు. తెదేపా రాష్ట్రకార్యదర్శి పెంచలరావు, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ఈఈకి వినతి

ఆత్మకూరు: ఏపీఎస్పీడీసీఎల్ డివిజన్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. గ్రేడ్-2 సిబ్బందిని జూనియర్ లైన్‌మెన్‌గా గుర్తించి రెగ్యులర్ చేయాలని ఈఈ భానునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శివప్రసాద్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో వేగం పెంచాలి

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు వేగవంతం చేసి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ఎంపీపీ బి.పద్మజారెడ్డి కోరారు. మంగళవారం ఆమె అధ్యక్షతన ఎంపీడీవో ప్రసన్నకుమారి ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీకొలను సహా పల్లెల్లో ఎక్కడా పారిశుద్ధ్య కార్యక్రమాలు జరగడం లేదని, వెంటనే పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల పరిషత్ భవనం శిథిల స్థితికి చేరడంతో కొత్తదాన్ని నిర్మించేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో డీటీ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ , ఉపాధి, పీఆర్ వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దాతృత్వ పరిమళం.. విద్యాలయాలకు వరం

వడ్డిపాలెంలో అసంపూర్తిగా నిలిచిన నాడు-నేడు పనులు

న్యూస్‌టుడే, కావలి

గత వైకాపా పాలనలో చేపట్టిన నాడు- నేడు కార్యక్రమంలో అసంపూర్తిగా నిలిచిన పనులు కొలిక్కి రానున్నాయి. ప్రస్తుత కూటమి పాలనలో ఆ పథకాన్ని 'మనబడి- మన భవిష్యత్'గా మార్చడం తెలిసిందే. ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ-4 కార్యక్రమానికి అనుసంధానం చేస్తున్నారు. దీంతో పారిశ్రామికవేత్తలు, దాతలు, పూర్వవిద్యార్థుల ద్వారా బడులన్నీ బాగుపడేలా కార్యాచరణలు రూపొందుతున్నాయి. ఇప్పటికే మండల విద్యావనరుల కేంద్రాల నుంచి జిల్లా అధికారులకు నివేదికలు కూడా వెళ్లాయి. నెలాఖరులోగా ఓ కార్యాచరణ రూపొందనున్నట్లు అధికారిక వర్గాల ద్వారా అందుతున్న సమాచారం.

పట్టణంలోని ముసునూరు పాఠశాలలో ఇప్పటికే పీ-4 కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రసూతి వైద్యురాలు మాలినీదేవి సాయంతో రెండు అదనపు గదులు నిర్మించారు. అలాగే గ్రామీణ మండలంలోని గౌరవరం, రుద్రకోట, సర్వాయపాలెం, కొత్తసత్రం జడ్పీ స్కూళ్లతో పాటు ఒట్టూరు ఆదర్శ పాఠశాలలో నిర్మాణాలకు ప్రతిపాదనలు చేశారు. ప్రహరీలు, అదనపు గదులు వంటివి ఈ ప్రతిపాదనల్లో ఉండగా, ఒక్కో పాఠశాలకు రూ.15 లక్షల వరకు అంచనాలు రూపొందించారు. పురపాలక సంఘ ఇంజినీరింగ్ విభాగం నుంచి కూడా త్వరలో ప్రతిపాదనలు పంపించనున్నారు. నాడు-నేడులో చాలావరకు నాసిరకం పనులు జరగడంతో మధ్యలో నిలిచిపోయిన వాటిని పూర్తి చేసేందుకు ప్రైవేట్‌గా నిధులు కష్టమవుతోంది. కొత్తగా అదనపు గదులు వంటివి నిర్మించేందుకే దాతలు ముందుకొస్తున్నారు. ఎంపీ బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ, తెదేపా జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర సోదరులు పాఠశాలల్ని బాగు చేస్తామని ఇప్పటికే ప్రకటించారు.

త్వరలోనే కొలిక్కి

–వెంకటసుబ్బయ్య, మండల విద్యాధికారి, కావలి

పాఠశాలల్లో ఆగిన పనులన్నీ త్వరలో కొలిక్కి రానున్నాయి. భవిష్యత్తు లోనే పనులు చేపట్టనున్నారు. పీ-4 కార్యక్రమంలో అవసరాలకు సరిపడా నిధులు సమకూరనున్నాయి. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

ఉత్తమ పురస్కార
అవార్డు గ్రహీతకు అభినందనలు

ఉత్తమ పురస్కార ప్రశంసా పత్రం అందుకుంటున్న శ్రీ పి.శ్రావణ్‌కుమార్ గారు తహశీల్దార్, కావలి మండలం.

2025-2026వ సంవత్సర కాలములో ఉన్నత అధికారులు మరియు ప్రజల మన్ననలు పొందుతూ రెవెన్యూ శాఖలో ప్రభుత్వ విధులను సమర్ధవంతంగా నిర్వహించినందుకు గానూ వారి విశిష్ట సేవలను గుర్తించి 2026- గణతంత్ర దినోత్సవ సందర్భంగా శ్రీయుత జిల్లా కలెక్టర్ శ్రీ హిమాన్షు శుక్ల IAS గారి ద్వారా ఉత్తమ పురస్కార ప్రశంసా పత్రము అందుకున్న కావలి మండల తహశీల్దార్ శ్రీ పి.శ్రావణ్‌కుమార్ గారికి మా హార్దిక శుభాకాంక్షలు తెలుపుతూ...

కావలి తహశీల్దార్ వారి కార్యాలయ సిబ్బంది మరియు గ్రామ రెవెన్యూ అధికారులు - కావలి.

(c) eenadu

క్రీడాకారుడిని సన్మానిస్తున్న పీఆర్ క్లబ్ ప్రతినిధులు

జాతీయ క్రీడాకారులకు ప్రశంసలు

చిల్లకూరు, న్యూస్‌టుడే: స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో చదువుతున్న ఏడుగురు విద్యార్థులు జాతీయస్థాయిలో వివిధ క్రీడల్లో రాణిస్తుండడంపై గూడూరు పీఆర్ క్లబ్ ప్రతినిధులు ప్రశంసించారు. సోమవారం రాత్రి పాఠశాలలో ఘనంగా సన్మానించారు. క్రీడాకారులకు ప్రతిభ అవార్డులతోపాటు నగదు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపల్ అనిల్‌కుమార్, పీడీ శ్రీరేష్, పీఈటీ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

• గూడూరు • కోవూరు • సర్వేపల్లి

ఏజీపీగా వనం ప్రసాద్ నియామకం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరు మండలం పారిచెర్ల గ్రామానికి చెందిన న్యాయవాది వనం ప్రసాద్‌ను గూడూరు సీనియర్, జూనియర్ సివిల్ కోర్టుల ఏజీపీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కొన్నేళ్లుగా న్యాయవాది వృత్తిలో ఉన్న ప్రసాద్‌ను నియమించడంతో పలువురు న్యాయవాదులు, బార్ అసోసియేషన్ నాయకులు అభినందనలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) గూడూరు: 85002 02046
కోవూరు :79950 67034, సర్వేపల్లి : 80085 73980

సమస్య : గూడూరులోని గమళ్లపాలెం వద్ద డ్రైనేజీ కాలువ సక్రమంగా లేక మురుగునీరు ఇళ్ల మధ్యలోనే పారుతోంది. స్థానికంగా ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. – శివకుమార్, గూడూరు

సమాధానం : కాలువల్లో పూడిక తీయించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. – వెంకటేశ్వర్లు, పురపాలక కమిషనర్

? కోట మండల పరిధిలోని చిట్టేడు పంచాయతీ పరిధిలోని పలు వీధుల్లో మురుగు కాలువలు లేవు. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. .– రాగిణి, స్థానికురాలు

✓ సమస్య పరిశీలించి సిబ్బందితో పరిష్కరిస్తాం. – దిలీప్‌కుమార్, ఎంపీడీవో

? కోట ఎస్టీ బాలికల గురుకుల పాఠశాల సమీపంలోని విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు చేసిన దిమ్మె దెబ్బతింది. కిందకు వాలిపోయి ప్రమాదకరంగా ఉంది.– భారతమ్మ, విద్యార్థిని తల్లి

✓ త్వరలోనే మరమ్మతులు చేసి ఇబ్బందులు లేకుండా చూస్తాం. – అనంతరావు, ఏఈ

? పొదలకూరు రూరల్ పరిధిలోని రాంనగర్ వీధిలో వేగ నిరోధకాలు అత్యంత ఎత్తులో ఉండటంతో రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. – కృష్ణమూర్తి

✓ సమస్య పరిశీలించి తొలగిస్తాం – యశ్వంత్ సింగ్, పంచాయతీ కార్యదర్శి

? రాపూరులో డంపింగ్ యార్డు లేక చెత్త, వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయడంతో దుర్వాసన తీవ్రంగా ఉంది. – స్థానికులు

✓ త్వరలో నిర్మాణ పనులు పూర్తి చేయిస్తాం – లక్ష్మీనరసింహం, తహసీల్దార్

? పొదలకూరు మండలం చాటగొట్ల-మరుపూరు గ్రామాల మధ్య కండలేరు ఎడమ కాలువ ఉపకాలువల్లో నీరు లీకై వృథాగా పోతున్నాయి. – వెంకటేశ్వర్లు, స్థానికుడు

✓ నీరు వృథా కాకుండా చూస్తాం. – అనిల్‌కుమార్, తెలుగు గంగ ఈఈ

? పొదలకూరు రూరల్ పరిధిలోని రమణారెడ్డికాలనీలో వాల్వ్ గుంతలపై మూతలు లేవు. – రమణయ్య, స్థానికుడు

✓ ఏర్పాటుచేస్తాం.– యశ్వంత్ సింగ్, ఈవో

? రాపూరు మండలం పులిగిలపాడులో ప్రాథమిక పాఠశాల చుట్టూ ప్రహరీ లేక పశువులు పాఠశాలలో వస్తున్నాయి. – స్థానికులు

✓ ప్రహరీ నిర్మిస్తాం–శ్రీనివాసులు, ఎంఈవో

? పొదలకూరు రూరల్ పరిధిలో మహ్మదాపురంలో వీధి దీపాలు వెలగడం లేదు. – రమణయ్య, స్థానికుడు

✓ ఏర్పాటుచేస్తాం.– యశ్వంత్‌సింగ్, ఈవో

సృజన వికాసం.. బహుమతులు సొంతం

విజేతలతో ఎంఈవో దిలీప్‌కుమార్, న్యాయనిర్ణేతలు

బుచ్చిరెడ్డిపాళెం, న్యూస్‌టుడే: బుచ్చి పురపాలక పరిధిలోని సెయింట్ మేరీస్ జూనియర్ కళాశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం రీజనల్ స్థాయి ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. వ్యాస రచన విభాగంలో శ్రీకృష్ణ(ప్రథమ), సాయి హేమ(ద్వితీయ), నాగలీలావతి(తృతీయ) స్థానాల్లో నిలిచారు. చిత్రలేఖనంలో శ్రీజన్య (ప్రథమ), కేవీ భవిష్య (ద్వితీయ), ఆశాజ్యోతి (తృతీయ), ఉపన్యాసంలో మోక్ష వల్లి (ప్రథమ), జశ్వంత్ (ద్వితీయ), సాయి హేమ (తృతీయ), క్విజ్‌లో తేజశంకర్ (ప్రథమ), శివ కృష్ణ (ద్వితీయ), అనుశ్రీ(తృతీయ) స్థానాల్లో నిలిచారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఈవో దిలీప్‌కుమార్, ప్రిన్సిపల్ శ్రీధర్ బహుమతులు ప్రదానం చేశారు. న్యాయ నిర్ణేతలుగా రిసోర్సు పర్సన్లు గండికోట సుధీర్, శేషయ్య, పీవీకే ప్రసాద్ రావు, హరీశ్ వ్యవహరించారు.

తగ్గిన దూరాభారం.. అన్నదాతలకు ఉపశమనం

పొదలకూరులో ఏర్పాటు చేసిన కేంద్రం వద్ద విద్యుత్తు నియంత్రికలు

న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

ప్రస్తుత పరిస్థితుల్లో అన్నదాతలు వ్యయప్రయాసలకోర్చి పంట సాగు చేస్తున్నారు. ప్రారంభం నుంచి కోతకు వచ్చే వరకు వారి అవస్థలు వర్ణణాతీతం. పంట చివరి దశలో హైవోల్టేజీ, విపత్తులు, ఇతర కారణాలతో నియంత్రికలు తరచూ దెబ్బతింటున్నాయి. మెట్టప్రాంతమైన సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాలకు చెందిన వారు వాటిని బాగు చేయించేందుకు కొత్తూరు, గూడూరు తీసుకెళ్లాలంటే నరకప్రాయమయ్యేది. నియంత్రిక పరిమాణాన్ని బట్టి ఆటో, ట్రాక్టర్ వంటి ప్రత్యేక వాహనంలో తరలించేందుకు అష్టకష్టాలు పడేవారు. జిల్లాలో గూడూరు, కొత్తూరు, కావలి, ఆత్మకూరులో మాత్రమే నియంత్రిక కేంద్రాలున్నాయి. దూరప్రాంతాలకు సొంత వాహనాల్లో తీసుకెళ్లి, మరొకటి తీసుకొచ్చే వరకు వ్యయప్రయాసలు పడేవారు. గతేడాది డిసెంబరు నుంచి పొదలకూరులో విద్యుత్తు నియంత్రికల నిల్వ కేంద్రం(ఎస్పీఎం) అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వం రూ.30 లక్షల వ్యయంతో నిర్మించింది. పొదలకూరు, మనుబోలు, రాపూరు, కలువాయి, సైదాపురం, సమీప మండలాలకు చెందిన వేలాది మంది రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతోంది.

● జిల్లాలో మారుమూల ప్రాంతమైన కలువాయి మండల పరిధిలోని ఒక గ్రామానికి చెందిన రైతు అయిదెకరాల్లో వరి సాగు చేశారు. పంట చివరిదశలో ఉండగా నియంత్రిక కాలిపోయింది. విద్యుత్తు ఉపకేంద్రం వద్దకు తీసుకెళ్లినా మరొకటి ఇవ్వలేదు. వారం రోజులు అవస్థలు పడ్డారు. సమస్య 'ఈనాడు'లో కథనం ప్రచురితమవడంతో నియంత్రిక అందజేశారు.

● పొదలకూరు మండల పరిధిలోని అంకుపల్లిలో నియంత్రిక కాలిపోయింది. కొత్తూరు తీసుకెళితే మరొకటి లేకపోవడంతో ఎనిమిది రోజులకు మరొకటి సమకూర్చారు. అప్పటి వరకు పంటకు నీరందక దిగుబడులు తగ్గాయి.

సర్వేపల్లి నియోజకవర్గంలో గతేడాది రైతులకిచ్చిన నియంత్రికల వివరాలు (కేవీ)

మండలం	16	25	63	100
పొదలకూరు	9	8	2	2
మనుబోలు	8	7	3	2
ముత్తుకూరు	10	13	11	8
టీపీ గూడూరు	11	12	12	10
వెంకటాచలం	14	12	10	11

● డిస్కం ఏఈ సునీల్‌కుమార్ మాట్లాడుతూ పొదలకూరులో ప్రారంభించిన ఎస్పీఎంతో రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. 16, 25, 63, 100 కేవీ సామర్థ్యం గల నియంత్రికలను ఉచితంగా మార్చుకోవచ్చన్నారు. నేరుగా కార్యాలయానికి వస్తే సిబ్బంది వాటిని మార్చి 24 గంటల్లో మరో నియంత్రిక ఇస్తున్నారని పేర్కొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

నిరసన వ్యక్తం చేస్తున్న బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, పని దినాలను అయిదు రోజులకు తగ్గించాలని దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా పట్టణంలోని ఎస్‌బీఐ వద్ద ఉద్యోగ సంఘం నాయకులు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బ్యాంకులన్నీ మూసివేశారు. బ్యాంకు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు రామచంద్రయ్య, వెంకటేశ్వర్లు, సునీల్‌కుమార్, సురేష్, ప్రత్యూష, ప్రసాద్, ఆంజనేయకృష్ణ, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

స్థలాలు ఆక్రమిస్తున్నారని లబ్ధిదారుల నిరసన

కోట, న్యూస్‌టుడే: కోట మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట మంగళవారం స్థానిక రెడ్డి కల్యాణ మండపం సమీపంలో పేదలకు ప్రభుత్వం ఇచ్చిన నివేశన స్థలాలను కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారంటూ లబ్ధిదారులు నిరసన చేపట్టారు. న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ సమగ్రంగా విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వరిలో సస్యరక్షణ చర్యలు పాటిద్దాం

మనుబోలు : వరిలో సస్యరక్షణ చర్యలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. మోతాదుకు మించి ఎరువులు వినియోగించవద్దని సూచించారు.

వాహనదారులకు శిరస్త్రాణం తప్పనిసరి

గూడూరు పట్టణం: వాహనదారులు నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ పెట్టుకోవడం చేయాలని ఆర్టీవో కిషోర్ తెలిపారు. గూడూరు సమీపంలోని రవాణాశాఖ కార్యాలయంలో మంగళవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు.

విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులకు సన్మానం

కోవూరు, న్యూస్‌టుడే: కోవూరులోని జైనా సన్ కల్యాణ మండపంలో కోవూరు మండల గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. అనంతరం 75 ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్లను పూలమాల వేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విషసర్పాలకు నిలయం

కోటలోని పాత పోలీసు స్టేషన్ భవనం నిరుపయోగంగా ఉంది. ఇరవై ఏళ్ల క్రితం మండల సముదాయంలో నూతన పోలీసు స్టేషన్ భవనం నిర్మించారు. అయితే ప్రస్తుతం భవనంతో పాటు పరిసరాలు విషసర్పాలకు నిలయంగా మారింది. స్థానికులు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు. స్థలాన్ని, భవనాన్ని పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ స్వాధీనం చేసుకోవాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోట

ఆదాయం వస్తున్నా నిర్లక్ష్యమెందుకో..!

పొదలకూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో రెండేళ్లుగా పురాతన భవనానికి ఉపయోగించిన టేకు కొయ్యలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. నిబంధనల ప్రకారం వేలం నిర్వహించి వచ్చిన నగదును పాఠశాల ఖాతాకు జమ చేయాలి. ప్రధానోపాధ్యాయిని పలుమార్లు జిల్లా పరిషత్తు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే వారే లేరు. విద్యాశాఖాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు

కుళాయి ఇలా.. నీరు పట్టుకునేదెలా?



పొదలకూరు మండలం బిరదవోలు పంచాయతీ పరిధిలోని కళ్యాణపురం గిరిజన కాలనీలో ఏర్పాటు చేసిన కుళాయిలు మరమ్మతులకు గురయ్యాయి. ప్రస్తుతం అన్నీ కుళాయిలకు ట్యాపులు సైతం లేవు. నీటిని పట్టుకునేందుకు వీలు లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. నీటిని నిల్వ చేసేందుకు అందుబాటులో ఉన్న ట్యాంకు ధ్వంసమై నిరుపయోగంగా ఉంది. అధికారులు స్పందించి కుళాయిలకు ట్యాపులను బిగించి సమస్యను పరిష్కరించాలని విన్నవిస్తున్నారు.– న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

దుర్గంధమయం

మనుబోలు మండల పరిధిలోని పిడూరు రోడ్డులో ఒక వీధిలో మురుగు నీరు ప్రవహిస్తోంది. కాలువ లేక రోడ్డుపై చేరడంతో అపరిశుభ్రంగా మారింది. ప్రధాన వీధి కావడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని పంచాయతీ కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. మండల అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, మనుబోలు

దుర్వాసనతో సతమతం

రాపూరులోని శ్రీరామ మందిరం, శివాలయం మధ్య ఉన్న గృహాల వద్ద చెత్త పేరుకుపోయింది. సీహెచ్‌సీ సమీపంలో, రిజిస్ట్రేషన్ కార్యాలయం పక్కన గుట్టలుగా పేరుకుపోయింది. సర్పంచి, పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బందికి విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. వ్యాధులు ప్రబలకముందే చెత్తను దూరంగా తరలించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని పలువురు వేడుకుంటున్నారు.– న్యూస్‌టుడే, రాపూరు

యువగళంతో ప్రజాబలం సాధించిన లోకేశ్

కేకు కోస్తున్న కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

గూడూరు పట్టణం, కోవూరు, పొదలకూరు, న్యూస్ టుడే: నారా లోకేశ్ యువగళం పేరుతో చేసిన పాదయాత్ర రాష్ట్రంలో ఓ చరిత్రగా నిలుస్తుందని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. యువగళం చేపట్టి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని ఆమె నివాసంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర తెలుగు యువత ఆధ్వర్యంలో మంగళవారం కేకు కోసి సంబరాలు చేశారు. నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇందుకూరుపేటలో వెయ్యి ద్విచక్ర వాహనాలతో నిర్వహించిన ర్యాలీలో మంత్రి గొట్టిపాటి, వేమిరెడ్డి దంపతులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పాల్గొన్నారు. ● యువగళం పాదయాత్ర ద్వారా లోకేశ్ ప్రజాబలం సాధించారని తెదేపా నాయకులు తెలిపారు. మూడేళ్లు పూర్తయిన సందర్భంగా గూడూరు పట్టణంలోని జాతీయ రహదారి కూడలి నుంచి సాయి బాబా మందిరం వరకు పాదయాత్ర నిర్వహించి, బాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా డ్రోన్ ద్వారా మంత్రి లోకేశ్‌బాబు భారీ కటౌట్‌కు పాలాభిషేకం చేశారు. తెదేపా నాయకులు కిరణ్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లురాజు, శివకుమార్, హరికుమార్, వెంకటేశ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సైకిల్ అందజేస్తున్న సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

● మంత్రి లోకేశ్ స్ఫూర్తితో పాఠశాల విద్యార్థినులకు సైకిళ్లు అందిస్తున్నట్లు సర్వేపల్లి నియోజకవర్గ తెదేపా సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. పొదలకూరు మండలం విరువూరులో యువగళం పాదయాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 3132 కిలోమీటర్ల యవగళం పాదయాత్ర స్ఫూర్తితో నియోజకవర్గంలో 3132 సైకిళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. విరువూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిది, తొమ్మిది, తరగతులు చదువుతున్న 22 మంది విద్యార్థినులకు అందజేశారు. మార్చి 29 నాటికి పంపిణీ పూర్తిచేస్తామన్నారు. పొదలకూరు నుంచి తాటిపర్తి, మహ్మదాపురం మీదుగా విరువూరు వరకు ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించారు. తెదేపా నాయకులు అజయ్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, సర్పంచి జగన్‌మోహన్‌రావు, రవిరాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: పాదయాత్ర చేస్తున్న నాయకులు

డిజిటల్ టూల్స్ వినియోగంతో ఆధునిక బోధన

మాట్లాడుతున్న ఎస్వీయూ మాజీ వీసీ రాజేంద్ర ప్రసాద్

వెంకటాచలం, న్యూస్‌టుడే: ప్రపంచీకరణ నేపథ్యంలో ఆంగ్ల భాషా ప్రావీణ్యం అవసరమని, విద్యార్థులకు ఆంగ్ల సాహిత్యం ద్వారా సామాజిక, సాంస్కృతిక విలువలు కూడా అందించాలని తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి రాజేంద్రప్రసాద్ సూచించారు. వీఎస్‌యూలో 'ఆంగ్ల భాష, సాహిత్య బోధనలో ఇటీవల ధోరణులు' అనే అంశంపై ప్రారంభమైన రెండు రోజుల జాతీయ సదస్సును మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. డిజిటల్ టూల్స్ వినియోగంతో బోధనను మరింత ప్రభావితం చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఎస్‌యూ రిజిస్ట్రార్ సునీత మాట్లాడుతూ అధ్యాపకులు ఆధునిక బోధన పద్ధతులు అవలంబించి విద్యార్థుల్లో క్రిటికల్ థింకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయ, పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అలరించిన ప్రదర్శనలు

వావిళ్లలో అలరించిన సాంస్కృతిక ప్రదర్శన

విడవలూరు, ముత్తుకూరు, న్యూస్‌టుడే:. విడవలూరు మండల పరిధిలోని అలగానిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో సరస్వతీపూజ నిర్వహించారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ● వావిళ్ల జడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం చెంచురామయ్య ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. ● రామతీర్థం జడ్పీ ఉన్నత పాఠశాల, ముత్తుకూరులోని పలు పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

మనుబోలు, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని లారీ ఢీకొన్న ఘటన మండలంలోని వీరంపల్లి అడ్డరోడ్డు వద్ద మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన అడపాల పెంచలయ్య, శంకరమ్మ కాగితాలపూరు అడ్డరోడ్డు వద్ద ఉన్న ఒక హోటల్‌లో పనిచేస్తున్నారు. పనులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి బయల్దేరి వస్తుండగా నెల్లూరు నుంచి గూడూరు వైపు వెళుతున్న గుర్తు తెలియని లారీ అదుపుతప్పి ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలవడంతో చికిత్స నిమిత్తం గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'నాతో పెట్టుకోకు' నవల ఆవిష్కరణ

నవలను ఆవిష్కరిస్తున్న ఆచార్య సంపత్‌కుమార్, కవులు

వెంకటాచలం, న్యూస్‌టుడే: మహిళలు సమస్యలెలా అధిగమించాలి... కష్టకాలంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి అనే అంశాలను తెలియజేస్తూ.. రచయిత పొట్లూరి సుబ్రహ్మణ్యం రాసిన 'నాతో పెట్టుకోకు' నవల బాగుందని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్ర సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ తెలిపారు. అధ్యయన కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సభలో ప్రముఖ రచయిత్రి సుభద్రా దేవితో కలిసి నవల ఆవిష్కరించి మాట్లాడారు. పొట్లూరి రచనా విధానం, నవల ప్రాముఖ్యతను ప్రసంగించి రచయితలను సన్మానించారు. కార్యక్రమంలో రచయితలు శివకుమార్, గంగిశెట్టి శివకుమార్, అధ్యయన కేంద్ర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్వా రంగాన్ని ఆదుకోవాలని వినతి

మంత్రి గొట్టిపాటికి వినతి పత్రం ఇస్తున్న భాజపా నాయకులు

ఇందుకూరుపేట : రాష్ట్రంలో ఆక్వాసాగు చేస్తున్న రైతులకు విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని ఇందుకూరుపేట మండల భాజపా నాయకులు కైలాసం శ్రీనివాసులు రెడ్డి విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కోరారు. మంగళవారం కుడితిపాలెంలో సబ్ స్టేషన్ ప్రారంభించడానికి విచ్చేసిన మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. సీఎం చంద్రబాబుతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు.

భూమి విలువపై విచారణ

మనుబోలు: మండలంలోని వెంకన్నపాలెం గ్రామంలో మంగళవారం భూమి విలువపై గూడూరు సబ్ రిజిస్ట్రార్ నందకిషోర్ విచారించారు. గ్రామానికి చెందిన అడపాల చెంచురెడ్డి పొలం విలువ తప్పుగా నమోదు కావడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో క్షేత్రస్థాయిలో విచారించినట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దారు రమాదేవి, ఆర్ఐ అరుణ్‌తేజ, వీఆర్వో శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

19 దేవాలయాలకు ఒకరే అధికారి

పొదలకూరు పట్టణంలోని శివాలయం

న్యూస్‌టుడే, పొదలకూరు

ఆలయాలకు పూర్తిస్థాయిలో ఈవోలు లేకపోవడంతో పర్యవేక్షణ సరిగా లేక విలువైన భూములు, దాతలు భక్తితో సమకూర్చినవి పక్కదారి పడుతున్నాయి. పొదలకూరు శివాలయానికి చెందిన ఈవో ప్రసాద్ రెడ్డి గ్రూపు దేవస్థానాల ఈవోగా కొనసాగుతున్నారు. సోమశిల సోమేశ్వరస్వామి ఆలయం నుంచి పొదలకూరు, చేజర్ల, కలువాయి, మండలాల్లోని దేవాదాయశాఖకు చెందిన సుమారు 19 ఆలయాలు ఆయనే పర్యవేక్షిస్తున్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో హాజరవుతున్నా మిగతా సమయాల్లో ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలోనే కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. పొదలకూరు శివాలయానికి మాగాణి మూడున్నర, మెట్ట ఆరు ఎకరాలకు పైగా భూములున్నాయి. వీటికి మూడేళ్లకు ఒకసారి నామమాత్రంగా వేలం ద్వారా కౌలుకు కేటాయిస్తారు. పట్టణానికి చెందిన గ్రామ దేవత పోలేరమ్మకు చెందిన రూ.కోట్ల విలువ చేసే(మాన్యం) ఆరున్నర ఎకరాలు ప్రధాన రహదారి పక్కనే ఉండగా 1996లో ఆర్టీసీ బస్టాండ్ నిర్మించారు. మిగతా భూమి కౌలుకిచ్చారు. ఇందులో కొంత ఆక్రమణలకు గురైంది. వావింటపర్తిలో చెన్నకేశవ స్వామి దేవస్థానానికి కూడా విలువైన భూములు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కనీసం మండలానికి ఒక ఈవో ఉండేలా చూడాలని, దాతలు సమకూర్చిన భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని విన్నవిస్తున్నారు.

నిధుల కొరత.. వసతులకు నోచుకోక..!

కుల్లూరు గ్రంథాలయం

విజ్ఞాన భాండాగారాల్లో మౌలిక వసతులు లేక నిధుల కొరత వేధిస్తోంది. గ్రామ పంచాయతీలు గ్రంథాలయాల సంస్థకు పన్ను సక్రమంగా చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోయి అభివృద్ధికి దూరంగా ఉంటున్నాయి. కలువాయి గ్రంథాలయంలో 9456, కుల్లూరులో 7475 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. పంచాయతీలకు వచ్చిన ఇంటి పన్నులో 0.08 శాతం గ్రంథాలయాలకు చెల్లించాలి. 2020-21 వరకు కలువాయి పంచాయతీ నుంచి రూ.11,02,527, కుల్లూరు నుంచి రూ.1,87,800, మండలంలోని 20 పంచాయతీల నుంచి రూ.16 లక్షల వరకు జమకావాల్సి ఉంది. పాఠకులు వస్తున్నా వసతుల్లేక వచ్చే వారి సంఖ్య తగ్గిపోతోంది. రెండింటికి ఒకరే లైబ్రేరియన్ ఉండటంతో శని, ఆది, సోమవారాల్లో కలువాయి, మంగళ, బుధ, గురువారాల్లో కుల్లూరు గ్రంథాలయాలను తెరుస్తున్నారు. దీంతో విజ్ఞాన భాండాగారాలు ఎప్పుడు తెరుస్తారో, ఎప్పుడు మూస్తారో తెలియక పాఠకులు అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కలువాయి

వరుస ప్రమాదాలు.. అయిదేళ్లుగా ప్రతిపాదనలు..!

● కోట మండల పరిధిలోని విద్యానగర్ సమీపంలోని ర.భ రోడ్డు అంచున ఉన్న విద్యుత్తు నియంత్రికను గతేడాది నవంబరులో వాహన చోదకుడు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడ్డారు.

● కోట మండల పరిధిలోని వీరారెడ్డి సత్రం సమీపంలోని విద్యుత్తు నియంత్రికను కారు వేగంగా ఢీకొంది. పక్కనే ఉన్న పంట కాలువలో పడింది. ఈ ఘటనలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి.

న్యూస్‌టుడే, కోట

కోట మండలం విద్యానగర్ నుంచి వాకాడు మండలం దుగరాజపట్నం వరకు 22 కిలోమీటర్లు డబుల్ రోడ్డు విస్తరణ పనులను ఆరేళ్ల క్రితం రూ.15 కోట్లతో చేపట్టారు. రోడ్డు విస్తరించి ఎత్తుగా చేయడంతో విద్యుత్తు నియంత్రికలు, స్తంభాలు అంచున ప్రమాదకరంగా ఉన్నాయి. ఈమార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదాలు జరిగే అవకాశముంది. వర్షమొస్తే మరింత ప్రమాదకరంగా ఉంటోందని పలువురు వాపోతున్నారు. దీంతో ర.భ అధికారులు అప్పట్లో స్తంభాలను, నియంత్రికలను కొంత దూరంలో ఏర్పాటు చేసేందుకు రూ.40 లక్షలతో ప్రతిపాదనలు చేశారు. విద్యుత్తు శాఖకు చెల్లిస్తే పనులు ప్రారంభిస్తారు. అయితే అప్పటి నుంచి నిధులు మంజూరు చేయలేదు. అయిదేళ్లుగా ప్రతిపాదనలతోనే పరిమితమైంది. రెండు శాఖల మధ్య సమస్య నలుగుతూ వాహన చోదకుల ప్రాణాల మీదకు వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాల్సిన అవసరముంది.

విద్యానగర్ వద్ద రోడ్డు అంచునే ప్రమాదకరంగా విద్యుత్తు నియంత్రిక

ఎక్కడ :	విద్యానగర్ నుంచి దుగరాజపట్నం వరకు
ఎన్ని గ్రామాలు :	12
రోడ్డు :	ఆర్అండ్‌బీ
కిలోమీటర్లు :	22
ఏర్పాటు చేయాల్సినవి :	18 నియంత్రికలు, 203 స్తంభాలు
ప్రతిపాదించిన నిధులు :	రూ.40 లక్షలు

● డిస్కం ఏడీ చిన్నయ్యను వివరణ కోరగా నిధులు చెల్లిస్తే పనులు చేపడతామని ఆవేదన వ్యక్తం చేశారు. ర.భ అధికారులు మాత్రం నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపామని పేర్కొన్నారు.

(c) eenadu

నెల్లూరు
• నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

29న నరసింహకొండపై లక్ష తులసీ పూజ

నెల్లూరు(మార్కెట్ సెంటర్): నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండపై భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని ఈ నెల 29న ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ అచ్యుత శంకర్‌రెడ్డి, ఈవో గోపి ప్రకటనలో తెలిపారు. స్వామివారికి స్నపన తిరుమంజనం లక్ష తులసీ పూజ, కల్యాణ మహోత్సవం జరుగుతాయని చెప్పారు. ఫిబ్రవరి 1న మాఘ పూర్ణిమ సందర్భంగా మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయం నుంచి నవాబుపేట మార్కెటింగ్ సొసైటీ రైస్‌మిల్లు వరకు నగరోత్సవం నిర్వహించి.., స్వామివారిని అక్కడ విడిది చేస్తారని తెలిపారు.

అయ్యప్ప ఆలయంలో..

నెల్లూరు(మార్కెట్ సెంటర్): రోహిణీ నక్షత్రాన్ని పురస్కరించుకుని నగరంలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరుగుతాయని అయ్యప్ప సేవా సమాజం నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. 1987 ఫిబ్రవరి 8వ తేదీన రోహిణీ నక్షత్రం రోజు స్వామివారి విగ్రహం ప్రతిష్ఠించిన సందర్భంగా పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ఆదర్శ రైతును సత్కరిస్తున్న అధికారులు

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని డీపీఎం కన్నయ్య కోరారు. నెల్లూరులో ఎన్‌ఎంఎన్‌ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ప్రకృతి వ్యవసాయ విధానాలు, క్షేత్రస్థాయి అమలును అధికారులు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదర్శ రైతు మల్లికార్జున ఎంపీపీ పదవి వ్యవసాయరంగంలో అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఆయన్ని ఆదర్శ రైతులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రాంతీయ సాంకేతిక సమన్వయకర్త రవిచంద్ర ప్రసాద్, రాష్ట్ర ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్ తరఫున కీర్తి తదితరులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తి.. కత్తుల సంస్కృతి

గ్రామీణంలో రౌడీమూకల ఆగడాలు

● రెండు నెలల క్రితం కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీ పరిధిలోని ఆర్‌డీటీ కాలనీలో పెంచలయ్య అనే యువకుడిని గంజాయి బ్యాచ్ కత్తులతో దారుణంగా హత్య చేసింది. తమ అక్రమ కార్యకలాపాలకు అడ్డు వస్తున్నాడని 14 మంది యువకులు పథకం ప్రకారం కడతేర్చారు.

● తాజాగా నెల్లూరు(గ్రామీణ నియోజకవర్గం పరిధిలోని కోడూరుపాడు కల్తీ కాలనీలో ఉన్నత పాఠశాల విద్యార్థుల మధ్య చెలరేగిన వివాదం తార స్థాయికి చేరింది. వివాదంలో స్థానిక రౌడీ మూకలు రంగ ప్రవేశం చేసి కత్తులతో స్వైర విహారం చేశారు. -న్యూస్‌టుడే, నెల్లూరు(వేదాయపాలెం)

నెల్లూరు(గ్రామీణ నియోజకవర్గంలో రౌడీ షీటర్లు.. మూకలపై పోలీసులు చర్యలు తీసుకుంటున్నా.. క్షేత్రస్థాయిలో వారి కార్యకలాపాలు ఆగడం లేదు. చిన్నపాటి వివాదాలకే కత్తులతో స్వైర విహారం చేస్తున్నారు. నేరాలకు పాల్పడిన వారిని నడిరోడ్డులో నడిపిస్తూ పీడీ యాక్ట్ ప్రయోగిస్తున్నా వారిలో మార్పు లేదు.

చిన్న వివాదమే.. : గణతంత్ర దినోత్సవం రోజున నెల్లూరు(గ్రామీణ నియోజకవర్గం కోడూరుపాడు కల్తీకాలనీలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో వేడుకలు జరిగాయి. పాఠశాలలో చదివే విద్యార్థికి అదే ప్రాంతానికి చెందిన మరో విద్యార్థితో గొడవ జరిగింది. ఈ విషయమై ఒక విద్యార్థి తరఫు వారు వచ్చి మా వాడికే సహించేది లేదంటూ హెచ్చరిస్తూ తమ వెంట తీసుకొచ్చిన కత్తులతో భయభ్రాంతులకు గురి చేశారు. కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు స్థానికులు అడ్డు వెళ్లి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేది. కత్తులు చూపించడంతో ఏం మాట్లాడకుండా మిన్నకుండి పోయారు.

చేతిలో రెండు కత్తులతో హల్‌చల్

రాజకీయ అండదండలు

వీరి వెనక రాజకీయ అండదండలు ఉన్నట్లు సమాచారం. ఇలాంటి సంఘటనలు జరిగితే రాజకీయ నాయకులు రంగప్రవేశం చేసి మా వాడే నంటూ పోలీసులకు చెప్పడంతో భయం లేకుండా పోతోంది. పదో తరగతి చదివే వారికి కత్తులు వెంట తీసుకువచ్చే వారితో పరిచయాలు ఉన్నాయంటే వారి నడత ఎలా ఉందో తెలుస్తోంది.

మరో స్టేషన్ ప్రతిపాదన బుట్టదాఖలు

నెల్లూరు గ్రామీణ నియోజకవర్గం జనాభా, విస్తీర్ణం పరంగా పెద్దది. కేవలం ఒకే ఒక పోలీసు స్టేషన్ ఉంది. స్టేషన్ పరిధిలో శివారు ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయి. దాంతో మరో పోలీసు స్టేషన్ ప్రతిపాదన తెరపైకి తీసుకువచ్చారు. ఏళ్లు గడుస్తున్నా.. అది కార్యరూపం దాల్చడం లేదు.

పటిష్ఠంగా పారిశుద్ధ్య పనులు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరపాలకసంస్థ కమిషనర్ వైవో నందన్ మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. మూడో మైలులో అధికారులతో కలిసి కాలువ నిర్మాణం తీరు, విద్యుద్దీపాలు, మౌలిక సదుపాయాలను ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి తెలుసుకున్నారు. ఖాళీగా ఉన్న స్థలానికి సంబంధించి పన్ను బకాయిలు సుమారు రూ.7లక్షలు ఉండటంతో స్థల యజమానితో మాట్లాడారు. మూడో డివిజన్ కిసాన్‌నగర్ ప్రాంతంలోని ఎన్టీఆర్ పార్కును తనిఖీ చేశారు. పార్కు ప్రాంతంలో విష సర్పాలు సంచరిస్తున్నాయన్న ఫిర్యాదు మేరకు పారిశుద్ధ్య చర్యలను పటిష్ఠంగా నిర్వహించాలని ఆదేశించారు. నగరంలో కాలువలు ఆక్రమణ జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి శ్రీనివాసులు, ఆర్‌ఐలు రవి, చినబాబు, ఈఈ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: వేమారెడ్డినగర్ ఒకటో వీధిలోని ఖాళీ స్థలాల్లో నీరు చేరి దుర్వాసన రావడంతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. వ్యాధుల బారిన పడుతున్నాం. - సుజాత, స్థానికురాలు

సమాధానం: పరిశీలించి తగిన చర్యలు వెంటనే తీసుకుంటాం. - నందన్, కమిషనర్

? నారాయణ ఆసుపత్రికి వెళ్లే ప్రాంతంలోని యూకోనగర్‌లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. వీధుల్లో గుంపులుగా తిరుగుతున్నాయి. చిన్నారులపై దాడులు చేస్తున్నాయి. -శ్రీహరి

✓ కుక్కలను పట్టించేందుకు చర్యలు చేపడతాం. - డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

-న్యూస్‌టుడే, నెల్లూరు(పొదలకూరురోడ్డు)

దోమల నివారణ చేయాలంటూ వినూత్న నిరసన

నెల్లూరు(విద్య): నగరంలోని 54 డివిజన్లలో దోమలు విపరీతంగా ఉన్నాయని వీటి నివారణకు కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. మంగళవారం నగరంలో సీపీఎం ఆధ్వర్యంలో దోమతెరలతో వినూత్నంగా నిరసన తెలిపారు. యుద్ధప్రాతిపదికన నిధులు కేటాయించి నివారణ చర్యలుతీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాసులు, సీఐటీయూ నగర కార్యదర్శివర్గ సభ్యులు నాగేశ్వరరావు, సూర్యనారాయణ, శ్రీనివాసులు, నగర కమిటీ సభ్యులు నరసింహ, పద్మ, సుబ్బమ్మ, ప్రసాద్, రషీద్, ఏమేలు, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

దోమ తెరలతో ర్యాలీ

నగర నియోజకవర్గంలో యువగళం విజయోత్సవ ర్యాలీ

యువగళం.. జన ప్రభంజనం

నెల్లూరు(పొదలకూరురోడ్డు): యువనేత నారా లోకేశ్ యువగళం పాదయాత్ర మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం నెల్లూరునగరంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మంత్రి నారాయణ నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌తో వేలాది మంది ప్రజలు, యువకులు స్వచ్ఛందంగా తరలివచ్చి వీఆర్సీ సెంటరు నుంచి గాంధీబొమ్మ వరకు బారులు తీరారు. ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి నారాయణ ఆదేశాల మేరకు నెల్లూరులో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నగర అధ్యక్షుడు మామిడాల మధు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

మాఘ పౌర్ణమి చండీ హోమం

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: నగరంలోని మూలాపేట ఈవోస్ ఆర్ఎం స్కూలు సమీపాన ఉన్న శ్రీ కంచి కామాక్షమ్మ, చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో ఫిబ్రవరి 1న మాఘ మాస పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి చండీ హోమం నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు హోమం జరగనుందని ఆలయ ఈవో ఉషాకుమారి, మేనేజర్ నందకిషోర్ తెలిపారు.

డిమాండ్ల సాధనకు 12న సమ్మె

కమిషనర్‌కు సమ్మె నోటీసును అందిస్తున్న నాయకులు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలు రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్స్ దేశవ్యాప్తంగా అమలులోకి తీసుకురావడం, కార్మికులకు అన్యాయం చేయడమేనని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా, నగర గౌరవాధ్యక్షులు కె. పెంచలనరసయ్య, కత్తి శ్రీనివాసులు అన్నారు. ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా నగరపాలక సంస్థ కమిషనర్ వైవో నందన్‌కు మంగళవారం సమ్మె నోటీసును అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు 17 రోజుల సమ్మెలో భాగంగా జరిగిన ఒప్పందాలు ఇంత వరకు అమలు చేయలేదన్నారు. దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వజ్రమ్మ, సునీల్, మనోజ్, దేశమూర్తి, కామాక్షమ్మ, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

దర్గామిట్ట పీఎస్‌ను సందర్శించిన నగర ఏఎస్పీ

నెల్లూరు (వేదాయపాలెం): దర్గామిట్ట పోలీసు స్టేషన్‌ను మంగళవారం రాత్రి నగర ఏఎస్పీ దీక్ష ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్ల వివరాలతో పాటు నేర నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఇన్‌స్పెక్టర్ కల్యాణ రాజును అడిగి తెలుసుకున్నారు.

ఘన వ్యర్థాల నిర్వహణ కీలకం

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: పురపాలకసంఘంలో ఘన వ్యర్థాల నిర్వహణ ఎంతో కీలకమైందని, వీటి గురించి తెలుసుకుని ఆచరిస్తే చెత్త నుంచి సంపద పొందవచ్చని మెప్మా పీడీ బి.లీలారాణి తెలిపారు. మంగళవారం నగరపాలకసంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటరులో మెప్మా ఆర్పీలకు ఒకరోజు సామర్థ్యాల పెంపు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణలో ఘన వ్యర్థాల నిర్వహణ, తడి, పొడి, హానికర ప్లాస్టిక్ వ్యర్థాలు, ఈ-వేస్ట్ నిర్వహణ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ నుంచి రిసోర్స్ పర్సన్ తిరుపతిరావు, జయమాధురిమ, మెప్మా టీఈ అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి సంతాపం

నెల్లూరు(లీగల్), న్యూస్‌టుడే: నెల్లూరు బార్ అసోసియేషన్ న్యాయవాది గోవిందు(48) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందారు. పలువురు న్యాయవాదులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అయ్యప్పరెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షుడు పద్మాకర్, ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అంకయ్య, లోక్ అదాలత్ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ గోపాల్‌రెడ్డి, న్యాయవాద ఐక్యవేదిక నాయకుడు మాజీ పీపీ రవికుమార్ సంతాపాన్ని ప్రకటించారు.


ద్వితీయ వర్ధంతి
ఉన్నత విలువలు, ఆశయాలకు మారుపేరుగా నిలిచి మా అందరి హృదయాలలో చెరగని ముద్ర వేసిన మా ఇంటి దైవం
కీ॥శే॥ కందికట్టు జయరామయ్య గారు
ద్వితీయ వర్ధంతి సందర్భముగా మీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...
కీ॥శే॥ కందికట్టు జయరామయ్య గారు
Rtd. HWO
Hon'ble President AP State Wardens & Matrons Association, Hyderabad.
జననం : 11-02-1949 మరణం : 19-02-2024
భార్య : కందికట్టు వెంకటశేషమ్మ
కుమారులు - కోడళ్ళు
కందికట్టు మధుసూదన్‌బాబు - విశాలక్ష్మి
కందికట్టు రాజారమేష్‌బాబు - శిల్ప
మనుమలు, మనుమరాళ్ళు : కె.కృష్ణసాయి, తన్మయిశ్రీ, తేజస్విని, నేహశ్రీ
యనమలపాళెం, నెల్లూరు-2, SPSR నెల్లూరు జిల్లా.

ఇలా వెళ్లడం ప్రమాదమే!

నగరంలో మంగళవారం యువకుడు ద్విచక్ర వాహనంపై ఒంటి కాలుతో ఆటోను నెట్టుకుంటూ వెళ్లాడు. కాస్త ఆదమరిచినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. సాధారణంగా ఆటో మరమ్మతులకు గురైతే మరో ఆటో సాయంతో మెకానిక్ దగ్గర తీసుకెళ్తుంటారు. ద్విచక్ర వాహనంతో ఇలా ఒంటి కాలుతో నెట్టడం ఎంత వరకు సమంజసమని నగరవాసులు అంటున్నారు. –న్యూస్‌టుడే, నెల్లూరు(బీవీ నగర్)

రాకపోకలకు అంతరాయం

నగర పరిధిలో బుజబుజనెల్లూరు వద్ద గ్రాసం కోసం వెళుతూ పశువులు రోడ్డుపైకి వస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యజమానులు కొంతమంది పశువులను రోడ్డు దాటించే సమయంలో ఒక్కసారిగా తీసుకొస్తున్నారు. అదే సమయంలో అటుగా వాహనదారులు వస్తున్నారు. అండర్ బ్రిడ్జి నిర్మిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని వాహనదారులు తెలిపారు. – న్యూస్‌టుడే, నెల్లూరుగ్రామీణం

పేరుకుపోయిన వ్యర్థాలు.. కదలని మురుగు

నగరంలోని హరనాథపురం కూడలి నుంచి చిల్డ్రన్స్ పార్కు వెళ్లే మార్గంలో కృష్ణపట్నం కాలువలో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. గుర్రపు డెక్కతో పాటు పిచ్చి మొక్కలు మొలిచాయి. దీంతో ప్లాస్టిక్ ఉత్పత్తులు, ఇతర వ్యర్థాలు పెద్ద ఎత్తున నిలిచిపోతున్నాయి. ఈ ప్రాంతం దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది. – న్యూస్‌టుడే, నెల్లూరు(నవాబుపేట)


32వ వర్ధంతి
మీరు కనుమరుగై 32 సంవత్సరాలు గడిచినా, అనుక్షణం మీ స్మృతులలో...
కుమారులు
కారంశెట్టి మనోహర్, B.Tech., B.L., M.Val
కారంశెట్టి ప్రభాకర్, B.Tech., Business Unit Head, TCS, London.
కారంశెట్టి కిషోర్‌కుమార్ B.Com., B.L.,
కోడళ్ళు
శైలజ, M.Sc.,
సువర్ణ, B.Com.,
గాయత్రి, B.Sc.,
మనుమరాండ్రు : నమ్రత, ఆశ్రిత, వర్షిత, రిషిత, సరయు, సంహిత
కీ॥ శే॥ కారంశెట్టి చిన వెంకటేశ్వర్లు గారు
MAHALAKSHMI ENGINEERING AGENCIES SUBEDARPET ROAD, NELLORE

లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రవాణాశాఖ అధికారులు

నెల్లూరు (రవాణా), న్యూస్‌టుడే: లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని రవాణాశాఖ అధికారులు హెచ్చరించారు. నగరంలో మంగళవారం డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడుపుతున్న విద్యార్థుల వాహనాలు ఆపి జరిమానా విధించారు. అనంతరం వారికి లైసెన్సు ఆవశ్యకతను వివరించారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా నగరంలోని నారాయణ వైద్య కళాశాలలో విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు బాల మురళీకృష్ణ, పూర్ణచంద్రరావు, షఫీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతరానికి మహనీయుల చరిత్ర తెలియజేయాలి

నెల్లూరు(సాంస్కృతికం), న్యూస్‌టుడే: నేటి యువతరానికి మహనీయుల చరిత్రను తెలియజేయాల్సిన అవసరం ఉందని మేరా యువ భారత్ జిల్లా అధికారి మహేంద్రరెడ్డి అన్నారు. పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, రత్నమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం టౌన్‌హాల్‌లో రాచపాళి రత్నావళి పద్యాల ఆడియో విడుదల చేశారు. ఈ సందర్భంగా మహనీయుల చిత్రపటాలను ప్రదర్శించారు. యువజన సర్వీసుల శాఖ సీఈవో నాగేశ్వరరావు మాట్లాడుతూ మహనీయుల ఆశయాలకు అనుగుణంగా యువత నడుచుకోవాలని కోరారు. సంగీత దర్శకుడు దారా సురేష్, గాయకుడు రమణయ్య తోపాటు పలువురు కళాకారులను సత్కరించారు. నిర్వాహకులు రియాజ్‌బాషా, రాయప్ప, దయాకర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల చిత్రాలతో ట్రస్ట్ నిర్వాహకులు

బాలోత్సవం గోడ ప్రతులు ఆవిష్కరిస్తున్న కమిటీ నాయకులు

29,30 తేదీల్లో సింహపురి బాలోత్సవం

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: నగరంలోని కస్తూరి దేవి బాలికల హైస్కూల్లో 29, 30 తేదీల్లో జరగనున్న సింహపురి బాలోత్సవాన్ని జయప్రదం చేయాలని సింహపురి బాలోత్సవ కమిటీ కార్యదర్శి విజయ్‌కుమార్ కోరారు. మంగళవారం నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో గోడప్రతులు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, శాస్త్రీయ నృత్యం, వెస్ట్రన్ డ్యాన్స్, ఏకపాత్రాభినయం, విచిత్ర వేషధారణ, సాంస్కృతిక పోటీలు ఉంటాయని.. విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. 4, 5 తరగతుల వారు సబ్ జూనియర్లుగా, 6,7 తరగతులు వారు జూనియర్లుగా, 8, 9, 10 తరగతుల విద్యార్థులు సీనియర్లుగా పోటీలు ఉంటాయని తెలిపారు. నగర కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బాలోత్సవ అకడమిక్ కన్వీనర్ చలపతి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు మద్దతు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ మద్దతు ప్రకటించిందని ఆ శాఖ గ్రామీణ కార్యదర్శి కె. పెంచలనరసయ్య పేర్కొన్నారు. మంగళవారం బ్యాంకు ఉద్యోగుల సమ్మెలో సీఐటీయూ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

పౌరహక్కుల సంఘం కన్వీనర్‌ను విడుదల చేయాలి

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: రెండు తెలుగు రాష్ట్రాల పౌరహక్కుల సంఘం కన్వీనర్ చైతన్యను తక్షణమే విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ కోరారు. .మంగళవారం నగరంలోని రామచంద్రారెడ్డి భవన్‌లో పౌరహక్కుల సంఘం, వామపక్షాలు, ప్రజాసంఘాలు, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చైతన్యను విడుదల చేసి కేసును ఎత్తివేయాలని కోరుతూ ఈ నెల 30న నగరంలో నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు.

నగరం మధ్య.. అభివృద్ధి మిథ్య

న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

నగరపాలకసంస్థ అధికారుల నిర్లక్ష్యం పలు ప్రాంతాల ప్రజలకు శాపంగా మారింది. ఇళ్ల మధ్య కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. కాలువల్లో పూడికతీయక పోవడంతో దోమలు ఉత్పత్తి చెంది కంటి మీద కునుకు లేకుండా పోతోంది. చెత్త పేరుకుపోవడంతో పశువులు కలియబెడుతున్నాయి. ఈ పరిస్థితి నగరంలోని మెక్లిన్స్‌రోడ్డు, మన్సూర్ నగర్ ప్రాంతాల్లో నెలకొంది.

మన్సూర్‌నగర్‌లో పగుళ్లిచ్చిన సిమెంటు రోడ్డు

రహదారులు ధ్వంసం

నగరం నడిబొడ్డున ఉన్న రెండు ప్రాంతాలు ఏర్పడి మూడు దశాబ్దాలకు పైగా అయింది. అభివృద్ధి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఉన్న సిమెంటు రోడ్లను తాగునీరు, భూగర్భ డ్రైనేజీ పనుల పనుల పేరుతో ధ్వంసం చేశారు. వాటికి కనీసం మరమ్మతులు చేపట్టక పోవడంతో గుంటలు మిట్టలుగా తయారయ్యాయి. ప్రతి రోజూ ఇంటింటి చెత్త సేకరణ చేపట్టకపోవడంతో వ్యర్థాలను ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో వేస్తున్నారు. రోడ్లపై పగుళ్లివ్వడంతో ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి గాయపడిన సంఘటనలు ఉన్నాయి. దోమల నివారణకు ఫాగింగ్, స్ప్రేయింగ్ చేసిన దాఖలాలు లేవని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తమ ప్రాంత సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం : దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తామని, ఎప్పటికప్పుడు చెత్త తరలించేలా చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ కనకాద్రి తెలిపారు.

అవార్డు గ్రహీతకు అభినందనలు

అటవీశాఖ నందు సమర్థవంతంగా విధులు నిర్వహించినందుకు గాను వారి విశిష్ట సేవలను గుర్తించి గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీ హిమాన్షు శుక్లా I.A.S., గారి ద్వారా ఉత్తమ పురస్కార ప్రశంసా పత్రం అందుకున్న జిల్లా అటవీశాఖ అధికారి శ్రీ K. మహబూబ్ బాషా గారికి మా హార్దిక శుభాకాంక్షలు తెలుపుతూ..
శ్రీ K. మహబూబ్ బాషా I.F.S., గారు జిల్లా అటవీశాఖాధికారి, నెల్లూరు.
ఎస్.మాల్యాద్రి అటవీ క్షేత్రాధికారి, నెల్లూరు & రాపూరు.

హార్దిక శుభాకాంక్షలు

విధి నిర్వహణలో అంకితభావం, వృత్తిపట్ల గౌరవంతో నడుచుకుని అందరి మన్ననలు పొంది ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న శ్రీ జి.విజయభాస్కర్ SE గారికి ఇవే మా హార్దిక శుభాకాంక్షలు.
జిల్లా కలెక్టర్ నుండి ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న జి.విజయభాస్కర్ గారు SE
RWS సిబ్బంది - నెల్లూరు.

శ్రద్ధాంజలి

జననం : 22-02-1955
మరణం : 10-01-2026
మా ఆత్మీయ మిత్రులు, శ్రేయోభిలాషులు శ్రీ కొట్టే రామమూర్తి గారి సతీమణి
శ్రీమతి కొట్టే మల్లీశ్వరి గారి
అకాల మరణం పట్ల చింతిస్తూ.. ఆమె పవిత్రాత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబసభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుని ప్రార్థిస్తూ.. శోకతప్త హృదయాలతో..
కోట గురుబ్రహ్మం చైర్మన్ శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం, నెల్లూరు.
నెల్లూరు ప్రసాద్ కోమల విలాస్
పాజర్ల శంకర్ శివశంకర్ ట్రాక్టర్ స్పేర్స్ గ్రూప్
దువ్వూరు పరసురామిరెడ్డి Land Lord
పెనుమల్లి చంద్రశేఖర్ రియల్ ఎస్టేట్
సగిలి జయరామిరెడ్డి బంధం ఫౌండేషన్

(c) eenadu

ఈనాడు
శ్రీ సత్యసాయి
బుధవారం జనవరి 28, 2026

హనుమంత వాహనంపై దర్శనమిస్తున్న ఖాద్రీశుడు

బ్రహ్మోత్సవాల సూచిక.. మధ్వనవమి వేడుక

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల ఆరంభానికి సూచికగా మంగళవారం మధ్వనవమి వేడుక వైభవంగా నిర్వహించారు. ఫిబ్రవరి 27న బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. దీంతో స్వామివారు వేడుకలకు ఆహ్వానం పలుకుతూ హనుమంత వాహనంపై పురవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

పొజిషన్ సర్టిఫికెట్‌కు.. రూ.8వేల లంచం

అనిశా అధికారులకు చిక్కిన వీఆర్వో, వీఆర్‌ఏ

హిందూపురం, న్యూస్‌టుడే: నివాసం ఉన్న ఇంటికి అన్ని అర్హతలు ఉన్నా పొజిషన్ సర్టిఫికెట్ జారీకి రూ.8వేల లంచం డిమాండ్ చేసిన వీఆర్వో హరిత, డబ్బు తీసుకుంటూ వీఆర్‌ఏ రామాంజినేయులు అవినీతి నిరోధక శాఖ (అనిశా) అధికారులకు మంగళవారం సాయంత్రం పట్టుబడ్డారు. ఈ ఘటనకు సంబంధించి కడప ఏసీబీ డీఎస్పీ సీతారామరావు తెలిపిన వివరాలిలా.. కిరికెర గ్రామానికి చెందిన జయచంద్రకుమార్ కొన్నేళ్ల కిందట ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాన్ని ఇతరుల నుంచి కొనుగోలు చేశాడు. ఆ ఇంటికి బ్యాంకు నుంచి రుణం తీసుకోవాలని పొజిషన్ సర్టిఫికెట్‌కు దరఖాస్తు చేయగా వీఆర్వో హరిత ధ్రువపత్రం జారీకి నిరాకరించి రూ.8వేల డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఇంత మొత్తం ఇవ్వలేనని ప్రాధేయపడగా రెండు విడతలుగా ఇవ్వమని చెప్పింది. లంచం ఇవ్వటానికి ఇష్టంలేని జయచంద్రకుమార్ అనిశా అధికారులను సంప్రదించాడు. మంగళవారం సాయంత్రం మొదటి విడతగా రూ.5వేలు ఇస్తానని వీఆర్వోకు ఫోన్ చేయగా ఆమె వీఆర్‌ఏ రామాంజినప్పను పంపుతానని చెప్పి అతడిని లయోలా ఉన్నత పాఠశాల వద్దకు పంపింది. బాధితుడు అతడికి డబ్బులు ఇస్తుండగా పథకం ప్రకారం వేచి ఉన్న అనిశా అధికారులు వీఆర్‌ఏను పట్టుకొని డబ్బు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనలో వీఆర్వో హరిత, ఆమెకు సహకరించిన వీఆర్‌ఏ రామాంజినప్పలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, బుధవారం వీరిని కర్నూలు ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ వివరించారు.

ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ వీఆర్‌ఏ, వీఆర్వో

ఆలోచనల్ని అంకుర సంస్థలుగా మార్చండి

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను సద్వినియోగం చేసుకొని యువత తమ ఆలోచనలను అంకుర సంస్థలుగా రూపొందించడానికి కృషి చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ విష్ణు చరణ్ పేర్కొన్నారు. జేఎన్‌టీయూలోని రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, స్కిల్ డెవలప్‌మెంట్‌పై 5 రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ఆరంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన ఇన్‌ఛార్జి కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక కుటుంబం- ఒక వ్యాపారవేత్త అనే లక్ష్యంతో ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేశారన్నారు. వ్యాపారవేత్తలు, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు నిధులతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాపార ఆలోచనలు విజయవంతం అయ్యే వరకు ఇన్నోవేషన్ హబ్ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వంతో పాటు పరిశ్రమలు, విద్యాసంస్థలు, పెట్టుబడిదారుల కలయికతో నడిచే ఒక సంస్థ ఇది అన్నారు. అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఇన్నోవేషన్ హబ్ సీఈవో హఫీజ్‌బాష, అటల్ ఇంక్యుబేషన్ కేంద్రం సీఈవో చంద్రమౌళి, శిక్షకులు వసుంధర, వేణుగోపాల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ విష్ణుచరణ్

నిర్లక్ష్యం ఖరీదు.. రూ.5 కోట్లు!

విద్యుత్తు మోటర్లకు మోక్షం కల్పించని వైనం

విద్యుత్తు కార్యాలయంలో వృథాగా మోటార్లు, సామగ్రి

ధర్మవరం పట్టణం, తాడిమర్రి, న్యూస్‌టుడే: విద్యుత్తు పథకాన్ని నిజానికి వ్యవసాయానికి నాణ్యమైన సరఫరాను అందించాలన్న లక్ష్యంతో 2018లో తెదేపా ప్రభుత్వం.. కేంద్రం సహకారంతో ఈఈఎస్ఎల్ పరిధిలో కొత్త కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా అర్హులైన రైతులను గుర్తించి ఉచితంగా విద్యుత్తు మోటార్లు, స్టార్టర్ పెట్టెలు, ఇతర సామగ్రి పంపిణీ చేయాలని నిర్ణయించింది. 5 హెచ్‌పీ సామర్థ్యంతో ప్రముఖ కంపెనీకి చెందిన మోటార్లు, స్టార్టర్లు జిల్లాలో ఎంపిక చేసిన మండలాలకు అందజేసింది. ధర్మవరం నియోజకవర్గంలోని తాడిమర్రి మండలానికి 200 పైగానే మోటార్లు సరఫరా చేశారు. రైతులకు పంపిణీ చేసే సమయంలో ఎన్నికలు రావడంతో కార్యక్రమం నిలిచిపోయింది. అవి తాడిమర్రి విద్యుత్తు కార్యాలయంలోనే నిరుపయోగంగా మారాయి. ఒక్కో మోటారు, సామగ్రితో కలిసి రూ.25,000 ఉండటంతో వాటి విలువ మొత్తం రూ.5 కోట్లకు పైగానే ఉంటుందని సంబంధిత శాఖాధికారులు అంచనా వేస్తున్నారు.

పక్కదారి పట్టి..

కొన్ని మోటార్లు, సామగ్రిని పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇటీవల అధికారులు గుర్తించారు. విద్యుత్తు శాఖలోని సిబ్బందే జిల్లాలోని తమ కార్యాలయాల్లో నీటి వినియోగానికి వాడుకున్నట్లు సమాచారం. ఇక ఏమాత్రం ఆలస్యం చేసినా ఉన్నవి సైతం దక్కే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వాటిని పంపిణీ చేయించాలని అన్నదాతలు కోరుతున్నారు.

పట్టించుకోని వైకాపా ప్రభుత్వం

గత ఐదేళ్ల వైకాపా పాలనలో పలుమార్లు రైతులు ఉచిత మోటార్లను పంపిణీ చేయాలంటూ ప్రజాప్రతినిధులు, అధికారులను విన్నవించుకున్నారు. ఏమాత్రం స్పందన లేకపోవడంతో రైతులు తీవ్ర నిరాశ చెందారు. మోటార్లను పంపిణీ చేసే పనులను దక్కించుకున్న గుత్తేదారులు అధికారులను సంప్రదించకపోవడంతో కార్యాలయంలోనే మూలుగుతున్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

- శివరాం, డీఈ విద్యుత్తు శాఖ

మోటార్ల పంపిణీ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. వచ్చిన తరువాత ప్రణాళిక మేరకు తగిన చర్యలు తీసుకుంటాం.

4న విద్యుత్తు అదాలత్

కదిరి, న్యూస్‌టుడే: స్థానిక విద్యుత్తు సబ్‌స్టేషన్ ఆవరణలో ఫిబ్రవరి 4న విద్యుత్తు అదాలత్ ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కృష్ణదేవ ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ పరిధి విద్యుత్తు వినియోగదారులకు సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కదిరిలోని సబ్‌స్టేషన్ ఆవరణలో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు అదాలత్ ఉంటుందన్నారు. డివిజన్ పరిధిలోని వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నన్ను కాస్త.. తలకెక్కించుకోండి!

ద్విచక్రవాహనదారులకు శిరస్త్రాణమే శ్రీరామరక్ష

గతేడాది అక్టోబరు 19న నల్లమాడ మండలం గోపేపల్లికి చెందిన లక్ష్మణ్‌సాయి, అరుణ్‌కుమార్, బన్నీ ద్విచక్రవాహనంపై కదిరి నుంచి నల్లమాడకు వస్తూ చెట్టును ఢీకొట్టారు. తలకు బలమైన గాయాలవ్వడంతో లక్ష్మణ్‌సాయి, అరుణ్‌కుమార్ అక్కడికక్కడే చనిపోయారు. బన్నీ గాయాలతో బయటపడ్డాడు. హెల్మెట్ ధరించి ఉంటే ఇద్దరు ప్రాణాలతో బయటపడేవారు.

గతేడాది ఇలా..

శిరస్త్రాణం ధరించకపోవడంతో మృతి చెందిన వారు: 118

నమోదైన కేసులు: 7,060

ఓ అన్నా.. తమ్ముడూ ఒక్కసారి ఇటువైపు చూడండి. నేను మీ శిరస్త్రాణాన్ని(హెల్మెట్). ప్రాణం విలువ మీకంటే నాకే బాగా తెలుసు. కేవలం నన్ను ధరించకపోవడం వల్లే ఏటా వందలమంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. హెల్మెట్ పెట్టుకోవాలని పోలీసులు ప్రమాణం చేయిస్తున్నా.. విరివిగా ప్రచారం చేస్తున్నా చాలామందిలో మార్పు కనిపించడం లేదు. నన్ను ధరించకుండా ప్రమాదాల్లో చనిపోయిన వారిలో యువకులే అధికం. గతేడాది 118 మంది కేవలం నన్ను ధరించకపోవడం వల్లే ప్రమాదాల్లో మృత్యువాతపడ్డారు. వీరిలో ఏ ఒక్కరైనా నా విలువను గుర్తించి ఉంటే నేడు వారి కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండేవారు. అందుకే ఇప్పటికైనా మారండి. నన్ను గుర్తించండి. నా మాట విని నన్ను కాస్తా తలకెక్కించుకోండి.

అపోహలు వద్దు

నన్ను ధరిస్తే జుట్టు ఊడిపోతుందని చాలా మంది యువతీ, యువకులు భయపడుతుంటారు. అదంతా అపోహ మాత్రమే. ఈ విషయం ఇప్పటికే వైద్యపరంగా రుజువైంది. ధరిస్తే జుట్టును ఎండ, కాలుష్యం బారి నుంచి కాపాడతాను. అందుకే అపోహలు విడిచిపెట్టి ధైర్యంగా నన్ను ధరించండి. నన్ను ఎంచుకునేటప్పుడు నాణ్యత విషయంలో రాజీ పడొద్దు. ఐఎస్ఐ మార్కు చూసి కొనండి.

- ఈనాడు, పుట్టపర్తి

భూగర్భజలం.. పుష్కలం!

ఒకేచోట పది ఫిల్టర్ బోర్లు

సాగు చేసే పంటలు : వరి, మల్బరీ, మొక్కజొన్న, జొన్న, రాగి, పూల తోటలు, నేపియర్ గడ్డి

భూగర్భ జలాల అంతర్గత ప్రవాహాలు ఎవరికీ అంతుబట్టవు. ఒక్కోచోట 1000 అడుగులు వేసినా నీటి చుక్క పడదు. మరోచోట అరడుగులలో 30 బోర్లు వేసినా నీరు తరగవు. నీటి లభ్యత ఉంటే రైతులు ఆనందానికి అవధి ఉండదు. కలిసి వచ్చిన అదృష్టాన్ని ఐక్యంగా నిలిచి తరాల నుంచి ఫలాలను పొందుతున్నారు పరిగి మండలం లోని పెన్నా పరీవాహక ప్రాంతాల రైతులు.

లభ్యత ఇలా: పైడేటి గ్రామ సమీపాన పెన్నానదిలో 6 అడుగుల వ్యవధిలో ఒక చోట పది, మరోచోట 30 దాకా ఫిల్టర్ బోర్లకు అందించేంతగా నీటి లభ్యత ఉంది.

ఏఏ గ్రామాల రైతులు వినియోగం?: పైడేటి, తిరుమల దేవరపల్లి, గణపతిపల్లి, రొద్దం మండలం మరవపల్లి, కలిపి, పెద్దమంతూరు.

80 నుంచి 90 అడుగుల్లో..

ఒక కిలో మీటరు నుంచి రెండు కిలో మీటర్ల మేర పీవీసీ పైపులు ఏర్పాటు చేసుకుని పంట పొలాలకు సాగు నీటిని తరలిస్తున్నారు. 2022-24 సంవత్సరాల్లో పెన్నా, జయమంగళి నదులు వరద నీరు ప్రవహించడంతో ఆయా నదుల్లో భూగర్భజలాలు అభివృద్ధి చెందాయి. 80 నుంచి 90 అడుగుల్లోనే పుష్కలంగా నీరు లభ్యమవుతోంది. గ్రామాల్లోని రైతులు ఎవరూ పట్టింపులకు పోకుండా నదిలో ఫిల్టర్ బోర్లను ఏర్పాటు చేసుకుని ఎవరికి వారు వివిధ రకాల పంటలను సాగు చేసుకుంటున్నారు.

- న్యూస్‌టుడే, కొడిగెనహళ్లి (పరిగి)

సెంట్రల్ వర్సిటీలో కొత్త కోర్సులు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : విద్యా విధానంలో మార్పులు నిత్యనూతనం. ఇటీవల కాలంలో వస్తున్న అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా సెంట్రల్ వర్సిటీలో కొన్ని కొత్త కోర్సులను పరిచయం చేస్తున్నారు.

★ **ప్రస్తుతం కొనసాగుతున్నవి?:** పీజీ 15 కోర్సులు, యూజీ 9 కోర్సులు, డిప్లొమో కోర్సులున్నాయి.

★ **నూతనంగా :** మూడు పీజీ కోర్సులైన ఎమ్మెస్సీ జీనోమిక్ సైన్స్, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎంసీఏను కొత్తగా ప్రవేశ పెడుతున్నాం. మరి కొన్ని కోర్సులను అత్యాధునిక డిజిటల్ విధానంలో తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- పాత్రికేయ సమావేశంలో వీసీ కోరి

తక్కువ కోతల్లోనే.. ఎక్కువ దిగుబడి

అరటి రైతులకు ఇజ్రాయెల్ రకాలు అందిస్తాం: సునీత

అరటిగెలను చూపుతున్న అధికారులు

రాప్తాడు, న్యూస్‌టుడే:

సంకల్పం: అరటి సాగులో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న అనంత జిల్లా రైతులను మరింత ప్రోత్సాహకాలు కల్పించాలని..

ప్రయోగం: గొందిరెడ్డిపల్లి దగ్గర ఇండస్ట్రియల్ ఏరియాలోని ఎలైట్ బయో టెక్నాలజీ టిష్యూకల్చర్ విధానంలో ల్యాబ్‌లో ఉత్పత్తి చేసిన మొక్కలను రైతులు సాగు చేయగా మంచి దిగుబడి వచ్చింది.

ల్యాబ్‌లో.. : ఇజ్రాయెల్‌లో పండే పొడవైన అరటి మొక్కను.. ఇక్కడి ఉద్యాన శాఖ అధికారులు సిబ్బందితో టిష్యూ కల్చర్ విధానంలో ల్యాబ్‌లో పెంచారు. ఈ మొక్క గెలను ధర్మవరపు మురళి.. ఎమ్మెల్యే సునీతకు మంగళవారం అందించారు. ఈ రకం సాగును ప్రోత్సహించాలని కోరారు.

ఇండస్ట్రియల్ యూనిట్ల అభివృద్ధితో..

'స్థానిక ఇండస్ట్రియల్ ఏరియాలోని అరటి ఉత్పత్తి యూనిట్లను మరింత అభివృద్ధి చేస్తే రైతుల డిమాండ్ మేరకు సరఫరా చేయవచ్చు. ప్రత్యేకంగా ఈ మొక్కను ఇజ్రాయెల్ నుంచి అరటి గడ్డలను దిగుమతి చేసుకుని ఇక్కడ టిష్యూకల్చర్ పద్ధతిలో ఉత్పత్తి చేయడం అభినందనీయం. బయట మార్కెట్ కంటే తక్కువ ధరకు, అధిక దిగుబడి, కాయ నాణ్యత, గెల పొడవు బాగుంటాయి. ఎకరానికి 35 టన్నుల వరకు దిగుబడితో పాటూ, తక్కువ కోతల్లో ఎక్కువ దిగుబడి సాధ్యం. ఇండస్ట్రియల్ యూనిట్లను మరింత అభివృద్ధి చేస్తే స్థానికంగా ఎంతోమందికి ఉపాధి లభిస్తుంది.

- ఎమ్మెల్యే పరిటాల సునీత

పిల్లల్లో మా బిడ్డను చూసుకుంటాం..

➤ పేద విద్యార్థులకు ఆర్థిక సాయం
➤ ప్రవాస భారతీయుడి ఉదారత

విద్యార్థినికి నోటు పుస్తకాలను అందిస్తున్న ఫౌండర్ కేశవరెడ్డి, ఛైర్మన్ గోపాల్‌నాయుడు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: ఆర్జించిన సొమ్ములో అంతో ఇంతో అభాగ్యులకు అందించి అందులో సార్థకతను వెతుక్కునే వారు సమాజానికి స్ఫూర్తిదాయకమే. ఈ కోవలో తెలంగాణ రాష్ట్రం, పెద్దపల్లి జిల్లా, కొత్తపల్లి గ్రామానికి చెందిన దాత డాక్టరు కేశవరెడ్డి ఒకరు.

ఆర్థిక సాయం ఎలా?

స్థిర నివాసం : అమెరికాలో టెక్సాస్‌లో (ఫిజిషియన్‌గా) స్థిరపడ్డారు.

ప్రేరణ: కేశవరెడ్డి, భారతి దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు రాజేశ్ మరణించడంతో అతని పేరు మీదుగా రాజ్ ఫౌండేషన్‌ను స్థాపించారు. అమెరికాలో ఉంటూ ఏడాదికి రూ.9 లక్షల వరకు పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నారు.

కార్యవర్గంలో ఎవరెవరు?

2018లో రాజ్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. విశ్రాంత స్టేట్‌బ్యాంకు మేనేజర్ ఛైర్మన్‌గా గోపాల్‌నాయుడు, వైస్ ఛైర్మన్ ఆర్‌కే నాయుడు, కార్యదర్శిగా శ్రీనివాసులు, కోశాధికారిగా రామపుల్లయ్య, నరసింహం, రాకేశ్, నటరాజ్ సభ్యులు

సేవ కొనసాగిస్తాం..

మా కుమారుడిని పిల్లల్లో చూసుకుంటూ ప్రతిభ గల పేద విద్యార్థులను గుర్తించి ఫౌండేషన్ ద్వారా చదివిస్తున్నాం. ఛైర్మన్, సభ్యుల సహకారంతో సాధ్యమైంది. భవిష్యత్తులో రూ.కోటి డిపాజిట్ చేసి.. వచ్చిన వడ్డీ డబ్బుతో సేవలను కొనసాగించాలనే ప్రణాళిక ఉంది.. - డాక్టర్ కేశవరెడ్డి, ఫిజిషియన్, అమెరికా

ప్రతిభ విద్యార్థుల దత్తత

దత్తత: గుంతకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు మండలాలకు చెందిన 23 మంది విద్యార్థులను..

కోర్సులు: ఇంటర్, బీఫార్మసీ, డిగ్రీ, బీటెక్, ఎంబీబీఎస్, నర్సింగ్ కోర్సులను చదవిస్తున్నారు.

ఒక్కో విద్యార్థికి : ఏడాదికి రూ.15 వేలు నుంచి రూ.40 వేల వరకు ఫీజుల బట్టి కళాశాలలకు చెల్లిస్తున్నారు.

ఖర్చు ఇలా: 23 మంది విద్యార్థుల్లో 15 మంది చదువుకుంటున్నారు. ఎనిమిది మంది ఉద్యోగాలు తెచ్చుకున్నారు. స్కూల్స్, కళాశాల్లో చదువుకుంటున్న ప్రతిభ విద్యార్థులకు మార్కులను బట్టి ఏడాదికి రూ.5వేల నుంచి రూ.10వేల వరకు ఉపకార వేతనాలను అందించింది. ఇప్పటి వరకు రూ.60 లక్షల ఖర్చు చేశారు.

పనులు చేయకపోతే.. నిధులు వెనక్కి!

రూ.80 కోట్ల అంచనాలపై నీలినీడలు

పాపంపేటలో సిమెంటు రహదారి పనులు

తపోవనం (అనంత గ్రామీణం): కేంద్ర ప్రభుత్వం ఇటీవల మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని సవరించింది. పేరు మార్పుతో పాటు పనుల నాణ్యత, నిధుల వినియోగంలో పారదర్శకతను తీసుకురావాలన్నదే ప్రధాన లక్ష్యం. కొత్త పథకం అమలు చేసే ముందు పాత పథకం కింద చేపట్టిన పనుల పూర్తి చేయడానికి కేంద్రం షరతు విధించింది. వచ్చే మార్చి 10లోగా పనులు పూర్తి చేసి.. ఎఫ్‌టీఓలను నివేదించి బిల్లుల మంజూరుకు స్లాట్ బుక్ చేసుకోవాలి. అలా చేయకుంటే నిధులు వెనక్కి మళ్లే అవకాశం ఉంది. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈక్రమంలో పనులు పూర్తి చేయకుంటే బిల్లులు రావడం గగనమే. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తేనే పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.

✦ ఉపాధి హామీ పథకం కింద ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.6 కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకు విడుదలయ్యాయి. ఈ నిధులతో సిమెంటు రహదారులు, డ్రైనేజీ, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, సచివాలయ భవనాలు, రైతు వికాస కేంద్రాల భవనాలు నిర్మాణాల్లో ఉన్నాయి.

పాతవి రద్దు చేస్తేనే..: ఉపాధి పథకం కింద గ్రామాల్లో చేపట్టిన పనులు వందల సంఖ్యలో ఆగిపోయాయి. పనులు ఇంకా ప్రగతి ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తున్నారు. ఒక గ్రామంలో పది పనుల్లోపు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి అవకాశం ఉంటుంది. ఉదాహరణకు అనంతపురం గ్రామీణ మండలంలో రూ.1.99 కోట్లకు సంబంధించి మస్టర్ చేయాలి. కక్కలపల్లి కాలనీ, కురగుంట, చిన్నంపల్లి, పూలకుంట గ్రామాల్లో రూ.1.02 కోట్లకు మస్టర్లు సిద్ధం చేశారు. పాత పనులు రద్దు చేయకపోతే రూ.1.99 కోట్లు వెనక్కి పోయే ప్రమాదముంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే సమస్య ఉంది.

✦ రాప్తాడు మండలంలో 2017-25 మధ్య కాలంలో 525 పనులు చేపట్టారు. వాటిల్లో చాలావరకు వివిధ దశల్లో ఆగిపోయాయి. వాటిని జాబితాల నుంచి తొలగించడమా.. లేక పూర్తి చేయాలి. అలా కాకుంటే ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరైన పనులు చేయడం సాధ్యం కాదు. మస్టర్ నమోదు చేయడం కుదరదని అధికారులు చెబుతున్నారు.

అందరి సహకారంతో సాధ్యం

- కె.లక్ష్మీనారాయణ, పంచాయతీరాజ్ డీఈఈ

ఉపాధి హామీ నిధులతో పనులన్నీ వందశాతం పూర్తి చేయాలంటే పాత పనులన్నీ జాబితాలో తొలగించాలి. పనులు పూర్తి కావాలంటే అందరి సహకారంతోనే సాధ్యమవుతుంది.

గారాలపట్టి.. తైక్వాండోపై దృష్టి

తల్లిదండ్రుల కష్టాన్ని కళ్లారా చూసిన విద్యార్థులు వారి శ్రమ వృథా కానీయకుండా చిన్నతనం నుంచే క్రీడల్లో ఉన్నత స్థానాలకు చేరుకొని తల్లిదండ్రుల కల సాకారం దిశగా అడుగేస్తోంది.


భవ్యశ్రీ

పేరు: భవ్యశ్రీ, నివాసం : తాడిపత్రి జయగనర్ కాలనీలో

తల్లిదండ్రులు, వృత్తి : శ్రీహరి రెడ్డి, రజిని దంపతులు. కుమార్తె భవ్యశ్రీ నాలుగో తరగతి చదువుతోంది. తండ్రి టీ స్టాల్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కుమార్తెకు మెరుగైన విద్య అందిస్తూ తైక్వాండోలోనూ ఐదేళ్లుగా శిక్షణ ఇప్పిస్తున్నారు.

ప్రతిభ : గతంలో హైదరాబాద్‌లో జాతీయ స్థాయి క్యాడెట్ తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటి అందరి దృష్టిలో పడింది. ఇప్పటి వరకు రాష్ట్రస్థాయిలో 4 బంగారు పతకాలు, జిల్లా స్థాయిలో 6 పతకాలు సాధించింది. **లక్ష్యం :** భవిష్యత్తులో క్రీడా కోటాలో ప్రభుత్వ కొలువు సాధించడమే లక్ష్యంగా ఉన్నట్లు భవ్యశ్రీ చెబుతోంది.. - న్యూస్‌టుడే, తాడిపత్రి

పేరు చందా.. తీరు దందా!

గుత్తి గ్రామీణం: గుత్తి మండలంలోని తొండపాడులోని రంగనాథస్వామి ఆలయంలో అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. దేవాదాయ శాఖ అధీనంలో ఉన్న అద్దె గదుల సొమ్మును కొందరు వసూలు చేసుకుంటున్నారు. నాలుగు నెలల నుంచి ఆలయంలో టికెట్ పద్ధతి అమల్లోకి తెచ్చారు. భక్తులు, అర్చకులు అభ్యంతరాలు వ్యక్తం చేసినా టికెట్లను విక్రయిస్తున్నారు

● డిసెంబరు 30న ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఘనంగా నిర్వహించారు. ఆలయ అధికారులు, సిబ్బంది టికెట్ పద్ధతి పెట్టారు.

● నిబంధనల ప్రకారం టికెట్ విధానం పెట్టాలంటే ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరి. వైకుంఠ ఏకాదశికి ఒక్కో టికెట్ ధర రూ.100 వసూలు చేశారు. ఒక్కో భక్తుడికి ఓ టికెట్ ఇవ్వాలి. ముగ్గురికి ఒకే టికెట్‌లో రూ.300 రాసి ఇవ్వడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రంగనాథస్వామి పేరుతో రసీదు పేపర్లు సిద్ధం చేశారు. కొన్ని గంటల్లోనే వెయ్యికి పైగా టికెట్లు విక్రయించారు. మొత్తంగా ఇలా రూ.43 వేలు వసూలు చేసినట్లు చెబుతున్నారు.

ఆలయంలో చందా పేరుతో ఏర్పాటు చేసిన బోర్డు

టికెట్‌కు అనుమతి రాలేదు

- శోభ, తొండపాడు, ఆలయ ఈవో

వైకుంఠ ఏకాదశికి టికెట్ పెట్టాలని దేవాదాయశాఖ కమిషనర్ నుంచి అనుమతి రాలేదు. చందా పేరుతో టికెట్లు విక్రయించాం. వచ్చే బ్రహ్మోత్సవాలకు టికెట్ ఇచ్చి వసూలు చేయాలని నిర్ణయించుకున్నాం.

అందుబాటులో యూరియా

➠ ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన
➠ జిల్లా వ్యవసాయాధికారి క్రిష్ణయ్య

పుట్టపర్తి, న్యూస్‌టుడే: రబీ సీజన్‌లో ఎక్కడా సమస్యలు రాకుండా ప్రణాళికలు సిద్ధం చేసి.. ముందుకు వెళ్తున్నామని జిల్లా వ్యవసాయాధికారి క్రిష్ణయ్య తెలిపారు. మంగళవారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ రైతులకు ఎక్కడా ఎరువుల కొరత రానీయమని... వరి, వేరుసెనగ ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం 65,719 ఎకరాలు కాగా ఈసారి పెరగనుంది. అన్ని పంటలకు 15,565 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని అంచనా వేశాం. ఇప్పటి వరకు 11,823 మెట్రిక్ టన్నులు వచ్చింది. ప్రస్తుతం రైతు సేవా, సహకార సంఘాల్లో 2,630 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు.

✦ పంట నమోదు, ఈకేవైసీ చేసుకుంటేనే రైతులకు ప్రభుత్వం అందించే పథకాలు, రాయితీలు. ఈ-పంట నమోదు పక్కాగా చేపడుతున్నాం. ఇప్పటి దాకా 26,707 ఎకరాల్లో నమోదు చేశాం. నిర్ణీత గడువులోపు పూర్తి చేస్తాం.

కందుల కొనుగోళ్లు..

జిల్లా వ్యాప్తంగా 32 వేల హెక్టార్లలో కంది పంట సాగైంది. ప్రభుత్వం గిట్టుబాటు ధరతో రైతుల నుంచి కొనుగోలు చేస్తోంది. ఇప్పటి వరకు జిల్లాలో 11,500 వేల క్వింటాళ్ల కందులు రైతుల నుంచి కొనుగోలు చేశామని ఆయన వివరించారు.

నెలాఖరులోపు పదోన్నతుల ప్రక్రియ పూర్తి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఈనెలాఖరు లోపు అన్ని కేడర్ల వారికి పదోన్నతుల కల్పించాలి. ఇందులో ఏమాత్రం జాప్యం చేయవద్దని ఇన్‌ఛార్జి కలెక్టర్ విష్ణు చరణ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష జరిపారు. నాన్ సెలెక్షన్ పోస్టులను నిబంధనల ప్రకారం భర్తీ చేయాలి. అన్ని శాఖలతోనూ సమన్వయం చేసేందుకు డీఆర్‌ఓను నోడల్ అధికారిగా నియమించామని తెలిపారు. కలెక్టరేట్ నుంచి సంప్రదింపులు చేసేందుకు ప్రతి శాఖ కార్యాలయంలోనూ ఒక నోడల్ అధికారిని నియమించాలన్నారు. కలెక్టరేట్‌లోనూ కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



(c) eenadu

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – తాడికొండ

బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Hospitality Partner: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Man of the Series: Hero
Digital Partner: ఈనాడు.నెట్, ETV BHARAT
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Organised by: ఈనాడు ఉత్తమ క్లబ్

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - I జూనియర్స్ : మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్స్‌లతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులు చేసి ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - I జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సులతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

సీనియర్స్ విన్నర్స్ రాయలసీమ రాకర్స్

గ్రౌండ్-2లో సీనియర్స్ : సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ చరణ్ జిత్ ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-I (జూనియర్స్)
మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)
మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

మధ్యవర్తిత్వంతోనే కేసుల పరిష్కారం

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

అనంతపురం (మూడోరోడ్డు), న్యూస్‌టుడే: మధ్యవర్తిత్వంతోనే సులభంగా కేసులను పరిష్కరించుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ. భీమారావు అన్నారు. న్యాయవాదులకు ఐదు రోజుల పాటు నిర్వహించే శిక్షణా తరగతులను ఆయన మంగళవారం జిల్లా కోర్టులో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 31 వరకు తరగతులు నిర్వహిస్తామన్నారు. న్యాయవాదులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చెన్నై, అలహాబాద్ నుంచి వచ్చిన అధ్యాపకులు అనూప్‌కుమార్ శ్రీవాస్తవ, శశిదేవి తర్ఫీదు ఇస్తారన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ధర్మసింగ్ నాయక్, న్యాయవాదులు పాల్గొన్నారు.

కోర్టు ఉద్యోగాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి దరఖాస్తు గడువును ఈనెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ. భీమారావు ఒక ప్రకటనలో తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్, ప్రింట్ ఆఫీసు, రికార్డు అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాల కోసం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

బ్రహ్మోత్సవాల నిర్వహణకు కమిటీ

లేపాక్షి, న్యూస్‌టుడే: లేపాక్షి దుర్గా, పాపనాశేశ్వర, వీరభద్రస్వామి ఆలయంలో ఫిబ్రవరి 14 నుంచి 18వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణకు తాత్కాలిక కమిటీ ఏర్పాటు చేయాలని ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి ఆధ్వర్యంలో సర్పంచి ఆదినారాయణ, తెదేపా మండల కన్వీనర్ అభిలాష్ తదితరులు తీర్మానించారు. స్థానిక ఆలయంలో మంగళవారం ఉత్సవాల నిర్వహణపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఆలయ కమిటీ ఛైర్మన్, సభ్యుల ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించామని, ప్రస్తుతం వాళ్ల పదవీ కాలం ముగియడంతో కమిటీ రద్దయ్యిందన్నారు. నూతన కమిటీ ఏర్పాటయ్యే వరకు తాత్కాలిక కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మరోమారు సమావేశమై నిధుల సమీకరణ, కార్యక్రమాల నిర్వహణ తదితర వాటిపై సమీక్షిస్తామని వారు వివరించారు. సమావేశంలో అన్నదాన కమిటీ సభ్యులు రామ్‌ప్రసాద్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడతాం'

ధర్నా చేస్తున్న రైతులు, సంఘం నాయకులు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: తుంగోడు గ్రామ పంచాయతీలో 40 ఏళ్లుగా సాగుచేసుకొంటున్న భూములకు సంబంధించిన పేద రైతులకు తగిన న్యాయం జరిగేంత వరకు పోరాడతామని రైతు సంఘం నాయకులు రామకృష్ణారెడ్డి, హనుమంత రెడ్డి, అశ్వర్థరెడ్డి, వెంకటేశులు, శ్రీరామప్ప అన్నారు. అష్టకష్టాలు పడి కొండగుట్టలను చదును చేసుకొని పంటలు సాగుచేసుకొంటూ జీవనం సాగిస్తున్న భూమిలో పరిశ్రమల యాజమాన్యం పొక్లెయిన్‌లతో పనులు చేస్తుండటాన్ని నిరసిస్తూ మంగళవారం పలువురు రైతులు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని ధర్నా నిర్వహించారు. 1982-83 నుంచి భూమి లేని నిరుపేద ఎస్సీ, బీసీ, ఓసీ రైతులు 150 మంది 400 ఎకరాలను సాగుచేస్తున్నట్లు చెప్పారు. అప్పట్లో రెవెన్యూ అధికారులు భూమి సర్వే చేసి, అడంగల్ నమోదు చేసినా, పట్టాలు, పాసుపుస్తకాలు అందించకుండా పేదలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఇదే నేపథ్యంలో పరిశ్రమల ఏర్పాటు కోసం తుంగోడు పంచాయతీలో వెయ్యి ఎకరాలు ప్రభుత్వ భూమి ఖాళీగా ఉందని అధికారులు నివేదించడంతో 40 ఏళ్లుగా వాటిని నమ్ముకొన్న పేదలు తీవ్ర అన్యాయానికి గురయ్యే అవకాశం ఉందని నాయకులు ధ్వజమెత్తారు. ప్రభుత్వం టవర్ ఏర్పాటు చేస్తోందని చెప్పి చదువురాని తనను వీఆర్వో, సిబ్బంది మోసం చేసి సంతకం చేయించారని, ప్రస్తుతం పరిశ్రమల కోసం భూములు తీసుకొనేందుకు ఇలా చేయించారని తనను తిట్టుకొంటున్నారని సర్పంచి గంగమ్మ, మాజీ సర్పంచి నారాయణరెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు ఇన్‌ఛార్జి తహసీల్దార్ మారుతి ప్రసాద్, ఎస్సై రమేశ్‌బాబు చేరుకొని ధర్నా చేస్తున్న రైతులతో చర్చించారు. భూములను పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. రైతులు శివశంకర్‌రెడ్డి, నాగరత్నమ్మ, రత్నమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

బీటెక్ సెమిస్టర్ పరీక్ష ఫలితాల విడుదల

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ పరిధిలో నిర్వహించిన బీటెక్ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. బీటెక్ ద్వితీయ సంవత్సరం ఒకటి, రెండు సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల చేశారు. పరీక్షల విభాగం సంచాలకులు నాగప్రసాద్‌నాయుడు, శివకుమార్, శారద ఫలితాలు విడుదల చేశారు.

ఒకేషనల్ విద్యార్థులకు ప్రయోగపరీక్షలు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు మంగళవారం ప్రయోగ పరీక్షలు ఆరంభమయ్యాయి. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం ప్రయోగ పరీక్షలు జరిగాయి. 10 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 414 మందికి 389 మంది హాజరయ్యారు. 25 మంది గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 371 మందికి 362 మంది హాజరయ్యారు. 9 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల కన్వీనర్, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి వెంకటరమణనాయక్ 2 కేంద్రాలు, డీవీఈవో గురువయ్య 2 కేంద్రాలు తనిఖీ చేశారు.

EENADU e Classifieds
JOBS

గూడ్స్ ఆటో డ్రైవర్ - 1 No. (టౌన్‌లో డెలివరీ చేయుటకు) Tally బిల్లింగ్ person -1 no. సేల్స్ పర్సన్స్ - 2 No's కావలెను. Con: 9703402722

మా ఆఫీస్ నందు వర్క్ చేయుటకు యువతి, యువకులు కావలెను. Q: 10th to డిగ్రీ. శాలరీ 08K to 30K. Contact: 9703131570

అనంతపురంలోని ప్రముఖ Jr. కాలేజిలో Maths/ Physics/ Chemistry/ Botany/ Zoology/ Civics/ Economics/ Commerce/ Sanskrit/ English Sr & JR Faculty, Accountant, Computer Operator Hostel Incharge, Receptionist, Wardens, Attender, MEOs కావలెను. ✆ 9704271270

అనంతపురం, ధర్మవరం టౌన్‌లో ఎడ్యుకేషన్ ఆఫీసులో జాబ్ చేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. Q:Any డిగ్రీ, జీతం: 10K-15K + ఇన్సెంటివ్స్ ✆ 7416471633

ATP **మారుతినగర్** నందు 8వ తరగతి బాబుకు సాయంత్రం 6-8 ట్యూషన్ చెప్పడానికి హోమ్ ట్యూటర్ కావలెను. సెల్: 8142221239.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU THE Ec WAY CLASSIFIEDS
5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే
తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...
వివరాలకు
8008709784
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

పబ్లిక్ నోటీస్

మహారాజశ్రీ గౌరవ సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు ధర్మవరం నందు మా కక్షిదారులు **I. మందల అనూష W/o ఎం.నరేష్,** అనంతపురము, **2. ఎం.నరేష్ S/o ఎం.రామానాయుడు,** అనంతపురము గార్లు, ప్రతివాదులు **I. వినోద్ అగర్వాల్, 2. ద్విషాగోయల్**లు ఢిల్లీ. ప్రతివాదులు 3, 4 మరియు 5లు అయిన **వై.రామచంద్రారెడ్డి,** ధర్మవరం. **టి.శరణ్‌బాబు,** అనంతపురము. **ఎం.త్రిభువన్‌రెడ్డి,** చిత్తూరు ల పేరుమీద C.K.పల్లి సబ్ రిజిష్టర్ ఆఫీస్ నందు రిజిష్టర్ చేయించిన డాక్యుమెంట్ నెంబరు 1529/2025 Dt. 12-8-2025ను రద్దు పరుచుటకు IP No. 29/2025 దావా వేసి ఉన్నారు. అందువలన ప్రజలందరికీ తెలియజేయడం ఏమనగా క్రింది షెడ్యూల్‌లోని భూములను అమ్మడం, కొనడం నేరం.

షెడ్యూల్

శ్రీ సత్యసాయి జిల్లా, C.K.పల్లి సబ్.డి., కనగానపల్లి మండలము, దాదులూరు గ్రామ పంచాయితీ ఏరియాలో

S.No.	Survey No.	Extent	Khatha No.
1	422-3	AC 2.41 Cents	2025
2	422-4	AC 0.26 Cents	2025
3	492-3	AC 3.61 Cents	2025
4	491-1	AC 0.78 Cents	2025
5	491-2	AC 1.66 Cents	2025
6	487-2	AC 2.99 Cents	2025
7	494-1	AC 3.70 Cents	1927

ఎం.నరేష్. సెల్: 7337414998

జూటూరు సుధాకర్‌రెడ్డి, కె.రామచంద్రారెడ్డి
అడ్వకేట్స్, ధర్మవరం.

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
బత్తలపల్లి శాఖ, శ్రీ సత్యసాయి జిల్లా.

స్థిరాస్థి విక్రయం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద స్థిరాస్తుల విక్రయం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సెక్యూర్డ్ క్రెడిటార్) అధీకృత అధికారి ద్వారా భౌతికంగా స్వాధీనం చేసుకొనబడినట్టి, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా పెట్టబడిన/ఛార్జ్ చేయబడిన దిగువ వివరించిన స్థిరాస్తి, దిగువ తెలిపిన రుణగ్రహీత(ల) & హామీదారు(ల) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, **బత్తలపల్లి శాఖ** కు రావాల్సిన బకాయి **Rs.9,58,165.20 (రూపాయలు తొమ్మిది లక్షల యాభై ఎనిమిది వేల నూటా అరవై ఐదు మరియు ఇరవై పైసలు మాత్రమే)** మరియు దానిపై తదనంతర వడ్డీ ఛార్జీలు మరియు వ్యయాలు రాబట్టుకొనుటకు **13.02.2026** తేదీన **"ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా", "అక్కడ ఏమున్నదో అది"** మరియు **"ఏది అక్కడ ఉన్నదో అదే"** ప్రాతిపదికన విక్రయించబడతాయని ఇందుమూలముగా ముఖ్యంగా రుణగ్రహీత(లు), హామీదారు(లు) మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది. **రిజర్వు ధర, బయానా కూడా దిగువ తెలుపబడినవి.**

రుణగ్రహీత పేరు మరియు చిరునామా/ కో-అప్లికెంట్/గ్యారంటార్లు
1) మెసర్స్ శ్రీనివాస ట్రేడర్స్, ప్రొ॥ శ్రీ వి. శ్రీనివాసులు, డోర్.నెం.2-729-1, ధర్మవరము రోడ్డు, బత్తలపల్లి, శ్రీ సత్యసాయి జిల్లా
2) శ్రీ బెస్త వెంకటస్వామి, డోర్.నెం.1-75, ధర్మవరము రోడ్డు, బత్తలపల్లి, శ్రీ సత్యసాయి జిల్లా.

ఆస్థి వివరములు

ఆంధ్రప్రదేశ్, హిందూపురము ఆర్.డి మరియు ధర్మవరము ఎస్.ఆర్.డి, బత్తలపల్లి గ్రామము, సర్వే నెం.253-1 నందు 97.35 చ॥గజములు లేదా 2.00 సెంట్ల స్థలము కల నివాస ఖాళీ స్థలము. ఈ ఆస్తి శ్రీ బి. వెంకటస్వామి కి చెందినది. దీనికి హద్దులు: తూర్పు: సి. వెంకట్రాముడు అమ్మిన ఆస్తి, పడమర: దా॥ ప్రసాద్‌కు చెందిన ఆస్తి, ఉత్తరము: 1వ ఐటము కు చెందిన ఆస్తి, దక్షిణము: రస్తా, కొలతలు : విస్తీర్ణము:97.35 చ॥గ॥లు లేదా 2.00 సెంట్లు.

వేలం తేది మరియు సమయము
13.02.2026, మధ్యాహ్నం 12.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు.
రిజర్వు ధర: రూ.13,60,000/- (అక్షరాల పదమూడు లక్షల అరవై వేలు మాత్రమే).
చెల్లించవలసిన ధరావత్తు : రూ.1,36,000/-
(అక్షరాల రూపాయలు ఒక లక్షా ముప్పై ఆరు వేలు మాత్రమే).
ధరావత్తు చెల్లించడానికి ఆఖరు తేది:12.02.2026

సవివరమైన నియమ నిబంధనలకొరకు ఈ క్రింద తెలిపిన లింకును రెఫర్ చేయవలెను. రిజిస్ట్రేషన్ తదితర వివరములకు సంప్రదించవలసిన వెబ్‌సైట్:https://baanknet.com ధరావత్తు మరియు రీఫండ్ వంటి వివరములకు సంప్రదించవలసిన ఇ-మెయిల్: ubin0902993@unionbankofindia.bank లేదా బ్రాంచి మేనేజర్, శ్రీ వై. హరికృష్ణ, సెల్: 7382354849, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బత్తలపల్లి బ్రాంచి గారిని సంప్రదించగలరు. రిజిస్ట్రేషన్, లాగిన్ మరియు బిడ్డింగ్ నియమములకు చూడవలసిన వెబ్‌సైట్: https://baanknet.com and https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx

తేది: 20.01.2026
ప్రదేశము: బత్తలపల్లి
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

కుణుతూరులో పదో శతాబ్దపు శాసనాల గుర్తింపు

గుర్తించిన స్తంభం

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని కుణుతూరు గ్రామంలో జైన(జయమ్మ దేవాలయం) దేవాలయంలో 10వ శతాబ్దపు రెండు భాగాలుగా ఉన్న స్తంభ శాసనాలను గుర్తించినట్లు చరిత్రకారుడు గోపి(బుక్కపట్నం) వెల్లడించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని జైన దేవాలయంలో 10వ శతాబ్దపు నాటి పశ్చిమ చాళుక్యుల శాసనాలు ఉన్నట్లు తెలిపారు. శాసనాలు వెయ్యేళ్ల నాటివని, నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయన్నారు. గతేడాది అక్టోబరు నెలలో గ్రామంలో పర్యటించి కొన్నింటిని భారత పురాతన శాఖకు పంపించగా నిర్ధారణ చేసినట్లు పేర్కొన్నారు. గ్రామంలోని త్రికూట చంద్రమౌళీశ్వరాలయం, జైన ఆలయం రాయలసీమలోనే అతి పురాతనమైనవని రాష్ట్ర ప్రభుత్వం వీటిని సంరక్షించాలని ఆయన కోరారు. పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని చరిత్రకారులు పూజారి ప్రసాద్‌స్వామి, సదాశివగౌడ్, ప్రవీణ్ చెప్పారు.

అంజన్న ఆలయంలో చోరీ

సోమందేపల్లి: నాగినాయనిచెరువులో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి దుండగులు హుండీ పగులగొట్టి సొమ్ము చోరీ చేశారు. రెండేళ్లుగా హుండీ సొమ్ము లెక్కించక పోవడంతో ప్రస్తుతం ఎంత మేర నగదు చోరీకి గురైందో సరిగా తెలియడం లేదని గ్రామస్థులు, పెద్దలు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రహదారి ప్రమాదంలో ఉద్యోగి మృతి

సోమందేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక నలగొండ్రాయనపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కియా అనుబంధ పరిశ్రమ ఎస్ఎల్ఏపీ ఉద్యోగి శ్రీధర్ రమేశ్(31) మృతి చెందారు. పేటకుంటలో ఉన్న ఎస్ఎల్ఏపీ పరిశ్రమలో విధులకు వెళ్తుండగా ద్విచక్ర వాహనం పైనుంచి ఆయన ప్రమాదవశాత్తు రహదారిపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే రహదారి అంబులెన్స్‌లో సిబ్బంది పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పరిశ్రమ అధికారులు వెంటనే క్షతగాత్రున్ని మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారని ఎస్సై రమేశ్‌బాబు తెలిపారు. మృతుడు శ్రీధర్ రమేశ్ తమిళనాడు రాష్ట్రం కడలూరు జిల్లాలోని అచలాపురం గ్రామానికి చెందిన వారు కాగా, కేరళకు చెందిన మైసీ సామ్రాజ్‌తో 11 నెలల కిందట వివాహం జరిగినట్లు ఆయన వివరించారు. రహదారి ప్రమాదంలో భర్త మృతి చెందడంతో భార్య బోరున విలపించారు.

ఆరేళ్లుగా మిరప.. రాబడికి లేదు కొదవ!

ముదిగుబ్బ, న్యూస్‌టుడే : ఆరేళ్లుగా మిరప సాగులో మెలకువలు పాటిస్తూ అధిక లాభాలను పొందుతున్నారు ముదిగుబ్బ మండలంలోని సిద్దన్నగారిపల్లికి చెందిన రైతు నారాయణస్వామి. తనకున్న 1.25 ఎకరాల్లో ఆగస్టులో మిరప సాగు చేశారు. గార్లదిన్నె మండలంలోని ఓ నర్సరీ నుంచి హాట్‌షాట్‌వన్ రకానికి చెందిన మిరప మొక్కలను ఒక మొక్క రూ.1తో 17 వేల మొక్కలు కొనుగోలు చేశారు. ముందుగా పేడ ఎరువులు చల్లించి ఐదుమడకలతో భూమిని దున్నించారు. రోటావేటర్, టిల్లర్‌తో చదును చేసి బోదులు ఏర్పాటు చేసి డ్రిప్పు పద్ధతిలో సాగు చేశారు.

తెగుళ్ల నివారణ ఇలా...

మిరపలో ఆకు ముడత, తామర పురుగు, తెల్లనల్లి తెగుళ్లు వ్యాపించాయి. ఇమిడాక్లోప్రిడ్, స్పైన్‌టోరామ్, డైకోఫాల్ తదితర మందులు పిచికారీ చేయడంతో తెగుళ్లను నివారించారు. దీంతో కాయ నాణ్యతతో పాటు దిగుబడి బాగా వచ్చింది. మొక్క కొనుగోలు నుంచి సేద్యం, కూలి, ఎరువులు, మందుల కోసం రూ.1.50 లక్షలు పెట్టుబడికే ఖర్చు చేశారు.

60 రోజుల్లో కోతకు...

మొక్క నాటిన 60 రోజులకు అక్టోబర్‌లో దిగుబడి ప్రారంభమైంది. మొదటి కోతలో 52 కిలోలవి 52 మూటలు, రెండో కోతలో 46 మూటలు, ఇలా మొత్తం ఐదు కోతల్లో 18 టన్నులు దిగుబడి వచ్చింది. టన్ను రూ.14 వేల నుంచి అత్యధికంగా రూ.20వేల వరకు స్థానిక వ్యాపారులకు విక్రయించారు. ఇప్పటి వరకు మొత్తం దిగుబడి విక్రయించగా రూ.4.50 లక్షల రాబడి వచ్చింది. పెట్టుబడి ఖర్చులు పోయి రూ.3 లక్షలు లాభం మిగిలింది. ఇంకా 10 కోతల దిగుబడి వస్తుందని, ధరలు ఇలానే కొనసాగితే మరో రెండు లక్షలు వరకు లాభం వస్తుందని రైతు ఆశాభావం వ్యక్తం చేశారు.

దిగుబడి చూపుతున్న రైతు నారాయణస్వామి

అలసంద, పెసర పంటలు సాగు చేశారా?

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: రబీ వ్యవసాయ సీజన్‌లో అనంత జిల్లాలో అలసంద, పెసర సాగు చేసిన రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని రెడ్డిపల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లీశ్వరి తెలిపారు. ప్రధానంగా తెల్లదోమలు, పల్లాకు తెగులు వ్యాపించి పంటను నాశనం చేస్తాయన్నారు. దీంతో దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందన్నారు. తెల్లదోమల నివారణకు రైతులు వేపనూనె 5 మి.లీ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేయడంతో పాటు ట్రైజోఫాస్ 1.5 మి.లీ, ఎసిఫేట్ ఒక గ్రాము లీటరు నీటికి పిచికారీ చేయాలి. పల్లాకు తెగులు నివారణకు రైతులు ప్రొఫినోఫాస్ 1.5 మి.లీ, అసిటామిప్రిడ్ 0.2 గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే తెగులు అదుపులోకి వస్తుందని శాస్త్రవేత్త తెలిపారు.

పల్లాకు తెగులు బారిన పడిన పెసరపంట

రైతేరాజు

చిట్కా

సమస్య-సమాధానం

నారాయణస్వామి శాస్త్రవేత్త

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: రబీ వ్యవసాయ సీజన్‌లో వివిధ రకాల పంటలు సాగు చేసిన రైతులు పంటల సాగులో ఎలాంటి సందేహాలున్నా రేకులకుంట వ్యవసాయ శాస్త్రవేత్త నారాయణ స్వామి చరవాణి నంబరు : **62812 84235**కు ఫోన్‌చేసి తగిన సలహాలు, సూచనలు పొందవచ్చు.

సమస్య : పొద్దుతిరుగుడు పంటకు పొగాకు లద్దె పురుగు తెగులు సోకింది. ఈ తెగులును ఎలా అరికట్టాలి.-వెంకటేష్, పెద్దవడుగూరు

సమాధానం: పొద్దుతిరుగుడు పంటలో పొగాకు లద్దె పురుగులు గుర్తించిన వెంటనే రైతులు నోవాలురాన్ ఒక మి.లీ చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే తెగులు అదుపులోకి వస్తుంది.

సమస్య : అరెకరం విస్తీర్ణంలో గోంగూర సాగు చేస్తున్నాం. ఆకులపై తెల్లటి మచ్చలు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యను ఎలా అధిగమించాలి.-మునిస్వామి, రేకులకుంట

సమాధానం: గోంగూర ఆకులపై తెల్లటి మచ్చలు, చారలు ఉంటే దీన్ని పొడ తెగులుగా గుర్తించాలి. వెంటనే రైతులు మెటలాక్సిన్ 3 గ్రాములు, మాంకోజెబ్ 3 గ్రాముల లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే తెగులు అదుపులోకి వస్తుంది.

లాభాల చామంతి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: చామంతి పూల సాగు ఆ రైతు ఇంట లాభాల సిరులు కురిపిస్తోంది. కళ్యాణదుర్గానికి చెందిన ఆంజనేయులు ఐదుకల్లు రోడ్డులో తనుకున్న ఎకరాలో చామంతి పంట సాగు చేస్తూ అధిక ఆదాయం ఆర్జిస్తున్నాడు. ఎకరాలో పూర్ణిమ, సెంటల్ అనే రకాలకు చెందిన తెలుపు, పసుపు, చాక్లెట్ రంగు చామంతి పూల సాగు చేపట్టారు.

● కర్ణాటకలోని చిత్రదుర్గం జిల్లా నాకినేటి గ్రామంలోని నర్సరీ నుంచి ఒక్కో మొక్క రూ.1.50లతో 8వేల మొక్కలకు రవాణా రూ.13 వేలు, పాలిథిన్ కవర్ల ఒక గట్ట రూ.2,500 వేలతో రూ.7 వేలు, కలుపు, పురుగు మందులకు రూ.15వేలు, రోజుకి ముగ్గురు కూలీలకు రూ.750 తదితర వాటితో కలిసి రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. సాగు చేసిన 45 రోజులకే పంట చేతికి రాగా రెండు నెలల వరకు దిగుబడి రానుంది. రోజు 60 కిలోల

చామంతి పువ్వులు కోతకు వస్తున్నాయి.

విపణిలో ఆశాజనకంగా ధర

చామంతి పువ్వులకు మార్కెట్లో రూ.70-100 ధర పలుకుతోంది. పండగ, ఇతరత్రా శుభకార్యాలు ఉన్నప్పుడు కిలో రూ.200 ధర ఉంటుంది. రోజుకు రూ.3 వేల నుంచి రూ.4వేల వరకు ఆదాయం వస్తోంది. ఇప్పటి వరకు రూ. 1.20 లక్షల వరకు రాబడి సమకూరింది. ఇంకా పది రోజులు పంట కాలం ఉంటుందని రైతు చెబుతున్నారు.

చామంతి పూల తోట

సస్యరక్షణ చర్యలు ఇలా..

పది రోజులకోసారి డ్రిప్, పురుగు మందులు, వేరుకుళ్లు రాకుండా ట్రైకోడర్మన్, సూరోమోనోజ్ మందును పంట నాటిన 20 రోజులకోసారి రెండు సార్లు మాత్రమే డ్రిప్ ద్వారా పంటకు వదలాలి. లద్దె పురుగు సోకకుండా రోగార్, అసిఫెట్ మందు 30-40 మి.లీ. 20 లీటర్ల నీటిలో కలిపి 10 రోజులకోసారి పంటకు పిచికారీ చేయాలి. తద్వారా పంట ఆశించిన స్థాయిలో చేతికొస్తుందని, స్వల్పకాలిక పంట ఎంతో ఊరట నిస్తోందని రైతు చెబుతున్నారు.

(c) eenadu

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

హనుమద్ వాహనంపై శ్రీనివాసుడి విహారం

హిందూపురం పట్టణంలోని పేట వెంకటరమణ స్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతుడైన వెంకటరమణుడు హనుమద్ వాహనంపై 'పుర' వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. –న్యూస్‌టుడే, హిందూపురం సాంస్కృతికం

ఐదు లాంతర్లు.. అప్పటి జ్ఞాపకాలు

మీకు తెలుసా?

వ్యాపార, వాణిజ్య, పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల కేంద్రమైన హిందూపురం పట్టణంలో మహాత్మాగాంధీ జ్ఞాపకార్థ గాంధీచౌక్ (ఐదులాంతర్ల కూడలి) పేరుతో సర్కిల్ ఏర్పాటైంది. స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మాగాంధీ దక్షిణ భారత దేశ పర్యటనలో భాగంగా 1938లో ఉమ్మడి అనంతపురం జిల్లా లోని పెద్దవడుగూరు, హిందూపురంలో పర్యటించారు. ఈ పర్యటనలో స్వాతంత్ర్య పోరాటానికి పట్టణంలో భిక్షాటన చేశారు. దీనికి గుర్తుగా పట్టణం నడిమధ్యలో(ఇక్కడి నుంచే కి.మీ ప్రారంభం) కూడలి, గాంధీ విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ కూడలిలో స్తంభం ఏర్పాటు చేసి అప్పట్లో వెలుతురుకు నాలుగుదిక్కులు, పైభాగంలో లాంతర్లు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి దీనికి ఐదు లాంతర్ల కూడలి అని పేరు వచ్చింది. అలాగే ఎంజీఎం పాఠశాలలో బహిరంగ సభ ఏర్పాటు చేసి గాంధీజీ ప్రసంగించినందుకు ఆయన పేరుపై మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఏర్పాటు చేశారు. ఇదండీ చరిత్ర. – న్యూస్‌టుడే, హిందూపురం

శుద్ధ జలం.. పెద్ద అబద్ధం

అనుమతులు లేని కేంద్రాలు.. నాణ్యత లేని నీళ్లు!

మడకశిరలో ప్రైవేట్ ట్యాంకు వద్ద నీరు పట్టుకుంటున్న మహిళ

గోరంట్ల, హిందూపురం, మడకశిర, న్యూస్‌టుడే: మారుతున్న జీవనశైలికి అనుగుణంగా మారుమూల గ్రామాల్లోనూ ప్రజలు శుద్ధజలానికి అలవాటుపడ్డారు. ప్రభుత్వం సైతం నీటిశుద్ధి ప్లాంట్లను ఏర్పాటుచేసి నాణ్యత గల నీటిని ప్రజలకు అందించే చర్యలు తీసుకుంటోంది. ఇంతవరకు బాగానే ఉన్నా వీటికితోడు ప్రైవేట్ తాగునీటి కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ఏ ప్రాంతంలోనూ ఒక కేంద్రానికి అనుమతుంటే ఒట్టు. పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో పరిపరిస్థితిని ఒకసారి పరిశీలిస్తే..

నియోజకవర్గం	కేంద్రాలు
హిందూపురం	40
పెనుకొండ	36
మడకశిర	17

ఎలా జరుగుతోందంటే

ఇష్టారాజ్యంగా ఏర్పాటుచేసుకోవడం, నాణ్యత ఉందోలేదో తెలియని నీరు నింపుకొన్న వాహనాలు తెల్లవారుజాము నుంచే చెవులు మారుమోగేలా వీధుల్లో తిరుగుతున్నాయి. కేంద్రం వద్ద కనీసం బోర్డు కూడా ఉండదు. బిందె రూ.10, క్యాన్ రూ.15 ప్రకారం విక్రయాలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలను నిలువునా మోసం చేస్తూ రూ.కోట్లలో సాగుతున్న ఈనీటి వ్యాపారం గురించి అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవంటే పరిస్థితి ఎంతదారుణమో అర్థం చేసుకోవచ్చు.

పరిశీలన చేయించి చర్యలు తీసుకుంటాం

ప్రైవేటు నీటిశుద్ధి కేంద్రాల నిర్వాహకులు తప్పనిసరిగా పంచాయతీల్లో అనుమతులు తీసుకోవాలి. లేదంటే పరిశీలించి మూసివేయిస్తాం. నాణ్యత విషయంలో ఇంజినీరింగ్ సహాయకులతో పరిశీలన చేయించి తగు చర్యలు తీసుకుంటాం.

-సమత, జిల్లా పంచాయతీ అధికారి

ప్లాంటుకు నిబంధనలు ఇలా..

- పురపాలిక, పంచాయతీల్లో అనుమతులు తప్పనిసరి
- బీఏఎస్ (బయోకెమికల్ అడ్జార్ప్షన్ సెపరేషన్) స్టాండర్డ్స్ పాటించాలి
- ఆహారకల్తీ నిరోధక, భూగర్భ జలాల శాఖ అనుమతులు తీసుకోవాలి.
- పెద్దఎత్తున నిర్వహించే కేంద్రాల్లో మైక్రోబయోలజిస్టు లేదా కెమిస్ట్ ఉండాలి
- నాణ్యత గల నీటిని సరఫరా చేయడానికి తరచుగా పరీక్షలు చేయించాలి
- కేంద్రంలో ఏర్పాటు చేసే ట్యాంక్ విషయంలోనూ నిబంధనలు పాటించాలి.

ఆత్మరక్షణ.. రక్షిత సాధన

కరాటేలో జాతీయస్థాయికి ఎంపిక

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పదోతరగతి పరీక్షలు దగ్గర పడుతున్నా ఓ వైపు చదువు కోవడానికి సమయం కేటాయిస్తూ జాతీయ కరాటే పోటీలకు సిద్ధమవుతోంది ముద్దిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నతపాఠశాల విద్యార్థిని రక్షిత. 2025 నవంబరులో కాకినాడలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర క్రీడల్లో పాల్గొని కరాటే ఆటలోని అన్ని విభాగాల్లోనూ రాణించి జాతీయ పోటీలకు అర్హత సాధించింది. ఫిబ్రవరి 1నుంచి 4వరకు పుణెలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు శిక్షకుడు నరేశ్ మార్గదర్శకంలో నెలరోజుల నుంచి తర్ఫీదు పొందుతోంది.

6వ తరగతిలోనే నేర్చుకున్న -రక్షిత

ప్రాథమిక విద్య చదువుతున్నపుడే క్రీడలంటే ఇష్టం. కోకో, కబడ్డీ, షటిల్, వాలీబాల్, చదరంగం ఆటల్లో ఆసక్తి పెంచుకున్నా. మహిళల ఆత్మరక్షణకే కాదు, ఆపదలో ఉన్న ఎదుటి వ్యక్తులను కాపాడటానికి కరాటే దోహద పడుతుందని మాస్టర్ చెప్పడంతో 6వ తరగతిలో నేర్చుకున్నాను. చేనేత కార్మికులుగా పనిచేస్తున్న తల్లిదండ్రులు ఆంజనేయులు, కళావతి ప్రోత్సాహం, పాధ్యాయుల సహకారంతో జాతీయ స్థాయికి ఎంపికయ్యాను. అక్కడా విజేతగా నిలవాలనే సాధన చేస్తున్నాను.

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: లక్ష్మీపురంలోని రామాలయం వెనుక కాలువలు శుభ్రం చేయలేదు. - ఎస్ఎస్ మూర్తి
సమాధానం: వెంటనే పారిశుద్ధ్య కార్మికులను పంపి శుభ్రం చేయిస్తా.
-శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, హిందూపురం.
– న్యూస్‌టుడే, హిందూపురం సాంస్కృతికం

సమస్య: వీబూదిపల్లిలో రహదారిపై మురుగు నీరు పారుతోంది. -నరసింహప్ప
సమాధానం: సిబ్బందిని పంపి శుభ్రతా చర్యలు చేపడతాం. -మంజునాథ్, సర్పంచి, కోడిపల్లి
సమస్య: ఉప్పరపల్లిలో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. -గోవిందమ్మ
సమాధానం: వారంలోపు ఏర్పాటు చేయిస్తాం. -రత్నమ్మ, సర్పంచి, నాయనిపల్లి
సమస్య: కిరికెర పంచాయతీలో పందుల బెడద తీవ్రంగా ఉంది. -వెంకటనారాయణ
సమాధానం: రెండు రోజుల్లో చర్యలు చేపడుతాం. - దామోదరమ్మ, ఎంపీడీవో
సమస్య: చౌళూరు పంచాయతీలోని వెంకటాపురంలో వీధి దీపాలు వెలగడంలేదు. -రమేశ్
సమాధానం: వెంటనే కొత్తవి ఏర్పాటు చేయిస్తాం. - నంజప్ప, సర్పంచి
సమస్య: గుడిబండ ఆర్డీటీ కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేయండి. -మంజునాథ్
–న్యూస్‌టుడే, లేపాక్షి, గుడిబండ

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

హిందూపురం గ్రామీణం: మండలంలో 2025 నవంబరు 11 నుంచి 2026 జనవరి 12 వరకు చేపట్టిన ఉపాధిహామీ పథకం పనులపై జరిగిన సామాజిక తనిఖీలో భాగంగా బుధవారం ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో వద్ద ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో దామోదరమ్మ తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

తాగునీటి సమస్య పరిష్కారించాలని కోరుతూ

గుడిబండ, న్యూస్‌టుడే: ఎస్ఎస్ గుండ్లు గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని మహిళలు మంగళవారం ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేశారు. నీటి కోసం వ్యవసాయ బోరుబావులను ఆశ్రయించాల్సి వస్తోందని, వాపోయారు. రెండు బోర్లు తవ్వారని మోటార్లు, పంపుసెట్ అమర్చకపోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోటార్లు అమర్చి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఐదు రోజుల పనికి బ్యాంకర్ల డిమాండ్

నిరసన ర్యాలీలో బ్యాంకు ఉద్యోగులు

హిందూపురం, న్యూస్‌టుడే: బ్యాంకు సిబ్బందికి ఐదురోజుల పనిదినాన్ని వెంటనే అమలు చేయాలని బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బ్యాంకు ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎస్‌బీఐ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. కమిటీ కన్వీనర్ ప్రసన్నకుమార్, కమిటీ నాయకులు ఫణిభూషణశర్మ మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. నిరసనలో సంఘం నాయకులు కృష్ణ, రాజశేఖర్, సురేశ్, మారుతీశ్ వివిధ బ్యాంకు సంఘం నాయకులు శశి, రంగనాథ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి 'మహాత్మాగాంధీ సందేశయాత్ర'

మడకశిర గ్రామీణం : సత్యం, సోదరాభావాన్ని చాటిచెప్పడానికి, దేశ సమగ్రత కోసం నేటి కాలంలో గాంధీ మార్గం ఎంతో ముఖ్యమని నమ్ముతూ మహాత్మాగాంధీ సందేశ యాత్రను బుధవారం ఉదయం 9 గంటల నుంచి నీలకంఠాపురంలో ప్రారంభించనున్నట్లు మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నీలకంఠాపురం నుంచి హిందూపురం వరకు 28, 29, 30 తేదీల్లో పాదయాత్ర ఉంటుందని, అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పొదుపు మంత్రం.. ఉపాధి మార్గం

రుణాలతో వ్యాపారాల్లో రాణిస్తున్న మహిళలు

పెనుకొండ, న్యూస్‌టుడే: పొదుపు సంఘాల్లో చేరిన గ్రామీణ మహిళలు ఆర్థిక క్రమశిక్షణతో పొందిన రుణాలను సక్రమంగా చెల్లించారు.. వీరి క్రమశిక్షణకు సీఎఐఎఫ్, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు ఇవ్వడంతో వ్యాపారాలు నిర్వహిస్తూ కుటుంబ ఆర్థిక ప్రగతికి తోడ్పాటునందిస్తున్నారు. పెనుకొండ మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన పెద్దశివమ్మ నాటుకోళ్ల పెంపకం, నాగలూరు గ్రామానికి చెందిన చిన్న రెడ్డమ్మ ఊరగాయల వ్యాపారం చేస్తూ ప్రతినెలా ఐదంకెల ఆదాయం పొందున్నారంటే ఆశ్చర్యమే కదూ.. వారు ఎలా ఆ స్థాయికి చేరారో వారి మాటల్లోనే తెలుసుకుందామా..

ఊరగాయ వ్యాపారంతో సంపాదన

నా భర్త ఓ ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తాడు. నేను సీఐఎఫ్ (కమ్యూనిటీ ఇన్‌వెస్ట్‌మెంట్ ఫండ్)లో రూ.లక్ష రుణం తీసుకొని ఇంట్లోనే ఊరగాయాల వ్యాపారం ప్రారంభించాను. చేసే విధానం, నాణ్యత నచ్చడంతో త్వరగానే మంచి పేరు వచ్చింది. ఊరగాయ చేయాలంటే కాయలు, వాడే వస్తువులు నాణ్యతగా ఉండాలి. మంత్రి సవిత సైతం మా ఊరగాయను మెచ్చుకున్నారు. ప్రతి నెలా ఖర్చులు పోను రూ.30 వేలు సంపాదిస్తున్నాను. -రెడ్డమ్మ

నాటుకోళ్ల పెంపకంతో ఆదాయం

మాది వ్యవసాయ కుటుంబం.. గతేడాది సీఎం అజయ్ కింద రూ.2.5లక్షల రుణం తీసుకుని నాటుకోళ్ల పెంపకం ప్రారంభించాను. ఇందుకోసం 10శాతం సబ్సిడీ వాటాగా రూ.25వేలు చెల్లించాను.. ప్రభుత్వ రాయితీ రూ.50వేలు పోగా రుణం రూ.1.75లక్షలు పొందాను. ప్రస్తుతం మార్కెట్లో నాటుకోళ్లకు గిరాకీ పెరగడంతో కిలో రూ.500 విక్రయిస్తున్నాను. కోళ్ల మేత, నిర్వహణ ఖర్చులు పోనూ నెలకు రూ.20వేల ఆదాయం పొందుతున్నా. -పెద్ద శివమ్మ

చెరువును పూడ్చేశారు!

ఇక్కడ కనిపిస్తున్న చిత్రాన్ని పరిశీలించండి. ఇదివరకు గోరంట్లలో సేకరించిన చెత్త యముకులగుట్టపల్లి సమీపంలో ఉన్న జగనన్న కాలనీ వద్ద వేసేవారు. విమర్శలు రావడంతో అక్కడ తొలగించి ఏకంగా చెరువులో వేసి మట్టి కప్పేస్తూ నీటిని కలుషితం చేస్తున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి సంజయ్ దృష్టికి తీసుకెళ్లగా సమస్యను తక్షణ పరిష్కారం కోసం రెవెన్యూ అధికారులతో స్థలం సేకరణ జరుగుతోందన్నారు. -న్యూస్‌టుడే, గోరంట్ల

కుళాయి చుట్టూ అపరిశుభ్రం



హిందూపురం పట్టణం బాలాజీనగర్ నీటి సంపు సమీపంలోని ఓ వీధిలో కుళాయి చుట్టూ ఎలా ఉందో చూడండి.. మురుగునీటి కాలువ సమీపంలో ఉండటంతో ఆ కాలనీ వాసులు నీటిని పట్టుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తానన్నారు. – న్యూస్‌టుడే, హిందూపురం

కాలమేదైనా మురుగు ఆగేనా

ఎస్.రాయాపురం ప్రధాన రోడ్డుపై మురుగు నీరు నిత్యం ఇలా పారుతూనే ఉంటుంది. ఇళ్లలోని నీటిని ఇలా రోడ్డుపైకి వదులుతుండడంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. కాలువలు నిర్మించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై సర్పంచి రాధమ్మ మాట్లాడుతూ మురుగు నీరు ప్రవహించకుండా చర్యలు తీసుకుంటామన్నారు. -న్యూస్‌టుడే, గుడిబండ

చెత్తే లేదు.. సంపద ఎక్కడ?

చెత్త సంపద తయారీ కేంద్రాలు పలు గ్రామాల్లో నిరుపయోగంగా మారాయి. దీంతో వాటి నిర్మాణ కోసం వెచ్చించిన లక్షలాది రూపాయల నిధులు వృథా అయ్యాయి. పైడేటి గ్రామంలో ఇదిగో ఇలా నిరుపయోగంగా ఉంది. ఈ విషయమై ఎంపీడీవో పూల రెడ్డప్పను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిరుపయోగంగా ఉన్న వాటిని వాడుకలోకి తీసుకొస్తామని ఆయన తెలిపారు. - న్యూస్‌టుడే, పరిగి

నివురుగప్పిన నియంత్రిక

ఎగువగొళ్లహట్టి ఇందిరమ్మకాలనీలో అంగన్‌వాడీ కేంద్రం పక్కనే విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. చుట్టూ కంచె లేకపోవడంతో కేంద్రానికి వచ్చే చిన్నారులు ఆడుకోవడానికి వెళ్లే సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై విద్యుత్తు ఏఈ సిద్దేశ్వరను వివరణ కోరగా నియంత్రిక చుట్టూ కంచె ఏర్పాటు చేయిస్తామన్నారు. -న్యూస్‌టుడే, అమరాపురం

వంగ మానైంది..

సాధారణంగా వంగ మొక్కలు మూడు నాలుగు అడుగుల వరకు పెరగడాన్ని మనం చూస్తుంటాం. సోమందేపల్లి పంచాయతీ పరిధిలోని చాకర్లపల్లిలో బెస్త లక్ష్మీదేవి ఇంటి పెరట్లో పెరిగిన ఒక వంగ మొక్క మానై అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఏకంగా పది అడుగులకు పైగా పెరిగి ఏడాదిన్నరగా తమ ఇంటికి, చుట్టుపక్కల వారికి వంటకు అవసరమైన వంకాయలు అందిస్తోందని చెబుతున్నారు లక్ష్మీదేవి. –న్యూస్‌టుడే, సోమందేపల్లి

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్ల పెద్దచెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తే ఎంతటి వారైపైనైనా చర్యలు తీసుకోవాలని మంత్రి సవిత నీటిపారుదల శాఖాధికారులను ఆదేశించినట్లు తెదేపా మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి పేర్కొన్నారు. మట్టి తరలింపులో అధికార పార్టీ నాయకుల పాత్ర ఉందని సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేయడాన్ని మండల తెదేపా నాయకులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. అక్రమంగా ఇసుక, మట్టి దందాలు చేసే సంస్కృతి వైకాపా నాయకులకే దక్కుతుందని విమర్శించారు. హస్తకళల కార్పొరేషన్ డైరెక్టర్ సోమశేఖర్, నాయకులు శ్రీధర్, గిరిధర్‌గౌడ్, నబీరసూల్, వేణు, జయరాం, నాగేనాయక్, జనసేన నాయకుడు సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్లలోని ఓ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని మంగళవారం ఉదయం నుంచి అదృశ్యమైనట్లు అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ అమ్మాయి పదోతరగతి చదువుతున్నట్లు చెప్పారు.

కుంచె కదిపితే అద్భుతమే

సుభాష్ చంద్రబోస్ చిత్రాన్ని గీస్తున్న నిహార్ (అంతరచిత్రంలో) పురస్కారం అందుకుంటూ..

మడకశిర మండలం ఆమిదాలగొంది ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న నిహార్ కుంచె కదిపితే అపురూప చిత్రాలు జాలువారాల్సిందే.. తండ్రి మంజునాథ్, తల్లి అంజలి ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. తండ్రి ఆర్మీలో జవాన్‌గా పనిచేస్తున్నారు. చిన్నప్పటి నుంచే చదువుతో పాటు ప్రకృతి చిత్రాలు, దేశ నాయకుల బొమ్మలు గీయడంలో ఆసక్తి పెంచుకున్న నిహార్ ఈ నెల 21న బుక్కపట్నంలోని డైట్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రకృతి చిత్రాలు గీసి ద్వితీయ బహుమతి అందుకున్నాడు. తండ్రి మాదిరిగానే సైన్యంలో చేరి దేశసేవ చేయాలన్నదే నా లక్ష్యం అంటున్నాడు. –న్యూస్‌టుడే, మడకశిర

పెంకాక్ సిలాట్ పోటీలకు ఎంపిక

హిందూపురం, న్యూస్‌టుడే: ఆల్ ఇండియా పెంకాక్ సిలాట్ పోటీలకు పట్టణానికి చెందిన ఎన్.శ్రీహర్ష, కె.ఖలీల్ (సీనియర్ విభాగంలో), మణితేజ, షఫీఉద్దీన్ (జూనియర్ విభాగంలో) ఎంపికయ్యారు. వీరు త్వరలో ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని పెంకాక్ సిలాట్ జిల్లా కార్యదర్శి జనార్దన్‌రెడ్డి తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కార్యదర్శులు వీరయ్య, బాలాజీ, మాజీ మున్సిపల్ ఛైర్మన్ జేవీ అనిల్‌కుమార్, రాష్ట్ర ఆర్అండ్‌బీ రహదారులు, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రమోహన్, పార్టీ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్‌లు అభినందించారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేత

పెనుకొండ, న్యూస్‌టుడే: రాంపురం జడ్పీ ఉన్నత పాఠశాల, వెంకటరెడ్డిపల్లిలోని ఎంపీయూపీ పాఠశాలలోని 250మంది విద్యార్థులకు మంగళవారం పుట్టపర్తికి చెందిన సాయి భక్తుడు గంగాధర్‌గౌడ్ అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. పాఠశాలల హెచ్ఎంలు ఉమాదేవి, నారాయణస్వామి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నీరు నింపారు.. దాహం తీర్చారు

చిన్నపల్లి గ్రామ సమీపంలోని తొట్టెకు ఉపాధి హామీ ఏపీవో అప్పస్వామినాయుడు స్పందించి మంగళవారమే క్షేత్ర సహాయకుల చేత నీటిని నింపించి పశువుల దాహార్తిని తీర్చారు. –న్యూస్‌టుడే, పరిగి

కమిషనర్ సేవలకు గుర్తింపు

జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న కమిషనర్ మల్లికార్జున

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: హిందూపురం మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకొని ఏడు నెలల కాలంలోనే పట్టణాభివృద్ధికి చర్యలు చేపట్టిన మల్లికార్జున సేవలను ప్రభుత్వం గుర్తించింది. ఉత్తమ మున్సిపల్ కమిషనర్‌గా ఆయనను ఎంపిక చేసింది. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ చేతులమీదుగా ప్రశంశా పత్రాన్ని సోమవారం ఆయన అందుకున్నారు. మల్లికార్జునను మంగళవారం మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పలువురు నాయకులు అభినందించారు.

'రాష్ట్ర భవిష్యత్తు మార్చిన యువగళం పాదయాత్ర'

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: యువగళం పాదయాత్ర ప్రారంభమై నేటికి మూడేళ్లు అయ్యిందని, రాష్ట్రంలో నాటి జగన్మోహన్‌రెడ్డి అరాచక, దోపిడీ పాలన పతనానికి నాందిపలికి గట్టి పునాదులు వేసిందని తెదేపా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. మంగళవారం మడకశిరలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాటి అరాచక పాలనలో యువగళం పాదయాత్రకు అడుగడుగునా పోలీసులతో అడ్డంకులు, జీఓ-1 పేరుతో పెట్టించిన అక్రమ కేసులు, మైకులు లాగేసుకుంటూ దారిలో ప్రజలతో మాట్లాడకుండా అడ్డుకుంటూ నీచరాజకీయాలు చేయడం, వ్యక్తిత్వ హననం లాంటి అణచివేతలకు గురిచేసినా పట్టుదలతో మంత్రి నారా లోకేశ్ పూర్తిచేసి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. సమావేశంలో డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఐదేళ్లకు రోడ్డు పనులు ప్రారంభం

రహదారికి ఇరువైపులా చెట్లను తొలగిస్తున్న పొక్లెయిన్

అమరాపురం, న్యూస్‌టుడే: అమరాపురం నుంచి విరుపసముద్రం మీదుగా కర్ణాటక సరిహద్దు వరకు ఐదేళ్ల క్రితం రెండు వరసల రోడ్డు నిర్మాణం కోసం తెదేపా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వైకాపా పాలనలో వదిలేయడంతో వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడేవారు. నాలుగేళ్లలో మూడుసార్లు ప్రమాదాలు జరిగి ఇద్దరు మృత్యువాత పడగా ఒకరు తీవ్ర గాయాలయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు రోడ్డు పూర్తి చేయిస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. ఆ మేరకు రెండు రోజులుగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగిస్తున్నారు. త్వరలో రోడ్డు పనులు ప్రారంభమవుతాయని మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సహకార సంఘం అధ్యక్షుడు గుణేష్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నరసింహమూర్తి తెలిపారు.

ఇందిరమ్మ కాలనీల్లో సమస్యల తిష్ఠ

ముళ్లకంపలతో రోడ్డు ఇలా..

గుడిబండ, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ ఇందిరమ్మ కాలనీల్లో సమస్యలు తిష్ఠ వేశాయి. ఇటికేపల్లి ఇందిరమ్మ కాలనీలో 80 బీసీ కుటుంబాలు ఉండగా 250 మంది జనాభా ఉన్నారు. కాలనీలో నాలుగు రోడ్లు ఉండగా నేటికీ ఒక సీసీ రోడ్డు, మురుగు కాలువ కూడా నిర్మించలేదు. వర్షాకాలంలో రోడ్లన్నీ బురదగా మారుతుండడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. కాలనీలో 30 వరకు ఇళ్ల నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. బిల్లులు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. తాగునీటికి సైతం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రివేళ ప్రజలు అంధకారంలో ఉండాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. కేకేపాళ్యం ఇందిరమ్మ కాలనీతోపాటు మోరుబాగల్, ముతుకూరు, గుణేమోరుబాగల్, బాలేపల్లి, వీరజ్జనపల్లి, నాచేపల్లి, బీటీపల్లి, తాళికెర గ్రామాల్లోని కాలనీల్లోనూ కనీస వసతులు కరవయ్యాయి.

మౌలిక వసతులు కల్పిస్తాం

మండలంలోని వివిధ ఇందిరమ్మ కాలనీలో తాగునీరు, వీధి దీపాలు, సీసీదారులు, మురుగు కాలువలు వంటి కనీస సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. ఆయా కాలనీలకు ఇంజినీర్లను పంపి కావాల్సిన వసతులపై ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపుతాం.

-కేశవరెడ్డి, ఎంపీడీవో, గుడిబండ

కెనరా బ్యాంక్ భారత ప్రభుత్వ రంగ సంస్థ
Canara Bank A Government of India Undertaking
నూతన శాఖ ప్రారంభోత్సవం
పెనుకొండ బ్రాంచ్
చిరునామా : # 1-248, మడకసిర రోడ్డు, పెనుకొండ-515110.
ప్రారంభకులు : శ్రీ ఐ. పాండురంగ మిథంతయ గారు (జనరల్ మేనేజర్, తిరుపతి)
శ్రీ ఐ. శ్రీనివాసులు గారు (అనంతపురం రీజియన్ హెడ్)
తేది : 28-01-2026 న బుధవారం
మీకు అందుబాటులో ఉన్న ప్రధాన సేవలు :
సేవింగ్స్ / కరెంట్ అకౌంట్లు / గోల్డ్ లోన్స్ / హోమ్ లోన్స్ / వెహికల్ లోన్స్ / డిజిటల్ బ్యాంకింగ్ సేవలు / ఇన్సూరెన్స్ / ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్ / రైతు రుణాలు / వ్యాపార రుణాలు / లాకర్ వసతి కలదు
మరిన్ని వివరాలకు : శ్రీ సి. ఓబులేసు, మేనేజర్, ఫోన్ : 89777 18991
అతిథులకు, కస్టమర్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
ఇవే మా హృదయపూర్వక ఆహ్వానం
పెనుకొండ బ్రాంచ్ సిబ్బంది
Canarabank.in 1800 1030
canarabank canarabankofficial canarabankinsta

(c) eenadu

అందుబాటులోకి నీటి తొట్టె

నల్లమాడ: మండలంలోని కొండ్రావారిపల్లిలో రోడ్డు పక్కనే దాహార్తి తీర్చడానికి నిర్మించిన నీటితొట్టె నిరుపయోగంగా ఉండటంపై 'తొట్టి నిర్మించారు- నీరు మరిచారు' శీర్షిక ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి ఆదేశాల మేరకు డిప్యూటీ ఎంపీడీవో మునావర్ పంచాయతీ సెక్రటరీ దాదాసాహెబ్ గ్రామానికి వెళ్లి తొట్టెను శుభ్రం చేయించారు.

తొలగిన కంపచెట్లు

ఓబులదేవరచెరువు: మండలంలోని ఆమడగూరు క్రాస్ ఓడీసీ నుంచి వెళ్లే రహదారిపై రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు పెరగడంతో స్థానికుల ఇబ్బందులపై 26న ప్రచురితమైన సమస్య కథనానికి అధికారులు స్పందించారు. ఈఓఆర్డీ అంజనప్ప, పంచాయతీ కార్యదర్శి శంకరప్ప రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంప చెట్లను జేసీబీతో తొలగింపజేశారు. సమస్య పరిష్కరించారు.

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

పారిశుద్ధ్య కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం

తనకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని చిన్నరామన్నగారిపల్లి గ్రామంలో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు రాజప్ప రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పంచాయతీ అభివృద్ధి అధికారులు రూ.52,700 నగదును బాధిత కుటుంబసభ్యులకు మంగళవారం అందజేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి అనంతరం భార్య రాజమ్మకు నగదు అందించారు. రామ్మోహన్, విశ్వనాథరెడ్డి, విజయ్, షబ్బీర్, నాగేశ్వరరెడ్డి, హనుమంత పాల్గొన్నారు.

తలుపుల: నూతనకాలువకు చెందిన బాదల్‌ఖాన్ కుమార్తె అనారోగ్యంతో శస్త్రచికిత్స చేయించుకొని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న వైకాపా నాయకుడు పూల శ్రీనివాసులురెడ్డి ఆమెకు రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. సర్పంచి పెద్దవలి, గుండువారిపల్లి సర్పంచి మల్లినాయుడు అందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222

సమస్య: చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లి గ్రామంలోని కోట వీధిలో ఓ పురాతన వ్యవసాయ బావి ఉంది. అందులోకి చుట్టు పక్కల వారు చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలు వేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. బావిలో నీరు ఉండటంతో దోమలు అధికమయ్యాయి -రాజారెడ్డి, స్థానికుడు

సమాధానం: బావిని పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం -చంద్రిక, పంచాయతీ కార్యదర్శి

సమస్య: చెన్నేకొత్తపల్లి మండలం నుంచి వెంకటాంపల్లికి వెళ్లే ప్రధాన రహదారి నుంచి పులేటిపల్లి గ్రామానికి వెళ్లే అనుసంధాన దారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో వాహనాలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది -వెంకటరాముడు, పులేటిపల్లి

సమాధానం: దారిని పరిశీలించి స్థితిగతులపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం - అబ్దుల్ ఖాదర్, ఇన్‌ఛార్జి పీఆర్ ఏఈ

- న్యూస్‌టుడే, చెన్నేకొత్తపల్లి

సమస్య: కటాగుళ్ల ఎస్సీ కాలనీలో తాగునీటి సరఫరా చేస్తున్నా కొన్ని చోట్ల నీరు రావడం లేదు. - చంద్ర

సమాధానం: సిబ్బందితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం.

సమస్య: పురపాలిక నుంచి పులివెందులకు వెళ్లే దారిలో మళ్లీ చెత్తకుప్పలు వేస్తున్నారు. - రమేష్

సమాధానం: పరిష్కార చర్యలు తీసుకుంటాం.

సమస్య: ఆసంభవపురం - పులివెందుల రోడ్డు కూడలిలో వీధి దీపాలు వెలగడం లేదు. - మనోహర్

సమాధానం: త్వరలోనే వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - కిరణ్‌కుమార్, కమిషనర్ - న్యూస్‌టుడే: కదిరి

తెదేపా నేత మృతికి సంతాపం

అమడగూరు(ఓబులదేవరచెరువు): అమడగూరు మండలంలోని నిలువురాతిపల్లెకు చెందిన తెదేపా సీనియర్ నాయకుడు నారాయణస్వామి(65) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మృతుడి కుటుంబసభ్యులకు ఫోన్ చేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పేరుకుంటున్న బకాయిలు.. వసూలైతే ఒట్టు

మేజర్ పంచాయతీలో ఇదీ పరిస్థితి

కూడలిలోని పంచాయతీ దుకాణాలు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు మేజర్ పంచాయతీకి సంబంధించి షాపింగ్ కాంప్లెక్స్ గదులు, మార్కెట్టు ప్రధాన ఆదాయ వనరులు. పంచాయతీ కేంద్రం కావడంతో నాలుగు రోడ్ల కూడలికి పరిసర మండలాల నుంచి మెరుగైన రవాణా సౌకర్యాలు ఉండటంతో వ్యాపారాలకు కేంద్రంగా ఉంది. గతంలో బుక్కపట్నం, పుట్టపర్తి రహదారిలో పంచాయతీ వారు 49 గదులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. ఏటా బహిరంగ వేలం ద్వారా గదులను అద్దెకు ఇచ్చి, వాటి ద్వారా వచ్చే సొమ్మును పంచాయతీ ఖాతాకు జమ చేస్తారు. ఇలా వసూలయ్యే సొమ్ము రూ.కోటికి పైగా ఉంటుంది. ఈ నిధులతో పంచాయతీ పరిధిలో తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుద్ధ్య చర్యలకు ఎంతో ఉపయోగపడుతుంది. కాని అధికారుల నిర్లక్ష్యంతో బకాయిలు రూ.61.84 లక్షలు పేరుకుపోయాయి.

ఇక్కడే అధికం

షాపింగ్ కాంప్లెక్స్‌లో 49 గదులు ఉన్నాయి. ఇందులో ఏళ్లుగా 7 గదులను కేటాయించారు. ఒక్కో గదిని రూ.4900 నెలసరి అద్దె నిర్ణయించి అప్పగించారు. రిజర్వ్ గదుల్లో వారు వ్యాపారాలు నిర్వహించకపోగా ఇతరులకు అధిక మొత్తానికి అద్దెకు ఇచ్చుకున్నారు. దీంతో ఏడు గదులకు రూ.7.15 లక్షల అద్దె బకాయి పడ్డారు. అలాగే జేబుగిరి గదుల్లో 2024, 2025 సంవత్సరాల్లో 9 గదులకు రూ.18.06 లక్షలు బకాయి పడింది. ఇక 2025-26 సంవత్సరంలో 11 గదుల అద్దె రూ.7.05 లక్షలు మొత్తంగా రూ.32.27 లక్షలు బకాయిలు పేరుకున్నాయి.

సకాలంలో చెల్లించక..

మేజర్ పంచాయతీలో వారపు, దిన సంత జనరల్ వీజు వసూలు హక్కుల కోసం ఏటా బహిరంగ వేలం నిర్వహిస్తారు. మూడు మార్కెట్లు నుంచి పంచాయతీకి ప్రతి సంవత్సరం రూ.25 లక్షలకు పైగా ఆదాయం వస్తోంది. వేలంలో మార్కెట్టును దక్కించుకున్న వారు గడువులోపే వీజులను వసూలు చేసి పంచాయతీ ఖాతాకు జమ చేయాల్సి ఉంది. అధికారుల మెతక వైఖరి కారణంగా గుత్తేదారులు నిధులను సకాలంలో చెల్లించడం లేదు. దీంతో మార్కెట్లు నుంచి రూ.29.57 లక్షలు బకాయి పేరుకుపోయింది.

మళ్లీ నోటీసులు ఇస్తాం

మార్కెట్టు, షాపింగ్ గదుల నుంచి బకాయిల వసూలు కావాల్సి ఉంది. మళ్లీ మరోసారి నోటీసులు జారీచేసి బకాయిలు వసూలు చేయడానికి చర్యలు తీసుకుంటాం. - సాదిక్ వలి, ఇన్‌ఛార్జి ఈవో, మేజర్ పంచాయతీ

'ఐదురోజుల పనిదినాలు అమలు చేయాలి'

కదిరి: బ్యాంకు ఉద్యోగులకు ఐదు రోజుల పని దినాలను అమలు చేయాలని మంగళవారం పట్టణంలో బ్యాంకు ఉద్యోగులు ఆందోళనకు దిగారు. విధులకు హాజరుకాకుండా స్టేట్‌బ్యాంకు ఆవరణలో ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయా బ్యాంకుల ఉద్యోగులు పాల్గొన్నారు.

ధర్మవరం పట్టణం: ఎస్‌బీఐ బ్యాంకుతోపాటు వివిధ బ్యాంకుల ఉద్యోగులు, సిబ్బంది పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఆర్‌ఎం కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. బ్యాంకు యూనియన్ నాయకులు రాజశేఖర్, వేణుగోపాల్ మాట్లాడుతూ 6 రోజుల పనిదినాలను కేటాయించడం ఎంత వరకు సమంజసమని తెలిపారు.

ధర్మవరం పట్టణంలోని ఆర్‌ఎం కార్యాలయం వద్ద ఉద్యోగుల ధర్నా

విద్యార్థులకు క్రికెట్ కిట్ అందజేత

అమడగూరు(ఓబులదేవరచెరువు), న్యూస్‌టుడే: అమడగూరు మండలంలోని గాజులపల్లి వద్ద ఉన్న ఆదర్శ పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి మంగళవారం క్రికెట్ కిట్టును అందజేశారు. గోపాల్‌రెడ్డి అమడగూరు మండలంలోని గోపాల్‌నాయక్ తండాలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ బదిలీపై చిలమత్తూరుకు వెళ్లారు. విద్యార్థులకు క్రికెట్ కిట్టును ఎంఈవోలు జిలాన్‌బాషా, సంపూర్ణ చేతుల మీదుగా అందజేశారు. ప్రిన్సిపల్ బాబావల్లి, పీడీ లక్ష్మీనరసమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నల్లమాడ, న్యూస్‌టుడే: మండలంలోని ఎన్.బడవాండ్లపల్లి గ్రామంలో రామాలయం నిర్మాణానికి మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి రూ.50 వేలు విరాళం గ్రామస్థులకు అందజేశారు. మంగళవారం పుట్టపర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కును గ్రామస్థులకు అందించారు.

తల్లీబిడ్డ మృతి.. ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: సాధారణ ప్రసవం కోసం పట్టణంలోని పద్మావతి ఆసుపత్రిలో చేరిన గర్భిణీ ఆడశిశువుకు జన్మనిచ్చిన గంట వ్యవధిలోనే తల్లీబిడ్డ మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. నంబులపూలకుంట మండలం జౌకల కొత్తపల్లికి చెందిన ఓబుల్‌రెడ్డి భార్య హారిణి(27) ప్రసవం నిమిత్తం పట్టణంలోని పద్మావతి ఆసుపత్రిలో చేరారు. మంగళవారం హారిణికి ఆడబిడ్డ గర్భంలోనే చనిపోయినట్లు గుర్తించిన వైద్యులు ప్రసవం చేశారు. కొద్దిసేపటికే ఆమెకు మూర్ఛ రావడంతో స్పృహ కోల్పోయి అనంతరం తనువు చాలించింది. విషయం తెలుసుకున్న మృతురాలి బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం పోలీసుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది.

నోటీసులు అందజేత

పట్టణంలోని పద్మావతి ఆసుపత్రికి డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం మంగళవారం నోటీసులు ఇచ్చారు. ఆసుపత్రి వైద్యులు మారుతిప్రసాద్ నిర్లక్ష్యం కారణంగా తల్లీబిడ్డ మృతిచెందిన విషయం తెలుసుకున్న ఆమె ఆసుపత్రిని పరిశీలించి సౌకర్యాలు లేకున్నా ప్రసవం చేస్తున్నట్లు గుర్తించి, నోటీసులు అందజేశారు.

'కార్మికుల హక్కులు కాలరాస్తే సహించేది లేదు'

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: కార్మికుల హక్కులను కాలరాసే విధంగా కేంద్రం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాల పెంపు, పీఎఫ్ అమలు, పలు డిమాండ్ల సాధనకు వచ్చేనెల 12న కార్మిక సంఘాలు దేశవ్యాప్త సమ్మె చేపడుతున్నట్లు వెల్లడించారు. సమ్మెకు సహకరించాలని కోరుతూ మంగళవారం పురపాలిక కార్యాలయంలో కమిషనర్ వెంకట రమణయ్యకు వినతిపత్రం అందజేశారు. అయూబ్‌ఖాన్, రఫీ, బాబు, ముకుంద పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ, కార్మిక సంఘాల నాయకులు

ముదిగుబ్బ: పారిశుద్ధ్య కార్మికుల సమస్యపై ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మె చేపడుతున్నట్లు సీపీఎం, సీఐటీయూ నాయకులు తెలిపారు. మంగళవారం ముదిగుబ్బ పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామికి వినతిపత్రం అందించారు. మండల కార్యదర్శి బాబ్జాన్, వెంకటేష్, పక్కీరప్ప మున్సఫ్ పాల్గొన్నారు.

పుట్టపర్తి పట్టణం: కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. ఆశా కార్యకర్తలు డీఎంహెచ్‌ఓ ఫైరోజ్ బేగం, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, యూనియన్ నాయకులు మున్సిపల్ ఏఈ స్వాతికి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

కదిరి పట్టణం: కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి అంగన్‌వాడీలకు పెన్షన్ సదుపాయం కల్పించాలని సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ సీడీపీవో రాధికకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటం

కదిరి, న్యూస్‌టుడే: విద్యారంగ, ఉపాధ్యాయ ఆర్థిక సమస్యల పరిష్కారానికి చేపట్టే దశలవారీ పోరాటానికి సిద్ధం కావాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజులునాయక్‌లు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి భవన ఆవరణలో మంగళవారం ఉద్యమ కార్యాచరణ కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ డిమాండ్ల సాధనకు 30న తహసీల్దార్లకు వినతులు, ఫిబ్రవరి 25న చలో విజయవాడ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వెంకటేశ్వర్లు, జవహర్, రవీంద్రనాథ్, లక్ష్మీప్రసాద్, జాఫర్‌హుసేన్, రామాంజనేయులు, ఆంజనేయులు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

వంగ.. అన్నదాతకు బెంగ

కదిరి- రాయచోటి ప్రధాన రహదారి పక్కన వంకాయలు పడేశారు. మండల పరిధిలోని గాజులవారిపల్లికి చెందిన శివరాంప్రతాప్ 16 ఎకరాల్లో వంగ సాగుచేశారు. పంట ఆశాజనకంగా ఉన్నా, ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో దిగుబడి వచ్చినా వంగకాయలను ప్రధాన రహదారి పక్కన ఇలా పారబోశారు. ఆరుగాలం కష్టించిన అన్నదాతకు వంగ బెంగ పట్టుకుంది. రహదారి పక్కన గుట్టగా పోయడంతో స్థానికులు కాయలు ఏరుకోవడానికి పోటీపడ్డారు. – న్యూస్‌టుడే, గాండ్లపెంట

నియంత్రిక.. రక్షణ లేక

మండలంలోని గౌకనపల్లి గ్రామంలో ఉన్న విద్యుత్తు నియంత్రిక చేతికి అందే ఎత్తులో ప్రమాదకరంగా మారింది. దీంతో గ్రామస్థులు అటుగా వెళ్లాలంటే జంకుతున్నారు. నియంత్రిక తక్కువ ఎత్తులో ఉన్నా దాని చుట్టూ ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. అనుకోని ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, నంబులపూలకుంట

చెత్త డంపింగ్ యార్డుకు చేరేనా?

పట్టణంలో వివిధ వార్డుల్లో నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించడంలో మున్సిపాలిటీ కార్మికులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. చెత్తను తరలించే క్రమంలో ట్రాక్టర్ ట్రాలీకి వెనుకభాగంలో తలుపులు లేకపోవడంతో సేకరించిన చెత్త గాలికి ఎగురుతూ రోడ్డుపైనే పడుతోంది. దీంతో వాహనదారులు చెత్త మధ్యనే రాకపోకలు సాగిస్తూ అవస్థలు పడుతున్నారు. శానిటేషన్ అధికారి శ్యామ్‌సన్ దృష్టికి తీసుకెళ్లగా తలుపులను బిగిస్తామని తెలిపారు.

- న్యూస్‌టుడే, ధర్మవరం పట్టణం

గుంతలా మొదలై.. మడుగులా విస్తరించి

మండలంలోని రంగనపల్లిలో పాఠశాలకు వెళ్లే వీధిలో పైప్‌లైన్ లీకేజీ వల్ల గుంత ఏర్పడింది. లీకేజీ నీటితో గుంతలో నీరు నిలుస్తోంది. ఫలితంగా దోమలు ఈ నీటిలో ఆవాసం ఏర్పరచుకొని వాటి సంతతి పెరుగుతోంది. చాలా రోజుల నుంచి నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి అనిల్ వివరణ కోరగా రెండు రోజుల్లో నీటి మడుగును తొలగించి లీకేజీని అరికడతామని వివరించారు **- న్యూస్‌టుడే, నంబులపూలకుంట**

సర్వేయర్ల డిమాండ్లు నెరవేర్చాలి

చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: గ్రామసచివాలయ సర్వేయర్ల డిమాండ్లు నెరవేర్చాలని మండలంలోని గ్రామ సచివాలయాల సర్వేయర్లు తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతో పాటు విధుల్లో చేరిన ఇతర విభాగాల ఉద్యోగులతో సమానంగా వేతనం అందించాలన్నారు. రీ సర్వే పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించి, వాటి నిర్వహణకు కావాల్సిన సామగ్రి అందించాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

రామగిరి, న్యూస్‌టుడే : మండలంలోని నసనకోట గ్రామానికి చెందిన జయం సురేంద్ర అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత మంగళవారం ఆ గ్రామానికి వెళ్లి సురేంద్ర కుటుంబాన్ని పరామర్శించి, రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. కుటుంబ సభ్యులు అధైర్యపడొద్దని ఎమ్మెల్యే వారిని ఓదార్చారు. తను, తెలుగుదేశం పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని ఆమె భరోసా కల్పించారు. ఎమ్మెల్యేతో పాటు స్థానిక తెదేపా నాయకులు రామ్మూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

శివపురంలో తీరిన తాగునీటి సమస్య

కనగానపల్లి, న్యూస్‌టుడే: శివపురంలో తాగు నీటి సమస్య తీరిందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాబాఫకృద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం శివపురంలో నీటి కోసం తవ్వించిన బోరుబావిని పరిశీలించారు. గ్రామంలో జనాభా అనుసరించి మూడు బోరుబావుల నుంచి ప్రజలకు తాగు నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. బోరుబావుల్లో నీటి మట్టం తగ్గడంతో సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తగా మరో బావిని తవ్వించామని తెలిపారు. గ్రామంలో నీటి కొరత తీరిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

కనగానపల్లి, న్యూస్‌టుడే: సమాజంలో ప్రతి ఒక్కరూ పోలీసు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై మహమ్మద్ రిజ్వాన్ పేర్కొన్నారు. మంగళవారం కోనాపురం, బాలేపాళ్యం గ్రామాల్లోని ప్రజలకు శక్తి టీం పోలీసు అధికారిణి జ్యోతి వివరించారు. ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసు వ్యవస్థ పని చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరు చరవాణిలో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల అత్యవసర సమయంలో ఉపయోగపడుతుందని సూచించారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామీణాభివృద్ధి సాధ్యం

తలుపుల: కూటమి ప్రభుత్వంతోనే గ్రామీణాభివృద్ధి సాధ్యమని తెదేపా మండల కన్వీనర్ మేడా శంకర పేర్కొన్నారు. స్వచ్ఛభారత్ కింద వేపమానిపేట, పెద్దన్నవారిపల్లి సచివాలయానికి కేటాయించిన 2 ట్రాక్టర్లను ఆయన మంగళవారం పంపిణీ చేశారు.

మహిళలకు చీరల పంపిణీ

ధర్మవరం: బలిజ కల్యాణ మండపంలో మంగళవారం వెంకటరమణాచార్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కాటమయ్య, ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు యోగీ ముక్తేశ్వరి చేతుల మీదుగా అతివలకు చీరలు అందజేశారు. సుధాకర్, అశోక్‌కుమార్, పాల్గొన్నారు.

క్రైం కార్నర్

తాళం వేసిన ఇంట్లో చోరీ

బత్తలపల్లి న్యూస్‌టుడే: మండలంలోని గంటాపురంలో ఓ ఇంటిలో దొంగలు పడి 4 తులాల బంగారం ఎత్తుకెళ్లిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు గ్రామానికి చెందిన పాలెం వసికేరప్ప, లక్ష్మీదేవి దంపతులు గొర్రెలు మేపుకొని జీవనం సాగిస్తున్నారు. సోమవారం రాత్రి దొడ్డిలో గొర్రెలు తోలుకొని అక్కడే నిద్రించారు. మంగళవారం ఉదయం ఇంటికి వెళ్లగా తలుపులు తెరచి ఉండటంతో లోపలికి వెళ్లి చూడగా బెడ్‌రూంలోని మంచం కింద ఉన్న డ్రా పెట్టెను పగలగొట్టి 4 తులాల బంగారు గొలుసును ఎత్తుకెళ్లారని బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వాచ్‌మెన్‌గా పనిచేసిన అపార్ట్‌మెంట్లోనే ..

అంబర్‌పేట: వాచ్‌మెన్‌గా పనిచేసిన అపార్ట్‌మెంట్‌లోనే చోరీకి పాల్పడ్డ నిందితుడి సహా మరో ఇద్దరిని లాలాగూడ పోలీసులు, సికింద్రాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల సహాయంతో అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.4.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం డీసీపీ రక్షితామూర్తి తెలిపిన వివరాల మేరకు సత్యసాయి జిల్లా, అమడగూర్ మండలం, చీకిరేవులపల్లికి చెందిన ప్రధాన నిందితుడు గుప్పగారి మహేశ్ (36) సికింద్రాబాద్ ఈస్ట్ మారెడుపల్లిలోని అరిహంత్ సదన్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేసేవాడు. అదే గ్రామానికి చెందిన పవన్‌కుమార్ (48), సురేంద్ర (37)తో కలిసి 21న అపార్ట్‌మెంట్‌లోని శరత్‌నరేష్ ఇంట్లోకి చొరబడి మహిళపై దాడి చేసి ఆభరణాలతో పరారయ్యారు. నిందితులను మంగళవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద అరెస్ట్ చేశారు. మహేశ్ కార్ఖానా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రెండు కిడ్నాప్ కేసుల్లో నిందితుడు. పవన్ బెంగళూర్‌లో జరిగిన హత్య కేసులో 2019లో అరెస్ట్ చేశారు.

విద్యుత్తు తీగలు తగిలి వరిగడ్డి దగ్ధం

తాడిమర్రి, న్యూస్‌టుడే: మండలంలోని పిన్నదరి గ్రామంలో వరిగడ్డితో వస్తున్న వాహనానికి విద్యుత్తు తీగలు తగిలి గడ్డి అగ్నికి ఆహుతైంది. మంగళవారం గ్రామానికి చెందిన రైతులు మాట్లాడుతూ నంద్యాల నుంచి పశువుల మేత కోసం లారీలో తీసుకువస్తున్న గడ్డి వాహనానికి గ్రామంలోకి రాగానే తీగలు తగిలాయి. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో వాటిని ఆర్పివేసేందుకు గ్రామస్థులు ప్రయత్నం చేసినా అప్పటికే సగం గడ్డి కాలిపోయిందని వారు వాపోయారు. రూ.లక్ష విలువ చేసే గడ్డి కాలిందని బాధితులు వాపోయారు.

జూదరుల అరెస్టు

ధర్మవరం: పట్టణంలోని శివానగర్‌లో మంగళవారం ఒకటో పట్టణ పోలీసులు నలుగురు జూదరులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.6200 నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

స్థల వివాదంపై ఘర్షణ.. ఇద్దరు మహిళలకు గాయాలు

ధర్మవరం, న్యూస్‌టుడే: మండలంలోని సుబ్బరావుపేటలో మంగళవారం రాత్రి ఇరువర్గాల మధ్య నెలకొన్న స్థలవివాదంపై ఘర్షణ జరిగింది. ప్రభావతి, వెన్నెల అనే ఇద్దరు మహిళలపై అదే గ్రామానికి చెందిన ఆదినారాయణ, శివయ్య, వారి కుటుంబ సభ్యులు దాడి చేశారు. గాయపడిన మహిళలను ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బుధవారం స్థలం సర్వే చేసేందుకు రెవెన్యూ అధికారులు వస్తున్న విషయం తెలుసుకొని ఆదినారాయణ అతని కుటుంబ సభ్యులు మంగళవారం రాత్రి తమపై దాడి చేశారని ప్రభావతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామీణ ఎస్సై రాజశేఖర్, పోలీసులు గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు.

ఆటో డ్రైవర్ నిజాయతీ

ధర్మవరం న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ శేఖర్ తన నిజాయతీని చాటుకున్నాడు. సోమవారం పట్టణానికి చెందిన అనసూయమ్మ ఆటోలో ప్రయాణిస్తూ హ్యాండ్ బ్యాగ్ మరిచిపోయింది. ఆటోలో వెనుకసీటులో బ్యాగు ఉండటం గమనించిన డ్రైవర్ శేఖర్ నేరుగా ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌కు వెళ్లి సీఐ నాగేంద్రప్రసాద్‌కు అప్పగించాడు. హ్యాండ్‌బ్యాగ్‌లో రూ.10 వేలు నగదు, రెండు సెల్‌ఫోన్లు ఉన్నాయి. దీనిపై అనసూయమ్మ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా ఆమెకు సీఐ బ్యాగు అందజేశారు. ఆటో డ్రైవర్ శేఖర్‌ను శాలువాతో సీఐ నాగేంద్రప్రసాద్, అనసూయమ్మ సన్మానించారు.

జిల్లా వృత్తి విద్యాశాఖాధికారికి సన్మానం

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: గణతంత్ర వేడుకల సందర్భంగా జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి(డీఐఈఓ) చెన్నకేశవప్రసాద్ ఉత్తమ అధికారిగా ఎంపికయ్యారు. మంగళవారం కొత్తచెరువులో డీఐఈఓను ఏపీ ప్రైవేట్ జూనియర్ కాలేజెస్ మెనెజ్మెంట్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ సభ్యులు రూపొందించిన కాలమానిని, డైరీలను డీఐఈవో ఆవిష్కరించారు. భక్తవత్సలం, భగవంతరెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఈశ్వరయ్య, వేణుగోపాల్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ధర్మవరం న్యూస్‌టుడే: పట్టణంలోని ఎన్డీయే కార్యాలయంలో మంగళవారం సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు పంపిణీ చేశారు. 11 మంది లబ్ధిదారులకు రూ.14.81 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. భాజపా నాయకులు రాజు, లక్ష్మినారాయణ, వెంకటేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

లబ్ధిదారురాలికి చెక్కు అందజేస్తున్న హరీష్‌బాబు

● వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తమకు తెలుసని ప్రజలను మభ్యపెడుతున్న వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హరీష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలుకు చెందిన కొత్తకాపు రాజశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి మంత్రి వద్ద పనిచేస్తున్నానని వివిధ ప్రాంతాలకు చెందిన వారిని బెదిరింపులకు గురిచేసి అక్రమ కార్యకలాపాలకు పాల్పడినట్లు బాధితుల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. అతనికి మంత్రి కార్యాలయానికి ఎలాంటి సంబంధం లేదని ప్రజలు ఎవరూ మోసపోవద్దని ఆయన కోరారు.

అందివచ్చిన అవకాశం.. పొదుపుతో సాకారం

కదిరి, న్యూస్‌టుడే: జీవనోపాధికి చేపట్టే వ్యవసాయం, వ్యాపారం, చేతివృత్తులు లాంటి వ్యాపకమేదైనా పెట్టుబడి తప్పనిసరి. లేదంటే కష్టజీవులుగా కుటుంబ పోషణ సాగించాల్సిందే. మహిళల ఆర్థిక స్వావలంబనకు పొదుపు సంఘాల ద్వారా గతంలో తెదేపా శ్రీకారం చుట్టింది. గ్రామీణ, పట్టణ పేదరికంలోని కుటుంబాలకు రుణ సదుపాయం కల్పించి ఆర్థిక భరోసా ఇస్తోంది. అతివలు తమకు అనువైన వ్యాపారం, చేతివృత్తులు, చిరువ్యాపారాలతో వచ్చే ఆదాయంతో కుటుంబాలను ఉన్నత శిఖరాలకు చేర్చుతున్నారు. అలాంటి అవకాశాలను అందిపుచ్చుకున్న వనితల వివరాలిలా..

ప్రైవేటు వడ్డీల భారం తప్పింది

ఓ పొదుపు మహిళా సంఘంలో చేరా. రూ.10 వేలతో మొదలైన రుణ సదుపాయం, నేడు రూ.2 లక్షలు స్థాయికి పెంచుకున్నా. గతంలో ఇంటి వద్దే తినుబండారాల వ్యాపారం చేశా. రుణ సదుపాయం ఉండటంతో హోల్‌సేల్‌గా దుకాణాలకు తినుబండారాలను సరఫరా చేస్తున్నా. నెలకు సుమారు రూ.3 లక్షలకు పైగా వ్యాపారం జరుగుతోంది. పొదుపుతో ప్రైవేటు వడ్డీల భారం తప్పింది. **- కల్యాణి**

చిరు వ్యాపారంతో ప్రశాంత జీవనం

మహిళా సమాఖ్య సభ్యురాలిగా పొదుపు రుణంతో చిరు వ్యాపారం చేపట్టా. కుటుంబ జీవనం, ముగ్గురు పిల్లల చదువులు సజావుగా సాగుతున్నాయి. సంఘం నుంచి రూ.2 లక్షల రుణం తీసుకొని వ్యాపారం చేసుకుంటున్నా. చిరు వ్యాపారంతో ప్రశాంత జీవనం సాగిస్తున్నా. చిల్లర దుకాణంతో కుటుంబ పోషణ, ఆర్థిక స్వావలంబనకు తోడవుతోంది. **- కళావతి**

(c) eenadu

అవినీతి అధికారులు.. దొరికేశారు..!

అనిశా వలలో ఇద్దరు ఖజానాశాఖ ఉద్యోగులు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, పాత శ్రీకాకుళం, న్యూస్‌టుడే: ఖజానాశాఖలో ఇద్దరు ఉద్యోగులు అవినీతి నిరోధకశాఖ(అనిశా) అడ్డంగా దొరికిపోయారు. శ్రీకాకుళం నగరంలోని ఉప ఖజానా కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్టీవో-2 ఎన్. రవిప్రసాద్, సీనియర్ అకౌంటెంట్ ఎ. శ్రీనివాసరావు మంగళవారం రూ.15 వేలు లంచం తీసుకుంటూ అనిశా అధికారులకు చిక్కారు. ఏసీబీ డీఎస్పీ(ఇన్‌ఛార్జి) రమణమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పట్టుబడిన ఉద్యోగులను విచారిస్తున్న అనిశా డీఎస్పీ రమణమూర్తి

శ్రీకాకుళం మండలం కిల్లిపాలెం వార్డు సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ హేమరాగిణి ఉద్యోగాన్ని 2023 మే 5న క్రమబద్ధీకరించారు. ఆమెకు సంబంధించిన వేతన బకాయిల బిల్లును ఈ నెల 10న ఉప ఖజానాశాఖకు ఆన్‌లైన్‌లో పంపించారు. సీనియర్ అకౌంటెంట్, ఎస్టీవో-2 రవిప్రసాద్ పరిశీలించారు. వారి లాగిన్ ద్వారా అక్కడి నుంచి వివరాలను సీఎఫ్ఎంఎస్‌కు పంపేందుకు రూ.20 వేలు లంచం అడిగారు. ఆమె తన వద్ద అంత డబ్బుల్లేవని చెప్పినా వినలేదు. రూ.15 వేలు ఇస్తే తప్ప పని జరగదని ఎస్టీవో చెప్పగా ఆమె అనిశా అధికారులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు మంగళవారం ఉప ఖజానా కార్యాలయంలో రూ.15 వేలు లంచం ఇచ్చారు. అదే సమయంలో అక్కడే ఉన్న అనిశా అధికారులు ఎస్టీవో-2, సీనియర్ అకౌంటెంట్లను అరెస్టు చేసి రెండో పట్టణ స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి రూ.15 వేలు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం వారిని విశాఖపట్నంలోని అనిశా న్యాయస్థానంలో హాజరుపరచనున్నారు. దాడిలో అనిశా సీఐలు కె. భాస్కరరావు, ఎస్. వి. రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శకు వెళ్లిన డీడీ..

అనిశా అధికారులకు పట్టుబడిన ఎస్టీవో రవిప్రసాద్, సీనియర్ అకౌంట్స్ అధికారి ఎ. శ్రీనివాసరావులను పరామర్శించేందుకు ఖజానాశాఖ డీడీ రవికుమార్ కార్యాలయానికి వెళ్లడం విమర్శలకు దారి తీసింది. ఆయన వెంట ట్రెజరీ ఉద్యోగుల సంఘ నాయకులు హాజరు కావడం చర్చనీయాంశమైంది.

అడవిలా ఉంది.. అక్కడెలా ఉండేది..!

ఈ చిత్రంలో కనిపిస్తుంది లావేరు మండలం బెజ్జిపురం సమీపంలో పేదలకు వైకాపా హయాంలో ఇంటి స్థలాలను మంజూరు చేసిన ప్రాంతం(జగనన్న కాలనీ). ఊరికి దూరంగా ఉండటంతో పాటు సరైన సదుపాయాల్లేక పనులు చేపట్టేందుకు చాలా మంది లబ్ధిదారులు ఆసక్తి చూపట్లేదు. మొత్తం 70 గృహాలు మంజూరుకాగా.. ఆరేళ్లలో 9 ఇళ్లు మాత్రమే నిర్మించారు. ప్రస్తుతం ఇలా పనికిరాని మొక్కలు, పొదలు పెరిగిపోవడంతో ఎవరూ ముందుకొచ్చే పరిస్థితి కనిపించట్లేదు. – న్యూస్‌టుడే, లావేరు

రగిలే పంతం.. అడ్డొస్తే అంతం..!

పవిత్ర క్షేత్రం శ్రీకూర్మంలో కక్షలతో ఆందోళన

● శ్రీకూర్మం గ్రామానికి గార మండల ఉపాధ్యక్షుడు బరాటం రామశేషును 2022లో డిసెంబరు 6న నలుగురు వ్యక్తులు కత్తులతో నరికి చంపారు. వ్యక్తిగత కక్షతోనే హత్య చేసినట్లు నిందితులు పోలీసుల ఎదుట అంగీకరించారు.

● ఈ నెల 19న అదే గ్రామానికి చెందిన పల్లా వినోద్ అనే యువకుడిపై ఆడవరం కూడలి వద్ద హత్యాయత్నం జరిగింది. దుండగులు ఇష్టానుసారం కొట్టి చనిపోయాడని భావించి కాలువలో పడేసి వెళ్లిపోగా.. ప్రస్తుతం ఆసుపత్రిలో చావుబతుకులతో పోరాడుతున్నాడు. ఈ ఘటనతో గ్రామంలో మళ్లీ అలజడి మొదలైంది.

● రామశేషును హత్య చేసిన చోటే 2024లో మళ్లీ డిసెంబరు 6వ తేదీనే ఉప్పాడ రాజేష్‌ను హత్య చేశారు. భూవివాదాల కారణంగా సొంత బంధువులే దారుణానికి ఒడిగట్టారని పోలీసులు తేల్చారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తావిభాగం

మహావిష్ణువు కొలువైన పవిత్ర క్షేత్రం శ్రీకూర్మం... గార మండలంలోని ఈ గ్రామం కక్షలతో రగులుతోంది. ఈ ఊరిలో సుమారు 6 వేల మందికి పైగా నివాసముంటున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు తోడు పితృకర్మల కోసం నిత్యం ఎంతో మంది వచ్చి వెళ్తుంటారు. రేయింబవళ్లు రద్దీగా ఉండే ఈ ఊరిపై ఎంతో మంది అర్చకులు, వ్యాపారులు ఆధారపడి ఉన్నారు. సముద్ర తీరానికి దగ్గర్లో ఉండటంతో పలువురు మత్స్యకారులు సైతం కుటుంబాలతో స్థిర నివాసాలు ఏర్పరుచుకున్నారు. తాజాగా ఓ యువకుడిపై హత్యాయత్నం జరగడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోననే భయం స్థానికులను వెంటాడుతోంది.

ఇటీవల గుర్తుతెలియని వ్యక్తుల దాడిలో గాయపడిన వినోద్

★ రాజకీయ కారణాలతో కొందరు గ్రామంలో ఆధిపత్యం కోసం కొట్లాటలకు దిగుతున్నారు. మరికొందరు ఆస్తి తగాదాల్లో తలదూర్చి దాడులకు తెగబడుతున్నారు.

★ గ్రామంలో శాంతి భద్రతలను అదుపులో ఉంచేందుకు నేర ప్రవృత్తి ఉన్నవారిని గుర్తించి పోలీసులు ఆరుగురిపై సస్పెక్ట్ షీట్లు తెరిచారు. అయినా కొందరిలో మార్పు కనిపించట్లేదు.

★ ఏమైనా జరిగినప్పుడు పోలీసులు పికెటింగ్ నిర్వహించి.. పరిస్థితి చక్కబడగానే తొలగించడంతో నేరాలు పెరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

‘శ్రీకూర్మంలో నిఘాను మరింత కట్టుదిట్టం చేస్తాం. ఇటీవల జరిగిన హత్యాయత్నం ఘటనకు బాధ్యులెవరనేది తెలియాల్సి ఉంది. చట్టాలను అతిక్రమిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవు’ అని డీఎస్పీ సీహెచ్ వివేకానంద స్పష్టం చేశారు.

కదంతొక్కిన బ్యాంకు ఉద్యోగులు

జిల్లావ్యాప్తంగా మంగళవారం బ్యాంకు ఉద్యోగులు ఆందోళనకు దిగారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్(యూఎఫ్‌బీయూ) ఆధ్వర్యంలో సుమారు 2 వేల మంది సమ్మెలో పాల్గొనడంతో కార్యకలాపాలు స్తంభించాయి. ఎక్కడికక్కడ ర్యాలీ, మానవ హారాలు నిర్వహించారు. శనివారం నుంచి వరుస సెలవులు, మంగళవారం నాటి సమ్మె ప్రభావంతో 17 బ్యాంకులకు చెందిన 253 శాఖల్లో సేవలు నిలిచిపోయాయి. ఏటీఎంల్లోనూ నగదు లేక ఖాతాదారులు ఇబ్బంది పడ్డారు. శ్రీకాకుళం నగరంలో సూర్యమహల్ కూడలి వద్ద మానవహారంగా ఏర్పడిన యూఎఫ్‌బీయూ ప్రతినిధులను చిత్రంలో చూడొచ్చు. – న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

29న ఎంఎస్ఎంఈల బలోపేతానికి కార్యశాల

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) కోసం సాంకేతికత, వినూత్న ఆవిష్కరణల్లో మేధోసంపత్తి హక్కులపై అవగాహన కల్పించడానికి ఈ నెల 29న జిల్లా మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో కార్యశాల నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు ప్రీతి నిహారిక మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాంకేతికత వినియోగం, ఆవిష్కరణలు, మార్కెటింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 99634 43595 నంబరును సంప్రదించాలని కోరారు.

జడ్పీ బడ్జెట్ @ రూ.1,743 కోట్లు

ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులు

ఆదాయం అంచనా (రూ.కోట్లలో..)	★ సహాయ గ్రాంట్లు, విరాళాలు:	★ నీటి సరఫరా, పారిశుద్ధ్య పనులు:	★ రహదారులు, వంతెనలు:	★ సీనరేజ్, స్టాంపుడ్యూటీ:	★ గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలు:	★ ఇతర మార్గాల ద్వారా:
	336.31	1241	12.21	7.91	47.77	97.62

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్తుకు సంబంధించి 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.1,743 కోట్లతో ప్రవేశపెట్టిన అంచనా బడ్జెట్‌కు సభ్యులు ఆమోదం తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్తు అధ్యక్షురాలు పిరియా విజయ అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. వివిధ శాఖలు, ఇతర మార్గాల ద్వారా జడ్పీకి రూ.1,743 కోట్ల ఆదాయం రానున్నట్లు అంచనా వేశారు. ఆ రాబడి నుంచి వివిధ అభివృద్ధి పనులు, కార్యాలయ నిర్వాహణకు రూ.1,671 కోట్లు వ్యయం అవుతుందని, రూ.71.64 కోట్ల మిగులు అంచనాతో రూపొందించిన బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా జడ్పీ అధ్యక్షురాలు విజయ మాట్లాడుతూ నిధుల లభ్యత ఆధారంగా బడ్జెట్ అమలుకు చిత్త శుద్ధితో కృషి చేస్తామని తెలిపారు. జిల్లా అభివృద్ధిలో సభ్యులంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి, డీసీసీబీ, డీసీఎంఎస్ అధ్యక్షులు ఎస్.సూర్యనారాయణ, సీహెచ్ అవినాష్, జడ్పీ సీఈవో డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్పీ అధ్యక్షురాలు పిరియా విజయ, చిత్రంలో జడ్పీ సీఈవో సత్యనారాయణ

వ్యయం వివరాలు..(రూ.కోట్లలో..)	
★ గ్రామీణ ఉపాధి కార్యక్రమాలు:	277
★ నీటి సరఫరా, పారిశుద్ధ్యం:	1,239
★ రహదారులు, వంతెనలు:	20.54
★ ఎస్సీ, ఎస్టీ సంక్షేమం:	1.79
★ ప్రజా పనులు:	6.33
★ ఇతర కేటాయింపులు:	126.66

సచివాలయ వ్యవస్థతో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిన జగన్ ప్రభుత్వం

జడ్పీ బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే కూన రవికుమార్

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: ‘గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ పెద్ద పనికిమాలిన వ్యవస్థ.. దాని ద్వారా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించింది’ అని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ విమర్శించారు. జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన జడ్పీ బడ్జెట్ సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలతో దుమారం రేగింది. సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించిన జరిగిన చర్చల్లో రవికుమార్ మాట్లాడుతూ ‘జడ్పీ అధికారుల తీరు సరిగ్గా లేదు. మున్సిపల్ అధికారుల పరిస్థితీ అలాగే ఉంది. కొత్తగా విధుల్లోకి వస్తే వివరాలు తెలుసుకోవాల్సిన బాధ్యత లేదా? పని చేయకున్నా జీతాలు తీసుకోవడం మానేస్తున్నారా? అధికారులు తప్పులు చేసి.. వాటిని కప్పి పుచ్చుకోవడానికి మళ్లీ తప్పులు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్లు రద్దు చేశారు. గృహనిర్మాణాలకు బిల్లులు మంజూరు చేయలేదు’ అని అన్నారు.

మధ్యలోనే సభ రద్దు : ఆయన మాటలకు వైకాపా జడ్పీటీసీ సభ్యులు పలుమార్లు అడ్డుపడుతూ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇంతలో రవికుమార్ సచివాలయ వ్యవస్థపై వ్యాఖ్యలు చేయడంతో వైకాపా జడ్పీటీసీ సభ్యులు ఆయనను చుట్టుముట్టి నిరసన తెలిపారు. వాగ్వాదానికి దిగి.. ఆ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని పట్టుబట్టారు. ఎమ్మెల్యే ససేమిరా అంటూ.. తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని చెప్పడంతో నిరసన కొనసాగించారు. సభ్యులు సభ నిర్వహణకు సహకరించాలని జడ్పీ అధ్యక్షురాలు విజయ ఎన్నిసార్లు అభ్యర్థించినా ఎవరూ పట్టించుకోకపోవడంతో సభను రద్దు చేస్తున్నట్లు ప్రకటించి సమావేశాన్ని ముగించారు.

రవికుమార్‌ను చుట్టుముట్టిన వైకాపా జడ్పీటీసీ సభ్యులు

Dhanik Bharat Educational Institutions
— The Lloyd Group Initiative —
ధనిక్ భారత్ విద్యా సంస్థలు
INTER | IIT-JEE | NEET
HYDERABAD | VIJAYAWADA | GUNTUR | VIZAG
దశాబ్దాల తరబడి అభివృద్ధి చెందుతూ ఉన్న దేశంగానే మిగిలిపోతున్న భారతావనిని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనేదే ధనిక్ భారత్ మిషన్ యొక్క ఉద్దేశం. అందులో భాగమే ధనిక్ భారత్ విద్యాసంస్థల స్థాపన.
– విక్రం నారాయణరావు
చైర్మన్, ధనిక్ భారత్ విద్యాసంస్థలు.

Smt. Balalatha Mallavarapu
Director, Dhanik Bharat Educational Institutions
Former Deputy Director, Ministry of Defence,
Two Times Civils Ranker

9,10వ తరగతి విద్యార్థులకు
బాలలత మేడం గారిని కలిసే గోల్డెన్ ఛాన్స్!
విద్యార్థులకు పదవ తరగతి తరువాత తమ కెరీర్‌ను ఎంపిక చేసుకునే ప్రస్థానంలో సందేహాలను నివృత్తి చెయ్యడానికి మీ ప్రాంతానికి వస్తున్న ధనిక్ భారత్ విద్యాసంస్థల డైరెక్టర్ బాలలత మేడం.
కెరీర్ గైడెన్స్ పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు...
ప్రతి విద్యార్థి తప్పక పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు...

HYDERABAD 9555 82 5559, 7032 30 5559
GUNTUR 9067 78 5559, 9067 74 5559
VIJAYAWADA 9067 64 5559, 9067 62 5559
VIZAG 9032 53 5559, 9032 54 5559

29 జనవరి 2026 (అనగా రేపు)
విజయనగరం
సమయం: 9:30AM - 12:00PM
వేదిక: INSPIIRO SCHOOL, NEAR NCS THEATRE, VIZIANAGARAM.
శ్రీకాకుళం
సమయం: 5:00PM - 07:30PM
వేదిక: HOTEL BLUE EARTH, OPP FOREST OFFICE, SRIKAKULAM.

30 జనవరి 2026 (అనగా ఎల్లుండి)
పలాస
సమయం: 9:30AM - 12:00PM
వేదిక: SURYARAJ INN, K.T ROAD, PALASA-KASIBUGGA
పాతపట్నం
సమయం: 5:00PM - 07:30PM
వేదిక: K.S.M PLAZA (FUNCTION HALL) MAIN ROAD, PATHAPATNAM.

(c) eenadu

శాలిహుండం జాతరకు వేళాయె..

29న వేణుగోపాలస్వామి చక్రస్నానం

గార (శాలిహుండం), న్యూస్‌టుడే: గార మండలం శాలిహుండంలో శ్వేత గిరిపై కొలువైన కాళీయ మర్దన వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం తిరుకల్యాణ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 2 వరకు వివిధ క్రతువులు నిర్వహించనున్నారు. ఏటా మాఘ శుద్ధ ఏకాదశి (భీష్మ ఏకాదశి) నుంచి 5 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రసిద్ధి చెందిన జాతరకు తెలుగు రాష్ట్రాలు, ఒడిశా నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివస్తారు. 28న సాయంత్రం ఉత్సవ మూర్తుల తిరువీధితో ఉత్సవాలు ప్రారంభమై.. ఫిబ్రవరి 2న స్వామి కల్యాణంతో ముగుస్తాయి.

నేటి అర్ధరాత్రి క్షీరాభిషేకం

● ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి స్వామికి క్షీరాభిషేకం నిర్వహించిన అనంతరం దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. 29న ఉదయం కొండపై కొలువైన వేణుగోపాలస్వామి, దిగువన ఉండే లక్ష్మీనృసింహస్వామి ఉత్సవ మూర్తులను వేర్వేరు పల్లకీల్లో పటిష్ఠమైన పోలీసు బందోబస్తు మధ్య ఆలయానికి సుమారు కిలోమీటరున్నర దూరంలోని వంశధార నది వద్దకు తీసుకొచ్చి చక్రస్నానం నిర్వహిస్తారు. ఈ క్రతువులో పాల్గొనడానికి వేల మంది తరలివస్తారు.

క్యూలైన్లు సిద్ధం

జాతర సందర్భంగా భక్తులు దర్శనానికి ఇబ్బంది పడకుండా క్యూలైన్లు, ఇతర ఏర్పాట్లు చేశారు. కొండ పైకి వచ్చిన భక్తులు తిరిగి వెళ్లేటప్పుడు ఘాట్ మార్గంలో వీర వసంతేశ్వరస్వామిని దర్శించుకునేలా చర్యలు తీసుకున్నారు. బుధవారం రాత్రి నుంచి గురువారం రాత్రి కొండ పైకి వాహనాలను అనుమతించబోమని డీఎస్పీ వివేకానంద స్పష్టం చేశారు. 300 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు విధుల్లో ఉంటారని గార ఎస్సై సీహెచ్ గంగరాజు తెలిపారు.

ధర్మకర్త మధురెడ్డితో చర్చిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఏర్పాట్లు పటిష్ఠంగా ఉంటే దర్శనాలు వేగవంతం

గార (శాలిహుండం), న్యూస్‌టుడే: ఉత్సవ ఏర్పాట్లు పటిష్ఠంగా ఉంటే దర్శనాలు వేగవంతమవుతాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. గార మండలం శాలిహుండం కొండపై వేణుగోపాలస్వామి జాతర ఏర్పాట్లను ఎస్పీ మహేశ్వరరెడ్డితో కలిసి పరిశీలించారు. ధర్మకర్త మధురెడ్డి, పాలకమండలి సభ్యులతో మాట్లాడారు. అంబులెన్సులు (3), అగ్నిమాపక యంత్రాలు (2), వైద్య శిబిరాల ఏర్పాటు, అత్యవసర సహాయక చర్యలు, క్యూలైన్ల ఏర్పాట్లపై ఆరా తీశారు. ఉన్నతాధికారుల సమన్వయంతో పర్యవేక్షించాలని తహసీల్దారు చక్రవర్తికి సూచించారు. దేవాదాయ శాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్, సర్పంచి కొంక్యాన ఆదినారాయణ, గుండ భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు. ● వంశధార నదిలో చక్రస్నానం సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లను సిబ్బందితో కలిసి ఎస్పీ పరిశీలించారు.

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – తాడికొండ

బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Hospitality Partner: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Man of the Series: Hero
Digital Partner: ఈనాడు.నెట్
TV Partner: ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

విజయనగరంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - I జూనియర్స్: మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ – రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్సర్లతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులకు ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - I జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

సీనియర్స్ విన్నర్స్ రాయలసీమ రాకర్స్

గ్రౌండ్-2లో సీనియర్స్ : సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ చరణ్ జిత్ ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-I (జూనియర్స్)

మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్

మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)

మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్

మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

కేంద్ర ఆర్థిక శాఖ హిందీ సలహా మండలి సభ్యుడిగా శ్రీధర్

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: హిందీ ప్రచార సభ రాష్ట్ర ప్రచార కార్యదర్శి, జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు కోనే శ్రీధర్ కేంద్ర ఆర్థిక శాఖ హిందీ సలహా మండలి సభ్యుడిగా నియమితులయ్యారు. రాష్ట్రం నుంచి ఇద్దరిని ఎంపిక చేయగా వారిలో శ్రీధర్ ఒకరు. హిందీ మంచ్ సంస్థను స్థాపించి 20 ఏళ్లుగా రాజభాష ప్రచారానికి కృషి చేస్తున్నారు. ఆయన్ను హిందీ ప్రచార సభ హైదరాబాద్ కేంద్ర ప్రధాన కార్యదర్శి గైబువల్లి, జేసీఐ సీనియర్ నాయకుడు నటుకుల మోహన్, జనతాదళ్(యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. తిరుపతినాయుడు తదితరులు అభినందించారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	165	285	305

ప్రత్తిపాడు నుంచి ఇచ్ఛాపురానికి కల్తీనూనె

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం వద్ద జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కల్తీ వంట నూనె తయారీ కేంద్రంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. 840 కిలోల నూనె స్వాధీనం చేసుకున్నారు. ఈ దందా సాగిస్తున్న 9 మంది ముఠాలో కీలక సూత్రధారిని అరెస్టు చేశారు. వివరాలను ప్రత్తిపాడు పోలీసుస్టేషన్‌లో మంగళవారం పెద్దాపురం డీఎస్పీ డి. శ్రీహరిరాజు తెలిపారు. ధర్మవరం వద్ద హైవే సమీపంలో ప్రతాప్‌సింగ్‌కు చెందిన రేకుల షెడ్డులో పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెం గ్రామానికి చెందిన బండారు ఫణిప్రసాద్ మరో 8 మందితో కలిసి నాలుగు నెలలుగా కల్తీ నూనె తయారు చేస్తున్నారు. ప్రత్తిపాడు ఎస్సై లక్ష్మీకాంతం ఆధ్వర్యంలో పోలీసు బృందం దాడి చేసి అతన్ని అరెస్టు చేశారన్నారు. జంతు కొవ్వును క్రూడ్ ఆయిల్‌తో మరిగించి వంట నూనె తయారు చేస్తున్నారన్నారు. కల్తీ వంట నూనెను ఎఫ్‌కే పాలెంలోనే నిందితుడు తయారు చేసి ఇచ్ఛాపురంలోని శ్రీవెంకటేశ్వర ట్రేడర్స్ యజమాని సంతోషి శ్రీనివాస్, రాజమహేంద్రవరంలోని ఎండీ ఇర్ఫాన్‌లతో ఒప్పందం కుదుర్చుకుని సరఫరా చేసేవాడని డీఎస్పీ తెలిపారు. 56 డబ్బాల్లో నిల్వ ఉంచిన 840 కిలోల నూనె, 60 కిలోల క్రూడ్ ఆయిల్, రూ.1.5లక్షల విలువ చేసే గ్యాస్ సిలిండర్లు, ఇతర తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయాల క్రికెట్ పోటీల్లో పరుగుల జోరు



పాతబస్టాండ్, న్యూస్‌టుడే: అంతర్ విశ్వవిద్యాలయాల సౌత్‌జోన్ క్రికెట్ పోటీల్లో శివానీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి దుప్పల కులశేఖర్ పరుగుల జోరుతో మెరిశాడు. మైసూర్‌లోని జేఎస్ఎస్ వైద్య కళాశాల మైదానంలో మంగళవారం పోటీలు ప్రారంభమయ్యాయి. జేఎన్టీయూ జీవీ- విజయనగరం జట్టు సభ్యుడైన కులశేఖర్ ఏఎన్ఎస్‌యూ యూనివర్సిటీ (శివమొగ్గ) జట్టుతో జరిగిన ఆటలో 126 పరుగులు సాధించాడు. 60 బంతుల్లో 30 ఫోర్లు, మూడు సిక్స్‌లు సాధించి జట్టు విజయంలో (189 పరుగులు) కీలక పాత్ర పోషించాడు.

లక్ష్యంపై గురి పెడితేనే భవిష్యత్తు

విద్యార్థులంతా పోటీతత్వంతో లక్ష్యంపై గురిపెడితేనే భవిష్యత్తును చక్కదిద్దుకోగలరని పలాస-కాశీబుగ్గ పుర కమిషనర్ ఇ. శ్రీనివాసులు అన్నారు. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో కాశీబుగ్గ సూర్యతేజ జూనియర్ కళాశాలలో ప్రాంతీయ స్థాయి ప్రతిభా పాటవ పోటీలు మంగళవారం నిర్వహించారు. సూర్యతేజ కళాశాల కరస్పాండెంట్ దానేటి పద్మజీ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీసేందుకు 'ఈనాడు' చక్కని అవకాశం కల్పిస్తుండటం సంతోషదాయకమన్నారు. న్యాయనిర్ణేతలుగా ఇప్పిలి ఏకాహం, బూర్జి కోటేశ్వరరావు, ఎల్. ఈశ్వరరావు, జి. నిర్మల వ్యవహరించగా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పలాస

ఈనాడు ప్రతిభా పాటవ ప్రాంతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజేతలకు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేస్తున్న పుర కమిషనర్ శ్రీనివాసులు, సూర్యతేజ కళాశాల కరస్పాండెంట్ దానేటి పద్మజీ తదితరులు

తొలి మూడు స్థానాల్లో విజేతలు

వ్యాసరచన: ఎం. అక్షిత(10) (జడ్పీ హెచ్‌ఎస్,చిన్నబడాం), ఎ. తనుశ్రీ(10) (మదర్‌థెరెసా విద్యాలయం, పలాస), బి. చైత్ర(9) (స్మార్ట్ స్కూల్, కాశీబుగ్గ)

చిత్రలేఖనం: కె. వర్ధన్(7) (స్మార్ట్ స్కూల్, కాశీబుగ్గ), బి. చైత్ర(9) (స్మార్ట్ స్కూల్, కాశీబుగ్గ), కె. బిందుమాధవి (9)(ప్రభుత్వ ఉన్నతపాఠశాల, పలాస)

ఉపన్యాసం: ఎం. లిఖిత(9) (స్మార్ట్ స్కూల్, కాశీబుగ్గ), పి. తేజేశ్వరి (8) (జడ్పీహెచ్, కాశీబుగ్గ), బి. ధాత్రి (10) (మదర్‌థెరెసా విద్యాలయం, పలాస)

క్విజ్: ఎస్. వర్షిత్(8) (శ్రీకృష్ణసాహితి, చిన్నబడాం), కె. లోహిత్(9) (జడ్పీహెచ్, కాశీబుగ్గ), బి. జ్యోతిష్ (9) (శ్రీకృష్ణసాహితి ఉన్నత పాఠశాల, చిన్నబడాం)

అసోం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పదవీకాలం పొడిగింపు

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: అసోం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కోత రవి పదవీకాలాన్ని ఆరు నెలలు పొడిగిస్తూ అక్కడి ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మే 1 నుంచి అక్టోబరు 31 వరకు ఆయన సేవలందించనున్నారు. 1993 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి కోత రవి సంతబొమ్మాళి మండలం కోటపాడు గ్రామ వాసి. 20 ఏళ్లు అసోంలో విధులు నిర్వహించడంతో పాటు 13 ఏళ్లు హోం వ్యవహారాలు, ప్రజా ఆహార పంపిణీ శాఖల్లో పని చేశారు. వాషింగ్టన్ డీసీలోని భారత రాయబార కార్యాలయంలో ప్రతినిధిగానూ విధులు నిర్వర్తించారు.

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి కల్యాణం

కమ్మసిగడాం మహాలక్ష్మి అమ్మవారి కల్యాణ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాత్రి 10.16 గంటలకు జాతర నిర్వాహక కుటుంబీకులంతా పాల్గొని కల్యాణ క్రతువు నిర్వహించారు. అనంతరం జాతర ప్రారంభమైనట్లు ప్రకటించారు. ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, రణస్థలం

విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: డా. బి.ఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో అవుట్‌సోర్సింగ్ విధానంలో ఏడాది పాటు పనిచేసిన తమను అన్యాయంగా తొలగించారని, తిరిగి విధుల్లోకి తీసుకోవాలని బాధిత ఉద్యోగులంతా వర్సిటీ వద్ద మంగళవారం ఆందోళనకు దిగారు. పూర్వపు వీసీ నిమ్మ వెంకటరావు పాలన సమయంలో 34 మందిని అవుట్‌సోర్సింగ్ విధానంలో నియమించారని, తర్వాత నియామకాల్లో నిబంధనలు పాటించలేదనే కారణంతో తొలగించారన్నారు. దీనిపై ఇప్పటికే న్యాయస్థానాన్ని ఆశ్రయించామన్నారు. తమ సమస్యను పరిష్కరించకుండా కొత్తగా నిబంధనలు పాటించకుండానే 65 మందిని అడ్డగోలుగా నియమించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. నియామకాల్లో ఎలాంటి రిజర్వేషన్లు పాటించారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకూ పోరాటం సాగిస్తామని హెచ్చరించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి దుర్మరణం



వెంకటరమణమూర్తి (పాత చిత్రం)

నరసన్నపేట, విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖలో ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడు దుర్మరణం చెందారు. ఎంవీపీ స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు నరసన్నపేటలో పాత స్టేట్ బ్యాంకు వీధికి చెందిన వ్యాపారి ఊణ్నా వెంకటరమణమూర్తి (67) విశాఖలో ఉంటున్న పెద్ద కుమార్తె ఇంటికి వచ్చారు. మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో మనవరాలిని మద్దిలపాలెం వద్ద స్కూల్ బస్సు ఎక్కించి ఎంవీపీ కాలనీ రైతుబజారుకు స్కూటీపై వెళ్తున్నారు. మద్దిలపాలెం ఆటోమోటివ్ వద్ద వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు స్కూటీని వెనక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో రోడ్డుపై పడిపోయిన వెంకటరమణమూర్తి మీదుగా బస్సు వెనక చక్రం వెళ్లిపోయింది. శిరస్త్రాణం ధరించి ఉన్నప్పటికీ అది పగిలిపోయి తల నుజ్జుయి ఘటనా స్థలంలోనే మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ కేవీఎస్‌వీ ప్రసాద్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని కేజీహెచ్ శవాగారానికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సును స్వాధీనం చేసుకున్నారు. ఆయన కుమారుడు భార్గవ్ నరసన్నపేట మండల రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి జైలు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష విధించినట్లు ప్రభుత్వ న్యాయవాది రాజేష్‌కుమార్ మిశ్ర మంగళవారం తెలిపారు. వజ్రపుకొత్తూరు ఠాణా పరిధిలో సంతపేట వీధికి చెందిన బి. చంద్రశేఖర్ పర్లాఖెముండి పట్టణంలో నివసిస్తూ ఓ బస్సులో పని చేసేవాడు. గతేడాది సెప్టెంబరు 15న రాత్రి గణపతి విగ్రహ నిమజ్జన వేడుకలో పాల్గొన్న ఐదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోక్సో న్యాయస్థానం న్యాయమూర్తి బిబుప్రసాద్ పండా విచారణ చేపట్టి నిందితుడికి జైలు శిక్ష విధించారు.

హరియాణాలో కేసు: పాతపట్నం వాసి అరెస్టు

శివకుమార్

పాతపట్నం, న్యూస్‌టుడే: ఫరీదాబాద్‌లో గతేడాది డిసెంబరు 8న చోటుచేసుకున్న డిజిటల్ అరెస్టు విషయమై ఈ నెల 11న అక్కడే కేసు నమోదైంది. దీనికి సంబంధించి నగదు బదిలీ విషయంలో పాతపట్నంలో మీ-సేవ కేంద్రం నిర్వహిస్తున్న టంకాల శివకుమార్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు గంగాకాంత్ చౌదరి అనే వ్యక్తి ఖాతాలో గతేడాది డిసెంబరు 9న సుమారు రూ.48 లక్షల వరకు నగదును గుర్తు తెలియని వ్యక్తులు మాయం చేశారు. ఈ నెల 11న గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. మోసం చేసిన వ్యక్తి ఖాతా నుంచి పాతపట్నంలో ఉంటున్న వ్యక్తి ఖాతాలోకి నగదు బదిలీ కావడంతో హరియాణా నుంచి వచ్చిన పోలీసులు అరెస్టు చేసి హరియాణాకు తరలించారు.

మైనర్ల తగాదా

శ్రీకాకుళం నేరవార్తా విభాగం: శ్రీకాకుళం నగర పరిధి అఫీషియల్ కాలనీలో సంయుక్త కలెక్టర్ అతిథిగృహం సమీపంలో మంగళవారం సాయంత్రం కొందరు బాలలు తగాదా పడ్డారు. తిట్ల పురాణంతో మొదలైన వివాదం కొట్టుకునే స్థితికి చేరింది. వీరంతా అక్కడికి సమీపంలోని ఓ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. జేసీ అతిథిగృహం సమీపంలో ట్యూషన్‌కు వస్తుంటారు. ఓ బడిలో చదువుతున్న బాలిక పట్ల కార్పొరేట్ పాఠశాలకు చెందిన విద్యార్థుల్లో కొందరు ఏడిపిస్తున్నారని తెలిసి వారికి బుద్ధి చెప్పాలని భావించి వాగ్వాదానికి దిగారు. కర్రలు, కత్తులతో ఒక వర్గాన్ని వెంటాడుతూ మరో వర్గం కాలనీలో పరుగులు తీసింది. స్థానికులు 112కు ఫోన్ చేసి విషయం చెప్పారు. ఒకటో పట్టణ ఎస్సై హరికృష్ణ సిబ్బందితో కలిసి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇరు వర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపారు.

మధ్యవర్తిత్వమే మేలైన పరిష్కార మార్గం

న్యాయవాదులకు శిక్షణ ఇస్తున్న సీనియర్ కోచ్ సురేష్, చిత్రంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తదితరులు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: కక్షిదారులతో మధ్యవర్తిత్వమే మేలైన పరిష్కార మార్గమని.. న్యాయవాదులు సమర్థంగా ఈ ప్రక్రియ నిర్వహించడానికి శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అభిప్రాయపడ్డారు. జిల్లా కేంద్రంలోని న్యాయసేవాసదన్‌లో మంగళవారం ఎంపిక చేసిన న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై 40 గంటల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 31 వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇరువర్గాలను సమన్వయం చేసి సమస్య సమసిపోయేలా చూడటం.. వివాదాల పరిష్కారంలో చట్టపరంగా సున్నిత అంశాలు, మెలకువలను శిక్షకులు, న్యాయవాదులు వీపీ తన్‌కచన్, పీజీ సురేష్ వివరించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆధునికీకరణ ఉత్తిదే..!

కునారిల్లుతున్న వంశధార కాలువ వ్యవస్థ

న్యూస్‌టుడే, నరసన్నపేట

వంశధార ప్రాజెక్టు నిర్మించి నాలుగు దశాబ్దాలు గడిచినా శివారు భూములకు సాగునీరందడం లేదు. ఇప్పటివరకు ప్రధాన కాలువ ఆధునికీకరణకు నోచుకోక ఆయకట్టు పరిధిలో సమస్యలు పెరుగుతున్నాయి. ఏటా నిధులు ఖర్చు చేస్తున్నా పరిస్థితిలో మార్పు రాకపోగా దయనీయంగా మారుతోంది.

నారాయణవలస వద్ద వంశధార ఎడమ ప్రధాన కాలువ

మండలం	గ్రామాలు	ఆయకట్టు (ఎకరాల్లో..)
హిరమండలం	12	2,008
సారవకోట	13	2,782
జలుమూరు	57	16,347
నరసన్నపేట	44	21,463
పోలాకి	49	22,708
కోటబొమ్మాళి	29	8,884
సంతబొమ్మాళి	40	26,383
టెక్కలి	35	14,947
నందిగాం	51	12,492
పలాస	36	8,362
వజ్రపుకొత్తూరు	31	11,796

ఇదీ పరిస్థితి

● వంశధార ప్రాజెక్టు పరిధిలో ఎడమ, కుడి కాలువల దిగువన 2,30,510 ఎకరాల్లో ఆయకట్టుకు సాగునీటి సమస్యలు తప్పడం లేదు. ● ఎడమ ప్రధాన కాలువ ద్వారా 2,480 క్యూసెక్కుల నీరు ప్రవహించాల్సి ఉండగా 1,800 క్యూసెక్కులు మాత్రమే ఇవ్వగలుగుతున్నారు. ● గొట్టా బ్యారేజీ నుంచి 104.82 కి.మీ. మేర ప్రవహించి పలాస మండలం ఈదురాపల్లి వద్ద శివారు భూములకు సాగునీరు ఇవ్వాలన్న లక్ష్యం ఇప్పటికీ నెరవేరలేదు. ● 2012 జులై 12న అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా రూ.100 కోట్లతో ఆధునికీకరిస్తామని హామీ ఇవ్వడంతో ప్రతిపాదనలు రూపొందించారు. ● 2014లో రూ.425 కోట్లతో సవరించారు. 2018 నాటికి నిర్మాణ వ్యయం రూ.525 కోట్లకు చేరింది. 2022లో రూ.725 కోట్లకు, గతేడాది రూ.950 కోట్లతో ప్రతిపాదనలు పంపినా పనులు సాగడం లేదు.

ఎక్కడికక్కడ గండ్లు

ఎడమ కాలువకు ఎక్కడికక్కడ గండ్లు పడ్డాయి. మరోవైపు గొట్టా బ్యారేజీ నుంచి 10 కిలోమీటర్ల మేర పెద్దఎత్తున ఇసుక మేటలు నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో కాలువలోకి నీటి విడుదల పరిమాణం తగ్గిస్తున్నారు.

రూ.9 కోట్లతో ప్రతిపాదనలు పంపాం..

వచ్చే ఖరీఫ్‌లో సాగునీరందించడానికి ఎడమ కాలువకు సంబంధించి అత్యవసర పనులు చేపట్టాలి. ఇందుకు రూ. 9 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదించాం. నిధులు మంజూరు కాగానే ఇసుక మేటలు తొలగిస్తాం. –మురళీమోహనరావు, ఈఈ, నరసన్నపేట డివిజన్

పొడవు (కి.మీ.ల్లో..) వంశధార నది 265 ఎడమ ప్రధాన కాలువ 104.826 కుడి కాలువ 55

నీటి సంఘాలు 54 డీసీలు 8 ప్రాజెక్టు కమిటీ 1

EENADU Classifieds

REAL ESTATE
HOUSE FOR SALE
Independent House for Sale in 4 Cents Visakha B Colony Srikakulam Contact : 9849673855.

రైస్ మిల్ & ప్లాంట్ ఆపరేటర్స్ కావలెను. Contact No: 80962 46099.

ఆఫీస్ అసిస్టెంట్స్ 10 పాస్ అయిన మహిళలు శ్రీకాకుళం సిటీలిమిట్స్‌లో మాత్రమే. 8885555513.

JOBS
శ్రీకాకుళంలోగల స్కానింగ్ & డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ... 9441123788.

MEDICAL
మెడికల్ రిప్రజెంటేటివ్స్ ... 9392394603

గమనిక

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

(c) eenadu

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

నాడు-నేడు ఇదే స్థితి

గోవిందపురం ఉన్నత పాఠశాలలో నాడు-నేడు కింద ఫేజ్-2లో అదనపు భవనాల నిర్మాణానికి రూ.1.60 కోట్లు మంజూరయ్యాయి. పాఠశాలలో కొన్ని గదుల్లో మరమ్మతులు చేసి వదిలేశారు. మూడు అదనపు భవనాల నిర్మాణం ప్రారంభించి పునాదుల స్థాయిలోనే అసంపూర్తిగా వదిలేశారు. ఇక్కడ 260 విద్యార్థులు చదువుతున్నారు. జూనియర్ కళాశాల పాఠశాల గదుల్లోనే కొనసాగుతుంది. కళాశాలకు అదనపు గది అయినా ఒక్కటి లేదు. దీనిపై ఎంఈవో వెంకటరమణను వివరణ కోరగా అసంపూర్తి భవనాల పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

అపరాలు, ప్రకృతి వ్యవసాయంతో ప్రయోజనం



వ్యవసాయ శాఖ ఏడీ భవానీశంకర్

రబీలో రైతులు అపరాలు, వాణిజ్య పంటలు, కూరగాయల సాగుపై దృష్టి నిలపాలి. గతేడాది ఖరీఫ్ చివరలో కురిసిన వర్షాలను సద్వినియోగపరుచుకోవాలని సోంపేట వ్యవసాయ సబ్‌డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు టి.భవానీశంకర్ సూచించారు. వివిధ కారణాలతో ఈ ప్రాంతంలో రబీ సాగు ఆలస్యమైందని, అయినప్పటికీ నీటి లభ్యత ఉన్నందున ఆదాయం తెచ్చే పంటల సాగుకు రైతులు ఆసక్తి చూపాలని సూచించారు. ఆయన ఈనాడు ముఖాముఖిలో మెరుగైన దిగుబడులు, ఆదాయం కోసం రైతులు తీసుకోవాల్సిన చర్యలు, ఇతర అంశాలను గురించి వివరించారు. – న్యూస్‌టుడే, సోంపేట

వరి కంటే ఇతర పంటలే మేలు

రబీలో వరి కంటే ఆదాయం తెచ్చే ఇతర పంటల వైపు రైతులు దృష్టి నిలపాలి. కూరగాయలు, నువ్వులు, మినుము, పొద్దుతిరుగుడు, పెసర తదితర పంటల సాగుతో మంచి ఆదాయం పొందొచ్చు. క్రమ ఎక్కువేస్తున్నప్పటికీ ఉద్యాన సాగు వైపు ఎక్కువ మంది రైతులు దృష్టి నిలపడం మంచి పరిణామం.

అందుబాటులో ఎరువులు..

రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు వెళ్లాలి. భూమిని సారవంతం చేయడంతోపాటు ప్రజలకు ఆరోగ్యవంతమైన పంటలు అందించేందుకు ఈ విధానం ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రభుత్వం కూడా ఈ సాగుకు ప్రోత్సాహం అందిస్తోంది. వినియోగదారుల నుంచి ఆదరణ లభిస్తే ఆహార పంటల పరంగా మంచి మార్పు చోటుచేసుకుంటుంది. వరితోపాటు కూరగాయలు, ఇతర వాణిజ్య పంటల సాగు చేసే రైతులు ఈ విధానం అవలంబించాలి. రబీ సాగుకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయి. సిఫార్సు మేరకు యూరియా పంపిణీ చేస్తున్నాం. కూరగాయల సాగులో యూరియా వినియోగించడం మంచిది కాదు.

'పొలం పిలుస్తోంది' ఓ శాఖది కాదు

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయంతోపాటు ఉద్యాన, పశుసంవర్ధక, కో ఆపరేటివ్, ప్రకృతి వ్యవసాయం తదితర శాఖల సిబ్బంది పాల్గొనాల్సి ఉంది. ఒకటి, రెండు శాఖలు మాత్రమే హాజరవుతున్నాయి. ప్రణాళికతోపాటు అన్ని వివరాలు ఆయా శాఖలకు తెలియజేస్తున్నాం. జిల్లా అధికారులు ఈ విషయంలో చొరవ తీసుకుంటే ఈ కార్యక్రమం మరింత ప్రయోజనకరంగా మారుతుంది.

భవనాలు అప్పగించలేదు..

ల్యాబ్‌ల్లో సిబ్బంది లేరు రైతు సేవా కేంద్రాల భవనాలను కొన్నింటిని అప్పగించలేదు. మిగిలినవి నిర్మాణం పూర్తి కాకపోవడంతో సచివాలయాల ద్వారా సేవలందిస్తున్నాం. ఎరువులు, విత్తనాల సరఫరా ఇతర కార్యక్రమాల కోసం వ్యవసాయ పరపతి సంఘాలు, డీసీఎంఎస్‌లు, సచివాలయాల్లో గోదాములు ఉండటంతో ఇబ్బందులు ఏర్పడటం లేదు. వ్యవసాయ ల్యాబ్‌ల్లో సిబ్బంది నియామకం లేకపోవడంతో మట్టి నమూనాల పరీక్షలు ఆమదాలవలస, ఎరువులు, పురుగు మందులు, విత్తనాల పరీక్షల కోసం విశాఖపట్నం పంపిస్తున్నాం.

తెరపై ఈనాడు

పలాసలో.. ఎస్వీ మ్యాక్స్: మన శంకర వరప్రసాద్‌గారు, హరిశంకర్: అనగనగా ఒక రాజు (మార్నింగ్, ఫస్ట్‌షో), భర్తమహాశయులకు విజ్ఞప్తి (మాట్నీ, సెకెండ్‌షో) ఇచ్ఛాపురంలో.. పూర్ణ: మన శంకర వరప్రసాద్‌గారు, మణికంఠ ఎల్‌మ్యాక్స్: అనగనగా ఒక రాజు (మార్నింగ్, ఫస్ట్‌షో), భర్తమహాశయులకు విజ్ఞప్తి (మాట్నీ, సెకెండ్‌షో), సోంపేటలో..ఎస్ఎస్‌మ్యాక్స్: మన శివశంకర ప్రసాద్‌గారు, శివ: అనగనగా ఒక రాజు – న్యూస్‌టుడే బృందం

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 8008574279 9063144707

? సమస్య: బెల్లుపడకాలనీ రెండో లైనులో కల్వర్టు శిథిలం కావడంతో ఇబ్బంది పడుతున్నాం. - జి.సంతోష్, ఇచ్ఛాపురం

● సమాధానం: సమస్యను పరిశీలించి, పరిష్కార చర్యలు చేపడతాం.

- ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

?: పలాస మండలం సుబ్బుగుడ్డిలో కాలువలు లేక ఇబ్బంది పడుతున్నాం. - స్థానికులు ● పరిశీలించి, కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. - జీవన్, పంచాయతీ కార్యదర్శి, అల్లుఖోల – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

?: ఎన్పీ రోడ్డు నుంచి ఉద్దానం కూర్మనాథపురం మీదుగా కొండవూరు వరకు బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. - చింత జయరాం, యూకేపురం ● ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రహదారి అభివృద్ధికి కృషి చేస్తాం. - నాగభూషణ్, జేఈ, పీఆర్, పలాస

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

పేదల స్థలాల్లో పెద్దలు పాగా..!

– న్యూస్‌టుడే, కాశీబుగ్గ

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలోని పలు ప్రాంతాల్లో పేదలకు గతంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలను పెద్దలు ఆక్రమించి, భవన నిర్మాణాలు చేపట్టి అద్దెకు ఇస్తున్నారు. ఈ వ్యవహారం యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధానంగా సూదికొండ ప్రాంతంలో భారీ భవనాలు నిర్మించి, అద్దెకు ఇస్తామని బోర్డులు సైతం ఏర్పాటు చేస్తున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

సూదికొండ ప్రాంతంలో అద్దెకు సిద్ధమైన భవనం

భవనాలు నిర్మించి అద్దెకిస్తున్న వైనం

కానరాని లబ్ధిదారులు

సూదికొండ ప్రాంతంలోని పురుషోత్తపురం, ఇంగిలిగాం రెవెన్యూ పరిధిల్లో 20 ఏళ్ల కిందట పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. అప్పట్లో ఆయా ప్రాంతాలు పనికిరాని మొక్కలు, రాళ్లతో ఉండటంతో అధిక శాతం మంది లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టడానికి ఆసక్తి చూపలేదు. పదేళ్లుగా కొంతమంది వారి స్థలాల్లో పునాదులు వేశారు. పలువురు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. మిగిలిన స్థలాలు ఖాళీగా ఉండటంతో పలు రాజకీయ పార్టీలకు చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ఆక్రమణలకు శ్రీకారం చుట్టి విక్రయాలకు పాల్పడుతున్నారు. ఇప్పటి వరకు 50 శాతం మేరకు ఆక్రమణలతో క్రయవిక్రయాలు జరిగాయి. కొనుగోలు చేసిన వ్యక్తులు భవనాలు నిర్మాణాలు చేపట్టి తాజాగా వాటిని అద్దెకు ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్నారు.

★ సూదికొండ ప్రాంతంలోని పారిశ్రామికవాడకు వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న కట్టడాల్లో 70 శాతం మేరకు ఆక్రమణలతో నిర్మాణాలు చేపట్టిన భవనాలే ఉన్నాయి. వాణిజ్య సముదాయాలు సైతం నిర్మాణాలు జరిగాయి. ఆక్రమణలు చేపట్టి భవన నిర్మాణాలు జరుగుతున్నా రెవెన్యూ, పురపాలక యంత్రాంగం అటు వైపు దృష్టి కేంద్రీకరించే పరిస్థితి లేదు. దీనిపై తహసీల్దార్ కల్యాణ చక్రవర్తిని వివరణ కోరగా గతంలో కొన్నింటిని అడ్డుకున్నామని, తాజా విషయం ఇంతవరకు తమ దృష్టికి రాలేదన్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మద్యం మత్తులో వీరంగం

కాశీబుగ్గ: పలాస ఇందిరాచౌక్ కూడలిలో రాజాం కాలనీకి చెందిన తిరుపతి మంగళవారం వీరంగం సృష్టించాడు. మద్యం మత్తులో బ్లేడుతో చేయి కోసుకుని రద్దీగా ఉండే ప్రాంతంలో సంచరించాడు. దీనిపై కాశీబుగ్గ సీఐ వై.రామకృష్ణ మాట్లాడుతూ తిరుపతికి అతని భార్యతో గొడవలున్నాయని, అందుకే అలా ప్రవర్తించాడన్నారు. దీనిపై కొంతమంది సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేశారని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా తప్పుడు ప్రచారాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తలతంపర-రామయ్యపట్నం రోడ్డుకు మోక్షం

సోంపేట, న్యూస్‌టుడే: తలతంపర-రామయ్యపట్నం రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. కంచిలి, కవిటి, సోంపేట మండలాలకు సంబంధించి 20 గ్రామాలకు ఇదే ప్రధాన మార్గం. దీన్ని అభివృద్ధి చేయాలని స్థానికుల ఆకాంక్షపై ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ స్పందించి ప్రభుత్వం నుంచి రూ.2 కోట్ల మంజూరు చేయించడంతో మంగళవారం రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. మత్స్యకార నాయకులు గోపాల్, రాజారావు, రామారావు, బాబూరావు, కూర్మారావు పనులు పరిశీలించి, ప్రభుత్వ విప్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

అలంకరించిన సింధుపోలమ్మ, చింతామణి అమ్మవార్లు

సిర్తలిలో సింధుపోలమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఐతెదేపా మండలాధ్యక్షుడు రమేష్ రెడ్డి, కామేష్ రెడ్డి పాల్గొన్నారు. ★ కవిటిలో చింతామణి అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం, కవిటి గ్రామీణం

తహసీల్దారుకు అభినందన

ఇచ్ఛాపురం తహసీల్దారు ఎన్. వెంకటరావుకు తెదేపా నాయకులు ఘనంగా సత్కరించారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా ఉత్తమ తహసీల్దారుగా పురస్కారాన్ని అందుకున్న ఆయనను మంగళవారం సత్కరించారు. నాయకులు నందిక జానీ, నాగరాజు పాత్ర్, రెయ్యి జానీ, మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, లోపింటి పద్మనాభం, బాబ్జీ, కామేశ్, లోహిదాసు, దక్కత రామారావు తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

నిత్య వెలుగులు

ఘాటి ముకుందపురంలో వీధి దీపాలు నిత్యం వెలుగుతున్నాయి. దీంతో దీపాలు మరమ్మతులకు గురై పాడైపోతున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. గ్రామంలో అన్ని వీధుల్లో ఇదే పరిస్థితి నెలకొందని, సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి హరికృష్ణను వివరణ కోరగా సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

రోడ్డుపై దుకాణాలు.. ట్రాఫిక్ సమస్యలు

పూండిబస్టాండ్‌లో మాంసం, చేపల దుకాణాలు రోడ్డుపైనే ఏర్పాటు చేస్తున్నారు. దీంతో విక్రయించే వారు ఎండలోనే తీవ్ర ఇబ్బందులు పడుతూ అమ్మకాలు సాగిస్తున్నారు. మరోవైపు ట్రాఫిక్ సమస్యలు వెంటాడుతున్నాయి. రోజు వారీ ఆశీలు వసూళ్లు చేస్తున్నా కనీస సౌకర్యాలు కల్పించడం లేదని, మార్కెట్ యార్డు నిర్మాణం చేపట్టాలని వ్యాపారులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి శరత్‌చంద్రదొరను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

– న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

అడుగుభాగం కనిపించలేదా?

ఇచ్ఛాపురం పుర పరిధి లాలాపేట, బంగ్లారోడ్డు కూడలిలో పాత ఇనుపస్తంభం అవశేషం ప్రమాదకరంగా మారింది. గతంలో ఉండే స్తంభం అడుగు భాగం తుప్పుపట్టి కూలిపోయే పరిస్థితిలో దానిని తొలగించి, సిమెంటు స్తంభాన్ని అమర్చారు. ఆ సమయంలో అడుగుభాగాన్ని వదిలేశారు. అది ప్రమాదాలకు నిలయంగా మారింది. సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని కమిషనరు నల్లి రమేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

శిథిలావస్థలో విశ్రాంతి భవనం

కవిటి మండలం అగ్రహారంలోని బస్సు షెల్టర్ శిథిలావస్థకు చేరడంతో ప్రయాణికులు అక్కడ విశ్రాంతి తీసుకునేందుకు భయపడుతున్నారు. దీంతో పక్కనే చెట్టు నీడలో, లేకుంటే ఎండలో బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ ఏఈ ధనంజయను వివరణ కోరగా సర్పంచితో మాట్లాడి మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

ప్రమాదాల రహదారి

సోంపేట ప్రధాన రోడ్డు నుంచి రాజుగారిపేటకు వెళ్లే మార్గంలో ఆరోగ్యవరం ఆసుపత్రి పరిధిలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కవిటి రోడ్డు నుంచి రాజుగారిపేట మీదుగా కొత్త సోంపేట వీధులకు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తుండటంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పంచాయతీ అభివృద్ధి అధికారి ఎం. శాంతికుమారి వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, సోంపేట

లక్ష్యంతో చదివి.. ఉన్నతంగా ఎదగాలి

ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సందడి

పదోతరగతి విద్యార్థులు లక్ష్యంతో చదివి, మంచి మార్కులతో ఉన్నతంగా ఎదగాలని వక్తలు ఆకాంక్షించారు. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లోని పలు విద్యాలయాల్లో మంగళవారం వార్షిక, వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కె.సూర్యారావు, ఎస్ఎంసీ అధ్యక్షురాలు ఆశి లతాశ్రీధర్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు నృత్యాలతో అలరించారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలచిన వారికి బహుమతులు అందించారు. వజ్రపుకొత్తూరు మండలం డోకులపాడు, నగరంపల్లి, పల్లిసారథి ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు సూర్యప్రకాశరావు, హేమరావు, కోదండరావు ఆధ్వర్యంలో సామూహిక భోజనాలు చేశారు. సోంపేట బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.మల్లేశ్వరరావు అధ్యక్షతన ఒడియా డీఐ దుర్గాప్రసాద్ చౌదరి, విశ్రాంత ఉపవిద్యాశాఖాధికారి టి.జోగారావు మాట్లాడారు. పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కేరింతలు.. తుళ్లింతలతో సందడి వాతావరణం నెలకొంది. కంచిలి, ఇచ్ఛాపురం కవిటి మండలాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం/గ్రామీణం, వజ్రపుకొత్తూరు, కవిటి గ్రామీణం, సోంపేట, పలాస పట్టణం, కంచిలి

నగరంపల్లి పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

డిమాండ్లు అంగీకరించాలి

సోంపేటలో నిరసన తెలుపుతున్న బ్యాంకు సిబ్బంది

సోంపేట, పలాస, న్యూస్‌టుడే: గతంలో తమతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు వారానికి ఐదురోజుల పని విధానాన్ని వెంటనే అమలు చేసి తమ ఇతర డిమాండ్లు నెరవేర్చాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం సోంపేట, పలాసలో ఉద్యోగులు, సిబ్బంది నిరసన తెలిపారు. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల పరిధిలోని అన్ని బ్యాంకు యూనియన్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు. యూనియన్ ప్రతినిధులు అశోక్, జోగారావు, ధనంజయ్, శ్యామ్‌కుమార్, శరత్‌కుమార్, కోదండరావు, నరసయ్య, దర్శి, రాజేష్ పాల్గొన్నారు. పలాస జీడిపండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు.

తప్పులు లేకుండా అనువాదం చేయండి

పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ఒడియా డీఐ దుర్గా ప్రసాద్ చౌదరి, అపోటా ప్రతినిధులు

సోంపేట, న్యూస్‌టుడే: ఒడియా పాఠ్య పుస్తకాలు తప్పులు లేకుండా అనువాదం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర ఒడియా డీఐ దుర్గాప్రసాద్ చౌదరి కోరారు. మంగళవారం సోంపేట ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాలలో ఒడియా ప్రాథమిక పాఠ్యపుస్తకాల అనువాదం కార్యశాల నిర్వహించారు. పాఠ్యపుస్తకాల ఒడియా భాష నిపుణులుగా అపోటా రాష్ట్ర ప్రధానకార్యదర్శి బృందావన్ దొళాయి, రామహరిపాడి వ్యవహరించారు. సమీక్షకులు ప్రమోద్‌కుమార్, జయరాం, రుక్కు, రవీంద్ర, మురళీకుమార్, కృష్ణమూర్తి, ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చిన్న పొరపాట్లతో కుటుంబాలు రోడ్డు పాలు

మాట్లాడుతున్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ గోవిందరాజు

కంచిలి, న్యూస్‌టుడే: వాహనదారులు చేసిన పొరపాట్లతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఇచ్ఛాపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ గోవిందరాజు, కంచిలి ఎస్సై పారినాయుడు అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం కంచిలి మార్కెట్ యార్డు ఆవరణలో కంచిలి, సోంపేట, కవిటి మండలాలకు చెందిన ఆటో, ట్రాక్టర్, ఇతర వాహన చోదకులతో రోడ్డు భద్రతపై అవగాహన సమావేశం నిర్వహించారు.

రెడ్డిక సామాజిక వర్గీయుల అభ్యున్నతికి తోడ్పాటు అవసరం

మంత్రి సవితకు వినతిపత్రం అందిస్తున్న శంకరరెడ్డి

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: అన్ని విధాలా వెనకబడి ఉన్న రెడ్డిక సామాజికవర్గం అభివృద్ధికి ప్రభుత్వ సహకారం అవసరమని రెడ్డిక కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండ శంకరరెడ్డి కోరారు. విజయవాడ బీసీ భవన్‌లో మంగళవారం బీసీ కార్పొరేషన్ల అధ్యక్షులతో బీసీ సంక్షేమశాఖామంత్రి సవిత ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అందించినట్లు శంకరరెడ్డి తెలిపారు. సమస్యలను ముఖ్యమంత్రికి వివరించి, పరిష్కార చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని శంకర్‌రెడ్డి అన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం అందజేత

శంకరరావు భార్యకు నగదు అందజేస్తున్న నాయకులు

పలాస, వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: ఆల్‌ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ యూనియన్, గిరిజన, ఆదివాసీ చైతన్య వేదికలు, తెదేపా ఎస్టీ విభాగం, పెంటిభద్ర, సవర మధ్య గ్రామస్థులంతా తెదేపా ఎస్టీ విభాగాధ్యక్షుడు సవర శంకరరావుకు ఆర్థిక సాయం అందించారు. విశాఖపట్నంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శంకరరావును మంగళవారం పరామర్శించి అతని భార్యకు రూ.57వేలు అందజేశారు. ★ అక్కుపల్లికి చెందిన మడ్డు వాసు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఇటీవల మృతి చెందగా.. అతని భార్య మోహినికి ఉద్దానం హెల్పింగ్ సొసైటీ దాతల సహకారంతో రూ. 10వేలు ఆర్థిక సాయం అందించింది. సంస్థ సభ్యులు దుష్యంత్, సంతోష్, సాగర్, బాలకృష్ణ పాల్గొన్నారు.

బాల్యవివాహాలు నేరం

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్

సోంపేట, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు చేసినా, చేసుకున్నా శిక్ష తప్పదని సోంపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్ సూచించారు. మంగళవారం సోంపేట బాలికోన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలకు 18, మగపిల్లలకు 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేసుకోవాలన్నారు. బాల్య వివాహాల విషయంలో పోలీసులు, ఉపాధ్యాయులకు సమాచారమివ్వాలని విద్యార్థులకు సూచించారు. గుడ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఎస్.ఎస్.శైలేంద్ర, ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాలరావు, వ్యాయామోపాధ్యాయురాలు రోజా, న్యాయవాదులు కాళీప్రసాద్, రుక్మాంగధరరావు పాల్గొన్నారు.

శాసనమండలిలో ప్రశ్నిస్తా

నగేష్ కుటుంబ సభ్యులను మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ విద్యార్థి మువ్వల నగేష్ కుటుంబానికి న్యాయం చేసేందుకు శాసనమండలి సమావేశాల్లో ప్రశ్నిస్తానని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు అన్నారు. నువ్వలరేవుకు చెందిన నగేష్ కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు. మృతికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. నగేష్ చనిపోయి ఏళ్లు కావస్తున్నా.. ఇప్పటి వరకు బాధిత కుటుంబ సభ్యుల న్యాయం కోసం పోరాడుతుండటం బాధాకరమన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ న్యాయం చేస్తామన్న మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. శ్రీధర్‌బాబా, హేమాచలం, నవీన్‌చౌదరి, రామ్‌నరేష్, అనిల్, వినోద్ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ఉద్యమ్ ఆధార్

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం, కాశీబుగ్గ

నిత్య జీవితంలో ఆధార్ కార్డు తప్పనిసరి అయిపోయింది. ప్రతి దానికి ఇది కీలకంగా మారింది. ఇదే విధానంలో చిరు వ్యాపారులు, కుటీర పరిశ్రమల వ్యవస్థాపకుల కోసం కేంద్ర ప్రభుత్వం అందించే గుర్తింపు కార్డే ఉద్యమ్ ఆధార్ కార్డు. ఇది తీసుకుంటే ప్రత్యేక గుర్తింపు సంఖ్య (యూఐఎన్) లభిస్తుంది. కొత్త వ్యాపారులు, ఇప్పటికే ఈ రంగంలో ఉన్న వారికి మరింత అండగా ఉండేందుకు కేంద్రం కొన్నేళ్ల కిందట దీన్ని ప్రవేశపెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనిపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. ఆసక్తి ఉన్నవారందరికీ రిజిస్ట్రేషన్ చేసి కార్డులు ఇస్తున్నారు.

కార్డు పొందడం ఇలా.. ఈ కార్డు అవసరమైన వారు వెలుగు కార్యాలయం, గ్రామ సచివాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలి. పాన్, ఆధార్‌తో అనుసంధానమైన చరవాణి తీసుకెళ్లాలి. మీసేవ కేంద్రంలో నిర్ణీత రుసుం చెల్లిస్తే దరఖాస్తు చేస్తారు. వెలుగు ఆధ్వర్యంలో చిరు వ్యాపారులు, స్వయం ఉపాధి పొందే వారు పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో ఇప్పటికే సగం మందికి కార్డులు జారీ చేసినట్లు డీఆర్‌డీఏ అధికారులు తెలిపారు.

ఇవీ ప్రయోజనాలు

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపారాలు చేసుకునే వారికి ఈ ధ్రువపత్రాన్ని అందజేస్తారు. ఇందులో ఉండే క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే వివరాలు పూర్తిగా వస్తాయి. బ్యాంకు రుణాలు సులువుగా లభిస్తాయి. ప్రభుత్వ పథకాల లబ్ధి ఉంటుంది. వ్యాపారాలకు చట్టపరమైన గుర్తింపు ఉంటుంది.

వ్యాపార విస్తరణకు దోహదం... చిరు వ్యాపారం చేసేవారిని గుర్తించడంతోపాటు తోడ్పాటుగా సీడ్ క్యాపిటల్ రుణాలు ఇప్పిస్తాం. ఉద్యమ్ ఆధార్ రిజిస్ట్రేషన్ చేసి, గుర్తింపు కార్డులు ఇస్తున్నాం. వీరి వ్యాపార విస్తరణకు బ్యాంకు రుణాలు పొందడానికి ఈ కార్డులు దోహదపడతాయి. – గోవిందరావు, ఏపీఎం, కవిటి

సైనికుల సేవలకు సలాం

సైనిక, వాయు, నేవీ దళాల్లో వివిధ హోదాల్లో సేవలందించి, ఉద్యోగ విరమణ అనంతరం కూడా యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్న విశ్రాంత సైనికాధికారులను ఇచ్ఛాపురం మాజీ సైనికోద్యోగుల సంక్షేమ సంఘం గుర్తించి సత్కరించింది. ఈ మేరకు మంగళవారం సీనియర్ అధికారి, సంఘ అధ్యక్షుడిగా ఇతర హోదాల్లో అందరికోసం సేవలందించిన దేవేంద్ర బెహరాను ఆయన ఇంటి వద్ద సన్మానించింది. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఆక్రమణలు తొలగించండి

సోంపేట, న్యూస్‌టుడే: సోంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఆక్రమణలు తొలగించాలని తెదేపా పట్టణ అధ్యక్షుడు శేఖర్, బీన ఆనంద్‌రావు డిమాండ్ చేశారు. ఈ విషయమై క్రీడాకారులు, ఇతర పెద్దలు గ్రీవెన్స్‌లో చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం మండల సర్వేయర్ నాగేశ్వరరావు, ఇతర అధికారులు పరిశీలించి ఆక్రమణలు గుర్తించారు.

గ్రామాన్ని శుభ్రం చేశారు..

కవిటిగ్రామీణం, పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: కొత్త కొజ్జిరియాలో సర్పంచి పద్మనాభం యువకులు మంగళవారం స్వచ్ఛాంధ్ర. స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ★ కిష్టుపురంలో శ్రీశయన సాధికారిక కమిటీ సభ్యుడు సూర్యకృష్ణంరాజు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

భర్తకు తలకొరివిపెట్టిన భార్య

పలాసలో ఓ దివ్యాంగుడు మృతిచెందగా ఆ మృతదేహానికి అతని భార్య తలకొరివి పెట్టింది. కాపువీధికి చెందిన దివ్యాంగుడు అభి(48) వాచ్ మెకానిక్‌గా పనిచేశారు. కడుపునొప్పితో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. రక్తసంబంధీకులు ఎవరూ రాకపోవడంతో అతని భార్య లక్ష్మి తలకొరివి పెట్టారు. – న్యూస్‌టుడే, పలాస

విధేయతకు మించిన విజ్ఞానం లేదు

విధేయతకు మించిన విజ్ఞానం లేదని, విద్యార్థులు సమాజంలో తలెత్తుకునేలా వ్యవహరించాలని సొండిపూడి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సుందర్ సోలమన్ ఆకాంక్షించారు. మంగళవారం షైనింగ్స్ స్టార్లకు, వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు పతకాలు అందజేశారు. – న్యూస్‌టుడే, మందస

(c) eenadu

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

ప్రతిభ చూపిన జ్ఞానసాయి, పావని

రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్‌లో సత్తా

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: మెళియాపుట్టి మండల విద్యార్థులు ఇటీవల నెల్లూరులో జరిగిన 8వ రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ చూపారు. చాపర ఉన్నత పాఠశాలకు చెందిన జ్ఞానసాయి 100, 200 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్‌లో ప్రథమ స్థానం కైవసం చేసుకుని స్వర్ణ పతకాలు దక్కించుకున్నాడు. కొసమాలకు చెందిన సీహెచ్.పావని 100, 200 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్‌లో తృతీయ స్థానంలో నిలిచి కాంస్యాలు సాధించింది. వీరిని మండల విద్యాశాఖాధికారులు ఎస్.దేవేంద్రరావు, పద్మనాభం అభినందించారు.

అధిక మోతాదులో ఎరువులు వాడొద్దు

జలుమూరు, కోటబొమ్మాళి, మెళియాపుట్టి, న్యూస్‌టుడే: అపరాల సాగులో అధిక మోతాదులో ఎరువులను వినియోగించొద్దని వ్యవసాయాధికారి కింజరాపు రవికుమార్ అన్నారు. జలుమూరు మండలం అక్కురాడ వద్ద మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఏఈవో సురేష్, వీపీఏ రమేష్ పాల్గొన్నారు. ★ కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేటలో జరిగిన కార్యక్రమంలో టెక్కలి ఏడీ జగన్మోహన్‌రావు పాల్గొన్నారు. రైతులంతా త్వరితగతిన ఈ- పంట వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. నాయకులు నంబాళ్ల శ్రీనివాసరావు, నంబాళ్ల రాజశేఖర్, ఏవో గోవిందరావు పాల్గొన్నారు. ★ మెళియాపుట్టి మండలం గొప్పిలి, గోకర్ణపురం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి ఎస్.దానకర్ణుడు మాట్లాడారు, అపరాలు, ఆరుతడి పంటలు సాగు చేస్తున్న రైతులకు యాజమాన్య పద్ధతులు, చీడపీడలు నివారణపై పలు సూచనలు చేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

కరవంజ ఆదర్శ పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యనభ్యసించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం కొమ్మువలస, బూరగాం, మాతల, నివగాం, మెట్టూరు, కొత్తూరు, సత్యవరం, పోలాకి, మబగాం, కోడూరు, దీర్ఘాశి, ఈదులవలస, గొల్లలవలస, పిరువాడ, ప్రియాగ్రహారం, నందిగాం, హిరమండలం ఉన్నత పాఠశాలల్లో వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మాతలలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ పాల్గొన్నారు. ★ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. జలుమూరు మండలం కరవంజ ఆదర్శ పాఠశాల వార్షికోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ★ పాతపట్నం ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గోవిందరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వార్షికోత్సవ సంబరాలకు రూ.20 వేలు నగదు వితరణగా అందించారు. ★ బుడితిలో జరిగిన వార్షికోత్సవంలో పీఏసీఎస్ అధ్యక్షుడు పొన్నాన బాలకృష్ణంనాయుడు మాట్లాడారు. పదో తరగతి పరీక్షల్లో బుడితి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధిస్తే బంగారు పతకం బహూకరిస్తానని ప్రకటించారు.

– న్యూస్‌టుడే బృందం

కొత్తూరు: మెట్టూరులో విద్యార్థుల నృత్య ప్రదర్శన

3 రోడ్లకు రూ.2.5 కోట్లు మంజూరు

సారవకోట, న్యూస్‌టుడే: హిరమండలం- తెంబూరు, జర్జంగి- పింద్రువాడ, బద్రి- సారవకోట రహదారుల అభివృద్ధికి రూ.2.5 కోట్లు మంజూరయ్యాయని ర.భ.శాఖ ఏఈ సరోజ తెలిపారు. ఈ మూడు రోడ్ల పనులు ఒకే ప్యాకేజీ కింద జరుగుతున్నాయని, త్వరలోనే నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేయిస్తామని ఆమె పేర్కొన్నారు.

కబ్జాలమయం.. కాలువ మాయం..!

ఆక్రమణల చెరలో వంశధార ప్రధాన ఎడమ కాలువ

పెద్దతామరాపల్లి సమీపంలో కాలువ గట్టుపై పెంచుతున్న మొక్కలు

– న్యూస్‌టుడే, నందిగాం

నందిగాం మండలంలో వంశధార ప్రధాన ఎడమ కాలువ సుమారు 25 కి.మీ. మేర ప్రవహించి దాదాపు 12,500 ఎకరాలను సస్యశ్యామలం చేస్తోంది. ప్రతి ఏడాది రైతులు కరవు బారిన పడకుండా కాపాడుతోంది. కూర్చున్న కొమ్మనే నరుక్కుంటున్న చందంగా కాలువ గట్టును రైతులే ఆక్రమిస్తున్నారు. దీంతో కుచించుకుపోయి నీటి ప్రవాహం తగ్గుతోంది. శివారు ప్రాంతాలకు సాగునీరందకుండా పోతోంది.

పట్టించుకోని అధికారులు

మండలంలో గొల్లవూరు వద్ద వంశధార ప్రధాన ఎడమ కాలువ ప్రవేశిస్తోంది. ఆదిలోనే హంసపాదు అన్న చందంగా గొల్లవూరు సమీపంలో కాలువ గట్టును ఆక్రమించి ఓ రైతు ఏకంగా పొలంగా మార్చి సాగు చేస్తున్నారు. మరికొంత మంది కాలువ గట్టుపై అరటి, టేకు చెట్లు, మిరప, టమాటా, ఇతర కూరగాయలు పండించుకుంటున్నారు. పట్టించుకునే వారే లేకుండా పోవడంతో పెద్దతామరాపల్లి వద్ద చెట్లు ఏపుగా పెరిగిపోయాయి. ఏళ్లుగా పరిస్థితి ఇలాగే ఉన్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

కల్లాల ఏర్పాటు

చిన్నతామరాపల్లి, పెద్దతామరాపల్లి వద్ద కొంత మంది రైతులు వంశధార స్థలంలోనే కల్లాలు ఏర్పాటు చేసి చిన్న చిన్న షెడ్లు వేసుకొని పశువుల శాలలుగా వినియోగించుకుంటున్నారు. కాపుతెంబూరు, హరిదాసుపురం, సుభద్రాపురం, సింగుపురం, సవరబాణాపురం, ఆనందపురం,

గొల్లవూరు వద్ద పొలంగా మార్చిన వైనం

పాత్రునివలస, కొత్తఅగ్రహారం, కణితివూరు వద్ద ఈ ఆక్రమణల జోరు ఎక్కువగా ఉంది. కణితివూరు వద్ద కాలువకు ఆనుకుని పొలంలోకి నీరు మళ్లించడానికి పిల్ల కాలువ తీయడంతో వరదల సమయంలో ఏటా పంట పంట పొలాలు ముంపునకు గురై తీవ్రంగా నష్టపోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సాగునీరందడం లేదు: వంశధార ప్రధాన ఎడమ కాలువ గట్టు ఆక్రమణలకు గురవడంతో కాలువ చిన్నబోయి నీటి ప్రవాహం తగ్గి శివారు ప్రాంతాలకు సకాలంలో సాగు నీరందడం లేదు. దీంతో ఆలస్యంతో ఉబాలు వేయాల్సి వస్తోంది. పంట దిగుబడి గణనీయంగా తగ్గుతోంది. దీనిపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం కానరావడం లేదు. ఇకనైనా స్పందించి ఆక్రమణలు తొలగించాలి.

– బంగారు బారికి, కవిటిఅగ్రహారం

విస్తరణ తప్పనిసరి: వంశధార ఫేజ్-2 నిర్మాణ పనులు పూర్తయితే ప్రధాన ఎడమ కాలువ సామర్థ్యం పెంచాల్సి వస్తోంది. దీంతో విస్తరణ తప్పనిసరి. ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

– శేఖరరావు, ఈఈ, వంశధార ప్రాజెక్టు, టెక్కలి

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజాసమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యులదృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: పాతపట్నం పంచాయతీ అచ్యుతాపురం వద్ద రాత్రి సమయంలో రహదారికి ఇరువైపులా ఆర్టీసీ బస్సులు నిలుపుదల చేస్తున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

- స్థానికులు • క్షేత్రస్థాయిలో పరిశీలించి, సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం.

- రామచంద్రరావు, పంచాయతీ కార్యదర్శి

– న్యూస్‌టుడే, పాతపట్నం

క్రికెట్ టోర్నీకి ఎంపిక

కోట ఢిల్లేశ్వరరావు

నరసన్నపేట, న్యూస్‌టుడే: ఈ నెల 27 నుంచి మైసూరులో జరగనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నీకి తమ కళాశాల విద్యార్థి కోట ఢిల్లేశ్వరరావు ఎంపికయ్యాడని నరసన్నపేట డిగ్రీ కళాశాల కళాశాల ప్రిన్సిపల్ పి.లత తెలిపారు. బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం తరఫున ప్రాతినిథ్యం వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. పీడీ భోగేశ్వరరావు, క్రీడాకారుడిని అధ్యాపకులు అభినందించారు.

సచివాలయం.. అయోమయం

టెక్కలి పట్టణంలో అయ్యప్పనగర్‌కు జాతీయ రహదారికి మధ్యలో నిర్మించిన సచివాలయం, ఇతర నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయాయి. ప్రాథమ్య భవనాల పేరుతో వైకాపా హయాంలో పనులు ప్రారంభించారు. ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే వారే లేకుండా పోవడంతో అసంపూర్తి భవనాల వద్ద పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు నివేదిక పంపామని, నిధులు మంజూరైతే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రేణుక తెలిపారు. – న్యూస్‌టుడే, టెక్కలి

నోరు తెరిచిన ప్రమాదం

కొత్తూరు మండలం మాతల- రుగడ రహదారిలో వీరనారాయణపురం, మాకవరం మధ్యలో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. మూడేళ్లుగా పరిస్థితి ఇలాగే ఉన్నా పట్టించుకునే వారే లేకుండా పోయారని వాహనదారులు వాపోతున్నారు. కొత్తూరు, హిరమండలం, పాతపట్నం మండలాల ప్రజలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు. సమస్యను పరిష్కరిస్తామని ఆర్‌అండ్‌బీ డీఈఈ సాగర్ అన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

నిర్లక్ష్యం చిమ్ముతోంది..!

సారవకోట మండలం లక్ష్మీపురం మంచినీటి పథకం పైప్‌లైన్ లీకులతో తాగునీరు వృథాగా పోతోంది. ప్రధాన రహదారి పక్కనే పరిస్థితి ఇలా ఉండటంతో ఆ మార్గంలో రాకపోకలు చేసే వారు పెదవి విరుస్తున్నారు. నీరు వృథాగా పోవడం వల్ల శివారు ప్రాంతాలకు అరకొరగా సరఫరా అవుతోందని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయాన్ని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ మధుబాబు వద్ద ప్రస్తావించగా.. తక్షణమే వృథాను అరికడతామని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, సారవకోట

ఒరిగిన స్తంభం.. జర భద్రం

నందిగాం మండలం రధజనబొడ్డపాడు పంచాయతీ భైరిబొడ్డపాడు- సవరలపురం బీటీ రహదారిలో సవరలపురం సమీపంలో విద్యుత్తు స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆ మార్గంలో రాకపోకలు చేసే వారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పొలాల పక్కనే పరిస్థితి ఇలా ఉండటంతో తక్షణమే స్తంభాన్ని సరిచేయాలని రైతులు సైతం కోరుతున్నారు. సిబ్బందికి తెలియజేస్తామని ఆ శాఖ జేఈ నేతాజీ చెప్పారు. – న్యూస్‌టుడే, నందిగాం

అదే తీరు.. అవే అవస్థలు

అన్నదాతలకు అవసరం మేరకు యూరియా అందిస్తామని వ్యవసాయాధికారిణి సూర్యకుమారి తెలిపారు. కరగాం రైతు సేవా కేంద్రంలో మంగళవారం యూరియా పంపిణీలో సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారన్న రైతుల ఆరోపణలతో ఆమె అక్కడికి చేరుకున్నారు. అనంతరం పేర్లు నమోదు చేసుకున్న వారికి 120 బస్తాలు పంపిణీ చేశారు. మిగిలిన సరకును బుధవారం సరఫరా చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట

సమస్యలు పరిష్కరిస్తాం

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ కరకలు, మాల్గోదర్ తదితర వీధుల్లో తాగునీటి సమస్య నెలకొంది. మురుగు కాలువలు, రహదారి నిర్మించే క్రమంలో తాగునీటి పైపులైన్లు తొలగించారు. దీనిపై గత నెల 29న 'కోటబొమ్మాళిలో దాహం దాహం' శీర్షికతో కథనం వెలువడింది. ఈ సమస్యను పలువురు మేమున్నాం.. మీకు తోడుగా దృష్టికి సైతం తీసుకొచ్చారు. మంగళవారం గ్రామీణ నీటిసరఫరా విభాగం జేఈఈ గౌతమి ఆయా ప్రాంతాలను సందర్శించారు. సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెదేపా జిల్లా అధికార ప్రతినిధి కిల్లాల శేఖర్‌బాబు అన్నారు. మెదునుగువలస నుంచి కొమ్మువలస మీదుగా గొట్టిపల్లి గ్రామానికి వెళ్లే రహదారి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.2.50 కోట్లు నిధులు రహదారి నిర్మాణానికి మంజూరయ్యాయని తెలిపారు. మురళీకృష్ణ, రామకృష్ణ, గుండపు రామారావు, తంగి అప్పన్న, పోలినాయుడు పాల్గొన్నారు.

సోషల్‌మీడియా సభ్యుడిగా నియామకం

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి), న్యూస్‌టుడే: వైకాపా సోషల్‌మీడియా శ్రీకాకుళం జిల్లా బృంద సభ్యునిగా కురుడు పంచాయతీ పాకివలసకు చెందిన బలివాడ సతీష్‌ను ఆ పార్టీ అధిష్ఠానం నియమించింది. ఈ విషయాన్ని పార్టీ మండలాధ్యక్షుడు హేమసుందరరాజు చెప్పారు.

ఇండియన్ పోలీస్ మెడల్‌కు జిల్లా వాసి ఎంపిక

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పోలీసు పతకాలు ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా మండలంలోని బోరుభద్ర గ్రామానికి చెందిన కరజాడ రామారావు ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికయ్యారు. ఈయన ప్రస్తుతం అసాల్ట్ కమాండర్, (గ్రేహౌండ్స్) విభాగంలో డీఎస్పీగా సేవలందిస్తున్నారు.

ఎస్ఐగా బాధ్యతల స్వీకరణ

నరసన్నపేట, న్యూస్‌టుడే: నరసన్నపేట ఎస్ఐగా బలివాడ గణేష్ నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. సీఐ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎస్పీ కార్యాలయం ప్రత్యేక విభాగంలో పనిచేస్తున్న గణేష్‌ను నరసన్నపేటకు బదిలీ చేశారన్నారు. గతంలో సారవకోట, కోటబొమ్మాళి, టెక్కలిలో ఈయన విధులు నిర్వహించారు.

వైద్య శిబిరానికి స్పందన

పోలాకి, న్యూస్‌టుడే: పోలాకి పీహెచ్‌సీలో విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలు గ్రామాల రోగులు హాజరవ్వగా మొత్తం 72మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు.

గులుమూరులో అగ్ని ప్రమాదం

హిరమండలం, న్యూస్‌టుడే: గులుమూరు గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో గార గోరయ్య, పాసి చిన్నమ్మలకు చెందిన పూరిళ్లు దగ్ధమయ్యాయి. మంగళవారం బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే గోవిందరావు పరామర్శించారు. వారికి బియ్యం, నిత్యావసర సరకులు అందజేశారు. ఇళ్లు మంజూరు చేయాలని తహసీల్దార్ కె.బాలకృష్ణకు సూచించారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరావు, సర్పంచి కోటి, శ్రీధర్, దాలిరాజు పాల్గొన్నారు.

వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గోవిందరావు, తహసీల్దార్ బాలకృష్ణ

కళింగవైశ్యులను బీసీల్లో చేర్చండి

మంత్రి సవితకు వినతిపత్రం ఇస్తున్న రాష్ట్ర కళింగకోమటి కార్పొరేషన్ ఛైర్మన్ గోవిందరాజులు, ఇతర నాయకులు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా కళింగవైశ్యులను బీసీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర కళింగకోమటి కార్పొరేషన్ ఛైర్మన్ బోయిన గోవిందరాజులు, పలువురు నాయకులు బీసీ సంక్షేమశాఖమంత్రి ఎస్.సవితకు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు విజయవాడ తెదేపా కార్యాలయంలో మంగళవారం మంత్రిని కలిసి సమస్యలను తెలియజేశారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వాసు, కార్యదర్శి సత్యనారాయణ, కొత్తకోట నర్సింహమూర్తి, శ్రీనివాస్ ఉన్నారు.

కేసుల పరిష్కారానికి లోక్‌అదాలత్ మంచి వేదిక

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్‌అదాలత్ సువర్ణావకాశమని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి వాణి తెలిపారు. నరసన్నపేటలో ఆమె మాట్లాడుతూ మార్చి 14న జరిగే లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకొని చట్టపరిధిలో రాజీకి అవకాశం ఉన్న కేసులను మాఫీ చేసుకోవచ్చన్నారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట

రూ.6 లక్షలతో ఆడిటోరియం నిర్మాణం

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బిగ్‌హెల్ప్ ఫౌండేషన్, పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.6 లక్షల వ్యయంతో నూతన ఆడిటోరియం నిర్మించారు. దీన్ని విశ్రాంత డీఈవో చెన్నూరు విజయనందరాజా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్య, క్రీడల్లో ప్రతిభ చూపిన పలువురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు భానుప్రకాశ్, ఎస్ఎంసీ ఛైర్మన్ గిరిబాబు, మాజీ ఎంపీపీ కర్రి విష్ణుమూర్తి, జయకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆడిటోరియాన్ని ప్రారంభిస్తున్న విశ్రాంత డీఈవో చెన్నూరు విజయనందరాజా

బ్యాంకు ఉద్యోగుల సమ్మె

పాతపట్నం ఎస్‌బీఐ ముందు నిరసన తెలుపుతున్న సిబ్బంది

పాతపట్నం, జలుమూరు, న్యూస్‌టుడే: ఐదు రోజుల బ్యాంకింగ్ విధానాన్ని అమలు చేయాలని సిబ్బంది కోరారు. దేశ వ్యాప్తంగా చేపడుతున్న నిరసనలో భాగంగా మంగళవారం పాతపట్నం ఎస్‌బీఐ ముందు ఆందోళన చేపట్టారు. సమ్మెలో పాతపట్నం, సారవకోట, గంగువాడ, హిరమండలం, చాపర ఎస్‌బీఐ ఉద్యోగులు, ఏపీజీవీబీ, కెనరా బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. జలుమూరులోనూ ఉద్యోగులు నిరసన చేపట్టారు. వరుసగా మూడు రోజులు సెలవులు కావడం, నాలుగో రోజూ సమ్మె సందర్భంగా బ్యాంకు మూతపడటంతో ప్రజలు అవస్థలు పడ్డారు.

రూ.4.58 కోట్ల పింఛన్ల నగదు విడుదల

కొత్తూరు, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా ఫిబ్రవరి నెలకు సంబంధించి సామాజిక భద్రత పింఛన్ల నిధులు విడుదలైనట్లు ఎంపీడీవో బీవీఆర్ ప్రసాదరావు తెలిపారు. స్థానికంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ .. 10,500 మందికి రూ.4.58కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిని వచ్చే నెల 1వతేదీ ఆదివారం కావడంతో ఈనెల 31న పంపిణీ చేపడతామన్నారు.

లోపాలు పునరావృతం కాకూడదు

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పథకంలో(వీబీజీ రామ్‌జీ) లోపాలు పునరావృతం కాకూడదని ప్రొసీడింగ్ అధికారి రాధ, అంబుడ్స్‌మెన్ గురుమూర్తి సూచించారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయం ఆవరణలో మంగళవారం ప్రజావేదిక నిర్వహించారు. ఇందులో రూ. 26.38 కోట్లతో జరిగిన వివిధ అభివృద్ధి పనులను పరిశీలించిన తనిఖీ బృందం సంబంధిత నివేదికలను ఈ కార్యక్రమంలో వెల్లడించారు. ముఖ్యంగా పనుల అంచనాలు, ఒకే కుటుంబానికి రెండు పని గుర్తింపు కార్డులు(జాబ్ కార్డులు), ఉద్యానవన పథకంలో మొక్కలు లేకపోవడం గుర్తించారు. ఏపీడీ శైలజ, సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ మాధవరావు, డ్వామా మానవవనరుల నిర్వాహకుడు శ్రావణ్, ఎంపీడీవో నర్సింహ ప్రసాద్, ఏపీవో రవి పాల్గొన్నారు.



ప్రజా వేదికలో పాల్గొన్న అధికారులు

మాజీ సర్పంచి మృతికి సంతాపం

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: తోటాడ మాజీ సర్పంచి, తెదేపా సీనియర్ నాయకుడు యర్నాగుల సూర్యనారాయణ (సూరిబాబు) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఈయన మృతి పట్ల రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పలువురు తెదేపా నాయకులు సంతాపం తెలియజేశారు.

ఊటనీరు.. ఒడిసి పట్టక కన్నీరు

– న్యూస్‌టుడే, మెళియాపుట్టి

పక్క చిత్రాన్ని చూసి అయ్యో నీరు వృథాగా పోతుంది అనుకుంటున్నారా.. మెళియాపుట్టి మండలం గొట్టిపల్లి పంచాయతీ చందనగిరి గిరి శిఖర గ్రామంలో 365 రోజులు పరిస్థితి ఇలాగే ఉంటుంది. గ్రామస్థుల అవసరాలు తీరగా మిగిలిన జలం ఇలా పోతుంది. మండల వ్యాప్తంగా కాలాలతో సంబంధం లేకుండా నిరంతరం పారే జలం అందుబాటులో ఉన్నా ఏడాదికో ఓ పంట పండటమే కష్టంగా మారుతోందని ప్రజలు వాపోతున్నారు.

చందనగిరిలో వృథాగా పోతున్న మిగులు నీరు

దృష్టి సారించని యంత్రాంగం

గిరి శిఖర గ్రామాల్లో ఊట నీటి వనరులు వినియోగంలో దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించడం లేదన్న చందంగా పరిస్థితి మారింది. ప్రకృతి సిద్ధంగా నీటి వనరులున్నా ఒడిసి పట్టుకోవడంలో పాలనా యంత్రాంగం దృష్టి సారించడం లేదు.

సాగునీటికి కష్టాలు

మెళియాపుట్టి మండల పరిధిలో వెంకటాపురం, కొత్తూరు, ముకుందాపురం, గొట్టిపల్లి, కేరాసింగి, ఇలైపురం, అంపురం, ముకుందాపురం తదితర గిరిజన పంచాయతీల పరిధిలో వందల ఎకరాల్లో వ్యవసాయానికి వర్షమే ఆధారం. అరకొర వానలు, ఎండెక్కితే ఇంకే నీటిగుట్టలతో రైతులు సాగునీటికి కష్టాలు పడుతున్నారు. కేరాసింగి, చందనగిరి, గూడ, పెద్దకేదారి, అడ్డివాడ ప్రాంతాల్లోని కొండల్లో వానలు పడితే ఆ నీరంతా ప్రవహించి ముకుందసాగరం, మాలపేట, చందనగిరి, రామకృష్ణ గెడ్డల ద్వారా ప్రవహించి కొంత మహేంద్రతనయ నదిలో కలుస్తుంది. మరి కొంత టెక్కలి మండలానికి చేరుతుంది.

పుష్కలంగా జలవనరులు

పాలకులు చిన్న నీటి వనరులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వృథాగా పోతున్నాయి. గిరి శిఖర గ్రామాలైన పెద్దకేదారి, అడ్డివాడ, ఎర్రమానుగూడ, గేటుపేట, దబ్బగుడ్డి, మూలపోలూరు, గూడ, కేరాసింగి, ముత్యాల బొంతు, గొట్టిపల్లి, వీరన్నపేట తదితర గిరిజన గ్రామాల్లో ఊటనీటి జాడలు పుష్కలంగా ఉన్నాయి. వీటిపై అధికార యంత్రాంగం దృష్టి సారించి నీటిని ఒడిసి పడితే గిరిజన రైతుల సాగునీటి కష్టాలు తీరుతాయి. ప్రత్యామ్నాయ పంటలు పండించుకోవడానికి అవకాశం ఉంటుంది.

ప్రతిపాదనలు పంపిస్తాం: ఐటీడీఏ పరిధిలో సాగునీటి వనరులకు సంబంధించి నిధులు కొరతతో పనులు చేపట్టలేక పోయాం. 2014- 19 మధ్య గిరిజన గ్రామాల్లో పారే నీటికి అడ్డుకట్ట వేసేందుకు కృషి చేశాం. రైతులు కోరితే ప్రణాళికలు తయారుచేసి, ప్రతిపాదనలు పంపిస్తాం.

- టి.ఆదినారాయణరెడ్డి, ఏఈ, ఐటీడీఏ(నీటిపారుదలశాఖ) పాతపట్నం

పశువులకు ఉచితవైద్యం

ఎత్తురాళ్లపాడు (కోబొమ్మాళి), నందిగాం, న్యూస్‌టుడే: కోటబొమ్మాళి మండలం తిలారు, నిమ్మాడ, కురుడు పశువైద్యకేంద్రాల పరిధిలో వాంద్రాడ, కొత్తపల్లి, సీతన్నపేట, నీలంపేట పంచాయతీల్లో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. మూగజీవాలకు నట్టల నివారణ మందులు వేశారు. ★ నందిగాం మండలం కొత్తఅగ్రహారంలో పశువైద్యాధికారి మన్మథరావు ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు బర్ల కిష్టమ్మ, దుంప కృష్ణ, గుమ్మడి కురమయ్య పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగులకు సన్మానం

హిరమండలం, న్యూస్‌టుడే: తహసీల్దారు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డీటీ బి.ప్రసాదరావు, ఏఎస్‌వో పి.అప్పలనాయుడులను మంగళవారం తహసీల్దారు కె.బాలకృష్ణ, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది సన్మానించారు. తహసీల్దారు మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉద్యోగులుగా కలెక్టర్ చేతుల మీదగా ప్రశంసాపత్రం అందుకున్న నేపథ్యంలో సత్కరించినట్లు చెప్పారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు శుభాకాంక్షలు

గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ శ్రీ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గారి చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న నరసన్నపేట MEO శ్రీ ఉప్పాడ శాంతారావు గారు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ శ్రీ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గారి చేతుల మీదుగా ఉత్తమ అవార్డు స్వీకరిస్తున్న నరసన్నపేట MEO ఉప్పాడ శాంతారావు గారికి మా హార్థిక శుభాకాంక్షలు

బెహరా వకులారత్నమాల HM, ZPHS - సత్యవరం	దుంపల వైకుంఠరావు Prinicipal AP Model School - పురుషోత్తపురం
తంగి మురళీమోహన్‌రావు PRTU - Dist. President	బమ్మిడి మన్మథరావు HM & Staff - కంబకాయ
కింజరాపు లక్ష్మణరావు SA SS - ZPHS - సత్యవరం	ఉప్పాడ వాసుదేవరావు SA - PSC - ZPHS - సుసరాం
సంపతిరావు పుష్పలత - క్రిష్ణంరాజు ఇందిరానగర్	N. ఉత్తరుడు SA SS - ZPHS - దేశవానిపేట
గంగు చంద్రశేఖర్ APTF - 1938 - ప్రెసిడెంట్	సంపతిరావు రామదాసు SA - Eng - MPUPS - చీడివలస
చింతాడ ధర్మారావు MPUPS - చీడివలస	శిర్ల ఉమారూపవతి నరసన్నపేట
కవిటి దివాకర్ APTF - 257	సీపాన త్రినాధరావు MPPS - దుప్పిలపాడు
పంగ పావనిమోహన్‌దాస్ రావులవలస	నల్లబాటి కైలాస్ MPPS - గడ్డెయ్యపేట
ఉప్పాడ పూర్ణారావు అధ్యక్షులు: కళింగ సంక్షేమ సంఘం	తంగుడు ఉషా క్రిష్ణమూర్తి నరసన్నపేట
HM & STAFF ZPHS, మడపాం	HM & STAFF ZPHS, బొరిగివలస
HM & STAFF ZPHS, బాడాం	HM & STAFF ZPHS, సుందరాపురం
HM & STAFF MPPS - లకిమేర	HM & STAFF MPUPS - దూకులపాడు
HM & STAFF MPPS - కోమర్తి	HM & STAFF MPPS - పెద్దపేట
MPPS - బొర్రు -STAFF నరసన్నపేట	HM & STAFF MPPS - గుండువిల్లిపేట

శ్రీకాకుళం
•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ

దూబ హేమశ్రీ

పాతబస్టాండ్, ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో గార మండలం [illegible]ల్లికి చెందిన దూబ హేమశ్రీ కాంస్య పతకం సాధించింది. పంజాబ్ యూనివర్సిటీ చండీగఢ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 26 నుంచి పోటీలు జరుగుతున్నాయి. డా.బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం నుంచి ప్రాతినిధ్యం వహించి 53 కిలోల కేటగిరీలో స్నాచ్ 75, క్లీన్ అండ్ జర్క్‌లో 97 కిలోల బరువు ఎత్తి తృతీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఆమెను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ.మహేశ్‌బాబు, కోచ్ అప్పన్న అభినందించారు.

అర్ధాంతరంగా టీసీ ఇవ్వడంపై ఆందోళన

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: పార్వతీశంపేట వద్ద ఉన్న సెయింట్ ఆన్స్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎస్.మణిదీప్‌కు పాఠశాల యాజమాన్యం అర్ధాంతరంగా టీసీ ఇచ్చింది. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు పాఠశాలకు వచ్చి ప్రిన్సిపల్ మేరీని జోయినిసను ప్రశ్నించారు. దీనిపై మండల విద్యాశాఖాధికారి శివ రాములకు ఫిర్యాదు చేశారు. పాఠశాల యాజమాన్యంతో మాట్లాడి విద్యార్థిని పాఠశాలలో చేర్పించుకుంటారని ఆయన హామీ ఇచ్చారు.

తెరపై ఈనాడు

✦ ఎస్‌వీసీ (రామలక్ష్మణ), శ్రీరిక, సన్మాన్: మన శంకరవరప్రసాద్ గారు ✦ మారుతి: దండోరా ✦ కిన్నెర: భర్త మహాశయులకు విజ్ఞప్తి ✦ సూర్య: అనగనగా ఒక రాజు ✦ కీర్తన: నారీ నారీ నడుమ మురారి ✦ సరస్వతి: రాజాసాబ్. – న్యూస్‌టుడే, పాతబస్టాండ్

మేమున్నాం.. మీకు తోడుగా
(10 AM TO 1 PM) 9502198883 8008552704

సమస్య: పంతులపేటకు వెళ్లే ప్రధాన రహదారిలో పనికిరాని మొక్కలతో ఇబ్బందులు పడుతున్నాం. – రాఘరావు, స్థానికుడు.
సమాధానం: సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం. – జాస్సన్, మున్సిపల్ ఏఈ, ఆమదాలవలస.

సమస్య: ఏజీనాయుడుకాలనీ వివరి వీధిలో మురుగునీరు నిల్వ ఉండటంతో అవస్థలు పడుతున్నాం. – రవీంద్ర, స్థానికుడు
సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి పనులు చేయిస్తాం. – టి.రవి, మున్సిపల్ కమిషనర్, ఆమదాలవలస
– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

జాతర ఏర్పాట్ల పరిశీలన

కమ్మసిగడాం జాతర ఏర్పాట్లను సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మంగళవారం పరిశీలించారు. ఆలయ పరిసరాలను చూశారు. ట్రాఫిక్ నియంత్రణ పద్ధతులపై పోలీసులకు సూచించారు. జాతర ప్రాధాన్యాన్ని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు జేసీకి వివరించారు. తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులున్నారు. – న్యూస్‌టుడే, రణస్థలం

రేపు రంగనాథస్వామి కల్యాణం

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: పురుషోత్తపురం గ్రామంలో ఈనెల 29న భూనీలాసమేత రంగనాథస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు పురోహితుడు ననపల యతిరాజాచార్యులు తెలిపారు. మంగళవారం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాల్సిందే

కమిషనర్ మోహన్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న పుర కార్మికులు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: కార్మికులకు నష్టం చేకూర్చే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని పుర కార్మికులు, ఉద్యోగుల సమాఖ్య జిల్లా నాయకుడు బలరాం తదితరులు డిమాండ్ చేశారు. వచ్చే నెల 12న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె చేయనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన నోటీసులను మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ మోహనరావును ఆయన కార్యాలయంలో కలిసి అందజేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు ఎ.గణేశ్, చిట్టి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సిలంబం ఆటలో... శివంగులు వీరు..!

కర్రసాములో అదరగొడుతున్న బాలికలు

కర్రను కంటికి కనిపించనంత వేగంతో తిప్పుతూ అంతర్జాతీయ స్థాయిలో అదరగొడుతున్నారీ బాలికలు. ప్రాచీన యుద్ధ కళగా పేరొందిన సిలంబం (కర్రసాము)లో బాల్యం నుంచే ఆసక్తి పెంచుకుని రాణిస్తున్నారు. ఈ గ్రామీణ క్రీడలో రాటుదేలి ప్రదర్శించిన ప్రతి వేదిక నుంచి పతకాలను జిల్లాకు తీసుకొస్తున్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా ఘట్కా అసోసియేషన్ ఆధ్వర్యంలో సాధన చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. – న్యూస్‌టుడే, పాతబస్టాండ్

బంగారు పావని..

శ్రీకాకుళం నగరానికి చెందిన **బి.పావని** ప్రస్తుతం ఇంటర్ చదువుతోంది. అమ్మ, నాన్నలు ఇచ్చిన స్ఫూర్తితో ఎనిమిదో తరగతిలోనే కర్రసాముపై ఆసక్తి పెంచుకుంది. నాలుగేళ్లలోనే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించింది. 2023లో విజయవాడలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో ఐదు దేశాల నుంచి వచ్చిన క్రీడాకారులతో పోటీపడి బంగారు పతకం అందుకుంది. చెన్నైలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో రజత, రాష్ట్ర స్థాయిలో రెండు బంగారు పతకాలు సాధించింది.

మూడేళ్ల సాధనతో..

శ్రీకాకుళం నగరం విశాఖ ఏ కాలనీకు చెందిన **బి.శ్రీకళ** రెండేళ్లుగా కర్రసాములో సాధన చేస్తోంది. ఓ ఆటోమొబైల్ కంపెనీలో పని చేస్తున్న తండ్రి చంద్రమౌళి స్ఫూర్తితో విజయవాడలో జరిగిన అంతర్జాతీయ పోటీలో బంగారు, చెన్నైలో జరిగిన జాతీయస్థాయి పోటీలో రజత పతకం సాధించింది. ప్రస్తుతం ఇంటర్ చదువుతున్న ఈ క్రీడాకారిణి రాష్ట్రస్థాయిలో రెండు బంగారు పతకాలు అందుకుంది.

ఆత్మరక్షణ క్రీడగా..

శ్రీకాకుళం నగరంలో ఉంటున్న మాజీ సైనికోద్యోగి వి.శ్యామ్‌సుందర్ తన బిడ్డ **ఉజ్వల** ఆత్మరక్షణ విద్యలో పట్టు సాధించాలనే లక్ష్యంతో కర్రసాములో చేర్పించారు. ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతున్న ఈ క్రీడాకారిణి 2023లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని బంగారు పతకం అందుకుంది. రెండేళ్లుగా వరుసగా రాష్ట్రస్థాయిలో బంగారు పతకాలు సాధించింది. జాతీయస్థాయిలో చెన్నైలో జరిగిన పోటీల్లో రజత పతకంతో సత్తా చాటింది.

అసలేంటీ ఆట

చేతి కర్రతోనే ఆత్మరక్షణ చేసుకునే ఈ ప్రాచీన విద్యలో పోటీ పడాలంటే క్రమశిక్షణ తప్పనిసరి. బరిలో దిగక ముందు నుంచే క్రీడాకారులకు పాయింట్లు నిర్ణయిస్తారు. ఓపెన్ కేటగిరీలో తమ వయసువారితో పోటీ నిర్ణయిస్తారు. క్రీడాకారుడు ఎంత ఎత్తుంటే అతని చెవి వరకు ఉండే కర్రతో పోటీకు దిగాల్సి ఉంటుంది. గురు నమస్కారానికి 3 పాయింట్లు, కర్రపట్టుకునే విధానానికి 2.5, కర్ర తిప్పే వేగానికి 2.5, ఉడాన్ అంటే పల్టీ కొట్టడానికి 1, క్రీడాకారుడు చేసే ధ్వనికి 1 పాయింట్ వేస్తారు. మూడు సార్లు చేతి నుంచి కర్ర కిందకు జారితే అర్హత కోల్పోతారు.

అమ్మ స్ఫూర్తి..

శ్రీకాకుళం నగరానికి చెందిన **బి.భావశ్రీ** అమ్మ ప్రసన్న ప్రభుత్వ ఉద్యోగి. ఆమె అందించిన స్ఫూర్తితోనే రెండేళ్లుగా సాధన చేస్తోంది. ప్రస్తుతం 10 చదువుతున్న ఈ క్రీడాకారిణి 2024, 25 సంవత్సరాల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించింది.

తీరిన ఇబ్బంది

స్పందనకు వందనం

పొందూరు మండలం బానాం గ్రామ పంచాయతీ పరిధిలోని తానెం నుంచి లోలుగు గ్రామానికి మధ్యలో ఉన్న విద్యుత్తు స్తంభం ఒక వైపు వాలి ప్రమాదకరంగా ఉంది. దీనిపై ఈనెల 26న 'వాలింది భయపెడుతోంది' అనే శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి మంగళవారం సరిచేశారు. – న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

మరుగున పడినా అడిగేదెవరు..?

స్వచ్ఛభారత్‌లో భాగంగా పరిసరాల పరిశుభ్రత, ఆరుబయట మలవిసర్జన నిర్మూలనకు అప్పటి తెదేపా ప్రభుత్వం మరుగుదొడ్లు నిర్మించింది. ఇందులో భాగంగా మండల పరిషత్, విద్యాశాఖ కార్యాలయాల్లోనూ నిర్మించారు. పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించకపోవడంతో వినియోగానికి దూరంగా ఉన్నాయి. పనికిరాని మొక్కలతో నిండిపోయాయి. ఈ విషయం ఎంపీడీవో పి.వెంకటరాజు వద్ద ప్రస్తావించగా పరిశీలించి మరమ్మతులు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, లావేరు

పక్కకు చూడు.. ప్రయాణం చేయి..

సరుబుజ్జిలి మండలంలోని తురకపేట-దుబ్బులపేట మధ్య రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు ఏపుగా పెరిగాయి. వీటి వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో విషసర్పాల భయం ఎక్కువగా ఉందని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఈవోపీఆర్డీ రామారావును వివరణ కోరగా పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

పందులు.. ఇబ్బందులు..

ఆమదాలవలస మండలం గోపీనగరం ప్రాంతాల్లో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. గుంపుగా వచ్చి ఇళ్లలోకి దూరుతున్నాయి. వీటి కారణంగా రోగాలు బారిన పడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి పందుల సమస్య తీర్చాలని స్థానికులు కోరుతున్నారు. ఈవోపీఆర్డీ గోపాలరావును వివరణ కోరగా పరిశీలించి, సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, గోపీనగరం

పగటి వెలుగులు

పొందూరు మండలం నరసాపురం గ్రామంలో వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్తు వృథా అవుతోంది. అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా కార్యదర్శితో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

పారిశుద్ధ్యం.. అధ్వానం

శ్రీకాకుళం గ్రామీణ మండలం గూడెంలో కాలువ వ్యవస్థ లేకపోవడంతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. రహదారుల పక్కన మురుగు నీరు నిలిచిపోతోంది. దోమల బెడదతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా కాలువల్లో పూడిక తొలగించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం గ్రామీణం

ఘనంగా సీబీసీఎన్‌సీ మహాసభలు

మాట్లాడుతున్న డీఎల్‌బీఎల్ కుమార్

రాగోలు (శ్రీకాకుళం గ్రామీణం)న్యూస్‌టుడే: శ్రీకాకుళం గ్రామీణ మండలం రాగోలులోని తెలుగు బాప్టిస్టు దేవాలయంలో ఈ నెల 26, 27 తేదీల్లో సీబీసీఎన్‌సీ 71వ మహాసభలు నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ హెచ్‌ఎస్ఎస్ పాల్ మాట్లాడుతూ జిల్లాలో సీబీసీఎన్‌సీ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడుతున్నామని తెలిపారు. బిషప్ డాక్టర్ డీఎల్‌బీఎల్ కుమార్, రెవరెండ్ కేజేఎస్ ప్రేమ్‌కుమార్ వాక్యోపదేశం చేశారు. మూడేళ్ల పాటు కొనసాగేలా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

రథసప్తమి ఏర్పాట్లలో విఫలం

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: రథసప్తమి నాడు అరగంటలో సూర్యనారాయణస్వామిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేశామని అధికార యంత్రాంగం గొప్పలు చెప్పి ఆదిత్యాలయ ప్రతిష్ఠను మంటగలిపారని వైకాపా నాయకుడు మెంటాడ స్వరూప్ విమర్శించారు. ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం పలువురు నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు.

ఇంటర్ విద్యార్థినికి అస్వస్థత

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు మండలంలోని కేజీబీవీ ఇంటర్ విద్యార్థిని పి.హారిక మంగళవారం తీవ్ర అస్వస్థతకు గురైంది. చికిత్స కోసం కుటుంబ సభ్యులు శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. పాఠశాలలో గణతంత్ర వేడుకల్లో భాగంగా సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి విద్యార్థినులంతా భోజనాలు చేసిన అనంతరం నిద్రించారు. మంగళవారం ఉదయం హారిక నిద్ర లేవకపోవడంతో తోటి విద్యార్థినులు సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు వాలిపల్లిపేటలో ఉన్న కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలిపారు. రాత్రి వరకూ స్పృహ రాకపోవడంతో ఆందోళనకర పరిస్థితి నెలకొంది. బాలికను ఆసుపత్రికి తీసుకెళ్లకుండా తల్లిదండ్రులకు అప్పగించి చేతులు దులుపుకోవడంపై కుటుంబ సభ్యులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కార్మిక సంఘ నాయకుడి మృతి

ఆమదాలవలస గ్రామీణంన్యూస్‌టుడే: ఆమదాలవలస మండలం కనుగులవలస గ్రామానికి చెందిన సీఐటీయూ కార్మిక సంఘ నాయకుడు పంచాది కృష్ణారావు(68) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. కార్మిక హక్కులు సాధన కోసం ఎన్నో పోరాటాలు చేసిన ఈయన మృతిపై స్థానిక తెదేపా నాయకులు సంతాపం వ్యక్తం చేశారు

సేవాస్ఫూర్తి పెంపొందించుకోవాలి

మాట్లాడుతున్న ప్రధానాచార్యులు సూర్యచంద్రరావు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: కళాశాల స్థాయిలో విద్యార్థులు జాతీయ సేవా పథకం కార్యక్రమాల్లో పాల్గొని సామాజిక సేవా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు కె.సూర్యచంద్రరరావు పిలుపునిచ్చారు. పొన్నాడ గ్రామంలో కళాశాలకు చెందిన ఎన్.ఎస్.ఎస్-2 విభాగం ప్రారంభించిన ఎన్ఎస్ఎస్ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

భాజపా పదాధికారుల నియామకం

పదాధికారులతో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పైడి సింధూర

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: భాజపా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు డా.పైడి సింధూర ఆధ్వర్యంలో పదాధికారులను నియమించారు. మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిషిదారాజు 10 మందికి నియామక పత్రాలు అందజేశారు. భాజపా జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగులో మెలకువలు పాటించాలి

రణస్థలం, న్యూస్‌టుడే : మొక్కజొన్న సాగులో మెలకువలు పాటించాలని వ్యవసాయాధికారి విజయభాస్కర్ అన్నారు. మంగళవారం కొండములగాంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు ఆధునిక, సాంకేతికత సరైన సమయంలో అందించడమే కార్యక్రమ ముఖ్యోద్దేశమన్నారు. ప్రస్తుతం మొక్కజొన్నలో పురుగు ఉద్ధృతి ఎక్కువగా ఉంటుందని, వ్యవసాయ సిబ్బంది సూచనలు పాటించాలన్నారు. ఉద్యానాధికారి అమరేశ్వరి పాల్గొన్నారు.

కొండములగాంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు

ఘనంగా పాఠశాల వార్షికోత్సవాలు

పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ హాజరయ్యారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలని సూచించారు. ✦ ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ✦ సరుబుజ్జిలి మండలం కొత్తకోట జడ్పీ పాఠశాలలో వేడుకలు జరిగాయి. పదో తరగతి విద్యార్థులు వీడ్కోలు సభ నిర్వహించారు. లావేరు మండలం బుడుమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు.
– న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం, ఆమదాలవలస పట్టణం, సరుబుజ్జిలి, లావేరు, కలెక్టరేట్ (శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య ప్రదర్శన

కొత్తకోట జడ్పీ పాఠశాలలో..

శ్రీకాంత్ బృందానికి అభినందన

దిల్లీలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో నగరానికి చెందిన శివశ్రీ నృత్య కళానికేతన్ వ్యవస్థాపకుడు రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్య బృందం కూచిపూడి నాట్యం ప్రదర్శించి ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ప్రత్యేకంగా అభినందించారని శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ ప్రశంసించారని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

ఉద్యోగాలకు 11 మంది ఎంపిక

ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 11 మంది విద్యార్థులు హైదరాబాద్‌కు చెందిన నోవేషన్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో రూ.9 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాలకు చెందిన సీఎస్ఈ, ఏఐఎంఎల్, ఈసీఈ బ్రాంచ్‌ల విద్యార్థులు పాల్గొనగా తుది దశలో 11 మందిని సంస్థ సీఈవో స్వాతి రుషిత, సీటీవో కె.తరుణ్‌రెడ్డిలు ఎంపిక చేశారు. ఎంపికైనవారిని కళాశాల ప్రధానాచార్యుడు ఎస్.సి.వి.రమణమూర్తినాయుడు, విభాగాధిపతి ఎస్.భాస్కర్, టీపీవో సి.హెచ్.రామకిషోర్ అభినందించారు. – న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

బాధితురాలికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ కె.నాగబాబు, ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి విశ్వక్సేన్

లావేరు, న్యూస్‌టుడే: జి.సిగడాం మండలం గెడ్డకంచరాం గ్రామానికి చెందిన క్రియాశీలక జనసైనికుడు పుక్కాల రాజశేఖర్ ఇటీవల మృతి చెందారు. కుటుంబ పరిస్థితిని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కె.నాగబాబు దృష్టికి తీసుకెళ్లగా మృతిని భార్యకు ఉద్యోగావకాశం కల్పించారు. ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి విశ్వక్సేన్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి డైరెక్టర్ పంచకర్ల సందీప్ స్పందించి రూ.50 వేల చొప్పున రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్సీ చేతుల మీదుగా లావేరు జనసేన పార్టీ కార్యాలయంలో అందించారు.

కార్యాలయాలకు అవసరం లేదా.. మరుగుదొడ్లు ?

పొందూరు వెలుగు కార్యాలయం వద్ద మరుగుదొడ్లు

– న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

❖ అధికారులు గ్రామాల్లో తిరుగుతూ ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి నిర్మించడమే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తున్నారు. కానీ ప్రభుత్వ కార్యాలయాల్లో మాత్రం వాటిని నిర్మించడం విస్మరిస్తున్నారు. ఒకటో, రెండో ఉంటే వాటిని అధికారులే వినియోగిస్తున్నారు. పలు కార్యాలయాల్లో మరుగుదొడ్లు ఉన్నా నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండాలన్న లక్ష్యంతో అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.. వారు ఉండే కార్యాలయాల వద్ద అందుబాటులో లేకపోవడంతో సిబ్బందితో పాటు, పనిమీద వచ్చి వెళ్లే ప్రజలకు అవస్థలు తప్పలేదు. ముఖ్యంగా మహిళల పరిస్థితి దయనీయంగా తయారైంది. కనీసం మండల కేంద్రాల్లోనైనా ప్రజా మరుగుదొడ్లు లేని దుస్థితి.

పొందూరు మండల ప్రజా పరిషత్తు కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల పరిస్థితి దారుణంగా ఉంది. వెలుగు కార్యాలయానికి సంబంధించిన మరుగుదొడ్లు పూర్తిగా పాడైపోవడంతో వెలుగు సిబ్బందితో పాటు, గృహనిర్మాణశాఖ, సబ్ రిజిస్ట్రార్, సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో ఆరు బయటకు వెళ్లి అవసరాలు తీర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సరుబుజ్జిలి తహసీల్దారు కార్యాలయంలోనూ అధికారులకే తప్ప ఇతరులకు వీలు లేకుండా తాళాలు వేస్తున్నారు. స్థానిక పీహెచ్‌సీలోనూ ఇదే పరిస్థితి.

సమస్య పరిష్కరిస్తాం

ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండాలి. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు ఇబ్బందులు పడకుండా చూసుకోవాలి. పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తాం. – **పావని, వాసుదేవరావు, పొందూరు, సరుబుజ్జిలి ఎంపీడీవోలు**

(c) eenadu

నెలాఖరులో సీఎం కుప్పం రాక

మూడు రోజుల పర్యటన ఖరారు

కుప్పం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెలాఖరులో కుప్పం రానున్నారు. ఈ నెల 30, 31, ఫిబ్రవరి 1న ఆయన సొంత నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తారు. ఈ మేరకు అధికారులు ప్రాథమిక వివరాలతో షెడ్యూల్‌ను రూపొందించారు.

● 30న శుక్రవారం గుడుపల్లె మండలం అగస్త్య విజ్ఞాన కేంద్రంలోని హెలిపాడ్‌కు సీఎం చేరుకుంటారు. స్థానికంగా కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం.. కుప్పం మున్సిపాలిటీ పరిధిలో పర్యటిస్తారు. ఏపీ పర్యాటక పున్నమి హోటల్‌ను పునఃప్రారంభిస్తారు. పట్టణ బైపాస్ మార్గంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. శాంతిపురం మండలం శివపురంలోని స్వగృహంలో రాత్రి బస చేస్తారు.

● 31న ప్రజల నుంచి వినతులు స్వీకరణ, కంగుందిలో పర్యాటక అభివృద్ధి పనుల పరిశీలన అనంతరం శాంతిపురం మండలం తులసినాయనపల్లె వద్ద ప్రజావేదిక సభలో పాల్గొంటారు. ఈ-సైకిళ్ల పంపిణీ, నూతన పింఛన్లను అందజేస్తారు. ● ఒకటో తేదీ ఉదయం ప్రజల నుంచి వినతుల స్వీకరణ అనంతరం.. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో సమీక్ష నిర్వహిస్తారు. తర్వాత తుమ్మిశి రోడ్డులోని హెలిపాడ్‌కు చేరుకొని తిరుగుపయనమవుతారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటల్లో, రూ.300 ఎస్ఈడీ టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో దర్శనం లభించనుంది. సోమవారం శ్రీవారిని 75,791 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.3.77 కోట్లు హుండీ కానుకలు లభించాయి. తిరుపతిలో శ్రీవారి దర్శనానికి సంబంధించి శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు 12 వేల టోకెన్లు జారీ చేశారు. వీరికి బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం కానుంది. శ్రీవారి మెట్టు నడకదారి భక్తులకు 2 వేల టోకెన్లు జారీ చేశారు.

చదువుకున్నోళ్లే చిక్కుతున్నారు

సైబర్ నేరగాళ్ల వలలో విద్యావంతులు

● తిరుపతికి చెందిన ఓ వైద్యుడికి మ్యాట్రిమోనీ వేదికగా ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని పరిచయమైంది. త్వరలో పెళ్లి కూడా చేసుకోవాలనుకున్నారు. ప్రస్తుత సంపాదన దాంపత్య జీవితానికి సరిపోదని, షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడదామని ఆ మహిళ వైద్యుడిని నమ్మించింది. మొదట కొంత పెట్టుబడి పెట్టించి రెట్టింపు ఆదాయంగా వచ్చిన రూ.7 లక్షలు డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించింది. దీంతో నమ్మకం పెరిగి రూ.84 లక్షలు పెట్టుబడి పెట్టారు. వాలెట్‌లోని రూ.9 కోట్లలో రూ.ఐదు కోట్లు డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా.. రాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. ● ఎస్వీయూ ఆచార్యుడి ఫోన్ నంబరును ఓ వాట్సప్ గ్రూప్‌లో చేర్చారు. అందులో నకిలీ ట్రేడింగ్ యాప్‌లు పంపి డౌన్‌లోడ్ చేసుకునేలా ప్రోత్సహించారు. వివిధ ఖాతాల నుంచి రూ.24.66 లక్షలు పెట్టుబడి పెట్టారు. ఆయన పెట్టుబడి పోర్ట్ పోలియో విలువ రూ.2.14 కోట్లుగా చూపించారు. విత్‌డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా డబ్బులు రాకపోవడంతో అసలు విషయం తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే

ఇలా సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుతున్న వారిలో 90 శాతం విద్యావంతులు, ఉద్యోగస్తులే ఉంటున్నారు. డబ్బులు ఊరికే రావని తెలిసినా.. అత్యాశకు పోయి మోసపోతున్నారు. షేర్ మార్కెట్లలో పెట్టుబడులంటూ.. డిజిటల్ అరెస్టులని.. నకిలీ లింకులు పంపించి సైబర్ నేరస్థులు అడ్డంగా దోచుకుంటున్నారు. అలా రాబట్టిన సొమ్మును ఆన్‌లైన్ గేమింగ్ ఖాతాలకు వెంటనే బదిలీ చేస్తున్నారు.

వారిపైనే దృష్టి

బ్యాంకు ఖాతాల్లో డబ్బులు.. ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్న వారిపైనే సైబర్ నేరగాళ్లు దృష్టిసారిస్తున్నారు. విశ్రాంత ఉద్యోగులను డిజిటల్ అరెస్టుల పేరుతో భయపెట్టి బ్యాంకులో ఉన్న నగదు కాజేస్తున్నారు. పిల్లలు విదేశాల్లో ఉంటే ఒంటరిగా ఉన్న వృద్ధుల బ్యాంకు ఖాతాలపై నిఘా పెడుతున్నారు. షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని బుట్టలో వేసుకుంటున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

- టెక్నాలజీని వినియోగించే వారు జాగ్రత్తలు పాటించాలి
- రిజిస్టర్ కాని సంస్థలో పెట్టుబడులు పెట్టకూడదు.
- డిజిటల్ అరెస్టులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండవు
- చరవాణులు, టెలిగ్రామ్‌లో వచ్చే లింకులు, ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయవద్దు.

వెంటనే అప్రమత్తమైతే..

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులను లేదా 1903 నంబరు ఆశ్రయించాలి. రెండు గంటలలోపు పోలీసులను సంప్రదిస్తే కాజేసిన మొత్తాన్ని తిరిగి పొందవచ్చు. కనీసం 24 గంటల్లో స్పందించినా ప్రయత్నించవచ్చు. వారు మీ ఖాతా నుంచి ఏ ఖాతాకు డబ్బు జమైందో గుర్తించి.. అందులోని నగదును ఫ్రీజ్ చేస్తారు. ఆలస్యం చేస్తే.. బదిలీ చేయించుకున్న మొత్తాన్ని ఇతరుల ఖాతాలకు మళ్లించే అవకాశం ఉంటుంది.

వివరాలు	2024	2025
కేసులు	241	186
దోపిడీ (కోట్లు)	12.31	14.45
రికవరీ (కోట్లు)	2.30	3.53

ఈ నంబర్లకు ఫిర్యాదు చేయండి

టోల్ ఫ్రీ: 1930, అత్యవసర: 112
వాట్సప్: 80999 99977

తప్పులు.. చిక్కులు

జిల్లాలో ఇప్పటికీ తొలగని రీ సర్వే సమస్యలు

ఈనాడు- చిత్తూరు, తిరుపతి:

జగన్ పాలనలో హడావుడిగా చేసిన రీ సర్వే ఇప్పటికీ అన్నదాతల్లో ఆందోళనను కలిగిస్తోంది. అప్పట్లో హక్కుదారుల సమ్మతి లేకుండా వేగంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని భావించడంతోనే భూమి విస్తీర్ణం, పేర్లు, ఫొటోలు తప్పుగా ముద్రించి యాజమాన్య హక్కు పత్రాలు పంపిణీ చేశారు. వాటిపై జగన్ ఫొటోను ఉంచడంపై అప్పట్లోనే రైతుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వచ్చాయి. అయినా లెక్క పెట్టకుండా వాటిని పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అప్పటి తప్పిదాలను సరిదిద్దడానికి 'రీ సర్వే గ్రామసభ'లు నిర్వహించినా పైపైనే విచారణ చేసి మమ అనిపించారు.

జగన్ హయాంలో ఆయన ఫొటోతో ఇచ్చిన పాసు పుస్తకం

రుణాలు అందక..

రీ సర్వే జరిగిన గ్రామాల్లో జగన్ పాలనలో సర్వే నంబర్ల స్థానంలో ల్యాండ్ పార్సిల్ మ్యాప్ (ఎల్‌పీఎం)ను ప్రవేశపెట్టారు. అప్పట్లో ఐదారుగురు రైతులకు కలిపి ఒకే ఎల్‌పీఎం కేటాయించారు. దాంతో వారికి పంట రుణాలూ రాని పరిస్థితి. ఒకవేళ భూమిని ఎవరికైనా విక్రయిద్దామన్నా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సంక్షేమ పథకాలు కూడా అందలేదు. గతంలో ఈ సమస్య పరిష్కారానికి రూ.500 రుసుము చెల్లించాల్సి ఉండగా కూటమి ప్రభుత్వం రూ.50 ఇస్తే చాలని పేర్కొంది. అన్నదాతలు ఎవరైనా ముందుకు రాకపోతే రెవెన్యూ యంత్రాంగమే గుర్తించి వాటిని చక్కదిద్దాలని ఉన్నతాధికారులు చెప్పినా క్షేత్రస్థాయిలో అమలు కాలేదు. ఇటీవల పంపిణీ చేసిన పాసు పుస్తకాల్లోనూ ఇవే పునరావృతం కావడంతో రైతులు తిరస్కరించారు.

వైకాపా హయాంలో రీ సర్వే పూర్తయిన గ్రామాలు: 180
విస్తీర్ణం: 39,970 ఎకరాలు
సమస్యలపై వచ్చిన అర్జీలు: 5,005

రెవెన్యూ క్లినిక్‌లలోనైనా పరిష్కరిస్తేనే

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు. యంత్రాంగం ఈ కార్యక్రమంలో రీ సర్వేకు సంబంధించి వచ్చిన అర్జీలనైనా పరిష్కరిస్తే అన్నదాతలకు చిక్కులు తప్పుతాయి. ఇది సరిగ్గా జరుగుతుందా? లేదా? అని ఉన్నతాధికారులు కూడా పర్యవేక్షించాలి.

తెప్పోత్సవం.. నేత్రోత్సవం

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తిరుపతి గోవిందరాజ స్వామివారి తెప్పోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం సాయంత్రం రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ పార్థసారథిస్వామి వారు భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామి వారు ఉభయ దేవేరులతో కలిసి తెప్పపై ఐదు చుట్లు విహరించి భక్తులకు అభయమిచ్చారు. అనంతరం ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగారు. బుధవారం కల్యాణ వేంకటేశ్వర స్వామివారు తెప్పలపై భక్తులను అనుగ్రహించనున్నారు. ఈ సందర్భంగా తితిదే హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో భజనలు, హరికథ, సంగీత కార్యక్రమాలు నిర్వహించారు.

పాఠశాలల్లో బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు ప్రత్యేకంగా మరుగుదొడ్ల నిర్మాణానికి యంత్రాంగం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. 12 రోజుల వ్యవధిలో 360 వరకు పాఠశాలల నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థినుల కోసం వీటిని నిర్మించనున్నారు. గత ప్రభుత్వంలో 124 పాఠశాలల నివేదికలు ప్రతిపాదనలకే పరిమితం కావడం, నాడు-నేడు పనులు అటకెక్కడంతో నూతన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఫిబ్రవరి నుంచి నిర్మాణాలు చేపట్టి సెలవుల్లో పూర్తి చేసేలా కసరత్తు చేస్తున్నారు. నెలాఖరులోపు 400 పాఠశాలల నుంచి ప్రతిపాదనలు వచ్చే అవకాశం ఉందని, నిధుల కేటాయింపు, ఇతర అంశాలపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

మాయ చేసి.. మాయం చేసి..

- కాగితాల్లోనే ఆడిట్ అభ్యంతరాలు
- జడ్పీలో కనిపించని దస్త్రాలు

న్యూస్‌టుడే, చిత్తూరు(మిట్టూరు)

ప్రజల నుంచి పన్నుల రూపంలో వచ్చే ఆదాయం, ప్రభుత్వం వివిధ పద్దుల కింద ఇచ్చే నిధుల వ్యయంలో స్థానిక సంస్థలు పారదర్శకత పాటించడం లేదు.. చేసే పనులకు, రాస్తున్న లెక్కలకు పొంతన ఉండటం లేదు.. గత వైకాపా పాలనలో 2023-24లో జిల్లా పరిషత్‌లో నిధుల ఖర్చులకు సంబంధించి రికార్డులే లేవని ఆడిట్‌శాఖ గుర్తించింది.. నిబంధనలు అతిక్రమించి ఇష్టానుసారంగా నిధులు ఖర్చు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

దస్త్రాలే లేవట..?

జడ్పీలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన దస్త్రాలే లేవని, తామెలా అందజేయగలమంటూ జడ్పీ అధికారులు.. ఆడిట్ శాఖ అధికారులకు చెప్పినట్లు సమాచారం. జడ్పీకి విడుదలైన నిధులు, ఖర్చులు, ఆదాయం తదితర వివిధ విభాగాల దస్త్రాలు మాయమైనట్లు తెలిసింది.

ఎప్పటికైనా పరిష్కరించుకోవాల్సిందే..

అభ్యంతరాలను ఎప్పటికైనా పరిష్కరించుకోవాల్సిందే. లేకుంటే ఆ సమయంలో విధుల్లో ఉన్న అధికారులకు ఇబ్బందులు తప్పవు. జిల్లా ఆడిట్ శాఖ ద్వారా ఇప్పటికే జడ్పీ అధికారులకు నోటీసులు ఇచ్చాం. స్పందించకపోతే రాష్ట్ర స్థాయి అధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకుంటాం.
-గోవిందప్ప, ఆర్‌డీడీ, ఆడిట్ శాఖ

మాకేం సంబంధం.. బదులివ్వలేం..

ఎప్పుడో జరిగిన పాలనాపరమైన తప్పిదాలు, అక్రమాలతో మాకేం సంబంధం.. ఇప్పుడు మేం బదులివ్వలేమంటూ 2023-24 ఆడిట్ అభ్యంతరాలపై జిల్లా పరిషత్ అధికారులు సమాధానాలు చెబుతున్నారని ఆడిట్ అధికారులు పేర్కొంటున్నారు. జడ్పీ అధికారులకు గతేడాది ఏప్రిల్‌లో జారీ చేసిన ఆడిట్ శాఖ నోటీసులు కాగితాలకే పరిమితమయ్యాయి. సదరు అభ్యంతరాలపై జడ్పీ నుంచి నేటికీ సమాధానాలు లేవు.

రూ.28.88 కోట్లకు లెక్కల్లేవు..?

గత పాలనలో జిల్లాకు చెందిన అప్పటి మంత్రికి వీర విధేయుడిగా వ్యవహరిస్తూ నాయకుల కనుసన్నల్లో కొనసాగిన విశ్రాంత సీఈవో అవినీతి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు అప్పట్లోనే వెల్లువెత్తాయి. 2023-24లో ఎన్నడూ లేనంతగా 90 అభ్యంతరాలకు సంబంధించి రూ.22.88 కోట్లకు లెక్కల్లేవని ఆడిట్ శాఖ ధ్రువీకరించింది. అభ్యంతరాలకు సంబంధించి దస్త్రాలు అందజేసి 3నెలల్లో పరిష్కరించుకోవాలి. అయినా అధికారుల్లో కదలిక లేదు.

ఇష్టానుసారంగా ఖర్చు..

ఆర్థిక సంఘం నిధులను ఇష్టానుసారంగా ఖర్చు చేశారు. పనులకు సంబంధించి ప్రొసీజర్ ల్యాప్స్, సరైన దస్త్రాలు లేనట్లు ఆడిట్‌లో గుర్తించారు. జడ్పీ ప్రావిడెంట్ ఫండ్ విభాగంలో రికార్డు లేకపోవడం గమనార్హం. వడ్డీ చెల్లింపులు, రీయింబర్స్‌మెంట్, క్యాష్ బుక్ నిర్వహణే లేదు. జీఎస్టీ, వ్యాట్, ఐటీ, క్యూసీ తదితర పన్నుల రూపంలో సమకూరిన రూ.25 లక్షలు ప్రభుత్వానికి జమ చేయలేదని అభ్యంతరాల్లో పేర్కొన్నారు.

104FM Tirupati
ఈ FM 104 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

బ్యాంకు ఉద్యోగుల సమ్మె

తిరుపతి (గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: బ్యాంకు ఉద్యోగులకు వారంలో ఐదు రోజుల పని దినాలు అమలు చేయాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ (యూఎఫ్‌బీయూ), ఎస్బీఐ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం యూఎఫ్‌బీయూ ఆధ్వర్యంలో స్థానిక ఎస్బీఐ మున్సిపల్ శాఖ వద్ద బ్యాంకు ఉద్యోగులు నిరసన తెలిపారు. వీరికి వివిధ సంఘాల నాయకులు మద్దతుగా నిలిచారు. యూఎఫ్‌బీయూ నాయకులు వీవీ ప్రసాద్, గిరిధర్, సీఆర్ఎస్ గోపినాథ్, ధన్వంత కుమార్, విజయ్‌భాస్కర్, శేషసాయి తదితరులు పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమంలో సంఘం నాయకులు, ఉద్యోగులు

శుభ స్వీకరణ

"ఆత్మీయమైన పలకరింపులకు ఇక సెలవు..."

కీ॥శే॥ డి. విఠల్ బాబు
(నవత గ్లాస్ & ప్లైవుడ్స్)

స్వస్తిశ్రీ విశ్వావసు నామ సం॥ 12-01-2026 రోజున (సోమవారం) ఉ॥ 10.22 ని॥కు మా తండ్రి గారైన శ్రీ దేశినేని విఠల్ బాబు గారు స్వర్గస్తులైనారు. అదేరోజు దహనక్రియలు మరియు పాలాభిషేకం జరిగినవి.

28-01-2026 (బుధవారం) ఉ॥ 10.00 గంటలకు మా స్వగృహం నందు కర్మక్రియలు జరుగును.
కొత్తఇండ్లు, కల్‌రోడ్ పల్లి గ్రామం, చంద్రగిరి మండలం,

ఇట్లు
డి. నవీన్, డి. ప్రవీణ్ మరియు కుటుంబ సభ్యులు
92467 69674

పెద్దకర్మ

కీ॥శే॥ శ్రీమతి డా॥ యం. శ్రీదేవి రెడ్డి
MS(General Surgeon), DNB, FRCS,
Surgical Gastroenterologist

వైద్య రంగంలో ఎన్నో మైలురాళ్ళను దాటి, పేద ప్రజలే దైవంగా భావించి, ఎంతోమందికి వైద్యసేవలు అందించి, మరెంతోమందికి ఉపాధిమార్గం చూపించి, విద్యాదాతగా, ఆరోగ్య ప్రదాతగా, మృదుస్వభావిగా అందరి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన మార్గదర్శకురాలు శ్రీమతి డా॥ యం. శ్రీదేవిరెడ్డి గారు 17-01-2026వ తేది శనివారం సా॥ 6గం॥లకు స్వర్గస్తులైనారు.
తదుపరి వీరి శుభస్వీకరణ 29-01-2026వ తేది గురువారం ఉ॥ 10 గం॥లకు ఐతేపల్లి, తిరుపతి - బెంగళూరు హైవే, చంద్రగిరి సమీపంలో, డా॥ శ్రీదేవి రెడ్డి గార్డన్స్ నందు జరుగునని తెలియజేయడమైనది. వారి పవిత్ర ఆత్మకు శాంతిచేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ ...

అశ్రునయనాలతో ...
భర్త : వెంకట్ రెడ్డి మొసలి, కుమారుడు : పృథ్వీకర్ రెడ్డి మొసలి
కుమార్తె : డా॥ ప్రీతికా రెడ్డి, అల్లుడు : నూతనకాల్వ ప్రశేన్ కుమార్ రెడ్డి
మనవళ్ళు : ఇఫ్రాన్ రెడ్డి, కైరవ్ రెడ్డి
వియ్యంకులు : నూతనకాల్వ అమర్‌నాథ్ రెడ్డి - రేణుకా రెడ్డి
మాజీ మంత్రి వర్యులు, శాసనసభ్యులు, పలమనేరు
పెద్దిరెడ్డి చెంగల్‌రెడ్డి, ఎ. అమరనాథ్ రెడ్డి, తలపల
మరియు కుటుంబ సభ్యులు
Mobile :
+91 91078 99999
+91 91077 99999

(c) eenadu

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – తాడికొండ: బ్యాటర్ల జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor
ధనిక్ భారత్ విద్యా సంస్థలు
IIT-JEE | NEET

Protein Partner
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ
(Non-Govt. Public Charitable Trust)

Hospitality Partner
City Chalapathi Institute of Technology
AUTONOMOUS
MOTHADAKA CAMPUS

Gift Partner
KL (DEEMED TO BE UNIVERSITY)

Man of the Series
Hero

Digital Partner ఈనాడు.నెట్
TV Partner ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్
Mee FM
Organised by ఈనాడు

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - I జూనియర్స్: మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ – రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్సర్లతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులకు ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - I జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సులతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

సీనియర్స్ విన్నర్స్ రాయలసీమ రాకర్స్

గ్రౌండ్-2లో సీనియర్స్ : సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ చరణ్ జిత్ ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-I (జూనియర్స్)
మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)
మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

పాఠశాలల రెన్యూవల్‌కు వసూళ్లు?

పలు ఫిర్యాదుల నేపథ్యంలో అంతర్గత విచారణ

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: విద్యాశాఖ పరిధిలో ప్రైవేటు పాఠశాలల అనుమతుల జారీ, పునరుద్ధరణ అంశం వివాదాలు, అక్రమాలకు వేదికగా మారింది. భవనాలు, మైదానాలు, అర్హతగల ఉపాధ్యాయులు, ఫైర్‌సేఫ్టీ, విద్యుత్తు, మరుగుదొడ్ల సౌకర్యం, తరగతి గదులు వంటివి నిబంధనల మేరకు లేకున్నా అనుమతులు ఇచ్చినట్లు తెలుస్తోంది. నిబంధనల మేరకు అన్ని వసతులు ఉన్నా రూ.60 వేల వరకు వసూలు చేశారని, లోటుపాట్లు ఉంటే రూ.1-2 లక్షల వరకు వసూలు చేసినట్లు పలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అమరావతిలో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కడప ఆర్జేడీ పరిధిలోకి ఉమ్మడి చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలు వస్తాయి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 182 పాఠశాలలకు అనుమతులు పునరుద్ధరించినట్లు తెలుస్తోంది. ఇందుకు వాటి యాజమాన్యాల నుంచి అధిక మొత్తంలో డబ్బులు డిమాండు చేసిన అంశం రాష్ట్రస్థాయిలో విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు రూపంలో వెళ్లడంతో ప్రస్తుతం అంతర్గత విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఏ పాఠశాలలకు రెన్యూవల్ ఇచ్చారు, నిబంధనలు అతిక్రమించినవాటిని గుర్తించే ప్రక్రియలో నిమగ్నమైనట్లు చెబుతున్నారు.

జిల్లాలో ఇలా.. ఒకటి నుంచి 5వ తరగతి వరకు ప్రైవేటు పాఠశాలలను మండలస్థాయి అధికారులు సందర్శించి నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారికి సమర్పిస్తారు. ఈ ప్రక్రియలో ఎక్కడికక్కడ సంతృప్తి చెందితేనే అనుమతులు వస్తాయని, లేనిపక్షంలో అనుమతుల కోసం కాళ్లు అరిగేలా తిరగాల్సిందేనన్న విమర్శలు లేకపోలేదు. ఆరు నుంచి పదో తరగతి వరకు ఉప విద్యాశాఖ అధికారి నేతృత్వంలో పరిశీలించి జిల్లాస్థాయి అధికారికి నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. తదనంతరం ఈ నివేదికను కడపలోని ఆర్జేడీ కార్యాలయం పరిశీలించి అనుమతులు ఇవ్వాలా, రెన్యూవల్ చేయాలా, లేక పెండింగులో పెట్టాలా అనే అంశంపై నిర్ణయం తీసుకుంటుంది. తిరుపతి జిల్లాకు సంబంధించి 43 పాఠశాలల యాజమాన్యాల నుంచి అధిక మొత్తంలో రెన్యూవల్ నిమిత్తం డబ్బులు డిమాండు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. తిరుపతిలో ఓ అధికారిణి గత ఏడాది చివర్లో సెలవుపై వెళ్లారు. దీంతో నేరుగా రంగంలోకి దిగిన మాఫియా ఆయా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడి రెన్యూవల్ చేయించినట్లు తెలుస్తోంది.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని పలువురు ప్రముఖులు మంగళవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి మూలమూర్తిని ఎం.ఎం.కీరవాణి కుటుంబం, గాయకుడు రాహుల్ సిప్లిగంజ్, ప్రముఖులు నటుడు రాజీవ్ కనకాల, సుమ దంపతులు దర్శించుకున్నారు.

శ్రీవారి ఆలయం ఎదుట సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి కుటుంబం, గాయని శ్రీలేఖ తదితరులు

భుజంపై ఎత్తుకుని.. కొండ మెట్లెక్కి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే : భక్తిని చాటుకోవడంలో ఒక్కొక్కరిదీ ఒక్కో ప్రత్యేకత. తమిళనాడుకు చెందిన భక్తులు మూడ్రోజుల క్రితం ముక్కంటి ఆలయానికి అనుబంధంగా ఉన్న కనకాచలంపై కొలువుదీరిన కనకదుర్గను దర్శించుకున్నారు. అయితే మెట్లు ఎక్కేటప్పుడు సరదాగా వారి కుటుంబీకులను భుజంపై కూర్చోబెట్టుకుని మెట్లు ఎక్కడం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కొంత దూరం వెళ్లాక మళ్లీ ఆమెను కిందకు దించేశాడు.

స్విమ్స్‌లో డయాబెటిక్ ఫుట్ క్లినిక్ ప్రారంభం

ఫిబ్రవరి 3 వరకు సేవలు

పరీక్షలు చేసుకుంటున్న డా.ఆర్వీ కుమార్

తిరుపతి (వైద్య విభాగం), న్యూస్‌టుడే: స్విమ్స్ - శ్రీ పద్మావతి హాస్పిటల్‌లో డయాబెటిక్ ఫుట్ క్లినిక్ సేవలు ప్రారంభించినట్లు సంచాలకుడు ఆర్వీ కుమార్ తెలిపారు. మధుమేహంతో పాదాల నరాలు పనిచేయకపోవడం, రక్త ప్రసరణ తగ్గడం, పాదాల చర్మం రంగు మారడం, గాయాలు తగ్గకపోవడం, తిమ్మిర్లు, పాదాల్లో వేడి.. వాపు, దుర్వాసన వంటి లక్షణాలు ఉంటే డయాబెటిక్ ఫుట్ క్లినిక్ వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ క్లినిక్ ఫిబ్రవరి 3వ తేదీ వరకు కొనసాగుతుందని, రోజూ మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు సేవలు అందిస్తామని ఫుట్ క్లినిక్ అధ్యక్షుడు డాక్టర్ హరిప్రసాద్ తెలిపారు. ఫిబ్రవరి 4 తర్వాత వచ్చే ప్రతి మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల పాటు క్లినిక్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎండోక్రైనాలజి విభాగాధిపతి అలోక్ సచన్, జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ముత్తేశ్వరయ్య, ప్రిన్సిపల్ డాక్టర్ ఉషాకళావత్, ఆర్ఎంఓ డాక్టర్ కోటిరెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాభివృద్ధికి ఒప్పందం

ఒప్పంద పత్రాలతో వర్సిటీ అధికారులు, విశ్రాంత అధికారుల ట్రస్ట్ సభ్యులు

తిరుపతి (వ్యవసాయం), న్యూస్‌టుడే: వ్యవసాయ, అనుబంధ రంగాల్లో చిరు, మధ్యతరహా పరిశ్రమల స్థాపనలో రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం, శిక్షణ ఇచ్చేందుకు వ్యవసాయ కళాశాల విశ్రాంత అధ్యాపకులు ముందుకు రావడం అభినందనీయమని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ ఉపకులపతి డా.ఆర్.శారద జయలక్ష్మీదేవి అన్నారు. వారు ఏర్పాటు చేసిన ఎఫ్.ఐ.ఆర్.ఇ.పి. (ఫైనాన్షియల్ ఇంక్లూషన్ రూరల్ ఆంత్రపెన్యూర్ ప్రమోషన్) ట్రస్ట్, వర్సిటీ మధ్య మంగళవారం పరస్పర అవగాహన ఒప్పందం జరిగింది. ఇకపై గ్రామీణ, మహిళా రైతులు, వ్యవసాయ విద్యార్థుల ఆదాయం పెంపునకు మార్గదర్శనం ఇస్తూ వర్సిటీ విస్తరణ కార్యక్రమాలు, నైపుణ్య శిక్షణలో వారు భాగస్వామ్యం వహిస్తారన్నారు. రిజిస్ట్రార్ ఎం.వి.రమణ, విశ్రాంత అధ్యాపకులు చంద్రారెడ్డి, హేమంత్‌కుమార్, పి.సుధాకర్, నాగార్జున, రామమూర్తి, వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి — టెండరు ప్రకటన

శ్రీవకుళమాత ఆలయం, పేరూరు నందు పూలు మరియు పెరుగు టెండర్ కొరకు 2026-2027 సంవత్సరమునకు 01-02-2026 నుండి 31-01-2027 గాను దరఖాస్తులు కోరడమైనది. ఆసక్తిగల వ్యాపారస్తులు "కార్యనిర్వహణాధికారి, టి.టి.డి." పేరు మీద రూ.112/- డి.డి తీసి పై తెలిపిన ఆలయములో 27-01-2026వ తేదీ నుండి దరఖాస్తు పొందగలరు. టెండరు ఫారంతో ధరావత్తు సొమ్ము (ఇ.యం.డి) Rs.10,000/- ఫారంతో D.D ద్వారా జతపరచవలెను (E.O TTD పేరు మీద). టెండరు దరఖాస్తుల స్వీకరణ ముగింపు 05-02-2026 మ.3.00 PM. టెండరు పరిశీలన 05-02-2026 మ.4.00 గంటలకు the Spl.Gr.Dy.E.O, SKVST కార్యాలయము, శ్రీనివాసమంగాపురం నందు జరుగును.
TTD-40021/10/2025-PRO SEC (Adv.No.374), Dt: 27.01.2026. కార్యనిర్వహణాధికారి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఉద్యాన శాఖ
జిల్లా ఉద్యాన అధికారి వారి కార్యాలయం, తిరుపతి.
షార్ట్ టెండర్ నోటీసు
ఆర్.ఓ.సి. నెం.ఎ/32/2025 తేది: 23.01.2026
తిరుపతి జిల్లాలోని 10 ఉద్యాన అధికారుల కేంద్రాలకు మామిడి ఫ్రూట్ కవర్లు (20X28 సెం. మీ) (టెండర్ షెడ్యూల్లో ఇచ్చిన విధంగా) కొనుగోలు చేసి సరఫరా చేయుటకు టెండర్లు కోరబడుచున్నవి. ఆసక్తి గల FPO/FPC సంస్థల వారు దరఖాస్తు రుసుము రూ. 10000/– (అక్షరాల పది వేల రూపాయలు) జిల్లా ఉద్యాన అధికారి, తిరుపతి వారి పేరు మీద తిరుపతిలో అన్ని జాతీయ బ్యాంకుల్లో చెల్లుబాటు అగునట్లుగా డి.డి. తీసి టెండరు ఫారాలు 28.01.2026 ఉదయం గం. 10.30ని.ల నుండి 31.01.2026 సాయంత్రం 05.00 గంటల వరకు పొందవచ్చును. పూర్తి చేసిన టెండర్లు 02.02.2026 నుండి 08.02.2026 సాయంత్రం 05.00 గంటల లోపల జిల్లా ఉద్యాన అధికారి వారి కార్యాలయములో డ్రాప్ బాక్స్‌లో వేయవలెను. 09.02.2026 తేది సా. 5.00 గంటలకు జాయింట్ కలెక్టరు వారి కార్యాలయములో సదరు టెండర్లు తెరువబడును. ఇతర వివరాలకు జిల్లా ఉద్యాన అధికారి, తిరుపతి వారిని సంప్రదించగలరు.
సం/- జిల్లా ఉద్యాన అధికారి, తిరుపతి జిల్లా
జాయింట్ కలెక్టరు, ఛైర్మన్, జిల్లా కొనుగోలు కమిటీ, తిరుపతి జిల్లా

శానంబట్లలో పాల వెల్లువ

రోజుకు ఆరువేల లీటర్ల సేకరణ

చంద్రగిరి, న్యూస్‌టుడే: పాడీపంట ఇవి రెండూ ఉన్న ఇంట సిరులపంటేనంటనని గ్రామీణులు నిరూపిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలతో వేసిన పంట చేతికిరాక, మంచి దిగుబడి వచ్చినా.. ధరలు లేక తరచూ అన్నదాతలు అప్పుల పాలవుతుంటారు. వీటి నుంచి తట్టుకునేందుకు పశుపోషణ ఎంతగానో ఉపయోగపడుతోంది. పాలు విక్రయిస్తూ, పశువుల వ్యర్థాలను పొలాలకు వాడుతూ.. శానంబట్ల రైతులు రెండు రకాలుగా ఆదాయం గడిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పంచాయతీ పరిధిలో 300 మందికి పైగా పాడిపై ఆధారపడి జీవిస్తున్నారు. రోజూ ఆరువేల లీటర్ల పాలు విక్రయిస్తూ ఆదాయం గడిస్తున్నారు. ఎటూ చూసినా పచ్చని పంటపొలాలు ఉండటం గ్రామం మరో ప్రత్యేకత. జిల్లాలో చిన్న పంచాయతీగా ఉంటూ ఎక్కువ పశువులను పోషిస్తూ ప్రత్యేకత చాటుకుంటున్నారు.

25 ఏళ్లుగా..

మాకు 20 ఆవులు ఉన్నాయి. రోజూ 160 లీటర్ల పాల దిగుబడి వస్తోంది. పొలంలో పశుగ్రాసం ప్రత్యేకంగా సాగు చేశాం. వెన్నశాతం మేరకు లీటరు పాలకు రూ.35-40 ధర చెల్లిస్తున్నారు. రోజుకు రూ.4,500 సంపాదిస్తున్నాం. 25 ఏళ్లుగా పాడిపరిశ్రమ ఆధారంగా జీవిస్తున్నాం.
- గోపి, కొత్తశానంబట్ల

మహిళల్లో ఆసక్తి

పంచాయతీలో పాలు సేకరిస్తూ అనేక కుటుంబాలు జీవిస్తున్నాయి. వెన్నశాతం ప్రకారం పాలను క్యాన్లలో నింపుకొని డైరీలకు సరఫరా చేస్తున్నాం. మహిళలు సైతం పాలుసేకరించి డిపోలకు అందించడానికి మొగ్గుచూపుతున్నారు. **- మీనా, మహిళా రైతు**

ప్రకృతి అద్భుతమైన ఇంజినీర్

గ్యాలరీని పరిశీలిస్తున్న తిరుపతి ఐజర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య, సీఎఫ్ సెల్వం

తిరుపతి (మంగళం), న్యూస్‌టుడే: ప్రకృతి ఓ అద్భుతమైన ఇంజినీరని, జీవవ్యవస్థలు సమస్యలను ఎలా పరిష్కరిస్తాయో గమనించడం ద్వారా మన భూమికి మేలు చేసే స్థిరమైన సాంకేతికతలను మనం సృష్టించవచ్చునని తిరుపతి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐజర్) డైరెక్టర్ ప్రొఫెసర్ శాంతను భట్టాచార్య తెలిపారు. తిరుపతి ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో మంగళవారం నూతనంగా ఏర్పాటు చేసిన బయోమిమిక్రీ గ్యాలరీ- ప్రకృతి స్ఫూర్తి సైన్స్ గ్యాలరీని అటవీశాఖ తిరుపతి సర్కిల్ సీఎఫ్ సి.సెల్వం, బెంగళూరులోని విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం డైరెక్టర్ సాజు భాస్కరన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్యాలరీలోని గబ్బిలాలకు సంబంధించిన ఎకోలొకేషన్ ప్రక్రియ ఆధారంగా దృష్టిలోపం ఉన్నవారి కోసం రూపొందించిన అల్ట్రాకేన్, తామర ఆకుల నీటి వికర్షణ గుణాలను ప్రదర్శించే ఇంటరాక్టివ్ ఎగ్జిబిట్లను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. సైన్స్ సెంటర్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ కె.శ్రీనివాసనెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

నేడు రైల్వేకోడూరులో కలెక్టర్, ఎస్పీ పర్యటన

తిరుపతి(రెవెన్యూ), న్యూస్‌టుడే: రైల్వేకోడూరులో బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు పర్యటించనున్నట్లు తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ తెలిపారు. జిల్లాలో నూతనంగా కలిసిన మండలాల్లోని సమస్యలు, చేయాల్సిన అభివృద్ధిపై పరిశీలన చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య


ప్రదీప్‌రామ్ (పాతచిత్రం)

నారాయణవనం, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాసులు కథనం మేరకు.. కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన కృష్ణమూర్తి కుమారుడు ప్రదీప్‌రామ్(19) బ్రాహ్మణతాంగేల్ సమీపంలోని శ్రీకృష్ణ హాస్టల్‌లో ఉంటూ స్థానికంగా ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఈఈఈ చదువుతున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం కళాశాలకు వెళ్లి హాస్టల్‌కి వచ్చిన ప్రదీప్‌రామ్ తన గదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హాస్టల్ యాజమాన్యం ఇచ్చిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పీజీఆర్ఎస్‌కు పూర్తిస్థాయిలో పరిష్కారం చూపించాలి

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: పీజీఆర్ఎస్ వినతులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని, గడువు దాటిన విభాగంలోకి వెళ్లకుండా చూడాలని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం వివిధ అంశాలపై ఎస్పీ సుబ్బరాయుడు, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య తదితరులతో కలిసి వివిధ శాఖల ఉన్నతాధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి సానుకూల అభిప్రాయం కలిగేలా అధికారులు పనితీరు ఉండాలన్నారు. జిల్లాలో అన్న క్యాంటీన్ల పనితీరు బాగుందని కితాబునిచ్చారు. మహిళలపై నేరాలు, డ్రగ్స్‌పై నివారణపై పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రాజముద్రతో ఎటువంటి తప్పులు లేకుండా పట్టాదారు పాసు పుస్తకాలను రైతులకు పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జేసీ గోవిందరావు, డీఆర్వో నరసింహులుతో కలిసి రెవెన్యూ అంశాలపై కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ క్లినిక్‌లు ప్రతి మండలంలో జరిగేలా సంబంధిత ఆర్డీవోలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఏపీఐఐసీకి సంబంధించిన దుగరాజపట్నం పనులు, శ్రీసిటీ అప్రోచ్ వంతెన తదితర పనులపై చర్చించారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయభరత్‌రెడ్డి, శ్రీసిటీ జీఎం భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో వ్యక్తి అదృశ్యం


అదృశ్యమైన బస్తా రావ్

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన వ్యక్తి అదృశ్యమైనట్లు తిరుమల వన్‌టౌన్ ఏఎస్ఐ మోహన్‌నాయుడు తెలిపారు. ఒడిశా రాష్ట్రం డెంకానల్ జిల్లా జగన్నాథపురం చెందిన బస్తా రౌట్ (65) కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 24వ తేదీన తిరుమలకు చేరుకున్నారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో తప్పిపోయిన అతను తిరిగి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. వివరాలు తెలిసినవారు పీఎస్ నెం.0877-2289027కు సమాచారం అందించాలని ఏఎస్ఐ కోరారు.

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఉద్యోగం ఇప్పిస్తామని నగదు వసూలు చేసి మోసం చేశారని ఏర్పేడు మండలంలోని పంగూరుకు చెందిన కృష్ణకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం మేరకు.. రేణిగుంట విద్యుత్తు ఉపకేంద్రంలో షిఫ్ట్ ఆపరేటర్‌గా ఉద్యోగం ఇప్పిస్తామని కొందరు వ్యక్తులు రాజకీయనేతల పేరుతో మూడునెలల కిందట రూ.3 లక్షల నగదు తీసుకున్నారు. ఇప్పటి వరకు ఉద్యోగం ఇప్పించకపోగా నగదు తిరిగి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. పోలీసులు న్యాయం చేయాలని కోరారు.

ఎర్రచందనం కేసులో అయిదేళ్ల జైలు

తిరుపతి (లీగల్) : వైఎస్సార్ కడప జిల్లా ఫ్లైయింగ్ స్క్వాడ్ డివిజన్ పరిధిలో నమోదైన ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నలుగురు నిందితులకు అయిదేళ్ల జైలుశిక్ష, రూ.3 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతిలోని ఎర్రచందనం కోర్టు న్యాయమూర్తి ఎ.నరసింహమూర్తి మంగళవారం తీర్పు వెలువరించినట్లు కోర్టు ప్రత్యేక పీపీ ఎ.అమరనారాయణ, పోలీసు లైజన్ అధికారులు జి.వెంకటేశ్వర్లు, ఎన్.రాజేష్, ఎం.శ్రీనివాసులు తెలిపారు. 2018లో కేసు నమోదు చేసి తమిళనాడు రాష్ట్రానికి చెందిన నడిపయ్యన్ మణికంఠన్, అన్నామలై ముగతియ, సదయాన్ సుబ్రహ్మణ్యన్, పిచ్చయ్యన్ శ్రీనివాసన్‌లను అరెస్టుచేసి వారి నుంచి 61 దుంగలు స్వాధీనం చేసుకుని కోర్టుకి అప్పగించారు.

బెట్టింగ్ కేసులో మరో నలుగురి అరెస్టు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: క్రికెట్ బెట్టింగ్ కేసులో మరో నలుగురు నిందితులను సైబర్‌క్రైం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఇప్పటివరకు ఈ కేసులో ఇద్దరిని అరెస్టు చేయగా తాజాగా ఆ సంఖ్య ఆరుకి చేరింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కమీషన్ కోసం నాని క్రికెట్ ప్రెడిక్షన్, వినయ్ క్రికెట్ కింగ్, మురళీ క్రికెట్, అజయ్ క్రికెట్ సంస్థల ద్వారా బెట్టింగ్ నిర్వాహకులు, ఆడేవారికి ఆన్‌లైన్‌లో మధ్యవర్తులుగా ఉంటూ పలువురు లావాదేవీలు జరుపుతున్నారు. ఈ క్రమంలో బుకీల సమాచారం వెలుగులోకి వచ్చింది. విశాఖలోని రుషికొండలోని ఓ హోటల్‌లో నలుగురిని అరెస్టు చేశారు. ఇందులో తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం రాగిమానుకుంట కాలనీకి చెందిన దేశినేని సుమంత్ (25), చిత్తూరులోని చంద్రగిరి మండలం కోటాల గ్రామానికి చెందిన లంకిపల్లి గణేష్ (27), తుళ్లూరు మండలం పెద్దకూరపాడుకు చెందిన కోపులు మురళి (21), నగరంపాలేనికి చెందిన మేడం బద్రేశ్వరరెడ్డి (22) ఉన్నారు. వీరిని రిమాండ్‌కు తరలించారు. చరవాణులు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు

పూత దశలో ఉన్న మామిడి తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

తిరుపతి (గ్రామీణం), న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు పడ్డాయని, ఇది మామిడి పంటపై తీవ్ర ప్రభావం చూపుతుందని, రసం పీల్చు పురుగులు, శిలీంద్రాలు ఆశించి దిగుబడి నష్టపరిచే అవకాశం ఉందనిరాస్ కేవీకే శాస్త్రవేత్తలు సుధాకర్, డా.శ్రీనివాసులు తెలిపారు. సస్యరక్షణ చర్యలను మంగళవారం వెల్లడించారు. తోటల్లో పూత ఒకేసారి రావడానికి మల్టి-కె 10 గ్రా, సూక్ష్మపోషక మిశ్రం 5 గ్రాములు చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. తేనెమంచు పురుగు, నల్లమచ్చ తెగులు, బూడిద తెగులు నివారణకు క్లోరిపైరిఫాస్ 50ఈసీ ఒక మి.లీ., వేపనూనె 3 మి.లీ, డైథేన్ ఎం45, బావిస్టిన్ (సాఫ్) 2 గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. మొగ్గదశ నుంచి పచ్చిపూత దశలో ఉన్న తోటల్లో తేనెమంచు, నల్లమచ్చ పురుగు, బూడిద తెగులు నివారణకు అసిఫేట్, బుప్రొఫెజిన్ 1.5 గ్రా, హెక్సాకొనజోల్ 5శాతం ఈసీ 1 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. వచ్చిన పూత ఎక్కువగా పిందె పట్టడానికి సూక్ష్మపోషక మిశ్రమాన్ని 5 గ్రాముల చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు.

ఇంటర్ పరీక్షలకు 687 మంది హాజరు

తిరుపతి (విద్య): ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులకు మంగళవారం ప్రయోగ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 9 కేంద్రాల్లో ఉదయం జరిగిన పరీక్షకు మొదటి సంవత్సరం విద్యార్థులు 46 మందికిగాను 361 మంది, మధ్యాహ్నం 350 మందికిగాను 326 మంది హాజరయ్యారు. వీరికి నెలాఖరువరకు పరీక్షలు జరగనున్నాయి. ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీ వరకు రెగ్యులర్ విద్యార్థుల ప్రయోగ పరీక్షలు జరగనున్నాయి.

EENADU Classifieds

EDUCATION
విజయవాడలో BPT/B.Sc., MLT- మేనేజ్‌మెంట్ కోటా సీట్లు- తక్కువ ఫీజు- కొన్నిసీట్లు కలవు. Affiliated to Dr.NTR యూనివర్సిటీ. ✆ 7680065835.

DISTANCE EDUCATION
10th/Inter, BA, B.Com., B.Sc,BBA, BCA, BLIS, MA,M.Com, M.Sc, MCA, MBA,MLIS, Dip, B.Tech, M.Tech, Ph.D, BNYS, BPT, Pharmacy, LLB, BA LLB. 9032030124.

JOBS
ADMISSION Pro for Om Narayana EM High School Q: any Degree. S: 15 to 30K +Incentives. TPT, Anmh, NLR Dt. ✆ 8106891985.
తిరుపతి నందు ఆఫీసులో పనిచేయుటకు ఆఫీసు బాయ్స్, క్లర్కులు కావలెను. ఆకర్షణీయ జీతం కలదు. Cont: 99489 55539.
E-KART నందు అర్జెంటుగా M/F కావలెను. Qly: Inter, Any Degree. Sal: 15,000/-. Online are Available. 9014120139.

THE EENADU WAY CLASSIFIEDS
B/W 5 లైన్ల ప్రకటన రూ. 500/-
Colour 5 లైన్ల ప్రకటన రూ. 600/- మాత్రమే
తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290
మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

తిరుపతి

•తిరుపతి • చంద్రగిరి

ఘనంగా ఆదర్శ పాఠశాల వార్షికోత్సవం

యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: స్థానిక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సరళ ఆధ్వర్యంలో వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. తెదేపా మండల అధ్యక్షుడు రఘునాథ, ఎంఈవో బాలసుబ్రహ్మణ్యం మాట్లాడారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. తెదేపా మండల ప్రధాన కార్యదర్శి మహేష్ నాయుడు, వైద్యాధికారిణి లీనాకుమారి, పాఠశాల కమిటీ ఛైర్మన్ ఉదయ్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తరకం చెరకు సాగు పరిశీలన

తిరుచానూరు, న్యూస్‌టుడే: వేమూరులో ఆదర్శ రైతు దామా అయ్యప్పనాయుడు పండించిన కొత్తరకం 16టీ7 చెరకు పంటను మంగళవారం శాస్త్రవేత్తలు రెడ్డికుమార్, రాకూర్ బృందం పరిశీలించింది. మండల వ్యవసాయశాఖ అధికారి సుబ్బరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిటెక్నిక్ క్రీడలు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: తిరుపతిలో బుధవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు రాష్ట్రస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీలు జరగనున్నాయి. స్థానిక ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బాలురకు, శ్రీపద్మావతి కళాశాలలో బాలికలకు వసతి ఏర్పాటుతోపాటు 25 రకాల క్రీడలు నిర్వహించనున్నట్లు ఎస్వీ కళాశాల ప్రిన్సిపల్ డా.ద్వారకనాథరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ రాజీవ్ ఓ ప్రకటనలో తెలిపారు.

పశుఆరోగ్య శిబిరాలు..

చంద్రగిరి, న్యూస్‌టుడే: నరసింగాపురం, రెడ్డివారిపల్లి, పాతశానంబట్ల పంచాయతీల్లో బుధవారం పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ వైద్యులు వంశీకృష్ణ, మౌనికాయాదవ్ కోరారు.

సమావేశంలో పాల్గొన్న అతిథులు, అధ్యాపకులు

వినియోగదారుల హక్కులు తెలుసుకోవాలి

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: వినియోగదారుల హక్కుల గురించి తెలుసుకోవాలని సీసీఐ ఛైర్మన్ అనంత్‌శర్మ పేర్కొన్నారు. శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం ధ్రుతి సమావేశ మందిరంలో వినియోగదారుల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కులపై అవగాహన లేమితో ఎంతోమంది కష్టమర్లు నష్టపోతున్నారని తెలిపారు. డిజిటల్ వినియోగదారుల భద్రత, ఫిర్యాదు చేసే విధానాలను వివరించారు. జిల్లా వినియోగదారుల మండలి అధ్యక్షులు రాజారెడ్డి, సీసీఐ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సెల్వరాజన్, ఉపాధ్యక్షులు హరిబాబు, రాష్ట్ర అధ్యక్షులు గోవిందరావు, తదితరులు ప్రసంగించారు. పౌరసరఫరాల శాఖ అధికారి అనురూప్, ఎన్ఎస్ఎస్ సెల్ కో-ఆర్డినేటర్ లలితకుమారి పాల్గొన్నారు.

8 నుంచి కల్యాణ వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు

చంద్రగిరి, న్యూస్‌టుడే: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 8 నుంచి 16 వరకు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 5న ఉదయం 6.30 నుంచి 11 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 7న సాయంత్రం అంకురార్పణం, 8న ఉదయం 8.15 నుంచి 8.35 గంటల మధ్యన శుభకుంభ లగ్నంలో ధ్వజారోహణంతో తొమ్మిదిరోజుల బ్రహ్మోత్సవాలు మొదలవుతాయి. అదే రోజు రాత్రి పెద్దశేష వాహనసేవ జరగనుంది.

బీటెక్ విద్యకు యోగ ముద్ర

ఆరోగ్య సమాజమూ కీలకమంటున్న మహిళా వర్సిటీ విద్యార్థినులు

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: ఆధునిక యుగంలో మనిషికి యోగా చాలా అవసరం. ఇది శరీరం, మనసును నియంత్రణలో ఉంచడంతోపాటు అనారోగ్యం దరి చేరనీయదు. ప్రతిరోజూ క్రమంతప్పకుండా సాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని శ్రీపద్మావతి మహిళా వర్సిటీకి చెందిన పలువురు బీటెక్ విద్యార్థినులు అంటున్నారు. భవిష్యత్తు లక్ష్యాన్ని చేరుకునే కోర్సులు అభ్యసిస్తూనే. వర్సిటీలో ప్రత్యేకంగా యోగా సర్టిఫికెట్ కోర్సులు చేస్తూ పోటీల్లో జిల్లా, రాష్ట్రస్థాయిలో సత్తా చాటుతున్నారు.

ధ్రువపత్రం అందుకుంటున్న తేజశ్రీ

మూడు బంగారు పతకాలు



మూడేళ్లుగా సాధన చేస్తున్నా. బీటెక్ చదువుతూనే వర్సిటీ నుంచి డిప్లొమా ఇన్ యోగా సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేశా. యోగాలో అన్ని ఆసనాలు అలవోకగా వేయగలను. తిరుపతి, భువనేశ్వర్, బెంగళూరులో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించా. జిల్లాస్థాయిలో మూడు బంగారు, వెండి, రాష్ట్రస్థాయిలో రెండు వెండి, కాంస్యం సాధించా. ఇంట్లో వాళ్లందరికీ యోగా నేర్పించా. ప్రతిరోజూ అందరూ తప్పకుండా సాధన కొనసాగిస్తారు. **- కె.కావ్యశ్రీ, బీటెక్ విద్యార్థిని**

మహిళల సమస్యలకు చెక్



భుజంగాసనంతో మహిళల ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలున్నాయి. రుతుక్రమం సక్రమంగా రానివారికి ఈ ఆసనం ఎంతగానో ఉపయోగపడుతుంది. అండాశయం, మూత్రాశయానికి సంబంధించిన పలు సమస్యలను ఈ ఆసనం నివారిస్తుంది. మధుమేహ బాధితులు సైతం మంచి ఫలితాలు పొందవచ్చు. మెడ, వీపునకు సంబంధించిన నొప్పి సమస్యలకు బాగా పనిచేస్తుంది. మూడేళ్లుగా సాధన చేస్తున్నా. నాకున్న చిన్న ఆరోగ్య సమస్యలన్నింటికి పరిష్కారం దొరికింది. జిల్లాస్థాయి పోటీల్లో 4 బంగారు, రాష్ట్రస్థాయిలో 3 పతకాలు సాధించా. మూడుసార్లు జాతీయస్థాయి పోటీలలో పాల్గొన్నా. **- ఎం.త్రివేణి, బీటెక్ విద్యార్థిని**

ఆరోగ్య సమస్యలకు... : బీటెక్ చదువుతూనే డిప్లొమా కోర్సు చేస్తున్నా. రెండేళ్లుగా సాధన కొనసాగుతోంది. ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రులకు రూ.లక్షల్లో వెచ్చించాల్సి వస్తోంది. వాటికి చెక్ పెడుతూ ప్రతిఒక్కరూ రోజూ గంటసేపు సాధన చేయాలి. అప్పుడే ఆరోగ్యంగా ఉంటారు. తిరుపతి, తాడేపల్లిగూడెం, ఛత్తీస్‌గఢ్‌లలో జరిగిన యోగా పోటీల్లో పతకాలు సాధించా. హ్యాండ్ బ్యాలెన్స్ పోటీలో బంగారు, బ్యాక్ బెండింగ్‌లో రజత పతకాలు వచ్చాయి. తాడేపల్లిగూడెంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలో బంగారు పతకం సాధించా. జాతీయస్థాయిలోనూ పాల్గొన్నా. **- పి.తేజశ్రీ, బీటెక్ విద్యార్థిని**

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే:

సమస్య: రేణిగుంట రోడ్డులో పశువులు ఎక్కువగా రోడ్డుపైన సంచరిస్తున్నాయి. బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. వాహనదారులు ఏమాత్రం నిర్లక్ష్యంగా వాహనాలు నడిపినా ప్రమాదం తప్పదు. **- వ్యాపారులు, రేణిగుంటరోడ్డు**

సమాధానం: పరిశీలించి వాటి తరలింపునకు చర్యలు చేపడతాం. **- డా.గుణశేఖర్, నగరపాలిక పశువైద్యాధికారి**

సమస్య: మహిళా వర్సిటీ మార్గం మొత్తం చిరువ్యాపారులు ఆక్రమించుకున్నారు. గతంలో ఈ మార్గంలో రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది కాదు. ఇప్పుడు ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. **- మారుతీ ప్రసాద్, పద్మావతినగర్.**

సమాధానం: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే దుకాణాలు తొలగిస్తాం. **- ఖాన్, నగరపాలిక ప్రణాళికాధికారి**

రామచంద్రాపురం, న్యూస్‌టుడే :

సమస్య: మండలంలోని మిట్టకండ్రిగ నుంచి పరమాలకు వెళ్లే ప్రధాన రహదారిలో యాగప్పరెడ్డికండ్రిగ వద్ద గ్రామం నుంచి వచ్చే నీరు రోడ్డుపై నిల్వ చేరుతోంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి బస్సుల కోసం వేచి ఉండాలంటే తిప్పలు తప్పట్లేదు. **- పవన్, వాహనదారుడు**

సమాధానం : సమస్యను పరిశీలించి రోడ్డుపై నీరు నిల్వకుండా పరిష్కరిస్తాం. **-పులిరాంసింగ్, ఎంపీడీవో**

విద్యుత్తు తీగలకు మరమ్మతు

స్పందనకు వందనం

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: రాయలచెరువు సమీపంలోని రాజానగర వద్ద వ్యవసాయ పొలాల్లోని విద్యుత్తు తీగలను ఆశాఖ అధికారులు సరిచేశారు. చేతికి అందే ఎత్తులో ఉండటంపై ఇటీవల 'ఈనాడు'లో వచ్చిన వార్తకు వారు స్పందించారు.

అలిపిరిలో వైకాపా అనవసర రాద్ధాంతం

తిరుపతి (తితిదే) : వైకాపా నేతలు, కార్యకర్తలు మంగళవారం అలిపిరి శ్రీవారి పాదాల మండపం, గరుడ కూడలి వద్ద అనవసర రాద్ధాంతం చేయడంపై భక్తులు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. లడ్డూ అంశంలో ఎటువంటి జంతువుల కొవ్వు కలపలేదని పసుపు నీళ్లతో మెట్లు కడగటం, వైసీపీ జిందాబాద్ అంటూ కేకలు వేయడం, భూమన నిజాయతీపరుడు అంటూ అరవడంతో విజిలెన్స్ విభాగం వారిని పంపించారు.

పెట్రోల్ బాటిల్‌తో నిరసన

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: ఆర్సీపురం మండలం సి.రామాపురం గ్రామానికి చెందిన సి.ఈశ్వర్‌రెడ్డి, మునిరత్నంరెడ్డిలు కుటుంబ సమేతంగా మంగళవారం పెట్రల్ బాటిల్‌తో వచ్చి కలెక్టరేట్‌లో నిరసన తెలిపారు. సర్వే నం.169/9లో 35 సెంట్ల బావి, మరో సెంటు భూమి మొత్తం 36 సెంట్ల వివాదాన్ని పరిష్కరించి న్యాయం చేయాలని డిమాండు చేశారు.

స్టీవార్డెన్‌ను తొలగించాలని వినతి

తిరుపతి (ఎస్వీయూ) : ఎస్వీయూ ఆవరణలోని డి-మెస్‌లో స్టీవార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్న నాగముని ప్రతి నిత్యం మద్యం తాగి విద్యార్థులను బెదిరిస్తున్నారని, ఆయనను తొలగించాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సుధారాణికి న్యాయ విభాగం విద్యార్థులు వినతిపత్రాన్ని సమర్పించారు.

ఇక్కడ చెత్తే పొంగేది

తిరుపతి అన్నమయ్య మార్గం మాస్టర్‌ప్లాన్ రహదారిలో కొత్తపల్లి వద్ద ఉన్న పెద్దకాలువలో కల్వర్టు వద్ద వ్యర్థాలు పేరుకుపోయాయి. చెత్తాచెదారం, ప్లాస్టిక్ ఇలా పోగు పడుతుంటే మురుగునీరు పారేదెలా అంటూ స్థానికులు వాపోతున్నారు. అధికారులు పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
- ఈనాడు, తిరుపతి

భక్తులు నడిచేదెలా?

తిరుపతి నగరంలోని పెద్దకాపు లేఅవుట్‌లో నిత్యం శ్రీవారి భక్తులు రాకపోకలు సాగించే మార్గంలో రహదారి గుంతలమయమై అధ్వానంగా మారింది. రాత్రి వేళలో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు పర్యవేక్షించి మరమ్మతు చేయించాల్సి ఉంది. **- ఈనాడు, తిరుపతి**

స్తంభం.. తప్పిన ప్రమాదం

చంద్రగిరి మండలంలోని బుచ్చినాయుడుపల్లి పొలిమేరలో మంగళవారం కార్మికుడు త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. నియంత్రిక ఇటీవల చోరీకి గురికాగా మంగళవారం మరోటి ట్రాక్టరులో తీసుకువచ్చారు. ఇనుప గొలుసుల సాయంతో అమర్చేందుకు యత్నిస్తుండగా స్తంభం ముక్కలై ట్రాక్టరుపై పడింది. అంతా ఊపిరి పీల్చుకున్నారు. **- న్యూస్‌టుడే, చంద్రగిరి**

మురుగు.. ముఖద్వారం

తిరుపతి గ్రామీణ మండలంలోని సి.మల్లవరం ముఖద్వారం వద్ద మురుగునీరు నిలిచిపోతోంది. ఈ రోడ్డుమీదుగా స్థానికులు గ్రామంలోకి ప్రవేశిస్తున్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో సాయంత్రం వేళ దోమలు ఎక్కువగా ఉంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి మురుగునీరు నిల్వచేరకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, తిరుపతి

బ్రాహ్మణ కో-ఆపరేటివ్ రుణాల పంపిణీ

సభ్యులకు రుణపత్రాల చెక్కు అందజేస్తున్న నిర్వాహకులు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: లడ్డూ ప్రసాదాల విభాగంలో పనిచేస్తున్న శ్రీవేంకటేశ్వర పోటు కార్మికులు ఆరుగురికి తిరుపతి బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నుంచి రూ.8 లక్షల చొప్పున మొత్తం రూ.48 లక్షల రుణ మంజూరు పత్రాలను మంగళవారం అందజేశారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో శ్రీకాళహస్తి పాలక మండలి సభ్యురాలు కామరాజుగడ్డ కుసుమకుమారి వాటిని అందజేశారు. సభ్యులు సి.ఆర్.కె. శేషగిరిరావు, భాగవతుల జయలక్ష్మి, సొసైటీ సీనియర్ అసిస్టెంట్ పి.ఆర్.ఎల్.కుమార్, అసిస్టెంట్ కార్తీక్, డి.లీలావతి, బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు చిత్రపు హనుమంతరావు పాల్గొన్నారు.

నూతన జేఈవో తనిఖీలు

డాక్టర్ ఎ.శరత్‌ను సన్మానిస్తున్న తితిదే ఉద్యోగ సంఘాల నేతలు

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తితిదే విద్యా, వైద్య విభాగం నూతన జేఈవోగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఎ.శరత్ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. తితిదే విద్యా సంస్థలను సందర్శించి అక్కడి లోటుపాట్లను ప్రిన్సిపాళ్లు, వార్డెన్ల నుంచి అడిగి తెలుసుకున్నారు. విభాగంలో చేపట్టాల్సిన అంశాలపై డీఈవో వెంకటసునీలు, సూపరింటెండెంట్ శివకుమార్‌లతో సమావేశమయ్యారు. ఉద్యోగ సంఘాల నేతలు చీర్ల కిరణ్, సునీల్‌కుమార్ యాదవ్, వంకీపురం పవన్, శైలేంద్ర కుమార్ యాదవ్, అడసలపల్లి వాసు, డా.ఎం.ప్రసాదరావు, జె.భాస్కర్ తదితరులు అభినందనలు తెలిపారు.

జాతీయ పురస్కారం

పురస్కారం అందుకుంటున్న పీఆర్ఎస్ఐ ప్రతినిధులు

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పిఆర్ఎస్ఐ) తిరుపతి చాప్టర్‌కు జాతీయస్థాయిలో కార్యక్రమాల నిర్వహణలో ఉత్తమ అవార్డు లభించింది. ఈ అవార్డును తితిదే ముఖ్య ప్రజాసంబంధాల విభాగం అధికారి డా.తలారి రవి మంగళవారం చాప్టర్ ఛైర్మన్ డా.జి.ఎస్.ప్రసాద్, కార్యదర్శి దుద్యాల చంద్రమోహన్, ఇతర కార్యవర్గ సభ్యులకు ప్రదానం చేశారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఇటీవల డెహ్రాడూన్‌లో జాతీయ సదస్సు జరిగింది. జాతీయ కౌన్సిల్ సభ్యులు కె.శ్రీనివాసరావు, కోశాధికారి కె.మధుసూదన్, జాయింట్ సెక్రటరీ సంస్కార్ రాజేష్, కార్యవర్గ సభ్యులు డా.సి.స్వరాజ్యలక్ష్మి, వి.వి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఎలక్ట్రీషియన్ల దినోత్సవం

పాకాల, న్యూస్‌టుడే: ప్రైవేటు ఎలక్ట్రీషియన్ల దినోత్సవాన్ని పాకాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి తమ డిమాండ్లను వినిపించారు. నిత్యం ప్రత్యేక రాయితీలతో ఆదుకోవాలని, ప్రభుత్వ పనుల్లోనూ అవకాశాలు కల్పించి ఉపాధికి సహకరించాలని సంఘం మండల శాఖ అధ్యక్షుడు షబీర్, కార్యదర్శి వెంకటేష్ విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, ప్రతినిధులు భాస్కర్, బాలాజీ, గంగాధర్, సెబాస్టియన్, లోక, వెంకట్రమణారెడ్డి, పురుషోత్తం, లోకనాథ్‌సింగ్, వెంకటేశ్వర్లు, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ పరికరాలు ఇవ్వాలి

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: ఆదరణ పథకం కింద నాయీ బ్రాహ్మణకులకు పరికరాలు మంజూరు చేయాలని మంత్రి సవితకు నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం వినతి సమర్పించారు. మగళవారం విజయవాడలో మంత్రిని కలిశారు. నాదస్వరం, డోలు, బ్యాండ్ యూనిట్లు, బ్యూటీషియన్, సెలూన్ షాపులకు సంబంధించి ఆధునిక పరికరాలు అందించాలని కోరారు.

చరిత్రలో నిలిచిన యువగళం పాదయాత్ర

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయిందని...పార్టీ అధికారంలోకి రావడానికి దోహదపడిందని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి డా.కోడూరు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం ఆటో డ్రైవర్లతో కలిసి సంబరాలు చేసుకున్నారు. 36వ డివిజన్‌లోని రాజన్న పార్కువద్ద తెదేపా నాయకులు మొక్కలు నాటి, కేక్ కోశారు. రజక కార్పొరేషన్ డైరెక్టర్ కరాటేచంద్ర, రాష్ట్ర కనీస వేతనాల డైరెక్టర్ జయరామిరెడ్డి, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యనిర్వాహక కార్యదర్శి తులసీరాం, మాజీ కౌన్సెలర్ చుక్కల దాము, తెదేపా బీసీ సెల్ నాయకుడు లోకనాథ్ యాదవ్ పాల్గొన్నారు. వర్సిటీలో టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. వెంకటేశ్వర నాయుడు, ఆనంద్ గౌడ్ పాల్గొన్నారు.

అత్యాచార కేసులో నిందితుడి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: తిరుపతి గ్రామీణ మండలానికి చెందిన యువతి (19)పై అత్యాచారానికి పాల్పడ్డ నిందితుడిని అరెస్టు చేసినట్లు అలిపిరి సీఐ రామ్‌కిషోర్ తెలిపారు. ఈనెల 23వ తేదీన రామచంద్ర నగర్‌లోని ఓ ప్రైవేట్ లాడ్జిలో యువతిపై అత్యాచారం జరిగినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడు రామచంద్రానగర్‌లో ఉన్నట్లు తెలుసుకుని మంగళవారం అరెస్టు చేశారు. బద్వేలుకు చెందిన వీర యశ్వంత్ (21)గా గుర్తించి న్యాయస్థానంలో ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

రాపిడో సిబ్బందిపై ఆటోవాలాల దాడి

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: రాపిడో సంస్థకు వ్యతిరేకంగా కొందరు ఆటోడ్రైవర్లు స్థానిక శాంతినగర్‌లోని ఆ సంస్థ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. ఈ క్రమంలో రాపిడో జోనల్ మేనేజర్ శ్రీనివాసులు, సంస్థ ఉద్యోగి చరణ్‌రాజ్ ప్రశ్నించడంతో వారిపై దాడికి పాల్పడ్డారు. రాపిడో సేవలు కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరింపులకు పాల్పడ్డారు. కేసు నమోదు చేసి ఆటో డ్రైవర్ల కోసం దర్యాప్తు చేస్తున్నట్లు అలిపిరి సీఐ రామ్‌కిషోర్ తెలిపారు.

అనధికార వ్యక్తుల తరలింపు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో అనధికార వ్యక్తుల తరలింపునకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మొత్తం 32 మందిని తిరుమల నుంచి తిరుపతికి బస్సుల్లో పంపారు. అనుమానాస్పదంగా ఉన్న 15 మంది వ్యక్తులను 'పాపిలియన్ డివైజ్'తో తనిఖీ చేశారు.

కారు నడుపుతూ..
గుండెపోటుతో వైద్యుడి మృతి



మల్లికార్జునరెడ్డి (పాత చిత్రం)

తిరుపతి (వైద్య విభాగం), న్యూస్‌టుడే: కారు నడుపుతూ గుండెపోటుకు గురైన వైద్యుడు మృతి చెందారు. అలిపిరి సీఐ రామ్‌కిషోర్ వివరాల మేరకు.. స్థానిక మధురానగర్ ఎస్ఎస్ గార్డెన్ అపార్టమెంట్‌లో డా.జీఆర్ మల్లికార్జునరెడ్డి (59) నివాసం ఉంటూ అమర ఆసుపత్రిలో పని చేస్తున్నారు. మంగళవారం ఉదయం కుమారుడు భరత్‌రెడ్డిని తన కారులో పాఠశాలలో దించి తిరిగి వస్తుండగా.. కారులోనే స్పృహ కోల్పోయారు. వాహనంపై నియంత్రణ కోల్పోయి అపార్టమెంట్ ప్రహరీని ఢీకొట్టారు. స్థానికులు స్విమ్స్‌కు తరలించగా గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య హిమబిందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

IN THE COURT OF THE
1ST ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) TIRUPATI
OEP No. 237 of 2025
OS No. 446 of 2019
Between: Avula Srinivasa Murthy
Decree Holder
And: A.Dhanamma & others
Judgement debtors
Notice U/o 21 Rule 64 CPC to Judgment debtors
To:1.A.Dhanamma W/o Late A. Muna swamy,
2. A.Lakshmi, D/o Late A.Muna swamy,
3. A.Venkatamuni S/o Late A. Munaswamy,
4. A.Kishore S/o Late A.Muna swamy D.No.8-288/5B, Sathya narayanapuram, TIRUPATI TOWN, Tirupati District .
Please take notice that the above decree holder filed Execution Petition for sale of E.P. schedule property and the same is posted to 18-02-2026 at 10-00 AM for your notice and you are hereby informed to appear in person or through an advocate on that date to raise your objections if any , failing which it will be decided in your absence.
(BY ORDER OF THE COURT)
PALLIPATTU MANI,
Advocate, Tirupati, Cell: 9491273119

ప్రభుత్వ భూముల జోలికొస్తే క్రిమినల్ చర్యలు

ఆర్డీవో రామమోహన్

తిరుపతి(రెవెన్యూ), న్యూస్‌టుడే: రీసర్వే సమస్యలు ఒక్కొక్కటిగా చక్కదిద్ది రైతులకు న్యాయం చేస్తామని, రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కొనసాగుతుందని తిరుపతి ఆర్డీవో రామమోహన్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని రెవెన్యూ సంబంధిత సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు.

రీసర్వేకు రైతులు తప్పనిసరి

డివిజన్‌లో మూడోవిడత రీ-సర్వే పూర్తయి నాలుగో విడత జరుగుతోంది. ఇప్పటివరకు చేసినవి కలిపి మొత్తం 132 గ్రామాలు ఉన్నాయి. రీ-సర్వే సమయంలో రైతులు తప్పక హాజరుకావాల్సి ఉండగా కొందరు స్పందించడం లేదు. దీంతో విస్తీర్ణం, హద్దులు వంటి సమస్యలు తలెత్తి రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి. రైతులు సరైన ఆధార్, ఫోన్ నంబరుతో రీ-సర్వే సమయంలో హాజరై సహకరించాలి. గత ప్రభుత్వం జారీచేసిన పట్టాదారు పాసుపుస్తకాల్లోని తప్పులు సరిచేస్తున్నాం. వాటి స్థానంలో రాజముద్రతో కూడిన నూతన పాసుపుస్తకాలు ఇవ్వాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏడు గ్రామాల్లో 802 మంది రైతులకు వాటిని పంపిణీ చేశాం.

ఆక్రమణల క్రమబద్ధీకరణకు 1,100 దరఖాస్తులు

డివిజన్ పరిధిలో ప్రభుత్వ భూములను గుర్తించి నిఘా ఉంచాం. ప్రతి మండలంలో బృందం ఏర్పాటు చేసి నిరంతరం పరిశీలిస్తున్నాం. ప్రభుత్వ భూముల్లో సూచికలు ఏర్పాటు చేయిస్తున్నాం. ప్రభుత్వ భూములు, చెరువులు, వాగులు, కుంటలు ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదు. ఎఫ్ఐఆర్ నమోదుచేసి క్రిమినల్ చర్యలు తీసుకుంటాం. అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల ఆక్రమణలను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వ ఉత్తర్వు 30 అనుసరించి డివిజన్‌లో మొత్తం 1,100 దరఖాస్తులు అందాయి. వాటిలో 900 దరఖాస్తులను పరిశీలించగా 471 మంది అర్హులుగా తేలారు. వారికి త్వరలోనే తేదీ ప్రకటించి క్రమబద్ధీకరణ పట్టాలు అందజేస్తాం.

'చౌక' అక్రమాలపై నిఘా

చౌకదుకాణాల డీలర్ల అక్రమాలపై ఫిర్యాదులు అందుతున్న విషయం వాస్తవమే. ఆ మేరకు విజిలెన్స్ అధికారులతో తనిఖీలు చేయిస్తున్నాం. గడిచిన నాలుగు నెలల్లో 15 నుంచి 20 దుకాణాలు తనిఖీ చేసి డీలర్లపై చర్యలు తీసుకోవడంతో పాటు స్టాక్ సీజ్ చేయడం జరిగింది. నూతన డీలర్లను నియమించే ప్రక్రియ కొనసాగుతోంది. రేషన్ బియ్యం అక్రమ రవాణాలో పట్టుబడే వారికి శిక్ష తప్పదు.

అందుకే పీజీఆర్ఎస్‌లో తిరస్కరణ

ప్రతి వారం నిర్వహించే పీజీఆర్ఎస్‌లో ఎస్టేట్ భూములు, చెరువులు, ప్రభుత్వ భూములకు సంబంధించిన అర్జీలు అధికంగా వస్తున్నాయి. వచ్చినవే వస్తుండటంతో వాటిని పరిష్కరించలేక తిరస్కరించాల్సిన పరిస్థితి వస్తోంది. ఇటీవల కలెక్టరేట్‌లో నిర్వహించిన తొలి రెవెన్యూ క్లినిక్‌కు మంచి స్పందన వచ్చింది. చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి నిర్వహించిన క్లినిక్‌కు మొత్తం 750 అర్జీలు వచ్చాయి. వాటిలో 20 అక్కడికక్కడే పరిష్కరించాం. మిగిలిన వాటికి నిర్దేశిత గడువులోపు పరిష్కారం చూపిస్తాం. మిగిలిన నియోజకవర్గాల్లోనూ ఈ క్లినిక్‌లు త్వరలో నిర్వహించి సమస్యలకు పరిష్కారం చూపుతాం.

ఏనుగుల దాడిలో పంటలు నష్టం

భాకరాపేట, పాకాల, న్యూస్‌టుడే: పదిపుట్లబైలు పంచాయతీలో జంట ఏనుగులు సోమవారం రాత్రి పొలాలపై పడి పంటలు నష్టపరిచాయి. పెరుమాళ్లగుడిపల్లికి చెందిన రైతు చెంగల్రాయులు మామిడి తోట, సుబ్రహ్మణ్యానికి చెందిన అరటి తోటను ధ్వంసం చేశాయి. కొండకిందపల్లిలో సి.అమరనాథ్ పొలంలో వరినారు, రమేష్ పొలంలో నేపియర్ గ్రాసం, పుల్లావాండ్లపల్లిలోని జి.రఘు, ఎ.కృష్ణమూర్తికి చెందిన మామిడి తోటలకు నష్టం కలిగించాయి. చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచర్ల పరిధిలోని తుమ్మచేనుపల్లిలో లక్ష్మణరెడ్డికి చెందిన 30 మామిడి, 10 టెంకాయ చెట్లను ధ్వంసం చేశాయి.

విద్యుత్తు నియంత్రిక చోరీ

చంద్రగిరి, న్యూస్‌టుడే: రాయలపురం పంచాయతీ పొలిమేరలోని నక్కలవంక సమీపంలోని వ్యవసాయ విద్యుత్తు నియంత్రిక చోరీకి గురైంది. గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి రాగితీగలు, ఆయిల్ దోచుకెళ్లారు. రైతు సుధాకర్‌రెడ్డి ఎస్పీడీసీఎల్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

మద్యం దుకాణంలో.. భాకరాపేట : స్థానిక లక్ష్మీవైన్స్‌లో చోరీ జరిగినట్లు దుకాణ యజమాని భాకరాపేట పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈనెల 25వ తేదీన రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి రాగా రిపబ్లిక్ దినోత్సవం రోజున అటువైపు వెళ్లలేదని, మంగళవారం ఉదయం దుకాణంలో పనిచేసే వ్యక్తి వెళ్లి చూడగా తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించాడన్నారు. నగదు రూ.2000, రూ.30 వేల మద్యం చోరీ అయినట్లు తెలిపారు.

సూపర్ మార్కెట్‌లో.. తిరుపతి (నేరవిభాగం) : జ్యోతి థియేటర్ కూడలి - అలిపిరి ప్రధాన మార్గంలోని ఎస్ మార్ట్‌లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఉదయం సిబ్బంది గుర్తించి యజమాని జబీర్‌కు సమాచారం ఇచ్చారు. కౌంటర్‌లో ఉన్న రూ.1.05 నగదు చోరీ చేసినట్లు ఫిర్యాదు చేశారు.

మద్యం కేసుల్లో 33 మందికి జరిమానా

తిరుపతి (లీగల్) : నగరంలో డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 33మంది వాహన చోదకులకు జరిమానా విధిస్తూ తిరుపతి ప్రత్యేక కోర్టు రెండో తరగతి న్యాయమూర్తి ధనలక్ష్మి మంగళవారం తీర్పు వెలువరించారు. నగరంలో ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణాచారి పర్యవేక్షణలో తనిఖీలు చేసి కేసులు నమోదు చేశారు. నిందితులకు రూ.10వేల చొప్పున జరిమానా విధించారు.

బహిరంగ ప్రకటన
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడము ఏమనగా నా కక్షిదారుడైన బెంగుళూరు నగరం, జ్ఞానభారతి 1వ బ్లాక్, వలగేరహల్లీ, కె.ఎస్.టౌన్, 10వ క్రాస్, శ్రీ గురుకృపనిలయం, నెం.33లో నివసించు ఇ.సుబ్రమణ్యం నాయుడు గారి కుమారుడు ఇ.గురుప్రసాద్ తిరుపతి జిల్లా, తిరుపతి అర్బన్ మండలం, తిరుపతి టౌన్, ఎస్.టి.వి.నగర్, డోర్ నెం. 19-42-S8-761 గల ఇంటిలో కాపురం వుండు సి.గోవర్ధన్ నాయుడు గారి కుమారుడు చలచీమల నరేష్ వార్లు తెలియజేయడమేమనగా ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి తిరుపతి టౌన్‌లో కాపురముండు గాలి పెద్దయ్య నాయుడు గారి కుమారుడు గాలి రెడ్డయ్య నాయుడు మరియు వారి భార్య గాలి లక్ష్మి మరియు కైకాలచెరువులో కాపురముండు గాలి పెద్దయ్య నాయుడు గారి కుమారుడు గాలి రమేష్ బాబు వార్లవద్ద నుండి 07-11-2025వ తారీఖున ఈ క్రింద కనబరిచన షెడ్యూలు దాఖలా ఆస్తిని విక్రయ అగ్రిమెంట్ పై వారు వ్రాసి ఇచ్చియున్నారు. అగ్రిమెంట్ సమయంలో కొంత నగదును అడ్వాన్సుగా ఇవ్వడమైనది. మిగిలిన పైకమును మూడు నెలల లోపు రిజిష్టర్ చేసుకొనునప్పుడు ఇవ్వడం జరుగును. కావున ఈ షెడ్యూలు ఆస్తులపై ఎవ్వరికైనా ఎలాంటి అభ్యంతరములుగాని, కోర్టు కేసులుగాని, కోర్టు అటాచ్‌మెంట్స్ గాని వున్నఎడల పది రోజులలోగా సరైన ఆధారములతో ఈ క్రింద తెలిపిన చిరునామాకు రిజిష్టర్ పోస్ట్ ద్వారా తెలియజేయగలరు.
పై గడువు లోపల ఎటువంటి అభ్యంతరములు రాని ఎడల నా యొక్క కక్షిదారునికి ఎలాంటి అభ్యంతరములు లేవని ధృవీకరించుకొని సబ్ రిజిష్టర్ ఆఫీస్ ద్వారా రిజిష్టర్ చేసుకొనబడును. తరువాత వచ్చు అభ్యంతరములకు మా యొక్క కక్షిదారునికి ఎటువంటి సంబంధములు వుండదు. రిజిష్టర్ పొందిన తరువాత ఎలాంటి అభ్యంతరములు చెప్పినను అవి చట్టరీత్యా ఎంతమాత్రం చెల్లనేరవు. అట్లు కాదని ఎడల అట్టి వారిపై నా యొక్క కక్షిదారుడు వారిపై సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకొనబడును. ఆధారములేని అభ్యంతరములను కూడా మా యొక్క కక్షిదారునికి ఎటువంటి సంబంధము లేదు. కావున ఈ యొక్క బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయుచున్నాము.
షెడ్యూలు :- తిరుపతి డి., తిరుపతి సబ్.డి., తిరుపతి అర్బన్ మండలం, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్, 19వ వార్డుకు చేరిన కొరమేనుగుంట రెసిడెన్షియల్ ఏరియాలో నెం.29, తిరుపతి గ్రామ లెక్కదాఖలా సర్వేనెం.1లో వేసియుండు ప్లాట్లలో మాకు హక్కు కలిగి ఈ దినం నీకు మేము విక్రయ అగ్రిమెంట్ చేయు ప్లాట్ నెం. 12కు గల జాగాకు హద్దులు మరియు కొలతల వివరములు : తూర్పు : కొరమేనుగుంట గ్రామ లెక్కదాఖలా సరిహద్దు, పడమర : 30అ॥ల వెడల్పు గల రోడ్డు, ఉత్తరం : కె. నీలకంటంగారి డోర్ నెం. 19-03-14/4 గల ఇల్లు, దక్షిణం : గాలి లక్ష్మి గారి ప్లాట్ నెం. 11 గల జాగా మరియు ఇతర జాగాలు ఈ నాలుగు హద్దుల మధ్య తూర్పు నుండి పడమరకు ఉత్తరం వైపు 71.9అ॥లు, తూర్పు నుండి పడమరకు దక్షిణం వైపు 76.9 అ॥లు, ఉత్తరం నుండి దక్షిణంనకు తూర్పు వైపు 40అ॥లు, ఉత్తరం నుండి దక్షిణమునకు పడమర వైపు 40అ॥లు మొత్తం 2970 చ॥అ॥ లేక 330 చ॥గ॥లు లేక 82.5 అంకణములు గల ఖాళీ జాగా.
వై. వెంకటేశ్వర రావు, న్యాయవాది
డి.నెం. 6-2-138, మారుతీ టవర్స్, 2వ ఫ్లోర్, ఫ్లాట్ నెం.201, సాయిరామ్ వీధి, నెం.1, తిరుపతి - 517 507, సెల్ : 94401 79591

(c) eenadu

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి • సత్యవేడు • రైల్వేకోడూరు

నిత్యాన్నదాన పథకానికి నగదు విరాళంగా అందజేస్తున్న బెంగళూరు భక్తులు

నిత్యాన్నదానానికి రూ.3 లక్షల విరాళం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల సౌకర్యార్థం అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి బెంగళూరుకు చెందిన భక్తులు రూ.3 లక్షల విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం దర్శనార్థం వచ్చిన పి.సర్వేష్, వేదకొర్తి, ఆర్.యశ్వంత్, ఆర్.గోకుల్, ధనుంజయ, అర్చన పేరుతో ఈ నగదును అందజేశారు. ఈవో బాపిరెడ్డి, ఆలయ ప్రొటోకాల్ ఏఈవో మోహన్ పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి విశేష అభిషేకాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయంలో కొలువుదీరిన క్షేత్ర పాలకుడైన కాలభైరవస్వామికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి ప్రదోషమూర్తితో పాటు ఉత్సవమూర్తికి విశేష అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి : 80085 74555
నాగలాపురం : 98854 43308
ఓబులవారిపల్లె : 99664 67525
రైల్వేకోడూరు : 97035 72572

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: సమస్య: కొర్లకుంట క్రాస్ నుంచి యల్లాపల్లె వెళ్లే ఆర్అండ్‌బీ గుంతలు పడి అధ్వానంగా మారింది. అధికారులు పరిశీలించి రహదారి మరమ్మతులు చేస్తే బాగుంటుంది. **- శివ, యల్లాయపల్లె**

సమాధానం: ఆ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు పూర్తి చేస్తాం. **- జయప్రకాష్, ఆర్అండ్‌బీ డీఈ**

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే: సమస్య: ఓబులవారిపల్లె మండల కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. పాత డ్రైనేజీ కాలువలో మురుగు తొలగించక పోవడంతో ముందుకు కదలడం లేదు. **- సుబ్రహ్మణ్యం, ఓబులవారిపల్లె**

సమాధానం: కాలువల్లో మురుగు తొలగిస్తాం. **- విజయరావు, ఎంపీడీవో**

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని లక్ష్మీనగర్, బైపాస్ ప్రాంతాల్లో వీధి లైట్లు సరిగా వెలగడంలేదు. ఒక్కోరోజు అసలు వెలగడంలేదు. రాత్రిపూట ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. **- ఉపేంద్ర, వ్యాపారి, లక్ష్మీనగర్**

సమాధానం: విద్యుత్తు సరఫరాలో సమస్యలవల్ల ఒక్కోసారి వీధి దీపాలు వెలిగించడంలో సమస్యలు ఏర్పడుతున్నాయి. వెంటనే అధికారులతో మాట్లాడి సరి చేయిస్తాం. **- జి.శివయ్య, సర్పంచి, రైల్వేకోడూరు**

అత్యాధునిక బస్ స్టేషన్‌గా తీర్చిదిద్దుతాం

పెచ్చులూడి పడుతున్న ఆర్టీసీ భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

తొట్టంబేడు, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండును అన్ని సౌకర్యాలతో అత్యాధునిక బస్ స్టేషన్‌గా తీర్చిదిద్దేలా కార్యాచరణ రూపొందించామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రయాణికులకు, సిబ్బందికి సౌకర్యంగా మంగళవారం డిపోలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. ఆర్టీసీ భవనాన్ని పరిశీలించారు. భవనం శిథిలమై పెచ్చులూడుతున్న విషయమై గతంలో సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. భవనాన్ని అత్యాధునికంగా తీర్చిదిద్దేందుకుతో పాటు డిపోకు రాబడి వచ్చేలా ఖాళీ స్థలంలో షాపులు నిర్మిస్తామని తెలిపారు. డిపో మేనేజర్ రేవతి, తెదేపా పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, నేతలు పాల్గొన్నారు.

ఫాగింగ్ ఉత్తిదే

✦ మూలనపడిన యంత్రాలు
✦ దోమలకు ఆవాసాలుగా గ్రామాలు

పుల్లంపేటలో నివాసాల వెనుక పారుతున్న మురుగు

ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో వణికిపోతున్నారు. దోమల కారణంగా మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి జ్వరాలు విజృంభిస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో దోమల నివారణకు అధికారులు చర్యలు చేపట్టక పోవడంతో గ్రామాల్లో పరిస్థితులు అధ్వానంగా మారాయి. నియోజకవర్గంలోని ఓబులవారిపల్లె, కోడూరు, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో 99 పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 2.86 లక్షల మంది జనాభా ఉన్నారు. ప్రతి పంచాయతీలో రహదారుల పక్కన చెత్త కుప్పలు, మురుగు నిల్వలు, దుకాణాల వద్ద కొబ్బరిబొండాలు, టీ కప్పులతో దోమలకు నివాసాలుగా మారుతున్నాయి.

నామమాత్రంగా కార్యక్రమాలు

గ్రామాల్లో మండల అధికారులు పాల్గొని దోమల దండయాత్ర, పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ అంటూ పలు కార్యక్రమాలు నామమాత్రంగా చేసి చేతులు దులుపుకొంటున్నారు. కార్యక్రమాల అనంతరం గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పరిస్థితిని పరిశీలిస్తున్న దాఖలాలు లేవు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

యంత్రాలు ఇవే..

రైల్వేకోడూరులో ఒకటి, ఓబులవారిపల్లె మండలంలో ఒకటి మాత్రమే ఉన్నాయి. చిట్వేలి మండల కేంద్రంలోని ఫాగింగ్ యంత్రం మూలన చేరింది. వైకాపా ప్రభుత్వం రెండేళ్ల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పంచాయతీకి ఫాగింగ్ యంత్రాలను సరఫరా చేసింది. ఆ యంత్రాలు నాణ్యతలేనివి కావడంతో మరమ్మతులకు గురయ్యాయి. ఒక్కొక్క మండలంలో రెండు, మూడు యంత్రాలు పని చేయడంలేదని పంచాయతీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులకు గురైన వాటిని వినియోగంలోకి తెస్తే బాగుంటుంది. ఈ నేపథ్యంలో ఫాగింగ్ కార్యక్రమాలు గ్రామాల్లో చేపట్టక పోవడంతో దోమల తీవ్రత పెరుగుతోంది.

చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కార్యదర్శులకు సూచించాం. ఫాగింగ్ యంత్రాలతో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలియజేశాం. పంచాయతీ నిధులతో ఫాగింగ్ యంత్రాలను మరమ్మతు చేయిస్తాం. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

-విజయరావు, ఎంపీడీవో, ఓబులవారిపల్లె

దోమల నివారణకు చర్యలు

ఏర్పేడు: మేర్లపాక పంచాయతీలో దోమల బెడద అధికంగా ఉందని ఈనాడులో ఇటీవల 'మేమున్నాం- మీకుతోడుగా' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై తెదేపా నేత కేకే రమణ స్పందించాడు. పంచాయతీలో ఫాగింగ్ చేయించడమే కాకుండా బ్లీచింగ్ చల్లించి సమస్యను పరిష్కరించారు.

పార్టీ చిత్రాలకు రంగులు

బీఎన్‌కండ్రిగ: వెస్ట్‌వరత్తూరు సచివాలయంపై వైకాపా నవరత్నాలతో మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి చిత్రాలు ఉన్నాయి. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో 'ప్రభుత్వాలు మారినా అధికారులు మారలే' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి అశోక్ సచివాలయ భవనంపై పార్టీ చిత్రాలకు రంగులు వేయించారు.

స్వచ్ఛ రథాన్ని సద్వినియోగం చేసుకోండి

నిత్యావసర సరకులు అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎన్నడూలేని విధంగా స్వచ్ఛ గ్రామ రూపకల్పనకు కూటమి ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ రథాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో స్వచ్ఛ రథాన్ని, తడి చెత్త, పొడి చెత్త బండ్లను ప్రారంభించారు. ప్రజలు తమ వద్ద పాత సామగ్రి ఇచ్చి ప్రతి ఫలంగా ఉచితంగా నిత్యావసరాలు తీసుకోవచ్చన్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్, ఏవో త్రివిక్రమరావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సామాన్య భక్తులకు శీఘ్ర దర్శనం

ఏర్పేడు, న్యూస్‌టుడే: గుడిమల్లం శ్రీపరశురామేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు శీఘ్రదర్శనం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. వచ్చేనెలలో జరిగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మంగళవారం ఆలయ ప్రాంగణంలో అన్నిశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయంతో పాటు గుడిమల్లం ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు రానున్నడంతో అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈవో రామచంద్రారెడ్డి, ఛైర్మన్ గిరినాయుడు, తహసీల్దార్ భార్గవి, సీఐలు శ్రీకాంత్‌రెడ్డి, జయచంద్ర పాల్గొన్నారు.

బహుమతులతో విద్యార్థులు

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

సత్యవేడు: చదువు కేవలం మార్కులకే పరిమితం కాదని జీవన, నైతిక విలువలు, క్రమశిక్షణ పెంపొందించు కోవాలని ప్రభుత్వ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయిని భారతి స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు పరంధామయ్య, ప్రసాద్, డిల్లీరాణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: మండలంలోని పల్లమాల, బీఎన్‌కండ్రిగ, నెలవాయి, కళ్లివెట్టు ఉన్నత పాఠశాలల్లో వైకాపా నాయకులు మంగళవారం విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు సులభతరంగా ఉండేలా దీన్ని తయారుచేసి అందిస్తున్నట్లు తెలిపారు.

సర్వేలపై అశ్రద్ధ

కార్యదర్శులకు మెమో జారీ

శ్రీకాళహస్తి: సచివాలయ కార్యదర్శుల పని తీరు సక్రమంగా లేక పోవడం, నిర్దేశించిన సర్వేలను పూర్తిగా చేపట్టక పోవడంపై ఉన్నతాధికారులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పురపాలక సంఘ కమిషనర్ సైతం వాళ్లకు మెమో ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.

పనితీరుపై అసంతృప్తి

శ్రీకాళహస్తి పురపాలక సంఘ పరిధిలో 22 స్వర్ణవార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిల్లో దాదాపు 200 మందికి పైగా వివిధ విభాగాలకు సంబంధించి కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం స్వర్ణవార్డు సచివాలయాల కింద రెండు సర్వేలను పూర్తి చేయమని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఏకీకృత కుటుంబాలకు సంబంధించి సర్వే, అలాగే పౌరుల ఈకేవైసీ విషయమై సర్వేలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. అయితే 22 స్వర్ణ వార్డు సచివాలయాల్లో ఏ ఒక్క సచివాలయం 50 శాతం చేపట్టక పోవడం గమనార్హం.

● ఏకీకృత కుటుంబాల సర్వేకు సంబంధించి అత్యధికంగా 20.26 శాతం భాస్కరపేట, అత్యల్పంగా 2.9 శాతం మేరకు శ్రీరాంనగర్ కాలనీ సచివాలయం చేపట్టడం గమనార్హం.

● పౌరుల ఈకేవైసీ విషయానికి వస్తే అత్యధికంగా సినిమా వీధి సచివాలయం 49.61 శాతం చేయగా వాటర్‌వర్క్స్ కాలనీ సచివాలయం కేవలం 11.43 శాతం మేరకు చేపట్టింది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టదల్చిన సర్వేల పురోగతిలో సచివాలయ కార్యదర్శులు శ్రద్ధ చూపడం లేదన్న విషయం సుస్పష్టమవుతోంది. ఇదే విషయమై 24 గంటల వ్యవధిలో వివరణ ఇవ్వాలంటూ పురపాలక సంఘ కమిషనర్ ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. మళ్లీ ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా కార్యదర్శులు విధి నిర్వహణలో కార్యోన్ముఖులై ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేసే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉంది.

ముక్కంటి సేవలో వేణుస్వామి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: జ్యోతిష్య సిద్ధాంతి వేణుస్వామి వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన వీరికి మంగళవారం ఆలయ ట్రస్టుబోర్డు మాజీ సభ్యుడు జయశ్యాం దగ్గరుండి దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

CHANGE OF SURNAME

I, **GAVANOOTHALA PRABHAKAR** (OLD NAME), S/o GAVANOOTHALA CHINNABBI, R/o D.No: 7/391-3, SURYA NAGAR, RAILWAY KODUR TOWN AND MANDAL, ANNAMAYYA DIST., A.P-516101 HAVE CHANGED MY SURNAME TO GAVANUTHALA PRABHAKAR (NEW NAME). HENCEFORTH, I SHALL BE KNOWN AS **GAVANUTHALA PRABHAKAR** (NEW NAME).

బహిరంగ ప్రకటన

ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా! నా క్లైంటు మెస్సర్స్ శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, తిరుపతి బ్రాంచి వారి మేనేజర్ వారు ఇచ్చిన ఆదేశాల ప్రకారము ఈ క్రింది కనిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తి పూతలపట్టు మండలం, పూతలపట్టు పోస్టు, పూతలపట్టు గ్రామంలో యుండు యస్.సుబ్రమణ్యంశెట్టి గారి కుమారుడు యస్.ప్రసాద్ బాబు గారికి చెందినదనియు, సదరు ఆస్తిని రిజిస్టరు తనఖా చేయించుకొని సదరు యస్.ప్రసాద్ బాబు గారికి రుణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి ఈ క్రింద కనిన షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి ఆప్పులు, ఛార్జీలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 5 దినముల లోగా ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా క్లైంటు బాధ్యులు కారు.

షెడ్యూలు

తిరుపతి రి.డి., పాకాల సబ్ డి., చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం పూతలపట్టు పోస్టు, పూతలపట్టు గ్రామపంచాయతీ, పూతలపట్టు గ్రామం, రామ్‌నగర్ కాలనీలో నాకు హక్కు కలిగి నా స్వాధీన అనుభవములో యుండు గ్రామకంఠం సర్వే నెంబరు 656 గల భూమిలో నేను మీకు దానం ఇచ్చు ఇంటి ఖాళీ జాగా మరియు ఇంటికి హద్దులు కొలతల వివరము. ఉత్తరము: మొగిలి గోవిందు గారి ఇల్లు, దక్షిణం: రామాపురం రోడ్డు, తూర్పు: చిత్తూరు & పీలేరు రోడ్డు, పడమర: మంగళం కృష్ణయ్య గారి ఇల్లు. ఈ మధ్య తూర్పు పడమర 28 అడుగులు మీ.8.54, ఉత్తరం దక్షిణం 34.5 అడుగులు మీ.10.52 కొలతలు గల 966 చదరపు అడుగులు లేక 107.33 చదరపు గజములు గల ఖాళీ స్థలము పూరా. సదరు జాగాలో నిర్మించియుండు పెంకుటిల్లు కొలతలు. సదరు ఇంటికి అమర్చియుండు తలుపులు, ద్వారబంధము, కిటికీలు, అలమరాలు, కరెంటు యావత్తు, కొయ్యసామానులు పూరా ఇంటి.

సం/- జి.వి.సుబ్బయ్య, బి.ఎ., బి.ఎల్., అడ్వకేట్,
డి.నెం.8/114/2, రాయల్ నగర్, ఆర్.సి.రోడ్డు, తిరుపతి.
సెల్ నెం: 94402 02564

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

నాగలాపురం, న్యూస్‌టుడే: స్థానిక ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈవో బాబయ్య మాట్లాడుతూ.. విద్యార్థి దశను విద్యార్థులు సంతోషంగా ఆటపాటలతో పాటు చదువులోనూ శ్రద్ధ చూపితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆహుతులను అలరించారు. ఎంఈవో-2 జనార్దనరాజు, ప్రధానోపాధ్యాయుడు కస్తూరయ్య, ఎస్ఎంసీ ఛైర్మన్ అయ్యప్ప పాల్గొన్నారు.

వివాదాస్పద భూముల్లో ఆర్డీవో విచారణ

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: మండలంలోని బీఎస్‌పురం గ్రామంలో వివాదాస్పద భూములపై ఆర్డీవో కిరణ్మయి మంగళవారం విచారణ చేపట్టారు. బీఎస్‌పురం రెవెన్యూలోని సర్వే నెం.132-1, 132-2లో క్వారీ యాజమాన్యం వారు అధీనంలోని ఎ.4.64 సెంట్ల భూమి తమదని, నోషనల్ ఖాతాలోని ఈ భూమికి ఖాతాను మార్చుచేసి, పట్టాలు తమ పేరున ఇవ్వాలంటూ తిరుపతికి చెందిన సుందరమ్మ ఫిర్యాదు చేశారు. ఈ భూమి 2008లో తమకు కేటాయించారని వెంకటేశ్వరా క్రషర్ యాజమాన్యం ఫిర్యాదు చేయడంతో భూములను పరిశీలించి విచారణ చేట్టారు. కార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

వైకాపా నేత ఇంటి వద్ద బందోబస్తు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని హరహరబావి వీధి సమీపంలో వైకాపాకు చెందిన నేత ఇంటి వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలోని హరిహరబావి వద్ద మంగళవారం ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. వైకాపా హయాంలో పురపాలక సంఘానికి చెందిన స్థలంలో ఆ పార్టీ నేత ఇల్లు నిర్మించుకున్నాడు. పురపాలక సంఘ రికార్డుల ప్రకారం ఆ స్థలం ఆక్రమించుకున్నట్లు ప్రస్తుతం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు నిర్ధారించారు. నిర్మాణాన్ని కూల్చేందుకు అధికారులు సిద్ధం చేసుకున్న సమాచారాన్ని తెలుసుకున్న సంబంధిత కుటుంబీకులు ఇంట్లో ఉండి తాళాలు వేసుకోవడంతో పురపాలక, రెవెన్యూ, పోలీసు అధికారులు ఇంటి వద్ద మొహరిస్తున్నారు.

వేసవిలోనూ వరదనీరు దాటాల్సిందే

మండలంలోని కొట్టరాళ్లమిట్టకు చేరుకోవాలంటే ఇప్పటికీ వరద నీరు దాటుకుని వెళ్లాల్సి వస్తోంది. శ్రీకాళహస్తి-పిచ్చాటూరు ప్రధాన మార్గం నుంచి గ్రామానికి చేరుకునే మధ్యలో ఓవాగు ప్రవహిస్తోంది. ఈవాగు వర్షా కాలంలో ఉద్ధృతంగా ప్రవహించడంతో గ్రామానికి నెల రోజుల పాటు రాకపోకలు నిలిచిపోతాయి. వర్షాలు తగ్గుముఖం పట్టినా వరదనీటిని దాటుకునే గ్రామానికి చేరుకోవాల్సిన దుస్థితి నెలకొంటోంది. ఈవాగుకు లోలెవల్ కాజ్‌వే నిర్మాణం చేపట్టాలని పలు మార్లు విన్నవించినా ప్రయోజనం లేక పోయిందని బాధితులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, కేవీబీపురం**

బ్రహ్మోత్సవం.. పనులు వేగవంతం

మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీకాళహస్తీశ్వరాలయం సిద్ధమవుతోంది. వచ్చే నెల 10వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలను పురస్కరించుకుని గోపురాలకు రంగులు వేయడం, రంగవల్లుల అలంకరణలు, దేవతామూర్తులు ఊరేగే చప్పరాలకు రంగులు వేయడం, విద్యుద్దీపాలంకరణ పనులు జోరందుకున్నాయి. రోజులు తక్కువగా ఉండటంతో సాంకేతిక విభాగం వారు మరింత పనుల నిర్వహణలో వేగాన్ని పెంచారు. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

వాలీబాల్ విజేత కంచరపాళెం

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మండలంలోని కంచరపాళెంలో అండర్-20 వాలీబాల్ టోర్నమెంట్ పోటీల్లో కంచరపాళెం పవర్‌బాయ్స్ జట్టు విజేతగా నిలిచింది. కంచరపాళెంయూత్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో పరిసర ప్రాంతాల నుంచి 28 జట్లు పాల్గొన్నాయి. తుది పోటీలో కంచరపాళెం జట్టు, కేపీఎం ఫ్రెండ్స్(సీ) జట్టు తలపడ్డాయి. సోమవారం రాత్రి వరకు హోరాహోరీగా జరిగిన పోటీలో కంచరపాళెం పవర్ బాయ్స్ జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో కేపీఎం ఫ్రెండ్స్(సీ)జట్టు నిలిచింది. విజేతగా నిలిచిన జట్టుకు మాజీ సర్పంచి, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి దశరథన్ చేతుల మీదుగా కప్‌ను, నగదు బహుమతిని అందించారు.

ఉత్తమ సేవలకు పురస్కారం

కలెక్టరు నుంచి పురస్కారం అందుకుంటున్న ఏఈవో జనార్దన్‌రాజు

నాగలాపురం, న్యూస్‌టుడే: మండలంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యాప్రగతికి చేసిన సేవలకుగాను ఎంఈవో జనార్దన్ రాజు ఉత్తమ ఎంఈవోగా అవార్డు అందుకున్నారు. తిరుపతిలో గత సోమవారం గణతంత్ర వేడుకల సందర్భంగా జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో జిల్లా కలెక్టరు, డీఈవో నుంచి ఆయన ఉత్తమ సేవా ప్రశంసా పత్రం, పురస్కారాన్ని అందుకున్నారు. అవార్డు అందుకున్న జనార్దన్‌రాజును మండల ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలి

పెగనలూరు, పుల్లంపేట: పుల్లంపేట, పెనగలూరు మండలాల్లోని గ్రామ సర్వేయర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గ్రామ సర్వేయర్లు కోరారు. ఈమేరకు మంగళవారం పుల్లంపేట, పెనగలూరు మండలాల్లోని గ్రామ సర్వేయర్లు తహసీల్దార్లకు వినతి పత్రాలను అందజేశారు.

ఫిబ్రవరి 16 నుంచి సహకార ఉద్యోగుల సమ్మె

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: ఏపీ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘ ఉద్యోగుల యూనియన్ ఐక్యవేదిక(జేఏసీ) ఇచ్చిన పిలుపు మేరకు న్యాయ పరమైన డిమాండ్లను పరిష్కరించని పక్షంలో ఫిబ్రవరి 16వ తేదీ నుంచి నిరవధిక సమ్మెను చేపట్టనున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిరంజీవిరెడ్డి, వేములయ్య తెలిపారు. మంగళవారం కదూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో సీఈవో సంపత్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు.

యథావిధిగా కొనసాగించాలి

శ్రీకాళహస్తి(గ్రామీణం(ఏర్పేడు), న్యూస్‌టుడే: ఉపాధిహామీ పథకాన్ని గతంలోలా యథావిధిగా కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి కోరారు. శ్రీకాళహస్తి మండలంలోని వేడాం పంచాయతీలో మంగళవారం ఉపాధిహామీ పనులను పరిశీలించారు. కేంద్రంలో భాజపా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధిహామీ పథకాన్ని నీరుగార్చే విధంగా వ్యవహరిస్తుందని తెలిపారు. గురవయ్య, శివకుమార్, గోపి, చారులత పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఏర్పేడు మండలంలోని ఆమందూరు రైల్వేగేటు సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. గత కొన్ని రోజులుగా రోడ్డు పక్కన ఉంటూ మంగళవారం మృతి చెందంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుని వద్ద లభించిన ఆధార్ కార్డులో తమిళనాడుకు చెందిన కుమార్(78)గా గుర్తించారు. ఈ నేపథ్యంలోనే ఆమందూరు సర్పంచి గుణయాదవ్, తెదేపా నేత సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు.

నారీమణులు.. వెలుగుకు బాట

పుల్లంపేట, న్యూస్‌టుడే: మహిళా పథకాల నిధులు పక్కదారి పట్టకుండా చూసేందుకు, సాంకేతికతపట్ల అవగాహన కల్పించేందుకు ఈ నారీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. అందులోని మహిళలు ప్రస్తుతం శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరంతా గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపట్టనున్నారు. వీరి ద్వారా నిధులు దుర్వినియోగానికి కాకుండా కాపాడేందుకు అవకాశం కల్గుతుంది.

ఏం చేస్తారంటే

● ప్రతి గ్రామం నుంచి ఇద్దరిని ఎంపిక చేస్తారు. అవసరాన్ని బట్టి మరింత మందిని నియమిస్తారు.

● సంఘంలోని పేద మహిళలకు సంక్షేమ పథకాలు చేరువ చేయడం, వ్యవసాయేతర జీవనోపాధులను తెలియజేస్తారు.

యాప్‌లపై అవగాహన

● పోషకాహారం, ఆరోగ్యం, పిల్లల పోషణ, రక్తహీనత సమస్యలు గుర్తించడం, వైద్య సిబ్బంది సహకారంతో నివారణ మార్గాలు సూచిస్తారు.

● వివిధ వయస్సుల్లో ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పిస్తారు. సంఘాల్లోని మహిళలకు రుణాలు మంజూరు చేయిస్తారు.

● రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 4810 సంఘాలు ఉండగా అందులో 48,185 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో సాంకేతిక పరిజ్ఞానం కల్గిన 688 మందిని నారీ మణులుగా ఎంపిక చేసి యాప్ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు.

ప్రతి పైసాకు..



సంఘాలను అభివృద్ధి బాటలో నడిపేంత జ్ఞానాన్ని సంపాదించుకున్నాం. ప్రతి సంఘ సభ్యురాలికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తాం. ప్రతి పైసా లెక్క పక్కా ఉండేలా చూస్తాం.
- సౌమ్య, కృష్ణంపల్లె

మన డబ్బు.. మన లెక్కలు



సంఘంలోని నగదు కొంత మేర దుర్వినియోగం అవుతుంది. మన సంఘంలోని నగదుకు మనమే లెక్కలు వేసుకుని అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చు. **- లక్ష్మీప్రసన్న, టి.బలిజపల్లె**

టికెట్ పొరపాటుపై విచారణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాహు, కేతు పూజలకు సంబంధించి ఒకే నంబర్‌తో రెండు టికెట్లు రావడంపై అధికారులు విచారణ చేపట్టారు. నలుగురు భక్తులు రాహు, కేతు పూజలకు పీఆర్‌వో కార్యాలయంలో మంగళవారం నాలుగు టికెట్లు తీసుకున్నారు. అందులో ఒకే నంబర్‌తో రెండు టికెట్లు రావడాన్ని గుర్తించిన స్కానర్ సిబ్బంది సమాచారాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అప్పటి కప్పుడు పరిశీలించి జరిగిన తప్పిదాన్ని గుర్తించి భక్తులకు ఇబ్బందులు లేకుండా పూజలు చేయించి పంపారు.

స్వచ్ఛంద సంస్థకు చేయూత

పుల్లంపేట, న్యూస్‌టుడే: గూడూరు పట్టణానికి చెందిన అంధుల జ్ఞాననేత్ర వలంటరీ స్వచ్ఛంద సేవా సంస్థకు ఆర్థికంగా చేయూత ఇస్తామని శాంతినికేతన్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం స్థానిక పాఠశాలలో అంధుల పాటకచేరిని నిర్వహించారు. సంస్థ అధినేత చందా శ్రీనివాస్, అంధ కళాకారులు కిరణ్, జయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

30న హుండీల లెక్కింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 30వ తేదీన స్వామి, అమ్మవార్లతో పాటు పరివార దేవతామూర్తుల హుండీలను లెక్కించనున్నారు. ఆలయ ఆవరణలోని అదనపు రూ.500 రాహు, కేతు మండపంలో లెక్కింపు జరుగుతుందని, నిర్దేశిత సమయానికి సిబ్బంది, అధికారులు, ఉద్యోగులు, స్వామివారి సేవకులు విధిగా హాజరుకావాలని ఆలయ ఈవో బాపిరెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

రేణిగుంట, న్యూస్‌టుడే: స్థానిక జీఆర్‌పీ పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. రేణిగుంట-పూడి రైల్వేలైన్‌లో సుమారు 60 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి అక్కడి కక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు తెలుపు రంగు చొక్కాపై చిన్నచిన్న చుక్కలు, కాఫీ కలర్ కాటన్ ఆఫ్ ఫ్యాంట్, తెల్లని గడులతో నీలి రంగు లుంగీ ధరించి ఉన్నట్లు తెలిపారు. ఎడమ కన్నుపై రెండు నల్లని పుట్టుమచ్చలు ఉన్నట్లు తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి నా క్లయింటు అయిన కె.నాగరాజు, తండ్రి కీ॥శే॥ కె.వెంకటేశ ఆచారి, డి.నెం.1-758, ఎన్.టి.ఆర్. నగర్, శ్రీకాళహస్తి టౌన్, తిరుపతి జిల్లా వారి తరపున తెలియజేయమేమనగా క్రింది కనిన షెడ్యూలు దాఖలా ఆస్తిలో నా క్లయింటుకు వారసత్వ రీత్యా సగ భాగం హక్కు కలిగి జాయింటు స్వాధీనానుభవంలో యున్నది. ప్రస్తుతం నా క్లయింటు చిన్నాయన అయిన కె.గణేష్, అతని భార్య కె.వెంకటమ్మ తదితరులు నా క్లయింటు సగ భాగం హక్కుకు భంగం కలిగించే విధంగా సదరు ఆస్తికి సంబంధించి తప్పుడు పత్రాలు సృష్టించి ఇతరులకు పరాధీనములు చేయుటకు తీవ్ర ప్రయత్నములు చేయుచున్నారు. అట్టి పరాధీనములు ఏవి కూడా చట్టరీత్యా చెల్లనేరవు. కనుక ఎవరైననూ సదరు ఆస్తికి సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరిపినచో అట్టివారు నా క్లయింటు తీసుకొనబోవు చట్టరీత్యా చర్యలకు బాధ్యులగుదురని తెలియజేయడమైనది.

షెడ్యూలు: తిరుపతి జిల్లా - తొట్టంబేడు సబ్ డిస్ట్రిక్ట్ - బుచ్చినాయుడు కండ్రిగ మండలం - కాటూరు సర్వే గ్రూప్ - కాటూరు గ్రామ కంఠం సర్వే నెం.27/1లో - తలుపు నెం.1-189 అసెసిమెంటు నెం.152 గల ఆర్.సి.సి. స్లాబ్ మిద్దె ఇల్లు మరియు ఖాళీ స్థలము ఇందుకు హద్దులు తూర్పు: మునెయ్య ఖాళీ స్థలం, దక్షిణం: రాజ వీధి, పడమర: సిమెంటు రోడ్డు, ఉత్తరం: ఖాళీ స్థలం

పూడి వెంకటేశ్వర్లు
అడ్వకేట్, శ్రీకాళహస్తి. సెల్: 9849418277

(c) eenadu

సూళ్లూరుపేట

• సూళ్లూరుపేట • వెంకటగిరి

శునకాలు పీకేస్తున్నాయ్

బీఎంఆర్‌నగర్‌లో పాఠశాల ఉంది. ఇక్కడికొచ్చే విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు శునకాలు ఇబ్బంది కలిగిస్తున్నాయి. చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఫజులుల్లా తెలిపారు. -న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

బురద.. వాహనం జారదా!

వర్షం పడితే దాబాల నుంచి వచ్చే లారీలు జాతీయరహదారి పైకి బురద మోసుకొస్తున్నాయి. ద్విచక్ర వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఎర్రమట్టి ఎండాక దుమ్ము రేగి వాహనదారుల కళ్లను నింపుతున్నాయి. -న్యూస్‌టుడే, తడ

అక్రమార్కులకు కలపతరువు

• నేతలు, అధికారుల అండదండలు

వాకాడు, చిట్టమూరు, న్యూస్‌టుడే: వాకాడు, చిట్టమూరు మండలాల్లో కలప అక్రమ నరికివేత ఇష్టారాజ్యంగా మారింది. ప్రభుత్వ, అటవీ, పోరంబోకు, ఉప్పు పోరంబోకు భూములతో పాటుగా నది పొర్లుకట్టలు, చెరువులు, కాలువల కట్టలు ఒకటేమిటి అన్ని ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమంగా నరికి ఇతర ప్రాంతాలకు లక్షల రూపాయలకు అమ్మేస్తున్నారు. ఇందుకు ఒక బృందం ఏర్పడి కలప అక్రమంగా నరకడం..

వాకాడులో రవాణాకు సిద్ధంగా కలప

సాయంత్రానికి లారీకి ఎక్కించి కంపెనీలకు అమ్మేయడం సాగుతోంది. అక్రమార్కులకు అటవీ శాఖ అధికారులు అండగా నిలుస్తున్నారు. కనీసం వీఆర్వో, పంచాయతీ అధికారి సైతం మనకెందుకులే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు.

అటవీ శాఖ రేంజర్ రమణయ్యను వివరణ కోరగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి వాటిపై ప్రజలు తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

తీరంలో బొగ్గు కాల్చివేత

తీర ప్రాంత గ్రామాల్లో ప్రభుత్వ, అసైన్‌మెంట్ భూముల్లో కలప అక్రమంగా నరకడం అక్కడే కాల్చి బొగ్గు తయారు చేయడం రెండు నెలలుగా సాగుతోంది. రెండు మండలాల్లోని తీర గ్రామాలు వన్యప్రాణి సంరక్షణ పరిధిలో ఉండటంతో ఇక్కడ కట్టెలు నరకడం, బొగ్గుల తయారీ నిషేధం. అయినా అటవీ అధికారులను అక్రమార్కులు లోబర్చుకొని అక్రమ వ్యాపారం సాగిస్తున్నట్లు తీరం వాసులు చెబుతున్నారు.

వేలం నిర్వహించరేమీ?

ప్రభుత్వ భూములు, చెరువులు, నది కట్టలు, ఇతర ప్రాంతాల్లో కలప నరికేందుకు ముందుగా పంచాయతీ తీర్మానంతో పాటు సంబంధిత శాఖ అధికారుల సమక్షంలో వేలం నిర్వహించాలి. వచ్చిన సొమ్మును ప్రభుత్వానికి చలానా రూపంలో చెల్లించి తదుపరి కట్టెలు నరకాలి. కానీ ఇక్కడ అలా కాదు. స్థానికంగా రాజకీయ నేతల అండదండలతో ఎక్కడపడితే అక్కడ కలప నరకడం, విక్రయించడం షరామామూలైంది. స్వర్ణముఖి నది, రొయ్యలవాగు ప్రాంతాల్లోనూ ఇటీవల అక్రమంగా నరికేశారు. ఇంకా పలు చెరువుల్లో లెక్కేలేదు.

'బ్లడ్ రోజస్' ట్రైలర్ విడుదల

వెంకటగిరి: పట్టణానికి చెందిన యువ దర్శకుడు మందాటి గురురంజన్ నిర్మించిన బ్లడ్ రోజస్ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను సినీ నటుడు రాజేంద్ర ప్రసాద్ విడుదల చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని నటుడు రాజేంద్ర ప్రసాద్ నివాసంలో చిత్రబృందం సమక్షంలో ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. బొగ్గులమిట్ట ప్రాంతానికి చెందిన దర్శకుడు గురురంజన్ ఇప్పటి వరకు కన్నడంలో రెండు చిత్రాలు నిర్మించారు. తాజాగా తెలుగులో మూడో చిత్రం బ్లడ్ రోజస్ నిర్మించారు. ఈ సందర్భంగా ఆయన 'న్యూస్‌టుడే'తో చరవాణిలో మాట్లాడుతూ కన్నడ హీరో ధర్మ కీర్తిరాజ, అప్సరరాణి ప్రధానపాత్రలో సినిమా తీస్తున్నామన్నారు. ఈ ట్రైలర్‌ను సినీ హీరో సుమన్, నటుడు అజయ్ ఘోష్ చూసి చిత్రబృందాన్ని అభినందించారన్నారు. ఈ చిత్రంలో జబర్దస్త్‌కు చెందిన పలువురు నటులు కూడా నటించారన్నారు. వచ్చే నెల 6న సినిమా థియేటర్‌లో విడుదల కానుందన్నారు. చిత్రం పూర్తిగా క్రైమ్, థ్రిల్లర్, యాక్షన్‌తో చిత్రీకరణ చేశామన్నారు.

ట్రైలర్ విడుదల చేస్తున్న సినీ నటుడు రాజేంద్రప్రసాద్

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని తెదేపా కార్యాలయంలో మంగళవారం పలువురు బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అందజేశారు. పేదలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు.

బీపీఎస్ అనరే

• నత్తనడకన భవన నిర్మాణాల క్రమబద్ధీకరణ

నాయుడుపేట పట్టణం, సూళ్లూరుపేట పట్టణం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణాల విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. కొత్త కట్టడాలు చేపట్టే వారి నుంచి కొన్ని రూ.లక్షల్లో వసూలు చేశారు. పాలకులు, అధికారుల సహకారంతో భారీగా అవినీతికి పాల్పడ్డారు. బరితెగించి మరీ వసూలు చేశారు. దీంతో గృహ నిర్మాణదారులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తంలో కొంత వీరికి కట్టేసి కట్టడాలు కట్టారు. పెద్ద పెద్ద భవంతులు నిర్మించిన వాళ్లు సైతం రెండు మూడు అంతస్తులకు అనుమతులు పొంది.. ఒకటి రెండు అంతస్తులకు అనుమతులు లేకుండా నిర్మించారు.

నాయుడుపేటలో ఇటీవల తొలగించిన అక్రమ కట్టడాలు

రాజకీయ నాయకుల జోక్యం

అక్రమ నిర్మాణాలతో వచ్చే రాబడి రాకుండా ప్రస్తుత రాజకీయ నాయకులు అడ్డుపడుతున్నారు. కట్టడాలను తొలగించవద్దని అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు విమర్శలున్నాయి. కొన్నిచోట్ల దరఖాస్తులు పరిశీలించి క్రమబద్ధీకరణ చేయడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

● కమిషనర్ ఎస్కే ఫజులుల్లాను వివరణ కోరగా.. 'బీపీఎస్ దరఖాస్తుకు ఈ ఏడాది మార్చి 12 వరకు గడువు ఉంది. ఈ అవకాశాన్ని అక్రమ భవన నిర్మాణాల యజమానులు సద్వినియోగం చేసుకోవాలి. కఠినమైన చర్యలకు పూనుకోకముందే చట్టబద్ధత కలిగేలా చేసుకోవాలి' అని అన్నారు.

పురపాలిక	అక్రమ కట్టడాలు	బీపీఎస్ దరఖాస్తులు	అనుమతులు
సూళ్లూరుపేట	5,844	49	05
నాయుడుపేట	3,000	89	09
వెంకటగిరి	800	43	01

అవకాశం కల్పించిన ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం బీపీఎస్(బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం)ను అమల్లోకి తీసుకురావడం తెలిసిందే. దీంతో పట్టణాల్లోని ప్రజలు తమ అక్రమ భవన నిర్మాణాలను క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం కల్పించింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాల నిగ్గు తేలుస్తున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించి వసూళ్లకు పాల్పడిన తీరుపై వివరాలు తెలుసుకుని నిబంధనలు, దరఖాస్తుల మేరకు అనుమతులు ఇస్తున్నారు.

గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం: కేజీ రూ. 31 నుంచి రూ.40 వరకు

రెండో రకం: కిలో రూ.20 నుంచి రూ.30 వరకు

ఉత్సవాలు ప్రారంభం

వెంకటగిరి, న్యూస్‌టుడే: పద్మశాలీయుల ఆరాధ్య దైవమైన భద్రావతి సమేత భావనారుషి ఉత్సవాలు మంగళవారం రాత్రి నుంచి మొదలయ్యాయి. పట్టణంలోని చేనేత వార్డులోని ఆలయంలో పులి వాహనాన్ని ముస్తాబు చేసి భద్రావతి సమేత భావనారుషి ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించారు.

ఉత్తమ వైద్యుడికి సత్కారం

వాకాడు, న్యూస్‌టుడే: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జేమ్స్ రోహిత్‌కు జిల్లా స్థాయి ఉత్తమ వైద్యుడు అవార్డును కలెక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా సోమవారం అందుకున్నారు. ఆ మేరకు ఆయనను ఆరోగ్య ఆవరణలో మంగళవారం తోటి వైద్యులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

భోజనం తయారీ ప్రైవేటుకు ఇవ్వొద్దు

నాయుడుపేట, న్యూస్‌టుడే: పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం తయారీ బాధ్యతలను ప్రైవేటు సంస్థలకు ఇవ్వొద్దంటూ మంగళవారం నాయుడుపేట మండలంలో మధ్యాహ్న భోజనం తయారీ కార్మికులు ఎంఈవో మునిరత్నంను కలిసి వినతిపత్రం అందజేశారు. తమకు ఉపాధి లేకుండా పోతుందని వాపోయారు. కార్మికుల యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఫజిరియా, కె.విజయమ్మ, కె.వాణి తదితరులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

లేబర్ కోడ్ రద్దుకు సమ్మె నోటీసు

వెంకటగిరి, న్యూస్‌టుడే: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌ను రద్దు చేయాలంటూ చేపట్టే సమ్మె నోటీస్‌ను పుర కమిషనర్ సాంబశివయ్యకు మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చెంగయ్య అందించారు. మంగళవారం కమిషనర్ ఛాంబర్‌లో ఈ నోటీస్‌ను ఇచ్చారు. వచ్చే నెల 12న సమ్మె చేపడుతున్నట్లు వివరించారు. నాయకులు సుబ్బయ్య, ప్రసాద్, పెంచలయ్య, పోలయ్య, రమణయ్య పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ గ్రామసభ

చిట్టమూరు, న్యూస్‌టుడే: వీబీ జీ రామ్‌జీ(ఉపాధి హామీ)పనులు పేదలకు వరమని తెదేపా బీసీ సెల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కాపులూరు చెంచురామాచారి అన్నారు. మంగళవారం ఎల్లసిరి ఎగువ గిరిజన కాలనీలో జరిగిన ఉపాధి పనుల సామాజిక తనిఖీ గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామంలో రూ.48,08,755 కోట్లకు 19 పనులు జరిగాయని, పీఆర్ కింద మరో రూ.9,33,005 కోట్లతో 4 పనులు జరిగినట్లు ఉపాధి పనుల తనిఖీ అధికారులు పేర్కొన్నారు. మెట్టు గ్రామంలో కూడా గ్రామసభ నిర్వహించారు.

ఆలస్యంగా నడిచిన రైళ్లు

తడ, న్యూస్‌టుడే: తడ- సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం మరమ్మతు పనులు చేపట్టారు. దాంతో పలు రైళ్లు ఆలస్యంగా నడవగా, కొన్ని రద్దయ్యాయి. చెన్నై నుంచి లక్నో వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు తడలో, మరో రైలు ఆరంబాకంలో ఆగిపోయాయి. దాదాపు మూడు గంటలు ఆలస్యంగా నడిచాయి. చెన్నై- నెల్లూరు మధ్య నడిచే మెము రైళ్లు రద్దయ్యాయి. దాంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

పని వేళల్లో మాత్రమే పనిచేస్తాం

తడ, న్యూస్‌టుడే: వివిధ రకాల సర్వేలతోపాటు అటు సచివాలయం పనులు, ఇటు రెవెన్యూ శాఖ పనులు చేయలేక సతమతం అవుతున్నామని... పని వేళల్లో మాత్రమే పనిచేస్తామని వీఆర్వోలు తహసీల్దారు శరత్‌బాబుకు మంగళవారం వినతిపత్రం అందించారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు వినతిపత్రం ఇచ్చే కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.

మీడియా సమావేశంలో తెదేపా నాయకులు

వైకాపా పాలనలో అభివృద్ధి శూన్యం

వెంకటగిరి, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో అభివృద్ధి శూన్యమేనని కౌన్సిలర్ నారి శేఖర్ అన్నారు. మంగళవారం తెదేపా కార్యాలయంలో నాయకులు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తాను వైకాపా కౌన్సిలరేనని, ప్రజలకు సేవ చేయాలని తలిచానని.. తీరా చూస్తే వైకాపాలో ఎలాంటి అభివృద్ధి కనిపించలేదన్నారు. జనసేన జిల్లా నేత రాధమ్మ మాట్లాడుతూ మహిళా కౌన్సిలర్లు తమకు అవమానం జరిగిందంటూ కల్లబొల్లి మాటలు చెబుతున్నారని, వైకాపా పాలనలో అసెంబ్లీ సాక్షిగా మహిళను అవమానపరిచినప్పుడు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. ఎస్సీ సెల్ నేత రామకృష్ణ, చంగారావులు మాట్లాడుతూ.. రాజ్యాంగానికి వ్యతిరేకంగా కౌన్సిలర్లు వ్యవహరించారన్నారు. మహిళాధ్యక్షురాలు స్వప్న, మాధవి, నేతలు వెంకటరమణ, రవి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఉపాధ్యాయుల సత్కారం

చిట్టమూరు: గునపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని పట్నం పూర్విక వ్యాసరచన పోటీల్లో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచి కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంది. మంగళవారం పాఠశాలలో ఎంఈవో-2 భూపయ్య, ఉపాధ్యాయులు పూర్వికను సత్కరించి అభినందించారు.

బాలికపై ఆటో డ్రైవర్ లైంగిక వేధింపులు

కోట, న్యూస్‌టుడే: అటవీ ప్రాంతంలో బాలికపై ఆటో డ్రైవర్ లైంగిక వేధింపులకు పాల్పడటంతో తప్పించుకొని స్థానికుల ద్వారా మంగళవారం పోలీసుస్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశారు. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. తిరుపతి జిల్లా చిట్టమూరు మండలానికి చెందిన బాలిక తల్లిదండ్రులతో గొడవపడి అమ్మమ్మ ఊరికి బయల్దేరింది. కోట మండలం తిన్నెలపూడికి చెందిన పాల క్యాన్లు సరఫరా చేసే ఆటో డ్రైవర్ గమనించి ఊరికి తీసుకెళతానంటూ నమ్మించాడు. చిట్టమూరు మండలం కొత్తగుంట వద్ద వాహనంలో ఎక్కించుకున్నాడు. కాసేపటికి కోట మండలం కొండుగుంట పరిసర ప్రాంతంలోని అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లాడు. లైంగిక వేధింపులకు పాల్పడటంతో బాలిక కేకలు వేస్తూ పరుగెత్తింది. స్థానికులు గమనించి కోట పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారు. సీఐ కిశోర్‌బాబు మాట్లాడుతూ ఫిర్యాదు మేరకు విచారిస్తున్నామని పేర్కొన్నారు.

రుణం పొంది.. అభ్యున్నతి చెంది

సూళ్లూరుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పొదుపు మహిళలు రుణాలు సద్వినియోగం చేసుకుంటున్నారు. స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి చెందుతున్నారు. కుటుంబ పోషణలో చేదోడువాదోడుగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు సూళ్లూరుపేటకు చెందిన పలువురు మహిళలు.

టైలరింగ్‌తో గిరివర్ధన

షార్ సర్కిల్ వద్ద టైలరింగ్ దుకాణం నిర్వహిస్తున్న గిరివర్ధన భాగ్యలక్ష్మి పొదుపు సంఘంలో సభ్యురాలు. రూ.1.50 లక్షలు రుణం పొంది అద్దె దుకాణం తీసుకున్నారు. స్వయం ఉపాధి కల్పించుకొని మరో నలుగురికి ఉపాధి కల్పిస్తోంది. నెలకు రూ.20 వేల వరకు సంపాదిస్తున్నారు.

ఎంబ్రాయిడింగ్ చేస్తూ స్వాతి

స్వతంత్రపురానికి చెందిన జి. స్వాతి గాంధీ సంఘ సభ్యురాలు. రూ.1.20 లక్షలు రుణంతో ఎంబ్రాయిడింగ్ వర్క్ చేస్తూ.. మరొకరికి ఉపాధి కల్పిస్తున్నారు. వ్యవసాయం చేస్తున్న భర్తకు చేదోడుగా ఉంటూ నెలకు రూ.30 వేల వరకు ఆర్జిస్తున్నారు.

నిత్యావసరాల దుకాణం నిర్వహిస్తూ లోకేశ్వరి

పట్టణ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రి వీధిలో నిత్యావసరాల దుకాణం నిర్వహిస్తున్న ఈమె పేరు మన్నేపల్లి లోకేశ్వరి. పొదుపు సంఘం నుంచి రూ.2 లక్షలు రుణం పొందారు. అద్దెకు దుకాణం తీసుకొని నెలకు రూ.15 వేల ఆదాయం గడిస్తున్నారు. డిష్ టీవీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న అతని భర్త సంపాదనకు చేదోడుగా నిలుస్తున్నారు.

ఆరుగురికి జరిమానా

వెంకటగిరి, న్యూస్‌టుడే: మద్యం సేవించి వాహనాలు నడిపిన ముగ్గురు, జూదం ఆడుతూ పట్టుబడిన ముగ్గురికి అపరాధ రుసుంను న్యాయమూర్తి విష్ణువర్మ విధించినట్లు ఎస్సై ఏడుకొండలు తెలిపారు. సోమవారం రాత్రి తనిఖీలు చేపట్టగా ఎ.శ్రీనివాసులు, షేక్‌రఫీ మద్యం సేవించినట్లు గుర్తించామన్నారు. ఒక్కొక్కరికి రూ.12,500 చొప్పున, ఎం.నాగరాజకు రూ.22,500 చొప్పున జరిమానా విధించారన్నారు. రాణిపేటలోని జామాయిల్ తోటలో జూదం ఆడుతున్న చల్లా సుబ్బారావు, రేవూరు ప్రసాద్, రంగినేని శ్రీనివాసులును పట్టుకుని న్యాయస్థానంలో హాజరు పరచగా వీరికి రూ.300 చొప్పున అపరాధ రుసుం విధించారన్నారు.

లోలెవల్ భవనం.. ప్రమాదం కనం

చిల్లకూరు గ్రామంలో జాతీయ రహదారి విస్తీర్ణంతో ప్రాథమిక పాఠశాల భవనం లోలెవల్‌కు చేరింది. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాల ఆవరణ ముందుభాగంలో ఉన్న స్థలం రహదారి నిర్మాణం కోసం సేకరించారు. ఇదే ప్రాంతంలో రహదారి హైలెవల్‌కు చేరడంతో పాఠశాల కింద భాగానికి చేరింది. లెవలింగ్ చేసి పాఠశాలను పునర్నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, పెళ్లకూరు

మేమున్నాం.. మీకు తోడుగా..

సూళ్లూరుపేట: 88979 08890
నాయుడుపేట: 80085 73970
వెంకటగిరి: 80085 73966

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: ? పట్టణంలోని కావలి వీధిలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. -డి.నారాయణ, స్థానికుడు ? పట్టణంలోని షార్ బస్టాండ్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే రహదారి పక్కన మురుగు ముందుకు కదలక దుర్వాసన వస్తోంది. దోమల బెడద ఎక్కువగా ఉంది. -గోవిందరాజులు, స్థానికుడు ✓ వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. మురుగు కాలువల్లో సిబ్బందితో వెంటనే పూడిక తీయిస్తాం. - చిన్నయ్య, కమిషనర్

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: ? ఎన్ఎస్ఆర్ కాలనీ అవతల ఉన్న గిరిజన కాలనీకి రాకపోకలు సాగించేందుకు కల్వర్టు దెబ్బతింది. ఇబ్బంది పడుతున్నాం -స్థానికులు ? భరత్‌నగర్‌లో కాలువలు సరిగా లేవు. మురుగు నిల్వతో దోమలు పెరుగుతున్నాయి. -రాజయ్య, స్థానికుడు ✓ కల్వర్టు, కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. -ఎస్కే ఫజులుల్లా, కమిషనర్

వెంకటగిరి, న్యూస్‌టుడే: ? పట్టణంలోని సాయిబాబా గుడి వెనుక నుంచి బొమ్మిడి కాలువకు వెళ్లే మార్గంలో సిమెంట్ రోడ్డు హెచ్చుతగ్గులుగా ఉంది. ఇక్కడ నీరు నిల్వ ఉండటంతో పాదచారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. -రాఘవయ్య, వెంకటగిరి ✓ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. -రామారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఇన్‌ఛార్జి సీఐ బాధ్యతలు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట అర్బన్ సీఐగా, గ్రామీణ సీఐ సంగమేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. అర్బన్ సీఐగా పని చేసిన బాబి, హెడ్‌కానిస్టేబుల్ రామ్మోహన్‌రాజులు ఆదివారం సాయంత్రం మద్యం దుకాణం సిబ్బంది నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీకి పట్టుబడిన సంగతి తెలిసిందే. దీంతో ఇక్కడే గ్రామీణ సీఐకి అదనపు బాధ్యతలు అప్పగించారు.

బ్యాంకు సిబ్బంది నిరసన

నాయుడుపేట, న్యూస్‌టుడే: పట్టణంలో మూడు రోజులుగా బ్యాంకు సేవలు స్తంభించడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆదివారం సెలవు కావడం, సోమవారం గణతంత్ర దినోత్సవం, మంగళవారం బ్యాంకు సిబ్బంది సమ్మె కావడంతో మూడు రోజులు పనిచేయలేదు. దీంతో లావాదేవి స్తంభించాయి. నాయుడుపేటలో ఎస్‌బీఐ, యూనియన్, ఏపీజీబీ, ఇండియన్, కేవీజీ, ఇతర బ్యాంకుల సిబ్బంది సమ్మె చేయడంతో సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. ● సూళ్లూరుపేట పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎస్‌బీఐ కార్యాలయం వద్ద బ్యాంకు ఉద్యోగులు సమ్మెలో పాల్గొని నిరసన తెలిపారు. వారంలో ఐదు రోజుల బ్యాంకింగ్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సూళ్లూరుపేటలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పాతికేళ్లు.. రైతులకు కన్నీళ్లు

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: దొరవారిసత్రం, చిట్టమూరు మండలాల్లో 14 తీర ప్రాంత గ్రామాల్లో ఉన్న ప్రజలకు తాగు, సాగునీరందించేందుకు మీజూరు చెక్‌డ్యామ్ పనులు చేపట్టారు. 16 కిలోమీటర్లు పొడవు, 3 కిలోమీటర్లు వెడల్పు 48 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న పులికాట్ సరస్సులో టీఎంసీ నీరు నిల్వ ఉండేలా 4 చోట్ల చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పలు దఫాలుగా పనులు చేసి 80 శాతం పూర్తి చేశారు. సముద్రం నుంచి ఆటుపోట్లకు వచ్చే ఉప్పు నీరు చెక్‌డ్యామ్‌లను దాటుకుని పులికాట్ సరస్సులోకి రాకుండా వియర్ వాల్, సరస్సు నిండిన తరువాత అదనపు వర్షపు నీరు సముద్రంలోకి వెళ్లేలా నెదర్లాండ్ టెక్నాలజీతో పనిచేసే పాలీ షెల్టర్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది.

పులికాట్ సరస్సులో 80 శాతం పూర్తయిన చెక్‌డ్యామ్

15 కి.మీ. తాగునీరు లేదు

తీర ప్రాంత గ్రామాల ప్రజలకు చుట్టూ 15 కిలోమీటర్ల మేర తాగునీటి వనరులు లేవు. దీంతో సూళ్లూరుపేట మండలంలోని ఆబాక, దొరవారిసత్రం మండలంలోని సింగనాలత్తూరు వద్ద బావులు, బోర్లు ఏర్పాటు చేసి అక్కడి నుంచి పైపులైన్ల ద్వారా తాగునీరు అందిస్తున్నారు.

పథకం	మీజూరు చెక్‌డ్యామ్‌ల నిర్మాణం
వ్యయం	రూ.5.36 కోట్లు
ప్రారంభం చేసిన సంవత్సరం	2001
సాగు, తాగునీరందే గ్రామాలు	14
నీటి నిల్వ సామర్థ్యం	టీఎంసీ
సస్యశ్యామలమయ్యే భూమి	7500 ఎకరాలు

చెక్‌డ్యామ్‌లో నీరు నిల్వ ఉంటే తాగునీటి సమస్య తీరుతుంది. లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కొంత, నేరుగా కొంత భూములకు సాగు నీరు అందుతుంది.

విస్మరించిన వైకాపా ప్రభుత్వం

గత తెదేపా ప్రభుత్వంలో మరమ్మతులకు గురైన కొన్ని చెక్‌డ్యామ్‌లను బాగు చేశారు. దీనికోసం కొంతమేర నిధులు ఖర్చు చేశారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా వీటిని విస్మరించింది. కూటమి ప్రభుత్వంలోనైనా చెక్‌డ్యామ్‌ల నిర్మాణం పూర్తి చేసి తీర ప్రాంతవాసుల పాతికేళ్ల కలను నిజం చేయాలని రైతులు కోరుతున్నారు.

శ్రీ కామిరెడ్డి జానకి రామిరెడ్డి గారు
మరణం 14-01-2026

ఉత్తరక్రియలు
మాకు ప్రేమానురాగాలు పంచి
ఆప్యాయత, అనురాగాలు, విలువలు
నేర్పించి మా ఉన్నతికి అహర్నిశలు
శ్రమించిన మా ఇంటి దైవం
గౌ॥ శ్రీ కామిరెడ్డి జానకి రామిరెడ్డి గారు
తేది 14-01-2026 బుధవారం స్వర్గస్తులైనారు
వారి పవిత్ర ఆత్మకు శాంతిచేకూరాలని
భగవంతుని ప్రార్థిస్తూ.. అశ్రునయనాలతో
తేది 28-01-2026 - శిలనిలువు
తేది 29-01-2026 - బ్రాహ్మణబియ్యాలు
నాయుడుపేట మండలం,
మడఫలం గ్రామంలోని
మా స్వగృహము నందు జరుగును
కావున తెలియజేయడమైనది... ఇట్లు
కుమారుడు
కామిరెడ్డి అశోక్ కుమార్ రెడ్డి
అల్లుడు మారంరెడ్డి మునీష్ రెడ్డి
మనవడు ఓడూరు తరుణ్ రెడ్డి

(c) eenadu

ప్రమాదాల దండయాత్ర.. వైద్యం బతికించే మాత్ర!!

రోడ్లపై ఘటనలతో బెంబేలు
అవసరాలకు తగ్గట్టుగా లేని ట్రామాకేర్ సెంటర్లు

ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, వన్‌టౌన్: విశాఖ నగర పరిధిలో రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రమాదం జరిగిన తొలి గంట (గోల్డెన్ అవర్)లో సరైన చికిత్స అందక మరణాలు ఏటికేడు ఎక్కువవుతున్నాయి. బాధితులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కేజీహెచ్‌లో మాత్రమే ట్రామా కేర్ సెంటర్ (టీసీసీ) అందుబాటులో ఉంది. లంకెలపాలెం నుంచి ఆనందపురం వరకు 16వ నంబరు జాతీయ రహదారి నగరంలో 73 కి.మీ. మేర విస్తరించి ఉంది. గతేడాది జాతీయ రహదారిపై 420 ప్రమాదాలు జరగగా.. 149 మంది ప్రాణాలు కోల్పోయారు. దీనికి తగ్గట్టుగా అత్యవసర వైద్యమందించేందుకు టీసీసీలు లేవు.



ప్రతిపాదనలకే పరిమితం

విమ్స్‌లో టీసీసీ ఏర్పాటుచేయనున్నట్లు గతంలో ఉన్నతాధికారులు ప్రకటించారు. కానీ ఆ ప్రతిపాదనలు ముందుకు వెళ్లలేదు. జాతీయ రహదారి పక్కనే ఉన్న విమ్స్‌లో టీసీసీ ఏర్పాటుచేస్తే ఎంతో ప్రయోజనకరం.

ఎక్కడ జరిగినా కేజీహెచ్‌కే...

విశాఖ నగరం, శివార్లలో నిత్యం కనీసం ఒకటి లేదా రెండు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎక్కడ ప్రమాదం జరిగినా ఎక్కువ శాతం బాధితులను అంబులెన్సుల్లో కేజీహెచ్‌కే తీసుకొస్తున్నారు. నగరం మధ్యలో ఉన్న కేజీహెచ్‌కు రావాలంటే కనీసం 30 నిమిషాల సమయం పడుతుంది. ప్రమాదాలు జరిగినప్పుడు మొదటి గంటలో వైద్యమందిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని వైద్యులు చెబుతున్నారు. అత్యవసర వైద్యంలో జాప్యం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

● వైద్యుల పోస్టులు ఖాళీ...

» కేజీహెచ్‌లో 11వ పంచవర్ష ప్రణాళికలో భాగంగా ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుచేశారు. అది పూర్వం ఆర్థోపెడిక్, న్యూరోసర్జరీ విభాగాల ఆధ్వర్యంలో ఉండేది. ప్రస్తుతం అత్యవసర వైద్య విభాగం (ఈఎండీ) ఆధ్వర్యంలో నడుస్తోంది.

» అప్పట్లో కాంట్రాక్టు ప్రాతిపదికన 20 వైద్యుల పోస్టులు మంజూరు చేశారు. అందులో చాలా మందికి మెరుగైన అవకాశాలు రావడంతో అక్కడ మానేసి వెళ్లిపోయారు. ప్రస్తుతం 10కి పైగా వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో అనుబంధ విభాగాల సహకారంతో నిర్వహణ సాగుతోంది.

» ఇక్కడికి వచ్చే కేసుల్లో బాధితులకు ప్రాథమిక చికిత్స తర్వాత, అవసరమైన పరీక్షలు చేసి.. సంబంధిత విభాగానికి పంపిస్తున్నారు. ఆ విభాగం ఆధ్వర్యంలో 20 వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయి. చాలా మంది బాధితులు ముందు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి బిల్లులు చెల్లించలేక చివరి నిమిషంలో కేజీహెచ్‌కు వస్తున్నారు. ఇక్కడ సరిపడా వెంటిలేటర్లు లేక అవస్థలు తప్పడం లేదు.

» ఈ కేంద్రానికి ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాలతోపాటు ఒడిశా నుంచి రోజుకు కనీసం 30 మంది రోగులు వస్తున్నారు. నెలకు 800 నుంచి 900 కేసుల వరకు వస్తున్నాయి. అవసరాలకు తగ్గట్టుగా అత్యాధునిక వైద్య సామగ్రి, మరిన్ని వెంటిలేటర్లు సమకూర్చాల్సి ఉంది.

వీఆర్‌ఎస్‌కు 817 దరఖాస్తుల రాక

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు కర్మాగారంలో మూడో దఫా స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పథకం గడువు మంగళవారంతో ముగిసింది. గడువు నాటికి మొత్తం 817 మంది దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. ఒక్క ఎస్‌ఎంఎస్ (స్టీల్ మెల్టింగ్ షాప్) నుంచే సుమారు 130 మంది దరఖాస్తు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. జనవరి 1 నుంచి 20వ తేదీ వరకూ దరఖాస్తుకు గడువు ఉండగా.. అప్పటికి సుమారు 600 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఆ తేదీని ఈనెల 27 వరకు పొడిగించడంతో 817 దరఖాస్తులు వచ్చాయి. వీరిలో ఎంతమంది వీఆర్‌ఎస్‌కు అర్హులో అధికారులు తేల్చనున్నారు.

రెండు విడతల్లో 1,587 మంది: ఇప్పటికే ఉక్కులో రెండుసార్లు వీఆర్‌ఎస్‌కు దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ రెండు విడతల్లో మొత్తం 1,587 మంది బయటకు వెళ్లారు. మూడో దఫా ఎంత మందికి వీఆర్‌ఎస్ ఇస్తారో చూడాలి. జనవరి 1, 2025 నాటికి శాశ్వత ఉద్యోగులు 12,338 మంది ఉండగా అది జనవరి 1, 2026 నాటికి 9,311కు చేరింది. ఒప్పంద కార్మికుల సంఖ్య 13,990గా ఉంది.

నేడు 'భారత్- న్యూజిలాండ్' టీ-20 మ్యాచ్

సాధనలో పాల్గొన్న అక్షర్‌పటేల్, అర్షదీప్‌సింగ్

విశాఖక్రీడలు, న్యూస్‌టుడే: 'భారత్- న్యూజిలాండ్' జట్ల మధ్య నాలుగో టీ-20 మ్యాచ్ బుధవారం నగరంలోని ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్యాలరీలను శుభ్రం చేసి, కుర్చీలకు సీటింగ్ నెంబర్లు వేశారు. ★ మంగళవారం స్టేడియంలో, 'బి' మైదానంలో క్రికెటర్లు సాధన చేశారు. తక్కువ ధర కలిగిన టికెట్లు దాదాపుగా అమ్ముడయ్యాయి, అధిక ధర కలిగిన టికెట్లు కొన్ని మాత్రమే ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని ఏసీఏ వర్గాలు పేర్కొన్నాయి. ★ మ్యాచ్ సందర్భంగా బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ట్రాఫిక్ మళ్లింపు అమల్లో ఉంటుందని, వాహనదారులు సహకరించాలని పోలీసులు సూచించారు. మ్యాచ్ వీక్షించడానికి వచ్చే వారిలో వీవీఐపీ పాసులు ఉన్న వారు ఎన్‌హెచ్-16పై స్టేడియం వరకు వెళ్లి 'ఏ' మైదానం లోపల 'పి-1' పార్కింగ్ వద్ద, వీవీఐపీ పాసులు కలిగిన వారు స్టేడియం 'బి' గ్రౌండ్ లోపల 'పి-2' పార్కింగ్ వద్ద, ఇతర టికెట్లు కలిగిన వారు వైజాగ్ కన్వెన్షన్ సమీప 'పి-3' పార్కింగ్ వద్ద వాహనాలను నిలపాలన్నారు. సాధారణ ప్రేక్షకులు సాంకేతిక ఇంజినీరింగ్ మైదానంలోని 'పి-4' పార్కింగ్ వద్ద, ఏఎస్‌నగర్ ఆరో వార్డు జీవీఎంసీ పార్కు-1లో, జీవీఎంసీ పార్కు-2లో, రత్నగిరి కాలనీ సమీప జీవీఎంసీ పార్కు-3లో పార్కింగ్ చేసుకోవాలని సూచించారు.

'అరకు వేడుక'...అదరహో అనేలా!

అరకులోయ, న్యూస్‌టుడే: చుట్టూ కొండలు.. ప్రకృతి సోయగాలతో అరకులో ప్రత్యేక ఆకర్షణ. ఉపోద్ఘాయన చలి దుప్పటి కప్పుకొనే అరకు మాదాని ఎక్కడెక్కడి నుంచో పర్యాటకులు తరలివస్తారు. వారికి ఆహ్లాదంతోపాటు ఆనందం పంచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అరకులో సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్సాహభరితంగా సాహస క్రీడలతో ఈనెల 29 నుంచి ఫిబ్రవరి ఒకటి వరకు అరకు ఉత్సవాలను నిర్వహిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ప్రారంభిస్తారు.

▶ **సాహసికులకు సిద్ధం కండి:** విశాఖపట్నం-అరకు హాట్ రహదారిపై గాలికొండ వ్యూపాయింట్ వద్ద బెలూన్లతో ట్రెక్కింగ్‌ను ఈ నెల 30న నిర్వహిస్తారు. ★ లోతేరు రహదారి నుంచి పద్మాపురం వరకు ట్రెక్కింగ్, 31న మారథాన్ పోటీలు నిర్వహిస్తున్నారు. ★ హాట్ ఎయిర్ బెలూన్, పారా గ్లైడింగ్, పారా మోటారింగ్, హెలికాప్టర్ విహారాలు ఉంటాయి. ★ 31న గాయని సునీత సంగీత విభావరి నిర్వహిస్తారు. ఒకటిన సంగీత దర్శకుడు తమన్ రానున్నారు.★ ముగింపు కార్యక్రమంలో వివిధ రకాల డ్రోన్ల ప్రదర్శన ఉంటుంది. ★ముఖ్యమంత్రి చంద్రబాబు రాక నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం చొంపి గ్రామంలోని హోంస్టేలను పరిశీలించి..నిర్వాహకులతో మాట్లాడనున్న నేపథ్యంలో అధికారులు అక్కడ పరిశీలించారు.

'ఐదు పని రోజులు' విధానానికి డిమాండ్

మాట్లాడుతున్న యూఎఫ్‌బీయూ విశాఖపట్నం కన్వీనర్ సుష్మ

ఆందోళనలో పాల్గొన్న బ్యాంకు ఉద్యోగులు

కార్పొరేషన్,జగదాంబ కూడలి, న్యూస్‌టుడే : ప్రతి వారం ఐదు పని రోజుల విధానాన్ని అమలు చేయాలని కోరుతూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం బ్యాంకు ఉద్యోగులు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. ఆందోళనలో పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు మాట్లాడుతూ... భాజపా అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగుల్ని, కార్మికుల్ని ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్ సంస్థలకు అనుగుణంగా నాలుగు లేబర్‌కోడ్స్ తీసుకురావడం దారుణమన్నారు. బ్యాంకు ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. దేశంలో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి, మోదీ, షా నిర్ణయాలు అమలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఐక్య పోరాటాలతోనే హక్కులు, డిమాండ్లు సాధ్యమవుతాయన్నారు.

★ డాబాగార్డెన్స్ సమీప ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద మంగళవారం నిర్వహించిన ఆందోళనలో యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ (యూఎఫ్‌బీయూ) విశాఖపట్నం కన్వీనర్ సుష్మ, ఇతర సంఘాల ప్రతినిధులు రమేష్‌నాయుడు, సతీష్, శ్రీనివాస్ మాట్లాడారు. బ్యాంకింగ్ రంగంలో 5 రోజుల పని విధానానికి రెండేళ్ల కిందట ఇచ్చిన హామీని అమలు చేయాలని కేంద్రాన్ని కోరారు. ఆందోళనలో 9 యూనియన్ల సభ్యులు పాల్గొన్నారు. ఆయా సంఘాల ప్రతినిధులు శాంసన్, గిరి, రామ్‌రతన్, కుమార్, భాస్కర్ తదితరులు హాజరయ్యారు.

'ఉత్సవ్' వెలుగులు.. ఉత్సాహం ఉరకలు..!

ఆకట్టుకున్న ప్రదర్శన

బీచ్ కబడ్డీ పోటీల్లో ఆసక్తికర దృశ్యాలు

★ మంగళవారం నుంచి ఆర్కేబీచ్‌లో క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. బీచ్ కబడ్డీ, ఫుట్‌బాల్, వాలీబాల్ పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ, విశాఖ గ్లోబల్ డేటా సెంటర్ సైకత శిల్పాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కార్పొరేషన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలను సంతోషపెట్టడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. ఆర్కేబీచ్‌లో మంగళవారం జరిగిన విశాఖ ఉత్సవ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. 2019లో అప్పటి వైకాపా ప్రభుత్వం విశాఖ ఉత్సవ్‌ను నిలిపివేసిందని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తిరిగి జరపాలని నిర్ణయించామన్నారు. తూర్పు, ఉత్తరం ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ ఈ ఏడాది లోటుపాట్లు తెలుసుకుని వచ్చే ఏడాది మరింత మెరుగ్గా ఉత్సవాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీ ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ ఛైర్మన్ గండి బాబ్జీ, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ పాల్గొన్నారు.

విశాఖ ప్రత్యేకత తెలిపే సైకత శిల్పం

గాయకుడు జావెద్ అలీఖాన్

★ **ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు:** ఉత్సవ్‌లో భాగంగా మంగళవారం కాళీమాత ఆలయం వద్ద వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టు కున్నాయి. టిల్లు బాయ్స్ కుర్చీలతో చేసిన విన్యాసాలు, గాలిలో తేలియాడుతూ ప్రదర్శించిన నృత్యాలు అబ్బురపరిచాయి. ప్రముఖ హిందీ గాయకుడు జావెద్ అలీఖాన్ హిందీ గీతాలతో అలరించారు. గోకుల్‌పార్కు వేదికపై కళాకారులు ప్రదర్శనలు అలరించాయి.

టిల్లు బాయ్స్ ప్రదర్శన

డాక్టర్ ఆదినారాయణ మృతికి ప్రధాని సంతాపం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖకు చెందిన ప్రముఖ వైద్యులు, పద్మశ్రీ డాక్టర్ ఎస్‌వీ.ఆదినారాయణ ఇటీవల కన్నుమూశారు. ఆయన మృతికి ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం ప్రకటిస్తూ మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు ఓ లేఖ రాశారు. 'ఆదినారాయణ గొప్ప సర్జన్.. పేద పోలియో రోగులకు అవసరమైన వైద్యం అందించడంతో పాటు, వారి పునరావాసానికి కృషి చేశారు. వేలాది మందికి అవసరమైన వైద్యశాలలు ఏర్పాటు చేశారు. యుక్త వయసులో ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా గుర్తింపు పొందారు. ఆయన సేవలకు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు వచ్చాయి. ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితుల హృదయాల్లో ఎప్పటికీ నిలిచిపోతారు' అని ప్రధాని లేఖలో పేర్కొన్నారు.

దంతెవాడ వరకే కిరండూల్ రైలు

జ్ఞానాపురం, న్యూస్‌టుడే : కేకే. లైన్‌లో భద్రతాపరమైన ఆధునికీకరణ పనులు, ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపడుతున్న నేపథ్యంలో ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 9 వరకు విశాఖ- కిరండూల్(58501) రైలు దంతెవాడ వరకే రాకపోకలు సాగిస్తుందని వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్ కుమార్ తెలిపారు.

'గాలి'లో దీపంలా ఆరోగ్యం!

★ నగరంలో క్షీణిస్తున్న వాయు నాణ్యత ★ పోర్టు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి

ఈనాడు-విశాఖపట్నం: నగరంలో గాలి నాణ్యత రోజురోజుకీ క్షీణిస్తోంది. పీల్చే గాలి కాలుష్యమై చిన్నారులు, వృద్ధులు శ్వాసకోశ సమస్యలతో అల్లాడుతున్నారు. ఈ సమస్య క్రమంగా పెరుగుతోంది.

> నగరానికి మూడువైపులా కొండలు, ఒకవైపు సముద్రం ఉన్నాయి. గాలిలో వేగం లేక... నగరాన్ని కాలుష్యం కమ్మేస్తోంది. తాజా గణాంకాలు సైతం భయాందోళన కలిగిస్తున్నాయి.

➤ **ఉదయం వాకర్స్‌పై ప్రభావం:** గాలి నాణ్యత (ఏక్యూ) క్షీణించడంతో ఉదయం వాకింగ్, వ్యాయామం చేసేవారిపై ప్రభావం పడుతోంది. పిల్లలు, వృద్ధుల్లో ఆస్తమా, శ్వాస సమస్యలు వస్తాయి. గుండె సమస్యలున్న వారు ఇలాంటి గాలి పీల్చితే ఇబ్బందులు తలెత్తుతాయని నిపుణులు చెబుతున్నారు.

➤ **పోర్టు కాలుష్యమే కారణం:** నగరంలో పోలీస్ బ్యారెక్స్ వద్ద గాలి నాణ్యత బాగా క్షీణించింది. దీనికి కారణం పోర్టు కాలుష్యమని అధికారులు పేర్కొంటున్నారు. నిత్యం బొగ్గు, ఇతర నిల్వలపై, రోడ్లపై నీళ్లు చల్లడం, నిల్వలు కవర్‌షెడ్‌లలో పెట్టడం, రవాణా సమయంలో కవర్‌తో కప్పడం వంటివి పూర్తిగా అమలు కావడం లేదు. వాహనాలు అధిక లోడు (ఓవర్‌లోడు)తో వెళుతూ కాలుష్యానికి కారణమవుతున్నాయి. పలుసార్లు చెప్పినా మార్పు రాని నేపథ్యంలో పోర్టులో కాలుష్య నియంత్రణపై అమరావతి స్థాయిలో సమీక్ష నిర్వహించాలని నిర్ణయించారు.

గాలి నాణ్యత లెక్క.. ప్రభావం ఇలా

★ **0-50 :** మంచి గాలి (ఆరోగ్యానికి సురక్షితం) ★ **51-100:** సంతృప్తికరం (కొద్దిగా ప్రభావం ఉండొచ్చు)
★ **101-200:** మోస్తరు (చిన్నారులు, వృద్ధులకు ఊపిరితిత్తులు, ఆస్తమా సమస్యలు) ★ **201-300:** ప్రభావం చూపే స్థాయి (శ్వాస సమస్యలు)
★ **301-400:** ప్రభావం చాలా ఎక్కువ (తీవ్రమైన సమస్యలు)

➤ **పీఎం 10, 2.5 పెరుగుదల:** గాలి నాణ్యతలో మార్పులతోపాటు సూక్ష్మ కాలుష్య కణాల (పీఎం10, పీఎం2.5) స్థాయి సైతం 7 నుంచి 12శాతానికి ఈనెల 25న పెరిగినట్లు గుర్తించారు. సంక్రాంతి సమయంలో నగరం నుంచి పెద్ద సంఖ్యలో జనం ఇతర ప్రాంతాలకు వెళ్లారు. నగరంలో వాహనాల రాకపోకలు తగ్గాయి. అప్పుడు వాస్తవ గాలి నాణ్యతను మధురవాడ, ఆరిలోవ, జీవీఎంసీ, చౌల్ట్రీ పరిధిలో పరిశీలించారు. నివేదికలు త్వరలో విడుదల చేస్తామని పీసీబీ ఈఈ పీవీ ముకుందరావు 'ఈనాడు'తో తెలిపారు.

ఈ నెల 19 నుంచి 25 వరకు వివిధ ప్రదేశాల్లో గాలి నాణ్యత సరాసరి ఇలా

మింధి	115
ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్	125
పోలీస్ బ్యారెక్స్	**237**
ఈఎస్ఐ హాస్పిటల్,మల్కాపురం	105
సీతమ్మధార	120
జ్ఞానాపురం	183
పెదగంట్యాడ	103
ఎంవీపీ రైతు బజార్	120
మాధవధార	94
ఆశీల్‌మెట్ట జీవీఎంసీ ఆఫీస్	197

వీడిన ఉత్కంఠ!!

బంగ్లాదేశ్ నుంచి మత్స్యకారులకు విముక్తి
29న బోటుతో సహా విశాఖకు పయనం

జైలు నుంచి విడుదలైన మత్స్యకారులతో మోంగ్లా పోర్టు వద్ద తూర్పుకోస్తా మరపడవల యజమానుల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్, తదితరులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : బంగ్లాదేశ్‌లోని భాగర్‌హాట్ జైల్లో బందీలుగా ఉన్న మత్స్యకారులు మంగళవారం విడుదలయ్యారు. భారత్-బంగ్లాదేశ్‌ల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం జైలు అధికారులు భారత్‌కు చెందిన 23 మంది మత్స్యకారులను విడుదల చేసి ఆ దేశ కోస్టుగార్డుకు అప్పగించారు. వారిలో 9 మంది విశాఖకు చెందిన వారు కాగా, మిగిలిన 14 మంది పశ్చిమబెంగాల్‌కు చెందిన వారు. విశాఖ మత్స్యకారుల బోటు అక్కడి మోంగ్లా పోర్టు వద్ద ఉండిపోవడంతో, వారిని అక్కడకు తీసుకెళ్లారు. బోటు మొత్తం పాడైపోవడంతో, మత్స్యకారులు మరమ్మతులు చేపడుతున్నారు. ఆయా పనులు పూర్తయిన తర్వాత, ఈనెల 29వ తేదీ అర్ధరాత్రి అక్కడ నుంచి భారత్‌కు బయలుదేరనున్నారు. భారత తూర్పుకోస్తా మర పడవల యజమానుల సంఘం అధ్యక్షులు వాసుపల్లి జానకిరామ్ బంగ్లాదేశ్ వెళ్లి, విడుదలైన మత్స్యకారుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచే బాధిత కుటుంబీకులతో ఫోన్లో మాట్లాడించారు.

ఇదీ జరిగింది: విశాఖపట్నం చేపలరేవు సమీప జాలరిపేటలో నివాసం ఉండే సత్యనారాయణకు చెందిన బోటులో (ఏపీ వీ5ఎంఎం 735) విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కొండరాజుపాలెం, తిప్పలవలస, రెల్లివీధి, బర్రిపేట, జాలరిపేటకు చెందిన మత్స్యకారులు.. ఎం.చినఅప్పన్న(డ్రైవర్), సూరాడ అప్పలకొండ, సూరపతి రాము, వాసుపల్లి సీతయ్య, నక్కా రమణ, మరుపల్లి ప్రవీణ్, మరుపల్లి రమేష్, మరుపల్లి చినఅప్పన్న, మైలపల్లి అప్పన్న అక్టోబరు 13న చేపలరేవు నుంచి బయలుదేరి వేటకు వెళ్లారు. సముద్రంలో మూడు వారాల పాటు చేపలవేట సాగించాల్సి ఉండగా, పొరపాటున అక్టోబరు 22న బంగ్లాదేశ్ జలాల్లోకి ప్రవేశించారు. బంగ్లాదేశ్ కోస్టుగార్డు అధికారులు అదే రోజున అరెస్టు చేసి భాగర్‌హాట్ జైలుకు తరలించారు. వీరు 98 రోజుల పాటు జైల్లో ఉన్నారు. భారత్, బంగ్లాదేశ్ మధ్య నెలకొన్న పరిణామాల నేపథ్యంలో వీరి విడుదలపై సందేహాలు ముసురుకున్నాయి. అయితే.. విశాఖపట్నం, విజయనగరం ఎంపీలు ఎం.శ్రీభరత్, అప్పలనాయుడు, విశాఖ దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, విశాఖ దక్షిణం తెదేపా ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ మత్స్యకారుల విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు వివరించారు. వారు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపడంతో మత్స్యకారుల విడుదలకు మార్గం సుగమమైంది.

శ్రద్ధాంజలి

ప్రేమ, మంచితనం, చెరగని చిరునవ్వుతో అందరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ... మమతానురాగానులకు విలువనిస్తూ.. మా అందరి హృదయాలలో సుస్థిర స్థానం ఏర్పరుచుకున్న మీరు మానుండి భౌతికంగా దూరమైనా మీ జ్ఞాపకాలు మరువలేము. మీ పవిత్ర ఆత్మకు సదా శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ....

భర్త: అంబటి క్రిష్ణమూర్తి (లేటు)
కుటుంబ సభ్యులు
దేవభూషణం, కోమలదేవి
అప్పలస్వామి, శ్యామల
డా॥ మోహన్‌రావు, శ్వేత
గంగాధర్, సునీత
మనుమలు: జ్ఞానేశ్వర్, క్రిష్ణమోహన్, క్రిష్ణ కేతన్, క్రిష్ణ గణేష్
మనుమరాళ్ళు : క్రిష్ణ మౌక్తిక, జోష్నికా, వర్ణికా మరియు బంధుమిత్రులు

కీ॥శే॥ అంబటి లీలావతి గారు
మరణం: 17-01-2026

పెద్దకర్మ: తేది. 28-01-2026 బుధవారం మ॥ 12 గంటలకు సంయుక్త ఫంక్షన్‌హాల్, NTPC, దీపాంజలినగర్, వైజాగ్‌లో జరుపబడును.

శ్రద్ధాంజలి

మా హృదయ ఫలకాలపై
చెక్కిన సజీవ శిల్పం
మీ రూపం.. అనురాగానికి
చిరునామా మీ హృదయం..
మీరు వేసిన ప్రతి అడుగు
మాకు ఆదర్శం..
నడిచిన ప్రతిదారి
సదాశయం... చేరిన ప్రతి
గమ్యం స్ఫూర్తిశిఖరం..
మీరే మాకు మార్గదర్శి..
We miss you dear Sir..

పద్మశ్రీ అవార్డు గ్రహీత
డా॥ సుంకర వెంకట ఆదినారాణరావు గారు
MS (Ortho), D.Sc (AU)
Managing Trustee: Free Pollo Surgical & Research Foundation Director General of Prema Hospital

Dr. Satish Kumar Pethakamsetty Chief Joint Replacement Surgeon Managing Director: KIMS ICON Hospitals, Visakhapatnam	Dr. M. Eswara Babu Specialist Orthopedic Dubai, United Arab Emirates
Dr. P.V. Sudhakar M.S., M.Ch., DNB., FAIS., FICS Consultant Plastic & Cosmetic Surgeon	Dr. N.R.V. Somaraju Chief Anaesthesiologist KIMS ICON Hospital, Sheelanagar
Dr. Lanka Ramarao Former Professor & HOD of Ortho G.V.P. Medical College, Visakhapatnam	Dr. A. Sriramamurthy Sri Sai Super Speciality Hospitals Vijayanagaram
Dr. Sunkara Brahmaji Consultant Ortho Surgeon Bhimavaram	Dr. Puppala Murali Krishna Sai Sanjeevani Hospital Tadepallegudem
Dr. Y.L. Narasinga Rao Former Professor & HOD OBG / AMC, KGH	Dr. P. Sivananda Professor & HOD Ortho Rangaraya Medical College, Kakinada Former Superintendent, KGH
Dr. T. Bhavani Prasad Professor &HOD of Ortho A.M.C / K.G.H, Visakhapatnam	Dr. M. Chandra Sekharam Naidu Professor of Orthopaedics A.M.C / K.G.H, Visakhapatnam
Dr. Ch.V. Muralikrishna Professor of Orthopaedics.AMC Superintendent, R.C.D. Hospital	Dr. B.V.R.N. Varma Consultant Orthopaedic Surgeon OMNI RK Hospitals, Visakhapatnam
Dr. P. Ashok Kumar Former Superintendent, KGH Former Principal, SMC, Vijayawada Former Principal, RIMS, Ongole	Dr. Udaya Kumar Boddapalli Professor & HOD Ortho, GEMS & Hospital Former Professor & HOD Ortho AMC / KGH, Visakhapatnam

ఆదర్శమూర్తికి అశ్రునివాళి



పద్మశ్రీ అవార్డు గ్రహీత
డా॥ సుంకర వెంకట ఆదినారాయణరావు గారు
MS (Ortho), D.Sc (A.U)
Managing Trustee: Free Polio Surgical & Research Foundation;
Director General of Prema Hospital
జననం: 30-06-1939 మరణం: 17-01-2026

వైద్యరంగంలో ఎన్నో మైలురాళ్ళను దాటి, ఎంతోమందికి వైద్యసేవలు అందించి, మరెంతో మందికి ఉపాధిమార్గం చూపించి, విద్యాదాతగా, ఆరోగ్య ప్రదాతగా అందరి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన మార్గదర్శకులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత డా॥ సుంకర వెంకట ఆదినారాయణరావు గార్కి ఘనమైన నివాళులర్పిస్తూ... వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ... వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ...

DEPARTMENT OF ORTHOPEDICS
ANDHRA MEDICAL COLLEGE / KGH
NORTH ANDHRA ORTHOPEDIC ASSOCIATION

సామాన్యుల కోసమే.. 'స్వర్ణభారతి'

శిలాఫలకం ఆవిష్కరణలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, మేయర్ పీలా శ్రీనివాసరావు, కలెక్టర్ హరేంధిరప్రసాద్, కమిషనర్ కేతన్‌గార్గ్, ఇతర ప్రజాప్రతినిధులు

కార్పొరేషన్, మద్దిలపాలెం, న్యూస్‌టుడే : మహా విశాఖ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రూ.16.90 కోట్లతో అభివృద్ధి చేసిన స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం సామాన్య ప్రజల కోసమేనని, నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చేది లేదని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, మేయర్ పీలా శ్రీనివాసరావు, కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్, కమిషనర్ కేతన్‌గార్గ్, ఇతర నాయకులతో కలిసి స్టేడియాన్ని ప్రారంభించారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు కాసేపు షటిల్ ఆడారు. అన్ని హంగులతో స్టేడియాన్ని అభివృద్ధి చేశామని, ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని మేయర్ అన్నారు. కార్యక్రమంలో ప్రధాన ఇంజినీర్ పీవీవీ.సత్యనారాయణరాజు, అదనపు కమిషనర్ పల్లి నల్లనయ్య, కార్పొరేటర్లు పద్మారెడ్డి, వసంతలక్ష్మి, బిపిన్‌కుమార్ జైన్, పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధునికీకరించిన స్టేడియం

టెన్నిస్ పోటీల నిర్వహణ అభినందనీయం

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే : కొన్నేళ్ల నుంచి క్రమం తప్పకుండా 'సీఎంఆర్-అయిస్టా' టెన్నిస్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎంపీ శ్రీభరత్ అన్నారు. మంగళవారం రాత్రి నగరంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన పోటీలను ఆయన ప్రారంభించారు. దేశం నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరై వివిధ వయసుల విభాగాల్లో తలపడ్డారు. ప్రారంభ కార్యక్రమంలో సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, మాజీ డీజీపీ ఎన్.సాంబశివరావు, శాప్ ఛైర్మన్ రవినాయుడు, టోర్నీ డైరెక్టర్ కె.సతీష్, ఆఫీసర్స్ క్లబ్ ప్రతినిధులు కె.రమేష్, డీఎస్ఎన్.రాజు, అయిస్టా ప్రతినిధులు కె.ప్రేమ్ చంద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గాల్లోకి బెలూన్లు వదిలి పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, మాజీ డీజీపీ ఎన్.సాంబశివరావు, శాప్ ఛైర్మన్ రవినాయుడు తదితరులు

నేడు షిప్‌యార్డు సీఎండీ ఎంపిక

న్యూస్‌టుడే, సింధియా : హిందుస్థాన్ షిప్‌యార్డు కొత్త సీఎండీ ఎవరో ఈనెల 28న తేలనుంది. గడిచిన కొన్ని నెలలుగా సంస్థలో డైరెక్టర్‌గా విధులు నిర్వహించిన కమొడోర్ గిరిదీప్ సింగ్ ప్రస్తుతం కొనసాగుతున్నారు. గత ఏడాదిలో కమొడోర్ హేమంత్ ఖత్రీ పూర్తికాలపు సీఎండీగా కొనసాగి పదవీ విరమణ చేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత దిల్లీలో ఈ పోస్టుకి ఇంటర్వ్యూలు జరిగినా సీఎండీ ఖరారులో ప్రతిష్టంభన నెలకొంది. ప్రస్తుతం కొనసాగుతున్న గిరిదీప్ సింగ్ కూడా ఈనెలాఖరునే పదవీ విరమణ చేస్తున్నారు. దీంతో సంస్థకు కొత్త సీఎండీ నియామకం అనివార్యమైంది. ఈ సందర్భంగానే కొత్త సీఎండీ నియామకానికి కసరత్తు జరుగుతోంది. షిప్‌యార్డు నుంచే ముగ్గురు అధికారులు పోటీపడుతున్నట్లు సమాచారం. ఈ ముగ్గురి నుంచే ఒకరికే సీఎండీ సీటు దక్కనుందని ఉద్యోగ వర్గాలు చెప్తున్నాయి.

రైళ్ల సమయాల్లో మార్పులు

జ్ఞానాపురం, న్యూస్‌టుడే : ఖుర్దారోడ్ రైల్వే డివిజన్ పరిధిలో మూడు రైళ్ల సమయాల్లో మార్పులు చేసినట్టు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. 18118 గుణుపూర్-రవుర్కెలా, 12253 ఎస్ఎంవీ బెంగళూరు-భాగల్పూర్, 22856 తిరుపతి- సంత్రాగచ్చి రైళ్ల సమయాల్లో మార్పులు జరిగాయన్నారు.

అవార్డు గ్రహీతలకు హృదయపూర్వక శుభాకాంక్షలు

శ్రీ ఎ. సింహాచలం గారు
APIIC, జోనల్ మేనేజర్, విశాఖపట్నం

శ్రీ ఎ. కిషోర్ గారు
కమిషనర్, APIIC - IALA
ఆటోనగర్, గాజువాక

విధి నిర్వహణలో విశిష్టమైన సేవలందించినందుకుగాను తేది: 26-01-2026 గణతంత్ర దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం కలెక్టర్ శ్రీ M.N. హరేందిర ప్రసాద్ గారు చేతుల మీదుగా ఉత్తమ అధికారులుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న అవార్డు గ్రహీతలు APIIC జోనల్ మేనేజర్ శ్రీ ఎ. సింహాచలం గార్కి మరియు APIIC - IALA కమిషనర్ శ్రీ ఎ. కిషోర్ గార్కి మా హృదయపూర్వక హార్దిక శుభాకాంక్షలు.

APIIC - IALA AUTONAGAR
GAJUWAKA NOTIFIED MUNICIPAL INDUSTRIAL ARIEAS SERVICE SOCIETY
Regd. No. 1163/1997, AUTONAGAR, VISAKHAPATNAM-12

VISAKHA AUTONAGAR SMALL SCALE INDUSTRILIASTS WELFARE ASSOCIATION
Regd. No. 550/90 AUTONAGAR, VSP-12

PEDAGANTYADA INDUSTRIAL WELFARE ASSOCIATION
VISAKHAPATNAM-44 Regd. No. 434/2014

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - తాడికొండ: బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Hospitality Partner: CITY Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Man of the Series: Hero
Digital Partner: ఈనాడు.నెట్
TV Partner: ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు ఛాంపియన్స్ క్లబ్

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - I జూనియర్స్ : మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్స్‌లతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులు చేసి ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - I జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సులతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

సీనియర్స్ విన్నర్స్ రాయలసీమ రాకర్స్

గ్రౌండ్-2లో సీనియర్స్ : సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ చరణ్ జిత్ ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-I (జూనియర్స్)
మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)
మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

నేడు, రేపు విశాఖలో జైళ్ల శాఖ జాతీయ సదస్సు

విశాఖపట్నం(ఆరిలోవ), న్యూస్‌టుడే: జైళ్లశాఖ జాతీయ సదస్సు జనవరి 28, 29 తేదీలలో విశాఖ నగరం రుషికొండ సాయిప్రియ రిసార్ట్స్‌లో జరుగుతుందని జైళ్ల శాఖ ఐ.జి. ఇండ్ల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు సమావేశాలకు ముఖ్య అతిథిగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హాజరవుతున్నారని, రెండో రోజు సదస్సుకు రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత వస్తున్నారన్నారు. కేంద్ర కారాగారాల నిర్వహణ, నూతన సంస్కరణలు, ఖైదీల సంక్షేమం తదితర అంశాలపై జాతీయ సదస్సులో చర్చిస్తారన్నారు. అన్ని రాష్ట్రాల జైళ్లశాఖ ఐజీ, డీఐజీ స్థాయి అధికారులు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

29 నుంచి ఫిర్యాదుల స్వీకరణ

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి ఈనెల 29, 30న జడ్పీ సమావేశ మందిరంలో ఉప లోకాయుక్త పి.రజని ఆధ్వర్యంలో ఫిర్యాదుల స్వీకరణతో పాటు, ఇప్పటికే లోకాయుక్త పరిధిలో ఉన్న కేసుల విచారణ చేపట్టనున్నారు. లోకాయుక్త సేవల్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. లోకాయుక్త చట్టం ప్రకారం అధికారులు, ఉద్యోగుల దురుసు ప్రవర్తన, అవినీతి, అధికార దుర్వినియోగం, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వంటి అంశాలకు సంబంధించి ఫిర్యాదుల స్వీకరణ ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

ఒత్తిడి లేని విద్యాబోధనకు ప్రాధాన్యం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యాబోధన చేయడమే ధనిక్ భారత్ విద్యా సంస్థల లక్ష్యమని సంస్థ వ్యవస్థాపకులు విక్రం నారాయణరావు అన్నారు. మంగళవారం హోటల్ దసపల్లాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య అనేది దేశాభివృద్ధికి ప్రధాన శక్తి అనే విశ్వాసంతోనే ధనిక్‌భారత్ విద్యాసంస్థలు ఏర్పాటు చేశామన్నారు. మధురవాడలో ధనిక్ భారత్ ఇంటర్ కళాశాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. విద్యారంగంలో అనుభవజ్ఞులైన బాలలత, సురేంద్ర, మస్తాన్‌రావు, రవీంద్రకుమార్, గిరిబాబు, రాంబాబు, సలీం, సాంబశివరావు సంస్థకు డైరెక్టర్లుగా ఉన్నారన్నారు. డైరెక్టర్ బాలలత మాట్లాడుతూ... సువిశాలమైన ప్రాంగణంలో అత్యాధునిక హంగులతో కళాశాలను నిర్మించామని, ఇంటర్‌లో అన్ని కోర్సులు అందుబాటులో ఉంటాయన్నారు.

సమావేశంలో సంస్థ వ్యవస్థాపకులు నారాయణరావు, డైరెక్టర్లు

జైకుమార్‌కు ప్రెసిడెంట్స్ పోలీస్ మెడల్ అందజేత

రమేష్‌కృష్ణన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఏఎస్ఐ జైకుమార్

మల్కాపురం, న్యూస్‌టుడే : సీఐఎస్ఎఫ్ క్రైం విభాగంలో 25 ఏళ్ల పాటు సేవలందించిన ఏఎస్ఐ జైకుమార్‌కి రాష్ట్రపతి నుంచి వచ్చిన ప్రెసిడెంట్స్ పోలీస్ మెడల్, ప్రశంసాపత్రాన్ని మంగళవారం అందజేశారు. మల్కాపురం సీఐఎస్ఎఫ్ పోలీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు (ఈడీ) రమేష్‌కృష్ణన్ చేతుల మీదుగా వీటిని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా జైకుమార్ సేవలను వారు అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్ హృషబ్ దేవాంగన్, అసిస్టెంట్ కమాండెంట్ అరవింద్‌కుమార్ శర్మ, సీజీఎం (చీఫ్ జనరల్ మేనేజరు) కిరణ్‌కుమార్, సీఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.10.6 లక్షల వార్షిక వేతనంతో కొలువులు

కంచరపాలెం, న్యూస్‌టుడే: ప్రభుత్వ కెమికల్ పాలిటెక్నిక్ కళాశాలలో కెమికల్ ఇంజినీరింగ్ డిప్లొమా పూర్తి చేసిన మహ్మద్ రియాజ్, బుద్దా సురేష్, పృథ్వీ.. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (పారాదీప్) కంపెనీలో కొలువులు సాధించారు. ఈ మేరకు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఆ కంపెనీ ఒక్కొక్కరికి రూ.10.6 లక్షల వార్షిక వేతనం ఇవ్వనుంది. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సంబంధిత విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ అభినందించారు. వీరంతా మంచి ప్యాకేజీతో ఎంపికవ్వడం కళాశాలకు గర్వకారణమన్నారు.

విద్యార్థులకు ధ్రువీకరణపత్రం అందజేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.రమణ

EENADU e Classifieds

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

REAL ESTATE

FLAT FOR SALE

KURMANNAPALEM

2nd Sale 1220 Sft 3BHK Semi Furnished Flat for Immediate sale opp. to Kurmannapalem RadioStation (Behind HP Petrol Bunk) Carparking Avail. ✆ 7013388590, 9038985646.

TAGARAPUVALASA

2 BHK & 3 BHK Flats for Sale, Beside ANITS College, Tagarapuvalasa. ✆: 96429 78696, 94406 75916.

LAND FOR SALE

GENERAL

పూసపాటిరేగ 'మం' గోవిందాపురం రోడ్డు హైవేకి 1/2KM తారురోడ్డు ఫేసింగ్ 9&4 ఎకరాలు కొబ్బరితోట అమ్మకం & హోటల్ లీజుకు కలదు. ✆ 9440255187.

PLOT FOR SALE

ATCHYUTAPURAM

DTCP Approved Plot (1120 Sq.Yds) Cheemalapalli, Atchutapuram, Vizag. Contact Phone: 9923879631

GAJUWAKA

426Sqyds N/F (54x72) Plot for Sale గాజువాక Nr. పెద్ద గంట్యాడ ఇండస్ట్రియల్ తిరుమల గ్యాస్ గూడెం ప్రక్కన Cont: 9441089274

JOBS

Special Recruitment for Retd.Employees. Those who are Interested to work as freelancing in a very reputed Org.Plz Come with your Credentials by ✆7702999763 for getting Decent Package.

Wanted Marketing Executive for Promoting Our Building Material Products in Vizag Attractive Salary + Incentive Contact Ph: 9703009555.

L&T Valves — At L&T Valves DEALER'S PLACE WANTED
WANTED Accountant & Sales Engineer
1) We are looking for a full-time Male / Female ACCOUNTANT who can independently handle all types of accounting and GST-related work, Minimum 3–4 yrs experience as an accountant in a distribution company, Good knowledge of Tally & Excel, Age: Between 35 to 40 yrs, within city limits.
2) we are looking Male Dynamic SALES ENGINEER having Degree in B.E.Mech or equivalent and having field experience of industrial products and can travel and having his own Bike.
Interest candidates send your CV to: sales@apsales.in
Ph: 98491 48481
Opp. Leelamahal Theatre, Visakhapatnam.

WANTED
▶MARKETING EXE.
▶COURIER PICK-UP BOYS
▶COMPUTER OPERATORS
For International Couriers
@ Vizag/HYD/Banglore Branches
SVES COURIER & CARGO
Near Diamond Park, Vizag.
9291901303

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేయుటకు స్త్రీ/పురు॥ కావలెను. రిటైర్డ్ ఉద్యోగులు / హౌస్‌వైఫ్స్‌కి ప్రాధాన్యత. ఫిక్స్‌డ్ శాలరీ + కమీషన్. Ct: 8885866999.

రైస్ మిల్ & ప్లాంట్ ఆపరేటర్స్ కావలెను. అనుభవజ్ఞులైన వెల్డింగ్, రిపేర్ తెలిసిన ఆపరేటర్స్ కావలెను. Contact No: ✆ 80962 46099.

సీతమ్మధారనందు ఇంటిపని చేయుటకు 35 సం॥లలోపు ఆడమనిషి కావలెను. Cont: 9355558899.

హౌస్‌కీపింగ్ మహిళ ఇంటిపని చేయుటకు MVP కి దగ్గరగా వున్నవారు కావలెను. ఉదయం 9 to 6:30, జీతం 10 వేలు. ఫోన్. 8885555513.

కళాసీలు & కౌంటర్ సేల్స్‌మెన్స్ (Q: ఇంటర్/ డిగ్రీ వ॥30సం॥ లోపు) కావలెను. భువనేశ్వర్ పెయింట్స్ & హార్డ్‌వేర్, రామాటాకీస్ మర్రిపాలెం, వైజాగ్ సెల్: 8886571718.

ఇంటిపని, వంటపని చేయటకు ఆడ మనిషి కావలెను. జీతం: 10,000లోపు, ఉ॥7.30 to 6PM సాగర్‌నగర్ 8328539794, 8121755558.

ACCOUNTING

Accountant required sal: 15k to 20k seethammadhara tax consultant office male 3 years exp any audit firm. ✆ 9966001488, 9666390999

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

బతుకు భారమై.. బిడ్డ బరువై..!

ఆటోలో శిశువును వదిలేసిన తల్లి

బిడ్డను తల్లికి అప్పగించిన కంచరపాలెం సీఐ రవికుమార్, ఆర్పీఎఫ్ అధికారులు

మాధవధార, రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: భర్తతో మనస్పర్థల కారణంగా ఐదు నెలల బిడ్డను జ్ఞానాపురం రైల్వేస్టేషన్ గేటు సమీపంలోని ఓ ఆటోలో తల్లి వదిలేసిన ఘటన ఇది. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా వేపాడ ప్రాంతానికి చెందిన శ్రావణి (22)కి అర్జున్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. ప్రస్తుతం కొమ్మాదిలో నివాసం ఉంటున్నారు. వీరికి ఐదు నెలల కిందట కుమారుడు జన్మించాడు. కొంతకాలంగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఉపాధి కోసం వారం రోజుల కిందట భార్యాభర్తలు విజయవాడ వెళ్లారు. అక్కడ ఎటువంటి పని దొరక్కపోవడంతో విశాఖ రావడానికి సోమవారం మధ్యాహ్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. రైలు దువ్వాడ స్టేషన్‌లో ఆగిన తర్వాత భార్యకు చెప్పకుండా అర్జున్ వెళ్లిపోయాడు. రైలు విశాఖ స్టేషన్‌కు వచ్చిన తర్వాత శ్రావణి భర్తకోసం వెతకగా కనిపించలేదు. తనను వదిలించుకునేందుకు పారిపోయాడని గ్రహించింది. చేతిలో చిల్లి గవ్వలేకపోవడం, భర్త వదిలేసి వెళ్లిపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన శ్రావణి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. దీంతో జ్ఞానాపురం స్టేషన్ గేటు బయట ఆటోలో బిడ్డను, బ్యాగ్‌ను వదిలేసి వెళ్లిపోయింది. కొంత సమయానికి ఆటోడ్రైవర్ వచ్చి చూడగా బాబు ఉండటంతో అవాక్కయ్యాడు. చుట్టుపక్కల వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో ఆర్పీఎఫ్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఆర్పీఎఫ్ ఎస్ఐ కీర్తిరెడ్డి, ఏఎస్ఐ కేయూ.ఎం.రావు తదితరులు వచ్చి బిడ్డను పరిశీలించి కంచరపాలెం పోలీసులకు సమాచారం ఇచ్చారు. తరువాత కంచరపాలెం పోలీసులు ఛైల్డ్‌రైట్స్ ప్రతినిధుల సహకారంతో శిశువును చికిత్స నిమిత్తం కేజీహెచ్ తరలించారు. ★ తల్లి శ్రావణిని గుర్తించేందుకు పోలీసులు సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు వెళ్లిన ఆమె అక్కడ కళ్లు తిరిగిపడి పోయింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఆమెను స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం కేజీహెచ్‌కు తీసుకువెళ్లి బిడ్డను అప్పగించారు. వెంటనే స్పందించి బిడ్డను తల్లి వద్దకు చేర్చిన కంచరపాలెం పోలీసులను సీపీ శంఖబ్రత బాగ్చీ అభినందించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడు దుర్మరణం చెందిన ఘటన ఇది. ఎంవీపీ స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట ప్రాంతానికి చెందిన పూన వెంకటరమణ (67)కు ఆరోగ్యం బాగో లేకపోవడంతో విశాఖలో ఉంటున్న పెద్ద కుమార్తె ఇంటికి వచ్చారు. మంగళవారం ఉదయం 8గంటల సమయంలో మనవరాలిని మద్దిలపాలెం వద్ద స్కూల్ బస్సు ఎక్కించి ఎంవీపీకాలనీ రైతుబజారుకు స్కూటీలో వెళ్తున్నారు. మద్దిలపాలెం ఆటోమోటివ్ వద్ద వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు స్కూటీని వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో రోడ్డుపై పడిపోయిన వెంకటరమణ మీదుగా బస్సు వెనుక చక్రం వెళ్లి పోయింది. శిరస్త్రాణం ధరించి ఉన్నప్పటికీ అది పగిలిపోయి తల నుజ్జునుజ్జయి ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ కేఎన్ఎస్‌వీ ప్రసాద్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సును స్వాధీనం చేసుకున్నారు.

జాతీయ వేదికపై ఐఐఎంవీ ప్రొఫెసర్ కూచిపూడి నృత్య ప్రదర్శన

ఆనందపురం, న్యూస్‌టుడే: ఐఐఎంవీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ జె.హెచ్.జ్యోత్స్న కూచిపూడి నృత్య ప్రదర్శనతో జాతీయ వేదికపై ఆకట్టుకున్నారు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని 'వందేమాతరం-150' ఏళ్ల వేడుకల్లో భాగంగా దిల్లీలో కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెను ఐఐఎంవీ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్, తదితరులు అభినందించారు.

జాతీయ జెండాతో ఐఐఎంవీ అసిస్టెంట్ ప్రొఫెసర్ జె.హెచ్.జ్యోత్స్న

ఒకేషనల్ ప్రయోగ పరీక్షలకు 95.82శాతం హాజరు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు మంగళవారం నుంచి మొదటి విడత ప్రయోగ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రథమ ఏడాది విద్యార్థులు 419 మందికి 375 మంది (89.50శాతం) హాజరయ్యారని ఆర్.ఐ.ఒ. పి.మురళీధర్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 383 మందికి 367 మంది (95.82శాతం) హాజరైనట్లు వివరించారు. నగరంలోని పలు పరీక్ష కేంద్రాలను తాను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు.

ఉక్కు పర్సనల్ డైరెక్టర్‌గా రాకేష్ నందన్ సహాయ్ నియామకం

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు డైరెక్టర్(పర్సనల్)గా ఎన్టీపీసీ అదనపు జనరల్ మేనేజర్ రాకేష్ నందన్ సహాయ్‌ను నియమిస్తూ ఉక్కు మంత్రిత్వశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డు 16 సెప్టెంబరు 2025లో నిర్వహించిన ఇంటర్వ్యూలో ఆయనను ఎంపిక చేశారు. ఉక్కు కర్మాగారంలో బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి 5 ఏళ్ల కాలంపాటు లేదా తదుపరి ఉత్తర్వులు వెలువడేవరకూ ఈ పదవిలో కొనసాగనున్నారు.

బెట్టింగ్ కేసులో మరో నలుగురి అరెస్టు

ఎండాడ, న్యూస్‌టుడే: క్రికెట్ బెట్టింగ్ కేసులో మరో నలుగురు నిందితులను సైబర్ క్రైం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఇప్పటివరకు ఈ కేసులో ఇద్దరిని అరెస్టు చేయగా తాజాగా ఆ సంఖ్య ఆరుకి చేరింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కమీషన్ కోసం నాని క్రికెట్ ప్రెడిక్షన్, వినయ్ క్రికెట్ కింగ్, మురళీ క్రికెట్, అజయ్ క్రికెట్ సంస్థల ద్వారా బెట్టింగ్ నిర్వాహకులు, ఆడేవారికి ఆన్‌లైన్‌లో మధ్యవర్తులుగా ఉంటూ పలువురు లావాదేవీలు జరుపుతున్నారు. ఈ క్రమంలో బుకీల సమాచారం వెలుగులోకి వచ్చింది. విశాఖలోని రుషికొండలోని ఓ హోటల్‌లో నిందితులను గుర్తిస్తూ నలుగురిని అరెస్టు చేశారు. ఇందులో తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం రాగిమానుకుంట కాలనీకి చెందిన దేశినేని సుమంత్ (25), చిత్తూరులోని చంద్రగిరి మండలం కోటాల గ్రామానికి చెందిన లంకిపల్లి గణేష్ (27), తుళ్లూరు మండలం పెదకూరపాడుకు చెందిన కోపులు మురళి (21), నగరంపాలేనికి చెందిన మేడం బద్రేశ్వరరెడ్డి (22) ఉన్నారు. వీరిని రిమాండ్‌కు తరలించారు. చరవాణులు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు.

చికెన్ ధరలు (కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	135	130
లైవ్	162	150
డ్రెస్డ్	235	270
స్కిన్‌లెస్	267	280

పెందుర్తి

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్
స్క్రీన్-1: అనగనగా ఒకరాజు
స్క్రీన్-2: మన శంకర వరప్రసాద్ గారు

నరవ యూపీహెచ్‌సీకి రూ.కోటి మంజూరు

నరవ(వేపగుంట), న్యూస్‌టుడే: నరవలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ) నిర్మాణానికి ప్రభుత్వం రూ.కోటి నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి సంబంధిత మొత్తాన్ని కేటాయించినట్లు పేర్కొంది. సంబంధిత నిధులతో ఆసుపత్రి భవన సమస్య తీరడమే కాక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సామగ్రి సమకూరుతుందని, సిబ్బంది నియామకానికి మార్గం సుగమం అవుతుందంటూ స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఫోన్ చేయండి.. సమస్య తెలపండి

పెందుర్తి జోనల్ కమిషనర్‌తో 'ఫోన్‌ఇన్' రేపు

వేపగుంట, న్యూస్‌టుడే: పెందుర్తి నియోజకవర్గం, జీవీఎంసీ పెందుర్తి జోనల్ కార్యాలయం పరిధిలోని 93, 94, 95, 96, 97 వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఆయా ప్రాంతాల ప్రజలు జోనల్ కమిషనర్ హెచ్.శంకర్‌రావు దృష్టికి తీసుకువెళ్లేందుకు 'ఈనాడు' అవకాశం కల్పిస్తోంది. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, అర్హులైన వారికి అందని సంక్షేమ పథకాలు తదితర వాటిపై జెడ్సీకి నేరుగా తెలియజేస్తే ఆయన తగు సమాధానాలు ఇస్తారు.

తేదీ: 29-01-2026 (గురువారం)
సమయం: ఉదయం 9.00 నుంచి 10.30 గంటల వరకు
ఫోన్ చేయాల్సిన నంబరు: 93472 79909

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ. 10 నుంచి ఒంటి గంట మధ్య

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం కాలనీలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వస్తోంది ఇబ్బందులు పడుతున్నాం. -సీహెచ్ అప్పారావు, సబ్బవరం ✓: శ్రీశ్రీస్వామిలో పరిశీలించి సిబ్బందితో చెత్త తొలగిస్తాం. - పి. ఆనందరావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం.

?: సబ్బవరం నుంచి చినగొల్లలపాలెం వెళ్లే రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరి రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. -సి.తాతారావు, సబ్బవరం ✓: ఈ సమస్యపై మండల సమావేశంలో చర్చించి తగిన చర్యలు చేపడతాం. -బోకం సూర్యకుమారి, ఎంపీపీ.

వేపగుంట, న్యూస్‌టుడే: ?: పురుషోత్తపురం ఎస్సీకాలనీ ప్రధాన కాలువలో చెత్త పేరుకుపోయింది. -కృష్ణారావు, స్థానికుడు ✓: కాలువను శుభ్రం చేయించి సమస్య పరిష్కరిస్తాం. -ప్రసాదరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ మండలం భరణికం సమీపంలో కల్వర్టు రక్షణ గోడలు దెబ్బతిన్నాయి. రాత్రుళ్లు వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. - నాగరాజు, పరవాడ ✓: ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తాం. - రమేశ్‌నాయుడు, ఎంపీడీవో, పరవాడ

ముత్యాలమ్మపాలెం తీరానికి మహర్దశ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం తీరానికి రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ పండగ వాతావరణం రానుంది. విశాఖ ఉత్సవ్‌లో భాగంగా ఈనెల 30, 31 తేదీల్లో రెండు రోజుల పాటు తీరం వద్ద బీచ్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. 2002లో అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో ఇక్కడ వసంతోత్సవ పేరిట ఫెస్టివల్ నిర్వహించి సినీ, టీవీ కళాకారులతో సాంస్కృతిక, జానపద ప్రదర్శనలు, బీచ్‌క్రీడలు పెద్దఎత్తున నిర్వహించారు. కూటమి ప్రభుత్వంలో ఇక్కడ మరోసారి సందడి నెలకొంటుందని తెలిసి స్థానికులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ఈ తీరం వద్ద 3 కి.మీ. పొడవు గల విశాలమైన ప్రకృతి సహజసిద్ధ ఇసుకతిన్నెలు, దాన్ని ఆనుకుని దామలకొండ, జీవిమానిటి, సరుగుడు తోటలు, ఇసుక తెన్నులు, ఉప్పుటేరు.. పర్యాటకుల మనసును కట్టిపడేస్తాయి. ఇక్కడ లోతు తక్కువగా ఉన్నందున సముద్ర స్నానాలకు అనుకూలంగా ఉంటుంది. అందుకే కార్తిక మాసం, శివరాత్రి, మహాశివరాత్రి రోజుల్లో జనం రద్దీ అధికంగా ఉంటుంది. సింహాద్రి ఎన్టీపీసీ, ఫార్మాసిటీ, హిందుజా పవర్‌ప్లాంటు, మెడ్‌టెక్ జోన్ వంటి పారిశ్రామిక సంస్థల ఏర్పాటుతో ఏటా పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది.

ఈ ఉత్సవ్‌లో భాగంగా భారీ వేదికపై సినీ, టీవీ కళాకారులతో సాంస్కృతిక నృత్య, జానపద, సంప్రదాయ ప్రదర్శనలు, బీచ్ కబడ్డీ, వాలీబాల్ పోటీలతో పాటు స్పోర్ట్స్, సాహస క్రీడలు తదితర వాటిని నిర్వహించనున్నారు. ఫుడ్‌స్టాల్స్ ఉంటాయి. దీన్ని విజయవంతం చేయడానికి అధికారుల బృందంతో కూడిన కమిటీలను ఏర్పాటు చేశారు.

ఈ తీరం పర్యాటకంగా అభివృద్ధి చెందాలంటే ఉప్పుటేరులో బోటుషికారుకు ఫైబర్ బోట్లు ఏర్పాటు, ఉప్పుటేరు దాటడానికి వీలుగా వంతెన నిర్మాణం, బీచ్‌లో బెంచీలు, సిమెంట్ బల్లల ఏర్పాటు వంటివి జరగాలి. ఎల్ఈడీ దీపాలు, పార్కులు, ఆట పరికరాలు, బీచ్‌రోడ్డు విస్తరణ, ఆర్వో ప్లాంటు, మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకోవడానికి గదులు, నీడనిచ్చే గుడారాలు, విశ్రాంతి భవనాలు నిర్మించాలి. గతంలో రాజా కృష్ణయ్య, ఒక్కడు మిగిలాడు తదితర సినిమాల్లో కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు.

కూటమి ప్రభుత్వం ఇక్కడ బీచ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయడం సంతోషకరం. ఇలాంటి వాటి జరగడం వల్ల ఈ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందడంతో పాటు ఎంతో మందికి ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి వేడుకలను విజయవంతం చేయాలి.

-చింతకాయల సుజాత, సర్పంచి, ముత్యాలమ్మపాలెం

బీచ్ ఫెస్టివల్ విజయవంతం చేయాలి

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం తీరం వద్ద ఈనెల 30, 31 తేదీల్లో నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. ఈ మేరకు తీరంలో జరుగుతున్న ఏర్పాట్లను మంగళవారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ప్రజలు కుటుంబ సమేతంగా తరలివచ్చి తిలకించేందుకు వీలుగా ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా అధికారులంతా సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజలు సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ వేడుకలు నిర్వహిస్తోందన్నారు. సర్పంచి చింతకాయల సుజాత, స్థానిక నాయకులు మానవపరపు అప్పలనాయుడు, పైలా జగన్నాధరావు, చింతకాయల ముత్యాలు, కన్నూరు వెంకటరమణ, బొడ్డు శ్రీనివాసరావు, వియ్యపు చిన్నా, నగిరెడ్డి చిన్నారావు, రవి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, చిత్రంలో ఎమ్మెల్యే రమేశ్‌బాబు, కలెక్టర్ విజయకృష్ణన్

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ రాంకీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. రాంకీ కమ్యూనిటీ హాల్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో 140 మంది ప్రతిభ గల విద్యార్థులకు ఉపకార వేతనాల కింద రూ.12,33,500 మొత్తాన్ని విశాఖ ఫార్మాసిటీ సంస్థ ఎండీ డాక్టర్ లాల్‌కృష్ణ చేతులమీదుగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాంకీ ఫౌండేషన్ అందిస్తున్న ఈ ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని తద్వారా మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు సాంబశివరావు, శ్రీకాంత్, గిరిధర్ రావు, రాజేశ్వరి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఉపకార వేతనాల చెక్కును అందజేస్తున్న విశాఖ ఫార్మాసిటీ ఎండీ లాల్‌కృష్ణ

31 వరకు ఇగ్నోలో ప్రవేశాలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో 2026 విద్యాసంవత్సరానికి డిప్లొమా, డిగ్రీ, పీజీ కోర్సుల్లో దూరవిద్యతోపాటు, ఆన్‌లైన్‌లో ప్రవేశాలు ఈనెల 31 వరకు జరుగుతాయని సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. టూరిజం, నర్సింగ్, డెయిరీ టెక్నాలజీ, ఆక్వా కల్చర్, వ్యవసాయం, జర్నలిజం, న్యాయవిద్య కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఫీజులు ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు డిగ్రీ కోర్సుల్లో 50శాతం ఫీజు రాయితీ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ignouadmission.samarth.edu.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఇదేం రహదారి..? అధికారులపై మేయర్ ఆగ్రహం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవానికి హాజరైన మేయర్ పీలా శ్రీనివాసరావు స్టేడియం ప్రాంగణంలో నిర్మించిన బీటీ (బ్యుటమినస్) రహదారిని పరిశీలించి, ఇంజినీరింగ్ అధికారులపై మండి పడ్డారు. పనుల్లో నాణ్యత లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారిపై రోలింగ్ చేయకుండా వదిలేయడంతో, పాత రహదారిపై ఉన్న లేయర్ పక్కకు జరిగిపోవడంతో పాటు, పిక్క ఊడిపోవడానికి సిద్ధంగా ఉంది. ప్రజాధనంతో చేపట్టే పనుల్లో పర్యవేక్షణ పెంచాలని, వెంటనే అధికారులంతా తీరు మార్చుకోవాలని మేయర్ హెచ్చరించారు.

ఎట్టకేలకు రహదారికి మరమ్మతులు

బీటీ లేయర్ పనులు జరుగుతున్న దృశ్యం

స్పందనకు వందనం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సినిమాహాల్ కూడలిలో శిథిల రహదారికి ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. కొంతకాలంగా ఈ రోడ్డుపై గుంతలు పడడంతో వెట్‌మిక్స్ వేసి వదిలేశారు. వాహనాల రాకపోకల సమయంలో పెద్దఎత్తున దుమ్ము ఎగిరిపడడంతో స్థానికులతో పాటు వాహన చోదకులు, దుకాణదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యపై 'అసంపూర్తి రహదారితో అవస్థలు' శీర్షికన ఈనెల 27వ తేదీన 'ఈనాడు'లో వెలువడిన కథనానికి బోత్రా కంపెనీ ప్రతినిధులు స్పందించారు. రహదారిపై బీటీ లేయర్ వేసి సమస్యను పరిష్కరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వీధి దీపాలకు మోక్షమెప్పుడో..

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరంలోని ప్రధాన మార్గంలో కొన్నేళ్లుగా రహదారి మధ్య దీపాలు వెలగక స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కుక్కల బెడద కారణంగా రాత్రి వేళ రాకపోకలకు భయాందోళన చెందుతున్నామని పలువురు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి విభాగినుల్లోని వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఈ బోరు ఉన్నా..లేనట్లే..

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట ఎస్సీబీసీ కాలనీలో బోరు బావిని పట్టించుకోకుండా రోడ్డు నిర్మించేశారు. దాంతో ఇది అందుబాటులో ఉన్నా నిరుపయోగమే. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని సంబంధిత అధికారులు ఈ చేతి పంపును వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రంథాలయ భవనం పూర్తి చేయరూ..

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం నాయుడుపాలెం పంచాయతీ మెట్టపాలెంలో గ్రంథాలయ భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులను బిల్లులు సకాలంలో రాకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు మిగిలిన పనులు పూర్తి చేయించి దీన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పరవాడలో కుక్కల బెడద

పరవాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం పరవాడలో కుక్కల బెడద అధికంగా ఉంది. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే పిల్లలు, వృద్ధులు భయపడుతున్నారు. ఇవి ద్విచక్రవాహనదారులను వెంబడించడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. వీటి నియంత్రణకు పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కస్తూర్బా పాఠశాలల సిబ్బందికి శిక్షణ

మాట్లాడుతున్న జిల్లా విద్యా శాఖాధికారి అప్పారావు నాయుడు

సబ్బవరం, న్యూస్‌టుడే: జిల్లాలోని కస్తూర్బా విద్యాలయాలు సమర్థంగా పనిచేస్తూ ఫలితాల సాధనలో ముందంజలో ఉన్నాయని జల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు అన్నారు. సబ్బవరంలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం ఏర్పాటు చేసిన కేజీబీవీల వార్డెన్లు, ప్రత్యేకాధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులను అన్ని విధాలా ప్రోత్సహించి తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై వారికి వివరించారు. జీసీడీవో జమీమా, మాస్టర్ ట్రైనర్లు శకుంతల, గీత తదితరులు పాల్గొన్నారు.

అ వీ ఇ వీ

హత్య కేసు నిందితులకు రిమాండ్

వేపగుంట, న్యూస్‌టుడే: మేహాద్రి రిజర్వాయర్ దిగువ భాగంలో కొత్తమ్మతల్లి అమ్మవారి ఆలయ సమీప నిర్మానుష్య ప్రదేశంలో గుంటూరు కల్యాణ్ చక్రవర్తి అనే యువకుడు హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులు వినోద్‌కుమార్, మనోజ్‌లను మంగళవారం పెందుర్తి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా ఈ హత్య ఉద్దేశపూర్వకంగానే జరిగిందని మృతుడి కుటుంబీకులు చేసిన ఆరోపణలపై విచారణ చేపడుతున్నట్లు సీఐ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు.

పెందుర్తి సీహెచ్‌సీలో హెచ్‌బీఏ1సీ వైద్య పరీక్షలు చేయాలి

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌బీఏ1సీ (మూడు నెలల మధుమేహ సగటు తెలియజేసే పరీక్ష) పరీక్ష సదుపాయం అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం పెందుర్తి యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు అల్లం కృష్ణారావు, వై.కామరాజు కోరారు. జిల్లాలోని భీమునిపట్నం, గోపాలపట్నం, అగనంపూడి సీహెచ్‌సీలలో ఈ సదుపాయం ఉన్నప్పటికీ పెందుర్తిలో లేకపోవడమేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత సదుపాయం ఇక్కడ లేకపోవడంతో వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తోందని, ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

యాదవ మహాసభ ఉపాధ్యక్షుడిగా 'అల్లు'

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పెదగంట్యాడకు చెందిన అల్లు రమణారావు యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు చింక నారాయణరావు యాదవ్ నియామక ఉత్తర్వులు జారీచేశారు. బీసీల సమస్యలపై దశాబ్దాలుగా పనిచేస్తున్నందుకు ఈ పదవి కల్పించినట్లు పేర్కొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

సంపత్ వినాయకుడు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం వాడచీపురుపల్లి పంచాయతీ పందివానిపాలెంలో బుధవారం శ్రీసంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు, దర్శనాలు; మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన, సాయంత్రం ఊరేగింపు, పరస, రాత్రి సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ వేడుకలను విజయవంతం చేయాలని వారు కోరారు.

ఘనంగా విద్యార్థుల వీడ్కోలు వేడుక

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తిలోని పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక ఘనంగా జరిగాయి. ప్రధానోపాధ్యాయిని సీహెచ్.చిన్నమ్మాయి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో ఎంఈవో-1 సువర్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని, మంచి నడవడికతో భవిష్యత్తు లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా జిల్లాస్థాయి గణతంత్ర వేడుకల్లో సంప్రదాయ నృత్యాలతో అలరించిన విద్యార్థులను ఎంఈవో సువర్ణ అభినందించారు.

గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో సువర్ణ, ఉపాధ్యాయులు

ఉత్తమ సేవలకు గుర్తింపు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి భవిత కేంద్రం సహిత విద్య ఉపాధ్యాయుడు బి.ఎ.వి. నాగేశ్వరరావుకు జిల్లా స్థాయి ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఈ మేరకు సోమవారం నగరంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ హరేంధిరప్రసాద్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పెందుర్తి ఎంఈవోలు సువర్ణ, మధుమూర్తి తదితరులు నాగేశ్వరరావును అభినందించారు.



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నాగేశ్వరరావు

సబ్బవరం, న్యూస్‌టుడే: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (డీఎస్ఎన్ఎల్‌యూ)లోని నలుగురు ఉద్యోగులు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. వీరిలో డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ దీప్తి, బి.మాధురి, డాక్టర్ లీలాకుమారి ఉన్నారు. ఈ సందర్భంగా ఉప కులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసే వారికి తప్పక గుర్తింపు లభిస్తుందంటూ అవార్డులు పొందిన వారిని అభినందించారు.

డీఎస్ఎన్ఎల్‌యూ ఉద్యోగులను అభినందిస్తున్న వీసీ సూర్యప్రకాశరావు

తిక్కవానిపాలెంలో పశువైద్య శిబిరం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం తిక్కవానిపాలెం గ్రామంలో మంగళవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. పరవాడ పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు కీర్తి రామకృష్ణ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. వాడచీపురుపల్లి పశువైద్యాధికారి సురేశ్‌కుమార్ తదితరులు మూగజీవాలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పశువైద్య సిబ్బంది పద్మ, నూకరత్నం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఏడీ రామకృష్ణ తదితరులు

రంగోత్సవ్ పోటీల్లో ఆరిపాక విద్యార్థుల ప్రతిభ

సబ్బవరం, న్యూస్‌టుడే: ఈనెల 23న విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి రంగోత్సవ్ పోటీల్లో సబ్బవరం మండలం ఆరిపాక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం.జె. రవీంద్రబాబు తెలిపారు. ఈ నెల 21న భీమునిపట్నం డైట్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో లఘు నాటికల విభాగంలో ప్రథమ స్థానం పొంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. విజయవాడలో జయహో భారత్-వికసిత్ భారత్ లఘునాటిక ప్రదర్శించి తృతీయ స్థానం దక్కించుకున్నారన్నారు. మంగళవారం జరిగిన పాఠశాల వార్షికోత్సవంలో 7, 8 తరగతులకు చెందిన సంబంధిత విద్యార్థినులు ఎం.కుసుమ, ఎస్.కోమలి, ఎ.ధనుశ్రీ, ఎస్.గ్రీష్మలతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయిని రామలక్ష్మిని, పాఠశాల కమిటీ ఛైర్మన్ మళ్ల యోగి, ఉపాధ్యాయులు అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు పాఠశాల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

విద్యార్థులకు ధ్రువపత్రాలు అందిస్తున్న రవీంద్రబాబు తదితరులు

కాలువల పనుల్లో ఫోకస్

నాణ్యతకు తిలోదకాలు!

వేపగుంట, న్యూస్‌టుడే: జోనల్ కార్యాలయ ఇంజినీరింగు విభాగం అధికారులు చేయిస్తున్న పలు అభివృద్ధి పనులపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పనుల్లో నాణ్యత లోపించడం, పర్యవేక్షణ లేకపోవడంతో సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. 94వవార్డు బీసీ కాలనీలో రెండు రోజులుగా కాలువ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆయా పనుల తీరు అధ్వానంగా ఉండడంతో ప్యాచ్ వర్కులు చేస్తున్నారా? కొత్త కాలువలు నిర్మిస్తున్నారా? అని సంబంధిత గుత్తేదారుడ్ని స్థానికులు ప్రశ్నించగా సరిగా స్పందించకపోవడంతో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. కాంక్రీట్‌లో ఇసుక శాతం ఎక్కువగా ఉంటోందని, ఇలాగైతే కాలువలు ఎంత కాలం నిలుస్తాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అప్పలనర్సయ్యకాలనీ, గంగిరెడ్లకాలనీ, ఎరుకల కాలనీల్లో చేపట్టిన కాలువ గట్ల పనుల్లోనూ నాణ్యత ప్రశ్నార్థకంగానే ఉన్నట్లు సంబంధిత ప్రాంతాల వారు అంటున్నారు. తక్షణమే జోనల్ కమిషనర్ స్పందించి ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించి, తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బీసీ కాలనీలో పాత కాలువ గట్టుపై కాంక్రీటుతో నిర్మిస్తున్నారిలా..

ముగిసిన శ్యామా నవరాత్రి ఉత్సవాలు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం దేవీపురంలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న శ్యామా నవరాత్రి వేడుకలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలు, రాజశ్యామల సహస్ర నామావళి హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం

వాడచీపురుపల్లి (పరవాడ), న్యూస్‌టుడే: పరవాడ మండలం తిక్కవానిపాలెం గ్రామంలో మంగళవారం శ్రీఆంజనేయస్వామి తీర్థం ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచే స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఈ సందర్భంగా ముగ్గులు, శ్లోకాలు, పద్యాల పోటీలు నిర్వహించారు. అన్నసమారాధన ఏర్పాటు చేశారు. పరసలో కోలాటం, సాము గరిడీలు, భజనలు, డాన్స్ బేబీ డాన్స్ తదితర ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

హోమ పూజలో పాల్గొన్న భక్తులు

సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: విశాఖ శారదాపీఠంలో జరుగుతున్న వార్షిక మహోత్సవాల్లో భాగంగా మంగళవారం సుబ్రహ్మణ్య స్వామికి విశేష అభిషేకాలు జరిగాయి. ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో పండితులు సుబ్రహ్మణ్య హోమం నిర్వహించారు. సాయంత్రం వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ వల్లీ కల్యాణం జరిగింది. రాజశ్యామల సహిత చండీయాగంలో భక్తులు పాల్గొని జగన్మాతను సేవించారు. ఈ ఉత్సవాలు బుధవారంతో ముగుస్తాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

ఘనంగా అమ్మవారి పరస

బంగారమ్మ తల్లి

లక్ష్మీపురం(వేపగుంట), న్యూస్‌టుడే: లక్ష్మీపురం పరిసర ప్రాంతాల ప్రజల ఆరాధ్య దైవాలైన దుర్గమ్మ, బంగారమ్మ అమ్మవార్ల పరస మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని పసుపు కుంకుమలతో మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఘనంగా పరస నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కోటనరవ, వేపగుంట ప్రాంతాల్లోని పైడిమాంబ అమ్మవార్ల పరసలు కూడా మంగళవారం ఘనంగా జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అజనగిరిలో..: సబ్బవరం, న్యూస్‌టుడే: 88వ వార్డు నంగినారపాడు శివారు అజనగిరిలో మంగళవారం పంచముఖ ఆంజనేయస్వామి తీర్థం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం కోలాటం, తప్పెట గుళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కమిటీ ప్రతినిధులు ఇంతి వెంకటరమణ, నారపిని అప్పలరాజు, పోలీసు, దేముడుబాబు, బొడ్డపల్లి తాతబాబు, గంగరాజు, సూరిబాబు చెట్టి శ్రీను, కృష్ణ, రాంబాబు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పూజలందుకున్న పంచముఖ ఆంజనేయ స్వామి

PUBLIC NOTICE

All the public are hereby inform you that, my client Pilla Venkata Narasimha Patrudu S/o Pilla Venkata Ramaiah Patrudu intend to purchase below mentioned schedule property from Paila Nagamani W/o P. Sama Sundara Rao, if any issue or objection to this property please be reported within 15 days from the date of this publication.

SCHEDULE

All that the piece and parcel of site measuring 155 sq.yds. or 130.018 sq.mts. (Eastern Part) out of 311 sq.yds., together with RCC slabbed house thereon consisting of Stilt Floor measuring 1400 Sft., Ground Floor measuring 1400 Sft. First Floor measuring 1400 Sft., Second Floor measuring 1400 Sft. and Third Floor measuring 200 Sft., bearing Door No.13-107, Municipal Assessment No.1086419932, with Electricity Sc. Nos. 1164252292 002232 situated at Plot No.132 of the Layout Approved by VUDA vide B.L.P. No. 11/2000 and final L.P.No.16/2001, covered by S.No.144/6 of Chinamushidiwada Village, within the limits of Greater Visakhapatnam Municipal Corporation, Visakhapatnam and Pendurthi Registration Sub District and the property bounded by : **EAST:** Plot No.131 site.; **SOUTH:** 80 Feet wide Road.; **WEST:** Part of site belongs to Velaganati Satya Nagar Narasimha.; **NORTH:** Plot No. 127 site.
MEASUREMENTS: East wing: 70.0 feet or 21.33 mts.; **South wing:** 20.0 feet or 6.09 mts.; **West wing:** 70.0 feet or 21.33 mts. **North wing:** 20.0 feet or 6.09 mts.

PANDU VAMSIKRISHNA, B.A.,B.L.
ADVOCATE
D.No. 49-46-23/1, 2nd Floor, Akkayyapalem,
VISAKHAPATNAM-530016. **Cell: 7788991789**

(c) eenadu

భీమిలి

సినిమాలు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్ - మన శంకర వరప్రసాద్ గారు
రాములమ్మ - భర్త మహాశయులకు విజ్ఞప్తి
తాతా - అనగనగా ఒకరాజు
సప్తగిరి - నారీ నారీ నడుమ మురారి

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాసపోలమ్మ అమ్మవారిని బంతిపూలు, తులసీ దళాలతో మంగళవారం ప్రత్యేకంగా అలంకరించారు. పరిసర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

క్రికెట్ సందడి షురూ

పీఎంపాలెం, న్యూస్‌టుడే: ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వద్ద మ్యాచ్‌కు ఒక రోజు ముందుగానే అభిమానుల కోలాహలం కనిపించింది. మంగళవారం ఉదయం నుంచే స్టేడియం పరిసరాలతో పాటు క్రికెటర్లు బస చేసిన రాడిసన్ బ్లూ రిసార్ట్స్ బయట టీషర్టులు, టోపీలు, జాతీయ పతాక విక్రయ కేంద్రాలు విరివిగా ఏర్పాటు చేశారు. దీంతో పలువురు అభిమానులు వాటి కొనుగోలుకు ఉత్సాహం ప్రదర్శించారు. సాయంత్రం క్రికెటర్లు నెట్ శిక్షణకు రావడంతో ప్రధాన గేటు బయట పెద్ద ఎత్తున అభిమానులు చేరుకుని బస్సుల్లో లోనికి వెళ్తున్న క్రీడాకారులకు చేతులు ఊపుతూ అభినందనలు తెలియజేశారు.

స్టేడియం బయట ఏర్పాటు చేసిన టీషర్టులు, టోపీల విక్రయకేంద్రాలు

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే: ?: శిరుగుడినగర్(ఎండాడ)లో పందుల బెడద తీవ్రంగా ఉంది. – కొండలరావు ✓: పందుల నివారణకు చర్యలు తీసుకుంటాం. – రాజా రవికుమార్, ఆరోగ్య అధికారి

?: పీఎంపాలెంలో విజేత సూపర్‌మార్కెట్ కూడలిలో స్పీడ్‌బ్రేకర్స్ లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. – రాజు ✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. – పీఎంపాలెం ట్రాఫిక్ పోలీసులు

?: తితిదే ఆలయం(రుషికొండ) ముఖ ద్వారంలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. – రామ్మూర్తి ✓: వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటాం. – రాజా రవికుమార్, ఆరోగ్య అధికారి

?: గాయత్రీనగర్(పీఎంపాలెం)లో వీధి దీపాలు వెలగడం లేదు. – స్థానికులు ✓: విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేపడతాం. – వేణు, విద్యుత్ ఏఈ

స్పందనకు వందనం

కాలువల శుభ్రతకు చర్యలు

ఎండాడ, న్యూస్‌టుడే: చాణిక్యపురి కాలనీ(మధురవాడ)లో కాలువలు అధ్వానంగా ఉండటంతో దోమల బెడద తీవ్రంగా ఉందని 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి తమ సిబ్బందితో కాలువల్లో పూడిక తొలగించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

'ఈనాడు-డయల్ యువర్ జెడ్సీ' కార్యక్రమానికి విశేష స్పందన

కొమ్మాది, న్యూస్‌టుడే

జీవీఎంసీ మధురవాడ జోన్ పరిధిలోని పలు వార్డుల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని జెడ్సీ వి.అయ్యప్పనాయుడు హామీ ఇచ్చారు. మంగళవారం నిర్వహించిన 'ఈనాడు-డయల్ యువర్ జెడ్సీ' కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. ప్రజలు అడిగిన పలు ప్రశ్నలకు అయ్యప్పనాయుడు జోనల్ కార్యాలయం నుంచి ఫోన్‌లో సమాధానాలు ఇచ్చారు. ఎక్కువ మంది రోడ్లు, కాలువలు అధ్వానంగా ఉన్నాయని, వీధి దీపాలు వెలగడం లేదని తెలియజేశారు.

సమస్య: 8వ వార్డు రెవెన్యూ లే-అవుట్‌లో స్వాతి ట్విన్ టవర్స్ వద్ద మూడురోజులుగా చెత్త నిల్వలు తొలగించలేదు. మిథిలాపురి వుడాకాలనీలో బ్యాంక్ ఆఫ్ బరోడా సమీపంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. పీర్‌లెస్‌కాలనీ, ఎండాడ వరాహగిరినగర్‌లో అంతర్గత రహదారులను అభివృద్ధి చేయాలి. ఎండాడ ప్రధాన రహదారిలో కాలువల్లో తీసిన వ్యర్థాలను తరలించలేదు. - **పి.త్రినాథ్‌రావు, కె.వి.రామరాజు, పీ.సీహెచ్.రాము నాయుడు, ఎస్.వి.లక్ష్మణరావు, కె.సాయిరామ్**

జవాబు: సంబంధిత అధికారులకు తక్షణమే తెలియజేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం.

స: చిన్నరుషికొండ సిల్వర్‌ఓక్స్ పాఠశాల ముందు రహదారిలో నిబంధనలకు విరుద్ధంగా భవన సముదాయం నిర్మిస్తున్నారు. పురమిత్రలోనూ ఫిర్యాదు చేశాం. నోటీసులు ఇచ్చారే తప్ప చర్యలు తీసుకోలేదు. అదే ప్రాంతంలో రహదారులు, కాలువలు సైతం నిర్మించాలి. - **ఎన్.విజయలక్ష్మి, గంగాధర్ రావు, కె.శ్రీనివాసాచార్యులు**

జ: స్వయంగా ఆ భవన సముదాయాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఇంజినీరింగ్ అధికారులతో అంచనాలు రూపొందించి రహదారులు, కాలువలను అభివృద్ధి చేస్తాం.

స: పీఎంపాలెం గాయత్రినగర్ రోడ్‌నెంబర్-5లో మహాపుష్కర్ అపార్టుమెంట్ వద్ద కుక్కల సంచారంతో భయాందోళన చెందుతున్నాం. అదే ప్రాంతంలో రహదారి మలుపు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాన్ని తొలగించాలి. - **కె.ఎన్.వేణుగోపాల్, రవీంద్రబాబు**

జ: శునకాలను పట్టి వీఎస్‌పీసీఏ సెంటర్‌కు తరలిస్తాం. అధికారులతో మాట్లాడి స్తంభాన్ని తొలగిస్తాం.

స: ఆపరేషన్ లంగ్స్ పేరిట పీఎంపాలెం ప్రధాన రహదారిలో దుకాణాలను తొలగించారు. ఆ సమయంలో కూలగొట్టిన వ్యర్థాలను తరలించలేదు. వీధిదీపాలు వెలగడం లేదు. - **దాసరి శ్రీనివాస్, జి.రాము, వి.వి.రమణ**

జ: ఆ వ్యర్థాలను తొలగించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు తక్షణమే ఆదేశాలు జారీ చేశా. కొత్త వీధిదీపాలు వచ్చిన వెంటనే అమర్చుతాం.

ఈనాడు మిత్రుడు

స: కారుషెడ్ కూడలి మోర్ షాపింగ్ కాంప్లెక్స్ నుంచి విజయం పాఠశాలకు వచ్చే రహదారి శిథిలావస్థకు చేరింది. కాలువలు సైతం ఏర్పాటు చేయాలి. - **పి.రాజగోపాలం, ఎ.శ్రీనివాసరావు.**

జ: క్షేత్రస్థాయిలో పరిశీలించి రహదారులు, కాలువల నిర్మాణానికి చర్యలు చేపడతాం.

కార్యక్రమంలో పాల్గొన్న అడ్మిన్ మనోరమణి, తదితరులు

సేంద్రియ పంటలకు ప్రోత్సాహం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్ సమీప ఆర్డీడీ లేఅవుట్‌లోని ఓ గృహ సముదాయంలో విశాఖ గార్డెన్ ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు మంగళవారం సమావేశమయ్యారు. హ్యాపీ గార్డెనర్స్ గ్రూప్‌నకు అనుబంధంగా 110 మందితో విశాఖ గార్డెన్ ఫ్రెండ్స్ పేరిట గ్రూపు ప్రారంభినట్లు అడ్మిన్ తుమ్మిడి మనోరమణి పేర్కొన్నారు. సేంద్రియ గార్డెనింగ్, నాణ్యమైన కూరగాయల పంటలను ప్రోత్సహించే దిశగా సభ్యులకు 42 రకాల ఆకుకూరలు, పూల విత్తనాలతో పాటు కుండీలను ఉచితంగా అందజేశారు. హ్యాపీగార్డెనర్స్ (హైదరాబాద్) అడ్మిన్ అప్పారావు ప్రోత్సాహంతో గ్రూప్ సభ్యులతో పాటు సామాజిక బాధ్యతగా ఆసక్తి గల వారికి ఉచితంగా విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు.

విజయరాంపురం పాఠశాలకు స్వచ్ఛ ఏవం అవార్డు

పద్మనాభం, న్యూస్‌టుడే: బాందేవపురం పంచాయతీ విజయరాంపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు అరుదైన గుర్తింపు లభించింది. స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ-2025 రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికైంది. విజయవాడలో ఈనెల 26న జరిగిన గణతంత్ర వేడుకల్లో సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు చేతులమీదుగా ఉపాధ్యాయుడు ఎం.శంకరనారాయణ అవార్డును స్వీకరించారు. పాఠశాల ప్రాంగణంలో కొబ్బరి, జామ, ఉసిరి, బత్తాయి, అరటి, నిమ్మ వంటి మొక్కలను నాటి హరితవనంగా తీర్చిదిద్దడంతో ఈ అవకాశం లభించినట్లు పేర్కొన్నారు.

శ్రీనివాసరావు చేతులమీదుగా అవార్డు స్వీకరిస్తున్న ఉపాధ్యాయుడు శంకరనారాయణ

లేఅవుట్ అభివృద్ధి స్థలాల వేలంపై నిరసన

మిథిలాపురి వుడాకాలనీలో సామాజిక భవనం వద్ద నిరసన తెలియజేస్తున్న సంఘం ప్రతినిధులు, కాలనీవాసులు

మధురవాడ, న్యూస్‌టుడే: మిథిలాపురి వుడాకాలనీ లేఅవుట్ అభివృద్ధి కోసం కేటాయించిన ఖాళీ స్థలాలు, పార్కులు, షాపింగ్ కాంప్లెక్సులను వీఎంఆర్డీఏ వేలం వేసే ఆలోచనను విరమించుకోవాలని 'మిథిలాపురి ఆర్‌డబ్ల్యూఏ జాయింట్ యాక్షన్ కమిటీ' ప్రతినిధులు కోరారు. కాలనీ ప్రధాన రహదారిలో పెట్రోల్ బంక్ పక్కన సంఘం కార్యకలాపాల కోసం అప్పట్లో వీఎంఆర్డీఏ నిర్మించిన భవనం వద్ద మంగళవారం సంబంధిత కమిటీ ప్రతినిధులు, కాలనీ ప్రజలు సమీకృతమై నిరసన చేపట్టారు. 1990లో మిథిలాపురి వుడా కాలనీ లేఅవుట్ వేసినప్పుడు కాలనీ అభివృద్ధి కోసం నివాసితుల విన్నపం మేరకు ఇక్కడ ఖాళీ స్థలంలో భవనం నిర్మించడంతో అప్పట్లో గ్రంథాలయం ఏర్పాటు చేసుకున్నామన్నారు. కాలక్రమేణా కొంత కాలం ఈ భవనాన్ని పోలీస్ స్టేషన్, జీవీఎంసీ సచివాలయంగా ఉపయోగించారని, ఇప్పుడు పారిశుద్ధ్య సామగ్రి, వాహనాల పార్కింగ్‌కు వినియోగిస్తున్నారన్నారు. జీవీఎంసీ సర్వేయర్ల భవనాన్ని పరిశీలించి వీఎంఆర్డీఏ సుమారు 800 గజాల స్థలాన్ని ఓ వ్యక్తికి వేలం వేసేందుకు తెరపైకి తెచ్చారన్నారు. ఇప్పటికే కాలనీలో కల్యాణ మండపం కోసం కేటాయించిన స్థలం అధికారుల వైఫల్యం వల్ల ఆక్రమణకు గురైందన్నారు. వీఎంఆర్డీఏలో కొంత మంది అధికారులు ఆక్రమణదారులతో కుమ్మక్కై వారికి ప్రతినిధులుగా వ్యవహరించడం ఆందోళనకు గురి చేస్తోందన్నారు. తమకు తగిన న్యాయం జరగకపోతే నిరసనలు ఉద్ధృతం చేస్తామని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు.

క్రీడల్లో మెరిసి.. పతకాలతో మురిపించి

పీఎంపాలెం, న్యూస్‌టుడే: నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, దేహదారుఢ్య రంగాల్లోనూ సత్తా చాటుతున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, విద్యాలయాల్లో శిక్షకుల పర్యవేక్షణలో నిత్యం సాధన చేస్తూ జిల్లా, రాష్ట్ర తదితర పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నారు.

* **లాన్ టెన్నిస్‌లో రాణిస్తూ..:** ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎన్.శశి సమ్మర్ లాన్ టెన్నిస్‌లో రాణిస్తున్నాడు. ఏయూలో 2025 ఇంటర్ కళాశాలల పోటీల్లో ప్రథమ స్థానం, ఇంటర్ యూనివర్సిటీ (బెంగళూరు) సౌత్‌జోన్ పోటీల్లో మెరుగైన ప్రతిభ, 2024లో ఏయూలో జరిగిన ఇంటర్ కళాశాలల టోర్నమెంట్‌లో ప్రథమ స్థానం దక్కించుకున్నాడు.

★ **దేహదారుఢ్య పోటీల్లో..:** ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న అజయ్.. దేహదారుఢ్య పోటీలకు సంబంధించి ఐబీబీఎఫ్ మిస్టర్ ఆంధ్ర జోనల్ బాడీబిల్డింగ్ జూనియర్ (నాల్గో స్థానం), ఐబీబీఎఫ్ మిస్టర్ ఆంధ్ర జోనల్ (మూడో స్థానం), ఐబీబీఎఫ్ మిస్టర్ ఆంధ్ర 70 కేజీల కేటగిరీ సింహపురి స్ట్రీమెన్ (బంగారు పతకం), మూడో మిస్టర్ ఆంధ్ర 2025 ఓపెన్ బిల్డింగ్ (నాల్గో స్థానం), మెన్స్ ఫిజిక్స్ తదితర పోటీల్లో రాణిస్తున్నాడు. ఈ ఏడాదిలో జరిగే ఐబీబీఎస్ జూనియర్ జాతీయ పోటీలకు, ఛత్తీస్‌గఢ్‌లో సీఎం ట్రోఫీ జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. మిస్టర్ విశాఖలో టాప్-6లో రాణిస్తున్నాడు.

★ **సైక్లింగ్‌లో..:** ఎంబీఏ మొదటి ఏడాది చదువుతున్న కె.వంశీకిరణ్‌కు చిన్ననాటి నుంచి సైక్లింగ్ అంటే ఇష్టం. ఈ క్రమంలో రోడ్డు సైక్లింగ్‌లో శిక్షణ పొందాడు. గత నాలుగేళ్లుగా రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నాడు. నాలుగు సార్లు జాతీయ పోటీల్లో పాల్గొన్నాడు. రెండో ఆలిండియా యూనివర్సిటీ సైక్లింగ్ ఛాంపియన్‌షిప్, ఒడిశాలో జాతీయ క్రీడా పోటీల్లో ప్రైవేటు ఛాంపియన్‌షిప్ గెలుచుకున్నాడు.

★ **బాక్సింగ్‌లో..:** ఎంబీఏ చదువుతున్న డి.సందీప్ బాక్సింగ్‌లో 2017 నుంచి 2025 వరకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో సత్తా చాటాడు. ఆలిండియా యూనివర్సిటీ క్రీడల్లో 2022, 2023, 2025 సంవత్సరాల్లో పాల్గొన్నాడు. 6వ ఎలైట్ మెన్ నేషనల్ హిసార్, గోవాలో జరిగిన 37వ జాతీయస్థాయి పోటీల్లో విజయం సాధించాడు.

సామాజిక తనిఖీల ప్రజావేదిక

పద్మనాభం, న్యూస్‌టుడే: మండల కాంప్లెక్స్ ప్రాంగణంలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీల ప్రజా వేదిక కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు మండలంలోని 14 గ్రామాల్లో చేపట్టిన రూ.17 కోట్ల పనులకు సామాజిక తనిఖీ బృందం పర్యటించి ఆడిట్ చేశారు. చెరువుల పూడికతీత పనులు, సీసీ రోడ్లు, సచివాలయ భవనాలు, బీటీ రోడ్ల తదితర పనులను పరిశీలించారు. పీడీ పూర్ణిమా దేవి నేతృత్వంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అయితే సామాజిక తనిఖీలు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో గ్రామ సభలు నిర్వహించి ప్రజల సమక్షంలో చర్చించేవారని, ఇప్పుడు ప్రజా వేదిక కార్యక్రమం సైతం మొక్కుబడిగా సాగుతుందని విమర్శిస్తున్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి గంగరాజు మాట్లాడుతూ.. పట్టుదలతో చదవి పదోతరగతిలో మంచిమార్కులు సాధించాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయుడు కె.కామేశ్వరరావు, ఉపాధ్యాయులు వై.భాస్కరరావు, బి.ముత్యాలనాయుడు, ప్రజాప్రతినిధులు కొట్యాడ సత్యమూర్తి, రైతు నాగరాజు, కొట్యాడ రెడ్డిబాబు, తదితరులు పాల్గొన్నారు

'ప్రజా పోరాటాలతో ఆక్రమణలు అడ్డుకుంటాం'

మధురవాడ, సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూ ఆక్రమణదారులను ప్రజా పోరాటాల ద్వారా అడ్డుకుంటామని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం అన్నారు. రుషికొండ గీతం విశ్వవిద్యాలయం వెనుక గేటు వద్ద మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు ధర్నా నిర్వహించారు. వర్సిటీ ప్రతినిధులు ప్రభుత్వ భూములు ఆక్రమించి క్రమబద్ధీకరణ, బదలాయింపులకు పాల్పడటం ఆనవాయితీగా మారిందన్నారు. ఎండాడ, రుషికొండలో 54.79 ఎకరాల ప్రభుత్వ భూమికి ఈ నెల 30న జరిగే జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానం కోసం పెట్టిన అజెండాను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరసనలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్యవర్గ సభ్యులు బి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం నరహరి నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య కల్యాణోత్సవం మంగళవారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని చూడముచ్చటగా అలంకరించి ఆలయ కల్యాణ మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. దేవతామూర్తుల పరిణయోత్సవాన్ని కనులపండువగా జరిపించారు.

నోరు తెరిచిన ఆపద

ప్రమాదకరంగా ఫ్యూజ్‌బాక్స్

ఎండాడ, న్యూస్‌టుడే: 8వ వార్డు పరిధిలో వీధి దీపాల సంబంధిత పరికరాలు, తీగల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రజలకు ప్రాణసంకటంగా మారింది. ఎండాడ 100 అడుగుల రహదారి నుంచి బీసీ కాలనీ (ఎండాడ)లో దుర్గాదేవి ఆలయానికి వెళ్లే మలుపులో ఓ ఫ్యూజ్‌బాక్స్‌కి తలుపులు లేకపోవడంతో ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. దాని చుట్టూనే వ్యాపార దుకాణాలు ఉన్నాయి. ఏ మాత్రం ఆదమరిచి దానికి తగిలినా ప్రాణాపాయం తప్పదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదానికి ఆహ్వానం

ఎండాడ, న్యూస్‌టుడే: ఎండాడ-రుషికొండ మార్గంమధ్యలో ముబారక్‌కాలనీకి వెళ్లే కూడలిలో కాలువపై వేసిన పలక ధ్వంసమైంది. దీంతో పాదచారులు, వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. రాత్రివేళ మరింత అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదానికి గురి కావాల్సిందే. అప్రమత్తం చేయడానికి స్థానికులు గోతిలో జెండాను, కర్రలను పెట్టారు. అధికారులు స్పందించి ఈ కాలువపై పలకలు వేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు విన్నవిస్తున్నారు.

తులసీనగర్ గోడు వినరూ...

పీఎంపాలెం, న్యూస్‌టుడే: ఆరో వార్డు పరిధి సూర్య తులసీనగర్‌లో ప్రధాన, అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కాలువలు లేక మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ఇక్కడ సుమారు రెండు వేల మందికి పైగా నివాసముంటున్నారు. అయినా మౌలిక వసతులపై జీవీఎంసీ అధికారులు దృష్టి సారించడం లేదు. పలుమార్లు సంక్షేమ సంఘం ప్రతినిధులు వినతులు సమర్పించినా ఇంత వరకు అభివృద్ధిపై ప్రతిపాదనలు కూడా చేయలేదని వాపోతున్నారు. జనావాసాలు లేని చోట రోడ్లు, కాలువలు అభివృద్ధి చేస్తున్నా.. తమ ప్రాంతాలను మాత్రం పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధ్వానంగా రోడ్డు

ఆర్కిటెక్చర్‌పై అవగాహన

తీర్చిదిద్దిన చిత్రాలతో విద్యార్థులు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: గీతం డీమ్డ్ వర్సిటీ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఆధ్వర్యంలో సాగర్‌నగర్ తీరం తదితర నగర పరిధి బీచ్‌ల్లో మంగళవారం 'బై ది బే-2026' పేరిట వినూత్న కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గీతం విద్యార్థులు, అధ్యాపకులు ఆహ్లాదకర బహిరంగ ప్రదేశాల్లో కూర్చొని వివిధ చిత్రాలను తీర్చిదిద్దారు. గీతం ఆయా విభాగం డీన్ ప్రొఫెసర్ విభూతి సత్యదేవ్ మాట్లాడుతూ సామాజికంగా ఆర్కిటెక్చర్ పట్ల ప్రజల్లో అవగాహన పెంచడానికి ఈ తరహా కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.

భీమిలిలో వైభవంగా 'విశాఖ ఉత్సవ్'

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

గ్రామీణభీమిలి, భీమునిపట్నం, న్యూస్‌టుడే: విశాఖ ఉత్సవ్‌లో భాగంగా భీమిలిలో మంగళవారం సాయంత్రం సంబరాలు హోరెత్తాయి. బీచ్‌లో కళావేదికపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఉర్రూతలూగించాయి. భీమిలి చారిత్రక, సాంస్కృతిక, పర్యాటక వైభవాన్ని చాటుతూ చేసిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈటీవీ ఫేం రేలారే రేలా జానపద గాయకుడు జానకీరామ్ బృందం ఆటపాటలు జనరంజకంగా సాగాయి. డాన్సర్ శివ బృందం పాశ్చాత్య, సినీ నృత్యాలకు జోష్‌ఫుల్‌గా వేసిన స్టెప్పులకు ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. అంతర్జాతీయ నృత్యకారిణులు డింపుల్, హర్షిత, టీనాల నృత్యం మైమరిపించింది. తొలిరోజు ఉత్సవాలకు నాగరాజు పట్నాయక్, స్వప్నలు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. డిప్యూటీ కలెక్టర్ శేష శైలజ, తహసీల్దార్ పైలా రామారావు, డీడీవో నిర్మలాదేవి, సీఐ తిరుమలరావు, నాయకులు గంటా నూకరాజు, కొప్పల రమేశ్, కశిరెడ్డి దామోదరరావు, తదితరులు హాజరయ్యారు.

★ 29న పడవల పోటీలు..: భీమిలి బీచ్‌లో కళావేదికపై బుధవారం సాయంత్రం ఆరు నుంచి తొమ్మిది వరకూ సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి విశాఖ, భీమిలి ప్రాంతాల మత్స్యకారులకు బోట్లు, పడవల పోటీలు నిర్వహించనున్నారు. చేపలుప్పాడ నుంచి భీమిలి వరకూ మెకనైజ్డ్ బోట్లు, నాగమయ్యపాలెం నుంచి భీమిలి వరకూ పడవలు పోటీలు జరగనున్నాయి.

ఘనంగా ప్లంబింగ్ వర్కర్ల సంఘం వార్షికోత్సవం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి ఎలక్ట్రికల్ ప్లంబింగ్ వర్కర్ల సంఘం వార్షికోత్సవం స్థానిక చిన్నబజారు కూడలిలో సంఘం అధ్యక్షుడు కె.సన్నిబాబు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా థామస్ అల్వా ఎడిసన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. భీమిలి జోన్ పరిధిలో జీవీఎంసీ పరంగా నిర్వహించే నిర్మాణాల్లో చేయాల్సిన విద్యుత్తు పనుల్లో సంఘ సభ్యులకు అవకాశం కల్పించాలని తీర్మానించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కళాసాహితీ సంఘం అధ్యక్షుడు పి.రాజేంద్రప్రసాద్ వర్మ, గంటా నూకరాజు, కె.ఎస్.నాయుడుపాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లు బాధ్యతగా మెలగాలి

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి బీచ్‌కు వచ్చే సందర్శకుల పట్ల ఫొటోగ్రాఫర్లు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తే కేసులు తప్పవని సీఐ బి.తిరుమలరావు హెచ్చరించారు. మంగళవారం ఫొటోగ్రాఫర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: తెదేపా నేత, పద్మశాలి సేవా సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కొప్పల రమేశ్ పుట్టినరోజు సందర్భంగా తగరపువలస, చిట్టివలసలలో మంగళవారం సేవా కార్యక్రమాలు చేపట్టారు. తెదేపా ఒకటో వార్డు అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు తమ్మిన సూరిబాబు, దిండి వెంకటేశ్‌లు వంద మందికి చిట్టివలస సంతపేటలో పేదలకు దుప్పట్లు, నిత్యావసరాలను పంపిణీ చేశారు. నాయకులు నర్సింగరావు, మద్దిల సుబ్బారావు, తీన్‌మూర్తి, సూరిబాబు తదితరులు హాజరయ్యారు. తగరపువలస మెయిన్‌రోడ్డులో స్థానిక పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో 50 మందికి దుప్పట్లు, రొట్టెలు, పండ్లు అందించారు.

చిట్టివలస సంతపేటలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

చురుగ్గా అభివృద్ధి పనులు

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: జీవీఎంసీ 98వ వార్డు అడివివరం గ్రామం పరిధిలోని పాత అడివివరం, పాత గోశాల ప్రాంతాల్లో రూ.76.17 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు కార్పొరేటర్ పీవీ.నరసింహం తెలిపారు. ఆయా పనులను అధికారులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. పాత అడివివరం ఏయూ లేఅవుట్‌లో రూ.38 లక్షలతో బీటీ రహదారి, పాత గోశాల దరి జెడ్పీ అతిథి గృహం వెనుక ప్రాంతంలో రూ.19.17 లక్షలతో సీసీ రోడ్లు, కాలువలు, సాయినగర్ ప్రాంతంలో రూ.19 లక్షలతో కల్వర్టు నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయని పేర్కొన్నారు. ఏఈ దుర్గాప్రసాద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామారావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పాత గోశాల ప్రాంతంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పీవీ నరసింహం

పరిమిత వేగంతో వాహనాలు నడపాలి

పీఎంపాలెం, న్యూస్‌టుడే: విద్యార్థులు రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలని, పరిమిత వేగంతో ద్విచక్రవాహనాలు నడపాలని సహాయ ఎంవీఐ ఎం.ఆనందరావు సూచించారు. పీఎంపాలెం సాంకేతిక ఇంజినీరింగ్ కళాశాలలో స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం 'రహదారి భద్రతా మాసోత్సవాలు-2026' పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రమాద దృశ్యాలు, గణాంకాలను దృశ్య శ్రవణ విధానం ద్వారా చూపించారు. కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆళ్వార్‌దాస్ గ్రూపు కార్యదర్శి, కరస్పాండెంట్ ఎస్.వి.హెచ్.రాజేంద్ర, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుంకరి రాహుల్ ఆళ్వార్‌దాస్‌లు, అకడమిక్ డైరెక్టర్ వి.శివరాంప్రసాద్, హెచ్‌ఆర్ అక్షత కొండూర్, తదితరులున్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సహాయ ఎంవీఐ ఆనందరావు

భక్తిశ్రద్ధలతో తాజుద్దీన్ ఉత్సవం

ఊరేగింపుగా వస్తున్న బాబావారి సందాల్

దాకమర్రి (తగరపువలస), న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక గురువు తాజుద్దీన్ బాబా జయంతి భీమిలి మండలం దాకమర్రి నీలయ్యమ్మసత్రం వద్దనున్న ఆశ్రమంలో మంగళవారం నిర్వహించారు. దేశంలోని పలు ప్రాంతాల నుంచి హిందూ, ముస్లిం భక్తులు వేలాదిగా తరలివచ్చి బాబా గులాబి రేకులు, కేకులు, అత్తర్లు, పవిత్ర వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. విజయనగరం, విశాఖ జిల్లాల్లోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన సందాల్‌లు భారీ ఊరేగింపుగా ఆశ్రమానికి చేరుకున్నాయి. ఆశ్రమ ట్రస్టీలు తిరుపతిరెడ్డి బాబా, రాజు కుమందన్, తదితరులు ఆనవాయితీగా బాబావారి సందాళ్లకు స్వాగతం పలికారు. సుమారు పాతిక వేల మందికి ఉచితంగా అన్నదానం చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాత్రి కొవ్వొత్తులను వెలిగించి బాబావారికి ప్రార్థనలు చేశారు.

ద్విచక్రవాహనదారుడిపై కారు డ్రైవర్ దౌర్జన్యం!

ఆనందపురం, న్యూస్‌టుడే: ఆనందపురం-విశాఖపట్నం జాతీయ రహదారిలో వేములవలస సమీపంలో ఓ కారు డ్రైవర్ ద్విచక్రవాహనదారుడుని గాయపర్చడంతో పాటు తీవ్రంగా తిట్టినట్లు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఆనందపురం పోలీసులు మంగళవారం తెలిపారు. ఆ వివరాలిలా.. శ్రీకాకుళం జిల్లా ఎచ్చర్ల ప్రాంతానికి చెందిన కొత్తకోట శ్రీనివాసరావు లాయర్ ప్రాక్టీస్ చేస్తున్నారు. కాగా మంగళవారం ఉదయం విశాఖపట్నం కోర్టులో పని నిమిత్తం శ్రీకాకుళం నుంచి ద్విచక్రవాహనంతో బయలుదేరారు. ఆనందపురం దాటాక ఓ కారు డ్రైవర్ వేగంగా వచ్చి తనను వెంబడించాడు. ఒక్కసారిగా ముందుకు వచ్చి కారును నిలిపేశాడు. కారు డ్రైవర్, మరో మహిళ తనను కొట్టడంతో పాటు తీవ్ర పదజాలంతో తిట్టారని పేర్కొన్నారు. డయల్ 100కి సమాచారం ఇస్తున్నట్లు గ్రహించిన సదరు వ్యక్తులు అక్కడ నుంచి పరారయ్యారని ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆనందపురం సీఐ వాసునాయుడు వెల్లడించారు.

(c) eenadu

విశాఖ తూర్పు

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ఇందిరానగర్(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: పదోవార్డు పరిధి ఇందిరానగర్ ఆనందమార్గ్ ఆశ్రమంలో మంగళవారం స్వాతంత్య్ర సమరయోధులు లాలాలజపతిరాయ్ జయంతిని నిర్వహించారు. విశాలాక్షినగర్ భగత్‌సింగ్‌నగర్ యువజన సేవా సంఘం ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు చిత్రలేఖనం, దేశభక్తి గీతాలాపన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. సంఘం ప్రతినిధులు పైడిరాజు, శ్రీనివాసరావు, కనకారావు, ఆశ్రమ నిర్వాహకులు సౌమ్యానంద అవధూత తదితరులు పాల్గొన్నారు.

'యువగళం'తో రాజకీయాల్లో పెను మార్పు

సిరిపురం(ఏయూ ప్రాంగణం), న్యూస్‌టుడే: వైకాపా అప్రజాస్వామిక పాలనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరిచేలా తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నిర్వహించిన యువగళం పాదయాత్ర రాజకీయాల్లో పెను మార్పు తీసుకొచ్చిందని వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ అన్నారు. నారా లోకేశ్ యువగళం పాదయాత్ర చేపట్టి మూడేళ్లయిన సందర్భంగా అభినందనలు తెలిపారు. ప్రజల పక్షాన నిలుస్తూ, అన్ని వర్గాలకు భరోసా కల్పిస్తూ యువగళం పాదయాత్ర సాగిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పాదయాత్రలో తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకొస్తున్నారని వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769

మద్దిలపాలెం: 9912120229

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ?: జోడుగుళ్లపాలెంలో వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. రాత్రుళ్లు ద్విచక్ర వాహనాల ఇందనం, విడిభాగాలు ఎత్తుకెళ్తున్నారు. – గౌరి, స్థానిక మహిళా సంఘం ప్రతినిధి. ✓: దీపాలను పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. – రామ్ శంకర్, సూపర్ వైజర్

సుందర్‌నగర్(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: ?: సుందర్‌నగర్ కూడలి నుంచి పాతడెయిరీ ఫారం కూడలి వరకు పశుసంచారం అధికంగా ఉంది. వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. – కామేశ్వరరావు, స్థానికుడు ✓: రహదారిపై తిరుగుతున్న పశువులను పట్టుకుని యజమానులకు జరిమానా విధిస్తాం. – డాక్టర్ రాజారవి కుమార్, పశుసంవర్ధక అధికారి

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ?: 20వ వార్డు పెదవాల్తేరు రామలక్ష్మి అపార్ట్‌మెంట్ ప్రాంతంలో చెత్త పోగులు పేరుకుపోయాయి. – ఎ.రమేష్, స్థానికుడు ✓: త్వరలో సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తాం. – ప్రకాష్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఆరిలోవ, న్యూస్‌టుడే: ?: 12వ వార్డు తోటగరువు ఎర్ని దుర్గమాంబ ఆలయం ఎదురుగా ఉన్న కాలువలో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు నిలిచిపోయింది. – చంటి, తోటగరువు. ✓: సిబ్బందిని పంపించి కాలువలో పూడిక తొలగిస్తాం. – అబ్దుల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

స్పందనకు వందనం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: జోడుగుళ్లపాలెంలో నెల రోజుల నుంచి భూగర్భ డ్రైనేజీ పొంగుతూ దుర్వాసన వెదజల్లుతోందని శనివారం 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. దీనికి ఏఈ శ్రీనివాస్ స్పందించారు. సిబ్బందితో భూగర్భడ్రైనేజీలో అడ్డంకులు తొలగించి మురుగు పారుదల అయ్యేలా చర్యలు తీసుకున్నారు.

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: పదోవార్డు పరిధి ఇందిరానగర్ ప్రధాన గెడ్డలో పందులు, వీధి కుక్కలు తిష్ట వేయడం, పారిశుద్ధ్యం దిగజారి దోమలు వృద్ధి చెందుతున్నాయని సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు సహాయ వైద్యాధికారి డాక్టర్ రాజారవికుమార్ స్పందించారు. ఆయన ఆదేశాలతో పదోవార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ జేసీబీతో గెడ్డను శుభ్రపరిచారు. దోమల లార్వా పెరగకుండా ద్రావణం పిచికారీ చేయించారు.

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: 23వ వార్డు మద్దిలపాలెం ఆర్టీసీ సిటీ డిపో వెనుక భాగంలోని కాలువల్లో మురుగు నిలిచిపోతోందని మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ స్పందించారు. సిబ్బంది చేత పూడిక తీయించి మురుగు పారుదల అయ్యేలా చర్యలు తీసుకున్నారు.

కన్నేసి.. గెడ్డలు కప్పేసి..!

పాతడెయిరీఫారంలో దర్జాగా ఆక్రమణలు

ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే

నగరంలో భూముల ధరలకు రెక్కలు రావడంతో కొంత మంది అక్రమార్కులు ప్రభుత్వ భూములు, గెడ్డలు, కొండలను ఆక్రమిస్తున్నారు. దొంగ పత్రాలు సృష్టించి దర్జాగా కట్టడాలు నిర్మిస్తున్నారు. స్థానికుల నుంచి ఫిర్యాదులు అందినా పట్టణ ప్రణాళిక అధికారులు పట్టించుకోకపోవడంతో ఆక్రమణదారులకు అడ్డే లేకుండా పోతోంది.

దుకాణాల నిర్మాణం: పదో వార్డు పరిధి పాతడెయిరీఫారం పోస్టాఫీసు వీధిలో గెడ్డకు ఆనుకుని 1000 గజాల స్థలంలో ఓ వ్యక్తి వాణిజ్య దుకాణాలు, రెండు ఇళ్లు నిర్మించేశాడు. తాయిలాలతో అధికారులను మచ్చిక చేసుకున్నాడు. అటువైపు ఎవరూ రాకపోవడంతో ఈసారి గెడ్డను ఆక్రమించి 100 గజాల వరకు మరో అదనపు దుకాణం నిర్మించేశాడు. స్థానికులు ప్రశ్నిస్తే ఆ స్థలం తనదే అని బెదిరించడం ప్రారంభించాడు. దీంతో స్థానిక సంఘం ప్రతినిధులు ఇటీవల ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నేరుగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

పాతడెయిరీఫారం పోస్టాఫీసు వీధిలో గెడ్డ అంచున నిర్మించిన భవనం

కళ్ల ముందే కనిపిస్తున్నా..: గెడ్డ ఆక్రమణ కారణంగా భారీ వర్షాలు, తుపానుల సమయంలో వరదనీరు పొంగి రహదార్లపైకి చేరుతోంది. ఈ కూడలికి దగ్గరలో మండల తహసీల్దారు కార్యాలయం ఉంది. గెడ్డకు ఎదురుగా జీవీఎంసీ వార్డు కార్యాలయం కూడా ఉంది. అధికారులు ప్రతిరోజు ఈ దారిలోనే రాకపోకలు సాగిస్తుంటారు. కళ్లముందే ఆక్రమణలు కనిపిస్తున్నా కనీసం నోటీసులు కూడా ఇవ్వకపోవటం గమనార్హం.

పూడిక తీయలేని పరిస్థితి: పోస్టాఫీసు ప్రాంతంలోని గెడ్డ కల్వర్టుకు 500 మీటర్ల నుంచి కంబాలకొండ చివరి వరకు రెండు వైపులా ఆక్రమణలు పెరిగిపోయాయి. ఒకరిని చూసి మరొకరు కబ్జాలకు పాల్పడుతుండటంతో గెడ్డ కాస్త చిన్న కాలువలా మారిపోయింది. మరో పక్క స్థానికులు వ్యర్థాలను ఆ గెడ్డలో వేసేస్తుండడంతో మురుగు పారుదల నిలిచిపోతోంది. ఆక్రమణల కారణంగా పూడిక తీయటానికి వాహనం కూడా వెళ్లలేని పరిస్థితులు ఉంటుండంతో తీవ్ర దుర్వాసనతోపాటు దోమలు వృద్ధి చెందాయి.

కేసులు పెడతాం: పాతడెయిరీఫారం ప్రాంతానికి రెవెన్యూ సిబ్బందిని పంపించి రికార్డులు పరిశీలన చేయిస్తాం. ఆక్రమణలు వాస్తమని తేలితే బాధ్యులకు నోటీసులు జారీ చేసి భూ ఆక్రమణ కేసులు నమోదు చేయిస్తాం. – కిరణ్‌పాల్, తహసీల్దారు, చినగదిలి మండలం

రోగులకు ఆక్సిజన్ పరికరాల వితరణ

ఆక్సిజన్ పరికరాలు అందజేస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఛాతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు రోగులకు మస్కట్ సీవీఎ చారిటబుల్ ట్రస్ట్ ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్ పరికరాలు అందజేయడం అభినందనీయమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. సునీల్‌కుమార్ తెలిపారు. మంగళవారం ట్రస్ట్ ప్రతినిధి ఎ.ఎస్.ఎస్.రామ్ ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న జ్యోతి, శంకరరావులకు ఆయా పరికరాలు అందజేశారు. వాతావరణంలోని ఆక్సిజన్‌ను సంగ్రహించి వీటిని రూపొందించారని, ఈ పరికరాలతో బాధితులకు నిరంతరం ప్రాణవాయువు అందించవచ్చని డాక్టర్ సునీల్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో వైద్యులు సూర్యకుమారి, జె.వి.ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు నూతన ఉపాధ్యాయులకు శిక్షణ

ఆరిలోవ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం నూతన ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఏపీ సామాజిక సంక్షేమ నివాస విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. గురుకులాల్లో విద్యా వాతావరణం, పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల వ్యక్తిగత శుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు.

కొట్టేది ఒకరు..తొలగించేది మరొకరా..!

పదోవార్డు రవీంద్రనగర్ చివరి బస్‌స్టాపు నుంచి గాంధీనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో ఈపీడీసీఎల్ సిబ్బంది ఇటీవల విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్నాయని చెట్ల కొమ్మలను తొలగించారు. రోజుల తరబడి వాటిని తొలగించకుండా వదిలేశారు. దీంతో స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఈపీడీసీఎల్, జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది ఒకరిపై ఒకరు చెప్పుకొంటూ కాలక్షేపం చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు. – విశాలాక్షినగర్, న్యూస్‌టుడే

ఇళ్ల ముందు కుప్పలు..తప్పని తిప్పలు

22వ వార్డు పిఠాపురంకాలనీలో కాలువ అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీని కోసం తీసిన మట్టిని ఇళ్ల, అపార్ట్‌మెంట్ల వద్ద వేశారు. దీంతో స్థానికులు ఇళ్లలోకి వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని స్థానిక నివాసితులు కోరుతున్నారు. – శివాజీపాలెం (మద్దిలపాలెం), న్యూస్‌టుడే

క్లిక్ క్లిక్

గేటు మూస్తే దారెటు..!

ఆంధ్రవిశ్వవిద్యాలయంలో గేట్ల మూసివేత వివాదం రోజురోజుకు పెరుగుతోంది. వర్సిటీ మెయిన్ గేటుతో పాటు అవుట్ గేట్ మాత్రమే తెరిచి ఉంచుతున్నారు. ఎన్నడూ లేని విధంగా సిరిపురం కూడలిలోని ఏయూ ఉద్యోగుల క్వార్టర్స్, కలెక్టర్ బంగాకు వెళ్లే మార్గంలో గేట్లకు తాళం వేశారు. దీంతో ఆయా క్వార్టర్స్‌లో ఉంటున్న ఉద్యోగుల కుటుంబాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.– ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే

తెల్లవారినా ఆరవు..!

దర్పణం

పెదగదిలి, చినగదిలి ముడసర్లోవ ప్రాంతాల్లో కొన్ని వీధి దీపాలు ఉదయం 8గంటలైనా వెలుగుతూనే ఉన్నాయి. కొన్ని దీపాలు రాత్రి 8గంటల వరకు వెలగడం లేదు. నిర్వహణ లోపమే ఈ పరిస్థితికి కారణమని స్థానికులు తెలిపారు. దీనిపై ఏఈ రాజేష్‌ను వివరణ కోరగా కొండవాలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మల కారణంగా తరచూ ఈ సమస్య తలెత్తుతోందన్నారు. వెంటనే పరిశీలించి మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.– ఆరిలోవ, న్యూస్‌టుడే

వారసత్వం, సంస్కృతిని కాపాడే బాధ్యత యువతదే

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: దేశ వారసత్వం, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత యువతపై ఉందని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. బీచ్‌రోడ్డులోని మేరా యువభారత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం జరిగిన యూత్ ఎక్స్ఛేంజ్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన యువతీ యువకులతో ముఖాముఖి నిర్వహించారు. ఉపాధి అవకాశాలు, సామాజిక పరిస్థితులు, ప్రస్తుత రాజకీయాల్లో యువత పాత్ర తదితర ప్రశ్నలకు ఎంపీ సమాధానం ఇచ్చారు. అనంతరం ప్రతిభ చూపిన యువతకు ధ్రువపత్రాలు అందజేశారు. మైభారత్ ఏపీ స్టేట్ డైరెక్టర్ అన్షుమాన్‌ప్రసాద్ దాస్, డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు, బలదేవ్ ఇండియన్ మార్షల్ ఆర్ట్స్ వ్యవస్థాపకులు బి.లక్ష్మణ్‌దేవ్, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పంటలకు ప్రోత్సాహం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్ సమీప ఆర్టీడీ లేఅవుట్‌లోని ఓ గృహ సముదాయంలో విశాఖ గార్డెన్ ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు మంగళవారం సమావేశమయ్యారు. హ్యాపీ గార్డెనర్స్ గ్రూప్‌నకు అనుబంధంగా 110 మందితో విశాఖ గార్డెన్ ఫ్రెండ్స్ పేరిట గ్రూపు ప్రారంభినట్లు అడ్మిన్ తుమ్మిడి మనోరమణి పేర్కొన్నారు. సేంద్రియ గార్డెనింగ్, నాణ్యమైన కూరగాయల పంటలను ప్రోత్సహించే దిశగా సభ్యులకు 42 రకాల ఆకుకూరలు, పూల విత్తనాలతో పాటు కుండీలను ఉచితంగా అందజేశారు.

'కళ'వరించి.. ఖ్యాతిగాంచి..!

◆ కూచిపూడి నృత్యంలో లిపికారెడ్డి విశేష ప్రతిభ

◆ దేశవిదేశాల్లో వేలాది ప్రదర్శనలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: కూచిపూడి నృత్యంలో దేశవిదేశాల్లో పేరు తెచ్చుకున్నారు విశాఖకు చెందిన లిపికారెడ్డి. ఆమె తల్లి కూచిపూడి నృత్యం నేర్చుకోవాలని భావించారు. కుటుంబ బాధ్యతల కారణంగా ఆ కోరిక నెరవేరలేదు. దీంతో కుమార్తె లిపికారెడ్డిని నృత్య కళాకారిణిగా బాల్యం నుంచి తీర్చిదిద్దారు. అలా సుమారు 28ఏళ్లుగా నృత్యమే జీవనంగా మార్చుకుంది లిపికారెడ్డి. భామా కలాపం నృత్య రూపకంలో ఆమె అభినయానికి నీరాజనాలు అందుకున్నారు. ఇటీవల విశాఖ కళాభారతిలో జరిగిన నృత్యోత్సవాల్లో గురుచరణ్ అవార్డు అందుకున్నారు. అంతేకాకుండా 200 మంది బాలికలకు కూచిపూడిలో శిక్షణ ఇస్తున్నారు.

లిపికారెడ్డి

ప్రదర్శనలు ఇలా..: తిరుమల బ్రహ్మోత్సవాల్లో 5 సార్లు, సింహాచలం, కాణిపాకం, అన్నవరం దేవాలయాల్లో నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. కువైట్, సింగపూర్, దిల్లీ, వారణాసి, అలహాబాద్, బెంగళూరు ప్రాంతాల్లో ఆమె నృత్యాభినయం ప్రేక్షకుల మన్ననలు అందుకుంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో 100 అవార్డులు అందుకున్నారు. ఇటీవల దూరదర్శన్ నిర్వహించిన ఆడిషన్స్‌లో బి హైగ్రేడ్ కళాకారిణిగా ఎంపికయ్యారు. ఇప్పటి వరకు 2వేల ప్రదర్శనలు ఇచ్చారు. ప్రస్తుతం ఏయూ నృత్య విభాగంలో అతిథి అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. 'దేశవ్యాప్తంగా ఉన్న వేంకటేశ్వరస్వామి దేవాలయాల్లో ప్రదర్శనలివ్వడమే తన లక్ష్యమ'ని లిపికారెడ్డి తెలిపారు.

★ గురువు పసుమర్తి సీతారామయ్య వద్ద లిపికారెడ్డి శిక్షణ పొందారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో వెనుతిరిగి చూసుకోలేదు. తండ్రి సత్యనారాయణరెడ్డి స్టీల్ ప్లాంట్ ఉద్యోగి. ఎక్కడ నృత్య ప్రదర్శనలు జరిగినా కుమార్తెను తీసుకెళ్లేవారు. చదువుకు ఆటంకం కలుగకుండా సాధన చేసేవారు. అలా బీటెక్, ఎంటెక్ పూర్తి చేశారు. 2000లో మలేసియాలో ఆమె ఇచ్చిన ప్రదర్శన స్థానిక తెలుగు వారిని విశేషంగా ఆకట్టుకుంది. దానికిగాను తెలుగు అసోసియేషన్ ఘనంగా సత్కరించింది.

గోతుల రహదారులకు మెరుగులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే:నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఛిద్రమైన రహదారులకు మరమ్మతులు చేపడుతున్నారు. ఇటీవల భాగస్వామ్య సదస్సు సందర్భంగా బీచ్‌రోడ్డులోని రహదార్లకు మెరుగులు దిద్దారు. అయితే కాలనీలు, వీధుల్లోని రహదారులు దెబ్బతిన్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వచ్చాయి. దీనిపై 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. దీనికి జీవీఎంసీ కమిషనర్ స్పందించారు. వీధుల్లో రహదారులపై పడిన గుంతలను పూడ్చి బీటీ లేయర్ వేస్తున్నారు. తాత్కాలిక మరమ్మతులతో కొద్ది రోజులకే మళ్లీ రహదార్లు దెబ్బతింటున్నాయని, శాశ్వతంగా బీటీ లేయర్ వేయాలని స్థానికులు కోరుతున్నారు.

మానసిక ఆసుపత్రికి వెళ్లే దారికి మరమ్మతులు

మర్యాదపూర్వక కలయిక

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబును మంగళవారం ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వన్నెంరెడ్డి సతీష్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. గౌతమ బుద్ధుడి విగ్రహం అందజేశారు. గ్రంథాలయాల అభివృద్ధికి సంబంధించిన విషయాలపై చర్చించారు.

నాగబాబుతో వన్నెంరెడ్డి సతీష్

సామాజిక సేవలతోనే ఆత్మసంతృప్తి

జ్ఞానాపురం, న్యూస్‌టుడే : తూర్పుకోస్తా రైల్వే పరిధి వాల్తేర్ డివిజన్‌కు చెందిన మహిళా సంక్షేమ సంఘం ప్రతినిధులు పలు ఆరోగ్య కేంద్రాల్లో సహాయక కార్యక్రమాలు నిర్వహించారని సంఘం అధ్యక్షురాలు జ్యోత్స్న బోహ్రా మంగళవారం పేర్కొన్నారు. మర్రిపాలెం, డీజిల్ లోకోషెడ్, శ్రీకాకుళం, విజయనగరం తదితర ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో బాధితులకు పండ్లు, రొట్టెలు, బేబీ కిట్లు, ఇతర సామగ్రి పంపిణీ చేసినట్టు వివరించారు. సామాజిక బాధ్యతగా నిర్వహించే సేవా కార్యక్రమాలతో ఆత్మసంతృప్తి కలుగుతుందన్నారు. అలాగే సంఘం సభ్యులు అనురాగ్ మాంటిసోరి పాఠశాల విద్యార్థులతో కలిసి గణతంత్ర వేడుకలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాఖ ఉత్సవ్‌లో భాగంగా మంగళవారం బీచ్‌రోడ్డు కాళీమాత ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై మైండ్ ఇన్‌ఫ్లూయెన్సర్ రవి మాయాజాలం ఆకట్టుకుంది. ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ తదితరులు ప్రదర్శనలను తిలకించారు. –న్యూస్‌టుడే, కార్పొరేషన్

పర్యావరణ విద్యతో జీవవైవిధ్యం పరిరక్షణ

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జీవ వైవిధ్యం పరిరక్షణకు పర్యావరణ విద్య అవసరమని గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం అన్నారు. మద్దిలపాలెం శ్రీభావన విద్యానికేతన్ పాఠశాల, అక్షర పాఠశాలల్లో మంగళవారం అంతర్జాతీయ పర్యావరణ విద్య దినోత్సవం, అంతర్జాతీయ స్వచ్ఛ విద్యుత్తు దినోత్సవాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పర్యావరణ హితంగా జీవించాలన్నారు. క్లీన్ ఎనర్జీని ప్రోత్సహించి వాతావరణం వేడెక్కకుండా చూడాలని కోరారు. పాఠశాలల ప్రతినిధులు నీలిమ, సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు జె.వి.రత్నం, విద్యార్థులు

ఇదేం రహదారి..?

అధికారులపై మేయర్ ఆగ్రహం

కార్పొరేషన్, న్యూస్‌టుడే : స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవానికి హాజరైన మేయర్ పీలా శ్రీనివాసరావు స్టేడియం ప్రాంగణంలో నిర్మించిన బీటీ రహదారిని పరిశీలించి, ఇంజినీరింగ్ అధికారులపై మండిపడ్డారు. పనుల్లో నాణ్యత లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారిపై రోలింగ్ చేయకుండా వదిలేయడంతో, పాత రహదారిపై ఉన్న లేయర్ పక్కకు జరిగిపోవడంతో పాటు, పిక్క ఊడిపోవడానికి సిద్ధంగా ఉందన్నారు. ప్రజాధనంతో చేపట్టే పనుల్లో పర్యవేక్షణ పెంచాలని, వెంటనే అధికారులంతా తీరు మార్చుకోవాలని మేయర్ హెచ్చరించారు.

తలుపుల్లేని కిటికీలు.. తుప్పు పట్టిన మంచాలు

చలికి వణుకుతున్న విద్యార్థులు

శ్రీకృష్ణాపురం గురుకుల పాఠశాల దుస్థితిది

ఆరిలోవ, న్యూస్‌టుడే

శ్రీకృష్ణాపురం గురుకుల పాఠశాల నిర్వహణ అధ్వానంగా మారింది. వసతి గృహాల కిటికీలకు తలుపులు లేకపోవడంతో విద్యార్థులు రాత్రుళ్లు చలికి వణికిపోతున్నారు. ఇనుప మంచాలు తుప్పపట్టడంతోపాటు ఆవరణ కూడా అస్తవ్యస్తంగా మారింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలు ఈ దుస్థితికి కారణమయ్యాయని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించిన పాలనను మెరుగుపర్చాలని కోరుతున్నారు.

అధికశాతం మన్యం ప్రాంతాల విద్యార్థులే: పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు 500కు పైగా విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల వసతి కోసం రెండు భవనాలు, వంటశాల, భోజనశాల, 20 తరగతి గదులు, విశాలమైన క్రీడా మైదానం ఉన్నాయి. ఈ ఏడాది నుంచి ఇంటర్‌తో పాటు జేఈఈ, నీట్ పరీక్షల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని ఏజన్సీ ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చి ఇక్కడ చదువుకుంటున్నారు.

దెబ్బతిన్న వసతిగృహం కిటికీలు

ఇంతటి ప్రాధాన్యత గల పాఠశాల నిర్వహణలో తరచూ లోపాలు తలెత్తున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు: గత వైకాపా ప్రభుత్వ హయాంలో గురుకుల పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు జరిగాయి. అర్హత, అనుభవం ఉన్న పురుషులను ప్రిన్సిపల్‌గా నియమించాల్సి ఉండగా జూనియర్ ఉపాధ్యాయురాలిని ఆ స్థానంలో నియమించారు. అనుభవ రాహిత్యంతోపాటు రాజకీయాలు చోటుచేసుకోవడంతో విద్యార్థులకు చదువుపై దృష్టి తగ్గిందని సీనియర్ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. నాడు వసతిగృహం కిటికీల తలుపులు ధ్వంసం చేయడం, స్నానాల గదుల్లోని కుళాయిలు విరిచేయడం, ఫ్యాన్ల రెక్కలు వంచేయడం, ర్యాగింగ్ లాంటి ఘటనలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు వచ్చాయి. భోజనాల్లో నాణ్యత కొరవడిందని డిసెంబరులో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేశారు. ఆ సమయంలో తనిఖీకి వచ్చిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలాశ్రీబాల వీరాంజనేయస్వామి ప్రిన్సిపల్, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఇటీవల కొత్త ప్రిన్సిపల్‌ను నియమించారు.

★ ఇప్పటికీ కిటికీలకు తలుపులు ఏర్పాటు చేయకపోవడంతో చలికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గోడలు మాసిపోయి ఉన్నాయని, పారిశుద్ధ్యం కూడా సరిగా లేదని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. కొత్తగా నియమితులైన ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు గురుకుల వసతి గృహంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆలయాల ఛైర్మన్‌లకు అభినందన

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఆలయాల నూతన ధర్మకర్తల మండలి అధ్యక్షులుగా ఇటీవల నియమితులైన పలువురు మంగళవారం ఎంపీ శ్రీభరత్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఉత్తర నియోజవర్గంలో ఐదు ఆలయాలకు నూతనంగా నియమితులైన అధ్యక్షులను అభినందించారు. ఆలయాల నిర్వహణలో లోటుపాట్లు రాకుండా సమర్థంగా బాధ్యతలు నిర్వర్తించాలని కోరారు. 25వ వార్డు సీతంపేట దుర్గాగణపతి ఆలయం ఛైర్మన్ నమ్మి రవికుమార్, 26వ వార్డు రామకృష్ణనగర్ రామలింగేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ కె.శ్రీనివాస్, 42వ వార్డు రైల్వేన్యూకాలనీ శ్రీలక్ష్మీగణపతి ఆలయం ఛైర్మన్ దువ్వి కాళీప్రసాద్, 53వ వార్డు సాయినగర్‌లోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ ఎస్.వెంకటరమణమూర్తి, 54వ వార్డు జై సంతోషి మాత సహిత సాయిబాబా ఆలయ ఛైర్మన్ మాధవరావు ఎంపీని కలిసినవారిలో ఉన్నారు. కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ జనసేన సమన్వయకర్త పసుపులేటి ఉషాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర్వులు అందజేస్తున్న ఎంపీ శ్రీభరత్

ఘనంగా కేడీపీఎం పాఠశాల వార్షికోత్సవం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ఈస్టుపాయింట్ కాలనీ కేడీపీఎం ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు మిగతా తరగతుల విద్యార్థులు వీడ్కోలు పలికారు. అనంతరం సినిమా పాటలకు నృత్యాలు చేసి అలరించారు. పాఠశాల హెచ్‌ఎం సుమతిబాయి, తదితరులు పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నేటి నుంచి భగవద్గీత ప్రవచనాలు

అల్లిపురం, న్యూస్‌టుడే : ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో భగవద్గీతలోని 11వ అధ్యాయంలో విశ్వరూప దర్శన యోగంపై సుశీలాజీ ఆంగ్లంలో ప్రవచిస్తారని వేదాంత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి ఎస్.వి.సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం డాబాగార్డెన్స్ సమీప వీజేఎఫ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 7.45 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు హరినాథ్‌రాజు, విశ్వేశ్వరరావు, రాజ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ప్రదర్శిస్తున్న ట్రస్ట్ సభ్యులు

31 వరకు ఇగ్నోలో ప్రవేశాలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో 2026 విద్యా సంవత్సరానికి డిప్లమో, డిగ్రీ, పీజీ కోర్సుల్లో దూరవిద్యతోపాటు, ఆన్‌లైన్‌లో ప్రవేశాలు ఈనెల 31 వరకు జరుగుతాయని సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. టూరిజం, నర్సింగ్, డెయిరీ టెక్నాలజీ, ఆక్వా కల్చర్, వ్యవసాయం, జర్నలిజం, న్యాయవిద్య కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఫీజులు ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు డిగ్రీ కోర్సుల్లో 50 శాతం ఫీజు రాయితీ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ignouadmission.samarth.edu.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నిరుద్యోగ రణభేరిని విజయవంతం చేయాలి..

హెచ్‌బీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే: ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీచేయాలని కోరుతూ ఈనెల 30న నిరుద్యోగ రణభేరి పేరిట చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్.మధురెడ్డి కోరారు. మంగళవారం హెచ్‌బీకాలనీలోని సీపీఐ స్తూపం వద్ద నిరుద్యోగ రణభేరి కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తరువాత నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని, తొలగించిన వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాము, శంకర్, రాంబాబు, గణేష్, అప్పలరాజు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

(c) eenadu

విశాఖ ఉత్తరం

• విశాఖ ఉత్తరం • విశాఖ దక్షిణం

నేటి నుంచి భగవద్గీత ప్రవచనాలు

గోడపత్రిక ప్రదర్శిస్తున్న ట్రస్ట్ సభ్యులు

అల్లిపురం, న్యూస్‌టుడే : ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో భగవద్గీతలోని 11వ అధ్యాయంలో విశ్వరూప దర్శన యోగంపై సుశీలాజీ ఆంగ్లంలో ప్రవచిస్తారని వేదాంత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విశాఖ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి ఎస్.వి.సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం వీజేఎఫ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజూ సాయంత్రం 6 నుంచి 7.45 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ట్రస్ట్ ప్రతినిధులు హరినాథ్‌రాజు, విశ్వేశ్వరరావు, రాజ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లో వేచిన ఉదయం..!

98 రోజుల తర్వాత జైలు నుంచి మత్స్యకారుల విడుదల

జైలు నుంచి విడుదలైన మత్స్యకారులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : బంగ్లాదేశ్ బాగర్‌హాట్ జైల్లో 98 రోజుల పాటు బందీలుగా ఉన్న 9 మంది మత్స్యకారులు మంగళవారం విడుదల కావడంతో వారి స్వగ్రామాల్లోని కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. తమ వాళ్లతో ఫోన్లో మాట్లాడిన కుటుంబ సభ్యులంతా ఒక్కసారిగా భావోద్వేగానికి గురయ్యారు. తమ వాళ్లు సురక్షితంగానే వస్తున్నారనే సమాచారం తెలుసుకోగానే... వారంతా ఊపిరి పీల్చుకున్నారు. ✦ బంగ్లాదేశ్ హోంమంత్రిత్వశాఖ అధికారులు, భారతదేశం తరఫున డిప్యూటీ హైకమిషన్ శ్రీ చంద్రజిత్, ఇతర అధికారులు, బాగర్‌హాట్ జైలు అధికారులు, అక్కడి జిల్లా మెజిస్ట్రేట్ ఆధ్వర్యంలో విడుదల ప్రక్రియ సజావుగా సాగింది. భారత అధికారులు మర పడవలు యజమానుల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ తెలిపారు.

'కూటమి' అండ

✦ ఇన్నాళ్లు బాధిత మత్స్యకారులు, వారి కుటుంబాలకు కూటమి నాయకులు అండగా నిలబడ్డారు. ఎంపీలు శ్రీభరత్, అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, లోకం మాధవి, దక్షిణ తెదేపా బాధ్యుడు సీతారాం సుధాకర్ ఇతర నాయకులు బాధిత కుటుంబీలను పరామర్శించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, తెదేపా నాయకుడు సుధాకర్ పలుమార్లు నిత్యావసరాలు సమకూర్చారు.

✦ కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ పలుమార్లు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ అధికారులతో మాట్లాడి... మత్స్యకారుల్ని వెనక్కి తీసుకొచ్చేలా కృషి చేశారని ఏపీ మర పడవల ఆపరేటర్ల సంఘం అధ్యక్షులు మైలపల్లి లక్ష్మణరావు పేర్కొన్నారు.

✦ మత్స్యకారులంతా బయలుదేరిన తర్వాత మూడు నాలుగు రోజుల్లో విశాఖ చేరుకుంటారని, బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం చూపిన చొరవతోనే బాధితులు సురక్షితంగా తిరిగి వస్తున్నారని లక్ష్మణరావు అభిప్రాయపడ్డారు. మత్స్యకారుల విడుదలలో కృషి చేసిన వారందరికీ బాధిత కుటుంబీలు కృతజ్ఞతలు తెలిపారు. ✦ బోటులో వెళ్లిన సూరాడ అప్పలకొండ అరెస్టు అయ్యే నాటికి, అతని భార్య అనిత గర్భిణిగా ఉండడంతో ఎమ్మెల్యే లోకం మాధవి స్పందించారు. గర్భిణికి ధైర్యం చెప్పి, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులతో మాట్లాడి, సురక్షిత ప్రసవం చేయించేలా చర్యలు తీసుకున్నారు.

బాధిత కుటుంబాల్లోని మత్స్యకార మహిళలతో బోటు ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు లక్ష్మణరావు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

మురళీనగర్, న్యూస్‌టుడే: ?: సెక్టార్-9 తెన్నేటి పార్కు సమీపంలో పోల్‌నెం.136ఎ బై1కు ఉన్న వీధిదీపం వెలగడం లేదు. – సంధ్య. ✓: సమస్యను వెంటనే పరిష్కరించే దిశగా సిబ్బందిని పంపిస్తాం. – అర్చన, వీధి దీపాల ఏఈ

గురుద్వారా, న్యూస్‌టుడే: ?: సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ట్రాఫిక్ స్తంభించిపోతుంది. – రాజు ✓: ట్రాఫిక్ నివారణకు చర్యలు తీసుకుంటాం. – రామారావు, ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ.

మాధవధార, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 50వ వార్డు వంశీనగర్‌లో కాలువలు వ్యర్థాలతో నిండి, మురుగునీరు నిల్వతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతుంది. - ఎస్ రమేష్ ✓: సంబంధిత సిబ్బందిని పంపించి కాలువలు శుభ్రం చేయిస్తాం.– బి.సుధాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్.

పోటీలో నిలిచి.. పతకాలతో మెరిసి..!

క్రీడల్లో రాణిస్తున్న నగర క్రీడాకారులు

విశాఖక్రీడలు, న్యూస్‌టుడే

బ్యాడ్మింటన్ కోర్టులో స్మాష్‌లతో హోరెత్తిస్తున్న క్రీడాకారుడు ఒకరు. వెయిట్ లిఫ్టింగ్‌లో కిలోల కొద్దీ బరువులు పైకెత్తి ఔరా అనిపిస్తున్న క్రీడాకారిణి మరొకరు. వీరిద్దరూ రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తున్నారు.

బ్యాడ్మింటన్‌లో...

విశాఖకు చెందిన విద్యార్థి వై.సూర్య రమణ రిత్విక్ బ్యాడ్మింటన్ పోటీల్లో పతకాలు సాధిస్తున్నాడు. నిత్యం రైల్వే స్టేడియంలో కోచ్ జి.సతీష్ వద్ద ప్రత్యేక తర్ఫీదు పొందుతున్నాడు. తల్లిదండ్రులు శివశంకర్ ప్రైవేటు ఉద్యోగి. తల్లి స్వాతి గృహిణి. రిత్విక్ కుటుంబం ఆర్థిక పరిస్థితి దృష్ట్యా రోజూ సాధన చేసుకునేందుకు వీలుగా రైల్వే అధికారులు ఉచితంగానే స్టేడియంలోకి అనుమతి ఇస్తున్నారు. క్రీడా సామగ్రిని కోచ్ సమకూర్చి, ఉచితంగా శిక్షణ తరగతులు కొనసాగిస్తూ.. ప్రోత్సహిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో జరిగే పోటీలకు వెళ్లే సమయంలో కొందరు దాతలు ఆర్థికంగా చేయూత ఇస్తున్నారు. ఇలా అందరి సహాయ సహకారాలతో ఇప్పటికే పలు పోటీల్లో పాల్గొన్న రిత్విక్ బంగారు, రజత పతకాలు సొంతం చేసుకున్నాడు. ఇటీవల బిహార్‌లో జరిగిన జాతీయస్థాయి సబ్‌జూనియర్ పోటీల్లో కాంస్య పతకం సాధించాడు. బాలుడి ప్రతిభను డీఆర్ఎం లలిత్‌బోహ్రా అభినందించారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో..

నగరంలోని డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో డిగ్రీ తొలి ఏడాది చదువుతున్న **తేజశ్రీ** వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో రాణిస్తుంది. వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు అందిస్తున్న ప్రోత్సాహంతో పతకాలు సాధిస్తుంది. ఆమె తల్లిదండ్రులు అప్పలస్వామినాయుడు టైలర్. తల్లి గౌరీ గృహిణి. రోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో సాధన చేస్తూ, మెలకువలు నేర్చుకుంటుంది. ఇటీవల జరిగిన ఏయూ అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణం పతకం, జిల్లా స్థాయి పోటీల్లో స్వర్ణం పతకం సొంతం చేసుకుంది. విజయనగరం కొండవెలగాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు విభాగాల్లో తలపడి రజత పతకాలు సాధించింది. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటడమే లక్ష్యంగా తేజశ్రీ ముందుకు సాగుతోంది.

ఘనంగా ముత్యాలమ్మ పరస

గురుద్వారా, న్యూస్‌టుడే: నక్కవానిపాలెం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఏడుగుళ్ల ముత్యాలమ్మ పరస మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సేవాగరిడీ, పులివేషాలు, భజన వంటి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇదేం రహదారి..?

అధికారులపై మేయర్ ఆగ్రహం

కార్పొరేషన్, న్యూస్‌టుడే : స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవానికి హాజరైన మేయర్ పీలా శ్రీనివాసరావు స్టేడియం ప్రాంగణంలో నిర్మించిన బీటీ (బ్యుటమినస్) రహదారిని పరిశీలించి, ఇంజినీరింగ్ అధికారులపై మండి పడ్డారు. పనుల్లో నాణ్యత లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారిపై రోలింగ్ చేయకుండా వదిలేయడంతో, పాత రహదారిపై ఉన్న లేయర్ పక్కకు జరిగిపోవడంతో పాటు, పిక్క ఊడిపోవడానికి సిద్ధంగా ఉంది. ప్రజాధనంతో చేపట్టే పనుల్లో పర్యవేక్షణ పెంచాలని, వెంటనే అధికారులంతా తీరు మార్చుకోవాలని మేయర్ హెచ్చరించారు.

నేడు సేవా మహోత్సవం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 26వ వార్డు లలితానగర్ లలితాపీఠంలో సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి సన్నిధిలో బుధవారం తెల్లవారు జామున 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కల్యాణ వేంకటేశ్వర స్వామి సేవా ఉత్సవం జరుగుతుందని పీఠం మేనేజర్ ఎం.కృష్ణసేన్ తెలిపారు. పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతి స్వామి, తదితరులు పాల్గొంటారని తెలిపారు.

హక్కుల సాధనకు కృషి

సీతంపేట, న్యూస్‌టుడే : బ్రాహ్మణుల హక్కుల సాధనకు విశాఖ జిల్లాలో బ్రాహ్మణ సంఘాలన్నీ ఏకమై ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంయుక్త కార్యాచరణ కమిటీ(జేఏసీ)గా ఏర్పడ్డాయని నిర్వాహకులు తెలిపారు. విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో జేఏసీ కన్వీనర్‌గా ఏ.కిరణ్‌కుమార్‌కు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బ్రాహ్మణ ఆస్తుల పరిరక్షణ, హక్కుల సాధనకు కమిటీ కృషి చేస్తుందన్నారు.

రేపు మాధవస్వామి కల్యాణ మహోత్సవం

మాధవధార, న్యూస్‌టుడే: మాఘమాసం భీష్మ ఏకాదశి సందర్భంగా గురువారం మాధవధారలోని మాధవస్వామి, వేణుగోపాల స్వామి ఆలయాల్లో కల్యాణం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం అధికారులు తెలియజేశారు. ఉదయం స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేసి, సాయంత్రం 6 గంటలకు సింహాచలం దేవస్థానం అర్చకులు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారన్నారు. అనంతరం పురవీధుల్లో తీరువీధి జరుగుతుందన్నారు.

సమ్మెబాటలో బ్యాంకు ఉద్యోగులు

మురళీనగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ బ్యాంకుల సిబ్బంది మంగళవారం ఒకరోజు సమ్మెబాట పట్టడంతో జంట కాలనీలలోని వివిధ బ్యాంకుల శాఖలు మూతపడ్డాయి. శనివారం నుంచి వరుసగా మూడు రోజులు సెలవు దినాలు కావడం, మంగళవారం సమ్మె కారణంగా బ్యాంకులు తెరుచుకోకపోవడంతో లావాదేవీలు నిలిచిపోయాయి. కొన్ని ఏటీఎంలలో నగదు రాక ఖాతాదారులు ఇబ్బందులు పడ్డారు.

భయం వదిలేస్తే.. మెరుగైన ఫలితం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే : విద్యార్థులంతా పరీక్షల పట్ల భయాన్ని వీడితే.. మెరుగైన ఫలితాలు వస్తాయని వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ కృష్ణ సూచించారు. ఛైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం అధ్యక్షురాలు గొండు ధనలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం 26వ వార్డు ఎన్‌జీజీఓఎస్ కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణ మాట్లాడుతూ... పరీక్షల సమయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పూర్తి అనుకూల వాతావరణంలో పిల్లల్ని పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, ఛైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ కె.అమృత బాలమణి, హెచ్ఎం జె.రాధాకుమారి, నాయకులు కిశోర్ కుమార్, కె.ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణ

అల్లిపురం, న్యూస్‌టుడే : విశాఖ దక్షిణం ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా, పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ భరోసా కల్పించారు. మంగళవారం సూర్యాబాగ్‌లోని విజన్ యూనిట్ ప్లాన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా 30వ వార్డు

నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

ఆర్థికసాయం అందజేత

కుమ్మరివీధిలో శ్రీ పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవానికి రూ.20 వేలు, 35వ వార్డు కల్లుపాకలు ప్రాంతంలో నివాసం ఉండే కె.శిరీష వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు, 35వ వార్డు ప్రసాద్‌గార్డెన్స్‌లోని ఎం.లక్ష్మీభాను ఇంటి మరమ్మతులకు రూ.10 వేలు ఆర్థిక చేయూత ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

అల్లిపురం, న్యూస్‌టుడే: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజలు ఇచ్చే అర్జీలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ ఆదేశించారు. మంగళవారం సూర్యాబాగ్‌లోని దక్షిణం జోనల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

కనకమహాలక్ష్మికి స్వర్ణపుష్పార్చన

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం అష్టాదళ పాదపద్మారాధన పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో జరిగిన పూజాదికాల్లో 108 బంగారు పుష్పాలు నివేదించి అమ్మవారికి పూజలు చేశారు. ఆయా పూజల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

ఉత్తమ సేవలకు గుర్తింపు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : విశాఖ పోర్టు అథారిటీ (వీపీఏ) మీడియా వ్యవహారాల బాధ్యుడిగా సేవలు అందిస్తున్న ఎం.శ్రీరామ్‌రెడ్డిని పోర్టు ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎం.అంగముత్తు అభినందించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీరామ్‌రెడ్డికి ప్రశంసాపత్రం అందజేశారు. డిప్యూటీ ఛైర్‌పర్సన్ రోష్ని అపరంజి కొరాటి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్‌రెడ్డికి ప్రశంసాపత్రం అందజేస్తున్న పోర్టు ఛైర్మన్ అంగముత్తు

సెల్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకోవాలని వినతి

మాధవధార, న్యూస్‌టుడే: జీవీఎంసీ 51వ వార్డు కళింగనగర్‌లో జనావాసాల మధ్య ఓ భవనంపై సెల్ టవర్ ఏర్పాటు చేయకుండా నిలువరించాలని వార్డు భాజపా అధ్యక్షుడు టి.లోహితరావు, కాలనీవాసులు కోరారు. ఈ మేరకు మంగళవారం పార్టీ ఉత్తర నియోజకవర్గం కార్యాలయ ఇన్‌ఛార్జి శ్యామల దీపికను కలిసి వినతిపత్రం అందజేశారు. చుట్టు పక్కల నివాసితులు ఎక్కువగా ఉన్నారని, సెల్ టవర్ నుంచి వచ్చే రేడియేషన్‌తో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

విద్యుత్తు దీపాల ఏర్పాటుకు సన్నాహాలు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 26వ వార్డు పరిధిలోని పలుచోట్ల విద్యుత్తు దీపాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని ఏఈ యోగిత తెలిపారు. మంగళవారం ఉదయం ఆమె వార్డులో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. స్థానికులతో మాట్లాడి... రాత్రి సమయాల్లో చీకటిగా ఉన్న కూడళ్లు, వీధుల్ని గుర్తించారు. మొత్తం 12 రింగ్ పోల్స్, 15 సాధారణ స్తంభాల ఏర్పాటుకు అనుమతులు వచ్చాయన్నారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న ఏఈ యోగిత, తదితరులు

కంచరపాలెం, న్యూస్‌టుడే: 54వ వార్డు పరిధిలోని గజపతినగర్, నలందనగర్ ప్రాంతాల్లో వీధి దీపాల సమస్యకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఇక్కడి సమస్యను కూటమి నాయకులు విద్యుత్తు శాఖాధికారులకు వివరించారు. ఆ మేరకు సుమారు రూ.5లక్షల నిధులతో స్తంభాలు మంజూరయ్యాయి. వాటిలో లైట్లు అమర్చిన ఒక రింగ్ పోల్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కుట్టా కార్తీక్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చిన సూర్యనారాయణ

రాజ్యాంగం విశిష్టతపై ఉపన్యాసం

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-13 భరద్వాజ క్షేత్రంలో అమరావతి విశ్వసాహితీ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం కవి సమ్మేళనం నిర్వహించారు. రిపబ్లిక్‌డే ఉత్సవాల్లో భాగంగా భారతదేశ వైభవాన్ని శ్లాఘిస్తూ కవులు కవితలను చదివి వినిపించారు. ప్రధాన కార్యదర్శి సి.హెచ్.చినసూర్యనారాయణ స్వాగతోపన్యాసం చేస్తూ గణతంత్ర విశిష్టతను వివరించారు. ముఖ్య అతిథిగా రొంగలి రాములు హాజరయ్యారు. డి.ఎస్.కుమార్, శివాజీ పట్నాయక్, ఆర్.విశాలాక్షి, కె.కృష్ణ, సీతారామయ్య, రమణమూర్తి, వి.వాసుదేవరావు, రామతాత, కవితలను చదవగా అడబాల సత్యనారాయణ సమీక్ష నిర్వహించారు.

సామాజిక సేవలతోనే ఆత్మసంతృప్తి

జ్ఞానాపురం, న్యూస్‌టుడే : తూర్పుకోస్తా రైల్వే పరిధి వాల్తేర్ డివిజన్‌కు చెందిన మహిళా సంక్షేమ సంఘం ప్రతినిధులు పలు ఆరోగ్య కేంద్రాల్లో సహాయక కార్యక్రమాలు నిర్వహించారని సంఘం అధ్యక్షురాలు జ్యోత్స్నబోహ్రా మంగళవారం పేర్కొన్నారు. మర్రిపాలెం, డీజిల్ లోకో షెడ్, శ్రీకాకుళం, విజయనగరం తదితర ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో బాధితులకు పండ్లు, రొట్టెలు, బేబీ కిట్లు, ఇతర సామగ్రి పంపిణీ చేసినట్టు వివరించారు. సామాజిక బాధ్యతగా నిర్వహించే సేవా కార్యక్రమాలతో ఆత్మసంతృప్తి కలుగుతుందని ఆమె పేర్కొన్నారు. అలాగే సంఘం సభ్యులు అనురాగ్ మాంటిసోరి పాఠశాల విద్యార్థులతో కలిసి గణతంత్ర వేడుకలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులతో మహిళా సంఘం ప్రతినిధులు

నూతన కమిటీ నియామకం

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 26వ వార్డు శంకరమఠం రోడ్డు రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయం నూతన కమిటీ ఏర్పాటైంది. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు, వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, వార్డు తెదేపా అధ్యక్షుడు కిశోర్‌కుమార్ హాజరై కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ఛైర్మన్‌గా కొత్తూరు శ్రీనివాసరావు, సభ్యులుగా వి.మోహన్‌రావు, ఎ.రాములమ్మ, ఆర్.వెంకటరాజేశ్వరి, జగన్నాథ్, మోహన్, రవికుమార్, కె.అనంతబాబు, ఎం.రాంబాయి, జి.ఆదిలక్ష్మి, బి.ఆంజనేయులు నియమితులయ్యారు.

సభ్యులకు నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

హజ్రత్ తాజుద్దీన్ బాబా జయంతి

మాధవధార, న్యూస్‌టుడే: హజ్రత్ తాజుద్దీన్ బాబా జయంతిని 53వ వార్డు జాకీర్ హుస్సేన్ నగర్‌లో మస్జీద్ ఆల్ ఖదీర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. చిన్నారులు నాతే కలాం ఆలపించారు. మసీదు ప్రాంగణంలో ఫతేహా నిర్వహించి కేక్ కోశారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ముస్లింలు హాజరయ్యారు. మస్జీద్ కమిటీ అధ్యక్షుడు మున్నా పర్యవేక్షించారు.

కేక్ కోస్తున్న కాలనీవాసులు

భగవన్నామ జపంతో మానసిక శాంతి

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-3 వ్యాసం శ్రీరామ్మూర్తి ప్రశాంతి ఆధ్యాత్మిక ఉద్యానవనాన్ని మంగళవారం రామకృష్ణమఠం పూర్వ అధ్యక్షులు ఆత్మవిదానంద మహరాజ్ సందర్శించారు. పార్కులోని విగ్రహమూర్తులను దర్శించి వివేకానంద మండపంలో జరిగిన భజనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనుగ్రహ భాషణం చేస్తూ సత్సంగం, భజన, గ్రంథ పఠన, భగవన్నామ జపం చేస్తే మానసిక శాంతి లభిస్తుందన్నారు. ప్రతిఒక్కరూ ఈ సాధనతో ముందుకు నడవాలని సూచించారు. వివేకానంద యువ మహామండలి, ప్రశాంతి పార్కు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మవిదానంద మహరాజ్‌తో యువ మండలి సభ్యులు

భూ కేటాయింపుల రద్దుకు డిమాండ్

కార్పొరేషన్, న్యూస్‌టుడే : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి భూముల్ని కేటాయించడం సరైంది కాదని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కోరారు. మంగళవారం సాయంత్రం విశాఖలోని హోటల్ మేఘాలయలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గీతం కళాశాలకు ఆనుకుని ఉన్న 54.79 ఎకరాల భూముల విలువ దాదాపు రూ.5 వేల కోట్లు ఉంటుందన్నారు. ఆ భూముల్ని గీతం సంస్థకు కేటాయించడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. 29న ఆయా భూముల్ని సందర్శించి, 30న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం సందర్భంగా గాంధీ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. మాజీ మంత్రి కె.కన్నబాబు, పార్టీ నగర అధ్యక్షుడు కేకే.రాజు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

యోగాతో సత్ఫలితాలెన్నో..

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: రైల్వేన్యూకాలనీలోని ఈసీహెచ్ఎస్ పోలీ క్లినిక్‌లో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ధ్యానం, యోగాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాజయోగిని బి.కె.శశికళ మాట్లాడుతూ దైనందిన జీవితంలో యోగా ప్రాముఖ్యత, మెడిటేషన్ వల్ల ప్రయోజనాల గురించి వివరించారు. విశ్రాంత కెప్టెన్ సి.జి.రాజు, భాస్కరరావు బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

31 వరకు ఇగ్నోలో ప్రవేశాలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో 2026 విద్యాసంవత్సరానికి డిప్లమో, డిగ్రీ, పీజీ కోర్సుల్లో దూరవిద్యతోపాటు, ఆన్‌లైన్‌లో ప్రవేశాలు ఈనెల 31 వరకు జరుగుతాయని సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. టూరిజం, నర్సింగ్, డెయిరీ టెక్నాలజీ, ఆక్వా కల్చర్, వ్యవసాయం, జర్నలిజం, న్యాయవిద్య కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఫీజులు ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. వివరాలకు ignouadmission. samarth.edu.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

గృహ నిర్మాణాలకు విన్నపం

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న ప్రాంతంలోనే గృహ నిర్మాణాలు చేపట్టాలని, ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని పలువురు బాధితులు కోరారు. జీవీఎంసీ 94, 96, 97 వార్డులకు చెందిన పలువురు నివాసితులు మంగళవారం కలెక్టరేట్‌కు వచ్చి ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. 97వ వార్డు పులగానివానిపాలెం సర్వే సంఖ్య 100, 94వ వార్డు చీమలాపల్లి సర్వేసంఖ్య 24, 96వ వార్డు సర్వే సంఖ్య 83/2 ప్రభుత్వ భూముల్లో ఎన్నో ఏళ్ల నుంచి నివాసం ఉంటున్నామని పేర్కొన్నారు. ఇప్పుడు ఆయా భూముల్ని కొందరు ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి... ఆక్రమణలు అడ్డుకోవడంతో పాటు, నివాసం ఉంటున్న వారికి పక్కా గృహాలు నిర్మించాలని కోరారు. నివాసం సంఘాల ప్రతినిధులు బి.రామకృష్ణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

మహిళలకు సూచనలిస్తున్న వైద్యురాలు

గురుద్వారా, న్యూస్‌టుడే: సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ లయన్స్ కేన్సర్ ఆసుపత్రిలో మంగళవారం ఉదయం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కీళ్లు, యూరాలజీ, నేత్ర, చర్మం, గైనిక్ వంటి పలువురు వైద్య నిపుణులు పాల్గొని పరీక్షలు జరిపారు. మహిళల్లో తరచూ ఎదురయ్యే ఆరోగ్య సమస్యల నివారణకు మహిళా వైద్యులు పలు సూచనలు చేశారు. శిబిరంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కల్యాణ్ ప్రసాద్, మేనేజింగ్ ట్రస్టీ వెలగపూడి ఉమామహేశ్వరరావు, వైద్యాధికారి ప్రసాద్, ఉమ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





(c) eenadu

గాజువాక

• గాజువాక • విశాఖ పశ్చిమం

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య
గాజువాక: 98494 65088
పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

సమస్య: కూర్మన్నపాలెం అశోకనగర్‌లో రోడ్డు నెంబర్-4లో పైపులైను లీకు వల్ల నీరంతా నేలపాలవుతోంది. పలుమార్లు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా తాత్కాలిక చర్యలు తీసుకున్నారు. -రామకృష్ణ, కూర్మన్నపాలెం. సమాధానం: మెకానిక్‌లకు ఆదేశాలివ్వడం జరిగింది.

?: కూర్మన్నపాలెం భరత్‌నగర్, గాజువాక 76వ వార్డులో నడుపూరు, గాంధీనగర్‌లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. -ఈశ్వరరావు, కూర్మన్నపాలెం, -నాగరాజు, 76వ వార్డు ✓: ఇప్పటికే సిబ్బందితో డ్రైవ్ చేపట్టాం. -కిరణ్‌కుమార్, ఏఎంఓహెచ్

గోపాలపట్నం, న్యూస్‌టుడే : ?: జీవీఎంసీ 89వ వార్డు బావాజీనగర్‌లో పారిశుద్ధ్య పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. – లక్ష్మి, బావాజీనగర్ ✓: ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడతాం. – రామకృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీ 80 అడుగుల రోడ్డులో వీధి దీపాలు వెలగడం లేదు. – గోపాలరావు, ఏపీఎస్ఈబీ కాలనీ ✓: దీపాల మరమ్మతులు చేపడతాం. – గోవిందరావు, విద్యుత్ పనుల నిర్వాహకుడు

స్పందనకు వందనం

పైపులైనుకు మరమ్మతులు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : 'ఈనాడు'లో ఉక్కు నిర్వాసితకాలనీలు, శివారు కాలనీల్లో పైపులైన్ లీకులపై వరుసగా వచ్చిన కథనాలకు అధికారులు స్పందించారు. సిబ్బంది రంగంలోకి దిగి 74, 75, 76 వార్డుల్లో పైపులైన్ల మరమ్మతులు, వాల్వుల పునరుద్ధరణ చర్యలు చేపట్టారు.

మురుగు కష్టాలు తీరే..

గాజువాక, న్యూస్‌టుడే : చినగంట్యాడ దరి స్నేహపురి కాలనీలో మురుగు సమస్య పనుల్లో కదలిక వచ్చింది. 'ఈనాడు'లో మంగళవారం 'మురుగు ముంచెత్తి..' శీర్షికన వార్తా కథనం వచ్చిన సంగతి తెలిసిందే. స్పందించిన నీటి సరఫరా సిబ్బంది డ్రైనేజీలో పూడిక తీసి మురుగుపారేలా చేశారు.

కనకమహాలక్ష్మికి స్వర్ణపుష్పార్చన

వడ్లపూడి, న్యూస్‌టుడే : పాతనగరం బురుజుపేటలో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం పుష్యపదాల పాదపద్మార్చన పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో జరిగిన పూజాదికాల్లో 108 బంగారు పుష్పాలు నివేదించి అమ్మవారికి పూజలు చేశారు. ఆయా పూజల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు.

అగనంపూడి-8, గాజువాక-9 కొత్త జోన్ నెంబర్లతో అధికారిక ఉత్తర్వులు

గాజువాక, న్యూస్‌టుడే : పాలనా సౌలభ్యం కోసం జీవీఎంసీ జోనల్ వ్యవస్థను పునర్ వ్యవస్థీకరించిన సంగతి తెలిసిందే. ఈనెల 1న గాజువాక నియోజకవర్గంలోని నాలుగు వార్డులు(77, 78, 79, 85)ను వేరుచేసి అగనంపూడి జోన్‌ను కొత్తగా ప్రారంభించారు. 15 వార్డులతో గాజువాక జోన్‌ను ఉంచారు. అయితే పరిపాలనా వెసులుబాటుకు ఉపయోగపడే జోన్ నెంబర్లను అధికారికంగా ప్రకటించలేదు. ఇప్పుడు కొత్త నెంబర్లతో కూడిన ఉత్తర్వులను కమిషనర్ కేతన్‌గార్గ్ జారీ చేశారు. 6వ జోన్‌గా ఉన్న గాజువాకను 9వ జోన్, అగనంపూడిని 8వ జోన్‌గా ఖరారు చేశారు. ఆయా జోన్ల విభజనతోపాటు పట్టణ ప్రణాళిక కొత్తగా తెరవనున్నారు. నగరవ్యాప్తంగా 10 జోన్లు ప్రస్తుతం ఉన్న సంగతి తెలిసిందే..

రేకులతో మూసేసి.. గుట్టుగా తవ్వేసి..

సింధియా, న్యూస్‌టుడే

జీవీఎంసీ 59వ వార్డులో పలుచోట్ల రెవెన్యూ విభాగం నుంచి అభ్యంతర సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) లేకపోయినా అక్రమంగా తవ్వకాలు జరుగుతున్నాయి. పత్రికల్లో ఈ వార్తలు వచ్చిన సమయంలో అధికారులు స్పందిస్తున్నా తర్వాత పరిస్థితి షరా మామూలే అన్నట్లు సాగుతోంది.

పారిశ్రామిక ప్రాంతం హిమాచల్‌నగర్ మెయిన్‌రోడ్డులో మాస్టర్‌ప్లాన్ ప్రకారం జీవీఎంసీ నుంచి 20 అడుగుల రోడ్డు విస్తరణ జరగాల్సి ఉంది. ఈ విస్తరణ జరగాల్సిన స్థలం ములగాడ మండల సర్వే నెంబరు 47లో ఉంది. అలాగే జిరాయితీ స్థలం సర్వే నెంబరు 56లో ఉంది. ఈ జిరాయితీ వెనుక కొండ భాగం ప్రభుత్వ బంజరు స్థలం సర్వే నెంబరు 55లో ఉంది. ఈ సర్వేలో స్థలానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ జరిగే అస్కారం లేదు. ఇదిలా ఉండగా రెండు నెలల కిందట మూడు సర్వేల్లో ఇష్టం వచ్చినట్లు కొండరు పనులు మొదలెట్టగా మండల రెవెన్యూ అధికారులు స్పందించి 'ప్రభుత్వ భూమి' అని హెచ్చరిక బోర్డు పెట్టారు. ఇటీవల బోర్డుని తొలగించి రోడ్డువైపు ఎవరికీ కనిపించకుండా రేకులతో మూసేశారు. లోపల మాత్రం గుట్టుచప్పుడుకాకుండా బంజరులో తవ్వకాలు చేపడుతున్నారు. దీంతో స్థానికులు భూ ఆక్రమణదారులకు భాగా లోతుగా మట్టి, రాళ్లను తవ్వేస్తున్నారని, తక్షణం అధికారులు పర్యవేక్షించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

హిమాచల్‌నగర్‌లో తవ్వకాలు బయటకు కనిపించకుండా రేకులతో మూసిన దృశ్యం

యూఎల్‌సీలో ఉంది.. చర్యలు తీసుకుంటాం..: రెవెన్యూ నిబంధనలు ఎవరు ఉల్లంఘించినా ఉపేక్షించేది లేదు. రోడ్డు విస్తరణ 20 అడుగుల వరకు మాస్టర్‌ప్లాన్‌లో ఉన్న మాట వాస్తవం. అలాగే జిరాయితీ వెనుక కొండ భాగం బంజరులో ఉన్న మాట వాస్తవం. ఈ వివాదాస్పద స్థలాల్లో ఎవరు నిర్మాణాలు జరిపినా రెవెన్యూ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం. స్థలం అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ)లో ఉంది. సిబ్బందితో పనులు నిలుపుదల చేయిస్తాం. - రమేష్‌నాయుడు, ములగాడ ఎమ్మార్వో

సమ్మె విజయవంతానికి పిలుపు

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు ఉద్యోగులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చేనెల 12న జరపతలపెట్టిన సార్వత్రిక సమ్మెకు సంబంధించిన గోడపత్రికను అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు మంగళవారం విడుదల చేశారు. సెక్టారు-7లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కూడలి ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

షిప్‌యార్డులో నోటీసు అందజేత

సింధియా, న్యూస్‌టుడే : హిందుస్థాన్ షిప్‌యార్డులో వచ్చే నెల 12న జరగనున్న దేశవ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా మంగళవారం సంస్థలోని ఐదు ప్రధాన కార్మిక సంఘాల యాజమాన్యానికి సమ్మె నోటీసును అందజేశాయి. ఫిబ్రవరి 12న ఉదయం 5 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 5 గంటల వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. ఐఎన్‌టీయూసీ, వైఎస్సార్‌టీయూసీ, సీఐటీయూ, హెచ్‌ఎంఎస్ పాల్గొన్నాయి.

బ్యాంకుల్లో నిలిచిన సేవలు

మల్కాపురం, న్యూస్‌టుడే : దేశవ్యాప్త బ్యాంకు ఉద్యోగుల సమ్మెలో భాగంగా.. మంగళవారం జీవీఎంసీ 40వ వార్డులో పలు ప్రభుత్వరంగ బ్యాంకుల కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఉద్యోగులు ఉదయం నుంచి సమ్మెలో పాల్గొన్నారు. వినియోగదారులు లావాదేవీలు కొనసాగక ఇబ్బందులు పడ్డారు. వారానికి ఐదు రోజుల పనిదినాల ప్రధాన డిమాండ్‌తో బ్యాంకు ఉద్యోగులు నిరసనలో పాల్గొన్నారు. అయితే ప్రైవేటు బ్యాంకుల్లో సేవలు కొనసాగాయి.

మహిళా సాధికారత కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి

గాజువాక, న్యూస్‌టుడే: ప్రతివార్డులోనూ పొదుపు సంఘాల సభ్యులు మహిళా సాధికారత కార్యక్రమాల్లో చురుగ్గా పాలుపంచుకోవాలని గాజువాక జోన్ యూసీడీ విభాగం ప్రతినిధులు స్పష్టం చేశారు. చినగంట్యాడ (ట్రిపుల్ సెంటర్) టౌన్‌లెవెల్ ఫెడరేషన్ (టీఎల్‌ఎఫ్), స్లమ్ లెవెల్ ఫెడరేషన్ (ఎస్‌ఎల్‌ఎఫ్) సభ్యుల ప్రత్యేక సమావేశం జరిగింది. యూసీడీ పీడీ సునీల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో.. ప్రభుత్వ పథకాలు విస్తృత ప్రచారం కల్పించి, వార్డు స్థాయిలో టీఎల్‌ఎఫ్, ఎస్‌ఎల్‌ఎఫ్‌ల బలోపేతానికి సభ్యులు, గ్రూప్ లీడర్లు కృషి చేయాలని కోరారు. పలువురు యూసీడీ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న పొదుపు సంఘాల సభ్యులు, యూసీడీ సిబ్బంది

30న మోదకొండమ్మ ఉత్సవం

సతీనగర్ (గాజువాక), న్యూస్‌టుడే: జీవీఎంసీ 73వ వార్డు సతీనగర్‌లో మోదకొండమ్మ అమ్మవారి 14వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఆరోజు ఉదయం సామూహిక కుంకుమార్చన, లక్ష్మీ గణపతి హోమం, మధ్యాహ్నం అన్నసమారాధన జరుగుతుందని పేర్కొన్నారు. సాయంత్రం కర్రి సంతోష్‌కుమార్ పర్యవేక్షణలో పల్లకీ సేవ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మోదకొండమ్మ అమ్మవారు

మాతంగీశ్వరి యాగ మహోత్సవాలు

శ్రీనగర్(గాజువాక), న్యూస్‌టుడే: శ్రీనగర్‌లో మాతంగీశ్వరి నవరాత్రి యోగ మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి పూజల్లో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ దంపతులు పాల్గొన్నారు. ఉత్సవ ప్రతినిధి వలారు బ్రహ్మానాయుడు ఆధ్వర్యంలో సంప్రదాయ పూజల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. పురోహితులు వశిశ్వర్, సీతారామకృష్ణశర్మ పర్యవేక్షణలో యాగం ఘనంగా జరిగింది. అఖిలపక్ష నాయకులు పప్పు రాజారావు, శ్రీరామ్మూర్తి, నూకరాజు తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

పూజల్లో పాల్గొన్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు

రేపు భావనారుషి తీర్థమహోత్సవం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గాజువాక బీసీరోడ్డు సంజీవకాలనీలో కొలువైన భావనారుషి, భద్రావతి, రమావిరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో ఈనెల 29న భీష్మ ఏకాదశి సందర్భంగా తీర్థ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆరోజు ఉదయం పంచామృతాభిషేకాలు, వ్రతాలు, సాయంత్రం పల్లకీసేవ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రమా సత్యనారాయణ స్వామివారు

అటు వెళ్లొద్దన్నా వినరే..

బాజీకూడలిలో ధ్వంసమైన హైట్‌గేజ్

ఎన్ఏడీకూడలి(బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే : ఎన్ఏడీ ఫ్లైఓవర్ కింద భారీ వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేదు. ఒకవేళ ఏ భారీ వాహనం వెళ్లినా పిల్లర్స్, బీమ్‌లు పైన తగులుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని భారీ వాహనాలు అటు వెళ్లకుండా ప్రారంభంలోనే హైట్‌గేజ్‌లు ఏర్పాటు చేశారు. అయితే కొన్నిసార్లు వాటిని కూడా వాహనాలు ఢీకొని ధ్వంసం చేస్తున్నాయి. అధికారులు స్పందించి హైట్‌గేజ్‌లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

భైరవా.. భయపడ్డావా..

గోపాలపట్నం(కొత్తపాలెం), న్యూస్‌టుడే : జీవీఎంసీ 89వ వార్డు ఎల్లపువానిపాలెంలో వీధి కుక్కలు ఎక్కువైపోయాయి. ఇళ్లలోంచి రావాలని జనం భయపడుతున్నారు. దీంతో రంగు బాటిళ్లు ఇళ్ల ముందు వేలాడదీస్తే కుక్కలు రావని సామాజిక మాధ్యమాల్లో తెలుసుకున్న ఈ ప్రాంతవాసులు.. ఇళ్ల ముందు ఇలా రంగు బాటిళ్లు వేలాడదీస్తున్నారు. ఇవి కట్టాక కుక్కలు రావటం లేదని చెప్పడం విశేషం.

ఎల్లపువానిపాలెంలో పలు ఇళ్ల ముందు కట్టిన రంగు బాటిళ్లు

అదిగో బోరు.. 'హద్దులు' చెరిపేశారు..

మల్కాపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 63వ వార్డు జైఆంధ్రకాలనీలో రోడ్డు పక్కన ఉన్న బోరును కూడా కలిపేసుకుని ఓ వ్యక్తి దర్జాగా ప్రహరీ నిర్మించేశారు. దీనివల్ల ప్రజలు నీళ్లు పట్టుకోవాలంటే ఆ ఇంట్లోకి వెళ్లాల్సిన పరిస్థితి. పలుమార్లు అధికారులు దీనిపై నోటీసులు పంపినా ప్రయోజనం లేదని తెలుస్తోంది. దీనిపై తాగునీటి విభాగం ఏఈ నాగేశ్వరావు వివరణ కోరగా.. చర్యలు తీసుకుంటామన్నారు.

63వ వార్డులో బోరును దాటి కట్టిన గోడ

చెత్త ఈ తీరు.. వెళ్లేనా నీరు?

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే : చెత్త అడ్డుపడితే అది మురుగునీరైనా ముందుకు కదలదు. బీహెచ్‌పీవీ మీదుగా షీలానగర్‌కు వెళ్లే జాతీయ రహదారి సేవామార్గంలో బీహెచ్‌పీవీ విద్యుత్తు ఉపకేంద్రం ముందు ఉన్న కాలువ ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తతో నిండిపోయింది. దీంతో మురుగు నీరు ముందుకు కదలడం లేదు. ఏ మాత్రం కొంచెం వర్షం పడినా నీళ్లు రోడ్డు మీదకు వచ్చేస్తున్నాయి.

కాలువలో భారీగా పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

సర్కారు రోడ్డు.. మాకెవరు అడ్డు..

ఎన్ఎస్‌టీఎల్ రోడ్డులో పార్కింగ్ చేసిన ప్రైవేటు బస్సులు

ఎన్ఏడీకూడలి (బుచ్చిరాజుపాలెం), న్యూస్‌టుడే : ఎన్ఎస్‌టీఎల్- గోపాలపట్నం 80 అడుగుల రహదారి రద్దీగా ఉంటుంది. పలు పాఠశాలలు.. కళాశాలలు ఉండటంతో వాహనాల రాకపోకలు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఎన్.ఎ.డి. వైపు ట్రాఫిక్ జామ్ అయితే ఇదే ప్రత్యామ్నాయ దారి. అయితే ఈ దారిలో పలు ప్రైవేటు బస్సులు ఇష్టారాజ్యంగా పార్కు చేస్తున్నారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారుతోంది.

● యాదవ మహాసభ ఉపాధ్యక్షుడిగా 'అల్లు'



పెదగంట్యాడ, న్యూస్‌టుడే : అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పెదగంట్యాడకు చెందిన అల్లు రమణారావు యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు చింక నారాయణరావు యాదవ్ నియామక ఉత్తర్వులు జారీచేశారు. బీసీల సమస్యలపై దశాబ్దాలుగా పనిచేస్తున్నందుకు ఈ పదవి కల్పించినట్లు పేర్కొన్నారు.

● 30 లిక్కర్ బాటిళ్లు స్వాధీనం

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : దువ్వాడ పోలీసులు మంగళవారం జరిపిన కార్డెన్ సెర్చ్ ఆపరేషన్‌లో సెక్టారు-1లోని ఒక పాన్‌షాపు నుంచి 30 లిక్కర్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని, పాన్‌షాపు నిర్వహిస్తున్న అరసి సురేష్(42) అనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్టు దువ్వాడ పోలీసులు తెలిపారు.

గోపాలపట్నంలో సినిమాలు

శ్రీనరసింహా: మన శంకర వరప్రసాద్‌గారు
నరసింహా : అనగనగా ఒకరాజు
మౌర్య : నారీనారీ నడుమ మురారి
ఎస్టీబీఎల్‌లో..: **స్క్రీన్-1లో**: మన శంకర్ వరప్రసాద్ గారు. **స్క్రీన్-2లో:** రాజా సాబ్
స్క్రీన్-3లో: నారీనారీ నడుమ మురారి
స్క్రీన్-4లో: అనగనగా ఒకరాజు

విద్యార్థులు సాంకేతిక నైపుణ్యంపై పట్టు సాధించాలి

ఆచార్య ప్రసాదరెడ్డి

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం కృత్రిమమేథపై కార్యశాల జరిగింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(హైదరాబాద్)కు చెందిన ఐహబ్ డేటా సహకారంతో జరిగిన ఈ కార్యక్రమానికి ఏయూ పూర్వ వీసీ ప్రొఫెసర్ పి.వి.జి.డి.ప్రసాద్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యం సాధించడం ద్వారా భవిష్యత్తులో అవకాశాలు అందిపుచ్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ గ్రూప్ ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ ఛైర్మన్ ఎల్.శ్రీకృష్ణదేవరాయలు, ఎన్.శ్రీకాంత్, డాక్టర్ ఈ. లక్ష్మీ లిడియా తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య ప్రసాదరెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రతినిధులు

'డంపింగ్‌యార్డు'కు ప్రాధాన్యమివ్వండి

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : ఈనెల 30న జరగనున్న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో గాజువాక చెత్త డంపింగ్ యార్డు తరలింపు అంశంపై ప్రత్యేక తీర్మానం చేయాలని 76వ వార్డు కార్పొరేటర్ జి.శ్రీనివాస్ మంగళవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రంలో కోరారు. ఇళ్ల మధ్య యార్డు వల్ల పలు కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కారణంగా సమావేశంలో ప్రత్యేక అంశంగా ప్రాధాన్యం కల్పించాలని కోరారు.

కమిషనర్ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్

ఆ.. గంటన్నర.. జన జాతర..!

గాజువాక, న్యూస్‌టుడే: అన్ని విద్యాసంస్థలు సాయంత్రవేళ ఒకేసారి విద్యార్థులను విడిచిపెడుతున్న తరుణంలో సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకూ పాతగాజువాక బస్‌స్టాప్ జన జాతరను తలపిస్తోంది. బస్సుల కోసం పడిగాపులు కాసేవారు కొందరైతే.. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల తాకిడితో కిక్కిరిసి పోతోంది. మంగళవారం కూడలిలో అడుగు తీసి అడుగేయడానికి అవస్థలు పడ్డారు. రద్దీ దృష్ట్యా బస్‌స్టాప్‌ను కాస్త ముందుకు మార్చాల్సి ఉన్నా స్థలాభావం కారణం చూపుతూ ఇటు ఆర్టీసీ, అటు జీవీఎంసీ అధికారులు మిన్నకుంటున్నారు.

బస్‌స్టాప్ వద్ద రద్దీ

శ్రీకృష్ణదేవరాయలు పాలన అద్భుతం

గోపాలపట్నం (కాకానినగర్), న్యూస్‌టుడే : జీవీఎంసీ 90వ వార్డు కాకానినగర్‌లోని డాక్‌యార్డ్ కేటీబీ కళాక్షేత్రంలో ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు పాల్గొని మాట్లాడారు. దేవరాయల పాలన అద్భుతమని కొనియాడారు. ముందుగా శ్రీకృష్ణదేవరాయలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బి.చిరంజీవి, భాస్కరరావు, నాయుడు, రమణ, సన్యాసిరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే : అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగింది. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. వ్యాసరచన, చిత్రలేఖనం, ఆటల పోటీల్లో విజేతలకుబహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం ఎంఎల్ఎస్ కాంతం, గ్రామ ప్రతినిధులు, పాఠశాల అభివృద్ధి కమిటీ ప్రతినిధులు, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిల్లలకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం కాంతం, పాఠశాల అభివృద్ధి కమిటీ ప్రతినిధులు

గోపాలపట్నం, న్యూస్‌టుడే : గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, జీవీఎంసీ 89వ వార్డు ఎల్లపువానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ దాడి వెంకటరమేష్ పాల్గొన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు బి.హాషణాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం స్వర్ణలత కవిత, సిబ్బంది పాల్గొన్నారు. చివరిలో బృంద చిత్రాలు దిగారు.

గోపాలపట్నం బాలికోన్నత పాఠశాలను వీడి వెళుతున్న పదో తరగతి విద్యార్థుల బృంద చిత్రం

బూడిద కుప్పలు.. ప్రజలకు తిప్పలు.. దర్పణం

దుమ్ము రేపుతూ వెళ్తున్న వాహనాలు

గాజువాక, న్యూస్‌టుడే : అది గంగవరం పోర్టు అప్రోచ్ రోడ్డు. ఇరువైపులా లెక్కలేనన్ని నివాసాలు. వ్యాపార వాణిజ్య సంస్థలు, ప్రైవేటు యార్డులు కొలువై ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గం కాలుష్యకారకంగా మారింది. పోర్టు నుంచి రవాణా అయ్యే బొగ్గు, జిప్సం, ఇతర రసాయనాల లోడు లారీలు, టిప్పర్లతో దుమ్ము, ధూళి కమ్మేస్తోంది. అటుగా వెళ్లే వారికి ప్రత్యక్ష నరకం కనిపిస్తోంది.

★ పెదగంట్యాడ చుట్టుపక్క కాలనీవాసులు చినగంట్యాడ, కణితిరోడ్డు, స్టీల్ ప్లాంటు మెయిన్‌గేటుకెళ్లే ఈ మార్గంలో క్షణం తీరిక లేకుండా భారీ వాహనాలు దూసుకుపోతున్నాయి. అటు వెళ్లాలంటే ఒళ్లంతా బూడిద పూసుకున్నట్లుగా మారిపోతుంది. పోర్టు యాజమాన్యం కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదని నివాసితులు గగ్గోలు పెడుతున్నారు. ప్రజాసంఘాలు వివిధ స్థాయిల్లో ఆందోళనలు సాగిస్తున్నాయి. దారిపక్కన కొండల్లా బూడిద కుప్పలను చూస్తే పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది. గతుకులమయమైన 1.5 కిమీ దారి ఒకవైపు, గుండెల్లో దడ పుట్టించే పరిస్థితి ఇంకోవైపు వాహనదారులను గుక్కతిప్పుకోనివ్వడంలేదు. ఇంకెన్నాళ్లు ఈ దుస్థితి అంటూ వీరంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దారి పక్కన బూడిద కుప్ప

శ్రమ.. 'ఫల'ప్రదం

ఖాకీ వనం.. ఆహ్లాదకరం..!

గాజువాక, న్యూస్‌టుడే

గుత్తుగా కాసిన అరటి గెలలు.. విరగకాసిన గులాబ్‌జామున్.. ఆకుకూరలు.. పూలమొక్కలు.. ఇలా ఎక్కడ చూసినా పచ్చదనమే కనిపిస్తుంది. ఇదెక్కడో రైతు పండించే తోట గురించి అనుకుంటున్నారా...? అయితే తప్పులో కాలేసినట్లే..! ఇది పెదగంట్యాడలోని న్యూపోర్టు పోలీసుస్టేషన్‌లో కనిపించే పచ్చదనం అంటే ఆశ్చర్యం కలగక మానదు. పదేళ్లుగా పోలీసు సిబ్బంది పడిన శ్రమ ఇప్పుడు 'ఫల'ప్రదమైంది.

నిండుగా అరటి గెల

గుత్తులుగా గులాబ్ జామున్

హరిత శోభితం.. విశాఖ నగరంలో ఎక్కడాలేని విధంగా న్యూపోర్టు పీఎస్‌కు రెండకరాల స్థలం ఉంది. స్టేషన్ ఆవరణ, వెనుక భాగంలో ఖాళీ స్థలంలో వివిధ ఫల, పుష్పజాతుల మొక్కలను నాటగా అవి ఏపుగా పెరిగాయి. కొబ్బరి, అరటి, మునగ, జామ, మామిడి, బొప్పాయి, దొండ, వంగ, బీర పాదులు, ఆకుకూరలు, కూరగాయల పంటలతో నిండుగా కనిపిస్తోంది.

తోటలో సి.ఐ., ఎస్.ఐ. శ్రమదానం

విధులకొచ్చే ఎస్‌హెచ్‌ఓ స్థాయి అధికారి నుంచి ఎస్ఐ, ఏఎస్ఐ, హెచ్‌సీ, పీసీలు, హోంగార్డుల వరకూ ప్రతి ఒక్కరూ మొక్కల సంరక్షణలో నిమగ్నమవుతుంటారు. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రతబాగ్చీ ఇటీవల న్యూపోర్టు పీఎస్‌ను సందర్శించి తోటలో కొబ్బరిమొక్క నాటారు. నగరంలోనే ఏ పీఎస్‌లోనూ లేని పచ్చదనం ఇక్కడుందని, దీన్ని మరింతగా తీర్చిదిద్దాలని సిబ్బందిని ఆదేశించారు. న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు తోట పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుండడంతో సిబ్బంది కూడా అడుగులు ముందుకేస్తున్నారు. ఇద్దరు ప్రైవేటు సిబ్బంది తోట సంరక్షణలో పాలుపంచుకుంటున్నారు.

31 వరకు ఇగ్నోలో ప్రవేశాలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో 2026 విద్యాసంవత్సరానికి డిప్లమో, డిగ్రీ, పీజీ కోర్సుల్లో దూరవిద్యతోపాటు, ఆన్‌లైన్‌లో ప్రవేశాలు ఈనెల 31 వరకు జరుగుతాయని సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. టూరిజం, నర్సింగ్, డెయిరీ టెక్నాలజీ, ఆక్వా కల్చర్, వ్యవసాయం, జర్నలిజం, న్యాయవిద్య కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఫీజులు ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు ignouadmission.samarth.edu.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

14వ వర్ధంతి
మంచికి, మానవత్వానికి మారుపేరుగా, కుటుంబ శ్రేయస్సుకై అహర్నిశలు శ్రమించిన మీరు మాకు దూరమై నేటికి 14 సం॥లు గడిచినా సదా మీ జ్ఞాపకాలతోనే జీవిస్తున్నాం. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తూ.. మీ.. భార్య: దుర్గాదేవి
కుమారుడు - కోడలు
Dr. సుజిత్ కుమార్ - Dr. చైతన్యమణి
RAO's Dental Care, Gajuwaka
కుమార్తె - అల్లుడు
D. నాగసురేఖ - D. శ్రీనివాస్
మనుమరాళ్లు: అపూర్వ, శాన్వి మనుమలు: షన్విన్, ఆరవ్
కీ॥శే॥ వేల్పూరి అప్పారావు గారు
Sr. Foreman (Mech) LMMM Dept.
విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్
జననం: 15-07-1964 మరణం: 28-01-2012

(c) eenadu

అమృతమే అమ్మ తాకితే..
విషమురా నువ్వు తాగితే

● కన్నప్రేమకు నోచుకోని శిశువు
● డబ్బా పాలు తాగుతుండగా మృతి

తొమ్మిది నెలలూ కష్టపడి మోశావ్..
పురిటి నొప్పులు పంటిబిగువున భరించావ్..
పండంటి బిడ్డను కన్నానని కళ్లతో మురిసిపోయావ్
అయినా ఈ పసిప్రాణాన్ని దూరం పెట్టావ్..

పుట్టగానే నా కళ్లు నిన్నే వెతికాయ్
పొత్తిళ్లలో ఒదిగిపోదామనుకున్నా..
ఒడి అందలేదు.. నువ్వు కనిపించలేదు..
కెవ్వుమన్నా నీ మనసు కరగలేదు

మహమ్మారి నిన్ను కమ్మేసిన వేళ..
నీ భయమే మృత్యువై నన్ను వెంటాడింది..
ముట్టుకుంటే నేనేమైపోతానని నీ బెంగ
అమ్మ స్పర్శ లేకుండా ఆయువుంటుందా..

మురిపాలతో మురిసిపో దామనుకున్నా..
పాలుపోక.. పాలే అందక.. నా ఊపిరాగింది.

తల్లి మురిపాలు అందని సమయంలో.. డబ్బా పాలు పడుతుండగా మృతిచెందిన శిశువు ఆవేదన ఇది. పుట్టిన వెంటనే తల్లి ప్రేమకు దూరమై.. నాలుగు రోజులకే ప్రాణాన్నీ విడిచాడు. ఈ విషాదకర ఘటన విజయనగరంలోని ఘోషాసుపత్రిలో జరిగింది. నగరానికి చెందిన ఓ మహిళకు ప్రాణాంతకమైన వ్యాధి సోకింది. విషయం తెలిసినప్పటికే ఆమె గర్భిణి. ఈనెల 24న ఘోషాలో పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. పాలిచ్చే అవకాశం లేకపోవడంతో వైద్య సిబ్బందే డబ్బా పాలు తాగిస్తున్నారు. మంగళవారం ఉదయం శిశువులో చలనం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. సమీపంలోని నవజాత శిశు సంరక్షణ విభాగానికి తీసుకెళ్లగా.. అప్పటికే బిడ్డ ప్రాణాలు విడిచినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆసుపత్రి వారే దీనికి కారణమని, పరిస్థితి విషమించినా పట్టించుకోలేదని బాధితులు బోరుమన్నారు. పాలు పట్టే సమయంలో పొలబారి ఊపిరాడక మృతిచెంది ఉండవచ్చని సూపరింటెండెంట్ పద్మజ తెలిపారు. విచారణ చేపడతామని చెప్పారు.
– ఈనాడు, విజయనగరం

రేపు ఈనాడు జిల్లాస్థాయి ప్రతిభా పాటవ పోటీలు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయి జూనియర్ కళాశాలల ప్రతిభా పాటవ పోటీలకు రంగం సిద్ధమైంది. విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఏజీఎల్ డిగ్రీ కళాశాలలో గురువారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభం కానున్నాయి. గత నాలుగు నెలలుగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో వివిధ కేంద్రాల్లోని 16 కళాశాలల్లో వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాసం, క్విజ్ విభాగాల్లో కళాశాల స్థాయిలో(ప్రభుత్వ, ప్రైవేటు) పోటీలు జరిగాయి. ప్రతి నెలా ఒక్కో కళాశాల నుంచి నాలుగు విభాగాల్లో ముగ్గురు చొప్పున 12 మంది బహుమతులు అందుకుని జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. విజయనగరం, రాజాం, పాలకొండ, సాలూరు, పార్వతీపురం, బొబ్బిలి, గజపతినగరం కేంద్రాల్లోని 16 కళాశాలల నుంచి విద్యార్థులు సిద్ధమయ్యారు. గురువారం ఉదయం 9 గంటలకల్లా విద్యార్థులు వేదిక వద్దకు చేరుకోవాలి. పోటీల అనంతరం జిల్లా స్థాయి విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

● గతేడాది సెప్టెంబర్‌లో ఎస్.కోట డిపోకు చెందిన కండక్టర్ ఈశ్వరరావు విధి నిర్వహణలో ఉండగా పెందుర్తి సమీపంలో గుండె పోటుతో కుప్పకూలిపోయారు. చోదకుడు వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లినా ప్రాణాలు నిలవలేదు.

● సంక్రాంతి పండగ అనంతరం రాజాం నుంచి విజయనగరానికి వస్తున్న బస్సులో చోదకుడు గురువులుకు ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన బోల్తాపడింది. ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

సిబ్బంది విశ్రాంత గదిలో ఇదీ మంచాల తీరు

డ్యూటీ చక్రంలో చిక్కుకున్న జీవితాలు

● ఆర్టీసీలో సిబ్బంది కొరత
● పనిభారంతో ఉన్నవారిపై ఇబ్బందులు

న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట

ఆర్టీసీలో సిబ్బంది కొరత ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నవారికి భారంగా మారింది. జిల్లావ్యాప్తంగా 646 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. 160 బస్సుల్లో వీరు విధులు నిర్వర్తిస్తున్నారు. పని భారం.. మానసిక ఒత్తిడి.. వెరసి విధి నిర్వహణలో అనారోగ్యానికి గురవుతున్నారు. ఇది వారితో పాటు ప్రయాణికుల మీదకు తెస్తోంది.

ఉమ్మడి జిల్లాలో ఇలాంటి ఘటనలు ఆందోళన రేపుతున్నాయి. పనిభారం, తీవ్ర ఒత్తిడి కారణంగా ఆర్టీసీ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. విధి నిర్వహణలో కొందరు.. ఇళ్లవద్ద మరికొందరు మృతిచెందుతున్నారు. గత ఏడాదిలో ఆరుగురు ప్రాణాలు విడిచారు.

● మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన తర్వాత బస్సుల్లో రద్దీ పెరిగింది. 50 మంది పట్టే బస్సులో 150 మందికి పైగా ప్రయాణిస్తుండడంతో వాహన నియంత్రణ చోదకులకు కత్తిమీద సాముగా మారుతోంది.

రెండు డిపోల్లో సిబ్బంది వివరాలు

సిబ్బంది	విజయనగరం	ఎస్.కోట
చోదకులు	145	94
కండక్టర్లు	202	81
ఇతర సిబ్బంది	100	24
మొత్తం	447	199

● కిక్కిరిసిన బస్సుల్లో టికెట్లు ఇవ్వడం, ప్రయాణికుల వాగ్వాదాలు.. కండక్టర్లను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నాయి.

● రోజుకు 12 నుంచి 15 గంటల పాటు పనిచేయాల్సిన పరిస్థితి. సరైన సమయానికి భోజనం లేకపోవడం, నిద్రలేమి కారణంగా పలువురు బీపీ, మధుమేహం, న్యుమోనియా, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్, వెన్నునొప్పి వంటి సమస్యల బారినపడుతున్నారు.

● స్టీరింగ్ పట్టుకున్న స్థితిలోనే డ్రైవర్లు గుండెపోటుకు గురవుతున్నారు.

గదులున్నా నిర్వహణ శూన్యం

● రాత్రి సర్వీసులకు వెళ్లిన సిబ్బందికి జిల్లాలో ఎస్.కోట, విజయనగరం బస్టాండ్లలోనే రెస్ట్ రూమ్స్(విశ్రాంతి గదులు) ఉన్నాయి. అక్కడ ఫ్యాన్లు, మంచాలున్నా.. నిర్వహణ సరిగా లేదు.

● కొత్తవలస, గజపతినగరం, బొబ్బిలి, రాజాం, చీపురుపల్లి బస్టాండ్లలో విశ్రాంతి గదుల్లేక బస్సుల్లోనే నిద్రించాల్సిన దుస్థితి. చలికాలం, వానాకాలంలో నిద్రలేక అలసటకు గురవుతున్నారు.

సర్దుబాటు చేస్తున్నాం.. జిల్లాలో సిబ్బంది కొరత కారణంగా ఉన్నవారితోనే సర్దుబాటు చేస్తున్నాం. ఇంకా 90 మంది చోదకులు, 40 మంది కండక్టర్లు అవసరం. ఈ మేరకు ఆన్‌కాల్ చోదకులను తీసుకుంటున్నాం. సిబ్బందికి ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేస్తున్నాం. – జి.వరలక్ష్మి, జిల్లా ప్రజారవాణాధికారిణి

శ్రద్ధాంజలి



ప్రేమానురాగాలకు మారుపేరయిన మీరు మా నుండి భౌతికంగా దూరమైనారన్న నిజం నమ్మలేకున్నాము. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ చప్ప రామారావు గారు
Rtd. డిప్యూటీ తహశీల్దార్
జననం: 20-07-1949 మరణం: 18-01-2026
తాళ్ళబురిడి, పార్వతీపురం

భార్య
స్వర్గీయ కనకరత్నం

కుమార్తెలు - అల్లుళ్లు
చప్ప ప్రభావతి - పెద్దింటి తిరుపతి
SA (Maths), ZPHS, పాచిపెంట SA (PS), ZPHS, తెర్లాం
చప్ప రామలక్ష్మి - గొట్టాపు వాసు
SGT, MPPS పిరిడి (HC) MEO-2, బొబ్బిలి

మనుమలు:
P. హరిసాయినాద్ B.Tech (IIT)
P. గాయత్రిచరణ్ (M.B.B.S)
B. జాజిప్రవల్లిక Software Engg
B. పృధ్వి Sr. Manager, GAIL (India) Ltd.

పెద్దకర్మ: 28-01-2026 తాళ్ళబురిడిలో మా స్వగృహమునందు జరుపబడును

భక్తజనసిరి

● అంబరాన్ని తాకిన శంబర ఉత్సవం

ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత శంబర పోలమాంబ జాతరలో ప్రధాన ఘట్టం సిరిమాను సంబరం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం 3.45 గంటలకు ప్రధాన వీధిలోని సిరిమాను వద్దకు అమ్మవారి ఘటాలు చేరుకున్నాయి. సంప్రదాయంగా ఉత్సవ కమిటీ ఛైర్మన్ నైదాన తిరుపతిరావు, కమిటీ సభ్యులు, నాయుడు, కరణం కుటుంబ సభ్యులు పూజారిని మేళతాళాలతో సిరిమాను వద్దకు 4.10 గంటలకు తీసుకొచ్చారు. 4.30కు పూజారి భాస్కరరావు సిరిమాను అధిరోహించి ఉత్సవం ప్రారంభించారు. గిరిడ, నాయుడు, కరణం ఇళ్లకు సిరిమాను వెళ్లగా పూజలందించారు. భారీ సంఖ్యలో భక్తులు వనం, చదురుగుడుల్లో అమ్మవారిని దర్శించుకున్నారు. – న్యూస్‌టుడే, మక్కువ, సాలూరు

రెండు రోజుల సెలవుకు ఒక్కరోజు సమ్మె

● ఉద్యోగుల నిరసనతో మూతపడిన బ్యాంకులు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: ఉద్యోగుల సమ్మెతో మంగళవారం జిల్లావ్యాప్తంగా బ్యాంకులు మూతపడ్డాయి. యూఎఫ్‌బీయూ(యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్) పిలుపు మేరకు సిబ్బంది నుంచి మేనేజర్ల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నగరంలోని ఎస్‌బీఐ ఫోర్టు బ్రాంచి నుంచి మూడులాంతర్లు, గంటస్తంభం, కన్యకాపరమేశ్వరి ఆలయం మీదుగా ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రధాన కూడళ్లలో మానవహారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూఎఫ్‌బీఈ కన్వీనర్ మురళీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. వారానికి రెండు రోజులు సెలవులు ఇవ్వాలని డిమాండు చేశారు.

నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ బ్యాంకుల ఉద్యోగులు

యువత జోష్..!

గరివిడి పశువైద్య కళాశాల మూడో వార్షికోత్సవం మంగళవారం రాత్రి సందడిగా జరిగింది. ముఖ్య అతిథిగా తిరుపతి శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం విద్యార్థి విభాగం డీన్ వి.వైకుంఠరావు, కళాశాల అసోసియేట్ డీన్ ఎం.శ్రీను, గరివిడి కళాశాల విద్యార్థి విభాగం అధికారి వై.అంబేడ్కర్ పాల్గొన్నారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. 2024-25 విద్యా సంవత్సరంలో కళాశాల టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. – న్యూస్‌టుడే, గరివిడి

Dhanik Bharat Educational Institutions
– The Lloyd Group Initiative –

ధనిక్ భారత్ విద్యా సంస్థలు

INTER | IIT-JEE | NEET
HYDERABAD | VIJAYAWADA | GUNTUR | VIZAG

దశాబ్దాల తరబడి అభివృద్ధి చెందుతూ ఉన్న దేశంగానే మిగిలిపోతున్న భారతావనిని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనేదే ధనిక్ భారత్ మిషన్ యొక్క ఉద్దేశం. అందులో భాగమే ధనిక్ భారత్ విద్యాసంస్థల స్థాపన.
– విక్రం నారాయణరావు
ఛైర్మన్, ధనిక్ భారత్ విద్యాసంస్థలు.

Smt. Balalatha Mallavarapu
Director, Dhanik Bharat Educational Institutions
Former Deputy Director, Ministry of Defence,
Two Times Civils Ranker

9,10వ తరగతి విద్యార్థులకు బాలలత మేడం గారిని కలిసే గోల్డెన్ ఛాన్స్!

విద్యార్థులకు పదవ తరగతి తరువాత తమ కెరీర్‌ను ఎంపిక చేసుకునే ప్రస్థానంలో సందేహాలను నివృత్తి చెయ్యడానికి మీ ప్రాంతానికి వస్తున్న ధనిక్ భారత్ విద్యాసంస్థల డైరెక్టర్ బాలలత మేడం.

కెరీర్ గైడెన్స్ పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు...

ప్రతి విద్యార్థి తప్పక పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు...

HYDERABAD 9555 82 5559 7032 30 5559
GUNTUR 9067 78 5559 9067 74 5559
VIJAYAWADA 9067 64 5559 9067 62 5559
VIZAG 9032 53 5559 9032 54 5559

29 జనవరి 2026 (అనగా రేపు)
విజయనగరం
సమయం: 9:30AM - 12:00PM
వేదిక: INSPIIRO SCHOOL, NEAR NCS THEATRE, VIZIANAGARAM.
శ్రీకాకుళం
సమయం: 5:00PM - 07:30PM
వేదిక: HOTEL BLUE EARTH, OPP FOREST OFFICE, SRIKAKULAM.

30 జనవరి 2026 (అనగా ఎల్లుండి)
పలాస
సమయం: 9:30AM - 12:00PM
వేదిక: SURYARAJ INN, K.T ROAD, PALASA-KASIBUGGA
పాతపట్నం
సమయం: 5:00PM - 07:30PM
వేదిక: K.S.M PLAZA (FUNCTION HALL) MAIN ROAD, PATHAPATNAM.

(c) eenadu

29 నుంచి సుగంధ మహోత్సవాలు

–న్యూస్‌టుడే, విజయనగరం మయూరి కూడలి

హజరత్ సయ్యద్ షహిన్ షా దర్బార్

ఆధ్యాత్మిక లోకంగా పిలిచే విజయనగరం బాబామెట్ట హజరత్ దర్బార్ సయ్యద్ షహిన్ షా బాబా ఖాదర్‌వలి 67వ మహా సూఫీ సుగంధ మహోత్సవాలకు సిద్ధమవుతోంది. ఈ ఏడాది ఉత్సవాలను ఘనంగా చేయాలని అతావుల్లా షరీఫ్ బాబా శిష్యులు దర్బార్ అధ్యక్షుడు, ధర్మకర్త డా.ఖలీలుల్లా షరీఫ్ షా ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. కృష్ణా జిల్లా చీమలపాడు, ఒడిశా, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వీరికి వసతి, భోజన సౌకర్యాలు కూడా కల్పిస్తారు. ఈ నెల 29 నుంచి మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు.

★ తొలి రోజున ఉదయం ఉరుసు మహోత్సవం ప్రారంభం అనంతరం పవిత్ర ఖురాన్ షరీఫ్ పఠనం, జెండా మహోత్సవం, చాదర్ సమర్పణ ఉంటాయి.

★ రెండో రోజు ఉదయం ఆరు గంటలకు పవిత్ర ఖురాన్ పఠనం అనంతరం దర్బార్ షరీఫ్ నుంచి నషాన్, చాదర్, సందల్ షరీఫ్‌లతో ఫకీర్ మేళా ఖవ్వాలీలతో ప్రత్యేక వాహనంలో విజయనగరం పురవీధుల్లో మహా ఊరేగింపు ఉంటుంది.

★ చివరి రోజు పవిత్ర ఖురాన్ షరీఫ్ పఠనం, చాదర్ సమర్పణ, ప్రసాదం పంపిణీ, సలామ్‌తో ఉరుసు సమాప్తం చేస్తారు.

ఏర్పాట్లు చేస్తున్నాం

బాబా భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని రకాల వసతి కేంద్రాలు ఏర్పాట్లు చేస్తున్నాం. దర్గా పనులు కూడా ముమ్మరంగా చేస్తున్నాం. బాబా ఆశీస్సులతో 64 ఏళ్ల నుంచి నిత్యాన్నదానం చేస్తున్నాం.

– డి.ఖలీలుల్లా షరీఫ్‌షా, దర్బార్ అధ్యక్షులు

ప్రజల్లో అసంతృప్తి ఉండకూడదు

మాట్లాడుతున్న కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: రెవెన్యూ అంశాలపై ఐవీఆర్‌ఎస్ సర్వేలో ప్రజల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోందని కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి పేర్కొన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా, క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. భూ యజమానులకు ఇబ్బందులు కలగకుండా, తప్పుల్లేని రెవెన్యూ రికార్డులను రూపొందించే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. జేసీ ఎస్.సేధు మాధవన్ మాట్లాడుతూ పాసు పుస్తకాల్లో వచ్చిన తప్పులను సరిదిద్దాలన్నారు. డీఆర్వో ఇ.మురళీ, ఆర్డీవో డి.కీర్తి, సర్వేశాఖ ఏడీ విజయకుమార్, విశ్రాంత ఉప కలెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రశంస

విద్యార్థినులు, ఉపాధ్యాయురాలిని అభినందిస్తున్న డీఈవో తదితరులు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: దక్షిణ భారతదేశ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో సత్తా చాటిన విద్యార్థులు, ఉపాధ్యాయులను డీఈవో మాణిక్యం నాయుడు అభినందించారు. ఈనెల 19 నుంచి 23 వరకు తెలంగాణలో జరిగిన పోటీల్లో చీపురుపల్లి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినులు కె.లిఖిత స్వరాజ్, సీహెచ్.మనస్విని రూపొందించిన 'క్రాప్ డాక్టర్' ప్రాజెక్టు ద్వితీయ, కొట్టాం జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయిని పి.స్వప్న తయారు చేసిన 'హరిత ల్యాబ్' ప్రాజెక్టు తృతీయ స్థానం సాధించాయి. మంగళవారం నగరంలోని విద్యాశాఖ కార్యాలయంలో అధికారులు వారిని ప్రశంసించారు. ఉప విద్యాశాఖాధికారి కె.వి.రమణ, జిల్లా సైన్స్ అధికారి టి.రాజేష్ పాల్గొన్నారు.

మనవడి పుట్టిన రోజు వేడుక వేళ విషాదం

విద్యుత్తు స్తంభం పడి వృద్ధురాలి దుర్మరణం

చిన్నారితో అప్పలకొండ (పాతచిత్రం)

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: వారిది ఉమ్మడి కుటుంబం.. మూడేళ్ల చిన్నారి పుట్టిన రోజు వేడుకలే అంతా సంతోషంగా ఉన్నారు. ఇంతలో విద్యుత్తు స్తంభం మృత్యువై వెంటాడింది. ఇంటి పెద్దను హరించి కుటుంబ సభ్యులకు కన్నీరు మిగిల్చింది. విద్యుత్తు స్తంభం మీదపడి వృద్ధురాలు మృతిచెందిన ఘటన ఎల్.కోట మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగాపురం గ్రామానికి చెందిన ఆవాల అప్పల నాయుడు, ఆవాల అప్పలకొండ(57)కు ముగ్గురు కుమారులు. అందరికీ వివాహాలయ్యాయి. కూలి పనులకు వెళ్తుంటారు. ఉమ్మడి కుటుంబంగా కలిసే ఉంటున్నారు. మంగళవారం చిన్న కుమారుడు దేముడునాయుడు కొడుకు మోహన్ మూడో పుట్టిన రోజు వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఉదయం పదకొండు గంటలకు ఆలయానికి వెళ్లి మొక్కులు తీర్చుకుని వచ్చారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఇంటి ముందు కుళాయి వద్ద అప్పలకొండ దుస్తులు ఉతుకుతున్నారు. అదే సమయంలో పక్కింటివారు చెట్లను తొలగిస్తున్నారు. ఈ క్రమంలో వేప చెట్టును కోస్తుండగా కొమ్మ విరిగి విద్యుత్తు తీగలపై పడింది. దీంతో విద్యుత్తు స్తంభం విరిగి ఆమెపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108లో ఎస్.కోట తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందారు. మనవడి జన్మదినం నాడు నాన్నమ్మ మృతిచెందడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుమారుడు ఎర్రినాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్ పడాల్ తెలిపారు.

అధికారులపై అభియోగాల రద్దు

ఈనాడు, విజయనగరం: ఆర్‌డబ్ల్యూఎస్ రోడ్డు విస్తరణ పనుల్లో అయిదుగురు అధికారులు ఎదుర్కొన్న అభియోగాలను రద్దు చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో విజయనగరం ఎస్ఈ కె.కాంతిమతి, డీఈ ఎం.ఆనంద్(రిటైర్డ్), టెక్నికల్ అధికారి ఎ.వెంకటరామయ్య(ద్వితీయ), ఆడిట్ ఈఈ ఎన్.మోహన్‌ప్రసాద్(విశ్రాంత), పే అండ్ అకౌంట్స్ అసిస్టెంట్ అధికారి ఎస్.నరేష్‌కుమార్(ప్రస్తుతం ఏలూరు) ఉన్నారు. భీమసింగి-ఎస్.కోట రహదారి విస్తరణ 2009లో సుమారు రూ.8 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టారు. ఇందులో అవకతవకలు జరిగాయని 2014-15లో విజిలెన్స్ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. పనులకు అడ్డంకిగా ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ పైప్ లైన్ తరలింపునకు సుమారు రూ.2 లక్షలు అవుతుందని అప్పట్లో ప్రాథమిక అంచనా వేశారు. ప్రక్రియ పూర్తయ్యాక రూ.8 లక్షలు చెల్లించాలని కోరడంతో ఆ మేరకు విడుదలయ్యాయి. ఈ క్రమంలో అనుమానాలు రేకెత్తాయి. పదేళ్లుగా విచారణ సాగింది. ఈ కారణంగా పలువురు పదోన్నతులకు నోచుకోలేదు. ఎట్టకేలకు అనుకూల నిర్ణయం వెలువడడంతో అధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అవార్డు గ్రహీతకు శుభాకాంక్షలు

విధి నిర్వహణలో విశిష్టమైన సేవలందించినందులకు గాను గణతంత్ర దినోత్సవం రోజున విజయనగరం జిల్లా కలెక్టర్ గౌ॥ ఎస్.రామసుందర్ రెడ్డి గారు చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన శుభసందర్భంగా హార్దిక శుభాకాంక్షలు

గౌ॥శ్రీ జి. మురళీమోహన్ గారు, గృహనిర్మాణ సంస్థ PD, VZM

గౌ॥శ్రీ ఎం. సత్యనారాయణ గారు, గృహనిర్మాణ సంస్థ DEE, గజపతినగరం సబ్‌డివిజన్

గృహనిర్మాణసంస్థ సిబ్బంది, గజపతినగరం సబ్ డివిజన్

హృదయపూర్వక శుభాకాంక్షలు

విధి నిర్వహణలో విశిష్టసేవలకు గాను రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్ గారి చేతుల మీదుగా ఉత్తమ అధికారి అవార్డు స్వీకరించిన మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు

శ్రీ అజురఫీ జాన్ గారు

తహశీల్దార్, రామభద్రపురం మండలం

కార్యాలయ సిబ్బంది, VRO's / VS's, VRA's /మండల చౌకధరల డిపో డీలర్స్

రామభద్రపురం మండలం

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

EENADU SPORTS LEAGUE 2025

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – తాడికొండ

బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET

Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)

Hospitality Partner: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS

Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)

Man of the Series: Hero

Digital Partner: ఈనాడు.నెట్

TV Partner: ETV BHARAT, ETV ఆంధ్ర ప్రదేశ్

Organised by: ఈనాడు ఉత్సాహం క్లబ్

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - I జూనియర్స్ : మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్స్‌లతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులు చేసి ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - I జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సులతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

సీనియర్స్ విన్నర్స్ రాయలసీమ రాకర్స్

గ్రౌండ్-2లో సీనియర్స్ : సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ చరణ్ జిత్ ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-I (జూనియర్స్)

మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్

మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)

మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్

మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

బతుకు భారమై.. బిడ్డ బరువై!

ఆటోలో శిశువును వదిలేసిన తల్లి

బిడ్డను తల్లికి అప్పగించిన కంచరపాలెం సీఐ రవికుమార్, ఆర్పీఎఫ్ అధికారులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: భర్తతో మనస్పర్థల కారణంగా ఐదు నెలల బిడ్డను జ్ఞానాపురం రైల్వేస్టేషన్ గేటు సమీపంలోని ఓ ఆటోలో తల్లి వదిలేసిన ఘటన ఇది. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా వేపాడ ప్రాంతానికి చెందిన శ్రావణి (22)కి అర్జున్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. ప్రస్తుతం కొమ్మాదిలో నివాసం ఉంటున్నారు. వీరికి ఐదు నెలల కిందట కుమారుడు జన్మించాడు. కొంతకాలంగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఉపాధి కోసం వారం రోజుల కిందట భార్యాభర్తలు విజయవాడ వెళ్లారు. అక్కడ ఎటువంటి పని దొరక్క పోవడంతో విశాఖ రావడానికి సోమవారం మధ్యాహ్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. రైలు దువ్వాడ స్టేషన్‌లో ఆగిన తర్వాత భార్యకు చెప్పకుండా అర్జున్ వెళ్లిపోయాడు. రైలు విశాఖ స్టేషన్‌కు వచ్చిన తర్వాత శ్రావణి భర్తకోసం వెతకగా కనిపించలేదు. తనను వదిలించుకునేందుకు పారిపోయాడని గ్రహించింది. చేతిలో చిల్లి గవ్వలేకపోవడం, భర్త వదిలేసి వెళ్లిపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన శ్రావణి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. దీంతో జ్ఞానాపురం స్టేషన్ గేటు బయట ఆటోలో బిడ్డను, బ్యాగ్‌ను వదిలేసి వెళ్లిపోయింది. కొంత సమయానికి ఆటోడ్రైవర్ వచ్చి చూడగా బాబు ఉండటంతో అవాక్కయ్యాడు. చుట్టు పక్కల వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. కంచరపాలెం పోలీసులు ఛైల్డ్‌రైట్స్ ప్రతినిధుల సహకారంతో శిశువును చికిత్స నిమిత్తం కేజీహెచ్ తరలించారు.

❖ తల్లి శ్రావణిని గుర్తించేందుకు పోలీసులు సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు వెళ్లిన ఆమె అక్కడ కళ్లు తిరిగిపడిపోయింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఆమెను స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం కేజీహెచ్‌కు తీసుకువెళ్లి బిడ్డను అప్పగించారు. వెంటనే స్పందించి బిడ్డను తల్లి వద్దకు చేర్చిన కంచరపాలెం పోలీసులను సీపీ శంఖబ్రత బాగ్చీ అభినందించారు.

పెరుమాళి సొసైటీపై మళ్లీ విచారణ?

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: తెర్లాం మండలం పెరుమాళి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పనితీరుపై మరోసారి విచారణ నిర్వహించనున్నారు. ఇప్పటికే కలెక్టర్ ఆదేశాల మేరకు సంయుక్త కలెక్టర్ సేధు మాధవన్ డీఆర్వోకు సూచించినట్లు తెలుస్తోంది. ఆ సొసైటీలో పరిపాలనా పరమైన ఉల్లంఘనలు జరిగినట్లు పేర్కొంటున్నారు. గతంలో గ్రామానికి చెందిన సొసైటీ సభ్యుడు శివరామరాజు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. డివిజనల్ రిజిస్ట్రార్ క్షేత్రస్థాయికి వెళ్లి నివేదిక అందజేశారు. దీనిపై ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందక రీ ఓపెన్ చేశారు. పనితీరు బాగోకపోవడం, అర్హతగల సిబ్బంది లేరని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, లాభాలు వస్తున్నా సభ్యులకు డివిడెండ్లు ఇవ్వకపోవడం, పెట్రోల్ బంక్ నిర్వహణలో సిబ్బంది చేతివాటం.. తదితర అవకతవకలు ఉన్నట్లు అర్జీలో పేర్కొన్నారు.

❖ మంగళవారం స్థానిక సహకారశాఖ ఆడిట్ కార్యాలయంలో కమిటీ ఛైర్మన్, సీఈవో, సభ్యులు సమావేశమయ్యారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అభివృద్ధిపై చర్చించినట్లు జిల్లా సహకార అధికారి పి.రమేష్ తెలిపారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	150	270	280

జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి కెరీర్ ఫెస్ట్‌లో జడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. గణసాయి టైలర్ టీచింగ్ కెరీర్‌లో ద్వితీయ, వై.హరిసాత్విక్ నాయుడు కెమిస్టు సైంటిస్టులో తృతీయ బహుమతి దక్కించుకున్నారు. వీరిని ప్రధానోపాధ్యాయులు జగదీశ్వర్రావు, శైలజారాణి తదితరులు మంగళవారం అభినందించారు.

8న ప్రజ్ఞా వికాస పరీక్ష

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులకు భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 8న ప్రజ్ఞా వికాస పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ పేర్కొంది. నగరంలోని ఎల్‌బీజీ భవనంలో మంగళవారం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.చినబాబు, డి.రాము, సహాయ కార్యదర్శులు ఎస్.సోమేష్, వి.భారతి, బాలికల కన్వీనర్ ఆర్.శిరీష సంబంధిత గోడప్రతులను ఆవిష్కరించారు. వచ్చేనెల 3వ తేదీలోపు రూ.30 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

గోడప్రతులు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రశాంతంగా ప్రయోగ పరీక్షలు ప్రారంభం

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో ఇంటర్ మీడియట్ ప్రయోగ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. తొలి విడతలో వృత్తి విద్యా కోర్సు విద్యార్థులకు నిర్వహిస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు బ్యాచ్‌లకు పరీక్ష జరిగింది. ఉదయం 24 పరీక్ష కేంద్రాల్లో 1,641 మందికి గాను 1,540 మంది, మధ్యాహ్నం 21 కేంద్రాల్లో 1,489 మందికి 1,433 మంది హాజరయ్యారు. సీసీ కెమెరాల నిఘాలో పక్కాగా పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకున్నట్లు డీఐఈవో నాగేశ్వరరావు తెలిపారు.

గడువు పెంపు

న్యాయవార్తా విభాగం: న్యాయ సేవాధికార సంస్థలో ఖాళీల భర్తీకి ఇటీవల ప్రకటన విడుదలైంది. ఈనెల 27 వరకు దరఖాస్తులు ఆహ్వానించారు. వరుస సెలవుల నేపథ్యంలో 30 వరకు పెంచినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

రేగిడి, వంగర, న్యూస్‌టుడే: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ అదనపు కార్యదర్శి సునీల్‌రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం రేగిడి మండలం ఉంగరాడ మెట్ట గురుకులాన్ని సందర్శించారు. ప్రభుత్వం ఏటా రూ.లక్షల్లో ఖర్చు చేస్తోందని, ఉన్నతంగా చదివి మంచి పేరు తీసుకురావాలన్నారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న తరుణంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వంటశాల పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ❖ అనంతరం వంగర మండలం మడ్డువలస అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న సునీల్‌రాజ్‌కుమార్

విడుదలయ్యాం.. వచ్చేస్తున్నాం..

బంగ్లాదేశ్‌లో చిక్కుకున్న మత్స్యకారులకు విముక్తి

జైలు నుంచి విడుదలైన మత్స్యకారులు

భోగాపురం న్యూస్‌టుడే: జీవనోపాధికి సముద్రంలోకి వెళ్లి బంగ్లాదేశ్ చెరలో మూడు నెలల పాటు బిక్కుబిక్కుమంటూ గడిపిన జిల్లాకు చెందిన మత్స్యకారులకు ఎట్టకేలకు విముక్తి కలిగింది. బాగర్‌హాట్ జైలు నుంచి 23 మంది భారతీయ మత్స్యకారులు మంగళవారం విడుదలయ్యారు. వీరిలో విజయనగరం జిల్లాకు చెందిన తొమ్మిది మంది ఉన్నారు. ఇరుదేశాల ఉన్నతాధికారుల సమక్షంలో వారిని విడుదల చేశారు. దీనికి సంబంధించి న్యాయపరమైన డాక్యుమెంటేషన్ జిల్లా మేజిస్ట్రేట్ ఎదుట ఈస్ట్ కోస్ట్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఓనర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ పూర్తి చేశారు. అనంతరం భద్రత ఏర్పాట్ల మధ్య మత్స్యకారులను మోంగ్లా పోర్ట్‌కు తరలించారు. వీరి బోట్లు మరమ్మతులకు గురికావడంతో బాగు చేసిన వెంటనే స్వదేశానికి పయనమవ్వనున్నారు. తమవారు తిరిగొస్తున్నారన్న వార్తతో తీరప్రాంత గ్రామాల్లో ఆనందం వెల్లివిరిసింది.

మధ్యవర్తిత్వంతో త్వరితగతిన పరిష్కారం

విజయనగరం న్యాయవార్తా విభాగం, న్యూస్‌టుడే: న్యాయస్థానాల పరిధిలో నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని, ఆ దిశగా వారికి న్యాయవాదులు అవగాహన కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత సూచించారు. విజయనగరంలోని జిల్లా న్యాయస్థానంలో మంగళవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులు వేగంగా పరిష్కారమవుతాయని చెప్పారు. నగదు, కాలాన్ని వృథా చేయకుండా ఇరువర్గాల వారు రాజీకి ముందుకు రావాలన్నారు. చెక్ బౌన్స్, ప్రమాద బీమా, పలు క్రిమినల్ కేసుల నుంచి బయట పడే అవకాశం ఉంటుందన్నారు. శిక్షకులు ఎ.ప్రమీల, ఎం.సిరాజ్ ప్రత్యేక సూచనలు చేశారు. న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత

EENADU e Classifieds

JOBS

Software Job Training in Vizianagaram Q: any Degree / BE / B.Tech / MCA / MSC / MBA any Year passout Cont: 7075909913.

1) Labourers (2) Production Operators (3) Maintenance Fitters (4) Sales- Executive (5) Office Clerk to work at AAC Bricks Factory, Bobbili Growth Centre. ✆ 6300568101.

HDFC ఫైనాన్షియల్ కన్సల్టెంట్స్ కావలెను. 10 to డిగ్రీ, జీతం: 15-30K, age: 25-55 y విజయనగరం జిల్లా అంతటా పనిచేయాలి. C:8919867018.

రైస్ మిల్ & ప్లాంట్ ఆపరేటర్స్ కావలెను. అనుభవజ్ఞులైన వెల్డింగ్, రిపేర్ తెలిసిన ఆపరేటర్స్ కావలెను. Contact No: ✆ 80962 46099.

VZM, ఆక్వాగార్డ్ షోరూంలో పనిచేయుటకు సిస్టం ఆపరేటర్ (F) కావలెను. సాయి వాటర్ సొల్యూషన్స్, M.G.రోడ్, 9AM-3PM & 3PM-9PM Cont: 9885980790

డెయిరీ ఫారంనందు పనిచేయుటకు అనుభవం కలిగిన భార్యాభర్త రెండు జంటలు కావలెను. ఇంటి సదుపాయం వసతి కల్పించబడును. Cont:94409 81322.

హేలాపురి ఫ్యామిలీ రెస్టారెంట్, RTC కాంప్లెక్స్‌దరి, VZMలో పనిచేయుటకు (పార్ట్‌టైం & ఫుల్‌టైం) వెయిటర్స్, కిచెన్ మేనేజర్, క్యాషియర్ కావలెను. ✆ 8978898343

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

బొబ్బిలి

●బొబ్బిలి ●రాజాం ●గజపతినగరం ●చీపురుపల్లి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రసంగిస్తున్న న్యాయమూర్తి కె.శారదాంబ

రాజాం, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు, లింగ వివక్ష చట్ట రీత్యా నేరమని సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ అన్నారు. రాజాంలోని ప్రభాకర్ పాఠశాలలో మంగళవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుడ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించారు. 15100 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఉచిత న్యాయ సహాయం, చట్టపరమైన సలహాలు, అత్యవసర న్యాయ సేవలు పొందొచ్చని తెలిపారు. న్యాయవాదులు ఆర్.విజయ్‌కుమార్, ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ ఎం.చిన్నంనాయుడు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

రాజాం రైతుబజారులో మంగళవారం కూరగాయల ధరలు (కిలో రూ.లలో).. ★ టమాటా: 27 ★ వంకాయలు: 32 ★ దొండ: 38 ★ బీర: 51 ★ బెండ: 50 ★ కాకర: 52 ★ చిక్కుడు: 30 ★ ఆనపకాయ (ఒకటి): 25 ★ అరటి (జత): 20 ★ మునగ: 80 ★ ఉల్లి: 30 ★ బంగాళదుంపలు: 24 ★ అల్లం: 80 ★ వెల్లుల్లి: 120 ★ పచ్చిమిర్చి: 58 ★ క్యాబేజీ: 10/25 ★ క్యారెట్: 40 – న్యూస్‌టుడే, రాజాం

తెరపై ఈనాడు

రాజాంలో.. ✦ ఎస్వీసీ సీతారామా: **అనగనగా ఒక రాజు, భర్త మహాశయులకు విజ్ఞప్తి** ✦ ఎస్వీసీ సీతారామా మినీ: **నారీ నారీ నడుమ మురారి** ✦ ఎస్వీసీ అప్సర: **మన శంకరవరప్రసాద్‌గారు** ✦ **బొబ్బిలిలో..** ✦ లక్ష్మీ: **అనగనగా ఒక రాజు** ✦ వాసవి: **భర్తమహాశయులకు విజ్ఞప్తి** ✦ టీబీఆర్ స్క్రీన్-1: **మన శంకరవరప్రసాద్‌గారు** ✦ టీబీఆర్ స్క్రీన్- 2: **నారీ నారీ నడుమ మురారి**

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి- 80085 74348

? పొనుగుటివలస వార్డు పరిధిలోని పాఠశాల సమీపంలో కాలువ చెత్తతో నిండిపోయింది. దుర్వాసన వస్తోంది. - **స్థానికులు** ★ క్షేత్రస్థాయిలో పరిశీలించి, వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. - **ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్** – రాజాం పట్టణం

? రంగరాయపురం అంగన్‌వాడీ కేంద్రం వద్ద బోరు మరమ్మతులకు గురైంది. - **స్థానికులు** ★ మరమ్మతులు చేపడతాం. - **శ్రీచరణ్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ** – న్యూస్‌టుడే, రేగిడి

? కూనేరు పంచాయతీ ఎగువ మిర్తివలసలో రక్షిత నీటి పథకం లేదు. తీవ్ర అవస్థలు పడుతున్నాం. - **సన్యాసిరాజు, గ్రామస్థుడు** ★ ఇటీవల గ్రామాన్ని పరిశీలించాం. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - **నవీన్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ** – న్యూస్‌టుడే, మెంటాడ

? లక్కిడాం ఎంపీయూపీ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం మధ్యలో నిలిపివేశారు. పశువులు, విషపు జీవులు లోపలికి వస్తున్నాయి. - **విద్యార్థుల తల్లిదండ్రులు** ★ ఉన్నతాధికారులకు నివేదిస్తాం. - **వెంకటరావు, ఎంఈవో-2** – గంట్యాడ గ్రామీణం

● రాజాం ప్రాజెక్టు పరిధిలో మండలాలు: **4** ● కేంద్రాలు: **339** ● ఆరు నెలలు- మూడేళ్లలోపు చిన్నారులు: **4,203** మంది ● మూడు- ఆరేళ్లలోపు : **2,280** మంది ● బాలింతలు: **827** ● గర్భిణులు : **847**

పర్యవేక్షణ కొరవడి.. గాడితప్పుతున్న బాలబడి

న్యూస్‌టుడే – సంతకవిటి, రాజాం గ్రామీణం, రేగిడి, వంగర

చిన్నారులకు ఆటపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్య అందిస్తే ఒత్తిడి దూరమవుతుంది. మెదడు చురుకుగా పనిచేస్తుంది. పౌష్టికాహారంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్య అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీలు ఏర్పాటు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో దీని లక్ష్యం పూర్తిగా నీరుగారిపోతోంది.

కేంద్రాలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 వరకు పనిచేయాలి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కార్యకర్తలు, ఆయాలు సమయానికి తీయడం లేదు. నిర్దేశిత సమయానికంటే ముందే మూసివేస్తున్నారు. పిల్లలను తీసుకురావడంపై దృష్టిసారించడం లేదు. కొన్నిచోట్ల ఆయాలకు అప్పగించి కార్యకర్తలు ఇతర పనులు చేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి.

మధ్యాహ్నం 3 గంటల లోపల మూసేసిన రాజాం మండలం బొద్దాం అంగన్‌వాడీ

● రాజాం మండలం బొద్దాంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలలోపల మూడు కేంద్రాలకు తాళాలు వేశారు. సారధిలోని కేంద్రం- 1, కేంద్రం- 2, లక్ష్మీపురంలోని అంగన్‌వాడీ కేంద్రాలూ మూడు గంటలకే మూతపడ్డాయి. ఇక్కడ సమయపాలన పాటించడంలేదని స్థానికులు చెబుతున్నారు. వంగర, రేగిడి మండలాల్లోని కేంద్రాల పరిస్థితి ఇదే.

● సంతకవిటి మండల కేంద్రంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మంగళవారం ఉదయం 10.20 గంటల వరకూ కేంద్రం-1 తెరుచుకోలేదు. కేంద్రం- 2 తెరిచి ఉన్నా.. ఆయా ఒక్కరే కేంద్రంలో ఉన్నారు. పిల్లలు ఎవరూ రాలేదు. 10.15 గంటల తరువాత ఇద్దరు పిల్లలు మాత్రమే వచ్చారు. కేంద్రాల కార్యకర్తలు సెక్టారు సమావేశానికి వెళ్లినట్లు చెబుతున్నారు.

తనిఖీలు చేయడంలేదు..

కేంద్రాలు సక్రమంగా పనిచేస్తున్నాయా.. లేదా? అన్నది ఐసీడీఎస్ సీడీపీవో, సూపర్‌వైజర్‌లు పర్యవేక్షించాలి. తనిఖీ చేసి, సక్రమంగా విధులు నిర్వహించేలా చూడాలి. మెనూ సక్రమంగా అమలు చేస్తున్నారా.. సమయపాలన పాటిస్తున్నారా.. వంటివి ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. వారు పట్టించుకోకపోవడంతో పర్యవేక్షణ కొరవడుతోంది.

మండలం	అంగన్‌వాడీలు
సంతకవిటి	89
రేగిడి	85
వంగర	69
రాజాం	96

కఠిన చర్యలు తీసుకుంటాం..

అంగన్‌వాడీ కేంద్రాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 9 గంటలకు తెరిచి, సాయంత్రం 4 వరకూ ఉంచాలి. విధి నిర్వహణలో అలసత్వం వహించే కార్యకర్తలు, ఆయాలపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆకస్మిక తనిఖీలు చేసి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటాం. సక్రమంగా విధులు నిర్వర్తించేలా చూస్తాం. – కళ్యాణి, సీడీపీవో, రాజాం ఐసీడీఎస్

ముకోసం

న్యూస్‌టుడే – చీపురుపల్లి

విద్యార్థులూ.. చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ ఉందని మీకు తెలుసా..? అవునండీ.. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కేంద్రం నిర్వహిస్తున్నారు. యువతకు ఉచితంగా నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. పరిసర ప్రాంతాల యువత కోర్సుల్లో చేరి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు.

ఈ కేంద్రాన్ని నాలుగేళ్ల కిందట ప్రారంభించారు. ఇప్పటివరకు 12 బ్యాచ్‌ల్లో శిక్షణ పొందిన 330 మందిలో 123 మంది ఉద్యోగ అవకాశాలు పొందారు. అవగాహన లేక చాలా మంది అవకాశాలు కోల్పోతున్నారు. ప్రస్తుతం రెండు కోర్సులు అందుబాటులో ఉన్నాయి. మూడున్నర నెలల పాటు శిక్షణ ఉంటుంది. ఒక బృందానికి పూర్తికాగానే మరొకటి ప్రారంభమవుతుంది.

శిక్షణ పొందుతున్న యువతులు

ఉచిత శిక్షణ.. అవకాశాల నిచ్చెన

- **కోర్సు:** డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్
- **అవకాశం:** 30 మందికి
- రెండు నెలలుగా శిక్షణ జరుగుతోంది. పూర్తికాగానే తదుపరి బ్యాచ్ ప్రారంభమవుతుంది.

- అప్లికేషన్ డెవలపర్ వెబ్ అండ్ మొబైల్
- రెండు బృందాల్లో 60 మందికి
- శిక్షణకు ఇటీవల అనుమతి వచ్చింది. త్వరలో ప్రారంభిస్తారు.

ఇలా సంప్రదించాలి.. ● ఆసక్తి గల యువత కళాశాలలోని శిక్షణ కేంద్రానికి వెళ్లాలి. ● పేరు, విద్యార్హత, చరవాణి నంబర్‌తో పాటు ఇతర వివరాలు నమోదు చేసుకోవాలి. ● నమోదు నిరంతరం జరుగుతూనే ఉంటుంది. ● శిక్షణ ప్రారంభమయ్యే ముందు అభ్యర్థులకు ఫోన్ చేస్తారు. ● కోర్సు పూర్తయ్యాక ధ్రువపత్రాలు అందజేస్తారు. ఉద్యోగ అవకాశం చూపిస్తారు. ● మార్కెట్‌లో డిమాండు ఉండే కోర్సులను ఎప్పటికప్పుడు అందుబాటులోకి తీసుకొస్తామని, వినియోగించుకోవాలని సమన్వయకర్త రమణ చెప్పారు.

బస్సు ఎక్కాలంటే.. ఎండలో ఉండాల్సిందే

దత్తిరాజేరు మండలంలోని పలు కూడళ్ల వద్ద బస్సు షెల్టర్లు శిథిలావస్థకు చేరాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గొభ్యాం, పాచలవలస, దత్తిరాజేరు రహదారి కూడళ్ల వద్ద పరిస్థితి దారుణంగా ఉంది. ప్రజలు బస్సుల కోసం ఎండలోనే ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. మరడాం, తాడెందొరవలస కూడళ్ల వద్ద కాకుండా దూరంగా నిర్మించడంతో వినియోగంలో లేకుండా పోయాయి. కొత్తవి నిర్మించాలని కోరుతున్నారు. సమస్యను ఎంపీడీవో కిశోర్‌కుమార్ వద్ద ప్రస్తావించగా.. జిల్లా అధికారులకు తెలియజేస్తామన్నారు. – న్యూస్‌టుడే, దత్తిరాజేరు

బాలలు భళా.. యువత మెరిశారిలా

న్యూస్‌టుడే బృందం: విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా చదవాలని ఉపాధ్యాయులు సూచించారు. మంగళవారం అన్ని ప్రభుత్వ పాఠశాలలు, పలు ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాలు నిర్వహించారు. ✦ రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పురపాలిక కమిషనర్ ఆకురాతి రామచంద్రరావు మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలన్నారు. ✦ బొబ్బిలి మండలం పెంట, పిరిడి ఉన్నత పాఠశాలల్లో డిప్యూటీ డీఈవో మోహనరావు విద్యార్థులను అభినందించారు. ✦ గజపతినగరం మండలం మరుపల్లి, దత్తిరాజేరు, బొండపల్లి, వంగర మండలం అరసాడ, మెరకముడిదాం మండలం చినబంటుపల్లి, చీపురుపల్లి మండలం పేరిపి, మెట్టపల్లి, కర్లాం, పెదనడిపల్లి, చీపురుపల్లి ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు సందడి చేశారు.

చీపురుపల్లి: శ్రీనివాసా జూనియర్ కళాశాలలో విద్యార్థినుల నృత్యం

బొబ్బిలి: పిరిడిలో భువన విజయం నాటకం ప్రదర్శన

ఉద్యాన రైతులకు బోరు తవ్వకాలకు రుణాలు

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: బోరు తవ్వకాలు చేపట్టే ఉద్యాన రైతులకు రుణాలు మంజూరు చేస్తామని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌పాణి అన్నారు. మంగళవారం గంట్యాడ ఆర్‌ఎస్‌కేలో ఉద్యాన, వ్యవసాయశాఖలతో పాటు వెలుగు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన పంటల సాగుతో మెరుగైన ఆదాయం పొందొచ్చని సూచించారు. 180 మీటర్ల దూరంలో విద్యుత్తు లైను ఉంటే ఉచితంగా కనెక్షన్ అందిస్తామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా ఉద్యానశాఖాధికారి చిట్టిబాబు, వ్యవసాయాధికారి శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన దారిలో అవస్థల ప్రయాణం

మెంటాడ మండలం చల్లపేట నుంచి కంటుభుక్తవలస గ్రామానికి వెళ్లే రహదారి గుంతలు ఏర్పడి, రాళ్లు తేలి అధ్వానంగా దర్శనమిస్తోంది. రాకపోకలు సాగించాలంటే తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రోడ్డు అభివృద్ధికి రూ.50 లక్షలతో ప్రతిపాదనలు పంపామని పీఆర్ ప్రాజెక్ట్స్ ఏఈ ఆదిమూర్తిని తెలిపారు. – న్యూస్‌టుడే, మెంటాడ

15 రోజులుగా నీరు రావడంలేదు

రేగిడి: సరసనాపల్లిలోని ఎస్సీ కాలనీకి 15 రోజులుగా కుళాయిల నుంచి నీరు రావడంలేదని స్థానికులు మంగళవారం గ్రామ సచివాలయం వద్ద నిరసన తెలిపారు. నీరు వచ్చేలా చూడాలని డిమాండు చేశారు. వాటర్ ట్యాంకు నుంచి కాలనీకి వెళ్లే వాల్ పాడైందని, తక్షణమే మరమ్మతులు చేసి నీరు వచ్చేలా చూస్తామని జేఈ శ్రీచరణ్ తెలిపారు.

30 నుంచి మజ్జిగౌరి ఉత్సవాలు

రాజాం గ్రామీణం: అంతకాపల్లి గ్రామంలో మజ్జిగౌరి అమ్మవారి 47వ ఉత్సవాలు ఈనెల 30 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ఎం.ధర్మారావు మంగళవారం తెలిపారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కమిటీ అధ్యక్షుడు సి.హెచ్.రాము చెప్పారు.

జాతీయస్థాయి పోటీల్లో కాంస్యం

గంట్యాడ గ్రామీణం: చెన్నైలో జరుగుతున్న 38వ జాతీయస్థాయి పోస్టల్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొన్న గంట్యాడ మండలం లక్కిడాం గ్రామానికి చెందిన గొల్లు కుమార్ కాంస్య పతకం సాధించారు. ఈయన ఎస్‌కోట మండలం సీతంపేటలో పోస్ట్‌మాస్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. పీపీఎస్ డైరెక్టర్ పరదేశినాయుడు తదితరులు అభినందించారు.

ప్రజల కోసం పనిచేయాలి

బాడంగి: ప్రజల కోసం కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే బేబినాయన బాడంగి ఎంపీపీగా ఇటీవల ఎన్నికైన యజ్జల లక్ష్మికి సూచించారు. మంగళవారం ఆమె ఎమ్మెల్యేను కోటలో మర్యాదపూర్వకంగా కలిశారు. అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

12న అంగన్‌వాడీల సమ్మె

బొబ్బిలి గ్రామీణం: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేస్తూ ఫిబ్రవరి 12న సమ్మె చేస్తామని అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం పీవో విజయలక్ష్మికి నోటీసు అందజేశారు. కార్యకర్తలు, సహాయకులకు ట్రేడ్ యూనియన్ హక్కులు కల్పించాలని, సరైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, కార్యకర్తలను గ్రేడ్- 3, సహాయకులను గ్రేడ్- 4 ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలనే డిమాండ్లతో సమ్మెకు వెళ్తున్నట్లు తెలిపారు.

‘అభివృద్ధిని ఓర్వలేకే వైకాపా ఆరోపణలు’

మాట్లాడుతున్న తెదేపా నేతలు

గజపతినగరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక నియోజకవర్గ వైకాపా నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఏఎంసీ ఛైర్మన్ పీవీవీ గోపాలరాజు అన్నారు. మంగళవారం గజపతినగరం తెదేపా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైకాపా పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిందనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. గజపతినగరం, దత్తిరాజేరు, జామి మండలాల కన్వీనర్లు గంట్యాడ శ్రీదేవి, చప్ప చంద్రశేఖర్, స్వామినాయుడు మాట్లాడుతూ.. మంత్రి శ్రీనివాస్ చేస్తున్న అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారన్నారు.

ఇరుకు గదుల్లో విధులెలా?

రామభద్రపురం మండలంలోని తారాపురం గ్రామ సచివాలయ భవనమిది. పంచాయతీ కార్యాలయం ఆవరణలో గతంలో ప్రారంభించిన సచివాలయ భవన నిర్మాణం కోర్టు ఉత్తర్వులతో ఆగిపోయింది. దీంతో అద్దె భవనంలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇరుకుగా ఉందని సిబ్బంది, ప్రజలు వాపోతున్నారు. సమస్యను ఎంపీడీవో రత్నం వద్ద ప్రస్తావించగా.. ప్రత్యామ్నాయ భవనం చూసి తరలిస్తామన్నారు. – న్యూస్‌టుడే, రామభద్రపురం

తొట్టెలోకి నీరు రాకుండా ఆపారని ఆందోళన

బాడంగి: పశువుల దాహార్తి తీర్చేందుకు బాడంగి మండలం పి.వెంకంపేట గ్రామంలో నీటితొట్టె ఏర్పాటు చేశారు. పక్కనే ఉన్న కుళాయి ట్యాంక్‌కు అనుసంధానం చేశారు. ఆ నీరు ట్యాంక్ నుంచి తొట్టెలోకి రాకుండా సర్పంచి భర్త పైపులకు వెల్డింగ్ చేసేశారని మంగళవారం గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వేసవిలో నీరులేకపోతే పశువులు ఇబ్బంది పడతాయంటున్నారు. తొట్టెలను పంచాయతీలకు అప్పజెప్పామని, క్షేత్రసహాయకునితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రామకృష్ణ, ఏపీవో సాయిరాం అన్నారు.

కోనేరులోకి మురుగు మళ్లించొద్దని వినతి

గరివిడి, న్యూస్‌టుడే: శివరాం గ్రామంలో మురుగు కాలువల్లోని మురుగును శివాలయం వద్దనున్న కోనేరులోకి మళ్లించొద్దని సర్పంచి శ్రీధర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు జి.దాలినాయుడు కోరారు. గ్రామస్థులతో కలిసి మంగళవారం తహసీల్దారు బంగార్రాజు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యంను కలిసి వినతిపత్రం అందించారు. ప్రత్యామ్నాయ మార్గంలో కాలువ తవ్వి మురుగునీరు మళ్లించాలని, భక్తుల ఆరోగ్యం పాడవకుండా చూడాలని విన్నవించారు.

జూనియర్ కళాశాలకు పరికరాల వితరణ

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ ల్యాబ్‌ల్లో అవసరమైన పరికరాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ విషయం తెలుసుకుని తన కుటుంబ సభ్యుల నుంచి రూ.60 వేలు సమకూర్చి పరికరాలు కొనుగోలు చేశారు. మంగళవారం వీటిని ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ కె.జనార్దన తెలిపారు. కొత్తా చంద్రావతి, జ్యోతి, శ్రీనివాసరావు, సింధు, పి.వరలక్ష్మి, సత్యనారాయణమూర్తి, పెంకి చైతన్యకుమార్ పాల్గొన్నారు.

తెర్లాం కొత్తవీధిలో చోరీ

తెర్లాం, న్యూస్‌టుడే: ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి, చోరీ చేసిన ఘటన తెర్లాం కొత్తవీధిలో చోటుచేసుకుంది. కందుల పైడిరాజు కుటుంబంతో కలిసి ఆదివారం మధ్యాహ్నం వంగర మండలం మరువాడ బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి మంగళవారం ఉదయం చేరుకున్నారు. తలుపులు తెరిచి చూసేసరికి బీరువాలోని లాకర్ తెరిచి ఉంది. పోలీసులకు సమాచారమివ్వడంతో ఎస్సై బి.సాగర్‌బాబు ఘటనాస్థలిని పరిశీలించారు. ఇంటి వెనుక కిటికీ గ్రిల్స్ తొలగించి, దొంగలు ప్రవేశించినట్లు గుర్తించారు. విజయనగరం క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించారు. రూ.50 వేలు నగదు పోయినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

యువగళం పాదయాత్రతో మలుపు

గరివిడి, న్యూస్‌టుడే: మూడేళ్ల క్రితం నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పిందని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. మూడేళ్లు అయిన సందర్భంగా మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. వేల కిలోమీటర్లు నడిచి, ప్రజలతో మాట్లాడి గుర్తించిన సమస్యలే నేడు కూటమి పాలనలో అభివృద్ధి ప్రణాళికలుగా మారాయన్నారు. ✦ **గంట్యాడ:** మంత్రి లోకేశ్ చేపట్టిన పాదయాత్రతో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయని తెదేపా మండలాధ్యక్షుడు కొండపల్లి భాస్కరరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో నేతలతో కలిసి కేకు కోశారు. రాష్ట్ర కొప్పలవెలమ సంక్షేమ సంఘం డైరెక్టరు అల్లు విజయ్‌కుమార్, తాటిపూడి ఆయకట్టు సంఘం ఛైర్మన్ కె.జగన్నాథరావు పాల్గొన్నారు.

చోదకులు గుంతలు పూడ్చుకున్నారు

గంట్యాడ గ్రామీణం: మండలంలోని బుడతనాపల్లి మీదుగా కొటారుబిల్లి కూడలికు వెళ్లే ప్రధాన రహదారిలో గుంతల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించకపోవడంతో ఆటోడ్రైవర్లు అందరూ కలిసి వాటికి మరమ్మతులు చేసుకున్నారు.

ఆమె కుటుంబ సారథి

న్యూస్‌టుడే – గజపతినగరం, గంట్యాడ గ్రామీణం, బొండపల్లి, దత్తిరాజేరు

గ్రామీణ ప్రాంతాల సాధారణ మధ్యతరగతి కుటుంబాల మహిళలు ఆర్థిక సారథులుగా మారుతున్నారు. స్వయం సహాయక సంఘాల్లో చేరి, ప్రభుత్వం అందిస్తున్న పలు రుణాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. పిల్లల చదువుల్లో, కుటుంబాన్ని నడిపించడంలో అండగా నిలుస్తున్నారు.

దర్జీగా.. దర్జాగా



బొండపల్లి మండలం కనిమెరక గ్రామానికి చెందిన **కె.సత్యవతి** దర్జీగా రాణిస్తున్నారు. స్వయం శక్తి సంఘంలో చేరి, రూ.3 లక్షలు రుణం తీసుకున్నారు. కుట్టుమిషన్ ఏర్పాటు చేసుకున్నారు. పని కోసం బయటకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దే ఉపాధి పొందుతున్నానని, నెలకు రూ.14 వేలు సంపాదిస్తున్నానని ఆమె చెబుతున్నారు. ఆర్థిక స్వేచ్ఛ ఉంటోందన్నారు.

శిక్షణతో ఉపాధి..

దత్తిరాజేరుకు చెందిన **మీసాల జ్యోతి** పొదుపు సంఘం ద్వారా పొందిన రూ.లక్ష రుణంతో రెండు కుట్టు మిషన్లు కొనుగోలు చేశారు. ఓవైపు దుస్తులు కుడుతూ.. మరోవైపు గ్రామంలోని పలువురు మహిళలకు కుట్టు శిక్షణ ఇస్తూ.. ఉపాధి పొందుతున్నారు. వచ్చిన ఆదాయంతో తన భర్తతో వెల్డింగు షాపు ఏర్పాటు చేయించారు. కుటుంబానికి ఆసరాగా నిలవడం ఆనందంగా ఉందని ఆమె చెబుతున్నారు.

కూలీ నుంచి పని కల్పించే స్థాయికి..

గజపతినగరం మండలం గంగచోళ్లపెంట గ్రామానికి చెందిన **మాసాడ సన్యాసమ్మ** అయ్యప్పస్వామి పొదుపు సంఘ సభ్యురాలు. సంఘంలో చేరకముందు వ్యవసాయ కూలీగా, ఆమె భర్త మేస్త్రీగా పనిచేసేవారు. గ్రూపులో చేరాక కుట్టుమిషన్ శిక్షణ తీసుకుని బ్యాంకు లింకేజీ రూపంలో రూ.4.8 లక్షలు.. స్త్రీనిధి నుంచి రూ.లక్ష రుణం పొందారు. కంప్యూటర్ ఎంబ్రాయిడరీ మిషన్ కొనుగోలు చేసి, దుస్తులు కుట్టడమే కాకుండా మరి కొంతమంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు.

పశు సంపదతో ఆదాయం..

గంట్యాడ మండలం లక్కిడాం గ్రామానికి చెందిన **కొల్లి ఎర్నికృష్ణమ్మ** పొదుపు రుణాలతో పాటు మరో రూ.20 లక్షల పెట్టుబడితో పాడి ఆవులను కొనుగోలు చేశారు. గంట్యాడ పశువైద్యశాఖ అధికారుల సూచనలతో రెండెకరాల విస్తీర్ణంలో పశుగ్రాసం పెంచుతున్నారు. పశువుల నుంచి రోజుకు 100 నుంచి 120 లీటర్ల పాల దిగుబడి సాధిస్తున్నట్లు చెబుతున్నారు.

అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి

గజపతినగరం, న్యూస్‌టుడే: మండల సమాఖ్యల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు రూపొందించాలని వెలుగు డీపీఎం చిరంజీవి అన్నారు. మంగళవారం గజపతినగరంలోని వెలుగు కార్యాలయంలో విజన్ బిల్డింగ్‌పై మూడో విడత శిక్షణ నిర్వహించారు. డీపీఎం పాల్గొని పలు సూచనలు చేశారు. ఏపీఎం నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతేసంగతి..!

రాజాం పట్టణంలోని బొబ్బిలి రహదారిలో సిరి ఫంక్షన్ హాల్ వద్ద రహదారి పక్కన కాలువపై మూత లేదు. దీంతో ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఇటువైపుగా రాకపోకలు చేసేవారు ఏ మాత్రం ఆదమరిచినా కాలువలో పడే ప్రమాదముంది. ఆపద రాకముందే పురపాలిక అధికారులు స్పందించాలని కోరుతున్నారు. వెంటనే మూత ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశిస్తామని కమిషనర్ రామచంద్రరావు చెప్పారు. – న్యూస్‌టుడే, రాజాం పట్టణం

కార్యకర్తలే పార్టీకి బలం: బొత్స

గరివిడి, న్యూస్‌టుడే: వైకాపాకు కార్యకర్తలే బలమని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అన్నారు. మంగళవారం గరివిడిలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు గ్రామ కమిటీల నియామకాలు పూర్తిచేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం మహిళలకు వడ్డీ రాయితీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, కొత్త పింఛన్లు వంటివి మంజూరు చేయలేదని, ఉపాధిహామీ కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించడంలేదని విమర్శించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

బ్యాంకు ఉద్యోగుల నిరసన

నిరసన తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులు

రాజాం, న్యూస్‌టుడే: బ్యాంకుల్లో వారానికి అయిదు రోజుల పని విధానం అమలు చేయాలని బ్యాంకు యూనియన్ల ఐక్యవేదిక (యూఎఫ్‌బీయూ) ప్రతినిధి పి.రాజేశ్వరరావు డిమాండు చేశారు. మంగళవారం రాజాం ఎస్‌బీఐ ప్రధాన బ్రాంచి వద్ద నిరసన తెలిపారు. అనంతరం అంబేడ్కర్ కూడలి మీదుగా ర్యాలీ నిర్వహించి, నినాదాలు చేశారు. సిబ్బంది కొరత, అధిక పని గంటల వల్ల ఆరోగ్యం, కుటుంబ జీవితం, మానసిక సమతుల్యతపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జీవిత బీమా ఉద్యోగులు, సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. ✦ **బొబ్బిలి గ్రామీణం:** బ్యాంకు ఉద్యోగులు బొబ్బిలిలోని ఎస్‌బీఐ బ్యాంకు వద్ద నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు మురళీ, రాజశేఖర్, సురేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి డాక్యుమెంటరీకి గుర్తింపు

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: బొబ్బిలి పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంపై విజయవాడ సమీపంలోని గన్నవరానికి చెందిన యువ ఆర్కిటెక్ట్ దాసరి సురేష్, దాసరి అభిషేక్ బృందం తీసిన డాక్యుమెంటరీ జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది. గతేడాది నేషనల్ అసోసియేషన్ ఫర్ స్టూడెంట్స్ ఆఫ్ ఆర్కిటెక్చర్ నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో నాలుగో స్థానంలో నిలిచింది. ఆలయ చరిత్ర, నిర్మించిన విధానం, శిల్పకళ, ఉన్నత ప్రమాణాలు తదితర అంశాలను అందులో పొందుపర్చారు. ఆలయ విశిష్టత, బొబ్బిలి రాజవంశీయులు ఆలయాన్ని ఎలా నిర్మించారో చూపించారు. ఆ బృందం మంగళవారం ఎమ్మెల్యే బేబినాయనను బొబ్బిలిలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన అభినందించారు.

ఉత్తమ అధికారికి హార్దిక శుభాకాంక్షలు

గౌ|| శ్రీ కె.కృష్ణమూర్తి గారు
మండల ఇంజినీరింగ్ ఆఫీసర్ (పంచాయితీరాజ్), గంట్యాడ

ఉద్యోగ నిర్వహణలో విశిష్టసేవలందించి, అధికారుల మన్ననలు పొంది, గణతంత్రదినోత్సవం నాడు విజయనగరం జిల్లా కలెక్టర్ గౌ|| శ్రీ ఎస్.రామసుందర్‌రెడ్డి IAS గారి చేతల మీదుగా ఉత్తమ అధికారిగా ప్రశంసాపత్రం స్వీకరించిన గౌ|| శ్రీ కె.కృష్ణమూర్తి గారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు

కొరుపోలు పోలినాయుడు
Class-I కాంట్రాక్టర్, బురదపాడు గ్రామం, గంట్యాడ మండలం

(c) eenadu

విజయనగరం

● విజయనగరం ● నెల్లిమర్ల ● ఎస్.కోట

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధి జరజాపుపేట ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ప్రధానోపాధ్యాయురాలు కామేశ్వరి అధ్యక్షతన ఘనంగా జరిగింది. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జామి, డెంకాడ మండలం అక్కివరం, కొట్టాం పాఠశాలల్లోనూ వేడుకలు జరిగాయి. – న్యూస్‌టుడే, జరజాపుపేట(నెల్లిమర్ల), జామి, డెంకాడ

వైభవంగా శివపార్వతుల కల్యాణం

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం దేవస్థానంలో క్షేత్రపాలకులైన ఉమా సదాశివస్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం చేపట్టారు. శివపార్వతులను పూలతో అలంకరించారు. ఈవో వై.శ్రీనివాసరావు పట్టువస్త్రాలను సమర్పించారు. ప్రధానార్చకుడు మల్లికార్జునశర్మ కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. – న్యూస్‌టుడే, నెల్లిమర్ల

సుబ్రహ్మణ్యునికి అభిషేకాలు

మాఘమాసాన్ని పురస్కరించుకుని నగరంలోని సిటీబస్టాండ్ సమీపంలో కొలువుదీరిన సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం పంచామృతాభిషేకాలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు గాయత్రీశర్మ వేదమంత్రాల నడుమ ఈ పూజలు సాగాయి. – న్యూస్‌టుడే, విజయనగరం కంటోన్మెంట్

ఉపాధి లెక్కల్లో చిక్కులు

వేపాడ, న్యూస్‌టుడే: వేపాడ మండలంలో 2024- 25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. డ్వామా పీడీ శారదాదేవి ఆధ్వర్యంలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక జరిగింది. 1328 పనులకు సంబంధించి రూ.14.27 కోట్ల వేతనాలు, రూ.4.09 కోట్ల మెటీరియల్ నిధుల వినియోగంలో జరిగిన తప్పులను ఎస్ఆర్‌పీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో డీఆర్‌పీలు చదివి వినిపించారు. దీంతో రూ.4.45 లక్షల రికవరీకి పీడీ ఆదేశించారు. డీవీవో పి.వెంకటరమణ, పీఈ కె.భానూజీరావు, సీనియర్ అసిస్టెంటు ఎన్.నారాయణరావు పాల్గొన్నారు.

పనుల్లో లోపాలను చదివి వినిపిస్తున్న డీఆర్‌పీలు

వాడీవేడిగా డెంకాడ మండల సర్వసభ్య సమావేశం

డెంకాడ, న్యూస్‌టుడే: డెంకాడ మండల కేంద్రంలో ఎంపీపీ బి.వాసుదేవరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ఎమ్మెల్యే నాగమాధవి హాజరయ్యారు. రఘు మండలో వారసత్వ భూములకు అధికారులు మ్యుటేషన్ చేయడం లేదని, రెండేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని ఎంపీటీసీ సభ్యుడు ముసలినాయుడు అన్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని తహసీల్దారు రాజారావును ఎమ్మెల్యే ఆదేశించారు. చొల్లంగిపేటలో పంచాయతీ తీర్మానం చేసిన పనులకు ఆమోదం తెలపడం లేదని, బిల్లులు ఇవ్వడం లేదని సర్పంచి కనకరాజు ఆవేదన వ్యక్తం చేశారు.

అక్రమాలపై తారు పూత

● నాణ్యత లేక రోజుల వ్యవధిలోనే ధ్వంసం
● నగరపాలికలో అధ్వానంగా దారులు

న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో నిర్మిస్తున్న రోడ్లు కొన్ని నెలల్లోనే దెబ్బతింటున్నాయి. నాణ్యత లేకపోవడం, అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఈ పరిస్థితి కనిపిస్తోంది. వర్షాల సమయంలో మరింత అధ్వానంగా మారుతున్నాయి. 2025- 26 ఆర్థిక ఏడాదిలో ఇక్కడ కొత్త రహదారుల నిర్మాణానికి రూ.9.84 కోట్లు మంజూరు చేశారు. ఇప్పటికే రూ.4 కోట్ల వరకు ఖర్చు చేశారు. అయినా మెరుగు పడలేదు. ఎప్పటికప్పుడు గుంతలు పూడ్చుతున్నా కష్టాలు వెంటాడుతున్నాయి.

పైడితల్లి పండగ సమయంలో రింగురోడ్డు నుంచి నాయుడు కాలనీ దారిలో ప్యాచ్ వర్కులు చేశారు. ఇలాంటి పనులకు రూ.లక్షలు వెచ్చించినా తారు ఊడిపోతోంది

గత రెండేళ్లలో మరమ్మతులు ఇలా..

గుంతలు	ఖర్చు(రూ.లలో)
60	18 లక్షలు
1311	87 లక్షలు
663	78.72 లక్షలు

తవ్వి వదిలేస్తున్నారు..

ముషిడిపల్లి, నెల్లిమర్ల పంప్‌హౌస్ నుంచి జిల్లా కేంద్రంలోని సుమారు 3.20 లక్షల మందికి నీళ్లిస్తున్నారు. 50 డివిజన్ల పరిధిలో 530 కి.మీల మేర పైపులైన్లు విస్తరించాయి. తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో బాగు చేసేందుకు తవ్వకాలు చేపడుతున్నారు. ప్రధాన రోడ్లు, కూడళ్లు, కల్వర్టుల కింద నుంచి వెళ్తుండడంతో ధ్వంసం చేస్తున్నారు. సకాలంలో పూడ్చకపోవడం, తవ్విన చోట తారు వేసి వదిలేయడంతో కొన్ని రోజులకే గుంతలు దర్శనమిస్తున్నాయి.

ఏటా పూడుస్తున్నా..

ఏటా పైడితల్లి పండగ సమయంలో ప్యాచ్ వర్కులు చేస్తారు. అవి కూడా ఎక్కువ రోజులు ఉండడం లేదు. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో రూ.1.83 కోట్ల వ్యయంతో 2 వేలకు పైగా గుంతలను పూడ్చినట్లు నగరపాలిక రికార్డుల్లో చూపారు. అయితే ఎక్కడ పనులు జరిగాయో కూడా తెలియడం లేదు. కొన్ని చోట్ల తారుపూత కనిపిస్తున్నా.. భారీ వాహనాలు వస్తే ఆ ప్రాంతం కుంగిపోతోంది. గత ప్రభుత్వ హయాంలో జగనన్న నగరబాట కింద రూ.లక్షల్లో ఖర్చు చేసినా.. ఉపయోగపడలేదు.

ప్రత్యేక దృష్టి..

రోడ్ల నిర్మాణం, గుంతల పూడ్చివేత పనులపై దృష్టిసారిస్తామని కమిషనర్ కె.అప్పలరాజు తెలిపారు. నాణ్యతతో జరిగేలా చూస్తామని, అవసరమైన చోట మరోసారి మరమ్మతులు చేస్తామని వెల్లడించారు. అవకతవకలు జరగకుండా ఇంజినీరింగ్, సచివాలయాల సిబ్బందిని అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.

తెరపై ఈనాడు

✦ ఎన్సీఎస్: ది రాజాసాబ్ ✦ శ్రీకృష్ణ: అనగనగా ఒక రాజు ✦ ఆదిత్య: నారీ నారీ నడుమ మురారి ✦ లీలామహల్: మన శంకరవరప్రసాద్‌గారు ✦ రంజనీ స్క్రీన్- 1: మన శంకరవరప్రసాద్‌గారు ✦ శివరంజనీ స్క్రీన్-2: నారీ నారీ నడుమ మురారి, అనగనగా ఒక రాజు ✦ హిమగిరి: మన శంకరవరప్రసాద్‌గారు ✦ సప్తగిరి: భర్త మహాశయులకు విజ్ఞప్తి. – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	80085 74326
భోగాపురం	70959 54646

?: మూడు లాంతర్లు సమీపంలో దుకాణాలు కనిపించకుండా ప్రకటన బోర్డులు పెడుతున్నారు. – ఆరిఫ్, దుకాణదారుడు ★ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - హరిబాబు, ఏపీసీ

?: గుమ్చీ దారిలో కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. - స్థానికులు ★ అక్కడి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేయిస్తాం. - కె.సాంబమూర్తి, ప్రజారోగ్య అధికారి

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

జొన్నాడ పీఏసీఎస్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

ఛైర్మన్, డైరెక్టర్లతో ఎమ్మెల్యే నాగమాధవి, నాయకులు

డెంకాడ, న్యూస్‌టుడే: రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు పనిచేయాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మంగళవారం జరిగిన జొన్నాడ పీఏసీఎస్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన భవిరిశెట్టి శ్రీనివాసరావు, డైరెక్టర్లు యర్రా చంద్రరావు, త్రిపురగిరి సత్యన్నారాయణను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

నైతిక విలువలు అవసరం

విద్యావిభాగం, న్యూస్‌టుడే: సామాజిక సేవా నిపుణుల అవసరం రోజురోజుకూ పెరుగుతోందని బెంగళూరుకు చెందిన నిమ్హాన్స్ మానసిక వైద్య సామాజిక సేవ విభాగం ఆచార్యుడు డా.ఎన్.జనార్దన పేర్కొన్నారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన సదస్సులో మాట్లాడారు. విద్యార్థులు నైతిక విలువలు పెంచుకోవాలని సూచించారు. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ హెచ్ఆర్ ప్రబంధకుడు డా.టి.శరత్‌చంద్ర, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య జితేంద్ర మోహన్ మిశ్రా, పరిపాలనాధికారి సూర్యనారాయణ పాల్గొన్నారు.

2 నుంచి పైడితల్లి జాతర

డెంకాడ, న్యూస్‌టుడే: విజయనగరం పైడితల్లి ప్రతిరూపంగా డెంకాడ మండలం జొన్నాడలో వెలసిన అమ్మవారి 70వ వార్షిక మహోత్సవాలు ఫిబ్రవరి 2 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి జి.శ్రీనివాస్ తెలిపారు. ఏటా భీష్మ ఏకాదశి తర్వాత వచ్చే మంగళవారం జాతర జరపడం ఆనవాయితీ. పెద్దఎత్తున భక్తులు రానున్నారని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో తెలిపారు.

తాజుద్దీన్ బాబా జయంతి వేడుక

విజయనగరంలో సారె ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

దాకమర్రిలో మత పెద్దలతో వెళ్తున్న కర్రోతు బంగార్రాజు

నాగ్‌పూర్ తాజుద్దీన్ బాబా జయంతి వేడుక విజయనగరంలో మంగళవారం ఘనంగా జరిగింది. బాబా భక్తులు తొలుత ఆబాద్ వీధి నుంచి కోట కూడలి, మయూరికూడలి మీదుగా దాకమర్రి వరకు భారీ ఊరేగింపు చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, వేషధారణలు అలరించాయి. ● భీమునిపట్నం మండలంలోని దాకమర్రిలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు పాల్గొన్నారు. చందల్ ఊరేగింపునకు హాజరై పూజలు చేశారు. బాబా బోధనలు సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, విజయనగరం మయూరికూడలి, భోగాపురం

నగరపాలిక పరిధిలోని కోట వద్ద వేషధారుల సందడి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఎల్.కోట, పూసపాటిరేగ, న్యూస్‌టుడే: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. మంగళవారం భీమాళిలో రూ.30 లక్షలతో ప్రభుత్వ ఆయుర్వేదిక్ డిస్పెన్సరీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏఎంసీ ఛైర్మన్ మల్లునాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఈశ్వరరావు పాల్గొన్నారు. ● కొవ్వాడ అగ్రహారంలో రూ.50 లక్షలతో సీసీ రోడ్డు, చింతపల్లిలో రూ.12 లక్షలతో మూడు తాగునీటి బోర్ల ఏర్పాటుకు ఎమ్మెల్యే నాగమాధవి శంకుస్థాపన చేశారు.

భీమాళిలో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే లలిత కుమారి

తవ్వేస్తారు.. వదిలేస్తారు

విజయనగరంలోని పలు ప్రాంతాల్లో పైపులైన్ల మరమ్మతుల కోసం రోడ్లు తవ్వి, వదిలేస్తున్నారు. ఏటా రూ.కోట్లతో రోడ్లు వేస్తున్నా.. ఈ కారణంగా దెబ్బతింటున్నాయి. సకాలంలో పూడ్చివేత పనులు సైతం జరగడం లేదు. దీంతో హెచ్చరికగా స్టాపర్లు, కర్రలు పెడుతున్నారు. అప్పుడప్పుడూ ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానిక కొత్తాగ్రహారం- 4లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. అక్కడ పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటామని డీఈఈ నరసింహారెడ్డి తెలిపారు. – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

నిరుపయోగం.. కియోస్క్ యంత్రం

డెంకాడ మండలంలోని మోపాడ రైతు సేవా కేంద్రంలో కియోస్క్ యంత్రం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. వ్యవసాయ శాఖకు సంబంధించి అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరిచేందుకు గత ప్రభుత్వ హయాంలో దీన్ని ఏర్పాటు చేశారు. సక్రమంగా వినియోగించకపోవడం, పర్యవేక్షణ లేకపోవడంతో ఇలా వృథాగా మారుతోంది. మరమ్మతులకు గురై మూలకు చేరింది. దీనిపై ఉన్నతాధికారులకు తెలియజేశామని, వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఏఈవో ప్రశాంతి 'న్యూస్‌టుడే'కు తెలిపారు. – న్యూస్‌టుడే, డెంకాడ

తాగాలంటే ప్రయాస తప్పదు

ఎల్.కోట మండలంలోని రేగ శివారు నీలకంఠపురంలో తాగునీటికి గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. డైరెక్ట్ పంపింగ్ ఉన్నా నీరందడం లేదు. రూ.39.60 లక్షలతో చేపడుతున్న ట్యాంకు నిర్మాణ పనులు ఆగిపోయాయి. దీంతో చేసేది లేక పొలాల్లోని వ్యవసాయ మోటార్ల వద్ద నీరు పట్టుకుంటున్నారు. దూరం కావడంతో ప్రయాస తప్పడం లేదని వాపోతున్నారు. ఇంటింటా కుళాయిల పేరిట రోడ్లు తవ్వినా పైపులు వేయలేదన్నారు. ట్యాంకు పనులు చివరి దశలో ఉన్నాయని, త్వరలో పూర్తి చేసి సమస్య పరిష్కరిస్తామని రక్షిత మంచి నీటి విభాగం ఇంజినీరు సన్యాసిరావు తెలిపారు. – న్యూస్‌టుడే, ఎల్.కోట

ఈ కష్టాలు తొలగేనా?



ఎస్.కోట మండలం పుణ్యగిరి రహదారిలో కొత్తవలస-కిరండోలు రైల్వే లైనులో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటుగా రోజూ 30 వరకు గూడ్సులు తిరుగుతుంటాయి. పట్టణం నుంచి పుణ్యగిరి వెళ్లే రోడ్డులో ఉన్న గేటు వేస్తున్నారు. గంటల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. కార్తికమాసం, మహాశివరాత్రి సమయాల్లో కష్టాలు తీవ్రమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో ఆర్వోబీ మంజూరైనట్లు రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ పంకజ్ చౌహాన్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఎస్.కోట

ధ్యానంతో ఒత్తిడిని జయించవచ్చు

విజయనగరం బాబామెట్ట, న్యూస్‌టుడే: నిరంతరం యోగా చేయడం ద్వారా ఆరోగ్యకరమైన జీవన విధానం అలవడుతుందని ఎస్పీ దామోదర్ అన్నారు. విజయనగరంలోని పి.ఎస్.ఆర్.పాఠశాలలో మంగళవారం యోగా భారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ధ్యానంతో ఒత్తిడిని జయించవచ్చని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అమ్మ జన్మనిస్తే. . శిరస్త్రాణం పునర్జన్మనిస్తుందన్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని కోరారు. అనంతరం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో కరపత్రాలను ఆవిష్కరించారు. సీఐలు శ్రీనివాసరావు, సూరినాయుడు, సామాజిక కార్యకర్తలు రామ్మోహన్, కృష్ణారెడ్డి, రవి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ● జీవితాలను నాశనం చేసే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ ఆర్.గోవిందరావు సూచించారు. జొన్నవలస జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్పీ దామోదర్ తదితరులు

రక్తదానం.. ప్రాణదానం

రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం రోటరీ క్లబ్ విజయనగరం ఆధ్వర్యంలో నగరంలోని ఆర్టీసీ డిస్పెన్సరీ వద్ద రక్తదాన శిబిరం జరిగింది. జిల్లా ప్రజారవాణాధికారిణి జి.వరలక్ష్మి ప్రారంభించారు. 32 మంది సిబ్బంది రక్తదానం చేయగా.. వారికి ధ్రువపత్రాలు అందించారు. – న్యూస్‌టుడే, అయ్యన్నపేట

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: నిర్వహణ పనుల నేపథ్యంలో బుధవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాజులపేట, డైట్ కాలేజ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని ఈఈ త్రినాథరావు ఓ ప్రకటనలో తెలిపారు.

ఆలయంలో చోరీకి విఫలయత్నం

అయ్యన్నపేట, న్యూస్‌టుడే: నగరంలోని శివాలయం వీధిలో ఉన్న వెంకన్న ఆలయంలో సోమవారం అర్ధరాత్రి ఓ బాలుడు చోరీకి యత్నించాడు. సీసీ కెమెరాల తీగలు కత్తిరించి, హుండీ దగ్గరకు చేరుకున్నాడు. చప్పుడు రావడంతో సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఈలోపే పరారయ్యాడు. పోలీసులకు సమాచారం అందించామని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందిని తొలగించామని దేవాదాయ శాఖ ఏసీ శిరీష తెలిపారు.

రూ.30 వేల పైపుల దగ్ధం

శృంగవరపుకోట: గోపాలపల్లి రామయ్యబందలో తుప్పలు కాల్చడంతో పక్కనున్న పొలంలోని రూ.30 వేల విలువైన నీటి సరఫరా పైపులు, 20 పామాయిల్ మొక్కలు కాలిపోయాయని రైతు పవన్ నరహరి వాపోయారు. న్యాయం చేయాలని ఎంపీడీవో, ఏపీవోకు ఫిర్యాదు చేశారు.

ఒత్తిడిని జయించాలి

విద్యావిభాగం: పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడిని జయించాలని ఎంవీజీఆర్ కళాశాల ఆచార్యుడు ఎస్.మోహన్‌కుమార్ పిలుపునిచ్చారు. మహారాజా కళాశాలలో మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మానసిక ఒత్తిడికి దూరంగా ఉన్నప్పుడే పరీక్షలు బాగా రాయగలరని పేర్కొన్నారు. 290 మంది విద్యార్థులకు పరీక్ష కిట్లను అందజేశారు.

ఏఎస్సై జనార్దనరావుకు అవార్డు

కొత్తవలస: కొత్తవలస ఏఎస్సై ఆర్.జనార్దనరావుకు విజయనగరం రోటరీ క్లబ్ వృత్తిపరమైన సేవా పురస్కారాన్ని మంగళవారం జిల్లా కేంద్రంలో అందజేసింది. గతేడాది ఆగస్టులో కొత్తసుంకరపాలెం సమీపంలోని దత్తుడు బందలో గుర్తు తెలియని మృతదేహం కనిపించింది. దాన్ని తీసేందుకు ఎవరూ ముందుకు వెళ్లలేదు. జోరువానలోనూ 60 ఏళ్ల ఈయన చెరువులోకి దిగి బయటకు తీశారు.

వేడుకగా మరిడిమాంబ జాతర

వేపాడ: బల్లంకిలో మరిడిమాంబ జాతర రెండో రోజు ఘనంగా సాగింది. అమ్మవారికి పూజలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలతో ఆలయ ఆవరణలో సందడి నెలకొంది. సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

జాతీయస్థాయి పోటీల్లో సత్తా

నెల్లిమర్ల: కొండవెలగాడకు చెందిన కె.గౌరిబాబు ఆల్ ఇండియా తపాలాశాఖ ఆధ్వర్యంలో తమిళనాడులో ఈనెల 25 నుంచి జరుగుతున్న జాతీయస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించాడు.



పచ్చాపచ్చని.. ప్రకృతే మెచ్చనీ!!

విజయనగరంలోని ఓ నర్సరీలో మొక్కలు కొనుగోలు చేస్తున్న నగరవాసులు

అక్కడే ఎక్కువ..

నగరపాలిక పరిధిలో 50 వరకు ప్రధాన నర్సరీలున్నాయి. వీటిల్లో రూ.20 నుంచి రూ.లక్ష విలువ చేసే మొక్కలున్నాయి. రాజమహేంద్రవరం సమీపంలోని కడియం, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా తదితర ప్రాంతాల నుంచి తెచ్చి అమ్ముతున్నారు. విశాఖ రోడ్డు, పెద్ద చెరువు, గోకపేట, పూల్‌బాగ్, ట్యాంక్‌బండ్, రామనారాయణం రోడ్డు తదితర ప్రాంతాల్లో అమ్మకాలు సాగుతున్నాయి. ఎలాంటి రసాయనాలు అవసరం లేకుండా కేవలం నీళ్లు మాత్రమే అవసరమయ్యే వాటిని విక్రయిస్తున్నారు. కుండీలు, వర్మీకంపోస్టు ప్యాకెట్లు, విత్తనాలు సైతం అందుబాటులో ఉంటున్నాయి.

బయటకెళితే ఓ శీతల పానీయం.. లేకుంటే కొబ్బరి బొండాం.. అదీ కాకుంటే చెరకు రసం.. చల్లదనం కోసం చాలామంది ఇవి కొంటుంటారు.. ప్రకృతి ప్రేమికులు మాత్రం ఓ మొక్క తీసుకెళ్తుంటారు.. ఇంట్లో పచ్చదనం పెరిగేలా, ఆహ్లాదకర వాతావరణం ఉండేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మిద్దె పంటలు ఓ వైపు.. పచ్చని తోటలు మరోవైపు.. పట్టణాల్లో ప్రస్తుతం ఈ ట్రెండ్ సాగుతోంది. నగరంతో పాటు నెల్లిమర్ల, ఎస్.కోటలో సంస్కృతి విస్తరిస్తోంది. – న్యూస్‌టుడే, నెల్లిమర్ల, ఎస్.కోట, విజయనగరం పట్టణం

పట్టణాల్లో నర్సరీలకు డిమాండు

పెద్దఎత్తున మొక్కల కొనుగోళ్లు

పంపిణీకి సిద్ధం..

పచ్చదనం పెంపులో మహిళలు కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే నగరపాలిక పరిధిలో వేల మంది మిద్దె తోటలు పెంచుతున్నారు. వీరిలో కొందరు వాట్సప్ గ్రూపులుగా ఏర్పడ్డారు. మొక్కల రకాలు, పెంపకం, నర్సరీల వివరాలను అందులో పంచుకుంటున్నారు. మరోవైపు అధికారులు సైతం 50 వేల వరకు పండ్ల మొక్కలను ఉచితంగా పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు.

అమ్మకాల జోరు..

నెల్లిమర్ల, ఎస్.కోట ప్రాంతాల్లోనూ నర్సరీలు వెలుస్తున్నాయి. పండ్లు, కూరగాయలు, పూలు జాతులు దర్శనమిస్తున్నాయి. ఇండోర్, అవుట్‌డోర్ రకాల విక్రయాలు ఎక్కువగా సాగుతున్నాయి. ఆక్సిజన్, స్నేక్, మనీ ప్లాంట్, ఆంథూరియం, అరేకా పామ్, గులాబీ మొక్కలను ప్రకృతి ప్రేమికులు కొంటున్నారు.

రోజంతా ఆహ్లాదకరం..



పండ్లు, కూరగాయలు, ఆకు కూరల రకాలను ఎక్కువగా కొంటున్నా. రసాయనాలు అవసరం లేదు. పెంపకం విషయంలో తొలుత ఇబ్బంది ఏర్పడినా.. రానురానూ అవగాహన వచ్చింది. గ్రూపుల ద్వారా వివరాలు పంచుకుంటున్నాం. గతేడాది విశాఖలో నిర్వహించిన ఆర్గానిక్ మేళాలో బెస్ట్ గార్డినర్‌గా అవార్డు దక్కింది. – బి.స్వాతి, వైఎస్సార్ నగర్, విజయనగరం

లక్ష్యాలను చేరుకోవాలి

లక్కవరపుకోట, న్యూస్‌టుడే: విజయనగరం జోన్‌లోని శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలు స్త్రీనిధి వార్షిక లక్ష్యాలను చేరుకున్నట్లు డిప్యూటీ జనరల్ మేనేజర్ పి.కృష్ణంనాయుడు తెలిపారు. మంగళవారం ఆయన ఎల్.కోట వెలుగు కార్యాలయాన్ని సందర్శించారు. అయిదు జిల్లాలకు రూ.722.76 కోట్ల రుణాలు లక్ష్యం కాగా, రూ.628.94 కోట్లు అందజేశామన్నారు. విజయనగరం రూ.288.87 కోట్లకు గానూ ఇప్పటివరకు 229.36 కోట్లు మంజూరు చేసిందన్నారు. పార్వతీపురంలో రూ.86.66 కోట్లకు రూ.63.01 కోట్లు, అల్లూరి సీతారామరాజు జిల్లా రూ.39.29 కోట్లకు రూ.21.22 కోట్లు చేసినట్లు చెప్పారు. రికవరీలో 98 శాతం ఉందని, మార్చికల్లా 100 శాతం చేస్తామన్నారు. ఏజీఎం యజ్జల చిట్టిబాబు, ఏపీఎం సింహాచలం, సీసీలు పాల్గొన్నారు.

(c) eenadu

విద్యుద్దీపాలంకరణలో ఆలయ శోభ

సింహ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం

దివ్యధామం.. అవని తేజం నేడే కల్యాణోత్సవం

న్యూస్‌టుడే, అంతర్వేది, మామిడికుదురు: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం విశేషోత్సవాలు అత్యంత వేడుకగా జరిగాయి. హనుమద్వాహనం, సింహ వాహనాలపై ఉత్సవమూర్తులను కొలువుదీర్చి భక్తులను గోవింద నామ స్మరణ నడుమ పురవీధుల్లో ఆధ్యాత్మిక కోలాహలంతో ఊరేగించారు. అంతకుముందు ఆలయ ప్రాంగణంలో వేదపఠనంతో జరిగిన శ్రీనారసింహ సుదర్శన యాగంలో అనేకమంది దంపతులు పాల్గొన్నారు. స్వామివారి దివ్య కల్యాణోత్సవాన్ని బుధవారం రాత్రి 1.56 గంటలకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కల్యాణ వేదిక చుట్టూ పటిష్ఠంగా రక్షణ వలయాన్ని ఏర్పాటు చేశారు. ఉత్సవాన్ని వీక్షించేందుకు ప్రత్యేక విభాగాలు సిద్ధమయ్యాయి. కల్యాణ ఘట్టాలను చూసేలా ఎల్‌ఈడీ తెరలను అమర్చారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు 50 సీసీ కెమెరాలు, ప్రత్యేక కంట్రోలు వ్యవస్థ ఏర్పాటయ్యాయి. స్వామివారి దర్శనాలకు ప్రత్యేకంగా క్యూలైన్లు సిద్ధం చేశారు.

గంగానమ్మకు కళా నీరాజనం

ఏలూరు తంగెళ్లమూడిలో గంగానమ్మ జాతర నేత్రపర్వంగా కొనసాగుతోంది. మంగళవారం వేడుకలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక సాయిబాబా ఆలయ నిర్వాహకులు, భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. సాయంత్రం మేడల ప్రాంగణంలో వేదికపై నాట్యాచార్య గండికోట రాజేశ్ శిష్య బృందం ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి.

న్యూస్‌టుడే, ఏలూరు ఆధ్యాత్మికం

దస్త్రానికింత..దండుకోవడమే అంతా!

- సిబ్బంది కొరతతో ప్రైవేటు వ్యక్తులదే హవా

ఈనాడు డిజిటల్, భీమవరం, తాడేపల్లిగూడెం అర్బన్, నరసాపురం, తణుకు, న్యూస్‌టుడే: ఎవరెన్ని చెప్పినా... మారమంతే అన్నట్లుగా తయారైంది జిల్లాలోని కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని సిబ్బంది తీరు. సిబ్బంది కొరత, పర్యవేక్షించే జిల్లా రిజిస్ట్రార్(డీఆర్) లేకపోవడంతో చాలా వరకు ప్రైవేటు వ్యక్తులు, దళారీలే దందా నడిపిస్తున్నారు. వారి ఆదాయం రోజుకి కనీసం రూ.10 వేలు నుంచి రూ.20 వేల వరకు ఉంటుందంటే అవినీతి ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

పరోక్షంగా సహకారం

జిల్లాలో గతేడాది మే నుంచి ఏలూరు డీఆర్ ఇన్‌ఛార్జ్ బాధ్యతలు నిర్వహిస్తుండగా తాడేపల్లిగూడెం, ఆచంట, మొగల్తూరు, నరసాపురం, పాలకొల్లు, ఉండి, వీరవాసరం సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు ఇన్‌ఛార్జుల పాలనలోనే ఉన్నాయి. రిజిస్ట్రేషన్‌కు స్లాట్ బుక్ చేసుకున్న కక్షిదారులు సబ్ రిజిస్ట్రార్ దగ్గరకు వెళ్తే, వారి ఆస్తుల వివరాలు సరైనవా కాదా నిర్ధారించిన అనంతరం సీనియర్ అసిస్టెంట్ ఆన్‌లైన్‌లో వేలిముద్రలు సేకరిస్తారు, లేదంటే ఐరిస్ తీస్తారు. వాటికి జూనియర్ అసిస్టెంట్ దస్తావేజు నంబరు కేటాయించి, దస్త్రాలు స్కాన్‌చేసిన తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. తగినంత సిబ్బంది లేక కొన్నిచోట్ల ప్రైవేటు వ్యక్తులే నిర్వహిస్తుండటంతో దస్త్రాలన్నీ సక్రమంగా ఉంటే రూ.5వేలు, లేకపోతే రూ.10వేల నుంచి రూ.20వేల వరకు వసూలు చేస్తున్నారు. పరోక్షంగా కొందరు అధికారులు వారికి సహకరిస్తున్నారు.

ఈసీలు, నకళ్లకు

స్టాంప్ కౌంటర్ల(షరాబు) రోజూ సంబంధిత కార్యాలయంలో ఎన్ని స్టాంప్ పేపర్లు అందుబాటులో ఉన్నాయనేది నోటీసు బోర్డులో ప్రజలకు అందుబాటులో ఉంచాలి. స్టాంప్ అమ్మకాలను నాన్ జ్యుడిషియల్, స్పెషల్ అడిసెవ్, కోర్టు ఫీజు, నోటరీ స్టాంపులు తదితర సేవలు షరాబు చేయాలి. జిల్లాలో పది మంది ఉండాల్సి ఉండగా ఒక్కరే ఉన్నారు. ఈసీలు, నకళ్లు, మార్కెట్ విలువ ధ్రువీకరణ పత్రాలు, తదితర పనులు చూసే కార్యాలయ సబార్డినేట్లు 20 మందికి నలుగురే ఉన్నారు. కంప్యూటర్, మాన్యువల్ ఈసీలు, నకళ్లను బట్టి రూ.200 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నారు.

దుకాణ అగ్రిమెంటు నిమిత్తం స్టాంప్ కొనుగోలుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లగా రూ.100 నాన్ జ్యుడిషియల్ స్టాంప్‌నకు రూ.150 తీసుకున్నారని, బ్యాంకు రుణం నిమిత్తం దరఖాస్తుపై రూ.వెయ్యి స్టాంపింగ్‌కు రూ.300 అదనంగా వసూలు చేశారని పెదతాడేపల్లికి చెందిన ఓ వ్యక్తి వాపోయారు. పెనుగొండ మండలం లేఅవుట్ రిజిస్ట్రేషన్‌కు వాసవి పెనుగొండలో సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో రూ.5వేలు అదనంగా వసూలు చేసినట్లు సిద్ధాంతానికి చెందిన ఓ వ్యక్తి వాపోయారు.

జిల్లా సబ్ రిజిస్ట్రారు కార్యాలయాలు 15

కేడర్	ఉండాల్సింది	ఉన్నది
సబ్ రిజిస్ట్రార్	18	10
జూనియర్ అసిస్టెంట్లు	38	15
షరాబులు	10	1

ప్రయోగ పరీక్షలు ప్రారంభం

ఏలూరు గ్రామీణ: జిల్లాలో ఇంటర్మీడియట్ వృత్తివిద్య ప్రయోగ పరీక్షలు మంగళవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మొత్తం పది కేంద్రాల్లో జరిగాయి. తొలి రోజు 1,504కి 1,320 మంది హాజరయ్యారు.

పశ్చిమలో ఫ్లో బస్సు

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు పరిచయం

పాలకోడేరు, న్యూస్‌టుడే: పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన యువ స్టార్టప్ క్రొవ్విడి మధులాష్ బాబు రూపొందించిన ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్(ఫ్లో) బస్సు తొలిసారి జిల్లాలో అడుగు పెట్టింది. సుమారు రూ.కోటితో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే ప్రయోగశాలగా దీన్ని తీర్చిదిద్దారు. ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థులకు ఈ ప్రయోగశాల ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేశారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించాలనే లక్ష్యంతో మధులాష్‌బాబు తొలిసారిగా బస్సును మంగళవారం జిల్లాకు తీసుకొచ్చారు. కాళ్ల మండలం పెదఅమిరం క్యాంపు కార్యాలయంలో ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు బస్సును ప్రారంభించారు. బస్సు లోపల ప్రయోగశాలను ఆయన నిశితంగా పరిశీలించారు. ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని మధులాష్‌బాబు, ఫ్లో టీమ్ సభ్యులు రఘురామకు వివరించారు. జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు ఆధునిక పరిజ్ఞానాన్ని పరిచయం చేయాలని ఆయన ఫ్లో బృందానికి సూచించారు. అనంతరం శృంగవృక్షం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చేరుకొని స్థానిక విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై వివరించారు.

బస్సు లోపలి ల్యాబ్ పరిశీలిస్తున్న ఉప సభాపతి రఘురామకృష్ణరాజు

ప్రమాదం మాట వినిపించని రోజేదీ?

ఈనాడు, ఏలూరు, భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: శిరస్త్రాణం ధరించకుండా ప్రమాదవశాత్తు పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్న వాహనచోదకులెందరో. జిల్లాలో సగటున రోజుకు 3 నుంచి 6 ప్రమాదాలు ఇలా జరుగుతున్నాయి. గాయాలపాలై చనిపోయిన ఉదంతాలూ ఉంటున్నాయి. అసలు ప్రమాదం మాట వినిపించని రోజంటూ ఉండదంటే అతిశయోక్తి కాదు. సరిపడా సిబ్బంది లేరనే సాకుతో ట్రాఫిక్ నిబంధనల అమలును పోలీసు, రవాణాశాఖలు విస్మరిస్తున్నాయి. రాష్ట్రంలో రహదారి ప్రమాదాలు అధికంగా చోటుచేసుకుంటున్న జిల్లాల్లో ఏలూరు ఒకటి.

శిరస్త్రాణం ధరించకుండా వేగంగా దూసుకెళ్లడం, రాంగ్‌రూట్‌లో వెళ్లిపోవడం, లైసెన్సు లేకుండా, చరవాణి మాట్లాడుతూ నడపడం తదితర ఉల్లంఘనలకు పాల్పడటం నిత్యం కనిపిస్తూనే ఉన్నాయి. ఏటా జిల్లా వ్యాప్తంగా ఈ కేసులు 50 వేలకు పైగా ఉంటున్నాయి. కఠిన చర్యలతోనే మార్పు సాధ్యమంటున్నారు నిపుణులు.

ఉంటే ప్రాణాలు దక్కేవి

శిరస్త్రాణం వెంట తెచ్చుకుని అది పెట్టుకోక కొందరు ప్రమాదాల్లో చిక్కుకుంటున్నారు. మృత్యువాత పడిన, తీవ్రంగా గాయపడిన ఘటనలు ఉంటున్నాయి. కలపర్రు నుంచి గుండుగొలను వరకు జాతీయ రహదారిలో ఏడాదిలో 10-15 మరణాలు, 100కు పైగా క్షతగాత్రులను చూస్తున్నామని జిల్లా పోలీసు విభాగంలోని డీటీఆర్‌బీ యంత్రాంగం, 108 అంబులెన్స్ సిబ్బంది చెప్పారు.

జరిమానాలతో సరి

శిరస్త్రాణం ఉండి ధరించని వారు కొందరైతే అసలు అది లేని వారు ఇంకొందరు. మెడ తిరగదని, మెడ సమస్యలొస్తాయని, ఊపి రాడదని, తన పక్క నుంచి వెళ్లే వాహనాలు కనిపించవు అని చాలా మంది బండికే పరిమితం చేస్తున్నారు. పోలీసుల వాహన తనిఖీల్లో చిక్కితే జరిమానాలు కట్టి వెళ్లిపోతున్నారు.

రహదారి నిబంధనల అమలు అంతంతే!

శిరస్త్రాణం ధరించేవారేరీ...

2025లో పశ్చిమలో నమోదైన కేసుల వివరాలు

- ✶ శిరస్త్రాణం ధరించని, లైసెన్సు లేకుండా, ముగ్గురు నడపడం, రాంగ్‌రూట్‌లో వెళ్తూ పట్టుబడిన కేసులు :61084
- ✶ విధించిన అపరాధ రుసుములు :రూ.2.74 కోట్లు

నిపుణుల సూచనలివీ

✦ శిరస్త్రాణం ధరించకపోతే జరిమానా విధింపుతో పాటు కొన్ని రోజులు వాహనాన్ని జప్తు చేయాలి. ✦ పదేపదే పట్టుబడుతూ, ప్రమాదాలు చేస్తుంటే ఏడాది పాటు వాహనం నడపకుండా ఆంక్షలు విధించాలి. ✦ సచివాలయాల వారీగా వీరి వివరాలు మహిళాపోలీసులకు, స్టేషన్ పోలీసులకిచ్చి నిఘా పెట్టిస్తే కొంత మార్పు వస్తుంది. ✦ రహదారులపై భారీ వాహనాల వేగాన్ని స్పీడ్ గన్నులు, కెమెరాలతో గుర్తించి జరిమానాలు వేస్తున్న మాదిరి శిరస్త్రాణం పెట్టుకోని వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తే కొంత కట్టడి అవుతుంది. .

బొండాడ డ్రెయిన్‌పై రెయిలింగ్‌లు విరిగి ప్రమాదకరంగా వంతెన

ఎడమైనా.. కుడైనా.. కాలువలోకే

భీమవరం మండలం ఎల్‌వీఎన్‌పురం సమీపంలో బొండాడ డ్రెయిన్‌పై దశాబ్దాల కిందట నిర్మించిన వంతెనకు ఇరుపక్కలా రెయిలింగ్‌లు విరిగిపోయి ప్రమాదకరంగా మారింది. నిత్యం నాలుగు గ్రామాల ప్రజలతోపాటు ఆక్వా ఉత్పత్తులతో కూడిన భారీ వాహనాలు దీని మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. వంతెనకు ఒక వైపు ఏర్పడిన గుంతలు ప్రజలకు ఇబ్బందికరంగా మారాయి. తక్షణం గుంతలు పూడ్చి రెయిలింగ్‌లు పునర్నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ర.భ.శాఖ ఏఈ రాజశేఖర్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

- న్యూస్‌టుడే, అనాకోడేరు, ఎల్‌వీఎన్‌పురం(భీమవరం గ్రామీణ)

❖ ఇది పాలకొల్లు పరిధిలోని ఎస్‌కేపీ ఉన్నతపాఠశాల ప్రహరీ. మొంథా తుపాను సమయంలో చెట్టు కూలి పడటంతో ఇలా దెబ్బ తింది. అప్పట్నుంచి బాగు చేయించినవారు లేరు. అత్యవసరంగా పునర్నిర్మించడం విద్యార్థుల భద్రత దృష్ట్యా అవసరం. ఈ పని పూర్తికి ప్రతిపాదనలను ప్రధానోపాధ్యాయుడు లీప్ యాప్‌లో నమోదు చేశారు. త్వరలో దాతల సహకారంతో పూర్తి చేయడానికి కృషి చేస్తున్నారు.

దాతలే నిర్మాతలు!

- ❖ బడి అవసరాలన్నీ లీప్ యాప్‌లో నమోదు
- ❖ కార్పొరేట్ నిధుల కోసం ప్రయత్నాలు

పాలకొల్లు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లోని అత్యవసర పనులతో పాటు కనీస వసతులను వచ్చే విద్యాసంవత్సరం నాటికి కల్పించాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. దాతలు, కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతలో భాగంగా అందించే నిధులతో పూర్తిచేయడానికి రంగం సిద్ధం చేసింది. మనబడి-భవిష్యత్తు కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలో చేపట్టాల్సిన ఆయా పనుల వివరాలను లీప్‌యాప్‌లో ఇప్పటికే నమోదు చేయించింది.

ప్రధానోపాధ్యాయులదే పనంతా: లీప్ యాప్‌లో నమోదు చేసిన పనుల వివరాలను ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులు, దాతల దృష్టికి తీసుకెళ్లనున్నారు. పాఠశాల, గ్రామపరిధిలో ఉన్న పారిశ్రామికవేత్తలను కలిసి వారి సాయం కోరనున్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు, తాగునీటి వసతి, ల్యాబ్ సౌకర్యాలు, కంప్యూటర్లు, స్మార్ట్‌బోర్డులు, క్రీడా మైదానాల అభివృద్ధి, ప్రహరీల నిర్మాణం, తరగతిగదుల నిర్మాణం వంటివి లీప్‌యాప్‌లో నమోదుచేసిన వాటిలో ఉన్నాయి. దాతల సౌలభ్యాన్ని బట్టి నిధుల మంజూరుకు ఉన్న అవకాశాన్ని అనుసరించి కనీస వసతులు కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. పెద్ద సంస్థల భాగస్వామ్యం లభిస్తే తరగతి గదులు కూడా నిర్మించే అవకాశం ఉంది.

వేలాది పనులు: జిల్లాలో అన్ని ప్రభుత్వ, పురపాలిక, జిల్లాపరిషత్ పాఠశాలల నుంచి వేలాదిగా ప్రతిపాదనలు లీప్ యాప్‌లో నమోదయ్యాయి. రూ.కోట్లలో నిధులు అవసరమని అధికారులు గుర్తించారు. ఏ బడి పరిధిలో పనులను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడే పర్యవేక్షించాల్సి ఉందని సమగ్రశిక్షా జిల్లా సమన్వయకర్త శ్యామ్‌సుందర్ వివరించారు.

- ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 3,068
- విద్యార్థులు 2.10 లక్షలు

యునానీ... కోరుతోంది చికిత్స

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆయుష్ విభాగంలో జిల్లాలో ఆకివీడులో మాత్రమే యునాని ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. గతంలో ఈ ఆసుపత్రి ద్వారా ఎక్కువగా డెల్టా, కొల్లేరు తీర మండలాల ప్రజలు సంప్రదాయ వైద్య సేవలు పొందేవారు. కొన్నేళ్లపాటు వైద్యుడు, మందులు లేకపోవడంతో వ్యయప్రయాసలకోర్చి వచ్చిన రోగులు తిరిగి వెళ్లిపోయేవారు.

ఒకప్పుడు ప్రాచుర్యం.. 50 ఏళ్ల కిందట ఆకివీడులో యునాని ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. తొలుత స్థానిక ముస్లిం వీధిలో నిర్వహించారు. 20 ఏళ్ల కిందట ప్రధాన రహదారిలోని పాత ప్రభుత్వ ఆసుపత్రిలోకి మార్చారు. భవనం శిథిలావస్థకు చేరుకుంది. శ్లాబ్, గోడలు సిమెంటు పెచ్చులూడుతున్నాయి. అప్పట్లో రోజుకు 200 మందికిపైగా రోగులు వచ్చేవారు.

రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

ఇప్పుడు తిరోగమనం దిశగా..

2023 ఆగస్టుకు ముందు సుమారు ఐదేళ్లు ఒక కాంపౌండర్‌తోనే నిర్వహించారు. మందులు కూడా నామమాత్రంగా ఉండేవి. ఆగస్టు నెలలో వైద్యుడిగా బి.అశోక్ నియమితులయ్యారు. అప్పటికే ఏడాది ముందు నుంచి విద్యుత్తు వసతి లేదు. అనంతరం కాంపౌండర్ ఉద్యోగ విరమణ చేశారు. విద్యుత్తు సౌకర్యం లేక ఎదురవుతున్న ఇబ్బందులపై 2024 నవంబర్ 27న 'ఈనాడు'లో ప్రచురితం కాగా ఉపసభాపతి రఘురామకృష్ణరాజు స్పందించి ఆయన ఆదేశాలతో విద్యుత్తుశాఖాధికారులు 24 గంటల్లో ఆసుపత్రికి విద్యుత్తు కనెక్షన్ ఇచ్చారు. వైద్యుడు ఉన్నా మందులు లేక సేవలు అందలేదు. ఎట్టకేలకు గత ఏడాది డిసెంబర్‌లో 32 రకాల మందులు వచ్చాయి. కానీ శిథిల భవనం, సిబ్బంది కొరత వెరసి వైద్య సేవలకు అవరోధంగా మారాయి. ప్రస్తుతం రోజుకు 15 మంది రోగులు మాత్రమే వస్తున్నారు. 'స్థలం కేటాయిస్తే భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయనున్నారు. సిబ్బంది పోస్టుల భర్తీకి ఉన్నతాధికారులకు నివేదించాం. వైద్య సేవలు మెరుగుపర్చేందుకు కృషి చేస్తున్నాం' అని వైద్యుడు అశోక్ తెలిపారు.

మార్చి 14న జాతీయ లోక్ అదాలత్

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: మార్చి 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఛైర్మన్, మూడో అదనపు జిల్లా న్యాయమూర్తిగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ బి.లక్ష్మీనారాయణ తెలిపారు. భీమవరం కోర్టుల్లో అపరిష్కృతంగా ఉన్న కేసుల పరిష్కారం కోసం ఈ ఏడాదిలో నిర్వహిస్తున్న తొలి జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. సివిల్, రాజీపడదగిన క్రిమినల్, మోటారు యాక్సిడెంట్ బీమా, ప్రామిసరీ నోటు, చెక్కుబాకీ, మనోవర్తి, గృహహింస, బ్యాంకు, బీఎస్‌ఎన్‌ఎల్ మొండి బకాయిలు తదితర కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు. సివిల్ కేసుల్లో రాజీపడితే అప్పటికే కట్టిన కోర్టు ఫీజు వాపసు వస్తుందన్నారు. కక్షిదారుల సౌకర్యార్థం ప్రత్యేక న్యాయమూర్తితో శాశ్వత లోక్‌అదాలత్‌లో రోజూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేసులు రాజీ చేయడానికి ప్రీ లోక్ అదాలత్ సిట్టింగులు నిర్వహిస్తున్నామన్నారు. కక్షిదారులు, న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేటి నుంచి గోస్తనీ నది తీర్థోత్సవాలు

పాలకోడేరు, న్యూస్‌టుడే: పాలకోడేరు శివారు మోగల్లులో గోస్తనీ నది ఒడ్డున ఈ నెల 28 నుంచి 30 వరకు గోస్తనీ నది తీర్థోత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ఛైర్మన్ గాదిరాజు కృష్ణంరాజు తెలిపారు. ఇప్పటికే నది ఒడ్డున ఉన్న ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు.

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్ 6లో

WE MANUFACTURE AND SUPPLY APPAREL
FOR BULK ORDER QUANTITES
REGULAR WEAR
- RELIGIOUS WEAR
- TOPS
- BOTTOMS
- UNDERGARMENTS
- NIGHT WEAR
FOR MEN & WOMEN
BOYS & GIRLS
VIJAYAWADA-AP
8977796538

ఎస్పీ అద్నాన్ నయీం అస్మిని సన్మానిస్తున్న పోలీసు సంఘం ప్రతినిధులు

పోలీసు దైనందిని..సమాచార నిధి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పశ్చిమ గోదావరి జిల్లా పోలీసు దైనందినిని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మంగళవారం ఆవిష్కరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తేదీల కోసమే కాకుండా జిల్లాలోని పోలీసు అధికారుల సమాచారం, అత్యవసర ఫోన్ నంబర్లు, శాఖాపరమైన ముఖ్యమైన వివరాలతో కూడిన ఓ సమగ్ర సమాచార నిధిగా ఇది ఉపయుగపడుతుందన్నారు. అనంతరం ఎస్పీ అస్మిని జిల్లా పోలీసు సంఘం సన్మానించింది. అదనపు ఎస్పీ వి.భీమారావు, డీఎస్పీ రఘువీర్ విష్ణు, ఎస్బీ సీఐ కేవీవీఎన్ సత్యనారాయణ, డీసీఆర్‌బీ సీఐ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, సీఐలు బి.శ్రీనివాసరావు, ఎం.నాగరాజు, జి.కాళీచరణ్, పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ మోజెస్ పాల్గొన్నారు.

డైరెక్టర్ నియామకానికి నిరీక్షణ

ఇన్‌ఛార్జుల పాలనలో నిట్

ఈనాడు డిజిటల్, ఏపీనిట్: ఇదిగో పరీక్షలు నిర్వహించారు... అవిగో ముఖాముఖిలు జరిగాయి... ఇంకేముంది ఏపీ నిట్ డైరెక్టర్ వచ్చేస్తారంటూనే నాలుగేళ్లు గడిచిపోయాయి. అవినీతి ఆరోపణలతో నిట్ డైరెక్టర్ వైదొలిగినప్పటి నుంచి శాశ్వత డైరెక్టర్ నియామకం జరగలేదు. ఇన్‌ఛార్జుల పాలనలోనే నడుస్తుండటంతో త్వరితగతిన నిర్ణయాలు తీసుకోలేక, నిధుల సమీకరణకు, పోస్టుల భర్తీతోపాటు పాలనాపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని కొందరు ఆచార్యులు వాపోతున్నారు.

తాడేపల్లిగూడెం పట్టణంలో 2015లో ప్రారంభమైన ఏపీ నిట్ నూతన కోర్సులతో పాటు పరిశోధన ప్రాజెక్టుల్లో ప్రత్యేక ముద్ర వేసింది. అవినీతి ఆరోపణలపై సీఎస్పీ రావును డైరెక్టర్ పదవి నుంచి తొలగించిన అనంతరం నాగ్పూర్ నిట్ డైరెక్టర్ ప్రమోద్ పడోలే, ఆపై హైదరాబాద్‌లోని ఐఐటీ డైరెక్టర్ బి.శ్రీనివాసమూర్తిని ఇన్‌ఛార్జ్‌లుగా చేశారు. తర్వాత పుణె నిట్‌కు చెందిన దిలీప్ పేష్వేను పూర్తిస్థాయి డైరెక్టర్‌గా నియమించినా వ్యక్తిగత కారణాలతో ఆయన బాధ్యతలు చేపట్టలేదు. ప్రస్తుతం రాయ్‌పూర్ ఎన్ఐటీ డైరెక్టర్ ఎన్‌వీ రమణారావు ఇన్‌ఛార్జ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఏడాదైనా: నిబంధనల ప్రకారం 15 ఏళ్లకు పైగా అనుభవం ఉన్నవారిని నియమిస్తారు. ఇందుకోసం గతేడాది డైరెక్టర్ పోస్టు భర్తీకి కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేసింది. సుమారు 80 మంది ప్రొఫెసర్లు పోటీపడ్డారు. వారికి ముఖాముఖిలు సైతం నిర్వహించారు. డిసెంబరు నెలాఖరులోనే శాశ్వత డైరెక్టర్ వస్తారని ప్రచారం జరిగినా జనవరి దాటింది. దాంతో ఎప్పుడొస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

పులి గండం తప్పినట్లేనా?

కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: వారం రోజులుగా మన్యంతోపాటు మైదాన ప్రాంతమైన కొయ్యలగూడెం మండలంలో ప్రజలను భయాందోళనలకు గురి చేసిన పులి అడవిబాట పట్టినట్లు తెలుస్తోంది. సోమవారం సాయంత్రం వరకు కొయ్యలగూడెం మండలంలోని దిప్పకాయలపాడు, మర్రిగూడెం, బిల్లిమిల్లి గ్రామాల పొలాల వద్ద సంచరించిన పులి రాత్రి కొత్తబాట పట్టింది. వెళ్తూ మార్గంమధ్యలో ఒక దున్నపోతుపై దాడి చేసి చంపింది. అనంతరం పడమటి కాలువ మీదుగా మహదేవపురం బుట్టాయగూడెం మండలంలోని అమ్మపాలెం అక్కడి నుంచి గత్తరువాగు మీదుగా లంకపల్లి వరకు వెళ్లినట్లు స్థానికులు, అటవీశాఖ సిబ్బంది పాదముద్రలను బట్టి గుర్తించారు. వెనుదిరిగి వెళ్తూ కండ్రికగూడెం సమీపంలో పొలంలో కట్టేసిన దున్నపోతును చంపింది. లంకపల్లి వరకు వెళ్లింది కనుక అక్కడి నుంచి అభయారణ్యం కావడంతో లోపలకి వెళ్లిపోయినట్లేనని భావిస్తున్నారు. ఒక వేళ అక్కడి నుంచి మరో దారికి మళ్లుతుందేమోనని దాని కదలికలను గుర్తించేందుకు లంకపల్లి వద్ద ట్రాపింగ్ కెమెరాలను అమర్చినట్లు అటవీ సిబ్బంది తెలిపారు. మరో రెండు రోజులపాటు పులి సంచారంపై నిఘా ఉంచి ఎటువంటి కదలికలు లేకపోతే భయాందోళనలు ఉండవని భావిస్తున్నారు.

పులి దాడిలో చనిపోయిన దున్నపోతును పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది

మూడు రోజుల తర్వాత. . పులి సంచారంతో గత మూడు రోజులుగా రైతులు పొలాలకు వెళ్లే మార్గం లేకుండా పోయింది. దిప్పకాయలపాడు, కన్నాపురం, బిల్లిమిల్లి, మర్రిగూడెం, చంద్రాయగూడెం, కండ్రిగగూడెం తదితర గ్రామాల రైతులు ఎట్టకేలకు మంగళవారం తమ పొలాలకు వెళ్లారు. సోమవారం రాత్రి ఈ ప్రాంతం నుంచి పులి వెళ్లిపోయినట్లు గుర్తించిన అనంతరం పొలాలకు వెళ్లామని గెడా సత్తిబాబు, కామినేని ఆనంద్‌కుమార్ తెలిపారు.

పదవీ విరమణ వేళ మీ ఆత్మీయులకు
శుభాకాంక్షలు తెలపండి



మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీస్‌లో సహోద్యోగులు ఎవరైనా రిటైర్ అవుతున్నారా! అయితే వారిని అభినందించి
ఆకాంక్షించండి... వారి భావి జీవితం సుఖమయం ఆనందమయం...
తెలియజేయండి ఈనాడు ద్వారా పదవీ విరమణ శుభాకాంక్షలు.
80080 12494

Divis దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్
హైదరాబాద్, విశాఖపట్నం & కాకినాడకు సమీపంలో ఉన్న మా బల్క్ డ్రగ్ పరిశ్రమ ప్రొడక్షన్ విభాగంలో పనిచేయుటకు ఈ క్రింది అర్హతలు, శారీరక ధారుఢ్యం మరియు మంచి ఆరోగ్యం గల అభ్యర్థులు కావలెను.
2022 TO 2025 PASSED OUT & 2026 PURSUING CANDIDATES

Job Title	Qualification	Age	Stipend (P.M)
Trainee Supervisor / Graduate Apprentice	B.Sc. Chemistry	20-25 yrs	Rs. 18,000/-
	B.Pharmacy B.Tech - Chemical / Instrumentation / Mech	20-25 yrs	Rs. 20,000/-
	M.Sc. (Organic Chemistry/ Analytical Chemistry)	20-25 yrs	Rs. 22,000/-
	M.Pharmacy (QA & RA)	20-25 yrs	Rs. 24,000/-

గమనిక : పైన తెలిపిన కోర్సులు పూర్తి చేసిన మరియు ఆఖరి సంవత్సరం చివరి సెమిస్టర్ చదువుతున్న అభ్యర్థులు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు జిరాక్స్ కాపీలను తీసుకుని ఈ క్రింది ప్రదేశాలలో జరుగు ఇంటర్వ్యూకు హాజరు కాగలరు. ఎంపిక కాబడిన అభ్యర్థులు షిఫ్టులలో పనిచేయవలసి ఉంటుంది.

02-02-2026	SIR C.R. REDDY PG COLLEGE (PG Seminar Hall), ELURU
03-02-2026	SHRI VISHNU COLLEGE OF PHARMACY BHIMAVARAM
03-02-2026	KGRL COLLEGE OF PHARMACY BHIMAVARAM
04-02-2026	DR. CSN DEGREE & PG COLLEGE (AUTONOMOUS) BHIMAVARAM
04-02-2026	DNR DEGREE & PG COLLEGE BHIMAVARAM
05-02-2026	SRI YN COLLEGE HRD Center, NARASAPURAM
05-02-2026	BRR & GKR CHAMBERS DEGREE COLLEGE PALAKOLLU
06-02-2026	JOGAIAH INSTITUTE OF TECHNOLOGY & SCIENCES, (Kalagampudi) PALAKOLLU
06-02-2026	SVKP & DR. K.S.RAJU ARTS & SCIENCE COLLEGE PENUGONDA
07-02-2026	DRG GOVT. DEGREE & PG COLLEGE PENTAPADU
07-02-2026	SCIM GOVT. DEGREE & PG COLLEGE TANUKU
09-02-2026	AKRG COLLEGE OF PHARMACY NALLAJERLA
09-02-2026	CSTS GOVT. KALASALA JANGAREDDIGUDEM
11-02-2026	ABN & PRR COLLEGE OF SCIENCE KOVVURU

Interested candidates should report to the venue on or before 10.30 am
సదుపాయాలు : 1) బ్యాచ్‌లర్స్‌కు ఉచిత వసతి. 2) ఉచిత యూనిఫాం, 3) అర్హులైన వారికి PF, ESI ఇవ్వబడును. 4) భోజన ఖర్చులో రాయితీ.
MALE CANDIDATES ONLY

(c) eenadu

గురుకులం పిలుస్తోంది! (దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం)

పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే: పేద పిల్లలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల ద్వారా ప్రభుత్వం నాణ్యమైన విద్య నందిస్తోంది. ఉచిత వసతి, భోజనం, ఏకరూప దుస్తులు, రాత, పాఠ్యపుస్తకాలు, ఇతర్రత్రా సదుపాయాలు కల్పిస్తోంది. ఇక్కడి విద్యార్థులు పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపుతుండటంతో.. గురుకులాల్లో ప్రవేశాలకు ఏటా పోటీ పెరుగుతోంది.

జిల్లాలో మొత్తం ఆరు.. జిల్లాలో మొత్తం 6 గురుకుల విద్యాలయాలున్నాయి. ఒక్కో గురుకులంలో 80 చొప్పున ఐదో తరగతిలో మొత్తం 480 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నారు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో గ్రూపులో 40 చొప్పున సీట్లు భర్తీ చేయనున్నారు. 2026-27 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఔత్సాహికులు ఫిబ్రవరి 19 లోపు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎక్కడెక్కడ అంటే.. **బాలురు:** పెదవేగి, చింతలపూడి. **బాలికలు:** వట్లూరు, పోలసానిపల్లి, జంగారెడ్డిగూడెం, ద్వారకాతిరుమల.

అర్హతలివే.. ఐదో తరగతి ప్రవేశాలకు 11 ఏళ్ల లోపు, ఇంటర్ ప్రథమ ఏడాదిలో 17 ఏళ్లలోపు వయసుండాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష మించరాదు. అర్హులు apgpcet.apcfss.in లో దరఖాస్తు చేసుకోవాలి. స్టడీ ధ్రువపత్రం, ఆధార్, ఫొటో, ఫోన్ నంబరు దగ్గర ఉంచుకోవాలి.

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

మధ్యవర్తిత్వంపై అవగాహన అవసరం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: న్యాయస్థాన కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వం ప్రధానమని, దీనిపై న్యాయవాదులకు అవగాహన అవసరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి అన్నారు. స్థానిక జిల్లా న్యాయస్థాన ప్రాంగణంలో న్యాయవాదులకు శిక్షణ తరగతులను మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. న్యాయస్థానాల్లో కేసులు విపరీతంగా పేరుకుపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజీ యోగ్యమైన కేసుల్లో ఇరు పక్షాలకు మధ్యవర్తిత్వం నిర్వర్తించి పరిష్కరించాలన్నారు. మద్రాసు హైకోర్టుకు చెందిన ఆర్.విజయ కమల, సత్యరావు శిక్షణనిస్తారని, అవకాశాన్ని న్యాయవాదులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి యు.ఇందిరా ప్రియదర్శిని, లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచండి : కలెక్టర్

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకంలో కొనసాగుతున్న పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. దీనిపై ఆమె సంబంధిత అధికారులతో మంగళవారం గూగుల్ మీట్ ద్వారా సమావేశం నిర్వహించి మాట్లాడారు. పది మండలాల్లో 114 పనులు మంజూరైతే ఇప్పటి వరకు 27 మాత్రమే పూర్తయ్యాయన్నారు. 63 పనులు కొనసాగుతుండగా ఇంకా 54 పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. ఎస్సీ జనాభా అధికంగా ఉన్న గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

జింకు లోపాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

మార్టేరు, న్యూస్‌టుడే: వరిలో జింకు లోపాన్ని ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ టి.శ్రీనివాస్, వరి ప్రధాన శాస్త్రవేత్త గిరిజారాణి సూచించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చలి తీవ్రత వల్ల జింకు ధాతువు అందక వరిలో మొక్క పెరుగుదల, పిలకలు వేయకపోవడం వంటి సమస్యలు కనిపిస్తున్నాయని చెప్పారు. ఎరువులు వేసినా మొక్కలు ఎదగకుండా ఆకులపై తుప్పు రంగు మచ్చలు గమనిస్తే జింకు లోపంగా గుర్తించి తక్షణం నివారణ చర్యలు చేపట్టాలన్నారు. లీటరు నీటికి 2 గ్రాముల చొప్పున ఎకరానికి 400 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి ఐదు రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. పిలకల దశలో ఉన్న చేలను ఒకసారి ఆరగడితే వేరు వ్యవస్థకు గాలి సోకి మొక్కకు పోషకాలు అందుతాయని పేర్కొన్నారు.

అయిదు రోజుల పని దినాలు వెంటనే అమలు చేయాలి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: బ్యాంకులో 5 రోజుల పని దినాల అమలు జాప్యంపై నిరసనలో భాగంగా యూఎఫ్‌బీయూ పిలుపుతో మంగళవారం ఒక రోజు సమ్మె చేశారు. భీమవరం ఎస్‌బీఐ ప్రధాన శాఖ వద్ద నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. గతేడాది మార్చి 24న ఇచ్చిన జాయింట్ నోట్‌లో 5 రోజుల బ్యాంకింగ్‌ను ఐబీఏ సూత్రప్రాయంగా అంగీకరించినప్పటికీ అమలు పరచడంలో ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తోందని ఎస్‌బీఐ ఎస్‌యూఏసీ ప్రాంతీయ కార్యదర్శి కె.బాల దుర్గాప్రసాద్ అన్నారు. 9 బ్యాంకు యూనియన్లు ఈ సమ్మెలో పాల్గొంటున్నాయన్నారు. జి.రామకృష్ణ, వీవీ ప్రకాశ్, అమర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - తాడికొండ

బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Hospitality Partner: Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Man of the Series: Hero
Digital Partner: ఈనాడు.నెట్
TV Partner: ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్, Mee FM
Organised by ఈనాడు

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - 1 జూనియర్స్: మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్సర్లతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులు చేసి ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - 1 జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సులతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

సీనియర్స్ విన్నర్స్ రాయలసీమ రాకర్స్

గ్రౌండ్-2లో సీనియర్స్ : సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ చరణ్ జిత్ ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-1 (జూనియర్స్)
మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)
మ్యాచ్-1: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం

ఏపీనిట్(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లో గ్రంథాలయ ఛైర్మన్ కార్తికేయ శర్మ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శన మంగళవారం ముగిసింది. బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో ఓనమాలు నేర్చుకునే పుస్తకాల దగ్గర నుంచి జీవిత పాఠాలు వల్లించే రచనలు, గ్రంథాలు, మహాభారతం, రామాయణం, భాగవతం కథలకు సంబంధించిన పుస్తకాలు ఉన్నాయి. ఈ సందర్భంగా నిట్ డీన్ (రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ) రవికిరణ్ శాస్త్రి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. నిట్ రిజిస్ట్రార్ పి.దినేశ్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి పుస్తకాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో డీన్‌లు కార్తిక్ శేషాద్రి, హిమబిందు, ఆచార్యులు పి.శంకర్, రాముడు, తపస్, సుదర్శన దీప, ప్రత్యూష, రాజేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పుస్తకాలను తిలకిస్తున్న నిట్ విద్యార్థులు

నేడు వాసవీశాంతిధాంలో వార్షికోత్సవం

వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: వాసవీశాంతిధాంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారి 90 అడుగుల పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ 7వ వార్షికోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు అఖిల భారత వాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ పి.ఎన్ గోవిందరాజులు తెలిపారు. మంగళవారం స్థానిక వాసవీ శాంతిధాంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ కోరికను మన్నించి పెనుగొండను వాసవీ పెనుగొండగా మార్చినందుకు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం అమ్మవారి ఆలయంలో నూతనంగా నిర్మించిన సంకల్ప మందిరాన్ని ప్రారంభించనున్నామన్నారు. వాసవీ పెనుగొండ అభివృద్ధికి కృషి చేస్తామని, స్థానికంగా బస్టాండ్ ఏర్పాటు, వేదపాఠశాల తదితర కార్యక్రమాలు చేపడతామన్నారు. వాసవీ శాంతిధాం పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి(బాలస్వామిజీ) మాట్లాడుతూ దేశ, విదేశాల్లో ఉండే వాసవీ భక్తులు వాసవీ పెనుగొండను దర్శించుకుంటారన్నారు. కార్యక్రమంలో అఖిల భారత వాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్టు ఉపాధ్యక్షులు బొండాడ రాంపండు, ఎస్.సతీష్, ప్రధాన కార్యదర్శి కేఆర్ కృష్ణ, కోశాధికారి ఎన్.ఎస్ శ్రీనివాసమూర్తి, లోకల్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ కోట్ల వెంకటేశ్వరరావు, కోట్ల సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్స్ జిల్లా సమన్వయకర్తగా సత్యనారాయణరాజు

మహదేవపట్నం (ఉండి), న్యూస్‌టుడే: ఓపెన్ స్కూల్స్ జిల్లా సమన్వయకర్తగా మహదేవపట్నంలోని ఉత్తరపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెన్మెత్స వెంకట సత్యనారాయణరాజు నియమితులయ్యారు. ఈ అంశాన్ని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో తను బుధవారం విధుల్లో చేరతానని వివరించారు.

మున్సిపల్ ఆఫీస్, పాలకొల్లు
ఆర్.ఓ.సి.నెం. 12/2026/ఇ1 ది. 27-01-2026
ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు
పాలకొల్లు పురపాలక సంఘ పరిధిలోని వివిధ వార్డులలో APUFIDC సాఫ్ట్ లోన్ నిధులతో మరియు పురపాలక సంఘ సాధారణ నిధులు వివిధ అభివృద్ధి పనులు చేపట్టుటకు గాను 36 - పనులకు అంచనాలు విలువ సుమారు రూ. 5,07,25,000/- లతో ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండరు కోరడమైనది. టెండరు షెడ్యూలు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెట్ నందు ది. 29-01-2026వ తేదీ సాయంత్రం గం. 04-00 ని.ల నుండి లభించును.
బిడ్ డాక్యుమెంట్ ప్రారంభ తేదీ : 29-01-2026 సాయంత్రం గం. 04.00 ని.లకు
బిడ్ డాక్యుమెంట్ డౌన్లోడ్ ముగింపు తేదీ : 13-02-2026 సాయంత్రం గం. 03.00 ని.లకు
ప్రైస్ బిడ్ తెరచు తేదీ : 13-02-2026 సాయంత్రం గం. 03.30 ని.లకు
మిగిలిన వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెట్ www.tender.apeprocurement.gov.in లేదా కమిషనరు, పాలకొల్లు పురపాలక సంఘము, పాలకొల్లు, పశ్చిమగోదావరి జిల్లా వారిని సంప్రదించగలరు.
సం/- కమిషనరు, పాలకొల్లు పురపాలక సంఘం

అవార్డు గ్రహీతకు శుభాకాంక్షలు

A.P.E.P.D.C.L. ప.గో.జిల్లా నందు విశిష్ట సేవలందించి రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీమతి C. నాగరాణి గారి చేతుల మీదుగా అవార్డు స్వీకరించిన S.E. శ్రీమతి P. ఉషారాణి గార్కి మా హృదయపూర్వక శుభాకాంక్షలు.
శ్రీమతి P. ఉషారాణి గారు
S.E., A.P.E.P.D.C.L. Operation Circle, W.G.Dt.
K. మధుకుమార్ E.E. Operation, నరసాపురం
Ch. రామకృష్ణ Dy. E.E., పాలకొల్లు
D. రామకృష్ణ Dy. E.E, ఆచంట
D. రాజీవ్ Dy. E.E, నరసాపురం
Sk. బాజ్జి A.E, పాలకొల్లు
L. శ్రీనివాసరావు A.E, పూలపల్లి
V.V. సత్యనారాయణ A.E. పోడూరు
V. చండీకిరణ్ A.E. యలమంచిలి
J. ప్రభాకర్ A.E. నరసాపురం
K. సుధాకర్ A.E2. సీతారామపురం
G.J.J. నాగరాజు A.E. పెనుమంట్ర
M. రామారావు A.E. ఆచంట
P. రాంబాబు A.E. పెనుగొండ
P. హరిప్రియ A.A.O. ERO, పాలకొల్లు

ఉత్తరం రాద్దాం.. బహుమతి సాధిద్దాం

మూడు రోజులే గడువు

ఆచంట, న్యూస్‌టుడే: తపాలాశాఖ నాలుగేళ్లగా 'ఢాయి ఆఖర్' పేరిట లేఖల పోటీ నిర్వహిస్తోంది. ముందుగా గత డిసెంబరు 8 తేదీ వరకూ మాత్రమే గడువు నిర్ణయించింది. తాజాగా ఈనెల 31 వరకూ పోటీకి ఉత్తరాలు పంపించే అవకాశం కల్పించింది. గత ఏడాది పోటీలో మన జిల్లాలోని తణుకు ప్రాంతానికి చెందిన వ్యక్తి బహుమతి అందుకున్నారు. ఈసారి పోటీలకు నన్ను ప్రభావితం చేసిన వ్యక్తి(లెటర్ టు మై రోల్ మోడల్) అనే అంశంగా నిర్ణయించారు. 18 ఏళ్ల లోపు, 18 ఏళ్లు పైబడిన వారికి రెండు విభాగాలుగా పోటీలు నిర్వహిస్తున్నారు. జాతీయ, రాష్ట్ర, ప్రాంతీయ స్థాయిలో రూ.500 నుంచి రూ.50000 నగదు బహుమతులు అందిస్తారు. ఇన్‌ల్యాండ్ లెటర్‌పై 500 పదాలు, ఏ-4 కాగితంపై 1000 పదాలు మించకూడదు. ఉమ్మడి జిల్లా వాసులు రాసిన ఉత్తరాలు తమ ప్రాంతాలను బట్టి తపాలా డివిజన్ కార్యాలయాలకు సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్, భీమవరం, తాడేపల్లిగూడెం, ఏలూరు ఈనెల 31లోపు అందేలా పంపించాలి.

రైస్ మిల్లర్లు నిబంధనలు పాటించాల్సిందే

చెరుకువాడలో ధాన్యం నిల్వలు పరిశీలించిన జేసీ

చెరుకువాడ(ఉండి), న్యూస్‌టుడే: ప్రభుత్వ నిబంధనలను రైస్‌మిల్లర్లు తప్పనిసరిగా పాటించాల్సిందేనని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. చెరుకువాడలోని రామాంజనేయ రైస్ మిల్లులో ధాన్యం నిల్వలు పరిశీలించారు. అక్రమ నిల్వలు, తూకంలో తేడాలుంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జిల్లా పౌరసరఫరాల అధికారి ఎన్.సరోజ, జిల్లా మేనేజర్ ఎండీ ఇబ్రహీమ్, ఏఎస్‌వో ఎం.రవిశంకర్, తహసీల్దార్ నాగార్జున, సీఎస్‌డీటీ సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు గీతాలు ఆలపిస్తున్న మహిళలు

ప్రజల జీవితాల్లో వెలుగులు

నాచుగుంట(ఉంగుటూరు), న్యూస్‌టుడే: ఏసుక్రీస్తు ప్రేమ విశ్వమంతా వ్యాపించి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిందని బైబిల్ మిషన్ అధ్యక్షుడు రెడరెండ్ పి.సజీవరావు అన్నారు. నాచుగుంటలో బైబిల్ మిషన్ మహా సభలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సుదూర ప్రాంతాల నుంచి విశ్వాసులు తరలివచ్చారు. మిషన్ ఉపాధ్యక్షుడు ఎ.దైవరావు, కార్యదర్శి వైఐడీ ఇమ్మానుయేలు, సంయుక్త కార్యదర్శి జీఆర్ ఇమ్మానుయేలు రాజుతో కలిసి సజీవరావు సభా ప్రాంగణానికి చేరుకుని తొలి సందేశమిచ్చారు. ప్రసన్నకుమార్, వినోద్‌బాబు, నోవా, విజయ్‌కుమార్ ప్రసంగించారు.

శిక్షణతో ఉపాధి బాట వేసుకోండి

ఉండిలో శిక్షణ ధ్రువపత్రాలు అందజేసిన శాస్త్రవేత్తలు

ఉండి, న్యూస్‌టుడే: తేనెటీగల పెంపకంపై పొందిన శిక్షణతో రాబోయే రోజుల్లో ఉపాధి బాటలు వేసుకోవడంతోపాటు అదనపు ఆదాయాన్ని సంపాదించుకోవాలని మార్టేరు వరి పరిశోధనా స్థానం ఏడీఆర్ టి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో తేనెటీగల పెంపకంపై వారం రోజులు నిర్వహించిన శిక్షణ తరగతులు మంగళవారం సాయంత్రంతో ముగిశాయి. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ఎన్.మల్లికార్జునరావు అధ్యక్షతన జరిగిన సభలో శ్రీనివాస్ మాట్లాడారు. శాస్త్రవేత్తలు ఎన్.డెబోరా మెస్సియానా, ఆర్.బిందుప్రవీణ, పి.వినయలక్ష్మి తదితరులు మాట్లాడారు. 25 మందికి శిక్షణ ధ్రువపత్రాలు అందజేశారు.

శ్రీవారి పుష్కరిణిలో తేలిన చేపలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి పుష్కరిణి(మాధవకుంట)లో చేపలు మృతి చెందాయి. అవి నీటిపై తేలుతూ దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో పంచాయతీ సిబ్బంది వాటిని తొలగించారు. పంచాయతీ చెరువును దేవస్థానం తీసుకుని పుష్కరిణిగా అభివృద్ధి చేసి అందులో వాటర్ ఫౌంటెన్ కూడా ఏర్పాటు చేసింది. అయితే ఇటీవల కాలంలో దేవస్థానం అధికారులు దాని నిర్వహణ గాలికొదిలేశారు. గతంలో కొందరు చేప పిల్లలను తీసుకొచ్చి వేశారని, ఈ నేపథ్యంలోనే అందులో చేపలు పెరిగాయని గ్రామస్థులు చెబుతున్నారు. అయితే మంగళవారం అందులోని చేపలన్నీ మృతి చెందాయి. ఎవరో విష ప్రయోగం చేసి ఉంటారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇందులో ఎవరో చేపలు పెంచుతున్నారని, ఎవరైనా విష ప్రయోగం చేసి ఉంటారని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. దేవస్థానం డీఈ సూర్యనారాయణ మాట్లాడుతూ చేపలు వర్షాలకు కొట్టికొచ్చి అందులో పెరిగాయన్నారు. పుష్కరిణి పక్కన పంచాయతీ బోరు వేసినప్పుడు గ్యాస్ వాటర్ అందులోకి వదలడం వల్ల చేపలు చనిపోయాయని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -143 రిటైల్ ధర 170 చికెన్ విత్ స్కిన్ - 247 చికెన్ స్కిన్‌లెస్ - 281. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 162, 171, 182 చికెన్ విత్ స్కిన్ - 314 చికెన్ స్కిన్‌లెస్ - 324.

ఆక్వా సదస్సు ప్రారంభం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం కేజీఆర్ఎల్ కళాశాలలో అంతర్జాతీయ ఆక్వా సదస్సు మంగళవారం ప్రారంభమైంది. ఆక్వా సాగుకు సంబంధించి జల ఆరోగ్య లక్షణ దృక్పథం- స్థిరమైన సముద్ర పర్యావరణం అనే అంశంపై రెండు రోజులపాటు కొనసాగుతున్న సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన నన్నయ విశ్వవిద్యాలయ సైన్స్, టెక్నాలజీ ప్రిన్సిపల్ పి.విజయనిర్మల మాట్లాడుతూ ఆక్వా సాగులో నానో టెక్నాలజీతో పిండ దశలోనే వ్యాధులు గుర్తించవచ్చన్నారు. అంతేకాక నానో సాంకేతికతతో నానో సెన్సార్ నీటి నాణ్యతను మానిటర్ చేస్తూ అంచనా వేయొచ్చన్నారు. ఏపీ మత్స్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పి.సుగుణ మాట్లాడుతూ ఆక్వా సాగులో ఎదుర్కొనే వ్యాధుల నిర్ధారణ, నివారణ చర్యలు వివరించారు. ఎంపెడా డిప్యూటీ డైరెక్టర్ విజయానంద్, కళాశాల అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, కరస్పాండెంట్ మెంటే రామ్‌మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

గురి తప్పిన తూటా

ఇంటి కిటికీ అద్దం ధ్వంసం

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం వైఎన్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు మంగళవారం ఫైరింగ్ సాధన చేస్తుండగా ఒక తూటా గురితప్పి సమీపాన కొపనాతి రాము ఇంటి కిటికీ అద్దానికి తగిలి లోనికి దూసుకువెళ్లింది. ఈ ఘటనలో అద్దం ధ్వంసమైంది. దీనిపై రాము ఎన్‌సీసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. గత 50 ఏళ్లలో ఎప్పుడూ ఇలా జరగలేదని.. దీనిపై విచారణ జరుపుతామని ఎన్‌సీసీ అధికారులు రాముకు హామీ ఇచ్చారు.

దిల్లీలో అవార్డు అందుకున్న మహాలక్ష్మి

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ వినియోగం లేకుండా, కిచెన్‌గార్డెన్ నిర్వహించినందుకు భీమవరం మండలం రాయలం అంగన్‌వాడీ కార్యకర్త చినిమిలి మహాలక్ష్మి అవార్డుకు ఎంపికైన విషయం తెలిసిందే. ఈ మేరకు రాష్ట్రం నుంచి దిల్లీకి ఎంపికైన ఐదుగురిలో మహాలక్ష్మి ఒకరు. దిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకలో కేంద్ర మంత్రి అన్నపూర్ణాదేవి చేతుల మీదుగా సోమవారం పురస్కారం అందుకున్నారు.

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

EENADU Classifieds

BUSINESS SERVICES
బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). ✆ 83338 33368
బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph : 8142292071.

EDUCATION
విజయవాడలో BPT/B.Sc., MLT- మేనేజ్‌మెంట్ కోటా సీట్లు- తక్కువ ఫీజు- కొన్నిసీట్లు కలవు. Affiliated to Dr.NTR యూనివర్సిటీ. ✆ 7995945835.

REAL ESTATE
FLAT FOR SALE
TPగూడెం ఏలూరు రోడ్డు సాయిబాబాగుడి దగ్గర మెయిన్‌రోడ్డుకు చేర్చి నార్త్, ఈస్ట్ బిట్టు శ్రీసాయిదుర్గా రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ ఈస్ట్ ఫేసింగ్ 2BHK 301 ఫ్లాట్ 1000sft గలది ఇంటీరియర్ + కార్ పార్కింగ్‌తో అమ్మకం. సంప్ర: 98665 29233.
LAND FOR SALE
2 ఎకరాల 20 సెంట్లు చేపల చెరువు అమ్మకం. దొడ్డనపూడి గ్రామం కాళ్ల మండలం, భీమవరం, ప॥ గో॥ జిల్లా. సెల్: 8500405678, 9885912559

JOBS
ఏలూరు నగరంలో HP పెట్రోల్ బంక్‌లో పార్ట్‌టైమ్ మోర్నింగ్ షిఫ్ట్ నైట్‌షిఫ్ట్ వర్క్ చేయుటకు ఉత్సాహవంతులైన యువతీ, యువకులు కావలెను. ✆ 93921 80560.
రైస్ మిల్ & ప్లాంట్ ఆపరేటర్స్ కావలెను. అనుభవజ్ఞులైన వెల్డింగ్, రిపేర్ తెలిసిన ఆపరేటర్స్ కావలెను. Contact No: ✆ 80962 46099.
ఏలూరులో ప్రముఖ జనరల్ ఇన్సూరెన్స్/లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో పార్ట్/ఫుల్ టైమ్ వర్క్ చేయుటకు ఎగ్జిక్యూటివ్స్, గృహిణులు, రిటైర్డ్ ఎంప్లాయిస్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. ✆ 78932 35972.
ప్రముఖ SML మహేంద్ర జయలక్ష్మి మోటార్స్ ఏలూరునందు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, సర్వీస్ అడ్వైజర్, సిస్టమ్ ఆపరేటర్స్, ఎలక్ట్రీషియన్స్ కావలెను. ✆ 99895 35241.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

నెక్ సూచించిన కోడిగ్రుడ్డ ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.15 పైసలు
తణుకు ఆఫీసు: 08819-224254

భీమవరం

•భీమవరం •ఉండి

ఉద్యోగ భద్రత కల్పించాలి

భీమవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: విద్యుత్తు మీటర్ల రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు. కలెక్టరేట్‌లో డీఆర్వో శివన్నారాయణరెడ్డిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ 29, 30, 31 తేదీల్లో విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా చేస్తామని వెల్లడించారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే ఫిబ్రవరి 2న రాష్ట్ర వ్యాప్త సమ్మె చేసేందుకు సిద్ధమవుతున్నట్లు వెల్లడించారు.

సమస్యలు పరిష్కరించండి

ఆకివీడు, న్యూస్‌టుడే: సమస్యలను పరిష్కరించాలని బ్యాంకు ఉద్యోగులు మంగళవారం ఆకివీడులో నిరసన ప్రదర్శన చేశారు. స్థానిక స్టేట్ బ్యాంకు వద్ద నుంచి గాంధీ విగ్రహం కూడలి వరకు ప్రదర్శన కొనసాగించారు. కార్యక్రమంలో వివిధ బ్యాంకు ఉద్యోగులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ఆకివీడు, న్యూస్‌టుడే: 'ధ్యానం' ఒక మతానికి సంబంధించినది కాదని.. ధ్యానంతో అందరూ మానసిక ప్రశాంతత పొందవచ్చని ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు తెలిపారు. మంగళవారం ఆయన ఆకివీడులోని పతంజలి యోగా ఆరోగ్య కేంద్రంలో 'మండల ధ్యాన విద్యార్థి ప్రాజెక్టు'ను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు, మానసిక వికాసం కోసం ధ్యాన సాధన ఎంతో దోహదపడుతుందని వివరించారు. ధ్యాన గురువులు, ఉపాధ్యాయులతో కలిసి ధ్యానం చేశారు. కార్యక్రమంలో తెదేపా సీనియర్ నాయకుడు మోటుపల్లి రామవరప్రసాద్, కౌన్సిలర్ కిమిడి అరుణకుమారి, వైద్యుడు వీబీ ప్రతాప్‌కుమార్, ఉండ్రమట్ల సాంబశివరావు, ఎంఈవో ఎ.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని రోజుల ముందు నోటీసులిచ్చారు : జేసీ

రీ-సర్వే తీరుపై ఆరా తీస్తున్న రాహుల్‌కుమార్‌రెడ్డి

ఆరేడు(ఉండి), న్యూస్‌టుడే: భూ రీ-సర్వేకి సంబంధించి ఎన్ని రోజుల ముందు నోటీసులిచ్చారని సంయుక్త కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆరా తీశారు. ఆరేడులో మంగళవారం ఆయన పర్యటించి రైతులు, అధికారులతో మాట్లాడారు. రైతుల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించే ముందు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ/ప్రైవేటు భూముల మధ్య సరిహద్దులను పరిశీలించారు. ప్రభుత్వ భూమి సెంటు కూడా తగ్గడానికి వీల్లేదని స్పష్టం చేశారు. రీ-సర్వే నోటీసులు అందాయా..? లేదా..! అని రైతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సమగ్రమైన సర్వే జరగాలని, తప్పిదాలకు ఏ దశలోనూ తావివ్వొద్దని దిగువ స్థాయి అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా సర్వే అధికారి కె.జాషువ, తహసీల్దార్ కె.నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ.. ఉపాధికి నిచ్చెన

తేనెటీగల పెంపకం వైపు యువత చూపు

ఉండి, న్యూస్‌టుడే: ప్రజలకు ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడంతో తేనె ఉత్పత్తుల వినియోగం బాగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో మార్కెట్లో తేనె, ఇతర ఉప ఉత్పత్తుల్లో నాణ్యతపై సందేహాలు రేగుతున్నాయి. ఈ దశలో తేనెటీగల పెంపకంతో నాణ్యమైన ఉత్పత్తుల సాధన, అదనపు ఆదాయం పొందొచ్చని ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో గ్రహించామని యువత అభిప్రాయపడింది. నూతన యూనిట్ల స్థాపనతో ఆదాయం ఆర్జించేందుకు ఉపాధికి ఇదో సువర్ణావకాశంగా మలుచుకుంటామని చెబుతున్నారు. యువత అభిప్రాయాలు వారి మాటల్లోనే..

చదువుతూ సంపాదన వైపు

మాది విస్సాకోడేరు. భీమవరంలో డిగ్రీ చదువుతున్నా. చెరువులు లీజుకు తీసుకొని కలువ, తామర పూలు, దుంపల ఉత్పత్తి చేస్తున్నాం. వాటికి సంబంధించి వీడియోలు చిత్రీకరించి ఇన్‌స్టాలో పెడుతుంటా. సీజన్లలో ఆన్‌లైన్‌లో వ్యాపారం చేస్తుంటాను. - ఆకుల ప్రవీణ్, డిగ్రీ విద్యార్థి, విస్సాకోడేరు

ఆర్థిక భరోసా కోసం..

పీజీ చేశా. ఇద్దరు పిల్లలు. నా భర్త ప్రభుత్వ ఉపాధ్యాయుడు. మాప్రాంతంలో పూలు, పండ్ల తోటలు ఎక్కువ. తేనెటీగల పెంపకంతో దిగుబడులు పెరుగుతాయని తెలుసుకున్నా. ఆర్థిక భరోసా కోసం శిక్షణ తీసుకున్నా. రాయితీపై యూనిట్ ఏర్పాటు చేస్తా. - కొమ్మిరెడ్డి శిరీష, వెలిచేరు, ఆత్రేయపురం, కోనసీమ జిల్లా

అవగాహన కల్పిస్తున్న అధికారులు

అదనపు ఆదాయం

నేను డిగ్రీ చదివా. బాలేపల్లిలో మూడెకరాల భూమి ముంది. మా మిత్రుడితో కలిసి కోళ్లఫారం పెట్టా. తేనెటీగల పెంపకం బాగుందని తెలుసుకొని శిక్షణకొచ్చా. పెద వేగిలో మా బావ పొలంలో యూనిట్ ఏర్పాటుచేసి ఆదాయం పొందాలని ప్రయత్నిస్తున్నా. - సీహెచ్. సంపత్‌కుమార్, బాలేపల్లి, వీరవాసరం మండలం

మేమున్నాం.. మీకు తోడుగా..

భీమవరం పట్టణం: 80085 74471	భీమవరం గునుపూడి: 80085 74474
భీమవరం మండలం: 80085 74533	వీరవాసరం: 80085 74475
పాలకోడేరు: 80085 74467	ఉండి: 80085 74526
ఆకివీడు: 80085 74525	కాళ్ల: 94401 04042

ఉండి, న్యూస్‌టుడే: ? ఉప్పులూరు గ్రామ శివారు రెండు తూముల నుంచి యండగండి పరిధిలోని రాయనివానిగూడెం మలుపు వరకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి పూర్తిగా దెబ్బతింది. - కె.గోపాలకృష్ణ, యండగండి.

✔ అంచనాలు పంపించాం. త్వరలోనే పనులు చేపడతాం. - కె.శ్రీహరిరాజు, ఆర్‌అండ్‌బీ ఏఈ, ఉండి.

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ? పట్టణంలోని విద్యుత్తు స్తంభాలకు, మలుపుల్లో ప్రైవేటు వ్యక్తులు బ్యానర్లు, కటౌట్లు కట్టారు. ప్రయాణ సమయాల్లో అడ్డంకిగా మారాయి - ఎస్.సుబ్రహ్మణ్యం, వ్యాపారి

✔ సంక్రాంతికి ఏర్పాటు చేసినవన్నీ తొలగిస్తున్నాం. - ఎం.శ్రీలక్ష్మి, సహాయ సిటీ ప్లానర్

? 22వ వార్డులోని వెంకయ్యానాయుడు వీధిలో రెండు రోజులుగా కుళాయి నుంచి నీరు రావడం లేదు. - పాలకోడేటి కార్తీక్, స్థానికుడు

✔ నీటి ఇబ్బందులు లేకుండా చూస్తాం - తాతబ్బాయి, పురపాలక డీఈ

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: ? రెండోపట్టణం 37వ వార్డులో రంగనాథరాజు వీధిలో డ్రెయినేజీలో మురుగు కదలక, వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతోంది. - కె.రామకృష్ణ, స్థానికుడు

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - పెన్మెత్స శ్రీనివాసరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

మావుళ్లమ్మకు భారీ గజమాల సమర్పణ

ఆకివీడు, న్యూస్‌టుడే: భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ అమ్మవారికి ఆకివీడు లక్ష్మీ గణపతి పండ్లు, పువ్వుల వర్తక సంఘం అధ్యక్షుడు షేక్ బాజీ 23 సంవత్సరాలుగా గజమాల సమర్పిస్తున్నారు. ఈ ఏడాది కూడా 150 కిలోల వివిధ రకాల పువ్వులతో భారీ గజమాల సిద్ధం చేసి మంగళవారం సాయంత్రం వాహనంపై భీమవరం అమ్మవారి ఆలయానికి తీసుకెళ్లారు.

ఆకట్టుకున్న హరికథ

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: మావుళ్లమ్మ ఆలయ మహోత్సవాల్లో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తెనాలికి చెందిన మొగలిచెర్ల నాగమణి భాగవతారిణి హరికథ గానం అందరినీ ఆకట్టుకుంది. రాత్రి మావుళ్లమ్మ నాట్యమండలి వారిచే 'పంచ రత్నముల' బాల నాగమ్మలో (వకీల్), శ్రీరామాంజనేయ యుద్ధంలో (యుద్ధం), గయోపాఖ్యానంలో (యుద్ధం, భవానీ), సత్యహరిశ్చంద్ర (కాటి కాపరి) సన్నివేశాలతో నాటకం ప్రదర్శించారు.

గానం చేస్తున్న నాగమణి

చెక్కులు అందుకున్నవారితో ఎమ్మెల్యే రామాంజనేయులు

పేదల ఆరోగ్యానికి భరోసా సీఎం సహాయ నిధి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: సీఎం సహాయ నిధి నుంచి భీమవరం నియోజకవర్గానికి చెందిన 34 మందికి రూ.25.03 లక్షలకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ఆయన కార్యాలయంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల ఆరోగ్యానికి భరోసాగా సీఎం సహాయ నిధి నిలుస్తుందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 509 మందికి రూ.4.35 కోట్లు కూటమి ప్రభుత్వం అందించిందన్నారు.

పెదఅమిరం(కాళ్ల), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధి పేరిట అందిస్తున్న ఆర్థిక సహాయం బాధిత కుటుంబాల్లో వెలుగు నింపుతోందని ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. కాళ్ల మండలం పెదఅమిరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం 31 మంది బాధితులకు వైద్య ఖర్చుల కోసం రూ.14,14,058 విలువైన చెక్కులను అందించారు.

ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయం చేయండి

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: భీమవరం 21వ వార్డు ప్రభుత్వ ఆసుపత్రి పక్కన నివాసముంటున్న పేదల ఇళ్లను నోటీసులివ్వకుండా తొలగించడాన్ని సీపీఎం పట్టణ నాయకులు ఖండించారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలో బాధితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.వైకుంఠరావు మాట్లాడుతూ ఇళ్లు కోల్పోయిన బాధితులకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణాలు చేసి అప్పగించాలని ప్రభుత్వాన్ని కోరారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన ఉపసభాపతి

ఉండి, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు మంగళవారం సాయంత్రం పర్యటించారు. బస్టాండ్‌లో ఉపాధి, ఇతర నిధులతో చేపట్టిన సీసీ రహదారి, డ్రెయినేజీ, మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు సుందరీకరణ పనులను పరిశీలించారు. ప్రయాణికులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామని చెప్పారు. అంతకు ముందు అన్న క్యాంటీన్ ప్రాంతంలో నిర్మించిన సీసీ రహదారి, పచ్చని మొక్కలతో ఉద్యానవనం ఏర్పాట్లను పరిశీలించారు. ఉండి ఏఎంసీ ఛైర్మన్ కలిదిండి రామకృష్ణంరాజు, తెదేపా మండల అధ్యక్షుడు కరిమెరక నాగరాజు, పాలకోడేరు సహకార సంఘ ఛైర్మన్ కొత్తపల్లి నాగరాజు, తెదేపా మండల మాజీ అధ్యక్షుడు కరిమెరక శ్రీనివాసరావు, తెదేపా గ్రామ అధ్యక్షుడు కాగిత బుజ్జి, గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి అనిల్‌కుమార్ తదితరులు మాట్లాడారు.

నేడు బస్టాండ్‌లో ప్రారంభోత్సవాలు.. **ఉండి, న్యూస్‌టుడే:** స్థానిక బస్టాండ్‌లో నూతన సీసీ రహదారి, పెద్ద వంతెన నుంచి ఆక్విడెక్టు వరకూ ప్రధాన పంట కాలువ గట్టుపై బాహ్య వలయ సిమెంట్ మార్గం, అన్న క్యాంటీన్ ప్రాంతంలో సీసీ రోడ్డు, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఉద్యానాన్ని ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు బుధవారం ప్రారంభిస్తారని ఆయన కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. అధికారులు, కూటమి నాయకులు, ప్రజలు హాజరుకావాలని కోరాయి.

క్రీడా ప్రతిభ వెలికితీయొచ్చు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో నిర్వహిస్తున్న ఆర్‌ఆర్‌ఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు మంగళవారం ప్రారంభించారు. భీమవరం డీఎన్నార్ కళాశాల క్రీడామైదానంలో ఈ పోటీలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఉపసభాపతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఉపయోగపడతాయన్నారు. క్రీడలు క్రమశిక్షణ, సహకారం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయన్నారు.

క్రీడాకారులకు అభినందనలు.. **భీమవరం పట్టణం, న్యూస్‌టుడే:** బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో ఈ నెల 26న జరిగిన పోటీల్లో భీమవరం విష్ణు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. ఈ సందర్భంగా కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో క్రీడాకారులను ప్రిన్సిపల్ మంగం వేణు, వైస్ ప్రిన్సిపల్ ఎం.శ్రీలక్ష్మి, అధ్యాపకులు అభినందించారు.

బ్యాటింగ్ చేస్తున్న ఉప సభాపతి రఘురామకృష్ణరాజు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

తణుకు, ఇరగవరం, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు చట్టరీత్యానేరమని తణుకు మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ పేర్కొన్నారు. బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.మహాలక్ష్మి ఆధ్వర్యంలో పట్టణంలోని చర్చి పాస్టర్లు, మసీదు ఇమామ్‌లు, దేవాలయాల పూజరులకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ★ బాల్యవివాహాలతో కలిగే అనర్థాలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఇరగవరం మండల పరిషత్తు కార్యాలయంలో పురోహితులకు, పాస్టర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు చేయబోమని ప్రతిజ్ఞ చేయించారు. డీసీపీవో యూనిట్ కౌన్సిలర్ సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు డీవీ మాణిక్యాంబ, ఎం.అరుణ కుమారి, ఏఎస్సై శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: రాయలం విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలోని కొమరాడ, అనాకోడేరు 11కేవీ ఫీడర్లపై చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపడుతున్నట్లు ఆ శాఖ ఈఈ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొమరాడ, గొర్లమూడి, దేగాపురం, అనాకోడేరు, తుమ్మగొప్ప, తుందుర్రు గ్రామాలతోపాటు ఆక్వా చెరువులకు విద్యుత్తు సరఫరా ఉండదని వెల్లడించారు.

కాళ్ల, న్యూస్‌టుడే: ఏలూరుపాడు 33కేవీ ఉప కేంద్రంలో నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఎన్ వెంకటేశ్వరరావు మంగళవారం రాత్రి తెలిపారు. ఆర్డీఎస్ఎస్ స్కీంలో భాగంగా నూతన 11కేవీ లైన్ల నిర్మాణం నిమిత్తం బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఏలూరుపాడు, జువ్వలపాలెం, చెరుకుమిల్లి, మందపాడు గ్రామాలకు సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

రాళ్ల రోడ్డుపై నరకయాతన

కొండేపూడి, అండలూరు ఆర్అండ్‌బీ రహదారిలో ప్రయాణం చేయాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. రెండు నెలల కిందట భారీగా గుంతలు పడటంతో పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు. అనంతరం గుంతలు పూడ్చే పనులు చేపట్టి చదును చేసి వదిలేశారు. దీంతో సుమారు నెల రోజుల నుంచి రాళ్లు లేచి మరింత అధ్వానంగా తయారైంది. ఒక పక్క రాళ్లు మరో పక్క దుమ్ముతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర యాతన పడుతున్నారు. త్వరలోనే మరమ్మతులు చేపడతామని ఆర్అండ్‌బీ ఏఈ డీఎస్ఎన్ మూర్తి తెలిపారు. - న్యూస్‌టుడే, పాలకోడేరు

తీగలే ఆధారం.. తెగితే ప్రమాదం

ఒరిగిపోయిన ఇనుప స్తంభం

ఆకివీడులోని దుంపగడప రోడ్డులో రెండు విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఒక సిమెంటు స్తంభం మధ్యలో విరిగిపోయి తీగలే ఆధారంగా వేలాడుతోంది. సమీపంలోని మరో ఇనుప స్తంభం ఒరిగిపోయింది. సుమారు ఆరు నెలల కిందట రెండు కొత్త స్తంభాలు తొలగించి కొన్ని నెలలపాటు అక్కడే ఉంచి అనంతరం మరో ప్రాంతానికి తీసుకెళ్లిపోయారని స్థానికులు చెబుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. దీనిపై ఏడీఈ శ్రీనివాస్ దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా స్తంభాలు మార్చేందుకు తీసుకుంటామని చెప్పారు. - న్యూస్‌టుడే, ఆకివీడు

మధ్యలో విరిగిపోయి తీగల ఆధారంగా ఉన్న స్తంభం

ట్రాఫిక్ పద్మవ్యూహంలో పట్టణం

భీమవరం పట్టణంలో ట్రాఫిక్‌తో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రహదారులపై వాహనాలు నిలిపేయడంతో ప్రయాణం నరకంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. ప్రకాశంచౌక్ నుంచి వెంకట్రామా థియేటర్ రోడ్డు, తాలూకాఫీసురోడ్డు పొడవునా వాహనాలతో ట్రాఫిక్ ఇబ్బందులు రెట్టింపవుతున్నాయి. 20 అడుగుల వెడల్పు దారిలో అటుఇటూ 10 అడుగులు ఆక్రమించడంతో ఇరుకులో ప్రయాణించే సమయంలో ప్రమాదాలు కొనసాగుతున్నాయి. దీనిపై ట్రాఫిక్ సీఐ వి.శ్రీనివాసు వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా ప్రయాణాలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, భీమవరం పట్టణం

తాలూకాఫీసు రోడ్డులో అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలు

రాజీ పడితే అన్యాయం చేసినట్టే

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆక్రమణల విషయంలో రాజీ పడితే భవిష్యత్తరాలకు అన్యాయం చేసినట్టేనని ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. మంగళవారం ఆయన ఆకివీడులోని రోజువారీ మార్కెట్ సమీపంలో మరమ్మతులు చేయించిన దుకాణాలను పరిశీలించారు. దుకాణాలను వ్యాపారులకు అద్దెకిచ్చి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం గంగానమ్మకోడు వెంబడి ఆక్రమణలను పరిశీలించారు. కోడు ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మోటుపల్లి రామవరప్రసాద్, నౌకట్ల రామారావు, తహసీల్దార్ ఫరూక్ తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గుండెపోటులో సాయుధ కానిస్టేబుల్ మృతి

వీరవాసరం, న్యూస్‌టుడే: భీమవరం కలెక్టర్ విడిది కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ నాళం కన్నయ్య (49) విధి నిర్వహణలో ఉండగా మంగళవారం తెల్లవారుజామున గుండె పోటుతో మృతి చెందారు. ఆయన మృత దేహానికి స్వగ్రామం వీరవాసరంలో పోలీసు లాంఛనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు భార్య శివలక్ష్మి, కుమారుడు గౌతమ్, కుమార్తె మనోగ్న ఉన్నారు. కన్నయ్య మృతి పట్ల స్థానికులు విచారం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి.. **ఆకివీడు, న్యూస్‌టుడే:** నగర పంచాయతీలోని సాయిదుర్గా నగర్‌కు చెందిన బండి అనసూయ జలదుర్గ (80) ఒంటరితనం భరించలేక ఈ నెల 17న ఒంటిపై నూనె పోసుకొని నిప్పంటించుకున్నారు. దీంతో బంధువులు ఆమెను భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం వృద్ధురాలు మృతి చెందారు. ఆమె కుమారుడు సీతారామయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

దారంతా గుంతలు.. చోదకులకు వెతలు

భీమవరం గునుపూడి: పట్టణంలో పలు రహదారులు అధ్వానంగా మారడంతో చోదకులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాసుపత్రి నుంచి రెండోపట్టణంలో వెళ్లే చిన్న వంతెన ప్రారంభం నుంచి పాత బస్టాండ్ వైపుకు వెళ్లే రహదారి రెండోపట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట గుంతలు, మరోవైపు డీఎన్నార్ కళాశాల, గొల్లవానితిప్ప గ్రామానికి వెళ్లే రహదారి భారీ గుంతలు, రాళ్లపైకి లేచిపోవడంతో ప్రయాణికులు నానాఅవస్థలు పడుతున్నారు. ఈ విషయమై పురపాలక ఏఈ టి.శరత్ మాట్లాడుతూ తాత్కాలిక మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు చేశామన్నారు.

మారుతీనగర్ కార్యవర్గం ఎంపిక

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం ఏడో వార్డు మారుతీ నగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం మంగళవారం ఎంపికైంది. గౌరవాధ్యక్షుడిగా కామన నాగేశ్వరరావు, అధ్యక్షుడిగా చెరుకూరి నరసింహరాజు, ఉపాధ్యక్షుడు డి.రాజేంద్రకుమార్, కార్యదర్శి పి.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి జి.రాంబాబు, కోశాధికారి పి.రామమోహనరావు, సభ్యులుగా ఎం.సత్యనారాయణ, డి.పాండురంగరావు, జి.శ్రీనివాసరాజు, కె.శ్రీరామచంద్రమూర్తి, కె.వెంకటేశ్వరరావు, ఏడుకొండలు, శరత్ నియమితులయ్యారు. కాలనీ అభివృద్ధికి సంఘటితంగా ముందుకెళ్లాలని తీర్మానించారు. మారుతీనగర్ పార్కు అభివృద్ధి, రహదారులు, డ్రెయిన్ల నిర్మాణ పనులను అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో పూర్తి చేయించుకోవాలని నిర్ణయించారు.

అధికారుల బాధ్యతారాహిత్యం తగదు: ఘంటా

మాట్లాడుతున్న జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో కొందరు అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుండటం తగదని జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అసహనం వ్యక్తం చేశారు. స్థానిక జిల్లా పరిషత్తు కార్యాలయంలో ఏలూరు, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల డీపీవోలు, డీఎల్పీవోలతో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల డీపీవోలు గైర్హాజరవడంపై ఛైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామాల్లో పారిశుద్ధ్య లోపాలు, చెత్త డంపింగ్, వ్యర్థాల నిల్వలు తదితరాలపై దృశ్య రూపకం ప్రదర్శించారు. ఆమె మాట్లాడుతూ.. పల్లెల పరిశుభ్రతకు అధికారులు పెద్దపీట వేయాలని ఆదేశించారు. సీఈవో ఎం.శ్రీహరి, డీపీవో కె.అనురాధ, డీఎల్పీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గజమాల యాత్ర

మొగల్తూరు, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామికి సమర్పించే గజమాలతో బుధవారం యాత్ర నిర్వహించనున్నట్లు పల్లవ సేన రాష్ట్ర అధ్యక్షుడు కొల్లాటి బాబూరావు తెలిపారు. కృష్ణాజిల్లా లక్ష్మీపురం పంచాయతీ పల్లవపాలెంలోఉదయం 10 గంటలకు యాత్ర ప్రారంభమవుతుందన్నారు. లోసరి, నాగిడిపాలెం, కాళీపట్నం, మొగల్తూరు, నరసాపురం మీదుగా అంతర్వేదిలో స్వామి ఆలయం వరకు యాత్ర కొనసాగుతుందని తెలిపారు.

వాణిని సత్కరిస్తున్న ఛాంబర్ అధ్యక్షుడు కోటేశ్వరరావు, నిర్వాహకులు

విజ్ఞానం, వినోదం, ట్రెక్కింగ్‌కు గుర్తింపు ఇవ్వాలి

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: విజ్ఞానం, వినోదం, ట్రెక్కింగ్ వంటి కార్యక్రమాలతో పర్యాటకాన్ని ప్రోత్సహిస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గుర్తింపు లభించడంలేదని యూత్ హాస్టల్స్ ఆఫ్ ఇండియా (వైహెచ్‌ఏఐ) పట్టణ శాఖ అధ్యక్షుడు ఆచార్య ఎం.సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక వాణిజ్య మండలి భవనంలో వైహెచ్‌ఏఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సుస్థిర పర్యాటకం వైహెచ్‌ఏఐ పాత్ర' అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గత ఏడాది హిమాలయాల్లోని 'సర్ పాస్', ఇటీవల రోమ్, స్విట్జర్లాండ్, జర్మనీ వంటి 9 దేశాలు విజయవంతంగా పర్యటించి వచ్చిన గొట్టుముక్కల వాణికి ప్రపంచ పర్యాటకుల అవార్డుతో సత్కరించారు. ముఖ్యఅతిథిగా వాణిజ్య మండలి అధ్యక్షుడు పులఖండం కోటేశ్వరరావు పాల్గొన్నారు. కార్యదర్శి కె.వెంకటరత్నం, సభ్యులు పాల్గొన్నారు.

ధర్నాలో పాల్గొన్న బ్యాంకు ఉద్యోగులు

డిమాండ్ల సాధనకు నిరంతర పోరాటం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు నిరంతరం ప్రభుత్వంతో పోరాడతామని తాడేపల్లిగూడెం బ్యాంకు ఉద్యోగుల కో-ఆర్డినేషన్ కమిటీ హెచ్చరించింది. బ్యాంకు ఉద్యోగులకు వారంలో 5 రోజుల పనిదినాలు అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు మంగళవారం సమ్మె చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని బ్యాంకులను మూసివేసి సుమారు 400 మంది ఉద్యోగులతో భారీ ర్యాలీ నిర్వహించారు. స్టేట్‌బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ రామ్‌ప్రసాద్, యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజినల్ సెక్రటరీ బి.దివ్య రజని మాట్లాడుతూ సిబ్బంది కొరత కారణంగా రాత్రి 8 గంటల వరకు పనిచేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో నాయకులు మానుకొండ కిరణ్, శిల్ప, బి.ఏడుకొండలు, లింగంపల్లి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

మహిళల్ని లక్షాధికారులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

ఉండి, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలందర్నీ లక్షాధికారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తోందని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (ఐబీ) వెంకటేశ్వరరావు తెలిపారు. ఉండి మండల సమాఖ్య కార్యాలయంలో ఉండి, పాలకోడేరు, పాలకొల్లు, యలమంచిలి, అత్తిలి మండలాల్లోని ఏపీఎంలు, సీసీలు, మోడల్ మండల సమాఖ్యలకు విజన్ బిల్డింగ్ మాడ్యూల్స్‌పై శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో తొలి విడతలో ఆదర్శ మండలాలుగా తణుకు, తాడేపల్లిగూడెం, ఆచంట, నరసాపురంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. రాబోయే అయిదేళ్లలో వ్యాపారాభివృద్ధిపై వార్షిక కార్యాచరణ రూపొందిస్తున్నామని.. రెండో విడతలో ఐదు మండలాల్లో విజన్ బిల్డింగ్‌పై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. రహదారులు, మంచినీరు, వ్యవసాయం, వ్యాపారం తదితర కార్యక్రమాలను గుర్తించి సంబంధిత శాఖల అధికారులతో కలిసి డాక్యుమెంటరీ తయారు చేస్తారన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించడమే లక్ష్యమని చెప్పారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు కర్రి జయలక్ష్మి, ఏపీఎం రాజేష్, సీసీ లక్ష్మీకుమారి, రిసోర్స్ పర్సన్లు జి.సుజాత, మోహన్‌శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

శీతాకాలంలో జింకు లోపం అధికం

కాళ్ల, న్యూస్‌టుడే: శీతాకాలంలో ఏర్పడే జింకు లోపంవల్ల దిగుబడి తగ్గి పురుగులు, తెగుళ్ల ఉద్ధృతి పెరుగుతుందని వ్యవసాయాధికారి రమేష్‌నాయుడు అన్నారు. మంగళవారం కాళ్ల మండలంలో పలు ప్రాంతాల్లో జింకు సమస్యను గుర్తించారు. రైతులు అధైర్యపడాల్సిన పనిలేదని వ్యవసాయాధికారుల సూచనలు పాటించి పంట దిగుబడి పెంచుకోవచ్చని సూచించారు. జింకు ధాతులోపం వచ్చినప్పుడు పై నుంచి 3 లేదా 4 ఆకుల్లో మధ్య ఈనే పాలిపోతుందని, దీనిని రైతులు గమనించాలన్నారు. దీనితోపాటు నాటిన 2-6 వారాల్లో ముదురాకు చివర్లలో, మధ్య ఈనే ఇరుపక్కల తప్పు, ఇటుక రంగు మచ్చలు కనిపిస్తాయన్నారు. చలి ఎక్కువగా ఉండే దాళ్వాలో లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయని తెలిపారు. దీని నివారణకు ప్రతి రబీ సీజన్‌లో ఎకరాకు 20కిలోల జింక్‌సల్ఫేట్ ఆఖరి దమ్ములో వేసుకోవాలన్నారు. పైరుపై లక్షణాలు కనిపిస్తే లీటరు నీటికి 2.0గ్రాముల జింక్ సల్ఫేట్, 5 గ్రాముల యూరియా కలిపి 5రోజుల వ్యవధిలో అవసరాన్ని బట్టి 2, 3 సార్లు పిచికారీ చేయాలని సూచించారు. భాస్వరం ఎరువులో జింక్ సల్ఫేట్ కలిపి కానీ, జింక్ సల్ఫేట్ ద్రావణంలో పురుగు, తెగుళ్ల మందు కలిపి వాడకూడదని చెప్పారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని ఆయన కోరారు.

(c) eenadu

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు అవకాశం

వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: వాసవీ పెనుగొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సుభాషిణి తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న బాలికలు ఫిబ్రవరి 19వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 95056 42277 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

నేడు గజమాల యాత్ర

మొగల్తూరు, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామికి సమర్పించే గజమాలతో బుధవారం యాత్ర నిర్వహించనున్నట్లు పల్లవసేన రాష్ట్ర అధ్యక్షుడు కొల్లాటి బాబూరావు తెలిపారు. కృష్ణాజిల్లా లక్ష్మీపురం పంచాయతీ పల్లవపాలెంలోఉదయం 10 గంటలకు యాత్ర ప్రారంభమవుతుందన్నారు. లోసరి, నాగిడిపాలెం, కాళీపట్నం, మొగల్తూరు, నరసాపురం మీదుగా అంతర్వేదిలో స్వామి ఆలయం వరకు యాత్ర కొనసాగుతందని తెలిపారు.

భద్రతా ఏర్పాట్లలో నిర్లక్ష్యం వద్దు: డీఎస్పీ

నిర్వాహకులకు సూచనలిస్తున్న శ్రీవేద అరవింద

నరసాపురం, న్యూస్‌టుడే: ప్రజా రవాణా పంటులో భద్రతా ఏర్పాట్లు పక్కాగా ఉండాలని.. ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వొద్దని డీఎస్పీ జి.శ్రీవేద అరవింద నిర్వాహకులకు సూచించారు. నరసాపురం పట్టణం- సఖినేటిపల్లి గ్రామాల మధ్య వశిష్ఠ గోదావరిపై నడిపే పంటు, రేవులను డీఎస్పీ మంగళవారం సందర్శించారు. పరిమితికి మించి ప్రయాణికులను అనుమతించొద్దని నిర్వాహకులకు సూచించారు. అవాంఛనీయ ఘటనలు, చోరీలు జరగకుండా చర్యలు చేపట్టాలని సీఐ బి.యాదగిరికి సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం : 80085 74504	ఆచంట: 90631 44737
పాలకొల్లు : 80085 74510	వాసవీ పెనుగొండ: 80085 74469
పోడూరు : 90631 44741	పెనుమంట్ర: 91212 29087

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? పూసర్ల రామరావు వీధిలో డ్రెయిన్లలో పూడిక సక్రమంగా తొలగించడం లేదు. మురుగు నిలిచిపోతోంది. - **కె. చంద్రశేఖర్, నరసాపురం**

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. -**పాత్రుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: ? నాగరాజు పేటకు వెళ్లే రహదారి పక్కనే చెత్త వేస్తున్నారు. వ్యర్థాలు కుళ్లి దుర్వాసన భరించలేకపోతున్నాం. -**రాము, స్థానికుడు**

✔ చెత్తను తొలగిస్తాం. -**పి.శ్రీనివాస్, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి**

మొగల్తూరు: ? కొత్తపాలెం-వెంప గ్రామాల మధ్య గొంతేరు డ్రెయినుపై ఉన్న వంతెన సమీపాన విద్యుత్తు స్తంభానికి పాదులు అల్లుకొని ప్రమాదకరంగా మారాయి. - **వెంకటరమణ**

✔ చర్యలు చేపడతాం. - **ప్రభాకరరావు, ఇన్‌ఛార్జి విద్యుత్తు ఏఈ**

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ? రామారావుపేటలో కొద్ది రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళ రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. - **చందు, పాలకొల్లు**

✔ మరమ్మతులు చేయిస్తాం. - **రాజ్‌కుమార్, పురపాలక డీఈ**

నేత్రపర్వం.. ప్రభ ఉత్సవం

నరసాపురం, పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం నాలుగో వార్డులో కొలువైన గంటాలమ్మ జాతరలో భాగంగా మంగళవారం అమ్మవారి ప్రభలతో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ట్రస్టు ఛైర్మన్ కృష్ణ భగవాన్ పూజలు చేసి ఊరేగింపును ప్రాంభించారు. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, ఏఎంసీ ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ తదితరులు అమ్మవారి ప్రభలను దర్శించుకున్నారు.

హనుమకు తమలపాకుల పూజలు

నరసాపురం పట్టణం, మార్టేరు, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణ పరిధి మొగల్తూరు రోడ్డులో, మార్టేరు జడ్ వంతెన వద్ద ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయాల్లో మంగళవారం అభిషేకాలు, తమలపాకుల పూజలు చేశారు. అనంతరం స్వామిని తమల పాకులతో పూలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

మార్టేరు: అలంకరణలో స్వామివారు

ఆంబోతుకు ఆలయం.. ఏటా వేడుకలు

మొగల్తూరు, న్యూస్‌టుడే: మొగల్తూరు మండలం పేరుపాలెంసౌత్‌లో ఆంబోతు ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం జరిపించి భక్తులకు అన్నసమారాధన చేశారు. కొన్ని దశాబ్దాల కిందట మొగల్తూరు, పరిసర గ్రామాల్లో సంచరించే ఆంబోతు పేరుపాలెంసౌత్‌కు చెందిన అందె పూర్ణచంద్రరావు కొబ్బరి తోటలో మృతిచెందింది. దీంతో ఆ రైతు అక్కడే గుడి నిర్మించి ఆబోతు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఏటా వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం వద్ద పొదల తొలగింపు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: కె.బేతపూడిలో అంగన్‌వాడీ కేంద్రం దుస్థితిపై ఈ నెల 26న 'అంగన్‌వాడీ.. స్వచ్ఛత కొరవడి' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఐసీడీఎస్ మొగల్తూరు సీడీపీవో బి.ఊర్మిళ, కొప్పర్రు సెక్టార్ పర్యవేక్షకురాలు పద్మావతి ఆ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించి ప్రాంగణంలో పిచ్చి మొక్కలు, పొదలు తొలగింపు పనులు చేయించారు.

లీకేజీ అరికట్టారు.. పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: పాలకొల్లు మండలం పూలపల్లిలో ఈడా వారి పేటకు వెళ్లే తాగునీరు 'వృథా..ఆగని ఆనే' శీర్షికతో గత నెల 26న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి పాలా శ్రీనివాసరావు స్పందించి పరిశీలించి పైపు లైనుకు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు.

కళాకారులను సత్కరించిన సభ్యులు

హాస్యంతో ఒత్తిడి దూరం

పాలకొల్లు సాంస్కృతికం, న్యూస్‌టుడే: పాలకొల్లులో క్షీరపురి కళాక్షేత్రం సంక్షేమ పరిషత్, రసధుని ఆధ్వర్యంలో హాస్యనాటక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన క్రియేటివ్ బృందం, జబర్దస్త్ నటుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం పరిషత్తు సభ్యులు మాట్లాడుతూ మంచి ఆరోగ్యం కోసం ఎప్పుడూ నవ్వుతూ ఉండాలన్నారు. హాస్య ప్రదర్శనలతో మనిషికి ఒత్తిడి దూరమై మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం కళాకారులను నిర్వాహకులు సత్కరించారు.

అడ్డగోలు వ్యయాలు.. లెక్కలకందని అక్రమాలు!

ఆలయాల్లో స్వాహా పర్వం

పాలకొల్లు, ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే

ఆలయాల్లో నిర్వహణ పనులు, రోజువారీ కార్యకలాపాల వ్యయాలను సైతం ఆదాయ మార్గాలుగా మలుచుకుంటున్నారు కొందరు అధికారులు, సిబ్బంది. ఏమాత్రం అవకాశం చిక్కినా అంతకంత ఖర్చులు చూపించి దేవుడి సొమ్మును స్వాహా చేస్తున్నారు. గత వైకాపా పాలనలో సమయానికి పాలకవర్గాలను నియమించకపోవడం, అధికారులకు స్థాయికి మించి బాధ్యతలు కట్టబెట్టడంతో కొందరికి అక్రమార్జన అలవాటుగా మారింది. పాలకొల్లు నియోజకవర్గంలోని పలు ఆలయాల్లో అడ్డగోలుగా నిధుల వ్యయాలు, నిబంధనల ఉల్లంఘనలు ఇటీవల వెలుగు చూశాయి.

● పాలకొల్లులో ఓ ప్రధాన ఆలయంలో కొబ్బరికాయలు కొట్టే బల్ల ఏర్పాటుకు చూపిన ఖర్చు అక్షరాలా రూ.2 లక్షలు. ఈ సొమ్ముతో కొబ్బరికాయలు పూర్తిగా ఒలిచే రెండు యంత్రాలు రెండు ఏర్పాటు చేయవచ్చని భక్తులు చలోక్తులు విసురుతున్నారు.

● ఇదే ఆలయంలో గతేడాది కార్తికమాసంలో అన్న ప్రసాదం వ్యయాలకు సంబంధించి కాకిలెక్కలు రాసి రూ.లక్షల్లో లోటు చూపిన వ్యవహారం అప్పట్లో తీవ్ర విమర్శలకు తావిచ్చింది.

ఇవిగో ఆనవాళ్లు..

● పాలకొల్లులో దేవాదాయశాఖకు సంబంధించిన ఒప్పంద ఉద్యోగాలను ఒక అధికారి తనకు కావాల్సినవారికే కట్టబెట్టారని ఆరోపణలున్నాయి.

● పాలకొల్లు పట్టణంలో ఒక దేవస్థానానికి చెందిన అధికారి తన ఇంటికి కావాల్సిన సరకులన్నీ దేవుడి ఖాతా నుంచే తీసుకెళ్తుంటారని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

● ప్రముఖులెవరైనా దేవస్థానాలకు దర్శనానికి వస్తే.. ఆ ముసుగులో రాసే ఖర్చులు అన్నీ ఇన్నీ కావని.. ఆ చిట్టా సర్వాంతర్యామికే తెలుసనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయంటే ఆలయాల్లో అవినీతి ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

● ఇదే పట్టణంలో మరో ఆలయంలో కల్యాణ మండపాన్ని అన్నదాన సత్రంగా చూపి పన్నులు ఎగవేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కల్యాణ మండపం అయితే వాణిజ్య విభాగంలో పన్నులు చెల్లించాలి. ఆదాయ, వ్యయాలకు లెక్కలు చూపాలి. అన్నదాన సత్రం అంటే ఆవేమీ ఉండవని నిర్వాహకుల ఆలోచన.

● యలమంచిలి మండలంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రామంలో ఆలయ భూముల్లో తగిన అనుమతులు లేకుండానే వాణిజ్య సముదాయాలు ఏర్పాటు చేశారు.

ప్రత్యక్షంగా చూసి.. సత్వరమే పరిష్కరించి

'ఈనాడు' ఆధ్వర్యంలో వాక్‌విత్ ప్రజారోగ్యాధికారి

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు పట్టణంలోని లజపతిరాయ్ పేట, బద్దావానిపేటల్లో పారిశుద్ధ్య, తాగునీటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు పురపాలక ఇన్‌ఛార్జి ప్రజారోగ్య అధికారి లక్ష్మణ్ దృష్టికి తీసుకువచ్చారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వాక్‌విత్ ప్రజారోగ్యాధికారి కార్యక్రమంలో ఆయన 27వ వార్డులో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు.

సమస్యలపై ఆరా తీస్తున్న ఇన్‌ఛార్జి ఎంహెచ్‌వో లక్ష్మణ్

ఈ సందర్భంగా పలు సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కార చర్యలు చేపట్టారు. వివరాలు ఇవీ..

? లజపతిరాయ్‌పేట, బద్దావానిపేటల్లో కొన్నిసార్లు కుళాయి నీరు రంగు మారి వాసన వస్తోంది. - **టి.పద్మావతి ఎల్‌ఆర్‌పేట, బి.మరియమ్మ (బద్దావానిపేట)**

? కొన్ని చోట్ల డ్రెయిన్లు పూడిపోయి దుర్వాసన వస్తోంది. - **పార్వతి (ఎల్‌ఆర్‌పేట)**

? ఎల్‌ఆర్‌పేటలో కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. -**సుబ్రహ్మణ్యం (ఎన్‌ఆర్‌పేట)**

? వార్డుల్లో మురుగు పారుదల సక్రమంగా లేని దోమల బెడద పెరిగింది. - **జి.నాగరాజు, బద్దావానిపేట, కె.కుమారి (ఎల్‌ఆర్‌పేట)**

? వార్డుల్లో కుక్కల బెడద అధికంగా ఉంది. రాత్రి వేళ గుంపులుగా సంచరిస్తూ పాదచారులు, ద్విచక్ర వాహనదారులపై దాడి చేస్తున్నాయి. - **మురళి (ఎల్‌ఆర్‌పేట)**

? ఖాళీ స్థలాల్లో పొదలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయి విష పురుగులు, పాములు సంచరిస్తున్నాయి. - **కె.ఉమాదేవి (లజపతిరాయ్‌పేట)**

» ఈ సమస్యలపై ప్రజారోగ్య విభాగం అధికారి స్పందించి పలు ప్రాంతాల్లో డ్రెయిన్లలో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. కొన్ని చోట్ల కుళాయి నీటి రసాయన పరీక్షలు చేశారు. ఖాళీ స్థలాల్లో పొదలు, వ్యర్థాలు తొలగించాలని వాటి యజమానులకు తాఖీదు జారీ చేయించారు. డ్రెయిన్లు, రహదారుల వెంబడి చెత్త లేకుండా చర్యలు చేపట్టారు.

పల్లెల అభివృద్ధికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నట్లు నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. యర్రంశెట్టిపాలెంలో రూ.22 లక్షలతో ఆయుష్ ఆసుపత్రి నిర్మాణానికి, రూ.20 లక్షలతో శ్మశానవాటిక అభివృద్ధి పనులకు ఆయన మంగళవారం తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, సర్పంచి యర్రంశెట్టి నాగముత్యమాంబ బాబులతో కలిసి శంకుస్థాపన చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలని అధికారులకు సూచించారు. ఏఎంసీ మాజీ వైస్‌ఛైర్మన్ యర్రంశెట్టి బాబులు, ఎంపీటీసీ సభ్యురాలు ఆకన శ్రీదేవి చంద్రశేఖర్, ఉప సర్పంచి తెలగంశెట్టి శ్రీదేవి వాసు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శంకుస్థాపన పూజల్లో నాయకర్

మొగల్తూరు: నియోజకవర్గంలో ప్రజలందరికీ శుద్ధి జలాలు అందించడమే ధ్యేయంగా కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే నాయకర్ తెలిపారు. వారథిపల్లో రూ.26.20 లక్షలతో నిర్మించనున్న తాగునీటి ట్యాంకు, రూ.5 లక్షలతో చేపట్టిన కాలువ రేవు పనులకు ఆయన మంగళవారం భూమిపూజ చేశారు. సర్పంచి తిరిమాని శాంతకుమారి, ఉపసర్పంచి దొంగ సత్యనారాయణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మహనీయుల బాటలో నడుద్దాం

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లులో విద్యా వికాస వేదిక ఆధ్వర్యంలో స్థానిక పెన్షనర్ల భవనంలో రచయిత సయ్యద్ నసీర్ అహ్మద్ రచించిన 'అల్లూరికి అండగా నిలిచిన ముజాహిదీన్ - మదీనా' పుస్తకాన్ని మంగళవారం వైద్యుడు కేఎస్‌పీఎన్ వర్మ, వేదిక సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన మహనీయుల ఆశయ సాధనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధికి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సభ్యులు వంగా నరసింహారావు, షేక్ వీరసాహెబ్, కృష్ణప్రసాద్, పెద్దిరాజు, ఎండీ జానీ, భాస్కరరావు, షేక్ బాజీ పాల్గొన్నారు.

పుస్తకాలు ఆవిష్కరించిన సభ్యులు

మత్స్యకారుల సమస్యలపై మంత్రికి వినతి

నరసాపురం, న్యూస్‌టుడే: మత్స్యకారుల సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని కోరుతూ బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత, ఆ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణలకు మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు మంగళవారం వినతిపత్రాలు అందించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వారిని కలిసి మత్స్యకార గ్రామాల్లో సమస్యలను వివరించినట్లు పెద్దిరాజు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

కళావేదికను ప్రారంభిస్తున్న సర్పంచి నాగముత్యమాంబ

దాతల చేయూతతో విద్యాభివృద్ధి

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న చేయూత అభినందనీయమని యర్రంశెట్టిపాలెం సర్పంచి యర్రంశెట్టి నాగముత్యమాంబ బాబులు అన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కోలపర్తి శ్రీనివాస్ తన భార్య జ్ఞాపకార్థం నిర్మించిన కళావేదికను పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా ఆమె మంగళవారం ప్రారంభించారు. ఉపాధ్యాయులందరూ అంకిత భావంతో పనిచేస్తుండటంతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు., ఏఎంసీ మాజీ వైస్-ఛైర్మన్ యర్రంశెట్టి బాబులు, ఉప సర్పంచి తెలగంశెట్టి శ్రీదేవి వాసు, పాఠశాల హెచ్ఎం కోలపర్తి శ్రీనివాస్, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ కూనపరెడ్డి గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొలగించకుంటే తిప్పలే!

జిన్నూరు (పోడూరు), న్యూస్‌టుడే: పోడూరు మండలంలో జగన్నాథపురం వద్ద ప్రారంభమై పోడూరు, మట్టపర్రు, పెనుమదం, ఎస్‌ఆర్‌ఆర్ పేట, రాజులగరువు, మేడపాడు, కాజ, కంగుపూడి గ్రామాల మీదుగా ప్రవహించే బాల మురుగు కాలువ ఇది. దీని పొడవున పిచ్చి మొక్కలు, పొదలు పెరిగి డ్రెయిన్‌ను కప్పేశాయి. దీనికి తోడు చాలా ఏళ్ల నుంచి పూడిక తీయకపోవడంతో ఎక్కడికక్కడ మట్టిదిబ్బలు వేశాయి. పోడూరు పరివాహక గ్రామాల పరిధిలో పూడిక ఎక్కువగా ఉంది. దీంతో అధిక వర్షాలు, వరదల సమయంలో పొలాలు ముంపు బారిన పడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వచ్చే వేసవిలో ప్రక్షాళన పనులు చేపట్టకపోతే మరోసారి ముంపు ముప్పు తప్పదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై డ్రెయిన్ల శాఖ ఏఈ దుర్గాప్రసాద్ స్పందిస్తూ ఈ ప్రాంతంలో డ్రెయిన్ల ప్రక్షాళన పనులు చేయించే దిశగా మంత్రి నిమ్మల రామానాయుడు ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు.

పొగ.. ప్రమాదాల సెగ!

మొగల్తూరు, న్యూస్‌టుడే: మొగల్తూరు- మత్స్యపురి మధ్య నల్లవారితోట సమీపాన ఉన్న మలుపు వాహనదారుల పాలిట ప్రమాదకరంగా మారింది. మొగల్తూరు పరిధిలో సేకరించిన చెత్తను ఈ రహదారి వెంబడి వేస్తున్నారు. ఇటీవల నరసాపురం పట్టణ పరిధిలో వ్యర్థాలను కొంతమేర ఇక్కడ దిగుమతి చేశారు. దీంతో కుప్పలుగా పేరుకుపోయిన వ్యర్థాలకు నిప్పు పెడుతుండటంతో నిత్యం పొగ వెలువడుతూ రహదారిని కమ్మేస్తోంది. దీంతో రాత్రి వేళ ఎదురుగా వచ్చే వాహనాలు సమీపించే వరకు కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యను నరసాపురం పురపాలక కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వ్యర్థాలు చేరి.. అధ్వానంగా మారి

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు పట్టణ పరిధిలో సాయిబాబా ఆలయం నుంచి టిడ్కో గృహ సముదాయాలకు వెళ్లే మార్గానికి ఇరువైపులా చెత్త వేయడంతో ఆ ప్రాంతం అధ్వానంగా మారింది. ఈ వ్యర్థాలు క్రమంగా నరసాపురం ప్రధాన కాలువలోకి చేరి జలాలు కలుషితమవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. దుర్వాసనతో టిడ్కో గృహ సముదాయాలకు రాకపోకలు సాగించే వారు ఇబ్బంది పడుతున్నారు. ఈ అంశంపై పురపాలక ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య అధికారి లక్ష్మణ్ స్పందిస్తూ పరిశీలించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయిస్తామని చెప్పారు.

ఆదరణ చూసి ఓర్వలేకే విమర్శలు: తెదేపా

వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ పాలనలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రజల నుంచి వసున్న ఆదరణ చూసి ఓర్వలేకే వైకాపా నాయకులు ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని తెదేపా మండల అధ్యక్షుడు గుత్తుల లోకేశ్ ధ్వజమెత్తారు. స్థానిక తెదేపా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఎంసీ ఛైర్మన్ బడేటి బ్రహ్మాజీ, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి ఉప్పలపాటి చంటి, పార్టీ గ్రామ స్థాయి అధ్యక్షులు, కార్యదర్శులు, అనుబంధ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వలాభం కోసమే దుష్ప్రచారం

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేసి ప్రజలకు అందుబాటులో ఉంటున్న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుపై దుష్ప్రచారాలు చేయడం సరికాదని శివదేవునిచిక్కాల సర్పంచి దిడ్ల మణివజ్రం అన్నారు. గ్రామంలో కూటమి నాయకులతో కలిసి మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామానికి చెందిన శ్రీనివాస్ తన స్వలాభం కోసం మంత్రిపై అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు.

రహదారి ప్రమాదంలో గాయాలు

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో ఓ వ్యక్తి గాయాలయ్యాయి. పట్టణ ఏఎస్సై చింతపల్లి సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళగుంటపాలేనికి చెందిన బందెల రోహిత్ ఈ నెల 24న రాత్రి ద్విచక్రవాహనంపై సీతారామపురం నుంచి నరసాపురం వస్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో రోహిత్‌కు గాయాలయ్యాయి. ఆయన్ను కుటుంబ సభ్యులు ప్రాంతీయ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి వచ్చిన సమాచారం మేరకు మంగళవారం కేసు నమోదు చేశామని ఏఎస్సై తెలిపారు.

పాలకొల్లు: నినాదాలు చేస్తున్న సిబ్బంది

బ్యాంకు ఉద్యోగుల ఆందోళన

పాలకొల్లు మార్కెట్, నరసాపురం, న్యూస్‌టుడే: డిమాండ్ల పరిష్కారం కోరుతూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ ఆధ్వర్యంలో బంద్ ప్రకటించడంతో మంగళవారం అన్ని ప్రాంతాల్లో జాతీయ బ్యాంకులు మూతపడ్డాయి. ఆయా సంఘాల నాయకులు పాలకొల్లు, నరసాపురం పట్టణాల్లో బ్యాంకు శాఖల వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అయిదు రోజుల పనిదినాల హామీని ఇప్పటి వరకు అమలు చేయకపోవడంతో సమ్మె చేపట్టాల్సి వచ్చిందన్నారు.

పశువైద్యశాలకు రాష్ట్రస్థాయి అవార్డు

వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: వాసవీ పెనుగొండ మండల ప్రాంతీయ పశువైద్యశాల జోన్-2 పరిధిలో ఉత్తమ పనితీరు కనబరిచి రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఎంపికైంది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం గుంటూరులో ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఈ ఆసుపత్రి అధికారులు, సిబ్బంది ముఖ్య కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరావు నుంచి అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆ శాఖ సహాయ సంచాలకులు బొడ్డు ప్రసాద్ స్థానిక పశువైద్యశాలకు వచ్చి సిబ్బందిని అభినందించారు.

వీడ్కోలు వేడుక.. మధుర స్మృతుల వేదిక

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలను నిర్వహించారు. నరసాపురంలో టేలర్, ఎస్ఎన్ఎస్ పురపాలక ఉన్నత పాఠశాలల్లో జరిగిన వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

మొగల్తూరు, న్యూస్‌టుడే: మొగల్తూరులో పెన్మత్స రంగరాజు జడ్పీ, ముత్యాలపల్లిలోని బండిముత్యాలమ్మ జడ్పీ ఉన్నత, కేపీపాలెం జడ్పీఉన్నతపాఠశాలల్లో ప్రధానోపాధ్యాయ అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో పది, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు పలికారు.

మొగల్తూరు: విద్యార్థినుల నృత్య ప్రదర్శన

పోడూరు, న్యూస్‌టుడే: పండితవిల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన వేడుకలో బాలికల నృత్యం, బాలుర లఘు నాటిక ప్రదర్శన ఆకట్టుకున్నాయి. జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలను గుర్తుపెట్టుకోవాలని విద్యా కమిటీ ఛైర్‌పర్సన్ పితాని దుర్గ కోరారు.

నరసాపురం: ఎస్ఎన్ఎస్ పురపాలక పాఠశాల విద్యార్థులు

అన్న క్యాంటీన్ సిద్ధం

ఆచంట, న్యూస్‌టుడే: శ్రామికులతో పాటు వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు వచ్చే సామాన్యుల ఆకలి తీర్చడమే ధ్యేయంగా ఏర్పాటైన అన్న క్యాంటీన్లు గ్రామీణ ప్రాంతాలకూ విస్తరిస్తున్నాయి. జిల్లాలో పట్టణ ప్రాంతాల్లో ఇప్పటికే 9 క్యాంటీన్లు ఉండగా కొత్తగా నియోజకవర్గ కేంద్రాలైన ఆచంట, ఉండిలో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఆచంటలో నిర్మాణం పూర్తవగా ప్రస్తుతం తుది మెరుగులు దిద్దుతున్నారు. ఆచంటలో మరో వారం పది రోజుల్లో అన్న క్యాంటీన్ అందుబాటులోకి వస్తుందని ప్రజారోగ్యశాఖ డీఈ విజయ్ తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన అన్ని క్యాంటీన్లను ఒకేసారి ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

నమోదైతేనే రాయితీలు!

క్షేత్ర పరిశీలన ద్వారా ఈ-పంట

పొలం వద్ద వివరాలను ఆన్‌లైన్ చేస్తున్న అధికారులు

ఆచంట, న్యూస్‌టుడే: నరసాపురం డివిజన్ పరిధిలోని ఆచంట, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల్లో రబీ వరి నాట్లు చివరి దశకు వచ్చాయి. దీంతో వ్యవసాయాధికారులు ఈ- పంట నమోదును వేగవంతం చేశారు. ఈ ప్రక్రియ డిసెంబరులో మొదలైనా ఇప్పటి వరకు 15 శాతం మాత్రమే పూర్తయింది. దీనిని వచ్చే నెల 15వ తేదీ నాటికి పూర్తి చేయాల్సి ఉంది. గతంలో సాగుదారులు రైతు సేవా కేంద్రాలకు వెళ్తే సరిపోయేది. ఇప్పుడు సిబ్బంది క్షేత్ర పరిశీలన చేసి పొలం వద్దే రైతు ఫొటోతో సహా వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నారు.

తప్పనిసరి.. ఈ-పంట నమోదు ఆధారంగానే ధాన్యం కొనుగోలు సమయంలో అనుమతి ఇస్తున్నారు. భవిష్యత్తులో ఏ రైతుకు ఎంత యూరియా ఇవ్వాలనేది కూడా వీటి ఆధారంగానే నిర్ణయిస్తారు. పంటల నష్ట పరిహారం, బీమా చెల్లింపులు, రాయితీపై వ్యవసాయ పరికరాలు, యంత్రాలు అందించడానికి ఈ-పంట వివరాలనే ప్రామాణికంగా తీసుకొనేలా ప్రణాళిక అమలు చేస్తున్నారు. ఆచంట, పోడూరు, పాలకొల్లు మండలాల్లో 30 వేల ఎకరాల్లో వరిసాగవుతుండగా.. అన్ని చోట్లా ఈ పంట నమోదు వేగంగా జరుగుతోందని.. రైతు పొలాన్ని గుర్తించి ఓటీపీ ద్వారా ప్రక్రియ పూర్తి చేస్తున్నామని ఏడీఏ మురళీకృష్ణ తెలిపారు.

అక్రమార్కులపై చర్యలేవీ?

వాసవీ పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: నడిపూడి పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై ఆధారాలతో సహా జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సరికాదని కూటమి నాయకులు పేర్కొన్నారు. మంగళవారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రస్తుత సర్పంచి, కార్యదర్శి కలిసి గ్రామాభివృద్ధికి ఉపయోగించాల్సిన నిధులను సొంత ఖాతాలకు మళ్లించిన తీరుపై నాలుగు నెలల కిందట జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై విచారణ జరిపినా నివేదిక సమర్పించకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోతే పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన చేపడతామన్నారు.

నిధుల దుర్వినియోగంపై పత్రాలు చూపుతున్న కూటమి నాయకులు

సేకరించి.. విజ్ఞానం పంచి!

విదేశీ కరెన్సీ, నాణేలు, స్టాంపులతో ప్రదర్శన

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: అయిదేళ్ల వయసులో చిగురించిన ఆసక్తి.. అభిరుచిగా మారి దేశ, విదేశాలకు చెందిన వందల కొద్దీ నాణేలు, అరుదైన స్టాంపులు సేకరించేలా చేసింది. నరసాపురం పట్టణ పరిధి కప్పలపేటకు చెందిన పాముల వనిత జ్యోతి ఎంబీఏ పూర్తి చేసి ఫైనాన్స్ మేనేజ్‌మెంట్‌లో డాక్టరేట్ పొందారు. ప్రైవేటు కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేసిన ఈమె ప్రస్తుతం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. గత 30 ఏళ్లుగా వివిధ దేశాలకు చెందిన కరెన్సీ, నాణేలు, స్టాంపులు సేకరించారు. వీటి విశేషాలు, ప్రత్యేకతలు విద్యార్థులకు తెలియజేయాలనే యోచనతో గణతంత్ర దినోత్సవం సందర్భంగా పట్టణంలోని జె.సికిలే పాఠశాల మైదానంలో ప్రదర్శన నిర్వహించారు.

విదేశీ నాణేలు తిలకిస్తున్న విద్యార్థులు

ఇలా మొదలై..

చిన్నతనంలో అమ్మ ఇచ్చిన నాణేలు, కరెన్సీ నోట్లు, స్టాంపులు దాచుకోవటంతో ఈ అలవాటు మొదలైందని, అప్పటి నుంచి ఇప్పటి వరకు 34 విదేశాలకు చెందిన 110 కరెన్సీ నోట్లు, 88 దేశాలకు చెందిన 1100 నాణేలు, 28 దేశాలకు చెందిన 100కు పైగా స్టాంపులు సేకరించానని వనిత జ్యోతి చెప్పారు. రాబోయే రోజుల్లో పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థల సౌజన్యంతో వీటితో అన్ని ప్రాంతాల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తానని తెలిపారు. అన్ని దేశాలకు చెందిన కరెన్సీ, నాణేల సేకరణే లక్ష్యంగా ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు.

ముంపుతో సాగుకు దూరం

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: ఎల్బీచర్ల, యర్రంశెట్టిపాలెం గ్రామాల పరిధిలోని వందలాది ఎకరాల పొలాలను ముంపు సమస్యతో సాగు చేయలేని పరిస్థితి ఏర్పడిందని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్బీచర్లలో మంగళవారం సమావేశమైన రైతులు ముంపు సమస్యను అనేకసార్లు ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం దిశగా చర్యలు చేపట్టడం లేదన్నారు. ఈ అంశంపై రైతులంతా సంఘటితమై ప్రజా ప్రతినిధులు, అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని సమావేశం తీర్మానించింది. సహకార సంఘ అధ్యక్షుడు గుబ్బల వీరాస్వామి పాల్గొన్నారు.

(c) eenadu

తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు: ఆరిమిల్లి

తణుకు, న్యూస్‌టుడే: మంత్రి లోకేశ్ సారథ్యంలో రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సుగమం అయ్యాయని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర ప్రారంభించి మూడేళ్లు పూర్తయిన నేపథ్యంలో మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి రాకముందు లోకేశ్ యువగళం పాదయాత్ర చేపట్టి 226 రోజుల పాటు 3132 కి.మీ. మేర రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ధ్యేయంతో అయిదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకువచ్చి పరిశ్రమలు నెలకొల్పేందుకు తన వంతు కృషి చేస్తున్నారని చెప్పారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

తణుకు, ఇరగవరం, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తణుకు మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ పేర్కొన్నారు. బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.మహాలక్ష్మి ఆధ్వర్యంలో పట్టణంలోని చర్చి పాస్టర్లు, మసీదు ఇమామ్‌లు, దేవాలయాల పూజారులకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ★ బాల్యవివాహాలతో కలిగే అనర్థాలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఇరగవరం మండల పరిషత్తు కార్యాలయంలో పురోహితులకు, పాస్టర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు చేయబోమని ప్రతిజ్ఞ చేయించారు. డీఎస్‌పీ యూనిట్ కౌన్సిలర్ సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు డీపీ మాణిక్యాంబ, ఎం.అరుణ కుమారి, ఎస్సై శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : అత్తిలి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో కొలువైన అయ్యప్పస్వామివారికి మంగళవారం ఆలయ అర్చకులు వాడపల్లి సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని రకరకాల పుష్పాలు, పండ్ల రసాలతో అభిషేకించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

పవనసుతుడికి తమలపాకుల సేవ

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి పెద్ద వంతెన వద్ద పంచముఖ ఆంజనేయుడికి మంగళవారం ఆలయ అర్చకులు వాడపల్లి రామాచార్యులు తమలపాకులతో ప్రత్యేక పూజలు, వివిధ రకాల పండ్లతో విశేష అభిషేకాలు నిర్వహించారు. స్వామికి రకరకాల పుష్పాలు, తమలపాకులతో విశేషంగా అలంకరణ చేశారు.

పాస్ పుస్తకాల్లో తప్పులు సవరిస్తాం

ఇరగవరం, న్యూస్‌టుడే: కంతేరులో మంగళవారం రెవెన్యూ సభ నిర్వహించారు. పట్టాదారు పాస్ పుస్తకాల్లో తప్పులుంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ ఎం.సుందరరాజు కోరారు. రికార్డులు పరిశీలించి, తప్పులు సవరించి కొత్త పుస్తకాలు అందిస్తామన్నారు. గ్రామ పరిధిలో భూములున్న జుత్తిగ, మల్లిపూడి పరిసర గ్రామాల రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. వీఆర్వోలు, సర్వేయర్లు అందుబాటులో ఉండి సమస్య పరిష్కరిస్తారని వివరించారు.

జీవన ఎరువుల వాడకంపై అవగాహన

ఇరగవరం, న్యూస్‌టుడే: వరి పంటలో జీవన ఎరువులు, జీవ రసాయనాలు వాడకం ద్వారా సాగు ఖర్చు తగ్గించుకుని అధిక దిగుబడి సాధించవచ్చని ఉత్తమ రైతు అవార్డు గ్రహీత కుక్కల వెంకన్న రైతులకు సూచించారు. వ్యవసాయాధికారి వై .రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో యర్రాయిచెరువులో మంగళవారం పొలంబడి నిర్వహించారు. పొలంగట్టుపై వివిధ రకాల కూరగాయలు, బంతి పూలను పండించడం ద్వారా అదనపు ఆదాయం లభిస్తుందని వివరించారు.. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వంతులోనూ వృథా!

అధ్వాన స్థితిలో షట్టర్లు

తణుకు, న్యూస్‌టుడే

పంట పొలాలకు సాగు నీరు అందించేందుకు ఏర్పాటు చేసిన లాకులు, షట్టర్లు తుప్పు పట్టడంతో వంతులవారీ విధానంలోనూ సాగునీరు వృథాగా పోతోంది. ఏళ్ల తరబడి వాటి నిర్వహణ కొరవడటంతో సక్రమంగా పనిచేయక పలు చోట్ల పంట పొలాలు, లోతట్టు గ్రామాలు జలమయమవుతున్నాయి. మరి కొన్ని చోట్ల నీరు వృథాగా పోయి పొలాలకు నీరందక బీటలు వారుతున్నాయి.

★ ఏటా రబీ సీజన్‌లో గోదావరిలో నీటిలభ్యత తక్కువ ఉండటంతో రైతులు ఉన్న నీటిని సక్రమంగా వినియోగించుకునేలా వంతుల వారీ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ఈ తరుణంలో కాలువపై ఉన్న లాకులు, షట్టర్లు శిథిలమైపోవడంతో నీరు వృథాగా పోతోంది. దీంతో సాగునీటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

నరసాపురం బ్రాంచ్ కాలువైన ఉండ్రాజవరం పంటకాలువ సుమారు 11 కి.మీ. మేర ప్రవహిస్తూ దాదాపు 5 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తుంది. కొన్నేళ్లుగా నిర్వహణ సక్రమంగా చేపట్టకపోవడంతో కాలువలో బురద పేరుకుపోయింది. దీనిపై ఉన్న జంగంచెరువు ప్రాంతంలో ఉన్న షట్టరు విరిగిపోగా, కాలువ శివారున ఉన్న షట్టరు పూర్తిగా శిథిలమైంది.

ఏటా ప్రతిపాదనలతో.. ఏళ్ల తరబడి సేవలు అందిస్తున్న లాకులకు ఏటా నిర్వహణ పనులు చేపట్టి అవసరమైన చోట్ల మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. గత ప్రభుత్వ హయాంలో వాటి ఊసేలేకుండా పోవడంతో నేడు మరమ్మతులు చేసేందుకు కూడా వీలులేని దుస్థితి నెలకొంది. అప్పట్లో ఏటా అధికారులు ప్రతిపాదనలు చేస్తున్నా నిధులు విడుదల చేయకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. కూటమి ప్రభుత్వంలోనైనా తమ సమస్యలు పరిష్కారమవుతాయని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

అత్తిలి మండలంలోని గుమ్మంపాడు లాకుల గేట్లు తుప్పు పట్టి ఏళ్లు గడుస్తున్నాయి. దీనిపై సుమారు 41500 ఎకరాల ఆయకట్టు ఆధారపడి ఉన్నా ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు.

'పలు చోట్ల నూతన షట్టర్లు ఏర్పాటు చేశాం, మరి కొన్నింటికి నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం' అని జలవనరుల శాఖ డీఈ శ్రీనివాస్ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	99498 53114
తణుకు	85558 50851
తణుకు గ్రామీణం	63005 79402
అత్తిలి	91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? రామారావుపేటలోని మిర్యాల వారి వీధిలో మురుగుబోదె నిండి భరించలేని దుర్వాసన వస్తోంది. - ఫణీంద్రకుమార్

✔ నీరు సాఫీగా ముందుకు సాగేలా చర్యలు చేపడతాం. - సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

? తాడేపల్లిగూడెం వెంకటేశ్వర నగర్‌లోని ఒకటో రోడ్డులో కల్వర్టు పలకలు పగిలి ప్రమాదకరంగా మారాయి. - వినయ్

✔ చర్యలు చేపడతాం. -ఎం.ఏసుబాబు, పురపాలక కమిషనర్

నివాళులర్పిస్తున్న ఎలక్ట్రీషియన్లు

మానవాళికి వెలుగు ప్రసాదించిన ఎడిసన్

తణుకు, న్యూస్‌టుడే: చీకట్లో మగ్గిపోతున్న మానవాళికి వెలుగును ప్రసాదించిన శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిసన్ విద్యుత్తు బల్బును కనుగొన్న రోజును ఎలక్ట్రీషియన్ డేగా నిర్వహించుకుంటామని తణుకు లైసెన్స్‌డ్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అండ్ వర్కర్స్ (ఆప్రటెక్) వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కేతా విజయ కుమార్, బళ్ల నాని పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్ డే వేడుకల్లో భాగంగా మంగళవారం స్థానిక తణుకు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆవరణలో థామస్ అల్వా ఎడిసన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎలక్ట్రీషియన్ జెండా ఎగురవేసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు యు.రామారావు, యు.జాన్, సహాయ కార్యదర్శి కె.పోతురాజు, మాజీ కార్యదర్శి వి.రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు సభ

చిన్నారుల నృత్యం

తాళ్లముదునూరుపాడు(తాడేపల్లి గూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పట్టణంలోని తాళ్లముదునూరుపాడు మాగంటి అన్నపూర్ణదేవి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్నాలో బ్యాంకు ఉద్యోగులు

డిమాండ్ల సాధనకు నిరంతర పోరాటం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు నిరంతరం ప్రభుత్వంతో పోరాడతామని తాడేపల్లిగూడెం బ్యాంకు ఉద్యోగుల కో-ఆర్డినేషన్ కమిటీ హెచ్చరించింది. బ్యాంకు ఉద్యోగులకు వారంలో 5 రోజుల పనిదినాలు అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు మంగళవారం సమ్మె చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని బ్యాంకులను మూసివేసి సుమారు 400 మంది ఉద్యోగులతో భారీ ర్యాలీ నిర్వహించారు. స్టేట్‌బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ రామ్‌ప్రసాద్, యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజినల్ సెక్రటరీ బి.దివ్య రజని మాట్లాడుతూ సిబ్బంది కొరత కారణంగా రాత్రి 8 గంటల వరకు పనిచేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నాలో నాయకులు మానుకొండ కిరణ్, శిల్ప, బి.ఏడుకొండలు, లింగంపల్లి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

12న జాతీయ సమ్మె విజయవంతానికి పిలుపు

గోడపత్రాలను చూపుతున్న కార్మికులు

తణుకు, న్యూస్‌టుడే: ఫిబ్రవరి 12న లేబర్ కోడ్స్ కోసం జరిగే జాతీయ సమ్మెలో ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్ కోరారు. మంగళవారం పట్టణంలో సీఐటీయూ అనుబంధ సంఘాలకు ప్రతాప్ ఆధ్వర్యంలో సమ్మె నోటీసులు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు యన్.చిన్నారావు, సురేష్, నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉత్తమ భవిష్యత్తు

ఇరగవరం: విజేతలతో అధికారులు, నాయకులు

ఇరగవరం, అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి భవిష్యత్తుతో ఉన్నత స్థితికి చేరాలని మండల విద్యాశాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. ఇరగవరం, రేలంగి ఉన్నత పాఠశాలల్లో మంగళవారం వార్షికోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయినులు జి.నాగమణి, ఆర్.మణిభారతి, విద్యాకమిటీ ఛైర్మన్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు. ★ అత్తిలి మండలం బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. పలు అంశాల్లో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు కూటమి నాయకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ ప్రగడ శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ రాచపోతు వెంకట సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



బల్లిపాడు: విద్యార్థినుల నృత్య ప్రదర్శన

అధికారుల బాధ్యతారాహిత్యం తగదు: ఘంటా

మాట్లాడుతున్న జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో కొందరు అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుండటం తగదని జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అసహనం వ్యక్తం చేశారు. స్థానిక జిల్లా పరిషత్తు కార్యాలయంలో ఏలూరు, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల డీపీవోలు, డీఎల్పీవోలతో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల డీపీవోలు గైర్హాజరవడంపై ఛైర్‌పర్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామాల్లో పారిశుద్ధ్య లోపాలు, చెత్త డంపింగ్, వ్యర్థాల నిల్వలు తదితరాలపై దృశ్య రూపకం ప్రదర్శించారు. ఆమె మాట్లాడుతూ.. పల్లెల పరిశుభ్రతకు అధికారులు పెద్దపీట వేయాలని ఆదేశించారు. సీఈవో ఎం.శ్రీహరి, డీపీవో కె.అనురాధ, డీఎల్పీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గజమాల యాత్ర

మొగల్తూరు, న్యూస్‌టుడే: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామికి సమర్పించే గజమాలతో బుధవారం యాత్ర నిర్వహించనున్నట్లు పల్లవసేన రాష్ట్ర అధ్యక్షుడు కొల్లాటి బాబూరావు తెలిపారు. కృష్ణాజిల్లా లక్ష్మీపురం పంచాయతీ పల్లవపాలెం లో ఉదయం 10 గంటలకు యాత్ర ప్రారంభమవుతుందన్నారు. లోసరి, నాగిడిపాలెం, కాళీపట్నం, మొగల్తూరు, నరసాపురం మీదుగా అంతర్వేదిలో స్వామి ఆలయం వరకు యాత్ర కొనసాగుతుందని తెలిపారు.

వణికిస్తున్న వారధి

రెయిలింగ్ కూలిన వంతెన

మండపాక (తణుకు గ్రామీణం), న్యూస్‌టుడే: తణుకు మండలం మండపాక గ్రామం నుంచి వేల్పూరు, గుమ్మంపాడు వెళ్లే రహదారిలో మడుగు కాలువపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. దీనికి తోడు వంతెనకు ఉన్న రెయిలింగ్ పూర్తిగా కూలిపోవడంతో అటుగా రాకపోకలు సాగించేందుకు చోదకులు హడలిపోతున్నారు. మండపాకలో ఉన్న అనేక పరిశ్రలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో నిత్యం ఉద్యోగులు, రైతులు వందల సంఖ్యలో ఇటుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ విద్యుత్తు దీపాలు లేక రాత్రి సమయాల్లో ప్రయాణం సాగించాలంటే చోదకులు పడే అవస్థలు అన్నీ ఇన్నీ కావు. దీనిపై పంచాయితీరాజ్ ఏఈ సత్యరుషి స్పందిస్తూ వంతెన నిర్మాణానికి రూ.80 లక్షల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని తెలిపారు.

చోదకా.. ఇదేం తీరు

తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పోలీస్ ఐలాండ్ వద్ద కొందరు ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో కొన్నిసార్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. బస్టాండ్ నుంచి వచ్చే వాహనాలు తణుకు వైపు లేదా మినీ బైపాస్ మీదుగా భీమవరం వైపు వెళ్లాలి. కానీ కొందరు నేరుగా రోడ్డు దాటుతుండటంతో ఏలూరు వైపు నుంచి తణుకు వైపు వెళ్లే వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ట్రాఫిక్ సిబ్బంది రక్షణ ఏర్పాటు చేసినా జాగ్రత్తలు పాటించడం లేదు. పెద్ద ప్రమాదం జరగక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

దుర్వాసన భరించలేకున్నాం

అపరిశుభ్రంగా సామూహిక మరుగుదొడ్లు

వేల్పూరు (తణుకు గ్రామీణం), న్యూస్‌టుడే: తణుకు మండలం వేల్పూరులోని పాండురంగడు వీధిలో ఉన్న సామూహిక మరుగుదొడ్ల వద్ద అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. గ్రామంలో సేకరించిన చెత్తను ఇక్కడ వేస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. ప్రస్తుతం బురద, తుప్పలు, పిచ్చి మొక్కలతో కనిపిస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై డిప్యూటీ ఎంపీడీవో నరసింహమూర్తి స్పందిస్తూ పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.

పాఠశాల ఆవరణలో పశువుల సంచారం

తాడేపల్లిగూడెం టూటౌన్, న్యూస్‌టుడే : కడకట్ల ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో పశువులు సంచరిస్తున్నాయి. వీటితో పాటు ఆంబోతులు వస్తుండటంతో అవి పిల్లలపై దాడి చేసే అవకాశం ఉంది. అధికారులు స్పందించి పశువులు లోపలికి రాకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

తూడు.. రైతుల గోడు

పంట కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

తణుకు, న్యూస్‌టుడే: తణుకు పట్టణంలో ప్రవహించే ఉండ్రాజవరం పంట కాలువలో పలు చోట్ల గుర్రపుడెక్క పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది. ప్రస్తుతం అన్నదాతలు వరినాట్లు వేసి మందులు చల్లుతున్న సమయంలో పొలాలకు నీరు అధికంగా అందించాల్సి ఉంటుంది. ఇటువంటి సమయంలో నీరు సక్రమంగా అందకపోతే దిగుబడిపై ప్రభావం చూపుతుందని వారు ఆవేదన చెందుతున్నారు. కాలువలో తూడు తొలగించి సాగుకు నీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటామని జలవనరుల శాఖ ఏఈ మురళీకృష్ణ తెలిపారు.

ఉచిత గుండె పరీక్షలు

తాళ్లముదునూరుపాడు (తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం తాళ్లముదునూరుపాడులోని బాల వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక చైతన్య ఎమర్జెన్సీ ఆసుపత్రి నిర్వాహకుడు సోమేశ్వరరావు సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. విజయవాడ కామినేని ఆసుపత్రి వైద్యులు పాల్గొని సుమారు 500 మందికి టూడీ ఎకో, ఈసీజీ, రక్తపోటు, మధుమేహ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా సుమారు రూ.3 లక్షల విలువైన మందులు అందించారు. కార్యక్రమంలో వైద్యులు పాండురంగారావు, కె.వెంకటేశ్వరరావు, బి.దివ్యశ్రీ, పి.వినతి, ఆసుపత్రి సిబ్బంది, రెడ్డి కమ్యూనిటీ నాయకులు కర్రి శ్రీనివాస్‌రెడ్డి, పోశంశెట్టి లక్ష్మి, నల్లిమిల్లి విజయానందరెడ్డి, కర్రి సురేష్‌రెడ్డి, వెలగల లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

ఆరుగొలను(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: మండలంలోని పశు ఆరోగ్యవైద్య శిబిరాన్ని ఆరుగొలనులో పశువైద్యుడు సునీల్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు నట్టల టీకాలు వేశారు. కార్యక్రమంలో ఆరుగొలను సొసైటీ ఛైర్మన్ వీరవెంకట సత్యనారాయణ, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : అత్తిలి మండలం మంచిలి నుంచి పెనుమంట్ర మండలం నత్తారామేశ్వరం వెళ్లే ప్రధాన మార్గంలో పుంతలో ముసలమ్మ ఆలయం వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో భార్యాభర్తలకు గాయాలైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి పడిపోయారని స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించామన్నారు.

విభిన్న ప్రతిభావంతులు.. క్రీడల్లో మెరికలు

పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

పెంటపాడు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పెంటపాడుకు చెందిన పలువురు దివ్యాంగ విద్యార్థులు క్రీడల్లో ప్రత్యేక ప్రతిభ కనబరుస్తున్నారు. మేధోవైకల్యం విభాగానికి చెందిన వీరు పెంటపాడు పోస్ట్‌బేసిక్ పాఠశాలలో పాఠశాల సహాయకురాలు(ప్రత్యేక విద్య) సాయి స్వరూపారాణి వద్ద నిత్యం తర్ఫీదు పొందుతున్నారు. ఇటీవల నిర్వహించిన మండల, జిల్లా, డివిజినల్ స్థాయిలో నిర్వహించిన పరుగు, షాట్‌పుట్, బేస్‌బాల్ పోటీల్లో సత్తా చాటారు. ఎనిమిదో రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికై ఇతర దివ్యాంగ విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆ వివరాలు వారి మాటల్లోనే.

పోలీసు అధికారి కావాలని..

పోస్ట్‌బేసిక్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. నాన్న చిన్నతనంలోనే చనిపోయారు. తల్లి నాగమణి చిల్లర దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. జిల్లా స్థాయిలో పరుగు పందెంలో విజేతగా నిలిచి రాష్ట్రస్థాయికి అర్హత సాధించా. పోలీసు అధికారి ఉద్యోగం సాధించి అమ్మ కల నెరవేర్చాలని నా ఆశయం. - **గొట్టపు వాపిర్ కుమార్**

షాట్‌పుట్‌లో ప్రతిభ

పెంటపాడు గోయెంకా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. తల్లి కుమారి. తండ్రి ముత్యాలు. మాది వ్యవసాయ కుటుంబం. భవిత పాఠశాల ద్వారా నాకు విద్యాబుద్ధులు వచ్చాయి. షాట్‌పుట్‌లో విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించా. ప్రభుత్వ ఉద్యోగిగా సేవలు అందించాలన్నదే నా ఆశయం. - **కోడి స్నేహలత**

ఉపాధ్యాయినిగా సేవలు అందిస్తా

పెంటపాడు ప్రభుత్వ గోయెంకా కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. తల్లి సుగుణ, తండ్రి పద్మ శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయం చేస్తుంటారు. జిల్లా స్థాయిలో షాట్‌పుట్, బేస్‌బాల్ క్రీడల్లో విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించాను. ఉపాధ్యాయురాలిగా సేవలందించాలనేది నా లక్ష్యం. - **సత్తి తన్మయ శ్రీదేవి**

పొంచి ఉన్న ప్రమాదం

తణుకు, న్యూస్‌టుడే: తేతలి జాతీయ రహదారి నుంచి కొండాయపాలెం వెళ్లే రహదారిలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఆ దారిలో తాగునీటిపైపు లైను కోసం పలు చోట్ల ఏర్పాటు చేసిన వాల్వులపై రక్షణ మూతలు దెబ్బతిన్నాయి. నిత్యం ఈ మార్గంలో రైతులు, కొండాపాలెం వెళ్లే గ్రామస్థులతో పాటు పరిశ్రమలో పనిచేసే కార్మికులు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయాల్లో ప్రమాదం పొంచి ఉందని చోదకులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు నివారించేందుకు వాటిపై రక్షణ మూతలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తెలిపారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు అవకాశం

వాసవీ పెనుగొండ, న్యూస్‌టుడే: వాసవీ పెనుగొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సుభాషిణి తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న బాలికలు ఫిబ్రవరి 19వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 95056 42277 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

అవార్డు గ్రహీతలకు సత్కారం

ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న కొమ్ముగూడెం సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ వినయ్ కల్యాణ్‌ను గ్రామ సర్పంచి తాడేపల్లి బేబీ ఆధ్వర్యంలో సత్కరించారు.

తాలూకాఫీసుకూడలి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న డ్వామా ఏపీడీ జీవీకే మల్లికార్జునరావు, ఎంపీడీవో కార్యాలయ సీనియర్ సహాయకురాలు ర్యాలి సుజాతలను జడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.చంద్రశేఖర్, డిప్యుటీ ఎంపీడీవో ఎం.వెంకటేశు, కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ★

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఇష్టమైన పని ఎంత కష్టమైనా తృప్తి ఇస్తుందని, తద్వారా ఆశించిన ఫలితాలు సాధించవచ్చని మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు అన్నారు. మంగళవారం తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని మున్సిపాలిటీల కన్నా తాడేపల్లిగూడేనికి గణతంత్ర దినోత్సవంలో ఎక్కువ అవార్డులు వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా అవార్డులు సాధించిన మున్సిపల్ ఇంజినీరు వెంకటరమణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ జి.సీతారాం, అసిస్టెంట్ ఇంజినీరు వెంకటేశ్వరరావు, సంక్షేమ కార్యదర్శి శ్రావణి, పారిశుద్ధ్య కార్యదర్శి రజనిలను కమిషనర్ శాలువా కప్పి సన్మానించారు. అనంతరం కమిషనర్‌ను మున్సిపల్ సిబ్బంది పూలమాలలతో సత్కరించారు.

తణుకు, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణతో పాటు సేవాభావంతో పనిచేస్తే గౌరవం సహజంగానే లభిస్తుందని ఎస్‌సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఏడుకొండలు పేర్కొన్నారు. జిల్లా స్థాయి అవార్డు గ్రహీత కూసు వెంకట సత్యరాజేశ్‌కు స్థానిక కళాశాలలో సత్కార సభ నిర్వహించి మాట్లాడారు. ఆయనను కళాశాల స్టాఫ్ క్లబ్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఆర్.భూపాల్, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి మారుతీదేవి, వైస్ ప్రిన్సిపల్ ఆర్.ఫణిధర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దానవరప్రసాద్

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

శేషమహల్‌రోడ్డు(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దానవరప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం శేషమహల్ రోడ్డులోని ప్రగతి ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ యూనియన్ కార్యాలయంలో అధ్యక్షుడు బండి దుర్గాప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పెండింగులో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే విడుదల చేయాలని, వివిధ కార్పొరేషన్‌లకు రుణాలు ఇవ్వాలని, 50 సంవత్సరాలకే పింఛను ఇవ్వాలని కోరారు. అనంతరం యూనియన్ ఆధ్వర్యంలో కాలమానిని ఆవిష్కరించారు. ఉపాధ్యక్షుడు ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

మహారాజశ్రీ తణుకు 1వ అదనపు సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A.No. 891/2025 IN O.S.NO. 617 OF 2025

వాది: గుత్తుల సత్యనారాయణ

ప్రతివాదులు: పెచ్చెట్టి రామారావు వగైరాలు వారి తరపున

పై నెంబరు దావాను వాది అయిన గుత్తుల సత్యనారాయణ, ప్రతివాదులైన తణుకు మండలం వేల్పూరు గ్రామములోని పెచ్చెట్టి రామారావు, పెచ్చెట్టి నాగేశ్వరరావు, గుత్తుల సత్యనారాయణ, గుత్తుల శివన్నారాయణ, బొంతు గోపాలం, వీరవల్లి శ్రీను, పంపన భూషణం, సనబోయిన రామకృష్ణ, సనబోయిన నాగ శ్రీనివాస్, వీరవల్లి అంజిబాబు అను వారలు చింతలదొడ్డిలోని శెట్టిబలిజ రామాలయం కమిటీ సభ్యులుగాను సదరు కమిటీ తరపున మరియు చింతలదొడ్డి శెట్టిబలిజ కులస్తుల తరపున ప్రతినిధులుగాను మరియు ఇతర కమిటీ సభ్యులు మరియు కులస్తులపైనా ప్రతినిధుల తరపు దావాగా (Suit in representative capacity) దాఖలు చేయుటకు అనుమతి కోరుచూ సిపిసి ఆర్డర్ 1 రూల్ 8 ప్రకారము I.A.NO. 891/2025న పై నెంబరు పిటిషన్‌ను దాఖలు చేయగా శ్రీ కోర్టు వారు పై నెంబరు దావా విషయమై దావా పరిహారములపై ఎవరికైనా అభ్యంతరములు ఉన్నయెడల దావాలో పార్టీలుగా ఎవరైనను ప్రతివాదులుగా చేరుటకు, సంసిద్ధత తెలుపు నిమిత్తము మరియు వాదనలు వినుపించు నిమిత్తము శ్రీ కోర్టు వారి ఎదుట ది. 09-02-2026 తేదీన ఉదయం 10 గం.ల నుండి హాజరు కావలసినదిగా ప్రకటన ద్వారా తెలియచేయవలసినదిగా ఉత్తర్వులు ఇచ్చియున్నారని ఈ ప్రకటన ద్వారా తెలియ పరచడమైనది.

తణుకు
27-01-2026

Sd/- NVSSP RAMA MOHAN
NVS RAMANUJAM, Advocates,
Tanuku, 99088 22433, 98483 69653

నీ మంచికే.. పరీక్ష చేయించుకో తల్లీ!

30 ఏళ్లు దాటిన అతివలకు ఆహ్వాన కార్డులు

వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: క్యాన్సర్ మహమ్మారి పలువురికి మరణశాసనం రాస్తోంది. అవగాహన లేకపోవడం, జబ్బు ముదిరిపోవడంతో వైద్యం అందించినా నయం కాకపోతోంది. ఈ సమస్యపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. అసంక్రమిక వ్యాధులపై పరీక్షలు చేయాలని నిర్ణయించింది. నడి వయసులోని అతివల్లో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి చికిత్స అందించేలా కార్యాచరణ రూపొందించింది. ఇందుకుగాను పరీక్షలు చేయించుకోవాలని ఆహ్వాన పత్రికను ముద్రించి అందజేస్తోంది.

ఇంటికొచ్చి.. రమ్మని పిలుస్తారు

● ఆరోగ్య పరీక్షలకు ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చిత్రాలతో కూడిన ఆహ్వాన పత్రిక రూపొందించారు. ● 'మీ కుటుంబం కోసం ఒక చిన్న అడుగు వేయండి. మీ సమయం కేటాయించండి. ఆరోగ్య సిబ్బంది మీకు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నారు'. 'సులువైన చిన్న పరీక్ష. బలమైన రేపటికి రక్షణ' అనే సందేశం ముద్రించారు. ● ఏ రోజు, ఏ ఆరోగ్య కేంద్రం, ఏ గ్రామం పరిధిలో పరీక్షలు చేస్తారనేది సిబ్బంది ముందుగా కార్డు అందజేసి ఆహ్వానిస్తారు. ఎన్ని గంటలకు రావాలో అందులో సూచిస్తారు. ● మహిళ పేరు నమోదు చేస్తారు. ● జిల్లాకు 1.98 లక్షల ఆహ్వాన కార్డులు చేరాయి. వీటిని ఆయా ప్రాంతంలోని ప్రభుత్వాసుపత్రులకు సరఫరా చేస్తున్నారు.

జిల్లాలో ఎన్‌సీడీ 4.0 సర్వే పరీక్షల సమాచారం

	వ్యాధి అనుమానిత లక్షణాలు	పరీక్షలకు సిఫార్సు
అధిక రక్తపోటు	27,187	3,989
మధుమేహం	24,741	534
నోటి క్యాన్సర్	24,741	534
రొమ్ము క్యాన్సర్	12,046	319
గర్భాశయ ముఖద్వారం	14,479	393

వైభవం.. శ్రీవారి చక్రస్నానం

హంస వాహనంపై విహరిస్తున్న శ్రీనివాసుడు

పుష్కరిణిలో చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

మారుతీనగర్(కడప) : తిరుమల తొలి గడప దేవుని కడపలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. మంగళవారం ఉదయం మాడ వీధుల్లో వసంతోత్సవం నిర్వహించారు. భక్తులు రంగులు చల్లుకుని సందడి చేశారు. అనంతరం ఆలయం ఎదుట ఉన్న పుష్కరిణిలో చక్రస్నానం చేయించారు. సాయంత్రం వైకుంఠ నాథుడు హంస వాహనంపై ఊరేగారు.

నిలిచిన రూ.5 వేల కోట్ల ఆర్థిక లావాదేవీలు



● యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు జిల్లాలో బ్యాంకులు మంగళవారం మూతపడ్డాయి. దీంతో జిల్లాలో సుమారు రూ. 5 వేల కోట్ల ఆర్థిక లావాదేవీల వరకు ప్రభావితమయ్యాయి. ● ప్రైవేట్‌వి మినహాయిస్తే... జిల్లాలో 12 ప్రభుత్వ, ఒక కోఆపరేటివ్, ఒక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 350కి పైగా శాఖలున్నాయి.

● కొందరు ఏటీఎంల ద్వారా డిపాజిట్లు, విత్‌డ్రాకు బారులు తీరారు. పలు ఏటీఎంలు పనిచేయక ఇబ్బందులకు గురయ్యారు. చాలా వరకు ఏటీఎంలలో మధ్యాహ్నం లోపే నగదు నిల్వలు ఖాళీ అయ్యాయి.

● ఈ నెల 24న నాలుగో శనివారం కావడం.. 25న ఆదివారం, 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా బ్యాంకులకు వరుసగా సెలవులొచ్చాయి. 27న మంగళవారం సమ్మెతో మూతపడ్డాయి. ● వరుసగా నాలుగు రోజుల పాటు బ్యాంకులు మూసివేయడంతో ఖాతాదారులు ఆర్థిక లావాదేవీల నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

- న్యూస్‌టుడే, కడప ఏడురోడ్లు

అవసరమే ఆసరాగా దోపిడీ

యూరియా అమ్మకాల్లో ఇష్టారాజ్యం

● బి.కోడూరు మండలం పాయలకుంట్ల రైతు సేవా కేంద్రానికి సోమవారం యూరియా వచ్చింది. బద్వేలు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో విక్రయాలు చేపట్టారు. బస్తా రూ. 266 అయితే రూ. 300 చొప్పున వసూలు చేశారు. పాయలకుంట్లతో పాటు బి.కోడూరు, ఐత్రంపేట, ప్రభలవీడు, తంగేడుపల్లె సచివాలయాల్లో అక్రమంగా పంపిణీ చేశారు.

● బ్రహ్మంగారిమఠం మండలం దిరసవంచ రైతు సేవా కేంద్రానికి ఈ నెల 14న 440 బస్తాల యూరియా వచ్చింది. వైకాపా నేతలను దగ్గర పెట్టుకుని వ్యవసాయాధికారులు ఇష్టారాజ్యంగా రెండు గంటల వ్యవధిలోనే విక్రయించారు. సాధారణ రైతులకు బస్తా కూడా దొరకలేదు.

● బద్వేలు, పోరుమామిళ్లలోని ప్రైవేట్ దుకాణాల్లో బస్తా రూ. 400 నుంచి రూ. 500 వరకు విక్రయిస్తున్నారు. ధర విషయమై ప్రశ్నించే వారికి స్టాక్ లేదంటూ ఇవ్వడం లేదు. తాము లోడు ఎరువుకు రూ. 30 వేలు లంచం ఇచ్చి తెచ్చుకుంటున్నామని, అధిక ధరకు విక్రయించకుంటే గిట్టుబాటు కాదంటూ దబాయిస్తున్నారు.

ఈనాడు, కడప: సాధారణంగా వరి పంటకు యూరియా వాడకం ఎక్కువ. రైతులు సాగు చేసిన పంట విస్తీర్ణం, అవసరమైన ఎరువును అంచనా వేయకుండా కొందరు వ్యాపారులు, సచివాలయ సిబ్బంది ఇష్టారీతిన అధిక ధరకు ఇస్తున్నారు. బస్తా రూ. 266 చొప్పున అమ్మాల్సి ఉండగా బహిరంగ మార్కెట్లో రూ. 400 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో రూ. 300 వరకు విక్రయిస్తున్నారు. కొన్ని చోట్ల అసలు అందుబాటులోనే ఉంచడం లేదు. అవినీతి అక్రమాల కారణంగానే వ్యవసాయ శాఖ కట్టడి చేయలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.


బి.కోడూరు రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం వేచిఉన్న రైతులు

● రబీలో సాధారణ సాగు విస్తీర్ణం:	● ఇప్పటి వరకు సాగు చేసింది:	● ఇందులో వరి, శనగ, మినుము, పెసర, నువ్వులు, వేరుసెనగ, జొన్న, సజ్జ పంటతో పాటు అరటి, నిమ్మ, బత్తాయి, మామిడి మొదలైన ఉద్యాన పంటలున్నాయి.
1,39,796 హెక్టార్లు	96,020 హెక్టార్లు	

● సాగు నీరు సమృద్ధిగా ఉండటంతో గతంలో ఎన్నడూ లేనంతగా కేసీ కెనాల్‌తో పాటు ఇతర ప్రాజెక్టుల కింద ఈ సారి అధిక విస్తీర్ణంలో వరి పంట సాగు చేశారు. ● వరికి అధిక మొత్తంలో రైతులు యూరియా వినియోగిస్తున్నారు. ● ఇదే అదనుగా ప్రైవేట్ దుకాణాలు నిర్దేశిత ధర కంటే అధికంగా వసూలు చేస్తున్నాయి. ● యూరియా కావాలంటే అధిక ధరతో పాటు ఇతర నిల్వ ఉన్న రసాయన ఎరువులూ కొనుగోలు చేయాలని బలవంత పెడుతున్నాయి.

పట్టాలెక్కని ట్రిపుల్ ఐటీలు

◆ నాలుగేళ్లుగా లేని స్నాతకోత్సవాలు
◆ వేల మంది విద్యార్థుల ఎదురుచూపులు

వేంపల్లె, న్యూస్‌టుడే: రాజీవ్ గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో నాలుగేళ్లుగా స్నాతకోత్సవాలు నిర్వహించడం లేదు. ఆరు ట్రిపుల్ ఐటీల్లో ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ కోర్సు పూర్తి చేసిన వేల మంది విద్యార్థులు ఒరిజినల్ డిగ్రీ పట్టాల(ఓడీ) కోసం ఎదురుచూస్తున్నారు.

● **2021లో ఆఖరు:** ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 24 వేల మంది ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తున్నారు. ఒక్కో ట్రిపుల్ ఐటీ నుంచి ఏటా వెయ్యి మంది వరకు బీటెక్ పూర్తి చేసుకుంటున్నారు. ఏటా స్నాతకోత్సవానికి సంబంధించి ఇడుపులపాయలో లేదా నూజివీడులో వేడుక ఏర్పాటుచేసి ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రముఖ విశ్వవిద్యాలయాల ఆచార్యుల చేతుల మీదుగా విద్యార్థులకు ఒరిజినల్ డిగ్రీ పట్టాలు అందిస్తున్నారు. 2021లో చివరిగా స్నాతకోత్సవాన్ని నిర్వహించారు. ఆ తర్వాత 2022, 2023, 2024, 2025 సంవత్సరాలకు సంబంధించిన ఊసేలేదు.

ఇవీ ఉపయోగాలు

ట్రిపుల్ ఐటీల్లో ఇంజినీరింగ్ కోర్సు పూర్తి చేసిన వారికి స్టడీ సర్టిఫికెట్, ప్రొవిజనల్ డిగ్రీ సర్టిఫికెట్ ఇస్తారు. ఇవి తాత్కాలికం. విదేశీ విద్యకు వెళ్లాలంటే ఓడీ తప్పనిసరి. ఈ విషయమై ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ.. రెగ్యులర్ వీసీ వచ్చిన తర్వాత స్నాతకోత్సవం నిర్వహించి విద్యార్థులకు ఒరిజినల్ డిగ్రీ పట్టాలు ఇస్తామని తెలిపారు.

కొండమ్మకు కొండంత అండ

జిల్లా సచివాలయం, పెండ్లిమర్రి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాలోని కమలాపురం నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సమయంలో పెండ్లిమర్రి మండలం వెల్లటూరు పంచాయతీ పరిధిలోని ఒంటరి మహిళ పుల్లిరెడ్డి కొండమ్మ తన దీన స్థితిని ఆయనకు తెలుపుతూ ఆదుకోవాలని కోరింది. స్పందించిన సీఎం సాయానికి హామీ ఇచ్చారు. ఈ మేరకు సీఎం మంజూరు చేసిన రూ. 2 లక్షల ఆర్థిక సాయాన్ని కడప కలెక్టర్ శ్రీధర్ కలెక్టరేట్‌లో కొండమ్మకు మంగళవారం అందించారు.

అక్రమం జోరు.. అధికారం బేజారు

ఇష్టారీతిన నాపరాయి తవ్వకాలు

జమ్మలమడుగు, మైలవరం, న్యూస్‌టుడే: పెన్నా నదీ గర్భం అక్రమార్కులకు వరంగా మారింది. ప్రకృతి సంపదపై కొందరి కళ్లు పడ్డాయి. అనుమతులతో సంబంధం లేకుండా నదీ గర్భంలోనే భారీగా తవ్వకాలు సాగిస్తున్నారు. అక్రమంగా నాపరాయిని వెలికి తీస్తున్నారు. అపై విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అదే సమయంలో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న నాపరాయి పలకలు

రూపాయి రాయల్టీ చెల్లించింది లేదు

వర్షాకాలంలో మైలవరం జలాశయం నుంచి పెన్నా నదికి నీరు వదిలారు. దీంతో తవ్వకాలకు అవకాశం లేకపోయింది. ప్రస్తుతం నీళ్లు తగ్గడంతో మళ్లీ మొదలెట్టారు. కొత్తగా ఏర్పాటుచేస్తున్న లే అవుట్లు, ఇళ్ల పునాదులకు నాపరాయి అవసరం ఉండటంతో కొద్ది రోజులుగా అక్రమ తవ్వకాలు జోరుగా సాగిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ రూ. 1,500 నుంచి రూ. 2 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇలా నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ప్రభుత్వానికి మాత్రం రూపాయి రాయల్టీ కూడా చెల్లించడం లేదు. ఈ వ్యవహారం మరి ముఖ్యంగా జమ్మలమడుగు - మైలవరం మండలాల సరిహద్దులోని పెన్నా నది గర్భంలో సాగుతోంది.

రెండే చోట్ల అనుమతులు

గతంలో ఎర్రగుంట్లలో భూగర్భ, గనుల శాఖ ఏడీ కార్యాలయం ఉండేది. సంబంధిత అధికారులు అడపాదడపా దాడులు చేసి అక్రమ తవ్వకాలను అడ్డుకునేవారు. ప్రస్తుతం భూగర్భ, గనుల శాఖ కార్యాలయాన్ని కడప తరలించడం అక్రమార్కులకు వరంగా మారింది. అధికారుల లెక్కల ప్రకారం జమ్మలమడుగు ప్రాంతంలో రెండు చోట్ల మాత్రమే అనుమతులు ఉన్నాయి. వాస్తవంలో మాత్రం ఎక్కడ పడితే అక్కడ తవ్వి తరలించుకుపోతున్నారు. దీంతో నదిలో కొన్ని చోట్ల సుమారు 50 అడుగుల లోతు వరకు గోతులు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం దృష్టి సారించి అక్రమ తవ్వకాలను అడ్డుకట్ట వేయాల్సి ఉంది.

అదిరేటి చీరలు మేం కడితే!

ఒంటిమిట్ట మండలంలోని ఒంటిమిట్ట, రాచపల్లె, కొత్తమాధవరం, మంటపంపల్లె, చింతరాజుపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో మంగళవారం వార్షికోత్సవాలు, పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల, బాలికలు ఆద్యంతం ఉత్సాహంగా గడిపారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. - న్యూస్‌టుడే, ఒంటిమిట్ట

జై కిసాన్.. జై జవాన్

బద్వేలుకు చెందిన గుమ్మళ్ల శ్రీనివాసులు సైనికుడిగా పని చేశారు. దేశ రక్షణకు సరిహద్దులో కాపలాగా ఉన్నారు. పదవీ విరమణ అనంతరం ఆతనికి పెద్ద గోపవరం వద్ద ప్రభుత్వం వ్యవసాయ భూమిని కేటాయించింది. దీంతో శ్రీనివాసులు అక్కడే నివాసం ఏర్పరుచుకుని వ్యవసాయం చేస్తున్నారు. తన వ్యవసాయ క్షేత్రం ప్రవేశ ద్వారం వద్ద రెండు వైపులా ఫిరంగుల ఆకృతులను నిర్మించుకున్నారు. దీంతో అటుగా వెళ్తున్న వారు ఆసక్తిగా చూస్తున్నారు. - న్యూస్‌టుడే, బద్వేలు

కత్తిలాంటి యువత

◆ ఆట.. అవుతుందని బతుకు బాట
◆ జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ

చాపాడు, న్యూస్‌టుడే: ఆటలేవైనా కూడా పేదవారికి అంటారు పెద్దలు. అవే ఆటలు పలువురికి ఉజ్వల భవిష్యత్తును ఇస్తాయి. ఎందరినో అందలమెక్కిస్తాయి. ఆటపాటలే వారి స్ఫూర్తికి ఒకపక్క, సాంకేతిక విద్యనభ్యసిస్తూనే.. మరోపక్క క్రీడల్లో రాణిస్తున్నారు కొందరు యువతీ యువకులు. చదువుల్లో ప్రతిభ చూపుతూనే, ఆటలో క్రీడా కోటాలో ఉద్యోగాలు సాధించాలని ఆశిస్తున్నారు. ఈ క్రమంలో ప్రతిభ చూపుతూ ప్రశంసలు అందుకుంటున్నారు. స్థానిక సీబీఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు.. జేఎన్‌టీయూ అనంతపురం తరఫున పలు క్రీడలకు ఎంపికై సౌత్ జోన్, ఇండియా స్థాయిలో సత్తా చాటారు. తాము సాధించిన విజయాలను 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.

రాష్ట్రస్థాయిలో పతకాలు

పదో తరగతి నుంచి ఫెన్సింగ్ నేర్చుకున్నా. ఇంటర్మీడియట్ చదువుతుండగా రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండుసార్లు పతకాలు సాధించా. ఆ తర్వాత జాతీయ పోటీలకు ఎంపికయ్యా. తాజాగా పంజాబ్‌లోని అమృతసర్ గురునానక్‌దేవ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఆలిండియా ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొన్నా. రోజూ రెండు గంటలు క్రీడలు సాధన చేస్తాను. **- అర్మిన్, బీటెక్ ద్వితీయ సంవత్సరం**

రైల్వేలో కొలువుదీరుతాను

ప్రొద్దుటూరు పట్టణం వైఎంఆర్ బాలికల పాఠశాలలో 8వ తరగతి చదువుతుండగానే షటిల్ బ్యాడ్మింటన్ నేర్చుకున్నా. ప్రస్తుతం జేఎన్‌టీయూ జట్టులో స్థానం సాధించాను. రాజమహేంద్రవరంలో నిర్వహించిన పోటీల్లో విజయం సాధించాం. ఏ ఆటకైనా కనీసం రోజూ రెండు గంటలు సాధన అవసరం. బీటెక్ పూర్తి చేసి క్రీడా కోటా కింద రైల్వేలో ఉద్యోగం సాధించడమే లక్ష్యం. **- శ్రావణి, బీటెక్ నాలుగో సంవత్సరం**

యూనివర్సిటీ జట్టుకు ప్రాతినిధ్యం

మాది పులివెందుల. పదో తరగతి చదువుతుండగా అంతర్ జిల్లా స్థాయి హాకీ పోటీల్లో అండర్-18 విభాగంలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచా. ప్రస్తుతం జేఎన్‌టీయూ అనంతపురం తరఫున ఎంపికై కేరళలోని కన్నూర్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నాం. క్రీడా కోటాలో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తా. **- పవన్‌కుమార్‌రెడ్డి, బీటెక్, మూడో సంవత్సరం**

రీ సర్వే పనుల వేగవంతానికి ఆదేశాలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న భూరికార్డుల స్వచ్ఛీకరణ, రీ సర్వే పనులను ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ ఆదేశించారు. రాజధాని అమరావతి నుంచి రాష్ట్ర రెవెన్యూ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, రాష్ట్ర భూ పరిపాలనా శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి.. రీ సర్వేపై జిల్లా ఉన్నతాధికారులతో దృశ్యమాధ్యమ విధానంలో మంగళవారం సమీక్షించారు. పనులు పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్ క్షేత్రస్థాయి అధికారులతో మాట్లాడారు. అపరిష్కృతంగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలన్నారు. వ్యక్తిగత వివరాల్లో ఎలాంటి తప్పిదాలు లేకుండా పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేయాలని చెప్పారు. సమీక్షలో సర్వే ఏడీ శాంతిరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సోదరా.. కాదా ఆపదా!

రోజువారీ కూలీలు బతుకు వేటలో ప్రమాదకరంగా ప్రయాణం చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. రహదారులపై ప్రమాదాలు వాటిల్లకుండా ఎన్ని చర్యలు తీసుకుంటున్నా వాహన చోదకుల నిర్లక్ష్యంతో అడ్డుకట్ట పడడం లేదు. అందుకు నిదర్శనమే ఈ చిత్రం. జమ్మలమడుగు - ముద్దనూరు ప్రధాన రహదారిలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై సిమెంట్ బస్తాలను తీసుకెళ్తూ ఇలా ప్రయాణించారు.

- న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

అర్ధరాత్రి అరాచకం

రెండు జేసీబీలతో ఇల్లు నేలమట్టం

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆర్థిక వివాదాల్లో ఉన్న ఓ ఇంటిని అర్ధరాత్రి రెండు జేసీబీలతో కూల్చి వేసిన ఘటన కడప నగరంలో తీవ్ర కలకలం రేపింది. బాధితుడు సట్టి భాస్కర్ తెలిపిన మేరకు.. కడప ఎర్రముక్కపల్లెలో గత కొన్నేళ్ల నుంచి నివాసం ఉంటున్నారు. భాస్కర్ సోదరులు 2013లో తిరుపతికి చెందిన ముద్ద వెంకట సుబ్బారెడ్డి నుంచి రూ. 20 లక్షలు అప్పు తీసుకున్నారు. ప్రతిగా తమ పేర్ల మీదున్న ఎర్రముక్కపల్లెలోని తొమ్మిది సెంట్ల స్థలాన్ని తనఖా పెట్టారు. ఏడాదిలోపు డబ్బులు చెల్లించేలా రిజిస్టర్ చేయించుకున్నారు. విడతల వారీగా రూ. 98 లక్షలు చెల్లించామని, అందుకు ఎలాంటి రసీదులు, పూర్తయినట్లు రాయించలేదని బాధితుడు తెలిపారు.

● **ఎక్కువ ఇవ్వాలని బెదిరించారు:** డబ్బులు చెల్లించిన తర్వాత ఇంటి పత్రాలు అడిగితే రూ. 2 కోట్లు చెల్లిస్తే ఇంటి పత్రాలిస్తానని బెదిరించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో సదరు ఇంటిని ముద్ద వెంకట సుబ్బారెడ్డి కడపకు చెందిన ద్వారకానాథ్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డిలకు విక్రయించారు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి రెండు జేసీబీలతో పలువురు వచ్చి భాస్కర్ ఇంటిని నేలమట్టం చేశారు. ఈ సమయంలో ఇంటిలో ఉన్న వారిని బలవంతంగా బయటికి పంపారు. వారి వద్ద ఉన్న చరవాణులను లాగేసుకున్నారు. సామగ్రి తీసుకుంటామని ప్రాధేయపడినప్పటికీ వినకుండా జేసీబీలతో ఇంటిని నేలమట్టం చేశారు. బీరువాలో ఉన్న బంగారు నగలు, నగదు తీసుకెళ్లారని, తాము రోడ్డున పడ్డామని కన్నీటి పర్యంతమయ్యారు. మంగళవారం ఉదయం బాధితులు రోడ్డుపై బైఠాయించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఒకటో పట్టణ సీఐ చిన్నపెద్దయ్య, ఎస్సైలు అమర్‌నాథ్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్ అక్కడికి చేరుకుని మాట్లాడారు. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని సర్ది చెప్పారు. దీంతో ఆందోళన విరమించారు.

జేసీబీలతో కూల్చడంతో నేలమట్టమైన ఇల్లు

మాకు సంబంధమే లేదు

ఇంటి కూల్చివేతపై కడపకు చెందిన శ్యామ్‌సుందర్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. తాము 2010లో తిరుపతికి చెందిన వెంకట సుబ్బారెడ్డి నుంచి 3.3 సెంట్ల స్థలాన్ని తొలుత, 2024లో తిరిగి తొమ్మిది సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఇంటిని ఖాళీ చేయాలని అడుగుతున్నా స్పందించకపోవడంతో పోలీసులను ఆశ్రయించామని, కలెక్టర్, ఎస్పీలకు విన్నవించినట్లు తెలిపారు. ఇళ్లను ఎవరు కూల్చిందీ తెలియదని.. వాటితో తమకు సంబంధం లేదన్నారు. ఇదిలా ఉంటే ఇంటి కూల్చివేతకు సంబంధించి పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బెయిల్‌పై విడుదల చేశారు.

శ్రీరామ్.. ఎవరి మాట వినలేదు

40 రోజుల్లోనే బదిలీ బహుమానం

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు ఒకటో పట్టణ ఠాణా సీఐ శ్రీరామ్ బాధ్యతలు చేపట్టిన 40 రోజుల్లోనే బదిలీ చేయడం.. ఆయన స్థానంలో అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న టి.వి.కొండారెడ్డిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడం చర్చకు దారి తీసింది. సీఐగా శ్రీరామ్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఒత్తిళ్లకు లొంగకుండా విధులు నిర్వహించారనే పేరు తెచ్చుకున్నారు. అసాంఘిక శక్తుల కట్టడికి కొంత వరకు ప్రయత్నించారు. రౌడీషీటర్లు, క్రికెట్ బుకీలు, రౌడీషీటర్లను కౌన్సెలింగ్‌కు పిలిచి తనదైన శైలిలో హెచ్చరికలు జారీ చేశారు. ఎప్పుడు హాజరు కాని పాత కేసుల్లో నిందితులుగా ఉన్న నాయకులను కూడా కౌన్సెలింగ్‌కు పిలిపించి హెచ్చరికలు చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా మద్యం దుకాణాలు తెరిచి మద్యం అమ్మకాలు సాగిస్తున్న వ్యవహారంపై నిఘా ఉంచి కట్టడి చేశారు. ఈ క్రమంలో ఆయన బాధ్యతలు చేపట్టిన కొన్ని రోజుల్లోనే బదిలీ కావడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

● **రాజకీయ నేతల హస్తం!..** సీఐ శ్రీరామ్ బదిలీ వెనుక కొందరు రాజకీయ నేతల ప్రమేయం ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత డిసెంబర్ 18న ప్రొద్దుటూరు ఒకటో పట్టణ ఠాణా సీఐగా ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం కొందరు నేతల మాటలను ఖాతరు చేయకుండా తన విధులు తాను నిర్వర్తించడం కంటగింపుగా మారింది. దీంతో ఆయనకు స్థాన చలనం తప్పలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



(c) eenadu

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: విద్యా ప్రమాణాలు పెరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ శ్రీధర్ ఆదేశించారు. కడప కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మంగళవారం కడప కేంద్రీయ విద్యాలయ యాజమాన్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది జరిగే పది, ఇంటర్ తరగతుల పరీక్షా ఫలితాల్లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. క్లాస్ రూంల నిర్వహణ కచ్చితంగా కొనసాగించాలన్నారు. విద్యాలయం పరిసరాల్లో విద్యుత్తు దీపాలు, చెత్త సేకరణ నిర్వహణ, తాగునీటి నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు ప్రిన్సిపల్ మునేశ్‌మీనా అకడమిక్ కార్యకలాపాలు వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నాగేశ్వరరెడ్డి, హరికృష్ణ, రవికుమార్, ఓబులరెడ్డి, ప్రతిమ, మహేశ్‌కుమార్, ఉమాదేవి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, చిత్రంలో కేంద్రీయ విద్యాలయ అధికారులు

వ్యాపార నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

రాజంపేట, న్యూస్‌టుడే : వ్యాపార రంగ నైపుణ్యాలు ప్రతి విద్యార్థి అలవరుచుకోవాలని, అప్పుడే ఏ రంగంలో ఉన్నా భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని పర్పుల్ స్ప్రింగ్ సంస్థ వ్యవస్థాపకురాలు పి. శ్రీనిధి అన్నారు. మంగళవారం స్థానిక అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో మహిళా సాధికారత, వ్యాపారాభివృద్ధి విభాగం సంయుక్త ఆధ్వర్యంలో వ్యాపార రంగంలో విలువల సృష్టి అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో వినియోగదారులు ఏమి కోరుకుంటున్నారో దానికి అనుగుణంగా ఉత్పత్తులు చేయడం, మార్కెట్ విధానంలో మెలకువల పాటించడం ద్వారా వ్యాపార రంగంలో రాణించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత సెల్ సమన్వయకర్త డాక్టర్ వి. మౌనేశ్వరి ఆధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ బి.సాయిబాబారెడ్డి, ఏఐటీఎస్ ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత, యూనివర్సిటీ వ్యవసాయ విభాగ డీన్ డాక్టర్ డి.లోక్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పర్పుల్ స్ప్రింగ్ సంస్థ వ్యవస్థాపకురాలు శ్రీనిధి

తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయొద్దు

గోడపత్రాలను చూపుతున్న సీఐ ప్రసాద్‌బాబు, తదితరులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: చదువుకునేందుకు కళాశాలకు వచ్చిన విద్యార్థులపై తల్లిదండ్రులు ఎంతో నమ్మకం, ఆశయం పెట్టుకున్నారని, వారి ఆశయాలను నెరవేర్చాలే తప్ప మత్తు పదార్థాలకు దగ్గర కావద్దని రాజంపేట మన్నూరు సీఐ ప్రసాద్ బాబు, ఏఐటీఎస్ ప్రిన్సిపల్ నారాయణ పేర్కొన్నారు. మంగళవారం రాజంపేట మండలం అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో డ్రగ్స్‌పై యువత మేలుకో- మత్తు నుంచి తేరుకో, డ్రగ్స్ వద్దు - జీవితం ముద్దు అనే అంశంపై పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీసు కళా జాగృతి బృందం వివిధ రకాలు నాటక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ మల్లిక, కళాబృందం సభ్యులు ఎస్ఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది సుశీల, మేషక్ బాబు, ఉదయ్‌కుమార్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైవీయూలో ప్రాంగణ ఎంపికలు

వైవీయూ, న్యూస్‌టుడే: యోగివేమన విశ్వవిద్యాలయం ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం ఆఫ్‌లైన్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరులోని ఎంఐ సంస్థ సిబ్బంది ఎంపికలకు వైవీయూ వస్తోందన్నారు. ఎంఎస్ ఆఫీస్‌పై ప్రాథమిక జ్ఞానంతో కమ్యూనికేషన్ నైపుణ్యాలు ఉండాలన్నారు. విద్యార్థులంతా వారి రెజ్యూమ్ హార్డ్ కాపీతో నూతన పరిపాలనా భవనంలోని ప్లేస్‌మెంట్ సెల్‌లో హాజరు కావాలన్నారు.

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – తాడికొండ

బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు.. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Hospitality Partner: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Man of the Series: Hero
Digital Partner: ఈనాడు.నెట్, ETV BHARAT
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - I జూనియర్స్ : మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్స్‌లతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులు చేసి ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - I జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సులతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

సీనియర్స్ విన్నర్స్ రాయలసీమ రాకర్స్

గ్రౌండ్-2లో సీనియర్స్ : సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ | చరణ్ జిత్ | ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-I (జూనియర్స్)
మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)
మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్
మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

జిల్లాకు 1,750 టన్నుల యూరియా

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: కడప రైల్వే స్టేషన్‌కు యూరియా మంగళవారం ర్యాక్‌లో వచ్చింది. ప్రైవేటు వ్యాపారులకు వెయ్యి టన్నులు, మార్క్‌ఫెడ్‌కు 750 టన్నులు పంపారు. వచ్చిన ఎరువులను జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్ పరిశీలించారు.

మహాశివరాత్రికి విస్తృత ఏర్పాట్లు

సిద్దవటం, న్యూస్‌టుడే : నిత్యపూజ స్వామికోనలో జరగనున్న మహా శివరాత్రి ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రమైన సిద్దవటం మండలం వంతాటిపల్లె శివారులోని కొండల మల అభయారణ్యంలో ఉన్న నిత్యపూజాస్వామికోనను మంగళవారం పోలీస్, అటవీ, దేవాదాయశాఖ అధికారులతో కలిసి ఏఎస్పీ సందర్శించారు. రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేయనున్న వాహనాల పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. పంచలింగాల గుడి నుంచి గర్భగుడి వరకు ఉన్న కాలిబాటలోని సమస్యాత్మక ప్రదేశాలపై ఆరా తీసి వాటి స్థితిగతులు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తులు నడిచే మార్గంలోని సమస్యాత్మక ప్రదేశాల్లో ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా ముందస్తుగానే పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఆయన గుడిలో స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. సీఐ నరసింహారాజు, ఎస్ఐ మహమ్మద్ రఫీ, ఆలయ ఛైర్మన్ రాజేంద్రప్రసాద్, సిబ్బంది చంద్ర, అటవీశాఖ ఉప అధికారి ఓబులేశు, బీట్ అధికారి పెంచలరెడ్డి పాల్గొన్నారు.

నిత్యపూజస్వామి కోనలో సమస్యాత్మక ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ, అటవీ, దేవాదాయశాఖ అధికారులు

చికిత్స పొందుతూ గొర్రెల కాపరి మృతి

ముద్దనూరు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన గొర్రెల కాపరి చికిత్స పొందుతూ మృతిచెందారు. ఎస్ఐ రమేష్ కథనం మేరకు.. ముద్దనూరు మండలం కొర్రపాడుకు చెందిన సంజీవ్ (48) కిరణ్ పల్లె గ్రామానికి గురువారం వెళ్లి గొర్రెలు కొనుగోలు చేశాడు. మినీవ్యాన్‌లో తిరిగి వస్తుండగా వెనుక కూర్చున్న అతడు ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన సంజీవ్‌ను చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలులోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

సంజీవ్ (పాత చిత్రం)

వృద్ధుడి మృతదేహం లభ్యం



మైదుకూరు: మైదుకూరు సమీపంలోని హుబ్లీ-కృష్ణపట్నం జాతీయ రహదారి పైవంతెన వద్ద 67 ఏళ్ల వృద్ధుడు ఒకరు మృతి చెందినట్లు మంగళవారం గుర్తించారు. తెల్లగడ్డం, తెల్లచొక్కా, నడుముకు శాలువా కట్టుకున్నాడు. పక్కనే దుప్పటి ఉంది. ఎవరైనా గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ రమణారెడ్డి సూచించారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తామని ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక రీజియన్ కార్యాలయంలో కన్వీనర్ కృష్ణారెడ్డి అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. 12వ పీఆర్సీ ముగిసి మూడేళ్లు గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే పీఆర్సీతో పాటు మధ్యంతర భృతి 30శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 10న జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన, 25న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రమణారెడ్డి, చంద్రశేఖర్, పుల్లయ్య, చంద్రహాస్‌రెడ్డి, శేఖర్‌బాబు, వెంకటరెడ్డి, గురయ్య, రీజియన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న నగదు అప్పగింత

బద్వేలు, న్యూస్‌టుడే : బద్వేలు పోలీసు సర్కిల్ కార్యాలయంలో విశ్రాంత ఉపాధ్యాయుడు సత్యనారాయణ శర్మకు ఆటోలో పోగొట్టుకున్న నగదు రూ.40 వేలను ఆటో డ్రైవర్ వెంకటరమణ ద్వారా మంగళవారం పట్టణ పోలీసులు అందజేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు సత్యనారాయణ శర్మ సోమవారం సాయంత్రం ఆటో ఎక్కి ఎగువ బ్రాహ్మణ వీధిలోని తన ఇంటికి వెళ్లారు. తన వెంటనున్న నగదు బ్యాగును తీసుకోవడాన్ని మరచిపోయారు. ఈ విషయాన్ని బద్వేలు పోలీసు స్టేషన్‌కు వెళ్లి పట్టణ సీఐ లింగప్ప దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఎస్ఐ చిరంజీవి, కానిస్టేబుల్ ఓబులేశును బృందంగా ఏర్పాటు చేసి విచారించమని ఆదేశించారు. అట్లూరు మండలం మాడపూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వెంకటరమణగా గుర్తించారు. అతని ద్వారా పట్టణ పోలీసుస్టేషన్‌లో అందజేశారు. నగదును అందజేసి నిజాయతీని చాటుకున్న ఆటో డ్రైవర్ వెంకటరమణను పోలీసులు అభినందించారు.

నగదును సత్యనారాయణ శర్మకు అందజేస్తున్న సీఐ లింగప్ప

చోరుల అరెస్టు.. 130 కిలోల రాగి తీగ స్వాధీనం

పోరుమామిళ్ల, న్యూస్‌టుడే : విద్యుత్తు నియంత్రికలో రాగితీగ చోరీ కేసులో ఆరుగురు దొంగలను అరెస్టు చేశామని సీఐ హేమసుందరరావు, ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పోరుమామిళ్ల మండలం యరసాల హరిజనవాడకు చెందిన ప్రసన్న, గొంగటి చెన్నరాయుడు, ముత్యాల రామలక్షుమయ్య, గంటా భూతప్ప, గంటా దిలీప్‌కుమార్, పేరమ్మగారిపల్లికి చెందిన జంబారపు నాగేంద్ర మండలంలో విద్యుత్తు నియంత్రికలు ధ్వంసం చేసి రాగితీగను చోరీ చేశారన్నారు. వీరిని అరెస్టు చేసి, వీరి నుంచి 130 కిలోల రాగితీగను స్వాధీనం చేసుకున్నామన్నారు. కలసపాడు, కాశినాయన, బి.కోడూరు, అట్లూరు, చాపాడు, బి.మఠం మండలాల్లో వారిపై రాగితీగ చోరీ కేసులు నమోదయ్యాయని చెప్పారు.

వివరాలు వెల్లడిస్తున్న సీఐ హేమసుందరావు, ఎస్ఐ కొండారెడ్డి

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032, వెబ్‌సైట్: www.shriramfinance.in/auction.
కార్యాలయ చిరునామా: డి.నెం.42/107-1, ఓబుల్‌రెడ్డి కాంప్లెక్స్, అప్సర సర్కిల్, జయనగర్‌కాలనీ, కడప - 5160032 & శాఖ కార్యాలయం: కడప -1

కమలాపురం ఎస్.ఆర్.ఓ (ఆర్.ఓ) ప్రకారం డాక్యుమెంట్ నెం.1224/2022 మోహన్‌బాబు దేవరశెట్టి గారికి చెందినది.

స్థిరాస్తులు అమ్మకము కొరకు ఈ–వేలం ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్, 2002, 9(1) & 8(6)తో చదువబడే క్రింద స్థిరాస్తుల ఈ–వేలం అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు గ్యారంటారు (లు)లకు తెలియజేయడమేమనగా దిగువ తెలిపిన రుణగ్రహీతలు / గ్యారంటార్లకు చెందిన ఆస్తులను సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా / ఛార్జిలో వుంచి పొందిన బకాయి మొత్తము తేది: 17.06.2024 నాటికి రూ.1,16,05,521/- లను + తేది:18.06.2024 నాటి నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులను రాబట్టుకునేందుకు సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు తేది 17.06.2024న జారీ చేసి శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క సెక్యూర్డ్ క్రెడిటార్ వారిచే స్వాధీనం చేసుకున్న ఆస్తులను "ఎక్కడ ఎలా వున్నదో అక్కడ" "అక్కడ ఎలా ఉన్నదో" అలానే మరియు "అక్కడ ఏమి ఉన్నదో" అనే పద్ధతిపై తేది: 12.03.2026 ఉదయం 11.గం॥లకు నుండి మ.1.00 గం॥ల మధ్య విక్రయించుటకు నిర్ణయించినారు.

అగ్రిమెంటు నెం.: CUDP2TF2203280002, రుణగ్రహీతలు/గ్యారంటార్ల యొక్క పేర్లు,చిరునామా :-1) దేవరశెట్టి మోహన్ బాబు తండ్రి దేవరశెట్టి, చిన్న పీరయ్య, డి.నెం.38/2873, రామక్రిష్ణానగర్, చిన్నచౌక్, కడప 2) డి.రెడ్డెయ్య, తండ్రి చిన్నపీరయ్య, డి.నెం.38/2873, రామక్రిష్ణానగర్, చిన్నచౌక్, కడప 3) షేక్ అబ్దుల్ రహిమాన్ తండ్రి ఎస్.అబ్దుల్, డి.నెం. 10/24-34-1, ఖలీల్ నగర్, కడప

స్థిరాస్తుల యొక్క వివరణ: (కమలాపురం ఎస్.ఆర్.ఓ(ఆర్.ఓ) నందు దేవశెట్టి మోహన్‌బాబు పేరున రిజిస్టరు కాబడిన పత్రంనెం.1224/2022 ప్రకారం):-వైయస్ఆర్ కడప జిల్లా, ప్రొద్దుటూరు రిజిస్ట్రేషన్ జిల్లా,కమలాపురం సబ్‌జిల్లా, కమలాపురం మండలం, పందిళ్ళపల్లి గ్రామ పంచాయితీ మరియు గ్రామ లెక్కదాఖలా, సర్కారు మెట్ట డి.నెం.150/4ఎ లో ఎ.2.58 సెంట్ల భూమి, మరియు సబ్ డివిజన్ అనంతరం సర్వేనెం. 150/4ఎ2 లో ఎ.0.94 సెంట్లు మరియు సర్వే నెం.150/4సి2లో ఎ.0.69 సెంట్లు మొత్తం విస్తీర్ణం ఎ.1.63 సెంట్లు హద్దులు: తూర్పు: వల్లిమాబుసాబ్ భూమి, పడమర: మన్నే ఈశ్వరయ్య భూమి, ఉత్తరం: వంక, దక్షిణం: రోడ్డు, ఈ హద్దుల మధ్య భూమి విస్తీర్ణం ఎ.1.63 సెంట్లు మాత్రమే. తాకట్టు రుణభారాలు: లేవు.

అగ్రిమెంటు నెంబరు	ఆస్తి యొక్క రిజర్వు ధర	ధరావత్తు	ధరావత్తు సమర్పణ విధానం	బిడ్ ఇంక్రిమెంటు మొత్తము	వేలం తేది	ధరావత్తు సమర్పణ తేది	ఆస్తుల తనిఖీ తేది:
CUDP4TF 2203280002	రూ.1,10,85,000/- (ఒక కోటి పది లక్షల ఎనభై ఐదు వేల రూపాయలు మాత్రమే)	రూ.11,08,500/-(పదకొండు లక్షల ఎనిమిది వేల ఐదు వందల రూపాయలు మాత్రమే	శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారిపేరున డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా	రూ.25000	12.03.2026	11.03.2026	10.03.2026

ఆసక్తి గల బిడ్డర్లు లాగిన్ ఐడి & పాస్ట్‌వర్డ్ ఏర్పాటు చేయడంలో, బిడ్ సమర్పణలో, ఈ బిడ్డింగ్ ప్రక్రియలో సహాయం కొరకు మెస్సర్స్ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, శ్రీ గౌరవ్ నంబూద్రి సెల్: 9833922941, ఈమెయిల్ <gaurav.n@samil.in> మరియు ఆస్తి సంబంధిత వివరాలకై అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీ.ఎం.గంగాధర, సెల్: +91 9959463246 సంప్రదించగలరు. అధీకృత అధికారి ఏ బిడ్డు అయినా లేక అన్ని బిడ్లను ఏ కారణము తెలుపకనే తిరస్కరించుటకు అధికారము కలిగి వున్నారు. ఆన్‌లైన్ వేలము టెండరు సమర్పణ/ బిడ్ ఫారం కొరకు/ టెండరు ఓపెన్ రియు వేలము కొరకు వెబ్‌సైట్ https://eauctions.Samil.in/home ను చూడగలరు. పూర్తి నియమ నిబంధనల కొరకు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెబ్‌సైట్‌లో తెలుపబడిన లింకు https://www.shriramfinance.in/auction ను చూడగలరు. గమనిక: ఇందుమూలముగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ " ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్"తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్" గా మార్పు చెందింది. ఇది తేది: 30.11.2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికెట్ ఇన్ కార్పొరేషన్ తేది: 30.11.2022 ద్వారా మార్పు చెందింది.

ప్రదేశము: కడప, తేది:27.01.2026 — సం// అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032, వెబ్‌సైట్: www.shriramfinance.in/auction.
కార్యాలయ చిరునామా: డి.నెం.42/107-1, ఓబుల్‌రెడ్డి కాంప్లెక్స్, అప్సర సర్కిల్, జయనగర్‌కాలనీ, కడప - 5160032 & శాఖ కార్యాలయం: కడప - 2

కడప ఎస్.ఆర్.ఓ (ఆర్.ఓ) ప్రకారం డాక్యుమెంట్ నెం.5738/2014 సిహెచ్.వెంకటసుబ్బారెడ్డి గారికి చెందినది.

స్థిరాస్తులు అమ్మకము కొరకు ఈ–వేలం ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్, 2002, 9(1) & 8(6)తో చదువబడే క్రింద స్థిరాస్తుల ఈ–వేలం అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు గ్యారంటారు (లు)లకు తెలియజేయడమేమనగా దిగువ తెలిపిన రుణగ్రహీతలు / గ్యారంటార్లకు చెందిన ఆస్తులను సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా / ఛార్జిలో వుంచి పొందిన బకాయి మొత్తము తేది: 23.01.2023 నాటికి రూ.2,48,66,537/- లను + తేది: 24.01.2023 నాటి నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులను రాబట్టుకునేందుకు సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు తేది 23.01.2023న జారీ చేసి శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క సెక్యూర్డ్ క్రెడిటార్ వారిచే స్వాధీనం చేసుకున్న ఆస్తులను "ఎక్కడ ఎలా వున్నదో అక్కడ" "అక్కడ ఎలా ఉన్నదో" అలానే మరియు "అక్కడ ఏమి ఉన్నదో" అనే పద్ధతిపై తేది: 12.03.2026 ఉదయం 11.గం॥లకు నుండి మ.1.00 గం॥ల మధ్య విక్రయించుటకు నిర్ణయించినారు. అగ్రిమెంటు నెం.: CUDP4TF1411210001,

రుణగ్రహీతలు/గ్యారంటార్ల యొక్క పేర్లు,చిరునామా :-1) సి.హెచ్.వెంకట సుబ్బారెడ్డి, తండ్రి సి.సుబ్బారెడ్డి, డి.నెం.20/797, మిద్దెపైన కో-ఆపరేటివ్ కాలనీ, కడప, కడప జిల్లా – 2) శ్రీమతి సి.రమ, భర్త సి.హెచ్.వెంకటసుబ్బారెడ్డి, డి.నెం.20/797, మిద్దెపైన కో-ఆపరేటివ్ కాలనీ, కడప, కడప జిల్లా, 3) జి.పద్మనాబరెడ్డి, తండ్రి జి.రామిరెడ్డి, డి.నెం.20/797, మిద్దెపైన కో-ఆపరేటివ్ కాలనీ, కడప, కడప జిల్లా

స్థిరాస్తుల యొక్క వివరణ: (కడప ఎస్.ఆర్.ఓ(ఆర్.ఓ) నందు సి.హెచ్.వెంకటసుబ్బారెడ్డి పేరున రిజిస్టరు కాబడిన పత్రంనెం.5738/2014 ప్రకారం):- షెడ్యూలు-1: వైయస్.ఆర్ కడప జిల్లా, కడప సబ్‌జిల్లా, కడప మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఏరియా, రామరాజుపల్లి గ్రామలెక్కదాఖలా, గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ, సర్కారు మెట్ట డి.నెం.114 లో ఎ.13.18 సెంట్లు భూమిని మార్పు చేసి వేసిన ఇంటి ప్లాట్లలో ప్లాటు నెం.72 మరియు ఇందుకు తూర్పు వైపు ఎ.0.07 సెంట్ల 350 చ.లింకులు మరియు ఇందున పడమర వైపు: ఎ.0.03 సెంట్ల 675 చ.లింకులు. లేదా 0.015 హెక్టార్ల స్థలం హద్దులు: తూర్పు: అదే ప్లాటులోని ఎ.0.03 సెంట్ల 675 చ.లింకుల ఓబాయపల్లి రామచంద్రారెడ్డికి చెందిన స్థలం పడమర: చిట్టా వెంకటసుబ్బారెడ్డి స్థలం, ఉత్తరం: రోడ్డు, దక్షిణం: ప్లాటు నెం.65. ఈ హద్దుల మధ్య తూర్పు నుండి పడమర: 19.05 చ.అ. లేదా 5.81మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: 84 అ. లేదా 25.81మీ. దారి హక్కులు మరియు ఇతర ఈజ్‌మెంట్ హక్కులతో సహా.

షెడ్యూలు-2: వైయస్.ఆర్ కడప జిల్లా, కడప సబ్‌జిల్లా,కడప మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఏరియా, రామరాజుపల్లి గ్రామలెక్కదాఖలా, గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ, సర్కారు మెట్ట డి.నెం.114 లో ఎ.13.18 సెంట్లు భూమిని మార్పు చేసి వేసిన ఇంటి ప్లాట్లలో ప్లాటు నెం.72 మరియు ఇందున పడమర వైపు: ఎ.0.07 సెంట్ల 350 చ.లింకులు. లేదా 0.031 హెక్టార్ల స్థలం హద్దులు: తూర్పు: కల్లూరు చెప్పల్‌రెడ్డికి చెందిన ఎ.0.07సెంట్ల 350 చ.లింకుల స్థలం పడమర: ప్లాటునెం. 73 లోని స్థలం, ఉత్తరం: పబ్లిక్ రోడ్డు, దక్షిణం: ప్లాటు నెం.65లోని స్థలం. ఈ హద్దుల మధ్య తూర్పు నుండి పడమర: 38.1 చ.అ. లేదా 11.62మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: 84 అ. లేదా 25.81మీ. వెరశి మొత్తం విస్తీర్ణం 355.6 చ.గ. దారి హక్కులు మరియు ఇతర ఈజ్‌మెంట్ హక్కులతో సహా. తాకట్టు రుణభారాలు: లేవు.

అగ్రిమెంటు నెంబరు	ఆస్తి యొక్క రిజర్వు ధర	ధరావత్తు	ధరావత్తు సమర్పణ విధానం	బిడ్ ఇంక్రిమెంటు మొత్తము	వేలం తేది	ధరావత్తు సమర్పణ తేది	ఆస్తుల తనిఖీ తేది:
CUDP4TF 1411210001	రూ.77,12,000/- (డెబ్బై ఏడు లక్షల పన్నెండు వేల రూపాయలు మాత్రమే)	రూ.7,71,200/-(ఏడు లక్షల డెబ్బై ఒక్క వేల రెండు వందల రూపాయలు మాత్రమే	శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారిపేరున డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా	రూ.25000	12.03.2026	11.03.2026	10.03.2026

ఆసక్తి గల బిడ్డర్లు లాగిన్ ఐడి & పాస్ట్‌వర్డ్ ఏర్పాటు చేయడంలో, బిడ్ సమర్పణలో, ఈ బిడ్డింగ్ ప్రక్రియలో సహాయం కొరకు మెస్సర్స్ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, శ్రీ గౌరవ్ నంబూద్రి సెల్: 9833922941, ఈమెయిల్ <gaurav.n@samil.in> మరియు ఆస్తి సంబంధిత వివరాలకై అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీ.ఎం.గంగాధర, సెల్: +91 9959463246 సంప్రదించగలరు. అధీకృత అధికారి ఏ బిడ్డు అయినా లేక అన్ని బిడ్లను ఏ కారణము తెలుపకనే తిరస్కరించుటకు అధికారము కలిగి వున్నారు. ఆన్‌లైన్ వేలము టెండరు సమర్పణ/ బిడ్ ఫారం కొరకు/ టెండరు ఓపెన్ రియు వేలము కొరకు వెబ్‌సైట్ https://eauctions.Samil.in/home ను చూడగలరు. పూర్తి నియమ నిబంధనల కొరకు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెబ్‌సైట్‌లో తెలుపబడిన లింకు https://www.shriramfinance.in/auction ను చూడగలరు. గమనిక: ఇందుమూలముగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ " ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్"తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్" గా మార్పు చెందింది. ఇది తేది: 30.11.2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికెట్ ఇన్ కార్పొరేషన్ తేది: 30.11.2022 ద్వారా మార్పు చెందింది.

ప్రదేశము: కడప, తేది:27.01.2026 — సం// అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

EENADU Classifieds

EDUCATION

అర్జున అకాడమి కడప DSC వ్యాయామ అభ్యర్థులకు మెగా గ్రాండ్ టెస్ట్ 01-02-2026, PET & SA [P.E] / PD. Cont: 6302642219.

విజయవాడలో BPT/B.Sc., MLT- మేనేజ్‌మెంట్ కోటా సీట్లు- తక్కువ ఫీజు- కొన్నిసీట్లు కలవు. Affiliated to Dr.NTR యూనివర్సిటీ. ✆ 7680065835.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఏటి డబ్బును వసూలుచేసి చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

JOBS

R K Services (Service partner to Amazon) Delivery Boys. Location:- Proddatur, Pulivendula, Vempalli. Cont: 9666011667, 8074953483, 8247261262.

సాహితి ఎంటర్ ప్రైజస్ : Exide బ్యాటరి డీలర్ దగ్గర పని చేయుటకు టెక్నీషియన్స్ కావలెను. కృష్ణ సర్కిల్, కడప. Cont: 9441040334.

E-KART నందు అర్జెంటుగా M/F కావలెను. Qly: Inter, Any Degree. Sal: 15,000/-. Online are Available. 9014120139

ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ॥ 330/- మాత్రమే
Contact:
KDP: 9989997626, 8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

సూపరింటెండెంట్ కార్యాలయము, సర్వజన వైద్యశాల, పులివెందుల

టెండర్ నోటీస్

Rc.No.Spl/GGH/Plvd Dated: 28-01-2026

సర్వజన వైద్యశాల నందు గల రోగులకు ప్రతిరోజు ఆహార సరఫరా నిమిత్తం ప్రతిరోగికి మూడు పూటలా టిఫిన్, భోజనం రోజుకు 80 మరియు 100 రూపాయలు ప్రకారం ఆహారం సప్లై చేయుటకు అర్హత కల్గిన కాంట్రాక్టర్ల నుండి టెండర్లు ఆహ్వానించడమైనది. ఇతర వివరములకు సర్వజన వైద్యశాల, పులివెందుల నందు సంప్రదించగలరు. Cell No: 9121441365

- ✷ టెండర్ షెడ్యూల్ జారీ చేయుటకు జారీ చేయు తేదీ 28-01-2026 నుండి 06-02-2026 వరకు
- ✷ టెండర్ షెడ్యూల్ ధర 1000/- రూపాయలు
- ✷ EMD 1,00,000/- (DD in favour of Superintendent, GGH, Plvd)
- ✷ షెడ్యూల్ దాఖలు చేయుటకు ఆఖరి తేదీ 06-02-2026 మధ్యాహ్నం 4 గంటలలోపు పూర్తి చేసిన టెండర్ అప్లికేషన్సు సూపరింటెండెంట్ కార్యాలయం నందు గడువు తేదీ లోపు సమర్పించవలెను.

టెండర్ ఏ కారణం చేతనైనా రద్దు చేయుటకు లేదా వాయిదా వేయుటకు సూపరింటెండెంట్ సర్వజన వైద్యశాల పులివెందుల వారికి అధికారము కలదు.

సం/- సూపరింటెండెంట్, సర్వజన వైద్యశాల, పులివెందుల

(c) eenadu

కార్మికుల హక్కుల సాధనకు సమ్మె

రాజంపేట, న్యూస్‌టుడే : కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల సాధన కోసం వచ్చే నెల 12న దేశ వ్యాప్త సమ్మె చేపడుతున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్ తెలిపారు. ఈమేరకు సమ్మెలో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మంగళవారం పుర కార్మికులతో కలసి ఆయన కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పుర కార్మిక సంఘం నాయకులు పి.వి.రమణ, ప్రసాద్, లక్ష్మీదేవి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

సిద్దవటం: హెల్మెట్, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మహమ్మద్ రఫీ అన్నారు. స్థానిక శివారులోని అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద మంగళవారం ఆయన వాహనాల తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణించిన వాహనదారులకు జరిమానా విధించారు. జిల్లాలో మధ్యప్రదేశ్‌కు చెందిన దొంగల ముఠా తిరుగుతున్నట్లు సమాచారం ఉందని, ఇళ్లల్లో, బ్యాంకులు, ఏటీఎంల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

రాజంపేట

•రాజంపేట • బద్వేలు

భక్తితో ఛత్ర ప్రదర్శన ఉత్సవం

బద్వేలు, న్యూస్‌టుడే : బద్వేలు శ్రీవారి ఆలయంలో మంగళవారం మల్లెం కొండేశ్వర ఛత్ర ప్రదర్శన పూజా కార్యక్రమం నేత్ర పర్వంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, ఆర్డీవో చంద్రమోహన్, పుర కమిషనర్ నరసింహారెడ్డి, ఎంపీపీ శేఖర్‌రావు, ఏపీ ఐఐసీ డైరెక్టర్ ప్రసాదరెడ్డి, తెదేపా శ్రేణులు హాజరయ్యారు. అనంతరం పుర వీధుల్లో మల్లెం కొండేశ్వర ఛత్ర ప్రదర్శన మేళతాళాల మధ్య నిర్వహించారు.

మల్లెం కొండేశ్వర ఛత్ర ప్రదర్శనలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, ఆర్డీవో చంద్రమోహన్ తదితరులు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
బద్వేలు గ్రామీణ : 8008573493

?: బ్రాహ్మణపల్లెలో వీధి దీపాలకు స్విచ్ ఏర్పాటు చేయక పోవడంతో నిరంతరం వెలుగుతూ ఉన్నాయి. **- నారాయణ, స్థానికుడు**

✓: స్విచ్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం. **- మోసే, పంచాయతీ కార్యదర్శి**

?: రామాపురంలో రోడ్లపై చెత్త పేరుకుపోయింది. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. **- సుధాకర్‌రెడ్డి, స్థానికుడు**

✓: వెంటనే సిబ్బందితో శుభ్రం చేయిస్తాం. **- వేమారెడ్డి, పంచాయతీ కార్యదర్శి**

– న్యూస్‌టుడే, గోపవరం

?: బద్వేలు ఎన్జీవో కాలనీలో మట్టి రహదారులతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. చర్యలు తీసుకోవాలి. **- సుబ్బారెడ్డి, స్థానికుడు**

✓: విషయం మా దృష్టికి వచ్చింది. సమస్యను పరిష్కరిస్తాం.

?: బద్వేలు పురపాలకలో నడకదారుల ఆక్రమణలు పెరిగిపోవడంతో పాదచారుల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఆక్రమణలు తొలగించాలి. **- స్థానికులు**

✓: ఆక్రమణలు తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

?: వెంకటయ్యనగర్ పాత పురపాలక కార్యాలయం వద్ద మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. వాహనదారులు గాయాల పాలవుతున్నారు. **- పుర ప్రజలు, బద్వేలు**

✓: మ్యాన్‌హోల్స్‌కు మూతలు ఏర్పాటు చేయిస్తాం. **(పై సమస్యలకు బద్వేలు పురపాలక కమిషనర్ నరసింహారెడ్డి సమాధానమిచ్చారు.)** – న్యూస్‌టుడే, బద్వేలు

గ్రామ సింహాలు.. జనం బెంబేలు

పట్టించుకోని పంచాయతీ అధికారులు

సుండుపల్లి, న్యూస్‌టుడే : సుండుపల్లి మండలంలో శునకాలు హడలెత్తిస్తున్నాయి. వీధుల్లో ఆడుకుంటున్న చిన్నారులపై.. నడిచి వెళ్లే వారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. రాత్రి వేళ ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారిని గ్రామ సింహాలు వెంబడిస్తూ కరుస్తున్నాయి. అవి వెంబడిస్తున్న క్రమంలో చోదకులు వేగంగా వాహనాలు నడిపి అదుపు తప్పి కింద పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. ఉదయం వేళ పొలాలకు వెళ్తున్న రైతులు, కూలీలపైనా దాడి చేస్తున్నాయి.

● మండలంలోని సుండుపల్లి, రాయవరం, బి.జి.రాచపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గత అక్టోబరు 1 నుంచి జనవరి 25వ తేదీ వరకు 179 మంది కుక్కకాటు బారినపడ్డారు.

● గడచిన మూడు నెలల కాలంలో సుండుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మొత్తం 108 మంది శునకాల కాటుకు చికిత్స పొందారు. వారిలో 50 శాతం మంది సుండుపల్లికి చెందిన వారే ఉన్నారు.

● అదేవిధంగా రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 56 మంది చికిత్స పొందగా.. వారిలో ఎక్కువ మంది మడితాడు, పెద్దినేనికాలువ, ముడుంపాడు, మాచిరెడ్డిగారిపల్లి పంచాయతీలకు చెందిన వారున్నారు.

● బి.జి.రాచపల్లి ఆరోగ్య కేంద్రం పరిధిలో 15 మంది చికిత్స పొందారు. వీరిలో వీరబల్లి మండలం సానిపాయి ప్రాంతానికి చెందిన వారు ఏడుగురు ఉన్నారు. మిగిలిన వారు ఓదివీడు, సుండుపల్లి మండలంలోని పొలిమేరపల్లి గ్రామ పంచాయతీలకు చెందిన వారున్నారు.

● కుక్కల దాడిలో జీవాలు మృత్యువాత పడుతున్నాయని పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సుండుపల్లిలో శనివారం ఇంటి ముందు ఆడుకుంటున్న నాలుగేళ్ల కరిష్మాను కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. ముఖం, తలకు తీవ్ర గాయాలయ్యాయి.

రహదారిపై స్వైర విహారం చేస్తున్న కుక్కలు

చర్యలు తీసుకుంటాం

వీధి కుక్కల బెడద తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. పంచాయతీ కార్యదర్శులతో చర్చించి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తాం. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- మస్తాన్, డివిజనల్ పంచాయతీ అధికారి, రాజంపేట**

వైభవం.. అంజన్న రథోత్సవం

నందలూరు, న్యూస్‌టుడే : మండలంలోని కుంపిణీపురం గ్రామంలో భోగాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. రథాన్ని పూలతో సుందరంగా అలంకరించి స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని కొలువుదీర్చారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి వచ్చిన జాగీరుదారు వంశస్థులు రథాన్ని లాగడంతో ఊరేగింపు ప్రారంభమైంది. రథాన్ని లాగేందుకు మహిళలు పోటీపడ్డారు. ఊరేగింపు కుంపిణీపురం, మిద్దెల, బలిజపల్లి గ్రామాల మీదుగా సాగింది. బాణసంచా కాలుస్తూ, డప్పువాయిద్యాల నడుమ రంగులు చల్లుకుంటూ అత్యంత వైభవంగా ఊరేగింపు కొనసాగింది.

రథాన్ని లాగుతున్న భక్తులు, ఇన్‌సెట్‌లో స్వామివారు

కొండమ్మకు అభిషేకం

రాజంపేట: అలంకరణలో ఆంజనేయుడు

సుండుపల్లి: అక్కంపల్లి సమీపంలోని వైఎస్సార్ కాలనీలోని బోయకొండమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

అంజన్నకు ఆకుపూజ..

రాజంపేట : పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి పంచామృతాభిషేకాలను చేశారు. స్వామి వారికి తమలపాకు పూజ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

బడి పండగ.. మురిసె మది నిండుగ

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : మండలంలో ఒంటిమిట్ట, రాచపల్లె, కొత్తమాధవరం, మంటపంపల్లె, చింతరాజుపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో మంగళవారం బడి వార్షికోత్సవ వేడుకలు, పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. బాల, బాలికలు ఆద్యంతం ఉత్సాహంగా గడిపారు. విద్యార్థినులు సంప్రదాయ వస్త్రాధారణతో కదిలొచ్చారు. పోటాపోటీగా నృత్య ప్రదర్శనలు చేశారు. హెచ్ఎంలు చొరవ తీసుకొని దాతల సహకారంతో పిల్లలకు రుచికర భోజన వసతి కల్పించారు. ఎంఈవో-2 వల్లూరు బ్రహ్మయ్య, ప్రధానోపాధ్యాయులు రవీంద్ర కుమార్, జమాల్‌రెడ్డి, అంబేడ్కర్, ఐజయ్య, మేరీ పాల్గొన్నారు.

ఒంటిమిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల ఆనందం

రాజంపేట పురపాలక బడ్జెట్ రూ. 46.68 కోట్లు

రాజంపేట, న్యూస్‌టుడే : రాజంపేట పురపాలక సభా భవనంలో మంగళవారం బడ్జెట్ కౌన్సిల్ సమావేశం జరిగింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ. 46.68 కోట్లతో రాజంపేట పురపాలక సాధారణ బడ్జెట్‌ని మంగళవారం ప్రవేశపెట్టారు. ప్రారంభ నిల్వగా రూ. 16.70 కోట్లు చూపగా సాధారణ జమ కింద రూ. 19.05 కోట్లు, మూలధనపు జమ కింద రూ. 10.92 కోట్లు చూపారు. ఇందులో సాధారణ ఖర్చులు రూ. 11.68 కోట్లు, మూలధనపు ఖర్చులు రూ. 14.95 కోట్లుగా చూపారు. అంతిమంగా సుమారు రూ. 20 కోట్లు నిల్వ ఉంటుందని అంచనా వేశారు. దీనిని సభ్యులకు చదివి వినిపించగా.. వారు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా తెదేపా ఫ్లోర్ లీడరు అశోక్‌కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని చక్రాలమడుగు సుందరీకరణ పనులు చేపట్టాలని కోరారు. పట్టణంలోని మురుగంతా చక్రాలమడుగులోకి కలుస్తోందని, అలా కాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని కోరారు. రైల్వేస్టేషన్ వద్ద అర్ధాంతరంగా ఆగిపోయిన ఆర్‌యూబీ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పలువురు సభ్యులు వివిధ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, పురపాలక ఛైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి అక్కడే ఉన్న పుర కమిషనర్ లక్ష్మీనారాయణకు సూచించారు.

మాట్లాడుతున్న పుర ఛైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

29న కోదండ రాముడి గ్రామోత్సవం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ఈ నెల 29న గురువారం ఉదయం భీష్మ ఏకాదశి సందర్భంగా గర్భాలయంలో సీతారామలక్ష్మణ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ తనిఖీ అధికారి నవీన్‌కుమార్ మంగళవారం తెలిపారు. రాములోరి ఊరేగింపు కార్యక్రమానికి భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

స్పందనకు వందనం

బద్వేలు, న్యూస్‌టుడే: బద్వేలు పురపాలకలోని తితిదే కల్యాణ మండపం ప్రహరీ గోడ నిర్మాణానికి ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. గతేడాది జూన్ 28న 'పడిపోయిన ప్రహరీ గోడ' అన్న శీర్షికన వార్త 'ఈనాడు'లో ప్రచురితమైంది. గోడ పడిపోవడం వల్ల పందులు, కుక్కలు వస్తున్నాయని వివాహ సమయాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని విశ్లేషిస్తూ కథనం వచ్చింది. దీనిపై స్పందించిన తితిదే ఇంజినీరు విభాగం అధికారులు రూ. లక్ష నిధులు మంజూరు చేసి నిర్మాణం పనులను చేపట్టారు.

ప్రతిభావంతులకు నగదు బహుమతులు

ఒంటిమిట్ట: మండలంలోని కొత్తమాధవరంలో 2024-25 విద్యా సంవత్సరంలో పదిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు 1996-97 విద్యా సంవత్సర పూర్వ విద్యార్థులు మంగళవారం నగదు బహుమతులు అందజేశారు. నవీన్‌కుమార్‌కు (ప్రథమ) రూ. 7 వేలు, హరిప్రియ (ద్వితీయ) రూ. 5 వేలు, సుగుణ (తృతీయ) రూ. 3 వేలు అందజేశారు. 500కు పైగా మార్కులు సాధించిన ఒక్కో విద్యార్థికి రూ. 500 చొప్పున ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జొన్నాదుల రమేష్, మేరువ నరసింహ, చేపూరి హరి పాల్గొన్నారు.

ఉద్యోగాలిస్తున్న కూటమి ప్రభుత్వం

నందలూరు: రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ నాడు చేపట్టిన యువగళం పాదయాత్ర యువతకు భరోసానిచ్చిందని రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి దేవూరి వేణుగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం యువగళం పాదయాత్ర మూడేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యువగళంలో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ ద్వారా కొత్త ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారని, పరిశ్రమలతో 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రణాళికతో ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో తెదేపా మండల కోక్లస్టర్ ఇన్‌ఛార్జి చుక్కా యానాది, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పోలి శివకుమార్, నాయకులు బండారు రెడ్డి శేఖర్, సాయిరాం చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఐదు రోజుల పని విధానం అమలుకు డిమాండ్

రాజంపేట ప్రధాన ఎస్‌బీఐ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

బద్వేలు: స్టేట్ బ్యాంకు వద్ద నిరసన తెలుపుతున్న బ్యాంకు సిబ్బంది

రాజంపేట, న్యూస్‌టుడే : బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం ఎదుట వివిధ బ్యాంకు ఉద్యోగులు మంగళవారం ఆందోళన చేపట్టారు. అక్కడి నుంచి పాతబస్టాండు వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ రాజంపేట రీజనల్ కార్యదర్శి నంద జగదీశ్ మాట్లాడారు. వారానికి ఐదు రోజుల పని దినాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ● **బద్వేలు గ్రామీణ :** పట్టణంలోని స్టేట్ బ్యాంకు వద్ద మంగళవారం వివిధ బ్యాంకుల సిబ్బంది నిరసన కార్యక్రమం చేపట్టారు. పలు ప్రభుత్వ రంగ బ్యాంకుల సిబ్బంది పాల్గొన్నారు. ● **సుండుపల్లి :** అయిదు రోజుల పనిదినాన్ని కోరుతూ బ్యాంకు ఉద్యోగులు సమ్మె చేయడంతో మంగళవారం మండలంలోని ఎస్‌బీఐ, కెనరాబ్యాంకు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులు మూతపడ్డాయి. వరుసగా నాలుగు రోజులు బ్యాంకులు మూత పడటంతో ఖాతాదారులు ఆర్థిక లావాదేవీలు నిర్వహించేందుకు ఇబ్బందులకు గురయ్యారు.

సమస్యలపై సబ్ కలెక్టర్‌కు వినతి

రాజంపేట, న్యూస్‌టుడే : ప్రధాన సమస్యలతో రాజంపేట పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వీటిని పరిష్కరించాలని కోరుతూ తెదేపా లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, నాయకులు షామీర్‌బాషా మంగళవారం సబ్ కలెక్టర్ హెచ్ఎస్ భావనకు వినతిపత్రం అందజేశారు. రాజంపేట ఆర్‌యూబీ నిర్మాణం అందుబాటులోకి రాకపోవడం కారణంగా రైల్వేస్టేషన్‌కు ఇరువైపులా ఉన్న గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 40 ఏళ్ల కిందట నిర్మించిన రోడ్లే నేటికీ దర్శనమిస్తున్నాయని, జనాభా పెరుగుతున్నా రోడ్ల విస్తరణ జరగని కారణంగా ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందన్నారు.

ఏఎస్పీ పరిశీలన

సుండుపల్లి, న్యూస్‌టుడే : సుండుపల్లి సర్కిల్ కార్యాలయం ఏర్పాటుకు అవసరమైన భవన నిర్ణయం కోసం మంగళవారం రాజంపేట ఏఎస్పీ మనోజ్‌హెగ్డే పరిశీలించారు. పాత పోలీసు స్టేషన్ భవనాన్ని సర్కిల్ కార్యాలయంగా ఏర్పాటు చేసేందుకు పరిశీలన చేస్తున్నారు. ఆయన వెంట సీఐ ఏపీ మస్తాన్, ఎస్ఐ ఎస్.కె.ఎం.హుస్సేన్ ఉన్నారు.

మునగ సాగు రైతులకు లాభదాయకం

వీరబల్లి, న్యూస్‌టుడే : రైతులు లాభాలు వచ్చే మునగసాగుపై ఆసక్తి చూపి సాగు చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని గ్రామాల్లో మునగ సాగు చేసిన రైతుల పొలాలను మంగళవారం ఆమె పరిశీలించారు. మునగ సాగుకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉందని, మార్కెట్లో మంచి గిరాకీ ఉందని రైతులకు సూచించారు. కేవలం పచ్చి మునగ ఆకును రైతులు మండల రైతు సమాఖ్యకు అమ్ముకోవడం జరుగుతుందన్నారు. వారు ప్రాసెస్ చేసి పౌడర్ తీసి అమ్మడం జరుగుతుందన్నారు. మునగ పౌడర్‌తో 100 రకాల ఉత్పత్తులు తయారు అవుతున్నాయని వాటికి అమెరికా, జర్మనీ తదితర దేశాల్లో ఎక్కువ డిమాండు ఉందన్నారు. అనంతరం గోదామును పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం ఖాదర్‌వలీ, సీసీలు కృష్ణయ్య, గంగాధర్, సుధాకర్, నాగేంద్ర, రైతు సమాఖ్య పథాధికారులు రాచన్న, రామయ్య, రాంప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణ అవసరం

పోలీసు డైరీని ఆవిష్కరిస్తున్న కమాండెంటు ఆనందరెడ్డి, ఇతర పోలీసు అధికారులు

సిద్దవటం, న్యూస్‌టుడే : క్రమ శిక్షణతో మెలిగి అంకిత భావంతో పనిచేసినప్పుడే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని కమాండెంట్ ఆనంద్‌రెడ్డి అన్నారు. సిద్దవటం మండలం భాకరాపేట శివారులోని ఏపీఎస్పీ పదకొండో బెటాలియన్‌లో మంగళవారం బెటాలియన్ పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు శివారెడ్డి ఆధ్వర్యంలో దైనందినిని కమాండెంట్ ఆవిష్కరించి మాట్లాడారు. అసిస్టెంట్ కమాండెంట్లు ప్రసాద్, రాజశేఖర్, ఆర్ఐ, ఆర్ఎస్ఐ, ఏఆర్ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

కాలువ పూడి దుర్వాసన

బద్వేలు పురపాలకలోని పోరుమామిళ్ల మార్కెట్ వీధిలో కాలువ పూడికతో నిండింది. ఎక్కడికక్కడ మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ఈ మార్గంలో ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. పలుమార్లు కాలువలో పూడిక తీయాలని ప్రజలు మున్సిపల్ అధికారులను కోరినా ప్రయోజనం లేకపోయింది. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డితో 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా కాలువలో పూడిక తీత పనులు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, బద్వేలు**

వృద్ధుడి అదృశ్యం

సుండుపల్లి, న్యూస్‌టుడే : మండలంలోని బేరిపల్లెకు చెందిన వృద్ధుడు ఎస్.బాషా అదృశ్యమైనట్లు అతని ముంతాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త కేసు నమోదు చేశామని ఏఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ నెల 22వ తేదీ తన భర్త డబ్బులు అడగడంతో లేవని చెప్పడంతో ఆయన అలిగి దుస్తులు సర్దుకొని వెళ్లిపోయాడని ఆమె పేర్కొందని తెలిపారు. ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

తారు మాయమై.. ప్రమాదాలకు నెలవై

● ఇదీ సుండుపల్లి - పీలేరు రహదారి దుస్థితి

సుండుపల్లి, న్యూస్‌టుడే : సుండుపల్లి - పీలేరు రహదారిలో తారు మాయమై గుంతలే కనిపిస్తున్నాయి. కంకర తేలి మట్టి రహదారిగా మారింది. రాకపోకలకు ఏమాత్రం అనువుగా లేదు. జి.రెడ్డివారిపల్లి పంచాయతీ తొగటపల్లె దాటిన అనంతరం తారు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు వేగంగా వెళుతూ ఇబ్బందులు పడటమేకాదు.. ప్రమాదాల ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్గంలో మితిమీరిన ఇసుక ట్రక్కుల ప్రయాణంతోనే రహదారి అధ్వాన స్థితికి చేరింది. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సమస్యను ఆర్‌అండ్‌బీ ఏఈ కుమార్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా వారం రోజుల్లో అత్యవసర మరమ్మతుల కింద పనులు చేస్తామని చెప్పారు.

పశు బీమాపై రైతులకు అవగాహన

కాశినాయన, న్యూస్‌టుడే: మండలంలోని నాడు వరికుంట్లలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. జీవాలకు నట్టల నివారణ మందులు తాపించారు. పశు బీమా పథకం గురించి రైతులకు నరసాపురం పశువైద్యాధికారి రామారావు అవగాహన కల్పించారు.

సుండుపల్లి : పశువైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యశాఖ సహాయసంచాలకులు కె.విజయకుమార్ తెలిపారు. చెన్నంశెట్టిపల్లి, మడితాటివాండ్లపల్లిలో మంగళవారం నిర్వహించిన పశు వైద్య శిబిరంలో పశువులు, జీవాలకు వైద్య చికిత్సలు చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి ఎన్.రవికుమార్, సహాయకులు మాలతి, సాయిలక్ష్మి పాల్గొన్నారు.

వీరబల్లి : మండలంలోని గురప్పగారిపల్లి పంచాయతీ సి.టి.కే తొగటపల్లిలో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వీరబల్లి సింగిల్ విండో అధ్యక్షులు ఎం.భానుగోపాల్‌రాజు, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.





(c) eenadu

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • మైదుకూరు

క్రీడలతో కుస్తీ.. పతకాలతో దోస్తీ

గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు క్రీడల్లో రాణిస్తున్నారు. చదువుతో పాటు ఆటల్లో తమ ప్రత్యేకత చాటుతున్నారు జమ్మలమడుగు

• రాష్ట్రస్థాయిలో కేజీబీవీ విద్యార్థినుల సత్తా

మండల పరిధిలోని కస్తుర్బా గాంధీ విద్యాలయం విద్యార్థినులు. ఫుట్‌బాల్, బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తూ అందరి మన్ననలు పొందుతున్న విద్యార్థినులపై న్యూస్‌టుడే కథనం.

- న్యూస్‌టుడే, జమ్మలమడుగు గ్రామీణ

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధిస్తా

రైల్వేకోడూరులో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-19 బేస్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు తరుపున పాల్గొని మొదటి స్థానంలో నిలిచాను. చదువుతో పాటు ఆటల్లో రాణించి క్రీడా కోటాలో ఉన్నత ఉద్యోగం సాధించడమే లక్ష్యం. - ఎస్.ఇంద్రజ

నిత్యం సాధన చేస్తున్నా

హిందూపురంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 ఫుట్‌బాల్ పోటీలు, గుంటూరులో జరిగిన అండర్-19 సాఫ్ట్‌బాల్ పోటీలో జిల్లా జట్టు తరుపున పాల్గొని సత్తా చాటాను. చదువు, క్రీడల్లో ప్రతిభ చాటేలా సాధన చేస్తున్నాను. - హారిణి

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..

హిందూపురంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 ఫుట్‌బాల్ పోటీల్లో మొదటిస్థానం, నరసరావుపేటలో జరిగిన అండర్-17 పోటీల్లో రెండోస్థానంలో నిలిచాను. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో జాతీయ స్థాయిలో రాణిస్తాను. - నాగమౌనిక

ఉపాధ్యాయుల సహకారంతో..

చిన్నప్పటి నుంచి క్రీడల్లో ప్రతిభ చాటుతున్నాను. మదనపల్లెలో జరిగిన అండర్-14 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచాను. ఉపాధ్యాయుల సహకారంతో జాతీయ స్థాయిలో రాణిస్తాను. - సుమతి

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

మంగళగిరి పార్టీ కార్యాలయం వద్ద తెదేపా జిల్లా అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి, నాయకులు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: 2029 సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా ప్రతి తెదేపా నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారని తెదేపా జిల్లా అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మంగళగిరిలోని తెదేపా జాతీయ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన ఒక్కరోజు నిర్వహించిన వర్క్‌షాపునకు భూపేష్‌రెడ్డి హాజరయ్యారు. పార్టీ కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సీఎం సూచించారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని చంద్రబాబు చెప్పినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్, జోనల్ ఇన్‌ఛార్జిలు, పార్లమెంట్ అధ్యక్షులు పాల్గొన్నారు. జమ్మలమడుగు నుంచి జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం

రాజుపాలెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని వెల్లాల డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2026-27 విద్యాసంవత్సరంలో అయిదోతరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ తులశమ్మ తెలిపారు. వచ్చే నెల 19వరకు దరఖాస్తు గడువు ఉందన్నారు. 6, 7, 8, 9 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కన్నేస్తే.. కాజేస్తారు

• పసిడిపురిలో వక్ఫ్ భూములు అన్యాక్రాంతం

మోడంమీదపల్లె బైపాసురోడ్డులోని వక్ఫ్ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలు

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే : ప్రొద్దుటూరులో వక్ఫ్ భూములపై కబ్జాదారులు కన్నేశారు. పట్టణంలోని మోడంమీదపల్లె మసీద్‌కు చెందిన వక్ఫ్ భూములు అన్యాక్రాంతమయ్యాయి. పంచాయతీ, రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖల అధికారుల అండదండలతో కొందరు ఇళ్లు నిర్మించగా, మరికొందరు కంచె ఏర్పాటు చేసి సెంట్ల చొప్పున విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం వాటిని కాపాడాల్సిన వక్ఫ్ బోర్డు అధికారులు అలసత్వం వహిస్తున్నారు.

● ఏపీ వక్ఫ్ బోర్డు గెజిట్ ప్రకారం ప్రొద్దుటూరులోని కొత్తపల్లెలో 565 సర్వే సంఖ్యలో 0.73 ఎకరాలు, తాళ్లమాపురంలో 440-2బీ/2ఏ, 440/2బీ1, 440/2ఏ2, 440/2ఏ1, 442/1, 442/2 సర్వే సంఖ్యలో 14.97 ఎకరాలు, మోడంమీదపల్లె రెవెన్యూ గ్రామంలో 263/1, 263/2, 260, 278/7, 305/ఏ, 309/1, 320/బీ, 387, 291, 293, 290/1బీ, 298, 208, 387/4, 308/2, 261, 309/2, 268/2, 262, 278/1, 482 సర్వే సంఖ్యల్లో 22.24 ఎకరాలు ఉంది. మొత్తం 37.94 ఎకరాల వక్ఫ్‌భూములున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీటిని సంరక్షించాలని కోరుతూ అనేక సార్లు ఫిర్యాదులు చేసినా ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. ప్రధానంగా మోడంమీదపల్లె బైపాసు రోడ్డుకు ఆనుకుని ఉన్న సర్వే సంఖ్య 260లో 1.23 ఎకరాలు, సర్వే సంఖ్య 261లో 0.84 ఎకరాలు కలిపి మొత్తం 2.07 ఎకరాలు ఆక్రమించారు. పెద్ద భవనాలు నిర్మించారు. సెంటు స్థలం విలువ రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు పలుకుతోంది. ఈ లెక్కన కోట్ల రూపాయలు దోచుకుంటున్నా వక్ఫ్‌బోర్డు అధికారుల్లో చలనం లేదు.

స్వాధీనం చేసుకుంటాం

కబ్జా చేసిన వక్ఫ్ భూములను స్వాధీనం చేసుకుంటాం. వక్ఫ్ భూములు, స్థలాలను రిజిస్ట్రేషన్ చేయరాదని సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ రాశాం. అక్రమ కట్టడాలను గుర్తించి నోటీసు లిస్తాం. తహసీల్దారు నేతృత్వంలో వారం రోజుల్లో పోలీసు బందోబస్తుతో వక్ఫ్ భూములను సర్వే చేయించేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. - వసీం అక్రమ్, వక్ఫ్‌బోర్డు జిల్లా అధికారి

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు : 9494294241
మైదుకూరు : 8008573447

?: ముద్దనూరు మండలం నల్లబల్లెలో కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నాం. - సుకుమార్‌రెడ్డి, నల్లబల్లె

✓: గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేయించేలా చర్యలు తీసుకుంటాం. - అనిల్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి

?: కొలవలి గ్రామంలో ఏర్పాటు చేసిన వీధిదీపాలు పగలే వెలుగుతున్నాయి. - గంగాధర్, కొలవలి

✓: గ్రామంలో రాత్రివేళ మాత్రమే వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - మోహన్‌రాజా, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, ముద్దనూరు

?: దొరసానిపల్లె బైపాసురోడ్డు పక్కన ఉన్న శ్మశాన వాటిక ప్రహరీ కూలిపోయింది. - కొండయ్య, దొరసానిపల్లె

✓: కూలిన గోడను మళ్లీ ఏర్పాటు చేయిస్తాం. - సాంబశివారెడ్డి, పంచాయతీ కార్యదర్శి

?: చెన్నమరాజుపల్లెకు సమీపంలో వంకపై వంతెన రక్షణ గోడ దెబ్బతింది. - శ్రీనివాసులు, గ్రామస్థుడు

✓: రక్షణ గోడను నిర్మించేలా చర్యలు తీసుకుంటాం. - లక్ష్మీనరసింహులు, ఆర్‌అండ్‌బీ డీఈ, ప్రొద్దుటూరు

?: స్థానిక సినీహబ్‌కు వెళ్లే వంతెనకు సమీపంలో తారురోడ్డుపై గుంతపడింది. - అబ్దుల్ జబ్బార్, స్థానికుడు

✓: రహదారిపై గుంత పూడ్చేలా చర్యలు తీసుకుంటాం. - లక్ష్మీనరసింహులు, ఆర్‌అండ్‌బీ డీఈ, ప్రొద్దుటూరు, - న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు గ్రామీణ

స్పందించారు.. పరిష్కరించారు

◆ కొండాపురం రామసుబ్బారెడ్డి కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదని 'మేమున్నాం మీకు తోడుగా'లో భాగంగా ఈనాడులో సమస్య ప్రచురితమైంది. స్పందించిన సిబ్బంది వీధి దీపాలను బాగు చేయించారు.

◆ బెడుదూరులోని పలు వీధుల్లో మురుగు రోడ్డుపై పారుతోందని 'మేమున్నాం మీకు తోడుగా'లో భాగంగా సమస్య ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో పారిశుద్ధ్య పనులు చేయించారు. - న్యూస్‌టుడే, కొండాపురం

అక్రమ వసూళ్లు అడ్డుకోవాలని డిమాండ్

కమిషనర్ రవిచంద్రారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న భాజపా నాయకులు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలక సంఘం కూరగాయల మార్కెట్‌లో పార్కింగ్, గేటు ఫీజుల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి కృష్ణ ప్రదీప్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు అక్రమ వసూళ్లను అడ్డుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి, పురపాలక కమిషనర్ రవిచంద్రారెడ్డికి మంగళవారం వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. మార్కెట్‌లో పార్కింగ్ స్థలం, సీసీ కెమెరాలు లేవన్నారు. వాహనాల భద్రతకు సెక్యూరిటీ గార్డులు అందుబాటులో లేరని వివరించారు. చిరు వ్యాపారుల నుంచి స్టాల్స్ కోసం రోజూ అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పాలెం శేఖర్‌కుమార్, నాయకులు గురుప్రసాద్, జయలక్ష్మి, మునిశేఖర్‌రెడ్డి, విక్రమ్, అక్బర్, రవి, గురురాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేమన పద్యాలపై ప్రచారం

అర్కటవేములలో ప్రచారం చేస్తున్న సభ్యులు

రాజుపాలెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని అర్కటవేముల గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి జమ్మలమడుగు కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వేమన పద్యాలపై ప్రచారం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు రంగనాయకులు, నరసింహ, వెంకటరెడ్డి, నాగరాజు, రాజేశ్వరి మల్లీశ్వరి రామకృష్ణ, చలపతి రమణ నరసప్ప పాల్గొన్నారు.

చెత్త సేకరణకు కార్యాచరణ

కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలో పొడిచెత్త సేకరణపై ఐటీసీ కంపెనీ ప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్యే వరదరాజులురెడ్డిని ఆయన కార్యాలయంలో కలిశారు. పట్టణంలోని కాలువల్లో ప్లాస్టిక్, వ్యర్థాలను తొలగించే అంశంపై చర్చించారు. సమావేశంలో కమిషనర్ రవిచంద్రారెడ్డి, పురపాలక ఇంజినీరు శ్రీనివాసులు, డీఈ యశోద, సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ డివిజన్ పునరుద్ధరణకు విజ్ఞప్తి

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: ప్రొద్దుటూరు అటవీ డివిజన్‌ను పునరుద్ధరించాలని సస్యశ్యామల సేవా సమితి కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులురెడ్డి కోరారు. ఈ మేరకు విజయవాడలో మంగళవారం రాష్ట్ర అటవీశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండేను కలిసి వినతిపత్రం అందించారు. ప్రొద్దుటూరు అటవీ డివిజన్ 1965కు ముందే ఏర్పడిన పురాతన విభాగమన్నారు. ప్రస్తుతం కడప డివిజన్‌లో విలీనం కావడంతో పర్యవేక్షణలో అధికారులకు ఇబ్బందులు ఉన్నాయన్నారు. ప్రొద్దుటూరు అటవీ డివిజన్‌ను స్వతంత్రంగా ఏర్పాటు చేస్తే అటవీ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ చేయవచ్చన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించండి

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని జిల్లా గ్రంథాలయ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల కోసం ఏటా రూ.120 కోట్లు కేటాయించాల్సి ఉండగా ప్రభుత్వం కేవలం రూ.40 కోట్లు మాత్రమే మంజూరు చేయడం బాధాకరమని జిల్లా గ్రంథాలయాల సంస్థ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాదెండ్ల బాబ్జీ మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన మిగిలిన జీతాలు, పెన్షన్ల భారాన్ని లైబ్రరీ సెస్సు ద్వారా జమయ్యే నిధుల నుంచే చెల్లిస్తున్నారని వివరించారు. గ్రంథాలయాల అభివృద్ధి, మౌలిక వసతులు, పుస్తకాల కొనుగోళ్లకు వినియోగించాల్సిన ఈ నిధులను జీతాల కోసం మళ్లిస్తే లైబ్రరీల అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. 2022-23 నుంచి ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాకపోవడంతో రూ.వందల కోట్ల బకాయిలు పేరుకుపోయాయని చెప్పారు. ఇలాగే కొనసాగితే ఫిబ్రవరి నెలలో జీతాలు, పెన్షన్లు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

త్యాగరాజ స్వామి ఊరేగింపు

మైలవరం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని వేపరాల గ్రామంలో త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా స్వామిని గ్రామంలో ఊరేగించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

ఇరుకైన దారులు.. వాహనదారులకు ఇక్కట్లు

ప్రొద్దుటూరులోని రిలయన్స్ పెట్రోల్ బంకు నుంచి ఎర్రగుంట్ల బైపాస్‌రోడ్డుకు వెళ్లే మార్గంలో రోడ్డు విస్తరణ పనులు చేస్తుండటంతో కొన్ని రోజులుగా వాహనాల రాకపోకలను నిలిపేశారు. దీంతో థియేటర్ మార్గంలో రద్దీ పెరగడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. - న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

ఒరిగింది.. కూలితే ప్రమాదమే

జాతీయ రహదారి నుంచి చియ్యపాడుకు వెళ్లే దారి పక్కన పసుపు పంట వద్ద విద్యుత్తు స్తంభం ఒరిగింది. అలాగే వదిలేస్తే కూలి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. రైతులు పొలాల్లో తిరుగుతున్న నేపథ్యంలో ప్రమాదం జరగకముందే విద్యుత్తు అధికారులు స్పందించాల్సి ఉంది. - న్యూస్‌టుడే, మైదుకూరు

అదుపు తప్పితే.. గని గుంతలోకే!

మైలవరం మండల పరిధిలోని వేపరాల-జమ్మలమడుగు మార్గంలోని నాపరాయి గని వద్ద రక్షణ గోడ లేకపోవడంతో రాకపోకలు సాగించేవారు భయాందోళన చెందుతున్నారు. ఏమాత్రం అదుపుతప్పినా గని గుంతలో పడిపోయే పరిస్థితి ఉంది. వీధి దీపాలు లేకపోవడంతో రాత్రివేళల్లో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. - న్యూస్‌టుడే, జమ్మలమడుగు, మైలవరం

పశువులు తరలిస్తున్న వాహనం పట్టివేత

కొండాపురం, న్యూస్‌టుడే: అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని ఎస్సై జయరాములు పట్టుకున్నారు. మంగళవారం కడప-తాడిపత్రి ప్రధాన రహదారిలోని కొండాపురం మండలం ముచ్చుమర్రి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సమీపంలో ఎస్సై జయరాములు ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో కడప నుంచి అనంతపురానికి అక్రమంగా ఆరు ఎద్దులను తరలిస్తున్న వాహనాన్ని గుర్తించారు. వాహనాన్ని సీజ్ చేసి, ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. సమీపంలోని పశువుల షెడ్‌లో ఎద్దులను ఉంచి పశువైద్యాధికారి రాజశేఖర్ రాజు వైద్య పరీక్షలు చేపట్టారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

మైదుకూరు, న్యూస్‌టుడే : మండలంలోని జాండ్లవరం గ్రామానికి చెందిన దప్పిలి సుబ్బరాజు అనే యువకుడి అదృశ్యంపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 5న ఇంటి నుంచి వెళ్లిన తన భర్త తిరిగి ఇంటికి రాలేదని భార్య రేష్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

సచివాలయ ఉద్యోగుల ఆందోళన

కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న సచివాలయ సిబ్బంది

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల మృతులపై హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తితో కమిటీ వేయాలని జిల్లా జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగుల మరణాలపై మానవత్వంతో పరిశీలించాలని కోరుతూ మంగళవారం జమ్మలమడుగులోని గాంధీ కూడలిలో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ కన్వీనరు మస్తాన్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజ కుళాయి రెడ్డి, జమ్మలమడుగు అధ్యక్షుడు నాగేంద్ర మాట్లాడుతూ ప్రతి రోజూ ఏదో ఒక జిల్లాలో ఉద్యోగులు మృతి చెందుతున్నారని దీనికి ప్రధాన కారణంగా అధికారుల ఒత్తిడి, వేధింపులేనని ఆరోపించారు. కార్యక్రమంలో చౌడేశ్వర్, వెంకటసుబ్బయ్య, సంజీవరాయుడు, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

తెదేపా మండల అధ్యక్షుడి నియామకం

చాపాడు, న్యూస్‌టుడే: తెదేపా చాపాడు మండలశాఖ నూతన అధ్యక్షుడిగా యాపరాల వెంకటసుబ్బారెడ్డి నియామకమయ్యారు. సోమాపురానికి చెందిన ఈయన గతంలో ఎంపీపీ, తెదేపా మండల అధ్యక్షుడిగా పనిచేశారు. తాజాగా మూడోసారి మండల పార్టీ పగ్గాలు చేపట్టారు.

ఆరోగ్యకర జీవన విధానాన్ని అలవర్చుకోవాలి

దువ్వూరు, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించి ఆరోగ్యకర జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ఎస్‌బీఐ నేచర్ ఫౌండేషన్ సభ్యులు వికాస్ బాలరాజు, బంగారు బాబు, రామకృష్ణ, తెదేపా నాయకుడు పొలిమేర రవీంద్రారెడ్డి పిలుపునిచ్చారు. దువ్వూరు మండలం నేలటూరు గ్రామంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు ఇంటి శుభ్రతకు అవసరమైన చీపుర్లు, బుట్టలు, తదితర సామగ్రిని అందజేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంతో రోగాలను నివారించవచ్చని వివరించారు.

మహిళకు చెత్త నిల్వ చేసుకునే డబ్బాను పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు, తెదేపా నాయకులు

స్వచ్ఛ సంకల్పానికి తూట్లు

రూ.లక్షలు ఖర్చు చేసి ప్రభుత్వం సమకూర్చిన చెత్త సేకరించే వాహనాలు మూలకుచేరాయి. దీంతో గ్రామాల్లో స్వచ్ఛత కరవైంది. ముద్దనూరు పశువైద్యశాలలో రిక్షాలను ఇలా నిరుపయోగంగా పక్కన పడేయడంతో తుప్పుపడుతున్నాయి. - న్యూస్‌టుడే, ముద్దనూరు

వంతెన శిథిలం.. ప్రయాణికులకు భయం

పెద్దముడియం మండల పరిధిలోని ఉప్పులూరు-నెమళ్లదిన్నె రహదారిలో ఉన్న కేసీ వంతెన ప్రమాదకరంగా మారింది. పురాతన వంతెన కావడంతో శిథిలావస్థకు చేరింది. దీంతో వంతెనపై ప్రజలు బిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి ఇరువైపులా ఎలాంటి రక్షణ వలయాలు లేవు. ఏమాత్రం అజాగ్రత్త వహించినా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ అభిలాష్‌రెడ్డి మాట్లాడుతూ వంతెన పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, పెద్దముడియం

వనరులు అపారం.. వినియోగించుకుంటే ఆదాయం

మైదుకూరులో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలం

మైదుకూరు, న్యూస్‌టుడే : మైదుకూరు పురపాలక ఏర్పాటై 14 ఏళ్లు అయింది. పట్టణం విస్తరిస్తున్నా అందుకు తగ్గట్లు సౌకర్యాలు కల్పించడం లేదు. మైదుకూరు పురపాలక ఆదాయం పెంచేలా చర్యలు తీసుకోలేదు. ఇంటి, నీటి పన్నులు, కూరగాయల మార్కెట్, బస్టాండు రుసుం వసూలు, ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు తప్పితే సొంతంగా ఆదాయ వనరులు పెంచుకోవడం లేదు. అధికారులు, పాలకులు మారుతున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

● పురపాలకలో ఖాళీ స్థలాలున్నా అధికారులు సద్వినియోగం చేసుకోలేక పోతున్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమయ్యాయి. ఖాళీ స్థలాల్లో భవనాలు నిర్మించి అద్దెకివ్వడం ద్వారా రాబడి వస్తుంది. పట్టణంలో ఫ్లెక్సీల ఏర్పాటుకు పన్ను వసూలుతో ఆదాయం పొందవచ్చు. ప్రొద్దుటూరు రోడ్డులో అన్నక్యాంటీన్, పాత పురపాలక కార్యాలయ ఆవరణం, ఓవర్ హెడ్ ట్యాంకు స్థలం, బద్వేలురోడ్డు, కడపరోడ్డులో ఖాళీ స్థలాలున్నాయి. వచ్చే ఆదాయంతో విద్యుత్తు దీపాలు, తాగునీటి కుళాయిల లీకేజీ నివారణ చర్యలు, బ్లీచింగ్ పొడి కొనుగోలుకు అవకాశం ఉంటుంది. పురపాలక ఆదాయం పెంచే దిశగా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

● ఈ విషయమై పురపాలక కమిషనర్ వై.రంగస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సొంత ఆదాయం పెంచుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు.

అవార్డు గ్రహీతకు శుభాకాంక్షలు

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అత్యుత్తమ ప్రతిభ కనబరచి, జరిగిన గణతంత్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్ డా॥ చెరుకూరి శ్రీధర్ గారి చేతుల మీదుగా కడప జిల్లా నుండి ప్రశంసా పత్రం అందుకొన్న ఒకే ఒక్క శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీ వంకం సుబ్బరాయుడు గారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలతో...

శ్రీ వి.సుబ్బరాయుడు గారు
శానిటరీ ఇన్‌స్పెక్టర్, ప్రొద్దుటూరు మునిసిపాలిటీ

1వ డివిజన్ సిబ్బంది
ప్రొద్దుటూరు పురపాలక సంఘం

అవార్డు గ్రహీతకు శుభాకాంక్షలు

విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరినందుకు గాను 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో APSPDCL S.E. ఎస్.రమణ గారి చేతుల మీదుగా ఉత్తమ ప్రశంసాపత్రం అందుకున్న శ్రీ ఎం.రవీంద్ర శ్రీనివాసులరెడ్డి గారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు.

శ్రీ ఎం.రవీంద్ర శ్రీనివాసులరెడ్డి గారు
DEE, ఆపరేషన్ టౌన్, APSPDCL, ప్రొద్దుటూరు.

ఎస్.అబ్దుల్ జబ్బార్, A.E., North, APSPDCL, ప్రొద్దుటూరు.
జి.లక్ష్మీనారాయణ, A.E., South, APSPDCL, ప్రొద్దుటూరు.
ఎం.క్రిష్ణకుమార్, A.E., East, APSPDCL, ప్రొద్దుటూరు.
కె.సుహాసిని, A.E., West, APSPDCL, ప్రొద్దుటూరు.

అవార్డుగ్రహీతకు శుభాకాంక్షలు

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అత్యుత్తమ ప్రతిభ కనబరచినందుకు గాను 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో శ్రీ ఎల్.శివశంకర్, IAS, CMD, APSPDCL గారి చేతుల మీదుగా ఉత్తమ ప్రశంసాపత్రం అందుకున్న శ్రీ కె.వి.వి.రమణారెడ్డి గారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు.

శ్రీ కె.వి.వి.రమణారెడ్డి గారు
E.E., ఆపరేషన్, APSPDCL, ప్రొద్దుటూరు.

ఎం.రవీంద్ర శ్రీనివాసులరెడ్డి
D.E.E., ఆపరేషన్ టౌన్, APSPDCL, ప్రొద్దుటూరు.
ఎస్.అబ్దుల్ జబ్బార్ A.E., నార్త్, APSPDCL, ప్రొద్దుటూరు.
జి.లక్ష్మీనారాయణ A.E., సౌత్, APSPDCL, ప్రొద్దుటూరు.
ఎం.క్రిష్ణకుమార్ A.E., ఈస్ట్, APSPDCL, ప్రొద్దుటూరు.
కె.సుహాసిని A.E., వెస్ట్ APSPDCL, ప్రొద్దుటూరు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు శుభాకాంక్షలు

శ్రీ నాగేష్, C.I., ముద్దనూరు.

77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీ శ్రీధర్ చెరుకూరి మరియు S.P. శ్రీ షెల్కే నచికేత్ గారి చేతుల మీదుగా ఉత్తమ ప్రశంసాపత్రం అందుకున్న శ్రీ నాగేష్, C.I. గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు.

సబ్ ఇన్‌స్పెక్టర్ మరియు పోలీసు సిబ్బంది
ముద్దనూరు పోలీస్ స్టేషన్

(c) eenadu

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: విద్యా ప్రమాణాలు పెంపొందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ శ్రీధర్ ఆదేశించారు. కడప కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మంగళవారం కడప కేంద్రీయ విద్యాలయ యాజమాన్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది జరిగే పది, ఇంటర్ తరగతుల పరీక్షా ఫలితాల్లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. క్లాస్ రూంల నిర్మాణం కచ్చితంగా కొనసాగించాలన్నారు. విద్యాలయం పరిసరాల్లో విద్యుత్ దీపాలు, చెత్త సేకరణ నిర్వహణ, తాగునీటి నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు ప్రిన్సిపల్ మునేశ్‌మీనా అకడమిక్ కార్యకలాపాలు వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నాగేశ్వరరెడ్డి, హరికృష్ణ, రవికుమార్, ఓబులరెడ్డి, ప్రతిమ, మహేశ్‌కుమార్, ఉమాదేవి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, చిత్రంలో కేంద్రీయ విద్యాలయ అధికారులు

ముత్యపు పందిరిపై శ్రీవారు

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందులలోని శ్రీపద్మావతి సమేత కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి వారిని అర్చకులు వరదాచార్యులు, బృందం వివిధ రకాల పూలమాలలతో అలంకరించి సింహవాహనంపై కొలువుదీర్చారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పురవీధుల్లో ఊరేగించారు. రాత్రికి పులివెందుల పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

ఆరోగ్యకర జీవనశైలితోనే సమాజాభివృద్ధి

వైవీయూ, న్యూస్‌టుడే: యువత ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలని వైవీయూ వీసీ ఆచార్య రాజశేఖర్ అన్నారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో యువతలో ఆరోగ్యకర జీవనశైలి ప్రోత్సాహం అనే అంశంపై మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వీసీ హాజరై మాట్లాడారు. శారీరక వ్యాయామం లేకపోవడం, మానసిక ఒత్తిడి జీవనశైలి సంబంధిత వ్యాధులకు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్ఎస్ఎస్ అధికారులు విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉండాలని సూచించారు.

ఎన్ఎస్ఎస్ అధికారులతో వైవీయూ వీసీ ఆచార్య రాజశేఖర్

బ్యాటర్ల జోష్.. బౌలర్లు అదుర్స్

రసవత్తరంగా ప్రారంభమైన ఈఎస్ఎల్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీ

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – తాడికొండ

బ్యాటర్లు జోష్ చూపించారు.. బౌలర్లు అదుర్స్ అనిపించారు. యువత కేరింతలు, ఆనందోత్సాహాల నడుమ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. రీజనల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్స్, సీనియర్స్ జట్లు రాష్ట్ర స్థాయిలో తలపడుతున్నాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ – రాయలసీమ రాకర్స్, తెలంగాణ టైగర్స్ – నార్త్ ఆంధ్ర నింజాస్ రెండు విభాగాల్లో తలపడ్డాయి. ఏపీ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య మధుమూర్తి ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు.

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor
ధనిక్ భారత్ విద్యా సంస్థలు
IIT-JEE | NEET
Protein Partner
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Hospitality Partner
Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Gift Partner
KL (DEEMED TO BE UNIVERSITY)
Man of the Series
Hero
Digital Partner
ఈనాడు.నెట్ ETV BHARAT
TV Partner
ETV ఆంధ్రప్రదేశ్
Organised by
ఈనాడు

విజయానందంలో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

భళా.. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్

గ్రౌండ్ - I జూనియర్స్: మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్ తలపడ్డాయి. సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 17 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ కేవలం 25 బంతుల్లో మూడు ఫోర్లు, మూడు సిక్సర్లతో 42 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగుకు దిగిన రాయలసీమ రాకర్స్ 14 ఓవర్లలో 86 పరుగులు చేసి ఆలౌటైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ వైభవ్ 4 కీలక వికెట్లు పడగొట్టి సెంట్రల్ ఆంధ్ర విజయంలో కీలక పాత్ర పోషించాడు.

గెలుపొందిన తెలంగాణ టైగర్స్

తెలంగాణ టైగర్స్ విజయభేరి

గ్రౌండ్ - I జూనియర్స్: రెండో మ్యాచ్‌లో నార్త్ ఆంధ్ర నింజాస్‌పై టాస్ గెలిచిన తెలంగాణ టైగర్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 178 పరుగులు చేసింది. అనంతరం నార్త్ ఆంధ్ర నింజాస్ 17.4 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. దీంతో తెలంగాణ టైగర్స్ జట్టు విజయాన్ని సొంతం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ప్రణీత్ 32 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్స్‌లతో 61 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకంగా నిలిచాడు. బౌలర్ సిద్ధార్థ 5 కీలక వికెట్లు తీశాడు. నార్త్ ఆంధ్ర నింజాస్ జట్టులో బ్యాట్స్‌మెన్ దుర్గా ప్రసాద్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, నాలుగు సిక్సులతో 43 పరుగులు చేశాడు.

రాయలసీమ రాకర్స్‌దే పైచేయి

సీనియర్స్ విన్నర్స్ రాయలసీమ రాకర్స్

గ్రౌండ్-2లో సీనియర్స్ : సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్‌తో మ్యాచ్‌లో రాయలసీమ రాకర్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 180 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ చరణ్‌జిత్ 56 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 87 పరుగులు చేశాడు. అనంతరం సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 133 పరుగులకే పరిమితమైంది. సందీప్ 43 బంతుల్లో 5 ఫోర్లతో 37 పరుగులు చేశాడు.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్

వైభవ్ చరణ్ జిత్ ప్రణీత్

28న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

గ్రౌండ్-I (జూనియర్స్)

మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్

మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

గ్రౌండ్-2 (సీనియర్స్)

మ్యాచ్-I: సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ × తెలంగాణ టైగర్స్

మ్యాచ్-2: నార్త్ ఆంధ్ర నింజాస్ × హైదరాబాద్ హీరోస్

సీనియర్స్ తెలంగాణ టైగర్స్ జట్టు

నార్త్ ఆంధ్ర నింజాస్ గైర్హాజరుతో అలా..

గ్రౌండ్-2లో సీనియర్స్: తెలంగాణ టైగర్స్ - నార్త్ ఆంధ్ర నింజాస్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. అనివార్య కారణాలతో నార్త్ ఆంధ్ర నింజాస్ మ్యాచ్‌కు హాజరు కాకపోవడంతో అంపైర్లు తెలంగాణ టైగర్స్ జట్టును విజేతగా ప్రకటించారు.

నేడు విశ్వవిద్యాలయంలో ప్రాంగణ ఎంపికలు

వైవీయూ, న్యూస్‌టుడే: యోగివేమన విశ్వవిద్యాలయం ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం ఆఫ్‌లైన్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరులోని ఎంఐ సంస్థ సిబ్బంది ఎంపికలకు వైవీయూ వస్తోందన్నారు. ఎంఎస్ ఆఫీస్‌పై ప్రాథమిక జ్ఞానంతో కమ్యూనికేషన్ నైపుణ్యాలు ఉండాలన్నారు. విద్యార్థులంతా వారి రెజ్యూమ్ హార్డ్ కాపీతో నూతన పరిపాలనా భవనంలోని ప్లేస్‌మెంట్ సెల్‌లో హాజరుకావాలన్నారు.

జిల్లాకు 1,750 టన్నుల యూరియా

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: కడప రైల్వే స్టేషన్‌కు యూరియా మంగళవారం ర్యాక్‌లో వచ్చింది. ప్రైవేటు వ్యాపారులకు వెయ్యి టన్నులు, మార్క్‌ఫెడ్‌కు 750 టన్నులు పంపారు. వచ్చిన ఎరువులను జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రానాయక్ పరిశీలించారు.

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032, వెబ్‌సైట్: www.shriramfinance.in/auction.
కార్యాలయ చిరునామా: డి.నెం.42/107-1. ఓబుల్‌రెడ్డి కాంప్లెక్స్, అప్సర సర్కిల్, జయనగర్‌కాలనీ. కడప - 5160032 & శాఖ కార్యాలయం: కడప -1

కమలాపురం ఎస్.ఆర్.ఓ (ఆర్.ఓ) ప్రకారం డాక్యుమెంట్ నెం.1224/2022 మోహన్‌బాబు దేవరశెట్టి గారికి చెందినది.

స్థిరాస్తులు అమ్మకము కొరకు ఈ-వేలం ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్, 2002, 9(1) & 8(6)తో చదువబడే క్రింద స్థిరాస్తుల ఈ-వేలం అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు గ్యారంటారు (లు)లకు తెలియజేయడమేమనగా దిగువ తెలిపిన రుణగ్రహీతలు / గ్యారంటార్లకు చెందిన ఆస్తులను సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా / ఛార్జిలో వుంచి పొందిన బకాయి మొత్తము తేది: 17.06.2024 నాటికి రూ.1,16,05,521/- లను + తేది:18.06.2024 నాటి నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులను రాబట్టుకునేందుకు సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు తేది 17.06.2024న జారీ చేసి శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క సెక్యూర్డ్ క్రెడిటార్ వారిచే స్వాధీనం చేసుకున్న ఆస్తులను "ఎక్కడ ఎలా వున్నదో అక్కడ" "అక్కడ ఎలా ఉన్నదో" అలానే మరియు "అక్కడ ఏమి ఉన్నదో" అనే పద్ధతిపై తేది: 12.03.2026 ఉదయం 11.గం॥లకు నుండి మ.1.00 గం॥ల మధ్య విక్రయించుటకు నిర్ణయించినారు.

అగ్రిమెంటు నెం.: CUDP2TF2203280002, రుణగ్రహీతలు/గ్యారంటార్ల యొక్క పేర్లు,చిరునామా :-1) దేవరశెట్టి మోహన్ బాబు తండ్రి దేవరశెట్టి, చిన్న పీరయ్య, డి.నెం.38/2873, రామక్రిష్ణానగర్, చిన్నచౌక్, కడప 2) డి.రెడ్డెయ్య, తండ్రి చిన్నపీరయ్య, డి.నెం.38/2873, రామక్రిష్ణానగర్, చిన్నచౌక్, కడప 3) షేక్ అబ్దుల్ రహిమాన్ తండ్రి ఎస్.అబ్దుల్, డి.నెం. 10/24-34-1, ఖలీల్ నగర్, కడప

స్థిరాస్తుల యొక్క వివరణ: (కమలాపురం ఎస్.ఆర్.ఓ(ఆర్.ఓ) నందు దేవశెట్టి మోహన్‌బాబు పేరున రిజిష్టరు కాబడిన పత్రంనెం.1224/2022 ప్రకారం):-వైయస్‌ఆర్ కడప జిల్లా, ప్రొద్దుటూరు రిజిస్ట్రేషన్ జిల్లా,కమలాపురం సబ్‌జిల్లా, కమలాపురం మండలం, పందిళ్ళపల్లి గ్రామ పంచాయితీ మరియు గ్రామ లెక్కదాఖలా, సర్కారు మెట్ట డి.నెం.150/4ఎ లో ఎ.2.58 సెంట్ల భూమి, మరియు సబ్ డివిజన్ అనంతరం సర్వేనెం. 150/4ఎ2 లో ఎ.0.94 సెంట్లు మరియు సర్వే నెం.150/4బి2లో ఎ.0.69 సెంట్లు మొత్తం విస్తీర్ణం ఎ.1.63 సెంట్లు హద్దులు: తూర్పు: వల్లిమాబుసాబ్ భూమి, పడమర: మన్నే ఈశ్వరయ్య భూమి, ఉత్తరం: వంక, దక్షిణం: రోడ్డు, ఈ హద్దుల మధ్య భూమి విస్తీర్ణం ఎ.1.63 సెంట్లు మాత్రమే. తాకట్టు రుణభారాలు: లేవు.

అగ్రిమెంటు నెంబరు	ఆస్తి యొక్క రిజర్వు ధర	ధరావత్తు	ధరావత్తు సమర్పణ విధానం	బిడ్ ఇంక్రిమెంటు మొత్తము	వేలం తేది	ధరావత్తు సమర్పణ తేది	ఆస్తుల తనిఖీ తేది:
CUDP4TF 2203280002	రూ.1,10,85,000/- (ఒక కోటి పది లక్షల ఎనభై ఐదు వేల రూపాయలు మాత్రమే)	రూ.11,08,500/-(పదకొండు లక్షల ఎనిమిది వేల ఐదు వందల రూపాయలు మాత్రమే	శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారిపేరున డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా	రూ.25000	12.03.2026	11.03.2026	10.03.2026

ఆసక్తి గల బిడ్డర్లు లాగిన్ ఐడి & పాస్ట్‌వర్డ్ ఏర్పాటు చేయడంలో, బిడ్ సమర్పణలో, ఈ బిడ్డింగ్ ప్రక్రియలో సహాయం కొరకు మెస్సర్స్ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, శ్రీ గౌరవ్ నంబూద్రి సెల్: 9833922941, ఈమెయిల్ <gaurav.n@samil.in> మరియు ఆస్తి సంబంధిత వివరాలకై అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీ.ఎం.గంగాధర, సెల్: +91 9959463246 సంప్రదించగలరు. అధీకృత అధికారి ఏ బిడ్డు అయినా లేక అన్ని బిడ్లను ఏ కారణము తెలుపకనే తిరస్కరించుటకు అధికారము కలిగి వున్నారు. ఆన్‌లైన్ వేలము టెండరు సమర్పణ/ బిడ్ ఫారం కొరకు/ టెండరు ఓపెన్ రియు వేలము కొరకు వెబ్‌సైట్ https://eauctions.Samil.in/home ను చూడగలరు. పూర్తి నియమ నిబంధనల కొరకు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెబ్‌సైట్‌లో తెలుపబడిన లింకు https://www.shriramfinance.in/auction ను చూడగలరు. గమనిక: ఇందుమూలముగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ " ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్"తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్" గా మార్పు చెందింది. ఇది తేది: 30.11.2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికెట్ ఇన్ కార్పొరేషన్ తేది: 30.11.2022 ద్వారా మార్పు చెందింది.

ప్రదేశము: కడప, తేది:27.01.2026 సం// అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై- 600032, వెబ్‌సైట్: www.shriramfinance.in/auction.
కార్యాలయ చిరునామా: డి.నెం.42/107-1, ఓబుల్‌రెడ్డి కాంప్లెక్స్, అప్సర సర్కిల్, జయనగర్‌కాలనీ. కడప - 5160032 & శాఖ కార్యాలయం: కడప - 2

కడప ఎస్.ఆర్.ఓ (ఆర్.ఓ) ప్రకారం డాక్యుమెంట్ నెం.5738/2014 సిహెచ్.వెంకటసుబ్బారెడ్డి గారికి చెందినది.

స్థిరాస్తులు అమ్మకము కొరకు ఈ-వేలం ప్రకటన

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్, 2002, 9(1) & 8(6)తో చదువబడే క్రింద స్థిరాస్తుల ఈ-వేలం అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు గ్యారంటారు (లు)లకు తెలియజేయడమేమనగా దిగువ తెలిపిన రుణగ్రహీతలు / గ్యారంటార్లకు చెందిన ఆస్తులను సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖా / ఛార్జిలో వుంచి పొందిన బకాయి మొత్తము తేది: 23.01.2023 నాటికి రూ.2,48,66,537/- లను + తేది: 24.01.2023 నాటి నుండి వడ్డీ మరియు ఇతర ఖర్చులను రాబట్టుకునేందుకు సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు తేది 23.01.2023న జారీ చేసి శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క సెక్యూర్డ్ క్రెడిటార్ వారిచే స్వాధీనం చేసుకున్న ఆస్తులను "ఎక్కడ ఎలా వున్నదో అక్కడ" "అక్కడ ఎలా ఉన్నదో" అలానే మరియు "అక్కడ ఏమి ఉన్నదో" అనే పద్ధతిపై తేది: 12.03.2026 ఉదయం 11.గం॥లకు నుండి మ.1.00 గం॥ల మధ్య విక్రయించుటకు నిర్ణయించినారు. అగ్రిమెంటు నెం.: CUDP4TF1411210001,

రుణగ్రహీతలు/గ్యారంటార్ల యొక్క పేర్లు,చిరునామా :-1) సి.హెచ్.వెంకట సుబ్బారెడ్డి, తండ్రి సి.సుబ్బారెడ్డి, డి.నెం.20/797, మిద్దెపైన కో-ఆపరేటివ్ కాలనీ, కడప, కడప జిల్లా - 2) శ్రీమతి సి.రమ, భర్త సి.హెచ్.వెంకటసుబ్బారెడ్డి, డి.నెం.20/797, మిద్దెపైన కో-ఆపరేటివ్ కాలనీ, కడప, కడప జిల్లా, 3) జి.పద్మనాబరెడ్డి, తండ్రి జి.రామిరెడ్డి, డి.నెం.20/797, మిద్దెపైన కో-ఆపరేటివ్ కాలనీ, కడప, కడప జిల్లా

స్థిరాస్తుల యొక్క వివరణ: (కడప ఎస్.ఆర్.ఓ(ఆర్.ఓ) నందు సి.హెచ్.వెంకటసుబ్బారెడ్డి పేరున రిజిష్టరు కాబడిన పత్రంనెం.5738/2014 ప్రకారం):- షెడ్యూలు-1: వైయస్.ఆర్ కడప జిల్లా, కడప సబ్‌జిల్లా, కడప మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఏరియా, రామరాజుపల్లి గ్రామలెక్కదాఖలా, గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ, సర్కారు మెట్ట డి.నెం.114 లో ఎ.13.18 సెంట్లు భూమిని మార్పు చేసి వేసిన ఇంటి ప్లాట్లలో ప్లాటు నెం.72 మరియు ఇందుకు తూర్పు వైపు ఎ.0.07 సెంట్ల 350 చ.లింకులు మరియు ఇందున పడమర వైపు: ఎ.0.03 సెంట్ల 675 చ.లింకులు. లేదా 0.015 హెక్టార్ల స్థలం హద్దులు: తూర్పు: అదే ప్లాటులోని ఎ.0.03 సెంట్ల 675 చ.లింకుల ఓబాయపల్లి రామచంద్రారెడ్డికి చెందిన స్థలం పడమర: చిట్టా వెంకటసుబ్బారెడ్డి స్థలం, ఉత్తరం: రోడ్డు, దక్షిణం: ప్లాటు నెం.65. ఈ హద్దుల మధ్య తూర్పు నుండి పడమర: 19.05 చ.అ. లేదా 5.81మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: 84 అ. లేదా 25.81మీ. దారి హక్కులు మరియు ఇతర ఈజిమెంట్ హక్కులతో సహా.

షెడ్యూలు-2: వైయస్.ఆర్ కడప జిల్లా, కడప సబ్‌జిల్లా,కడప మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఏరియా, రామరాజుపల్లి గ్రామలెక్కదాఖలా, గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ, సర్కారు మెట్ట డి.నెం.114 లో ఎ.13.18 సెంట్లు భూమిని మార్పు చేసి వేసిన ఇంటి ప్లాట్లలో ప్లాటు నెం.72 మరియు ఇందున పడమర వైపు: ఎ.0.07 సెంట్ల 350 చ.లింకులు. లేదా 0.031 హెక్టార్ల స్థలం హద్దులు: తూర్పు: కల్లూరు చెన్నారెడ్డికి చెందిన ఎ.0.07సెంట్ల 350 చ.లింకుల స్థలం పడమర: ప్లాటునెం. 73 లోని స్థలం, ఉత్తరం: పబ్లిక్ రోడ్డు, దక్షిణం: ప్లాటు నెం.65లోని స్థలం. ఈ హద్దుల మధ్య తూర్పు నుండి పడమర: 38.1 చ.అ. లేదా 11.62మీ. మరియు ఉత్తరం నుండి దక్షిణం: 84 అ. లేదా 25.81మీ. వెరశి మొత్తం విస్తీర్ణం 355.6 చ.గ. దారి హక్కులు మరియు ఇతర ఈజిమెంట్ హక్కులతో సహా. తాకట్టు రుణభారాలు: లేవు.

అగ్రిమెంటు నెంబరు	ఆస్తి యొక్క రిజర్వు ధర	ధరావత్తు	ధరావత్తు సమర్పణ విధానం	బిడ్ ఇంక్రిమెంటు మొత్తము	వేలం తేది	ధరావత్తు సమర్పణ తేది	ఆస్తుల తనిఖీ తేది:
CUDP4TF 1411210001	రూ.77,12,000/- (డెబ్బై ఏడు లక్షల పన్నెండు వేల రూపాయలు మాత్రమే)	రూ.7,71,200/-(ఏడు లక్షల డెబ్బై ఒక్క వేల రెండు వందల రూపాయలు మాత్రమే	శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారిపేరున డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా	రూ.25000	12.03.2026	11.03.2026	10.03.2026

ఆసక్తి గల బిడ్డర్లు లాగిన్ ఐడి & పాస్ట్‌వర్డ్ ఏర్పాటు చేయడంలో, బిడ్ సమర్పణలో, ఈ బిడ్డింగ్ ప్రక్రియలో సహాయం కొరకు మెస్సర్స్ శ్రీరామ్ ఆటోమాల్ ఇండియా లిమిటెడ్, శ్రీ గౌరవ్ నంబూద్రి సెల్: 9833922941, ఈమెయిల్ <gaurav.n@samil.in> మరియు ఆస్తి సంబంధిత వివరాలకై అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, శ్రీ.ఎం.గంగాధర, సెల్: +91 9959463246 సంప్రదించగలరు. అధీకృత అధికారి ఏ బిడ్డు అయినా లేక అన్ని బిడ్లను ఏ కారణము తెలుపకనే తిరస్కరించుటకు అధికారము కలిగి వున్నారు. ఆన్‌లైన్ వేలము టెండరు సమర్పణ/ బిడ్ ఫారం కొరకు/ టెండరు ఓపెన్ రియు వేలము కొరకు వెబ్‌సైట్ https://eauctions.Samil.in/home ను చూడగలరు. పూర్తి నియమ నిబంధనల కొరకు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వెబ్‌సైట్‌లో తెలుపబడిన లింకు https://www.shriramfinance.in/auction ను చూడగలరు. గమనిక: ఇందుమూలముగా తెలియజేయడమేమనగా "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్ " ఎన్‌సిఎల్‌టి చెన్నై వారి ఉత్తర్వు ప్రకారం "శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్"తో విలీనం కాబడింది. ఇటీవల "శ్రీరామ్ ఫైనాన్స్ ట్రాన్స్‌పోర్ట్ లిమిటెడ్" గా మార్పు చెందింది. ఇది తేది: 30.11.2022 నుంచి పేరు మార్పుకు సంబంధించిన సర్టిఫికెట్ ఇన్ కార్పొరేషన్ తేది: 30.11.2022 ద్వారా మార్పు చెందింది.

ప్రదేశము: కడప, తేది:27.01.2026 సం// అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

బ్యాంకుల్లో అయిదు రోజుల పని విధానానికి డిమాండ్

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: బ్యాంకుల్లో అయిదు రోజుల పని విధానాన్ని అమలు చేయాలని జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ సెక్రటరీ శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు యూఎఫ్‌బీయూ కడప కన్వీనర్ అజీజ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఏడురోడ్ల కూడలి వద్ద ప్రభుత్వ, కోఆపరేటివ్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుల అధికారులు, ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. ముందుగా ఏడురోడ్ల కూడలి నుంచి మొదటి గాంధీ బొమ్మ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్ల అమలుకు చరయలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో నిరవధిక సమ్మెలోకి వెళ్లడానికి కూడా వెనుకాడమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు రామ్‌భాస్కర్‌రెడ్డి, రాజీవ్‌కుమార్, ఎన్‌సీబీఈ, ఏఐబీఓఏ, ఏఐబీఓసీ నాయకులు, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి

మాట్లాడుతున్న న్యాయమూర్తి బాబా ఫకృద్దీన్

మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు శిక్షణ

కడప న్యాయవిభాగం, న్యూస్‌టుడే: మధ్యవర్తిత్వమనేది చట్టబద్ధమైన న్యాయ ప్రక్రియ అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి ఏస్.బాబా ఫకృద్దీన్ అన్నారు. స్థానిక జిల్లా కోర్టులో మంగళవారం మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ పద్ధతితో సమయం, డబ్బులు ఆదా అవుతాయన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు శాంతి, దీనబాబు, రమేష్ కుమార్, ప్రవీణ్ కుమార్, ప్రత్యూష కుమారి, అసిఫా సుల్తానా, న్యాయవాదులు పాల్గొన్నారు.

వైవీయూ విద్యార్థికి బంగారు పతకం

వైవీయూ, న్యూస్‌టుడే: చండీగఢ్ పంజాబ్ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న వెయిట్ లిఫ్టింగ్ పురుషుల విభాగంలో వైవీయూ విద్యార్థి నీలం సోపిన్ 60 కిలలో విభాగంలో బంగారు పతకం సాధించాడు. స్నాచ్ విభాగంలో 1/2 కిలోలు, క్లీన్ అండ్ జర్క్ విభాగంలో 125 కేజీలు మొత్తంగా 237 కేజీల బరువునెత్తి విశ్వవిద్యాలయానికి బంగారు పతకం తెచ్చినట్లు వీసీ ఆచార్య రాజశేఖర్ ప్రశంసించారు. ఇదే విద్యార్థి గతంలో ఈస్ట్ సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడని గుర్తు చేశారు.

బంగారు పతకం అందుకున్న వైవీయూ విద్యార్థి నీలం సోపిన్ (మధ్యలో ఉన్న వ్యక్తి)

హామీల అమలుకు ఉద్యమం

కడప విద్య, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర సంయుక్త అధ్యక్షుడు ఎస్ఎండీ ఇలియాస్‌బాషా అన్నారు. స్థానిక ఎస్టీయూ భవన్‌లో మంగళవారం ముఖ్య నాయకులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుండటంపై ఎస్టీయూ మూడు దశలుగా ఉద్యమ కార్యాచరణ ప్రకటించిందన్నారు. అనంతరం నాయకులు ఉద్యమ కరపత్రాలు ఆవిష్కరించారు.

తాళం వేసిన ఇళ్లలోకి చొరబడి చోరీ

● నగలు, నగదు అపహరణ

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలోని పలు ప్రాంతాల్లో సోమవారం అర్ధరాత్రి వరుస చోరీ ఘటనలు కలకలం రేపాయి. తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చేసుకుని తలుపులు ధ్వంసం చేశారని పోలీసులు మంగళవారం తెలిపారు. రిమ్స్ సమీపంలో నివాసం ఉంటున్న నాగలక్ష్మి అనే మహిళ ఇంటికి తాళం వేసి ఈ నెల 24న ఊరికెళ్లారు. తిరిగి వచ్చే సరికి ఇంటి తలుపులు ధ్వంసం చేసి ఉండటాన్ని గుర్తించారు. బీరువాలో ఉన్న 12 గ్రాముల బంగారు నగలు చోరీ చేశారు. వైఎస్సార్ కాలనీకి చెందిన నాగరాజు ఈ నెల 24న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఊరికెళ్లగా ఆ ఇంటి తలుపు పగులగొట్టి అయిదు తులాల బంగారు నగలు దొంగలించారు. ఎర్రముక్కలపల్లెలోని విశ్రాంత రైల్వే ఉద్యోగి మునిస్వామి ఈ నెల 24న ఇంటికి తాళం వేసి పులివెందులలో ఉన్న వారి బంధువుల ఇంటికి వెళ్లారు. ఆ ఇంట్లోకి చొరబడి 20 గ్రాముల బంగారు నగలు, 200 గ్రాముల వెండి వస్తువులు దోచుకెళ్లారు. ఈ నేపథ్యంలో ఎస్పీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో పోలీసులు రైల్వేస్టేషన్, బస్టాండ్ ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టారు. అనుమానితుల గుర్తింపు కార్డులను పరిశీలించారు.

ఎర్రముక్కపల్లెలోని ఓ ఇంటి గడియను పగులగొట్టిన దుండగులు

EENADU Classifieds

EDUCATION **JOBS**

అర్జున అకాడమి కడప DSC వ్యాయామ అభ్యర్థులకు మెగా గ్రాండ్ టెస్ట్ 01-02-2026, PET & SA [P.E] / PD. Cont: 6302642219.

విజయవాడలో BPT/B.Sc., MLT- మేనేజ్‌మెంట్ కోటా సీట్లు- తక్కువ ఫీజు- కొన్నిసీట్లు కలవు. Affiliated to Dr.NTR యూనివర్సిటీ. ✆ 7680065835.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఏటి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

R K Services (Service partner to Amazon) Delivery Boys. Location:- Proddatur, Pulivendula, Vempalli. Cont: 9666011667, 8074953483, 8247261262.

సాహితి ఎంటర్ ప్రైజస్ : Exide బ్యాటరి డీలర్ దగ్గర పని చేయుటకు టెక్నీషియన్స్ కావలెను. కృష్ణ సర్కిల్, కడప. Cont: 9441040334.

E-KART నందు అర్జెంటుగా M/F కావలెను. Qly: Inter, Any Degree. Sal: 15,000/-. Online are Available. 9014120139

ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ॥ 330/- మాత్రమే
Contact:
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

సూపరింటెండెంట్ కార్యాలయము, సర్వజన వైద్యశాల, పులివెందుల

టెండర్ నోటీస్

Rc.No.Spl/GGH/Plvd Dated: 28-01-2026

సర్వజన వైద్యశాల నందు గల రోగులకు ప్రతిరోజు ఆహార సరఫరా నిమిత్తం ప్రతిరోగికి మూడు పూటలా టిఫిన్, భోజనం రోజుకు 80 మరియు 100 రూపాయలు ప్రకారం ఆహారం సప్లై చేయుటకు అర్హత కల్గిన కాంట్రాక్టర్ల నుండి టెండర్లు ఆహ్వానించడమైనది. ఇతర వివరములకు సర్వజన వైద్యశాల, పులివెందుల నందు సంప్రదించగలరు. Cell No: 9121441365

- టెండర్ షెడ్యూల్ జారీ చేయుటకు జారీ చేయు తేదీ 28-01-2026 నుండి 06-02-2026 వరకు
- టెండర్ షెడ్యూల్ ధర 1000/- రూపాయలు
- EMD 1,00,000/- (DD in favour of Superintendent, GGH, Plvd)
- షెడ్యూల్ దాఖలు చేయుటకు ఆఖరి తేదీ 06-02-2026 మధ్యాహ్నం 4 గంటలలోపు పూర్తి చేసిన టెండర్ అప్లికేషన్‌ను సూపరింటెండెంట్ కార్యాలయం నందు గడువు తేదీ లోపు సమర్పించవలెను.

టెండర్ ఏ కారణం చేతనైనా రద్దు చేయుటకు లేదా వాయిదా వేయుటకు సూపరింటెండెంట్ సర్వజన వైద్యశాల పులివెందుల వారికి అధికారము కలదు.

సం/- సూపరింటెండెంట్, సర్వజన వైద్యశాల, పులివెందుల

(c) eenadu

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

5 రోజుల పని దినాలు కల్పించాలి

ఎస్బీఐ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పులివెందుల, న్యూస్‌టుడే: న్యాయపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, 5రోజుల పనిదినాలు అమలు చేయాలని పులివెందులలోని అన్నీ బ్యాంకుల సిబ్బంది సమ్మె బాట పట్టారు. స్థానిక ఎస్బీఐ ప్రధాన కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒత్తిడితో చాలా మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పనిభారం తగ్గించాలని వారు డిమాండ్ చేశారు.

ప్రతిభను వెలికి తీసేందుకే పోటీ పరీక్షలు

విజేతలతో కడప ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి.. హాజరైన విద్యార్థులు

కడప విద్య, న్యూస్‌టుడే: ప్రతిభా పాటవ పోటీలు ప్రతిభను వెలికి తీసేందుకే దోహదపడతాయని కడప ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక శ్రీహరి డిగ్రీ కళాశాలలో మంగళవారం ఈనాడు ఆధ్వర్యంలో నగర స్థాయి ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. పాఠశాల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు 'నీటి సంరక్షణ, నిర్వహణ-ప్రతి నీటి బొట్టు విలువైనది' అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు, 'ఆరోగ్యమే మహాభాగ్యం.. మానసిక, శారీరక ఆరోగ్యానికి పాటించాల్సిన ఆహారపు అలవాట్లు, జీవనశైలి' అనే అంశంపై ఉపన్యాసం, వర్తమాన అంశాలు, జనరల్ నాలెడ్జ్‌పై క్విజ్, 'మాతృభాష ప్రాముఖ్యత, దాని పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలు' అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాజగోపాల్‌రెడ్డి.. ఈనాడు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

విజేతలు వీరే.. : వ్యాసరచనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో బి.సుప్రియరెడ్డి (9వ తరగతి, లిటిల్‌ఫ్లవర్ ఉన్నత పాఠశాల), షేక్ మిస్బా (8వ తరగతి, గౌరి మెమోరియల్ ఉన్నత పాఠశాల), షేక్ ఉమ్మేసల్మా (6వ తరగతి, న్యూహారైజన్ పాఠశాల) నిలిచారు.

★ చిత్రలేఖనంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో బీవీ భానుశ్రీ (9వ తరగతి, విష్ణువిద్యా మందిర్ పాఠశాల, బుగ్గలేటిపల్లి), డి.ప్రవస్తి (8వ తరగతి, గౌరీ మెమోరియల్ పాఠశాల), ఎస్.సబహుస్సేన్ (10వ తరగతి, గౌరీమెమోరియల్ పాఠశాల) ప్రతిభ కనబరిచారు. ★ క్విజ్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో ఎం.వినయ్‌సందేశ్ (9వ తరగతి, శ్రీసాయివిజ్ఞాన్ పాఠశాల), జి.లోహిత్‌కుమార్‌గౌడ్ (9వ తరగతి, బాలవికాస్), కె.శ్రీసుస్మిత (10వ తరగతి, గురుకుల్ విద్యాపీఠ్) ప్రతిభ చాటారు.

★ ఉపన్యాస పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో యు.వెన్నెలశ్రీ (9వ తరగతి, బాలవికాస్ పాఠశాల), ఎం.అమీనా (10వ తరగతి, శ్రీసాయికృష్ణ పాఠశాల), ఎస్.అంజుమ్ (8వ తరగతి, శ్రీవేంకటేశ్వర పాఠశాల) నిలిచారు. ఉపన్యాసం విభాగానికి అధ్యాపకులు డాక్టర్ పి.జయప్రకాశ్‌రెడ్డి, వ్యాసరచన విభాగానికి అధ్యాపకులు గోపాల్‌రెడ్డి, చిత్రలేఖనం విభాగానికి అధ్యాపకులు అశోక్‌లు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కడప ఉప విద్యాశాఖాధికారి వారికి బహుమతులు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

కడప: 8008573428, 8074174832
పులివెందుల : 8008573466
కమలాపురం : 8008573475

?: సింహాద్రిపురంలోని పాతూరులో శ్మశాన వాటిక వద్ద ముళ్లపొదలు పెరిగి అంతిమ సంస్కారాలకు ఇబ్బందిగా మారింది. సదుపాయాలు కల్పించాలి.
- వీరనారాయణరెడ్డి, స్థానికుడు

✓: ముళ్లపొదలు తొలగిస్తాం. సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం.
- శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీవో

?: గురిజాల ప్రధాన రహదారిపై మురుగు పారుతుండటంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నాం. - ప్రతాప్‌రెడ్డి, వాహనదారుడు

✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
- శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీవో

?: బలపనూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలో మురుగు, చెత్తాచెదారంతో అపరిశుభ్రత నెలకొంది. - లక్ష్మీదేవి, స్థానికురాలు

✓: పారిశుద్ధ్య కార్మికులకు తెలిపి సమస్యను పరిష్కరిస్తాం. - సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, సింహాద్రిపురం

?: పెండికి బసిరెడ్డి జలాశయం(పీబీఆర్) దగ్గర ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. దీంతో పర్యాటకులు చీకటి పడగానే తిరుగు ప్రయాణం కావాల్సి వస్తోంది.
- నాయుడు, పార్నపల్లె

✓: విద్యుత్తు దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - వెంకటేశ్వర్లు, పీబీసీ ఈఈ

?: లింగాల బీడీల చర్చి ఉన్నత పాఠశాల సమీపంలో హోటల్ యజమానులు వ్యర్థాలను వేస్తుండటంతో దుర్గంధం వ్యాపిస్తోంది.
- నారాయణ, స్థానికుడు

✓: వ్యర్థాలను తొలగించి, ఇక నుంచి అక్కడ వేయకుండా చర్యలు తీసుకుంటాం.
-శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో

?: పార్నపల్లె నుంచి పులివెందుల వరకు, రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన వాటర్‌గ్రిడ్ పైపులైన్ ఎయిర్‌వాల్వ్‌ల నుంచి నీరు లీకేజీ అయి వాహన చోదకులపై పడుతోంది.- జలాలి, వెలిదండ్ల

✓: పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
- రవికుమార్, మేఘ కంపెని మేనేజరు
- న్యూస్‌టుడే, లింగాల

స్పందించారు.. పరిష్కరించారు

వేంపల్లె: కర్లపల్లెలోని రోడ్డుపై పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఆదివారం గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించి శుభ్రం చేశారు. ఈ సమస్య ఆదివారం ఈనాడులో 'మేమున్నాం.. మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున సిబ్బందిని అక్కడికి పంపించి శుభ్రం చేయించారు.

కమలాపురం: పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మకాలనీ చివరి వీధిలో స్తంభానికి అల్లుకున్న తీగ మొక్కలను విద్యుత్తు సిబ్బంది తొలగించారు. 'నిలువునా అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికన 'ఈనాడు'లో శుక్రవారం ప్రచురితమైన చిత్ర కథనానికి విద్యుత్తు శాఖ ఏఈ చాంద్‌బాషా స్పందించి సిబ్బందితో పనులు చేయించారు.

● కమలాపురం బీడీకాలనీలో కాలువలో ఉన్న వ్యర్థాలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో తీయించారు. ఈ సమస్య ఈ నెల 25న 'మేమున్నాం..మీకు తోడుగా' శీర్షికన ప్రచురితం కావడంతో స్పందించి పారిశుద్ధ్య పనులు చేయించారు.

ఉద్యాన వనం.. ఆహ్లాదం దూరం

• సమస్యలకు నిలయంగా నెహ్రూ పార్క్

కడప నగరపాలక, న్యూస్‌టుడే : కడప పురపాలక సంస్థగా ఆవిర్భవించిన తర్వాత పురపాలక కార్యాలయం పక్కన గాంధీ పార్క్, కో ఆపరేటివ్ కాలనీ బహిరంగ స్థలంలో నెహ్రూ పార్క్ నిర్మించారు. గాంధీ పార్క్‌ను 2003లో అప్పటి పాలకులు హోటల్ యాజమాన్యానికి ధారాదత్తం చేయడంతో కాలక్రమంలో పార్క్ కనుమరుగైంది. ఆ నాటి గుర్తుగా మిగిలింది నెహ్రూ పార్క్ ఒక్కటే..! ఈ ఉద్యానవనంలో ఉన్న పరికరాలు, పిల్లల ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్ అన్నీ శిథిలావస్థకు చేరాయి. ఇక్కడికి వచ్చే వారు కూర్చోవడానికి వేసిన బల్లలు సైతం విరిగిపోయాయి. దాతలు ఇచ్చిన వాటర్ ప్లాంటును నిరుపయోగంగా మార్చారు. రూ.లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఫౌంటెయిన్ చెత్త కుండీలా మారింది. నెహ్రూ పార్క్‌ను అభివృద్ధి చేయడానికి 3 సంవత్సరాల నుంచి ప్రణాళికలు రూపొందిస్తున్నా అడుగు ముందుకు పడటంలేదు. ఉద్యానవనాల అభివృద్ధికి ఎన్‌క్యాప్ నిధులు, నగరపాలక సంస్థ సాధారణ నిధులు అందుబాటులో ఉన్నాయి. దాదాపు రూ.80 లక్షల వ్యయంతో పార్క్ అభివృద్ధి పనులకు నగరపాలక సంస్థ టెండర్లు పిలిచింది. మొదటిసారి ఒకే గుత్తేదారు టెండర్లు వేశారు. వారికి తగిన అర్హతలు లేవని టెండర్లు రద్దు చేశారు. రెండోసారి టెండర్లు పిలవగా దాఖలైన బిడ్లను పరిశీలిస్తున్నామని ఎస్ఈ చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు.

పార్కులో పనిచేయని ఫౌంటెయిన్

నగరం : కడప
డివిజన్లు : 50
జనాభా : 4,50,000

భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు

పూజలు చేస్తున్న మహిళలు

అలంకరణలో అమ్మవారు

మారుతీనగర్, న్యూస్‌టుడే: స్థానిక బిల్టప్ సమీపంలో వెలసిన విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. విజయదుర్గాదేవి అమ్మవారిని తెల్లవారుజాము నుంచే ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేదపండితులు మంత్రోచ్ఛరణల నడుమ పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించాలి

కడప విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులంతా పదో తరగతి ఫలితాలలో ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) షంషుద్దీన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ అంధుల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంఈవో-1 రఫీక్ అహ్మద్ తన తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థులకు దుప్పట్లను డీఈవో చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎస్‌వో వేపరాల ఎబినేజర్, ఎఫ్ఏసీ మురళీ, పీఎస్ హెచ్‌ఎం రమణ పాల్గొన్నారు.

దుప్పట్లు అందుకున్న విద్యార్థులతో డీఈవో షంషుద్దీన్

క్వాంటమ్ టెక్నాలజీతో మంచి భవిష్యత్తు

వేంపల్లె, న్యూస్‌టుడే: క్వాంటమ్ టెక్నాలజీతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు సాధ్యమని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య కుమారస్వామిగుప్త అన్నారు. కళాశాలలో మంగళవారం క్వాంటమ్ ఇన్నోవేషన్ హబ్ నేతృత్వంలో రూపొందించిన క్వాంటమ్ బ్రోచర్స్‌ను ఆయన ఆవిష్కరించారు. రాబోయే రోజుల్లో క్వాంటమ్ టెక్నాలజీకే డిమాండ్ ఉంటుందన్నారు. ఏవో రవికుమార్, అకడమిక్ డీన్ రమేష్‌కైలాస్, సుధాకర్‌రెడ్డి, భాస్కరయ్య, మదన్, క్యాంపస్ నిర్వాహకుడు పవన్‌కుమార్ పాల్గొన్నారు.

వీబీ జీ రామ్‌జీ చట్టం వద్దు

నందిమండలం(పెండ్లిమర్రి), న్యూస్‌టుడే: ఉపాధి కూలీలకు నష్టం కల్గించే వీబీ జీ రామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలని కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు మహబూబ్‌బాషాతో కలిసి మంగళవారం నందిమండలంలో పర్యటించారు. రాష్ట్రాలపై భారం మోపే కొత్త విధానం తగదని అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. నియోజకవర్గ బాధ్యుడు అశోక్‌కుమార్‌రెడ్డి, కడప నగర అధ్యక్షుడు సయ్యద్, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

మహిళకు కరపత్రం అందిస్తున్న కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి

రైతులకు పంట రుణాలు అందించేలా చర్యలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రైతులకు అన్ని సీజన్‌లలో పంట రుణాలు అందించేలా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ శ్రీధర్ చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో డీఎల్‌టీసీ సమావేశం మంగళవారం నిర్వహించారు. సీఈవో రాజమణి, ఎల్డీఎం జనార్దనం, డీసీవో వెంకటసుబ్బయ్య, డీడీఎం విజయవిహారి, జీఎం ప్రతాప్‌రెడ్డి, డీజీఎం నారాయణరాజు, వ్యవసాయ శాఖ ఏడీ మాధవి పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి మైనింగ్ సమస్యలు

పులివెందుల, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో నెలకొన్న భూగర్భ గనుల సమస్యలను పరిష్కరించాలని తెదేపా నియోజకవర్గ బాధ్యుడు బీటెక్ రవి రాష్ట్ర భూగర్భ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రను కోరారు. అమరావతిలోని సచివాలయంలో మంగళవారం ఆయన్ను కలిసి సమస్యలను వివరించారు. ముగ్గురాయి పరిశ్రమల పునరుద్ధరణలో వైకాపా ప్రభుత్వం పెట్టిన ఇబ్బందులను విన్నవించారు. తగు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు బీటెక్ రవి తెలిపారు.

మంత్రి కొల్లు రవీంద్రకు సమస్యలను వివరిస్తున్న బీటెక్ రవి

ఐక్యతకు చిహ్నం ఎన్‌సీసీ

కడప విద్య, న్యూస్‌టుడే: ఎన్‌సీసీ క్యాడెట్లు కవాతులో పాల్గొంటే తద్వారా క్రమశిక్షణ, ఐక్యత, దేశభక్తి పెంపొందుతాయని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్) ప్రిన్సిపల్ డాక్టర్ రవికుమార్ అన్నారు. స్థానిక కళాశాల ఆవరణలో మంగళవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కవాతులో ఉత్తమ ప్రతిభ చూపిన ఎన్‌సీసీ క్యాడెట్లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్, ఎన్‌సీసీ అధికారులు కెప్టెన్ డాక్టర్ నీలయ్య, లెఫ్టినెంట్ మహేష్, అధ్యాపకులు శివరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

ప్రమాదాల నివారణకు కృషి

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ కృషి చేయాలని ఆర్టీసీ ప్రాంతీయ అధికారి గోపాల్‌రెడ్డి, బ్రేక్‌ఇన్‌స్పెక్టర్ విజయభాస్కర్ కోరారు. స్థానిక ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో మంగళవారం డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ప్రమాదాలను నివారించాలంటూ ప్రతిజ్ఞ చేశారు.

పాత ఆసుపత్రి పాడుబడుతోంది

పులివెందుల, న్యూస్‌టుడే: పులివెందులలో ఏళ్ల తరబడి వైద్య సేవలందించిన భవనాలను, వైకాపా ప్రభుత్వంలో రూ.కోట్లు వెచ్చించి సౌకర్యాలు కల్పించారు. కానీ, నూతన వైద్య కళాశాలను నిర్మించడంతో అక్కడికి పట్టణ ప్రభుత్వాసుపత్రిని మార్చారు. దాంతో అప్పటి నుంచి పాత భవనం నిరుపయోగంగా మారింది. నిర్వహణ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇతర వాటికైనా ఉపయోగించుకోవాలని కోరుతున్నారు.

నేటి నుంచి ఉచిత శిక్షణ

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నుంచి నిరుద్యోగులకు కడప నగరం శివారులోని ఆ బ్యాంకు వద్ద ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఆరిఫ్ మంగళవారం తెలిపారు. సెల్‌ఫోన్ మరమ్మతులు, సేవలు (30 రోజులు), ఫొటో, వీడియోగ్రఫీ(31 రోజులు)పై శిక్షణ ఇస్తామన్నారు. 18 నుంచి 50 ఏళ్ల లోపు వయసున్న వారంతా నేరుగా శిక్షణకు హాజరు కావచ్చునన్నారు. వివరాలకు 94409 05478, 99856 06866 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రత్యేక హోదా విషయం లేవనెత్తాలి

వేంపల్లె, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రత్యేక హోదాపై ఎంపీలు పార్లమెంట్‌లో మాట్లాడాలని మాజీ ఎంపీ, రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి కోరారు. వేంపల్లెలో ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కేంద్రం హోదాతో పాటు పెద్దమొత్తంలో నిధులు ఇవ్వాల్సి ఉందన్నారు. దీనిపై అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీర్మానం చేసినా అమలు కాలేదన్నారు. కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు కాలేదన్నారు. వీటిపై ఎంపీలు పార్లమెంట్‌లో, రాజ్యసభ సభ్యులు రాజ్యసభలోనూ లేవనెత్తాలన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

వేంపల్లె, న్యూస్‌టుడే: స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద 11కేవీ స్తంభాలు మార్చుతుండటంతో బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సుబ్బారాయుడు తెలిపారు. రెడ్డినగర్, సాయినగర్, కెనరాబ్యాంకు వీధి, కందుల కాంప్లెక్స్, నాలుగురోడ్ల కూడలి, జీఎం కాంప్లెక్స్, గాంధీరోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అంతరాయం ఉంటుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని.. ఇద్దరికి గాయాలు

పులివెందుల, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న వారికి గాయాలైన ఘటన పట్టణ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పట్టణానికి చెందిన దంపతులు, తన కుమార్తెతో కలిసి స్థానిక నారాయణ కళాశాల వైపు నుంచి వస్తుండగా.. పాత రోడ్డులోని ఏటీఎం సమీపంలో వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో చిన్నపాపతో పాటు దంపతులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ఈ మేరకు ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఒకరికి..

పులివెందుల, న్యూస్‌టుడే: దుకాణంలో గ్యాస్ సిలిండర్ పేలడంతో వ్యక్తికి గాయాలైన ఘటన మండల పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం బాకరాపురానికి చెందిన పుష్పరాజు బజ్జీల దుకాణం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో రాత్రి గ్యాస్ పేలింది. ప్రమాదంలో గాయపడిన ఆయన్ను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప తాలూకా ఠాణా పరిధిలో వైఎస్సార్ కూడలి వద్ద మంగళవారం నగరంలోని ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఘర్షణ పడ్డారు. ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

పులివెందుల, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన బాలిక(17) అదృశ్యమైందని ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం అనంతపురం జిల్లాకు చెందిన బాలిక కుటుంబం పులివెందులలో స్థిరపడ్డారు. సోమవారం సాయంత్రం బాలిక ఇంటిలో నుంచి చెప్పకుండా వెళ్లిపోయింది. స్నేహితులు, బంధువులు వద్ద విచారించగా.. ఫలితం లేకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. దర్యాప్తు చేసున్నట్లు సీఐ తెలిపారు.

ప్రమాదమని తెలిసినా పట్టదా!

కడప నగరంలోని రహదారులు చిన్నవి. పైగా రోడ్డుకిరువైపులా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమించేశారు. పాదచారులు రోడ్లపై నడుస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో లగేజీ ఆటోవాలాలు కనీస పరిజ్ఞానం లేకుండా ఆటోకు రెండు వైపు ఫ్లెక్సీలకు సంబంధించిన ఇనుప చువ్వలను తగిలించుకుని నగరంలో రద్దీగా ఉండే ప్రాంతాల్లో వెళ్తున్నారు. పొరపాటున ఇనుప చువ్వలకు కట్టిన తాడు తెగిపోతే ప్రమాదం జరిగే ఆస్కారముంది. ట్రాఫిక్ సీఐ సురేశ్‌రెడ్డిని వివరణ కోరగా.. ఇలా ప్రమాదకరంగా సామగ్రి తీసుకెళ్లే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.
- న్యూస్‌టుడే, కడప (నేరవార్తలు)

జాతీయ స్థాయిలో కుస్తీ పట్టేందుకు సిద్ధం

క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా మట్టి కుస్తీ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేష్

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లా చీరాలలో ఈ నెల 25, 26 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి మట్టి కుస్తీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు మెరిశారు. భాకరాపేటకు చెందిన జస్వంతి 62 కేజీల లోపు సీనియర్ విభాగంలో.. టి.శ్రీకృష్ణవంశీగౌడ్ 85 కేజీల పైబడిన సీనియర్ విభాగంలో బంగారు పతకాలు సాధించారు. జూనియర్ విభాగంలో కడపకు చెందిన కె.వెంకటలక్ష్మీ 65 కేజీలలోపు విభాగంలో బంగారు పతకాన్ని అందుకుంది. ఈ మేరకు జిల్లా మట్టి కుస్తీ అసోసియేషన్ కార్యదర్శి కొన్నిపాటి వెంకటేష్ అభినందనలు తెలిపారు. వీరు హైదరాబాద్‌లో ఏప్రిల్ రెండో వారంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన వివరించారు.

లోలెవల్ వంతెన.. ఎన్నాళ్లీ యాతన

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: కడప శివారులోని విశ్వనాథపురం రైల్వే లోలెవెల్ వంతెన నిర్మాణ పనుల ఆలస్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎర్రముక్కపల్లె వైపు పనులు ఇప్పటికే పూర్తి అవ్వగా.. విశ్వనాథపురం వైపు మాత్రం ఇంకా మొదలు కాలేదు. దాంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. రాకపోకలు సాగించాలంటే వాహనదారులు అరగంట పాటు ఇక్కడే నిరీక్షించాల్సి వస్తోంది. సాయంత్ర వేళల్లో మరీ ఇబ్బందిగా ఉంటోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పరిష్కరించాలని కోరుతున్నారు.

వేమన నాటక ప్రదర్శనకు అనుమతి

వైవీయూ, న్యూస్‌టుడే: యోగి వేమన యూనివర్సిటీలో మార్చి నెలలో వేమన నాటకాన్ని ప్రదర్శించడానికి అనుమతి ఇవ్వాలని వైవీయూ పాలక మండలి సభ్యులు మల్లికార్జునరెడ్డి వీసీ రాజశేఖర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశామన్నారు. రెండు రోజులపాటు ప్రదర్శించేందుకు వీసీ అనుమతి ఇచ్చారని ఆయన వివరించారు.

(c) eenadu